# శ్రీ సిద్ధాంత శిఖామణి

# ప్రవచన ప్రభ

## ఆశీర్వచనము

(కన్నడ మూలము)

"విద్యా వారిధి"
"విద్యా వాచస్పతి"
శ్రీమత్ కాశీజ్ఞాన సింహాసనాధీశ్వర శ్రీ 1008 జగద్గురు
**డా॥ చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు**
విశ్వారాధ్య జ్ఞాన సింహాసనము
జంగమవాడి మఠము, వారణాసి

అనువాదము మరియు విశేషప్రదీపికారచన
**ప్రా॥ మఠం లింగయ్య స్వామి**
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాదు.

ప్రకాశకులు :
**శైవభారతీ శోధ ప్రతిష్ఠానము**, వారణాసి.

**"Shree Siddharta Shikhamani Pravachana Prabha"**
by H.H. Shree 1008 Kashi Jagadguru
**Dr. Chandrasekhara Sivacharya Mahaswamiji**
Jangamawadimath, Varanasi

*Translation and Viseshapradeepika by :*
**Prof. Matham Lingaiah Swamy**
Osmania University, Hyderabad

*Published by :*
**Saiva Bharathi Sodh Prathisthan**
D-35/77, Jangamawadimath,
VARANASI - 221 001. U.P.

© Reserved by Shree Kashi Jangamawadimath, Varanasi

Copies :

First Edition : 2008

Price :

Pages :

*Typesetting :*
**M/s. Jayalakshmi Printers**
3-2-814, Kachiguda,
HYDERABAD - 500 027. A.P.
Cell : 09391104717

**Horizon Graphics**
S.No. 26, Azad Market
Moti Market, Esamia Bazar,
HYDERABAD - 500 027. A.P.
Cell : 09247336685

*Printers :*

# ఆశీర్వచనము

వీరశైవ ధర్మము సనాతనమైనది. ఈ ధర్మమునకు యుగ యుగముల పరంపర గలదు. శివుని ఆదేశము మేరకు శ్రీ జగద్గురువులైన పంచాచార్యులు లింగోద్భవులై వీరశైవ ధర్మమును సంస్థాపించి యున్నారు. యుగము యొక్క భేదము వలన, ఈ పంచాచార్యులు విభిన్నమైన పేర్లతో పిలువబడిరి. వీరు కృతయుగమునందున, ఏకాక్షర శివాచార్య, ద్వ్యక్షర శివాచార్య, త్ర్యక్షర శివాచార్య, చతురక్షర శివాచార్య మరియు పంచాక్షర శివాచార్య యనెడు పేర్లతో వీరు పిలువబడిరి. త్రేతాయుగము నందున వీరే ఏకవక్త్ర శివాచార్య; ద్వివక్త్ర శివాచార్య, త్రివక్త్ర శివాచార్య, చతుర్వక్త్ర శివాచార్య, పంచవక్త్ర శివాచార్య యనెడి పేర్లతో యవతరించిరి. ఆ పిదప ద్వాపర యుగము నందన వీరే, రేణుకాచార్య, దారుకాచార్య, దేనుకా చార్య, ఘంట కర్ణాచార్య మరియు విశ్వకర్ణ ఆచార్యులుగా అవతరించిరి. తదనంతరము, కలియుగపు ప్రారంభమున వీరే రేవణారాధ్య శివాచార్య, మరుళారాధ్య శివాచార్య, ఏకో రామారాధ్య శివాచార్య, పండితారాధ్య శివాచార్య మరియు విశ్వారాధ్య శివాచార్య యనెడి పేర్లతో అవతరించిరి.

ఈ పంచాచార్యులు వీరశైవ ధర్మ సంస్థాపకులై తద్ధర్మ ప్రచారమునకై పంచపీఠములను నెలకొల్పిరి. ఈ ఐదు పీఠములే మన జాతీయ పీఠములుగా విరాజిల్లు చున్నవి. నేడు లభించెడి పరంపర ఆధారంగా తెలియుచున్నదేమనగా, ద్వాపరయుగమునకు చెందిన ఈ పంచాచార్యులు, ప్రసిద్ధములైన ఐదు ధర్మ సూత్రములను ఉల్లేఖించిరి, వీటినే వీరశైవ ధర్మసూత్రములని యందురు.

శ్రీ జగద్గురువు రేణుకాచార్యుల వారు, అగస్త్య మహర్షికి పడ్విడి సూత్రమును, శ్రీ జగద్గురు దారుకాచార్యులు, దదీచి మహర్షికి వృష్టి సూత్రమును, శ్రీ జగద్గురు ఘంటాకర్ణ శివాచార్యులవారు వ్యాస మహర్షికి లంబన సూత్రమును, శ్రీ జగద్గురు ధేనుకర్ణ శివాచార్యులవారు, సానంద మహర్షికి ముక్తా గుచ్ఛ సూత్రమును, మరియు శ్రీ జగద్గురువు విశ్వకర్ణ శివాచార్యులవారు దుర్వాసమహర్షికి పంచవర్ణ సూత్రమును ఉపదేశించిరి. ఈ సూత్రముల ముఖాంతరముగా భూలోకమున వీరశైవ ధర్మమును ప్రచారము చేసిరి.

ఈ రీతిగా శ్రీ జగద్గురు పంచాచార్యులు పై విధముగా పంచ సూత్రముల ముఖాంతరముగా జగత్తుకు వీరశైవ సిద్ధాంతమును బోధించి యీ ధర్మమును ప్రతిష్టించిరి.

**శ్లో॥ పంచానన ముఖోద్భూతాన్ పంచాక్షర మనూపమాన్ ।**
**పంచ సూత్ర కృతాన్ వందే పంచాచార్యాన్ జగద్గురూన్ ॥**

ఈ శ్లోకములోని భావమేమనగా పరమాత్ముని పంచ ముఖముల నుండి ప్రాదుర్భవించిన పంచాక్షర స్వరూపులైన మరియు పంచ సూత్రములను రచించిన శ్రీ జగద్గురు పంచాచార్యుల నమస్కరించెదను. ఈ శ్లోకము వలన తెలిసిడి దేమనగా, పంచముఖోద్భూతులైన పంచాచార్యులు, పంచ సూత్రముల ద్వారా వీరశైవ సిద్ధాంతమును ప్రచారము చేసి రనునది తెలియవచ్చుచున్నది. కాశీపీఠమునకు చెందిన శ్రీ జగద్గురు విశ్వకర్ణ శివాచార్య భగవత్పాదుల వారు దూర్వాస మహర్షికి బోధించిన పంచవర్ణసూత్రము, కాశీ పీఠము నందున లభించినది. దీని గురించి బెలగాం జిల్లాకు చెందిన హీరెమఠ పు చరపట్టాధికారియైన శ్రీ సిద్ధ నంజేశ్వర శివాచార్యులు భాష్యమును రచించిరి. ఈ పంచవర్ణ సూత్రముల గురించిన యీ భాష్యమును ప్రకటించి ప్రచారములకు తెచ్చుటకై దేశములోని వివిధ పీఠములవారు ప్రయత్నించవలసి యున్నది. అదేవిధిన మిగిలిన సూత్రములను కనుగొనుటకు పండిత లోకము ప్రయత్నశీలులై పరిశోధనలను చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైన గలదు.

శ్రీ జగద్గురు రేణుకా భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షికి ఉపదేశించిన 'పడ్విడి' సూత్రమును ఆధారముగా గొని, శ్రీ శివయోగి శివాచార్యుల వారు "రేణుకా గస్త్య సంవాదమనెడి "శ్రీ సిద్ధాంత శిఖామణిని" రచించిరి. ఇంతవరకు ఉపలబ్ధములైన వీరశైవ సిద్ధాంతమును ప్రతిపాదించెడి గ్రంథములలో "శ్రీ సిద్ధాంత శిఖామణి" ప్రాచీనమైనదిగా గుర్తింపబడినది. వీరశైవ సిద్ధాంతమును క్రమబద్ధముగా తెలియజెప్పెడి గ్రంథము అయినందున "శ్రీ సిద్ధాంత శిఖామణి"ని ప్రతి ఒక్కరు అధ్యయనము చేయవలెను.

"శ్రీ సిద్ధాంత శిఖామణి" గ్రంథ కర్తయైన శ్రీ శివయోగి శివాచార్యుల వారు, శివయోగ సిద్ధిని పొందిన శ్రేష్ఠమైన శివయోగులై యుండిరి. వీరు కామికాది – వాతూలాంతము వరకు గల 28 శివాగమములను ఆమూలాగ్రముగా అధ్యయనము చేసిరని, ఈ క్రింది శ్లోకము వలన తెలియుచున్నది.

**శ్లో॥ చిదానంద పరాకాశ శివానుభవ యోగతః**
**శివయోగీతి నామోక్తి యనస్య యథార్థ యోగినీ ॥**
**శివాగమ పరిజ్ఞాన పరిపాక సుగంధినా !**
**యదీయ కీర్తిపుష్పేణవాసిత హరితాం ముఖమ్ ॥** (సి.శి. 21 & 22)

ఈ రెండు శ్లోకములలో స్వతఃగా వారే చెప్పినట్లుగా, వీరికి వీరశైవ సిద్ధాంతము గురించి విస్తృమైన అధ్యయన పరిజ్ఞానము కలదనియును, గంభీరమైన అనుభవము గలదనియును తెలియవచ్చుచున్నది. శ్రీ శివయోగి శివాచార్యుల వంశమునకు చెందిన వారైన వీరి ముత్తాత శివయోగులవారును, వీరి తాతయైన ముద్ద దేవులవారును వీరి తండ్రియైన సిద్ధనాధుడును శివయోగులందరికిని శిఖా రత్నముల వలె వెలుగొందుచుండిరని శ్రీ శివయోగి శివాచార్యుల వారు తమ వంశ వర్ణనలో ఎంతో గౌరవ పూర్వకముగా ప్రతిపాదించిరి. ఒక వంశము నందున ఒక్క శివయోగి ఉద్భవించునది దుర్లభమైన విషయము కాగా, శ్రీ శివయోగి శివాచార్యుల వారి వంశములో ఉద్భవించిన వారెల్లరు శివయోగులైనందున, వీరి వంశము ఎంతో ప్రశస్థమైనది అని తెలియుచున్నది. ఇట్టి ఉత్తమ వంశము నందు జనించిన శ్రీ శివయోగి శివాచార్యులవారు వీరశైవులెల్లరకు మార్గదర్శకులైరి.

క్రీ.శకం ఆరవ శతాబ్దము నందున బౌద్ధ మతము ప్రబలముగా ప్రచారములో నున్నందున అనేక జనులు ధర్మాంతరులై మార్గ భ్రష్టులైరి. ఈ స్థితి యందున, సనాతనమైన వీరశైవ ధర్మమునకు చెందినవారు మతాంతరులై పోకుండా వుండుటకై శ్రీ శివయోగి శివాచార్యుల వారు వేదాగమ, పురాణ, సమ్మతమైన విషయములను ఆధారముగా గ్రహించి స్వతంత్రమైన వీరశైవ సిద్ధాంత గ్రంథమును రచించిరి. అదియే " శ్రీ సిద్ధాంత శిఖామణి ". ఈ విధముగా శివుని వలన ఉపదేశింపబడిన శివాగమములలో చెప్పబడిన సమగ్రమైన వీరశైవ సిద్ధాంతమును క్రమబద్ధముగా బోధించిన ఆద్య గ్రంథమే "శ్రీ సిద్ధాంత శిఖామణి', యిది వీరవైశులకు సర్వస్వము. నూటొక్క స్థలములతో కూడిన దగు యిది ఒక వీరశైవుల మత తంత్రము. శివాగమముల ఉత్తర భాగమున వీరశైవ సిద్ధాంతము ప్రతిపాదించబడినది. అదియే యీ గ్రంథము నందున ప్రతిపాదించుట చేత, దీనికి "శ్రీ సిద్ధాంత శిఖామణి" యనెడి పేరు యివ్వబడినది. గ్రంథము యొక్క చివరి భాగము నందు, శివయోగి శివాచార్యులవారు వ్రాసిన యీ క్రింది శ్లోకములను గమనించుడి.

**శ్లో॥ శ్రీ వేదాగమ వీరశైవ సరణిం శ్రీ షట్ స్థలోధ్యనమణిం ।**
**శ్రీ జీవేశ్వర యోగపద్యతరణిం ఏ గోప్య చింతామణిం ॥**
**శ్రీ సిద్ధాంత శిఖామణిం లిఖియితా యస్తం లిఖిత్వాపరాన్ ।**
**శ్రుత్వా శ్రీవయితా సయాతి విమలాం భక్తించ ముక్తిం పరామ్ ॥** (21-54)

పై శ్లోకములందున వేదాగమ వీరశైవ సరణిని శ్రీ షట్ స్థల సిద్ధాంత ఉద్యన్మణిని, జీవేశ్వర యోగ పద్య తరణిని శ్రీ గోప్య చింతామణినిని, రచించినానని శివయోగి శివాచార్యులవారు తెలియచేసిరి. ఇట్టి శ్రేష్ఠమైన శ్రీ సిద్ధాంత శిఖామణిని ఎవరు వ్రాయుదురో, ఎవరు వ్రాయించెదరో వారికి భోగ, భాగ్యములు లభించి చివరకు లింగాంగ సామరస్యము లభించునని శివయోగి శివాచార్యుల వారు తెలియచేసిరి. అందుచేత శ్రీ సిద్ధాంత శిఖామణి ఒక శ్రవణయోగ్యమైన గ్రంథమై యున్నది.

ఈ గ్రంథమునకు కన్నడ, తెలుగు, తమిళము, హిందీ, ఆంగ్లము, మరాఠి మొదలైన భాషలలో అనేకానేకులు భావార్థమును ప్రకటించిరి. అయితే ఈ గ్రంథము నందలి తత్త్వములను వివరముగా తెలియచేసెడి వ్యాఖ్యాన రూపమైన గ్రంథములు వెలువడలేదు. దీనిని వినిన శ్రీ కాశీ జగద్గురువుల వారు ప్రప్రథమముగా కన్నడము నందున శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన రూపమైన వ్యాఖ్యానమును వ్రాసి "శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ" అను 2000 పుటల ఉద్గ్రంథమును ప్రకటించిరి. ఇది యింతవరకు నాల్గు ముద్రణలు పొందినది. కర్ణాటకము నందున జనులందరికి ప్రీతి పాత్రమైనది. ఆ పిదప ఈ గ్రంథము మరాఠి భాషలోనికి అనువదింపబడినది. దీనిని అనువదించినవారు డా॥ శ్రీ దిపరశ్రీకర. వీరు ఈ గ్రంథమునకు "జన్మాకా అఖేరచా" అనే పేరిడిరి. ఇది కూడా ఐదు మారులు ముద్రింపబడి మహారాష్ట్ర జనులందరకు ప్రీతిపాత్రమైనది.

ఇప్పుడు తెలుగుభాషా పండితులు, సంశోధకులు, ఉత్తమ లేఖకులు, మేధావి మరియు శ్రేష్ఠమైన వాఙ్మయ మరియు త్రికాల స్వేష్ఠ లింగపూజా నిష్ఠులు అగు ఆచార్య మఠం లింగయ్య స్వామి వారు నా కన్నడ భాషలోని "శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ"ను తెలుగుభాషలోకి

అనువదించిరి. ఈ అనువాదము శబ్ద శం అను వాదమై యుండక తెలుగు భాషా సౌందర్య దృష్టితో మూల భావమునకు ఆటంకము కలుగకుండ స్వతంత్రముగా వ్రాసిరి. ఇంతియే కాదు, ప్రతి యొక్క ప్రవచనమునకు "విశేష ప్రదీపిక" యనెడి స్వతంత్ర వ్యాఖ్యానమును రచించిరి. వీరి యీ విశేషప్రదీపిక కూడ మూల కన్నడ ప్రవచనమునకు హెచ్చిన మేరకు బలమును చేకూర్చినది. ఇందుచేత అనువాద వీరశైవ సిద్ధాంతము ప్రగాఢమైన పాండిత్యమును ప్రదర్శించిరి. వీరి యీ అనువాదము సరళి వలన మేము ఎంతో సంతోషించితిమి. ఇంతేకాదు, ఈ గ్రంథమునకు ఉత్తమమైన పీఠికను కూడ రచించిరి. ఈ పీఠిక యందు గ్రంథకర్తకాల, దేశ, శైలి మరియు గ్రంథము యొక్క గంభీర విషయముల గురించి పాండిత్య పూర్వక విషయములను పొందుపరచుటచే, యిది యందరి మాన్యతను పొందగలదనే విషయములో సందేహము లేదు.

వీరు కన్నడము నుంచి అనువదించిన బసవవేశ్వర వచనముల "బసవేశ్వర గీతామృతమును" చూసి ప్రభావితుడనై వీరికి "సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ" అనువాదమును చేయుమని ఆదేశించితిమి. ఇట్టి ఆదేశము 'మల్కేడు' లో నిర్వహింపబడిన మా శ్రావణమాస అనుష్ఠాన సందర్భమున , విశ్వారాధ్య విశ్వభారతి" పురస్కారమును అందచేయు సందర్భమున ప్రకటించితిమి. ఆచార్య మఠం లింగయ్యా స్వామి వారు రెండు సంవత్సరములు శ్రమించి అనువాద కార్యమును సుసంపన్నం జేసిరి. ఇందుచేత ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి వీరశైవుడి ఇళ్లలో సిద్ధాంత శిఖామణి" గ్రంథముండవలననెడి ప్రగాఢమైన కోరిక నెరవేరినది. ఈ సందర్భమున ఆచార్య మఠం లింగయ్యస్వామి వారికిని, వారి కుటుంబ సభ్యులకును శివానుగ్రహము లభించాలని ఆశీర్వదించుచున్నాము. శ్రీ జగద్గురు పంచాచార్యుల ఆశీర్వాదము వలన వీరు పూర్ణాయుష్కులై ఆరోగ్యవంతమైన జీవితమును గడుపవలెనని ఆశించుచున్నాము. ఇంకను హెచ్చైన సాహిత్య కృతులను చేసి సమాజము నందున అమితమైన గౌరవమును బడయువలెననియును ఉత్తమమైన కీర్తి ప్రతిష్ఠిలను పొందవలెనని ఆశీర్వదించుచున్నాము.

శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ రచనా వ్యాసాంగములోను ప్రూపు రీడింగు యిత్యాదులలోను సహకారమును అందించిన పండిత విద్వాంసులైన శ్రీయుతులు శివశ్రీ ఆవులశెట్టి పుల్లప్ప; శివశ్రీ పురాణం నాగయ్య, శివశ్రీ కొల్లిపర మదనమోహన్, శరణశ్రీ కొండా బసవరాజు, శివశ్రీ యం. శంకరయ్య స్వామి, శివశ్రీ సాంబశివ శర్మ, డా॥ మహాంతయ్య, శివశ్రీ డా॥ రాజయ్య, శివశ్రీ భంగిమఠం పరమేశ్వరయ్య, శివశ్రీ మడుపతి వీరయ్య, శివశ్రీ మడుపతి విశ్వనాథం, శివశ్రీ షాబాదు గురు శాంతప్ప, శివశ్రీ జగదేవహీరెమఠ ఆచార్య మార్గం బసవరాజులకు అనంత ఆశీర్వచనములు.

ఈ గ్రంథమునకు డి.టి.పి సేవలనందించిన శివశ్రీ ప్రసాద్ మరియు వారి కుటుంబ సభ్యులకును, అందముగా ముద్రణను చేసిన మహబూబ్‌నగర్ నగరమందలి శ్రీరామా ప్రెస్ యజమాని శివశ్రీ ముక్తా శ్రీశైలముగారికిని వారి కుటుంబ సభ్యులకును అనత మంగళాశీర్వాదములు.

# మున్నుడి

చిన్మయుడైన శివపరబ్రహ్మ సంకల్పానుసారముగనే యీ జగత్తు చరించుననెడిది ఆగమవిదులు తెలిపెడి భావన. ఇది నిత్యసత్యము. శివప్రేరణకు లోనైన జీవుడు కార్యోన్ముఖుడై కార్యసాధన కుపక్రమించు ననెడిది ఉపనిషద్వాదుల యభిప్రాయము, కాగా గురులింగ జంగములు లోకకల్యాణము నాశించి ప్రేరకులౌదురనెడిది వీరశైవుల విశ్వాసము.

ఒకానొక సాయం సమయమున శ్రీశ్రీశ్రీ 1008 శ్రీమద్ కాశీ జగద్గురువులు జ్ఞాన పీఠాధీశ్వరులైన డా॥ చంద్రశేఖరశివాచార్యులవారు ఫోనులో మాట్లాడుచూ, నాకు **విశ్వభారతి పురస్కారము**నిచ్చుచున్నామని తెలిపిరి. వినమ్రుడనై, విదిత యశస్సంపన్నునినొక ప్రశ్న వేసితిని. "వీరశైవ వాఙ్మయమునకు నేను చేసిన సేవ గణనీయమైనది కాదు కదా! ఎందులకీ పురస్కారము నిచ్చుచున్నార"నెడిది ఆ ప్రశ్న.

"నీవు చేయబోయెడి కార్యమున"కనిరి.

మళ్ఖేడ్‌లో నిర్వహింపబడిన పురస్కార ప్రదాన సభలో సన్మంగళమూర్తియైన మహాసన్నిధివారు తమ యాశీర్వాద ప్రసంగములో "శ్రీ సిద్ధాన్త ప్రవచన ప్రభ" తెలుగులో వెలువడనున్నదనియును, నేనా కార్యభారమును వహించ బోవుచున్నాని ప్రకటించిరి. నన్ను వెన్నంటి వచ్చిన భక్తామహేశ్వర బృందములోని ప్రముఖులైన శివశ్రీ యం. శంకరయ్య, శివశ్రీ పురాణం నాగయ్య, శివశ్రీ డా॥ మహంతయ్య, శివశ్రీ యం. వీరయ్య, శివశ్రీ కల్వ మల్లికార్జునప్ప, శివశ్రీ డా॥ మార్గం బసవరాజు మున్నగువార్లు హర్షాతిరేకములను ప్రకటించిరి. శివశ్రీ మళ్ఖేడ్ అప్పగారు శ్రీశ్రీశ్రీ 108 గంగాధరశివాచార్య మహాస్వామివారు 'భళీ! భళీ! యనిరి. షట్‌స్థల బ్రహ్మలు తమ ప్రమోదమును ప్రకటించిరి. సభికులు సంతసించి చప్పట్లు కొట్టిరి. చప్పట్లు చప్పుడుకు నా గుండె దడదడ లాడెను. భయము హెచ్చెను. "నేను చేయగలనా?" అనే ప్రశ్న నన్ను బాధించెను. నా మనోగతము నెరింగిన మహాసన్నిధివారు అపాంగ వీక్షణము ద్వారా అనంతమైన శక్తిని ప్రదానము చేసి ధైర్యమును చేకూర్చిరి.

నా కార్యసాధనా క్రమములో సహకారము నొసంగిన వారు అసంఖ్యాకులు. వీరందరిలో కొందరి సేవలు స్మరణయములు. వేదవ్యాసునికి గణపతి యొసంగిన సేవలను పోలెడి సేవలందజేసిన వారిలో శివశ్రీ ఆవులశెట్టి పుల్లప్పగారు ప్రముఖులు. సహనశీలురై యెంతో శ్రమకోర్చి పరిశ్రమించిరి. ఇట్టి సేవల నందించిన వారిలో శివశ్రీ పురాణం మఠం నాగయ్య, శివశ్రీ మదన్‌మోహన్, శరణశ్రీ కొండా బసవరాజు గలరు. శివశ్రీ భంగీమఠము పరమేశ్వరయ్య, శివశ్రీ మడుపతి వీరయ్య గారులును వారివారి శక్తిమేరకు సహకరించిరి. గణపతి సేవలనందించినవారికి ప్రేరకుడై వారి కార్యమును సమన్వయము చేసెడి నాయకుడై నిలిచిన వాడును, నా బాల్యమిత్రుడును అయిన ఆచార్య మార్గం బసవరాజ వారి సేవలు శ్లాఘనీయుము. వీరందరికీ మహాసన్నిధి వారి యాశీర్వచనము ద్వారా సకల సన్మంగళములు చేకూరుగాక!

విశేషప్రదీపిక రచనా నిమిత్తము నేను వివిధ గ్రంథముల నుండి ప్రమాణములను గైకొని ఉటంకించితిని. ఈ గ్రంథముల ప్రచురణకర్తలందరికి నా కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను. వీరికి మహాసన్నిధి వారి కరుణా కటాక్షములు లభించుగావుత! కొన్ని అముద్రిత గ్రంథములనుండి ప్రమాణములుదహరింపబడినవి. వీటినందజేసినవారికి నా ప్రత్యేకమైన కృతజ్ఞతలు.

వ్రాతప్రతిని పరిశీలించుటకై మహాసన్నిధివారు సికింద్రాబాదుకు విచ్చేసి ఒక సప్తాహకాలము గడిపిరి. ఆ సమయమున మహాసన్నిధివారికి విడిది యిత్యాది సౌకర్యములు కల్పించిన శివశ్రీ కొప్పునూరి బసప్పగారి సేవలు అవిస్మరణీయము. ఈ సందర్భమున నాకు సహకారము నొసంగిన పండితగణమునకు ప్రమోదమును చేకూర్చెడి విధముగా సేవలనందించిన వారి కుటుంబ సభ్యుల సేవలు చిరస్మరణీయులే. వీరికి సకల సన్మంగళములు సిద్ధించుగావుత!

ప్రచురణ భారమును మోసిన వీరశైవ ధర్మప్రచార సంస్థ సేవలు శ్లాఘనీయములు. దీని గౌరవాధ్యక్షులైన శివశ్రీ శాబాదు గురుశాంతప్పగారు, అధ్యక్షులు శివశ్రీ జగదేవ్ హిరేమఠ్ మరియు యీ సంస్థ హితాభిలాషులు శివశ్రీ మాడపు వీరమల్లేశ్, మరియు శివశ్రీ హేరూర్ విజయకుమార్ గార్లు ఎంతో శ్రమించిరి. ఈ సంస్థ దినదినాభివృద్ధిని గాంచుగావుత! డిటిపి సేవలందించిన ప్రసాద్‌కు శుభములు కలుగుగాక! ప్రూఫ్ రీడింగ్ సేవల నందించిన శివశ్రీ యం. శంకరయ్య స్వామి, శివశ్రీ సాంబశివశర్మ, శివశ్రీ కొల్లిపర మదన్‌మోహన్, శివశ్రీ పురాణం నాగయ్య, శివశ్రీ డా॥ మహంతయ్య, శివశ్రీ డా॥ బి.రాజయ్య, శివశ్రీ భంగిమఠం పరమేశ్వరయ్య, శివశ్రీ మడపతి వీరయ్య, శివశ్రీ మడుపతి విశ్వనాథం, శివశ్రీ ఆవులశెట్టి పుల్లప్ప, శివశ్రీ మార్గం బసవరాజ మున్నగు వారికి మహాసన్నిధి వారి ఆశీర్వాదముల వలన మనోభీష్టసిద్ధి గల్గునుగావుత!

మహాసన్నిధివారి యానతిని అమలుచేయుటలో నాకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహకరించిన అనేకానేక భక్తమాహేశ్వరులకు, గురులింగజంగముల కటాక్షలబ్ధి పుష్కలముగా లభించి, తద్వారా మనోభీష్టసిద్ధి కల్గును గాక! మేమందరము సామూహికముగా చేసిన కృషివలన ధార్మికజనులు మరియు వీరశైవ జనలోకము లాభమును పొంది సద్గతిని బడయుటకు ఈ గ్రంథపఠనము పెద్ద ఉపకరణముగా నుండగలదని భావించుచున్నాము. పాఠకులీవిధిన లాభమును పొందుదురుగాక! ఇట్టి సేవలందించుటకు సందర్భమును కల్పించిన మహాసన్నిధివారి చరణములకు కృతజ్ఞతాపూర్వకమైన ప్రణతులర్పించుచున్నాము.

**అనువాదము మరియు విశేషప్రదీపిక కర్త**

# విషయసూచిక

పుట సంఖ్య

పీఠిక xiii-xlii

**1. ప్రథమ పరిచ్ఛేదము** **1–13**

ప్రవేశిక

అ) శివస్తుతి – శక్తిస్తుతి

ఆ) గ్రంథకర్త శ్రీ శివయోగి శివాచార్య వంశవర్ణన

**2. ద్వితీయ పరిచ్ఛేదము** **14–19**

అ) మంగళాచారణ

ఆ) వస్తు నిర్దేశన

ఇ) సృష్టిక్రమ నిరూపణ

**3. తృతీయ పరిచ్ఛేదము** **20–30**

శివసభా వర్ణన

**4. చతుర్థ పరిచ్ఛేదము** **31–37**

అ) శ్రీ జగద్గురు రేణుకాచార్య అవతారం

ఆ) అవతార ఉద్దేశం

ఇ) మలయాద్రి వర్ణన

ఈ) అగస్త్యాశ్రమ వర్ణన

ఉ) అగస్త్య మునివర్ణన

ఊ) శ్రీ జగద్గురు రేణుకాచార్య – అగస్త సమాగమము

ఋ) అగస్త్యమహర్షి ప్రార్థన

**5. పంచమ పరిచ్ఛేదము** **38–177**

శివాద్వైత సిద్ధాంతోపదేశం

**అంగస్థలములు (1–44)**

భక్తిస్థలము

| స్థలాంకము | స్థలనామము | ఆశీర్వచనములు | పుట |
|---|---|---|---|
| 1) | పిండస్థలము | (1–2) | 42–84 |
| 2) | పిండజ్ఞానస్థలము | (1–2) | 84–114 |
| 3) | సంసారహేయస్థలము | (1–10) | 114–177 |

**6. షష్ఠమ పరిచ్ఛేదము** **178–339**

| | | | |
|---|---|---|---|
| 4) | గురుకారుణ్యస్థలము | (1–5) | 178–226 |
| 5) | లింగధారణస్థలము | (1–11) | 227–339 |

| | | | | |
|---|---|---|---|---|
| **7. సప్తమ పరిచ్ఛేదము** | | | | **340-465** |
| 6) | భస్మధారణస్థలము | (1-9) | 340-410 | |
| 7) | రుద్రాక్షధారణస్థలము | (1-7) | 410-465 | |
| **8. అష్టమ పరిచ్ఛేదము** | | | | **466-515** |
| 8) | పంచాక్షరజపస్థలము | (1-12) | 466-515 | |
| **9. నవమ పరిచ్ఛేదము** | | | | **516-577** |
| 9) | భక్తమార్గ క్రియాస్థలము | (1-7) | 516-546 | |
| 10) | ఉభయస్థలము | (1) | 547-555 | |
| 11) | త్రివిధ సంపత్తిస్థలము | (1) | 556-561 | |
| 12) | చతుర్విధసారాయ స్థలము | (1) | 561-572 | |
| 12-15) | సోపాధి, నిరుపాధి, సహజదానస్థలము | (1) | 572-577 | |
| **10. దశమ పరిచ్ఛేదము** | | | | **578-645** |
| మాహేశ్వరస్థలము | | | 578-587 | |
| 16) | మాహేశ్వర ప్రశంసాస్థలము | (1-4) | 587-607 | |
| 17) | లింగనిష్ఠాస్థలము | (1-2) | 607-615 | |
| 18) | పూర్వాశ్రయనిరసనస్థలము | (1) | 615-621 | |
| 19) | సర్వాద్వైత నిరసనస్థలము | (1) | 621-626 | |
| 20) | ఆహ్వాన నిరసనస్థలము | (1) | 627-630 | |
| 21) | అష్టమూర్తి నిరసనస్థలము | (1) | 631-634 | |
| 22) | సర్వగత్వనిరసనస్థలము | (1) | 634-637 | |
| 23) | శివజగన్మయస్థలము | (1) | 637-639 | |
| 24) | భక్తదేహికలింగస్థలము | (1) | 640-645 | |
| **11. ఏకాదశ పరిచ్ఛేదము** | | | | **646-683** |
| 25) | ప్రసాదిస్థలము | (1-2) | 646-656 | |
| 26) | గురుమాహాత్మ్యస్థలము | (1) | 656-660 | |
| 27) | లింగమహాత్మ్య స్థలము | (1) | 660-667 | |
| 28) | జంగమమాహాత్మ్య స్థలము | (1) | 667-670 | |
| 29) | భక్తమహాత్మ్యస్థలము | (1) | 670-675 | |
| 30) | శరణమహాత్మ్యస్థలము | (1) | 675-681 | |
| 31) | ప్రసాదమహాత్మ్యస్థలము | (1) | 681-683 | |
| **12. ద్వాదశ పరిచ్ఛేదము** | | | | **684-724** |
| ప్రాణలింగిస్థలము | | | | |
| 32) | ప్రాణలింగిస్థలము | (1-2) | 684-691 | |
| 33) | ప్రాణలింగార్చనస్థలము | (1-2) | 691-700 | |
| 34) | శివయోగసమాధిస్థలము | (1-5) | 701-714 | |
| 35) | లింగనిజస్థలము | (1-2) | 714-720 | |
| 36) | అంగ - లింగ స్థలము | (1) | 721-724 | |

| | | | | |
|---|---|---|---|---|
| **13. త్రయోదశ పరిచ్ఛేదము** | | | | **725-756** |
| శరణస్థలము | | | | |
| 37) | శరణస్థలము | (1) | 725-730 | |
| 38) | తామసనిరసన స్థలము | (1-4) | 730-746 | |
| 39) | నిర్దేశనస్థలము | (1) | 747-751 | |
| 40) | శీలసంపాదనస్థలము | (1) | 751-756 | |
| **14. చతుర్దశ పరిచ్ఛేదము** | | | | **757-794** |
| ఐక్యస్థలము | | | | |
| 41) | ఐక్యస్థలము | (1-4) | 757-769 | |
| 42) | ఆచార్యసంపత్తి స్థలము | (1-4) | 769-782 | |
| 43) | ఏకభాజనస్థలము | (1) | 782-786 | |
| 44) | సహభోజనస్థలము | (1-3) | 786-794 | |
| **15. పంచదశ పరిచ్ఛేదము** | | | | **795-875** |
| భక్తస్థలము | | | | |
| 45) | దీక్షాగురుస్థలము | (1-8) | 795-837 | |
| 46) | దీక్షాగురుస్థలము | (1-2) | 837-846 | |
| 47) | జ్ఞానగురుస్థలము | (1) | 847-851 | |
| 48) | క్రియాలింగ స్థలము | (1) | 851-856 | |
| 49) | భావలింగ స్థలము | (1) | 857-860 | |
| 50) | జ్ఞానలింగస్థలము | (1) | 861-863 | |
| 51) | స్వీయస్థలము | (1) | 863-868 | |
| 52) | చరస్థలము | (1) | 868-871 | |
| 53) | పరస్థలము | (1) | 871-875 | |
| **16. శోడశ పరిచ్ఛేదము** | | | | **876-945** |
| మాహేశ్వరస్థలము | | | | |
| 54) | క్రియాగమస్థలము | (1-2) | 876-883 | |
| 55) | భావాగమస్థలము | (1-2) | 883-890 | |
| 56) | జ్ఞానాగమస్థలము | (1-2) | 891-898 | |
| 57) | సకాయస్థలము | (1-2) | 898-901 | |
| 58) | అకాయస్థలము | (1) | 902-906 | |
| 59) | పరకాయస్థలము | (1-2) | 907-913 | |
| 60) | ధర్మాచారస్థలము | (1-6) | 913-935 | |
| 61) | భావాచారస్థలము | (1-2) | 936-941 | |
| 62) | జ్ఞానాచారస్థలము | (1) | 942-945 | |

| | | | |
|---|---|---|---|
| **17. సప్తదశ పరిచ్ఛేదము** | | | **946-1030** |
| ప్రసాదిస్థలము | | | |
| 63) | కాయానుగ్రహస్థలము | (1-2) | 946-954 |
| 64) | ఇంద్రియానుగ్రహస్థలము | (1-2) | 955-966 |
| 65) | ప్రాణానుగ్రహస్థలము | (1-3) | 967-979 |
| 66) | కాయార్పితస్థలము | (1) | 980-985 |
| 67) | శరణార్పితస్థలము | (1-2) | 985-996 |
| 68) | భావార్పితస్థలము | (1) | 996-1003 |
| 69) | శిష్యస్థలము | (1-2) | 1004-1015 |
| 70) | శుశ్రూషాస్థలము | (1-2) | 1016-1026 |
| 71) | సేవ్యస్థలము | (1) | 1027-1030 |
| **18. అష్టాదశ పరిచ్ఛేదము** | | | **1031-1081** |
| ప్రాణలింగిస్థలము | | | |
| 72) | ఆత్మస్థలము | (1-2) | 1031-1049 |
| 73) | అంతరాత్మస్థలము | (1) | 1049-1053 |
| 74) | పరమాత్మస్థలము | (1) | 1053-1056 |
| 75) | నిర్దేహాగమస్థలము | (1) | 1056-1062 |
| 76) | నిర్భావాగమస్థలము | (1) | 1063-1066 |
| 77) | నష్టాగమస్థలము | (1) | 1066-1070 |
| 78) | ఆదిప్రసాదిస్థలము | (1) | 1070-1074 |
| 79) | అంత్యప్రసాదిస్థలము | (1) | 1074-1077 |
| 80) | సేవ్యప్రసాది స్థలము | (1) | 1077-1081 |
| **19. ఏకోనవింశతితమ పరిచ్ఛేదము** | | | **1082-1140** |
| శరణస్థలము | | | |
| 81) | దీక్షాపాదోదకస్థలము | (1) | 1082-1085 |
| 82) | శిక్షాపాదోదకస్థలము | (1) | 1086-1089 |
| 83) | జ్ఞానపాదోదకస్థలము | (1) | 1090-1094 |
| 84) | క్రియానిష్పత్తిస్థలము | (1) | 1095-1100 |
| 85) | భావనిష్పత్తిస్థలము | (1) | 1100-1103 |
| 86) | జ్ఞాననిష్పత్తిస్థలము | (1) | 1104-1107 |
| 87) | పిండాకాశస్థలము | (1) | 1108-1113 |
| 88) | బింద్వాకాశస్థలము | (1) | 1113-1117 |
| 89) | మహాకాశస్థలము | (1) | 1117-1127 |
| 90) | క్రియాప్రకాశస్థలము | (1) | 1127-1131 |
| 91) | భావప్రకాశస్థలము | (1) | 1131-1136 |
| 92) | జ్ఞానప్రకాశస్థలము | (1) | 1136-1140 |

| | | | | |
|---|---|---|---|---|
| **20. వింశతితమ పరిచ్ఛేదము** | | | | **1141-1175** |
| ఐక్యస్థలము | | | | |
| 93) | స్వీకృతప్రసాదిస్థలము | (1) | 1141-1147 | |
| 94) | శిష్టోదనస్థలము | (1) | 1148-1153 | |
| 95) | చరాచరలయస్థలము | (1) | 1154-1159 | |
| 96) | భాండస్థలము | (1) | 1159-1162 | |
| 97) | భాజనస్థలము | (1) | 1162-1165 | |
| 98) | అంగాలేపస్థలము | (1) | 1165-1167 | |
| 99) | స్వపరాజ్ఞస్థలము | (1) | 1168-1170 | |
| 100) | భావాభావలయస్థలము | (1) | 1170-1171 | |
| 101) | జ్ఞానశూన్యస్థలము | (1) | 1172-1175 | |
| **21. ఏకవింశతితమ పరిచ్ఛేదము** | | | | **1176-1181** |
| త్రికోటిలింగ స్థాపనాలీల | | (1) | 1176-1181 | |
| శ్లోకార్థముల అకరాది పట్టిక | | | | **1182-1196** |
| సహాయక గ్రంథసూచి | | | | **1197-1198** |
| వ్యాఖ్యానమునకు ఉపయోగపడిన గ్రంథముల పట్టిక | | | | **1199** |
| సంకేతాక్షర సూచి | | | | **1200** |

# పీఠిక

ఆధ్యాత్మిక సంస్కృతికి పుట్టినిల్లైన భారత దేశము యావత్ ప్రపంచమునకు పథదర్శినిగా విరాజిల్లుచున్నదనెడిది విశ్వమెరిగిన విశిష్ట సత్యము. ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతలు, వివకాసమును చవిచూసిన నాటి నుండి నేటి వరకు విదేశీయులు ఇచ్చటికివచ్చి సుసంపన్నమై నిత్యనూతన శోభలతో ప్రకాశించుచున్న భారతీయ ఆధ్యాత్మిక విలువలను అధ్యయనము చేసి విశేషమైన లబ్ధిని పొందుచున్నారు. భారతదేశములో ప్రభవించిన సిద్ధాంతముల కొకక ప్రత్యేకత గలదని తెలియనివారెవ్వరు? అయితే అందరికీ అవగతము కానివిషయమేమనగా ఈ దేశమున వెలసిన సిద్ధాంతమణులలో శిఖామణి వలె ప్రకాశించెడి వీరశైవ సిద్ధాంతము ఉత్కృష్టమైనదనెడి విషయము. సనాతనమైనట్టియీ ధర్మము యొక్క వేర్లను శివాగమములలో గాంచగలము. శివుడు పార్వతికిని, స్కందునికిని యుపదేశించిన శివాద్వైతమే యీ ధర్మమునకు ఆధారభూతమైన ప్రాతిపదిక యని తెలియవచ్చుచున్నది. ఆగమములలో పేర్కొనబడిన సప్తవిధ శైవములలో వీరశైవమునకొక విశిష్టత గలదు. అదెట్టిదనగా ఇయ్యది పరిపూర్ణ పరిణితిని పొందిన ధర్మము. దీనిలో యిమిడి యున్న విలువలు మౌళిక మానవతా విలువలతో యనుబంధము గల్గినవి. దీనిదివ్య ప్రభలవలన స్ఫూర్తి పొందిన సిద్ధాంతములు వికసన మొంది వినూత్న కాంతులను సంతరించికొనినవి.

చరిత్ర గమనములో వివిధ స్వదేశీయ విదేశీయ ప్రభావాలకు లోనైన జనులు సనాతనమైన వీరశైవము యొక్క గొప్ప తనమును గాంచలేని స్థితికి చేరిరి. వీరిలో కొందరు పూర్వమీమాంసవైపు మొగ్గగా మరికొందరు వామ పక్షములవైపు పరుగిడిరి. ఈ ఇరువర్గముల యొక్క ధోరణులను నిరసించెడి వారు నాస్తికులైరి. నాస్తిక మతముల విజృంభణకు దోహదము చేసిరి. నాస్తికమతముల ప్రభావమెంతో కాలము వరకు కొనసాగలేదు. అవైదిక మార్గముల కాదరణ తగ్గెను. వివేకవంతులు వినూత్నమైన మార్గముల కొఱకైయన్వేషింపజొచ్చిరి. సామాన్యులు నిస్సహాయులై ప్రత్యామ్నాయ మార్గముల యావిర్భావము కొరకై నిరీక్షింపజొచ్చిరి. నూతన మార్గములను పరీక్షించిన పడింతప్రముఖులు సనాతన మార్గములను మరల కనిపెట్టుటే సరియైన పరిష్కారమని భావించిరి. ఈ విధములైన ఆలోచనా ప్రవంతులు నలుదెసల నుండి పలు దెసలకు ప్రవహింపజొచ్చెను. కొంతకాలము వరకుఈ విపత్కర స్థితి కొనసాగెను.

భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో క్రీ.శ. ఐదవ శతాబ్ది యొక్క ఉత్తర భాగమునకు గల ప్రాముఖ్యత అనన్య సామాన్యమైనదని గుర్తించ వచ్చును. నాటి సామాజిక స్థితి గతుల నేపథ్యంలో తల యెత్తిన బహువిధములైన సమస్యల స్వరూప స్వభావముల నవగతము చేసికొని, జఠిలమైన సమస్యలకు సులభమైన పరిష్కార మార్గముల యన్వేషణకై ప్రయత్నములు చేపట్టబడినవి. వేదాగమ పురాణాదులలోని జ్ఞాన భాగము తరుణోపాయములకు కేంద్ర స్థానమని చెప్పబడినది. మత వైషమ్యాల స్థానమున మతసామరస్యము నెలకొల్పబడెను. జైన బౌద్ధాదులు తమ తమ ప్రభావములను కోల్పోయి కాంతి హీనములై యున్న పరిస్థితిలో తికమకకు గురియైన స్థితిలో ఆస్తికత్వమే శరణ్యమని తెలుపబడెను. వర్ణ వ్యవస్థ కల్పించిన దిగ్బంధముకు గురియైనట్టి శైవ వైష్ణవాది మతములు చైతన్యహీనతను సంతరించుకొనిన దశలో అతి వర్ణాశ్రమీయత నాయుధముగా గొని అసమానతలను చిన్నాభిన్నము లుగా చేయవచ్చుననియును, ఆధ్యాత్మిక ప్రపంచము నందున సమతా మమతలకు అగ్రస్తానము లివ్వవచ్చునని తెలుపబడెను. వివక్షత వలన గలిగెడి వికృత పరిణామములకు స్వస్తిని చెప్పి స్త్రీలు, అంత్యజులు, అల్పసంఖ్యాకులు అందరితో పాటుగా నాధ్యాత్మిక ప్రగతిని సాధించ వచ్చునని తెలుపబడెను. భేధఅభేద సిద్ధాంతముల కంటెను భేదాభేద సిద్ధాంతమైన శక్తివిశిష్టాద్వైతమే శాస్త్రీయ మైనదని సమరసభావనతో తెలుపబడెను.

ఇట్టి బహుముఖములైన సామాజిక ప్రయోజనములను చేకూర్చిపెట్టిన ఘనత "సిద్దాంత శిఖామణి" యనెడి తాత్విక గ్రంథమునకు దక్కుతుంది. దీనికి రేణుకాగస్త్య సంవాదమనెడి నామాంతరము గలదు. జనసామాన్యములోననిది "రేణుక గీత"గా గుర్తింపు పొందినది.

నాటి నుండి నేటి వరకు సిద్ధాంత శిఖామణి సామాజిక ప్రగతిగమనమును శాసించెడి ఉత్తమమైన ధార్మిక గ్రంథముగా తనవంతు పాత్రను పోషించుచున్నది. అశేష ప్రజానీకము యొక్క మన్ననల నందుచున్నది. పండితులు దీనిలోని ధార్మికాంశములను పరామర్శించి

పరమోత్కృష్టమైన ఆనందమును పొంది ధన్యులగుచున్నారు. గురువర్గము ప్రవచనముల ద్వారా ప్రజా చైతన్యమునకు కేంద్ర బిందువులస్థానముల నలంకరించి భక్తులను ధన్యులను చేయుచున్నారు.

మాహేశ్వరులీ గ్రంథమును పారాయణ గ్రంథముగా గ్రహించి స్వాధ్యాయన పరులై లింగాంగ సామరస్యమును గురించి తెలిసికొనుచున్నారు. భక్తులు ప్రవచనముల సారమును గ్రహించి ధర్మపరాయాణులై ధన్యత పొందుచున్నారు. పామరులు భక్తామాహేశ్వరులగమన శీలతచే ప్రభావితులై భవిపథమును వీడి శివపథము వైపు మరలుటకు యత్నించుచున్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల్గిన గ్రంథమునకు "సిద్ధాంత శిఖామణి" యనెడి అభిధానము ఎందుకు నొసంగబడినదో యను దానిని గ్రహించుట యెంతో ఆవశ్యకమైనయంశమని తెలిసికొనవలెను.

## గ్రంథము యొక్క నామౌచిత్యము

ఒక కవి తన గ్రంథమునకు పేరిడెడి సందర్భములో,తాను పెట్టెడి పేరు గ్రంథము యొక్క స్వభావమును తెలియజేసేవిధముగా నుండుటకు తగు జాగ్రత్త వహించును. కృతి కర్త యిట్టి జాగ్రత్తనే వహించెనని తెలియుచున్నది.

సిద్ధాంతమనెడి పదమును ఒక విశిష్ఠమైన దానిని సూచించేదిగా స్వీకరించనైనది. క్రింది శ్లోకమును కనుడి.

**శ్లో॥ సిద్ధాంతాఖ్యే మహాతంత్రే కామికాద్యేశివోదితే।**
**నిర్దిష్టముత్తరే భాగే వీరశైవమతం పరమ్॥**

(సి.శి. 5:14)

ఇచ్చుట సిద్ధాంతమనగా సిద్దాంత మనెడి పేరు గల్గినట్టి ఇరువది యెనిమిది శివాగమములు. సిద్ధాంతమునకు మహా తంత్రమనెడి విశేషణముపయోగించి విశిష్టమైనదానిగా చేయబడినది. శిఖామణి అనే పదము చిట్ట చివరిది అనే అర్ధమును సూచించేదిగా గ్రహించనైనది. ఈ శ్లోకమును గనుడి:

**శ్లో॥ సర్వేషాం శైవతంత్రాణాముత్తరత్వాన్నిరుత్తరమ్।**
**నామ్నాప్రతీయతే లోకేః యత్సిద్ధాంతశిఖామణి॥**

(సి.శి. 1:31)

శివాగమము లన్నింటిలోను ఉత్తరభాగమునవివరింపబడుటచేత నిరుత్తరమైనదిగా వెలుగొందెడిదైనవీరశైవ మతమునువివరించెడిదైనందున యీ గ్రంధమునకు సిద్ధాంతశిఖామణి యనెడినామకరణము చేయబడినదని తెలియుచున్నది.

అయితే, 'శిఖామణి' అనే పదమును మరొక్క రీతిలో అన్వయించు కొనవచ్చును. శిఖాఅనగా అగ్రము అనెడి అర్థము కలదు:శిఖామణి యనగా శిఖరాగ్రమున నిలిచి ప్రకాశము నిచ్చెడిదని గ్రహించగలరు. ఆస్తిక మతములన్నింటికినీ వెలుగు నిచ్చెడి సిద్ధాంతమును సిద్ధాంత శిఖామణిగా యెంచవచ్చును. కృతికర్త యీ భావమును గ్రహించి యుండునని తెలిపెడి శ్లోకమును గమనించుడి:

**శ్లో॥ యేన రక్షావతీ జాతా శివభక్తిః సనాతనీ।**
**బుద్ధాది ప్రతిసిద్ధాంతమహాధ్వాంతాంశుమాలినా॥** (సి.శి. 1:23)

ఫలశ్రుతి యీగ్రంథమును సకలార్థ సాధకమైనచింతామణితో పోల్చినది. ఈ విశ్లేషణ నేపథ్యమున మనము గ్రహించ వలసినదేమనగా యిది యీ సార్థక నామధేయము గల్గి సకలార్థసిద్ధిని గల్గించేదిగా యున్నది.

## గ్రంథ లక్ష్యము

ప్రతి గ్రంథమునకు ఒక లక్ష్యముండును. లక్ష్యము నేపథ్యముననే గ్రంథరచన కొనసాగును. అయితే గ్రంథలక్ష్యము లోక హితమునకు దోహదముచేసెడిదై యుండవలెననెడి నియమ మొకటి గలదు. ఈ నియమమును పాటించినవాడే సుకవి అనిపించికొనును. అప్పుడే అతని గ్రంథము ఉత్తమ గ్రంథముగా గుర్తింపబడును.

రేణుకాగస్త్య సంవాదమును గ్రంథస్థము చేయుటద్వారా తాను సాధించదలచిన లక్ష్యములెట్టివో శ్రీ శివయోగి శివాచార్యులవారు క్రింది శ్లోకములో వివరించిరి.

**శ్లో॥ వేదమార్గా2విరోధేన విశిష్టాచారసిద్ధయే।**
**అసన్మార్గనిరాసాయ ప్రమోదాయ వివేకినామ్॥** (సి.శి. 1-26)

ఈ శ్లోకములోన మూడు లక్ష్యములు వివరింపబడినవి. అవి:

1. నాస్తిక మార్గముల నిరసన:
2. వీరశైవ దర్శనమునకు సంబంధము గల్గిన విశిష్టాచారములను సవైదిక మార్గమున విస్తరించుట;
3. వివేకవంతుల ప్రమోదమును సాధించుట.

ఈ మూడింటికీ పరస్పరానుబంధత గలదు. వాస్తవముగా చూచిన యెడల ఆచార సంపత్తిని పెంచుటే సిద్ధాంత శిఖామణి యొక్క ప్రాథమిక లక్ష్యమని తెలియుచున్నది.

ఆచారము యొక్క ప్రాముఖ్యత గురించి తెలిపెడి క్రింది శ్లోకము గమనార్హమైనదైయున్నది.

**శ్లో॥ ఆచార ఏవ సర్వేషామలంకారాయకల్ప్యతే।**
**ఆచార హీనః పురుషో లోకేభవతి నిందితః॥** (సి.శి.16:13)

ఆచారముల గురించిన విషయ విస్తరణకునొక పరిధిని యేర్పాటు చేసికొనుట సంభవించినది. ఈ పరిధి వేదములతో సుసంగత్యమనెడి దానికి యనుసంధానము చేయబడినదని తెలియుచున్నది. వైదికత కొరకు యింత మేరకు ప్రాముఖ్యత నిచ్చుటకుగల కారణమేమిటో తెలిసికొనుట యెంతో ఆవశ్యము. అవైదిక పథములను నాటి వివేకవంతులుచిన్న చూపునకు గురిచేసినారని భావించవచ్చును. వీరి ప్రమోదము సాధించునిమిత్తమున వేదసుసంగత్వమునకు పెద్దపీట వేయనైనదని గుర్తించగలము.

ఆగమ వాఙ్మయములోన యాచారముల విస్తరణబహువిస్తృత స్థాయిలో చేయనైనది. ఆచారములు ఐదని తెలుపబడినది. అవి (1) శివాచారము;(2)లింగాచారము; (3) సదాచారము, (4)భృత్యాచారము (5) గణాచారము. శివపరబ్రహ్మయెడల చిత్తైకాగ్రతతో శైవీభక్తిని పెంచుకొనుటయే శివాచారములోని మౌలికాశయమని యన వచ్చును. పాంచరాత్రాగమానుయాయుల నవవిధ భక్తుల కంటెను భిన్నముగా నుండెడివై, విలక్షణ స్వభావమును సంతరించికొనిన షడ్విధ భక్తులే శివాచారములోనికీలకాంశములని తెలిసికొనవలెను. గురుదత్తమైన వైయక్తికస్వేష్టలింగోపాసన; గురులింగ, చరలింగముల సమారాధన; త్రిలింగోపాసనతో పాటుగా త్రిలింగముల అవాంతర బేదములైన షడ్లింగముల సమర్చనలు లింగాచారములోని ముఖ్యాంశములని తెలిసికొనగలరు. సదాచారము శీల సంపాదనకు ప్రాముఖ్యత నివ్వగా భృత్యాచారము దాసోహ ప్రతిపాదనకు ప్రాణమును పోయును. గణాచారము ధర్మపరిరక్షణకై త్యాగబుద్ధిని యలవరచుకొని సమధికమైన రీతిలో ప్రధానములను ప్రవిమల బుద్ధితో చేయవలెనని శాసించుచున్నది.

## రచనాకాలము

ఒక గ్రంథమును సరియైన కోణము నుండి యవగాహన చేసికొనవలెనినచో దాని రచనా కాలమును గురించి తెలిసికొనుట యెంతో ఆవశ్యకమైన విషయమని గుర్తించగలరు. రచనాకాలము నాటి రాజకీయ, ఆర్థిక,సామాజిక మరియు సాంస్కృతిక స్థితిగతులప్రభావములకు లోనై గ్రంథ రచన జరుగును.

సిద్ధాంత శిఖామణి రచనా కాలము గురించి యేకాభిప్రాయము లేదని చెప్పవచ్చును. పలువురు పండితులు పలు విధములైన యభిప్రాయములను వెలిబుచ్చిరి. వీటిని స్థూలముగా రెండు వర్గములుగవర్గీకరించ వచ్చును. మొదటి దాని ప్రకారము గ్రంథము యొక్క రచన పన్నెండవ శతాబ్దికి తరువాత వచ్చెడి కాలమున జరిగినదనియును, రెండవ యభిప్రాయము ప్రకారము గ్రంథరచన పన్నెండవ శతాబ్ది కంటెను పూర్వమున గల కాలముననే జరిగినదని భావింపబడినది.

త్రిలింగదేశము నందున ప్రముఖ వీరశైవ వాఙ్మయ విమర్శకులై విఖ్యాతినార్జించినవారిలో ప్రముఖులైన వారిలో ముప్వురు గలరు. వారిలో ఇరువురు మొదటి యభిప్రాయమును బలపరచగా, ఒక్కరు రెండవ అభిప్రాయమునకు ప్రాధాన్యత నిచ్చిరి. ఇరువురిలో నొకరైన డా॥ చిలుకూరి నారాయణరావుగారు సిద్ధాంత శిఖామణిని బసవేశ్వరునికి తరువాయి కాలమునకు చెందినదని తెలియజెప్పిరి. వీరు చూపిన కారణమేమనగా, పాల్కూరికి సోమనాథుడు శ్రీ రేణుకాచార్యులవారిని మతస్థాపనాచార్యులుగా గుర్తించలేదు. ఇరువురిలో రెండవ వారైన డా॥ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఏ కారణమును చూపకయే సిద్ధాంత శిఖామణి ఆర్వాచీనమైనదనియనిరి. మూడవ వారైన బండారు తమ్మయ్యగారు సిద్ధాంత శిఖామణి10వ శతాబ్దికి చెందిన రేణుక విజయకావ్యకర్తయైన సిద్ధనాథునికిని, శివయోగి శివాచార్యులవారికిని పితపుత్రుల సంబంధము గలదనియును, తండ్రి రేణకుని చరిత్రకు కావ్యరూపమివ్వగా, కొడుకు రేణుకుని సిద్ధాంతమునకు గ్రంథ రూపమిచ్చెనని తమ్మయ్యగారు తెలిపిరి.

డా॥ చిలుకూరి వారి వాదన బలహీన మైనదని యెంచవచ్చును. రేణుకాచార్యుల వారిని సోమనాథుడు గుర్తించ నంత మాత్రమున రేణుకాచార్యుడు, ప్రాచీనుడు కాడని యెట్టులనగలము. అదే విధముగా ప్రమాణములను చూపకుండా సిద్ధాంత శిఖామణి ఆర్వాచీన మైనదని తెలిపెడి వేటూరిగారి యభిప్రాయమును గణనలోనికి తీసికొనజాలము. లిం॥ పండిత చిదిరెమఠం వీరభద్రయ్యగారు తమ్మయ్యగారి యభిప్రాయమునకు స్పందించుచు, "తమ్మయ్యగారి అభిప్రాయము ప్రసంగవశమున వచ్చిన" దనిరి అందుచేత తమ్మయ్యగారి వాదము బలహీనమైనదగుచున్నది. ఈ విధముగా విమర్శకత్రయము యొక్క ప్రతిపాదనలు సిద్ధాంత శిఖామణి యొక్క రచనాకాలమును నిర్ణయాత్మకముగా తెలియజెప్పుట లేదు. తెలుగునేల లోనియితర విమర్శకులు వీరినే యనుసరించుటచేత వారి యభిప్రాయములను పరిశీలించెడి యవశ్యకత లేదు.

ఇది యిట్టులుండగా అఖిల భారత స్థాయికి చెందిన పరిశోధకుడైన డా॥ దాస్‌గుప్తగారు, "A History of Indian Philosophy" లో నొక సంచలనాత్మక వ్యాఖ్య జేసిరి. సిద్ధాంత శిఖామణి బసవేశ్వరునిచే వ్రాయబడినదనిరి. శ్రీపతి పండితుడు సిద్ధాంత శిఖామణి గురించి తెలిపినందున సిద్ధాంత శిఖామణి రచనా కాలము బసవేశ్వర–శ్రీపతి పండితుల కాలములకు మధ్యనగల కాలమని తెలిపిరి.

డా॥ దాస్‌గుప్త గారి వ్యాఖ్య వివాదగ్రస్తమైనదయ్యెను. సిద్ధాంత శిఖామణి మూల పాఠములో బసవేశ్వరుని గురించిన ప్రసంగము లేదనెడిది వీరశైవులెల్ల నెరిగిన సత్యమే. అయితే సిద్ధాంత శిఖామణికి వ్యాఖ్యానమును వ్రాసిన మరితొంటిదార్యులవారిచే దిగువనీయబడిన వాక్యము ఆధారముగా డా॥ దాస్‌గుప్తగారు దురవగాహనకు లోనైనదనెడి విషయము చాలా మందికి తెలియదు.గమనించుడి :

**అథ వీరభద్రాచారబసవేశ్వరాచారం సూచయన్ భక్తాచార భేదం ప్రతిపాదయతి॥**
**శివనిందాకరం దృష్ట్వా ఘాతయేదథవా శపేత్।**

**స్థానం వా తత్పరిత్యజ్య గచ్ఛేద్యద్యక్షమో భవేత్॥** (సి.శి. 6.36)

అవతారికకు మూలపాఠమునకుగల భేదము నరయకుండగవెలిబుచ్చబడిన డా॥ దాస్‌గుప్త గారి వాదమువర్జ్యమే.డా॥ దాస్‌గుప్త గారు చేసిన మరొక పొరపాటేమనగా శ్రీ పతి పండితుడిని బసవేశ్వరునికి తరువాయికాలమువాడని తెలుపుట. అయితేశ్రీపతి పండితుని శ్రీకర భాష్యములో సిద్ధాంత శిఖామణి గురించితెలుపబడినదని తెలిపెడి డా॥ దాస్‌గుప్తగారి వాక్కులు అసత్యములు కావు.

సిద్ధాంత శిఖామణి రచనాకాలము గురించి విభిన్నమైన యభిప్రాయములు ప్రకటితములై యున్నవి. రేణుకాగస్త్యసంవాదమునకు గ్రంథరూపమును కల్పించిన శ్రీ శివయోగి శివాచార్యుల వారు చేసిన వంశవృక్ష వివరణ, సిద్ధాంతశిఖామణిరచనాకాలము దెలియజేసే స్థితిలో లేదు.

కాలనిర్ణయము చేసిన వారిలో కొందరురచనా కాలమును క్రీ॥శ॥ 8వ శతాబ్ది కంటే పూర్వమున నున్న కాలమని యనగా, మరి కొందరు దీని కార్వాచీనత్వము నంటగట్టిరి. శ్రీ బసవేశ్వరుని వచనములలో సిద్ధాంతము లేదనియును, ఇట్టి లోపమును పూరించుటకే సిద్ధాంత శిఖామణి విరచితమైనదని తెలిపెడి వారును గలరు.

సిద్ధాంత శిఖామణి యొక్క ప్రాచీనత్వము గురించిన విషయములో సానుకూలవైఖరి నవలంబించిన వారెందరో గలరు. వీరిలో పండిత చిదిరె మఠం వీరభద్ర శర్మగారు, కాశీ జగద్గురు పీఠము నధిరోహించి "జ్ఞాన సింహాసనమునకు విశిష్ట విఖ్యాతి నార్జించిన మహాపురుషులు, డా॥ చంద్రశేఖర శివాచర్యుల వారు (వర్తమానమున జ్ఞాన సింహాసన రూఢుడై యున్న జగద్గురువుల వారు) ముఖ్యులు.

ప్రాచీనత్వ వాదమును బలహీనపరిచెడి వాటిలోన యీ క్రింది రెంటినిముఖ్యమైనవిగా పరిగణింప వచ్చును.

1. శివయోగి శివాచార్యుని సిద్ధరామేశ్వరుని సంప్రదాయమునకు చెందిన వాడని తెలిపే మరితొంటదార్యుని తత్త్వప్రదీపిక.

2. శ్రీకర భాష్యము యొక్క కాలము గురించి శ్రీహయవదనరావుగారు వెలిబుచ్చిన అభిప్రాయము.

ఈ రెంటిని పరిశీలింతుముగావుత. మరి తొంటదార్యుల వారి కృతిని నిశితముగా పరిశీలించిన శ్రీ కాశీజగద్గురువు డా॥ చంద్రశేఖర శివాచార్యుల వారు తెలిపిన యటుల, శివయోగి శివాచార్యులవారి తండ్రియైన సిద్ధనాథునికిని సిద్ధరామునికిని యభేధము గలదని భావించి నందుచేతమరి తొంటాదార్యుల వారు పొరబాటుగా వ్రాసిరి. సిద్ధనాథుడు మరియు సిద్ధ రాముడు వేర్వేరు కాలములకు చెందిన భిన్నమైన వ్యక్తుల నెడిదేగ్రహించ వలసిన విషయము.

శ్రీకర భాష్యమును ప్రకటించిన శ్రీ హయవదనరావుగారు శ్రీ పతి పండితుని కాలమును కీ.శ. 1400 సం॥ అని నిర్ణయించిరి. ఈ అభిప్రాయమును పరీక్షించిన డా॥ చిల్కూరి నారాయణ రావుగారు వెలిబుచ్చిన యభిప్రాయము గమనార్హమైనదై యున్నది. గమనించుడి:

"శ్రీపతి పండితులు క్రీ.శ. 1400 సం॥ర ప్రాంతము వాడని నిశ్చయించినాడు.కాని, దొలుత ఈ నిశ్చయమును ముందుగా చేసికొని తరువాత దానికి ప్రమాణముల కోసము వారు తంటాలు పడినట్లు వారి వ్రాత ధోరణి వలన కనుగొనవచ్చును."

ఈ విషయమును బహుముఖ కోణముల నుండి పరిశించిన శ్రీ పండిత చిదిరెమఠంవీరభద్రశర్మగారు ఈ క్రింది విధముగా తెలిపిరి:

"ఉపలబ్ధ ప్రమాణైరేతైః అనంతపాలరాజస్య శ్రీ పండితస్యచ, సమకాలికత్వం "క్రీ.శ.1072. తమే2బ్దేస్థితత్యం చ సుదృఢం ప్రస్తాప్యతే".

సిద్ధాంత శిఖామణిలోని తత్త్వమును బ్రహ్మసూత్రముల నేపథ్యమున వ్యాఖ్యానించిన శ్రీపతి పండితుడు క్రీ॥శ॥ 11వ శతాబ్ధికి చెందిన వాడైతే సిద్ధాంత శిఖామణి గ్రంథ కర్త కీ॥శ॥ 11వశతాబ్ధికంటెను పూర్వకాలమునకు చెందిన వాడగును. అయితే ఈ కాలములోన నేభాగమునకు చెందినవాడో యనెడిది నిశ్చయాత్మకముగా చెప్పలేమని పండితులు ప్రతిపాదించుచున్నారు. క్రీ॥శ॥ 11వ శతాబ్ధి యందున బహుళ ప్రచారము గల్గినదై నందున నియ్యది క్రీ.శ. 7 లేదా 8వ శతాబ్దిలోనవిరచితమైయుండునని భావించెడివారు. కొందరైతే, శివాచార్యుల వారు క్రీ॥శ॥ 5వశతాబ్ధికిని 8వ శతాబ్ధికిని మధ్యలో గల కాలమునకు చెందిన వాడని మరి కొందరు భావించిరి. ఇట్టి ఆలోచనను హేతుబద్ధము చేయుటకై యత్నించినవారిలోన డా॥ చంద్రశేఖర శివాచార్యులవారు ముఖ్యులు. బౌద్ధాది యసన్మార్గముల వలనపరిపీడితయై యున్న శైవభక్తినిపరిరక్షించెడి వంశక్రమమునకు చెందిన శ్రీ శివయోగి, బౌద్ధమతాది నాస్తిక పథము పతనమును పరికించిన కాలమని తెలియబడెడి క్రీ॥శ॥ 8వశతాబ్ధి యొక్క ఉత్తర భాగమునకును సుసంగత్యగలదని శ్రీ జగద్గురువుల వారు సిద్ధాంతీకరించిరి.వీరి యాలోచన యదార్థమునకు చాలా సన్నిహితముగా గలదని తెలిపెడి యాధారమొకటి లభించినది.

తిరుమూల రనెడివాడు క్రీ॥శ॥ 6వ శతాబ్దికి చెందినవాడు అతని 'తిరుమూల'మనెడి సైద్ధాంతిక గ్రంథములో షట్స్థల వివేచన గలదు.దీనిలోని పారిభాషికపదములు. కొంత మేరకు సిద్ధాంత శిఖామణి లోని పరిభాష పదములను పోలియున్నవి. ఈ విషయమును పరిశోధించిన డా॥ బాదల రామయ్యగారి యభిప్రాయమును గనుడి; "శ్రీపతి పండితునికిమునుపే తమిళ దేశమున 6వ శతాబ్దము నాటికే తిరుమూలర్ మూడు వేల పద్యముల పరిమితి గల తిరుమూలమను...

శైవ సిద్ధాంతమును ఆగమ సాంప్రదాయ బద్ధముగా ప్రతిపాదించియుండెను.

ఈ అంశమును తెలిపెడి "Saivisim in South India" ఈ క్రింది విధముగా తెలుపుచున్నది.

"In the first part of the 7th tantra he has brought out the raremeanings of Shatsthala Vivechana, which is one of the cordial (cardinal?) tenants of the same veeraMaheswara"

అందుచేత, సిద్ధాంత శిఖామణి క్రి॥శ॥ 5 శతాబ్ధినాటికే ప్రచారమున నుండెడిదని భావించవచ్చును. మరితొంటదార్యులవారు,ఇటీవలి కాలము వాడైనందున సంక్షిప్తముగా చెప్పవలెననిన కొందరుభావించిన యటుల సిద్ధాంత శిఖామణి రచనాకాలము 12వ శతాబ్దికి ఉత్తరమునగల కాలము కాజాలదు. మరి తోంటాదార్యులవారు క్రీ.శ. 17వ శతాబ్ది వాడైనందున యతని యవగాహన విశ్వసనీయము కాజాలదు. వీర శైవమునకు వైదికత్వ లక్షణముగలదని తెలుపుటకై రచింపబడిన శ్రీకర భాష్యము రామానుజుని కాలమునకు చెందిన దగుట చేత, సిద్ధాంత శిఖామణి కాలము 12వ శతాబ్ది కంటెను తరువాతి కాలమునకు చెందినదని చెప్పలేము. ఉపలబ్ధమైన ప్రమాణమలు మరొక విధముగా తెలుపుచున్నవి.

బౌద్ధమత క్షీణత,తిరుమూలరు వారి గ్రంథములవలన సిద్ధాంత శిఖామణియొక్క రచనా కాలము క్రీ॥శ॥ 5వ శతాబ్ధాకి చెందినదగుచున్నది. అయితే ఈ విషయము స్తిరీకరణ పొందవలెననిన చో, యింకా కొంత పరిశోధన యొక్క యావశ్యకతగలదు.

## శివయోగి శివాచార్యుల వ్యక్తిగత వివరాలు

శివయోగి శివాచార్యుల వారువీరమహేశ్వర వర్గమునకు చెందిన వాడనియును, జగద్గురు పరంపరానుగతమైన శూలాల కుటుంబమునకు చెందినవాడనియును, మఠస్థ మహేశ్వరుడైన గృహస్థుడని భావింపబడుచున్నది. శ్రీ పండితవీరభద్రశర్మ. శ్రీ బండారుతమ్మయ్య, శ్రీ పెద్దమఠం రాచవీర దేవర యిత్యాది పండితులిట్టి యభిప్రాయములనే వెలిబుచ్చిరి. అయితే, కొందరితడునిరాభారిమఠ సాంప్రదాయమునకు చెందినవాడని తెలిపిరి. ముద్ద దేవుడు, సిద్ధ నాథుడు మరియు శివయోగుల వారి మధ్య, గురు, శిష్య సంబంధము గలదనితెలియజేసిరి. ఈ గ్రంథములో పుత్ర పదము శిష్యపదమునకు పర్యాయ పదముగా వాడబడలేదు. ఈ కారణమున వీరిది పితా–ఔరస పుత్రులకు

సంబంధించిన బంధమేగాని మరొక్కటి కాదని గుర్తించగలరు. అంతేకాదు, గురు–శిష్య పరంపరమైన యెడలుద్ధ దేవునికర సంజాతుడుసిద్ధ నాథుడనియును, సిద్ధనాథునికి తాను కరతలోద్భవుడనని శివయోగి శివాచార్యుల వారు చెప్పియుండెడివారు.

ఇక దేశము విషయములో వచ్చినయెడ, శివయోగి శివాచార్యులవారు తెలుగువాడే యనియనవచ్చును. "సిద్ధాంత శిఖామణిశైలి...ఆంధ్ర కవితా సంప్రదాయానుసారముగ ననేక స్థలములలో యతి మైత్రి గలిగి తత్కర్తయగు శివయోగిని ఆంధ్ర క్షేత్రమగు కొలనుపాకలో నున్న వానిగా నిరూపించుచున్న" దని తెలిపిన శ్రీ పండిత చిదిరె మఠం వీరభద్ర శర్మ వాక్కులు గమనార్హములై యున్నవి (రేణుకా విజయం పీఠిక పేజి నెం. 14). అయితే పండిత కాశీనాథ శాస్త్రిగారు, డా॥ జ.చ.ని. వారును శ్రీ శివయోగిని కర్ణాటక ప్రాంతమునకు చెందిన వాడిని తెలుపుటకు పూనుకొనిరి. అయితే వీరి ప్రతిపాదనను సమర్థించెడి బలమైన యధారములు చూడబడలేదు. అందుచేత, పండిత చిదిరె మఠం వీరభద్ర శర్మగారి సిద్ధాంతమే శిరోధార్యమైన దగును.

కొలనుపాకలోన నష్టాదశ వర్ణములైన యష్టాదశ మఠములుండెడి వనెడి జగద్విదితమైన విషయము. శివయోగులాఈ మఠములలోని యెదో ఒక మఠమును పరిపాలించెడి మఠస్థ మహేశ్వరుడై యుండును. ధర్మప్రచారమనెడి ధర్మమును పాలించెడి క్రమమున సిద్ధాంత శిఖామణిని రచించెనని తెలియుచున్నది.

## విషయము - పరిధి

సిద్ధాంత శిఖామణిలోన యేయే విషయము చెప్పబడినదో యనెడి దానిని గ్రంథకర్త యీ క్రింది విధముగా వివరించిరి:

శ్లో॥ **తేష్వాగమేషు సర్వేషు పురాణేష్వఖిలేషుచ।**
**పురా దేవేన కథితం దేవ్యైతన్నన్దనాయ చ॥**
**తత్సమ్ప్రదాయసిద్ధేన రేణుకేన మహాత్మనా।**
**గణేశ్వరేణ కథితమగస్త్యాయపునః క్షితౌ॥**

శ్లో॥ **వీరశైవ మహాతన్త్రమేకోత్తరశతస్థలమ్।**
**అనుగ్రహాయ లోకనామభ్యధాత్ సుధీయాం వరః॥**

(సి.శి. 1:28 నుండి 30 వరకు)

ఆచార్య రేణుకుల వారు అగస్త్యునకు నుపదేశించిన నూటొక్క స్థలములు గల్గిన వీరతంత్రమే సిద్ధాంత శిఖామణి యొక్క విషయమని చెప్పబడినది. కైలాసమున శివుని చేత శివాస్కందుల కుపదేశింపబడిన యీ వీరతంత్రము భూతలమున రేణుకుని చేత మొట్టమొదటగా నుపదేశింపబడినదని తెలుపబడినది. ఇచ్చట వీరతంత్ర మనగా వీరశైవ సిద్ధాంత మనిగ్రహించవలెను. స్థలమనెడి దానికిగల యర్థమేమిటో తెలిసి కొందుము గావుత.

సామాన్యార్థములో స్థలమనగా నేలలేక ప్రదేశము "స్థలతీతిస్థల"మ్మనెడిది పండిత వాక్కు స్థానమై యుండునది స్థలమగుచున్నది. శైవభారతి శోధ ప్రతిష్ఠానము వారి శ్రీ సిద్ధాంత శిఖామణి కొరకై 'జ్ఞానవత' హిందీ వ్యాఖ్యను వ్రాసిన ఆచార్య రాధేశ్యామ్ చతుర్వేదీగారు స్థలమనెడి పదమునకు 'విషయ' మనెడి అర్థము నిచ్చిరి.

వీరశైవ సిద్ధాంతమున స్థల మనెడి దానికి నొక ప్రత్యేకమైన సాంకేతికార్థము గలదనెడిది గ్రహించవలసిన విషయము ఈ అంశమును స్పష్టీకరించెడి మగ్గియమాయి దేవుని "అనుభవసూత్రము" లోని యీ శ్లోకమును గమనించుడి:

**శ్లో॥ స్థీయతే లీయతే యత్ర జగదేతచ్చరాచరమ్।**
**తత్ర్బహ్మస్థల మిత్యాహుః స్థలతత్త్వవిశారదాః॥**

సృష్టి కంటెను పూర్వమునను, ప్రళయమునకు పిదప నీ చరాచర జగత్తు దేనిలో లీనమై యుండునో దానిని స్థల మందురనితెలుపబడినది. స్థలము పరబ్రహ్మ వాచకమని గ్రహించవలెను. జీవుడు భవస్థితిని వీడి గురు కారుణ్యమున భక్తుడై గురుదత్త యిష్ట లింగము నర్చించుచు,గురుసేవలో నిమగ్నుడై జంగముని పర్యవేక్షణానియంత్రణలకధీనుడై ఆధ్యాత్మిక సాధన చేసే స్థితిని స్థలమని గుర్తించనైనది. వివిధ అంగస్థలములలో సుస్థిరమైన సఫలీకృతమైన సాధన చేసినచో శివైక్య మనెడిది సిద్ధించునని శివాగమములు తెలుపుచున్నవి. చతుర్విధముక్తులకంటెను శివైక్యతాసిద్ధి భిన్నమైనదని తెలుపబడినది. ఈ స్థితిలో జీవుడు శివుడైవిరాజిల్లునని తెలుపబడినది. ఈ స్థలములలో మొదటిది "పిండ స్థలము". పిండస్థలి యొక్క లక్షణములను తెలిపెడి క్రిందిశ్లోకమును గనుడి.

**శ్లో॥ శివశక్తిసముత్పన్నే ప్రపంచే2స్మిన్ వికల్ప్యతే।**
**పుణ్యాధికః క్షీణపాపః శుద్ధాత్మాపిండనామకః॥**

(సి.శి.5:32)

పాపక్షీణత, పుణ్యాధిక్యత, పరిశుద్ధమైన అంతఃకరణ గల్గిన జీవుడు పిండనామ ధేయముతో పిలువబడునదేయీ నిర్వచనములోని భావము. చివరిదగు జ్ఞాన శూన్య స్థలమీ క్రింది విధిన నిర్వచింపబడినది.

**శ్లో॥ పరాపరసమాపేక్షభావాభావవివేచనమ్।**
**జ్ఞానం బ్రహ్మణి తన్నాస్తిజ్ఞానశూన్యస్థలం విదుః॥**

(సి.శి.20:60)

భేద, భేదాభేద ధశల నధిగమించి, శూన్య స్థితి చేరిన "లింగైక్యుని దశ"ను జ్ఞాన శూన్య స్థల మనబడునని గ్రహించగలరు.

నూటొక్క స్థలములన్నియును పంచమ పరిచ్ఛేదము నుండి యిరువదియవ పరిచ్ఛేదము వరకుగల పదహారు పరిచ్ఛేదములలో బోధింపబడినవి. మొదటి నాల్గు పరిచ్ఛేదములు ప్రవేశిక పాత్రను పోషించెడివై యున్నవి. వీటిలో శివాచార్యుల వారి పరిచయము, సృష్టి క్రమము, రేణుకాచార్యుల వారి అవతార వృత్తాంతము, రేణుకుడు లింగోద్భవుడగుట, రేణుకగస్త్యుల సమావేశము, అగస్త్యుల వారి అభ్యర్థనలు వివరింపబడినవి. పౌరాణిక కథనమువ్యాసోచ్ఛిష్టము వలె గోచరించినప్పటికీ, కొన్ని యంశములవివరణలలో శివాచార్యులు తమ స్వగతాభిప్రాయమునకే ప్రాముఖ్యతనిచ్చినట్లు తెలియుచున్నది. ఇట్టి యంశములలో రేణుకావతార కారణము గలదు శివాచార్యుల వారు చూపిన కారణము రేణుక విజయాదులలో గోచరించదు.

శివయోగి శివాచార్యుల వారు నూటొక్క స్థలములను ద్వివిధములుగా వర్గీకరించిరి. అవి అంగ, లింగస్థలములు. పిండ స్థలము నుండిసహాభో(భా)జన స్థలము వరకు గల 44 స్థలములు అంగ స్థలముల నియును, దీక్షా గురు స్థలము నుండి జ్ఞానశూన్య స్థలము వరకు గల 57 స్థలములు లింగ స్థలములనియును తెలుపబడినది. ఈరెంటికినీ మధ్యలోగల భిన్నత్వము గురించిన వివరణ తెలిసికొనుట యెంతో అవశ్యము. ఇట్టి విచారణను మగ్గియ మాయి దేవుని "అనుభవసూత్రము" లో గాంచగలము. గమనించుడి:

**శ్లో॥ స్వశక్తి క్షోభ మాత్రేణ స్థలం తద్ద్విధం భవేత్।**
**ఏకం లింగస్థలం ప్రోక్తమన్యమంగస్థలంస్మృతమ్॥**

(అనుభ సూ॥ 2-10)

పర(బ్రహ్మావాచకమైన స్థలము స్వశక్తిక్షోభ చేత అంగస్థల, లింగస్థలములుగా విడిపోవుచున్నది. బసవేశ్వర వచనములకు సమగ్ర సమీక్షను వ్రాసిన బాడాల రామయ్యగారు తెలిపినయటుల అంగము ఆరాధకము కాగా లింగమారాధ్యమగుచున్నది. ఈ భావమునే వెలిబుచ్చెడి అంగపద నిర్వచనమును గనుడి.

**శ్లో॥ అం భవేత్పరమం(బ్రహ్మతత్పరంతత్పరాయణం।**
**అంగస్థల మితి ప్రాహు రంగతత్త్వ విశారదాః॥**

(అనుభసూ॥ 4-3)

ఆరాధ్యమైన లింగస్థలమీక్రింది విధముగా వివరింపబడెను.

**శ్లో॥ లీయతే గమ్యతే యత్రయేనసర్వం చరాచరం**
**తదే తల్లింగ విత్యుక్తంలింగతత్త్వపరాయణైః**

(అనుభసూ॥ 3-2)

అంగస్థలములలో నుండెడి సాధకులను ప్రగతి పథము వైపు గమనింపజేయుటే లింగస్థలీయులైన దీక్షాగురువు ఇత్యాదుల కర్తవ్యమని గుర్తించగలరు.

శివయోగి శివాచార్యుల వారు 44 అంగస్థలములను ఆరు విధములుగావర్గీకరించిరి. క్రింది శ్లోకములలో నావర్గము లెట్టివో తెలియజేసిరి.

**శ్లో॥ ఆదౌ భక్త స్థలం ప్రోక్తం తతో మాహేశ్వరస్థలమ్।**
**ప్రసాదిస్థల మన్యత్తు ప్రాణలింగిస్థలంతతః॥**
**శరణ స్థలమాఖ్యాతం షష్ఠమైక్యస్థలం మతం॥**

(సి.శి. 5-03)

లింగస్థలములను కూడ యిదే విధిన వర్గీకరింపబడినవి. భక్తాది లింగ స్థలములు భక్తాది అంగ స్థలముల నాశ్రయించుకొని యుండునని తెలుపబడినది. క్రింది శ్లోకమును గమనించుడి:

**శ్లో॥ గుర్వాది జ్ఞానశూన్యాన్తా భక్తాదిస్థల సంశ్రితాః।**
**స్థలభేదాఃప్రకీర్త్యన్తే పంచాశత్సప్తచాధునా॥**

(సి.శి. 15-03)

వీరశైవ తన్త్రము నవలంబించెడివాడు వీరశైవుడనబడుచున్నాడు. అట్టివీరశైవుని లక్షణము లెట్టులుండవలెనో యనెడి దానిని శ్రీశివయోగి శివాచార్యులవారు క్రింది విధముగా వివరించిరి.

**శ్లో॥ వీశబ్దేనోచ్యతే విద్యా శివజీవైక్యబోధికా।**
**తస్యాం రమన్తే యే శైవా వీరశైవాస్తు తేమతాః॥** (సి.శి. 15-16)

శివజీవైక్యతను నిర్దేశించే వాడే వీరశైవుడని తెలుపబడినది. ఈ నిర్వచనమెంతో విలక్షణమైనదై యున్నది. వీరవ్రతనిష్ఠలో గురుదత్తమైన యిష్టలింగమాధ్యమమున శివుని పూజించేవాడే వీరశైవుడనే యభిప్రాయము నేపథ్యములో శివాచార్యులవారు ప్రధానము చేసిన నిర్వచనమును పరిశీలించినచో, నిర్వచనము యొక్క విలక్షణత విస్పష్టము కాగలదు.

వీరశైవ ధర్మమునకు కాయముగా భావించబడు అష్టావరణముల చర్చ యిందులో సవిస్తరముగా నున్నది. మరియును పంచాచారముల ప్రసక్తి కూడా కలదు.

చివరి పరిచ్ఛేదములోన ఆచార్య రేణుకల వారి మహిమాతిశయము తెల్పెడిది రావణుని సంకల్పమును పూర్తి చేయడానికి గాను విభీషణుని కోరికను మన్నించి రేణుకాచార్యుడు ముక్కోటి లింగములను స్థాపించిరి.

సంక్షిప్తీకరణకై చెప్పెడిదేమనగా సిద్ధాంతశిఖామణి యొక్క విషయ పరధి యెంతో సమగ్రమైనది. వీరశైవ సిద్ధాంతము యొక్క వివిధాంశములు విస్తృత ప్రాతిపదికన వివరింపనైనది. సిద్ధాంత శిఖామణి గురించిన వ్యాఖ్యానాదులు చేసెడి వారు పంచాచార్యాదులను వివరించే ప్రయత్నము చేయుటలోన నౌచిత్యముండునని చెప్పవచ్చును. ఇట్టి ప్రయత్నము చేసినవారిలో డా॥ చంద్రశేఖ శివాచార్యులవారు ముఖ్యులు.

## తత్త్వ ప్రతిపాదన

సిద్ధాంతశిఖామణిని కేవలము మతకృతియని భావించుట తగనిపని. ఈ గ్రంథము నొక దర్శన గ్రంథముగా స్వీకరియవలెను. దీనికి గలకారణ మేమన యీగ్రంథములో సుసంపన్నమైన తాత్విక చింతన గలదు. భగవద్గీతలోననుపనిషత్తుల సారాంశముగలదని భావింపబడుచున్నది. ప్రస్థానత్రయములోని యొక భాగముగాభగవద్గీతకెంతో గౌరవము దక్కినది. అయితే, సిద్ధాంత శిఖామణిలోన నుపనిషత్తుల సారముతో బాటుగా శివాగమములసారాంశమిమిడియున్నది. అందుచేత సిద్ధాంత శిఖామణినొక యుత్కృష్టమైన దర్శన గ్రంథముగా నంగీకరించవలెను.

తత్త్వ గ్రంథములలో సాధారణముగా జీవ, శివ మరియు జగత్తుల స్వరూప స్వభావములు వివరింపబడును. ఈ విషయముల యెడ విభిన్నమైన యభిప్రాయములు నెలకొని యుండుటచేత అనేకానేక తత్త్వములు ప్రచలితములైనవి. ఈశ్వరాస్తిత్వమును నిరాకరించెడివి నాస్తిక తత్త్వములనబడును. చార్వాక, బౌద్ధ, జైనాదులీ కోవకు చెందినవి. ఈశ్వరాస్తిత్వము నంగీకరించెడి వాటిలోన నద్వైతమెంతో ప్రాచుర్యమును పొందిన తత్త్వము. ఆది కాలము నుండి 8వ శతాబ్ది వరకు గల కాలములోన నెంతో మంది దార్శనికులు వారి వారి యభిమతములకనుగుణముగా నద్వైతమును ప్రతిపాదించిరి. ఇట్టి వారిలోన నాది శంకరాచార్యుల వారొకరు. వీరు క్రీ.పూ. 6వ శతాబ్దికి చెందిన వారని తెలుపబడినది. శ్రీ టి.యస్. నారాయణశాస్త్రి,బి.ఏ.,బి.ఎల్, వారు ఇండియన్ రివ్యూ అనెడి పత్రికలో 1915లో ప్రకటించిన వ్యాసములోన యీ విషయము నిరూపితమై యున్నది. 8వ శతాబ్దికి చెందిన శంకరుడే ఆది శంకరాచార్యుల వారి పరంపరకు చెందిన ఆచార్యుడనియును, ఆది శంకరుని సిద్ధాంతమునే వీరు పునః ప్రతిష్ఠించినారనియును తెలుపబడినది. అదే విధిన మొహంజదారో, హరప్పా త్రవ్వకాలలో వెలువడిన నాగరికతా కాలము కంటెను ముందుననే ఆది రేణుకాచార్యుల వారు నొక విశిష్టమైన తత్త్వమును ప్రతిపాదించిరని తెలియుచున్నది. ఈ విషయమును విశేష పరిశోధనలు సలిపిన లిం॥ జ.చ.ని. వారి గ్రంథములు, తెలియజెప్పుచున్నవి. వీరుశివముఖోద్భూతలనియును, శివుని సద్యోజాత ముఖారవిందము నుండి జన్మించిన వీరికి వీరభద్రస్వామి గోత్రపురుషుడనియును వీరు ప్రతి యుగములోను భూలోకమున ప్రకటుడై ధర్మోపదేశము చేసెననియును తెలియుచ్చుచున్నది.స్వాయంభు, సుప్రభేదాది ఆగమములో పంచాచార్యోత్పత్తి విభాగములో రేణుకాది పంచాచార్యుల యవతార విశేషములను గాంచగలము. ఆగమ విజ్ఞాన విశారదుడైన శివయోగి శివాచార్యుల వారు సిద్ధాంత శిఖామణిలో త్రేతాయుగము లోన విరచితమైన శ్రీ ఆచార్య రేణుకుల లీలలను వివరించిరి. చివరి పరిచ్ఛేదములో వీటిని గాంచగలము.

ఆచార్య రేణుకుల వారు ప్రతిపాదించి బోధించిన తత్త్వము “శివాద్వైత తత్త్వ”మని తెలియజెప్పబడినది. గమనించుడి:

**శ్లో॥ మదద్వైతపరం శాస్త్రం వేదవేదాన్త సమ్మతమ్ ।**
**స్థాపయిష్యసి భూలోకే సర్వేషాం హితకారకమ్ ॥** (సి.శి. 3-86)

నామసామ్యముండుటచేత శివాద్వైతము, కేవలాద్వైతములోని యొక అవాంతర భేదమని తలపవలదు. ఈ విషయమును స్పష్టము చేయుటకై వీరశైవాచార్యులు ఈ తత్త్వమునకు ననేక నామధేయములనిచ్చిరి. వీటిలో విశేషాద్వైతము, శక్తి విశిష్టాద్వైతము, మరియు భేదాభేద సిద్ధాంతములు ముఖ్యమైనవి. భక్తాది షట్స్థలములలో సాధన చేసిన సాధకుడు సాధనా ఫలముగా శివజీవ సామరస్యము పొందు క్రమము ఈ సిద్ధాంతములో వివరింపబడినందున దీనికి షట్స్థల సిద్ధాంతమనెడి సార్థక నామధేయము లభియినది. భారతీయ తాత్త్వికేతిహాసములోన నీ సిద్ధాంతము మొట్టమొదటి శాస్త్రీయమైన ప్రతిపాదనయనియును, మిగిలిన సిద్ధాంతములు ఈసిద్ధాంతమునుండి యుద్భవించినవేయని తెలుపబడుచున్నది.

సదసద్వివేక శూన్యత గలవారికి సత్యమేదియో యను దానిని తెలుపుట తాత్త్విక సిద్ధాంతము యొక్క ప్రథమ కర్తవ్యమని గుర్తింపబడినది. సిద్ధాంత శిఖామణిలోని పిండస్థలము నందున నంతిమ సత్యము గురించిన యుపదేశమును గాంచగలము. ఈ శ్లోకమునుగమనించుడి

**శ్లో॥ ఏక ఏవ శివః సాక్షాచ్చిదానన్దమయో విభుః ।**
**నిర్వికల్పో నిరాకారో నిర్గుణో నిష్ప్రపఞ్చకః ॥** (సి.శి. 5-33)

శివుడొక్కడే అంతిమ సత్యమని చెప్పబడినది. ఇచ్చట శివుడనగా పౌరాణిక ప్రసిద్ధి కలిగిన వాడును, త్రిమూర్తులలోన నొకడును, సంహార కర్తయని గుర్తింపబడిన వాడును అగు శివుడు కాడు. ఆగమిక తత్త్వములలోన యిమిడి యున్న శివుడనెడి పరబ్రహ్మతత్త్వము. ఉపనిషద్వాదులు దేనిని బ్రహ్మమని పిలుతురో దానిని ఆగమ విదులు శివుడందురని తెలిసికొనగలరు. ఇట్టి తత్త్వమునకే శివయోగి శివాచార్యులవారు ప్రణమిల్లి యీ క్రింది విధముగా స్తుతించిరి.

**శ్లో॥ బ్రహ్మేతి వ్యపదేశస్య విషయం యంప్రచక్షతే ।**
**వేదాన్తినో జగన్మూలం తన్నమామి పరం శివం ॥** (సి.శి. 1-2)

"శివస్సత్యమ్" అనెడి దందరి ఆమోదమును పొందిన విషయము. ఉపనిషద్వాదుల "బ్రహ్మ సత్య"మ్మనెడి భావన "శివస్సత్య" మ్మనెడి దానిని సమర్థించునదై యున్నది.

జగత్తు యొక్క సత్యత్వ విషయమును మొదటగా ప్రతిపాదించిన వారు శివాద్వైతులే. అయితే. 8వ శతాబ్దికి చెందినశంకరాచార్యులవారు, బౌద్ధాచార్యుడును, తన స్వీయ గురువును, అగు గౌడపాదాచార్యుల ప్రభావానికి లోనై, బౌద్ధుల మాయావాదమునకు ప్రతిగా జగన్మిథ్యావాదమును ప్రతిపాదించిరి. ఆచార్య రేణుకులవారి అనుయాయులైన శ్రీకంఠుడు, శ్రీపతి పండితులవారు జగన్మిథ్యావాదమును పరామర్శించి, శివాద్వైతుల వాదమే యనుసరణీయమని ప్రకటించిరి.

శివాద్వైతము ప్రకారము జగత్తు కూడ శివుడే.

శైవదర్శనములలో సాధారణముగా శివ జీవ జగత్తుల గురించిన యుపదేశాదులుండును. తదనుగుణముగనే సిద్ధాంత శిఖామణిలో జీవుని గురించిన చర్చ గలదు. శివాద్వైతము ప్రకారము శివుడే జీవుడగుచున్నాడు. ఈ విషయమును డా॥ చంద్రశేఖర శివాచార్య మహాస్వాములు (కాశీ జగద్గురువు) ఈ క్రింది విధముగా వివరించిరి

**"సృష్టి యెంబుదు పరశివను తన్న వినోదక్కాగి రచిసిద ఒందు లీలా జాలవు. ఈ లీలె యల్లి శివను జీవనాగియూ, జగత్తాగియూ, మత్తు ఆ జీవజగత్తుగళ ప్రేరకనాగియూ మై దాళుత్తానె"**

ఈ గురు వాక్యముల అర్థమును గనుడి :

"సృష్టి యనెడిది పరశివుడు తన వినోదమునకై రచించిన ఒక లీలాజాలము. ఈ లీలయందు శివుడు జీవునిగాను, జగత్తుగాను, మరియు నీ రెంటికి నీ ప్రేరకునిగాను రూపొందును".

ఇట్టి భావనను పిండస్థలములోని యీ క్రింది శ్లోకమున గాంచగలము.

**శ్లో॥ పరతత్త్వమయోపాధిబ్రహ్మచైతన్యమీశ్వరః ।**
**భోక్తా భోజ్యం ప్రేరయితా వస్తుత్రయమిదం స్మృతమ్ ॥** (సి.శి. 5-40)

భోక్త యనగా అనుభవించెడివాడు. భోజ్యమనగా అనుభవించెడిది. ప్రేరకుడు ప్రేరణ నిచ్చెడివాడు. ఈ మూడంశములు వస్తుత్రయమనబడును. ఈ వస్తుత్రయము పరమేశ్వరుడేయని యీ శ్లోకమునందున తెలుపబడినది. అద్వైతమును ప్రతిపాదించెడి సోమానందుని త్రిక సిద్ధాంతము యీ భావమునే ప్రతిపాదించినది. త్రిక సిద్ధాంతమునకు కాశ్మీర శైవమనెడి పేరు గలదని గ్రహించుడి :

శ్వేతాశ్వతరోపనిషత్తులో నాచార్య రేణుకులవారి భావముల ప్రతిబింబమును గాంచగలము గమనించుడి :

**శ్లో॥ "భోక్తా భోగ్యం ప్రేరితారం చ మత్వా ।**
**సర్వం ప్రోక్తం త్రివిధం బ్రహ్మమేతత్ ॥** (శ్వే.ఉ. 1-12)

శివుడే శివ జీవ జగత్తులుగా రూపును దాల్చుననెడిది శ్రుతి సమ్మతమనెడిదేనని గ్రహించవలసిన విషయము.

అయితే "సర్వజ్ఞః ప్రేరకశ్శంభుః", "కించిజ్ఞో జీవ ఉచ్యతే" అనెడి భావములను పృథఃకరణ దృష్టితో చూచిన యెడల కొన్ని సందేహముల కాస్కారమేర్పడును. ఈరెండూ ఆగమిక భావములే యనెడిది సర్వులెరిగిన సత్యము. ఇచ్చట ద్యోతకమయ్యెడి భేదమునే విధముగా నవగాహన చేసికొనవలయుననెడి ప్రశ్నను నివృత్తి చేయుటకై ఆచార్య రేణుకులవారు ఈ ఉపదేశమునిచ్చిరి.

**శ్లో॥ ఆత్మత్వమీశ్వరత్వం చ బ్రహ్మణ్యేకత్రకల్పితమ్ ।**
**బింబత్వం ప్రతిబింబత్వం యథా పూషణి కల్పితమ్ ॥** (సి.శి. 5-37)

బింబ ప్రతిబింబముల మధ్య గల భేదము సంపూర్ణమైనది కాదు. సాపేక్షకరమైన యీ భేదమునకు ఉపాధియే కారణమగును. అదేవిధిన శివజీవుల మధ్యన దోచెడి భేదము కల్పితమైనది. ఇదియే పై శ్లోకములోని కేంద్రాంశము. అయితే ఇట్టి భేద ప్రకల్పన మెందుచేత గల్గుచున్నదనెడి దానిని గుర్తించుట యెంతో అవసరము. ఈ విషయమును వివరించుటకై శ్రీ రేణుక భగవత్పాదులవారు శక్తియనెడి భావనను వివరించిరి. షట్త్రింశత్ తత్త్వములలో శక్తితత్త్వమొకటి. శివుని కేవలావస్థలో శివునిలో లీనమై అవ్యక్తముగా నుండెడి శక్తి శివుని క్రీడావస్థలో ప్రకటితమై శివునితో అవినాభావ సంబంధము కల్గియుండును. ప్రవృత్తి క్రమములో శక్తి శుద్ధమాయమై సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్య లనెడి తత్త్వముల ఉత్పత్తికి కారణమగును. ఈ తత్త్వముల మాధ్యముననే శివుడు ప్రేరకుడగుచున్నాడు. శుద్ధమాయ యనెడిది మాయగా రూపమునొంది అవిద్యాది మిశ్రతత్త్వముల ఉత్పత్తికి కారణభూతుడగుచున్నాడు. మాయ వలన త్రిగుణములేర్పడును. ఈ త్రిగుణములవలననే శివుడు భోక్తృవగును. క్రింది రేణుకోపదేశమును గనుడి :

**శ్లో॥ కించిత్సత్వరజోరూపం భోక్తృసంజ్ఞకముచ్యతే ।**
**అత్యంత తామసోపాదిర్భోజ్యమిత్యభిదీయతే ॥** (సి.శి. 5-39)

నివృత్తి క్రమములో ప్రేరక స్థానమున శుద్ధోపాధిలో నుండెడి శివుడు, జీవుని స్థానములో అశుద్ధోపాధియందుండెడి శివుని కాపాడుటకై వలయు చర్యలను చేపట్టును. అష్టావరణముల సాహిత్యమును ప్రకల్పించును. షట్‌స్థల తత్త్వమునుపదేశించును, శివాచార పథములను చూపును. శుద్ధమాయగాను, మాయగాను మారి శివుని ప్రవృత్తి మార్గమున నడిపించిన శక్తి, "శక్తిపాత" ప్రక్రియ కారణమున నివృత్తికి దోహదము చేయును. షడ్విధ భక్తి స్వరూపమును సంతరించికొని జీవునిగానున్న శివుని ఆధ్యాత్మిక పురోగమనమునకు కారణమగును. జీవుడు భక్తాంగ, మహేశ్వరాంగ, ప్రసాదాంగ, ప్రాణలింగ్యాంగ, శరణాంగ, మరియు ఐక్యాంగ స్థలములలో సాధన చేయును. ఆయా స్థలములలో ఆయా స్థలముల నాశ్రయించి యుండెడి లింగస్థలము సాధకునికి సహాయము చేయును. అశుద్ధోపాధి నుండి విముక్తిని పొందిన జీవుడు తన పూర్వరూపమైన నిర్గుణ శివబ్రహ్మయగును. సహభో(భా)జన స్థలము శివైక్యతా సిద్ధి యొక్క క్రమము వివరింపబడినది.

## తత్త్వ ప్రవక్త - ఆదిరేణుకాచార్యులు

సిద్ధాంత శిఖామణిలోని తత్త్వమును ప్రతిపాదించిన రేణుకుని గురించి తెలిసికొనుట యెంతో అవసరము. వీరశైవ మత స్థాపకునిగా శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారికి యెంతో ఖ్యాతి గలదు. రేణుకుని పేరుమీద తీర్థక్షేత్రములెన్నియో వెలసినవి. వీటిలో ప్రాచీనమైన వెన్నియో గలవు. మహాభారతములోని వన పర్వమున వివరింపబడినట్టి రేణుకాతీర్థము వాస్తవముగా రేణుక తీర్థమేయని శ్రీపండిత చిదిరెమఠం వీరభద్రశర్మ గారు సహేతుకముగా తెలియజేసిరి. ఆ సేతు హిమాచల పర్యంతమీ క్షేత్రములు వ్యాపించి యున్నవి. దక్షిణదేశములో వీటి సంఖ్య అధికముగా గలవు. ఆచార్య రేణుకుని పరంపరలో విరాజిల్లిన వారు తత్త్వ ప్రచారకులుగాను, ధర్మపురుషులుగాను గణనకెక్కిరి. శంకరాచార్యులవారికి చంద్రమౌళీశ్వర లింగమును ప్రదానము చేసిన రేవణ సిద్ధుడు రేణుకాచార్యుని కలియుగ అవతారము. కవులీ మహానుభావుని చరిత్రను కీర్తించి ధన్యత బడసిరి. భక్తా మహేశ్వరులు తమ తమ విధేయతను ప్రకటించిరి. ఇంత విస్తృత ఖ్యాతిని బడసిన ఆచార్య రేణుకుడెవ్వరు? అనే ప్రశ్న ఉదయించును.

## అవతార భావన :

భారతావనిలోన నవతార భావనకు గట్టి సమర్థత గలదు. ధర్మ సంస్థాపనార్థము విష్ణువు అనేక అవతారమెత్తినట్లుగా, యిదేవిధముగా శివునాదేశము ప్రకారము శివగణములు అవతారమెత్తిరని తెలియగలరు. శివుడు శివగణములకు తన సామర్థ్యముతో సరితూగెడి సామర్థ్యము నిచ్చెనని సిద్ధాంత శిఖామణిలో తెలుపబడినది. ఈ క్రింది శ్లోకములను గనుడి :

**శ్లో॥ ఇత్యేవం ప్రార్థితః శంభుర్బ్రహ్మణా విశ్వయోనినా ।**
**ససర్జాత్మసమప్రఖ్యాన్ సర్వగాన్ సర్వశక్తికాన్ ॥**
**ప్రబోధపరమానందపరివాహితమానసాన్ ।**
**ప్రమథాన్ విశ్వనిర్మాణ ప్రలయాది విధిక్షమాన్ ॥** (సి.శి. 2-26)

శివుని సద్యోజాతాది పంచముఖములనుండి రేణుక, దారుక, ఘంటాకర్ణ, ధేనుకర్ణ మరియు విశ్వకర్ణ గణములు అను పంచాచార్యులుద్భవించిరనియును, వీరిలో రేణుకుల వారొకరినియును, వీరశైవ ధర్మమును స్థాపన చేయుటే వీరి కర్తవ్యమనియును తెలియుచున్నది. వీర, నంది, భృంగి, వృషభ, స్కందులు వీరి గోత్ర పురుషులనియును తెలుపబడినది. వీరు కైలాసమున శివుని సన్నిధిన నుండి ప్రత్యేకమైన గౌరవ ప్రపత్తులు పొందుదురనియును, శివాదేశమున కనుగుణముగా భూలోకమునకు విచ్చేసి లింగోద్భవులై గురులీలలను రచింతురనియును, అట్టి గురులీలలోని యంతర్భాగమే రేణుకాగస్త్య సంవాదమనియును గ్రహింతురు. సోసలె రేవణారాధ్యుడు గ్రంథస్థము చేసిన చోళరేణుక సంవాదము రేణుకాచార్యుని మరొక లీలయనియును గుర్తించవలెను.

ఆచార్య రేణుకుని యవతార వృత్తాంతము గురించి సందేహములు వెలిబుచ్చెడి వారు ఉండవచ్చును. అవతార భావన నంగీకరించిన వారు సాంప్రదాయములన్నింటిలోను గలరు. స్మార్తులు శంకరాచార్యులవారిని శివుని యవతారమని యెంతురు. రామానుజుడు, తాను లక్ష్మణుని (ఆదిశేషుని) యవతారమని చెప్పికొనెను. అట్టి యెడ శ్రీ రేణుకాచార్యులవారు అవతార పురుషుడని భావించుటలో బాధకము లెవ్వి?

## చారిత్రాత్మక పురుషుడు :

ఆచార్య రేణుకుని కేవలమొక పౌరాణిక పురుషునిగా భావించుట సబబు కాదు. శ్రీ రేణుకాచార్యులు చరిత్రకెక్కినపురుషుడు. అయితే కవులు చిత్రీకరించిన లీలా విశేషములు చారిత్రాత్మక దృష్టికి యవరోధములై నిలిచినవి. అదే విధిన రేణుకాచార్య రేవణసిద్ధ యనెడి పేర్లు పర్యాయ పదములని భావించుటచేత రేణుకాచార్యులెప్పటివారో యనెడిది యవగతమగుటలోన యవరోధము లేర్పడినవి. రేణుకాగస్త్య సంవాదము ఋగ్వేదకాలము కంటెను ముందుననే సంభవించినదని తలపవలెను. ఆగమ సాహిత్యములో ఆగస్త్యుని ప్రమేయము గలదని పాశ్చాత్య పండితులెంచుచున్నారు. రేణుకుడు ప్రతిపాదించిన భావనల కనుగుణ్యత గల ఆధారము లెన్నియో మొహంజొదారో హరప్పా త్రవ్వకాలలో బహిర్గతమైనవి. అందుచేత శ్రీ రేణుకాచార్యుల వారు క్రీ.పూ. 4000 సం॥నకు చెందినవాడని దలపవచ్చును అయితే, యీ విషయములో మరికొంత పరిశోధనను చేపట్టవలసిన అవశ్యకత గలదనెడిది గుర్తింపదగిన విషయము. ఆధునిక కాలమున "పిహెచ్‌డి" ఉపాధికై కృషి చేసే బళ్ళారి, హుబ్లి, ధార్వాడ్‌లకు చెందిన విశ్వ విద్యాలయాల విద్యార్థులీ దిశలో పయనించుచున్నారని తెలియుచున్నది. వీరి కృషి జయప్రదమైన యెడల వర్తమానమున నెలకొనియున్న తికమక స్థితిగతి దూరీకరణను పొందవచ్చును.

## అవతార రహస్యము :

"శ్రీ రేణుకాచార్యులవారు భూలోకములోన యెందుకు అవతరించిరి?" అనెడిదొక అంతు చిక్కని ప్రశ్న. ప్రముఖులెందరో పలు విధములైన కారణములను చూపిరి. వీరిలో శ్రీ శివయోగి శివాచార్యులవారును గలరు అయితే వీరు చూపిన కారణములు అవతార రహస్యమును తెలిపెడి స్థితిలో లేవు.

అవతారమనెడి భావన భారతీయ సంస్కృతిని ప్రభావమునకు గురిచేసిన యంశములలోన అతి ముఖ్యమైనది. సామాన్యుని నమ్మిక చట్రమును గట్టిగా పెనవేసికొన్న భావనలలోన అవతార భావన కీలకమైనది. పురాణములన్నియునూ అవతారముల గురించి వివరించెడి కృతులే కదా! రామాయణ భారతాదులిట్టివే. భగవద్గీతగా బహుళ ప్రచారము నొందిన కృష్ణార్జున సంవాదము ప్రకారము "దుష్ట శిక్షణ"యే అవతారము యొక్క పరమార్థము. దుష్టుని సంహరించుట కంటెను దుష్టునిలోని దుష్టత్వమును తొలగించుట పరమోత్కృష్ట భావన యగుచున్నది. దుష్టత్వము వైదొలిగిన పిదప దుష్టుడు శిష్టుడై లోక కళ్యాణమును సాధించెడి సమర్థత గల్గిన విశిష్టుడగును. "ఇట్టి ఫలితమును సాధించుట యెట్టుల?" అనెడి దానిని తెలుసుకొను యత్నమును చేసిన వారెవ్వరునూ లేరు.

దీనికిగల కారణమేమనగా ఎంతటి గొప్పవాడికైననూ ఇయ్యది స్ఫురించదు. ఇది అనుభవైక వేద్యమే కాని జ్ఞానము వలన స్ఫురించెడిదికాదు. శివప్రసాదము వలన అనంతమైన శక్తిని సముపార్జించుకొని, లింగోద్భవ మూర్తిగా ప్రకటనమంది ఆకాశగమనాదులు సలిపి జ్ఞానవృద్ధుడైన అగస్త్యునకే గురువై, రేణుకగీత ప్రవక్తయై, లోకముల నేలెడి ప్రథమ జగద్గురువై విరాజిల్లిన శ్రీ రేణుకాచార్యులవారికే శివప్రసాద మహిమను చెప్పుటకు వలయు అర్హత గలదు. ప్రసాదముచేత దుష్టత్వము దూరమగునని యెరిగిన రేణుకులవారు ప్రసాద మహిమను ప్రతిపాదించుటకై ఈ సిద్ధాంతమును బోధించెనని యెరుగవలెను.

ప్రకృతి వలన జనించిన పదార్థము ననుభోగము చేసెడి జీవుడు పదార్థ జన్యమైన కర్మబంధములలో చిక్కికొని విలవిలలాడుచున్నాడు. కర్మకు వశుడై కర్మలను చేయుచు, కర్మఫలము ననుభవించుటకు పలు జన్మలనెత్తుచు అలమటించుచున్నాడు. అనేకమైన నీచ యోనులలో

జన్మించుచున్నాడు. అనివార్యమైన మరణమును పొంది మరల జన్మించుచున్నాడు. జనన-మరణముల చక్ర బంధములనుడి విడివడుటకై జీవి ప్రసాదోపభోగి కావలెనని యుద్ఫోదించిన శ్రీ రేణుకులవారి బోధలు సదా స్మరణీయములు. జాతి, వర్గ, లింగ, వర్ణ భేదములతో ప్రమేయము లేకుండగా ప్రతియొక్కరిని తరింపజేసెడివి. ప్రసాద భావన ఆగమములలో విస్తరింపబడినదైననూ, ప్రసాదమనగా నేమిటో తెలియనిస్థితిలో నున్న తరుణములో శుద్ధ, సిద్ధ, ప్రసిద్ధ ప్రసాదములే నిజమైన ప్రసాదములని తెలిపినవారు శ్రీరేణుకాచార్యులవారు గురువు కటాక్షించినది శుద్ధ ప్రసాదము, ఇష్టలింగమునకు నివేదించిన పదార్థము సిద్ధ ప్రసాదమగును. జంగమారాధన వలన లభించెడి ప్రసిద్ధ ప్రసాదమని గుర్తించవలెను. ఈ విధముగా ప్రసాద మహిమను తెలుపుటే రేణుకావతార రహస్యమని తెలియుచున్నది.

## రేణుకులవారు ప్రతిపాదించిన జీవుని విషాదయోగము :

వేదాంత గ్రంథములన్నియును జీవుడు సంసారములో ననుభవించెడి దుఃఖముల గురించి వివరించుచున్నవి. జగత్తు శివశక్తుల సంయోగము వలన గల్గి జీవునికి సుఖ-దుఃఖాదుల యనుభవమునకు ఆస్కారము కల్గించుచున్నది. స్త్రీ పురుషుల సంగమము వలన యేర్పడిన సంసారము జీవిని నిరంతర సుఖాసక్తి గలవానిగా మార్చుచున్నది. సుఖములకై పరువెత్తుచు దుఃఖములనే చవి చూచుచున్నాడు. తానే నిర్మించికొనిన సంసారము, సముద్రమువలె ఉప్పొంగి జీవిని ఉక్కిరి బిక్కిరి చేయుచున్నది. నీటిలోనికి నెట్టబడి మునిగిపోయెడి వాడు ఊపిరి అందక యెట్టి వేదనకు గురియగునో అట్టి వేదన గల్గినా జీవిని సుఖాసక్తి వీడుటలేదు. జీవుడు ఆశాజీవి. సంసారము యెడల మమకారము పెంచికొని వివిధ భ్రమలకు లోనై భూలోకములోనే నరకలోకానుభవమును పొందుచున్నాడు.

ఇట్టివారికి జ్ఞానోదయము గల్గించుటకై శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు తమ ఉపదేశమును ప్రదానము చేసిరి. సంసార హేయ స్థలములోన యీ ఉపదేశము గలదు. "ఐహికే క్షణికే సౌఖ్యే పుత్రదారాది సంభవే!...... కస్య వాంఛా వివేకినః!" అని బోధించిన రేణుకుల వారి బోధ గమనార్హమైనది. ఐహిక సుఖములు క్షణికమైన వనియును, వీటి యెడల అనురక్తి గల్గియుండుట హితకారి కాజాలదని ఉద్భోదించిరనెడిదే యీ ఉపదేశములోని భావము.

కొందరు స్వర్గసుఖముల నభిలషించి యజ్ఞయాగవ్రతతపాదులు చేయుచు పారలౌకిక సుఖాపేక్షతో పలు యాతనలకు గురియగుచున్నారు. స్వర్గ నివాసి యగుటకై యత్నించిన త్రిశంకువు, స్వర్గాధిపత్యమును కోరి శతమఖములను చేసి శతమఖుడగుట కొరకు కృషి సల్పిన నహంశుడు ఈ సందర్భమున స్మరణీయులు. "క్షయిత్వాదియుతే స్వర్గే కస్యవాంఛా వివేకినః" యనెడి రేణుకుల వారి ప్రశ్న స్వయం బోధకమైనదై యున్నది.

జీవుడు కర్మవశముననే జన్మించి త్రివిధ దుఃఖముల ననుభవించుచున్నాడని రేణుకులవారు విశదీకరించిరి. వీరి యీ ఉపదేశమున యీ అంశమును గాంచగలము.

> **శ్లో॥ భూత్వా కర్మవశాజ్జన్తుర్బ్రహ్మాణాదిషు జాతిషు ।**
> **తాపత్రయమహావహ్నౌ సన్తాపాద్ దహ్యతే భృశమ్ ॥** (సి.శి. 5-65)

తాపత్రయములనగా ఆధి భౌతిక, ఆధ్యాత్మిక, ఆధి దైవిక తాపములని గుర్తించగలరు. వీటి వివరణను పంచమ పరిచ్ఛేదములోని 66వ శ్లోకమునుండి 70వ శ్లోకము వరకు గల శ్లోకములలో గాంచగలము.

జనన-మరణముల మర్మమెరుగక మథనపడెడి వెర్రివారికి వివేకమును ప్రదానము చేయనెంచిన శ్రీరేణుకాచార్యులవార, వీటినుండి తప్పించికొనుటకెట్టి వారికైననూ సాధ్యము కాదని తెలిపెను. క్రింది శ్లోకమును గమనించుడి :

**శ్లో॥ మచ్యకూర్మవరాహాఽజైర్నృసింహమనుజాదిభిః ।**
**జాతేన నిధనం ప్రాప్తం విష్ణునాపి మహాత్మనా ॥** (సి.శి. 5-64)

శారీరక సౌఖ్యముల యెడ యనురక్తి గల్గి జీవితమును దుఃఖభాజనముగా చేసికొనెడి వారి నుద్దేశించి ఆచార్యులవారు "కః వివేకీ రమతే దేహే నశ్వరే దుఃఖభాజనే" అని ప్రశ్నించిరి. బుద్ధిహీనులే విషయ సుఖముల నాశింతురనెడిది దీనిలోని భావము.

నిత్యానిత్య వివేకము లేనందుననే జీవునికి సంసారము యెడల యనురక్తి గల్గునని తెలిపిన ఆచార్య రేణుకుల వారు పిండజ్ఞాన స్థలములోన ఆత్మ గురించిన విజ్ఞానమును బోధించిరి. "శరీరేంద్రియ బుద్ధిభ్యో వ్యతిరిక్తః సనాతనః" అని తెలియజెప్పిన రేణుకుని వాక్కులు విజ్ఞానదాయకములై విరాజిల్లుచున్నవి. దేహేంద్రియ బుద్ధ్యాదుల కతీతముగా నుండెడి సనాతన తత్త్వమేఆత్మయని చెప్పబడినది. అత్యంత హేయమైన సంసారమును అధిగమించుట యెట్లు అనెడి ప్రశ్న ఉదయించుచున్నది. దీనికి సమాధానముగాఆచార్య రేణుకులవారు తరుణోపాయమును ఈ క్రింది యుపదేశమునందున యిచ్చిరి.

**శ్లో॥ నిత్యానిత్య వివేకినః సుకృతినః శుద్ధాశయస్యాత్మనో ।**
**బ్రహ్మోపేంద్ర మహేంద్రముఖ్యవిభవేష్వ స్థాయితాం పశ్యతః ॥**
**నిత్యానంద పదే నిరాకృత జగత్సంసార దుఃఖోదయే ।**
**సాంబే చంద్రశిరోమణౌ సముదయేద్భక్తిర్భవధ్వంసినీ ॥** (సి.శి. 5-77)

శివభక్తివలననే సంసారమనెడి భవము ధ్వంసమగునని చెప్పబడినది. శివభక్తి లేనివారికి సంసారమనెడి సాగరమును దాటుట దుస్సాధ్యమైన విషయమని గ్రహించగలరు. ఇట్టి మహత్తు గల్గిన శివభక్తి చేయుటెటుల? అనెడి ప్రశ్న తలయెత్తును. ఈ ప్రశ్న యొక్క నేపథ్యమున శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు ప్రతిపాదించిన భక్తితత్త్వము గురించి తెలిసికొనెదము గావుత.

## రేణుకాచార్యులు తెలిపిన భక్తియోగము :

భారత ఆధ్యాత్మిక క్షేత్రమున బహుళ ప్రాచుర్యము నొందినది భక్తిపథమే. అయితే, భక్తియనగా నేమిట యనెడి విషయములోన నేకాభిప్రాయము లోపించినది. ఉపనిషద్వాదులు భక్తి జ్ఞానముల కభేదమును ప్రకటించగా పౌరాణికులు భక్తికి పట్టమును గట్టిరి. ముక్తికిది సులభమైన మార్గముగా పరిణమించినదనిరి. పురాణ వాఙ్మయమంతయును భక్తుల కథలతో నిండియున్నది. శివమహాపురాణములోని భక్తుల కథలు శైవుల కాదర్శప్రాయములు కాగా, భాగవతములోని కథలు భాగవతుల నాలుకలపై నిత్యము నడయాడుచున్నవి. నేటి దేవాలయ వ్యవస్థకు భక్తియే కదా పట్టుగొమ్మ. శైవమత భేదములలోన ఉత్కృష్టమైనదని యెంచబడిన వీరశైవమునందున భక్తికి యెంతో ప్రాముఖ్యత గలదు.

సిద్ధాంత శిఖామణిని భక్తికి కావ్యమని యనవచ్చును. శ్రీరేణుక భగవత్పాదులవారు ఏకోత్తర శత స్థలముల గురించి చేసిన ఉపదేశమంతయును భక్తియోగమునకు సంబంధించినదే. స్థూలముగా చూచిన యెడల భక్త, మహేశ, ప్రసాది, ప్రాణలింగి, శరణ మరియు ఐక్య స్థలములలోన వరుసగా శ్రద్ధాభక్తి, నైష్ఠిక భక్తి, అవధానభక్తి, అనుభవభక్తి, ఆనందభక్తి మరియు సమరస భక్తులు కేంద్రాంశములై నిలిచినవి. తాత్త్వికముగా చూసిన యెడల శక్తియే యీ ఆరు భక్తుల రూపమును దాల్చి ఆయా స్థలములలో సాధన చేసెడి సాధకుని రూపములోనున్న శివుని సేవించుచున్నది. సూక్ష్మదృష్టిచే పరికించిన యెడల భక్తస్థలమునకు చెందిన పదునైదు అంగస్థలములును, తొమ్మిది లింగస్థలములును భక్తియోగమును వివరించి బోధించుచున్నవి.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు ఉపదేశించిన "భక్తుని" నిర్వచనము భక్తస్థలము యొక్కయు, భక్తి యోగమును శాసించెడి అంశముల లక్షణములను తెలిసికొనవచ్చును. గమనించుడి :

**శ్లో॥ శైవీభక్తిః సముత్పన్నా యస్యాసౌ భక్త ఉచ్యతే ।**
**తస్యానుష్ఠేయ ధర్మాణాం ముక్తిర్భక్తస్థలం మతమ్ ॥** (సి.శి. 5-26)

ఈ నిర్వచనము ప్రకారము పిండస్థలము నుండి సహజదాన స్థలము పర్యంతము గల స్థలములలోను, దీక్షాగురు స్థలమునుండి పరస్థలము వరకును గల స్థలములలోను వివరింపబడిన ధర్మ సంచయము ననుసరించుటే భక్తియోగమనబడుచున్నది. ఈ ధర్మములలో కొన్ని సాధకుని స్వీయ సంస్కారమునకు సంబంధించినవైతే, మరికొన్ని అతడు చేపట్టే సేవలకు అనుబంధము గల్గియున్నవి. భక్తుని సంస్కారమునకు సంబంధించినవి వీరశైవమున చెప్పబడిన అష్టావరణములలోని సాధన ప్రాయములగు భస్మధారణ, రుద్రాక్షధారణ, పంచాక్షరీ మంత్రములకు సంబంధము గల్గియున్నది. భక్తుడు సేవించదగినవారు అష్టావరణములలోని గురు-లింగ-జంగమములు మొదటివి. అంగస్థలములలోన నుపదేశింపబడగా, చివరివి లింగస్థలములలో బోధింపబడినవి. సాధనా ఫలములైన పాదోదక ప్రసాదములు చతుర్విధసారాయ స్థలమున బోధింపబడినవి. ఈ విధముగా, ఆగమోక్తములైన అష్టావరణములన్నియును భక్తియోగమును శాసించునవై యున్నవి.

ఈ స్థలములన్నింటిలో 'భక్తిమార్గ క్రియా స్థలమునకు విశిష్టమైన స్థానము గలదు. ఇందు నవ విధ భక్తులు వివరింపబడినవి. ఈ నవ విధ భక్తుల ద్వారా గురువును, జంగముని సేవించి తరించవలెననెడిదే గ్రహించవలసిన విషయము. దానములను నిర్దేశించెడి స్థలములు భృత్యాచార తత్త్వమును తెలుపుచున్నది. భక్తుడు తనువు, మనము మరియు ధనములను దాసభావముతో గురు-లింగ జంగముల కర్పించవలెననెడిదే కేంద్రాంశము. భజించుటయే భక్తియనెడి భావన యొక్క పూర్ణవికాసమును ఈ స్థలములలో గాంచగలము. భక్తియనెడిది జ్ఞానముతో సంగమించినచో వినూత్న తేజమును సంతరించికొనును. శ్రీరేణుకులవారీ దృక్కోణమును విస్మరించలేదని తెలియుచున్నది.

## శ్రీ రేణుకులవారు ప్రతిపాదించిన జ్ఞానయోగము :

ఉపనిషద్వాదుల సిద్ధాంతములలో జ్ఞానమున కితోధికమైన ప్రాముఖ్యత యివ్వబడినది. స్మార్తుల కేవలాద్వైతమును ఉదాహరణగా గైకొనవచ్చును. జ్ఞానమును విస్మృతికి గురిచేసిన భక్తిపథములు మూఢభక్తికి నిలయములై నిలిచినవి. శివాద్వైతములో భక్తి జ్ఞానములకు సమానమైన ప్రాముఖ్యత లభించినది. షట్‌స్థల జ్ఞానము వీరశైవమునకు ఆయువు పట్టని తెలియని వారు ఉండరు.

ఆచార్యులవారి దృష్టిలో జ్ఞానము వస్తు నిష్ఠితమైనది కాదు. శివ-జీవా భేద జ్ఞానమే నిజమైన జ్ఞానమని భావింపబడినది. ఏకోత్తర శత స్థలములలో మొదటి రెండు స్థలములైన పిండస్థలము మరియు పిండజ్ఞాన స్థలములు శివజ్ఞానమును, జీవ జ్ఞానమును ప్రదానము చేయుచున్నవి. చివరిదగు జ్ఞానశూన్య స్థలము, శూన్య స్థలమున జ్ఞానమునకుండెడి అస్తిత్వ విషయమును వివరించునదై యున్నది. ఇంచుమించుగా ప్రతి షట్‌స్థలములో జ్ఞానమునకు సంబంధించిన యంశములను గాంచగలము. గమనించుడి :

**భక్త స్థలము –** పిండస్థలము, పిండజ్ఞాన స్థలము, జ్ఞానగురు స్థలము, జ్ఞానలింగ స్థలము

**మాహేశ్వర స్థలము –** జ్ఞానాగమ స్థలము, జ్ఞానాచార స్థలము

**శరణ స్థలము –** జ్ఞానపాదోదక స్థలము, జ్ఞాన నిష్పత్తి స్థలము, జ్ఞాన ప్రకాశ స్థలము

**ఐక్య స్థలము –** స్వపరాజ్ఞ స్థలము, జ్ఞానశూన్య స్థలము

ఇవి జ్ఞానముతో ప్రత్యక్షమైన సంబంధము గల్గియుండగా, పరోక్షమైన సంబంధము గల్గిన స్థలము లెన్నియో ఉపలభ్యము. ఈ సందర్భమునందున, జ్ఞానము పోషించెడి పాత్ర యెట్టిదో తెలిసికొనవలసి యున్నది. ప్రాథమికముగా గమనించవలసినదేమనగా భక్తి–జ్ఞానములు పరస్పర పూరకములు. పరస్పర పోషకములుగా భావించవచ్చును. అయితే, ఈ రెంటి యందు భక్తికి ప్రధానమైన భూమిక యివ్వబడినది. భక్తాది స్థలములలో శ్రద్ధాది భక్తులు బలోపేతములై సాధకుని సాధనను ఫలప్రదము చేయుటకై జ్ఞానము ఉపకరణముగా తోడ్పడవలెనని భావింపబడినది. అదే విధముగా భక్తాది స్థలములకు సంబంధించిన జ్ఞానమునకు సుసంపన్నత గల్గించుటే భక్తియొక్క పాత్ర అని గుర్తించగలరు.

పిండజ్ఞానము వలన శంభుభక్తి స్థిరీకరణను పొంది భవి శాంభవదీక్షను గొని, లింగధారియై భక్తుడగుచున్నాడు. సంశయచ్ఛేద కారకుడైన జ్ఞాన గురువుచేత నుపదిష్టితుడై సమ్యక్ జ్ఞానమును లబ్ధిగా పొందును. జ్ఞాన లింగమునుపాసన జేసి జ్ఞానలింగియై విరాజిల్లును. అభేదజ్ఞాన సంపన్నుడగును. సాధన పరిపూర్ణమైన పిదప మాహేశ్వర స్థలములోనికి ప్రవేశించును. ఇచ్ఛేట జ్ఞానాగమస్థలియై చిత్తములోని మోహమును తొలగించికొనును. మాహేశ్వరస్థలములోని జ్ఞానాచార స్థలమువలన "శివాద్వైత జ్ఞానమే నిజమైన జ్ఞానమని యెరింగిన వాడగును. సాధన సంపన్నమైన పిదప ప్రసాదియగుచున్నాడు. ఇతడు శరణ స్థలియైన పిదప జ్ఞాన పాదోదకము చేత నభిషిక్తుడై పునీతుడగుచున్నాడు. జ్ఞాన నిష్పత్తి వలన లబ్ధిని పొంది జ్ఞాన ప్రకాశస్థలియై తన ఆనందభక్తిని సుసంపన్నము చేసికొనును. చివరకు ఐక్యస్థలమున జ్ఞానశూన్య స్థలము వలన భేదభావమును పూర్తిగా తొలగించికొని శిఖి–కర్పూర న్యాయమున శివైక్యతాసిద్ధిని పొందును. ఈ విధముగా జ్ఞానము ఎంతో ముఖ్యమైన పాత్రను పోషించుచున్నది. సంపత్తిని పెంచుటలో విఫలమైన యెడల పైన వివరించిన ఫలితములు గల్గవు.

## శ్రీ రేణుకుల వారు ప్రతిపాదించిన కర్మయోగము :

ఆచార విచారణ కర్మ సిద్ధాంతము మీద ఆధారపడియున్నది. ఈ సిద్ధాంతమునకు విస్తృతమైన ప్రచారము లభించినది. ప్రస్థానత్రయముతో పరిచయమున్నవారికి యీ యంశము యొక్క ప్రాముఖ్యత సువిదితమే. వీరశైవము కర్మసిద్ధాంతమునంగీకరించినది. ఆచార్యులవారి ప్రతిపాదనలు కర్మ సిద్ధాంతమును బలపరచుచున్నవి. ప్రప్రథమముగా నుపదేశింపబడిన పిండస్థలములోనే మనము కర్మ సిద్ధాంతము యొక్క ఛాయలను గాంచగలము. గమనించుడి :

**శ్లో॥ మాయాశక్తివశాదీశో నానామూర్తిధరః ప్రభుః ।**
**సర్వజ్ఞః సర్వకర్తా చ నిత్యముక్తో మహేశ్వరః ॥**
**... ... ... ... ... ... ... ... ... ... ...**
**పరిభ్రమంతి సంసారే నిజకర్మానుసారతః ।**
**దేవతిర్యఙ్మనుష్యాదినానాయోనివిభేదతః ॥** (సి.శి. 5:46–48)

శివుడే మాయావశవర్తియై తత్ఫలితముగా జీవుడై కర్మబద్ధుడై నిజకర్మానుసారముగా సంసారములో పరిభ్రమించుచున్నాడని తెలుపబడినది.

కర్మబంధమునుండి తప్పించుకొనుట యెట్లు? అనెడిది ఒక జటిలమైన ప్రశ్న. తత్త్వవిదుల నైను తికమకకు గురిచేసెడి సాంద్రత యీ ప్రశ్నకు గలదు. కేవలాద్వైతులు కర్మ సన్యాసమే శరణ్యమనిరి. జీవుడు సన్యాసమును స్వీకరించి కర్మలను త్యజించవలెనని యుద్బోధింపబడినది. అతివర్ణాశ్రమీయులైన వీరశైవులు సన్యాసమును స్వీకరింతురే? ఇంకను మరికొందరు, కర్మఫలమును త్యజించవలెననిరి. విశిష్టాద్వైతులీ మార్గమునను సరించిరి. విశేషాద్వైతులైన వీరశైవులకిది ఆమోదయోగ్యమైనది కాదు. కర్మ చేయకుండా ఉండుట యెంత కష్టమో కర్మఫలమంటకుండా కర్మల నాచరించుట యంతకన్నా కష్టము. ఎట్టి వానికైననూ కర్మఫలము ననుభవించుట యనివార్యమైన విషయమని

తెలిసికొనగలరు. 8వ శతాబ్దికి చెందిన నీలకంఠుని బ్రహ్మసూత్ర భాష్యమునకు వ్యాఖ్యగా నిలిచిన క్రియాసారములో మహాత్మ్యుడైన విష్ణువు కర్మఫలము ననుభవించుటకై దశావతారముల నెత్తెనని తెలుపబడినది. భృగుఋషి శాపము వలన విష్ణువు మత్స్యకూర్మాది నానారూపములనొంది తనుచేసిన కర్మవలన సంప్రాప్తమైన ఫలముల ననుభవించెను. అట్టి యెడ తరుణోపాయమెట్టిది?

శ్రీరేణుకాచార్యులవారు ఒక ఉత్తమ పథమును ప్రదానము చేసిరి. ఈ పథము నిష్కామ కర్మ యోగము కంటెను భిన్నమైనది. విలక్షణమైనది. గురులింగ జంగములకు సమర్పించుటకై చేసెడి కర్మవలన జీవుడు కర్మబద్ధుడు కాకుండగ ఉండగలడని తెలియజేసిరి. జీవిని కర్మజిత్తుగా చేసెడి కర్మ సంచయమెట్టిదో యనెడిది తెలిపి ఇది సాంప్రదాయకమైన శాస్త్రములలో తెలుపబడిన నిత్య నైమిత్తిక ప్రాయశ్చిత్తాదుల కంటెను భిన్నమైనవని తెలిసికొనగలరు. వీటిలో కొన్ని భక్తిమార్గ క్రియాస్థలమున వివరించనైనది. మరికొన్ని శీల సంపాదన స్థలములో గాంచగలము. ఆచార సంపత్తి స్థలమున మరికొన్ని క్రియలు సూచింపబడినవి. లింగస్థలములైన క్రియాలింగస్థలము, క్రియాగ స్థలము, క్రియా నిష్పత్తి స్థలము మరియు క్రియా ప్రకాశ స్థలములలో సాధకుడాచరించవలసిన క్రియలు స్పష్టీకరించనైనది. ఈ క్రియలన్నింటినీ యైదు వర్గములుగా వర్గీకరించవచ్చును. అవి : 1) సదాచారము, 2) శివాచారము, 3) లింగాచారము, 4) గణాచారము మరియు 5) భృత్యాచారము. సదాచారము సౌశీల్యమునకు సంబంధించినదైతే, శివాచారము శివ–జీవాభేదానుభాగమమునకు అనుగుణ్యత గల్గియుండును. లింగ స్థలములోని భావలింగ, భావాగమ, భావనిష్పత్తి, భావ ప్రకాశస్థలములీ యంశములకు సంబంధించినవని తెలిసికొనగలరు. లింగాచారము లింగధారణ, లింగార్చన యిత్యాది స్థలములలో వివరింపబడినది. శివుని తన యిష్టలింగరూపమున అర్చించి స్వేష్టలింగ తీర్థ ప్రసాదములను శివ పాదోదక ప్రసాదములుగా భావించి స్వీకరించు ఆచరణలు యిందులో గలవు. భృత్యాచారము జంగమార్చనకు సంబంధించినది. దాసోహ భావముతో చేసెడి దానాదులు భృత్యాచారములోని భాగములే. గణాచారముధర్మ పరిరక్షణకు సంబంధించినదని గ్రహించగలరు.

ఆచారము భక్తునకలంకారము వంటిదనియును, ఆచారహీనుడు నిందితుడగునని తెలిపిన ఆచార్య రేణుకులవారు దేహమున్నంతవరకును ఆచారవంతుడుగా ఉండాలని ఉద్బోధించిరి.

ఆచార నిరతి శ్లాఘనీయమైనదే. అనాచారము నరకతుల్యమే. సందేహములకు తావులేదు. అయితే ఆచారవంతుని లక్ష్యము ఆచారవంతుడై లోకమాన్యుడగుట కాదు. ఆచార సంపత్తి ద్వారా సమరసభక్తిని కొనసాగించి లింగైక్యతా సిద్ధిని పొందుటే. లింగైక్యతాసిద్ధి ఐక్య సంప్రాప్తమగును. కాని, తన్నిమిత్తమైన సాధన ప్రాణలింగి స్థలమునుండి సంపన్నమైనదగును. శ్రద్ధాభక్తి వలన దేహమును, నిష్ఠాభక్తి వలన యింద్రియములను తన స్వాధీనములోనికి తెచ్చికొనిన సాధకుడు ప్రసాది స్థలమున సర్వాంగ లింగియగును. లింగప్రాణి యగుటకై ప్రాణలింగి స్థలమున సాధనను నెరపును. ఈ సాధన శివయోగ మార్గమున సుసంపన్నము కావలెనని సూచింపబడినది. ఈ దిశలో సాధకుని యనింపజేయుటకై శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు ప్రసాదించిన యుపదేశమెట్టిదో తెలిసికొనవలసి యున్నది. ఆ దిశలో ప్రయత్నింతుముగాక.

## శ్రీ రేణుకాచార్యులవారు విస్తరించిన శివయోగపథము :

యోగమునొక స్వతంత్ర దర్శనముగా తీర్చిదిద్దిన ఘనత పతంజలికి దక్కును. వీరి అష్టాంగయోగము బహుళ ప్రఖ్యాతి నార్జించినది. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన సమాధులు అష్టాంగములనబడుచున్నవి.

వీరశైవులు యోగమును స్వతంత్రపథముగా స్వీకరించలేదు. ధ్యాన ధారణ సమాధులే ముఖ్యమైనవని యెంచిరి.

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు శివయోగమునకు సముచితమైన ప్రాముఖ్యత నిచ్చిరి. లింగధారణ స్థలము, పంచాక్షరీ జపస్థలము, శివయోగ సమాధి స్థలములలో యోగమునకు సంబంధించిన విశేషమైన బోధనలను ప్రదానము చేసిరి. శివదీక్షితునకుండవలసిన

లక్షణములను వివరించుచు యమ నియమాదులకు సంబంధించిన బోధను సల్పిరి. శీల సంపాదన స్థలములోను, ఆచార సంపత్తి స్థలములోను వీటికి సంబంధించిన యుపదేశములను గాంచగలము. లింగార్చనా క్రమమును వివరించుచు ఆసన విజ్ఞానమును బోధించి పంచాక్షరీ జప స్థలముననను, ప్రాణలింగి స్థలముననను ప్రాణాయమమునకు సంబంధించిన యుపదేశములనిచ్చిరి. ప్రత్యాహార విషయములు భక్తి మార్గ క్రియా స్థలమున గాంచగలము. లింగనిష్టా స్థలము, సర్వాద్వైత నిరసన స్థలము, అష్టమూర్తి నిరసన స్థలములలో ధారణ సాధించుట యెట్టులనెడిది బోధింపబడినది. శివయోగ సమాధి స్థలమునందున మిగిలిన యంశములు వివరింపబడినవి. షట్ చక్రముల జ్ఞానమును ప్రదానము చేసెడి యీ యుపదేశమును గనుడి :

**శ్లో॥ అంతః షట్చక్రరూఢాని పంకజాని విభావయేత్ ।**
**బ్రహ్మాదిస్థాన భూతాని భ్రూమధ్యాన్తాని మూలతః ॥** (సి.శి. 12 : 25)

భ్రూమధ్యమమునకు పైన సహస్రదళ కమలముందునని తెలుపబడినది. కైలాసము గురించి వినూత్నమైన చింతననిచ్చెడి యీ క్రింది బోధను గమనించుడి :

**శ్లో॥ భ్రూమధ్యాదూర్ధ్వభాగేతు సహస్రదలమంబుజమ్ ।**
**భావయేత్తత్ర విమలం చంద్రబింబం తదంతరే ॥** (సి.శి. 12-26)
**సూక్ష్మరంధ్రంవిజానీయాత్ తత్ కైలాసపదం విదుః ।**
**తత్రస్థం భావయేచ్ఛమ్భుం సర్వకారణ కారణమ్ ॥** (సి.శి. 12 : 26-27)

ఈ విధముగా నాచార్యులవారు శివయోగమునకు సంబంధించిన యెన్నో వివరముల నిచ్చిరి.

తాత్త్వికత గురించి చేపట్టబడిన యీ విశ్లేషణ వలన తేలిన విషయమేమనగా శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు ఒక సమగ్రమైన తాత్త్విక దర్శనమును లోక హితార్థమై, ప్రదానము చేసిరి. భవియై భవ బాధల ననుభవించెడి నరుని యుద్ధరించుటే యీ బోధ యొక్క పరమావధి. ఈ బోధననుసరించి ఆధ్యాత్మిక సాధన చేసెడివాడు అనితర సాధ్యమైన విభూతులను పొంది, భవ బంధములను త్రెంచికొని, కర్మజిత్తై, జనన మరణ చక్రబంధమునుండి విడుదలను పొంది లింగాంగ సామరస్యము పొందగలడు.

ఇట్టి సుసంపన్నమైన తత్త్వమున కొక గ్రంథరూపము నిచ్చిన శివయోగి శివాచార్యులవారు తన రచనా వ్యాసాంగమునందున నాధారభూతమైన వాఙ్మయముగా తీసికొనిన వాఙ్మయమెట్టిదనెడిది తెలిసికొనవలెను. ఎప్పుడో పూర్వకాలమున నుపదేశింపబడిన రేణుకోపదేశమును వినికిడి ఆధారముగా వ్రాసినాడని యనుట కాస్కారములేదు. ఈ విషయము పరిశీలింతుముగాక.

## ఆధారభూతమైన గ్రంథములు :

శ్రీ శివయోగి శివాచార్యులవారు తమ గ్రంథములో తెలిపినట్లుగా తాను శివాగమములను ఆధారముగా గొని సిద్ధాత శిఖామణి రచనను గావించిరి. ఈ యంశము సత్యదూరమైనదనుటకు వీలులేదు. అయితే, తాను వేదముల కవిరోధమైన విధమున కొనసాగింతునని చెప్పుకొనుటవలన, శివయోగి శ్రుతులను కూడా ఆధారముగా గొనెనని తెలియుచున్నది. వేదములనుండి కొన్ని ప్రమాణములను సంగ్రహించి సిద్ధాంత శిఖామణిలో పొందుపరిచిరని తెలియుచున్నది. అదే విధముగా పౌరాణిక వాఙ్మయమును కూడ ఉప్రదించినట్లుగా తెలియుచున్నది. అయితే వీరు ఇతర సిద్ధాంత గ్రంథములను పరికించలేదా అనెడి ప్రశ్న ఉదయించును. ఇతరగ్రంథములను పరిశీలించిరని తెల్పెడి అంతర్గత సాక్ష్యమొకటి గలదు. పరికించుడి :

**పురాహైమవతీ సూనురవదత్ తే షడాననః ।**
**శివధర్మోత్తరం నామ శాస్త్రమీశ్వర భాషితమ్ ॥** (సి.శి. 4 : 43)

శివధర్మోత్తర శాస్త్రమనెడి గ్రంథము గురించిన పరిజ్ఞానము గల్గినవారిలో శివయోగి శివాచార్యులవారు ఒకరని తెలియుచున్నది. ఈ గ్రంథములోని భావములను శివయోగి గ్రహించి యుందురు.

పాల్కురికి సోమనాథుని చతుర్వేద సారములో శివధర్మ శాస్త్రమునుండి యుద్ధరింపబడిన కొన్ని ప్రమాణములు చూపబడినది. గ్రంథ నామధేయమును పరిశీలించినచో ఇది శివధర్మోత్తర శాస్త్రము కంటెను ప్రాచీనమైనదని తెలియుచున్నది. బహుశః ఈ గ్రంథము శివయోగి శివాచార్యుల వారికి ఉపయుక్తముగా నిలిచిన గ్రంథములలో నొకటని భావించుట కాస్కారము గలదు. ఈ విషయమై మరింత పరిశోధన జరుపవలసిన యవశ్యకత గలదు.

## సంస్కృత వాఙ్మయముపై సిద్ధాంత శిఖామణి ప్రభావము :

మహాపురుషులు సమాజము యొక్క సమస్త కార్యక్షేత్రములను తమ తమ ప్రభావమునకు గురిచేసి, ఆయారంగముల గమన క్రమమును మార్చెడి మహిమా సంపన్నులై విరాజిల్లుచుందురు. సమాజము యొక్క అత్యంత ప్రాముఖ్యత గల్గిన రరమైన వాఙ్మయముపై వారు చూపెడి ప్రభావము చరిత్ర గతినే మార్చివేసెడి సమర్థత గల్గియుండును. ఇట్టి మహనీయులలోన శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు ముఖ్యుడని గుర్తింపబడిరి.

సంస్కృత వాఙ్మయములోన నాగమిక వాఙ్మయమే మొట్టమొదటిదని తెలియుచున్నది. ఇట్టి ప్రాచీన వాఙ్మయమునకు చెంది శివాగమములలో శ్రీరేణుకాచార్యులవారి గొప్పతనము కీర్తింపబడినది. స్వాయంభువాగమములోని పంచాచార్యోత్పత్తి ప్రకరణము, సుప్ర బోధాగమములోని గురులక్షణ ప్రకరణము, పాశుపత తంత్రములోని ఉత్తర భాగమున శ్రీరేణుకాచార్యుల గురించిన ప్రస్తావనలను గాంచగలము. వైదిక వాఙ్మయమునకు చెందినదనియును, యజుర్వేదమునకు సంబంధించినదియును అగు వీరలైంగ్యోపనిషత్తులో రేణుకుని ప్రస్తావన గలదని తెలియుచున్నది.

క్రీ.శ. పదవ శతాబ్దిలో రేణుకుని చరిత్రను తెలియజేసెడి రెండు గ్రంథములు వెలువడినవి. మొదటిది ఈశాన గురువు వ్రాసిన రేణుక చంపూ కాగా, రెండవది సిద్ధనాథుడు వ్రాసిన రేణుక విజయము. ఈ గ్రంథముల యొక్క ప్రాముఖ్యతను ఇంత అంతని వివరింపజాలము. సమకాలీన జగత్తును ప్రభావపరచడముతో బాటుగా మున్ముందు రాబోవు తరములకు మార్గదర్శక ప్రాయమైనదై కీర్తిని గడించెను. దీని నాధారముగా గొని కన్నడ, తెలుగు మరియు తమిళ కవులు వారి వారి రచనలను చేసిరని తెలియుచున్నది. 11వ శతాబ్ది యొక్క పూర్వభాగమున రేణుక కల్పమనెడి గ్రంథము వెలువడినది. ఇదే కాలములో రేణుక ప్రశ్న యనెడి గ్రంథము వెలువడెను. మొదటిది రేణుకులవారు బోధించిన ఆయుర్వేద రహస్యములకు సంబంధించినదైతే, రెండవది జ్యోతిర్గణితమునకు చెందినది. శ్రీపతి పండితులు తమ బ్రహ్మసూత్ర భాష్యమునందున సిద్ధాంత శిఖామణి నుండి గ్రహించిన ప్రమాణములను పొందుపరిచిరి. వీరికంటెను పూర్వమున వ్రాయబడిన సిద్ధాంత శిఖామణి యొక్క ప్రభావమును గాంచగలము. శంకరాచార్యుని కాలమునకు చెందిన వాడును,బ్రహ్మసూత్రములకు శివాద్వైతపరమైన భాష్యము వ్రాసినవాడును, అయిన నీలకంఠుడు తన భావచక్రమును సిద్ధాంత శిఖామణిలోని భావములకనుగుణముగా రూపొందించుకొనెనని తెలియుచున్నది. క్రీ.శ. 10వ శతాబ్ది వాడైన శ్రీకంఠుడు సిద్ధాంత శిఖామణిలోని ప్రమాణములను ఆధారముగా గొని తన భాష్యమును రచించెనని తెలియుచున్నది.

క్రీ.శ. 1090కు చెందిన శ్రీవృషభలింగ శివాచార్యులవారు సిద్ధాంత శిఖామణి నాధారముగా గొని “శివ ప్రసంగ రత్నాకరమనెడి గ్రంథమును రచించిరని తెలియుచున్నది. 15–16 శతాబ్దుల మధ్యకాలములో వెలువడిన గుణరత్నం యొక్క సముచ్చయ టీకా, వృషభ

పండితారాధ్యుల వారి నారాయణోపనిషద్భాష్యము, నంజనార్యుల వారి వేదాంత సార వీరశైవ చింతామణి మొదలగు వాటిపైన సిద్ధాంత శిఖామణి యొక్క ప్రభావము గలదని తెలియుచున్నది. 17వ శతాబ్దికి చెందిని భట్టోజీ దీక్షితుల వారు రచించిన తత్త్వకౌస్తుభ నిర్ణయమనెడి గ్రంథము, ఆగమ-తంత్రశాస్త్రముల గూర్చి వీరశైవులకును స్మార్తులకును ఏర్పడిన వివాదము యొక్క నేపథ్యమున వ్రాయబడెను. అధికారమును గురించిన నిర్ణయీకరణ చేయుటకై దీక్షితులవారు సిద్ధాంత శిఖామణిని ఆధారముగా గొనెనని తెలియుచన్నది. ఇందులో లిఖింపబడిన యీ పంక్తులను పరిశీలించుడి :

**"తెన 'అతప్తతనూరజ్ఞ' ఇత్యాదినా దీక్షయారహితః సాక్షాన్నాప్ను యాల్లింగ ముత్తమ' మిత్యంతేన అగస్త్యం ప్రతి రేణుకేన పవిత్ర శ్రుతేల్లింగధారణ పరయా వ్యాఖ్యానాత్"**

17వ శతాబ్దమునకు చెందిన సోసలె సిద్ధ రామార్యుడు, చోళ-రేణుక సంవాదమును గ్రంథస్థము చేసెను. ఈ కాలమునకే చెందిన మరితొంటదార్యులవారి సిద్ధాంత శిఖామణి టీకా పండిత లోకము యొక్క ప్రస్తుతిని పొందినట్టిదని గుర్తించగలరు. 18వ శతాబ్దికి చెందినదైన షడక్షర మంత్రి విరచితములై ధర్మ శిరోమణి, వీర శైవాచార కౌస్తుభములును, కెళది బసవరాజ రచించిన శివతత్త్వ రత్నాకరము సిద్ధాంత శిఖామణి ప్రభావమునకు లోనైన గ్రంథములలో ముఖ్యమైన గ్రంథములుగా నెంచబడుచున్నవి. 19వ శతాబ్దికి చెందిన కాశీ లక్ష్మణ శాస్త్రి వారి గురువంశ కావ్యము రేణుకులవారి పరంపరకు చెందిన రేవణ సిద్ధుడు, 8వ శతాబ్దివాడైన శంకరాచార్యుని స్వశిష్యునికి ప్రదానము చేయబడిన చంద్రమౌళీశ్వర లింగము గురించిన ఉదంతమును వివరించినది.

## కన్నడ వాఙ్మయముపై సిద్ధాంత శిఖామణి యొక్క ప్రభావము :

కన్నడమున వచన వాఙ్మయమునకు గల స్థానము గణనీయమైనది. ఈ వాఙ్మయము సిద్ధాంత శిఖామణి ప్రభావమునకు లోనైనదని తెలియుచున్నది. బసవేశ్వరుని కంటెను పూర్వులైన శివశరణులలో ఆదయ్యగారు ఒకరని శ్రీ లిం॥ పండిత చిదిరెమఠం వీరభద్రశర్మ గారి రచనల వలన తెలియుచున్నది. ఆదయ్యగారు 11వ శతాబ్దికి చెందినవారని తెలుపబడినది. వీరి వచనములలో ఆచార్య రేణుకుల వారి గురించిన ప్రస్తావన గలదని తెలుపబడినది.

సంస్కృత శ్లోకములు గల్గిన శ్రీ బసవేశ్వరుల వారి వచనములను సంకలనము చేసి ప్రకటించినవారును, బెంగుళూరుకు చెందిన ప్రఖ్యాత విద్వాంసులును అయిన చ. సుందరేశన్‌వారు వ్యక్తపరచినట్లుగా క్రింది సిద్ధాంత శిఖామణిలోని శ్లోకమువ శ్రీ బసవేశ్వరుల వారి యొకానొక వచనములో గాంచగలము.

**శ్లో॥ ప్రసాదాదేవ సా భక్తిః ప్రసాదో భక్తిసంభవః ।**
**యథైవాంకురతో బీజం బీజతో వా యథాంకురః ॥** (సి.శి. 9-11)

శ్రీ బసవేశ్వరులవారు, భక్తుని ఐక్యస్థలమున చెప్పిన "నీ నొలియిత్తెపుణ్య; నీనొల్లదుదె పాప... కూడల సంగమ దేవా!" (వ.సం. 505) అనెడి వచనములోన నీ శ్లోకము గలదు. చెన్న బసవన, అక్కమహాదేవి వంటి శరణాగ్రగణ్యుల వచనములలోన ఇట్టి ధోరణులను గాంచగలమని డా॥ చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు తెలియజేసిరి.

బసవేశ్వరునికి సమకాలీనుడును, శివశరణుల ప్రభావమునకులోనుయై "బసవరాజ రగళె", "కాయక రగళె" ఇత్యాది రచనలను చేసిన వాడును, అయిన హరిహర మహాకవి, రేణుకుని పరంపరకు చెందిన వాడైన "రేవణ సిద్ధుని" చరిత్రను రచించిరి. హరిహరుని మేనల్లుడును, గొప్పకవిగా పేరుగాంచినవాడును, అయిన రాఘవాంకుడు తన "సిద్ధ రామేశ్వర పురాణము"లో రేవణ సిద్ధుని గురించిన విశేషాంశములెన్నింటినో తెలియజేసిరి. సొన్నలాపురములో శాలివాహన శక 1020 సం॥ నందు ముద్దగౌడ మరియు సుగ్గలాదేవి లనెడి

పుణ్యదంపతులకు, శ్రీ రేవణ సిద్దేశ్వరుల వారి కృపాశీర్వాదము వలన శ్రీ సిద్ధ రామేశ్వరుల వారు జన్మించిరని తెలుపబడినది. పాల్కురికి సోమనాథుని బసవ పురాణము చేత ప్రభావితుడై కన్నడమున బసవ పురాణమును రచించిన భీమకవి, రేవణ సిద్ధునిగురించి వ్రాసెనని తెలియుచున్నది. 15వ శతాబ్దిలో వెలువరింపబడిన కృతులలో బొమ్మరసు వారి సౌందర పురాణము, తోంటద సిద్ధలింగయతి వారి "సిద్ధేశ్వర వచనములు", విళందూరు హరిహరుని "ప్రభుదేవ పురాణము"లును సిద్ధాంత శిఖామణి ప్రభావానికి లోనైన ప్రధాన కృతులుగా నెంచవచ్చును. 16వ శతాబ్ది అనేకమైన కృతులలో రేణుకుని ప్రభావమును గాంచెను. చతుర్ముఖ బొమ్మరసు రేవణ సిద్ధ పురాణమును రచించగా, మల్లణ్ణకవి రేవణ సిద్ధ కావ్యమును వ్రాసిరి. ఉజ్జయినీశుని కృతి సిద్ధాంత శిఖామణికి కన్నడ టీకాగా పేరును గాంచెను. 17వ శతాబ్దిలో ప్రకటితమైన గ్రంథములలో సంపాదనెయ పర్వతేశుని చతురాచార్య పురాణము పంచాచార్య వ్యవస్థకు బహుళ ప్రచారము నొసంగెను. ఈ కాలములోనే వెలువడిన సోసలె రేవణారాధ్యుని సిద్ధాంత శిఖామణి టీకా ఒక గొప్ప సిద్ధాంత గ్రంథముగా పేరుగాంచెను. 18వ శతాబ్ది చతురాచార్య ప్రబంధము, భీమేకాద్రి పురాణమనెడి రేణుకాలీలా విలాసములను గాంచెను. 20వ శతాబ్ది రేణుకుని గురించిన అనేక కృతులను గనెను. ఇవి కొన్ని వందల సంఖ్యలో గలవు. పండిత కాశీనాథశాస్త్రి పండిత చిదిరెమఠం వీరభద్రశర్మ, డా॥ వాగీశ పండితారాధ్య మహాస్వామి, డా॥ జ.చ.ని. వంటి పండితులు సిద్ధాంతశిఖామణి ప్రభావానికి లోనై అనేకానేకమైన గ్రంథములను, వ్యాసములను మరియు స్తోత్రాదులను రచించి యమరులైరి. సమకాలీన జగత్తులో కాశీ జగద్గురువులు డా॥ చంద్రశేఖర శివాచార్యులవారు చేయుచున్న రచనలు సిద్ధాంత శిఖామణికి వెలుగునిచ్చెడి మణిదీపికలైనవని చెప్పవచ్చును.

## తెలుగు వాఙ్మయముపై సిద్ధాంత శిఖామణి యొక్క ప్రభావము :

తెలుగు వాఙ్మయ చరిత్ర నధ్యయనము చేసెడివారికి "ఆదికవి" యెవరు అనెడి సందేహము కలిగెడి యవకాశముకలదు. నన్నెచోడుని "కుమార సంభవము" ప్రకటితమైన పిదప "నన్నయ ఆదికవి కాడేమో?" అని భావించెడివారు తమ తమ ప్రతిపాదనలను జేసిరి. వీరి భావనలలో "నన్నెచోడుడే ఆదికవి" యనెడి భావము నెలకొనియున్నది. అయితే గమనింపదగిన విషయమేమనగా నన్నయ మరియు నన్నెచోడుడు సిద్ధాంత శిఖామణి ప్రభావమునకు గురి అయి ఉందురని భావించుట కాస్కారము గలదని వీరశైవ విజ్ఞులు భావించుచున్నారు. ఆది పర్వములోని ప్రథమ శ్వాసములోని 10-12 పద్యములను పరికించిన వారికి రాజరాజ నరేంద్రుడు "జగత్పరిపూజ్యములైన యీశ్వరాగమములపై మనస్సు లగ్నము చేసిన వాడని తెలియుచున్నది. ఆగమసారమని యెంచదగిన సిద్ధాంత శిఖామణి గురించి యితడెరిగియే యుండును. ఇతని ప్రేరణచేత భారతాంధ్రీకరణకై పూనికొనిన నన్నయ కూడ సిద్ధాంత శిఖామణిని పఠించి యుండును. ఈ విషయమై పరిశోధన చేపట్టవలసియున్నది.

నన్నెచోడుడు తన కావ్యమును "జంగమ మల్లికార్జున కంకితముగా నొసంగెను. అతడు చేసిన గురుస్తుతిని గమనించుడి :

**మ. అమలజ్ఞానసుదీప వర్తిగొని వృద్ధాచారుడై వేదశా**
**స్త్రములం దున్న సదర్థమెల్లగొని విద్వత్ప్రీతి గావించువా**
**నిమహాత్ముండనబొల్చు పుణ్యనిధి వాణీముఖ్యు సర్వజ్ఞుజం**
**గమలింగం బగుమల్లికార్జును సదాకల్యాణు కీర్తించెదన్?**

ఇచ్చుట ప్రార్థితుడైన వాడు అష్టావరణములలోన నొక ఆవరణ యనబడెడి జంగముడేయని తెలియుచున్నది. జంగమ లింగము లేదా చరలింగమనెడి భావన వీరశైవ పారిభాషిక పదమే. శైవుడైన నన్నెచోడుడు జగత్తుకే వంద్యుడని చెప్పబడినట్టి జంగమ లింగము నర్చించుటలోన ఆశ్చర్యమేమున్నది. వీరు తమ గ్రంథములో విస్తరించిన జంగమ మహత్తుకు సిద్ధాంత శిఖామణిలోనిజంగమ మహాత్మ్య స్థలమే మూలాధారామని తెలియుచున్నది.

పండితత్రయములోన నొకడును, బసవనకు సమకాలీనుడును, వీరశైవ దీక్షితుడును, జంగమార్చనా కళాశీలుడున అగు మల్లికార్జున పండితుడు పలు విషయములలో సిద్ధాంత శిఖామణికి అనుగుణ్యత కల్గిన భావములు ప్రకటించెనని తెలియుచున్నది. వీరశైవము, వేద సమ్మతమైనదని వాదనలు సల్పిన పండితునికి సిద్ధాంత శిఖామణియే ప్రేరణనిచ్చియుండును. పండితుడు ప్రతిపాదించిన భేదాభేద సిద్ధాంతమునకు సిద్ధాంత శిఖామణిలోని శివాద్వైతమే మూలభూతమైనదని యెరిగినవారు కొందరే. పండితుడు ప్రతిపాదించిన అద్వైత పరామర్శ, అష్టమూర్తి నిరసనలకు సిద్ధాంత శిఖామణిలోని మాహేశ్వర స్థలములోన మూలాధారమును గాంచగలము. ఈవిషయములను తులనాత్మకముగా పరిశీలించిన వారికి పిహెచ్‌డి ఉపాధికి వలయు సామాగ్రి లభించుననుటలోన సందియమున కాస్కారము లేదు.

లింగధారణ, లింగార్చన, జంగమార్చన యిత్యాదుల మహత్తును చాటిన తొలి శతకాలలో సర్వేశ్వర శతకమొకటని గ్రహించగలరు. దీని రచయిత అన్నమయ్య. ఇతడు బసవేశ్వరునికి సమకాలికుడే. శివాద్వైతమును ప్రతిపాదించెడి యీ కృతిపై సిద్ధాంత శిఖామణి ప్రభావము గలదని చెప్పవచ్చును. ఇందులోని క్రింది పద్యమును గనుడి :

**కింకన్ దనున్నదల్చి చక్రమునదా గృష్ణుండనిన్వైచినని**
**బొంకం బొప్పగ దాని దుత్తురుముగాబోదట్టియుప్పొంగె ని**
**శ్శంకాత్ముండు దధీచి శాశ్వతులు నీ సద్భక్తులూ హింపగా**
**సంకల్ప ప్రభవ ప్రతాపవన భాస్వద్భావ సర్వేశ్వరా!**

ఈ పద్యముపై సిద్ధాంత శిఖామణిలోని యీ శ్లోకము యొక్క ప్రభావమెంతమేరకు గలదో ఊహింపవచ్చును.

**శ్లో॥ మద్భక్తేన దధీచేన కృత్వాయుద్ధం జనార్దనః ।**
**భక్తచక్రాయుధః పూర్వం పరాభవముపాగమత్ ॥** (సి.శి. 3-73)

“శ్వేతస్యమమ భక్తస్య .... దగ్ధ పురాభవత్” “కృతాశ్వమేధో... మేషవక్త్రోஉభవత్ పురా” అనెడి శ్లోకముల నాధారముగా గొని వ్రాయబడిన పద్యములను సర్వేశ్వర శతకములో గాంచగలము. ఈ కృతిని రచించిన అన్నమయ్య భక్త మహాత్మ్యమున విస్తరించెను. ఇట్టి విస్తరణకు సిద్ధాంత శిఖామణిలోని భక్త మహాత్మ్య స్థలము ఉపకరించినదని చెప్పుటకు ఆస్కారము గలదు.

శివభక్తికి పట్టము గట్టిన వాడును, వీరమాహేశ్వరుడనని చెప్పికొనిన వాడును, అయిన పాల్కురికి సోమనాథుని “అనుభవ సారము” ఒక విశిష్టమైన సైద్ధాంతికకృతి “గురు-లింగ-జంగము”లు మాత్రమే ఆరాధనీయులని ప్రతిపాదించిన కావ్యమిది. ఈ భావములను విస్తరించుటకై సోమనాథుడు అనేక రచనలను చేసెను. గురుమాహాత్మ్యము తెలియజెప్పుటకై పండితారాధ్య చరిత్రను లిఖించెను. జంగమ మాహాత్మ్యము నెరింగించుటకై బసవ పురాణమును రచించెను. లింగధారణ, లింగార్చన, పాదోదక స్వీకారము ప్రసాద గ్రహణము ఇత్యాదులు వేద సమ్మతములైన భక్తి సత్క్రియలే యని తెలియజెప్పుటకై చతుర్వేదసారమును రచించెను. వీటన్నింటిపైననూ సిద్ధాంత శిఖామణి యొక్క ప్రభావము గలదని తెలియుచున్నది.

ఈశ్వరార్చన కళాశీలుడని కీర్తింపబడిన వాడును, కవిసార్వభౌముడని పేరుగాంచిన వాడును, హరవిలాసాది కృతులద్వారా శివభక్తుల మహిమను చాటినవాడును అయిన శ్రీనాథుడు సిద్ధాంత శిఖామణి ప్రభావమునకు లోనైనాడని తెలియుచున్నది. ఇతని కృతులను పరిశోధించిన వారెందరో యీ విషయమును గ్రహింపరైరి. అయితే ఒకరిద్దరి పరిశోధనలలోన యీ యంశము కొంతమేరకు పరిశీలించనైనది.

సోమనాథుని శిష్యులుగాను, అతని సిద్ధాంతమును ప్రచారములోనికి తెచ్చుటకై అనేక రచనలు చేసిన పిడపర్తి కవులలో పిడుపర్తి బసవన ముఖ్యుడు. కెరయ పద్మరసు రచించిన కన్నడ దీక్షా బోధను ఇతడు ద్విపదగా తెలుగున వెలువరించెను. క్రీ.శ. 1450కి చెందిన యీ కవి, శివుడు దేవికి బోధించిన సిద్ధాంతమే దీక్షాబోధగా రచింపబడినదని తెలిపెను. సిద్ధాంత శిఖామణిలో గురుకారుణ్య స్థలము, లింగ ధారణ స్థలముల ఛాయలను ఈ గ్రంథమున గాంచగలము. ఇదే కాలమునకు చెందిన చెన్నాప్రగడ నాగేశ్వరకవి, సిద్ధాంత శిఖామణిని ద్విపదగా రచించిరి. అయితే సిద్ధాంత శిఖామణి యొక్క పూర్ణ రూపము గ్రహించలేదని తెలియుచున్నది. ఇంకనూ ఇది అముద్రితముగానే యున్నది.

పర్వతమంత్రి వీరమాహేశ్వరాచార సంగ్రహమువంటి గ్రంథములు సిద్ధాంత శిఖామణిలోని భావములను శ్రౌత శైవమున కనుగుణముగా మార్చికొనబడినట్టివని తెలిసికొనగలరు. వీరశైవమున అంగీకార యోగ్యములైనవి కావని యెంచబడిన ఉపనయన సంస్కారము యజ్ఞోపవీత ధారణము, గాయత్రీ ఉపాసన, అగ్ని ముఖార్చన ఇత్యాదులను శ్రౌతశైవులు ప్రచారములోనికి తెచ్చిరి. సిద్ధాంత పరముగా చూచిన యెడల, సిద్ధాంత శిఖామణి శ్రౌతశైవులకును అనుసరణీయమైనదని తెలుపబడినది.

ఈ విధముగా వీరశైవాంధ్ర వాఙ్మయము సిద్ధాంత శిఖామణి ప్రభావమునకు లోనై ఎన్నో వినూత్నమైన భావములనావిష్కరించినవని తెలిసికొనగలరు.

ఒక సిద్ధాంతమును జన సామాన్యమునకు, చేరువగా తెచ్చెడి సాధనములలో ప్రవచనమెంతో మహిమాన్వితమైనది. ఈ సత్యమును, గుర్తెరిగిన వీరశైవాచార్యులు కలకాలముగా ప్రవచన ప్రభలను వెదజల్లుచున్నారు. అయితే ప్రవచనమునకు లిఖితరూపము నిచ్చిన ఘనత శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ కృతికర్తకు దక్కుచున్నది.

## ప్రవచన ప్రభ విశిష్టత :

ఆధునిక ఆధ్యాత్మికతా క్షేత్రములో ప్రవచనమున కెంతో ప్రాముఖ్యత గలదు. నవనాగరికతా వికసన-విక్రాంతుల కారణమున నైతిక విలువలు దిగజారుచున్నవి. శాంతి, సుస్థిరత, పురోగమన మరియు ప్రమోదములు కరువైనవి. పరపీడనా పరాయణులవలన ప్రజలు భయభ్రాంతులకు లోనగుచున్నారు. ఇట్టి స్థితిలో ప్రవచనములు మణిదీపికలై జన సామాన్యమును సత్క్రమమార్గములో నడిపించెడి సాధనములగుచున్నవి. ఇట్టి ఉత్కృష్టమైన విలువలను పోషించెడి ప్రవచనములలో కాశీ జగద్గురువులు డా॥ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి వారి ప్రవచనము ప్రశస్తమైనదై విలసిల్లుచున్నది. వినూత్నమైన వెలుగుల నీనెడి యీ విశిష్ట ప్రభ లోక కళ్యాణమును సాధించెడి దిశలో ప్రసరించుచున్నది.

ప్రవచన కర్త యీ క్రింది లక్ష్యములను స్మృతి-పథమున నుంచికొని ప్రవచనములను ప్రదానము చేసెనని తెలియుచున్నది.

1. సనాతనమైన వీరశైవ ధర్మములోన యిమిడియున్న మౌలికమైనట్టి మానవతా విలువలకు విశిష్టమైన ప్రచారము నిచ్చి తద్వారా సర్వజన హితమును, సమరస భావమును సాధించుట.

2. తాత్త్విక వినీలాకాశములో సహస్ర చంద్ర ప్రభాపటలముతో విరాజిల్లెడి ఆది జగద్గురు శ్రీరేణుకాచార్యుల విశిష్టత గురించి ప్రజలకు తెలియజెప్పుట.

3. ధర్మాచరణమే లోకముల నుద్ధరించి ప్రగతి పథమున నడిపించెడి ప్రేరకమని విశదీకరించుట.

4. భారతావనిలో ప్రభవించిన తత్త్వములలో శక్తి-విశిష్టాద్వైతము గుణాత్మకమైనదని తెలియజెప్పుట.

5. ధర్మ చింతనాపరులకు ప్రేరణినిచ్చి వారిచేత బహుముఖ ప్రయోజనములను ప్రకల్పన చేసెడి ప్రశస్తమైన కార్యములను చేయించుట.

ఈ లక్ష్యములన్నియును వర్గ-వర్ణ-లింగ వివక్షతల కాస్కారము లేని విధముగా అన్ని వర్గములకు చెందినవారి నుద్దేశించి రూపొందింపబడినవని తెలిసికొనగలరు. జగద్వల్లభుని యభిమతమని గ్రహించుడి. ఈ లక్ష్యములను సాధించు నిమిత్తమున ప్రవచనము కొన్ని విశిష్టమైన లక్షణములను సంతరించికొనినది.

జగద్గురువులవారు జనరంజకమైన భాషను నుపయోగించిరి. భాష సంస్కృత పద భూయిష్టమైనట్లు దోచినను దేశభాషల తియ్యదనముల నందియ్య లేదనియనలేము. అవగాహనా సౌలభ్యమును చేకూర్చుటే అభినవ సర్వజ్ఞుని లక్ష్యమని తెలియుచున్నది. అయితే పండితుల యభిరుచులను విస్మరించినారని అనలేము. పండిత పామరుల యభిరుచులకు సమతౌల్యమును గల్పించారనియునూ లేము. భావపుష్టినొక యధికరణ కారకముగా గ్రహించి, తదనుగుణమైన భాషను ప్రయోగింపనైనది.

సిద్ధాంత ప్రతిపాదన విషయములో జగద్గురువుల వారు ఆది జగద్గురువునే యనుసరించిరి. మూల శ్లోకములనిచ్చి, వాటికి యవసరమైన మేరకు అన్వయ భావార్థములను ప్రదానము చేసిరి. అయితే సిద్ధాంతమును విడమరిచి చెప్పుటకై స్వతంత్రించిరి. సృజనాత్మకమైన శక్తిని ప్రయోగించి ప్రశస్తమైన రీతిలో సిద్ధాంతమును విస్తరించి చెప్పిరి. అయితే, విస్తరణ విహితమైన విధముగనే కొనసాగినది. సుదీర్ఘమైన విస్తరణకు పూనుకొనలేదు. శ్రోతల యొక్క అవధాన-అవగాహన పరిధులను దృష్టియందిడికొని విస్తరణ ప్రక్రియను చేపట్టిరి.

తాను చెప్పెడిది మహాత్ముల మన్ననలను పొందిన విషయమే యని తెలుపుటకు కాబోలు మహానుభావుల వచనములను ఉద్ధరించి చూపిరి. శివశరణుల వచనముల నెన్నింటినో మనమీ ప్రవచనములో గాంచగలము. మహారాష్ట్రలో విఖ్యాతి నార్జించిన మన్మథస్వామి, అభిప్రాయములకు అభినుతి, అభిదానము లివ్వబడినవి.

హిందీ కవులకైతలకు కమనీయమైన స్థానమివ్వబడినది. తెలుగు భాషతో పరిచయము లేనివాడైనందున శ్రీవారు తెలుగువారి భావముల నుటంకించరైరి. మహానుభావుల మాటలకు మహత్తును చేకూర్చుటకై స్వామివారు తంత్రముల నుండియును, వేదాదుల నుండియును, ఉపనిషత్తుల నుండియును అనేక ప్రమాణముల నొసంగిరి. పురాణముల నుండి గ్రహింపబడిన భావములు పౌరాణికుల ప్రశంసలనందినవి. భక్తుల హృదయములోనికి చొచ్చుకొని పోయే విధముగా భావములను ప్రతిపాదించుటకై పండితోత్తముడైన ప్రవచన కర్త లోకోక్తుల నుపయోగించిరి. ప్రవచనమునకు మరింత బలమును చేకూర్చుటకై దృష్టాంతముల నిచ్చిరి. కథలను చెప్పిరి. కన్నులకు కట్టినట్లుగా చిత్రీకరించిరి. ఉపమానోపమేయకములనొక వినూత్న మైన విధిలో ప్రవేశపెట్టిరి.

భక్తిని పెంచుటే పరమ కర్తవ్యమని యెంచెడి పరశివస్వరూపి, శ్రోతల మానసిక క్షేత్రములలో భక్తి బీజముల నాటెడి అవశ్యకతను విస్మరించరైరి. నమ్మక చత్రమును, విశ్వాస నిర్మితిని దృఢ తరము చేయుటకై గురువుల వారు గురుతరమైన ప్రయత్నమును చేసిరి. భక్తి వెర్రి తలలను వేసి వైపరీత్యముల సృష్టించుట హితకారి కాదని యెంచెడి పరమేశ్వర స్వరూపుడు జ్ఞాన దాయకమైన బోధనలెన్నింటినో ప్రధానము జేసిరి. భర్తృహరి భావములకు ప్రధానమైన స్థానమునిచ్చిరి. స్థానికులైన జర్జజ్ఞుని వంటి నీతి బోధకుల భావములకు సముచితములైన స్థానమునిచ్చిరి.

ఆశీర్వచనమనెడి పేరిడబడిన తన ప్రవచనమును ఉసంహరించెడి సందర్భములలో ఉపేంద్ర వల్లభ సన్నిభుడు వారు ఉపదేశమునిచ్చిరి. సమకాలిన స్థితి గతులలో భక్తమహేశ్వరులును, ఇతరులును ఎట్టి వైఖరి యవలంభించవలెనో యనెడిది తెలుపబడినది. ఈ విధముగా సకల సద్గుణసమోపేతమై సదసద్వివేకాదులను కల్పించెడి ప్రవచనమును ప్రసాదించిన ప్రవచన కర్తకు సంబంధించిన వివరములను తెలిసికొనుట వివేకవంతుల లక్షణము కదా! ఆ దిశలో మనము ప్రయత్నింతుముగాక!

## సిద్ధాంత శిఖామణి - సాహితి విలువలు :

సిద్ధాంత శిఖామణికి "జ్ఞానవలీ" హిందీ వాఖ్యను వ్రాసిన ఆచార్య డా॥ రాధేశ్యామ్ చతుర్వేదిగారు సిద్ధాంత శిఖామణి ఒక మహాకావ్యమని నుతించిరి. 1997 సం॥లో కాశీ యందు నిర్వహింబడిన "జాతీయ చర్చాగోష్ఠి" సిద్ధాంత శిఖామణిని పరిశీలించి, యిది ఒక ఉత్తమ సాహిత కృతి యని తేల్చి చెప్పినది. ఈ గోష్ఠిలో పాల్గొనినవారు దేశములోని నలు మూలల నుండి వచ్చిన పండితులని తెలిసికొనుడి. ఇతని పరిశీలనాత్మక వాఖ్యల నేపథ్యమున సిద్ధాంత శిఖామణిలోన యిమిడి యున్న కావ్యకళను పరిశీలింతము గావుత.

కావ్యమునకు వస్తువు ఎంతో ముఖ్యమైన దనియెంచబడినది. వస్తువు పురాతనమైనదై ఉండవలెననెడి యభిప్రాయమొకటిగాదు. ఆ వస్తువు యెడల కృతకర్త కెనలేని భక్తి ప్రపత్తులుండవలెననెడి మరొక యభిమతము గలదు. ఈ రెంటికిసరిపడే విధముగా శివుని కథను వస్తువుగా గైకొన బడినది. నాయకునిగా శివునికి అద్వితీయమైన గుణములు గలవు. ఒక దశలో అతడు నిర్గుణుడైనను సర్వజ్ఞత్వము, సర్వ కర్తృత్వము మరియు ఈశత్వమతనిని అద్వితీయునిగా చేయుచున్నది. కృతి ప్రవక్తయైన రేణుకునికిని, ప్రవక్త చెప్పిన దానిని గ్రంథస్తము చేసి శివయోగికి శివుని యెడల యనుపమానమైన భక్తి కలదు. ప్రథమ పరిచ్ఛేదములోని శివస్తుతిని, పిండ స్థలములోని శివుని గుణగణముల వర్ణన యీ విషయమును దృఢతరము చేయుచున్నది. అయితే, నాయిక యెవ్వరనెడి ప్రశ్న తలయెత్తును. ఇచ్చుట గుర్తించ వలసిన దేమనగా జీవుడే నాయిక. నాయికా నాయకుల యనుబంధ సంబంధములలో వచ్చెడి మార్పుల గురించిన వివరణయే 'ఆద్యసత్కథల" కథనము.

అత్యుత్తమమైన కావ్యవస్తువైననూ, దానికి వినూత్న కావ్యగుణముల మేళనము చేయకుండినచో కథనము పేలవముగానుండును. ఈ విధముగా పరిణమించకుండా ఉండుటకై తగు జాగరూకత గైకొనబడినదని తెలియుచున్నది. తత్ఫలితముగా సిద్ధాంత శిఖామణి కొన్ని ప్రత్యేక లక్షణములనుసంతరించికొనినది.

కథావస్తువు ప్రాచీనమైన దైననూదానికి క్రొత్త దనము కల్పింపబడినది. సిద్ధాంత శిఖామణి కంటెను పూర్వమువెలువడిన శైవకావ్యములకు, సిద్ధాంత శిఖామణికి పోలిక లేనే లేదు. శివ-జీవ సంబంధబాంధవ్యముల యెడల దృష్టిని సారించిన కావ్యాలలో సిద్ధాంత శిఖామణి మొట్టమొదటిదని చెప్పవచ్చును.

ఈ కావ్యము ప్రాథమికముగా శివాద్వైత సిద్ధాంతమును వివరించుటకొరకే రచింపబడిననూ, కేవలము సిద్ధాంత కృతిగాగోచరించదు. శివలీలా వైభవమును వివరించెడి కథలో సిద్ధాంతము మేళవింపబదినది. చతుర్థ పరిచ్ఛేదము వరకును కథాంశమే చెప్పబడినది. 5వ పరిచ్ఛేదము నుండి 20వ పరిచ్ఛేదము పర్యంతముగల బాగములో సిద్ధాంత వివరణను గాంచగలము. 21వ పరిచ్ఛేదమున త్రికోటి శివలింగముల ప్రతిష్ఠాపనకు సంబంధించిన కథ వివరింపబడినది.

వేద, వేదాంగ, ఆగమ, పురాణాదుల నుండి వాక్యముల నుద్ధరించి యుదహరించినా, అవి ఉద్ధృత వాక్యములుగా కనిపించకుండా ఉండుటకై తగు జాగ్రత్త చూపబడినది. కృతిప్రవక్త కవితా ధారలోన యివి లయ మొందినవని చెప్పవచ్చును. ఈ విషయమును బహిర్గతము చేసెడి క్రింది శ్లోకమును గనుడి:

**శ్లో॥ అతప్తతనురజ్ఞో వై ఆమః సంస్కారవర్జితః।**
**దీక్షయా రహితః సాక్షాన్నాప్నుయాల్లిఙ్గముత్తమమ్**

(సి.శి. 6:61)

"అతప్తతనూర్నతదామో అశ్నుతే" అనెడిది శ్రుతి వాక్యము. ఈ వాక్యము శ్లోకము నందున లయయై వినూత్నమైన రూపమును సంతరించుకొనినది.

అయితే ప్రవక్త తనకు గల వైదిక, ఆగమిక మరియు పౌరాణిక విజ్ఞానము యీ విధముగా విస్తరించి చూపినా, కేవలము పాండిత్య ప్రకటనమునకై తానీ విధిన విస్తరించుచున్నాడనెడి భావము పాఠకులకు కలుగకుండా ఉండుటకై తగు జాగరూకత వహించినట్లు దోచుచున్నది. ఇదెంతో శ్లాఘనీయమైన యంశము కదా! ఈ సందర్భముగా మరొక అంశమును గుర్తించగలము. వేద, వేదాంగ, ఆగమ పురాణాదులలోని విడివిడిగా నున్న భావముల నొక్కచోటికి చేర్చినప్పుడు, అవి ప్రత్యేకమైన అంశములని దోచే విధముగా రచన కొనసాగింపబడినది.

ఛందస్సు విషయమునకు వచ్చిన యెడల అందరికీ సులభముగా అవగతమయ్యెడి విధముగా కావ్యమును తీర్చి దిద్దుటకై బహుళ ప్రచారములో నున్న అనుష్టుప్ఛందమే యుపయుక్తమైనదిగా గ్రహింపబడినదని తెలియుచున్నది. అయితే పరిచ్ఛేదము యొక్క చివరన వివిధ ఛందములను ఉపయోగించినట్లు గ్రహించ గలము. వీటిలో మాలినీ, పంశస్థ, శార్దూలవిక్రీడితము మొదలగునవి గలవు.

అన్వయ సౌలభ్యము, భావస్పష్టత, క్లిష్టత్వ నివారణ మొదలగునవి సాధించుటకై వలయు భాషాశైలిని యెంపిక చేసికొనినట్టుల తెలియుచున్నది. దీర్ఘసమాసములనుపయోగించక పోవడమును గ్రహించగలము. చిన్న చిన్న సమాసములతో అనల్పమైన భావములు చెప్పబడినవి. ఇక అక్షరముల విషయమునకు వచ్చినచో, పారాయణ సౌలభ్యమును సాధించుటకు కాబోలు, వర్గ ప్రథమ, తృతీయాక్షరములనే అధికముగా నుపయోగించబడినవని తెలియుచున్నది. ఈ విషయమును వివరించెడి డా॥ రాధేశ్యామ్ చతుర్వేదిగారి విశ్లేషణ గమనార్హమైనదై యున్నది.

ఉపమానములను కుప్పలు కుప్పలుగా గుప్పించి పాఠకుల నుక్కిరి బిక్కిరి చేసెడి ప్రయత్నములనీకృతి యందున గాంచగలము. క్రింది శ్లోకమును గనుడి:

**శ్లో॥ అర్థహీనా యథా వాణీ పతిహీనా యథా సతీ।**
**శ్రుతిహీనా యథా బుద్ధిర్భావహీన తథా క్రియా॥**

(సి.శి. 16:19)

క్రియ భావ సహితమై యుండని యెడల గల్గెడి ఫలితమును ఈ శ్లోకము వివరించినది. ఉపమాలంకారముతో బాటుగా అనేకమైన ఇతర అలంకారములు ఉపయోగింపబడినవి. వీటిలో పరికర, వస్తూపమా, శ్లేష, ఉత్ప్రేక్ష రూపకములు గలవు. ఒకే శ్లోకములో ఒకటి కంటెను ఎక్కువ అలంకారములను స్ఫురింపజేసెడి ప్రయత్నమును గాంచగలము ఈ శ్లోకముగనుడి:

**శ్లో॥ పరిజ్ఞాతే శివే సాక్షాత్కో వాఽన్యమభికాంక్షతీ।**
**నిధానే మహతి ప్రాప్తైకఃకాచం యాచతేఽన్యతః**

(సి.శి. 13:6)

ఇందులో ప్రతి వస్తూపమతో బాటుగా ప్రశ్నాలంకారము కూడ ఉపయోగింపబడినదని గుర్తించుడి. ఈ క్రింది దానిలో వస్తూపమ రూపకముల సమరస దర్శనమును గాంచగలము.

**శ్లో॥ శివానందం సమాసాద్యకోఽవాన్యముపతిష్ఠతె।**
**గంగామృతం పరిత్యజ కః కాంక్షేన్మృగతృష్ణికామ్** (సి.శి. 13:7)

ఇందులో ప్రశ్నాలంకారమును కూడ గాంచగలము.

ఈ విధముగా సిద్ధాంత శిఖామణి విశిష్టాలంకారాల చేత నలంకృతమైన రూపము గల్గి విశేషమైన శోభతో విరాజిల్లుచున్నది.

ఇది భక్తి ప్రధానమైన కావ్యమగుటచేత నవరసపోషణాకాస్కారము లేదు. శాంత రసపోషణకు లోపము లేనేలేదు సంసారహేయస్థలమున భీభత్సభయానక కాస్కారమేర్పడినదని గ్రహించగలము. తామస నిరసన స్థలము రౌద్ర రసపోషణము చేపట్టబడినది. శరణ స్థలమున శృంగార రసము పోషింపబడినది. ఇయ్యది ఆధ్యాత్మిక రతికి సంబంధించినదని గుర్తించగలరు. ఐక్య స్థలమున అద్భుత రసానుభూతి కవకాశము లభించునని తెలిసికొనుడి. ఈ విధముగా సాధ్యమైనంత మేరకు రసపోషణ సముచితమైన రీతి చేపట్టబడినదని గ్రహించగలరు.

కావ్యములో అష్టాదశ వర్ణనలుండవలెననిలాక్షిణికులందరు కైలాససభావర్ణనము, అగస్త్యాశ్రమవర్ణనము, లింగోద్భవ లీలా వర్ణనము మొదలగువాటిలో అనేక విధములైన వర్ణనలను గాంచగలము.

ఈ చర్చ యొక్క నేపథ్యములో మనము తెలిసికొనవలసిన దేమనగా సిద్ధాంత శిఖామణి సర్వలక్షణ సమన్వితమై యలరారెడి అమూల్యమైన కావ్యము.

## ప్రవచనానువాద విధానము

భాషాంతరీకరణ యనెడిదొక సంక్లిష్టమైన కార్యము. అనువదించెడి వాడనేకమైన యవరోధముల నెదుర్కొన వలసి యుండును. మూలమును రచించిన వ్యక్తి పాండతీవైభవ సంపన్నుడుగాను,ఆధ్యాత్మిక జగత్తును పరిపాలించెడి సామ్రాట్టుగాను, దిశ పరివ్యాపితమైయున్న కీర్తి ప్రభను గల్గిన వాడుగను విరాజిల్లుచుండిన సందర్భములలోన యీ అవరోధము లనంతములై యనువాదకునిని ఉక్కిరి బిక్కిరి చేయును. బుద్ధి భయమునకు లోనగును. కరము కదలనని భీష్మించు కొనును. నేనెట్టి స్థితినే యెదుర్కొంటిని. అల్పజ్ఞుడనైన నేను అనలజ్ఞుడును, సర్వజ్ఞత్వం లక్షణాన్వితుడను, చదువులకు నెలవైన కాశికా నగరిలో జ్ఞాన సింహాసనము నధిష్ఠించినవాడును, బహుభాషా కోవిదుడును, ప్రవచనకర్తగా అశేష జనావళి యొక్క అభిమానమును చూరగొనినవాడును డా॥ చంద్రశేఖర శివాచార్య మహాస్వాముల వారి కన్నడ ప్రవచనమును అనువదించుటకు పూను కొనుట ఒక సాహసమే. అయితే నేనిట్టి సాహసమును చేపట్టుటకు కారకము మరియు ప్రేరకము మహాస్వాముల వారి యనుల్లంఘనీయమైన ఆజ్ఞయే. ప్రేమానురాగముల సాకార స్వరూపుడైన వాడును, శీత సహస్ర చంద్రులు ప్రసరింపజేసెడి వెన్నెలలను పోలెడి చల్లదనముతో కూడికొని యున్న అనురాగమును వర్షించెడి వాడును అయిన అపర చంద్రశేఖరుడు దగ్గరకు చేర్చుకొని ధైర్యమును ప్రసాదముగా ప్రధానము చేసిరి. నీకిది దుస్సాధ్యము కాదనిరి. మఠస్థఅయ్యాగా నున్న నీకిది ధార్మిక కర్తవ్య మనిరి.

యథాతథముగా అనువదించుట లోగల సాధక బాధకముల నేపథ్యమున స్వేచ్ఛ నభిలషించితిని. స్వేచ్ఛానువాదము సేతునంటిని. యథాయథముగా అనువదించుమనిరి. శ్రీ వారిచ్చిన స్వేచ్ఛను కొంత మేరకు మాత్రమే స్వీకరించితిని మూలమున నుండెడి భాషా సౌందర్యమునకును, భావ పరిపుష్టికిని భంగము కలుగని విధముగా అనువదించుటకై ప్రయత్నించితిని.

మూల శ్లోకముల అన్వయ భావార్థముల నొసంగెడి సందర్భములలో తెలుగులో వెలువడిన సిద్ధాంత శిఖామణి గ్రంథముల బరికించితిని. భావార్థమునకు పటుత్వమొసంగుటకు యత్నించితిని. విషయ విస్తరణ విషయములోన అనాసక్తి పరిధిని తగ్గించుటకై తగు జాగ్రత్తలను గైకొంటిని. నిడివిని పెంచుకొనుటయో లేక తగ్గించుటయో చేయుట జరిగినది. అయితే విషయము యొక్క మౌళిక భావములు చెడకుండా జాగ్రత్త వహించి తగు చర్యలను గైకొంటిని.

ప్రవచనములో నుదహరింపబడిన కన్నడ పద్య-గద్య కృతులను అనువదించెడి సందర్భములో మూలమును యదాతథముగా నిచ్చితిని. తెలుగు లిపి నుపయోగించితిని. ఈ విధముగా చేయుట వలన రెండు లక్ష్యము సిద్ధించుకృతిని యెంచితిని. మొదటిది కృతకర్త కృతిని యదాతథముగా పఠించుట వలన పాఠకునికి దివ్యానుభూతిని పొందుటకు సంబంధించినదైతే, రెండవది అనువాదము యొక్క విశ్వసనీయతను పెంచుటకు అనుబంధము గల్గియున్నది. పద్యగద్య కృతుల మూలములోనున్న సొగసులు చెడకుండగ ఉండేవిధిన గద్యపద్యముల ననువదించితిని. మూలమున కతి సమీపమున నుండే భాషనుపయోగించితిని. కన్నడ, సంస్కృతలోకోక్తులు నీవిధముగా నే యనువదింపబడినవి.

స్వామివారుదహరించిన దృష్టాంతములు, కథలు మరియు దృశ్యములు ప్రవచన ప్రభ యొక్క ప్రకాశమును ఇనుమడింప జేసెడి వని తెలిసికొనగలరు. వీటిని యనువదించెడి సందర్భములో వీటిలోని సందేశమును ప్రస్పుటముగా తెలియజేయుటకై ప్రత్యేక శ్రద్ధను గైకొంటిని.

## ప్రదీపికా రచన

కర్ణాటకలో బహుళ ప్రచారము నొందిన సిద్ధాంత శిఖామణి అచ్చుటి పండితుల చేత బహు విధములుగా పరామర్శింపబడెను. అనేక టీకా గ్రంథములు తెలుపబడినవి. తెలుగు నేలలోన యిట్టి కృషి చేపట్టబడలేదు. కొందరు మూల పాఠము మాత్రమే ప్రకటించిరి. మరి కొందరు భావార్థ సహితముగా ప్రచురించిరి. పండిత పెద్దమఠం రాచవీర దేవర వారి కృషి చేత వెలువడిన గ్రంథమీకోవకు చెందినది. కొలనుపాకలోని సోమేశ్వరస్వామి వీరభద్రయ్యగారొక గ్రంథము ప్రకటించిరి. ఇదియును ఈ కోవకు చెందినదే. ఇట్టి లోపమును పూరించుటకై ప్రదీపికా రచన చేపట్టనైనది.

జగద్గురువుల వారి ఆశీర్వచనముల లోన యుటంకింపబడిన సిద్ధాంత శిఖామణి పాఠము (శ్లోకములను), జగద్గురువుల వారి ఆశీః ప్రసంగమును నైపుణ్యముగా గైకొని ప్రదీపికను రచించితిని. ఆగమోక్తమైన షట్ స్థల సిద్ధాంతమును, శివతత్వములో నిమిడియున్న షట్త్రింశత్త్వములను భావచత్రముగా ()విశ్లేషణ చేపట్టబడినది. విశ్లేషణ, సైద్ధాంతికాంశములను పలువిధములైన కోణముల నుండి పరిశీలించుటకు చేపట్టబడినది. ఈ సందర్భములో నాటి నుండి నేటి వరకు తెలుగు నాట వెలసిన కవిపండితుల యభిప్రాయము లను ప్రకాశములోనికి తేబడినవి. మన తెలుగు నాటి చారిత్రాత్మక, సాహితీ పరమైన యనుభవములను గణన లోనికి గైకొననైనది. వీటిని కన్నడిగుల అను భావములతో పోల్చి చూడనైనది. తన్నిమిత్తమై శివశరణుల యనుభవము ప్రాతిపదికగా గైకొనబడినది. అవకాశమున్న చోట ఆగమ వాఙ్మయము పండిత త్రయము యొక్క కృతులకును, పాల్కురికి వారి బృహత్సాహితీ వైభవమునకును, శివ కవుల చింతనలకును సుసంగత్యముండే విధముగా ప్రదీపికా రచన కొనసాగించబడినది.

ప్రదీప యొక్క పాత్రను కేవలము విశ్లేషణకు మాత్రమే పరిమితము చేయబడలేదు. జగద్గురువుల వారి ఉపదేశము యొక్క ప్రాముఖ్యతను విశదీకరించుటతో ప్రదీపిక క్రియాశీలమైన పాత్రను పోషించే విధముగా మలచబడినది. శ్రీవారి ఉపదేశమునకు బలమును చేకూర్చుటకై వలయు ప్రబోద ప్రేరణ నొసంగుటకై ప్రయత్నించనైనది.

## పాద దీపికలు

1. చూడుడి : ఆంధ్రపత్రిక వారి "బసవ పురాణము" లోని పీఠికా భాగము మరియు "పండితారాధ్య చరిత్ర"లోని పీఠికా భాగము.
2. శైవ భారతీ శోధ ప్రతిష్ఠానము వారి శ్రీ సిద్ధాంత శిఖామణి (2006) లోని శ్రీ జగద్గురువుల వారి ప్రస్తావననను చూడుడి.
3. చూడుడి : ఉపోద్ఘాతము పండితారాధ్య చరిత్ర, ఆంధ్రపత్రిక వారి ప్రచురణ.
4. చూడుడి : శివధర్మ గ్రంథమాల, సికింద్రాబాద్ వారి "రేణుక విజయము"లోని ప్రసక్తి.
5. చూడుడి : శివధర్మ గ్రంథమాల, సికింద్రాబాద్ వారి "రేణుక విజయము"లోని ప్రసక్తి".
6. వివరములకై పంచమ పరిచ్ఛేదములోని ద్వితీయాశీర్వచనమును దర్శించుడి.
7. రేణుక విజయములోని ప్రసక్తి.
8. వివరములకై శ్రీకర భాష్యము కొరకు పండిత చిదిరె మఠం వీరభద్రశర్మగారు వ్రాసి వాస్తవికమును చూడుడి.
9. శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ (బెంగుళూరు: శ్రీ పంచాచార్య మానవ ధర్మసంస్థే), 4వ సంపాదన, 2006, పుట 123).
10. రేణుక విజయములోని ప్రసక్తి.

# పిండస్థలము

## ఆశీర్వచనము-1

శ్రీ సిద్ధాంత శిఖామణియనెడిది వీరశైవ షట్స్థలమార్గమునకు చెందిన నూటొక్క సోపానములను నిరూపించెడి ప్రాచీనమైన యేకైక సంస్కృత గ్రంథమైయున్నది. వీరశైవమహామతస్థాపనా చార్యులలో నొకరైన శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారి చేత, సప్తసాగరములనే తన యదరమునందు జీర్ణించుకొని మహామహిమాన్వితుడయిన శ్రీ ఆగస్త్యమహర్షికి నుపదేశింపబడిన యీ షట్స్థల సిద్ధాంతము, శ్రీ శివయోగిశివాచార్యుల చేత సంగ్రహింపబడినది.

తెలుగు దేశములోని కొలనుపాక క్షేత్రమున శ్రీ సోమేశ్వర మహాలింగమునుండి శివుని యానతి మేరకు దివ్యదేహధారియై లోకోద్ధారణకై యవతరించిన శ్రీజగద్గురు రేణుకభగవత్పాదులు, నాకాశమార్గమున సంచరించుచు, మలయాచలమునకు వెళ్ళగా, అక్కడే నివసించుచుండిన అగస్త్యమహర్షులు, ధర్మపత్నియైన లోపాముద్రతో, పూజ్యపాదుల నాదరముతో నాహ్వానించికొని వచ్చి, యున్నతాసనము మీద కూర్చుంబెట్టి, పాద్యాదులతో పాదారవిందములను పూజించి, చేతులు జోడించికొని కూర్చుండగా, శ్రీ భగవత్పాదులు తపోవిషయకమైన కుశల ప్రశ్నలను అడిగిరి. అప్పుడు అగస్త్యుడు “ఓ భగవంతుడా! తమరి యనుగ్రహము చేత నా తపస్సునందున నెట్టి విఘ్నములును లేవు, అయినా సకల వేదాగమములను చదివిన నా మనస్సునందు నొక సంశయము సంభూతమైనది అదేమనగా, వేదములందు “ద్వా సుపర్ణా సయుజా సఖాయా” (ముండ ఉ॥ 3-1-1) మొదలైన ద్వైత మంత్రములు, “ఏకమే నా ద్వితీయం బ్రహ్మ” (ఛాం.ఉ.6-2-1). మొదలగు అద్వైత మంత్రములు పరస్పర విరుద్ధములై కనబడుచున్నవి. అంతేకాదు, ద్వైతవాదులు ద్వైతపరమైన మంత్రములే సత్యమైనవనియును, అద్వైత భోధక మంత్రములు సేనాధిపతికి యతని శౌర్యము ఇత్యాదులను చూచి, నీవే రాజువని చెప్పునట్లే యది జీవాత్మకు పరమాత్మయని చెప్పెడి మంత్రములు కేవలము ఉపచారార్థములే కాని సత్యమైనని కావని చెప్పుదురు. అదేవిధిన అద్వైతవాదులు అద్వైత మంత్రములే సత్యమైనవనియు, ద్వైతమంత్రములు మాత్రము లోక ప్రసిద్ధమైన ద్వైతమును మరల చెప్పుచున్నవేకాని, నూతనమును గూర్చి భోధించెడివికానందున, వాటికి ప్రామాణికత లోపించినదని యందురు. ఇట్టి ప్రసంగమునందు, వీటిమర్మములనెరుగక మూఢునిగానున్న నాకు మార్గమును చూపించవలెనని యీ క్రింది విధిన ప్రార్థించెను.

శ్లో॥ ఉక్త్వా భవాన్ సకలలోక మహోపకారమ్ ।
సిద్ధాంత సంగ్రహమై నాదృత బాహ్య తంత్రమ్ ॥
సద్యః కృతార్ధయితేమర్హతి దివ్య యోగిన్ ।
నానాగమ శ్రవణవర్తిత తం సంశయం మామ్ ॥ (సి.శి.4 : 53)

అప్పుడు

శ్లో॥ అథాగస్త్య వచః శ్రుత్వా రేణుకో గణనాయక ।
ధ్యాత్వాక్షణం మహాదేవం సాంబమహ సమా హితః ॥ (సి.శి.5:1)

అగస్త్యుని యొక్క విజ్ఞాపనను విని శ్రీ రేణుకాచార్యుల వారు క్షణకాలము మేరకు శక్తి విశిష్టుడైన శివుని ధ్యానము చేసి అగస్త్యునితో ఈ క్రింది విధమున చెప్పెను.

శ్లో॥ అగస్త్య ముని శార్దూల సమస్తాగమపారగ ।
శివజ్ఞానకరం వక్ష్యే సిద్ధాంతం శ్రుణు సాదరమ్ ॥ (సి.శి.5-2)

(సకల శాస్త్రములు చదివిన ఓ అగస్త్యుడా! నీ సందేహమును దూరము చేసే శివ జ్ఞానమును నిచ్చెడి సిద్ధాంత తత్వములను చెప్పుచున్నాను. వినుము)

నీకు సందేహమును గల్గించిన ద్వైతమరియు నద్వైత మంత్రములకు వేదమే ప్రమాణమైన కారణమున నొకదానిని కాదని మరొక దానిని గౌరవించుట శాస్త్రసమ్మతమైనది కాదు. ఈ కారణమున నుభయ సమ్మతమైన వీరశైవ షట్స్థల సిద్ధాంతము అందరికిని ఆదరణీయమైయున్నది.

సర్వ శ్రుతుల సమన్వయాత్మకమైన ఈ సిద్ధాంతములోని ముక్తి మార్గమునందు ముఖ్యమైన భక్త, మహేశ, ప్రసాది, ప్రాణలింగి, శరణ మరియు నైక్యమనే ఆరు సోపానములు గలవు. వీటిలో భక్త మరియు మహేశ శ్థలములోని సాధకుడు నారాధనీయుడైన పరమాత్మను తనకంటెను భిన్నమైన వానిగా తెలిసికొని శ్రద్ధ మరియు నిష్ఠలతో పూజిస్తాడు, అందుచేత నీరెండు స్థలములయందు జీవ-పరముల భేదమును బోధించెడి ద్వైత శ్రుతులు సార్థకమగు చున్నవి. మున్ముందు నితని సాధన వెలుగొంది, అవధాన మరియు ననుభవ భక్తుల చేత, ప్రసాది మరియు ప్రాణ లింగ స్థలములకేదగును. ఇతడు జీవ పరమాత్ములందు నత్యంత భేదముకాని, అత్యంతాభేదముకాని యనుభవించకుండ భేదాభేదముల ననుభవించును. ముందున నానంద మరియు సమరస భక్తుల ప్రభావము చేత, భావము వికాసమై శరణ మరియు ఐక్య స్థలములను చేరిన సాధకుడు పరమాత్మునితో తనను అత్యంతాభిన్నమైనవానిగా తెలిసికొంటాడు. ఈ విధిన నీ షట్ స్థల మార్గమునందు క్రమముగా సాధకునికి భావవికాసమై భేద-భేదాభేద-అభేదమును ననుభవించుటచేత శ్రుతులన్నింటి సమన్వయాత్మకమగు యీ సిద్ధాంతము మిగిలిన సిద్ధాంతములన్నింటికి శిఖామణియై మొప్పుచున్నది.

శ్రీ రేణుక భగవత్పాదులీవిధముగా ప్రతిపాదించిన పిదప, నగస్త్యుడు “ఓ భగవంతుడా! యీ షట్స్థల మార్గమును కూలంకషముగా బోధించవలసినదని వెడగా. నప్పుడు శ్రీ రేణుక భగవత్పాదులు.

**శ్లో॥ భక్తస్థలం ప్రవక్ష్యామి ప్రథమం కలశోద్భవ ।**
**తదవాంతర్ భేదాంశ్చ సమాహిత్మనాః శ్రుణు ॥** (సి.శి.5-24)

భక్తిస్థలం గురించియు, దాని యవాంతర భేదములను గూర్చి చెప్పుచున్నాను. చక్కగా నుంచబడిన మనస్సుతో వినుము

శ్రీ రేణుక భగవత్పాదులు సవిస్తారముగా నుపదేశించిరి. వీరు తెలియజెప్పిన స్థలములలో మొదటి స్థలమే పిండస్థలము.

పిండాండ మరియు బ్రహ్మాండములనెడి శబ్దములు దార్శనిక ప్రపంచమునందున నెంతయో వాడుకలో నున్నవి. పిండాండమనగా శరీరము, బ్రహ్మాండమనగా జగత్తు. ఇవి యీ రెంటికి సామాన్యమైన యర్థములు ఈ సందర్భమున పిండస్థలమునందు వచ్చెడి “పిండ” శబ్దముకు తనదే యగునొక విశేషార్థము గలదు. అద్దానిని శ్రీ రేణుక భగవత్పాదులు ఈ క్రింది విధిన వివరించిరి.

**శ్లో॥ బహుజన్మకృతౌః తై పుణ్యైః ప్రక్షీణే పాప పంజరే ।**
**శుద్ధాంతః కరణో దేహీ పిండశబ్దేన గీయతే ॥** (సి.శి.5ః 30)

అనేక జన్మలలో చేయబడిన పుణ్యముల చేత నశింపబడిన పాపసంచయము గల వాడును, పరిశుద్ధమైన అంత కరణ గల వాడును, అగు దేహధారి (జీవుడు) పిండశబ్దము చేత పిలువబడు చున్నాడు

పుణ్యము, పాపము, పూర్వజన్మ మరియు పునర్జన్మలు కంటికి కనిపించెడి వస్తువులుగావు. వీటిని శాస్త్రానుభవముల వలననే అరయవలెను. అదేవిధిన “తస్మాత్ శాస్త్రంప్రమాణంతే కార్యకార్యవవస్థితౌ” (గీతా, 6-24) అని గీతాకారుడునుపదేశించిరి. లౌకిక జీవనము నందునూ ప్రత్యక్షముగా నగోచరమైన దానిని యనుమాన మరియు శబ్ద ప్రమాణముల వలన యరసినటులే, పుణ్యము, పాపము మరియు జన్మాంతరములను నరయ వలెననిన శాస్త్రములకు శరణాగతులై యుండవలసి యున్నది.

భారతీయ శాస్త్రజ్ఞులు జీవుల సంఖ్యను నొకటికాదు, రెండుకాదు, 84 లక్షలుగా పరిగణించిరి. వీటిలో నుద్భిజ్జములు 21 లక్షలు, స్వేదజములు 21 లక్షలు, అండజములు 21 లక్షలు మరియు జరాయుజులు 21 లక్షలని మననశీలురైన మునులు మనోగతాభిప్రాయము. ఇదే మాటను అక్కగారి యనుభవములోని నుడుపువలన చెప్పవలెననిన.

**ఒందల్ల ఎరడల్ల మూరల్ల నాల్కల్ల-**
**ఎంబత్తు నాల్కు లక్షయోనియొళగె బందె బందె!**
**బారద భవంగళ నుండెనుండె!**
**శుభాశభంగళ కండె కండె!**
**హిందణ జన్మ గళే నాదరూఆగలి,**
**ముందేనీ కరుణసా చెన్న మల్లికార్జునా!**

అక్కగారి వచనము యొక్క తెలుగు అనువాదము:
**ఒకటికాదు, రెండు కాదు మూడుకాదు నాల్గుకాదు,**
**ఎనుబది నాల్గు లక్షల యోనులలో నుండి వచ్చితి వచ్చితి!**
**రారాని భవంబులు గలిగె గలిగె!**
**శుభాశుభముల కంటి కంటి!**
**వెనుకటి జన్మలేమైననూ కాని,**
**ముందట మీరు కరుణించు మో చెన్నమల్లికార్జునా**

"పాపానుగుణదింద గిడమర క్రిమిగళ రూపాగి, కీటపతంగాదియాగి, ఆ పక్షికులవాగి, మృగజాతి యాగి, మేలాగి పశు రూపాగి బహుబాధేగలిసి"అని శ్రీ నిజగుణశివయోగులవారు చెప్పినట్లుగ, మనుష్యడుతానే చేసిన పరవధూ కూటమి, అన్యులవిత్తాపహరణ, అభక్ష్యసేవన, హింసలనే శారీరిక పాపములచేత, హుళక్కి, యనుచిత్వము, నిష్ఠురత్వము, పైశూన్యము (చాడీలు చెప్పుట) లనేడి వాచిక దోషముల యెడల ననురాగము, అనిష్టచింతనము, పర ధన పరసతుల యెడలాకాంక్షలనేడి మానసిక దురితముల వలన హీనాతిహీనములైన యోనులయందు జన్మను దాల్చి, ఆయా జన్మల యందు ననుభవించవలసిన యెన్నో పాపములననుభించి యవశిష్టమైన పుణ్యపాపములు సమానమైన పిదప "ఉభాభ్యాంపుణ్యపాపాభ్యాంమానుష్యం లభ్యతే వశ: (1-41, పు.40) అనే నైష్కర్మ సిద్ధిలోని వచనానుసారముగ పున: మనుష్యునిగ జన్మనుదాల్చును.

ఈ విషయమును మరింత యెక్కువగా తెలిసికొనుటకై శ్రీ నిజగుణ శివయోగి వాక్కులు గమనార్హములని యెంచి వాటి తెలుగు రూపం నువ్వనైనది.

**"పాపానుగుణము చేత చెట్టుచేమ క్రిముల రూపమై**
**కీటక పతంగాదులై, ఆపక్షికులమై, మృగజాతియై**
**ఆ మీద పశురూపమై బహుబాధలను గడించి"**

అన్ని జన్మల యందు మనుష్య జన్మ శ్రేష్ఠమైనది ఈ విధిననే శ్రీ నిజగుణ శివయోగులు "నరజన్మ దిందిహదొళు మిగిలుంటే" నరజన్మము కంటె మించిన దుండునే? అనుచు దీని మహిమను కొనియాడిరి దీనికెల్ల కారణము మనుష్యుని యందుండె కర్తృత్వ శక్తియే. మనుష్యుడు సత్యకర్మలను జేసి స్వర్గానికీ పోవచ్చును. జ్ఞానమును సంపాదించి ముక్తుడునూ కావచ్చును. అటులనే దుష్కర్మల నాచరించి మరల హీనయోనులకు వెనుతిరుగనూ వచ్చును అనేక పర్యాయములనంతమైన హీనయోనుల యందు తిరిగి, దైవయోగము వలన మనుష్య జన్మమునకు వచ్చిన జీవి మళ్ళీ దుష్కర్మలనాచంచి యధోగతికి పోవుట సరియైనదికాదు. ఇటులే, "దురితకర్మవనొల్లదిరు పుణ్యవనేమాడు దురిత కర్మము నొల్లక యుండి పుణ్యమును చేయము" అని శ్రీ నిజగుణులునుపదేశించిరి ఎరుగుట కీ మాటలు సులభమైనా, ఆచరించుటయెంతో కఠినమైనది.

" "పరోపకార: పుణ్యాయ, పాపాయ పరపీడనమ్," (పరోపకారమే పుణ్యము, పాపమే పరపీడనము)" అని వ్యాసమహర్షిగారు పుణ్య పాపముల యర్థమును నర్థవంతముగనెరిగించిరి. అందుకే జ్ఞాను లీవిధిన చెప్పిరి.

**శో॥ "పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యంనేచ్ఛన్తి మానవా: ।**
**పాపస్య ఫలం నేచ్ఛంతి పాపం కుర్వన్తి యత్నత: ॥**

పుణ్యము యొక్కఫలమును కోరెడి మానవులు పుణ్యకార్యము చేయటకు నిష్టపడరనియును, పాప కర్మలను ప్రయత్న పూర్వకముగ చేసెడి వీరు పాపఫలముననుభవించుట కిష్టపడరని పై శ్లోకము యొక్క భావము. పాపమును రెయింబవళ్లు ప్రయత్నపూర్వకముగ చేసే మనిషికి సుఖము చిక్కుటెట్లు? అందుచేతనే బహుళ సంఖ్యాకమైన జనులు నెల్లప్పుడూ దుఃఖసాగరమునందు మునిగియున్న వీరికి దుఃఖము సుఖముగా గోచరించే అవివేకము సంప్రాప్తించును. "దుఃఖవన్నే సుఖవైబరు అవివేకి గళం". వివేకవిహీనులు దుఃఖమునే సుఖమందురని నిజగుణులవారి వాక్కులు. అవివేకులై జీవనమును కొనసాగించే జీవుల యిట్టి యవివేకమును దూరము చేయుటే శాస్త్రముల ప్రయోజనము.

మనము ఆచరించెడి పుణ్యకర్మలయందు సకామ పుణ్యమనియూ, నిష్కామ పుణ్యమనియూ రెండు విధములు గలవు. వీటియందు నిష్కామపుణ్యము చేతనే యంతః కరణము శుద్ధియయ్యెడి కారణముననూ, అంతః శౌచమే ముక్తికి మూలమైన దైనందున, ముముక్షువు దీనినే యాచరించవలెను. దేహములోని స్వచ్ఛత, సౌందర్యము మొదలైనవి లోకములోని జనుల ప్రేమను సంపాదించెడి కారణములైననూ, అంతరంగములోని స్వచ్ఛత-సుందరతలు దేవుని ప్రేమను సంపాదించుటకై మూలములై యున్నవి. బసవేశ్వరుల వారి వచనము గనుడి:

**కళబేడ కొలబేడ హుసియనుడియలు బేడ**
**అన్యరిగె అసహ్య పడబేడ**
**తన్నబణ్ణిసబేడ, ఇదిరు హళియలు బేడ**
**ఇదే అంతరంగశుద్ధి, ఇదే బహిరంగ శుద్ధి**
**ఇదే నమ్మకూడల సంగమదేవర నొలిసుతపరి**

ఈ వచనమునందు నంతరంగ బహిరంగములరెంటి శుద్ధియూ శివుని మెప్పుదలకు కారణమగునని సూచించిరి వివరములు గోరువారు బసవేశ్వర గీతామృతము (2005, పేజి-237-238)ను చూడగలరు.

చెట్ల మీది ఫలములు పక్వమైననే పక్షుల తమంతట తామే వచ్చెడియటుల, నాదప్రియుడూ, వేదప్రియుడుకాక భక్తి ప్రియుడైన శివుడు, పరిపక్వమైనయంత:కరణ గల భక్తులకు అమ్ముడు బోవుచున్నాడు "నమ్బికరెదరె ఓ ఎన్ననే శివను? నంబరు నచ్చరుబ రిదె కరెవరు నంబలరియరీ లోకద మనుజరు" "నమ్మి పిలిచినచో ఓ అనడా శివుడు? నమ్మరు, నచ్చరు, ఊరకే పిలుస్తారు, నమ్మనెరుగరీ లోకములోని మనుజులని అన్నగారి పరిపక్వ హృదయులుగా భక్తుల మనోగతిని వివరించిరి.

"ఓ శివుడా! మీ వాస్తవికమైన వాసస్థాన మెయ్యది" యని పార్వతి ప్రశ్నింపగా 'మద్భక్తా యత్రగాయంతి తత్ర తిష్ఠామి పార్వతీ!" "నన్ను స్మరించెడి భక్తుల హృదయమునందు నుండుచున్నానని శివుడు తెలిపెను.

అటులే భక్తి యనెడి విత్తినబీజము సరిగా మొలకెత్తి పలమివ్వవలెనన్న యోగ్యమై ఉండవలెను. అటులే భక్తి యనెడి పంట పండి ముక్తి కావలెననెడి యెడల అంతః కరణ శుద్ధి యవసరము.

విత్తిన బీజము సరిగా మొలకెత్తి ఫలమివ్వవలెనన్న క్షేత్రము స్వచ్ఛముగనూ, యోగ్యమూ అయియుండవలెను. అటులే భక్తియనెడి పంట పండి ముక్తియనెడి ఫలము కావలెనెనినెనెడ, అంతః కరణమనెడి క్షేత్రమునకు శుద్ధి యవసరము. నూటొక్క అంతస్తుల మహలును కట్టుటకే భద్రమైన నేలకట్టు వలయునటులే, వీరశైవుల నూటొక్క అంతస్తుల ముక్తి మందిరము కట్టుటకు నీ పిండస్థలము పునాది పాత్రను పోషించును.

శ్రీ జగద్గురువుల వారి యాదేశము రీతిగనే పాపపంజరమునుండి బయలువెడలిన మానవుడు పిండమని అనిపించి కొనును. వారింట చెట్టుకు వ్రేలాడు పురుగులు తమమేని చుట్టూ ముళ్ళను పెనవేసి కొని వాటిమధ్య నివసించినటులే, జీవాత్మ కూడ తాను చేసికొనిన పాపమనే పంజరమునందు తానే చక్కికొనివుండును- అందుచేత దూరమగుటకు తానే ప్రయత్నించవలసియుండును పాపక్షయము రెండు విధములుగానున్నది. మొదటిది దాని ఫలమును ననుభవించుట, రెండవది పుణ్యకర్మలను చేయుట. పాపమును ననుభవించియే తీరవలే ననిన నెంతో కాలము కావలెను. అంతేకాదు, పాపఫలము ననుభవిస్తూ, దాని వాసనాబలముచేత మరల పాపకర్మలను చేయవలసివచ్చునేగాని పాపము నుండి నివృత్తిని పొందుట చాలా కష్టము. దీనినే సుభాషితకారులు నీదిగువ తెలిపిన విధిన చెప్పిరి.

**శ్లో॥ అదత్త దోషేణ భవేద్దరిద్ర: ।**
**దారిద్ర్యదోషేణ కరోతి పాపం ।**
**పాపాదవశ్యం నరకం ప్రయాతి।**
**పునర్దరిద్రో పునరేవ పాపి॥**

ఈ జన్మలో చేయని దోషముల వలన పూర్వజన్మకు చెందిన వాటివల్ల దరిద్రము సంప్రాప్తమగు ననియును, దరిద్రదోషము వలనపాపమును చేయుననియును, పాపము చేత నరకానికి పోవుననియును, మళ్ళీ దరిద్రుడై పాపియగుచున్నాడని శ్లోకములోని భావము పాపమును నాశనము చేసెడి రెండవ యుపాయమైన పుణ్యములు చేయుట వలన మానవుడు పాప పంజరము నుండి సహజముగా ముక్తుడగును. శ్రీ రేణుకాచార్యులు నీ మార్గమునే నొక్కి చెప్పిరి.

పాపభంజకములైన పుణ్య కర్మలైననూ యజ్ఞ, దాన, జపతపాదులు బహువిధములుగనుండి, బహుళ కష్టసాధ్యములైయున్నవి. స్వేచ్ఛా ప్రవృత్తుల వలన శాస్త్రముల యందు శ్రద్ధలేని యీ కలికాలమున యజ్ఞ యాగాదులు నాచరించుట అసాధ్యమైన మాట. ఈ కాలమున జనులకు నల్పశ్రమచే మహాఫలము యొక్క ప్రాప్తి కావలెను. అట్టిది దేవుని నామ స్మరణ యొకటే. అందుకే "కలౌ నామ సంకీర్తనమ్" అనియనిరి. నామస్మరణ యొక్క మహిమ యద్భుతమైనది దూదిపింజల మహాపర్వతమును, అగ్ని కణముసావకాశముగా భస్మము చేసినయటులె అనంతకాలమునుండి సంగ్రహింపబడిన పాపమనెడి పర్వతము నామస్మరణ యనెడి అగ్నికి సంపర్కమైన పిదప సహజము దహింపబడును.

అందరికీ తెలిసినయటుల మహాపాపియైన వేటగాడు, నారద మహర్షిచే "రామ"మంత్రమును పొంది, అది సరిగా అనలేక "మరా" "మరా" యని విపరీతముగానే నుచ్చరించి పాపనిర్ముక్తుడై ఆదికవి వాల్మీకి యని అనిపించుకొనుట, నామజపము యొక్క అద్భుత మహిమయై యున్నది. భూమియందు విత్తిన బీజమును ఎట్లు వేసిననూ మొలక ఊర్ధ్వ ముఖముగా వచ్చెడియటులే శ్రద్ధ యొకటుంటే చాలు, మంత్రమెట్లు జపించిననూ సిద్ధిలభించును. ఈ విషయమున "ఉలటానామ్ జపత జగజానా, వాల్మీకి భయో బ్రహ్మసమానా" అని తులసీదాసు నుడివిరి.

శివధ్యాస, శివ చింతన లేని నరుడు పెండయందుండుడే వేనకువేల పురుగులవలె "ఇద్దరేను శివశివా సత్తరేనూ శివశివా" యని బసవన్న తనవచనమున శివనామమును జపించని మనుష్యుని పెండలోని పురుగని నిందించిరి. యీ క్రింది వచనము గనుడి.

**వాయుగుణపను సర్పబల్లుదు,**
**మధురగుణవను ఇరువే బల్లుదు,**
**వేళె గుణవను కోళి బల్లుదు,**
**గోత్రగుణవను కాగెబల్లుదు**
**మనుష్యజన్మ దల్గి బందు శివజ్ఞానవిల్లదిర్దొడె**
**ఆకాగె కోళిగింత కర కష్టకాణా కలిదేవరదేవ।**

ఈ వచనము యొక్క తెలుగు అనువాదము నీ క్రింద నివ్వనైనది.
**వాయుగుణమును సర్పమెరుగును**
**మధుర గుణమును చీమ యెరుగును**
**గోత్రాగుణమును కాకి యెరుగును**
**మనుష్య జన్మయందున వచ్చి శివజ్ఞానము లేకుండిన**
**ఆ కాకి కోళ్ళకంటెను కని కష్టుడుగ నవుమా కలిదేవర దేవ**

పశుపక్షులందు స్వభావసిద్ధమైన కొన్ని గుణములు గలవు. అయితే అవి మనుష్యులందు లేవు. వాయువులోని సూక్ష్మమైన శుద్ధతలను సర్పమెరుగునే కాని, యితరులెరగరు మాధుర్యమునెరిగే గుణము స్వాభావికముగా చీమకుగలదు చెట్టు మొదలును

మూరుకొని కొమ్మయందు పక్వమైన పండు నెరిగి నేరుగా నదే పండుకు చీమలు చాలుగట్టును. మనుష్యుడైతే పండును కొరికి పుల్లదని నుమ్మివేయుటను చూస్తాము.

ఒక యూరియందు సుశిక్షితులైన దంపతులు నివసించు చుండిరి చదివిన వారిపిల్లలు నిత్యోపయోగ పదార్థములను డబ్బీలలో వేసి వాటి మీద పదార్థముల పేర్లు వ్రాసినట్లే వీరు కూడా వ్రాసిరి. వాన కాలము దినము, ఇంటిలో చీమల సంఖ్యపెరిగినది. అన్నీ చీమలు చాలు గట్టి చక్కెర డబ్బ కడకు పోదొడగినవి. చీమల బెడదకు బేజారైన ఆడవారు. చక్కెర డబ్బిని యింకొక స్థలమున పెట్టిననూ వాటి బాధ తప్పలేదు అప్పుడు నా చదివికొనిన ఆడపిల్లలు చీమలను మోసగించాలని, కారపు పొడియని వ్రాయబడిన డబ్బియందు చక్కెరను, అటులే చక్కెర యని వ్రాయబడిన డబ్బియందు కారపు పోడిని పోసి పెట్టిరి. భర్త, ఆఫీసునుండి రాగానే ఛాయి చేసియిచ్చుట భార్య కర్తవ్యమైయున్నది. అయితే, ఆ సాయాంకాలమున, తలనొప్పి చేత బడలికజెంది పండుకొనియున్న భార్యను చూసిన భర్త యే దినము తానే చాయి చేయవలెనని వంట యింటికి పొయి పోయ్యి మీద నీటిని మసలుటకై పెట్టి, డబ్బాలమీద వ్రాయబడిన పేర్లను చూసి మొదట చాయి పొడివేసిన పిదప చక్కరయని వ్రాయబడిన డబ్బిని గైకొని డబ్బా తెరిచేలోపునే విద్యుత్తుపోయినది. చీకటిలోనె డబ్బి మూతను దీసి దానిలోని కారప్పొడిని చాయ్‌లోవేసి, మూత మూసి యదాస్థామున నుంచెను. అంతలోనే విద్యుత్తువచ్చి దీపము వెలిగెను. చాయ్ వైపు చూడగానది చక్కటి రంగుగల్గియుండెను. తాను మంచి చాయిని కాయ గల్గితినను గర్వముతో, తన భార్యకు నొక కప్పును ఇచ్చి తానొక కప్పుటీని గైకొనెను. నాలుకకు చాయ్ తాకగానే 'చుర్' మని యన్నది. అప్పుడేతని భార్య, "అయ్యో, మోసమైనది. నేను చీమలను మోసము చేయవలెనని యెంచి చక్కెరయని వ్రాయబడిన డబ్బిలో కారపు పొడిని వేసితిని, అయితే మీరే మోసపోతిరి కదా!" అని వంటయింటిలోనికి వచ్చి చూస్తుంది. కారపు పొడి యని వ్రాయబడిన డబ్బీలో చక్కెరగలదని యెరిగి చీమలు చాలు కట్టి యుండెను. "ఏమండీ, చీమలకున్న బుద్ధి మీకులేదుకదా" యని గేలి చేసినది. దీనివల్ల తెలిసినదేమనగా, చీమల కుండెడి మధుర గుణపు జ్ఞానము మనుష్యులకు లేదు.

అదేవిధముగా నైసర్గిక వాతావరణము వలన బ్రాహ్మీముహూర్తమును కోడి యెరిగినంతగా మనుష్యుడు ఎరుగడు. కోళ్ళనేవి ప్రాచీనకాలములోని అలారమ్ గడియారములు. పల్లెలోని రైతులందరు కోడి కూయగనే ఇంక తెల్లవారెడి వేళ సమీపించినదని లేచి తమ పనులు చేయుటను, ప్రారంభింతురు. గడియారమును చూడనిదే వేళను గుర్తించుట మనుష్యునికెన్నటికినీ సాధ్యము కాదు. అటులే కాకివలె తమ బంధు బలగమును ప్రేమ చేయుట మనుష్యునికి సాధ్యముకాదు.

కాకికది స్వాభావికమైన గుణము. అట్లె "కాగె బందుగుళ కండరె కరెయదే తన బంధు బళగము "నని అన్న గారు పలికిరి మనుష్యునికి మాత్రము చాలా స్వార్థము గలదు మొదట తన పొట్ట నిండిన పిదప తనవారివైపు చూస్తాడు. "కాకి యొక్క మెతుకును కనిన మరి పిలువదే తన బందు బలగము "నని అన్నగారి నుడువుల యర్థము. పశుపక్షులకుండెడిదొక్క గుణమైననూ మనుష్యునికి లేని కారణమున, అన్ని ప్రాణులలోను శ్రేష్ఠుడు అని అనిపించుకొను మనుష్యుడు, తనకుండె శ్రేష్ఠమైన గుణమంటే, పశుపక్షులు చేయజాల కుండెడి శివద్యాన జ్ఞానములే. ఒకవేళ మనుష్యుడు వాటిని చేయకుండిన యెడల నా కాకి, కోళ్ళ కంటె యీతని జీవనము హేయమైనదని "రజకరత్న" మడివాళ మాచయ్య వారి యభిప్రాయమై యున్నది.

**" ఇళె నిమ్మదాన, బెళె నిమ్మదాన,**
**సుళిదు సూసువ గాళి నిమ్మదాన,**
**నిమ్మదానవ నుండు అన్యరను హొగళువ**
**కున్నిగళ నెనెంబె రామనాథ! " అని చెప్పే**
శ్రీ దేవర దాసి మార్యుని వచనమొకటి గలది. దీని తెలుగు రూపము
**ఇడ మీ దానము పంట మీ దానము**
**సుళ్ళు జుట్టి చల్లెడి గాలి మీ దానము**
**మీ దానమును మెక్కియన్యులను పొగడెడి**
**కుక్కపిల్లల నేమందు రామనాథ!**

దేవర దాసిమార్యుల వచనము ప్రకారము అన్ని పదార్థములు పరమాత్మునివన్నదినిజము. అతనికి పదార్థములకై కోరిక లేదు. ఇట్లు నన్నిటిని యిచ్చిన యతని పేరును భక్తితో నొక్కసారియైననూ నుడివిన చాలు ఇంకనూ కావలసినవీ యివ్వగల సమర్థుడు శివుడు.

ఒక గృహస్థుడు మరణోన్ముఖుడయ్యేడి సమయమునందు అతని పిల్లలు నతని దగ్గరకు వచ్చి "అప్పా! అంత్య కాలమునందు మాకేమి చెప్పెదరు?" అని ప్రేమతో నడుగగా "పిల్లలార! హరనుతి" అని ప్రాణములు విడిచెను వృద్ధుడు పిల్లలకు భూమిని ఎక్కువగా పండించుటకు (సాగు) చెయుడియని చెప్పదలచి, నోరు తిరుగని కారణమున "హరనుతి" యనెను, ఎంత ఎక్కువ పొలమును సాగులోనికి తెస్తే, అంత హెచ్చులాభమగునని వృద్ధుని భావములోననుండెను అంత్యకాలమున నీతడు "హర" యనెడి తన నామమును నుడివి యుండెనని శివుడు గణపదవిని యిచ్చెనని శ్రీ నిజ గుణులు నీక్రింది విధిన తెలిపిరి.

**మరణకాల దల్లి హొలద, హరగణెనుత కళావళిసిద॥**
**నరనిగ భవనొలిసిద సారతరద సోగసుగైదనాగి॥**

ఈ వాక్కుల తెలుగు రూపమిది:

**మరణ కాలమునందు పొలములో**
**పసనుచేయుమని కలవరించిన**
**నరునికి భవుడు వలచి, సార**
**తెరగు సొగసు చెయ్దంబుగాన.**

శివనామ మహిమను శ్రీ నిజగుణుల మాటలలో

**"హరనామవను బిదె జగిస బల్లవర**
**భవ-మరణ-మాయా-కర్మమల పాశ బంధ**
**బహుదురిత సంసార సంతాప**
**సంచయవళిదు వరభోగ మోక్షవహుదు.**

దీని తెలుగురూపమిది :

**హరనామమును విడక జపించగల వారి**
**భవ-మరణ-మాయా-కర్మ మల పాశబంధము,**
**బహు దురిత సంసార సంచయ మరగి**
**వరభోగ మోక్షమగును.**

హరనామము మనుషుని మనోరథములనెల్లనూ మెయికొనే కల్పవృక్షమని యెరిగించిరి. పంచాక్షరిలోని 'శివ' యనెడి రెండక్షరములు మహొత్కృష్టమైనవని తెలిపెడి యీ శ్లోకమును గమనించుడి:

**శ్లో॥ విద్యాసు శ్రుతిరుత్కృష్టాతలైకాదశినీ శ్రుతౌ।**
**తత్ర పంచాక్షరీ మంత్రః తత్రశివేత్యక్షర ద్వయం॥**

విద్యలలో శ్రుతి యుత్కృష్టమైన దనియును,శ్రుతి కంటెను దానిలో నేకాదశిని గొప్పదనియును, దాని కంటెను నటయున్న పంచాక్షరి గొప్పదనియును, దానికంటె దానిలోని శివయనెడి రెండక్షరములు చాలా గొప్పపనియును యీ శ్లోకమునందు చెప్పబడినది రుద్రాధ్యాయము సభ్యసించుటకును, పంచాక్షరిని జపించుటకును నసమర్థులుగా నున్నవారు, అంత్యక్షణమున నాలుక చేత "శివ" యనెడి రెండక్షరములు నుడివిన చాలు జీవనము సార్థకమగును.

శతకోటి పాపములను చేసి శ్వేతుడనెడి మహాపాపి "శివుని" యనెడి పేరుగల వేశ్యయంద ననురక్తుడై దినదినము నామె ముడిచికొనుటకై మల్లెలు మొదలగు పువ్వులను తెచ్చుచుండెను. ఒకసారి యితరుల తోటలోనికి దొంగతనముగా ప్రవేశించి పువ్వులు కోసికొని కంచెను దాటి వచ్చేటప్పుడు కాలు జారి నేల బడెను అప్పుడు చేతిలోని పూవులన్నియు జారి క్రింద బడగ, వాడు

నీపూలు శివునికి ముట్టనీ యని ప్రాణములు వదిలెను. జీవితములో చివరి వరకునూ పాపములను చేసిన వీని ప్రాణమును తీసికొని నరక యాతన పెట్టుటకై భయంకరులైన యమ దూతలు నొక దిక్కునుంఢి రాగా, మరొక దిక్కునుండి యితడు నంత్యకాలమునందు శివ నామమును నుడివినందులకు గణపదవినిచ్చుటకై శివ దూతలు వచ్చిరి. శ్వేతుని ప్రాణము గురించి వీరియందుననేక వాద ప్రతివాదములై చివరకు శివదూతలు నిట్లనిరి "యీతడునగణిత పాపములను చేసినది సత్యమైననూ మరణకాలమునందు పరమపావనమైన శివుని నామమునుచ్చరించుటచేత 'కుంబారగె వరుషదొ' గె నిమిష "కుమ్మరికి వరుషము, ద్రోనెకు నిమిష" మనెడి పలువురాడెడి మాట వలె జన్మజన్మాంతర పాపములన్ని శివనామ స్మరణచే దహింపబడినవి" యమదూతలకు విషయమవగతమయ్యెను. శివదూతలు, శివునినాజ్ఞమేరకు, శ్వేతునికి గణపదవిని నొసంగిరి.

శ్వేతుడు మరణ కాలమునందున భక్తితో శివ నామ స్మరణ చేయకుండిననూ, అతడు నుచ్చరించిన వెలయాలి పేరులో "శివ" యని యుండుటచేత పాప విముక్తుడయ్యెను. అట్టి యెడ శివనామమును భక్తితో నుండి స్మరించిన నెడ నెట్టి ఫలితములు నుండునో వేరుగా చెప్పనక్కర లేదు.

ఏ సంప్రదాయమునకు చెందిన వారైననూ శివ నామస్మరణ చేసిన నెడ జన్మ జన్మాంతరములలోన తాను చేసిన పాపము నశించి పోవును. పరిశుద్ధాంతరంగుడగును పిండుడనిపించికొని వీరశైవ సిద్ధాంతరీత్యా షట్ స్థల మార్గమునందు నడచుటకు నర్హుడగుచున్నాడు. ఎవ్వరైనను వారివారి యిష్ట దైవముల నామస్మరణ చేసిననూ అవన్నియునూ శివనామస్మరణగానీ పరిణమించి సత్ఫలితముల నొసంగును దీనికి గల కారణమేమనగా దేవుడొక్కడే నామములనేకములు. దీనిని వేదవాక్కులలో చెప్పవలెననిన

**"ఏకమ్ సద్విప్రా బహుధా వదంతి"**

అందుచేత మీరెల్లరూ తమతమ యిష్టదైవముల నామముల జపించి పాపములను తొలగించుకొని తమ తమ మనోబుద్ధులను పరిశుద్ధముగా నుంచికొని పిండస్థలములకు సాధికారులై వీరశైవ షట్ స్థల పథములో పయనించుటకు యోగ్యులుకాగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

దిII 15-07-1990
శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

విద్యావాచస్పతి శ్రీ చంద్ర శేఖర శివాచార్య మహాస్వామి వారు, ఈ ఆశీర్వచనమున పిండశబ్దముకును, పిండస్థలమునకు సంబంధించిన మౌళిక విషయము లెన్నింటినో వివరించిరి.

అండ, పిండ మరియు బ్రహ్మాండములనెడి పదములు బహువిస్తృతముగానుపయోగింపబడుచున్నవి. వీటికి గల అర్థములు కూడ విభిన్న విధములుగా విస్తరింపబడినవి సందర్భానుసారముగా వీటి భావములో మార్పు కన్పట్టుచున్నది " పేశీకోశో ద్విహీనేణ్డమ్" అని తెలుపుచు, అమరసింహుడు అండమనగా గ్రుడ్డు అని తెలిపిరి (అ.కో.ద్వి.కాం.సి.వ. శ్లో -37) పేశీకోశములనెడివి దీనికి పర్యాయపదములు "అనుతి నిస్సరత్యస్మోచ్ఛిశురిత్యండం" అనెడి లింగయ సూరిగారి వ్యుత్పత్తి ప్రకారము దీనినుండి పిల్లవెడలును. అందు చేత దీనికీ పేరు గల్గినది "పిండ్యతే పిండీ క్రియత ఇతి పిండం" అనెడి లింగయ సూరి వ్యుత్పత్తి ప్రకారము ముద్దగా చేయబడినది పిండమని తెలియుచున్నది. ఇది సాంకేతిక పరమైన అర్థమైయున్ననూ, పిండము గర్భమునకు పర్యాయపదముగా వాడబడుచున్నదని వావిళ్ళ వారి సంస్కృతాంధ్ర నిఘంటువు వలన తెలియుచ్చుంది. బ్రహ్మాండమనగా బ్రహ్మదేవుడు సృష్టించిన విశ్వమనెడి అర్థము గ్రహింపవచ్చును. ఈ మూడు పదములలోను నొకే అర్థమును గాంచగలము. అది పుట్టుక, జీవుల ప్రభవములోన యీ మూడింటికిని ప్రధానమైన భూమిక గలదు.

శ్రీ భగవత్పాదుల వారు పిండశబ్దమునే భావముతో ప్రయోగించిరో యనునది డాII జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు వివరించిరి. ఈ విషయమై మరి కొంత యవగాహన పెంచికొనుట వలన శ్రీవారి భావన మరింత స్పష్టమగును. తన్నిమిత్తమై పిండపద ప్రయోగము యొక్క పూర్వప్రయోగముల గురించి తెలిసికొనవలెను. శుద్ధశైవమునకు చెందిన తిరుమూలర్ అనెడి వాడు, తన తిరుమూలమనెడి

గ్రంథములో పిండలింగమనెడి ప్రయోగమును చేసిరని తెలియుచున్నది. సి.వి.నారాయణ అయ్యర్ అనెడి పండితుడు, తమ "Shaivism in south India" అనెడి గ్రంథములోన యీతిరుమూలర్‌కు సంబంధించిన వివరములనిచ్చిరని డా॥ బాడాల రామయ్య గారు “తమ బసవేశ్వర వచనాలు- సమగ్రసమీక్ష” యనెడి గ్రంథములోన యుల్లేఖించిరి (పే॥ 310) తిరుమూలర్ షట్ స్థల వివేచన గురించి వ్రాసిరనియును, అది వారి గ్రంథములోని ఏడవ తంత్రము యొక్క పూర్వ భాగమున గలదనియును, తెలుపబడినది. తిరుమూలర్ ప్రకారము అండలింగము, పిండలింగము, సదాశివలింగము, ఆత్మలింగము, జ్ఞానలింగము మరియు శివలింగములే షట్ స్థలములు. ఈ విచేచన వీరమాహేశ్వర సాంప్రదాయమునకు చెందినదనియును, ఇద్దానికి ప్రమథగణాధిపతి యగు నందీశ్వరుడే మూలపురుషుడని తెలుపబడినది సాధకుడు అండలింగమున ప్రవేశించి, క్రమక్రమముగా ప్రగతిని సాధించి శివలింగ స్థలమును చేరును.

శివలింగస్థలమెట్టిదోయని తెలిసుకొనుటకై స్థల శబ్ద వివేచన యవసరమగుచున్నది.

“స్థలతీతిస్థలం” అనెడి వ్యుత్పత్తి ప్రకారము, స్థలమనగాస్థానము. నీరు లేకుండగ,తనంతట తానేచదరమై యుండెడిస్థానమే స్థలమని చెప్పబడినది. ఈ లౌకికార్థము కంటెను భిన్నముగా మగ్గియమాయి దేవుడు స్థలమనే శబ్దమునకు పారలౌకిక అర్థమును ప్రతిపాదించిరి.

**శ్లో॥ “స్థీయతే లయతే యత్ర జగదేతచ్చరాచరమ్।**
**తద్బ్రహ్మస్థలమిత్యాహు: స్థలతత్వవిశారదా:”** (అనుభవసూత్రము, 2:1)

మాయిదేవిని భావనలకు శివాగమములే మూలమని తెలియుచున్నది.

పిండస్థలమనగా, పరబ్రహ్మతత్వమునకు చెందనిదనియును, పూర్ణ ప్రగతిని పొందే దిశలో శివలింగస్థలముండుననియు అపరిపూర్ణ దశలో అండ పిండ స్థలములుండునని తెలియుచున్నది.

తిరుమూలర్, ఆరవ శతాబ్దికి చెందిన వాడని, మద్రాసు విశ్వవిద్యాలయము వారు శైవమును గూర్చి 1936లో వెలువరించిన గ్రంథములో తెలుపబడినది శ్రీ లిం॥ కాశీజగద్గురువు వీరభద్ర శివాచార్యులవారు, తమ రేణుక విజయమనెడి గ్రంథములో సిద్ధాంత శిఖామణిని సంకలనము చేసిన శ్రీ శివయోగి శివాచార్యుల వారు క్రీ॥శ॥ ఏడవ శతాబ్దము కంటెను పూర్వుడని తెలియజెప్పిరి అట్టియెడ, తిరుమూలర్ సిద్ధాంత శిఖామణిలోని షట్‌స్థల వివేచనను గైకొని, దాని నాధారముగా తన వివేచనను విస్తరించిరని భావించుటకు అవకాశముకలదు.

పిండస్థలం అనునది, అండస్థలమునకు పిదపన వచ్చెడి స్థలమైనందున, అండస్థలమనునది పిండస్థలము కంటెను పూర్వదశయని తెలిసికొన వలెను. సాధకుడు, మొదటగా భక్తిశూన్యుడై యుండును. అట్టి దశను భవి దశయని యందురు. భవి యొక్క లక్షణములను తెలిపెడి యీ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ మద్యపానీ మాంసభక్షీ చాన్య దైవస్య పూజకః ।**
**అలింగీచ దురాచారీ పంచైతే భవినః స్మృతాః ॥**

భవికి అయిదు లక్షణములుండుననియును, మద్యపానము, మాంసభక్షణము, శివుడుకాక అన్యులను పూజించువాడు, లింగధారణ లేనివాడు, దురాచారము, లనెడివే భవి యొక్క లక్షణములని తెలుపబడినది. భక్తి మార్గ క్రియాస్థలమున మరికొన్ని లక్షణములను గాంచ గలము.

ఇట్టి లక్షణములు గల్గుటకు కర్మసంచయమే కారణమని, డా॥ చంద్రశేఖర జగద్గురువుల వారు తెలిపినది సత్యదూరమైన విషయము కానేరదు. “బహు జన్మ కృతైః పాపైః వర్ధతేత పాప పంజరం” అనెడి పండితోక్తి ప్రకారము పూర్వజన్మలలో చేసిన పాపముల ఫలితముగా మానవుడు ఈ విధముగా పరిణామమునొందుచున్నాడు. ఇట్టి వాని యుద్ధరణకు శివ కరుణ ప్రధానమైన భూమికను వహించును. కరుణలేనిదే భక్తి కలుగదనే సిద్ధాంతమొకటికలదు. దీనిని శక్తిపాత సిద్ధాంతమని యందురు. మానవుడు మలామాత్రుడై యుండుననియును, మలావృతమెంత ప్రగాఢముగా నుంటే శివభక్తిగల్గుట అంత కష్టమని చెప్పబడినది భక్తుడుగా రూపొందుటకై భవి, భవుని భవ్యమను కరుణ పొందాలని

సూచింప బడినది. మానవుడు ప్రయత్న పూర్వకముగా కృషిచేసిన గాని శివకరుణ ప్రసరింపదు. భవికి తనను తాను ఉద్ధరించికొనవలెననెడి కోరిక ముందుగా గలుగ వలెను.

ఇట్టి సంకల్పము కల్గుటకై శుద్ధాంత: కరణము గల్గి యుండవలెను. ఈ విషయమున సందేహమున కాస్కారములేదు. అట్టిది బహుజన్మలలో చేసిన పుణ్యముల వలన గల్గుననెడి విషయము నిత్యసత్యమే. ఈ రెండూ ఉండియూ తగిన ప్రోద్బలము లేని యెడల భవికి భక్తి యెడలననురక్తి పెరుగదు వారు దుష్టుల సహవాసమును పొంది చెడిపోవచ్చునూ అందుచేత, వారి హృదయములో భక్తి బీజములను నాటవలెను. ఎవ్వరు నాటవలెను? అనెడి ప్రశ్న ఉదయించును. సద్భక్తులే యనెడిది ఉత్తరము. గురువర్గమునకు చెందిన జగద్గురువుల, చరపట్టాధికారుల, మఠస్థ అయ్యల ధార్మిక ప్రసంగములనేర్పాటు చేయవలెను. నైష్ఠికతను గల్గిన వీరి ప్రసంగముల వలన జన సామాన్యములో శివభక్తి యెడల సుముఖత యేర్పడును వీరశైవ పండితులీ గురువర్గము వారి ప్రసంగములకు పుష్టినిచ్చెడి యత్న పూర్వకమైన సందేశముల నివ్వవలెను. సదస్సులనేర్పాటు చేసి శివోన్ముఖతను కల్గించవలెను. పురోహితవర్గము తమవంతు పాత్రను నిర్వహించవలెను. వీరశైవ పురోహితులు శుభకార్యాదులు చేయునప్పుడు భక్తి బీజములను నాటవలెను. సుఖవంత జంగములు వీరందరికీ తమ సహయమునందజేయవలెను. అప్పుడు భవి అండస్థలమును ప్రవేశించి, భక్తి బీజము మొలకెత్తి పెరిగే స్థితిలో పిండస్థలమున ప్రవేశించును.

**- శివం భూయాత్ -**

## ఆశీర్వచనము-2

ఈ సచరాచర ప్రపంచము శివశక్తుల విలాసవిభవము వలన ప్రభవించినదని వీరశైవ దార్శనిక దృష్టి తెలియజేయుచున్నది. యీ క్రింది శ్లోకమును గమనించుడి:

**శ్లో॥ శివశక్తి సముత్పన్నే ప్రపంచే స్మిన్ వికిలప్యతే ।**
**పుణ్యాధికః క్షీణపాపః శుద్ధాత్మా పిండనామకః** (సి.శి.5-32)

శివశక్తుల సంయోగము వలననుత్పన్నమైన యీ ప్రపంచమునందు, క్షీణమైన పాపమును, ఆధిక్యత గల పుణ్యమును గలవాడును, పరిశుద్ధమైనయంతరంగము గలవాడును, పిండమనే పేరుతో పిలువబడు చునున్నాడని శ్లోకము యొక్క అర్ధము. ముప్పదియారు తత్వములతో గూడికొడియున్నదే ప్రపంచమని వీరశైవ దర్శనము తెలుపుచున్నది శివ, శక్తి, సదాశివ, యీశ్వర, శుద్ధవిద్య, మాయ, కల,విద్య, రాగ, కాల, నియతి, పురుష, ప్రకృతి, మహత్తులును, అంతరంగ చతుష్టయమును, కర్మేంద్రియములును, జ్ఞానేంద్రియములును, పంచభూతములును, పంచతన్మాత్రలును నీ ముప్పదియారు తత్వములలో గలవు. ఈ తాత్విక సృష్టికి విమర్శ శక్తిగల్గిన పరశివుడే మూల కారణుడు. “శివ: శక్త్యాయుక్తోయదిభవతి శక్త: ప్రభవితుం” అనే ఆగమోక్తి ప్రకారము, శివుడు శక్తిని కూడికొనియుండని యెడల నీ ప్రపంచము పుట్టదని దీని అర్థము. శివశక్తులు చంద్ర చంద్రికలవలే విడదీయని యవినాభావసంబంధము చేత సదా కలసిమెలసియుందురు. పాలకడలి నుండియింపును, వెన్నల నుండి చల్లదనమును, పువ్వుల నుండి సువాసనను యెట్లువిడదీయలేమో, అదే విధిన శివశక్తులను విడదీయలేమని నిజగుణులు తెలిపిరి. కాళిదాసు గారును నిదియే విధిన నుడివిరి ఈ క్రింది శ్లోకమును గమనించుడి:

**శ్లో॥ వాగర్థావివసంపృక్తౌ వాగర్థః ప్రతిపత్తయే ।**
**జగత: పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ॥**

వాక్కు మరియు నర్థము వలె కలసిమెలసి యున్నవారనియును, జగత్తుకు తల్లిదండ్రులైన పార్వతీపరమేశ్వరులకు నమస్కారము చేయుచున్నానని శ్లోకములోని బావము.

శివుడు సచ్చిదానంద స్వరూపుడు. దీని భావమేమనగా నేనున్నాను, నేను ప్రకాశమానుడుగా నున్నాను. నేను నానందించు చున్నాను అనెడి యనుభవములోని యెచ్చరింతతో కూడికొని యుండును. ఈ అరయికనే విమర్శశక్తియన బడును. ఇది లేనియెడ శివుడు జడుడనిపించు కొనును. శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులు నీ క్రింది విధిననుపదేశించిరి.

శ్లో॥ యథా చంద్రే స్థిరా జోత్స్నా విశ్వవస్తుప్రకాశినీ ।
తథా శక్తి విమర్శాత్మా ప్రకారే బ్రహ్మణి స్థితా॥ (సి.శి.మ 20-38)

యెట్లైతే జగత్తులోని వస్తువులన్నింటిని ప్రకాశింపజేసెడి వెన్నెల చంద్రునిలో నెలకొని యున్నదో, అదే విధిన బ్రహ్మయందలి ప్రకాశమునందు విమర్శయనెడిది యుండునని శ్లోకములోని యర్థము.

ఏదో నొక పని జనించ వలెనని నుపాదాన మరియు నిమిత్త మనెడి రెండు కారణములు కావలెను. కుండల చేయుటకై మన్ను నుపాదాన కారణమగును. కుమ్మరి నిమిత్త కారణమగును.అదే విధిన జగదుత్పత్తికి శక్తి శివులు వరుసగా నుపాదాన నిమిత్త కారణములగు చున్నారు. లోకమునందున నుపాదాన నిమిత్తకారణములు పరస్పరము భిన్నములై యున్నవి. కాని శివశక్తులు విడివడిలేరు. ఇదే విశిష్టమైన యంశము. సాలెపురుగు తన గూటిని కట్టెటప్పుడు బయలు నుండి యేవస్తువులను తెచ్చికొనకయే తనదేయగు చేతనాంశవలన నిమిత్తకారణమై, శరీరాంశ వలన నుపాదానకారణమైన యటులే శివాంశ నిమిత్తకారణముగను, శివునిలో నెలకొనియున్న శక్తి యుపాదాన కారణముగను నగుచున్నవి. మరో మాటలో చెప్పవలెనని శివుడభిన్నుడై యుభయ కారణములగు చున్నాడు.

ఈ జగత్తుకు శక్తి యుపాదాన కారణమైనందున, దానినుండి యుత్పన్నమైన జగత్తులోని అన్ని పదార్థములయందు నొకానొక ప్రకారమైన శక్తి ఉండియే. ఉండును. జీవుని యందు నల్పజ్ఞత్వ అల్పకర్తృత్వములు, ఆకాశము నందలి వ్యాపనశక్తి, వాయువునందలి, స్పందనశక్తి, అగ్నియందలి జ్వలశక్తి, నీరునందలి పిండీకరణ శక్తి, భూమియందలి ధారణ గురుత్వాకర్షణ శక్తి మొదలగు వాటిని ఉదాహరణములుగా గైకొన వచ్చును.

విశ్వమున స్వకర్మానుసారముగా బ్రతికెడి జీవులెన్నో గలవు వీటిలో తాను చేసిన జపతపాదుల చేత నెంతో నెక్కువ పుణ్యమును గడించి, పాపమునకు చెందిన రాశిని నాశనము చేసికొని, పిండమని పిలువబడే పరిశుద్ధాంత కరణము గల జీవి, లక్షలాది నక్షత్రముల మధ్యన శోభించెడి పరిపూర్ణమైన చంద్రునివలె విశిష్టముగా కన్పట్టును ఇతనిలో మానవతలోని యుత్కృష్ట లక్షణములు నెలకొని యుండుటచేత, మనుష్యత్వ మున్న శ్రేష్టమనుష్యుడని యెన్నబడుచున్నాడు. మనుష్యత్వము ప్రాముఖ్యతను తెలిపే యీ క్రింది సుభాషితమును గమనించుడి.

శ్లో॥ దుర్లభం త్రయమేతత్ దైవానుగ్రహకారకమ్ ।
మనుష్యత్వం ముముక్షత్వం మహాజనసమాశ్రయ:

మనుష్యత్వము, ముముక్షత్వము, మహాజనుల సంగమము లనెడి దుర్లభమైన మూడింటి యందున మనుష్యత్వమునకు మొదటి స్థానముగలదని పై శ్లోకములోని భావము.

మనుష్యుడు, దేహమున్నంత మాత్రమున మనుష్యుడనిపించికొనడు ఉత్తమ శీలస్వభావముల చేత మనుష్యుడనిపించికొనును. ఇట్టి గుణములు లేనియెడల “మనుష్యరూపేణ మృగాశ్చరంతి” అని అనిపించి కొనును. మనుష్యరూపముతో మృగములు తిరుగాడు చున్నవి యని యీ సంస్కృత శ్లోక ఖండికలోని యర్థము.

ఒక చాకలి పులి చర్మమును తన గాడిదకు కప్పి, రాత్రి కాగానే పరుల పొలమునందు మేయుటకు విడుచుచుండెను. రాత్రిలో పొలమును గాచెడి జనులు పులికి బెదరి పొలమునుగాయునది వదిలి ఇంటికి పారిపోవు చుండిరి. గాడిద మాత్రము పొట్టనిండ పైరును దిని వెలుగునయ్యెడిలోననే తన యొడయుడగు చాకలి యింటికి చేరుచుండెను. గాడిద యొక్క యీ దైనందిన చర్య చేత నూరిలోని యనేక సస్య క్షేత్రములు నష్టమును పొందెను. పాడైన పొలములకు చెందిన పెద్దలందరూ కూడి కొని సమస్యను చర్చింప దొడుగిరి. పులిమాంసాహారియనియును, అది జొన్న, దంటులను తినజాలదని యీ పులి యింత వరకు జొన్న, దంటులను దినినదేగాని యెట్టి ప్రాణినిగాని, మనుష్యునిగాని హింసించలేదుకనుక యిందులో నేదియో మోసమున్నదనియును గ్రహించిరి. వారందరూ నిజమ నెరుగుటకై యనేక శస్త్రాస్త్రములను తీసికొని చేతినందు దివిటీలను ధరించి పులి మేయుచున్న పొలమునకేగి, యేకకాలము నందుననే వారందరూ పులి మీద పడి కొట్ట దొడంగిరి అది పులి కాదనియును. పులితోలు కప్పికొనిన గాడిదయని తెలిసెను. అప్పుడు, వారెల్లరూ యింతకంటె ముందుననే నిజమును తెలిసికొనలేని తమ యవివేకమును నిందించికొనిరి. చాకలికి తగిన శిక్షను విధించిరి.

ఈ దినములలో దోషిత వాతావరణమునందు, మృగములే యెక్కువగా నున్నవి. అడవి యందున నుండెడి మృగముల వలె జపతపాదులను వీడి చరించెడివారు నిందనీయులే యని నీతిశాస్త్రకోవిదులు చెప్పుచున్నారు. మనుష్యత్వమునకు దూరమైన వారిని యన్నగారు కూడ నిందించిరి. వేలకొలది జనులలోన  కొందరు మాత్రమె మనుష్యత్వము పొందుటకు ప్రయత్నించుచున్నారని గీతాకారుడునుడివెను గమనించుడి "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతి సిద్ధయే"  దీనివలన పిండస్థలములోని యధికారము గల వారి సంఖ్య అల్పమైనదైయుండునని గ్రహింపదగును.

**ఓం శాంతి: శాంతి: శాంతి:**

16-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక:

శ్రీ జగద్గురువులవారు పిండస్థలమునకు చెందిన మౌళికాంశములను వివరిస్తూ శివశక్తుల సంగమమువలన పుట్టిన ప్రపంచములో పుణ్యాధిక్యతగల్గిన జీవుడు పిండుడనిపించి కొనునని తెలిపిరి.

"విసర్యాసే విస్తరేచ ప్రపఞ్చ: " (అ.కో.తృ.కాల.నా.వ., 29) అనెడి పండితోక్తి ప్రకారము  ప్రపంచశబ్దమువైపరరీత్యమునకును విరివికిని గలపేర్లని అమరసింహుడు తెలిపిరని తెలియుచున్నది "ప్రపంచ్యత ఇతి ప్రపంచ:" అనెడి లింగయ సూరి వారి వ్యుత్పత్తి వచనము ప్రకారము విస్తరింపబడినది ప్రపంచ మగుచున్నది ఈ లౌకికార్థమే తాత్త్విక వివరణకు, అనుకూలముగా నున్నది.

శివాగమముల ప్రకారము, ప్రపంచము ప్రకృతి నుండి యుద్భవించును, త్రిగుణ విశిష్టమైన ప్రకృతిలోన యిరువది నాలుగు తత్త్వములు చేరుటచే ప్రపంచము ఏర్పడెనని తెలుపబడినది. ప్రకృతి యొక్క ప్రపంచిత స్వరూపమే ప్రపంచమని భావించ వలెను. ఈ 24 తత్త్వములు సాంఖ్యులు చెప్పెడి తత్త్వములే. ఉపనిషద్బ్రహ్మ వాదులును, బ్రహ్మసూత్రములకు భాష్యమును వ్రాసిన త్రిమతాచార్యులును, ఈ భావమునే స్వీకరించిరి ఇది యిట్టులుండగా, శివ శక్తుల నుండి ప్రపంచము ఉద్భవించినదనెడిది యెట్టుల సుసంగతమగును? ఇక్కడ మరొక ప్రతి బంధకము గలదు. శక్తి యనెడి దానిని సాంఖ్యులుగాని, ఉపనిషద్బ్రహ్మవాదులు గాని యొక కారకముగా నంగీకరించరైరి. ఇట్టి సందేహము గల్గిన స్థితితో శ్రీ జగద్గురు డా॥ చంద్రశేఖర శివాచార్యుల వారి ఆశీర్వచనము జ్ఞాన దాయకమైయున్నది. శివశక్త్యాది షట్ త్రింషత్తత్త్వముల నుండియే ప్రపంచ మేర్పడినదని వివరించిన శ్రీవారి వాక్కులు జ్ఞాన ప్రదములు.

శివాగమములన్నియును ఈ ముప్పది యారు తత్త్వముల నంగీకరించినవి. కాశ్మీర శైవమువంటి శైవ దర్శనములన్నియును శివుని ముప్పది యారు తత్వములనంగీకరించినవి. ఈ ముప్పది యారు తత్త్వములలో ప్రకృతితత్త్వము పదమూడవ తత్త్వమగును. దీని కంటెను పూర్వకములగు శుద్ధతత్త్వములలోను, ఏడు మిశ్రతత్త్వములలోను లేని విశిష్ట లక్షణము ఈ తత్త్వమున గలదు. మొదటి 12 తత్త్వములు త్రిగుణాతీతములు. ఈ త్రిగుణముల వలననేమీ  ప్రపంచము గల్గినది. ఇట్టి ప్రపంచోత్పత్తికి ప్రకృత్యాది భూమ్యంత ముగల తత్త్వములు కారణ భూతములగు చున్నవి.

ఇట్టి సంసారములో జీవుడు పుణ్యపాపములనాచరించు చున్నాడు. తత్ఫలితముగా సుఖదు:ఖములను, జనన-మరణములను  పొందు చున్నాడు. పాపాధిక్యత గల్గినప్పుడు జీవుడు ప్రవృత్తి మార్గమును గమనించును. పాపము వలన శుభ కార్యముల ప్రభావము సన్నగిల్లునని తెలియుచున్నది. "శుభం కర్మశ్యతి తనూకగోతి కల్మషం" అనెడి వ్యుత్పత్తి ప్రకారము శుభకర్మలను చేయుటయే పుణ్యమనబడుచున్నది. ఇచ్చట యెవ్వరి శుభమునాశించి చేసెడిది పుణ్యమగును? అనే ప్రశ్న గల్గును. స్వార్థము నిమిత్తమున చేసెడి శుభకర్మలు పుణ్య ప్రదములే యైననూ, లోకకల్యాణమునాశించి చెసెడి శుభకర్మలే యెక్కువగా పుణ్యదాయకములని చెప్పవచ్చును. అట్టి పుణ్యమునధికముగా గడించిన వాడు. అశుభకార్యముల తగ్గించికొనిన యెడల భవిత్వము దశనుండు పిండస్థలమును చేరి ధన్యతను బడసెడి స్థితికి  చేరును.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-3

శ్రీ రేణుక భగవత్పాదుల వారి యుపదేశమును గమనించుడి:

**శ్లో॥ ఏక ఏవ శివః శివ స్సాక్షాచ్చిదానందమయో విభుః ।**
**నిర్వికల్పో నిరాకారో నిర్గుణో నిష్ప్రపంచక ః॥**
**అనాద్య విద్యాసంబంధ్నాత్ తందాంశో జోవనామకః ।**
**దేవతిర్యఙ్మనుష్యాదిజాతి భేదే వ్యవస్థితః॥**
**మాయీ మాహేశ్వరస్తే, షాం ప్రేరకో హృదిసంస్థితః**
**చంద్రకాంతే యథా తోయం సూర్యకాంతే యథా2 నలః॥**
**బీజే యదాంకురః సిద్ధః తథా మ్మని శివః స్థితాః॥** (సి.శి.5:33-35)

ఒక్కడే యేకాకిగా నున్న వాడును, సాక్షాత్తుగ సచ్చిదానందమయుడును, లోకైక విభుడును, నిర్వికారుడును, నిరాకారుడును, గుణరహితుడును, నిరంకారుడును, నిష్ప్రపంచకుడును, శివుడునునైన వానియంశ అనాదిదియును నైన యవిద్యాసంబంధమువలన జీవుడనెడి పేరును ధరించుచున్నాడనియును, దేవ తిర్యఙ్మనుష్యాది జాతి భేదములయందు వ్యవస్థితుడగు చున్నాడనియును, అట్టివాని హృదయమున శివుడు నివాస మేర్పరుచుకొని ప్రేరకుడైయుండున నెడిదీ శ్లోకములోని బావార్థము.

పరశివుడు విశ్వాత్మగనూ, విశ్వోత్తర్ణునిగనూ రెండు రూపములున్నవాడు. అతడు విశ్వాత్మగా నార్భవించుటకు మొదలున సచ్చితానంద స్వరూపుడై, నిర్గుణుడై నిరాకారుడై వికల్పరహితుడై సర్వవ్యాపకుడై, వేరొక్కటి లేకుండగ, తనయందునూ భేదములేకుండగా తానే తానై యుండును. శ్రీ రేణుకాచార్యులవారు నుపదేశించిన శివుని విశ్వోత్తీర్ణస్థితిని శ్రీ ప్రభు దేవులవారు తమ యనుభవములోని వాణితో నీ క్రింది విధిన నుడివిరి?

**ఆది అనాది ఇల్లదందు, హమ్ముబిమ్ముగళిల్లదందు**
**సచరాచరవెల్ల రచనెగె బారదుదు**
**గుహేశ్వర నీనొబ్బనె ఇద్దెయల్ల ఇల్లదందు.**

ఆదిలేదు, అనాదిలేదు, అహంబులేదు, సచరాచరజగత్తులేదు, ఇంకేమియూ లేదు, గుహేశ్వరానీవొక్కడవే యుంటివియప్పుడు నని ప్రభుదేవుని వాక్కుల సారము.

"ఏతఏవ శివ:" అనెడి శ్రీ రేణుక భగపత్పాదుల యుపదేశము, "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" (చా.ఉ॥ 6-2-1) అనెడి శ్రుతి వాక్యములు సారసర్వస్వముగానున్నవి. జగత్తులోని పదార్థములలో స్వగత, స్వజాతీయ, విజాతీయములనెడి మూడు విధములైన భేదము లుండును. మనుష్యత్వ భేదముండిన నెడపశువులలో పశుత్వభేద ముండును. ఇదియే విజాతీయ భేదముగా గుర్తించ వలెను. దేవదత్త, యజ్ఞదత్తులు పరస్పరముగా భిన్నులైయుందురు మనుష్యులలో సాజాత్యమున్న కారణమున నిది సజాతీయ భేదమని పించికొనును. ఇంకా, ఒకని శరీరము నందున నుండెడి భేదము స్వగత భేదమని పించి కొనును. ఇట్టి భేదములు విశ్వోత్తీర్ణుడౌ శివునియందున లేవని చెప్పుటయే రేణుక భగవత్పాదుల వారి యాశయము.

ఈ ప్రపంచము నభివ్యక్తమయి యున్నప్పుడు శివుని కన్యమైన వేరొక పదార్థము లేని కారణమున విజాతీయ భేదమనెడిది లేకుండెను. శివుని వంటి మరొక శివుడు లేని కారణమున సజాతీయభేదమూ లేదు. మనకువలె శివునికి పాదాద్యవయవములు లేనందున స్వగత భేదము ఉండదు. ఇట్లు త్రివిధభేదములు లేని శివుడును నేవిధిననున్నాడు? అనే ప్రశ్న తలయెత్తును. సంశయ నివారణకై శ్రీభగవత్పాదులు "సాక్షాత్ చిదానందమయ:" అని యుపదేశించిరి.

సంస్కృతమునందు "మయట్" ప్రత్యయము వికారము, ప్రాచుర్యము మరియు స్వార్థములనెడి మూడు విధములుగా అర్థముచేసికొనబడుచున్నది. "మృణ్మయోఘట:" యనెడి దానిలో కుండయనెడిది మట్టి యొక్కవికారమని చెప్పుదురు. "జంగమమయోగ్రామః" అనెడి దానియందు అధికముగా జంగమయ్యలు నధికముగా నున్ననూ యితర జాతీయులు నల్పసంఖ్యలో

నున్నారు నెనడిది ప్రాచుర్యార్థములోని శబ్దము యొక్క అర్ధము. అయితే, " సచ్చిదానందమయ:" అనెడిదానిలో "చిదేవచిన్మయమ్" అనెడిదాని స్వరూపార్థమునే స్వీకరించవలసియుండును. ఎందుకనగా, శివుడు మన్నుచేత కుండయైన యటుల సత్,చిత్, ఆనందముల నుండి యుత్పన్నము కాలేదు. లేదా వాటివలె వికారదునూ కాదు. గ్రామమునంధు జంగమయ్యలు నధికముగా నుండి మిగిలినవారు నల్పప్రమాణమునందు ఉండినయటుల శివుని యందు సత్తు, చిత్తున, ఆనందములు నధికముగా నుండి వేరే గుణములు నల్బప్రమాణములో గలవనేది యనుటకు నవకాశము లేనందున సచ్చిదానందముల ప్రాచుర్యము గలవాడు శివుడుకాడు. పాల యందుకన్పేట్టేడి శుభ్రత్వము మధురత్వము ద్రవ్యత్వములు పాల యొక్క స్వరూపములగానుండినటులే సచ్చిదానందత్వములు శివుని స్వరూపముగ యున్నవి.

ఇటులే, సచ్చిదానందస్వరూపుడైన శివుడు "విభు:" (అనగా వ్యాపకుడు)గా నున్నాడు. సర్వమూర్త ద్రవ్యసంయోగిత్వం విభుత్వం" 'అని చెప్పుచు ప్రపంచములోని చరాచరవస్తువులలో సంయోగమున్నదే విభువని నైయ్యాయికులు అర్థమును చేసిరి. పంచమహాభూతములయందు భూమ్యాదితరములకంటె. నాకాశము నెంతో విశాలముగానున్నది " పాదో స్య విశ్వభూతాని త్రిపాదస్యామృతం దివి" యనెడి వేదమంత్రము నాకాశము మొదలుకొని యఖిల బ్రహ్మాండములు నా శివుని యొక్క భాగముననున్నవి. మిగిలిన మూడు భాగములు నమృతస్వరూపములుగా నున్నవని చెప్పుట చేత జగత్తుకెల్లను నాకాశము నవకాశమునొసగుచున్నది. అట్టి యాకాశమున కవకాశము నిచ్చెడి పరమాత్ముడు, దానికంటెనూ వ్యాపకుడైయున్నాడు అందుకే శ్రుతి "ఆకాశవత్ సర్వగతత్వ నిత్య:" అని చెప్పుచున్నది ఆకాశమువలె సర్వగతత్వము గలవాడును, నిత్యుడునునైన వాడు పరమాత్మయని దీనియర్థము. మరొక మాటలో చెప్పవలెననిన, శ్రుతి శివుని సర్వవ్యాపకత్వమును ఆకాశముతో పోల్చిచెప్పినది.

వయస్సునందన చిన్న వారైననూ, జ్ఞానముచేత పెద్దరికమును పొందిన యక్కగారు నీ విషయమును తమ యనుభావ పరమైన నుడి యందునెంతో చక్కగా వ్యక్తపరచిరి గమనించుడి:

**అష్టవిధార్చనయమాడి ఒలిసువెనె అయ్యా?**
**నీను బహిరంగ వ్యవహార దూరస్థను**
**అంతరంగదల్లి ధ్యానవమాడి ఒలిసువెనెఅయ్యా**
**నీవు వాఙ్మనాతీతను.**
**జపస్తోత్రదింద ఒలిసువెనె అయ్యా?**
**నేను మతి గతీతను.**
**హృదయకమలదల్లింబిట్టు కొంబెనె అయ్యా?**
**నీను సర్వాంగ పరిపూర్ణను.**

అక్కగారి వాక్కుల యొక్క తెలుగు రూపము:

**అష్టవిధార్చనను జేసి వలపింతునె అయ్యా?**
**నీవు బహిరంగ వ్యవహార దూరస్థుడవు.**
**అంతరంగమునందు ధ్యానమును జేసి వలపింతునే అయ్యా?**
**నీవు వాఙ్మనాతీతుడవు**
**జపస్తోత్రముల చేత వలపింతునే అయ్యా?**
**నీవు మతి కతీతుడవు.**
**హృదయకమలమునందు నిమ్మిడికొందునే అయ్యా?**
**నీవు సర్వాంగపరిపూర్ణుడవు** (అను.వా.మ.లి.స్వా)

ఇంకనూ మిగిలిన శరణలు శివుని యీ స్వరూపమునకు శూన్యము, సర్వశూన్యము, నిరాలంబము, చిత్ బయలు చిదాకాశమను పేర్లిడి కొనియాడిరి. యిట్టి చిత్ బయలు యొక్క అరయిక జడమతులకు చిక్కదనిరి విషయ విషదీకరణ నిమిత్తము శ్రీ దాసిమార్యుల యీ వచనమును గమనించుడి:

**ఆడబారద బయలుస, నోడ బారద బయలు**
**నుడియ బారదబయలు హిడియ బారద బయలు**
**ఈ ఒడలిల్లద బయలొళగె అడగిద్ద భేదవ**
**ఈ లోకద జడరెత్త బల్లరై రామనాథ?**

దీని తెలుగు భావమిది:

**ఆడరాని బయలు చూడలేని బయలు**
**నుడువరాని బయలు పట్టరాని బయలు**
**ఈ బయలు లేని బయలులో నణగి యున్నభేదమును**
**ఈ లోకములోని జడులెట్లెరుగుదురు? రామనాథ!** (అను.వా.మ.లి.స్వా)

ఈ వచనమున చిదాకాశములోని శివుని సూక్ష్మత్వము వివరింప బడినది. జగమంత, మొగులంత విరివిగల పరమాత్మ నిర్వికల్పుడై యున్నాడు. నిర్వికల్పము మనస్సుకు చెందిన యొక వృత్తి. మహర్షి పతంజలి "శబ్ద జ్ఞానానుపాతి వస్తుశూన్యో వికల్ప:" అని యీ వృత్తికి చెందిన లక్షణమును యోగసూత్రమునందు ప్రతిపాదించిరి. శాబ్దిక వ్యవహారమునకు మాత్రము కారణమై, అస్తిత్వరహితమైనదగు వస్తువిషయక మానసిక వృత్తియే వికల్పము.! గొడ్డుదానిబిడ్డ, గగన కుసుమము, కుందేటికొమ్ము మొదలగు నకిలీ పదార్థములు వికల్పవృత్తి విషయములై యున్నవి. శాస్త్రములు పరమాత్మను వాఙ్మనముల కగోచరుడని చెప్పుట చేత, ఆకాశ కుసుమాదుల వలె శివుని యస్తిత్వమైననూ లేనివానివలె భావించవలదు. శ్రీ రేణుక భగవత్పాదులు "నిర్వికల్పయనగా" వికల్పాత్మకమైన వృత్తికి విషయము కాదని భోదించిరి.

ఒకవేళ శివుని యస్తిత్వమున్న యెడల చూడగ రానిదెటుల? ఈ ప్రశ్నకు సమాధానముగా భగవత్పాదులు "నిరాకార:" అని యనిరి. అవయవ ములున్నది సాకారమగును. అవయవములైననూజన్య పదార్థములై యుండును. శివుడు అనాది, యనంతుడైన కారణమున నతనికి జననము లేదు. అందుకే నిరవయవుడిగను, నిరాకారునిగను అయి యుండును. ఆకారము లేకుండిననూ అతని చెలువము సీమలేనిదై యుండును. అందు చేతనే అక్కగారు "సావిల్లద-కేడిల్లద రూపిల్లద చెలువంగా- నొలిదెనవ్వా" అనుచు శివుని నిరాకార సౌందర్యమును మెచ్చికొనిరి. "చావు లేని, కీడు లేని, రూపులేని చెలువమున కేనువలచితినమ్మా" యని అక్క గారి మాటల కర్థమని గ్రహింపదగును రూపమునకు చెందిన చెలువము చర్మచక్షుపులకు వేద్యమైతే, రూపులేని చెలువము జ్ఞాననేత్రమునకే గోచరమగును, క్షణికమైన, రక్తమాంసములతో కూడిన దేహములోని సౌందర్యమున కమ్ముడుపోయెడి పిచ్చి మానవుల కన్నియున్ననూ భగవంతుని సౌందర్యమును వారు, సంసారము నందు మునిగిపోయిన కారణమున, చూడజాలరు. ఒక సారి యొకానొక ఆచార్యుడు నది యందున మునిగి లేచి నిజనివాసమునకు వచ్చుచుండెను. అతడొక విచిత్రమైన దృశ్యమును గాంచెను. ఒక బోయవాడు తన పెళ్ళామును నదిని దాటించి కొని వచ్చి యిసుకలోని వేడిచేత తన భార్య కాళ్ళు కంది పోవునేమోయని యామె పాదముల క్రింద కమలములనిడి నడిపింపజొచ్చెను. వాడి మోహపరశతకు నా ఆచార్యుడు ఖిన్నుడయ్యెను. అంత మోహమువలదనెను. అశాశ్వతమైన పడతి అందము కంటెను దేవుని శాశ్వతమైన అందము మేలైనదనెను. స్త్రీని ఆరాధించెడి దానికంటె భగవదారాధనలో మనస్సు లగ్నము కావలెననెను. బోయవాడు నాస్తికుని వలె వాదిస్తూ కనిపించని అందము గూర్చి చింతించుట కంటె సాకారమైయున్న తన భార్య యొక్క అపురూపమైన అందమే తన కారాధ్యమనెడి బోయవాని అజ్ఞానమును రూపుమాపనెంచిన నా ఆచార్యుడు వానికి శివ దర్శనమును కల్గించెను. వాడు తన్మయుడై, భార్యనే కాదు, తనను తానే మరిచిపోయి శివభక్తిలో మునిగి తేలెను. చివరకు ముక్తిని పొందెను. ఆచార్యుడును తన నిస్వార్థమైన చెయ్దము చేత ముక్తిని పొందెను. బోయవాడు దర్శించినది శివుని సాకార సౌందర్యము. దాని కంటెను యతని నిరాకార సౌందర్యము మేలైనదై మాటలకందనిదై యుండును. మనుష్యులు శివుని నిరాకార సౌందర్యమును వీక్షించుటకై కృషిచేయుట యుత్తమమగును.

పరశివుడు నిరాకారుడైనటులే నిర్గుణుడుగాను నుండును అందుచేతనే, శ్రీ భగవత్పాదులవారు "నిర్గుణ:" అని యన్నారు. సత్వ, రజస్, తమస్, లనెడి పాకృత గుణములు లోక ప్రసిద్ధములై యున్నవి. సుఖమును కల్గించి సత్యగుణము, క్రియాసక్తిని గల్గించి

రజోగుణము, మరియు నిద్రా అలసత్వముల ద్వారా తమోగుణము జీవులను బాధించుచున్నది. మరోమాటలో చెప్పవలెననిన ప్రకృతి నుండి పుట్టిన యీ మూడు గుణములు జీవిని బంధించివేసే కారకములగుచున్నవి. శివుడు సదాముక్తుడగుట చేత నతనికి యీ గుణములతో సంబంధము నుండదు. అందుకే, నిర్గుణుడ నిపించికొనుచున్నాడు.

నిరాకారుడునూ, నిర్గుణుడునూ అగుటచేత, శివుడు, నిష్ప్రపంచకుడగుచున్నాడు. పిండాండ, బ్రహ్మాండ రూపములైన వ్యష్టి, సమిష్టి ప్రపంచము నామ రూపములయందు రూపొందుట కంటె ముందుగనే శివుడు తనకు తానేయై యుండును. ఇదియే నిష్ప్రపంచకస్థితి దీనినే యంబిగడ చౌడయ్యవారు తమ యనుభవములోని నుడువులందున నెంతో సుందరముగా తెలిపిరి గమనించుడి:

**అసురమాలెగళిల్ల, త్రిశూలడమరుగవిల్ల**
**బ్రహ్మకపాలవిల్ల, భస్మ భూషణనల్ల,**
**వృషభ వాహనవిల్ల, ఋషియ మగళొడనిర్దాతనల్ల,**
**ఎసగువ సంసారద కురుహిల్లచాతంగె**
**హెసరాపుదెంద నమ్మ అంబిగర చౌడయ్య!**

వారినుడువుల తెలుగు రూపమును గనుడి:

**అసురమాలలు లేవు, త్రిశూలడమరుకములు లేవు**
**బ్రహ్మకపాలములేదు, భస్మభూషణుడుకాడు**
**వృషభవాహనము లేదు, ఋషిబిడ్డచెంతగలవాడుకాడు**
**ఎసగెడి సంసారములోని గురుతు లేదతనికి**
**పేరగుననెనాదు అంబిగ చౌడయ్య**

సృష్టియొక్క పూర్ణమైన వికసిత రూపమును ప్రపంచమని యందురు. అది వికసితముకాని మొదటి శివుని స్థితియె నిష్ప్రపంచకస్థితి. ఈ స్థితిని వివరించెడి శ్రీ మన్నిజగణులవారి పరమానుభవ బోధలోని నుడువులను గనుడి:

**ఏనొందు తోరదజ్ఞాన వల్లద సచ్చి।**
**దానందద్వయ నిత్యపరిపూర్ణ॥**
**మానవిదూరనకల్పితనవికృతి।**
**తానేకనచలనా పరమాత్మా॥**

వీరి వాక్కుయొక్క తెలుగు రూపమును గనుడి:

**ఏ యొక్కటి కన్బట్టని యజ్ఞానమునుకాని సచ్చి**
**దానందద్వయనిత్యపరిపూర్ణము ॥**
**మానవిదూరనకల్పితనవికృత।**
**తానేకచలనాపరమాత్మ**

ఈ విధముగ శ్రీ రేణుకభగవత్పాదులు ప్రతిపాదించిన పరశివ స్వరూపమును, శివానుభవవేత్తల యనుభవములోని నుడువులును నొకేవిధిననున్నవి.

జగత్తునందు నొంటిగా నెంతో కాలము వరకు పూరకయే కూర్చొని కాలమును వెళ్ళబుచ్చుట యెంతో కష్టమైన పని. అందుకే "ఏకాకీనైపరమతే" యని శ్రుతి చెప్పినది. విమర్శశక్తితో నొడగూడిన పరశివుడు ననంత కాలమువరకు తానొక్కడై యుండి, వేసరి, తానే పూజ్యుడు, పూజకుడు కావాలని యనిపించి,"ఏకో హం బహుస్యాం ప్రజాయేయ" (బృ.ఉ.1-2-5) యని సంకల్పించికొనిన వెనువెంటనే శివుని యందున నవినాభావసంబంధము గల్గిన విమర్శశక్తి తన యంశలైన అనంత- అవిద్య శక్తులను ప్రకటించి కొనునది. ఈ అనాది అవిద్య శక్తితో సంబధమును పొందిన పరశివుని యంశమే జీవాత్మయగు చున్నది. "అంశత్యం నామ అనావిష్కృత- అఖిలశక్తిమత్వమ్" యనెడి ప్రమాణముననుసరించి, పరిపూర్ణ వస్తువులోని శక్తుల సంకుచిత స్వరూపమే యంశమగును.

అందు చేతనే శివుని స్వాభావికములైన సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము, పరిపూర్ణత్వము, నిత్యత్వము మరియు వ్యాపకత్వము లనెడివి అనాద్య విద్య సంబంధమైన పిదప సంకుచితములై అల్పజ్ఞత్వము, అపరిపూర్ణత్వము, అనిత్యత్వము మరియు నవ్యాపకత్వములుగ పరిణమించును, అందుచేత, శివాంశమైన జీవుడు నల్పజ్ఞుడు, అల్పకర్తుత్వసహితుడుగను పిలువబడుచున్నాడు.

విమర్శశక్తిలోని యంశములైన అవిద్యలు ననంతములైనందున, పరశివాంశములైన జీవాత్మలైననూ అనంతములైయున్నని ''ఆత్మావై జాయతే పుత్ర:'' అనెడి ప్రమాణము చెప్పినయటుల, పెనిమిటియే పెళ్ళాము సంపర్కము చేత బిడ్డడై జన్మించుననెడిదిలోకానుభవమున సిద్ధమైయున్నది. బిడ్డ యుత్పత్తికి మాధ్యమమైన తల్లియు, బిడ్డకు తండ్రి గూర్చి తెలియజెప్పుటకు నేవిధముగా కారణమైయున్నదో, అటులనే విమర్శ శక్తియు అవిద్యా శక్తి రూపమున దాల్చి పరమాత్ముని జీవాత్మునిగా చేయును. మళ్ళీ యామె, తానే శ్రద్ధ, నిష్ఠ, అవధాన, అనుభవ, ఆనంద మరియు సమరసములవెడి క్రమప్రకారముగా వికసితమయ్యేడి భక్తిలోని రూపములను దాల్చి, జీవాత్మను పరమాత్మ రూపమునందున నభేదముజేసి ముక్తిని గల్గించును.

శక్తి-భక్తుల గూర్చిన విశేష వివేచన నిచ్చెడి శ్రీ మాయదేవుల వారి యనుభవసూత్రములోని యీ యంశములు గమనించదగియున్నవి. గమనించుడి:

**శ్లో॥ "తస్మాత్ సవాసనాశక్తిర్భక్తిర్నిర్వాసనామతా"**
**"శక్తి: ప్రవృత్తిరాఖ్యాతా నివృత్తిర్భక్తిరీరితా"**
**"అధోముఖీ భవేచ్ఛక్తిర్భక్తిరూర్ధ్వముఖీ భవేత్"**

శక్తి వాసనా సహితమైయుంటే, భక్తి వాసనా రహితముగానుండుననియును, శక్తి ప్రవృత్తి పరమైనదైతే భక్తి నివృత్తి పరమైనదనియునూ, శక్తి యొక్క గమనము నధోముఖముగా నుంటే, భక్తిరమ్యము యూర్ధ్వముఖముగా నుంధుననియు పై యంశముల యర్థము, మాయిదేవుల విశ్లేషణ యెంతో ఫలప్రదముగానున్నదని తెలుపవచ్చును. భక్తి జీవునికి ముక్తిని గల్గించుటకై దోహదము చేయునని గ్రహించదగను

ఈ విధిన జీవుని జన్మకు కారణమైన శక్తి తల్లి వలె మరల యతని యున్నతికై కారణమైయున్నదనెడిది వీరశైవ ధర్మమునందు నంగీకృతమైన శక్తి యొక్క విశిష్టమైయున్నది పరశివాంశలైన జీవాత్మలు ప్రతియొక శరీరమునందు నొక్కొక్కరి వలె భిన్న-భిన్నములైయున్నవి. అందు చేతే, ఎన్ని శరీరములుండునో యన్ని జీవాత్మలుండును.

శాస్త్రకారులు జీవులను (శరీరములను) 84 లక్షల విధములుగా వర్ణింతురు స్కాందపురాణములో నీ విషయమైకొంత వివరణగలదు గమనించగలరు:

**శ్లో॥ దేవా: షోడశ లక్షాణి నవలక్షాణిమానుషా: ।**
**దశభిర్దశస్తద్వజ్జలజా విహగా మృగా:॥**
**సరీసృపాస్తులక్షాణి ఏకాదశ చరేతరా:।**
**అష్టాచ దశలక్షాణి సప్తజన్మాన్యమూనివై॥**

84 లక్షల జీవరాసులలో 16లక్షలు దేవతల నియును, 9 లక్షలు మనుష్యులనియును, జలజ, పక్షి, మృగములొక్కొక్కటి 10 లక్షలనియును, సర్పములు 11 లక్షలనియును, మిగిలిన చరేతరములు 18 లక్షలనియును ఈ శ్లోకము వలన తెలియుచున్నది ఈ విధముగా మొత్తము ఏడు జన్మలకు చెందినవైన 84 లక్షల శరీరములగుచున్నవి.

జీవాత్మ తన కర్మానుసారముగా దేవమానవాది శరీరములను ధరించుచున్నాడు ఒకశరీరమును వీడి మరో శరీరమును ధరించును.

పరశివుని వినోదముకై సృష్టింపబడిన జీవములు, స్వకృత కర్మానుసారముగ నానావిధ జన్మములను దాల్చుచు, భవారణ్యమున కష్టపడునదిగ కరుణా సాగరుడైన శివుడు జీవాత్మల హృదయమున వసియించువాడై సన్మార్గము వైపు పయనించుటకు వలయు ప్రేరణనిచ్చును. అందుకొరకే శ్రీ భగవత్ పాదుల వారు "మాయీ మహేశ్వరస్తేషాంప్రేరకోహృది సంస్థిత:" అని యుపదేశించిరి. చంద్రకాంతశిలలో నీరును, సూర్యకాంత శిలలో అగ్నియును, బీజమునందు వృక్షమును అణగియుండి యున్నటుల ప్రతి యొక్కని

మనస్సున శివుడు నణగియుంఢి ప్రేరకుడుగా వ్యవహరించును శివుడు సర్వవ్యాపకుడు, జీవాత్మలు పరిచ్ఛిన్నులు, వ్యాపకమైన ఆకాశము ఘట-మఠాదిపరిచ్ఛిన్న వస్తువుల యందుననున్నటులే, వ్యాపకుడైన శివుడు సర్వజీవాత్మల హృదయమునందున నురుగు పాలలోని నెయ్యి వాసనలేకుండగా పొదిగికొని యుండినటుల నుండును- ఈ మాటనే అన్నగారి తమ యనుభవపర వాక్కులలో "కరియుకన్నడిమొళగడగిదంతయ్యా! ఎన్నొళగె నీనడగిదె కూడలసంగమదేవా" అని నుడివిరి. "కరియు నద్దములో నడగిన అనుట్లయ్యా! నాలో నీవడిగినది కూడల సంగమ దేవా!" అను అన్నగారి వాక్కుల కర్థము "ఈశ్వర: సర్వభూతానాం హృద్దేశే... తిష్ఠతి", అనెడి వాక్కులలోను నిదియే చెప్పబడినది. గీతాకారుని ప్రకారము శరీరము ఒక చలనశీలతగల యంత్రము (Automobile) వంటిది. వాహనమును ఛోదకుడు నడిపినటులే శరీరములో హృదయ గతుడై యున్న ఈశ్వరుడు ప్రేరకుడై జీవిని నడిపించుచున్నాడు. కాని ఆశ్చర్యకరమైన విషయమేమనగా ఆ జీవి తాను ఈశ్వరునిచేత ప్రేరేపింపబడుచున్నాడనెడిది గ్రహించక అజ్ఞానియై తిరుగాడుచుండును.

చెట్లయొక్క పరస్పర రాపిడివల్ల నగ్నిపుట్టినట్లును, పాలను కాచి, తోడిడి, పెరుగునుజేసి, పెరుగును చిలికి, వెన్ననుదీసి, యద్దానిని కాచిన నెయ్యి యొక్క సువాసనవచ్చినట్లుగ, సాధకుని కృషి వల్ల శివుని నెలవు కన్గొనబడును. బాహ్యవృత్తులను విడిచి వేసి, యంతర్ముఖుడై సాధన చేసిన పిదప హృదయస్థుడగు శివుని సాన్నిధ్యము యొక్క జ్ఞానము గల్గుచున్నది. "పరాంచి ఖాని వ్యతృణస్స్వయం భూ-స్తస్మాత్పరాఙ్పశ్యతి నాంతరాత్మన్" అనెడి శ్రుతి కఠోపనిషత్ 2-4-1 ప్రమాణము ననుసరించి, సృష్టికర్త జగత్తునుసృష్టించేటప్పుడు ప్రాణులన్నింటి యింద్రియములను బహిర్ముఖములుగా సృష్టించును. అందు చేతనే మనుష్యుని జ్ఞానేంద్రియములుగాని, కర్మేంద్రియములుగాని అంతరంగ చతుష్టయమైననూగాని, బహిరంగముననుండెడి శబ్దస్పర్శాది పంచతన్మాత్రలైనను గాని విషయముల సుఖమును ననుభవించుటకై యాతురత పొందునేగాని, అంతర్ముఖములై శివుని యునికిని గాంచజాలవు. దేహాంతర్గతుడై యున్న పరమాత్ముని తత్వము నెరుగుటకై ప్రయత్నించిన శ్రీషణ్ముఖస్వాముల వారు చెప్పినది గమనించదగియున్నది.

**మనవెంబ మర్కటవు, తనువెంబ వృక్షవ నేరి**
**ఇంద్రియంగళెంబ శాఖె శాఖెగె హారి**
**వియంగళెంబ ఫలంగళం అనుభవిసి**
**భవదత్తము ఖవాగి హారియుత్తదెనోడా**
**మన వెంబ మర్కటవ నిమ్మనెనహెంబ పాశదల్లికట్టి**
**ఉళిహికొళ్ళయ్యా, అఖండేశ్వరా!**

ఈ నుడువుల తెలుగు రూపమును గమనించుడి:

**మనసనెడి మర్కటము, తనువనెడి వృక్షము నెక్కి**
**ఇంద్రియములనెడి శాఖశాఖకు పాకి,**
**విషయములనెడి ఫలముల ననుభవించి**
**భవము నటు ముఖమై పరువెత్తె చూడుమో**
**మనసనెడి మర్కటమును మీ మననమనెడి పాశమున గట్టి**
**ఉంచికొనుమయ్యా, అఖండేశ్వరా!**

సకలేంద్రియముల వ్యవహారమునకు మనస్సే మూలకారణ మగను. దీనిని యింద్రియముల కధ్యక్షత వహించే దానిగా చూడవచ్చును. మనస్సు యొక్క సమస్త వ్యవహారములకును సాక్షియైన శివుడు ప్రతిక్షణమూ యోగ్యమైన విచారముల మూలమున మనస్సునకు నెచ్చరికను జేయుచుండును. ఆ హెచ్చరికను గైకొని తదనుగుణముగా మెలిగెడివాడు పెరుగుదలను గాంచుచున్నాడు. బ్రాహ్మీముహూర్తమునందు లేవవలెనని రాత్రి అలారమ్ పెట్టి పరుండిన పిదప సమయానికి సరిగ్గా గడియారము యొక్క గంట మ్రోగగనే, లేచి పనులను ప్రారంభింతురు. ఇంకా కొందరు, వినియూ అలాగే పరుండుదురు. మరికొందరికి ప్రగాఢమైన నిద్రవల్ల గంటవినబడదో, అటులే మనుష్యులు ననుచితమైన పనులలో తగిలి కొనినపిదప, భగవంతుని పిలుపు వినబడదు. అంతర్వాణిని విని తదనుగుణముగా నడచెడివారు కొందరైతే, దానిని వినియూ లక్ష్యపెట్టని వారు ఇంకాకొందరైతే, దానిని వినియూ లక్ష్యపెట్టనివారు ఇంకా కొందరుందురు మరి కొందరికి ఆ వాణి వినబడదు. ఇట్టివారు నజ్ఞాన తిమిరంబున మునిగియుందురు.

తండ్రియైన వాడు తప్పి నడిచెడి కొడుకుకు దారిచూపించినట్లు జగత్పితయైన శివుడు ప్రతియొక్కరికీ అంతర్వాణి ద్వారా హితోపదేశమును చేయును అది యెట్లనగా ఒక మనిషి జీవనోపయోగమునకై వలయుసామగ్రిని కొనుటకై పట్టణమునకు పోయి, అంగడియందు పది రూపాయల సామగ్రికొని, అంగడివానికి యిరువది రూపాయల నోటునిచ్చెను. అంగడి వాడు పదిరూపాయలను తిరిగి యిచ్చుటకు బదులుగా వ్యాపారములో గడబిడ కారణమున పదిహేను రూపాయలనిచ్చెను. డబ్బును తీసికొనిన పిదప మనస్సునందు తాను ఐదు రూపాయల నధికముగా పొందిన విషయము స్ఫురించును. అంతేకాదు ఐదు రూపాయలను తిరిగి యిచ్చి వేయవలెననెడి ఆలోచన కూడ మనస్సునపుట్టును. అదియే యీశ్వరుని వాణి. లోభియగు మనిషి నా వాణిని వినియూ విననట్లే యుండును. డబ్బిచ్చుటకై తిరస్కరించును. ఈ విధిననెన్నియో ఘటనలు ఘటించిన పిదప నీశ్వరుని వాణినంతా పెడచెవిన పెట్టి పాపియై యధోగతికి దిగుచున్నాడు. శివుని వాణిననుసరించి జీవనమును చక్కదిద్దుకొనువాడు నీశ్వరుని వలె జగద్వంద్యుడగును.

అంతరంగమునందు పుట్టెడి యంతర్వాణిని ననుసరించిన యెడల గురువుల చేత పున: పురాణ పుణ్యకథలను వినెడి లేదా సన్మార్గబోధకమైన పుస్తకమలను చదివెడి యవశ్యకత లేదు. అందుకే మనుజుని మార్చుటకు నెన్నియో సత్సంగములు నడిపించుటయే గాక యనేక సద్గ్రంథముల రచనలు రచింపబడుచున్నవి. తన కల్యాణము కోరెడు మనుష్యుడు శివుని యంతర్వాణిని లక్ష్యము పెట్టుట నేటి కర్తవ్యమై యున్నది.

జీవాత్మ యొక్క హృదయమునందు శివుడు నివసించిన యెడల జీవుడు ననుభవించెడి సుఖ-దు:ఖాదులు ఈశ్వరునికీ గల్గవలెను కదా? ఈ ప్రశ్నకు నవకాశమేలేదు "జీవత్వం దు:ఖసర్వస్వం తదిదం మలకల్పితమ్" అని శ్రీ రేణుక భగత్పాదులు నుపదేశించిరి. జీవత్వమును అన్ని దు:ఖములును మలము చేత కల్పింపబడినవని యీ వాక్కుల యర్థము. 18వ పరిచ్ఛేదమున నాత్మస్థలమునందు నీ వాక్యములు గలవు. శివునికి జీవత్వముగాని, దు:ఖసుఖభోగత్వము గాని గల్గదు. అతడు నిర్మలుడని గ్రహింపదగును.

శివుని యిచ్ఛాశక్తి యొక్క సంకోచరూపమే ఆణవమలము, జ్ఞాన శక్తియొక్క సంకోచము, మాయామలముగాను గ్రహింపదగును. ఆణవమలముయొక ఆవరణము చేత జీవాత్మ తన వ్యాపకతను మరిచి కేవల శరీరవాసియైన తనను అల్పుడననియును, మాయామలము యొక్క యావరణముచేత తన దేహము మరియు దేహమునకు సంబంధించిన సతీపుత్రాదుల యందు నేను, నాది యనెడి యభిమానములచే భ్రమనుగల వాడగుచున్నాడు. అటులనే, కార్మిక మలము యొక్కయావరణముచే కర్మల వాసనారూపముగ పుణ్యపాపములను సంపాదించు చున్నాడు. సుఖదు:ఖములు, పుణ్య పాపముల ఫలములైన కారణమున కర్తృత్వ భావన చేత కర్మచేసిన జీవాత్మకు ఫలభోగమగునదే కాని సాక్షియైన మలత్రయ రహితుడైన శివునికి సుఖ దుఃఖములు కలుగజాలవు. అందుచేతనే, శ్రీ రేణుకభగవత్పాదులు "ఏతేషా దేహినాం సాక్షీ ప్రేరక: పరమేశ్వరః" అని యుపదేశించిరి ! దేహములు ధరించిన జీవులకు శివుడు సాక్షీభూతునిగను, ప్రేరకునిగాను నుండునని యీ వాక్కులయర్థము ఈ సందర్భమున, శ్వేతాశ్వతరోపనిషత్తులోని యీ వాక్కులు గమనార్హములైయున్నవిః

**శ్లో॥ ద్వాసుపర్ణా సముజాసఖావ సమానంవృక్షం పరిషస్వ,జ్యాతే ।**
**తయోరన్య: పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్నో2 భిచాక: షితి ॥** (శ్వే.ఉ.4-9)

ఒక చెట్టు మీద రెండు పక్షులు పరస్పర స్నేహభావముతో నున్నవనియును, వాటిలో నొకటి పళ్లను తినుచున్నదనియును, మరొకటి దానికి సాక్షియై కూర్చొని ప్రకాశమానముగానున్నదనియును శ్లోకములోని భావార్థము శివ జీవుల సంబంధమును వివరించే యీ వాక్కుల ననుసరించి శివుడు సాక్షియైయున్నాడు.

శ్రీ విద్యారణ్యుల వారు నీ భావననెంతో హృద్యంగముగా వివరించి తెలిపే వారి శ్లోకాన్ని గమనించుడి:

**శ్లో॥ ఈశకార్యం జీవభోగ్యం జగత్ ద్వాభ్యాంసమన్వితం ।**
**పితృజన్యాభర్తృభోగ్యాయథాయోషిత్తద్యేశ్యతామ్॥** (పంచదసి 4:18)

ప్రపంచమును నీశ్వరుని బిడ్డగానెంచి, జీవిని ఆమెభర్తగా భావిస్తూ చెప్పిన యీ శ్లోకానుసారము భర్తను భోగములలో ముంచెడి స్త్రీ తన జన్మకు కారకుడైన తండ్రికి భోగములనిచ్చుట కేవిధముగా అర్హురాలుగాదో, అదేవిధిన ప్రపంచము శివునికి

సుఖదు:ఖముల నివ్వజాలదు. ఈ లౌకిక దృష్టాంతము వలన భావము మరింత స్పష్టమగు చున్నది. జీవాత్మల హృదయస్థుడై ప్రేరకుడుగనున్న శివునికి జీవాత్మల సుఖదు:ఖముల సంపర్కము త్రికాలముల యందునూ ఉండదనెడిది శాస్త్రసమ్మతమైనది.

**ఓం శాంతి: శాంతి: శాంతి:**

తేది. 17-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహా స్వాముల వారు, ఈ ఆశీర్వచనమునందున శివతత్త్వమునకు చెందిన కీలకాంశముల నెన్నింటినో చర్చించిరి శివుడు, స్వీయలీలా వినోదార్ధమై జీవునిగా పరిణామము నొందెననెడి విషయము శైవ దర్శనములన్నింటిలోను ప్రతిపాదించ బడినది. శివ-జీవాభేదము ప్రతిపాదించ బడినది. స్మార్తులు ప్రతి పాదించెడి శివ కేశవాభేదము కంటెనూ వారి ఆచార్యుడు శ్రీ ఆదిశంకరా చార్యుల వారు ప్రతి పాదించెడి జీవాత్మ పరమాత్మాద్వైతము వంటిది కాదు. ఇచ్చట ప్రతిపాదించబడిన శివ జీవాభేదము శ్రు తి సమ్మతమైన దేయని శ్రీపతి పండితుల వారి శ్రీ కరభాష్యము వలన తెలియుచున్నది. మగ్గెమాయి దేవుల వారి అనుభవసూత్రమనెడి గ్రంథములోన యీ విషయమై సవిస్తరమైన చర్చ గలదు. శివునికి రెండు రూపములుండునని తెలియుచున్నది మొదటి ది కైవల్యరూపము. నిర్గుణ పరబ్రహ్మ రూపముననుండెడి శివుని రూపమే యీ కైవల్య రూపము. సృష్టి కంటెను ముందున నుండెడి దశయిది. ఇట్టి నిర్గుణ శివపరబ్రహ్మ యొక్క తత్త్వమును వివరించుటకై శ్రీ భగవత్పాదులవారు బహువిధములైన విశేషణములను ప్రయోగించిరి. ఈ తత్త్వము యొక్క విస్తృతమైన వివరణను శ్రీ భగవత్పాదులవారు ద్వితీయ పరిచ్ఛేదమున 3వ శ్లోకము నుండి 6వ శ్లోకము వరకు గల నాలుగు శ్లోకములలో నిచ్చిరి. సర్వతంత్ర స్వతంత్రత, సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వములు నిర్గుణ పర శివ లక్షణములైయుండెను అహంకారాభి మానములచేత శివుడు పరిణామమును పొందుచు నైదు శుద్ధతత్త్వములుగా ప్రచలితుడయ్యెను మాయా సంపర్కము చేతను, అవిద్య వలననూ శివుడు జీవుడగుచున్నాడు. ఈ పరిణామములలో శక్తి కీలక పాత్రను పోషించును. శివుని ప్రవృత్తి మార్గమున పయనింపజేసి ప్రపంచోత్పత్తికీ కారణమగుచున్నది. శక్తి ఉపాదాన కారణమని గ్రహించగలరు.

ఈ పరిణామ క్రమములో 'అవిద్య'కు గల పాత్ర యెట్టిదో గుర్తించ వలెను.

"అజ్ఞాన మవిద్యాహంమతి: " అనెడి అమర సింహుని వాక్కు (అ.కో.ప్రకాం., దీ.వ.,7) ప్రకారము అవిద్య యనెడిది అజ్ఞానము యొక్క పర్యాయపదము అయిననూ ఈ రెంటిలో కించిద్భేదము గలదు. జ్ఞానము యొక్క లేమి యజ్ఞానమగును "న జ్ఞానం అజ్ఞానం" అని లింగయసూరి వివరించెను. "విపరీతజ్ఞాన మవిద్యా" యని చెప్పబడినది.

తాత్త్వికముగా చూసిన యెడల శుద్ధతత్త్వమైన శుద్ధవిద్య భేద భావమునకు లోనై మాయయగును. మాయామలము ఆవృతముకాగా పురుషుడు అవిద్యచేత ప్రభావితుడై ఆత్మానాత్మవివేకమును కోల్పోయి సుఖదు:ఖములకు లోనగును. కర్మ బద్ధుడై అనేకానేక జన్మలకు లోనగను. ఇట్టివాడు జనన-మరణ చక్రబంధమున జిక్కికొని అనేక జన్మల నెత్తుచున్నాడు "దేవతిర్యఙ్మనుష్యాది యోనులలో జన్మించుచున్నాడు. పాల్కురికిసోమనాధుడు, ఈ జన్మల గురించి యిక్రింది విధముగా చెప్పెను.

"లలినెనుబదినాల్గు లక్షయోనులబుట్టి మహిమీదనంత్య జన్మమున జీవుడదయించు...." (చతుర్వేదసారము, పద్యము 179). జీవుడు యెనబది నాల్గు లక్షల యోనుల యందున పుట్టుచున్నాడని సోమనాధుడు చెప్పెను. ఈ పద్యమునకు గల ఆధారము శివ మహాపురాణమని తెలియుచున్నది.

84 లక్షల జీవరాశిలో దేవతలు కూడ ఉందురనెడి విషయము అవిస్మరణీయమైన విషయము. ముప్పదిమూడు కోట్ల దేవతలున్నారని పురాణాదులు చెప్పుచున్నవి. వీరిలో 16 లక్షల రకములకు చెందిన విభిన్నదేవతలు గలరని తెలిసికొన వలెను. స్కాందపురాణము ప్రకారము 16 లక్షల సంఖ్య మేరకు దేవతలను వర్గీకరించవచ్చని తెలియుచున్నది. సాంకేతికంగా చూసిన యెడల వీరందరూ జీవులే. బ్రహ్మ, విష్ణువు, ఇంద్రాదులు ఇందులోన గలరు. అందు చేత వీరు కూడ జీవులే వీరిలో నెవ్వరునూ శివునికి సమానులు కారు. ఈ కారణము వలననే పాల్కురికి సోమనాధుడు తమ సోమనాథభాష్యములో శివుడొక్కడే పరబ్రహ్మయని నిరూపించుటకై త్రిమూర్తి, ద్విమూర్తులనిరసన యిత్యాది భావనలను ప్రతిపాదించిరి. త్రిమూర్తి నిరసనలోన త్రిమూర్తులు పరబ్రహ్మవాచ్యులు కారని తెలిపిరి. ద్విమూర్తి నిరసనలో శివకేశవా భేదమును ఖండించిరి. ఈ వాదనలను తాత్త్వికపరముగా స్వీకరించవలెను. అట్టి యెడల ఈ వాదములలోని భావము సుబోధకమగును శివుని పరబ్రహ్మత్వమిచ్చట బహువిధ ప్రమాణములతో నిరూపితమై యున్నది. ఈ తత్వమే ఆగమములలో గలదు. శివుడు అద్వితీయుడని వర్ణింపబడినది. శివుడే జగత్కర్తయని చెప్పుచు, శ్రీభగవత్పాదుల భావమును ప్రతిబింబించెడి బసవపురాణములోని యీ క్రింది ద్విపదలను గనుడి:

**"వేదవేదాంతాదివాద సిద్ధాంత**
**వాదతర్కముల సంపాదించిమించి**
**న్యాయవైశేకాద్యఖిల వాగ్సృష్ట**
**ధీయులోక్తుల పెక్కు తెరగులుసూపి"**

**"నద్వితీయుడు రామనాథుడే కర్త**
**సద్విధి సర్వము సర్వేశరుండు**
**శ్రుతి "యేక ఏవ రుద్రే" యను తత్త్వ**
**గతి "లింగమధ్యే జగత్సర్వ"మనియు**
**రతి "లింగబాహ్యేత్పరం నాస్తి" యనియు**
**సతత మిట్టులు శ్రుతి చాటెడిగాన"** (బ.పు.ష.ఆ. 633-64)

శివపరబ్రహ్మ తత్త్వము యొక్క మౌళిక లక్షణములు ఎట్టివి? శ్రీ భగవత్పాదుల వారు ప్రయోగించిన విశేషణములో నీ లక్షణములు అంతర్లీనముగా కన్పట్టుచున్నవి. వీటిని మూడుగా వర్గీకరించ వచ్చును. అవి: సర్వ భర్తృత్వము, సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము శ్రీభగవత్పాదుల వారి 'విభు' అనెడి విశేషణమున పతిత్వమిమిడియున్నది. శివుడు పశుపతి యనియును, సకల జీవరాశి పశువులని పాశపత సిద్ధాంతము తెలుపుచున్నది. వీరశైవము ఈ సిద్ధాంతమును ఆమోదించినది. అందుచేత వీరశైవమునకు మహా పాశుపతమని నామధేయముకలదు.

శివుడు జీవుడైన పిదప మీలక్షణములకు పరిమితులేర్పడుచున్నవి. దేవతిర్యాఙ్మనుష్యాదలకందరికినీ నీ పరిమితులు కల్గుచున్నవి. మాయ 'అవిద్య' లే ఈ పరిమితులు నేర్పడుటకు కారణములగుచున్నవి. శివజీవులకు భేదములు కల్గును. బసవపురాణములో మీ భేదములు ఈ క్రింది విధముగా వివరింపబడినవి.

**జీవుడు శివుడని బావింతురేని,**
**జీవుడు మలినుడు శివుడు నిర్మలుడు**
**జీవుడు దుష్కర్మి శివుడు నిశ్కర్మి**
**జీవుడు సకళుడు శివుడు నిశ్కళుడు**
**జీవుడు సభావులుడు శివుడు భావుడు**
**తీవుడు నిత్యుండు శివుడు నిత్యుండు**
**జీవుడు శుద్ధుఇడు శివుడు శుద్ధుండు**
**జీవుడు మృత దుఃఖ శివుడు అమృతుండు**
**జీవుడు సంసారి శివుడు సంసారి**
**జీవుడు సందేహి శివుడు సందేహి**
**కావున జీవుడు శివుడు కానేకాదు.** (.. బ.పు.ష.ఆ.703-715)

ఇచ్చట యివ్వబడిన జీవత్వ లక్షణాలు దేవతిర్యఙ్మనుష్యాదుల కందరికినీ ఉండునని గ్రహించవలెను. సాంకేతికముగా దేవుడనగా శివుడే. దేవుళ్ళుగా పిలువబడెడి విష్ణు విరించ్యాది ముప్పదిమూడు కోట్ల దేవతలు ఒక జాతికి చెందిన జీవులని గ్రహించవలెను.

జీవుడు విషయాసక్తుడై కర్మలను చేయుచు పుణ్యపాపముల నార్జించుచున్నాడు. పుణ్యాధిక్యత గల్గినప్పుడు స్వర్గమునకేగి దేవజాతికి చెందిన వాడగుచున్నాడు. పాపాధిక్యత గల్గినప్పుడు హీనయోనులలో జన్మించుచున్నాడు. క్షుద్రజీవియగుచున్నాడు. పుణ్యక్షీణత గల్గినప్పుడు పాపాధిక్యత వలన గలిగే ఫలములు సంప్రాప్తమగును. వీటన్నింటి యుమ్మడిఫలితముగా జీవుడు జనన-మరణ చక్రబంధమున జిక్కి దు:ఖముల పాలగుచున్నాడు శివుడు దయా మయుడు. పతితోద్ధారణ చేసెడి లక్షణముగలవాడు. తాను మంగళమయుడు. ఇతరులసన్మంగళముల నాకాక్షించెడివాడు. సచ్చిదానందస్వరూపుడు. ఇతరులకును అట్టి అనుభవమునే కలుగజేయాలని కొరెడివాడు అతనికి దేవతల యెడపక్షపాతము లేదు. నీచ జన్మలలోనున్న వారి యెడల విరాగమును లేని వాడు అందుచేత దేవతలనేవిధముగా పాలించునో అదేవిధముగా రాక్షసాదులను కూడ పరిపాలించు చున్నాడని పురాణములు చెప్పుచున్నవి ఇట్టి సమత భావము విష్ణ్వాదులకు లేదనేది గ్రహించవలసిన విషయము.

జీవుడు పడెడి పతనదిశనుగనివారినుద్ధరించుటకే, జీవుని యంతరంగమున ప్రేరకుడుగా నిలుచున్నాడు. ఇచ్చట గ్రహించవలసిన ధర్మసూక్ష్మమొకటి కలదు అశుద్ధతత్వములకు చెందిన జీవుడు అనబడెడి శివునిలో, శుద్ధతత్త్వమునకు చెందిన శివుడు ప్రేరకుడగుచున్నాడని తెలిసి కొనవలెను ఒకే శివుడు మలసహితుడై జీవునిగాను, మలరహితుడై శివునిగాను ఉండును.

ఉపనిషద్బ్రహ్మవాదుల ప్రకారము, ఈ ప్రేరణచేత జీవుడు కర్మలు చేయుట యందాసక్తిని పెంచికొనును. భారతములో ప్రేరణకు ఇట్టి పాత్రనే యివ్వబడినది. కాని భక్తివాదుల ప్రకారము ఈ ప్రేరణ కర్మలను చేయించెడిదికాదు భగవద్భక్తిని పెంచెడిదగును. వీరశైవధర్మము ప్రకారము ఈ ప్రేరణ కొంక లక్ష్యముగలదు. అది యెంతో ఉదాత్తమైనదైయున్నది. ప్రవృత్తిమార్గమున పయనించుచు సంసారమనెడి వలలో చిక్కికొని బాధలననుభవించెడి జీవునికి ప్రవృత్తి మార్గమును వీడుటకై శివుని ప్రేరణ దోహదముచేయును. తత్ఫలితముగా, పిండస్థలమునకు పూర్వదశలో నుండి యుండెడి జీవికి నివృత్త్యున్ముఖత ప్రాప్తించి, జీవుని గమనము పిండస్థలమును చేరెడి లక్ష్యమువైపు నిర్దేశింపబడును.

–శివం భూయాత్–

## ఆశీర్వచనము-4

శ్లో॥ ఆత్మత్వమీశ్వరత్వం చ బ్రహ్మణ్యేకత్రకల్పితమ్ ॥
బింబత్వం ప్రతిబింబత్వం యథా పూషకల్పితమ్ ॥
గుణత్రయవిభేదేన పరతత్త్వే చిదాత్మని ।
భోక్తృత్వం చైవ భోజ్యత్వం ప్రేర కత్వం చ కల్పితమ్ ॥
గుణత్రయాత్మికా శక్తి బ్రహ్మనిష్ఠా సనాతనీ ।
తద్వైషమ్యాత్ సముత్పన్నా తస్మిన్ వస్తుత్రయాభిదా
కించిత్సత్త్వరజో రూపం భోక్తృసంజ్ఞకముచ్యతే ।
అత్యంత తామసోపాధిర్భోజ్యమిత్యభిధీయతే ।
పరతత్త్వమయోపాధి బ్రహ్మచైతన్యమీశ్వరః ।
భోక్తా భోజ్యం ప్రేరయితా వస్తుత్రయమిదం స్మృతమ్॥ (సి.శి.5-36 నుంచి 40)

జగత్తున నెల్లెడలా వెలిగెడి సూర్యుడు నొక్కడైననూ అద్దములయందు ప్రతిబింబములుగను, ఎన్ని యద్దము లుండునో, అన్ని ప్రతిబింబములుగా దోచును, ఇట్లున్ననూ అతని యేకత్వమునకు భంగము కలుగుట లేదు. అటులే, సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము నిత్యాద్యనేక కల్యాణగుణసమేతుడై యున్న శివుడు, స్వకీయ విమర్శ శక్తి యొక్క యంశములైన అనంత అవిద్యల యందు ప్రతిబింబితుడై యున్నను. యీశ్వరుడనెడి మూల తత్వమునకు చ్యుతిరాదు.

సూర్యునికి జగత్తునంతను వెలిగించెడి మహా ప్రకాశముండినయటుల, అద్దమునందున నుండెడియతని ప్రతిబింబమునకు మూలనగల చీకటిని పారద్రోలెడి సామర్థ్యముండునటులే, శివుని యందు సర్వజ్ఞత్వాది గుణగణములున్ననూ, అతని ప్రతిబింబమైన జీవాత్మయందు సంకుచిత శక్తులైన యల్పజ్ఞత్వాదులు నుండును.

బింబప్రతిబింబములయందునత్యంత భేదమైననూ, అత్యంతాభేదమైనను ఉండదు, కాని వాటియందు భేదాభేదములను చెప్పవలసియుండును. ఒకవ్యక్తి పూర్వముఖముగా నుండిననెడ నతని ప్రతిబింబము పశ్చిమముఖముగా కన్పట్టును. బింబము బయటనుండిన నెడ ప్రతిబింబము నద్దములోన దోచును. ఇట్లే పరాఙ్ముఖత్వము, దర్పణస్థితత్వ మిత్యాది ధర్మముల చేత భేదము దోచిననూ, బింబప్రతిబింబములందు సమాన రూపముండుట చేత, బింబము లేనిదే ప్రతిబింబముదోచదుగాన, ప్రతిబింబమునకు కారణమైనయద్దము మొదలగు నుపాదులు నాశనమైన పిదప ప్రతిబింబముస్వతంత్ర స్థితి యుండదు గాన, ప్రతిబింబము బింబమునకునందే యనుభవమునకు వచ్చును. అందుచేతనీ రెంటియందున భేదమును నిదియే, యభేదమనునిదియే. అటులే, జీవుడు మరియు నీశ్వరుల యందు సంసార దిశన భేదమునూ, ముక్తావస్థయందున నభేదము. నంగీకరించి, వీరిరువురియందు భేదాభేదమును చెప్పెడి వీరశైవ సిద్ధాంతమునకు, బింబప్రతిబింబమైనవి సాధకమేగాని బాదకము కాజాలదు.

సామాన్యముగా దార్శనిక ప్రపంచమునందు జీవ, యీశ్వర మరియు జగత్తులనెడి మూడు పదార్థములు విచారణీయములై యుండును భారతీయ తత్వజ్ఞానులు వీటి స్వరూపాది విచారములందున నేకాభిప్రాయమును గల్గి యుండియూ తమదే అయిన నొక చింతన యొక్క వైశిష్ట్యముననెంతో సుందరముగా నిరూపించిన వారు శ్రీ రేణుక భగత్పాదుల వారు గమనించుడి: ఒకే నిగూఢమైన తత్వము భోక్త, భోజ్యము మరియు ప్రేరకునిగా కల్పితమైనదని యుపదేశించిరి. జీవుడే భోక్తయనియును, జగత్తును భోగ్యమనియును, ఈశ్వరుని ప్రేరకునిగాను తెలియజేసిరి. బ్రహ్మమే యీ త్రివిధరూపములుగా పరిణమించుననెడి శ్రీరేణుకులవారి యభిప్రాయము శ్రుతి సమ్మతముగా నున్నదని తెలిపెడి యీ ప్రమాణమును గమనించుడి:

శ్లో॥ భోక్తాభోగ్యం ప్రేరితారంచమత్వా।
సర్వంప్రోక్త త్రివిధం బ్రహ్మమేతత్॥

గౌరీ పున్నమీ నాడు చక్కెర చేత తయారు చేయబడిన నానా ప్రకారములైన బొమ్మలను మంగళారతి పళ్ళెమున నుంచి గౌరమ్మకు హారతినిచ్చెడి సాంప్రదాయమొకటి కర్ణాటకలో నాచరణలో నున్నది. ఈ బోమ్మలు బలువిధములైన దేవతామూర్తులకు చెందినవైయుండును. పిల్లలకు నివి విభిన్నమైనవిగా గోచరించిననూ, వీటి నమ్మే అంగడివానికి యివన్నియును చక్కెర బొమ్మలే. ఒకే విధమైనవి గాన, ఖరీదు ధర కూడ నొకటిగానే ఉండును. అటులనే "యత్సాక్షాదపరోక్షద్బ్రహ్మ" యనెడి శ్రుతి వాక్కుననుసరించి జ్ఞానులకు సర్వమూ శివమయముగా దోచిననూ, అజ్ఞాలైన జీవులకు జీవునిగనూ, జగత్తుగనూ మరియు నీశ్వరునిగనూ దోచును.

సృష్టియనెడిది పరశివుడు తన వినోదములకై రచించిన నొక లీలావిలాసము. ఈ లీలయందుశివుడు జీవునిగనూ, జగత్తుగనూ మరియు జీవ జగత్తుల ప్రేరకునిగను రూపుదాల్చును. శివుని యాత్రివిధములగు రూపములకు అతని యందు నుండెడి శక్తియే కారణము పరశివునియందు నవినాభావ సంబంధముతో నుండెడి విమర్శ శక్తికి "అవిభాగ పరామర్శ", "విభాగపరామర్శ" లనెడి రెండు అవస్థలు గల్గును. వీటియందు మొదటిది జగదుత్పత్తి కంటెనూ పూర్వమునకు చెందినది. రెండవది జగదుత్పత్తికి చెందినది.

నెమిలి గుడ్డులో మున్ముందు రూపుగొను పక్షికి చెందిన విచిత్రమైన రెక్కల వన్నెలు మరియు శరీరావయవములు రసరూపమున నుండునటులే విమర్శ శక్తిలోని నవిభాగ పరామర్శ దెసయందు విచిత్రముగాతోచెడి యీ విశ్వము నేకరూపముగ నణగియుండును. ఈ విధిననే, "విమర్శాఖ్యా పరాశక్తిర్విశ్వవై చిత్యకారిణీ" యని శ్రీ భగవత్పాదులు నిరువదియవ పరిచ్ఛేదము లోని భాజన స్థలమునందు నుపదేశించిరి.

శివుని యందును జగద్రచనకు చెందిన యిచ్ఛ జాగృతమైన పిదప విమర్శశక్తియును విభాగపరామర్శ యవస్థను దాల్చును. అప్పుడు సత్వ, రజో తమములు సామాన్యావస్థ అయిన ప్రకృతి తత్వములోని ప్రాదుర్భావమగును. యీ మూడు గుణములు సామాన్య వ్యవస్థ యందున నున్నప్పుడు జగము జనించదు. వీటి వైశమ్యము విశ్వములోని వైచిత్ర్యములకు మూలమని గ్రహింపదగును. మూడింటిలో నేదియో నొకటియుత్కృష్టమైయుండి, మిగిలిన రెండు గుణములు దాని యధీనమై యుండు స్థితియే వైషమ్యము.

ఈ త్రిగుణ గుణములు యందు రజోగుణము యొక్క మిశ్రణ చేత దూషితమైన సత్వగుణోపాధియైన అవిద్యయందున నుండెడి శివాంశనే భోక్తృయైన జీవునిగనూ, తమోగుణ ప్రధానమైన ప్రకృతితోకూడిన శివుడె భోజ్యమైన ప్రకృతిగనూ, శుద్ధసత్యగుణోపాధియైన మాయతో నొడగూడిన పరశివచైత్యమే ప్రేరకుడగు శివునిగనూ పిలువబడుదురు. నిస్తరంగాంబుధి యందు వాయుప్రకోపము చేత తరంగము లుద్భవించిన యటులనే ప్రశాంతమైన సుఖసాగరమగు పరశివుని యందు గుణత్రయముల యొక్క సంబంధముచేత భోక్తృ, భోజ్య మరియు ప్రేరకములనెడి వస్తుత్రయములును ప్రావిర్భవించును.

**ఓం శాంతిః ఓంశాంతి ః ఓంశాంతి ః**

18-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖరశివాచార్యుల వారు శివ జీవాబేద తత్త్వమునెంతో చక్కగా వివరించి వస్తుత్రయమును గూర్చి విశ్లేషణ చేసి భక్త కోటికి మహోపకారమును చేసిరి.

ఆత్మపరమాత్మ తత్వములకు గల అనుబంధము గురించి బహువిధములగు దృక్పథములు బయల్వెడలినవి. వివిధ వాదములు వెలువడినవి. వీటిలో కొన్ని నిరీశ్వర వాదములు. ఆస్తిక వాదములు స్థూలముగా రెండు విధములుగా విభజింపబడినవి అవి: ద్వైతము, అద్వైతము, శివజీవులు భిన్నమైన వారు అని చెప్పునది ద్వైతము. ఒకే బ్రహ్మభ్రాంతి మూలమున జీవునిగా కన్పట్టుచున్నాడనెడిది అద్వైతము.

ఈ రెంటికి మూలము బ్రహ్మ సూత్రములే. వీటికంటెనూ భిన్నముగా కొన్ని సిద్ధాంతములు ప్రతిపాదింపబడినవి. ఈ వాదములు శివాగమములను ఆధారముగా గొనినవి. అట్టివాటిలో వీరశైవమొకటి. శివ–జీవుల నివృత్తి దశలో నభేదమే పొడసూపును కాని ప్రవృత్తి మార్గమున పయనించిన పిదప శివ– జీవులకు భేదము కన్పట్టుచున్నది. సృష్టి ప్రారంభము కాని యప్పుడు అభేదమే, సృష్టి పిదప గల్గెడి భేదము యైననూ సాదృశమైన భేదమే కాని సంపూర్ణమైన భేదము కాదు. శివుడే జీవుడయి కొన్ని విశిష్టమైన లక్షణములు సంతరించుకొని. మలావృతుడై అశుద్ధత్వము పొందును. తాను శివుడను, కాను అనెడి భావము గల్గియుండును.

శివుడు జీవుడుగా యెట్టులయ్యెననెడిది తెలియ జెప్పుటకే శ్రీ భగవత్పాదువారు వస్తుత్రయోత్పత్తి గూర్చి తెలియజేసిరి వస్తుత్రయముల గురించిన మహిమ్నః స్తోత్రమున ఈ క్రింది విధముగా నున్నది.

**శ్లో॥ తవైశ్వర్యం యత్తజ్జగదుదయ రక్షాప్రలయకృత్ ।**
**త్రయీ వస్తువ్యస్తం తిసృషు గుణభిన్నాసుతనుషు**
**అభవ్యానామస్మిన్ వరద రమణీయామరమణీం**
**విహంతుం వ్యాక్రోశీం విదధత ఇహైతే జడధియః ॥** (మహిమ్న: స్తవము, శ్లో॥ 4)

ఈ స్తవము యొక్క కర్తయగు పుష్పదంతుడు పౌరాణిక పురుషుడు. స్కందపురాణములోని ప్రభాస ఖండము 147వ అధ్యాయమునను, పద్మపురాణోత్తరార్ధమున 43వ అధ్యాయమునను, దేవీ భాగవత పురాణములోని 9వ అధ్యాయమునను ఈ పుష్పదంతుని కథ వివరింబడినది ఈ స్తవమును గూర్చి వ్యాఖ్యానిస్తూ పండిత వీరభద్ర శర్మ (శ్రీ కాశీ జగద్గురువు) గారు యీ క్రింది విధిన వ్యాఖ్యానించిరి.

ఇందు చార్వాకుడు విమర్శింపబడినాడు. "చతుర్భూతములలో స్వాభావికముగా గలుగు చేష్టల వలన జగత్కార్యము తనంతతానే జరుగుచున్నది. కాని దీనికి కర్తగు నీశ్వరునొకడు లేడు" అని పామరజన మనోహరముగా చార్వాకులు బల్కుచున్నారు. కాని ప్రపంచములో ఒక్క కార్యమైన కర్త లేకుండగ జరుగుచున్నట్లుగా నిరూపించ గలరా? ప్రయత్నము లేకయే అన్న పానాదులు ప్రాణి కోట్ల యొక్క నోటిలో తామే వచ్చి పడుచున్నవా? లేవు. కావున సర్వజ్ఞుడును, సర్వకర్తయునగు శివుని మహిమ ఇచ్ఛా క్రియాజ్ఞానమువలన తెలియవలయునే గాని పామరుడు స్థూలముగా కనుగొన జాలడు.

(శివ పంచస్తవి, పు. 7)

ఈ విధముగ, శివుని యొక్క ప్రేరకపాత్ర గూర్చి చెప్పబడినది. ఈ ఈశ్వర తత్వము షట్త్రింశత్ తత్త్వముల కోవకు చెందినదనియును తెలిసికొనగలరు.

**–శివం భూయాత్–**

## ఆశీర్వచనము-5

**అత్ర ప్రేరియితా శంభుః శ్యుద్ధోపాధిర్మహేశ్వరః ।**
**సమ్మిశ్రోపాధయఃస్సర్వే భోక్తారః పశవః స్మృతాః**
**భోజ్యమవ్యక్తమిత్యుక్తం శుద్ధతామసరూపకం॥**
**సర్వజ్ఞః ప్రేరకః శంభుః కించిద్జ్ఞో జీవ ఉచ్యతే।**
**అత్యంతగూఢచైతన్యం జడమవ్యక్తముచ్యతే।**
**ఉపాధిః పునరాఖ్యాతః శుద్ధా శుద్ధ విభేదతః**

**శుద్ధోపాధిః పరా మాయా స్వా(శయా మెహకారిణీ॥**
**అశుద్ధోపాధీ రప్యేవమవిద్యా (శయ మెహినీ।**
**అవిద్యా శక్తి భేదేన జీవా బహువిధా స్మృతాః ॥** (సి.శి.5-41-44)

శా(స్త్రోపదేశము విధిముఖమనియునూ, నిషేధముఖ మనియునూ రెండు విధములుగనున్నది. అద్వైతవేదాంతులు "(బహ్మసత్యం జగన్మిథ్యా జీవో(బహ్మైవనాపరః", " నేహ నా నాస్తికించన" మొదలగు (ప్రమాణ వచనములచేత పరమతత్వమును తెలుపుచున్నారు. శివాద్వైతులైన వీరశైవులు " జీవః సత్యం జగత్సత్యం శివః సత్యం స్వభావతః" "సర్వలింగమయంజగత్" అనెడి (ప్రమాణములచేత సర్వ(త శివతత్వమును జూపెట్టి, విధిముఖోపదేశము చేత పరతత్వములోని యెరుకను గల్గజేయుచున్నారు.

(ప్రకృతమునందు, శ్రీ రేణుక భగవత్పాదులైననూ భోక్తృ, భోజ్యమరియు (ప్రేరకుడైన వాడు నొక్కడేయనెడి విధిముఖోపదేశము చేతనే శ్రీ అగస్త్య మహర్షికి సర్వ(త శివదృష్టిని తెచ్చియిచ్చిరి. "శివతత్వాత్ సముత్పన్నం శివ యేవ చరాచరమ్" అని తెలిపిరి. శివతత్వమునుండి పుట్టిన యీ జగత్తంతయును శివుడే యనునది యీ వాక్కులకున్న అర్థము.

ఇట్టి శివదృష్టిని సాధించికొనిన అన్నగారైననూ ఈ విధిననే తలిచిరనెడి దానిని స్ఫురింపజేసే వచనమును గమనించుడి:

**ఎత్తెత్త నోడిదత్తత్త నీనేదేవా,**
**సకల విస్తారద రూహు నీనే దేవా**
**విశ్వతశ్చక్షు నీనే దేవా,**
**విశ్వతోముఖ నీనే దేవా,**
**విశ్వతోబాహు నీనే దేవా,**
**విశ్వతః పాద నీనే దేవా, కూడలసంగమ దేవా.!**

వచనము యొక్క తెలుగు రూపమిదిః

**ఎటైట చూసిననట్టట్ట నీవే దేవా,**
**సకల విస్తారపు రూపు నీవే దేవా,**
**విశ్వతశ్చక్షువు నీవే దేవా**
**విశ్వతోముఖ నీవే దేవా,**
**విశ్వతోబాహు నీవే దేవా,**
**విశ్వతోపాదుడ నీవే దేవా, కూడలసంగమదేవా.**

నిషేధముల మరియు విధిముఖోపదేశముల (ప్రయోజన మొకటే అయియున్ననూ నిషేధముఖముకంటెను వీరశైవాభి మత విధిముఖోపదేశము హెచ్చుగా లోకోపోయోగియైయున్నది. నిషేధముఖోపదేశము చేత శరీరాది సకల (ప్రపంచమునందున మిథ్యాత్వ బుద్ధిగల్గి మనిషి తాను చేయుచుండెడి వ్యవసాయ వ్యాపారాది వ్యవహారముల యందు ననాసక్తత గల్గినవాడై, నిర్లలక్ష్య భావమును వహించిననెడ సాంసారిక జీవనమే నస్తవ్యస్త య్యెడి స్థితి సంభవించగలదు. విధిముఖపరమైన ఉపదేశము చేత సర్వ(త శివ దర్శనమయ్యెడి కారణమున, దేనియందును అనాసక్తత గల్గదు గాన యెన్నియోగుణములు గల్గును. "యద్యత్ కర్మకరోమి తత్తదఖిలం శంభోతవారాధనమ్" అనెడి భావమేర్పడును. ఎదేది నేను చేయుచున్నానో అది యెల్లను తమరి ఆరాధనమే" అనేది దీని యర్థము. ఇట్టి సుందరభావన కల్గుట చేత వ్యవహారములన్నియునూ చక్కగా భక్తి భావముతో నిర్వహింపబడును. దాని వలన లౌకిక జీవనము స్వారస్యముగా కొనసాగును. అందుచేతనే శరణులు, "కాయకమేకైలాస" మని నమ్మి, ఆచరించి, చేసెడి యుద్యోగముల యందున ముక్తి సుఖముననుభవించిరి.

శుద్ధ సత్వగుణోపాధివలన మహేశ్వరుడనిపించికొనెడి పరమాత్మ (ప్రేరకుడైననూ, మి(శోపాధికులైన జీవాత్మలు కర్మఫలంబులను భోగించెడి పశువని యనిపించికొనును (ప్రతి యొక్కడు కర్మలను చేయుచుండును "నహికశ్చిత్ క్షణమపిజాతు తిష్ఠత్యకర్మకృత్" అనెడి

గీతోక్తి ప్రకారము వివశుడై కర్మలను చేయును. కర్మలను చేయకుండగ నొకక్షణమైననూ ఉండజాలడని గీతోక్తిలోని భావము మానవుడు చేసెడి కర్మలలో విహితావిహితములుండునని గ్రహించి. తాను చేసెడి కర్మల యనుభోగములకు తానే బాధ్యుడుగా నుండును "సుఖదుఃఖముల యనుభవమే భోగము". ఇవి మనస్సుకు చెందిన విషయములు సుఖదుఃఖముల భోగోత్పక్తికి ముఖ్యముగ శబ్దాదులే కారణములగును ఇవి ప్రత్యక్షముగా మనస్సుకు సంబంధము గల్గియుండవు. ఇంద్రియములు మాధ్యమములుగా నుండును. కళ్ళురూపము చేతనూ, చెవులు వినికిడి చేతనూ, చర్మము స్పర్శచేతనూ, నాలుక రసము చేతనూ, ముక్కు వాసన చేతనూ మనమునకు తృప్తి గల్గించుచున్నవి.

"ఆపాతరమ్యా విషయాః పర్యంతపరితాపినః" అనెడి సూక్తిననుసరించి, ఆరంభమున సుఖమును గల్గించిననూ అంత్యమున దుఃఖమును గల్గించునదే విషయముల స్వభావము విషయములవలన ప్రాప్తమయ్యెడి సుఖము నావగింజంత. దుఃఖముననుభవించియూ మరల సుఖమునకై పరువులు తీసెడి మనస్సు యొక్క ప్రవృత్తిని శ్రీ భగవత్పాదులు పశువృత్తియనియును, ఇట్టి భవి ప్రవృత్తి (ఆత్మజ్ఞాన శూన్యం) గలవారిని పశువులనియూ సంబోధించిరి.

**శ్లో॥ ఆహారనిద్రా భయమైథునాంచ।**
**సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్॥**
**జ్ఞానంహి తేషామధికో విశేషః**
**జ్ఞానేనహీనాః పశుభిః సమానాః॥**

ఈ సుభాషితము పశువుకు మనిషికి గల తేడాను వివరించుచున్నది. ఆహారము, నిద్ర, భయము, మైథునములనెడివి పశువులకును, నరులకును సమానముగా నుండుననియును, మనుష్యులకు జ్ఞానమనెడిది యధికముగానుండెడి విశేషగుణమనియును, అదిలేనివారు పశువులతో సమానమనియును సుభాషితములోని భావము.

నాల్గుకాళ్ళ పశువులను పగ్గములచేత కట్టియుంచెడి దానిని మనము చూతుము, అయితే, రెండుకాళ్ళ పశువును కట్టెడి పగ్గమెయ్యది? దీనికి, శ్రీనిజగుణ శివయోగులు నెంతయో నర్మగర్భితమైన యుత్తరము నిచ్చిరి. "మమకారము కంటెను మిక్కిలి యెక్కువైన బంధముండునే?" యనునది వారిచ్చిన ప్రశ్నరూపకమౌ యుత్తరము. పొలము, ఇల్లు, భార్య, పిల్లలు, ధనము మరియు బంగారము, మొదలగు, సాంసారిక వస్తువుల యందున నుండెడి, నాది అనెడి భావన వంటి బిగువైన పగ్గము మరొక్కటి లేదు. ఈ వస్తుసంచయమే బంధములు కల్గిన వారిని సంబంధము గలవారని అందురు.

"సమ్యక్ బంధః సంబధః", అనెడి వివరణ ప్రకారము సంబంధమనగ ధృఢముగ కట్ట బడిన బంధమని అర్థము అపరిచితమైన వ్యక్తులు ఇంటికి రాగానే వీరు ఎవరు? అని ప్రశించినయెడల, మాసంబంధీకులు అనెడి వాడుకమున్నది, అందుచేత భార్య భర్త, తండ్రి, బిడ్డలు, అత్త, కోడలు, మామ, అల్లుడు అనెడి వీరి యందు యుండెడి లౌకిక సంబధములు, ఈ జన్మయందు విడిపించుకొనరాని బంధనములు ఆకాశమునందు ఏంతో దూరమున, ఎగిరెడి గాలిపటము. సూత్రమును లాగగనే, మనకడకు మరల వచ్చినయటులే, తన యింటిని వీడి బహుదూరపు దేశ విదేశములకు పోయివుండినను, అక్కడి కార్యము ముగిసిన పిదప మనుష్యుడు తన ఇంటికే వచ్చును, సంస్కృతము నందు ఇంటిని "గృహ" అందురు, 'గృహతీత గహం' అనేనుడువుల ప్రకారము ఎంత దూరముపోయినను మనిషిని తనకడకు లాగి తెప్పించెడి శక్తి వాటియందు కలదు.

రావణుని సంహారమైన పిదప లంక రామచంద్రుని స్వాధీనమైనది. లంక సామాన్య పట్టణము కాదు, అది శ్రీలంక సిరి గల్గిన స్వర్ణ నగరము. ఆ నగరము యొక్క వైభవమును గనిన లక్ష్మణుడు తన అన్నతో ఇట్లనెను:

అన్నా! మనము ఇక్కడే వుండిపోవుదము, ఆపాడు అయోధ్యయందున యేమున్నది? అది విని రామచంద్రుడు "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" కన్నతల్లి, పుట్టిన భూమి ఈ రెండు స్వర్గము కంటెను శ్రేష్ఠమని తెలిపి అయోధ్యకు లక్ష్మణునితో వచ్చెను, అవతారపురుషుడని గుర్తింప బడిన రామచంద్రుడే నావూరు నాఇల్లు అని మరలి వచ్చినప్పుడు మిగిలినవారి పాటులెట్లుండును?

ఈ విధముగ మనుష్యుడు యెంతవరకు వస్తువులు మరియు వ్యక్తుల జతకు సంబధము చేయునో అవి అన్నియు ఆమేరకు ఇతని గొంతుకు పగ్గమును కట్టును, ఒకే పగ్గము చేత కట్టబడిన పశువుకు దాని నుండి విడిపించుకొనుట వీలుగాదు, అట్టైన కంటికి కనిపించని అహంకార మమకారములనెడి ఎన్నియో పగ్గముల చేత కట్టబడిన ఈ మనుష్య పశువుకు ముక్తి యనెడిది మనస్సులోని

అంగడియే, ఒకసారి గురుశిష్యులు ఇరువురు నదికి స్నానముకై పోవునపుడు. ఒక కాపువాడొక ఎద్దును అదే పట్టణము నుండి, కొనుక్కొని దాని మెడకు పగ్గమును బిగువుగా కట్టి, తాను ముందుగా పట్టుకొని బయలుదేరెను. ఎద్దు అతనిని వెంబడిచుచుండును, ఆ దృశ్యమును చూచి గురువుగారు శిష్యునితో యిట్లు ప్రశ్నించిరి, ఎద్దుమరియు కాపువాడు వీరిరువురిలోన ఎవరి మెడకు పగ్గము కట్టబడినది? ఈ ప్రశ్నకు శిష్యుడు గురువుగారు! తమరి దృష్టిమందమైనదా ఏమి? ఎద్దుయొక్క మెడయందున పగ్గము కనిపించుట లేదా? ఇంతే కాకుండ పశువులే పగ్గము చేత కట్టబడునే కాని మనుష్యులు ఎక్కడైనను పగ్గముచేత కట్టపడుదురా? పగ్గమును పట్టుకొనిన కాపు వాడు ముందు ముందుగనే వెళ్లు చున్నాడు అందుచేత కట్టబడిన ఎద్దు వెనుక వెనుక పోవుచున్నది చూడండి అనిబదులు పలికెను. అప్పుడు గురువుగారు వీనికి ఇప్పుడే శాస్త్రజ్ఞానమును ఇవ్వ వలెనని ఎంచి ఆకాపువాన్ని పిలిచి, ఓయీ ఈ ఎద్దు ఎవరిది, అని ప్రశ్నించిరి, స్వామి ఇది నాది, ఇప్పుడే ఐదువేల రూపాయలనిచ్చి కొని తెచ్చితిని అని కాపు వాడు అనెను. అప్పుడు ఆగురువుగారు ఎద్దుని చూసేడి నెపమున దాని మెడపగ్గమును విప్పివేసెను. విడుదల పొందిన ఎద్దు సంస్కార బలముచేత తన మొదటి ఇంటి కడకు పరుగెత్త సాగెను అంతట కాపు వాడు ఎద్దును పట్టు కొనునిమిత్తము దాని వెంబడి పరుగులు తీయసాగెను. ముందు ఎద్దు దానివెనుక కాపువాడు పరుగెత్తుతుండగా అప్పుడు గురువుగారు శిష్యునివైపు చూస్తూ చూడు ఇప్పుడు ముందెవరున్నారు? వెనుక ఎవరున్నారు? ఎవరిమెడయందు పగ్గమున్నది? అని ప్రశ్నించగా శిష్యుడు గురువుతోనిట్లనెను. ఓ గురువుగారు. కాపువాని మెడయందు పగ్గమమేదియును లేదు. అయిననువాడు ఎద్దు వెనుకన ఎందుకు పరుగెత్తుచున్నాడు, శిష్యుని ఈ ఆశ్చర్యకరమైన ప్రశ్నను గురువుగారు, ఓ శిష్యా ఇదియే మమకారమనెడి పగ్గమని హెచ్చరించిరి.

ఆణవ మాయా కార్మికములన బడెడి త్రివిధ పాశములచేత బాధితుడైన జీవాత్మ సాంసారిక విషయములయందు వ్యామోహి యైనందు వలననే శ్రీరేణుక భగవత్పాదులు మనుష్యుని పశువని పిలిచిరి. వీరశైవ సిద్ధాంతమునందున చీమ మొదలుకొని చతుర్ముఖ బ్రహ్మపర్యంతముగల సకల జీవరాసులూ పశువులనియు, శివుడు పతియనియునంగీరించనైనది అందు చేతనే శివసహస్రనామముల యందు శివునికి "పశుపతి" యనెడి పేరు ప్రసిద్ధమై యున్నది నేపాలు దేశమునందున శివుడు పశుపతి యనియే స్తుతింపబడుతు పశుపతినాథ్ మందిరమున వెలసియున్నాడు.

బసవన్నగారు తమవచనములలో వీరశైవములోని పశుపతి సిద్ధాంతము నజ్ఞులకైననూ తెలిసెడి విధమున తెలియజెప్పిరి "పశువును నేను పశుపతివినీవు", "భక్తిరసమనెడి" పచ్చికను మేయించి, సుబుద్ధి యనెడి యుదకమును ద్రావించి సాకుమయ్యా! యనెడి బసవన్న వారి వాక్కులు చిరస్మరణీయములు

**విషయవెంబ హసురనెన్న ముందెతందు పసరిసిదెయయ్యా!**
**పశువేన బల్లుదు, హసురెందెళసువుదు,**
**విషయ రహితనమాడి, భక్తి రసవదణియె మేయిసి**
**సుబుద్ధియెంబ ఉదకవ నెరెదు**
**నోడిసలహయ్యా కూడల సంగమ దేవా!**

దీని తెలుగు రూపమిది:

**విషయమను పచ్చికను నా ముందే తెచ్చి పరిచితవయ్యా**
**పశువేమి యెరుగు? పచ్చికయని యెలయు (ఎగబడు)**
**విషయరహితుని జేసి భక్తిరసపు దళమును మేపి**
**సుబుద్ధియను ఉదకము త్రాపి**
**సాకుమయ్యా, కూడల సంగమ దేవా!**

**బడపశు పంకదల్లి బిద్దొడె కాల బడివు దల్లదె బేరే గతియుంటే**
**శివ శివ, హొడెహె హారేదెహనయ్యా నిమ్మ మన దత్తలెన్న తెగెయయ్యా**
**పశువనాను, పశుపతినీను**
**తుడుగుణి యెందు ఎన్నహిడిదు బడియదమున్న**
**ఒడెయ నిమ్మబయ్య దంతె మాడు, కూడల సంగమ దేవా!**

దీని తెలుగు రూపము:

**బడుగు పశువు పంకమున బడెనేని**
**కాళ్ళు కొట్టుకొనునే గాని వేరే గతి గలదే!**
**శివ శివ! పోయితి పోయితి నయ్యా**
**నీ మనము వైపు నన్ను తీసికొనుమయ్యా!**
**పశువును నేను– పశుపతివి నీవు!**
**దొంగ తిండి యని నన్ను పట్టి కొట్టక ముందే**
**ఒడుయుడా! మిమ్ము తిట్టనటుల చేయు, కూడల సంగమ దేవా!**

దెబ్బలు తింటూకూడ, దొంగ తిండికై యెగబారెడి పశవుల పలె జీవుడు పదే పదే జనన మరణములకు గురియగుచు బాధపడుచున్ననూ, ఆ జనన మరణములకు కారణమైన విషయభోగములననుభవించుటకై తాపత్రయపడును కామాది విషయాసక్తులు ప్రబలమైనవనియును, వాటిని జీవుడు వీడనొల్లడనియును శ్రీ నిజగుణుల వారు తెలిపిరి. కామక్రోధ మద మత్సరంబులను నిరోధించి, పశుప్రవృత్తి నుండి విడుదల పొంద వలెనని అక్కగారు తెలియజెప్పిరి.

మదనారి అయిన మహాదేవుని దయలేనిదే బోక్తగా పిలువబడె జీవునికి భోగాసక్తి నివృత్తికాజాలదు. అందు చేతనే భక్తుడైన వాడు ఘ్రాణ, రసన, నేత్ర, త్వచ శ్రోత్రములనెడి పంచజ్ఞానేంద్రములయందు క్రమముగా ఆచార లింగము, గురు లింగము, శివలింగము, జంగమ లింగము, ప్రసాదలింగములను భావనా పరముగా ప్రతిష్ఠించి గంధ, రస, రూప, స్పర్శ మరియు శబ్దములనెడి పంచ విషయములను ఆయా లింగములకు నర్పించి ప్రసాదబుద్ధితో వాటిని యనుభవించి ప్రసన్న మనుస్సుగలవాడై శివపరమాత్మ యొక్క పావన కృపను పొంది ధన్యుడుగావలెను.

ఇంతకు ముందు చెప్పిన ప్రకారము పరశివ తత్వమే శుద్ధోపాధిచేత మహేశ్వరుడనియు, మిశ్రోపాధి చేత పశువైన జీవాత్మగను పిలిపించి కొనినయటులె కేవలము తమోగుణోపాధిచే కూడియుండెడి భోజ్యమైన యీ జగద్రూపముగా పరిణమించును ఇక్కడ చెప్పెడి యీ పరిణామ వాదము సాంఖ్యసమ్మతమైన వికృతమగు పరిణామవాదము కాదు. అయితే కాంచనమే కటకమన బడెడి యాభరణముగను, మన్నే కుండలుగా అయినట్లుగా నవికృత పరిణామ వాదమునునెరుగవలెను.

జీవజగత్తు మరియును నీశ్వరులనే యీ పరమాత్ముని త్రివిధ రూపములయందు ప్రేరకుడగు పరమేశ్వరుడు సర్వమునూ ఎరిగినవాడగుట చేత సర్వజ్ఞుడనియునూ, సంకుచిత జ్ఞానమున్న జీవాత్మను అల్పజ్ఞుడనియును, ఏమియును నెరుగని జగత్తు జడమనియును పిలిపించి కొందురు.

“స్వపర జ్ఞప్తి శూన్యత్వం జడత్వమ్” అనెడి వివరణ ప్రకారము తనదేది, పరులదేది యనెడి దానిని తెలిసికొనలేని దానిని జడమందురు. పృథివ్యాది పంచభూతములును, వాటియందున నుత్పన్నమయ్యెడి భౌతిక ప్రపంచమును తమ పరభేదము నరయలేనిదగుట జడముగానుండు జడములయందునూ నిగూఢముగా చైతన్యమణగి యుండుననెడిది శ్రీ రేణుక భగవత్పాదుల వారి యభిమతమనియెరుగవలెను.

బల్బుకు చెందిన గాజు లోని దీపమునకునావరణగాయున్నా, దీపపు ప్రభకు నేవిధముగ ప్రతిబంధకముకాదో అటులనే ఈశ్వరునికి నుపాధియైన పరామాయ గాజు వలె పరిశుద్ధముగా నుండుటచేత, శివుని యావరించినా స్వస్వరూపము యొక్క యావరణ కానందున, యీశ్వరునికి మాయా మోహములు నుండవు. అయితే జీవాత్మకు నుపాధిగానున్న అవిద్య మలినమైనదైనందున స్వస్వరూపము యొక్క విస్మృతియై జీవునికి మాయామోహముల బంధము లేర్పడుచున్నవి. జీవోపాధియైన యవిద్యయూ అనంత

రూపముల యందున నుండుట చేత యీ జీవులునూ అనంతముగా నధిక సంఖ్యలో నుందురు ఈ అనంత జీవాత్మల మోహమును నిరసనము చేసి వీరిని పునః మూల తత్త్వమైన పరిశివుని యందున నైక్య మొందించుటయే శాస్త్రముల ప్రయోజనమై యున్నది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

19-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

వీరశైవ తాత్విక దర్శనమున శివుడు, ప్రకృతి మరియు పురుషుడనెడివి యతి ముఖ్యమైన తాత్వికాంశములు. శ్రీ కాశీ జగ్గురు విద్యా వాచస్పతి చంద్రశేఖర శివాచార్యులవారు, ఈ విషయముల గురించి విజ్ఞానదాయకములగు వాటినెన్నింటినో వివరించిరి. భేదాబేద సిద్ధాంతములోని మౌళికాంశములను, ఈ తత్వముల పరిణామ క్రమమును ఎంతో చక్కగా వివరించిరి.

శివుడు స్వీయలీలావిలాస వైభవోన్నతి కొరకు శివ-జీవ-ప్రకృతులుగా పరిణామమును పొందునని వీరశైవ సిద్ధాంతము ప్రతిపాదించినది కొందరన్య దర్శనముల యెడల నభిమానము గలవారై పలు వైవిద్యములైన వాదములను ప్రతిపాదించిరి. వీటిలోన, అతిముఖ్యమైనది ప్రకృతి తత్వము యొక్క స్వరూప స్వబావములకు సంబంధించినది. వీరి వాదనలు ‘‘వస్తుత్రయము యొక్క పరస్పరానుబంధమును ప్రశ్నించునదైయున్నది. ఈశ్వరునికి ప్రేరకుని పాత్ర గలదనెడి విషయమునందున విపరీతమైన అభిప్రాయ భేదములు గలవు ప్రకృతి యావిర్భావానికిని, దాని మనుగడకు మరియు, దాని విద్యుక్త ధర్మనిర్వహణకు ఈశ్వరునితో నెట్టిప్రమేయము లేదనే వాదనలు గలవు. ఇట్టి వాదనలే శివ-జీవుల సంబంధముల గురించియును గలవు ఇట్టి వాదనలకు స్పందించిన అనామయస్తవకర్త యీ విధిన యుత్తరమునిచ్చిరి. విజ్ఞాన ప్రదాయకమగు ఈ కవి వాక్కులు గమనింప దగినవైయున్నవి.

**శ్లో॥ భోగ్యామాహుః ప్రకృతి మృషయశ్చేతనా శక్తి శూన్యాం**
**భోక్తానైనాం పరిణమయితుం బంధవర్తీ సమర్థః ॥**
**బోగోప్యస్మిన్ భవతి మిథునే పుష్కల స్తోత్రహేతో**
**నీల గ్రీవత్వమసి భువన స్థాపనా సూత్రధారః** (అనామయస్తవము, శ్లో 5)

దండి కవి వాదములోని సారాంశమేమనగా కొందరు కపిలాది ఋషులు చైతన్యమే లేనట్టి జడప్రకృతిని భోగింప దగిన దానిగా చెప్పుచున్నారు పోనీ వారు చెప్పిన పురుషుడైనను సమర్థుడనుకొన్నను వాడు అవిద్యాది మాయాపాశముతో కూడికొని యుండునని వారి శాస్త్రమే తెలుపుచున్నది. వీరిరువురి మధ్య భోగానుభవము స్వయముగా గల్గుట లేదు. అది ప్రేరకుడగు మరియొక్కని ప్రమేయము వలన గల్గుచున్నది కావున చరాచరాత్మకమైన సకల జగత్తుకు పరమేశ్వరుడే సదా కారణుడై యున్నాడు.

దండి మహాకవి శ్రీ భగవత్పాదుల వారి భావములతో పరిచయము గల్గియుండి యుండునని బావించుటకు ఆదారములు గలవు. వస్తుత్రయములో శివుడు ప్రేరకుడనెడి విషయము పండితలోకము చేత నామోదింపబడినది.

ప్రకృతిలోని జలాదులకు శివుడు ప్రేరక శక్తియని తెలిపెడి చతుర్వేద సారములోని ఈ ప్రమాణమును గనుడి:

**శ్లో॥ చంద్రాంక మౌళియాజ్ఞను “పృథివ్యాఓషధయ” యన నీ ధరాతలంబు నందు**
**హరునియాజ్ఞన ‘దశవాపోన్న మాపోమృతాపో” యనగ జలంబతిశయిల్లు**
**రుద్రుని యాజ్ఞను రుద్రోయనగను సోయగ్ని యనగ దానలరు అగ్ని**
**పరమేశునాజ్ఞను “ప్రాణోతతో వాయుభూరితి” యనజను మారుతంబు.**
**నభవునాజ్ఞ వెలయునట్ల “శూన్యస్తథా”**

యనగ శూన్యమట్ల ననుసరించు
గాన శివుడు నాదికర్త యేటకు వేఱ
ప్రత్యయంబు లేల బసవలింగ! (చతుర్వేద సారము, 48)

పాల్కురికి వారి ప్రకారము శివుడు పంచ భూతములకు ప్రేరణ శక్తిగా నిలుచుచున్నాడని గ్రహించగలరు. ఇందువలన "సర్వజ్ఞః ప్రేరక ః శంభుః" అనెడి శ్రీ భగవత్పాదుల వాక్కులు సర్వత్ర ఆమోదితమైన విషయములని తెలిసి కొనుట కవకాశము కలదు.

"సర్వేభోక్తారః పశవః" అనెడి భగవత్పాదుల వారి యుపదేశములో పాశుపత సిద్ధాంతము యొక్క ఛాయలు గోచరించు చున్నవి పాశుపత మనెడి దొక స్వతంత్ర దర్శనమని తెలియుచున్నది ఇది యెంతో ప్రాచీనమైనది "శైవాగమేషు ముఖ్యం పశుపతి పాశా ఇతి త్రయం" యనెడి ప్రమాణము ప్రకారము శివాగమములలో పాశుపత భావనలే యిమిడి యున్నవి. బాద రాయణుల వారు దీని గూర్చి వ్యాఖ్యానమును చేసిరి పంచమవేదములో దీని ప్రస్తావన గలదు పుష్పదంతుడు, తమమహిమ్న స్తవములో దీని గురించి యీ క్రింది విధిన ప్రస్తావించిరి

శ్లో॥ త్రయీ సాంఖ్యం యోగః పశుపతి మతంవైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిద మదః పథ్యమితిచ।
రుచీనాం వైచిత్ర్యాద్ ఋజుకుటీల నానాపథజుషాం
నృణామేకో గమ్యస్త్వమసి పయసామర్ణవా ఇవా ॥ (మహిమ్నః స్తవము, 7)

వీరశైవమునకు మహా పాశుపత మతమనెడి పేరుగలదని లి॥డా॥జ.చ.ని మహా స్వాముల వారి మతము పశువులకు - పశుపతికిని గల సంబంధమును వివరించెడి యీ పద్యమును గనుడి:

శ్రుతి అహమ్మేవ పశూనా మధిపతి ర
 సావితి యనగ విస్తార మహిమ
వర్ణనకెక్క 'శర్వాయ చ పశుపత
 యే నమో' "యన నిద్ధమహిమ
బ్రబలి "ఇమం పశుపతయేచతే యద్య
 బధ్నామి" యనగ నపాప తుహియ
వ్యాపిత లీల 'నుమాపతయేపశు
 పతయే' యన నతుల మహిమ

బరగు గాన శివుడె పశుపతి యజహరీం
ద్రాదులెల్ల బశువులనెదు శ్రుతులు
చదివి చదివి కూలలది యెట్ల కో శివ
భక్తి హీనులైరి బసవ లింగ! (చతుర్వేద సారము, 34)

- శివం భూయాత్-

# ప్రథమ పరిచ్ఛేదము
## ప్రవేశిక

శ్రీ వీరశైవ సిద్ధాంతము, నిగమానిగమములలో ప్రసిద్ధములుగానున్న సిద్దాంతములకు శిఖామణి వంటిదనియును, నూటొక్క స్థలములు గల ఈ సిద్ధాంతము ప్రప్రథమమున శ్రీ రేణుకాచార్యుల వారు నుపదేశించిరనియును, శివయోగి శివాచార్యులవారు నీ సిద్ధాంతమునకు గ్రంథ రూపమును గల్పించిరనియును తెలుపబడినది. శ్రీ మరితొంట చార్యుల వారి ఈ క్రింది శ్లోకములు గమనార్హమైయున్నవి.

**శ్లో॥ అనేకవిధసిద్ధాంతశిఖామణిమనామయమ్ ।**
**శ్రీవీరశైవసిద్ధాంతమేకొత్తరశతస్థలమ్ ॥**
**రేణుకాగస్త్యసంవాదం నిగమాగమవిశ్రుతమ్ ।**
**ప్రదీపయతి గుప్తార్థముద్ధృత్య శివయోగిరాట్ ॥**

శ్రీ రేణుకాగస్త్య సంవాదమనెడి పేరున వినుతింపబడిన ఈ వీరశైవ సిద్ధాంతమును యోగి విరాటగు శ్రీ శివయోగి శివాచార్యులవారు అనేక గుప్తార్థములను వెలికిదీసి గ్రంథరూపమున ప్రకటించిరనెడిది ఈ శ్లోకయుగ్మకము వలన తెల్లమగుచున్నది.

"నిర్విఘ్న సమాప్తికామో మంగలమాచరేత్" అనెడి పండితోక్తి ప్రకారము గ్రంథము నిర్విఘ్నముగా పరిసమాప్తము కావలెననెడి యభిలాషగలవారు గ్రంథారంభమునందున మంగళములనాచరించ వలెననెడిది శిష్టాచారమైయున్నది.

మంగళాచరణము మూడు విధములుగా నుండును. అవి – వస్తునిర్దేశరూపము, నమస్కార రూపము మరియు నాశీర్వాదరూపము. గ్రంథమునందున ప్రతిపాదింపబడెడి వస్తువునే నేరుగా వర్ణించుటకు ప్రారంభించిన యెడల నద్దానిని వస్తు నిర్దేశరూప మంగళమని యందురు. విషయమును ప్రతిపాదించుటకు పూర్వమే తన ఇష్టదేవతకు నమస్కారమును చేయుటయనెడిది రెండవ రకమైన మంగళము. ఇంకను నిష్ఠ దేవతకు నమస్కారమును చేయక, ఆ దేవునికి జయము గాని యని కోరునదే యాశీర్వాద రూపకమైన మంగళము. ఆస్తిక గ్రంథములలోన ఈ మూడింటిలోన యేదో రకమైన మంగళాచరణ ముండును.

ఇదే శిష్టాచారము యొక్క యనుసరణను చేసిన శివయోగి శివాచార్యుల వారు తాము రచించెడి "సిద్ధాంత శిఖామణి" యనెడి నూటొక్క స్థలముల యీ బృహద్గ్రంథము నిర్విఘ్నముగా పరిసమాప్తిని గొని, మున్ముందున శిష్య ప్రశిష్యరూపమైన జ్ఞానధార యఖండముగా ప్రవహించవలెనని సదుద్దేశముతో శివశక్తుల యవినాభావ సంబంధమును నొప్పెడి వీరశైవ సిద్ధాంతమున కనుగుణముగా నుండెడి శివశక్తులకు నమస్కార రూపమైన మంగళాచరణను పన్నెండు శ్లోకములు చేసిరి. ఈ మంగళాచరణమందున వీరశైవ సిద్ధాంతపు రహస్యమును నిమిడ్చుట యనెడిది శ్రీ శివయోగి శివాచార్యుల వారి యలౌకిక ప్రతిభకు తార్కాణమని గుర్తింపవచ్చును. ప్రకృతమున ఆ మంగళ శ్లోకముల రహస్యమును తెలిసికొందుము గాక.

### శివస్తుతి

**శ్లో॥ త్రైలోక్యసంపదాలేఖ్యసముల్లేఖనభిత్తయే ।**
**సచ్చిదానందరూపాయ శివాయ బ్రహ్మణే నమః ॥ (సి.శి. 1-1)**

ముల్లోకములలో నుండెడి చరాచర వస్తు జాలమనెడి చిత్రము లిఖింపబడుటకై మూలాధారమగు గోడవంటివాని కొరకును, సచ్చిదానంద స్వరూపునిగా యున్నవాని కొరకును, పరబ్రహ్మగానున్నవాని కొరకును, శివుని కొరకును నమస్కారము చేయుచున్నా ననెడిది శ్లోకములోని భావార్థము.

స్వర్గ మర్త్య పాతాళము లనెడివి ముల్లోకములని శాస్త్రములయందున వర్ణింపబడినది. ప్రస్తుతము మనము నివసించెడి లోకము మర్త్యలోకము. దీనికి పైభాగమున స్వర్గమును, క్రింది భాగమున పాతాళమును గలవని తెలుపబడినది. ఈ మూడు లోకములలో గల

చరాచర వస్తువులు చిత్రము వంటివే ! ఏదో యొక చిత్రమును నిర్మించవలెననిన దానికి ఆధారముగా గోడయొక్క ఆవశ్యకత గలదు. మూడులోకములనెడి సువిశాలమైనట్టి చిత్రరచనకు పరశివుడే యాధారమైన గోడగానున్నాడు. ఈ పరశివుడు సద్రూపుడుగను, చిద్రూపుడుగను మరియు నానందరూపునిగను దోచును. చిత్రము కంటెను గోడ విశాలముగా నుండునటులే ఈ మూడులోకములకంటెను పరశివుడు బహువ్యాపకుడైయుండును. అందుచేతనే, యతనిని పరబ్రహ్మయని పిలుతురు. "స భూమిం విశ్వతోవృత్వా2త్యతిష్ఠ ద్దశాంగులమ్" అనెడి వేదమంత్రమైననూ పరమాత్మ యొక్క వ్యాపకత్వమును సమర్థించుచున్నది.

"శివ ఏకో ధ్యేయః సర్వమన్యత్పరిత్యజ్య" అనగా అందరినీ విడిచి జగదాధారుడైన పరశివునొక్కనినే ధ్యానము చేయవలెననెడి శ్రుతి వచనము చెప్పినయటుల శ్రీ శివయోగి శివాచార్యులవారు నా పరాత్పర పరశివునికి నమస్కారమును చేసిరి.

**శ్లో॥ బ్రహ్మేతి వ్యపదేశస్య విషయం యం ప్రచక్షతే ।**
**వేదాంతినో జగన్మూలం తం నమామి పరం శివమ్ ॥ (సి.శి. 1-2)**

ఇది బ్రహ్మము అనెడి శబ్దమునకు వేదాంతులెవ్వని విషయముగా నెంతురో, ఎవ్వడు జగత్తుకు మూలమై యున్నాడో, యట్టి పరముడైన శివునికి నమస్కరించుచున్నాను అనెడిది యీ శ్లోకములోని భావార్థము.

"బృహ్మత్వాత్ బ్రహ్మ" యనెడి వ్యుత్పత్తి మేరకు నన్నిటికంటెను పెద్దదైన వస్తువును బ్రహ్మయని పిలుతురు. మనకు దోచెడి భూమివంటి వస్తువులు నెంతయో విశాలముగా దోచును. ఆ భూమి కంటెను జలము విశాలమైనది. ఈ విధముగా విచారించుచు పోయిన యెడల జలము కంటెను నగ్ని, యగ్ని కంటెను వాయువు, వాయువు కంటెను ఆకాశము, ఆకాశము కంటెను పరమాత్మ విశాలముగా నుండును. అందుకే

**శ్లో॥ "తస్మాద్వా పతస్మాదాత్మన ఆకాశః సంభూతఃకాశాద్వాయుః,**
**వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యఃపృథ్వి, పృథ్వివ్యా ఓషధయః**
**ఓషధిభ్యో న్నం, అన్నాత్ ప్రజాః॥"**

అనెడి శ్రుతియూ నిరతిశయమై వ్యాపకమైనది. పరమాత్మయని వర్ణించి చెప్పినది. ఈ విధముగా నన్నిటికంటెను పెద్దయైనవాడునగు పరమాత్మను వేదాంత శాస్త్రకారులు బ్రహ్మయని పిలుతురు. అన్నిటికంటెను విశాలమైన జగత్తు యొక్క యుత్పత్తి స్థితిలయలకు కారణభూతుడగు పరశివునికి శివయోగి శివాచార్యుల వారు నమస్కారమును చేయుచున్నానని తెలిపిరి.

**శ్లో॥ యస్యోర్మి బుద్బుదాభాసః షట్త్రింశత్తత్త్వ సంచయః ।**
**నిర్మలం శివనామానం తం వందే చిన్మహోదధిమ్ ॥ (సి.శి. 1-3)**

ముప్పదియారు తత్త్వముల సమూహము ఏ జ్ఞానసముద్రపుటలలలో నురుగువలె నుండియుండునో యట్టి శివుడనబడెడి జ్ఞాన సముద్రునికి వందనము చేయుచున్నాను అనెడిది ఈ శ్లోకములోని భావము.

శ్రీ శివయోగి శివాచార్యుల వారు శ్లోకము నందున వీరశైవ సిద్ధాంత సమ్మతమైన ముప్పదియారు తత్త్వముల యుత్పత్తి విషయమును బహు సంగ్రహముగా నిరూపించిరి. ఈతత్త్వముల యదార్థ జ్ఞానము కానిది వీరశైవ సిద్ధాంతమ వగాహనలోనికి రాజాలదు. అందుచేత నీ సందర్భమున యీ తత్త్వముల స్వరూపము గురించి శాస్త్రీయముగా విచారింతుముగావుత.

వీరశైవ సిద్ధాంతము ప్రకారము పరశివుని యందున నవినాభావ సంబంధము చేత విమర్శశక్తి నిహితముగా నుండును.

"ఏకోహం బహుస్యాం ప్రజాయేయ" యని చెప్పెడి (ఛాందో 6-2-3) శ్రుతి ప్రకారము పరశివునికి జగదుత్పత్తిని చేసెడి యిచ్ఛగలగనే, అతని విమర్శ శక్తియందున స్ఫురణగా "శివశక్తి, సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్య, మాయ, కలా, విద్యా, రాగ, కాలా, నియతి, పురుష, ప్రకృతి, బుద్ధి, అహంకారము, మనస్సు, శ్రోత్ర, త్వక్, నేత్ర, జిహ్వా, ఘ్రాణ, వాక్, పాణీ, పాద, పాయు, ఉపస్థ, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ, ఆకాశ, వాయు, అగ్ని, జలము మరియు పృథ్వులు అనునవి ముప్పదియారు తత్త్వములు.

పరశివునికి కేవలావస్థ మరియు లీలావస్థ యనెడి రెండవస్థలు గలవు. కేవలావస్థయందున పరశివుడు నన్నింటిని తనలోన యిమిడ్చుకొని తానొక్కడే యుండును. "ఏకాకినైవ రమతే" యనెడి వచనము ప్రకారము, అనంతకాలము వరకు తానొక్కడే యుండి యుండుట చేత వేసిరి యునప్పుడు "ఇదం జగత్ సృజేయమ్" అనెడి యిచ్ఛ తల యెత్తును. వెనువెంటనే స్తబ్ధమైన సముద్రము నందున వాయువు యొక్క తాకిడి వలన సూక్ష్మమైన కంపనలు గల్గినట్టులే పరశివుని యందున స్వల్పమైన చలనము గల్గును. ప్రాథమికమైన యీ కించిత్ చలనమే విమర్శ శక్తియని పించుకొనును. పరశివుని యిచ్ఛా శక్తి రూపమైన ఈ విమర్శ శక్తి యంతరంగము నందున జ్ఞానశక్తిగాను, బహిరంగమున క్రియాశక్తిగాను వికాసమును పొందును. ఈ విధముగా నొక్కటే అయిన విమర్శ శక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తియనెడి మూడు రూపములను పొందును. శ్రీ భగవత్పాదుల వారి ఈ క్రింది యుపదేశములోన ఈ యంశము గాంచగలము.

**శ్లో॥ గుణత్రయాత్మికా శక్తిర్బ్రహ్మనిష్ఠా సనాతనీ ।**
**తద్వైషమ్యాత్ సముత్పన్నా తస్మిన్ వస్తుత్రయాభిధా ॥** (సి.శి. 5-39)

సనాతన మైనదియునూ, త్రిగుణాత్మకమైనదియునూ, శివునితో కూడుకొని యుండెడిదియును నయిన శక్తిలోని గుణములలో వైషమ్యము కలుగగనే. దాని యందున వస్తుత్రయముత్పన్న మగుచున్నది.

ఇచ్చుట తెలుసుకొనవలసిన యొక దార్శనిక రహస్యము గలదు. అదెట్టిదనగా విమర్శనాశక్తికి "అవిభాగ పరామర్శ" దశ మరియు "విభాగ పరామర్శ" దశ యనెడి రెండు దశలు గలవు. సృష్టి యయ్యెడి దశకంటె పూర్వమున "మయూరాండ రసన్యాయము" ప్రకారము విభాగము నొందక యుండెడి దశను "అవిభాగ పరామర్శ" దశ యందురు. నెమలి గుడ్డు నుండి కాలక్రమమున కాళ్ళు, కళ్ళు, రంగురంగుల రెక్కలు నుద్భవించిన యటులే సృష్టి కార్యక్రమములో శక్తి విభాగ పరామర్శ దశను పొందును. మూడు శక్తులుగా పరిణామమును పొందును. ఈ విషయమును స్వప్రభానంద శివాచార్యుల వారు, తమ శివాద్వైత మంజరిలో ఈ క్రింది విధముగా తెలియజెప్పిరి.

**శ్లో॥ అనాదినిధనాచ్ఛాంతాచ్ఛివాత్ పరమకారణాత్ ।**
**ఇచ్ఛాశక్తిర్వినిష్క్రాంతా తతో జ్ఞానం తతః క్రియా ।**
**తత్రోత్పన్నాని భూతాని భువనాని చతుర్దశ ॥**

శక్తి యొక్క మూడు రూపములతో కూడి కొనియే పరశివ చైతన్యము ముప్పది యారు తత్త్వములుగా పరిణమించును.

**1) శివతత్త్వము :-** పూర్వమున చెప్పబడిన ఇచ్ఛాశక్తి యొక్క అంతరంగభూతమైన జ్ఞానాంశ యందున ప్రవేశించిన శివచైతన్యమే శివతత్త్వమని పిలువబడుచున్నది. ఈ శివతత్త్వము శివుడు, నీలకంఠుడు, చంద్రశేఖరుడు మొదలగు పేర్లతో పిలుతురు. సగుణరూపమైన శివతత్త్వమే ముముక్షువులచేత నుపాసింప బడుచున్నది.

**2) శక్తితత్త్వము :-** ఇచ్ఛాశక్తి యొక్క బహిరంగమైన క్రియాంశమునందున ప్రవేశించిన చైతన్యమే శక్తి తత్త్వము. ఇదే సదాశివాది భూమ్యాంతము గల ముప్పది నాలుగు తత్త్వములకు నుపాదాన కారణమగును. ఈ విషయమును శ్రీ శివయోగి శివాచార్యుల వారి ఈ క్రింది శ్లోకము వలన తెలిసికొనగలము.

**శ్లో॥ సదాశివముఖాశేషతత్త్వమౌక్తికశుక్తికామ్ ।**
**వందే మాహేశ్వరీం శక్తిం మహామాయాదిరూపిణీమ్ ॥** (సి.శి. 2-2)

**3) సదాశివతత్త్వము :-** శక్తి తత్త్వము ఇచ్ఛాశక్తి యొక్క అంతరంగమైన జ్ఞానశక్తి యందు ప్రవేశించినప్పుడు, నీటిలో నానబెట్టిన శనగలు నుబ్బి అంకురము లగుటకు సిద్ధమైన యటుల నొక విలక్షణమైన యవస్థను పొంది మున్ముందున నుత్పన్నమయ్యెడి ప్రపంచమును గురించి "అహమిదం" (నేనే ఈ ప్రపంచము) అనెడి యభిమానమును దాల్చగా దానిని 'సదాశివ తత్త్వమని' యందురు. సదాశివతత్త్వమును మొదలుకొని పృథ్వీతత్త్వము వరకు గల ముప్పది నాలుగు తత్త్వములనెడి ముత్యములు పుట్టుకకు ముత్తెపుచిప్ప వంటి పాత్రను

పోషించినదియును, మహా మాయారూపమును ధరించి లోకములను కప్పివేయునదియును, శివునితో నవినాభావ సంబంధము గల్గి యతనితో నిరంతరము కూడుకొని యుండెడిదియును అయిన శక్తికి వందన మాచరించుచున్నా ననెడిది శ్లోకములోని భావము.

**4) ఈశ్వర తత్త్వము :-** శక్తి తత్త్వము నిచ్ఛాశక్తికి బహిరంగమైన క్రియాశక్తియందున ప్రవేశించి యుత్తమ క్షేత్రము నందున విత్తిన మంచి బీజము వలె నంకురించి, యంకురితమైన ప్రపంచమును గురించి "అహమిదం" (నేను యీ ప్రపంచమును) అనెడి యభిమానమును దాల్చగా నద్దానిని యీశ్వర తత్త్వమని యందురు.

సదాశివ తత్త్వమునకును, ఈశ్వర తత్త్వమునకును నుండెడి సూక్ష్మమైన వ్యత్యాసమే మనగా భూమి యందున నాటబడిన బీజము మొదట నంకురోన్ముఖమైన యనంతరము నే విధముగా నంకురితమగునో, అటులనే శక్తి తత్త్వము నిచ్ఛాశక్తి యొక్క అంతరంగమైన జ్ఞానాంశమును ప్రవేశించి యుంకురాయమానమైన బీజము వలె నుండి సదాశివ తత్త్వమని పించికొనిన యెడల క్రియాంశమును ప్రవేశించిన యదే శక్తి తత్త్వమే అంకురిత బీజము వలె క్రియా ప్రాధాన్యతతో నీశ్వర తత్త్వ మనిపించుకొనును. కొందరు దీనిని 'నారాయణ' యని అందురు.

**5. శుద్ధ విద్యా తత్త్వము :-** క్రియా ప్రాధాన్యమైన 'ఇదం' మరియు జ్ఞాన ప్రధానమైన 'అహం' లకు మధ్య 'సాగర తరంగ న్యాయము' వలన అభేద జ్ఞానముగా 'అహమేవేదం జగత్' (ఈ జగమంతయును నేనే) యనెడి జ్ఞానము కలుగగా, నప్పుడది శుద్ధ విద్యా తత్త్వమనిపించుకొనును. గురువుల యుపదేశము వలన శాస్త్రజన్యమైన జ్ఞానమును శుద్ధ విద్యయని యందురు. కొందరు నీ తత్త్వమును 'బ్రహ్మతత్త్వ'మని యందురు.

ఈ యైదు తత్త్వముల యందున శివాంశ ఎక్కువగా నుండుట చేత వీటిని శుద్ధ తత్త్వము లని యందురు.

6) **మాయా తత్త్వము :-** శుద్ధ విద్యారూపముగా పరిణమించెడి శక్తి తత్త్వమున, మయూరాండ న్యాయము ప్రకారము, భావి ప్రపంచపు సకల సామగ్రి సూక్ష్మ రూపమున నణిగి యుండును. ఎప్పుడు నీ సకల పదార్థముల లేదా తత్త్వముల పరస్పర భేదభావము గల్గునో, అప్పుడా శుద్ధ విద్యయే "మాయా తత్త్వమనిపించికొనును. ఈ మాయా తత్త్వము యొక్క ప్రభావము చేతనే పరమాత్ముని యంశయైన జీవాత్మయందున "నాహ మీశ్వరః" (నేను నీశ్వరుడనుగాను) యనెడి భ్రమ యుత్పన్నమగును. ఈ మాయాశక్తి ప్రభావము చేతనే శుద్ధుడైన జీవుడు 'సంసారి' యనిపించికొనును.

**(7-11)కలాది పంచతత్త్వములు :-** పరమాత్ముని మాయ చేత నపహరింపబడిన యైశ్వర్యమున్నవాడగుట చేత నితని సర్వ కర్తృత్వ, సర్వజ్ఞత్వ, పరిపూర్ణత్వ, నిత్యత్వ, వ్యాపకత్వ రూపములగు శక్తులు సంకోచమును పొంది కలా, విద్యా రాగ, కాల నియతులై జీవాత్మ నావరించి యుండును. అందుకే, వీటిని పంచకంచుకములని యందురు. జీవుని లోని సర్వకర్తృత్వ శక్తి సంకోచమును గొని అల్పకర్తృత్వమును బడసినప్పుడు "కలాతత్త్వ" మనిపించుకొనును. సర్వజ్ఞత్వము సంకోచమును పొంది "విద్యాతత్త్వ"మగును. జీవుని పరిపూర్ణత్వము సంకోచమును పొంది "రాగతత్త్వ" మనిపించుకొనును. ఈ రాగము ప్రభావము వలననే జీవుడు స్రక్-చందన-వనితాదుల యెడల నాసక్తి గలవాడగుచున్నాడు. జీవుని నిత్యత్వము సంకోచమును పొంది భూత భవిష్యద్వర్తమాన రూపమైన 'కాల' తత్త్వమనిపించుకొనును. అటులనే, వ్యాపకత్వము సంకోచమును పొంది యవ్యాపకమై "ఈ కారణము వలన యీ కార్యమే పుట్టునది వేరైనది పుట్టజాలదు" అనెడి నియమమునకు నసాధారణ కారణమైన "నియత తత్త్వమ"నిపించుకొనును.

ఈ పంచ కంచుకములచే పరివృత్తుడైన జీవుడు పురుషుడై సంసారము నందున ప్రవృత్తుడగును.

**12) పురుష తత్త్వము :-** కట్టెల సంయోగము కాగా అగ్ని నుండి చిన్న చిన్న నిప్పురవ్వలు పుట్టినటుల పరశివుని యిచ్ఛాశక్తియొక్క సంయోగము వలన యావిర్భవించెడి శివాంశమే పురుష తత్త్వమనిపించుకొనును. ఇతనిని ఆణవ మలము నావరించి యుండుట చేత ఆత్మయందున అనాత్మత ఆరోపించబడి "నాహ మిశ్వరః" అనెడి భావనను పొంది తాను పరమాత్మకంటెను భిన్నుడిననెడి భావన గల్గి దాను నణువు వంటి వానిననియును తెలిసికొనును ఆత్మానాత్మ వివేకమును కోల్పోయి దేహమునే ఆత్మగా భావించును ఇదే ప్రకారముగా అన్యోన్య భావభేద లక్షణాత్మకమైన మాయా మలము చేత నావృతుడై తనను, తనకు సంబంధించిన వారిని మాత్రమే ప్రేమించెడి వాడై

యన్యుల యెడల వైరిభావమును దాల్చును. రాగద్వేషముల మూలముననే శుభాశుభ కర్మలను నాచరించెడి వాడై కార్మిక మలము చేత నావృత్తుడై యుండును.

మాయాతత్త్వమును మొదలుకొని పురుష తత్త్వము పర్యంతము గల యేడు తత్త్వములు మిశ్ర తత్త్వము లనిపించుకొనును. వీటిని శుద్ధాశుద్ధ తత్త్వములనియును అందురు.

**13. ప్రకృతి తత్త్వము :-** ఇచ్చటివరకు చెప్పబడిన పన్నెండు తత్త్వములు త్రిగుణాత్మకతత్త్వములు. ప్రపంచమైనను త్రిగుణాత్మకమైనది. అందుచేత ప్రపంచపు ఉత్పత్తికి కారణభూతమైన ప్రకృతి తత్త్వము గురించి తెలుసుకొనవలెను.

కార్యోన్ముఖగర్భితమైన యిచ్చాశక్తి తన యందున యుండెడి జ్ఞానశక్తి మరియు క్రియాశక్తులలో "జ్ఞానం క్రియా న భవతి" (జ్ఞానము క్రియ కాజాలదు), "క్రియా జ్ఞానం నభవతి" (క్రియయను జ్ఞానము కాజాలదు) అనెడి అన్యోన్యాభావ రూపమైన భేదబుద్ధి గల్గిన మాయా తత్త్వము నందున ప్రతిస్ఫురించగా నయ్యది ప్రకృతి తత్త్వమనిపించు కొనును. ఇది సత్త్వ, రజో మరియు తమోగుణముల సామ్యావస్థారూపమై యుండును. ప్రపంచము యొక్క రచన యందున యిదే ప్రధానమైనదిగా నుండుట చేత దీనిని "ప్రధాన"మని పిలుతురు. ఈ ప్రకృతి తత్త్వము బుద్ధిని మొదలుకొని పృథ్వి తత్త్వము పర్యంతముగల ఇరువది మూడు తత్త్వములకు మూలకారణమైయుండును.

**(14-36) మహదాది త్రయోవింశతి తత్త్వములు :** ప్రకృతియని యనిపించుకొనెడి శక్తి తత్త్వమే నిశ్చయాత్మకమైన వ్యవహారమును చేయుటకై రూపొంది "బుద్ధి" తత్త్వమనిపించి కొనును. దీనిని మహత్ తత్త్వమనియును అందురు. బుద్ధితత్త్వమైన యీ శక్తి తత్త్వమే నేను, నాది యనెడి యభిమానమును పొంది "అహంకార" తత్త్వమనిపించుకొనును. అదే శక్తి తత్త్వము "మోడుపోయిన మ్రాను దొంగనేమో" యనెడి సంకల్ప-వికల్పములను పొంది "మనస్సు"గా యగుచున్నది. మనోబుద్ధ్యహంకారములు సుఖదుఃఖాద్యంతరంగిక పదార్థములకు కారణమైనందున వీటిని అంతఃకరణములని యందురు. ఈ అంతఃకరణము ఇచ్ఛాశక్తి ప్రధానముగా నున్నదై యుండును.

ప్రకృతి తత్త్వము జ్ఞానశక్తి ప్రాధాన్యత చేత శబ్ద జ్ఞానమునకు సాధనముగా శ్రోత్ర తత్త్వమనియును, రసజ్ఞానమునకు సాధనముగా జిహ్వ తత్త్వమనియును, స్పర్శ జ్ఞానమునకు సాధనముగా తత్త్వమనియును అనిపించుకొనును. అదే విధిన రూపగంధాదుల కొరకు సాధనాలుగా నేత్ర మరియు ఘ్రాణ తత్త్వములనిపించుకొనును. ఈ ఐదు ఇంద్రియములు శరీరమునందున యుండి బాహ్య విషయముల జ్ఞానమునకు సాధనములై యుండుట చేత వీటిని బాహ్యకరణములని యుందురు.

ఇదే ప్రకారముగా నీ ప్రకృతి తత్త్వమే రజోగుణ ప్రాధాన్యత చేత ఉచ్చారణ క్రియకు సాధనమై వాక్ తత్త్వముగను, ఆదాన ప్రదానాది క్రియలకు సాధనముగా పాణి తత్త్వముగను, గమనాగమన క్రియలకు సాధనముగా పాద తత్త్వముగను, మల విసర్జన క్రియ కొరకు పాయు తత్త్వముగను రేతోమూత్ర పరిత్యాగము కొరకు ఉపస్థతత్త్వముగను పిలువబడును. ఇవి క్రియాశక్తి ప్రాధాన్యత గలవైనందున వీటిని కర్మేంద్రియములని పిలుతురు.

ప్రకృతియే తమోగుణ ప్రాధాన్యత చేత కేవలము శ్రోత్రేంద్రియ గ్రాహ్యమైన "శబ్ద తత్త్వ" రూపముగాను, కేవలము త్వగింద్రియ గ్రాహ్యమైన "స్పర్శ తత్త్వ రూపముగాను, కేవలము నేత్రేంద్రియ గ్రాహ్యమైన రూపతత్త్వముగాను, కేవలము జిహ్వేంద్రియ గ్రాహ్యమైన 'రసతత్త్వ' రూపముగాను, కేవలము ఘ్రాణేంద్రియ రూపమైన 'గంధ తత్త్వ' రూపముగాను పరిణమించును.

ఈ శబ్దస్పర్శ రూప రసగంధములు క్రమముగా ధ్వన్యాత్మ వర్ణాత్మకముగా గాని, శీతోష్ణరూపముగా గాని, నీల పీతాదులుగా గాని, మధురాదుల రూపములుగా గాని, సుగంధ దుర్గంధరూపములుగా గాని విభాజితమై యుండకుండ సామాన్యముగా దోచుట చేత వీటిని పంచతన్మాత్రలని పిలుతురు. ఇవి అత్యంత సూక్ష్మమైనవి. వీటి నుండియే స్థూలములగు పంచమహాభూతములు నుత్పన్నమగును.

పంచభూతముల యుత్పత్తి క్రమము నద్వైత వేదాంతులు చెప్పెడి దానికంటెను భిన్నముగా ప్రతిపాదింపబడినది. తమ సహకారము చేత శబ్ద తన్మాత్ర, దీని నుండి శబ్ద స్పర్శములనెడి రెండు గుణములు గల "వాయు తత్త్వ" ముత్పన్నమయ్యెను. వాయు తత్త్వము నుండి "రూపతన్మాత్రయు", ఆ రూపము నుండి శబ్ద, స్పర్శ రూపములు గల "యగ్నితత్త్వ" ముత్పన్నమయ్యెను. అగ్ని నుండి రస తన్మాత్ర

గల్గెను. రసము నుండి శబ్ద, స్పర్శ, రూప, రసములు గల జల తత్త్వముత్పన్నమయ్యెను. జలమునకు గంధ తత్త్వము గల్గెను. గంధము నుండి శబ్దస్పర్శాది యైదు గుణములు గల పృథ్వి తత్త్వము గల్గెను.

తైత్తిరీయోపనిషత్తు (2-1-1) లో పంచభూతముల యుత్పత్తి గూర్చి ఈ క్రింది విధముగా తెలుపబడినది.

"తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః అద్భ్యః పృథివి".

శ్రుతి వాక్యము నందున పంచభూతముల యుత్పత్తి క్రమము గురించి తెలుపునప్పుడు పంచతన్మాత్రల పేర్లు తెలుపబడలేదు. క్రమమును నిరూపించునప్పుడు చెప్పబడిన యుత్తరోత్తర భూతముల యందున పూర్వ భూతముల గుణముల యస్తిత్వము కన్పట్టును. అందుచేత రెండు భూతముల మధ్యన తన్మాత్రలను నవశ్యముగా గల్పించవలసియుండెను.

ఈ విధముగా నుత్పన్నమైన పంచభూతముల చేత పధ్నాలుగు లోకములును, ఆయా లోకములలోని చరాచర వస్తువులు మరియు జీవరాశి యుత్పన్నమైనది.

పూర్వోక్తమైన ముప్పదియారు తత్త్వములు శక్తి విశిష్టుడైన పరశివ బ్రహ్మ యొక్క పరిణామ రూపమువలే అయినందున వీరశైవ సిద్ధాంతమునందున యావికృత పరిణామ వాదము, జగత్సత్యవాదము స్వీకరింపబడినవి.

ఈ రీతిన శక్తి విశిష్టుడైన శివుడు ముప్పదియారు తత్త్వముల యందున పరిణామమును పొంది లీలా వినోదము ననుభవించును. ఈ లీలా వ్యాపారము ముగిసిన పిదప తన శక్తిని సంకోచింప జేసి తాబేలు తన అవయవములను ముడిచికొనునటులే సచరాచర ప్రపంచమును తనయందున యణగించుకొని తానొక్కడే కేవలావస్థయందున మిగిలి యుండును.

**శ్లో॥ యద్భాసా భాసతే విశ్వం యత్సుఖేనానుమోదతే ।**
**నమస్తస్మై గుణాతీత విభవాయ పరాత్మనే ॥** (స.శి. 1-4)

ఎవ్వరి ప్రకాశము చేత నీ విశ్వము ప్రకాశించుచున్నదో, ఎవ్వరియానందము చేత ఈ విశ్వము నానందించునో, అట్టి త్రిగుణాతీత వైభవము గలవాడును, పరమాత్ముడును యగు వాని కొరకు నమస్కారమనెడిది ఈ శ్లోకము యొక్క తాత్పర్యము.

ప్రకాశము మరియు నానందము ప్రతియొక్కరికిని కావలసినవి. అవి జగత్తున దోచుట చేత జీవులు జగత్తువైపుకు నన్ముఖులై సాగుచున్నారు. కాని యివి జగత్తున యుండునట్లు దోచినను జగత్తులో నుండెడివి కావు. ఇవి పరమాత్ముని లోనైయుండును. అగ్ని యొక్క సంపర్కము వలన నీరు వేడిగా దోచును. చక్కెర సంపర్కము వలన పిండి పదార్థములు తీపి పదార్థములుగా దోచును. ఇటులనే ప్రకాశమానము మరియు నానందమయము గాని ప్రపంచము పరశివుని సంపర్కము చేత ప్రకాశమానముగాను, ఆనందమయముగా దోచును. "తస్యభాసా సర్వమిదం విభాతి", తస్మైవానం దస్యాన్యాని భూతాని మాత్రా ముపజీవంతి", అనెడి శ్రుతి వచనముల యాధారమున జగత్తు ప్రకాశమయమై ఆనందభరితమై దోచుచున్నది. సత్, చిత్, ఆనందములతో కూడి కొనియుండెడి శివునియందున మాయిక ములగు త్రిగుణములుండవు. అట్టి పరశివునికి శివయోగి శివాచార్యుల వారు నమస్కారములను ప్రదానము జేసిరి.

**శ్లో॥ సదాశివముఖాశేషతత్త్వోన్మేషవిధాయినే ।**
**నిష్కలంకస్వభావాయ నమః శాంతాయ శంభవే ॥** (సి.శి. 1-5)

సదాశివ తత్త్వమును మొదలుకొని పృథ్వీ తత్త్వము వరకు గల తత్త్వముల వికసిత ప్రకటనను చేసెడి వాని కొరకును, నిష్కళంక స్వభావముగల వాని కొరకును, ప్రశాంతమూర్తి కొరకును, శంభుని కొరకు నమస్కారము, అనెడిది ఈ శ్లోకము యొక్క తాత్పర్యము.

శక్తి విశిష్టుడైన శివుడు తన వివర్ణ శక్తిచేత సదాశివాది తత్త్వముల నుత్పత్తి చేసినను తాను మాత్రము, దుమ్ము ధూళి గాలి నీరు మొదలగునవి యుండినను నాకాశము వాటిలో లిప్తము గాని యటుల నిష్కళంకుడైయుండును. "శుద్ధమీశ్వర చైతన్య" మనెడి ప్రమాణమొకటి యీ విషయమును సమర్థించుచున్నది. ఇతడు శాంతమూర్తియై యుండును. జగతిలోనెవ్వరైనను దోషరాహిత్యమును, ప్రశాంతతను వాంఛించిన యెడల వారు శివుని శరణు జొచ్చవలెను. ఇద్దానిని సూచించుటకే శివయోగి శివాచార్యుల వారు తమ నమస్కారమును శంభువుకు సమర్పించిరి.

**శ్లో॥ స్వేచ్ఛావిగ్రహయుక్తాయ స్వేచ్ఛావర్తనవర్తినే ।**
**స్వేచ్ఛాకృతత్రిలోకాయ నమః సాంబాయ శంభవే ॥** (సి.శి. 1-6)

తన యిచ్ఛానుసారముగా వివిధరూపములలోన యేదో నొక రూపమును ధరించెడి వాని కొరకు, తన యిష్టమున కనుగుణముగా ప్రవర్తించెడి వాని కొరకు, తన యిష్టానుసారముగా త్రిలోకములను సృష్టించెడి వాని కొరకు, శక్తిని కూడుకొని యుండెడి వాని కొరకు, శంభుని కొరకు నమస్కారమనెడిది ఈ శ్లోకములోని తాత్పర్యము

పరశివుడు లీలావైభవ సమేతుడు. సర్వ తంత్ర స్వతంత్రుడు తనకు వలసినదానిని తాను చేయగలవాడు. అందుచేత, "స్థిరేభిరంగైః పురూరప ఉగ్రః" అనెడి శ్రుతి వచనము ప్రకారము భక్తులననుగ్రహించుటకై తత్త్వాత్మక సృష్టిని చేయుటకై, జ్ఞానులకు సాయుజ్యమును ప్రదానము చేయుటకై నానా విధములగు లీలామయ స్వరూపములను ధరించును. సర్వజ్ఞత్వ, నిత్యతృప్తత్వ, అనాది బోధత్వ, స్వతంత్రత్వ, అనంత శక్తిత్వములనెడి షడ్గుణైశ్వర్యములు గల్గి తన ఇష్టమునకు నెల్లలు లేనివాడైయుండును. శక్తి సమేతుడగు నిట్టి శివుడు తన యిచ్ఛానుసారముగా స్వర్గమర్త్యపాతాళములను సృష్టించును. అట్టి శంభువు కొరకు శివయోగి శివాచార్యుల వారు నమస్కారమును సమర్పించిరి.

**శ్లో॥ యత్ర విశ్రామ్యతీశత్వం స్వాభావికమనుత్తమమ్ ।**
**నమస్తస్మై మహేశాయ మహాదేవాయ శూలినే ॥** (స.శి. 1-7)

"ఎవ్వనియందున సహజమైనదియును, సర్వశ్రేష్ఠమైనదియును అగు ఈశత్వము స్థిరముగా నిలిచియుండునో యట్టి వానికొరకు, మహేశ్వరుని కొరకు, మహాదేవుని కొరకు, త్రిశూలధారి కొరకు నమస్కారమును ప్రదానము చేయుచున్నాను" అనెడిది శ్లోకములోని భావార్థము.

జగత్తునందున నొకరి మీద నింకొకరు నొడయుడుగా నుండుటను గాంచగలము. భూమిని పాలించెడి సర్వశ్రేష్ఠుడైన వానిని చక్రవర్తియని పిలుతురు. ఇదే విధముగా పధ్నాలుగు లోకములకు వేర్వేరుగా నొడయుళ్ళు నుందురు. వీరందరిని పరిపాలించెడి సర్వశ్రేష్ఠమైన నొడయుడే పరమశివుడు. నొడతనపు సీమ యనెడి దిచ్చట పరిసమాప్తిని పొందును. అందుచేత నితనిని మహేశుడు, మహాదేవుడని పిలుతురు. "తమీశ్వరాణాం పరమం మహేశ్వరమ్" అనెడి శ్రుతి వచనము. దీనిని సమర్థించుచున్నది. "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం । బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాస్సంప్రసూయంతే న కారణమ్" అనెడి శ్రుతి ప్రమాణము ప్రకారము శివుడు బ్రహ్మ విష్ణ్వాది పిపీలికాంతముగల సకల జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయలకు కర్తయై యుండుట చేత మహేశ్వరుడుగాను, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తుల కలయిక రూపమగు త్రిశూలమును ధరించుటచే శూలియనియును, "దేవేషు చ మహాన్ దేవో మహాదేవ స్తతా స్మృతాః" యనెడి వచనము ప్రకారము బ్రహ్మవిష్ణ్వాది దేవతల కెల్లను పూజ్యుడై తన కంటెను నుత్కృష్టమైన మరొకడు లేని వాడైయుండుటచే, మహాదేవునిగాను పిలువబడుచున్నాడు. అట్టి వానికి శివయోగి శివాచార్యుల వారు నమస్కరించిరి. ఆ పిదపవారు శక్తిని స్తుతించిరి. శక్తి శివునిలోన నవినాభావ సంబంధము గల్గియుండునని తెలిసికొనవలెను.

## శక్తిస్తుతిః

**శ్లో॥ యామాహుస్సర్వలోకానాం ప్రకృతింశాస్త్రపారగాః ।**
**తాం ధర్మచారిణీం శంభోః ప్రణమామి పరాం శివాం ॥** (సి.శి. 1-8)

ఎవ్వరిని శాస్త్రకోవిదులు సర్వలోకములకును మూలకారణమని చెప్పుదురో, అట్టి పరశివునితో కలిసియుండి యతనితో చరించెడి పరాశక్తికి నమస్కరించుచున్నాననెడిది శ్లోకములోని భావార్థము.

వీరశైవ సిద్ధాంతమును ఆమూలాగ్రముగా తెలిసికొని తాత్వికులు "మాయాంతు ప్రకృతతి వద్యాన్మాయినం తు మహేశ్వరం", "చిచ్ఛక్తి వల్లభః శివః" "పరాస్య శక్తిర్వివిధైవ యత్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ" మొదలగు శ్రుతుల ప్రమాణము చేత శివుని సహధర్మిణియైన శక్తిని సకల ప్రపంచపు టుత్పత్తికి మూలకారణముగా చెప్పెడి శక్తికి శివయోగి శివాచార్యుల వారు నమస్కరించిరి.

జగదుత్పత్తి యందున శివునికెంత పాత్రగలదో అంతేపాత్ర శక్తికి గలదు. శివుడు జగదుత్పత్తికి నిమిత్త కారణము కాగా, శక్తి యుపాదాన కారణమగును. అందుచేతనే శక్తి విశిష్టుడైన శివుడు జగదుత్పత్తి యందున నూర్ణ నాభి (సాలె పురుగు) వలె యభిన్న నిమిత్తోపాదానా కారణుడగుచున్నాడు. శివయోగుల వారు శక్తిని "సహధర్మచారిణీ యనెడి విశేషణము నుపయోగించుట యనెడిదెంతో నర్థపూర్ణముగా నున్నది. సహధర్మచారిణీ యనగా శివునితో సదా కూడుకొని యుండెడిదని యర్థము. కవికుల గురవగు కాళిదాసు రఘువంశ కావ్యపు ప్రారంభ శ్లోకమున.

**శ్లో॥ వాగర్థావివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ।**
**జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥ (రఘువంశము)**

ఈ మంగళాచరణ శ్లోకమునందున శబ్దము మరియు నర్థముల యందును నిత్యమైన సంబంధ ముండునటులే జగజ్జననీ జనకులైన పార్వతీపరమేశ్వరులకును నిత్యమైన సంబంధమును ప్రతిపాదించినారు. పార్వతీ పరమేశ్వర యనెడి పౌరాణిక శబ్దములు. అయితే తత్త్వశాస్త్రపు దృష్టిలో వీరు శివశక్తులౌదురు.

**"నమః సోమాయచ రుద్రాయచ"** (తై. సం. 4,5-8)

"ఉమా సహాయా పరమేశ్వరం ప్రభుం (కైవల్య. 1-7) మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయిన్‌తు మహేశ్వరం (శ్వేతాశ్వతర ఉ.4-10) మొదలగు శ్రుతి వాక్యములైనను శివశక్తుల యవినాభావ సంబంధమును స్పష్టముగా ప్రతిపాదించుచున్నవి. శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారును నీ భావమును నీక్రింది యుపదేశమున పొందుపరిచిరి.

**శ్లో॥ యథా చంద్రే స్థిరా జ్యోత్స్నా విశ్వవస్తుప్రకాశినీ**
**తథా శక్తిర్విమర్శాఖ్యా ప్రకాశే బ్రహ్మణి స్థితా ॥** (సి.శి. 2-38)

విశ్వములోని సమస్త వస్తువులను ప్రకాశింపజేసెడి వెన్నెల చంద్రునియందున స్థిరముగా నుండునటులే చరాచరాత్మకమైన సకల పదార్థములను ప్రకాశమానముగా జేసెడి విమర్శ శక్తి ప్రకాశ స్వరుపుడైన పరశివుని యందున స్థిరముగా నుండు ననెడి విషయమును నీ యుపదేశమున గాంచగలము.

సచ్చిదానంద స్వారూపమైన పరబ్రహ్మము "అస్మి" ప్రకాశనందామి "(ఉన్నాను, ప్రకాశించుచున్నాను, ఆనందించుచున్నాను) అనెడి యనుభవము చేత కూడుకొని యుండును. ఈ యనుభవమే పరబ్రహ్మ యొక్క విమర్శశక్తి. ఒకవేళ యీ శక్తిని పరశివుని యందున యొప్పని యెడల ప్రకాశరూపమైన స్ఫటికము తన ప్రకాశము గురించి యరయకుండా నుండుట చేత జడమై యుండునటులే బ్రహ్మము కూడా జడమై యుండవలసియుండును.

ఈ విధమూగా శివుడు 'శక్తి విశిష్టుడ'ని సిద్ధమైనది.

విమర్శశక్తితో కూడుకొని యిండెడి బ్రహ్మము, అద్వైత వేదాంతములోన చెప్పిన యటుల నిర్విశేషముగా నుండక సవిశేషముగా నుండును. చరాచరాత్మకమైన జగదుత్పత్తికి కారణీభూతమై యుండును. ఈ జగత్తు శివశక్తుల విలాసమని యెంచవలెను.

జగతికి శివశక్తుల విలాసమును తెలియజెప్పెడి యీ సిద్ధాంతమును "శక్తి విశిష్టాద్వైత సిద్ధాంత" మని యందురు. "శక్తిశ్చ శక్తిశ్చశక్తిః, తాభ్యాం విశిష్ట జీవేశౌ, తయోరద్వైతం శక్తివిశిష్టాద్వైతమ్" అనెడిది శక్తి విశిష్టాద్వైతము యొక్క ఉత్పత్తి. శివుడే విధిన శక్తి విశిష్టుడై యుండునో, అదే విధిన జీవుడును శక్తి విశిష్టుడై యుండును. శివుని శక్తి సర్వజ్ఞత్వ, సర్వకర్తృత్వా రూపముననుండగా, జీవుని శక్తి అల్పజ్ఞత్వ, పరిమిత శక్తిత్వ రూపమున నుండును. జీవుడు శివుని యందున సమరసమైన యప్పుడు నతనిశక్తి వికాసమును పొందును. ఈ విధముగా వికసిత శక్తి విశిష్టుడగు జీవునికిని, శక్తి విశిష్టుడగు శివునికిని సామరస్యము నుండవలెనని బోధించెడి సిద్ధాంతమునే శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతమని యందురు. ఈ సిద్ధాంతమున శక్తి శివుని విడిచి యుండదు. అందుచేత శివయోగి శివాచార్యుల వారు శక్తిని స్తుతించినప్పుడు నద్దానిని శివుని సహధర్మచారణీయని యభివర్ణించిరి.

శ్లో॥ యయా మహేశ్వరః శంభుర్నామ రూపాది సంయుతః ।
తస్యై మాయాస్వరూపాయై నమః పరమశక్తయే ॥ (సి.శి.1-9)

దేనితో కూడుకొని మహేశ్వరుడగు శంభువు నామ రూపాదులు గల వాడగునో, అట్టి మాయాస్వరూపిణి కొరకు, పరమశక్తి కొరకు నమస్కారము అనెడిది యీ శ్లోకములోని భావార్థము. స్వభావతః శివునికి నామ రూపాదులుండవు. శక్తి యొక్క సాంగత్యము వలన ప్రభావితుడై నామ రూపాదులను ధరించెడి వాడగు చున్నాడు. ఈ విషయమును, శ్రీ నిజగుణ శివయోగుల వారు నీ క్రింది విధముగా తెలియజెప్పిరి.

శ్లో॥ హేళ హె సరిల్లద భవను నిన్న దెసెయింద భాళ లోచన నాగి
నిఖిల నార్జరమైళక్కె అధిపతియాదను ఎందొడె
ఆగమ నిగమ జాలవు ఐదువలె నిజనుతి గెనగజాతా ॥

దీని తెలుగు రూపమును గనుడి -

శ్లో॥ పేర్కొన పేరులేని భవుడు నీదు దశవలన ఫాలలోచనునిగా నిఖిల నిర్జర మేళనమునకు
ఆగమ నిగమ జాలము నైదుపది సేయవే నిజనితికి నగ జాతా !

నిజగుణుల వారి చిత్రణ బహు సుందరముగా నున్నది. తత్త్వ ప్రకాశిక "శక్తో యయాస సంభుర్భుక్తౌ ముక్తాచ పశుగణస్యాస్య" అని తెలిపినది స్వసమవేత యైన చిచ్ఛక్తి వలన ననేక నామ రూప క్రియలతో విశిష్టుడైన శివుడు, శివకోటికి భుక్తిముక్తుల నిచ్చుచున్నాడనెడిది ఈ సూక్తి యొక్క భావార్థము. జగదుపాదాన కారణీభూతమైదియును, త్రిగుణాత్మకమైనదియును, మాయా రూపమున నున్నదియును, మూల ప్రకృతియును, శివునితో నవినాభావ సంబంధము గల్గి శివునితో కూడియుండెదగు శక్తికి శివయోగుల వారు నమస్కారమును చేసిరి.

శ్లో॥ శివాద్యాదిసముత్పన్నశాంత్యతీతపరోత్తరామ్ ।
మాతరం తాం సమస్తానాం వందే శివకరీం శివామ్ ॥ (సి.శి. 1-10)

"శివుని వలన నాదికి యాదిన పుట్టిన శాంత్యాతీతోత్తర కళారూపముగల దానికిని, సమస్తలోకమునకు మాతృస్థానమున నున్నదానికొరకు, మంగళకారిణియైన దానికొరకు శివా అని పిలువబడెడి శక్తి కొరకును వందనము చేయుచున్నాను" అనెడిది శ్లోకములోని భావార్థము.

శివుడు స్వీయలీలా విలాసము నిమిత్తమున కేవలముగా నొక్కడై యైయున్న తాను "లింగము" మరియు "అంగము"గా విభక్తుడగును. లింగము మరల నారు రూపములను దాల్చును. అవి ఆచారలింగము, గురులింగము, శివలింగము, జంగమ లింగము, ప్రసాదలింగము మరియు మహాలింగము. ఇదే విధిన అంగము నారు రూపములను దాల్చును. అవి భక్తాంగము, మహేశాంగము, ప్రసాద అంగము, ప్రాణలింగ్యంగము, శరణాంగము మరియు నైక్యాంగము.

**శివునితో నవినాభావ సంబంధము గల శక్తి మొదట 'కళా' మరియు 'భక్తి'గా విభజితమై యాపిదప 'కళ' యారు కళలుగా రూపాంతరము చెందును. అవి - నివృత్తికళ, ప్రతిష్ఠాకళ, విద్యాకళ, శాంతికళ, శాంత్యతీత కళ మరియు శాంత్యతీతోత్తరకళ. ఈ కళలు వరుసగా నాకార, గురు, శివ, జంగమ, ప్రసాద మరియు మహాలింగముల నాశ్రయించియుండును. భక్తియును నారు రూపములను పొందును. అవి - శ్రద్ధాభక్తి, నిష్ఠాభక్తి, అవధానభక్తి, అనుభవభక్తి, ఆనందభక్తి మరియు సమరసభక్తి. భక్తియొక్క ఈ రూపములు వరుసగా భక్తి, మహేశ, ప్రసాది, ప్రాణలింగి, శరణ మరియు ఐక్యస్థలముల నాశ్రయించుకొని యుండును.**

"నివర్త్యతే అనయా ఇతి నివృత్తిః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము నే కళ వలన భక్తుని కర్మభోగము నివృత్తియగునో అది నివృత్తికళయని పిలువబడును. ఆచారలింగమును నాశ్రయించుకొని యుండెడి యీ నివృత్తి కళ యొక్క కృపవలన భక్తస్థలములోని వీరశైవుడు తన కర్మభోగము నుండి నివృత్తిని పొందుచున్నాడు. దీనిని క్రియాశక్తి యనియును పిలుతురు."

"ప్రకర్షేణ స్థాప్యంతే అనయా ఇతి ప్రతిష్ఠా" అనెడిది ప్రతిష్ఠా కళ యొక్క నిర్వచనము. ఇది గురులింగమును నాశ్రయించు కొనియుండును. ఈ గురు లింగారాధకులైన మహేశ్వర స్థలములోని వీరశైవుల యొక్క మనోవృత్తిని శివుని యందున స్థిరముగా నుండునటుల యనుగ్రహించెడి పాత్రను యీ కళ పోషించును. దీని కృప వలననే వీరశైవునికి సంసారమునందున నుండెడి రాగము క్రమక్రమముగా దూరము చేయబడును. ఈ కళకు జ్ఞానశక్తియనెడి పర్యాయనామము గలదు.

"ఆత్మానం యయా వేత్తి సా విద్యా" అనెడిది విద్యా కళ యొక్క నిర్వచనము. ఏ కళ యొక్క కృపచేత ప్రసాది స్థలములోని వీరశైవుడు శివలింగారాధన ఫలముగా తన ఆత్మ యొక్క అరయికను పొందుచున్నాడో అదియే విద్యా కళయనబడును. దీనికి యిచ్ఛాశక్తి యనెడి మరొక పేరు గలదు.

శాంతి దాయకమైన కళయే శాంతికళ. ఇది జంగమ లింగమును నాశ్రయించుకొని యుండును. ఈ జంగమ లింగారాధకుడగు ప్రాణలింగ స్థలి యొక్క త్రిమలములు నీ కళ కృపవలన విచ్ఛేదనము చేయబడును. తత్ఫలితముగా శాంతి చేకూరుచున్నది. ఈ కళను నాదిశక్తి యనియును పిలుతురు.

శాంతికళ కంటె నతీతమైనదే శాంత్యాతీత కళ. ఇది ప్రసాద లింగమును నాశ్రయించి యుండును. ప్రసాద లింగారాధకుడగు శరణస్థలములోని వీరశైవుడు నీ కళ కృపవలన సచ్చిదానందకర రూపమైన పరశివుని గురించి జ్ఞానమును పొందును. ఈ కళను పరాశక్తియనియును పిలుతురు.

శాంత్యాతీత కళను మీరి యుండెడిదియును, నత్యంత సూక్ష్మమైనదియును అగు కళయే. శాంత్యాతీతోత్తర కళ. ఇది మహాలింగమును నాశ్రయించుకొని యుండును. మహాలింగోపాసకుడగు యైక్య స్థలములోని వీరశైవుడు నీ కళ యొక్క కృపచేత సచ్చిదానంద రూపమైన పరశివుని యందున సమరసమును బడయును. ఈ కళకు చిచ్ఛక్తి యనెడి నామాంతరము గలదు. మాతృస్థానమున నుండెడి యీ కళ వలన నందరికీ సన్మంగళ ఫలప్రాప్తి కలుగవలెననెడి యాకాంక్షతో శ్రీ శివయోగుల వారు నీ కళకు నమస్కారమును చేసిరి.

**శ్లో॥ ఇచ్ఛాజ్ఞానాదిరూపేణ యా శంభోర్విశ్వభావినీ ।**
**వందే తాం పరమానందప్రబోధలహరీం శివామ్ ॥** (సి.శి. 1-11)

ఇచ్ఛా జ్ఞానాదుల రూపము చేత నెవ్వరు విశ్వమును ప్రకాశమానము చేయుచున్నదో అట్టి శక్తి కొరకును, పరమానంద జ్ఞాన ప్రవాహము వంటిదాని కొరకును, శివా అనబడెడి శివుని శక్తికి వందనము చేయుచున్నాననెడిది శ్లోకములోని భావార్థము.

"పరాస్య శక్తి ర్విమలా వితర్కా స్వాభావికీ రుద్ర సమాన ధర్మిణీ। జ్ఞానక్రియే చ్ఛాది సహస్ర రూపాతన్మే శివసంకల్పమస్తు" అనెడి ప్రమాణము ప్రకారమున నే శక్తి పరమశివుని యిచ్ఛాశక్తి క్రియాశక్తి మరియు జ్ఞానశక్తి రూపముల చేత జగత్తును ప్రకాశింపజేయునో, యేశక్తి పరమానంద బోధ ప్రవాహరూపమున నుండునో అట్టి శక్తికి శివయోగుల వారు నమస్కారమును చేసిరి.

**శ్లో॥ అమృతార్థం ప్రపన్నానాం యా సువిద్యాప్రదాయినీ ।**
**అహర్నిశమహం వందే తామీశానమనోరమామ్ ॥** (సి.శి. 1-12)

ముక్తిని కోరి శరణు జొచ్చిన వారికి నుత్తమమైన జ్ఞానమును ప్రదానము చేసెడి యీశానుని కూడుకొని యుండెడి శక్తికి నహర్నిశము నమస్కరింతును ననెడిది యీ శ్లోకములోని భావార్థము.

అమృతత్వ మనెడిది మనుష్యుని జీవితములోని యొక ముఖ్యమైన లక్ష్యము. దీనికి ముక్తి, మోక్షము, కైవల్యము లనెడి పర్యాయ నామములు గలవు. ఈ ముక్తి దొరకవలెననిన "వేదాంత వాక్యజా విద్యా శివజీవైక్య బోధినీ" అనెడి సూత సంహితా వచనానుసారముగా శివ-జీవుల యైక్య బోధకమైన జ్ఞానమెంతో నవశ్యకమైనది. దీనినే యుపనిషత్తులు "తత్త్వమసి" యని బోధించుచున్నవి. మోక్షదాయకమైనదియును, పరమ పవిత్రమైనదియును అగు యీ ఐక్యజ్ఞానము కేవలము జీవుల ప్రయత్నము వలన దొరకదు. దాని

కొరకు చిచ్ఛక్తి యొక్క యనుగ్రహము కావలెను. ప్రపత్తి భావముతో నభ్యసింపబడిన విద్య వలన అహంకారము నశించి ప్రసాదబుద్ధియుండుట చేత కైవల్యము సుసాధ్యమగును. ఈ కారణముననే శివయోగుల వారు చిచ్ఛక్తికి నమస్కారమును చేసిరి.

శివజీవైక్య జ్ఞానమును సంపాదించుటకై శక్తి విశిష్టుడైన శివుని స్మరించవలెననెడిది గుర్తించ వలసిన విషయము.

మంగళాచరణానంతరము శ్రీ శివయోగి శివాచార్యుల వారు తన వంశవర్ణనను సంక్షిప్తముగా చేసిరి.

## గ్రంథకర్త శివయోగి శివాచార్యుల వంశ వర్ణనము

**శ్లో॥ కశ్చిదాచారసిద్ధానామగ్రణీః శివయోగినామ్ ।**
**శివయోగీతి విఖ్యాతాః శివజ్ఞానమహోదధిః ॥** (సి.శి. 1-13)

ఆచార సంపన్నులైన శివయోగులలోన నగ్రగణ్యుడై, శివజ్ఞానమునకు జ్ఞానసముద్రుని వంటివాడును, శివయోగియనెడి నామముతో విఖ్యాతుడైన వాడును నగు దివ్య పురుషుడుండెను.

**శ్లో॥ శివభక్తిసుధాసింధుజృంభణామలచంద్రికా ।**
**భారతీ యస్య విదధే ప్రాయః కువలయోత్సవం ॥**
**తస్య వంశే సముత్పన్నో ముక్తామణిరివామలః ।**
**ముద్దదేవాభిదాచార్యో మూర్ధన్యః శివయోగినామ్ ॥** (సి.శి. 1-14,15)

ఎవ్వరి వాణి, శివభక్తియనెడి పాలసముద్రము నుండి పైకుబికిన చంద్రునివలె, భూమండలమనెడి కలువకు ముదమును గల్గించుచుండెనో అట్టి వాని వంశమునందున నిర్మలమైన ముత్యపు హారము వంటివాడును, శివయోగులలో నగ్రగణ్యుడును, ముద్ద దేవాచార్యుడనెడి పేరుగలవాడు పుట్టెను.

**శ్లో॥ ముద్దానాత్ సర్వజంతూనాం ప్రణతానాం ప్రబోధతః ।**
**ముద్ద దేవేతి విఖ్యాతా సమాఖ్యా యస్య విశ్రుతా ॥** (సి.శి. 1-16)

శరణాగతులైన వారికి ప్రబోధము వలను సకల జీవకోటికి చూపువలనను ముదమును కూర్చిన యితడు సార్థక నామధేయుడనెడి ప్రసిద్ధిని గాంచెను.

**శ్లో॥ తస్యాసీన్నందనః శాంతః సిద్ధనా థాభిదః శుచిః ।**
**శివసిద్ధాంతనిర్ణేతా శివాచార్యః శివాత్మకః ॥** (సి.శి. 1-17)

ముద్ద దేవాచార్యునకు మూర్తీభవించిన శాంతరూపియును, శుచిర్భూతుడును, శివ సిద్ధాంతమును పూర్తిగా నెరిగిన వాడును, శివస్వరూపము గలవాడును అగు సిద్ధినాథుడనెడి పేరుగల శివాచార్యుడు నుదయించెను.

**శ్లో॥ వీరశైవశిఖారత్నం విశిష్టాచారసంపదం ।**
**శివజ్ఞానమహాసింధుం యం ప్రశంసంతి దేశికాః ॥** (సి.శి. 1-18)
**యస్యాచార్యకులాజ్జాతా సతామాచార మాతృకా ।**
**శివభక్తిః స్థిరా యస్మిన్ జజ్ఞే విగతవిప్లవా ॥** (సి.శి. 1-19)

**శ్లో॥ తస్య వీరశైవాచార్య శిఖారత్నస్య నందనః ।**
**అభవచ్ఛివయోగీతి సింధోరి వ సుధాకరః ॥** (సి.శి. 1-20)

“దేశికులు నెవ్వరిని వీరశైవ శిఖారత్నమనియును, విశిష్టాచార సంపదగలవాడనియును, శివజ్ఞాన మహాసముద్రుడనియును పొగిడిరో, ఏ యాచార్యుని కులమున సత్పురుషులును, నుదయించిరో, ఏ ఆచార్యుని కులము నాచారములకు మాతృక వంటిదో, ఎవ్వరి యందున

శివభక్తియుపద్రవ రహితమై సుస్థిరమై యున్నదో, అట్టి వీరశైవాచార్య శిఖారత్నమును అగు సిద్ధనాథునికి క్షీరసాగరము నుండి చంద్రుడు పుట్టినయట్లు శివయోగి పుట్టెను" అనెడిది ఈ శ్లోక త్రయములోని భావార్థము.

సిద్ధనాథుడు తన కొడుకుకు తన పితామహుని పేరును పెట్టికొనెనని గ్రహించవలెను.

ఇక మీదట గ్రంథకర్త స్వీయ పరిచయమును మరియు నవతారిణికను నిరూపించిరి.

**శ్లో॥ చిదానందపరాకాశశివానుభవయోగతః ।**
**శివయోగీతి నామోక్తిర్యస్య యదార్థ్యయోగినీ ॥**

**శ్లో॥ శివాగమపరిజ్ఞానపరిపాకసుగంధినా ।**
**యదీయకీర్తిపుష్పేణ వాసితం హరితాం ముఖం ॥**

**శ్లో॥ యేన రక్షావతీ జాతా శివభక్తిః సనాతనీ ।**
**బుద్ధాదిప్రతిసిద్ధాంతమహాధ్వాంతాంశుమాలినా ॥**

**శ్లో॥ స మహావీరశైవానాం ధర్మమార్గప్రవర్తకః ।**
**శివతత్త్వపరిజ్ఞానచంద్రికావృతచంద్రమాః ॥**

**శ్లో॥ ఆలోక్య శైవతంత్రాణి కామికాద్యాని సాదరమ్ ।**
**వాతులాంతాని శైవాని పురాణాన్యఖిలాని తు ॥**

**శ్లో॥ వేదమార్గావిరోధేన విశిష్టాచారసిద్ధయే ।**
**అసన్మార్గనిరాసాయ ప్రమోదాయ వివేకినామ్ ॥**

**శ్లో॥ సర్వస్వం వీరశైవానాం సకలార్థప్రకాశనమ్ ।**
**అస్పృష్టమఖిలై ర్దోషైరాదృతం శుద్ధమానసైః ॥**

**శ్లో॥ తేష్వేవాగమేషు సర్వేషు పురాణే ష్వఖిలేషు చ ।**
**పురా దేవేన కథితం దేవ్యైతన్నందనాయచ ॥**

**శ్లో॥ తత్సంప్రదాయసిద్ధేన రేణుకేన మహాత్మనా ॥**
**గణేశ్వరేణ కథితమగస్త్యాయ పునః క్షితౌ ।**

**శ్లో॥ వీరశైవమహాతంత్రమేకోత్తరశతస్థలం ॥**
**అనుగ్రహాయలోకానామభ్యధాత్ సుధియాంవరః ॥** (సి.శి. 1-21-30)

ఎవ్వనికి శివానుభవ యోగము వలన శివయోగియనెడి పేరు సార్థక నామధేయమైనదో, శివాగమ పరిజ్ఞాన మనెడి పుష్పము వలన యెవ్వరి కీర్తియనెడి సువాసన దశదిశలకు వ్యాపించినదో, బౌద్ధాది ప్రతి సిద్ధాంతము లనెడి గాఢతిమిరమునకు సూర్యుని వంటి వాడైన యెవ్వని చేత సనాతనమైన శివభక్తి పరిరక్షింపబడినదో, అట్టి శివతత్త్వ పరిజ్ఞానమనెడి వెన్నెలతో చుట్టబడిన నెల వలె వెలిగెడి వాడును, వీరశైవులకు ధర్మ మార్గ ప్రవర్తకుడుగా నుండెడివాడును అగు శివయోగి కామికము నుండి వాతులము వరకు గల ఆగమములను, సమస్త శైవపురాణములను పరిశీలించి, వైదిక మార్గమునకు విరోధము గాని యటులను, విశిష్టమైన ఆచారము యొక్క సిద్ధి కొరకును, జైన బౌద్ధాది యసన్మార్గములను నిరసించుట కొరకును, వివేకవంతుల ప్రమోదము కొరకును, వీరశైవుల యొక్క సమస్తమైన సదర్థములను ప్రకాశమానము చేసెడిదియును, దోషరహితమైనదియును, పరిశుద్ధమైన మనస్సుగల వారి చేత నాదరింప బడెడిదియును, పూర్వకాలము నందున నాగమ పురాణాదులలో శివుని చేత పార్వతికిని, స్కందునికిని యుపదేశింపబడినదియును, శివసాంప్రదాయమున ప్రసిద్ధుడైన రేణుకుడనెడి మహాత్ముని చేత భూతలము మీదున మరలను ఆగస్త్య మహాఋషికి నుపదేశింపబడి నదియును, నూటొక్క స్థలములతో

కూడి యున్నదియును అగుదానిని వీరశైవ మహాతంత్రమని పిలువబడినదియును, లోకుల కనుగ్రహమును ప్రదానము చేయుటకై, ధీమంతులలోన శ్రేష్ఠుడైన వాడగు శివయోగి శివాచార్యుడు చెప్పెన నేడది యీ శ్లోకసంచయములోని భావార్థము.

శివయోగి శివాచార్యులవారు గ్రంథరచనకై తాను కామికాది యాగమములను పరిశీలించెనని తెలిపినది గమనార్హమైన విషయము. ఈ ఆగమము లెట్టివో తెలుసుకొనవలెను. అవి యేమనగా - 1) కామిక, 2) యోగజ, 3) చింత్య, 4) కారణ, 5) అజిత, 6) దీప్త, 7) సూక్ష్మ, 8) సహస్ర, 9) అంశుమాన్, 10) సుప్రభేద, 11) విజయ, 12) నిఃశ్వాస, 13) స్వాయుంభవ, 14) అనిల, 15) వీర, 16) రౌరవ, 17) ముకుట, 18) విమల, 19) చంద్రజ్ఞాన, 20) బింబ, 21) ప్రోద్గీత, 22) లలిత, 23) సిద్ధ, 24) సంతాన, 25) సర్వోక్త, 26) పారమేశ్వర, 27) కిరణ, 28) వాతుల ఆగమములు.

శ్రీ శివయోగుల వారు శ్రీ రేణుక భగవత్పాదుల వారి గురించి తెలుపుచూ భూతలమున నియ్యది శ్రీ భగవత్పాదుల వారిచేత నుపదేశింప బడినదని చెప్పిరి. శివుని సద్యోజాత ముఖము నుండి శ్రీ రేణుకాచార్యుల వారు నుద్భవించిరని గుర్తెరుగగలరు.

**శ్లో॥ సర్వేషాం శైవతంత్రాణాముత్తరత్వాన్నిరుత్తరమ్ ।**
**నామ్నా ప్రతీయతే లోకే యత్సిద్ధాంతశిఖామణిః ॥** (సి.శి. 1-31)

శివాగమములకు చివరన యుండుట చేతను, వీరశైవ సిద్ధాంతమునకు పిదప మరే సిద్ధాంతము చెప్పబడనందున నిద్దానికి "సిద్ధాంత శిఖామణి" యనెడి పేరు గల్గినది.

**శ్లో॥ అనుగతసకలార్థైశైవతంత్రైఃసమస్తైః ।**
**ప్రకటితశివబోధాద్వైతభావప్రసాదే ॥**

**విదధతు మతిమస్మిన్ వీరశైవా విశిష్టాః ।**
**పశుపతిమతసారే పండితశ్లాఘనీయే ॥** (సి.శి. 1-32)

సకల శైవ సిద్ధాంతముల చేత యనుసరింపబడిన సకలార్థములు గలదియును, ప్రకటితమైన శివాద్వైత జ్ఞానము గల్గినదియును, పండితుల చేత శ్లాఘింప బడినదియును, పాశుపత మతసారమై యున్నదియును అగు శ్రేష్ఠమైన యీ సిద్ధాంతమునందున వీరశైవుల బుద్ధి నిమగ్నము కానిమ్ము, అని శ్లోకములో తెలుపబడినది. ఈ కారణమున ప్రతి యొక్కరు సిద్ధాంత శిఖామణిని యందు పూజ్య బుద్ధినుంచి చదివి ఇతోధికమైన ఆధ్యాత్మిక లబ్ధిని పొందవలెను.

దీనితో సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ గ్రంథమున పూర్వ పీఠికా భాగమునకు చెందిన ప్రథమ పరిచ్ఛేదము సంపూర్ణము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# ద్వితీయ పరిచ్ఛేదము

శ్రీ శివయోగి శివాచార్యులవారు రెండవ పరిచ్ఛేదమును ప్రారంభించుటకు పూర్వమున శిష్టాచారము ననుసరించి మరల మంగళా చరణను చేసిరి.

**శ్లో॥ సచ్చిదానందరూపాయ సదసద్వ్యక్తిహేతవే ।**
**నమః శివాయ సాంబాయ సగణాయ స్వయంభువే ॥** (సి.శి. 2-1)

సచ్చిదానంద స్వరూపుని కొరకును, సదసద్ వ్యక్తావ్యక్త ప్రపంచము యొక్క పుట్టుకకు కారణభూతమైన వాని కొరకును, శక్తి సమేతునికై, ప్రమద గణ సమేతునకై, స్వయంభువైన వానికిని, శివునికి నమస్కారము అనెడిది శ్లోకములోని భావార్థము.

**శ్లో॥ సదాశివముఖాశేషతత్త్వమౌక్తికశుక్తికాం ।**
**వందే మాహేశ్వరీం శక్తిం మహామాయాదిరూపిణీమ్ ॥** (సి.శి. 2-2)

సదాశివ తత్త్వమును మొదలుకొని పృథ్వీ తత్త్వము వరకు గల ముప్పదియారు తత్త్వములనెడి ముత్యములకు ఆశ్రయమైన ముత్యపు చిప్పవంటి దాని కొరకును, మహామాయాది రూపములలో విరాజిల్లెడి దాని కొరకును, మాహేశ్వరునితో నవినాభావ సంబంధము గల్గిన దాని కొరకును, శక్తి కొరకును వందనము లనెడిది శ్లోకములోని భావార్థము.

మంగళాచరణా నంతరము సృష్టి క్రమమును పేర్కొన దలచిన శ్రీ శివాచార్యులవారు వస్తు నిర్దేశన నీ క్రింది విధముగా జేసిరి.

## వస్తు నిర్దేశన

**శ్లో॥ అస్తి సచ్చిత్సుఖాకారమలక్షణపదాస్పదం ।**
**నిర్వికల్పం నిరాకారం నిరస్తాశేషవిప్లవం ॥** (సి.శి. 2-3)

సచ్చిదానంద స్వరూపము గలదియును, లక్షణ రహితమైన ప్రదేశమున నుండెడిదియును, దేనితోను బాధింపబడనిదియును, భేదరాహిత్యము గలదియును, ఆకారము లేనిదియును అగు నొక పదార్థమున్నది, అనెడిది శ్లోకము యొక్క భావార్థము.

**శ్లో॥ పరిచ్ఛేదకథాశూన్యం ప్రపంచాతీత వైభవం ।**
**ప్రత్యక్షాదిప్రమాణానామగోచరపదే స్థితం ॥** (సి.శి. 2-4)

దేశ కాలాది విభజన లేనిదియును, ప్రపంచ వైభవమునకు మీరినదియును, ప్రత్యక్షాది ప్రమాణముల కందనియును అయియున్నది.

**శ్లో॥ స్వప్రకాశం విరాజంతమనామయమనౌపయమ్ ।**
**సర్వజ్ఞం సర్వగం శాంతం సర్వశక్తి నిరంకుశం ॥** (సి.శి. 2-5)

స్వయముగా ప్రకాశించెడిదియును, శ్రేష్ఠమైన తేజస్సు గల్గినదియును, నిరుపమానమైనదియును జనన-మరణాదులు లేనిదియును, సర్వజ్ఞత్వము గలదియును, సర్వ వ్యాపకమైనదియును, ప్రశాంతమైనదియును, సర్వశక్తులు గల్గి నిరంకుశముగా నుండెడిదియును (అయియున్నది).

**శ్లో॥ శివరుద్రమహాదేవ భవాదిపదసంజ్ఞితం ।**
**అద్వితీయమనిర్దేశ్యం పరంబ్రహ్మ సనాతనమ్ ॥** (సి.శి. 2-6)

శివ, రుద్ర, మహాదేవ, భవాది పేర్ల చేత పిలువ బడెడిదియును, అద్వితీయమైనదియును అనగా సజాతీయమైన, విజాతీయమైన మరియు స్వగతమైన భేదములు లేకుండ యుండెడిదియు ఇట్టిదని చూపజాలనిదియును, సనాతనమైనదియును, పరబ్రహ్మమును (అయియున్నది).

ఈ శ్లోకములు శివ పరబ్రహ్మ స్వరూపమును అభివర్ణించినవి. పరబ్రహ్మ సత్–చిత్ ఆనందములే తన స్వరూపములుగా గల్గి యెల్లరకు తెలియని యటుల నన్నింటిలోను పొదిగికొని యున్నది. అందుచేత నది యవిభాజ్యమని చెప్పబడినది. పరిచ్ఛేదమనెడిది దేశ, కాల మరియు వస్తువుల భేదము చేత మూడు విధములుగా నుండును. ఒక దేశములో నుండి మరొక దేశములో నుండకుండుట యనెడిది దేశ పరిచ్ఛేదము. ఒక కాలములో నుండి మరొక కాలములో నుండ కుండగ నుండెడిది కాల పరిచ్ఛేదము. ఒక వస్తువులోన నుండి మరొక వస్తువులో లేకుండుట వస్తు పరిచ్ఛేదమనబడును. పరబ్రహ్మ దేశ కాలవస్తువుల పరిమితులకు లోబడక నంతట యుండుట చేత పరిచ్ఛేద శూన్యుడగును.

ప్రపంచ వైభవము క్షణికమైనదై యుండుట చేత పరశివుడు నా క్షణిక వైభవము కంటెను విలక్షణమైన శాశ్వత వైభవముతో కూడుకొని యుండును.

ఈ జగత్తున ప్రమాణమున కెంతయో ప్రాముఖ్యత గలదు. ఏదైనా వస్తువును నేరుగా వలసిన యెడల ప్రత్యక్ష, అనుమానాది ఆరు ప్రమాణములలోన యేదో యొకటి సహాయకమగును. అయితే యీ ప్రమాణములు నేవియును పరశివుని గురించి తెలిసికొనుటకు సహాయముగా నుండజాలవు. అందుచేత నతడు ప్రమాణముల కగోచరుడు. సూర్యుడు తన వెలుగులోనే తాను దోచునటుల పరశివుడైనను తన ప్రకాశమునకై వేరే ప్రకాశము నపేక్షించ కుండుటచేత "అత్రాయం పురుషః స్వయం జ్యోతిః" అనెడి శ్రుతి ప్రమాణమున కనుగుణముగా స్వయం ప్రకాశుడగు చున్నాడు. పరశివుని వంటివాడు మరొకడు లేనందున నతడు నుపమానాతీతుడుగా నున్నాడు. నిశ్శరీరియై యుండుటచేత నతనికి జనన – మరణము లుండవు. సర్వజ్ఞుడును, సర్వశక్తి సమన్వితుడును, విశ్వ వ్యాపకుడును, శాంతుడును అగు పరశివుడొక్కడే యేకాకి యై యుండెను.

**శ్లో॥ తత్ర లీనమభూత్ పూర్వం చేతనా చేతనం జగత్ ।**
**స్వాత్మలీనం జగత్కార్యం స్వప్రకాశ్యం తదద్భుతమ్ ॥** (సి.శి. 2-7)

ఆ పరశివుని యందున చరాచరమైన ప్రపంచము సృష్టి కంటెను ముందున అణిగి యుండి, మరల ఆ పరబ్రహ్మ చేత మాత్రమే ప్రకాశమానము చేయదగినదై యుండును.

**శ్లో॥ శివాభిదం పరంబ్రహ్మ జగన్నిర్మాతుమిచ్ఛయా ।**
**స్వరూపమాదధే కించిత్ సుఖస్ఫూర్తివిజృంభితమ్ ॥** (సి.శి. 2-8)

జగమును సృష్టించే ఇచ్ఛతో శివ యనెడి పేరుగలదియును, పరబ్రహ్మమై యున్నదియును, ఆనంద స్ఫూర్తిగలదియును.

**శ్లో॥ నిరస్తదోషసంబంధం నిరుపాధికమవ్యయం ।**
**దివ్యమప్రాకృతం నిత్యం నీలకంఠం త్రిలోచనమ్ ॥** (సి.శి. 2-9)

నిర్మలమైనదియును, నుపాధి లేనిదియును, నాశనము లేనిదియును, ప్రకృతితో సంబంధము లేనిదియును, నిత్యమైనదియును, దివ్యమైనదియును, నీలవర్ణము గల కంఠము గలదియును, మూడు కళ్ళు గలదియును ...

**శ్లో॥ చంద్రార్ధశేఖరం శుద్ధం శుద్ధస్ఫటికసన్నిభం ।**
**శుద్ధముక్తాఫలాభాసముపాస్యం గుణమూర్తిభిః ॥** (సి.శి. 2-10)

అర్ధచంద్రుని తల మీద దాల్చినదియును, పవిత్రమైనదియును, శుద్ధమైన స్ఫటికము యొక్క కాంతిని వెదజల్లునదియును, బ్రహ్మ విష్ణు రుద్రులచేత పూజింపదగిన వాడును ...

**శ్లో॥ విశుద్ధజ్ఞానకరణంవిషయంసర్వయోగినాం ।**
**కోటిసూర్యప్రతీకాశం చంద్రకోటిసమప్రభమ్ ॥** (సి.శి. 2-11)

నిర్మలమైన జ్ఞానమునకు కారణభూతమైనదియును, యోగులందరికిని తెలిసికొనదగిన విషయముగా నుండునదియును, కోటి సూర్యుల మరియు కోటిచంద్రుల కాంతికి సమానమగు ప్రకాశము గలదియును, నప్రాకృత గుణముల కాధారభూతమైనదియును నపరిమితమైన మహిమలు గలదియును అగు ఆ వస్తువు నొకానొక రూపమును ధరించెను.

**శ్లో॥ అప్రాకృతగుణాధారమనంతమహిమాస్పదం**
**తదీయా పరమా శక్తిః సచ్చిదానందలక్షణా ।**
**సమస్తలోకనిర్మాణసమవాయస్వరూపిణీ**
**తదిచ్ఛయాఽభవత్ సాక్షాత్తత్స్వరూపానుసారిణీ ॥** (సి.శి. 2-12,13)

ఆ పరశివ బ్రహ్మమునకు చెందినదియును, సర్వశ్రేష్ఠమైనదియును, శక్తిస్వరూపియును, సచ్చిదానంద లక్షణము గలదియును, సమస్త జగన్నిర్మాణార్థము నుపాదాన కారణము కాగలదియును, పరతత్వ రూపమున కనుగుణముగా నుండెడిదియును అగు పరశివుని విమర్శశక్తి సాక్షాత్కరించెను.

ఈ సందర్భమున తెలిసికొనవలసిన దేమనగా శివుని కేవలావస్థలో శివుని యందున యణిగి యుండెడి శక్తి, మయూరాండ న్యాయమున శివేచ్ఛ చేత యతని లీలావస్థయందున వివిధ స్వరూపములుగా వికసన మొందును.

శివశక్తుల స్వరూపమును వర్ణించి వీరి వికాసపరిణామమును తెలిపిన పిదప శ్రీ శివయోగిగారు సృష్టి క్రమమును నిరూపించిరి. ఇట్టి నిరూపణ "స ఐక్షత", "లోకాన సృజత", "యథా పూర్వమకల్పయత్" మొదలగు శ్రుతి వచనముల కనుగుణముగా చేయబడినది.

## సృష్టి క్రమనిరూపణ

**శ్లో॥ స శంభుర్భగవాన్దేవః సర్వజ్ఞః సర్వశక్తిమాన్ ।**
**జగత్సిసృక్షుః ప్రథమం బ్రహ్మాణం సర్వదేహినామ్ ॥** (సి.శి. 2-14)
**కర్తారం సర్వలోకానాం విదధే విశ్వనాయకః ॥**

షడ్గుణైశ్వర్యవంతుడును, సర్వమునెరిగిన వాడును, సర్వశక్తులు గలవాడును, జగన్నాయకుడును అగు ఆ శంభుదేవుడు జగత్తును సృష్టించ వలెననెడి కోరికగలవాడై మొదటగా పధ్నాల్గు లోకములను, పిపీలికాది బ్రహ్మ పర్యంతము గల సకల జీవులను సృష్టించెను.

షడ్గుణైశ్వర్య సంపన్నుని మాత్రమే భగవంతుడని యందురు. ఈ షడ్గుణము లెట్టివో యని తెలియజెప్పెడి ఈ క్రింది శ్లోకముగనుడి

**శ్లో॥ ఐశ్వర్యస్య సమగ్రస్య జ్ఞానస్య యశసిశ్రియః ।**
**వైరాగ్యస్యచ ధర్మస్య షణ్ణాం భగ ఇతీరితః ॥**

సకల విధమగు సంపద, జ్ఞానము, యశస్సు, శోభ, వైరాగ్యము మరియు ధర్మములను ఆరు రకముల ఐశ్వర్యములను "భగ"మని యందురు.

శివునికి యీ గుణములు గలవు. అందుచేత నతడు భగవంతుడని పిలువబడుచున్నాడు. శివుడు జగత్తును సృష్టించిన క్రమము యజుర్వేదములోన యీ క్రింది విధముగా నివ్వబడినది

**"విశ్వాధికో రుద్రో మహర్షి ర్హిరణ్యగర్భం జనయామాస పూర్వం"**

ఈ శ్రుతి వాక్యముల కనుగుణముగనే శ్రీ శివయోగి శివాచార్యులవారు సృష్టి క్రమము యొక్క వివరణ గలదని గ్రహించగలరు.

**శ్లో॥ తస్మై ప్రథమపుత్రాయ శంకరః శక్తిమాన్విభుః ।**
**సర్వజ్ఞః సకలా విద్యా సానుగ్రహముపాదిశత్ ॥** (సి.శి. 2-15)

సుఖసంతోషముల నిచ్చువాడును, సర్వజ్ఞత్వము, సర్వకృత్వములు గలవాడును, అందరిని పాలించెడి ప్రభువును అగు శివుడు సకల విద్యలను దయతో తన ప్రథమ పుత్రుడగు బ్రహ్మకు నుపదేశించెను.

శివుడు బ్రహ్మకు సకల విద్యలను గరపెననెడిది శ్రుతులలో చెప్పబడిన విషయము. శ్వేతాశ్వతరోపనిషత్తులో నీ క్రింది విధిన తెలుపబడినది

**శ్లో॥ "యో బ్రహ్మాణం విధదాతి పూర్వం
యో వైవేదాశ్చ ప్రహిణోతి తస్మై"**

**శ్లో॥ ప్రాప్తవిద్యో మహాదేవాద్బ్రహ్మావిశ్వనియామకాత్ ।
సమస్తలోకనిర్మాణసముద్యోగపరోఽభవత్ ॥** (సి.శి. 2-16)

విశ్వనియామకుడగు మహాదేవుని వలన సకల విద్యలను పొందిన బ్రహ్మ సమస్త లోకముల నుత్పత్తి చేసెడి పనిని ప్రారంభించుటకు నుద్యుక్తుడయ్యెను.

**శ్లో॥ కృతోద్యోగోఽపినిర్మాణే జగతాం శంకరాజ్ఞయా ।
అజ్ఞాతోపాయ సంపత్తిర్ భవన్మాయమావృతః ॥** (సి.శి. 2-17)

బ్రహ్మ, శంకరుని యాజ్ఞమేరకు జగత్తును నిర్మించుటకు ప్రయత్నించినను మాయావృతుడై యున్నందున జగన్నిర్మాణోపాయము నెరుగని వాడయ్యెను.

**శ్లో॥ విధాతుమఖిలాన్ లోకానుపాయ ప్రాప్తుమిచ్ఛయా ।
పునస్తం ప్రార్థయామాస దేవదేవం త్రియంబకమ్ ॥** (సి.శి. 2-18)

అఖిల లోకములను సృష్టించుటకు వలయు నుపాయమును పొందెడి కోరిక చేత బ్రహ్మ త్రియంబకుడగు దేవదేవుని మరల ప్రార్థించెననెడిది భావార్థము. బ్రహ్మ యొక్క ప్రార్థన యీ క్రింది విధిన నుండెనని శ్రీ శివయోగుల వారు తెలియజెప్పిరి.

**శ్లో॥ నమస్తే దేవదేవేశ నమస్తే కరుణాకర ।
అస్మదాదిజగత్సర్వనిర్మాణవిధిషుక్షమః ॥**

**శ్లో॥ ఉపాయంవద మే శంభో జగత్ సృష్టౌ జగత్పతే ।
సర్వజ్ఞః సర్వశక్తిస్త్వం సర్వకర్తా సనాతనః ॥** (సి.శి. 2 - 19,20)

దేవదేవుడవైన కరుణాసాగరుడైన నీకు నమస్కారము ! నన్ను మొదలుకొని సమస్త జగత్తును సృష్టించెడి సామర్థ్యము గల జగత్పతే ! నీవు సర్వజ్ఞుడవు. సర్వశక్తి సమన్వితుడవు. జగత్కర్తవు. సనాతనుడవు. ఓ శంభూ ! జగత్సృష్టి గురించి వలయు నుపాయమును నాకు తెలియజెప్పుము అనెడి బ్రహ్మగారి ప్రార్థన లోని భావార్థము.

**శ్లో॥ ఇతి సంప్రార్థితాః శంభుర్బ్రహ్మణా విశ్వనాయకః ।
ఉపాయమవదత్తస్మై లోకసృష్టిప్రవర్తనం ॥** (సి.శి. 2-21)

ఈ విధముగా బ్రహ్మ చేత ప్రార్థింపబడిన వాడగు లోకనాయకుడు లోకసృష్టికై కార్యోన్ముఖుడై యున్న బ్రహ్మకు నుపాయమును తెలియజెప్పెను.

**శ్లో॥ ఉపాయమీశ్వరేణోక్తం లబ్ధ్వాఽపి చతురాననః ।
న సమర్థో భవత్కఽర్తుం నానా రూపమిదం జగత్ ॥** (సి.శి. 2-22)

చతురాననుడు, ఈశ్వరుని చేత చెప్పబడిన జగత్తును సృష్టించుటకై వలయు నుపాయమును పొందియు, నానా రూపములలోన గల యీ జగత్తును సృష్టించుటకు నసమర్థుడయ్యెను.

**శ్లో॥ పునస్త ప్రార్థయామాస బ్రహ్మా విహ్వల మానసః ।**
**దేవదేవ మహాదేవ జగత్ప్రథమకారణ ॥**
**నమస్తే సచ్చిదానంద స్వేచ్ఛా విగ్రహరాజిత ।**
**భవ శర్వ మహేశాన సర్వకారణకారణ ।**
**భవదుక్తో ప్యుపాయో మే న కించిద్ జ్ఞాయతేఽధునా ॥**
**సృష్టిం విధేహి భగవన్ ప్రథమం పరమేశ్వర ।**
**జ్ఞాతోపాయస్తతః కుర్యాం జగత్సృష్టిముమాపతే ॥** (సి.శి. 2-23-26)

వ్యాకుల మనస్సు గల్గిన బ్రహ్మ మరల పరశివుని యీ క్రింది విధిన ప్రార్థించెను.

"దేవదేవా ! జగత్కారణుడా ! సచ్చిదానంద స్వరూపుడా ! భవుడా ! శర్వుడా ! మహేశ్వరా! సర్వమునకు కారణీభూతుడైన వాడా ! మీరు నుపాయము నిచ్చినను నయ్యది నాకు నవగతమగుటలేదు. అందుచేత, మీరు సృష్టిని గావించుడి. ఆ పిదప జగత్ సృష్టి పద్ధతిని లెస్సగా తెలిసికొన్న పిదప నేను సృష్టిని చేసెదను.

**శ్లో॥ ఇత్యేవం ప్రార్థితః శంభుర్బ్రహ్మణా విశ్వయోనినా ।**
**ససర్జాత్మ సమప్రఖ్యాన్ సర్వగాన్ సర్వశక్తికాన్ ॥**
**ప్రబోధపరమానందపరివాహితమానసాన్ ।**
**ప్రమథాన్ విశ్వనిర్మాణ ప్రళయాపాడ్ నక్షమాన్ ॥** (సి.శి. 2-27, 28)

సృష్టికర్తగా నియుక్తుడైన బ్రహ్మ చేత ప్రార్థింపబడిన శంభువు తనతో సమానమైన ప్రతిభగలవారును, సర్వజ్ఞులును, సర్వశక్తి సమన్వితులును, పరమోత్కృష్టమైన జ్ఞానానంద మయ మనస్కులను, సృష్టి-స్థితి-లయలను చేసెడి సామర్థ్యము గలవారును అగు ప్రమథులను సృష్టించెను.

**శ్లో॥ తేషు ప్రమథవర్గేషు సృష్టేషు పరమాత్మనా ।**
**రేణుకో దారుకశ్చేతి ద్వావభూతాం శివప్రియౌః ॥** (సి.శి. 2-29)

పరమాత్ముని చేత సృష్టించబడిన ప్రమథులలో రేణుక దారుకులు శివునికి ప్రీతిపాత్రులుగా నయిరి.

**శ్లో॥ సర్వవిద్యావిశేషజ్ఞౌ సర్వకార్యవిచక్షణౌ ।**
**మాయామలవినిర్ముక్తౌ మహిమాతిశయోజ్వలౌ ॥**
**ఆత్మానందపరిస్ఫూర్తి రసాస్వాదనలంపటౌ ।**
**శివతత్త్వ పరిజ్ఞానతిరస్కృతభవామయౌ ॥**
**నానాపథమహాశైవతంత్రనిర్వాహతత్పరౌ ।**
**వేదాంతసారసర్వస్వ వివేచనవిచక్షణౌ ॥**

**నిత్యసిద్ధౌ నిరాతంకౌ నిరంకుశపరాక్రమౌ ।**
**తాదృశౌ తౌ మహాభాగౌ సంవీక్ష్య పరమేశ్వరః ॥**
**సమర్థౌ సర్వ కార్యేషు విశ్వాసపరమాశ్రితౌ ।**
**అంతః పురద్వారపాలౌ నిర్మమే నియతౌ విభుః ॥** (సి.శి. 2-30-34)

అన్ని విద్యల విశేషార్థముల నెరిగిన వారును, సకల కార్యములను కుశలముగా చేయగలవారును, మాయా మలము నుండి విముక్తిని పొందినవారును, సముజ్వలమైన మహిమాతి శయముగలవారును, ఆత్మానందమును పరిపూర్ణముగా ననుభవించుటకై యాసక్తి గలవారును, శివ తత్త్వ పరిజ్ఞానమునిండుగా నుండి యుండుట చేత జనన-మరణములనెడి భావమును దూరము చేసికొనిన వారును, నానావిధములుగానున్న శివాగమముల నధ్యయనము చేసి సిద్ధాంతమును స్థాపించెడి సమర్ధత గల వారును, ఉపనిషత్సార సర్వస్వము నెరిగినవారును, సకల సిద్ధులు గలవారును, అవరోధములు లేనివారును, మహా పరాక్రమవంతులును, అన్ని కార్యములు చేయగలవారును, విశ్వాస పాత్రులును అగు వారిరువురుని చూసి విభుడు వారిని తన అంతఃపుర ద్వారపాలకులుగా నియమించెను.

**శ్లో॥ గణేశ్వరౌ రేణుక దారుకావుభౌ ।**
**విశ్వాస భూతౌ నవ చంద్రమౌలేః ॥**
**అంతః పుర ద్వారగతౌ సదా తౌ**
**వితేన తుర్విశ్వ పతేస్తు సేవాం ॥** (సి.శి. 2-35)

రేణుక దారుక లిరువురును, విశ్వాసపాత్రులై అంతఃపురపు ద్వారపాలకులుగా జగత్పతి యొక్క సేవను చేయజొచ్చిరి.

దీనితో సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ యను గ్రంథమున పూర్వ పీఠికా భాగమునకు చెందిన ద్వితీయ పరిచ్ఛేదము సంపూర్ణము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# తృతీయ పరిచ్ఛేదము

## శివ సభావర్ణన

శివయోగి శివాచార్యుల వారు నీ పరిచ్ఛేదమున మొట్టమొదట కైలాసమును వర్ణించెను.

**శ్లో॥ కదాచిదథ కైలాసే కలధౌత శిలామయే ।**
**గంధర్వ వామ నయనా క్రీడామౌక్తిక దర్పణే ॥** (సి.శి. 3-1)

ఆ పిదప నొకానొక సమయమున కైలాసము నందున, వెండిరాళ్ళతో కూడుకొనిన ప్రదేశమున, గంధర్వస్త్రీలు క్రీడానంతరము తమ ముఖములను చూచుకొనుటకై యుపయోగించెడి ముత్యముల యద్దము వంటి మెరుపు గల ప్రదేశమునను

**శ్లో॥ మందారబకులాశోకమాకందప్రాయభూరుహే ।**
**మల్లీమరందనిష్యందపానపీనమధువ్రతే ॥** (సి.శి. 3-2)

మందార, పొగడ, అశోక, మామిడి మొదలగు చెట్లుగల ప్రదేశమునందునను, పూతేనియను త్రాగి మదించి మత్తెక్కి తిరుగాడెడి తుమ్మెదలున్న చోటునను

**శ్లో॥ కుంకుమస్తబకామోదకూలంకషహరిన్ముఖే ।**
**కలకంఠకులాలాపకందలద్రాగబంధురే ॥** (సి.శి. 3-3)

కుంకుమ పూగుత్తుల పరిమళముతో నిండిన దిక్కులు గలదియును, కోకిల గుంపులు చేసెడి రాగాలాపన వలన నుత్పన్నమైన మధుర ధ్వనులు నిండిన ప్రదేశమునను.

**శ్లో॥ కిన్నరీగీతమాధుర్యపరివాహితగహ్వరే ।**
**సానందవరయోగీంద్రబృందాలంకృతకందరే ॥** (సి.శి. 3-4)

కిన్నర స్త్రీలు చేసెడి గీతాలాపన వలన పరివ్యాప్తమైన మాధుర్యము గల గుహలోనను, సానందాది యోగీంద్రుల బృందము చేత నలంకృతమైన గుహయందునను.

**శ్లో॥ హేమారవిందకలికాసుగంధిరసమానసే ।**
**శాతకుంభమయోమయస్తంభశతొత్తుంగవిరాజితే ॥** (సి.శి. 3-5)

బంగారు కమలముల మొగ్గల సువాసనతో కూడిన జలము గల మానస సరోవరము గల ప్రదేశమునను, ఎత్తైన నూరు సువర్ణ స్తంభములతో విరాజిల్లెడి మంటపమునను.

**శ్లో॥ మాణిక్యదీపకలికామరీచిజ్యోతితాంతరే ।**
**ద్వారతోరణసంరూఢశంఖపద్మనిధిద్వయే ॥** (సి.శి. 3-6)

మాణిక్య దీపపుకాంతులతో ప్రకాశమానమై యుండెడిదియును, బాహ్యమున తోరణ స్తంభ ద్వయము మీద నుంచబడిన శంఖ పద్మ నిధి ద్వయము గలదియును,

**శ్లో॥ ముక్తాతారకితోదారవితానాంబరమండితే ।**
**స్పర్శలక్షితవైడూర్యమయభిత్తిపరంపరే ॥** (సి.శి. 3-7)

చుక్కలవలె మెరిసెడి ముత్తెములతో నిండిన మేల్కట్టు వస్త్రములు గలదియును. తాకిన గాని తెలియని మాణక్య మగమయములగు గోడలు గలదియును.

**శ్లో॥ సంచరత్ప్రథమశ్రేణీపదవాచాలనూపురే ।**
**ప్రవాలవలభీశృంగశృంగారమణిమంటపే ॥** (సి.శి. 3-8)

తిరుగాడెడి ప్రమథ గణముల కాళ్ళ గజ్జెల సవ్వడితో నిండినదియును, పగడములతో నిండిన ప్రాకార శృంగముల చేత నలంకృతమై సుందరమైన మణిమయంబున.

**శ్లో॥ వందారుదేవముకుటమందారరసవాసితం ।**
**రత్నసింహాసనం దివ్యమధ్యస్థం పరమేశ్వరం ॥** (సి.శి. 3-9)

నమస్కరించెడి దేవతల కిరీటములలోని మందార కుసుమముల రసము చేత పరిమళ భరితము చేయబడిన దివ్యమైన రత్న సింహాసనమునందున కూర్చొనియున్న పరమేశ్వరుని.

**శ్లో॥ తమాస్థానగతం దేవం సర్వలోకమహేశ్వరం ।**
**త్రయ్యంత కమలారణ్యవిహారకలహంసకం ॥** (సి.శి. 3-10)

వేదత్రయాంతమునగల యుపనిషత్తులనెడి కమలముల యారణ్యము గల్గిన సరోవరమున తిరుగాడెడి రాజహంస వంటివాడును, సకల లోకాధినాధుడును, ఆస్థానగతుడైయున్న దేవదేవుని,

**శ్లో॥ ఉదారగుణమోంకారశుక్తికాపుటమౌక్తికం ।**
**సర్వమంగలసౌభాగ్యసముదాయనికేతనం ॥** (సి.శి. 3-11)

లోకకళ్యాణము నాశించెడి యౌదార్యము గలవాడు, ఓంకారమనెడి ముత్యపుచిప్పకు ముత్యము వంటివాడును, సకలవిధ సౌభాగ్యములకును నెలవైయున్నవాడును అగు వానిని

**శ్లో॥ సంసారవిషమూర్ఛాలజీవనం జీవనౌషధం ।**
**నిత్యప్రకాశనైర్మల్యకైవల్యసురపాదపం ॥** (సి.శి. 3-12)

సంసార విషమూర్ఛలోలకు జీవ సంజీవనీ యౌషధం వంటివాడును అనునిత్యమును ప్రకాశించెడి వాడును, నిర్మలుడును, ముక్తిని కోరెడివారికి కల్పవృక్షము వంటివాడును అగు వానిని

**శ్లో॥ అనంతపరమానందమకరందమధువ్రతం ।**
**ఆత్మశక్తిలతా పుష్యత్త్రిలోకీపుష్పకోరకం ॥** (సి.శి. 3-13)

అంతము లేని పరమానంద మనెడి పుప్పొడిలోని పూతేనెను గ్రోలెడి మధుపము వంటివాడును, త్రిలోకములనెడి పువ్వును తీగవలె రక్షించెడి స్వయంశక్తి గలవాడును అగువానిని,

**శ్లో॥ బ్రహ్మాండకుండికాషండ పిండీకరణపండితం ।**
**సమస్తదేవతాచక్రచక్రవర్తిపదేస్థితమ్ ॥** (సి.శి. 3-14)

బ్రహ్మాండములోనున్న వాటినన్నింటినీ ఒకే ప్రదేశమునకు తేగల సామర్థ్యము గలవాడును, దేవతలకందరికినీ సార్వభౌముడుగానున్న వాడును, అగువానిని.

**శ్లో॥ చంద్రబింబాయుతచ్ఛాయాదాయాదద్యుతివిగ్రహం ।**
**మాణిక్యముకుటజ్యోతిర్మంజరీపింజరాంబరం ॥** (సి.శి. 3-15)

పదివేల చంద్రబింబములు వెదజల్లెడి కాంతితో పోటీ పడెడి కాంతిగల దివ్య విగ్రహము గలవాడు, నమస్కరించెడి దేవతల కిరీటములలో గల మాణిక్యముల కాంతిచేత వివిధ రంగులతో ప్రకాశించెడి వస్త్రములు గలవాడును అగువానిని

**శ్లో॥ చూడాలం సోమకలయా సుకుమారభిసాభయా ।**
**కళ్యాణపుష్పకలికాకర్ణపూరమనోహరం ॥** (సి.శి. 3-16)

కోమలమైన కమలపుతంతువువలె ప్రకాశించెడి చంద్రబింబ మనెడి యాభరణము శిరమున గలవాడును, మంగళమయమైన మల్లె మొగ్గలను కర్ణాభరణములుగా ధరించినవాడును అగువానిని.

**శ్లో॥ ముక్తావలయసంబద్ధరుండమాలావిరాజితం ।**
**పర్యాప్తచంద్రసౌందర్యపరిపంక్తిముఖశ్రియం ॥** (సి.శి.3-17)

ముత్యపు హారములతో కూడియున్న పుర్రెల హారము గలవాడును, పరిపూర్ణ స్థితిలోనున్న చంద్రుని కాంతిని తిరస్కరించెడి ముఖ కాంతి గలవాడును అగువానిని

**శ్లో॥ ప్రాతఃసంపుల్లకమల పరియాయ త్రిలోచనం ।**
**మందస్మితమితాలాపమధురాధరపల్లవం ॥** (సి.శి. 3-18)

ప్రొద్దుటే విచ్చికొనిన కమలములవంటి మూడు కన్నులు గలవాడును చిరునగవులోను, మితభాషణలోను శోభించెడి పెదవులు గలవాడును, అగువానిని

**శ్లో॥ గండమండలపర్యంతక్రీడ న్మ కరకుండలమ్ ।**
**కాలిమ్నా కాలకూటస్య కంఠనాలే కలంకితం ॥** (సి.శి. 3-19)

చెక్కిళ్ళ వరకును వ్రేలాడుచు నుండెడి మకర కుండలములు గలవాడును, కాలకూట విషము చేత కుత్తుకయందున నలుపును పొందినవాడును, అగువానిని

**శ్లో॥ మణికంకణకేయూరమరీచీకరపల్లవైః ।**
**చతుర్భిఃసంవిరాజంతంబాహుమందారశాఖిభిః ॥** (సి.శి. 3-20)

మణి కంకణముల తోడను, భుజకీర్తులతోడను, వాటి నుండి వెలువడెడి కాంతులతో కూడుకొనిన లేత చిగుళ్ళవంటి కోమలమగు హస్తములును, మందార వృక్షశాఖలను బోలెడు అందమైన నాల్గు భుజములును గలవాడును అగు వానిని.

**శ్లో॥ గౌరీపయోధరాశ్లేషకృతార్థభుజమధ్యమం ।**
**సువర్ణబ్రహ్మసూత్రాంకంసూక్ష్మకౌశేయవాససం ॥** (సి.శి.3-21)

గౌరీదేవి యొక్క పాలిళ్ళ నాలింగనము చేసుకొని ధన్యతబడిసిన యెద గలవాడును, బంగారు శివసూత్రము సన్నని పట్టువస్త్రమును ధరించిన దేహముగలవాడును అగువానిని

**శ్లో॥ నాభిస్థానావలంబిన్యా నవమౌక్తికమాలయా ।**
**గంగయేవ కృతాశ్లేషం మౌళిభాగావతీర్ణయా ॥** (సి.శి. 3-22)

నాభివరకు వ్రేలాడెడియును, తలమీది నుండి దిగివచ్చెడి గంగవలె నున్నట్టిదియును అగు కొంగ్రొత్త ముత్యాలహారముగల వాడును, అగువానిని

**శ్లో॥ పదేన మణిమంజీరప్రభాపల్లవితశ్రియా ।**
**చంద్రవత్స్ఫాటికం పీఠం సమావృత్య స్థిత పురః ॥** (సి.శి. 3-23)

ముందుభాగమున పాదములకుగల రత్నపు గజ్జెల ప్రకాశము చేత పరివ్యాప్తమై చంద్రునివలె మెరిసెడి స్ఫటిక పీఠము మీద కాళ్ళనిడి కూర్చునియున్నవాడును, అగువానిని

శక్తి వర్ణనం

**శ్లో॥ వామపార్శ్వనివాసిన్యా మంగలప్రియవేషయా ।**
**సమస్తలోకనిర్మాణసమవాయస్వరూపయా ॥** (సి.శి. 3-24)

ఎడమ భాగమున కూర్చునియున్న మంగళమయమైన ప్రియమైన వేషము గలదానితోను, సమస్తలోకములను సృష్టించెడి విధిలో తనతో అవినాభావ సంబంధము గల దానితోనున్న వాడును, అగువానిని

**శ్లో॥ ఇచ్ఛాజ్ఞానక్రియారూపబహుశక్తి విలాసయా ।**
**విద్యా తత్త్వ ప్రకాశిన్యా వినాభావ విహీనయా ॥** (సి.శి. 3-25)

ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్త్యాది వివిధ శక్తులుగల దానితోను విద్యా తత్త్వమును ప్రకాశమానము చేసెడి దానితోను, తనతో నెడతెగని సంబంధము గలదానితో కూడియున్నవాడును, అగువానిని

**శ్లో॥ సంసారవిషకాంతారదాహదావాగ్నిలేఖయా ।**
**ధమ్మిల్లమల్లికామోదఝంకుర్వద్భృంగమాలయా ॥** (సి.శి. 3-26)

సంసారమనెడి విషవృక్షపుటడవిని దహించి వేసెడి కార్చిచ్చువంటి దానితో కూడియున్న వాడును, కొప్పులో తురుముకొనిన మల్లెల సుగంధము చేత నాకర్షింపబడి ఝంకారము చేయుచు తిరుగాడెడి భ్రమరముల వరుస గలదానితో కూడియున్నవాడును, అగువానిని

**శ్లో॥ సంపూర్ణచంద్రసౌభాగ్యసంవాదిముఖపద్మయా ।**
**నాసామౌక్తికలావణ్యనాసీరస్మితశోభయా ॥** (సి.శి. 3-27)

పూర్ణచంద్రుని ప్రకాశముతో పోటీపడెడి తేజస్సుగల ముఖపద్మము గల దానితోను, అందమైన ముత్యపు నాసికాభరణము శోభచేతను, మందహాసము చేతను శోభించెడి దానితోను కూడియున్న వాడును అగువానిని

**శ్లో॥ మణితాటంకరంగాంతర్వలితాపాంగలీలయా ।**
**నేత్రద్వితయసౌందర్యనిందితేందీవరత్విషా ॥** (సి.శి. 3-28)

రంగమంటపమున పరువబడిన రతనాల చెవికమ్మల కాంతియుతమైన క్రీగంటి చూపులుగల దానితోను నేత్రద్వయము యొక్క సౌందర్యము చేత తిరస్కృతమైన నల్లకలువల కాంతిగల దానితోను కూడుకొని యున్నవాడును, అగువానిని

**శ్లో॥ కుసుమాయుధకోదండకుటిలభ్రూవిలాసయా ।**
**బంధూకకుసుమచ్ఛాయాబంధుభూతాఽధరశ్రియా ॥** (సి.శి. 3-29)

మన్మధుని వింటివలె వంగిన కనుబొమ్మల శోభ గలదానితోను, మంకెనపువ్వు యొక్క ఎర్రటి చ్ఛాయకు చుట్టము వలెనుండెడి పెదవుల సిరిగల దానితో కూడుకొని యున్నవాడును, అగువానిని

**శ్లో॥ కంఠనాలజితానంగకంబుబిబ్బోకసంపదా ।**
**బాహుద్వితయసౌభాగ్యవంచితోత్పలమాలయా ॥** (సి.శి. 3-30)

మన్మథుడు విజయుడైన పిదప నూదెడి శంఖము యొక్క సౌందర్యమును జయించెడి అందమైన మెడ గలదానితోను, భుజద్వయము యొక్క సౌందర్యముతో వంచింప బడిన కలువల మాల సౌందర్యము గల దానితోను కూడియున్నవాడును అగువానిని

**శ్లో॥ స్థిరయౌవనలావణ్యశృంగారితశరీరయా ।**
**అత్యంతకఠినోత్తుంగపీవరస్తనభారయా ॥** (సి.శి. 3-31)

సుస్థిరమైన యౌవ్వన లావణ్యముల చేత సింగారింపబడిన మేను గలదాని తోను, బాగుగా బలిసి గట్టిగాను, ఎత్తుగాను నున్న కుచముల భారము గలదానితోను కూడియున్నవాడును అగువానిని

**శ్లో॥ మృణాలవల్లరీతంతుబంధుభూతావలగ్నయా ।**
**శృంగారతటనీతుంగపులినశ్రోణిభారయా ॥** (సి.శి. 3-32)

తామరతూండ్ల తీగలకు బంధువుగా నున్న నడుముగల దానితోను, మెత్తని యిసుక తిన్నెలవలె యెత్తుగా నుండి సుందరముగా నున్న పిరుదుల భారముగల దానితోను కూడియున్న వాడును, అగు వానిని

**శ్లో॥ కుసుంభకుసుమచ్ఛాయాకోమలాంబరశోభయా ।**
**శృంగారోద్యానసంరంభరంభాస్తంభోరుకాండయా ॥** (సి.శి. 3-33)

కుంకుమ పువ్వు వన్నె గల కోమలమైన వస్త్రములను ధరించిన దానితోను, సుందరమైన ఉద్యానవనములోన శోభించెడి అరటి బోదెల వంటి తొడలు గల దానితోను, కూడియున్న వాడును, అగువానిని

**శ్లో॥ చూతప్రవాలసుషమాసుకుమారపదాబ్జయా ।**
**స్థిరమంగలశృంగారభూషణాలంకృతాంగయా ॥** (సి.శి. 3-34)

మామిడి చిగుళ్ళవలె మృదువుగా శోభించెడి పాదపద్మములు గలదానితోను, నిత్య గల మంగళమయమైన శృంగార భరితమైన వివిధ ఆభరణముల చేత నలంకరింపబడిన దానితోను కూడుకొని యున్నవాడును, అగువానిని

**శ్లో॥ హారనూపురకేయూరచమత్కృతశరీరయా ।**
**చక్షురానందలతయా సౌభాగ్యకులవిద్యయా ॥** (సి.శి. 3-35)

హారములు, కడియములు, గజ్జెలు మొదలగు ఆభరణములతో శోభించెడి శరీరము గల దానితోను, నయనానందమును గల్గించెడి బంగారు మెరుపు తీగవంటి దానితోను, సకల సౌభాగ్యములను చేకూర్చెడి విద్యా రూపియైన దానితోను కూడుకొనియున్న వాడును, అగువానిని

**శ్లో॥ ఉమయా సమమాసీనం లోకజాలకుటుంబయా ।**
**అపూర్వరూపమభజన్ పరివారాః సమంతతః ॥** (సి.శి. 3-36)

సకల భువనములు కుటుంబముగా గలవానిని, ఉమాదేవితో కూడుకొని, సింహాసనము మీద కూర్చుని యున్నవానిని, అపూర్వమైన రూపము గలవానిని పరివారము చుట్టూ నిలిచియుండి సేవించుచుండెను.

**శ్లో॥ పుండరీకాకృతిం స్వచ్ఛం పూర్ణచంద్రసహోదరం ।**
**దధౌ తస్య మహాలక్ష్మీః సితామాతపవారణం ॥** (సి.శి. 3-37)

మహాలక్ష్మి, పరమేశ్వరుని కొరకు కమలము వలె స్వచ్ఛముగాను, పూర్ణచంద్రుని వలె శీతలముగను నుండెడి తెల్లటి గొడుగును పట్టి సేవించుచుండెను.

**శ్లో॥ తంత్రీఝంకారశాలిన్యా సంగీతామృతవిద్యయా ।**
**ఉపతస్థే మహాదేవ ముపాంతే చ సరస్వతీ ॥** (సి.శి. 3-38)

సరస్వతీ దేవి వీణానాదముతో కూడిన సంగీతామృత విద్య చేత సమీపముననే యుండి మహాదేవుని సేవించుచుండెను.

**శ్లో॥ ఝణత్కంకణజాతేన హస్తేనోపనిషద్వధూః ।**
**ఓంకారతాలవృంతేన విజయామాస శంకరం ॥** (సి.శి. 3-39)

ఉపనిషత్తులనెడి వనిత, కరకంకణములు సవ్వడి చేయుచుండగా ఓంకారమనెడి విసనకర్రను వీచుచు సేవించుచుండెను.

శ్లో॥ చలచ్చామరికాహస్తా ఝుంకుర్వన్మణికంకణాః ।
అసేవంత తమీశానమభితో దివ్య కన్యకాః ॥ (సి.శి. 3-40)

శబ్దము చేసెడి మణికంకణాలంకృత హస్తములచే, చామరములు దాల్చి వీచెడి దేవ కన్నియలు చుట్టుముట్టి సేవించుచుండిరి.

శ్లో॥ చామరాణాం విలొలానాం మధ్యే తన్ముఖమండలం ।
రరాజ రాజహంసానాం భ్రమతా మివ పంకజం ॥ (సి.శి. 3-41)

చలించెడి చామరముల మధ్యనగల ముఖమండలము, చలించెడి రాజహంసలమధ్యనగల కమలము వలె శోభించుచుండెను.

శ్లో॥ మంత్రేణ తమసేవంత వేదాః సాంగవిభూతయః ।
భక్త్యా చూడామణిం కాంతం వహంత ఇవమౌలిభిః ॥ (సి.శి. 3-42)

వేదము సాంగముగాను, శిరసావహించిన యటుల భక్తితో మంత్రముల చేత భజించుచుండెను.

శ్లో॥ తదీదాయుధధారిణ్యస్తత్యమానవిభూషణః ।
అంగభూతాః స్త్రియః కాశ్చిదాసేవంత తమీశ్వరమ్ ॥ (సి.శి. 3-43)

కొందరు స్త్రీలు శివుని ఆయుధములను, ఆభూషణములను ధరించి యతని యంగరక్షకుల వలె నిలిచి సేవించుచుండిరి.

శ్లో॥ ఆప్తాధికారిణః కేచిదనంతప్రముఖా అపి ।
అష్టౌ విద్యేశ్వరా దేవమభజంత సమంతతః ॥ (సి.శి. 3-44)

పరమేశ్వరునికి ఆప్తాధికారులనదగిన వారెందరో ప్రముఖులును, యెనమండుగురు విద్యేశ్వరులును శివుని చుట్టూ చేరి సేవించుచుండిరి.

శ్లో॥ తతో నందీ మహాకాల శ్చండో భృంగిరిటిస్తతః ।
ఘంటాకర్ణః పుష్పదంతః కపాలీ వీరభద్రకః ॥ (సి.శి. 3-45)

శ్లో॥ ఏవమాద్యా మహాభాగా మహాబలపరాక్రమాః ।
నిరంకుశమహాసత్త్వా భేజిరే తం మహేశ్వరం ॥ (సి.శి. 3-46)

తదనంతరము నందీశ్వరుడు, మహాకాలుడు, చండుడు, భృంగిరిట, ఘంటాకర్ణుడు, పుష్పదంత, కపాలీ, వీరభద్రుడు మొదలగు గొప్ప పరాక్రమము గలవారును, ఎదురులేని శక్తిసమన్వతులును అగు మహా మహిమాన్వితులు పరమేశ్వరుని భజించుచుండిరి.

శ్లో॥ అణిమాదికమైశ్వర్యం యేషాం సిద్ధేరపోహనం ।
బ్రహ్మాదయః సురా యేషామాజ్ఞాలంఘనభీరవః ॥ (సి.శి. 3-47)

ఎవ్వరి సిద్ధిముందున యణిమాదికములగు ఐశ్వర్యములు తుచ్ఛమైనవై యుండునో, ఎవ్వరి ఆజ్ఞను ఉల్లంగిచుట యందు బ్రహ్మాది దేవతలు భీతచిత్తులై యుందురో

శ్లో॥ మోక్షలక్ష్మీపరిష్వంగముదితా యేఽతరాత్మనా ।
యేషామిషత్కరం విశ్వసర్గసంహారకల్పనం ॥ (సి.శి. 3-48)

ఎవ్వరు మోక్షలక్ష్మి యొక్క ఆలింగనము చేత పరితుష్టులై యుందురో, ఎవ్వరికి జగత్తు యొక్క సృష్టి-స్థితి-సంహార కార్యములు సులభసాధ్యములో

శ్లో॥ జ్ఞానశక్తిః పరా యేషాం సర్వవస్తుప్రకాశినీ ।
ఆనందకణికా యేషాం హరిబ్రహ్మాది సంపదః ॥ (సి.శి. 3-49)

ఎవ్వరి సర్వోత్కృష్టమైన జ్ఞానశక్తి సకల వస్తువుల యదార్థ జ్ఞానమును గలుగజేయునో, ఎవ్వరికి బ్రహ్మవిష్ణ్వాదుల సంపద ఆనందము లుప్తమైన యంశమో,

శ్లో॥ ఆకాంక్షంతే పదం యేషాం యోగినో యోగతత్పరాః ।
కాంక్షణీయ ఫలో యేషాం సంకల్పః కల్పపాదపః ॥ (సి.శి. 3-50)

ఎవ్వరి పదమును యోగ తత్పరులైన యోగులు నాకాంక్షింతురో ఎవ్వరి సంకల్పము అపేక్షించిన ఫలముల నిచ్చెడి కల్పవృక్షము వంటిదో,

శ్లో॥ కర్మకాలాది కార్పణ్యచింతా యేషాం న విద్యతే ।
యేషాం విక్రమసన్నాహో మృత్యోరపి చ మృత్యవః ॥ (సి.శి. 3-51)

తేసారూప్య పదం ప్రాప్తా ప్రమథా భేజిరేశివం ॥

ఎవ్వరికి కర్మకాలకామాదుల చింతయుండదో, ఎవ్వరి విక్రమ సన్నాహము చేత మృత్యువుకు మృత్యువు గల్గునో అట్టి సారూప్య పదవిని పొందిన ప్రమథులు శివుని భజించుచుండిరి.

శ్లో॥ బ్రహ్మోపేంద్రమహేంద్రాద్య విశ్వతంత్రాధికారిణం ।
ఆయుధాలంకృతప్రాంతాః పరితస్తం సిషేవిరే ॥ (సి.శి. 3-52)

బ్రహ్మ విష్ణువులు, నాయుధదారులై, జగత్సూత్రధారియైన శివుని చుట్టూ నిలుచుండి సేవించుచుండిరి.

ఆదిత్యా వసవో రుద్రా యక్షగంధర్వకిన్నరాః ।
దానవా రాక్షసా దైత్యాః సిద్ధవిద్యాధరోరగాః ॥
అభజంత మహాదేవ మపరిచ్ఛిన్న సైనికాః ॥ (సి.శి. 3-53)

ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, దానవులు, రాక్షసులు, దైత్యులు, సిద్ధులు, విద్యాధరులు, పన్నగులు నసంభావుక సైనిక బలముతో విచ్చేసి విశ్వైకనాథుని సేవించుచుండిరి.

శ్లో॥ వశిష్ఠో వామదేవశ్చ పులస్త్యాగస్త్యశౌనకాః ।
దధీచిర్గౌతమశ్చైవ సానందశుకనారదాః ॥
ఉపమన్యు భృగువ్యాస పరాశర మరీచయః ।
ఇత్యాద్యా మునయః సర్వే నీలకంఠం సిషేవిరే ॥ (సి.శి. 3-54, 55)

వశిష్ఠాది మునులెల్లరు నీలకంఠుని సేవించుచుండిరి.

శ్లో॥ పార్శ్వస్థ పరివారాణాం విమలాంగేషు బింబితః ।
సర్వాంతర్గతమాత్మానం స రేజే దర్శయ న్నివ ॥ (సి.శి. 3-56)

శివున కిరువైపుల నున్న సపరివార జనుల నిర్మలాంగముల మీద ప్రతిబింబించెడి శివుని రూపము శివుడు సర్వాంతర్గతుడనెడి భావమును కల్గించుచుండెను.

శివుని పేరోలగమును వివిధ దేవతా సమాహకృత శివసేవనమును వర్ణించిన పిదప శ్రీ శివయోగి శివాచార్యుల వారు శివుని వ్యాపారమును వర్ణించిరి.

శ్లో॥ క్షణం స శంభుర్దేవానాం కార్యభాగం నిరూపయన్ ।
క్షణం గంధర్వరాజానాం గానవిద్యాం విభావయన్ ॥ (సి.శి. 3-57)

శంభువు, క్షణకాలము వరకు దేవతల యొక్క కార్యభాగమును నిరూపించుచు, క్షణము గంధర్వ రాజుల గానవిద్యను ఆలించుచుండెను.

శ్లో॥ బ్రహ్మ విష్ణ్వాదిభిర్దేవైః క్షణమాలాపమాచరన్ ।
క్షణం దేవమృగాక్షీణాం లాలయన్నృత్య విభ్రమమ్ ॥ (సి.శి. 3-58)

క్షణకాలము వరకు బ్రహ్మవిష్ణ్వాదులతో మాటలాడుచు, మరుక్షణం దేవతాస్త్రీల నృత్యములను వీక్షించుచుండెను.

శ్లో॥ వ్యాసాధీనాం క్షణం కుర్వన్ వేదోచ్చారేషు గౌరవం ।
నిదధానక్షణం దేవాముఖే బింబాధరే దృశః ॥ (సి.శి. 3-59)

క్షణకాలమువరకు వ్యాసాదులు చేసెడి వేదోచ్చారణమును (పఠనమును) ఆలించుచు, క్షణకాలము దేవి యొక్క ముఖారవిందమును పరికించుచుండెను.

శ్లో॥ హాస్య నృత్యం క్షణం పశ్యన్ భృంగిణా పరికల్పితమ్ ।
నందినా వేత్రహస్తేన సర్వతంత్రాధికారిణా ॥ (సి.శి. 3-60)

క్షణము వరకు భృంగీశ్వరుని చేత చేయబడిన వినోదభరిత నృత్యమును వీక్షించుచు, సమస్త కార్యాధికారియును, దండధారియును,

శ్లో॥ అముక్షతా సదా పార్శ్వ మాత్మాభిప్రాయవేదినా ।
చోదితాం వాసయన్ కాంశ్చిద్విసృజను భ్రూవిలాసతః ॥ (సి.శి. 3-61)

శ్లో॥ సంభావయంస్తథా చాన్యానన్యానపి నియామయన్ ।
సమస్త భువనాధీశమౌలిలాలితశాసనః ।
అకుంఠశక్తిరవ్యాజలావణ్యలలితాకృతిః ॥ (సి.శి. 3-62)

సదాశివుని పార్శ్వమున నెడతెగకుండగ నుండెడి వాడును, శివుని మనోగతాభిప్రాయమును నెరిగిన వాడును అగు నంది చేత కొందరిని పిలిపించుచును, కొందరిని నేత్ర సౌంజ్ఞ చేత పంపించుచు, ఇతరులతో మాట్లాడుచుండెను.

శ్లో॥ స్థిర యౌవనసౌరభ్యశృంగారితకలేవరః ।
ఆత్మ శక్త్యమృతాస్వాదరసోల్లాసితమానసః ॥ (సి.శి. 3-63)

స్థిరముగా నుండెడి యవ్వన సౌరభము చేత యలంకృతమైన శరీరము గలవాడు, తనయందు నుండెడి శక్తి రూపమైన యమృతము యొక్క రసాస్వాదన చేత సంతుష్టుడైన మనస్సుగల వాడు.

శ్లో॥ స్వాభావిక మహైశ్వర్య విశ్రామ పరమావధిః ।
నిష్కలంక మహాసత్త్వ నిర్మితానేక విగ్రహః ॥ (సి.శి. 3-64)

సహజముగా సకలైశ్వర్యముల విశ్రమణకు పరమావధియైనవాడు, నిష్కలంకమను మహాశక్తి చేత నిర్మించబడిన యనేక రూపములు గలవాడు.

శ్లో॥ అఖండారాతిదోర్దండకండూఖండనపండితః ।
చింతామణిః ప్రపన్నానాం శ్రీకంఠః పరమేశ్వరః ॥ (సి.శి. 3-65)

అనేక వైరిజనుల భుజముల యొక్క దురదను పోగొట్టినవాడు. ఆశ్రితులకు చింతామణి వంటివాడు, నీలకంఠుడగు పరమేశ్వరుడు,

**శ్లో॥ సభాంతరగతం తంత్రం రేణుకం గణనాయకం ।**
**ప్రసాదం సులభం దాతుంతాంబూలంసతమాహ్వయత్ ॥** (సి.శి. 3-66)

సభలో నుండినవాడును, ప్రసిద్ధుడును, సులభుడును అగు రేణుక గణనాయకునికి తాంబూలమనెడి ప్రసాదమును ఇచ్చుటకు పిలిపించి ఈ విధముగా నాదేశించెను.

**శ్లో॥ శంభోరాహ్వానసంతోషసంభ్రమేణైవ దారుకం ।**
**ఉల్లంఘ్య పార్శ్వ మఘమల్లోక నాథస్య రేణుకః ॥** (సి.శి. 3-68)
**తమాలోఖ్య విభూస్తత్ర సముల్లంఘిత దారుకం ।**
**మహాత్మ్యం నిజభక్తానాం ద్యోతయన్నిదమబ్రవీత్ ॥** (సి.శి. 3-69)

రేణుకుడు సంభ్రముడై శంకరుని ఆహ్వానమును శీఘ్రముగా పోలన చేయుటకై దారుక గణేశ్వరుని మీద నుండి లంఘించుకొని పోయి లోకనాథుడి యొక్క సమీపమునకు చేరెను. సర్వవ్యాపియైన పరమేశ్వరుడు తనభక్తుల యొక్క మహాత్మ్యమును చూపించుటకై దారుకా గణేశ్వరుని ఉల్లంఘున చేసిన వాడైన రేణుక గణేశ్వరునితో యిట్టులినెను.

**శ్లో॥ రే రే రేణుక దుర్బుద్దే కథమేశ త్వయాఽధునా ।**
**ఉల్లంఘితః సభామధ్యే మమ భక్తో హి దారుకః ॥** (సి.శి. 3-70)

ఓరీ దుర్బుద్ధి కల్గిన రేణుకా నీవు సభా మధ్యమున నాభక్తుడైన యీ దారుక గణేశ్వరుని ఉల్లంఘున నెందుకు చేసితివి ?

**శ్లో॥ లంఘునం మమ భక్తానాం పరమానర్థ కారణం ।**
**ఆయుః శ్రియం కులం కీర్తిం నిహాన్తి హీశరీరణాం ॥** (సి.శి. 3-71)

నా భక్తుల యొక్క లంఘునము మహా అనర్థమునకు కారణమగును. అది మనుజుల యొక్క ఆయువును, లక్ష్మిని, కులమును మరియు కీర్తిని నష్టపరచును.

**శ్లో॥ మమ భక్తమవజ్ఞాయ మార్కండేయ పురా యమః ।**
**మత్పాదతాడనాదాసీత్ స్మరణీయ కలేవరాః ॥** (సి.శి. 3-72)

ప్రాచీనకాలమునందు యమరాజు నాభక్తుడైన మార్కండేయుని కవమానమును చేసి నాకాలి యొక్క ఆఘాతముచే నష్టమైపోయెను.

**శ్లో॥ భృగోశ్చ శంకుకర్ణస్య మమ భక్తి మతోస్తయోః ।**
**కృత్వానిష్టమభూద్ విష్ణుర్వికేశా దశయోనిభాక్ ॥** (సి.శి. 3-73)

నా భక్తులు అయిన భృగు మరియు శంకుకర్ణులకు అనిష్టములు చేసి విష్ణువు విశిష్ట కేశములు కలవాడయ్యెను అనగా, అనేక మస్తకములపై వెంట్రుకలు మొలిచిన వాడయ్యెను. అనగా పదిమారులు జన్మలనెత్తిన వాడాయెను.

**శ్లో॥ మద్భక్తేన దధీచేన కృత్వా యుద్ధం జనార్ధనః ।**
**భగ్న చక్రాయుధః పూర్వం పరాభవముపాగమత్ ॥** (సి.శి. 3-74)

ప్రాచీనకాలమునందు నా భక్తుడైన దదీచితో యుద్ధమును చేసి జనార్ధనుడన బడెడి విష్ణువు చక్రము మరియు ధనుస్సును విరిగినవాడై పరాజయమును పొందిన వాడాయెను.

**శ్లో॥ కృతాశ్వమేధో దక్షోఽపి మద్భక్తాంశ్చ గణేశ్వరాన్ ।**
**అవమత్యా సభామధ్యే మేషవక్త్రోఽభవత్ పురా ॥** (సి.శి. 3-75)

అశ్వమేధ యజ్ఞమును చేసెడివాడై నదక్షుడు సభామధ్యమున నా భక్తులైన గణేశ్వరులకు అవమానమును చేసి మేకతలను పొందినవాడాయెను.

**శ్లో॥ శ్వేతస్య మమ భక్తస్యదురతిక్రమతేజసః ।**
**ఔదాసీన్యేన కాలోఽపి మయా దగ్ధః పురాఽభవత్ ॥** (సి.శి. 3-76)

ప్రాచీన కాలమున అన తిక్రమణీయ తేజోవంతుడైన మా భక్తుడగు శ్వేతుని ఉదాసీనము వలన నేను యమున్ని కూడా దగ్ధము చేసితిని.

**శ్లో॥ ఏవమన్యేఽపి బహవోమద్భక్తానామతిక్రమాత్ ।**
**పరిభూతా హతాశ్చాసన్ భక్తా మే దురతిక్రమాః ॥** (సి.శి. 3-77)

ఈ విధముగా యితరులకు వేరే అయినవారు నా భక్తులకు అవమానము చేసిన కారణము వలన పరాభవమును పొంది మరణించిరి. అందుచేత నా భక్తులు అనుల్లంఘనీయులగుచున్నారు.

**శ్లో॥ అవిచారేణ మద్భక్తో లంఘితో దారుకస్త్వయా ।**
**ఏశ త్వం రేణుకానేన జన్మవాన్ భవ భూతలే ॥** (సి.శి. 3-78)

ఓ రేణుకా ! నీవు ఆలోచన లేకుండగా నాభక్తుడైన దారుకుని మీద నుండి లంఘించితివి. ఈ కారణమున నీవు పృథ్వీ మీద జన్మను దాల్చుము.

**శ్లో॥ ఇత్యుక్తః పరమేశే భక్తమహాణత్మ్యశంసినా ।**
**ప్రార్థయామాస దేవేశం ప్రాణిపస త రేణుకః ॥** (సి.శి. 3-79)

భక్తుల యొక్క మహాత్మ్యమును తెల్పెడి పరమేశ్వరుని వలన, యీ ప్రకారముగా తెలుపబడగా రేణుకుడు శివుని పాదములపై బడి, ప్రార్థించెను.

**శ్లో॥ మానుషీం యోనిమాసాధ్య మహాదుఃఖవివర్దినీం ।**
**జాత్యాయుర్భోగ వైశమ్యహేతుకర్మోపపాదినీం ॥** (సి.శి. 3-80)

**శ్లో॥ సమస్త దేవకైంకర్యకార్పణ్య ప్రసవస్థలీమ్ ।**
**మహోతాపత్రయోపేతాం వర్ణాశ్రమ నియంత్రితామ్ ॥** (సి.శి. 3-81)

**శ్లో॥ విహాయ త్వత్పదామ్భోజసేవాం కింవా వసామ్యహమ్ ।**
**యథామేథామానుషో భావోన భవేత్ క్షితిమండలే ॥**
**తథా ప్రసాదం దేవేశ విదేహి కరుణానిధే ॥** (సి.శి. 3-82)

ఓ దేవదేవేశ ! దుఃఖమును పెంచెడి జన్మ ఆయువు మరియు భోగముల వైశమ్యములకు కారణ భూతమైన కర్మములను చేయించెడి సమస్త దేవతల యొక్క సేవ కత్వరూపియగు దీనత్వము యొక్క జన్మస్థలీ దైహిక, దైవిక, భౌతిక, తాపత్రయములతో కల్గిన మరియు వర్ణాశ్రమ ధర్మములచే నియంత్రితమైన మనుష్య జన్మను పొంది నీ చరణ కమలముల యొక్క సేవ నుండి దూరమై యెటులుండగలను? ఓ కరుణానిధి ! పృథ్వీ మండలము మీద నామనుష్య భావము యెటుల వుండదో అటుల కరుణించుము.

**శ్లో॥ ఇతి సంప్రార్థితో దేవో రేణుకేన గణేశ్వరః ।**
**మా భహీశీర్మమ భక్త నాం కుతో భీతిరిహేశ్యతి ॥** (సి.శి. 3-83)

రేణుకుని చేత యీ విధముగా ప్రార్థితుడైన మహేశ్వరుడు, రేణుకునితో నిట్టులనెను. భయపడకుము నా భక్తులకు యీ జగత్తుయందున భయమెక్కడిది.

**శ్లో॥ శ్రీశైలస్యోత్తరే భాగే త్రిలింగవిషయే శుభే ।**
**కొల్లిపాక్యాభిధానోఽస్తికోఽపిగ్రామొ మహత్తరః ॥** (సి.శి. 3-84)

శ్రీశైలమున కుత్తర భాగమున కుల్యపాక యనెడి పేరు గలదియును, త్రిలింగదేశములోనిదియును అగు నొక క్షేత్రము విరాజిల్లుచున్నది.

**శ్లో॥ సోమేశ్వరాభిదానస్య తత్ర వాసవతో మమ ।**
**అస్పృశన్ మానుషం భావం లింగాత్ ప్రాదుర్భవిష్యసి ॥** (సి.శి. 3-85)

అచ్చట సోమేశ్వర లింగమనెడి పేరుగల నాలింగ రూపము నుండి దివ్యమైన మానవేతరమైన రూపమును నవతరించుము.

**శ్లో॥ మదీయలింగసంభూతం మద్భక్తపరిపాలకం ।**
**విస్మితా మానుషాః సర్వే త్వాం భజంతు మదాజ్ఞయా ॥** (సి.శి. 3-86)

నాలింగ రూపము నుండి పుట్టెడివానిని, నా భక్తులను కాపాడే వానిని(గా) నిన్ను నా ఆజ్ఞ వలన విస్మితులైన సకల జనులు కొలుతురు గాక !

**శ్లో॥ మదద్వైతపరం శాస్త్రం వేదవేదాంతసమ్మతం ।**
**స్థాపయిష్యసి భూలోకే సర్వేషాం హితకారకం ॥** (సి.శి. 3-87)

భూలోకమున నివసించెడి సర్వ మానవుల హితమును గూర్చెడిదియును, వేదవేదాంత సమ్మతమైనదియును, శివాద్వైతసిద్ధాంతమును భూలోకమున స్థాపించుము.

**శ్లో॥ మమ ప్రతాపమతులం మద్భక్తానాం విశేషతః ।**
**ప్రకాశయ మహీభాగే వేదమార్గానుసారతః ॥** (సి.శి. 3-88)

నా ఉపమాతీతమైన ప్రతాపమును, విశేషించి నా భక్తుల యొక్క మహిమలను వేదమార్గాను సారముగా ప్రకాశమానము చేయుము.

**శ్లో॥ ఇత్యుక్త్వా పరమేశ్వరః స భగవాన్ భద్రాసనాదుత్థితో ।**
**బ్రహ్మోపేంద్రముఖాన్ విసృజ్య విబుధాన్ భ్రూసంజ్ఞయా కేవలం ॥** (సి.శి. 3-89)

**శ్లో॥ పార్వత్యా సహితో గణైరభిమతైః । ప్రాప స్వమంతః పురం ।**
**క్షోణీభాగమవాతరత్ పశుపతేరాజ్ఞావశాద్రేణుకః ॥** (సి.శి. 3-90)

ఈ ప్రకారముగా భగవంతుడగు పరమేశ్వరుడు రేణుకునికి చెప్పి ఆసనము నుండి లేచి కేవలయు కను సౌంజ్ఞచే బ్రహ్మేంద్రాదులను పంపించి వేసి పార్వతీ సహితుడై తనకిష్టమైన గణములతో తన అంతఃపురమున కేగెను. పశుపతి ఆజ్ఞ కధీనుడై శ్రీ రేణుకుడు భూలోకమున యవతరించెను.

దీనితో సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభయను గ్రంథమున పూర్వ పీఠికా భాగమునకు చెందిన తృతీయ పరిచ్ఛేదము పరిపూర్ణము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# చతుర్థ పరిచ్ఛేదము

**శ్లో॥ అథ త్రిలింగవిషయే కుల్యపాకాభిదే పురే ।**
**సోమేశ్వరమహాలింగాత్ ప్రాదురాసీత్ స రేణుకః ॥** (సి.శి. 4-1)

అటు పిదప శ్రీ రేణుకులవారు త్రిలింగదేశము నందున కుల్యపాక యనెడి పేరు గల క్షేత్రమున సోమేశ్వర మహాలింగము నుండి ప్రాదుర్భ వించెను.

**శ్లో॥ ప్రాదుర్భూతం తమాలోక్య శివలింగాత్ త్రిలిగంజాః ।**
**విస్మితాః ప్రాణినః సర్వే బభూవురతితేజసం ॥** (సి.శి. 4-2)

త్రిలింగ దేశములోని, సకల జీవులును, శివలింగము నుండి ప్రాదుర్భవించిన తేజోవంతుడగు నతనిని చూసి ఆశ్చర్య చకితులైరి.

**శ్లో॥ భస్మోద్ధూళితసర్వాంగం సారరుద్రాక్ష భూషణం ।**
**జటామకుటసంయుక్తం త్రిపుండ్రాంకితమస్తకం ॥** (సి.శి. 4-3)

భస్మముచే ప్రోక్షింపబడిన/అలంకరించబడిన సర్వాంగములు గలవానిని, శ్రేష్ఠములగు రుద్రాక్షలను భూషణముగా ధరించిన వానిని, జటామకుటములతో కూడుకొనియున్న వానిని, భస్మత్రిపుండ్రములను ధరించిన ఫాలభాగము గలవానిని.

**శ్లో॥ కటీతపటీభూత కంథాపటలబంధురం ।**
**దధానం యోగదండం చ భస్మాధారం కమండలం ॥** (సి.శి. 4-4)

నడుముకు యోగులు ధరించెడి బొంతను చుట్టినవానిని, యోగదండము, భస్మ బొక్కసము, కమండలమును ధరించిన వానిని

**శ్లో॥ శివాద్వైత పరిజ్ఞాన పరమానందమోదితం ।**
**నిర్ధూతసర్వసంసారవాసనాదోషపంజరం ॥** (సి.శి. 4-5)

శివాద్వైత పరిజ్ఞానము వలన కల్గెడి పరమానందమును పొంది సంతోషించెడి వానిని, దూరముగా నెట్టబడిన సంసార వాసనా దోషములు గలవానిని

**శ్లో॥ శివాగమసుధాసింధుసమున్మేషాసుధాకరం ।**
**చిత్తారవిందసంగూఢశివపాదాంబుజద్వయం ॥** (సి.శి. 4-6)

శివాగమములనెడి క్షీర సముద్రమును, పొంగుకు గురి చేసెడి చంద్రుని వంటివానిని, చిత్తమున శివపాద పద్మ ద్వయములను సదా సంస్మరించువానిని

**శ్లో॥ యమాది యోగతంత్రజ్ఞం స్వతంత్రం సర్వకర్మసు ।**
**సమస్తసిద్ధసంతానసముదాయశిఖామణిం ॥** (సి.శి. 4-7)

యమనియమాది కూడి అష్టాంగ యోగముల నెరిగినవానిని, సమస్త విధి నిషేధాది కర్మల యెడల స్వతంత్రుడైన వానిని, సిద్ధ సముదాయమునక శిఖామణి వంటి వానిని

**శ్లో॥ వీర సిద్ధాంతనిర్వాహకృతపట్టనిబంధనం ।**
**ఆలోకమాత్రనిర్భిన్నసమస్తప్రాణిపాతకం ॥** (సి.శి. 4-8)

వీరశైవ సిద్ధాంతము స్థాపన మరియు నిర్వహణకు పట్టబద్ధుడై యున్నవానిని చూపు చేత సమస్త ప్రాణుల పాపములు నాశనము చేయగలవానిని.

శ్లో॥ తమపృచ్ఛన్ జనాః సర్వే నమంతః కో భవానితి ।
ఇతిపృష్టో మహాయోగీ జనైఃవిస్మితమానసైః ॥ (సి.శి. 4-9)

శ్లో॥ ప్రత్యువాచ శివాద్వైతమహానందపరాయణః ।
పినాకినః పార్శ్వవర్తీ రేణుకాఖ్యగణేశ్వరః ॥ (సి.శి. 4-10)

శ్రీ రేణుక గణేశ్వరునికి జనులెల్లరు నమస్కరించి తామెవ్వరని ప్రశ్నించిరి. విస్మిత మానసులగు జనుల చేత నీ విధముగా ప్రశ్నింపబడిన మహాయోగి శివాద్వైత పరాయణుడు, సదా శివుడితో నుండెడివాడును, రేణుకుడనెడి పేరుగలవాడు అయిన గణేశ్వరుడు ఈ విధముగా బదులుచెప్పెను.

శ్లో॥ కేనచిత్ కారణేనాహం శివలింగాదిహభావం ।
నామ్నా రేణుకసిద్ధోహం సిద్ధసంతాననాయకః ॥ (సి.శి. 4-11)

శ్లో॥ స్వచ్ఛందచారీ లోకేఽస్మిన్ శివసిద్ధాంతపాలకః ।
ఖండయన్ జైనచార్వాకబౌద్ధాదీనాం దురాగమాన్ ॥ (సి.శి. 4-12)

సమస్త సిద్ధులకు నాయకుడును, రేవణ సిద్ధుడను నేను శివాదేశమున వీరశైవ మతమును స్థిరపరచుటకు ఇచ్చట సోమేశ్వర లింగము నుండి ప్రకటింపబడితిని.

ఓ మహా భక్తులారా ! ఈ లోకమందున సర్వ తంత్ర స్వతంత్రుడును నాస్తిక వాద ప్రచారములైన చార్వాక, జైన, బౌద్ధాది మతములను ఖండించుచు, శివాగమ సిద్ధాంతమును ప్రతిష్ఠాపించుటకు నేను అవతరించితిని.

శ్లో॥ ఇత్యుక్త్వా పశ్యతాం తేషాం విషయస్థిరచక్షుషాం ।
ఉత్థాయవ్యోమ మార్గేణ మలయాద్రిముపాగమత్ ॥ (సి.శి. 4-13)

కొలనుపాక మహాజనులకు ఈ రీతిన తెలిపి శ్రీ రేణుక భగవత్పాదులు రెప్ప వాల్చక చూస్తున్న వారు చూస్తుండగనే తన స్థానము నుండి లేచి, ఆకాశమార్గమున మలయపర్వతము వైపుకు పయనించిరి.

## మలయాచల వర్ణనము

శ్లో॥ నవచందనకాంతారకందలన్మందమారుతం ।
అభంగురభుజంగస్త్రీసంగీతరససంకులం ॥ (సి.శి. 4-14)

శ్లో॥ కరిపోతకరాకృష్ట స్ఫురదేలాతివాసితం ।
వరాహ దంష్ట్రికాధ్వస్తముస్తాసురభికందరం ॥ (సి.శి. 4-15)

శ్లో॥ పటీరదలపర్యంకప్రసుప్తవ్యాధదంపతిం ।
మాధవీమల్లికాజాతీమంజరీరేణురంజితం ॥ (సి.శి. 4-16)

శ్రీ రేణుకా భగవత్పాదులు కొలనుపాక క్షేత్రము నుండి, ఆకాశమార్గమున పయనిస్తూ మలయపర్వతమునకు వేంచేసిరి. ఆ మలయపర్వతము అనేక చందన వృక్షములతో అలంకృతమై వాతావరణము సుగంధభరితమైన మందమారుతముతో నిండియుండెను. ఎడతెగని నాగకన్యల సంగీత సుస్వరములచేత పరివ్యాప్తమైనదియును, ఏనుగుల తొండముల చేత, మలినము చేయబడిన మేలకుల తీగల సువాసనలతో నిండినదియున్ను, అడవిపందులచే ధ్వంసము జేయబడిన నాగర మస్తకముల సువాసనా భరితమైన కొండ చరియలు కలదియును, గంధపు చెట్ల లేచిగుళ్ళ పానువుపై పరుండిన కిరాతక దంపతులు గలదియును, మల్లికా, మాధవీ, గురువింద, జాజి మొదలగు పూగుత్తులు పుప్పొడిచే సుభరితమై యుండెను.

## అగస్త్యాశ్రమ వర్ణనము

శ్లో॥ తత్ర కుత్ర చిదాభోగ సర్వర్తు కుసుమద్రుమే ।
అపశ్యదాశ్రమం దివ్యమగస్త్యస్య మహామునేః ॥ (సి.శి. 4-17)

శ్లో॥ మందారచందనప్రాయైర్మండితం తరుమండలైః ।
శాఖాశిఖర సంలీనతారకాగణకోరకైః ॥ (సి.శి. 4-18)

శ్లో॥ మునికన్యాకరానీతకలశాంబువివర్ధితైః ।
ఆలవాలజలాస్వాదమోదమానమృగీగణైః ॥ (సి.శి. 4-19)

శ్లో॥ హేమారవిందనిష్యందమకరందసుగంధిభిః ।
మరాలాలాపవాచాలవీచిమాలామనోహరైః ॥ (సి.శి. 4-20)

శ్లో॥ ఇందీవర వరజ్యోతిరంధీకృత హరిన్ముఖైః ।
లోపాముద్రాపదన్యాసచరితార్థతటాంకితైః ॥ (సి.శి. 4-21)

శ్లో॥ హారనీహారకర్పూరహరహాసామలోదకైః ।
నిత్యనైమిత్తికస్నాన నియమార్హైస్తపస్వినాం ॥ (సి.శి. 4-22)

శ్లో॥ ప్రకృష్టమణిసోపానైః పరివీతం సరోవరైః ।
విముక్త సత్త్వ వైరస్యం బ్రహ్మలోకమివాపరం ॥ (సి.శి. 4-23)

శ్లో॥ హూయమానాజ్యసంతానధూమగంధిమహాస్థలం ।
శుక సంసత్సమారబ్ధశ్రుతిశాస్త్రోపబృంహణం ॥ (సి.శి. 4-24)

ఆకాశ మార్గమున మలయపర్వతమునకు వేంచేసిన శ్రీ రేణుక భగవత్పాదులు, అన్ని రుతువులకు చెందిన వివిధ పూలచెట్లతో శోభిల్లుచున్న ఒకానొక విశాల ప్రదేశమున అగస్త్య మహాముని ఆశ్రమమును గాంచెను. ఆ ఆశ్రమమున కల్ప మరియు చందన వృక్ష శాఖాగ్రములు గల పూమొగ్గలు ఆకసమునగల నక్షత్ర సముదాయము వలె శోభిల్లుచూ, ఆశ్రమ వాసినులైన మునికన్యల సుకుమార హస్తములచేకొని తేబడిన నీటి కుండలతో నింపబడిన పాదుకల మూలమున గల నీటిని కడుపారా త్రాగి సంతోషముతో ఆడ లేళ్ళు తిరుగాడుచున్నవి.

శ్రీ అగస్త్యముని ఆశ్రమము అనేక సరస్సులతో విరాజిల్లుతున్నది. ఆ సరోవరములన్నియు సువర్ణ కమలనామ సుగంధములచే వ్యాప్తి చెందబడియున్నవి. ఆ సరస్సులో చరించు రాజహంసల సమధురా రావములచే మిశ్రితమైన చిరు అలల సవ్వడులు మనోహరమగుచున్నవి. ఆ సరోవరములోని నీలి కమలములచే నలుదిక్కులలో అంధకారము వెలసియున్నది. అగస్త్య మహర్షి ధర్మపత్ని లోపాముద్రా పాదస్పర్శలతో ఆ సరోవర తీరములు ధన్యమైనవి.

స్వచ్ఛమైన ముత్యపు హారములు, హిమబిందువులు, కర్పూరము మరియు శివ మందహాసము వలె స్వచ్ఛమైన ఆ సరోవర జలముల యందు ఆ ఆశ్రమ వాసులు నిత్య నైమిత్తిక స్నానాదికాలు ఆచరించుచున్నారు. ఈ సరోవరాల పానములు మణిమయ భూషితములై యున్నవి.

ఆ అగస్త్యాశ్రమమున అనేక కూర ప్రాణులు తమ పరస్పర వైర భావాన్ని మరిచి మెలుగుచుండగా వైర శూన్యమైన ఆ ఆశ్రమ ప్రాంతము మరొక బ్రహ్మలోకమును తలపిస్తున్నది. ఎల్లవేళలా హవనసుగంధ ద్రవ్యముల వాసనలతో నిండి, ఆ ఆశ్రమములోని చిలుకల కలకలా రావములు వేదశాస్త్ర పురాణమున గల అనేక విషయములు చర్చిస్తున్నట్లుగా కర్ణముల కింపైన ధ్వనులతో నిండియున్నవి. ఇలా సర్వవిధాలా సుమనోహరమైన అగస్త్య ఆశ్రమాన్ని శ్రీ రేణుక భగవత్పాదులు వీక్షించడము జరిగినది.

## అగస్త్య ముని వర్ణనలు

శ్లో॥ తస్య మధ్యే సమాసీనం మూలే చందన భూరుహః ।
సుకుమారదల చ్ఛాయావారితాదిత్య తేజసః ॥ (సి.శి. 4-25)

శ్లో॥ తడిత్పింగజటాభారైస్త్రిపుండ్రాంకితమస్తకైః ।
భస్మోద్ధూళితసర్వాంగైః స్ఫురద్రుద్రాక్షభూషణైః ॥ (సి.శి. 4-26)

శ్లో॥ నవ వల్కలవాసోభిర్నానానియమధారిభిః ।
పరివీతం మునిగణైః ప్రమథైరివ శంకరమ్ ॥ (సి.శి. 4-27)

శ్లో॥ సముజ్వలజటాజాలైస్తపః పాదపల్లవైః ।
స్ఫురత్సౌదామినీ కల్పై జ్వాలాజాలైరివానలం ॥ (సి.శి. 4-28)

శ్లో॥ విశుద్ధభస్మకృతయా త్రిపుండ్రాంకితరేఖయా ।
త్రిస్రోతసేవ సంబద్ధశిలాభాగం హిమాచలం ॥ (సి.శి. 4-29)

శ్లో॥ భస్మాలంకృతసర్వాంగం శశాంకమివ భూగతం ।
వసానం వల్కలం నవ్యం బాలాతపసమప్రభం ॥ (సి.శి. 4-30)

శ్లో॥ వడవాగ్నిశిఖాజాల సమాలీఢమివార్ణవం ।
సర్వాసామపి విద్యానాం సముదాయనికేతనం ॥ (సి.శి. 4-31)

శ్లో॥ స్వకృతప్రాకృతాహంతం నిరూఢశివభావనం ।
తృణీకృతజగజ్జాలం సిద్ధీనాముదయస్థలమ్ ॥ (సి.శి. 4-32)

శ్లో॥ మోహాంధకారతపనం మూలబోధమహీరుహం ।
దదర్శ స మహాయోగీ మునిం కలశసంభవం ॥ (సి.శి. 4-33)

శ్రీ రేణుక భగవత్పాదుల వారు సూర్య కిరణముల కడ్డుపడిన లేతనైన పత్రఛాయలొసంగు ఒక శ్రీ గంధపు వృక్షమూలమున కూర్చుండిన వానిని, పింగళ వర్ణపు జటాజూటము గలవానిని, సర్వాంగముల యందున భస్మోద్ధూళనమును చేసికొని, మస్తకమందున త్రిపుండ్రములను ప్రకాశమానమైన రుద్రాక్షలను ధరించియున్న శ్రీ అగస్త్య మహర్షుల వారి చుట్టూ నూతనములైన నారచీరలను గట్టి అనేక వ్రతాచారముల యందున తత్పరులైన మునులు కూర్చునియుండిరి. ఈ సన్నివేశము చూచెడివారికి ప్రమథగణములచేత పరివృతుడై యుండెడి శంకరుని వలె అగస్త్యమహర్షి దివ్య ప్రకాశముతో కన్పట్టుచుండెను. తపస్సనెడి వృక్షము చిగుళ్ళవలె మెరిసెడి జడలను ధరించిన అగస్త్యమహర్షి జ్వాలలచేత ఆవృతుడైన అగ్నివలె తేజోపుంజమై దోచుచుండెను. శరీరము మీది త్రిపుండ్రమును ధరించిన మహర్షి గంగానది యొక్క మూడు ప్రవాహములతో కూడిన హిమాలయ పర్వతపు శిలాప్రదేశము వలె శోభిల్లుచుండెను. శరీరము నందెల్ల భస్మలేపనము చేసుకొని యుండుటచే భువికవతరించిన అపరచంద్రుని వలెను కొత్త నారచీరలను కట్టి యుండుటచేత లేత యెండవలె కాంతిమతుడై దోచుచుండెను. సమస్త విద్యలకు ఆగారమై సముద్రమువలె గంభీరుడై శరీరాదుల యెడ అహంకార మమకారములను వీడిన వాడై, శివభజనయందున సదాలీనమైన మనస్సుగలవాడై అణిమాది అష్టసిద్ధులకు మూలస్థానమై విరాజిల్లెడి శ్రీ అగస్త్యుల వారు జగత్తులోని మోహజాలము నెల్ల పరిత్యజించి నిర్లిప్తుడై యుండెను. మోహమనెడి గాఢాంధకారమును తన జ్ఞానసూర్యుని చేత నివారించుకొని స్వస్వరూపానంద సంధానుడై యుండెడి అగస్త్య మహర్షిని శ్రీ రేణుక భగవత్పాదుల వారు చూసినవారైరి.

# శ్రీ రేణుకా అగస్త్య సమాగమము

**శ్లో॥ తమాగతం మహాసిద్ధం సమీక్ష్య కలశోద్భవః ।**
**గణేంద్రం రేణుకాభిఖ్యం వివేద జ్ఞానచక్షుషా ॥** (సి.శి. 4-34 )

**శ్లో॥ తస్యానుభావం విజ్ఞాయ సహసైవ సముత్థితః ।**
**లోపాముద్రాకరానీతైరుదకైరతిపావనైః ॥** (సి.శి. 4-35)

**శ్లో॥ పాదౌ ప్రక్షాలయామాస స తస్య శివయోగినః ।**
**సంపూజ్య తం యథా శాస్త్రం తన్నియోగపురస్సరం ॥** (సి.శి. 4-36)

**శ్లో॥ మునిర్వినయసంపన్నో నిషసాదాసనాంతరే ।**
**సమాసీనం మునివరం సర్వతేజస్వినాం విభుం ॥** (సి.శి. 4-37)

శ్రీ రేణుకా భగవత్పాదులవారు తన ఆశ్రమమునకు దయచేసిన దానిని గని అగస్త్యమునియు తన దివ్యదృష్టి చేత వారి మహిమను గురించి తెలిసికొని వెంటనే తన ఆసనమును వీడి లేచి తన ధర్మపత్నియైన లోపాముద్రాదేవి చేత పోయబడిన పవిత్రజలముతో శ్రీ రేణుక భగవత్పాదుల వారి పవిత్రమైన పాదకమలములను కడిగిన వాడాయెను. శాస్త్రోక్తమైన రీతిన యా దంపతులు శ్రీమహా గురువుల వారి పాద పూజను చేసిరి. అనంతరము వినయసంపన్నులైన అగస్త్యులు శ్రీ రేణుకాచార్యులవారి ఆనతిమేరకు తాను వేరొక ఆసనమునందున కూర్చుండెను. ఈ విధముగా యిరువురును ఆసీనులైన పిదప సిద్ధకుల చక్రవర్తియైన శ్రీ రేణుక భగవత్పాదుల వారు అగ్రగణ్యులై యున్న అగస్త్య మహర్షిని గమనించి ప్రశాంతమైన వాణితో కుశల ప్రశ్నలనడుగ నారంభించిరి.

**శ్లో॥ ఉవాచ శాంతయా వాచా రేవణ సిద్ధశేఖరః ।**
**నిర్విఘ్నం వర్తసే కిం నిత్యా తే నియమక్రియాః ?**

**శ్లో॥ అథవాఽగస్త్య తేజస్విన్ కుతః స్యుస్తేఽన్తరాయకాః ।** (సి.శి. 4-38)

సిద్ధశేఖరుడైన రేవణుడు ప్రశాంతమైన వాణిచేత నీ నియమ క్రియలు నిర్విఘ్నముగా సాగుతున్నవి కదా ! అగస్త్యా ! తేజస్వివైన నీకు నంతరాయములు గల్గవు కదా ! అని కుశలము నడిగెను.

**శ్లో॥ వింధ్యో నిరుద్ధో భవతా విశ్వోల్లంఘన విభ్రమః ।**
**నహుషో రోష లేశాత్తే సద్యః సర్పత్వమాగతః ॥** (సి.శి. 4-39)

జగత్తున రాటశక్యముగాని ఎత్తుకెదిగిన వింధ్య పర్వతము ఎదుగుదలను నిరోధించినాడవు స్వల్ప ప్రమాణమున గల నీ కోపము చేత నహుషుడు నప్పటికప్పుడే సర్పమయ్యెను.

**శ్లో॥ ఆచాంతే భవతాపూర్వం పంకశేషాః పయోధయః ।**
**జీర్ణస్తే జాఠరే వహ్నౌ దృప్తో వాతాపిదానవః ॥** (సి.శి. 4-40)

పూర్వకాలము నీవు సముద్రముల నీటిని త్రాగగా చేత బురద మాత్రమే మిగిలినది నీ మద్యోత్తుడైనా వాతాపియనెడి రాక్షసుడు నీ జఠరాగ్ని యందు జీర్ణమయ్యెను.

**శ్లో॥ ఏవం విధానాం చిత్రాణాం సర్వలోకాతిశాయినాం ।**
**కృత్యానాం తు భవాన్ కర్తా కస్త్యేఽగస్త్య సమప్రభః ॥** (సి.శి. 4-41)

ఓ అగస్త్య మహర్షీ ! ఈ వీధముగా సర్వలో కాతిశయములగు గొప్ప ఆశ్చర్యమును గొలిపెడి పనులకు కర్తవు నీవు. అందుచేత నీతో సమానమైన వాడెవ్వడు గలడు ?

**శ్లో॥ శివాద్వైతపరానందప్రకాశనపరాయణం ।**
**భవంతమేకం శంసంతి ప్రకృత్యా సంగవర్జితం ॥** (సి.శి. 4-42)

నీ వొక్కడివే శివాద్వైత జ్ఞానముచే గల్గిన శ్రేష్ఠమైన ఆనందమును ప్రకటించెడి వాడివనియును, ప్రకృతి నుండి నిస్సంగియై యుండెడి వాడవని యందురు.

**శ్లో॥ పురా హైమవతీ సూనురవదత్తే షడాననః ।**
**శివధర్మోత్తరం నామ శాస్త్రమీశ్వర భాషితం ॥** (సి.శి. 4-43)

పూర్వమున పార్వతీ నందనుడైన, షణ్ముఖుడు, ఈశ్వర ప్రోక్తమైన శివధర్మోత్తరమను శాస్త్రమును నీకు బోధించెను.

**శ్లో॥ భక్తిః శైవీ మహాఘోరసంసారభయహారిణీ ।**
**త్వయా రాజన్వతీ లోకే జాతాగస్త్యమహామునే ॥** (సి.శి. 4-44)

ఓ అగస్త్య మహర్షీ ! ఘోరమైన సంసార భయమును హరించెడి శివభక్తి నీ వలననే లోకమున నీ ప్రకాశమానమైనది.

**శ్లో॥ ఇతి తస్య వచః శ్రుత్వా సిద్ధస్య ముని పుంగవః ।**
**గంభీర గుణయా వాచా బభాషే భక్తి పూర్వకం ॥** (సి.శి. 3-45)

మునిశ్రేష్టుడైన అగస్త్యుడు, రేవణ సిద్ధుని పలుకులను విని అత్యంత భక్తి పూర్వకముగా గంభీర గుణముతో కూడిన మాటలతో పలికెను.

**శ్లో॥ అహమేవ మునీంద్రాణాం లాలనీయోఽస్మి సర్వదా ।**
**భవదాగమసంపత్తిర్మాం వినా కస్య సంభవేత్ ॥** (సి.శి. 4-46)

మీ రాకయనెడి సంపత్తి నాకు గాక యెవ్వరికి గల్గినది ? అందుచేత మునీంద్రులకు నెప్పుడు నేను మాత్రమే శ్లాఘనీయుడనై యున్నాను.

**శ్లో॥ స్థిరమద్య శివజ్ఞానం స్థిరా మే తాపసక్రియా ।**
**భవద్దర్శన పుణ్యేన స్థిరా మే మునిరాజతా ॥** (సి.శి. 4-47)

మీ దర్శన పుణ్యము చేత యిప్పుడు నా శివజ్ఞానము స్థిరమైయున్నది. నా తపస్సోధనము ఫలవంతమై మునిసార్వభౌమత్వము స్థిరమైనది.

**శ్లో॥ సంసారసర్పద్రష్టానాం మూర్ఛితానాం శరీరిణాం ।**
**కటాక్షస్తవ కల్యాణం సముజ్జీవన భేషజం ॥** (సి.శి. 4-48)

సంసారమనెడి సర్పము చేత కరవబడిన, మూర్ఛితులైన జీవులకు, మీ కళ్యాణకటాక్షము శుభము గల్గించెడి జీవనౌషధము వంటిది.

**శ్లో॥ సమస్తలోకసందాహతాపత్రయమహానలః ।**
**త్వత్పదాంబుకణాస్వాదాదుపశామ్యతి దేహినాం ॥** (సి.శి. 4-49)

సకలలోకములను దహింపజేయు ఆధ్యాత్మిక త్రయ తాపమనెడి ప్రచండాగ్ని మీ పాదోదకములోని యొక కణము నాస్వాదించుట చేత శాంతించును.

**శ్లో॥ రేణుకం త్వాం విజానామి గణనాథం శివప్రియం ।**
**అవతీర్ణ మిమాం భూమిం మదనుగ్రహకాంక్షయా ॥** (సి.శి. 4-50)

నన్ను అనుగ్రహించ వలెననెడి కోరికతో నీ భూలోకమున అవతరించినవాడవు, శివునికి ప్రియమైన వాడవును, గణనాయకుడవును నగు మిమ్ము రేణుకులని యెరుగుదును.

**శ్లో॥ భవాదృశానాం సిద్ధానాం ప్రబోధధ్వస్తజన్మనాం ।**
**ప్రవృత్తిరీదృశీ లోకే పరానుగ్రహకారిణీ ॥** (సి.శి. 4-51)

జ్ఞానము చేత ధ్వస్తమైన జన్మలు గల తమవంటి సిద్ధపురుషుని లోకసంచారము మానవాళి ననుగ్రహించెడిదై యున్నది.

**శ్లో॥ త్వన్ముఖాచ్ఛ్రోతుమిచ్ఛామి సిద్ధాంతశ్రుతిసమ్మతం ।**
**సర్వజ్ఞ వద మే సాక్షా చ్ఛైవం సర్వార్థ సాధకం ॥**
**సద్యః సిద్ధికరం పుంసాం సర్వయోగీంద్ర సేవితం ।**
**దురాచారై రనాఘ్రాతం స్వీకృతం వేదవేదిభిః ॥**
**శివాత్మైక్య మహాబోధ సంప్రదాయ ప్రవర్తకం ॥** (సి.శి. 4-52,53)

ఓ సర్వజ్ఞుడా ! శ్రుతి సమ్మతమైన సిద్ధాంతమును మీరు చెప్పగా వినదలచితిని. సర్వార్థ సాధకమైనదియును, శివునికి సంబంధించినదియును, జీవులకు వెనువెంటనే పుణ్యము నిచ్చెడిదియును, సర్వయోగులు సేవించునదియును, దురాచారులు పొందనిదియును, వేదవిధుల కంగీకారమైనట్టిదియు శివజీవైక్య బోధకమైన సిద్ధాంతశాస్త్రమును నాకుపదేశింపుము.

**శ్లో॥ ఉక్త్వా భవాన్ సకలలోకమహోపకారం ।**
**సిద్ధాంతసంగ్రహమనాదృతబాహ్యతంత్రం ॥**
**సద్యః కృతార్థయితుమర్హతి దివ్యయోగిన్ ।**
**నానాగమశ్రవణవర్తితసంశయం మాం ॥** (సి.శి. 4-53)

యోగీశ్వరా ! ఖండింపబడిన వేద బాహ్య తంత్రములు గలదియును, సకల లోకులకు మహోపకారమునొనరించు సిద్ధాంత సంగ్రహమును బోధించి వివిధాగమములు వినికిడి వలన గల్గిన సంశయములను నన్ను వెంటనే కృతార్థుని చేయుము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

దీనితో సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభయనెడి గ్రంథమున పూర్వ పీఠికా భాగమునకు చెందిన చతుర్థ పరిచ్ఛేదము పరిపూర్ణము.

# పంచమ పరిచ్ఛేదము

## శివాద్వైత సిద్ధాంత ఉపదేశము

ఈ ప్రకారముగా అగస్త్య మహర్షి విజ్ఞాపనను వినిన అనంతరము వేదాగమ సమ్మతమైన వీరశైవ సిద్ధాంతమును భూలోకమునందున సంస్థాపించుటకై భూమికి అవతరించియున్న శ్రీ రేణుక భగవత్పాదుల వారు తాము ప్రారంభించవలసిన ఉపదేశమును నిర్విఘ్నముగా పరిసమాప్తము కావలెననెడిది ఉద్దేశ్యముతో శిష్టాచారపు పద్ధతి ప్రకారము మనస్సునందుననే శివుని ధ్యానించి ఉపదేశమును ప్రారంభించిరి.

**శ్లో॥ అథాగస్త్యవచః శ్రుత్వా రేణుకో గణనాయకః ।**
**ధ్యాత్వా క్షణం మహాదేవం సాంబమాహ సమాహితః ॥** (సి.శి. 5-1)

శ్రీ అగస్త్య మహర్షి యొక్క విజ్ఞాపనను వినిన శ్రీ రేణుక భగవత్పాదుల వారు ప్రశాంతమైన మనస్సుతో శక్తిసమేతుడైన పరమశివుని ఒక క్షణకాలము ధ్యానించి ఉపదేశమును ప్రారంభించిరి.

**శ్లో॥ అగస్త్య మునిశార్దూల సమస్తాగమపారగ ।**
**శివజ్ఞానకరం వక్ష్యే సిద్ధాంతం శ్రుణు సాదరం ॥** (సి.శి. 5-2)

సకల ఆగమశాస్త్రములను నెరిగిన మునిశ్రేష్ఠులైన ఓ అగస్త్య మహామునీ ! శివజ్ఞానమును గలుగజేయు సిద్ధాంత తత్త్వమును నీకు చెప్పుచున్నాను. ఆదరపూర్వకముగా ఆలించుము.

తాను చెప్పవలసిన సిద్ధాంతము యొక్క మహాత్యము తెలుపుటకై జగత్తులోని అనేక సిద్ధాంతముల స్వరూపములను తెలియజేయుచున్నారు.

**శ్లో॥ అగస్త్య ఖలు సిద్ధాంత విఖ్యాతాః రుచిభేదతః ।**
**భిన్నాచారసమాయుక్తా భిన్నార్థప్రతిపాదకాః ॥** (సి.శి. 5-3)

ఓ అగస్త్యా ! ఈ జగత్తునందున చెప్పెడి వారి మరియు వినెడివారి ఆపేక్షల వైచిత్ర్యము యొక్క పరిణామముగా వేరు వేరు ఆచారములను మరియు వేరువేరు అర్థములను ప్రతిపాదించెడి అనేక సిద్ధాంతములు ప్రసిద్ధములై యున్నవి.

ఆ సిద్ధాంతములు ఎయ్యవి ? అనేది జిజ్ఞాస గలిగినప్పుడు ప్రస్తుతము వాటి పేర్లను నిరూపించుచున్నారు.

**శ్లో॥ సాంఖ్యం యోగః పాంచరాత్రం వేదాః పాశుపతం తథా ।**
**ఏతాని మానభూతాని నోపన్యాని యుక్తిభిః ॥** (సి.శి. 5-4)

ఓ అగస్త్యుడా ! సాంఖ్యము, యోగము, పాంచరాత్రము, వేదము మరియు పాశుపతములనెడి పేరున అనేక సిద్ధాంతములు జగత్తునందున ప్రసిద్ధములై యున్నవి. వీటియందున సాంఖ్య శాస్త్రము కపిల మహర్షి చేత ప్రణీతమై యున్నది. ఈ సిద్ధాంతమునందున ప్రకృతి మరియు పురుషులనెడి రెండు ముఖ్య తత్త్వములు అంగీకృతములై యున్నవి. సాంఖ్య సిద్ధాంతము ప్రకృతి పురుషుల కంటె విలక్షణమైన ఈశ్వరుని ఒప్పుకొనదు. అందుచేత వీరు నిరీశ్వర సాంఖ్యులు అనిపించుకొందురు.

యోగశాస్త్రము పతంజలి మహర్షిచే ప్రణీతమై యున్నది. దీనియందు కష్టసాధ్యములైన యమ, నియమాది అష్టాంగ యోగములు ప్రతిపాదించ బడినవి. అంతియేకాదు. పద్ధతి యొక్క ప్రాప్తి కొరకు ఈశ్వరుని అనుగ్రహమును వీరు ఒప్పికొనుట చేత ఈ యోగశాస్త్రాను యాయులు సేశ్వర సాంఖ్యులనెడి పేరుతో పలువబడుచున్నారు.

పాంచరాత శాస్త్రము వాసుదేవుని చేత ప్రణీతమై యున్నది. దీని యందున వైష్ణవ దీక్ష యొక్క అంగభూతమైన తప్త, శంఖ చక్రాది ధారణలు నిరూపించబడినవి. ఈ సిద్ధాంతమునందున చిత్, అచిత్, ఈశ్వరుడు అనెడి మూడు పదార్థములు ప్రతిపాదింప బడినవి. ఈ పాంచరాత్ర సిద్ధాంతమునకు వైష్ణవ సిద్ధాంతమనెడి పేరుయు గలదు.

పశు, పాశ, పతలునెడి పదార్థ త్రయమును చెప్పెడి సిద్ధాంతమునకు పాశుపత సిద్ధాంతమనెడి పేరు గలదు. ఇది మూలతః ఆగమ రూపమునందున శివుని చేత ప్రతిపాదించబడిన శైవ సిద్ధాంతము.

శివుని అప్రయత్న సిద్ధ నిశ్వాసల నుండి నిఃశ్రుతములైన ఋగ్, యజుః, సామములనెడి వేదముల పూర్వకాలిదాను సారముగా శైవించి మహర్షిచే విరచితమైన పూర్వ మీమాంస శాస్త్రము ఇదియును అనీశ్వరమైన సిద్ధాంతమే.

ఈ విధముగా జగత్తునందున ప్రసిద్ధములై యున్న అన్ని సిద్ధాంతములు ప్రమాణరూపములై యుండుటచేత తర్కాది యుక్తులచేత ఎవ్వరూ వీటిని ఖండన చేయకూడదు.

**విశేష విచారము :** గ్రంథకర్తలైన శ్రీ శివయోగి శివాచార్యుల కాలమునకు సాంఖ్య, యోగ, పాంచరాత్ర, పాశుపత, మీమాంస శాస్త్రములు ప్రమాణములుగా ప్రసిద్ధములై యుండవచ్చును. అందుచేత సమన్వయ వాదులైన శ్రీ శివయోగి శివాచార్యులవారు వాటి ఖండనను నిరాకరించిరి. వేదాగమ సమ్మతమైన సిద్ధాంతమైనను అది అపసిద్ధాంతము కాజాలదు. అందుచేత దాని ఖండనను చేయుట సరికాదు అనెడిదే గ్రంథకర్త యొక్క గూడాభిప్రాయము. తాము చేసిన ప్రతిజ్ఞకు అనుగుణముగనే సిద్ధాంత శిఖామణి గ్రంథమున ఎక్కడైనను వేద సమ్మతములైన ఏ సిద్ధాంతమునైనను ఖండించెడి ప్రయత్నమును వీరు చేయలేదు. భారతమునందున ఈ విధముగా ప్రతియొక్క సిద్ధాంత వాదియు తమ తమ మతగ్రంథముల యందున అన్య సిద్ధాంతముల ఖండనను విడిచివేసి కేవలము తమ సిద్ధాంతమును ప్రతిపాదించిన యెడల దార్శనికుల పరస్పర కలహమే నిలిచిపోవును.

ఈ సిద్ధాంతము యొక్క రాద్ధాంతము బౌద్ధములోగల వివిధ భేదములను తెలియజేసెడి ఈ ప్రమాణమును గమనించండి

**అధికారానుగుణ్యేన బౌద్ధశాస్త్రం చతుర్విధం ।**
**ప్రత్యక్షగమ్యం బాహ్యార్థమితి సౌత్రాంతికో బ్రవీత్ ॥**
**బుద్ధ్యాకారానుమే యార్థో బాహ్యోవైభాషికోదితః ।**
**బుద్ధిమాత్రం వదంత్యత్ర యోగాచారోన చాపరం ॥**
**నసన్నాసన్న సదసన్న చోభాభ్యాం విలక్షణం ।**
**చతుష్కోటి వినిర్ముక్తం తత్త్వం మాధ్యమికా విదుః ॥**

బౌద్ధము నాల్గు విధములనియును, బుద్ధుని శిష్యులైన వైభాషిక, సౌత్రాంతిక, యోగాచార మరియు మాధ్యమికులనెడి వారిచే నివి యేర్పరచ బడినవి. జగత్తు గూర్చి వీరిలో విభిన్నమైన యభిప్రాయములు గలవు. సౌతాంత్రికుని ప్రకారము బాహ్యమునందు ప్రపంచము గలదు. ఇది ప్రత్యక్షముగా ప్రతీతి యందుగలదు. వైభాషికుని మతమున జగత్తు బయటికి తోచదు. అయితే బుద్ధియందు ననుభవమునకు వచ్చుట చేత నద్దానిని బాహ్యమున గలదని అనుమానము వలన గ్రహించవలెను. యోగాచార్యుడు, జగత్తులేనే లేదు. అది మన బుద్ధిలోనే గలదు. మాధ్యమికుడు, శూన్యవాదమును ప్రతిపాదిస్తూ, లోనగాని, వెలుపలగాని, సద్రూపమున గాని, అసద్రూపమున గాని లేనే లేదు. "సర్వం శూన్యం" అంతయూ శూన్యమే.

ఈ నాల్గింటిలో సౌత్రాంతికులు, వైభాషికులును లోన వెలుపలగల వస్తువులన్నింటినీ అంగీకరించి, వాటికి క్షణికత్వమును ఆపాదించిరి. క్షణికత్వమనగా, ప్రతిక్షణముననూ వస్తువు పుట్టి, నాశనమగునని అర్థము. వీరు విరక్తులైయుందురు. యోగాచార్యులు,

"ప్రతిమావనితా న్యాయము" చేత బాహ్య వస్తువులనన్నింటినీ విజ్ఞానమనెడి మనస్సునచేర్చి మనోనియమనముతో వైరాగ్యోపదశమును చేయుదురు. మాధ్యమికులు దేనిని ఒప్పక, బాహ్యము లేదు, అంతరమూ లేదనుచు మధ్యస్థులై యుందురు. వీరు సుషుప్తావస్థ యనెడి గాఢనిద్రావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, దానిని జాగ్రదావస్థతో పోల్చి వైరాగ్యము నుపదేశింతురు.

## వ్యాఖ్యానము

శ్రీ కాసీ జగద్గురు విద్యావాచస్పతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామి వారు ఆతానాత్మ వివేచననుపదేశముగా ననుగ్రహించిరి. కాయమే ముఖ్యమైనదైయున్నదనెడి నిరీశ్వర వాదము నిశితముగా పరిశీలించిరి. బుద్ధియే ఆత్మయనెడి వారి గూర్చి వివరణనిచ్చిరి. ఆత్మ యీ రెంటికి భిన్నమైనదై యుండునని తెలిపిరి.

అంగస్థలములలో పిండస్థలము, పిండ జ్డానస్థలములెంతో ముఖ్యమైనవి పిండస్థలము గురించి తెలిసికొంటిమి. ఇప్పుడు పిండ జ్ఞానస్థలము గూర్చి తెలియ జెప్పబడుచున్నది. శ్రీ భగవత్పాదుల వారు ఈ స్థలమున ఆరు శ్లోకముల పరిమితి మేరకు ఉపదేశమును కటాక్షించిరి. వీటికి సంబంధించిన యుపదేశములలో పిండ జ్ఞానియెవ్వడి అని తెలుపుచు ఈ క్రింది త్రయమును కటాక్షించిరి.

1) శరీరాత్మ వివేకేన పిండజ్ఞానీ సకశ్యతే

2) ఆధ్మస్థితి వివేకీ యః పిండ జ్ఞానీ స కథ్యతే

3) ప్రేరకం యో విజానాతీశ్వరః పిండజ్ఞానీసకవ్యతే

ఈ ముడింటి లోను వివేకము మరియు జ్ఞానము అనెడి రెండంశములకు ప్రాముఖ్యత నివ్వబడినది. అమరసింహుని ప్రకారము వివేకమనగా ప్రకృతి-పురుషులు వేరని యెరుగుటయే "వివేకః పృథగాత్మితా" అనెడివి. వీరి వాక్కులు మోక్ష సాధనమైన బుద్ధినే జ్ఞానమని యందురని చెప్పబడినది.

## విశేష ప్రదీపిక :

*శ్రీ కాశీ జగద్గురు విద్యావాచస్పతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామి వారు ఆతానాత్మ వివేచననుపదేశముగా ననుగ్రహించిరి. కాయమే ముఖ్యమైనదైయున్నదనెడి నిరీశ్వర వాదము నిశితముగా పరిశీలించిరి. బుద్ధియే ఆత్మయనెడి వారి గూర్చి వివరణనిచ్చిరి. ఆత్మ యీ రెంటికి భిన్నమైనదై యుండునని తెలిపిరి.*

*అంగస్థలములలో పిండస్థలము, పిండ జ్డానస్థలములెంతో ముఖ్యమైనవి పిండస్థలము గురించి తెలిసికొంటిమి. ఇప్పుడు పిండ జ్ఞానస్థలము గూర్చి తెలియ జెప్పబడుచున్నది. శ్రీ భగవత్పాదుల వారు ఈ స్థలమున ఆరు శ్లోకముల పరిమితి మేరకు ఉపదేశమును కటాక్షించిరి. వీటికి సంబంధించిన యుపదేశములలో పిండ జ్ఞానియెవ్వడి అని తెలుపుచు ఈ క్రింది త్రయమును కటాక్షించిరి.*

*1) శరీరాత్మ వివేకేన పిండజ్ఞానీ సకశ్యతే*

*2) ఆధ్మస్థితి వివేకీ యః పిండ జ్ఞానీ స కథ్యతే*

*3) ప్రేరకం యో విజానాతీశ్వరః పిండజ్ఞానీసకవ్యతే*

*ఈ మూడింటి లోను వివేకము మరియు జ్ఞానము అనెడి రెండంశములకు ప్రాముఖ్యత నివ్వబడినది. అమరసింహుని ప్రకారము వివేకమనగా ప్రకృతి-పురుషులు వేరని యెరుగుటయే "వివేకః పృథగాత్మితా" అనెడివి. వీరి వాక్కులు మోక్ష సాధనమైన బుద్ధినే జ్ఞానమని యందురని చెప్పబడినది.*

ఈ సిద్ధాంతము యొక్క రాద్ధాంతము బౌద్ధములోగల వివిధ భేదములను తెలియజేసెడి ఈ ప్రమాణమును గమనించండి

**అధికారానుగుణ్యేన బౌద్ధశాస్త్రం చతుర్విధం ।**
**ప్రత్యక్షగమ్యం బాహ్యార్థమితి సౌత్రాంతికో బ్రవీత్ ॥**
**బుద్ధ్యాకారానుమే యార్థో బాహ్యోవైభాషికోదితః ।**
**బుద్ధిమాత్రం వదంత్యత్ర యోగాచారోన చాపరం ॥**
**నసన్నాసన్న సదసన్న చోభాభ్యాం విలక్షణం ।**
**చతుష్కోటి వినిర్ముక్తం తత్త్వం మాధ్యమికా విదుః ॥**

బౌద్ధము నాల్గు విధములనియును, బుద్ధుని శిష్యులైన వైభాషిక, సౌత్రాంతిక, యోగాచార మరియు మాధ్యమికులనెడి వారిచే నివి యేర్పరచ బడినవి. జగత్తు గూర్చి వీరిలో విభిన్నమైన యభిప్రాయములు గలవు. సౌతాంత్రికుని ప్రకారము బాహ్యమునందు ప్రపంచము గలదు. ఇది ప్రత్యక్షముగా ప్రతీతి యందుగలదు. వైభాషికుని మతమున జగత్తు బయటికి తోచదు. అయితే బుద్ధియందు ననుభవమునకు వచ్చుట చేత నద్దానిని బాహ్యమున గలదని అనుమానము వలన గ్రహించవలెను. యోగాచార్యుడు, జగత్తులేనే లేదు. అది మన బుద్ధిలోనే గలదు. మాధ్యమికుడు, శూన్యవాదమును ప్రతిపాదిస్తూ, లోనగాని, వెలుపలగాని, సద్రూపమున గాని, అసద్రూపమున గాని లేనే లేదు. "సర్వం శూన్యం" అంతయూ శూన్యమే.

ఈ నాల్గింటిలో సౌత్రాంతికులు, వైభాషికులును లోన వెలుపలగల వస్తువులన్నింటినీ అంగీకరించి, వాటికి క్షణికత్వమును ఆపాదించిరి. క్షణికత్వమనగా, ప్రతిక్షణముననూ వస్తువు పుట్టి, నాశనమగునని అర్థము. వీరు విరక్తులైయుందురు. యోగాచార్యులు, "ప్రతిమావనితా న్యాయము" చేత బాహ్య వస్తువులనన్నింటినీ విజ్ఞానమనెడి మనస్సునచేర్చి మనోనియమనముతో వైరాగ్యోపదశమును చేయుదురు. మాధ్యమికులు దేనిని ఒప్పక, బాహ్యము లేదు, అంతరమూ లేదనుచు మధ్యస్థులై యుందురు. వీరు సుషుప్తావస్థ యనెడి గాఢనిద్రావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, దానిని జాగ్రదావస్థతో పోల్చి వైరాగ్యము నుపదేశింతురు.

## వ్యాఖ్యానము

శ్రీ కాసీ జగద్గురు విద్యావాచస్పతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామి వారు ఆతానాత్మ వివేచననుపదేశముగా ననుగ్రహించిరి. కాయమే ముఖ్యమైనదైయున్నదనెడి నిరీశ్వర వాదము నిశితముగా పరిశీలించిరి. బుద్ధియే ఆత్మయనెడి వారి గూర్చి వివరణనిచ్చిరి. ఆత్మ యీ రెంటికి భిన్నమైనదై యుండునని తెలిపిరి.

*అంగస్థలములలో పిండస్థలము, పిండ జ్ఞానస్థలములెంతో ముఖ్యమైనవి పిండస్థలము గురించి తెలిసికొంటిమి. ఇప్పుడు పిండ జ్ఞానస్థలము గూర్చి తెలియ జెప్పబడుచున్నది. శ్రీ భగవత్పాదుల వారు ఈ స్థలమున ఆరు శ్లోకముల పరిమితి మేరకు ఉపదేశమును కటాక్షించిరి. వీటికి సంబంధించిన యుపదేశములలో పిండ జ్ఞానియెవ్వడి అని తెలుపుచు ఈ క్రింది త్రయమును కటాక్షించిరి.*

1) శరీరాత్మ వివేకేన పిండజ్ఞానీ సకశ్యతే

2) ఆత్మస్థితి వివేకీ యః పిండ జ్ఞానీ స కథ్యతే

3) ప్రేరకం యో విజానాతీశ్వరః పిండజ్ఞానీసకవ్యతే

ఈ ముడింటి లోను వివేకము మరియు జ్ఞానము అనెడి రెండంశములకు ప్రాముఖ్యత నివ్వబడినది. అమరసింహుని ప్రకారము వివేకమనగా ప్రకృతి-పురుషులు వేరని యెరుగుటయే "వివేకః పృథగాత్మితా" అనెడివి. వీరి వాక్కులు మోక్ష సాధనమైన బుద్ధినే జ్ఞానమని యందురని చెప్పబడినది.

## ఆశీర్వచనము-6

శ్లో॥ మాయాశక్తివి శాదీశో నానామూర్తి ధరః ప్రభుః ।
సర్వజ్ఞః సర్వకర్తా చ నిత్యముక్తో మహేశ్వరః ॥
కించిత్కర్తా చ కించిజ్ఞో బద్ధో2నాదిశరీరవాన్ ।
అవిద్యామోహితా జీవా బ్రహ్మైక్య జ్ఞాన వర్జితాః ॥
పరిభ్రమంతి సంసారే నిజకర్మానుసారతః ।
దేవతిర్యఙ్మనుష్యాది నానాయోనివిభేదతః ॥
చక్రనేమిక్రమేణైవ భ్రమంతి హి శరీరిణః ।
జాత్యాయుగభోగవైషమ్యకారణం కర్మ కేవలమ్ ॥ (సి.శి.5-45-48)

వీరశైవదార్శనిక సిద్ధాంతము, శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతమని ప్రసిద్ధిని గాంచినది. ఇందున యీశ్వరుడు శక్తి సంపన్నుడైతే జీవాత్మయూ శక్తియుతుడే. అయితే, ఉభయ శక్తుల యందున భేదముండెడి కారణమున నొకడు ఈశ్వరునిగను, మరొకడు జీవుడని పిలిపించి కొందురు. ఈశ్వరోపాధియైన మాయా శక్తియూ శుద్ధసత్వగుణముగలదైనందున మహేశ్వరుడు నిత్యముక్తుడునూ, సర్వమునూ ఎరిగినవాడిగనూ అయియుండును.

శరీరములోని యాపాద మస్తకముల వలన నయ్యెడి వ్యవహారము లన్నియూ ఆశరీరము నధిష్ఠించెడి జీవునికి తెలిసినయటులే, సమిష్ఠి శరీరాభి మానియై "విరాట్" అని పిలిపించికొనెడి శివుడు సకల జీవరాశుల శరీరములయందున నయ్యెడి సమస్త వ్యవహారములను నెరుగ గల వాడగును అటులనే మఠము, మందిరములాదిగాగల ప్రార్థనా నిలయములలో నొకే సమయమున లక్షలాది జనులు తమ తమ కోరికలను నివేదించి కొనుచుండగా, భక్తి ప్రియుడునూ, దయాసాగరుడునూ అగు నతడు భక్తుల కోర్కెలను తీర్చుట జరుగుచున్నదని గమనించగలము.

మందిరమునకు వెళ్ళి గట్టిగా వేడికొనవలసిన యవశ్యకయూ లేదు సూక్ష్మమైన విషయములను గ్రహించెడి శివుడు, మనస్సునందున కోరుకొన్న కోరికలను నెరవేర్చును. గట్టిగా అరుస్తూ ప్రార్థన సల్పెడి యొక వ్యక్తిని చూసి " ఓరీ దేవుడు చెవిటి వాడా! ఎందుకంత గట్టిగ యరచుచు వేడుచున్నావు? చీమకాలు కదిపినప్పుడు వచ్చెడి చిన్న శబ్దమునైననూ గ్రహించగల్గిన వానికి నీ మాటలు వినుటకెట్టి యిబ్బంది యూ ఉండదుకదా" అని వేరొకడు మందలించినాడట. మందలించిన వాడొక మహాఘన కార్యమును చేసిన వాడైనాడు. శివుని సర్వజ్ఞత్వమును నిరూపించిన వాడైనాడు.

ఏ కార్యమైననూ కర్తలేనిది కాజాలదు. కార్యమును ప్రారంభించుటకు మున్ను కర్తకు కార్యమునకు చెందిన సంపూర్ణమైన యవగాహన యవసరమైయుండును. అందుచేతనే "జానాతియిచ్ఛతి యతతే కరోతి" అనే లోకోక్తి ప్రచారములోనికి వచ్చినది. "తెలిసికొనును, కోరికొనును, యత్నించును, చేయును" అనేది లోకోక్తిలోని యర్థము. ఈ జగత్తైననూ ఒక కార్యమగుట చేత దీనికైననూ ఒక కర్త కావలేను కదా? విశాలమైన యీ విశ్వరచన, యెంతటి మానవుని చేతనైననూ సాధ్యము కాదుకదా! ఈశ్వరుని చేతనే రచియింపబడవలెను. అతడైననూ సర్వజ్ఞుడైయుండి తీరవలెననెడి అనుమాన ప్రమాణము చేత యీశ్వరుని సర్వజ్ఞత్వము సిద్ధించును.

"ఎల్లబల్లవరిల్ల, బల్లవరు బహళిల్ల" యనెడి సర్వజ్ఞుని సూచన గమనించ దగినది "అంతా తెలిసినవారులేరు తెలిసిన వారెక్కువగా లేరు" అని నుడువుల కర్థము. ఎరిగిన వాడొక్కడే, వాడే పరమాత్మయని సర్వజ్ఞుడు నిగూఢముగా సూచించిన వాడైనాడు.

సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము యిత్యాది లక్షణములు గలిగిన శివ పరబ్రహ్మ మాయాశక్తి యొక్క సాంగత్యముచేత వివిధరూపములను దాల్చుచున్నాడు. అందుచేత ఒక విధముగా చూసిన యెడల ఏ మూర్తిని ఉపాసన చేశిననూ అది శివోపాసనగానె పరిణమించుననెడిది భగవత్పాదులవారి భావము. భగవత్పాదులవారి ప్రతిపాదనవలన మతవైషమ్యములు నిరాధారమైనవి తెలియదగును.

జీవాత్మలైననూ అవిద్యా సంబంధముచేత మోహావృత్తులై "అహంబ్రహ్మాస్మి" "శివోహం" అనెడి భావమును దాల్చుదురు "నేను బ్రహ్మను" "నేను శివుడను" అనేవి యీ వాక్కులకు గల యర్ధములు. ఇట్టివారు శివ జీవైక్య జ్ఞానశూన్యులై జనన మరణాత్మకమగు సంసారమునందు సంచరించు చున్నారు.

జీవుల యొక్క యీ వైషమ్యమునకు వారివారి కర్మలే కారణములగుచున్నవి

మనము చేసెడి పుణ్యపాపములనెడి కర్మలను దార్శనికులు సంచిత, ప్రారబ్ధ మరియు ఆగామి యని మూడువిధములుగ విభజించిరి. జన్మజన్మాంతరముల యందున సంగ్రహించబడిన కర్మనే సంచితకర్మ యనబడు చున్నది. ఒక విధముగా చూసినయెడల సంచిత కర్మలలో ఏఏ కర్మలు పరిపక్వమగుచున్నవో వాటిని అనుభవించుటకై జీవుడు దేహమును ధరించి సుఖదుఃఖము లననుభవించుచున్నాడో వాటిని ప్రారబ్ధకర్మలు అందురు. ఈ సుఖదుఃఖముల యొక్క అనుభవ క్రమములో ఏఏ కర్మలు చేయబడుచున్నవో, వాటిలో ఏ కర్మముల యొక్క ఫలము మున్ముందు జన్మలలో కాలాంతరమున అనుభవమునకు వచ్చుచున్నవో వాటిని ఆగామి కర్మలు అందురు.

పొలమునందున పండిన జొన్న, గోధుమ మొదలగు ధాన్యములను రైతులు గాదెలో పోసి సంరక్షించుదురు అవసరము మేరకు ఆ ధాన్యమును గాదెల నుండి గైకొని జీవనము కొనసాగింతురు. మున్ముందు జీవనముకై కొన్నివిత్తనములను, సాగు జేసిన పొలమునందు విత్తుదురు. ఈ మూడింటిలో, గాదె లోని ధాన్యము సంచితకర్మకు సంకేతమైతే, అప్పుడప్పుడు తీసెడి ధాన్యము ప్రారబ్ద కర్మకును, పొలమున విత్తిన బీజములు 'ఆగామి' కర్మకు సంకేతములగును.

భుజించినది, సంగ్రహించునది, మరియు విత్తునది సదా కొనసాగునటులే, జీవులైననూ సంచిత, ఆగామి, మరియు ప్రారబ్ధమునెడి కర్మచక్రమునందు సదా తిరుగుచుందురు ఈ విషయములను స్పష్టపరిచెడి యీ సుభాషితములు గమనార్హములైయున్నవి

**శ్లో॥ సుఖస్య దుఃఖస్యన కో2 పి దాతా**
**పరోదదాతీతి కుబుద్ధిరేషా।**
**అహంకరోమీతి వృథాభిమానః**
**స్వకర్మసూత్ర గ్రథితోహి లోకః।**

ఎవరి సుఖదుఃఖములకైననూ వారు చేసెకొనెడి ప్రారబ్ధమే కారణమని సుభాషితములోని బావము, "వైషమ్యనైర్ఘృణ్యేన సాపేక్షత్వాత్తథాహి దర్శయతి" బ్ర.సూ. 2-1-34 అనే దానిలో నిదే భావము గలదు. జగత్తులోని విషమతకు కర్మమే కారణమనియును, పరమాత్మలో నిర్దయ, పక్షపాతము మొదలగునవి ఉండవనియును, వ్యాసుల వారి భాష్యము వలన తెలియుచున్నది.

సమత్వము, మరియు దయాగుణము గల్గిన పరమాత్ముడే జగత్తును నిర్మించెను. అయిననూ, ప్రాణుల కర్మానుగుణముగా బడుగు, బలవంతుడు, కురూపి, సురూపి, మూర్ఖుడు,విద్యాంసుడు, దానవుడు, మానవుడు మొదలగు వెషమ్యములు గల్గుచున్నవి. ఈశ్వరుడు నిమిత్తకారణుడనెడి యీ పౌరాణిక వాక్కులను గమనించుడి:

**శ్లో॥ నిమిత్తమాత్రమే వాసౌ, సృజ్యానాం స్వర్గీకర్మణి।**
**ప్రధాన కారణీభూతా యతో వైస్పృజ్య శక్తయః॥**

"పుణ్యః పుణ్యేన కర్మణా భవతి", " పాపః పాపేన కర్మణాభవతి" యనెడి శ్రుతి వాక్యములును నీ విషయమునే స్థిరపరచుచున్నవి. అందుచేతనే శ్రీ రేణుకభగవత్పాదులు "జాత్యాయుర్భోగవైషమ్య కారణం కర్మకేవలమ్" అని ఆదేశించిరి.

ఒక యూరిలో నొక ధనాఢ్యుడుండెను. ఇంటిలో భార్య, భర్త మరియు నొకే యొక కొడుకు సభ్యులుగానుండిరి. శాస్త్ర సంస్కార రహితులైన వీరు ధనము చేత శ్రీ మంతులై యున్ననూ, దాన ధర్మాది సద్గుణ సంపత్తి విషయములలో వీరు సంస్కార హీనులై యుండిరి. తరుణ పయస్కుడైన కొడుకుకు కన్యను వెతుకు చుండిరి. వీరి వలెనే శ్రీ మంతులైన యింటి వారి కన్య యొకర్తె వారికి నచ్చెను. సంపద విషయమున రెండు కుటుంబములూ సమానముగా నున్ననూ, సంస్కార విషయమున వైపరీత్యము లుండెను.

కన్యయింటికి చెందిన తల్లిదండ్రులు ధార్మికులైనందున యింటిలోని వారందరూ దాన ధర్మాది సాత్వికములు స్వాభావిక గుణములైయుండెను. అట్టి సంస్కారము గల కన్య, లగ్నము పిదప యీ కుసంస్కారుల యింటిని ప్రవేశించెను.

"భుంజతే తే త్వఘం పాపా యే పచత్యాత్మకారణమ్" అను గీతోక్తి గలదు. తమ కొరకు మాత్రమే వండికొని తినెడివారు అన్నము రూపములో నున్న పాపమును భుజించు చున్నారని యీ గీతోక్తిలోని భావము. ఈ విషయమును నెరిగిన కోడలు, అత్తవారియింట్లో ప్రతికూల పరిస్థితులున్నందున, యేమియునూ చేయక కాలమును వెళ్ళబుచ్చుచుండెను. ఈమె అత్తమామల భయము వలన బిక్షకు డొక్కడైననూ వీరి యింటి ముందున తిరుగకుండిరి.

ఒకసారి బహుదూరపు అతిథి యొకడు వీరియింటి ముందుకు వచ్చి "భవతి భిక్షాందేహి" అని అర్థించెను. అతిథియొక్క ఆర్త ధ్వనిని వినిన కోడలికి మనస్సు కరిగినీరైనది. ఏమైననూ కొంత పెట్టుదమనిన యత్తగారు వంట యింటిలోనే యున్నారు. ఇంకేమి చేయాలి యని యోచించిన కోడలు వాకిలి కడకు వచ్చి, "స్వామీ, మా యింటిలో మీకై పెట్టవలెన్న, వేడివేడి పదార్థము లేవియును లేవు. చద్దిది యున్నది అందు చేత ముందుకు దయచేయండి" అని యనెను " అమ్మా! చద్దిదానినే కొంత పెట్టి పంపించుడి" యని అతిథి కోరెను "అదైననూ ముగియవచ్చిన"దని కోడలు అతిథితోననెను. అతిథి "అట్లైన, అది అంతా ముగిసిన పిదప మీరేమి చేయుదు" రని యడిగెను. " మేము కూడ మీ వలెనే జోలెను గైకొని బయలుదేరెద" మని కోడలు సమాధాన మిచ్చెను.

ఇరువురి సంభాషణను వినిన యత్తగారొక అగ్నిగోళమై వాకిలి కడకు వచ్చి, కోడలును మరియు నతిథిని నోటికి వచ్చినట్లుగా తిట్టి కోడలును లోపలికి పిలిచి కొని పోయెను. అంతలోనే, యంగడి నుండి మామ వచ్చెను. అప్పుడు, అత్త తన మగనితోనిట్లనేను " ఏమండీ! ఎంతటి యనాఢ్యమైన కోడలు, మన తల రాతకు దొరకినది. ఈమె మన యింటి మర్యాదను పట్టపగలే అమ్మివేయుచున్నది. బిక్షకై వచ్చిన బిక్షుకుని మన యింటి పద్ధతి ప్రకారము తిట్టి పంపివేయుటను విడిచి కేరీ వారెల్లా వినేయటుల "యింటిలో మీకు పెట్టెడి వేడి పదార్థములు లేవు, చద్దియన్నమున్నది. అదియునూ అయిపోవుచున్నది. అది అయిపోయిన పిదప మేమూ మీ వలెనే బిక్షకై బయలు దేరెదము" అని మన యింటి మర్యాదను పాడు చేసినది. ఈమేను బయటకు గెంటి వేయుడి. నా కొడుకుకు మరొక పెళ్ళి చేసెదను".

ఎంతో తక్కువ తెలివి యున్న మామ, భార్యమాటకు వల్లెయనక, సుశిక్షితురాలైన కోడలు ఈ విధిన యెందుకు పలుక వలసి వచ్చినదని యోచించెను. కోడలును దగ్గరకు పిలిచి కొని, "అమ్మా! మన యింటి లో మేమైననూ, నీవైననూ ఎప్పుడైననూ చద్ది యన్నమును తినలేదు. ఇట్లుండగా, బిక్షకునికి అట్లేల చెప్పితివి?" అని అడిగెను. కోడలు నీవిధిన సమాధానమునిచ్చెను, "మామగారు, నేను చెప్పిన వంట కుండలో చేసినదీ కాదు. మన కర్మయనెడి పంటకు చెందిన మాట. క్రిందటి జన్మయందున చేసినదనగా చద్దిదే కదా! క్రిందటి జన్మలో చేసిన అనేక పుణ్యకర్మలవలన మీరు శ్రీమంతుల యింటిలో జన్మించితిరి. "కూర్చుని తింటే ముంతెడి పొన్నైననూ చాలదు" అనెడి సామెత ప్రకారము, పుణ్యకార్యములు చేయకుండా పూర్వపు కర్మమునే తింటూ కూర్చొనిన యెడల, అది ముగిసిన పిదప మనమైననూ బిక్షను వేడెడి అవసరము కాదా! "క్రిందటి కర్మను నిపుడు కుడువవలెనే ఆత్మా, ఇప్పటి కర్మను ముందున కుడువవలెనే ఆత్మా " అని జ్ఞానులు అందరు కదా! కోడలి దృష్టి, తాత్వికపరమైన దైనందున, చద్ధిది అనగా క్రింతటి జన్మదనే విషయమును వినిన మామగారికి, ఔదార్య భావనలు మొలకెత్తెను. అప్పుడు నతడు తన భోషాణము తాళము చెవిని కోడలి కిచ్చి, దానధర్మములు చేయుమని నుడివిరి.

కొట్టరువు తలుపులు తెరిచి చూచిన కోడలికి, దానిలో పురుగుపట్టిన గోధుమలు, శనగలు కన్పట్టెను. వేరే మంచి ధాన్యము లేకుండెను. మామగారి కింకనూ జ్ఞానము గల్గలేదనియును, పూర్ణమైన జ్ఞానమును గల్గజేయవలెనని యెంచిన కోడలు, ఆ గోధుమలను విసిరి పిండి చేసి రొట్టెలు చెసెను. శనగలను కూడా విసిరిపించి శనగ పిండితో కూరను జేసి, రొట్టె-కూరలను మామకు వడ్డించెను వాటిని తినేటప్పుడు మామగారు, "ఏమమ్మా, ఈ దినమున వంటకము లెందుకో నోటికి రుచికరముగాలేవు. ముక్క వాసన గొట్టుచున్నవి కదా! అని అడిగెను. అప్పుడా కోడలు, "మామగారు, మీరిచ్చిన పదార్థములే మీకు మున్ముందు జన్మలో తినుటకు దొరుకును గాన, ఇప్పటి నుండియే పుచ్చి పోయిన పదార్థములు తినుట గూర్చి రూఢిగావలెనని యెంచి యా పుచ్చులతోనే వంటకములు చేసితినని బదులు పలికెను.

కోడలు మాటలు వినిన పిదప మామకు బుద్ధివచ్చెను ఇంటిలోని వారెల్లా వారి మున్ముందు జన్మలలో సుఖశాంతులు పొందే నిమిత్తము సుసంస్కృతులై దానధర్మములను జేయ దొడగిరి.

ఇది అంతయునూ పర్యాలోచన చేసిన పిదప జగపు విషమతకు మన మన కర్మలే కారణమగుట చేత యీశ్వరునికి వైషమ్యము, నిర్దయలనెడిదోషము నుండవు. అందుచేతనే, "నేను చేసిన కర్మ బలవత్తరమైన దైన యెడల నీవేమి చేస్తావు దేవుడో యనుచు వేదాంత భావన గల వారు పాడి యాడుటను గమనించగలము.

"ఈశ్వరః పర్జన్యవత్ దృష్టవ్యః" అని శాంకర భాష్యమున చెప్పబడినది. రైతు పొలమునందున చెరకు, గోధుమ, మిరపకాయ మొదలగు వాటి విత్తనములను విత్తును. వాన పడగనే అన్ని బీజములు మొలకెత్తి పెరిగి ఫలవంత మయ్యేటప్పటికీ, వాటియందున విభిన్న రసముల యనుభవమగును. వాననీరు ఒకే విధముగా నున్ననూ నాయా వస్తువుల యందున గల రసభేదములకు ఆయా బీజములే యెట్లు కారణమగునో, అదే విధిన జగత్కర్తయైన శివుడు ప్రాణుల అదృష్టానుసారముగ రచించుటచేత, అతనియందున వైషమ్యము నాపోదింపదగదు.

ఈ కాలపు విజ్ఞానయుగమునందు విద్యుచ్ఛక్తి చేత నెన్నియో పనులు నిర్వహింపబడుచున్నవి. నిత్యోపకరణములే కాకుండా, వినోద విజ్ఞాన దాయకమైనవగు పరికరములెన్నియో విద్యుచ్ఛక్తి వల్ల నుపయోగమునకు వచ్చినవి. బల్బువల్ల వెలుతురు, ఫ్యాన్ వలన చల్లనిగాలి రేడియో టెలివిజనుల వలన వినోధ-విజ్ఞానములు లభించుచున్నవి. విద్యుచ్ఛక్తి ఒకటే అయిననూ, యంత్రములలోని క్రియా భేదము వలన విభిన్న క్రియలు జరుపబడుచున్నవి. అదే విధిన పరమాత్మ ఒక్కడే అయిననూ ప్రాణుల కర్మరూపములైన యంత్రములు విభిన్నములుగా నుండుట చేత జగత్తున వైవిధ్యత గల్గుచున్నదిని యెరుగ వలెను.

మన వైషమ్యమునకు మన కర్మలే కారణములు అని తెలిసిన పిదప యీశ్వరుని అవశ్యకతయేల? అనే ప్రశ్న తల యెత్తవచ్చును. ఈ ప్రశ్న సమంజసమైనది కాదు. ఎందుకనగా, మనము చేసిన కర్మలు జడములై యున్నందున, స్వతః వాటికి ఫలములనిచ్చెడు సామర్ధ్యములేదు. అంగడివాడు మనము యిచ్చెడి డబ్బుకు వచ్చెడి పదార్ధములను తూకము చేసి యిచ్చిన యటులే ప్రాణుల కర్మలను సమీక్షించి వాటికి యోగ్యములైన ఫలముల నిచ్చుటకై యీశ్వరుడు అంగడివానివలె మధ్యస్థుడగు చున్నాడు. ఒకవేళ సర్వజ్ఞుడైన యీశ్వరుడే లేక పోయిన యెడల అంగడి వాడు లేని యంగడివలె జగమెల్లయూ వ్యవస్థా శూన్యతను పొందియుండెడిది.

"జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే" యనెడి గీతోక్తి (గీత 4-37) ననుసరించి, ఆత్మజ్ఞానము పొందినవాడు, సంచిత మరియ నాగామి కర్మల నుండి ముక్తుడైననూ, "నా భుక్తం క్షీయతే కర్మకల్పకోటిశతైరపి" అనెడి మహాభారతములోని వచనము ప్రకారము ప్రారబ్ధకర్మనుండి తప్పించికొనుట కెంతటి గొప్పవానికైననూ సాధ్యము కాదని శ్రీ నిజగుణులు సోదాహరణ పూర్వకముగా నిరూపించిరి.

నిరపరాధి యైన భృగుపత్నిని సంహరించిన కారణమున భృగుఋషి శాపమువలన విష్ణువు పది యవతారములు దాల్చెను. గర్వితుడై శివనిందను చేసిన కారణమున బ్రహ్మ తన అయిదుతలలలో నొక తలను కోల్పోయెను. గురుపత్నియైన తారను మోహించుటచేత చంద్రుడు క్షయరోగి యయ్యెను. అహల్యాగమనము యొక్క ఫలముగా గౌతమఋషి యిచ్చిన శాపము వలన దేవేంద్రుడు శరీరమంతటను యోనులు గలవాడయ్యెను. హరియే ప్రత్యక్షదైవమని కాశిలో గల విశ్వనాథ మందిరమున పల్కిన కారణమున నందీశ్వరుని శాపము వలన వ్యాసమహర్షి స్తంభించిన హస్తము గల వాడయ్యెననియుని నాగ కరి పక్ష్యాదులు చెరబట్టబడుచున్నవనియును, సప్తద్వీపముల నేలిన హరిశ్చంద్ర మహారాజుకు యంత్యజుని సేవించెడి విధిగల్గెననియును, పంచపాండవులకు నజ్ఞాత వాసము గల్గినదనియును, ఇవన్నియును ప్రారబ్ధ కర్మఫలములేయని శ్రీ నిజగుణులు తెలిపిరి.

ఈ ప్రారబ్ధ కర్మకు లౌకిక భాషయందు దైవ లిఖితము లేదా తలరాత మొదలగు నామాంతరములు గలవు. తలరాతను చెరిపెడి దెవ్వరికినీ సాధ్యముకాదని తెలిపెడి యీ వాక్కులు గమనార్హములైయున్నవి. "లలాట లిఖితా రేఖా పరిమార్ష్టుం న శక్యతే" దేవతలైననూ తలరాతను మార్చజాలరని యీ వాక్కులలోని భావము.

ఒకసారి, యొక దైవజ్ఞుడు సముద్రతీరమున సంచరించునపుడు నొక తలపుర్రెను గాంచెను. ఇదియెవ్వరిదై యుండునని పరీక్షించగ సమీపించి, తనకు గల జ్యోతిష్య శాస్త్రవిజ్ఞానము చేత నా పుర్రె తలరాతను కని పెట్టెను. అది యీ విధిన నుండెను.

శ్లో॥ జన్మ: ప్రభృతి దారిద్ర్యమటనం పృథివీ తలే।
సముద్రతీరే మరణం కించిదగ్రేభవిష్యతి॥

పుట్టినప్పటినుండియూ దరిద్రుడనియునూ, దేశ సంచారిగా కాలము గడిపెననియునూ, సముద్రతీరము నమరణమైన పిదప మరికొంత జరుగనున్నది యని శ్లోకములోని భావార్థము. సముద్ర తీరమున చచ్చేది నిజమైనదిగనుక యిక ముందేమి జరుగనున్నదో తెలిసి కొన వలెననెడి కుతుహలము గల్గిన వాడై, దైవజ్ఞు డాతల పుర్రెను సంచిలో వేసికొని నిజనివాసము దిశన బయలుదేరెను. కొంత దూరము వెళ్లిన పిదప యతని కొక గృహస్థుడు తారసపడెను. నీవు యీ తలపుర్రెను జాగ్రతపరచి పెట్టుము, నేను వచ్చినప్పుడు ఇవ్వవలెనని కొరెను. దైవజ్ఞుని యెడ గౌరవ భావమును గల్గిన యా గృహస్థుడు వల్లె యని పుర్రెను గైకొని యింటికి పయనమయ్యెను. దైవజ్ఞుడు తన దారిన తాను వెళ్ళెను. ఇంటికి చేరిన నా గృహస్థుడు, మారుమూలలో నున్న యొక గదిలోనికి వెడలి, దానిలోని యొక పెట్టెలో పుర్రెను భద్రపరచి, తాళము వేసి యుంచెను. తాళపుచెవిని యెంతో జాగ్రత్తగా తన వద్ద దాచికొనెను. బయటికి వెళ్ళినప్పుడైననూ తాళపు చెవిని వీడలేదు. తాను కార్యార్థియై వెడలుచు, భార్యకు వివరముల నివ్వకయే ఆ పెట్టెలోని వస్తువును నీవు చూడగూడదని చెప్పి బయటికి వెడలెను. వద్దన్న పనిని చేసి తీర వలెననెడి స్వభావము గల్గిన భార్య, భర్త వెడలగనే, తన కుతూహలము నాపుకొనలేక, తాళమును విరుగగొట్టి లోపలి వస్తువును గాంచి హడలెత్తి పోయెను. ఇది యేమిటి? పుర్రెను యింటిలోనికి తెచ్చెడి దేమిటి? పెట్టెలో భద్రపరచడమేమిటి? ఇట్టి ప్రశ్నలెన్నియో గల్గెను. కారణమును గనిపెట్ట వలెననెడి సంకల్పము గల్గెను భర్త కారణ రహితముగా నిట్టిపని చేయడని తానెరిగి యుండెను. తనకు కారణము చెప్పడను విషయమును గూడనామె యెరిగియుండెను. తలపుర్రెను యథావిధిగా పెట్టెలో భద్రపరచి, బయటికి వచ్చెను. ఇంటికి యెదురున నున్న ఇంటి వైపుకు చూసెను. అక్కడొక ముసలిది, కూర్చొని యుండెను. ఆమెను విచారించెను. కారణమేమై యుండునో తెలుపుమనెను. మొదటి నుండియూ భర్తగారి విషయములన్నియూ తెలిసియుండునని భార్య భావించి, సరియైన సమాధానము నాశించెను. కాని, ముసలిదాని నైజము నెరుగనిదైయుండెను. ఆముసలిది తంటాల మారి స్వభావము గలదై యుండెను. చిరకాలము నుండియూ, భార్యా భర్తలకు మధ్య తంటాలు పెట్టెడి ప్రయత్నములు సలిపి విఫలమై యుండెను. దీని నొక నవకాశముగా గైకొని, పునః ప్రయత్నము చేయనెంచి లేని పోనివి కల్పించి యా యిల్లాలుకు చెప్పెను ఆమె భర్త ఇంకొక పెళ్ళియాడెననియు, ఆమె గతించి పోగా మోహమును వీడలేక పుర్రెను దాచికొని యున్నాడనియును, భార్యమీద చూపెడి మమకారము వట్టి బూటకమనియును లేనిపోనివి కల్పించి తెలియజేసి తన దారిన తాను వెడలెను. మనస్సు అగ్నిపర్వతమై క్రోధాగ్ని ప్రజ్వరిల్లెను. సవతిపోరు తనకు తప్పలేదనియునూ, తన సవతిచచ్చియూ తనను సాధిస్తున్నదనియునూ భావించెను ఆగ్రహమును పట్టలేనిదై, తలపుర్రెను తీసి బ్రద్దలుగొట్టి చూర్ణముగా చేసి చీమలు తినుటకై మూలకు నెట్టివేసెను. తలకొకగుడ్డను చుట్టికొని, అలిగి పరుండెను. భర్త వచ్చిన పిదప భయంకరమైన రీతిలో జగడము చేయ దొడంగెను. భర్త నుడివిన మాటలేవియును ఆమెకు తలకెక్కలేదు. మొండిగా వాదులాడ జొచ్చెను. భర్తకు నేమి చేయవలెనో తెలియదయ్యెను. విధిలేక మౌనము వహించెను. ఈలోపుననే యా దైవజ్ఞుడు ఏతెంచెను గృహస్థుడు జరిగిన విషయగతిని వివరించెను. దైవజ్ఞుడు మర్మము నెరిగిన వాడయ్యెను. భార్యాభర్తలకు నచ్చజెప్పనెంచెను. ఈ సంఘటనలకు వారెవ్వరునూ బాధ్యులు కారనియునూ, ఆ పుర్రె తలరాతనే కారణమని తెలుపుచు విషయములన్నింటినీ వివరించెను. భార్యాభర్తలు నాశ్చర్యము నొందిరి. గృహస్థుడి భార్య చేతిలో బడి బ్రద్దలు గొట్టబడి చూర్ణము చేయబడెడి విధిరాత యా తలపుర్రె కుండెనని గ్రహించిరి. ఎప్పటి వలె ననురాగ భరితులై యుండిరి. దైవజ్ఞుడును తన దారి తాను వెళ్ళిపోయెను.

ఈ విధిన, చచ్చినా తలరాత ప్రకారము భోగాభోగములననుభవింపక తప్పదని తెలియుచున్నది. ఇక బ్రతికియున్న వారి గతి గురించి వేరుగా చెప్పనక్కరలేదు.

జీవులెల్లరూ ప్రారబ్ధ కర్మానుసారము తమ తమ యనుభవములను పొందుచు జీవనమును కొనసాగింతురనియును, ఎవరి తల రాతకైననూ పరమాత్ముడు బాధ్యత వహించడనియును, ఎవరి బాధ్యత వారిదేననియునూ గ్రహింపదగును

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

20-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము

## విశేష ప్రదీపిక :

ఈశ్వరుని యొక్క సర్వకర్తృత్వమును గూర్చియు, కర్మ తత్త్వము గురించియును శ్రీ చంద్రశేఖర శివాచార్యుల వారు బహువిస్తృతమైన ఉపదేశమునిచ్చిరి.

శివుడు శుద్ధ మాయా శక్తి వశముచేత వివిధరూపములను ధరించుచున్నాడు. ఇచ్చట వశమనగా శక్తితో అవినాభావ సంబంధము కల్గియుండుట. శుద్ధ ఉపాధి యైన మాయను పరామాయ యని యందురు ఈ పరామాయ సాంగత్యములో శివుడు ధరించు రూపములలో సద్యోజాత, వామదేవ, అఘోరాది రూపములుగలవు. ఇవి ఉపాసనా రూపములు. ఇట్టి వివిధ మంగళకర రూపములను ధరించెడి శివుడు, సర్వజ్ఞుడుగాను, సర్వ కర్తృత్వము వహించెడి వాడుగాను, నిత్యముక్తుడుగాను వుండును.

ఈ ఉపదేశ ఖండికలో, శ్రీ భగవత్పాదులు, శివాంశ వలన జీవులకు కలుగు లక్షణములను వివరించిరి. అశుద్ధమాయా (అవిద్య) ప్రకారము దీని చేత జగత్తుమితమై యుండును, అమరసింహుడు 'మాయ' అనెడి పదమును ఇంద్రజాలమునకు సంబంధించినదిగా తెలిపెను. తాత్వికార్థము తెలిసికొన వలెను. షట్త్రింషత్ తత్త్వాలలో మాయ అనెడిది గలదు. కాని దానికి మాయా శక్తి యనెడి పేరు ఇవ్వబడలేదు. వీరశైవమున చెప్పబడెడి శక్తి త్రయములోన యిచ్ఛా, జ్ఞాన మరియు క్రియా శక్తులు గలవు. మాయాశక్తి పేరు కన్పట్టదు. శివస్తుతులలో శివుడు మాయాశక్తితో కూడికొని సదాశివాది భూమ్యంతము గల ముప్పదినాలుగు తత్త్వముల ఉత్పత్తికి కారణమయ్యెనని తెలుప బడినది. శ్రీ శివయోగి శివాచార్యుల వారు తాము చేసిన శక్తి స్తుతిలో ఇట్టి భావమునే వ్యక్తీకరించిరి గమనించుడి:

**శ్లో॥ సదాశివ ముఖాశేష తత్త్వ మౌక్తిక శుక్తికాం।**
**వందే మాహేశ్వరం శక్తిం మహామాయాదిరూపిణీం॥** (సి.శి 2-2)

శ్రీ శివాచార్యుల వారు మాయా శక్తిని శక్తికి పర్యాయపదముగా ఉపయోగించెనని తెలియు చున్నది. మాయారూపిణి యనగా అనేక రూపములలో నున్న శక్తి అని గ్రహించవలెను. శుద్ధవిద్యగా పరిణమించిన శక్తియే మాయ తత్త్వమై సర్వతంత్ర స్వతంత్రుడైన యీశ్వరుని పరిమిత శక్తి సంపన్నుడగు పురుషునిగా మార్చివేసెనని షట్త్రింషత్ జ్ఞాన సంపన్నుల వలన తెలియుచున్నది. ఈ పురుషుడే జీవుడని గ్రహించిన వాడై, పురుషుడు కించిత్ జ్ఞుడు, కించిత్ కర్తృత్వము గల వాడును, దేహమున బంధింపబడిన వాడు గను పరిణామమొందెను.

దేవతిర్యఙ్మనుష్యాది నానారూపములను ధరించిన శివుడు, త్రిమలావృతుడై, అవిద్య ప్రభావమునకు లోనయ్యెను. తత్ఫలితముగా శివుడు జ్ఞానశూన్యుడైన జీవుడై పోయెను. "అహం ఏవ ఇదం జగత్" అనెడి భావము లుప్తమయ్యెను. "న అహం ఈశ్వరః" అనెడి భావము చోటు చేసికొనెను. తాను శివుని కంటెను భిన్నుడనెడి అజ్ఞానము గల్గెను.

దేహిగా పరిణామమును పొందిన శివుడు జీవుడై శివత్వము నకెట్లు దూరమయ్యెనో యని తెలిపెడి సోమనాథుని విశిష్ట విజ్ఞతను గనుడి:

**సీ॥ శివుడు నిస్సంసారి జీవుండు సంసారి**
**తజ్జీవునకు శివత్వంబు గలదే?**
**శివుడు నిర్మల దేహి జీవుండు మలదేహి**
**తజ్జీవునకు శివత్వంబు గలదే?**
**శివుడు దా నిష్కర్మి జీవుంథు దుష్కర్మి**
**తజ్జీవునకు శివత్వంబు గలదే?**
**శివుడు దానిత్యుండు జీవుండనిత్యుండు**
**తజ్జీవునకు శివత్వంబు గలదే?**
**యరసిజూడ బర్వత పరమాణుమాత్ర**
**తరమునకు సంబరంబును ధరణికైన**

**యంతరంబులు గలుగు జీవాత్మకెట్లు**
**పొసగుబరమాత్మ యోగంబు బసవ లింగ.** (పాల్కురికి సోమనాథుడు,
చతుర్వేదసారము,ప. 178)

సోమనాథుని "అంతరంబులు గలుగు- పర్వతంబు పరమాణుమాత్ర" యనెడి పలుకులు మరువ రానివైయున్నవి.

దేహధారియైన వాడు కర్మలను చేసియే తీరవలెననెడి కర్మవాదుల వాదమొక్కటి గలదు ఆహార-విహారాదులను కర్మలుగా నెంచిన యెడల వీరి భావన సత్యదూరమైనది కాదని తోచును. కాని పూర్వమీమాంస వాదము ప్రకారము కర్మయనగా యజ్ఞయాగాదులు. ఈ భావము పరిగ్రహణీయము కాదు. ఇట్టి కర్మలు అవాంఛనీయమైన పరిణామములకు దారి తీయును. కర్మఫలము రెండు విధములుగానుండును. మొదటిది సకారాత్మకమైనది. దీనిని పుణ్యమని యందురు. దీని వలన స్వర్గాది పారలౌకిక సౌఖ్యములు లభించును. లోకుల వలన గల్గెడి సన్మానాది సత్కారములు కూడ యీ కోవకు చెందినవే! రెండవది, పాపము, ప్రతికర్మవెంబడి యేదో నొక దోషభూయిష్టమైన కార్యాచరణ యుండియే తీరును. యజ్ఞములను ఉదాహరణగా గైకొనిన యెడల, జంతు బలి వంటివి జరుపవలసి యుండును. లేని యెడల యాగఫలము లభించదు. బలి యిచ్చిన హింసా దోషము సంప్రాప్త మగును. అది నరక-దాయకమని చెప్పబడినది.

కర్మఫలము బలీయమైనది. దాని ననుభవించియే తీరవలెను. లేని యెడల నద్దానిని యనుభవించుటకై మరొక జన్మ యెత్త వలసియుండును.

**పండిత నాగలి మూర్ఖనాగలి, సంచిత కర్మ ఉండల్లదె బిడు దు**
**ప్రారబ్ధ కర్మ భోగిసిల్లదె హోగదెందు శ్రుతి సాఱుత్తిదావే, నోడా!**
**తానావలోక దొళగిద్దెడెయూ బిడదు,**
**కర్మఫలగూడి కూడల సంగమ దేవరిగె**
**ఆత్మనైవేద్యవ మాడి దవనె ధన్య.**

ఈ వచనపు తెలుగు రూపము:

**పండితుడుగాని, మూర్ఖుడుగాని సంచిత కర్మభుక్తి కాకుండ విడదు**
**ప్రారబ్ధకర్మ భోగించిన గాని పోదని శ్రుతులు చాటుచున్నవి చూడుడో!**
**తానే లోకమున నున్ననూ విడదు,**
**కర్మఫలమును గూడి కూడల సంగమ దేవునికి**
**ఆత్మనివేదన చేసిన వాడే ధన్యుడు** (వ.సం.773)

పిండస్థలముననుండెడి శివభక్తుడు ఇట్టి కర్మలను చేయవలదు. శివ భక్తగణ సాంగత్యం, శివధ్యానం, శివార్చన .యిత్యాదులను, ఫలాసక్తి లేకుండగ, చేసిన యెడల నయ్యది ఫలకారి కాగలదు.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-7

శ్లో॥ ఏతేషాం దేహినాం సాక్షీ ప్రేరకః పరమేశ్వరః ।
ఏతేషాం భ్రమతాం నిత్యం కర్మయంత్ర నియంత్రణే॥
దేహినాం ప్రేరకః శంభుర్హితమార్గోపదేశకః।
పునరావృత్తి రహిత మోక్షమార్గోపదేశకః॥
స్వకర్మ పరిపాకేన ప్రక్షీణమలవాసనః।
శివప్రసాదాజ్జీవో2యం జాయతే శుద్ధమానసః॥
శుద్ధాంతః కరణే జీవే శుద్ధకర్మవిపాకతః
జాయతే శివ కారుణ్యాత్ ప్రస్ఫుటా భక్తి రైశ్వరీ
జంతురంత్య శరీరో2 సౌపిండశబ్దాభిధేయకః (సి.శి.5-49-52)

సంసారమందున సంచిరించెడి జీవులు ధరించు దేహములు, కర్మఫలములననుభవించెడి సాధనములు, అందు చేతనే "భోగాయతనమ్ శరీరమ్" అని అన్నారు. మనోబుద్ధులతో కూడిన జీవాత్మనే సుఖ దుఃఖములను భోగించిననూ స్థూల విషయముల భోగమును, సూక్ష్మ శరీరమునకు తలపింపజేయుటకు స్థూల శరీరము యొక్క అవశ్యకత గలదు. ఈ స్థూల మరియు సూక్ష్మ శరీరములు రెండును గ్రుడ్డి మరియు కుంటివారి వలె పరస్పరము తాదాత్మ్యముగ వ్యవహరించుండును.

దావాగ్ని చేత మండుచుండెడి యడవిలోన నొక గ్రుడ్డి మరియునొక కుంటి చిక్కికొనియుండిరి. గుడ్డికి కాళ్ళుగలవు. పరువెత్తెడి సామర్థ్యము గలదు. అయితే కళ్ళు లేనందున మార్గము కానరాదు. కుంటికి కళ్ళుగలవు. దారికనిపించును. కాళు ళ్ళలేనందున పరుగె×త్తిపోయి తనను తాను రక్షించి కొనెడి స్థితి యందున లేదు. ఈ స్థితిలో, పరస్పర సమీపమున నున్న వీరిరువురును నొక యొప్పందమును చేసి కొనిరి, గుడ్డివాని భుజముల మీద కుంటివాడు కూర్చుండి దారి చుపుచుండగను గుడ్డి వాడు కుంటి వానిని మోసికొని పోతూ ఉండెను. భయంకరమైన దావాగ్నిని తప్పించి కొని పోవుటకు నెంతో శీఘ్రముగా నడిచేటప్పుడు, కుంటి వానికి తానే పోవుచున్నాననియును, గుడ్డి వానికి తానే పోవుచున్నాననియెడి భవాత్మక తాదాత్మ్యమొచ్చినయటుల మన స్థూల మరియు సూక్ష్మ శరీరముల సంబంధముండును.

సూక్ష్మశరీరమునకు కళ్ళున్న కుంటి వానికి వలె జ్ఞానముండదు. భోగించలేదు. కుంటి, గుడ్డి వారిరువురును కలిసి యడవిని దాటిన యటుల స్థూల మరియు సూక్ష్మశరీరములు రెండునూ తాదాత్మ్యమును పొందిన పిదప జీవునికి సుఖ దుఃఖముల భోగించుట సంభవమగును. తిట్లు శాపనార్థములు శరీరమునకు తాకవు. అవి మనస్సుకు తాకగానే స్థూల శరీరము తిట్టినవానిపైకి బడితను పట్టుకొని బయలు దేరును కొట్టెడి దెబ్బలు మనస్సుకు తాకవు. శరీరమునకు తాకగానే మనస్సుకు కోపమువచ్చి నోటి నుండి తిట్ల పర్షము కురియును. ఈ అనుభవము వలన యెరుగ వలసిన దేమనగా ఉభయ శరీరములు నొకటియై, వీటి రెంటి యభిమానియైన జీవుని దేహి యనిపించి ప్రారబ్ద కర్మానుసారముగా సుఖదుఃఖముల ననుభవిస్తూ సంచరిచుచుండును. వీనికి కర్మయంత్రముల సంచాలకుడైన పరమాత్మసాక్షివలె వ్యవహరించుచున్నాడు.

సామాన్యముగా లోకము నందున కోర్టు కచేరీల యందు సాక్షి శబ్దము యొక్క వాడుకయగు చున్నది. వాది ప్రతివాదులు యెవరో యొకరి పక్షమునకు చెందియుండ కుండగ నిష్పక్షపాత భావముతో వారిరువురి మధ్య నడచిన ఘటనల గూర్చి కోర్టు నందు న్యాయాధికారికి నెరింగించెడివాడే సాక్షి యనబడును. సాక్షుల వివరణల బట్టియే తీర్పు చెప్పబడును. ఈ దినములలో నెవరు డబ్బును యిచ్చినచో వారివైపుననే అనుకూలముగా సాక్ష్యమునిచ్చెడి వారు యధార్థముగా సాక్షులనబడరు. అందుచేతనే, "రాగద్వేష శూన్యత్వేసతి చేతనత్వమ్ సాక్షిత్వమ్" అని శాస్త్రజ్ఞులు సాక్షి శబ్దమును నిర్వచించిరి ప్రేమగాని, పగగాని, లేకుండగ, చైతన్యవంతుడై యుండెడి వాడే సాక్షియని యీ నిర్వచనము యొక్క అర్థము. రాగద్వేషములు లేకుండుట వలన నిష్పక్షపాతత్వము సిద్ధించును. చెట్టు గుట్ట, ఇత్యాదులు రాగద్వేషరాహిత్యము గల్గి యున్ననూ, చైతన్యశూన్యములై యుండును. అవి సాక్షులు కాజాలవు.

ఈశ్వరుడు రాగద్వేష శూన్యుడును, చైతన్యవంతుడునూ అయియున్నందున నతడు సాక్షియనెడి పదమునకు సరిపడి యుండును. ఈ విషయమును మరింత యెక్కువగా తెలియపరచెడి సర్వజ్ఞుల వారినుడువులు గమనించుడి:

**తోడిర్ద బావిగె కూడిర్ద జలసాక్షి।**
**మాడిద్దక్కెల్ల మన సాక్షి। సర్వకు**
**మృడనే తా సాక్షి సర్వజ్ఞ॥**

ఈ త్రిపదయొక్క తెలుగు రూప మిది:

**తోడిన బావికి కూడిన జలమే సాక్షి।**
**చేసిన వాటికెల్ల మనసే సాక్షి । అన్నింటికీ**
**మృడుడే తా సాక్షి సర్వజ్ఞ॥**

వాది ప్రతి వాదులకు నడుమన నుండెడి వాడు సాక్షియై నటులనే, జీవునికిని, అతడు చేసిన కర్మకును నడుమ మధ్యవర్తిత్వము వహించి, నిష్పక్షపాత భావముతో ఫలభోగములను గల్గజేయువాడే తానై పరమాత్మ సాక్షి పాత్రను పోషించును.

లోకమునంధున యిరువురి జగడములో మధ్యవర్తిత్వమును వహించెడి వ్యక్తి, ప్రసంగానుసారముగ యిరువురికిని హితమైన మార్గోపదేశమును చేయునట్లే, ఈశ్వరుడు హృదయమున నివసించెడి వాడుగా, నుండి, అధోముఖముగా ప్రవర్తించుచున్న జీవునికి, అంతర్వాణి ద్వారా హెచ్చరికలు చేయుచుండును. జీవునికి తగిన యవగాహన లభించని పక్షమున తానే నర రూపమును దాల్చి గురువై శాస్త్రప్రమాణ వచనముల ద్వారా జీవునికి జ్ఞానప్రదానము చేసి, పునరావృత్తిరహితమైన మోక్షమార్గమును ఉపదేశించు చున్నాడు “సాక్షాత్‌భర్గోనరాకృతః” యనెడి ప్రమాణవచనము, గురువు యొక్క శివత్వమును నిరూపించుచున్నది. కంటి యెదురున శివుడే నర రూపముననున్నాడని యీ ప్రమాణ వచనములోని భావము.

“ సఏషః పూర్వేషామపిగురుః కాలేనానవచ్ఛేదాత్” (1:27)అనెడి యోగ సూత్రమొకటి కలదు. పతంజలి, ఈశ్వరుడే మొదటి గురువని యీ సూత్రమునందు వివరించిరి. వీరశైవుల గురు పరంపరయూ శివుని వలననే ప్రారంభమైనది. వీరశైవ ధర్మ సంస్థాపకులైన రేవణారాధ్య, మరుళారాధ్య, ఏకోరామారాధ్య, పండితారాధ్య, విశ్వారాధ్య ఆచార్యులనెడి పంచాచార్యులు, సదాశివుని సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, మరియు యీశానములనెడి పంచముఖముల నుండి ప్రతి యుగమందుననూ ఉద్భవించి ధర్మతత్వములను ప్రతిష్ఠాపించిరి, ఈ ఆచార్యులు ధర్మప్రచారమునకై రంభాపురి, ఉజ్జయిని, కేదార, శ్రీశైల మరియు కాశీలనెడి పవిత్ర క్షేత్రముల యందున పంచమహాపీఠములను సంస్థాపించి, ఆదిలో అగస్త్య, దధీచి, వ్యాస, సానంద, మరియు దూర్వాసులనెబడె మహర్షులకు ధర్మబోధను చేసినట్లు శివాగమములయందు ప్రసిద్ధమైనదిగా నున్నది.

ఊరిలోని ధార్మిక కార్యక్రమముల నిర్వహణ యా ఊరి మఠమయ్య స్వామి కర్తవ్యమై యున్నది. మఠమయ్య కంటె మేలైన విచారములుగల్గి గురువై యుండెడి వానిని పట్టాధికారి యని యందురు. పంచాచార్యులు పట్టదేవర కంటెను మేలైన గురు స్థానమున నుందురు. పంచగురువులకును, వారి జన్మకును, మూల పురుషుడైన వాడు శివుడైనందున శివుడే ఆది గురువగును. ఈ విధిన పతంజలి మతము వీరశైవులకునూ సమ్మతమైనదిగా ఉన్నది కామికాది వాతూలాంతము మొదలు, వీరశైవ సిద్ధాంత బోధకములైన 28 శివాగములు సాక్షాత్ శివుని చేత పార్వతికి నుపదేశింపబడినవే. ఈ ఆగమముల యొక్కఉత్తర బాగమున చెప్పబడిన వీరశైవ తత్వములు, పునః ఆచార్యులవలన మహర్షులకును, మహర్షుల వలన జన సామాన్యమునకు ప్రాప్తమైన కారణాన, యీ జ్ఞానపరంపరకు జ్ఞాన నిధియైన పరమేశ్వరుడే మూలమైన కారణమున, యీ జ్ఞాన గంగా ప్రవాహము ఆది కాలమునుండి నేటి వరకూ లోకకల్యాణార్థమై నిరాటంకముగా ప్రవహించుచున్నందుననూ, శివుడే ఆదిగురువని భావింప దగును. గురురూపమును ధరించిన పరమాత్మ శిక్ష, దీక్ష మరియు జ్ఞానోపదేశముల చేత మోక్షమార్గమును చూపి జీవాత్మలను అనుగ్రహించుచున్నారు. అందుచేతనే, శ్రీ రేణుక భగవత్పాదులు “పునరావృత్తిరహిత మోక్ష మార్గోపదేశకః” యని ఉపదేశించిరి.

శివానుగ్రహమునకు వీరశైవ దర్శనమునందున శక్తి పాతమను పేరు గలదు. శివుని యనుగ్రహాత్మాకమైన యీ శక్తి పాతము నందరికినీ సులభముగా దొరకదు. అనేక జన్మల యందున నిత్యనైమిత్తిక మరియు ప్రాయశ్చిత్తాదుల నాచరించి తద్వారా కర్మమంతయును పరిపక్వత చెందింపజేసికొని, మలత్రయముల వాసనను దూరముజేసి కొనిన గాని కర్మఫలము సిద్ధించదని, ఆచార్యుల అభిప్రాయాములు మలముల గురించి చెప్పుచు “మలో ప్యామశ్చపక్వశ్చ భవేత్ సంసారకారణమ్” అని శివపురాణములో

తెలుపబడినది (శి.పు. 7-1-31-72), "ఆమమలము", పక్వమలములనెడి రెండు విధములైన మలములు గలవనియును, తపస్సు చేత పక్వమయ్యెడిది. పక్వమలమనియును, తద్విరుద్ధమైనదే ఆమమలమని వివరింపబడినది. తపస్సు చేత మలమును తగ్గించుకొనిన జీవుడు, శివానుగ్రహమును పొందుటకు అర్హుడగుచున్నాడు. ఈ విషయమును మరింతయెక్కువగా విషదపరచెడి శ్రీ మరితొంటదార్యుల వారి వాక్కులను గమనించుడి:

**శ్లో॥ తపస్తప్తా తనుర్యస్యస తప్త తనురుచ్యతే।**
**పరిపక్వో విమోక్షాయ సో శ్నుతేలింగధారణమ్॥**
**నకరోతి తప: పూర్వ సో తప్తతనురుచ్యతే।**
**అపక్వో యం విమోక్షాయ నాశ్నుతే లింగధారణమ్॥** (వీరశైవానంద చంద్రికా, పు. 78)

ఎవ్వని తనువు తపస్సు చేత తప్తత పొందినదో అట్టి వాడు "తప్తతనువు" గలవాడగుననియును, వాడే మోక్షము కొరకై లింగధారణ పొందుననియును తద్విరుద్ధముగా నున్నవాడు "అతప్తతనువు" గల వాడనియును, అట్టి వాడు శివానుగ్రహము పొందుటకు అర్హుడు కాడనియును, యీ శ్లోకములలోని భావము. శ్రీ రేణుక భగవత్పాదులు నుపదేశించినది గమనించుడి:

**శ్లో॥ స్వకర్మ పరిపాకేన ప్రక్షీణ మలవాసన: ।**
**శివప్రసాదాజ్జీవో యంజాయతే శుద్ధమానస: ॥**

జీవుడు కర్మపరిపక్వమైన పిదపను, వాని మలవాసన క్షీణించిన పిదపను, శివప్రసాదము వలన శుద్ధమానసుడగు చున్నాడు. జన్మజన్మాంతరముల నుండి జీవుడు చేయుచున్న తపస్సు కారణమున కర్మపరిపక్వమై, మలవాసన దూరమై మన శుద్ధిని కలిగించును. శివప్రసాదమె మనః శుద్ధిని గల్గించెడి సాధనము. ఇట్టి మనః శుద్ధి గల వానికే శివభక్తిగల్గును. శివభక్తియును, శివ ప్రసాదమును పరస్పర పోషకములని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి:

**ప్రసాదా దేవ సా భక్తిః ప్రసాదో భక్తి సంభవః।**
**యద్వైవాంకురతో బీజం బీజతోవాయథాంకురః॥**

ఇది భక్తిమార్గక్రియాస్థలమున (9వ పరిచ్ఛేదము) చెప్పబడిన వాక్కులు.

బీజాంకుర పరమైన సంబంధముగల భక్తి- శివానుగ్రహములు నొకదానిపై మరొకటి ఆధారపడి యుండును. భక్తిలేని వానిని శివుడను గ్రహించడని తెలియదగును శివానుగ్రము లేనిది భక్తిగల్గునె? భక్తిలేనిదె శివానుగ్రహముకల్గునే యేది ముందు? యేది వెనుక? యనెడి ప్రశ్నలుదయించే యవకాశము గలదు.

ఒక ఊరిలో నొకనికి చిరకాలము వరకు పెళ్ళి కాలేదు. వయస్సు ముదిరినవాడైనందుననూ, పెళ్ళి గురించిన ప్రగాఢమైన యాకాంక్ష గలవాడైనందుననూ, పెళ్ళికాని కారణమున పిచ్చి యెక్కెను. పిచ్చి తగ్గిన పిదప పిల్లనిచ్చెదమని యొకకన్యపక్షము వారనిరి. పిల్లవాని పక్షము వారు, ముందుగా పెళ్ళి కానివ్వండి, పిచ్చి తగ్గుతుందనిరి. ఇరుపక్షములవారు హఠవాదులైతే యేమియు ఫలితముండదు. ఎవ్వరో నొక్కరు పట్టును వీడవలెను. పెళ్ళి కానందుననే పిచ్చి వచ్చినదిగాన, కన్య పక్షమువారు చొరవ తీసికొని పెళ్ళిని చేయించిన యెడల సత్ఫలితములు లభించును. అదేవిధిన జీవాత్మ చొరవ తీసికొని భక్తిని యలవరచుకొన వలెను. భక్తిని చేస్తూ ఉండిన యెడల కొంత కాలము పిదప శివానుగ్రహము సంప్రాప్తమగును. జీవునికి భక్తి గల్గని యెడల శివుని కయ్యెడి నష్టమేమియునుండదు. కాని, సంసారమును దాటి ముక్తిని పొందవలెననిన జీవునికి శివానుగ్రహము తప్పనిసరిగా కావలెను. కాన బుద్ధిమంతులైన వారు, యీ విషయమును గ్రహించి భక్తిని పెంపొందించుకొనవలెను.

ఈ విధముగా పరిశుద్ధాంత రంగుడై "పిండ"దని పించు కొనిన జీవికి మున్ముందు పిండజ్ఞానాది స్థలముల స్థితియు ప్రాప్తమై శివైక్యతను పొందును గాన, అతనికి పునః శరీరాంతర ప్రాప్తి రూపమైన సంసారలంపటములుండవని, శ్రీ భగవత్పాదులు పిండస్థల సాధకునికి "అంత్యశ్శరీరి" అనే పేరును ఆదేశించిరి.

అందు చేత ప్రతి యొక్కడు, స్వీయ కల్యాణము నిమిత్తమున, శివభక్తిని పెంపొందించుకొని, ముక్తి మార్గానుయాయియై, అంతః కరణ శుద్ధిని సాధించి, తన జీవనమును సార్థతకత చేసికొన వలెను.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

21-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము

## విశేష ప్రదీపిక :

జీవుడు నానా విధములగు దుఃఖములనను భవించుననియును, శివుడు సాక్షీభూతుడై యుండి యతనికి హితమార్గోపదేశము చేయునని శ్రీ జగద్గురు చంద్ర శేఖర శివాచార్య వారు తమ యాశీర్వచనమున విశ్లేషణ పూర్వకముగా వివరించిరి.

శ్రీ భగవత్పాదుల వారు వస్తుత్రయములోని జీవుడు స్వకర్మానుసారముగా నీ సంసారమున భ్రమించుచున్నాడనియును, నానా యోనుల యందున పుట్టుచుగిట్టుచు సంసార దుఃఖముల ననుభవించుచున్నాడనియు తెలిపిరి. అదేవిధిన ఒక జీవి జన్మించెడి జాతి, ఆయువు మరియు భోగము-విషమ పరిస్థితులకును కర్మలే కారణమని తెలిపియుండిరి. ఇచ్చట శివుని పాత్రను వివరించ బడినది. కర్మయంత్రమును నియంత్రణ చేసే కార్యమున నిమగ్నుడై యీ లోకము శివుడు భ్రమించుచుండునని తెలుపబడినది. జీవుల నుద్ధరించునని తెలుపబడినది. ఇచ్చట యొక సందేహము తలయెత్తును. కర్మ చేసియే తీర వలెననియును, చేసిన కర్మను తప్పని సరిగా అనుభవించవలెనని చెప్పబడుచున్నది అట్టి యెడ శివుడు కర్మయంత్ర నియంత్రణ నేవిధిన చేయును? ఈ సందేహమును తీర్చి కొనుటకై కర్మవాదమును పరిశీలించవలెను.

జగత్తు స్వయంభువు, చావు పుట్టుకలు సహజముగా స్వకర్మ వలననే కలుగుచున్నవి. దీనికి ప్రత్యేకముగా ప్రేరకుడుగాని సంచాలకుడు గాని వేరొకండు ఉండడు. ఇది నిరీశ్వరవాదము. పూర్వమీమాంస శాస్త్రమునకు చెందిన యీ వాదములో కొన్ని ప్రభేదములు గలవు. భాట్టము, ప్రాభాకరమనెడివేయీ భేదములు కపిల మహిర్షి వంటివారి సాంఖ్యుల ప్రకారము, జగత్తు ప్రకృతి ప్రధానమైనది ప్రకృతితానే జగత్తుగా పరిణమించి తన హావభావములతో మాయాపాశమును వేసి పురుషునితో భోగించును. ఈశ్వరునితో పనిలేదు ఈ విధముగా ఈశ్వరునికి ప్రాముఖ్యత నివ్వబడలేదు. ఒక దానిలో ప్రకృతికిని, మరొక దానిలో పురుషునికి ప్రాముఖ్యత నివ్వబడినది.

వీరశైవ మీ యుభయవాదములను ఖండించినది. సోమనాథ భాష్యమునయీ విషయమై బహువిధములగు ప్రమాణములనిచ్చుచు, “సర్వకర్మాధి పతిః పరమేశ్వర ఏవ తం పరమేశ్వరం వినాకేవల కర్మణ ఏవ కర్తృత్వం న భవతి” సిద్ధాంతీకరించ నైనది (సోమనాథ భాష్యము, కర్మవాద నిరసనమ్). ఇదే విధిన “గాన కర్మంబు శ్రీ కంఠానుసారి, పూని తత్కర్మంబు బుద్ధ్యను సారి” అని పండితారాధ్యచరిత్ర వాద ప్రకరణమున చెప్పబడినది. ఈ వాదనలన్ని శ్రీ భగవత్పాదుల వారి వాదన కనుగుణ్యత గల్గియున్నవి.

శ్రీ భగవత్పాదుల వారు శివునికి ప్రేరకుని పాత్రను కల్పించిరి. ఇద్దానిని సోమనాథ భాష్యము సమర్థిస్తూ “కర్మాపి పరమేశ్వర ప్రేరణం వినా తత్కర్మి శుభాశుభకర్మఫలం స్వమేవాదాతుం న సమర్థం భవతి” అని తెలిపినది ఈ విషయము మరింత స్పష్టపరిచెడి యీ క్రింది ద్విపదలను గనుడిః

**“దనరి లక్ష్యము ధనర్థపదేయకున్న**
**దనకు దా బాణంబు నని యెట్లు దాకు?**
**బెనుపొంద నీశ్వర ప్రేరణ లేక**
**తనకు దా కర్మంబుసనియెట్లు పొందు?**
**విది నుత్తమాధమ విరచిత క్రియల**
**విది నిషేధంబుల వెంట గర్ములకు**
**బటువగు పుణ్యపాపములబుట్టించి**
**యటస్వర్గలోకాదుల కనిచి**

**ప్రథిత శుభాశుభాస్పద సుఖదుఃఖ**
**పథము పొందించు నప్పరమేశ్వరుండు**
**గర్మకర్తల గూర్చు గర్తప్రాపించు**
**గర్మంబునం దాది కర్తాను సారి॥** (పండితారాధ్య చరిత్ర, వాద ప్ర.)

శివుడు, తన ప్రతి రూపమైన జీవుని యెడల కరుణాంతరంగుడై హితబుద్ధి గల్గియుండి. జీవుని కర్మల యొక్క నిమిత్తము లేకుండ ఎవ్వరికి హితమేదియో నయ్యది యిచ్చు చున్నాడు జీవుని స్థితిగతుల నెరుగుటకై యీ జగతిన శివుడు జీవునివెన్నంటి తిరుగాడు చున్నాడు. అందుకే నతడు సాక్షి యగుచున్నాడు దీని భావమేమనగా జీవుడు ఒక్కడే ఒంటరిగా లేనేలేడు అతనికి తోడుగా శివుడును కలడు. కాని యతని నెలవు అందరికీ ద్యోతకము కాదు. గుర్తించుట యనెడిది సాధ్యము కాదు. పిండస్థలమునకు చేరనంత వరకు జీవునికి శివుడు స్ఫురించడు. నాస్తికుడుగనో, శివేతరములనుపాసనజేసెడివానిగనో యగుచున్నాడు. శివుని యెడల భక్తి కలుగనంత వరకు జీవునికి శివుడున్నాడనే భావన మదికి రాదు "బుద్ధిః కర్మానుసారిణి" యని చెప్పబడినది కదా! పూర్వసుకృత పరిపాకము వనల సుబుద్ధి గలుగును. అట్టి వాడే శివుని అస్తిత్వమును గుర్తించ గలడు. ఈ వాస్తవమునెంతో రమ్యముగా చిత్రించి చూపెట్టెడి హలాయుధుని ఈ కృతిని గనుడి:

**శ్లో॥ సంసారే స్మిన్ ధ్రువమసులభం మానుషం జన్మలబ్ధ్వా**
**యుష్మానేకోభజతి సుకృతీ కశ్చిదన్యం చ దేవం।**
**ఆరూఢో పి స్మరహర గిరిం రోహణం భాగ్యయోగా**
**దేకోరత్నం కలయతి మహత్ కాచ మన్యశ్చఫల్గు॥** (హలాయుధస్తవము, శ్లో1110)

హలాయుధుని కృతిలోని భావమను యథాతథముగా చిత్రంచిన శ్రీశృంగారకవి వేంకట రామయ్యగారి యీ క్రింది పద్యమును గనుడి:

**మ॥ ఘనసంసారము నందు దుర్లభమనంగా నొప్పుమర్త్యత్వముం**
**గని ధన్యుండు భజించు చుండు నిను నొక్కం డన్యదైవంబుసే**
**వనజేయుంగద! రోహణాద్రిని మహాభాగ్యంబు చేక్కినన్**
**ఘనరత్నంబొక డొందు వేరొకడు దా గాచంబు జెందున్ శివా!** (ఆంధ్ర హలాయుధస్తవము, ప.10 శివపంచస్తవి.)

శివభక్తి గల్గుట యనెడిది దుర్లభమైన విషయము. శివభక్తి యనెడి రత్నమందరికి దొరకదు. గాజు ముక్కను గొని, యద్దానిని రత్నమని భ్రమించి భూభ్రమణముజేసెడి వారే యధిక సంఖ్యలో నుందురు శివ భక్తియే కీలకమైనదని గ్రహించ వలెను. శివానుగ్రహము లేని వారికి శివభక్తి కలుగదు. విహితావిహితములను, నిషిద్ధానిషిద్ధ కర్మలను లెక్కించకుండ, యిష్టానుసారముగా కర్మల నాచరించెడి వారిని శివుడియ్య గొనడు. శివ కార్యములు చేసిన వారికిహితమును కూర్చును. ఇట్టి వారు పిండస్థలమును చేరిన వారగుదురు. వారిలో శివుడే విధిన కన్పట్టునో తెలిపెడి వచనముగనుడి.

**ఉదకదోళగె బయ్చిట్ట బయ్కెయ కిచ్చినంతిద్దిత్తు**
**ససియెళగణ రసదరుచియంతిద్దిత్తు**
**ననెయొళగణ పరిమళదంతిద్దిత్తు,**
**కూడలసంగమ దేవర నిలవు కన్నెయస్నేహదంతద్దిత్తు**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది:

**ఉదకములో బెట్టబడిన కోరికల చిచ్చువలెయున్నది.**
**సస్యములోని రసపు రుచివలె యున్నది**
**ననము(మొగ్గ)లోని పరిమళమువలె యున్నది**

**కూడల సంగమ దేవుని నిలవు**
**కన్నియ స్నేహమువలె యున్నది.** (బసవేశ్వరుని వచనములు, మ॥. 1)

**-శివం భూయాత్-**

# పిండజ్ఞాన స్థలము

## ఆశీర్వచనము-1

వీరశైవ మహామతస్థాపనాచార్యులైన శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల చేత శ్రీ అగస్త్య మహర్షికి యుపదేశింపబడిన షట్స్థల బోధాత్మకమైన శ్రీ సిద్ధాంత శిఖామణి యొక్క నూటొక్కస్థలముల యందు క్రమ ప్రాప్తమైన రెంఢవస్థలమే పిండజ్ఞానస్థలము:-

పొలముయొక్క స్వచ్ఛత, విత్తిన బీజముయొక్క మొలకకు సహాయకమగునటుల అంతఃకరణము యొక్క పరిశుద్ధరూపమైన పిండస్థలము యొక్క స్థితియు ముందటి పిండజ్ఞానాది అవస్థల ప్రాప్తికై మూలమైయున్నది ఇటులనే "అనేక జన్మభాజనాత్ స్వవిచారం చికీర్షతి" అని శ్రీ విద్యారణ్యులవారు ప్రతిపాదించిరి.

వేదాంత శాస్త్రమునందైననూ "అధికారీతు విధివదధీత వేదవేదాంగత్వేనాపాతతో2 ధిగతాఖిలవేదార్థో 2స్మిన్ జన్మని జన్మాంతరే వా కామ్య నిషిద్ధవర్జనపురఃసరం నిత్యనైమిత్తిక ప్రాయశ్చిత్తో పాసనానుష్ఠానేన నిర్గతనిఖిల కల్మషతయా నితాంత నిర్మల స్వాంతః సాధన చతుష్టయ సంపన్నః ప్రమాతా" (వేదాంతసారము పు. 5) అని సదానంద యోగీంద్రులు వేదాంతశాస్త్రమునందు అధికారియొక్క లక్షణమును నిరూపించునప్పుడు వివేకవైరాగ్య, శమాది షట్కము మరియు ముముక్షత్వములనెడి సాధన చతుష్టయముల ప్రాప్తికి జన్మజన్మాంతరములయందు నిష్కామభావముతో నాచరించిన నిత్యనైమిత్తిక కర్మల పుణ్యప్రభావము చేత ప్రాప్తమైన నిర్మలాంతః కరణమే కారణమని చెప్పిరి.

అంతః కరణము యొక్క పరిశుద్ధత తర్వాత వేదాంతశాస్త్రములోని అధికారి యందు ప్రాప్తమైన వివేకము నిత్యానిత్య వస్తువిషయకముగా అయి యున్నయెడల వీరశైవ సిద్ధాంతమునందు పరిశుద్ధాంతః కరణి అయిన పిండయనెడి జీవునికి ప్రాప్తమయ్యెడి పిండజ్ఞానము రూప వివేకము ఆత్మానాత్మల విషయకమైనదని యెడిదిగమనార్హమైన విషయము. దీనినే శ్రీ జగద్గురు శ్రీ రేణుక భగవత్పాదులు ఈ విధముగా వివరించిరి.

**శ్లో॥ శరీరాత్మవివేకేన, పిండజ్ఞానీ స కథ్యతే**
**శరీరమేవ చార్వాకై, రాత్మేతి పరికీర్త్యతె**
**ఇంద్రి యాణాం తథాత్మత్వ మపరైః పరిభాష్యతే**
**బుద్ధతత్వగతైరౌద్ధైర్బుద్ధిరాత్మేతిగీయతే** (సి॥శి॥ 5-53-54)

శ్రీభగవత్పాదులవారు వీరశైవాభిమత వివేకముయొక్క స్వరూపమును మరియు ఆత్మ స్వరూపవిషయకములైన భారతీయ ధార్శనికుల విభిన్నపక్షములను సూత్రరూపముగా నుపదేశించిరి.

భారతీయ దర్శనముల యందు వైదిక మరియు అవైదికములని రెండు విధములుగనున్నవి. వేదాగమములు మన్నించి తదధీనముగనడిచెడివి వైదికములు వేదాగమములను మన్నించక స్వంతంత్రముగా నుండెడి మతములే అవైదికమతములు అవైదిక మతములు చార్వాక జైనము మరియు బౌద్ధములని మూడు విధములు. వైదికమతములు సాంఖ్య,యోగ,న్యాయ, వైశేషిక, పూర్వ మరియు ఉత్తర మీమాంసలని యారు విధములుగా నున్నవి.

ఉత్తరమీమాంసయని చెప్పబడెడి వేదాంత దర్శనమైననూ శక్తి విశిష్టాద్వైత, శాంకర, రామానుజ, మధ్వ, నింబార్క గౌడీయ, వల్లభ మరియు రామానందములని ఎనిమిది శాఖలు ఉద్భవించినవి.

ఈ వైదికదర్శనములయందు శక్తి విశిష్టాద్వైత, ద్వైత, మరియు విశిష్టాద్వైత సిద్ధాంతములు సనాతనములై యున్నవి.

భారతీయదర్శనముల పంక్తియందు ప్రథమముగా పరిగణింపబడెడిదై ననూ మిగిలిన దర్శనములకు ప్రతి పక్షముగ యుండెడిదె చార్వాకదర్శనము. ఇది ఉపనిషత్తులద్వారా విదితమగుచున్నది. "మేయంప్రీతి. విచికిత్సాఆస్తీత్యేకి నాయమస్తీతిచైకే," బహు ప్రాచీనకాలమునందు జనులు ఇహలోకము కంటె పారలౌకిక జీవనము గూర్చి బహు చింతించువారిగా నుండిరి. అందుకే, యజ్ఞము, యాగము, దానము, తపస్సు మొదలగు వ్రతముల నాచరించెడిదానిలోనే కాలమును గడపుటచేత భౌతిక జీవనమును తిరస్కరించు చుండిరి ఐహిక జీవనమును తిరస్కరించుచుండిరి. భౌతిక వాదులైన చార్వాకులు దీనిని సహించక, ఇటులనే విడిచిన యెడల ఐహిక జీవనమే అస్తవ్యస్తమగునని భయపడి, వైదికులతో నంగీకరించరైరి పుణ్యము, పాపము, దేవుడు, పరలోక జన్మాంతర మరియు దేహభిన్నమగు ఆత్మమొదలగు విషయములను అతికఠోరముగా ఖండించదొడగిరి.

బుద్ధిరహితమైన జన సామాన్యమునకు, వీరి మాటలు ఎంతో హృదయంగమముగా కన్పించెను. లోకమునందు వీరి యనుయాయుల సంఖ్యదినదినమునకు పెరుగజొచ్చినది. అందుచేత, యీ దర్శనమునకు లోకాయతమనెడి పేరు ప్రసిద్ధమైనది.

చార్వాక దర్శనము యొక్క మూల ప్రవర్తకులెవ్వరు? వారిగ్రంథము లెయ్యవి యనెడి ప్రశ్నలకు నిశ్చయాత్మకమైన సమాధానములు దొరకవు. అయిననూ, దేవతల గురువుగారైన బ్రహస్పతి, రాక్షసులను వంచించుటకై యీ శాస్త్రమును రచించిరనెడి పౌరాణికవార్త యొకటి గలదు. కొందరు, యీ పౌరాణిక వార్తను నమ్మజాలనివారై, యా పేరుగల మరొక వ్యక్తి యీ దర్శనానికి కర్తయై యుండునని నమ్ముచున్నారు. యీ దర్శనములోని విషయమలను నిరూపించెడి స్వతంత్రగ్రంథములు దొరకజాలవు. అయిననూ, వైదిక దర్శన కారులు, తమ తమ దర్శనములయందు, పూర్వ పక్షరూపముగా వీరి కొన్ని సిద్ధాంతములను పరిశీలించి ఖండించుట చేత యీ దర్శనపు పరిచయము గల్గుచున్నది.

ప్రియకరములైన సుందర వాక్యములచే తన సిద్ధాంతమును ప్రతి పాదించునదే, చార్వాక దర్శనమనెడి భావన యొకటి కలదు "చారు వాక్యస్యసః చార్వాకః" అనెడి వ్యుత్పత్తి యీ భావనను బలపరచుచున్నది చారు అనగాసుందరమైనదనియును, అట్టి సుందరమైన వాక్కుగల వాడే చార్వాకుడనియును గ్రహింపదగును. ఈ భావనను సమర్థించెడి యీ ప్రమాణమును పరిశీలించుడి:

**శ్లో॥ యావజ్జీవేత సుఖం జీవేత్**
**ఋణం కృత్వా ఘృతం పిబేత్।**
**భస్మీబూతస్య దేహస్య**
**పునరాగమనం కుతః॥**

జీవితాంతము వరకు సుఖముగా బ్రతుకవలెననియును, అప్పు చేసియైననూ నెయ్యిని త్రాగవలెననియును, బూడిదగా మారిన దేహము తిరిగివచ్చెడి దెట్లు? ఇట్టి భావనలను ప్రచారము చేసెడి యీ చార్వాక మతము ప్రీతి గొలుపకుండా ఉండునే?

వీరి సైద్ధాంతిక భావనలను వీరి మాటలలోనే తెలిసికొనుదము గావుత. జగత్తున నాల్గే భూతములు గలవు. అవి: భూమి, నీరు, తేజస్సు మరియు వాయువు ఈ నాల్గింటి వికారమే యీ చరార జగత్తు. ఈ నాల్గు భూతముల చేత నిర్మతమైనదే శరీరము ఆత్మ అనెడిది వేరుగా నుండదు. కామమే పరమ పురుషార్థము. కామమును పొందుటకై అర్థము (ధనము) సహకరించును, గానదానిని సంపాందిచు కొనవలెను. మోక్షమనెడిది లేనేలేదు మరణమే ముక్తి.

కొందరు దార్శనికులు శరీరముకంటెను ఆత్మభిన్నమైనదని తెలిపెడి మాట, జనులను మూఢులను జేసి మభ్యపెట్టుటకై చెప్పుమాట. ఆత్మ వేరే అయినదైన యెడల, యమ భటులు దానిని లాగికొని పోయేటప్పుడది గోచరించవలెను కదా! రాజభటులు అపరాధి శరీరాన్ని యీడ్చికొని పోయేటప్పుడు, శరీరమేవిధిన కన్పట్టునో, ఆ విధిన యమభటుల చేత తీసికొని వెడలబడెడి ఆత్మ యెందుకు గోచరించుటలేదు అందుచేత, ఆత్మయేదేహము, దేహమే యాత్మ అని చార్వాకుల వాదము. ( ఇక్కడ యమభటులు కూడా కన్పడరు)

దేహము నందున కన్పట్టెడి చైతన్యమైననూ భౌతికమైనదే. తమలపాకు, సున్నము, కాచు, వక్క పొడియును వేరువేరు వర్ణములకు చెందినవైననూ, నోటియందున వేసికొని, నమలుతూ ఉంటే, తాంబూలము యెరుపెక్కిన యట్లె, నాల్గు భూతములను శ్రీకరణ వలననే భౌతికశక్తి పుట్టు చున్నది. ఈ భౌతిక శక్తియే ఆత్మ, మనస్సు, సుఖము, దుఃఖము ఇచ్ఛ, కామము, క్రోధము వంటి యనేక రూపములను పొందును.

"సంయోగో విప్రయోగాంతః " అనే ప్రమాణము ప్రకారము, కూడినది విడిపోవుట జరిగియే తీరును. చతుర్భూతములు నొకానొకప్పుడు విడిపోవును. దానితో చైతన్య శక్తి యడుగంటును దేహిమృతుడనియని పించికొనును. ఈ రీతిగా అనాయాసముగా సంభవించెడి మరణమనెడి మోక్షము నిమిత్తమున వ్రతాదులను సలిపి కష్టపడవలసిన పని లేదు.

వేదానుయాయులు యజ్ఞాది వేదవిహిత కర్మలను చేయుటచేత అదృష్టము కారణమగు నని చెప్పుచుందురనియును, అది సత్యదూరమైనదని చార్వాకుల వాదన "నదృష్టం అదృష్టం" అనెడి వ్యుత్పత్తి మేరకు దానిని చూసిన వారేలేరు. చూడబడినచో అది అదృష్టముకానేరదు. కనబడనిదానికై చెయ్యిని చాచెడిది కష్టములను కొని తెచ్చుకొనుటయే.

కారణము లెనిదే కార్యముగల్గదు. సుఖదుః ఖములను ప్రత్యక్షముగనే అనుభవించుచున్నాము. వాటికి పుణ్యపాపములే కారణములను దానిలో ఔచిత్యము లేదు. కారణములు మనకు కన్పట్టుచునే ఉండును.

మనము అనుభవించెడి సుఖదుఃఖములు కారణాంతరముల వల్ల కల్పించబడినవే. వాటికి విశేషకారణములుండవు. కొంగకు తెలుపు, కాకికి నలుపు వచ్చుటలో నెట్టి విశేషములేదు, స్వాభావికముగా వాటికా రంగులు సంప్రాప్తమైనవి. ఒకవేళ ఒక్కొదానికి అదృష్టము, విశేషకారణములను జోడిస్తూపోతే కొన మొదలు తెలియని స్థితి సంప్రాప్తమగును. అందుచేత దాన ధర్మములు చెయుటచే పుణ్యము రాదు సురాపానాది నిషిద్ధపదార్థములను సేవించుట చేత నష్టముకాని, పాపము కాని సంభవించదు ఒక వేళ అవి ఉన్నవని వాదిస్తే అది మోసగించుటే యగును.

అందరూ సుఖదుఃఖములననుభవించుటకై కారణమైన యీ లోకము కాకవేరేలోకము లేనేలేదు. వంచకులైన వైదికులు చెప్పినయటుల జ్యోతిష్టోమాదియాగములు చేయుటచే దేహావసానానంతరము, దేవయానము ద్వారా స్వర్గమునకు పోయి, అమృతము చవిచూచి, సుఖములను పొందవచ్చుననెడిదియును, పర వధూగమనము మొదలగు పాపకర్మలచేత నరకమునకు పోయి కష్టపడుదురనెడిదియూ అవాస్తవములే. మృష్టాన్న భోజనము, మనోహరమైన వస్త్రాభణాధుల ధారణ, వనితాజన భోగములలో చిక్కుకొనుట వంటివే స్వర్గసుఖములు, శత్రుహింస, రోగాదుల చేత బాధలు పడుట, ఇళ్ళులేకుండగ గాలికి వానకు గురియగు చు బాధపడుట వంటివే నరక బాధలు.

వైదికులు స్వరసుఖములనాశించి చేసెడి యజ్ఞ యాగాదులలో దున్నపోతు యిత్యాదులను బలి యిత్తురు. మాంసభక్షణకై వారు తపించుచుండుటవల్లనే యజ్ఞయాగాదులు చేయుచున్నారు "యాజ్ఞికీహింసా హింసాన భవతి" అనే ప్రమాణమును చూపెదరు. వారు చేసేది హింసకాదట. వారు బలియిచ్చే పోతుకు స్వర్గము లభించునని తెలుపుదురు. అంతసులభముగా స్వర్గము లభ్యమైనయెడల, ఆ పోతుకు బదులుగా తమ తండ్రిని యెందుకు బలి యివ్వరు? వీటన్నిటి దృష్ట్యా యివన్నియును కాల్పనికములే.

తీర్థయాత్రలు చేసి, నదీ జలాలలో మునిగి నందున పాపము క్షయమగునని చెప్పుట సరియైనది కాదు. అదినిజమైన యెడల చేప, కప్ప ఇత్యాది జల చరములకు మోక్షము రావలసియుండును కదా! తలవెంట్రుకలను, గోర్లనుకత్తిరించకుండా ఉంటే బ్రహ్మచారి యంటారు. అట్లైన యెలుగు బంటి శ్రేష్ఠమైన బ్రహ్మచారి యగును భగభగమండెడి భర్త చితిలో భార్య భర్తతో సహా భస్మమైతే మోక్షమగునందురు. దీపానికి ఆకర్షితురాలై దీపమును తాకి దీపమువేడికి ప్రాణములు వీడెడి దీపపు పురుగు పరమపతివ్రత యగునుగదా! స్త్రీ సంపర్కము నెరుంగని వానిని బ్రహ్మచారియంటారే? మరి తాబేలు బ్రహ్మచారి కావలసి యుండును. గాలిని భుజించెడి వానిని యోగి అందురే?పాము యోగి కావలెను కదా! ఫలాదులు తింటూ ఉండెదివానిని తపస్వి అంటారే? అడవిలో పళ్ళుతింటూ ఒళ్ళుపెంచెడి కోతి తపస్వి యగునే? అందుచేత నుపవాస వ్రతాది నైష్టిక క్రియల వల్ల శరీరమునకు అనవసర ప్రయాసగల్గును. వీటి వల్ల కల్గెడి ఫలము శూన్యము.

కపట వైదికులు చెప్పిన యటుల ఆత్మ శరీరము కంటెను భిన్నమై యున్నయెడల ఆత్మపూర్వజన్మలో యే శరీరములో నివసించెను? అప్పటియనుభవము లెట్టివి? మొదలగువాటి స్మృతి ఈ జన్మలో గల్గవలెను గదా! ఎందుకు అవి స్మృతికి వచ్చుటలేదు? అంతే కాకుండా, మరణానంతరము స్వర్గమునకు వెళ్ళి, రంభ, మేనక, తిలోత్తమాది దేవ వేశ్యలతో సంభోగము సలిపి, సుఖములననుభవించి, "క్షీణేపుణ్యేమర్త్యలోకం విశంతి అనే ప్రమాణాను సారము భూలోకమున జన్మనెత్తెడిది నిజమైన యెడల దేహికి తాననుభవించిన స్వర్గభోగముల స్మృతి యెందుకు వచ్చుటలేదు? అందుచేత దేహమే ఆత్మ. ఆత్మ వేరుగా యుండదు.

జగత్తులోని ప్రతి యొక్క మనుష్యుడు, "అహంగౌరః" "అహంస్థూలః" "అహంకృషః" అనగా, నేను తెల్లవాడినని, నేను బలవంతుడనని, నేను బలహీనుడననియు తన శరీరమే తాను అనే బావమునను‌భవించు చున్నాడు. నేను తెల్లని వానిని, నేను ఎరుపు వన్నె గలవానిని, నేను పసుపువన్నెగల వానిని, నేను లావుగా నున్నవానిని, నేను బక్కపలుచని వానిని యనెడివే యిట్టి అనుభవము. తన శరీరమును మంచి తిండివలన బలోపేతము చేయుటలోనూ ఔషధ సేవనద్వారా రోగ నివారణ పొందుటలోనో అత్యుత్తమ రీతిలో వస్త్రాభరణాదుల ద్వారా అందచందములను పెంచికొని అద్దము యెదుట నిలిచి యాత్మసంతృప్తి పొందుటకైయత్నించుటలోనో నేటి వ్యక్తులు కాలమును గడుపు చుందురు.

"శరీరమే ఆత్మ" యనెడి దానిని బలపరచే ప్రమాణము శృతులలో లభ్యమగు చున్నవి. చాందోగ్యో పనిషత్తులో ఈవిధిన నున్నది.

పూర్వకాలము దేవతల రాజైన యింద్రునికిని, రాక్షసుల రాజైన విరోచనునికిని యొకే విధమైన కోరిక జనించెను. "ఆత్మజ్ఞానియైన వాడు శోక మోహములు లేని వాడై యుండుననియును, ఆత్మజ్ఞానికి సకల మనోరథములు నెరవేరుననెడి ఆత్మజ్ఞానము యొక్క ప్రఖ్యాతి దృష్ట్యా, అద్దానిని పొంది సకల మనోరథములను నేరవేర్చుకొనవలెననెడి యాకాంక్షగలెను. వీరిరువును బ్రహ్మ దగ్గరకు వెళ్లిరి, రెండుసంవత్సరముల వరుకు, బ్రహ్మచర్యవ్రతమునుపూని, బ్రహ్మను సేవించిరి. ప్రసన్నుడైన బ్రహ్మ వారు వచ్చిన కారణమేమిటని ప్రశ్నించెను. ఆత్మజ్ఞానమును బోధించి ధన్యులను చేయుమని వారిరువురునూ, విజ్ఞాపన చేసిరి. బ్రహ్మవారికి యీ విధిన ఉ పదేశించిరి.

''సాధ్వలంకృతౌ సువసనౌ పరిష్కృతౌ భూత్వోదకశరావే క్షేదామితితౌ సాధ్వలంకృ సువసకా పరిష్కృతౌ భూత్వోదశకరావే2వేక్షాంచక్రాతే తౌ హ ప్రజాపతిరువాచ కిం పశ్యథ ఇతి॥ .... ఏష ఆత్మేతి హెూవాచ్యే తదమృత మభయమే తత్ బ్రహ్మేతి తౌహ శాంత హృదయౌప్రొవ్రజతుః" (ఛాందో ఉ.8-8-2-3). మీరిరువురును, మంచి వస్త్రభూషణాదులను ధరించి యలంకృతులై నిండుగా నీళ్ళుగల తొట్టిలోనికి తొంగి చూడుడి, మీకు అమృతమయమైన ఆత్మస్వరూపము గోచరించునని బ్రహ్మోపదేశములోని భావము. వారావిధిననే జేసిరి. వారి శరీరపు ఛాయలే వారికి గోచరించెను. దానిని తమరి ఆత్మగా గుర్తెరిగి వారివారి స్వస్థలములకు వెళ్ళిరి.

బృహదారణ్యక శ్రుతియు శరీరమే ఆత్మయనెడి భావనలకు బలము నిచ్చుచ్చున్నది "అస్థూలం, అనణు, అహ్రస్వం, అదీర్ఘం, అలో హితు, అచ్ఛాయం," అనెడి వాక్కులలో ఆత్మగూర్చి తెలుపుచు, స్థూలము కాదు, సూక్ష్మముకాదు, హ్రస్వము, కాదు, దీర్ఘముకాదు, ఎరుపుకాదు, నలుపూకాదు అని ఆత్మయొక్క లక్షణములను వివరించనైనది. "అహంగౌరః", "అహంస్థూలః" అహం కృశం" అనెడి భావనలకివి విరుద్ధమైనవి కానేరవు. అందు చేత శరీరమే ఆత్మయగుచున్నది.

అంతేకాదు, "అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః సశృణోత్యకర్ణః (శ్వే. ఉ॥ 3-29) అనెడి శ్రుతి వాక్యములు ఆత్మను దేహముతో పోల్చి చెప్పబడినది కాళ్ళులేకున్ననూ నడవగలదు, చేతులులేకున్ననూ పట్టుకొనగలదు, కళ్ళు లేకున్ననూ చూడగలదు, చెవులు లేకున్ననూ వినగలదు అని యీ వాక్కులలోని బావము ఇట్టి లోకవిరుద్ధమైయున్న వాదనలు, నమ్ముట యెటుల?

చచ్చిపోయిన పితృదేవతల తృప్తికై అసంబద్ధమైన పితృకర్మలను చేయు చున్నారు. ఒక బ్రాహ్మణుడు పొట్టనిండాతిని, మీ పితృదేవతలు తృప్తిపొంది రనును అందులోని యదార్థమెట్టిది. ఒకరు తింటే మరొక్కరిపొట్ట నిండునే? బ్రాహ్మణుడు తింటే, బ్రతికి యున్నపుడు తండ్రికి పొట్టనిండునే? మండెడి దీపమునకు నెయ్యి లేదా నూనె వేసిన యెడల ఆరిన దీపము వెలుగగలదే? ఇది వృథా ప్రయాస కాదా? పాండవులు లక్కయింటిలోపడి దహింప బడిరని యెంచి ధృతరాష్ట్రమహారాజు చేసిన పితృకర్మలు వృధా అయిన యటులే, అన్నీ పితృకర్మలు వృధాగా వ్యర్థమగును. ఇటులనే, "యాగాత్ స్వర్గో భవతి" అనే మాటలను నమ్మిజనులు ఎంతో వ్యయమును చేసి నెయ్యి, చందనము, పట్టువస్త్రములు మొదలగువాటిని నిప్పులో వేసి వృథా చేయుచున్నారు. ఇట్టి చర్యలవలన చిక్కునది బూడిదయే! లేని స్వర్గము చిక్కుటయెట్లు?

అంతేకాదు, వైదికులు పని దొంగలైనందున, కష్టపడకుండా ఉదరపోషణ చేసికొనుటకై మన్నుతోను. రాళ్ళతోను, కట్టెలతోను, వెండి-బంగారములతోను విగ్రహాలను తయారు చేయించి, వాటికి వివిధ నామధేయములను కల్పించి, మందిరములను నిర్మించి ముగ్ధజనులను  మోసము చేయుచున్నారు. విచార శీలత గల్గిన వారు యిట్టి మోసమునకు నాస్కారము గల్గించవలదు.

"అప్యకార్య శతంకృత్వా భర్తవ్యాః స్త్రీసుతాదయః" అనెడి ప్రమాణమొకటిగలదు వంద అపకార్యములజేసి యైననూ భార్యాపుత్రులను పోషించికొనవలెనని యీ ప్రమాణములోని భావము. ఏ పనులను చేసినా తప్పులేదు. సుఖజీవనమే ముఖ్యమైన లక్ష్యమై యుండవలెను. ఈ దేహ మంతరించిన పిదప సుఖమూ ఉండదు. దుఃఖమూ ఉండదు. ప్రాణము పోయిన పిదప స్మశానమునకు మోసికొని వెళ్ళి కాల్చడమో పాతిపెట్టుటయో చేయుదురు ఆ పిదప అది పుటుట్ట యెట్లు? అందుచేత, మరణమే మోక్షము. మరణమనెడిది సులభముగా లభించునదే! ఇదిట్టుల యుండగా, బుద్ధిహీనులును వంచకులైన వైదికులు తమ పొట్టనింపికొనుటకై లేని పోనివి కల్పించి, అగ్నిహోత్రము చేయుమనియును, మరెన్నో వ్యర్థమైన నియమములను విధింతురు. ఈ నియమముల వలన యెట్టి ఫలితముండదని గ్రహింప దగును.

ఈ విధముగ దేహమే యాత్మ యనెడి తెలివిగల్గిన తెలివితక్కువ చార్వాక సిద్ధాంతమునకు చెందిన యీ మాటలను వినినపిదప యెట్టి ఆస్తికునికైననూ సందేహములు కల్గును. ఈ మాటలు రమణీయముగా నున్ననూ సైద్ధాంతికముగా సరియైనవి కావు. ఈ చార్వాకులలోని కొందరు శరీరమనగ యింద్రియముల సమూహమే యని యందురు. చెట్టులోని కాండము, వేర్లు, కొమ్మలు, ఆకులు, పువ్వులు, పిందెలు మొదలగునవి విడదీసి వేరు వేరుగా పెట్టిన యెడల, చెట్టును వెతికినా దొరకునే. అదే విధిన కాయము యొక్క కాళ్ళు, చేతులు, కళ్ళు, మొండెము విడదీసి పెట్టినచో శరీరమును నుండదు. నేను పోవుచున్నాను, నేను పట్టుకొను చున్నాను. మొదలగు వాటిలో 'నేను' అనే పదము, యింద్రియములనే సూచించుచున్నది గాన ఆత్మయనగ ఇంద్రియములె వీరి ప్రతిపాదనలలో కొన్ని యొక్కొక్క యింద్రియానికే ప్రాముఖ్యతనిస్తే, మరి కొన్ని యింద్రియముల సామూహిక స్వరూపమునకు ప్రాముఖ్యత నిత్తురు.

మన శరీరమునందు శ్రోత్ర, త్వక్, చక్షు, రసన, మరియు ఘ్రూణయనెడి ఐదు జ్ఞానేంద్రియములును, వాక్, పాణి పాద, పాయు మరియు నుపస్థయనెడి అయిదు కర్మేంద్రియములును, మనస్సనెడి అంతరింద్రియమును గలవు. వెరసి పదినొకండు యింద్రియములుగలవు. చనిపోయిన పిదప యీయింద్రియములన్నియును చైతన్యమును, చలన శక్తిని కోల్పోవును. అందుచేత జడములగు యింద్రియములు ఆత్మగా పిలువబడవు. ఈ కారణమున, చూసెడి, వినెడి వంటి వాటికి యాధారభూతములైన జ్ఞానేంద్రియములే ఆత్మయని గ్రహింపదగును. వీటిలోనూ సుఖప్రదాయకమగు నేత్రము శ్రేష్ఠమైనదియునూ, ప్రధానమైనదియూ గాన నదియె ఆత్మయని గుర్తెరుగవలెను అవి లేని యెడల క్రమముగా శ్రోత్ర, త్వక్, రసన మరియు ఘ్రూణములను, ఒకటి లేని యెడల మరొక్క దానిని ఆత్మగా గ్రహింప దగును, కర్మేంద్రియములలో జ్ఞాతృత్వశక్తి లేనందునను, శరీరములోని యితర భాగముల వలె జడములై యుండుట చేతను నవి ఆత్మగా పరిగణింప బడవు.

ఈ ఇంద్రియాత్మవాదులలో కొందరు, ఒక్కొక్క యింద్రియము ఆత్మకాజాలదని వాదిస్తూ, జ్ఞానేంద్రియముల సమూహమునే ఆత్మయను చున్నారు. ఇంకా కొందరు యింద్రియములకు ప్రేరకముగా నుండెడిదియూ, అంతరింద్రియముగా గుర్తింపబడినదగు మనస్సే ఆత్మయని ప్రతి పాదింతురు చూస్తూ ఉన్ననూ, విను చున్ననూ మనస్సు లగ్నమైయుండని యెడల యీ క్రియలు విఫలములగు చున్నవి గదా!

వీరిలో నొక వర్గము నొక విలక్షణమైన ప్రతిపాదనను చేసినది. పదియునొకటిగ గల యింద్రియముల కన్నింటికినీ స్ఫూర్తిని కల్గించెడి ప్రాణశక్తియే ఆత్మయని వీరు ప్రతిపాదించిరి. యోగాభ్యాసము చేత యింద్రియములను నిశ్చల స్థితిలోనికి తెచ్చి, మనస్సును నిరోధించి నిరంతరము ధ్యానములో మునిగియుండెడి యోగికి ప్రాణశక్తియే జాగరూకతతో నుండి, శరీరమును రక్షించుచున్నది. లేని యెడల యా శరీరమును పశు పక్ష్యాదుల నుండి రక్షించే వారెవ్వరునూ ఉండేవారు కారు.

ప్రాణశక్తియే సర్వశ్రేష్ఠమైన దనెడి యొక సుందరమైన దృష్టాంతమొకటి ఛాందోగ్యోపనిషత్తులో నివ్వబడినది. బ్రహ్మ యొక్క శరీరమును సృజించి, దానిలో ఇంద్రియములను, మనస్సును, ప్రాణశక్తిని నింపి భూలోకమునకు పంపెను ఇచ్చటకు వచ్చిన పిదప శరీరములోని యింద్రియాదులు పరస్పరము సఖ్యత భావనను నొందలేక "అహం శ్రేయానస్మి-అహం శ్రేయానస్మి" అంటూ వాదులాటకుదిగినవి నేను శ్రేష్ఠమైన దానినై యున్నాననేది యీ వాక్కుల లోని భావము శ్రేష్ఠమైనది యేది, అనే విషయముతేల లేదు. ప్రాణశక్తి బ్రహ్మ దగ్గరికి వెడలి యీ విధిన ప్రశ్నించి సమాధానమును గొనెను. "తేహప్రాణాః ప్రజాపతిమపీరమే త్యోచు భగవాన్ కోనః శ్రేష్ఠః ఇతితాన్ హోవాచ యస్మిన్ వఉత్ క్రాంతే శరీరం పాపిష్ఠ తరచ్ఛివ దృశ్యతేలే సవః శ్రేష్ఠ ఇతి" (ఛాఉ .5-1-7). ఓ భగవంతుడా! మాయందున శ్రేష్ఠులెవ్వరు- మీలో ఎవరు శరీరాన్ని వీడినచో నది క్రియాశూన్యమై యమంగళమైనదిగామారునో నదియే శ్రేష్ఠమైనదని బ్రహ్మ బదులు చెప్పెను.

బ్రహ్మ చెప్పిన విధిన యొక్కొక్క యింద్రియము శరీరమును కొంతకాలము పిదప వచ్చి తాను వీడి పోయినందు వలన గల్గిన పరిణామములు నెట్టివోయని గమనించినవి. మొదట వాక్కు వెడలి పోయి, ఒక యేడాది పిదప వచ్చి చూచెను. శరీరము మూగగా మారిననూ, అది మాటలాడుట మానలేదు వాక్కుకు బదులుగా సంజ్ఞల ద్వార మాట్లాడుట కొనసాగుచుండెను కళ్ళు, చేతులు ప్రధానమైన పాత్రను పోషించినవి. వాక్కులేని లోటును తీర్చినవి. వాక్కు, తాను శ్రేష్ఠతరమైనది కాదని గ్రహించినదై, యధావిధిన శరీరమున నుండెను.

తరువాత, కన్ను వెడలి పోయెను. గుడ్డివాడుగా మారిన శరీరము చూచెడిది కొనసాగించుచుండెను త్వక్కు, చక్షువుల పాత్రను పోషించెను. అదే విధిన మిగిలిన యింద్రియములును, మరియు మనస్సును వీడి పోయి గమనించినవి అట్టి చర్యల వల్ల శరీరానికి కొంత యిబ్బంది గల్గినా, ఎట్టి హాని సంభవించ లేదు శరీరము చైతన్యవంతమై యుండెను. చివరగా ప్రాణము శరీరమును వీడెను. మనస్సు చింతించుటను, ఇతర యింద్రియములు వాటి వాటి కార్యములు నిర్వహింప జాలనివై జడములుగా మారెను. చైతన్యహీనత పొందిన కాయము నమంగళమై పోయేను. క్రిమి కీటక పతంగాదులు కాయమునకు నష్టమును జేయజొచ్చినవి. అప్పుడు, యింద్రియములు మరియు మనస్సు, ప్రాణము యొక్క శ్రేష్ఠత్వమును అంగీకరించినవై "త్వం నః శ్రేష్ఠో సి మోత్క్రామితి" యని విజ్ఞాపన జేసినవి. నీవే శ్రేష్ఠమైన దానవు, శరీరమును వీడ వలదనెడిది యీ విజ్ఞాపన యొక్క భావార్థము. ప్రాణము శరీరమును వీడిన యెడల ఇంద్రియములు, మరియు మనస్సు తమ తమ అస్తిత్వమును కోల్పోయి నాశనమును చవి చూడగలవి గ్రహించిన వయ్యెను. ఈ దృష్ఠాంతము వల్ల ప్రాణమనెడిది శ్రేష్ఠతమమైనదని నిరూపింపబడినది.

ఉపనిషత్తులోని వాక్కులు వాస్తవములని తెలిపెడి సంఘటన లెన్నింటినో మనము నను నిత్యము చూడగలము.

ఇంకనూ చెప్పవలెననిన, మనమందరము ప్రగాఢమైన సుషుప్తి అవస్థలోనున్నప్పుడు ఇంద్రియము లన్నియును తమ తమ వ్యాపారములను విరమించికొని యుండును. అప్పుడు జాగరూకతతో నుండెడిది ప్రాణమొక్కటే కదా! తైత్తిరీయోపనిషత్తులోనూ, యీ పక్షానికి అనుకూలమైన ప్రమాణములు లభించుచున్నవి. గమనించుడి:

"తస్మాద్వా ఏత్తస్మాదన్నరసమయాత్। అన్యోంతరాత్మా ప్రాణమయః। తేనైష పూర్ణః సహ ఏష పురుషవిధ ఏవ" (తైత్తి. ఉ. 2-2) ప్రాణమే ఆత్మయనునది యిందులో గల భావము.

ప్రాణము, ఆత్మ పరస్పరము భిన్నమైనవనెడి వాదన యొకటి వీరిలో గలదు. అపంచీకృత పంచమహాభూతముల సమిష్ఠి రజోగుణము చేత నుత్పన్నమైన ప్రాణమునకు జ్ఞానప్రధానమైన గుణములేదు. ఇది క్రియాప్రాధాన్యత గల్గినట్టిదే. అందుచేత జడలక్షణములు గల్గినదగు చున్నది ఈ విషయమున నొక దృష్ఠాంతము నివ్వవచ్చును రాత్రి వేళ పరుండియున్న యొక ఆడపిల్ల ముక్కుననున్న ముక్కుపుడకను దొంగ దొంగిలించికొని పోవుచున్నయెడల, ముక్కుననే తిరుగాడెడి ప్రాణవాయువు వానిని నిరోధింపలేదు. ఆమెను లేపనూ లేదు. ఆమె మెల్కొనిన పిదప, దొంగతనము యే విధిన జరిగినదో తెలియజెప్పనూ లేదు ఇట్టి జడమైనది ఆత్మ యెట్లగును? దశేంద్రియములకును, మనః ప్రాణములకు, నిర్ణయములను ప్రదానము చేసి తద్వార వాటి వ్యహారములకు కారణముగా నిలిచే బుద్ధియే ఆత్మయని యీ పక్షము ప్రతి పాదించినది "అన్యో ంతర ఆత్మావిజ్ఞానమయః" యనెడి తైత్తిరీయ ఉపనిషత్తులోని ప్రమాణము (తై. ఉ. 2-4) యీ వాదమునకు బలమునిచ్చినది. విజ్ఞానమే ఆత్మయనెడిది ప్రమాణములోని భావము అందుచేత విజ్ఞానమును గల్గించెడి బుద్ధియే ఆత్మయని వీరు వాదించిరి.

బుద్ధియే ఆత్మయనెడి సిద్ధాంతమును బౌద్ధసిద్ధాంతమందురు. అందుచేతనే, "బుద్ధి తత్వ గతై ర్బౌద్ధై ర్బుద్ధిరాత్మేతి గీయతే" అని శ్రీ భగవత్పాదులవారు నుపదేశించిరి.

బుద్ధితత్త్వ గతులైన బౌద్ధుల చేత బుద్ధి, ఆత్మగా చెప్పబడుచున్నదని యీ వాక్కులలోని భావము బౌద్ధము గౌతమబుద్ధుని చేత ప్రతిపాదింపబడినదనే అభిప్రాయము నెలకొని యున్నందున, సుమారు రెండు వేల సంవత్సరముల క్రితము బౌద్ధమతమును ప్రతి పాదించిన గౌతమ బుద్ధుని కంటెను శ్రీ భగవత్పాదులు అర్వాచీనులా? యనెడి సందేహము గల్గును. అట్టిసందేహమున కాస్కారము లేదు. బౌద్ధమతము గౌతమ బుద్ధుని పేరున ప్రచారములోనికి తే బడిననూ, వీటిలోని భావములన్ని యునూ ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడినవీ. శ్రీ భగవత్పాదులవారు ఉపనిషత్తులలోని భావములను చెప్పుచున్నారనియును, గౌతమబుద్ధుని కంటెను ప్రాచీనుడనియును గ్రహించవలెను. సిద్ధాంతశిఖామణిని గ్రంథస్థము చేసిన, శ్రీ శివయోగి శివాచార్యుల వారు, తమ గ్రంధారంభమున

తమగురించి తామే వ్రాసి కొనుచు "బౌద్ధాది ప్రతి సిద్ధాంత మహాద్వాంతాంశు మాలినా" అని తెలిపిరి బౌద్ధాది ప్రతిపక్షములోని సిద్ధాంతములను అంధకారముతో పోలుస్తూ, తాను సూర్య కిరణములను వెదజల్లి యా చీకటిని దూరము చేసెడి వాడినని, శ్రీశివయోగి వాక్కులలోని బావము శ్రీ శివయోగులవారు ఏడవ శతాబ్దికి చెందిన వారైనందున యీ విధిన వ్రాసిరి రేణుకాగస్త్య సంవాదమును గ్రంథస్థము చేసిన శ్రీ శివయోగి శివాచార్యులు గౌతమ బుద్ధుని కంటెనూ ఆర్వాచీనులైననూ శ్రీ రేణుక భగత్పాదులు ప్రాచీనులే. జిజ్ఞాసులు, యీ విషయమున రచింపబడిన బహువిస్తారమైన సాహిత్యమును సంప్రందించగలరు ఈ సాహిత్యమున ప్రవచనప్రభ కృతి కర్తకు చెందిన రచనలు గలవు. వీటిలో మేమువ్రాశిన సిద్ధాంత శిఖామణి–సమీక్ష అనేది సంస్కృత ప్రబంధమును అవలోకించగలరు. ఈ విషయమును గురించిన చర్చ ఈ గ్రంథములోని పరిచయ భాగమున కలదు.

ప్రకృతమున గౌతమబుద్ధుని చేత ప్రతిపాదింపబడిన సిద్ధాంతమును సంక్షిప్తముగా పరిశీలింతుముగావుత. ఈ సిద్ధాంతమునందున ప్రపంచమును "బాహ్యసముదాయము" మరియు "అభ్యంతర సముదాయమని విభజింతురు. భూతి, గుట్ట, నది, సముద్రము మొదలగునవి బాహ్యసముదాయమునకు చెందినవి. ప్రతి ఒక్కరి యంతరంగముననుండెడి సుఖము, దుఃఖము, రాగద్వేషములు, కామక్రోధములు మొదలగునవి రెండవ కోవకు చెందినవి. వీటిలో బాహ్యసముదాయమును చెందినవి ఖర, స్నిగ్ధ, ఉష్ణము మరియు యీరణ అనబడెడి నాల్గు విధములైన పరమాణు పుంజముల నుండి యుత్పన్నమగును అభ్యంతర సముదాయమునకు చెందినవి రూపస్కంద, విజ్ఞానస్కంద, వేదనాస్కంద, సంజ్ఞాస్కంద మరియు సంస్కారస్కందములనెడి పంచస్కందములనుండి యుత్పన్నమగును. చెవి, ముక్కు, కన్ను, చర్మము, నాలిక, యనెడి జ్ఞానేంద్రియములకు గోచరించెడి శబ్ద స్పర్శ, రూపరసగంధములనెడి విషయములకే రూపస్కంద మనెడి పేరు వీటికంటెను వెలుపల నభివ్యక్తమయ్యెడి దానికే విజ్ఞానస్కందమనెడి పేరు శబ్దస్పర్శాదుల చేత గల్గెడి సుఖ దుఃఖాదుల అనుభవమును వేదనా స్కందమందురు. దేవదత్తాది నామములనే సంజ్ఞాస్కందమని యెదురు. వీటిలో నుండెడి వాసనలనే సంసారస్కందమని యందురు. శరీరేంద్రియాదులు క్షణికమైనవనీ తెలిపెడి యీ ప్రమాణమును గమనించుదు:

**శ్లో॥ క్షణాదూర్ధ్వం నతిష్ఠంతి శరీరేంద్రియ బుద్ధయః ।**
**దీపార్చిరివ వర్తంతే స్కందాః క్షణ విలంబినః ॥**

స్కందములన్నియును క్షణికమైనవని శ్లోకములోని బావము, దీపమును నుపమానముగా నివ్వనైది క్షణికమైన వాటిని గూర్చిన విజ్ఞానమే ఆత్మయని యీ సిద్దాంతము యొక్క రాద్ధాంతము. బౌద్ధములోగల వివిధ భేదములను తెలియజేసెడి యీ ప్రమాణమును గమనించుడి:

**శ్లో॥ అధికారానుగుణ్యేన బౌద్ధశాస్త్రం చతుర్విధం।**
**ప్రత్యక్షగమ్యం బాహ్యార్థమితి సౌత్రాంతికో బ్రవీత్ ॥**
**బుద్ధ్యాకారానుమే యార్థో బాహ్యోవైభాషి కోదితః ।**
**బుద్ధిమాత్రం వదంత్యత్ర యోగాచారోనచాపరం।**
**నసన్నాసన్నసదసన్న చోభాభ్యాం విలక్షణం।**
**చతుష్కోటివినిర్ముక్తం తత్త్వం మాధ్యమికా విదుః॥**

బౌద్ధము నాల్గు విధములనియును, బుద్ధుని శిష్యులైన వైభాషిక, సాతాంత్రికుని, యోగాచార మరియు మాధ్యమికులనెడి వారి చే నివి యేర్పరచ బడినవి. జగత్తుగూర్చి వీరిలో విభిన్నమైన యభిప్రాయములు గలవు. సౌతాంత్రికుని ప్రకారము బాహ్యమునందు ప్రపంచముగలదు. ఇది ప్రత్యక్షముగా ప్రతీతి యందుగలదు. వైభాషికుని మతము జగత్తు బయటికిదోచదు. అయితే బుద్ధియందుననుభవమునకు వచ్చుట చేత సద్దానిని బాహ్యమున గలదని, అనుమానము వలన గ్రహించవలెను. యోగా చార్యుడు, జగత్తు లేనే లేదు. అది మనబుద్ధిలోనే గలదు. మాధ్యమికుడు, శూన్యవాదమును ప్రతిపాదిస్తూ, లోనగాని, వెలుపల గాని, సద్రూపమున గాని, అసద్రూపమున గాని లేనే లేదు. "సర్వం శూన్యం" అంతయూ శూన్యమే.

ఈ నాల్గింటిలో సౌత్రాంతికులు, వైభాషికులును లోన వెలుపలగల వస్తువులన్నింటినీ అంగీకరించి, వాటికి క్షణికత్వమును ఆపాదించిరి, క్షణికత్వమనగా, ప్రతిక్షణముననూవస్తువు పుట్టి, నాశనమగునని అర్థము వీరు విరక్తులైయుందురు. యోగాచారులు, "ప్రతిమావనితా న్యాయము" చేత బాహ్యవస్తువులనన్నింటిని విజ్ఞానమనెడి మనస్సునచేర్చి మనోనియమముతో వైరాగ్యోపదేశమును

చేసిరి. మాధ్యమికులు దీనిన ఒప్పక, బాహ్యములేదు, అంతరమూ లేదనుచు మధ్యస్థులై యుందురు. వీరు సుషుప్తావస్తయనెడి గాఢనిద్రావస్థను చూచి, సర్వశూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చి యుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, దానిని జాగ్రదవస్థతో పోల్చి వైరాగ్యమునుపదేశింతురు.

వీరియందు, మాధ్యమిక సిద్ధాంతులు, ప్రపంచమును బాహ్యముననూ, అభ్యంతరముననూ నిరాకరిస్తూ, శూన్యవాదమును ప్రతిపాదించుటచేత, వీరికి నిర్వాణప్రాప్తి యోగ్యత అధికముగా నుండుట చేత, యీ మార్గమును మహాయాన మార్గమందురు. మిగిలినవి, ప్రపంచమును నేదో నొక మాధ్యమమున సంగీకరించుట చేత, వారిని కనిష్ఠులనిగా యెంచి "హీన యాన" మనెడి పేరు యివ్వనైనది.

మెత్తము మీద, ప్రపంచము యొక్క అస్తిత్వము గురించి భిన్నాభిప్రాయములున్ననూ, క్షణిక విజ్ఞాన రూపమైన బుద్ధియే ఆత్మయనెడి విషయమున నేకాభిప్రాయము గలదు. అందుచేత, బౌద్ధ సిద్ధాంతముచేత బుద్ధియే ఆత్మయనెడి విషయము నిర్ధారింపబడినది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ది. 22-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు విద్యావాచస్పతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామి వారు ఆత్మానాత్మ వివేచన నుపదేశముగా ననుగ్రహించిరి. కాయమే ముఖ్యమైన దైయున్నదనెడి నిరీశ్వర వాదము నిశితముగా పరిశీలించిరి. బుద్ధియే ఆత్మయనెడి వారి గూర్చి వివరణనిచ్చిరి. ఆత్మ యీ రెంటికి భిన్నమైనదై యుండునని తెలిపిరి.

అంగస్థలములలో పిండస్థలము, పిండజ్ఞానస్థలములెంతో ముఖ్యమైనవి పిండస్థలము గురించి తెలిసికొంటిమి. ఇప్పుడు పిండజ్ఞాన స్థలము గూర్చి తెలియజెప్పబడుచున్నది. శ్రీ భగవత్పాదుల వారు ఈ స్థలమున ఆరు శ్లోకముల పరిమితి మేరకు ఉపదేశమును కటాక్షించిరి వీటికి సంబంధించిన యుపదేశములలో పిండజ్ఞానియెవ్వడి? అని తెలుపుచు ఈ క్రింది సూత్ర త్రయమును కటాక్షించిరి.

1) శరీరాత్మవివేకేన పిండజ్ఞానీ సకథ్యతే
2) ఆత్మస్థితి వివేకీయః పిండజ్ఞానీసకథ్యతే
3) ప్రేరకం యో విజానాతీశ్వరః పిండజ్ఞానసకథ్యతే

ఈ మూడింటిలోను వివేకము మరియు జ్ఞానము అనెడి రెండంశములకు ప్రాముఖ్యత నివ్వబడినది. అమరసింహుని ప్రకారము వివేకమునగా ప్రకృతి - పురుషులు వేరని యెరుగుటయే "వివేకః పృథగాత్మితా" అనెడివి వీరి వాక్కులు మోక్షసాధనమైన బుద్ధినే జ్ఞానమని యందురని చెప్పబడినది. "మోక్షేధీరాజ్ఞనమ్" అని అమరకోశములో తెలుపబడినది పురుషుని గురించి తెలిసి కొనకుండగ మోక్షమునకు సంబంధిచిన వివేచన చేపట్టలేదు. అయితే ఆత్మ తత్వమెరుగ కుండగ పురుషతత్వమవగతము కాదు. ఈ కారణము చేత ఆత్మజ్ఞానము కీలకమైనదిగా గుర్తించ వలెను.

ఆత్మయనెడి పదము యొక్క అర్థము బహువిధములుగా నున్నదని తెలిపెడి అమరకోశములోని యీ నుడువులు గనుడి:

**"ఆత్మాయత్నో ధృతి ర్బుద్ధి స్స్వభావో బ్రహ్మవర్ష్మచ"**

ఆత్మశబ్దమునకు యత్నము, ధైర్యము, బుద్ధి, స్వభావము, పరమాత్మ మరియు శరీరము అనెడి అర్థములు కలవని దీనిలోని భావము మరొక సందర్భమున, అమరసింహుడు, "క్షేత్రజ్ఞః, ఆత్మాపురుషః" అని చెప్పెను. ఆత్మకు క్షేత్రజ్ఞ, పురుషః అనెడివి పర్యాయపదములని దీని లోని భావము "అతతి సంసరతీత్యాత్మా" అనెడి వ్యుత్పత్తి ప్రకారము సంతతము సంసారమునందు తిరుగాడెడి వాడే ఆత్మయని చెప్ప బడినది "అత్తి స్వకర్మఫలమితి-ఆత్మా" అనెడి వ్యుత్పత్తి ననుసరించి ఆత్మయనగా స్వకర్మ ఫలముననుభవించెడి వాడు.

శైవదర్శనములు జీవుడుఅనెడి పదమునే యుపయోగించిరి. దర్శనములలో పురుషపదము ప్రయోగించబడినది ఆత్మ పదమెక్కువగా వేదాంత వాఙ్మయమున నుపయోగింపబడినది. భగవద్గీతలో క్షేత్రజ్ఞుని విస్తృతమైన చర్చ గలదు.

వీరశైవమున షట్త్రింశత్ తత్త్వములు గలవు అందులో ఆత్మ యనెడి తత్త్వము లేదు. కాని "పురుష" అనెడిది తత్త్వము గలదు. "పురిశరీరే శేతః ఇతి పురుషః" అనెడిది పురుషపదము యొక్క సామాన్యార్థము. శరీరము నందుండువాడు అనెడిది దీనిలోని యర్థము. తాత్త్వికముగా దీనికి మరొక అర్థము ఇవ్వబడినది.

"పంచ కంచుకముల చేత బద్ధుడైన వాడే పురుషుడని చెప్పబడినది. కలా, విద్య, రాగ, కాల మరియు నియతులే పంచకంచుకములు, శివుని ఐశ్వర్యములైన సర్వకర్తృత్వము, సర్వజ్ఞత్వము, పరిపూర్ణత్వము, నిత్యత్వము, వ్యాపకత్వముల సంకోచిత రూపములే యని చెప్పబడినది.

ఇది యిట్టులుండగా, వీరశైవమునకు నిర్వచనమును ప్రదానము చేసెడి సందర్భమున శ్రీ భగవత్పాదుల వారు "విశబ్దేనోచ్యతే విద్యా శివజీవైక్య బోధికా। తస్యాం రమంతే యే శైవా వీరశైవాస్తుతే మతా॥" అని యుపదేశించిరి. ఇచ్చట జీవ పద ముపయోగింపబడినది. అయితే, పిండజ్ఞాన స్థలమున ఆత్మానాత్మ వివేకముగురించి పిండుడు యెందుకు తెలిసికొన వలెననెనో? యనెడిదొక మర్మగర్భిత విషయమని యెంచ వచ్చును. పిండస్థలమున నున్నవాడు పూర్ణ భక్తుడు కాదు ఇతడు శివదీక్షను పొందిన పిదప భక్తుడగును అట్టివానికి యవసరమయ్యెడి పరిజ్ఞానమును అతనికి తెలియజేయ వలెనని యీ విధముగా తెలిపెనేమో?

ఈ మర్మము లోని భావమేమనగా శరీరమునే ఆత్మగానెంచెడి చార్వాక మతము, బుద్ధినే ఆత్మగా నెంచెడి బౌద్ధధర్మములు సరియైనవి కావని తెలుపుటయే ఆచార్యుల వారి యుద్దేశము. ఈ మర్మమునెరింగిన వాడైన పాలకురికి సోమనాధుల వారు, పండితారాధ్య చరిత్రలో, వాద ప్రకరణము నందున యీ ధర్మములను పరామర్శించి విమర్శించిరి. శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారును, ఈ మార్గమునే యవలంబించి ఆశీర్వాదమును కటాక్షించిరి.

ప్రేరకునిగా ఈశ్వరునికి గల ప్రాముఖ్యతను తెలియజెప్పుటకే నిరీశ్వరవాదములైన చార్వాక బౌద్ధములు విమర్శింపబడినవని గుర్తించవలెను. పిండస్థలమున నున్న వారిలో శివభక్తిని దృఢతరము చేయుటయే ముఖ్యమని శ్రీ భగవత్పాదుల వారు భావించిరి.

నాస్తికవాదములను పరామర్శించి, వాటిని కోలాహలములని విమర్శించుచు, తన ఆస్తిక భావములను సమర్థించెడి పుష్పదంతుని యీ క్రింది స్తుతి గమనార్హమైయున్నది.

**శ్లో॥ ధ్రువం కశ్చిత్ సర్వం సకల పరస్త్వ ధ్రువమిదం**
**పరోధ్రవ్యాధ్రవ్యే జగతి గదతి వ్యస్త విషయే।**
**సమసే ప్యేతస్మిన్ పురమథన తైర్విస్మిత ఇవ**
**స్తువన్ జిహ్రేమి త్వానఖలు నను ధృష్టా ముఖరతా।**

"ఓ శివా! భాట్టమతీయులు ఈ జగత్తును నిత్యమని యందురు. బౌద్ధులు అనిత్యమని యందురు జైనులు నిత్యానిత్యములని యెంతురు. ఈశ్వరునితో గల సంబంధము అవాస్తవికమని కోలాహలమును చేయు చున్నారు నేను నిన్ను జగత్కర్తగా స్తుతించెడి సాహసమును చేయుచున్నాను. అల్పజ్ఞుడైన నేను పరిహాసపాత్రుడనగు చున్నాను ఇట్లని నేను ఊరకే ఉండను. ఎవ్వరి ప్రాగల్భ్యమైనను ధైర్యసహితమై యుండును కదా!" అనెడిది పుష్పదంతుని స్తుతిలోని భావము.

లిం॥ పండిత చిదిరె మఠం వీరభద్ర శర్మ (కాశీ జగద్గురువులు) గారు, ఈ స్తవమును గూర్చి యీ క్రింది విధముగా వ్యాఖ్యానమును చేసిరి. (శివపంచస్తవి)

మీమాంసా శాస్త్రమున కుమారిల భట్టుని సిద్ధాంతమునకు భాట్టమనియును, ప్రభాకరుని వాదమునకు ప్రాభాకరమనియుని పేర్లు గలవు.ప్రభాకరుడు కుమారిలునికి శిష్యుడైనను ఉభయునకు భిన్నమతము లేర్పడెను కుమారిలుడు గురువుకావున గురుమతమనియును భాట్టమతమునకు మారుపేరు గల్గేను. ఇందు జగత్తు ప్రవాహరూపముగ నిత్యమనియును సిద్ధాంతము గలదు. బౌద్ధులు సర్వమును క్షణికమనియును శూన్యమనియును జెప్పుదురు. జైనులు స్యాద్వాదులు, అనగా "జగత్తు నిత్యము కూడ కావచ్చును అనిత్యమును కావచ్చును" అనువాదమును గల్గియున్నారు. (ఇందు ఆకాశాది పంచకములు నిత్యము. ఘటపటాదులు అనిత్యములు)"

ఈ విధముగ నిరీశ్వరవాదములు అవాంఛనీయములని తెలియుచున్నది పిండస్థలమున నున్న సాధకుడు పుష్పదంతుని వలె అచంచలమైన శివభక్తిని గల్గియుండి భాట్టబౌద్ధాది మార్గములు అవిహితములనెడి 'జ్ఞానము' ను పెంపొందించి కొనవలెను.

భాట్టాదుల యుపదేశముల గూర్చియెట్టి భావము గల్గియుండవలెనో యని తెల్పెడి యీ వేదసారము లోని పద్యమును గనుడి:

సీ॥ **జైమినికృతపూర్వ మీమాంసకులు నుచితావర్థంబు తాదైవమని తలంచి**
**కర్తలేదని కర్తకర్మంబయని "స్వర్గకామోయజేత్తని కర్మకాండ**
**భాట్ట శాస్త్రంబను భాష్యంబుసేయ భట్టాచార్యలింగమిట్లంతరింప**
**బొరిమహిమ్నమున "ముఖరయతి మోహాయ జగతామనుచు ధర్మశాస్త్ర మతము.**
**దొడరుదాను కాన దూష్యంబులగుచును**
**మేలు గాని వాని నేల చెప్ప**
**గాకమున్ను వేరె కర్మవాదంబట్ల**
**పడయగలరె ముక్తి బసవ లింగ॥** (చతుర్వేదసారము, ప. 163,)

పిండస్థలమున నున్న వారు వీరమహేశ్వరా చారసంపన్నుడైన పాలకురికి సోమనాథుల వారి పై వాక్కులను పరిపాలించ వలెను.

చార్వాకుల వాదనలను సమీక్షించి, అదియేవిధిన నిర్హేతుకమైన దో యనెడిది పండితారాధ్య చరిత్రలోని వాద ప్రకరణమును వివరింప బడినది ఈ రెంటికి గల సంబంధము గూర్చి యీ విధిన చెప్పబడినది:

సీ॥ **నొడలు విడువకున్న నొడలి తో నాత్మ**
**యడబడనిద్రించి యుండియు వేఱ**
**చన్న జాగ్రత్వంబు స్వప్నంపునెరుగు**
**చున్నది యాత్మయొ యొడలొ వీక్షింప**
**సందడి నయ్యాత్మ జాగ్రత్క్రియాదు**
**లందును స్వప్న క్రియాదుల యందు**
**నలరి నిమిత్తంబులైన కర్మములు**
**దలయెత్త తత్కర్మఫల కాంక్షయున్న**
**భూత సూక్ష్మంబుల చేత నారబ్ధ**
**మైతనరెడు నొడళ్ళంద వ్యాపించి**

ఆ॥ **ఘనకర్మఫలములాకాంక్షబోగింప**
**తను బొందునాయాస జనిత విశ్రాంతి**
**మానంబు వ్రాపింప మసలు సుషుప్తి**
**దానిట్లు పరలోకయానవర్తనము**
**నాత్మయు నొడలు వేరై యుండి యుండ॥** (పండితారాధ్యచరిత్ర, వాద ప్రకరణము)

దేహము ఆత్మ కంటెను భిన్నమైనదని సోమనాథుడు నిరూపించెను. తన్ని మిత్తమై బహువిధములైన దృష్టాంతముల నొసంగెను.

పామరజనుల కాకర్షణీయముగా నుండెడు చార్వాక వాదముల చేత ప్రభావితుడు కాకుండగా పిండస్థలములోని భక్తుడు, శివుడు ఉన్నాడనియెడి ఆస్తిక బావనను పెంపొందించి కొనవలెను. చారు తరముగా నుండెడి చార్వాకుల చారు వాక్యముల ప్రభావము నుండి విడిపడి వీరశైవ తత్వము యెడల యనురాగమును పెంచి కొనవలెను. అదియంత సులభతరమైనది కాదని గ్రహించగలరు.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-2

**శ్లో॥ నేంద్రియాణాం న దేహస్య న బుద్ధేరాత్మతా భవేత్।**
**అహం ప్రత్యయవేద్యత్వాదనుభూతస్మృతేరపి॥**
**శరీరేంద్రియ బుద్ధిభ్యో వ్యతిరిక్తః సనాతనః।**
**ఆత్మస్థితివివేకీ యః పిండజ్ఞానీ స కథ్యతే॥** (సి.శి.5-55-56)

భారతీయ అవైదిక సిద్ధాంతులు ఆత్మగురించి ఏ రీతిన యాలోచించిరో యనెడిది ఆయా సిద్ధాంతముల కనుగుణముగనే సూక్ష్మముగా పర్యావలోకన చేయనైనది. వీరు ప్రతిపాదించిన యటుల, శరీరము గాని, యింద్రియములుగాని, మనస్సుగాని, బుద్ధిగాని ఆత్మ కాజాలవని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిరి. గమనించండి:

**"నేంద్రియాణాంన దేహస్య నబుద్ధేరాత్మతా భవేత్।"** (సి.శి.5-55)

నేను యనెడి యనుభవాత్మక జ్ఞానమునకు విషయమై శరీరాదులకంటెనూ విలక్షణమైన సనాతన తత్వమే ఆత్మయనియును, దీనినెరింగిన వాడే పిండజ్ఞానియని శ్రీ రేణుక భగవత్పాదుల వారుపదేశించిరి. సద్యః పూర్వోక్త మతములను నిరాకరించిరి.

"అహం", "మమ" యనెడి రెండు వస్తువులు గలవు. నేను, నాది యనెడివి వీటి యర్థములు. వీటిలో 'అహం" అనెడిది ఆత్మ. మమ అనెడిది అనాత్మ పదార్థము నేను, నాది అనబడెడి అనుభవపు కొలమానము ద్వారనే, ఆత్మ, అనాత్మ తత్వముల విస్తృతిని తెలిసికొన వలెను. ఒక దీపమును వెలిగించిన పిదప, ఆ దీపము నెక్కడ పెట్టిననూ, దాని చుట్టు ప్రక్కల నున్న ప్రదేశములకు వెలుతురు వ్యాపించును అదే విధిన 'నేను' అనే ఆత్మ తత్వము శరీరములో నిలిచియున్ననూ, నావి అనెడివి దీపపు కాంతివలె బహుదూరము వరకు వ్యాప్తి చెంది యుండును.

అనాది కాలము నుండియును, అజ్ఞానము కారణమున, నిజమైన ఆత్మతత్వమునెరుగని వాడై, శరీరాది యనాత్మ పదార్థము తాననెడి భ్రమలో చిక్కికొని, తన నిజ స్వరూపమును మరచెను. తత్ఫలితముగా, జనన-మరణ చక్రమున చిక్కికొని పరితపించు చున్నాడు. అందు చేతనే, అనుభావులు "ఎరిగిన నెడ శరణుడు, మరచిన నెడ మానవుడు" అని అనిరి. నిజమెరిగిన నిజగుణుల వంటి వారు, "నేనెవరిని" అని విచారించవలెననీ తెలియచెప్పిరి. యీ ప్రశ్న ఎవరికి వారే వేసికొని, విజ్ఞతపెంచికొన వలెను. తనను తానెరిగిన వాడే మహాత్ముడు తనను తాను మరచి, ఇతరముల నెంత యెరిగిననూ ఫలితము శూన్యమే. అట్టి వాడు మహాత్ముడని పించి కొన జాలడు. ఆత్మజ్ఞానము యొక్క గొప్పతనమును కొనియాడుచు, సర్వజ్ఞులవారు చెప్పిన త్రిపది గమనార్థమైయున్నది.

**తన్న తానరితవంగె భిన్నభావనెయిల్ల!**
**తన్నవరిల్ల పరరిల్ల త్రైభువన।**
**తన్నోళగిహుదు సర్వజ్ఞ**

దీని తెలుగు రూపమిది:

**తనను తానెరిగిన వానికి భిన్న భావన లేదు।**
**తనవారు లేరు, పరులులేరు, త్రైభువనము**
**తనలోనే వుండును సర్వజ్ఞ॥**

ఇట్టి అరయిక మానవునికి మాత్రమే గల్గును. మానవజన్మకు వచ్చి, తానెవరో తానెపరో తెలిసికొన కుండగ ఉండిన యెడ నది యనర్థదాయక మగునని గుర్తెరుగవలెను. ఈ విషయమును తెలుపుచు, మనలను హెచ్చరించెడి యీ ఉపనిషద్వాణిని గమనించుడి:

**శ్లో॥ ఇహచేదవేదీదథ సత్యమస్తి।**
**నచేతి హోవేదీన్మహతి వినష్టిః॥** (కేన. ఉ.2-5)

ఆత్మజ్ఞానమును పొందుటకు యత్నించని వాడు ద్విపాద పశువని కొందరు మహానుభావులు సెలవిచ్చిరి.

జగత్తులోని సకల పదార్థముల జ్ఞానమును పొందుట కంటెను, తనకు నత్యంత సమీపమున నున్న ఆత్మను గురించి తెలిసికొనుట యనేది సులభముగా సాధ్యము కాదు. ఒక రత్నాల వ్యాపారి, యెంతో విలువైన రత్నమును, తనయింటిలో సురక్షితమైన గదియందున నొక పెట్టెలో పెట్టి జాగ్రత్తగా కాపాడుచుండును. అదే విధిన భగవంతుడును ఆత్మ జ్ఞానమనే రత్నమును భద్రపరచి యుంచెను. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, మరియు ఆనందమయములనెడి పంచకోశములలో పదిల పరిచిరి అందు చేతనే, చార్వాకుల వంటివారు ఆత్మజ్ఞానము నెరుగుటకు ప్రయత్నించి విఫలురైరి. నిజమైన తత్వమును వీడి శరీరాదులే యాత్మ, అని యనే స్థితికి చేరిరి. అట్టివారు, పిండ జ్ఞానులనబడరు. పిండజ్ఞానుల లక్షణములను తెలియజెప్పెడి శ్రీ స్వతంత్ర సిద్ధలింగేశ్వరుల వారి వచనము గమనించదగినది:

**పిండ పిండవెందెను,**
**తను పిండవే? మన పిండవే?**
**వాయుపిండవే? అల్ల,**
**ఆది పిండవిడిదు బంద జ్ఞానపిండవేపిండ,**
**అదనరియలిల్ల.**
**అదుక్షీరదొళగణ ఆజ్యదంతే, పాషాణదొళగణ**
**పావక దంతె అడగిర్పుదాగి**
**అంతప్ప నిర్మల పిండనిమ్మ శరణంగాయిత్తు**
**నిజగురు స్వతంత్ర సిద్ధలింగేశ్వర.**

ఈ వచనపు తెలుగు రూపమిది:

**పిండ పిండ మంటిని,**
**తనువు పిండమే? మనసు పిండమే?**
**వాయువు పిండమే? కావు.**
**ఆది పిండమును పట్టి వచ్చిన జ్ఞాన పిండమే పిండము**
**అద్దాని నెరుగనైతి**
**అది క్షీరములో గల ఆజ్యము వంటిది, పాషాణములోపల గల**
**పావకుని వలె అడగి యుండును గాన**
**అంతటి నిర్మల పిండము, మీ శరణులకైనది**
**నిజగురు స్వతంత్ర సిద్ధలింగేశ్వర.**

రాయి రాయికి రాపిడి కానిదే నిప్పుపుట్టదు. పాలను తోడువేసి, పెరుగును చేసి చిలికి వెన్నను దీసి దానిని కరగబెట్టిన గాని నెయ్యిరాదు. అదే విధిన శరీరము యొక్క అనాదిత్వమునకు చెందిన అరయిక రానిదే ఆత్మ యొక్క అరయికరాదు. అందుచేత, శరీరము మొదలగునవి ఆత్మలా, లేదా అనాత్మపదార్థములా యనెడి దానిని పర్యాలోచన చేయుదుము గావుత.

శ్రీ జగద్గురువుల వారు ఆత్మానాత్మలను గుర్తించుటకై "అహం ప్రత్యయవేద్యత్వా దనుభూతస్మృతేరపి" అనె అనుభవాత్మకమైన యసాధారణ గీటు రాయిని మన చేతికి యిచ్చిరి. దాని ద్వారానే ఆత్మను గుర్తించవచ్చును. ఏది అహం యనెడి జ్ఞానమునకు విషయమై యున్నదో దేని పూర్వానుభవముల స్మరణగల్గునో అదే ఆత్మ అనే గీటురాయి.

లోకమునందు విషయాసక్తులైన యనేక పామరజీవులకు పొలము ఇల్లు ధనము పాడి పంట పశువులు మొదలగునవి ప్రాప్తించినపిదపనూ, అవి అభివృద్ధిగాంచుట చేతనూ ఎంతో ఆనందము నొందుదురు. అవి తరిగినప్పుడూ దుఃఖముబొందుదురు. అందువలన ధనకనకాధివస్తువులే ఆత్మ యనెడి భావము కలిగి యుందురు. ఇది సమంజసముకాదు. ధనకనకాదులు జడపదార్థములు–

అంతేకాక నా పొలము నా పశువులందుమే కాని, నేను పొలమును నేను పశువును అనుటలేదు. ఆత్మ జడముకాక చైతన్యవంతమైనది. నేననువిషయానికిగాని తత్ సంబంధమైన జ్ఞానానికి గాని ఇవేవియు చెందియుండవు– కాన ఈ పదార్థములు ఆత్మకాజాలవు.

ఇంకా శరీరమునందున నేను స్థూలముగా నున్నాను, నేను కృశాంగుడనై యున్నాను అనేవి వ్యవహారమునకు వచ్చుట చేతను, చలన పరమైన చైతన్య ముండుట చేతను, శరీరమే ఆత్మ యనెడిది చార్వాకుల యభిప్రాయమైయున్నది అయితే, ఇదియునుక్తియుక్తమైనది కాదు. ఎందుకనగా, లోకమున యెంత మూఢుడైననూ, నాశరీరమని యనునేగాని నేను శరీరమును అని యనునే? శరీరము కూడ, పొలము, ఇల్లు యిత్యాదుల కోవకు చెందినదని గ్రహింప దగును. శరీరమనునది, నేను అనే దానికంటేను భిన్నమైనదని తెలియుచున్నది.

బాల్యమునందున్న శరీరమే వృద్ధాప్యమున నుండున నెడిది కూడ సరియైనది కాదు. అవి, భిన్నమైనవే. పరిణామ క్రమమున భేదములు గల్గు చున్నవి. పూమాల యందు పువ్వులు భిన్న భిన్నముగా నున్ననూ వాటిని జోడించెడి దారము ఒక్కటేయై యుండునో, అటులనే బాల్య, యవ్వన, వార్ధక్యముల యందు పరిణామమును పొందిన శరీరములు భిన్నములై యున్ననూ, ఆ మూడు శరీరములలో అను స్యూతముగా వచ్చెడి ఆత్మ, శరీరము కంటెను విలక్షమయి యుండునని గ్రహించ వలెను.

ఒక పురుషుడు నొక స్వప్నమును గాంచెను. అందులోనతడు స్త్రీ రూపముననుండి, యటులనే వ్యవహరించెను. మేల్కొనిన పిదప తాను పురుషుడనని కన్గొన్నను. ఈ రెండు అవస్థలలో శరీరములు భిన్నములుగా నున్ననూ, ఈ రెంటియందునూ అభిమానమును దాల్చెడి జీవాత్మ ఆ రెంటి కంటెనూ భిన్నమైన దనేది అందరూ అంగీకరించెడి విషయమే. స్త్రీ పురుష రూపములు శరీరధర్మములే గాని, ఆత్మకు సంబంధించినవి కావనెడి దానిని యెంతో చక్కగా వివరించెడి దేవర దాసిమార్యుల వారి వచనమును గమనించుడి:

**మొలె–ముడి బందరె హెణ్ణెంబరు,**
**గడ్డ–మీసె బందరె గండెంబరు,**
**నడువె సుళివాత్మను**
**గండూ అల్లహెణ్ణూ అల్ల కాణా రామనాథ!**

దీని తెలుగు రూపమిది:

**రొమ్ము–ముడి వచ్చిన ఆడదందురు,**
**గడ్డము–మీసము వచ్చిన మగవాడందరు,**
**నడుమ తిరిగెడి ఆత్మ ఆడది కాదు – మగవాడు కాదు, రామనాథ ।**

యోగసిద్ధిని బడసిన నొకడు, తన యోగముచేత, ఏకకాలముననే యనేక శరీరములను ధరించి అన్ని శరీరములలోను తానొక్కడే నియామకుడై వానియందు సుఖదుఃఖముల ననుభవిస్తూ లీలావైభవమును చేయుచున్ననూ ఆశరీరములన్నియునూ తనవే యనెడి అభిమానమును పొందుచుండును. అందుచే, అహం యనెడి ప్రతీతి దేహము కంటెనూ భిన్నమై యాత్మ ననుసరించి యుండునని తెలిసికొన వలెను.

చార్వాకులు, దేహమే ఆత్మయని చెప్పుచు, దీనికి పునర్జన్మ ఉందదందురు. ఇది సరియైనది కాదు. పుట్టిన పసిపాప, తన తల్లి చన్నును నోటిలో పెట్టగానే, చీకుట ప్రారంభించును. దీనికై ప్రేరణ యెక్కడి నుండి లభించినదనే ప్రశ్న తలయెత్తును. అనేకానేక జన్మలలో లభించిన సంస్కారముల ఫలితముగనే, పసిపాప పాలను కుడుచు చున్నది. శరీరము, ఆత్మకు వాసస్థానమే గాని, ఆత్మతోనభిన్నత్వము గల్గినది కాదు. స్వీయకర్మానుసారము, ఆత్మయొక శరీరము నుండి మరొక శరీరములోనికి వెడలుచున్నది. “శరీరాణి సంయాతి నవాని దేహీ” యనెడిది ప్రఖ్యాతి గాంచిన నుడి. దేహి కొంగ్రొత్త శరీరములలోనికి వెళు ్ళచుండునని దీనియర్థము. దేహమును ధరించేది గావున ఆత్మను దేహీ అని పిలుతురు. ధరించినది విసర్జనీయమే కదా!

మరణానంతరము, దేహమును వీడిబయల్వెడలెడి జీవాత్మ కళ్ళకు కనిపించదు కదా! అట్టి యెడ జీవాత్మ శరీరము కంటె భిన్నమైనదని నమ్ముట యెటుల? ప్రత్యక్ష ప్రమాణము లేదు కదా! ఇట్టి సందేహముల కాస్కారములేదనే చెప్పవలెను. ఎల్లవేళలయందునూ ప్రత్యక్ష ప్రమాణములు లభించుట యనేది సాధ్యదూరమైన విషయము. ప్రత్యక్ష ప్రమాణము లభించని

పక్షమున యనుమాన లేదా శబ్ద ప్రమాణముల ద్వార విషయగ్రహణ చేయవలెను. అనుమాన ప్రమాణమును చార్వాకులును అంగీకరించిరి. గమనించుడి:

**శ్లో॥ "రేరే నుమానంయతి ప్రమాణం**
**చక్షుస్తవాస్తీతి కిమత్ర మానమ్।**
**భవాదృశే దూర విదేశమాగతే**
**చరంతు వైధవ్య విధానమంగనాః॥**

ఈ శ్లోకమున రెండు దృష్టాంతములు గలవు. కళ్ళు తమను తామే చూడలేవు. వస్తువులు కన్పడు చున్నవి గాన, కళు ్ళకలవందుము. ఒకడు విదేశమునకు వెళ్ళెను. వాడు బ్రతికియున్నాడనే ప్రత్యక్ష ప్రమాణము లోపించగా భర్త నుండి వచ్చిన లేఖల నాధారముగాగొని, భార్యవైధ్యవ్యము నాశ్రయింపక, యెప్పటి వలెయుండునది లోకవిదితమైన సత్యము. ఈ దృష్టములలోన యనుమాన ప్రమాణములకు ప్రాముఖ్యత నివ్వనైనది. వాహన ఛోదకుడు, వాహనము నాపి, బయల్వెడగలనే వాహనము చలన రాహిత్యమును పొందును అదే విధిన, జీవాత్మతనను వీడగనే, శరీరము జడమగుచున్నది. ఈ విధిన అనుమాన ప్రమాణము ద్వారా జీవాత్మగలదని నిశ్చయింప వచ్చును. శ్రుతుల యందున, ఆత్మ పవిత్రమైన దానిగా నుతియింపబడినది జన్మజరామరణాదులు లేని దనియును చెప్పబడినది అట్టియెడ, ఎముకల గూడు, మాంసపు ముద్ద, మలమూత్రాదులకు నిలయమైన దేహము, ఆత్మయగునే?

పంచభూతాత్మకమైన తనువును తనతో పోల్చుకొనెడి జీవుడు అజ్ఞాని యనియును, రోగములకు నిలయమై విలయమయ్యెడి దేహమును ఆత్మగా భావించవలదని శ్రీ నిజగుణుల వారు నుద్బోధించిరి. పుట్టినప్పటి నుండియూ ఏదో ఒకరకమైన రోగము శరీరమును పీడించుచునేయుండును. ఈ రోగములను రెండు విధములుగా విభజింప వచ్చును. అవిః ధాతుజన్యములు, కర్మజన్యములు. దేహమునందున వాతపిత్త మరియు కఫములనెడి త్రివిధ ధాతుప్రత్యయముల వలన గల్గెడి రోగములు ధాతు జన్యములు. ఆయుర్వేదము ప్రకారము వాతము చేత 81, పిత్తము చేత 64, కఫము నుండి 215, వెరసి 360 రోగములు ప్రతిపాదింపబడినవి. "గహనా కర్మణోగతిః" అనెడి సూక్తి ప్రకారము, కర్మజన్య రోగము లనేకములుగా లెక్కకు మించి యుండును. పొలములోని కలుపు నెన్ని సార్లు తీసివేసినా, అది మళ్ళీమొలచిన యటుల, ఔషధసేవన చేయగనే తగ్గినట్లు కన్పట్టే రోగాలు, మళ్ళీ తలయెత్తి చిరకాలము నిలిచియుండును. రోగములకు నిలయమై యుండెడి తనువును తానుగా భావించి కొనుట తెలివిలేని తనమే యగును. ఆ విధముగా భావింఛుటవలన పాపము సంక్రమించు నని తెలిపెడి శ్లోకమును గమనించుడి

**శ్లో॥ దేహాత్మబుద్ధిజం పాపం న తద్గోవధ కోటిభి ః**
**ఆత్మాహం బుద్ధి జంపుణ్యం నభూతోనభవిష్యతి॥**

దేహమే తానని దృఢముగా నమ్మి వ్యవహరించే మనిషికి ఒక కోటి గోవులను వధించిన పాపము వచ్చునని, చిద్రూపమైన ఆత్మనే నేనని తెలిసికొనిన వచ్చెడి పుణ్యము, మరేదాని వల్లనూ రాదు, అని శాస్త్రముల ప్రమాణముండుటచేత, ఆ దేహాత్మా బుద్ధి వలన యుత్పన్నమైన పాపమును దాన ధర్మాదుల వలన గల్గి అల్ప పుణ్యము చేత నాశనము చేయుట యెన్నటికినీ సాధ్యముకాదు. ఈ విషయమున ఛాందోగ్య శృతిలోని చతుర్థ అధ్యాయమనందు ఎంతో సుందరమైన యొక దృష్టాంతము గలదు.

పూర్వకాలమునందున "జానశ్రుతి" యనెడి పేరున చక్రవర్తి, ఎంతో ధార్మికుడై రాజ్యమును పరిపాలన చేయుచుండెను. అతడు బావులు, చెరువులు మొదలగునని త్రవ్వించుట, అన్నసత్రములు కట్టించుట, భూహిరణ్య దానాదులు చేయుట ద్వార గొప్ప పుణ్యాత్ముడనిపించి కొనెను. ఇతని పుణ్యమయమైన ధవళకీర్తి దశదిశల యందుప్రసరించెను.

ఒక దినము రాత్రి యందు అంతః పురము యొక్క మేలైన భవనపు పైభాగమున ధర్మపత్ని సమేతుడై ధార్మికచర్చను చేయుచు విశ్రమించు చున్న సమయమున, రెండుహంసలు ఆకాశమునందు వీరి అంతః పురము మీది నుండి విహరించుచువెళ్ళెను. అపుడు ఆడపక్షి తన మగనికి ఈ విధముగా చెప్పెను. అదిగో చూడండి జానుశ్రుతి మహరాజుగారు ధర్మపత్నీ సమేతులై కూర్చొ నియున్నారు. తేజోమయమైన వారి పుణ్య పుంజము ఆకాశమండలమున వ్యాపించినది మనము వారి అంతఃపురము యొక్క భవనమును విడిచి దూరమునందు ఎగురుదుము గాక. లేని యెడల వారి పుణ్యతేజమునందు దహించి పోగలము, ఆ ఆడపక్షి యొక్క మాటను విని మగపక్షి ఇదేమి చెప్పుచున్నావు. మహా మహితాత్ముడైన రైక్వుని యొక్క పుణ్యముముందు ఈ జాన శ్రుతి

యొక్క పుణ్యము సాగరము ముందు ఆవగింజంతగాను. అందు చేత ఏమియునుకాదు వెళ్ళుదమనిరాజాంతః పురమందిరముపై భాగమునుండి ఎగురుచువెళ్ళెను.

పక్షుల సంవాదమును విని చకితుడైన జానుశ్రుతికి నిద్దురపట్టలేదు. తెల్లవారెడివరకు నా విధననే కూర్చొని యుండెను రైక్వుడెవ్వడైయుండును? అతడెంత శ్రీమంతుడై యుండును ? ఏమేమి దాన – ధర్మము చేసి సముద్రమంత పుణ్యమును సంపాందించెను? ఇట్టి విచార తరంగములు అతని మనస్సును నంటికొని యుండెను.

తెల్లవారగానే, భటులను పిలిపించి యీ భూమండలమునందున "రైక్వు డనెడి వాడు ఎక్కడ యున్ననూ, ఎట్టుల యున్ననూ వెతికి, అతను వచ్చుటకు సంసిద్ధుడైనయెడ మర్యాద పూర్వకముగా పిలిచికొనిరండని ఆజ్ఞాపించెను. రాజాజ్ఞ ప్రకారముగా గొప్ప గొప్ప గ్రామములను, పెద్ద పెద్ద పట్టణములను చేరి వెతికిరి. ఫలికము లేకండెను. చివరకు, నొక చిన్న గ్రామములో నొక చెట్టు క్రింద దుమ్ములో బడిపోరలు చుండెడి వాని జూచి యతడే రైక్వుడని యెరిగిగిరి రైక్వుడు దిగంబరుడై యుండెను. అతని స్థితిని జూచిన వారికి శివయోగి సిద్ధయోగియైన సిద్ధరామేశ్వరుల వారి వాక్కులు జ్ఞప్తికి వచ్చెను. అవి యేవనగా: "వీరనాదరె వైరిగళకాట బహళవయ్యా, దానశూరనాదరె యాచకర కాట బహళవయ్యా అతి రూపనాదరె అంగనెయరకాట బహళవ్య". "వీరుడైతే వైరివర్గము కాటు బహుళమయ్యా, దానశూరుడైతే యాచకుల కాటు బహుళమయ్యా" అనేది శ్రీ సిద్ధరాముల వారి వాక్కులకు గల అర్థము "అధికముగా దానములు చేసినందులకే యీ స్థితి సంభవించియుండును.అందుకే కదా, "అతిసర్వత్ర వర్జయేత్" అనెడి నుడి గల్గినది అనుచు మనస్సున పరిపరివిధములుగ నాలోచింప జొచ్చిరి. వారు రైక్వుని సమీపించి ప్రశ్నించజొచ్చిరి.

**భటులు** : స్వామీ రైక్వుడనగా మీకేనా?

**రైక్వ** : జనులు ఈ శరీరమును రైక్వుడని యందురు.

**భటులు** : శరీరము కంటెనూ మీరు వేరే ఉందురే?

**రైక్వ** : అవును భూమి, జలము, అగ్ని, వాయువు ఆకాశములను మీరిన వానినినేను.

**భటులు** : స్వామీ! మన రాజు జానుశ్రుతి, తమరిని రాజభవనమునకు పిలిచికొని తెమ్మని మమ్ములను పంపించిరి. దయచేసి రథమును ఎక్కుడి.

**రైక్వుడు** : మీ రాజు దగ్గర నాకయ్యెడి ప్రయోజన మేమియును లేదు. ఒక వేళ మీ రాజు గారికి నా చేత నేదైననూ కావలసియుండిన నెడ యతనినె ఇక్కడికి రమ్మని చెప్పుడి.

రైక్వుడు యీ గర్వభరితమైన సమాధానమునువిని "భటులు" ఏమియూ లేని యితని అహంకారమునకు కారణమైనది యే బాహ్యసంపత్తు దోచుట లేదు. ఏమైననేమి, మహారాజు గారు నపేక్షించిన వ్యక్తి దొరకినాడు. ఈ విషయమును రాజుగారికి తెలియజేయవలేనని తమలో తాము విచారించికొని మరలి వచ్చి మహారాజు గారికి జరిగిన విషయములను గూర్చి తమ నివేదికను సమర్పించిరి రాజు గారు నీ విధిన యాలోచించ దొడగరి : రైక్వుడు విచిత్ర స్థితిలో నుండియూ, స్వాభిమానముతో మాట్లాడుటకు గల కారణమేమై యుండునో కదా! నా దగ్గరలేనిదేది యో నొకటి, యతని దగ్గర ఉండియే తీరవలెను.

"అద్దానినెరుంగుటకై తాను అతని దగ్గరకు వెళ్ళియే తీరాలి" పిదప, అపారమైన ధనరాశులనుగైకొని రైక్వుని దగ్గరకు జేరి, భయ –భక్తులతో మెలగుచు, తాను తెచ్చిన సంపద నతని పాదముల కడనిడి యీ విధిన వినతులు చేసికొనెను.

"స్వామీ! రెండు హంసలు, తాము సంపాదించిన అపారమైన పుణ్యరాశిని గూర్చి కొనియాడుటను విని ఆశ్చర్యచకితుడనైతిని అంతటి పుణ్యమును సంపాదించుటకై తమరు గావించిన పుణ్యకార్యము లెట్టివి.

"ఓ రాజా! నన్ను చూసిన వెనువెంటనే నేను ఎవ్వరికైననూ యేమియును ఇచ్చే స్థితిలో లేనని తెలియును కదా! నేను పొందిన పుణ్యము దాన ధర్మములు చేసి సంపాదించిన పుణ్యము కాదు" అని రైక్వుడు సమాధానమునిచ్చెను. ఆపిదప వారివురి మధ్య సంభాషణలు యీ విధిన కొనసాగెను.

**రాజు** : అటులైన యెడ, నాకంటెను అధికమైన పుణ్యమునునే విధిన పొందితిరి?

**రైక్వుడు** : ఓ రాజా! శరీరమునందు నేననెడి భావన దృఢమైనపిదప కోటిగోవులను చంపిన పాపము వచ్చుననెడి శాస్త్ర ప్రమాణము గలదు ఈ విధముగానున్న దానిని నాశనము చేయుటకు నెన్ని దాన-ధర్మములు చేసిననూ అది పోదు.

**రాజు** : స్వామీ! దాన ధర్మములను విడిచిననెడ, పుణ్యసంపాదన నిమిత్తముగ నుండెడి వేరొక మార్గమేది?

**రైక్వుడు** : అదియే, ఆత్మజ్ఞానమునకు చెందిన మార్గము

ఈ విధముగ, ఆత్మజ్ఞానము యొక్క మహిమను గుర్తెరిగిన రాజు విధిప్రకారము రైక్వుని దగ్గర శిష్యునిగా జేరి శరీరముల కంటెను విలక్షణమైన ఆత్మజ్ఞానమును సంపాదించి లోకోత్తరమైన కీర్తిశాలి అయ్యెను దేహాత్మ బుద్ధిత్యజించని వానికి నిజానందము గల్గదనియును, వాడు కోటి జన్మలలో నుగ్రతాపసిగా యున్ననూ, ఆత్మానుభూతి గల్గదనియునూ శ్రీ నిజగుణులవారు స్పష్టముగా తెలిపిరి.

ఇంకను, పూర్వమునందున, ప్రజాపతి దగ్గరికి ఆత్మ జ్ఞానము కొరకై విచ్చేసిన ఇంద్రుడు, మరియు వైరోచనునికి బ్రహ్మ నీరునిండిన తొట్టిలోకి చూడండి అని చెప్పెను. వారిరువురూ, దానిలో కన్పట్టిన దేహమే ఆత్మయని గ్రహించి వెళ్ళిపోయిరి. తన స్థానమునకు పోయిన యింద్రునికొక సందేహము గల్గెను. నశ్వరమైన శరీరము ఆత్మకాజాలదు కదా? అని యోచించి, వెనుదిరిగి ప్రజాపతి దగ్గరకు వచ్చి తన సందేహమును వెలిబుచ్చెను. కన్పట్టునది ఆత్మకాదు, చూసెడిది ఆత్మయని ప్రజాపతి ఉపదేశించిరి. అప్పుడు, ఇంద్రుడు చూసెడిది కన్నే యగు కారణాన నాత్మయనగా కన్నే, యని నిశ్చయించి కొని వెనుదిరిగెను.

కాలాంతరమునందు, కన్ను ఎప్పుడు అన్నింటినీ చూడలేదు గాన, కన్ను ఆత్మయగుట యెట్లు అనెడి సందేహమును పొందిన యింద్రుడు, ప్రజాపతి దగ్గరికి విచ్చేసి ప్రణమిల్లి తన సందేహమునకు సమాధానమును కోరెను. కన్నును చూసెడిది యెయ్యదో అదియే ఆత్మయని ప్రజాపతి ఉపదేశించిరి. కన్నులో పడెడి దుమ్ము ధూళి యిత్యాదులను గుర్తెరిగే శక్తి కన్నుకు లేదనియును. ఇట్టి జ్ఞానమును కల్గించెడిది మనస్సనియును, ఆ మనస్సే ఆత్మయని యింద్రుడు నిశ్చయించికొనెను. స్వస్థానమునకు వెళ్ళెను.

కొంతకాలము పిదప సంకల్ప వికల్పాత్మకమై, చంచలత్వగల్గినట్టి మనస్సు ఆత్మయెట్లగుననెడి సంశయము ఇంద్రునకు గల్గెను. తక్షణమే ప్రజాపతిని దర్శించి, తన సంశయము గూర్చి తెలిపెను. మనస్సు యొక్క చాంచల్యమును గురెరుగునదియే ఆత్మయని తెలుసుకొనుము అని ప్రజాపతి తెలియజెప్పెను. మనస్సును చూసెడిది బుద్ధియేగనుక, బుద్ధియే ఆత్మయని నిర్ణయించికొని తన దారి తాను వెడలెను.

అంతర్ముఖుడై విచారించెడి యింద్రునికి మరో సందేహము గల్గేను. గాఢనిద్రలో నున్నప్పుడు బుద్ధియొక్క అస్తిత్వముండదు గాన, బుద్ధి ఆత్మయగుటెట్లనెడిదే ఆ సందేహము శ్రీ బ్రహ్మదేవుని కడకు వచ్చి తాను పొందిన సందేహమును నివేదించెను. బుద్ధి యొక్క అస్థి నాస్తికత్యములకు సాక్షిగానుండెడిది దెద్దియో, అదియే ఆత్మయని తెలిసి కొనుమని ప్రజాపతి గారునుపదేశించిరి అప్పుడు నిజమైన ఆత్మతత్వాన్ని తెలిసికొని, యింద్రుడు నెంతో ఆనందమును పొందెను.

"బుద్ధేః పరతస్తుసః" అనెడి వాక్కు గూర్చి అంతర్ముఖుడై యుండెడి సాధకుడే తెలిసి కొనగలడు బుద్ధి కంటెను అతడు/అది వేరుగానుండును అనేది ఈ వాక్కులోని యర్థము. బహిర్ముఖుడై యుండెడి వానికియీ అర్థము స్ఫురించదు. ఈ సత్యమును సోదాహరణ పూర్వకముగా వివరించెడి అక్కగారి వచనమునుగనుడి:

**హగలు నాల్కుజావ అశనక్కె కుదివరు**
**యిరుళు నాల్కు జావ వ్యసనక్కె కుదివరు**

**అగస నీరొళగిర్దు బాయారి సత్తంటె**
**తమ్మొళగిర్ద మహాఘనవనరియరు చన్నమల్లికార్జునా.**
**"పగలు నాలుగు జాములు అశనమునకై కుదియుదురు**
**రాత్రి నాలుగు జాములు వ్యసనములకై కుదియుదురు**
**చాకలి నీటిలోనే యుండి నోరెండిచచ్చినట్లు**
**తమలో నున్న మహాఘనము నెరుగరు చన్న మల్లికార్జునా".**

అనేది అక్కగారి వాక్కుల తెలుగు రూపము. ఆత్మతత్వము నెరుగని వారై, శరీరమునకే ప్రాముఖ్యత నిచ్చెడి వారి వైనమునుగాంచి, అక్కగారు పరితపించిరని యీ వాక్కుల వలన తెలిసికొనగలము.

నోటిలో మాంసపు ముద్దను కరచుకొని, గగన తలమున విహరిచెడి కాకిని, వందలాది కాకులు చేరి, మాంసపుముక్కకై పొడిచి పొడిచి వేధించుచుండుని. మాంసమును వీడిన యెడ, వీటి బాధ తప్పును అదే విధిన సంసారములోనున్న వారికి భార్యాబిడ్డలు బాధకలగుచున్నారు. దేహమే ఆత్మయనెడి దేహాభి మానమును వీడనంత వరకూ భార్యా పుత్రాదులు పీడిస్తూనే ఉందురు.

దేహమే ఆత్మ, మరణమేముక్తి, సుఖజీవనమే పరమార్థము, ఋణానుబంధమనెడిది మిధ్య యిత్యాదుల ననెడి చార్వాకుల వాక్కులింపుగా నున్ననూ, అవి శాస్త్ర సమ్మతమైనవి కావని తెలియవచ్చు చున్నది వెనుక జేసిన, యిప్పుడు యుచున్న, మున్ముందు చేసెడి కర్మల ఫలములను మనమే అనుభవించ వలెను మరెవ్వరూ వాటిలో పాలును పంచికొనజాలరు.

ఒక సారి యొక దొంగ యొక పంటకాపు వాని యింటిలోనికి జొరబడెను. అది నడురాత్రి యైనందున అందరూ నిదురుంచుచుండిరి. అందిన సొమ్ములన్నింటినీ ఒక మూటగా కట్టి గైకొని వెనుదిరిగెను. త్వరగా వెళ్ళిపోవాలనె తపన వానిని పట్టిపీడించుచుండెను. తత్ఫలితముగా వాడు పరుండి యున్న యెనుమును గాంచలేనివాడై, దాని నడుము మీద కాలిడెను. గేదె దిగ్గున లేచెను. గేదె బలము యొక్క తాకిడికి తట్టుకొన జాలని దొంగ, చేతిలో నున్న నగల మూటను విడిచి వేసి యొకవైపు పడిపోయెను. మూట మరొక వైపుకు పడెను. దొంగ లేచి నిలబడెను. గేదె వానిని గాంచి, "అంతకు యింతైతే, యింతకు యెంత" అని ప్రశించెను దొంగకు బోధపడలేదు. వివరించమని కోరెను. తాను పూర్వజన్మలోన యీ యింటిలో నొక సేవకురాలిగా నుంటిననియునూ ఆ ఋణమును తీర్చి కొనుటకై యీ జన్మనెత్త వలసి వచ్చినదని తెలిపెను. నీవు అన్ని నగలను దొంగిలించికొని పోవుచున్నావు కదా! వీరి ఋణమును దీర్చికొనుటకు నీవెన్ని జన్మల నెత్తవలనో యేమో యని నుడివెను. దొంగకు సద్బుద్ధి గల్గెను. నగల మూట నక్కడనే వదిలి వేసి వెడలి పోయెను.

కథలు కల్పితములే యైననూ, వాటిలోని తత్వము ఎంతో మార్మికముగా నుండును. ఋణా నుబందములుండవని పలికే చార్వాకుల పలుకుల కమ్ముదుపోయి, ఇచ్చటకు వచ్చిన యటుల వర్తించుట యనర్థదాయకము కాగలదు. శరీరాని కంటెను భిన్నముగా నుండెడి ఆత్మ లోకాంతర జన్మాంతరములలో సంచరించును గాన శ్రేష్ఠమైన కార్యములను మాత్రమే చేస్తూ జీవనమును సుఖమయము చేసికొన వలెను.

నేను చూస్తూ ఉన్నాను, నేను వినుచూ ఉన్నాను అనే మాటలలో, చూచుట, వినుట మొదలగునవి యింద్రియముల ధర్మమైననూ, యీ యింద్రియముల జతకు నేను అనే మాటను జోడించి చెప్పుట చేత, అవియే ఆత్మ యగునను భ్రమగల్గుట సహజమే. కాని చెవి వంటి యింద్రియము, యే కారణమువలన నైననూ, చెడిపోయి పనిచేయక పోతే, నా చెవి చెడినదనును. చెవి తలకంటెనూ భిన్నమైనదనే అర్థమిందులో నుండును. అదే విధిన నా కన్ను, నా ముక్కు అనుచుందుము. ఇవి యేవియూ ఆత్మ కాజాలవు.

ఇంద్రియముల కధినేతృత్వము వహించెడి మనస్సు కూడ ఆత్మకాజాలదు 'అహంసుఖీ', అహం దుఃఖీ" అనే మాటలలో, నేను సుఖముగానున్నాను, నేను దు ఃఖములోనున్నాను అని అనుచున్నప్పుడు, మనస్సుయొక్క ధర్మములైన సుఖదుఃఖములు తనయందు ఆరోపించికొని తానే మనస్సు  అనే భావన గల్గిననూ, అది వాస్తవము కాదు. మనస్సు చంచలమైనది. అంతే కాదు, కొన్ని సందర్భములలో నది తనకు తానే వ్యవహరించును. అందుచేత, మనస్సు ఆత్మకాజాలదు.

జాగ్రత మరియు స్వప్నావస్థలన్నింటిలోనూ నిర్ణయములు చేసే, బుద్ధియూ ఆత్మ కాజాలదు ప్రగాఢమైన నిద్రలో బుద్ధి యొక్క వృత్తియు నణగి పోవును.  అట్టి స్థితిలో ఆత్మ యొక్క అస్తిత్వము ఉండియే తీరును కదా! అందుచేతనే, లేచినపిదప "సుఖేన సుప్తో హం నకించిదవేదిషమ్" అనే భావన పొందును" నేను సుఖముగా నిద్రించితిని ఏమియును తెలియలేదు"  అనేది  యీ వాక్కులలోని భావము ఇట్టి సుఖమయ, అజ్ఞానపరమైన యనుభవమును పొందిన వాడు వేరుగా నుండ వలెను కదా! అతడు బుద్ధికంటెనూ విలక్షణమైన వాడైయుండవలెను కదా! ఒక్కొక్క సారి నా బుద్ధి స్థిరముగా నుండదని అనుభవమును పొందిన వాడు బుద్ధి కంటెనూ భిన్న మైన వాడని దోచును. అతడే ఆత్మ.

నేలలో నిక్షిప్తమైన నిధిని గూర్చి తెలిసి కొని వెలికిదీయ కుంఢగ, నేలపై భాగమున నటుయిటు తిరిగిన యెడల  దరిద్ర్యము దూరము కాదు. అదే విధిన అంతర్గతమైన ఆత్మ తత్వమును తెలిసికొనకుండిన యెడల ప్రయోజనముండదు. ఆ అరయిక కలుగవలెను అందుచేతనే, భగవత్పాధులవారు " ఆత్మ స్థితి వివేకీయః పిండజ్ఞానీ సకథ్యతే" ఎవ్వడైతే ఆత్మస్థితికి చెందిన వివేకము గల్గియుండునో వాడే పిండజ్ఞాని " అని శ్రీ భగవత్పాదులు వారి యుపదేశములోని అర్థము.

ఆత్మ తత్వము నెరుగకండా చెడి పోయ్యెడి వారెందరో గలరు. అట్టి వారిని గూర్చి తెలిపెడి ఉదంతమొకటి గలదు. ఒక యూరిలో నొక పెద్ద శివాలయముండెను. దాని ముఖ ద్వారమున భిక్షుకులెందరో నెలవుల నేర్పరచుకొని బిక్షను వేడుచుందురు. వారిలో నొకడి గత 35 సంవత్సరములుగా నటయే యుండెను. అతడు కుష్టురోగము చేత పీడింపబడుచుండెను. ధానధర్మములు చేసెడి వారి దాక్షిణ్యముల వలన యతని జీవనము ఏదోనొక విధమున కొన సాగుచుండెను. ఒక నాడు అతడు దివంగతుడయ్యెను. అతని పీనుగ యొక దినమంతయూ నేలమీద పడియుండెను. చివరకు కొందరు పూనుకొని, ద్రవ్యమును సేకరిఇంచి, శవమునకు అంతిమ సంస్కారమును జేసిరి. రోగగ్రస్తుడైన వాడైనందున, వానికి దహన సంస్కారమునే  జేసిరి. వాడు ఎంతో కాలమునుండియు కూర్చుండి యున్న ప్రదేశమును శుద్ధి జేయనెంచిరి. అక్కడి నేలను పన్నెండుగజములు మేరకు త్రవ్వి, మట్టిని  దీసివేసి, ఆ మట్టి మీద చమురును పోసి కాల్చను సమకట్టిరి. రోగ క్రిములను పూర్తిగా నాశనము చేయవలెననెడిదే వారి ఆకాంక్ష. త్రవ్వేటప్పుడు, వారికి భూగర్భమున నొక తామ్ర పాత్ర లభించెను. దాని మూతిని విప్పి  చూడగనే, వారి కాశ్చర్యమును గొలిపే విధముగా దానిలో వారు బంగారు నాణెములను గాంచిరి. ముప్పది ఐదు సంవత్సరములు, అక్కడ కూర్చుండియుండియు, నిధి గుర్తెరుగనందున, బిక్షకుడు దుర్భరమైన దారిద్ర్యముననుభవించెనని గ్రహింపవలెను. ఆత్మ జ్ఞానమును పొందలేని అవివేకియు  నిట్టి వాడెయని తెలిసికొనవలెను. ఆత్మ జ్ఞానియైన అల్లమ ప్రభువు వారి వచనమును గమనించుడి:

**హేమనిన్నదల్ల, భూమినిన్నదల్ల**
**కామిని నిన్నవళల్ల, ఇవెల్ల జగకిక్కిదవిధి**
**నిన్న దెంబుదు జ్ఞానరత్న, అదన్ను ధరిసిదెయాదొడె**
**నిన్నంతహ సిరివంతర్లి కాణా గుహేశ్వర।**

దీని తెలుగు రూపమిది:

**హేమము నీదికాదు, బూమినీదికాదు,**
**భామిని నీది కాదు, ఇవన్నియును జగతిచ్చినవిధి**

**నీదనేది జ్ఞానరత్నము, దానిని ధరించిన యెడ**
**నీ వంటి సిరివంతులు లేరు, గనుమా, గుహేశ్వరా**

ప్రభుదేవుల వారు ఆత్మ జ్ఞానము యొక్క మహత్తును కొని యాడిరి.

"జ్ఞాన మార్గము కృపాణము ధార" వంటిదనే వాక్కొకటి కలదు. పదునైన ఖడ్గము, పదార్థములను ఖండించి వేరువేరుగా చేసిన యటులే, పిండజ్ఞానము చేత శరీరాది అనాత్మపదార్థములు, ఆత్మ నుండి విడదీసి చూడగలిగెడి వాడు ధన్యజీవి కాగలడు. తన్నిమిత్తమై, సాధకుడు అంతర్ముఖుడై యుండవలెను. ఈ విషయాన్ని నొక్కి చెప్పెడి ఉపనిషద్వాణిని గమనించుడి:

**శ్లో॥ పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూ**
**స్తస్మాత్ పరాఙ్పశ్యతినాంతరాత్మన్।**
**కశ్చిద్ధీఃర ప్రత్యగాత్మా నమైక్ష**
**దావృత్త చక్షురమృతత్వమిచ్ఛన్।** (కఠో. 2-4-1)

కఠోపనిషత్తునందు చెప్పిన యటుల, ప్రజాపతి ఇంద్రియములను బహిర్ముఖముగా సృష్టించెను. ఈ కారణమున మన యింద్రియములన్నియును బహిర్ముఖముగా నున్నవి. సామాన్యులు అంతర్ముఖులు కాజాలరు. అతి వేగముగా ప్రవహించే ప్రవాహములో పడి సమస్త జడపదార్థములు కొట్టికొనిపోవు నటులే, వీరున్నూ భవమనెడి ప్రవాహములో కొట్టికొని పోవుదురు. నదీ ప్రవాహానికి యెదురీదెడి చేపలు మొదలగువాటివలె ఆత్మ జ్ఞానమును కోరెడి వీరుడు, అంతర్ముఖుగును. దేహాదులకంటెను ఆత్మభిన్నమైనదని యెరుగును. యముడు నచికేతునికను గ్రహించిన యుపదేశము యొక్క సారాంశమిదియే. అంతర్ముఖుడుగా నుండ దలచిన వాడే విధిన నుండవలెనో యనెడిది విపరించెడి కవి కాళిదాసు శ్లోకమొకటి గమనార్హమై యున్నది.

**వికారహేతౌ సతి విక్రియంతే।**
**యేషాంన చేతాంసిత ఏవ ధీరాః॥**

మనస్సును వికృత పరి చెడి వస్తువు లెదురుగనున్నా వాటి చేత చలింప బడకుండగ మనస్సును నిలిపి యుంచెడి వాడే, ధీరుడనియును, అట్టివాడే ఉత్తముడని శ్లోకములోని భావము. ధీర మనోవృత్తిని గూర్చి తెలిపెడి కథ యొకటి గలదు. గమనించుడి.

ఒక ఆత్మజ్ఞాని వద్దకు ఇరువురు యువకులు వచ్చిరి. ఆత్మ జ్ఞానమును ప్రసాదించుమని వేడిరి. వారిరువురునూ అట్టి జ్ఞానమును పొందుట కెంతవరకు అర్హులో యనేది తెలిసికొనదలచిన గురువు గారు వారిద్దరికీ ఒక పరీక్షను పెట్టదలచెను. వారిద్దరికి, చెరియొక పావురము నప్పగించి, ఎవ్వరూ లేని ప్రదేశమున, ఎవ్వరూ చూడని విధమునను, ఎవ్వరూ తెలిసికొనజాలని విధిన చంపి విగత జీవులైన పక్షులను తీసికొనిరండి. ఆ పిదప ఆత్మజ్ఞానము గురించి ఉపదేశింతుననెను. ఇరువురూ పావురములను గైకొని యెవరి దారిన వారు వెళ్ళిరి. వారిలో నొకడు ఊరి వెలుపలకు వెడలి, యొక నిర్జన ప్రదేశము నెంచికొని వచ్చి పావురము గొంతు నులిమిచుపి యద్దానిని తీసుకొని గురువుగారి పాదములకడ కానుకగా సమర్పించెను "స్వామీ! మీరు చెప్పిన విధిన చేసితినిగాన, దయ చేసి గురూపదేశమును ప్రసాదించుమని వేడుకొనెను, గురువు గారు వానివైనమును గాంచి, వాడొక మూర్ఖుడని యెంచి, జ్ఞానమును పొందే అర్హత వానికి లేదని నిశ్చయించి కొనెను. వేరొక వాడును రానీ మీ యిరువురికినీ, ఒకే సారి గురూపదేశము చేసెదనని చెప్పెను.

వేరొక యువకుడు, ఒక దినము పిదప, గురువు పాద సన్నిధికి చేరి నమస్కరించి యీ విధినయనెను “ఓ గురుదేవా! మీరు కోరిన యటుల చేయటకై యత్నించి విఫల మనోరథుడనైతిని. ఆత్మజ్ఞానమును తెలుపుటో లేదా మానుటయో మీరే నిర్ణయించి కొనుడి” పావురమును గురువు గారి చరణ సన్నిధిన యుంచి. చేతులు జోడించి నిల్చుండెను. గురువు గారును సంతృప్తిని పొందెను. అంతర్ముఖియైన శిష్యుడు తన వద్దకు వచ్చిన కారణాన యెంతో సంతసమొందెను. తన మనో భావములను బహిర్గతము కానివ్వకుండగ జాగ్రత్త పడెను. “ పక్షిని యే కారణమున చంపలేక పోయితివో, వివరముగా తెలుపుమని ఆదేశించిరి. శిష్యుడు వినయమున, చేతులు జోడించికొని, వివరములనీ విధిన విన్నవించెను.

“ఓ గురోత్తమా! మీ చరణ సన్నిధిని వీడి, స్వస్థానమునకు వెళ్లి న పిదప పక్షిని చంపప్రయత్నించితిని. కాని ఆ సమయము పగటి పూటయైనందునను, ఎవ్వరైననూ చూతురేమోయని భయపడి, ప్రయత్నమును విరమించితిని. రాత్రి పూట అనుకూలముగా నుండునని యెంచి యొక గదిలోనికి వెళ్ళి, కిటికీలను, తలుపులను మూసి, యొక దీపమును వెలిగించికొని పక్షిని చంప పూనితిని. కాని, నాకళ్ళు స్థితి గతులను గమనిస్తుందని గ్రహించితిని. దానికి గల కారణము దీపపు కాంతియని గుర్తెరిగి దీపము నార్పివేసితిని. అయిననూ, పక్షి నాకళ్ళకు కన్పించుచుండెను. మిలమిలా మెరిసెడి పక్షి కళ్ళు, చీకటిలోను కాంతులను వెదజల్లుచునుండెను. తన్నివారణకై కన్నులకు బట్టను కట్టికొని, పక్షిని చంప నెంచితిని. నా మనస్సు నేను పక్షిని చంపుచున్నాననెడి దానిని పసి గట్టెనని యెరింగితిని కళ్ళు కనిపించకుండా బట్టను కట్టికొన గల్గితేగాని, మనస్సుకు బట్టను కట్టుట యెట్టులో తెలియదయ్యెను. పక్షిని చంపుట సాధ్యము కాదని యెంచి , ప్రయత్నమును విరమించితిని. ఎవ్వరూ చూడకుండగనూ, ఎవ్వరూ కనిపెట్టని విధముగనూ యే కార్యమైననూ చేయలేమని గ్రహించితిని. నేనెరిగిన సత్యమును తమరికి నివేదించుటకై మీ కడకు వచ్చితిని”

శిష్యుని యనుభవమును వినినపిదప గురువుగారు వానికి ఆత్మతత్వమును గూర్చి పొందుపరచి చెప్పెను. మనస్సు వరకు అంతర్ముఖియై పయనించిన శిష్యునికి బుద్ధిగూర్చియు, బుద్ధికంటేనూ భిన్నముగానుండెడి ఆత్మగూర్చియు తెలియజెప్పెను.

యేదైనా క్రియను చేపట్ట వలెననిన, జ్ఞానము యెంతో అవసరమైయున్నది. వీరశైవ సిద్ధాంతము నందున గురుకరుణ వలన ప్రాప్తమయ్యెడి యిష్టలింగము తన అరయిక రూపమైన ఆత్మ యొక్క చిరుగుర్తుయై యున్నందునను, ఎవ్వనికి దాని గూర్చి అరయిక లభించునో వాడు దానిని ఎంతో ప్రేమతో పూజించుననియును, లింగధారణ స్థలమును ప్రతిపాదించుటకంటె ముందుగనే పిండజ్ఞానస్థలముపదేశించిరి.

యిష్టలింగమే ఆత్మకు ప్రతిరూపమని యెరుగని వారు, జ్ఞానశూన్యులైనందున, లింగమునొక రాయిగానెంచి, దాని యెడల ప్రేమను వీడిన వారై, యే కోయ్యకో, గూటమునకో లేదా గూటిలోనో వేసి చరియింతురు. అట్టివారు ఆత్మలు లేని ప్రేతములని గ్రహింపదగును. వేసికొనెడి వారైననూ, ఆత్మజ్ఞానము నెరుగుటయెంతో అవసరము అద్దానిని యెరుగక యిష్టలింగము యెడల ప్రేమను పెంచి కొనినచో ప్రయోజనముండదు. అట్టి ప్రేమకు సంబంధించిన ఉదంతమొకటి పంచతంత్రములో నివ్వబడినది.

ఒక రాజు తన వినోదము కొరకు ఒక కోతిని పెంచెను. దాని నెంతో ప్రేమతో చూచికొనుచుండెను. రాజు గారి ప్రేమను పొందిన కోతికి యెనలేని గౌరవము లభింపజొచ్చెను. దానికి హద్దు, అదుపు ఉండేవి కావు. అదియును రాజు యెడల నెంతో ప్రేమ గల్గియుండెను. రాజు తినే సమయాన తానూ తినుచుండెను. రాజు పరుండినప్పుడు, తాను రాజు గారి అంగరక్షకుని పాత్రను పోషించుచుండెను. మంచము కడ కూర్చొని, అతనికి నిద్రాభంగము కలుగ నివ్వకుండగ జాగ్రత్తలు గైకొనెడిది. ఈ విధిన కొన్ని దినములు గడచిపోయెను ఒక దినము రాజు గారు, భోజనము చేసి, విశ్రాంతిని పొందుటకై శయ్యా మందిరమునకు వెడలెను. కోతియు నతని ననుసరించి శయ్యా గృహమునకు వెళ్ళెను. పగటి నిద్ర వ్యసనమని యెరిగియూ, రాజు పరుండి నిద్రలోకి వెడలెను. కోతి మంచముకడ కూర్చొని కాపలాకాయ జొచ్చెను. రాజు గారు గాఢమైన నిద్రలోనికి జారిపోయిరి. ఆ సమయాన నొక యీగ రాజు గారి నోటిమీద వ్రాలెను. కోతియూ ఈగను గాంచి, తన స్వామికి నిద్రా భంగమగునేమోయని, చేతి చేత నా ఈగను అదిలించి తరిమెను. కాని ఆ ఈగ మరల మరల వచ్చి వాలు చుండెను. కోతికి కోపము వచ్చెను. ఆకోపమునకు హద్దులు లేకుండెను. అరిషడ్వర్గాలలో కోపము బలవత్తరమైనదనియునూ, దీని వలన హింసా ప్రవృత్తి చెలరేగునని విజ్ఞుల మతము. ఎంతటి మహిమాన్వితుడైన మనిషికైననూ కోపము వలన బుద్ధి మాంద్యము సంభవించును కదా! యుక్తాయుక్త విచక్షణను వీడి అనర్ధదాయకమైన కార్యములు చేపట్టును కదా! అల్పజీవియైన కోతి గురించి చెప్ప వలసిన దేమున్నది? ఆగ్రహావేశపరవశురాలైన కోతి, ఈగను చంపనెంచెను.

చుట్టు ప్రక్కలకు దృష్టిని సారించగా, రాజు గారి పొడవైన కరవాలము కనిపించెను. అద్దానిని గైకొని ఒరలోనుండి బయటికి లాగెను. ధగధగ మెరిసెడి, కత్తి వెలికి వచ్చెను. ఆ కత్తికి మంచి పదునుండెను. కోతి, ఈగ వ్రాలియున్నరాజు గారి నోటివైపుకు గురిపెట్టెను. ఈగను, రెండు ముక్కలుగా చేయాలని, బలమంతమునుపయోగించి కత్తితో వ్రేటును వేసెను. ఈగ, యిాలోపునే, యెగిరి పోయెను. దాని కేమియు కాలేదు. కాని రాజు నోరు ఖండింపబడెను. మోములోని యితర భాగములు ఖండనకు గురి యయ్యెను. రాజు విలవిల లాడుచు ప్రాణములు వీడెను. జ్ఞాన రహితమైన ప్రేమ అనర్థదాయకమని యీ కథ తలియజెప్పుచున్నది. ఇదే విధిన పిండజ్ఞానము లేనివానికి యిష్టలింగము నిచ్చి, పాణితలము నిడికొని, పూజించుమని యనినయెడ, వాడు లింగమును రాయిగా నెంచి విసిరి వేయకుంధా ఉండునే? ఈ కారణమున ప్రతి ఒక్కరికినీ పిండజ్ఞానమెంతో అవసరము.

ఈ వైజ్ఞానిక యుగములో మేధాశక్తితో చంద్రలోకమునకును, బృహస్పతి లోకమునకును, మరేలోకముకైననూ వెడలి. భౌతిక వస్తువులను వెదకి విజయమును సాధించినా, మన విజ్ఞాన సంపన్నులు తమను తామరయక బహువిధములైన కష్టనష్టముల నెదుర్కొనుట యనెడిది మనము గాంచ గలము. అందుకే బసవన్న గారు “ఏనాదరూ సాధిస బహుదు, మత్తేనాదరూ సాధిసబహుదయ్యా! తానారెంబుద సాధిసబహుదే?” అని ప్రశ్నించిరి. తనది కానిది తన కంటెనూ ఎంతదూరమున నున్ననూ వెతుకుట సుసాధ్యమే. కాని తనను తానరయుటచాల కష్టమని అన్నగారి వాక్కులలోని భావము. శ్రీ దేవర దాసిమార్యులును, ఆత్మ గురించి యెరిగి తన ఆశ్చర్యమును వెలిబుచ్చిరి గమనించుడి:

**మరదొళగే మందాగ్నియ ఉరియ దంతిరిసిదె**
**నొరెవాలొళగె తుప్పవ కంపిల్లదంతిరిసిదె.**
**శరీర దొళగాత్మననారు కాణ దంతిరిసిదె**
**నీను బెరసిద భేదక్కె బెరగాదెనయ్యా రామనాథా !**

వచనము యొక్క తెలుగు రూపమిది:

**మానులోని మందాగ్ని యెరియ నట్లుంచితివి.**
**నురుగు పాలలోని నేయిని కంపులేని యట్లుంచితివి.**
**శరీరములోని ఆత్మను ఎవరూ  చూడనట్లుంచితివి.**
**నీవు వెరసిన భేదమునకు వెరగయ్యెనయ్యా రామనాథా !**

ఇట్టి భావములే శ్రీ షణ్ముఖస్వామివారి పిలుపులోను గాంచగలము. గమనించుడి:

**ఎన్ని తనువిన మరెయలిర్ద**
**చినుమయన అరసువ బన్నిరే.**
**ఎన్న మనద మరెయలిర్ద**
**మహాఘన వస్తువ హుడుకువ బన్నిరే.**
**ఎన్న ప్రాణద మరెయలిర్ద**
**పరబ్రహ్మవెంబ అఖండేశ్వరన నోడువ బన్నిరే.**

వీరి పిలుపు యొక్క తెలుగు రూపమిది:

**నా తనువులోని మరుగున నున్న**
**చిను మయుని యరయగ రారండి**
**నా మనసులోని మరుగున నున్న**
**మహావస్తువును వెదుకగ రారండి**
**నా ప్రాణములోని మరుగున నున్న**
**పరబ్రహ్మ మనెడి అఖండేశ్వరుని జూడగరారండి.**

శరీరాంగములనే ఆత్మగా గాంచెడి వారిని, ఆత్మ తత్వము నెరుగుటకై రమ్మని పిలిచెడి శ్రీ షణ్ముఖస్వామి వారి పిలుపులోని తత్వమునెరింగిన గాని ఆత్మ తత్వము తెలియదు.

గీతలోని క్షేత్ర – క్షేత్రజ్ఞ విభజన కూడ, ఆత్మ అనాత్మలకు సంబంధించిన విభజనగా గ్రహింపదగను. శరీరమే క్షేత్రము, ఇద్దానికి భిన్నమైనది ఆత్మ ఆత్మకు క్షేత్రజ్ఞుడను నామాంతరమవ్విబడినది. ఈ విషయంబును మరింత విస్తృతముగాను, సోదాహరణముగాను తెలిపెడి ప్రభుదేవుని వచనమును గమనించుడి:

**అపరిమితద కత్తలెయొళగె విపరీతద బెళక నిక్కిదవరారే ?**
**బెళగూ అదె, కత్తలెయూ అదె! అదేనుచోద్యవొ?**
**బందక్కొందుంజదు, ఆనెయూ సింహవూబందాగి ఉంబుద**
**కందు బెరగాదెను కాణా గుహేశ్వరా!**

ప్రభువుల వారి వాణి యొక్క తెలుగు రూపమిది.

**అపరిమితమైన చీకటిలో విపరీతమైన వెలుగునిచ్చిన దేవరు?**
**వెలుగూ అదియె! చీకటి అదియె! అదేమి చోద్యమో?**
**ఒకదాని కొకటి బెదరపు, ఏనుగు సింహము ఒకటై తినును**
**కని, వెరగయ్యెను, గనుమా, గుహేశ్వరా!**

ఆత్మానాత్మపదార్థముల కలయిక విడ్డూరముగా నున్నదని తెలుపుటకై వెలుగు– చీకట్లను, గజ సింహములను ఉదాహరణములుగా నివ్వబడినవి.

ఈ విధముగా, శ్రీ రేణుక భగవత్పాదుల వచనానుసారము, నాది యనేది అనాత్మయనియు, నేను అనేది ఆత్మయని నిరూపణ చేయనైనది. శరణులునూ ఈ మార్గమునే యను సరించిరని తెలియుచున్నది. కాని చివరకొక యవరోధమును అధిగమించ వలసియున్నది. అదియే అహంకారము 'అహం' ప్రత్యయమునకు చెందిన యీ రెండి మధ్యగల భేదమును తెలిసికొన వలెను.

అహంకారానికి కర్తృత్వముండును. భోక్తృత్వధర్మము కూడ దానిలో ఉండును. ఆత్మకు చైతన్య ధర్మముండును. చైతన్యము, అహంకారమున కుండే లక్షణము కాదు. అది జడమైయుండును. మరొక భేదము గలదు. జాగ్రత్ స్వప్నావస్థలలో నుండెడి, అహంకారము సుషుప్తిలో నుండదు. అట ఆత్మమాత్రమే ఉండును. ఇంద్రియముల నుండి అహంకారము పర్యంతము గలవన్నియునూ అనాత్మ పదార్థములనియూ, ఆత్మ వీటికి భిన్నమై వీటి అరయికను గల్గి సాక్షీభూతముగా నుండెడిదని గ్రహింపదగును.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ది. 23-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

ఈ ఆశీర్వచనమున ఆత్మజ్ఞానము నెంతయో విస్తృతముగా వివరింపబడినది. కాయము ఆత్మకాదని నిరూపించనైనది. శ్రీజగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు తమ ఉపదేశమున పొదిగిన కథలు రత్నములవలె ప్రకాశించుచున్నవి.

ఆత్మజ్ఞానమే నిజమైన రత్నమని చెప్పిన అల్లముడు చిరస్మరణీయుడు. ఆత్మజ్ఞాన శూన్యుడు ఆగర్భ దరిద్రుని కంటెను దురదృష్టవంతుడని చెప్పబడినది.

ఆత్మ– పరమాత్మల సంబంధమును వివరించెడి సిద్ధాంతము లెన్నియో గలవు. ఈ రెండు భిన్నమైనవికావని యద్వైతులనుచుండుగా, ఈ రెంటికీ భేదము గలదనియు, ఈ రెండు వేరు వేరుగా నుండునని తెలిపెడిది ద్వైతము. అద్వైతము నాస్తికమని తెలిపెడి వారు గలరు.

అయ్యది ప్రచ్ఛన్న భౌద్ధమని విమర్శయొకటి గలదు "స్వేచ్ఛా ప్రచారంబు ప్రచ్ఛన్న బౌద్ధంబు హేస్వైక హేతువన్యాయ సరణి, అజ్ఞానతరము మహాజన దూష్యంబు పాతకా వానమ ప్రస్తుతంబు, నాలో కాయతము నెలవు ఆత్మాద్వైత" మని చతుర్వేదసారము (ప.162) తెలుపుచున్నది ఈ వాదనను, " నాస్తికులును యుక్తి దూరులును గైకొంద్రుగాక" యని సోమనాథుడు తన యభిప్రాయమును తెలియజెప్పిరి.

"నాస్తి పరలోక ఇతిమతి రస్యేతి నాస్తికః" అని లింగయ సూరి తెలిపెను. పరలోకము లేదనెడి వాడు నాస్తికుడని లింగయ సూరి వారి భావము.

నాస్తికతను మిథ్యాదృష్టియని అందురని తెలుపుటకై అమర సింహుడు "మిథ్యాదృష్టిర్నాస్తికతా " (అమరకో, ప్ర. కాం.ధీ.వ., శ్లో॥ 4) అని తెలిపిరి. "మిథ్యాచాసౌ దృష్టిఃశ్చమిథ్యాదృష్టిః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము, ఇహలోకమే కాని పరలోకము లేదనెడిదే మిథ్యా దృష్టి. ఇట్టి దృష్టిని మనమున దాల్చి సిద్ధాంతములజేసెడి వారెందరో గలరు వీరిలో "శరీరాత్మాభేదభావము" గల్గిన వారు ముఖ్యులు.

పరలోకము మిథ్యయైన యెడల దేవుడనెడి వాడు కూడ మిథ్యయే యగును. అట్టి యెడ ఇహలోక మెట్టులేర్పడు ననెడి సందేహము తలయెత్తును. ఈ విషయమున శ్రీ లిం॥ పండిత వీరభద్రశర్మ (శ్రీ జగద్గురువు) గారు "చతుర్భూతములలో స్వాభావికముగ గలుగు చేష్టల వలన జగత్కార్యము తనంతట తానే జరుగుచున్నది. కాని దీనికి కర్తయగు నీశ్వరు డొకడు వేరుగా లేడు" (శివ పంచస్తవి, పుట 7) అని తెలియజెప్పిరి. భూమి, జలము, అగ్ని మరియు వాయువులే యీ చతుర్భూతములని చెప్పబడినవి. ఈ సిద్ధాంతము లోని సారాంశ మీక్రింది విధముగనున్నది:

దేహమేయాత్మ. ఈ రెంటికి భేదము గలదని చెప్పుటకు వీలు లేదు. కారణమేమనగా దానిని మనము గాంచలేము. తనువును తెగనరికి పరికించిన యెడల, దేహము కంటెను వేరుగా నుండెడి ఆత్మ నిజమైతే, ఆత్మ కన్పట్టునే? కనిపించదు. కనిపించని యాత్మగలదని నమ్ముట యెట్లు? అహంప్రత్యయము దేహమునకే వర్తించును. నేను నల్లని వాడ, నేను ఎఱ్ఱని వాడను. అని మనము పలుకుట లేదా అదే విధిన నేను పొడగరిని, నేను పొట్టివాడనని పలుకుచున్నాము గదా ఈ "నేను"లన్నియును కనిపించేశరీరము నుద్దేశించి చెప్పబడినవే కదా! ఈ కారణము చేత దేహమునకును ఆత్మకును భేదములేదు. రెండును ఒకటె. భూజలాగ్ని వలన దేహముద్భవించు చున్నది ఈ కాయము మరణానంతరము నేలలోనో నిప్పులోనో కలిసి లుప్తమగును ఇది మరల పుట్టదు. పునర్జన్మ రాహిత్యమే ముక్తి యని దలచిన యెడ మరణమే ముక్తియని యనదగును. కనులకు కనిపించెడిదే వాస్తవము. కనిపించనిది లేదనే చెప్పవలెను. పరలోకము కనిపించదు. కనుకనయ్యది లేదు. అట్టియెడ సుఖమే స్వర్గము. దుఃఖమే నరకము. పుణ్యలోకమంటు వేరుగా యేదియు లేనందువల్లనే పుణ్య పాపముల చింతన యనవసరము.

పిండజ్ఞాని యిట్టి భావజాలమును గల్గియుండవలదని వీరశైవ విజ్ఞులు తెలియజెప్పుచున్నారు. దీనికి గల కారణమేమనగా పిండస్థలముల నుండెడి జీవి నివృత్త మార్గ గమనియైయుండును. ఈశ్వర కర్తృత్వమును ప్రశ్నించెడి యిట్టి భావనల వలన యతనికి చిత్తచాంచల్యము గల్గును. చిత్తవృత్తిని నిరోధించని స్థితిలో ప్రవృత్తి మార్గమున పయనించును. వీరశైవ తత్వము యెడల విముఖత ప్రదర్శించే యవకాశము గలదు. భోగ లాలసుడై దుష్కర్మనిర్వహణా దురంధురుడై దుర్మార్గానువర్తియై దుష్టుల సహవాసమును పొంది పాపాధిక్యత పెంపొందించుకొనును. తద్వారా పుణ్యము క్షీణించి యథోగతిన పయనించుచు చివరకుపతనమగును. ఎన్నో జన్మల పిదప లభించిన "పిండ" స్థానమునుండి చ్యుతిని పొందును. ఇట్టి స్థితిని నివారించుకొనుటకై పిండజ్ఞాని ఈ క్రింద వివరింపబడిన విషయములను గ్రహించి తన శివ భక్తిని పెంపొందించి కొనవలెను.

దేహత్మాభేదము విబుధజన విరుద్ధమైనది శరీరము జడమైనది. ఆత్మ వలననే దీనికి చైతన్యము కల్గినది. నిద్రలో నున్నప్పుడు ఆత్మ చైతన్యసహితుమైయుండిన యెడల శరీరము చైతన్యహీనమై మృతశరీరము వలె పడియుండును. మృతుడైన పిదప ఆత్మ భూలోకమున కొంత కాలము వరకు భూతమైచరించుననెడిది సత్యదూరము కాదని తెలియుచున్నది. బసవ పురాణములోని సప్తమాశ్వాసమున గల ఉద్భటుని కథ యీ విషయమునకు దృష్టాంతముగా నుండగలదు. పన్నెండు వేల సంవత్సరముల నుండి భూతము నొక మఱ్ఱి చెట్టు నాశ్రయించికొని యుండెడిదనియును, నవి శివభక్తునిచితి పొగ వలన ముక్తిని గాంచెననియును తెలుపబడినది. ఇట్టి కథలెన్నియో పురాణములలో చెప్పబడినవి. అగ్నిలో నుండెడి యినుము అగ్నిగా దోచినను, అగ్నివేరుగా నుండును. ఇనుము అగ్ని కాదు. అదే విధిన ఆత్మను వేరుగా నుండును. ఆత్మ కాయము కాదు. కాయ మాత్మకాదు. ఘటపటాదులు తమకు తామై యేర్పడవు. వాటి కొక కర్తయుండును. ఈ జగత్తుకును వేరుగా నొక కర్తయుండును అతడే శివుడు.

దేహములో దశేంద్రియములు గలవు వీటిలో నైదు కర్మేంద్రియములు. ఐదు జ్ఞానేంద్రియములు దేహము ఏ విధిన ఆత్మ కాజాలదో నదే విధిన యింద్రిములును ఆత్మ కాజాలవు. ఆత్మనిర్గమించిన నాడు యింద్రియములన్నియును జడములగుచున్నవి. ఇవి దేహికి సహకరించెడి సాధనములు మాత్రమే. విషయోపభోగము నిమిత్తమున ఇంద్రియములు సాధనములుగా పని చేయును.

బుద్ధియనెడిది యంతరంగ చతుష్టములలోనొకటి బుద్ధి ధీవర్గమునకు చెందినది. బుద్ధియు దేహికి సాధనమేగాని దేహము కాదు. బౌద్ధుల వంటి నాస్తిక వాదులు బుద్ధిని యాత్మగా చెప్పి వాదింతురు. ఈ వాదములు పిండస్థలమున జీవుని పెడమార్గమున పయనింప

జేయును. అందుచేత బుద్ధియును ఆత్మ కాజాలదని గ్రహించవలెను. దేహేంద్రియబుద్ధ్యాదులలో అహం ప్రత్యయ ప్రమేయముగలదు. నా దేహము, నా యింద్రియములు, నా బుద్ధియనెడి భావన గల్గినను ఇవి దేహికంటెను భిన్నమైనమే. వీటిలో మమ (నాది) యనే భావమేముండును. నేను దేహమును అని అనమము కదా ఆత్మను యిది యని నిర్వచించుట చాలా కష్టమైన పని. దీనిని చూపుటకై ప్రత్యక్ష ప్రమాణము అలభ్యములే. ఈ వాస్తవము యొక్క నేపథ్యములో ఆత్మయనేది యెవ్వడికి నాడు 'అహం' ప్రత్యయము ద్వారా స్వయముగా అనుభవముద్వారా తెలిసికొనవలసినిదే! ఇతరత్రా నయ్యది అనిర్వచనీయమైనది అందుచేత తనను తానెరిగిన వాడే ధన్యుడని బసవేశ్వరుల వారు తెలిపిరి అట్టి వానికి ఆత్మ జ్ఞానము సిద్ధించును. ఈ కారణముననే కాబోలు, తనను తానెరుగుటయే ముక్తియనెడి భావనకు ప్రచారము లభించినది.

ఆత్మ సనాతనమైనదనెడిది సర్వత్రా అంగీకరింపబడిన యంశము. సృష్టి జరిగినప్పటి నుండియును ఆత్మ యున్నదనియును అందరు అంగీకరిస్తూ ఉన్నారు. బసవన్న వారు, ఈ విషయమును, ఈ వచనము ద్వారా పరోక్షముగా తెలియజేసిరి.

**కాళియ కంకాళ దిందమున్న**
**త్రిపుర సంహార దిందమున్న**
**హరివిరించి గళిందమున్న**
**ఉమెయ కళ్యాణ దిందమున్న**
**అందింగెళెయ నీను, హళెయనాను**
**మహాదాని కూడల సంగమదేవా!**

దీని తెలుగు రూపమును గనుడి:

**కాళీకంకాళము కంటె మున్నున**
**త్రిపురసంహారము కంటె మున్నున**
**హరివిరుంచుల కంటె మన్నున**
**ఉమాకల్యాణము కంటె మున్నున**
**మున్నున మున్నున మున్నున**
**అప్పటికి కొంగ్రొత్త నీవు పాతవాడి నేను**
**మహాదాని కూడల సంగమ దేవా!**

బసవేశ్వరుల వారి "హళెయ నాను" అనెడిది కీలకమైన పదద్వయము. ఇచ్చట ఆత్మ సనాతనమైనదని ప్రతిపాదించబడినది. దేవునికి "కాలావధి" యుండదు. అతడు కాలాతీతుడు. అతనికి ప్రాత క్రొత్త లనెడివి ఉండవనెడిది వేద్యము.

ఇట్టి ఆత్మకు మరియు దేహమునకు గల సంబంధమెట్టిదో తెలిసి కొనవలసియున్నది. నిరాకారుడు సాకారుడుగా నుండుటకై దేహమును గ్రహించునని చెప్పబడినది. దీనికి గల కారణమేమనగా ఆత్మ కర్మఫలము నను భోగము చేసి కొనుటకే భూలోకమున దేహియై పుట్టుచున్నదని వేదాంతులు చెప్పుచున్నారు. ఇచ్చట ఆత్మ స్వచ్ఛందముగా పుట్టునాయనెడి సందేహము కలుగవచ్చును. కర్మపాశమున బద్ధుడై యున్నందున పరాధీనుడై పుట్టుచున్నాడనునది గ్రహించవలసిన విషయము. ప్రారబ్ధకర్మవలననే జన్మ లభించునని తెలియుచున్నది.

ఈ విషయమున బసవలింగశతకములోని యీ క్రింది పద్యము గమనించదగినదై యున్నది.

**ఆత్మాదాన వ్యక్తమందు బ్రాణముపుట్టు**
**బ్రాణమునందు సంభవము మనసు**
**మనసున వాగ్వృత్తి జనితమౌ**
**ప్రభవించు శబ్ద ప్రపంచ మట్ల**
**యాత్మాది భూతాది యందంగముదయించు**
**నంగంబునంద్రియము వొదము**
**నింద్రియంబుల జని యించువిషయము**
**లవ్విషయంబుల సంభవించు గోర్కు**
**.... ... ... బసవలింగ ।** (చతుర్వేదసారము, 247)

ఆత్మనుండియే దేహము, ఇంద్రియములు ఇత్యాదులు జనించినవని తెలుపబడెడి యీ పద్యము ఉపనిషత్ ప్రమాణములతో సరి తూగు చున్నది. ఇద్దానిని చూసిన మీదట దేహాత్మలు యొకటే యనెడి భావన దోచదు. పిండస్థలమున ప్రవేశించిన సాధకుడు ఇట్టి ఆత్మజ్ఞానము నవగతము చేసికొన వలెను.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-3

**శ్లో॥ నశ్వరాణి శరీరాణి నానారూపాణి కర్మణా।**
**ఆశ్రితో నిత్య ఏవా సావితి జంతోర్వివేకితా**
**శరీరాత్పృథగాత్మానమాత్మనః పృథగీశ్వరమ్।**
**ప్రేరకం యో విజానాతి పిండజ్ఞానీ తికథ్యతే॥** (సి.శి. 54-55)

ఆత్మ- అనాత్మలను వేరుజేసి చూసినంత మాత్రాన నది సంపూర్ణజ్ఞానము కాజాలదు. అందుచేతనే శ్రీ భగవత్పాదులవారు, ఆత్మ నిత్యమనియును, ఆనాత్మ పదార్థములు నశ్వరములనియును తెలియజేస్తూ నిత్యానిత్య వివేకమును బోధించు చున్నారు "యద్దృష్టం తన్నష్టం" యనెడి సూక్తి యొకటి గలదు "ఏది కన్పట్టునో, అది మరుగుపడును" అని యీ సూక్తి లోని భావము పుట్టక ముందున నుండక మరణానంతరము కన్పట్టక, మధ్యలో కొంతకాలము వరకు కన్పించు చుండెడిదే యీ కాయము. అందుచేత, నిది అనిత్యమైనది. త్రికాలముల యందును ప్రకాశించెడిదే ఆత్మ. అందు చేత, దీనిని నిత్యమైన దానిగా నెరుగవలెను నైయాయికులు "ప్రాగభావ- ప్రధ్వంసాభావా ప్రతియోగిత్వం నిత్యత్వమ్" అని నిత్యత్వమును నిర్వచించిరి. ఉత్పత్తి, వినాశములు లేనిది నిత్యమైనదని యీ నిర్వచనములోని భావము. నిత్యత్వానికి విరుద్ధమైనది అనిత్యత్వము.

షడ్భావ వికారములకు శరీరము గురియగు చున్నది "జాతే, అస్తి, వివర్ధతే, పరిణమతే, అపక్షీయతే, వినశ్యతి" అనెడివి షడ్భావ వికారములు. పుట్టునది, ఉండునది, పెరుగునది, పరిణామమొందునది, క్షయించునది. నష్టమయ్యెడిది" అనెడివే, భావ వికారములకు గల అర్థముఅట్టి యెడ శరీము శాశ్వతమైన దెట్లు? అందుకే శ్రీ భగవత్పాదులు "నశ్వరాణి శరీరాణి" అని ఉ పదేశించిరి. శరీరములు నశించెడివని యుపదేశములోని భావము.

తాము షడ్భావ వికారముల ననుభవిస్తూనే, యింకనూ దేహాభిమానము వీడకుండా, అవి యనుభవించెడి సుఖ సంతోషముల యెడ యనురక్తుడై యుండెడి జీవులను చూచిన యెడల నచ్చెరువుగల్గును. దీని కంటెనూ ఆశ్చర్యకరమైన విషయము మరొక్కటి యుండదని ధర్మరాజు చెప్పియుండెను. యక్ష ప్రశ్నకు నతడిచ్చిన సమాధానమియ్యది:

**శ్లో॥ అహన్యహని భూతాని ప్రవిశంతి యమాలయం।**
**శేషాశ్చస్థాతుమిచ్ఛంతి కిమాశ్చర్య మతఃపరమ్।**

దినదినము అసంఖ్యాకమైన జనులు, అసువులు బాసి యమపురికి వెడలు చున్నను, మిగిలినవారు స్థిరముగా నుండుదుమని కోరుకొంటారు. దీని కంటెను ఆశ్చర్యకరమైన విషయమేది? యని శ్లోకములోని భావము.

చచ్చిన వాని శరీరమును స్మశానమునకు తీసికొని వెళ్ళి పాతిపెట్టుటయో, దహించుటయో చేయు సమయాన జనులు స్మశాన వైరాగ్యమును పొందుదురు. జీవితము క్షణభంగురమని, మరణమనివార్యమనియు, చావు చెప్పి రాదనియు, ఆస్తి పాస్తులేవియూ వెన్నంటి రావనియు, పలు విధములుగా మాటలాడు చుందురు. ఇంటికి రాగానే, చచ్చిన వారి స్థిర చరాస్తుల పంపిణీ, విషయమున వారసులు కుక్కల కంటెనూ హీనముగా జగడమాడెడి పామరులెందరోగలరు. వీరిని గాంచిన జ్ఞానులకు ఆశ్చర్యము కలుగకుండునే? ఈ విషయమున ప్రభుదేవుల వారు చెప్పిన వచనము ఎంతో జ్ఞానదాయకముగా నున్నది. గమనించుడి:

**సంసారవెంబ హెణ బిద్దరె**
**తి బంద నాయ జగళవ నోడిరే!**
**నాయి జగళప నోడి హెణనెద్దు నగుత్తిదె.**

**గుహేశ్వర నెంబ లింగవల్లిల్ల కాణిరే!**

ప్రభుదేవుల వాక్కు యొక్క తెలుగు రూపమిది:

**సంసార మనెడి పీనుగ పడినయెడ**
**తినగ వచ్చిన కుక్కల జగడమును చూడుడీ!**
**కుక్కల పోరు చూచి పీనుగ లేచి నగుచున్నది**
**గుహేశ్వరుడనెడి లింగమట లేదు చూడుడీ!**

రామ- రావణ, కౌరవ- పాండవ, వాలి-సుగ్రీవ మొదలగువారి చరిత్ర లెరిగియూ, భాగస్వాములై బంధువులు, ఆస్తిని గైకొని, భ్రమకు లోనై మృతిజెందెడి దీపపు పురుగులవలె నశించి పోవు చున్నారు. వివేకమున్న వారీ గతిన ప్రవర్తించరని, నిజగుణులవారు తెలియ జెప్పిరి. "శీర్యతే ఇతి శరీరమ్" అనెడి వ్యుత్పత్తి ప్రకారము చూసినా, శరీరము నాశనమయ్యెడిదని తెలియును.

'దిహ ఉపచయే" అనే ధాతువునుండి వచ్చిన దేహమనే పదమునకు కూడిక యని అర్థము. వివిధ పదార్థముల సంగ్రహ స్వరూపమే దేహమని తెలియదగును. ఎముకలు, మాంసము, నరములు, రక్తము, మల మూత్రములు ఇత్యాదులు దీనిలో గలవు. ఇవన్నియును నశ్వరములే కదా.

శరీరము యొక్క స్వరూప స్వభావములను ఎంతో చక్కగా వివరించెడి పురాణోక్తిని గమనించుడి:

**శ్లో॥ అమేధ్యపూర్ణం క్రిమిజంతు సంకులం**
**స్వభావదుర్గంధమశౌచ మధృవమ్।**
**కలేవరం మూత్రపురీష భాజనం**
**రమంతి మూర్ఖా విరమంతి పండితాః॥** (విష్ణు పురాణము)

క్రిమికీటకాదులకు నిలయమై, అమేధ్య మలమూత్రాదులతో నిండియుండి, దుర్గంధము గల్గి, అపవిత్రమై యుండునది శరీరమనియును, మూర్ఖులు దానితో క్రీడిస్తే, పండితులట్టి ప్రయత్నము నుండి విరమించి కొందురని యీ ఉక్తిలోని భావము.

ఇంటిలోని కసవును నొకేస్థలమునకు చేర్చి, కుప్పగా పేర్చి, తానిమీద పట్టువస్త్రమును కప్పిన యెడల, జనులు నిజమెరుగని వారై, దానిలో ఏదో అమూల్యపదార్థములు గల వని భ్రమకు లోనౌదురు శరీరము గూర్చి భ్రమనుపెంచి కొనెడి వాడును అట్టివాడే. ఎంత సుందరమైన వారైననూ, వారిలో ఈ అశుచి ఉండియే తీరును. వారి చర్మములోని వర్ణము ఆకర్షణీయముగా నున్ననూ, వారి శరీరము పురాణోక్తిలో వివరించిన విధినే ఉండును కదా!

వ్యక్తుల శరీరముల యొక్క ఉపరితలము, అంతర్గతమైనదై, యుండి ఉంటే యే విధిన నుండు నోయని తెలిపెడి యీ ఊహా చిత్రమును గమనించుడి:

**శ్లో॥ యది నామాస్య కాయస్య యదంతస్తద్బహిర్భవేత్।**
**దండమాదాయ లోకో యం శునఃకాకాంశ్చవారయేన్॥**

దేహములోని రక్తమాంసాదులు వెలికి వచ్చి, చర్మము అంతర్గతమై యుంటే ప్రతి యొక్కడు చేతిలో దండమును పట్టికొని కాకులను, కుక్కలను దరిచేరనియ్యకుండా తనను తానే రక్షించి కొనుచు తిరుగాడ వలసి యుండును. అట్టి స్థితిని తప్పించి, అందమైన చర్మమునిచ్చి, మన యింపు సొంపులను పెంచిన పరమాత్మను మరచి తోలు తిత్తిమీద మమకారమును పెంచికొనెడి వానినేమన వచ్చును?

నేను, నాది యనెడి మోహములో చిక్కికొనిన వాడు, ఉత్తమోత్తమమైన తిండి పదార్థములను తినుచు, దేహపుష్టిని పెంచికొనును. ఉదయము వండిన వంట, సాయం సమయానికి పులిసిపోయిన యటులే, అన్నమయ కోశము గల్గిన దేహము అన్నరసము చేత తయారు చేయబడి, నియమిత కాలము పిదప వికృతమై నశించును ఇట్టిది అనివార్యముగా జరుగును కదా!

ఒక యిల్లాలు, అత్త వారింటనున్న, తన కూతురు నాల్గునెలల గర్భవతి యని తెలిసికొనెను. ఆమెకెంతో సంతోషము గల్గెను. ఆమె ఊహాలోకమున దేలియాడజొచ్చెను. ప్రసవానికై తన కూతురు నిక్కడకే రప్పించి కొనవలెననియును, ఆమె వచ్చిన పిదప ఆమె కిష్టమైన పదార్థములను తినిపించవలెనని కోరుకొనును. తన కూతురుకు, మామిడి పళ్ళంటే యిష్టమని జ్ఞప్తికి తెచ్చికొనెను. అది ఆ పళ్ళు లభించే కాలమైనందున, తన కూతురుకు మామిడి పళ్ళను అందుబాటులో నుంచికొనవలెనని నిశ్చయించికొనెను. చెట్టు ఒకటి ఇంటిలో నుండుటచేత, ఆమె యాలోచనలు అటువైపు తిరిగెను చెట్టుమీదనే పళ్ల నుండనిచ్చిన యెడల యింటి కోడళ్ళు వాటిని తిని తమ కూతురు కేమియూ మిగల్చరని యెంచెను. ఎవ్వరూ లేని సమయాన, పళ్ళను సంగ్రహించి, యొకపెట్టెలో పెట్టి, దానికొక తాళము వేసి, ఎవ్వరూ తిరుగాడని మారుమూల గదిలో నా పెట్టెను భద్రపరచెను నాల్గైదు నెలల పిదప కూతురును రప్పించి కొనెను. ఆమె అనురాగమునకంతు లేకుండెను. తన కూతురు నొక యేకాంత ప్రదేశమునకు వెంబడించికొని వెళ్ళి, సుఖాసీనురాలిని జేసి, తాను వెడలి మామిడి పళ్ళ నుంచిన పెట్టెను కొని తెచ్చెను. పెట్టె తరచి చూచెను. ఆమె ఆశ్చర్యమున కంతు లేకుండెను. పళు ్లబూజు పట్టియుండెను. ఎండి యొరుగులై యుండెను చూడలేని చూడజాలని వికృత రూపము నొంది యుండెను. విషయము నెరిగిన కూతురు, తల్లి అవివేకమునకు నవ్వుకొనెను. పళ్ళు యిన్ని దినములు నిలిచి యుండునే యని ప్రశ్నించెను. ఇంత మాత్రము నీకు తెలియదా యని బుద్ధి చెప్పెను.

ప్రకృతి నియమాల కనుగుణముగా పదార్థము పరిణామములకు గురియగుచున్నది. ప్రతివస్తువు స్వభావమిదియే "స్వభావో దురతి క్రమః" అనే సూక్తి ప్రకారము, పదార్థము యొక్క పరిణామమొందెడి స్వభావమును మార్చుటకు వీలు పడదు. ఈ విషయమున, బసవన్న గారిచ్చిన ఉదాహరణ యెంతో చక్కగా నున్నది. గుమ్మడి కాయకు ఇనుప చట్రమును బిగించినయెడల నది నశించకుండునే? అనెడి అన్నగారి ప్రశ్న, ఎన్ని సుగంధ ద్రవ్యములను పులిమికొనినాయేమి? లోని దుర్గంధము దూరమగునే? కాదు కదా! కుక్క తోకను చక్కగా చేయలేము. ఎంత యత్నించినా, అది వక్రగతిని పొందును. శరీరములోని దుర్గందాదులు నట్టివే. ఈ భావమునే తెలిపెడి శ్లోకాన్ని గమినించుడి:

**శ్లో॥ కాయః స్రగ్గంధ దూపాద్యై యత్నే నాపిసుసంస్కృతః।**
**నజహాతి స్వకం భావం శ్వపుచ్ఛ ఇవ నామితః॥**

దేహము ప్రాణమున్నంతవరకు ఆద్యాత్మిక, ఆధి భౌతిక మరియు ఆది దైవికములనెడి తాపత్రయములయందు పడి బాధపడు చుండును. జీవించి యున్నంతవరకు చింతలోను, మరణించిన పిదప చితాగ్నిలో పడి దేహము భస్మమగుచున్నది.

శరీరము యొక్క షడ్భావ వికారములలో చివరది మరణము. "మరణం ప్రకృతిః శరీరిణాం వికృతిర్జీవనముచ్యతే" అనెడి ఉక్తి యొకటి గలదు. జీవనము వికృతి యనియును, మరణము ప్రకృతి యనియును ఈ శ్లోకములోని భావము. చావనెడిది ఆశ్చర్యమైనది కాదు. ఒకడు ఎన్ని సంవత్సరములు జీవించినాడనెడిది పరమాశ్చర్యకరమైన విషయము ఒక రబ్బరు బుగ్గలోని గాలి యనెడిది తాత్కాలికముగా నుండును. పిల్లలు ఆడుకొనెడి సందర్భమున దానికి చిన్న దెబ్బతగిలి రంధ్రము పడిన యెడల గాలి వెడలి పోవును కదా! కాని బుగ్గ వంటి మానవ శరీరమునకు, నవ రంధ్రములుండిననూ ప్రాణవాయువు నిలిచియే ఉండును. ఇది ఆశ్చర్య కరమైన విషయము కాదా! ఎప్పటికైననూ గాలి పోవలసినదే. అందుకే "జాతస్య మరణం ధృవమ్" అనే ఉక్తి ప్రచారములో నున్నది. పుట్టిన పిదప చావు తప్పదని దీని యర్థము.

మర్త్య లోకములోనికి వచ్చిన వారి ముందున మృత్యువు ముట్టకుండా మిగిలినవారెవ్వరు? కాలము యొక్క ఈ కట్టడిని గని ప్రభు దేవుల వారు వెరగొంది ఈ క్రిందివిధముగా చెప్పిరి.

**హులి యబెణ్ణి నల్లహుల్లెందు హొాగి**
**మేదుబందెనెందరె ఇదకందు బెరగాదె**
**రక్కసియమనెడె హొాగినిద్రె గయిదు**
**బందె వెందరె ఇదకందు బెరగాదె**
**జవనన మనగె హొాగి సాయదె**
**బదుకిబందె నెందరె ఇదకందు బెరగాదె గుహేశ్వరా!**

**పులి యొక్క వెన్నున ఒక లేడి వెడలి**
**మేసి వచ్చెననిన కని వెరగాయె**
**రక్కసి మనికికి పోయి నిద్రజేసి**
**వచ్చితిననిన దీనినిగని వెరగాయె**
**యముని మనికికి పోయి చావక**
**బ్రతికి వచ్చితిననిన దీనిని గని వెరగాయె గుహేశ్వరా!**

"సంయోగో విప్రయోగాంతః " అనెడి నియమమును గమనించిన యెడల, పంచభూతముల కలయిక అయిన దేహము నిలువదు. కారణమేమనగా విడిపోవుట యనేది ప్రకృతి ధర్మము పంచభూతములు విడి పోవగనే, దేహము నశించును.

జగత్తులో జీవులన్నియునూ యమునికి భక్ష్యభోజ్యములని తెలిపెడి సూక్తి యొకటి గలదు "కాలోజగద్భక్షకః" అనెడిదే ఆసూక్తి.

పుట్టిన జీవికి యొక నిర్ణీత జీవన పరిమితి గలదు మనిషి నూరు సంవత్సరములు బ్రతుకునందురు. అది సరియైనది కాదు. వెలుగు నీడల వలె పుట్టుక చావులు ఒక దానివెనక వేరొకటి వెన్నంటి యుండును. రథమున కుండెడి యిరు చక్రములవలె, జీవనమనెడి రథమునకు చావు పుట్టుకలు చక్రముల వంటివి. ఏ క్షణమున నైననూ రథచక్రములు రథమును వీడి వెడల వచ్చును.

జన్మదినోత్సవాలు చేసి కొనెడి వారిని చూస్తూనే ఉంటాము. పామరుల కది పండుగ సంతోషదాయకము. వాస్తవంగా సంతోషదాయకమైనదేనా? ఈ ప్రశ్న, తమ బిడ్డల జన్మ దినముల పండుగలు చేసే తల్లి, దండ్రులు తమకు తామే వేసికొనవలెను. అయిదవ జన్మదిన మనగా, ఆ బాలకునికి అయిదు సంవత్సరముల మేరకు ఆయుశ్శు క్షీణించినదని అర్థము. ఈ విషయము తెలిసి కొనిన తల్లి-దండ్రులు సంతోషించ వలెనా? విచారించవలెనా? జ్ఞానులు నిట్టి విషయమును గమనించిన వారై "ఆయుక్షీణం నజానంతి తస్మాత్ జాగ్రత జాగ్రత" అని హెచ్చరించు చుందురు.

నశ్వరమై నశించే స్వభావముగల శరీరములోని ఆత్మతత్వమును గుర్తెరిగిన వానికి మరణమే పరమానంద దాయకమైన విషయమగును నిత్యా-నిత్య వస్తువివేకము లేని వారికి, యిట్టి భావన రాదు. మరణము గురించి వింటే భయమును పొందుదురు. మరణమనెడిది విశ్వజనీనమైనది. యెవ్వరునూ దీని నుండి తప్పించి కొన లేరు. ఈ విషయమును తెలియ జెప్పెడి కథలెన్నియోగలవు.

ఒక యూరిలో నొక యిల్లాలు సుఖమయమైన జీవనమును కొనసాగించుచుండెను. ఆమె కొక పిల్లవాడు పుట్టెను. యెంతో ప్రేమతో పెంచి పోషించు చుండెను. అకస్మాత్తుగా విషజ్వరము మూలమున బాలకుడు విగతజీవుడయ్యెను. శవసంస్కారమును చేయు నిచ్ఛలేనిదై, యే విధిననైననూ బిడ్డను బ్రతికించి కొనవలెనని కృతనిశ్చయురాలై యుండెను. ఆ వూరి వెలుపల నొక యోగి పుంగవు డొచ్చినాడని విని, బాలుని శవము తీసుకొని వెళ్ళి, ప్రాణబిక్ష పెట్టమని కోరెను. యోగీశ్వరుడు, ఈమెకు జ్ఞానోదయమును గల్గించనెంచెను. ఊరులోకి వెళ్ళి, చావు గల్గని యింటినుండి పిడికెడి బియ్యమును తెమ్మనెను. వాటితో నాశీర్వదించి బ్రతికింతుననెను. ఆమె యెంతప్రయత్నించినా అట్టి యిల్లు లభించదయ్యెను. ఆమె వెను దిరిగి వచ్చి, సత్యమును నివేదించెను. యోగి ఆమెకు జ్ఞానోపదేశమును చేసెను. ఆమె గొప్ప యోగిని యై లోకములనుద్ధరించే కార్యముల నెన్నెంటినో చేసెను.

దేహాత్మ బుద్ధి యున్నవారికి మరణభయమనెడిది తప్పదు. అందుచేత శ్రీ భగవత్పాదులవారు ఈ పిండస్థలమున నిత్యమైన ఆత్మ యొక్క అరయికను కల్గించిరి.

భూమి యందదగిన వేర్లపైన వటవృక్షము ప్రపంచమునకు కన్పట్టుచు వెల్లి విరియును. ఆత్మానాత్మల సంబంధము నట్టిదే. కన్పట్టని ఆత్మ నాధారముగా గైకొని దేహము మనుగడ గొన సాగించును. వేర్లకు, చెట్టుకును గల బంధము తెగి పోయిన యెడల, చెట్టు నేల కొరుగును. అదే విధిన, ఆత్మతో సంబంధము లేనినాడు శరీరము విగత ప్రాణిగా అయిపోవును. దుర్గంధ పూరితమగును అందు చేత, కన్పించే వస్తుసంచయము నుండి దృష్టిని మరల్చి కన్పించని ఆత్మను గూర్చి తెలిసి కొనుటకు ప్రయత్నించ వలెను. ఇది మానవుని ప్రాథమిక కర్తవ్యమని యెరుగవలనెను.

ఆత్మ జిజ్ఞాసువైన మైత్రేయికి శ్రీ యాజ్ఞవల్క్యుల వారు కటాక్షించిన ఉపదేశము గమనార్హమైయున్నది. "ఆత్మనస్తుకామాయ సర్వం ప్రియం భవతి ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోత్రవ్యో మంతవ్యో నిధిధ్యాసితవ్యో మైత్రేయ్యాత్మని ఖల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాత యిదం విదితమ్" (బృ. ఉ.4-5-6)

పరమ ప్రేమాస్పదమైన ఆత్మనే దర్శనము శ్రవణము మననము మరియు నిధిధ్యాసనములకు అర్హత గలది. లోకమునందు సామాన్యముగ ఎల్లరు ధనముమీద ప్రేమ గలవారై యుందురు, అందుకే "అర్థాః బహిశ్చరాః ప్రాణాః" అను సూక్తి యొక్కటి కలదు. ధనమనెడిది దేహమునకు బయలున చరించెడి ప్రాణమని ఈ సూక్తి యొక్క అర్థము. ధనము మీద లోభము పెంచుకొని కష్టపడి సంపాదించినను యింటియందు భార్య పిల్లలు రోగులుగ నున్నప్పుడు ధనమును ధారాళముగ వ్యయపరచి వారి యొక్క ప్రాణములను నిలుపుటకు ప్రయత్నించుచున్నారు. అప్పుడు అతని ప్రేమ ధనమునందు తగ్గి భార్య పిల్లలను ఆశ్రయించును,

ఇంటిలో ఎల్లరు పరుండినప్పుడు అకస్మాత్తుగ నిప్పు తగలి యిల్లు కాలుట ప్రారంభమైన పిదప అందరిని విడచి తానొక్కడె బయటికి పరువెత్తివచ్చుటను చూతుము. యిందు చేత పిల్లలు మొదలగువారి కంటెను తన శరీరమే తనకు ప్రేమగలది అని తెలియును, తన శరీరము మీదకి ఎవరైనను, కొట్టుటకు వచ్చినప్పుడు అశక్తుడైన మానవుడు కొట్టేవారికి వెన్ను చూపి తన కళ్ళు మొదలగు సూక్ష్మ అవయవములకు దెబ్బలు తగలకూడదని చేతులతో మూసికొనుచున్నాడు, అప్పుడు దేహముకంటెను ఇతడు ఇంద్రియములమీద ఏక్కువ ప్రేమ గలవాడని అనుభవమునకు వచ్చును.

ఆకస్మాత్తుగ కళ్ళు చేతులు కాళ్లు మొదలగు అవయవములకు అసాధ్యమైన రోగములు వచ్చి చేరినప్పుడు ఆయా అవయవములు కత్తరించినగాని నీవు జీవించి వుండవు, లేని యెడల చత్తువు అని వైద్యులు చెప్పినప్పుడు కాళ్ళు చేతులు పొయినను చింతలేదు. నాప్రాణము మిగిలిన చాలు అని కాళ్ళు చేతులను కత్తరించుకొనుటకు తయారగును. యిందుచేత అవయవములకంటె ప్రాణమే ప్రేమాస్పదమైనదని తెలియును. మరి కొందరు జీవనము నందు అనేకకష్టములను అనుభవించి జీవనమే నిస్సారమని యెంచి విసుగు చెంది ఉరి వేసికొనియో, చెరువు బావులలో దూకి తమప్రాణములను వీడెదరు, యిందు చేత ప్రాణముకంటెను ప్రియమైనది ఆత్మయే అనెడిది అందరికి అనుభవవములోకి వచ్చెడి విషయము, ఈ కారణముననే శ్రీ విద్యారణ్యస్వామివారు ఈ విధిననుడివిరి

**శ్లో॥ విత్తాత్ పుత్రః ప్రియః పుత్రాత్ పిండం**
**పిండాత్ తథేంద్రియాణి, ఇంద్రియేభ్యః**
**ప్రియాః ప్రాణాః ప్రాణాదాత్మ పర ప్రియః**

ధనము కంటెను పుత్రుడు, పుత్రునికంటెను శరీరము, శరీరముకంటెను యింద్రియములు యింద్రియములకంటెను ప్రాణములు ప్రాణము కంటెను ఆత్మ అధిక ప్రేమాస్పదమైనవని శ్లోకములోని భావము అందుచేత శరీరము అశాశ్వతమైనది, అనగా శరీరములన్నియు అనిత్యమైన పదార్థముల వర్గములకు చెందినవనియును, పరమ ప్రేమాస్పదమైన ఆత్మ మాత్రము నిత్యమైనదనియును తెలిసికొనిన వాడే పిండజ్ఞాని యగును.

పిండజ్ఞానికి నిత్యానిత్య వివేకముతో పాటుగా, యీశ్వర పరిజ్ఞానము కూడ కలుగవలెనని శ్రీ భగవత్పాదుల వారు బోధించిరి గమనించుడి:

**శ్లో॥ శరీరాత్ పృథగాత్మానమాత్మన పృథగీశ్వరమ్।**
**ప్రేరకం యో విజానాతి పిండజ్ఞానీ తికథ్యతే॥** (సి.శి.5-85)

ఎటులయితే శరీరము కంటెను ఆత్మ భిన్నమైనదో, అటులనే ఆత్మ కంటెను పరమేశ్వరుడు భిన్నమైనవాడనియూ, అతడు అన్నింటికీ ప్రేరకుడనీ తెలిసి కొనుట యెంతో అవసరము. అప్పుడే పిండజ్ఞానియొక్క జ్ఞానము పరిపూర్ణమైన దగు. చున్నది.

వేదాంత పరిభాషలో "తత్త్వం పదార్థశోధనే" యనెడిది యుపయోగింపబడుచున్నది. తత్ మరియు త్వం పదముల శోధననే యిది యని గ్రహింప దగును. ఇది ఆత్మ-పరమాత్మ వివేచనకు సంబంధించిన విషయము. కొందరు ఇద్దానిని పిండజ్ఞానముతో పోల్చి చూతురు. అయితే, కొంత భేదమును గాంచగలము, వేదాంతవాదము చాలా మేరకు "కేవలాద్వైత" భావన వైపు మొగ్గు

చూపును. జీవాత్మ-పరమాత్మలకు అభేదము ప్రకటించుటయే అద్వైతుల లక్ష్యము. వీరశైవ మట్టిదికాదు. ఇద్దానిని భేదాభేదవాదమందురు. నివృత్తి దశలోనే అభేదముండును. ప్రవృత్తినంధున జీవాత్మపరమాత్మలకు మధ్య భేదమే అధికముగా నుండును. భక్తస్థలములోని అవాంతరభేదమైన పిండజ్ఞాన స్థలమున జీవాత్మ పరమాత్మలకు భేదమే ఉండును. పరమాత్మ పూజ్యుడైతే, సాధకుడు పూజకుడగును. నిత్యానిత్య పదార్థముల వివేకమును గల్గి, జీవాత్మ-పరమాత్మ భిన్నత్వము నెరిగి, యీశ్వరుడు ప్రేరకుడని గ్రహించి, ఇతరుల కంటెనూ విలక్షణమైన వ్యక్తిత్వము గల్గి, జీవనము సాగిస్తూనే, వివేకము బలము వలన వైరాగ్యమును పొందెడి వాడే, పిండజ్ఞానియని గుర్తెరుగవలెను.

దీనితో పిండజ్ఞాన స్థలము సంపూర్ణము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ది. 24-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

శ్రీ మదాచార్యవర్యులు విద్యా వాచస్పతి జగద్గురు శ్రీ చంద్రశేఖరులవారు ఆత్మవిద్యను యీ ఆశీర్వచనమున ప్రదానము చేసిరి. పిండజ్ఞానికి వలయు విజ్ఞాన నిధిని సులభగ్రాహ్యమయ్యెడి విధిన ప్రదానము చేసిరి.

పిండస్థలమున నుండెడి జీవుడు శ్రద్ధా భక్తికంటెను పూర్వదశలో నుండెడి వాడు. ఈ స్థితిలో యతనికి కావలసిన జ్ఞానమెట్టిది యనెడిది యూహింప వచ్చును. భేదాభేద సిద్ధాంతములలోని యభేద సిద్ధాంతము విహితము కాదని శ్రీ భగవత్పాదుల వారి బోధనల వలన తెలియుచున్నది. భేదమే ప్రతిపాదించవలెను. ఈ సిద్ధాంతము ప్రకారము శివుడు జీవుడు భిన్నమైన వారు జీవుడు శరీర సహితుడు ఇయ్యవి మూడు తెరగులుగనుండును. అవి:

స్థూల శరీరము, సూక్ష్మ శరీరము మరియు కారణ శరీరము. స్థూల శరీరమునే కాయమనియును, సూక్ష్మ శరీరమును ఆత్మయనియును అందురు. కారణశరీరము పరమాత్మ తత్త్వమునకు సంబంధించినదని యెరుగవలెను.

వేదాంత వాదము ఆత్మతత్త్వము వరకే పరిమితమగును. పరమాత్మ-జీవాత్మలు ఒక్కరేయని యందురు. ఇట్టివారి నద్వైతులందురు ఈ వాదనను ఖండించెడి వారు ద్వైతులు ఈ వాదన ప్రకారము పరమాత్మ జీవాత్మ మరియు ప్రకృతులు గలవు. మూడును నిత్యములే, వీరిని వివిధ పేర్లతో పిలుతురు. ఆత్మను భోక్తృ అని, ప్రకృతిని భోజ్యమని యందరు.

ఆత్మ సనాతనుడనెడిది సాంఖ్యుల చేత ప్రతిపాదింప బడినది. ఈ విషయమున భేదాభిప్రాయములు గలవు. బౌద్ధులు దీనిని యంగీకరించరు. చార్వాకులు కూడ ఆత్మ నిత్యమైనదని నుడువరు. దీనికొక కారణము గలదు. వీరి యాత్మ తత్త్వము భిన్నమై యుండును. శరీరమే యాత్మ యనెడి భావనకు వీరెకువ్వ ప్రాముఖ్యత నిత్తురు. దేహము పంచభూతాత్మకమైనది. అందుచేత, నిది నిత్యమైనది కాదు. కాలానుగుణముగా మార్పులకు గురియగును. వర్షవాతాతపశైథిల్యములకు లోనై నశించెడి యవకాశము కలదు. బాల్యాది వృద్ధాప్యము వరకు గల వివిధ దశలలో వైపరీత్యముల నెదుర్కొని సుఖదుఃఖము లననుభవించు చుండును. కాని బుద్ధికి యుండెడి పరిమితుల మూలమున దేహి తన స్వరూపములో నిమిడి యున్న తత్త్వము నెరుగ జాలడు. నీరు – క్షీరము గలసి యున్నప్పుడు, నయ్యవి విడదీయరానివిగా దోచును. సగటు మనిషి వాటిని విడదీసి చూడలేడు. పృథః కరణనైపుణ్యమునకు ఎంతో కీలకమైన ప్రాముఖ్యత గలదు. హంస మాత్రమే నీటిని విస్మరించి పాలను గ్రహించగలదు. నీర-క్షీర పృథః కరణ కౌశలము శునకమునకు గలదే? అదే విధిన దేహముతో కలిసి యుండెడి యాత్మను దేహమునుండి విడదీసెడి నీర-క్షీర వృథః కరణ వివేకమును గడించుట అంత సులభమైన పని కాదు. అజ్ఞుడు విడదీసి చూడలేని దానిని విజ్ఞుడు విడదీసి చూడగలడు. ఇట్టి విజ్ఞతను పెంపొందించి కొన వలెనని శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు తెలియజెప్పిరి.

బసవపురాణములోన యంగమునకు నీ లక్షణములు గలవని తెలుపబడినది.

**అంగంబు పూర్వ కర్మావశేషంబు**
**నంగంబు సుఖదుఃఖ సంగతి నెలవు**
**నంగబు పుణ్యపాపాలయం బట్టి** (బసవపురాణం, షష్ఠాశ్వాసము, పద.698-702)

పూర్వకర్మావశేషంబు ననుభవించుటకే ఆత్మ దేహబునాౖశయించుచున్నదని గ్రహించవలెను. ఆత్మ సుఖదుఃఖములను దేహి యను మాధ్యమము లేకుండగ యనుభవించ లేదు. ప్రవృత్తి మార్గముననుండెడి ఆత్మ దేహము మాధ్యమముగా గొని విషయాసక్తిని దీర్చికొనును. సంచిత కర్మ ఇత్యాదులు దేహము వలన జరుపబడెడి కార్యముల వలన సిద్ధించును. ఈ విధముగా దేహము ఆత్మ కంటెను భిన్నమైనదని యెరుగవలెను. కర్మోపభోగము పరిపూర్ణముగా అయినప్పుడు ఆత్మ కాయమును వదలి వేయును. మరణము సంభవించును. కాయము నశ్వరమైనది గాన నశించి తీరును.

ఆత్మానాత్మ వివేకముతో పాటు, పిండజ్ఞాని నిత్యానిత్య వివేకమును పెంపొందించికొన వలసిన యవశ్యకత యెంతైనా గలదు. పుట్టినది గిట్టక తప్పదు. చావనెడిది తథ్యము అందుచేత శరీరము నశించియే పోవును. ఇచ్చట సందేహమున కాస్కారములేదు. అవతారపురుషులకైనను మరణము తప్పలేదు. కృష్ణుడు బాణము ౖవేటుకు చచ్చెనని చెప్పబడినది. రాముడు సరయూ నదిలో ప్రవేశించి తన తనువును వీడెనని చెప్పబడినది. నృసింహుని శరీరమును శరభేంద్రుడు చీల్చి చెండాడెనని చెప్పబడినది అట్టి యెడ సాధారణ జీవుల సంగతి గురించి యిక చెప్పవలెనా?

ఆత్మకు చావు పుట్టుకలు లేవనియును, అది నిత్యమైనదనియును చెప్పబడినది. వాతాతపశైథిల్యములకు ఆత్మ అతీతముగా నుండును. ఆయుధము చేతనది చీల్చబడజాలదు. పంచభూతములు ఆత్మను నష్టపరచలేవు. ఈ విధిన ఆత్మ శాశ్వతమైనదని గ్రహించ వలెను.

జగత్తు పుట్టినప్పటినుండియును ఆత్మ ఉండియున్నది. ఈ విషయమును పిండజ్ఞాని తెలిసికొనవలెను. నానాయోనులలో బడిదేహమును దాల్చి పుట్టి గిట్టి పలు విధములైన వేదనలకు గురియయ్యెడి ఆత్మను (జీవిని) యుద్ధరించ వలెనను తలంపు శివునికి వచ్చునని ఆగమములు తెలుపుచున్నవి. హిత మార్గమును సూచించెడి యీ శివుడు- జీవుని కంటెను భిన్నుడని గ్రహించవలెను. శివ-జీవాభేదమును ప్రతి పాదించే యాచార్యుల వారు ఈ విధిన యెందుకు వివరించిరో తెలిసి కొనవలెను. ప్రారంభ దశలో భేదభావముండుట యేయుచితమని గ్రహించవలెను. భక్తి జ్ఞానవైరాగ్యములు గణనీయముగా పెరిగినప్పుడే శివ-జీవాభేదము గురించిన జ్ఞానము హితకారి కాగలదు. లేని యెడల సాధకుడు శివ పూజాదుల జేయుటలో నాసక్తిని పెంచి కొనడు శివపూజాసక్తి లేనిది శివభక్తి గలుగదు. భక్తిలేని వానికి ముక్తిగలుగదు. అందుచేత పిండజ్ఞాని ఆత్మ కంటెను పరమాత్మ వేరైన వాడని గుర్తించవలెను. అతని యనుగ్రహము నాశించి అర్చనాదులను చేయుచు పుణ్యాధిక్యతను, పాపప్రక్షాళనమును పొందవలెను. ఇదియే పిండజ్ఞానికి గల యేకైక కర్తవ్యము.

**-శివం భూయాత్-**

# సంసార హేయస్థలము

## ఆశీర్వచనము:-1

**శ్లో॥ నిరస్తహృత్కలంకస్య నిత్యానిత్యవివేకినః ।**
**సంసార హేయతాబుద్ధిర్జాయతే వాసనా బలాత్॥** (సి.శి. 5-57)

హృదయములో కల్మషము దూరమైన వానికి, నిత్యానిత్య వివేకము పొందిన వానికి, వాసనా బలము వలన సంసారము హేయమైనదనే బుద్ధి గల్గునని శ్లోకములోని భావము.

ఇచ్చట అధికారి యనే విషయము గురించి తెలిసి కొనవలసియుండును. అనుబంధ చతుష్టయములో నధికారమొకటి యని గుర్తెరుగ వలెను. సంబంధము, విషయము మరియు ప్రయోజనములనెడివి మిగిలినవి వీటిలో అధికారి యొక్క పాత్ర ప్రముఖమైనది ప్రయోజనములలోని భేదమువలన అధికారులలో భేదము లగు చున్నది. ఈ బోధసారములోని వచనములో నా యాభేదములను గాంచగలము గమనించుడి:

**శ్లో॥ జ్యోతిష్టోమే స్వర్గకామో వివాహే పుత్రకామవాన్।**
**వాణిజ్యే లోభవాన్ మోక్షే ముముక్షురధికారవాన్॥**

స్వర్గ సుఖములను కోరువాడు జ్యోతిష్టోమ మనెడి యాగము చేయుటకును, పుత్రసంతానమును కోరువాడు వివాహ విషయమునందున, లోభ బుద్ధిగల వాడు వ్యాపారము నందును, మోక్షము నందు ముముక్షువు అధికారము గల్గిన వారై యుందురని శ్లోకములోని బావము.

మోక్షాపేక్ష గల్గినంత మాత్రాన, ముక్తిలభించుట సంభవించదు. ప్రయోజన ప్రాప్తికై వివేకము, వైరాగ్యము మరియు శ్రమ-దమాది సాధనములను గల్గియుండవలెను. "సుమ్మనె ఆగదు ముక్తి" ఊరకయే ముక్తి కలగదు యని తెలిపిన శ్రీ నిజగుణుల వారి వాక్కులు స్మరణీయములు. ఇది నిత్యమైనది, యిది అనిత్యమైనదని తెలిసి కొనకుండగ, హృదయములోని భోగేచ్ఛ దూరము కాకుండగ, శమ-దమాది సాధనములు సాధించ కుండగనూ కేవలము ముక్తి కావలెనని కోరితే గల్గెడి ప్రయోజన మేమియూ ఉండదని నిజగుణులనుపదేశము.

"కశ్చిత్ ధీరః ప్రత్యగాత్మా నమమేక్షత్" యనెడి యుపనిషద్వాణియూ ముక్తి సులభముగా లభించెడిది కాదని తెలుపు చున్నది.

మితాయి కొట్టులోని మితాయిలను తినెడి యధికారము గల వాడెవ్వడు? అనెడిది విచారించిన యెడల తినెడి కోరికతో పాటుగా కొనెడి సామర్థ్యము గలవాడే అర్హుడని తేలును. అదేవిధిన కష్టముల నివృత్తిని, పరమానంద సుఖ ప్రాప్తిని గల్గించెడి లింగాంగసామరస్యమును కోరువానికి, కోరికతో పాటుగా వివేకము, వైరాగ్యము, శమ-దమాది సాధనములు నుండవలెను. ఇవి గల్గినట్టివాడే నిజమైన మోక్షాధికారి యని గ్రహించవలెను.

ఈ విషయములనే శ్రీ భగవత్పాదులు అగస్త్య మహర్షికి యుపదేశించిరి.

జన్మజన్మాంతరముల యందున నాచరించిన నిష్కామ సత్క్రియల ఫలితముగా జీవిలో వాసనా బలము గల్గును. తద్వారా విగత కల్మషుడై, నిర్మల మనస్సియై యుండెడి స్థితిలో, విషయాసక్తిని వీడి, భోగేచ్ఛకు బంధము వేసి ఆత్మజ్ఞానమును పొందెడి వివేకమును సంపాదించిన వాడు మోక్షమున కర్హుడని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిరి. అట్టి వానికే సంసారము యెడల హేయ భావమేర్పడునని తెలిపిరి. హేయబుద్ధిగల వాడే ముక్తిని పొందగలడని వివరించిరి.

"సంసార హేయతాబుద్ధి" గురించి తెలిసికొన వలెననిన యెడల, సంసార మంటే యేమిటి? దాని యెడల హేయబుద్ధి యెందుకు గల్గును? అనెడి ప్రశ్నలకు సమాధానముల నన్వేషించవలెను.

సంసారము గురించి గుర్తెరిగిన జ్ఞానులు, సంసారమును బహు విధములైన ఉపమానములతో జోడించి చెప్పిరి. పగబట్టిన శత్రువనియును, విషవృక్షమనియును, ఘోరారణ్యమని తెలిపెడివారు కొందరైతే, సంసారము క్షణ భంగురమైనదని తెలుపుటకై నీటి బుడగ, గాలికి పెట్టిన దీపమని మరికొందరందురు. ఇంకా కొందరు దీనిని మహారోగమనియందురు. ఎవ్వరి అనుభవము యేరీతిన నుండునో, ఆ రీతిననే ఉపమానములు అభివ్యక్తమగు చున్నవి.

ఇట్టి భావనలు, నుపమానముల జ్ఞానమును పెంచినా, సంసారమంటే ఏమిటో తెలుపజాలవు.

లోకపు వాడుకయందున జగత్తు, సంసారమనే పదములు నొకదాని కొకటి పర్యాయ పదములుగా నుపయోగింపబడుచున్నవి. సామాన్య దృష్టిచే చూచిన యెడల రెండిటిలోనూ అభేదము గోచరించును. లోతుగా పరిశీలించిన యెడల యీ రెంటికిని మధ్య కొంత భేదముగలదని ద్యోతకమగును.

వాస్తవికముగా యీ రెండూ భిన్నముగా నున్న యదార్థములు. శివుని చేత నిర్మతమైనదే జగత్తు. జీవుని చేత సృష్టింపబడినదే సంసారము. ఈ విషయమును విడమరచి చెప్పేది శ్రీ విద్యారణ్య స్వాములవారి వాక్కును గమనించుడి:

**శ్లో॥ ఈ క్షణాది ప్రవేశాంతా సృష్టిరీశేన కల్పితా।**
**జాగ్రదాది విమోక్షాంతః సంసారో జీవకల్పితః॥**

శక్తి విశిష్టుడైన శివుడు మాయా శక్తి చేత సకల జగత్తును సృష్టించుచున్నాడు. జీవునికి అట్టి సమర్థత ఉండదు. సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము శివుని కుండునే గాని జీవుని కుండవుగా! జీవుడు శివుడు సృష్టించిన చరాచరా పదార్థములను సేకరించికొని, యివి నావి యనెడి మమకారము పెంచికొను చున్నాడు ఆ మమకారమే సంసార మగుచున్నది.

బుద్ధి, ఆభాస, ఆత్మయిత్యాదులగురించిన అరయిక లేని వాడై మోహ పరవశుడై యుండెడిజీవి యొక్క వ్యామోహమే సంసారమని తెలిపెడి వాసిష్ఠ గ్రంథములోని యీ నుడుపులు గమనించుడి:

**శ్లో॥ కాబుద్ధిః కో యమాభాసః కోవాత్మా త్రి జగత్కథమ్।**
**ఇత్యనిర్ణయతో మోహః సోయం సంసార ఇష్యతే॥**

పరమాత్ముడు పంచమహాభూతములను సృష్టించుచున్నాడు. జీవుడు వాటి నుపయోగించి యిల్లు, బావి, చెరువు మొదలగు వాటిని సృష్టించి యివి నావి యనెడి యభిమానమును దాల్చుచున్నాడు. పరమాత్మ, ఆడ, మగ అనెడి భేదము గల వ్యక్తుల నేర్పరచగా, జీవుడు వివాహము ద్వారా ఆడ–మగలను కలిపి దంపతులను చేసి బాంధవ్యముల నేర్పరచును యీ విధముగా నాది యనెడి మోహమే, మమకారమై, సంసారముగా పరిణమించుచున్నది. మోహపరవశతచేత జీవుడు సంసారములో తిరుగాడుచుండును. "సంసరతీతి సంసారః" అనెడి వ్యుత్పత్తి యీ భావమును బలపరచుచున్నది.

"తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" (చా.ఉ.6–2–3) అనెడి ఉపనిషత్తు వాక్కులో చెప్పినయటుల యీశ్వరుని సత్యసంకల్పము వలన రచితమైనదే జగత్తు. జాగ్రదవస్థనుండి ముక్తి పొందునంత వరకు జీవాత్మ యొక్క అవిద్యవలన కల్పితమైన నేను, నాది యనెడి యభిమానమే సంసారము. అవిద్య చేత కల్పితమైన సంసారము, తత్వజ్ఞానము చేత నివృత్తియగును. జగత్తు శివ స్వరూపమైనదగుటచేత యది జ్ఞానముచేత మాత్రమే నివృత్తము కాగలదు.

ఉత్పత్తిపరముగా గమనించిన యెడల, జగత్తు యొక్క ఉత్పత్తికి పరశివుడు, నిమిత్త కారణుడగును. అతనితో అవినాభావ సంబంధము గల్గిన శక్తి యుపాదాన కారణమగును. ఇది యిట్టులుండగా, జీవాత్మ సంసారానికి యుపాదాన కారణమనేది యుందదు. కల్పితమైన దైనందున, ఉపాదాన కారణముండదు. అయితే దీనికి నిమిత్తకారణ మొకటి కలది. అదియే జీవుని, అవిద్యా శక్తి, ఈ విధిన, జగత్తుకు – సంసారమునకు స్పష్టమైన భేదము గోచరించును.

ఇక లయ విషయమునుపరిశీలన చేసిన యెడల, జీవునికి జ్ఞానోదయమైన మరుక్షణమే సంసారము లయమొందును. జగత్తు యొక్క లయము జీవుని జ్ఞానోదయానికి సంబంధము గల్గిన యంశము కాదు. శివుని తిరోధాన విధి చేతనే జగత్తులయమగును. జగల్లయకువేరే కారణములు నుండవు.

సుఖదుఃఖముల గూర్చి చెప్పవలెనన్నచో నివి సంసారమునకు సంబంధించిన యంశములే జగత్తు నందు వాటికి స్థానములేదు. జీవన్ముక్తులైన వారు దుఃఖాదులు లేనివారై జగత్తున జీవించు చుందురు. ఈ విధముగ, జగత్తు మరియు సంసారముల గురించి కూలంకషముగా విచారమును చేసిన వీరశైవాచార్యులు, జగత్తును సత్యమనియే స్వీకరించిరి. సంసారమును తుచ్ఛమైన దానిగాను హేయమైన దానిగాను ఉపదేశించిరి. శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులు జగత్తుగూర్చి తెలియజెప్పిన వాక్కులు చాల విశిష్టములై యున్నవి గమనించుడి:

**శ్లో॥ "శివతత్వాత్ సముత్పన్నం జగస్మాన్నభిద్యతే"**
**తథా శివాత్ సముత్పన్నం శివ ఏవచరా చరమ్**
**తస్మాచ్ఛివమయం సర్వం జగదేతచ్చరాచరమ్"**
**"తథా భూమ్యాది రూపేణ శివ ఏకో విరాజతే"**

పై వాక్కులలో జగము సత్యమైనదని ఆచార్యుల వారు సెలవిచ్చిరి. తంతువుల చేత నిర్మితమైన వస్తువు యెట్లైతే తంతు మయమో మన్ను చేత నిర్మితమైన కుండ ఎటుల మృద్రూపమైనదో అటులే శివ–శక్తుల సృష్టియే జగత్తు. శివశక్తుల స్వరూపమైనట్టిది యైనందున అదెప్పటికినీ అబద్ధము కాజాలదు ఈ జగత్తుకు అబద్ధమని చెప్పిన యెందరో వ్యక్తులు మరియు వారి సహచరులెల్లరూ కాల గర్భమునందు అబద్ధమై పోయిరేకాని జగత్తు మాత్రము అప్పటినుండి యిప్పటి వరకూ ఎప్పటిలాగే కన్పట్టు చున్నది. ఈ విషయమున జగత్తు గూర్చి విస్పష్టముగా తెలియజెప్పెడి శ్రీపతి పండితులవారి శ్లోకము గమనార్హమై యున్నది.

**శ్లో॥ జీవః సత్యం జగత్ సత్యం, శివఃసత్యం స్వభావతః**
**తయోరభేదః సత్యంవా క్రిమిభ్రమరమోరివ** (బ్ర.సూ.శ్రీకరభాష్యం. 2:3:40)

**జీవుడు సత్యమే, జగత్తూ సత్యమే**
**శివుడూ సత్యమె – భ్రమరకీట న్యాయమున**
**జీవుడు శివుడగు చున్నాడు కనుక**
**శివ జీవాభేదము కూడ సత్యమె అనెడిది**
**శ్రీపతి పండితుల వారి శ్లోకములోని భావము**

ఇంకనూ జగత్తును అబద్ధమని చెప్పెడి అద్వైత వేదాంతుల అభిప్రాయ మైననూ జీవాత్మ యొక్కమనోమయ సంసారమును లేదని చెప్పుటకు వీలు లేదని పర్యవసించు చున్నదని తెలిసికొనవలెను. అందుచేత శ్రీ విద్యారణ్య స్వామిగారి "పంచాదః" యనుగ్రంథమందు ఈశసృష్టి సుఖదుఃఖములకు హేతుభూతమైనది కాదు. కించిత్తు జీవ సృష్టియే సుఖ దుఃఖములకు కారణమైనదిగా అనేక దృష్టాంతములమూలకముగా ప్రతి పాదించిరి. కనిపించెడి జగత్తుసత్యము శివము. సుందరమైనది యని విద్యారణ్యులవారి భావము. మనో మయమైన జీవాత్మ యొక్క సంసారము అమంగళమైనది. అందుకే హేయమైనదని తెలిసికొన వలెను.

మనోమయమైన జీవాత్మల సంసారము, "పిండే పిండే మతిర్భిన్న" అనెడి యుక్తి వలె ఎన్ని శరీరములో అన్ని మనుష్యులుగా ఉండుటచేత, ప్రతి యొక్క జీవుని సంసారము భిన్న భిన్నముగా నున్నది. జగత్ నందు ఏకరూపత ఉన్నను సంసారమునందు ఏకరూపతకానవచ్చుట లేదు. ప్రతి యొక్క జీవాత్మ నిర్మోహిగా అయి మొక్షమును పొందు వరకు వారి వారి సంసారము వారు పోయిన కడకెల్లను వెంబడించి యుండును, అందుచేత "శ్రీ దేవి కాళోత్తరము" అనెడి ఆగమమందు చిత్తే చలతి సంసారో నిశ్చలే మోక్ష ఏవహి సంసారము యొక్క మూలము మనస్సని చెప్పబడినది.

శ్రీ శంకరా చార్యులవార వివేక చూడామణి యందు సంసారమనెడి వృక్షమునకు అజ్ఞానమే బీజము. దేహమే నేను అనెడి భావనమే అంకురము, పునః పునః శబ్దాది విషయములను భోగించవలెననెడి ఇచ్చారూపమైన రాగమే చిగురుటాకులు. జీవాత్మజేసెడి కర్మలే జలధార, శరీరమే కాండము, ప్రాణములే కొమ్మలు, ఇంద్రియముల సమూహమే మొగ్గలు, శబ్దాది విషయములే పువ్వులు, దుఃఖఃమే ఫలము, మరియు ఆ ఫలమును అనుభోగము చేసెడి జీవాత్మనే పక్షి యని సంసారమనెడి వృక్షముయొక్క వివరణను యిచ్చిరి.

సంసారమునందు మొదట మొదట సుఖము యొక్క అనుభవమున్నను చివరకు దుఃఖమే చేతి కందుచున్నది. ఇది సర్వానుభవసిద్ధమైన విషయము. ఈ కారణముననే, జ్ఞానులు ఈ విధిన హెచ్చరింతురు.

**శ్లో॥ జన్మదుఃఖం జరా దుఃఖంజాయా దుఃఖం పునః పునః।**
**సంసార సాగరో దుఃఖం తస్మాజ్జాగ్రత జాగ్రత॥**

పుట్టుకలోను, కళత్రాదులలోను, ముదుసలితనములోను, వెరసి సంసారములో దుఃఖము దుఃఖమే గలదు. అట్టి సంసారము గూర్చి జాగరూకుడవై యుండుము అని శ్లోకములోని భావము. మోహమనెడి ముసుగులో నిదురించెడి వారి గూర్చి చేయబడిన మేలు కొలుపు నీశ్లోకమును గ్రహింపవలెను. పుత్రాదుల వలన కొంతమేరకు సుఖము లంభించినా, అది క్షణికమైనదే. నిర్మలాంతః కరణ గల్గిన సాధకుడు

జనానాదుల నిజస్వరూపము నెరిగిన యెడల అతనికి సంసారము యెడల హేయబుద్ధిగల్గును. సంసారము యెడల గల్గెడి యీ హేయబుద్ధినే వైరాగ్యమని అందురు. త్యాగాజ్జగతి పూజ్యంతే పశుపాషాణపాదపాః", మోహమనెడి గిరికి విరతి వజ్రము వంటిది, వైరాగ్యమే వాభయమ్" మొదలగు ఉక్తులను చూచిన యెడల, విరతి, విరాగము, వైరాగ్యము లనెడివి పర్యాయ పదములవలె దోచును ఈ పదములనెటవి పర్యాయపదములవలె దోచును. ఈ పదములు నెంతో అర్థ గర్భితములైయున్నవి కేవలము శారీరకముగా వ్యక్తులను మరియు వస్తువులను విడిచి వేయుటయే త్యాగము మానసికముగా వీటిని విడిచివేసి యుండుటయే విరతి లేదా వైరాగ్యమని గుర్తెరుగవలెను.

వైరాగ్యములో భేదములు గలపని తెలిపెడి బోధసారోక్తి గమనార్హమైయున్నది.

**వైరాగ్యం ద్వివిధం సూక్ష్మం తదేదమవధారయ ।**
**జిజ్ఞాసా ముఖ్యమేకం సాజ్జిహా సాముఖ్యమేవచ ।**

వైరాగ్యములో రెండు విధములు గల పనియును, వాటిలో జిజ్ఞాసా వైరాగ్యమే ముఖ్యమైనదనియును, జిహాసా వైరాగ్యము

ముఖ్యమైనది కాదని శ్లోకములోని భావము. జిహాసావైరాగ్యము గూర్చి వివరించెడి శ్లోకమును గమనించుడి:

**రాజ్యభ్రష్టా దీర్ఘరోగాః పరాదనాహతశ్రియః ।**
**యే విరక్తాస్తపస్యంతి జిహాసా ముఖ్యమేవతాత్ ॥**

రాజ్యాధికారము కొల్పోవుట వలననూ, ఎంతో కాలము రోగముల చేత పీడింపబడుచుండుట వలననూ, యితరుల అధీనములో నుండవలసిన స్థితి యేర్పడుట వలననూ, సిరిపోవుట వలననూ వైరాగ్యభావన గల్గి యడవిలోనికి వెడలి తపస్సు నాచరిస్తూ ఉండేవాడి వైరాగ్యమును జిహాసా వైరాగ్యమందురనియును అది ముఖ్యమైనది కాదనియును శ్లోకములోని భావమని గ్రహించగలరు.

జిహాసావైరాగ్యము అధమమైనది. ఎందుకనగా ధనకనకాదుల అభావము వలన గల్గు చున్నది అందుకే దీనికి అభావ వైరాగ్యమనెడి పర్యాయ నామముగలదు. ఇట్టి దానిలో భోగవాసనలు సంపూర్ణముగా నివృత్తి నొందవు జన్మాంతరములలో జీహాసావైరాగ్యముగల వాడు మరల భోగాసక్తుడగును.

జిజ్ఞాసావైరాగ్యమును సోదాహరణ పూర్వకముగా వివరించెడి యీ శ్లోకములను గమనించుడి:

**శ్లో॥ ఆధివ్యాధి భయోద్వేగ పారతంత్ర్యాది వర్జితాః ।**
**యేధీరా ముక్తిమిచ్ఛంతి శ్రుణు తేషామయం క్రమః ॥**
**కామధేనుర్గృహే యేషాం నివాసోనందనే వనే ।**
**కాశ్యపాద్యాస్తపశ్యంతి జిజ్ఞాసా ముఖ్యమేవతత్ ॥**

ఆధివ్యాధి భయోద్వేగాదులును, పరతంత్రతయు, లేకుండిననూ, కామధేనవు యొక్క సన్నిధి, నందనవనములో నివాసము మొదలగు సుఖసంపత్తియున్ననూ, యెవ్వరైతే తపస్సునాచరింతురో అట్టి వారికి గలవైరాగ్యమును జిజ్ఞాసా వైరాగ్యమందురు. దీనినే సహజమైన వైరాగ్యమని యందురు.

"సర్వపరిగ్రహభోగతః కస్య సుఖం న కరోతివిరాగః" అనెడి ఉక్తి యటుల నిజమైన వైరాగ్యమే సుఖప్రదమైయున్నది.

**శ్రీ నిజగణ శివ యోగులు**
**వనితాదిదోష దరుశనవె నిమిత్తవా ।**
**వనువిందవనం బిడువుదు రూపు బళికా ॥**
**మనవత్త లెరిగదా నిష్ట యదు కార్య వెం ।**
**దెనుతెబరెవుదె విరాగతె గె నెలయందు ॥** – కైవల్య పద్ధతి జ్ఞాన ప్రతి పాదన స్థల 3-2

"వనితాది దోషదర్శనమె నిమిత్తము. వాటిని విడుచుట రూపు పిదప, మనము అటుగుంజకుండా నిష్టము, కార్యము, అనుచువచ్చునది విరాగతకు నెలవని" ఈ కృతి యొక్క భావమేమనగా, సతి పుత్ర ధనాదుల యందున అనిత్యము అశుచి దుఃఖ దోషాదులను గాంచునదే వైరాగ్యమునకు బీజమనియును ఏదైనా నిమిత్తమున ఆ విషయములను త్యాగము చేయునదే రూపమనియును, మరియు విడిచిన విషయములవైపు మనస్సు మరల తిరుగకుండగా చేయునదే కార్యము. ఈ విధముగా వైరాగ్యము యొక్క బీజముల రూపము, మరియు కార్యముల గురించిన సూక్ష్మమైన వివరణను నిజగుణ శివ యోగుల వారు యిచ్చిరి. ఇది ఐహిక మరియు పారలౌకిక విషయముల గురించి కార్యరూపమును దాల్చినప్పుడు పూర్ణత్వమును బడయును. అందుచేత "ఇహాముత్ర ఫలభోగ విరాగః" అని వైరాగ్య లక్షణములను తెలియచెప్పిరి.

ఈ రీతిగా సంసార మనగా నేమి? మరియు దాని గురించి యుండెడి హేయబుద్ధి అనే వైరాగ్యమనగా నేమి అనెడి బహుముఖములైన రెండు ప్రశ్నలకు సామాన్యమైన సమాధానమును సమీక్షించనైనది. ఇంకా వీటి గురించి కూలంకషముగా విచారింతుము గాక

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ది. 25-07-1990

శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

# విశేష ప్రదీపిక :

సంసారమనగా నేమిటో తెలియజెప్పి, జగత్తు కంటెను అది భిన్నమైన దని తెలిపి, సంసార నిరసనకు కారణ భూతమైన వైరాగ్యము గురించి శ్రీ విద్యావాచస్పతి కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వామిగారు జ్ఞానదాయకమైన ప్రవచనమును ప్రదానమును చేసిరి.

సంసారమును హేయభావముతో చూడ వలెనని యాస్తిక మతములన్నియును తెలుపు చున్నవి. సంసారమనగా నేమి? యనెడి విషయములోన యేకాభిప్రాయము లేదు. నిఘంటువు బహువిధములగు అర్థముల నిచ్చినది. తెలుగు సాహిత్యమున సంసారమనగా కాపురము అనెడి అర్థమున వ్యవహారములో గలదు. అందు చేత, కొందరి మతము ప్రకారము భార్యాపుత్రులను హేయ భావముతో చూసి, సన్యాసమును స్వీకరించినగాని ముక్తి సంప్రాప్తము కాదు. ఈ భావన సరియైనదికాదు. వీరశైవమున యిట్టి భావనవల కాస్కారము లేదు. ఈ విషయమును లోతుగా పరిశీలించ వలసి యున్నది.

" ప్రాణ్యుత్పాదే సంసరణమ్" అనెడి అమరసింహుని వాక్కుప్రకారము ప్రాణుల యొక్క ఉత్పత్తి రూపమే సంసారము. ఆత్మ జనన-మరణ చక్రబంధమున చిక్కి యీ సంసారమున తిరుగాడునని యాస్తికులు నమ్ముచున్నారు. "సంసార చక్రనిర్వాహం కర్మ కేవలమ్" అని శ్రీ భగవత్పాదుల వారునుపదేశించిరి (11-75). ఆత్మ కర్మఫలముల ననుభోగము చేయుటకై యీ సంసారమున పుట్టుచు చచ్చుచు తిరుగాడునని కపిల మహర్షి గారు సెలవిచ్చిరి. సాంఖ్య వాదనమున నివి నిరూపితములు. (వివరములకై పండితారాధ్య చరిత్ర, వాద ప్రకరణమును చూడ గలరు.) "జీవుడు సంసారి శివుడ సంసారి" యని బసవ పురాణము (షష్ఠాశ్వాసము-713) లో చెప్పబడినది. "జీవుడు మృతదుఃఖి" యని కూడ చెప్పబడినది. అట్టి యెడ సంసారము భవనముకు సమానార్థకమగు చున్నది.

సంసార మనగా ప్రాపంచిక భ్రాంతి యనెడి అర్థము కూడ గలదు. మనవి కాని వాటిని మనవి యని భావించి భ్రమకు లోనైతిరుగాడుటను సంసారమని భావించ వలెను. భూమి, భామ, బంగారము ఇత్యాదుల యెడల వ్యామోహము పెంచికొని రాగ ద్వేషాదులకు లోనై విషయానురక్తిని, అహంకార మమకారములను పెంచి కొనుటయే సంసారమని దలపవచ్చును. సృ అనెడి గత్యర్థక ధాతువు నుండి నిష్పన్నమైన సంసారము ఈ అర్థమునే సూచించుచున్నది.

సంసారమనగా రాజమార్గమనెడి అర్థము గలదు. జనులు దీనిలో తిరుగాడుదురుగాని యిది సంసార మనిపించుకొను చున్నది. దీనిని పద్ధతి యనియు అందురు. సంసారమనెడిది జనన-మరణ, సుఖ-దుఃఖములతో కూడి కొన్నది. ఈ విషయమును ప్రతిపాదించెడి సోమనాథుని పద్యమును గమనించుడిః

**సీ॥ ఒందేమి విష్ణుని కుత్పత్తి గలుగుట**
**కనజయదష్టమి దినము సాక్షి**
**శార్ఙికి సంసార సంగతి దుస్థితి**
**సిద్ధమై యునికికి సీత సాక్షి**
**య చ్యుతునకు గూలు టది తెల్ల మనుటకు**
**భువి జరుండనియెడి బోయసాక్షి**
**హరి కిట్టి భవములనంతంబు లగుటకు**
**మత్స్య కూర్మాది జన్మములు సాక్షి**

**యతడు శివుని శిష్యుడగుటకు రామేశ్వ**
**రాది సుప్రతిష్ఠలవియె సాక్షి**
**యట్టి విష్ణువునకు నభవు నక్షరు బరా**
**త్పరుని బోల్ప దగునె బసవ లింగ॥** (చతుర్వేదసారము, ప.116)

ఇచ్చట శివుడు పరబ్రహ్మయనియుని, విష్ణువు జీవి యనియును గ్రహించ వలెను జనన-మరణములగూర్చి చెప్పి, సీత కొరకై రాముడు పడిన దుఃఖము మొదలగువని చెప్పబడినవి సంసారము వీటన్నిటితో కూడి కొనెడిదని తెలిసికొన గలరు.

ప్రవృత్తి మార్గమున పయనింప దలచిన వానికి సంసార సుఖము సంతుష్టిని యివ్వవచ్చును. మానసిక రోగికి స్వపర దుఃఖములు సంతుష్టిని యివ్వవచ్చును. కాని నివృత్తి పథమున గమనింపదలచిన పిండజ్ఞానికి సంసారమనిన హేయ భావము గల్గియుండును "హా" ధాతువు వలన నిశ్పన్నమయ్యెడి హేయ శబ్దమునకు విడువదగినది యనెడి అర్థము ఇవ్వబడినది. సుఖదుఃఖములు, చావు పుట్టుకలు విడువ

దగినవని గుర్తించవలెను. శివ-జీవ సామరస్యమును సాధించిన స్థితిలో సంసారము సారహీనమై గన్పట్టును. హేయ శబ్దమునకు మోనియర్ విలియమ్స్ పోదగినదనెడి మరో అర్థము నిచ్చిరి. సంసారము వెడలి పొయ్యెడి యవకాశము గలదనియును గ్రహించగలరు.

ఇట్టి భావము గల్గుట యనెడిది సుసాధ్యమైన విషయము కాదని తెలిసికొనవలెను. పూర్వజన్మలో జీవుడు పొందిన యనుభవము వలన యీ హేయబావము గల్గ అవకాశము గల్గును. పుణ్యాధిక్యత, పాపప్రక్షీణతల వలన మనము పరిపక్వత నొందు. అట్టి వానికి మాత్రమే సంసారము యెడల హేయ భావమేర్పడును ఈ జన్మలో సాధించవలసినవి కొన్ని గలవు. వాటిలో నిర్మలాంతః కరణ ముఖ్యమైనది హృదిలోని కల్మషమును కడిగి కొనవలెను. విషయాసక్తి వ్యసనలోలత్వము, కామాది యరిషడ్వర్గమునకు గురియగుట మొదలగువని దూరము చేసి కొనినగాని హృదయమాలిన్యము దూరముకాదు. చివరగా, పిండజ్ఞాని ఆత్మ-అనాత్మ వివేకమును, నిత్యానిత్య వివేకములను పెంపొందించికొన వలెను. ఆత్మజ్ఞానము పొందవలెను. ఆ పిదప శివపరమాత్మ తత్వబోధకమగు శివజ్ఞానమును బడయ ముందుకు సాగవలెను.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-2

**శ్లో॥ ఐహికే క్షణికే సౌఖ్యే పుత్రదారాదిసంభవే।**
**క్షయిత్వాదియుతే స్వర్గే కస్య వాంఛా వివేకినః॥** (సి.శి. 5-58)

ఇహలోకమునందున, సతి, సుతాదుల వలన గల్గెడి సుఖము క్షణికమైనదై యుండుట చేత, మరియు పారలౌకిక స్వర్గాది సుఖములు క్షయ పతనాదులతో కూడియుండుట చేత, వివేకులైన వారు యీ రెండు లోకముల సుఖముల యందు అభిలాష గల వారగుట లేదు.

సంసారిక సుఖము ఐహికమైనదనియును, పారలౌకికమనియు రెండు విధములుగా ఉండును. ఈ లోకమునందున భార్యా, బిడ్డలు, పొలము, ఇల్లు, ధనము, కనకము మొదలగు విషయముల సంపర్కము చేత గల్గెడి మానసిక సంతోషమును ఐహిక సుఖములనియునూ, స్వర్గాదులయందు అమృతపానము, అప్సర స్త్రీలతో సంభోగము, మరియు నందనవన విహారముల యందు గల్గెడి క్షణిక తృప్తిని పారలౌకిక, సుఖములనియునూ పిలువబడుచున్నవి. ఈ ఉభయ సుఖములకు సుమధురమైన శబ్దము అనుకూలమైన వ్యక్తి యొక్క స్పర్శ, కనులకు రమణీయమైన రూపము, జిహ్వాపేక్షిత రసము, మరియు ఘ్రాణా భీష్టములైన గంధముల అను, పంచవిషయములే నిమిత్తములై యుండును.

"ఐహికే క్షణికే సౌఖ్యే" అనెడి శ్రీ రేణుక భగవత్పాదులు ఉపదేశము వలె, వైషయిక సుఖము ఎవ్వరికినీ సంపూర్ణమైన సుఖమును యివ్వలేదు, ఇవ్వదు, ఇవ్వబోదు దానిలో ఇచ్చెడి సమర్థతయైననూ ఉండదు.

ప్రాసంగికముగా సుఖము, దుఃఖము, మరియు ఆనందము అనెడి శబ్దముల గూఢార్థమైననూ పర్యావలోకనము చేతుము గాక మనమందరము ఎరిగిన యట్లే సుఖము మరియు దుఃఖములనెడి యీ రెండు, బహుళ భిన్నమైనవి కావు, ఈ రెండూ ఒకటే. ఒకే నాణ్యము యొక్క యిరువైపుల వంటివి. మనము యిప్పుడు అనుభవించడి సుఖము కాలాంతరము నందు దుఃఖరూపముగాను, సుఖరూపముగాను పరివర్తించునది గనుచున్నాము. అందుచేత, ఈ రెంటియందు భేదము లేదు, కాని పరణామము ప్రయుక్తమైనది. చివరి ప్రమాణము యొక్క సుఖమును దుఃఖమనియును, దుఃఖమును సుఖములనియూ మనము వ్యవహరించుచున్నాము. సంసారము నందున కేవలము దుఃఖానుభూతియే యుండిన యెడల యిక్కడ యెవ్వరూ ఉండుటకు కోరుకొనరు. ఆశ్చర్యకరమైన విషయమేమనగా, దుఃఖమే, సుఖమనెడి పలుచని, కవచమును కప్పికొని ఎదురు వచ్చి, సుఖముగా గోచరించున్నది.

సాంసారికములైన సుఖదుఃఖములు చిత్రముగా తోచుచున్నవి. మనము దుఃఖముతో నిండియున్ననూ మన లక్ష్యము మున్ముందు వచ్చెడి సుఖము యొక్క కాల్పనిక సముద్రములో మునిగి యుండును. అందుచే దుఃఖము యొక్క అరయిక గల్గక యుండును. సుఖమనెడిది కేవలము భవిష్యత్తుకు చెందిన ఆశయే కాని వాస్తవికమైనది కాదు. అయితే, మనుష్యులయందుండెడి ఆశ అతనిని సర్వదా తిప్పుచూ ఉండును.

సుఖము యొక్క ప్రతి ద్వంద్వి దుఃఖమనియును, దుఃఖము యొక్క ప్రతి ద్వంద్వి సుఖమనియునూ లోకములో వాడుక గలదు. ఆనందానికి యిట్టి ప్రతి ద్వంద్వి యుండదు. ద్వంద్వాతీతమైన ఆనందానుభూతి ఆత్మానుభవమునకు చెందినది. అందుకే, శ్రుతులు, ఆత్మను "ఆనందఘనః" అని అనుచున్నవి.

సాంసారిక సుఖదుఃఖములు తమ తమ సీమలను దాటిన యెడల అపాయములు కల్గించెడివిగా యగుచున్నవి. దుఃఖము యొక్క తాకిడి కంటెనూ సుఖము యొక్క ఆఘాతము ప్రమాద భరితమని యెరుగవలెను.

ఒక ఆఫీసులో బంట్రోతుగా పని చేసెడి వాని కొకనికి లాటరీ తాకినది. ఒక లక్షరూపాయల బహుమానము గలదా లాటరీ. వాడు యింటిలో లేనప్పుడు లాటరీ గురించిన వార్త యింటికి చేరెను. బంట్రోతు భార్యకు నేమి చేయవలెనో బోధ పడలేదు. గాబరాపడి పోయి, సమీపములో నున్న శివాలయమున కెళ్ళెను. అక్కడి పూజారిని కలిసి "స్వామీ! నేను చెప్పెడిది దయ చేసి విని తమరు సలహా యివ్వండి. మాది నిరుపేద కుటుంబము. నా భర్త నేటి వరకును వేయి రూపాయలనైననూ ఒకే సారి చూడలేదు. ఇప్పుడొకలక్ష రూపాయల లాటరీ తాకినది ఇంత ద్రవ్యము నొకే సారి కళ్ళజూసిన యెడల నా భర్తకు నేమి కానున్నదో యనెడి భయము నన్ను వేదించుచున్నది. అతనికి పిచ్చైనా పట్టవచ్చును. లేని యెడల, గుండె ఆగిపోయి ప్రాణమైనా పోవచ్చును. ఏమి చేస్తారో ఏమో? మీ యిష్టము. నాకు మాత్రము పతి బిక్ష పెట్టుడి. వేడికొనుచున్నాను. మా కింకెవ్వరునూ లేరు. దయచేసి నా మాంగల్యమును రక్షించుడి. అన్ని విన్నవించుకొనెను.

పూజారి మనస్సు కరిగి నీరయ్యెను. ఆ పరమసాధ్వి యెడల గౌరవభావముతో పాటు దయాభావము గల్గెను. ఏదో ఒకటి చేసి ఆమె పతి ప్రాణములను రక్షించవలెననెడి కోరిక గల్గెను.

" ఏమమ్మా! ఎందుకు బెదరెదవు? నేనుండగా నీకు భయపడునావశ్యకత లేదు. నీ భర్త కార్యాలయమునుండి యింటికి వచ్చిన పిదప నన్ను పిలిపించుడి. అన్ని విషయములను నేను స్వయముగా చక్కదిద్దెద" నని పూజారి ఆమెకు నభయ ప్రదానము చేసెను. ఆమె భారమంతా పూజారి నెత్తిన మోపి వెడలిపోయెను. పూజారి తనలోతాను నీ విధిన యనికొనెను. "ఒకే సారి లక్ష రూపాయల గూర్చి తెలిపిన యెడల ప్రమాదమే. కొంచెము కొంచెము నుండి క్రమేపి మొత్తము పెంచికొనుచు పోయిన యెడల నపాయ ముండబోదు" ఈవిధిన మనస్సున నొక యోజన తయారు చేసి కొని, ఆ సాధ్వి పిలుపుకై యెదురు చూచుచుండెను. అంతలోనే సాయంసమయ మయ్యెను. పూజారికి పిలుపు వచ్చెను. ఆ దంపతుల యింటికి చేరెను. పూజారిని చూసిన బంట్రోతుకు అచ్చెరువయ్యెను. "ఏమి స్వామి? ఇక్కడికి దయచేసిన కారణమేమిటో సెలవియ్యండి. మీ సేవనుజేసి కొని తరించుదు" మని వినయముగా విన్నవించెను. పూజారి" ఏమయ్యా! నీ కొక శుభవార్త చెప్పుటకు వచ్చితిని. నీ జాతకము ప్రకారము నీకొక లాటరీ తగులనున్నది. పాతిక వేల రూపాయల వరకు లబ్ధిగల్గును. నీకు సంతోషమేనా? యింత మంచి మాట చెప్పినందుకు నాకు మంచి దక్షిణ యివ్వ వలెను సుమా!" అని తన యోజన ప్రకారము మాటలాడ జొచ్చెను.

పూజారి మాటలు, బంట్రోతుకు నమ్మశక్యమైనవిగా దోచలేదు. "ఏమి స్వామి! పరాచకములేల? నాకంత ధనము వచ్చునే? ఇయ్యది సత్యమే? ఒక వేళ యిది నిజమైన యెడల అట్టి ధనములో సగమును తీసి మీకు సమర్పించు కొనెద" నని అనెను.

ఎవ్వుడూ చిల్లర తప్ప, హెచ్చు ధనమును గాంచని పూజారికి పన్నెండు వేల అయిదు వందలు తనకు రాబోవు చున్నదని యెరిగిన వాడై, ఆనంద పరవశమున నుబ్బి తబ్బిబ్బై గుండె యాగి గుటుక్కుమనెను.

ఇక్కడ నొక ఆశ్చర్యకరమైన విషయము గలదు. దుఃఖము, యెంత గొప్పదైననూ, ప్రాణాంతకము కాజాలదు. మున్ముందు రాబోవు సుఖముల గురించి ఆశవలన మనిషి జీవించియే యుండును. అధికమైన సుఖమే ప్రాణాంతకముగా పరిణమించుచున్నది.

సుఖవంతునికి శాంతి యుండుననెడి లోకోక్తి గలదు. సుఖశాంతులు, ఒక దానిమీద మరొకటి యాధారపడి యుండుననెడి అభిప్రాయమొకటి కలదు. వాస్తవికముగా, నియ్యది సత్యదూరమైన విషయము. కారణము తెలిసి కొందుముగాక.

ఒక సంగీత విద్వాంసుడు నొక చేత తాంబూరాను వాయించుచు, గళము విప్పి యెంతో మధురముగా పాడు చున్న సందర్భమున శ్రోతలు మొదట యెంతో ఆసక్తితో తన్మయులై వినుచుందురు. కొందరు అర చేతితో తాళము వేస్తూ తన్మయత్వమును

బహిర్గతము చేయుదురు ఇట్టి స్థితి యెంతో కాలము వరకు కొనసాగదు. ఒక గంట తదుపరి, తన్మయత్వములో తేలియాడిన వారే తల పట్టుకొని నొక్కుకుంటూ కూర్చొని యుందురు ఇంకొక గంటలోపునే వారికి వేసరింపు గల్గి వెడలి పోవుదురు. మొదటగా వారు పొందినది సుఖమనియూ, పిదపపొందినది తద్విరుద్ధమైనదని అనుటకు వీలు లేదు. మొదట పొందినదీ అశాంతియే చివర పొందినది అశాంతియే. మొదటి యనుభవము ప్రీతికరమైనదిగాన, దానిని ప్రీతికరమైన అశాంతిగా గుర్తించవచ్చును. రెండవది అప్రీతికరమైన అశాంతి. దానినే దుఃఖముగా నెరుగవలెను.

సుఖదుఃఖముల యందు వస్తువేమియూ ఉండదు. వ్యక్తులను నిమిత్తముగా గైకొని అవి బహిర్గతమగును. తన ఆత్మస్వరూపమైన ఆనందము అట్టిది కాదు. దాని ప్రాప్తికై అన్యులనపేక్షించెడి యావశ్యకత లేదు. అయితే మోహాక్రాంతులైన మానవులు, తమవైపు తిరిగి చూసికొని తన్నాత్మస్వరూపమైన ఆనందమును పొందకుండగ, యితరుల వైపు చూస్తూ దుఃఖ భాజనులగుచున్నారు. ఈ విషయము నెరుకపరచెడి కథ యొకటి ప్రచారములో గలదు.

భగవంతుడు లక్షలాది జీవరాసులను సృషించిన పిదప మనుష్యుని సృష్టించెను. ఆ పిదప ఆయనకు మనుష్యుల చేష్టల చేత విసిగి పోయెను. దినము రాత్రి యనకుండా ఎప్పుడంటే అప్పుడు ఆయన వాకిట నిలిచి కోరికలను కోరుచున్నారు. వారి సమస్యలకు అంతులేదు గాన, వారి కోరికలకు కూడ అంతు లేకుండెను. వీరి బాధపడలేక, సమస్యకు గల పరిష్కారమార్గము నన్వేషించెడి నిమిత్తము దేవతల నెల్లరనూ పిలిపించి సభను యేర్పాటు చేసి వారి సలహాలను కోరెను. ఒక దేవత లేచి, తమరు హిమాలయపర్వతము యొక్క శిఖరాగ్రమును జేరి కూర్చొని విశ్రమించుడి, అని సూచించెను. భగవంతుడు "హిమాలయాల మీద కూర్చొని యెన్ని దినముల వరకు ఉండవచ్చును. నేడు గాని రేపుగాని పర్వతారోహకులు రాకుండా యుందురో నా విశ్రాంతికి భంగమేర్పడదా" అని ప్రశ్నించెను. "చంద్రమండలములో గాని, మరే గ్రహము మీదనైననూ నివాసమేర్పరచు కొనుడి" యని మరో దేవత పల్కెను. "అంతరిక్షనౌకలు వస్తాయి కదా! అక్కడకూడ భద్రత యెక్కడిది" అని భగవంతుడు బదులు పలికెను. ఇంకొక్క దేవుడు "స్వామీ! మానవుడు మూర్ఖుడు. ఎంత దూరమైనా వెడలి వెతక గల్గునేగాని, తనలో నున్న నిన్ను వెతక లేడు. అందుచేత, వాని మనస్సులో వుండిన యెడల, నీకు వాని బాధనుండివి ముక్తి లభించును. ఇది సత్యమని అని పల్కగా అందరూ గ్రహించిరి.

ఈ విధముగా, మానవులు తన అంతతరంగమునందున గల భగవంతుని గూర్చి ఆలోచించకుండగ, బాహ్య సాంసారిక విషయముల గురించి ఆలోచిస్తూ, క్షణిక బోగముల కొరకు పరువెత్తుచుందురు. కుటుంబమును, సంపత్తును ఆశ్రయింతురు. కోరిన సుఖములు లభించని యెడల దుఃఖములకు గురియగుదురు. కాన బుద్ధిమంతులు, ఆనంద సంప్రాప్తికై, తనను తానే అన్వేషించికొనవలెను. మరి దేనినీ అపేక్షించకూడదు.

ఒక యువకుడైన సన్యాసి, దేశ సంచారమును చేసి, తన స్వదేశమునకు మరలిపోవును ఇతడు, రాజు గారి బాల్యస్నేహితుడై యుండెను. మేని మీద చిరిగిన వస్త్రములుగల్గి, అర్ధనగ్నశరీరియై, ఎంతో వికారముగా కన్పట్టెడి యతడు, రాజుగారిని దర్శించనెంచెను. రాజు గారి కడకు వెళ్ళెను. సన్యాసిని చూడగనే రాజు గారికెంతో సంతోషము గల్గెను. లేచి నిల్చుండి, సన్యాసికి నమస్కారము చేసి, మంచి ఆసనమున కూర్చుండ బెట్టి కుశల ప్రశ్నలడిగెను పిదప "జగమంతయూ తిరిగి వచ్చితివి కదా! నాకై యేమి తెచ్చితివని అడిగెను. ఎంతటి సంపన్నుడైననూ, ఇంకా కావాలని కోరునే గాని వలదనియునునే? ఏమీ లేని సన్యాసిని, అన్నీ కలిగి యున్నరాజుగారు కోరుటయనెడిది ఆశ్చర్యకరమైన విషయమే కదా! "నీవు యీ విధిన అడిగెదవని నాకు తెలుసు, నీకై యొక అపూర్వమైన వస్తువును తీసికొని వచ్చితివి" అని సన్యాసి అనెను.

సన్యాసి చేతియందున నేమియునూ లేకుండెను ఆశాభరిత దృష్టితో చూచిన రాజుకు, నిరుత్సాహమే గల్గెను. అయిననూ, ఆశ వీడక, "ఎమి తెచ్చితివి. త్వరగా తెలుపు" మనెను. ఓరాజా! జగత్తులో తిరిగి తిరిగి, ఎన్నియో ప్రదేశములలో వెదకి వెదకి, నీకై యొక ప్రత్యేకమైన కానుకను తెచ్చినాను. నీ దగ్గర లేనిదిది" యని యనుచు, జోలెలో చెయిని వేసి యొక చిన్న అద్దమును వెలికి తీసి రాజుగారి చేతికిచ్చెను. రాజుకు కోపము వచ్చెను. "ఓయీ సన్యాసీ! నీ బుద్ధి భ్రమించినది. అందుకే, యీ విధిన మాటలాడుచున్నావు. నా యింట్లో అద్దము లెన్నియో గలవు. సుందరమైన నిలుపుటద్దమును నీవు చూసినదే కదా!" అని బిగ్గరగా యనెను. సన్యాసి, రాజును శాంతపరచి, యీ విధిన నుడివెను. "ఓ రాజా! యిది సామాన్యమైనది కాదు ఏకాంత ప్రదేశమున నిలిచి, దీని మీదున నొక కాగితమును పరచి దీని లోనికి చూడుము. నిన్ను నీ వెరుగుదువు" ఆ పిదప సన్యాసి నిర్గమించెను. కుతూహల భరిత మనస్కుడైన రాజు, అద్దమును గైకొని అంతఃపురమునకు వెడలెను. తన ఏకాంత మందిరమున, సుఖాసీనుడై అద్దము మీద కాగితమును కప్పి,

చూచెను. ఆశ్చర్యకరముగా కాగితము మీద కొన్ని పదమలు కన్పట్టెను. "అద్దములన్నియు వ్యర్థమైనవే! నీమనస్సు కంటెనూ ఉత్తమమైన అద్దము వేరొకటి లేదు. ఇప్పుడుదాని మీద ధూళి అలుముకొని యున్నది. అట్టి ధూళిని దులిపి, గనిన యెడ నిన్ను నీవు తెలిసి కొనగలవు" రాజుగారు సన్యాసి అభిప్రాయమును తెలిసి కొనిన వాడయ్యెను. తనను తానెరిగినచో, సర్వమూ ఎరిగినయటులే యని తెలిసికొనెను.

ఆత్మానందము యొక్క అరయికను యెరుగుటకై వచ్చిన మనుష్యుని, ఈషణత్రయములు చెడగొట్టు చున్నవి. "దారేషణ", "విత్తేషణ" మరియు "లోకేషణ" యనెడివే యీషణత్రములు వీటి ప్రభావమునకు లోనైన వాడు, భార్యాపుత్రాదులను చేరి, తాను కోరుదానిని యివ్వుడని వేడికొనెడి భిక్షుకుడగుచున్నాడు. ఆనంద సామ్రాజ్యానికి సామ్రాట్టైన జీవాత్మకు ఆణవాది మలత్రయముల మూలమున బిక్షుక స్థితి సంప్రాప్తమగు చున్నది. ఇట్టి దీనావస్థలోనుండెడి జీవుని రక్షించుటకే శ్రీ రేణుక భగత్పాదుల వారు సతీసుతాదుల నుండి లభించెడి సుఖము క్షణికమైనదనియునూ, అట్టిదానికై జీవనమును వ్యర్థము చేసెకొనవలదని తెలియ జెప్పిరి.

భార్యాపుత్రులే సర్వస్వమని పరువులు తీసెడి పరమమూర్ఖులకు కనువిప్పును గల్గించెడి యీ శ్లోకమును గమనించుడి:

**శ్లో॥ మాతాపితృ సహస్రాణి పుత్రదారాశతానిచ।**
**తవానంతాని యాతాని కస్య తే? కస్యవా భవాన్॥**

అనేక జన్మలకు లోనై వచ్చిన జీవికి లెక్కకు మించిన మాతా పితృ దారాపుత్రాదులు గల్గిరి. అట్టి యెడ, ఎవ్వరికి ఎవ్వరు అనేది నిశ్చయాత్మకముగా తెలిసికొనజాలము కదా! ఈ ధర్మసూక్ష్మము నెరుగకుండా, భార్యా పుత్రుల వెంట పరువులు పెట్టెడి వాని నేమని యనవచ్చును?

వనితల సౌందర్యపిపాస గలవారు, మాంసపు ముద్దలైన కుచములను, దోషభూయిష్టమైన వెంద్రుకలను, ఎముకలను మాంసమును కప్పియుంచెడి తోలును గాంచి భ్రమించి, వనితల వెనువెంట పరువెత్తుచున్నారు వనితలంగీకరించిన యెడల మోహసముద్రమున బడిమునిగి పోయి, తన అస్తిత్వాన్ని కోల్పోవుచున్నారు. వనిత తిరస్కరిస్తే, శోకాబ్ధిలోపడి పోవుదురు రెండు విధములుగనూ చెడుపును గల్గించెడి వనితా వ్యామోహమును వీడని వారిని యేమనగలము? ఇదిట్టులుండగా, కొందరు వనితలు, కోరిన పదార్థములను సమకూర్చుచు తన యిష్టార్థములను పూర్తిజెసెడి భర్తలుండగా, పగలురాత్రి పరపురుషుని సాంగత్యమును వాంఛిస్తూ, వారితో శారీరక సంపర్కము గల్గిన వారి విధి మరొక్క రీతిలో నుండును "కన్యల సౌందర్యమును గాంచి, పడిపోకుండగ నిలిచెడి వాడే "విరతు"డని శ్రీ నిజగుణుల వారు సెలవిచ్చిరి. ఈ విషయమున మరింత వివేకమునిచ్చెడి శివ ధర్మోత్తరములోని యీ శ్లోకము గమనించ దగినదై యున్నది:

**శ్లో॥ క్రిమిభిస్తుద్యమానస్య కుష్టినః పామనస్యచ।**
**కండూయనాగ్ని తాపాభ్యాం యత్ సుఖంస్త్రీషుతద్భిదుః॥**
**మలమూత్ర విసర్గాత్తు సుఖం భవతి యాదృశమ్।**
**తాదృశం స్త్రీషు విజ్ఞేయం మూఢైః కల్పితమన్యథా॥**

మూర్ఖులు స్త్రీసుఖము గురించి పలురకములైన భావములు గల్గియున్ననూ, కుష్టురోగి క్రిముల మూలమున పొందెడి దురదను గోకికొని ఉపశమనము పొందినప్పుడును, చలి భాధతో పరితపించేవానికి అగ్నితాపమును పొందినప్పుడును, మలముత్రాదుల విసర్జనకై వసతులు లోపించిన యప్పుడు వాటిని వీడలేక బాధకు గురియై చివరకు ఏదో విధిన వాటిని విసర్జించిన యప్పుడు పొందెడి సుఖములెట్టులో స్త్రీ సుఖములో కూడ నట్టి యనుభూతియే యుండునని శ్లోకములోని భావార్థము. ఈ వివేచన యెంతోసుందరమైనదై యున్నది. స్త్రీ సౌఖ్యము లోన నెట్టి ప్రత్యేకత లేకుండిననూ అద్దానికై రెపరెపలాడెడివారు నశించుచున్నారు. పద్మమనెడి భ్రమతోనొక భ్రమరము మొగిలి పువ్వును ఆశ్రయించినదట. పుప్పొడి రాలి, దాని వలన కళ్ళు మూసికొని పోయెను. అంధత్వముప్రాప్తించెను. బయలుకు వెళ్లుటకు యత్నించగా, మొగలి పువ్వు యొక్క ముళ్ళ కారణమున రెక్కలు ఊడి పడెను. పువ్వులోనే పడి, భాధపడచు కొంత కాలమునకు భ్రమరము ప్రాణములను వీడెనట. స్త్రీ వ్యామోహమునకు గురియై పరిభ్రమిస్తూ, భ్రమలకు లోనై, అందచందములనెడి ప్రభలచేత నంధత్వమును పొంది, కామినుల దురాకాంక్షలనెడి ముళ్ళచేత గమన శీలతను కోల్పోయి, రోగగ్రస్తులై క్రుంగి కృషించి నశించెడి వారెందరైతే గలరో వారెల్లరూ మొగిలి పువ్వును కోరి నశించెడి భ్రమరముల వంటివారే శరణులునూ యీ విధిననే తెలిపిరి గమనించుడి:

**హెణ్ణిగాగి సత్తవరు కోటి మణ్ణిగాగి సత్తవరు కోటి**
**హొన్నిగాగి సత్తవరు కోటి నినగాగి సత్తవర నొబ్బరనూ కాణె।**

ఈ వాక్కుల తెలుగు రూపమును గనుడి:

**పడతికై చచ్చిన వారు కోటి మన్నుకై చచ్చిన వారు కోటి**
**పొన్నుకై చచ్చిన వారు కోటి నీకై చచ్చిన వారి నొక్కరినీ గాన।**

స్త్రీల నుండి యోగులు దూరముగా నుండవలెనని చెప్పుటకు కాబోలు యోగశాస్త్రము స్త్రీ గురించి యీ క్రింది విధిన తెలిపినది.

**శ్లో॥ అంతకః పవనో మృత్యుః పాతాలం వడవానలః।**
**క్షురధారా విషం సర్పః సర్వమిత్యేకతః స్త్రియః॥**

ప్రాణములు తీసే యముడు, వాయుదేవుడు, మృత్యుదేవత, పాతాళము, బడబానల మనెడి అగ్ని, కత్తిపదును, విషము, పాములన్నియును ఏకమై స్త్రీయందుండునని శ్లోకములోని భావము.

స్త్రీ సమాగమము వలన విషపరిమాణములుండునని తెలిపిన మహానుబావుల యనుభవోక్తులను మననము చేసుకొంటూ, అట్టి సుఖము నుండి జాగ్రత్త పడుట సాధకునుడి అవసరము.

సతి యేవిధిన దుఃఖదాయకమో, అదే విధిన కొడుకు కూడ దుఃఖము నిచ్చువాడేయగును. లోకము లోని జనులు పుత్రుని వాస్తవికతను తెలిసికొనలేక, పుత్రునికై పగలూ రాత్రీ కోరికలు పెంచి కొందురు. యింటివారు, వాడవారు, ఊరు వారు నానావిధములుగా సందేహములు వెలి బుచ్చుచు విచిత్రముగా మాటలాడు వైనమునుండి నూతన దంపతులకు సుతుని చింత ప్రారంభమగుచున్నది పుత్రుడు పుట్టి చచ్చిననూ బాధ అంతగా ఉండదు. లోకము తనను గొడ్డుదియని యంటే భరింప జాలదొక స్త్రీ. కొందరు స్త్రీలు సుతులను కోరి కష్టముల కోర్చి వ్రతముల నాచిరంతురు. గర్భము ధరించిన పిదప గల్గెడు చింతలు పరిపరివిధములుగా నుండును. గర్భమును చెడకుండా కాపాడు కొనెడిది మొదటి చింత యగును. నవమాసములు నిండిన పిదప, సుఖప్రసవమునకు చెందిన చింత పుట్టిన పిదప బాలుని ఆరోగ్యము చింత. ఆపిదప వాడు పెరిగిన స్థితిలో కొంటెతనము చింత, తరుణ వయస్సుకు వస్తే వాని నైతిక పతనము గురించిన చింత, తరువాత వివాహము చింత, ఆ పిదప వాని బ్రతుకు దెరువు చింత, దైవమను కూలించ కుండా ఉండి, వాడు అసువుల బాసినచో ఎడతెగని చింత, ఈ విధిన పుత్రుడు, పుట్టక మునుపుననూ, పుట్టి జీవనము చేయునప్పుడునూ చింతా కారకుడై, చచ్చిన పిదప చింతను మిగిల్చి వెడలి పోవును.

కొందరు పుత్రులు తల్లిదండ్రులను పీడించెడి వారుగా అగుదురు. అట్టివారిని గాంచి యొక కవి నుడివిన నుడువులివి! "పుత్ర వ్యాజముపాగతో రిపురయంమాకస్యచిజ్ఞాయతామ్" శత్రువే పుత్రుడై పుట్టినాడనియును, ఇట్టి దుస్థితి యింకెవ్వరికినీ కలుగ కూడని యీ శ్లోక భాగములోని భావన ఇంకొక కవి పుత్రుడు, శత్రువెట్లగునో వివరించి చెప్పెను. చూడిడి:

**శ్లో॥ జాయమానో హరేద్భార్యాం వర్ధమానోహరేద్ధనమ్।**
**మ్రియమాణో హరేత్ప్రాణాన్ నాస్తి పుత్రసమోరిపుః॥**

పుట్టిన యప్పుడు తల్లికి ప్రాణాంతమగుచు, పెరుగునపుడు పితృధనమును హరిస్తూ, చచ్చెటప్పుడు తల్లిదండ్రుల ప్రాణము తీసే వేదననిస్తూ ఉండే పుత్రునితో సమానమైన శత్రపులేడని శ్లోకములోని భావము.

పుత్రుడు మూర్ఖుడై యుంటే తల్లిదండ్రుల వేదనను ఊహించికొన లేము. ఈ క్రింది శ్లోకమును గమనించుడి

**శ్లో॥ అజాతమృతమూర్ఖేభ్యోమృతా జాతౌ సుతౌ సరౌ।**
**యసావదల్పదుఃఖాయ యావజ్జీవంజడోదహేత్॥**

పుట్టకుండగ నుండెడి పుత్రుడును, పుట్టి చచ్చే పుత్రుడును, బ్రతికి మూర్ఖుడుగా నుండెడి పుత్రుడు దుఃఖదాయకులనియును, వీరిలో మిగిలిన వారి కంటెనూ మూర్ఖుడైన కొడుకె యెక్కువగా బాధించేవాడని శ్లోకములోని భావము.

పిల్లలు పుట్టకముందే యింత బాధను కల్గిస్తే పుట్టిన పిదప యింకా ఎంత బాధ పెట్టుదురోయని భయపడి, సంతానేచ్ఛను వదలి సుఖమయమైన జీవితమును గడిపిన యొక దంపతుల కథ యొకటి గలదు.

ఒక ఊరిలో నొక జంట సుఖమయమైన జీవితమును గడుపుచుండెడి వారు. ఒకనాడు రాత్రివేల, మంచము మీద పరుండి, ఊహా జగత్తులో విహరించు చుండిరి వారి మాటలీవిధిన నుండెను.

"ఏమండీ! దేవుని దయవలన మనకు పుత్రుడైన యెడల, వాని నెక్కడ పరుండ బెట్టుదుము. కొంచెము ఆలోచించి చెప్పండి." అని భార్య భర్తనడిగెను.

మన మిద్దరమూ కొంచెము సర్దుబాటు చేసి కొనిన యెడల, మన యిరువురి మధ్యన మన బాబు పరుండ గలడని భర్త ప్రత్యుత్తరమిచ్చెను. భార్య కొంచెము సమయమువరకు ఆలోచనలలో తెలియాడి "యేమండీ! ఒక వేళ కవలలును పుట్టిన యెడ యెట్టుల" యని అడిగెను.

భర్త వెనువెంటనే తడుము కొనకుండగా, "నేను యే విధిన చేయాలో చెప్పెదను. అప్పుడు గాని నీ కర్థము కాదు. నీ వటువైపు జరుగు, నేనిటువైపు జరిగెదను. అప్పుడు గాని బోధపడ" దనెను. ఆ విధిన జరిగి చూసికొనిరి. స్థలము చాలదేమోయని యెంచిన భర్త "యింకా కొంచెము జరుగుద" మనెను. ఇరువురు ఒకే సమయమున జరిగి, మంచము మీద నుండి దబేలు మని పడిరి. ఇరువురి నెత్తులు పగిలెను. రక్తము వెలువడ జొచ్చెను. వారొక గుణపాఠమును నేర్చికొనిరి. పుట్టక మునుపె యిన్ని కష్టములు కల్పించిన పుత్రులు మనకేల యని భావించికొనిరి.

అయితే, ఒక యింటి వాడైన పిదప, పిల్లలు లేకుండా జీవనము గడపులో నౌచిత్యముండదు. ధర్మాభిమానియై, సత్ప్రవర్తన గల్గిన కొడుకు తండ్రి జీవితమునకు ధన్యత చేకూర్చు ననుటలో సందేహము లేదు. కాని వీటికి విరుద్ధమైన లక్షణములు గల్గిన వాడు పుట్టి, పెరిగి, విచ్చలవిడితనముతో జీవితమును గడిపిన యెడల తండ్రి నరకమును చవి చూస్తాడు. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల అభిప్రాయమేమనగా, భార్యాపుత్రులతో జీవనము గడుపుచుండిననూ వారి యెడల యెక్కువగా మోహమును పెంచికొనిన యెడల, యనర్థములు గల్గును. బురదలోని కమలమువలె, అంటె అంటకుండా యుండిన యెడల నాధ్యాత్మిక లబ్ధి గరిష్టస్థాయిలో నుండగలదు.

ఇక పారలౌకిక సుఖము గురించి తెలుప వలెననిన, స్వర్గాది భోగములు తాత్కాలికమైనవని గుర్తెరుగ వలెనని శ్రీ భగత్పాదుల వారు అభిప్రాయపడిరి. "క్షయిత్వాది యుతే స్వర్గే కస్య వాంఛా వివేకినః" అని ప్రశ్నించిరి. యజ్ఞ యాగ, దాన, ధర్మ, తపోధ్యానాదులవలన స్వర్గము లభించినా, పుణ్యము క్షీణించగనే, మర్త్యమున జనియించక తప్పదు. క్షయము, పతనములనెడి లక్షణములు గల్గిన పారలౌకిక సుఖము వాంఛనీయమైనది కాదు. ఐహిక సుఖము వలెనే, స్వర్గాది సుఖములునూ వర్జనీయులే.

ఈ విషయమును సమర్థించెడి ఉపనిషద్వాణిని గనుడి:

**తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే।**
**ఏవమేవాముత్ర పుణ్యచితో లోకః క్షీయతే॥**

విజ్ఞుడైన సాధకుడు, ఐహిక మరియు పారలౌకిక సుఖముల యెడల హేయ భావమును పెంపొందించుకొనును.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ది. 26-07-1990
శ్రీసిద్దేశ్వర దేవస్థానము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

సుఖదుఃఖముల స్వరూప స్వభావములను శ్రీ కాశీ జగద్గురువుల వారు విశ్లేషణాత్మకముగా వివరించిరి.

సగటు మనిషి సుఖజీవనమునునభిలషించును. దుఃఖమును పొందకుండా జాగరుకుడై యుండును. సుఖదుఃఖములు వెలుగు వీడల వంటివని కొందరంటే మరొకరు రాత్రింబవళ్ళ వంటివని యందురు.

సుఖమున కివ్వబడిన పెక్కు అర్థములలో దుఃఖరాహిత్యమే సుఖమనెడిదొకటి "దుష్టానిఖాని ఇంద్రియాణి అత్రేతి దుఃఖమ్" అనెడి వ్యుత్పత్తి ప్రకారము దేని చేత యింద్రియములు దుష్టములగునో నదియే దుఃఖము "దుర్నిందితం ఖనతి దుఃఖమ్" దుష్టముగాఖేదపెట్టునది దుఃఖమని యెంచబడినది బాధ, పీడ, వ్యథ అనెడివి దుఃఖమునకు పర్యాయపదములు. మానవ శరీరములోని వివిధములగు ఇంద్రియముల వలన కలిగెటి వీడయే దుఃఖమని దలపవచ్చును.

మనకు ప్రియాతి ప్రియమైనవి దూరమై యలభ్యములైనప్పుడు గలిగెడి యసంతృప్తియే దుఃఖమునకు కారణమగు చున్నది. 'మమ' కారమిక్కడ కీలకమైన పాత్రను పోషించును. నావి యనెడివి లభించిన యెడల అసంతృప్తి స్థాయి తగ్గిపోవును. దుఃఖోపశమనమగును. కాని వస్తు సంచయములు లేదా వ్యక్తులు లభించిన పిదప లభించెడి మనోభావము సుఖము కాజాలదు. సుఖము యొక్క యనుభవము పొందుటకై వలయు స్థితి యేర్పడినదని భావించ వలెను. వస్తువు కొనితెచ్చిన యెడల అసంతృప్తి దూరమగునే కాని తృప్తి చేకూరదు. వస్తువును అనుభవించి పొందెడిదే తృప్తి యనెడి యనుభవము. ఇట్టి తృప్తి చిరకాలము నిలిచి యుండను అనెడి భావమేర్పడిన యెడల నయ్యది సుఖము అనిపించికొనును. "సుష్ఠు ఖనత్యశుభమితి సుఖము" అనెడి వ్యుత్పత్తి ప్రకారము అశుభమును పోగొట్టునది సుఖమగును రాగల శ్రేయస్సును అడ్డగించునది అశుభమని యెంచబడినది. అట్టి యెడ రాబోవుశ్రేయస్సే సుఖమని యని పించి కొనును.

రాబోవు శ్రేయస్సే కల్యాణబందమునకు కారణమగును వివాహబంధముతో నేకమయ్యెడి స్త్రీ పురుషులలో నిట్టి భావమే యుండును కదా! పుత్రసంతాన పరమైన యాకాంక్షయును రాబోవు శ్రేయస్సును దృష్టియందు నిల్పియే పెంపొందించికొన బడుచున్నవి.

భార్యాపుత్రుల వలన సుఖము లభించునే? ఒక వేళ లభించినచో నదియెంత కాలము వరకు నిలుచును? ఈ ప్రశ్నలు మానవ జాతిని చిరకాలము నుండియును వేధించుచున్నవి. భారత సంస్కృతికి పట్టుగొమ్మలని భావింపబడెడి రామాయణము మరియు భారతములోన గల యెన్నియో దృష్టాంతముల వలన తెలిపెడిదేమనగా భార్యా పుత్రులు సుఖము కంటెను దుఃఖమునే యధికముగా కల్పింతురు. దశరథుని సంతానాపేక్ష యతనిచే కామ్యకర్మను చేయించెను. పుత్రకామేష్టి చేయబడినదనె చెప్పబడినది. యతనికి తన భార్య మీద గల యనురాగము, రాముని మహాపురుషుని యరణ్యవాసమునకు కారణమయ్యెను. ఈ కర్మకు ఫలితముగాను, పుత్రవాత్సల్యము చేతను చివరి దశలో దుఃఖమునకు లోనై బాధనుపొంది, విగత ప్రాణము గలవాడయ్యెను. అదే విధిన భార్యమీద మమకారము వలన రాముడు వర్ణనాతీతమైన వేదనకు గురియయ్యెను. వారి చావుకు కారణమయ్యెను రామ–రావణ యుద్ధములో పెద్ద యెత్తున ప్రాణ నష్టముగల్గెను. ధృతరాష్ట్రుని పుత్రవాత్సల్యము కురుక్షేత్ర సంగ్రామమునకు కారణమయ్యెను.

భార్యాపుత్రుల వలన లభించెడి సుఖమెంత కాలమువరకు సీమితమైయుండు ననెడివిషయములో విభిన్నమైన యభిప్రాయములు గలవు. ఇది చిరకాలము వరకు నుండెదనే విషయములోన నేకాభిప్రామ గలదు. క్షణికమైనదేయని యనెడి వారే యధిక సంఖ్యాకులు. భార్యాపుత్రుల బంధమునుంఢి విడివడి పిండజ్ఞాని, శివభక్తిని పెంపొందించి కొనవలెను. వీరి నుండి పూర్తిగా విడిపోయి యుండవలెననెడి నియమమేదియును లేదు. భావపూర్ణముగా విడిపోయి యుండిన చాలునని వీరశైవ విజ్ఞుల యభిప్రాయము. కౌటుంబిక జీవనము శివ పూజనమునకు సహకారి కారకముగా మలచి కొనవలెను. భార్యాపుత్రులు తన భక్తికి పుష్టిని యిచ్చే విధముగా మార్చికొనవలెను.

పూర్వోక్తమైనవి ఐహిక సుఖములు, భూలోకమున జీవి పొందెడి సుఖములు. వీటికి భిన్నముగా పై లోకమున లభించెడి సుఖములు, పరలోక సుఖములనబడుచున్నవి. వీటిని గూర్చి అనామయస్తవమున క్రింది విధముగా తెలుపబడినది.

**శ్లో॥ కశ్చిన్మర్త్యః పరికృత తను ర్నీల కంఠత్వయా చేద్**
**దృష్టస్నిగ్ధస్స పునరమర స్త్రీ భుజగ్రాహ్యకంఠ॥**
**అప్యారుధస్సుర పరివృతం స్థానమాకండలీయం**
**త్వం చేత్ కృద్ధస్య పతతి నిరాలంబనధ్వాంతజాలే॥** (అనామయ స్తవము, 10 శివ పంచస్తవి పే.168)

అమర స్త్రీల ఆలింగన సౌఖ్యము ననుభవించుట, అమరపతి సింహాసనమునధిరోహించుట, అమరావతి నేలుట, అమృత పానము చేయుట, కల్పవృక్ష కామధేనువుల వలన కామ్య వస్తువులను గోరి యనుభవించుట మొదలగునవి స్వర్గసుఖములని యెంచ వలెను.

సగటు మనిషి స్వర్గసుఖములను కోరును తన్నిమిత్తమై శాస్త్ర విహితమైన యజ్ఞ యాగాది కామ్యకర్మలను, వ్రతములను, ఆచరించును జంతుబలినిచ్చును. హింస జేసిన దుష్కర్మ, యతనికి బంధమై చుట్టి కొనును.

స్వర్గసౌఖ్యములు కూడ అశాశ్వతములేయని చెప్పబడుచున్నది. పుణ్యాధిక్యత తగ్గిన వెంటెనే జీవి స్వర్గము నుండి చ్యుతిని పొంది భూలోకమున జన్మించుచున్నాడు. గీతాదులలో యీ విషయమున ప్రమాణములు గలవు.

వివేకవంతుడు

"వివేచన వివేకః" యనెడి వ్యుత్పత్తి ప్రకారము విడదీసి చూసెడిదే వివేకమని తెలియుచున్నది సుఖము యొక్క తత్త్వమును విడదీసి పరీక్షించించును. హితాహితముల వివేచన చేయును. జీవి శాశ్వత సుఖమును గల్గించెడి ప్రత్యామ్నాయమునే యెంచికొన వలెనని యెరుగును దారా పుత్రాదులును, స్వర్గాదిభోగముల కంటెను భిన్నముగా నుండెడిదిను, శాశ్వతమైన శ్రేయస్సును గలుగజేయు సుఖమునే వాంఛించించును.

పురుషునికి శాశ్వత సుఖమును గల్గించెడిది ఆనంద ప్రాప్తియని వివేకవంతు డెరుగుచున్నాడు.

లౌకికముగా చూసిన యెడల, సుఖము మరియు ఆనందములకు భేదము లేదు. కాని పారలౌకికముగా చూచిన యెడల ఆత్మానందమే నిజమైన ఆనందము. ఆత్మజ్ఞానమును పొందుటయే నిజమైన ఆనందమని వేదాంతవాదులనెదరు. ఇట్టి ఆనందమే రీతిన నుండునో యని తెలిసికొనుటకై శ్రీ శంకరాచార్యుడు శివానందలహరి, ఆనందలహరి యనెడి కృతులను, రచించెను. మొదటిది శివునికి సంబంధించినదైయుంటే, రెండవది శక్తికి సంబంధించినదైయున్నది.

ఆత్మజ్ఞానమే పరమాత్మ జ్ఞానమని యద్వైతులు వాదింతురు. తానే భగవంతుడినని గుర్తెరిగిన వాడు పొందెడి యానందము అద్వితీయమైనదని యందురు. ద్వైతులు ఈ వాదనను నిరాకరింతురు. ఆత్మ వేరు, పరమాత్మ వేరనియును, పరమాత్మ జ్ఞానమును పొంది యతని సమీపమునకు వెడలుటలో పొందెడి యానందమునకు మించిన యానందము మరొక్కటి లేదందురు. వీరశైవము ఈ రెంటిని నిరాకరించి. ద్వైతా ద్వైతముల కతీతమైన దగు విశిష్ట జ్ఞానమును ప్రతిపాదించెను.

శివజీవైక్యతా సిద్ధిని బోధించెడి విద్యలో క్రీడించునప్పుడు గల్గెడి ఆనందమే నిజమైన ఆనందమని, ఇట్టి ఆనందము పొందుట యనెడిది సుసాధ్యమైన విషయముకాదనియును తన్ని మిత్తిమై శివ కారుణ్యమును సంపాదించ వలెననుట వీరశైవసిద్ధాంత ప్రతిపాదన.

శివ కారుణ్యము పొందవలెననిన భక్తికి యితరమైన సాధనము మరొకటిగానరాదు. పిండజ్ఞాన స్థలమున సాధన చెసెడి వాడు, శివ కరుణను పొందునిమిత్తము శివభక్తిని పెంపొందించి కొనవలెను. శివుని కొలుచుటయే యుత్తమమని తలప వలెను. ఈ విషయమును స్పష్టపరచెడి శ్రీ సోమనాధులవారి యీ కందమును చూడిడి:

**క. స్వర్గసుఖార్థుల కును నప**
**వర్గసుఖార్థులకును గోర్కె వారక సలుపన్**
**భర్గనివేధిత పుష్పని**
**రర్గళ ఫల రాశిలోని యల్పమె చాలున్‌।** (అనుభవసారము, ప.-160)

స్వర్గాది సుఖములు శివుని కొక పుష్పము సమర్పించుట వలన వచ్చెడి ఫలమును పోల్చినచో, శివ పూజాఫలమే గొప్పదని తెలుప బడినది. సోమ నాథుని హిత బోధ గమనార్హమైయున్నది గనుడి:

**కం. కాన యఖిలాల్ప భోగలి**
**తానములగు చిక్కులందు దగులక సద్భ**
**క్తానీక మర్థిగొలుచుట**
**మానిత మోక్షార్థ విమలమతి త్రిపురారీ।** (అనుభవసారము, ప.-163)

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము : 3

**శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మమృతస్యచ।**
**జంతుర్మరణజన్మాభ్యాం పరిభ్రమతి చక్రవత్ ॥** (సి.శి.5:63)

పుట్టినవానికి చావనెడిది నియమితమైయున్నది. చచ్చినవానికి పుట్టుకయే నిశ్చితమై యున్నది. అందుచేత జీవుడు, పుట్టుక చావులకధీనుడై చక్రమువలె తిరుగాడుచున్నాడు. పుట్టుక చావులు నైసర్గికములని తెలిపెడి ప్రమాణమును గనుడిః **"మరణం ప్రకృతిః శరీరిణాం, వికృతిర్జీవన ముచ్యతే"**. శరీరధారులకు మరణము ప్రకృతియనియును, జన్మము వికృతియనియును శ్లోకాంశములోని భాగము.

శాస్త్రకారులు యీ విషయమును వివరించుటకై షడ్భావ వికారములనెడి వానిని ప్రతిపాదించిరి. వికారములు పరివర్తన యొక్కఫలస్వరూపమని తెలియుచున్నది. భావ వికారములు ఆరు విధములుగా నుండునని తెలుపబడనది. అవి యేమనగా, అస్తి, జాయతే, వర్ధతే, విపరిణయతే అపక్షీయతే మరియు వినశ్యతి.

మాతృగర్భములో నున్నప్పుడు 'అస్తి' అనియు, ప్రసవమైనప్పుడు 'జాయతే' యనియు, క్షీరాదులచేత పోషింపబడి వృద్ధినొందుటకు 'వర్ధతే' అనియును, వృద్ధి పరిపూర్ణమైనప్పుడు అల్పమైన మార్పులకు గురియగుటను 'విపరిణమతే' యనియు వయస్సు ముదిరి దేహము శైథిల్యము వైపు మొగ్గుచూపినయప్పుడు 'అపక్షీయతే' యనియును, ప్రాణము పోయి, దేహము పంచభూతములతో కలిపోయినప్పుడు 'వినశ్యతి' యనియును చెప్పబడినది.

ఈ షడ్భావ వికారములు సహజసిద్ధమైనవనియు వీటినుండి తప్పించుకొనుట యసాధ్యమనియును తెలుపబడినది.

**"హులియ బెన్నినల్లి బుదు హుల్లెహోగి**
**మేదు బుందెనెందరె, ఇదకండు బెరగాదె**
**రక్కసియ మనెగె హోగి నిద్రెగైదు బందెనెందరె**
**ఇదకండు బెరగాదె, జవననమనెగె హోగి**
**సాయదే బదుకి బందెనెందరె, ఇదకండు బెరగాదె గుహేశ్వరా!**

అను వచనములో శ్రీ ప్రభు దేవులవారు చావు తథ్యమని తెలిపిరి. వీరి వచనము యొక్క తెలుగు రూపమియ్యది.

**పులియొక్క వెన్నున లేడి పోయి**
**మేసి వచ్చెననిన, దీనిని గని వెరగైనది**
**రక్కసి యింటికి వెడలి**
**నిద్రజేసివచ్చెననిన దీనిని గని వెరగైనది**
**జముని యింటికిపోయి**
**చావకుండా బ్రతికి వచ్చెననిన గని వెరగైనది**

చావునుండి తప్పించుకొనుట యనేది అసాధ్యమైన విషయమని గ్రహింపదగును.

నీటి బుడగ పగలకుండా కలకాలము స్థిరముగా నుండిన యెడల, ఆశ్చర్యము దోచును. మానవుని మనుగడయు నట్టిదే. వివిధాంగములు గల్గి, నవ ద్వారములనెడి నవరంధ్రములు గల్గిన కాయము ప్రాణముతో నిలిచియుండుటయే నొక ఆశ్చర్యము. ఒక జీవి దినమున కెన్నో వేలసార్లు గాలిని పీల్చికొని వదలుచున్నాడు. ఈ ప్రక్రియకు అంతరాయమేర్పడినచో మరణము సంభవించును. అట్టి అంతరాయమేర్పడెడి యవకాశములు వేలసంఖ్యలో నుండును కదా!

ఈ విధిన జనన మరణములు స్వాభావికములని తేలినది. స్వభావ సిద్ధమైన వాటిని అతిక్రమించుట సాధ్యమగునే? "స్వభావో దురతి క్రమంః" అనెడి వాక్కు ననుసరించి, స్వభావ సిద్ధమైన దానిని మించిపోవుటకు వీలుకాదని స్పష్టమగును. ఈ విషయమును సోదాహరణగా వివరించే కథయొకటి కలదు.

పూర్వకాలమున నొక ఋషి ఆశ్రమము నేర్పరచుకొని జీవించుచుండెను. అతడు మహిమాన్వితుడై యుండెను. నదికి వెడలి స్నానాదులు ముగించుకొని నిత్య నైమిత్తికముల నాచరించెడి సమయమున నతని దోసిలి యందునొక యెలుక పిల్లపడెను. అది యెటునుండి వచ్చిపడినదో తెలియకుండెను. ఋషికి ఆశ్చర్యముతో బాటుగా, కారణమును తెలిసికొనవలెననెడి కుతూహలము హెచ్చెను. తలయెత్తి ఆకాశము వైపు చూసెను. పైననొక గ్రద్ద యెగురుచూ కన్పించెను. బహుశః ఆ గ్రద్ద నోటి నుండి జారి తన దోసిలిలో పడియుండునని గ్రహించెను. మృత్యువునుండి తప్పించుకొనిన యెలుకను గాంచిన ఋషికి నొక ఆలోచన గల్గెను. దీనిని నేలమీద వదిలిన యెడల, గ్రద్ద దిగివచ్చి ముక్కున కరుచుకొని తిని తన ఆకలి తీర్చుకొనును. అటుల కానివ్వకూడదని నిశ్చయించుకొనెను. దానికి రక్షణ కల్పింపనెంచి, తన మహిమ చేత దానినొక మానవ శిశువుగా మార్చివేసెను. ఎలుక ఆడదైనందున శిశువు కూడ నా జాతికే చెందనదై యుండెను.

ఋష్యాశ్రమమున పసిపిల్ల పోషింపబడి పెరిగి పెద్దగా నయ్యెను. తగినంత వయస్సుకు వచ్చిన పిదప, ఋషి ఆమెవివాహమును చేయదలచెను. తేజోవంతుడైన వరునితో నామె పెళ్ళిని చేయదలచెను. మరుక్షణమే సూర్యుని పిలిచెను. సూర్యుడటచకు వచ్చి నిలిచెను.

సూర్యుని గాంచిన బాలిక కళ్ళను గట్టిగా మూసికొనెను. ఋషితో యీ విధిన అనెను: "అప్పా! యితనిని చూడలేకున్నాను. అతని కిరణముల కాంతికి నా కళ్ళు బాధకు గురియైనవి. అతని వేడిమి భరించరానిదైయున్నది. శీతల స్వభావము గల్గి, యితని కంటెనూ శూరుడైన వరుని పిలిపించుడి".

ఋషి సూర్యుడికి సెలవిచ్చి, ఆలోచనలో పడెను. సూర్యుని తేజస్సును నిరోధించెడి శక్తిగల మేఘరాజే తన కూతురుకు తగిన వరుడని యెంచి, యతనిని రావించెను. మేఘరాజు విచ్చేసెను. నల్లని మేనువన్నె గల్గి, కాయము నుండి నీరు పెల్లుబుకుచుండగా చూపరులకు వింత గొలిపే రూపమును దాల్చియుండెను. ఇతడు, ఋషి కన్యకు నచ్చిన వరుడు కాలేకపోయెను. "అప్పా! ఇతడు స్ఫురద్రూపి కాడు. అంతేకాదు, ఈతని మేనినుండి నిరంతరమూ నీరు వెలువడుచున్నది. నాకితడు మెచ్చినవాడు కాడ"ని యామె తండ్రికి విన్నవించెను.

మేఘములను అల్లకల్లోలమునకు గురిజేసెడి వాయువే తన కన్నియకు తగిన వరుడని యెంచిన ఋషి, వాయువును ఆహ్వానించెను. కన్య వాయువును చూసి ఋషితో నిట్లనెను. "అప్పా! యితనికి స్థూల శరీరము లేనేలేదు కదా? మీదు మిక్కిలి, చంచల స్వభావము గల్గినవాడగుటచేత, నొకచోట స్థిరముగా నుండజాలడు కదా! ఒకేచోట నిలుకడగా నుండి, యితని కంటెను పరాక్రమశాలిగా నుండెడి వరుని పిలిపించుడి" అని అనగా ఋషి మరల ఆలోచనలో పడెను. వాయువును నిరోధించెడి శక్తి సామర్థ్యములు గల పర్వతరాజే తన కన్యక తగినవాడని నిశ్చయించుకొని, యతనిని రప్పించెను. కన్య యతనిని గాంచి, ఋషి వైపుకు తిరిగి "తండ్రీ! యితడు మొరటుగా నున్నాడు. దూరము నుండి చూచిన యెడల నాకర్షణీయముగా కనిపించినా, దగ్గరగా వచ్చి చూస్తే యితడు కురూపియని తేలును. చూడజాలము. ఇతడు నాకు నచ్చలేదు. ఇతనికంటెనూ, బలశాలియైన వానిని పిలింపించుడి" అనెను.

ఋషికి దిక్కు తోచలేదు. మళ్లీ ఆలోచింపజొచ్చెను. పర్వత శ్రేణులనైననూ చెరచివేసే సామర్థ్యముగల ఎలుకను పిలిపించి, తన కన్యకు చూపెను. దానిని చూడగాను, కన్య పరమానందభరితురాలయ్యెను. సిగ్గుపడుచూ, తలవంచి, మౌనముగా నిలుచుండెను. ఆమె వైనము ఆమె మెచ్చికను తెలియజెప్పుచుండెను. "మౌనం సమ్మతి లక్షణమ్" అనెడి మర్మమునెరిగిన ఋషి, ఆమెను చూసి జాలిపడెను. ఆమె తన స్వభావమును వీడజాలని దైనందున, తన స్వజాతియైన ఎలుకనే వరించెనని యెరిగెను. ఆమెను తన ప్రభావము చేత, యెలుకగా మార్చివేసి, ఎలుకవెంబడి వెడలిపొమ్మని సెలవునిచ్చెను. తన స్వీయ అనుభవమునకొక శ్లోకరూపమును కల్పించి, యీ విధిననుడివెను.

**శ్లో॥ సూర్యంభర్తారముత్సృజ్య పర్జన్యం మారుతం గిరిమ్ ।**
**స్వజాతిం మూషికా ప్రాప్తాస్వజాతి ర్దురతిక్రమః॥**

సూర్యుని, పర్జన్యుని, గాలిని, గిరిని భర్తృత్వమునకై తిరస్కరించి, స్వజాతికి చెందిన దానిని వరించిన మూషికము యొక్క స్వజాతి దురతిక్రమమైనది కదా! అనెడిది శ్లోకములోని భావము.

ఎంతోమంది మహానుభావులు తమశక్తి నుపయోగించి, చచ్చినవారిని బ్రతికించిరని చెప్పుదురు. మరియట్టి మహత్తు గల్గిన వారు కూడ చచ్చిపోయిరి కదా? ఇది ఆశ్చర్యజనకము కదా?

జన్మనెత్తిన ప్రాణికి మరణము తప్పదనియును, అది అనివార్యమైనదనియునూ, అట్టిదానికై శోకించు నావశ్యకత లేదనియును యోగీశ్వరులు బోధించిరి.

మరియొక విషయము గలదు. తపో మహిమ చేత కొందరు చిరంజీవులైనారనెడి వాడుక యొకటి కలదు. బలిచక్రవర్తి, మార్కండేయుడు, మారుతి, వ్యాసుడు, అశ్వత్థామ మొదలగువారు చిరంజీవులని చెప్పబడుచున్నది. కాని వీరిని అమరులని పిలుచుటకు వీలులేదు. వీరికి గల చిరంజీవత్వము, నిరంతరమైనది కాదు. నాల్గు యుగములు ముగియగానే, వీరి చిరంజీవత్వము ముగియుననెడిది శాస్త్ర సమ్మతము.

ఈ విధముగ నేవిధిన జూసిననూ **"జాతస్యహి ధృవో మృత్యుః॥** అనెడి శ్రీ రేణుక భగవత్పాదుల వారి యుపదేశము సర్వానుకూల సిద్ధమైయున్నది.

పుట్టినవారు చచ్చెడిది, మనము ప్రత్యక్షముగా చూస్తూ వున్నాము. ఇంతకు ముందటివారు చచ్చిరనెడి విషయమును వినుచూ ఉన్నాము. ఈ కారణముచేత పుట్టినవాడు చచ్చిపోవుననెడిది అందరికీ ఆమోదయోగ్యమైన విషయమే. అయితే ధ్రువం జన్మ మృతస్యచ॥ అనెడి దానిని గూర్చి సందేహములు గలవు. చచ్చినవాడు తప్పనిసరిగా పుట్టుననెడి యర్థమునిచ్చెడి యీ వాక్కులు అందరికీ ఆమోదయోగ్యముగా నుండజాలవు. దీనిని నమ్మునదెట్లు అను ప్రశ్న ఉదయించును. చచ్చినవాడు, మరల పుట్టినట్లుగా ప్రత్యక్షముగా చూసిన వారెవ్వరూ లేరు కదా!

ఈ సంశయ నివారణకై కాబోలు, శ్రీభగవత్పాదులవారు **"జంతుర్మరణ జన్మాభ్యాం పరిభ్రమతి చక్రవత్"** అని ఉపదేశించిరి. చక్రములోని పళ్ళు ఏవిధముగా పైనుండి క్రిందికి, క్రిందినుండి పైకి తిరుగుచూ ఉండునో, అదేవిధిన జీవుడు జననమునుండి మరణమునకును, మరణమునుండి జననమునకునూ తిరుగుండునని తెలిపిరి.

ఇదే భావనను శ్రీశంకరాచార్యుని స్తోత్రములలో గాంచగలము గమనించుడి :

**శ్లో॥ పునరపి జననం పునరపి మరణం**
**పునరపి జననీ జఠరే శయనమ్ ।**

మరల జననం, మరల మరణం, మరల తల్లి కడుపున పరుండుటయును అనునది వీరి వాక్కులోని భావము.

జీవనమనెడిదొక పునరుక్తి. ఈ జన్మమునందున మనము చూసిన దానినే చూస్తూ, వినిన దానినే వింటూ, తినిన దానినే తింటూ, ముట్టిన దానినే ముట్టుచూ ఏ విధిన కాలమును గడుపుచుందుమో, అదేవిధిన వీటికి క్రిందటి జన్మయందున చేసియుంటిమి. వీటి సంస్కారమూలమున మున్ముందు జన్మలలో కూడ వీటినే ఆచరింతుము.

మానవుడెన్ని జన్మల నెత్తవలెనో యనునది చెప్పుట కష్టము. ఈ భూమినంతనూ చూర్ణముగా చేసి, పరమాణువులుగా మార్చిన యెడల నెన్ని పరమాణువులు వచ్చునో అంత సంఖ్యమేరకు జీవుడు శరీరములను ధరించుచున్నాడు. ఒక జన్మనుండి మరొక జన్మకు తిరుగాడుచునే యుండును. జన్మించినప్పుడు ఏమియూ తీసికొనిరాడు. మరణించినప్పుడు ఏమియూ తీసికొనిపోడు. **"బరువాగ హోగువాగ ఒత్తలె– బందుహోగువ నడువె బరీ కత్తలె"** యని వేదాంతులు పాడుచుందురు. **"వచ్చేటప్పుడూ బత్తలే, పోవునప్పుడూ బత్తలే, వచ్చిపోయే నడుమ వట్టి చీకటే"** యనెడిది కన్నడ నుడువులలోని భావము.

ఇది యిట్టులుండగా, **"ఏకేన జన్మనా ముక్తిః వీరాణాంతు మహేశ్వరి"** యనెడి ఆగమోక్తి యొకటి కలదు. ఇవి శివుని మాటలు. "ఓ పార్వతీ! ఒకే జన్మచేత వీరశైవులకు ముక్తి లభించుచున్నది" అని ఆగమోక్తిలోని భావన **"ధ్రువం జన్మ మృతస్యచ"** యనెడిదుగు భగవత్పాదుల

వాక్కునకును, ఆగమోక్తి కిని వైరుధ్యము గలదాయను సందేహము గల్గును. ఇట్టి సందేహము గల్గుటలో, ఆశ్చర్యమేమియూ లేదు. వాస్తవికముగా, వైరుధ్యమనెడిది లేనేలేదు. అదెట్టులనిన, దానిలోని గూఢమైన అభిప్రాయము యీ క్రింది విధిన నున్నది.

వీరశైవులకు పునర్జన్మ ఉండదనెడిది శతశః సత్యమైనది. అయితే, వీరశైవులని యెవ్వరిని పిలువవలెను? ఇదియొక జటిలమైన ప్రశ్న. మనము సామాన్యముగా లింగమును ధరించినవారి ఉదరములయందున జన్మించిన వారినెల్లరనూ వీరశైవులని వ్యావహారికముగా పిలుచుచు వచ్చుచున్నాము. ఇది వీరశైవుల వ్యావహారిక పరిభాషయేగాని, తాత్విక పరిభాషకాదు. శూరులేయగుదురనేది సత్యదూరమైన యంశము. ఆ విధిననే జరుగవలెననెడి నియమమేదియునూ లేదు. శూరత్వమనెడిది యొక వ్యక్తికి చెందిన వ్యక్తిగత లక్షణము. సాధన చేసినగాని అది లభించదు. అందుకే, లింగమును ధరించనీ, ధరించకపోనీ, వీరశైవ ధర్మాచరణ చేయనీ–చేయకపోనీ, లింగవంతుల ఉదరములనుండి పుట్టినంత మాత్రమున యతనిని వీరశైవుడని పిలుచుట శుద్ధ తప్పు. ఈ విషయమును విశదపరచెడి శ్రీరేణుకాచార్యుల వారి ఉపదేశమును గనుడి:

**శ్లో॥ విశబ్దేనోచ్యతే విద్యా శివజీవైక్యబోధికా ।**
**తస్యాం రమంతే యే శైవా వీరశైవాస్తుతే మతాః ॥** (సి.శి.5:16)

ఈ శ్లోకము యొక్క అర్థమును గనుడి :

వీశబ్దేన = 'వీ' యనెడి శబ్దము చేత, శివజీవైక్య బోధినీ = శివుని మరియు జీవుని యేకత్వమును బోధించెడి; విద్యా = తెలివిడి; ఉచ్యతే=చెప్పబడిచున్నది; తస్యాం=దానియందు; యే=ఎవడు; శైవాః=శివభక్తులు; రమంతే=ఆనందముననుభవింతురో; తే=వారు; వీరశైవాః స్తు=వీరశైవులు; తేమతాః= వారే అనబడుదురు.

శివుని మరియు జీవుల ఐక్యబోధకమైన తత్వజ్ఞానమును పొంది, ఆ జ్ఞానానందమున రమించెడి శైవులే వీరశైవులని వీరశైవ శబ్దము యొక్క నిజమైన తాత్త్వికయర్థమని గ్రహించదగును. ఇది శ్రీరేణుకాచార్యులవారి ఉపదేశములోని సారాంశము.

శ్రీభగవత్పాదులవారి ఉపదేశము యొక్క భావమేమనగా, గురువు వలన దీక్షను పొంది, వీరశైవమునకు అంగములైన అష్టావరణములను, ప్రాణములనదగిన పంచాచారములను, తెలిసికొని వాటియందు నిష్ఠను గల్గియుండి, వాటిని పాలిస్తూ ఆత్మస్వరూపమైన షట్స్థల మార్గమునందున ముందుకు నడిచి, లింగాంగ సామరస్యరూపమైన తత్వజ్ఞానమును పొంది వాటియందుననే తల్లీన చిత్తమున్నవాడే వీరశైవుడు. ఇట్టి వీరశైవునికి నొకే యొక జన్మయందున ముక్తి అయ్యెడి కారణమున ఇతనికి పునర్జన్మ యుండదనెడిదే ఆగమములోని యభిప్రాయము. శ్రీరేణుక భగవత్పాదులును దానినే సమర్థించి, దానికంటెను విపరీతమై ధర్మాచరణములను చేయక, కేవలము వీరశైవుల ఉదరములయందు జన్మించిన వానికి మాత్రము పునర్జన్మ తప్పదనుటచేత శ్రీరేణుక భగవత్పాదుల వారి వాక్కులకునూ, ఆగమములలోనున్న భావమునకునూ పరస్పర వైరుధ్యము లేదనెడిది విజ్ఞులు గుర్తెరుగవలసిన విషయము.

చచ్చిన వారెల్లరూ మరల తిరిగిరాని ముక్తిని బడయుదురేని, అదియొక సహజమార్గమై, ముక్తికొరకై చేయబడెడి సాధకుని పరిశ్రమ వ్యర్థమగుచున్నది. ఈ కారణమున, లింగాంగ సామరస్య బోధక తత్వజ్ఞానమును పొంది, పరశివునియందు సమరసమగువరకు, యీ పునర్జన్మము యెవ్వరికిని తప్పుటలేదు. మరొకమాటలో చెప్పవలెనని ముక్తిపొందుట యనెడిది సుసాధ్యమైన విషయము కాదు. ఈ విషయమును విశదపరచెడి శ్రీ చెన్న బసవేశ్వరులవారి వచనమును గనుడి :

**బట్ట బయలెల్ల గట్టి గొండడె, స్వర్గమర్త్య పాతాళక్కెతావిన్నెల్లిహదో**
**మేఘజలవెల్ల ముత్తాదొడె, సప్తసాగరంగళిగె ఉదకవిన్నెల్లిహుదో?**
**కష్టజీవి మనుజరెల్ల నెట్టనే శివజ్ఞాని గళాదొడె**
**ముందెభవద బళ్ళిగె బీజవిన్నెల్లిహుదో?**
**సాక్షి :"గురుభక్తిం పరిత్యజ్య సద్యోపి నరకం వ్రజేత్" ఇంతెందు దాగి**
**నమ్మకూడల సంగయ్యనల్లి సావిరకొబ్బ సత్య**
**లక్షక్కొబ్బ భక్త, కోటి కొబ్బ శరణ**

చెన్న బసవన్నగారి అనుభవపు నుడియొక్క తెలుగు రూపమును గనుడి :

**బట్టబయలంతయూ గట్టిగైన యెడల**
**స్వర్గమర్త్య పాతాళములకు తాపు యింకెక్కడిదో?**
**మేఘ జలమంతయూ ముత్యమైయున్న యెడల**
**సప్తసాగరములకు ఉదకమింకెక్కడిదో?**
**కష్టజీవులెల్లరూ నేరుగా శివజ్ఞానులైన యెడల**
**ముందు భవపు తీగకు బీజమెక్కడిదో?**
**సాక్షి : "గురుభక్తిం పరిత్యజ్య సద్యోపినరకం ప్రజేత్" ఇట్లున్నదిగాన**
**నాదు కూడల సంగయ్య యందు,**
**వెయ్యికొక్క సత్యము, లక్షకొక్క భక్తుడు, కోటికొక్క శరణుడు.**

శరణుడే ముక్తి కర్హుడని యెరుంగవలెను. ఉపనిషద్యాదులను, గీతా కోవిదులును యిదే రీతిన తెలిపిరి. చచ్చిన వారెల్లరూ సద్గతిని పొందుదురే? పొందరు కదా! ఈ నగ్నసత్యమును విడమరచి చెప్పెడి శ్రీషణ్ముఖ స్వామి వారి వచనమును గనుడి:

**సత్తుహోగువవరెల్ల స్వర్గపదస్థరే? అల్లల్ల**
**కైదువ పిడిదవరెల్ల మహాకలిగళే? అల్లల్ల**
**లింగవ ధరిసువవరెల్ల లింగ ప్రాణిగళే? అల్లల్ల**

శ్రీ షణ్ముఖుల వారి వచనము యొక్క తెలుగు రూపమును గనుడి:

**చచ్చిపోయినవారెల్లరూ స్వర్గస్థులే?**
**కైదుపు పట్టిన వారెల్లరూ మహాకలులే?**
**లింగమును ధరించువారెల్లరూ లింగప్రాణులే**

చచ్చిన ప్రతియొక్కడు స్వర్గానికి పోడు, కత్తిని బట్టిన ప్రతివ్యక్తి మహావీరుడు కాదు, లింగమును కట్టికొనిన ప్రతివ్యక్తి లింగప్రాణి కాలేదనేది శ్రీషణ్ముఖులవారి దివ్యవాణిలోని భావము.

చచ్చి సద్గతిని పొందిన వారి గూర్చి యేమగును అనే ప్రశ్న ఉదయించును. **"ధ్రువం జన్మమృతస్యచ"** యనెడి శ్రీభగవత్పాదులవారి వాక్కులలో సమాధానమిమిడి యున్నది. ఈ విషయాన్ని మరింతగా విపులీకరించెడి ఉపనిషద్వాణిని గనుడి :

**శ్లో॥ "సస్యమివ మర్త్యః పచ్యతే**
**సస్యమివ జాయతే పునః"** (కఠ. 1-6)

పొలములోని సస్యము, వానకు పెరిగి వృద్ధినిగాంచి, యెండకాలమున నేలకొరిగి, మళ్ళీ వానకాలమున మరల పెరుగును. అదేవిధిన చచ్చి సద్గతి పొందినవారు కొంతకాలమట యుండి, పుణ్యము క్షీణించగనే మర్త్యమునకు వచ్చి జననమొందుచున్నారు. గీతా కోవిదులును ఈ విధిననే వచింతురు.

ఒక పల్లెలోని యొక వ్యక్తి యొక మహానగరమునకు ఒంటరిగా వెడలెను. పట్టణమును చూచెడి యిచ్ఛ గలవాడై వచ్చియుండెను. రైలుస్టేషన్‌ను వీడి, పట్టణాన్ని చూస్తూ చూస్తూ ఒక నాలుగు బాటల కూడలికి వచ్చి చేరెను. ఆకాశాన్నంటెడి భవనములతో విరాజిల్లెడి యా కూడలిని చూస్తూ ముగ్ధుడై పోయెను. నిశ్చేష్టుడై నిలబడియుండెను. కొంచెము సేపు తిలకించిన పిదప, అతడు వచ్చే పోయే వాహనాలపైననూ, వ్యక్తుల పైననూ దృష్టిని నిలిపెను. వేలసంఖ్యలో వాహనాదులు నలువైపులకు వెడలుచుండెను. వ్యక్తులు పరువెత్తుచున్న పగిదిన నడచి వెడలుచుండిరి. వారిని చూసి పల్లెటూరివాడు ఇట్లనికొనెను "ఏదో బలవత్తరమైన కారణము వలన యా పట్టణమునకు చెందిన వారెల్లరూ పట్టణమును వీడి వెడలి

పోవుచున్నారు. ఇక్కడే కూర్చొని ఉంటాను. కొంత సమయము పిదప నేనొక్కడనే మిగిలిపోతాను. అప్పుడు ఈ పట్టణము నా స్వంతమౌతుందియని ఆలోచిస్తూ కళ్ళు మూసికొనెను. బాగా అలసటకు గురియైయున్న వాడైనందున కూర్చొనియే నిద్రబోయెను. ఒడలు తెలియని గాఢమైన నిద్రలోకి జారిపోయెను. ప్రొద్దుటే మెలకువకు వచ్చెను. కళ్ళు తెరచి చూడగానే రద్దీ యధావిధిగా నుండెను. అతనికెంతో ఆశ్చర్యము కలిగెను. రాత్రి పట్టణాన్ని వీడి పోయినవారు, మరల యెప్పుడు వచ్చిరని ఆలోచింపజొచ్చెను. సమాధానము లభించలేదు. తనకు ఎదుటన కూర్చొనియున్న ముదుసలివాని వద్దకు వెడలి తన సందేహమును వెలిబుచ్చెను. అతడు యీ విధిన సమాధానమునిచ్చెను. "వీరు పట్టణమును వీడిపోలేదు. తమ తమ ఇళ్ళయందు విశ్రాంతిని పొందిరి. వీరి పరుగు, ఇంటినుండి ఆఫీసుకు, ఆఫీసునుండి ఇంటికి ఎడతెరిపి లేకుండా కొనసాగుచునే యుండును" అప్పుడా పల్లెటూరి వానికి జ్ఞానోదయమయ్యెను. ఈ విధిననే జీవి భూలోకము వీడిపోవుట లేదు. ఒకవేళ పోయినా, కొంత పరిమితకాలము వరకు భూమిని వీడి స్వర్గములోనో, నరకములోనో నివసించి తిరిగి భూలోకమున జన్మించును. అందుకే ముక్తులయ్యేడి స్థితివరకు యీ జనన మరణములు తప్పజాలవనియే శ్రీ రేణుక భగవత్పాదులవారి యుపదేశములోని గూఢార్థము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 27-7-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానం, షోలాపూర్**

## విశేష ప్రదీపిక :

జనన మరణములు సహజములని తెలియజెప్పెడి శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారి ఆశీర్వచనము చిరస్మరణీయము.

మనిషి భద్రతను కోరికొనును. భద్రతను దెబ్బదీసెడిదేదైనను భయమును కల్గించును. భయము గల్గిన యపుడు చిత్తస్థైర్యము ఛేదింపబడును. భయాందోళనలకు గురియైనవాడు ప్రశాంతతను కోల్పోవును. భయములన్నింటి కంటెను నధికమైనది మరణ భయము.

మరణమనిన భయమెందులకని ప్రశ్నించినవారు గలరు. "మరణమే మహార్నవమి" యని చాటిన ఘనత శ్రీబసవేశ్వరులవారికి దక్కును. కాని యిట్టివారు చాలా అరుదుగా నుందురు. మరణము నూహించుకొని భయమునకు గురియయ్యేడివారే యధిక సంఖ్యలోనుందురు.

పిండజ్ఞాని మరణములో నిమిడియున్న తత్త్వము నెరింగినచో యతడు మరణమును గూర్చి భయపడడు. "మ్రియతే మృత్యుః మరణంచ" అనెడి వ్యుత్పత్తి ప్రకారము ప్రాణత్యాగమే మరణమనబడుచున్నది. తాత్వికముగా చూసిన యెడల మరణమునకు మరొక అర్థముగలదని దోచును. ప్రాణము పోవుటకు గల కారణమెట్టిది? అనెడి ప్రశ్న కలుగును. శ్రీసోమనాథులవారి పండితారాధ్య చరిత్రలోగల కాలవాద వాదమును పరికించిన యెడల సర్వము కాలవశమున జరుగుచున్నదనెడి వాదన యొకటి గలదని తెలియుచున్నది. ఆయువు తీరిననాడు అసువులు బాయుదురనెడిది యీ వాదమువలన వచ్చినదే. నశ్వరంబైన యీ దేహమునకు నిశ్చితమైన కాలమానము గలదనియును, "శతాయుఃపురుషః" అనెడి శాస్త్రోక్తి ప్రకారము మనుజుడు నూరు సంవత్సరముల మేరకు బ్రతుకుననియు, ఆ పిదప మరణము తథ్యమనియును తెలుపబడినది. శరీరము బాల్య, యవ్వన మరియు వృద్ధాప్యములనెడి దశలలో శరీరము మార్పుకు గురియై నూరేళ్ళు సమీపించెడి దశలోనది జీర్ణమై యసువులు బాయుననెడిది కాలవాదుల వాదము. 'అత్యయః' యనెడి శబ్దము ఈ అర్థమునే స్ఫురింపజేయుచున్నది. కాలధర్మము నొందెననెడి లోకోక్తియు నీ అర్థమునే సూచించుచున్నది.

కాని కాలమును మీరి బ్రతికినవారు యెందరో గలరని పురాణేతిహాసముల వలన తెలియుచున్నది. మార్కండేయుని కథ చిరపరిచితమే! రామాయణములోని హనుమ, భారతములోని అశ్వత్థామలు చిరంజీవులని తెలుపబడినది. "శ్రుతి శతాయుర్వై పురుష" యనగాలంబు మీరు మాది రాజప్రభుండు" యని శ్రీ సోమనాథులవారు చాటిరి (చతుర్వేదసారము ప.3) 1400 సంవత్సరములమేరకు బ్రతికిన సకలేశు మాదిరాజయ్య కథ బసవ పురాణములోగలదు. ఇది యిట్టులుండగా, అకాల మృత్యువు పాల్పడి చచ్చెడి వారసంఖ్యాకులు.

కాలవాదము చార్వాకాది సిద్ధాంతములకనుగుణముగా నున్నది. వీరశైవ సిద్ధాంతమునకది సరిపోదు.

మరణమునకు దిష్టాంతం అనెడి పర్యాయ శబ్దము గలదు. ఇది తత్వమును ప్రతిఫలించే విధముగా నున్నది. "దిష్టస్య జీవిత కాలస్య ప్రారబ్దకర్మణోవా అంతః దిష్టాంతః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము జీవితకాలము యొక్కగాని ప్రారబ్దకర్మ యొక్కగాని అంతము దిష్టాంతమనబడుచున్నది. ఈ భావన శ్రీభగవత్పాదుల వారు ప్రతిపాదించిన దానికి సన్నిహితముగా నున్నదని దోచుచున్నది.

శ్రీమదాచార్యులవారు, ఇంతకు క్రితమే చేసిన యీ ఉపదేశమును గాంచిన యెడల యవగాహన విస్తృతమయ్యెడి యవకాశము గలదు.

**"...శరీరిణః జాత్యాయుర్యోభోగ వైషమ్య కారణం కర్మ కేవలమ్"** (సి.శి. 5:45)

ఒక జీవియొక్క ఆయువు కొరకు వాడు చేసిన ప్రారబ్ద కర్మయే కారణమని తెలుపబడినది. జీవుడు కర్మననుభవించుటకే దేహి యగుచున్నాడని కర్మవాదులు చెప్పుదురు. కర్మఫల భోగము పూర్తిగా ముగిసిన పిదప జీవుడు మరణమును పొందునని భావింపదగును. ఈ వాదన ప్రకారము, ఒక జన్మలో చేసిన కర్మలు మరుజన్మకు కారణమగుచున్నవి. జననమరణములీవిధిననే చక్రీయ ప్రక్రియలో కొనసాగుచుండునని సాంఖ్యులు చెప్పుదురు. భగవద్గీత వలన యీ భావము బహుశ ప్రచారమును పొందెను.

ధ్రువం అనెడి మాటకు శాశ్వతము మరియు నిశ్చయము అనెడి రెండర్థములు గలవు. జన్మించెడి ప్రక్రియ శాశ్వత ప్రతిపాదికమీద కొనసాగునని తెలిపబడుచున్నది. ఈ వాదమును వీరశైవ మంగీకరించదు. శివుడు స్వీయ క్రీడావిలాసమున జగత్తును సృష్టించెను. స్వేచ్ఛ ప్రకారము లయమును చేయును.

జగత్తు పుట్టుక యా విధిన యుండిన యెడల ఇక జీవుని సంగతి గూర్చి చెప్పవలయునే? శివేచ్ఛ ప్రకారముగా జన్మము సంభవించవలెనా లేదా యనెడిది నిర్ణయింపబడునని భక్త్యుద్యమ నేతలు చెప్పుచున్నారు. శివకారుణ్యమును పొందిన జీవి యేవిధముగా మరణమును తప్పించి కొనగలడో, అదే విధిన జన్మనుండియును తప్పించికొనవచ్చునని తెలియుచున్నది. బసవనన్న వారి వచనము లెన్నియో ఈ భావమునే కల్గించుచున్నవి. "జన్మ జన్మలకు పోనివ్వవల"దని పదే పదే వేడికొనును. "శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" యని చెప్పెడి వాక్కులోను ఈ అర్థమే స్ఫురించుచున్నది. అట్టి యెడ, "జాతస్యఃమరణం ధ్రువం" సక్రమమైయున్ననూ, చచ్చినవానికి పుట్టుక తప్పదు యనెడిది "ధ్రువ"మైన దానిగా తీసికొనజాలము. శివకారుణ్యము యొక్క మహత్తు గుర్తెరిగినవాడు ఈ భావము సరియైనదేయని తెలియును. భక్తిపథమును ప్రతిపాదించెడి ప్రతిధర్మము ఇట్టి భావమునే వహించినది. ఇది యిట్టులుండగా శ్రీభగవత్పాదులవారు ధ్రువం జన్మ మృతస్య చ" అని యెందుకు ఉపదేశించెనో తెలిసికొనవలసియున్నది.

వీరశైవమునకు భక్తియే పునాది. భక్తిగల్గిన భవి భక్తుడై భక్తిని జేసి భక్తి చేత ముక్తిని పొందెడి మార్గమును వీరశైవము బోధించుచున్నది. శివభక్తి గల్గినవారికి ముక్తి సులభసాధ్యమని చెప్పెడి ధర్మమిది. 'శివ' అనెడి అక్షరములు జిహ్వ మీదికి వచ్చిన యెడల ముక్తి గల్గునని చెప్పబడినది. అష్టావరణముల గురించి తెలుపుచు వాటిని ధరించినచో పునర్జన్మ యుండదని శ్రీభగవత్పాదులవారు పలు సందర్భములలో చెప్పిరి.

లోతుగా పరిశీలన చేసిన యెడల శ్రీ భగవత్పాదుల వారి యుపదేశములోని మర్మము తెలియగలదు. "ధ్రువం జన్మ మృతస్యచ యనెడిది సాధారణ సూత్రము. శివభక్తివలన జన్మరాహిత్యమును సాధించవచ్చును అనెడిది విశేష సూత్రము. విశేషసూత్రము విధించినయప్పుడు సామాన్యసూత్రము వైదొలగిపోవును. జన్మ ధృవమైనది. చచ్చినవాడు నిశ్చయముగా పుట్టియే తీరును. పిండస్థలమున నుండెడివాడు ఈ సూత్రమునకు బద్ధుడై నానా యోనులలో జన్మించినవాడై మల పక్వత వలన మానవుడైనాడు. ఇట్టివాడు పొందవలసిన జ్ఞానమెట్టిది? యీ విషయము సవిస్తరముగా పిండ జ్ఞాన స్థలమున తెలిసికొని యుంటిమి. అద్దానినే యిచ్చట పునః స్మరణ జేసికొనవలెను. శివభక్తి యనెడిది కీలకమైన యంశము. ప్రవృత్తి దిశలో శక్తి మాయమై జీవునికి బహుజన్మలను కల్పించుచున్నది. నివృత్తి దిశలో శక్తియే భక్తియై జీవుని యుద్ధరించుచున్నది. ఈ భక్తి వలన ముక్తి లభించి, జన్మరాహిత్యంబు సిద్ధించును. ఈ విషయమును గుర్తెరిగి, జ్ఞానమును సంపాదించిన పిండదు సంసార హేయస్థలమున ప్రవేశించిన యప్పుడు అతనికీ విశేషసూత్రము బోధించవలెనని గ్రహించవలెను. తత్ఫలితముగా అతనిలో వ్యక్తావ్యక్తముగ నుండెడి శివభక్తి దృఢతరమై సుస్థిరముగా నిలుచును. వానిని గురుకారుణ్య స్థలము దిశలో పయనింపజేయును.

ఈ ధర్మసూక్ష్మమును గ్రహించిన వీరశైవులు పిండజ్ఞాన స్థలమునుండి సంసార హేయస్థలమునందున యడుగిడిన జీవికి గురుభక్తి యెడల అనురక్తిని కల్గించవలెను. తగిన ప్రేరణలను నొసంగవలెను.

-: శుభం భూయాత్ :-

## ఆశీర్వచనము : 4

**శ్లో॥ మత్స్యకూర్మవరాహాంగై ర్నృసింహ మనుజాదిభిః**
**జాతేన నిధనం ప్రాప్తం విష్ణునాపి మహాత్మనా ॥** (సి.శి. 5:64)

మత్స్యకూర్మవరాహాంగము చేతను, నరసింహ, మనుజాదుల చేత జన్మించిన వానిచేతను, మహాత్మునిచేతను, విష్ణువు చేతను మరణము పొందబడినదని శ్లోకములోని భావము. మహాత్మునిగా స్తుతింపబడుచు, మత్స్యాది దేహములు దాల్చుటకై జన్మించిన విష్ణువుకు మరణము

సంప్రాప్తమయ్యెను. ఇక సామాన్యుల విషయమున నాలోచింపవలసిన పనిలేదు. ఎంతటి మహాత్మునికైననూ జనన మరణములు తప్పవని చెప్పుటకై విష్ణువు నుదాహరణగా గైకొని శ్రీ రేణుక భగవత్పాదులు విషయ విశదీకరణ చేసెను.

విష్ణువు ధర్మపాలన నిమిత్తము అవతారముల నెత్తెనని లోకమున వాడుక కలదు. భగవద్గీత యీ భావనను సమర్థించుచున్నది. వ్యాసులవారు దశావతారముల గురించియూ, ఆయా అవతారముల పరమార్థము గురించియే వివరించు నిమిత్తమున పురాణములు రచించిరని తెలుపబడినది. రామాయణమున వాల్మీకి రామావతారమును, భారతమున వ్యాసుడు కృష్ణావతారమును అభివర్ణించిరి. "ఆత్మానాం సృజామ్యహమ్", "సంభవామి యుగే యుగే" అనెడి గీతోక్తులలో విష్ణువు తన సొంత నిర్ణయానుసారమే అవతారముల నెత్తెనని తెలియుచున్నది. కాని విష్ణువు తానుచేసిన కర్మఫలము ననుభవించుటకే దశావతారములను దాల్చెననెడి విషయమును గూర్చి తెలిసినవారు పరిమితముగా నుందురు. ఆ విషయమును గూర్చి విచారణ చేయుదుముగాక.

దేవాసుర సంగ్రామము నందున యొకపరి అసురులు తమ రక్షణకొరకు భృగు మహర్షుల వారి ఆశ్రమమునకు వచ్చి శరణాగతులైరి. ఆశ్రమమునందున ఋషులు లేకుండిరి. భృగు మహర్షి సతీమణి యుండెను. ఆమె వారికి ఆశ్రయము నివ్వగా అదే సమయమున విష్ణువు ఆశ్రమము లోనికి ప్రవేశించి, రాక్షస సంహారము చేయుటకై ప్రయత్నించెను. ఋషి పత్ని తన అభ్యంతరమును తెలుపుతూ తనను శరణుజొచ్చిన వారిని రక్షించుట తన కర్తవ్యమనియును, రాక్షసులను చంపవలదనియును వేడుకొనెను. భృగు మహర్షి ఆశ్రమములోలేని కారణమున, ఆశ్రమములోనికి ప్రవేశించవలదని అభ్యర్థించెను. విష్ణువు ఆమె మాటలను త్రోసిపుచ్చెను. తన మార్గమున కవరోధములు కల్పించుచున్న ఋషిపత్నిని చంపి తన మార్గమును సుగమము చేసికొనుటకై నిశ్చయించుకొనెను. మొదటగా ఋషిపత్నిని చంపివేసెను. పిదప రాక్షసులను సంహరించి, తనదారిన తాను వెడలిపోయెను.

భృగు మహర్షులవారు ఆశ్రమమునకు వచ్చి, గడిచిన సంగతులనన్నింటినీ జ్ఞానదృష్టిచేత తెలిసికొనెను. హరి చేసిన అత్యాచారమును గని క్రుద్ధుడయ్యెను. "ఓయీ హరీ! యజమానులు లేని ఆశ్రమములో ప్రవేశించి, నిరపరాధియైన నా ధర్మపత్నిని చంపితివి. అందులకై నీవు భూలోకమున కోటి జన్మలను దాల్చుము. అన్ని జన్మలలోను నీకు స్త్రీల వియోగము గల్గుగాక. నిన్ను పూజించెడువారు పాషండులై చరింతురుగాక" యని శాపమునిచ్చిరి.

శాప వృత్తాంతము నెరిగిన హరి భయగ్రస్తుడయ్యెను. శివానుగ్రహమును పొందుటకై కాంచీపురమునకు వెడలి ఏకాంబరేశ్వరుని అర్చించెను. శివుడు ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యెను. "ఓయీ హరీ! నా భక్తులు పెట్టిన శాపమును మరల్చెడి శక్తి యెవ్వరికినీ లేదు. వారే అన్యథా చేయగలరు. నీవు వెడలి భృగువునే శరణు వేడు"మనెను. విష్ణువటులనే జేసెను. శివుడు, భృగుమహర్షికి మనస్సునందున ప్రత్యక్షమై యీ క్రింది విధిన యుద్బోధించెను.

**శ్లో॥ విమోచయ హరింశాపాద్ భృగో బహుజనిప్రదాత్। మదర్చనారతం విద్ధి భక్తంచమునిసత్తమ॥**
**దశస్తు జన్మ దద్విష్ణోరేకస్మింస్తత్ర జన్మని।స్త్రీయా విముక్తోతి చిరం దుఃఖీ భవతునాన్యతః ।**

(క్రియాసారము పు.398)

ఓ భృగు మహర్షీ! నా భక్తుడై నన్ను పూజించిన హరికి తరుణోపాయమును తెలుపుము. కోటి జన్మలకు బదులుగా పది జన్మలనెత్తుటకును, ప్రతి జన్మలోను స్త్రీ వియోగ దుఃఖము ననుభవించుటకంటె, యొక జన్మలో నట్టి పీడను అనుభవించే విధిన అనుగ్రహించుమనెడిది శ్లోకములోని భావము.

భృగు మహర్షులవారు, శివుని ఆజ్ఞను తలదాల్చెను. తలలో చంద్రుని ధరించిన వానిని గాంచి, హరి యీ విధిన విజ్ఞాపన చేసెను.

**శ్లో॥ తదా పునరుమాకాంతం రమాకాంతాః ప్రణమ్యతం।**
**ప్రార్థయామాస భగపన్ దశస్వపి చ జన్మసు ॥**
**యమాజ్ఞాననివృత్యర్థం నిగ్రహానుగ్రహౌ కురు।**
**త్యమేవ దేవదేవేశ దయాలో భక్తవత్సల।** (క్రియాసారము పుట.398 )

ఓ మహాదేవా! భక్తవత్సలుడవైన నీవు పదిజన్మల యందునూ నా అజ్ఞానమును దూరము చేయుటకై నిగ్రహానుగ్రహములను చేసి నన్నుద్ధరించిన వాడవగుము అని హరిహరుని ప్రార్థించెనని శ్లోకములోని భావము. హరి కోరిక మేరకు శివుడు ఐదు అవతారములలో నిగ్రహమును, ఐదు అవతారములలో ననుగ్రహమును చేసి లోకకళ్యాణమును గల్గించెను. వాటిని గూర్చి తెలుసుకొందుముగాపుత.

## మత్స్యావతార నిగ్రహము :

పూర్వకాలమున, జగత్తంతయును జలమయము కాగను, సోమకుడనెడి రాక్షసుడు బ్రహ్మకడకు వెడలి వేదములను లాగికొని పోయి సముద్ర గర్భమున దాగికొనెను. యజ్ఞ యాగాదులాగిపోయెను. హవిస్సు నిచ్చెడివారు లేని కారణమున దేవతలు శక్తి హీనులుగా కాజొచ్చిరి. దేవతలు విష్ణువును ప్రార్థించిరి. వేదములను కొని తెమ్మని కోరిరి. విష్ణువు మత్స్యరూపమును దాల్చి, సముద్రములోనికి ప్రవేశించెను. సోమకుని చంపి వేదములను గైకొని బ్రహ్మ కొసంగెను.

సోమకుని చంపి దేవతలను గాచితినను తలంపుతో విష్ణువు క్రమేపి గర్విష్టి కాజొచ్చెను. మత్స్యరూపముననే ఉండి,సముద్రమును అల్లకల్లోలము పాలు జేయుచు, జలచరములన్నింటినీ తింటూ లోక కంటకుడయ్యెను. మహా మత్స్యరూపముననుండియున్న విష్ణువును గాంచిన దేవతలు భయగ్రస్తులై భర్గుని శరణుజొచ్చిరి. శివుడొక చిట్టిగణుని పిలిపించుకొని, మత్స్యావతారమును నిగ్రహించెడి బాధ్యతను, అతనికి అప్పగించెను. ఆ చిట్టిగణుడు, కాయమును పెంచి, యొక మహానావికుని రూపమును దాల్చి, సముద్రములోనికి ప్రవేశించి, మత్స్యము రూపముననున్న విష్ణువును, ఒక జాలమున పట్టి బంధించెను. రెండు కళ్ళను పెరికివేసి, విజయాట్టహాసము చేయుచు కైలాసగిరికేగి కైలాసనాథునికి మ్రొక్కి సాధించిన కార్యమును నివేదించెను. దేవతల ప్రార్థనలమేరకు శివుడు, ఆ కళ్ళను తన మెడలో దాల్చి, ప్రమథుని ప్రశంసించుచు ప్రత్యేక మన్ననలను గావించెను. ఈ ఘటన చేత నిగర్వియైన విష్ణువు శివుని కొలువజొచ్చెను. మత్స్యరూపముననే మహాదేవుని పూజించెను. అమాయక జీవులను చంపిన దోషమునుండి విముక్తుని జేయుమని కోరెను. శివుడు ప్రసన్నుడై, యతని కోర్కెను దీర్చెను. పిదప విష్ణువు, మత్స్యావతారము చాలించి వైకుంఠమునకు వెడలుటకు నుద్యుక్తుడయ్యెను. ఈలోపుననే, అతనికొక ఆలోచన వచ్చెను. శివుని ప్రార్థించి మరొక వరమును వేడెను. మత్స్యరూపముననున్న తనను అర్చించినవానికి యిష్టార్థసిద్ధిని కలుగజేయుమని ప్రార్థించెను. శివుడు, విష్ణువుకు అభయ ప్రదానము చేసెను. అతడు వైకుంఠమునకు వెడలి సుఖముగా నుండెను. నేటికిని కంచిలో మత్స్యావతావతారమును అర్చించేవారికి యేకామ్రేశ్వరుడు వరములనిచ్చుచున్నాడు. ఇది భక్తుల విశ్వాసము.

## కూర్మావతార నిగ్రహము :

పూర్వకాలమున దూర్వాసుని శాప ప్రభావము వలన దేవతల సంపద సముద్రము పాలయ్యెను. దానిని మరల పొందుటకై, దేవాసురులు సముద్ర మథనమును చేపట్టనెంచిరి. మందర పర్వతమును కవ్వముగా జేసి, వాసుకిని కవ్వపు త్రాటిగా జేసిరి. పాల సముద్రమును చిలికే సమయానికి, మందరము పాల సముద్రమునందు మునిగిపోయెను. దేవతలు విష్ణువును ప్రార్థించిరి. తరుణోపాయమును కోరిరి. విష్ణువు వారి కోరిక మేరకు, కూర్మరూపమును దాల్చి, సముద్ర గర్భమునకు చేరి, మందరమును తన వీపున నిడికొని దాని భారమును వహించెను. అది మునుగకుండా యుండిన మందరముతో మథనము ప్రారంభింపబడెను. మథనము వలన లభించిన అమృతమును త్రావిన కూర్మమునకు మత్తెక్కెను. గర్వము హెచ్చెను. లోకకంటకుడై దేవాసురులను బాధింపజొచ్చెను. దేవతలు శివుని ప్రార్థించి రక్షించమని వేడిరి. శివుడొక గణనాథుని పిలిపించి, కూర్మమును నిరోధించుమని ఆదేశించెను. గణనాథుడు శివుని ఆజ్ఞ మేరకు కూర్మమును సంహరించి, దానివెన్నును తీసికొచ్చి వచ్చి శివుని పాదముల కడనుంచెను. దేవతల ప్రార్థన మేరకు శివుడు, నద్దానిని తన మెడలో ధరించెను. గణనాథుని సముచితరీతిన సన్మానించెను. విష్ణువు, శివుని ప్రార్థించి, శివానుగ్రహము వలన విగతకల్మషుడై వైకుంఠమునకు వెడలిపోయెను.

## వరాహావతార నిగ్రహము :

హిరణ్యాక్షుడనెడి రాక్షసుడు దేవతలను పీడిస్తూ ఉండేవాడు. భూమిని తీసికొనివెళ్ళి సముద్రము యొక్క అడుగున ఉంచినాడట. విష్ణువు వరాహ రూపమును దాల్చి వానిని సంహరించెను. గర్వముతో లోకకంటకుడయ్యెను. సప్త సముద్రములను అల్లకల్లోలము చేస్తూ, పర్వత

శ్రేణులను కూల్చివేస్తూ జీవులను హింసిస్తూ తిరుగాడజొచ్చెను. దేవతల మొర విని శివుడు వరాహుని నిగ్రహించుటకై ఒక గణనాథుని నియోగించెను. గణనాథుడు వరాహమును పైకెత్తి నేలకేసి విసరెను. మరుక్షణముననే యది అసువులను బాసెను. దాని కొమ్మును విరిచి, శివునికి సమర్పించెను. శివుడు దానిని మెడలో ధరించెను. విష్ణువు నిర్మోహితుడై శివుని పూజించి, ప్రసన్నుని జేసికొని వైకుంఠమునకు వెడలిపోయెను. శివుడు గణనాథుని తగురీతిన సన్మానము చేసెను.

## నరసింహావతార నిగ్రహము :

హిరణ్యకశ్యపుడు వరగర్వితుడై దేవతలను పీడించుచుండెను. తన స్వంత కొడుకును కూడ పీడనకు గురిచేసెను. అతని కొడుకు హరిభక్తుడై నందున, విష్ణువు నృసింహ రూపమును దాల్చి, తన భక్తుని రక్షించుకొనుటకై హిరణ్యకశ్యపుని పొట్టను చీల్చి చంపివేసెను. దేవతలు హర్షించిరి. కాని వారి ఆనందమెంతో సమయము వరకు నిలువలేదు. హిరణ్యకశ్యపుని రక్తమును త్రావి మత్తెక్కిన నరసింహుడు లోకకంటకుడై లోకములను సంహరింపజొచ్చెను. దేవతలు దేవదేవుని జోక్యమును కోరిరి. శివుడు వీరభద్రుని పిలిపించి, నృసింహుని నిరోధించమని ఆదేశించెను. వీరభద్రుడు తండ్రి యానతిని తలదాల్చిన వాడై నృసింహుని కడకేగెను. మంచిమాటలతో కార్యమును చక్కబెట్టదలచెను. కార్యము ఫలించలేదు. వీరభద్రుడు శరభ రూపమును దాల్చి నృసింహుని వీపును చీల్చి, ఆ చర్మమును గైకొని కైలాసమునకు వెళ్ళెను. కానుకగా శివునికి సమర్పించి మన్నన బడసెను. శివుడు వీరభద్రుని మెచ్చుకొని తగురీతిన సన్మానమును చేసెను. నృసింహ రూపమును వీడిన విష్ణువు విగత గర్వము గలవాడై గౌరీపతిని స్తుతించి విగత కల్మషుడయ్యెను. ప్రసన్నుడై తన సదనమునకు వెడలెను.

## వామనావతార నిగ్రహము :

బలి చక్రవర్తి గొప్పదాన శీలియై యుండెను. అతడు నూరు యజ్ఞములను చేసి స్వర్గాధిపత్యమును పొందాలని దలచెను. నూరవ యజ్ఞమును గూర్చి ఆలోచించెడి వేళ, దేవేంద్రునికి దుర్బుద్ధి పుట్టెను. తన పదవిని రక్షించుకొనుటకై విష్ణువును శరణుజొచ్చెను. స్వభావరీత్యా దానవ విరోధియైన వాడగు విష్ణువు, బలిని బలిపెట్టదలచెను. కశ్యపునికి కొడుకై పుట్టి, వామనుడై బిక్షాటన చేస్తూ బలికడ కేతెంచెను. వామనుని గాంచి ముచ్చటపడిన బలి, యేమివలయునో కోరుమనెను. వామనుడు మూడడుగుల నేలనే కోరెను. బలి యిచ్చెదననెను. కాయమును పెంచిన వామనుడు రెండు పాదములతో భూమ్యాకాశములతో కప్పివేసి, మూడవ పాదమెచ్చట పెట్టవలెనని బలిని ప్రశ్నించెను. బలి తన శిరస్సును చూపి యట మోపమని యడిగెను. వామనుడు తన పాదమును మోపి, బలిని పాతాళము వరకు చేరేవిధముగా అదిమివేసెను. బలి భయమును చూసిన దేవతలు సంబరములను చేసికొనిరి. ఆ పిదప త్రివిక్రమ రూపములోని వామనుడు పెరుగుచునే యుండెను. గర్వించిన వాడైనందున కాబోవు వైపరీత్యముల గూర్చి ఆలోచించలేకపోయెను. బ్రహ్మాండము బ్రద్దలగునేమో యనెడి భయము పొడసూపెను. దేవతలు శివుని కడకు వచ్చి, పరిపరి విధములుగా ప్రార్థించి లోకములను రక్షించవలెనని కోరిరి. శివుడు, త్రివిక్రముని నిగ్రహించుటకై భైరవుని నొకని పంపెను. భైరవుడు భీకరాకారమును దాల్చి, త్రివిక్రముని కంటెను గురుతరమైన రూపమును దాల్చి, త్రివిక్రముని చీల్చి చెండాడి, చీల్చిన చర్మమును వస్త్రముగా ధరించి, వెన్నెముకను ఆయుధముగా ధరించి విరాజమానుడై నిలిచెను. విశ్వనాథుని కడకేగి త్రివిక్రమ వధ గురించి తెలియబరచెను. శివుడు సంతసించి, భైరవుని సత్కరించెను. దేవతలు సంతోషభరితాంగులైరి. విష్ణువు, శివుని పూజించి, తత్ఫలితముగా కల్మష రాహిత్యమును పొంది, నిజ సదనమునకు వెడలెను.

ఈ విధిన, హరుడు హరిని నిగ్రహించి హరిహరుడయ్యెను. లోకకళ్యాణమును సాధించెను. తదుపరి, శివుని అనుగ్రహ లీలలను తెలిసికొందుము గాక.

## పరశురామావతార అనుగ్రహము :

భృగు శాపఫలముగా, హరి జమదగ్ని ఋషికి పుత్రుడై జన్మించెను. పితృవాక్య పరిపాలన నిమిత్తమున తన తల్లిరేణుకాదేవి గారి శిరచ్ఛేదమును చేసిన వాడయ్యెను. తండ్రిగారి అనుగ్రహము వలన తల్లి ప్రాణములను బడసెను. తండ్రిగారు కోపమును వీడిరి. తాను శివానుగ్రహప్రాప్తికై యరణ్యమున కేగి అతిఘోరమైన తపస్సును చేయజొచ్చెను. ఇద యిట్టులుండగా, నొకసారి కార్యవీర్యార్జునుడనెడి రాజు, జమదగ్ని ఆశ్రమమును

సందర్శించెను. ఋషి యతనికి అతిథి సత్కారములు చేయనెంచి, కామధేనువును ఉపయోగించుకొనెను. కామధేనువు మహిమను గాంచిన రాజు, లోభ చిత్తమును పెంపొందించుకొని అద్దానిని కోరెను. జమదగ్ని యతని కోరికను తిరస్కరించగా, రాజు క్రుద్ధుడై కృపాణమును గైకొని జమదగ్ని శిరస్సును ఖండించెను. కామధేనువును గైకొని వెడలెను.

రేణుకాదేవి సహగమనము చేసెను. కాని వర్షము కారణమున చితాగ్ని చల్లబడెను. అంతవరకు, ఆమె వస్త్రములు కాలిపోయి యుండుటచేత, ఆమె వివస్త్రయై నిలిచెను. స్మశానములోని ఛండాలురు ఆమె మానసంరక్షణకై వేపతప్పలను తెచ్చి యిచ్చిరి. మంటల వలన గాయములు మానువరకామె వెలివాడలోనే ఉండి, పిదప ఆశ్రమమునకు వెడలెను. వివరములను తెలిసికొనిన జమదగ్ని కొడుకగురాముడు, తపో భూమినుండి వచ్చి, ఆశ్రమమును సందర్శించి, క్రుద్ధుడై ప్రతీకారము గురించిన యోచన గలవాడై, తగిన శక్తిని సంపాదించు నిమిత్తము తపోభూమికి వెడలిపోయెను. శివుని గూర్చి ఘోరతపమాచరించెను. శివుడతని తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమయ్యెను. యావత్ క్షత్రియ జాతిని నిగ్రహించెడి శక్తి సామర్థ్యములనిమ్మని వేడికొనెను. శివుడతని భక్తికి మెచ్చి, తిరుగులేని "పరశువును" ప్రసాదించెను. దానిని చేపట్టి నందున, యతడు పరశురాముడయ్యెను. శివానుగ్రహమును పొందిన పరశురాముడు, శివుడిచ్చిన గండ్రగొడ్డలి చేత క్షత్రియ సంహారమునకు పూనుకొనెను. మొదటగా కార్త్యవీర్యార్జునిని చంపెను. పిదప రాజుల నందరిని చంపెను. అంతటితో ఆగలేదు. ఇరువది యొక్క పర్యాయములు క్షత్రియులపైకి దండెత్తి భూమండలములోని క్షత్రియులనెల్లరిని సంహరించివేసెను. గెలిచిన రాజ్యమును కశ్యపునికి దానముగా నిచ్చెను. కొంతకాలమువరకు తల్లిని సేవించిన పిదప మహేంద్రగిరికి పోయి, ఆశ్రమమేర్పరచికొని, శివారాధనలో మునిగి తేలుచు కాలమును గడిపెను. కల్పాంతమున, శరీరమును వీడి, విష్ణువు రూపమును దాల్చి వైకుంఠమునకు వెడలెను.

## రామావతార నిగ్రహము :

రామకథ జగమెరిగినదే. పుత్రకామేష్ఠి యాగఫలముగా పుట్టిన శ్రీరాముడు వీరునిగా పేరుగాంచెను. సీతా స్వయంవరమున సీతను చేపట్టెను. దశరథుని కోర్కెమేరకు, అడవికి వెడలెను. భృగు శాపఫలముగా భార్యావియోగము సంప్రాప్తమయ్యెను. విచారణ చేయగా, సీతను రావణుడపహరించెనని యెరిగెను. మహాబలశాలి యగు రావణుని నిగ్రహించుటెట్టులో తెలియనివాడై, తరుణోపాయము నిమిత్తమున, అగస్త్యుని దర్శించెను. తన కోరికను విన్నవించెను. అగస్త్యుడతనికి, శివోపాసన చేసి దివ్యశక్తులను పొందుమని యుపదేశించెను. రాముడు శివోపాసన చేసి శివుని ప్రసన్నుని గావించుకొనెను. శివానుగ్రహము చేత రావణుని నిగ్రహించెను. అయోధ్యకేగి, పట్టాభిషేకమును చేయించికొనెను. ఉత్తర రామాయణములోని యుదంతముల యనంతరము, శివానుగ్రహమునకై శివోపాసన చేసెను. తత్ఫలితముగా విగతకల్మషుడై సరయూ నదిలో ప్రవేశించి తనువును వీడెను. విష్ణువు రూపమును దాల్చి నిజనివాసమునకు వెడలెను.

## బలరామావతారానుగ్రహము :

ద్వాపర యుగమున విష్ణువు బలరామునిగా పుట్టెను. దుష్టశిక్షణ, శిష్టరక్షణయే లక్ష్యముగా నిడికొని జీవించెను. అనన్య సామాన్యమైన శివభక్తిని పెంచుకొని, శివారాధకుడైయుండెను. శివానుగ్రహము వలన యెన్నియో విజయములను సాధించెను. చివరన,అవతారమును ముగించి వైకుంఠమునకు వెడలెను.

## శ్రీకృష్ణావతారానుగ్రహము :

ద్వాపర యుగమున శ్రీవిష్ణువు, దేవకీ వసుదేవుల నందనుడై జన్మించెను. సాందీపని ఋషి వలన సకల విద్యలను గడించి షడ్గుణైశ్వర్య సంపన్నుడయ్యెను. శివభక్తిపరుడై, శివోపాసన చేసినందుననే యతనికి షడ్గుణైశ్వర్యము లభించెను. ధర్మము, ఐశ్వర్యము, యశస్సు, శోభా, జ్ఞానము మరియు వైరాగ్యములను షడ్గుణైశ్వర్యములందురు. ఉపమన్యుని నుండి శివదీక్షను పొంది శివోపాసన చేసి కామితార్థములను పొందెను. లోకకంటకులైన రాక్షసులను, కౌరవులను సంహరించి భూభారమును తగ్గించెను. పాండవులితనికి విధేయులై అతని లక్ష్యమునకు సాధనములుగా వ్యవహరించిరి. జగత్ఖ్యాతి నార్జించిన గీతను అర్జునునికి ఉపదేశించి గీతాచార్యుడయ్యెను. చివరికి శివానుగ్రహమును పొంది, విగత కల్మషుడై వైకుంఠమును చేరెను.

## కల్కి అవతారమున అనుగ్రహము :

ఇది కలియుగమునకు చెందిన అవతారము గుఱ్ఱమునెక్కి ఖడ్గమును పూని కల్కి లోకములో నున్న దుష్టులనెల్ల సంహరించునని చెప్పబడినది.

ఈ విధిన విష్ణువు దశావతారములను ధరించెననియును, కర్మఫలముననుభవించెననియును చెప్పబడినది. శివ పురాణములోని శంకర సంహితలో విస్తారమైన వివరణ కలదు. శివపురాణములోని యంశములనే, శ్రీ నీల కంఠశివాచార్యులు, క్రియాసారములోని పదునాల్గవ ఉపదేశమున పొందుపరిచిరి.

మొత్తము మీద గ్రహించవలసినదేమనగా అవతార పురుషులకైననూ కర్మఫలమునుండి తప్పించుకొన శక్యము కాదు. దానిననుభవించుటకై భూలోకమునకు వచ్చి జన్మనెత్తి, ఫలభోగానంతరము మరణమును పొందవలసి యున్నది. అట్టి యెడ సామాన్య జీవి గురించి ప్రత్యేకముగా చెప్పవలయునే? యెట్టి వారికైననూ, మరణమనివార్యమని శ్రీభగవత్పాదులవారి ఉపదేశములోని సారాంశము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 28-7-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానం, షోలాపూర్**

## విషేష ప్రదీపిక :

జనన మరణము లెట్టివారికైనను తప్పవనెడి నగ్నసత్యమును తెలిపెడి యాశీర్వచనమిది. విష్ణువు యొక్క యవతార తత్త్వమును విశ్లేషించి, ప్రతి యవతారములోను శివునిచేత పరిపాలింపబడి విష్ణువు ధన్యత బడసెనని శ్రీ జగద్గురు విశ్వారాధ్య శివాచార్య పరంపరకు చెందిన శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులు తెలిపిరి. శ్రీవారి విశ్లేషణ విజ్ఞానదాయకమై యున్నది.

భారతదేశము మహాత్ములకు పుట్టినిల్లు. పౌరాణిక యుగమునుండి నేటివరకు ననేకులు మహాత్ములుగా సుస్థిరమైన ఖ్యాతిని గడించిరి. అట్టివారిలోన శ్రీమహావిష్ణువొకడు. పాంచరాత్రవాదము ప్రకారము విష్ణువు పరబ్రహ్మ. ఈ వాదము యొక్క వివరములను పండితారాధ్య చరిత్రలో గానగలము. పరబ్రహ్మకు చావు పుట్టుకలుండవు. కాని విష్ణువు దశావతారములను దాల్చెనని పురాణములు తెలుపుచున్నవి. స్వేచ్ఛచేత నతడు దశావతారముల దాల్చెనని చెప్పబడినది. ధర్మసంస్థాపన నిమిత్తమునను, సాధుజనులను రక్షించుటకును, దుష్కృతములు చేసెడివారిని శిక్షించుటకు తానే యవతారముల నెత్తుచున్నానని శ్రీకృష్ణుడు అర్జునుని కుపదేశించెనని వ్యాసుడు మహాభారతము నందున తెలిపెను.

వీరశైవము ప్రకారము శివుడే పరబ్రహ్మ. విష్ణువు జీవుడు. వీరశైవము పాశుపత సిద్ధాంతము నంగీకరించును. ఇచ్చట పరబ్రహ్మను పతియని యందురు. జీవుని పశువనియని యందురు. పశువు పాశముచేత బద్ధుడై యుండును. శివుని మినహాయించిన యెడల సకల జీవరాశి పాశబద్ధులే. త్రిమలములే పాశములనబడుచున్నవి. ఇట్టి ఆలోచనా ధోరణిని ప్రతిబింబించెడి శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి :

**'విశ్వాధికో రుద్ర'న హొగళవ శ్రుతిగళు**
**విశ్వరూపాయవై నమః**
**పరమరూపనే నమో, పరతత్త్వనెనమో**
**ఆదియారూఢభయకరనే నమో**
**'హరియను హరిసిదనె' ఎందు శ్రుతియు సారుత్తిరలు**
**సంహార కారణనె నమో, నమ్మకూడల సంగమ దేవా**
**మహద్ మహద్భ్యో నమః** (బ.వ.535)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**"విశ్వాధికో రుద్రు"ని పొగడెడి శ్రుతుల**
**"విశ్వరూపాయవై నమః"**
**పరమ రూపుడా నమో, పరతత్త్వమా నమో**
**ఆదియారూఢ భయకరుడా నమో**
**హరిని హరించినాడని శ్రుతులు చాటుచుండగ**
**సంహార కారణుడా నమో, మా కూడల సంగమ దేవా!**

బసవన్నగారు శివుని పరతత్త్వమును నిరూపించుచు హరిని హరించినవాడు శివుడని తెలిపెననునది. పురాణ ప్రసిద్ధమైన విషయము. స్మార్తులు 'హరిహర' అనెడి శబ్దమునకు హరి మరియు హరుడు అని అర్థమును తెలుపుదురు. తిక్కన యీ భావమునే గ్రహించి హరిహరతత్త్వమును ప్రతిపాదించెను. కాని తిక్కనకంటెను పూర్వకాలమునకు చెందిన సోమనాథులు బసవన్న భావమునే విస్తరించిరి.

విష్ణువు జీవుడని తెలిసికొనవలెనని శ్రీ భగవత్పాదులవారి భావము. పిండస్థలమున నుండెడి జీవి విష్ణువు స్థితిని దృష్టాంతముగా గైకొని కొన్ని, ధర్మసూత్రములను గ్రహించవలెను. శ్రీవాచస్పతుల వారు వివరించిన భృగుశాప వృత్తాంతమునుండి ధర్మ రహస్యములను గ్రహించవలెను. సోమనాథుల వారు భృగు శాపవృత్తాంతమును ఈ క్రింది విధముగా తెలిపెను.

**సీ॥ పుట్టడె భృగుశాపమున బది(లు?) రూపులు చెనసి తిర్యగ్యోనులను మురారి**
**యజున కధోక్షజుం డనగఁ దాఁగ్రొడుకయ్యె నయ్యంబురుహనాభు దదియుగాక**
**యదితికి నింద్రానుజు దన నత్రిసతికి దత్తాత్రేయుడనగ నా హరి జనించె**
**గృష్ణుండు నాదేవకికి బుట్టె మరి బాదరాయణుం దన జనార్ధనుడు గాదె**

**యది పురాణ యుక్తినట్లు "విష్ణుః పితా మహో" యనంగ వేదమతము గాదె!**
**వెండి హరి యయోనిజుండె యజాతుడె భవవివర్జితుండె బసవలింగ॥**
(చతుర్వేద సారము - 104)

ఈ పద్యము ప్రకారము విష్ణువు పలు అవతారములనెత్తెనని తెలియును. ఈ అవతారములన్నీ విష్ణువు భృగుమహర్షి భార్యను అకారణముగా చంపినందులకే సంభవించినవని తెలియుచున్నది. ప్రారబ్ధ కర్మవలన లభించిన శాపము శివానుగ్రహము వలన కుదింపబడినది. శివభక్తివలన ప్రారబ్ద కర్మ ఫలమును మార్చికొనవచ్చునని యనుటచే కర్మఫలము తప్పనిసరిగా అనుభవించవలెననెడి సాధారణ సూత్రము ప్రభావహీనమగుచున్నది.

పిండజ్ఞాని యీ విషయమును గ్రహించి విష్ణువువలె శివభక్తుడై భక్తిని పెంపొందించుకొనవలెను.

ఈ ఉదాహరణలో మరొక దర్మసూత్రము గలదు. శాపము ఫలితముగా లభించిన జన్మలవలన ఖ్యాతిని సంపాదించుట. ఇదియును శివభక్తివలననే లభించినది. ప్రతికూలమైన స్థితినుండి యనుకూలమైన ఫలితము పొందవచ్చుననెడిది సిద్ధమై కన్పట్టుచున్నది.

శ్రీ చంద్రశేఖర జగద్గురువుల వారి ప్రవచనాశీర్వాదములో తెలిపిన విషయములవలన మరొక ధర్మసూత్రము బహిర్గతమైనది. ఏయే అవతారములనుండి విష్ణువు శివభక్తుడై చరించెనో, ఆయా అవతారములు అధిక తరమగు లోకఖ్యాతిని తెచ్చిపెట్టినవి.

భార్గవ రామ, శ్రీరామ మరియు కృష్ణావతారములలో విష్ణువు విశేషమైన యర్చనాదులు చేసెను. ఇవి యెక్కువ కీర్తి దాయకములైనవి. నృసింహ, త్రివిక్రమాది యవతారములలో విశేషమైన యర్చనలు చేయనందున హింసాపూరితమైన మరణము చవిచూడవలసి వచ్చెను.

రామావతారమున వాలిని చంపిన కర్మవల్లనే కృష్ణావతారమున చావుకు కారణమయ్యెనని తెలియుచున్నది. కృష్ణుని చావుకు కారణమైనవాడు, బోయగా పునర్జన్మను పొందిన వాలియేయని తెలిపెడి కథ యొకటి ప్రచారములోనున్నది.

ఈ విధముగా వీక్షించిన యెడల, శివభక్తిలో గొప్ప శక్తి కలదని తెలియును. ధ్రువమని తలపబడెడి జనన మరణములు అధ్రువములు కాగలవు.

జన్మ రాహిత్యమును సాధించుటకు నాస్కారము నేర్పదును. ఒకవేళ జన్మనెత్తిననూ నయ్యది సుఖదాయకముగనే పరిణమించును. చేసెడి సత్కృతుల వలన ద్విగుణీకృతమైన ఫలము లభించును. అసంకల్పితముగా చేయబడెడి దుష్కృతములైనను దుష్ఫలితములనివ్వజాలవు. వివరములు గోరువారు భక్తమహాత్మ్య స్థలమున యివ్వబడిన శ్రీ భగవత్పాదులవారి యుపదేశమును గాంచగలరు.

పూర్వోక్తి విశ్లేషణ నేపథ్యమున పిండ జ్ఞాని తెలిసికొనవలసిన దేమనగా సదృఢమైన శివభక్తిని పెంచుకొని, సంసార భోగముల యెడల హేయభావమును దాల్చుకొని, గురుకారణ్యమును చేకొనుటకై కృషి చేయుటయే తక్షణ కర్తవ్యమై యున్నది.

-: శుభం భూయాత్ :-

## ఆశీర్వచనము : 5

**భూత్వా కర్మవశాజ్జంతు బ్రాహ్మణాదిషు జాతిషు।**
**తాపత్రయ మహావహ్ని సంతాపాత్‌దహ్యతేభృశమ్ ॥** (సి.శి. 5:65)

కర్మవశమున జీవుడు, బ్రాహ్మణాది జాతులలో జన్మించి, తాపత్రయమనెడి భీకరమైన అగ్నిచేత దహింపబడుచు బాధకు గురియగుచున్నాడని శ్రీభగవత్‌పాదులవారు సెలవిచ్చిరి. ఇట్టి బాధకు విశ్రాంతి యుండదనెడి శ్రీ భగవత్పాదులవారి యుపదేశమును గనుడి :

**కర్మమూలేన దుఃఖేన పీడ్యమానస్య దేహినః।**
**ఆధ్యాత్మికాదీన నిత్యం కుత్ర విశ్రాంతిరాప్యతే ॥** (సి.శి. 5:66)

ఆధ్యాత్మికాది కర్మల వలన నుత్పన్నమయ్యే దుఃఖములచేత ననునిత్యము పీడింపబడుచున్న జీవికి విశ్రాంతి యెక్కడిది? అనునది శ్లోకములోని భావము.

**"స్వకర్మ సూత్ర గ్రంథితోః లోకః"** అనెడి సూక్తి యొకటి కలదు. "జీవులు తాము చేసిన కర్మ మనెడి త్రాడుచేత కట్టుబడినారు" అనెడిది ఉక్తిలోని భావము. ఈ బంధితునికి స్వాధీనత ఉండదు. కర్మకు అధీనుడై యిష్టాయిష్టములతో ప్రమేయము లేకుండగనే, సుఖ-దుఃఖాదుల ననుభవించును. ఇది మనకు కన్పట్టెడి సత్యమే కదా!

కర్మఫలములైన సుఖదుఃఖములు మన మనస్సుకు ప్రత్యక్షముగా కనిపించిననూ, సుఖదుఃఖములకు మూల కారణమైన కర్మలు అగోచరముగనే యుండును. అందుచేతనే, శాస్త్రము దీనిని అదృష్టమని చెప్పుచున్నది. అదృష్టమనగా జూడబడనది అయిననూ, అది సుఖదుఃఖముల నాధారముగా గొని పరిశీలించిన యెడల, అనుమేయములే. మానవ జీవనము కర్మాధీనమని యెంతో సుందరముగా తెలిపిన యీ పద్యమును గనుడి :

**బదుకు జటకా బండి, విధియదర సాహేబ**
**కుదురెనీన్ అవను పేళ్దంతె**
**మదువెగో మసణకో**
**హోగెంద కడె హోగు మంకుతిమ్మ**

డి.వి. గుండప్ప యనెడి కన్నడకవి పద్యము యొక్క తెలుగు రూపమును గనుడి :
**బ్రదుకు జటకా బండి, విధి దాని సాహేబు**
**గుఱ్ఱము నీవు; అతడు చెప్పినట్టు**
**మెదలుకో మసలుకో**
**పొమ్మన్నకడకు పొమ్ము మంకు తిమ్మ.**

విహితకర్మలను గూర్చి వివరించెడి సూక్తులెన్నియో కలవు. 'సత్యం వద-ధర్మంచర' అనెడివి చెప్పబడుచున్నవి. సత్యమును పలుకుము, ధర్మము నాచరింపుము అనేది యీ సూక్తిలోని భావము. వీటివలన పుణ్యప్రాప్తి యగునని చెప్పబడినది. **"నకలంజం భక్షయేత్", "సురాం న పిబేత్", "మాహింస్యాత్ సర్వభూతాని", స్వాధ్యాయాన్మా ప్రమదః,** అనెడి నిషిద్ధ కర్మలు. మాంసమును తినవలదు, మద్యమును సేవించవలదు, ప్రాణులను హింసించవలదు, స్వాధ్యాయనపరుడవై యుండవలెను మొదలగునవి యీ కోవకు చెందినవి. వీటిని ఉల్లంఘించుటచేత పాపము సంప్రాప్తమగుచున్నది.

విహిత కర్మలను నాల్గు విధములుగా విభజింపవచ్చును. అవి : నిత్య, నైమిత్తిక, కామ్య మరియు ప్రాయశ్చిత్తములు. వీటి గూర్చి కొంత వివరముగా తెలిసికొందుముగాపుత.

## నిత్యకర్మలు :

మీమాంస శాస్త్రము నిత్యకర్మలను యీ క్రింది విధిన నిర్వచించినది.

**శ్లో॥ నిత్యం సదా యాపదాయుర్న కదాచిదతి క్రమేత్।**
**ఉపేత్యాతి క్రమే దోషః శ్రుతేరత్యాగదర్శనాత్ ॥**
**ఫలాశ్రుతేర్వీప్సయా చతన్నిత్య మిహకీర్తితమ్॥** (శ్లోకవార్తికము -పుట 475)

ఏ కర్మను ఆచరించుటచే ఫలప్రాప్తి కలుగకుండిననూ, ఆచరించకుండా ఉంటే దోషములంటుచున్నవో, అట్టి కర్మను నిత్యకర్మమని అందురని శాస్త్ర ప్రమాణములోని భావము. బ్రాహ్మణులకు సంధ్యావందనాదులు నిత్యకర్మలగును. వీరశైవులకవి విహితములు కావు. ఇవి నిషిద్ధ కర్మలగును. ఇష్టలింగార్చన యనెడిది వీరశైవులకొరకు విహితమైనట్టి నిత్యకర్మము. వీరశైవుడు, గురుకారణ్యమును బడసి, దీక్షను స్వీకరించి జీవించి యున్నంతవరకు లింగమును మేనిమీదనే నిలిపి, అనునిత్యము నద్దానిని పూజించవలెను. ఇట్టి విహిత క్రియలను చేయకుండిన యెడల పాపోత్పత్తి జరిగి నరక భాజనుడగును.

నిత్యక్రియలు విహితమైన రీతిన చేయకుండుట యనెడిది, ఒక అభావము మాత్రమే. అభావము దోషమెట్లగునను ప్రశ్న ఉదయించును. దీనికి సమాధానమును ఈ దృష్టాంతమువలన తెలుపవచ్చును.

యింటి స్వంతదారు తన సేవకునికొక కార్యమును పురమాయించెను. ఆ పని చేయుట సేవకుని ధర్మమైయున్నది. దానిని చేయుటచేత సేవకుని ప్రత్యేకమైన లబ్ధి లభించదు. కాని, చేయకుండిన యెడల, దోషమగును. సేవకుడు శిక్షార్హుడగుచున్నాడు. **"అహరహః సంధ్యాం ఉపాసీత"** యనెడి శ్రుతి వాక్యమును బ్రాహ్మణుడు ఉల్లంఘించకూడదు.**"అహరహః స్వేష్టలింగముపాసీత"**యనెడి గురువాక్యములు వీరశైవులకును అనుల్లంఘనీయమై యున్నవి. దీనినెవ్వరును తప్పించకూడదు.

## నైమిత్తిక కర్మ :

ఇది నిత్యకర్మ వంటిదే. చేయుట చేత విశేష ఫలముండదు. కాని చేయకుండుటచేత దోషమగును. ఈ రెంటికీ గల భేదమేమనగా, అనునిత్యము చేసేది, నిత్యకర్మము కాగా, నిమిత్తము వచ్చినప్పుడు చేసెడిదే నైమిత్తిక కర్మ. జయంతులు, వర్ధంతులును యీ కోవకు చెందినవి. బ్రాహ్మణ మతమున శ్రాద్ధాదులును నైమిత్తికములే. పండుగల సందర్భమున పాదతీర్థ ప్రసాదాదులను విధిగా పొందుట, జంగమ సమారాధనలు చేయుట మొదలగునవి వీరశైవులకు నైమిత్తిక ధార్మిక క్రియలు.

## కామ్యకర్మములు :

కామ్యత్వమనగా అని **"ఫలకామనాధీన – కర్తవ్యతా కత్వమ్ కామత్వమ్"** అని చెప్పబడినది. ఏదైనా నొక ఫలము నాశించి సాధకునిచే చేయబడునవి యీ వర్గమునకు చెందినవి. కామ్యములేవైననూ కావచ్చును. ఇహలోకమునకు చెందినవైననూ, పారలౌకికమైననూ కావచ్చును. సంతానాపేక్షతో చేసెడి వ్రతాదులు ఇహలోకమునకు చెందినవైతే, స్వర్గాది సౌఖ్యములనాశించి యజ్ఞయాగాదులు చేయుటయనేది పారలౌకికమునకు చెందినది. వీరశైవులు అనుదినము నారాధించు ఇష్టలింగము యిష్టార్థ ప్రదాయకమైనందున తమ యొక్క కోరికలనుగాని, యిష్టార్థములనుగాని ప్రాప్తించుకొనుటకై వేరే ఏ కామ్యకర్మలు చేయక ఇష్టలింగ పూజనే చేసి తమ మనోభీష్టములను సిద్ధించుకొనవలెను.

## ప్రాయశ్చిత కర్మలు :

దోష నివారణ నిమిత్తము, శాస్త్రములయందు ప్రతిపాదించబడిన కర్మలే ప్రాయశ్చిత కర్మలు. ఈ విషయమును విశదీకరించెడి యీ శ్లోకమును గమనించుడి :

**శ్లో॥ ప్రాయోనామ తపః ప్రోక్తం చిత్తం నిశ్చయ ఉచ్యతే**
**తపో నిశ్చయ సంయుక్తం ప్రాయశ్చిత్తమితిస్మృతమ్** (న్యాయ.కో.–పుట 592)

ప్రాయమనగా తపస్సనియును, చిత్తమనగా నిశ్చయమనియును, తపో నిశ్చయములతో కూడికొనినదే ప్రాయశ్చితమని చెప్పబడినది. తానుచేసిన నిషిద్ధకర్మలను గుర్తెరిగి, సంక్రమించిన దోషముల నివారణకై చేపట్టబడెడి కర్మ ప్రాయశ్చిత్త కర్మయగుచున్నది.

వీరశైవులు తమ యిష్టలింగము దేహమనుండి వేరుగా విడిపోనివ్వరాదనియును, గురువుగారుపదేశించిన మంత్రమును బహిర్గతము చేయవలదనెడి నిషేధములు గలవు. వీటికి విరుద్ధముగా సంభవించిన యెడల ప్రాణత్యాగమే ప్రాయశ్చిత్తమని ఆగమములలో తెలుపబడినది. కొందరు గురువు దగ్గరికి వెడలి పునః మంత్రోపదేశమును బడసినచో దోషనివారణయగునని అందురు. ఆధునిక యుగమున యిదియే సక్రమమైన ప్రాయశ్చిత్తము కాగలదు.

ఈ వివిధ కర్మలలో, కామ్యకర్మలను, నిషిద్ధ కర్మలను, విడిచివేసి, నిత్యనైమిత్తిక కర్మల నాచరిస్తూ, ఎప్పుడైననూ దోషములు గల్గిన యెడల వాటి నివారణకై ప్రాయశ్చిత్తకర్మల నాచరించెడి సాధకుని నిష్కామ కర్మయోగి అని అందురు. ఇతనికి నిష్కామ పుణ్యము యొక్క ప్రభావముచేత వివేకము ఉత్పన్నమై ఇహిక మరియు పారలౌకిక సుఖమునందున నిస్పృహభావన కల్గి, లింగాంగ సామరస్యమైన ఆత్మజ్ఞానము యొక్క ఫలము వలన సంచితకర్మము దహింపబడి ఐక్యస్థితి సంప్రాప్తమగును. ఇందుకు విరుద్ధముగా, నిత్యనైమిత్తికాదులను వీడి, కేవలము కామ్య మరియు నిషిద్ధ కర్మల ఆచరణ యెడ శ్రద్ధను గనబరచెడివాడు సకామ కర్మి యనబడుచున్నాడు. అట్టివాడు, కర్మజన్యములగు పుణ్యపాపముల ఫలితముగా నికృష్ట జన్మలను బడయుచు సదా సంసారమునందున త్రితాప సంతప్తుడై తిరుగుచున్నాడు. అందుకే ఆచార్యులవారు **"భూత్వాకర్మవశాత్... తాపత్రయ... సంతాపాద్దహ్యతే భృశమ్"** అని ఉపదేశించిరి.

జీవులయొక్క యీ సకామ కర్మయనెడిది మూడు విధములుగా ఉండును. అవి సంచిత, ప్రారబ్ధ మరియు క్రియామాణ లేదా ఆగామకర్మలు. వీటిలోన క్రిందటి అనేక జన్మ జన్మాంతరములయందు చేయబడి, ఇప్పుడు ఫలోన్ముఖము కాకుండగ, కేవలము సంస్కారరూపమున సంగ్రహముగా నుండెడి, పుణ్యపాపములను సంచితకర్మ లనియందురు. ఈ సంచిత కర్మల యందు కొన్ని కర్మలు పరిపక్వమై యిప్పుడు మన జన్మకు కారణమై సుఖదుఃఖములనెడి ఫలములను ఎప్పుడు ఇవ్వను ప్రారంభించినయున్నవో వాటిని ప్రారబ్ధ కర్మలందురు. ఇప్పుడు ప్రారబ్ధ కర్మలననుభవిస్తూ చేయబడెడి కర్మలు, సంచిత కర్మలయందు కూడికొని, కాలాంతరమునందున ఫలముల నిచ్చెడివైనందున వాటిని "క్రియమాణ" లేదా "ఆగామి" కర్మలని అందురు.

శ్రీపతంజలి మహర్షిగారు శీఘ్రముగా ఫలములనిచ్చెడి కర్మల గురించి తెలియజెప్పిరి. ఈ తెలివిడి గల్గించెడి యోగ సూత్రమును గనుడి :
**శ్లో॥ "క్లేశమూలః కర్మశయో దృష్టాదృష్టజన్మ వేదనీయః"** (యో.సూ.2–12)

అవిద్యాది క్లేశములచేత ప్రవృత్తుడైన జీవాత్మచేత చేయబడెడి కర్మలను దృష్టజన్మవేదనీయ, అదృష్టజన్మ వేదనీయములని రెండు విధములుగా నుండును. దృష్టజన్మవేదనీయములు, అతి త్వరగా ఫలితముల నిచ్చెడివని గ్రహింపదగును.

అత్యుగ్రముగా నాచరింపబడెడి, జప, తప మరియు సమాధి సాధనలును, ఈశ్వరార్చన, మహానుభావులను సేవించుట ఇత్యాదులు దృష్ట జన్మ వేదనీయములకు ఉదాహరణములు. వీటికి విరుద్ధముగా సాధుసత్పురుషాదుల పీడనము, హింస యిత్యాదులునూ దృష్టజన్మ వేదనీయములే. యీ క్రింది చరిత్రలు, యీ విషయమును విస్పష్టపరచెను.

శిలాదముని తనయుడగు నందీశ్వరుడు, అత్యుగ్రమైన శివపూజను చేసి, పుణ్యఫలము వలన, దేవతా స్వరూపమును దాల్చి శివసదనమును చేరెను. సహుషుడనెడివాడు అత్యున్నతమైన పుణ్యఫలము వలన యింద్ర పదవికి అర్హుడయ్యెను. పదవీ స్వీకారము నిమిత్తమున పయనమయ్యెను. సప్తర్షులు, అతనిపల్లకిలో నెక్కించుకొని, యా పల్లకిని మోసికొని వెడలుచుండిరి. సహుషునికి శీఘ్రముగా వెడలువలెననెడి యభిలాష గల్గెను. అతడు, అగస్త్యుని కాలితో తన్ని "సర్ప! సర్ప!" అనెను. త్వరత్వరగా వెడలు అనెడిది అతని ఆదేశములోని భావము. అగస్త్యుడు క్రుద్ధుడై "సర్పోభవ" అని శాపమునిచ్చెను. వెనువెంటనే, సహుషుడు పాముగా మారి భూమి మీద పడెను.

ఈ రెండు ఘటనలు దృష్ట జన్మవేదనీయ కర్మలను సోదాహరణముగా వివరించినవి. ఆగామి కర్మలే అదృష్ట జన్మవేదనీయములు.

ఒక రైతు తాను పండించిన ధాన్యమును భద్రపరచుకొని, దినదినము కొంత గ్రహించి పక్వాన్నములుగా జేసికొని భుజించును. మరికొంత ధాన్యమును విత్తనములుగా నుపయోగించి సాగును చేయును. ధాన్యమును నిలువజేసి కొనునది సంచిత కర్మవంటి దనియును, పక్వాన్నముల జేసికొని అనుభోగము చేయునది ప్రారబ్ధ కర్మయనియును, విత్తిన విత్తనములు ఆగామి కర్మకు సంకేతములనియును గ్రహింపదగును.

అదృష్ట జన్మనీయములవలన జాత్యాదులు లభించునని తెలియుచున్నది. పతంజలివారి యీ సూత్రమును గనుడి :

**శ్లో॥ "సతిమూలే సద్విపాకో జాత్యాయుర్భోగః"** (సూ. 2-13)

పరిపక్వత పొందిన సంచితకర్మల మూలముననే జాతి, ఆయువు, భోగములు కల్గుచున్నవనునది సూత్రములోని భావము. జాతి యనగా ప్రాప్తమయ్యెడి జన్మమనియును, 'ఆయు' అనేది జీవించెడి కాలమనియును, భోగమనగా అనుభవించెడి సుఖదుఃఖములనియును గ్రహించవలెను.

మానవునికి తమ కర్మానుసారముగ లభించెడి జన్మములు మూడు విధములుగా నుండును. అవి : ఉత్తమ, మధ్యమ మరియు అధమములు. పుణ్యాధిక్యతవలన నుత్తమ జన్మ లభించునని తెలిపెడి యుపనిషద్వాణిని తిలకించండి :

**శ్లో॥ పుణ్యేన పుణ్యలోకం నయతి, పాపేనపాప**
**ముభాభ్యామేవ మనుష్యలోకమ్** (ప్రశ్నోపనిషత్తు 3-7)

పుణ్యముచేత పుణ్యలోకములకు, పుణ్యపాపములచేత మనుష్యలోకమును లభించునని యీ వాణిలోని భావము. పుణ్యాధిక్యత వలన దేవతా జన్మమును, పుణ్యపాపముల సామ్యమున మనుష్య జన్మయును, పాపాధిక్యత వలన హీన జన్మయును లభించునని గ్రహించవలెను. ఈ విషయమును నెంతో సుందరముగా చిత్రించిన శ్రీ నిజగుణ శివయోగుల వారి వాక్కులను

**పాపానుగుణదిందె గిడమర క్రిమిగళ రుపాగికీటపతుగాది యాగి॥**
**ఆ పక్షికులవాగిమృగజాతియాగి మే లాపశురూపాగి బహుబాధెగలసి**
**భూతపంచకదరూపాగి యోషదియాగి। ధాతుసప్తకద రూపాగి తందెయొళు॥**
**మాతెయ సూతక రుధిరరూపాగి మత్తే తనువాగవచ్చరియను కేళి**
**బాలకతరుణ జరాజీర్ణరూపాగి। మేలెనరకియాగి బళికీ క్రమదొళు॥**
**తాళలారెను తనువను శంభులింగవే। పాలిసెందెరగి బిన్నైపె భీతియొళు ॥** (క్రై.ప.జీ.స్థ 3)

దీని తెలుగు రూపమును గనుడి :

**పాపానుగుణము వలన పొదర్రూను క్రిముల**
**రూపమై కీటపతంగాదులై**
**ఆ పక్షికులమై మృగజాతియై మే**
**లున పశురూపమై బహుబాధను గలసి**
**భూత పంచకపు రూపమై యోషధియై**
**ధాతు సప్తకపు రూపమై తండ్రిలో**
**మాతలో సూతక రుధిర రూపమై మళ్ళీ**
**తనువయ్యెడి చరియనువిని**
**బాలక తరుణ జరాజీర్ణ రూపమై**
**మేలున నరకియై మరల యీ క్రమములో**
**తాళజాలను తనువును శంభులింగమా**
**పాలించుమని యెరగి విన్నవించితి భీతిలో.**

ఈ విధముగా జీవుల జనశ్రేణి కర్మాధీనమని యెంతో మార్మికముగా నుపదేశించిరి.

బీజాంకుర న్యాయమున, కర్మనుండి దేహము లభించును. అదే విధిన దేహము వలన కర్మలుత్పన్నమగును. ఈ విధిన దేహము మరియు కర్మ పరస్పర పోషణములగుచున్నవి. ఉత్తమాధమ జన్మలకు కర్మల స్వభావమే కారణమగుచున్నది. ఈ ఉదాహరణను గమనించుడి. ఒక అధికారి కర్తవ్యనిష్ఠుడై యధికారమును సదుపయోగము చేసికొనిన యెడల పదోన్నతిని పొందుచున్నాడు. తద్విరుద్ధముగా ప్రవర్తించిన యెడల పదావనతిని పొందును. ఒక జీవి ఆత్మజ్ఞానము సంపాదించుకొని నిష్కామకర్మియై జీవించిన యెడల ముక్తిని పొందును. మానవత్వమును మరచి మనస్సుకు నచ్చి యట్టుల ప్రవర్తించిన యెడల హీనజీవుల గర్భములలో పుట్టును. మనము చేసెడి కర్మలవల్లనే మనకు జన్మ లభించుననెడి విషయమును సమర్థించెడి యుపనిషత్ప్రమాణమును గనుడి :

**శ్లో॥ యోనిమన్యే ప్రపద్యంతే శరీరత్వా దేహినః।**
**స్థాణుమన్యేనుసంయంతి యథా కర్మయథాశ్రుతం॥** (కఠోనుపనిషత్తు : 2-2-7)

ప్రాకృతమైన బ్రహ్మసృష్టి యందు, జనించిన మనుష్యులను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులని నాల్గు భాగములుగా విభజింతురు. వీరశైవులు యీ నాల్గింటిలో దేనికినీ చెందినవారు కారు. ఎందుచేతననగా, వర్ణాశ్రమములతో కూడిన బ్రహ్మసృష్టియగుటకు ముందుననే వీరశైవులు సృష్టింపబడిరి. శివసృష్టివలన పుట్టిన వీర, నంది, భృంగి, వృషభ, స్కంద యనెడివారు పుట్టిరి. వారివలన వీరశైవుల సృష్టి యేర్పడినది. ఈ విధముగా వర్ణాశ్రమములు నేర్పరచిన బ్రహ్మ సృష్టికంటెను ముందుగనే వీరశైవులు సృష్టింపబడిరి. ఈ కారణమువలన, వీరు అతివర్ణాశ్రమీయులని పిలువబడుచున్నారు.

వీరశైవులు అతివర్ణాశ్రయులై యుండుటవలన వర్ణాశ్రమ భేదములుండవు. వీరశైవ సదాచార సంగ్రహమనెడి గ్రంథమునందు వీరశైవుల ఉత్పత్తిని ప్రతిపాదించబడినది. అచ్చట జంగమ మరియు భక్త యనెడి రెండు భేదములను మాత్రమే సూచించనైనది. ఇచట జంగముడు గురుస్థానమునుండి భక్తులకు దీక్షాది సంస్కారములను చేసి వారిని ధర్మమార్గమునందున ప్రవృత్తులను చేయును. ఈ విధముగా వీరశైవ ధర్మమునందున గురు మరియు భక్త అనెడి రెండే భేదములు గలవు. వర్ణాశ్రమములు లేవు.

పూర్వకాలమున జంగములు మరియు బ్రాహ్మణులు కర్తవ్యనిష్ఠులై తమయందు త్యాగము, తపస్సు మరియు శాస్త్రాధ్యయనము మొదలగునవియగు ఉత్కృష్ట గుణముల చేత విరాజిల్లుచు, జనులకు సన్మార్గోపదేశమును చేయుచు, సమాజములోని మిగిలిన వర్గములనుండి పూజ్యతను పొంది

శ్రేష్ఠులనిపించుకొనిరి. దీనికి విపరీతముగా యెంతోమంది జంగములు మరియు బ్రాహ్మణులు తమ తమ కర్తవ్యభ్రష్టులై తమకు చెందిన జనుల యందున నుండెడి గౌరతను కోల్పోయియుండుటను గాంచగలము. ఇంతేకాదు, జంగమేతరులును, బ్రాహ్మణేతరులునైన వ్యక్తులు జంగముల మరియు బ్రాహ్మణుల యందున నుండవలసిన త్యాగము, తపస్సు, జ్ఞానము మొదలగు ఉత్కృష్ట గుణములను సంపాదించి జగత్తునందున పూజ్యతను పొందుట దానిని చూస్తూ వున్నాము.

వీటన్నింటినీ చూసిన పిదప, మనుష్యుల యొక్క ఉత్కృష్ట గుణములే పూజనీయములు. శరీరములు పూజనీయములు కావు. ఈ విషయమును సమర్థించెడి యీ ప్రమాణమును గనుడి :

**శ్లో॥ "గుణాః పూజాస్థానం గుణిషునచ లింగంనచవయః"**

జాతియనెడి విషబీజమును నాశనము చేయుటకై శ్రీ బసవేశ్వరులవారు నెంతో కృషిచేసిరి. తాము బ్రాహ్మణజాతియందు పుట్టిననూ, తన జన్మకు సంబంధించిన అభిమానమును బడయకుండ అన్ని జాతులను పక్కకునెట్టి, భక్త మరియు భవి అనెడి జాతులను చేసిరి.

గీతా కోవిదులును బ్రాహ్మణాది జాతులకు శరీరమే ప్రధానమైనది, కాదని చెప్పుచు గుణము మరియు కర్మలు ప్రధానమైనవని చెప్పిరి.

అందుచేత ఎవరియందు సత్వగుణము ప్రబలముగ నుండి, శమ దయాది సద్గుణములు గలిగినవాడై ఆత్మ జ్ఞానమును సంపాదించి, తాను సంపాదించిన ఆ జ్ఞానమును జగత్తుకు బోధించి బ్రహ్మజ్ఞాని యనిపించుకొనునో. అతడే బ్రాహ్మణుడు, ఈ గుణములు బ్రాహ్మణ జాతియందు పుట్టినవానియందు వుండనిచో అతడు వాస్తవముగ బ్రాహ్మణుడు కాడు.

అదే విధముగ జంగమ శబ్దమైనను జ్ఞానవాచకమై యున్నది.

**శ్లో॥ జానంత్యతిశయాద్ ఏతు, శివం విశ్వ ప్రకాశకం**
**స్వస్వరూపతయా తే తు, జంగమా ఇతి కీర్తితాః** (సి.శి.-11:36)

జగత్ ప్రకాశకుడైన పరమాత్మను తనయొక్క ఆత్మస్వరూపముగ తెలిసికొనిన ఆత్మజ్ఞానులే జంగములని శ్రీజగద్గురు రేణుక భగవత్పాదుల వారు ఆదేశమును యిచ్చియున్నారు.

ఈ కారణమువలన సత్వగుణము గలవారై శివజ్ఞానము బడసి, ఆ జ్ఞానమును జగత్తులోని జనులెల్లరకు బోధించుటకై సదా సంచారము చేసెడి మహానుభావులే వాస్తవికముగ జంగములనిపించుకొందురు.

జంగమ జాతియందు జన్మించినవారియందు, ఒకవేళ ఈ గుణములు లేనిచో వారు జాతి జంగములగుదురే కాని తాత్వికముగ జంగములు కాజాలరు. ఇంకను సత్వము గౌణమై, రజోగుణము ప్రధానముగనుండి శరీరమునందున శక్తి సంపాదించి దాని బలముచేత తన గ్రామము ప్రాంతము, రాష్ట్రము మరియు దేశముల యొక్క సంరక్షణను ఎవరు చేయుదురో వారిని క్షత్రియులందురు. అటులనే తమోగుణము గౌణమై రజోగుణము ప్రధానముగనుండి వ్యాపారము ద్వారా జనసామాన్యమునకు సకల ఉపభోగ్య పదార్థములను యోగ్యమైన వెలకు చిక్కునటుల ప్రయత్నించెడి స్వభావము గల వ్యక్తులను వైశ్యులు (అనుచున్నారు) అని అందురు.

ఇంకను ఎవరియందు రజోగుణము గౌణముగా నుండి తమోగుణమే ప్రధానముగ నుండును. ఎవరి బుద్ధియందు విచారశక్తి లేనందువలన స్వయము కార్యనిర్వహణ సామర్థ్యములేని వారై యితరులు చెప్పెడి దానిని మాత్రము చేయుచు సేవావృత్తిలో వుందురో అట్టివారిని శూద్రులనందురు.

యీ విధముగ జంగమ బ్రాహ్మణ క్షత్రియ వైశ్య మరియు శూద్రజాతులు గుణము మరియు కర్మ ప్రధానములుగ వుండుటచేతను ఈ గుణ కర్మలు జీవుని యొక్క పుణ్య పాపములచేత ప్రాప్తమగుట వలన జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు, జీవుని యొక్క వుత్కృష్ణ లేదా నికృష్ట జన్మల ప్రాప్తికి అతని కర్మలే కారణములని ఆనతి నిచ్చిరి.

యింకను జీవాత్మ తాను ఆశ్రయించిన భోగాయతనమైన శరీరమునందు ఎన్ని దినములవరకు వుండవలెననెడి, ఆయుష్యమైనను, అతని ప్రారబ్ధకర్మను అవలంభించి యుండుచున్నది. ప్రారబ్దకర్మ ముగిసింతవరకు జీవునికి దేహవియోగరూపమైన మరణము ఉండజాలదు, ఈ కారణమువలననే జ్ఞానయోగులు ఈ క్రింది విధముగ తెలియజెప్పిరి.

**శ్లో॥ ఆయుఃకర్మచ విత్తంచ విద్యానిదనమేవచ**
**పంచైతాన్యపి సృజ్యంతే, గర్భస్థస్యైవదేహినః**

జీవుడు ఎన్నిదినములవరకు బ్రతుకవలెను. ఏమి ఉద్యోగమును చేయవలెను, ఎంత సంపదను మరియు విద్యను సంపాదించవలెను. ఎప్పుడు చావవలెను, అనెడి ఈ అయిదు విషయములు ఆయా జీవునియొక్క కర్మానుసారముగ మొదలై నిశ్చితములై వుండుననెడిది శ్లోకములోని భావము.

జగత్తున జన్మించిన జీవునికి, ఎప్పటికప్పుడు దొరకెడి సుఖదుఃఖములైననూ అతడు చేసిన పూర్వపు కర్మలే కారణములగుచున్నవి. ఈ కారణమువల్లనే జగద్గురువులవారు, యీ క్రింది విధి నుపదేశించారు.

**శ్లో॥ కర్మమూలేన దుఃఖేన పీడ్యమానస్య దేహినః॥ ఆధ్యాత్మికాదినా నిత్యం కుత్ర విశ్రాంతి రాప్యతే॥**
(సి.శి.5-62)

వేగముగా గోడకు కొట్టిన బంతి, గోడకు తాకి మరల మన దగ్గరకు వచ్చెడియటుల, ఆకాశమునకు చిమ్మిన ధూళి లేదా పువ్వులు, మరల మన నెత్తిమీదనే వచ్చిపడిన యటుల, మనము చేసెడి సుకృత, దుష్కృతములు కాలాంతరమునందున మనకే శుభాశుభములను కలుగజేయును. అందుచేత, మనము ఎవ్వరినైననూ వంచించిననూ, పీడించిననూ మనలను మనమే వంచించి కొనుచున్నాము. లేదా పీడించికొనుచున్నామని గ్రహించవలెను. ఈ విషయమున వ్యాసమహర్షి గారు చేసిన ఉపదేశము గమనార్హమైయున్నది.

**శ్లో॥ శ్రూయతాం ధర్మసర్వస్వం శ్రుత్వా చైవావధార్యతాం।**
**ఆత్మనః ప్రతికూలాని పరేంగాం న సమాచరేత్॥**

ఏ వ్యవహారము వలన మనకు ప్రతికూలము జరుగుచున్నదో, అట్టిదానిని మనము యితరులకు చేయవలదు. ఇదియే ధర్మ సర్వస్వమని, శ్లోకములోని భావము. ఎవ్వరైనా మనలను తిట్టినా, కొట్టినా, మనకు మనోవేదన కలుగును కదా! అట్టి మనోవేదనను మనము యితరులకు కల్పించకూడదు.

**"తన్నంతె పరర బగెదొడె కైలాస నెరెమనయక్కు సర్వజ్ఞ"** యనెడి సర్వజ్ఞుని వాక్కులు సదా స్మరణీయులు. తనలాగే యితరులను చూసిన యెడ కైలాసము సమీపమున నుండునని యీ నుడువులలోని భావము. ఇది యిట్టులుండగా పరులకు బుద్ధిపూర్వకముగా కీడును చేస్తూ, వాటి ఫలితముగా ననేక జన్మలనెత్తి, ప్రతిజన్మలోను త్రివిధ దుఃఖములనుభవించుచు, విశ్రాంతి యనెడిది లేకుండగ దుఃఖసాగరమైన సంసారమున తిరుగాడుచున్నారు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 29-7-1990
స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానం, షోలాపూర్**

## విశేష ప్రదీపిక :

జనన మరణములు సంభవించుటకు ప్రారబ్ధకర్మ కారణభూతమైన యంశమని తెలిసికొనియుంటిమి. ప్రారబ్ధకర్మ యనిననేమి? అది యితర కర్మలతో నేవిధముగా భిన్నమైనది యనెడి యంశములను శ్రీకాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు ఎంతో విపులముగా వివరించిరి.

సామాజిక జీవనములో జాతిభేదములను గాంచగలుగుదుము. వీటిలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య మరియు శూద్రయనెడివి ప్రధానమైన జాతులు. వీటికి వెలుపల నుండెడి వారిని అంత్యజులు అని అందురు. జాతులలో బ్రాహ్మణజాతి ఉన్నతమైనదనియును, క్షత్రియ, వైశ్య మరియు శూద్రులవారికి తరువాత స్థానమున క్రమానుగతముగా నుందురనియును తెలుపబడినది.

ఒక వ్యక్తి యొక జాతిలో నుద్భవించుటకు కారణములేమైనవా కలవా? అనెడి ప్రశ్న చిరకాలము నుండియును పరిశీలింపబడుచునే యున్నది.

జాతులకు సంబంధించిన వివేచనలో "సంస్కార"మనెడి దానికెంతో ప్రాముఖ్యత కలదు. సంస్కారములను రెండు విధములుగా విభజింపవచ్చును. మానవ జన్మకు పూర్వమున వివిధ యోనులలో పొందిన సంస్కారము. వీటిని పూర్వజన్మలలోని వాసనలు అని అందురు. ఈ విషయమును ధ్రువపరచెడి ప్రమాణములు గలవు. పూర్వజన్మవాసన బలమువలననే సంసారము యెడల విరాగము భావము వచ్చునని తెలుపబడినది.

**"సంసార హేయతా బుద్ధిర్జాయతే వాసనా బలాత్।** శ్రీభగవత్పాదులవారి వాక్కులు.

జన్మించిన పిదప, నొందె సంస్కారములు జన్మోత్తర సంస్కారములనవచ్చును. ఉపనయనాదులు ఈ కోవకు చెందినవని గ్రహింపవచ్చును.

సంచిత పుణ్యపాపములనెడివి పూర్వజన్మ వాసనల వలన వచ్చును. ఇద్దాని వలననే ఉత్తమాధమ జన్మలలో నేదో యొకటి లభించునని తెలియుచున్నది. **"జాత్యాయుర్భోగవైషమ్య కారణం కర్మ కేవలమ్"** (సి.శి. 5-45) అని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి. శ్రీ ఈశ్వర సత్యనారాయణ శర్మగారు ఈ సూత్రమును గూర్చి యీ క్రింది విధముగా వ్రాసిరి.

"జాతి, ఆయువు, సుఖము, దుఃఖము మున్నగు వానియందు జీవులకు గల్గు హెచ్చుతగ్గులకు వారి వారి కర్మఫలములే కారణములు. బ్రాహ్మణాది జాతులు జన్మసిద్ధములేయని భగవత్పాదుల యభిప్రాయము. "సతిమూలే తద్విపాకోజాత్యాయుర్భోగః" యనెడి పతంజలి సూక్తి దీనినే స్థిరపరచుచున్నది. (సిద్ధాంత శిఖామణి, శ్రీసోమేశ్వర దేవస్థానము, కొలనుపాక ప్రచురణ, పుట 88)

శ్రీభగవత్పాదుల వారి భావమును శ్రీ పాల్కురికి సోమనాథుడు ఈ క్రింది విధముగ విస్తరించినారు.

**సీ॥ లలి నెనుబదినాల్గు లక్షయోనుల బుట్టి**
**మహిమీద నంత్యజన్మమున జీవు**
**డుదయించు నవియు ముప్పదిరెండు చనియెనే**
**నంతట మరి శూద్రుడై జనించు**
**నెన్నంగ నిరువదేనింట వైశ్యుండు**
**నష్టాదశమున రాజగునతండు**
**నరపతి తొమ్మిదింటను బ్రాహ్మణుండగు...**
**... ... ... ... ... ... ... ... బసవలింగా!** (చతుర్వేదసారము 179)

ఒక జాతిలో జన్మించినవానికి గల్గెడి యనుభవ మెట్టిది యనెడిది గుర్తించవలసియున్నది. ఒక వ్యక్తి కులమదమును పెంచికొనెడి యవకాశము గలదు. కులాధిక్యతను మనమున భావించి అహంభావ పూరిత హృదయుడగును. మనస్సు మలినమగును. తనజాతి యెడల గల మమకారము దినదిన ప్రవర్ధమానమైన స్థితిలో బుద్ధి మందగించును. స్వజాతి పరత్వమును ప్రతిపాదించుటకై పరజాతి అమరత్వమును నిరూపించుటకు ప్రయత్నించుచు క్రోధాది యరిషడ్వర్గమునకు జీవి బలియగుచున్నాడు. ఈ సందర్భమున విహితావిహితములను, నిషేధానిషేధముల నెంచ వివిధ కర్మలను చేపట్టును.

కులమదము పెంచికొనుట హితకారి కాదని పెద్దలు చెప్పుచున్నారు. బసవన్నగారి ఈ వచనమును గనుడి :

**“కులమదవళియ దన్నక్క శరణనాగలేకె?**
**విధివశ బిడదన్నక్క భక్తనాగలేకె?”**

శరణ స్థలమున సోధనచేసి వాడైనను, కులమదము గల్గియుండిన, వాని సాధన ఫలించదని బసవన్న వారు సెలవిచ్చిరి.

కులధర్మములవలన జీవికి కర్మబంధములు పెరిగెడియవకాశము గలదు. వర్ణ ధర్మములు పాటించి తీరవలెనని మనువు తెలిపిరి. ప్రతి ధర్మమునకు విహితమగు కర్మలు నిర్దేశింపబడినవి. వీటిని ఆచరించని యెడల ధర్మోల్లంఘన జరుగునని మనువు ధర్మశాస్త్రము తెలుపుచున్నది. ఈ కర్మలలో నిత్యనైమిత్తికాదులు జనన–మరణ చక్రమున జిక్కి తిరుగాడెడి జీవికి ముక్తిని ప్రదానము చేయజాలవు. సంచిత కర్మను తగ్గించలేవు. ఆగామి కర్మలు అసంఖ్యాకములగుము. కులధర్మమైన యుద్ధము చేసిన ఫలితముగా అర్జునునికి మరుజన్మ గల్గి బోయగా పుట్టెనని కిరాతార్జునీయము వలన తెలియుచున్నది. బ్రాహ్మణ విహితమైన యజ్ఞ యాగాదులు, స్వర్గ ఫలమును మాత్రమే గల్గించునని భగవద్గీత ఘోషించుచున్నది. బ్రాహ్మణుని నిత్యనైమిత్తికముల వలన “భక్తి భావము గల్గజాలదని” బసవ పురాణము తెలుపుచున్నది. బసవేశ్వరుడు యజ్ఞోపవీత సంస్కారమును పొందుటకు విముఖత చూపెను. అద్దానినతడు కర్మలతగా నెంచెను. కర్మలతచేత బద్ధుడైన వాడు బహుజన్మల నెత్తవలసినదే కదా!

కులాచారాదులవలనను, కులాభిమానము వలన గల్గెడి ప్రారబ్ధకర్మల ఫలముగా జీవుడనేక విధములగు దుఃఖములకు లోనగుచున్నాడని తెలిసికొనవలెను. తాపత్రయములు హెచ్చి జీవితము దుర్భరమగుచున్నది. జ్వరపీడితులైన వారు లోపము వలన యేవిధిన బాధకు గురియగుదురో యదేవిధిన తాపత్రయముల వలన జీవి యలమటించును. ఈ మార్గమునకు స్వస్తి పలికి భవబంధములను దూరము చేసెడి సత్పథము కొరకు అన్వేషణ చేయుట జీవుల కర్తవ్యమైయున్నది.

శివభక్తి భవదుఃఖములను దూరము చేయునని శివాగమములు నొక్కి చెప్పుచున్నవి. శివపురాణాదులు భక్తుల కథల ద్వారా ఆగమములో నిమిడియున్న రహస్యములను విడమరిచి చెప్పుచున్నది. పిండస్థలమున నున్న భక్తిని పెంపొందించుకొనవలెను. కాని భక్తిని పెంచుకొనుట సులభతరమైన విషయముకాదని తెలియుచున్నది. ఈ విషయమును స్పష్టము చేసెడి అన్నమయ్య వారి యీ పద్యమును గనుడి :

**శ్లో॥ జ్వర సంతాప విశోషితాంగుడు సుధాసంకాశ దివ్యాన్నపా**
**నరస శ్రేణి భుజించ రోయుగతి నున్మాదేంద్రియ ధ్వాంతదు**
**స్తర సంసారమద ప్రమత్తుడు మహాసౌఖ్యాస్పదంబైనమీ**
**చరణారాధన యందు బుద్ధిజొరపంజాలండు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము.ప. 80)

సంసారమనెడి జ్వరమును తగ్గించెడి వాడెవ్వడు? శివుడేయని యజుర్వేదము చాటుచున్నది. శివునికి వైద్యనాథుడనెడి పేరు గలదు. శివుడు గురువై వచ్చి వైద్యుని పాత్రను పోషించునని శివాగమములు చెప్పుచున్నవి. ఈ ధర్మసూక్ష్మమును, పిండజ్ఞాని గ్రహించవలెను. గురువే తన భవరోగమును తగ్గించగలడనెడి నమ్మకమును పెంచికొనవలెను. కులమదమును వీడవలెను. గురుకారుణ్యము సంపాదించు దిశలో పయనించవలెను.

## సంసారహేయస్థలము

### ఆశీర్వచనము : 6

**శ్లో॥ ఆధ్యాత్మికం తు ప్రథమం ద్వితీయం చాధి భౌతికమ్।**
**ఆధిదైవికమన్యచ్చ దుఃఖత్రయమిదం స్మృతమ్॥** (సి.శి.5:67)

దుఃఖములు మూడు విధములుగా నుండుననియునూ, మొదటిది ఆధ్యాత్మికమనియును, రెండవది ఆది భౌతికమనియును, మూడవది ఆధి దైవికమనియును చెప్పబడుచున్నదని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు నుపదేశించిరి. ఆధ్యాత్మిక దుఃఖములో భేదములు గలవనియును శ్రీవారు సెలవిచ్చిరి గమనించుడి.

**ఆధ్యాత్మికం ద్విధా ప్రోక్తం బాహ్యాభ్యంతర భేదతః।**
**వాతపిత్తాదిజం దుఃఖం బాహ్యమాధ్యాత్మికం మతమ్॥**
**రాగద్వేషాదిసంపన్నమాంతరం పరికీర్త్యతే** (సి.శి.5:68)

ఆధ్యాత్మిక దుఃఖము రెండు విధములుగా ఉండుననియును, బాహ్యాభ్యంతర భేదము వలన యీ వర్గీకరణ జరిగినదనియును, వాత, పిత్తాదులచె గల్గెడిది బాహ్యపరమైన ఆధ్యాత్మిక దుఃఖమనియును, రాగద్వేషాదుల చేత పుట్టెడిది అంతఃపరమైనదనియును శ్లోకములోని భావము. ఇతర దుఃఖముల వివరణ యీ క్రింది విధముగా యివ్వబడినది.

**శ్లో॥ ఆధిభౌతికమేతద్ధి దుఃఖం రాజాధిభూతజం।**
**ఆధిదైవికమాఖ్యాతం గ్రహయక్షాదిసంభవమ్॥** (సి.శి.5:65)

రాజాదులచే కల్పించబడెడిది ఆధి భౌతిక దుఃఖమనియును, గ్రహయక్షాదుల చేత గల్గెడిది ఆధి దైవిక దుఃఖమనియును శ్లోకములోని భావము.

దొంగలు, క్రూరజంతువులైన సింహము యిత్యాదులు, విషజీవులైన సర్పాదులు మొదలగు వాటిచే గల్గు దుఃఖములు మొదటి వర్గమునకు చెందినవనియును, భూతప్రేతాదులచేత గల్గెడి దుఃఖము రెండవ కోవకు చెందినవనియును గ్రహించవలెను.

"అనుకూలవేదనీయం, సుఖం", "ప్రతికూల వేదనీయం దుఃఖం" అనెడి శాస్త్రోక్తుల ప్రకారము, అనుకూలముగా కన్పట్టునది సుఖమనియును, ప్రతికూలముగా కన్పట్టునదే దుఃఖమనియును గ్రహించవలెను. ఈ జగత్తులోన అనుకూలమైన వాటికంటెను ప్రతికూలమైనవే ఎక్కువగా నుండును. అందుచేతనే జ్ఞానులు, "సంసార సాగరం దుఃఖం" అని అందురు. దుఃఖదాయకములు, అసంఖ్యాకులుగా నుండును. "నూరు సావిర కోటి యుంటు శంకరా!" అని చెప్పిన శ్రీనిజగుణుల వారి వాక్కులు చిరస్మరణీయములు. నూరువేల కోట్ల సామగ్రివల్ల దుఃఖము గల్గుచున్నదని వీరి వాక్కులోని భావము. ఈ విధముగా నసంఖ్యాకములుగా నున్న దుఃఖములను, శ్రీభగవత్పాదులవారు ఆధ్యాత్మిక, ఆధి భౌతిక మరియు ఆధి దైవికముల నెడివని మూడు విధములుగా విభజించిరి.

**"ఆత్మానాం అధికృత్య భవతీతి ఆధ్మాత్మికమ్"** అనెడి వివరణ ప్రకారము శరీరము మరియు మనస్సుల యొక్క కారణమున గల్గెడి దుఃఖములను **ఆధ్యాత్మిక దుఃఖమని** యందురు. **"భూతాని అధికృత్య జాయత ఇతి ఆధిభౌతిక"**మని చెప్పబడినది. ప్రాణులచేత గల్గిన దుఃఖము **ఆధి భౌతిక**మగుచున్నది. అదే విధిన, దేవాన్ అధికృత్యా జాయత ఇతి **ఆధిదైవిక** మను వివరణ చేత దేవతలు లేదా దైవికశక్తులవలన గల్గెడివి ఆధి దైవిక దుఃఖములగుచున్నవి.

ఆధ్యాత్మిక దుఃఖములలో శరీరమునకు చెందినవి చాలా గలవు. వాత, పిత్త, శ్లేష్మముల వ్యత్యాసముల వలన గల్గెడి రోగములు అసంఖ్యాకములుగా నున్నవి. అందుచేత శ్రీనిజగుణులవారు శరీరమును రోగములకు పుట్టినిల్లు అని చెప్పిరి. వాతమునుండి 8, పిత్తమునుండి 64 కఫము వలన 215 రోగములు గలుగుచున్నవని ఆయుర్వేద శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. ఈ విధిన మొత్తము 360 రోగములు ప్రతిపాదించబడినవి. ఇంకను, కర్మ జన్యములైనవి 5 రోగములు. ఈ విధముగా 365 రోగములైనవి. సంవత్సరానికి 365 దినములు కాగా, ప్రతిదినమునకొక రోగము చొప్పున లెక్కకు వచ్చును. తోటలో నేదో ఒక ఫలము పక్వమునకు వచ్చినయట్లు శరీరమున యేదోనొక రోగము గల్గుచున్నది. నిరోగిగా నుండి జీవితమును గడుపుటకెట్లు సాధ్యమగును.

ఈ విధముగా రోగముల కాకరమైయున్న శరీరమునాశ్రయించిన జీవాత్మకు సుఖపు ప్రాప్తి గల్గజాలదని విచారించిన న్యాయశాస్త్ర కోవిదుడైన గౌతమఋషి సుఖదుఃఖములకు కారణభూతమైన శరీరమును, దుఃఖకారకములగు యిరువదియొక్క యంశములలో మొదటిదానిగా గుర్తించిరి. శరీరమున్నంతవరకు దుఃఖము యొక్క అభావము గల్గుట యనెడిది సులభసాధ్యమైన విషయము కాదు. ఏదోనొక రోగమునకు నాశ్రయము నిచ్చెడి కాయము బాహ్యపరమైన ఆధ్యాత్మిక దుఃఖములకు కారణమైయుండును.

ఇంక, అంతరంగిక ఆధ్యాత్మిక దుఃఖముల విషయానికి వచ్చిన యెడలనవి మనస్సుకు సంబంధించినవని తెలిసికొనవలెను. "రాగద్వేషాది సంపన్నమ్" అనెడి శ్రీ భగవత్పాదుల వారి వాక్కులను గుర్తించికొనవలెను. శరీరములోని జ్వరాదులు రోగములకు కారణమైన యటులే, మనస్సుకు చెందిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరముల మూలమున యనురాగ విద్వేషాలును, యీర్ష్య, అసూయాదులును దుఃఖ దాయకములగుచున్నవి.

బాహ్యాధ్యాత్మిక దుఃఖములకు కారణమైన రోగాదుల యుపశమనార్థమై యౌషధ సేవన, పథ్య పదార్థముల సంసేవన చేయుచుందుము. మనస్సునందున నుండెడి కామాదుల గుర్తెరుగలేని జీవుడు, వీటి నివారణకై యేమియును చేయలేని స్థితిలో యున్నాడు. చికిత్స నొందని రోగికి బాధలు నధికమగును. అదే విధిన మానసిక ఋగ్మత ప్రమాద జనకములగుచున్నవి. కొందరు తమ జీవనమునే బలి యిచ్చికొనుచున్నారు. అందుకే **"పడతికై చచ్చినవారు కోటి, పుడమికై చచ్చినవారు కోటి, పొన్నుకై చచ్చినవారు కోటి"** యనెడి శరణునుడి ప్రఖ్యాతికి వచ్చినది.

సూక్ష్మముగా పరిశీలించిన యెడల, కామ క్రోధాదులు నెంత శక్తివంతములో తెలియుచున్నది. ఈ కారణమున కామాదులయొక్క స్వరూపమును పరీక్షించి, తదనంతరము వాటి యొక్క ప్రశమనోపాయముల నన్వేషించెదము.

## కామము :

మనస్సులోని రోగములన్నింటి కంటెనూ ఇది ప్రబలమైనది. ఇది యితర మానసిక రోగములకు కారణభూతమైనది. కామమనెడి శబ్దము యొక్క సామాన్యార్థము, "ఇచ్ఛ" యగుచున్నది. దీనిని సమర్థించెడి వైశేషిక శాస్త్ర భాష్యములోని ఈ క్రింది ప్రమాణమును గ్రహించుడి :

**శ్లో॥ "కామోభిలాషః రాగః సంకల్పః కారుణ్యం**
**వైరాగ్య ముపధాభావ - ఇత్యేవమాదయ ఇచ్ఛా భేదాః"** (ప.పా.భాష్య పుట:635)

కామము, అభిలాష, రాగము, సంకల్పము, కారుణ్యము, వైరాగ్యము, ఉపధా మరియు భావములనెడివి ఇచ్ఛ యొక్క ప్రభేదములని ప్రమాణములోని భావము. ఇచ్ఛలో కామ మనెడి దొక యంతర్భాగమని భాష్యకారుడగు శ్రీప్రశస్త పాదాచార్యులవారు చెప్పుటచేత కామమొకరకమైన యిచ్ఛయని స్థిరపడినది.

శ్రీప్రశస్త పాదాచార్యులవారు, కామమును గూర్చి వివరణనిస్తూ-**"మైథునేచ్ఛా కామః"**అని చెప్పిరి. కూటువుకు చెందిన కోరికయే కామమనెడిది ప్రతీతమైనదని యెరుగవలెను. కామాగ్నిచేత పీడింపబడెడివానికి సౌఖ్యమెక్కడిది?యని ప్రశ్నించెడి శివధర్మోత్తరములోని యీ ప్రమాణమును గనుడి.

**శ్లో॥ న రాత్రౌ విందతే నిద్రాం కామాగ్నిపరిపీడితః॥**
**దివాపి చ కుతః సౌఖ్యమర్థోపార్జన చింతయా॥**

స్త్రీ సంభోగాసక్తి గలవానికి పగలుగాని, రాత్రిగాని సుఖమనెడిది యుండదు. ఈ కోరిక మానవుని వివేకమును పాడుచేసి యతనిచేత గొప్ప యనర్థములను చేయించును.

మన్మథుడు, తన బాణముల ప్రభావము చేత యెవరెవరి చేత యేయే యనర్థములను చేయించునో యనెడిది వివరించెడి ప్రబోధ చంద్రోదయములోని యీ శ్లోకములను గనుడి :

**అహల్యాయై జారః సురపతి రభూదాత్మతనయాం ।**
**ప్రజానాథో యాసీదభజత గురోరిందరుబలామ్**
**ఇతిప్రాయః కోవాన పదమపథే కార్యతమయా॥**
**శ్రమో మద్బాణానాంక ఇవ భువనోన్మాథ విధిషు॥**

(ప్రబోధ చంద్రోదయము 1-14)

దేవేంద్రుడు అహల్యను, బ్రహ్మ తన బిడ్డ యగు శారదను, చంద్రుడు తన గురువుగారి పత్నియగు తారను మోహించినది తన బాణముల ప్రభావము చేతనేయని చెప్పెడి కాముని మాటల వలన కామమెంత యనర్థదాయకమో కనబడుచున్నది.

ఆకులలముల నాహారముగా గొనుచు తపస్సు చేసికొనెడి విశ్వామిత్ర, పరాశర యిత్యాది తాపసులు కామముచేత బద్ధులై స్త్రీ వ్యామోహమునకు కట్టుబడి యుండిరనెడిది పురాణ ప్రసిద్ధమైన విషయము.

కామముచేత పీడితుడైన వాని వివేక మేమేరకు దిగజారునో? తెలిపెడి కాళిదాసు యొక్క మేఘదూతములోని యీ వాక్కులను గనుడి:

**"కామార్తాహి ప్రకృతి కృపణాశ్చేతనా చేతనేషు"**

కామమోహితునికి చేతనా చేతనముల వివేకము నుండదని కాళిదాసు వాక్కులోని అర్థము. పత్ని యొక్క విరహతాపమునందు పడి బాధపడెడి యక్షుడు, ఒక జాణ చేత తన భార్యకు పంపించవలసిన సందేశమును, అచేతనమై యుండెడి మేఘముచేత పంపించేది చూచి, కవికుల గురువు చెప్పిన నుడువులివి.

**"బలవానింద్రియ గ్రామో విద్వాంసమపికర్షతి"**యనెడి సూక్తి ప్రకారము, కామము విద్వాంసునియైననూ విధ్వంసమునకు గురి చేయుననెడిది యీ సూక్తిలోని భావము.

ఢిల్లీ పాదుషా దర్బారున జగన్నాథ పండితుడనెడి బ్రాహ్మణ పండితుడు ఆస్థాన విద్వాంసునిగా నుండెను. ఒకసారి రాజుతో జగన్నాథుడు చర్చించుచు కూర్చుండి యున్నప్పుడు లవంగి యనెడి యొక యవన యువతి బంగారపు బిందెలో చల్లటి నీరును నింపి తెచ్చి రాజుకును, మరియు నక్కడయున్న యితరులకును నీటిని ద్రావించి, రిక్తమైయున్న బిందెను నిండిన బిందెను పెట్టికొనిన యట్లు తలమీద పెట్టికొని యెంతో వయ్యారమునొలకపోయుచు వెళ్ళెడి తీరును చూసి, రాజు జగన్నాథ పండితుని కిట్లనెను. "ఓ కవిశ్రేష్ఠుడా! ఈ లవంగి రిక్తమైయున్న బిందెను నిండిన బిందెవలె తనమీద నిడుకొని వెడలుచున్నది కదా! ఆ బిందెలోన యేమి నిండియున్నది? వర్ణించుడి". ఆశుకవియైన జగన్నాథ పండితుడు తక్షణముననే యీ క్రింది విధిన కవితను చెప్పెను.

**శ్లో॥ ఇయం సుస్తనీ మస్తకన్యస్త్రీ కుంభా।**
**కుసుంభారుణం చారు చీలం వసానా।**
**సమస్తస్య లోకస్య చేతః ప్రవృత్తిం**
**గృహిత్వాఘటే న్యస్య యాతీవ భాతి॥**

ఓ మహారాజా! సుందరమైన స్తనములతో సుశోభితురాలై, పసుపువన్నెగల చీరను, చుట్టియున్న యీమె తలమీది బిందెలో నీరు లేకున్ననూ, సభ్యుల మనోవృత్తులను తనయందున నింపికొని యున్నది. మరొక మాటలో చెప్పవలెననిన, యెల్లరూ ఆమె ఎడల నాకర్షితులైయున్నందున, యిచ్చటనున్న వారి మనస్సులను బిందెలో నింపికొని వెడలుచున్నది.

కవియొక్క అద్భుతమైన కల్పనాశక్తికి ముగ్ధుడైపోయిన రాజు సంతుష్టుడై "ఓ కవి పండితుడా! మేము చాలా సంతసించితిమి. నీకేమి కావలెనో కోరుకొనుము. నీ కోర్కెలను తీర్చెద"ననెను.

జగన్నాథ పండితుడు, తన యభీష్టమును దిగువన యివ్వబడిన కవిత ద్వారా తెలియబరచెను.

**శ్లో॥ న యాచే గజాలిం న వా వాజిరాజం**
**న విత్తేషు చిత్తం మదీయం కదాచిత్ ।**
**ఇయం సుస్తనీ మస్తకన్యస్త కుంభా**
**లవంగీ కురంగీ దృగంగీ కరోతు॥**

ఓ రాజా! నాకు నేనుగుగాని, గుఱ్ఱముగాని వలదు. విత్తము మీద నాసక్తిలేదు. మంచి స్తన సంపద గల్గి, నెత్తిన బిందెనిడికొని, లేడికన్నులవంటి చంచల దృష్టి గల్గి, వెడలుచున్న లవంగిని నాకు ననుగ్రహించవలెనని యీ కవితలోని భావము.

జగన్నాథ పండితుని యభీష్టమును వినిన రాజు, అతనికిట్లనెను. "ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా! ఈమె ముసల్మాను జాతికి చెందినది. నీకు యోగ్యురాలైన కన్యకాదు. ఈ కారణమున, ఇంక నేమైననూ వేడికొనుము".

లవంగిమీద నమితాసక్తిని పెంచికొనిన జగన్నాథ పండితుడు, తన యొక్క పాండిత్యమును, కులాచారములను మరచిపోయి తనకు ఆమెనే కావలెనని యీ క్రింది విధిన వేడెను.

**శ్లో॥ యవనీ నవనీత కోమలాంగీ**
**శయనీ యే యదిలభ్యతే కదాచిత్।**
**అవనీతలమేవ సాధు మన్యే**
**నవనీ మాఘవనీ వినోద హేతుః॥**

ఈ కవిత యర్థమేమనగా నవనీత కోమలాంగి అయిన యీ లవంగిలో దోషమిమేయును లేదు, ఆమె పొందులో తనకు స్వర్గ సౌఖ్యములు గల్గనున్నవి. ఈ కారణమువలన తనకు మరేమియును అంగీకార యోగ్యముకాదు.

రాజుగారు జగన్నాథ పండితుని మాటను మన్నించెను. లవంగిని అప్పగించెను. జగన్నాథ పండితుడామెను పెళ్ళియాడి, యామెపొందున స్వర్గసౌఖ్యములను గాంచజొచ్చెను. అతని యనుచిత ప్రవర్తనను చూసి పండితలోకము అచ్చెరువుపొందెను. బ్రాహ్మలోకము అతనిని బహిష్కరించెను. జనసామాన్యమతనిని జుగుప్సాభావముతో చూడజొచ్చెను. ఈ విధముగా ననేక సద్గుణములు గల్గియున్నా కామాసక్తివలన జగన్నాథ పండితుడు నందరిచేతను తిరస్కృతుడయ్యెను. చివరకు, తన తప్పిదమును తాను గ్రహించిన వాడయ్యెను. పశ్చాత్తాపమునకు గురిఅయ్యెను. కాశీకి వచ్చి, దోషనివారణకై "గంగాలహరి" అనే కావ్యమును రచించెననుడి జనశ్రుతి యొకటి గలదు.

స్త్రీ సాంగత్యము వలన వివేక భ్రష్టత్వము గల్గి సర్వనాశనము సంఘటించును. అందుకే, వివేకము గల విజ్ఞులు స్త్రీ సాంగత్యమునుండి దూరముగా నుండుటకై ప్రయత్నించవలెను.

కామము వలన గల్గెడి యనర్థములను అంచనా వేయలేము. అనుభావముగల మహాపురుషులు చెప్పిన విషయములను గమనించిన యెడల సమస్య యొక్క జటిలత్వము అవగతమగును. ఈ విషయమున, నిజగుణ శివయోగి గారు తెలిపిన యంశములు గమనార్హములై యున్నవి కనుడి :

"ఓయీ జీవుడా! ఈ కామము నీ సుగుణ సంపత్తిని, నిగమాది విధులను మిక్కిలిగా చేసిన తపస్సును, తనకు గల్గిన సిద్ధులను, జగత్ పూజ్యతను, సుందరమైన శరీరమును, పెద్దల మెప్పులను, రాజుల మన్ననను, తనకు మున్ముందు గలుగబోవు ముని-దేవ-గణ పదవులను, రుద్రేశ్వర సదాశివ భావనను మరియు ఘనశంభు లింగమిచ్చెడి ముక్తిని చెరచును గాన దానిని వీడవలెను.

**"న జాత, కామః కామానాము ప భోగేన శామ్యతి"** యనెడి యయాతి మహారాజు నుడువుల ప్రకారము స్త్రీ సంగమమును చేసి కామాభిలాష తీర్చికొనుట యనెడిది సాధ్యమయ్యెడి విషయము కాదు. ఎట్టి వానికైననూ ఈ విధిన ఫలితము లభించదు. అగ్నిలో నెయ్యిని వేయుట చేత నగ్ని మరింత ప్రజ్వరిల్లును. అదే విధిన, స్త్రీ సంభోగమును చేసిన కొలది యింకనూ కావలెనను భావము గల్గును. తృప్తి లభించదు. ఈ కారణముచేత శమ-దమములను ప్రయోగించి, అంతరింద్రియములపైననూ బహిరింద్రియములపైననూ నియంత్రణను సాధించి తద్వార కామమును నిగ్రహించవలెను.

ఇచ్ఛకు గల యితర ప్రభేదముల గురించి తెలిసికొందుము గావుత.

## అభిలాష :

**"అభ్యవహారేచ్ఛాభిలాషః"** అని చెప్పబడినది. భోజనమును చేయవలెననెడిది యభిలాషయగును. భోజనము గురించి యడిగిన యప్పుడు తమరికి యేయే పదార్థముల యందభిలాషగలదని యడిగెడి పరిపాటియునూ కాగలదు.

## రాగము :

**"పునః పునర్విషయానురంజనేచ్ఛారాగః"**అని చెప్పబడినది. విషయపరమైన అనుభోగమును మరల మరల చేయవలెననెడి మానసికవృత్తిని రాగము అని అందురు. శబ్ద, స్పర్శ, రూపరసం, గంధ రసములనెడివి విషయములని తెలిసికొనవలెను.

## సంకల్పము :

**"ఆసన్న క్రియేచ్ఛా సంకల్పః"** అనెడి వివరణ ప్రకారము ఆగామి కర్మల కర్తృత్వము యొక్క అపేక్ష సంకల్పమనిపించుకొనును. మనుష్యుడు, ఏదో నొక పని చేయునప్పుడు దీనిని యీ విధిన చేయవలెనని సంకల్పించుకొని తదనుగుణముగానే చేయుచున్నాడు. అందుచే భవిష్య కార్యముల సంపాదనపరమైన యిచ్ఛను సంకల్పముగా భావించవలెను.

## కారుణ్యము :

**"స్వార్థమనపేక్ష్య పరదుఃఖ ప్రహాణేక్షా కారుణ్య"** మనే కారుణ్యము గూర్చి చెప్పబడినది. స్వార్థమును కోరికొనకుండగ, యితరుల యొక్క దుఃఖములను దూరము చేయవలెననెడి యపేక్ష కారుణ్యమని అనిపించుకొనును.

## ఉపధా :

**"పరపంచనేచ్ఛా ఉపధా"** యని చెప్పబడినది. ఇతరులను వంచించవలెననెడి కోరికను గల్గియుండుటను ఉపధాయగును.

## వైరాగ్యము :

**"మోక్షదర్శనాద్విషయత్యాగేచ్ఛా వైరాగ్యం"** అనెడి దాని ప్రకారము శబ్దాది విషయముల దోషముల గుర్తించి వాటిని త్యాగము చేయవలెననెడి అపేక్ష గల్గియుండిన యెడలనట్టి యపేక్ష వైరాగ్యమగును.

## భావము :

**"అంతర్నిగూఢేచ్ఛాభావ"** మని చెప్పబడినది. గూఢముగా నుండెడి యిచ్ఛను భావమని అందురు.

విభిన్నమైన యిచ్ఛలలో వైరాగ్యమును మినహాయించిన యెడ, మిగిలినవన్నియును మనుష్యునికి నానావిధములైన దుఃఖముల నిచ్చుచున్నవి. కామమనెడిది మహా భయంకరమైనది. జీవుని సర్వనాశనమునకు కారణమగుచున్నది. ఈ కారణముననే పతంజలి "చిత్తవృత్తి నిరోధః"యని యోగమునకు నిర్వచనమిచ్చెను. కామాదులకు నిలయమైన చిత్తవృత్తిని నిరోధించనిది యోగము సంప్రాప్తము కాదని గ్రహించవలెను. కామాదుల మీద విజయమును సాధించినగాని ఆధ్యాత్మికపరమైన అంతర్ దుఃఖములు దూరము కావు. క్రోధమునకు కామమునకును చాలా సన్నిహిత సంబంధము గలదు. మైథునేచ్ఛయే క్రోధమునకు మూలమని గ్రహించవలెను.

## ద్వేషము :

క్రోధమునకు ద్వేషమునకు సన్నిహితత్వము గలదు. అందుచేత ద్వేషము గూర్చి తెలిసికొనవలెను. **"ప్రజ్వలనాత్మకో ద్వేషః"** అని చెప్పబడినది.

ఏ భావము పుట్టిన పిదప మనుష్యుడు సంతప్తుడైనటుల కన్పట్టునో యట్టి చిత్తవృత్తిని ద్వేషమందురు. తనకు నపేక్షితమైన ఘటన లేదా వ్యక్తి యొక్క స్మృతి గల్గినప్పుడు ఈ ద్వేషము గల్గును.

## క్రోధము :

**"శరీరేంద్రియాది వికారహేతుః క్షణమాత భావీ ద్వేషః క్రోధః"** అని చెప్పబడినది. కళ్ళు ఎఱ్ఱగా యగుట, శరీరమున కంపన పుట్టుట, పెదవిని కొరికికొనుట మొదలగు శారీరక వికారములతో కూడికొనియుండి, క్షణమాత్రము గోచరించెడి మానసిక జ్వలన వృత్తియే క్రోధమని యెరుగవలెను. ఈ అవస్థ వచ్చిన పిదప మనుష్యుడు, రాక్షసునివలె ప్రవర్తించును. కృద్ధావస్థ యందున శరీరమంతటా హింసావృత్తి పరివ్యాప్తమగును. క్రోధమును పొందినవాడు, ఎదుటివాడు దుర్బలుడైన యెడల, వానిని హింసించును. ఒకవేళ యెదుటివారు సబలులైన తానే తనను హింసించి కొనును. క్రోధమును చెందిన వాడు రాక్షసునికంటెను క్రూరముగా ప్రవర్తించునని తెలిపెడి శ్లోకమొకటి బోధసారమున కలదు. అమితమైన క్రోధమును నొందిన నృసింహుడు రాక్షసుని కంటెనూ క్రూరముగా ప్రవర్తించెనని తెలుపుటకై యీ శ్లోకము విరచితమైనది.

**శ్లో॥ రుధిరం పిబతి స్వేయం దివా తమసి నృత్యతి ।**
**భీషయత్యాత్మనాత్మనం క్రూరః క్రోధీన రాక్షసః ॥**

తన రక్తమును తానే త్రావుచు, పగలు చీకట్ల భేదము నరయజాలకుండగనుండి, తనను తాను హింసిచి కొనుచు నున్న క్రోధియే రాక్షసుని కంటెనూ క్రూరుడని శ్లోకములోని భావము.

హింసాది పాప ప్రవృత్తులకు కారణభూతమయ్యేడి క్రోధమును శాస్త్రజ్ఞులు మహాఛండాలుడని పిలిచిరి. క్రోధము వచ్చిన పిదప, ఒక వ్యక్తి తన గురువును, పెద్దలను కూడ తిరస్కరించి మాట్లాడును. తన యింటి నంటిన నిప్పు యింటిని ధ్వంసము చేయుటయేగాక పరుల యిళ్ళను కూడ దహించివేయును. అదే విధిన తన కోపము తన శరీరములోని రక్తమాంసాదులను దహించివేసి, మరియొకరి మీద ప్రహారమును చేయుచున్నది. అందుకే, కోపము తన శత్రువు, శాంతము పరుల శత్రువని చెప్పుదురు. క్రోధి యొక్క మానసిక స్థితిని తెలిపెడి శ్లోకమును గనుడి :

**శ్లో॥ అంధీకరోమి భువనం బధిరీ కరోమి**
**ధీరం సచేతన మ చేతనతాం నయామి ।**
**కృత్యం న పశ్యతి నయేన హితం శృణోతి**
**ధీమానధీతమపిన ప్రతి సందధాతి ॥** (బోధసారము పుట:22)

## సంసార హేయస్థలము :

## ఆశీర్వచనము : 6

క్రోధము నొందినవాడు కళ్ళుండియూ గ్రుడ్డివాడగును, చెవులుండియూ చెవిటివాడగును. చైతన్యమున్ననూ చైతన్యము లేనివానివలెను, బుద్ధియుండియూ బుద్ధిలేనివానివలె ప్రవర్తించును. ఈ విధముగా క్రోధ పరవశుడై వ్యక్తియుండునని గ్రహించవలెను.

కామము వల్లనే క్రోధము గల్గునని చెప్పుదురు. "కామాత్ క్రోధోభిజాయతే" యనెడి గీతోక్తి (గీత – 2–69) యొకటి కలదు. కామమున ప్రతిబంధకము లేర్పడినయప్పుడు క్రోధము నుద్భవించును. కామమే క్రోధముగా పరివర్తన మొందునని చెప్పవచ్చును.

ద్రోహము, మన్యువు, అక్షమా, మరియు అమర్షలనెడివి క్రోధము యొక్క యితర ముఖములని తెలుపబడినది. వాటి గూర్చి తెలిసికొందుము గావుత :

## ద్రోహము :

**"అలక్షిత వికారశ్చిరాను బద్ధాకారావసానో ద్వేషో ద్రోహః"** అనెడి వివరణ ప్రకారము నాద్యమున శరీరమునందున వికారము లేవియును కన్పట్టకుండగ, యెన్నో దినముల పిదప, ప్రతీకారము గన వచ్చినచో, నట్టి ద్వేషమును ద్రోహమని యందురు. అపకారము చేసినవానికి, ప్రత్యపకారము చేయునంతవరకు ననుకూల సమయమునకై వేచియుండి, తగిన సమయము వచ్చినప్పుడు పగదీర్చికొనెడి మనోవృత్తియే ద్రోహము. ఇది ద్వేషము యొక్క యొక యవాంతరభేదమని గ్రహించవలెను.

## మన్యువు :

**"అపకృతస్య ప్రత్యపకారా సమర్థస్యాంతర్నిగూఢోమన్యుః"** అనెడి వివరణ ప్రకారము అపకారము చేసినవానికి ప్రతిగా అపకారము చేసెడి సామర్థ్యము లేకుండగా యుండెడి వ్యక్తియందున, గుప్తముగా నుండెడి ద్వేషమునే మన్యువని అందురు. ఇదైననూ ద్వేషము యొక్క మరొక్క శాఖయే. ఈ మన్యువు చేత నాక్రమింపబడిన వ్యక్తి తనలో నెల్లప్పుడూ సంతాపము ననుభవించుచుండును.

## అక్షమ :

**"పరగుణ ద్వేషో క్షమా"** అనెడి వివరణ ననుసరించి యితరుల గుణముల యెడల ద్వేషభావము గల్గియుండుటే "అక్షమ". ఇతరులలో నుండెడి యుత్కృష్ట గుణగణములు తనలో లేనందువలన యీ గుణముల యెడ ద్వేషభావమును పెంచుకొనెడివాడు అక్షమ గలవాడగును. అక్షమ అనెడిది ద్వేషములో నొక యవాంతర భేదమని గ్రహింపదగును.

## అమర్ష :

**"స్వగుణ పరిభవ సముత్థో ద్వేషోమర్షః"** అనెడి వివరణ ప్రకారము తన గుణముల పరాజయము వలన గల్గెడి ద్వేషమును "అమర్ష" యందురు.

లోతుగా పరిశీలించిన యెడల ద్వేషము యొక్క వివిధ రూపములే క్రోధ, ద్రోహ, మన్యు, అక్షయా మరియు అమర్శలని తెలియుచున్నది.

## లోభము :

"ధర్మ విరోధేన పరద్రవ్య జిఘృక్షా లోభః" అని చెప్పబడినది. ధర్మవిరుద్ధముగా పరద్రవ్యములను బడియవలెననెడి కోరికను లోభమని అందురు. నరకమునకు ద్వారములనదగిన మూడు దుర్గుణములలో లోభమొక్కటి యని తెలియుచున్నది. కామక్రోధములనెడివి, మిగిలిన ద్వారములు. లోభమనెడి దానిని విషముతో పోల్చుదురు. పాము, తేలు ఇత్యాదుల వలన బాధింపబడిన వ్యక్తి కొంత సమయము పిదప సాధారణ స్థితికి వచ్చెడి యవకాశము గలదు. కాని లోభమనెడి విషము తలకెక్కిన వానిని రక్షించుట చాలా కష్టము. లోభికి యెంత సంపద గల్గినా తృప్తి గలుగదు. అందుకే ప్రబోధసారములో నరహరి యీ క్రింది విధిన తెలియజెప్పెను.

**శ్లో॥ మేరవో ఘృతబింద్వాభా దురాషాదావపాపకే।**
**కథం సహస్రలక్షాద్యైస్తృప్తి తృష్యతులోభవాన్॥** (బోధసారము–పుట. 23)

లోభికి నుండెడి దురాశయనెడి దావాగ్నికి మేరు పర్వతములు, నేతి బిందువులుగా దోచును, అట్టి ఎన్ని వేల లక్షల రూప్యములైననూ లోభికి సంతృప్తి నివ్వజాలవు. ఇది నరసింహుని భావన.

లోభి యగువాడు ద్రవ్యార్జన నిత్యమున యెట్టి నీచ కార్యమును చేయటానికైననూ వెనుకంజ వేయడు. అందుకే శ్రీ నిజగుణుల వారు "లోభము కంటెను దుర్గుణము అన్యము ఉండునే?" అని ప్రశ్నించిరి.

ధనమును గడించి, తాను ననుభవించకుండగను, సత్పాత్రత గలవారికి దానమియ్యకను, పాము వలె యెప్పుడూ, ధనమును రక్షిస్తూ చివరకు అసువులు బాసిన వాని వారసులు వాని నోట్లో చిన్న బంగారపు ముక్క నైనను పెట్టక మట్టినే వేయుదురని సర్వజ్ఞుడు తెలిపెను.

లోభమనెడి పదమునకు పలురకములైన నిర్వచనము లిచ్చెడి యీ క్రింది శ్లోకమును గనుడి.

**శ్లో॥ లోహార్గలో భద్రహరో లోలాంతకో భయప్రదః।**
**లునాత్యుభౌచ యల్లోకా తేన లోభఃప్రకీర్తితః॥** (లోభసారము, పుట : 26)

దేని చేత మనిషి లోహముతో చేసిన అరదండ మాదిరిగా మారుచున్నాడో, దేని చేత సుఖమునశించిపోవునో, దేని చేత చంచలత్వము పెరుగునో, ఏది భయకారకమో, దేనివల్ల యిహపరములలోను దుర్గతి లభించునో యట్టిదానిని లోభమందురని శ్లోక రచయిత నరహరిగారి యభిప్రాయము. 'లో'యనే అక్షరము నుండి లోహపు అరదండమును, లోలాతకమనే రోగము, లోకములను సూచిస్తూ, భ చేత భద్రనాశనమును, భయదాయకము, ఉభయలోక భ్రష్టత్వమును సూచిస్తూ కవి యెంతో సుందరముగా లోభి యొక్క వ్యక్తిత్వమును వర్ణించిరి.

"అత్యాశ గతిర్నాస్తి" అనెడి లోభి తన సంపదలో నొక్కపైసయూ వ్యయము కావలదని యోచిస్తూ , ఒక్కోసారి మొత్తమును కోల్పోయి మతిచెడి భ్రష్టత్వమును పొందెడి యవకాశము గలదు.

లోభి యొక్క చిత్ర వృత్తి యేవిధముగా నుండునో యనెడిది తెలిపే కథయొకటి కలదు. ఒక ఊరిలో నొక దంపతులు కాపురమును చేయుచుండిరి. వారికిరివురు కుమారులు నుండిరి. వ్యవసాయము వలన జీవనము సాగుచుండెను. సతిపతి లిరువురునుపరమలోభులై యుండిరి. పొలము పనులలో చాలా వరకు జాగ్రత్తను వహిస్తూ ఎంతో కొంత వెనకకు వేసెడి వారు. భార్య భర్త మ్గాముననే పయనించుచు ఇంటి వ్యయమున పొదుపును పాటిస్తూ కొంత మిగిల్చెడిది. ఒక నాడు భర్త పొలమునకు వెడలెను. పిల్లలిరువురును ఇంటి దగ్గర యుండిరి. ఒక మంగలి యా మార్గమున వెడలుచుండగా, నా యిల్లాలు వానిని పిలువ నంపెను. మా పిల్లలకు గుండు చేయించాలి. ఎంత వరకు ద్రవ్యము వ్యయమగను అని అడిగెను. మంగలి, తెలివైన వాడైనందున, యిరువురిని గాంచి "అమ్మా! పాతిక రూపాయలిప్పించండి ముగ్గురికి క్షౌరకర్మ చేసి వెడలెదను. ఇల్లాలు ఇంకను పొదుపు చేయనెంచి, బేరమాడి ఆ మొత్తమును ఇరువది రూపాయలకు తగ్గింపజేసెను. ఆమె దృష్టిలో తన యిర్వురు పిల్లలతో పాటు, భర్తకు కూడా క్షరకర్మ యాపైకములోన పూర్తగునని తలంచెను. కాని మంగలి వాడు ఇద్దరికి పని చేసి ముగ్గురు పైకము పొందతలచెను. చివరకు మంగలి యిద్దరు పిల్లల క్షౌర కర్మ పూర్తి అయిన వెంటనే, ఒప్పందము సొమ్ము ఇప్పించ గోరగా నా యిల్లాలు, మూడవ వ్యక్తి పని గూడ పూర్తయిన గాని రూప్యములివ్వననెను. దానితో మూడవ వ్యక్తిని అతను చూపుమనగా, భర్త యింకనూ తిరిగి రాకపోవుటచేత తానె గుండు గీయించుకొని, మంగలికి ఇయ్యివలసిన సొమ్ము ఇచ్చి పంపెను.

మరొక వైపు భర్త తన జొన్న చేనును కోయించుకోడానికి కుదుర్చుకున్న కూలివాండ్రు, ఆ పనిని మద్యాహ్నము మూడుగంటల వరకే పూర్తిచేసి కూలి రాళ్ళు ఇప్పించ కోరగా, నతడు వారికి సాయంత్రము వరకు పని చేసిన గాని కూలివ్వననెను. దానితో కూలి వారు, మిగిలిన సమయములో చేయవలసిన పనేమిటో సెలవివ్వమని కోరగా పంటకు రాని కంది చేనును కూలి డబ్బులు ఆదా చేయడానికై కోయించివేసెను.

సాయంత్రము యింటి దగ్గర చేసిన ఘన కార్యముల నొకరి కొకరు చెప్పుకొని, తెలివిగా తామెంత పొదుపు చేసినారో గొప్పగా ఊహించుకొనిరి. కాని, పంటకు వచ్చే కంది చేనును కోసుకోవడము వలన తామెంత నష్టపోయిన విషయము, భార్య భర్త బ్రతికుండగనే గుండు గీయించుకొని ముత్తైదువ తనమునకు కళంకము కల్పించిన విషయాన్ని తెలియరైరి. ఔరా, పిసినారి తనమున కింతకన్న మంచి ఉదాహరణము కానవచ్చేనే?

జగత్తులోను, ప్రతి యొక్క వ్యవహారమునకు, దనమే ప్రధానమై యున్నందున నది లేనిదియే వ్యవహారమూ నడువ జాలదు. ఈ కారణము వలన కేవలము ధనమును గూర్చిన యపేక్షను లోభమున వలదు. తన నిత్యవ్యవహారమునకై పర్యాప్తమైన ధనముండి యున్ననూ,

ఇంకా బడయ వలెనన్న కోరికతో న్యాయమును, నీతిని మరియు ధర్మమును నుల్లంఘించి అర్థ పిపాసను పెంపొందించుకొనినచో నయ్యడి లోభమగుచున్నది. లోభము వ్యక్తుల సుఖశాంతులను చెడగొట్టి, యతనిని దుఃఖములోనికి నెట్టివేయుచున్నది. అందుచేత, ప్రతి వ్యక్తి లోభమును గెలువ వలెను. లేని యెడల సద్గతి లభించదు.

## మోహము:

లోభము యొక్క ప్రగాఢమైన యవస్థను మోహమని అందరు. "హనో పాదాన సామర్థ్యం మోహః"అని చెబ్బబడిది. కార్యకర్య, హితాహిత, సారాసార వివక్షతను కోల్పోయి యండుటయే మోహమని యందురు. మా+ఊహః అనెడి శబ్దము యొక్క పదవిచ్ఛేదము కూడా అదే అర్థమును స్ఫురింపజేయుచున్నది.

మోహమనెడిది పాశము వంటిది. ఈ పాశమున జిక్కిన వ్యక్తి విల విల లాడుచూ నశించుచున్నాడు. దీపములోని జ్వాల చేతనాకర్షింపబడి మోహపరవశయై దీపమును తాకి యసువులు బాసెడి దీపపు పురుగుల వలె పడతి, పుడమి, పొన్ను, మొదలగు వాటి వ్యామోహమునకుకు గురియైన జీవి సద్యకాలములోని జీవనమునకు ముప్పును కొని తెచ్చుకొనుచున్నాడు. నిత్యానిత్యముల గురించి ఆలోచించువాడు శుచి, అశుచికి మధ్యన గల భేదమును గాంచజాలడు. దుఃఖమును కొని తెచ్చికొని, దానినే సుఖమని యెంచి సంతుష్టుడయ్యెడి దశకు చేరికొనును.

మోహము వలన సకల జీవరాశి వ్యధకు గురియగు చున్నదని వ్యాసుడు ధర్మజుని ముఖమున చెప్పెను. ఈ శ్లోకమును గనుడి.

**శ్లో॥ అస్మిన్ మోహమయే కటాహే**
**సూర్యాగ్నినా రాత్రి దివేంధనేన**
**మాసర్తుదర్వీపరిఘట్టనేన**
**భూతాని కాలః పచతతి వార్తా॥**

జగత్తులోన విశేషమైన వార్త యెయ్యదియని యక్షుడు ప్రశ్నించగ, ధర్మజుడిచ్చిన సమాధానమిది.

కాలుడు సకల భూతములను కడాయిలో వేసి వేల్చి పక్వము చేయుచున్నాడు. ఆ కడాయిలో మహామోహమనెడి నూనె నిండుగా నున్నది. దివారాత్రములు ఇంధనములైనవి. సూర్యుడే నిప్పై భగభగ మండుచున్నాడు. మాస, ఋతువు, లిత్యాదులు, జల్లి గంటలై నూనెలోని జీవులను త్రిప్పుచూ సరిగా పక్వమయ్యె ప్రక్రియలో సాధనములుగా నున్నవి. దీనిని మించిన వార్త మరొక్కటెక్కడిది యనెడి సమాధానము యక్షునికి లభించెను.

శబ్దమునకై మృగము, స్పర్శ కై గజము, రూపమునకై పతంగము, రసమునకై మీనము, గంధమునకై భ్రమరము వ్యామోహమును చెంది నశించును.

'విరతమనెడి వజ్రాయుధమును గైకొని మోహమనెడి పర్వతమును

ధ్వంసమొనర్చవలెననియును,' అప్పుడే జీవునికి భద్రత చేకూరుననియును శ్రీ నిజగుణులవారు ప్రబోధించిరి. ఈ విధిన విరత భావన వహించి మోహమును జయించి మోహన రూపమున నున్న, అంతరాధ్యాత్మిక దుఃఖముల నుండి దూరమై యుండవలెను. ఇదియే ప్రతి జీవి యొక్క కర్తవ్యమని గ్రహించవలెను.

భయము, ఈర్ష్య, విషాదము, సంశయము లనెడివి కూడ దుఃఖహేతువులని చెప్పబడుచున్నవి. వీటి గూర్చి తెలిసి కొనుట యెంతో అవసరము.

కామ, క్రోధ, లోభ, మోహములకు గురియై, అనిష్ట ప్రాప్తిని పొంది బాధ నొందెడి సమయమున, తరుణోపాయముతోచని స్థితిలో

గల్గెడి మానసిక కంపనను భయమని అందురు. పరుల సంపత్తును గూర్చి యసహన భావన వహించుటయే యీర్ష్య. భార్యా పుత్రాదులును, భృత్యమిత్రాదులును దూరమయ్యెడి స్థితిలోను, తన దని భావింపబడెడి వస్తు సంపద నష్టమైనప్పుడు గల్గెడి మనస్సులోని వ్యాకులతలను విషాదమందురు. అనిశ్చిత జ్ఞానమే సంశయమగును.

ఈ విధిన బాహ్యపరమైన, అంతరంగిక ఆధ్యాత్మిక దుఃఖములు జీవిని పీడించునని గుర్తెరుగవలెను. జాగరూకత వహించవలెను. ఆది వ్యాధులనెడి నామాంతరముగల యీ దుఃఖములు, సోకుండా నుండుటకై యందు జాగ్రత్తలను తీసికొనుట యెంతగానో యవసరమై యున్నది.

ఆధ్యాత్మిక దుఃఖముల గూర్చి తెలిసికొనిన పిదప ఆది భౌతిక దుఃఖములను గురించి తెలిసికొన వలసిన యవశ్యకత గలదు.

అండజములైన పక్షులు, సర్పములు, మొసళ్ళు మొదలగు వాటి వలనను, జరాయుజములైన పులి, సింహము, మనష్యులు ఇత్యాదుల వలననూ, స్వేదజములైన పేను యిత్యాదుల నుండియును, ఉద్భిజములైన చెట్టు, చేమ, రాయి, రప్పల వలననూ గల్గెడి దుఃఖములు ఆది భౌతిక దుఃఖములనబడు చున్నవి.

వర్ష వాతాతపముల వలన గల్గెడి దుఃఖము ఆదిదైవిక దుఃఖమనబడుచున్నది.

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక దుఃఖములు జీవులను నిరంతరము తాపత్రమునకు గురిచేయుచున్నవి. అందుచేత వీటిని తాపత్రయములని యందురు.

తాపత్రయముల నివాణకై శాస్త్రమునందు బహువిధములైన యుపాయములు తెలుపబడినవి. మణి, తంత్ర, ఔషధాదులగురించిన వివరణ గలదు. కాని యీ ఉపాయములన్నియును, తాపత్రయమును సమూలముగా దూరము చేయలేవు వీటిని, ఆత్మజ్ఞానము చేత హరించవలెను. ఈ కారణముననే కపిలాదులు సాంఖ్యాది శాస్త్రములను రచించిరి. ఇవి ప్రాకృతులకు నుపయుక్తముగా నున్నవి.

అప్రాకృతులకై వీరశైవాచార్యులు షట్ స్థల విజ్ఞానశాస్త్రమును ప్రచారములోనికి తెచ్చిరి. దుఃఖ త్రయముచే తప్తుడైన జీవి సంసారము యెడల హేయబుద్ధిని పెంపొందించికొనిన సాధకునికి, దీక్షనిచ్చి, యిష్ట ప్రాణ మరియు భావలింగముల యుపాసనా మార్గమును తెలియజెప్పిరి. షట్స్థల సాధన ద్వరాతాపత్రయమును నేవిధిన నాశనము చేయవలెనో యనునది యుపదేశించిరి. అనల్పజ్ఞాన సంపన్నులు నితోధిక లబ్ధిని పొందుచున్నారు.

అల్పజ్ఞాన సంపన్నుల విధము మరొక విధిన నున్నది. మద్యపానాది మత్తు పదార్థములను సేవించుట, మనోరంజకములగు నృత్య, గానా నాటకాదులు ద్యార లబ్ధిని పొందుట మొదలగునవి తాపత్రయమును దూరము చేసెడి మార్గములను యెంచబడుచున్నవి. ఇది యదార్థము కాదని తెలిసికొనవలెను. వీటి వలన దుఃఖములను తాత్కాలికముగా మరచిపోవచ్చును. ఆత్యంతిక నివృత్తి కాదు. అందుచేత యిట్టి మార్గములలో పయనిస్తూ కాలమును వృధా చేయకుండా, వీరశైవాచార్యులు సూచించిన మార్గమును ననుసరించుట శ్రేయస్కరమని గుర్తెరుగగలరు.

ఓం శాంతి శాంతి శాంతి

ది 30-7-1990
శ్రీ సిద్దేశ్వర దేవస్థానం
సొన్నలాపురము

## విశేష ప్రదీపిక :

దుఃఖముల స్వరూప స్వభావములను శ్రీజగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు తమ ఆశీర్వచనములో వివరణాత్మకముగా తెలియజేసిరి.

సుఖదుఃఖములకు పరస్పరముగా వైరుధ్యముండదని యెంచెడి వారెందరో గలరు. దుఃఖము యెడ విముఖత ప్రదర్శించుచు, సుఖము నభిలషించునది లోకాచారమై యున్నది. సుఖజీవన సంప్రాప్తికై సర్వ శక్తుల నవిశ్రామముగా వెచ్చించే వారధిక సంఖ్యలో గలరు. వీరెల్లరూ భాగ్యవంతులు కావలెననెడి తపనలో ఆరోగ్యమే మహాభాగ్యమనెడి విజ్ఞతను విస్మరింతురు. ధనకనకాదులు దగ్గరగును. ఆరోగ్యము దూరమగును. రోగపీడితులై నిరంతరము దుఃఖములో మునిగి యుందురు.

**"రుజ్యంతే సంతప్యన్తే అనయేతి రోగః"**

అనెడి వ్యుత్పత్తి ప్రకారము దేనిచేత తపింప జేయబడుదురో యది రోగమనబడుచున్నది. వివిధములైన పీడలు రోగముల వలన సంభవించును. దీనికి ఆమయః అనెడి పర్యాయ పదము గలదు. **"ఆ మీనాతీత ఆమునః"** అనెడి వ్యుత్పత్తిననుసరించి, అంతటి హింసించునది రోగమని తెలయుచున్నది. రోగముల సంఖ్యాకములుగానున్నవి. యీ సంఖ్య దినదినము పెరుగుచుయున్నది. రోగిష్టిగా నున్నవారి సంఖ్యయూ పెరుగుచున్నది. రోగము యెందుకు సంక్రమించునో యనెడిది తెలియుటలేదు. అనేకులు ననేకానేకమైన కారణములను వివరింతురు. భౌతికపరముగా ఆలోచించెడివారు తెలిపెడి కారణముల స్వభావము వేరువేరుగ కన్పట్టుచున్నది. ఈ విషయమున విద్యావాచస్పతుల వారి యాశీర్వచనము విజ్ఞాన దాయకముగానున్నది.

భౌతికేతర పథమున పరిశ్రమించెడి వారి యభిప్రాయములు మెండుగా గలవు. గ్రహచలనము నొకానొక కారణమైయున్నది. సూర్యచంద్రాది గ్రహములు నుండెడి స్థితిని బట్టి యారోగ్యమనారోగ్యములు గల్గుచున్నవని తెలుపబడుచున్నది. పురోహితులు చూపించెడి ఉపశమన మార్గములలో కర్మకాండనొకటిగ యున్నది. కర్మకాండ వలన జీవి ప్రవృత్తి మార్గము వైపు మరలును. మాయాశక్తికివశుడై మరు జన్మకు లోనగునని విజ్ఞులు తెలుపుచున్నారు.

వాస్తు శాస్త్ర నిపుణుల ప్రకారము గృహనిర్మాణములో సంభవించిన లోపముల వలన రోగాదులు సంక్రమించెడి యవకాశము గలదనుచున్నారు. వీరు దశదిక్పాలకుల దృష్టి పరచుటకై హోమాది కర్మలను చేసిన యెడల వాస్తు దోషములు నివారింపబడి రోగాదులు క్షీణించునని చెప్పుచున్నారు. వీరు సూచించిన విధిన కర్మలను చేసిన యెడల కర్మబంధములు సడలెడి యవకాశములుండవు. కామ్యకర్మలవలన కర్మలత బలీయమై జీవునిసంసార లంపటమున యిరికించునని యుపనిషద్యాదులు తెలుపుచున్నవి. వారు నిష్కామ కర్మమార్గమే ముక్తి దాయకమని తెలుపుదురు.

అవిద్య ప్రభావమునకు లోనైన వారెందరో భూతప్రేత పిశాచాదులే రోగములను కల్పించునని భూతవైద్యుల నాశ్రించుచున్నారు. రోగనివారణకై క్షుద్రపూజలను చేయుచు, జంతుబలిని ప్రదానము చేయుచు రోగోపశమనమును వాంఛింతురు.

మానసిక రోగములైన రాగ ద్వేషములకు లోనైన వారు మనశ్శాంతికై పలు విధములగు వ్యసనములకు లోనగుచున్నారు. లోకవ్యవహారముల వలన రాగద్వేషములు గల్గుచున్నవనియును, మానసిక వత్తిడి చేత సమస్య జటిలమగుచున్నదనియు వాదించుచున్నారు.

పూర్వోక్తమైన చర్చలో బహిర్గతమైన విషయములలో సత్యాసత్యము లెట్టులుండినను, ఈ చర్చ రోగ సంబంధమైన సమస్య తాత్విక పరముగా అవగాహన జేసికొనుటకు దోహదము చేయదని భావించెడి యవకాశము కలదు. ఇట్టి భావన నిరాధారమైనదని చెప్పక తప్పదు. నిశిత పరిశీలన చేసిన వారికి నిజతత్వము తెలియును. అయినను, ఈ విషయమై కొంత వివరణ యిచ్చిన యెడల విషయములో స్పష్టత గోచరించునని యెంచనైనది.

ఇంతకు క్రితమే పిండ స్థలమున తెలిపిన యటుల, సకల సంసార దుఃఖములకు కర్మయేకారణభూతమైన యంశము. రోగాదులకు కూడా కర్మయే కారణమగుచున్నదని తెలిపెడి శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమీ క్రింది విధిన నున్నది.

**శ్లో॥ అవిద్యా మోహితా జీవా బ్రహ్మైక్యఃజ్ఞానవర్జితాః॥**
**పరిభ్రమన్తి సంసారే నిజకర్మానుసారతః॥**
**చక్రనేమి క్రమేణైవ భ్రమన్తి హిశరీరణః**
**జాత్యాయుర్భోగ వైషమ్య కారణం కర్మ కేవలమ్॥** (సి.శి.:5:43-47)

రోగమనెడి దుఃఖోపభోగమునకు కర్మయే కారణమని తెలపబడినది. ప్రారబ్ధ కర్మవలన రోగాదు గల్గునని కర్మవాద విదులు తెలుపుచున్నారు. ఇది యట్టులుండగా, ప్రకృతి వాదుల ప్రకారము, పంచభూతములే రోగాదులకు హేతువులైయున్నవని తెలిపిరి. భూమ్యాదుల వలనను, అగ్నిజలాదుల వలనను రోగములు గల్గుచున్నవని తెలుపుబడినది. కాలవాదుల ప్రకారము, శరీరము కృషించి బలహీనమగుటకు కాలమే కారణమనియును, శరీరము జీర్ణమయ్యెడి దశయైన వృద్ధాప్యమున రోగములధికముగా గల్గుచున్నవనియును తెలుపబడినది..

ఈ విధముగా వివిధ తత్త్వములు వివిధ కారణములను ప్రతిపాదించుచున్నవి. వీటిలో కొంత మేరకు సత్యము గలదని దోచుచున్నది.

భక్త్యుద్యమము ప్రభవించిన పిదప భక్తియే సకల రోగ నివారిణి యనెడి భావమునకు బలము చేకూరెను. భక్తి చేత రోగ నివారణ చెందిన భక్తుల కథలు బహుళ ప్రచారమును పొందినవి. సర్వేశ్వర శకతములోని యీ క్రింది పద్యమును గనుడి.

శ్లో॥ పెంపందల్లి యగున్ రుజాపటల దుష్పీడా విధిక్షోభవా
వారింపన్ వైద్యుడగుం గుమార్గవిధులం(గ్రీడింప బోకుండశి
క్షింపన్ బల్లిదుడైనతండ్రియగుచున్ శ్రీమంతుగానెంతయున్
సంపద్వృద్ధియొనర్పదాతయగు నీసద్భక్తి సర్వేశ్వరా
(యథా వాక్కుల అన్నమయ్య సర్వేవ్వర శతకము56)

శివుడు భవ రోగమునే కాదు, భువిన గల సకల రోగములను నివారించునని యీ పద్యము చాటుచున్నది.

ధక్షుని శాపము చేత క్షయ రోగమును పొందిన చంద్రుడు, శివ భక్తి వలన పూర్తిగా క్షయము కాకుండగ కాపాడ బడెననెడి పౌరాణిక కథ శివభక్తి వలన రోగ నివారణ జరుగుననెడి భావన నిజమగుచున్నది. బ్రహ్మవైవర్త పురాణములో నొక కథగలదు. వివరములు గోరువారు పండితారాధ్య చరిత్రయందలి వాద ప్రకరణలోని ఇందు ధారణము గావించగలరు.

క్రి॥శ॥640లో నున్న దండి మహాకవికి కాలవశమున కుష్ఠరోగము వచ్చి యుండెననియును, ఎన్ని ఔషధములను సేవించినను ఫలితము లేకుండెననియును, సూర్యనారాయణోపాసన చేసినను వ్యాధి పోలేదనియును, శివోపాసన చేసి, అనామయస్తవమును వ్రాసి, ఆ వ్యాధిచే విముక్తిని పొందెననియు తెలిపెడి గాథ యొకటి గలదని శ్రీ లి॥ పండిత వీరభద్ర శర్మ చిదిరేమఠము (జగద్గురు) వారు తెలిపిరి. (శివ పంచస్తవి)పు160)– ఈ క్రింది శ్లోకమును గమనించిన యెడల యీ గాథ సత్యదూరమైనదికాదని తెలియును.

శ్లో॥ కశ్చిస్మర్త్యః పరికృతతను ర్నీలోకుత్సయాచేద్
దృష్ట స్నిగ్ధస్సే పునరమస్త్రీ భుజగ్రాహ్యకంఠః
అప్యారుధి సురపరివృతం స్థాన మా ఖండలీయం
త్యం చేత్రుద్ధస్సపతితి నిరాలంబద్ధాతజాలే (అనామయస్తవము, శ్లో.10)

ఈ శ్లోకమును ఆంధ్రీకరణ చేసి లిం॥ పండిత చిదిరె మఠం వీరభద్రశర్మ (కాశీ జగద్గురు) వారు, రచించినయీ క్రింది పద్యముపై శ్లోకములోని భావమును ప్రతిఫలించుచున్నది.

చం॥ హర! భవదీయ దివ్యకృపనందినచో గృశుడున్కురూపియున్
సురవనితాగ్రహారనవసుందర్వదేహుడుకాడె? ఎవ్వడే
నురుతరమైన నింద్రపదమొప్పుగనెక్కడె?దేవపూజ్యుడై
మరికుపితుండవైన బడిమ్రగ్గడె తామకకూపమందునన్
(ఆంధ్రానామయస్తవము, ప.10, శివపంచస్తవి, పు.తు.191)

ఈ విధముగారోగ పీడ చేత బాధపడెడి వారెందరో శివకరుణను సంపాదించి రోగము నుండి విముక్తిని పొందెదరని తెలియుచున్నది.

తాత్వికముగా చూసిన యెడల శివుని శక్తి మాయా శక్తిగా పరిణమించి ప్రకృతిగా రూపాంతరము చెంది పురుషుడుగా మారిన శివుని భోగోపభోగ యనుభవమునకు సహాయ కారిగా నుండును. మగ్గయ మాయిదేవుని శివాను భవ సూత్రము ప్రకారము జీవుని యుద్ధరించుట శక్తియే భక్తియై జీవుని రూపములో నున్న శివుని సేవించుచున్నది. భోగపబోగముల వలన గల్గిన రోగములను నివారించుచున్నది. యీ కారణము వలననే కాబోలు, అన్నమయ్య శివభక్తి జీవునికి తల్లి, తండ్రి, వైద్య, దాతలుగా సహకరించునని తెలిపిరి. పోషణ వలన పెరుగుదలను దృఢతరము చేసెడి తల్లి పాత్రను పోషించెడి భక్తి వలన ఆధ్యాత్మిక దుఃఖములు దూరమగును. తండ్రిగా దండించి దుర్మార్గవర్తనను నివారించుంట చేత దుస్సాంగత్యాదులు నివారింపబడును. నిషిద్ధకర్మలు చేయబడవు. భౌతికముగా, శరీరములో రోగ నిరోధక శక్తియు పెరుగును. ఆనందమయమైన జీవితము సంప్రాప్తమగును. వైద్యుని పాత్రలో శివభక్తి రోగోపశమనము గల్గించునని యింతకు క్రితమే తెలిసికొంటిమి. శివభక్తి దాతయై భౌతిక సంపదతో బాటుగా ఆరోగ్యమహాభాగ్యమును ప్రధానము చేయును. ఇది యిట్టులుండగా శుద్ధతత్వత గల శివుడు తన కర్తృత్వలక్షణము వలన పంచభూతములను, దేవ దానవ భూత పిశాచ యక్షాదులను తన నియంత్రణలోనికి తెచ్చికొని, వాటికి తగు ఆదేశముల నిచ్చుచు శివభక్తి సహితుడగు జీవుని ఆది భౌతికమరియు ఆధిదైవిక దుఃఖముల నుండి కాపాడుచున్నాడు.

జీవుడు శివభక్తి వలన తగిన ఫలితములను తగు రీతిలో పొందవలెననినచో శక్తి పాతము కావలెను.శక్తిపాతమును గల్గించెడి శక్తి శ్రీ గురువుకు మాత్రమే ఉండును. అందుచేత పిండజ్ఞాన స్థలమున నున్న భక్తుడు సంసారము యెడల హేయతాభావమును పూని గురుకారుణ్య స్థలము నందు పయనించుటకు ప్రయత్నించవలెను. వీరశైవధార్మిక వ్యవస్థలలో పంచ జగద్గురువులు, చరపట్టాధికారము గల చరమూర్తుల నబడెడి శివాచార్యులు మరియు మఠమయ్యలు మాత్రమే గురుస్థలీయులని పిలువబడుచున్నారు. గురు క్రమానుగత శ్రేణిలో జగద్గురువు సర్వోత్కృష్టస్థానము నుండగా శివాచార్యులు మధ్య స్థానమునను, మఠమయ్య క్షేత్రస్థాయిలో నుండును. పరంపరానుగతముగా వచ్చెడి యీ ధార్మిక వ్యవస్థను గుర్తెరిగి, పిండజ్ఞాని వీరిలోని యే ఒక్కరి దగ్గరికైనను చేరవలెను. వారివలన కృపను బడయుటకు కృషి చేయవలెను. కృపగల్గిన వాడు శక్తి పాతమును సాధించుటకు అర్హతను పొందగల్గును. తద్వారా భౌతిక పరరోగములే భవరోగములను కూడా నిర్మూలనము చేసికొనగలడు.

**శుభం భూయాత్**

## ఆశీర్వచనము : 7

## సంసార హేయ స్థలము

**శ్లో॥ దుఃఖైరేతైరుపేతస్య కర్మబద్ధస్య దేహినః।**
**స్వర్గేవాయదివా భూమౌ సుఖలేశో న విద్యతే॥** (సి.శి.5:70)

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక మరియు ఆదిదైవికములనెడి దుఃఖముల చేతను, పుణ్యపాపములనెడి కర్మపాశముల చేతను బంధితుడైన జీవికి స్వర్గమునందునగాని, భూమి మీదగాని లేశమాత్రమైననూ చోటు ఉండదు.

**శ్లో॥ తటిత్సోవీచీమలాసు ప్రదీపస్య ప్రభాసు చ।**
**సంపత్సు కర్మ మూలాసు కస్యవా స్థిరతామతిః॥** (సి.శి.5:71)

మెరుపు తీగలయందుననూ, సముద్రపుటలల వరుసల యందును, దీపపు శిఖయందునను ఏ విధిన శాశ్వతత్వముండదో, అదే విధిన ప్రారబ్ధ కర్మవశమున గల్గెడి సంపత్తునకు శాశ్వతత్వముండ జాలదని వివేకవంతులు నెరుగుదురు.

త్రాటికి కట్టబడిన బిందెను చేదుబావిలో వేసిన పిదప నది త్రాడును లాగితే పైకి వచ్చును. త్రాటిని వదలితే బావిలోని లోతునకు వెడలును. అదే విధిన జీవుడు పుణ్యపాపములనెడి కర్మ పాశముల చేత బంధితుడై, కర్మ తననెటువైపునకు నీడ్చునో యటుపోవును, ఏది తినిపిస్తే దానిని తినును. ఎచ్చట పరుండబెట్టిన యచ్చట పరుండును.

భూలోకము నందున, బాల్య, యౌవన, వృద్ధాప్య మరియు మరణములనెడి యవస్థలు, ప్రతి ఒక్కరికీ వచ్చును. విచారము చేసి చూసిన యెడల యీ యవస్థలలో సుఖము కంటెను దుఃఖము యధికముగా నుండును. జన్మించేటప్పుడు, ప్రసవించి భూమి మీద పడుటచేత జననమూ ఒక మహా దుఃఖమే. బాలికల కైతే కర్ణవేధ జరుపబడును. అది దుఃఖమే. పాఠశాలలకు వెడలు నప్పుడు గురువుగారు దెబ్బలను కొట్టుచున్నారు. ఈ విధముగా బాల్యము పలు విధములుగా పరాధీనమై దుఃఖమయమగుచున్నది.యీయనుభవములను వివరించెడి శివ ధర్మోత్తరములోని యీ శ్లోకమును గనుడి.

**శ్లో॥ కౌమారే కర్ణవేధేన మాత పిత్రోశ్చతాడనాత్।**
**అక్షర ధ్యయనాద్యైశ్చ దుఃఖ స్యోద్గురు శాసనాత్।**

యవ్వనావస్థలో రేయింబవళ్లు బాధలే గల్గును. మనస్సునందున ఉత్పన్నములయ్యెడి కామారాగాదులు రాత్రివేళలో పట్టి పీడించును. పగటి వేళలో కుటుంబ భారమును మోయుటకై వలయు ద్రవ్యమును నేవిధిన సంపాదించవలెనో యనెడి వ్యధతో బాధపడుచుండును.

వృద్ధాప్యమున సంభవించెడి దుఃఖము లనేకము. అయ్యవి యవర్ణనీయములు. యింటికి అంటిన నిప్పు యింటిలోని సంపత్తిని కాల్చివేయును. బూడిద మాత్రమే మిగులును. వృద్ధాప్యమనెడి అగ్నిమేనును ముట్టిన, వ్యక్తి యొక్క సామర్థ్యములన్నియూ క్రమేపీ తగ్గిపోవును. చూసెడి, వినెడి, ముట్టెడి, వాసన చూసెడి, వచ్చెడి, పోయెడి సామర్థ్యము తగ్గి కాయము నిరుపయోగముగా తయారగును.

నోటిలోని పళ్ళూడిపోయి, వాణికుంఠితమై, యింద్రియములు దుర్బలములైన దానిని చూస్తే యీ వృద్ధునికి మరల బాల్యము వచ్చిన యటుల దోచును. అదే విధిన వృద్ధుల స్వభావము బాలకుల స్వభావమును పోలియుండును. తన శక్తుల నెల్లా కోల్పోయిన ముదుసలి వాని మాటను యెవ్వరూ వినరు. పడతియును సరిగ్గా సేవను చేయదు. పిల్లలు శాత్రువులగుదురు. ఇట్టి స్థితిని యెంతో చక్కగా వర్ణించిన ఘతన యీ క్రింది సుభాషితమును వ్రాసిన వానికి దక్కును.

**శ్లో॥ గాత్రం సంకుచితం గతిర్విగలితాభ్రష్టాచదంతావలిః**
**దృష్టిర్నశ్యతి వర్ధతే బధిరతా వక్త్రంచ లాలాయతే॥**
**వాక్యం నాద్రియతేచ బాంధవజనైర్భార్యానశుశ్రూషతే।**
**హా కష్టం పురుషస్వ జీర్ణవయసః పుత్రో2ప్యమిత్రాయతే॥**

ఈ తెరగున, ముదుసలి తనముననూ సుఖముండదు. మరణమున సుఖముండునా? అదియును సుసాధ్యము కాదు. అందుకే శ్రీ భగవత్పాదులవారు "దేహినః సుఖలేశోనవిద్యతే" యని సెలవిచ్చిరి.

పుణ్యాధిక్యత మూలమున స్వర్గమునకు పోయిన వారికి సుఖముండదా? అనెడిప్రశ్న యుదయించవచ్చునేమో? అద్దానికిసమాధానమును వినుడి. ఏదో యొక పుణ్య విశేషము చేత స్వర్గము చేరినా, చింత యనెడిది వారిని వెన్నంటియే యుండును. పుణ్యాధిక్యత క్షీణించే క్రమములోనే వారి చింత హెచ్చును. పుణ్యము నిశ్శేషమైన పిదప స్వర్గమును వీడవలెననెడి చింతచేత స్వర్గవాసి దుఃఖమును ననుభవించును. ఈ విధముగ జీవికి స్వర్గమునకు పోయిననూ సుఖము లభించదు.

సంసారమునందున మనము పొందెడి సుఖము వాస్తవముగా సుఖము కాదనియును, జీవుడు భ్రమ ప్రభావమునకు లోనై దుఃఖమునే సుఖముగా భావించికొని జీవిస్తున్నాడనియు తెలిపెడి యీ క్రింది శ్లోకమును గనుడి.

**శ్లో॥ గతసారె2త్రసంసారే సుఖభ్రాంతిఃశరీరిణామ్।**
**లాలాపానమివాంగుష్ఠే బాలానాంస్తన్యవిభ్రమః**

చంటి పిల్లలు వ్రేలును తల్లి చనుమొనయని భావించి చీకుదురు వారికి పాలు లభ్యమగునే? కావు కదా! అదే విధిన నిస్సారమైన సంసారమున జీవి దుఃఖమును ననుభవించుచు, భ్రమకు లోనై యద్దానిని సుఖమని యెంచుచున్నాడు.

ఇది యిట్టులుండగా, క్షణములో వచ్చి, మరుక్షణమే మాయమయ్యెడి సంపత్తు యొక్క చంచల స్వభావమును గుర్తించకుండా దాని మీద మమకారమును పెంచికొను వారెందరో గలరు.

ధనాన్ని గడించుటకై యెన్నియో దుఃఖముల చవిచూడవలెను. కఠిన పరిశ్రమవలన ధనమును సంపాదించవలెను. అది వచ్చిన వెను వెంటనే అన్నదమ్ముల నుండి కీడు వచ్చును. తర్వాత రాజు నుండియును, దొంగల వలనను ముప్పు ఏర్పడవచ్చును. ఇంటిలో భద్రముగా పెట్టినచో అగ్నిప్రమాదము వచ్చునేమో యనెడి భయము గుల్గును. భూమి యందు పాతిపెట్టినచో యక్షాదుల వలన భయము గల్గును. వీటినన్నిటిని తట్టుకొని ధనమును కాపాడుకొనినచో పిల్లలు ధనమును విచ్చలవిడిగా వ్యయపరచి, మనస్సుకు సంతాపమును చేకూర్చెదరు. యీ విధముగా ధనము వలన సుఖము కంటెను దుఃఖమే అధికముగా నుండునని గ్రహించవలెను.

నీతిశాస్త్రజ్ఞులు సంపదను రోగముతో పోల్చిరి. రోగ గ్రస్తుడు, రోగము మూలమున, అంగవైకల్యము పొందెడి యవకాశముండును. అదే విధిన, సంపద వలన యంగవైకల్యమేర్పడునని తెలిపెడి యీ సుభాషితమును గనుడి.

**బధిరయతి కర్ణవివరం వాచం**
**మూకయతి నయనమంధయతి।**
**వికృతయతి గాత్రయష్టిం**
**సంపద్రోగోయ మద్భుతో రాజన్॥**

సంపద యనెడి రోగము నెంతో నద్భుతమైన దనియును, దాని వలన చెవులు చెవుడును, ముఖము మూగతనమును, కళ్ళు గ్రుడ్డితనమును పొందుననియును, కాయము వికృత స్వరూమును పొందుచున్నదని యీ సుభాషితములోని భావము. ధనము వలన యహంకారము సంప్రాప్తమగుననియును, అట్టి అహంకారము వలన కళ్ళు కనిపించవు, చెవులు వినిపించవు, నోరు మూగబోవును, మేను ఎన్నో విధములుగా వంకరటింకరగా తయారగునని గ్రహించవలెను. ఈ మార్పులన్నియును భౌతికపరమైనవి కావనియును, ప్రవర్తనాపరమైన వనియును గుర్తించవలెను.

సంపద చేత గర్విత మతులై చరించెడి వారి గురించి చెప్పుచు "హావు తిందవం నుడిసబహుదు.."అనే వచనములో దరిద్రమే యీ రోగమునకు ఔషధమని తెలియజెప్పిరి.

**హావు తిందవరనుడిసబహుదు**
**గరహెడెదవర నుడిసబహుదు**
**సిరిగరహెడెదవర నుడిసలు బారుదు నోడయ్యా**
**బడతన మెబ మంత్రవాది హోగలు రుదనె**
**నుడిదరు, కూడల సంగమయ్య దేవా।** (బ.స.వ.132)

**దీని తెలుగు రూపమును గనుడి.**
**పాము తినిన వాని నుడివించవచ్చు**
**గాలి కొట్టిన వానిని నుడవించవచ్చును.**
**సిరగరకొట్టిన వారిని నుడివించ రాదు చూడయ్యా**
**బడుగు తనమనెడి మంత్రవాది పోవగనె**
**నుడువుదురయ్యా, కూడల సంగమదేవా।** (బసవేశ్వర గీతామృతము. పు. 163)

శ్రీ నిజగుణ శివయోగుల వారు సంపదను విషమిశ్రితమైన తేనె, నెయ్యిలతో పోల్చిరి, చలి యందు రుచికరముగా నుండి, పరిణామము ప్రాణములను తీసెడి యీ పదార్థముల వలెనే, సిరి మొదటగా కొంత సుఖమునిచ్చినా, చివరన పలు విధములైన విషపరిణామములు గల్గుటకు కారణమగుచున్నది. ఈ విధిన తెలుపుచు, ధనమును కూడ బెట్టుట కంటెను దానిని సత్పాత్రత గలవారికి దానము గానిచ్చి కైలాసమునకు వెళ్ళెడి యర్హతను పొందవలెనని ఉద్భోదించిరి. శివభగవద్భజన మాన కుండగ నుండవలెననిరి.

దురాశ గలవాడు దుర్మార్గుడై చివరకు హంతకుడై, పూజ్యులైన వారినైనను కూల్చెడి స్థాయికి దిగజారును. యీ క్రింది శ్లోకమును గనుడి.

**మాతరం పితరం పుత్రం భాత్రరంవా సుహృత్తమమ్।**
**లోభావిషోడ నరోహంతి స్వామినం వా ససహోదరం॥**

సంపత్తు వలన లోభము గల్గును. లోభమును పొందినవాడు, తల్లిని, తండ్రినీ, కొడుకును, మిత్రుని, స్వామినీ, సోదరుని చంపుచున్నాడని శ్లోకములోని భావము.

సపంత్తు వలన లోభము, లోభము వలన క్రోధము, క్రోధము వలన ద్రోహము గల్గుచున్నవనియును, సంపత్తే అన్నింటికినీ మూలమని గ్రహించవలెను. సిరి యనెడిది యొక సంతలో కూడి కొని యున్న జనుల వంటి దనియును, దానిని నమ్ముకొని చెడవలదని బసవనవారు సెలవిచ్చిరి.

**సంసారమెలుదొందు గాళియ సొడరు**
**సిరియెంబు దొందు సూతెయమంది కండయ్యా!**
**ఇడనచ్చి కెడబేడ సిరియెంబుద**
**మరెయదెపూజిసు నమ్మకూడల సంగమదేవన** (బ.స.వ.164)

**సంసారమనెడిదొక గాలిలోని దీపము**
**సిరియనెడిదొక సంతలోని మంది, కనుడయ్యా**
**దీనిని నచ్చి చెడవలదు, సిరియనెడి దానిని**
**మరువక పూజించు మన కూడల సంగమ దేవుని** (బ.స.వ.164)

జ్ఞానులైన వైరాగ్య మూర్తులు, ధనమును తృణముతో సమానముగా చూచెదరు. భక్తిపరులు సంపద సంపాదనయెడల భక్తిని పెంపొందించు కొనకుండ, భగవంతుని గూర్చి భక్తిని పెంపొందించి కొందురని శివశరణుల చరిత్రల వలన తెలియుచున్నది. అందుచేత, శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు సూచించిన యటుల మెరుపు తీగవలె క్షణ కాలము మాత్రమే యుండెడి సంపద యెడల గల స్థిర బుద్ధిని త్యాగము చేసి, భగవంతుని యెడల స్థిరబుద్ధిని పెంపొందించుకొనవలెను. ఇది మన యెల్లర కర్తవ్యమైయున్నది.

ది. 31-07-1990,
శ్రీ సిద్దేశ్వర దేవస్థానం-షాపూర్

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేష ప్రదీపిక :

సుఖమనెడిది లేదనియును, భ్రాంతిచే దుఃఖమునే సుఖమని భావించి జీవించుచున్నామని తెలిపిన శ్రీ జగద్గురువుల వారి యీ ఆశీర్వచనము అమోఘమైనది.

"భ్రాంతి మూల ప్రపంచ..." (సి.శి.12-18)

అనెడి ఆచార్యోక్తి ప్రకారము, ప్రపంచములోని వస్తుసంచయము నెడల జీవుడు భ్రాంతికి గురియగుచున్నాడు. మాయచేత తనది కానివి తనదని భ్రమించి మమకారమును పెంచుకొనుచున్నాడు. మమకారము రాగద్వేషములకు పుట్టినిల్లగు చున్నది. రాగ ద్వేషముల వలన దుఃఖము ద్విగుణీకృతముగుచున్నది. నానాటికి పెరుగు చున్న దుఃఖ పరంపరల నేపథ్యములో సగటు మనిషి సుఖాభిలాషను పెంచి కొనుచున్నాడు.

సుఖమనెడిది భావనా ప్రపంచమునకు సంబంధించిన విషయము. తృప్తి దీనికి మూలాధారమై నది. తృప్తి లేని వానికి సుఖమెక్కడిది. ఉన్న దానితో తృప్తి పడి, యీ తృప్తికి కారణమైన వస్తు సంచయాదులు శివదత్తమైనవనీ భావించెడి వాడు. దుఃఖమును అలనుభవించడు. అసంతృప్తి గల వాడు అమరేంద్ర పదవిని యధిష్ఠించినను సుఖమును చవి చూడలేడు.

తృప్తి అసంతృప్తులు పరస్పర సంబంధముగల అంశములు. వీటి మధ్యగల బేధము సాపేక్ష పరమైనదే కాని సంపూర్ణమైనది కాదు. కాలానుగుణముగా అసంతృప్తి గాను, తృప్తి అసంతృప్తిగాను పరిణమించును. ఇవి శీఘ్రగతిన జరుగుతున్నవని తెలిసికొనవలెను. ఒక దశలో అసంతృప్తి అధిక మొత్తములో సమకూడుచున్నది.

అసంతృప్తి వలన దుఃఖము పరివ్యాప్తమగును. అసంతృప్తి రాహిత్యమును సుఖమని యెంచుటకు వీలు లేదు. భవిష్యత్తులో శ్రేయస్సు గల్గుననెడి భావనయే సుఖము. విషయ భోగములవలన గల్గెడిది సుఖము కాదనియును, సుఖమని దోచెడి దుఃఖమే సంప్రాప్తమగును. నిజమైన

సుఖమెట్టిది యనెడి విషయములో విభిన్నమైన యభి(ప్రాయములు తలయెత్తినవి. ధనము వలన చిరకాలము సుఖముగా నుండవచ్చునని కొందరు భావిస్తే, పుణ్యమును చేసి స్వర్గమున విరాజిల్లెడి సుఖముననుభవించాలని మరికొందరు భావింతురు. ఈ రెండు మార్గములు శాశ్వతమైన సుఖముల నివ్వజాలవని గ్రహించిన వార్తు అంతర్గత సుఖమును అపేక్షింతురు. అదియే శాశ్వతమైన సుఖమని నమ్ముదురు.

అయితే యివన్నియు నిరర్థకములే యనెడి వాదన యొకటి కలదు. దీనిని యథావాక్కుల అన్నమయ్యగారు సమర్థించినట్లు తెలిపెడి ఆధారమొకటి గలదు. ఈ కవి బసవన్న కంటెను సుమారు 50 సం॥ తరువాతి కాలమునకు చెందిన వాడనియును, సోమనాథుని కంటెను, పూర్వుడనియును తెలియుచున్నది. వీరి యీ పద్యమును గనుడి.

**"సమదోత్సాహ సుఖాభిలాషలును నీ సంసార మాయావినో**
**దములున్ స్వర్గ ఫలాపవర్గఫల చిత్తభ్రాంతులుంబ్రాజ్వరా**
**జ్యమహాకాంక్షలునెన్ని చూడనివి నీ సదర్భక్తికత్యంతరా**
**యములైమాటికి మాటి కడ్డుపడు గామ్యశ్రేణి సర్వేశ్వరా!"** (సర్వేశ్వర శతకము, ప.72)

ఈ కవి భక్తియే పరమోత్కృష్టమైనదనియును, మోక్షము కంటెన అధికమైనదని చాటి చెప్పెను. బసవ పురాణములోని కొన్ని కథలు యీ భావమునే చాటుచున్నది. శివుడు ప్రత్యక్షమై యపవర్గమిచ్చెదగైకొను మనిన సందర్భమున, అపవర్గము కంటెను భక్తులను సేవించుచు భూలోకములో నుండుటయే యుత్తమమని యాపవర్గపదమును తిరస్కరించిరి. ముముక్షువుల కీ విషయము ఆశ్చర్యము గొలుపవచ్చును. అన్నమయ్య శ్రీ భగవత్పాదుల వారి యీ యుపదేశము నాధారముగాగొనియే పద్యము రచించిరనెడి విషయము నెరిగిన వారెవ్వరూ లేరు. సర్వేశ్వర శతకమును ప్రకటించివారు యీ విషయమును స్పృశింపరైరి. వీరశైవ ధర్మ రహస్యమును ప్రతిబింబించే యీ వాదన వలన తెలిసేదేమనగా లింగాంగ సామరస్యమును మించిన సుఖము లేనేలేదు. సంసారములో నట్టి సుఖము లభించదు. కైవల్యములోనూ ఇట్టి సుఖము లేదు ఇట్టి శాశ్వత సుఖమునిచ్చెడి శివజీవైక్య సాధనకై పిండజ్ఞాని శ్రీ గురువు నాశ్రయించవలెనని తెలిసికొనగలరు.

**-: శుభం భూయాత్ :-**

## ఆశీర్వచనము : 8

**శ్లో॥ మలకోశే శరీరేస్మిన్ మహాదుఃఖవివర్ధనే।**
**తడిదంకుర సంకాశే కోవా మోదేతపండితః॥** (బ.స.వ.5:68)

మాలిన్యమునకు నిలయమై, మహాదుఃఖమును గలుగ జేయుచు, క్షణికమై మెరపు వలె తళుక్కుమని వారుక్షణమే మాయమయ్యెడి దగు, శరీరము నందున వివేకవంతులును అనురాగమును పెంచికొనరు.

**శ్లో॥ నిత్యానంద చిదాకారమాత్మతత్వం విహాయకః।**
**వివేకీ రమతే దేహేనశ్వరే దుఃఖభాజనే॥** (బ.స.వ.5:69)

నిత్యానంద దాయకమైనదియును, శాశ్వత మైనట్టిదియునగు ఆత్మతత్వమును వీడి యశాశ్వతమైన దుఃఖదాయకమైన శరీరము నందున వివేకమున్న వాడెవ్వడునూ క్రీడించి యీనందమును పొందునే? ఈ విధిన, శ్రీ భగవత్పాదులవారు, యుగయుగాంతరముల నుండియు, కల్ప-కల్పాంతరముల నుండియును లక్షలాది శరీరములలో నివసించి, దేహాభిమానమును పెంపొందించికొని, తన యంతరంగములో నెలకొని యున్న యాత్మజ్యోతి నరయకుండగ యుండి, సంసార చక్రమునందున చిక్కి కొని తిరుగాడెడి వారిని దృష్టి యందున నుంచికొని, యీ ఉపదేశమును చేసిరి.

ధనవంతుల యిళ్ళలో నుండెడి యినుప త్రిజోలి యందు యెంతో విలువైన రత్నమణి, మాణిక్యాదులు పొదుగబడిన రకరకములైన ఆభరణములు ధనము మొదలగునవి యుండునని మన మెరుగుదుము. శరీరమనెడి దానిని యేమేమి నింపబడినవనియు తెలిసికొనుటకై వివేకవంతులు విచారించిన యెడల సత్యము, బహిర్గతమగును. శరీరములో మలినము, దుర్గంధములుండునని తేలును అందుకే, శ్రీ భగవత్పాదుల వారు, శరీరమును "మలకోశ" మనిరి.

శరీరతత్వమును కళ్ళకు కట్టినట్టుగా వివరించెడి యక్కగారి వచనమును గనుడి.

**అమేధ్యద హడికె, మూత్రద కుడికె**
**ఎలువిన తడికె. కీవిన హడికె**
**సుడిలీ దేహవ, ఒడలవిడిదు**
**చెన్నమల్లికార్జున నరి మరుళె।**

తెలుగు రూపమును గనుడి;

**అమేధ్యపు పడిక, మూత్రపు కుడుక**
**ఎముకల తడిక, చీముది పడిక**
**కాలనియీ దేహము, ఒడలు విడిచి**
**చెన్నమల్లికార్జుని నెరగుము మరులా!**

లోకమున వస్త్ర ధారణ, ఆ భూషణముల ధారణ, సుగంధ ద్రవ్యములను పులుము కొనుట మొదలగునవి చేపట్టెడి విషయములో ఎంతో శ్రద్ధ కనబరచెడి వారెందరో గలరు. వాస్తవికముగా అమంగళకరమైన నగ్నకాయమును, ఇతరులు చూడవలదని వస్త్రములను ధరించుచున్నారు. శారీరక దుర్గంధము, ఇతరులకు సోక కుండుటకై సుగంధములను పులుముచున్నారు.

ఎన్ని సంస్కారములను చేసికొనినను, కుక్క తోక యెంత ప్రయత్నించిననూ చక్కగా కాకుండా వంకరగా నయ్యెడి విధిన, పరుండి లేచెడి వరకే మనిషి నవద్వారముల నుండి దుర్గంధము పొడసూపుట ప్రారంభమగును. వివిధ రకముల వాయువులు ఆవరించి యొక వ్యక్తి నిరోగగ్రస్తుని చేసిన యప్పుడును, ముదుసలి తనమునను, దేహి తన శరీరమును పరిశుభ్రపరచి కొనెడి స్థితిలో నుండడు. అప్పుడు, దేహము యొక్క అమంగళత్వము, అపవిత్రతలు తెలియవచ్చును.

దేహమనెడిది, అపవిత్రమైనదగు నొక పదార్థమని తెలిపెడి మైత్రేయ్యుపనిషత్తులోని వాక్కులను గనుడి.

**శ్లో॥ "భగవాన్ శరీర మిదం మైథునాదేవోద్భూతం**
**సంవిదపేతం నిరయ ఇవ మూత్రాద్వారేణ**
**నిష్క్రాన్తమస్థి భిచ్చితం మాంసే నానులిప్తం**
**చర్మణావబద్ధం విణ్మూత్రవాతపిత్తకఫ**
**మజ్జామేదోవ సాభిరన్యైశ్చ మలైర్బహుభిః**
**పరిపూర్ణమేతాదృశే శరీరే వర్తమానస్య**
**భగవంస్త్వంనో గతిరితి"** (1-3)

శరీరమనగా దంపతుల మైథునము వలన యుద్భవించి యోని ద్వారము నుండి బయల్వెడలి, ఎముకల చేత సుస్థిరయై, మాంసము చేత లిప్తియై, చర్మము చేత కప్పబడినదై, మల మూత్రవాతపిత్త కఫ మరియు మజ్జా మొదలగు అనేక మలిన పదార్థములతో కూడినట్టి యపవిత్రమైన పదార్థమని శ్లోకము లోని భావన. ఇట్టి శరీరమే నేననెడి భావన గల్గిన వానికి భగవంతుని ప్రాప్తి కాజాలదు. ఎంత కాలము శ్రమించినా, ఫలితముండదు.

**శ్లో॥ స్పృష్ట్వా స్వదేహ స్త్రోతాంసి మృతోయైః శోధ్యతే కరః**
**తథప్య శుచి బాందస్య న విరజ్జంతి కిం జనాః**

మనుష్యుడు శౌచాతి క్రియలకు పోయి వచ్చిన ఎడల మలమూత్రములు తాకినా చేతిని బాగుగా నీటిలో కడిగి శుభ్రము చేసికొనుచున్నాడు. ఇంతటి అనేక మలినత గల్గిన భాండమైన శరీరము వలన మనుష్యుడు అదెందుకో విరతిని పొందుటలేదని అనుభావులు ఆశ్చర్యమును పొందుచున్నారు.

ఒక ఊరి యందు యవ్వనము నందునే విధవ రాలైన ఒక యువతి ఉండెను. ఆమె మంచి సాంప్రదాయమైన కుటుంబమునకు చెందినదై యుండెను. ఇంటిలో తానొక్కతే భగవంతుని చింత యందు కాలము గడుపు చుండెను. ఆ ఊరిలో ఒక కామాంధుడు అసహాయురాలిగా యున్న యా అబలను తన కామ జ్వాలకు ఆహుతి చేయుటకై పొంచి యుండెను. అవకాశము కొరకై ఎదురు తెన్నులు కాయుచుండెను. ఓ సాయం సమయాన అతడు ఇంటికి వచ్చెను. ఎప్పుడు రాని యా దుష్టుడు తన ఇంటికి ఎందుకు వచ్చెనో యని ఆమె భయపడి, బెదరక అతనితో శిష్టాచారపు మాటలనాడటం ప్రారంభించినది. ఈ దుష్ట మనిషి లావణ్యయుక్తమైన ఆ యువతి శరీరమును చూస్తూ, కొంత సేపటికి కామము నెత్తినెక్కగా ఆమె శరీరము వైపు చేతిని చాచెను.

ధర్మ పరాయణురాలైన ఆ యువతి యుక్తితో తన మానమును రక్షించుకొన ఆమె అతనితో నిట్లనియె. ఓ ప్రియుడా నీకున్న అభిలాష నాకు గూడ గలదు. వెతుకుచున్న తీగ కాలికి చుట్టుకొనినయట్లు భగవంతుడు నిన్ను నా దరికి పంపించినాడు. మన ఇద్దరి యొక్క మనోరథమును నెరవేర్చినాడు. అయితే నొక సమస్య గలదు. ప్రకృతి ధర్మము ప్రకారము నేను అపవిత్రురాలనై యున్నాను. నీవు రేపటి దినమున వచ్చిన యెడల మన ఇద్దరి యొక్క మనోరథము నెరవేరగలదు. రేపు ఇదే సమయమునకు ఇక్కడికి రండి. అని వినయముగా పల్కెను.

ఆ యువతి మాటలను విని నా వ్యక్తి రేపటి దినమును సంస్మరిస్తూ తన ఇంటికి వెళ్ళిపోయెను. ఆమె ఈ విధిన ఆలోచించదొడగెను. ఇప్పుడు ఎట్లో అబద్ధమాడి తప్పించుకొంటిని. అయితే రేపు ఇతడి బారిన పడకుడా తప్పించుకొనుట ఎటుల" ఈ ప్రశ్న ఆమెను వేధించసాగెను. అంతలో నా రాత్రి గడిచెను. ఆమెకు ఒక ఉపాయముతోచెను. తన సౌందర్యమే పరపురుషుని చిత్తాకర్షణకు కారణమైనదనియును, అట్టి సౌందర్యమునకు మల మూత్ర రక్త మరియు మాంసాదులే కారణమనియును, వాటిని నియంత్రించిన ఎడల సమస్యకు పరిష్కారము లభించునని యెంచెను. ఆమె అతితీక్షణమైన విరోచన కారిణిని సేవించెను. మరుసటి దినమున తెల్లవారగానే శౌచ క్రియ ప్రారంభమయ్యెను. ఆ యువతి తన ఇంటిలో నొక మూలన గుంతలో చేసికొని అందులోనే శౌచమునకు పోయి వచ్చుచుండెను. వేకువ జామున ప్రారంభమైన ఈ శౌచ క్రియ సాయంకాలము వరకు కొనసాగెను. బలమంతయు బైటికి పోయి రక్త భేదులై ఆమె శరీరము శక్తి హీనమాయెను. ఆమె కళ్లు లోపటికి పోయి యుండెను. చెంపలు లొట్టలాయెను. శరీరము లోని రక్త మాంసములు విచలితమై అస్తిపంజరము వలె చూచెడి వారికి భయానకముగా దోచుచుండెను. ఈ స్థితి యందు ఆ యువతి తన గదిలో మంచముపైన పరుండెను.

నిన్నటి వలెనె మనస్సు నందు అసంఖ్యాకమైన ఊహ మేడలను నిర్మిస్తూ ఆ వ్యక్తి కాముని ప్రభావమునకు లోనైన ఆవ్యక్తి యువతి ఇంటికి వచ్చి ఆమె వైపు చూచెను. ఆమె స్థితిని చూచి ఆశ్చర్యమును పొందెను. ఆమెను ఈ విధముగ నడిగెను. నిన్న నిన్ను చూసినాను. నీదేహసౌందర్యము ఎక్కడికి పోయినది. అప్పుడు పవిత్ర భావములు కల్గిన యువతి అతని కిట్లనెను. మీరు నిన్న చూసిన సౌందర్యము ఈ గదిలో నొక మూలన వేసి మూసియుంచితిని, వెళ్ళి చూడండి అని యనగా వాడు ఆతురతగా పోయి మూతను తీసి చూసెను. లోపల దుర్గంధమును గ్రక్కెడి మలినము చూసి పరుగెత్తుకొని వచ్చెను. అప్పుడు ఆ యువతి అతనికి ఈ విధముగా బుద్ధి చెప్పెను. అన్నా! నీవు ఆ మూలన చూసి వచ్చిన ఆ మలినమే నా ఈ చర్మపు భాండమున నుండినప్పుడు ఈ శరీరము సుందరముగా కనబడినది. వాస్తవికముగా శరీరము నుందు దోచెడి సౌందర్యము మాయకమైనది. క్షణికమైనది. ఇట్టిక్షణిక సౌందర్యమునకు మోహితుడవై మీ ధర్మమును పాడుచేసుకొనవలదు.

ఆమె హితవాక్యములాదుష్టుడిని ఆలోచింపజేసెను. వాడు సన్మార్గమున పయనించెను. ఈ విధముగా ఆమె తన ధర్మమును కాపాడుకొనినది. ఎదుటి వాని ధర్మమును కూడా కాపాడుటకు కారకురాలైనది.

ఈ శరీరము, తాను అమంగళమై దుర్గంధ పూరితమై యుండుటయే కాదు, దాని సంబంధమును చేసికొనిన సకల పదార్థములను దుర్గంధ భరితముగా చేయుచున్నది. ప్రతి దినము ఇంటి యందు తయారు చేయబడిన పక్వాన్నములు,ఈ శరీరపు సంబంధముచే మొదట సుందరముగను సుగంధము వెదజల్లెడివిగ నున్న ఆ యా పదార్థములు మనుష్యుని ఉదరమందు ప్రవేశించి బయటకు వచ్చినపుడు ఆ అమంగళము

మరియు దుర్గంధ పూరితమగుచున్నవి. ఇది ప్రతి యొక్కరి అనుభవములోనికి వచ్చెడి విషయము. ఈ సత్యము దృష్ట్యా ప్రతియొక్కరూ శరీరము యొక్క అపవిత్రత గురించి ఆలోచించుకోవలెను.

అంతేగాదు శరీరమందైనను లేదా ఇంటియందైనను ఒక భూతము ప్రవేశించిన ఎడల సుఖశాంతులు పాడగుచున్నవి. అయితే అయిదు భూతములు ఈ శరీరములో నివసించుచుండగా జీవికి సుఖము ఏ విధముగా లభించును?

అందుకే బోధ సారమున **"పంచ భూత నివాసోయం, కథంతత్ర సుఖీభవేత్"** అని ప్రశ్నించబడినది.

వాన కాలములో మెరుపులు క్షణకాలములో వచ్చునటులే ఈ శరీరమైనను ప్రారబ్ధ కర్మను ఉండునంత వరకు కనిపించి పిదప కనుమరుగవుచున్నది. ఇదంతయును పర్యావలోకన చేసిన వివేక వంతుడు శరీరము నేను మరియు నాది అనెడి మోహమును త్యజించవలెనని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారుపదేశించినారు.

కనిపించెడి శరీరము నశ్వరము, అమంగళము, అని ఎరిగిన వెనుక జీవుడు దేనిని నమ్మవలెను? అనెడి జిజ్ఞాస గల్గినపుడు శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధిన ఉపదేశించిరి.

**శ్లో॥ నిత్యానంద చిదాకార మాత్మతత్వం విహాయకః**
**వివేకీరమతే దేహే నశ్వరే దుఃఖభాజనే॥** (బ.స.వ. 5:68)

అనిత్యము అశుచి మరియు దుఃఖరూపమైన ఈ శరీరము నందు నిత్యమైనది సత్యమైనది శుద్ధమైనది మరియు ఆనంద రూపమైన ఆత్మతత్వము యిమిడి యున్నది. నిత్య నిత్య వస్తువుల వివేకము ఉన్న వాడు అనిత్యాది ధర్మములతో గూడిన శరీరము నుండి తన మనోవృత్తిని పరావర్తించుకొని, సచ్చిదానంద స్వరూపమైన ఆత్మచింతనయందు మునిగిపోయి నిత్య సుఖియై బ్రతుకును. ఆత్మ విషయకమైన ఈ నిత్యసుఖానుభవమే ముక్తి. జీవన్ముక్తి యొక్క విలక్షణమైన ఆనందమును పొందవలెననిన ప్రతి యొక్కరూ దేహాభిమానమును త్యజించవలసి యుండును. శ్రీనిజగుణ శివయోగులు ఈ విధమున ఉపదేశించిరి.

**"విరముక్తి సుఖమును బడయుటకై చెడెడి కాయము ఎడల మోహమును వీడవలెను."**

దేహము అమంగళము నశ్వరము దుఃఖభాజనము అయినదని తెలిసికొని దేహమునే త్యాగము చేయుట బుద్ధిమంతుల లక్షణము కాదు. అయితే దేహాభిమానమును త్యాగము చేయుట ఎంతో మహాత్మ్యమైన విషయము. బసవేశ్వరులవారు కూడల సంగమ దేవుని వలచగా వచ్చినా ప్రసాద కాయమును చెరపకూడదు, అని యనిరి. అనగా దేహత్యాగము హీనమనియు దేహాభిమాన త్యాగమే ఉత్తమమైనదనియును చెప్పబడినది.

జీవించి యున్నంత వరకు దేహమును ఆరోగ్యముగా యుంచుకొని దాని యొక్క కురూపము, సురూపము ఎడల అసహ్యము, అహంకారములను పెంచుకొనక దేహాదులకు అదిష్ఠానము ఆనందస్వరూపము అయిన ఆత్మతత్వమును ఎరిగి దాని చింత యందు తన యొక్క అధిక భాగమైన ఆయుష్షును వెచ్చించుటయే మనుష్యుని ముఖ్యమైన లక్ష్యమనెడి తత్వమును శ్రీ భగవత్పాదులవారు ఇచ్చట ఉపదేశించినారు.

01-8-1990

**శ్రీ సిద్దేశ్వర దేవస్థానము**
**షోలాపురం**

ఓంశాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

లోకమున ప్రాణమున కున్న విలువ మరే యంశమునకు లేదు. ప్రాణము నిలుపుకొనుటకై తాను సంపాదించుకొనిన ద్రవ్యమంతయును వ్యయపరచును. తన ప్రాణమును రక్షించికొనుటకై యెదుటివాని ప్రాణుమును తీయుటకైనను సిద్ధమే. ప్రతి మనిషి చిరాయువును వాంఛించును. భోగలాలసత్వమే వ్యక్తి నీ విధిన ప్రవర్తింపచేయుచున్నది. కామక్రీడల వలన సుఖమును పొందగోరును. దేహాభిమానమును పెంచికొని, దేహము కదు జాగ్రత్త వహించి పోషించును. ఇట్టి వారు దేహతత్వమెరుగ జాలరని తెలిసికొనవలెను. అక్కగారి వచనము నుదరహించుచు శ్రీ విద్యావాచస్పతుల వారు ప్రదానము చేసిన జ్ఞానము మరువరానిది.

శరీరము మలకోశమని శ్రీ భగవత్పాదుల వారు నుడివిరి. మల మూత్రాదులకు నిలయమై యున్న దేహము మీద యభిమానమును పెంచి కొనుట యవివేకమే! కదా! శరీరము యొక్క అస్తిత్వము గురించి గుర్తించని వారు అధిక సంఖ్యలో గలరు. శబ్దస్పర్శాదులతో పొందే సుఖమే నిజమైన సుఖమని యెంచి దేహము సుఖభాజనమని భావించెడి వారెందరో గలరు.

పండితుడైన వాడు ఇట్టి భావమును వహించజాలడని శ్రీ భగవత్పాదుల వారు తెలియజెప్పిరి. **"పండతే జానాతి పండితః"** అనెడి వ్యుత్పత్తి ప్రకారము ఎఱిగెడి వాడు పండితుడగును. **"సర్వేగత్యర్థకాఃజ్ఞానార్థాః పండాధీరస్యసంజాతా పండితః"** అనెడి వ్యుత్పత్తి చేత బుద్ధిగల వాడు పండితుడగును. **"పండిత సమదర్శకః"** అనెడి సూక్తి ప్రకారము శివజీవుల యెడల సమభావము గల వాడే పండితుడగును. శివ జీవాభేదమును గురించిన తత్వమును ఎరిగిన వాడే పండితుడనవచ్చును. శివ-జీవైక్యతా సిద్ధిని ప్రదానము చేసెడి బుద్ధిని పెంపొందించుకొనిన వాడే నిజమైన పండితుడు. ఇట్టి వారు కాయము మల కోశమని తెలిసికొందురు. ఈ భావమును విస్తరించిన అన్నమయ్యవారి యీ పద్యమును గనుడి.

**మలినాంగుడగు టేమి కష్టము మనోమార్గంబు నీ భక్తిని**
**ర్మల సౌభాగ్యనిదాన దీపశిఖయై రంజిల్లు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము 92)

అను నిత్యము అశుద్ధముగా నుండెడి దేహము భక్తి చేత శుద్ధిని పొందుననెడి భావన యెంతో మర్మగర్భమైనది. మాయాశక్తి వలన కాయము మలినమగును. శక్తి, భక్తిగా రూపొంది నప్పుడు దేహము పరిశుద్ధమగును. ఈ విషయము మున్ముందున భక్త దేహిక స్థలమున విస్తరింపబడును.

కాయము శాశ్వతమైనదని యనెడి వారుండరు. కాని సాపేక్షపరమైన శాశ్వతత్వము నాపాదించే వారు గలరు. "నేను యింత మేరకు జీవింతునని యనెడి వారుగలరు. **"నేను నూరు సంవత్సరములు బ్రతికెదనని"** ప్రకటించినవాడు మరునాడు ప్రక్కమీద నుండి లేవకమునుపే మరణించెనని తెలిసినప్పుడు, మానవుడెంత యవివేకి యనెడిది తెలియనగును.

బుద్ధిమంతుడగు పండితుడు కాయము క్షణికమైనదని తెలిసికొనును. ఈ విషయమును తెలిపెడి అన్నమయ్య వారి పద్యమును గనుడి.

**కాయంబన్నది వారి బుద్బుదసదృక్షంబందు రూపింపలే**
**బ్రాయంబన్నది శారదాంబుద తటిత్ ప్రాయంబు సపత్సుభ**
**శ్రేయంబన్నది మాయ-యిట్లెరిగియున్ శీఘ్రంబే నీ ధ్యానసం**
**స్థాయిభావన బొందదేమిటికయో సంసారి సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము 83)

వేదాంతవాదుల ప్రకారము, ఆత్మ ప్రారబ్ధకర్మ ననుభవించుటకే దేహమనెడితోడుగును ధరించును. కర్మోపభోగము ముగిసిన వెనువెంటనే కాయము నశించును.

ప్రారబ్ధ కర్మలవలన సుఖము-దుఃఖములు గల్గునని యందురు. వచ్చెడిది కేవలము దుఃఖమే యని భావించెడి వారెందరో లేరు. కొద్ది మందికి మాత్రమే, యీ విషయము దృగ్గోచరమగును. దేహము దుఃఖభాజనమనెడి విషయమును స్పష్టపరిచెడి బసవన్న వారి వచనమును కనుడి.

**ఎంతు శివభక్తియ నానుపమిసువెనయ్యా! ఎంతు శివాచారవెనగె వేద్యవప్పుదయ్యా!**
**కామక్రోధ లోభ మోహమదమత్సరదింద కట్టువడదెను హసివుతృషె వ్యసనదింద కుడియుత్తిద్దెనె**
**పంచేంద్రియ సప్తేంద్రాతు హరిహంచుమాడి కాడిహవయ్యా**
**అయ్యా, అయ్యా ఎన్న హుయ్యల కేళయ్యా కూడల సంగమ దేవా, నానేవె నేలెనయ్యా!** (బ.పు. 47)

ఈ వచనపు తెలుగురూపమును గనుడి.

**ఎట్లు శివభక్తినుపమింతునయ్యా! ఎట్లు శివాచారము నాకు వేద్యమగునయ్యా**
**కామక్రోధ లోభమోహమదమాత్సర్యములచే ఆకలి దప్పుల వ్యసనములచే కుదింపబడుచున్నాను.**
**పంచేంద్రియ సప్తదాతువులు పరిపరియాలు జేసి కాద్పరచెనయ్యా**
**అయ్యా అయ్యా నాడు కుయ్యిని వినుమయ్యా! కూడల సంగమ దేవా, నేనుమి సేతునయ్యా!**

పూర్యోక్త వివరణ వలన తేలెడిదేమనగా కాయము అపరిశుద్ధమై, అశాశ్వతమై మరియు దుఃఖభాజనమై యున్నది.

దేహాభిమానమును ద్రుంచి, ఆత్మజ్ఞానమును పెంచి, దుఃఖభాజనమైన దేహమును సుఖదాయకము చేసెడి శక్తి శ్రీ గురువునకు గలదు. అతని కరుణామృతమును బడసి పరిశుద్ధుడుగుటకు పిండ జ్ఞాని సంసిద్ధుడు కావలెను. నిత్యానిత్య వివేకములను పెంచికొని నిత్యుడు శ్రీ గురువు పాదముల నెరగి కృతార్థ సిద్ధిని బడయవలెను.

-: శుభం భూయాత్ :-

## ఆశీర్వచనము : 9

**శ్లో॥ వివేకి శుద్ధహృదయో నిశ్చితాత్మసుఖోదయః।**
**దుఃఖహేతౌ శరీరేఽస్మిన్ కలత్రే చ సుతేషు చ**
**సుహృత్సు బంధువర్గేషు ధనేషు కుల పద్ధతౌ**
**అనిత్య బుద్ధ్యా సర్వత్ర వైరాగ్యం పరమశ్నుతే॥** (సి.శి. 5:75)

ఆత్మ సుఖస్ఫురణ గలవాడును, నిత్యానిత్య వివేకము గలవాడును, దుఃఖములకు కారణమైన శరీరము, పడతి, పిల్లలు, స్నేహితులు, బంధువులు, ధనము, జాతి మొదలగు వాటి యందున, అనిత్య బుద్ధి గల్గి వాటియందున మహావైరాగ్య భావనను పొందును.

శ్రీభగవత్పాదులవారు, జీవుని యొక్క శరీరము మొదలుకొని జగత్తులోని సకల పదార్థములు దుఃఖదాయకములే యియును, ఆత్మయట్టిది కాదని యిక్కడ ఉపదేశించిరి.

అవివేకము ప్రభావమునకు లోనైన జీవులు దుఃఖదాయకములైన శరీరము, భార్య, పిల్లలు సంపద, జాతి మొదలగువాటియందు సుఖరపమైన భ్రాంతి గల్గియుండుట చేత, తమ అమూల్యమైన జీవితమును వాటికై ధారబోయు చున్నారు.

చేపలను ఉదాహరణగా గైకొనిన యెడల నవి మాంసపు ఎర భ్రాంతి చేత ఆకర్షితమై గాలమునకు చిక్కికొని జాలరి చేతిలోబడి ప్రాణములను వీడుచున్నవి.

అదే విధమున విషయ సుఖములనెడి దుఃఖముల మీద సుఖమనెడి సన్నటి పొర యుండును. విషయములననుభవించే టప్పుడు మొదట సుఖకరముగా దోచిననూ చివరన దుఃఖము పొడసూపును.

ప్రీతికి సంబంధించిన వ్యవహారముల గూర్చి గొప్పగా ఆలకించెడి యవసరము లేనే లేదు. సాంసారిక సంబంధములన్నియు స్వార్థము మీదనే ఆధారపడుచున్నవి. భార్య-భర్త, తల్లి-తండ్రి, బందు-బలగము లనెడివన్నియును స్వార్థము మీదనే యాధారపడియుండును. స్వార్థము గూర్చి వివరిస్తూ, యాజ్ఞవల్క్య మహర్షి యీ క్రింది విధిన వివరించిరి.

శ్లో॥ "నవాఅరే పత్యుఃకామాయ పతిః ప్రియో
ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి॥

సతి–పతుల మధ్యగల సంబంధము కాయమనెడి స్వార్థము మీద ఆధారపడియున్నవని వీరివాదము.

సతి–పతుల సంబంధములే కాదు. తల్లి–కూతురు, తండ్రి–కొడుకు మొదలగునవి యును స్వార్థమనే పునాది మీద ఆధార పడియున్నవి. స్వార్థము నెరవేరని స్థితిలో మనలనెక్కువ ప్రేమిస్తూ ఉండే వారే మనకు శత్రువులుగా మారిపోవుచున్నారు. ఒకప్పుడు నెంతో ప్రేమానురాగములలో నుండెడి భార్యా భర్తలు ఒకరి కొకరు ప్రాణశత్రువుల స్థితికి దిగజారుచున్నారు.

ఇది యిట్టులుండగా చాలా వరకు ప్రజలు భార్యాబిడ్డల వలన లభించెడి దుఃఖమును భ్రాంతి మూలమున సుఖమని యెంచి నశించి పోవుచున్నారు.

విషయముల యెడల భోగాసక్తిని పెంచికొను వ్యక్తికి లభించెడి సుఖము కంటెను, రోగము వచ్చునేమో యనెడి భయము వలన మిక్కుటమైన దుఃఖము సంప్రాప్తమగును.

ఉత్తమ కులమున పుట్టితి ననెడి భావన వలన కొంత మేరకు సుఖము లభించినా, ఆచారమును తప్పి, కులాచారము నుల్లంఘించిన దోషము వలన కులము వారు శిక్షింతురేమో యనెడి భయము నిరంతరము పట్టి పీడించుచుండును. కులచ్యుతికి గురియైన యెడల గల్గెడి దుఃఖము గరిష్ఠ స్థాయిలో నుండును. సంపద వలన రెండు రకములైన దుఃఖములు గల్గును. మొదట, సంపదను దోచుకొని పోవుదురేమో యనెడి భయము వలన దుఃఖము గల్గును. అదే విధిన, రాజులు సంపదను లాగి కొని పోవుదురేమో యనెడి భయము వలన కల్గెడి దుఃఖము రెండ కోవకు చెందినది. మౌనియై కూర్చుండెడివానికి ప్రజలు తనను దీనుడని యెంచుదురేమో యనెడి భయము నెల్లప్పుడు వెన్నంటి యుండును. బల్లిదునికి పగవారి వలన భయము. ప్రాణరక్షణకై ఆత్మ సంరక్షణకై యెల్లప్పుడు జాగరూకతతో నుండవలెను. అందమైనవానికి అంగనల మీద వలన దుఃఖము గల్గుచున్నది. పండితుడైన వానికి ప్రతి వాదుల నుండి భయము లేర్పడుచున్నవి. ఓడి పోయిన పండితుడు అవమానము చవిచూచును. అది దుర్భరమైనది కదా! గుణవంతునికైతే దుర్గుణములు అబ్బునేమో యనెడి భయము. ఈ విధముగా ప్రతి వస్తువులోను ఏదో నొక భయము లేదా దుఃఖము దాగి యుండును. వీటి యెడల యనురక్తిని పెంచికొని, భయాందోళనలకు, దుఃఖక్లేషాలకు గురియగుట కంటెను, వైరాగ్య భావనను గల్గి విరక్తిలో నిజమైన సుఖమును పొందుటయే మంచిదని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిరి.

సుఖమయమైనది యేది యనెడి ప్రశ్నకు సమాధానముగా, నీ క్రింది యుపనిషద్వాక్యము లివ్వబడినవి.

**"యోవైభూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి"**

ఈ జగత్తున యన్నింటి కంటెను గొప్పదౌ ఏ పదార్థము గొప్పదో, నదియే సుఖమయమైనది. మిగిలిన వన్నియును దుఃఖమయమైన వని ఉపనిషద్వాణిలోని భావమని తెలుసుకొనుడి. జగత్తున నన్నిటికంటెను గొప్పగా వెలుగొందెడి వాడు పరమాత్ముడొక్కడే. మిగిలిన వన్నియును అల్పములే. వివేకవంతుడైన వాడు, జగత్తులోని దుఃఖదాయకమైన పదార్థముల యెడలను, భార్యాపుత్ర మిత్రాదుల యెడలను మమకారము యెడల పరమాత్మను గూర్చి భక్త్యనురాగములను పెంచి కొనుట, ఎంతో శ్రేయస్కరముగా నుండును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

02–08–1990

శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము షోలాపురము

## విశేష ప్రదీపిక :

ఆధ్యాత్మిక దుఃఖములలో 'రాగద్వేషములు' ముఖ్యమైనవని తెలిసికొని యుంటిమి. వీటి వలననే మానవ సంబంధాలు ఏర్పడుచున్నవి. బంధు మిత్రుల యెడల యనురాగము గలుగును. బంధువులు కాని వారి యెడ నిర్లిప్త భావము,శత్రువుల యెడల వైషమ్య భావ మేర్పడి ద్వేషము చోటు చేసికొనును. రాగము సుఖానుభావము పిదపవచ్చుననియును, ద్వేషము దుఃఖానుభవము పిదప వచ్చుననియు తెలియుచున్నది.

రాగమునకును మమకారము నకును దగ్గర సంబంధము గలదు. మమ అనెడిది తమ మరియు తస్యతో సాపేక్ష సంబంధము గల్గి యుండును. మమ అంటే నాది. తవ, తస్యలు నీది మరియు అతనిది అనెడివని గుర్తించవలెను. మమకారము పుత్ర కళత్రములకును, ధనమునకు అనుబంధము గలిగి యుండును. మన్ను, పొన్ను మరియు పడతి రూపములో నున్న వాటిని సంగ్రహించి మమకారము పెంచుకొని వ్యక్తి తన అసంతృప్తిని తగ్గించికొనుచున్నాడు. వీటిని తన జీవన పర్యంతము భద్రపరచుకొనుటకు తగిన చర్యలు చేపట్టును. అర్జన మరియు భద్రతలో ననేక నిషిద్ధ కర్మల నాచరించెడి యవకాశము గలవి లోభాది యరిషడ్వర్గమునకు బలికావచ్చును. ఇవన్నియును వర్జనీయములనియును సన్యాసమే శరణ్యమనియును, వైరాగ్యములో నమృతత్వం గలదని చెప్పెడి వారు గలరు. కైవల్యోపనిషత్తు నిట్టి భావములనే ప్రతిపాదించినది. పుత్రుల వలనను, కుల పద్ధతుల వలనను కలిగెడి యనర్థముల గురించి యింతకు క్రితమే యిదే స్థలమున వివరించబడినది.

లౌకికముగా నాలోచించిన యెడల బంధువులు, మన సంతోషమును పంచికొనెదరే గాని దుఃఖమును పంచికొనరు. బెల్లముండిన యప్పుడే యీగలు వ్రాలును,సంపద యున్నంత వరకే బంధువులు వత్తురని తెలిసికొనవలెనని నీతి శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. ఈ విషయమును శ్రీ బసవన్న వారు ఈ క్రింది వచనము నందు తెలియజెప్పిరి.

**చంద్రోదయాలకై అంబుధి హెచ్చువుదయ్యా,**
**చంద్రంగె రాహు అడ్డ బందల్లి అంబుధిబొబ్బిట్టిత్తెఅయ్యా.**
**అంబుదియముని ఆపోశనవ కొంబల్లి**
**చంద్రమనడ్డ బందనె అయ్యా**
**ఆరిగారూ ఇల్ల; కెట్టవంగెళెయిల్ల**
**జగద నెంట వీనెలు అయ్యా,**
**కూడల సంగమ దేవా!** (బ.పు. 25)

దీని తెలుగు రూపమిది:

**చంద్రోదయమున కంబుధి హెచ్చున దయ్యా**
**చంద్రుడు కూడిన కందున దయ్యా**
**చంద్రునికి రాహువు అడ్డము వచ్చిన యచ్చట**
**అంబుధిబొబ్బిడెనే అయ్యా**
**అంబుధిని ముని ఆపోశనముగ గొనిన యచ్చట**
**చంద్రుదడ్డము వచ్చెనే అయ్యా!**
**ఎవ్వరికెవ్వరు లేరు. చెడిన వానికి చెలికాండ్రు లేరు**
**జగతికి నంటువు, నీవే దేవా, కూడల సంగమదేవా**

(బసవేశ్వర గీతామృతము పుట 79)

తాత్వికముగా చూసిన యెడల యివన్నియును మాయాశక్తి వలన గల్గిన బంధముల పరిణామముగా వచ్చినవే. హరుని నరుని చేసి బాధకు గురి చేసెడివి. 'పురుషతత్త్వము'లో జీవి పొందెడి భేద భావము వలన గల్గినవే. వీటిని వదలి సన్యాసము తీసికొనవలసిన పని లేదు. గురువును శరణు వేడిన చాలును. గురువును చేరి యతని కరుణను పొందుటకు ప్రయత్నించుట యెంతయో అవశ్యకత గలదు.

–: శుభం భూయాత్ :–

## ఆశీర్వచనము - 10

**శ్లో॥ వివేకినో విరక్తస్య విషయేష్వాత్మరాగిణః**
**సంసార దుఃఖ విచ్ఛేద హేతౌ బుద్ధిః ప్రవర్తతే॥** (సి.శి. 5:76)

వివేకవంతునికిని, విరాగికిని, ఆత్మ విషయమునందున యనురాగము పెంపొందించి కొనిన వానికిని, సంసార దుఃఖములను ఛేదనము చేసెడి యుపాయములను అన్వేషించుట యందు బుద్ధి కేంద్రీకరింపబడియుండును. అతడు తరుణోపాయములను గూర్చి నిరంతరము వెతుకుచునే యుండును.

**శ్లో॥ నిత్యానిత్య వివేకినః సుకృతినః శుద్ధాశయస్యాత్మనో**
**బ్రహ్మోపేంద్ర, మహేంద్ర ముఖ్య విభవేష్వస్థాయితాం పశ్యతః॥**
**నిత్యానందపదే నిరాకృత జగత్సంసారదుఃఖోదయే।**
**సాంబేచంద్రశిరోమణౌ సముదయే ద్భక్తిర్భవధ్వంసినీ॥** (సి.శి. 5:77)

నిత్యా నిత్య వివేకమును పెంపొందించుకొనిన వాడును, వేదాగమాదులలో తెల్పిన విధముగా సుకృత్యములను చేసెడి వాడును, నిర్మలమైన యంతఃకరణము గలవాడును, బ్రహ్మోపేంద్రాది దేవతల యొక్క వైభవము లైననూ క్షణిక మైనవే యనెడి భావము గల్గిన వాడును, అగు పిండ జ్ఞానికి, సచ్చిదానందన స్వరూపుడును, నిత్యపరిపూర్ణుడును, సంసారదుఃఖోత్పత్తిని నిరాకరించినవాడును, చంద్రశేఖరుడును, సాంబుడును అగు పరమాత్మను గూర్చినట్టిదియును, సంసార దుఃఖమును విధ్వంసము చేయునట్టిదియగు భక్తి ఉదయించుచున్నది.

సంసారమునందున యున్న ప్రతి యొక్కనికిని తాను దుఃఖరహితమైన సుఖమును పొందవలెననెడి కోరిక యుండును. సుఖ జీవన ప్రాప్తికై పరిశ్రమించును. కాని అతనికి సుఖమునే విధిన పొందవలెననెడి విషయములోను, తత్సంబంధమైన సాధనముల గూర్చియు పరిజ్ఞానముండదు. పదే పదే దుఃఖమునే పొందుచున్నాడు. సుఖమునకు దాస్యమును చేసెడి జీవి, పంచతన్మాత్రలైన రూప-రస-గంధ-శబ్ద-స్పర్శల ననుభవిస్తూ సుఖమును అన్వేషించును. విషయ సుఖముల నెన్నియో మార్లు అనుభవించుచున్నాడు. చివరకు దుఃఖమునే పొందుచున్నాడు. అప్పుడతనిని నిత్యానిత్య వివేక విజ్ఞత యుపకారము చేయును. విషయ భోగములు విషాద కారకములని గుర్తెరిగి ఇవి దోషభూయిష్టములని తెలిసి కొనుచున్నాడు. అప్పుడు విరక్తి భావన గల్గుచున్నది. ఇట్టి విరక్తి భావన శాశ్వతమైనదిగా గుర్తించవలెను. ఇది, పురాణాదులు వినెడి సందర్భమునను, ప్రసూతి వేదనకు గురియైనప్పుడును, స్మశానము సందర్శించినప్పుడును గల్గెడి వైరాగ్య భావన కంటెను భిన్నమైనది.

పురాణ శ్రవణ, ప్రసవ వేదన వేదన, స్మశాన దర్శన వలన గల్గెడి వైరాగ్యము క్షణికమైనది. అంతే కాదు, అది పలాయన వాదము నుండి ప్రావిర్భవించినవి. ఇట్టి వైరాగ్యములు వివేకముతో కూడుకొని యుండవు.

ఈ వాస్తవముల నేపథ్యమున శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు విషయములందున విరక్త భావమును గల్గిన వాడై ఆత్మానందముననుభవించే వివేకవంతుడు సంసారము నుండి తరించే మార్గముల గురించి యన్వేషణ చేయుచుండును. అన్యులు, సుఖబుద్ధి గలవారై, దుఃఖములోనే సుఖముగల దనెడి భ్రాంతికి లోనై సంసార చక్రమున చిక్కికొని తిరుగుచున్నారని యుపదేశించిరి.

సంసార సాగరము నుడి తరింపచేసెడి యుపాయములెన్నియో గలవు. వాటిలో భక్తి యెంతో శ్రేష్ఠమైనది. **"మోక్ష కారణ సామగ్ర్యాం భక్తి రేవగరీయసి"** అన్ని చెప్పబడినది. మోక్ష సాధన నిమిత్తమున నుపయోగించెడి సామగ్రి యందు భక్తి యనెడిది గొప్పనైనదని దీనిలోని భావము.

లోకమున జనులు కొందరిని పూజ్యులని, మరి కొందరిని యపూజ్యులని భావించుటను మనము గమనించుచున్నాము. అట్టి పూజ్యుల యెడల యనురాగ భావముతో మెలుగుదురు. అట్టి యనురాగమే భక్తియని తెలిపెడి యీ సూక్తిని గమనించుడి.

**"పూజ్యేషు అనురాగోభక్తిః"**

పెద్ల యెడల గల ప్రేమను **"భక్తి"** యని యనవచ్చును.

ప్రేమ గురించి చెప్పవలెననిన లోకమున ఒకరి నొకరు ప్రేమించుచుందురు. కొందరు నిర్జీవముగా నుండెడి వస్తువుల యెడల ప్రేమ పెంచికొందురు. ఇట్టి ప్రేమలు స్వార్థమనెడి పునాది మీద నిర్మింపబడును. ఇట్టి ప్రేమ యశాశ్వతమైనది ఇది భక్తి కాజాలదు.

వ్యక్తుల యెడల, వస్తువుల యెడల గల ప్రేమను త్యజించి, జగత్కళ్యాణకారకుడును, సంసార దుఃఖమును దూరము చేసెడి వాడును, చంద్రరేఖను దాల్చిన వాడును, పార్వతీ పతియునగు పరమేశ్వరుని యందు ప్రేమ గల్గిన యెడల నయ్యది భక్తి యనిపించికొనును. ఈ భక్తికి గొప్ప మహత్తు గలదు. అందుకే శ్రీ భగవత్పాదుల వారు "భక్తిర్భవ ధ్వంసినీ" యని యుపదేశించిరి. భక్తి వలన భావమనెడి సంసారము నాశనమగునని యుపదేశములోని భావము. చావు పుట్టుకల చక్రము నుండి విముక్తి లభించును.

మన మెవ్వరినైనను ప్రేమించిన యెడల వారి వారి వద్దగల దానిని మనకు పంచి యిత్తురు. అజ్ఞానులను ప్రేమించిన యెడల, వారు తామనుభవించెడి దుఃఖమునే పంచి యిత్తురు వారి దగ్గర లేనిది యివ్వలేరుగదా?

లోకములోని కొందరు తమ జీవన కాలమంతయూ అనేకులను ప్రేమించి, అంత్యదశలో, తనను ప్రేమించెడి వారుండక పరితప్త హృదయులై ప్రాణములు విడుచుచున్నారు. ఇది అందరూ ఎరిగిన విషయమే.

ఇదంతయును గమనించెడి వివేకవంతులు సంసార దుఃఖములు లేని వాడగు పరమాత్మ యందు ప్రేమను గల్గియుందురు. జీవన కాలమంతయూ శివుని ప్రేమిస్తూ వెచ్చింతురు. మరణ కాలమున "శివ శివ" యనుచు ప్రాణమును విడుతురు. "అంతే యామతిః సాగతిః" యనెడి ప్రమాణము ప్రకారము, వారు శివునినే పొందుచున్నారు.ఈ విధముగా శివభక్తిని పెంపొందించి కొనిన వారికి మరణము దుఃఖదాయకమైనది కాదు. అందుకే, శివశరణులు "మరణమే మహర్నవమి" యని ప్రకటించిరి.

అక్క మహాదేవి వంటి భక్తురాండ్రు **"న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి"** యనెడి సామాజిక కట్టడిని చిత్తు జేసి తల్లిదండ్రి, అన్నతమ్ముడు, భర్త–మరిది వంటి వారి ఆశ్రయమును పొందకుండ పరమేశ్వరునినే ఆశ్రయించి తరించిరి. ఇట్టి వారి భావమున కద్దము పట్టెడి యీ శ్లోకమును చూడుడి.

**శ్లో॥ త్వమేవ మాతాచ పితాత్వమేవ త్వమేవ బంధుశ్చసఖాత్వమేవ।**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవ దేవ॥**

ఇట్టి వారు తమ జీవితములో సంసారిక దుఃఖముల ననుభవించలేదు.

ఇల్లు ముంగిలి వదలి, అన్న వస్త్రములు లేకుండగ భక్తి మార్గమున పయనించిన అక్కమహాదేవిగారు కష్టములు ననుభవించెను కదా యనెడి సందేహము పాఠకులకు గల్గవచ్చును. అట్టి యెడ, అక్కగారి యీ క్రింది వచనమును గనుడి;

**హసివాదొడె భిక్షాన్నగళుం**
**తృషెయాదొడె కెరెభావి హళ్ళగళుంటు**
**శయనకె హాళు దేగుల ఉంటు**
**ఆత్మసంగాతక్కె నీనెనగుంటు చన్నమల్లికార్జునా!**

ఈ వచనము తెలుగు రూపమును గనుడి :

**ఆకలియైన బిక్షాన్ని ములుగల్లు**
**దప్పికయైన చెరువు బావి, పల్లములుగల్లు**
**శయనమునకు పాడు దేవలముగల్లు**
**ఆత్మ సంగాతమునకు నీవు నాకు గల్గితివి చెన్న మల్లికార్జునా!**

సాధకులు లౌకిక దుఃఖముల వలన, అగ్నిలో తప్తమైన బంగారములో మాలిన్యము దగ్ధమై పరిశుద్ధమైన బంగారము మిగిలినయట్టుల, పరిశుద్ధులగుదురు. అంతేకాదు, లౌకిక దుఃఖముల వలన వారి ధైర్య సాహసములు పెరుగును. హర్షభరిత చిత్తులై అన్నింటినీ యెదుర్కొనెదరు.

లౌకిక ప్రేమలో నారంభమున స్వల్పమైన సుఖముండి, అంత్యమున యనంతమైన దుఃఖము గల్గును. అయితే, పారమార్థిక, ప్రేమలో దీనికి విరుద్ధముగానుండును. మొదట కొంచెము దుఃఖ మెదరైననూ చివరన యనంతమైన సుఖమే లభించును.

వీరశైవ సిద్ధాంతము నందున శ్రద్ధ, నిష్ఠ, అవధాన, అనుభవ, ఆనంద, సమరసముల వలన బడెడి భక్తికి చెందిన క్రమబద్ధమైన వికాసమే ముక్తికి సోపానములుగా మార్చబడినవి. సాధకుడు హరిబ్రహ్మేంద్రాది దేవతల ఐశ్వర్యములు అస్థిరమైనవని యెంచి, ముక్తి సోపానములైన యారు విధములైన భక్తుల నవలంబించి జనన మరణాత్మక సంసారము నుండి తరించుటకు ప్రయత్నించవలెను.

ఈ తెరగున, తాను కాని దాని యందున, తాననెడి మిథ్యాభిమాన రూపమైన సంసారము నందున హేయబుద్ధి యుండెడి సాధకుడే, గురు కారుణ్యము బడయుటకు నర్హుడగుట చేత, యీ సంసార హేయ స్థలము నందున నిరూపితమైన యన్ని విషయములను,ప్రతి యొక్క వీరశైవుడు పర్యాలోచన చేసి తన యాత్మకల్యాణమునకై ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

| | |
|---|---|
| 03-08-1990 | దీనితో సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ |
| శ్రీసిద్దేశ్వర దేవస్థానము | గ్రంథంలోని పంచమ పరిచ్ఛేదము |
| షోలాపురము | సంపూర్ణమైనది. |

## విశేష ప్రదీపిక :

శ్రీభగవత్పాదుల వారి సంసారహేయ స్థలమునకు చెందిన యుపదేశము యొక్క అంతిమ చరణము గురించి యాశీర్వదించిన శ్రీ విద్యావాచస్పతి వారుసంసారహేయతా బుద్ధి గురించిన విశేషమైన యంశములను వివరించిరి.

బుద్ధి ధీ వర్గమునకు చెందినదని యమరము చెప్పుచున్నది. బుద్ధి వికాస మొందిన దశలో వివేకముదయించును. వివేకమున్న వాడు నిత్యా నిత్య విచక్షణాదృష్టితో సంసారమును విశ్లేషించి సంసారము యెడల విరక్తిని పెంపొందించికొనును. వివేకవంతుడైన విరాగి యొక్క బుద్ధి యే దిశలో పయనించు ననెడిది యెంతో ముఖ్యమైన విషయము.

"బుధ్యతే అనయేతి బుద్ధిః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము, దేని చేత యెరుగబడుచున్నది" నయ్యది బుద్ధియనబడును. జ్ఞాతృయొక్క సంస్కారము ననుసరించి జ్ఞేయము నిర్ణయించబడును. కుసంస్కారము గల వారి బుద్ధి కుమార్గముననే పయనించును. విషయభోగాసక్తి వలన భోజ్యముల వైపు బుద్ధి ప్రవర్తించును. సంస్కారము కీలకమైన పాత్రను పోషించునని గుర్తింపవలెను. పూర్వజన్మలలో జీవి పొందిన సంస్కారముల వలన బుద్ధి యొక్క ప్రవర్తన నిర్దేశింపబడుచున్నదనేది కర్మవాదుల వాదము. వీరు "బుద్ధిః కర్మానుసారిణి" యని ప్రతిపాదించిరి. పూర్వజన్మ సంస్కారము వలననే వైరాగ్య భావనలుగల్గునని గుర్తించవలెను. అట్టి సంస్కారము లేని వానికి సంసారము భోక్త భోజ్యము. భోగాసక్తి గలవానికి యోగాసక్తి కలుగునే?

వైరాగ్య భావన గల్గిన వాడు సంసార దుఃఖముల నుండి విముక్తి బడయుటకు నేవిధముగా ఆలోచించు ననెడిదొక జటిలమైన ప్రశ్న. భారతీయాధాత్మిక సంస్కృతిలో పలు మార్గములు ప్రతిపాదింపబడినవి. సన్యాసము వలన యమృతత్యము సిద్ధించునని కైవల్యాది యుపనిషత్తులు తెలుపుచున్నవి. "ప్రజ్ఞానం బ్రహ్మ" యని అద్వైతాచార్యులైన శ్రీ శంకరుల వారనిరి. భక్తియే యుత్తమమార్గమని శ్రీ భగవత్పాదుల వారు తెలిపిరి. శ్రీవారి యీ యుపదేశమును గనుడి.

**"భక్తిః శైవీ మహాఘోర**
**సంసారభయహారిణీ॥** (స.శి. 4:44)

శివభక్తి వలన సంసార భయము హరింపబడుననెడిది ఉపదేశములోని భావము. ఈ భావమునే శ్రీ యధావాక్కుల అన్నమయ్యగారు ఈ క్రింది విధిన విస్తరించిరి.

**ఉరుసంసార గజేంద్ర దర్ప దళన వ్యూఢప్రతాపోగ్రకే**
**సరి; దుష్ప్రాప శరీర బంధ విపులక్ష్మాజవ్రజఛేదవి**

**స్ఫురిత క్రూరకుదంరధార; దురితప్రోద్భూత జీమూదు**
**స్తర సంఘాత విఘాత మారుతము నీద్భక్తి సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, 57)

సంసారమనెడి గజమునకు సింహము వంటిదనియును, శరీరాభిమానుము ద్రుంచెడి గొడ్డలియనియును, పాపౌఘమనెడి మేఘమండలమును చెల్లా చెదురుగా చేసే మారుతము వంటిది శివభక్తి యని తెలుపబడినది.

**"ఇంత సంత సంతోషింప నేటికి మీకు భ్రాంతి బొందిన వెర్రి పశుజీవులార!**
**నందీశ్వరుడు సేయే నవ్రతపంబు చందంబు సూచియో శంకించి రాక**
**చీరికి గైకొన్న శ్రీప! నీపదవికోరునే బ్రహ్మ! నీ కొండక పదవి**
**ఓరి దేవేంద్ర! నీయెడ బడుపదవి పేరత దెరుగునే పెక్కులేమిటి**
**ననుగాని యాతండు నాపదంబైన మనమున దలపడు మాభక్తులాన"**

– :శుభం భూయాత్ :–

# షష్ఠ పరిచ్ఛేదము

## గురుకారుణ్య స్థలము

### ఆశీర్వచనము :1

శ్లో॥ తతో వివేక సంపన్నో విరాగీ శుద్ధ మానసః।
జిజ్ఞాసుః సర్వసంసార దోష ధ్వంసకరం శివం॥
ఉపైతి లోక విఖ్యాతం లోభ మోహ వివర్జితమ్।
ఆత్మతత్త్వ విచారజ్ఞం విముక్త విషయ భ్రమమ్॥
శివ సిద్ధాంత తత్త్వజ్ఞం ఛిన్న సందేహ విభ్రమమ్।
సర్వతంత్ర ప్రయోగజ్ఞం ధార్మికం సత్యవాదినమ్॥
కులక్రమాగతాచారం కుమార్గాచార వర్జితమ్।
శివధ్యాన పరం శాంతం శివతత్త్వవివేకినమ్॥
భస్మోద్ధూలన నిష్ణాతం భస్మతత్త్వ వివేకినమ్।
త్రిపుండ్రధారణోత్కంఠం దృతరుద్రాక్షమాలికమ్॥
లింగధారణసంయుక్తం లింగపూజా పరాయణమ్।
లింగాంగ యోగతత్త్వజ్ఞం నిరూఢాద్వైతవాసనమ్
లింగాంగస్థలభేదజ్ఞం శ్రీగురుంశివ వాదినమ్॥ (స.శి.6:1-6)

సంసారమందున పరిత్యాగబుద్ధిగల్గి, పవిత్రమైన మనస్సు గలవాడును, దేహాత్మవివేక సంపన్నుడును, సంసారవిరతుడునగు ముముక్షువు సాంసారికములైన సకల దుఃఖములను పరిహరించు కొనుటకై పరశివ మహాలింగమును గూర్చి తెలిసికొనెడి యిచ్ఛగలవాడై, అంతటి పరబ్రహ్మ స్వరూపమును ఉపదేశించువాడును, లోక ప్రసిద్ధుడను ధనాదిలోభములనుండియూ అజ్ఞానము నుండియూ ముక్తిని పొందిన వాడును, శివాగమములను శివధర్మశాస్త్రములను నెరిగి, వాడును, ఏ ఒక్క సంశయమును లేని వాడును, సకల శివాగమముల ప్రయోగముల నెరిగి, శివధర్మమునందు నిష్ఠగలవాడును, సత్యమునే పలుకగలవాడును, గురువంశానుగతాచారముల యందున తత్పరత గలిగి, దురాచారములు లేనివాడును, శివలింగ ధ్యానమునందాసక్తి గల్గిన వాడును, భస్మోద్ధూళన కౌశల్యము గలవాడును, రాగద్వేషాదులులేని వాడును, పరలింగస్వరూపము నెరిగిన వాడును, భస్మ త్రిపుండ్రములను, రుద్రాక్ష మాలికలను ధరించుటయందు నిష్ఠ గలవాడును, బాహ్యముననూ, అంతరంగముునను లింగమును ధరించిన వాడును, ఉభయ లింగ పూజాసక్తుడును, లింగాంగ సామరస్య స్వరూపము నెరిగిన వాడును, సర్వత్ర బలమైన శివభావనగలవాడును, అంగలింగ స్థలములనే నూటొక్క స్థలముల నెరిగిన వాడును, మంగళకరముగ మాట్లాడువాడును యగు గురువు నాశ్రయించలెను.

ప్రతి యొక్క మముక్షువు పరమాత్మ తత్వము నెరుగుటకై, అట్టి తత్వమును యదార్థముగా తెలిసికొనిన సద్గురువునే యాశ్రయించ వలెననెడి యుపనిషదోక్తిగలదు. కనుడి.

**"తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్సమిత్పాణి"** (ము.ద.ఉ: 2:12)

అందుకే నిజగుణ శివయోగుల వారు "గురువు లేని వాడికి ముక్తిసమకూడదని తెలిపిరి. అయితే అట్టిఉపదేశమునకు అర్హుడైన శిష్యుడెట్టులుండవలెను అనెడి ప్రశ్న మొదట పొడసూపును. ఆ పిదప పరబ్రహ్మతత్వమును బోధించెడి గురువు గారి కుండవలసిన లక్షణము

లెయ్యవి, అనే ప్రశ్న ఉదయించును. ఈ రెంటికిని సమాధాన మిచ్చుటకై శ్రీ భగవత్పాదులవారు మొదటిగా శిష్యుని లక్షణములను, ఆ పిదప గురువుగారి లక్షణముల నుపదేశించిరి.

**శిష్యలక్షణములు :**

పరిశుద్ధ మనస్కుడును, నిత్యానిత్య వివేకవంతుడును, ఇహలోక పరలోక సుఖముల యెడల నిస్పృహగలవాడును సంసారములోని సకల దుఃఖములను దూరము నందుంచగలిగి మహాలింగ తత్త్వమును తెలిసికొనవలెననెడి ఉత్కంఠమైన కోరిక గల వాడు మాత్రమే యోగ్యుడైన శిష్యుడనిపించికొనును.

శ్రీ భగవత్పాదుల వారు సిద్ధాంత శిఖామణి యందున పిండ స్థలమున మనఃశుద్ధికి చెందిన ఉపాయములను, పిండజ్ఞాన స్తలమున నిత్యానిత్య, ఆత్మానాత్మ వివేకముల గూర్చియును, సంసారహేయ స్థలమున వైరాగ్యమును క్రమముగా బోధించిరి. ఆ కారణమున వైరాగ్యాది ఉత్కృష్ట గుణములు గలవాడే శిష్యపద వాచ్యుడగును.

అనుభవ సారములో, నిజగుణుల వారు శిష్యుని గురించి యీ క్రింది విధముగా తెలిపిరి.

**శ్లో॥ "గురు దేవతా భక్తి వర వేద విధినిష్ఠే**
**విరతి ముంతాదనవ సుచారిత్రంగళిరలవనే**
**శిష్యనెనిసువను".** (అనుభవసారము 1-3-2)

గురుభక్తి, నైష్ఠికత, విరతి యిత్యాది నవ గుణములు గలవాడే మంచి శిష్యుడనబడుననెడిది శ్రీ నిజగుణుల వారి యుపదేశ సారము. ఈ నవ గుణము లెటివో తెలిసికొందుము గాక!

1. పరశివ బ్రహ్మమే నిత్యమైన వాడు, తక్కినవి అనిత్యములనియెడి వివేకము.

2. ఇహలోకములోని స్రక్-చందనాదులు, వనితాదులకు చెందిన విషయములు కర్మాదీన-మగుటచేత, నే విధముగా ననిత్యములని యనిపించికొనునో, వాటి వలెనే యజ్ఞాది కర్మల ఫలముగా ప్రాప్తమయ్యెడి స్వర్గాది లోకములలోని అమృతపానము,అప్సర స్త్రీలసంగమము, మరియు నందన వన విహారాదులైననూ శాశ్వతమైనవి కావనియు నిత్యమైనవనియును తెలిసికొని యీ యుభయలోకములకు చెందిన భోగముల ఎడల విరక్తి లేదా వైరాగ్యము;

3. పరశివ పరమాత్మ తత్త్వమును గూర్చిన శ్రవణము, మననము, మరియు ధ్యాన నిరతిగల్గి, అంతరింద్రియమైన మనస్సు అన్య విషయముల యెడల, మమత పెంచి కొనకుండగ నియంత్రించెడి శమము.

4. పంచ కర్మేంద్రియములును, పంచాజ్ఞానేంద్రియములును ననాత్మవిషయముల కడకు పరువులెత్త కుండగ నియంత్రించే సామర్థ్య రూపముననుండెడి దమము;

5. దోషభూయిష్టములగునవి సందర్శించినప్పుడు మనస్సైననూ, బహిరింద్రియములైననూ పరిత్యక్తములైన శబ్దాది విషయములవైపు నీడ్చుబడకుండగ జాగరూకముగా నుండెడి ఉపరతి;

6. సుఖము-దుఃఖము, జయము-పరాజయములనెడి ద్వంద్వములను సహించెడి స్వభావ రూపమున నుండెడి తితిక్ష,

7. లక్ష్యమైన పరమ తత్త్వము యొక్క చింతనయందున మనస్సుకు చెందిన యేకాగ్రత రూపమైన సమాధానము;

8. గురువు మరియు శాస్త్ర విషయముల యందున గల వచనములు యెడ నిష్ఠారూపమైన శ్రద్ధ,

9. అగ్ని యందున లేదా నీటి యందున పడిపోయి యున్నప్పుడు వ్యక్తి తన ప్రాణములను నిలిపికొనవలెననెడి యభిలాష తీవ్రస్థాయిలో ఉండునటులే, యీ సంసార తాపత్రయము నుండ దూరమై మోక్షమును బడయ వలెననెడి కోరిక రూపమున నుండెడి మముక్షత్వము.

బృహదారణ్యకములోను ఈ విధమైన భావనలే గలవని తెలియుచున్నది. కనుడి;

**"శాంతో దాంత ఉపరస్తితిక్షుః సమాహితోభూత్వాత్మన్యేవాత్మానం పశ్యతి"**

(బృహదారణ్య 4-4-23)

ఈ తొమ్మిది గుణములను పరిశీలించిన యెడల ఒక విషయము బోధపడును. మొదట చెప్పబడిన గుణములు, ఉత్తరోత్తములైన వాటికి కారణ భూతములై యున్నవి. నిత్యానిత్యవస్తు వివేకము వలననే యిహపరభోగముల యెడల వైరాగ్య భావన గల్గుచున్నది. ఈ వైరాగ్యము వల్లనే శమదమాదులు గల్గుచున్నవి. ఈశమ దయాదుల వలననే, ముముక్షత్యము గల్గును. ఇట్టి దైవీగుణములకు నిలయమై యుండెడి వ్యక్తి శిష్యుడు కాగలడు.

శిష్యుని యోగ్యతను నిర్ణయించెడి విషయమున విశేష విచారము చేసిన శ్రీ నిజగుణులవారు పరమానుభవ భోధలోన శిష్యుడు యీ క్రింది గుణములతో విరాజిల్లవలెనని తెలిపిరి.

1. గురుభక్తి 2. నిరహంకారము 3. నిరపేక్షత 4. సైరణ 5. కరుణ 6. అనుకూలత 7.సురసత 8. సుస్థిరబుద్ధి 9. సద్గుణసంపత్తి 10.పరహితత 11.అమలత 12. అచలత 13. శాంతత 14. దయ 15. శుచిత్వము 16. ధీరత్వము 17. అవికారత్వము 18. పరమ విరక్తత 19. మృదువాణి 20. సాత్వికత్వము 21. ప్రసన్నత 22. మదమత్సరములు లేకుండుట 23. ఆత్మరతిత్వమ. వీటన్నింటిలో విరతి ముఖ్యమైనదని చెప్పుచు, దీపము వెనువెంట దీపపు కాంతి వచ్చిన యటుల, విరతి యుండిన వానికి మిగిలిన గుణగణము లబ్బునని తెలిపిరి.

**వాజశ్రవసనముని కొడుకైన నచికేతుడు**

**"మృత్యవేత్వా దదామి"** అనెడిదండ్రిగారి మాటలను విని యముని పట్టణమునకు పోవును. యమ లోకము నందున యముడు లేని కారణమున మూడు దినముల వరకు వాకిలి వెలుపలనే కూర్చొని, యముని కొరకును, అతని రాకకై యెదురు చూస్తూ ఉండెను. తన లోకమునకు వచ్చిన యముడు ఆతిథ్యమును స్వీకరించకయే కూర్చొని యున్న నచికేతుని విషయమును తెలిసికొని ఖించిత్‌భిన్నుడై నచికేతుని సమీపించి యీ క్రింది విధిన వేడికొనెను.

**తిస్రో రాత్రిర్యదవాత్సీర్గృహే**
**మే2నశ్నన్ బ్రహ్మన్ అతదిథిర్నమస్యః**
**నమస్తేస్తు బ్రహ్మన్ స్వస్తిమే2స్తు**
**తస్మాత్ప్రతి త్రీన్వరాన్ వృణీశ్వ॥**

"ఓ అతిథియైన బ్రాహ్మణోత్తమా! నానుండి యే ఆతిథ్యమును స్వీకరించక మూడు రాత్రులను నా యింటి వాకిలి ముందు గడపిన కారణమున, నాకు కల్గు దురిత శాంతికైనకు నీవు మూడు వరములను కోరుకొనుము. మీకు నమస్కార"మని యనెను.

యముని మాటలను వినిన నచికేతుడు, సంతుష్టుడై యీ క్రింది విధిన రెండు వరముల నడిగెను.

“నీ నుండి పంపించబడిన నేను నాయింటికి పోయిన యెడల, నా తండ్రిగారునన్ను గుర్తించవలెను. ఇది నా మొదటి కోరిక. స్వర్గలోకమును పొందుటకై యేయగ్ని యందు నేయే విధిన హవనము చెయవలెనో తెలియజెప్పుము. ఇది నారెండవకోరిక.”

నచికేతుని అభీష్టమును తెలిసికొనిన యముడు మిగుల సంతుష్టిని పొందెను. “తథాస్తు” అనెను. అగ్ని విద్యను గూర్చి తత్సంబంధితాగ్నికి నచికేతాగ్నియని పేరిడెను. మూడవ వరమును కోరమనగా నచికేతను డిట్లనెను.

**యేయం ప్రేతేవిచికిత్సా**
**మనుష్యే2స్తీత్యేకే నాయమస్తీతి చైకే।**
**ఏ తద్విద్యామనుశిష్ట స్త్వయా2హం**
**వరాణామేష వరస్తృతీయః॥** (క.ష. 1-1-20)

“ఓ యమదేవా! మృతమనుష్యుని గూర్చి జగత్తున నొక సందేహము కలదు. అదేమనగా శరీర ఇంద్రియ మనోబుద్ధ్యాదుల కంటెను భిన్నమైన యాత్మతత్త్వము కలదని కొందరు, లేదని మరి కొందరందురు. దీని గూర్చి నాకు తెలియజెప్పవలెను.”

మృత్యువు ముఖము నుండి తప్పించికొని అమృతత్వమును బడసెడి సాధన రూపములో నున్న యీ మూడవ కోరికను కోరగా యమునికి నొక సందేహము గల్గెను. “త్యాగేనైకే అమృతత్వమానశుః” అనెడి శ్రుతి వచన ప్రకారము, అమృతత్వప్రాప్తికై త్యాగమే ముఖ్యమైన కారణము. ఆ త్యాగ బుద్ధి యితని యందున గలదో లేదో యనునది పరీక్షించవలెను కదా! యని ఎంచి, సందేహనివృత్తికై నచికేతుడు ప్రలోభపడు నేమోయని ఎరుగదలచెను.

“ఓ నచికేతుడా! నీవు తెలిసికొన దలచిన తత్త్వమును తెలిసికొనుటకై దేవతలు కూడ శ్రమింతురు. తత్త్వమెంతో సూక్ష్మమైనది గాన తెలిసికొనుట యనేది యెంతో కష్టముతో కూడికొనియున్నది. ఇంతటి కష్టసాధ్యమైన తత్త్వము నెరుగుటకై ప్రయత్నించి నిరాశ పొందుట కంటె మరేదైనను కోరుము. సుఖపడయెదవు. ఏయే పదార్థములు నీకు దుర్లభములుగానున్నవో వాటిని కోరుము. సుందరమైన వనితలు,వస్త్రములు, వాహనములు, ఏనుగులు, గుఱ్ఱములు, ఇతర పశువులు, ధనము, కనకము, భూమి, పుత్రపౌత్రాదులు మొదలగు వాటిలో నీకేమి కావలెనో. అంతియేకాదు, నీవెన్ని సంవత్సరములు జీవించి యుండవలచితివో తెలుపుము అని యముడు అడుగగా మృత్యుదేవుని ప్రలోభదాయకమగు వచనములను వినిన సువిచారియైన నచికేతుడు చలించలేదు. అతడు యముని కిట్లనెను.

ఓ యమరాజా! “నవిత్తేన తర్పణియో మనుష్యః” అనెడి సూక్తి ప్రకారము, మనుష్యుని కెంత సంపదనిచ్చినా తృప్తి పరచుట సాధ్యమయ్యే విషయముకాదు. అందుచేత నివి నాకు వలదు “వరస్తుమే వరణీయః సఏవ” ఆత్మవిద్యయే నేను వలచెడి యేకైక వస్తువు. దానినుపదేశించండి.” అని పలుకగా

నచికేతుని దృఢనిశ్చయమును వినిన యముడు, అతని వైరాగ్య భావనల చేత సంతుష్టుడైనందున, యాతినికి ఆత్మ విద్యనుపదేశించి కృతార్థుని చేసెను.

ఈ విధముగా ఆత్మ కళ్యాణమును చేయఁగల గురుకృప దొరకవలయుననిన శిష్యునికి విరతి యిత్యాది సద్గుణములుండవలెననితెలియుచున్నది. అందుచేతనే, శ్రీ భగవత్పాదుల వారు శిష్యుని లక్షణములను ప్రస్తావిస్తూ, వివేక సంపన్నుడు, విరాగి, విశుద్ధమనస్కుడు, జిజ్ఞాసా ప్రవృత్తిగలవాడే గురుకరుణను పొందుటకు అర్హుడని యుపదేశించెను.

ఇంతటి యోగ్యత లేని వానికి, గురు కరుణ లభించినచో, దాని వలన యెట్టి సత్ఫలితము కాజాలదు. అందుచే శ్రీబసవేశ్వరుల వారు

"సగణయబెనకంగె సంపగెయరళల్లి పూజిసిదడె" ఫలమేమియని ప్రశ్నించెను. పేడతో చేసిన వెంకయ్య విగ్రహమునకు సంపెంగ మొగ్గలతో పూజలు చేసిన ఫలమేమని అన్నగారి ప్రశ్నలోని భావము. అదే విధిన, లౌకిక మానవునికి శివదీక్ష నిచ్చిననూ, శివభక్తుడగునా యని తన సందేహమును వెలువరించెను.

ఈ కారణము మూలమున గురువుగారు, మొదట శిష్యుని పరీక్షించిన పిదప నుపదేశమునిచ్చుట యనెడిది యుక్తతమైన విధి యగును.

## గురువు లక్షణము :

ఆధ్యాత్మిక మార్గము నందున శిష్యుడొక్కడే యోగ్యుడైనయెడల చాలదు. గురువు నందుననూ ఉత్కృష్టములైనగుణము లుండవలెనని శ్రీ రేణుకాచార్యుల వారి యభిప్రాయమైయున్నది. అందుచే శ్రీ భగవత్పాదుల వారు గురువు లక్షణములను నిరూపించుచు, నతని యాధ్యాత్మిక యోగ్యత మరియు కులములోని యోగ్యత యనెడి యుభయ దృష్టి చేత యుపదేశమును చేసిరి. మొదటగా, ఆధ్యాత్మిక యోగ్యతను విచారింతుమగాక.

గురువు నందున నుండదగిన గుణముల నీ క్రింది విధిననివ్వనైనది.

"లోకవిఖ్యాతి, లోభమోహరాహిత్యము, ఆత్మతత్వ విజ్ఞత, విషయభ్రమ రాహిత్యము, శివసిద్ధాంత తత్వజ్ఞత శాస్త్రముల యెడల సందేహరాహిత్యము, సర్వతంత్ర, ప్రయోగవిధి విజ్ఞత, ధార్మికత మరియు సత్యవాక్పరిపాలన".

"ఖ్యా-ప్రకథనే" యనెడి ధాతువు నుండి 'ఖ్యాతి' యనెడి శబ్దము నిష్పన్నమైనది. ఖ్యాతి యనగా ప్రసిద్ధి. "లోకే విశేషేణ ఖ్యాతః లోక విఖ్యాతః" అనెడి వివరణ ప్రకారము లోకమునందున విశేష గుణముల చేత ఖ్యాతిని పొందిన వాడు లోక విఖ్యాతుడనబడును. గురుస్థానమును నలంకరించెడి వ్యక్తి, తన యుత్కృష్ట గుణముల చేత జగత్తున విఖ్యాతిని పొందిన వాడై యుండవలెను.

ఖ్యాతి యెవ్వరికి వలదు? జగత్తున జన్మించిన ప్రతి వ్యక్తి ఖ్యాతిని పొందవలెననెడి మనోభావన గల్గియుందురు. అందుచేతనే, యొక సుభాషితకారుడు నీ క్రింది విధిన నుడివెను.

**శ్లో॥ ఘటం భింధ్యాత్పటం ఛింద్యాత్కుర్యాత్ గర్భభరోహణం।**
**యేనకేన ప్రకారేణ ప్రసిద్ధః పురుషో భవేత్॥**

కుండను పగుల గొట్టియైనను, పాత బట్టను చింపి యైనను, గాడిదనెక్కియైనను, ఏదోనొక ప్రకారము చేత పురుషుడు ప్రసిద్ధి గలవాడు కావలెను. కాని అయతే, జ్ఞానము, వైరాగ్యము, కీర్తి, శ్రీ, బలము, మరియు ఐశ్వర్యము లనెడి షడ్గుణముల చేత లోకమునందున విఖ్యాతుడై యుండవలెను. షడ్గుణముల యందున, జ్ఞానమనగా ఆత్మజ్ఞానము, వైరాగ్యమనగా ఇహలోక పరలోకములలో నుండెడిభోగ్య వస్తువుల యందు నిస్పృహత, కీర్తి యనగా మంచి చరిత్ర, శ్రీ యనగా శోభాయమానమైన దేహములోని కాంతి, బలమనగా ఆత్మబలము, ఐశ్వర్యమనగా అణిమ, మహిమ, గరిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము మరియు వశత్వము లనెడి అష్టైశ్వర్యములు ఇట్టి లోక విలక్షణములైన గుణముల చేత గురువు ప్రసిద్ధుడై యుండవలెను.

అష్టైశ్వర్యములు నీశ్వరుని కుండెడి గుణములనియును, గురువునందున యుండ దగినవి కావనియును, గురువు లందరిలోనూ ఈ గుణములు కన్పట్టవనియును సందేహములుదయించుట సహజమే.

అయితే, భగవంతుడే గురురూపమునకు వచ్చియున్నాడని చెప్పబడినది. **"సాక్షాత్ భర్గో నరాకృతి"** యనెడి శ్రుతి ప్రమాణము నీ భావమును స్థిరపరచుచున్నది. శ్రీ భగవత్పాదుల వారు నీ భావము నీ క్రింది విధిన వివరించిరి.

**శ్లో॥ అప్రత్యక్షో మహాదేవః సర్వేషామాత్మమాయయా।**
**ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే॥** (సి.శి. 9-53)

"దృష్టి కగోచరుడగు మహాదేవుడు, ఆత్మమాయచే అందరికిని గురురూపమున ప్రత్యక్షముగా తిరుగాడుచున్నాడు" అనునది శ్లోకములోని భావము. **"హర తన్న రూపవ తోరలు ధరెగె మర్త్యనాగిబందను"** అనెడి అక్కగారి నుడువులునునీ భావమునే సమర్థించుచున్నది. "హరుడు తన రూపమను చూపుటకై ధరమీదకు మర్త్యరూపమున గురువై వచ్చినాడనునది భావము. ఇది యీ విధిన నుండగా, భగవంతునిలో నుండెడి అష్టైశ్వర్యములు గురువులోను ఉండునని భావించవలెను.

శ్రీ రేణుక భగవత్పాదుల వారొనరించిన గగన విహారము, ఏకకాలముననే ముక్కోటి శివలింగముల స్థాపన యిత్యాదులు గమనించిన యెడల గురువుగారు అష్టైశ్వర్య సంపన్నులై యుందురనెడిది నిజమని తెలియుచున్నది.

ఈ విధిన శ్రీ రేణుక భగవత్పాదుల లోక విఖ్యాతికి చెందిన విషయమును తెలియజెప్పిరి. ఆ పిదప "లోభమోహ వివర్జితమ్" అని యుపదేశించిరి.

"లోభ మోహములు సామాన్యమైనవి కావు. యివి అంతరంగిక శత్రువులని శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిరి. శత్రువులను ఇంటిలోన యుంచికొని నిశ్చింతగా ఉండుట యెట్లు అసాధ్యమో, అదే విధిన లోభమోహములకు మనస్సున ఆశ్ర మిచ్చి నిశ్చింతగా జీవించుటయు నెట్టిమహాత్మునికైననూ సాధ్యము కాదు. తేలు ఎక్కడున్ననూ తనను తాకిన వారికి కుట్టకుండా ఉండలేదు. అదే విధిన, లోభ మోహములు ఎవ్వరి యందున యుండునో వారిపై తమ ప్రభావమును చూపకుండ ఉండదు. లోభాదులు దొంగల వలె జీవునికి నష్టముచేయునని తెలిపెడి యీ క్రింది శ్లోకమును గనుడి:

**కామఃక్రోధశ్చలోభశ్చ దేహే తిష్ఠంతి తస్కరాః।**
**జ్ఞానరత్నాప హరాయ తస్మాజ్జాగ్రత జాగ్రత॥**

లోభాదుల వలన జ్ఞానము నాశనమగునని చెప్పబడినది. అరిషడ్వర్గములు పరస్పరముగా నొక దానినొకటి వెన్నంటి యుండును. ఏ ఒక్క దానికైననూ ఆశ్రయమిచ్చిన యెడల, మిగిలినవి వచ్చి చేరుట తథ్యము. జీవితమును నరక భాజనము చేయును. "లోభమూలాని పాపాని" అని శాస్త్రకారులు చెప్పిరి. లోభము ప్రభావము వలన మనుష్యుడు చేయ కూడని పాపములను చేయును. అందుకే జ్ఞానులు "లోభం త్యజేత్" అని ఉపదేశించిరి.

ఒక ఊరిలో నొక పండితుడుండెను. అతడు సకల శాస్త్ర పారంగతుడై యుండెను. తన వలెనే శాస్త్రాధ్యయనమును చేసిన యొక కన్యను చేపట్టి జీవనమును గడుపు చుండెను. ఇరువురును, శాస్త్ర పాండిత్యము గలవారైనందున, విశ్రాంతి సమయమున శాస్త్ర సంబంధిత చర్చలను చేస్తూ కాలమును గడిపెడి వారు. ఒకసారి పండితుని భార్య తన భర్తను "పాపమునకు తండ్రెవ్వరని యడిగెను. అభ్యాసము చేసిననూ, అనుభవ శూన్యుడును, అల్పమతి గలవాడున నగు పండితుడు జవాబు నివ్వలేక పోయెను. నా ప్రశ్నకు సమాధానము నివ్వలేని వానివి నీ వెక్కడి పండితుడివని పండితుని భార్య కుచ్చినట్లు మాట్లాడెను.

స్వాభిమానియైన పండితునికి యుత్తరమియ్య కుండగ నింటిలో నుండుట కష్టమైన విషయమయ్యెను. భార్య చేత యవమానితుడై యింటిలో నుండుట కంటెను చావుటయే మేలని యెంచిన వాడై, యింటినుండి బయల్వెడలి ప్రాణత్యాగమునకు సిద్ధపడెను. ఉరిని మెడకు వేసుకొని ప్రాణములు విడిచెడి ప్రయత్నము చేసెడి స్థితిలో నతని మస్తకమున నొక యాలోచన వచ్చెను. ప్రాణములు విడుచుట వలన ఫలితమేమి? ప్రశ్నకు నుత్తరమిచ్చినటుల కాదు కదా! నాకు ఉత్తరము చిక్కకుండిన యెడల, నా కంటెను గొప్ప సండితులైన వారికి ఉత్తరము చిక్కవచ్చునుకదా!

వారినడిగి ప్రశ్నకు నుత్తరమును బడయుటలో వివేకమున్నది. ఆ విధిన నుత్తరమును బడసి యింటికి పోయి భార్యకు తగిన విధిన బుద్ధి చెప్పవలె నని తలచి ప్రాణత్యాగము చేసే ప్రయత్నమును విరమించెను. పండితులకు పుట్టినిల్లై విరాజిల్లెడి కాశీనగరమునకు వెడలి పండితులను సందర్శించి, ప్రశ్ననడిగి ఉత్తరము నడగ జొచ్చెను.

ఈ ప్రయత్నమున నతనికి నిరుత్సాహమే యెదురయ్యెను. “పాపమునకు తండ్రి యెవ్వ”డనెడి ప్రశ్నకు విద్వాంసులెవ్వరూ నుత్తరము నివ్వరైరి. పరిస్థితిని సమీక్షించికొనిన యతనికి మరియొక యాలోచన వచ్చెను. ప్రతి ప్రశ్నకు నుత్తరము పండితుల నుండియే లభించుననెడి నియమమేదియును లేదు కదా! సామాన్యులు సమాధానము నివ్వ వచ్చును కదా! యని తలచి జన సామాన్యము నడగ జొచ్చెను. ఒక అట్టముక్కను గైకొని “పాపమునకు తండ్రియెవ్వడు” అని దాని మీద వ్రాసికొని, దానిని మెడయందు తగిలించుకొని కాశీనగరము లోని వీధుల యందు సంచరింప జొచ్చెను. సందు గొందుల యందు ననూ అన్వేషణ చేసెను. కాశీ నగర పౌరులతనినే “పాప్ కాబాప్” యని పిలువ జొచ్చిరి.

ప్రతి దినము సంచరించిన యటులే తిరుగుచు నొక వేశ్యల వీధిలోనికి ప్రవేశించెను. ఒక వేశ్య అతడు తగిలించుకొనిన యట్టముక్కను చూసి, ప్రశ్ననెరింగినదై “నీ ప్రశ్నకు నుత్తరమిచ్చెదను, మా యింటికి రండి” అని పిలిచెను. పండితుడు సంతసించెను. “నీవెవ్వరు” అని ప్రశ్నించెను. ఆమె తన పరిచయము నీ క్రింది విధిన నిచ్చెను.

**“ఓ పండితోత్తమా! నేనీ నగరమున పేరును గాంచిన వేశ్యను. నా పేరు పద్మలోచని, పడుపు వృత్తి నాశ్రయించి జీవనమును కొనసాగించుచున్నాను.”**

ఆమె పరిచయమును తెలిసికొనిన, పండితుడు **“పాపం శాంతం”** అని చెవులను మూసుకొని “మీ వంటి వారి యింటికి వచ్చి, నివసించుట యనేది ధర్మవిరుద్ధమైన దగును. నా వంటి పండితుడా పనిని చేయజాలడు. నేను నీ మాటను మన్నించ జాల”ననెను.

“మీ రెంతో కాలము నుండి వెతుకుచున్న ప్రశ్న యొక్క యుత్తరము మీకు కావలె ననిన మీరు రావలసియుండును. మీ పవిత్రతకు భంగము వాటిల్లకుండగ చూసికొనెడి బాధ్యతను నేను స్వీకరింతును. నేనొక యింటిని కట్టించితిని. గృహప్రవేశ కార్యక్రమము జరుగలేదు. ఆ కొత్త యింటిలో మీకై వసతిని యేర్పాటు చేసి, మీకు నచ్చెడి విధిన సకల సౌకర్యములను సమకూర్చెదను. బ్రాహ్మణ వర్గమునకు చెందిన వారినే పిలిపించి మీకై పక్వాన్నముల జేయించెదను.” మీరెట్టి సందేహమునూ పొందవలసిన పని లేదు. అంతయు మీ యిష్టాను సారమే జరుగగల”దనెను.

పద్మలోచని మాటలను వినిన పండితుడు నాలోచనలో బడెను. ధర్మమునకు భంగము వాటిల్లని విధిన యేర్పాట్లు జరుపబడిన యెడల, వేశ్య యింటికి పోవుటలో ననౌచిత్యము లేదనియెంచెను. ఆమెయింటికి పోకుండిన యెడ, తన ప్రశ్నకు ఉత్తరము చిక్కదని చింతించి, వేశ్య యభ్యర్థనను స్వీకరించి యామె యింటికి వెడలెను.

పద్మలోచన తన మాటను నిలబెట్టుకొనెను. పండితునికి యెట్టి యిబ్బందిని కలుగనివ్వలేదు. పండితుని యనుమతి మేరకే, ప్రవర్తింపజొచ్చెను. అతనికి దూరమున నిలిచి యుండి యెన్నో విషయముల గూర్చి చర్చింపజొచ్చెను. ఈ విధిన కొన్ని దినములు గడిచెను.

ఒక దినమున పద్మలోచని, పండితుని దగ్గరకు వచ్చి, ఒక వేయి బంగారు నాణెములు గల పళ్ళేరమును నాతని ముందున నుంచి, సాష్టాంగ నమస్కారమును చేసి “ఓ పండితుడా! బ్రహ్మజ్ఞానియైన వానికి నొక ముద్ద అన్నమును పెట్టిన యెడల, అనేక జన్మల యందున జేసిన పాపము దూరమగునని మీరే సెలవిచ్చితిరి. మా వంటి బడుగుల యింటికి భాగ్య దేవతవై వచ్చితివీవు. నేనే స్వయముగా వంటను చేసి, తమరికి వడ్డించి, తృప్తి పరచి కృతార్థత పొందవలెనని నా మనస్సుకు దోచినది. మీరు యొప్పి కొనిన యెడల, నొక దినమున కోరికను తీర్చికొనెదను. నా కోరికను నిరాకరించవలదు. నా మీద దయను చూపుడి” యని వేడికొనెను.

పండితుడు, ఆలోచనలోనికి పడిపోయెను. ఒక పరి బంగారు నాణెములను వీక్షించుచు, మరొక పరి వేశ్యను చూడ దొడంగెను. పవిత్రుడనై, స్వయం పాకినై యిన్ని దినముల వరకు కాలమును గడిపిన తాను, ఈ అపవిత్రురాలి చేతి వంట నెటుల భుజించవలెను? అని తలంచెను. మరుక్షణముననే, ఒక పూట భోజనమును చేసిన మాత్రమున కలుగు దోషముతో వచ్చెడి లబ్ధిని పొందిన యెడల, భోజనమును చేయుటలో తప్పులేదు. వేయి వరహాలు లభించును. వీటిని వదలు కొనుటలో వివేకముండునే? భుజించిన పిదప, శాస్త్రాను సారముగా ప్రాయశ్చిత్తమునకై విధింపబడిన కర్మను చేసి దోషనివారణ పొందవచ్చును కదా! యని యోచించదొడగెను.

ఈ విధముగా పరస్పర విరుద్ధములైన విచారములకు లోనైన పండితుని మనస్సు, లోభము చేత ప్రభావితమై, పద్మలోచని చేతి వంట భుజించుటకు నిశ్చయమును చేసికొనెను. పండితుడు, పద్మలోచనకు తన యంగీకారమును తెలియజేసెను.

పండితుని యనుమతిని పొందిన వెనువెంటనే, పద్మలోచన పంచ విధ పక్వాన్నములను జేసి, యుచితాసనమును నేర్పాటు చేసి, పండితుని తోడ్కొని వెళ్ళి అర్ఘ్యపాద్యాదుల నొసగి, యాచమనమును చేయించి, ఆసనముపై కూర్చుండ బెట్టెను. వెండి పళ్ళెరమున వేడుక మీరగా పక్వాన్నములను వడ్డించెను. సాష్టాంగ నమస్కారముచేసి, "భుజించి నన్ను ధన్యురాలిని చేయండి" యని వేడికొనెను.

స్నానాదులతో శుచిర్భూతుడై యున్న పండితుడు, పద్మలోచన విజ్ఞాపనను విని, సంతుష్టుడై తినుట కుపక్రమించెను. మొదటి ముద్దను గైకొని నోటిలో పెట్టికొనపోవుచుండెను. సమీపముననే. చేతులు జోడించి నిలిచి యున్న పద్మలోచన చెయ్యిని చాచి పండితుని చెంపను చెళ్ళుమని వాయగొట్టెను. పండితుని చేతిలోని అన్నపు ముద్ద విడువడి దూరమున భూమిపై పడెను.

ఈ సంఘటన చేత బిత్తర పోయిన పండితుడు "ఏమిటిది?" యని పద్మలోచనను ప్రశ్నించెన. "ఓ పండితుడా! మీరడిగిన ప్రశ్నకిది ప్రత్యుత్తర"మని పద్మలోచన బదులిచ్చెను. ఈ విధిన చెంప వాయునట్లు కొట్టుట యనేది యుత్తరమెట్లగునని పండితుడమాయకముగానడిగెను. అప్పుడామె "విద్వాంసులు, సంతులైన సంజాతులు మీరు, ఇన్ని దినములుగా కాపాడుకొని వచ్చిన పవిత్రతను, ఈ వేయివరాల లోభమునకై, త్యాగము చేసి పాపిష్ఠిగా నగుటకు సిద్ధపడితిరి కదా! ఈ కారణమున లోభమే పాపమునకు తండ్రియైనది. తమరికి తెలియజెప్పుటకే యీ విధిన జేసితిని. క్షమించండి" అని పద్మలోచన వివరణ నిచ్చెను. పండితుడు జ్ఞానోదయము పొందిన వాడై, పద్మలోచనకు నమస్కరించి తన యింటికి వెడలెను. తన భార్య ప్రశ్నకు ఉత్తరమునిచ్చెను. భర్తకు జ్ఞానోదయమైనందున పండితుని భార్య సంతసించెను. పండితుడు నిర్లోభియై జీవనమును సాగించ దొడగెను.

ఈ విధముగా లోభము విద్వాంసులనైననూ, పవిత్రముగా నున్నవారినైననూ పతితులుగా చేసెడి కారణమున గురవైనను ధన కనక వస్తువాహనాదుల ఎడల లోభము లేకుండగ నుండవలెను. లోభావిష్టుడైన గురవైననూ, తాను శిష్యులను పీడించి పొందిన వస్తువుల నెవరైననూ అపహరింతురేమోయనెడి చింతలో పీడింపబడుచు, చివరన నా వస్తువులనే స్మరిస్తూ ప్రాణమును వీడును, భగవన్నామ స్మరణకు దూరమగును. యిట్టి గురువులే నధిక సంఖ్యలో నున్నారు. అందుచే, అనుభవము గలవారు "గురువో బహవః సంతి శిష్య విత్తాపహారకాః॥

లోభము వలె మోహము కూడా గొప్ప శత్రువై యున్నది. ఏదో నొక వస్తువు మీద అతిగా ప్రేమను పెంచికొనుటయే మోహమనిపించికొనును. తత్త్వనిష్ఠుడుగా నుండవలసినగురువు వస్తు నిష్ఠగల వాడైన యెడల నతని నుండి జిజ్ఞాసులకు ఏమియూ లాభము కాజాలదు. శాస్త్రముల ప్రకారము వ్యక్తులే వస్తువుల మీద మోహమును పెంచికొనెదరో యవియే ప్రతిబంధకమగును. ప్రాణము వీడు వరకు నా వస్తువులకు చెందిన మోహము వెన్నంటి యుండును.

మరణ సమయమున కూడ అదే చింతన యుండుటచేత నా వ్యక్తి పునర్జన్మ మెత్తుటకు కారణమగును. ఒక వ్యక్తి జింకను తలుస్తూ ప్రాణమును వీడగా, నతడు జింక రూపమున జన్మించెనని శాస్త్రములో చెప్పబడినది. వ్యక్తికిని, సమాజమునకును చేటును చేసెడి లోభ మోహములును గురువైన వాని యందున నుండ కూడదు. ఒక వేళ గురువు యందున యివి యుండిన యెడల యితడు శిష్యుల లోభ మోహముల నే విధిన దూరము చేయగలడు? అందుచేత నీ యభయ దుర్గుణములు లేని వాడే యదార్థమైన గురువు.

గురువు లోభ మోహములకు దూరమై యుండిన చాలదు. అతడు ఆత్మతత్త్వము నెరిగిన వాడై యుండవలెను. అయుకే, శ్రీ భగవత్పాదుల వారు, గురువు లక్షణమును తెలుపుచు, "ఆత్మతత్త్వ విచార జ్ఞః"యని తెలిపిరి. ఆత్మతత్త్వమును గూర్చి యదార్థమైన జ్ఞానము లేని వాడు, దాని గురించి యుపదేశము చేయుటకై యనర్హుడగుచున్నాడు. తనకే ఆత్మ అనాత్మ స్వరూపాల గురించి నిశ్చయము లేనప్పుడు, ఉపదేశము చేయుటెందులకని జ్ఞానులు ప్రశ్నింతురు. ఆత్మా, అనాత్మ విషయములను యదార్థముగా విచారము చేసి, నిశ్చయించికొనిన గురువే తనువనగానేమి? దీని నెందుకు పొందెదము? నేనెవరిని? పరమాత్మ-ఎవరు? నీవెవరివి? శరీరమునకు జనన మరణములేల గల్గుచున్నవి? మననము, శ్రవణము,స్పర్శ యిత్యాదులు చేసెడి తను వెవ్వరిది?; ఈనుదుపు లెక్కడి నుండి పుట్టుచున్నవి? మొదలగు ప్రశ్నల నడిగెడి శిష్యునికి ప్రత్యుత్తరమిచ్చునే గాని యితరుల కది సాధ్యమగునే? అందుకే, "కింశిలా తారయే చ్ఛిలా" సూక్తి. రాయి, రాయిని నీటిలోన తేలియుండే విధిన చేయగలదే? అనేది దీనిలోని భావము. ఆత్మజ్ఞానమును బడసిన గురువే,సంసార సాగరమును దాటి, శిష్యుల నుపదేశ మూలకముగా ఆత్మజ్ఞానులను జేసి సంసారము నుండి దాటించగలడు. అందుకే, శ్రీ గురువు స్వతఃగా ఆత్మజ్ఞాన సంపన్నుడై యుండవలెను.

ఇంకనూ గురువైనవాడు, విషయభ్రమలకు లోను కాకుండా ఉండవలెను. "విషన్వంతి యింద్రియాణి స్వస్వ-ఆకారేణ పరిణమీయంతి ఇతి విషయా" అనేది వ్యుత్పత్తి మేరకు శబ్దస్పర్శాది విషయములు మనుష్యుని యింద్రియములను, తమ తమ ఆకారముల యందు పరివర్తించికొని యతనిని సదా ఆ విషయములనే స్మరించి కొనునట్లు చేయును. చివరకు, అతని ప్రాణము తీయును.

ఆత్మ చింతనను మరచి విషయ భోగముల యందు మనస్సు నుంచినచో, మధురాన్న మును వీడి పచ్చిమాంసమును తినినయట్లును, కస్తూరిని వీడి బురదను రుద్దుకొనినయట్లగునని శివయోగులు తెలుపుదురు.

## గురుకారుణ్య స్థలము

### ఆశీర్వచనము : 1

అందుచేత జ్ఞానియైన బసవన్నగారు, తనను విషయరహితుని జేసి కాపాడుమని శివునికి విజ్ఞాపన చేసెను. విషయమనెడి పచ్చికను తెచ్చి తన ముందు పరచిన, పశువు పచ్చికను మేయునట్లే తాను విషయాసక్తి గల వాడనగుచున్నానని వాపోయెను.

**విషయవెంబ హసురనెన ముందెతందు పసరిసిదెయయ్యా**
**పశువేన బల్లుదు? హసురెందెళసువుదు,**
**విషయరహిత నమాడి, భక్తిరసవదణియే మెయిసి**
**సుబుద్ధి యెంబుదకవ నెఱెదు**
**నోడి సలహయ్యా, కూడల సంగమ దేవా!**

దీని తెలుగు రూపము :

**విషయమనెడి పచ్చిక దెచ్చి ప్రసరించితివయ్యా!**
**పశువేమి యెరుగు? బచ్చికయని మేయు**
**విషయరహితుని జేసి భక్తిరస దళము మేపి**
**సుబుద్ధి యనెడి యుదకమును పోసి**
**చూసి సాకుమయ్యా, కూడల సంగమ దేవా!**

ప్రపంచములోని యీ విషయ వాసనల మధ్యన నుంటూ, వాటి ప్రభావమును మనస్సు వీడకుండగ బ్రతకుకుట యెట్లు యనెడి ప్రశ్న తలయెత్తును. పడవ నీటిలో నుండుటచేత నెట్టి బాధయు ఉండదు. అయితే దాని లోపలికి నీరు వచ్చిన యెడల ప్రమాదమేర్పడును. అదే విధిన సంసారమందున యున్నంత మాత్రమున దానిచేత బద్ధుడగుననెడిదేమియు ఉండదు. అయితే ప్రపంచమును తన మనస్సు లోనికి తీసికొనిన యెడల, నీరు నిండిన పడవ మునిగిపోయిన యటుల, జీవుడు సంసారమునందున మునిగిపోవుచున్నాడు.

మనస్సునందున ప్రపంచమును రాకుండగ నిరోధించుటకై ఆగమముల యందున నొక యుపాయము గలదు. ఈ క్రింది ప్రమాణమును గనుడి :

**శ్లో॥ యస్య యస్య పదార్థస్య యాయా శక్తిరుదీరితా।**
**సాసా సర్వేశ్వరీదేవీ సస సర్వోమహేశ్వరః॥**

కన్పట్టెడి ప్రపంచమంతయూ శివశక్తుల విలాసమే. శివాది భూమ్యంతములైన ముప్పదియారు తత్వముల రూపమునందున శివశక్తులు లీలా వినోదములను చేయుచున్నారు. "అనారోపితం రూపం తత్వమ్" అనెడి వివరణ ప్రకారము, ఆరోపితము కాని యదార్థమైన స్వరూపమును తత్వమని పిలిచెదరు. ప్రపంచమున ముప్పదియారు తత్వములుండి యున్నందున, యిది శ్రీశంకరాచార్యులు చెప్పిన యటుల కల్పితమైనది కాదు. "సర్వం శివమయం జగత్", "సర్వం లింగమయం జగత్", "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనెడి ప్రమాణముల ననుసరించి యిది యంతయును శక్తి విశిష్టుడైన శివుని స్వరూపమే శివశక్తులచే సృష్టింపబడిన యీ జగత్తునందు దోచెడి ప్రతియొక్క వస్తువునందున శివశక్తులు అణగియున్నారు.

భూమియందున నుండెడి ధారణశక్తి, జలము నందుండెడి ద్రవశక్తి, అగ్నియందుండెడి వ్యాపక శక్తి మొదలైనవి ఆదిశక్తి యొక్క స్వరూపమే. వస్తువులన్నియును శివస్వరూపములే. శివశక్తులకు అవినాభావ సంబంధములుండుటచేత, యొకటిగానై యున్నవి. **"యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర బ్రహ్మ దర్శనమ్"** అనెడి సూక్తి యటుల యెక్కడచూసినా పరమాత్ముడే యున్నాడు, అనెడి యుత్కృష్టమైన భావన పుట్టిన పిదప, విషయముల ప్రతీతి కాకుండగనే, సదా పరమాత్మనే చూడవచ్చును. అందుచేత గురువైన వాడు యీ భావనతో యుండిన యెడల, సత్ఫలితములగును. విషయముల నుండి విముక్తిని బడయవచ్చును. అందుచేతనే శ్రీభగవత్పాదులవారు, "విముక్త విషయ భ్రమమ్" నొక్కి వక్కాణించిరి.

ఈ విధిన విషయరహితుడైన గురువు శివసిద్ధాంత తత్వజ్ఞునిగా యుండవలెనని శ్రీ భగవత్పాదులవారు నుపదేశించిరి.

శివసిద్ధాంతమనగా నేమియో స్వల్పముగా నాలోచింతుముగావుత.

శివునిచేత నుపదేశింపబడిన కామికాది వాతులాంతమువరకు గల యిరువది యెనిమిది శివాగమములను శివసిద్ధాంతమందురు. శ్రీ అఘోర శివాచార్యులవారి యీ క్రింది వచనమును గనుడి:

**శ్లో॥ "సిద్ధాంత శబ్దః పంకజాది శబ్ద పద్యోగరూఢ్యా**
**శివ ప్రణీతేషు కామికాదిషు దశాష్టాదశ తంత్రేషు ప్రసిద్ధః"** (రత్నత్రయము పుట 5)

గురువైనవాడు, శివాగమములను బాగుగా అభ్యాసము చేసి, వాటి యందున ప్రతిపాదింపబడిన తత్వమెట్టిదియో తెలిసికొని, సోదోహరణతో నా తత్వమును తననాశ్రయించిన శిష్యులకు బోధించవలెను.

సమాజములోని ప్రతియొక్క వ్యక్తియును, శాస్త్రముల నభ్యసించి, వాటి మర్మమును తెలిసికొనుట యసాధ్యమని యెరిగిన సమాజములోనివారు, తమరియొక ప్రతినిధిని గుర్తించి, యతనికి అన్ని సౌకర్యములను సమకూర్చిపెట్టి శాస్త్రాధ్యయనమునకై పంపించెదరు. సమాజము యొక్క ప్రతినిధిగా శాస్త్రాధ్యయనమునకు వచ్చిన ఆ వ్యక్తియే గురువు. శాస్త్రము యొక్క తత్వపు తెలివిడికై తన జీవితమును ముడుపుగా కట్టియుంచిన ఆ గురువు దానిని యదార్థముగా నభ్యసించకుండిన యెడల, తాను మూర్ఖుడగుటయే కాదు, తనను నమ్మిన శిష్య సమాజమునే అజ్ఞానాంధకార కూపమునందున త్రోసి, పతితులను చేయుచున్నాడు. సర్వజ్ఞులవారి హెచ్చరికను గనుడి :

**బళ్ళి గురుడరు కూడి।**
**హళ్ళవను బిద్దంతె।**
**ఒళ్ళెయా గురువినుపదేశ విల్లదిరె**
**ఎల్లియదు ముక్తి? సర్వజ్ఞ।**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

*పిలుచు గురువుల గూడి*
*పల్లమున బడినయట్లు*
*మంచి గురువు యొక్క ఉపదేశములేనిదే*
*యెక్కడిది ముక్తి సర్వజ్ఞ।*

శ్రీ భగవత్పాదులవారు గురుస్థానము నధిష్ఠించిన వ్యక్తి శ్రోత్రియుడుగా నుండవలెననెడి దానినే **"శివసిద్ధాంత తత్త్వజ్ఞం"** అనే నుడువులచేత నిరూపించిరి.

శాస్త్రాధ్యయనమును చేయునెడల అనేక సందేహములు తలయెత్తును. కాలుకు నాటుకొనిన ముల్లు, కంటిలో పడిన నలుసు, ఏవిధముగా బాధకు గురిచేయునో, యదేవిధిన తలయెత్తిన సమస్య మనిషికి ప్రశాంతత నివ్వదు. అభ్యాసమునందున తలయెత్తిన సమస్య యొక్క పూర్వాపరాలను పరామర్శించి, స్వతగః సంశయ రాహిత్యమును పొందెడివాడే గురువు కాగలడనే యుద్దేశము చేత **"ఛిన్న సందేహ విభ్రమమ్"** అని శ్రీ భగవత్పాదులవారు గురువుకు విశేషణము నిచ్చిరి.

శాస్త్రములయందున ప్రమాణ గత సంశయము మరియు ప్రమేయగత సంశయమని, సంశయములను రెండు విధములుగా విభజన చేయబడినవి. ప్రమాణ గ్రంథముల గురించి మనస్సున సందేహము తలయెత్తిన యెడల యది ప్రమాణగత సంశయమగును. వీరశైవ సిద్ధాంతమున ప్రతిపాదించెడి శాస్త్రీయ గ్రంథముల యందున జీవాత్మ పరమాత్మల భేదము, ప్రతిపాదింపబడినదా? అభేదము ప్రతిపాదింపబడినదా? లేదా భేదాభేదము ప్రతిపాదించుట జరిగినదా? మొదలగు ప్రశ్నలు ప్రమాణ గత సంశయముల వర్గమునకు చెందినవి.

జీవాత్మ పరమాత్మలకు గల భేదము సరియైనదా కాదా? అనే ప్రశ్నలవంటి సందేహము పాఠకుల మనస్సున గల్గిన యెడల నయ్యవి ప్రమేయగత సందేహములనబడును. ఈ రెంటిని కలిపి అసంభావనా సంశయములని పిలుతురు.

సకల శాస్త్ర పారంగతుడైన శ్రీ అగస్త్య మహర్షికి యీ రెండు రకములైన సంశయము లంకురించగను,తన పుణ్యఫలముగా, తన ఆశ్రమమునకు వచ్చిన శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వలన శివ సిద్ధాంతము గూర్చి విని సకల వేదాగమములు, జీవాత్మ పరమాత్మల భేదాభేదమునే ప్రతిపాదించుచున్నవనెడి నిర్ణయమును గైకొని తన జీవనమునే ధన్యము చేసికొనెను. ఈ కారణము వలన గురువైన వాడు ఈ ప్రమాణగత మరియు ప్రమేయగత సంశయముల స్వరూపమైన యసంభావనను, శాస్త్రమునకు చెందిన తాత్పర్య నిర్ణయము వలన దూరము చేసికొని సందేహ శూన్యుడై యుండుటయే కాక విపరీత భావనలు లేకుండగ యుండవలెను.

విపరీతమైన నిశ్చయమును విపరీత భావనయని అందురు. దీనికొరకై శ్రీభగవత్పాదులవారు విభ్రమ యనెడి శబ్దమును ప్రయోగించిరి. జీవ–పరమాత్మల భేదాభేదమే సత్యమైనది అనెడి భావనకు విపరీతముగా భేదమే సత్యమైనది లేదా అభేదమే సత్యమైనది అనెడి నిర్ణయమును విపరీత భావన యందురు. ఇట్టి విపరీత భావన గలవాడు గురువు కాజాలడు. ఈ కారణము వలన శాస్త్ర సంశయ రహితుడును, విపరీత భావనలేని వాడును గురుస్థానమునకు యోగ్యుడగును.

సకల విద్యలకు పుట్టినిల్లైన భారతదేశమున అరువది నాలుగు విద్యలు మన ప్రాచీన ఋషులచే ప్రతిపాదింపబడినవిఅందరి పూజలనందికొనెడి పూజ్యస్థానము నలంకరించిన గురుదేవులు, ఈ తంత్రములన్నింటినీ యెరుగుటయేగాక వాటిని యథాతథంగా ఆయా యోగ్య సమయములందు అన్వయించెడి ప్రయోగములను తెలిసినవాడై యుండవలెను. 'సర్వతంత్ర ప్రయోగజ్ఞం' అనెడి విశేషణము సార్థకమగుటకు ప్రయత్నించవలెను.

"ధర్మో రక్షతి రక్షితః" యనెడిది ప్రాచీనాచార్యుల యుపదేశమైయున్నది. "ఎవరు ధర్మమును రక్షించెదరో వారిని ధర్మము రక్షించును" అనెడిది యీ ఉపదేశము యొక్క అర్థము. ధర్మము యొక్క స్థాపన మరియు రక్షణలు భగవంతుని కర్తవ్యములైయున్నవి. పరమేశ్వరుడే గురువై వచ్చి యుండుటచేత ధర్మసంరక్షణ చేసెడి భారము గురువుమీద ఉండును. ధర్మోపదేశమును చేసెడివారు ధర్మమును నాచరించవలెను. లేని యెడల వారికి యుపదేశము చేసెడి యధికారముండదనియును, శ్రీ రేణుక భగవత్పాదుల వారు యానతి నిచ్చిరి.

"సత్యం వద" అనెడిది వేదము యొక్క ప్రభు సమ్మితోపదేశము. రాజాజ్ఞను నుల్లంఘించిన వాడు శిక్షకు గురికావలసియుండును. రాజువలె ఆజ్ఞాపించిన వేదము యొక్క యాజ్ఞను మీరిన వాడెవ్వడైనను శిక్షింపబడవలెను. సత్యమందరికీ ప్రియమై యుండదు. అది అప్రియముగా దోచిననూ వ్యక్తి మరియు సమాజము శ్రేయస్సు దానిలో అణగియుండును. అందుకే, "సత్యమేవ జయతే" యనెడి వేదవాక్కు దేశము యొక్క నినాదమైయున్నది.

వ్యక్తిని మొదలుకొని దేశము మరియు విశ్వము యొక్క కళ్యాణమును కోరుకొనెడి గురుదేవులవారు సత్యవాదిగా నుండవలెనని వేరుగా చెప్పేపనిలేదు. వ్యావహారిక వాడుకలో వచ్చెడిదొక సత్యమైన యెడల పారమార్థిక వ్యవహారములందు వచ్చెడిది మరొక సత్యము. అబద్ధము, అనుచితము, నిష్ఠురత్వము మరియు వైశూన్యము వాణియొక్క దోషములై యున్నందున, యీ దోషయుక్తుడైన మనుష్యుడు పరమాత్మ కృపను పొందకయున్న దశలో పశుపక్ష్యాది హీన యోనులలో జన్మించుట జరిగినది. మానవ జన్మ లభ్యమైన పిదప, అట్టి హీనయోనులలో పుట్టకుండా ఉండవలెనన్న, సత్యమునే పలుకవలెను. ఇది వ్యావహారిక సత్యము.

సత్య స్వరూపమైన పరమాత్మ విషయకముగా నుడుపుట పారమార్థిక విషయములలోని సత్యభాషణ. గురువైనవాడు, తన నిత్య వ్యవహారములందు సత్యమునే పలుకవలెను. సర్వదా శిష్యులకు, సత్య స్వరూపమైన పరమాత్ముని విషయమున వాణిని సత్యమునకే సమర్పింపవలెను. అప్పుడు తానే సత్యవాదియని యనిపించుకొనవలెను.

ఈ విధముగా నింతవరకు వివరించిన గుణగణములందున గురువు యొక్క తాత్విక యోగ్యత ప్రతిపాదించబడినది.

వీరశైవ ధర్మమందున సద్గుణములతోబాటు సత్కులోత్పన్నతకు కూడా ప్రాధాన్యత యివ్వబడినది. సద్గుణ సంపన్నుడైనంత మాత్రమున, వీరశైవ గురుపీఠమునకు అధికారి కాజాలడు. అందుకే, శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు "కులక్రమాగతాచారమ్" అనేది గురువుకు విశేషణముగా యిచ్చెను. సిద్ధాంత శిఖామణికి, సంస్కృత టీకను వ్రాసియున్న, శ్రీమరితోంటదార్యులవారు, "కులక్రమాగతాచారమ్" అనెడి పదమునకు "గురువంశక్రమానుగతాచారవాన్" అనెడి అర్థమును వ్రాసిరి. దీని భావమేమనగా, గురువంశము నందున యుత్పన్నుడై, ఆ వంశములోని ఆచార విచారములను అనూచానముగా సాగించికొనుచు వచ్చినవాడే గురుస్థానమునకు యోగ్యుడగును. ఈ విషయమున శ్రీ నీలకంఠ శివాచార్యులవారు, చెప్పిన యంశములు గమనార్హములై యున్నవి.

**శ్లో॥ మఠస్థల సముత్పన్నః శాంతః శైవాగమార్థవిత్।**
**అనూచానః ప్రసన్నాత్మాః శివదీక్షాభిషేచితః ॥** (క్రియాసారము 25వ ఉపదేశము)

గురుస్థానము నలంకరించవలసిన వాడు, మఠస్థ స్థలమునకు చెందిన వారి వంశమున పుట్టినవాడై యుండవలెనని యుపదేశించిరి. వీరశైవులయందున పెద్దమఠము, పురాణమఠము, స్థావరమఠము మొదలగు ఉపనామములు జంగమ వంశములోని కొందరికివ్వబడినవి. అందుచేత తెలిసి వచ్చెడిదేమనగా, జంగమ వంశమునందు పుట్టినవారే వీరశైవ గురుపీఠములకధికారులు కాగలరు.

జంగమ శబ్దము యొక్క తాత్వికార్థమైననూ, "శివజ్ఞాని" యని యగును. జంగములు తత్వజ్ఞాన పరంపరను కాపాడుకొనుచు వచ్చిన కారణమున ఆ వంశమునందున పుట్టినవారే గురువులు కాగలరు. దీనిగురించి యింకనూ కూలంకషముగా విచారణ చేయవలెననిన జంగమ వంశమున పుట్టినవారికి మాత్రమే, పుట్టుక కారణమున గురుస్థానమునకు యోగ్యత వచ్చునెడిది కాదు. ఇంతవరకు చెప్పబడి, ఇక మీదట చెప్పబోవు సద్గుణముల జతకు జంగమ వంశోత్పన్నుడైన యెడల సువర్ణమునకు సుగంధ మబ్బినట్లగుననుట నిర్వావాదము.

సత్కులములందున సదాచారము యనుదిన నిత్యవ్యవహారమైనందున, అందు జన్మించిన ప్రతివ్యక్తికి సదాచారము రక్తగతమై యుండును. వారికి ఆచార విషయమున మరల నేర్పవలసిన యావశ్యకత యుండదు. ఈ ఒక్క కారణము వలననే జంగమ వంశమునకు మహత్వము వచ్చినది. అది అనాది కాలమునుండి నేటివరకు అనూచానముగా కొనసాగవచ్చుచున్నది.

దీనిచేత వచ్చెడి నిర్ణయమేమనగా, జంగమ కులమున పుట్టినవాడై, మిగిలిన యుత్తమ గుణములు గలవాడే వీరశైవ ధర్మము యొక్క గురువగును. కాని ఆచరణమందున వీరశైవుల పట్టాధికార మఠములందున పుత్రవర్గ పరంపర మరియు శిష్యవర్గ పరంపర రెండు విధములు గలవు. పుత్రవర్గ పరంపర యందున జంగమ వంశపు వంశ పారంపర్య వటువులుగా విద్యాభ్యాసము చేయించి పట్టాధికారులుగా నియుక్తులు చేయుదురు. ఇంకనూ శిష్యవర్గ పరంపర మఠములలో వంశ పరంపరను పాలించకుండా గురువులు తమకు యోగ్యమనిపించిన ఏదో గ్రామము యొక్క జంగమ వటువులను ఎంపికచేసి వారికి విద్యాభ్యాసము చేయించి మఠాధిపతులుగా చేయుదురు. ఈ శిశ్య వర్గ పరంపర యొక్క కొన్ని మఠములయందు వీరశైవ పంచమ వంశము నందు జన్మించిన యోగ్యమైన వటువులకు జంగమ దీక్షనిచ్చి, అతని నామఠమునకు పట్టాధికారిగా చేయుదురు. ఈ విధంగా వీరశైవ మఠ పరంపర యందున జంగమ మరియు భక్తులిద్దరికినీ మఠాధిపత్యము వహించెడి పరంపర రూఢి యందుగలదు.

ఈతడు చెడునడవడికకు దూరమై, ఎప్పుడూ శివధ్యాన, శివతత్త్వ చింతనలను చేయుచు, భస్మతత్త్వమును తెలిసికొని, దాని యుద్ధూళన మరియు త్రిపుండ్ర ధారణ చేసికొనెడివాడై, శరీరము మీద శాస్త్రపద్ధతి ప్రకారము యిష్టలింగమును, రుద్రాక్షలను ధరించి, యిష్ట–ప్రాణ–భావలింగముల పూజల యందున పరాయణుడై యుండవలెను. ఇంతియేకాదు, లింగాంగ యోగమనెడి శివజీవుల యైక్యబోధన యొక్క తత్త్వమును తెలిసికొని దానియందే దత్తచిత్తుడై యుండవలెను. అంగమునకు చెందిన 44 తత్త్వముల మరియు 57 లింగ స్థల తత్త్వముల భేదమును బాగుగా యెరిగి యుండవలెను. సర్వదా మంగళమయ వచనములను నుడివెడి యీ మహాపురుషుడే వీరశైవ ధర్మము యొక్క సద్గురువనిపించుకొనును.

ఈ తెరగున, సర్వలక్షణ సంపన్నుడైన సద్గురువే, శ్రీ నిజగుణుల వారి దృష్టిలో "విహితగురు" వనిపించుకొనును. విహిత గురువనే భావన శ్రీ నిజగుణులవారి సాహిత్యమునందున, గురువులలో గల వివిధ రకములను వివరించెడి సందర్భమున చెప్పబడినది. బోధక గురువు, వేదక గురువు, నిషిద్ధ గురువు, కామ్య గురువు, సూచక గురువు, వాచక గురువు, కారక గురువు, విహిత గురువులని గురవులను ఎనిమిది రకములుగా వర్గీకరింపబడినవి.

వాస్తవికముగా గురువులు ఎనిమిది రకములుగా నుందరు. ఎనిమిది రకములైన శిష్యుల యోగ్యతను బట్టి యుపదేశము చేయుటచేత ఎనిమిది విధములైన గురువులని చెప్పబడుచున్నారు. వీరిలో శాస్త్రమునకు సంబంధించిన శబ్దార్థములను బోధించెడివాడు బోధక గురువు. తత్త్వము యొక్క దర్శనమును చేయించెడివాడు వేదక గురువు. ఆకర్షణ వశీకరణ వంటి విద్యలనుపదేశించి, యిహలోకమున సుఖమును, పరలోకమున దుఃఖము నిచ్చెడివాడే నిషిద్ధ గురువు. పుణ్యాది కామ్యకర్మల నుపదేశించి యిహపరములందున సుఖమును కల్గించెడివాడే కామ్యగురువు వివేకమును బోధించి, శమ–దమాది షట్క సంపత్తిని శిష్యుని హృదయమున నుత్పన్నము చేయువాడే సూచక గురువు. శివ–జీవుల యైక్య జ్ఞానమును బోధించువాడే కారక గురువు. ఇంకా చివరన శిష్యుని సంశయములను, విపరీత భావనలను దూరము చేసి నిత్యమైన ముక్తినిచ్చెడివాడే విహితగురువనిపించుకొనును. ఇవి అనుభవజ్ఞుల నుడువులు.

నీటిని వడబోసి త్రాగవలెను. అదేరీతిన గురువు నెరిగి ఎంపిక చేసికొనవలెను. గురువుగారి గుణ గణములు, నడవడి నరసి, అతడు సేవ్యుడా కాడా యనెడిది గుర్తెరిగి, సద్గురువు లక్షణము గల గురువు నాశ్రయించి, జీవనము యొక్క కళ్యాణమునకై శిష్యుడు కృషి చేయవలెను. శిష్యుడు గురువుకు త్రికరణశుద్ధితో శరణన వలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 4-8-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానం, షోలాపూర్**

## విశేషప్రదీపిక :

శ్రీ గురువును గురించిన ఆశీర్వచనములో శ్రీ జగద్గురువు శ్రీకరమగు విషయములెన్నింటినో వివరించిరి. గురుశిష్యుల లక్షణములను తెలియజేసిరి.

పిండస్థలములో ప్రవేశించినజీవి, 'జీవి' తత్త్వము గుర్తెరిగి, గురుకరుణను పొందుటకై వలయు గుణ గణములను పెంపొందించుకొని సద్గురువును నాశ్రయించవలసియుండును. ఆతడెట్టి లక్షణములు గల గురువునాశ్రయించవలెననెడి ప్రశ్న ఉదయించెడి యవకాశము గలదు.

భారతదేశములోని దర్శనములన్నియు గురువుయొక్క ప్రాముఖ్యత నంగీకరించినవి. తల్లిదండ్రుల పిదపగల స్థానమును గురువు నకివ్వవలెననెడి భావన బహుళ ప్రచారములోనున్నది. బ్రాహ్మణులీ భావనకెక్కువ ప్రాముఖ్యతనిత్తురు. తల్లిని మించిన దైవము లేదనియును, పితృవాక్య మనుల్లంఘనీయమనియు తెలుపుదురు. పితృవాక్యపాలనకై పరశురాముడు తన తల్లి తలను తెగనరికెననెడి పౌరాణిక గాథలు గలవు. దశరథరాముని కథ అందరెరిగినదే. వీరశైవ ధర్మమున తల్లిదండ్రుల కిట్టి ప్రాముఖ్యతలేదు. గురువుకే యధికమైన ప్రాముఖ్యత గలదు.ఈ పద్యమును తిలకించుడి

**కారణోక్తుల "నగురోరధికంనగురోరధికం" బని రూఢి బొగడ**
**నిల గురురూపో మహేశ్వరో మహేశ్వరో" యనుచు సర్వాగామోత్తరములు నర్థి బొగడ**
**మతి 'గురురూపం సమాదాయ' యనుచు గ్రియాతిలకంబు నత్యర్థి బొగడ**
**వారక 'నాస్తి తత్వంగురోఃపర'మని యారుశేయంబుపోరిబొగడ**
**శ్రుతులు "నాచార్య దేవోభవతి" యనగ**
**సకల భుక్తి ముక్తి ప్రదాయకుదు గురుడు**
**శివుడు గురుమూర్తి వర సదాశివుడు యనుచు**
**బ్రస్తుతించెడు గురుమూర్తి బసవలింగ। (చతుర్వేదసారము 52)**

"న గురోరధికం" బనెడి యాగమోక్తి గుర్తింపదగినదై యున్నది. భుక్తిముక్తులకు గురుడే కారణభూతుడని చెప్పబడినది. దీక్షనిచ్చి మరుజన్మకు కారకుడైన గురుడు భవిని భక్తునిగా చేయుటచేత, అతడు జన్మదాతయై తల్లిదండ్రుల స్థానమును స్వీకరించును. అందుచేత తల్లిని మించిన దైవము లేదనుటకు మారుగా గురువును మించిన దైవము లేదని భావించికొనవలెను. అదే విధిన తండ్రి మాటను జవదాటకూడదనెడి వాక్యము స్థానమున గురుని యాజ్ఞను జవదాటకూడదనెడిదానిని యాచరణలో పెట్టవలెను. ఎప్పుడైతే శ్రీగురువు తల్లిదండ్రుల స్థానమును స్వీకరించునో అప్పుడు తల్లిదండ్రులు తమ అస్తిత్వమును కోల్పోవుదురు. వీరన్య ధర్మీయులైతే విస్మరణీయులగుదురు. పూర్వాశ్రమ నిరసనస్థలమున యిట్టి విస్మరణకు గల తాత్విక కారణములు వివరింపబడినవి. యిచ్చట గ్రహించవలసినదేమనగా గురువునకు అనన్య సామాన్యమైన స్థానము గలదు.

"నాస్తి తత్త్వం గురోఃపర"మనెడిది గమనింపదగినది. గురువుకంటెను వేరగు పరతత్త్వము లేదనెడిది దీనిలోని భావము. పృథివ్యాధి శివతత్వము వరకు గల షట్త్రింశవేత్ తత్త్వముల కంటెను గురువు అధికుడని తెలియుచున్నది. అనగా, నిర్గుణ శివపరబ్రహ్మ స్థానమును శ్రీగురువు స్వీకరించునని గుర్తించవలెను. వీరిరువురికిని యభేదమని గ్రహించవలెను. ఈ విషయమును స్పష్టము చేసెడి 'గురురూపో మహేశ్వరః' అనెడి ఆగమ సూత్రముల ననుసరించి శ్రీగురువు, భుక్తి-ముక్తుల ప్రదాతయగుచున్నాడు.

శ్రీగురువునకింతటి ప్రాముఖ్యత యెందుకు గల్గినదో తెలిసికొనవలసియున్నది. తన్నిమిత్తమై జీవి యెట్టిస్థితిలో యుండి యలమటించుచున్నాడో ముందుగా తెలిసికొనవలెను.

శివాంశమైన జీవుడు మాయాశక్తికి లోనై యాత్మానాత్మ మరియు నిత్యా నిత్య వివేకములు లేనివాడై యీ సంసారమున సంచరించును. భ్రమకు లోనై కాయమునే సర్వస్వమని యెంచును. కాయ పోషణకై ధనమార్జించును. కాయ భోగమునకై పడతిని గైకొని ఫలముగా సంతానము నొందును. కాయము నిచ్చిన తల్లిదండ్రులకును, దారాపుత్రాదులకును రక్తసంబంధము గలవారు బంధువులగుదురు. వీరందరితో తాను పొందెడి సుఖసంతోషములలో భాగమును పంచుకొనుటకు మిత్రులు గల్గుదురు. ఈ విధముగా జీవునకు సంసార బంధములు పెరిగి పెరిగి వికృతరూపమును దాల్చి కోరికలు పుట్టవలె పెరిగి వాటిని దేర్చుటకై జీవిచేత పాపమును చేయించుచున్నవి. తద్వారా దుఃఖమున పొందుచున్నాడు. సంసారము మదమెక్కిన యేనుగువలె విజృంభణము చేసి జీవి సర్వనాశనమునకు కారణభూతమగును. పాపములు కారుమేఘములై జీవితమును అంధకారబంధురము చేయును.

సకలోపద్రవములకు కాయమే కారణమై యున్నందున మరణమే ముక్తియనెడి వాదములు గలవు. చార్వాకులీ కోవకు చెందినవారు. సన్యాసము స్వీకరించవలెననెడివారును గలరు. సన్యాసమువలన అమృతత్వం సిద్ధించునందురు. ఈ రెండు వాదములు నిరాధారమైనవని నిరాకరించెడి వారును గలరు. వ్రత తపాదులవలన దేహమును శుష్కింపజేయాలని మరికొందరందురు. తపశ్చర్యలు తాపమును హెచ్చించునే గాని మోక్షము నివ్వజాలవని ముముక్షువులు వాదింతురు. ఈ స్థితిలో జీవి అయోమయ పరిస్థితిలోనికి నెట్టబడుచున్నాడు. ఇట్టి స్థితిలో పిండజ్ఞాని యెరుగవలసినదేమనగా ఈ దేహమును గురుసేవ కంకితము చేసిన యెడల నమోఘములైన ఫలితములుండును. గురువు రక్షణ కవచమై జీవిని రక్షించును. సంసారమనెడి మద గజమునకు కేసరియగును. పాపమేఘమును విచ్ఛేదనము చేసెడి ప్రచండ మారుతమగును. దేహాభిమానమునకు గొడ్డలి పెట్టగును. భయమును పోగొట్టి శివపథమును చూపి చింతను మాన్పును. కల్పవృక్షమై సంక్షేమము చేకూర్చును. అది యెట్టులోయని తెల్పెడి యనుభవ సారములోని యీ పద్యమును గనుడి :

**సీ॥ గురుమూర్తియను కల్పతరువొప్పు దత్తరు మూలంబు కరుణానిలోల దృష్టి**
**యాద్యశాఖోన్నతి యాజ్ఞామహత్త్వ మ య్యుపశాఖ లాది తత్త్వోదితములు**
**పల్లవంబులు శ్రుతుల్ ప్రసవముల్ మంత్రముల్ ఫలము లింగంబు తత్పరిమళంబు**
**జంగమ బోధల సారంబు నిత్యప్ర సాదాదికనయనోత్సవము ముక్తి**
**ఆ॥ యగుచు నాది కాదియగుచు నఖండితం బగుచు సకల నిష్కళాంగమగుచు**
**నభిమతార్థదాయి యగుచు శిష్యావళిం దన్ను జేర్చుకొనును దాత యగుచు**

(అనుభవసారము 53)

గురుడు భక్తిముక్తుల నొసగెడి వాడుగా సాక్షాత్ శివుడుగా పరిణామము పొందుచున్నాడని తెలియుచున్నది. పిండజ్ఞాని యీ ధార్మిక రహస్యమును గుర్తించవలెను. అయితే యతని కట్టి మహత్తు యెట్టులగల్గును? అనెడి సందేహము గల్గుటలో ననౌచిత్యము లేదు. భగవంతుడే భక్తి-ముక్తుల నిచ్చెడి సాధికారత గల్గియున్నాడని నమ్మబడుచున్నది. ఆ సేతు హిమాచలము వరకు గల అసంఖ్యాకమైన దేవాలయములలోన పూజల సల్పెడి లక్షలాది భక్తులు యీ భావననే మదిని దాల్చియున్నారు. నరునికి హరుని శక్తులెట్టులబ్బును యనెడిదొక జటిలమైన ప్రశ్నతో గురుని నరునిగా భావించెడి వారి యిట్టి వాదనలు నిరాధారములు కావు. లోకమున గురువులమని చెప్పుకొనుచు తిరుగాడెడు వారిని దృష్టి యందుంచుకొని వారీ విధిన వాదింతురు. వీరు సూచించెడి నరులు మలసహితులు, అదీక్షితులు, అల్పజ్ఞానము గలవారు. అనల్పమైన విషయ వాసనలు గలవారు. విషయ భోగములు పొందే క్రమములో లోభమోహములకు గురియయ్యెడివారు. ఇట్టి వారు శివలాంఛనములు ధరించినను శివతత్త్వము నెరుగజాలరు. ఇట్టివారిని గాంచిన చెన్న బసవేశ్వరులవారి మనోభావములను గనుడి.

**వ॥ ముండచేత వాయనము గొన్న నేమయ్యా**
**మొగడున్న ముత్తైదువలు మెచ్చజాలరు**
**శైవగురుని చేత లింగసాహిత్యమైన నేమయ్యా**
**వీరశైవ శరణులు మెచ్చరు**
**ఈ కారణముచేత కూడల చన్న సంగమ దేవయ్యా**
**శైవగురువుచేత సాహిత్యము పొందుటకంటె**
**చచ్చుట యే మేలయ్యా** (చెన్న బసవేశ్వరుని వ. 80)

ఇందులోని ముత్తైదువ మరియు ముండ అనెడి పదములు మర్మగర్భముగా వాడబడినవి. లింగధారణ గల్గిన వారు మరియు లింగధారణ లేనివారని గ్రహించవలెను. యీ వచనములో సూచించిన శైవగురువు లింగధారణ లేనివాడు. ఆదిశైవము, శుద్ధశైవము, సామాన్య శైవమిత్యాదులలోనివారు లింగధారులు కారు. ఇట్టి సాంప్రదాయములకు చెందినవారు వీరశైవ సిద్ధాంతము నవగతము చేసికొనజాలరు. అందుచేత పిండజ్ఞాని అట్టి గురువుల నాశ్రయించవలదని శ్రీభగవత్పాదుల వారునుపదేశమునిచ్చిరి. శ్రౌతశైవులు లింగధారణ గల్గియున్నను, వారు కర్మలతకు బద్ధులైయున్నారు. బ్రాహ్మణ పథమున పయనించుచు నుపనయనాదులు పొంది సంధ్యావందనాది నిత్యకర్మల నాచరింతురు. వీరున్ను వీరశైవ సాంప్రదాయమునకు చెందినవారు కారు. పరంపరానుగతముగా సహజ వీరశైవ గురుస్థానములగు మఠమయ్య, చరపట్టపుటయ్య, మరియు పంచ జగద్గురువులే గురు కారుణ్య స్థలమున పిండజ్ఞానికి దీక్షను ప్రధానము చేసెడి సాధికారత గల్గిన గురువర్గ పరంపరకు చెందిన వారని గుర్తించవలెను.

ఈ స్థలములకు చెందినవారు వేదాగమ పరిజ్ఞానము గలవారై నిత్యక్రియలను శాస్త్రోక్త విధిన చేయుదురని యున్నూ పిండజ్ఞాని అట్టి భావమునే మనమున దాల్చవలెను.

కొందరు శివపథమును పొందుటకై గురుపథము అనావశ్యకమని భావించెడి యవకాశము గలదు. అందుచేత, శివతత్త్వమునకును గురుతత్త్వమునకు గల పరస్పర యనుబంధము గురించి తెలిసికొనుట యెంతో అవసరము. శివుడే జీవుడై దుఃఖమును పొందెడి దశలో శివుడే గురుడై తన రూపమే అయిన జీవుని రక్షించికొనుటకు భూలోకమునకు విచ్చేయుచున్నాడని ఆగమములు తెలుపుచున్నవి. "గురు రూపో మహేశ్వరః" యని చెప్పబడినది. ఈ వాస్తవము దృష్ట్యా వీరశైవ పరంపరకు చెందిన గురువు నరుడు కాడు. సాక్షాత్తుగా హరుడే. నరుని కండెడి పరిమితులితనికుండవని భావించికొనవలెను. ఈ భావము వల్లనే భక్త వుదయించును. అద్దానిని గురుభక్తియని యందురు. ఇట్టి భక్తి అందరికి కలుగనేరదు. పూర్వజన్మ సంస్కారము గలవారికి యిది సుసాధ్యము. ఈ సంస్కారముతో బాటుగా శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు వివరించిన గుణగణములు గలవానికే గురుభక్తి గల్గును.

భక్తియనెడి శబ్దమును సేవ అనెడి అర్థమున స్వీకరించవలెను. గురువును సేవించుటయే గురుభక్తి యగుచున్నది. సేవలను రెండు విధములుగా విభజించవచ్చును. మొదటిది లాంఛనప్రాయముగా చేసెడి సేవ, రెండవది చిత్తశుద్ధితో చేసెడి సేవ. మొదటిది నిష్ఫలహేతువగును. రెండవది ఫలదాయకమైనది. చిత్తశుద్ధితోపాటు త్రికరణశుద్ధి యుండవలెనని వేరుగా చెప్పనవశ్యకత లేదు.

శ్రీగురువు శిష్యుని పరీక్షించి పరిగ్రహించును. శ్రీభగవత్పాదులు సూచించిన లక్షణములు లుప్తమైన యెడల, గురువును సేవించెడి యవకాశము లభించదని గుర్తించవలెను.

గురువును సేవించెడివానికి కోరికల మీద ఆపేక్ష ఉండకూడదు. సకామ సేవ దుష్ఫలితములనిచ్చును. నిష్కామ సేవ విహితమైననూ అధిక ఫలకారి కాదు. సహజసేవనే ఫలదాయకమని గుర్తించవలెను. తాను గురు రూపములోనున్న శివుని సేవించుచున్నానని భావించి పూజించుట సహజసేవ యగును. దీనివలన గురువు ప్రసన్నుడగును. ప్రసన్నుడైన శ్రీగురువు పిండజ్ఞానికి కరుణావలోకనమను ప్రదానము చేయును.

గురు కరుణను పొందుటయే గురుకారుణ్య స్థలమున పిండజ్ఞానికి లక్ష్యమై యుండవలెను. ఈ లక్ష్యసిద్ధి జరుగవలెననిన పిండజ్ఞానికి గురుమహిమ వలన సిద్ధించెడి ఫలముల దృష్టాంతములు దోచవలెను. తాత్త్వికపరముగా చూచిన యెడల గురు కరుణ వలన గల్గెడి పరిణామము లెట్టివో గుర్తించవలెను.

సంసార బంధములను ఛేదించుటకు భక్తియే మూలాంశమని గుర్తించితిమి. శివకరుణకు శివభక్తికి అవినాభావ సంబంధము గలదు. శివభక్తి గలవానికి శివకరుణ లభించును. శివకరుణ గలవారికే శివభక్తి సిద్ధించును. ఇట్టి మహత్వపూర్ణమైన శివభక్తికి గురుపాదములే మూలాధారములైయున్నవి. గురుపాదములు సేవించనివారికి శివభక్తి కలుగజాలదని గుర్తించవలెను. ఈ విషయమున శ్రీ బసవేశ్వరులవారి యీ వచనము జ్ఞానదాయకమగును.

**మడకెయ మాడువడె మన్నే మొదలు, తొడిగెయ మాడువడె హొన్నేమొదలు**
**శివపథవనఱివడె గురుపథవె మొదలు, కూడలసంగమ దేవర నఱివడె**
**శరణర సంగవలె మొదలు** (బ.వ.70)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**మట్టికను చేయునెడ మన్నే మొదలు, తొడువులు చేయునెడ పొన్నే మొదలు**
**శివపథము నెరుగగ గురుపథమే మొదలు, కూడల సంగమ దేవుని నెరుగగ**
**శరణుల సంగమమే మొదలు** (బసవేశ్వర గీతామృతము పుట 109)

ఒకరు చేస్తూ వుంటే చేసేవైనము, పుస్తకాలలో చూసి నేర్చుకొని చేసే వైనము హితమైనదని కాదని చెప్పబడినది. గురూపదేశము తప్పనిసరిగా వుండి తీరవలెనని తెలియజెప్పబడినది.

నమ్మకమనెడిది యెంతో ముఖ్యమైనది. మెచ్చిక కూడ చాలా అవసరము. నమ్మక, నచ్చక ఊరకే గురువును సేవించినచో యెట్టి ఫలితముండదని గ్రహించవలెను. గురువును గురుభావముతో చూడవలెను. గురువు కంటెను పెద్దవారు లేరనియును, తనకంటెను పిన్నవారు లేరనియును భావించుకొని గురువును సేవించవలెను. గురువు యెడల పిండజ్ఞాని పెంపొందించు కొనవలసిన నమ్మక విశ్వాసములు ఈ క్రింద సూచించిన భావనల మీద ఆధారపడి వుండవలెను.

సీ. అఖిల వేదాదీతమగు మూలమంత్రాక్షరములకు నతని వాక్యముల తేట
యయ్యక్షరాత్మకుండగులింగమూర్తి కాతని మనో భావంబు
జనితబూమి యాలింగమూర్తికి నాశ్రయంబైన శరణుని
కాతని కరాగ్రంబు తల్లి యమ్మ హాశరణున కాభరణంబైన భక్తికాతని
పదాబ్జములెయూత

ఉ॥ యట్టి భక్తికాదియైన జీవన్ముక్తి కతని ఘనదయామృతావలోక
నంబె పరమ పదవియమ్మహత్తరకీర్తి నొప్పు గురుని మహిమ జెప్ప దరమే

(అనుభవసారము ప- 37)

## ఆశీర్వచనము - 2 :

శ్లో॥ సేవేత పరమాచార్యం శిష్యో భక్తి భయాన్వితః।
షణ్మాసాన్ వత్సరం వాపి యావదేష ప్రసీదతి॥ (సి.శి 6-7)

ఆత్మ కళ్యాణమునకై గురువు నాశ్రయించిన శిష్యుడు అత్యంత భయభక్తులతో నారునెలలుగాని లేదా నొక వత్సరకాలమైనను, గురువుగారు ప్రసన్నుడయ్యేడి వరకు సేవించుచుండవలెను.

శ్లో॥ ప్రసన్నం పరమాచార్యం భక్త్యాముక్తి ప్రదర్శకమ్। ప్రార్థయే దగ్రతః శిష్యః ప్రాంజలిర్వినయాన్వితః॥
భో కళ్యాణ మహాభాగ శివజ్ఞానమహోదధే। ఆచార్య వర్య సంప్రాప్తం రక్షమాం భవరోగిణమ్॥

(సి.శి 6-8-9)

తానుచేసిన సేవ చేత గురువు ప్రసన్నుడైనది తెలిసికొని, భక్తి-ముక్తికి మార్గదర్శకమైన వాడగు నా ఆచార్యుని దరజేరి శిష్యుడు చేతులు మోడ్చి నిలిచుండి, యీ విధిన ప్రార్థించవలెను. ఓ మంగళాత్మకుడా! శ్రేష్ఠమైన శివజ్ఞానమునకు సాగరము వంటివాడా! సంసార రోగము వలన బాధింపబడి, వచ్చి మీ శరణు జొచ్చితిని. ఈ భవ బాధలను రూపుమాపి నన్ను రక్షించుడి.

సాధారణముగా జ్ఞానప్రాప్తి చేసికొనుటకై యుపాయము లెయ్యవి యనెడి ప్రశ్న ఉదయించును. ఈ శ్లోకమును గనుడి :

శ్లో॥ గురు శుశ్రూష యా విద్యా పుష్కలేన ధనేన వా।అథవా విద్యయా విద్యా చతుర్థంనాస్తి సాధనమ్॥

శ్లోకములో గురుసేవ, పుష్కలమైన ధనము, విద్య యొక్క వినిమయ మనెడి మూడు ఉపాయములు ప్రతిపాదింపబడినవి. గురువు గృహస్థుడైన యెడల యతని సాంసారిక జీవనమునకై ధనము యొక్క అవశ్యకత యుండెడి కారణమున, ధనికుడైన శిష్యుడు పుష్కలముగా ధనమునిచ్చి, గురువుకు సంతృప్తిపరిచి, యాతని కరుణని పొంది జ్ఞానమును సంపాదించవచ్చును. గురువు గృహస్థుడు కాకుండినను, సామాజిక మరియు ధార్మిక కార్యక్రమములను చేసెడి యభిలాష గలవాడై యుండిన యెడల, అతనికైననూ ధనము యొక్క అవశ్యకత యుండుటచేత, అతనికి తగినంత ధనమును సమకూర్చి సామాజిక మరియు ధార్మిక సేవ యందు సహభాగియై, గురుకరుణను పొందవలెను.

ఇంకను జగత్తునందున ననేకమైన విద్యలుండుటచే తనకు రాని విద్యను, శిష్యునికి వచ్చియుండిన యెడల, తన విద్యను ప్రదానము చేసి, శిష్యుని విద్యను గ్రహించునది, విద్యా వినిమయ పద్ధతి యగును. ఈరెండు ఉపాయములకంటెను గురుసేవను సలిపిగురుకృపను సంపాదించునది సర్వోత్కృష్టమైనది. దానికొరకే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు, "సేవేత పరమాచార్యం శిష్యో భక్తి భయాన్వితః" అని యానతి నిచ్చిరి.

వేడినవారికి, వేడినంత యిచ్చెడి సామర్థ్యము గలవాడును, షడ్గుణైశ్వర్య సంపన్నుడునగు గురువుకు శిష్యుని యీ ధనము యొక్క యభీప్సితమైనను, సకల విద్యలకు సాగరమైనవానికి శిష్యునియందు యుండెడి విద్య యొక్క అపేక్షయైనను ఉండదు. ఈ కారణమునపుష్కలముగా ధనమునిచ్చిగాని, విద్యయొక్క వినిమయము ద్వారాగాని శ్రీ సద్గురుని కరుణను పడయుట అసాధ్యమైన విషయము. అందుచేత శిష్యుడు సేవావృత్తినే ఆశ్రయించవలెను.

**"సేవాధర్మః పరమగహనో యోగినామప్య గమ్యః"**

అనెడి సూక్తి ప్రకారము సేవయే మహత్త్వము గలిగినదని తెలిసికొనవలెను. గురుభక్తి సంపన్నులైన శ్రీ నిజగుణశివయోగులవారు గురుసేవను ఆప్త, అంగ, స్థాన మరియు సద్భావము అనెడి నాలుగు విధములుగా వర్ణించిరి.

దేహము యొక్క నీడ సదా దేహమును అనుసరించి యుండునటులే శిష్యుడైనవాడు గురువు యొక్క నీడ ననుసరించి అతని మనస్సుకు సదా అనుకూలముగా నడచుకొనునదే ఆప్తసేవ.

సంతానము యొక్క ప్రాప్తికొరకు కులగురువులైన వశిష్ట మహర్షులవారి ఆశ్రమమునకు ధర్మపత్నియైన సుదక్షిణాదేవిని కూడుకొని వచ్చిన దిలీపమహారాజుకు, వశిష్ట మహర్షులు కామధేనువు సంతానమైన నందినియొక్క ఆప్తసేవకై దంపతులనాజ్ఞాపించెను. దిలీప మహారాజు గారి ధర్మపత్ని ఆశ్రమము యొక్క సీమవరకు నందినిని వెంబడించి వెనుదిరుగగా, దిలీపుడు అడవియందు సాయంకాలమునకు నందినిని అనుసరిస్తూ కాపలగనుండెను. అనుదినము దిలీప మహారాజు అడవి యందు గోవు యొక్క ఆప్తసేవను చేసిన విధానమును కవి కులతిలకుడైన కాళిదాసు ఈ క్రింది విధిన వర్ణించెను.

**శ్లో॥ స్థితః స్థితాముచ్చలితః ప్రయాతాం నిషేదుషీ మాసన బంధ ధీరః ।**
**జలాభిలాషీ జలమాదదానాం ఛాయేవతాం భూపతిరన్వగచ్ఛత్॥**

దీని భావము నందిని నిలిచిన యెడల దిలీపుడును నిలుచుండెను. అది బయలుదేరిన తానూ బయలుదేరెడివాడు. అది విశ్రాంతికై పరుండిన తానూ కూర్చొని యుండెడివాడు. అది నీరును కుడిచిన యెడల తానూ నీటిని త్రాగెడివాడు. మొత్తము మీద దానియొక్క నీడ ఉపాధియందు మహారాజు నందినిని అనుసరించెను.

ఈ రీతిగా శ్రీసద్గురువు యొక్క మనోవృత్తికి కించిత్తైనను విపరీతము కాని యటుల, యెల్లకాలమునందు ఆయన కనుసన్నలలో నడుచుకొనుట గురువు యొక్క ఆప్తసేవయగును.

అంగమనగా కరచరణాద్యవయములు– మనము, మన శరీరము మరియు శరీరము యొక్క అవయవములయందు ఎంత ప్రేమను గలిగియున్న వారమై యుందుమో, అదేవిధిన శ్రీసద్గురువు యొక్క పాదాది అవయవముల యందు ఎంతో ప్రేమగలవారై యుండి, పాదములను ప్రక్షాళన చేయుట, స్నానమును చేయించుట, శరీరమునందున ఏమైన వేదన, వ్యాధులు అయిన యెడల శరీరము యొక్క సంవాహనాదుల చేత ఉపచారములను చేయుట మొదలగునవి శ్రీగురువు యొక్క అంగసేవకు చెందినవి. మరొక మాటలో చెప్పవలెననిన శ్రీ గురువు గారి ప్రతియొక్క అవయవమునకు సేవ చేయునది అంగసేవ యగును. ఇందు నిమిత్తము ఎంతో సహనభావము ఉండవలసియుండునని వేరుగా చెప్పవలసిన అవసరములేదు. గురుపాద సేవగురించి శివశరణులు బహు విస్తారముగా తెలిచజేసిరి. శ్రీ షణ్ముఖ స్వాముల వారి యీ క్రింది వచనమును గనుడి :

**"గురుచరణవ పూజిసి ఎన్న హస్తంగళు పరుషవాదవు.**
**గురుచరణవ నోడి ఎన్న కంగళు పరుషవాదవు.**
**గురుచరణవ హాడి హరసి ఎన్న జిహ్వే పరుషవాయిత్తు.**
**గురుచరణవ నెనెదు ఎన్న మన పరుషవాయిత్తు.**
**గురుచరణవ ధ్యాని సి ఎన్నభావ పరుషవాయిత్తు**
**నోడా అఖండేశ్వరా"**

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**గురుచరణమును పూజించి నా హస్తములు పరుషమైనవి**

**గురుచరణమును చూసి నా కళ్ళు పరుషమైనవి.**
**గురుచరణమును పాడి స్వస్తిని పలికి నా జిహ్వా పరుషమైనది.**
**గురుచరణమును తలచి నా మనస్సు పరుషమైనది.**
**గురుచరణమును ధ్యానించి నా భావము పరుషమైనది**
**చూడుమా అఖండేశ్వరా!**

అదే విధిన గురుచరణముల గురించి పలికిన శ్రీ దేవర దాసిమార్యులవారి నుడువులను గనుడి :

**"ఉరివ కెండద మేలె తృణవ తందిరిసిదరె,**
**ఆతృణవనా కెండ నుంగిదంతె,**
**గురుచరణద మేలె తనువెంబ తృణ్ణవ తందిరిసిదరె**
**ఆతనే సర్వాంగవెల్ల లింగ కాణా రామనాథా"**

ఈ వచనము యొక్క తెలుగు రూపమియ్యది.

**కణకణలాడెడి యింగలము మీద తృణమును తెచ్చివుంచిన యెడ,**
**ఆతృణము నా నిప్పు మింగిన యటుల,**
**గురుచరణము మీద తనువనెడి తృణమును తెచ్చి యుంచిననెడ**
**ఆతడే సర్వాంగముల యందు లింగము కనుమా రామనాథా!"**

పై రెండు వచనములలో గురువుగారి పాదాది యంగముల సేవా ఫలము సుస్పష్టముగా ప్రతిపాదించబడినది. శరణులు శివయోగులు మరియు ఆచార్యుల యొక్క ఈ అనుభవములోని నుడువులమీద విశ్వాసమునుంచి, ప్రతియొక్కరూ, గురుచరణమును సేవించి, ఆలింగసేవ యొక్క ఫలముగా తమ శరీరము యొక్క శుద్ధీకరణను చేసికొని శివకృప ప్రాప్తికై ప్రయత్నించవలెను.

అగ్ని యొక్క స్పర్శను పొందిన తృణము అగ్నియైన యటులె, వరపుణ్యమయ గాత్రుడైన శ్రీ గురువు యొక్క చరణమునంటి సేవించిన యెడల శిష్యుని జన్మ జన్మాంతరముల పాపములన్నియును దహించిపోయి, శ్రీగురువు యొక్క పుణ్యమయమైన దేహమువంటి దేహము గలవాడగుచున్నాడు. తానసేక జన్మలయందు జపతపాదులచేత దూరము చేసికొనవలసిన పాపరాశి, దూదిదిండును అగ్నికణము దుగ్ధము చేసిన యటుల అర్ధక్షణమున గురుచరణ స్పర్శచేత భస్మమగుచున్నది. నిష్టాపూర్ణమైన అంగసేవ చేత గురువుయొక్క మనస్సు కరిగిపోవుచున్నది. శిష్యుడు శీఘ్రముగా గురుకృపను బడయగల్గును.

మనము మన పొలములు మరియు ఇళ్ళమీద ప్రేమచే వాటినే విధముగా కాపాడుకొనుచుందుమో, అదే విధిన గురువుగారి సన్నిధానమునకు వారి ఇల్లు, మఠము, పొలము, తోట మొదలగు స్థానముల సంరక్షణా కార్యమునందు తత్పరతతో సేవచేయునది, ప్రతిదినము గురువుగారి మఠము యొక్క చెత్త చెదారమును ఊడ్చివేసి స్వచ్ఛము చేయునది, పర్వదినముల యందు దానికి సున్నము లేదా ఝగులను వేసి అలంకరించునది మఠము యొక్క ప్రాంగణమును స్వచ్ఛముగానుంచి కలాపిని చల్లి, రంగవల్లిని వేసి శోభాయమానముగా చేయునది, అటులనే శ్రీ గురువు యొక్క పొలము లేదా తోటయందు యథోచితమైన పొలము పనులను మరియు తోటపనులను నిర్వహించెడి బాధ్యతను స్వీకరించునది, పొలమునందు లేదా తోటయందు వచ్చిన ఫలసాయము మనుష్యులు లేదా పశువులచేత పాడుకాకుండా పగలు, రాత్రి పొలమునందే యుండి సంరక్షించునది మొదలగునవి గురువుయొక్క స్థానసేవ అనిపించుకొనును.

పూర్వకాలమున, ధౌమ్య ఋషుల ఆశ్రమము నందున, ఆరుణి యనెడి విద్యార్థి, గురుసేవా వ్రతమును గైకొని విద్యాధ్యయనమును చేయుచుండెను. ఒకదినమున అడవినుండి కట్టెలను తీసికొనివచ్చు నపుడు, ఆశ్రమము యొక్క పొలము గట్టు తెగి వరిపొలములోని నీరంతయు బయటికి పారిపోయెడి దానిని చూచి మనమునందు ఈ క్రింది విధిన విచారించుకొనెను.

"నేను ఇపుడు ఈ ఒడ్డును సరిచేయుచు నిలిచియుండిన ఆశ్రమమునందు కట్టెలు లేని కారణముచేత వంటకు యిబ్బంది యగును. అందుచేత కట్టెలను మోసికొనిపోయి అక్కడ అప్పగించిన తదుపరి యిక్కడికి వచ్చి పొలము గట్టును సరిజేయవలెను". ఈ విధముగా విచారము చేసిన ఆరుణి, వేగముగా ఆశ్రమమునకు వచ్చి కట్టెలమోపును దించుకొని, గురువుగారికి ఈ క్రింది విధిన చెప్పెను.

"ఓ గురుదేవా! వరిపొలము యొక్క గట్టు తెగి నీరు బయటికి పారిపోవుచున్నది. నేను పోయి దానిని సరిచేసి వచ్చెదను". ఆరుణి యొక్క ఈ మాటలను వినిన గురువుగారు, తథాస్తు అని ఆనతి యిచ్చిరి. గురువుగారి ఆనతిమేరకు ఆరుణి పొలమునకు వచ్చి పారిపోయెడి నీరును ఆపుటకై శక్తిమేర శ్రమించెను. అయినను నీరు ఆగలేదు. "నేను దినమంతయు దీనినే చేయుచూ కూర్చొనియుండిన నేటి అభ్యాసమునందు అనుపస్థితి యగును. ఏమి చేయవలెను?"అని మరల మనస్సునందుననే విచారించుకొనజొచ్చెను. చివరకు ఒక నిర్ణయమునకు వచ్చెను. గురుసేవకంటెను అభ్యాసము ఎక్కువైనదికాదు. ఇప్పుడు నేను ఎటులనైనను పారి బయటికి పోవుచున్న ఈ నీటిని ఆపివేయవలయును, అని తలవంచి తగినంత ప్రయత్నమును చేసి సఫలమనోరథుడగుటకు ప్రయత్నించెను. కాని ఫలితము కన్పట్టలేదు. చివరకు తానే విరిగిన గట్టు స్థానమున పరుండి నీటిని బయటికి వెడలకుండ నాపజొచ్చెను. సాయంకాలమైననూ లేచి పోవలయుననెడి ఆలోచనయే అతడు చేయలేదు. ఆశ్రమమునందున సాయంకాలము దీపము పెట్టెడి సేవ ఆరుణిదే అయియుండెను. ఆశ్రమమునందు ఎల్లెడల చీకటి ఆవరించగను గురువుగారు "ఆరుణి ఎక్కడ వున్నాడు? ఇంకా దీపమునెందుకు వెలిగించలేదు?" అంటూ మిగిలిన శిష్యులనడుగగా "గురువుగారూ! మధ్యాహ్నము వరిగట్టును సరిచేయుటకు పోయినవాడు యింతవరకు రాలేదు?" అని వారెల్లరు తెలిపిరి. అప్పుడు ఋషి "అట్లైన అతనికి ఏదైన దుర్ఘటన సంభవించి యుండ వచ్చును. అక్కడికి పోయి చూచెదముగాక! పదండి" అని చేతియందున కాగడాను పట్టుకొని శిష్యులను వెంబడించుకొని పొలమువైపుకు వచ్చి ఆరుణీ! ఆరుణీ! యంటూ ఎలుగెత్తి పిలువజొచ్చిరి. గగనవ్యాప్తి అయిన గురువుగారి ఈ ధ్వని ఆరుణి యొక్క చెవికి చేరినది. అప్పుడు ఆరుణియు అర్ధమూర్ఛిత అవస్థయందుననే చిరుధ్వనియందు ఓ అంటూ ఉత్తరమునిచ్చెను.

ఆరుణి యొక్క ఈ చిన్న ధ్వని నిశ్శబ్ద వాతావరణమునందున యెల్లరికి వినబడెను. ఆ ధ్వనివైపు పరుగెత్తి వచ్చి చూచిరి. పారెడి నీటికడ్డముగా పరుండియుండిన ఆరుణిని చూసిరి. అతని శరీరము మీదినుండి నీరు ప్రవహించిపోవుచుండెను. శీతలము వలన అతడు మూర్ఛావస్థను పొందియుండెను. అతని స్థితిని చూసి, కరుణార్ద్ర హృదయులైన గురువుగారు పరుగెత్తికొనివచ్చి అతనిని లేవదీసి ఆశ్రమమునకు తెచ్చి ఉపచారములను చేసిరి. మేలుకొనిన ఆరుణి "అయ్యో! ఇక్కడికి నేనెటుల వచ్చితిని? వరిగట్టు గతి ఏమై వుండవచ్చును?" అని అడుగగా అక్కడే వున్న గురువుగారు "ఆరుణీ! ఏమియును చింతించవలదు. నీ యందునగల గురుభక్తి అద్వితీయమైనది. నీ కీర్తి ఆచంద్రార్కము నిలిచివుండుగాక" అని నిండు మనసుతో ఆశీర్వదించిరి. ఈ ప్రకారముగా గురువుయొక్క స్థానాదులయందు సేవను చేయునది స్థానసేవ యగుచున్నది.

గురుసేవను చేసెడివాడు సంపూర్ణమైన అంకిత భావముతో సేవను సలుపవలెనని గ్రహించదగును. అపుడు భావన యనగా నేమిటియో తెలుసుకొనవలసి యుండును. సిద్ధాంత శిఖామణిలో భావము గురించి ఈ క్రింది విధిన చెప్పబడినది.

**శ్లో॥ భావ ఏవాస్య సర్వేషాం భావాచార ప్రకీర్తిత।**
**భావో మానసచేష్టాత్మా పరిపూర్ణః శివాశ్రయః** (సి.శి. 16-67)

సంపూర్ణముగా శివునినే ఆశ్రయించిన మనస్సు యొక్క వ్యవహారమును భావము అని అందురు. ఈ కారణమువలన, శిష్యునియందు యుండెడి "శ్రీగురువు సాక్షాత్తుగా పలుకెడి పరమాత్మయనెడి అచంచలమైన విశ్వాసమే" సద్భావన యనిపించుకొనును.

మనుష్యుని జీవనమునందున భావనకు ఎంతో ప్రాశస్త్యము కలదు. మనము ఏ పనిని చేయుచున్నాము అనే దానికంటెను, ఏ భావముతో చేయుచున్నామనెడిది ఎంతో ముఖ్యమైనది. అందుచేతనే శ్రీ జగద్గురు రేణుకాచార్య భగవత్పాదులు ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**భావనావిహితం కర్మ పావనాదపి పావనమ్।**
**తస్మాద్భావనయా యుక్తం పరధర్మం సమాచరేత్॥** (సి.శి. 16-68)

భావన మూలకముగా చేసిన కర్మయే పావనము. మరియు పుణ్యప్రదమైనది అని శ్రీ భగవత్పాదులవారి ఉపదేశములోని భావన. భావనాశూన్యమైన పూజాది క్రియలు యాంత్రిక క్రియలగుచున్నవి. యంత్రపు బొమ్మవలె, చేతినందున జపమాలనుపట్టుకొని విద్యుత్తు సహాయముచేత నడిచెడి బొమ్మవలె మంత్రమును పఠించుచు చేతిలోని రుద్రాక్షలను లెక్కపెట్టిన యెడల యేమియును ఫలముండదు అదేవిధముగా భావనారహితమైన వ్యక్తి ఎంతకాలము జపించిననూ, ఎంతకాలము పూజించిననూ ఎట్టి ప్రయోజనము కలుగదు.

భావనలేనిది, గురువు యెడల గల భయముతో చేసెడి ఆప్త, అంగ మరియు స్థాన సేవలును ఫలితమునివ్వజాలవు. చేసెడి శిష్యుడు ప్రేమానురాగములతో చేయవలెను. భయభ్రాంతితో చేసెడి పనులలో అనురాగముండదు కదా!

శ్రీగురువే పరమాత్ముడనెడి అచలమైన విశ్వాసము సద్భావనతో సేవించునదే ఉత్తమమైన పద్ధతియగును.

గురువుయొక్క మహత్త్వమును ఎంతో సుందరముగా చిత్రించిన సర్వజ్ఞులవారి ఈ క్రింది వచనము గమనించదగియున్నది.

**సురతరువు మరవల్ల। సురభియొందావల్ల।**
**పరుష పాషాణ – దొళగల్ల గురురాయ।**
**నరరొళగె అల్ల సర్వజ్ఞ!**

దీనియొక్క తెలుగు రూపము :

**సురతరువు మ్రానుకాదు। సురభియొక ఆవు కాదు।**
**పరుషము పాషాణములోనిది కాదు గురురాయుడు**
**నరులలోని వాడు కాదు సర్వజ్ఞ!**

సర్వజ్ఞుని వచనము ప్రకారము కల్పవృక్షమునకు, కామధేనువునకు, స్పర్శవేదికిని ప్రత్యేకమైన స్థానములు గలవు. కల్పవృక్షము మరియు కామధేనువు కామ్యమునిచ్చెడివి. స్పర్శవేది వలన ఇనుము బంగారమగును. అట్టి యెడ కల్పవృక్షమునొక వృక్షమని, కామధేనువునొక పశువని, స్పర్షవేది నొక ఒక రాయియని యనుటలో ఔచిత్యముండదు. అటులనే నరులలో నొకడుగా నున్నను నరలోక కళ్యాణమునకు వచ్చిన పరమేశ్వరుని అపరరూపమైన శ్రీగురువును నరుడనుటలో అవివేకము బహిర్గతమగును. సర్వజ్ఞుడు అంతటితో ఆగలేదు. శ్రీగురువు శివునికంటెను ప్రశస్తమైనవాడని తెలియజెప్పునాతని ఈ క్రింది వచనమును గనుడి :

**నంబువదు। నినగేకె। హంబలవు పరశివన।**
**నంబి గురుదైవవ నగస్త్యమునియు తా।**
**నంబుధియ సవిద సర్వజ్ఞ"**

దీని తెలుగు రూపము :

**నమ్మునది నిన్నేల। కోరడము పరశివుని।**
**నమ్మి గురుదైవమనియగస్త్యముని తా।**
**నంబుధిని త్రాగెను సర్వజ్ఞ॥**

సర్వజ్ఞులవారి వచనములో శివునికి ఒక ప్రశ్న వేయడమైనది. అదేమిటనగా నిన్ను నమ్మనదెందుకు? నిన్ను కోరడమెందుకు? ఈ ప్రశ్నలలో శివుని నమ్మినందువలన, శివుని కోరినందువలన ప్రత్యేకమైన ఫలితము లభించదు. ఒకవేళ లభించినా తృప్తికరముగానుండదు. ఇది ఇటులుండగా గురువును నమ్మి, గురుసేవను చేయుచుండిన యెడల అనితరసాధ్యమైన కార్యములను సునాయాసముగా సాధించవచ్చును. అగస్త్యముని గురువును నమ్మి సప్త సముద్రములను ఒకే గుటకతో మ్రింగివేసెను. ఇది గురు మహత్త్వమునెంతో ఎంతో గొప్పగా చిత్రించుచున్నదని చెప్పవచ్చును.

గురువును మించినది మరొక్కటిలేదని చెప్పెడి షణ్ముఖ స్వామివారి వచనమొకటి కలదు. కనుడి:

**"గురువే పరతత్వవు తానె నోడా! గురువే పరవస్తువు తానె నోడా!**
**గురువే పరబ్రహ్మవు తానె నోడా! గురువే పరశివను తానె నోడా!**
**గురువినింద పరవిల్లవెందు సకలశ్రుతిగళు హొగళుతిప్పవు నోడా!**
**ఇంతప్ప శ్రీగురువింగె నమోనమః ఎంబెనయ్యా, అఖండేశ్వరా"**

ఈ వచనము యొక్క తెలుగు రూపము :

**"గురువే పరతత్వము తానె చూడుమా! గురువే పరవస్తువు తానె చూడుమా!**
**గురువే పరబ్రహ్మము తానె చూడుమా! గురువే పరశివుడు తానె చూడుమా!**

**గురువు కంటెను పరములేదని సకలశ్రుతుల పొగడుచున్నవి చూడుమా!**
**ఇంతటి శ్రీగురువుకు నమోనమః అనెదనయ్యా అఖండేశ్వరా!**

ఈ వచనములన్నియు శ్రీగురువు ఎడల తమ కుండెడి సద్భావనను వివరించుచున్నవి. ఈ వచనకర్తల అంకితభావమునకివి అద్దమును పట్టుచున్నవి.

ఒకానొక సమయమునందు గురుశిష్యులిరువురు సంచరించుచు సాయంకాలము సమయమునకు ఒక దట్టమైన అడవిని ప్రవేశింతురు. రాత్రియందు ఏదో ఒక గ్రామమునందు నివసించివలసియున్నను ప్రొద్దుమూకెడివరకు ఏ ఊరు రానందున ఆదినమున అనివార్యముగా రాత్రిని అడవియందే గడుపవలసి వచ్చినది. నిర్జనారంభము, క్రూరమృగములచే నిండియుండుటచే నాయడవి నుండి సురక్షితముగా బయలువెడలి రావలసిన యెడ యిద్దరూ ఏకకాలమునందు నిద్రించరాదని నిర్ణయించుకొనిరి. మొదట గురువుగారు అక్కడనే ఒక చెట్టు దగ్గర పవళించెను. గురువుగారు నిద్రించెడి సమయమందు, అతని శరీరమునకు ఏదో ఒక మృగమువలన లేదా విషకీటకము వలన అపాయము వాటిల్లకుండ వుండుటకై శిష్యుడు కాపలా కాయుచు జాగ్రత్తగా కూర్చొని యుండెను.

నాలుగు గంటలవరకు నిశ్చింతగా నిద్రించిన గురువుగారు నిద్రనుండి మేల్కొని శిష్యునిమీద దయతలచి పరుండమని యానతిచ్చెను. అప్పుడా శిష్యుడు విశ్రాంతి గైకొనుచుండగా గురువుగారు మేల్కొని యుండిరి. శిష్యుని దేహము యొక్క రక్షణ యందు తత్పరులైయుండిరి.

శిష్యుడు పరుండిన ఒక గంట తదుపరి ఒక కాలసర్పము శిష్యునివైపు ప్రాకుచు వచ్చెడి దృశ్యమును గురువు చూసి పరుగెత్తి పామును వెడలగొట్టి శిష్యుని రక్షణయందు నిమగ్నులై యుండిరి. అప్పుడా పాము గురువుగారితో చెప్పెను. "గురుదేవా! తాము నాకు అడ్డము రావలదు. మీ శిష్యునికి నాకు ఏడు జన్మలనుండి వైరము కలదు. ఒకసారి ఇతడు నాకు సర్పమై కరిచెను. మరియొకసారి నేను సర్పమై వీనిని కరిచితిని. గత జన్మమందు నేను మనుష్యునిగా నుండినపుడు సర్పముగా నుండిన నన్ను నితడు నన్ను కరచి రక్తమును పీల్చెను. ఆ కారణమున నీతని రక్తమును నేను పీల్చి నా పగను తీర్చికొందును". అనగా సర్పము యొక్క ఈ విచిత్రమైన మాటను విని గురువుగారు "ఏమే ఉరగమా! ద్వేషమునకు ద్వేషము పెంచుకొనుచుపోయిన యెడల అది ఎన్నటికిని శాంతించదు. ఏడు జన్మల నుండి వచ్చుచుండెడి మీ యిరువురి ద్వేషమీరీతిగా కొనసాగుచుండిన ఏడువేల వర్షములు గడచినను తీరదు. ఇంతవరకు అయినదేమో అయినది. ఇప్పుడు గురువుగారి సన్నిధియందు ద్వేషమును విడువుము" అని ఉపదేశించిరి.

గురువుగారి ఈ ఉపదేశమును వినిన సర్పము "గురుదేవా! మీరు ఏమేమి చెప్పినను ఈతని కుత్తుకనుండి ఒక బొట్టు రక్తమైనను నా నాలుకకు తగులనిదే నాకు సంతృప్తి కాజాలదు. ఈ ఒక్కసారి రక్తము పీల్చుటకొప్పుకొనుడి. మున్ముందు మీరు చెప్పినయటుల వినెదను" అనెను.

అప్పుడా గురువుగారు శిష్యుని ప్రాణరక్షణయు కావలెను మరియు సర్పమునకు శిష్యుని కుత్తుకలోని రక్తము దొరకవలెను అని ఆలోచింపజొచ్చెను. ఇంతలో ఏదైనా నొక ఉపాయమును చేయవలెనని యోచించి ఆ సర్పమునకిట్లనెను.

"ఏమే భుజంగమా! శిష్యుని కుత్తుకలోని వేడి రక్తమును ఆయుధముచేత వెలికిదీసి నేను తీసికొని నీకు యిచ్చెదను. దీనికై ఒప్పుకొందువా?" అని అడిగిరి. ఆ మాటకు సర్పమంగీకరించెను. వెనువెంటనే గాఢనిద్రయందువున్న శిష్యుని యెదమీద కూర్చొని తమదగ్గరనున్న సన్న చాకుచేత యాతని కుత్తుకను స్వల్పముగా కోయవలెనని ప్రయత్నించుచుండునంతలోనే శిష్యుడు మేల్కొని తన యెదమీద యెవరు కూర్చొని యున్నారని కృద్ధుడై కనులు తెరచిచూచి గురువుగారే చేతిలో చాకును పట్టుకొని కూర్చొనియుండుట కనులారా కనిన శిష్యుడు శాంతమనస్కుడై ఏమియును నుడువక మరల కళ్ళు మూసుకొని పరుండెను.

గురువుగారు శిష్యుని కుత్తుకను స్వల్పముగా కోసి రక్తమును తీసి సర్పమునకర్పించగా నది ద్వేషమును మరచి సంతోషచిత్తముతో వెడలిపోయెను. సర్పము పోయిన పిదప గురువుగారు శిష్యుని తో "ఓయీ శిష్య శిరోమణీ! మేము నీ యెదమీద కూర్చొని కుత్తుకలోని రక్తమును తీయునపుడు మేల్కొని నాచేతిలోని ఆయుధమును గని, ప్రతిగా ఏమియు అడగనిదే మరలా కళ్ళు మూసుకొని నిశ్చింతగా నిదురించితివి గదా! నీవా దృశ్యమును చూచి భయపడవలెను, మా మీద అవిశ్వాసము కాలుగవలెను, ఎందుల కూరకుంటివి?

గురువుగారి మీ మాటలకు శిష్యుడు "గురుదేవా! నా రక్షణ భారమును తమమీద వేసి నిదురించిన నా గొంతుకలోని రక్తమును తాము తీసినది నాకు తెలిసిననూ నేను నిశ్చింతగా యుండినది ఎందుకనగా, తమను నమ్మిన పిదప నాకు మరిక చింతయేల? సాక్షాత్తుగా త్రిమూర్తులకతీతుడైన పరశివుని రూపమైన మీ నుండి నాకు హితమే యగును కాని అహితమగునే? అందుచేత నేను నిశ్చింతగా నుంటిని అని బదులు పలికెను..

ఈరీతిగా గురువే పరశివుడు. అతడే నా హితచింతకుడు అనెడి ఉన్నతమైన భావన కలుగుటయే సద్భావన యగును.

ఈ కారణము వలననే బసవేశ్వరులవారు గురువును గురించి వచనము నుడివిరి.

**"తందెనీను, తాయినీను, బంధునీను, బళగనీను,**
**నీనల్లదే మత్తారూ ఇల్లవయ్యా!**
**కూడల సంగమదేవా, హాలలద్దు, నీరలద్దు!**

ఈ వచనము యొక్క తెలుగు రూపము :

**"తండ్రివి నీవు, తల్లివి నీవు, బంధువు నీవు, బలగము నీవు**
**నీవు కానిది మరేదియు లేదయ్యా!**
**కూడల సంగమ దేవా!**
**పాల ముంచుము, నీట ముంచుము**

ఈ వచనమునందు కూడల సంగమ క్షేత్రాధిపతియు తమ దీక్షాగురువు అయిన శ్రీజాత వేదముని శివాచార్యుల గురించి తమ సద్భావనను తెలియజెప్పిరి.

సాధారణముగా లోకమున తల్లిదండ్రులకు ఎంతో ప్రాముఖ్యత నిత్తురు. గురువునకు అంతకంటెను అధికమైన ప్రాముఖ్యత గలదనెడి తెలియజెప్పెడి శ్రీ తొంటడ సిద్ధ లింగేశ్వరులవారి వచనమును గనుడి:

**గురువి నింద ఉపదేశవ పడెదు, గురుపుత్రనెనిసు కొండు,**
**బళిక పూర్వద తందె తాయి యెందు, బుధుబళగవెందు**
**మల సంబంధవ నెనెయ లారదు కాణిరో!**
**నెనెదిరి యాదరె శివద్రోహ తప్పదయ్యా!**
**ఇన్ను నిమగె తాయి తందెయ హేళిహె కేళి**
**గురువే తాయి, గురువే తందె, గురువే బంధు**
**గురువి నింద పరవిన్నారు ఇల్లవెంబు నమ్మబల్లరె**
**శిష్యనెంబెనయ్యా మహాలింగ గురుశివ సిద్ధేశ్వర ప్రభువే!**

ఈ వచనము యొక్క తెలుగు రూపము :

**గురువువలన నుపదేశము బడసి, గురుపుత్రుడనిపించికొని,**
**వెనుక పూర్వపు తండ్రి తల్లియని, బంధు బలగమని**
**మల సంబంధమును దలపరాదు, కానుడో!**
**తలచిన యెడల శివద్రోహము తప్పదయ్యా**
**ఇంకను మీకు తల్లిదండ్రుల గూర్చి చెప్పెద వినుడి**

**గురువే తల్లి, గురువే తండ్రి, గురువే బంధువు**
**గురువు కంటెనూ పరమింకేదియు లేదని నమ్మగల్గిన**
**శిష్యుడందునయ్యా మహాలింగ గురు శివ సిద్ధేశ్వర ప్రభువా!**

ఈ విధముగా గురువే తన సర్వస్వమని నమ్మి గురుసేవను చేయుట సద్భావసేవయని శ్రీనిజగుణులవారు నిరూపించిరి.శ్రీగురువు నెంతకాలము సేవించవలెననెడి సందేహము వచ్చెడిది సహజమే. అందుకే, శ్రీ భగవత్పాదులవారు "షణ్మాసాన్ వత్సరం వాపి యావదేష ప్రసీదతి" అని ఉపదేశించిరి. ఆరునెలలుగాని, ఒక సంవత్సరముగాని, లేదా లెక్కయనెడిది లేకుండగ నతనికి సంతృప్తి గల్గినంతవరకు సేవించవలెనని యానతినిచ్చిరి. సేవచే సంతుష్టుడైన శ్రీ గురువు యొక్క సంతోష సంతృప్తికర యవలోకనమే గురు కరుణ యనిపించుకొనును. గురువు వద్ద నభ్యసించిన విద్య ఫలప్రదము కావలెననిన యెడ, గురు కరుణ తప్పనిసరిగా పొందవలెనని శ్రీ నిజగుణులవారు తెలియజెప్పిరి.

ప్రాచీనకాలమున రాజుల పిల్లలు విద్యాధ్యయనమునకై ఋష్యాశ్రమములకు వెళ్ళెడివారనెడి ప్రతీతి యొకటి కలదు. ఒక రాజు తన కొడుకును ఆశ్రమమునకు పంపించెను. ఆశ్రమమందున యన్ని విధములుగా సేవలను సలిపి గురుకృపను పొందవలెననెడియొక పద్ధతియుండెను. రాజకుమారుడు తాను గురుసేవను చేయజాలనని తన తండ్రిగారికి కబురు పంపెను. సంతానము మీద నమితమైనయనురాగమును పెంచుకొనిన రాజు, తన కొడుకు యిబ్బందుల పాలగుటను సహించలేకపోయెను. గురుకుల పద్ధతిని మార్చుటకు వీలులేదని గ్రహించెను. తన కొడుకు సహాయార్థమై యొక సేవకుని నియమించి గురుకులమునకు పంపెను. రాజకుమారుడు విధిగా చేయవలసిన సేవలనన్నింటినీ రాజుచేత నియమింపబడిన సేవకుడు చేయజొచ్చెను. అతడు రాజకుమారునికి కూడ సేవలను చేయుచుండెను.

ప్రపంచమున సేవ యనెడి దాని ప్రాముఖ్యత నెరుగని వారెందరో గలరు. ఆవును సేవించి సంతుష్టురాలిని చేసినచో నయ్యది యమృత వృష్టిని గురిపించును. దానివీపుమీద కూర్చుండిన ఫలముండదు. దాని పాదముల చెంత కూర్చుండియే తీరవలెను.

సేవకులను ఏర్పాటుచేసి పనులను చేయించుకొనుటయనేది అన్నిరకములైన పనులకు వర్తించదు. కొన్ని పనులను తానే స్వయముగా చేయవలెను. వాటిని సేవకుడు చేసిన యెడల, ఫలమును సేవకుడే పొందును. యజమానికి యెట్టి ఫలితము లభించదు. తాను తినవలసిన తిండి, తాను చేయవలసిన సంభోగము తానే చేయవలెను. యితరులు చేసిన నయ్యది యనర్థదాయకమగును. బసవన్న వారును, దేవర దాసిమార్యులును, శివపూజ తానే స్వయముగా చేయవలెనని చెప్పుటకు యీ రెండు దృష్టాంతముల నిచ్చిరి. ఇట్టి జ్ఞానము సంపన్నులైనవారికి గల్గదు కదా? వివేకవంతులే విషయములను గ్రహింపగలరు.

గురుకులమున సేవకుడు గురుశుశ్రూషను భక్తిశ్రద్ధలతో చేయుచు గురవనుగ్రహమును పొందెను. విద్యార్థులకు వెనుక వరుసన కూర్చొని శ్రద్ధగా వినుచుండెను. అతనిలోని అధ్యయనాసక్తిని గాంచిన గురువెంతో సంతసించెను. వాడు గురుకరుణకు పాత్రుడయ్యెను.

పండ్రెండు సంవత్సరముల పర్యంతము ఇదే విధిన కొనసాగెను. రాజకుమారుని విద్యాభ్యాసము ముగిసెను. అతడు అన్ని విద్యలను నేర్చెను. ఇతోధిక ప్రావీణ్యత సంపాదించెను. అహంభావ పీడితుడైనందున గురుశుశ్రూష చేయలేదు. వాస్తవికముగా నిజలోటని యతడు గ్రహించలేకపోయెను.

రాజు రాజకుమారునికి పట్టాభిషేకము చేసి రాజ్యపాలనా భారమునతనికప్పగించి తాను విశ్రాంతిని గైకొనజొచ్చెను. రాకుమారుడు రాజుగా తన బాధ్యతలను సక్రమముగా నిర్వహింపజొచ్చెను. కాలాంతరమున కరువు సంభవించెను. అనావృష్టిచేత పంటలు పాడైపోయెను. త్రాగుటకు నీరు లభించకుండెను. ప్రజలు క్రొత్త రాజును చేరి వారి కష్టములను తీర్చుమని కోరిరి. సకల విద్యలను అధ్యయనము చేసిన వాడైనందున, వర్షములను కురిపించుట యెట్టుల యనెడి దానిని యోచింపజొచ్చెను. పర్జన్య యజ్ఞము వలన ఫలితముండునని గ్రహించి, విధి ప్రకారము యజ్ఞమును చేసి పూర్ణాహుతి నిచ్చెను. కారుమేఘములు కప్పెను. ఉరుములు ఉరుమినవి. మెరుపులు మెరసెను. కాని వర్షము కురువలేదు. పండిత పామరులెల్లరూ సంభ్రమాశ్చర్యములకు గురియైరి. విధి విధానములో లోపము లేవియును లేవని తేలెను.

రాజెంతో నాందోళనకు గురి యయ్యెను. తన ప్రతిష్ఠకు భంగము వాటిల్లెనని బాధపడజొచ్చెను. ఇట్టి విపత్కర స్థితిలో రాజుగారి విద్యాభ్యాసకాలమున, యతనికి తోడుగా నుండి, యతనికి బదులుగా గురుశుశ్రూష చేసిన వాడగు రాజసేవకుడు, రాజు దగ్గరకు వచ్చి యొక విన్నపమును చేసెను. రాజుగారి సేవకునిగా, తనకొక ధర్మము గలదనియును, దాని ప్రకారము రాజుగారు ఎదుర్కొంటున్న విపత్కర స్థితిని

నివారించే నిమిత్తము తనవంతు కృషిని చేయవలెననియు, రాజుగారు అనుమతించిన యెడల తానా ప్రయత్నమునకు పూనుకొందుననెను. రాజు తన అనుమతినిచ్చెను. రాజువలెనే సేవకుడు, పర్జన్య యజ్ఞమును చేసెను. వర్షములు కురిసెను. విధి విధానము తేడా లేకుండెను. రాజు తాను విఫలమనోరథుడగుటకును, సేవకుడు సఫల మనోరథుడగుటకును గల కారణము లెట్టివో యని తెలిసికొననెంచెను. సేవకుని వెంట నిడికొని, గురుకులమునకు వెళ్ళెను. గురువుగారికి సాష్టాంగ నమస్కారమాచరించి, విషయమును వివరించి చెప్పెను. తన వైఫల్యమునకు గల కారణమెయ్యది యని ప్రశ్నించెను. అప్పుడు, గురువుగారు "ఓ రాజా! నీవు అహంభావము చేత గురుశుశ్రూష చేయ నిరాకరించితివి. నీ సేవకుడా సేవను చేసెను. గురుసేవను చేయకుండగనార్జించిన విద్యలు ఫలప్రదము కాజాల"వని యుపదేశించెనురాజు తన తప్పును తెలిసికొనినవాడై పశ్చాత్తాపమునొందెను. రాజ్యపాలన భారమును, మంత్రుల కప్పగించి, గురుకులములో ప్రవేశించి పండ్రెండు సంవత్సరముల వరకు గురువుగారిని భక్తి ప్రపత్తులతో సేవించెను. అతని సేవలను పొందిన గురువుగారు ప్రసన్న హృదయుడయ్యెను. సఫల మనోరథుడవు కమ్మని నాశీర్వదించెను. రాజు ధన్యుడనైతినని మనస్సున భావించుకొనెను. గురువుకు కానుకలను సమర్పించి, వెనుదిరిగి వెడలి, రాజ్యపాలనా భారమును స్వీకరించి ప్రజారంజకుడై ఖ్యాతిని గాంచెను.

సకల శస్త్రవిద్యల నభ్యసించిననూ, శస్త్రవిద్యా గురువైన శ్రీపరశురాముని చేత నభిశప్తుడైనందున మహాభారతములోని కర్ణుడు, గురుకృపకు దూరమైనందున నేర్చిన విద్యలు యుద్ధరంగమున నిష్ఫలము కాగా నోటమిని చవిచూసెను. ఈ కారణమున సకల విద్యాప్రాప్తి గూర్చి మనోరథముగల శిష్యుడు, గురుకృపకై సేవను చేసి గురువును సంతోషపరిచి విద్యలను సంపాదించికొనవలెను. ఈ తెరగున సేవను చేసి విద్యను గడించినవారిలో ఉపమన్యుడు, సత్యకాముడు మొదలగువారు గలరు. వీరి చరిత్ర యెంతో ఖ్యాతిని గాంచెను.

"సమయ ఏవ కరోతి బలాబలం" అనెడి సూక్తి యొకటి కలదు. కాలమే మనుష్యుని సబలునిగానూ, నిర్బలునిగానూ చేయునని దీనిలోని భావము. యుగయుగానికి మానవ ప్రవర్తనలో మార్పులు వచ్చినటుల గాంచగలము. గురుశిష్య సంబంధములో కూడ అట్టి మార్పులే గల్గినవని శ్రీప్రభుదేవులవారి వచనము వలన తెలియచున్నది గనుడి :

**కృతయుగదల్లి శ్రీగురు శిష్యంగె బడిదు బుద్ధియ కలిసిదరె**
**ఆగలి మహాప్రసాద వెందెనయ్యా!**
**త్రేతాయుగదల్లి శ్రీగురుశిష్యంగె బైదు బుద్ధియ కలిసిదరె**
**ఆగలి మహాప్రసాద వెందెనయ్యా!**
**ద్వాపరయుగదల్లి శ్రీగురు శిష్యంగె ఝంకిసి బుద్దియ కలిసిదరె**
**మహాప్రసాద వెందెనయ్యా!**
**కలియుగ దల్లి శ్రీగురు శిష్యంగె వందిసి బుద్దియ కలిసిదలె**
**ఆగలి మహాప్రసాదవెందెనయ్యా!**
**గుహేశ్వరా నిమ్మకాలద కట్టళియ కలితనక్కెనాను బెరగాదెను**

ఈ వచనము యొక్క తెలుగు రూపము:

**కృతయుగమునందున శ్రీగురువు శిష్యుని కొట్టి బుద్ధిని చెప్పినచో**
**కానిమ్ము మహాప్రసాద మనె నయ్యా!**
**త్రేతాయుగమునందున శ్రీగురువు శిష్యుని తిట్టి బుద్ధిని చెప్పినచో**
**కానిమ్ము మహాప్రసాద మనె నయ్యా!**
**ద్వాపరయుగమునందున శ్రీగురువు శిష్యుని ఝళిపించి బుద్ధిని చెప్పినచో**
**కానిమ్ము మహాప్రసాద మనె నయ్యా!**
**కలియుగమునందున శ్రీగురువు శిష్యునికి వందించి బుద్ధిని చెప్పినచో**
**కానిమ్ము మహాప్రసాద మనె నయ్యా!**

గుహేశ్వరా మీ కాలపు కట్టడి యొక్క కలితనమునకు నేను వెరగైతిని.

ఇచ్చట ఈ వచనమున నానాటికి దిగజారుచున్న అనుశాసనము యొక్క స్థితి యెంతో సుందరముగా చిత్రించబడినది. దీనికి శిష్యులు బాధ్యులని చెప్పలేము. గురువు కూడ సమానమైన బాధ్యత వహించవలెను. విద్యాభ్యాస దశలో క్రమశిక్షణను పాటించకుండగ, ఏదోవిధిన విద్యను ఎంతో కొంత నేర్చుకొని, ఏదోనొక మార్గమున గురుస్థానమును నధిరోహించినవారు శిష్యునికివందించవలసినదే! ఈ స్థితిని చక్కబరచవలెననిన సమాజమే పూనుకొనవలసియుండును. ప్రాచీన విద్యాధ్యయన సంస్కృతి పునః ప్రతిష్ఠ చేయవలెను. అప్పుడు మన సంస్కృతి యున్నత స్థితిలో నుండును.

గురుకరుణను పొందగల్గెడి శిష్యుని మనోభావన లెట్టులుండవలెనో యనెడిది అక్కగారి యీ వచనము చదివినవారికి బోధపడగలదు.

**అరలుగొండ కెరెగె తెరె బందు హొయ్దంతె**
**బరలు గొండ ససిగె మళె సురిదంతాయిత్తువోడా!**
**ఇదే ఎనగె ఇహద సుఖ, పరద గతి నడెదు బందాయి త్తెనగ**
**చన్నమల్లికార్జున నెంబ గురుపాదవ కండు ధన్యళాదెను**

ఈ వచనము యొక్క తెలుగు రూపము :

**అరుగుగొనిన చెరువుకు తెరవచ్చి పారినట్లు**
**వట్టుగొనిన సస్యమునకు వాన గురిసినట్లైనది చూడుమా**
**ఇదే నాకు యిహలోక సుఖము, పరము యొక్క గతి నడిచివచ్చినట్లైనది**
**చెన్న మల్లికార్జునుడనెడి గురుపాదము గని ధన్యురాలనైతిని.**

ఇట్టి మనోభావన గల ప్రతి యొక్క శిష్యుడు గురుకృపను తప్పనిసరిగా పొందును.

గురువు తన సర్వస్వమును త్యాగము చేయుటకు సంసిద్ధుడైనవాడు. గురుకృపను పొందగలడనెడి భావన గలదు. గురు గీతలోని యీ క్రింది దానిని గనుడి :

**శ్లో॥ శరీరమింద్రియం ప్రాణమథనం స్వజన బాంధవాన్।**
**ఆత్మదారాదికం సర్వం సద్గురు భ్యోనివేద యేత్॥** (గురుగీత – 40)

పరమానుభవ బోధలోనూ ఇట్టి భావననే గలదు. గనుడి :

**శ్లో॥ తనుమనోధన ధాన్య వనితా వాహన వస్త్ర**
**వెనిసు వఖిల వస్తు చయ వను**
**ఇవితు వంచిసదె సద్గురు వినోళర్పిత**
**వెనిపెను వరశిష్య నరియల్కె॥** (పరమానుభవబోధ 6–3–8)

ఈ విధముగా తన సర్వస్వమును గురువునకు సమర్పించి, వాటియందు తనదనెడి భావన లేకుండగ నుండి, తత్పరతతో సేవ చేయగను, భుక్తి ముక్తి ప్రదాయకుడగు శ్రీగురువు ప్రసన్నుడై తనయందున నుండెడి దివ్యజ్ఞానమును శిష్యునికి దారబోయును.

మనము సమర్పించెడి పదార్థములకంటెను మన మస్తకమును భక్తితో సమర్పించెడి తీరును బట్టి గురుకృప యొక్క గమన మాధారపడియుండును. గురువుకు నమస్కరించి, శిష్యుడు తన మస్తకమునే విధిన సమర్పించవలెనో తెలియజెప్పెడి ప్రమాణములు గమనార్హములైయున్నవి. శ్రీ నిజగుణులవారి యీ క్రింది నుడువులను గనుడి :

**ఎరడు పదవెరడు కరవెరడు భుజవెదెనొసలు**
**వెరడు నెల సొంకలష్టాంగదిం నమిసి॥**

శ్రీ నిజగుణులవారి వాక్కుల తెలుగు రూపమిది :

**రెండు పాదములు రెండుకరములు రెండు భుజములెద నొసలు।**
**బిరుసగు నేలను సోకను సాష్టాంగముతో నమించి॥**

శ్రీ నిజగుణులవారు తెలిపిప యటుల నమస్కరించిన యెడల, అహంకారము పూర్తిగా నశించిపోవును.

గురుసన్నిధిని చేరిన పిదప నేవిధి గురుకృప పొందవలెనో ననెడి దానిని చెప్పెడి యీ స్మృతి వాక్యములను గనుడి :

**శ్లో॥ వృత్యస్త పాణినా కార్యముప సంగ్రహణం గురోః।**
**సవ్యేన సవ్యః స్పృష్టవో న దక్షిణేచ దక్షిణః॥**

**గురువుగారి కుడిపాదం క్రింద తన కుడి**
**అరచేతిని, ఎడమ పాదము క్రింద నెడమ**
**యరచెయ్యిని పెట్టి, అతని పాదముల**

పైభాగమున తన ఫణమును గట్టిగా నదిమిపెట్టి నమస్కరించవలెనని శిష్యునికి సూచన యివ్వబడినది. ఈ విధిన చేసినవారికి గురుకృప లభించును.

ఈ విధముగా విధేయత ప్రకటించెడివారికి సకల సత్ఫలితములబ్బునని తెలిపెడి యీ సూత్రమును గనుడి :

**శ్లో॥ అభివాదన శీలస్య నిత్యం వృద్ధోప సేవినః ।**
**చత్వారి తస్య వర్ధంతే ఆయుః ప్రజ్ఞా యశోబలం ॥** (ఆపస్తంభ)

వినయమున సాష్టాంగ నమస్కారము చేసి పెద్దలను సంతృప్తి పరచెడి వానికి దీర్ఘాయువు, ప్రజ్ఞ, కీర్తి మరియు బలము లభించునని సూత్రములోని భావమని గ్రహింపదగును.

బావిలోనికి విడిచిన భాండము తలను వంచినగాని దానిలోనికి నీరు రాని యటులే, వినయమున తలను వంచకుండా, నిటారుగానిలిచియుండెడి వానికి లబ్ధి చిక్కదు. గురువు దగ్గర యుండెడి జ్ఞానామృతము శిష్యుని మస్తకమునకు చేరజాలదు. అది నిండజాలదు.

అశోక మహారాజు కళింగ యుద్ధమునందున జరిగిన ప్రాణహింసను గని కరుణార్ధ హృదయుడయ్యెను. నాడు ప్రసిద్ధిన నున్న బౌద్ధ ధర్మమును స్వీకరించి జీవనమును గడుపుచుండెను. ధర్మప్రచారము చేసెడి మహాత్ములనిన యెంతో శ్రద్ధగలవాడై యుండెను. తాను వెళ్ళే దారియందున యెవ్వరైన మహాత్ములు కనిపించిన యెడ, తాను వాహనము నుండి దిగి వారి పాదములకు తన మస్తకమును పత్తి నమస్కరించు చుండెను.

ఒక నాడతడు, తన మంత్రిని తో కూడి రాజవీధిన పయనించుచుండెను. ఒక మహాత్ముడు తన కెదురుగ వచ్చెడిది గని, గుఱ్ఱము దిగి, పాదరక్షలను విడిచి, మస్తకము మీది మకుటమును భూమిమీద నిడి, లజ్జలేని వాడై, మహాత్మునికి సాష్టాంగనమస్కారమును చేసెను. చక్రవర్తిగారు ప్రవర్తించిన తీరు ఆగమ సమ్మతమైన విధిన నుండెను. **"కూర్యాద్దండ నమస్కారం నిర్లజ్జో గురుసన్నిధౌ"**యని చంద్రజ్ఞానాగమము చెప్పుచున్నది. (చం.జ్ఞా.ఆ.క్రి. 2-33)

రాజుగారి ప్రవర్తన మంత్రి కచ్చెరువును కల్గించెను. మహాత్మునికి నమస్కారము చేయవలెననెడి యభిలాష యతనికి లేకుండెను. రాజుకు బెదరి, నమస్కరించెను. కైమోడ్పు చేసెనేగాని, సాష్టాంగ నమస్కారము చేయలేదు.

రాజమందిరమునకు వెడలిన పిదప, మంత్రి రాజు కిట్లనెను. "ఓ మహారాజా! మీరు చక్రవర్తులు. మీవంటివారు దారి వెంబడి వెళ్ళేవారికి నమస్కరించుట మంచిదికాదు. ఈ విధిన చేయుటచేత, సింహాసనమునకే అగౌరవము ప్రాప్తించును. పాదరక్షలు లేకుండగ నడిచెడివారి కాళ్ళు దుమ్ము, ధూళి యిత్యాది మలిన పదార్థములు గల్గియుండును. అట్టివారి కాళ్ళకు మణిమయ మకుటమును ధరించెడి మీ మస్తకముననానించుటలో నౌచిత్యముండునే?

మంత్రి యభివ్యక్తము చేసిన యభిప్రాయమును విని రాజు "ఓ మంత్రివర్యా! ఇప్పుడు నేను మీ కేమియును చెప్పలేను. సమయము మీకు తెలియజెప్పును"అనెను.

ఈ ఘటన జరిగిన పిదప నాలుగైదు వత్సరములు గడిచిపోయెను. ఒకనాడు రాజు తన మంత్రిని పిలిపించి తాళము వేయబడియున్న నొక పెట్టెను చూపించి, "ఇందులోని వస్తువులను పట్టణ వీధిలో నమ్మివేసి వచ్చెడి ద్రవ్యమును గైకొనిరం"దని ఆజ్ఞాపించెను.

మంత్రి, రాజుగారి ఆదేశము మేరకు, పెట్టెను సేవకుల సహాయముతో మోయించుకొని వెడలి విఫణి వీధిని జేరెను. ఒక స్థలమున పెట్టెను పెట్టించి, దానిని తెరచి చూసెను. అతనికి ఆశ్చర్యము కల్గించెడి విధిన నా పెట్టెలో వివిధ ప్రాణుల మస్తకములుండెను. ఇంతటి నీచ కార్యమును చేయుటకై, రాజుగారు నన్ను నియుక్తుడిని చేయుటకు కారణమేమైయుండునని యాలోచింపజొచ్చెను. అతనికి కారణము తోచలేదు. అయినా, రాజాజ్ఞను అమలు చేయవలసినదని భావించి మస్తకములను అమ్ముట కుపక్రమించెను. అనతి కాలములోనే మస్తకములన్నియును అమ్మబడెను. ఒక మనిషి మస్తకము మాత్రము మిగిలిపోయెను. సాయంకాలము వరకు వేచి చూసెను. అద్దానిని కొనెడి వాడు లేకుండెను. మంత్రి రాజమందిరమునకు వెడలి విషయమును నివేదించెను. రాజుగారు "దానిని ఊరకే ఎవరికైననూ ఇచ్చివేసి రం"దని పునః ఆదేశించెను. మంత్రి రాజాజ్ఞ అమలు చేయుటకై యెంత ప్రయత్నించినా ఫలితము లేకుండెను. తిరిగి వచ్చి రాజుగారికి తన అశక్తతను వెల్లడిజేసెను. అప్పుడు రాజు అతనికిట్లనెను :

"ఓ మంత్రివర్యా! జగత్తులోని జనులు, ఎల్లప్రాణుల రుండములను ధనమునిచ్చి కొనిరి. మనుష్యుని తలను తీసికొనుటకెవ్వడునూ సిద్ధపడలేదు. దానివలన ప్రయోజనము లేదని వారు భావించియుందురు. అంతేకాదు, దానిని తీసికొని వెళ్ళుట వలన వారు మైలపడుదురని భయపడి యుందురు. ఈ విధముగా ఎవ్వరికీ అక్కరకు రాని మానవ మస్తకమును ఎందుకు మహాత్ముల పాదముల కడ సమర్పించకూడదు. సమర్పణం చేసినచో జన్మ సార్థకమగును కదా!"

మంత్రిగారికి యింతకు ముందున జరిగిన సంఘటన గుర్తుకు వచ్చెను. తన యొక్క యనుచితమైన ప్రవర్తనను తలచికొని సిగ్గుపడినవాడయ్యెను.

ఈ విధిన మనుష్యుని మస్తకము, గురువు పాదములకు మాత్రమే చెల్లునుగాన, దానిని భక్తిశ్రద్ధలతో గురుపాదముల కడ సమర్పించవలెను. పిదప వినయ పూర్వకముగా గురువుగారికి ప్రశ్నను వేయవలెను. గురువుగారు నుత్తరము నివ్వకుండగ మౌనముగా నుండిన యెడల, సేవను కొనసాగించవలెను. సేవ వలన సంతుష్టుడైన పిదప కళ్యాణ కైవల్య ప్రదాతయైన గురువుగారి యెదురున నిలిచి చేతులు జోడించికొని "భో కళ్యాణ మహాభాగ! శివజ్ఞాన మహోదధే! ఆచార్యవర్య! సంప్రాప్తం రక్షమాం భవ రోగిణమ్" అని విజ్ఞాపన చేసికొనవలెను. భవరోగము చేత బాధితుడనైన నన్ను రక్షించమని వేడికొనవలెను.

జీవులకు, భోగైశ్వర్యములు, ఈశ్వరారాధన వలననూ, కైవల్యప్రాప్తి గురువుగారి యుపదేశము వలననూ లభించుననెడి భావము నెలకొని యున్నది. కళ్యాణ కైవల్యములు గురువు వలన దొరకుటెట్లు? అనెడి ప్రశ్న ఉదయించుట సహజమే.

అయితే, శ్రుతుల యందున సద్గురువును అర్చించినవారికి కోరిన కోరికలు తీరునని తెలుపబడినది. యీ శ్రుతి వాక్యములను గనుడి :

**శ్లో॥ యం యంలోకం మనసా సంశిభాతి।**
**విశుద్ధసత్త్వః కామయతే యాంశ్చకామాన్।**
**తంతంలోకం జయతే తాంశ్చకామాన్।**
**తస్మాదాత్మజ్ఞం హ్యర్చయేద్భూతి కామః॥**

ఈశ్వరుని విశిష్టావతారమే గురువైన కారణమునను, గురువుకు నీశ్వరుని యందున నుండెడి యైశ్వర్యప్రధానమైన సామర్థ్యముండి యున్నందునను, జ్ఞానోపదేశము మూలకముగా ముక్తినిచ్చెడి శక్తిగల్గి యున్నందునను, గురువును సేవించుట వలన యుభయ విధములైన లాభములు దొరకుననుటలో సందేహము లేదు.

ఈ కారణమువలననే శ్రీకంఠశివాచార్యుల వారు బ్రహ్మసూత్ర భాష్యమును ఆరంభమున “కైవల్య కల్పతరువే కళ్యాణ గురవే నమః” అనెడి గురుస్తుతిని చేసిరి.

సర్వసాధారణముగా త్రిమూర్తుల మహిమల గురించి జనులలోనెంత నమ్మకము గలదు. వీరిలోన నొక్కొక్కరికి యొక్కొక్కసామర్థ్యమే గలదనెడిది అందరూ ఎరిగినదే. త్రివిధ సామర్థ్యములను గల్గియున్న గురువు త్రిమూర్తుల కంటెను అధికుడని గురుగీత చెప్పుచున్నది కనుడి :

**శ్లో॥ గురుర్విష్ణుః సత్వమయో రాజసశ్చతురాననః।**
**తామసో రుద్ర రూపేణ సృజత్యవతి హంతి చ ॥** (గురుగీత -164)

శ్రీగురువుకు గల యనుగ్రహ సామర్థ్యమును వివరించెడి యీ క్రింది శ్లోకమును గనుడి :

**శ్లో॥ మునిభిః పన్నగైర్వాపి సురైర్వా శాపితోయది।**
**కాలమృత్యుభయాద్వాపి గురుః సంత్రాతి పార్వతి ॥** (గురుగీత -141)

పరమేశ్వరుడే స్వయముగా గురువు యొక్క గొప్పతనము నుతించెనని గ్రహింపదగును. మునులు, పన్నగులు, సురులు శపించినా, అకాల మృత్యుభయము గల్గినా, గురువుగారనుగ్రహించిన యెడల నివి యన్నియును నివారింపబడునని గురు గీతావాక్కులోని భావము.

ఇట్టి సర్వోత్కృష్ట గుణ సంపన్నుడైన శ్రీగురుని శిష్యుడు సర్వతోముఖముగా సేవింపవలెనని తెలుపుచున్న యీ శ్లోకమును గనుడి :

**శ్లో॥ పృష్ఠతః సేవయం దర్కం జఠరేణ హుతాశనమ్।**
**స్వామినం సర్వభావేన పరలోకమమాయయా॥**

సూర్యుని వెన్నుతోనూ, అగ్నిని ఎదురుగానుండి సేవించుట జరుగుచున్నదని తెలుపుచు, శ్రీగురుస్వామిని అన్నివైపులనుండి సేవించవలెనని శ్లోకములోని భావము. ఈ విధిన శిష్యుడు గురువును సేవించి, ఆత్మకళ్యాణమును సంపాదించికొనవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 5-8-1990
స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానం, షోలాపూర్**

## విశేష ప్రదీపిక :

శ్రీచంద్రశేఖర శివాచార్యులవారు గురుసేవను గురించి యెన్నియో విషయములను వివరించిరి.

ఆధ్యాత్మిక రంగములో సాధన చేసెడివారికి సద్గురుని యండదండలెంతో మేరకు నవశ్యకములై యుండును. గురుసన్నిధిన చేరిన వారికి తెలిసికోవలసిన విషయమేమనగా వారు గురుకారుణ్యము యొక్క ప్రాముఖ్యతను గుర్తించవలెను. గురుకారుణ్యమే సర్వస్వమని తెలిపెడి శ్రీబసవేశ్వరులవారి వచన శాస్త్రసారములోని యీ క్రింది వచనమును గనుడి :

**గురుకారుణ్యమే సదాచారము గురు కారుణ్యమే శివాచారము**
**గురుకారుణ్యమే ప్రసాదరుచి మొదట గురుడు, వెనుక లింగము**
**కూడల సంగమ దేవా!** (చూడుడి : బాడాలా రామయ్యవారి అనువాదము)

వీరశైవ ధర్మమునకు అష్టావరణములు కాయము వంటివి. ఆ కాయమునకు చైతన్యము నిచ్చెడివే పంచాచారములు. వీటిని వీరశైవ ధర్మము యొక్క పంచప్రాణములనియు పిలుతురు. అష్టావరణములలో లింగము ముఖ్యాతి ముఖ్యమైనది. లింగధారణ మరియు పూజనము వీరశైవము యొక్క విశిష్ట లక్షణమైయున్నది. లింగమునకు నైవేద్యముగా నిడిన పదార్థమును ప్రసాద భావముతో వీరశైవుడు గ్రహించును. లింగధారి ప్రవర్తనకు సంబంధించిన నిర్దేశక సూత్రములే సదాచార శివచారములు. ఈ విధముగా కేంద్రాంశమై వెలిగెడి లింగమును ప్రదానము చేసెడివాడే శ్రీగురుడు. అందుకే బసవన్న మొదట గురుడు – వెనుక లింగమని యనెను. గురుకరుణను పొందని వాడు లింగమును పొందలేడు. తత్ఫలితముగా భవియై, దురాచారియై, బహుదేవతారాధకుడై ప్రసాదమునకు దూరమై శిష్యుడు పతనమగును. గురువు కరుణయొక్క ప్రాముఖ్యత నెరిగినచో భవి భక్తుడై, భక్తుడు భర్గునికి సన్నిహితుడైన శరణుడై, శరణుడు శివుడై విరాజిల్లును. గురుకరుణను చిన్నచూపుకు గురిచేసెడివాడు సిద్ధిని పొందక భవమున గూలునని విజ్ఞులు తెలిపిరి.

'కరుణైవ కారుణ్య'మనెడి వాక్కు ప్రకారము కరుణయే కారుణ్యమగును. "కుర్వంత్యాత్మానమధీన మనేనేతి కరుణా" అనెడి వ్యుత్పత్తి ప్రకారము కరుణ గల్గిన వ్యక్తి ఎవరి గురించి కరుణ గల్గినదో వానికి అధీనుడగుచున్నాడు. గురుకరుణకు పాత్రుడైన వాని యభీష్టమును శ్రీగురువు నెరవేర్చునని తెలిసికొనవలెను.

గురుకరుణను సాధించెడిది యెయ్యది యనునది పిండజ్ఞాని తెలిసికొనవలసిన ముఖ్యాతి ముఖ్యమైన యంశము. ఈ యంశమును బోధించెడి యీ క్రింది పద్యమును గనుడి :

**సీ. అచ్యుత బ్రహ్మామరాగోచరుండయ్యు పరశుద్ధ భక్తైక వత్సలుండు**
**నన్నాదబిందు కళాతీతుడయ్యునా శ్రితశిష్యవర్గీసంతతి కుటుంబి**
**స్థిర వత్సరవ్యోమ సింహాసనుండయ్యు సాధకాత్మాంభోష షట్పదుండు**
**పరమాణుతరమహత్తరమూర్తి యయ్యుస ల్లింగ జంగమ ప్రాణలీయమూర్తి**

**ఆ. యనగ వినగ నాది కాది యైసన్మతి నెగడ బొగడ మహిమ దగిలి మిగిలి**
**యున్న యసదృశ ప్రసన్నైక సద్గురు మూర్తి గొలువకెట్లు ముక్తి దొరుకు?**
(అనుభవసారము)

శ్రీ గురువు భక్తవత్సలుడని తెలుపబడినది. గురుభక్తి వలన గురుకరుణ లభించునని తెలిసికొనవలెను.

గురుభక్తి ప్రాముఖ్యత నెరుగనివారు గురూపదేశమును పొందకయే శివభక్తిని పెంపొందించుకొనుటకు యత్నింతురు. ముక్తిదాయకమైన శివభక్తికి గురుభక్తియే బీజమని గుర్తు దెలిపెడి శ్రీ సోమనాథుని యుపదేశమును గనుడి :

**క. గురుభక్తి దురిత నాశని**
**గురుభక్తి యగణ్య పుణ్య గోచరమౌస**
**ద్గురుభక్తి భక్తి బీజము**
**గురుభక్తియె సహజముక్తి గురుభక్తినిధీ!** (అనుభవసారము ప 41)

**"వట్టిమాటల చేత పుట్టునే భక్తి"** యని ప్రశ్నించెడివారు గలరు. తను మన ధనములను సమర్పించకుండగ భక్తి గలుగనేరదని తెలిసికొనవలెను. లోభమనెడిదొక పెనుభూతము వంటిదని పిండజ్ఞాని గ్రహించవలెను. మనుజుని పట్టి పీడించి భవమునకు ద్రోసివేయును. ధనమును త్యాగము చేయకుండగ భక్తిని పొందవలెనని ప్రయత్నము సేతురు. అట్టిది వృథా ప్రయాసయగును. వైరాగ్య భావన గల్గిన గురువుకు ద్రవ్యమెందులకనెడి ప్రశ్నను, లోభగుణము గలవారు వేయుచుందురు. గురువు విషయోప భోగి కాదు. తన్నిమిత్తమై ద్రవ్యము యొక్క అవశ్యకత లేదనే చెప్పవలెను. కాని, స్వీయ కుటుంబ భారమును మోయుటకు ద్రవ్యమవసరమే కదా! శ్రీ గురువుకు కుటుంబ బాధ్యతలును శిష్యసంతతియును యుండును. వారిలో కొందరి పోషణభారమును గురువు భరించెడి స్థితి యేర్పడవచ్చును. అంతేకాదు, ధార్మిక కార్యక్రమముల నిర్వహణ, మఠము యొక్క బాగోగులు ఇత్యాదులకై ద్రవ్యము అవసరమే కదా!

ఎంతమేరకు ద్రవ్య సమర్పణ చేసిన అంతమేరకు గురువు ప్రసన్నుడగు ననెడి భావన సరికాదు. ఇది సత్యదూరమైన యభిప్రాయమనెడిది గుర్తించవలెను. గురువు కరుణను పొందుటకై ద్రవ్యమే సర్వస్వమనెడి భావనను పిండజ్ఞాని వదలి వేయవలెను. అతడు వదల వలసినది లోభచిత్తమును మాత్రమే. శ్రీగురువు ద్రవ్యమును వేడదు. అయిననూ, పిండజ్ఞాని తన శక్తిమేరకు ధన సమర్పణమును చేయుచుండవలెను.

లోకాచారమున దేవాలయ నిర్మాణమును చేపట్టెడి సాంప్రదాయము గలదు. దేవునికి నిత్యార్చనలు చేయుటకును, నైవేద్యాదులకును భూమి, గోవు, సువర్ణాదులను దానము చేయుచుందురు. ఇది వీరశైవేతరులకు చెందిన సాంప్రదాయమని గ్రహించవలెను. పిండజ్ఞాని యీ విషయమును విస్మరించవలదు. శ్రీగురువు నివాసమైన మఠమే వీరశైవులకు సర్వస్వము. మఠమునకు దేవాలయమునకంటెను అధిక ప్రాధాన్యత గలదని గుర్తించవలెను. దేవాలయములలో నుండెడి ఆరాధ్య వస్తువునొక విగ్రహమో లేదా లింగమో అయియుండును. ఇవి చైతన్యసహితమైనవి కావు. శ్రీగురువు నిత్య చైతన్యమూర్తి. లోకము నుద్ధరించుటకై నేలమీదికి దిగివచ్చిన నిర్గుణ పరశివతత్త్వము. అట్టి శ్రీ గురువు నివాసమైన మఠమును నిర్మించి, ఎప్పటికీ బాగోగులు చూస్తూ, అది శిథిలము కాకుండగ చూసే బాధ్యత శిష్యులపై గలదు. తన్నిమిత్తము ద్రవ్యమును సమర్పించవలసియుండును.

కేవలము ద్రవ్య సమర్పణలు చేసి గురుకరుణ పొందుట సుసాధ్యము కాదని శ్రీవిద్యా వాచస్పతి శివాచార్యులవారు నెంతో సమర్థవంతముగా ప్రతిపాదించి నిరూపణ చేసిరి. వారొసంగిన దృష్టాంతములు చిరస్మరణీయమైనది.

ఈ స్థితిలో గురుభక్తి నేవిధిన చేపట్టి చేయవలెననెడి ప్రశ్న తలయెత్తును. ఈ ప్రశ్నకు నుత్తరము నొసంగుట సులభమైన పనికాదు. భక్తితత్త్వము నెరిగినగాని విషయమవగతము కాదు.

బ్రహ్మసూత్రముల నాధారముగా గొని సిద్ధాంతము చేసిన శంకరాదులు భక్తిజ్ఞానముల కభేదము బ్రకటించిరి. స్వస్వరూపాను సంధానమే భక్తియని యద్వైతులనిరి. పరమాత్మ జ్ఞాన లక్షణమే భక్తియని రామానుజుడనెను. వీరి భావనల కాధారము యుపనిషత్తులలో గలదు. 'ప్రజ్ఞానం బ్రహ్మ' యనెడి భావన వీరి సిద్ధాంతమునకు మూలమని తెలియుచున్నది. అయితే, కర్మలేనిది భక్తి యెటుల సిద్ధించునని కర్మవాదులు ప్రశ్నింతురు. జ్ఞానముతో ప్రమేయము లేకుండగ భక్తిగల్గునని వారు వాదింతురు. శ్రీకాళహస్తి మహాత్మ్యమును గానము చేసిన ధూర్జటి యీ వాదనను సమర్థించెను. భక్తి కుదురుటకు జ్ఞానము సాధనముగా నుపయోగపడునేగాని, జ్ఞానము భక్తి కాజాలదని భక్తివాదులు వాదింతురు.

శబ్దోత్పత్తిని గమనించిన యెడల భక్తి యనెడిది సేవను సూచించును. "కొలుచుటయే భక్తి" యని సోమనాథుడు తన యనుభవ సారమున ప్రకటించెను. సేవలు 'నవ విధములు'గా చేయవచ్చునని పోతన వారి "ఆంధ్ర భాగవత పురాణము" తెలుపుచున్నదనెడి మాట ఖ్యాతిన నున్నది. పన్నెండవ శతాబ్దికి చెందిన అన్నమయ్య, తన సర్వేశ్వర శతకములో వీటిని సూచించుటయే యుండెను. కాని బసవన్న భృత్యాచారమే భక్తియని తెలిపిరి. వీరశైవమున గల పంచాచారములలో భృత్యాచారము కీలకమైనది. సదాచారము, శివాచారము, లింగాచారము మరియు గణాచారములనెడివి మిగిలిన ఆచారములు. "నా కన్న పిన్నలు లేరు గురుని కంటెను పెద్దలు లేర"ని భావించికొని పిండజ్ఞాని, శిష్యకోటిలో చేరి గురుని సేవించవలెను. ఒక భృత్యుడు తన యజమానినేవిధముగా సేవించునో అదే విధముగా శ్రీగురుని సేవించవలెను. 'దాసోహం' అనే భావన పెంపొందించుకొని శ్రీగురుని సేవించవలెను. గురుకటాక్షమును పొందుటకిదియే 'రాచబాట' యని గుర్తించవలెను. తన తనువును, గురుసేవ కంకితము చేయవలెను.

ఇచ్చట పిండజ్ఞాని గ్రహించవలసిన విషయమొకటి కలదు. గురుసేవ యనగా శ్రీగురువును నేరుగా సేవించుట యనెడిది స్వీకరించవలదు. అయిననూ, ఇట్టి సేవాభాగ్యము గురుకటాక్షము గణనీయస్థాయిలో నున్నప్పుడే లభించును. గురుసేవ యనెడి దానిని గురువుకు చెందిన వారందరి సేవ యనియును, శ్రీగురువుకు చెందిన వస్తు సముదాయమును పెంచి, భద్రపరిచి, గురువునకు అందజేయుట యిత్యాదులనియు గ్రహించవలెను. ఇచ్చట విశాల భావమును దాల్చవలెను. శ్రీగురువు దారాపుత్ర శిష్య మిత్రాదులందరిని గురువుయొక్క అభిన్నరూపములని భావించుకొని, సేవించినవారికి యుత్తమోత్తమమైన ఫలితములు లభించును. ఈ మర్మము నెరుగజాలక చంద్రుడు, గురుపత్ని యెడల అన్యభావమును దాల్చి, మోహపరవశుడై, తానూ పతనమై తార పతనానికి కారకుడై చరిత్ర హీనుడయ్యెనని పురాణములు తెలుపుచున్నవి. పిండజ్ఞాని యిట్టి మర్మముల నెరుగుట యెంతోను అవసరము. గురువుగారి మఠము (నివాసము)ను శుభ్రము చేయుట, నిర్మాణాదులలో పాల్గొని శ్రమదానము చేయుట, మఠమునకు విచ్చేసెడి శ్రీ గురుని భక్తులను, భక్తుల సేవించి వారికెట్టి యిబ్బంది కలుగకుండగ మెలగుట మొదలగునవియును గురుసేవలోని యంతరార్థములని గ్రహించవలెను. దాసభావనతో శ్రీగురుని సేవించుట వలన తనువుతోపాటుగా మనస్సు కూడ శ్రీగురుని సేవకు నంకితమగుచున్నది.

దాసునికి స్వామిని సంతృప్తిపరచుటయే కర్తవ్యమైయుండును. తన సేవలచేత శ్రీగురుడు సంతుష్టుడౌనో కాదో యనెడి సందేహము ఎప్పటికప్పుడు తలయెత్తుచుండును. సంతుష్టుడు కాని యెడల, తన యెడలనతడు యెట్టి వైఖరి అవలంభించునో యేమో యనెడి అనిశ్చితస్థితిని నతడెర్కొనును. ఈ భావము యొక్క యుమ్మడి ఫలితముగా శ్రీగురువు తనను దూరము చేయునో? యేమో యనెడి సందిగ్ధ పరిస్థితిని సూచించే ప్రశ్న తలయెత్తును. ఈ కారణమున భక్తునికి భయము గల్గెడి యవకాశము గలదు. అందుచేత, పిండజ్ఞాని "భయమే భక్తికి హేతు"వని గ్రహించవలెను. భయము భక్తికి ప్రాణప్రదమైనదని సోమనాథుడు తన అనుభవసారములో ప్రకటించెను. (ప.57). శ్రీ భగవత్పాదులవారు భయభక్తులతో పిండజ్ఞాని గురువును సేవించమని చెప్పిరన్న విషయమును నీ నేపథ్యమున యవగతము చేసికొనవలెను.

ఎన్ని దినములు లేదా మాసములు గురువును సేవించవలెననెడి ప్రశ్న తలయెత్తును. ఈ విషయమున విభిన్నమైన యభిప్రాయములు గలవు. బ్రాహ్మణ కులజునికి తక్కువకాలము, శూద్రునకైతే యెక్కువ కాలము అవశ్యముగా నుండవలెననెడి యభిప్రాయమొకటి గలదు. ఎవ్వరైననూ కనిష్ఠముగా 6 మాసములనుండి ఒక సంవత్సరము వరకు తప్పనిసరిగా శ్రీగురువును సేవించవలెననెడిది గ్రహించవలెను. పిండజ్ఞాని వివేకసంపద ఎంతమేరకు గలదనెడిది శ్రీగురువు ప్రత్యక్షముగా తెలిసికొనవలెను. ఆత్మానాత్మ మరియు నిత్యానిత్య వివేకము లేనివారికి శివజీవైక్య భావనసిద్ధింపజాలదు. అదేవిధిన పిండజ్ఞాని అంతరంగము శుద్ధమైనదా కాదా? అనెడిది తెలిసికొనవలసియున్నది. మానసిక శుద్ధిలేని వానికి మల విచ్ఛేదనము సంభవించదు. వైరాగ్య భావన పరిపూర్ణముగా నున్నదా లేదా యనెడిది కూడ శ్రీగురువు పరీక్షించవలసియుండును. ఈ కారణము వలన పిండజ్ఞాని తగు సమయము వరకు గురుసేవలో కాలము గడుపవలెను.

గరిష్ఠ సమయమైనంతమేరకు నుండవలెననెడిది వెంగిలి ప్రశ్నయే యగును. శ్రీగురువు ప్రసన్నుడగునంతవరకు పిండజ్ఞాని సేవించుచునేయుండవలెను. శిష్యునికి తొందరపాటుగాని, అసహనము గాని యుండకూడదు. శ్రీగురు నాగ్రహమునకు గురిచేసెడి ప్రవర్తనకు పూనుకొనవలదు. ఈ విధిన కొలువగ, కొలువగ నొకానొక శుభావహమందున శ్రీగురువు కృప లభించగలదు. దానికి సంకేతము శ్రీగురువు గారి కృపావలోకనమే యని గుర్తించవలెను. శ్రీగురువనెడి కల్పతరువుకు "కరుణావిలో దృష్టి"యే మూలమనియును, "ఘన దయామృతావలోకనమే పరమ పద"మని పిండజ్ఞాని భావించవలెను. అడవిలో మిట్ట మధ్యాహ్నము తిరుగాడుచు దప్పికొనినవాడు శీతల పానీయము పొందిన యటులను, ఆగర్భ దరిద్రుడు పెన్నిధిని పొందిన యటులను భావించుకొని తాను ధన్యుడనైతినని మనమున దలచవలెను. శ్రీగురువు పాదముపై బడి తన కృతజ్ఞతను తెలియజేసికొనవలెను. లేచి నిలిచి ముకుళిత హస్తుడై శ్రీగురువును పరిపరివిధములుగా స్తుతించి రక్షింపుమని వేడికొనవలెను.

ఇచ్చట రక్షణ అనెడి పదమునకు గల అర్థమెట్టిదో తెలిసికొనవలసియున్నది. రక్ష అనే ధాతువునుండి వచ్చిన యీ శబ్దమునకు పాలనయనెడి యర్థము ఇవ్వబడినది. పాలనలో యోగక్షేమములును, శిక్షణలును నంతర్భాగములై యుండును. భవరోగముతో బాధపడెడి శిష్యునికి వైద్యుడై రోగమును తొలగించుచున్నాడు. దుష్టశిక్షణ శివుని 'మృడరూపము' యొక్క ప్రధానమైన విధియై యున్నది. శిష్టరక్షణ చేయుటయును నతని కర్తవ్యమే గనుక రోగ నిర్మూలనము చేయుటయేగాదు అది మరల సంభవించకుండగ రక్షణను నేర్పరచును. ఇక యోగము గురించి చెప్పవలెననిన పిండజ్ఞాని శివజీవైక్య విద్యను గడించుటకై శ్రీగురువు దోహదకారియగుచున్నాడు. గురూపదేశములో యీ విద్యను గడించెడి విధి విధానమును, మార్గదర్శక సూత్రములును బోధింపబడుచున్నవి. త్రిమలములను చ్ఛేదించి, శివజ్ఞానార్జనకై వలయు సుస్థితిని శ్రీగురువు యేర్పాటు చేయుచున్నాడు. విద్యలన్నిట కంటెను నుత్తమోత్తమమైన విద్యతో కూడియుండు విధిని శ్రీగురువు బోధించును. క్షేమమనెడి గడించిన విద్యవలన సార్థకత పొందుట యనెడిది గుర్తించవలెను. శివజీవైక్య బోధకమైన విద్యలో క్రీడించినయప్పుడే పిండజ్ఞానికి సార్థకత లభించును. అదియును శ్రీగురువు కటాక్షము వలన లభించునని గుర్తించవలెను.

ఈ కారణముల దృష్ట్యా శ్రీగురువు ప్రసన్నుడైన పిదప నా ప్రసన్నత వలన ధన్యతను పొందుటకై పిండజ్ఞాని కృషిచేయవలెనని గ్రహించవలెను.

– శుభం భూయాత్ –

## ఆశీర్వచనము : 3

**శ్లో॥ ఇతిశుద్దేన శిష్యేణ ప్రార్థితః పరమో గురుః।**
**శక్తిపాతం సమాలోక్య దీక్షయా యోజయేదమమ్॥** (సి.శి. 6-10)

పరిశుద్ధుడైన శిష్యునిచేత ప్రార్థితుడైన పరమ గురువు, శక్తిపాతమును సమీక్షించి, సముచితమని తోచిన యెడల దీక్షను శిష్యునికి ప్రదానము చేయవలెను. శక్తిపాతమనెడిది పరమాత్ముని యనుగ్రహమని తెలిసికొనుడి. అదిలేనివానికి దీక్షను ఇవ్వకూడదని చెప్పబడినది. శ్రీగురువు మాత్రమే శక్తి పాతచిహ్నములను కనుగొనగల్గును.

**శ్లో॥ దీయతే చ శివజ్ఞానం క్షీయతే పాశబంధనమ్।**
**యస్మాదతః సమాఖ్యాతా దీక్షేతీయం విచక్షణైః॥** (సి.శి. 6-11)

ఎయ్యది శివజ్ఞానము నిచ్చునో, నెయ్యది పాశబంధములను క్షీణింపజేయునో, అద్దానిని విచక్షణగల విద్వాంసులు దీక్షయని అందురు.

**శ్లో॥ సాదీక్షా త్రివిధా ప్రోక్తా శివాగమ విశారదైః।**
**వేధారూపా క్రియారూపా మంత్రరూపా చ తాపస॥** (సి.శి. 6-12)

దీక్ష మూడు విధములుగ నుండుననియును, అవి వేధా, క్రియా, మంత్ర రూపములలో నుండుననియును శివాగమ విశారదులచేత చెప్పబడినదని శ్రీభగవత్పాదులవారు, తాపసేంద్రులగు అగస్త్యులవారికినుపదేశించిరి.

**గురోరాలోకమాత్రేణ హస్తమస్తక యోగతః।**
**యః శివత్వ సమావేశో వేధా దీక్షేతి సా మతా।**
**మంత్రదీక్షేతి సా ప్రోక్తా మంత్రమాత్రోపదేశినీ॥**
**కుండమండలి కోపేతా క్రియాదీక్ష క్రియోత్తరా॥** (సి.శి. 6-13-14)

గురువుయొక్క ఆలోకనము చేతను, హస్తమస్తక సంయోగము వలన వచ్చినదియును, అట్టి శివత్వము శిష్యునిలో ప్రవేశించుచున్నదో అట్టిదానిని వేధాదీక్షయని యందురు. మంత్రోపదేశము వలన యెట్టి సంస్కారము గల్గునో అట్టిదానిని మంత్రదీక్షయని అందురు.

ఆప్త, అంగ, స్థాన మరియు సద్భావనల చేత చతుర్విధ సేవలను చేసిన శిష్యుడు, గురువుయొక్క అనుగ్రహమునకై గురుసమ్ముఖమునందున నిల్చియుండి ప్రార్థించికొననప్పుడు, శ్రీగురువు శిష్యునికి దీక్షాగ్రహణ యోగ్యత యున్నదో లేదో పరీక్షించవలెను. ఇట్టి యోగ్యతను శక్తిపాతమందురు.

మోక్షము నందాసక్తి, సంసారమునందు జుగుప్స, శివభక్తుల యెడ భక్తిభావము, శ్రీగురూపాసన, శివాగమములయెడల నమ్మకము మొదలగునవి శక్తిపాతము యొక్క చిహ్నములని వివేక చింతమణి వలన తెలియుచున్నది. అన్ని చిహ్నములు పొడసూపినప్పుడే శక్తిపాతమగునని గ్రహించవలెను. శక్తిపాతమును శివానుగ్రహమని అందురు. జన్మ జన్మాంతరముల యందు నాచరించిన నిత్య, నైమిత్తిక మరియు ప్రాయశ్చిత్తములనెడి వాటిని యనుష్ఠానము చేయుటవలన పరిపక్వమైన మల త్రయమున్నవారికే శక్తిపాతము గల్గును.

వ్యాసమహర్షి మలమును రెండు విధములుగా విభజించెనని తెలియుచున్నది. శివపురాణములోని యీ క్రింది ప్రమాణమును గమనించుడి :

**శ్లో॥ "మలోప్యామశ్చ పక్వశ్చ భవేత్ సంసారకారణమ్।"** (శి.పు. 1/31/72)

సంసారమునకు కారణమైయున్న మలము రెండు విధములుగా నుండుననియును, మొదటిది ఆమ మలమనియును, రెండవది పక్వమలమనియును వ్యాసోక్తిలోని భావము. తపస్సుచేత ప్రక్షీణమైన దానిని పక్వమలమనియును, తద్విరుద్ధమైన దానిని ఆమ మలమనియును గ్రహింపదగును. ఆమ మలమును అపక్వమలనియనవచ్చును. అనేక జన్మలలో చేసిన తపస్సు పరిపక్వమైన మలము కలవాడే శివానుగ్రహమును పొందుటకై యర్హత గల్గియుండును.

**శ్లో॥ స్వకర్మ పరిపాకేన ప్రక్షీణమల వాసనః।**
**శివప్రసాదాజ్జీవోఽయం జాయతే శుద్ధమానసః॥**
**శుద్ధాంతఃకరణే జీవే శుద్ధకర్మ విపాకతః।**
**జాయతే శివకారుణ్యాత్ ప్రస్ఫుటా భక్తిరైశ్వరీ॥** (సి.శి. 5 :52-53)

ఈ ఉపదేశములో శ్రీజగద్గురు రేణుక భగవత్పాదులు, అనేక జన్మల తపస్సుచేత పరిపక్వమైన మలము గల సాధకుడే శివానుగ్రహమునకు పాత్రుడగునని యానతినిచ్చిరి.

శ్రీమరితొంటదార్యులవారు తపస్సుచేత పరిపక్వత చెందిన మలము గలవానిని తప్త తను సహితుడనెను. ఇట్టివాడే దీక్షను పొందుటకు అర్హుడని తెలిపిరి. వీరశైవానందచంద్రికలోని వీరి యుపదేశమియ్యది.

**శ్లో॥ తపస్తప్తా తనుర్యస్య స తప్త తనురుచ్యతే।**
**పరిపక్వో విమోక్షాయ సోఽశ్నుతే లింగధారణమ్॥**
**నకరోతి తపః పూర్వం సోఽ తప్తతనురుచ్యతే।**
**అపక్వోఽయం విమోక్షాయ నాశ్నుతే లింగధారణమ్॥** (పు. 78)

కిరణాగమము, కర్మసామ్యము వలన శక్తి పాతము గల్గునని చెప్పబడినది. అందులోని ప్రమాణమును గనుడి :

**శ్లో॥ సమే కర్మణి సంజాతే తత్కాలం యోగ్యతావశాత్।**
**తీవ్రశక్తి నిపాతేన గురుణా దీక్షితో యదా॥**
**సర్వజ్ఞ సశివోయద్వత్ కించిజ్ఞత్వవివర్జితః॥**
**"విరుద్ధయోః కర్మణోః సమబలయోరన్యోన్య ప్రతిబంధేకర్మసామ్యమ్"**

యనెడి వ్యాఖ్య ప్రకారము కర్మసామ్యమనగా పరస్పర విరుద్ధములైన పుణ్యపాపములు సమబలములు గలవియై పరస్పర ప్రతిబంధకములై యుండెడి జీవుని స్థితి. సామాన్యముగా సకల జీవుల కార్యములు విషమమై యుండును. అందుచేత కర్మ సామ్యము సహజముగా నందరికీ రాజాలదు.

శరీరమునందున వాతపిత్తకఫములనెడి ధాతువులు విషమమైన యప్పుడు, ప్రాణులు ఏదోనొక విధమునకు చెందిన రోగముచేత పీడింపబడుదురు. ధాతువులు సమత్వమును పొందినప్పుడు శరీరము స్వస్థమగును. అదే విధిన, మనుష్యుని పుణ్యపాపములు విషమావస్థలో నున్నప్పుడు, జీవియొక్క అంతఃకరణము యేదోనొక యుపద్రవమునకు లోనై శాంతిని కోల్పోవును. జీవుడు అట్టిస్థితికి దూరమై, యుండినప్పుడు నిరుపద్రవియగును. పుణ్యపాపములు సమతను పొందినప్పుడు జీవుని అంతఃకరణము నిరుపద్రవయుక్తాంతఃకరణ గల జీవుడి శివానుగ్రహరూపమే శక్తి పాతమును పొందెడి యర్హతను పొందునని కిరణాగమవాక్కులోని భావము.

రోగపీడితుడై యశక్తుడైన మనిషి, ఔషధ సామర్థ్యము చేత బలశాలియగునటులే, శివానుగ్రహ రూపమైన శక్తిపాతముచేత జీవులకు దృక్ క్రియాత్మకమైన యైశ్వర్యము దొరికి మోక్షమును పొందెడి సామర్థ్యము సంప్రాప్తమగును. అదిలేని యప్పుడు కేవలము కర్మానుసారముగా భోగముల నుపభోగించి సంసారియనిపించికొనును.

సంసారి దీక్షను పొందుటకు అర్హుడు కాడనియును, సంసారము యెడల వైరాగ్యభావన కల్గి, శివపాద సందర్శనాసక్తి, తదాశయ సిద్ధికై మార్గదర్శనము చేసెడివాని నన్వేషించవలెననెడి జిజ్ఞాస మొదలగునవి గలవాడే శివానుగ్రహ రూపమైన శక్తి పాతమును పొందుట కర్హుడని చెప్పెడి పౌష్కరాగామములోని యుపదేశమును గమనించుడి :

**శ్లో॥ వైరాగ్యం జాయతే క్షిప్రం సంసారాత్ దుఃఖసాగరాత్।**
**దిదృక్షా జాయతే శంభోః పాదపంకజ యోరపి॥**
**కదా ద్రక్ష్యామి దేవేశం మోక్షేహం బంధతఃకదా।**
**కోవా దర్శయితా శంభోరితి సంజాయతే మతిః॥**
**ఏవం సంసారతో భీతమనుగృహ్ణాతి చేశ్వరః** (పౌ.ఆ.)

గురువుగారొక వేళ శిష్యుని పరీక్షించకుండగనే దీక్షనిచ్చిన యెడల, యతని గుణ, శీలస్వభావముల యందున యెట్టి మార్పు రాదని మొదటివలెనే ఉండుననియును చెప్పబడినది. ఇట్టివారిని మన దైనందిన జీవితములో చూడగల్గుదుము. ఇట్టివాడు వేషలాంఛనుడే కాని భక్తుడు కాడని శ్రీ చెన్న బసవన్నవారు సెలవిచ్చిరి. వీరి వచనమును గనుడి :

**కబ్బునద శునకవ తందు పరుష్కవముట్టిసతోడనె**
**హోన్న శునకవప్పుదల్లదె పరుషవాగలరియదునోడా!**
**లోకద మానవన తందు భక్తన మాడిదొడె**
**వేషలాఛనియహనల్లదె భక్తనాగలరియ నోడా**
**ఇదు కారణ, కూడల చెన్న సంగమ దేవయ్య!**
**మజ్జనక్కెరెవ భవిగళనెంతు భక్తరెంబెనయ్యా!**

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**ఇనుప శునకము దెచ్చి పరుషము ముట్టించిన వెంటనే**
**పొన్ను శునకమగునేగాని, పరుషము కాగ నరయదు చూడుమా!**
**లోకపు మానవుని తెచ్చి భక్తుని చేసిన వెంటనే**
**వేషలాంఛనుడగునే గాని భక్తుడు కాగ నరయడు చూడుమా!**
**ఇది కారణము, కూడల చెన్న సంగమ దేవయ్యా!**
**మజ్జనమునకెలయు భవులను భక్తులెట్లుందునయ్యా**

దేవర దాసిమార్యుల వచనమును నిట్టి శిష్యునికి దీక్షనిచ్చెడి గురువును నిందించుటను గాంచగలము. కనుడి :

**హొలబనరియద గురువు సులభనల్లద శిష్యన**
**కెలబలన నోడి విచారిసి మాడిదుపదేశ**
**అంధకనకయ్య అంధక హిడిదంతెకాణా రామనాథా!**

దీని తెలుగు రూపమును గనుడి :

**పొలము నరయని గురువు సులభుడు కాని శిష్యుని**
**వలపల దాపలను జూచి విచారించి చేసిన యుపదేశము**
**అంధకుని కైని యంధకుడు పట్టినట్లే కనుమా రామనాథా!**

గురువు శిష్యుల నిద్దరిని గ్రుడ్డివాడనడము విశేషాంశమని యెరుంగుడి :

## దీక్ష విచారము :

దీక్షయనగా నేమి యనెడి జిజ్ఞాస గల్గినప్పుడు శ్రీ భగవత్పాదులవారు దీక్షయనగా నొక సంస్కారమనియును, న్యుత్పత్తి "క్షీయతే పాశబంధనమ్" అని సెలవిచ్చిరి. దీక్ష మలత్రయమును నాశనము చేయునని గ్రహింపదగును. దీక్షయొక్క సకారాత్మక గుణమేమనగా నది "దీయతే శివజ్ఞానం" దీక్షవలన శివజ్ఞానము లభించునని దీని యర్థము.

జగత్తులోని జీవులెల్ల మూడు రకములైన మలపాశములచేత కట్టబడియున్నారు. అందుచేత జీవుని పశువని పిలుతురు. శక్తిత్రయమనెడిది శివుని నైసర్గికము. శక్తిత్రయము సంకోచము చెందినప్పుడు మలత్రయమగుచున్నది. శక్తిత్రయములోన యిచ్ఛాశక్తి, జ్ఞానశక్తి మరియు క్రియాశక్తులు గలవు. మలత్రయమునందున ఆణవమలము, మాయామలము మరియు కార్మిక మలములు గలవు.

శివుని యిచ్ఛాశక్తి సంకోచమునొంది ఆణవ మలమయ్యెను. ఆణవమలావృతుడైన జీవుడు, తన విభుత్వమును మరచిపోయి,తాను అపూర్ణుడననెడి భావనను పొందుచున్నాడు. అందుకే, క్షేమరాజాచార్యుల వారు **"అపూర్ణం మన్యతా రూపమాణవం మలం"** అని ఆణవ మలము లక్షణమును తెలిపిరి.

మాయా మలమనెడిది పరశివుని జ్ఞానశక్తి యొక్క సంకోచిత రూపము. క్షేమరాజాచార్యులు చెప్పిన యటుల "భిన్నవేద్య ప్రథారూపం మాయియం మలమ్" అనెడిది మాయా మలము యొక్క లక్షణమై యున్నది. దీని ప్రభావము వలన జీవుడు భేదబుద్ధితో వ్యవహరించును. తాను పరశివునికంటెను భిన్నమైన వానిననియును, దేహమే తాననియును, గృహక్షేత్రాదులెల్లా తనవనియును భావించికొనును.

పరశివుని క్రియాశక్తి యొక్క సంకోచరూపమే కార్మిక మలము. "శుభాశుభానుష్ఠానమయం కార్మమలమ్" అని క్షేమరాజు దీని లక్షణమును తెలిపిరి. ఇది శుభాశుభవాసనాయుక్తమైనదనియును, ఈ వాసనా బలము వలననే జీవుడు శుభాశుభ కర్మల నాచరిస్తూ ఆ కర్మఫలములైన సుఖదుఃఖముల ననుభవించుచున్నాడనియును గ్రహించగలరు. అదేవిధిన దేవ-తిర్యక్-మనుష్యాది యోనులలో జన్మించుచు సంసానమునందున తిరుగాడుచున్నాడని తెలిసికొనవలెను.

ఈ మూడు మలములు అనాదికాలమునుండి యుండటచేత, జీవభావము కూడ అనాదికాలము నుండి యుండి యున్నది. జీవుని యా అనాదిమలములను నివృత్తిచేసి, శివజ్ఞానమును గల్గించెడి సంస్కారమే దీక్ష యనబడుచున్నది. సూర్యకిరణములలో దాహశక్తి జతకు ప్రకాశశక్తి యుండి యున్నయటుల, దీక్షయందున మలనాశకశక్తి మరియు జ్ఞాన ప్రకాశకత్వమనెడివి యుండును. శ్రీసద్గురువువలన దొరకెడి దీక్షా సంస్కారముచేత, పరిశుద్ధుడైన జీవాత్మనే పరమాత్ముని ప్రేమకు పాత్రుడగుచున్నాడు. ఇంటియందున పరిశుద్ధమైన వస్త్రములు ధరించిన తండ్రి దగ్గరకు, ధూళి ధూసరితమగు బట్టలు గల బిడ్డ అప్పా! యని కౌగిలించుకొనుటకు వచ్చినప్పుడు, తండ్రి యా బిడ్డను ఎత్తికొని ముద్దాడక, దూరముననుంచును. కసిరికొట్టును. తల్లి, బిడ్డయెంత మలినమును గల్గియున్ననూ, బిడ్డనెత్తికొని, అతని మలిన పూర్వకమైన బట్టలను విప్పి, స్నానము చేయించి కొత్తబట్టలను తొడిగి, తండ్రి దగ్గరకు పంపించిన పిదప తండ్రి బిడ్డను ఎత్తికొని ప్రేమను చేయును. అదేవిధిన దీక్షను పొంది మలరాహిత్యమును పొందిన జీవాత్మను పరమాత్మ దగ్గరకు తీసికొని, తన అనుగ్రహమునకు పాత్రుని చేయును. అందుకే, శివభక్తులెల్లరకూ దీక్షయెంతో నవశ్యకమైయున్నది.

## వేధాదీక్ష :

దీక్షయనెడిది వేధాదీక్ష, మంత్రదీక్ష, క్రియాదీక్షయనెడి మూడు విధములుగా నున్నది. ప్రతియొక్క జీవునికి కారణ, సూక్ష్మ మరియు స్థూలమనెడి మూడు శరీరములుండును. ఈ మూడు శరీరములకు, వీరశైవమునందున, యోగాంగ, భోగాంగ మరియు త్యాగాంగములనెడి పేర్లు గలవు. వీటియందు క్రమముగా ఆణమ, మాయిక, మరియు కార్మికములనెడి మలములుండును. వీటి నివారణకై మూడు దీక్షలు నిరూపితమైనవి.

శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదులవారు వేధాదీక్ష గురించి యీ క్రింది విధిననుపదేశించిరి.

**శ్లో॥ గురోరాలోక మాత్రేణ హస్తమస్తక యోగతః।**
**యః శివత్వ సమావేశో వేధాదీక్షేతి సామతా॥** (సి.శి 5 :12-14)

శ్రీగురువు తన యమృత మయమైన హస్తమును శిష్యుని మస్తకము మీదుంచి, కృపాపూర్ణమైన దృష్టితో నవలోకన చేయును. శిష్యుని యందున నుండెడి అపూర్ణత్వ భావదాయకమగు ఆణవమలము నివృత్తమై "శివోహం" అనెడి ఉత్కృష్ట భావనముదయించును. ఇట్టి భావననే భావలింగమందురు. తన చిత్కళ యొక్క రూపమైన యీ భావలింగపు ఎరుక అయినప్పుడు, శిష్యునియందున శివత్వము సమావేశమగునని తెలిసికొనవలెను. పరశివుని తోడ సాక్షాత్ యోగ లేదా తాదాత్మ్య సంబంధమును చేసికొనెడి యోగ్యత గల అంగమును యోగాంగమని అందురు. మనుష్యుని స్థూల మరియు సూక్ష్మ శరీరముల సంస్కారముకంటెను కారణ శరీరమనిపించి కొనెడి యోగాంగము యొక్క సంస్కారము ఎంతో మహత్వ పూర్ణమైయున్నది.

ఈ సంస్కారము చేత జీవనమునకు చెందిన సంకుచిత భావములన్నియును నివృత్తములై నిరహంకార స్థితియూ, సర్వత్రా సమదృష్టియును అలవడుట ప్రారంభమగును.

చంద్రజ్ఞానాగమము ప్రకారము యోగాంగ సంస్కారరూపమైన వేధాదీక్ష యందున యేడు వుపసంస్కారములు గలవని ప్రతిపాదించిరి. అవి : ఏకాగ్రచిత్తత, దృఢవ్రతత, పంచేంద్రియార్పితత, అహింస, లింగనిష్ఠ మనోలయము మరియు సద్యోన్ముక్తులుపరిపరి విధములుగా పరుగెత్తిపోయెడి

చిత్తమును, చిన్మయ లింగమునందుననే మంచిగా నెలకొల్పుటను నుపదేశించునదే యేకాగ్ర చిత్తసంస్కారము. పట్టిన నిరుమములను ఎప్పుడైననూ విడువకుండా ఉండుమని శ్రీగురువు శిష్యునికి బోధించునదే దృఢవ్రత సంస్కారము. ఈ దృఢవ్రతమును శ్రీ బసవన్నవారు "ఛలబేకు శరణంగె పరధనవ నొల్లెనెంబ" యని తెల్పెడి వచనమునందున యెంతో మార్మికముగా చిత్రించిరి.

**ఛల బేకు శరణంగె పరధనవ నొల్లెనెంబ**
**ఛల బేకు శరణంగె పరసతియ నొల్లెనెంబ**
**ఛల బేకు శరణంగె పరదైవవ నొల్లెనెంబ**
**ఛల బేకు శరణంగె లింగ జంగమ ఒందె ఎంబ**
**ఛల బేకు శరణంగె ప్రసాద దిటవెంబ**
**ఛల విల్ల దవర మెచ్చునమ్మ కూడల సంగమదేవ!**

ఈ వచనపు తెలుగు రూపమిది :

**ఛలము వలయు శరణునికి పరధన మొల్లననెడి**
**ఛలము వలయు శరణునికి పరసతి నొల్లననెడి**
**ఛలము వలయు శరణునికి పరదైవ మొల్లననెడి**
**ఛలము వలయు శరణునికి లింగ-జంగమ మొకటనెడి**
**ఛలము వలయు శరణునికి ప్రసాదము దిటమనెడిది**
**ఛలము లేనివారిని మెచ్చుడు, కూడల సంగమదేవుడు**
(ఛలమనగాధృఢ సంకల్పము)

వ్రత నియమములను పాలించెడి భక్తునికి, యెన్నెన్నో విఘ్నములు వచ్చుటయేకాదు, దేవుడు కూడ పరీక్షించుచుండును. అందుకే బసవన్నగారు ఈ క్రింది విధిన తెలిపిరి :

**శివభక్త నాగి తన్న హిడిహెనెందు హోదరె**
**నుగ్గుమాడువ, నుసియ మాడువ,**
**మసియ మాడువ కూడల సంగమ దేవర**
**నెరెనంబిదనాదరె కడెగె తన్నంతె మాడువ**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది :

**శివభక్తుడై తనను పట్టెదనని పోయినచో**
**నుగ్గు చేసెడి నుసిని చేసెడి**
**మసిని చేసెడి కూడల సంగమదేవుడు**
**నెరనమ్మినచో చివరకు తనయంత చేయును.**

ఈ వచనము నందున భక్తిపథమున నడిచెడి భక్తుని భగవంతుడు పరీక్షించెడి పద్ధతిని వివరించి దానిలోన యుత్తీర్ణుడయ్యెడివాని, చివరకు తనయంతగా చేయునని బసవన్నవారు దృఢవ్రతము యొక్క ఫలితమును ప్రతిపాదించినారు. అందుచేత, సాధకుడు, ధృతిచెడక, వ్రతమును చెరచక, నిష్ఠతో ముందడుగు వేసినచో ముక్తికరతలామలకమగును.

"పంచేంద్రియార్పణ" యనెడిది మూడవ ఉప సంస్కారము. దశేంద్రియములు స్వాభావికముగా తమ తమ విషయములవైపు పరువులెత్తును. అట్టి యింద్రియములను పరశివుని కర్పించి, వాటియందున యాశభావము పెంచికొనునదే పంచేంద్రియార్పణ సంస్కారము. ఇంద్రియములను

పరశివునికి యర్పితములు కావలెననిన ఆయా ఇంద్రియముల విషయములను వాటి యధిష్ఠాతృ లింగములకు నర్పించవలసి యుండును. తదనుగుణముగను, వీరశైవ సిద్ధాంతమునందున శ్రోత్ర-వాగింద్రియములకు ప్రసాద లింగమును, త్వక్- పాణి యింద్రియములకు జంగమ లింగమును, నేత్ర-పాదేంద్రియములకు శివలింగమును, జిహ్వా-గుహ్యములకు గురులింగమును, మరియు ఘ్రాణ-గుదేంద్రియములకు ఆచార లింగమును నధిష్ఠాతృవుగా స్వీకరించనైనది. ఇట్టి కారణము మూలమున శిష్యుడు సద్గురువుల ఉపదేశము వలన వినెడి మరియు తాను నుడివెడి వ్యాపారమును ప్రసాద లింగమునకును, ముట్టెడి, పట్టెడి పదార్థములను జంగమ లింగములకును, చూచెడి-నడిచెడి వ్యాపారములను శివలింగమునకును, చవిగొను సొగయించు వ్యాపారములను గురులింగమునకును, అటులనే మూకొనెడి విడిచెడి వ్యాపారములను నాచారలింగమునకును యర్పించవలెను. ఇట్టి యర్పణలే "పంచేంద్రియార్పణ" సంస్కారమనిపించికొనును.

పంచేంద్రియ విషయములను లింగార్పితము చేసిన పిదప నా విషయములు ప్రసిద్ధములుగా పరిణమించుచున్నవి. ఆ విధిన చేయని యెడల, నా విషయములే విషయములుగా, కుక్కకు చిక్కిన కుందేలు వలె, జీవుని ప్రాణమును తోడివేసి, మరల మరల భవచక్రమున తిరుగునటుల చేయును. అందుచేత, మోక్షాపేక్షయున్న ప్రతియొక్క సాధకునికి పంచేంద్రియార్పణ సంస్కారము ప్రముఖమైనదై యుండును. శ్రీగురువు వేధాదీక్షనొసంగునప్పుడు, విషయములను లింగార్పితములుగా జేసి, లింగభోగియై జీవించెడి విధానమును తెలియజెప్పును.

ఉప సంస్కారములలో నాల్గవది అహింసయగును. అహింస లక్షణమును తెలియజెప్పెడి పతంజలి యోగ సూత్ర వ్యాస భాష్యములోని యీ క్రింది వివరణను గనుడి :

**శ్లో॥ "తత్రాఽహింసా సర్వథా సర్వదా సర్వభూతానామనభిద్రోహః"** (2/30)

యే రీతిగనైననూ, ఏ ప్రాణికైననూ ద్రోహమును చేయకుండా ఉండుటయే యహింసయని చెప్పబడినది. యోగసూత్రముల వృత్తికారుడైన భోజదేవుడు, రచించినది చూడదగియున్నది. గనుడి :

**శ్లో॥ "తత్ర ప్రాణ వియోగ ప్రయోజనం వ్యాపారో హింసా, సా**
**చ సర్వానర్థహేతుః తదభావోఽహింసా"** (యో.సూ. వృ. 2/30)

సర్వానర్థములకు కారణభూతమైన ప్రాణి ప్రాణమును వియోగము చేయు ఉద్యోగమే హింస; ఆ విధిన చేయకుండా ఉండునదే అహింస అనెడిది వృత్తిలోని భావము.

యోగశాస్త్రము ప్రకారము యజ్ఞయాగాదులలో చేసెడి జంతుబలి యిత్యాదులు హింసగానే భావింపవలెను. యజ్ఞమును చేసి స్వర్గమును చేరి సుఖము ననుభవించెడివాడు, తాను యజ్ఞము నిమిత్తమున చేసిన హింస యనెడి కర్మ యొక్క ఫలమును అవశ్యకముగాననుభవించవలసియుండును. ఈ కారణముననే యజ్ఞములలో జంతుహింసకు ఆస్కారములేని జపయజ్ఞమే యుత్తమమైనదిగా భావింపబడుచున్నది.

యోగసూత్రపు వ్యాస భాష్యములో 81 ప్రకారములైన హింసలను చెప్పి, వాటిని చేయకుండా నుండుటయే అహింసయని చెప్పబడినది. మౌలికముగా హింస కృత, కారిత మరియు అనుమోదిత యనెడి మూడు విధములుగా నుండును. తానే చేసిన దానిని కృత హింసయనియును, అన్యులచేత చేయించునది కారిత హింస యనియును, వేరే యెవ్వరైనా చేసిన దానిని ఆమోదించిన యెడల నయ్యది యనుమోదిత హింసయగును. ఇవి ఒక్కొక్కటి మళ్ళీ మూడు విధములుగానుండును. లోభ, క్రోధ, మోహముల నాధారము చేసికొని పై మూడు తొమ్మిది విధములగుచున్నవి. మృదు, మధ్య మరియు తీవ్ర అనెడి మూడు లక్షణములనాధారముగా గొని తొమ్మిది 27గా పరిణమించును. ఈ 27లో మిత,మధ్య, అమితయనెడి వాటిని వర్గీకరణకై గైకొని 81 రకములు చెప్పబడినవి. ఇవి శారీరక సంబంధమైనమే. వాచిక, మానసిక హింసలను వీటికి జోడిస్తే హింసలు నసంఖ్యాకములగును. వీటికి దూరముగా నుండుటయే నిజమైన అహింస.

శారీరక మరియు వాచిక హింసలకు మానసిక హింసయే కారణమైయున్నది. సకల విధ అనర్థములకు బీజ భూతమైన మనస్సునందున గల్గెడి యీ హింసాభావనలను తొలగించి జీవించు నటుల శ్రీగురువు నుపదేశించును. అన్ని జీవులలోను శివుడేయుండుటచేతదీనిని గ్రహించినవాడు హింసను చేయగలడా?

వేధాదీక్షయొక్క ఐదవ అవాంతర సంస్కారమే లింగ నిష్ఠా సంస్కారము. భక్తియొక్క అచలమైన భావనలకు నిష్ఠయను పేరుగలదు. తన ఇష్ట, ప్రాణ, మరియు భావలింగములయందు అచలమైన భావన నొనడగూడునటుల ఉపదేశించునదే లింగనిష్ఠా సంస్కారము. దీనినే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఈ క్రింది విధిన ఉపదేశించిరి.

**శ్లో॥ అపగచ్ఛతు సర్వస్వం శిరచ్ఛేదనమస్తు వా।**
**మాహేశ్వరో న ముంచేత్తు లింగపూజా మహావ్రతమ్॥** (సి.శి. 10-22)

తన సర్వస్వమే నష్టమైనను శిరచ్ఛేదనమైననూ, లింగపూజా రూపమైన మహావ్రతమును వీడజాలను అనెడి భావనయే లింగనిష్టయని పై శ్లోకములోని భావన. డాక్టరు జా.చా.ని.వారు "లింగభక్తి, లింగసేవ, లింగపూజ, లింగధ్యానములు ఎంతో కష్టమనిపించినను విడకుండ యుండునదే లింగనిష్ఠ. అన్యులు లింగమునందు అనాదరము అలవడునటుల అనేకమాటలనాడినను వాటిని వినకుండ గైకొనిన లింగవ్రతమును నిరాటంకముగా కొనసాగించుటయే లింగనిష్ట. కాయకము వల్లగాని, మరే యితర కారణముల వల్లగాని శరీరము బాధకుగురియైనను, సంకల్పము వలనగాని, వికల్పము వలనగాని, మనస్సు బాధకు గురియైనను కాలకాలమునకు చేసెడి లింగ పూజాదులయందు అలసటనొందక వీడకుండా చేయునదే లింగనిష్ట. బీదరికము వచ్చిననూ, బంధువులు విడిచిపోయిననూ, లింగమే పరమసంపత్తనుచు, లింగమే ఆప్తబంధువనుచు భావించునదే లింగనిష్ట" అని తమ 'సంస్కారము' అనెడి గ్రంథములోన తెలియజేసిరి. (పుట.120) ఇంతియే కాకుండా లింగనిష్ట యొక్క అనేకముఖములను తెలియపరచిరి. ఈవిధముగా ఇష్టలింగమునందు నిష్ట కలిగియుండునటుల సద్గురువు ఉపదేశించుచున్నాడు. ఇదే లింగానిష్ఠా సంస్కారము.

వేధా దీక్ష యొక్క ఆరవసంస్కారమే మనోలయదీక్ష."సంకల్ప వికల్పాత్మకమ్ మనః" అనెడి వచనము ప్రకారము మనస్సు స్వభావతః సంకల్ప వికల్పములతో కూడుకొని యుండి చంచలమైనదే మనస్సు. తన స్వభావమును వీడి మనస్సు మహాలింగము మొక్క ధ్యానము నందు తన్మయమయ్యే విధముగా ఉపాయములను తెలియజెప్పుటయే మనోలయ దీక్ష యగుచున్నది

మనోలయమైన యెడల సదాశివునితో అభేదత్వము సిద్ధించునని తెలిపెడి ఆదయ్యగారి వచనము మనోలయ దీక్ష యొక్క ప్రాముఖ్యతను తెలియజేయుచున్నది. ఈ వచనమును గనుడి :

**"సకలేంద్రియంగళల్లి వికరిసువ మనవ సెళెదు**
**నిందాతనే సుఖి. పంచేంద్రియంగళిచ్ఛెయల్లి కీళు**
**మనగొండు సుళివాతదుఃఖ. మనవు బహిర్ముఖవాగలు**
**మాయాప్రపంచె. మనవు అంతర్ముఖవాగలు అవిరళజ్ఞాని;**
**మనవు మహదల్లి నిందిరలాత ముక్త;**
**మనోలయవాదడె, సౌరాష్ట్ర సోమేశ్వర లింగదల్లి అభేద్యను"**

ఈ వచనమునకు తెలుగు రూపమియ్యది :

**సకలేంద్రియములందు వికలించెడి మనస్సును సంధించి**
**నిలిచినవాడే సుఖి. పంచేంద్రియముల ఇచ్ఛయందు కీడు**
**మనసుంచి తిరిగెడువాడు దుఃఖి. మనము బహిర్ముఖము కాగను**
**మాయాప్రపంచి. మనము అంతర్ముఖము కాగను అవిరళజ్ఞాని**
**మనము మహతిన నిల్పియుండెడివాడు ముక్తుడు.**
**మనోలయమైనచో సౌరాష్ట్ర సోమేశ్వరలింగమునందు అభేద్యుడు"**

మనస్సు అంతర్ముఖమైన యెడల మహాదేవుని గాంచవచ్చును. అది బహిర్ముఖమైన యెడల సంసారమే కన్పట్టును. అందుచేత అనేకమంది మునులు, ఋషులు ఈ మనస్సును అంతర్ముఖముగా చేయుటకై తమ జీవనమును ముడుపుగా చేసిపెట్టిరి.

చంచలమైన మనస్సును నిగ్రహించుట కష్టమైన పనియని అందరూ ఎరిగిన విషయమే.

**"మనోదుర్నిగ్రహమ్ చలమ్"** అని గీతాకారుడు నుడివెను. అభ్యాసముచేతను, వైరాగ్యముచేతను మనస్సును నియంత్రణ చేయవచ్చునని గీతలో చెప్పబడినది (గీత 6-35)

**"మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః"** అనెడి వచనము ప్రకారము మన బంధనములకును, మరియు ముక్తికిని మనస్సే కారణమగుచున్నది. అందుచేత దాని నిగ్రహమే మనుష్యునికి చిరతరమైన సుఖమును యివ్వగలదు. ప్రతిదినము మనము గాఢమైన నిద్రను అనుభవించుచున్నాము. ఈ గాఢనిద్రయందు ఎల్లరూ సుఖులు గానే యుందురు. రాజు, బుద్ధిమంతుడు, మూర్ఖుడు మొదలగు వారెవరైనను వారి వారి వ్యవహారములను ముగించిన పిదప నిద్రకు పూనుకొందురు. దీని రహస్యమేమి? నిజమైన సుఖశాంతులు ఈ జాగ్రత్త ప్రపంచముననే దొరికిన యెడల నిద్రపోవునదెందుకు? ఈ విషయములన్నింటిని పర్యాలోచన చేసిన పిదప బహిర్ముఖము నందు, జాగ్రత్, స్వప్నములయందు, సుఖదుఃఖములను అనుభవించి వేసరి అయిన పిదప ఆనందానుభవమునకై మనస్సు ఆపేక్షించినప్పుడు మనుష్యుడు నిదురించును. ఆ సుషుప్తి యవస్థయందు బాహ్యప్రపంచమునకు చెందిన ఎట్టి సామగ్రియు వుండదు. అయినను మనకు ఆనందప్రాప్తి యగుచున్నది. దీనికి గల కారణమేమనగా మనస్సుననున్న విలయమే.

మనస్సునందు విలయము అయిన వెంబడే మహానందము యొక్క ప్రాప్తి యగునననునది మనకు తెలియజేయుటకే పరశివుడు మనుష్యులకు ఈ సుషుప్తి యవస్థను దయచేసినాడు. ఈ అవస్థయు కర్మాధీనమగుటచే, మనకు అవసరమైనప్పుడు ఆనందమును అనుభవించజాలము. అందుచే ప్రయత్న పూర్వకముగా మనోబలమును సాధించవలెను. ఇదే పురుషార్థము. శ్రీగురువు యొక్క మార్గోపదేశము ప్రకారము అభ్యాసము మరియు వైరాగ్యముల బలముచేత మనస్సును అంతర్ముఖముగా నుంచుకొనుటయే మనోలయ దీక్షయని యెరుంగవలెను.

వేధాదీక్ష యొక్క చివర సంస్కారమే సద్యోముక్తి సంస్కారము. జీవన్ముక్తి యొక్క స్వరూపమును తెలిసికొని శిష్యుడు ఆస్థితియందు వుండి యుండునటుల ఉపదేశించునదే సద్యోముక్తి సంస్కారము. జీవన్ముక్తి యొక్క విలక్షణమైన ఈ ఆనందమును అనుభవించుటే పరమ పురుషార్థము. ఈ పురుషార్థము యొక్క ప్రాప్తికై ఇంతకు పూర్వమున చెప్పబడిన మనోలయ సంస్కారమే మూలమైనదైయున్నది. మనోలయమును సాధించిన వానికి జీవన్ముక్తికై ప్రత్యేకముగా పరిశ్రమించెడి ఆవశ్యకతలేదు. ఎందుకనగా అది తనకు తానే సిద్ధించుచున్నది.

జీవన్ముక్తిని ననుభవించిన మహానుభావులయొక్క వాక్కులు గమనార్హములై యున్నవి. ఈ దిశలో శ్రీ షణ్ముఖస్వామివారి వచనము ఎంతో ఉపయోగకరమైనదని చెప్పవచ్చును. కనుడి :

**"పశ్చిమ గిరియ చిత్‌సూర్య ఉదయవాదుద కండె**
**సుత్తముత్తలిన కత్తలెయెల్ల, అత్తిత్త హరిదు**
**హోదుద కండె, హత్తు దిక్కిన తోరె ఒళగెల్ల**
**బెళకిన మొత్తవే తుంబిదుద కండె**
**ముచ్చిద కమలంగళెల్ల బిచ్చి అరళి**
**అచ్చ హొస గంధపు దెసెదెసెగె ఎసెదుద కండె**
**ఇంతిదర కౌశలవ కందు బెరగాదెనయ్యా అఖండేశ్వరా!**

దీనియొక్క తెలుగు రూపమును చూడుడి :

**"పశ్చిమగిరిలోని చిత్‌సూర్యుని ఉదయమైనదానిన గంటి**
**చుట్టుముట్టియున్న చీకటియెల్ల అటుయిటుపాతి**
**పోయెడి దానిని గంటి, పదిదిక్కుల దొరకు లోనెల్ల**
**వెలుగు మొత్తము నిండినదానిని గంటి**

**ముడిచిన కమలములెల్ల విచ్చి వికసించి**
**అచ్చమైన కొంగ్రొత్త గంధమును దెసదెసకు ఎగసెడిదిగంటి**
**ఇట్టి దీని కౌశలమునుగని వెరగైనదయ్యా అఖండేశ్వరా!"**

జీవన్ముక్తిలేనిది జీవనము యొక్క సాఫల్యమేయుండదు. ఈ విషయము శ్రీషణ్ముఖస్వామి గారి వచనములోని భావమును అవగతము చేసికొనిన పిదప మనోగతమగును.

ఈ రీతియైన వేధాదీక్షలోని ఏడు ఉపసంస్కారములు జ్ఞాన ప్రధానములై యున్నందున వీటిని వేధాదీక్ష యొక్క అంగములని గ్రహించవలెను. ఈ సంస్కారములన్నియు అలవడిన పిదప వేధాదీక్ష పూర్ణమగుచున్నది. శిష్యునియొక్క 'ఆణవ' మలము నివృత్తియై అతని సంకుచిత భావములన్నియును తొలగిపోవును. ఈ విషయమును వివరించెడి శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారి ఈ క్రింది ఉపదేశము గనుడి :

**శ్లో॥ "శివాత్మక మిదం సర్వం శివాదన్యన్న విద్యతే।**
**శివోఽహమితి యా బుద్ధిస్తదేవ జ్ఞానముత్తమమ్"** (సి.శి. 16-31)

ఈ జగమంతయు శివరూపమైనది. శివుని వెలుపల యితరమైన పదార్థములు లేవు. నేనైనను శివస్వరూపమునే అయియున్నాను. అనెడి ఉత్తమమైన మనోభావన జీవునికి కల్గునని జగద్గురువులవారి ఉపదేశములోని భావము. ఈ విధిన శిష్యుని ఆణవమలమును నివారించెడిదియు, భావలింగము యొక్క స్వరూపమును తెలియజేయునదే వేధాదీక్షా సంస్కారమని గుర్తెరుగవలెను.

## మంత్రదీక్ష :

**"మాంత్రీ దీక్షేతి సా ప్రోక్తా మంత్రమాత్రోపదేశినీ"** అనెడి శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారి ఉపదేశము ప్రకారము మంత్రోపదేశము ప్రధానమై యుండెడి దీక్షయే మంత్రదీక్షయని తెలియుచున్నది. ఈ మంత్రదీక్ష యందునను ఏడు అవాంతర భేదములు గలవనియును, వీటిని గుర్తెరుగవలసిన అవసరమున్నదనియును తెలిసికొనవలెను. ఈ ఏడు ఏవనగా 1) సమయ సంస్కారము 2) నిస్సంసార సంస్కారము 3) నిర్వాణ సంస్కారము 4) తత్త్వ సంస్కారము 5) ఆధ్యాత్మ సంస్కారము 6) అనుగ్రహ సంస్కారము 7. సత్య, శుద్ధ సంస్కారము. వీటి గురించి సంక్షిప్తముగా తెలుసుకొందుముగాక!

## సమయ సంస్కారము :

**"సమయః శపథాచారకాల సిద్ధాంత సంవిదః"** అనెడి అమరసింహుడి వచనము ప్రకారము సమయము అనెడి శబ్దమునకు కాలము, శపథము, సిద్ధాంతము లనెడి అనేక అర్థములు కలవు. ప్రకృతమందున సమయ శబ్దమునకు కాలము మరియు ఆచారము అనెడి రెండర్థములను స్వీకరించనైనది. మంత్రదీక్షను చేయునప్పుడు, దీక్షను పొందువాడి వయస్సును గమనించవలెను. ఎనిమిది వర్షములకు తక్కువగానున్న చిన్నపిల్లలకుగాని, యెనభై వర్షములు పైబడి వినిపించక, కనిపించక, మూలకు వుండెడి ముదుసలికి గాని ఈ దీక్షఫలింపజాలదు. మంత్రార్థమును ఎరిగెడి బౌద్ధిక సామర్థ్యము యొక్క జతకు దీని గురించిన ఆసక్తియును వున్న యోగ్య సమయమును పరీక్షించి మంత్రమును ఉపదేశించునదే సమయ సంస్కారమనిపించుకొనును.

సమయము యొక్క మరొక్క యర్థము ఆచారమైయున్నది. అంగమునకు సంబంధించిన తల్లి, తండ్రి, బంధు, బలగము మొదలగు వాటియందు వ్యామోహమును వీడి, మంత్ర సంస్కారమును పొందిన బంధు బలగమే తన బలగమనే భావనతో లింగాచారము నందు ఆసక్తి యున్నవానికి మాత్రమే మంత్రదీక్షను యివ్వవలెను. ఇది కూడా సమయ సంస్కారము అనిపించుకొనును.

## నిస్సంసార సంస్కారము :

తన తనువు కరణాదుల మీద గల వ్యామోహమును త్యజించునదే నిస్సంసారము. సంసారము నందు ఆసక్తియున్న వానిచేత మంత్రజపము జరుగదు. అందుచేతనే శ్రీగురువు మంత్రోపదేశమునకంటె పూర్వముననే సంసారపు వ్యామోహమును విడుచుటకై, చేసెడి ఉపదేశమే నిస్సంసార సంస్కారమనిపించుకొనును.

## నిర్వాణ సంస్కారము :

నిర్వాణమనగా ముక్తి. ఆకలి, దప్పిక, సుఖము, దుఃఖము మరియు జనన మరణములనెడి షడూర్ముల అభిమానమును త్యాగముచేసే విధిన ఉపదేశించి సంస్కారము చేయునదే నిర్వాణ సంస్కారమనిపించుకొనును.

## తత్త్వ సంస్కారము :

"అనారోపితరూపమ్ తత్త్వమ్" అనెడి ప్రమాణము ప్రకారము ఆరోపితము కాని సత్య స్వరూపమునే తత్త్వమని యందురు. ఈ జగత్తున ఉత్పత్తి, స్థితి, మరియు సంహారములకు కారణుడైన వాడును, సత్తు, చిత్తు, మరియు ఆనందరూపుడైన పరమాత్ముడే తత్త్వమనిపించుకొనును. అతడు మంత్ర స్వరూపుడు. ఆ పరమాత్మయొక్క స్వరూపమే నీ ఆత్మరూపమని బోధించునదే (తత్త్వ సంస్కారము)

## ఆధ్యాత్మిక సంస్కారము :

ఆత్మ, పరమాత్మల ఐక్యబోధయే ఆధ్యాత్మిక సంస్కారమనబడును. 'నమఃశివాయ' యనెడి ఈ పంచాక్షరి మహా మంత్రము, 'తత్త్వమసి' వాక్యమువలె జీవుని, పర శివునితో ఐక్యమునే బోధించును. ఇందులో నమః అనగా జీవాత్మ, శివయనగా పరమాత్మ. ఆయ అనగా వీరిరువురి ఐక్యము. ఈ తెరగున మంత్రోపదేశమునకు పూర్వముననే, శిష్యునికి మంత్రము యొక్క వాస్తవికతను తెలియజేసి పరమాత్మునితో ఐక్యబోధను చేయునదే ఆధ్యాత్మ లేక ఆధ్యాత్మిక సంస్కారమగును.

## అనుగ్రహ సంస్కారము :

శ్రీగురువు యొక్క కృపనే అనుగ్రహము. దూడను కనగనే దానిని తృప్తి పరచవలెననెడి భావము ఆవులలో నెలకొనగనే అది పాల చేపులను విడుచునటులే, శిష్యుని గాంచగనే అతనికి బోధించవలెననెడి ప్రేమోత్సాహములు శ్రీగురువు యొక్క మనస్సునందు నిండియుండుటయే అనుగ్రహమగును. ఈ అనుగ్రహము మూడు విధములుగానుండును. అవి కాయానుగ్రహము, కరుణానుగ్రహము మరియు ప్రాణానుగ్రహము. ఈ త్రివిధములును బడయవలెనినిన శిష్యుడు తన శరీరేంద్రియ ప్రాణములను శ్రీగురువుకు సమర్పించవలసి యుండును. ఈ అనుగ్రహమే మంత్రసిద్ధికి కారణమైనందున త్రికరణములను గురువుగారికి సమర్పించి శిష్యుడు సంపాదించెడి గురుకృప, అనుగ్రహ సంస్కారము వలన లభించుచున్నది.

## సత్యశుద్ధ సంస్కారము :

మంత్ర జపమునకు ముఖ్యమైనవగు వాక్కు, మరియు మనస్సు పరిశుద్ధములై యుండవలెను. సత్యమును పలికిన వాణి, మరియు పరిశుద్ధము కాని మనస్సు గలిగియున్నవాడు ఎంతకాలము జపించినను మంత్రసిద్ధి కలుగదు. ఈ కారణమువలన దీక్ష కన్న ముందుగనే సత్యవాక్పరిపాలనను, మరియు పరిశుద్ధమైన మనస్సును కలిగియుండవలెను. వీటికి సంబంధించిన ఉపాయములను బోధించి శిష్యుని సంస్కరించునదే సత్యశుద్ధ సంస్కారము అనిపించుకొనును.

ఈ విధముగా ఈ అవాంతర సంస్కారములతో కూడిన దీక్షయే మంత్రదీక్ష. ఈ దీక్షచేత శిష్యుని సూక్ష్మ శరీరమునందలి మాయామలము నివృత్తమై ప్రాణలింగము అలవడుచున్నది. ఈ తెరగున చేసెడి దీక్షను భోగాంగ సంస్కారమనియును అందురు. ఈ సంస్కారము చేత మనోబుద్ధులు సుసంస్కృతములై జీవుడు పరిశుద్ధుడగుచున్నాడు. వీరశైవులకు ఈ దీక్ష ఎంతో ఆవశ్యకమైయున్నది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 6-8-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానం, షోలాపూర్**

## విశేష ప్రదీపిక :

శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు నీ యాశీర్వచనమున దీక్షా సంబంధిత యంశములను వివరించి భక్తులను ధన్యులను గావించిరి.

స్వీయ సేవ చేత శ్రీగురువు ప్రసన్నత బడసిన సంసార హేయతా బుద్ధి విశిష్టుడగు పిండజ్ఞాని, గురుకారుణ్య స్థలమున దీక్షను పొందుటకై యర్హుడగుచున్నాడు. అయితే గురు ప్రసన్నత పొందిన వారికి తప్పనిసరిగా నిట్టి యర్హత లభించునని భావించుటకు వీలులేదు. ఈ కారణముననే శైవాగమముల ననుసరించి రూపొందింపబడిన నియమావళి ప్రకారము పిండుడు దీక్షను పొందవలెనినిన యతడు శక్తి పాతమును పొందియుండవలెను. శ్రీగురుడు శక్తిపాతము యొక్క గతిని గమనించకుండగ దీక్షను ప్రదానము చేయకూడదనెడి నియమము గలదు. శ్రీ భగవత్పాదులవారి యుపదేశములోను నీ యంశమిమిడియున్నది.

శక్తిపాతమనెడిది శ్రీ గురువు మాత్రమే గుర్తించగలడని చెప్పబడినది. మృగేంద్రాగమము యందున శక్తిపాతమును గూర్చి యీ క్రింది విధముగా తెలుపబడినదని పండిత కాశీనాథ శాస్త్రిగారి వ్రాతల వలన తెలియుచున్నది

**శ్లో॥** **"ఏషాం శరీరిణాం శక్తిః పతత్యదివివృత్తయే**
**తేషాం తల్లింగమౌ త్సుక్యం ముక్తౌ ద్వేషోభవస్థితా,**
**భక్తిశ్చ శివ భక్తేషు శ్రద్ధా తచ్ఛాసకేవిధౌ॥** (మృగేంద్రాగమము)

జీవునియొక్క ప్రవృత్తి గమనము నిరోధింపబడుటకై యెట్టి స్థితి దోహదము చేయునో యట్టి స్థితిని శక్తిపాతమైన స్థితిగా గుర్తించవలెను. దీని వివరణ నిమిత్తము జీవి ప్రవృత్తి మార్గమున యెందుకు పయనించునో తెలిసికొనవలెను. శివుడు మాయాశక్తి వలన జీవుడగునని తెలియుచున్నది. కళ యిత్యాదులతో కూడికొనియుండుటచే యతనిని సకళుడు అని అందురు. జీవుడు లక్షల కొలది జన్మలనెత్తి సంసారమున తిరుగాడెడి క్రమములో నతడు కొన్ని సత్కార్యములు చేయును. పుణ్యమును పొందును. కుకార్యములను కూడ, కర్మవశమున చేయును. పాపములు సంప్రాప్తియగును. మానవ జన్మనెత్తిన పిదప అంత్యజ, శూద్ర, వైశ్య, క్షత్రియ మరియు బ్రాహ్మణ జాతులలో జన్మించును. ఆయా కులోచిత ధర్మములు చేయుటవలనన పుణ్యపాపములు లభించును. నిషిద్ధములగు అవిహిత కర్మలను చేసి పాపముల మూటకట్టికొనును. ఎప్పుడైతే పుణ్యము గుణాత్మకముగా పెరిగి, పాపము క్రమముగా క్షీణించునో అప్పుడతడు పరిపక్వమల విశిష్టడగుచున్నాడు. తత్ఫలితముగా కొన్ని సుగుణములను పొందును. మొదటిది వివేకము. ఈ వివేకము వలన శివ-జీవులకు సంబంధించిన యనుబంధము గురించియును, జీవికి-ప్రకృతికి గల సంబంధము గురించియును తెలిసికొనును. జ్ఞాన సముపార్జన చేయదొడగును. సంసారము యెడల హేయభావము గల్గును. తరుణోపాయము నన్వేషించును. బహు దేవతారాధన వైపు మొగ్గుచూపును. కులాచారముల వలన యిట్టి ధోరణి బలపడును. బసవ పురాణములో నిది నిరూపితమైయున్నది. బ్రాహ్మణ కులాచారములు బహు దేవతారాధనను ప్రోత్సహించునని తెలియజేయబడినది. మూఢనమ్మకములు పెరిగి మరల నజ్ఞానిగా మారుచున్నాడు. శివభక్తుల సాంగత్యము వలన శివుడే యారాధ్యుడని తెలిసికొనును. శివానుభవ గోష్ఠులలో పాల్గొనును. క్రమక్రమముగా శివుని యెడల యనురాగమును పెంచికొనును. దానిని దృఢతరము చేసికొనుటకు పరిస్థితులనుకూలించిన యెడల పురాణములు పఠించును. పౌరాణికుల ప్రవచనములు వినును. పురాణములలో నధికముగా శివునినే పరబ్రహ్మాగా తీసికొనబడినదని గుర్తించును. శివతీర్థ క్షేత్రములను సందర్శించును. ఆసేతు హిమాచలము వరకు శివాలయములే అధికముగా గలవని యెరుగును. శివాధిక్యత యెడల క్రమముగా నమ్మకమేర్పడును. స్మార్తుల శివ కేశవాభేదము కల్పితమని యెరుగును. పంచాయతముల పూజ అప్రస్తుతమని యెరుగును. దేవతలందరు శివుని సేవకులనెడి భావమును పెంపొందించికొనును. ఇట్టి భావము గల్గిన యీ క్రింది పద్యమును గనుడి :

**చం॥** **ఇన విఘ్నేశ్వర మాతృకాద్రుహిణ బ్రాహ్మీస్కంద దుర్గారమా**
**వనితాధీశ్వర భైరవుల్ బలసి భాస్వద్భక్తి సంయుక్తినీ**
**కనిశంబుం బరివార భృత్య నికరంబైరన్న నిన్నింక గొ**
**ల్వని వారెవ్వ రజాండ భాండములలో వర్ణింప సర్వేశ్వరా** (సర్వేశ్వర శతకము 5)

ఇంతటి గొప్ప గొప్ప దేవతలే శివారాధకులై ధన్యులైనప్పుడు తానెందుకు శివుని గొల్వరాదనే ప్రశ్నను వేసికొనును. సృష్టి స్థితిలయలకు శివుడే కారణమని యెరుగును. శివభక్తి గలవాడు మహాఘనుడనియును, అదిలేనివాడల్పుడనియును భావించికొనును. చిత్తైకాగ్రతతో శివభక్తిని పెంచికొనును. వీరవ్రతివలె శివైక నిష్ఠాతత్పరుడగును. ఇతర దేవతార్చనల యెడల నిరాసక్తత గల్గి యుండును. శివభక్తి ద్వారా ముక్తిని సాధించుటకు పూనుకొనును. వీరమాహేశ్వరులను సేవించి వీరభక్తి రహస్యముల నెరుగును. లింగధారణ యెడల యనురక్తిని పెంచికొనును. భస్మధారణ పరమ కర్తవ్యమని

యెంచును. ఊర్ధ్వపుండ్రాదులను ధరించడు. రుద్రాక్షలను ధరించుట కిష్టపడును. తులసీమాలకు దూరమగును. పంచాక్షరీ మహామంత్రమే మంత్రరాజమని యెరుగును. గాయత్రికి తిలోదకములిచ్చును. శివప్రసాదమే శివభక్తికి మూలమని యెంచును. తిరుపతి లడ్డూల చింత వీడును. భక్త పాదోదకములే తీర్థ రాజములని యెంచును. గంగాది తీర్థములవైపు తిరిగి చూడడు.

ఈ విధముగా అనన్యమైన శివభక్తి గలవాడు నివృత్తి మార్గమున పయనించగల్గును. ఇట్టి వానికి శక్తిపాతము గల్గినదని గుర్తించవలెను. వీటిలో నేది లోపించినా, నయ్యది లేమిగా యెంచబడును.

లేమిగలవానికి లింగధారణ చేసిన యెడల వాడు లింగధారిగా కన్పడిననూ మానసికముగా అన్యధర్మీయుడగుచున్నారు. లింగధారియై యుండియూ తిరుపతికి వెడలి గుండు గీయించుకొని పంగనామము పెట్టికొని గోవింద భజన చేసెడివాడు నీ కోవకు చెందినవాడే. ఇట్టివారిని లింగ భవి అనెడి పేరుతో పిలుతురు. ఇట్టివారికి లింగధారణ సంస్కారము చేసిన గురువు నిందనీయుడగునని తెలిసికొనగలరు. శ్రీ జగద్గురువులవారు దాసిమార్యుల వచనము నుదహరించి శివజ్ఞాన పరివ్యాప్తికి దోహదము చేసిరి. జ్ఞాన సింహాసనాధీశ్వరునిగా కర్మతః తన అస్తిత్వమును ప్రస్ఫుటపరచిరి.

పిండజ్ఞాని ఈ దశలో వీరశైవ ధర్మమే సర్వోత్కృష్టమైనదని యెరుగును. "నవీరశైవ సదృశం మతమస్తి జగత్త్రయే" యనెడి యాగ మోక్తి అతని నమ్మకమునకు నాధారభూతమైన యంశమగును. ఈ భావన మత దురహంకారమునకు సంబంధించినదని భావించుట యవివేకమగును. ముప్పది మూడు కోట్ల దేవతలలో శివుడొకడు, ఏ దేవుడైతేనేమి పూజించుటకు అనెడి భావములు గల్గుటవలననే బహుదేవతారాధన ప్రబలి అజ్ఞానము హెచ్చుచున్నది. వీరశైవము అన్నిమతములలో నొకటి యనెడి దను భావనలో న జ్ఞానలేశమిమిడియుండును. వీరశైవము యొక్క గమ్యము జీవుని శివునిగా రూపొందించుట వీరశైవము సూచించెడి మార్గము. వేదాగమ సమ్మతమై షట్ త్రింశత్ తత్త్వముల నాధారముగా జేసికొని రూపొందించబడినది. శివుడే దీనిని ప్రతిపాదించెనని శివాగమములు తెలియజేయుచున్నవి. యీ కారణముననే వీరశైవ ముత్కృష్టమైనదని యెరుగదగును.

వాస్తవముగా శివుడే జీవుడు. కాని మలత్రయముల ప్రభావమునకు లోనై తన అస్తిత్వమును మరిచిపోవుచున్నాడు. పరాధీనునివలె భావించుకొనును. "సర్వం విధివశమ్" అనెడి భావన పొందును. తనకేమియును తెలియదు. తెలిసినది స్వల్పమే యనెడి భావమును పొందును. విభుడననెడి భావన పొందలేక పశువుననెడి భావనను పొందును.

ఇట్టి భావనలకు పాశమే కారణమని పశుపతితత్త్వము తెలుపుచున్నది. ఈ పాశమునే మలములచే నేర్పడిన బంధముగా గుర్తించవలెను. మలముల గురించి చంద్రజ్ఞానాగమమున యీ క్రింది విధముగా గలదు.

**శ్లో॥ ఆణవం మాయికం చైవ కార్మికం చయధా క్రమమ్**
**మలత్రయ మనాదీదం తనుత్రయ గతం భవేత్** (చంద్ర. జ్ఞా.ఆ. మూడవ పటలము)

అనాది కాలము నుండియును త్రిమలములు గలవని తెలుపబడినది. అద్దానిని గుర్తించవలెను. గమనించుడి.

**శ్లో॥ అనాది నిధనాచ్ఛాంతా చ్ఛివాత్ పరమ కారణాత్**
**ఇచ్ఛాశక్తి ర్వ్రిని ష్క్రాంతా తతో జ్ఞానం తతః క్రియా ॥**
**తత్రోత్పన్నాని భూతాని భువనాని చతుర్దశ॥**

శివుడే పరమ కారణుడనియును, అనాదియనియు తెలుపబడినది. పరమ శాంతమున యేకాకియైయున్న శివునికి స్వీయ క్రీడా విలాసార్థమై సృష్టిని చేయదలచెను. అతనితోనే అతనిలోనే యుండెడి యిచ్ఛాశక్తి యుద్దీపన పొంది యుపాదాన కారణమయ్యెను. పరశివుడు నిమిత్తకారణుడయ్యెను. తత్ఫలితముగా స్పందన పుట్టెను. స్పందన వలన శబ్దము పుట్టెను. ఈ శబ్దమునే నాదమని యందురు. దానివలననే మలము గల్గును. దీని విచ్ఛేదనమే దీక్షయొక్క పరమార్థమని గ్రహించవలెను.

– శుభం భూయాత్ –

## ఆశీర్వచనము : 4

శ్లో॥ మాంత్రీ దీక్షేతి స ప్రోక్తా మంత్రమాత్రోపదేశినీ ।
కుండమండలికోపేతా క్రియాదీక్షా క్రియోత్తరా ।
శుభమాసే శుభతిథౌ శుభకాలే శుభేఽహని
విభూతిం శివభక్తేభ్యో దత్వా తాంబూలపూర్వకమ్॥
యథావిధి యథాయోగం శిష్యమానీయ దేశికః॥
స్నాతం శుక్లాంబరధరం దంతధావన పూర్వకమ్॥
మండలే స్థాపయేచ్ఛిష్యం ప్రాఙ్ముఖం తముదఙ్ముఖః॥
శివస్యనామ కీర్తం చ చింతామపి చ కారయేత్॥ (సి.శి 6-15 నుండి 17 వరకు)

హోమగుండము మరియు స్వస్తికమండలములను తయారు చేసి క్రియాప్రధానముగా చేసెడి దీక్షను క్రియాదీక్ష అందురు. ఈ దీక్షను రాజయోగపు పవిత్రమైన మాసము నందు ఒక శుభముహూర్తమును చూసి అందు తన సమీపము యొక్క శివభక్తులకు తాంబూల భస్మములను యిచ్చి ఆమంత్రించవలెను. దీక్షా సమయమునందు స్నానాదుల చేత పరిశుద్ధమైన శిష్యుని స్వస్తి కమండలము మీద, పూర్వాభిముఖముగా కూర్చుండ బెట్టి శ్రీగురువు తాను ఉత్తరాభిముఖముగా కూర్చుని శిష్యుని చేత శివనామస్మరణమును చేయించవలెను.

కాయ మరియు సూక్ష్మ శరీరముల సంస్కారానంతరము ప్రస్తుత స్థూల శరీరమునకు సంస్కారము చేయుటకై శ్రీ రేణుక భగవత్పాదుల వారు దీక్ష యొక్క విధానమును వివరింప జొచ్చిరి. "శరీరమాద్యంఖలు ధర్మసాధనమ్" అనేది కాళిదాసు యొక్క ఉక్తిప్రకారము లౌకిక పారమార్థిక జీవనములకు స్థూల శరీరము ఎంతో ఆవశ్యకమైనది. మనము క్రిందట చేసిన కర్మఫలితముగా, మనకు స్థూల శరీరము యొక్క ప్రాప్తి యగుచున్నది. అందుకే ఇది కార్మ మలయుక్తమైనది. మల యుక్తమయిన దేహము అమలమైన లింగపూజకు సాధనము కాజాలదు. అందుచేత దేహము నిర్మలము కావలెను. శరీరము యొక్క కార్మమలము నీటితోన తోమినచో పోయెడిదికాదు. దానిని తొలగించుటకు క్రియాదీక్షయే అమోఘమైన సాధనము

**క్రియా దీక్ష :** క్రియా ప్రధానమైన దీక్షయే క్రియాదీక్ష. ఈ దీక్షను చేయవలెననిన శుభమాసము నందు, తిధి, వార, నక్షత్ర, యోగ మరియు కరణములనెడి పంచాంగ పరిశుద్ధమైన ముహూర్తమును చూసి కొని దీక్షను చేయవలెను. దీక్షకంటె మొదటి దినమునందు, తన గ్రామములోని దీక్షను పొందిన అందరూ శివభక్తులకు తాంబూలము, మరియు భస్మములను యిచ్చి ఆమంత్రించవలెను. వచ్చినశివభక్తులనెల్లరను ఆదరపూర్వకముగా ఆహ్వానించి, ఉచితమైన ఆసనము నందు కూర్చుండబెట్టి వారందరి సమ్ముఖము నందున శిష్యుని సంస్కరించవలెను.

ప్రాతఃకాలము నందు శాస్త్రోక్త పద్ధతి ప్రకారము ఉత్తరేణి వేరులేదా వేపకడ్డీల చేత శిష్యుని పళ్ళను తోమించి శుభ్రము చేయించవలెను. అనంతరము పరిశుద్ధమైన జలముతో స్నానము చేయించి శుభ్రమైన బట్టలను తొడిగించి స్వస్తికమండలము నందున పూర్వాభిముఖముగా కూర్చుండబెట్టి ఆజన్మ పర్యంతము శివపూజను చేసెదనని సంకల్పమును శిష్యునిచేత చేయించి దానిని ద్యోతకము చేయుటకై అతని కుడిచేతికి కంకణము కట్టవలెను. కంకణ బద్ధుడైన వాని మనస్సునందున అనవరతముగా శివనామము స్మరించుకుంటూ కూర్చురమని తెలియజేయవలెను.

వేదా మరియు మంత్రదీక్షలకు అవాంతర సంస్కారములు వుండియున్నట్లే క్రియాదీక్షకును ఏడు అవాంతర సంస్కారములు నిరూపించబడినవి. అవి ఏమనగా అజ్ఞానసంస్కారము, ఉపమా సంస్కారము, స్వస్తికారోహణ సంస్కారము, కలశాభిషేక సంస్కారము, స్వాయత సంస్కారము, వీటిని గురించి సంక్షిప్తముగా తెలిసినొకనెదము గాక.

## 1. ఆజ్ఞా సంస్కారము :

దీక్షకై శరణాగతుడైన శిష్యుని, శ్రీగురువు దీక్ష నిచ్చుటకు పూర్వమే అహింస,సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము ఇత్యాది దశవిధ ధర్మముల మర్మమును తెలియపరచి వాటిని నిత్యజీవనము నందున తప్పని సరిగా పరిపాలించు కొనుటకాజ్ఞాపించవలెను. ఇట్టి ఆజ్ఞయే ఆజ్ఞాసంస్కారమనబడును.

## 2. ఉపమా సంస్కారము :

శ్రీ గురువు తాను చేసిన ఆజ్ఞప్రకారము శిష్యుడు నడుచుకొనుటకై ఆ మార్గము నందున నడచిన కీర్తి శీలులగు అనేక ఆచార్యుల, శరణుల చరిత్రలను తెలియపరచి శిష్యుని హృదయము నందున తన ఉపదేశమును ధృవపరచుటకై చేయు సంస్కారమును ఉపమా సంస్కారమని అందురు.

## 3. స్వస్తికారోహణ సంస్కారము :

స్వస్తిక అనెడిది ఒక ఆసనము యొక్క పేరు. ఈ ఆసనము మీద కూర్చుండినచో శరీరము వెంటనే ఆయాసము కాదు. శివ పూజాదులకు ఆయాసము లేకుండగా ఎంతో కాలము వరకు కూర్చుండవలసి యుండిన ఈ ఆసనము సుగమమైనది యగును. శివపూజకుల స్వస్తికాసనము శరీరము యొక్క స్వస్థత, మరియు మానసిక స్వాస్థత చేకూర్చునని చెప్పబడినది. స్వస్తికాసనము యొక్క పద్ధతిని తెలియజేసి శివపూజకు కూర్చుండెడి విధానమును చెప్పుటయే స్వస్తికారోహణ సంస్కారము. అందుకే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు "మండలే స్థాపయేత్ శిష్యమ్" అని ఆనతినిచ్చిరి. ఇంకను మనము కూర్చుండెడి ఆసనమైనను స్వస్తియై యుండవలెను. అందుకే పూజ స్థానమును గోమయము చేత అలికించి, లేదా గోమూత్రమును చిలికించి, కడిగి రంగవల్లిని వేసి అట్టి పవిత్ర స్థానము మీద దర్భాసనమును లేదా రత్నకంబళిని పరచి దాని మీద కూర్చొని పూజచేయవలెనని శిష్యునికి బోధించుటయే స్వస్తికారోహణ దీక్ష యనబడును.

## 4. కలశాభిషేక సంస్కారము :

పవిత్రమైన నీరునిండిన బిందెను కలశమని అందురు. చల్లటి కలశోదకము యొక్క అభిషేకముచేత శరీరము యొక్క యూష్ణము తగ్గి శీతలము కలిగినయటులే శ్రీసద్గురువు తన సద్భావనా రూపమైన కలశమునందు కరుణా రూపమె నిండిన జలముచేత శిష్యుని బుద్ధిరూపకమైన మస్తకము మీద అభిషేకము చేసి, అతనియొక్క హృదయములోని ఆతురతను శాంతపరిచి, అతనిని పవిత్రుడిగా చేసెడి సంస్కారమే కలశాభిషేక సంస్కారము.

## 5. విభూతి పట్టా సంస్కారము :

ఆసనాశీనుడై అభిషిక్తుడైయున్న శిష్యునికి ఆరోగ్య వర్ధకము, ఐశ్వర్య ప్రదాయకము అయిన పరమాత్ముని మేని వెలుగు అనబడెడి పవిత్రమైన భస్మముచేత, వీరశైవ శాస్త్రోక్త పద్ధతి ప్రకారము, మస్తకాది సర్వావయవములకు త్రిపుండ్రధారణ చేయునదే విభూతిపట్టా సంస్కారము.

## 6. ఆయత సంస్కారము :

పంచసూత్ర ప్రక్రియచేత నిర్మితమైన శిలామయ శివలింగమునకు మంత్ర సంస్కారమును చేసి దాని మొదటి శిలత్వమును దూరముచేసి, శివకళను దానిలోనింపి, శిష్యుని శరీరము మీద, ఇష్టలింగమును నెలకొల్పునదే ఆయత సంస్కారము.

## 7. స్వాయత సంస్కారము :

సద్గురువుచేత ప్రాప్తమైన ఇష్టలింగము కేవలము శిలాలింగము కాదు. అది తనదే అయిన ఆత్మకు ప్రతీక వంటిదనెడి భావన శిష్యుని యందు ఒనగూడునట్లుపదేశించి, ఇష్టలింగమునందు ఆత్మస్వరూపమును దర్శించునటుల శిష్యుని మనస్సునందు చేయునదే స్వాయత సంస్కారము.

ఈ విధముగా ఈ ఏడు అవాంతర సంస్కారములతో కూడిన దీక్షను క్రియాదీక్ష అందురు. ఈ దీక్షచేత శిష్యుని కార్మిక మలము నివృత్తమై, పరిశుద్ధమైన దేహియై, తన పూర్వపు మాంస పిండత్వమును తొలగించుకొని సద్యః మంత్ర పిండమనిపించుకొనును.

ఈ ప్రకారమైన క్రియాదీక్షను శుభతిథి, వార, నక్షత్ర, యోగ, కరణములతో కూడిన పవిత్ర మాసమున శివభక్తు లెల్లరను తన యింటికి ఆదరముతో ఆహ్వానించి వీరశైవ తంత్రోక్త పద్ధతిన తనయింటి గురువులచేత బడిసి ధన్యుడు కావలయును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 7-08-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు విద్యా వాచస్పతి చంద్రశేఖర శివాచార్యులవారు క్రియాదీక్ష గురించియు తదంతర్గత యవాంతర భేదములను సులభగ్రాహ్యమగునట్లు అనుగ్రహించిరి.

క్రియాదీక్ష దీక్షాత్రయములలో నొకటి. వేదాదీక్ష మరియు మంత్రదీక్షలు తక్కినవి "శిష్యపాణితలే దత్తా యా దీక్షా సా క్రియా భవేత్" అని కారణాగమము తెలుపుచున్నది. యిష్టలింగ ప్రదానమునకు సంబంధించినదే క్రియాదీక్షయని యెరుంగవలెను. "దీక్షాత్రయేణ నిర్దగ్ధ్వా లింగత్రయ ముపాదిశేత్" అని చంద్రజ్ఞానాగమము తెలిపినది. మలత్రయములను దగ్ధము చేసి తనుత్రయములకు లింగత్రయముల నను సంధానము చేయునదే దీక్షయని చెప్పబడినది. "శరీరత్రయ గత మల ధ్వంసక కారుణ్య కైవల్యత్రయ విభూతిత్రయ ప్రదాయక అష్టావరణ పంచాచార సద్గురు కరుణా కటాక్ష లబ్ధి శక్తిపాతాధ్యవచ్ఛిన్న పరశివేష్ట" లింగ ధారణాత్మక పాశుపత దీక్షా" అని శ్రీకర భాష్యము తెలిపినది.

తనుత్రయము లెట్టివో శ్రీ విద్యా వాచస్పతి చంద్రశేఖర శివాచార్యులవారు వివరణాత్మకముగా తెలిపిరి. త్యాగాంగ, యోగాంగ మరియు భోగాంగములే తనుత్రయములని గుర్తించవలెను. అంగమనగా, వీరశైవ పరిభాష ప్రకారము, జీవియేయని గ్రహించవలెను. శ్రీ మగ్గియ మాయిదేవుల వారి యీ క్రింది నిర్వచనమును గనుడి :

> **'అర భవేత్ పరమంబ్రహ్మ తద్గతం తత్పరాయణమ్**
> **అంగస్థలమిత్ ప్రోక్తం రంగస్థల విశారదైః॥** (అ.సూ. 4-3)

శ్రీపతి పండితులవారు తెలిపెడి తనుత్రయములు, శ్రీ మగ్గియ మాయిదేవుడు చెప్పెడి అంగత్రయములును, కారణాగమములలో తెలుపబడిన శరీరత్రయములకు భేదమేమియును లేదు. స్థూల శరీరమునకు నిష్టలింగమును, సూక్ష్మ శరీరమునకు ప్రాణలింగమును, కారణ శరీరమునకు భావలింగమును శ్రీగురువులు ప్రదానమును చేయుదురు.

దీక్ష యెంతో మహత్తుతో కూడిన ఘటన. కొందరు శరణులు దీనిని వివాహము వంటిదని యనిరి. వీరి వచనముల ప్రకారము శరణసతి-లింగపతి న్యాయమున శివుడు పతియగును. ఆత్మ సతికి ప్రతీక. ఆత్మకు లింగ భేదముండదని వివేకవంతులెరుగుదురు. భృత్య-స్వామి బంధమే సతి-పతి బంధమగును. అది శరణస్థలమున సంప్రాప్తమగును. అద్దానికి దీక్షయే నాందిగా యగును. పెళ్ళికి బంధుగణము వచ్చి సాక్షీభూతులగుదురు. ఇచ్చట భక్తగణమే బంధువులు. వారికి విభూతి వీడ్యములనిచ్చి ఆహ్వానించవలెనని శ్రీ భగవత్పాదులవారు తెలిపిరి. కుడకలు పెట్టి పిలిచెడి లౌకికాచారముతో దీనిని పోల్చవచ్చును. వివాహమునకు వలెనే మంటప రచన జరుగును. కారణాగమములో యీ విషయమై విస్తృతమైన చర్చ కలదు. కుండ మండలమనగా జల కుంభములు గల 'మండల' ప్రదేశము. ఇచ్చట దీక్షను పొందెడి వానికి స్నానమును చేయింతురు. కన్యకు, మైలపోలుజుట్టి, మంగళ స్నానములు చేయించుట యనేది దీనిని పోలియున్నది. శ్వేత వస్త్రములు ధరించమని ఆచార్యులనిరి. పెళ్ళికూతురు మంచి "అంచు"గల తెల్లని పట్టుచీరను కట్టికొనుటను దీనితో పోల్చవచ్చును. శివధ్యానముతో దీక్షా కార్యక్రమము సుసంపన్నమగుచున్నది. శివపార్వతుల వివాహములో పార్వతీదేవి శివధ్యానమును చేయుచు వివాహతంతులో పాల్గొనెనని పౌరాణికులందురు.

- శుభం భూయాత్ -

## ఆశీర్వచనము : 5

**విభూతి పట్టం ధృత్వాగ్రే యధాస్థానం యధావిధి**
**పంచబ్రహ్మమయైస్తత్ర స్థాపితైః కలశోదకైః॥**
**ఆచార్యః సమమృత్విగ్భిస్త్రీ వారమభిషేచయేత్**
**అభిషిచ్య గురుః శిష్యమాసినం పురతః శుచిమ్।**
**తతః పంచాక్షరీం శైవీం సంసార భయతారిణీమ్**
**తస్య దక్షిణకర్ణే తు నిగూఢమపి కీర్తయేత్।**
**ఛందో రూపమృషిం చాస్య దేవతాంన్యాసపద్ధతిమ్** (సి.శి. 6 :18-21)

స్వస్తికాసనమునందు కూర్చుండిన శిష్యునికి, శాస్త్రోక్త పద్ధతి ప్రకారము, త్రిపుండ్రమును ధరింపజేసి, పంచాచార్యుల ప్రతీకగా పంచకలశములను స్థాపించి, ఋత్విజులతో కూడిన ఆచార్యుడు పవిత్ర కలశోదకములచేత అభిషేకమునుచేసి, సంసార భయమును దూరము చేసెడి శివపంచాక్షరీ మహామంత్రమును శిష్యుని కుడిచెవియందు అత్యంత గూఢముగా ఉపదేశించి, ఆ మంత్రము యొక్క ఛందస్సు, దేవత మరియు న్యాసపద్ధతిని నేర్పవలెను.

వీరశైవ సిద్ధాంతమునందు ధార్మిక వ్యవహారమునకు శ్రీగురువే ముఖ్యుడైయున్నాడు. వీరశైవ గురు పరంపరయందు భావన ప్రసిద్ధులైన శ్రీ జగద్గురు రేవణ సిద్ధ, శ్రీజగద్గురు మరళసిద్ధ, శ్రీ జగద్గురు ఏకోరామారాధ్య, శ్రీ జగద్గురు పండితారాధ్య మరియు శ్రీ జగద్గురు విశ్వారాధ్యులు యుగమునకు ఆదియందు పరశివుని ఆజ్ఞమేరకు వీరశైవ సిద్ధాంతమును సంస్థాపించుటకై అవతరించి రంభాపురి (బాళెహొన్నూరు), ఉజ్జయిని, కేదారము, శ్రీశైలము, మరియు కాశీ క్షేత్రముల యందు క్రమముగా వీరసింహాసనము, సద్ధర్మ సింహాసనము, వైరాగ్య సింహాసనము, సూర్య సింహాసనము, మరియు జ్ఞాన సింహాసనము అనెడి అయిదు పీఠములను స్థాపించి, జగత్ ప్రసిద్ధులైన అగస్త్య, దధీచి, వ్యాస, సానంద మరియు దూర్వాస మహర్షులకు వీరశైవ సిద్ధాంతమును ఉపదేశించినది సుప్రసిద్ధమైయున్నది. ఈ పంచ పీఠాధీశ్వరులు ప్రతియొక్క యుగమునకు ఆదియందు అవతరింతురని ఆగమ శాస్త్రములు ఘంటాఘోషగా తెలియపరచినవి. ప్రతియొక్క యుగమునందున వీరిపేర్లు భిన్నభిన్నముగా యుండి యుండెను. కృతయుగమునందు ఏకాక్షర శివాచార్యులు, ద్వ్యక్షర శివాచార్యులు త్ర్యక్షర శివాచార్యులు, చతురక్షర శివాచార్యులు మరియు పంచాక్షర శివాచార్యులు, త్రేతాయుగమునందు ఏకవక్త శివాచార్యులు, ద్వివక్త్ర శివాచార్యులు, త్రివక్త్ర శివాచార్యులు, చతుర్వక్త్ర శివాచార్యులు, మరియు పంచవక్త్ర శివాచార్యులు, ద్వాపర యుగమునందున రేణుక శివాచార్యులు, దారుక శివాచార్యులు, ఘంటాకర్ణ శివాచార్యులు, ధేనుకర్ణ శివాచార్యులు, మరియు విశ్వకర్ణ శివాచార్యులు, కలియుగమునందున రేవణసిద్ధ శివాచార్యులు, మరుళసిద్ధ శివాచార్యులు, ఏకోరామారాధ్యా శివాచార్యులు, పండితారాధ్య శివాచార్యులు, మరియు విశ్వారాధ్య శివాచార్యులు. ఈ తెరగున యుగభేదముచేత ఈపంచాచార్యుల పేర్లు భిన్నముగా నుండును.

ఈ పంచాచార్యుల అయిదు పీఠములు అత్యంత ప్రాచీనమై యుండి, ఇవి సమస్త వీరశైవులకు గురుపీఠములై యున్నవి. వీర, నంది, భృంగి, వృషభ మరియు స్కంద గోత్రములకు చెందిన వీరశైవులెల్లరు ఈ పీఠములకు శిష్యులైయున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర, తమిళనాడు మొదలగు ప్రదేశములయందు ఈ పంచపీఠముల శాఖామఠములుండి, ఆ మఠముల అధిపతులు అయిన పట్టాధ్యక్షులు, మూలపీఠముల ఆచార్యుల ఆజ్ఞ ప్రకారము ఆ పీఠ పరంపరకు చెందిన శిష్యులెల్లరకు దీక్షాది ధార్మిక సంస్కారములను చేయుచున్నారు. ప్రతియొక్క వీరశైవుడు తన ధర్మమునకు చెందిన మూలగురువులైన పంచాచార్యులను పిలిపించుకొని వారి సమ్ముఖమునందు తమ గోత్రమునకు సంబంధించిన గురువులైన పట్టాధ్యక్షులచేత దీక్షను బడయవలెను. అయితే పంచపీఠముల ఆచార్యులను ప్రతియొక్క ధార్మిక విధియందు పిలిపించుకొనుట ఎల్లరికీ సాధ్యముకాదు. అందుచేత దీక్షాది కార్యక్రమములను చేయునపుడు పంచాచార్యుల ప్రతీకగా పంచకలశములను స్థాపించి వాటియందు భావనాపూర్వకముగా ఆచార్యులను ఆహ్వానించి కలశ సన్నిహితులైన పంచాచార్యుల సమ్ముఖమునందు దీక్షా విధానమును ప్రారంభించవలెను.

స్వస్తికాసనమునందు శిష్యుడు కూర్చుండిన అనంతరము అతని ఫాలము, తల, రెండు చెవులు, రెండు భుజములు, గొంతు, యెద, నాభి, వెన్ను, రెండు బాహువులు, రెండు ముంజేతులు, మెడభాగము - అనెడి ఈ పదునైదు స్థానములయందు శాస్త్రోక్త పద్ధతి ప్రకారము త్రిపుండ్రమును

ధరింపచేసిన పిదప వైదికవిధిని నిర్వహించు శాస్త్రులతో కూడుకొని, పట్టాధ్యక్షులు పంచబ్రహ్మ రూపములైన పంచకలశముల పవిత్రజలముతో శిష్యునికి ముమ్మారు అభిషేకముచేసి, అతని శరీరమును శుద్ధపరిచి పవిత్రుడైన ఆ శిష్యుని తనవద్దకు పిలిచి సంసార భయమును దూరము చేసెడి సామర్థ్యమున్న పంచాక్షరీ మహామంత్రమును అతని కుడిచెవియందు అత్యంత నిగూఢముగా ఉపదేశించి ఆ మంత్రము యొక్క ఋషి, ఛందస్సు, దేవతా విధానములను తెలియపరచి ఈ మంత్రమును ప్రతిదినము తప్పనిసరిగా జపించునటుల ఆజ్ఞాపింతురు. ఇంతేకాదు, విధి విధానములయిన పిదప క్రియాదీక్ష పూర్ణమగును.

ఈ రీతిగా సద్గురువునుండి వేద మంత్ర మరియు క్రియాదీక్షలను పొందిన వీరశైవుడు గురువుయొక్క ఆజ్ఞ ప్రకారము శివపూజ, శివధ్యానము, శివపంచాక్షరీ మంత్ర జపమును నిత్యము చేసెడివాడై శివసాయుజ్యమును పొందుచున్నాడు. ఈ తెరగైన సద్గతి మనకు చిక్కవలెనననిన మనము మొదట మన కుల గురువులను శరణుజొచ్చి వారిసేవను చేసి వారి యనుగ్రహమును సంపాదించుట ఆవశ్యకమైయున్నది. అది ప్రతియొక్క వీరశైవుని మొట్టమొదటి కర్తవ్యమైయున్నది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 8-08-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు దీక్షా విధానములోని సూక్ష్మాంశములను వివరించి చెప్పిరి.

దీక్షాక్రమములో విభూతి పట్టాదీక్షకు యెంతో ప్రాముఖ్యత గలదు. శ్రీ సోమనాథులవారు దీని గూర్చి యీ విధిన తెలిపిరి.

శ్లో॥ **"విధి లిఖిత లలాట వివిధ దురక్ష**
**రావళి మాయ భస్మాభిషేక ప్ర**
**భావ సంగతి భూతి పట్టంబు పూరి"** (పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్ర. పు.29)

క్రియాదీక్షలోని యంతర్భాగమైన విభూతి పట్టా దీక్షవలన పిండుని నొసట గల బ్రహ్మరాత తొలగించబడును. "సర్వం విధి వశం" బ్రహ్మరాతను మార్చగలమా? అనెడివి పిండుని నమ్మక నిర్మితిలో నుండియుండును. లోక వ్యవహారమున యివి బహుళముగా నుపయుక్తమగును. సంచిత-ప్రారబ్ధ కర్మల వలన గల్గెడి ఫలితములను బ్రహ్మరాత వలన గల్గునని భావించుట వాడుకలోనున్నది. "సంకీర్ణ బహు పూర్వజన్మ మలాది పంకంబు" అణచబడుచున్నది. మొదట భస్మస్నానమాచరింపజేసిన పిదప విభూతి పట్టదీక్ష నొసంగవలెనని సోమనాథులవారు తెలియజెప్పిరి.

దీక్షలో పిండుని అంగమును శుద్ధి చేసెడి క్రమములో కలశాభిషేక దీక్ష యొక్క ప్రస్తావన వచ్చును క్రియాదీక్ష ప్రకృతి సంబంధమును తెగటార్చి భువిని భక్తునిగా చేసెడి క్రియ యైనందున పాంచభౌతికశుద్ధి ప్రత్యేకతను సంతరించికొనును. పంచ జగద్గురువుల పాదోదకములు మాత్రమే ప్రకృతి బంధమును ద్రుంచి వేసి కార్మిక మలమును దూరము చేయగలదు. అందుచేత, పంచ కలశస్థాపన చేసి, జగద్గురువులనందు నాహ్వానించి, పంచబ్రహ్మమంత్రములతో పూజించి వారి కరుణామృతమును స్ఫురింపజేసే పంచకలశోదకములతో పిండుని స్థూల శరీరము శుద్ధి చేయబడుచున్నదని గ్రహించవలెను.

మంత్రోపదేశము 'మనుదీక్ష'కు సంబంధించినది. పండితారాధ్య చరిత్రలో దీని గురించి యీ క్రింది విధముగా తెలుపనైనది.

ద్వి॥ **"శస్త్ర సదాచార్య హస్తస్వకీయ**
**మస్తక సంయోగ విస్తార విధుల**
**బాంచ భౌతిక శుద్ధి భావశుద్ధి సృ**
**జించి తదయ దేశిక దయా రూఢి**

**శ్రీమూల మంత్ర దయా మృతసార**
**కామిత నిజ కర్మ కలిత సంగతిని"** (పండితారాధ్య చరిత్ర పుట29)

ఈ మంత్ర దీక్ష వలన సూక్ష్మశరీరమని పిలువబడెడి యోగాంగమునాశ్రయించిన మాయామలము ద్రుంచబడును. సకళపురుషుడు నిష్కళుడై వెలుగును.

– శివం భూయాత్ –

## లింగధారణ స్థలము :

## ఆశీర్వచనము : 1

శ్లో॥ **స్ఫాటికం శైలజం వాపి చంద్రకాంతమయం తువా।**
**బాణం వా సూర్యకాంతం వా లింగమేకం సమాచరేత్॥**

సద్గురువులు శిష్యునికి లింగదీక్షననుగ్రహించవలెననిన స్ఫటికము, పర్వతశిల, సూర్యకాంతశిల, చంద్రకాంత శిల, బాణశిలలో దేనితోనైననూ లింగమును నిర్మించవలెను.

## సద్గురువు వలన యిష్టప్రాప్తి :

శ్రీజగద్గురువులు, రేణుక భగవత్పాదులవారు మహామహిమాన్వితుడైన అగస్త్య మహర్షిగూర్చి ఇంతకంటెను పూర్వమున గురుకారుణ్య స్థలమును తెలియపరచి సద్యః లింగధారణ విషయమున నానతి నిచ్చుచున్నారు.

భారతీయులకు గురువు, దైవము మరియు శాస్త్రము శ్రద్ధకు సంబంధించిన విషయములై యున్నవి. "శాస్త్రీతి శాస్త్రం" అనే వ్యుత్పత్తి ప్రకారము మానవుని ఐహిక మరియు పారలౌకిక జీవనమును నియమించెడి లేక రూపించెడి అతి అమూల్యమైన సాహిత్యమే శాస్త్రము. ప్రాచీన సాహిత్యమైన వేదాగమములు ఆది గురువైన భగవంతునిచేత రచింపబడినవి. అయితే, శాస్త్రములు భగవంతుని సాకార స్వరూపమైన గురువులచేత రచింపబడినవి. గురువులు, వేదాగమములనే యాధారముగా గొని శాస్త్రరచన గావించిరి. ఈ కారణమువలన, మనుష్యుడు తన జీవితమును సర్వాంగ సుందరముగా మలచికొనదలచిన యెడల, గురుదేవుని యందున శ్రద్ధనిడి, శాస్త్రముల యెడల విశ్వాసముతో, శాస్త్రవిహిత మార్గముననే పయనించవలెను. "తస్మాత్ శాస్త్ర ప్రమాణంతే కార్యాకార్య వ్యవస్థితా" అనెడి గీతోక్తి ప్రకారము మనుష్యుని కర్తవ్య కర్మలకు శాస్త్రములే ప్రమాణములై యున్నవి.

శ్రీమన్నిరంజన శివయోగులవారు "మనసిగె బందంతె నడెయదిరిహదల్లి" అని ఆదేశించిరి. మనస్సుకు వచ్చిన యటుల ప్రవర్తించవలదని హెచ్చరించిరి. నిశిద్ధాచరణలను విసర్జించి, విహిత మార్గమున నడిచినవారికి గురుకరుణ మరియు శివకరుణ సహజముగనే లభించును. "న గురోరధికం" యనెడి యాగమ ప్రమాణము, గురువుకంటెను నధికుడైన వాడెవ్వడూ లేదు. దేవునికంటెను హెచ్చుగుస్థానము గురువుకు లభించినది. భారత దేశములో పుట్టిన మతములన్నియును నీ విషయమున నేకాభిప్రాయమును గల్గియున్నవి. గురువును నిరాకరించెడి వానికి సద్గతి దొరకదని చెప్పబడినది. శ్రీభగవత్పాదులవారి యీ ఉపదేశమును గనుడి :

శ్లో॥ **గురుభక్తి విహీనస్య శివభక్తి ర్న జాయతే ।**
**తతశ్శివే యథా భక్తిః తథాభక్తిర్గురావపి॥** (సి.శి. 11 : 24)

శివునియందున నెట్టి భక్తిగల్గునో యట్టి భక్తి గురువునందు గల్గియుండాలనియును, అట్టి సాధకునికే సద్గతి లభించుననియును, గురుపథమునెరిగిన వానికి శివపథము నవగతమగునని శ్రీబసవనగారు ప్రకటించిరి.

సాధారణముగా భోగమోక్షములు, జీవనమునకు లక్ష్యములైయున్నవి. శివుడు, తనను భక్తితో సేవించినవారికి భోగ్యపదార్థములను వరములుగా యిచ్చుచున్నాడు. ముక్తికై గురూపదేశము తప్పనిసరిగా అవసరమైయున్నందున, నయ్యది లేనిదే ముక్తి లభించదు. ఈ విషయమున శివుడేమియును చేయజాలడు. శ్రీగురువు రెంటిని ప్రదానము చేయగలడు. అందుకే శ్రుతి "ఆత్మజ్ఞం హ్యర్చయేద్భూతి కామః" అని ఆదేశించుచున్నది.

ఈశ్వరుని అర్చించి యీశ్వరుని కంటెను భిన్నమైన భోగఫలములను బడయుటకంటెను సద్గురువు నాశ్రయించి, ఆరాధించి, యీశ్వరునినే ప్రాప్తి చేసికొనుట యెంతో ఉత్తమము. అప్పుడు భౌతిక భోగములు వలచిన రాకుందునే? చివరకు, ఈశ్వర స్వరూపమును పొంది ముక్తి, సుఖము కూడ సంప్రాప్తమగును కదా! అందుకే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు, శ్రీ గురువు యొక్క అనుగ్రహ ఫలమే శివుని ప్రాప్తి యని తెలియజెప్పుటకే గురుకారుణస్థలము పిదప లింగధారణ స్థలమునుపదేశించిరి.

## శివుని లింగోద్భవ లీల :

**శ్లో॥ లయం గచ్ఛతి యత్త్రైవ జగదేతచ్చరాచరం ।**
**పునః పునః సముత్పత్తిం తల్లింగం బ్రహ్మ శాశ్వతం॥** (సి.శి. 6 : 36)

జగత్తులోని చరాచరములు ఎందు వచ్చి ఎందున లయమగుచున్నవో, మరల యీ ప్రక్రియ దేనివలన గల్గుచున్నదో అదియే శాశ్వతమైన బ్రహ్మమనియును, దానినే లింగమందురనియును శ్లోకములోని భావము. జగత్తుయొక్క యుత్పత్తి, స్థితిలయలకు కారణభూతమైన పరమతత్త్వమే లింగమని శ్రీ భగవత్పాదులవారి యుపదేశములోని సారాంశము. లింగమనెడి పరశివుని నిర్గుణ నిరాకార స్థితికి ప్రతీకయగుచున్నది. "అణోరణీయాన్ మహతో మహీయాన్" అనెడి శ్రుతివాక్యము తెల్పిన యటుల లింగమూర్తి యణువుకంటెను సూక్ష్మమైన యణువుగను, మహత్తుకంటెను మహత్తైనదిగను అయి వున్నది. శివ, లింగ, మరియు స్కంద పురాణములందు పరశివుడు విరాట్ లింగ స్వరూపమున యవతరించిన లీల ఎంతో విస్తారముగా నివ్వబడినది. యిది శివుని యిరువది యైదవ లీలయని వాతుల శుద్ధాగమమునందు (1-134) ప్రతిపాదింపబడినది.

ఈ ప్రపంచ మంతయూ, ప్రళయ సముద్రము నందున మునిగినప్పుడు, బ్రహ్మ మరియు విష్ణువుల మధ్యన నేను శ్రేష్ఠుడను నేను శ్రేష్ఠుడను అనెడి కలహమారంభమయ్యెను. ఈ కలహమున నర్థవంతము చేసి వారిరువురికి జ్ఞానోదయమును గల్గించుటకై యా ఇరువురి మధ్యయందున పరశివుడు విరాట్ జ్యోతర్లింగ రూపమున నవతరించి అశరీరవాణి వలన యీ విధముగా పల్కెను. "ఈ లింగము యొక్క ఆద్యంతములను అరసికొని రండి" ఆ ఆదేశము ప్రకారము బ్రహ్మ లింగము యొక్క మస్తకము నెరగుటకై హంసయై ఆకాశము దిశకెగిరి పోయెను. విష్ణువు శ్వేత వరాహమై పాతాళమునకు దిగెను. ఈ ఇరువురూ వేయి సంవత్సరములవరకు శ్రమించినా లింగముయొక్క ఆద్యంతములను కానరైరి. నిరాశను ఎదుర్కొని వెనుతిరిగిరి. అయితే, బ్రహ్మ లింగ మస్తకమును గని వచ్చితి"నని, ఆ అబద్ధమును సాధించుకొనుటకై కేతకీ పుష్పం మరియు కామధేనువులను సాక్షిగా తెచ్చియుండెను. కేతకి యబద్ధపు సాక్ష్యమును చెప్పినందున, నీ లింగపూజకై యనర్హమైన దానివిగా పరశివుడు శపించెను. దానివలెనే బ్రహ్మపరముగా సాక్ష్యమును చెప్పుటకై వచ్చిన కామధేనువు మస్తకముచేత జానని అబద్ధము చెప్పిననూ, వాలము నటు ఇటూ త్రిప్పి, "బ్రహ్మ లింగ మస్తకమును చూడలేదు" అన్నట్లుగా సూచించెను. "అబద్ధమును చెప్పిన నీ మస్తకమును పూజించుట వలన ఫలముండదు; సత్యమును చెప్పిన తోకను పూజించినవారికి ఫలప్రాప్తియగు"నని శివ పరమాత్మ యానతి నిచ్చెను. అబద్ధము చెప్పిన బ్రహ్మ పూజ కనర్హుడని శివుడు బ్రహ్మకు శాపమిచ్చెను. లింగ పాదమును చూడలేదని, సత్యమును పలికిన విష్ణువుకు "నీవు జగత్పూజ్యుడవు కమ్మ"ని ఆశీర్వచనము నిచ్చెను. అందుకే లోకమునందు బ్రహ్మకై దేవాలయములు అరుదుగా నుండును. లోకములోని మనుష్యులు గోవు యొక్క మస్తకమును వీడి దాని పుచ్ఛమును పూజించుచున్నారు.

నేటి వైజ్ఞానిక యుగమునందు ప్రకాశమతి వేగముగా ప్రయాణము చేసెడి వస్తువని కనుగొనుటయైనది. సూర్యుని కిరణములు భూమిని చేరుటకై యెంతో సమయమును గొనుచున్నదనియును చెప్పబడినది. నక్షత్రములు, సూర్యుని కంటెను పెద్దవైయున్నవనియును, వాటి కిరణములు భూమిని చేరుటకై కొన్ని వేల సంవత్సరములు తీసికొనుననియును చెప్పబడినది. వీటన్నిటినిబట్టి విశ్వమెంత విస్తారమైనదో తెలియుచున్నది. ఇట్టి విస్తారమైన జగత్తు యొక్క తుది మొదలు చూడగ బ్రహ్మ విష్ణువులకు సాధ్యము కాలేదనేది చెప్పెడి పురాణ వాక్యములు, నేటి వైజ్ఞానికులు చెప్పెడి మాటలను పోలియున్నవి. అందుచేత,యిది కాల్పనికమైన గాథ కాదని చెప్పవచ్చును.

## దేవ దానవులు లింగపూజకులు :

ఈ విధముగా ప్రపంచమునకు పూర్వమునందున పరమేశ్వరుడు లింగరూపమున నుండుటచేత లింగము యొక్క యితిహాసము ప్రపంచమెంత ప్రాచీనమైనదో అంత ప్రాచీనమైనది. సృష్టియొక్క ఆదినుండి నేటివరకు నవ్యాహతముగా కొనసాగుచు వచ్చుచున్నది. ప్రపంచము యొక్క

మూలతత్త్వము లింగమని యెరిగి, దేవదానవ యక్ష రాక్షస గరుడ గంధర్వ నాగ మరియు మనుష్యులు మొదలగువారు యుగయుగముల యందున వివిధ ద్రవ్యముల చేత లింగమును నిర్మించి పూజించిన విషయము శైవపురాణములయందు ఏకధాటిగా యనేక సందర్భములలో చెప్పబడినది.

లింగపురాణములోని పూర్వభాగమునకు చెందిన74వ అధ్యాయమునందున దేవదానవాదులు ఏవిధముగా వారివారి యోగ్యతలకనుగుణముగా నానావిధ ద్రవ్యములచేత శివలింగములను నిర్మించి పూజ చేసి తమరి యభీష్టమును నెరవేర్చుకొనిరో యనునది విస్తారముగా వివరించబడినది. విష్ణువు ఇంద్రనీలమణి లింగమును, ఇంద్రుడు పద్మరాగమణిలింగమును, విశ్రవుని కొడుకు స్వర్ణలింగమును, విశ్వ దేవతలు వెండి లింగమును, అష్టవసువులు చంద్రకాంత మణిలింగమును, అశ్వినీ కుమారులు పార్థివ లింగమును, వరుణుడు స్ఫటిక లింగమును,సూర్యుడు తామ్రలింగమును, చంద్రుడు ముత్యపు లింగమును, అనంతాది నాగులు ప్రవాళ లింగమును, దైత్యులు అయస్కాంత లింగమును, రాక్షసులు లోహమయ లింగమును, మయాసురుడు మరకతమయ లింగమును, లక్ష్మీదేవి బిల్వవృక్షపు లింగమును, మునులు దర్భచేత చేయబడిన లింగమును, సరస్వతి రత్నలింగమును, దుర్గ హేమలింగమును మరియు పిశాచములు సీసపు లింగమును నిర్మించి ధరించి పూజించి కృతార్థసిద్ధిని పొందిరని తెలుపబడినది.

## లింగ నిర్మాణమునకై ద్రవ్యములు :

గరుడ పురాణమునందున పుష్పము, గోమయము, ఉప్పు, భస్మము, బెల్లము, చక్కెర, ధాన్యము, ఫలము, గరిక, కర్పూరము, బెండ, అయస్కాంతము, వైఢూర్యము మొదలగు ముప్పదియారు ద్రవ్యముల చేత శివలింగమును నిర్మించి పూజించెడి విషయము ప్రతిపాదింపబడినదని తెలుపబడినది. వివరములు గోరువారు, శ్రీరామదాస గౌడ వారి శివాంకను (పేజి 150) చూడగలరు.

ఈ విషయమును గూర్చి లింగ పురాణము మరికొన్ని వివరములనిచ్చినది గమనించుడి :

**"షడ్విధం లింగ మిత్యాహుర్ద్రవ్యాణాం చ ప్రభేదతః"** (74-13)

ఉపయోగించెడి ద్రవ్యములను బట్టి లింగమును ఆరు విధములుగ విభజింపవచ్చునని యీ పురాణోక్తి తెలుపుచున్నది. అవి శైలజ, రత్నజ, ధాతుజ, దారుజ, మృణ్మయ మరియు క్షణికములని లింగములు **"సర్వం లింగమయం జగత్"** అని తెలుపబడినది.

ఈ పురాణోక్తులను గమనించిన పిదప తెలియునదేమనగా లింగము కాని పదార్థమే లేదు. **"సర్వం లింగమయం జగత్"**యనుటలోన యనౌచిత్యము లేదు.

## ఇష్టలింగ నిర్మాణము-విభిన్నశిలలు :

శ్రీభగవత్పాదులవారు, ఇష్టలింగ నిర్మాణము గురించి తెలుపుచు, "స్ఫాటికం శైలజం వాపి చంద్ర కాంతమయంతువా। బాణం వా సూర్యకాంతం వా" అని యిష్టలింగ నిర్మాణమునకు వలయు శిలల గూర్చి చెప్పిరి. ఇవన్నియునూ విశిష్టమై విలక్షణమైన శక్తిగలవియనియును తెలియుచున్నది. చంద్రకాంత మరియు సూర్యకాంతశిలలు, ఆకర్షణశక్తిగల్గిన అయస్కాంత శిలల జాతికి చెందినవి. చంద్రకాంత శిల చంద్రుని కిరణముల స్పర్శచే పులకరించును. నీరుపైకుబుకును. అగ్నిస్పర్శచే, సూర్యకాంతశిల నుండి వేడి బహిర్గతమగును. ప్రాచీన సంస్కృత కవులు వీటిని గూర్చి ప్రత్యేకముగా వర్ణించిరి. కావ్యములను గనిన వారికిది సువిదితమే. ఇప్పుడిట్టి యుత్కృష్టమైన శిలల యొక్క అభావము గలదు. స్ఫటిక, శైలజ మరియు బాణశిలలు విరివిగా లభించును. శైలజ శిల గురించి తెలిపెడి లింగ పురాణోక్తులను గనుడి :

శ్లో॥ **"శైలజం సర్వసిద్ధిదం"; "శైలజం చోత్తమం**
**ప్రోక్తం మధ్యమం చైవధాతుజం"**

(లింగపురాణము, పూర్వభాగము అ.74,17-18)

శివాగమములలోను శైలజలింగము యొక్క ఉల్లేఖనగలదు. కనుడి :

**శ్లో॥ శ్రీశైలజం మహాదేవ హ్యైహికాముష్మిక ప్రదం ।**
**సర్వోత్తమోత్తమం లింగం సర్వాభీష్టార్థదాయకం॥**
(పారమేశ్వర తంత్రము, ద్విప. 11)

వీరశైవ ధర్మ శిరోమణి వంటి వీరశైవ గ్రంథములు 'శ్రీశైలజ' లింగము యొక్క విశిష్టతను నుతించినవి. "శ్రీశైలజ" అనగా శ్రీ పర్వతమున పుట్టిన శిల యనెడి అర్థము చెప్పనైనది.

## శిల యొక్క ఉత్కృష్టత :

జగద్వ్యాపియూ, జగదంతర్యామియూ అయిన పరశివతత్త్వము జడచేతనములలోన సమానముగా వ్యాపించికొని యుండుటచేత, చేతన గలవాటియందు పూజను విధించకుండగను, జడ ద్రవ్యములగు శిల యిత్యాదులచేత నిర్మితమైన శివలింగమును పూజించుటను విధించిన కారణమేమైయుండును? అనెడి జిజ్ఞాసుల మనమునందు పుట్టవచ్చును, అందుచేత ఆచార్యుల వారి ఉక్తి యొక్క రహస్యమును గురించి ఆలోచింతము గాక. శిల యొక్క ఉత్కృష్ట గుణములనెత్తి చూపెడి ఈ క్రింది సుభాషితమును కనుడి :

**న ద్విషంతి యాచంతె పరనిందాం న కుర్వతే**
**అసాహూతా నచాయాంతి తేనా శ్మానోపి దేవతాః**
(సుభాషిత రత్న భాండాగారము పు. 159)

శిలలు పరస్పరము ద్వేషించవు. యితరులను ఏమియు అడుగవు. పరులను నిందించవు. పిలిచికొని పోయిననేగాని యితంలయొక్క యిండ్లలోకి పోవు, ఈ గుణములు శిలలో వుండుటచేత జగత్తునందు దేవతామూర్తులై పూజింపబడుచున్నవి. యీ సుభాషితములోనున్న భావన, గుణములన్నియును అగ్నిశిలలో సహజముగా వుండును.

కాని అందరి మనుష్యులయందు ఈ గుణములుండవు. మనుష్యుడు యితరులను ద్వేషించును, పరులను వేడికొనును. పరనిందను చేయును. పిలువనిదే వివిధ స్థానములకు తనకు తానే నిర్ణయించుకొని పోవుచున్నాడు. ఈ దుర్గుణముల కారణముచేతనే జగత్తులోని మనుష్యులందరు పూజ్యులుకాలేకపోయిరి. అందుచేతనే-

**గుణాః పూజాస్థానం, గుణిశున చ లింగం, వయః॥** అనెడి కవి వాణి ప్రసిద్ధియైయున్నవి. దీని భావమేమనగా పురుషుడు, స్త్రీ మరియు నపుంసకులు అనెడి లింగములు కాని, పెద్ద చిన్న వయస్సులు కాని పూజార్హతను తెచ్చి పెట్టవు. అయితే సద్గుణములే పూజనీయములు. సద్గుణములు పురుషునియందు, ఒనగూడినప్పుడు అతడు పూజ్యుడుగాను, స్త్రీయందు కలిగినప్పుడు ఆమె పూజ్యనీయురాలుగాను దోచును. కాని ఏదైనను జడపదార్థమునందు పూజ్యత దోచునే? సామాన్యముగా లక్షకొక్క భక్తుడు కోటికొక్క గురుడు, శతకోటికొక్క శరణుడు అనెడి అనుభవజ్ఞుల వచనానుసారముగ మనుష్యజాతి యందు అవగుణములే ఎక్కువగా నుండును. గుణవంతులు లక్షకు కోటికి ఒకరు వుందురు. అట్టి వ్యక్తులే జగత్తునందు పూజ్యులైవున్నారు. మరొక సుభాషితకారుడు త్యాగగుణమును గలదానినే పూజనీయమని ఎంచెను. ఈ క్రింది సుభాషితము కనుడి :

**శ్లో॥ త్యాగ ఏకో గుణః శ్లాఘ్యః కిమన్యై గుణరాశిభిః।**
**త్యాగాజ్జగతి పూజ్యంతే పశుపాషాణ పాదపాః॥** (సుభాషిత రత్న భాండాగారము పు. 71)

సర్వశ్రేష్ఠమైన త్యాగగుణము వుండినందువలననే గోవు యిత్యాది పశువులు శిలలచేత నిర్మితమైన విగ్రహములు మరియు బిల్వాది వృక్షములు పూజనీయములైనవి. గోవృక్షాదులు జీవనపు స్వార్థపుకంటెను పరోపకార ప్రధానమైనవి అయినందున పూజనీయములగుచున్నవి. ఇదే విధిన వివరించెడి ఈ శ్లోకమును గమనించుడి :

శ్లో॥ రవిశ్చంద్రో ఘనా వృక్షానది గావశ్చ సజ్జనాః ।
ఏతే పరోపకారాయ యుగే దేవేన నిర్మితాః॥

పరోపకారములనెడి మాలికయందు సూర్య, చంద్ర, మేఘము, చెట్టు, నది, గోవు మొదలగు వాటితో పాటు సజ్జనుడు కూడా చేరియుండునని గ్రహించవలెను. ఒక సత్పురుషునికి అర్పించవలసిన శ్రద్ధను రవి, వృక్షము యిత్యాదులకు అర్పించవలెనని పైశ్లోకములోని భావము. ఇవన్నియును పరోపకారము చేయు నిమిత్తమున భగవంతునిచేత సృష్టింపబడినవని తెలిసికొనవలెను.

అందుచేత మన భారతీయ సంస్కృతియందు ప్రకృతినే పరమాత్ముడని పూజించెడి పద్ధతి రూఢి యందున్నది. దీని రహస్యార్థమును తెలియని కొందరు ఈ ప్రకృతి పూజను మూఢనమ్మకము క్రింద జమకట్టుచున్నారు. తనకయ్యెడి బాధలను మౌనముగా అనుభవించి మనుష్యునికొరకే తన జీవితమును అర్పణ చేసెడి పశు వృక్ష పాషాణములైనను మనుష్యుడు తెలిసికొని గౌరవించుట ఎంతో యుక్తమైన చర్య. దీనికి ఉదాహరణగా ఆవుపాలను యిచ్చి జనులకు వుపకరించుచున్నది. దాని పేడ ఇంటిని శుభ్రపరచుటకు కలాపిగాను పిడకలు చేసిన యెడల వంటచెరకుగాను, మరియు పంటలు పండించుటకు ఎరువుగాను ఉపయోగపడుచున్నది. దానిని కాల్చిన యెడల విభూదియై నొసలుననలంకరించుచున్నది. ఇవన్నియును చెప్పుచు ఒక శివయోగి నీ మలము దేనికుపయోగపడునురా? మానవా! అని ప్రశ్నించెను.

ఈ కారణము వలన ప్రకృతిలోని జడవస్తువులైన శిలలచేత నిర్మించబడిన శివలింగములను పూజించి, మనుష్యుడు వాటిలోగల ఉత్కృష్టగుణములను తన యందు అలవరచుకొని తానుపూజ్యతను పొందవలెననెడిదే శిలానిర్మితమైన ఇష్టలింగముల పూజ యొక్క రహస్యార్థము.

ఇంకను, **"అత్యంత గూఢచైతన్యమ్ జడ మవ్యక్తముచ్యతే"** (సి.శి 5-43)

అనెడి ఆచార్యులవారి యుక్తిని పరిశీలించిన యెడల జడము అనెడి పదార్థమే వుండదు. గూఢమైన చైతన్యమునకే లోకమున జనులు జడము అని పిలిచెదరు. వాస్తవముగా చూసిన యెడల చైతన్య రాహిత్యము గల్గినదే జడమగును. కాని చైతన్య సహితమైనది జడము లెటులగును? మొదట మనము వృక్షాదులను జడములని భావించితిమి. అయితే అవి కూడా మనుష్యులవలె ఊపిరి తీసుకొనునని శాస్త్రజ్ఞులు గుర్తించిరి. వాటిలో జీవనక్రియ జరుగునని ప్రతిపాదించబడినది. విజ్ఞానము వికాసమైన కొలది, చెట్లు యిత్యాదులు ఉచ్ఛ్వాస నిశ్వాసలను తీసుకొనుటయేకాదు, వాటికీ మనస్సు వుండుననియును, వాటికి కూడా మనుష్యునివలె బాధా యిత్యాదులు వుండుననియును గుర్తించబడినది. ఒక మనుజుని ఎవరైనను కొట్టిన యెడల వాని యెడల శత్రుభావన కలిగినవాడు సంతోషించును. అయితే అడవియందున ఏదో ఒక వృక్షమును ఎవడైనను గొడ్డలితో నరుకుచుండిన యెడల ఆ బాధను ఆ వృక్షము ననుభవించుటయేకాదు, ఆ వృక్షమును చుట్టుముట్టియుండిన వృక్షములన్నియును అనుభవించునని శాస్త్రజ్ఞులు తెలుసుకొనిరి. ఈ కారణమువలన వృక్షాదులను ఎవరైనను జడ పదార్థములనిన యెడల వారిని విజ్ఞానహీనులని యనవలెను. తమ బాధలను తపస్సు చేసుకొనెడి తాపసులవలె మౌనముగా అనుభవించెడి, సుగుణమును గల్గిన చెట్లు, చేమ, యిత్యాదులనుండి మనుష్యుడు ఎంతో నేర్చుకొనవలసియుండును.

వృక్షాదులు సచేతనముగా నుండినటులే రాయి, మన్ను యిత్యాదులు చేతనసహితములై యుండును అని గ్రహింపదగును. దీనిని అంగీకరించనివారు తమ అజ్ఞానత్వమును ప్రదర్శించుచున్నారు.

"స్వపరజ్ఞప్తి శూన్యత్వం జడత్వం" అని శాస్త్రజ్ఞులు స్థూలదృష్టితో జడమనుదానికి అర్థమునిచ్చిరి. తనది, మరియు పరులది అనెడి జ్ఞానము లేనిదే జడమని అర్థము. కాష్టమౌనమునాచరించెడి ఒక దివ్యయోగి తనకు కలిగిన తన మరియు అన్యవస్తువుల ఎరుకను తన వాణి ద్వారా అభివ్యక్తము చేయకుండ ఊరకనే ఉండెడి స్థితిని చూసి, యితడు జడబుద్ధి యున్నవాడని చెప్పుట ఎంతటి అపరాధమనిపించుకొనునో, రాయి, మన్ను జడమనువారు అంతే అపరాధమును చేసినవారగుదురు, వాటికి తన మరియు అన్యుల తెలివిడిలేదు అనడానికి ప్రమాణమేమి? మనము ఎంత మాలిన్యతను వాటిమీద వేసిననూ వాటిని త్రవ్వినను, కత్తిరించిననూ ప్రతీకారము చేయకుండా వుండుటచేత వాటిని జడపదార్థములనుట తప్పు. ఎందుకనగా అవి వాటి సహనశీలత యొక్క పరాకాష్టలోని అవస్థయైయున్నది. అందుకే సర్వత్రా చైతన్యమును సాక్షాత్కరించుకొనిన మహర్షులు "సర్వం ఖల్విదం బ్రహ్మ", "యత్ సాక్షాదపరోక్షాద్బ్రహ్మ" అని సర్వమును చైతన్యము వున్నదానిగా పరిగణించి చెప్పిరి. శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులు కూడా ఈ క్రింది శ్లోకమును ఇదే విధిన ఉపదేశించిరి.

**శ్లో॥ "పత్రశాఖాదిరూపేణ యథా తిష్ఠతి పాదపః।**
**తథా భూమ్యాదిరూపేణ శివా ఏకో విరాజతే ॥** (సి.శి. 10 : 70)

ఈ విధముగా సిద్ధాంత శిఖామణిలోని శివాజగన్మయ స్థలమునందు, పృథివ్యాధి పంచ మహా భూతములను పరమాత్మనిగానే ప్రతిపాదించినారు. మహాత్మా బసవేశ్వరులు కూడా ఇదేవిధిన తెలిపిన ఈ క్రింది వచనమును గనుడి :

**ఎత్తెత్త మోడిదత్తత్త నీనే దేవా! సకల విస్తారద రూహు నీనే దేవా!**
**విశ్వతశ్చక్షు నీనే దేవా! విశ్వతోముఖ నీనే దేవా!**
**విశ్వతో బాహు నీనే దేవా! విశ్వతో పాదననే దేవ కూడల సంగమ దేవా!**

దీనియొక్క తెలుగు రూపము గనుడి :

**ఎట ఎట చూచినను అటయట నీవేదేవా! సకల విస్తారపు రూపు నీవే దేవా!**
**విశ్వతశ్చక్షువు నీవే దేవా! విశ్వతో ముఖుడవు నీవే దేవా!**
**విశ్వతో బహుడవు నీవే దేవా! విశ్వతో పాదుడవు నీవే దేవా కూడల సంగమ దేవా!**

ఈ వచనమునందు సర్వత్రా చేతనాస్తిత్వమును వ్యక్తపరచినారు. జగత్తులోని కణకణములయందు అణగివుండెడి చైతన్యశక్తిని అనుభవించకయుండెడి వ్యక్తియే జడుడుగాని, రాయి, మన్ను జడములు కావు. అందుచేత రాయి, మన్నులయందు గూఢ చైతన్యము వుండెడి దానిని శ్రీరేణుకా భగవత్పాదులవారు బహిర్గతము చేసే ఉపదేశమును యిచ్చిరి. ఈ విధముగా వైజ్ఞానిక మరియు ఆధ్యాత్మిక గీటురాయిని గీకిచూసిన పిదప జగమంతయు జంగమమే అనియును, చైతన్య సహితము అయినదనియును తెలిసెను. శిలలయందు ఊగిన ఈ సుషుప్తచేతనపు మహిమను జగత్తుకు తెలియజేయుటకే పరశివుడు భూలోకమునందున మహాపర్వదిన సందర్భమున జ్యోతిర్లింగమల రూపమున అంతరించినాడని శివతత్వజ్ఞుల యభిప్రాయము. ఈ లింగము యొక్క అవతారమును వర్ణించెడి శ్లోకమును గనుడి :

**శ్లో॥ "మాఘకృష్ణ చతుర్దశ్యామాదిదేవో మహానిశీ**
**శివలింగతయోద్భూతః సూర్యకోటి సమప్రభః।**

మాఘకృష్ణ చతుర్దశినాడు మధ్యరాత్రి సమయమున మహాదేవుడు కోటి సూర్యప్రభలతో దివ్య జ్యోతిర్లింగముగా నుదయించిన వాడయ్యెను అనునది శ్లోకములోని భావన.

శాస్త్రములయందు నీరు, భూమి, తేజస్సు, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు మరియు ఆత్మ అనెడి పరమాత్ముని అష్టమూర్తిత్వ వర్ణన వచ్చుచున్నది. దీని భావమేమనగా యివన్నియును పరమాత్ముని రూపమే. అందుకే వీటిని దేవుళ్ళని పూజించెడి సాంప్రదాయము భారతీయ సంస్కృతిలో నేటికిని కొనసాగుచున్నది.

వీటియందు వుండెడి పరోపకారణమువలననే యివి పూజలను అందుకొనుచున్నవి. వీటిని పూజించి వీటికిగల త్యాగము, మరియు పరోపకారమునకు చెందిన గుణములను మనుష్యుడు తన జీవనమునందున అలవరచుకొనుటయే వీటి పూజ యొక్క రహస్యము అందుకే ప్రాచీన మహర్షులు, కంచియందు పృథ్వీలింగమును, జంబుకేశ్వరమునందు జలలింగమును, అరుణాచలమునందు తేజోలింగమును, కాళహస్తియందు వాయులింగమును, చిదంబరమునందలి ఆకాశలింగమును పూజనీయములని ప్రతిపాదించిరి. పరమాత్ముని అష్టమూర్తిత్వమునందు వచ్చెడి పంచమహాభూతముల పేరున శివలింగములను ప్రతిష్ఠాపనచేసి పంచ మహాభూతము కూడా పూజనీయములేయని తెలియపరచిరి.

జగత్తున ఏ సాంప్రదాయమునకు చెందిన విగ్రహములైనను ఉత్కృష్టములైన శిల, లేదా కాష్టములవలన నిర్మితములైన దానిని కనుచున్నాము. ఇచట కాష్టమనగా కట్టెయని గ్రహించవలెను. సాంప్రదాయమునకు అనుగుణముగా మూర్తుల ఆకారములు భిన్నముగా వుండవచ్చును. కాని వాటి మూలభూతములైన శిలలు ఒకే విధముగా నుండును. ఈవిధముగా జడములవలె తోచిననూ ఉత్కృష్టగుణములను పొందిన శిల యొక్క

గుణములను మనుష్యుడు తన జీవనమున అలవరచుకొనిన యెడల అతడు మహాదేవుడు కాగలడు. ఈ రహస్యమును ఎరిగిన వారైన శ్రీరేణుక భగవత్పాదులవారు శ్రేష్ఠములైన శిలలనే ఇష్టలింగ నిర్మాణమునకై ఉపయోగించవలెనని ఆదేశమునిచ్చిరి.

## స్థావర లింగము మరియు ఇష్టలింగము - భేదములు :

దేవాలయములందు ప్రతిష్ఠాపితమైన వాటిని స్థావర లింగములందురు. దేహముమీద ధరించబడినది ఇష్టలింగమనీ, ఈ రెంటియొక్క సామాన్యమైన పరిభాష. అతిప్రాచీనమైన శివసంస్కృతి యందు శివుని లింగరూపమునందు పూజించెడి పద్ధతి రూఢిరుందు వచ్చినది. పరిశుద్ధమైన స్థానమునందు విశాలమైన దేవాలయములను నిర్మించి వాటియందు స్థాపితములైన బృహదాకారపు శివలింగములను స్థావరలింగములని పిలిచెదరు. ఈ లింగములు దేవస్థానము యొక్క పరిమాణమునకు అనుగుణముగా కొన్ని ప్రదేశములలో అతి విశాలమైన ఆకారముగలవిగనూ మరికొన్ని ప్రదేశములలో అల్పతరమైన ఆకారము గలవిగనూ వుండెడి దానిని చూచుచున్నాము. స్థావర లింగముల పరిమాణము యింతే యుండవలెనని నిశ్చితముగా చెప్పబడలేదు. అయితే దేహముమీద ధరింపబడెడి ఇష్టలింగమునకు అంగుష్ఠ మాత్రమైన పరిమితి విధించబడినది. వీరశైవులకు ఇష్టలింగ పూజవలె ప్రాణలింగ మరియు భావలింగముల పూజయు విహితమైయున్నది. సాధకుని స్థూలమునుండి సూక్ష్మతత్వము కడకు చేర్చవలెనను ఉద్దేశ్యముతో వీరశైవాచార్యులు హృదయాకాశము నందుండెడి ప్రాణలింగముయొక్క ప్రతీకగానే బాహ్యమునందు ఇష్టలింగమును కల్పించినారు.

శ్లో॥ **"అంగుష్ఠ మాత్రః పురుషోఽంతరాత్మా।**
**సదాజనానాం హృదయే సన్నివిష్టః ॥**
**హృదామనీషా మనసాభిక్లప్తో।**
**య యేతద్ విదురమృతాస్తే భవంతి॥**
(శ్వేతాశ్వతరోపనిషత్ 3-13)

ఈ ఉపనిషత్తు మంత్రమునందు ప్రతియొక్క జీవియొక్క హృదయాకాశమునందు అంగుష్ఠ పరిమాణమున శివుడు నివసించుచున్నాడు అని ప్రతిపాదించబడినది. జీవుల హృదయములందు పరమాత్ముని నివాసము యిదే అని తెలిపెడి భగవత్పాదుల వారి ఉపదేశమును కనుడి.

శ్లో॥ **"సమస్తజగతాత్మాఽపి శంకరః పరమేశ్వరః**
**భక్తానాం హృదయాంభోజే విశేషేణ విరాజతే।** (సి.శి. 10-67)

ఇదే భావమును తెలియజెప్పెడి గీతాసూక్తిని గనుడి.

**"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేవార్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥** (గీత -18-61)

అంతరంగము నందు యుండెడి ఆ పరమతత్త్వమును సాక్షాత్కారము చేసుకొనెడిదే మనుజుని జన్మము యొక్క లక్ష్యమైయున్నది. ఈ సూక్ష్మ ఆత్మతత్త్వము యొక్క ఉపాసన అందరికీ సులభసాధ్యము కాని కారణమున అదే ఆకారపు స్థూల లింగము యొక్క కల్పనను వీరశైవ ఆచార్యులు చేసి దానిని ఇష్టలింగమని పిలిచిరి.

## ఇష్టలింగ పరిమాణము :

హృదయాకాశమునే మూలముగా పెట్టుకొని నిర్మితమైన ఇష్టలింగము హృదయాకాశము యొక్క పరిమాణమంతే యుండవలెను. **'అంగుష్ఠమాత్రః పురుషోంతరాత్మా'** అనెడి ఉపనిషద్వాక్యము హృదయాకాశములోని ఆత్మ అంగుష్ఠ పరిమాణమున వుండునని చెప్పినది. అందుకే అప్పయ్య దీక్షితులవారును **"మనుష్యహృదయాబ్జకోశానా మయష్ఠ పరిమాణత్వాత్"** (పంచరత్న స్తుతి - పుట - 13) అని హృదయాకాశము యొక్క

పరిమాణమును అంగుష్ఠమాత్రమంతే అని నిరూపించినారు. ఈ కారణమువలన వీరశైవుల ఇష్టలింగమైనను అంగుష్ఠ పరిమాణమంతే వుండవలెను. కాంతిచేత ఆవృతమైన అంగుష్ట పరిమాణముగల ఈ ఇష్టలింగము మానవుని హృదయ కోశము యొక్క ఆకారమును పోలియుండును.

## పంచసూత్ర లింగము :

శ్రీశైల శిలచేత నిర్మితమైన లింగము కంతి యొక్క ఆవరణమును పొందుటకు పూర్వమే పంచసూత్రాత్మకమై యుండును. పంచసూత్రముల యొక్క అర్థము భౌతిక మరియు ఆధ్యాత్మిక దృష్టిచేత రెండు విధములుగా వుండును.

శ్లో॥ **"లింగ వృత్త సమం పీఠం దైర్ఘ్యం విస్తార ఏవచ**
**తదర్థం గోముఖం చైవ ప్రోక్తం లింగస్య లక్షణం** (క్రియాసారము భాగము-3, పుట 41)

శ్రీనీలకంఠ శివాచార్యులు చెప్పిన ఈ సూక్తి ప్రకారము ఈ లింగమును నిర్మించునపుడు బాణము యొక్క చుట్టుకొలతయంతే పీఠము యొక్క యెత్తు, మరియు వైశాల్యము వుండవలెను. దాని అర్థభాగము గోముఖము వుండవలెను. అనగా బాణము యొక్క చుట్టుకొలత, (2) పీఠము యొక్క క్రిందిభాగము (3), పీఠము యొక్క పైభాగము (4) పీఠము యొక్క యెత్తు సమానముగా వుండవలెను. గోముఖము మాత్రము బాణము చుట్టుకొలతకు సగభాగముగా నుండవలెను. ఈ విధముగా ఈ ఐదు కొలతలతో కూడినదే పంచసూత్రలింగమని యెరుగవలెను. ఇష్టలింగమునకై ఉపయోగించెడి ఈ పంచసూత్రలింగము అంగుష్ట పరిమాణము కంటెను చిన్నదై వుండవలెను. ఎందుకనగా మున్ముందు వచ్చెడి కంతి యొక్క ఆవరణ అనంతరము అంగుష్ఠ పరిమాణమునకు సమానమైనదై వుండవలసి యుండును.

కంతిచేత ఆవృతమైన లింగము ఏవిధముగా హృదయముయొక్క ఆకృతిని పోలియుండునో అటులనే ఈ పంచసూత్రములు హృదయములోని అయిదు భాగముల యొక్క సంకేతరూపమని వైజ్ఞానిక దృష్టితో శ్రీ జి.టి. అక్కులయ్య దీక్షితుల వారు ఇష్టలింగ విజ్ఞానమనెడి గ్రంథమున ప్రతిపాదించినారు. వీరి విచారము ప్రకారము తార, దండము, కుండలి, అర్థచంద్రము, మరియు బిందువులే పంచసూత్రములు. ఇందులో తార గుండ్రముగాను, దండము సరళముగాను, కుండలి సర్పాకారముగాను, అర్థచంద్రము అర్థ చంద్రాకారముగాను, బిందువు పూర్ణాకారముగాను వుండును. వీటిని మేళవించగనే పంచసూత్రముల పీఠికాలింగము తయారగును. ఈ పంచసూత్రములు హృదయములోని అయిదు అవయవముల ఆకారమునకు సమానముగా వుండును. హృదయమునందున త్రిపిధానము, కుడ్యము, శిరము, అర్థచంద్రపిధానములు, రక్త బిందువులు అనెడి అయిదు అవయవములు వుండును. ఇవి క్రమముగా తార, దండ, కుండలి, అర్థచంద్రము, మరియు బిందువు ఆకృతిని పోలియుండును. ఈ విధముగా లింగము యొక్క కల్పనకు మనుష్యుని హృదయమే మూలమై యున్నది. ఆచార్యులవారి ఈ క్రింది ఉపదేశమును గనుడి.

శ్లో॥ **'మూలమ్ విద్యా శివః శైవసూత్రం పంచాక్షరస్తథా**
**ఏతాని నామధేయాని కీర్తితాని మహామనోః॥** (సి.శి. 8-23)

ఇందు జగద్గురు రేణుక భగవత్పాదులవారు పంచాక్షర మహామంత్రమును మూలము, విద్య, శివః, శైవసూత్రము మరియు పంచాక్షరము అనెడి అయిదు పేర్లు వున్నవని తెలియపరచిరి. ఈ ఒక్కొక్క పేరు యొక్క అర్థము బహుమార్మికమైయున్నది. దీనిని పంచాక్షరీ జపస్థలమునందు వివేకము చేయుదుముగాక. ఇక్కడ ముఖ్యముగా శైవసూత్రము అనెడి నామమును విచారింతుము. "సూచనాత్సూత్రమ్" అనెడి వ్యుత్పత్తిమేరకు శివ సంబంధితమైన సకలతత్త్వమును 'నమఃశివాయ' యనెడి అయిదు అక్షరములు సూచించుచుండుటకే ఈ పంచాక్షరిని శైవసూత్రమని పిలిచిరి. దేవనాగరి లిపి యొక్క ఈ అయిదు అక్షరములు పూర్వము నందు చెప్పిన తార, దండము, కుండలి, అర్థచంద్రము మరియు బిందువు ఆకృతికి సమానముగా గలవియై యున్నవి. ఈ విషయమున శివతత్త్వ రత్నాకరమునగల వివరణ గమనించవలసియున్నది.

శ్లో॥ **నకారస్తారకస్థానం మకారోదండముచ్యతే**
**శికారః కుండలాకారో వాకారశ్చార్థ చంద్రకః**
**యకారో బిందురూపోఽ యంకారః పంచవర్ణకః**
(శివతత్త్వ రత్నాకరమ,కల్లోలము-1, తరంగము-4, శ్లోకము39-40)

ఈ రీతిగా శివతత్త్వ రత్నాకరము కృతికర్త కెళది బసవ భూపాలుడు పంచాక్షరములకు మరియు తారాది పంచావయవములకు ఆకృతి సామ్యమును చెప్పి పంచాక్షరములనెడి పంచసూత్రములచేతనే ఈ పంచసూత్ర ఘటిత లింగము నిర్మాణమైనదని తెలియపరచినారు.

కామికాగమములోను ఈ విషయమున కొంత వివరణ కలదు.

**శ్లో॥ "ప్రథమం తారకరూపం ద్వితీయం దండ ఉచ్యతే**
**తృతీయం కుండలాకారం చతుర్థం చార్ధచంద్రకం**
**పంచమం బిందుసంయుక్తం ప్రణవం పంచబ్రహ్మారాట్"**

ఈ విధముగా పంచాక్షరములే పంచసూత్రములు. వీటి మేళనచేత తయారైన లింగమే పంచసూత్ర లింగము. పంచాక్షర మహామంత్రము పరశివుని సూచకముగా వుండునటులే ఈ పంచసూత్రలింగమైనను పరశివుని సూచకముగా నుండును. ఈ విషయమును తెలియజేసెడి కిరణాగమసూత్రమును గనుడి.

"సూచనాత్పరమేశస్య లింగం సూత్రమితీరతమ్" ఇదే ప్రకారముగా సకలవర్ణ సమామ్నాయమునకు మూలమైన ఓంకారమైనను ఇవే తారాదండాది పంచ అవయవముల స్వరూపమైన కారణమున ఓంకారము, పంచాక్షరి మరియు పంచసూత్రమనెడి ఇష్టలింగము మనుష్యుని హృదయకోశమునందునగల అవయవముల సంయుక్త స్వరూపమని తెలియవచ్చుచున్నది. అతి సూక్ష్మమైన మరియు తన హృదయస్థమైన ప్రాణలింగ స్వరూపము నరయవలయుననిన హృదయముయొక్క అవయవముల సదృశమైన అవయవములచేత నిర్మితమైనప్రణవము, పంచాక్షరి, మరియు పంచసూత్రములచేత నిర్మితమైన ఇష్టలింగము యొక్క ఉపాసన బహిర్గమునందు అవశ్యకమైనదని తెలియవచ్చుచున్నది. అందుచేత వీరశైవాచార్యులు శిష్యునికి లింగదీక్షను అనుగ్రహించునపుడు శ్రీరేణుక భగవత్పాదులవారు ఆదేశించిన నర్మదాబాణ లింగమునుగాని, లేదా సూర్యకాంత, చంద్రకాంత, స్ఫటిక లేదా శ్రీశైల పర్వతములోని ఉత్కృష్ట శిలయందు పంచసూత్ర ప్రమాణానుసారముగా నిర్మించిన ఏదో ఒక శివలింగమును తీసికొనవలెను. ఇప్పటి పరిస్థితియందు సూర్యకాంత, చంద్రకాంత, స్ఫటిక నిర్మిత లింగములు దొరకుట దుర్లభమైనందున శ్రీగురువుగారు లింగ దీక్షకాలమునందు నర్మదాబాణలింగములను లేదా శ్రీశైల శిలయొక్క పంచసూత్రలింగములనే ఉపయోగించుట జరుగుచున్నది. అయినను నర్మదాబాణ లింగములకంటెను శిలచేత నిర్మితమైన పంచసూత్ర లింగముల వాడుకయే యెక్కువగా కనుపించుచున్నది. మొత్తముమీద శ్రీరేణుక భగవత్పాదులవారు ఆనతినిచ్చిన లింగములయందు ఏదో ఒక లింగము వుండిన చాలును. వాటియందు ఎట్టి భేద భావనయు వుండదు. లింగపూజయందు లింగ నిర్మిత ద్రవ్యము కంటెను సాధకుని భక్తి ప్రధానమైనదై యుండును. ఈ కారణమువలన ఉపాసకులు ఎట్టి బేధము చూపకూడదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 9-08-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీకాశీ జగద్గురువువారు లింగతత్త్వమును గూర్చి విజ్ఞానదాయకమైన యాశీర్వచనమును ప్రదానము చేసిరి.

లింగమనగా నేమి యనెడిది గ్రహింపజాలక చాలామంది తికమకకు గురియై వైవిధ్యత గల్గిన వ్యాఖ్యానములు బయల్వెడలినవి.

"లిఙ్గం చిహ్న రేపసోః" అని యమరసింహుడు తెలిపెను. లింగమనగా చిహ్నము మరియు పురుషాంగమని యర్థము తెలుపబడినది. 'లింగ్యత్ జ్ఞాయత్ అనే నేతిలింగం' (లిగి-గతో) అనెడి వుత్పత్తి ప్రకారము దేనిచేత ఎరుగబడునో నయ్యది లింగము.

పంచమ వేదమున లింగము గురించిన యొక కథ కలదు. ఒకసారి శివుడు బ్రహ్మతో "భూతంబుల సృజియించుటకు లింగమెందుల"కని నిజలింగము నట వదలి వేసి మాల్యవంతంబునకేగి తపమాచరించెదనని వెడలిపోయెను. ఇచ్చట, లింగమనగా శివుని పురుషాంగమనెడి యర్థము గలదు. అప్పుడా శివలింగమునీ క్రింది విధముగా ప్రకాశించెనట.

శ్లో॥ ఆ సమయమున లింగము
భాసురగతి చూడనొప్పె బ్రహ్మాదులకుం
జేసిరి పూజలు వాగలు
వాసన ముఖ్యామరాది వర్గము దారున్! (ఆంధ్రభారతము)

ఈ భావన వలన శివతత్త్వము బహిర్గతము కాదు. లింగతత్త్వము ప్రస్ఫుటము కాదు.

వేదములలో లింగపదము ప్రయుక్తము కాలేదు. కాని "అయం యే హస్తో భగవాన్" వంటి శ్రుతి వాక్యములు పరోక్షముగా లింగమును, దాని యర్చన సూచించుచున్నవని వేదవిధుల యభిప్రాయము. శ్వేతాశ్వతరోపనిషత్తులో లింగతత్త్వమిమిడియున్నదని తెలిపెడి ఆధారములు గలవు. ఇచ్చట శివుడు పరబ్రహ్మ. కైవల్యోపనిషత్తులోను నిట్టి భావనలు గలవని సదాశివ భాష్యము వలన తెలియుచున్నది. శ్రీపతి పండితుడు లింగోపాసన శ్రుతి సమ్మతమేనని శ్రీకర భాష్యమున తెలిపిరి. సోమనాథుని సోమనాథ భాష్యము నీకోవకు చెందినదే. భాగవత మీ భావననే గ్రహించెను. శివుడు పరబ్రహ్మయనెడిదంగీకరింపబడినది. ఈ క్రింది పద్యమును గనుడి :

ఆదికి నాది లోకముల కన్నిటికిం బ్రభుదవ్యయుండు వే
దాది పవిత్ర వాచక సహస్ర పరిస్ఫుట వాక్యరూపుడు
హోదళన ప్రకారక శుభోదయ కారణ దివ్యనాముడుం
బాదయితుండు ధృజ్మహిత ఫాలుడు లోలుడు భక్తి యుక్తికిన్
(ఆంధ్రభారతము, ద్రోణ పర్వము, ఐదవ ఆశ్వాసము)

వేదములో లింగమును "పవిత్ర" అనెడి పేరుతో పిలువబడినదనెడిది గుర్తించవలసిన యంశము. శ్రీ విద్యా వాచస్పతివారు, యీ విషయమై యెంతో విశ్లేషణనిచ్చిరి.

శివపరబ్రహ్మ యొక్క గురుతే లింగమనెడి భావన కలదు.

శివుని యే రూపమైనను గొలువవచ్చునని కొన్ని పురాణములనుచున్నవి. లింగరూపమున కొలుచుటే యుత్తమమైనదని మరికొన్ని పురాణములనుచున్నవి. ఈ భిన్నత్వము యొక్క నేపథ్యములో శ్రీ సోమనాథులవారి యీ క్రింది పద్యమును గనుడి :

చం॥ అనయము బంచవింశతి మహావరమూర్తుల నీశ్వరాదులన్
దనరిన మూర్తి మూర్తి ఘనతత్త్వ సదాశివ పంచకంబులన్
జనసుత నూరుకోట్ల యుగసంఖ్యలు గొల్చిననొందు తత్ఫలం
బనుప లింగమూర్తి నిమిషార్థము గొల్చినబొందు సమ్మతిన్ (అనుభవసారము ప.157)

పాల్కురికి సోమనాథుడు, శివుని పంచవింశతి లీలావిగ్రహములైన నటరాజాది విగ్రహములను, సద్యోజాతాది పంచముఖముల, వెలింగెడి సదాశివుని రూపమునుగాని పూజించుకంటె నిర్గుణ పరబ్రహ్మపరమైన లింగరూపమును పూజించుట హితకారణమని చెప్పెను.

అట్టి నిర్గుణ పరశివలింగము విశ్వ వ్యాప్తమైయుండును. దానినర్చించుట యెట్టుల? యనెడి ప్రశ్న తలయెత్తును. శైవులు దేవాలయములలో నుండెడి లింగమునే పరశివలింగమని యెంచి పూజింతురు. సప్త విధ శైవములలో నుత్తమోత్తమమైనదగు వీరశైవమును స్థావర లింగార్చన విహితమైనది కాదని తెలిసికొనవలెను. శ్రీ జగద్గురువులవారు ఈ విషయమును విడమరిచి చెప్పిరి.

క్రియాదీక్షలోన యిష్టలింగ ప్రధానమే కీలకమైనదని యెరింగి యుంటిమి. గురుదత్తమైన యిష్టలింగమును మాత్రము పూజించవలెనని తెలిసికొనగలరు. తాత్వికపరముగ యిష్టలింగమనగా నేమి? అనెడిది తెలిసికొనినచో యీ విషయము మరింతగా విశదమగును.

లింగము పరబ్రహ్మ వాచకము. ఈ లింగమునుండియే షట్ త్రిశంత్ తత్త్వములు బయల్వెడలినవి. వీటిలో శివతత్త్వము మరియు శక్తితత్త్వము మొట్టమొదటివి. ఈ రెంటి వలన మిగిలిన తత్త్వములేర్పడునని ఆగమ విధులందురు. శైవులీ శివుని నర్చింతురు శాక్తేయులు శక్తినర్చింతురు. శక్తి

యొక్క పురుష రూపమైన విష్ణువును అర్చింతురు. శివ–శక్తుల సంగమ ఫలితముగా నేర్పడిన విశ్వములో జనించిన వినాయక, స్కంద, సూర్యాదులను నర్చించెడివారు వరుసగా వైనాయక, స్కాంద మరియు సౌర మతీయులైరి. వీరెవ్వరును లింగతత్త్వులకంటెను నధికులు కారని గ్రహించవలెను. ఇచ్చట శివుని గుర్తులింగమని భావన లుప్తమగును. లింగమునుండి శివుడు ప్రకటనమును పొందెననెడి యర్థము వచ్చును. లింగాంగ సామరస్యము ద్వారా లింగతత్త్వములో లీనమగుటకు యత్నించు వాడే వీరశైవుడు. అట్టి మహత్తర లక్ష్యమును సాధించుటకు నిష్ఠలింగార్చన సాధనతుల్యమని యెంచవలెను.

ఇష్టలింగము స్థూలశరీరమునకు చెందినది. సూక్ష్మ మరియు కారణ శరీరములందున ప్రాణ మరియు భావలింగము లుండును. ఈ చివరి రెండు వస్తుమయమైనవి కావు. ఇష్టలింగము వస్తుమయమైనది. లింగమునే వస్తువు చేత రూపొందవలెననెడి ప్రశ్న ఉదయించును. స్థూలలింగ రూపకల్పనకై యే వస్తువుకైనను ఉపయోగించవచ్చుననెడి భావన పౌరాణిక గాథల వలన నభివ్యక్తమగును. ముప్పది యారు తత్త్వములలో చివరిదగు పృథ్వీతత్త్వము నుపయోగించి లింగమును పూజించవలెనని పార్థివలింగార్చకులందురు. జలచరులు జలలింగములను పూజింతురని బసవ పురాణములో చెప్పబడినది. బ్రహ్మ విష్ణువులు అగ్నిరూపమున నున్న మహాలింగము నర్చించి ధన్యత పొందిరని లింగ పురాణాదులలో వివరించబడినది. పంచ భూతముల వలన యేర్పడిన వస్తు సంపద వలన లింగములను రూపొందించెడి సాంప్రదాయము గలదు. సువర్ణలింగము, రజిత లింగము, తామ్రలింగము, కాష్ఠ లింగము, సికత లింగము, రసలింగము, స్ఫటిక లింగము మొదలగునవి పూజింపబడినవని తెలిపెడి గాథలు గలవు.

వీటన్నిటికంటెను శిలానిర్మితమైన లింగమే శ్రేష్ఠమైనదని శివాగమములు తెలుపగా శిలలతో రూపొందించబడిన లింగములే నధికసంఖ్యలో పూజింపబడుచున్నవి. ఇది యిట్టులుండగా శ్రీభగవత్పాదులవారు స్ఫటికము, శైలజము మరియు చంద్రకాంతల వలన నిర్మితములైన యిష్టలింగములనే శ్రీ గురుడు శిష్యుని కెందుకు నొసంగవలెననెడి ప్రశ్న యుదయించును.

లౌకిక పరముగా నాలోచించిన పిదప వీటిలో శ్రేష్ఠత్వము గలదని తెలియును. స్ఫటికము నిర్మలత్వమునకు చిహ్నము. శైలజము దృఢత్వమునకు చిహ్నము. వర్షవాతా తపాదులచే శిథిలము కాకుండా సుస్థిరముగా నిలిచిన శైలజమునకు కొన్నివేల సంవత్సరముల చరిత్ర కలదు. చంద్రుడు శీతలమునకు చిహ్నము. అమృతత్వమునకు సంకేతము చంద్రకాంత శిలకును ఈ గుణములు గలవందురు.

తాత్త్వికముగా చూసిన యెడల దేహిలో బ్రహ్మరంధ్రమున చిదాకాశముండుననియును, అచ్చట చంద్రుడు ప్రకాశించుచు అమృతవృష్టి కురిపించుచుండుననియును శివయోగానుసంధానమును చేసెడివారు తెలుపుదురు. ఈ వివరములు ప్రాణలింగి స్థలమున లభించును. అద్దానికి సంకేతమే చంద్రకాంతశిలయని భావింపవచ్చును. ఈ విషయమును సూచించుటకై స్ఫటికము సూచింపబడినది.

భ్రూమధ్యమున స్ఫటిక చ్ఛాయతో భావ లింగము వెలుగొందునని తెలుపబడినది. ప్రాణలింగము స్వర్ణకాంతులననునని తెలుపబడినది. స్వర్ణము ఖనిజము నుండియే వచ్చును. పృథ్వీ తత్త్వముతో సంబంధముండును. ఈ కారణమున శైలజలింగము ఆ విషయమునకై సంకేతముగా నిలుచునని భావించవలెను.

లింగాంగ సంయోగ క్రమములో యిష్ట ప్రాణ భావలింగముల ననుసంధానము చేసికొని తద్వారా పశ్చిమ పద్మాసనముననుండెడి పరలింగములో లీనము కావలెనని సూచింపబడినది. అట్టి లక్ష్యసాధనకై జీవుడు మూడింటినలవరచుకోవలెను. అవి : యేకైక నిష్ఠాపరతత్త్వము, మనోనైర్మల్యము మరియు ప్రసన్నత్వము. శివుని యందున అచంచలమైన నిష్ఠ గలిగియుండాలనెడిది శైలజము సూచించును. స్ఫటికము నిర్మలత్వమును సూచించుచున్నది? చంద్రకాంత ప్రసన్నత్వమునకు సంకేతముగా నిలుచును.

అయితే ఈ మూడింటిలో నెయ్యది శ్రేష్ఠమైనదనెడి ప్రశ్న తలయెత్తవచ్చునేమో? అది యప్రస్తుతమైన దగును. భక్తుని లక్షణములను, గుణగణములను నేపథ్యముగా గొని శ్రీగురువు యేదైన నొకదానిని యెంపిక చేసికొనవచ్చును.

లోకాచారమున, శ్రౌత, మార్గశైవులు తమతమ యిష్టలింగముల నిమిత్తము శైలజముల నెంపిక చేసికొనుచుందురు. ఇవి చిన్న పరిమాణమున నుండును. వీటిచేత సులభముగా శివయోగమును సాధింపజాలము. దృష్టి యోగము సాధించుటలోన యిబ్బందుల నెదుర్కొనవలసియుండును. వీరశైవులు చంద్రకాంతములనే యుపయోగించుచున్నారు. దీనిపైన కాంతిని పులిమి ప్రాణలింగాకారమున యంగుష్ఠ ప్రమాణమున రూపొందింతురు. దీనివలన, శివయోగాను సంధానము సుగమమగునని యిష్టలింగ విజ్ఞానమువలన తెలియుచున్నది.

– శుభం భూయాత్ –

## ఆశీర్వచనము : 2

శ్లో॥ సర్వలక్షణసంపన్నే తస్మిన్‌లింగే విశోధితే
పీఠస్థితే ఒభిషిక్తే చ గంధపుష్పాది పూజితే

మంత్రపూతే కలాంశైవీం యోజయేద్విధినా గురుః
శిష్యస్య ప్రాణమాదాయ లింగే తత్ర నిధాపయేత్

తల్లింగం తస్య తు ప్రాణే స్థాపయదేక భావతః
ఏవం కృత్వా గురుర్లింగం శిష్యహస్తే నిధాపయేత్ (సిశి 6 : 22-24)

శిల్ప శాస్త్రముల యందున చెప్పబడిన లక్షణములచేత, యుక్తము, పంచ గవ్యాదులచేత పరిశుద్ధమైనదియూ హస్తపీఠమునందుంచబడి యభిషిక్తమైనదియూ ఉపచారములచేత సంపూజితమూ, మంత్రముచేత సంస్కరింపబడినదియునగు శివలింగమునందున శివకళ మరియు శిష్యుని ప్రాణమును ననుసంధానము చేయవలెను. ఆ లింగమును మరల శిష్యుని ప్రాణమునందున తాదాత్మ్యము పొందించవలెను. ప్రాణమే లింగము, లింగమే ప్రాణమనెడి భావన శిష్యునికి యేర్పడే విధముగా బోధించి, సద్గురు వాలింగమును శిష్యుని హస్తపీఠము నందున యుంచవలెను.

## పంచసూత్ర లింగ పరీక్ష :

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు, దీక్షా విధానమునందున చేయబడెడి లింగసంస్కారమును బహుమార్మికముగా నుపదేశించిరి. అంగము నందునగాని, శిలాలింగమునందునగాని, భగవంతుని ఆవిష్కారము చేయు, సంస్కారము బహుముఖ్యమైనది. సద్గురువు శిష్యునికి లింగదీక్షను అనుగ్రహించుటకంటెను పూర్వముననే, శిష్యునికి ప్రదానము చేయవలసిన శైలజ లింగము ఆగమశాస్త్రోక్త విధానము ప్రకారము రచితమైనదా కాదా అనెడి దానిని పరీక్షించవలెను. ఎందుచేతననగా, విధి విధానము ప్రకారము నిర్మింపబడని లింగమువలన యెన్నియో దుష్ఫలితములు గల్గునని, శ్రీ నీలకంఠ శివాచార్యులవారు నుపదేశించిరి. అద్దానిని గాంచుడి :

శ్లో॥ లింగాధిక్యే భవేన్మృత్యుః శక్త్యాధిక్యేధనక్షయః।
లింగశక్త్యోః సమత్వం హి భోగమోక్షఫలప్రదం
(క్రియాసారము, భా -3, పుట-41)

లింగభాగము అధికముగా నుండిన యెడ అపమృత్యువును, శక్తిభాగము నధికమైనచో ధనక్షయము సంభవించునని చెప్పుచు, రెండు సమముగా నుండవలెననియును, అట్లున్న యెడల సాధకునికి భోగమోక్షములు సమకూరుననియును శ్లోకములోని భావమని గ్రహింపదగును. ఇచ్చట లింగమనగా బాణమనియును, శక్తియనగా పీఠమనియును గ్రహించవలెను.

**"సర్వలక్షణ సంపన్నే తస్మిల్లింగే విశోధితే।"** అనెడి జగద్గురువులవారి ఆదేశము యొక్క అంతరార్థమేమనగా శ్రీగురువు, శిష్యుని కళ్యాణము నిమిత్తమున యిచ్చెడి లింగము పంచసూత్ర విధానము ప్రకారము నిర్మితమైనదో లేదో పరిశోధించవలెను.

## శివలింగ సంస్కారము :

శివలింగము యొక్క పరీక్షను సల్పిన పిదప లింగము యొక్క శిలత్వమును దూరము చేయుటకై విధి ప్రకారము జలాధివాసము మరియు ధాన్యాది వాసమును చేయించవలెను. అదెట్టులనిన, గురుకలశమునకు పశ్చిమ భాగమున నొకపూర్ణకుంభమును పెట్టి, నొక కొత్త వస్త్రముతో దర్భ సహితముగా నున్న శివలింగమునకు చుట్టి, ఆ లింగమును పూర్ణకుంభములో నుంచవలెను. శ్రీరుద్రమును పఠించవలెను. అనంతరము, "ఉత్తిష్ఠ బ్రహ్మణస్పత్" యనెడి మంత్రమును పఠిస్తూ, లింగమును జలమునుండి వెలికితీసి, వస్త్రమును విప్పివేసి, 'ఆపోహిష్ఠా" అనెడి మంత్రముతో

నభిషేకమునుచేసి, అష్టవిధార్చనలతో లింగమును పూజించవలెను. తదుపరి, గురుకలశమునకు నీశాన్య భాగమున, వరి లేదా యితర ధాన్యము నింపబడిన పళ్ళెరమునుపెట్టి, దానియందున అష్టదళ కమలమును లిఖించి, దానిమీద శివలింగమును పరుండబెట్టి, ఓ వేయి మార్లు పంచాక్షరిని జపించవలెను. అనంతరము, "ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే" అనే మంత్రమునుచ్చరిస్తూ, శివలింగమును ధాన్యమునుండి వెలికితీసి, పంచామృతము చేతను, శుద్ధోదకముచేతను అభిషేకమును చేయవలెను. తదనంతరము, షోడశోపచారములతో శివలింగమును పూజించవలెను. ఈ ప్రకారముగా శివలింగము యొక్క శిల్పదోషమును దూరము చేయవలెను.

అనంతరము, శివలింగమున శివకళను ఆవాహన, శివలింగము యొక్క అధఃపట్టికయందున భువనాధ్వన్యాసమును, అధఃపంకమునందు పదధ్వన్యాసమును, మధ్యభాగమున వర్ణాధ్వన్యాసమును ఊర్ధ్వపంకమునందున కలాధ్వన్యాసమును, ఊర్ధ్వ పీఠమునందున తత్వాధ్వన్యాసమును ఆజ్య ప్రధారికా భాగమున మంత్రాధ్వన్యాసమును, తచ్చివ శివలింగము మస్తక పంచకమునందున, హృదయాది స్థానములయందు అష్టత్రింషత్ (38) కలాన్యాసములు చేసి శుద్ధముచేసిన పిదప, బియ్యముచేత నింపబడిన పళ్ళెరమునందున ప్రణమును రచించి, దానిమీద శివలింగమునుపెట్టి వస్త్రముతో ఆచ్ఛాదన చేయవలెను.

ఆ పిదప శిష్యుని మస్తకమునందున నుండెడి చిత్కళను ఆకర్షించి శివలింగమునందున ప్రతిష్ఠించవలెను. శివుని మస్తకముననుండెడి చిత్కళను ఆకర్షించెడి విధానమును సిద్ధాంత శిఖామణి యొక్క సంస్కృత వ్యాఖ్యానకారులైన శ్రీ మరితొంటదార్యులవారు ఎంతో సుందరముగా వివరించిరి.

## లింగమునందున శివకళా సంయోజన :

సన్నిధియందున కూర్చొనియున్న శిష్యుని మస్తకము మీద శ్రీ సద్గురువులు శ్రీ గంధము చేత పంచదళ కమలమును లిఖించి, దాని యొక్కొక్క దళమునందున నకారాది యకారము వరకు గల పంచాక్షరములను వ్రాసి, మధ్యభాగమున ఓంకారమును వ్రాసిపూజించి దానిమీద తమ అమృతహస్తమును నిలుపవలెను. ఈ క్రింద నివ్వబడిన శ్లోకమును పఠిస్తూ శివకళను శ్రీగురువు ధ్యానము చేయవలెను.

**శ్లో॥ నిత్యానంద స్వరూపాం నిరుపమ విభవాం నిష్కలాం నిర్విశేషాం।**
**నిర్వ్యాచేనోర్ధ్వమాయా విరచిత వపుషం విశ్వవంద్యాపరాంతాం॥**
**ఆధారమాదిశక్తిం గుణగణనమితాం దేవదేవీంశివాఖ్యాం।**
**వందే హృత్పద్మపీఠే పరమ శివపదాం శ్రీమతీమూర్ధ్వ సంజ్ఞాం॥**

నిత్యానంద స్వరూపియు, నిరుపమానమైన వైభవము గలదియు, నిష్కళగలదియు, ఊర్ధ్వమాయచేత సహజముగా శరీరమును ధరించునదియును, విశ్వవంద్యయు, సమస్తభువనములకు ఆధారభూతమైనదియు, ఆదిశక్తిరూపియు, సద్గుణములు గలదియు, శివా అనెడి పేరుగలదియు, పరమ మంగళ స్వరూపము గలదియు, అగు మహాదేవిని హృత్కమలమునందున నమస్కరించుచున్నాననెడిది పై ప్రార్థనలోని భావము. ఈ విధముగా శ్రీగురువు శివకళను ధ్యానముచేసిన పిదప శిష్యుని మస్తకమునందున "శాంత్యాతీతోత్తరా" అనే శివకళ ప్రకటనమగును. దీనినే చిత్కళయని అందురు. అప్పుడు శ్రీగురువు "క్రోం" అనెడి బీజాక్షరమును పఠిస్తూ ప్రబలమైన మానసిక శక్తి పురస్కరముగా, అంకుశముద్రచేత ఆ శివకళను ఆకర్షించి, ముందుగనే పరిశుద్ధము చేయబడిన శివలింగమునందున స్థాపించవలెను. శ్రీగురువు ఆ లింగమును తన వామకరపీఠమున పెట్టికొని విద్యుక్త విధిన పూజించవలెను. శివకళ చేత సంబంధము పొందిన ఇష్టలింగమున శిష్యుని ప్రాణశక్తిని ప్రతిష్ఠించవలెను. ఈ విధిన శివకళ, జీవకళలు యిష్టలింగమున నిల్పిన యనంతరము, శ్రీగురువు దానిని శిష్యుని కరపీఠమున గోముఖముగానుంచవలెను. దీనికంటె ముందున యా లింగమును శిష్యుని ప్రాణశక్తియందున సమరసము చేయవలెను. ఆ పిదప శ్రీగురువు, ఇష్టలింగము యొక్క మహత్తును గూర్చి యుపదేశము నివ్వవలెను.

ఇష్టలింగమునందున శివకళ మరియు జీవకళలను సంయోజన జేసెడి విధి విధానము నెరింగిన పిదప నదే విధముగ వైజ్ఞానిక, యౌగిక మరియు వ్యావహారిక విషయముల కనుగుణముగా నున్నదో తెలిసికొనెడి యవసరము గలదు.

ఎనుబది నాలుగు లక్షల జీవరాసులయందున మానవజన్మ శ్రేష్ఠమైనది. “యథా బ్రహ్మాండం తథాపిండాండం” అనెడి యుక్తి ప్రకారము పరమాత్ముడు బ్రహ్మాండములోని సకలతత్వముల నతిసూక్ష్మముగా మనుష్యుని పిండమునందున నుంచినాడు. ఈ కారణమువలననే శ్రేష్ఠమైన సాధకుడు శరీరమునందున సకలమును సాక్షాత్కారము చేసికొనును. ఈ విధిన కృతార్థసిద్ధిని పొందిన శ్రీ నిజగుణులవారు “నరజన్మదిందిహదోళు మిగిలుంటె”యని ప్రశ్నించిరి. (క్రైప నీతిక్రియాచర్యస్థలము1). నరజన్మకంటెను హెచ్చైనదేదీ యుండదని వీరి ప్రశ్నలోని భావము. వీరు నరజన్మ యొక్క మహత్తును కొనియాడిరి.

ప్రపంచమునందున శివుడు మరియు శివకళలు వ్యాప్తమైయుండిన యటులే, మనిషి శరీరము నందుననూ అవి వ్యాపించి యుండును. యోగశాస్త్రము ప్రకారము, ఆధార, స్వాధిష్ఠాన, మణిపూరక అనాహత విశుద్ధి మరియు ఆజ్ఞా యనెడి షట్చక్రములు గలవు. అవి మనుష్యుని గుదము, గుహ్యము, నాభి, హృదయము, కంఠము మరియు భ్రూమధ్యములయందున నుండును. వీటిని ముఖ్యకేంద్రములని గ్రహించవలెను. ఈ చక్రములందున కళాప్రపూర్ణుడైన శివుడు లింగమూర్తియై నివసించును. ఒక్కొక్క స్థానమున యొక్కొక్క కళచేత విశిష్టుడై యుండి, వివిధ నామధేయములతో పిలువబడుచున్నాడు.

నివృత్తి కళాయుక్తమైన ఆచారలింగము ఆధారచక్రమునందుననూ, ప్రతిష్ఠాకళాయుక్తమైన గురులింగము స్వాధిష్ఠాన చక్రమునందుననూ, విద్యాకలాయుక్తమైన శివలింగము మణిపూరక చక్రమునందుననూ, శాంతికలాయుక్తమైన జంగమ లింగము అనాహత చక్రమునందుననూ, శాంత్యాతీత కలాయుక్తమైన ప్రసాదలింగము విశుద్ధ చక్రమునందుననూ, శాంత్యాతీతోత్తర కలాయుక్తమైన మహాలింగము, ఆజ్ఞాచక్రము నందునను ఉండునని వీరశైవయోగులు వర్ణించి చెప్పిరి.

శివయోగ సామర్థ్యమును గడించిన సద్గురువు శివుని మస్తకము మీద తన యమృతహస్తమును పెట్టినయప్పుడు, శిష్యుని శరీరము నందున నుండే ఆధారాది చక్రములు జాగృతినిగొని, యధోముఖమై యుండెడి శక్తి యూర్ధ్వముఖి యగును. శాంత్యాతీత కలారూపమైన పరాశక్తి యూర్ధ్వమున పయనించి బ్రహ్మరంధ్రము వైపు ప్రవహించును. బ్రహ్మరంధ్రమును పశ్చిమ చక్రమని పిలుతురు. అప్పుడు శ్రీ గురువు, పశ్చిమ చక్రమును చేరిన చిత్కళను, అంకుశముద్రచేత యాహ్వానించి శిష్యుని యిష్ట లింగమునందున స్థాపించును. ఇదే విధిన శిష్యుని ఆ జీవకళయనబడెడి ప్రాణశక్తిని ఆకర్షించి అదే లింగమున నిలుపును. ఈ లింగమును శిష్యుని ప్రాణములతో తాదాత్మ్యమును పొందించి, శిష్యునికి యనుగ్రహించును. ఈ విధిన గురుకరుణచేత ప్రాప్తమైన లింగము శిష్యుని ఆత్మ మరియు ప్రాణస్వరూపములునైయున్నది. ఇప్పుడది జడ వస్తువుకాదు. సంస్కార విశేషములచేత చైతన్యమూర్తియై విరాజిల్లును. సంస్కారము వలన జడము, చైతన్యముగా పరిణమించుననెడి విషయము శాస్త్ర సమ్మతమై యున్నది. ఇది అందరి యనుభవములోనికి వచ్చెడి విషయమే! ఈ విషయమును స్పష్టపరచెడి యుపనిషద్వాణిని గనుడి :

**శ్లో॥ తస్మాద్వా ఏతస్మా దాత్మనః ఆకాశః సంభూతః। ఆకాశాద్వాయుః । వాయోరగ్నిః । అగ్నేరాపః**
**అద్భ్యః పృథివీ । పృథివ్యా ఓషధయః । ఓషధిభ్యోఽన్నం। అన్నాత్పురుషః। సవా**
**ఏష పురుషోఽన్నరసమయః ।** (తైత్తిరీయోపనిషత్-2-1)

చిద్రూపమైన పరమాత్మతత్వమునుండి, సామాన్యముగా జడములని తోచెడి పంచమహా భూతములు, వాటినుండి వనస్పతి, దానినుండి అన్నము, అన్నమునుండి పురుషుడు నేర్పడిరని ఉపనిషద్వాణి తెలుపుచున్నది. చైతన్యయుతమైన దానినుండి జడ ముద్భవించి, దానినుండి పునః చైతన్య ముద్భవించునని యీ ప్రతిపాదన వలన తెలియుచున్నది.

శ్రీ నిజగుణుల వారి వాక్కులను గనిన యెడల యీ విషయము మరింత స్పష్టపడగలదు కనుడి :

**నిద్రెబారదిదెన్న పరిభవదుఃఖస।**
**ముద్రవెనుసువ సాయసవ నెనె నెనెదు।**
**పాపానుగుణదింద గిడ మర క్రిమిగళ।**
**రూపాగికీటపతంగాది యాగి।**

**ఆ పక్షియ కులవాగి మృగజాతి యాగిమె।**
**లాపశురూపాగి బహుబాధె గలసి**
**భూత పంచకద రూపాగి యోషదియాగి।**
**ధాతు సప్తకదరూపాగి తందెయొళు॥**
**మాతెయ సూతకరుధిరరూపాగి మత్తీతను**
**వాగువచ్చరియను కేళి**
**బాలక తరుణ జరా జీర్ణరూపాగి**
**మేలె నరగియాగి బళికీ క్రమదొళు॥**
**తాళలారెను తనుపను శంభులింగవే**
**పాలిసెందరగి బిన్నైపె భీతియొళు।**

శివయోగుల వాక్కు యొక్క తెలుగు రూపమును గనుడి :

**నిద్రరాదిది నా పరిభవ దుఃఖ స**
**ముద్రమనియెడి సాయసము దలచి తలచి ॥**
**పాపానుగుణముచే చెట్టు చేమ క్రిముల ।**
**రూపమై కీటపతంగాదులై॥**
**ఆ పక్షి కులమై మృగజాతియైయే**
**లున నా పశురూపమై బహుబాధలందు గలసి**
**భూత పంచకము రూపమై యోషధియై**
**ధాతు సప్తకము రూపమై తండ్రిలో॥**
**మాతయొక్క సూతకపు రుధిరరూపమై మళ్ళీ తను**
**వయ్యె తను యచ్చెరువును విని**
**బాలక తరుణ జనా జీర్ణరూపమై**
**మేలున నరకియై వెనుకీ క్రమములో॥**
**తాళజాలను తనువును శంభులింగమా**
**పాలించ నెరిగి విన్నవించితి భీతిలో॥**

తనదైన ప్రాకృతిక సంస్కారబలముచే ప్రకృతి, జడమును చేతనాయుతమైన దానిగా పరివర్తించుచున్నది. మన స్థూల శరీరములన్నియును అన్నమయమనియెడిది సర్వానుభవ సిద్ధమైన విషయము తల్లిదండ్రులు తినిన అన్నమే సప్త ధాతువుల రూపమునందున పరివర్తన పొందును. భుజించిన అన్నము నొక్కదినము పిదప రసమగును. రసము నైదు దినముల వరకు పక్వమై రక్తమగును. రక్తము నైదు దినముల వరకు పక్వమైన పిదప మాంసమగును. అదే విధిన మాంసము మేధస్సుగను, మేధస్సు అస్థిగను, అస్థి మజ్జగను, మజ్జ వీర్యముగా పరివర్తనను పొందుచున్నది. ఈ విధముగా మనము నీ దినము తినిన యన్నము తొంబది దినములలో వీర్యమగును. అనుదినమున జరుపెడి ప్రాకృతిక సంస్కారము వలననే యన్నము వీర్యమగును. ఈ వీర్యకణములోనే భావి ప్రజ యతి సూక్ష్మమైన జీవుల రూపమున నివసించి యుండును. బాల్యమునుండియూ తయారయ్యెడి యీ వీర్యము ఇరువది మూడు వర్షముల ప్రాయము వరకు నొక పరిపూర్ణమైన రూపమును పొందును. ఇదే ప్రకారము ఆడపిల్లల శరీరము నందుననూ సప్తమ ధాతువు సూతకు రుధిరమని యనిపించికొనును. ఇది వారి పదునెనిమిది నుండి ఇరువది సంవత్సరములవరకు పూర్ణరూపమును దాల్చును. ఈ పరిపూర్ణత్వమును పొందిన మాతాపితల సంయోగము వలన కలిసిన రేతస్సు మరియు రుధిరముల వలననే మాత యొక్క యుదరమున శిశువుగా పరిణమించుచున్నది. ఇట్టి యీ విషయము ఛాందోగ్యయుపనిషత్తు అయిదవ అధ్యాయములోని మూడవ ఖండము నుండి తొంబదియవ ఖండము వరకు నెంతో సుందరమైన కథ మూలకముగాతెలియపరచబడినది.

ఆరుణి మహర్షి యొక్క కొడుకు శ్వేతకేతువు ఒకానొక దినమున పాంచాల దేశపు జైబలిరాజు సభకు వచ్చెను. ఆ సభయందు జైబలి ప్రవాహణుడు శ్వేతకేతునితో యిట్లనెను. నీవు నీ తండ్రి వలన జ్ఞానార్జనను చేసితివా? దానికి శ్వేతకేతువు చేసితిని అని ఉత్తరమునిచ్చెను. జైబలి స్వేతకేతువుతో "ఈ లోకమును త్యజించిన జీవులు ఎక్కడికి పోవుదురు? మరల ఈ లోకమునకు ఎటుల వచ్చెదరు? దేవయాన మరియు పితృయాన మార్గములేవిధముగా భిన్నములైయుండును? పితృలోకము ఇంకను నిండలేదెందులకు? అయిదవ ఆహుతియందు పురుషుని వ్యుత్పత్తి ఎటుల అగుచున్నది? అనెడి అయిదు ప్రశ్నలనడిగెను. శ్వేతకేతువు ఒక్కదానికైనను వుత్తరము నీయజాలకుండెను. తండ్రివలన జ్ఞానార్జనము చేసి వచ్చితినని చెప్పిన శ్వేతకేతువు భగ్న హృదయుడై తన తండ్రి సమీపమునకు వచ్చి రాజా స్థానమునం దు నడిచిన విషయములన్నింటిని వివరించెను. ఆ ప్రశ్నలకు ఉత్తరములను ఆరుణి మహర్షిని అడిగెను. మహర్షియు ఉత్తరముల నీయజాలకుండెను. అప్పుడే ఆరుణి మహర్షి తెలిసికొనవలెనెనెడి జిజ్ఞాసతో స్వయముగా జైబలిరాజు యొక్క ఆస్థానమునకు వచ్చెను. రాజు అతిథియైన మహర్షికి పూజాదులను చేసి సత్కరించి తమకు ఏమి సంపత్తు కావలెను? అని ప్రశ్నించెను. అప్పుడా మహర్షి ఓ మహారాజా! నాకు భౌతిక సంపత్తు ఏదియు అవసరములేదు. నా కుమారుని అడిగిన ప్రశ్నలకు వుత్తరము యిచ్చిన చాలును. అదే నా యొక్క దక్షిణా సంపత్తు అగును అని కోరికొనెను.

మహర్షి యొక్క ప్రార్థనానుసారముగా జైబలి ప్రవాహణుడు, మొదట పంచాగ్ని విద్యను తెలియజేసి పంచమాగ్నియందు హోమము చేసిన పిదప పురుషుని యుత్పత్తి యగునని తెలియపరచెను. దానికి వివరణనిస్తూ ఓ గౌతమ గోత్రజా! ద్యులోకమనెడి అగ్నియందు ప్రథమముగా దేవతలు శ్రద్ధ యనెడి హవిస్సును హోమము చేయగా, సోముడు అనెడి రాజు యొక్క ఉత్పత్తి అయినది. ముందుననే పర్జన్యమనెడి అగ్నియందు దేవగణములు సోముని ఆహుతి చేయగా మేఘములై వృష్టి వుత్పన్నమైనది. అనంతరము పృథ్వి అనే అగ్ని యందు వృష్టిని ఆహుతి చేయగా అన్నము ఉత్పత్తి అయినది. ఆ మీద పురుషుని జఠరాగ్నియనెడి అగ్నియందు అన్నమును హోమము చేయగా వీర్యము ఉత్పన్నమైనది. తదనంతరము స్త్రీ యనెడి యగ్నియందు వీర్యమును హవనమును చేయగా గర్భము ఉత్పత్తి అయినది. గర్భము యొక్క పరిపూర్ణ అవస్థ అనంతరము జీవి ప్రాదుర్భవించును. ఈ విధముగా "పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవంతి" అని తెలియపరచెను. ఈ విధముగా అయిదవ ఆహుతియందు పురుషుని ఉత్పత్తి విధానమును తెలియపరచెను.

ఇదే ప్రకారముగా ఈ లోకమును త్యజించిన జీవులు తమ కర్మానుసారముగా బ్రహ్మలోకమునకో పితృలోకమునకో తరలెడి విషయమును, పితృలోకమునకు పోయినవారు తాము తరలిన ధూమాది మార్గముల ద్వారానే మరల వచ్చెడిదానిని, అర్చిరాది మార్గముల ద్వారా దేవయానము, ధూమాది మార్గములద్వారా పితృయానము భిన్నమయ్యెడి విషయమును, బహుళ సంఖ్యలో క్షుద్రజీవులు 'పునరపి జననం పునరపి మరణం' అనెడి చక్రమునందు సదా తిరుగుతూ వుండుటచేత పితృలోకము ఎప్పటికిని నిండదను విషయమును తెలియపరచెను. ఈ విధముగా అన్ని ప్రశ్నలకు రాజు సమాధానము నిచ్చి ఆరణి మహర్షి మనస్సుకు సమాధానమును కల్గించి పంపించివేసెను.

ఇక్కడ మనకు ప్రస్తుతమైన విషయము ఏమనగా జీవులు భక్షించిన అన్నమే సంస్కారమును పొందుచూ పురుషరూపమును దాల్చుచున్నది. ఈ విషయము ఉపనిషత్తు ప్రమాణమువలన సిద్ధమైనది. ఇదే ప్రకారముగా తైత్తిరీయశృతి యొక్క భృగువల్లిలోని రెండవ అనువాకమునందు గల "అన్నయి బ్రహ్మేతి వ్యజానాత్। అన్నాదేవ ఖల్విమాని భూతాని జాయంతే। అన్నేన జాతాని జీవంతి। అన్నం ప్రయంత్యభి సంవిషంతీతి।" అనెడి మంత్రమైనను ఇదే మాటను దృవపరచి చివరకు అన్నమునే బ్రహ్మముగా తెలియపరచినది.

అన్నరసము వలన కలిగెడి శుక్రశోణితములు, ప్రజోత్పత్తికి కారణములై యుండుటచేత "అన్నమ్ వై ప్రజాపతిస్తతోహవై తద్రేతస్తత్మాదియాః ప్రజాయంత ఇతి" (ప్రశ్నోపనిషత్తు 1-14)

అనెడి మంత్రము అన్నమునకు ప్రజాపతి అనెడి సంజ్ఞను ఇచ్చినది.

ఈ విధముగా అన్నమునుండి ప్రజోత్పత్తి జరుగుననెడి సుదీర్ఘమైన విచారముచేత జడవస్తువునకు యోగ్యమైన సంస్కారమును చేసిన పిదప అది చేతనముగా పరివర్తించునని, లేదా సుప్తచేతనము సంస్కారముచేత ప్రకటనమగుననియును అందరికీ అవగతమైనది. అటులనే శివయోగ సామర్థ్యమును పొందిన సద్గురువులచేత శాస్త్రోక్త విధి ప్రకారము సంస్కరించబడిన శైలజ శివలింగమునందు శిష్యుని మస్తకమునందలి చిత్కళయు వ్యక్తమగుననెడి విషయములో సందేహముండకూడదు.

## ఇష్టలింగమునందున శిష్యుని ప్రాణసంయోజన :

ఇంకా శివకళాయుక్తమైన శివలింగమునందు సద్గురువులు శిష్యుని ప్రాణమును ఆకర్షించి దానిలో సంస్థాపించి, శివకళ, మరియు జీవకళ భరితమైన శివలింగమును శిష్యుని ప్రాణముతో తాదాత్మ్యమును చేసి ఆలింగమును శిష్యుని హస్తమునందున వుంచవలెనని జగద్గురువులవారు ఆదేశమునిచ్చిరి. దీనియొక్క రహస్యార్థమును యిచట విచారింతుము గాక.

వీరశైవ ధర్మమునందు చేయబడెడి లింగదీక్ష యనగా అంగ లింగముల వివాహమే అని యెఱుంగవలెను. ప్రపంచములోని వనితాది వ్యామోహమునుండి దూరమగుటకు తననే లింగముయొక్క సతిగా భావించునది వీరశైవ ఆచార్యులు కల్పించిన ఒక శ్రేష్ఠమైన మార్గము.

రేణుక భగవత్పాదుల వారి ఈ ఉపదేశమును గనుడి :

**శ్లో॥ అంగలింగీ జ్ఞానరూపః సతీజ్ఞేయః శివః పతిః**
**యత్సౌఖ్యమ్ తత్సమావేశే తద్వాన్ శరణనామవాన్** (సి.శి. 13-2)

ఈ ఉపదేశమున భగవత్పాదులవారు సాధకుడు శరణస్థలమును చేరిన పిదప అంగలింగములయందు సతిపతి భావన పరిపూర్ణావస్థను పొందునని తెలియజేసిరి.

**"యథాస్త్రీయా సంపరిష్వక్తీర్తన బాహ్యం కించన**
**వేదనాంతరమ్ ఏవ మేవాయం పురుషః**
**ప్రజ్ఞానేనాత్మనా సంపరిష్వక్తో న భాగ్యం కించన**
**వేదనాంతరం"** అనెడి ఉపనిషత్తు మంత్రమైనను లౌకిక సతీపతులు రతిసుఖము యొక్క పరాకాష్ఠ యందు క్షణకాలము అభిన్నులైయుండినటులే శ్రేష్ఠమైన సాధకులు ఉపాసనయొక్క పరాకాష్ఠను చేరిన పిదప ఉపాస్యము తోడుగా అనంతకాలము వరకు సమరసులు అగుదురని ప్రతిపాదించినది. తన యిష్ట దేవతను పతిగా భావించి తనకు తాను సతిగా తెలిసికొని అలౌకిక సతిపతి భావనతో ఇష్టదైవమును ఆరాధించెడి పద్ధతియు ఉపనిషత్కాలమునుండియు ప్రసిద్ధమై యున్నది. వీరశైవ సిద్ధాంతమునందున ఆచార్యులు దీనిని ఎంతో ఘనముగా ప్రచారమునకు తెచ్చిరి. అందుకే సద్గురువులచేత లింగదీక్షను పొంది భక్త, మహేశ, ప్రసాది మరియు ప్రాణలింగి స్థలములను దాటి శరణస్థలమును చేరిన అక్కమహాదేవి, గణదాసి వీరన్న, షణ్ముఖస్వామి మరియు ఉరులింగ దేవర మొదలగు అనేక శరణులు తమ అనుభావ వచనములందు ఇదే భావమును వ్యక్తీకరించిరి.

ఈ అక్కగారి వచనమును గనుడి :

**భవవిల్లద భయ విల్లద నిర్భయ చలువం గొలిచెనాను**
**కులసీమ యిల్లద నిస్సీమ చెలువంగె నావొలదె**
**ఇదు కారణ చెన్నమల్లికార్జున చెలువ గండననగె**
**ఈ సావకె ప్రవ గండరనొయ్దు ఒలెయొళగిక్కు**

అక్కగారి వచనపు తెలుగు రూపమిది :

**భవములేని భయములేని నిర్భయ చెలువువాని వలచితిని నేను**
**కులసీమ లేని నిస్సీమ చెలువుని నెను వలచితిని**
**ఇది కారణము, చెన్న మల్లికార్జునుడు చెలువు గండడు నాకు**
**ఈ చావును చెరిచెడి గండని యెత్తి పొయ్యిలోకి వేయుము**

గణదాసిగారి వచనమును గనుడి :

**నమ్మగణంగళ సహాయదింద ఏనేను ఫలపదవి ఎందొడె**
**అష్టావరణంగళు సాధ్యవాదవు**
**సాధ్యవాద కారణ, శ్రీగురువు ఎన్నకరస్థలక్కె**
**లింగవ కొట్ట - ఎందెందిగూ సతి పతి భావ**
**తప్ప బేడెందు, గణసాక్షియు మాడి,**
**నీను అంగవాగి లింగవే ప్రాణవాగిరి ఎందు**
**ఇబ్బరిగూ ఆజ్ఞెయ మాడిద కారణ,**
**ఎన్నంగవే నిన్నంగ, నిన్నంగనే ఎన్నప్రాణ**
**ఎన్న ప్రాణవే నిన్న ప్రాణ...**
**శాంత కూడల సంగమదేవ**

గణదాసిగారి వచనము యొక్క తెలుగు రూపమిది :

**మా గణముల సహాయము చేత ఏమేమి ఫల పదవి యనినచో**
**అష్టావరణములు సాధ్యమైనవి**
**సాధ్యమైన కారణము, శ్రీగురువు నాకరస్థలమునకు లింగమునిచ్చెను**
**ఎప్పటికైననూ సతి-పతి భావము తప్పవలదని**
**గణమును సాక్షినిచేసి, నీవు అంగముగా లింగమే ప్రాణమై యుండుమని**
**ఇద్దరికీ ఆజ్ఞను ఇచ్చిన కారణమున**
**నా అంగమే నీ అంగము, నీ అంగమే నా ప్రాణం**
**నా ప్రాణమే నీ ప్రాణము.....**
**శాంత కూడల సంగమ దేవా**

షణ్ముఖస్వామి వారి వచనమును గనుడి :

**ఏలె శివనె! నీను ఎన్న మెచ్చి కైవిడిద కారణ**
**ఎమ్మవరు సకల గణంగళ సాక్షియమాడి**
**నినగె ఎన్న మదువెయమాడి కొట్టరు...**
**అఖండేశ్వరా!**

షణ్ముఖస్వామి వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**ఓయీ శివుడా! నీవు నన్ను మెచ్చి చేపట్టిన కారణము**
**నావారు సకల గణములను సాక్షిగా చేసి**
**నీకు నా పెళ్ళిని చేసి యిచ్చిరి...అఖండేశ్వరా!**

ఈ రీతిగా తమ యిష్టలింగమునే పతిగా కొనియాడిన శివశరణులు ఎందరో కలరు. ఈ విధముగా సాధకునియందును మరియు ఇష్టలింగమునందున సతిపతి భావన అలవడిన పిదప సాధకుని ప్రాణము ఇష్టలింగమునందున, శివకళాయుక్తమైన ఇష్టలింగము సాధకుని ప్రాణలింగమునందున సమరసమగునది గలుగును.

లౌకిక వివాహ సంస్కారమైనను సతీపతుల పరస్పర ప్రాణములను సమరసము చేయుచున్నది. ఇది యెటులనిన ఎక్కడో జన్మించి పరస్పరము పరిచయమేలేని వరుడు మరియు కన్యలను ఒక్క కడకు తెచ్చి గురువు, పెద్దల సాక్షిగా కన్యాదాన, వరప్రతిజ్ఞ, వధూవరుల సంకల్పము, అక్షతారోపణ, పరస్పర మాల్యార్పణ, మాంగల్యధారణ, బ్రహ్మబంధన, ఉమామహేశ్వరపూజ, పాణిగ్రహణ, సప్తపది, పంచకలశతీర్థ ప్రోక్షణ మరియు నాకబలి, మొదలగు విధానములు శాస్త్రోక్త పద్ధతిచేత నెరవేరిన పిదప కన్య వరుని గృహమున ప్రవేశించును.

ఈ వివాహ సంస్కారము అయ్యేడి దానికంటెను పూర్వమున పరస్పర పరిచయము ఎక్కడాలేని వరుడు మరియు కన్యసంస్కార మహోత్సవము వలన దంపతులగుచున్నారు. ఈ సంస్కారము వారిరువురి దేహములను ఒక్కటిగా చేయు ఒకానొక చర్యకాదు. పరస్పరము ప్రాణములను, మనస్సులను ఒక్కటిగా చేసెడి మహత్వపూర్ణమైన సంస్కారము. అందుచేత పతియొక్క ప్రాణము నందు పత్ని యొక్క ప్రాణము, పత్ని యొక్క ప్రాణము నందు పతియొక్క ప్రాణము సమరసమగుచున్నవి. ఇదే ప్రకారముగా సతీపతుల యొక్క మనస్సులు పరస్పరము సామరస్యము పొందియుండును. దేహములు రెండైననూ వారిరువురి యొక్క ప్రాణములు, మనస్సులు ఒకటిగానేయై జీవించుచుందురు. లౌకిక లేక ఆధ్యాత్మికమైన ఏదో ఒక లక్ష్యమును సాధించవలెననిన దానికి సంబంధించినవారు పరస్పరము విచారము చేసికొని సమ్మతితో ఒక నిర్ణయమునకు వచ్చి కార్యమును సాధింతురు. గురువులు, పెద్దలు కల్పించుకొని చేసిన ఈ సంబంధమును జన్మ వున్నంతవరకు సతీపతులు పరిపాలించుచుందురు. పాలు, తేనెలవలె సమరసమై జీవింతురు. ఇదే నిజమైన బ్రతుకు. ససారమైన జీవితము. దీనికి విపరీతమైన సంబంధము కలిగిన దంపతులు వైషమ్య భావములు గలిగివుందురు. అదే కంటికెదురుగా కన్పట్టెడి దుఃఖదాయకమైన సంసారము.

అన్యోన్యముగా ప్రేమతో జీవించెడి దంపతులు తాము ఎప్పుడూ దూరము కాకూడదని యోచించుచుందురు. ఇంతేకాదు. భారతీయ పతివ్రత మున్ముందున అనేక జన్మలయందు ఇతడే తనకు పతియై దొరకవలెనని తన ముగ్ధ భావనను భగవంతునికి నివేదించుకొనును.

ఈ విధముగా పరస్పరము సంబంధములేని స్త్రీ పురుషులు ఒకటియై అనురాగపూరితమైన జీవితమును అనుభవించుటకు గల కారణములు ఎట్టివి? లోతుగా పరిశీలించిన యెడల వారిరువురి మధ్యన నెలకొనియుండెడి పరస్పర ఆకర్షణ, విషయవాంఛలు, మరియు సంతానమును పొందవలెననెడి కోరికలు ముఖ్యమైన కారణములుగా కనిపించును. సంతానప్రాప్తికి పూర్వమునందున వారిరువురు మనస్సులయందు తాదాత్మ్యము పొందిన యటులనే సంతానోత్పత్తి పిదప వారిరువురి మనస్సులు మరియు ప్రాణములు సంతతియొక్క మనస్సులలోను ప్రాణములోను తాదాత్మ్యత పొందును. ఇది అందరి అనుభవములోనికి వచ్చెడి విషయమే. అయినను దీనికై ఒక దృష్టాంతమును చూచెదము గాక.

గ్రామీణ ప్రదేశమునందు ఒక పేద కుటుంబము వుండెను. కృషికాయకమే వారి జీవనోపాయమై యుండెను. దంపతులకు ఒక్కడే మగ సంతానము. వీరిరువురు కొడుకును ఎంతో వాత్సల్యముతో పెంచిరి. తల్లిదండ్రుల జతకు కృషి కాయకమునందు మనసారా కష్టపడి నాగలి యోగి యనిపించుకొనెను. కొడుకు వివాహ యుక్త వయసుకు వచ్చెను. అది గమనించిన తల్లిదండ్రులు తమవలెనే అతగిని గృహస్థుని చేయుటకై యోగ్యురాలైన కన్యను వెదకి వివాహ కార్యమును గురువుల మరియు పెద్దల సన్నిధిన నెరవేర్చిరి. నూతన దంపతులు భక్తితత్పరులై, కృషికాయక నిష్ఠగలవారై, కాలమును గడుపుచుండిరి. కొంతకాలము గడిచిన పిదప వారికొక మగ సంతానము గలిగెను. నూతన దంపతులు ఏ పనియందు నిమగ్నులైయుండినను మనసు మాత్రము వారి కొడుకుపైననే నిలిచియుండెను. అది స్వల్ప విషయమైనను చేతియందు పనిని ఆపి వేసి తక్షణమే యిరువురును కొడుకు దగ్గరికి వచ్చుచుండిరి. పొలమునందుననే యిల్లు యుండెను. ఒకనాడు ఇంటియందున వయోవృద్ధులైన తల్లిదండ్రులు తమ మనుమడిని ఆడించుచు ఇంటి పడసాలలో కూర్చునియుండిరి. పిల్లవాని తల్లి వంటగదియందు వంట చేయుచు పనిలో నిమగ్నురాలై యుండగా తండ్రి పొలమునందున కార్యాసక్తుడై యుండెను.

ఎండకాలమైనందున ప్రాతఃకాలమున పనిచేయుచుండగనే సూర్యుని తేజస్సు తీక్షణము కాజొచ్చెను. పిల్లవాని తండ్రి సూర్యోదయమునకంటే ముందుననే పొలమునందు కార్యాసక్తుడై యుండెను. పని వత్తిడి మూలమున ఆకలి, దప్పికను లెక్కించకుండా, ఎండ యొక్క తాపమును లక్ష్యము చేయకుండా కష్టపడుచునే యుండెను. మనుమడిని ఆడించుచూ కూర్చొనియున్న తాత పొలము నందు కష్టపడెడి తన కొడుకును పిలిచి, ఎండ తగ్గునంతవరకు విశ్రాంతి తీసికొనుటకై మరియు భోజనమును చేయుటకై ఆదేశమునిచ్చెను. తండ్రిగారి పిలుపును లెక్కచేయక అతని కొడుకు, పొలములో పనిచేయుచునే యుండెను.

తాను నీడలో కూర్చొని యుండినను, తనదేయైన రక్తమునకు చెందినవాడగు తన కొడుకు ఎండలో పరితపించునది చూసి ముదుసలి సహించజాలకుండెను. కొడుకును పిలిచి, విసిగివేసారిపోయెను. కొడుకు పొందెడి దైహిక బడలిక వలన తన కయ్యెడి సంతాపమును తాళజాలక ఆ వృద్ధుడు ఒక ఉపాయమును ఆలోచించెను. తన కొడుకునకు బుద్ధి కలిగించవలెనని నిర్ణయించుకొనెను. తన తొడ మీద ఆడుకొనుచున్న పసికూనను ఎండచేత భగభగమని మండుచున్న నేలమీద పరుండబెట్టెను. ఆ పసికూనకు కాగుచున్న ఇనుప పెనముమీద కూర్చుండబెట్టినట్లైనది. తాపమును సహించని పసికూన బిగ్గరగా ఏడ్వజొచ్చెను. పొలములో పనిచేసెడి యువకుడు తన బిడ్డడి ఆర్తధ్వనిని వినెను. వాని నెత్తిమీద పిడుగు పడినట్లయ్యెను. తనచేతి యందున్న పనిని అక్కడనే వదిలి పరిగెత్తికొనివచ్చి పసివానిని ఎత్తికొని సముదాయించుచు తన తండ్రిగారి అనుచితమైన కార్యమునకు కోపగించుకొనెను. రెచ్చిన కోపావేశముతో తన తండ్రితో ముదుసలివైయున్నావు. ఇది నీకు తెలియదా? పసికూనను మండుటెండలో వేయుదురే? అనుచు పలు దుర్భాషలాడెను.

అనుభవజ్ఞుడైన ఆ ముదుసలి తన కొడుకుతో నీ కొడుకు ప్రాణములతోడ నీ ప్రాణములు తాదాత్మ్యము పొందియుండునటులే నా ప్రాణములు నీ ప్రాణములతో తాదాత్మ్యము పొందియున్నవి. నీవు ఎండలో అనుభవించుచున్న కష్టమును చూసి నేను తాళలేకపోయితిని. నేను నిన్ను ఎన్నోసార్లు పిలిచినను నీవు నా పిలుపును లక్ష్యము చేయలేదు. నేను పడే వేదన నీకు అవగతము కాలేదని యెఱింగినవాడనై, అట్టి వేదననే కలిగించిన యెడల నీకు జ్ఞానోదయమగుననియును యెంచితిని. అందుకే నీ కొడుకును యెండలోనికి తెచ్చివేసితిని. తెలిసినదా? అప్పుడు కొడుకునకు తన తండ్రిగారి అంతరంగము యొక్క భావము అవగతమయ్యెను. చూచితిరా? తండ్రి పిల్లల పరస్పర ప్రాణమునకు చెందిన తాదాత్మ్యత!

వివాహ సంస్కారము లౌకికమైనందున ఈ ప్రేమ యొక్క తాదాత్మ్యము సీమితమైయుండును. అయితే దీక్షా సంస్కారము అట్టిదికాదు. ఇది అధ్యాత్మికపరమైనది. లింగమునందున సాధకుడు తాదాత్మ్యమును పొందును. దీనియర్థమేమనగా జీవుడు మొత్తము విశ్వముతో తాదాత్మ్యమును పొందుచున్నాడు. శివునికి, విశ్వమునకూ అభేదమే కదా? ఈ కారణము వలన లింగభక్తుడు విశ్వకుటుంబియగుచున్నాడు.

వివాహ సంస్కారము సతిపతులను పరస్పర తాదాత్మ్యము చేయునటులే ఏకాగ్రచిత్తము, దృఢవ్రతము పంచేంద్రియార్పణ, అహింస, లింగనిష్ఠ, మనోలయము లనెడి ఏడుభాగములు గల వేదాదీక్షయు, సమయ సంస్కారము, నిస్సార సంస్కారము, నిర్వాణ సంస్కారము, తత్త్వ సంస్కారము, ఆధ్యాత్మిక సంస్కారము, అనుగ్రహ సంస్కారము అనెడి ఏడు భాగములు గల మంత్రదీక్షయు ఉపమా సంస్కారము, స్వస్తికారోహణ సంస్కారము, విభూతిపట్టా సంస్కారము, ఆయత్త సంస్కారము, మరియు స్వాయత్త సంస్కారములు భాగములుగా గల క్రియాదీక్షయు గలిగి మొత్తము ఇరువదియేడు సంస్కారములతో గూడిన దీక్షను గురువు శిష్యునికి నొసంగుచున్నాడు. అంతేకాదు. ఆ లింగమునందు చిత్కళను, శిష్యుని ప్రాణమును స్థాపించి ఆ లింగమును శిష్యునిని ప్రాణమున ప్రతిష్ఠాపనచేసి ఆ పిదప లింగమును శిష్యుని కరస్థలమున పెట్టుచున్నాడు.

ఇక్కడ గమనించవలసిన విషయమేమనగా భార్యాభర్తల మధ్య వుండెడి పరస్పర అనురాగమునకు వివాహ విధిలోని వివిధ సంస్కారములే కారణములని యెంచుటకు వీలులేదు. వారియందు పరస్పరము నెలకొనియున్న విషయాసక్తి, మరియు సంతానాపేక్షలు కారణమైన యటులనే సంస్కారము పొందిన శిష్యునిలో సంసారము యెడల విముఖత, విషయ సుఖముల యెడల జుగుప్స, ప్రబలమైన లింగభక్తి మరియు సాయుజ్యమును పొందవలెననెడి కోరిక మొదలగునవి వుండవలెను. అప్పుడే ఆతడు లింగప్రాణి యగుచున్నాడు.

శ్రీరేణుక భగవత్పాదులవారు లింగధారణ స్థలమును ఉపదేశించుటకు మునుపే వివిధ స్థలములయందు దీక్షను పొందుటకు అభిలాషయున్న శిష్యునికి వుండవలసిన యోగ్యతల గురించి ఉపదేశమును యిచ్చిరి. అట్టి యోగ్యతలు గలవాడే లింగప్రాణియు, ప్రాణలింగియు కాగలడు. లింగమును ధరించే ప్రతిఒక్కరు లింగప్రాణులు కాజాలరు. యీ విషయమును వివరించి చెప్పెడి యీ వచనమును గనుడి :

**"సత్తు హోగువవరెల్ల స్వర్గపదస్థరే? అల్లల్ల**
**కైదువ పిడిదవరెల్ల మహాకలిగళే? అల్లల్ల**
**లింగవ ధరిసువవరెల్ల లింగప్రాణి గళే? అల్లల్ల**
**అదేను కారణవెందడె కపియకైయల్లి రత్నవకొట్టదెజె**

**అదుహణ్ణెందు కడిదునోడి, కల్లెందు బిసువుటల్లదె**
**ఆ రత్నద దివ్యబెళగనరివెదే అయ్యా?**
**ఇంత దృష్టదంతె, మడ్డజీవి గళకైయల్లి దొడ్డలింగ విర్దదేను?**
**ఆ లింగ దల్లి మహాఘన పరమ కళెవనరియద బళిక**
**అదుఒడ్డు కల్లినంతె కండెయా అఖండేశ్వరా!**

దీని తెలుగు రూపమిది :

**చచ్చిపోయెడివారెల్ల స్వర్గస్థులే? కారు కారు**
**కైదువు పట్టిన వారందరూ కలులే? కారు కారు**
**అదేమి కారణమనినచో**
**కపి చేతికి రత్నము నిచ్చినచో పండని కరచి చూచి రాయని విసురునే కాని,**
**ఆ రత్నపు దివ్యమైన వెలుగు నరయునే అయ్యా!**
**ఇట్టి యీ దృష్టము వలె**
**మడ్డిజీవుల చేతినందున దొడ్డలింగమున్ననేమి?**
**ఆ లింగమునందున మహాఘనమైన పరమకళనరయని వెనుక**
**అది యొడ్డు రాయివంటిదే**
**కంటివా, అఖండేశ్వరా?**

యోగ్యతలేని సాధకునికి లింగమైనను శిలగానే కనిపించును. అందుకే పందచేతికి చంద్రాయుధమును అంధుని చేతికి దర్పణమును, మర్కటము చేతికి మాణిక్యమును యిచ్చిన ఎట్టి ఫలితముండునో అట్టి ఫలితములే శివతత్త్వము నెరుగనివారికి లింగమిచ్చిన పిదప కలుగగలవని బసవణ్ణవారు శెలవిచ్చిరి. మరొక్క మాటలో చెప్పవలెనని అట్టివారికి లింగధారణ చేయుటవలన ఎట్టి ప్రయోజనముండదు. లింగప్రాణి గురించి తెలిపెడి యీ వచనమును గనుడి :

**శ్రీగురువు ఎన్న కరస్థలక్కె లింగవ కొట్ట-ఎందెందిగూ**
**సతి-పతి భావ తప్పబేడెందు, గణసాక్షియంమాడి,**
**నీను అంగవాగి, లింగప్రాణివాగిరి యెందు**
**ఇబ్బరిగూ ఆజ్ఞమాడిన కారణ, ఎన్నంగవె నిన్నంగ**
**నిన్నంగవే ఎన్నప్రాణ, ఎన్న ప్రాణవె నిన్న ప్రాణ**
**నిన్న ప్రాణవే నిన్న ప్రాణవాదమేలె, ఎన్నమానాపమాన**
**ఎన్నహాని వృద్ధి నిమ్మదయ్య... శాంత కూడల సంగమదేవా?**

దీని తెలుగు రూపమిది :

**శ్రీగురువు నా కరస్థలమునకు లింగము నిచ్చెను**
**ఎప్పటెప్పటికి సతిపతి భావము తప్పవలదని,**
**గణసాక్షినిచేసి, నీవు అంగమై లింగము ప్రాణమైయుండిరని**
**ఇద్దరికీ ఆజ్ఞనిచ్చిన కారణమున, నా అంగమే నీ యంగము**
**నీ అంగమే నా ప్రాణము, నా ప్రాణమే నీ ప్రాణము**

**నీ ప్రాణమే నా ప్రాణమైన పిదప, నా మానపమానములు నీ వయ్యా**
**నా హానివృద్ధులు నీవయ్యా.... శాంత కూడల సంగమ దేవా!**

గణదాసి వీరన్నయనెడి శరణుడు యోగ్యుడైన శిష్యునికి గురువు లింగదీక్షను యిచ్చినయెడల వాడు లింగ ప్రాణియగునని తనకు తానే ఒక ఉదాహరణగా నొసంగిన వాడయ్యెను.

ప్రాచీనకాలములోని ఋషులు ప్రతిపాదించిన వివాహ విధి యొక్క తెలివిడిలేని ఇప్పటి సమాజములోని దంపతులెందరో తమతమ జీవితములలో పొందిక లేకుండగ బాధకు గురియగుచున్నారు. అదేవిధిన వీరశైవుల లింగ భక్తియు తగ్గుముఖము పట్టుచున్నది. కాలము ప్రభావమో, ప్రచారము యొక్క అభావమో, యోగ్యత యొక్క శూన్యతనమో మరేదో విషయము కారణమైయుండును. ఇది యెంతో బాధకరమైన విషయము. ఇంతకుక్రితము భక్తియందు వీరులై, వీరశైవులు అనిపించుకొనిన మనము మన వీరత్వమును తగ్గించుకొనకూడదు. మన నిజమైన సంపత్తు లింగమేననియును, మనము పుట్టినప్పటినుండియు గిట్టేటప్పటివరకు మనవెంబడి వుండెడి నిజమైన సఖుడు లింగమేననియును తెలిసికొనవలెను. ఈ మర్మమును ప్రతియొక్క వీరశైవుడు గ్రహించవలసిన అవసరమున్నది. ఒకవేళ యోగ్యతలేనిదే ఇష్టలింగము సంప్రాప్తమైన యెడల క్రమక్రమముగా భక్తిని పెంచుకొని లింగప్రాణి యగుటకు ప్రయత్నించవలెనే కాని లింగమునకు దూరమై నామమాత్రమైన లింగవంతునిగా మారుటలో ఔచిత్యము వుండదు.

శిలాలింగమునందు చిత్కళను ప్రతిష్ఠాపించెడి శాస్త్రీయ సంస్కారము, మరియు దానిలోని విశేషములు జనసామాన్యమునకు అవగతమయ్యెడి అవసరమున్నదని తెలుసుకొనవలెను. ఈ విషయములను విదితము చేయుటకే వైవాహిక సంస్కారమును ఉదాహరణముగా గైకొననైనది. అదేవిధిన జడపదార్థమైన లింగములో చైతన్యమెట్టులుండునను విషయములో సామాన్యులకు అర్థము కావలెననే ఉద్దేశ్యముతో లౌకిక ఉదాహరణములను యివ్వనైనది. ప్రౌఢ జిజ్ఞాసువులకు యివియన్నియును అవసరములేదు. వారికి ఇవి సామాన్యముగా దోచిననూ, సామాన్యజనులకు తెలియపరచుటకై లౌకిక ఉదాహరణములే ఉపయోగపడునని గ్రహించవలసిన విషయము.

శివకళ, మరియు జీవకళతో కూడిన ఇష్టలింగమును ప్రతియొక్క సాధకుడు అవధానపూర్వకముగా దేహము మీద ఎల్లప్పుడు ధరించియుండవలెను. లగ్నము అయినయప్పుడు సతి మెడలో మాంగల్యము కట్టి అద్దానిని పెళ్ళియైనదానికి గుర్తుగా సదా ధరించినటులే గురుకరుణ పొందిన వానికి సాక్షిగా నిలిచెడి ఇష్టలింగమును సదా మేనియందున ధరించవలెను.

ఇది అనివార్యమైన విషయమని తెలుగు బొమ్మయ్యవంటి భక్తులు స్పష్టపరచినారు.

**గురుకరుణవ పడెదుదక్కె చిహ్నావావుదెందడె, అంగదమేలె లింగ**
**స్వాయత్త వాగిర బేకు, అంగదమేలె లింగస్వాయత్తవిల్లదె ఒరిదెగురుకరుణ**
**వాయితెందడె అదెంతో? లింగవిహీన నాగి గురుకరుణ ఉంటె ఇల్ల ఆ**
**మాత కేళలాగదు, ఇదుకారణ**
**లింగధారణ వుళ్ళదె సదాచార, ఇల్లదిలె**
**అనాచార వెంబెనయ్య తెలుగేశ్వరా!**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది :

**గురుకరుణ బడసినందుకు చిహ్నమెయ్యది యనినచో**
**అంగము మీద లింగము స్వాయత్తమై యుండవలెను**
**అంగము మీద లింగము స్వాయత్తము లేనిదే**
**వట్టి గురుకరుణ యైనదనినచో అదెట్లో**
**లింగవిహీనునికి గురుకరుణ గల్గునే? కాదు**

**ఆ మాట వినకూడదు**
**ఇది కారణము, లింగధారణ గలదే సదాచారము**
**లేనియెడల అనాచారమయ్యా, తెలుగేశ్వరా!**

ఈ వచనము నందున తెలుగు బొమ్మయ్యగారు గురుకరుణకు గుర్తుగా ఇష్టలింగమే వుండవలయుననియును లింగధారణ చేయుటయే సదాచారమనియును నొక్కి చెప్పిరి. ఈ కారణమున ప్రతి యొక్క వీరశైవుడు తమతమ గోత్ర సూత్రములకు సంబంధించిన సద్గురువులవలన అవశ్యముగా లింగదీక్షను బడసి శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఆదేశించినయటుల లింగప్రాణిగా నగుటకు ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 10-08-1990
స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు శివదీక్షా ప్రదాన సమయమున లింగమునకు చేయవలసిన సంస్కారములను సవివరముగా నుపదేశించిరి.

లింగధారణ క్రమములో లింగము యొక్క ఎంపిక యెంతో కీలకమైనదని గుర్తించవలెను. శ్రీగురువు నీ విషయమున యెంతో జాగరూకుడై యుండవలెను. ధారణ నిమిత్త మెంపిక చేయబడిన దానికి విహిత లక్షణములు గలవా? లేవా? యనెడిది జాగ్రత్తగా పరీక్షించవలెను. ఈ విషయమున, క్రియాసారము మార్గదర్శక సూత్రముల నొసంగినది. వివిధాంగములు సరియైన రీతులలో గలవో లేవో చూడవలసియుండును.

శ్రీగురువు లింగమునకు విహితమగు సంస్కారములను చేయవలెను. సంస్కరింపబడిన లింగము శిల్పఖండమే. జడపదార్థమనిపించికొనును. సంస్కరణ లింగము నిత్య చైతన్యమును సంతరించికొని శివత్వమును సంతరించికొని ప్రకాశమానమగును.

శ్రీభగవత్పాదులవారు లింగముయొక్క శోధన కెక్కువ ప్రాముఖ్యతనిచ్చిరి. సామాన్యముగా లింగమునందున సహజముగా నుండెడి శిలత్వ సంబంధమైన దోషములుండుననియును, వాటిని నివారింపవలెననెడి భావనతో తన్నిమిత్తమై జలాధివాసము, చేయించెడి సాంప్రదాయము కొనసాగుచున్నది. ఇది శోధన యనెడి దానికి సామాన్యార్థములో స్ఫురించెడి భావన. లౌకికముగా చూచిన యెడల నియ్యది సరియైనదని తోచును.

శోధనయనెడి దానికి విశేషార్థమొకటి గలదేమో యనెడిది గుర్తించవలసి యున్నది. సకారాత్మకముగా చూచిన యెడల శోధనయనగా శుద్ధియే. శుద్ధి, వృద్ధికి దారితీయును అనెడిది నిత్యసత్యము కాదనలేము. పైరుకు కలుపుతీయుట సస్యవృద్ధికి దారితీయును. స్నానము చేయుటవలన దేహము శోధింపబడిననూ, నయ్యది ఆరోగ్యమును వృద్ధి చేయును. ఇచ్చట వృద్ధి యనెడిది శుద్ధి యొక్క సకారాత్మక రూపమని గ్రహించవలెను.

లింగ సంస్కారములో శోధన యనెడిది శివకళను ఆవాహనము చేయుటకు చేయబడుచున్నది. "సంస్కారః కథ్యతే తేన షడధ్వపరిశోధనమ్" అని క్రియాసారము చెప్పుచున్నది. "షడధ్వశోధన ద్వార శివకలా మావానార్థం షడధ్వ శుద్ధిం కరోతి" యనెడి ప్రయోగ నిపుణుల వాక్కు ననుసరించి లింగమునందున శివకళ నాహ్వానించుటకై చేయబడెడి క్రియను శోధన క్రియగా తీసికొనవలెను. షడధ్వశుద్ధి గురించిన విధి విధానము "వీరశైవ సంస్కార చంద్రికలో వివరముగా నివ్వబడినది. ఆసక్తి గలవారు చూడగలరు.

జలాధివాసము చేత దోష నిర్మూలనను పొంది, ధాన్యాదివాసము ద్వార దేవతా బీజత్వమును గల్గి శోధన ద్వార శివకలావాహనకై వలయు స్థితి యేర్పడును. అట్టి లింగమును అభిషేకము మరియు అష్టవిధోప చారముల ద్వార శ్రీ గురువు దానికి శివత్వ పుష్టి కల్గించవలెను. లింగమునకు పంచాక్షరి కభేదము కల్గించుటకే లింగమును మంత్రపూతము చేయవలెనని శ్రీ భగవత్పాదులవారు చెప్పిన యటుల తెలియుచున్నది. మంత్రాధ్వన్యాసము ద్వారా లింగము మంత్రపూతమగుచున్నది. ఇద్దాని వివరములు వీరశైవ సంస్కార చంద్రికలో గలవు. లింగమున శివకళను ప్రవేశింపజేయుటకై అష్టత్రింశత్ కలాన్యాసము విధింపబడినది.

శివకళా యోజన క్రమములో గురువు శిష్యుని మస్తకమునందలి చిత్కలను గ్రహించి లింగమునందు ప్రతిష్ఠించును. ఇంతకు క్రితమే శివలింగమునకు ప్రాణ ప్రతిష్ఠ జరుపబడియుండును. శివుని ప్రాణశక్తితో జీవుని చిత్కళ సంయోజనము పొందును. జీవుని ప్రాణ ప్రతిష్ఠాక్రమము ద్వార శిష్యుని

బ్రహ్మరంధ్రమున నుండెడి శివ పరబ్రహ్మను శిష్యుని ప్రాణములయందు స్థాపించబడును. ఆ పిదప లింగములోని చిత్కళను శ్రీ గురువు గ్రహించి జీవుని ప్రాణమున నిలుపుచున్నాడు. ఈ స్థితిలో నిష్టలింగమునకు, జీవుని పంచ ప్రాణములకును అభేదమేర్పడును. ఈ క్రమమును శ్రీ సోమనాథులవారు వివరించిన తీరు గమనార్హమైయున్నది.

**"సద్గురు కరుణా సముద్గత పరమ**
**చిద్గతతన్మంత్ర హృద్గత లింగ**
**సన్నిహితాంగ సత్సంగత లింగ**
**సన్నిహిత ప్రాణ సంబంధ కళల**
**సప్రాణ లింగ లింగ ప్రాణమథన"**

(పండితారాధ్య చరిత్ర దీక్షా ప్ర.)

ఈ విధముగా శిష్యుని ప్రాణములకును, మరియు శిష్యుడు ధరించబోవు యిష్టలింగమునకు నభేదమును సాధించిన పిదప నద్దానిని శిష్యుని హస్త పీఠమున నుంచవలెను. ఇది శ్రీ భగవత్పాదులవారి ఆదేశము.

దీక్షను పొందువాడు, తన పూర్వాశ్రమ స్థల వాసనలచేత, వామహస్త పీఠము గురించి కొన్ని యపోహల బెంచికొని యుండెడి యవకాశము గలదు. పరధర్మముల పుణ్యమా యని యీ అపోహలు పెరిగెడి యవకాశము గలదు. ఇట్టి యపోహలు నిరాధారమైనవి. సూర్యునికి తర్పణము నిచ్చే సమయములోను, యజ్ఞమున పూర్ణాహుతిని సమర్పించుటకును, దేవతార్చనలో నమస్కారము నాచరించుటకును వామహస్త పీఠము పఠించుట లేదా? లోకాచారము నిట్టులుండగా వీరశైవాచారము ప్రకారము వామకరపీఠమున యిష్టలింగమును పెట్టుకొనుటలో ననౌచిత్యముండునే? సందేహ చిత్తుల మనస్సులలోని సందేహములను పటాపంచలయ్యెడి యాస్కారమును కల్పించెడి యథావాక్కుల వారి యీ క్రింది పద్యమును గనుడి :

**శివ సాహిత్యుల సత్కర స్థలము కాశీక్షేత్రమా హస్తదే**
**శవిశాలోన్నత శాఖలారయగ బంచక్రోశమా పాణిసం**
**భవ శోభాన్విత చిత్రరేఖలు మహాభాగీరథీ తీర్థముల్**
**శివలింగంబల విశ్వనాథుడరయన్ సిద్ధంబు సర్వేశ్వరా!**

(సర్వేశ్వర శతకము ప. 111)

– శివం భూయాత్ –

## లింగధారణ స్థలము

## ఆశీర్వచనము : 3

శ్లో॥ **ప్రాణవద్ధారణీయం తత్ప్రాణలింగమిదం తవ।**
**కదాచిత్కుత్రచిద్వాపి న వియోజయ దేహతః॥**
**యదిప్రమాదాత్పతితే లింగే దేహాన్మహీతలే**
**ప్రాణాన్విముంచ సహసా ప్రాప్తయే మోక్ష సంపదః**
**ఇతి సంబోధితః శిష్యో గురుణా శాస్త్ర వేదినా।**
**ధారయేచ్ఛాంకరం లింగం (సి.శి.6 : 25-27)**

## శరీరే ప్రాణయోగతః :

ప్రాణముండు వరకు, నీ ప్రాణలింగము నెప్పుడూ అసాధారణ భక్తి భావముచే దేహము ధరింపవలయును. ఒక వేళ ప్రమాద వశమున విడి పడిన యెడ, ప్రాణములను వీడవలెను. మోక్షము లభించు" నని శ్రీగురువు చేత నుపదేశమును పొందిన శిష్యుడు మేనినప్రాణమున్నంత వరకు యిష్టలింగమును ధరించ వలెను.

## ఇష్టలింగము : రక్షాకవచము :

ఇష్టలింగమును గూర్చి తెలిపెడి స్కాంద పురాణములోని యీ క్రింది శ్లోకమును గమనించుడి.

**శ్లో॥ యో హస్తపీఠే నిజమిష్టలింగం విన్యస్య తల్లీన మనః ప్రచారః।**
**బాహ్యక్రియా సలికుల నిస్పృహాత్మా సంపూజయత్యంగ స వీరశైవః॥**

ఇష్టలింగమును సదా దేహము మీద ధరిస్తూ, దానిని ప్రతి దినమూ పూజించెడి వాడే వీరశైవుడని యీ శ్లోకములోని భావము.

ఇతని అంతరంగ సాధన మరియు బహిరంగపూజకు యిష్టలింగమే ముఖ్యమైనదని గ్రహింపదగును. జీవుడు శివునికి తనను సమర్పించికొనుటకు ఉపయోగింపబడెడి వ్రతముగా దీనిని భావించవలెను. మనకెంతో ప్రీతిపాత్రమైన వస్తువును సదా మన సమీపములోనే యుంచుకొనుచున్నాము కదా! అదే విధిన, శివుని అమితముగా ప్రేమించెడి వీరశైవుడు, అతని చిరురూపమును మేనిన ధరించుచున్నాడు.

ప్రాచీన కాలమునందున ఋషులు ఇష్టలింగమును తమ ఉత్తమాంగమమైన శిరస్సునందున ధరించెడి వారని తెలియుచున్నది యీక్రింది పౌరాణిక ప్రమాణమును కనుడి;

**శ్లో॥ కశ్యపాత్రి భరద్వాజ గౌతమాద్యా మహర్షయః।**
**ధారయంతి సదా లింగ ముత్తమాంగే విశేషతా॥**

కశ్యప, అత్రి, గౌతమ, మరియు భరద్వాజాదిఋషులు ఎల్లప్పుడూ లింగమును తమ శిరస్సున ధరించెడి వారు. శిరస్సున లింగమును ధరించెడి సాంప్రదాయమును, పాటించెడి వారిని శిరోవ్రతులని అందురు. వీరశైవమున కనేక నామాంతరములు గలవనియును మహావ్రతము, పాశపతవ్రతము, శిరోవ్రతము, అత్యాశ్రమ వ్రతము, శాంభవవ్రతములు వీరశైవ యనెడి పదమునకు పర్యాయ పదములని పండితాగ్రగణ్యులైన యుమచిగి శంకర శాస్త్రిగారు, తమ సిద్ధాంత శిఖోపనిషత్తు బాష్యమునందున తెలియజేసిరి. వీరనేక ప్రమాణములు నొసంగి విషయ నిరూపణ చేసిరని తెలియుచున్నది.

వీరశైవుల నైష్ఠికతను గనిన వ్యాసహర్షి ఆశ్చర్యచకితుడయ్యెనని తెలియుచున్నది. యీ క్రింది స్కాందపురాణములోని ప్రమాణమును గనుడి;

**శ్లో॥ శైలాదేన మహాభాగా విచిత్రా లింగధారకాః।**
**శివస్యోపరి లింగంచ ధ్రియతేచ పురాతనైః॥**
**లింగేన సహపంచత్వం లింగేన సహజీవనం।** (స్కాందపు కేదార ఖండము, 741-42)

లింగధారులుగా జన్మించి, లింగధారిగానే జీవించి, లింగదారులుగానే మరణించెడి వారు. ప్రాచీన కాలమున నెండెడి వారనియును, లింగమే వీరికి సర్వస్వముగా నెండెడిదనియును, జనసామాన్యమునకు వీరి నైష్ఠికత వింత గొలిపెడిదిగాయుండుననియు శ్లోకములోని భావము.

ఇంతటి వీరవ్రతుల వారి సంతానమైన మనము ఆ వ్రతమును పరిపాలన చేసినప్పుడే నిజమైన వీరశైవులము కాగలము. వీరశైవ ఆచార్యులు, ఈ మహావ్రతము నాచరించెడి సాధకునికి రక్షణ నిచ్చుటకై యెనిమిది రక్షాకవచముల నొసంగిరి. అవి; గురు, లింగ, జంగమ, విభూతి, రుద్రాక్ష, మంత్రము, పాదోదకము మరియు ప్రసాదము. కామక్రోధాది యంతరంగపు శత్రువుల నుండి మనలను మనము రక్షిచుకొనుటకై యుపయోగపడెడి

నిజమైన రక్షణా కవచములివి. నేటి వీరవైవులెందరో, కంచెలేని తోట యే విధిన చెరచ బడుచున్నదో మరియు అడవిలో సంరక్షణలేని స్థితిలో సాధుజంతువులేవిధిన క్రూర జంతువులకు నాహారముగా మారుచున్నవో, అదే విధిన, రక్షాకవచములకు దూరమై ధర్మరాహిత్యమునొంది, విషయవాంఛలనెడి వ్యాఘ్రములకు బలియగుచున్నారు. తుపాకి లేకుండగ, తుపాకి లైసెన్సును మాత్రము గైకొని, అడవికి వేటకై వెళ్ళెడి వేటగాని ప్రవర్తనకునూ, నేడు రక్షణ కవచమునకు దూరమైన వీరశైవుల ప్రర్తనకునూ ఎంతో సామ్యము గలదు.

ఒక వేటగాడు, బరువైన తుపాకిని గైకొని, వేటాడు నిమిత్తము, వేటాడిన ప్రాణులను మోసికొని వచ్చుటకై యొక యెడ్ల బండిని, యొక సేవకుని, తీసికొని వెడలెను. సేవకుడు బండిని నడిపించుచుండెను. వారు ఘోరాటవి యొక్క మధ్య భాగమును చేరిరి. బండినొక సురక్షిత ప్రదేశమున నిలిపి, సేవకుని బండిలోనే కూర్చుండబెట్టి, వేటగాడు తుపాకిని భుజమునకు వేసికొని, వేటను వెతుకుచూ బయలు దేరెను. ఎంత దూరము వెళ్లినా ఫలితము లేకుండెను. తిరిగి తిరిగి అలసిపోయెను. బరువైన తుపాకి మరింత భారమనిపింప జొచ్చెను. వేట దొరకుట లేదు కదా, దీనిని వృథాగా మోయుట యెందుకనెడి సందేహమతనికి గల్గెను. దీనిని బండిలో పెట్టిన యెడల భారము తగ్గును, తత్ఫలితముగా వేటను వెతుకుచూ మరింత దూరము వెళ్ళుటకై సాధ్యమగునని యెంచెను.వేటను కనుగొనిన పిదప తుపాకీని తెచ్చుకొని వేటాడ వచ్చునని భావించెను. వెనుదిరిగి వెడలి, తుపాకిని, బండి యందున పెట్టి, మరల వేటకై తన యన్వేషణను కొనసాగించెను. వేటను వెతుకుచూ చాలా దూరము వరకు వెడలెను. క్రమేపి అతడు తన బండికి దూరము కాజొచ్చెను.ఆ విధిన రెండు మూడు మైళ్ళు వరకు వెడలెను. ఇతడు, ఇటు ఇటు చూస్తూ వెడలుచుండగా ఆకలిగొని యాహారమునకై వెదకెడి పులి యొకటి యతనికెదురయ్యెను. నిరాయుధుడుగా నున్న వేటగాని గనిన పులి యెంతో సంతసించెను. ఆహారమే తనను వెతుకుచూ వచ్చినదనెడి భావన దానికి గలిగెను. పులిని చూసి వేటగాడదిరెను. వెనుదిరిగి చూసెను. చాలా దూరమున నిలిచియున్న బండిలో తన ఆయుధము గలదు. దాని గొని తెచ్చికొనెడి యవకాశము లేదని తెలిసి కొనెను. నిరాశగల్గెను. మృత్యువు తప్పదని గ్రహించెను. భయముతో నుక్కిరి, బిక్కిరి యయ్యెను. బుద్ధి మందగించెను. దిగ్భ్రాంతికి గురి అయ్యెను. అయిననూ, ఆశను వీడడయ్యెను. "ధైర్యం సర్వార్థ సాధనం" బడెడిపెద్దల నుడుపులతనికి ప్రేరణ నిచ్చెను. ప్రాణ రక్షణకై ప్రయత్నింపజొచ్చెను. తెలియకుండగనే,యతని జేబులోనికి చేయిలేపగా ఒక కాగితము దానికి తాకెను. దానిని బయటకు తీసి ఇదేమిటని చూసెను. అది ప్రభుత్వమిచ్చిన తుపాకీ లైసెన్సని తెలిసికొనెను. అతనికి ఆశ్చర్యము గల్గెను. ఆనందము హెచ్చెను. తన ప్రాణము నిలిచియుండునని సంబరపడెను. ధైర్యమును కూడగట్టుకొని, పులితో యిట్లనెను, "నేనొక గొప్ప వేటగాడిని, వేలకు వేలసంఖ్యలో నీవంటి పులులను యమ సదనమునకు పంపితిని. నా తుపాకీశక్తి నీకు తెలియదు నన్నట్లు పరువెత్తనియ్యకు. అదుగో! అచ్చట బండి కలదు. దానిలో నా తుపాకి గలదు. ఆ బండి ఇటు వైపునకే వచ్చుచున్నది. ఆకలిగొనిన పులికి యాతని మాటలు వినబడునే? అది సమీపమునకు రాజొచ్చెను. వేటగానికేమియును దోచలేదు. దీనికి నా మాటల యెడల విశ్వాసము లేనట్టుల దోచుచున్నదని భావించెను. దానికి నచ్చచెప్పుటకై "నీకు నా మాటలు నమ్మశక్యము గావని యనిపించిన, ఇదిగో యీ లైసెన్సును చూడుము" అనుచు కాగితమును పట్టుకొని యున్న కుడిచేతిని ముందుకు చాచి, కాగితమును దానికి చూపుటకై, తానే పులిని సమీపింపజొచ్చెను. పులికి కాగితముతో నేమి పని? అది తన ఆకలి తీర్చుకొనుటకై పైకెగిరి యతని మీదికి దుమికెను. అతడు నేలకొరిగెను. అది యతని గుండెను చీల్చి, వేడి వేడి రక్తమును త్రాగి సంతృప్తిని పొందెను.వేటాడుటకై వెడలిన బుద్ధి హీనుడగు వేటగాడు, తానే పులికి వేటగా అయ్యెను.

ఇదే విధముగా సంసారమనెడి ఘోరారణ్యమందున యరిషడ్వర్గములను వేటాడుటకై వీరశైవ ఆచార్యులు యిష్టలిగమనెడి తుపాకిని సాధకునికి చేతికిచ్చిరి. దానిని యెప్పుడూ తన దగ్గరగా నుంచికొనెడి సాధకుని యరిషడ్వర్గములు ముట్టజాలవు. ఇష్టలింగమును ధరించకుండ, మేము వీరశైవుల మనెడివారందరూ తుపాకీ లేనిదే వేటకై వెడలిన వేటగాని వంటి వారు, వీరెల్లరూ బహిర్ముఖులై, పూజా ధ్యానాదులకు దూరమై, భావోన్ముఖులై పరువులెత్తుచున్నారు. అందుచేతనే, దీక్షాసమయమందున శ్రీ గురువు లింగము యొక్క మహత్తును తెలుపుచూ దీనిని ప్రాణముండు నంతవరకు దేహము మీద నుండి తీయ వలదు. ఇది నీ ప్రాణము కంటెను గొప్పదగు ఆత్మతత్వమునకును, పరమాత్మ తత్వమునకును చెందినదని గుర్తించు"మని బోధచేయవలెనని శ్రీ భగవత్పాదుల వారు ఆదేశము నిచ్చిరి. వీరి యాజ్ఞను పరిపాలించినప్పుడు మనకు రక్షణ చేకూరును.

## వీరశైవుల నిత్యక్రియలు : ఇష్ట లింగధారణ మరియు పూజ.

యావజ్జీవం అగ్నిహోత్రము, జుహ్యాత్" యనెడి వేద మంత్రమునందు అగ్నిహోత్రము నిత్యకర్మము అయి వున్నదని తెలియుచున్నది. దానిని జీవనమున్నంతవరకు పరిపాలించవలెనని వేదము యొక్క ఆదేశమొకటి కలదు. అగ్నియే దేవుడని పూజించువారికిఅగ్నిహోత్రం నిత్యకర్మయై

యున్నది. వీరశైవులకు ఏది విహితమో అనునది తెలియచెప్పెడి 'సిద్ధాంత శిఖోపనిషత్తు' వీరశైవ భాష్యములోని ఈ క్రింది శ్లోకము గమనార్హమైయున్నవి.

**శ్లో॥ లింగస్య దారణం యస్య స్థూలదేహేనవిద్యతే।**
**తద్దేహం నిష్ఫలమ్‌యం" జీవత్యక్త శరీరవత్॥**
**తస్మాత్ దారణమ్ ప్రోక్తం యావజ్జీవాగ్ని హోత్రవత్॥** (సి.శి.నిషత్తు భాష్యము పుట29)

ఈ ప్రమాణము ప్రకారము, లింగధారణము దాని పూజ వీరశైవుల నిత్యకర్మమై తమ జీవనమున్నంత వరకు తప్పనిసరిగా చేయవలసిన కర్మ.

నిత్యకర్మమనే పదమునకు అర్థమేమిటో తెలిసికొనవలసి యున్నది. న్యాయకోశములోని ఈ క్రింది శ్లోకమును పరికించుడి.

**శ్లో॥ నిత్యం సదా యావదాయుర్‌నఖ దాచితిక్రమేత్।**
**ఉపేత్యాతిక్రమే దోష శ్రుతేరాత్యాగదర్శనాత్॥**
**ఫలిశ్రుతీర్వ్యప్స, యాచ్చ తన్నిత్యమిహ కీర్తితమ్।** (న్యాయకోశం : పుట : 417; 418)

పూర్యోక్త ప్రకారము నిత్యకర్మమునసుష్టించిన యెడల విశేషపుణ్యమేమి యుండదు. అయితే చేయకుండ ఉండినయెడల దురితప్రాప్తియగును. ఈ కారణమున దురితములనరికట్టుటకై విధిగా నిత్యకర్మలు చేయవలెను. వీరశైవుడు యిష్టలింగమును మేనిన ధరించకుండ ఉండిన యెడల కల్గెడి దోషము లెట్టివో తెలిసికొనవలసి యున్నది. సిద్ధాంతశిఖోపనిషత్తు వీరశైవ భాష్యములోని ఈ క్రింది శ్లోకమీవిషయమును వివరించగలదు.

**శ్లో॥ భక్తస్యాచి చిద్రతో లింగం యావత్ప్రాణ విదారణమ్।**
**శ్వమాంసభక్షణమ్ తావదాన్నే నరచితం భవేత్॥** (సి.శి.నిషత్తు భాష్యము పుట : 29)

లింగవిరహితుడై ఎవ్వడైతే అన్నమును భుజించుచున్నాడోనయ్యది, కుక్కమాంసము వంటిదనియును ఆ యన్నమును తినుట వలన కుక్కమాంసమును తినెడి దోషము కల్గుననియును, శ్లోకములోని భావన. ఇట్టి దోషములను నివారించుటకై ప్రతి వీరశైవుడు లింగదారణమునవశ్యముగా చేయవలెను. అదియునుగాక ఈ క్రింది ప్రమాణము ప్రకారము దీక్షా సమయమున లింగమును నిరంతరము ధరించెదనని ప్రమాణము చేసిన శిష్యుడు తదనుగుణముగానే ప్రవర్తించుటలో ఔచిత్యముండును.

**శో॥ అత్యాశ్రామిత్వాత్ గణవంశజానామ్।**
**లింగాంగ సంగినాం తత్రజన్మాంతదీక్ష॥** (సిద్ధాంత శిఖోపనిషత్ : శ్లో12 )

పైప్రమాణము ప్రకారము, వీర, నంది, వృషభ, భృంగి మరియు స్కందుల వంశజులైన వారును, అత్యాశ్రమీయులమనిపించుకొనెడి వారును మరియు లింగాంగ సంగులైన వీరశైవులకు దీక్ష కాలము నందు గురువుగారు శిష్యునిచేత "నేను నా ప్రాణమున్నంతవరకు తమరి నుండి ప్రాప్తమైన యిష్టలింగమును ధరించుకొని యుండెదను, అనెడి ప్రతిజ్ఞను చేయుచున్నందు వలన ఆ ప్రతిజ్ఞానుసారముగా లింగధారణ తప్పని సరిగా చేయవలెను.

## వీరశైవులు సాయశ్చిత్త వర్జితులు

గురువుగారాదేశించిన యటులశాస్త్రోక్త విధిన యిష్టలింగమును ధరించినను అది అకస్మాత్తుగా దేహము నుండి జారిపడిన యెడల దానికి ప్రాయశ్చిత్తమేమిటి? రేణుక భగవత్పాదులవారు ఈ విషయమున క్రింది ఉపదేశము నిచ్చిరి.

**శ్లో॥ యదిప్రమాదాత్ పతితే లింగేదేహాన్మహీతలే।**
**ప్రాణాన్ విముంచ సహసాప్రాప్తయే మోక్ష సంపద॥**

ప్రమాద వశమున లింగము నేల మీద పడిన యెడల ప్రాణమునే త్యజించవలెనని పై శ్లోకములోని భావన, యిట్టి భావనలే శివాగమములలో, కనపడుచున్నవి.

**శ్లో॥ యల్లింగం గురుణాదత్తం ప్రాణలింగం తదేవహి।**
**మద్యేనష్ట ప్రమాదేన దేహం తక్త్యాశివం వ్రజేత్**

(పారమేశ్వరతంత్ర పటల2, శ్లో 102 మరియు 103)

**శ్లో॥ గతే లింగే త్యజేత్ ప్రాణం వీరశైవహ సఏవహి।** (పరమ రహ్యము-3-2)

**శ్లో॥ వీరశైవః క్రమః ప్రోక్తః ప్రాయశ్చిత్త వివర్జిత।**
**ప్రాణలింగే వ్రతే లుప్తే హస్తఖడ్గాదనర్వాయనే॥**
**ముఖమ్ పంకజవ చింద్యాద్వీరబృత్యస్య లక్షణమ్**

(వాతుల శుద్ధాఖ్య తంత్ర పటలం 10-51,52)

పైన పేర్కొనిన ఆగమ ప్రమాణములు శివుని ఆజ్ఞ మేరకే యివ్వబడినవని తెలియుచున్నది. అందుచేత వీరశైవులకు ప్రాణత్యాగము తప్ప వేరొక ప్రాయశ్చిత్తము లేదనెడిది ప్రతిష్టితమైనది. అయితే యిట్టి కఠోరమైన నియమము వీరశైవులను వీరవ్రతులుగా తీర్చిదిద్దుటకే విధింపబడినదని గ్రహింపవచ్చును. ప్రాణత్యాగము విషయమున మరి కొంత చర్చ జరుగవలసి యున్నను తదుపరి భాగమున నది తెలిసికొందుము. ప్రస్తుతము వీర వ్రతము గురించి తెలిసుకొనెదము గాక.

## వీరశైవుల వీరవ్రతము :

వీరశైవులు వీరవంతులని యింతకు ముందే తెలియజేయనైనది. లింగదారణ వ్రతమును పరిపాలించ వలయునన్న జీవిత పర్యంతము ధీరులుగాను, శూరులుగాను వుండవలెను. వేరే విధముగా చ్పెవలెననిన వీరశైవులకు వీరత్వము మరియు శూరత్వము ఆవశ్యకములైన గుణములు ప్రాణభయమున్నవారు వీరులెట్లునబడుదురు? అట్టి వారు వీరవ్రతమును పాటించలేరు నిష్టతో లింగధారణ మతమును పరిపాలించెడివాడె వీరశైవుడు అనుబడుచున్నాడు ఈ విషయమున వివరణనిచ్చెడి చంద్రజ్ఞానాగమములోని శ్లోకములను పరిశీలించుడి.

**శ్లో॥ ఇష్టలింగ వియోగేవావ్ర తానాం వా పరిచుత్యత**
**దృణవత్ ప్రాణ సంత్యాగ యితివ్రతమ్ మతం॥**
**భక్త్యు త్యాసవిశేషో2పివీరత్వమితి కద్యతే।**
**వీరవ్రత సమాయోగాద్ వీరశైవం ప్రకీర్తితమ్॥**

(చందజ్ఞానాగమము : క్రియాపాదం 10;33-34)

ఇష్టలింగ వియోగము జరిగిన యెడల ప్రాణములను తృణప్రాయముగా నెంచి పరిత్యజించెడి భక్తి యొక్క పరాకాష్టనే వీరవ్రతము అని యందురు. ఈ వీరవ్రతము సదా పాటించెడివాడే వీరశైవుడు.

శివునికి తననే అర్పించుకొనెడి గుణగణములు గలవాడే వీరుడని వాతులాగమము లోని ఈ క్రింది శ్లోకముల వలన తెలియుచున్నది.

**శ్లో॥ విశిష్ఠయార్యతే యస్మాద్ వీరయిత్యభిధీయతే।**
**శివేన సహః సంబంధం శైవమిత్యాధృతంబుధైః॥**
**ఉభయోః సంపుటబావాత్ వీరశైవమితి స్మృతమ్।**
**శివా యార్పితజీవత్వాత్ దేవీరతంత్ర సముద్భావాత్॥**
**వీరశైవ సమాయోగాత్ వీరశైవ మిస్మృతమ్॥** (వాతులశుద్ధాఖ్యతంత్రము, 10; 27-29)

పై శ్లోకములోని భావమేమనగా శివునకు తననే అర్పించుకొనెడి విశిష్ఠగుణముండుట చేత వీరుడనియును యిష్టలింగ ధారణ మూలకముగా శివునితో నిత్యసంబంధమును స్థాపించు కొనియుండుటచే శైవుడనియును, ఈ రెండు పదముల యొక్క సంపుటీకరణము వలన వీరశైవ శబ్ద ముద్భవించినదనియును, యిట్టి యోగ్యత కల్గిన వాడే వీరశైవుడని తెలియుచున్నది. ఇంకొక ప్రమాణములో యీ విషయమునింకొక రీతిన గలదు.

**శ్లో॥ వికల్పోవా వికల్పార్థోర శబ్దోరహితార్థకః।**
**వికల్పరహితం శైవం వీరశైవంప్రచక్ష్యతే॥** (క్రియానుసారము; ఉపదేశం, శ్లో:37)

ఇష్ట లింగము వియోగమైనపుడు పూర్వోక్త ప్రకారము ప్రాణమును త్యజించవలెనా వలదా యనెడి వికల్పమును వీడి నిశ్చయముగా గురువుగారి, మరియు శివుని యొక్క శాసనమును పరిపాలించువాడే పై శ్లోకములో తెల్పినట్టి వీరశైవుడు. ఈ విధముగా వీరశైవ శబ్దము యొక్క వ్యుత్పత్తిని ప్రతిపాదించెడి ఆగమ శాస్త్రమును పరిశీలించిన పిదప, నిజముగా లింగదారణ వ్రతమును వాళ్ళ చేత ఆచరింపయోగ్యమైనది గాదు. ఈ విషయమున శ్రీ శణ్ముఖస్వామి యిచ్చిన వివరణను ఎంతో వుపయుక్తముగా నున్నది. గమనించుడీ.

వచనం : **ఛల విరబేకు శివభక్తి యమాడువల్లి, హిడిదుబిడెనెంబ**
**ఛలవిర బేకు నిత్యనేమదల్లి హిడిదుబిడెనెంబ**
**ఛలవిరబేకు శీలవ్రతదల్లి హిడిదుబిడెనెంబ**
**ఛలవిరబేకు నమ్మ అఖండేశ్వర లింగనకూడ**
**ఎందిగూఆగల బారదెంబినైష్ఠేయల్లి॥**

ఈ వచనము యొక్క తెనుగురూపము గనుడీ;

**చలముండవలెను. శివభక్తిని చేసెడి దాని యందు, పట్టినది వీడననెడిది**
**చలముండవలెను నిత్యనేమమందు పట్టినది వీడననెడిది.**
**చలముండవలె శీల వ్రతమందు పట్టినది వీడననెడిది గూడ.**
**చలముండవలె మన అఖండేశ్వర లింగము గూడ.**
**ఎప్పటికి విడువననెడి నిష్ఠయందు**

షణ్ముఖ స్వామి వచనములో లింగమును మేనినుండి దూరము కానివ్వననెడి గట్టి పట్టుదల శివభక్తునిలో వుండవలెనని చెప్పబడినది.

చలమనెడిది వీరశైవునకుండవలసిన ఆవశ్యమైన లక్షణమని తెలియుచున్నది. అందుకే బసవణ్ణ వారు

"చలవిల్లద వరమెచ్చనమ్మకూడల సంగమదేవా" యని ప్రకటించిరి. దీని యర్థమేమనగా పట్టుదల లేని వారిని శివుడు ఎన్నటికీను మెచ్చడు. శ్రీ నిజగుణశివయోగులును పట్టిననీమమును వీడకుండవుండుటనే చలమనియును, అట్టి చలమును తనలో నిలుపవలసినదిగాశివుడిని వేడుకొనెను.

## ప్రాణత్యాగము-విషయమున రహస్యార్థమేమి?

మహారాష్ట్రమునకు చెందిన ప్రఖ్యాత వీరశైవ యోగులైన శ్రీ మన్మథస్వామిగారు తమ పరమ రహస్యమనెడి మరాఠి గ్రంథములో ఈ క్రింది విధిన తెల్పిరి.

**శ్లో॥ లింగ హాబీజయాచా ప్రాణ। తోహరవతాచీసోడి ప్రాణ।**
**అయిసీహే వీరశైవలక్షణా। జాణదేవీ సాచపై॥** (పరమ రహస్యము : 3-5)

ఈ పరమ రహస్యమునందు లింగమే తన ప్రాణమని తెలిసికొని వీరశైవుడు ఆ లింగము పతనమైనప్పుడు, ప్రాణమునే త్యాగము చేయవలెనని ప్రతిపాదించిరి. మన ధర్మమునకు చెందిన ప్రాచీనాచార్యులు మరియు సాధువుల వచనములనవలోకనము చేసిన పిదప యిష్టలింగమును ఎప్పటికి కూడా శరీరము నుండి దూరము చేయకూడదనెడిదే వారి హృద్గతాభిప్రాయమని తెలియుచున్నది.

అకస్మాత్తుగా లింగము పడిపోయినపుడు, బలాత్కారముగా ప్రాణమును వీడునది ఆత్మ హత్య కాదా? అనెడి సందేహము రాక మానదు. ఐతే గురువు యొక్క ఆదేశము మరియు శివుని యొక్క ఆ దేశము యీ విధముగా నున్నందున ధర్మశాస్త్రము ప్రకారము వీరి కొరకు చేసెడి ప్రాణత్యాగము ఆత్మహత్య కానేరదు. అందుచేత లింగము పతితమైనప్పుడు చచ్చెడి వారికి ఎట్టి దోషముండదు. సంసారమునకై భయపడి బలవంతముగా చచ్చెడి వారికి దోషముండును గాని పరమాత్మునికై చచ్చెడివాడికి దోషముండునా?

'అంతేయామతి: సాగతిః' యనెడి వచనము ప్రకారము లింగము యొక్క వియోగమును భరించ లేక ప్రాణార్పణ చేసిన యెడల అతడు లింగ రూపమునే పొందగలడు. దుర్గతి పొందుటకు చావు ముఖ్యమైనదిగాదు. చావుకు సంబంధించిన భావన ముఖ్యమైనది.

మరొక్క విషయమేమనగా దేవునికై చచ్చుటకు సన్నద్ధులైన వారిని దేవుడు చావనిచ్చునే? తన ప్రేమ యొక్క లక్ష్యమైన మల్లయ్య కొరకై శ్రీశైల పర్వతము నుండి దుమికిన శ్రీ సిద్ధరామేశ్వరుడు చచ్చెనా? ఇట్టి దృష్టాంతములు శైవేతరమైన ధర్మములలో కూడా కలవు. భక్తుని భక్తిని పరీక్షించుటకై భగవంతుడు పెట్టే పరీక్షలలో భగవంతుడు ప్రాణత్యాగానికి సిద్ధపడుచున్నాడా లేదా యనెడిది కూడా వుండును. నిజమైనభక్తులు మాత్రమే ప్రాణమును తృణప్రాయముగా నెంచి, విగత జీవులగుటకు సిద్ధమగుదురు. అట్టి యెడ భగవంతుడు ప్రత్యక్షమై ప్రాణత్యాగము నివారించుచున్నాడు. అయినను ఇతర విషయములకై ప్రాణత్యాగమునకై సిద్ధపడుదురేగాని, దైవము కొరకు ప్రాణిచ్చు వారెందరు? ఈవిషయమున ప్రభుదేవుల వారి వచనము గమనార్హమై యున్నది.

**శ్లో॥ హెన్నిగాగిసత్తవరు కోటి, మణ్ణిగాగి సత్తవరుకోటి**
**హొన్నిగాగి సత్తవరుకోటికోటి**
**గుహేశ్వరా నినగాగి సత్తవరనొబ్బరన్నుకానె**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది

**శ్లో॥ పడతి కొరకు చచ్చెడి వారు కోటి,**
**మన్నుకై చచ్చెడివారు కోటి**
**పొన్ను కొరకైచచ్చెడి వారు కోటి కోట్లు**
**గుహేశ్వరా నీకై చచ్చెడి వానినొక్కరిని కాన**

పై వచనమున తెల్పిన ప్రకారము ప్రాణత్యాగము చేయుటము, అంత సులభమైన పనిగాదు. అందుచేత దేవునికైనను దేవుని ధ్యానమునకైనను ఆవేశమును గొని ప్రాణత్యాగమును చేసిన యెడల సద్గతి యానేగాని దుర్గతి కానేరదు. ఇదియే శ్రీరేణుక భగవత్పాదులవారి యుపదేశములోని రహస్యార్థము.

శివభక్తి నిరూపణకై ప్రాణత్యాగమున కొడగట్టిన శివభక్తులెందరో సద్గతిని పొందిన విషయము నయనారుల చరిత్రలలో బహువిస్తారముగా నిరూపితమైనది.

ఇంకను, శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము వ్యవహారిక పక్షమును ఆలోచింతుముగాక, మనిషి సామాజిక జీవి. సమాజమునందున బ్రతుకుటకై యతనికి సతి, సుత, సంపత్తులు నెంతోను అవశ్యకమైయున్నవి. తనను తాను ప్రేమించికొనిన యటులే తన వారిని, తన వస్తువులను ప్రతిమనిషి అమితముగా ప్రేమించుచున్నాడు. కొందరు తమ వారిని, తమ వస్తువులనెంత మేరకు ప్రేమిస్తారనగా,వాటి నిమిత్తమున వారు ప్రాణ త్యాగమునకైననూ సిద్ధపడుదురు. ఈ విషయమును చూసి శ్రీ సర్పభూషణశివయోగి గారు "బలిద లౌకనిగె సతి పుత్రాదిగళే బ్రహ్మ" యని సెలవిచ్చిరి. సతి పుత్రుల యెడల నధికమైన ప్రేమాతిశయము గల వారికి సతిపుత్రాదులే సర్వస్వమనెడిది శివయోగుల వాక్కులోని భావము. ఒక వ్యక్తి దేనినమితముగా ప్రేమించునో దాని యెడల నతని ప్రాణములు తాదాత్మ్యమును పొందుచున్నవి. వాటికి ప్రమాదము సంభవించినప్పుడా వ్యక్తి ప్రాణములు త్యజించును. ఎంతో కష్టమున కోర్చి, తాను సరిగా తినక, యితరులకు పెట్టకుండగ లోభ బుద్ధిగల వారు భాగ్యమును కూడబెట్టుచున్నారు అది దొరల పాలో లేదా దొంగలపాలో యైనప్పుడా లోభి ప్రాణమును వీడకుండా ఉండగల్గునే? పతి మరణమును చూచి యసువులు బాసే సతులు, సతీ వియోగము ననుభవించలేక చచ్చి పోయెడి ప్రేమికులెందరో గలరు. పుత్ర వియోగమును భరించజాలక నేలకొరిగిన వారు చాలా మందిగలరు. రామాయణములోని దశరథుడట్టివాడే కదా! వీటన్నిటికీ శాస్త్రములోనామోదము కలదే? వారి ప్రేమలే వారిచేత నా పనులను చేయించుచున్నవి. అదే విధిన లింగముపైన యమితమైన ప్రేమానురాగములు గల్గినప్పుడు, లింగము పతనమైనప్పుడు ప్రాణములు వీడుటకు నిశ్చయించికొనుట లోక విరుద్ధమైన విషయము కానేరదు. కాన శ్రీ భగవత్పాదులావిధిన యుపదేశము నిచ్చి యుందురా? ప్రారబ్ధ కర్మానుసారముగా లభ్యమయ్యెడి ఒకానొక దినమున దూరమయ్యెడివియూ అగు అనిత్య వస్తువుల మీద మమతను పెంచికొని వాటి నిమిత్తమున ప్రాణమును వీడి సంసారచక్రమున జిక్కి బాధలకు గురియగుట కంటెను నిత్య-సత్యస్వరూపమైన లింగతత్వమును ప్రేమించి జీవుడు లింగస్వరూపిగా కావాలనెడిదే ఆచార్యుల ఉదదేశములోని భావమని గ్రహించవలెను.

## శాస్త్ర నియమము - విపరీతార్థపరిహారము :

"ప్రాణాన్ విముంచ సహసా" యనెడి యాచార్యుల వారి వాక్కులో శిష్యుని ప్రాణ హరణ జరిగితీరవలెనని భావము గలదని గ్రహించవలదు. ఈ విషయము గుర్తెరుగుటకై వైదిక పద్ధతులను పరిశీలింతుము గాక,"యాజ్ఞికీ హింసా హింసానభవతి" యనెడి సూక్తి విధిన యజ్ఞము నందున చేసెడి హింస, హింస కాజాలదని దీని భావము. దీనిని బట్టి వేదము హింసను ప్రబోధించుచున్నది అని యనుట యుక్తము కాదు. స్వాభావికముగా హింసాప్రవృత్తి గల్గిన మానవుని, హింసను అరికట్టుటకే యజ్ఞమును విధించినదని చెప్పుదురు. ఏ విధముగా హింసను నిరోధించుటకై వేదవాక్కులు నుపయోగింపబడుచున్నవో, అదే విధిన, ప్రాణత్యాగము చేయవలెననెడి భగవత్పాదుల వారి వాక్కు శిష్యుని ప్రాణములను రక్షించుటకే యనిదలచవలెను. లింగము యెడల నధిక జాగరూకత వహించి, యెల్లప్పుడూ తన మేనిన నిలిపి తద్వారా శిష్యుడు సర్వతోముఖమైన రక్షణ పొందవలెననెడి సదుద్దేశముతోనే ప్రాణ త్యాగ నియమము విధింపబడినదని గ్రహించవలెను.

నిరంతర లింగధారణ యనెడి వీరశైవుల యొక్క కఠినమైన వీరవ్రతము. దీనిని సరిగా గ్రహించని వారు ఎన్నోసందేహములను గల్గియున్నారు. ధరించవలెనా? వలదా? ధరించిన పిదప వియోగమైన యెడల యేమి చేయవలెను? ప్రాణత్యాగము కర్తవ్యమా? అకర్తవ్యమా? కారణములు, ఏ విధిన నన్ననూ వీరశైవులు యిష్టలింగము యెడల ఉదాసీనము వహించుట క్షంతవ్యము కాదు.

శాస్త్రమునకు సంబంధించిన నియమములు సామాజిక హితము నాశించియే ఉద్దేశింపబడినవి. వాటి మర్మమును గుర్తెరిగి ఆచరించిన యెడల సత్ఫలితములు లభించును. కొన్ని సందర్భములలో వాటిని, అపార్థము చేసుకొనెడి యవకాశము కలదు. అనేక మంది మహదీయ భక్తి సంపన్నులై, ఆచార్యులు ఉపదేశించిన యటులే తన జీవనమును గడిపిరి. లింగము యెడల అమితమైన ప్రేమానురాగాలను పెంచిరొనిరి. ప్రమాదవశాత్, అది దూరమైనయపుడు, వారి ప్రాణము అప్రయత్నముగనే వారిని వీడి వెళ్ళెను. నేడును ఆప్తుల మీద ప్రేమను పెంచికొనినవారు, ఆప్తుల కేమైననూ ప్రమాదమేర్పడి నప్పుడు గుండె ఆగిపోయి చచ్చెడివారు లేరే? ఈ విధముగనే, లింగము దూరమైనప్పుడు నైష్టికులైన మహాత్ముల వారి ప్రాణములు బయల్వెడలి పోయెను. భక్తిలో పరిపూర్ణమును సాధించిన వారికే యిట్టిది సాధ్యమగును.

దీనిని, సతిపతుల యొక్క సంబంధముతో పోల్చి చూడవచ్చును. పతి వియోగము గల్గినప్పుడు సతియొక్క దేహము విగత ప్రాణి కావచ్చును. యిట్టి స్థితి అందరికీ సంభవించునే? పతి మీద ప్రగాఢమైన ప్రేమానురాగము గల్గి, పతిలేనిది తాను జీవించ జాలననెడి మనోభావము గల్గిన గాని యిది సంభవము కాదు.

కొన్ని సందర్భాలలో సతి విగత ప్రాణి కాకుండిననూ, పతిలేని జీవితము నిస్సారమని భావించికొని మనఃపూర్వకముగా ప్రాణమును త్యాగము చేయవచ్చును. మనస్సులో గల్గిన ఆందోళన వల్లగాని, వైరాగ్యభావన వల్లగాని యిది సంభవించును. దీనిలోనూ దోషము లేదనవచ్చును. ఇదే విధిన సాధకుడు స్వచ్ఛందముగాను, ప్రయత్నపూర్వకముగాను విగత ప్రాణి కావచ్చును. సాధకునికి సద్గతి లభించియే తీరును, శాస్త్రోక్తి ప్రకారమిది ఆత్మహత్య కాజాలదు. ప్రాణము దానంతట అదియే దేహమును వీడి పోయినప్పుడు సాధకునికి యెట్టి ఫలితము లభించునో, అట్టి ఫలితమే యీ సాధకుడును పొందుచున్నాడు. ఇది యిట్టులుండగా, శాస్త్ర నియమములను అంధవిశ్వాసముతో నాచరించే పద్ధతి కూడా కొనసాగుచున్నది. “గతాను గతిలోకోనలోకః పారమార్థికః” యనెడి సూక్తి ప్రకారము, సాధారణముగా జనులు అంధవిశ్వాసములవైపు మొగ్గును చూపుచున్నారు. సతీ సహగమనము నొక ఉదాహరణగా గైకొనవచ్చును. భర్త గతించిన స్త్రీ భర్త చితిపైనకు బలవంతముగా త్రోసి ఆమె ప్రాణములను తీసెడి దురాచారము క్షంతవ్యముకాదు. దానిని హత్యగానే భావించవలెను. శాస్త్రము కూడ దీనినంగీకరించదు. ఇదే విధిన లింగము దూరమైన సందర్భమున లోకాపవాదమునకో, లేదా కీర్తిని పొందుటకో సాధకుడు ప్రాణత్యాగమునకు పూనుకొనవచ్చును. మరి కొందరు, అనారోగ్యముతో విసిగి యిట్టి యాచరణలకు పూనుకొనవచ్చును. ఇట్టిది శాస్త్ర సమ్మతము కానేరదు. దీని వలన సద్గతి లభించదు. ఇది గర్హనీయమైనదైయున్నది.

## శరణుల విచారము మరియు దాని పరిణామము :

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారి యుపదేశము యొక్క మర్మము నెరుగకయే, యిష్టలింగ వియోగమైనప్పుడు ప్రేమరహితమైన ప్రాణార్పణలు లేదా బలవంతముగా చేయించెడి ప్రాణార్పణలు నిరోధించి, అంధ విశ్వాసము గల వారి కళ్ళు తెరిపించుటకై శరణులు కృషి సల్పిరి.

**వీరి విచార ధారలను గనుడి:**
**అంగదమేలణ లింగ హిగిత్తెందు**
**ఆత్మఘాతవ మాడికొళ్ళ బేకెంబరు అజ్ఞానిగళు**
**అంగవావుదు లింగవావుదెందరియరు**
**అంగమే ఆత్మ లింగమే అరివు**
**ఇష్టలింగవను ప్రాణలింగవెంబ కష్టవైల్లియదొ**
**ఇష్టలింగహోదరె ప్రాణలింగ హోగదునోడా**

**అంగదొళగె మహాలింగ తిరలు కైయ లింగబిద్దితెందు**
**వెల దొళంగవ హుణువరు భంగ పడువరల్లా**

ఈ విచార ధారయొక్క తెలుగు రూపమును గనుడి;

**అంగము మీదట లింగము వీగెనని**
**ఆత్మఘాతమును చేసికొనవలెనందురు అజ్ఞానులు**
**అంగమెయ్యది లింగమెయ్యది యనెడి దెరుగరు**
**అంగమే, ఆత్మ లింగమే జ్ఞానము**

**ఇష్టలింగము ప్రాణలింగమనెడి కష్టమెక్కడిదో**
**ఇష్టలింగము పోయినా ప్రాణలింగము పోదుచూడుమా**

**అంగము లోపల మహాలింగముండగను చేతలింగము పడినదని**
**నేలకూలెడి హూణులు భంగపడుదురు కదా!**

ఈ విధముగా ననేకమైన వైచారిక వచనముల వలన చెన్న బసవన్న మరియు ప్రభుదేవులు మొదలగు వారు లింగవంత సమాజమును హెచ్చరించిరి.

శరణుల యీ హెచ్చరికనువిని యప్పటివారు కొందరు ఆచరించి యుందురు. అయితే ఇప్పుడు మాత్రము ఎంతో మంది హెచ్చరికను ఆచరిస్తున్నట్లు తెలియుచున్నది.

ఇష్టలింగము అకస్మాత్తుగా ప్రమాద వశమున నేలన బడునదటులుండనీ, తామే స్వయముగా లింగమును తీసి గూటమునకు తగిలించుటయో లేదా దేవుని గదిలోని యొక గూటిలో పడవేయుటయో చేసెడి వారిని చూచుచున్నాముగదా!.

## వైచారికత అవసరము నాస్తికత వలదు :

మనుష్యుడు ధర్మమార్గమున నడువ వలెననిన శాస్త్రము లేదా శస్త్రము యొక్క భయముండవలెను. ఈ రెండు భయము లేనినాడు మానవుడు నాస్తికుడుగానూ, విశృంఖలుడునూ అగును. ఇప్పటిసమాజమునకు ప్రభుత్వము యొక్క శస్త్ర భయమూ లేదు. ధర్మశాస్త్ర భయమూ లేదు. ఈ కారణమున, సామాజిక స్వాస్థ్యము పాడగును. ఇదొక మానవుని వినాశ మార్గము. అంధ విశ్వాసములను దూరము చేసికొనుట యావశ్యకమైన విషయమే. అయితే వైచారికతను క్రమక్రమముగా పెంచికొని నాస్తికుడగుట గొప్ప దోషమగును.

బంగారపు వ్యాపారియొకడు, గీటురాయిని ముందున నిడికొని, ప్రజలు తెచ్చి యిచ్చిన బంగారపు ఆ భరణములను గీటిరాయికి రాచి పరీక్షించుచుండెను. ఇది యతని నిత్య వ్యవహారమై యుండెను. ఇరువది అయిదు సంవత్సరములుగా నతడు ఈ విధిననే చేయుచుండినందున, ఎవ్వరైననూ ఏ వస్తువు నిచ్చినా గీటరాయికి గీకి పరీక్షింపజొచ్చెను. అతినికి తెలియకుండగనే నిది జరగుచుండెను. అది యొకక వైశాఖ మాసములోని దినము. లగ్నముల సమయము పని వత్తిడి యెక్కువగా ఉండెను. గ్రాహకులు అధిక సంఖ్యలో వచ్చుచుండిి. అంతా గందరగోళముగా నుండెను. ఇది యిట్టులుండగా, నతనికొక మిత్రుడుండెను. అతనికొక పెద్ద తోట యుండెను. అందులో నతడు రక రకముల పూలచెట్లను పెంచెను. బంగారపు వ్యాపారి అయిన తన మిత్రునికలిసి పోవుటకై యాతడు దుకాణమునకు వచ్చెను. తన తోట లోని గులాబి పువ్వునొక దానిని యెంతో భద్రముగా తీసికొని తెచ్చెను. అది అరుదైన జాతికి చెందినదై యుండెను. దాని రంగు సువర్ణమును పోలి యుండెను. దానినతడు వ్యాపారి చేతికి నొసంగెను. తన స్నేహితుని యెంతో ఆదరణముతో కూర్చుండబెట్టి, తన పనిని వదలు కొని యాతనితో మాట్లాడెడి, వ్యాపారి యొక యనౌ చిత్యమైనపనిని చేసెను. అలవాటులో పొరపాటుగా పరిణమింంచిన ఆ పని వింతగొలిపెడిదై నుండెను. పువ్వును గీటురాయికి గీకి పరీక్షించి అపహాస్యమునకు గురి అయ్యెను. గులాబి అందమును చెరిచిన వాడయ్యెను. దాని గుభాళింపు నాస్వాదించి, మనోహ్లాదకరమైన యనుభవమును పొందలేకపోయెను. బ్రతికెడి పద్ధతియును అట్టిదేయని డి.వి.జి. యనెడి కన్నడ కవి నిరూపించిన వాడయ్యెను. అతని 'మంకు తిమ్మన కగ్గయ" నెడి కృతిలోని 626వ పద్యములో నీ విషయము గలదు.

## వచనము :

తర్కమనెడిది మంచిదే. తర్క పద్ధతిలో పరీక్షించి విషయగ్రహణ చేయుట వలన యుత్తమమైన ఫలితము వచ్చును. కాదనలేము. కాని ప్రతి యొక్క విషయమును తర్కమునకు గురి చేయుట యనేది సరియైన విషయము గాదు. "నైషాతర్కేణ మతి రాపణేయా" అని శాస్త్రము చెప్పినది. భక్తి స్థలములోని సాధకునికి తర్కము కంటె భావమే ముఖ్యమైనదని గ్రహించవలెను. భక్తి భావన కనుకూలముగా నుండెడి తార్కిక వాదములు గ్రాహ్యములే. కాని భక్తి భావమును కృశింప జేసెడి తర్కము అవాంఛనీయమైనది. ఇష్టలింగ వియోగమైనప్పుడు ప్రాణత్యాగమును చేయవలెననెడి

భగవత్పాదుల ఉపదేశమును తర్కమునకు గురిచేయకూడదు. ప్రాణత్యాగమును, ఆత్మఘాతుక చర్యగాతీసుకొనవలదు. ఆ విధిన చేసిన యెడల గులాబీ పువ్వును గీటురాయికి గీచినట్లే యగును.ఆత్మఘాతుక చర్య ఉచితమైనది, కాదనే తర్కమును భగవత్ పాదుల వారి యుపదేశమునకు వర్తింపచేయకూడదు.పువ్వు యొక్క సొగసు, సుగంధము మరియు లాలిత్యముల నెరుగజాలని వ్యాపారివలె ప్రవర్తించవలదు. ఆచార్యులవారి యుపదేశములోని యదార్థమును గ్రహింపవలెను. తాత్విక మర్మమునెరుగవలెను. అట్టి యెడ పువ్వు యొక్క అందమునుగని, సుగంధమును పీల్చి ఆనంద ప్రాప్తిని పొందిన యటులే, యుపదేశము యొక్క మర్మము నెరిగి దాని నుండి లాభమును పొందెడి ప్రయత్నము చేయవలెను. అప్పుడు ఆచార్యుల వారి యుపదేశము యెడల అనాదరణ భావము పొడచూపదు. అవహేళన భావము గలుగదు. గ్రహించవలసిన విషయము తెలియగలదు. ఇష్టలింగధారణ యనెడి నియమ పాలన యెడల సాధకుడు అచంచలమైన నమ్మిక విశ్వాసములు గల్గి యుండవలెననియును, నిష్కాభావ సమన్వితుడై నియమ పాలన చేయవలెననియును, అజాగ్రత్తగా ఉండకూడదనియును గ్రహించవలెను. ఈ విధిన గాంచిన యెడల శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమనెడి పుష్పము వలె సుగంధము ప్రతి యొక్కరి అనుభవమునకు వచ్చును. ఇట్టి పరిమళమును ప్రతి యొక్క వీరశైవుడు భ్రమరమువలె న్యాస్వాదించిన యెడల మరవరాని మధురానుభూతి గల్గును.

## ప్రాణమున్న ప్రేతములు :

ఈ విధముగా నెంతో మహాత్తుతో కూడిన శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమును పెడచెవిన పెట్టిన వారిని శ్రీ మన్మథ స్వామి వారు పిశాచి వంటి వారని తెలిపిరి. వారి వాక్కులను గనుడి.

**జయాచాప్రాణలింగీ భరలా। తోకైసా ఆసే హేహీ పురలా।**
**లింగగేలియా దేహీ సంచరలా' పిశాచవతజాణిచీ।** (పరమ రహస్యము 3-14)

ఇష్టలింగమే వీరశైవుల ప్రాణ లింగము. అదే వారి ప్రాణవాయువు. ప్రాణము లేని దేహము ప్రేతమనిపించుకొనును. ఈ కారణమున, లింగము కాయమునలేని వీరశైవుడు ప్రేతమని చెప్పబడినాడు. నేటి స్థితిలోన యిట్టివారెందరోగలరు. ప్రేత పిశాచములుండెడి స్థలమెయ్యది? శ్మశానములే కదా! అట్టియెడ సంస్కార విహీనులై భక్తి శ్రద్ధారహితులై యుండెడి వారి యిళ్ళు శ్మశానములా? వైష్ణవ సాంప్రదాయములో నిట్టి భావనలు గలవని తెలియుచున్నది. తుకారామ్ గారు 'శ్మశానతే భూమిప్రేతరూపజన శ్రద్ధాభక్తి విహీన" అని తెలిపిరి. దేవభక్తి లేకుండుగ, కేవలం విషయాసక్తిగల యసంస్కృత జనులను చూసి, వారు యీ మాటలననిరి.

చదువుకొన్నవారెల్లరూ, ధర్మాభిమానము లేనివారై, సంస్కార హీనులై, కుతర్కములను చేయుచు, చీకటి వైపు నడుగిడుచుండెడి విషయమును గూర్చి వీరశైవ సమాజము జాగరూకత వహించి యుండవలెను. ధర్మాచరణలు మానవుని జీవనమును ఉజ్వలముగా చేయును. అందుచేత ధర్మ బాహ్యులమై యుండవలదు. మాంగల్యము లేని స్త్రీ, కుంకుమాది సంస్కారములకూ దూరమై యమంగళముగా తయారగును. లింగము లేని లేదా లింగమును ధరించని వీరశైవుడు మంగళ స్వరూపి కాగల్గునే? వస్త్రములు వ్యక్తియొక్క శోభను పెంచును. ఆభరణము లుండిననూ లేకున్నను మంచి వస్త్రలములు ధరించెడి వాడు మంగళామూర్తిగా కనబడును. ఎన్నో ఆభరణముల నలంకరించికొని, వస్త్రహీనముగా నున్న యమంగళుడనిపించుకొనును. లింగాభక్తికి, లింగధారణకు దూరమై యాడంబరమైన జీవనమును గడిపెడి వారిట్టివారే.

## ఇష్టలింగ వియోగము :

## ప్రాయశ్చిత్త విచారము :

నేటి వీరశైవులు, ఆగమోక్త విధిన వీరవ్రతమును పరిపాలించెడి స్థితిలో లేరు. వీరశైవుని, యిష్టలింగము భంగపడినప్పుడు, ప్రాణ త్యాగమే విహితమని ఆగమములు నుడివినా, మార్గాంతరము యొక్క యన్వేషణ యవశ్యమై యున్నది.

వీరశైవేతరులలో కొందరు లింగధారులుగలరు. అట్టివారిలో శుద్ధశైవు లొకరు. వీరి యాచరణములలో ప్రాయశ్చిత్తము విహితమై యున్నదా యనెడిది గుర్తించవలెను. మొదట ప్రాయశ్చిత్తమనగా నేమియో తెలిసికొనుట యెంతో అవసరము. ఈ విషయమున యంగీరస స్మృతి కొంత వరకు సహకరించును. అందులోని యీ ప్రమాణమును గనుడి:

**శ్లో॥ ప్రాయోనామ తపః ప్రోక్తం చిత్తం నిశ్చయ ఉచ్చతే।**
**తపోనిశ్చయ సంయుక్తం ప్రాయశ్చిత్తమితి స్మృతం॥** (న్యాయకోశము : పుట 592)

"ప్రాయః" అనగా తపస్సనియును, చిత్తం అనగా నిశ్చయమనియును, దోష నివారణకై నిశ్చయింపబడిన తపస్సే ప్రాయశ్చిత్తమనియును అంగీరస స్మృతి లోని శ్లోకము యొక్క అర్థము.

ఇక శుద్ధశైవులకు నెట్టి ప్రాయశ్చిత్తము విహితమైనదో తెలిసికొనెదము గాక.వాతులాగమమున యీ విషయమును గూర్చి క్రింది విధిన చెప్పబడినది.

**శ్లో। శుద్ధశైవో విశేషేణ మంత్రయంత్ర ప్రచారణాత్॥**
**శుద్ధోభవతి లోపేషు ప్రాయశ్చిత్త విధానతః॥**
**స్వేష్టలింగే పరిభ్రష్టే నష్టే దగ్ధేహృతేపివా॥**
**నీతేవా మూషికా ద్వైశ్చ కాక కౌలేయ వానరైః**
**జప్త్వా లక్షమ ఘేరస్య విధినా లింగకాంతరం।**
**ప్రతిష్ఠాప్యనయేత్ శుద్ధిం పిండికాయాం తథైవచ।**

(వాతుల శుద్ధాగమము, పటలము10,57-60)

ఇష్టలింగము దేహము నుండి చ్యుతమైననూ, నష్టమైననూ, దగ్ధమైననూ, అపహరింపబడిననూ, లేదా ఎలుక, కాకి, కోతి మరియు కుక్కల చేత లాగికొని పోబడినప్పుడును లక్షమార్లు అఘోర మంత్రమును జపించి ప్రాయశ్చిత్తమును చేసికొనవలయును. తదనంతరము శ్రీ గురువు నుండి సంస్కార పూర్వకముగా మరొక లింగమును పొందవలెనని చెప్పబడినది.

అఘోర మంత్రమనెడిది పంచ బ్రహ్మమంత్రములలో నొకటి. అది యీ క్రింద నివ్వనైనది.

**ఓం అఘోరే భ్యో౽థఘోరేభ్య ఘోరఘోరతరేభ్యః**
**సర్వేభ్య స్సర్వ సర్వేభ్యో నమస్తే అస్తు రుద్ర రూపేభ్యః**

ప్రాయశ్చిత్త సంబంధమైన కర్మలకై అఘోర మంత్రము ఎంతో ప్రశస్తమైనదని లింగపురాణము తెలుపుచున్నది. లింగపురాణములోని పూర్వభాగమునందు, 15వ అధ్యాయములోన యెంతో వివరణ యివ్వబడినది. "దేవ ప్రచ్యావకశ్చైవ లింగప్రధ్వంసకస్తథా" అనెడి ప్రమాణానుసారముగా లింగప్రధ్వంసకులును అఘోర మంత్రమును జపించుట చేత దోషనివారణ జరుగును. పుష్పదంతుడును "అఘోరాన్నాపరోమంత్రః" అని మహిమ్నలోన యీ మంత్రమును నుతించెను. దీని కంటెను శ్రేష్ఠమైన మంత్రమేదియును లేదని పుష్పదంతుని వాక్కులోని భావము. అయితే పంచాక్షరి సప్తకోటి మంత్రముల యందున శ్రేష్ఠమైనదని చెప్పబడినది కదా! అనే సందేహము గల్గుట సహజమే. నిత్యానుష్ఠానమునకై పంచాక్షరియును, ప్రాయశ్చిత్తమునకై అఘోర మంత్రము శ్రేష్ఠమైనదని గ్రహింపదగును.

శుద్ధశైవులకే విహితమై యున్న ప్రాయశ్చిత్తానుష్ఠానమును, వీరశైవులకును విహితమని యెంచి యిష్టలింగ వియోగ సందర్భమున యీ మంత్రము నుపయోగించి దోషనివారణ పొంది, ఆ పిదప విద్యుక్త విధిన గురువు నుండి యిష్ట లింగమును సంస్కార పూర్వకముగా పొందుటయే శ్రేయస్కరము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**ది॥ లింగష్టం 1990**

**స్థలం : శ్రీ సిద్ధేశ్వర దేవస్థానం, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు, యిష్టలింగధారణలో నిమిడి యున్న ధార్మిక విషయమలును చర్చించుచు, యిష్టలింగధారణ నిరాఘాటంగా కొనసాగవలెనని తెలియజేసిరి.

దీక్షా త్రయములో క్రియాదీక్ష ముఖ్యమైనదని తెలిసికొంటిమి. దీక్షలన్నిటికీ ఇది పునాది వంటిది. ఈ దీక్ష జరుగని యెడల తక్కిన దీక్షలు సంపన్నములు కావు. దీనిలో యిష్టలింగ ప్రదానము ముఖ్యాతిముఖ్యమైనది. ఈ క్రియకు స్వాయత్త దీక్షయని యందురు. ఆయత్తదీక్ష జరిగిన పిదప స్వాయత్త దీక్ష జరుపబడును. స్వాయత్త దీక్షలోని యంతర్భాగముగా, శ్రీ గురువు శిష్యునికి యీ క్రింది యుపదేశము నిచ్చును.

**"హే వత్స తవ ఇష్టార్థ సాధకం ఇష్టలింగం**
**ప్రాణలింగ మేతదితి భావయ!**
**హే వత్స, ఏకదేవ ఖలు సర్వతత్త్వతమ్**
**పరవస్విితి అను చింతయ।**
**హే వత్స, ఇదమేవ హి అజహర్యోరపి**
**దుర్లక్ష్యం నిజతత్త్యమితి నిశ్చిమ।**
**హే వత్స నిమిషార్థం మప్యేతత్**
**త్వచ్ఛరీరాన్నవియోజయన్ అవధానేన**
**ధారయ! త్రికాలమప్యేతత్ సమర్చ్యాం నియమేన సమాచర।**
**హేవత్స, యత్కించిదపి వస్తుజాతం**
**ప్రాణలింగేస్మిన్ అసమర్ప్యాన స్వీకురు।"**

**హే వత్స, ఇతో భోగమోఓఆ దయస్సర్వే 2పి**
**పురుషార్థాః కరగతా ఏవేతి విశ్వసిహి।**

**హే వత్స, సర్వక్లేశాన్ పరిత్యజ్య సదా సుఖ**
**యుక్తో భవ! సత్యమిదం, సత్యమిదం" నన్నది.**

ఈ ఉపదేశములోని భావము:

**ఓ వత్సా, ఇది నీ యిష్టార్థ సాదక యిష్టలింగము, ప్రాణలింగము వంటి దనియును, సకల తత్త్వాతీత పరశివ వస్తువని భావించుము.**

**ఓ వత్స్యా, ఇద్దానిని బ్రహ్మవిష్ణువులును పొందలేక పోయిరని తెలిసికొనుము.**

**ఓ వత్సా, దీనిని యర నిమిషమునైనను శరీరము నుండి వేరు చేయకుండగ ధరించుము.**

**ఓ వత్సా, ఈ లింగమూర్తిని ముప్పొద్దులు నియమ ప్రకారముగాపూజించుము.**

**ఓ వత్సా! యే పదార్థమైనను నీ లింగమునకు సమర్పించకుండగ స్వీకరించరాదు.**

**ఓ వత్సా! ఈ లింగమూర్తి వలననే సకల విధ పురుషార్థములు హస్తగతమగును.**

**ఓ వత్సా! సకల క్లేశములను దూరము చేసికొని సుఖమయ మైన జీవితమును గడుపుము. ఇది సత్యము - ఇది సత్యము.**

ఈ ఉపదేశము యొక్క నేపథ్యమున శ్రీ భగవత్పాదులవారు చేసిన యుపదేశమును అవగతముచేసికొనవలెను. వీరియుపదేశములో మూడు అంశములు గలవు. అవి ప్రాణము వలె యిష్టలింగమును దరించవలెను. ఎట్టి పరిస్థితిలోను దీనిని దేహము నుండి దూరము చేయవలదు. మరియు ప్రమాద వశాత్తున యిష్టలింగము నేల మీదపడిన యెడల ప్రాణ త్యాగము చేయవలెను.

ఈ మూడు విషయములు నొక విషయమునే చెప్పుచున్నవి. అవి యేమనగా యిష్టలింగమును దేహము నుండి దూరము చేయకూడదు. యెందుకు దూరము చేయకూడదో యనడి దానికి అనేకములైన కారణములు గలవని స్వాయత్త దీక్షా సందర్భమున శ్రీ గురువు చేసిన యుపదేశము వలన తెలియుచున్నది.

అన్ని ధర్మములు మనుజుడు పురుషార్థముల కొరకు కృషి చేయవలయునని తెలుపుచున్నవి. ధర్మార్థ కామ మోక్షములే పురుషార్థములు. ధర్మమనగా వర్ణధర్మమనియును ఆశ్రమ ధర్మమనియును తెలుపబడుచున్నది. ఇవి ప్రాకృతుల ధర్మములు. వీరశైవము అప్రాకృత ధర్మమనియును, శివధర్మమనియును చెప్పబడినది. వీరశైవ ధర్మీయులు అతివర్ణాశ్రమీయులని శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు విపులీకరణ చేసి యుండిరి.

వీరశైవులు వర్ణాశ్రమీయుల కంటెనతీతులనుటను "చతుర్వేద సారము" లోని యీ ప్రామాణిక పద్యమును గనుడి.

**సీ॥ లలి నెను బదినాల్గు లక్షయోనులబుట్టి**
**మహిమీదనంత్యజన్మమున జీవు**
**డుదయించు నవియుముప్పదిరెండు చనియెనే**
**నంతట మరిశూద్రుడై జనించు**
**నెన్నంగ నిరువదేనింట వైశ్యుండగు**
**నష్టాదశమున రాజగునతండు**
**నరపతి తొమ్మిదింటను బ్రాహ్మణుండగు**
**బ్రాహ్మణుతేనింట భక్తు డగును**

**నట్టి భక్తుండు జంగమంబగును మూట**
**జంగమంబంతమున గూడు శంభునందు**
**నంత 'నంతే శివం నన్యత'నుచు శ్రుతులు**
**పరగ జోటిడి గావున బసవ లింగ** (చతుర్వేద సారము, ప. 179)

వీరశైవులు షట్ స్థల ధర్మమును పాటింతురు. భక్తాదిషట్ స్థలములకు విహితమైన ధర్మములు వేరు వేరుగా నుండును. ప్రతి వీరశైవుడు షట్స్థలములను అవగతము చేసికొని శివజ్ఞాని కావలెను. జ్ఞానము వలన కర్మ దగ్ధమగును" విధి నిషేధాతీత వర్త"నుడుగా వీరశైవుడు పరిగణింపబడును. కర్మలతని బంధింపవు. కర్మజిత్తగును. శాస్త్ర విహిత నిత్య నైమిత్తిక కామ్యకర్మలు వీరశైవున కనావశ్యకములౌను. వీటి స్థానమున లింగధారణ మరియు లింగార్చన లనుల్లంఘనీయములగు నియమములగును. లింగమును హస్త పీఠమున పెట్టికొని పూజించువాడే వీరశైవుడగునని శివపురాణమనుచున్నది. ఇష్టలింగ ధారణ లేని వాడు ధర్మమును ఉల్లంఘించుచున్నాడు. అధర్మీయుడు నరకమున పడునని శాస్త్ర వచనము. లింగ దీక్షను పొందినను కారణాంతరముల వలన లింగధారణకు దూరమైన వారిని రక్షించి కాపాడుటకే శ్రీ భగవత్పాదులు నీ యుపదేశము ననుగ్రహించిరి.

అర్థము లేని ధర్మము నాచరించుట కష్టతరమగును. ఇష్టార్థ సిద్ధికై శాస్త్రము కామ్యకర్మలను చేయవలెనని చెప్పుచున్నది. యజ్ఞయాగ తపోవ్రతాదులు నీ కోవకు చెంది కామ్యకర్మ యొక్క ఫలితమునే యిచ్చును. అసంఖ్యాకమైన కర్మలు చేయవలసి యుండును. వీరశైవునకు యిష్టార్థ సిద్ధి యతిసులభముగా యిష్టలింగార్చన వలన గలుగుచున్నది. సాధారణ కామ్యకర్మలలో నుండెడి కర్మజాడ్యము వీరశైవమని తాక జాలదు. ఆర్జిత వస్తు సంపదను యిష్టలింగమునకు సమర్పించుట చేత కర్మ ఫల్లటమగుచున్నది. ఇంతటి మహత్తరమైన యిష్టలింగమును ధరించని వాడు వివేకవంతుడు కాజాలడు.

కామమనెడి పురుషార్థము సర్వత్రా వర్జనీయము. బ్రహ్మచర్యమున కామము జోలికి పోవలదు. గృహస్థుడు సంతానాపేక్షతో మాత్రమే కామము ననుభవించవలెను. మిగిలినయా శ్రమీయుల కది వర్జనీయమే. వీరశైవమున యింద్రియములను నిరోధింప వలసిన పని లేదు. లింగధారియైన వాడు త్వగాదుల నుండి పొందెడి యనుభవమును యిష్టలింగమునకు సమర్పించి యనుభోగము చేయవలెనని చెప్పబడినది. ఇట్టి కామోపభోగము ధర్మబద్ధమై యుండవలెననెడి నియమము కలదు. ఇట్టిమహత్తరమైన యనుభవము నిచ్చెడి యిష్టలింగమునకు దూరమయ్యెడి వాడు నిందనీయుడుకాదా!?

ముక్తి విషయమున విభిన్నమైన యభిప్రాయములు గలవు. సాలోక్యము, సామీప్యము, సారూప్యములు సాధ్యము కావచ్చును. సాయుజ్యము సాధించుట చాలా కష్టము. సాయుజ్యమును మించినదని వినుతింపబడెడి లింగాంగ సామరస్యము అలింగ ధారికెట్టుల సాధ్యమగును? ఈ కారణముననే లింగధారణ అనుల్లంఘనమై యున్నది. సాయత్త దీక్షా సందర్భమున శ్రీ గురువు శిష్యుని యుద్దేశించి "అరనిమిషమైనను లింగమును దూరము చేసికొనక సావధాన చిత్తముతో ధరించవలెను" అని తెలిపిరి.

షడ్విధ భక్తులలో నవ ధ్యాన భక్తి యొకటి. అది ప్రసాది స్థలమున నుపయుక్తమగును. భక్తి స్థలమున శ్రద్ధా భక్తియే విహితమని శ్రీమగ్గియ మాయిదేవులవారు తెలిపిరి. ఇచ్చట యవధానమనగా జాగరూకత. ఎంతో జాగరూకతతో లింగము ధరించవలెను. జాగరూకత వహించిన వానికి ప్రమాదము వాటిల్లదనెడిది జన నుడి గదా! అజాగ్రత్త వలన ప్రమాదములు హెచ్చును. ప్రమాద వశాత్తున లింగము దేహమును వీడి నేల మీద పడకూడదనెడి ఆగమ కోవిదుల యభిప్రాయము. తదను గుణముగనే శ్రీ భగవత్పాదులవారు ప్రాణత్యాగమును నిర్దేశించిరి. ఇయ్యది యవధానమును పెంచుటకే కాని మరే యితర కారణము కాజాలదు. పెద్దలు ప్రాణత్యాగమును కోరరు. సావధాన చిత్తము నాశింతురు.ఈవిషయము స్పష్టము చేసెడి విఖ్యాతయను భావి వాక్కులను గనుడి.

**తందె మక్కళిగె బుద్ధియ హేళువల్లి**
**తప్పింగె మునివ నల్లదె ప్రాణక్కెమునియ**
**లింగవంతను లింగవంతరిగె బుద్ధియ హెళువల్లి**
**అవగుణక్కె మునివల్లదె లాంఛనక్కె మునియ**
**లింగవంతను లింగపథవ హెళిదడె**
**మచ్చరిసువర మెచ్చ కూడల సంగమదేవ** (బ.వ. 652)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**తండ్రి పిల్లలకు బుద్ధిని జెప్పునప్పుడు**
**తప్పుకు కోపగించును గాని ప్రాణమునకు కోపగించదు.**

లింగవంతుడు లింగవంతులకు బుద్ధిని చెప్పునప్పుడు అవగుణమునకు కోపించుగాని లాంఛనముకై కోపగించదు. లింగవంతుడు లింగ పథము చెప్పినచో మత్సరించు వారిని మెచ్చరు కూడల సంగమ దేవా!

ప్రాణ భయమును చూపుట వలన అవధానము పెరుగునని భావించి యిట్టి కఠోర నియమమని భావించవలెను.

శాస్త్ర ప్రకారము చేయవలసిన కర్మలను చేయకుండినను, చేయకూడని కర్మములను చేయుట వలనను దోషము సంప్రాప్తమగును. ఈ దోషము నుండి విముక్తిని పొందుటకై కొన్ని ప్రాయశ్చిత్తములు విధింపబడినవి. ఉదాహరణకు అభక్ష్యము భుజించిన వానికి బంగారు కడ్డిని కాల్చి నాలుక చురక వేసిన దోషము పోవునని కర్మఠుల వాదనము. ఇత్యాది యుచితానుచితములను పరిశీలించుట ప్రస్తుతమగును. ప్రస్తుతమేమనగా ప్రాయశ్చిత్తకర్మలు విహితమా కావా? ప్రాయశ్చిత్తము చేసికొనెడి యవకాశముండిన యెడల పదే పదే తప్పు చేసెడి యవకాశము గల్గును. సావధాన చిత్తమునకు భంగములు వాటిల్లును. ఈ కారణమున వీరశైవులు ప్రాయశ్చిత్త కర్మలను నిరసించిరి. ఈ విషయమున మన యవగాహనను పెంచెడి పెద్దల వాక్కుల గనుడి.

**సదాచార సద్భక్తి యిల్ల దవర నొల్లనయ్యా**
**అవరారాధన దండ!**
**విచ్చ నిచ్చి ప్రాయశ్చిత్తర వొల్ల**
**కూడల సంగమ దేవా, బూభారకర** (బవ, 650)

ఈ వచనము యొక్క తెలుగురూపము :

**సదాచారము సద్భక్తి లేని వారి వొల్లనయ్యా!**
**వారి యారాధన దండుగ!**
**నిత్య నిత్యము ప్రాయశ్చిత్తము చేసెడి వారి నొల్ల**
**కూడల సంగమ దేవా, భూభారకుల**

ఇచ్చట తెలిసికొన వలసిన దేమనగా అవధాని యొక్క లింగము అనివార్యమైన కారణం వలన భూమి మీద పడినప్పుడు అతడు చేయవలసిన దేమిటి? ప్రాణత్యాగమనెడి దానిని తాత్వికముగా నర్ధము చేసినకొనవలెను, ఎన్నియో కష్టములకోర్చి చావలేక తిరుగాడెడి వానిని గాంచి వాడు బ్రతికినా చచ్చినట్టులే యని యందుము గదా! ఈ విషయమును తెలిపెడి కథ యొకటి గలదు. ఒకానొక యూరిలో నొకానొక భోగి జీవించుచుండెను. వాడొక అందగాడిగా పేరుగాంచెనూ వానికొక యందమైన భార్య యుండెను. మేరు పర్వతమును పోలెడి సంపద యతని సొంతమై యుండెను. దిగంత పరివ్యాప్తమైన కీర్తి వానికుండెను. స్వామిభక్తి గల సిబ్బంది యుండిరి. వాడు భూతలమున స్వర్గమును చవిచూసెను. కాలాంతరమున విధి వక్రించెను. రూపమునకు గ్రహణము పట్టెను. రూపసి యగు పడతి యతనిని వీడి మరొకనిని చేరెను. సంపద కరిగి నీరయ్యెను. అపకీర్తి యనెడి కారుమేఘము కీర్తి చంద్రికను కబళించి వేసెను. స్వామిభక్తులైన సిబ్బంది దూరమై ద్రోహబుద్ధిగలవారు దరిన చేరిరి. వానిని చూసి జూసి జనులు ప్రాణమున్న పీనుగయని పిలువజొచ్చిరి.

లింగమును కోల్పోయిన వాడును ఇట్టివాడేయని గ్రహించవలెను. ప్రాణమును వీడుము అనగా భక్తునిగా నున్న దేహమును త్యజించి భవిగా జీవనము గడపవలెనని గ్రహించగలరు. వెనువెంటనే పిదప నతడు గురువు నాశ్రయించి, దీక్షను బడసి భక్తునిగా పునర్జన్మను పొందవలెను. ఈ విధిన అర్థము చేసికొనుటయే యుక్తమని యెంచగలరు.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము 4 :

**లింగస్య ధారణం పుణ్యం సర్వపాపప్రణాశనం**
**ఆదృతం మునిభిః సర్వైరాగమార్థవిశారదైః**
**లింగధారణమాఖ్యాతం ద్విధా సర్వార్థసాధకైః**
**బాహ్యమభ్యంతరంచేతిమునిభిర్మోక్ష కాంక్షిభిః** (సి శి 6:28–29)

## మన భాగ్యమునకు శిల్పులము మనమే :

మనుష్యుడు తన సర్వ పాపములను దూరము చేసికొని పుణ్యజీవియగుటకై లింగధారణమే యమోఘమైన సాధనమని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు జగత్తుకు నుపదేశము నిచ్చిరి. జీవుల పుణ్య పాపములే జగత్తులోని పుణ్యపాపములకు కారణములైయున్నవి. ప్రతివాడు సర్వదా సుఖముగా నుండుటకే యిచ్చగించును అయితే, సుఖమును గల్గించెడి యుత్తమ క్రియలను మాత్రము తలపెట్టడు. "పుణ్యస్యఫలమిచ్ఛంతి" అని అనుభవజ్ఞులు నుడివిరి. మన భాగ్యమునకు మనమే శిల్పుల మైనందున యుత్కృష్ట క్రియల ద్వారా మన భాగ్యమును మనమే నిర్ణయించుకొనవలెను. వాక్పాణి పాదోపస్థపాయువులనెడి కర్మేంద్రియములు శుభాశుభ కర్మలకు కారణభూతములై యున్నవి. వీటిలో హస్తమునకు ప్రాముఖ్యత కలదు. "అయం మే హస్తో భగవాన్" అనెడి వేద మంత్రము హస్తము యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పుచున్నది. కరము శక్తియంత్రమునకు నెలవు కాన, నిత్యము ప్రాతఃసమయమున కరదర్శనమును చేసికొని తమ యమూల్యమైన హస్తములద్వారా తనకు మరియు జగత్తుకును హితమును కూర్చెడి కార్యములనే చేయవలెను.

కార్యసిద్ధికై పాతక నివారణ యవశ్యముగా నున్నదని తెలిపెడి పురాణోక్తికిని కనుడి.

**శ్లో॥ యావచ్చ పాతకం దేహే తావత్ సిద్ధిర్నజాయతే।**
**గతేచ పాతకే తస్య సర్వంచ సఫలం భవేత్॥** (శివపురా, రుద్రసం, సృష్టిఖండ, 12–70)

పాతక నివారణకై వలయు నుపాయమును గూర్చి తెలిసికొనుట ప్రతి యొక్కరి కర్తవ్యమై యున్నది.

## పరశివుడే పాపనాశకుడు :

మనుష్యుని యంతరంగ బహిరంగములు మలినముతో కూడికొని యున్నవి. ప్రకృతి, పరమేశ్వరులకు యీ మాలిన్యమును దూరము చేసెడి శక్తి సామర్థ్యములు గలవు. భూమి మనము చేసెడి మాలిన్యాదులను స్వీకరించి, సుగంధభరితమైన పుష్పములను, మధురమైన

ఫలములనొసంగుచున్నది. మనము వదిలెడి బొగ్గుపులుసు వాయువును వృక్షములు గ్రహించి మనకు ప్రాణవాయువు నిచ్చుచున్నవి. నీరు మన మాలిన్యమును దూరము చేయుచున్నది. అగ్ని మలినమును భస్మము చేయగా సూర్యచంద్రులు, చీకటిని తొలగించి వెలుతురు నిచ్చుచున్నారు. లింగాంగ సామరస్యము వలన మన యంతరంగము నిర్మలమగును.

శివుని దర్శన స్పర్శనాదుల చేత పాపము పటాపంచమగునని చెప్పబడిన అగ్ని స్పర్శచేత వస్తువులే విధిన దగ్ధమగునో, అదే విధిన శివుని దర్శన స్పర్శనాదుల చేత జీవుని పాపము బూడిదై, యతడు పుణ్యజుడుముగా వెలుగునని తెలియుచున్నది. ఇందుకు నిదర్శనముగా...

ఒక యూరిలోన కడు పాపిష్టియైన వాని ఆయువు తీరిపోయెను. యమ దూతలు, యముని ఆదేశము మేరకు, వాడి ప్రాణములు తీసికొని పోవుటకు భూలోకమునకు వచ్చిరి. అదొక వేసవిలోని మధ్యరాత్రి, సమయమై యుండెను. ఆ పాపి అంగళమందు వేయబడిన మంచము మీద హాయిగా నిదురించుచుండెను. వాని స్థూల-సూక్ష్మశరీరములు పాప పంకిలముతో నిండియుండెను. కుళ్ళను ముట్టుటకు మనుష్యులు వెనుకంజవేయునటులే, యమదూతలు వీనిని ముట్టుట కిష్టపడరైరి. యముని ఆదేశము పాలించుటెట్టులయని యాలోచించి మంచముతో సహా వానిని తీసికొన పోవలెనని నిశ్చయించికొనిరి. నలుగురును ఒక్కొక్క మంచపు కాలును పట్టుకొని మంచము నెత్తికొని యమ పురికి వెడలి యముని సన్నిధిన మంచమునుంచి చల్లని గాలియందున హాయిగా నిద్రించుచున్న వానికి మెలకువ రాలేదు. ఇద్దానిని గని యముడు క్రుద్ధుడై గర్జించగా పాపియా గర్జనను విని బెదిరి లేచి కూర్చుండెను. యముడు, అతనిని భూలోకమున నేమేమి పాపములు చేసితివని ప్రశ్నించగా పాపి, లోకమున తాను చేయని పాపములు లోకమున నింకేమియు మిగల లేవని బదులు పలుకగా వినిన యముడు, పాపిని రౌరవ నరకము నందు వేయుమని యముడు దూతల నాజ్ఞాపించెను. అప్పుడా పాపి తెలివితో ధైర్యమును వీడవలదని నిశ్చయించుకొనెను అతనికొక యోచన తట్టెను. అతడు, యముని గని నన్ను రౌరవ నరకమందు వేయుమని చెప్పుటకు మీరెవ్వరని మొండి ధైర్యముతో నడిగెను. యముడు, నేను యమ ధర్మరాజును, ప్రాణులకు వారి వారి కర్మానుసారముగా శిక్షలను విధించుటకై సర్వాధికారములు గలవాడను అని యుత్తరము నిచ్చెను. పాపి, యమునితో "యమదేవుల వారు మీరేనా; పాండవులలో నొకడైన ధర్మరాజు మీ మంత్ర పఠనము వలన పుట్టినాడట! అవునా? యని యనెను. యముడు అవును, అయినా నీకేమి కావలెను" అని పాపిని ప్రశ్నించగా పాపి, ఏమీలేదు, అతని కీర్తి యెంతో మేరకు గలదు, అతనిని కనులారా చూడాలనెడి కోరిక కలదు అని తెలుపగా యముడు, "అతడు స్వర్గమందుననున్నాడు, నీ వంటి పాపి కచట ప్రవేశముండదని పాపికి యుత్తరము నిచ్చెను. అప్పుడు పాపి యమునితో, పాపియైన ధర్మరాజును నరకమునందు వేయకుండగ స్వర్గమునకు పంపించినారా? మీ మంత్రము వలన జనించినందుకా? భూలోకములో నుండెడి పక్షపాతము ఇక్కడ కూడ యున్నదా" అని యనెను. పాపి మాటలను వినిన యమునికి పట్టరాని కోపము వచ్చెను. "ఓరీ పాపి! నోరు మూయుము. అధిక ప్రసంగము చేయుచున్నావు. జాగ్రత్త అంటూ ధర్మరాజు చేసిన పాపమేదో తెలుపుమని గద్దించి పలికెను. పాపి యమ ధర్మజున కిట్లనెను.

"ఓయీ యమా! ఏమియూ తెలియనట్లే మాట్లాడు చున్నావే? ఇంతకు మున్ను నెవ్వరూ చేయనంత పాపము ధర్మరాజు చేసెను. తెలిసిన జ్ఞానియై యుండియూ అతడు పాపమును చేసినాడే! తెలిసి దోషమును చేస్తే మహాపాపమగును. పాచికలాటలో పడతిని యొడ్డుట ధర్మ విరుద్ధము కాదా? యుద్ధభూమి నందు, కపట నాటక సూత్రధారియైన కృష్ణుని మాటలను విని, అశ్వత్థామ చచ్చినాడని యబద్దమాడి ద్రోణాచార్యుల మరణానికి కారణము కాలేదా? ఈ విధముగా తెలిసియుండియూ కావలెనని బుద్ధి పూర్వకముగా పాపము చేసిన యతనిని మహాపాపిగా పరిగణించి అనంతకాలము వరకు నరకములో పడవేయుటకు బదులుగా స్వర్గమునకు పంపించిన మిమ్ములను కూడ రౌరవ నరకములో వేయవలసిన యవశ్యత గలదు. జాగ్రత్త వహించుము అంటూ ధైర్యముతో గట్టిగా, బిగ్గరగా వాదించెడి పాపి మాటలను వినిన యముడు బెదరిన వాడయ్యెను. గుండె దడ దడ లాడెను. నోరు పడిపోయెను. సూటిగా వాని వైపుకు చూడలేకుండెను. పాపివాదనలో నతనికి సత్యముగోచరించెను. తాను దోషము చేసెనేమోయను సందేహము గలుగ జొచ్చెను. అపరాధియైన తనకు నితని శిక్షించెడి యధికారము నుండ జాలదని యెంచెను. మందస్వరముతో "ఇతనిని బ్రహ్మలోకమునకు తీసికొని వెడలుడి, సృష్టికర్తనే యితనికి తగిన శిక్షనువిధించునని" అని భటులకు నాదేశము నిచ్చెను.

యమదూతలు వానిని మోసికొని బ్రహ్మలోకమునకు గొనిపోయిరి. వాడు మంచము మీదనే పరుండి యుండెను. బ్రహ్మదేవుడు, పద్మాసనమున కూర్చుండి నాలుగు వేదములను చేతిన ధరించి తన నాల్గు ముఖములతో వేదమును చదువజొచ్చెను. అధ్యయమునందు నిమగ్నుడైయున్న బ్రహ్మకడ మంచమును దించి, యమభటులు విరించికి మ్రొక్కి, వినయముతో (అప్పుడు పాపి, బ్రహ్మ ఎదుట నిలిచి యుండెను) "ఓ ప్రభూ!

మేము యమలోకము నుండి వచ్చితిమి. వీడు భూలోకమునకు చెందినవాడు. ఎన్నో పాపములను చేసిన వాడు. ఆయువు ముగిసిన పిదప యమలోకమును మోసికొని వచ్చితిమి. యమరాజు నితనికి రౌరవ నరకమును విధించగా వీడు వెనువెంటనే, యమునిపై పక్షపాత నేరారోపణ చేసెను. జూదమాడి యసత్యమును పలికిన ధర్మరాజు శిక్షార్హుడనియును, జ్ఞానియైయుండి యిట్టి నేరము చేయుట గొప్పమహాపాపమనియును, అతనిని శిక్షింపక ఉదాసీనత వహించిన యముడు దోషి యనియును, తన కొడుకు యెడల పక్షపాతమును చూపినందున శిక్షార్హుడనియును అని ఆరోపించగా వీనిని శిక్షించెడి నైతికాధికారము తనకు లేదని భావించిన యముడు మీకడకు పంపిరి, దయచేసి మీరు వీనిని శిక్షించుడి" అని యమభటులు విన్నవించుకొనిరి.

బ్రహ్మ, పాపియుద్ధతతనము గూర్చి విని క్రుద్ధుడై గర్జించగా బ్రహ్మలోకమే వణికి పోయెను. పాపికి బ్రహ్మ యిట్లనెను. ఓరీ లౌకికుడా! నీవు చేసిన పాపము లెట్టివో తెలియకుండగనే మాటలాడుచున్నావు. నీమనస్సుకు వచ్చినట్లు మాట్లాడుట తగని పని" అని హితవాక్యములు పలికి యమభటుల వైపుకు తిరిగి వీనిని వేనకు వేలసంవత్సరముల వరకు రౌరవ నరకములోనపెట్టుడి" అని ఆజ్ఞను జారీచేసెను.

"నన్ను నరకమునకు పంపించెడి వారు మీరెవ్వరు స్వామీ! మీ పరిచయము చేసికొనవలదే" అని పాపి బ్రహ్మనూ వ్యంగ్యముగా ప్రశ్నించెను.

బ్రహ్మ హూంకరిస్తూ "నా గూర్చి నీకు తెలియదా? అందుకే యీ విధిన వినయ శూన్యుడవై ప్రవర్తించుచున్నావా? నేను పరమ శివుని మొదటి కొడుకును. నాకు నాలుగు వేదములు ముఖోద్గతములు, యీ సృష్టికి ఆది కర్తను నేను. తెలిసినదా?" అని బదులు పలికెను.

అప్పుడు పాపి బ్రహ్మకిట్లనెను "మహా సంతోషము స్వామీ! మీ గూర్చి పౌరాణికులు చెప్పగా కొంత మేరకు వింటిని. అయితే చూచే సౌభాగ్యము దొరుకకుండెను. నేడది లభించినది ధన్యుడనైతిని. పరమ దయాళులైన మీరు దయచేసి నా పాపమును మన్నించి నన్ను యీ ఒక్కసారి క్షమించుడి? ఇది వినిన బ్రహ్మ అసహ్యాభావమును వహించి "ఛీ! ఇదెప్పటికిని సాధ్యము కాదు. పాపమునకు తగిన ప్రాయశ్చిత్తము కావలెను' "వీనిని తీసికొని వెళ్ళుడి"యని యమభటుల నదిలించెను.

పాపి ఆలోచనలలో పడెను. బ్రహ్మచేసిన దోషముల గూర్చి ఆలోచించగా యతని బుద్ధికొక ఆలోచన తట్టెను. కష్టము తప్పినదని భావించికొని, ధైర్యముతో బ్రహ్మకిట్లనెను. "ఓ బ్రహ్మ దేవా! నీవు పరశివుని మొదటి కొడువై చతుర్వేదివై, సృష్టి కర్తవై యుండియును, ఎవ్వరూ చేయని మహాపరాధమును చేసితివి కదా? సరస్వతి నీ కూతురు కదా? ఆమెను పెళ్ళి జేసికొంటివే. కూతురు పెళ్ళాడెడి మహాపాపులు భూలోకమున యొక్కరైననూ లేరు. చతుర్వేదములను చేపట్టి, ధర్మంచర యని లోకమున కుపదేశిస్తూ స్వతఃగా ధర్మముల్లఘించిన మీ యంతటి దోషులింకెవ్వరును లేరు. అయితే, ప్రాయశ్చిత్తమునైనా చేసికొంటివే? అదియు లేదే? స్వతహాగా పాపివైన నీకు నన్ను శిక్షించెడి యధికారముండునే? నా జతకు శిక్షననుభవించుటకై మీరును నరకమునకు రండు" పాపి మాటలను వినిన బ్రహ్మకు భయము కాజొచ్చెను. తన మనస్సులో "మనుష్యులు చాలా తెలివి గలవారు. దేవతలు చేసిన తప్పులను చూపుచున్నారు. చేసెడి దేమున్నది? వీడు సత్యమునే నుడివెను. నేను దోషినే, పాపము చేసిన నాకు, వీనిని శిక్షించెడి నైతికాధికారము లేదు. నా అధికారము లేని దానిని చేసిన యెడల, యున్న అధికారము వుండిపోవును. వీనిని శివుని దగ్గరకు పంపించుటే ప్రస్తుత కర్తవ్యము. "యీ విధిన తలచికొని, "యమ భటులారా! మీరు ఈ పాపిని కైలాసమునకు గొనిపొండు. అని దూతలను ఆజ్ఞాపించెను.

యమభటులు, బ్రహ్మగారి ఆదేశము మేరకు, పాపిని మంచము మీద పరుండబెట్టి, మోసికొని శివలోకమునకు వెడలిరి. శివలోకమున శివుడు ధ్యాన నిమగ్నుడై యుండెను. సత్యమై యున్నవాడును, సుందర రూపుడును, మంగళమయుడగు శివుని గని పాపి సంతోషభరితమగుడయ్యెను. తన జీవితము ధన్యమైనదని యెంచెను. పాపమునకు చెందిన శిక్ష నుండి ముక్తుడనైతినని మోదము నందెను. అతనికి ధైర్యము యినుమడించెను.

యమభటులు శివస్తుతిని చేసి శివుని ప్రసన్నుని చేసికొనిరి. అతడు ధ్యానమును వీడి యమభటులతో యిట్లనెను. "యమ దూతలారా! ఏమి సమాచారము? యముదూతలు యమలోకములోను, బ్రహ్మలోకములోను జరిగిన సంఘటనలను వివరించి "పాపి"ని శిక్షించుడని వేడిరి. శివుడు క్రుద్ధుడయ్యెను. పాపిని యీ విధిన ప్రశ్నించెను. "నీవు చేసిన యపరాధము లెట్టివి?" పాపి "స్వామీ! నేను చేయక మిగిలిన అపరాధమే లేదనెను.

"ఇతడు తాను చేసిన తప్పుల నొప్పికొనినాడు. అందుచేత, యితనిని ఘోరమైన నరకమున వేయుడి" యని యమదూతలకు శివుడు నాదేశము" నిచ్చెను.

"స్వామీ! మీ ఆజ్ఞ మేరకే నడిచి కొనెదని" పలికి యమభట్లు మంచమునెత్తికొని పాపిన మోసికొని వెడలుటకు నుద్యుక్తులైరి. అప్పుడు పాపి శివుని "నన్ను ఘోర నరకమునకు పంపించుటకు తమరెవ్వ"రని ప్రశ్నించెను. "నేను పరమశివుడను, త్రిమూర్తులకు మూల కారణుడిని" అని బదులు పలికెను. "స్వామీ! మీరు అసలు శివునివా, లేక నకిలి శివునివా"యని పాపి శివుని మరల ప్రశ్నించెను. అప్పుడు "శివుడు, "ఏమి యిట్లంటివి? నిజము నీకు తెలియదా?" అని పాపిని యడిగెను.

పాపి వినయముతో శివుని కిట్లనెను; "తమరు అసలు శివుడై యుండినచో నన్ను నరకమునకు పంపుదురే? మీ ధర్శనము వలనపాపములు దహించికొని పోవునని మా అవ్వ చెప్పి యుండెను. మీ పురాణములలో నీ విధిన తెలుపుచూ, శివభక్తుల కథలు చెప్పబడినవి. నేను నరకమునకు వెడలినచో మీ కథలన్నియునూ కల్లలౌను కదా!' అని యనిన పాపి మాటలకు శివుడు సంతష్టుడయ్యెను. అతనిని మన్నించి సాయుజ్యముక్తినిచ్చెను. శివుడు పతిత పావనుడు గదా!

## లింగధారణ పుణ్య ప్రదమైనది :

"లింగస్య ధారణం పుణ్యః" అని భగవత్పాదుల వారు నుపదేశించిరి. ఈ విషయమున లింగపురాణము లో బహువిస్తారమైన వివరణగలదు. లింగమనెడిది పరమేశ్వరుని రూపమని తెలుపబడినది. శివుడు లింగరూపమున యుద్భవించెనని శివుని పంచవింశతి లీలలను గుర్తెరిగిన విజ్ఞులు నుడువుదురు. వాతులలాగమమున లింగోద్భవ లీలలగురించి తెలుపబడినది. కనుడి.

**శ్లో॥ లింగోద్భవ స్వరూపంతు పంచవివశత్ ప్రకీర్తితమ్।**
**ఏతే మహేశరూపాః స్యుమూర్తి భేదాః ప్రకీర్తితాః॥** (వాతుల శుద్ధాఖ్య తంత్రము 1-134)

లింగోద్భవ లీల, యిరువది యైదవ లీల యనితెలుపబడినది. లింగపురాణములోని పూర్వభాగమున యిరువది యారవ యధ్యాయమునందు, శివలీలకు చెందిన విగ్రహముల నేవిధిన ప్రతిష్టించి పూజించవలెనో తెలుపబడినది. పరశివుని లింగరూపమును ధరించి పూజించునది యధికముగా నివ్వబడినది. శివుని నిరాకార నిర్గుణములకు లింగము ప్రతీకమైనందున లింగధారణ మరియు పూజ ప్రశస్తమైనది. యిట్టి ఆచరణ వలన పాపములన్ని పటాపంచలై పుణ్యప్రాప్తి యగునని శ్రీ భగవత్పాదుల యుపదేశము లోని సారాంశము. సకల మాలిన్యములకు నిలయమైన భూమి లింగస్థాపన వలన యెట్టి విశిష్టతను పొందునో లింగధారియు అట్టి పుణ్య విశిష్టతనే పొందునని విజ్ఞులు విశదపరిచిరి.

లింగసంబంధము చేత భూమి పావనమగును.

భూమికి లింగమును ధరించునదనెడిది యొక ప్రాచీనమైన శైవ సాంప్రదాయమైయున్నది. లింగమును ధరించిన భూభాగములు పుణ్య క్షేత్రములని యనిపించుకొనును.సోమనాధుని వలన సౌరాష్ట్రము, మల్లికార్జునుని వలన శ్రీశైలము, మహాకాలుని వలన ఉజ్జయిని, ఓంకారేశ్వరుని వలన అమలేశ్వరము, వైద్యనాధుని వలన పరళి, భీమశంకరుని వలన ఢాకిని, రామేశ్వరము వలన సేతుబంధము, నాగేశ్వరుని వలన దారుకావనము, విశ్వేశ్వరుని వలన వారణాసి, త్ర్యంబకేశుని వలన గౌతమీతటము, కేదాకేశ్వరుని వలన హిమాలయము, ఘృష్ణేశ్వరుని వలన శివాలయము మున్నగు ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రములు పుణ్యప్రదములై విరాజిల్లుచున్నవి.

అదే విధిన, అమరనాథుని వలన కాశ్మీరము, పృథ్వీ లింగముచేత శివకంచి, జల లింగము చేత జంబునాథ క్షేత్రము, తేజోలింగము వలన అరుణాచలము, వాయులింగము వలన కాళహస్తి, ఆకాశ లింగము వలన చిదంబరము పవిత్ర క్షేత్రములై పుణ్యప్రదములై యొప్పారుచున్నవి. ఇట్టివి భారత దేశములో కోట్ల సంఖ్యలో గలవు. ప్రపంచములోని పలు దేశములలో శివలింగములు స్థాపింపబడి పూజింపబడుట అనాదిగా కొనసాగును వచ్చుచున్నది. దీనికై చరిత్రయే పరమ ప్రమాణము.

ఈ క్షేత్రముల యందున, శివలింగ ధర్శనార్థమై కొన్ని లక్షల సంఖ్యలో వచ్చుచున్నారు. జ్యోతిర్లింగముల దర్శనము వలన యేడు జన్మలలో చేయబడిన పాపము పరిహారమగునని ప్రాచీన కాలమునకు చెందిన ఋషుల చేత చెప్పబడినది. లింగము యొక్క మహిమ సామాన్యుల కవగతము కాదని శ్రీ నిజగుణులవారు సెలవిచ్చిరి (క్రై.ప.4-34)

లింగాష్టకములో లింగము యొక్క మహిమ సవివరముగా చెప్పబడినది. చూడుడి.

**జన్మజదుఃఖ వినాశక లింగం**
**కామదహన కరుణాకర లింగం**
**రావణ దర్పవినాశకలింగం**
**దక్షసు యజ్ఞ వినాశక లింగం**
**సంచిత పాప వినాశక లింగం**
**దినకర కోటి విభాసురలింగం**
**సర్వసముద్భవ కారణ లింగం**
**సంచిత పాప వినాశక లింగం**
**అష్టదరిద్ర వినాశక లింగం**

ఈ విధముగా యెంతో మహత్వము గలదని గుర్తించగలరు.

## దేహమే దేవాలయము :

భూమిని పవిత్రముగా చేసెడి లింగము, దేహము మీదకు వచ్చిన యెడలదేహము దేవాలయము కాదా? వాస్తవముగా, లింగ ధారిదేహము తిరుగాడే దేవాలయమే. తన దేహమే దేవాలయమైన పిదప లింగధారికి, వేరే దేవాలయమునకు వెళ్ళెడి ప్రశ్నగ మొదలు వచ్చును. వీరశైవాచార్యులైన జాతవేదముని శివాచార్యుల వారిచే యిష్టలింగదీక్షను పొందిన శ్రీ బసవేశ్వరుల వారు దేహమునే దేవాలయముగా భావించికొనిన మహానుభావులు, వీరి వాక్కులను గనుడి.

**“ఉళ్ళవరు శివాలయ మాడువరు. నా నేను మాడువె?**
**బడవనయ్యా-ఎన్నకాలె కంబ, దేహవే దేగుల**
**శిరవెహొన్న కళసవయ్యా కూడల సంగమదేవా కేళయ్యా**
**స్థావరక్కళివుంటు జంగమక్కళి విల్లా॥**

దీనికి తెలుగురూపమిది :

**ఉన్నవారు శివాలయము కట్టగలరు.**
**నేనేమి కట్టగలను? బడుగునయ్యా!**
**నాకాళ్లే కంబములు దేహమే దేవళము**
**శిరమే జంగమ కలశమయ్యా!**
**కూడల సంగమదేవా! వినుమయ్యా!**
**స్థావరమునకు కంతముండును జంగమున కంతములేదు.**

“ఇదే విధిన నున్న ప్రభువుల వారి వాక్కులను గనుడి;

**కాలే కంభగళాదవెన్న! దేహవే దేగులవాయితయ్యా!**
**ఎన్న నాలిగెయే ఘంటె, శిర సువర్ణద కలశ- ఇదేనయ్యా?**
**శిరవే లింగక్కె సింహాసన వాగిద్దితయ్యా, గుహేశ్వరా,**
**నిమ్మ ప్రాణలింగ ప్రతిష్ఠే పల్లటివాగదింతిద్దెనయ్యా॥**

ఈ వాక్కుల తెలుగు రూపమును గనుడి;

**కాళ్ళే కంబములైనవి నావి। దేహమే దేవాలయమైనదయ్యా।**
**నా నాలుకయే ఘంట, శిరము సువర్ణపు కలశము దేనయ్యా**
**శిరమే లింగమునకు సింహాసనముగా నైయున్నదయ్యా, గుహేశ్వరా!**
**మీ ప్రాణలింగ ప్రతిష్ఠ పల్లటముగ కాకుండగ నుంటినయ్యా**

వీరశైవులకు ప్రాప్తమైన యీ లింగధారణ సౌభాగ్యము, వారి యనేక జన్మల పుణ్యవిశేష మనియే చెప్పవలెను. లింగధారి యొక్క భావము పరిశుద్ధమైనదై యుండుట చేత, నతడు కామ క్రోధాదుల చేత ముక్తుని పొంది సకల పాపములను తొలగించికొని పుణ్యపుంజమగు చున్నాడు.

## లింగధారులైన మహర్షులు :

లింగము యొక్క మహత్తును తెలిసికొని ఆగమ విశారదులైన అనేక మంది ఋషులు లింగధారులై లింగపూజకులైరి. శ్రీ మరితొంటదార్యుల వారు, తమ వీరశైవానంద చంద్రికలోన యీ ఋషుల పేర్లను తెలిపిరి.

నీల, మహేశ్వర, ఘంటాసిద్ధ, సారంగ, వృద్ధాగస్త్య, త్రిశిఖ, అష్టజట, పంచవర్ణక, సిద్ధశాసన (రేణుకాచార్యుల శిష్యపరంపరలోని ఋషులు)

చాలవాండ, మహాతప, జ్యోతిర్మతి, చిక్క వ్యాఘ్రకంథ, బృహద్వథ, నారకంథ, మత్స్యకంథ, ఏకాదశ శిఖ, మల్లికార్జున (దారుకాచార్యులు శిష్యపరంపరలోని ఋషులు)

ఈ విధముగనే మిగిలిన ఆచార్యుల యొక్క శిష్య పరంపరయందు వచ్చెడి అనేక మంది ఋషుల పేర్లను ఉల్లేఖించడమైనది. శ్రీ మరితొంటచార్యులవారు తమ ఉల్లేఖనకు ఆగమములే ప్రమాణములని స్పష్టపరచిరి. వీరందరును లింగదీక్షను పొంది, ఇష్టలింగధారులై, ఇష్టలింగపూజకులై వుండిరని తెలియవచ్చుచున్నది. వీరి చరిత్ర అన్ని పురాణములలో గలదు. ఈ విధముగా ఇష్టలింగధారణ యనెడి ఆచారమును ఎంతో ప్రాచీనమైనదనియును, ఇది ఇతిహాసిక దృష్టితో చూచిన వారికి స్పష్టమగుననియును తెలియుచున్నది.

ఇంతటి పరాత్పరమైన లింగధారణ, బాహ్య మరియు అభ్యంతరమని రెండు విధములుగా నున్నవని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు నాదేశము నిచ్చిరి. మనుష్యుని అంతరంగపు పవిత్రతకై అంతరంగపు లింగధారణ, బహిరంగము యొక్క పవిత్రతకై బహిరంగ లింగధారణ అత్యావశ్యకమైనవి. ఈ ఉభయ విధి లింగధారణల వలన మనుజుని సాధన పరిపూర్ణమై సకల మనోరథములును సిద్ధించును. కాన ప్రతియొక్కరూ బహిర్లింగధారిగనూ, అంతర్లింగ ధారిగనూ సంస్కరింపబడి యుండవలెననెడిదియే పూజ్య పాదుల వారి ఆశయము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**ది : 12-8-1990**
**స్థలం : శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము**
**షోలాపూర్**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు లింగధారణము పుణ్యదాయకనెడి విషయమును ఎంతో విపులముగా తెలియజెప్పిరి.

లింగధారణ సనాతన కాలము నుండియే కొనసాగుచు వచ్చుచున్నది. శ్రుతులలో లింగధారణ ప్రతిపాదింపబడినదని వీరశైవ భాష్యకారులు నిరూపించిరి. శ్రీకర భాష్యము, సోమనాథ భాష్యము మొదలగు ప్రమాణ గ్రంథములలో లింగధారణ గురించి వివరమైన చర్చ గలదు. లింగధారణ గూర్చి చర్చించుచు శ్రీ పతి పండితుడు పూర్వపక్షమున గల భావనలు నిరాధారమైనవని తెలిపిరి. లింగ చక్రధారణలను నిషిద్ధము లనెడి పూర్వ పక్ష వాదనలను స్మార్తులు ప్రచారము లోనికి తెచ్చిరి. శ్రీ శంకరాచార్యులు లింగధారణను నిరాకరించెనని, కాయమున లింగమును ధరించుటయును చక్ర ముద్రను వేసికొనుటయును విహితము కాదని వారి వాదన. బసవేశ్వరునికి సమకాలికుడైన పండితారాధ్యుడు బసవన వలెనే వీరశైవ దీక్షను బడిసి యుండెను. ఆయన నుద్దేశించి బ్రాహ్మణులిట్టులనిరని సోమనాథుడు తెలిపెను.

**"పండితయ్యా! నీవు పౌరాణికుడవు**
**సద్విజోత్తముడవు, సచ్చరితుడవు**
**విద్వాంసుడవు వేదవిదుడవట్లయ్యు**
**భూతియు రుద్రాక్షములు దాలపదగునె**
**నీతియె లింగసన్నిహితమై యున్కి?** (పం.చ.దీక్షా.ప్ర. పు.31)

లింగధారణ గురించి దురవగాహన గల్గినవారు పూర్వకాలమునను యుండెడి వారు. ఇట్టి వారిచేత పిండస్థలము నుండి భక్తస్థలమున కడుకిడిన వాడగు జీవుడు దురవగాహనపెంచి కొన వలదని శ్రీ భగవత్పాదుల వారు నీ యుపదేశమునిచ్చిరి.

లోకమున సుఖము నాశించెడి వారు కోకొల్లలు. ఈ సుఖమునకు కారణమేమిటి యని యాలోచించెడి వారు నల్ప సంఖ్యలో నుందురు. పూర్వ జన్మలో సంపాదించిన పుణ్యము వలననే యీ జన్మలో సుఖమును పొందుచున్నామని గ్రహించెడి వారు చాలా అల్ప సంఖ్యలో నుందురు. పుణ్యపాపములే సుఖదుఃఖములకు కారణములని శాస్త్రములు తెలుపుచున్నవి.

మంచి పనులు చేయుట వలన పుణ్యము లభించును అనెడి శాస్త్ర వాక్యము. "పుణతి శుభం కరోతీతి పుణ్యమ్ (పుణ శుభకర్మణి)" అనెడి వ్యుత్పత్తి ప్రకారము పుణ్యమనగా శుభమును చేయునదని అర్థము. సుకృతము వలన పుణ్యము లభించును. దుష్కృతము వలన పాపము సంప్రాప్తమగును. నిత్యకర్మలను, నైమిత్తిక కర్మలను మరియు ప్రాయశ్చిత్త కర్మలను చేయకుండుటయే ఉద్ధృతమని ప్రాకృతులందురు. కామ్య కర్మలైన యజ్ఞ, యాగ, జపతప దానాదులే పుణ్యములని చెప్పబడినది.

లింగధారణ పొందిన వాడు వీటిని చేయవలసిన పని లేదని వీరశైవ దర్మవిధులు తెలుపుచున్నారు. లింగధారణ వలన పాపము పల్లటమగును. ఈ విషయమును స్పష్టము చేసెడి శ్రీ బసవేశ్వరుల వారి వచనమును గనుడి.

**పాతక శతకోటియ నొరసలు**
**సాలదె ఒందు శివన నామ?**
**సాలదె ఒందు హరన నామ?**
**కూడల సంగమ దేవా, నిమ్మఉండిగెయ పశువమాడిద యాగి** (బసవ. 5:84)

దీని తెలుగు రూపమిది.

**శత కోటి పాపముల**
**చాలదా ఒక్క శివనామము?**
**చాలదా ఒక్క హరనామము?**
**కూడల సంగమ దేవా,**
**మీదు ముద్రాంకిత పశువుగ చేసినందున.**

లింగ ముద్ర ధరించినందున గల్గెడి ఫలము తెలుపబడినది. బసవన యుపయోగించిన పదము పాశుపత సిద్ధాంతమును సూచించుచున్నది. వీరశైవమునకు మహా పాశుపత ధర్మమను పేరుగలదని జ.చ.ని. శివాచార్యులవారు తెలియజేసిరి. తత్సంబంధమైన యాధారములు శ్రీకర భాష్యములో గలవు. **"లింగాంగ సంగినాం చైవ పునర్జన్మ న విద్యతే, ఏష పాశుపతో యోగః పశుపాశనివృత్తియే"...** శ్రీకర భాష్యము.

(శ్రీచిదిరె మఠం) వీరభద్ర శర్మ వారి చేత పరిష్కృతమ్) అని తెలుపబడినది. లింగపురాణము లోను నిట్టి భావనలను గాంచవచ్చును.

లింగధారణము వలన పాప నాశనమగుననెడి భావనమునకు మూలము శివాగమములలో లభించును. చంద్రజ్ఞానాగమములోని యీ క్రింది భావములను గనుడి:

**శ్లో॥ విశిష్టమష్టావరణైః పంచాచారాభిమండితమ్।**
**సధ్యః పాపక్షయకరం కర్మజ్ఞాన సముచ్ఛయమ్॥**
**మహేశ్వర ప్రతిష్ఠాది కృత్యాచార్య శోభితమ్॥** (చం.జ్ఞా.ఆ.శ్లో 57)

అష్టాంగ యోగములో ధ్యాన, ధారణ మరియు సమాధులు మాత్రమే వీరశైవమున యంగీకరింపబడివనవని శ్రీ మగ్గియ మాయి దేవుల వారు తెలియజేసిరి. ధ్యానమును గూర్చియును, దాని వలన లభించెడి పుణ్యమును గురించియును నన్ని ధర్మముల నంగీకరించినవి. భక్త్యుద్యమమున ధ్యానమునకు గల ప్రాముఖ్యత యనన్యసామాన్యమైనది. శివనామ స్మరణ వలన యనంతమైన పుణ్యము లభించునని పౌరాణికులు చెప్పుచున్నారు. శ్రుతులును శివనామ మహిమను కీర్తించుచున్నవి. శైవోపనిషత్తులలోను, శైవాగమములలోను శివనామమును గూర్చిన వివరములు గలవు. శివపంచస్తవిలో శివనామ మహిమను మహిమ్నస్తవ కర్తయైన పుష్పదంతుడు వినుతించెను.

శివుని తలచుటచేత నపవర్గము సిద్ధించునని తెలిపెడి సోమనాథుని నుడువుల గనుడి:

**సీ॥ తప్పక భృగుసంహితను "యః శివేతిస్మ**
**రేత్కించి" దనుచు సత్క్రియ దలిర్ప**
**ఘనమైన విష్ణువాక్యము "శివయేనాను**
**చింతయే" త్తనుచు సంస్మృతి దలిర్ప**
**సతతంబు శ్రీభాగవత పురాణంబున**
**'శివశివే' యంచును జెలగిమ్రోయ**
**మున్న కూర్మ పురాణమున "శివ ఇత్యక్ష**
**రధ్యయం" బనుచు పురాణ వితతి**

**చెలగి యిట్లు మ్రోయు "శివ శివ శివ దేవ"**
**యనుచు శ్రుతులు బొగడునట్లుగాన**
**శివుని దలచు మాత్ర, సిద్ధించు నపవర్గ**
**పదవి! యొండు లేల బసవ లింగ!** (చతుర్వేద సారము, ప. 58)

ధ్యానము కంటెను ధారణ యుత్తమ మైనదని యోగశాస్త్రము వలన తెలియుచున్నది.

మనసారా ధ్యానము చేయుటకంటె కండ్లతో చూచుట, కండ్లతో చూచుట కంటే చేతులతో పూజించుట, చేతులతో ముట్టి పూజించుట కన్న సదాకాలము, దేహముపై ఎడతెగకుండ ధరించు హర్షము పరమావధి యయ్యెను చూడుమా!

ఈ కారణమున కూడల చన్న సంగయ్య నీ శరణులు

.......... ఆచరించుచున్నారు.

(చన్న బసవేశ్వర వ. 150, అను : రెకళిగె మఠం వీరయ్య శివానుభవ సమితి ప్రచురణ)

తాత్వికముగా మాయవలన కర్మభోగము కలుగుచున్నది. కర్మను అనుభవించెడి క్రమమున జీవుడు సుకృత దుష్కృతములను జేసి పుణ్య పాపముల నార్జించును. భవిభక్త లింగధారియైన పిదప శక్తి భక్తియై జీవుని నివృత్తి మార్గమున నడిపించి మాయా ప్రభావమునుపసంహరించుకొనును. లింగధారి పాపములనుండి విముక్తిని పొందుచున్నాడు. చేసిన, చేయుచున్న చేయబోయెడి క్రియలన్నీ సుకృతములేయగును. అసంకల్పితముగా గాని

ధర్మాచరణ నిమిత్తమున చేయబడు క్రియ చూచువారికి దుష్కృతముగా తోచినను అతి సత్క్రియగానే పరిణమించును. కన్నడ బ్రహ్మయ్య కథ, ముగ్ధ సంగయ్య శృంగారము మొదలగునవి యీ కోవకు చెందినవే. వివరములకై బసవ పురాణమును చదవగలరు.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము : 5

**శ్లో॥ చిద్రూపం పరమం లింగం శంకరం సర్వకారణం।**
**యత్తస్య ధారణం చి త్తై తదాంతరముదాహృతం॥** (సి.శి. 6.30)

సర్వకారణమూ, చిద్రూపము, శివస్వరూపము శ్రేష్ఠమునైన లింగమును చిత్తమందున సదా చింతించుట, యంతర్లింగ ధారణ యగుచున్నది.

**శ్లో॥ చిద్రూపం హి పరం తత్త్వం, శివాఖ్యం విశ్వకారణం।**
**నిరస్తవిశ్వకాలుష్యం నిష్కలం నిర్వికల్పకం॥**
**సత్తానంద పరిస్ఫూర్తి-సముల్లాసకలామయం।**
**అప్రమేయమనిర్దేశ్యం ముముక్షుభి రుపాసితం॥**
**పరం బ్రహ్మ మహాలింగం ప్రపంచాతీతమవ్యయం।**
**తదేవసర్వభూతా నాంమంత స్త్రి స్థానగోచరం॥** (సి.శి. 6.31–33)

పరబ్రహ్మమని పిలిపించికొనెడి మహాలింగము, సర్వశ్రేష్ఠమైన తత్త్వము అదియే విశ్వానికి కారణభూతమైనదివిశ్వమునకు కారణభూతమైననూ విశ్వము యొక్క కాలుష్యమునకు నంటికొని యుండదు. అందుచేతనే యది నిర్వికారమూ నిర్వికల్పమూ అయియున్నది. 'సచ్చిదానందముల సముల్లాస రూపమైన కలాశక్రియతో యుక్తమైయున్నది. బాహ్యప్రమాణములకు అగమ్యమూ, అనిర్దేశమూ అయియున్నది. అయినా ముముక్షముల చేతనుపాసింపదగియున్నది. ఈ విధముగా ప్రపంచాతీతమూ, నిర్మలమూ అయిన ఆ మహాలింగమే సాధకుల యంతరంగములో భావగర్భితమై తోచుచున్నది.

**శ్లో॥ మూలాధారే చ హృదయే భ్రూమధ్యే సర్వదేహినాం।**
**జ్యోతిర్లింగం సదా భాతి యద్ బ్రహ్మేత్యా హురాగమాః** (సి.శి. 6:34)

**అపరిచ్ఛిన్న మవ్యక్తం లింగం బ్రహ్మ సనాతనం।**
**ఉపాసనార్థమంతః స్థం పరిచ్ఛిన్నం స్వమాయయా ॥** (సి.శి. 6:35)

అపరిఛిన్నమూ, అవ్యక్తమూ, సనాతనమూ అయినదే లింగం. అదియే పరబ్రహ్మ. ఈ లింగతత్త్వము యుపాసనానుకూలతకై రుంతరంగములోని మూడు స్థానములయందున తన మాయా శక్తి చేత పరిచ్ఛిన్నమైనది.

## అంతర్లింగము యొక్క స్థూల స్వరూపము :

శ్రీ జగద్గురువుల వారు నతి సూక్ష్మమూ, యోగా భ్యాసగమ్యమూ అయిన అంతర్లింగ స్వరూపము నిచ్చట వర్ణించిరి. ప్రతి స్థూల ఉత్పత్తికై సూక్ష్మమే కారణమై యుండును. శివాది భూమ్యంతము వరకు గల ముప్పదియారు తత్త్వములు, అవరోహణ క్రమము నందున స్థూల, స్థూలములై వచ్చును. ఆరోహణ క్రమమునందున, సూక్ష్మ-సూక్ష్మ తత్త్వముల యుపలబ్ధి యగును. ముప్పది యారు తత్త్వముల యందున శబ్ద, స్పర్శ, రూప, రస మరియు గంధములనెడి పంచతన్మాత్రలచేత నాకాశము, వాయువు, అగ్ని, జలము మరియు పృథ్వియనెడి పంచతత్త్వములు నుత్పన్నములగును. ఇది వేదాంగములలో ప్రసిద్ధమైన విషయమే. వీటి యందున పృథ్వి కంటెను జలము, జలము కంటెను అగ్ని, అగ్ని కంటెను

వాయువు, వాయువు కంటెను ఆకాశము సూక్ష్మములని గ్రహించవలెను. ఇదే విధిన యుత్తరోత్తర తత్వములునూ సూక్ష్మములై యుండునని తెలిసికొనవలెను. పంచ కర్మేంద్రియములు పంచ జ్ఞానేంద్రియములు, మనస్సు, అహంకారము, బుద్ధి, ప్రకృతి, పురుష, నియతి, కాలము, రాగము, విద్య, కలా, మాయ, శుద్ధ విద్య, ఈశ్వర, సదాశివ, శక్తి మరియు శివ అనెడి తత్వములు నుత్తరోత్తర సుక్ష్మాతి సూక్ష్మములై పోవుచున్నవి. ఈ ముప్పది యారు తత్వములలో సూక్ష్మాతి సూక్ష్మమైనదే శివ తత్వము. దీని కంటెనూ సూక్ష్మాతిసూక్ష్మమైనది చిచ్ఛక్తి విశిష్టమైన పరశివతత్త్వము. అన్నిజీవుల ఆత్మయే యిది. ఈ పరమతత్త్వము యొక్క అరయిక లేని కారణమున జీవులు జనన మరణ సంసారము నందు తిరుగాడుచున్నారు. దీని అరయిక ముక్తికి మూలమగుచున్నది. జగన్మూలకారణము, పరశివాబిధము అయిన ఆ తత్వమే అంతర్లింగము. దాని చితనమే అంతర్లింగధారణ శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు దాని స్వరూపమును చిద్రూపమని వర్ణించిరి. అదియొక మహావెలుగు. ఆ వెలుగుకు ఉపాధి లేదు. "యద్భాసాం భాసతే విశ్వం" అనెడి సూక్తి ప్రకారము సూర్యునికిని ప్రకాశము నిచ్చెడి చిత్ సూర్య స్వరూపమది. దాని ప్రకాశమును భౌతిక దృష్టి చేత చూచుట సాధ్యము కాదు. ప్రాణులచేత వర్ణించబడజాలదు. అందుచేతనే అనుభవజ్ఞులు మాట మనముల యందు అక్కడక్కడ మారిన స్వాతిశయపు నిరుపాధిక, నిర్మలజ్యోతి వెలుగిది. విమల పరంజ్యోతి వెలుగుది. అని తెలియజెప్పిరి. ఇట్టి వెలుగును కనుగొనిన నిజానుభావియగు నిజగుణ శివయోగి వారు ఈ విధిననే తెలియజేసిరి.

అంతేకాకుండా ఈ వెలుగు జగత్తుకు మూల కారణమైనను జగత్తుయొక్క కాలుష్యము దీనినంటజాలదు. అందుకే 'నిరస్త విశ్వకాలుష్యం' అని చెప్పబడినది. పంచతత్వములలో నొకటగు ఆకాశమే కలుషితము కాజాలదనిన శివతత్వము కలుషితమగునే? అందుచేతనే "ఆకాద వత్సర్వగతస్య నిత్యః" అని శృతి తెలియజేయుచున్నది.

ఇది నిర్గుణము, నిరాకారము అయియున్నందున నిష్కలం నిర్వికల్పకం అని పిలువబడుచున్నది. నిర్గుణము, నిరాకారము అయి యుండినను, ఈ పరశివ తత్వము అద్వైత వేదాంతులు అంగీకరించెడి బ్రహ్మవలె నిర్విశేషమైనది కాదు. అయితే సచ్చిదానంద స్వరూపిణియైన చిచ్ఛక్తి అథవా శాంత్యతీతోత్తర నామక కళాయుక్తముగాయుండుట చేత 'సత్తానంద పరస్ఫూర్తి సముల్లాస కలామయం' అని భగవత్పాదులు అనిరి. అందుచేత నిర్గుణ, నిరాకారమైనను సవిశేషమైనదిగానే భావించవలెను. సచ్చిదానంద స్వరూపమైన పరశివ బ్రహ్మమునకు ఆస్మి, ప్రకాశే, నందామి, అనుబడు వాటి అర్థమేమనగా నేను విన్నాను. జ్ఞానియై యున్నాను. ఆనంద రూపముగా నున్నాను అనేడి బోధను స్వీకరించిన యెడల బ్రహ్మము యొక్క నిర్విశేషత్వము సిద్ధించదు. ఆ బోధను ఒప్పకుండిన యెడల ప్రకాశమానమైన స్పటికమునకు తన ప్రకాశము యొక్క జ్ఞానము వుండని యటులనే, పరశివ బ్రహ్మకు తన స్వరూపము యొక్క జ్ఞానము లేకుండుటచే స్పటికము వలె జడము కావలసి యుండును. అందుచేత సచ్చిదానంద స్వరూపమైన పరశివ బ్రహ్మమునందు సచ్చిదానంద స్వరూపిణియైన విమర్శశక్తి యనెడి పర్యాయనామమున శాంత్యతీతోత్తర కళను వీరశైవాచార్యులు స్వీకరించిరి.

సామాన్యముగా జగత్తునందు ప్రమాతృ, ప్రమాణ మరియు ప్రమేయములు అనెడి త్రిపుటముల ద్వారానే వ్యవహారములు జరుగుచున్నవి. ప్రత్యక్షాది ప్రమాణ గమ్యమైనది ప్రమేయ మనిపంచుకొనును. శబ్దము, స్పర్శ, రూపము, రసము, మరియు గంధములు అనెడి ప్రమేయముల జ్ఞానమునకై చెవి, చర్మము, కన్ను, నాలుక మరియు ముక్కు అనెడి ప్రత్యక్ష ప్రమాణములు అసాధారణమైన కారణములగుచున్నవి. ఈ ప్రమాణములు శబ్దాదులను ఎరిగినంత మేరకు క్రమముగా తమకు ఆశ్రయములైన ప్రసాద లింగము, జంగమ లింగము, శివ లింగము, గురు లింగము, మరియు ఆచార లింగములను ఎరుగవు. వాటివలననే ఇంద్రియములకు అధ్యక్షత వహించెడి మలినాస్పదమైన మనస్సైనను తనకు ఆశ్రయముగా నుండెడి మహాలింగమును గురించి, ఎరుగ జాలదు. అందుచేతనే సామాన్యముగా 'అప్రమేయమ్' అని ఆచార్యులవారు అనిరి. ఈ విధముగా ప్రమాణ గమ్యముగా నుండుటచేతనే అనిర్దేశ్యము అయినది. అవ్యయము, ప్రపంచాతీతము, పంచబ్రహ్మస్వరూపము అయిన మహాలింగము ఎల్లరకు అగమ్యగోచరమే అయ్యుండిన పక్షమునందు శాస్త్రములయందు దాని చర్చ నిష్ఫలమైయుండునని విచారించి జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు 'ముముక్షుభిరుపాసితం' అని అనిరి.

## అంతర్లింగాభివ్యక్తి యొక్క కేంద్రములు :

"మోక్తుమిక్షుర్ముముక్షుః" అనెడి వుత్పత్తి మేరకు ముక్తి యొక్క తీవ్రమైనపేక్ష వున్న సాధకునిని ముముక్షువని పిలిచెదరు. ప్రపంచము యొక్క వెలుపల ఏమిటి అనెడి జిజ్ఞాసతోకూడుకొని ఆత్మతత్వమును ఎఱుగుటకు కోరిక కల్గియుండుటయే ముముక్షుత్వ లక్షణము. వీరికి

ప్రపంచములోని ఇతర వస్తువుల యెడల ఎట్టి ఆకాంక్షయు యుండదు. వివేకము, వైరాగ్యము, మరియు శమాదిషట్క సంపత్తి యొక్క ప్రాప్తి అనంతరము సాధకునిలో ఉదయించే మహోన్నతమైన భావన ఇది. ఈ భావన కలవానికి మాత్రమే పరశివ బ్రహ్మోపాసన సుసాధ్యమగుచున్నది. పరశివ బ్రహ్మము సర్వవ్యాపకమై యుండినను ఉపాసకులకు మూలాధార హృదయము, మరియు భ్రూమధ్యములనెడి ముఖ్యకేంద్రముల యందు జ్యోతిర్లింగ రూపముగా అనుభవ గమ్యమగును. ఆకాశమండలములోని సూర్యుడు మేఘముల చేత అవృతమైనప్పుడు అతని ప్రచండ ప్రకాశము కనుమరుగైన యటులనే శరీరములోని మూలాధారాధి స్థానముల యందుండెడి జ్యోతిర్లింగముల ప్రకాశము రజ, తమముల మాలిన్యము చేత అవృతమై యుండును. సహజముగా వీటి ప్రకాశము ఎల్లరకును దొరకదు. ప్రచండమైన మారుతము మేఘములను చెల్లాచెదురుచేసి సూర్య ప్రకాశమును ప్రకటన చేయునటులనే యోగసాధకుని తీవ్ర ప్రాణాయామ సంపత్తి చేత చక్రముల నావరించిన మాలిన్యము దూరమగును. 'అంతః క్షీయతే ప్రకాశావరణం' అని పతంజలిగారు చెప్పిరి. (యో.సూ.2.52) ఈ విధముగా ప్రాణాయామ పురస్సరముగా ఏకాగ్ర మనస్సుతో మూలాధారాది కేంద్రముల యందు ధ్యానమగ్నులు అయిన పిదప అంతర్లింగము యొక్క జ్యోతిని కనుగొనుటకు ఆస్కారము ఏర్పడును. దీని అనుభవమునకై ఏకాంతత, మరియు ఏకాగ్రతలు పరమావశ్యకమై యున్నవి. నిర్జన ప్రదేశమునందున ఏకాగ్రతను సాధించవలెను. అయితే ఏకాగ్రతకు మనస్సులోని సంకల్ప వికల్పములన్నియును అణిగిపోవలసిన అవసరము వున్నది. సముద్రము యొక్క కెరటములు అణగుట ఎంత కష్టమో మనస్సులోని సంకల్పములు అణగుట అంతే కష్టముతో కూడుకొన్నది. అందుచేత ఊరకయే కూర్చుండి వుండుటవంటి కష్టతరమైన పని మరొక్కటి లేనేలేదు.

ఒక పని కాకపోతే మరొక్క పనిని చేయుచూ మనుష్యుడు వలసినంత సమయమును గడపవచ్చును. అయితే నిమిషార్థమైనను ఊరకే కూర్చుండుట సాధ్యముకాదు. ఈ మాటను ఉపనిషత్‌వాదులు కూడా అంగీకరింతురు. "కశ్చిత్ ధీరః ప్రత్యంగాత్మాన మైక్షత్ వ్యావృత్త క్షురమృతత్వ మిచ్ఛన్" "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతీత సిద్ధయే' అని చెప్పబడినది. వెయ్యింటికి ఒక్కనికే ఇది సాధ్యమగునని తెలిసికొనవలెను. మనస్సును ఏదో ఒక చక్రమునందున కేంద్రీకరించవలెననిన మొదట ఆ స్థానము స్థిరముగా నుండవలెను. వెన్నును ముదువక నిటారుగా శిలావిగ్రహము వలె కదల కుండా కూర్చుండుటకు అభ్యాసము చేయవలెను. స్థిరమైన దేహమునందుననే మనస్సు సుస్థిరమగును. తద్విరుద్ధమైన స్థితిలో అది సాధ్యము కాదు. హిమాలయము నందున ధ్యానమగ్నుడై కూర్చొని యున్నశివుని సాకారచిత్రములను ఎన్నింటినో చూచుచున్నాము. ఆ చిత్రము జగత్తుకు యిచ్చెడి సందేశమేమి?

అంతరంగము యొక్క మంగళమయమైన శివత్వమును అనుభవించవలెననిన నీవైనను యిటులనే సాధన చేయవలననునదే ఆ సందేశము కాదా? తన సూక్ష్మతత్వము యొక్క చింతనకు చెందిన ప్రత్యక్షమైన ప్రయోగమును శివుడు తానే చూపించుచున్నాడు. కపిల వస్తునగరము మహారాజు శుద్ధోదనుని కొడుకైన సిద్ధార్థుడు. నలుబది రెండు వర్షములు సతతముగా ప్రయత్నించి మనస్సును ఏకాగ్రతవైపు మళ్ళించగలిగి అంతరంగమునకు సంబంధించిన జ్యోతిర్లంగమును ఎరిగి అప్పుడు బుద్ధుడు అనిపించుకొనెను.

ధర్మము, సాంప్రదాయము మొదలగు వాటి భేదములు బహిర్ముఖ్యమైనప్పుడే కనిపించును.అయితే అంతరంగమును ప్రవేశించిన పిదప అందరి అనుభవమూ ఒక్కటే. బాహ్యమునందలి కలహములు దూరము కావలెనని అంతరంగము యొక్క ప్రవృత్తి ఎంతో అవశ్యకమైనది. మంత్ర యోగము, అయ యోగము, హఠయోగము, రాజ యోగము మరియు శివయోగములు. బహిర్ముఖుడైన జీవుని అంతరంగము వైపు త్రోయుటకు ప్రయత్నించును. ఏదో ఒక మార్గము ద్వారా మనుష్యుడు లోనికి ప్రవేశించినచాలు. వెలుపలి ఉప ద్రవములన్నియును శాంతమగును. అందుచేతనే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు బహిర్లింగ ధారణ స్వరూపమును తెలిపెడి దానికి ముందనే సమస్త మానవ కులమునుద్ధరించెడి ఉద్దేశ్యముతో అంతర్లింగము యొక్క స్వరూపమును, దాని ఉపాసనా పద్ధతిని గూర్చి ఉపదేశము నిచ్చిరి.

## అపరిచ్ఛిన్నము పరిచ్ఛిన్నమైన కారణము :

అపరిచ్ఛిన్నము, అవ్యక్తము, సనాతనము, బ్రహ్మమని పిలిపించు కొనెడిదే లింగతత్వము. 'లింగ మధ్యే జగత్సర్వమ్' అనెడి సూక్తి వలె జగత్తులోని కణ కణములోను లింగతత్వము నిండి యున్నది, అట్టి యెడ శరీరములోని మూలాధారము, హృదయము మరియు భ్రూమధ్యములయందు జ్యోతిర్లింగములు సాక్షాత్కారమగునని చెప్పిన కారణమునకు గల అర్థమేమి? ఆ అఖండతత్వము ఈ విధముగా ఖండమై ఎందుకు కనుపించును? అనెడి జిజ్ఞాస కలిగెడి అవకాశము కలదు. అందుకే శ్రీ భగవత్పాదుల వారు 'ఉపాసనార్థ మంతస్థం పరిచ్ఛిన్నంస్వమాయయా' అని ఉపదేశించిరి.

దీని భావమేమనగా ఆ లింగతత్వము వాస్తవికముగా సర్వవ్యాపకమే అయినను ఉపాసన చేసే వారెల్లరూ 'తదంశో జీవనామకః' (సి.శి.5-34) అనెడి ప్రమాణ ప్రకారము అతని అంశరూపమై యుండుట చేత చిన్న వారమైనా మన పూజా విధానమునకు అనుకూలముగా నుండుటకై పరశివలింగము తన మాయా శక్తిచేత చిన్నదై కనుపించును 'అణోరణీయాన్ మహతో మణీయాన్' అనేడి సూక్తి ప్రకారము అణువునకు అణువువంటి వాడును, మహత్తుకు మహత్తు వంటి వాడును అగు పరశివుడు, పిల్లల ప్రేమకొరకై పిల్లలవలె ఆటలాడెడి తల్లిదండ్రుల వలె మనకనుకూలముగా తనకు తానే మలచుకొనుచున్నాడు. మరో మాటలో చెప్పవలెననిన భక్తుని ప్రేమచేత బద్ధుడయిన పరమశివుడు తన సర్వ వ్యాపక తత్వమును భక్తుని సౌకర్యార్థమై తగ్గి కనబడుచున్నాడు.

ఒక వూరునందు జిల్లాధికారియొకడు గృహస్థుడై జీవనమును కొనసాగించుచుండెను. వారికి సంతానము కలుగ లేదు. ఎంత కాలము వేచిచూచినా ఫలితము లేదు. ఏమి లేకుండినను సహనముతో అనుభవించెడి గృహస్థులు సంతానము లేకుండిన యెడల వూరకే యుండజాలరు. సంతానములేని యెడల వారి జీవనమే శూన్యమైన యటుల మున్ముందు జీవితమే చీకటియేయని భావించుకొనెదరు. అంతేకాదు ఒంటరిగా వుండెడి భయమొకటి. సత్ పుత్రులుండెడి యిల్లు ధగధగలాడెడి దీపములచేత అలంకృతమై యుండినటుఞోచును. పిల్లలులేనియిల్లు విద్యుద్దీపముల చేత అలంకరింపబడిననూ యిల్లు అంధకార బంధురము వలె దోచును. వంశాంకురము యొక్క ఆభావము చేత దంపతులెంతో చింతా క్రాంతులైరి. వైద్యక్రియలు యెట్టి ప్రభావమును చూపలేదు. తీర్థక్షేత్ర సందర్శనలు, దేవతారాధనలూ మెండుగా చేసిరి. మందుల ప్రభావమో, లేదా వారు చేపట్టిన ఆరాధనల ప్రభావమో తెలియదు కాని పన్నెండు సంవత్సరముల పిదప వారికి మగబిడ్డ కలిగెను. తల్లిదండ్రులకు పట్టరానంత సంతోషమయ్యెను. ఊరిలో వారికందరికీ విందు భోజనము పెట్టిరి. సాధు సజ్జనుల కెల్లరకునూ అతిథ్యము నిచ్చిరి. వారు అనుదినము నిత్యోత్సవములను జరుపుచుండిరి. క్రమంగా పిల్లవాడు పెరుగజొచ్చెను. బుడి బుడి అడుగులతో తల్లిదండ్రులను మురిపించుచు దిరుగాడుచుండెను. వేదములోని 'తత్వమసి' మొదలగు వాక్యములనుగని ముముక్షువులు పరమాత్మతో అభిన్నతను సాధించి ఆనందమును పొందిన యటులే యా గృహస్థులు పిల్లవాని మాటలకు, చేష్టలకు సంతోషపడుచుండిరి. తల్లియొక్క వాత్సల్యము గురించి చెప్పవలయునే? పిల్లవాడు పెద్దగై ఇంటి నిండుగా తిరుగాడుచుండెను. పిల్లవాని నిండైన ఆనందముగా పలువరెసతో నవ్వినపుడు శరత్కాలములోని చంద్రుని శీతలములను పొంది ఆనందించిన యటుల దంపతులు ఆనందించుచుండిరి. ఆ ఇల్లాలు యింటిపనులన్నిటిని పనివాళ్ళపై వదిలి పిల్లవానితో సంతోషమున కాలము గడుపుచుండెను భర్తయైనను ప్రతి దినము ఎనిమిది గంటల వరకు ఇల్లు విడిచి ఉద్యోగమునకై పోవలసినదే కదా? పిల్లవానిని విడచి పోవుటకు అతనికి యిష్టము కాకుండెను. కాని పోయెడిది అనివార్యమై యుండెను. పోవునపుడు పిల్లవానిని ముద్దాడి ఎత్తికొని బలవంతముగా తన సతికి యిచ్చి వెళ్ళుచూ వెనుదిరిగి చూచుచు తన మనస్సును అక్కడనే విడిచి భౌతిక కాయముతో కార్యాలయమునకు వెళ్ళుచుండెను. ఎక్కడ కూర్చుండిననూ పిల్లవానిని గురించిన ఆలోచనే! దేవునిపై కోపము వచ్చెను. ఓయీ! దేవుడా! నన్ను ఆడదానిగా ఎందుకు పుట్టించలేదు? ఇంటి దగ్గరనే యుండి పిల్లవానితో ఆటలాడుచూ పరిపూర్ణమైన ఆనందమును పొందియుండెడి వానిని కదా! అని పరిపరి విధములుగా మధనపడుచుండెను.

పిల్లవాడు ఎల్లప్పుడు నవ్వుచూ ఉండవలెను. ఎప్పటికి ఏడువకూడదు, అని భర్త భార్యకు అదేశములిచ్చెను. పసివాడు ఏదడిగినను అది యా క్షణముననే తెచ్చి యివ్వవలెనని ఆదేశము ఇచ్చి తన జీతము మొత్తమును భార్యకు అప్పగించెను. చూసిన దానిని కావలెనని అడుగుట పిల్లల యొక్క స్వభావము, అడిగినవన్నియును ఆ పిల్లవానికి తెచ్చి యిచ్చుచుండిరి. అది ఒక సాయంకాలపు సమయము భర్త ఆఫీసు నుండి రాకుండెను, భార్య పిల్లవానిని ఆడించుచు వాకిలియందున నిలచివుండెను. అప్పుడే ఒక చాకలివాడు గాడిదమీద బట్టలమూటను పెట్టుకొని తన కొడుకుతో సహా తాను గాడిద మీద కూర్చుండి పోవుచుండెను, ఈ దృశ్యమును పడతి చంకలోని పిల్లవాడు చూచెను. వాని మనస్సుకు ఎంతో సంతోషము కలిగెను. తనను కూడ దాని మీద కూర్చుండ బెట్టుమని తల్లిని కోరగా తల్లి యిది మనకు తగదు అనెను, పిల్లవాడు ఏడ్చుట ప్రారంభించెను, వాని ఏడ్పు ధ్వని వింటూనే తల్లికి ఆందోళన కలిగెను. ఆ గాడిద మీద కూర్చుండ బెట్టుమని పిల్లవాడు మంకుపట్టు పట్టెను. తల్లి సముదాయిస్తూ అది గాడిద యనియును మనము దాని మీద కూర్చుండకూడదనియును, వలసినంత బుద్ధిని చెప్పెను, అయినను పిల్లవాని ఏడుపు ఆగకుండెను, బాల హఠము, స్త్రీల హఠము మరియు రాజుల హఠము సామాన్యమైనవి కావు కదా, ఏమి ప్రయత్నములు చేసినను, ఎన్ని వస్తువులిచ్చినను ఫలితము లేకుండెను, ఆ తల్లి తన కొడుకును సముదాయించుటలో విఫలమయ్యెను యింతలోనే భర్త యింటికి వచ్చెడి సమయమయ్యెను. ఆ తడు పిల్లవాని ఏడుపు ఎప్పుడు వినియే వుండలేదు. యిప్పుడు ఏడుపును విని ఎంతకోపమును తెచ్చుకొనునో ఏమో, నాగతి ఏమి కానున్నదో అని ఆ తల్లి చింతించుచు పిల్లవానిని లోనికి తీసికొని వెళ్ళెను. పిల్లవాని నోరు సన్నాయిని వూదిన యట్లె సప్పుడు చేయుచుండెను. అంతలోనే ఆ

పడతి మగడు వచ్చెను, పిల్లవాని ఏడుపు ధ్వనిని విని కోపతాపమును పొందెను. భార్యపై మండిపడెను. ఎందుకు ఏడ్చుచున్నాడని గద్దించి అడిగెను, అప్పుడు వారిరువురి మధ్యన జరిగిన వాదోపవాదములు యీ క్రింది విధిన కొనసాగెను, భార్య : స్వామి ఈ బాలకుని కోరిక బహు విచిత్రముగ నున్నది. వీడి కోరికను తీర్చుట యనేది ఎవ్వరికిని సాధ్యము కాదు, యోగ్యాయోగ్యతలను విచారించకయే ఈ కోరికను కోరినాడు, సాయంకాల సమయమున నేను వాకిలి యందున ఆడించుచు నిలచి యుంటిని. అప్పుడు ఒక చాకలివాడు తన కొడుకుతో కూడుకొని ఆ గాడిద నెక్కి వెడలుచుండెను.వాడు ఆ దృశ్యమును చూచి తానుకూడ గాడిద నెక్కెదనని తనని కోరెను. వలదు అనగానే ఏడుపు లంకించుకొన్నాడు. యంతటి పెద్ద అధికారి యొక్క కొడుకును గాడిద మీద ఎటుల కూర్చుండబెట్టవలెను, మీరే చెప్పండి.

భర్త : అట్లైనచో యిప్పుడు ఏమి చేయవలెను.

భార్య : నాకేమియును పాలుపోవడములేదు.

భర్త : నీవు పోయి ఎక్కడి నుండైనను ఒక గాడిదను తీసుకొని రమ్ము. ఆ పిమ్మట మన ముద్దుల కొడుకును దాని మీద కూర్చండబెట్టి వానికి సంతోషమును కలిగింతము గాక.

భార్య : యీ పనిని నే చేయలేను. కావలసిన యెడ నీవే వెళ్ళి తీసుకొని రమ్ము.

భర్త : నేను ఈ వూరికి చెందిన ఒక పెద్ద అధికారిని. నేను గాడిదను తెచ్చేటప్పుడు ఎవరైనా చూచిన యెడల వారు నన్నేమందురు.

భార్య : స్వామీ మీరు తెచ్చిన యెడల మీరు అపవాదమునకు గురి యగుదురు, ఒక వేళ నేను తెచ్చిన యెడల, యిదిగో. యింత పెద్ద అధికారి యొక్క భార్య ఒక గాడిదను తీసుకొని పోవుచున్నదని ప్రజలు మనిద్దరిని ఆడిపోసుకొందురు. ఈ కారణము వలన నేను తీసుకొని వచ్చినను నీ పేరు ప్రజలలో రానే వచ్చును. అయితే నీవు మాత్రము తీసుకొని వచ్చిన ఎడల నేనునొక దానినైనను లోకాపవాదము నుండి తప్పించుకొందును కదా.

భర్త : నీవు చెప్పినది నిజమే, మన మిద్దరములో లోకాపవాదము నుండి తప్పించుకొనవలెను, పిల్లవానిని మాత్రము గాడిద మీద కూర్చుండ బెట్టవలెను. అంతటి వుపాయము ఏదైనా వుంటే చెప్పు. అప్పుడు ఆ పడతి కొంచెము సేపు ఆలోచించి, పిదప భర్త దగ్గరకు వెడలి పిల్లవానికి వినిపించని యటులు చెవిలో ఈ క్రింది విధముగా చెప్పెను.

స్వామీ గాడిద మీరే ఏందుకు కాకూడదు. అప్పుడతడు నేను గాడిదగ అయ్యిడిదెలా అని మెల్లగా ప్రశ్నించెను. అప్పుడు ఆ తెలివైన భార్య నీవు ముఖమునకు ఒక బట్టను కట్టుకొని మెకాళ్ళ మీద నడుచుచు వంటియింటి నుండి రండి, ఆ పిదప నేను నాటకమును ఆడించెదను.

భార్య యొక్క యుక్తికి అంగీకారమును తెలిపిన అధికారి తన ముఖమును మూసికొని మోకాళ్ళ మీద నడచి రాదొడగెను. భార్య ఏడ్చెడి పిల్ల వానిని ఎత్తుకొని పడసాల యందు నిలిచియుండెను, పశువు వలె వచ్చెడి భర్తను కొడుకుకు చూపిస్తు ఆ యిల్లాలు యిటుల అనెను, బాబూ! యిదిగో చూడు నీవు కోరిన గాడిద వచ్చుచున్నది, భార్య నోటి నుండి గాడిద అని అనిపించుకొనుట యిది మొదటి సారియైన మన ఆ అధికారికి కూడా ఎక్కడలేని కోపము వచ్చెను. అయిన యిప్పుడు కోపము వచ్చిన యెడల నాటకము భంగమగును, అని తలచి ఓపిక వహించెను. భార్య పుత్రుడు వున్న స్థలమునకు వచ్చి చేరెను.

తల్లి పిల్లవాడిని నకిలీ గాడిదమీద కూర్చుండ బెట్టెను, పిల్లగానికి సమాధానమైనది. ఒక క్షణమున సంతోషమును వెలిబుచ్చెను. మరుక్షణము మళ్ళీ ఏడువ సాగెను. ఎందుకు ఏడుస్తున్నావు ఏమి కావలెను. తల్లి అడిగెను, అమ్మా నీవు దాని మీద కూర్చొనుము అని ఏడుస్తూనే పిల్లవాడు చెప్పెను. భర్త అంగీకారము లేకయే అతని మీద కూర్చునుటయెట్లు అని తలచి, ఓ కొడుకా ఈ గాడిదకు మన యిద్దరి బరువును మోసెడి శక్తి లేదు, ఈ కారణము చేత నీవొక్కడవే గాడిద నెక్కి వెళ్ళుము అనెను, పిల్లవాడు సమాధానము కాలేదు మళ్ళీ ఏడువు సాగెను. అప్పుడు భర్త హూ! అనే ధ్వని చేత భార్యను కూర్చుండుమని తన సమ్మతిని తెలిపెను. భార్య అతనిపై కూర్చుండినను ఈ యిరువురి భారము మోయుచు గాడిద రూపమున భర్త కొంత దూరము పోవగానే మళ్ళీ ఏడువ సాగెను, తల్లి వాణ్ని సముదాయిస్తూ ఎందుకు ఏడుస్తున్నావని అడిగెను. ఈ గాడిద మౌనముగ నడచుచున్నది చప్పుడు చేయుట లేదు అని అనెను, భార్య భర్త మీది నుండి దిగకుండనే భార్య కొంచెము వంగి అతని చెవిలో మెల్లగా

యిట్లు పలికెను, ఏమండీ మీ గాడిద పాత్ర పూర్తి కాలేదు, గాడిద వలె హోం(డ్రు పెట్టండి. అ మాటలు వినిన భర్త అటులనే చేసెను. పిల్లవాడు సంతోషపడెను. అధికారి గాడిద పాత్ర ముగిసెను. వారి కథ ముగిసినది. యీ కథ వలన తేలినదేమనగా ఒక పెద్ద అధికారి తన కొడుకు సంతోషము కొరకై భార్య సలహా మేరకు తన అధికార హోదాను పక్కకు నెట్టి గాడిద పాత్రను ధరించి కొడుకును సంతోష పరచెను. యిదే విధిన జగత్తు మరియు ఆకాశముల విస్రుతికంటెను విత్రుత మగనుండెడి మహానీయ మూర్తి యగు జగత్ పితా జగత్ పతి యగు పరమేశ్వరుడు తన అంశ నుండి జన్మించిన అల్ప బుద్ధిగల జీవుల వుపాసన సౌకర్యార్థమై తన మాయాశక్తి సహాయోగముతో పరిచ్ఛిన్నమై ప్రతి యొక్క జీవుని అంతరంగమునందు సూక్ష్మమైన జ్యోతిర్లింగరూపములో నివసించును. అందుకే శ్రీ భగవత్‌పాదుల వారు శివుడు వుపాసన నిమిత్తము జీవునికి అంతస్థుడై వున్నాడని వుపదేశించెను.

అంతరంగమునందున జ్యోతిర్లింగమును చూసిన వారికి జగమంతయు లింగమయముగ దోచును. దృష్టిని మార్చుకొన వలెనే గాని సృష్టిని మార్చుకొనలేము, సృష్టి యందు సదా శివుడు ఎల్లప్పుడు వుండును. అతనిని తెలిసికొనుటకై సూక్ష్మబుద్ధి యొక్క అవశ్యకత కలదు. బాహ్య శుచి కంటెను అంతరంగములోని శుచి ఎంతో గొప్పదని తెలిసికొనవలెను.

ఈ అంతఃశుచితో బాహ్యక్రియలన్నియును శుచిర్భూతములగుచున్నవి. ఈ రహస్యమును జగత్తుకు తెలియజేసి చెప్పుటకై పూజ్యులైన ఈ రేణుక భగవత్ పాదులవారు అంతర్ లింగధారణను మొదటిగా వుపదేశించిరి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**తేది : 13-8-1990**
**స్థలం : శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము**
**షోలాపూర్**

## విశేష ప్రదీపిక :

అంతర్లింగ ధారణయొక్క ప్రాముఖ్యతను శ్రీకాశీ జగద్గురువుల వారు నీ యాశీర్వచనమున యెంతో వివరముగా దెలియపరచిరి.

అంతర్లింగము మరియు బహిర్లింగము అనెడి భావనలు చిరకాలము నుండియు పండితుల దృష్టిని యాకర్షించినవి. అంతర్లింగ ధారణయే శ్రేష్ఠమైనదనియును, బహిర్లింగధారణను ముముక్షువులు కాంక్షించరు యని తెలుపబడినది.

ప్రాణలింగ స్థలమును గురించి యుపదేశించెడి సందర్భమున శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు అంతర్లింగం యొక్క ప్రస్తావన తీసికొని వచ్చిరి. వీరి యుపదేశము గనుడి :

**శ్లో॥ అంతర్గతం చిదకారం లింగం శివ మయం పరమ్।**
**పూజ్యతే భావ పుష్పైర్యాత్ ప్రాణలింగార్చనం హితత్॥**

దీని భావమేమనగా హృదయకమలమునందున విరాజమానమై యున్న చిద్రూపమున నున్న లింగమును భావ పుష్పముల చేత నర్చించవలెను. ఇదియే ప్రాణలింగార్చన మగును. హృదయాలయమున నది యెక్కడ యే విధిన నుండునో యనెడిది శ్రీ భగవత్పాదుల వారు పన్నెండవ పరిచ్ఛేదములోని 14వ మరియు 15వ శ్లోకములలో వివరించిరి. ఈ విషయమును మున్ముందున వివరముగా చర్చింతుము. ఈ దశలో నా చర్చ యనావశ్యకమై యున్నది.

ప్రాణలింగ స్థలమున భక్తుడు నానంద భక్తిని యాచరించుచు నంతర్లింగాను సంధానము చేయును. కాని భక్తస్థలము శ్రద్ధాభక్తికి సంబంధించిన స్థలము. ఇచ్చట నిష్టలింగార్చనకే ప్రాముఖ్యత గలదు. ప్రాణ లింగికైననూ యిష్టలింగార్చన యవిస్మరనీయమే.

డా॥ రుద్రప్పగారు వారి వీరశైవ సిద్ధాంత శిరోమణిలో నంతర్లింగ ధారణ గురించి తెలియజేయుచు వామన పురాణములోని యీ ప్రమాణమును చూపిరి.

శ్లో॥ తతోఽ వ్యయాత్మా స హరిః స్వహృతబంకజ శాయినం।
దర్శయామాస దేవానా మురారిర్లింగమైశ్వరం॥

దేవతల విజ్ఞాపన మేరకు తన హృదయములోని అంతర్లింగమును శ్రీ హరి దేవతలకు చూపెనని తెలుపబడినది. కాని లింగపురాణములో విష్ణువు స్థూలాంగమున యిష్టలింగమును ధరించెనని తెలుపబడినది. మునులు కూడా యిష్ట లింగమును ధరించిరని వివరింపబడినది. శ్రీ కాశీ జగద్గురువుల వారీ విషయము వివరించినారు. అయితే, వామన పురాణములో సూచింపబడినది విష్ణువు యొక్క ప్రాణలింగమై యుండును. శ్రీ బసవన వారును హృదయమున నున్న లింగము గురించి 816వ వచనమున వ్రాసిరి. ఇయ్యది ప్రాణలింగస్థలమున వచ్చెడి ప్రస్తావన. ఇష్టలింగమునకును, ప్రాణలింగము పరస్పర పూరకమగు సంబంధము గలదని ప్రతిపాదింపబడినది.

అట్టి యెడ బాహ్యలింగధారణ యనగా నేమి? ఇయ్యది యిష్టలింగధారణకు ప్రతిగా వాడిన భావమా యనెడిది తెలిసికొనవలసి యున్నది.

బహిర్లింగమును గుర్తించ జాలని వారు తికమకకు గురియై విపరీతమైన భావము నవలంబించెడి యవకాశము గలదు. బహిర్లింగ ధారణ యనగా నేమియో తెలిసికొనుటకు యత్నించవలెను.

దశ విధ శైవములలోన శిఖరాగ్రమున నెండెడిది వీరశైవము. శివభక్తి యొక్క పరిపక్వత లింగైకనిష్ఠాపరత్వములో విభజనకు కీలకాంశములై యున్నవి. పరిణితి చెందని దశలో సామాన్య శైవాదులు నేర్పబడినవనని తలచుట యుత్తమము. ఇట్టి వాడు దేవాలయములలో నుండెడి స్థానలింగములను పూజించును. అది శివునికి నెలవని గట్టిగా నమ్మును. తాను బవిననెడి భావన యతని మనస్సున నిండియుండును. మనశ్శాంతి దేవాలయములలో నేదో యొక దానిని యెంపిక చేసికొని దాని లోని లింగము యెడ అనన్యమైన భక్తిని పెంచికొనును. ఈలింగములకు వివిధ నామ ధేయములు గల్గినవి. శ్రీ శంకరాచార్యుల వారు జ్యోతిర్లింగముగా గుర్తించిన సోమనాథాది లింగములకు వేరు వేరు పేర్లుగలవని మన మెరిగినదే? శివుని సహస్రనామములలో నేదో ఒక నామమును గ్రహించి, ఆయా లింగములకు పెట్టబడుచున్నది. అనన్య సామాన్యమైన భక్తితో సేవించి తరించిన వారి పేర కూడా ఆయా శివలింగములు పిలువబడుచున్నవి. శ్రీకాళహస్తీశ్వర లింగమట్టిదే? శ్రీ కృష్ణ దేవరాయల ఆస్థానమును అలంకరించిన కవి ధూర్జటి కాళహస్తీశ్వర స్వామి భక్తుడై ఒకకావ్యమును వ్రాసి తరించెనని తెలియుచున్నది. వీరి శతకము నెంతో ఖ్యాతి నార్జించినది. ఇట్టిది బాహ్యలింగధారణ నుదాహరణగా గైకొనవచ్చును. సుదూరమున నున్న శ్రీ కాళహస్తీశ్వర లింగమును చిత్తమున నిలిపి ధూర్జటి ధన్యుడయ్యెనని తెలియుచున్నది. స్మార్తాచారములకు లోనైన వారు కొందరు శ్రీశైలాది క్షేత్రములలోని లింగములు తమ తమ ఇంటి దేవుళ్ళని యెంచి పూజించుటను మనము గాంచ గలము. ఇట్టి వారు సంవత్సరానికొకపరిగాని, తమ తమ యభీష్టానుసారముగా గాని యచ్చటకి వెడలి ఆ లింగమును పూజించి వత్తురు. వారి చిత్తము నిండా ఈ దేవాలయమునకు సంబంధించిన శివుడే యుండును. వారి యూరిలోనున్న శివాలయము లోని శివలింగము, వారు చిత్తమున నిల్పిన లింగమునకు సమానమైనది కాదనే భావన కూడల కలుగ వచ్చును.

బహిఃప్రదేశమున భూమి మీద వెలసిన బాహ్య లింగధారణ యనగా

శివలింగమనియును, అద్దానిని ధరించిన వాడే బాహ్యలింగ ధారణ గల వాడని గ్రహించుటలోన యౌచిత్యముండును. ఈ విషయమున శ్రీ కాశీ జగద్గురువుల వారు విశేషమైన వివరముల నిచ్చిరి. స్థావర లింగార్చన వీరశైవులకు విహితము కాదనిరి.

ఇష్టలింగము గురించిన సందేహము గల్గెడి యవకాశము లేదు. తాత్వికముగా గమనించిన యెడ యిష్టలింగము, అంతర్లింగము యొక్క ఒక దెస యని చెప్పవలెను. రూపాయి నాణెమునకు రెండు వైపులుండును. ఒకటి బొమ్మ, రెండవది బొరుసు. అంతర్లింగము యొక్క బాహ్య రూపమే యిష్టలింగముగా భావించుట కంటెను, అంతర్లింగము యొక్క నొక పార్శ్వమని గ్రహించుట వలన భావము స్పష్టమగును. రూపాయి నాణెమునకు యని బొమ్మ ముఖ్యమా? బొరుసు ముఖ్యమా? ప్రశ్నించిన ప్రత్యుత్తరము రాగలదే. రెండూ ముఖ్యమే, యనెడిది నిర్వివాదమైన యశము. అల్లమ ప్రభు – సిద్ధరామేశ్వర సంవాదములో యీ విషయము నిరూపితమై యున్నది. వివరముల గోరు వారు ప్రభులింగ లీలను చదువగలరు.

పిండ స్థలము నుండి భక్త స్థలమునకు వచ్చిన భక్తుడు బహిర్లింగములైన స్థావర లింగముల యెడ భక్తి పెంచి కొనవలదు. అట్టి భక్తిపిండ స్థలమున నున్న వానికే విహితమై యున్నది. ఆ దశను దాటి యధ్యాత్మికొన్నతి సాధించిన భక్తునికి యిష్టలింగము సర్వస్వమని యెంచవలెను. అంతర్లింగములనగా ప్రాణ భావ లింగములని గ్రహించవలెను. ఇష్ట ప్రాణ భావలింగములే భక్తునకు ఆరాధ్యములు. ఇష్ట లింగము ఒక్క అవాంతర భేదములలో ఆచార లింగమొకటి. అది మూలాధార స్థానమున లింగ మొకటి. అది మూలాధార స్తానమున నుండును. ప్రాణలింగము హృదయ కమలమున నుండును. భావలింగము యొక్క అవాంతర భేదమైన మహాలింగము భ్రూమధ్యమున నుండును. వివరములు గోరువారు "అనుభవసారము" అనెడి గ్రంథమునకై డా॥ మతలింగయ్యస్వామిగారు వ్రాసిన పీఠికను చదువగలరు. ఈ గ్రంథము శ్రీ బసవ నాగయ్యగారి సంపాదకత్వమున తెలుపబడినది.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము : 6

శ్లో॥ **లయం గచ్ఛతి యత్రైవ జగదేతచ్చరాచరం।**
**పునః పునః సముత్పత్తిం తల్లింగం బ్రహ్మ శాశ్వతమ్।** (సి.శి.6 : 36)

దేనియందు సచరాచరాత్మకమైన యీ జగత్తు పునః పునః ఉత్పత్తి మరియు లయలను బొందునో శాశ్వతమైన బ్రహ్మ స్వరూపమే లింగము.

శ్లో॥ **తస్మాల్లింగమితిఖ్యాతం సత్తానందచిదాత్మకం।**
**బృహత్త్వాద్బృంహణత్వాచ్చబ్రహ్మశబ్దాభిధేయకమ్॥** (సి.శి.6 : 37)

ప్రసిద్ధిని బడసి, సచ్చితానందరూపమైన ఆ లింగము మహత్త్వముతో కూడి, ఈ విశ్వము కంటెను పెద్దదియు, మరియు పోషించునదై యుండుటచేత దీనిని బ్రహ్మమని పిలుతురు. శబ్ద వాచకమై తెలుపుచున్నది.

శ్లో॥ **ఆధారే హృదయే వాపి భ్రూమధ్యే వా నిరంతరం।**
**జ్యోతిర్లింగానుసంధానమాంతరం లింగధారణం॥** (సి.శి.6 : 38)

అంతరంగపు మూలాధార, అనాహత, మరియు నాజ్ఞాచక్రముల యందున జ్యోతిర్లింగము ననుసంధానమును చేయునదే యంతర్లింగ ధారణమనబడును.

శ్లో॥ **ఆధారే కనక ప్రఖ్యం హృదయే విద్రుమప్రభం।**
**భ్రూమధ్యే స్ఫటికచ్ఛాయం లింగం యోగీ విభావయేత్॥** (సి.శి.6 : 39)

శివయోగి లింగమును ఆధార చక్రమునందు సువర్ణకాంతిమయ కాంతిగలదిగాను, అనాహత చక్రము నందున పగడపు కాంతి గలదిగను లింగమును, ఆజ్ఞాచక్రము నందు స్ఫటిక కాంతి గలగదిగను భావించికొనవలెను.

శ్లో॥ **నిరుపాధికమాఖ్యాతం లింగస్యాంతర ధారణం।**
**విశిష్టం కోటిగుణితం బాహ్యలింగస్య ధారణాత్॥** (సి.శి.6 : 40)

అంతర్లింగ ధారణము నిరుపోధికమనియు చెప్పబడును. నిరుపాధిక లింగధారణమని యందురు. ఇది బాహ్యలింగ ధారణకంటెను కోటిరెట్లు మేలై యున్నది.

## లింగము బ్రహ్మ శబ్ద వాచ్యము :

అంతర్లింగము యొక్క సూక్ష్మమైన రూపమును శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదులవారు, ఇంకను విస్తృతము చేసి చూపుచున్నారు. మనుష్యుని యాధారాది చక్రములలో ప్రకాశమానముగా దోచిననూ దానినొక పరిచ్ఛిన్న వస్తువుగా భావించవలదు. అది జగత్తులోని యుత్పత్తి లయలకు మూలకారణమైయున్నది. అది విశ్వాత్మకమూ, విశ్వోత్తీర్ణమూ అగును. **"స భూమిం విశ్వతో వృత్వా"** అనెడి శ్రుతి వాక్యము నిట స్మరణీయము.

ఆనంద స్వరూపమైన అంతర్లింగము యొక్క పోషణ లేనిదే జీవి జీవించలేడు. జాగ్రత్స్వప్నముల యందున విషయ సుఖములకై పరిశ్రమించి యలసిన జీవి సుషుప్తి స్థితిన ప్రవేశించును. అచ్చట యే విషయములు లేకుండిననూ ఆనందములోనే యుండును. సుషుప్తిలో 8 గంటల మేరకు పొందిన ఆనందము వలన నొక వ్యక్తి 16 గంటల వరకు పనిచేసెడి సామర్థ్యమును పొందుచున్నాడు. ఒకటి రెండు దినములు నిద్రానందప్రాప్తి లేకుండిన వ్యక్తి స్థితి చింతాజనకముగా మారును. అన్నము, నీళ్ళు లేకుండిననూ కొన్ని దినముల వరకు బ్రతుకవచ్చును.

అయితే నిద్రలేనిదే బ్రతుకజాలదు అందుకే, నిద్రయందున నొక జీవి పొందెడి ఆత్మానందమే, యతని పోషక తత్త్వమగును. ఏ తత్త్వము వలన జీవి పోషితమగుచున్నదో, నా తత్త్వము యొక్క యరయిక యెల్లరికీ ఉండదు. మూర్ఛితుడైన వ్యక్తికి నాళిక ద్వారా పాలు మరియు పండ్ల రసమును పోసెడి దానిని వైద్యశాలలో చూడగలము. కొందరు ఎంతోకాలము మూర్ఛావస్థలోనుండి, ఆ అవస్థలోనే ప్రాణములు విడిచెదరు. నాలుగైదు సంవత్సరముల వరకు పండ్లరసము చేత బ్రతికెడి మూర్ఛితుడైన వ్యక్తికి తానే విధముగా బ్రతుకుచున్నాడో యనెడి తెలివిడి యుండదు. మనమందరమూ అట్టిస్థితిలోనే యున్నాము. మనమే తత్త్వము వలన పోషింపబడుచున్నామో ఆ తత్త్వము గూర్చి మనకేమియునూ తెలియదు. తాను కూర్చునియున్న నేలలో పాతిపెట్టబడిన బంగారము గురించి తెలిసికొనలేక, పావలాకై చాచి బిక్షమెత్తెడి బిచ్చగాని తెరగు మనది. అజ్ఞాన దారిద్ర్యమును పోగొట్టి అంతరంగములోని లింగమును గురించిన సుజ్ఞాన నిధిని శ్రీభగవత్పాదులవారు లోకమునకు నొసంగిరి. జ్యోతిర్లింగాను సంధాన విధానమును గూర్చి ఉపదేశించిరి. దీనినే అంతర్లింగ ధారణమని యందురని తెలిపిరి.

సృష్టికర్తయైన బ్రహ్మ, జీవుని యింద్రియములను బహిర్ముఖముగా చేసి యుంచెనని తెలియుచున్నది. యీ యుపనిషద్వాణిని గనుడి :

**"పరాంచిఖాని వ్యతృణత్ స్వయంభూః**
**తస్మాత్ పరాజ పశ్యతినాంతరాత్మన్"**

అందుచేత, జీవులెల్లరూ బహిర్ముఖులై బ్రతుకుచున్నారు. లోపలివైపుకు చూసెడి అభ్యాసమెవ్వరికినీ యలవడుట లేదు. కళ్ళు, చెవులు మూసికొని కూర్చుండిననూ, అంతరంగములోని మనసు వెలుపలి విషయములనే చింతించును. విషయచింతనను వీడి, అంతరంగమును గూర్చి ధ్యానము చేయుట యెటులో ప్రతి వ్యక్తి తన మనస్సుకు నేర్పవలెను.

## విభిన్న వర్ణముల లింగములు :

ధ్యానమునకు చెందిన విధానమును తెలియజేసిరి. యీ క్రింది శ్లోకమును గనుడి :

**శ్లో॥ ఆధారే కనకప్రఖ్యం హృదయే విద్రుమప్రభం।**
**భ్రూమధ్యే స్ఫటికఛాయం లింగం యోగీ విభావయేత్॥** (సి.శి.6-39)

దేహమునందున మూడు కేంద్రములు గలవనియును, అవియే మూలాధార, హృదయగత మరియు భ్రూమధ్యములని తెలుపుచూ, ఆయా స్థలముల యందున నుండెడి లింగముల వర్ణములను గూర్చి యీ శ్లోకమున తెలుపబడినది. అవి యీ క్రింది గతిన గలవు.

| | | |
|---|---|---|
| మూలాధారము | : | బంగారుఛాయ |
| హృదయము | : | పసుపు / పగడము |
| భ్రూమధ్యము | : | స్ఫటికము |

## న్యాసోపయోగి ముద్రలు :

ధ్యానమును చేయుటకు ముద్రలు పరమావశ్యకమైనవి. పైన చెప్పబడిన మూడు కేంద్రముల యందున నేకాగ్రత సాధించునెడ, శక్తి సంచాలినీ ముద్ర, శాంభవీముద్ర, మరియు ఉన్మనీ ముద్రలను సాధించవలెనని యోగశాస్త్రము చెప్పుచున్నది.

యోగేశ్వరానంద మహాస్వామిగారు, తమ బహిరంగయోగ మనెడి గ్రంథములోన యెన్నియో ముద్రల గూర్చి తెలియజెప్పిరి. అవి : మహాముద్ర, మహాబంధము, మహావేధ, ఖేచరీ ముద్ర, విపరీతకరణీ ముద్ర, వజ్రోలిముద్ర, శక్తిసంచాలినీ ముద్ర, యోనిముద్ర, ఉన్మనీముద్ర, శాంభవీముద్ర, కాకీముద్ర, అశ్వినీముద్ర, త్రిబంధముద్ర, మాతంగినీ ముద్ర, యోగముద్ర. ఈ ముద్రలన్నియును ప్రాచీన గ్రంథములనుండి గ్రహింపబడినవని తెలియుచున్నది.

శ్రీనిజగుణ శివయోగులవారు హఠయోగమును గూర్చి చెప్పుచూ, అంతరంగానుసంధానము చేసెడి యోగికి ఆసనము మరియు ముద్ర లవసరమని చెప్పెను. శివయోగమును చేపట్టదలచినవారు ఇతర యోగముల గూర్చి తెలిసికొనవలెననియును, వివిధ యోగమార్గములు పరస్పర పూరకములనియునూ తెలియజెప్పిరి.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు, **"ఆధారే కనక ప్రఖ్యం లింగం యోగీ విభావయేత్"** అని ఆదేశమునిచ్చిరి. శివయోగ సాధకుడు, ఆధారచక్రమునందున స్వర్ణలింగమును భావించికొనవలెను. సాధకుని ప్రారంభదశలో కనక కాంతులీనే లింగము కనిపించదు. అందుచేత సాధకుడు మూలాధార స్థానమున కనక ప్రకాశమును వెదజల్లెడి లింగము గలదని భావించవలెను. శ్రీగురువు పర్యవేక్షణలోను, శ్రీగురువు ఆదేశముల కనుగుణముగనూ, సాధన చేయుచుండిన యెడల, కాలాంతరమునందు శ్రీగురువు పొందిన యనుభవమునే శిష్యుడును పొందగలడు.

మూలాధారమనెడిది శరీరములోని నడిమి భాగమని యెంచబడినది. గుదమునకు పైననూ గుహ్యమునకు క్రిందనూ, ఈ రెంటికినీ రెండు అంగుళముల దూరమున, నొక యంగుళము ప్రమాణమున యీ చక్రముండునని తెలియుచున్నది. మూలాధారమున సువర్ణ వర్ణముగల జ్యోతిర్లింగమును దర్శించగోరువారు, సుఖకరమూ స్థిరమూ అయిన సుఖాసనమున కూర్చొని, ప్రాణాయామమును చేసి "శక్తి సంచాలినీ" యనెడి ముద్ర సహాయముచేత, ధ్యానమును ప్రారంభించవలెను.

దృష్టిని నాసాగ్రమున నిలిపి, అర్ధనిమీలిత నేత్రములతో, ఏకాగ్రతను సాధించి, దృష్టిని మూలాధార స్థానమున కేంద్రీకరించుట యనెడిది శక్తి సంచాలినీ ముద్రయని తెలుపబడినది. యీ విధిన చేసెడి సాధన లక్ష్యసాధన కుపకరించగల దనెడిది యనుభవజ్ఞుల యొక్క అభిప్రాయము.

మూలాధార చక్రమున నుండెడి శక్తిని మేల్కొలిపి, యద్దానిని యూర్ధ్వముగా పయనించే విధముగా చేయుటకై కృషి చేపట్టబడును. అందుకే దీనికి శక్తిచాలినీ, శక్తిసంచాలినీ ముద్ర యనెడి సార్థక నామధేయము సిద్ధించినది. హఠయోగులు ప్రాణాయామ విశేషము చేత నాశక్తిని జాగృతికి తెచ్చుచుందురు. ఇది అల్ప ప్రకృతి గలవారికి సాధ్యమయ్యెడిది కాదు. రాజయోగులు, మరియు శివయోగులు సుదృఢమైన మనోబలము నుపయోగించి, ముద్రల ద్వారా శక్తి జాగృతిస్థితికి తెచ్చెదరు. దీనికైననూ ప్రబలమైన యేకాగ్రత కావలసియున్నది. ఏకాగ్రమైన మనోబలము చేత యెల్ల చక్రములను ఛేదించవచ్చును. అతి చపలత గలవారికి నిట్టి సాధన సాధ్యమయ్యెడిది కాదు.

హృదయమునందలి పసుపురంగు గల జ్యోతిర్లింగమును దర్శించుటకై శాంభవీ ముద్రను సాధించవలసి యుండునుసుఖాసనమున కూర్చుండి, అర్ధనిమీళిత నేత్రములతో, దృష్టిని నాసాగ్రమున నిలిపి, బహిర్గతములైయున్న వస్తువులను చూడక, అంతర్గతమువైపు మనోవృత్తిని మళ్ళించి, యద్దానిని హృదయ కమలమున నిలుపుటయే శాంభవీ ముద్రయగుచున్నది. శ్రీనిజగుణ శివయోగుల వంటి మహానుభావులు దీనిని యుపయోగించుటవలన సత్ఫలితములు లభించునని తెలిపిరి. ఈ విధముగా హృదయ స్థానమున అంతర్లింగాను సంధానమును సాధించవచ్చును.

భ్రూమధ్యములోని శుభ్రమైన వర్ణము గల జ్యోతిర్లింగములో ననుసంధానము చేసికొనుటకై యున్మనీముద్రను సాధించవలసియుండును. ఈ ముద్ర శాంభవీ ముద్రను పోలియుండును. భేదమేమిటనగా శాంభవీ ముద్రలో మనోవృత్తి హృదయ స్థానమున నిలుపబడుచుండగా, యిట ఆజ్ఞాచక్రమున నిలుపబడుచున్నది. స్ఫటికఛాయలో నున్న లింగమును దర్శించుటవలన యిచ్చట అంతర్లింగ ధారణ యగుచున్నది.

సాధన చేయకుండగ నుండెడి సామాన్య జనులకు, ముద్రల సాధనాపరమైన విషయము కఠినముగా దోచవచ్చును. "అంతర్లక్ష్యం బహిర్దృష్టిర్నిమేషోన్మేష వర్జితా" యనెడి హఠయోగమునకు చెందిన వాక్కు ప్రకారము రెప్పలను వాల్చకుండగ అర్ధ నిమీళిత నేత్రముల యందు దృష్టిని నిలిపి, మనోవృత్తిని అంతర్ముఖముగా మళ్ళించుట యెటుల యనెడిది జటిలిమైన ప్రశ్న. దృష్టి వెలుపలికి మరలగానే మనోవృత్తియును దానిని ననుసరించునదై బహిర్ముఖమగును కదా! అయితే సామాన్యులకైననూ ముద్రాసాధన సహజముగనే సంప్రాప్త మగును అది యెట్టులనిన తన అతిప్రీతికరమైన సతీసుతాదులనూ, ఇల్లు–పొలములనూ, వదలి యాత్రకొరకు లేదా వ్యాపారమునకై యెంతో దూరము వరకు వెడలెడి గృహస్థునికి తన ప్రియకరమగు వస్తువుల తలపు రాగానే, తానెంత దూరముననున్ననూ, ఏకాగ్రమైన మనోవృత్తి చేత తన్మయుడై వాటిని ధ్యానించుచుండును. అప్పుడతని కళ్ళు తెరిచి యుండిననూ ఎదుటగల వస్తువులను చూడజాలడు. కళ్ళను కదల్చజాలడు. అందరికీ, ఈ అనుభవము నెప్పుడో నొకప్పుడు గల్గును. ఈ స్థితి గల్గుటకు గల కారణమెయ్యది? ఆయా వస్తువుల మీద గల యాసక్తియే కదా! ఇట్టి ఆసక్తి, అంతరంగములోని ఆత్మతత్త్వము యెడల పెరిగిన యెడల ముద్రాసాధన సులభతరమగును.

ఇంకా కొందరికి సగము మూసిన కళ్ళతో నిదురించెడి యలవాటు ఉండును. కనురెప్పలను వాల్చరు.

ఎదుటివానికి యతడు చూస్తున్నట్లుగనే దోచును. కాని నిదురించెడి వానికి యేమియును కనిపించదు. గాఢనిద్రలో మునిగియుండును. నిదురించెడి వాని మనస్సు వికల్పములను వీడి తన మూలకారణమైన దానిలో లీనమైయుండును. ఇది సహజముగానే లభించెడి స్థితి. అంతర్లింగ ధారణ పొందిన వాని స్థితియు నట్టిదే. దృష్టి బహిర్గతమైయున్ననూ, మనోవృత్తి అంతరంగములోని జ్యోతిర్లింగముల మీద నిలుపబడి, వాటిలో లీనమగుచున్నవి.

మనుష్యుని భావనలో నపారమైన సామర్థ్యము గలదు. అది అంతర్గతమై యుండును. **"యాదృశీ భావనీ యస్య సిద్ధిర్భవతి తాదృశీ"** అనెడి సూక్తి ప్రకారము మనము భావించినటులే మనకు సిద్ధి కలుగుచున్నది. మూలాచార్యులవారు నుపదేశించిన యటుల ఆయా కేంద్రముల యందున, ఆయా జ్యోతిర్లింగములను భావించికొని సాధన కొనసాగించిన యెడల, అంతర్లింగ ధారణ సిద్ధించగలదు. జ్యోతిర్లింగముల దర్శనమగును.

## ఇష్టలింగము - అంతర్లింగోపాసన :

వెలుపలి ఆలంబనలేనిదే, బహిదృష్టిని నిరోధించి యంతర్లక్ష్యమునందు కూడునది సాధ్యముకాదు. తన్నిమిత్తమై ప్రబలమైన సాధనము కావలెను. అందుకే, వీరశైవాచార్యులు, అంతరంగములోని జ్యోతిర్లింగము యొక్క యాకృతిన నుండెడి యిష్టలింగమును మన కర స్థలమునకు ప్రసాదించి పరిపాలించిరి. ఇది మన పశ్చిమ చక్రములోని చిత్కళతో కూడి యుండుటచేత, దీని ముఖముననే అంతరంగమునందు ప్రవేశించుట యగుచున్నది. శ్రీ నిజగుణులవారి ప్రకారము, అంతరము యొక్క జ్ఞాన చిహ్నమైన యిష్టలింగము, ఆ జ్ఞానమును తలచుటకై మాధ్యమమైయుండునని సూత్రరూపమున సెలవిచ్చిరి.

అందుచేత, వీరశైవ సాధకులు, యిష్టలింగమును ఎడమ యరచేతిలో పెట్టికొని దానిని నాసాగ్రముతో ననుసంధానమును చేసికొని, దృష్టినుండి యిష్టలింగమును పన్నెండంగుళముల దూరమున పెట్టి కొంతసేపటివరకు త్రాడనచేసి, తదనంతరము సంకల్పబలము చేత మూలాధారాదులలోని యేదోనొక చక్రమునందున మనస్సును నెలకొలిపి, యనుసంధానమును జేయదొడగిన యెడల సాధకుని సాధనకు తగిన యనుభవములు వచ్చుట యనేది ప్రారంభమగును.

శ్రీజగద్గురువులవారు నుపదేశించిన అంతర్లింగాను సంధానమును సాధించిన శరణులెందరో గలరు. అట్టి యనుభవమును పొందిన శ్రీ ప్రభుదేవులవారి వాణిని గనుడి :

**గుదలింగ నాభికమలదింద మేలె**
**షడంగుల వన్నొత్తిదరే**
**కణ్ణిల్లదె కాణబహుదు లింగ ప్రకాశవ**
**........... గుహేశ్వరా!**

దీని తెలుగు రూపమును గనుడి :

**గుదలింగము నాభికమలముల మేలిన**
**షడంగుల మునొత్తినచో**
**కళ్ళులేనిదే కానవచ్చును లింగప్రకాశమును**
**........... గుహేశ్వరా!**

దీపమునకై యుపాధులు కావలెను. నూనె, ఒత్తి, ప్రమిద మొదలగునవి దీపమునకు ఉపాధులగును. అట్టి యెడ, అంతరంగములోని దీపమునకు నుపాదులెయ్యవి అనెడి ప్రశ్న తలయెత్తును.అంతరంగములోని జ్యోతిర్లింగమున కట్టి ఉపాధుల యవశ్యకత లేదు. ఇది స్వయం

ప్రకాశమానమై వెలుగును. ఈ కారణముననే, శ్రీభగవత్పాదులవారు "నిరుపాధిక మాఖ్యాతం" అని యంతర్లింగమును అభివర్ణించిరి. శ్రీ నిజగుణులవారును నిదే విధిన వర్ణించిరి. "నిరుపాధిక నిర్మల జ్యోతి బెళగుతదె" అని యనిరి.

ఈ విధముగా అంతర్లింగ ధారణ, ఎంతో విశిష్టమైనదిగా తెలిసికొంటిమి. ఇది బహిర్లింగ ధారణ కంటెను కోటి విధములుగా మెరగైనదని తెలిసికొంటిమి. ప్రతియొక్కరూ శ్రీగురువు నిర్దేశకత్వములో నెంతో మహత్వ పూర్ణమైన యంతర్లింగాను సంధానమును చేసికొని జనన-మరణ దుఃఖమునకు దూరమగుటకు ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 14-08-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు లింగతత్త్వము నెంతో రమ్యముగా విశ్లేషించి భక్తులకు జ్ఞానోదయము గల్గించెడి విధిన యీ యాశీర్వచనమునిచ్చిరి.

వేదములలోన యింద్రుడే ప్రధానదైవము విష్ణువు అతని సహయోగి. ఇంద్రుడే తల్లికి పుట్టెనో విష్ణువును ఆ తల్లికే పుట్టెను. రుద్రుడును ఇంద్రుని సహయోగియే ఇంద్రుని కతీతమైన శక్తి గలదనెడి భావన గల్గించెడి మంత్రములు గలవు. పురుష సూక్తమట్టిదేయని తెలియుచున్నది.

ఉపనిషత్తులు బ్రహ్మతత్త్వమును ప్రతిపాదించినవి. విశ్వమును సృష్టించి పోషించెడి తత్త్వమే బ్రహ్మమని యెరుగవలెను. ఈ తత్త్వమును గ్రహించియే బాదరాయణుడు బ్రహ్మసూత్రములను రచించిరి. వీటిని ఆధారము చేసికొని శంకరులవారు అద్వైత సిద్ధాంతమున కొక రూపమునిచ్చిరి. ఇచ్చట బ్రహ్మయనగా నిర్గుణ బ్రహ్మ. నామరూపములుండవు. సచ్చిదానంద రూపమియ్యది రామానుజుడు ఉపనిషత్ బ్రహ్మతత్త్వమునకు శ్రీహరి రూపమును కల్పించు ప్రయత్నమును చేసిరి. వేదములలో వచ్చెడి విష్ణువు ఉపేంద్రుడైతే, యిచ్చటనతడు పరబ్రహ్మ. శంకరునికి సమకాలికుడైన శ్రీనీలకంఠశివాచార్యులవారు బ్రహ్మ సూత్రములకు భాష్యమును వ్రాసిరి. ఇచ్చట శివుడే బ్రహ్మ. ఇట్టి భావననే శ్రీకంఠుడును విస్తరించి బ్రహ్మసూత్రములకు భాష్యమును వ్రాసిరి. ఇతడు రుద్రతత్త్వమును విస్తరించి యద్దానిని శివతత్త్వముగా రూపొందించెనని యుందురు. శ్రీరామానుజులవారు శ్రీకంఠుని భాష్యముచేత ప్రభావితులైరనియును, తన భాష్యమున శివుని స్థానమున శ్రీహరిని స్థాపించి విస్తరించిరనెడి యభిప్రాయమొకటి గలదు. వీరి భావము లిట్టులుండగా లింగతత్త్వమును విస్తరించిన శివాగమముల నాధారముగా గొని శ్రీరేణాకాచార్యుల వారు లింగతత్త్వమును విస్తరించిరి. ఇచ్చట లింగమే పరతత్త్వము సృష్టిస్థితి లయల కిదియే మూలకారణము. ఈ తత్త్వమునే వీరశైవ భాష్యకారులు విస్తరించి చెప్పిరి. శ్రీనీలకంఠ శివాచార్యులును, శ్రీకంఠుడును, శ్రీపతి పండితుడును, శ్రీసోమనాథుడును వీరశైవపరమైన భాష్యములు వ్రాసి శ్రీరేణుకుల వారి భావములను విస్తరించిరి. శివుని నిర్గుణ రూపమే శివుడనవచ్చును. నిర్గుణ శివునికిని లింగమునకును అభేదమని చెప్పవచ్చును. లింగములోనే 36 తత్త్వములు నిమిడియుండునని శివయోగి శివాచార్యులవారు తెలియజేసిరి. కనుడి :

**శ్లో॥ యస్యోర్మి బుద్బు దాభాసః షట్త్రింషత్ తత్త్వ సంచయః**
**నిర్మలం శివనామానం తం వందే చిన్మహోదధిం।** (సి.శి.1 : 3)

శివ/లింగమనెడి సముద్రములో పృథివ్యాది శివ పర్యంతము వరకు గల తత్త్వములు నీటి నురుగువలె అణిగియుండును.

శ్రీపండితారాధ్యులవారు దీనిని సర్వాద్వైత తత్త్వమనిరి. వారి యీ పద్యమును గనుడి :

**క. సర్వము నీ యాధీనమ(ము)**
**సర్వేశ్వర కానగుణ విచారితవృత్తిన్**
**సర్వంబు నీవయను శ్రుతి**
**నిర్వాహము బొందనేర్చు నిత్యానందా!** (శి.త.సార. ప.63)

అద్వైతమనగా సర్వమూ శివుడేయను భావననేగాని, శంకరులవారు చెప్పెడి అద్వైతముకాదని యీశ్వరాద్వైత ప్రతిపాదన జేసిరి. (శివతత్త్వసార.ప.64) ముప్పది యారు తత్త్వములకు, శివుడే యుద్భవస్థానంబని 81వ పద్యములో తెలిపిరి.

లింగమునుండియే ముప్పదియారు తత్త్వములు వెలువడుననియును, ఈ తత్త్వముల సమగ్ర స్వరూపమైన విశ్వమునకు లింగము స్థితిపాలన చేయుచు పోషించుననియును ప్రళయమున నీ తత్త్వములు లింగములోనే లీనమగుననియు తెలిసికొనవలెను. లింగతత్త్వము యొక్క ప్రాముఖ్యతను శ్వేతాశ్వతర, కైవల్య యిత్యాది యుపనిషత్తులలోను గలదు. ఆగమములోని లింగతత్త్వమే, వేదములలో రుద్రతత్త్వమై, ఉపనిషత్తులలో బ్రహ్మతత్త్వమై బ్రహ్మసూత్రములకు ప్రధాన విషయమై విరాజిల్లినదని తెలియుచున్నది.

లింగమే అంగమైనదనియును, అంగము షడ్విధములనియును, భక్తాంగాది ఐక్యాంగము వరకు గల అంగములలో ఆచారాది మహాలింగ పర్యంతముగల షల్లింగములుండుననియును, ఈ లింగములు జీవుని లేదా అంగుని మూలాధారమునుండి భ్రూమధ్యము వరకుగల ఆరు స్థానములలో నుండుననియును, మగ్గియ మాయిదేవుడు ప్రతిపాదించిరి. వీరు శ్రీ భగవత్పాదుల భావములనే విస్తరించిరని తెలియుచున్నది. మూలాధారమున ఆచారలింగముండుననియును, హృదయమున చరలింగముండుననియును, భ్రూమధ్యమున మహా లింగముండుననియు తెలిపిరి.

ఈ లింగముల యొక్క లక్షణములను విద్యా వాచస్పతి, జగద్గురువులునగు శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు హృద్యముగా వివరించిరి.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము : 7

శ్లో॥ **యే ధారయంతి హృదయే లింగం చిద్రూపమైశ్వరం ।**
**న తేషాం పునరావృత్తిర్ఘోరసంసారమండలే॥** (సి.శి.6 : 41)

హృదయ కమలమునందు, చిద్రూపమైన శివలింగమును ధరించినవారికి ఈ ఘోర సంసారమునందు పునర్జన్మ వుండదు.

శ్లో॥ **"అంతర్లింగాంనుసంధానమాత్మవిద్యాపరిశ్రమః ।**
**గురూపాసనశక్తిశ్చ కారణం మోక్షసంపదాం॥** (సి.శి.6 : 42)

హృదయ కమలమునందు అంతర్లింగాను సంధానమును చేయుట ఆత్మవిద్యయందు శ్రమించుట మరియు గురుసేవను చేయుట యనెడి మూడును కారణములై యున్నవి.

శ్లో॥ **"వైరాగ్యజ్ఞానయుక్తానాం యోగినాం స్థిరచేతసాం ।**
**అంతర్లింగానుసంధానే రుచిర్బాహ్యే న జాయతే॥** (సి.శి.6 : 43)

వైరాగ్య, జ్ఞానాదుల వలనను పరిపూర్ణులై స్థిరమైన మనసున్న యోగులకు అంతర్లింగాను సంధానమునందు విశేషమైన ప్రీతి వుండును. బాహ్య లింగధారణయందు అంత ప్రీతి వుండదు.

శ్లో॥ **బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ వాసవాద్యశ్చ లోకపాః ।**
**మునయః సిద్ధగంధర్వా దానవా మానవాస్తథా॥**
**సర్వేభ జ్ఞానయోగేన సర్వకారణకారణం।**
**పశ్యంతి హృదయే లింగం పరమానంద లక్షణం॥** (సి.శి.6 : 44-45)

బ్రహ్మ, విష్ణువు, రుద్రులనెడి త్రిమూర్తులు, ఇంద్రుడు మొదలగు దిక్పాలకులు, సకలమునులు, సిద్ధులు, గంధర్వులు, దానవులు, మరియు మానవులు శ్రేష్ఠమైన జ్ఞానయుక్తులై సర్వ కారణములకే కారణమై పరమానంద స్వరూపమైన మహాలింగమును హృదయమునందు సాక్షాత్కరించుకొనుచున్నారు.

**శ్లో॥ తస్మాత్సర్వ ప్రయత్నేన శాంకరం లింగముత్తమం ।**
**అంతర్వి భావయేద్విద్వానశేషక్లేశముక్తయే॥** (సి.శి.6 : 46)

విద్వాంసుడైనవాడు తన పంచక్లేశముల విముక్తికై సర్వవిధములుగా ప్రయత్న పూర్వకముగా మహాలింగమును అంతరంగమునందున పరిభావించుకొనవలెను.

## అంతర్లింగోపాసన - సంసారనాశనము :

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు సంసారములోని సకల జీవులు జనన మరణపరమైన ఆవృత్తినుండి ముక్తు కావలెనని కరుణాభావముతో అంతర్లింగాను సంధానమును ఉపదేశించినారు. జనసామాన్యులు తెలిసికొనినయటుల బయటకు కనిపించెడి జగత్తు సంసారము కాదు. ఇది దుఃఖదాయకమైనదియు కాదు. అహంకార మమకారములే సంసారము. అందుచేత జననాది దుఃఖ పరంపర కలుగుచున్నది. ఈ విషయము గురించి సంసార హేయస్థలమునందు విస్తారముగా నిరూపింపజేయనైనది. **"సస్య మివ జాయతే మర్త్యః సస్య మివపచ్యతే పునః"** అనెడి ఉపనిషద్వాక్యము ప్రకారము మన పుట్టుక చావులకు నిర్దిష్టమైన సంఖ్య యున్నదా? ఉండినను దానిని లెక్కించటము సాధ్యమగునే? శ్రీ నిజగుణ శివయోగులవారు చెప్పిన యటుల ధరను నలుగగొట్టి ధూళిగాచేశి పరమాణువులుగా మార్చినచో ఎన్ని పరమాణువులగునో అన్ని జన్మలను జీవుడు ధరించుచున్నాడు. ఈ ప్రకారముగా జీవులయొక్క జన్మల గురించి ఆలోచించుట వ్యర్థమైన ప్రయత్నమే యగునని శివయోగులవారు హెచ్చరించిరి. అయినను ఈ సత్యమును మనము గ్రహించుటలేదు. అందుకే **"జన్మ దుఃఖం, జరాదుఃఖం, జాయాదుఃఖం పునఃపునః। సంసార సాగరం దుఃఖం తస్మాజ్జాగ్రత జాగ్రత"** అని యోగులు జ్ఞానులు జీవులను హెచ్చరించుచునే యున్నారు.

**"ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్ నిబోధత"** అనెడి ఉపనిషద్వాక్యములు కూడా ఈ విషయమునే మనదృష్టికి తెచ్చుచున్నవి. **"కశ్చిత్ ధీరః ప్రత్యగాత్మానమైక్షత్"** అనెడి శ్రుతి వాక్యము ప్రకారము ఎవరో ఒక్కరు జాగరూకత వహించుచున్నారు. మిగిలిన అనంతకోటి జీవులు ఘోర సంసారమునందు పడి తిరుగుచున్నారు. ఇటువంటి పిష్టపేషణము ముగియునది ఎపుడు? అనేది సందేహముగా నిలుచుచున్నది. "నతేషాం పునరావృత్తిర్ఘోర సంసార మండలే" అని అభయ హస్తమునిచ్చుచు, శ్రీ రేణుక భగవత్పాదులవారు హృదయ కమలమునందు చిద్రూపమైన జ్యోతిర్లింగమును ధరించువారికి పునరావృత్తి వుండదని చెప్పిరి.

## మోక్ష సంపత్తు :

ముక్తియనెడిది యొక అమూల్యమైన సంపద. ఇది అక్షయమైనది. భౌతికపరమైన సంపద పీనుగకు చేశిన శృంగారము వంటిది. ఆత్మశ్రీ వున్నవాడు భౌతికపరముగా దరిద్రునివలె దోచిననూ అతడొక ఆగర్భ శ్రీమంతుడే. బట్టలు లేకుండా దిగంబరుడుగా ఒక విరిగిన బండి క్రింద కూర్చుని వున్న రైక్వుని దగ్గరకు చక్రవర్తియైన జానుశృతి జ్ఞానభిక్షకై రాలేదా? ఈ అమూల్యమైన సంపదయొక్క మహత్వమును మరియు ప్రాప్తికి సంబంధించిన మార్గములు తెలియకున్నవి. అందుకొరకే శ్రీ భగవత్పాదులవారు ఈ క్రింది ఉపదేశమునిచ్చిరి.

**శ్లో॥ అంతర్లింగానుసంధానమాత్మవిద్యాపరిశ్రమః ।**
**గురూపాసనశక్తిశ్చ కారణం మోక్షసంపదాం॥** (సి.శి.6 : 42)

అంతర్లింగాను సంధానము, ఆత్మవిద్యను పొందెడి పరిశ్రమ మరియు గురుసేవ అనెడివి మోక్ష సంపదప్రాప్తికై మూల కారణములని శ్రీ భగవత్పాదులవారు నుపదేశమునిచ్చిరి. పగలు రాత్రి శవశకటము విపద్రూపము అయిన సంసార సంపత్తును సంపాదించుకొని చుండెడి మనము మోక్ష సంపత్తికై స్వల్పమైనను శ్రమించుచున్నామా? అని ప్రశ్నించుకొనిన యెడల వచ్చెడి ఉత్తరమేమి? ఉత్తరమిచ్చుటకు అసమర్థమైన మన జీవనము జీవనము కాదు. ఇదియొక ఉపజీవనము. భూమికే భారముగా పరిణమించెడి జీవనము. మనుష్య రూపములో నిది మృగ జీవనమని "తే మర్త్యలోకే భువిభారభూతా మనుష్య రూపేణ మృగాశ్చరంతి" అని ఒక కవి తన బాధను వెళ్ళబుచ్చుకొనెను. అడవి యందున క్రూరమృగముల సంఖ్య క్రమేపీ తగ్గుచున్నది. దీనికి కారణమేమనగా అవి మనుష్య రూపమును ధరించి ఊరికి చేరినవి. ఇది కవి యొక్క కల్పన. సత్యదూరము కాదేమో?

సద్గురువైన అనిమిష యోగి యొక్క అనుగ్రహమునకు పాత్రుడై ఆత్మవిద్యను సంపాదించి అంతర్లింగాను సాధనమును చేశి అనుభావిగా ఎంతో అనుభవమును గడించిన అల్లమ ప్రభువులవారు నుడివిన నుడువులు గమనించదగియున్నవి.

**"హేమ నిన్నదల్ల భూమి నిన్నదల్ల కామిని నిన్నవళల్ల**
**ఇవెల్ల జగక్కిక్కిద విధి; నిన్నదెంబుదు జ్ఞానరత్న**
**అంతప్ప రత్నవను ధరిసిదె యాదెడె**
**నిన్నంతహ సిరివంతరిల్లకాణా గుహేశ్వరా"**

పై వచనమునకు తెలుగు రూపమిది :

హేమము నీది కాదు, భూమి నీది కాదు, కామినియు నీది కాదు. ఇవి యెల్ల జగమిచ్చిన విధి; నీది యనెడిది జ్ఞానరత్నము. అంతటి రత్నమును ధరించిన యెడల నీయంతటి సిరివంతులు లేరు కనుమా గుహేశ్వరా!

ఈ మర్మమును తెలిసినవారు ఎంతమంది? ఆచార్యులు చెప్పినది తెలియదు. శివశరణులు చెప్పినది కూడా తెలియదు. అట్టి యెడ ముక్తి సంపాదన యెటుల సంప్రాప్తమగును?

భౌతిక సంపత్తును ప్రాప్తి చేసికొనవలెననిన ఎనిమిదిగంటల పరిశ్రమ అనివార్యము. ప్రతియొక్క క్షేత్రము నందు ఎనిమిదిగంటల నియమము కలదు. దీనితో చాలక ఎంతోమంది జనులు అధిక సమయము (ఓవర్‌టైమ్) పరిశ్రమించుచున్నారు. ఇటులైనను చివరకు దొరకునదేమి? నిరాశయే కదా! ఆయుష్యమున్నంతవరకు కష్టపడి సంపాదించి చావును కౌగలించుకొనెడి శతాయుషి అయిన ముదుసలి ముక్కెరతో చచ్చెడిదానిని చూచితిరా? మరొక్కమాటలో చెప్పాలంటే చిన్నమెత్తు బంగారమైనను మనవెంట మనము తీసుకుని వెళ్ళగలమా? మనము సంపాదించినదంతయు యిక్కడనే మిగిలియుండును. మనము వట్టి చేతులతోనే పోవుచున్నాము. ఇట్టి జ్ఞానము ఎంతమందికి కలదు? ఈ విషయమున ప్రముఖ భక్త కవి కబీరు చెప్పినది గమనార్హమైనది. 'ముట్టీ బాంధ్‌కే ఆయాథా హాథ్ పసార్‌కే జాయేగా' రిక్తముగానే వచ్చి రిక్తముగానే వెళ్ళుచున్నామనెడిది కబీరుగారి భావన. ఇది అందరి అనుభవములోనికి వచ్చెడి విషయమే కదా?

## సమయము యొక్క అభావము మరియు సాధన :

కొందరు జనులు "మోక్ష సంపదను సంపాదించుకొనే కోరిక మాకు కలదు. అయితే ఈ సంసార జంఝాటమునందు గురుసేవను చేయుట, ఆత్మవిద్యను సంపాదించుట, అంతర్లింగాను సంధానమును చేయుట వంటి వానికి మాకు సమయమే దొరకదు. ఏమి చేయవలెను?

సాధన చేయుటకు సమయము లేదనెడివారు సోమరిపోతులు మాత్రమే. వారు సాధకులు కారు. మనము ఎంత సమయమును వ్యర్థముగా గడుపుచున్నామో అనెడిది మనకే తెలియదు. ఒక దినమునకు 24 గంటలు కదా! మనయొక్క ఉపజీవనమునకై ఎనిమిది గంటలు గడుచును. ఈ పనియొక్క బడలికను తీర్చుకొనుటకు ఎనిమిది గంటలు నిదురింతుముగాక. ఇప్పటివరకు పదహారు గంటలైనవి.ఇంకను రెండు సమయములు భోజనము చేయుటకై ఒక గంట, మన సామగ్రిని తెచ్చుటకొక గంట మరియు ఆరోగ్యమును కాపాడుకొనుటకు వాయు విహారమునకై ఒకగంట అవసరము. ఈ విధముగా మనమొత్తము అనివార్య జీవనమునకై ఒక దినమున పంతొమ్మిది గంటలు అవసరమని యెంచిననూ యింకనూ అయిదు గంటలు మిగిలియుండును కదా. ఒకవేళ మీరు మనోరంజన ప్రియులైన యెడల మూడుగంటలు చలనచిత్రముకొరకో నాటకాదులకొరకో వ్యయపరచి యుండవలయును కదా. ఈ సమయము యొక్క ప్రజ్ఞానము మనకున్నదా? ఒక మనుష్యుడు ఉదయమునందొక గంట, సాయంత్రము నందొక గంట తనను తాను రక్షించుకొనుటకై వినియోగించుకొనలేడా? ఈ రెండు గంటలలో సద్గురువుల సేవ, ఆత్మవిద్య యొక్క స్వాధ్యయనము మరియు అంతర్లింగాను సంధానము చేయలేమా? శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారి ఆదేశము ప్రకారము చేసినయెడల జీవికి మోక్షసంపద కరతలామలకమగుచున్నది.

ప్రతియొక్క సామాన్యజీవికి రెండు గంటల సమయము తప్పనిసరిగా దొరకుచున్నది. ఇంకను విశేష సాధనము చేయవలెననెడి శ్రేష్ఠమైన సాధకునికి దినమునకు ఆరు గంటల సమయము లభ్యమగును. ఈ సమయమును సద్వినియోగము చేసుకొనుటకై ఒక గంట గురుసేవకును,

ఒక గంట ఆత్మవిద్య సముపార్జనకును, ఒక గంట అంతర్లింగాను సంధానమునకును కేటాయించుకొని, ప్రాతఃకాల సాయంకాలములందు సాధన చేసిన యెడల అతడొక ఆదర్శ సాధకునిగా మోక్షశ్రీని సహజముగానే పొందగలడు. గృహస్థులైనవారికి ప్రతినిత్యము గురుసేవ చేయుట భౌతికముగా సాధ్యము కాకపోవచ్చును. అందుచేత దినమున రెండుగంటలు పనిచేయుట వలన లభించిన ధనమును తన జీవితమునకు కళ్యాణమార్గమును చూపించిన సద్గురువుకు సమర్పించవలెను. ధనమును సమర్పించుటకు కాని యెడల సద్గురువుల యెడల మనస్సునందు శుభచింతననైనను తప్పనిసరిగా చేయవలెను. ఈవిధముగా తను, మన, ధనములలో దేనినో ఒకదానిని తప్పనిసరిగా గురుసేవ కర్పణ చేయవలెను. మనకు దొరికిన సమయమును సదుపయోగము చేసికొనుటకై ప్రతి ఒక్కరు ప్రయత్నించవలెను. సమయమును మించిన అమూల్యమైన వస్తువు మరొక్కటిలేదు.

**శ్లో॥ ఆయుష్యః క్షణ ఏకోపి నలభ్యః స్వర్ణకోటిభిః**
**స ఏవ వ్యర్థతాం నీతః కానుహానిస్తతోవిధికా**

ఒక కోటి స్వర్ణ నాణ్యముల నిచ్చిననూ, ఒక క్షణ ప్రమాణమైన ఆయుష్యము దొరకదు. దానిని వ్యర్థము చేసికొనిన మనుష్యునికి పూరించలేని నష్టము సంభవించునని సుభాషితకారులు హెచ్చరికను చేయుచున్నారు. మన జీవనము యొక్క అమూల్యమైన సమయమును కేవలము ఉపజీవనమునకు మాత్రమే పాడుచేయుట మంచిదికాదు. మోక్షాపేక్ష కలిగిన ప్రతిఒక్కరు తనకు సాధ్యమైనరీతియందు గురుసేవ, స్వాధ్యాయము అంతర్లింగ అనుసంధానము అవశ్యముగా చేయవలెను.

వైరాగ్యభరితులు, జ్ఞానసంపన్నులు, స్థిరబుద్ధియుతులైన శివయోగులకు అంతర్లింగాను సంధానముననే అధికమైన ఆసక్తి వుండుటచే, వారు బాహ్య లింగాను సంధానముకంటె అంతర్లింగాను సంధానమునకే ఎక్కువ ప్రాముఖ్యమునిత్తురు.

## దేవతలు, మునులు - అంతర్లింగోపాసకులు :

ఈ అంతర్లింగాను సంధానమును ఎవరెవరు చేశిరి? అనబడెడి జిజ్ఞాస కలుగవచ్చును. పరమశివుని ప్రథమ పుత్రుడైన బ్రహ్మ మొదలుగా మనుష్యుని పర్యంతము ఎల్లరూ అంతర్లింగాను సంధానులైన విషయమును శ్రీ భగవత్పాదులవారుపదేశించిరి.

ఈ విశ్వము యొక్క ఉత్పత్తి, పాలన మరియు సంహారములకు బ్రహ్మ, విష్ణు, రుద్రులనెడి త్రిమూర్తులు గలరు. వీరు పరమశివతత్త్వము యొక్క విశిష్ట అంశములు. వీరైనను ఆమూలలింగతత్త్వమును హృదయమునందున ధ్యానించి సాక్షాత్కారము చేసికొనినారు. ఇంద్రుడు, అగ్ని మొదలగు అష్టదిక్పాలకులు, పూర్వాది దిశలకు అధిపతులైయున్నారు. వీరికి ఐరావతము ఇత్యాదులు వాహనములుగా నున్నవి. వీరిని లోకపాలకులందురు.

**శ్లో॥ ఇంద్రో వహ్నిః పితృపతిర్నైఋతో వరుణో మరుత్ ।**
**కుబేర ఈశః పతయః పూర్వాదీనాం దిశాం క్రమాత్ ॥** (అమర 1:3-2)

ఈ శ్లోకములో అమర సింహులు లోకపాలకుల గురించి తెలియజెప్పిరి. వీరందరున్నూ అంతర్లింగాను సంధానమును చేసుకొని శివుని తత్త్వమును లింగతత్త్వమును సాక్షాత్కారము చేసికొనిరి. వీరివలెనే కశ్యప, అత్రి, వశిష్ట, గౌతమ, భాగురి, గురు, కణ్వ, బృహస్పతి, శక్తి, జమదగ్ని, పరాశర, మార్కండేయ, శిలాద, దధీచి, ఉపమన్యు, భరద్వాజ, మొదలగు ఋషులు శివోపాసకులైయుండిరని పురాణములు తెలుపుచున్నవి. వీరందరునూ లింగమూర్తియైన శివుని తమ హృదయమునందున సాక్షాత్కరించుకొనినారు. ఇదే విధిన సిద్ధ గంధర్వాదులు అనెడి దేవయోనికి సంబంధించినవారు అంతర్లింగాను సంధానమును చేసికొని లింగతత్త్వమును కనుగొనిరి. బాణ, రావణ, హిరణ్య, కశ్యప, హిరణ్యాక్ష, మరియు భస్మాసురాది దానవులు వారి శివభక్తిచేత లోక ప్రసిద్ధులై యున్నారు. వీరైనను శివుని అంతర్లింగ ధారణ ద్వారా ప్రసన్నుని చేసుకొనినవారే. ఇదే ప్రకారముగా అనేక జనులు సాధనా మార్గమునందున ప్రవృత్తులై అంతర్లింగమును సాక్షాత్కారము చేసుకొనగలిగిరి.మొత్తము మీద చెప్పునదేమనగా శివుడు దేవాది దేవుడు, మహాదేవుడు అయివున్నాడు. శివుని యొక్క లింగమూర్తి అందరికినీ ఆత్మయును, ఆత్మలింగమును అయివుండుట చేత సుజ్ఞాన సంపన్నులైన బ్రహ్మాది మనుష్యులవరకు ఎల్లరూ అంతర్లింగోపాసనను చేసిన విషయము తెలియవచ్చుచున్నది. ఈ అంతర్లింగము అందరికీ పూజనీయమైనది, స్థిరమైనది. ఈ విషయమున వాతులశుద్ధాగమము తెలియజెప్పెడి విషయము గమనార్హమై యున్నది.

శ్లో॥ "విష్ణు బ్రహ్మ సురేంద్ర చంద్ర రవిభిః సద్భూతి మద్భిః పరైః
దేవాద్యైః పరమంత్ర విద్భిరఖిలైః సద్భక్తిమద్భిర్నరైః ।
సద్భిః సత్పథవర్తిభిః మను మునిపాతైః ఉపాస్యంమహత్
శ్రీలింగం శివతత్త్వ ముఖ్యనిలయం హృద్యం ప్రపద్యే నిశమ్॥

(వాతుల శుద్ధాగమ, పటల 9, శ్లోక 1)

ఈ శ్లోకము వలన పరిపుష్టమయ్యెడిదేమనగా విష్ణు బ్రహ్మ సురేంద్రాదులందరు అంతర్లింగాను సంధానులై ఎల్లపుడూ శ్రీలింగమును ధ్యానించుచున్నాడని తెలియుచున్నది.

ఈ అంతర్లింగాను సంధానముచేత అవిద్యాది పంచక్లేశముల నివృత్తిని పొంది, శాశ్వత సుఖప్రాప్తి కలుగుచున్నది. ఈ విధముగా అంతర్లింగాను సంధానము మొక్క మహత్యము ఎంతో విశిష్టమైనదని తెలిసికొనిన పిదప సుజ్ఞాన సంపన్నులెల్లరూ అంతర్లింగాను సంధానమును చేసికొని తమతమ జీవితములను సఫలము చేసుకొనుదురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 15-08-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురువులు, విద్యావాచస్పతి శ్రీ చంద్రశేఖర్ శివాచార్యుల వారు అంతర్లింగ ధారణ యొక్క ఫలితమును విశ్లేషించి, అది మోక్షదాయకమని చెప్పుచు క్లేశ నివారణకై ద్దానిని ధారణ చేయవలెనని తెలిపిరి.

మానవుడనుభవించెడి యనేక క్లేశములగురించి, వాని స్వభావముగురించియు సంసార హేయస్థలమున తెలిసికొంటిమి. ఈ క్లేశము లశేషముగా నుండుననియును, వాటినుండి విముక్తిని పొందుట సులభసాధ్యము కాదనియును పెద్దలు చెప్పుదురు.

"క్లేశనం క్లేశః (క్లిశూవిబాధనే) అనెడి వ్యుత్పత్తి ప్రకారము క్లేశమనగా అలమటము పడుట. దీని వలన పీడితుడు దీనావస్థకు చేరుననియును, ఇంద్రియాదులు చెదరిపోవుననియును తెలుపబడినది.

యోగశాస్త్రము క్లేశముల నైదు విధములుగ విభజించినది. అవి : అవిద్య, అస్మిత రాగము, ద్వేషము మరియు అభినివేశము.

అవిద్యవలన నేను జీవుడన ననెడి భావన పెంపొందును. అస్మితయనెడి అహంకారము వలన గల్గును. రాగము మమకారమువలన గల్గును. రాగమునకు విరుద్ధమైనదే ద్వేషము. అభినివేశము చొరవ, పట్టుదలను సూచించును. సాంసారిక విషయములపై అమితమైన ఆసక్తిని అభినివేశమని యనవచ్చును.

అవిద్యా క్లేశము, అభినవక్లేశము, అస్తిగత గతక్లేశము, రాగక్లేశము మరియు ద్వేషక్లేశములే క్లేశములనెడి మరొక యభిప్రాయము గలదు. అభినవ క్లేశమనగా సాంసారిక విషయములపై ఆసక్తి వీడలేకుండుట. అస్తిగత క్లేశము విషయ భోగముల యెడల లాలసత్వమును గల్గించును. క్లేశముల మూలమున యంతరంగశుద్ధియు బహిరంగ శుద్ధియు ప్రతికూలముగా ప్రభావపరచబడును. కాయ వికారములును, మనో వికారములును విజృంభించును. శుద్ధి రాహిత్యము వలన త్రికరణము కలుషితమగును. త్రికరణశుద్ధి లోపించిన దశలో నరిషడ్వర్గము నష్టమును గల్గించును. ఈ పరిణామమల ఫలితముగా జీవుడు ఆత్మజ్ఞానమునకు దూరమైపోవును. ఆత్మేతర వస్తువుల యెడ మమకారమును పెంచికొని అహంభావపూరితుడై దురితములు చేయును. జన్మ రాహిత్యమునకు దూరమగును.

ఆత్మజ్ఞానమును పెంచికొనవలెననెడి కోరిక కలిగితే గురుకరుణ యనెడిది యత్యంత యవశ్యకమైనదగును. గురూపాసన చేయనివానికి గురుకరుణ లభించజాలదు. గురూపదేశమే యాత్మానాత్మ వివేచనకు మూలాధారమైన యాదేశము కదా! గురు కరుణ వలన త్రిమలములు వైదొలగిపోవును.

అంతర్లింగాను సంధానము చేత క్లేశములు తొలగిపోయి మోక్షసాధనకు మార్గము సుగమమగునని శ్రీభగవత్పాదులవారు సెలవిచ్చిరి. అదెట్లు సుసాధ్యమో యనెడిది తెలిసికొనుట యెంతో అవసరము. క్రియాదీక్షాక్రమములో ప్రకృతితో సంబంధము తొలగిపోవును. ఇష్టలింగము యొక్క అవాంతరములగు ఆచార లింగ, గురులింగములనెడి అంతర్లింగముల ధారణ చేత అభినవ, హస్తగత క్లేశములు వీడును. జన్మ రాహిత్యమునకు మార్గము సుగమమగును.

అవిద్యా క్లేశమునకు మూల కారణమగు అవిద్య మిశ్రతత్త్వమునకు సంబంధించినది. మాయామలము చేత నీ తత్త్వము లావరింపబడు క్రియాదీక్ష సహిత మను దీక్షలవలన మాయాపటలము పటాపంచలమగును. సూక్ష్మాంగమునకు ప్రాణలింగానుసంధానమగును. అవిద్య తొలగిపోవును. శివునికి నాకు భేదము లేదనే భావన పోవును. శివయోగాను సంధాను క్రమములోన యంతర్లింగోపాసకుడు జగత్తు శివమయమని యెరుగును. అతనికి యెటు చూసినా శివుడే గోచరించును. తత్ఫలితముగా 'నాది' యనెడి మమకారము వీగిపోవును. రాగక్లేశము మరియు ద్వేష క్లేశములు తొలగిపోవును. అభినివేశ క్లేశము కాస్కారమే యుండదు. వేధాదీక్ష ప్రదాన క్రమము ఆణవ మలము వైదొలగి భావలింగమనెడి అంతర్లింగము ప్రదానము చేయబడును. అయ్యది అహంకారమును రూపుమాపును. అస్మితక్లేశము వీడిపోవును.

ఈ విధముగా అంతర్లింగాను సంధానము మహా హితకారియగుటచే జ్ఞాన వైరాగ్య సంపన్నులైన ఋషులు, త్రిమూర్తులు, దేవేంద్రాదులు నంతర్లింగ ధారణ యెడల అభిరుచి గల్గియంతర్లింగధారణ గురించిన జ్ఞానమెరిగినవారై అంతర్లింగాను సంధులై యున్నారని తెలియగలరు.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము : 8

**శ్లో॥ అంతర్ధారయితుం లింగమశక్తః శక్తఏవ వా।**
**బాహ్యం చ ధారయేల్లింగం తద్రూపమితి నిశ్చయాత్॥** (సి.శి.6:47)

అంతరంగమందు లింగ ధారణ చేయు సామర్థ్యముండనీ, ఉండకపోనీ, అంతర్లింగ స్వరూపమైయున్న యిష్టలింగమును బహిర్గతముగా (దేహముపై) ఎల్లరూ ధరించవలెను.

**శ్లో॥ లింగంతు త్రివిధం ప్రోక్తం స్థూలం సూక్ష్మం పరాత్పరం।**
**ఇష్టలింగమిదం స్థూలం యద్బా హ్యే ధార్యతే తనౌ॥** (సి.శి.6:48)

లింగము స్థూల సూక్ష్మ మరియు పరాత్పరములని మూడు విధములుగా నుండును. వీటిలో శరీరము మీద ధరియింపబడెడి యిష్టలింగము స్థూలమైనది.

**శ్లో॥ ప్రాణలింగమిదం సూక్ష్మం యదన్తర్భావనామయం।**
**పరాత్పరం తు యత్ప్రోక్తం తృప్తిలింగం తదుచ్యతే॥**
**భావనాతీతమవ్యక్తం పరబ్రహ్మ శివాభిదం** (సి.శి.6:49)

హృదయ కమలము నందు భావనా రూపమున ధ్యానింపబడునది సూక్ష్మలింగము. బాహ్యేంద్రియములకు మరియు భావనకు అతీతముగా నుండెడి పరశివ బ్రహ్మమే తృప్తిలింగము లేక భావలింగమని చెప్పబడుచున్నది.

## ఇష్టలింగ ధారణ యొక్క అవశ్యకత :

పూజ్యులైన శ్రీ రేణుక భగవత్పాదుల వారు ఇంతవరకు మహిమాశాలియైన అగస్త్య మహర్షి గురించి అంతర్లింగము యొక్క ధారణ మరియు దాని స్వరూపము గురించి యుపదేశించి యింకను త్రివిధ లింగముల స్వరూపము మరియు బాహ్య లింగధారణ యొక్క ఆశ్యకతను ఉపదేశించిరి. **"బాహ్యం ధారయేత్ లింగం"** అని ఆదేశించిరి. అంతర్లింగ ధారణకు సంబంధించిన సామర్థ్యముతో సంబంధము లేకుండగ, ప్రతియొక్కరు బాహ్యలింగ ధారణను విధిగా చేయవలెనని ఆదేశించిరి. శివునికంటెను గురువు శ్రేష్టమైనవాడని భావించుట భారతీయ సంస్కృతిలో పరంపరానుగతముగా వచ్చుచున్నది. భారతదేశములో ఆవిర్భవించిన ఆస్తిక మతములన్నియును యిట్టి భావనలనే కల్గియున్నవి. వీరశైవులు

అష్టావరణములయందు గురువునకు ప్రథమ స్థానమును యిచ్చిరి. వారి ఆదేశము శిరసా పరిగ్రాహ్యమని యెంచబడినది**"కశ్చిత్ ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్, వ్యావృత్త చక్షః అమృతత్త్వమిచ్ఛన్"** యనెడి శ్రుతి ప్రమాణము ప్రకారము హృదయ గుహయందు పొడచూపెడి జ్యోతిర్లింగమును సందర్శించునది ధీరుల యొక్క కార్యము. **"వికార హేతవే సతీవిక్రియంతే యేషాం న చేతాంసిత యేవధీరాః"** (కుమార సంభవము) యనెడి కవివాక్కు ప్రకారము వికృతము చేసెడి విషయములు ఎదురనున్నను ఎవరి మనసు వికారమును పొందదో వారే ధీరులని యెంచవలయును.

ఇట్టివారిని గీతాకరుడు "స్థితప్రజ్ఞుడ"ను పేరుతో పిలిచెను. ఈ కారణమువలన అందరు ఇంతటి ధైర్యశాలులై వుండవలెను. కాని అది జరుగుటలేదు. బహిర్ముఖ వృత్తికి చెందిన జనులకు బహిర్ముఖముగానే భగవంతుని దర్శించవలెను. అందుచేతనే వీరశైవ ఆచార్యులు అంతరంగములోని ఆత్మలింగము యొక్క చిరురూపమును యిష్టలింగముగా మన హస్తకమలములకందించిరి. అంతరంగములోని జ్యోతిర్లింగము అనుసంధానము చేసెడి సామర్థ్యము వచ్చినను బాహ్య లింగ ధారణను ఎట్టి పరిస్థితులలోను తిరస్కరించరాదు.

ప్రాథమిక పాఠశాలయందు పిల్లలకు మూలాక్షరముల నభ్యాసమును గావింతురు. పిల్లవాడు ఒక సంవత్సరము పర్యంతము చర్విత చర్వణముగా ఆ అక్షరములనే మననము చేయుచుండును. మున్ముందు ప్రాథమిక మాధ్యమికాది శిక్షణను ముగించి విశ్వవిద్యాలయమును చేరినవారికి అచ్చట అభ్యసముచేసి ఎం.ఏ.పట్టాను పొందుట జరుగుచున్నది. ఈ విధముగా ఒక భాషమీద లేదా ఒక విషయము మీద కాలక్రమేణా సాధించిన సంపూర్ణ సాధికారతను సంపాదించుచున్నాడు. అనేక గ్రంథములను రచించెడి సామర్థ్యమును పొందుచున్నాడు. అయినను ప్రాథమిక దశయందు అభ్యసించిన మూలాక్షరములను త్యాగము చేయవచ్చునే? ఆ విధముగా త్యాగముచేసిన యెడల సాహిత్య రచనను చేయగల్గునే? అదే విధిన సాధన యొక్క ప్రాథమిక దశయందు ప్రాప్తించిన యిష్టలింగమును, అంతర్లింగాను సంధానము చేసెడి స్థితికి చేరినను, దానిని త్యాగము చేయునది యోగ్యము కాదు. వలదని యనునదే గురువుగారి ఆదేశము.

ఇచ్చటనుండెడి శాస్త్రీయార్థమేమనగా యిష్టలింగ ధారణ, మరియు దానియొక్క అర్చన, వీరశైవులకు అజన్మాంతము వరకు ఆచరించవలసిన నిత్యసత్క్రియలు. ఇతర ధర్మీయులకు నిత్య కర్మలెట్టివో వీరశైవులకు యిష్టలింగ ధారణ మరియు అర్చనా అట్టిదే. "ఆకరణే ప్రత్యవాయః" యనెడి ప్రమాణము ప్రకారము నిత్యకర్మలు చేయనివానికి దురితముల ప్రాప్తియగును. సద్గురువుగారు దీక్షను చేయునప్పుడు శరీరమునందు ప్రాణమున్నంతవరకు లింగధారణ మరియు లింగపూజలను వీడరాదని ఆదేశించును. గురువుగారి ఆదేశమును పాటించుట శిష్యుని ప్రథమ ధర్మము. ఈ యిష్టలింగపూజ యొక్క ఫలమే అంతర్లింగాను సంధానము. ఇది లేనిది అది సంప్రాప్తము గాదు. అందుచేత సాధనకు ప్రథమస్థాయి అనదగిన యిష్టలింగధారణ మరియు పూజలను ఎట్టి పరిస్థితులలోను వీడకూడదు. ఈ విషయమున శ్రీ ఉదయానా చార్యులవారు యిచ్చిన దృష్టాంతము మీమాంస శాస్త్రమునకు అనుగుణముగా నుండియున్నను, దానివలన మనము కొంత జ్ఞానమును పొందగలము.

**"తత్వజ్ఞాన మేవ నిశ్శేయ సహేతు కర్మాణి త్వనుత్పన్న జ్ఞానస్య జానార్థి నస్తత్ ప్రతి బంధకా ధర్మ నివారణ ద్వారేన ప్రాయశ్చిత్త వదుపయుజ్యంతే।**

**ఉత్పన్న జ్ఞానస్య త్వం తరాల బద్ధనృష్టే; శారీరి పరిసమాప్తి వత్ ప్రారబ్ధా శ్రమధర్మపాలనమ్**
**లోక సంగ్రహార్థమితి యుక్త ముత్పస్యామ॥** (కిరణావళి, పుట 132)

దీని తాత్పర్యమేమనగా అనావృష్టి నెలకొన్నప్పుడు వర్షము కొరకు శారీరి యాగమును చేయవలెనని మీమాంస శాస్త్ర విధానము కలదు. వర్షము కొరకై యాగమును చేసెదనను సంకల్పముచేసి యాగమును ప్రారంభించెదరు. యాగము ప్రారంభమైన మూడవ దినమునకే వర్షము ప్రాప్తమైన యెడల, మిగిలిన నాల్గు దినములవరకు యాగమును కొనసాగించవలెనా లేదా అంతటితోనే ఆపవలెనా? మధ్యలో ఫలప్రాప్తి జరిగినను చేసిన సంకల్పము నెరవేర్చుటకై మిగిలిన నాలుగు దినముల వరకు యాగమును కొనసాగించుటయే ధర్మము. లేనియెడల దోషము సంప్రాప్తమగును. అటులనే అంతఃకరణ శుద్ధి ద్వారా ఆత్మ సాక్షాత్కరమే నిత్మకర్మయొక్క ప్రయోజనము. ఒక వ్యక్తి ఆత్మ సాక్షాత్కారము బడయుటకై జీవితాంతము తపస్సు చేసెదనని సంకల్పించి, అట్టి కర్మను ప్రారంభించుచున్నాడు. వానికి వయస్సులోని యాభై సంవత్సరమునకే జ్ఞానప్రాప్తియైన యెడల నిత్యకర్మను ఆపవలెనా అనే సందేహము కలుగవచ్చును. దానికై గల ఫలమెట్టిది అనెడిది రెండవ సందేహము. సంకల్పానుసారముగా జీవితాంతము వరకు నిత్య కర్మను జ్ఞానియైనను చేయవలసినదే. యోగాభ్యాసము ద్వారా శ్వాసను బంధించి బ్రతుకనేర్చిన యోగియైనను, సమాధినుండి ముక్తుడైన పిదప శ్వాసక్రియను జరుపకుండునే. ఇక ప్రయోజనమును గూర్చి చెప్పవలెననిన, లోకసంగ్రహమే దాని ప్రయోజనము. ఈ విధముగా ఉదయ నాచార్యులవారిచ్చిన ప్రమాణమెంతో జ్ఞానదాయకమై యున్నది.

ఇష్టలింగ పూజయనెడి నిత్య సత్క్రియను దాని ఫలమైన అంతర్లింగ ధారణ సామర్థ్యమును సంపాదించిన శివయోగులు లోకసంగ్రహార్థమై మరియు తాము చేసిన సంకల్పమును నెరవేర్చుటకై యిష్టలింగధారణను మరియు దాని పూజలను కొనసాగించెదరు. ఈ విషయమున మడివాలు మాచదేవర వారి వాక్కులు గమనింపదగియున్నవి.

వ॥ **"అరివా నరి ది హే నెందు క్రియయ బిడబరగుదే?**
**మధురక్కే మధురవదగలాగి ఆసవిగె సవి కొరతేయుంటె"**

తెలుగు రూపమును గనుడి :

**"అరయిక ఐనదని క్రియను వీడవచ్చునే**
**మధురమునకు మధురము ఒదిగియుండిన యెడల ఆచవికి చవికొరత కల్గునే"**

ఈ విధముగా మాచదేవరగారు యిష్టలింగ ధారణ మరియు పూజలను సమర్థించిరి. మాచదేవరగారి దృష్టాంతమును లౌకిక దృష్టితో చూసిన యెడల విపరీతార్థము సాధకునకు దోచవచ్చును. తినగ తినగ వేము తియ్యనగునట్లే, తినగ తినగ తీపి చేదెక్కును. కాని పారమార్థిక దృష్టిలో యిది పొసగదు. వస్తుతః పదార్థము యొక్క గుణము మారదు. రుచిలోని భావము భోగి యొక్క అనుభవములోనే కన్పట్టును. అసంపూర్ణ జ్ఞానము కల్గిన సాధకునకు లౌకికదృష్టి అలవడే అవకాశము కలదు. కాని యిట్టిది పూర్వజ్ఞానికి వర్తించదు. ఇది లిట్టులుండగా అంతర్లింగ ధారణ సామర్థ్యములేని సాధకుడు యిష్టలింగ ధారణ మరియు పూజను అవశ్యముగా చేయవలయును కదా! నిర్గుణా రాధన కొరకు సగుణారాధననే ఆలంబనమని గుర్తెరుగనివారు కలరా? ప్రతి వీరశైవుడు ఈ సత్యమును గ్రహించవలెను.

## సూక్ష్మము యొక్క ఆరాధనకు స్థూలము యొక్క ఆవశ్యకత :

బాహ్యమునందుండెడి భగవత్కృతియే అంతరంగములోని భగవత్తత్త్వమును యెరుగ పరుచుననెడి విషయమును తెలియచేసెడి ఈక్రింది పురాణోక్తిని గనుడి :

శ్లో॥ **"ఆలంబనమ్ వినా తస్యపదముచ్చాహిః సుదుష్కరమ్**
**నిర్గుణ ప్రాప్తయే నృణామ్ ప్రతిమాలంబనమ్ కృతామ్॥**(శివపురాణము,వి.స. అధ్యాయం 12-64)

పై పురాణోక్తి స్థూలము యొక్క ఆవశ్యకతను తెలియచెప్పుచున్నది. జాగ్రదవస్థయందు అనుభవించిన విషయములే స్వప్నానుభవమునకు కారణమగునటులే, బాహ్య లింగధారణ మరియు అర్చనలు అంతరంగపు లింగార్చనకు దోహదపడును. దేహమునందున యిష్టలింగమును ప్రతిష్ఠించనిదే ప్రాణలింగ సంబంధము కాదని గ్రహించవలెను. ఈ విషయమున పలువురు అనుభవజ్ఞులు తమతమ అభిప్రాయములను తెలియచేసిరి.

1. కరస్థలమునకు యిష్టలింగ సాహిత్యము లేనిది జ్ఞానయోగము యొక్క కూటమి కాజాలదు.
2. సాకారమును బట్టి అర్చనో, పూజనో చేయవలెను గాని నిరాకారమును నమ్మకూడదు.
3. సతీ సంగతి సుఖమును ఒనగూడనిదే గణసాక్షిగ వివాహమాడుట యెందులకు?
4. లింగమును విడిచి ఆత్మ యుండునే. శివుని విడిచి శక్తియుండునే?

ఈవిధముగా శరణులు యిష్టలింగ ధారణ యొక్క ప్రాముఖ్యతను తెలియజెప్పిరి. కొందరు నిష్ఠురములను కూడా పల్కిరి. ఈ క్రింది వాక్కును గనుడీ.

**"కూడల చెన్నసంగయ్య నల్లయిష్టలింగ సంబంధవిల్లదనర ముఖవా నొడలాగదయ్య ప్రభువే"** దీని తెలుగు రూపాంతరము

**"కూడల చెన్నసంగయ్య యందు యిష్టలింగసంబంధము లేనివారి ముఖమును చూడనుకాదయ్య ప్రభువే"**

ఈ విషయమున శరణుల అభిప్రాయములును, ఆచార్యుల వారి ఉపదేశములును ఒకే విధముగా నున్నవి. ఈ కారణము వలన వీరశైవులు యిష్టలింగమును చులకన భావముతో చూడకుండ

**"తద్రూపమితి నిశ్చయాత్"** యనెడి శ్రీ రేణుక భగవత్పాదులవారి ఉపదేశము మేరకు అంతరంగములోని జ్యోతిర్లింగమిదే అని గట్టిగా నమ్మి దీనిని ధరించవలెను.

## ప్రాణలింగము మరియు భావలింగముల స్వరూపము :

జీవునికి స్థూల, సూక్ష్మ మరియు కారణములనెడి మూడు శరీరములుండును. ఈ కారణమువలన ఇతడు ధరించవలసిన లింగములును మూడు విధములుగా నుండునని రేణుకా భగవత్పాదులవారుపదేశించిరి. వీటిని, స్థూలలింగము, సూక్ష్మలింగము మరియు పరాత్పర లింగములని యందురు. స్థూల శరీరము మీద ధరించబడునదే, స్థూలలింగము. అదే మన ఇష్టలింగము. ఇది హస్తకమలముల యందు పూజింపబడి, హస్తమునందు ధరింపబడెడిది. చిన్నగా కన్పించినను విశ్వమనెడి మహావృక్షమును తనలో అణగించుకొనిన బీజమిది. శ్రీనిజగుణ శివయోగులవారు యిష్టలింగమును బీజముతో పోల్చిరి. బీజము యొక్క గర్భమునందు మహావటవృక్ష మణిగియున్నటులే యిష్టలింగమనెడి బీజములో విశ్వవ్యాపితమగు శివ విభూతియిమిడి యుండును.

అంతరంగమునందున సూక్ష్మముగా నుండెడిది ప్రాణలింగము. ఇది సూక్ష్మ శరీరమునకు దాల్చబడెడి లింగము. దీనియొక్క స్వరూపమును శ్రీ జగద్గురువులవారు యింకొక సందర్భమున ఈ విధముగా తెలియజెప్పిరి.

**శ్లో॥ "ప్రాణాపానసమాఘాతాత్కందమధ్యాద్యదుత్థితమ్**
**ప్రాణలింగం తదాఖ్యాతమ్ ప్రాణాపాననిరోధిభిః॥** (సి.శి. 12:6)

ప్రాణాయామ విశేషము ద్వారా, ప్రాణవాయువు మరియు అపానవాయువుల సంఘటన అయిన పిదప నాభి కంద మధ్యమునుండి ఆవిర్భవించు ఒక జ్యోతిని ప్రాణలింగమందురు. మున్ముందు అది శుషుమ్నామార్గము ద్వారా ఊర్ధ్వముఖముగా ప్రవహించి, హృదయ కమలము యొక్క అనాహత చక్రమునందు అంగుష్ఠ పరిమాణమున స్థిరపడుచున్నది. దీనికి విద్యుదం వర్ణము కలదని చెప్పబడినది. యోగాభ్యాసులకు హృదయ కమలమునందు పసుపు పచ్చని వర్ణములో కన్పించెడి జ్యోతియే ప్రాణలింగము. సూర్యోదయము కాగానే ముంజీకటుల్లో ఆ ప్రకాశమునందు లీనమైన యటులనే, హృదయములోని ఈ జ్యోతియందు ప్రాణవాయువు లయమగుచుండుటచే ప్రాణలింగమనెడి పేరునివ్వబడినదని చెప్పబడినది. ఎంతోమంది శివయోగులు ప్రాణలింగము యొక్క ప్రకాశమును అనుభవించి వివరించిరి. ప్రకాశము అన్ని పదార్థములను ప్రకాశవంతముగా చేయునటులే హృదయగత ప్రకాశము స్వాప్నిక పదార్థములను ప్రకాశవంతము చేయుచున్నది.

**"అత్రాయం పురుషః స్వయంజ్యోతిః"**

యనెడి ఉపనిషత్తు వాక్కునైనను ఆత్మ స్వయం ప్రకాశముకలదనియును, ఆ ప్రకాశము యొక్క అనుభవము తెలియచెప్పినది.

జాగ్రదావస్థయందు, సూర్యచంద్రాదుల వెలుగులందు వ్యవహరించినటులే స్వప్నమునందు ఈ ఆత్మ ప్రకాశమువలన వ్యవహారములు జరుగుచున్నవి. ఎందుచేతననగా స్వప్నమునందున

**"న త్ర సూర్యోబాతి నచంద్ర తారకమ్"** (శ్వే.ఉ. 6-14)

శ్రుతి ప్రమాణము ప్రకారము సూర్యచంద్రాదులక్కడ వుండరు. అచ్చట కేవలం నిరుపాధికమైన ప్రకాశము వుండును. అదియే వీరశైవులు భావించెడి ప్రాణలింగ ప్రకాశము.

మన చిద్రూపము యొక్క అరయికయే ప్రాణలింగమని ఆచార్యులవారుపదేశమునిచ్చిరి. ఈ క్రింది వుపదేశమును గనుడి :

**శ్లో॥ "క్రియా యథాలయం ప్రాప్త తథాభావోపిఽలీయతే।**
**యత్ర తద్ దేశికైరుక్తమ్ భావలింగమితి స్ఫుటమ్"** (సి.శి. 15-37)

శివోహమ్ అనెడి భావము ఎచ్చట లయమగునో అదియే భావలింగము. సాధకుడు శుద్ధమైన బుద్ధి వృద్ధిచేత శివోహం; శివోహం అని అనుసంధానించుచు కూర్చొని యుండగా ఆ బుద్ధివృద్ధి కూడా లయమై ద్యా తృధ్యేయముల భేదము తొలగి ధ్యేయమొక్కటే తనకు తానై మిగిలి వుండును. ఈ శివోహం భావనాత్మక బుద్ధివృత్తి యొక్క లయమునకు అధిష్ఠానమైనదే భావలింగము. ఈ విధముగా భావనాతీత మైనదియు, అవ్యక్తమైనదియు, పరాత్పరమైనదగు పరశివ బ్రహ్మమే భావలింగము. దానిని తృప్తి లింగమని కూడా పిలిచెదరు. ఈ భావలింగము యొక్క అనుసంధానము చేత ప్రాప్తమైన తృప్తి సంసారము యొక్క ఏ విషయ భోగముల వలనైనను ప్రాప్తము కాజాలదు. అందువలన పరమసంతృప్తిదాయకమైన ఈ లింగమునకు తృప్తిలింగమనే పేరు యివ్వబడినది.

ప్రతియొక్క వీరశైవుడు తన యోగ్యతనుబట్టి యిష్ట, ప్రాణ మరియు భావలింగములను ప్రతిదినము తప్పనిసరిగా ఆరాధించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 16-08-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు నిష్టలింగమును ధరించవలసిన నవశ్యకతను నొక్కి చెప్పిరి.

అంతర్లింగ ధారణ గూర్చి యింతవరకు చర్చించినదంతయును శివయోగమునకు ననుబంధముగా గల్గిన విషయము. అనుభవభక్తికి చెందిన దశ. అందున నిరంతర పంచాక్షరీ జపమును చేయుచు ఇష్టలింగమును ప్రాణలింగమున విలీనము చేసెడి దశ నిరంతర శివధ్యానము శివసాన్నిధ్యమున కల్గించును. శివునితో కూడియుండి సహచర్యముననుభవించేందుకు ప్రయత్నించెడి శివజీవ భేదాభేద భావనలో నుండును. ఈ స్థితిలో నిష్టలింగము యొక్క అవశ్యకత గూర్చి సంశయమేర్పడే యవకాశము గలదు. ఇట్టి సందేహమునకు గల కారణముల నూహించగలము. ఇతర యోగమార్గములు నిష్టలింగధారణను విధించుటలేదు. అంతర్ముఖమై యోగసాధన చేసిన యెడల సిద్ధిగల్గునని యందురు. వారి సిద్ధాంతము ప్రకారము, బాహ్య లింగార్చన యనావశ్యకమై యున్నది. వీరశైవ సిద్ధాంతమునకు నట్టి భావనలు విహితమైనవి కావు. ఈ కారణముననే యిష్టలింగ ధారణ తప్పనిసరియని చెప్పబడినది. ఇట్టి భావమునే బసవన్నవారి వచనములలో గాంచగలము. గనుడి :

**ప్రాణలింగ ప్రతిగ్రాహకనాద బళిక**
**లింగవిరహిత నాగినడెవపరి ఇన్నెంతో?**
**పంచేంద్రియ సుఖంను లింగవిరహిత నాగిభేంజిసలాగమ**
**లింగరహితనాగి ఉగుళ నుంగలాగదు**
**ఇంతెందు కూడల సంగన వచన** (బ.వ. 796)

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది :

**ప్రాణలింగ ప్రతిగ్రాహకు డైన వెనుక**
**లింగవిరహితుడై నడిచెడి పరి యింకెటులో**
**లింగ విరహితుడై నుడివెడి పరి యింకెటులో**
**పంచేంద్రియ సుఖమును**
**లింగ విరహితుడై భుజించునది కూడదు**
**లింగవిరహితుడై ఉమ్మిని మింగుట కూడదు**
**ఇటులనినది, కూడల సంగని వచనము**

శివయోగసాధన ద్వారా నిత్యము శివుని చెంత యుండెడి వానికైనను నిష్టలింగ ధారణ తప్పనియని తెలియుచున్నది.

ఇట్టి నిబంధనలకు గల తాత్త్విక కారణమెట్టిదనెడిది గుర్తించవలసియున్నది.

వీరశైవమున ప్రసాద నియమమొకటి గలదు. ఇష్టలింగార్చన చేసుకొనిన పిదప పదార్థములను నిష్టలింగమునకు నివేదన చేసి, వాటిని ప్రసాదముగా మార్చికొని భక్తుడు భక్తి శ్రద్ధలతో స్వీకరించవలెను. ప్రసాదాదేతరములను భుజించకూడదనెడి నియమము గలదు. అంతర్లింగమునకు భౌతిక పదార్థాలయర్పణ సుసాధ్యము కాదు. భావపరమైన వస్తువులనే నివేదింపవలెను. కాయమునకు ప్రసాదము కావలెను. భక్తునిమేను ప్రసాద కాయమనబడుచున్నది. ఇష్టలింగమును వీడినచో ప్రసాదము సిద్ధించుట యెటుల. బసవన్న వారి వచనములోన యీ అంశము ప్రస్ఫుటముగా వివరింపబడినది. ప్రసాద కాయము లుప్తమైనప్పుడు దశేంద్రియములు విజృంభించి కాయవికారమును, మనో వికారమును గల్గించును. భక్తుడు పాపకూపములో పడును. ఈ కారణమున యిష్టలింగ ధారణ తప్పనియని తెలిసికొనగలరు.

ప్రస్తుతమున భక్తస్థలమున వివేచన జరుగుచున్నది. భక్తస్థలమున యుండెడిది శ్రద్ధాభక్తికి సంబంధించినది. యిచ్చట స్వామి భృత్య సంబంధమే కర్తవ్యమైయుండును. దాసి తన యజమానిని సేవించి యతని కరుణను పొందుటకై తపనపడుచుండును. జీవుడును శివుని పూజించి తరించాలనెడి కోరిక గల్గియుండును. ఈ విషయమును స్పష్టము చేసెడి శ్రీ పండితారాధ్యుల వారి యీ క్రింది పద్యమును గనుడి :

**కం॥ ఆరాధ్యుండారాధకు**
**డారాధక మనగలేని యద్వైత దురా**
**చారకృత సర్వశూన్యా**
**కారస్థితి నేమిసేయ గావచ్చు శివా!**

(శివతత్త్వ సారము ప.50)

ఇచ్చట ఆరాధ్య - ఆరాధక సంబంధముండియుండవలెను. యిష్టలింగమే ఆరాధ్యము. జీవుడు ఆరాధకుడు. కోరెడిది శివకరుణను మాత్రమే. శివకారుణ్యము ద్వారా లింగాంగ సామరస్యమును బొందుటయే భక్తుని లక్ష్యమైయుండును. అద్దానిని సాధించుటకై భక్తియే కారణభూతమగును. శివకరుణకును భక్తికి అవినాభావ సంబంధముండుటచే భక్తుడు కోరెడిది కేవలము భక్తియే యని గ్రహించగలరు.

ఇట్టి సాధనకు గురుదత్త లింగమే ఆరాధ్యమని యెంచవలెను.

దీక్షాక్రమములో శ్రీగురువును జీవునికి లింగత్రయమును ప్రదానము చేయును. వేధాదీక్షవలన భావలింగము మను దీక్షవలన ప్రాణలింగము, క్రియాదీక్షవలన యిష్టలింగము లివ్వబడుచున్నవి. వీటియొక్క ప్రాముఖ్యత భక్తుని సాధనక్రమమును బట్టి మారుచుండును. ప్రాథమికదశలోన యిష్టలింగమును, మాధ్యమిక దశలో ప్రాణలింగమును, యున్నతదశలో భావలింగములు ప్రాముఖ్యత సంతరించికొనును.

ప్రాథమిక దశలో జీవుడు ద్వైత భావనను మదినదాల్చి, సాధనకుపక్రమించుచున్నాడు. భక్తిస్థలమున శ్రద్ధతోను, మహేశ్వరస్థలమున నిష్ఠలోను ఇష్టలింగోపాసన చేయును. ఇష్టలింగమే పరతత్త్వమని యెంచును. హరిబ్రహ్మాదులకే యందని పరాత్పరలింగము గురుకరుణ వలన తన కరతలమునకు వచ్చినిల్చినదని భావన పొందును. సాధన పరిపూర్ణమై పరిపక్వత పొందిన దశలో గురుకరుణ వలనను, జంగమ బోధనల వలనను ప్రాణలింగము యొక్క ప్రాధాన్యతను గుర్తించును.

ప్రసాది-ప్రాణలింగి స్థలములలో పాక్షికముగా ద్వైతభావనను, పాక్షికముగా అద్వైత భావనను పొందును. ప్రసాది స్థలమున ద్వైతము గరిష్టముగా నుండగా ప్రాణలింగి స్థలమున అద్వైతము గరిష్ఠముగా నుండును. ఇష్టలింగార్చన యెడల కంటెను ప్రాణలింగార్చనకు అధికమైన ప్రాముఖ్యతనిచ్చును.

శరణైక్య స్థలములద్వైతమునకు చెందినవి. జీవుడు తాను శివుడనని తెలిసికొని యుండును. తెలిసికొనినంత మాత్రమున ముక్తి లభించదు. తాను శివునిగా పరిణామమును పొందుటకై సాధన చేయవలసియుండును. జ్ఞాన-క్రియల అవశ్యకత సమముగానుండును. అందుచేత యిష్టలింగార్చన అవిస్మరణీయమగును. భావపరమైన అర్చనకు, ధ్యానమునకు, యోగమునకు ప్రాముఖ్యతనుండినను ఇష్టలింగ పూజ కొనసాగించుచుండవలెను.

ఒక్కమాటలో చెప్పవలెననిన, యే దశలోనైనను యిష్టలింగ ధారణము మరియు పూజలనివార్యములని గుర్తించవలెను. శ్రీగురువు ప్రదానము చేసిన ఈ లింగత్రయమును జీవుడు సదా ధరించవలెననెడిది, గుర్తెరుగవలసిన విషయము. పిండజ్ఞానమును పొందిన పిండుడు, సంసారము యెడల హేయతా భావమును దాల్చి గురు కరుణను పొంది భక్తుడగును. అతడు సాధించెడి ప్రగతి క్రమమును వివరించెడి శ్రీ అన్నమయ్య యొక్క అమృతవాణి యీ క్రింది విధిన నున్నది.

**భవికిన్ భక్తి మహత్త్వమంకురితమై పాటిల్ల భక్తుండు బాం**
**ధవమాత్రుండగు భక్తిపుష్టితముగా దద్భక్తుదాత్మేశుడై**
**సవిశేషస్థితి దోచు, భక్తి సఫలోత్సాహంబునుంబొందగా**
**నవికల్పస్థితి నంత భక్తుడును నీవైయుండు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము 52)

భక్తుడే చివరకు భర్గుడగునని గ్రహించవలెను. భక్తుని ఇట్టి యెదుగుదలలో యిష్టలింగార్చన కీలకపాత్ర పోషించునని తెలిసికొనగలరు. ఈ కారణముననే శ్రీ కాశీ జ్ఞానసింహాసనాధీశ్వరుడు నిష్టలింగ ధారణ మరియు పూజనము తప్పనిసరిగా విధి ప్రకారము చేయవలెనని బోధించిరి.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము : 9

శ్లో॥ **"ఇష్టలింగమిదం సాక్షాదనిష్టపరిహారకః।**
**ధారయేత్ భవధానేన శరీరే సర్వదా బుధః॥** (సి.శి. 6:50)

సర్వారిష్టములను పరిహరించి, యిష్టార్థసిద్ధిని గల్గ చేసెడి దానిని యిష్టలింగమని యందురు. వివేకయుతులు సావధాన పూర్వకముగా శరీరము మీద ఎల్లప్పుడూ ఇష్టలింగమును ధరించవలెను.

శ్లో॥ **"మూర్ధ్నివాకంఠ దేశే వా కక్షే వక్షస్థలేఽపి వా।**
**కుక్షౌ హస్తస్థలే వాపి ధారయేల్లింగమైశ్వరం॥** (సి.శి. 6:51)

ఈ ఇష్టలింగమును మస్తకము, కంఠము, కక్షప్రదేశము, ఎద, పొట్ట లేదా అరచేతిమీద తనకు అనుకూలమైన యేదో నొక స్థానమునందున ధరించవలెను.

శ్లో॥ **"నాభేర ధస్తాల్లింగస్య ధారణం పాపకారణం।**
**జటాగ్రే త్రికభాగే చ మలస్థానే న ధారయేత్॥** (సి.శి. 6:52)

నాభికిను క్రింది భాగమున ఇష్టలింగమును ధరించకూడదు. అది పాప కారణమగును. అదేవిధిన జటాజూటముననను, వెన్నుమీదను, మలస్థానముననను లింగమును ధరించవలదు.

## ఇష్టలింగమనిష్ట పరిహారకము :

ఇష్ట మరియు ననిష్ట యనెడి పదములు లోకమునందున ప్రసిద్ధిని గాంచినవి. అపేక్షితమైనది యిష్టమనియును, ననపేక్షితమైనది యనిష్టమనియును తెలుపబడినది. సాధారణముగా జనులెల్లరూ సుఖమునే కోరుకొనెదరు. అందుచేత సుఖము మరియు దానికి సాధనములుగా నుండెడివానిని యిష్టములని యనవచ్చును. దుఃఖమునపేక్షించెడి వారుందురే? అందుచేత దుఃఖము మరియు దానిని గల్గించే సాధనములు ననిష్టములగుచున్నవి. అనిష్టములు మూడు విధములుగా నుండును. అవి : ఆధ్యాత్మిక, ఆదిభౌతిక మరియు ఆది దైవికములు. ఇవి శాఖోపశాఖల ముఖాంతరముగా ననంతములై యున్నవి. శ్రీ నిజగుణ శివయోగులవారు నూరువేల కోట్ల అనిష్టములు గలవనిరి. అనిష్టములగుటకు గల కారణము లెట్టివి యనెడి సందేహము గల్గుట సహజమే. ఈ విషయమున యేకాభిప్రాయము లోపించినదని చెప్పవచ్చును. ఈ క్రింది సుభాషితమును గనుడి :

శ్లో॥ **"వైద్యా వదంతి కఫపిత్థ మరుద్వికారాన్।**
**జ్యోతిర్విదో గ్రహగతిం పరివర్తయంతి।**

**భూతాభిషంగ ఇతిభూత విదో వదంతి।**
**ప్రాచీనకర్మ బలవాన్ మునయో వదంతి॥** (సుభాషిత రత్న భాండాగారము, పుట 183)

శారీరక మరియు మానసిక పీడలకు లోనైన మనుష్యుడు, వైద్యుడి వద్దకు పోయిన యెడల, వారు వాత, పిత్త మరియు కఫముల దోషముల వలన నా పీడ గల్గినదని చెప్పును. జ్యోతిర్విదులు గ్రహగతి సరిగా లేదని యందురు. తాంత్రికులైనచో, భూతప్రేత దోషములని యందురు. సామాన్యులు ప్రారబ్దకర్మల ఫలితమని యందురు. వీరు తమకు గల దృష్టిమేరకు ఔషధము, నవరత్నధారణ, మంత్రిసిద్ధులు, యంత్రములు మొదలగునవి యుపయోగించి యుపచారములను చేయుదురు.

ఇచ్చట, ఔషధములచేత రోగమనెడి యనిష్టము, నవరత్న ధారణ మరియు నవగ్రహ జపములవలన గ్రహముల దుర్దశ యనెడి యనిష్టము, యంత్రముల చేత భూతావేశము యనబడెడి యనిష్టము నివృత్తియగునని భావింపబడుచున్నది. ఆయా ఉపచారములను పొందిన వారికి అనుభవము లెట్టులుండునో చెప్పజాలము. కొన్ని కొన్ని సందర్భములలో సత్ఫలములు లభించినను సర్వత్రా నిరుత్సాహము నెలకొనుయుండునని మన నిత్య జీవితములో గాంచగలము.

ఈ మణి మంత్రాదులు, ఆయా సంబంధిత యనిష్టములను దూరము చేయగల్గనేమో గాని యన్ని యనిష్టములను తొలగిచలేవు. వీటన్నింటిని దూరము చేసెడి మార్గమేదియైన నున్నదా? వేయున్నొక కుండల దొంతర ఒక్క దుడ్డుకర్ర పెట్టుకు బద్దలగునటుల, అన్ని యనిష్టములను దూరము చేసెడి మార్గము భగవద్భక్తియని తెలిసికొనవలెను. ఈ భగవద్భక్తి కొరకై సాధకుడు పలు మార్గములలో పయనించకూడదని, సద్గురువుగారు దీక్షా సంస్కారమును చేసి భగవత్స్వరూపమైన యిష్టలింగమును అనుగ్రహించును.

**ఇష్టలింగమిదమ్ సాక్షా దనిష్ట పరిహారకమ్** యనెడి శ్రీ రేణుకా భగవత్పాదులవారి ఉపదేశము ప్రకారము, సాధకుని అనిష్టములన్నింటిని దూరము చేసి, ఆతనికి సర్వాభీష్టములను సిద్ధింప చేసెడి సామర్థ్యము ఇష్టలింగమునకు కలదు. దీని భావమేమనగా నిరంతరము యిష్టలింగమును ధరించుటయేగాక అచంచలమైన నిష్టతో పూజించిన వారికి యిట్టి ఫలితము లభించునని తెలిసికొనగలరు.

ఈ విషయమున మగ్గెయ మాయిదేవులవారి వాక్కులు గమనించదగియున్నవి.

**శ్లో॥ ఇష్టాప్రాప్తికరమ్ సాక్షాదనిష్ఠ పరిహారకమ్।**
**ఇష్టిః పూజా తయా నిత్యమిష్టమ్ పూజిత మాదరాత్॥**
**ఇష్టలింగమితి ప్రోక్త మాచార్యైర్లింగ పూజ కైహిః**
**ఇష్టమర్దనమ్ స్వభక్తానా మనుయచ్ఛతి సర్వదా॥** (అనుభవసూత్రము 3-9-10)

ప్రతినిత్యము అత్యంత ఆధరముతో పూజింపబడెడి లింగము వారి శ్రద్ధాసక్తుల ప్రకారము, అనిష్టములను దూరముచేసి సకలాభీష్టములను నెరవేర్చును. వీరశైవుడు తన కోరికలను యిష్టలింగమునకే నివేదించవలెను. ఇతరులను కోరకూడదు. ఈ అన్యులు మానవులైనను కావచ్చును. దేవతలైనను కావచ్చును.

ఇష్టలింగము యొక్క మహత్తు నెరగనివారు అన్యమార్గములో సంచరించు అవకాశము కలదు. అట్టివారి నుద్దేశించి ప్రభుదేవులవారు ఈ క్రింది విధిన నుడివిరి.

**జగత్కర్తను చేతిన పెట్టుకొని యింటింటికి తప్పనిసరిగా**
**తిరిగెడు తిరుగుబోతువలె కష్టపడకూడదు భక్తుడు**
**వేడకూడదు భవిని, కాడును చెంది వేడి ఒడలును చరచికొనకూడదు**
**వేటకుక్క కుందేటిపై నోరుదెరచినట్టె గుహేశ్వరా॥**

సద్గురువు యొక్క ఆదేశము ప్రకారము యిష్టలింగమునందు నిష్టను పెంచుకొని ధైర్యమును పెంచుకొనవలెను. అందుచేత యిష్టలింగమనెడిది అన్యులకు చింతామణి ఎట్టిదో, వీరశైవులకు నట్టిది. ఇక్కడ గ్రహింపదగు విషయమేమనగా, యిష్టలింగమునందు నిష్ట పెరిగిన వీరశైవుడు తన

అభీష్టసిద్ధికై వేరెకడకు పోవునవశ్యకతలేదు. నిజమైన నిష్టకల్గిన వీరశైవుడు యితరులవద్దకు పోవుట క్షిషపడునా? బుద్ధిమంతులు యిష్టలింగమును అవధానపూర్వకముగా శరీరము మీద ధరించవలెనని, జగద్గురువులవారి ఉపదేశములోని సారాంశము.

## అవధాన పూర్వక లింగధారణ :

ఇష్టలింగమును ధరించినవారు బహుళముగా నుందురు. అయితే అవధాన పూర్వకముగ ధరించెడి వారెందరు? అవధానమనెడిది ఒక భక్తి విశేషము. పరిపూర్ణమైన జాగరూకత కిదొక సంకేతము. తనవద్ద గల వస్తువు యొక్క అవధానము తప్పిన యెడల ఆ వస్తువు వున్నదో లేదో యనెడి సందేహమేర్పడును.

**“బగత్‌మే బచ్చా రక్‌కే షహర్‌మే డూండ్‌నో ॥** యనెడి హిందీ లోకోక్తి ప్రకారము అట్టివాని జీవితము గడుచుచుండును.

ఒకసారి ఒక ఆడమనిషి ఒక చిన్నపిల్లను వెంబడించుకొని జాతరకు వెళ్ళినది. జాతరయందు దేవుని దర్శనముకంటెను కొనుగోళ్ళ వ్యవహారము యొక్క గందరగోళమే యెక్కువగా నుండును. పిల్లలకైతే కన్పించిన ప్రతి వస్తువును పొందవలెనని కోరికుండును. తల్లి పిల్లను వెంబడించుకొని దేవుని దర్శనమును పొంది బజారులోకి వచ్చెను. అచ్చట ఒక పాములవాడు పామునాడించుచుండెను. అది చూచుటకై జన సమూహము మూగియుండెను. పిల్లకు దానిని చూడవలెననెడి ఆతురత సహజముగానుండును గదా! కాని అది సాధ్యముకాదయ్యెను. తల్లిపిల్లను చంకనెత్తుకొని చూపించుటకు ప్రయత్నించినది. అయినను సరిగ్గా ఆట కనిపించలేదు. చివరకు భుజముల మీద ఎత్తుకొని చూపెను. అప్పుడు పిల్లకు నా ఆట సరిగ్గా కన్పింపజొచ్చెను. పిల్ల ఎంతో సంతోషముతో ఆట చూడనారంభించెను. చూస్తూ చూస్తూండగాను ఆ పిల్లకు నిద్దుర ఆవరించినది. అది తల్లితలను గట్టిగా పట్టుకొని అక్కడే నిద్రించినది. పిల్లనెత్తుకొనిన తల్లియును ఆటను చూసెడి ధ్యాసలో మైమరచినది. ఆటయొక్క సంబరములో తాను ఎత్తుకొనిన పిల్ల గురించి మరచిపోయెను. ఆట ముగిసిన వెంబడే పిల్లను వెతుకుట ప్రారంభించెను. జాతరంతయును వెతికెను. పిల్ల యెక్కడ కన్పించలేదు. నిద్రలోమునిగియున్న పిల్ల ఎలాంటి చప్పుడు చేయకుండ తల్లి భుజములమీద సుఖనిద్రలో మునిగియుండెను. తల్లి వెతికి వేసారి విచారముతో ఇంటిదారిని బట్టెను. ఆమె తన పిల్లను తలచుకొని దుఃఖిస్తూ తన యింటికి చేరెను. యింటిలోకి ప్రవేశించబోగా ద్వార భాగమున పై కడప పిల్ల తలకు గట్టిగా తాకెను. బాధతో ఆ శిశువు గావుకేక పెట్టెను. పిల్లయొక్క ఏడుపు ధ్వనిని విని తల్లి జాగృతిని పొంది పోయిన పిల్ల చిక్కినదని సంబరపడెను.

పిల్లను ఎత్తుకొనియున్నను ఆమెకు తెలియకుండెను. ఇక్కడ “ధారణ”, అనగా “అవధారణ” లేకుండెను. ఈ విధముగా వస్తువును తన చేతియందుననే పెట్టుకొని గాబరాగా వేరే ప్రదేశములందు వెదికెడి అనుభవమును ఎప్పుడో ఒకప్పుడు ఎవ్వరైనను పొందుట సహజమే? మరపు అనెడిది మనిషి బుద్ధి యొక్క సహజ స్వభావము. ధరించిన వస్తువు యొక్క అవధారణ తప్పిన యెడల, దానియొక్క ప్రయోజనము లభించదు. జాగ్రత్త తప్పిన వెంటనే మనుష్యునికి ప్రమాదములు సంభవించును. తన శరీరము మీద యిష్టలింగము కలదనెడి స్పృహ సర్వదా వున్న యెడల అతనిచేత నిషిద్ధ కార్యములు చేయబడవు. మనుష్యుని ఏదో తప్పు వ్యవహారము చేయవలసియుండిన యెడల వాడెవ్వరికి తెలియకుండ చేయుటకు ప్రయత్నించును. జనసామాన్యమునకు బెదరెడి మనుష్యుడు దేవునికి బెదరడు? తన దేహము మీద దేవుడున్నాడు అనెడి సంపూర్ణమైన తెలివిగల మనుష్యుడు, తనవలన అపరాధములు కానట్టుల జాగ్రత్త వహించును. దేవాలయము వలెనే, దేహమును పవిత్రముగానుంచుటకు ప్రయత్నించును. దేహము మీద యిష్టలింగమును అవధాన పూర్వకముగా ధరించుటకు ఆజ్ఞాపించిన భగవత్పాదులవారి ఆదేశము యొక్క భావనయైనను యిదియే అయ్యున్నది.

## ఇష్టలింగమును ధరించెడి స్థానములు :

అట్టైన యిష్టలింగమును దేహమునందున ఎక్కడైననూ ధరించవచ్చునే? లేదా ధరించుటకై విశేషస్థానము లేవైననూ గలవా? అనే జిజ్ఞాస కలుగవచ్చును. శ్రీ భగవత్పాదుల వారు “మూర్ధ్నివా కంఠదేశేవా కక్షే వక్ష స్థలేపివా, కుక్షౌ హస్తతలే” అని లింగధారణకై విశేష స్థలములను సూచించిరి. ఈ స్థలము లన్నియూ బొడ్డుకు పై భాగమున గలవనెడిది గమనార్హమైన విషయము. వీటిలోనేదో స్థానము నెంపికచేసుకొని, ఎవరికివారు తమ కనుకూలముగా దోచిన స్థానములలో లింగధారణను చేసికొనవలెను. ధరింపకూడని స్థలములను గురించియూ శ్రీ

భగవత్పాదులవారు నిర్దేశమునిచ్చిరి. నాభికి క్రింది భాగమునను, మలస్థానముల లోను, జటుకు చివరనూ లింగమును ధరించవలదని నిర్దేశమునిచ్చిరి.

ఉపనిషదాగమ పురాణాదులలోను లింగధారణకు సంబంధించిన వివరములు నివ్వబడినవి.

**శ్లో॥ శీర్షే కంఠే వక్షసి కక్ష దేశే**
**నాభౌ హస్తే సర్వదా ప్రాణలింగం ధార్యం।**
**యథాసంప్రదాయం పురస్తాత్**
**గురో ర్విదిత్వా హృదయం ముఖ్యముక్తం ॥** (సిద్ధాంత శిఖోపనిషత్ - 16)

**మూర్ధ్ని కంఠె భుజే హస్తే హృత్సలే నాభిమండలే**
**ఏతేషా మేకదేశేతు ధారయేత్ శివలింగకమ్॥** (వాతుల శుద్ధాగమ 10-36)

**లింగం వస్త్రేణ వేష్టితం మస్తకే కందరే**
**కక్షే వక్షస్యథ కరస్థలే।**
**నాభెరథస్తాత్ సతతం ప్రమాదాన్నేవధారయ॥** (స్కంద పురాణము)

## లింగకరడిగ మరియు శివదారములు :

లింగమును మేనున ధరించుటకై కరడిగయు మరియు దారమును అవశ్యకముగా కావలెను. వీటి విషయమున ఆగమములలోన నెన్నియో వివరములివ్వబడినవి. సజ్జికకై యుపయోగించవలసిన వస్తువుల వివరములను కనుడి:

**సౌవర్ణ ముత్తమం దేవి యది శక్తిస్తథా చరేత్।**
**రాజితం పిత్తలం తామ్రం నైవ కాంస్యేన కారయేత్।**
**సీసేన త్ర పురాణా దేవి తాంతవి పాటికాపివా**
**ఏతేష్ట వ్యతమం నిత్యం నాన్యత్ కుర్యా దనాపది॥**
**పరిత్యజ్యాపి యత్నేన ప్రాణమానధనాదికం॥**
**సంరక్షణీయం గిరిజే లింగమేవ న సంశయః॥** (పారమేశ్వర తంత్రము 2:34-37)

కరడిగ బంగారమునదై యుండిన యుత్తమమై యుండునని తెలుపబడినది. వీలు లేని యెడల, ఉత్తమమైన ధాతువులతో అనగా వెండి, ఇత్తడి, రాగి, కాంస్యము మరియు సీసములను కరడిగను చేయించుటకుపయోగించవచ్చునని తెలుపబడినది.

సజ్జికాకృతిని గూర్చిన వివరణలు పారమేశ్వర తంత్రము (2-38,39) పత్తి, మామిడి, బిల్వముల కాయల రూపములలోను, మోదకముల రూపములలోను సజ్జికను రూపొందింపజేయవలెను.

"భోగస్వర్గాప వర్గాయ మమ నందీశ్వరాకృతిః" అనెడి శివవాక్కుల ప్రకారము నంది రూపమున నున్న సజ్జిక, మంచి ఫలితములనిచ్చును.

కరడిగకు సంధించెడి దారము, కరడిగనే ధాతువుచేత చేయబడినదో, అదే ధాతువుతో చేయించవలెను. నూలిని కూడ, యుపయోగించవచ్చును. పారమేశ్వర తంత్రమున, సూత్రమును గూర్చిన వివరణ యీ క్రింది విధిన కలదు.

**శ్లో॥ శుక్లో జ్ఞానప్రదుస్తత్ర రక్తోవశ్యకరోగుణః।**
**శ్యామః శత్రుభయంకరః పీతః పుత్రప్రదాయకం**

**చిత్రోవిచిత్రఫలదః సుదృఢచ్ఛేదవర్జితః।**
**అగ్రంథిర్యయు రూపః స్యాదానాభ్యాకంఠమధ్యతః॥**
**యావదిచ్ఛం భవేద్దేవి సజ్జికాగుణ ఉత్తమః**
**తావదేవ ప్రకుర్వీత సజ్జికాగుణవిమీశ్వరీ॥** (పారమేశ్వర తంత్రము, 2 : 49–50)

తెలుపు జ్ఞానదాయకమనియును, ఎరుపు వశీకరణ దాయకమనియును, నలుపు శత్రు భయంకరమైనదనియును, పసుపు పుత్రదాయకమైనదనియును, చిత్రవర్ణము గలది నానారకములైన ఫలములనిచ్చునదనియు తెలుపబడినది. ఎవరెవరికి ఏదేది ప్రీతికరమో ఆయా రంగుల దారముల నుపయోగించవలెను.

శివదారమునకు ఎన్ని దారములుండవలెనో ననె విషయములోన ఆగమములు కొంతమేరకు వివరణ నిచ్చినవి. శివసూత్రములో ముప్పది యారు దారములు / పోగులు ఉండవలెనని తెలుపబడినది. దీనికి సంబంధించిన ప్రమాణములు వాతులములో గలవని తెలుపబడినది. “ఇష్టలింగ విజ్ఞాన”మనెడి గ్రంథములోన యీ క్రింది ప్రమాణము ఇవ్వబడినది.

**శ్లో॥ జ్ఞానకర్మ సముచ్చిత్య శ్రీ గురులింగ జంగమాః।**
**షడ్విధా షట్స్థలైరుక్తాః షట్ త్రింశత్తత్వతోయతాః**
**అతోద్వాభ్యాం సముచ్చిత్య త్రిరావృత్య ప్రకల్పయేత్॥**
**షట్సూత్రం తచ్ఛివం ప్రోక్తం రుద్రగ్రంథిసమాయుతం॥**
**అప్రమత్తేన తద్ధార్యం శివసజ్జికయా సదా।** (ఇష్టలింగ విజ్ఞానం – పుట 82)

ఈ ప్రమాణములోని భావమేమనగా, వీరశైవ సిద్ధాంతమునందున పూజనీయములైన గురు, లింగ, జంగములు, జ్ఞాన కర్మలనెడి రెండు సాధనము మరియు, షట్స్థలములనెడివి ముక్తికి చెందిన సోపానములు గలవు. ఈ మొత్తమును లెక్కించిన యెడల ముప్పదియారు అగుచున్నవి. ($3\times2\times6=36$). గురులింగ జంగములనెడి వారిని, జ్ఞాన కర్మముల ద్వారా అర్చించి, భక్త, మహేశ, ప్రసాది, ప్రాణలింగి, శరణ మరియు ఐక్యములనెడి సోపానములనధిరోహించి ముక్తిని పొందవలెననెడిదే యీ ముప్పది యారు తత్త్వములలోని సారాంశము.

మరికొందరు, అరువది మూడు పోగులను విహితమైనవిగా నెంచెదరు. ఈ సంఖ్య, అరువది ముష్వరు పురాతనులను సూచించుచున్నదని విజ్ఞుల యభిప్రాయము. ఈ రీతిగా వీరశైవుల యొక్క అనేక ఆచరణలు తత్వ ప్రధానములై యుండుటయేకాదు భౌతిక ఫలప్రదాయకములై యున్నవి.

అందుచేత, సకల వీరశైవులు సద్గురువుల ఆదేశము మేరకు నిష్టార్థ ప్రదాయకమునగు, ఇష్టలింగమును పైన తెలిపిన దానిలో ఒక ధాతువుచేత నిర్మితమైన కరడిగ యందునపెట్టి, తనకు అపేక్షితమైన శివదారము చేత సంబంధమును చేయించిగాని, లేదా కేవలము వస్త్రమునందున జుట్టియైన గాని నాభిస్థానమునకు పై భాగమున కంఠము మొదలగు స్థానములయందు అవధాన పూర్వకముగా నెప్పటికినీ విడివడనటుల ధరించి భక్తితో పూజించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 17–08–1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపురము**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు లింగధారణ విధి విధానములను నెంతో చక్కగా వివరించిరి.

జీవి సుఖమయమైన జీవితము నభిలషించును. సంసారము దుఃఖమయము. ఇందులో సుఖము లేశమాత్రమైనను లేదని వివేక వైరాగ్య సంపన్నులు గుర్తించినను, సగటు మనిషి యా విధిన యాలోచించదు. కర్మల నాచరించి తద్వార తన యిష్టానుసారముగా సుఖములననుభవించుటకు యత్నించును. శాస్త్రములలో, యిష్టార్థసిద్ధిని పొందగోరెడి వారికొరకు, కామ్యకర్మలు వివరింపబడినవి. శ్రీవిద్యా వాచస్పతులవారు వీటి వివరణ పిండస్థలమున యిచ్చిరి.

మానవుడు కోరెడిదొకటైతే లభించెడిది మరొకటై యుండును. యజ్ఞదాన తపశ్చర్యలను చేసియు ననిష్టములను పొందినవారెందరో గలరు. శ్రీ సోమనాథులవారి యీ యుపదేశమును గనుడి :

**సీ॥ బ్రాహ్మణ దానంబు బాత్రతన్జేసిన పరశురాముడు దేశభ్రష్టుడయ్యె**
**బ్రాహ్మణ దానంబు బాత్రతన్జేసిన బలియు రసాతల బద్ధుడయ్యె**
**బ్రాహ్మణ దానంబు బాత్రతన్జేసిన దక్షుండు క్రతులోన దగ్ధుడయ్యె**
**బ్రాహ్మణ దానంబు బాత్రతన్జేసిన గౌతము గోవధకారి యయ్యె**

**గీ॥ నిట్టి బ్రాహ్మణ దానంబు లెంచి చూచి**
**భువిని శివభక్త దానంబు పొంకమనెడి**
**కంచి పొదిలెయు శీసింధు కటకములను**
**వంచి వంచుట గానరో బసవలింగ** (చతుర్వేద సారము, ప.346)

కర్ణుని యుదంతము మనమెరిగినదే. తపస్సులు చేసిన తాపసులు ననిష్టమునుండి తప్పించికొనలేరు.

ఇష్టమునకు వ్యతిరేకమైనది అనిష్టమనియందురు. మేరు పర్వతమంత ధనమును గోరిన వానికి దరిద్రము సంప్రాప్తమగుటను గాంచుచున్నాము. సుఖమయ జీవితము కోరెడివారికి దుఃఖమయ జీవితము లభించును. అనిష్టమనగా కీడు, శోకము మరియు పాపములనెడి యర్థములు గలవని నిఘంటువువలన దెలియుచున్నది. ఈ యుపదేశమున యీ అర్థముననే ప్రయోగింపనైనదని గ్రహింపదగును.

ఇష్టలింగ ధారణ వలన సకారాత్మక మరియు నకారాత్మక ఫలితము లుండునని తెలియుచున్నది. ఈ కారణముననే శ్రీ భగవత్పాదులవారు **"అవధానేన ధారయేత్"** అనెడి ప్రయోగమును చేసిరి. అవధానమనగా జాగరూకత. మన రక్షణకై మన దగ్గర పెట్టుకొనిన యాయుధము యెడల సావధానమును వహించని యెడల ప్రాణాపాయమును తెచ్చిపెట్టును. రక్షణ కవచముగా నెంచబడిన యిష్టలింగము కూడ అనిష్టముల నివ్వగలదు. వీటిని నివారించికొని యిహలోకమున యిష్టార్థసిద్ధిని, పరమున లింగాంగ సామరస్యమును పొందుటకై యెట్టి అవధానమును చేపట్టవలెనో యనెడిది శ్రీ జగద్గురువులు రేణుక భగవత్పాదులవారు నుపదేశించిరి.

నాభికి పైభాగమున యిష్టలింగమును ధరించుటవలన యుత్తమమైన ఫలితములు లభించును. ధారణ యోగ్యములైన ప్రదేశములు తెలియజెప్పబడినవి. ఈ విధిన ధరించినవారికి యిష్టార్థసిద్ధి గల్గును. సుఖమయమైన జీవితము లభించుననియును సర్వపాపములు నాశనమగునినయు, స్వాయత్త దీక్షాక్రమములో వివరించనైనది. ఇంతకుక్రితమే యీ విషయమును సవివరముగా తెలియజేయనైనది.

లింగధారణకై యోగ్యముగాని ప్రదేశము లెట్టివో శ్రీ భగవత్పాదులవారు నుపదేశించిరి. ఈ ప్రదేశములలోన యిష్టలింగమును ధరించిన యెడల ననిష్టములు వచ్చును. "నాభే రధస్తాల్లింగస్య ధారణం పాపకారణమ్" అనెడి శ్రీ భగవత్పాదులవారి వాక్కులు నవిస్మరణీయములని గ్రహించవలెను. పాపముతో బాటుగా కీడు, కీడు వలన దుఃఖము గల్గునని తెలిసికొనవలెను. ఈ విషయముల నెల్లను గుర్తెరిగి సావధానము వహించి నిషిద్ధ స్థలములలో లింగమును ధరించుట కూడదని యనిష్టముల నాహ్వానింపదగదని గ్రహించవలెను.

భక్తగణములలోన యవధానపరమైన రెండు లోపములు సంభవించుచున్నవి. మొదటిది, లింగమును దేహమునుండి దూరము చేసెడిది రెండవది నిషిద్ధ ప్రదేశములలో ధరించుట ఈ రెండూ అనర్థ దాయకములే.

సాంగత్య దోషమువలన యీ రెండు లోపములును గల్గుచున్నవి. ద్విజులని పిలువబడెడి యజ్ఞోపవీతధారుల సాంగత్యము వలన గల్గిన దోషము మూలమున లింగమును నాభికి క్రింది భాగమున ధరించెడి యాచరణలను చేసెడివారు కన్పట్టుచున్నారు. తాము ధరించెడి శివసూత్రమును జంధ్యముగా స్ఫురింపజేయుటకై వీరు శతవిధములుగ ప్రయత్నింతురు. వీరశైవులు కూడ ద్విజులే యనియును, లింగదీక్షవలన ద్విజత్వము స్వభావసిద్ధముగా వచ్చుననియు వీరెరుగరు. ఇది దురదృష్టకరము.

నాస్తికుల యొక్క సాంగత్యము వలననో లేదా లింగధారణను నిరసించెడి స్మార్త సాంప్రదాయకులిత్యాదుల సాంగత్యమువలన లింగధారణ యెడల నిరాసక్తత పెరిగి లింగధారణకు దూరమగుచున్నారు. ఇదియును ననిష్టకారకమే.

భక్తగణము సావధానచిత్తమును వహించి పూర్వోక్త దోషములు సంభవించకుండగ తగు జాగ్రత్తలను గైకొనగలరు. శ్రీ కాశీ జ్ఞానపీఠాదీశుడు సూచించిన విధిన లింగధారణ చేసికొని సుఖమయమైన జీవితమును పొందగలరు.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము : 10

**శ్లో॥ లింగధారీ సదాశుద్ధో నిజలింగం మనోరమం।**
**అర్చయేత్ గంధ పుష్పాద్యైః కరపీఠే సమాహితః** (సి.శి. 6:53)

ఇష్టలింగ ధారకుడు నెప్పుడూ పవిత్రుడైయుండును. ఈ కారణముచేత, మనోహరమైన తన యిష్టలింగమును వామ హస్త పీఠము నందుంచికొని, యేకాగ్రమైన మనస్సుతో గంధ పుష్పాది యుపచారములచేత పూజించవలెను.

**శ్లో॥ బాహ్యపీఠార్చనాదేతత్ కరపీఠార్చనం వరం।**
**సర్వేషాం వీరశైవానాం ముముక్షూణాం నిరంతరం** (సి.శి. 6 : 54)

మోక్షాపేక్ష గలవారైన సమస్త వీరశైవులకు బాహ్యపీఠమునందున యిష్టలింగమునుంచి పూజించుట కంటె తమతమ కరస్థలమునందుంచి యిష్టలింగమును పూజించుటయే శ్రేష్ఠతరమైనది.

**శ్లో॥ బ్రహ్మవిష్ణ్వాదయో దేవా మునయో గౌతమాదయః**
**ధారయంతి సదా లింగముత్తమాంగే విశేషతః॥** (సి.శి. 6:55)

బ్రహ్మాది దేవతలు, గౌతమాది మహర్షుల విశేషముగా తమ మస్తకము నందుననే యిష్టలింగమును ధరించుచున్నారు.

**శ్లో॥ లక్ష్మ్యాదిశక్తయః సర్వాః శివభక్తి విభావితాః॥**
**ధారయంత్యలికాగ్రేషుశివలింగమహర్నిశం॥** (సి.శి. 6:56)

శివధ్యాన తత్పరులైన లక్ష్మి మొదలగు శక్తులు రేయింబవళ్ళు ఫాలముమీద శివలింగమును ధరింతురు.

## ఇష్టలింగధారి - సదాశుద్ధుడు :

పవిత్రమైన శివలింగము యొక్క సంపర్కముచేత, అపవిత్రమైన శరీరము పవిత్రముగా పరిణమించుననెడి దివ్య సందేశమును శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు జగత్తున కందించిరి.

**“లింగధారీ సదాశుద్ధః”** అని ప్రకటించిరి.

**"పవిత్రం తే వితతం బ్రహ్మణస్పతే"** అనెడి ఋగ్వేద సూక్తి ప్రకారము భగవంతుడు పవిత్రుడు. అతని సంపర్కము చేత అమంగళము మంగళమయముగాను, అపవిత్రము పవిత్రముగాను, అశుద్ధము పరిశుద్ధముగాను పరిణమించును. అల్పమైన పదార్థములు, శ్రేష్టమైన వస్తువుల సంపర్కముచేత, అనల్పమైన పదార్థముగా పరిణమించుటను మనము సర్వత్ర గాంచగలము. పాల సంపర్కమున నీరు, పూవుల సంపర్కమువలన దారము గొప్ప మహత్తును పొంది శ్రేష్ఠతరములగుచున్నవి గదా!.

స్వభావతః అపవిత్రమైన దేహము పవిత్రమైన యిష్టలింగ సంపర్కము చేత పవిత్రముగా పరిణమించుచున్నది. ఈకారణమువలన, లింగధారికి యే సూతకములు స్పృశించవు. లింగధారి సదాశుద్ధుడై యుండును. ఈ విషయమును విడమరిచి చెప్పెడి యీ క్రింది ప్రమాణమును గనుడి :

శ్లో॥ **గచ్ఛ న్తిష్ఠన్ని మిషన్ను న్మిషన్వా।**
**స్వపన్ జాగ్రన్ లింగాధారీశుచిః స్యాత్॥** (సిద్ధాంత శిఖోపనిషత్తు - 14)

ఈ రెండవ ప్రమాణమును గనుడి :

శ్లో॥ **అత్యాశ్రమిత్వాత్ గణవంశజానాం**
**లింగాంగ సంగినాం తత్రాజన్మాంత దీక్షా**
**యథాగంగా శివ సంగాత్తథైవ**
**న సూతకం వా నాప్యశుచిత్వమేషాం ॥** (సిద్ధాంత శిఖోపనిషత్తు - 12)

ఈ ప్రమాణములననుసరించి వీరశైవునికి సూతకాదులుగాని, అశుచులు గాని లేవు. లోకము యొక్క రూఢివలె జనన మరణ మరియు రజః సూతకములు, వీరశైవునకుండవు. ఎట్టి సూతకాదులందైనను లింగపూజను మానకూడదు. స్నానాది శుచిక్రియల నాచరించి యథావిధిగా తన కార్యక్రమములను నిర్వహించికొనవచ్చును.

శాస్త్రము లింగధారణలేని జన సామాన్యమునకై సూతకమును విధించినది. జనన సందర్భమున పన్నెండు దినములు, మరణానికి పదమూడు దినములు, రజస్సుకైతే నాల్గు దినములు సూతక దినములని తెలుపబడినవి. వారు దేవుని పూజలను మానివేయవలసి యుండును. వీరశైవుల యిళ్ళలోన యిట్టివి పాటించవలసిన పనిలేదు. జనన మరణాదులు సంభవించినప్పుడు, స్నానము చేసి శుచిర్భూతుడై గురు జంగముల ధూళి పాదోదకమును ఇంటియందున నెల్లెడల చిలుకరించి యింటిని శుద్ధిచేసి కొనవలెనని, వీరశైవాచార్యులు విశేష నియమములను విధించిరి. వీరశైవులకు, సూతక సంపర్కమెందుకుండదు అనెడి శాస్త్ర సంబంధమైన చర్చ, భక్తి మార్గ క్రియా స్థలమున చేపట్టబడును.

ఈ విధముగా, సదా శుద్ధుడై విరాజిల్లెడి వీరశైవుడు **"అర్చయేద్గంధ పుష్పాద్యైః"** అనే ప్రమాణము ప్రకారము సాధ్యమైనంతమేరకు గంధ పుష్పాదులను సేకరించుకొని **"అర్చయేత్ కరపీఠె సమాహితః"** అనే ప్రమాణానుసారముగా లింగమును వామకరపీఠమున పెట్టుకొని తనకు వీలైన ఉపచారములచేత లింగమును పూజించవలెను.

## ఇష్టలింగ పూజా విధానము :

ఇష్టలింగ పూజకుడు స్నానాదులచేత శుచిర్భూతుడై శ్వేత కంబళము వేసిన ఆసనము మీద కూర్చుండవలెను. పూర్వాభిముఖముగా లేదా ఉత్తరాభిముఖముగా కూర్చుండుట విహితమైయున్నది. ఇష్టలింగమును వామకర పీఠమున నేవిధిన పెట్టికొని పూజిరచలెనో అనెడిది తెలియబరచెడి సూక్ష్మతంత్రములోని యీ క్రింది ప్రమాణమును గ్రహించవచ్చును.

శ్లో॥ **కరస్థల గతం లింగం వామతఃకృత గోముఖం।**
**కనిష్టానామికాగ్రాభ్యాం శివలింగం చ గోముఖం॥**
**అంగుష్ఠగ్రేణ చైవంహి సంస్పృశేదర్చనా విధౌ।**
**భావప్రాణేష్టలింగాని పూజయేదేక భావతః॥**
**పృథగ్భావం న కుర్వీత ప్రాణలింగపరోయతః।** (సూక్ష్మతంత్రపటలము, 53-55)

ఈ ప్రమాణము ప్రకారము, వామకర పీఠమున యిష్టలింగమును పెట్టి, అంగుష్ఠము కడకు గోముఖమును చేసి, కనిష్టికా మరియు అనామికముల తోడ గోముఖము స్పర్శమయ్యెడి విధిన పట్టికొని తన దృష్టికి నేరుగా పన్నెండు అంగుళముల అంతరమునందున లింగస్థిత కరపీఠము నుంచవలెను.

మొదట శాంభవీ ముద్రతో దృష్టిని ప్రాణలింగమున నిడి, అంతరంగమందున గల ప్రాణ భావ లింగములను మనోవృత్తిచేత ధ్యానమును వాటిపైన నుంచి, అర్థాను సంధాన పూర్వకముగా పంచాక్షరీ మహామంత్రమును జపించవలెను. సాధకుని నిర్నినిమేష దృష్టి సంబంధము చేత యిష్టలింగ కాంతి యందావిర్భవించిన సూక్ష్మమైన విద్యుత్తు వామ హస్తపు అంగుష్ఠ మరియు అనామికా గుళికముల మూలముగా హృదయము మరియు బ్రహ్మ రంధ్రము వరకు వ్యాపించి యందలి చక్రములలో జాగృతిని తెచ్చి, ప్రాణభావ లింగముల యనుసంధానముల యోగ్యత గల్గచేయుటచేత సాధకుడు మనస్సు, దృష్టి మరియు బుద్ధిని యేకకాలమునందున శ్రీ లింగాను సంధానమున తత్పరములైనవిగా చేయవలెను. ఈ విధముగా **"రుద్రోభూత్వా రుద్రమర్చయేత్"** అనెడి ప్రమాణము ప్రకారము సాధకుడు లింగ తత్వమునందున తన్మయుడు కావలెను. "రుద్రునివై రుద్రుని పూజించవలెను" అనెడిది ప్రమాణములోని భావము. ఆ పిదప, సాధకుడు ఆగమోక్తములైన పంచ, అష్ట, షోడశ మరియు షట్త్రింశాది యుపచారముల చేత యిష్టలింగమును అర్చించవలెను.

శ్రీ నిజగుణ శివయోగులవంటివారు, యే పుణ్య విశేషము వలననో యిష్టలింగ పూజ చేసెడి భాగ్యము లభించినదని సంతోషముతో తెలిపిరి. శ్రీ నిజగుణులవారు వివరమైన శివపూజా విధానమును తెలియజెప్పిరి. ఇందులో మజ్జనము, వస్త్రము, శ్రీగంధము, అక్షతలు, పుష్పములు, ధూపదీప నైవేద్యములు, తాంబూలము  ఛత్ర చామర దర్పణాదులు, వ్యజనము, నమస్కారములు మొదలగునవి యెట్లు సమర్పించవలెనో తెలియజెప్పిరి. ఇవి సమర్పించునప్పుడు ప్రేమానురాగములలో నిమగ్నుడై యుండెడి సాధకుడు, ఉత్తమ ఫలితములననుభవించును.

వీరశైవుల పూర్వజన్మలలోని పుణ్య ఫలముగా "జగమంత విస్తృతను, ఆకాశమంత వైశాల్యమును గల్గిన లింగతత్వము కరస్థలమునకు వచ్చి చులకనగుచున్నది. ఇది శ్రీగురువు కరుణ వలన సాధ్యమయ్యెడి యీ యనుభవము వీరశైవుల సొత్తైనది.

తాత్వికముగా చూచిన యెడ యిష్టలింగ పూజ యనెడిది, ఆధ్యాత్మిక రతికి చెందిన అద్వితీయ అనుభూతి. శరణసతి – లింగపతి న్యాయమున సాధకుడి, రత్యనుభవమిది. సతి, అనురాగ ప్రపూర్ణమై, తనకు తానుగా తన సర్వస్వాన్ని పతికి సమర్పించియెట్టి సంభోగ సౌఖ్యముననుభవించునో, అట్టి శివానందమును సాధకుడు పొందవలెను.

భారత దేశములోని భక్త్యుద్యమము, ఆధ్యాత్మికరతిని కైవల్యప్రాప్తికై సాధనమని యెంచినది. వైష్ణవులు ప్రేయసీ–ప్రియుల మధురానుభూతులను, ఆదర్శముగాగొని, దానిని ఆధ్యాత్మిక జీవనమున కనువర్తింతురు. వీరశైవము భక్తి మార్గమునకు చెందినదని వేరుగా చెప్పు నవశ్యకత లేదు.

శ్రీ నిజ గుణులవారి యీ క్రింది కృతి చూడదగినదై యున్నది :

**ఆవ పుణ్యవో లింగపూజా విధియనుభావ వహుదు నర్మజన్మదొళు**
**సావిరముఖదొళరసినోడి నిగమాగమావళి గాణద సాధ్యవిదు॥**
**మొదలు లింగవ కళెయన్ను బావిసువరతి॥**
**హృదయ దొళడగూడినెనెవ రీతి॥**
**సదమల లోచనదొళునిట్టిసువరతి॥**
**యొదవి కరదొళిం బిడువరతి॥**
**హరుషరసదొళు మజ్జనవెరె వింపు॥**
**పరమ గంధాక్షతె గొడువింపు॥**
**పరిమళవెసె వలను సింగరిసు వింపు॥**
**వరధూపారతిగళ నెత్తువింపు॥**

రసమొసరువ సవిగళనోడువనురాగ।
వెసెవ తాంబూలవను నీడువను రాగ॥
మిసునియ ఛత్రచామరవనిక్కువను రాగ।
పోసెదు దర్పణవను విడివనురాగ॥
కొడె బిజ్జణిగెయ నోడిబీసువలేసు।
నాడెనమిసి లల్లెగరెవలేసు॥
మాడువ తనుపుళకదొళు పాడువలేసు।
నోడు తానందాశ్రు సురివలేసు॥
హింగదె పుష్పాంజలి గైయుపతిసుఖ।
సింగరీవెనిసి బణ్ణిసువసుఖ॥
మంగళమయ శంభువెసిసి రాజిపసుఖ।
లింగపూజా సంభ్రమద సుఖ॥

నిజగుణులవారి యీ కృతి యొక్క తెలుగు రూపమును గనుడి :

ఏమి పుణ్యమో లింగపూజా విధి
యనుభావ మగునది నరజన్మలోన।
వేయి ముఖములుగ నరసిచూచి
నిగమాగమావళి గానని సాధ్యమిది।
మొదలున లింగకళను భావించెడి రతి।
హృదయములో నొడగూడి నెనవెడి రతి॥
హరుష రసములో మజ్జనమెసగించెడి యింపు
పరమ వస్త్రగంధాక్షతలు పెట్టెడి యింపు॥
పరిమళమిచ్చు మొగ్గల సింగరించెడి యింపు।
వరధూపారతుల నెత్తెడి యింపు॥
రసము పెరుగుల చవుల చూచెడి యనురాగు
ఎసగు తాంబూలము నిచ్చెడి యనురాగము॥
మిసుగు ఛత్రచామరముల నిచ్చెడి యనురాగము।
పొసగి దర్పణము బట్టెడి యనురాగము।
కూడ విసనకఱ్ఱ చూసి వీచెడి లెస్స
నాడెకు నమించి లలిగొనెడిది లెస్స॥
చేసెడి తనువు పులకింతలో పాడేది లెస్స
చూస్తూ ఆనందాశ్రువులు కురిపించుట లెస్స
వెనుక పుష్పాంజలి చేసె దతిసుఖము॥
సింగారమెంతో వర్ణించెడి సుఖము॥
మంగళమయ శంభునెంతో రాజించెడి సుఖము
లింగపూజా సంభ్రమపు సుఖము ॥ (క్రై.ప. నీతి 25)

సామాన్యముగా సాంసారిక పదార్థములు కైవసమగునప్పుడు మూఢులు నుబ్బియాడుదురు. జగదాది శివలింగమును ఇష్టలింగము రూపమున కరగతము చేసికొనిన విధిని గని శరణులు శివయోగులు నలి యాడుదురు. "ఇష్టప్రాణ స్తథా భావం త్రిధా ఏకం పరానన" అనే ప్రమాణమును గని, తాను పొందిన ఇష్టలింగమును పూజించిన యొక శరణుడు, ఆనందాతిరేకముతో నుడివిన వాక్కులను గనుడి :

**"ఇష్ట ప్రాణస్తథా భావం తిధా ఏకం పరాననె"**
**ఎంబుదాగి త్రివిధవూ ఏకీభవిసి**
**లింగరూపవాడి ఎన్న కరస్థలక్కె బందు**
**కరతళామలక వాగి తోరత్తైదానె**
**ఆహా ఎన్నపుణ్యవే! ఆహా ఎన్న భాగ్యవే!**
**ఆహా ఎన్న సత్యవే! ఆహా ఎన్న నిత్యవే!**
**శివశివ! మహాదేవ! మహాదేవ! నీనెబల్లె**
**ఉరులింగ పెద్ది ప్రియ విశ్వేశ్వరా!**

పెద్దివారి వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**"ఇష్ట ప్రాణ స్తథాభావం త్రిధాఏకం పరాననా"**
**అనెడిది గాన, త్రివిధమూ ఏకీభవించి**
**లింగరూపమై నా కరస్థలముకు వచ్చి**
**కలతలామలకమై దోచుచాయిత్తు**
**ఆహా నా పుణ్యమా! ఆహా నా భాగ్యమా!**
**ఆహా సత్యమా! ఆహా నా నిత్యమా!**
**శివశివ! మహాదేవ! మహాదేవ!**
**నీవే యెరుగు, ఉరులింగపెద్ది ప్రియ విశ్వేశ్వరా!**

మనము చేసెడి యుపచారములు శివునికి మహా సంతోషమును కల్గించును. జగత్తునందున సంతుష్టుడైన వ్యాపారి ఉపచారములు చేసి తనను తృప్తి పరచిన వానికి కొంత ధాన్యమును ఇచ్చును. రాజు అట్టివానికి గ్రామముల దానము చేయును. ఇక శివుడే సంతుష్టుడైన చెప్పెడిదేమున్నది. సద్గతియే దాని మహా ఫలమని నిజగుణశివయోగులవారు చెప్పిరి. సాలెపురుగు, కుక్క, ఏనుగు, పంది, పక్షి మొదలగు వాటికి శివుడు ముక్తియొసంగెనని తెలియజెప్పిరి. నిజగుణ శివయోగులవారు తెలియజెప్పిన కథనము ఈ క్రింది విధముగానున్నది ఒకానొక అరణ్యములో ఒక సరోవరము చెంతన ఒక పాడుబడిన దేవాలయముండెను. అందులోని శివలింగమును పూజించెడువారే లేకుండిరి. ఆ దేవస్థానమునందు ఒక సాలెపురుగు ప్రతిదినము లింగము యొక్క మస్తకము మీద దన గూటిచేత నీడను కల్పించుచుండెను. ఏనుగు సరోవరము నుండి నీటిని తొండమునిండ గైకొని సరోవరములోని కమలములను నెత్తిమీద నిడుకొని లింగము కడకు వచ్చి అభిషేకించి పువ్వులను వేయుచుండెను. చీమ తియ్యటి పదార్థములను తీసికొనివచ్చి లింగము కడ నైవేద్యముగా పెట్టుచుండెను. దేగ యిత్యాది పక్షులు తమ తమ ఆహారములను ఆ లింగము మీదనుంచి ముక్కుతో పొడిచి పొడిచి తినుచుండెటివి. కుందేలు, పంది, కుక్క మొదలగు జంతువులు వెన్నంటి రాగా ఆ పక్షులు తమ ప్రాణములను నిల్పుకొనుటకై లింగము చుట్టు తిరుగాడజొచ్చెను. వాటిని పట్టుకొనుటకై జంతువులు పరుగిడుచుండెను. శివుడు ఈ వైనమంతయును గాంచి ఈ జీవములన్నియును తనకు అభిషేకము, వస్త్రము, పుష్పములు, నైవేద్యములను సమర్పించడమేగాకుండా, ప్రదక్షిణలను కూడా చేయుచున్నవని ఆ జీవులన్నింటికిని ముక్తి నొసగెను. ఆ జీవులు కొన్ని తమ సహజ వ్యవహారములనే చేసినను శివుడు వాటిని తనకు చేయబడిన ఉపచారములుగా గ్రహించి సంతుష్టుడుగాగ భక్తుడు తాను యెరిగి భక్తితో ఉపచారములను చేసిన యెడల శివుడు సంతుష్టుడుగాకుండునే?

జ్ఞానములేని జీవులను ఉదాహరణగా గైకొని అజ్ఞాన పరవశులైన కొందరు యాంత్రికముగా పూజలను చేసి సంతుష్టులయ్యెడి అవకాశము కలదు. కాని వీరశైవులు గ్రహించవలసిన దేమనగా, ఉపచారములను సమర్పించెడి సమయమున ప్రేమానురాగములతో కూడిన భక్తితో

రోమాంచనములు కాగ ఆనందాశ్రువులు కురయగ భక్త్యావేశముతో వీటిని గావించిన యెడల ఉత్తమోత్తమమైన ఫలములు చేకూరును.

వైదిక శివపూజా విధులయందు అర్ఘ్య పాద్యాది, యిరువది యేడు అభిషేక సామాగ్రులు ప్రతిపాదించబడినది. ఈ ఉపచారముల నర్పించెటప్పుడు, మూగవానివలె నర్పించకుండ వేదోక్త లేదా పురాణోక్త మంత్రములను భావపూర్ణకముగా పఠించుచు సమర్పించవలెను. అప్పుడుగాని త్రికరణ పూజ సంభవించదు. కాని వీరశైవుడు దిగువ నివ్వబడిన విధులు యిష్టము లింగమునభిషేకించవచ్చును.

**శ్లో॥ జపః పంక్షాచరాభ్యాసః ప్రణవాభ్యాస ఏవవః।**
**రుద్రాద్యాయాదికాభ్యాసో న వేదాధ్యనాధికం॥** (సి.శి. 9:23)

ఉపనిషత్తులను కూడా వేదములేయగును. అధర్వశిఖా, శ్వేతాశ్వతర, కైవల్యాది ఉపనిషత్తులు. నవేదాధ్యయనాదికం, రుదాధ్యాయము.

యనెడి శ్రీ రేణుకాచార్యులవారి ఉపదేశము ప్రకారము తనకు అనుకూలముగా లభించెడి సామాగ్రులచే యిష్టలింగమునభిషేకించవచ్చును. ఏమి దొరకని పక్షములో కేవలము జలధార ద్వారనైనను యిష్టలింగము నభిషేకించిన చాలు.

"జలధారాప్రియః శివః" అనే సూక్తి ప్రకారము శివునికి వేరే ఉపచారములుండినను, లేకున్నను జలముతో అభిషేకమ చేసిన సంతుష్టుడగును. జలమును పోసే సందర్భములో జలము అఖండముగా యిష్టలింగ మస్తకమును నిరంతరము తడుపుతున్నట్టుగా, పూజకుని మనోవృత్తి కూడ పూజా సమయమునందు లింగముతో అఖండముగా సంబంధము కల్గియుండవలెను.

రుద్రాభిషేకము గురించి ఎంతో ప్రచారము కలదు. రుద్ర యనే పదము వేదములో విరివిగా నుపయోగించబడినది. "రుత్" అనే ధాతువునుండి నిష్పన్నమైన దీని యర్థము, దుఃఖమును ద్రవింప చేసెడివాడు రుద్రుడు. "దుఃఖ ద్రావయతీతి రుద్రః" యనెడి వ్యుత్పత్తిని యే విధముగా అర్థము చేసికొనదగును. రుద్రోపాసన రుద్రాభిషేకమును సల్పుటవలన జరుగుచున్నది. రుద్రాధ్యాయమును పఠించినవారికి సమస్త పీడలు తొలగి యింటిలో సుఖశాంతులు నెలకొనును. శ్రీ రుద్రము యొక్క మహత్తును భక్తి మార్గమ క్రియాస్థలమున వివరింపబడినది. ప్రతిదినము రుద్రమును పఠించుట సాధ్యముకాని యెడల శ్రావణ మాసమునందు కాని శివరాత్రి మున్నగు పర్వదినములయందు, రుద్రమును పఠిస్తూ, యిష్టలింగమునకు పూజను చేసికొనుట శుభదాయకము. వేదమంత్రములను పఠించుట అందరికి సాధ్యపడదు. పూరాణోక్త మంత్రములను పఠించి అభిషేకమును చేయవచ్చును. అదియును సాధ్యముకాని యెడల ఏకాగ్రమైన చిత్తముతో ప్రణవ సహిత పంచాక్షరిని పఠిస్తూ యిష్ట లింగమును పూజించవచ్చును. ఇక్కడ గ్రహించవలసిన విషయమేమనగా, సాధ్యాసాధ్యములను గుర్తెరిగి వీరశైవుడు అభిషేక విధిని నిర్వర్తించవచ్చును. రుద్రాభిషేకము మాత్రమే చేయవలయునను నియమము లేదు.

లింగాభిషేకానంతరము మడి వస్త్రముచేత లింగముపై వున్న తడిని తుడిచి భస్మ, గంధ, అక్షత, బిల్వదళ, పుష్పాదులచేత మనసారా పూజించి, ధూప దీపములను వెలిగించి శక్త్యానుసారము అర్చనలు గావించిన చాలును. తాను భుజించెడి పదార్థమును లింగమునకు నైవేద్యముగా నొసంగి, తాంబూలాదులను సమర్పించి ప్రదక్షిణ పూర్వక నమస్కారములను చేయవలెను.

పూజా ఫలప్రాప్తికై ప్రణామమును శాస్త్రోక్తి విధి ప్రకారము చేయవలెననెడి నియమమొకటి కలదు. ఈ క్రింది ప్రమాణమును గనుడి :

**శ్లో॥ పదాత్పదాంతరం గచ్ఛేత్ కరౌ చలన వర్జితౌ।**
**స్తుతిర్వాచా హృదిధ్యానం చతురంగం ప్రదక్షిణం**
**ఆసన్న ప్రసవా నారీ తైలపూర్ణం యథా ఘటం।**
**వహంతి శనకైయార్తి తథా కుర్యాత్ ప్రదక్షిణం॥** (క్రియాసారము, 14వ ఉపదేశము)

చేతులను కదల్చకుండగ, నాలుకమీద శివనామము నడియాడుచుండగ, హృదయమున శివధ్యానమును చేయుచు, నిండు గర్భిణి నడిచిన తీరున లేదా నూనె నిండుగా నున్న కుండను మోయుచు వెడలుచున్న గతిన మెల్లి మెల్లిగా, అడుగులోన యడుగను వేయుచు వెడలుచుండవలెను. ఈ విధిన దేవుని చుట్టూ తిరుగవలెను. ఇట్టిదానినే ప్రదక్షిణయని యందురు.

ప్రదక్షిణలోన పలు రకములు గలవు. వీటిలో సవ్య, అపసవ్య మరియు సవ్యాపసవ్యము లనెడివి ముఖ్యమైనవి. దేవుని తన కుడివైపుకు జేసికొని చుట్టివచ్చిన యది సవ్యమైన ప్రదక్షిణయగును. దీనికి విరుద్ధమైనది అపసవ్యము. ఈ రెంటి యొక్క కలయిక సవ్యాపసవ్యమగును. ప్రతి ప్రదక్షిణ తూర్పునుండి ప్రారంభించి తూర్పువరకు చేయవలెను. ఎవ్వరికేది విహితమనెడి విషయములో వివరణలొసంగబడినవి. ఇది రెండు పక్షములుగా చెప్పబడినది. ఈ క్రింది ప్రమాణమును కనుడి.

**శ్లో॥ తత్ర సవ్యం బ్రహ్మచారిణమపసవ్యం యతీనాం।**
**సవ్యాపసవ్యంగృహీ వనస్థయోరితికశ్చన పక్షః॥**
**సవ్యం సాదారణమపసవ్యం యతీనామేవ**
**సవ్యాపసవ్యం దక్షిణానామే వేత్యపరః పక్షః॥** (క్రియాసారము 14వ ఉపదేశము)

ఒక పక్షము ప్రకారము సవ్యము బ్రహ్మచారికిని, అపసవ్యము యతికిని, మిగిలిన వారికి సవ్యాప సవ్యములు విహితములగును. మరొక పక్షము ప్రకారము సవ్యము సాధారణమై యందరికీ వర్తించేదనియు, అపసవ్యము యతులకనియును, సవ్యాప సవ్యములు గురువునుండి దీక్షను పొందిన వారికనియును తెలియుచున్నది.

నమస్కారము విషయములోనూ పలు ప్రభేదములు గలవు. ఈ ప్రమాణమును గనుడి :

**"ప్రణామశ్చతుర్విధః । అష్టాంగః పంచాంగ స్త్ర్యంగ ఏకాంగశ్చ।"** (క్రియాసారము 14వ ఉపదేశము)

ప్రణామములు నాలుగు రకములనియును, అవి అష్టాంగ, పంచాంగ, త్ర్యంగ మరియు ఏకాంగములనియును చెప్పబడినవి. అష్టాంగములను నేలకు ఆనించి చేసెడి నమస్కారము అష్టాంగ ప్రణామము. రెండు మోకాళ్ళను, రెండు మోచేతులను మరియు ఫాలమును నేలకు ఆనించి ప్రణామమును చేయుట యనెడిది పంచాంగ ప్రణామము. మోకాళ్ళమీద కూర్చుండి, రెండు చేతులను శిరమునకు చేర్చి చేసెడి ప్రణామమైననూ పంచాంగ ప్రణామమే యగును. రెండు పాదముల మీద నిలుచుండి, రెండు చేతులను తలమీద నుంచి నమస్కరించెడి త్ర్యంగ నమస్కారమగును. కేవలము శిరమును వంచి నమస్కరించెడిది, యేకాంగ నమస్కారమగును.

ఇప్పుడు వివరించిన ప్రదిక్షణ నమస్కారములును, ఇష్టలింగపూజలకు వర్తించునా యనెడి సందేహము గల్గును. ఈ విధిన చేయుటకు సాధ్యమగునా? లేచి నిల్చుండి ప్రదక్షిణ చేయలేము. అష్టాంగ, పంచాంగ, మరియు త్ర్యంగ నమస్కారములు చేయు వీలు ఉండదు.

గ్రహించవలసిన విషయమేమనగా క్రియాసరకృతి కర్త, చెప్పెడివన్నియునూ దేవాలయ స్థాపిత శివలింగములకు వర్తించెడివేమో యనెడి సందేహము గల్గను.

ఇష్టలింగ పూజలో, పూజకుడు కుడిచేతి పిడికిలిని బిగించి, అంకుశముద్రను పట్టి, వామకర పీఠమునందలి యిష్టలింగము చుట్టూ సవ్యమార్గమున, అంకుశముద్రను వహించిన కుడిచేతిని త్రిప్పి, అంకుశముద్రలో బహిర్గతమయ్యెడి అంగుష్ఠముతో భ్రూమధ్యము తాకించుట చేత ప్రదక్షిణ నమస్కారములు సంపన్నములగును.

చివరకు యింటియందు గురు జంగములుండిన యెడల పాదోదక ప్రసాదములను తీసికొనవలెను. లేనియెడల లింగోదకలింగ ప్రసాదములను తీసికొనవచ్చును. కాని యిది తీసికొనెడి సందర్భమున తాను, గురుజంగముల పాదోదక ప్రసాదములనే తీసుకొనుచున్నానని మనమున భావించుకొని లింగోదక లింగ ప్రసాదములను భక్తితో సేవించవలెను.

ఈ విధముగా అన్నిపూజలు చేసిన పిదప చివరన శాంభవీ ముద్రతో శివుని నిరీక్షించి భావమునందున మనోవృత్తి ద్వారా భావ మరియు ప్రాణలింగములను అనుసంధానమును చేసికొని ఆపిదప యిష్టలింగమును సజ్జిక యందుంచవలెను. శివపూజ అయిన పిదప ధర్మగ్రంథముల స్వాధ్యాయము లేదా పారాయణమును చేయవలయును. వీరశైవులకు సిద్ధాంత శిఖామణియే ఏకైక ధర్మగ్రంథమైనందున దీని యొక్క పారాయణమును చేయుట సర్వ విధముల శ్రేయోదాయకము.

ఇష్టలింగపూజను దినమునకు ఎన్నిమార్లు చేయవలయుననెడి జిజ్ఞాస కలుగవచ్చును. ఈ విషయమును స్పష్టపరచెడు సూక్ష్మాంగమములోని యీ క్రింది ప్రమాణములను గమనించుడీ!

శ్లో॥ **ఏకకాలమ్ ద్వికాలమ్వాః త్రికాలమువాపి శాంకరి।**
**పూజయే న్నియతమ్ లింగమ్ ప్రాణలింగపరాయణః॥**

శ్లో॥ **ఏవం యహః కురుతే భక్త్యానిత్యమా ప్రాణసంచరాత్।**
**వీరశైవః సవిజ్ఞేయః సర్వశైవోత్తమోత్తమః॥** (సూక్ష్మతంత్రము 6:62–63)

పై ప్రమాణమునసరించి దినమునకొక్కసారియైనను యిష్టలింగ పూజను విధిగా ప్రాణమున్నంతవరకు చేయవలెను. అవకాశమున్నవాళ్ళు ద్వికాల, త్రికాలములందు చేసుకొనవచ్చును. అప్పుడే ఆతడు వీరశైవుడగును. ఈ విధముగా పూజలు చేసెడి వీరశైవుడు శైవులందరిలోను ఉత్తమోత్తముడని సూక్ష్మతంత్రము తెలియచేయుచున్నది.

మహరాష్ట్రకు చెందిన సంతాన శిరోమణియైన శ్రీ మన్మథస్వామివారు షట్కాల యిష్టలింగపూజను చేయుట మంచిదని సూచించిరి. వారి మరాఠి కృతి యందిట్లున్నది.

**పహలీపూజ అరుణోదయ కరి! ప్రహరి దిన ఆలియా, దూసరీ,"**
**దోనా ప్రహర తీతిసరి! చౌతీతిసరే పృహరీకే॥**
**పాంచవీ సాయంకాళీ కరీ! సహావీ పూజామధ్య రాత్రిః॥**
**కరావయా అళససకరీ! లింగపూజేసి॥**
**సహపూజా నఘడతీ జరీ। తరీ త్రికాళ లింగనిష్ఠాధరీ॥**
**త్రికాళమ్ నఘడతీ తరీ! తోపశు జడజీవ॥** (ప.ర. 3:34–35)

అరుణోదయమునుండి మూడు గంటలకొక్కసారి పగలు ఐదు మార్లు ఇష్టలింగముయొక్క పూజను చేయవలెను. చివరన రాత్రి శివలింగ పూజ చేయవలెనని శ్రీ మన్మథస్వామి తెలిపిరి. శ్రీనాథుని రచనలనుండి షట్కాల శివలింగ పూజ వివరములు తెలియదగును.

ఇదంతయును పరిశీలించిన పిదప, నిరుద్యోగులకు, నిర్వాపారులకు మాత్రమే యిష్టలింగ పూజ సాధ్యమగునని అపోహ కలుగవచ్చును. అయితే, ఆగమము మరియు సంతులయొక్క అభిప్రాయములను దృష్టిలో వుంచుకొని ఆలోచనను చేయవలసి యుండును.

మానవుడు తన ఉద్యోగ వ్యవహారములకే కాకుండ ఎంతో సమయమును ఆటలకో వినోదమునకో దేశవిదేశముల వార్తలను వినుటకో, తనకు సంబంధములేని విషయములలోను తలదూర్చుటవలన, కల్గెడి సమస్యలలో చిక్కుకొనుట వలనను, పరనింద, మరియు నిషిద్ధ కార్యములు చేయుటలలోను, మనోరంజన కార్యక్రమములోను వెచ్చించుచున్నాడు. ఇది సర్వానుభవసిద్ధమైన విషయమే! సమయమంత విలువైన వస్తువు మరేదియు లేదు. తన నిత్య జీవనమునకు అవసరమైన మేరకు సమయపాలనను చేసికొని మిగిలిన సమయమంతయును లింగపూజ, ధార్మిక లింగ సంబంధిత విషయములలో గడుపుట శ్రేయస్కరము. అప్పుడే మనుజుని జీవనము నందు సంస్కరణ కనపడును. లోకము యొక్క నియమము ప్రకారము 58 లేక 60 సం॥లకు మనుజునికి ప్రాపంచిక వ్యవహారములనుండి విశ్రాంతి యివ్వనగుచున్నది. తన ఉద్యోగ విరమణ పిదప మిగిలిన ఆయుర్దాయమును మంచి పనులకై వినియోగించుట శ్రేయస్కరము. **"వార్ధకే మునివృత్తినాం యోగేనాంతే తనుత్యాజామ్"** యనెడి రఘువంశములోని కాళిదాసు సూక్తి ప్రకారము, మనోవృత్తిని నిరోధించుకొని, మౌనమును పాటిస్తూ యోగాభ్యాసమునందు నిరతుడై చివరకు యోగియై దేహమును త్యజించవలెనని తెలియుచున్నది. ఈ క్రమమును మనము పాటించక జీవనము యొక్క చివరి క్షణము వరకు ఏదో వ్యాపకములో చిక్కుకొని అనంతమైన దుఃఖముల నాహ్వానించుకొనుచున్నాము.

మన జీవన సౌఖ్యము కొరకు కూడు, గూడు, గుడ్డ ఎటుల నిత్యవసరములో వాటికంటెను హెచ్చుగా శివపూజా ధ్యానాదులు అవశ్యకములని గ్రహించగలరు. ఈ సందర్భమున మహాత్మాగాంధీ గారి అభిప్రాయము గమనించదగియున్నది. భోజనము లేకుండ ఒకదినముండవచ్చును గాని,

ప్రార్థన లేకుండగ, ఒక నిమిషమైనను వుండజాలనని తన ఆత్మకథలో తెలియజేసిరి. అయితే, మనకు ప్రార్థన పూజాదులుండుకున్నను చింతయుండదు. ఛాయా, నాష్టలు మొదలు గావలెను. మన జీవనము అదఃపతనము గాకుండునే? వీటన్నింటిని పర్యాలోచనము చేసికొని మనమున ఉద్యోగ వ్యవహారములకు లోపమురాని విధిన సమయమును సాధించుకొని యిష్టలింగార్చన, జపము, ధ్యానాదులు సల్పి, జీవనమును పావనము చేసికొనవలెను.

## శరణుల దృష్టియందు యిష్టలింగ పూజ :

వీరశైవ శరణులు యిష్టలింగము నందు చాలా నిష్ఠ గల ప్రాణులైయుండిరి. వారి పూజలో వారికి బడలిక కలిగెడిది కాదు. వారమని ఎరుగ, దినమని ఎరుగ ఏమని ఎరుగనయ్యా! చీకటి అని ఎరుగ పగలని ఎరుగ ఏమని ఎరుగనయ్యా! నిన్ను పూజించి నను మరచితినయ్యా, అని బసవేశ్వరులవారు తెలిపిరి. ఈ వచనములందు వారి లింగపూజ నిష్ఠ బయలగుచున్నది. యిదే సమరస పూజ ఈ పూజను ఎల్లప్పుడు చేయాలనే కోరిక వారికుండెను. అయితే బిజ్జలుని మంత్రిగా యుండుటచేత వారి అత్యధిక సమయము రాజకీయములలో గడుపుట జరుగుచుండెను. అది తప్పనిసరిగా అందుకే అతనికి బయటి పనులనిన విసుగువచ్చుచుండెను. లింగపూజకై సమయము చిక్కనందున బాధకు గురియై ఆ బాధను వెలిబుచ్చెడి ఈ క్రింది వచనమును గమనించుడు.

**అంగ్యెయొళగణ లింగవనోడుత్త**
**కంగళుకడిగో వరివుత్త**
**సురియుత్త ఏందిప్పెనో, నోటలేప్రాణవాగి**
**ఏందిప్పెనో? కూటవేప్రాణవాగి ఏంది ప్పేనో**
**ఎన్న అంగలి కారద సంగవళిదు**
**కూడల సంగయ్య లింగయ్య, లింగ లింగ లింగవిన్నెత్త**

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**అరచేతిలోని లింగము జూచుచు**
**కన్నులు కనుగడ పొంగుచు కురియ చెప్పెడుండెదనో**
**చూడి యే ప్రాణమై యెప్పుడుండెదవో,**
**అంగవికారపు సంగమడగి**
**కూడల సంగమదేవయ్యా, లింగము లింగమనుచు**

లౌకిక వ్యవహారము బహువిచిత్రమైనది. వృద్ధిలేనిదే సమాధానముండదు. వృద్ధిగల్గిన తృప్తియుండదు. అటులనే ప్రతియొక్కరికినీ లౌకిక వ్యవహారముల యెడల యెప్పుడో ఒకప్పుడు వేసరము రానేవచ్చును. అది వచ్చినప్పుడు, ఆధ్యాత్మిక పారమార్ధికములను రెంటిని వెంబడించికొని పోవలసియుండును. "అట్టివాడే జాణ"యని శ్రీ నిజగుణులవారు సెలవిచ్చిరి. శరణులందరూ లౌకిక పారమార్ధికములను రెంటిని కూడికొని నడచిరి.

లింగపూజలు చేసెడివాడు దురాచారి కాకుండగ నుండవలెనని శ్రీ షణ్ముఖస్వామి వారు తెలిపిరి. వీరి వచనమును గనుడి :

**మొట్టి మొట్టి పత్రి పుష్పవ తందు వటవట లింగవ**
**పూజిసదేను? తనుమనద కెట్టతనవ హింగదన్నక్కర**
**హుసి కళవు పరదార వ్యాపారదల్లి హరదాడువ**
**మరుళు బుద్ధియ దూరవాగిర్పను నోడా, నమ్మ అఖండేశ్వరను.**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది.

**మూటెడు మూటెడు పత్రి పుష్పముల తెచ్చి**
**వటవట లింగమును పూజించిననేమి?**
**తను మనముల చెడ్డతనము వీడని దనుక**
**హుళుక్కి కల్లరి పరదార వ్యాపారమున పారాడు మరులబుద్ధి**
**దురాచారులకు దూరమైయుండు మా అఖండేశ్వరుడు.**

ఇది యిట్టులుండగా, గుణావగుణములు లెక్కించకయే లింగపూజలో నిమగ్నులైన వారికి సద్గతి లభించు ననెడి మరొక యభిప్రాయము కలదు. కనుడి.

**పరుషద పర్వత దల్లి కబ్బిణ ఉంటే అయ్య!**
**అష్టవిధార్చనె షోడషోపచారవ మాడు వాతంగె అవగుణ ఉంటె అయ్యా!**
**ఇద కారణవాగి, భక్తకాయ మమకారవయ్యా! కూడల చెన్న సంగమ దేవా!**

దీని తెలుగు రూపమును గనుడి!

**పరుషపు పర్వత మందున యినుము గల్గునా అయ్యా!**
**అష్టవిధార్చన షోడషోపచారములు చేయువానికి**
**అవగుణము గల్గునే అయ్యా!**
**ఇదే కారణమై, భక్త కాయము మమ కారమయ్యా కూడల చెన్న సంగమ దేవా!**

ఈ శ్రీ చెన్న బసవన్న వారి ప్రకారము, దోష భూయిష్టుడైన వాడునూ, శివపూజ చేయుటచే సద్గుణరాశిగా మారునని తెలియుచున్నది.

"సజ్జనురాలనై మజ్జనమున కెచ్చెద. శాంతురాలనై పూజను చేసెద, సమరతితో నిన్ను పొగడెద" అనెడి అక్కమహాదేవి తీరు అందరకబ్బునే? హీనుడైన వాడు, లింగపూజను చేస్తూ చేస్తూ క్రమ క్రమముగా తన హీనత్వమును వీడి సద్గుణ సంపన్నుడగుచున్నాడు.

మనన, మరపులనెడివి మానవునికి సహజముగానే యుండును. ఏదైననూ మరచి పోవచ్చును కాని యిష్టలింగార్చనను మరువరాదు. "మరువక పూజించు మారామనాథుని" యని దేవర దాసి మార్యుల వారు తన సందేశమునిచ్చిరి. ఆసక్తి లేని యంశములను, అనురాగము లేని వ్యక్తులను మరచి పోవుట సహజమే? కాని పరస్త్రీని కన్నిడి చూసి, ఆమె అందచందాలను తలచికొనుచు కాలము గడిపెడి వారెందరో కలరు. సతుల సంగమమునకైననూ, సరియైన తిండి కొరకైనను పరువు లిడు మనిషికి, వీటియెడలయెంతో ప్రేమను గల్గి యుండును. ప్రఖ్యాతిని గాంచిన యొక భక్తుని కథ యిట్టులున్నది. పూర్వపు దశలో కామదేవునిభక్తుడై కామకేళిలో మునిగి తేలుటకై యొక భోగభామిని కడకు వెడలు చుండెను. నిత్యానుష్ఠానమునకు దూరమై రేయింబవళ్ళను ఆమె చెంతనే యుండెడి వాడు. అతని స్థితినిగాంచి ఆమెకు అతని మీద జాలి గల్గెను. అతనిలో భగవద్భక్తి పెంచి, వాని నుద్ధరించనెంచెను. ఆమె మాటల నతడు పెడ వెవిన పెట్టెను. "కామ దేవ, కామదేవ" యని యన జొచ్చెను. అప్పుడామె తన మీద చూపించెడి ప్రేమలో సగభాగమైననూ వామ దేవుని మీద నిలుపుమనెను. వాడు, వామ దేవుడు వామదేవుడు వామదేవుడు, దేవుడు కాదు, కామ దేవుడే ఆరాధ్యుడనెను. వామ దేవ నామోచ్చారణ ఫలముగా వానిలో శివభక్తి జనించి, శివుని మీద యనురాగము ను పెంచికొని గొప్ప భక్తుడయ్యెను.

ప్రతి యొక్కడు శివుని మీద ప్రేమను పెంచికొనవలెను. ఆ విధిన జేసినచో యిష్టలింగార్చనను మరచి పోవుట యనెడిది సంభవించునే? శ్రీ దాసిమార్యుల వాక్కులోని మర్మమిదియే.

శ్రీ ప్రభు దేవుల వారు అంతర్లింగపూజకై ఎక్కువగా మొగ్గు చూపినట్టు కనిపించును. భక్తి లేకుండగను, అంతర్లింగాను సంధానమునకై ప్రయత్నించకయూ, బాహ్యలింగమునకై ప్రాముఖ్యత నిచ్చెడి ధోరణులను వీరు నిరసించిరి. వీరి యీ క్రింది వచనమును గనుడి :

**హొట్టెయమేలె కట్టోరిగద మూటెయకట్టిదరేన?**
**హసివుహోహుదే? అంగదమేలెలింగ భక్తనాగ బల్లనే?**
**స్వాయతవాదరేమ ఇల్లుకల్లు మెళెయమేలె సిక్కిదడె**
**ఆ కల్లు లింగవె? ఇట్టాత్ గురువే ఇంతప్ప వర కండడె నాచువెనయ్యా గుహేశ్వరా!**

ఈ వచనను తెలుగు రూపమును గనుడి

**పొట్టమీద చద్దన్నపు మూట కట్టిననేమి? ఆకలి పోవునే**
**అంగము మీద లింగము కల్గిననేమి, భక్తుడు కాగల్గునే?**
**పెట్టిన రాయి పొద మీద చిక్కినచో ఆ రాయి లింగమా?**
**పెట్టినవాడు గురువా? ఇంతటి వారిని గనిన సిగ్గుగునయ్యా! గుహేశ్వరా!**

ఈ వచనము కూడ, అదే విధిన నున్నది. కనుడి:

**పృథ్వి హుట్టిదశిలె, రాళ్ళు కొట్టెడి వానికి పుట్టిన మూరుతి**
**మంత్రక్కెలింగవాయిత్తల్లా! ఈ మూవరింగె హుట్టిద మగన లింగవెందు**
**కైవిడివ అచ్చ వ్రతకేడిగుళనేనెంతెగుహేశ్వరా!**

తెలుగు రూపమును గనుడి;

**పృథ్వికి పుట్టిన శిల, రాతిపనివానికి పుట్టిన మూరుతి మంత్రమునకు లింగమైనది కదా!**
**ఈ ముగ్గురికి కొడుకును లింగమని చేపట్టిన విభజన వ్రతము చెడినవారి నేనేమందు గుహేశ్వరా!**

ప్రాథమిక పాఠశాలలో నేర్చికొనిన పరిజ్ఞానము నాధారముగా గొని యున్న విద్య నభ్యసించిన వానికి మాత్రమే విద్యాప్రాప్తి గల్గును. అతడు పండితుడగును. ప్రాథమిక స్థాయిని వీడజాలక, అక్కడనే కాలమును వెలిబుచ్చెడి విద్యార్థిసాధించెడి గణనీయముగా నుండునే, అదే విధిన, యిష్టపూజను చేసి, దాని నాధారముగా గొని, అంతర్లింగాను సంధానమునకై కృషి చేయుటయే సాధకుని కర్తవ్యమైయున్నది.ఇదియే అల్లమప్రభుదేవుల వారి వాక్కులలో నిమిడి యున్న భావమని గ్రహింపదగును.

అంతరంగములోని లింగము గూర్చిన భావము క్రమముగా పెరుగును. ఒక స్థితికి చేరిన పిదప సాధకుడు సాధన నింకా పెంచికొని, చివరికి కొన్ని ఉపచారముల చేసి విషయములను మరచిపోవును. కారణమేమనగా, బాహ్య పూజ చేయుచున్ననూ, మనోవృత్తి అంతరంగమువైపు మరలి యుండును. ఈ విషయమును వివరించెడి, ప్రభుదేవుల వారి వచనమును గనుడి.

**అగ్ఘవణియ తందు మజ్జనవమరై దవన,**
**పుష్పవ తందు పూజయ మరెదవన,**
**జాగరవ తందు అర్పితవ మరెదవన,**
**లింగవ కుడు తన్న మరెదస్య మహాఘన బళకొండిత్తు, గుహేశ్వరా!**

అగ్ఘవణిని తెచ్చి మజ్జనము మరచిన వాని, పుష్పముల తెచ్చి పూజను మరచిన వాని, జగ్గిని తెచ్చి యర్పిత మును మరచినవాని, లింగమును గని తనను తాను మరచినవాని మహాఘనము లోగొనినది గుహేశ్వరా!

ఈ విధముగ ప్రభుదేవుల వారు అంతరంగము అలివడిన సాధకుని యొక్క స్థితిని ఏంతో సుందరముగా చిత్రీకరించిరి.

ఒక వ్యక్తి రెండు బొమ్మలను తీసుకొని సముద్రనాదుని పూజకు వెళ్ళెను. అందులో ఒక బొమ్మ రాయితో ను మరొకటి లవణముతోను చేయబడి వుండెను. రాయి బొమ్మ మరియు లవణముపు బొమ్మలను సముద్రుని పూజించుటకై సకలోపచారములను తీసుకొని సముద్రము కడగు చేరెనవి. రెండును సముద్రములోనికి దిగి పూజను చేయుటను ప్రారంభించినవి. పూజ ముగిసిన పిదప రెండు బొమ్మలు ధ్యానము చేయుట ప్రారంభించినవి. రాతి బొమ్మ కనులు తెరచి చూచెను. దానికి ఎంతో ఆశ్చర్యము గలిగెను. తన మిత్రుడైన లవణము బొమ్మ అక్కడ కనబడ లేదు, మిత్రుడు ఏమైనాడని ఆరాటపడెను. దానికి పట్టరానంత దుఃఖము వచ్చెను. దుఃఖమును ఆపుకొనలేక పోయెను. బిగ్గరగా ఏడ్చెను.

యిక్కడ గ్రహించవలసిన విషయమేమనగా మూలస్వభావమైన సముద్రములో లవణము కలసిపోయి అంతర్ధానమయ్యెను, సముద్ర నీటి నుండియె వుప్పు తయారు చేయబడుచున్నదని ప్రత్యేకముగా చెప్పనవసరము లేదు.యిదే విధిన యిష్టలింగార్చనను చేసెడి వ్యక్తి తన మూలస్వభావమైన శివతత్వములో క్షణ కాలమైననను, లీనమగుటకు కృషి చేయవలెను. యీ విధముగా చేసిన యెడల యిష్టలింగార్చన చేసెడి వ్యక్తి అంతర్లింగానుసంధానమును పొంది పరమశివుని సన్నిధానము పొందగలడు తద్వారా శివుని కరుణను సాధించగలడు.

యోగులకు బాహ్యలింగ పూజకంటెను అంతర్లింగాను సంధానము యెడలనే యెక్కువ అభిరుచి యుండునని తెలిపెడి శ్రీ భగవత్పాదుల వారి యీ యుపదేశమును గనుడి :

**శ్లో॥ వైరాగ్య జ్ఞానయుక్తానా యోగినాస్థిర చేతసాంచి।**
**అంతర్లింగాను సంధానేరుచి ర్బాహ్యేన జాయతే॥**

జ్ఞాన వైరాగ్య సంపన్నులకును, యోగులకును, సుస్థిరమైన మనస్సు గల వారికినీ బాహ్యలింగాను సంధానము కంటె అంతర్లింగాను సంధానమే యెక్కువ రుచికరముగా దోచునని శ్లోకములోని భావము. ఈ విధిన యోగులైన ప్రభుదేవులవారి భావములు, ఆచార్యుల వారు నిర్దేశించిన మార్గమున కనుగుణముగనేయున్నవని తెలియుచున్నది.

ప్రభుదేవులవారు బాహ్యలింగ పూజను వీడవలదని చెప్పిన నుదువు లెన్నియో గలవు. అనుభవమంటపమున నొక సంఘటన ఘటిల్లెను. నులియ చందయ్య యనెడి శరణుడు తన లింగమును తీసివేసెను. లింగమును తీసి వేయుటలోని యౌచిత్యమును కన్గొనుటకై మాచయ్యగారు చందయ్యగారిని వెంబడించికొని యనుభవ మంటపమునకు వచ్చియుండెను. ఆ సందర్భమున ప్రభుదేవుల వారు నుడువిన నుడువులివి.

**"అంగమున్నంత వరకు లింగముండ వలెను**
**లింగమున్నంత వరక నర్పణాధుల చేయవలెను"**

**"పట్టిన వ్రత నియమమముల విడువక పాటించవలెను"**

**"కళ్ళు చూడకుండగ నుండిన యెడల మనస్సు మననము చేయగల్గునే?"**

**అంగపు లింగమే మనస్సుకు లింగము, మనో లింగమే భావలింగము–**
**భావ లింగమే జంగమ దాసోహము.**

"పరుషము నైననూ ఒక కడ నుంచవలసినదే! రత్న విశేషమైననూ కుందనమున బంధించి సంధించవలెను.
లింగమును పట్టిన యెడలనూ పూజించెడి యంగము ఉండవలెను గదా! గుహేశ్వరా!

ఈ విధముగా పలు దృష్టాంతముల నొసంగి "ఓ చందయ్యా! అంతర్లింగము నెరిగిన వాని నైననూ బాహ్యలింగమును వీడలేదు కదా! యని తమనే ఉదాహరణగా నిచ్చినారు.

ఈ సంఘటన గరించి గుర్తెరిగిన వారికి అల్లమ ప్రభువల వారి యభిప్రాయములు స్పష్టముగా నవగత మగును.

ఆచార్యుల వారి వాక్కుల వలననూ, శరణుల నుడువుల వలననూ తెలిసిన విషయమేమనగా యెట్టి సందర్భములోను వీరశైవుడు యిష్టలింగమును ధరించి మరువక పూజించవలెను. అప్పుడే యతనికి యైహిక మరియు పారలౌకిక ప్రగతి కన్పట్టును.

## యిష్టలింగ పూజ వలన శారీరక మరియు మానసిక ఆరోగ్యము :

యీ తెరగున యిష్టలింగపూజ వలన ఆధ్యాత్మిక ప్రగతితో పాటుగ మనిషికి శారీరక మరియు మానసిక ఆరోగ్యము లభించును, తద్వారా ఆనందమయమైన జీవితమును పొందగలదు.

**'ధారయేత్ సతతం రత్నం, సిద్ధమంత్రమహోషధీః'** అనెడి ఆయుర్వేద సూక్తి ఒకటి కలదు.

అష్టాంగ హృదయము అనెడి గ్రంథములో సూత్రస్థానము యొక్క దినచర్యాధ్యాయములో యీ ప్రమాణము తెలుపబడినది. మనుజుడు ఆరోగ్య లాభము కొరకు, మణి మంత్రము మరియు ఔషధములను వుపయోగించవలెనని చెప్పబడినది. వాటిలో మణిని శరీరములోని ఏదో ఒక భాగమున ధరింతురని తెలిసికొనవలెను. సూర్యకాంత, చంద్రకాంత మరియు స్పటిక ములును, శ్రీశైల పర్వతమునందు వుత్కృష్టమైన శిలాఖండములు రత్నములుగనె పరిగణింపబడుచున్నవి. వీరశైవుల యొక్క యిష్టలింగము వీటిలోని ఏదో ఒక దాని వలన తయారు చేయబడుచున్నది అందుచేత భౌతిక దృష్టితో చూసిన యెడల యిష్టలింగము ఒకదివ్యమైన రత్నమే అని ఎరుంగవలెను.

యిష్టలింగము మీద లేపనము చేయుటకై నిర్మింపబడిన కంతియు భల్లాతకి (జీడి) చేత తయారు చేయబడుచున్నది. "అయస్కాంత భల్లాతకీ ఇత్యేనాని రసాయనాని" అనెడి వైద్య శతశ్లోకిలోని ప్రమాణము ప్రకారము అయస్కాంతము మరియు జీడి నూనెలు రసాయనౌషధములని ప్రతిపాదింపబడినవి.

జీడి నూనెను శుద్ధము చేసి శూల, మూల వ్యాధి, అతి సారము మొదలగు రోగములకు ఉపయోగించెడి విధానము గలదని, గుణ భూషణ నిఘంటువు వలన తెలియుచున్నది. చరక సంహితలో దీని నుపయోగించి పది విధములైన యౌషధములు తయారు చేయవచ్చునని తెలియజెప్పబడినది.

ఇష్టలింగ పూజలో నుపయోగింపబడెడి పంచామృత మరియు జలాభిషేకముల ద్వారా శుద్ధి చేయబడెడి జీడి నూనె ఔషధగుణమును పెంపొందించుకొనుచున్నది. ఇష్టలింగమునకు ప్రోక్షణ చేయుట, లింగోదకమును ప్రాశన చేయుట ఇత్యాదుల వలన, వీరశైవుని శారీరక రోగములు సహజముగానే నివృత్తియగును. ఉత్తమారోగ్య ప్రాప్తి యగును.

ఇక మంత్రము యొక్క విషయమును గూర్చి చెప్పవలెనని పంచాక్షరీ మహామంత్రము శ్రేష్ఠతరమైనదని తెలియజెప్పబడినది. ఏడు కోట్ల మంత్రములలో నిది యుత్తమోత్తమమైనది. సకలార్థ సిద్ధిని కలుగజేయు మంత్రమిది. వీరశైవుడు, యిష్టలింగ పూజా సందర్భమున, పంచాక్షరినుపయోగించికొని లబ్ధిని పొందుచున్నాడనెడిది, లోకమెరిగిన సత్యమే. దీని వలన మనస్సు నిర్మల మగును. మానసిక రోగములు దూరమగును.

ఈ విధిన యిష్టలింగధారణ మరియు పూజల సందర్భమున, వీరశైవుడు మణి, మరియు మంత్రములను ధరించి, ఔషధమును సేవించుచున్నాడు. ఇవి యన్నియును ఆయుర్వేద శాస్త్రము విధించిన సూత్రముల కనుగుణముగా యున్నవి. లౌకిక దృష్టితో చూసిననూ, ఇష్టలింగ ధారణము మరియు పూజనములు ఆరోగ్య ప్రదాయకములని స్పష్టపడుచున్నది. ఈ కారణమున, ప్రతి వీరశైవుడు, పూర్ణారోగ్య ప్రాప్తికై పూర్వోక్త విధిన యిష్టలింగ ధారణ మరియు పూజలను ప్రతి నిత్యమును విధిగా చేయవలెను.

ఇష్టలింగము యొక్క పీఠము గురించిన సందేహము గల్గెడి అవకాశము గలదు. శైవములోని కొన్ని వర్గములకు చెందిన వారు లింగమును బాహ్యపీఠమున నుంచి, పూజాదుల నొనర్తురు.దీనిని గాంచిన వీరశైవులు, తమ యిష్ట లింగములను పీఠమున నుంచి పూజించెడి సంకల్పమును పొందెడి యవకాశము కలదు. అది విహితము కాదు. అందుకే, శ్రీ భగవత్పాదుల వారు "బాహ్య పీఠార్చనాత్ కరపీఠార్చనం వరం" అని యుపదేశించిరి. బాహ్యపీఠార్చనము కంటెను, కరపీఠార్చననే యుత్తమమైనదని, యీ ఉపదేశము సూచించినది.

## దేవతలు, మునులు లింగధారులు :

లింగధారణ మరియు పూజనము దేవతలకైననూ విహితమైనదని శ్రీ భగవత్పాదుల వారు ఆదేశించిరి. "బ్రహ్మ విష్ణాదయోః" అనుచు వివరముల నిచ్చిరి. శ్రీవారు చెప్పినయటులే, నేటికిని విఠలేశ్వరుని కిని, కొల్లాపురపు మహాలక్ష్మికిని, తుల్జాపురపు అంబా భవానికిని మస్తకము నందున లింగము కనిపించుచున్నవి. విఠలేశ్వరుడు శ్రీ మహావిష్ణువు అవతారమనియును, మహాలక్ష్మి మరియు అంబా భవానులు ప్రముఖమైన శక్తులని గుర్తెరుంగవలెను.

లింగాష్టకములోని, యీ క్రింది ప్రమాణములను గనుడి:

**"బ్రహ్మ మురారి సురార్చిత లింగం**
**దేవముని ప్రవరార్చిత లింగం**
**సిద్ధసురాసుర వందిత లింగం**
**దేవగణార్చిత సేవిత లింగం**
**సురగురు సురవర పూజిత లింగం'**

ఈ బహుప్రాచీనమైన ప్రమాణము వలన స్పష్టమయ్యెడి దేమనగా, శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు తెలిపిన యటులే దేవత లందరూ శివారాధకులే. మునులు శివుని పూజించి తరించిరి. సిద్ధులును శివుని పూజించి ధన్యతను బడసిరి. అసురులు శివారాధకులై యిష్టార్థ సిద్ధులని బడసిరనెడిది తెలియజెప్పెడి పౌరాణిక గాథలెన్నియోగలవు.

**ఇంద్రనీలమయం లింగం విష్ణునాపూజితం సదా।**
**పద్మరాగమయం శుక్రో హైమం విశావసః సుతః॥**
**విశ్వేదేవాస్తథా రౌప్యం వసవః కాంతికం శుభం।**
**లక్ష్మీ వృక్ష మయం లక్ష్మీర్గుహోవై గోమయాత్మకం।**
**సరస్వతీచ రత్నేన కృతం రుద్రస్య వాగ్భవా।**
**దుర్గాహైమం మహాదేవం సవేదికమనుత్తమం॥**
**బహునాత్ర కిముక్తేన చరాచరమిదం జగత్।**
**శివలింగం సమభ్యర్చ స్థితమత్ర న సంశయః॥**
(లింగపురాణము, పూర్వభాగము అధ్యాయము 74, శ్లోకము 2-12)

ఈ పురాణోక్తి ననుసరించి, విష్ణువు ఇత్యాది దేవతలును, లక్ష్మి యిత్యాది శక్తులును లింగములను పూజించిరని తెలియుచున్నది. పూజించిన లింగములను నుత్తమాంగమున ధరించెడి వారనియు తెలియుచున్నది.

లింగమును మస్తకము నందున ధరించెడి సాంప్రదాయము గలదని తెలిపెడి లింగపురాణములోని యీ క్రింది ప్రమాణమును గనుడి.

**కశ్య పాత్రి భరద్వాజ గౌతమాద్యా మహర్షయః**
**ధారయంతి సదాలింగముత్తమాంగే విశేషత॥** (లింగపురాణము)

ఈ విధముగా దేవ దానవ ముని గణాదులు శివుని మీద యెంతో భక్తిని పెంచికొని శివ పూజానురక్తులై, లింగధారణాసోక్తులై తమతమ జీవితములను ధన్యము చేసికొనిరి. మానవులమైన మనము, వీరి నుండి ప్రేరణను పొంది లింగ ధారణను విధిగా పాటించవలెను. మస్తకమున ధరించుటకు సాధ్యము గాని యెడల, బొడ్డుకు పైభాగమున యొక్కడైననూ లింగమును ధరించి, విద్యుక్త విధిన ప్రతిదినము పూజించి

యుపచారాదులను చేసి లింగోదకము మరియు లింగప్రసాదములను భక్తితో సేవించి ఆరోగ్యభాగ్యమును పొంది ధన్యులము కావలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 18-08-1990
స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము**
**షోలాపూర్**

## విశేషప్రదీపిక :

ఇష్టలింగార్చన విధివిధానమును శ్రీ విద్యా వాచస్పతులును, శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాదీశ్వరులగు శ్రీ చంద్రశేఖర శివాచార్యుల వారు సవిస్తారముగా తెలిపి భక్తా మహేశ్వరులను బహువిధములుగా ధన్యులను జేసిరి. మానవులే కాదు దేవదానవ ఋష్యాదులును లింగధారులై, లింగ పూజకులై తరించిరని తగిన విధిన ప్రమాణముల జూపిరి. లింగ ధారణ యెడల నాసక్తినిపెంచికొనజాలక నటునిటు నూగిసలాడెడి వారలీ ఉద్బోధనుండి యుచిత రీతిన లబ్ధిని పొందవలెను.

లింగధారణ యావశ్యమైనదని యింతకు క్రితమే తెలిసికొని యుంటిమి. పిండ స్థలము నుండి క్రమక్రమముగా భక్త స్థలమునకు విచ్చేసి భక్తుడైన వానికి శ్రద్ధను పెంపొందించి కొనవలసిన యవసరము కలదు. పూర్వాశ్రయ వాసనలు వీడజాలని వారికి శ్రద్ధ యలవడదు. అచ్చటి వారి సాంగత్యము వలన కొన్ని సందేహములు గలుగ వచ్చును. బ్రాహ్మణ వర్ణమునకు చెందిన మల్లికార్జున పండితుడు వీరశైవ దీక్షను స్వీకరించి స్వీయ సాధన కుపక్రమించిన దశలో పూర్వాశ్రమ స్థలమునకు చెందిన బ్రాహ్మణుడీ విధిన ప్రశ్నించెను.

**"పండితయ్యా! నీవు పౌరాణికుడవు**
**సద్విజోత్తముడవు, సచ్చరిత్రుడవు**
**విద్వాంసుడవు వేదవిదుడవట్లయ్యు**
**భూతియు రుద్రాక్షములు దాల్చనగునె**
**నీతియె లింగసన్నిహితమై యున్కి?**
**... ... ... ... ... ... ... ...**
**హరి విరించ్యాది సురాసురముని ని**
**కరము దాల్చిన వారు గలరె మున్నాది?**

ఇట్టి ప్రశ్నల వలన యిష్టలింగ ధారణ ఆర్యాచీనమేమో యనెడి సందేహము గలుగ వచ్చును. ప్రాచీన యాచరణలే ప్రామాణికమై నిలుచును. వాటి యెడల శ్రద్ధను పెంచికొనుట సులభసాధ్యమే. యజ్ఞోపవీత ధారణ నుదాహరణగా గైకొనిన యెడల, నయ్యది యత్యంత ప్రాచీనాచారమనియు దేవతలు యజ్ఞోపవీత ధారణ చేసెడి వారని తెలిపెడి వారిని గాంచగలము. అదే విధము లింగధారణ ప్రాచీనత్వమును నెరుక బరచవలసిన యవశ్యకత గలదు.తన్నిమిత్తమై శ్రీ భగవత్పాదులవారు నీ యుపదేశమును నిచ్చిరి. బ్రహ్మ విష్ణ్వాది దేవతలు, లక్ష్మీదుర్గాది శక్తులు, మునులు లింగధారులై యున్నారని తెలియజేసిరి. శ్రీ భగవత్పాదుల వారి భావమును శ్రీ సోమనాధుడు విస్తృత పరిచెను. సోమనాధ భాష్యములోను, పండితారాధ్య చరిత్రలోను సవివరమైన చర్చగలదు. చతుర్వేదసారములో సంక్షిప్తముగా తెలియజేసేను. పండితారాధ్య చరిత్రలోనివగు నీక్రింది వాటిని గనుడి :

**"నజవిష్ణు ముఖ్యులు నాదిశక్తులును**
**మునులునయ్యె లింగముల లింగమూర్తి**
**ననయంబు ధరియించి యర్చింతురనిన**
**జగతి బద్మపురాణ సంహితలందె**

**సగు శంభు రాఘవ సంవాదములను**
**జలజజ హరి ముఖ్య సకల దేవతలు**
**నలి మస్తకే ధారణం శుభమ్మనగ**
**... ... ... ... ... ...**
**నలి లలాటే ధారణం ప్రశస్త మనగ**
**నలికాగ్రముల దాల్తు రత్యంత భక్తి**
**దగ యథా లక్ష్మ్యాదృతం పురా' యనగ**
**జగతి లక్ష్మీ ముఖ్యశక్తులన్నియును** (పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్రకరణము)

దేవతలు లింగధారులు అని తెలిపెడి ప్రమాణము లెన్నియోగలవు. వామన పురాణము, పద్మపురాణము, లింగపురాణములలో వీటిని గాంచగలము. శ్రీ విద్యావాచస్పతులవారు నీ ప్రమాణములలోని కొన్నింటిని చూపిరి. చారిత్రాత్మక ప్రమాణములను కూడ చూపిరి. ప్రఖ్యాత దేవాలయములో దేవతామూర్తులు లింగధారణ గల్గియున్నారని తెలిపిరి. శ్రీవారి విధిననే సోమనాథుడును చారిత్రాత్మక ప్రమాణములను చూపి యుండెను. గనుడి.

**సీ॥ ఉపమన్యు శిష్యుడై యోగిహరి యింద్రనీ**
**లింపు లింగంబు గొల్వడె ధరించి**
**వెయ్యేసి తామరవిరుల బూన్చుచు**
**చక్రమర్థించి కొనడె జనార్ధనుండు**
**నటు 'శిరోమే ధారయన్తి "యనన్విష్ణు**
**శిరమున సద్విధి ధరించె**
**విఠలేశ్వర శిరోవేదికా స్థిరలింగ**
**మూర్తియుండిన యట్టి వార్త వినరె**

**యిట్టి శ్రుతులు 'రుద్రయత్తేజ'మని చారు**
**చిత్రమన నభీష్ట సిద్ధులేశు**
**కరుణబడసి గాదె హరి దేని నెరుగరే**
**బ్రహ్మజనులు శ్రుతుల బసవ లింగ।** (చతుర్వేద సారము, ప. 102)

తాత్విక పరముగా చూచిన యెడల దేవతలు కూడా జీవులే. కర్మపాశము చేత బంధితులై నానావిధములగు సుఖ దుఃఖముల ననుభవించెడి వారే. నిత్యనైమిత్తిక ప్రాయశ్చిత్త కర్మలను చేసెడివారే. విధి నిషేదాతీత వర్తనులు కారు. చంద్రుడు నిషిద్ధ కర్మ నాచరించి తత్ఫలమును గుడిచెనని 'తారాశశాంకోదంతము' తెలుపుచున్నది. గురుపత్నితో శయనించిన కారణమున శాపమునకు గురియయ్యెనని పురాణముల లోన గలదు. భృగుశాప వశమున విష్ణువు దశావతారముల నెత్తెనని తెలుపబడినది. స్త్రీ హత్య యనెడి నిషిద్ధ చర్య చేసినందులకీ శాపము వచ్చెనని తెలుపుదురు. 'సత్యంవద' యనెడిది శాస్త్ర నియమము. అసత్యమును పలుకుట నిషిద్ధ క్రియ. అద్దానిని జేసి బ్రహ్మ శివుని చేత 'దండిపబడెనని' కాలభైరవలీల' తెలుపుచున్నది.

ఈ విషయములన్నియును పిండ స్థలమున వివరింపబడినవి. శ్రీ భగవత్పాదులవారా స్థలమున ప్రదానముచేసిన యీ క్రింది యుపదేశమును గనుడి :

**శ్లో॥ కించిత్ కర్తాచ కించిద్జ్ఞోబద్ధోఽనాది శరీరవాన్।**
**అవిద్యా మోహితా జీవా బ్రహ్మైక్య జ్ఞాన వర్జితాః॥**
**పరిభ్రమన్తి సంసారే నిజకర్మాను సోరతః।**
**దేవతిర్యఙ్మనుష్యాది నానాయోని విదతః॥**

దేవతలు నదితికి పుట్టిరనియును పురాణములలోన చెప్పబడినది. హరి "అదితికి నవరూజుండన బుట్టి యింద్రున కనుజుండగాడే" యని చెప్పి (చత్వేద సారము ప.106), "వెండి హరి యయోనిజుండె యజాతుడె"యని (ప.104) ప్రశ్నించిన సోమనాథుడు నీ విషయమునే విస్తరించిన వాడయ్యెను. దేవతలు అజాతులుకారు. వారికిని స్థూల శరీరము లుండుననియును, శస్త్రాదులచే వారి అంగము ఛేద్యము దక్ష యజ్ఞోదంతము వలన తెలియుచున్నది. అమృతమును త్రాగి అమరులైరి యని యందురు కాని వారికిని చావు గల్గినదని తెలిపెడి కథలుగలవు. మన్మథుని వృత్తాంతము దీనికొక యుదాహరణగా నిల్చును.

దేవతలు కామ్యకర్మలను సేతురుని పురాణములలో చెప్పబడినది. వారు కోరికలు తీర్చుకొనుటకై యజ్ఞాదులను చేయుదురనెడి కథలు గలవు. వీరు వివిధ పదవులనాశించి యిష్టార్థఫల సిద్ధిని గల్గించెడి యిష్టలింగమును ధరించి ఆయా పదవులను పొందిరని పండితారాధ్య చరిత్ర చెప్పుచున్నది.

ఇచ్చట గ్రహించ వలసిన దేమనగా నిష్టలింగము ధరించుట వలన ననిష్టములు దూరమగును. ఇష్టార్థసిద్ధి గల్గును. ఈ ఫలములు పొందుటకై దేవతలు, మునులు, శక్తులు నిష్టలింగధారణ చేసి యభీష్టసిద్ధిని బడసిరి. ఈ వాస్తవికతను గుర్తెరిగి పిండస్థలమునుండు భక్తస్థలమును ప్రవేశించిన వాడు తన భక్తిని ధృఢ తరము చేసికొనవలెను. యిష్టలింగమును సావధాన చిత్తముతోను భక్తి శ్రద్ధలతోను ధరించవలెను. అంతేకాని మత దురహంకారమును పెంచికొనుటకీ యంశములను గ్రహించవలదు. అహంకారము నేరూపమున నున్నను వర్జనీయమే యనెడిది మరువరాని యంశము. ధర్మాచరణల యెడల నభిమానము పెంచికొనుటలో దోషము లేదు. లింగధారణ యెడల నభిమానమును పెంచికొనుట కర్తవ్యమని గ్రహించవలెను.

లింగార్చన సందర్భమున శుద్ధి యనెడి భావన ప్రాముఖ్యతను సంతరించికొనును. పూజా సందర్భములోన పంచశుద్ధులు చేసికొన వలెననెడి ప్రాకృత సాంప్రదాయమొకటి కలదు. తను శుద్ధి, స్థల శుద్ధి, ప్రతిమ శుద్ధి, పదార్థశుద్ధి మంత్రశుద్ధులు చేసికొనెడి సాంప్రదాయము పరంపరానుగతముగా వచ్చుచున్నదని పండితారాధ్య చరిత్ర (ధీక్షా ప్రకరణము) వలన తెలియుచున్నది. శుద్ధివిధి విధానము లెంతో కష్టతరముగా నుండునని తెలియుచున్నది. షట్సమ్మార్జన స్వస్తి పుణ్యహవాచన, అఘమర్షణస్నానము, గంగాజల ప్రోక్షణ, పంచామృతాభిషేకము మరియు ప్రాశన ఇత్యాదులు శుద్ధికిసంబంధించిన క్రియలని పౌరోహితులు తెలుపుదురు. కర్మజీవులై కాలము వెళ్ళబుచ్చెడి వారికే యివి విహితములనియును, గురుకారుణ్య సిద్ధిచేత భక్త స్థలమున ప్రవేశించి భక్తునిగా పరిణామము పొందిన వానికివి విహితములా కావా? యనెడి సందేహము గలుగవచ్చును. శ్రీ భగవత్పాదుల వారు "లింగధారీ సదాశుద్ధః" యని యుపదేశించెను. లింగధారణ ప్రభావము వలన సర్వాంగశుద్ధిని బడసినపిదప మరల మరల శుద్ధి చేసికొనుట యెంతవరకు యుక్తమనెడి భావన పొడచూపును.

లింగధారణ గలవాని మేను తీర్థముల కంటెను పవిత్రమైనదని తెలిపెడి యీ అన్నమయ్య వారి పద్యమును గనుడిః

**కమనీయంబగు సర్వతీర్థములు లింగబున్నచో**
**మూర్తిమంతములై యొప్పుచు నుందు;**
**లింగమును దాత్సర్యంబుతో**
**భక్తిగా త్రములందెప్పుడు నుండుగాన**
**(భక్తిగా మహితోదత్వార్థ మూహింపదీ**
**ర్థములందెల్లను దివ్య తీర్థము సద్భక్తుండు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప. 25)

"లింగధారీ సదాశుచీః" యనెడి శ్రీభగవత్పాదులవారి భావనకు నొక చక్కని దృష్టాంతమివ్వబడినది. గంగానది తీర్థములకు తీరమున శివలింగమున్నందుననే పవిత్రత చేకూరినది. అటులనే సదా లింగమును మేనున ధరించెడి లింగధారి సకల తీర్థముల కంటెను పవిత్రుడు. ఇట్టి వాని పాద తీర్థములు నెత్తిన చల్లికొనిన చాలును, వేర్వేరు తీర్థములలో స్నానమాడ పని లేదని అన్నమయ్యగారు తెలియజేసిరి.

లింగ ధారణ వలన పవిత్రత స్వతః సిద్ధముగా వచ్చుచున్నందున, లింగధారికి పంచశుద్ధులనావశ్యములు పుణ్యాహవాచనము లిత్యాదులు చేయుట వివేక యుతమైనది కాదని గుర్తించవలెను. అఘమర్షణాదులు ప్రాకృతములగు లోకాచారములే కాని లింగధారులకు కర్తవ్యములు కావు.

పంచ శుద్ధులనావశ్యములని తెలిపెడి శ్రీ సోమనాథుల వారి వాక్కుల గనుడి;

**..............................................మున్ను**
**మస్తకంబున దయామతితోడ గురుడు**
**హస్తంబిడిన నాత్మకది శుద్ధిగాన**

**తానుశుద్ధి గురుడ చేసిన దాన బోక**
**తనుశుద్ధి జేసికో దనకు దావశమె?**
**తనుశుద్ధి జేసికో దాను నేర్చినను**
**మును గురుండేల యిమ్ములనట్లు గాన**
**శివుదున్న యచ్చోట యవిముక్త భూమి**
**యవుట పూజాస్థానమది శుద్ధి గాక**
**మున్ను శుద్ధ స్థానమున గూరు చుండి**
**యెన్న నచ్చట శుద్ధి యేటికి జేయ?**
**.....................................**
**భావింపనటుగాన పంచశుద్ధులును**
**గావించు చూడ్కియ కాదె తప్పనుచు,** (పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్రక.)

స్వాయత్త దీక్షను పొందిన పిండుడు భక్తుడైన సందర్భమున నెరుగ వలసినదేమనగా తాను సదా శుద్ధుడై యుండుట చేత ప్రాకృతాచారములైన షట్సమ్మార్జన, పుణ్యాహవాచనము, ప్రాణాయమము, న్యాసక్రియలు మొదలగు వాటిని చేయుటను తిరస్కరించవలెననెడిది గుర్తించి మెలగవలెను. లోకాచరాములో నుండెడి శుద్ధి క్రియలు ననావశ్యములని భావించవలెను.

లింగమును మూడు స్థానముల యందున పూజించెడి పరంపర కొనసాగుచు వచ్చుచున్నది. మొదటిది దేవాలయములలో నుండెడి లింగమును పూజించెడి పద్ధతి. ఇద్దానిని సామాన్య శైవులు పూజింతురు. లింగపూజ నిత్యనియమము కాదు ఎక్కడైనను కనబడితే దర్శించిపూజింతురు. శైవ క్షేత్రమున నుండెడి శివలింగములను పూజించెడి వారు మిశ్రశైవులనబడుదురు. శుద్ధశైవులు శివాధిక్యత నంగీకరించి, యితర దేవతల నచరులుగా నెంతురు. శివద్విజులీకోవకు చెందినవారే. వీరి పూజా చరణలు నీ క్రింది విధిన నుండును.

**శ్లో॥ మంత్రయంత్ర క్రియా ముద్రాన్యాసా వాహన కాదిభిః॥**
**ఉపచారై బహుర్విధౌలింగం సింహాసనే యజేత్॥**

(వీరశైవ సిద్ధాంత శిరోమణి, (రుద్రప్ప), పుటం. 42)

సింహాసనమున లింగము నిడి పూజించెడి సాంప్రదాయము వీరిదే. వీరికి నిత్యాచార నియమము గలదు.ద్విజులైతే వైదిక సూత్రముల నుపయోగింతురు. శ్రీ రుద్రము నెంతో విస్తృతముగా నుపయోగింతురు.

బాహ్య పీఠార్చన విహితము కాదని వీరశైవులు గుర్తించవలెను. కరపీఠార్చనము శ్రేష్ఠమైనదని శ్రీ భగవత్పాదులు నుపదేశించిరి. సింహాసనములో పెట్టి పూజించెడి యాచారము శుద్ధశైవులదనియును, వీరశైవులకది విహితము కాదని ఎరుగవలెను.

కొందరు రుద్రముతో నిష్టలింగమును పూజించుటలో నెక్కువ సమయము పట్టునని తలచి, సౌకర్యార్థమై యిష్టలింగమును పీఠము మీద పెట్టి, అద్దానితో సూత్రానుబంధము నేర్పాటు చేసికొని పూజింతురు. శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము దృష్ట్యా యిట్టి యాచారణలను నిలిపివేసి కరపీఠార్చనకు పూను కొనవలెను.

ఇక యుపచారముల విషయమును గురించి తెలుపవలెననిన యిచ్చట భక్తియే ప్రధానము. ఉపచారము లన్నియుండవలెననెడి నియమమేమియును లేదు. శ్రీ భగవత్పాదుల వారు గంధము మరియు పుష్పముల గురించి ప్రత్యేకముగా తెలపినందున, వీటిని లింగపూజలో తప్పని సరిగా నుపయోగించవలెను. అర్చన కంటెను నంతర్లింగాను సంధానమునకెక్కువ సమయము యివ్వవలెను.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము : 11

శ్లో॥ వేదశాస్త్రపురాణేషు కామికాద్యాగమేషుచ।
లింగధారణ మాఖ్యాతం వీరశైవస్య నిశ్చయాత్॥
ఋగిత్యాహ ప్రవిత్రం తే వితతం బ్రహ్మణస్పతే।
తస్మాత్పవిత్రం తల్లింగం ధార్యం శైవమనామయం॥ (సి.శి. 6:57-58)

వేదములు, శాస్త్రములు, పురాణములు, కాలకాది వాతులాంతములైన సమస్త శివాగమములందు, వీరశైవునకు లింగధారణము ముఖ్యమని చెప్పబడినది.

“పవిత్రంతే బ్రహ్మణస్పతే” యనెడి ఋగ్వేద మంత్రము, లింగధారణను బోధించు చున్నది. యీ కారణమున దోషరహితమూ పవిత్రమూ అయిన లింగమును దేహము మీద ధరించవలెను.

శ్లో॥ బ్రహ్మేతి లింగమాఖ్యాతం బ్రహ్మణః పతిరీశ్వరః।
పవిత్రం తద్ధి విఖ్యాతం తత్సంపర్కాత్ తనుఃశుచిః॥ (సి.శి. 6:59)

ఇష్టలింగరూపమైన బ్రహ్మమునకు, పరశివబ్రహ్మ అధిపతియై యున్నాడు.అందుకే అతడు, బ్రహ్మణస్పతి: అని పిలువబడుచున్నాడు. అది పవిత్రమై యుండుట చేత, దాని సంపర్కము వలన దేహము కూడ పవిత్రమగుచున్నది. అందుచేత దానిని దేహము మీద ధరించవలెను.

శ్లో॥ ఆతప్తతనురజ్ఞోవైహ్యామః సంస్కార వర్జితః।
దీక్షయా రహితః సాక్షాన్నాప్నుయాల్లింగముత్తమం॥ (సి.శి. 6:60)

శివునికై తపస్సు చేయని వాడును, పరిపక్వాంతః కరణ లేనివాడును, శివసంస్కారము లేని వాడును, ఆత్మానాత్మల, నిత్యానిత్యము వివేకములేని వాడును, గురు కారుణ్యమును పొందని వాడును అయిన వ్యక్తి శ్రేష్ఠమైన శివలింగమును స్వతఃగా తానే తీసుకొని ధరించవలెను.

శ్లో॥ అఘోరా పాపకాశీతి యా తే రుద్రశివాతనూః।
యజుషా గీయతే యస్మాత్ తస్మాచ్ఛివోఽఘవర్జితః॥ (సి.శి. 6:61)

“యాతే రుద్రశివాతనూరఘోరాఽపాపకాశినీ” అనెడి యజుర్వేద మంత్రము నందున శివభక్తుల దేహమైన లింగము, శాంతమూ, మంగళమయమూ, పాపరహితులైన భక్తుల యందున యిష్టలింగము రూపమున ప్రకాశించును అని చెప్పబడుటచే యిష్టలింగధారియైన శివుడు పాపవర్జితుడుగా నగుచున్నాడు.

శ్లో॥ యో లింగధారీ నియతాంతారాత్మా నిత్యం శివారాధన బద్ధ చిత్తః।
స ధారయేత్సర్వ మలా పహత్యై భస్మామలంచారు యథాప్రయోగం॥ (సి.శి. 6:62)

నియతమైన మనస్సు గల్గి సదాశివుని పూజ యందు నాసక్తిగల లింగధారియైన వీరశైవుడు తనసర్వదోషముల నివృత్తికై శాస్త్రోక్త పద్ధతి ప్రకారము నిర్మలమైన భస్మమును సుందరముగా ధరించికొనవలెను.

## వేదాగమములే మూలము :

వీరశైవ ధర్మము నందున నాచరింపబడుచున్న యిష్టలింగ ధారణ మరియు ఇష్టలింగ పూజను ప్రతిపాదించెడి అత్యంత ప్రాచీనమైన సాహిత్యమెయ్యది? ఎప్పటి నుండి ప్రారంభమైనది అనెడివి చర్చనీయాంశములుగా చేయబడినవి. నిష్పక్షపాతబుద్ధి లేని వారును, పరిపక్వమైన

జ్ఞానము లేని వారును, వేదాంగము ప్రమాణములను చూడకయే మాటలాడెడి వారును, తమకు తాము విద్వాంసులమని భావించికొని గర్వితమతులై యుండెడి వారును, అగు ఎంతో మంది ప్రవచనకారులు నేమేమో తప్పుడు మాటలను చెప్పి జనులను భ్రాంతికి గురిచేయుచున్నారు. తమరి దగ్గర గల కించిత్ జ్ఞానమును సాధనముగా గొని, అబద్ధములు నిండియుండెడి విధిన సాహిత్యమును రచించుచున్నారు. జ్ఞానము యొక్క దురుపయోగమున కొడగట్టుచున్నారు. తాము అసత్యమార్గమున నడుస్తూ, ఇతరుల నామార్గముననే పయనింపజేయుచున్నారు. ఈ కారణము చేత, సామాన్య జనులు, ఈ విషయమున, జాగరూకులై యుండవలెను.

వేదాగమములే భారతీయ సంస్కృతికి మూలాధారమైన సాహిత్య సంపద. ఈ వేదాగమములు జగత్తుకు ఆదిగురువైన శివుని నుండియే ప్రాప్తమైనవని చెప్పెడి ప్రమాణములు కలవు.

**సద్యోజాతేన ఋగ్వేదం వామదేవేనయాజుషం।**
**అఘోరేణ తథా సామ పురుషే త్వథర్వణం॥**
**ఈశానేన ముఖేనైవ కామికాద్యాగమస్తథా।**
**జనయామాస విశ్వేశః సర్వసిద్ధి ప్రదాయకః** (బ్ర.సూ, శ్రీకర భా. 1-1-3)

శివుని సద్యోజాత ముఖము నుండి ఋగ్వేదము, వామదేవ ముఖము నుండి యజుర్వేదము, అఘోరముఖము నుండి సామవేదము, తత్పురుష ముఖము నుండి అధర్వణ వేదము, మరియు ఈశాన ముము నుండి కామికము నుండి వాతులము వరకు గల శివాగమములు నావిర్భవించినవని యీ ప్రమాణము చెప్పుచున్నది. అనేకానేక గ్రంథము లీ విధిననే తెలిపినవి.

భారత దేశములోని దర్శనములన్నింటికినీ వేదాగమములే మూల సూత్ర ప్రదాయకములైనవి. ప్రాచీనాచార్యులలో కొందరు వేదములనే ప్రధానముగా గైకొని తమ ధర్మగ్రంథములు రచించిరి. మరి కొందరు, ఆగమములనే ప్రధానముగా గొని గ్రంథములను రచించిరి. అయితే, వీరశైవమునకు చెందిన ప్రప్రథమ ధర్మాచార్యులును, పంచాచార్యులలో నొక్కరునూ అగు శ్రీ రేణుకా భగవత్పాదుల వారు, శ్రీ అగస్త్య మహర్షికి నుపదేశిస్తూ వేదాగమములకు సమానమైన ప్రాధాన్యత నివ్వవలెనని తెలిపిరి. వారి యుపదేశమును గనుడి :

**శ్లో॥ వేద ధర్మాది దాముత్వాత్ సిద్ధాంతాఖ్యః శివాగమః।**
**వేద బాహ్య విరోధిత్వాద్వేద సమ్మత ఉచ్యతే॥**
**వేద సిద్ధాంత యోగైక్యమేకార్థ ప్రతిపాదనాత్।**
**ప్రామాణ్యం సదృశం జ్ఞేయం పండితైరేతయో సదా॥**

సిద్ధాంతమనెడి పేరుగల శివాగమశాస్త్రము, వేదోక్తమైన ధర్మమును ప్రతిపాదించుట చేతను, వేద బాహ్యములగు ధర్మములను ఖండించుట చేతను, సిద్ధాంత శైవమును వేదసమ్మతమైనదిగా చెప్పుదురనియును, వేదములు, సిద్ధాంత శాస్త్రము నొకే విషయమును ప్రతిపాదించిన వనియును, పండితులు ఈ రెంటి యొక్క ప్రమాణములకు సమానమైన ప్రాధాన్యత యివ్వవలెననియును భగవత్పాదుల వారి యుపదేశములోని భావము.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారికి శివుడిచ్చిన ఆదేశములోను వేదాగమములకు సమానమైన ప్రాముఖ్యత నివ్వబడినదని తెలియుచున్నది. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ మదద్వైతపరం శాస్త్రం వేదవేదాంతసమ్మతం।**
**స్థాపయిష్యసి భూలోకే సర్వేషాం హితకారకం॥** (సి.శి. 3:86)

జగత్తులోని సమస్త మానవులకు హితకారకము, వేద వేదాంత సమ్మతమైనదగు శివాద్వైత సిద్ధాంతమును స్థాపించెడివాని వగుము అనెడిది యీ ప్రమాణములోని భావము.

ఈ విధముగా శ్రీ జగద్గురువుల వారు ప్రతిపాదించిన సిద్ధాంతము, శివుని ఆదేశము మేరకు, వేదాగమ సమ్మతముగా నుండే విధముగా నుపదేశించిరి. విజ్ఞులీ విషయమును గుర్తింతురు గాక.

## వేదాగమపురాణములు – సిద్ధాంత శిఖామణి మూలసూత్రములు :

వేదాగమములనే నాధారముగాగొని శ్రీ జగద్గురువులు రేణుక భగవత్పాదుల వారు, మహా మహిమాశాలియైన ఆగస్త్యమహర్షికి వీరశైవ సిద్ధాంతమును నుపదేశించిరి. కాలాంతరమున, 7వ శతాబ్దికంటెను పూర్వముననే, శ్రీ శివయోగిశివాచార్యుల వారనెడి మూర్ధన్య విద్వాంసులు, వేదాగమ సమ్మతమైన జనులకు బోధించుటకై, వ్యాస ప్రణీతమైనవియును, వేదాగమముల అర్థములను నుప బృంహించెడి శైవపురాణములను పరామర్శించి సిద్ధాంత శిఖామణిని రచించిరి.

సమస్త వీరశైవ సిద్ధాంతముల నిమిడ్చికొనినదియునూ, ఉపలబ్ధ గ్రంథములలోన నతి ప్రాచీనమైనదియూ వీరశైవమునకు నేకైక ధర్మగ్రంథమైయున్నదియునూ "సిద్ధాంత శిఖామణి"యే అని చెప్పవచ్చును. సిద్ధాంత శిఖామణి కృతికర్త వాక్కులను గనుడి:

**శ్లో॥ సర్వస్వం వీరశౌవానాం సకలార్థ ప్రకాశకం।**
**అస్పృష్ట మఖిలైర్దోషైరాదృతం శుద్ధమానసైః॥** (సి.శి. 1 : 27)

వీరశైవులకు సకల పురుషార్థ ప్రకాశము నిచ్చెడిదియును, సర్వస్వము అయినట్టిదియునగు దీనిని దోషరహితులును, శుద్ధమనస్కులును అయినవారిచే ఆదరింపబడినది అని యీ శ్లోకములోని భావము.

సిద్ధాంత శిఖామణి యొక్క రచనా విధానమును గురించి, కృతి కర్త యీ క్రింది విధిన వివరించిరి.

**శ్లో॥ ఆలోక్య శైవతంత్రాణి కామికాద్యాని సాదరం।**
**వాతూలాంతాని శైవాని పురాణాన్యఖిలాని తు॥**
**వేదమార్గా విరోధేన విశిష్టాచారసిద్ధయే।**
**అసన్మార్గ నిరాసాయ ప్రమోదాయ వివేకినాం।** (సి.శి. 1:25–26)

వాతులాది ఆగమములను చూసి, సకలశైవ పురాణములను పరిశీలించి, వేదమార్గమునకు అవిరుద్ధముగాను, జైన, బౌద్ధాదియ సన్మార్గముల నిరసనకై, వివేకవంతులకు సంతుష్టినిచ్చే విధముగాను, వీరశైవ సదాచారమార్గము వివరించెడి రీతిన గ్రంథము సంకలనము చేయనైనదని శ్లోకములోని భావము.

వాస్తవికముగా వీరశైవ సిద్ధాంతము శివుని చేత ప్రతిపాదింపబడినదని చెప్పెడి యీ ప్రమాణమును గనుడి.

**శ్లో॥ త్వేషాగమేషు సర్వేషు పురాణే ష్వఖిలేషుచ।**
**పురాదేవేనకథితం దేవ్యై తన్నందనాయచ॥**

వీరశైవ సిద్ధాంతము పూర్వకాలమున శివుని చేత పార్వతిచే, కుమారస్వామికి బోధింపబడినదనియును, ఈ విషయము ఆగమ పురాణాదులలోను గలదనియును శ్లోకములోని భావము.

శివుని చేత ప్రతిపాదితమైన వీరవైవ సిద్ధాంతము శివపరంపరకు చెందిన రేణుక భగవత్పాదుల చేత జగద్వ్యాపితము చేయబడినది. భగీరథుని అభ్యర్థన మేరకు భువికిదిగిన దేవగంగ, శివ కటాక్షమును పొంది, శివగంగయై భగీరథుని మనోరథమును నెరవేర్చుటకై భాగీరథియై ప్రవహిస్తూ సగరుని సంతతిని కాపాడుటయే కాదు, నాటి నుండి నేటి వరకు తనలో మునిగిన వారినందరినీ పవిత్రము చేయుచు అవిచ్ఛినముగా లోక కళ్యాణమును చేకూర్చుచున్నది. అదే విధిన అగస్త్యున యభ్యర్థన మేరకు శ్రీ రేణుక భగవత్పాదుల వారి యుపదేశామృత ప్రవాహము, నాటి నుండి నేటి వరకు అవిచ్ఛిన్నముగా శివజ్ఞానామృతము నంద జేయుచున్నది. తనివితీరా గ్రోలిన ఋషులెందరో వీరశైవ భావ పరంపరను వివిధ కృతులలో గ్రంథస్థము చేసిరి. దేవర దాసి మార్యుల వారు,ఈ అమృతము గ్రోలి పునీతులై, యనుభవమును గడించి, ఆగమ జ్ఞానమునకు నాత్మానుభవమును జోడించి వచన రచన గావించిరి. ఆ పరంపరలో వచ్చిన శ్రీ బసవేశ్వరాదులు శ్రీ దేవర దాసి మార్యుల వార నుసరించిన

మార్గమునే యనుసరించిరి. ఎంతో విస్తృతమైన శరణ వాఙ్మయము వెలువడి కన్నడ భాష సుసంపన్నమయ్యెను ఈ వాఙ్మయములోన యనేకమైన సంస్కృత శ్లోకములు గలవు. ఇవన్నియును, వేదాగమ పురాణములకు చెందినవని వేరుగా చెప్పెడి యవశ్యకత లేదు. వేదాగమ పురాణాదులలోని ప్రమాణ వాక్యములు చదివి, వాటిని అవగాహన జేసికొనిన పిదప వచన వాఙ్మయమును చదివిన యెడల ఇతోధికమైన పరిజ్ఞానము లభించును. కేవలము వచన వాఙ్మయమునకే తమ అధ్యయనమును పరిమితము చేసిన యెడల పూర్ణపరిజ్ఞానమలభ్యమై, దురవగాహనకు అస్కారమేర్పడును.

వీరశైవ సిద్ధాంతమున యతి ముఖ్యమైన లక్షణముగా నెంచబడిన లింగధారణ పూజ వేదాగమ సమ్మతమైనదని శ్రీ భగవత్పాదుల వారు వివరించిరి. "వేదాగమ పురాణేషు కామికా ద్యాగమేషుచ లింగధారణ మాఖ్యాతం" అని యుపదేశించిరి.

ప్రస్తుతమున లింగధారణ పరమైన వేదాగమ పురాణాదులలోని వాక్యములను, ఇచ్చట సంక్షిప్తముగా వివరింతుము గాక.

## వేదములు మరియు వేదసమ్మతమైన లింగధారణ :

'విద్' అనెడి ధాతువు నుండి 'వేద' అనెడి శబ్దము నిష్పన్నమైనది. వేదమనగా "తెలివిడి" యని గ్రహించవలెను. వేదమనెడిది లౌకిక మరియు పారలౌకిక వ్యవహారములను తెలియ పరచెడి యపారమైన జ్ఞానరాసి. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదములను నాల్గు వేదములు గలవు. వీటిలోన మొదటి మూడింటిని 'వేదాత్రయీ' అనెడి పేరుతో పిలుతురు, ఈ వేదములలో సంహితా, బ్రాహ్మణ, అరణ్యక మరియు ఉపనిషత్తులను భాగములు కలవు. ప్రతి వేదమునకును అనేకమైన శాఖోపశాఖలు గలవు. మొత్తము మీద1131 శాఖలు గలవనియును, ఒక్కొక్క శాఖ కొక్కొక్క ఉపనిషత్తు గలదనియును చెప్పబడినది. ప్రతి యుపనిషత్తున కనేకానేకమైన శాఖలు గలవని తెలియుచున్నది. ఉపనిషత్తులన్నియును ప్రకటింపబడలేదనియును. ఇంకనూ ప్రకటించవలసిన వెన్నియో గలవనియును తెలియవచ్చుచున్నది.

వేదములలోని యనేక మంత్రములకు శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు భాష్యములు వ్రాసిరి. ఈ క్రింది ప్రమాణమును చూడండి.

**శ్లో॥ "రేవణ సిద్ధ, మరుళ సిద్ధైకోరామసిద్ధ**
**పండితారాధ్యాదయః సహస్రశీర్షం దేవమిత్యాది**
**పరశివ ధర్మప్రతిపాదక వాక్యానాం నారాయణాత్మక**
**విష్ణు ప్రతిపాదికత్యేపి ఏతదను వాకస్య**
**పరశివత్యేన కశ్చిదప దోషః। శివస్య శక్తిర్విని**
**యోగకాలేచ చతుర్విదా 2 భచ్ఛివ సత్రసాదాత్।**
**భోగేభవానీ పురుషేషు విష్ణుః క్రోధేచ కాళీ**
**సమరేచ దుర్గా॥ ఇతి శ్రుతౌ.....**
**శివస్య శక్తత్వేన విష్ణో శక్తి త్తేన స్పష్టముపదిష్ట**
**త్వాత్, శక్తి శక్తి మత్రోరంభేద వ్యపదశాచ్చ"।**
**ఇతి వదంతి.**

శ్రీవృషభ పండితారాధ్యులవారి వలె వేదోపనిత్తులకు వీరశైవ పరముగా భాష్యము వ్రాసిన వారెందరో గలరు. దొరికిన వన్నియును అసంపూర్ణముగనే యున్నవి. వీటిని పూర్ణరూపమున ప్రకటించే విషయములోన యింకను ఎంతో కృషి చేయవలసి యున్నది.

"శ్రుతి సార భాష్యము" నందున, మైసూరులోని పెద్ద చెరువు దగ్గర కొత్త మఠముకు చెందిన శ్రీ శివపూజ శివలింగ శివయోగీంద్ర స్వాముల వారు, వేద మంత్రములకు వీరశైవ పరమైన వ్యాఖ్యను రచించిరి. 1913లో మొదటిసారిగా ప్రకటితమైన ఈ గ్రంథము నందున నాల్గు వేదములకు చెందిన సుమారు ముఖ్యమైన 75 మంత్రముల మీద సవివరమైన వ్యాఖ్యానమును గాంచగలము. లింగధారణతో పాటుగా శివుని జగన్మయత్వము, శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతము, లింగాంగ సామరస్యము మొదలగునవి వేద సమ్మతములని నిరూపింపబడినవి.

"లింగధారణ చంద్రిక" యనెడి శ్రీనందికేశ్వర శివాచార్యుల వారి కృతి, లింగధారణ విషయమున నొక యద్వితీయమైన గ్రంథమని యోచించబడుచున్నది. పండితుల చేత సాక్షాత్ విశ్వనాథుడే యనెడి మన్నన బడసిన మహా మహోపాధ్యాయ పం॥ శివకుమార శాస్త్రి గారు, ఈ గ్రంథమునకు సంస్కృతములో వాఖ్యానమును వ్రాసిరి. 'శరత్' అనెడి పేరు ఈ వాఖ్యానమునకివ్వబడినది. శ్రీ జగద్గురు విశ్వారాధ్య పీఠము జంగమ వాడి మఠము కాశీ, వారు ఈ గ్రంథమును మొదటి సారిగా 1905లో ప్రకటించిరి. బెంగుళూరుకు చెందిన, ఆస్థాన విద్వాన్ పండిత రత్నం శిర్షి గురుశాంతశాస్త్రిగారు, దీనిని శ్రీ జంగమవాడి మఠము వారిచే 1938లో పునర్ముద్రణ చేయించబడినది. దీనిని కన్నడంలోనికి అనువదించి 1951లో ప్రకటించిరి. ఇందులో హిందీ అనువాదము చూడగలము. ఈ గ్రంథము నందున బాహ్యపూజ, అంతర్లింగాను సంధామునకు సంబంధించిన విషయాలన్నీ వేదప్రమాణముల చేత నిరూపింపబడినవి.

వీరేశ్వర శాస్త్రిగారి వీరశైవాన్వయ చంద్రిక (1830) కూడ యీ కొవకు చెందిన గ్రంథమే.

ఇవటూరి నందికేశ్వర శాస్త్రిగారిచే రచితమైన "ఈ వీరశైవాష్టావరణ ప్రమాణష్టకా భరణం" సంస్కృత గ్రంథము మహోత్కృష్టమైనది. ఈ కవి ఆంధ్రప్రదేశ్‌కుచెందిన వాడు. ఇది తెలుగు లిపిలో ప్రకటించబడినది. దీని లోని "శివలింగ ప్రకరణ"లో యిష్టలింగధారణ మరియు పూజలు వేదాగమ సమ్మతములే యని నిరూపించబడినది. ఇది త్వరలోనే దేవనాగరి లిపిలో వెలువడగలదని తెలియుచున్నది.

ఈ గ్రంథముల యందున వేదమంత్రముల ద్వారా యిష్టలింగ ధారణకు సంబంధించిన శాస్త్రీయ చర్చ గలదు. తర్క వితర్కములు విస్తరింపబడినవి. వీటిని చూసి పండితులు పరమ హర్షమునుపొందెదరు. సామాన్యులకవి అర్థము కావేమో? ఆసక్తి గలవారు వీటిని పఠించి తమ తమ సందేహములను తొలగించికొనగలరు.

**ప్రస్తుతము కొన్ని వేద మంత్రములను పరిశీలింతుము గాక..**
**"నిధన పతయేనమః నిధన పతాంతికాయనమః**
**... ... ... సర్వలింగం స్థాపయతిపాణి మంత్రం పవిత్రం"** (తై. ఉ. 4-16-33,34)

ఇందులో 'పాణిమంత్రం' అనగా ఇష్టలింగమే. కృష్ణద్వైపాయనులవారు స్కాందాదులలో నిచ్చిన యర్థ వివరణను పరిశీలించిన యెడల యీ విషయము సుబోధకమగును.

స్కాందములోని యీ ప్రమాణమును గనుడి:

**మనసా త్త్రాయతే స్మాత్త స్మాన్మంత్రోఽ యమీరితః।**
**వాచ్యవాచక రూపేణ ద్వ్యధా మంత్రః ప్రకీర్తితః**
**వాచకో వర్ణరూపస్యాత్ వాచ్యశ్చపరమశివః।**
**మనుదేవతయోరైక్యం తస్మాదాహర్మహర్షయః॥**

మంత్రమనగా 'మనసాత్త్రాయతే ఇతిమంత్రః' అని చెప్పబడినది. పాణౌమంత్రం పాణి మంత్రం అనెడి వ్యుత్పత్తి మేరకు హస్త పీఠము నందున నుంచి, మననము చేయుట వలన రక్షించెడి మాత్రమే పాణిమంత్రము. ఇది రెండు విధములుగ నుండును. అవి: వాచ్యము మరియు వాచకము. "ఓం నమః శివాయ" యనెడిదే వాచకము పరశివుడు వాచ్యుడగును. ఇతడును, ఇష్టలింగము రూపమున హస్తపీఠము నందున నిలిచి యుండును.

ఇచ్చుట వాచ్యముగా గ్రహింపబడిన ప్రణవ సహిత పంచాక్షరీ మంత్రమునకును, వాచ్యుడగు పర శివుని రూపమునగల యిష్ట లింగమునకునూ అభేదము గలదని తెలిపెడి ప్రమాణము సిద్ధాంత సారావలి లోన యివ్వబడినది. గమనించుడి !

**శ్లో॥ నమః పీఠమితి ప్రోక్తం శికారం మధ్యమీరితం।**
**వాకారం గోముఖం వృత్తం యకారం గోళకంస్మృతం॥**
**ఓంకార లింగమాఖ్యాతం షడ్వర్ణం లింగముచ్యతే॥**

'నమః' అనెడి రెండక్షరములే పీఠమనియునూ, 'శి' యనెడిది మధ్య భాగమనియును, 'వ' గోముఖ మనియును, యకారము గోళకమనియున, 'ఓం' అనెడి ప్రణవమే లింగమనియును శ్లోకములో చెప్పబడినది.

ఈ విధముగా వాచకము, వాచ్యమును అయినది యిష్టలింగమని తెలిసినది. యిష్టలింగమును పాణి తలమున నడికొని, నోటి ద్వారా యిష్టలింగ రూపమైన ప్రణవ సహిత పంచాక్షరిని పఠించుట చేత వీరశైవుడు రక్షణను పొందుచున్నాడు. మనోబుద్ధ్యాదులను రక్షించే, ఈ ఇష్టలింగమునే వేదము "పాణి మంత్ర"మని సంబోధించినది.

లింగపురాణములోని యీ క్రింది ప్రమాణము పూర్వోక్త విషయమునే ప్రతిపాదించినది. కనుడి;

**శ్లో॥ యజురస్యాహ సర్వంవై లింగం స్థాపయతీతిచ।**
**తస్మాద్ధార్యం మహాలింగం పాణిమంత్రేత మంత్రతః॥**
**పాణౌ లింగం వినిక్షప్య దీక్షాకాలే గురుః శివం।**
**యోనస్తవతి తన్మంత్రం పాణిమంత్రం వదంతిహి॥**
(లింగపురాణము, ఉత్తర భాగము, అధ్యా : 21)

దీక్షా కాలము నందున శ్రీ గురువునొసంగెడి లింగమే పాణిమంత్రమని చెప్పబడినవి.

పంచాక్షరీ మంత్రము, పాణిమంత్రము, లనెడివి యిష్టలింగము యొక్క ప్రతి రూపములని యెంచదగును. అందుచేత వీటి యందున అభేదము గలదు.

లింగపురాణములోను నిట్టి భావములే గలవని తెలిసికొనగలరు. వివరములు గోరువారు, కాంచీ పట్టణ నివాసియు, అష్టాదశపురాణోద్ధారకుడును అగు శ్రీ పువ్వాడ వెంకట రాముల వారిచే 1876లో ప్రకటింపబడిన లింగపురాణమును చూడగలరు.

ఋగ్వేదములోని "అయంమే హస్తో భగవయంమే భగవత్తం। (అష్టకళ, అధ్యాయము1, వర్గ25) అనే మంత్రము, హస్తపీఠములోని యిష్టలింగమునే ప్రతిపాదించుచున్నది. శ్రీ పం॥ శివ కుమార శాస్త్రిగారు, తమ లింగధారణ చంద్రికలో యీ మంత్రమునకు ఈ క్రింది విధిన వివరణనిచ్చిరి.

**"అయం భగవాన్ -లింగరూపః సదాశివః**
**యే హస్య మమహస్త గతః ఇత్యర్థః అయమేవ**
**సదాశివః యే భగవత్తరః మమసర్వ్యై శ్వర్యవత్తరః**

దీని భావమేమనగా లింగరూమైన సదాశివుడు నా హస్తమును పొందియున్నాడు. ఈ శివలింగమూర్తి నాకు అతిశయమైన ఐశ్వర్యమును ప్రసాదించును భగవాన్ అనే పదమునకు యిష్ట లింగమనెడి యర్థము ఇవ్వబడినది. ఎందుచేత ననగా, భగవాన్ అనెడి శబ్దమునకు సమీపమున హస్త అనే శబ్దము కలదు. హ్తమున పెట్టికొని పూజించెడిది ఇష్టలింగమును మాత్రమే నారాయణాది దేవతల ప్రతిమలను చేతిలో పెట్టికొని యర్చించెడి విధానముగాని, ప్రమాణముగాని కనిపించలేదు. ఈ విషయమున, యెట్టి సందేహమునకాస్కారము లేదు.

ఇచ్చట, అధారాధేయ భావము చేత హస్తమునకును, ఇష్టలింగమునకును, భేదమున్నను, ఈ రెంటికిని యభేదము ఎందుకు చూపబడినదనెడి సందేహము కలుగవచ్చును. దానిని నివారించి కొనవలసి యున్నది.

లింగము దేహమున్నంత వరకు, ఎప్పటికినీ దూరము కాకూడదనెడి నియమమొకటి కలదు కదా! ఆచార్యుల వారు ఈ విషయమున ప్రత్యేకమైన యాదేశమును ఇచ్చిరి. ఈ నియమము ఆగమ సమ్మతమైనదే యని తెలియుచున్నది. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**భూమౌ ప్రతిష్ఠితం లింగం పునర్నోత్పాట్యతేయథా।**
**దేహే ప్రతిష్ఠితం లింగ మంతే2పి నవిభజ్యతే॥** (వాతులాగమము)

ఈ ఆగమోక్తి యొక్క భావమేమనగా భూమి మీద ప్రతిష్ఠాపితమైన లింగము నెటుల పెకల్చ కూడదో, అదే విధిన దేహము మీద గురువు చేత ప్రతిష్ఠితమైన లింగమును అంత్యకాలము వరకు దేహము నుండి దూరము చేయకూడదు.

వీరశైవుడు నిత్య లింగాను సంధాని యనెడిదానిని ప్రతిపాదించుటకే వేదము "హస్త గతః భగవాన్" అనెడి యభేదమును చెప్పినది. ఇదియే హస్తము-భగవాన్ అనే పదములకు చెప్పబడిన వైదికాభేదము లో నిమిడియున్న రహస్యమైన అర్థము.

## ఆగమములు-ఇష్టలింగ ధారణ :

"ఆప్తవచనా దావిర్భూతమర్థ విశేష సంవేదన మాగమః" అనెడిది ఆగమము ఆ యొక్క వ్యుత్పత్తి. యదార్థ వక్తృవును, ఆప్త పురుషుడని అందురు. అంతటి ఆప్త పురుషుని నుండి వెలువడిన లేదా నుపదేశింప బడినదే ఆగమశాస్త్రము.

పరశివుడే ఆప్తుడగును. అతడు ఉపదేశించినవే యీ ఆగమములు. ఆగమములు శివుని వక్త్రము నుండి వచ్చినవని తెలిపెడి యీ క్రింది ప్రమాణమును గనుడి:

**శ్లో॥ ఆగతం శివవక్త్రాత్తు గతంచ గిరిజా ముఖే।**
**మతం శ్రీ వాసుదేవేన ఆగమస్తేన కీర్తితః॥** (భాస్కరి, ద్వి.భా. పుట 85)

ఈ శ్లోకములోని భావమేమనగా శివుని వదనారవిందము నుండి వెడలి పార్వతీ దేవి బుద్ధిలోనికి ప్రవేశించేటప్పుడు, అక్కడే సాక్షిగా యున్న వాసుదేవుని చేత నేశాస్త్రము సమ్మతి బడసినదో అదియే ఆగమ శాస్త్రము. ఇది ఆగమ శబ్దము యొక్క రూఢార్థమై యున్నది.

ఇంకను యౌగికార్థమును విచారించవలసినదనిన "ఆసమంతాద్ అర్థమ్ గమయతీతి ఆగమః" అనెడి వుత్పత్తి ప్రకారము సంపూర్ణతత్వమును బోధించెడి శాస్త్రమే ఆగమశాస్త్రము. పతంజలి ప్రకారము 'ఆగచ్ఛంతి బుద్ధి మాంచహంతే యాస్మాత్ అభ్యుదయనిః శ్రేయసోపాయః స ఆగమః" (యో.సూ. 1-25) అనెడిది ఆగమము) తత్వ వైశారది

దీని భావమేమనగా ఇహలోకపు మరియు పరలోకపు సుఖములను బడసెడి ఉపాయములు ఏ శాస్త్రమునందు జన సామాన్యమునకు సరళముగా తెలిసెడి విధముగా చెప్పబడినవో అవే ఆగమశాస్త్రములు. శ్రీవాచస్పతి మిశ్రా కూడా ఈ విధముగనే తెలిపిరి.

వేదములకంటెను ఆగమములు సరళమైనవని తెలుపబడినది. ఆగమములకు తంత్రమనెడి పర్యాయపదము కలదు.

"తన్యతే విస్తార్యతే జ్ఞానమనేన" అనెడి వుత్పత్తి ప్రకారము వేటి అధ్యయనము వలన అన్ని విధములయిన జ్ఞానములు సంప్రాప్తముగుచున్నవో వాటిని తంత్రములందురు. ఈ విషయమును నిరూపించెడి ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ తనోతి విపులానర్థాన్ తంత్రమంత్ర సమన్వితాన్**
**త్రాణంచ కరుతే యస్మాత్ తంత్ర మిత్య భిధీయతే**

ఆగమము లేక తంత్రసాహిత్యమైనను శైవ, పాశుపత, సోమ మరియు లాకులములు అనెడి పేర్లతో అనేక విధములుగా నున్నవి. వీటిలోని శైవాగమములు వామము, దక్షిణము, మిశ్రము సిద్ధాంతమనెడి నాల్గు ప్రకారములుగా నున్నవి. సిద్ధాంత ఆగమములుగా ప్రసిద్ధిగాంచిన కామికాది వాతులాంతము వరకుగల ఆగమములలోని ఉత్తర భాగమున వీరశైవ సిద్ధాంతము ప్రతిపాదించ బడినదని శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు తెలియజేసిరి. వీరి ఈ క్రింది ఉపదేశమును గమనించుడి.

**శ్లో॥ 'సిద్ధాంతాఖ్యే మహాతంత్రే కామికాద్యే శివోదితే**
**నిర్దిష్టముత్తరే భాగే వీరశైవమతమ్ పరమ్** (సి.శి. 5:14)

ఈ విధముగా వీరశైవమునకు వేదములు మరియు ఆగమములు ఆధారముగా నున్నవని తెలిసికొనవలెను.

విపులమైన ఈ ఆగమ సాహిత్యమైనను సంపూర్ణముగా దొరకలేదు. అయినా ఖండఖండములుగా దొరికిన భాగములనే అనేక సంఘములు, సంస్థలు ప్రకటనమును జేసిరి.

పాండిచ్చేరి యందలి కొన్ని ఆగమములు ప్రసిద్ధములై యున్నవి. వారణాశి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయము వారిచే తంత్రసంగ్రహము, లుప్తాగమసంగ్రహము అనెడి పేర్లతో అసంపూర్ణమైన భాగములు మరియు ఖండఖండములుగా దొరికిన ఆగమ శ్లోకములు ప్రకటింపబడినవి. లింగైక్యులు పండిత కాశీనాథశాస్త్రిగారు చంద్రజ్ఞానాగమము, మకుటాగమము, సూక్ష్మాగమము, కారణాగమముల యొక్క చివరి భాగములను ప్రకటించిరి. హుబ్లిలోని మూరుసావిరమఠము వారిచే తంత్రసంగ్రహము అనెడి గ్రంథము ప్రకాశమును గొనినది. షోలాపురమునకు చెందిన వారదమల్లప్పగారు పారమేశ్వరాగమమును ప్రకటించిరి. ఇంతేగాక మైసూరుకు సంబంధించిన ఓ.ఆర్.ఐ. యొక్క నిర్దేశకులైన డాక్టర్ హెచ్.పి. మల్లదేవరగారు ఆగమసాహిత్యము మీద విశేష పరిశోధనను చేశిరి. అదే సంస్థముఖమున ఆగమములను ప్రకటించెడిప్రయత్నము చేయుచున్నారు. ఇటీవలి కాలములో వాతుల శుద్ధాగమమునకు సంబంధించిన రెండు భాగములను ప్రకటించిరి. డాక్టరు జ.చ.ని. వారునూ ఆగమసాహిత్యమును చాలా వరకు పరిశోధించి అనేక గ్రంథములను రచించిరి. అంతే కాకుండా తమరికి దొరికిన వీరాగమము యొక్క తాళపత్ర ప్రతిని ముద్రించెడి కార్యమును చేపట్టిరి.

ఈ విధముగా ఆగమసాహిత్యము మీద ఇంకా ఎక్కువగా పరిశోధనలు జరుపబడి ఆ సాహిత్యము ప్రకాశితమై విద్వజ్జనులకు చేరిన యెడల వీరశైవ ధర్మముయొక్క గొప్పతనము మరియు ఇష్టలింగము యొక్క ప్రాచీన యితిహాసము జనులందరికినీ బాగుగా తెలియగలదు. నేటి వరకు ముద్రితమై దొరకెడి ఆగమములను ఆధారముగా గొని ఇష్టలింగధారణ సిద్ధాంతమును నిరూపింతము.

**శ్లో॥ న వీరశైవ సదృశమ్ మతమస్తిజగత్రయే**
**సర్వభోగప్రదం పుణ్యమ్ శివసాయజ్యదాయికమ్**
**యస్య భస్మలలాటేస్తి కంఠేలింగ మదాత్మకమ్**
**రుద్రాక్షదారణం దేహే సోహం దేవీన సంశయః**

(పారమేశ్వర తంత్రము-పటలము-1 శ్లో. 42 నుండి 48)
(ప్రకటన-వారద ప్రకాశన-షోలాపురం-1904)

ఈ పారమేశ్వరాగమమునందు చెప్పబడిన పై శ్లోకము యొక్క భావమేమనగా శివుడు పార్వతితో వీరశైవ మతమునకు సమానమైన వేరొక మతము లేదనియును, ఫాలమునందున భస్మము, కంఠమునందున లింగము మరియు రుద్రాక్షలను ధరించినవాడు సాక్షాత్ నా స్వరూపము అని చెప్పెను.

వాతుల శుద్ధాగమములోని ఈ ప్రమాణమును గనుడి:

**గురుణాదత్తమ్ లింగమ్ తు శివమంత్రేణ ధారయేత్**
**మూర్ధ్ని కంఠే భుజే హస్తే హృత్స్థలే నాభిమండలే**
**ఏతేశామేక దేశేతు ధారయేత్ శివలింగకమ్**

(వాతుల శుద్ధాగమము-పటలము 10 : శ్లో 35-36)

(ఓ.ఆర్.ఐ. ప్రకాశన-మైసూరు-1983)

ఈ శ్లోకములోని భావమేమనగా గురువుల చేత ప్రాప్తమైన ఇష్టలింగమును పంచాక్షర మహామంత్రమును పఠించుచూ మస్తకము, భుజము, కరము, హృదయము మరియు నాభిమండలము లందున ఏదో ఒక స్థానమున లింగమును ధరించవలెను. కారణాగమములో ప్రతిపాదించబడిన ఇష్టలింగధారణ గురించి తెలిసికొనెదముగాక.

**అత్యాశ్రమమ్ పాశుపతమ్ శాంభవమ్ తచ్ఛిరోవ్రతమ్**
**ఇత్యేవమ్ నామభిః పుణ్యైర్నిగమాంతేషు గీయతే**
**తనుత్రయ గతానాది మలత్రయమసౌగురుః**
**దీక్షాత్రయేణ సమ్దహ్య లింగత్రయముపాదిశేత్......**
**శిష్యపాణి తలేదత్తాయ దీక్షా సాక్రియాభవేత్**

(కారణాగమము-ఉత్తరభాగము-క్రియాపాదము- పటలము-1-శ్లోకము-9-10-12-
కాశీనాథ గ్రంథమాల, మైసూరు-1956)

ఈ శ్లోకములోని భావమేమనగా అత్యాశ్రమ, పాశుపత, శాంభవ వ్రతములనెడివి వీర శైవమునకు పర్యాయ నామములు, ఈ ధర్మమునందు సద్గురువులు మూడు విధములైన దీక్షా సంస్కారముల చేత శిష్యుని స్థూల, సూక్ష్మ, కారణ శరీరములందుండెడి కార్మిక, మాయ, మరియు అణవ మలములను దూరము చేసి ఇష్ట, ప్రాణ మరియు భావలింగములను కటాక్షించుచున్నారు. శిష్యుని హస్తతలము నందు ప్రాప్తమైన లింగమే ఇష్టలింగము.

సూక్ష్మతంత్రములో చెప్పబదిన ఇష్టలింగమునకు సంబంధించిన విషయములు ఈ క్రింది విధముగా నున్నవి.

**శ్లో॥ ఏకకాలమ్ ద్వికాలమ్ వా త్రికాలమ్ వాపి శాంకరీ**
**పూజయేన్నియతమ్ లింగమ్ ప్రాణలింగ పరాయణః**

**పవమ్ యఃకురుతే భక్త్యా నిత్యమాప్రాణసంచరాత్**
**వీరశైవ స విజ్ఞేయః సర్వశైవోత్తమోత్తమః** (సూక్ష్మతంత్రము. పటలము 6-శ్లో.61-62)

(ప్రకటన : శంకరప్ప అచ్చప్ప టొప్పిగి - హుబ్లి 1914)

ఈశ్లోకములోని భావమేమనగా సద్గురువుచేత సంప్రాప్తమైన తన యిష్టలింగమును దేహమున ధరించి తన దేహమున్నంతవరకు ప్రతిదినము ఒకటి రెండు లేక మూడు సార్లు పూజించువాడే వీరశైవుడు. మరియు ఇట్టివాడు శైవులందరికంటెను ఉత్తమోత్తముడు. ఈ విధముగా అనేకమైన ఆగమముల యందు వీరశైవుల యిష్టలింగధారణ విషయము విస్తారముగా నిరూపింపబడినది. ఇక్కడ నుదహరించబడిన వాక్యములు కొన్ని మాత్రమే. దిగ్దర్శన చేశెడి నిమిత్తము ఎంపిక చేసికొనబడిన ఆగమముల నుండి శ్లోకములు యివ్వనైనది. ఆసక్తి కలవారు విశేషాధ్యయనము నిమిత్తము ఆయా గ్రంథములను పఠించగలరు.

## పురాణము మరియు ఇష్టలింగధారణ

వేదాగమములు పిదప వచ్చెడి ప్రామాణిక గ్రంథములు పురాణములే. "పురానవమ్ భవతీతి పురాణమ్" అనెడి యుత్పత్తి ప్రకారము పాతదైనను కొత్తదనిపెంచెడి కథావస్తువే పురాణము. 'పురాభవమ్ పురాణమ్' అనెడి యుత్పత్తి ప్రకారము పూర్వకాలము నందు సంభవించిన వృత్తాంతమే పురాణము.

ఇతి హాస పురాణములు పంచమ వేదములనెడి ప్రసిద్ధికలదు. కృష్ణద్వైపాయమని అనేక పురాణములు రచింపబడినవి. వీటిలో బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, నారద, మార్కండేయ, అగ్ని, భవిష్య బ్రహ్మ వైవర్త, లింగ, వరాహ, స్కంద, వామన, కూర్మ, మత్స్య, గరుడ మరియు బ్రహ్మాండ పురాణములనెడివి పద్దెనిమిది పురాణములు. ఇవి మహా పురాణములని చెప్పబడినవి.

వీటిలో శివపురాణము, లింగపురాణము మరియు స్కంద పురాణములందు వీరశైవ సిద్ధాంతము గురించి స్పష్టముగా వివరించబడినది.

శివపురాణములోని ఈ క్రింది ప్రమాణమును గనుడి :

శ్లో॥ 'శివభక్తో వసేన్నిత్యం శివలింగం సమాశ్రితః
స్థాణులింగాశ్రయేనైవ స్థాణుర్భవతి భూసురాః'
(శివపురాణము - విద్యేశ్వరసంహిత - ఆధ్యాయము - 16 శ్లోకము -159)

ఈ శ్లోకములోని భావమేమనగా శివభక్తుడు ఎల్లప్పుడు శివలింగధారియై యుండవలెను. ఈ విధముగా శివలింగమును ధరించినవాడు సాక్షాత్తుగా శివుడే యగుచున్నాడు.

ఇందులోనిదే యగు మరొక ప్రమాణమును గమనించుడి :

శ్లో॥ 'విభూత్యభ్యర్చనం కుర్యాద్విభూత్యాచ నివేదయేత్
పూజాంకృత్వాథ తల్లింగం శిరసాధారయేత్ సదా'
(శివపురాణము - వి.స. అధ్యాయము - 16 శ్లోకము -56-57)

ఈ శ్లోకములోని భావమేమనగా శివపూజాకాలమునందు శివభక్తుడు విభూత్యాది ఉపచారములతో తన అంగమును అలంకరించుకొని విభూతిచేతనే శివలింగమును అర్చించవలెను.

ఈ సందర్భమున తెలియజెప్పునదేమనగా పైన వుదహరించిన శ్లోకములు అరుణోదయరాయ అనబడెడి కలకత్తావాసి ముద్రణాలయమున ముద్రింపబడిన శివపురాణము నుండి గ్రహింపబడినవి.(ప్రకటన - 1890).

స్కంద పురాణము ఒక ముఖ్యమైన శైవపురాణము. శ్రీ ఖేమరాజ శ్రీకృష్ణదాస, ముంబాయివారు విక్రమ సం - 1965లో ఈ స్కంద పురాణమును ముద్రించిరి. స్కందపురాణములోని శంకర సంహిత, మదరాసు, మైసూరు, షోలాపురముల నుండి ప్రకటింపబడినవి. ఈ సంహితలోని 81 నుండి 86వ ఆధ్యాయముల వరకు వీరశైవ ధర్మము యొక్క తత్త్వములు ఎక్కువగా ప్రతిపాదించబడినవి. వీరశైవ మరియు ఇష్టలింగ అనెడి పదములు స్పష్టముగా నిర్వచింపబడినవి. ఈ పురాణములోని కొన్ని ప్రమాణములను కనుడి.

శ్లో॥ శిలాదేన మహాభాగా విచిత్రా లింగధారకాః
దేహస్యోపరి లింగమ్ తు ధృయతే హి పురాతనైః
'లింగేన సహ పంచత్వం లింగేన సహజీవితం'
(స్కందపు-కేదార ఖండము-అధ్యాయము-7 శ్లో-41-42)

ఇష్టలింగధారులు ఎంతో విచిత్రమైనవారు. వీరు లింగముతోనే జనించి లింగముతోనే మరణింతురు. గర్భము యొక్క ఎనిమిదవ నెలలోని ప్రాప్తమైన ఇష్టలింగమును భూగర్భమునకు పోవునపుడు జతకు తీసుకొని పోవుదురు.

శ్లో॥ 'ధారయదేవధానేన లింగమ్సద్గురుణార్పితమ్
ప్రమదాత్ పతితే లింగే ప్రాణానపి పరిత్యజేత్'
పతితే ప్రాణలింగే యో ధత్తే ప్రాణాన్నరాధమః
సచాండాల ఇతిజ్ఞేయః శివద్రోహిన తం స్పృశేత్
(స్కంద:పు: శంకరసంహిత-ఆధ్యా-83-శ్లో-67-68)

ఈ శ్లోకములోని భావమేమనగా గురువుల చేత పొందబడిన ఇష్టలింగమును అవధాన పూర్వకముగా దేహము మీద ధరించుకొనవలెను. ప్రమాదము చేత లింగము దేహము నుండి పడిపోయినచో ప్రాణమునే త్యాగము చేయవలెను. అవధాన త్యాగము చేయనివారు శివద్రోహియు, చండాలుడు అగుచున్నాడు. అట్టి వానిని ఎవరునూ ముట్టుకొనకూడదు.

**శ్లో॥ 'ఉరస్థలే హర్లింగం ధృత్వా శక్ర పురోగమాః**
**లింగస్థం మాం సమారాధ్య స్వం స్వ పదమవాసిరే**
**లక్ష్మీ సరస్వతీ ముఖ్యా దేవ్యో మల్లింగధారణాత్**
**ధృత్వా నిజాంగే తల్లీన భావా జగ్ముః పరమ్ సుఖమ్**
(స్కంద:పు: శంకర సంహిత, అధ్యా-84-శ్లో-43-44)

ఈ శ్లోకములోని భావమేమనగా విష్ణువు, ఇంద్రుడు మొదలగు దేవతలు తమ యెద మీద ఇష్టలింగమును ధరించుకొని లింగరూపియైన నన్ను పూజించి తమ తమ పదవులను పొందిరి. అటులనే లక్ష్మీ సరస్వతీ మొదలైన స్త్రీ దేవతలు ఇష్టలింగమును ధరించుకొని దానియందు తల్లీనమస్కులై పరమానందమును పొందుదురు.

లింగపురాణమనెడిది కాంచీపురమునకు చెందిన పువ్వాడ వెంకటరావుగారు ప్రకటించి నారనెడి విషయమును ఇంతకుముందే ముచ్చటించితిమి. వాటిలోని కొన్ని ప్రమాణములను గమనించెదము గాక.

**శ్లో॥ కీటో భ్రమర యోగేన భ్రమరో భవతి ధృవం**
**మానవః శివయోగేన శివో భవతి నిశ్చయం**
**... ... ... ... ... ... ... ... ... ... ... ...**

**ఆచార లింగం ప్రథమం, గురులింగం ద్వితీయకం శివలింగం తృతీయ స్యాచ్చరలింగం చతుర్థకం ప్రసాదం పంచమం లింగం, మహాలింగంతు షష్టకం, భక్తోమహేశ్వరశ్చైవ ప్రసాదీ ప్రాణలింగకః**
**శరణైకః స్థలైః షడిః క్రమాల్లింగముదాహృతమ్**
(లింగ పు. ఉత్తర భాగము అధ్యాయము-21 శ్లో-93, 123)

ఈ శ్లోకములోని భావమేమనగా భ్రమర కీటకము నిరంతరము చింతనలన నుండుటచే భ్రమరమగునటులనే మానవుడు శివయోగముచేత శివుడే యగుచున్నారు. నిరంతరము అంతరంగ బహిరంగములలో శివసంబంధము చేసుకొనుటచే ఇది సంప్రాప్తమగును. భక్త, మహేశ, ప్రసాది, ప్రాణలింగి, శరణ, మరియు ఐక్య స్థలములలోని సాధకులకు క్రమముగా ఆచారలింగము, గురులింగము, శివ లింగము, జంగమ లింగము, ప్రసాద లింగము మరియు మహాలింగము ఉపాసించుటకై తగినవై యున్నవి.

లింగపురాణములోని పై ప్రమాణమునకు అనుగుణముగా చూచిన యెడల వ్యాసుని కాలమునకు పూర్వమే శివదీక్ష, ఇష్టలింగధారణ, షట్స్థల ఉపాసనా పద్ధతి కొనసాగుతూ వచ్చుచున్నదని తెలియుచున్నది.

పూర్వోక్త వివరణ ప్రకారము తెలిసెడిదేమనగా ముఖ్యమైన శైవపురాణములు వీరశైవ ధర్మమును గూర్చి విస్తృతముగా చర్చించినవి యీ కారణము మూలముననే శివయోగి శివాచార్యుల వారు కొన్నిసందర్భములలో పురాణోక్తములను యథాతథముగా గ్రహించి, సిద్ధాంత శిఖామణి యందున పొందు పరచిరి.

జనసామాన్యమునకు తెలియవలెననెడి లక్ష్యముతో వేదాగమ పురాణాదుల నుండి పరిమిత విధిన శ్లోకముల నుదహరించనైనది. యింకను లోతుగా తెలిసికొనవలె ననెడి ఆసక్తిగల వారు శ్రీ మరితొంటార్యుని వీరశైవానంద చంద్రికను చూడగలరు. ఈ గ్రథములోని వాదకాండయందునగల తృతీయ ప్రకరణమున వేదాగమ పురాణాదుల నుండి ప్రమాణములను గొని లింగధారణ సిద్ధాంతము బహు సుందరముగా నిరూపించబడినది.

ఉరిలింగదేవుల వారగు ఉరిలింగపెద్ది, తన వచనములందున వైదిక మంత్రములను ఉద్ధరించి చూపి, లింగధారణ వేద సమ్మతమైన దేయని తెలియజెప్పిరి కనుడి.

**"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" ఎందెనిసువ లింగవు**

**"అత్యతిష్ఠ దశాంగలమ్" ఎందెనిసువ లింగవు**

**"శ్రుతిః చకితమభిధతేః" ఎందెనిసు వలింగవు**

**"అయం మే హస్తో భగవాన్ అయంమేభగవత్తరః"**

**ఎందెనిసి వంగవు**

**"ఏక మూర్తిః త్రిధాభేదం" ఎందెనిసువ లింగవు**

**శ్రీగురు లింగ జంగమ రూపాగి,**

**"ఇష్టప్రాణస్తథాభావం త్రిధాఏకం వరాననే"**

**ఎందుదాగి**

**ఈ త్రివిధపు ఏకీభవిసి, లింగ రూపాగి**

**ఎన్నకర స్థలక్కెందు కరతళామళకవాగి**

**ఆహా ఎన్న పుణ్యవే। అహాఎన్న భాగ్యవే। అహా తోరుత్తదానె ఎన్న సత్యవే**

**ఆహా ఎన్న నిత్యవే। శివ శివా। మహాదేవ మహాదేవ**

**నీనెబల్లె ఉరిలింగ పెద్ది విశ్వేశ్వరా।**

(వచన సాహిత్య సంగ్రహము, బెంగుళూరు, 1965, పుట137)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి;

**"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ"**

**అని యనిపించి కొనెడి లింగము**

**అత్యతిష్ఠ దశాంగులం"** అని యనిపించి కొనెడి లింగము

**"శ్రుతిః చకితమభి దత్తేః"** అని యనిపించికొనెడి లింగము **'అయు మే హస్తో భగవాన్ అయంమే భగవత్తరః"** అని యనిపించి కొనెడి లింగము.

**"ఏకమూర్తిః త్రిధాభేదం"** అని యని పించికొనెడి లింగము

శ్రీ గురులింగ జంగమ రూపముగా,

**"ఇష్ట ప్రాణ స్థథా భావం త్రిధాపకం వరాననే"**

అనినది గాన త్రివిధముగా ఏకీభవించి, లింగరూపమై

నాకరస్థలమునకు వచ్చి కరతలామలకముగా ఆహానా దోచుచున్నది. పుణ్యమా! ఆహ నా భాగ్యమా! ఆహా నా సత్యమా! ఆహా నా నిత్యమా! శివ శివా! మహాదేవ మహాదేవ

నీవే ఎరుగుదువు ఉరిలింగపెద్ది విశ్వేశ్వరా!

ఇష్ట లింగధారణ యొక్క ఇతిహాసము బహు ప్రాచీనమైనదని యీ బహు విధ ప్రమాణముల ద్వార తేటతెల్లమగుచున్నది. ఇది యిట్టులుండగా వేదమంత్రములకు విపరీతార్థముల నొసంగి, మనస్సుకు వచ్చినట్టు మాటలాడెడివారు వివేకవంతులగుదురే?

శ్రీ భగవత్పాదుల వారు "పవిత్రంతే వితతం బ్రహ్మణస్పతే" యనెడి ఋగ్వేద మంత్రమును, అఘోరాஉ పాపకాశినీ యాతే రుద్రశివాతనూః" అనెడి యజుర్వేద మంత్రము నుదహరించి యిష్టలింగధారణ వేద సమ్మతమైనదేయని తెలిపిరి. ఈ వేదమంత్రముల అర్థములను పరిశీలింతుము గాక, ఋగ్వేదమంత్రము యొక్క పూర్తి పాఠమును గనుడి!

**పవిత్రంతే వితతం బ్రహ్మణస్పతే।**
**ప్రభుర్గాత్రాణి పర్యేషి విశ్వతః**
**అతప్తతనుర్నత దామో అశ్నుతే।**
**శ్రుతాస ఇంద్వహంస్తత్య మాశత॥** (ఋగ్వేద సంహితా, 9-83-1)

శ్రీ నందికేశ్వర శివాచార్యులవారు, ఈ మంత్రమునకు ఈ క్రింది విధముగా అర్థము నిచ్చిరి.

హే!బ్రహ్మణస్పతే-లింగరూప శరీరావచ్ఛేదేన శరీరభావేనాధిష్ఠిత పరమశివ; తే=తవ; తత్=బ్రహ్మపద వాచ్య లింగ రూపం శరీరం, పవిత్రం=ఉక్తరీత్యా శుచ్యశుచి కాలేఽపి ధర్తుం యోగ్యం, వితతం-ఇష్టాది భేదేన, భక్తశరీరాది భేదేనవా, బహువిధం, ప్రభుః, నిగ్రహానుగ్రహసమర్థస్త్వం; విశ్వతః=సమస్తాని, సార్వవిభక్తి స్తసితి గాత్రాణి = భక్త శరీరాణి, పర్యోషి=వ్యాప్యోషి, ధార్యమాణఃసన్= లింగరూపశరీర ద్వారా, భక్తాంగ శరీరో2ఽసీత్యర్థః, అతప్తతనూఃతప్తా=వేధా, మను, క్రియా దీక్షా త్రయేణ నిర్దగ్ధ పాప పంజరా తనూర్యస్యసాన భవతీత్యప్తనూః దీక్షాత్రయ రహితః, ఆమః=అపరిపక్వాంతః కరణసన్, తత్=పర, శివస్వరూపం నాశ్నుతే
(లింగధారణ చంద్రిక (1950), పుట 125 & 126)

లింగపురాణములోని యీ క్రింది శ్లోకములైననూ, పూర్వోక్త వేదమంత్రములకు నదే విధమైన యర్థమునిచ్చినది కనుడి :

**బ్రహ్మేతి లింగ మాఖ్యాతం బ్రహ్మణ పతిరీశ్వరః।**
**పవిత్రం తద్ధి విఖ్యాతం త్సం పర్కాత్ తనుశుచిః॥**
**ఋగిత్యాహ పవిత్రంతే వితతం బ్రహ్మణస్పతే।**
**తస్మాత్ పవిత్రం తల్లింగం ధార్యశైవమనామయం।**
**అతప్త తనురజ్ఞోవై హ్యాఘీ సంసార లక్షణః।**
**దీక్షయా రహితః సాక్షాన్నాప్నుయాల్లింగ ముత్తమం।**
**యః కరోతి తపః పూర్వం సతప్త తనురుచ్యతే**
**పరిపక్వో విమోక్షాయ సోశ్నుతే లింగధారణం।**
**న కరోతపః పూర్వం సోఽతప్తతనురుచ్యతే॥** (లింగపురాణము, ఉత్తర భాగము, 21వ అధ్యాయము)

ఈ రెండు ప్రమాణముల యొక్క తాత్పర్యము తెలిసికొనుట జ్ఞాన ప్రదమగును.

"తల్లింగం బ్రహ్మశాశ్వతం", "లింగం బ్రహ్మ సనాతనం" అనెడి ప్రమాణమూల ప్రకారము పరబ్రహ్మ యనెడి పదము లింగమనెడి పదమునకు పర్యాయ పదమగును. బ్రహ్మపద వాచ్యమైన యిష్టలింగము నందున నధిష్ఠితమైన పరశివతత్వమే బ్రహ్మణస్పతి. ఈ రెంటికిని యభేదము గలదు. పరబ్రహ్మ తత్వమొక్కటే కదా! వివిధ భక్తులు వారి వారి స్థితిగతుల ననుసరించి యిష్టలింగ, ప్రాణలింగ, భావలింగ, అచారలింగ, గురులింగ, శివలింగ, జంగమలింగ, ప్రసాద లింగ మరియు మహాలింగము లనెడి యనేక పేర్లుగల లింగములను ధరించినా వీటి తత్వములో భేదముండదు. నిగ్రహానుగ్రహ సమర్థత గల్గిన లింగము, భక్తుల స్థూల, సూక్ష్మ మరియు కారణ శరీరముల యందున యిష్ట లింగ, ప్రాణలింగ మరియు భావలింగములుగా వ్యాప్తిని గొనును. శివదీక్షా సంస్కారము చేత అణవాది మలత్రయములను దూరము చేసి కొననిదే జీవించెడి అపక్వాంతరంగము గలవారు ఈ లింగమును పొందవలదు. శివజ్ఞాన సంపన్నులునూ, శివలింగమునకు శరణాగతి చేసిన వారును, ఈ లింగమును పొందెడి యర్హత గల్గియున్నారు.

ఇక్కడ గ్రహించ వలసిన విషయమేమనగా పరశివలింగము యెల్లప్పుడూ పవిత్రముగనే యుండును. అట్టి దానిని సద్గురువుల వారి వలన దీక్షా పూర్వకముగా పొందవలెను. దీక్షా సంస్కారమును చేయకుండగ, శ్రీ గురువు, లింగమును శిష్యునికి యివ్వకూడదనెడి నిషేధము గలదు.

మరొక విషయమేమనగా, దీక్షా యథేచ్ఛగా నిచ్చుటకు యెవ్వరికినీ సాధ్యపడదు. శిష్యుని యర్హతను గాంచి, శ్రీ గురువు సంతృప్తిని చెంది, లింగదీక్ష నివ్వవలెను. శిష్యుడు నపరిపక్వమలయుతుడైన యెడల, అతనికి దీక్షా సంస్కారము చేయుట కూడదు.

“మలోఽప్యామశ్చపక్వశ్చ భవేత్ సంసార కారణమ్” అని శివపురాణములో (7-1-31/32 తెలుపబడినది. క్రిందటి అనేక జన్మలలో చేయబడిన తపస్సుల చేత క్షీణమయ్యెడి మలమును పక్వమలమని యందురు. తద్విరుద్ధమైనది ఆయ మలము. పక్వమలముగలవాడే దీక్షను పొంది లింగమును ధరించుటకు అర్హుడగు చున్నాడు.

లింగపూజ చేయుటకై దీక్షను పొందుట తప్పని సరియని చెప్పబడినది. గురువు అనుమతిని పొందకుండా, ఏదోనొక మార్గమున నొక యిష్టలింగము వంటి లింగమును పొంది, అద్దానిని పూజించిన యెడల గల్గెడి ఫలమెయ్యది అనెడి సందేహము గలుగ వచ్చును. అట్టి అధీక్షితుని నుండి శివుడు కదలి వెడలి పోవునని తెలిపెడి యీ ప్రమాణమును గనుడి.

**యథా మృగపతిం దృష్ట్వా భీతోయాతిపనే గజః।**
**అదక్షితోఽర్చయేల్లింగం తథైవాహం మహేశ్వరీ॥** (దీక్షాబోధ)

అడవిలోన సింహమును చూడగనే గజమే విధముగా దూరముగా వెడలిపోవునో, అదే విధిన యదీక్షితుని గాంచి శివుడు వెడలిపోవునని చెప్పబడినది. క్రూర జంతువు యొక్క క్రూరత్వమెట్టిదో, దీక్షను పొందని శివారాధకుని దోషము యొక్క గరిమ అట్టిదని గుర్తించవలెను. అట్టివాడు తపస్సు ద్వారా తన మలమును క్షీణింపజేసికొనుటకై ప్రయత్నించవలెను.

మహారాష్ట్రకు చెందిన సంత శిరోమణియైన శ్రీ మన్మథ స్వామిగారు, తమ పరమ రహస్య మనెడి గ్రంథమున, యీ విషయమును గూర్చి యీ క్రింది విధముగా వ్రాసిరి.

**శివదీక్షా ఝూలావిణ। జో మూఢ కరీశివపూజన।**
**తో పామర జీవ వ్హణూన। దేవపూజన నఘేతి త్యాచీ!** (పరమరహస్యము, 7-90, పుట-78)

మూర్ఖుడు, దీక్షా రహితుడై శివపూజను చేసిన యెడల యెట్టి ఫలమూ ఉండదని శ్రీ మన్మథ స్వామి వాక్కు తెలుపుచున్నది.

ఇష్టలింగసంబంధము వలన దేహము పవిత్రమగును. ఇంతటి వ్యక్తికి భూతాదులు సోకవని తెలిసికొనవలెను. “పవిత్రం తే వితతు బ్రహ్మణస్పతే” అనెడి వేదవాక్కు ఈ విషయమునే బలపరచుచున్నది.

ఇక మీద, శ్రీ రేణుక భగవత్పాదుల వారు నుదహరించిన ఋగ్వేదము వలెనే గౌరవింపబడెడి యజుర్వేదములోని మంత్రార్థమును విచారింతుముగాక.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు నుదహరించిన యజుర్వేద మంత్రము యొక్క పూర్ణ పాఠమును గనుడి.

**శ్లో॥ “యాతే రుద్ర శివాతనూ రఘోరాఽపాపకాశినీ।**
**తయానస్తనువా శన్తమయా శంతమాయా గిరిశంతాఽభిచాకశీహి॥**
(యజుర్వేదీయము, రుద్రాధ్యాయము, నమకము ప్రథమోను వాకము)

శ్రీ నందికేశ్వర శివాచార్యులవారు, తమ లింగధారణ చంద్రిక యందున, యీ శ్రుతి యొక్క అర్థమును గూర్చి క్రింది విధముగా వివరించిరి.

రుదం = రోదనం, సంసార దుఃఖ జనితం ద్రావయతీత రుద్రః। రుద మజ్ఞానం ద్రావయతీత రుద్రః। హేరుద్ర! అఘోరా=శాంతాకారాశివా! సర్వ మంగళ ప్రదా, యాతే తనుః=లింగరూప శరీరం, సా అపాపకాశినీ =లింగరూప శరీరావచ్ఛిన్నః శివః శమ దమ సంపన్నః భక్తగాత్రే ధార్య పర్యావసితార్థః

(లింగధారణ చంద్రికా, పుట 122)

శ్రీ నందికేశ్వర శివాచార్యులవారు, వ్యాస మహర్షి పూర్వోక్త శ్రుతి వాక్యముల కిచ్చిన, అర్థమునే గ్రహించి యుండునని తెలిపెడి పరమప్రమాణములు లింగపురాణము నందు లభించుచున్నవి. శైవపురాణములలో పేరెన్నిక గనిన దగు లింగపురాణములోని యీ క్రింది శ్లోకములను పరికించుడి.

**శ్లో॥ యాతే శివా తనూరుద్ర లింగం మంగళదాయకం।**
**లింగం శివాతనూః ప్రోక్తా మూర్తి ఘోరాతనుః స్మృతా॥**
**అపాపేషుచ భక్తేషు తయోర్మధ్యే శివాతనో।**
**కాశతే పరమేశస్య శిష్టాస్తే లింగధారిణః॥**
**తయా శంతమయా, సౌఖ్యకారిణ్యా లింగరూపయం**
**అభిచాకషీః తను వాగిరీశం తాభి రక్షతామ్"** (లిం.పురాణము)

పూర్వోక్తమైన శృతి, భాష్యము మరియు పురాణోక్తుల యొక్క తాత్పర్యము ఈ క్రింది విధముగా గ్రహించవలెను.

వేదముల యందు యజుర్వేదము, దానిలో శ్రీ రుద్రము అందులో ఎనిమిదవ అనువాకము, ఆ అనువాకములో పంచాక్షరీ మంత్రము ఉత్తమోత్తమమైనవని చెప్పబడుచున్నది. ఈ క్రింది రూపమును గనుడి.

**విద్యాసు శృతిరుత్కృష్టా రైద్రైకాదశిని శ్రుతౌ**
**తత్ర పంచాక్షరీ తస్యా శివ ఇత్యక్షరద్వయం॥**
**"రోదనం దావయతీతి రుద్రః" ఋదం అజ్ఞానం ద్రావయతీతి వారుద్రః"** అనెడి వ్యుత్పత్తుల మేరకు

జీవులు జనన మరణ సంసార దుఃఖమునందుగాని, జీవనము వరించిన అణవాది మలత్రయరూప అజ్ఞానములను గాని నాశనము చేశెడి కారణము చేత శివునికి రుద్ర అనెడి పేరు వచ్చినది. ఈ రుద్రునికి ఘోర, అఘోరములనెడి రెండు శరీరములు గలవు.

**"లింగమ్ శివా తమూః ప్రోక్తా మూర్తి ఘోరాతనుస్మృతా"**

అనెడి వ్యాసుని వచనము ప్రకారము పరశివుని లింగరూప దేహము అఘోరమైనది. అనగా శాంత స్వరూపమైనది. ఇంకా చరకరణాద్యవయవములు గల సర్పము, త్రిశూలము, వ్యాఘ్రాజనములు మరియు చంద్రుడు, గంగ, గిరిజ యిత్యాదులుగ కూడుకొని యుండెడి శరీరమే ఘోరమైనది. ఇంకను దీనినే ఘోర రూపమని పిలుతురు.

"లింగంతు శివయోర్దేహః" అనెడి వాక్యము ప్రకారము వీరశైవులు ధరించెడి యిష్టలింగము శివ శక్తుల యొక్క అభిన్న దేహము. ఇది అఘోరమై, మంగళమయమై వుండును. ఇది అపాపకాశినియై యుండును. అపాపకాశిని యనగా "అపాపేషు, భక్తేషు, కాశితా ఇతి అపాపకాశినే" అనెడి ప్రమాణము ప్రకారము పాపరహితులైన భక్తుల శరీరముల మీద ఎల్లప్పుడూ ప్రకాశించెడిది. పాపాధిక్యత గల వారికి శివుని చిహ్నములైన లింగము, భస్మము, రుద్రాక్ష వంటి వాటి మీద సహజమైన ద్వేషము వుండును. ఈ విషయమున సిద్ధాంతశిఖానోపనిషత్తు ఈ క్రింది విధముగా తెలియజెప్పినది.

**శ్లో॥ పాపపూర్ణస్య మర్త్యస్య త్రిపుంద్రోద్ధూళనే శివే।**
**రుద్రాక్ష ధారణే ద్వేషః స్వత ఏవ ప్రజాయతే॥** (సి. శిఖోపనిషత్తు–శ్లోకం–7)

ఈ ప్రమాణము ప్రకారము పాపిష్టులయి మనుష్యులు శివలింగము గురించియు, భస్మోద్ధూళనము గురించియు, భస్మత్రిపుంద్రధారణ గురించియు, రుద్రాక్షధారణ గురించియు ద్వేషాతిశయమును కలిగివుందురు.

ఈ కారణము మూలమున తెలిసెడిదేమనగా ఇష్టలింగము ధరించవలెననిన దోషనివారకములైన త్రివిధ దీక్షా సంస్కారములుపరమావశ్యకములై యున్నవి. ఈ దీక్షల ద్వారా పరిశుద్ధాంతరంగులైన భక్తుల స్థూల శరీరము మీద ఇష్టలింగరూపముగను, సూక్ష్మ మరియు కారణ శరీరముల

మీద ప్రాణ లింగ, భావలింగ రూపములుగను ఈ లింగరూపమైన రుద్రుడు ప్రశాంతమూర్తిగా సదా ప్రకాశమానముగా దోచుచుండును. మరొకమాటలో చెప్పాలంటే అఘోరరూపమైన ప్రశాంతము, మరియు మంగళమయత్వముగల ఇష్టలింగ, ప్రాణలింగ, భావలింగమనే యా ముగ్గురు మూర్తులచే భక్తుడు లింగ శరీరియై మంగళమయుడై మంగళకారకుడై లోక కళ్యాణమును సాధించుచున్నాడు. ఇదియే 'యాతేరుద్ర శివాతమాః' అనెడి మంత్రము బోధించెడి భావము యొక్క తాత్పర్యము.

ఈ విధముగా వేదాగమోపనిషత్ పురాణేతిహాస ప్రసిద్ధమగు ఈ యిష్టలింగమును ధరించిన యెడల 'తస్మాచ్చైవోఘ వర్జితః' అనెడి జగద్గురువు రేణుకాచార్య భగవత్పాదుల వారి ఉపదేశము ప్రకారము అంతరంగములోను బహిరంగములోను మంగళకారకమగు లింగమును ధరించిన శివభక్తుడు సర్వ విధములయిన పాపముల నుండి ముక్తిని బడసి జగత్తునందు సర్వోత్కృష్టుడై శోభించుచున్నాడు.

ఈ ప్రవచనము నందున ఇచ్చటివరకు వేదకాలము నుండి ప్రారంభించుకొని వచన కాలము వరకు వెలువడిన సకల ప్రమాణముల చేత వీరశైవ సిద్ధాంతము యొక్క అంతర్లింగ మరియు బహిర్లింగముల స్వరూప స్వభావములను తెలిసి కొంటిమి. లింగధారవిధి మరియు పూజా పద్ధతులను కూలంకుషముగా విచారించనైనది. భక్తి శ్రద్ధలు గలిగిన వీరశైవులు ఈ శ్రేష్ఠమైన ధర్మ స్వరూపమును గుర్తెరిగి అవశ్యముగా ఈ ఉత్కృష్టధర్మమునాచరించవలెను. అప్పుడే మనము గ్రంథోపదేశకులైన శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారి కృపకు పాత్రులమయ్యెదము.

ఈ విధముగా లింగధారియు, సంయమన చిత్తుడు, శివలింగారాధకుడు అగు వీరశైవుడు సర్వదోషముల నుండి విముక్తిని ప్రసాదించెడి లింగపూజాంతర్భాగమైన భస్మధారణను శాస్త్రోక్త పద్ధతిలో ధరించవలెను.

ఇది శ్రీ శివయోగి శివాచార్యులవారి ప్రణీతమైన సిద్ధాంత శిఖామణి యొక్క భక్తస్థలాంతర్గతమైన లింగధారణ్థలమును గురించిన ఆశీర్వచనము సంపూర్ణమైనది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 19-08-1990

స్థలం : **శ్రీ సిద్ధేశ్వర దేవస్థానము, షోలాపూర్**

ఇది షష్టమ పరిచ్ఛేదము

దీనితో శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభ గ్రంథమున ఆరవ పరిచ్ఛేదము సంపూర్ణమైనది.

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు లింగధారణకు సంబంధించిన వేద ప్రమాణముల నెల్ల విపులముగా వివరించిరి.

భక్త స్థలమున నున్న భక్తునకు శ్రద్ధా భక్తులు నెంత మెండుగా నుండిన యెడ నతని ప్రగతి అంత గుణాత్మకముగా నుండును. ఈ శ్రద్ధ యొక్క పెరుగుదల నమ్మక విశ్వాసముల మీద నాధారపడి యుండును. గురుదత్తమైన యిష్టలింగము సామాన్యమైనది కాదనియును, విశ్వవ్యాపకమై యుండి, అగమ్యమగోచరమైన లింగము తన మేనిన యున్నదనెడి భావన నతడు పొందవలెను. ఇట్టి భావన పెంపొందించెడి విధముగనే గురూపదేశము నుండవలెనని తెలిపెడి యంశముల క్రియా దీక్ష విధానములో గలవు. స్వాయత్త దీక్ష నొసంగునపుడు శ్రీ గురువు యొక్క యుపదేశము నీ క్రింది విధముగా నుండునని తెలియుచున్నది.

**హే వత్స! ఎతదేవ ఖలు సర్వతీతం పరవస్త్వితి**
**అను చాతయ!**
**హే వత్స ఇదమేవహి అజహర్యోరపి దుర్లక్ష్యం**
**నిజతత్త్వమితి నిశ్చిను।**

ఈ యుపదేశ ఖండకల భావమీ క్రింది విధిన నుండునని గ్రహించగలరు.

ఓ వత్సా! ఈ యిష్టలింగము సర్వతత్త్వాతీతమైన పరవస్తువు.

ఓ వత్సా! బ్రహ్మవిష్ణువులకైనను దొరకని దుర్లభమగు నిజతత్త్వమిది.

ఈ యుపదేశములో నున్న యంశములు గమనార్హమై యున్నవి. శివుడే పరబ్రహ్మ. ఈ శివ పరబ్రహ్మ "అప్రమేయ మగోచర అభేద్యమైన లింగము" రూపమున నుండును.

ఈ తత్వము షట్ త్రింషత్ తత్త్వాల కతీతముగా నుండే మూల తత్త్వము. శివతత్త్వము యీ ముప్పది యారు తత్త్వములలోని దొకటై యున్నదని గ్రహించవలెను. శక్తి తత్త్వము కూడ నట్టిదే. ఈ లింగతత్త్వమే జగదుత్పత్తిలయలకు మూల స్థానమగుచున్నది. దీనినే పరవస్తువని యందురు. బ్రహ్మ విష్ణువులును నీ పరతత్త్వమును గాంచలేక పోయిరనెడి యొక పౌరాణిక గాథ కలదు. ఈ వివరములను నింతకు క్రితమే శ్రీ విద్యావాచస్పతి వారు తెలియజెప్పిరి. అయితే నా పరవస్తువే శ్రీ గురువు కరుణాకటాక్షము వలన మన హస్త తలమునకు వచ్చినదని భావించి కొన వలెననెడిది స్వాయత్త దీక్షలోన చెప్పబడినది.

భావమనెడిది చాల ప్రభావశాలియగు గురు తరాంశము. భావమెట్టులో సృష్టి యటుల గోచరించును. రజ్జు సర్పభ్రాంతి గూర్చి శ్రీ శంకరుడు చెప్పెను. 'జగన్మిథ్యా' భావమును పెంపొందించి కొనవలెనని యతడు చెప్పి యుండెను. యద్భావం తద్భవతి యనెడిది పండితోక్తి. వీరశైవము శ్రీ శంకరాచార్యుల వారి జగన్మిథ్యా భావము నంగీకరించలేదు. జగత్తు సత్యమనిరి. ఈ జగత్తు ఈశ్వర నిర్మితమనియును, ఈశ్వరుడు నీ జగత్తులో నణువణువునా యుండునని భావించవలెనని తెలిపిరి. ఆ ఈశ్వర తత్త్వము నకు మించినది లింగతత్వమనియును, ఆ లింగమే శ్రీ గురువు కరుణ వలన మనకు దత్తద చేయబడినని భక్తుడు భావించవలెనడిది, గ్రహించవలసిన విషయము.

ఇట్టి భావ పుష్టిని పెంచికొనుట యనెడిది సులభ సాధ్యమైన విషయము కాదు. తన పూర్వాశ్రమ మున నుండెడి సంస్కారములు మూలమున అవరోధము లేర్పడెడి యవకాశములు గలవు. పూర్వాశ్రయమునకు చెందిన బంధుమిత్రాదుల వలన గల్గెడి సాంగత్య దోషము వలన నవరోధములు పెరుగవచ్చును. కాలాంతరమున భక్తుడు భవిగా పరివర్తన చెంది పతనమయ్యెడి యవకాశము కలదు. శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచన మీ విషమును విశద పరచుచున్నది.

**హుటుపల్లిభవి, మరళి భక్తన మాడి,**
**పూర్వాశ్రియప కళెదు**
**హొందువల్లి భవియాగి హోహరముట్టలాగదు**
**అవన ముట్టిదవ మున్నవెప్రతగేడి**
**అవన శ్రద్ధకాలవే శ్వాసమాంస**
**క్రియాకారవె క్రిమిగళు, తద్దినవెమద్యమాంస**
**ఇదు కారణ, కూడల సంగమ దేవా**
**అవన మనెయ విచారిసదె హక్కవంగెనాయ్య కనరక** (బసవ. వ. 674)

ఈ వచనపు తెలుగు రూపమిది!

**పుట్టువునందు భవి, మరలి భక్తుని చేసి,**
**పూర్వాశ్రయమును గడచి,**
**పొందుటయందున భవియై పోవు వారిని ముట్టకూడదు.**
**అతనిని ముట్టిన వాడు మున్నున వ్రత చేటు**
**వాని శ్రద్ధాకాలమే శ్వానమాంసము**
**క్రియాకారమే క్రిములు, తద్దినమే మద్య మాంసము**
**ఇది కారణము కూడల సంగమ దేవా!**
**వాని యింటికి విచారించక పోవువానికి**
**నాయక నరకము** (అనువాదము డా॥ మ.లి.స్వామి)

ఈ విధిన పతన మయ్యెడి వారిని రక్షించుటయే శివాచార్యుల కార్యమై యున్నది. మఠార్యులు మహిమాన్వితమైన పాత్రను పోషించవలెను. మడపతులు నచ్చు జెప్పవలెను. సుఖాబస్తు జంగమయ్యలు సుజ్ఞానప్రదానము చేయవలెను. సద్భక్తులు సక్రియాత్మక పాత్ర నిర్వహించవలెను. వీరు చేయవలసిన దేమిటో శ్రీ భగవత్పాదుల వారు సూత్రప్రాయముగా బోధించిరి.

వీరశైవమెంతో ప్రాచీనమైన ధర్మము. వేదాగమములకు సమానమైన ప్రాముఖ్యత నివ్వబడినది. ఇది ఆగమములలోని యుత్తర భాగమున వివరింపబడిన శైవ సిద్ధాంతమునకు చెందినదని తెలుపుచు, డా॥ చిలుకూరి నారాయణరావుగారు, పండితారాధ్యచరిత్ర, యనెడి గ్రంథమున నీ క్రింది విధముగా వ్రాసిరి.

"భిన్నా చారములతో కూడినట్టిన్ని, భిన్నార్థ ప్రతిపాదకములయినట్టిన్ని, అనేక సిద్ధాంతములు భిన్నరుచికరములై ప్రబలినవి, సాంఖ్యము, యోగము, పాంచరాత్రము, వేదమతము, పాశుపతము ఇవన్నీ వేదముల నాశ్రయించినవే. కాని, అవి వేదములోని కొన్ని భాగములను మాత్రమే తీసికొని తక్కిన వాటిని విడిచి పెట్టుతని. శైవ సిద్ధాంతమట్లు కాక సమస్త వేదమును ఆశ్రయించినది. కాబట్టి అది అన్ని సిద్ధాంతముల కంటెను ఉత్తమమైనది. కాబట్టి అది వేదము వలె పరమ ప్రామాణ్యము పొందుచున్నది".

వాస్తవ మిట్టులుండగా కొందరనవసరమైన యపోహలను కల్గించుచుందురు. భక్తుడు తికమకకు గురియయ్యెడి యవకాశము గలదు.

భక్తుని నమ్మకము పెంచుటకై క్షేత్ర స్థాయిలో గురుస్థానమున నున్న 'మఠమయ్య' మరియు నతని శిష్యగణము వేద ప్రమాణములను చూపి లింగధారణ యొక్క ప్రాశస్త్యమును జనులందరికీ తెలియజేసి జనాభిప్రాయము లింగధారణకు సుముఖముగా నుండునటులను కృషి చేయవలసి యుండును. ఇదియే భగవత్పాదుల యాశయమై యుండెను.

ప్రమాణముల గురించి శ్రీ చంద్రశేఖర శివాచార్యుల వారు పిండస్థలమున వివరించిరి. ప్రమాణములన్నింటిలోను వేదప్రమాణములకే యెక్కువ ప్రాముఖ్యత గలదు. బాదరాయణుల వారు, వేదములను మాత్రమే ప్రమాణములుగా గైకొనిరి. బాష్యకారులును నీ మార్గమునే యనుసరించిరి. ఆగమములకును సమానమైన ప్రాముఖ్యత యున్నది. పురాణములకు తరువాతి స్థానం లభించును. కొన్ని శైవ పథములు నాగమములను మాత్రమే పరమ ప్రమాణములుగా స్వీకరించినవి. అందుచేత, వీటి కంత ప్రచారము లభించలేదు.

శ్రీ భగవత్పాదుల వారు కొన్ని మంత్రములను సూచన ప్రాయముగా నిచ్చి, వేదములలో లింగధారణ ప్రతిపాదింపబడినదని తెలిపిరి. వీరశైవ భాష్యకారులైన శ్రీ కంఠుడు, నీలకంఠుడు, శంకరుడు శ్రీ భగవత్పాదుల వారి భావములకు విస్తృత ప్రాతిపదికను కల్పించిరి. సోమనాథుని వంటి వారు వేదాగమ పురాణాదుల నుండి ప్రమాణములను గ్రహించి భాష్యములు వ్రాసిరి. భాష్యములలోని భావములను తెలుగువారికి తెలియపరచుటకై యనుభవసారము, చతుర్వేద సారము, పండితారాధ్య చరిత్ర యనెడి గ్రంథములు సోమనాథుని చేత రచింపబడెను.

చతుర్వేద సారములోని యీ క్రింది పద్యమును గనుడి;

**సీ॥ నియతి ప్రహర్షంబు మెయి 'బ్రాణ లింగం 'ధ**
**రేత్సుధీ' యనుచును సారెకును బలుక**
**నర్థియై 'ధారయే ద్యస్తు హస్తేన' లిం**
**గాకారమనుచు నస్తోక లీల**
**నవిరళప్రీతియై 'శివ లింగధారణం**
**కుర్యా"త్తనుచు నతి ధైర్య లీల**
**నొనర 'వక్త్రాథార్య నోచ్ఛిష్టమితి నిశ్చి**
**తంబ'నుచు బురాణ తతినుతింప**

**గీ॥ సారముగ 'శివాతనూరఘోరాపాప**
**కాశిని "యను శ్రుతులు గలుగునట్ల**
**చదివి చదివి దుష్ట జనులు లింగ**
**బాహ్యులగుటదేమి? బసవ లింగ!** (చతుర్వేద సారము, ప.64)

ఈ విధిన ప్రమాణములను చూపెడి పద్యములెన్నియో గలవు.

పండితారాధ్య చరిత్రలో నివ్వబడిన ప్రమాణములలో ఋగ్వేదమునకు సంబంధించినవి యీ క్రింది విధముగా నున్నవి.

**సీ॥ "మఱి లింగ ధారణ మహిమ వేదముల**
**నెఱగరే నదియు దా నెయ్యది యనిన**
**నదిగాదే ఋక్స్యూక్తి యను భవ రోగ**
**బిద 'మయం మే విశ్వ భేషజో, యనగ**
**రతి 'యం శివాభిమర్శన' నాగమతిని**
**యతి 'నయంమాతా అయం పితా' యనగ**
**నట 'జీవాతురాగమా' త్తనగ**
**ఘటియిల్లు ముంజేతి కంకణమునకు**
**దర్పణం బేల యంద 'యిదం తవ ప్ర**
**సర్పణ' మ్మంచు ఋక్సంహిత సాటి** (పండితారాధ్య చరిత్ర దీక్షాప్ర.)

యజుర్వేదము నుండియును ప్రమాణముల నిచ్చుచు శ్రీ సోమనాథుల వారు నంత్యమున నీ క్రింది విధిన వ్రాసిరి:

**నోమి 'నా నిటు జగన్నుతి నిశ్చయించు**
**నామహానీర్తత్ర సూత్రార్థమయ్యాది**
**జను రుద్రసూత్రార్థ సరణి దానెట్టు**
**లన 'నఘోరాంగుడవైన యోరుద్ర!**
**మొగి నీ మహాలింగమూర్తి యట్లొప్పె**
**నగ నవినాభావ సంబంధలీల**
**జనన పాపుల యంద సరిప్రకాశించు**
**నని యెదు గాన నిరంతర లింగ**
**సహితులు, భువి పాపరహితులిమ్మాడ్కి** (పండితారాధ్య చరిత్ర దీక్షా, ప్ర)

ఈ బహువిధ ప్రమాణముల దృష్ట్యా, క్రియాదీక్ష వలన లింగమును పొందిన భక్తుడు నా లింగము యొక్క మహిమ నెరింగి సదా మేనిన ధరించెడి పూనికను, తన దేహము నుండి తీయననెడి ఛలమును పెంపొందించికొన వలెనని గుర్తించగలరు.

లింగము అందరికీ సులభముగా లభ్యమయెయడిది కాదు. సంచిత పుణ్యము, పాపరాహిత్యము పొందిన వాడే లింగధారణ కర్హుడు. జ్ఞానసంపన్నుడైన వాడేయిష్టలింగమును పొందగలడు. గురు కారుణ్య మెంతో నవశ్యము. అది లేనిది లింగము ప్రదానము చేయబడదు. త్రివిధ దీక్షల చేత త్రివిధ మలము దగ్ధము చేసికొనిన వాడే లింగ ధారణకు అర్హుడగును. ఇవి సాధించ కుండగ లింగమును పొందుట దుస్సాధ్యమైన విషయము.

ఈ విషయము లన్నియును పిండస్థలమున చెప్పబడినవి. పిండజ్ఞాన స్థలమున విస్తరించబడినవి. సంపారహేయ స్థలమున సమీక్షింపబడినవి. లింగ స్థలము యొక్క ప్రారంభమున పరామర్శింపబడినవి. లింగధారణకు అర్హుడైన వానినే గురువు గ్రహించును. కరుణను ప్రధానము చేయును కదా! ఈ సందర్భమున వీటిని మరల యెందులకు చెప్పబడినవో తెలిసికొనవలసి యున్నది.

ఈ అర్హతలు గల వారి సంఖ్య పరిమితముగనే యుండుననెడిది యదార్థమైన విషయము. అర్హతలు లేని వారికి లింగ ధారణ చేసెడి గురువులుందురనెడిది వాస్తవము కాదు నిజమై నీ గురువు నిట్టి పనులను చేయడు. ఈ విషయములన్నియును గురు కారుణ్య స్థలమున తెలిసి

కొంటిమి. అల్ప సంఖ్యలో నున్న లింగాంగులు అధిక సంఖ్యాకుల ఆచార విచారముల చేత ప్రభావితులయ్యేడి యవకాశము గలదు. లింగధారులకు విహితము కాని కొన్ని యాచార సాంప్రదాయముల యెడల ఆసక్తి పెరుగ వచ్చును. ఆసక్తి యనురక్తిగాను, యనురక్తి ప్రగాఢమైన వాంఛగాను పరిణామము పొందవచ్చును. విపరీతమైన బ్రాహ్మణీకరణను పొందిన వారిని యిచ్చట యుదాహరణగా తీసికొనవచ్చును. బ్రాహ్మణాచారముల నలవరచికొని యవియే యనుసరణీయమని తెలుపుచుందురు. వీర శైవాచారముల యెడ క్రమక్రమముగా విరక్త భావన పొందవచ్చును. ఇట్టివారు కాయమున లింగమును ధరించియును మనమున యజ్ఞోపవీతమును ధరింతురు. బుద్ధిని కర్మాచరణవైపు మరల్చెదరు. అహంకార పూరిత యంతరంగము గల వారై తాము చేయునదే శాస్త్రబద్ధమని పిడివాదమును చేయుదురు. వీరశైవాచారములను నిందింతురు. పంచాచారములను పాటించెడి వారి యెడ ద్వేషము పెంచి కొనెదరు. కాల క్రమములో వీరు పతనమును పొందుదురు. ఇట్టి వారిని "లింగభవు"ల నియందురు. త్రికరణ శుద్ధి లేని లింగధారిని లింగభవి యన వచ్చును. ఇట్టి వారిని, బసవాది శివశరణులు నిరసించిరి. వివరములు గోరువారు బసవన్న వారి, తామస నిరసన స్థలమున చెప్ప బడిన వచనములను గనుడి.

'లింగ భవి' వర్గములో బ్రాహ్మణేతరములును, వీరశైవేతరములును అగు సాంప్రదాయముల వైపు మొగ్గు చూపెడి వారు గలరు. ఆర్య సమాజము, బ్రహ్మ సమాజము, బ్రహ్మకుమారీ పథము, ఇత్యాదుల చేత ప్రభావితులయ్యేడి వారు కొందరైతే, మనస్సుకు నచ్చిన దీక్షలను పొంది మండల కాలము పర్యంతము మరో ప్రపంచములో విహరించెడి వారు మరి కొందరు. ఇంక కొందరు హైందవేతర మార్గమున పయనిస్తూ బాబాల చుట్టూ దర్గాలచుట్టూ తిరిగెడి ఆసక్తిని ప్రదర్శించుచున్నారు.

ఈ విధముగా వీర శైవేతర మార్గములలో పయనించెడి వారిని పతనము కాకుండగ పరిరక్షించుటకై శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము నుద్దేశింపబడినది. ఎంతో దుర్లభమైన లింగ ధారణ లభించిన వారు నసాధారణులనియును, వారు సాధారణ జనుల వలె ప్రవర్తించ వలదని శ్రీ భగవత్పాదులు చెప్పియున్నారు. భక్తుడైన పిండుడు పిండ స్థల లక్షణములను విడనాడవలె ననెడిదే యంతర్గతముగా నున్న భావన. ఇట్టి భావన పెంపొందించుకొన్న యెడల ఆధ్యాత్మిక ప్రగతి సిద్ధించదు. వైయక్తిక ప్రగతి లేనిది సామూహిక సంక్షేమము చేకూరదు. అందుచేత లింగధారి సావధాన చిత్తుడై వీరశైవేతర సాంప్రదాయముల నుండి దూరముగా నుండవలెను.

వీరశైవ ధర్మమున యష్టావరణము లెంతో ముఖ్యమైనవనింతకు క్రితమే తెలిసి కొంటిమి. వీటిలోని దొకటగు భస్మము గురించియును, తత్సంబంధమైన వివిధ ధారణా పద్ధతులును తరువాతి స్థలమున వివరింపబడును. లింగధారణ మరియు భస్మధారణ పరస్పరము అనుబంధముగల యంశములని తెలపుటకే యీ స్థలమున భస్మధారణ గురించి సూచన ప్రాయముగా తెలియజేయబడినది. భస్మము ధరించుట లింగధారికి తప్పనిసరియని తెలపుటయే యీ సూచనలోని యంతరార్థము.

పాల భాగమున భస్మత్రిపుండ్రములను ధరించుటయే విహితమని మున్ముందు తెలిసి కొనగలము. ఇది యిట్టులుండగా, లోకాచారములో వివిధ విధానములు ప్రచలితమై యున్నవి. గంధమును ధరించెడి వారు కొందరైతే, కుంకుమను పెట్టికొనెడి వారు నింకా కొందరు. నుసిపెట్టికొనెడి వారును గలరు. ఈ వస్తువులలో బిందువు, అర్ధచంద్రము, ఊర్ధ్వపుండ్రములు, అడ్డపు రేఖలు మొదలగు ఆకారములలో ఫాలము నలంకరించికొనెడి లౌకికులెందరో నున్నారు. వీరి వలెనే లింగధారి ఆయా ముద్రలను ధరించెడి యవకాశము గలదు. ఇట్టి వారిని కొందరిని చూడగలము. ఇవి అన్నియును పిండుడిగా యున్న దశలో దరింపదగినవి. శివభక్తి ప్రబలి పిండుడు భక్తుడైన పిదప నీ ముద్రలను ధరించుట విహితము కాదని గ్రహించవలెను.

భస్మధారణ వలన శివభక్తి దిన దిన ప్రవర్ధమానమగును. లేని యెడల, నయ్యది సన్నగిల్లెడి యవకాశము గలదు. కుంకుమ ధారి శాక్తేయము వైపు మొగ్గు చూపవచ్చును. గంధ ధారి మధ్వ సాంప్రదాయి యై కృష్ణ భక్తిని పెంచికొన వచ్చును. ఊర్ధ్వ పుండ్రధారి వైష్ణవము వైపు తిరుగవచ్చును. శివభక్తి తగ్గితే తిరోగమనమే కదా! భక్తుడు లౌకికుడగుచున్నాడు. లౌకికునికి భవ బాధలు తప్పవని శ్రీ భగవత్పాదుల వారు పిండ స్థలముననే నుపదేశించిరి.

– శివం భూయాత్ –

# సప్తమ పరిచ్ఛేదము
# భస్మధారణ స్థలము

## ఆశీర్వచనము - 1

**శ్లో॥ భస్మధారణ సంయుక్తః పవిత్రో నియతాశయః ।**
**శివాభిధానం యత్ప్రోక్తం భాసనాద్భాసితం తథా ।**
**మహాభస్మేతి సంచింత్య మహాదేవం ప్రభామయం ।**
**వర్తంతే యే మహాభాగా ముఖ్యాస్తే భస్మధారిణః ॥** (సి.శి. 7 : 1-2)

"స యేష భస్మ జ్యోతిః" జాబాల । శ్రుతి వాక్యమున శివునికి భస్మమనెడి పేరు ప్రతిపాదింపబడినది. శివతత్త్వమును భాసిల్లజేయును గావున దీనికి భస్మనెడి పేరు గల్గినది. ఇట్టి భస్మము నెవ్వరు ధరింతురో వారు పవిత్రులుగను, నియతాశయులుగనూ అగుచున్నారు. పరమాత్మను "మహాభస్మ"మని భావించుటయే యనెడిది నిరుపాధిక భస్మమనియు, ఈ నిరుపాధిక భస్మమును ధరించుటయే ముఖ్యమైన భస్మధారణయని అందురు. ఈ విధమున భస్మమును ధరించినవాడే నిరుపాధిక భస్మధారులు.

## నిరుపాధిక భస్మధారణః

భస్మధారణ, స్వేష్టలింగ పూజ యనెడి నిత్యకర్మకు ప్రధానాంగమైయున్నది. భస్మధారణ రెండు విధములు. అవి- సోపాధిక మరియు నిరుపాధికములు. శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు, నిరుపాధిక భస్మధారణను, ముఖ్యమైనదానిగా యెంచిరి. "ప్రభామయం మహాదేవ మహాభస్మేతి సంచింత్య" అని ఆజ్ఞను విధించిరి. ప్రకాశమానమైనవాడును, మహాదేవుడును మహాభస్మమేయని సర్వదా చింతించవలెననెడిది శ్రీభగవత్ సాదులవారి యుపదేశము. పరమశివుని యొక్క చైతన్యము పిండాండములోను, బ్రహ్మాండములోని పరివ్యాప్తిని పొందియున్ననూ అద్దానిని పిండాండములోనే కన్గొనుటయే శ్రేష్ఠతరమగును. బ్రహ్మాండమునగాంచుట సుసాధ్యమైన పని కాదు. పిండాండమున నరయుట సులభతరము మరియు శ్రేయస్కరము. పిండాండమునందు, పరమశివుని గనుటకు హృదయమే తగినస్థానము. "ఆత్మని శివ స్థితః" (సి.శి. 5.35) యనెడి శ్రీ రేణుక భగవత్పాదులవారి వాక్కులు ఈ విషయమునే సూచించుచున్నవి. శ్రీజగద్గురు రేణుక భగవత్పాదులవారు మూడు ఉపమానముల నిచ్చి యీ విషయమును సుస్పష్టము చేసిరి. గమనించండి.

**(1) చంద్రకాంతే యథాతోయం**
**(2) సూర్యకాంతే యధా నలః**
**(3) బీజే యధాంకురః** (సి.శి. 5.35)

చంద్రకాంత శిలలో నీరును, సూర్యకాంత శిలలో అగ్నియును, విత్తులోన మొలకయు నే విధముగా నమరియుండునో నా విధిననే దేహములో శివుడున్నాడని తెలుపబడినది. దేహమునకు హృదయమే కేంద్రస్థానమైనందున, శివుడచ్చట నెలకొని యుండునని గ్రహించవచ్చును.

జగదాదిన శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు చెప్పిన వాక్కులను, ద్వాపరయుగమున వేదవ్యాసులవార గ్రహించి శ్రీ గీతాచార్యుని ముఖమున తెలియజెప్పిరి కనుడి:

**శ్లో॥ ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥**

లోకములలోని సర్వజీవుల హృదయస్థానమున శివుడు నిలిచియుండునని తెలుపబడినది.

హృదయమే భగవన్మందిరమని గ్రహించవలెను. స్థూలబుద్ధిగలవారు హృదయమందిరముననే పూజలను సల్పెడిసామర్థ్యము గల్గియుండక. బాహ్యముననున్న దేవాలయాదుల నాశ్రయింతురు. సూక్ష్మబుద్ధియుతుడు అటుల చేయడు. హృదయ మందిరమునందుననే శివునికి తన యర్చనలిచ్చును.

బాహ్యమందిరములలోన వెలిగెడి దీపము ప్రమిద, వత్తి మరియు తైలములయుపాధిచేత వెలిగి వెలుగునిచ్చును. ఈ కాంతి పరిమిత ప్రకాశమునే యిచ్చును. హృదయమందిరమున వెలిగెడి దీపము నిరుపాధికమైనది దాని జ్యోతి నిర్మలమైనది. దాని ప్రకాశమునకు పరిమితులుండవు. ధగధగా మెరిసెడి హృదయ జ్యోతి నలుదిక్కుల యందున నుండెడి అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయును.

అంధునికి దీపము వెలుగునివ్వజాలదు. అతనికెటుచూచినను, కారుచీకటి కమ్ముకొని యున్నటుల కనిపించును. అదేవిధిన త్రిమలావృతుడై, మాయ యొక్క ప్రభావమునకు గురియై, జ్ఞానదృష్టి రాహిత్యమును పొందిన సామాన్యుడు, హృదయమందిరములోని దీపమును చూడజాలడు. బయలున చీకటి యావరించినప్పుడు, మనుష్యుని బాహ్య వ్యవహారములన్నియును, నిలిచిపోవను. ఆటలనే, అంతరంగమున యజ్ఞానమనెడి యంధకారమును గల్గినవాని సాధన అనాది కాలమునుండి నిలిచిపోయినది. బయట చుట్టూ చీకటి యావరించినచో దీపము నేర్పాటు చేయుటకై మనుజుడు యత్నించెడిది చూస్తూ ఉన్నాము. అయితే, ఇతడు అనాది కాలమునుండియును నంతరంగమున చీకటిని గల్గియున్నాడు. ఇది ఆశ్చర్యమును కల్గించెడి విషయమే కదా! దీనిచేత స్పష్టమయ్యేడిదేమనగా, ఇతనికి బాహ్య వ్యవహారముల గూర్చి ఎంత ఆసక్తిగలదో, అంత ఆసక్తి ఆంతరంగ వ్యవహారముల గురించి లేదని స్పష్టమగుచున్నది. అంతరంగములోని యంధకారము జీవుని ముక్తికి ప్రతిబంధకమగును అయితే, అది సంసారములోని భుక్తికి ప్రతిబంధకమగుటలేదు. “భుక్తికి చెందిన సుఖమునుసంసారములో గల్గినచో ముక్తినియరసెడి వారుందురే?” ఇట్టి వారికి అంతరంగములోని చీకటిని దూరము చేసికొనవలెననెడి యాలోచనయైననూఉండునే?

భూమి, భామ, హేమములు గొప్ప ప్రలోభదాయకములగుచున్నది. జీవునిలో వీటిని యధికముగా పొంది భోగముల యందు మునిగి తేలాలనెడి కోరికమెండుగా యుండును. ఇవన్నియును జగత్తులోని ఆకర్షణలు. అయస్కాంతము, ఇనుము నాకర్షించినయటులే యివి మనుజుని సంసారమువైపునకు లాగికొని వెడలుచున్నవి. సాంసారిక భోగుల జీవితము, దీపము యెడల ఆకర్షణ పెంచికొని, అద్దానిని తాకి, యొడలును కాల్చికొని, మరణమును వరించెడి దీపపు పురుగువంటిదే. అందుకే భర్తృహరి యీ క్రిందివిధిన తెలిపిరి.

**“భోగా న భుక్తా పయమే వభుక్తాః”**

భోగమనెడి పదమునకు, అమరసింహుడీ క్రినిదివిధిన అర్ధమును తెలిపెను.

**“భోగః సుఖే స్త్ర్యాడి భృతా కావహేశ్చఫణాకాయయోః”**

వీరి వాక్కు ప్రకారము భోగ అనే పదమునకు స్రక్చందన వనితాది విషయముల చేత ప్రాప్తమయ్యెడి సుఖము, పాము పడగ మరియు పాముయేను అనెడి అర్ధములు గలవు.

భోగమనగా సుఖములే యనెడి భావము సర్వత్రా వ్యాపించియున్నది వాస్తవముగా, భోగమనగా సుఖ దుఃఖముల యను భోగమనెడి మరొక యభిప్రాయము కలదు. ఈ క్రింది శాస్త్రోక్తిని గనుడి.

**“సుఖదుఃఖాన్యతార సాక్షాత్కారః భోగః”**

ఈ భావనకు గల కారణము యెట్టిదో యెరుగవలసియున్నది. వనితాదుల వలన సుఖముతోపాటుగా దుఃఖము కూడ యనుభవములోనికి వచ్చును కదా! అందుచేత భోగమనగా సుఖ దుఃఖముల సమిష్టి రూపమని గ్రహించుటలో యౌచిత్యముండును.

సంసారమున సుఖానుభవము కొంతమేరకే లభించును. అధికంగా దుఃఖప్రాప్తియగును. ఆవగింజంత సుఖమునాశించెడివాటికి అనంత సాగరమంత దుఃఖము వెన్నంటియే యుండును. అజ్ఞులు ఈ విషయమునెరుగరు. కళ్ళు మూసికొని భోగానుభవమునకై పరుగులు తీయుచు, రాబోవు ప్రమాదములెట్టివో యనెడి యోచన గల్గదు.

వనితాదులతో సరసమాడుట యనేది విషసర్పముతో ఆడికొనిన యటులే, పాములవాడు పాము కాటుచేత ప్రాణములు వీడుటలేదా? అట్టియెడ సామాన్యుడు ప్రాణములను మిగిల్చికొనగల్గునే.

మహాయోగులే పాములతో క్రీడించి, ప్రమాదములకు గురికాకుండ నుండగలరు. ఈ విషయమున సాకార శివుని యుదాహరణగైకొనవచ్చును. "భోగే భవాని" యనెడి వాక్కు ప్రకారము భోగపురుషుడై యుండియును మహాయోగేశ్వరుడైనందున భోగభూషణుడై ప్రకాశించుచున్నాడు. భోగభూషణుడనగా నాగభూషణుడేయని గ్రహించవలెను.

శివానుగ్రహమును పొందివారికి శివునికుండెడి శక్తులు లభించునని శివభక్తుల చరిత్రలు తెలుపుచున్నవి. శివభక్తి చేత శివుని ప్రసన్నుని జేసికొని, శివ దత్తమైన చక్రమువలన అజేయుడై లోకపాలకుడుగా వినుతింపబడెడి శ్రీమహావిష్ణువును శివునివలె భోగమును తన వశములోనికి తెచ్చికొని భోగశయనుడైనాడు. సర్పమతనికి శయ్యయై సుఖము నిచ్చుచున్నది కదా.

ఈ ఇరువురి యనుభవమువలన తెలియునదేమనగా భోగి కాదలచినవాడు యోగిగానో లేదా భక్తునిగానోకావలెను. అట్టియెడ, భోగికానివాడు యోగికాలేడనే లోకోక్తిని విస్మరించవలెను. భక్తియోగమును పొందనివాడు భోగి కాలేడు, అని గ్రహించవలెను.

యోగమనగా నియమబద్ధుడై జీవించెడి జీవనముయొక్క ఒక కళ. విద్యుత్తును ఉపయోగించెది కళను ఎరిగినవాడు దాని నుండి తన నిత్యవ్యవహారములను చేసికొనుచూ సుఖముగా కాలమును గడుపును. అయితే, ఏతద్రహస్యమును తెలియనివాడు కాలునికి అతిథిగా పోవుటలేదే! అటులనే బ్రతుకుయొక్క కళను ఎరిగిన భోగి చిరంజీవియై సుఖముగా నుండును. అద్దానిని ఎరుగనివాడు 'భోగే రోగభయం' అనేది భర్తృహరియొక్క వచనము ప్రకారము రోగియై వేదననుభవించుచున్నాడు. ఈ విషయమున శ్రీనిజగుణ శివయోగుల వారి వాక్కులు చూడదగినవిగా యున్నవి.

**బేడ బేడ భోగదొడనాట**
**నోడు నంజువెరసిద సవియూట**
**కీడు కడెయోళిహుదు మాయెయ కై మాట** (కై.ప.జీ. 17)

తెలుగు రూపమిది:

**వేడ వేడ భోగములొడనాట**
**చూడు విషము కలిసిన చవితిండి**
**కీడు కడననుండు, మాయదికైయాట.**

శ్రీమన్నిజగుణ శివయోగిగారు కేవలము భోగాసక్తులైనవారిని జాగరూకులైయుండుడని హెచ్చరించిరి. ఈ నుడిని విని జాగరూకులై యుండెడివారు తగిన సత్ఫలితములను పొందగలరు. అయితే మనమందరము భోగులమై ఎక్కువరోజులు బ్రతుకవలెనని అనుకొనిన యెడల అది ఎటుల సాధ్యమగును? ప్రజ్వలించెడి ప్రదీపమున చీకటి యావరించలేని యటుల అంతరంగములోని ఆత్మజ్యోతి చింతనయందు తల్లీనుడైయుండెడివానికి జనన మరణ భయములు వుండవు. అంతరంగమునందు పరమశివుని చింతనరూపమైన ఈ నిరుపాధిక లేదా మహాభస్మమును ధరించుటచేత ఎట్టి ఫలము ప్రాప్తమగును? అనెడి ప్రశ్న ఉదయించును. జనకుడు యాజ్ఞవల్క్యునితో అడిగిన ప్రశ్న ఈ క్రిందివిధముగా నున్నది.

శ్లో॥ **"అథాజనోహః వైదేహః స హోవాచ యాజ్ఞవల్క్యం భస్మ**
**ధారణాత్ కిం ఫలమష్ణుతయితి, స హోవాచ తద్భస్మధారణాదేవ**
**ముక్తిర్భవతి తద్భస్మధారణాదేవ సాయుజ్యమాప్నోతి। న సాపున**
**రావర్తతే। స యేష భస్మ జ్యోతిరితియే యాజ్ఞవల్క్యః।**

**"జనకోః వైదేహః స హోవాచ యాజ్ఞవల్క్యం భస్మధారణాత్**
**కిం ఫలమష్ణుతే? న వేతి। తత్ర పరమ హంసాః సంపత్కారుణీ**
**శ్వేతకేతు దుర్వాస హోవభునిదాపేజడభరత దత్తాత్రేయరేవతక**
**భుశుండ ప్రభృతి యోపి విభూతిధారణాదేవ ముక్తాః శ్యుః స**
**ఏషాభస్మజ్యోతిరితి వే యాజ్ఞవల్క్యః** (బృహజ్జాబాలోపనిషత్తు – ఏడవ బ్రాహ్మణము 2 – 3)

జనకుడు మరియు యాజ్ఞవల్క్యుల పేర్లను (ఎరుగనివారెవరు? సాక్షాత్తు సూర్యభగవానుడి ఉపాసనచేత సకలశాస్త్రములను ఎరిగినవారు యాజ్ఞవల్క్యులైతే సకల భోగముల మధ్యన యుండియు యోగజీవనమును గడిపినవాడు జనకుడు. దేహధారిగా యుండినను దేహము యొక్క అభిమానమును త్యాగముచేయుటచే అతనికి వైదేహజనకుడు అను పేరు ప్రాప్తమైనది.

ఆ వైదేహ జనకుడు మహాజ్ఞానియైన యాజ్ఞవల్క్యునితో ఇటుల ప్రశ్నించెను. ఈ చిద్భస్మమును ధరించుటచేత అయ్యెడి ప్రయోజనము ఏమి? మరియు ఎవరెవరు దానిని ధరించి ఫలమును బడసినారు?అపుడు యాజ్ఞవల్క్యుడు ఓ రాజా! ఈ అంతరంగపు భస్మధారణచేత సాయుజ్య కైవల్యము ప్రాప్తమగును. ఈ సంసారమునందున పునరావృత్తి సంభవించదు. ఈ భస్మమును ధరించిన సంవర్తక, అరుణి, శ్వేతకేతు, దూర్వాస, ఋభు, విదాఘ, జడభరత, దత్తాత్రేయ రైవతక మరియు భుశుండరే మొదలైన పరమహంసలు ముక్తిని బడసిరి.

ఈ విధముగా బృహజ్జాబాలోపనిషత్తునందు ఈ నిరుపాధిక భస్మధారణ జతకు సోపాధిక భస్మధారణ విధానమును విస్తృతముగా ప్రతిపాదించబడినది.

శివమహాపురాణమునందు నిరుపాధిక భస్మధారణ గురించి ఈ విధముగా చెప్పబడినది.

**"ఏకం జ్ఞేయం మహాభస్మ ద్వితీయం స్వల్ప సంజ్ఞకం"** (శివపురాణము - విద్య - 24-2)

శివమహాపురాణములో మహాభస్మ అనెడి పదము ఉపయుక్తమైనది. ఇది గమనార్హమైన విషయము "తరతి శోక మాత్మవిత్" అనెది శ్రుతి ప్రమాణము ప్రకారము చిద్భస్మము, మహాభస్మము, నిరుపాధిక భస్మము అని పిలిపించుకొనెడి పరశివచైతన్యమును తన అంతరంగమునందు సాక్షాత్కారము చేసికొనినవాడే ఈ శోకసాగరమును దాటగలడు.

సంసారము యొక్క సకల దుఃఖముల నివృత్తికి ఈ చిద్భస్మము దివ్యౌషధమైయున్నది. ఈ కారణము వలన మనుష్య జన్మను ఎత్తిన ప్రతి ఒక్కడు తన ఆయుష్యమున్నంతవరకు దీనిని ప్రాప్తముచేసికొనవలెను. లేనియెడల యమశిక్ష తప్పదు కదా!

ఒక చక్రవర్తి యొక్క ఆస్థానమునకు రత్నపు వ్యాపారి యొకడు వచ్చి మహారాజునకు అత్యమూల్యమైన రత్నమును సమర్పించి ఈ క్రింది విధముగా నివేదించుకొనెను. ఓ రాజా! ఇది యొక్క దివ్య రత్నము. ఇంతటి అమూల్యమైన రత్నమును ధరించెడిసామర్థ్యము సామాన్యజనులకు వుండదు. అందుచేతనే తమరి సన్నిధికి విచ్చేసితిని. దీనిని శ్రేష్ఠులైన రత్న పరీక్షకుల చేత పరీక్షింపంజేసి దీనికి నిర్దిష్టమైన వెలను యిచ్చి నన్ను అనుగ్రహించవలెను. మరియొక మహత్త్వపూర్ణమైన విషయమేమనగా దీని వెల యొక్క నిర్ధారణయందు అవధానత అయిన యెడల ఇది చిట్లిచూరు చూరగును. ఈ కారణమున రత్నమునకు అవమానము కాని యటుల దీని వెలను నిర్ధారించవలెను.

వ్యాపారి యొక్క ఈ మాటలను వినిన రాజుకు ఆనందము మరియు ఆశ్చర్యము కలిగెను. ఆ క్షణమునందునెనే తన రాజ్యమునందుండెడి అనేక రత్న పరీక్షకులను పిలిపించి వారికి ఆ రత్నమును యిచ్చి దాని యోగ్యమైన వెలను నిర్ధారించుటకై ఆజ్ఞాపించెను. రత్న పరీక్షకులు ఎల్లరూ దానిని బాగుగా పరీక్షించి ఒకడు పదివేలు, మరొకరు యిరువది వేలు, మరొక్కడు యాభైవేలు, ఈ విధముగా తమతమకు తెలిసిన రీతి మూల్యమును నిర్ధారణచేసి మహారాజుకు నివేదించిరి. వారు తమ మూల్యమే సరియైనదని పరస్పరము వాదులాడుకొనుచూ కలహమునకు దిగిరి. దీనిని చూసి రాజుకు సమాధానము కాలేదు. వీరెవ్వరునూ శ్రేష్ఠమైన పరీక్షకులు కారని నిశ్చయించి దేశదేశముల యందు ఈ క్రింది విధముగా దండోరాను వేసెను.

అనుభవజ్ఞులైన రత్నపరీక్షకులు వుండినయెడల తన ఆస్థానమునకు రావలెను. వారికి యోగ్యమైన బహుమానమునుయిచ్చి సత్కరించెదము.

రత్న పరీక్షకు సంబంధించిన వార్త కర్ణోపకర్ణముగా దేశము మొత్తమునకు వ్యాపించెను. దేశములోని మూలమూలల నున్న రత్న పరీక్షకులు రాజు యొక్క ఆస్థానమును చేరిరి. వచ్చిన రత్నపరీక్షకులు నొక్కొక్కరిని పిలిచి ఈ విద్యను నేర్పిన గురువు ఎవరు? నీకు గల అనుభవము యెన్ని సంవత్సరముల మేరకు గలదు? మొదలగు ప్రశ్నలను మహారాజుగారు వేయదొడంగిరి. చివరకి వీరందరికినీ గురువైన యెనభై సంవత్సరముల అనుభవము కలిగి తొంభై తొమ్మిది సంవత్సరములు వయసు గల వయోవృద్ధుడొకడు రాజు యొక్క ఆస్థానమునకు వచ్చెను. రాజుకు పరమానందమయ్యెను. కారణమేమనగా మిగిలివారందరూ ఈయన శిష్యులై అయివుండిరి. మహా అనుభవజ్ఞుడైన యితనివలననే రత్న పరీక్ష జరుగవలెనని విచారించి రత్నమును అతనిచేతికిచ్చి దీనిని పరీక్షించి దీని మూల్యమును నిర్ధారించవలసినదని ఆజ్ఞాపించెను.

ఆ రత్నమును తన చేతికి తీసికొనిన ఆ వృద్ధుడు రాజుతో ఇట్లులనెను. ఓ రాజా! దీనిని పరీక్షించుటకై ఒక సప్తాహము సమయము కావలెను. ఈ కారణమువలన తాము నాకు స్వతంత్రమైన ఒక గదిని ఏర్పాటు చేయుడి. ఒక వారము పిదప దీనియొక్క వెలను నిర్ణయించి చెప్పగలను. రాజు ఈ వృద్ధుని మాటలను విని అతడు చెప్పినయటులనే తగిన వసతిని ఏర్పాటుచేసెను. జనులకు దినదినము కుతూహలము హెచ్చుగుచుండెను. నిర్ధారించిన సమయమునకు ఆ వయోవృద్ధుడు ఆస్థానమునకు వచ్చి "ఓ రాజా! ఈ రత్నము ఒక కోటి రూపాయల విలువ చేయును" అని చెప్పెను.

ఇతడి వెలయొక్క నిర్ణయమును విని రత్నాల వ్యాపారి సంతుష్టుడయ్యెను. అయితే రాజుగారి మనస్సుయందు ఒక ప్రశ్న తలయెత్తెను. దీనియందుండెడి విశిష్టత ఎట్టిది? ఇంత పెద్దమొత్తములో ధనమును ఎందుకివ్వవలెను? అనెడి ప్రశ్న అతనిని వేధింపజొచ్చెను. రాజు ఆ ప్రశ్నలకు బహిరంగముగనే రత్న పరీక్షకుని వుద్దేశించి అడిగెను. అప్పుడావయోవృద్ధుడు ఓ రాజా! ఇదియొక సిద్ధరత్నము. ఇది స్వయం ప్రకాశమానమైనది. ఇది యుండెది గదిలో దీపమును వెలిగించెడి యావశ్యకత యుండదు. దీని వెలుగు వలన చీకటి చెల్లాచెదరగును. అంతేకాదు. ఈ రత్నము ఎవరివద్దనుండునో వారి మనోరథములు నెరవేరగలవు. రత్నము యొక్క మహిమను ఎరిగిన రాజుకు ఎంతో సంతోషము చేకూరెను. వ్యాపారికి కోటి రూపాయలను యిచ్చి పంపించివేసెను. రాజు మనసులో ఈ రత్న పరీక్షకునికి ఏమి బహుమానము ఇవ్వవలెననెడి సందేహము పొడసూపెను. ఆస్థానములో నున్న విద్వాంసులందరినీ అడుగగా వేయి, అయిదువేలు, పదివేలు మొదలగు, విభిన్నమైన అభిప్రాయాలు బయల్వెడవలెను. నిర్దిష్టమైన సలహా రానందున రాజునకు సమాధానముకాలేదు. మరల దేశమునందు దండోరా వేయించెను. రత్న పరీక్షకునికి ఎంత బహుమానము యివ్వవలెనని ప్రశ్నించెను. దేశము మొత్తము యిదే వార్త. తత్వజ్ఞానియైన తపస్వియొకడు రాజు ఆస్థానము ముందునకు వచ్చియుండెను. ఈ గందరగోళమును చూచి ఒక క్షణకాలమువరకు నిలిచి యుండి అన్ని విషయములను ఎరింగెను. రాజు దగ్గరికి వెళ్ళి అతనితో యిటులనెను. నేను రత్న పరీక్షకునికి వెలకట్టెదను. రాజుకు చాలా సంతోషమయ్యెను. మనుష్యుల వెలను మహాత్ములే కట్టగలరు కదా? అని ఆలోచించెను. ఆ మహాత్మునికి ఈ విధముగా వినతిని చేసికొనెను. ఓ యోగీశ్వరా! ఈ రత్న పరీక్షకునికి ఎంత మానధనమును యివ్వవలెను? అప్పుడు ఆ మహాత్ముడు ఆ వృద్ధుని ఆపాదమస్తకము పరిశీలించి అతనిని కొన్ని ప్రశ్నలను అడిగెను? అని ఈ క్రింది విధముగా నుండెను.

**మహాత్ముడు:-** ఓ పరీక్షకా! నీ వయస్సు ఎంత?

**రత్నపరీక్షకుడు:-** స్వామీ! నాకు తొంభైతొమ్మిది వర్షములు నిండవచ్చునవి.

**మహాత్ముడు:-** రత్న పరీక్ష వ్యవహారమును ప్రారంభించి ఎన్ని సంవత్సరములయినది?

**రత్నపరీక్షకుడు:-** ఎనుబది సంవత్సరములయినవి.

**మహాత్ముడు:-** ఇంత సమయమును రత్నపరీక్ష కొరకు మాత్రమే వెచ్చించితిరా?

**రత్నపరీక్షకుడు:-** ఔను స్వామీ! (అభిమానముతో బదులు పలికెను)

**మహాత్ముడు:-** నీ అంతరంగమునందు ఒక రత్నమున్నది కదా! దానిని కంటివా?

**రత్నపరీక్షకుడు:-** ఏమి స్వామీ! రత్నములు సురక్షితమైన ప్రదేశములు ఇనుప పెట్టెలయందు వుండును కదా! అంతరంగములో వుండునే?

**మహాత్ముడు:-** ఔను. హృదయమైనను ఒక కారాగారమే. దానిలో ఒక దివ్య రత్నమున్నది. అదే జ్ఞానరత్నము. పరమాత్మ రత్నము. దీని అరయిక నీకు అయినదా?

**రత్నపరీక్షకుడు:-** ఓ స్వామీ! లోపల ఒక రత్నముండునని నీవలెననే వింటిని. దానిని నేను చూడనూ లేదు. ఈ అనుభవము నాకులేదు.

రత్నపరీక్షకుని ఈ వుత్తరమును వినిన మహాత్ముడు ఏమయిన నుండెడి ఈ రాళ్ళనే రత్నములని తెలిసికొనివాటిపరీక్ష నిమిత్తము అమూల్యమైన ఆయుష్యమును వెచ్చించి తనలోనున్న జ్ఞానరత్నమును చిన్నచూపుకు గురిచేశినాడని రత్న పరీక్షకుని గురించి కృద్ధుడయ్యెను. అతడు రాజుతో ఓ రాజా! మధ్యాహ్నపు యెండ యందు యితని శరీరము మీద గల బట్టలన్ని తీసివేసి ఒక స్తంభమునకు కట్టి వేడి వేడి నీళ్ళను పోసి చర్మము కందిపోయిన పిదప బలమైన వేయి పెట్టులను పెట్టుడి. ఇదే యితనికి యివ్వదగిన యోగ్యమైన బహుమానము. అపుడు రాజు ఓ మహాత్మా! ఇతనికి యివ్వవలసిన బహుమానమేమి? అని నేనడిగితే మీరు శిక్షనే విధించుచున్నారే. ఇది న్యాయమా? అపుడు ఆ మహాత్ముడు రాజుతో యిట్టులనెను. ఓ రాజా! అంతరంగము నందలి పరమాత్ముడనెడి రత్నమును తెలిసికొనజాలక ఆయుష్యమునంతను వ్యర్థముగా గడిపిన ప్రతియొక్క మనుష్యునికి చివరన యిట్టి బహుమానమే దొరుకును. జీవనమునందు ఏమి సంపాదించిననూ దానినంతనూ బంధు బాంధవులెల్లరూ పంచుకొనెదరు. మెనిమీద వుండెడి వెలగల వస్త్రములనైనను విప్పికొని సాధారణమైన వస్త్రముల తొడిగి మట్టిలో పూడ్చిగాని, అగ్నికు ఆహుతి చేసికాని, మరో విధమునగాని చేతురేగాని ఇంకేమియును వుండదు. భౌతికసంపాదన ఎంతమేరకు చేశిననూ చివరకు లోకమునుండి అతనికి దొరికెడి పురస్కారము ఇదియే. అందుచేత యితనికి బుద్ధి చెప్పవలెనని ఈ శిక్షను విధించితిని. వీనికి యింకను ఆయుష్యు కలదు. ఇకమీదనైనను జాగరూకుడై అంతరంగములోని పరమాత్మను తెలుసుకొనవలెననియే నా శిక్ష యొక్క అంతిమలక్ష్యము.

మహాత్ముని ఈ ఉపదేశమును విని ఆ వయోవృద్ధుడే కాదు. రాజే కాదు. సకల జనులు జాగరూకత వహించినవారైరి. ఆ పూజ్యపాదుల జ్ఞానామృతమును పానముచేసి అంతరంగమునందుండెడి జ్యోతిని ఎరిగినవారై కృతార్థులైరి.

పరమాత్మునికి ఉపనిషత్తునందు భస్మ జ్యోతి అను పేరు గలదు. ఈ కారణము వలన భస్మజ్యోతి స్వరూపమైన ఆ పరశివుని హృదయమున నిరంతరము చింతించునదే నిరుపాధిక భస్మధారణయగును. ఇంతటి నిరుపాధిక భస్మధారణవలన సాధకుని దుర్వాసనలన్నియు వైదొలగి అతడు పవిత్రాత్ముడగుచున్నాడు. అందుచేత పూజ్యపాదులు శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు ఈ భస్మధారణ స్థలము యొక్క ప్రారంభమునందున సర్వశ్రేష్ఠము, ఉపాధిరహితము అయిన నిరుపాధిక భస్మధారణను తెలియపరచి ఇకముందు సర్వజనోపయోగమైన శరీరము మీద ధరించబడు సోపాధిక భస్మస్వరూపమును, మహత్వమును, ధారణా విధిని, మరియు నిర్మాణవిధులను విస్తారముగా ఉపదేశించినారు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**దినం॥ 21-08-1990**
**స్థలం: శివానుపుర మంగళ భవనం, షోలాపురం**

## విశేష ప్రదీపిక :-

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు శ్రుతిచేత ప్రతిపాదింపబడిన నిరుపాధిక భస్మధారణ గురించి సవివరముగా ఉపదేశమునిచ్చిరి.

భస్మధారణ భారతావనిలో బహుకాలము నుండి గౌరవింపబడుచున్నది. వేదకాలము నుండియును భస్మధారణ సాధకుల మన్ననలను బడసినదని తెలిపెడి యీ క్రింది పద్యమును గమనించండి.

**సీ ॥ తగ మంత్రితం భస్మధారయేత్తని వ్రాయు**
**నొగిని శ్వేతాశ్వతరోపనిషది**
**నెరయ జాబాలోపనిషది 'సఏవభ**
**స్మ జ్యోతి'రని వ్రాయు మఱియునట్ల**
**మహిమ 'భూత్యైన ప్రమధితవ్య'యని వ్రాయు**
**నా యజుర్వేదంబు నదియు గాక**
**మఱియగ్నిరితి భస్మ" మన వాయురిత భస్మ**
**మన యథర్వణ శిరస్సు నందు వ్రాయు**
**ననుచు జదివి చదివి "యామ్నాయ నుతభస్మ**

**విముఖ వృత్తి జెంది వెట్టి జమ్మ**
**లెట్టి పాపమంతలోనె"**
**కా[మగురుచిత్త, నలిన భృంగ సోమనాథలింగ!** (అన్యవాద కోలాహలము)

ఈ పద్యములో 'సఏవ భస్మ" యనెడిది కీలకమైన యంశము. "సఏవ భస్మజోతిః" అనెడి దానికి వావిళ్ళవారి ప్రతిలోని లఘుటీకలో ఆ భస్మమే తేజస్స్వరూపమనెడి యర్థము నివ్వబడినది. భస్మమనెడిది జ్యోతి స్వరూపమనియును, జ్యోతి తమస్సును దూరము చేయునటులే, భస్మము అజ్ఞానమును దూరముచేయుచున్నది భస్మము జ్ఞానప్రదమని గ్రహింపవలెను.

జ్ఞానము రెండు విధములుగా నుండును. మొదటిది వస్తుపరమైనది. రెండవది యాధ్యాత్మపరమైనది. మొదటిది భౌతిక విజ్ఞానమైతే రెండవది ఆత్మతత్త్వమునకు సంబంధించినది. ఈ ఉభయ విధములగు జ్ఞానము భస్మధారణ వలన లభించునని తెలుపబడినది. ఈ కారణముననే నిరీశ్వరవాదులైనను భస్మమును ధరింతురని నాస్తిక సాంప్రదాయముల వలన తెలియుచున్నది.

"సఏవభస్మజ్యోతిః" అనెడి దానిని మరొకరీతిన అర్థము చేసికొనెడి యవకాశము గలదు. "అతడు, జ్యోతి స్వరూపుడగువాడు, భస్మముగా నెరుంగవలెను. ఇచ్చట భస్మమనగా ప్రకాశమని గుర్తించవలెను. వేదాంత పరిభాష 'స' అనగా పరబ్రహ్మ 'సోహం' అనెడి యద్వైతుల వాక్కులును, 'శివోహం' అనెడి శివాద్వైతుల వాక్కులను చిర పరిచితములే భస్మము పరబ్రహ్మక భేదము చూపబడినది. భస్మమే శివుడు శివుడే భస్మము యనెడి యభేదభావమున కాస్కారముగల్గుచున్నది.

అష్టావరణములలోని గురులింగ జంగములను శివుని యభిన్నరూపములుగనే భావించవలెనని శివాగమములు తెలిపినవి. రుద్రజాబాల ఉపనిషత్తు భస్మమును కూడ శివుని య భిన్న స్వరూపముగా భావించవలెనని తెలుపుచున్నది. ఈ విషయమును విశదపరచెడి శ్రుతి వాక్యములను గనుడి.

**శ్లో ॥ భస్మ ధ్యానాత్సం ధానం భవతి భస్మధ్యానాత్ పంచాక్షరీ**
**స్మరం భవతి తస్మాద్ధ్యానాత్ స్థాణత్వం గచ్ఛతి**
**సఏష భస్మ జ్యోతిః సఏష భస్మ జ్యోతిః ॥** (భాస్మజాబాలోపనిషత్తు)

ఈ శ్రుతి వాక్యమున "భస్మజ్యోతిః అనగా జ్యోతిర్లింగ"మనెడి యర్థము చెప్పబడినది. ఈ విషయమును వివరించెడి డా॥ రుద్రప్పగారి వాక్కులను గమనించుడి.

"భస్మమనగా జ్యోతిర్లింగము. మనుష్యుడట్టి జ్యోతిర్లింగమయమైన భస్మధారణ చేత శుద్ధాత్ముడగును. ఆ భస్మ(ము) పరశివా పరనామపరబ్రహ్మము కనుక ఆ జ్యోతిర్లింగ స్వరూపము చేత ఉజ్వలించుచుండును. అందువలననే దానికి భసితమని పేరు గలదు. ఆ మహాభస్మము జ్యోతిర్మియమైన మహాదేవస్వరూపమని భావించి ఏ లింగధారులు వర్తించుచుందురో ఆ శ్రేష్ఠులైన జనులు నిరుపాధిక భస్మధారులని పిలువబడుదురు".
(శ్రీ వీరశైవ సిద్ధాంత శిరోమణి – పేజీ 237)

ఈ వివరణ వలన తెలియునదేమనగా భస్మము సాధనము భూమికని పోషించుననెడి భావన స్థానములోనియ్యది సాధ్యమనెడి భావన పెంపొందును. ఇట్టిస్థితి యందున అంతర్లింగాను సంధానమునకును నిరుపాధిక భస్మధారణకును భేదముండదు. లింగధారణ సందర్భమున నుపదేశించిన యంతర్లింగము కూడ జ్యోతిర్లింగ రూపమనియే చెప్పబడినది. అద్దానిస్థానము కూడ హృదయగతమేయని చెప్పబడినది.

కాని నిరుపాధిక భస్మధారణను సాధనముగాను, అంతర్లింగ ధారణను సాధ్యముగాను చూసెడి యవకాశము లేకపోలేదు. ఈ విషయమున శ్రీ రుద్రప్పగారి యభిప్రాయమీ విధముగనున్నది.

**".... నిరుపాధిక భస్మము, తద్బాహ్య చిహ్నమే సోపాధిక**
**రూపమే సోపాధిక భస్మధారణయగును"॥** (శ్రీ వీరశైవసిద్ధాంత శిరోమణి, పు. 238)

భస్మజాబాలోపనిషత్తులోని సంధానం భవతి, పంచాక్షరీ స్మరణంభవతి, స్థాణుత్వం గచ్ఛతి అనెడివి గమనార్హములు. భస్మధ్యానాత్ సంధానం భవతిని, భస్మజ్యోతివలన సంధానముగా అర్థము చేసికొనవలెను. ఇచ్చట సంధానం అనగా అంతర్లింగాను సంధానమని తెలిసికొనవలెను. అదేవిధిన భస్మజ్యోతిని ధ్యానించుటచే పంచాక్షరీ మంత్రసిద్ధిగల్గును, మరియు జడత్వము తొలగి చైతన్యము వచ్చును.

అంతర్లింగము జ్యోతి స్వరూపమై యున్నందున బుద్ధి వికసమొందును. వికసితమైన బుద్ధి శివజ్ఞాన సముపార్జనవైపు నున్ముఖతను పెంచికొనును. ఇచ్చట శివజ్ఞానమనగా సాకార శివుని లీలావైభవములనెడి పరిమితార్థమును తీసికొనవలదు, శివుని తత్వమని యెరుగవలెను. సర్వవ్యాపకమై,

సర్వజగత్తు కారణమైయున్న శివతత్త్వమని తెలిసికొనవలెను. చరాచర జగత్తు శివేచ్ఛానుసారము, శివశక్తుల సంయోగము వలన యేర్పడునని తెలిపెడిదే శివ జ్ఞానము. అణువణువునా అతడున్నాడని యెరుగవలెనని యీ జ్ఞానము వలన తెలియగలదు. జగత్తులోని ప్రతి యంశ శివునిదనెడి తలపు పెంపొందును. భక్తుడు లోకహితమును చేయవలెననిడి సంకల్పము గల్గును. పంచాక్షరీ జపము వలన మనస్సులో ప్రసన్నత చోటు చేసికొనును. మాలిన్యము తొలగిపోవును. విషయ చింతన నుండి విముక్తి లభించును. బుద్ధి ప్రకల్పనకనుగుణముగా లోకకల్యాణము నాచరించుటకై యుద్యుక్తుడగును. భస్మజ్యోతి ధ్యానము వలన దేహము పరిశుద్ధమగును. ఇంద్రియములు స్వార్థము గురించి కాకుండగ పరార్థము గూర్చి కృషి చేయుటలో నిమగ్నమగును. విషయోప భోగముల నిమిత్తము వేధించవు. శబ్దాస్పర్శాదుల వలన గల్గెడి విషయ సుఖములవైపు విముఖతగల్గును. శివభక్తుల సాంగత్యము, శివభక్తుల సంసేవన, శివ భక్తుల సద్గోష్టి యిత్యాదులు భక్తునికి రుచికరముగా దోచును. ఇతరములు తుచ్ఛములని యెంచును. ఈ విధముగా బుద్ధి, మనస్సు మరియు ఇంద్రియములు శివోన్ముఖత పొందిన పిదప భక్తుడు సాధనలో ప్రగతి గాంచగలడు. భక్తి పథమున గల వివిధ స్థలముల వైపు గమనోన్ముఖత పెంపొందించుకొనును.

నిరుపాధిక భస్మధారణ వలన గల్గెడి ఫలితములను విద్యావాచస్పతిగారు యెంతో వివరముగా విశ్లేషించి చెప్పిరి. శివభక్తులు, నిరుపాధిక భస్మధారణ యెడల ఆసక్తిని పెంచి కొనెడి యవసరము నెంతైనా గలదు. అదే అంతర్లింగ ధారణలో బాటుగా బహిర్లింగధారణ నవశ్యముగా చేయవలెనని లింగధారణ విధిన, నిరుపాధిక భస్మధారణ చేసెడివారు సోపాధిక భస్మధారణ యెడల ననాసక్తిని పెంపొందించికొనుటలో నౌచిత్యములేదు. నిరుపాధిక భస్మధారణ వలన నంతరంగము నిర్మలమగును. బహిరంగ పరిశుద్ధికై సోపాధిక భస్మధారణను చేయవలెను. ఈ విధిన చేసిన యెడల నుభయాంగములును శుద్ధిని బడయును. సోపాధిక భస్మధారణ తరువాయి యాశీర్వచనములో వివరింపబడినది.

'శివం భూయాత్'

## ఆశీర్వచనము - 2

శ్లో॥ శివాగ్న్యాది సముత్పన్న మంత్రన్యాసాది యోగతః
త్వపాధి కమిత్యాహు ర్భస్మతంత్రవిశారదాః ॥ (సి.శి. 7-3)

సత్యోజాతాది మంత్రములచేత సుసంస్కృతమైన గోమయమును శివమంత్ర సంస్కృతమైన అగ్నియందు దహించబడి నిర్మాణము చేయబడిన భస్మమును భస్మశాస్త్ర విశారదులు సోపాధిక భస్మము అని పిలుతురు.

శ్లో॥ విభూతిర్భసితం భస్మక్షారం రక్షేతి భస్మనః
ఏతాని పంచనామాని హేతుభిః పంచభిర్భృశమ్ ॥ (సి.శి. 7-4)

బహు ముఖ్యములైన అయిదు కారణములచేత భస్మమునకు విభూతి, భసిత, భస్మ, క్షార, రక్ష అనెడి అయిదు పేర్లు సంప్రాప్తమైనవి.

శ్లో॥ విభూతిర్భూతి హేతుతాద్భసితం తత్త్వభాసనాత్
పాపానాం భర్ప్య నాద్భస్మ క్షారణాత్ క్షారమాపదామ్
రక్షణాత్ సర్వభూతే భ్యో రక్షేతి పరిగీయతే ॥ (సి.శి. 7-5)

అణిమాది అష్టైశ్వర్యములు ప్రాప్తమగుటచేత దీనికి విభూతి, శివతత్త్వమును ప్రకాశింపజేయుటచేత భసితము, త్రికరణముల యందు గల్గెడి పాపములను బెదరునటుల చేయుట చేత భస్మము, తాపత్రయముల నుండి ఆవిర్భవించిన విపత్తులను నాశనము చేయుటవలన క్షారమునియును, గ్రహాదుల భీతి నుండి రక్షించుటచేత రక్షయనియును భస్మమునకు సార్థక నామధేయములు కలవు.

## సోపాధిక భస్మము:-

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు శ్రీ అగస్త్యమహర్షికి నిరుపాధిక భస్మము యొక్క మహత్తును, మరియు స్వరూపమును తెలియపరచి యిప్పుడు సోపాధిక భస్మస్వరూపమును దాని ప్రయోజనమును ప్రతిపాదించుచున్నారు.

ప్రకృతమునందున నిరుపాధి, మరియు సోపాధి అనెడి శబ్దములకు ఉపాధిరహిత, ఉపాధి సహిత అనెడి సామాన్యార్థములు కలుగుచున్నవి.

వెలుపల ఏదో ఒక సామాగ్రి యొక్క అపేక్ష లేకుండగా పరిశుద్ధమైన మనస్సుచేత పరశివుని చిద్రూపము యొక్క చింతన చేయుటయే నిరుపాధిక భస్మధారణ యగును. గోమయమనెడి బాహ్య ఉపాధి వలన నిర్మించబడెడి విభూతిని బాహ్యపరమైన అవయవముల యందు శాస్త్రోక్త విధినికనుగుణముగా ధరించునేదే సోపాధిక భస్మధారణ ఈ సోపాధిక భస్మధారణ నిర్మాణమును గురించి మున్ముందు పూజ్యులు శ్రీ రేణుక భగవత్పాదులవారు తెలియపరచినందున ప్రస్తుతము ఈ సోపాధిక భస్మము యొక్క నామధేయముల మర్మమును తెలిసికొందుము గాక.

వీరశైవ సిద్ధాంతము యొక్క అష్టావరణముల యందు విభూతి యనెడిది ఒక ముఖ్యమైన ఆవరణ. 'ఆవ్రియతే దేహాధికం ఏవ తద్ ఆవరణం' అనెడి ఉత్పత్తి మేరకు శరీరము మరియు మనస్సులను సంరక్షించె భద్రమైన కవచమే ఆవరణము. షట్‌స్థల మార్గమునందున ముందుకు నడిచెడి సాధకునికి అరిషడ్వర్గముల యొక్క బాధ కలుగరాదనెడి వుద్దేశ్యముచేత మన ఆచార్యులు మనకు గురు, లింగ, జంగమ, పాదోదక, ప్రసాద, విభూతి, రుద్రాక్ష మరియు మంత్రములనెడి యెనిమిది భద్రములైన కవచములను తొడిగినారు.

వీటి మర్మములను ఎరుగని సమకాలీన మూఢజనులు ఒక్కొక్క ఆవరణమును విడిచివేయుచున్నారు. నేటి కలికాలమునందున సంపూర్ణముగా నిరావృతులైయున్నారు. గురు, లింగ, జంగములయందు శ్రద్ధలేదు. విభూతి, రుద్రాక్ష, మంత్రముల యందు నిష్టలేదు. పాదోదక, ప్రసాదముల యందు అవధానములేదు. ఈ విధముగా అష్టావరణ విహీనులై యుండెడి మూర్ఖుల యొక్క పరిస్థితిని చూసినయెడల అత్యంత శీతల ప్రదేశమున వస్త్ర విహీనుడై వుండెడి దరిద్రుని స్థితి స్మృతిపథమునకు వచ్చును. ఇట్టి స్థితి ఎంతో చింతాజనకమైనది కదా! ఇంతేకాదు. అంతరంగ బహిరంగముల యందును సహనమును వీడి అశాంతితో బాధపడుచున్నారు. ఇంతటి జనులు తమ జీవనమును సమతౌల్యము వైపు చేర్చుటకై వీరశైవ అష్టావరణముల యందు నిష్టను వహించుటకు సిద్ధపడుట ఎంతో అవసరము. అప్పుడే అంతరంగమున ప్రశాంత భావమేర్పడి బహిరంగమున సాత్విక లక్షణములు పొడసూపును.

బహిరంగ అష్టావరణ అంతర్గతమైన విభూతి, పవిత్రమైన గోమయముచేత నిర్మితమై యుండును. సర్వదోషములను దూరముచేసి సకలైశ్వర్యములను గల్గించెడి సామర్థ్యము ఈ విభూతియందున గలదు. అందుకే దీనికి విభూతి, భసితము, భస్మము, క్షారము మరియు రక్ష అనెడి అయిదు సార్థక నామములు లభించినవి. వీటియొక్క మహిమను విచారింతుము గాక.

## విభూతి:-

'విభూతిర్భూతి హేతుత్వాత్' అనెడి అచార్యులవారి ఉక్తిని అనుసరించి భూతికి కారణమైనది విభూతి అనియును తెలియుచున్నది. "భూతిర్భస్మని సంపది' అనెడి అమరసింహుని వాక్యము (అమర కోశము 3-69) ప్రకారము భూతి అనగా సంపత్తు అనియును అర్థము లభించుచున్నది. ఇది భౌతిక సంపదయనియును, జ్ఞానసంపదయనియును, రెండు విధములుగా నుండును. మనుష్యుని జీవనమునకై ఈ ఉభయ సంపత్తులు ఎంతో ఆవశ్యకమై యున్నవి. శాస్త్రోక్త విధి ప్రకారము శ్రద్ధతో విభూతిని ప్రతిదినము ధరించినయెడల ఈ ఉభయ విధములైన సంపదలు ప్రాప్తమగును.

ఆగమములలోను, ఉపనిషత్తులలోను గోమయము చేత విభూతిని తయారుచేసెడి విధానము ఉక్తమైయున్నది.

గోమయము యొక్క గొప్పతనము యెంతగానో కొనియాడబడుచున్నది. గోమయములో లక్ష్మీదేవి నివసించియుండుననెడి పురాణోక్తి గలదు. ఇట్టి మహిమాన్వితమైన గోమయము వలన తయారు చేయబడెడి విభూతిని ధరించిన యెడల భౌతిక సంపద పుష్కలముగా లభించగలదు.

గోమయములో లక్ష్మీదేవి నివసించియుండెడి విషయమున స్కాందపురాణములోని రేవా ఖండమునందునను, పద్మపురాణములోని సృష్టి ఖండమునందునను, భవిష్యత్తు పురాణములోని ఉత్తర భాగమునను, మహాభారతమునందునను కథలు గలవు. ఈ విషయున కథా వస్తువు ఈ క్రింది విధినన్నది.

ప్రజాపతి, ప్రజల పాలనకై గోవును సృష్టించెను. పరోపకారియైన గోవు యొక్క పవిత్ర దేహమునందున నివసించియుచ్చ దేవతలందరకును గల్గెను. అందుచేత, హృదయమునందున కార్తికేయుండును. శిరస్సునందున బ్రహ్మ, ఫణయందున శివుడు, రెండు కళ్ళలోన సూర్య చంద్రులు,

నాలుకమీద సరస్వతి, పళ్ళయందున మరుద్గణములు, రోమములయందున యసంఖ్యాకమైన ఋషి గణములు,తోన్నె యమరాజు, స్తనములయందు సముద్రాది దేవతలు, మూత్రమునందున గంగ, గిట్టల ముందు భాగమున గంధర్వాదులు, తుంటియందున పశుగణములు, ముఖమున అగ్ని, కుత్తుకయందున పార్వతి, ముక్కున జ్యేష్ఠాదేవి పిరుదులలో పితరులు మరియు తోకయందున రమాదేవి నివాసమును చేసికొనిరి. ఈ విధముగ సకల దేవతలు తమకు దొరికిన ప్రదేశమున నివసించజొచ్చిరి. ఈ విషయమును గూర్చి తెలిసికొనిన లక్ష్మీదేవి, గోవు దగ్గరకు వచ్చి, నాకును నీ దేహమున యేదో నొక ప్రదేశమున నివసించెడి యవకాశము నివ్వవలెనని వినతిని చేసెను. అప్పుడు ఆ గోమాత, నా యంగమున సకల దేవతలు ఉన్నారు. నీ కొరకు స్థానము లేదు. నీ కిష్టమైన యెడల, నా పేడలో స్థానమున్నందున, అచ్చట నివసించుము. లక్ష్మీదేవి యా విధిననే, గోమయమున నివసించియున్నది.

పురాణ విషయములటుయుండనిమ్ము. భౌతికము చూసినా, గోమయము వలన నెన్నియో లాభములు గలవు ప్రాచీనకాలమునుండియును రైతులు గోమయమున పొలమునందున ఎరువుగా వేసి పుష్కలమైన, ఆరోగ్యదాయకమైన పంటను పండించుచుండిరి. రసాయనిక యెరువులు వాడుట వలన వచ్చెడి విష పరిణామములెట్టులున్నవో ఎరుగనిదెవ్వరు. ఈ ఎరువుల వలన పచ్చని పంటల వలన భూసారము నష్టమగును. ధాన్యమును తినెడివారికి రకరకముల రోగములు వచ్చుచున్నవి.

ఈ విధముగా గోమయము, భౌతికముగాను, పారమార్థికముగాను అమూల్యమైనదిగా యెంచబడెడి గోమయమును అగ్నిలో దహించి, భస్మమును తయారుచేయుదురు. భస్మమును భక్తిశ్రద్ధలతో దర్శించెడివారికి సకల విధములునుండెడి సంపదలు గల్గుటలో సందేహమునకు ఆస్కారము ఉండదు.

లలాట లిఖితమును మార్చివేసి జీవితమును సుఖమయము చేసెడి శక్తి భస్మమునకు కలదని చెప్పవచ్చును. తన్నిమిత్తమై ఈ క్రింది ప్రయాణమును పరికించండి.

**శ్లో ॥ ఏతాని తాని శివ మంత్ర పవిత్ర తాని**
**భస్మాని కామ దహనాంగ విభూషితాని ।**
**త్రిపుండ్రకాని రచితాని లలాటే పట్టే**
**లుంపంతి దైవలిఖితాని దురక్షరాణి ॥** (క్రియా సారము, ఉపదేశము 8, పుట 81)

పంచాక్షరి మహామంత్రమును నుపయోగిస్తూ భస్మ త్రిపుండ్రములను ఫాలభాగమున ధరించిన యెడల లలాటములోని ప్రతికూల లిఖితము చెరిగిపోవునని యీ ప్రమాణము తెలుపుచున్నది. ఈ కారణమున పేదరికముతో బాధపడెడివారు ప్రతి నిత్యము శ్రద్ధతో లలాటమందున త్రిపుండ్రములను ధరించిన యెడల వారికి సంపదగల్గి పేదరికము దూరమగును. అలసత్వము వైదొలగును. ఇంకవ అధికముగా శ్రమించవలెననెడి కోరిక జనించును. పేదవాడు క్రమక్రమముగా ధనవంతుడయ్యెడి యవకాశమేర్పడును.

విభూతి పరిపూర్ణత్యమునకు చిహ్నముగా గాంచబడుచున్నది. పర్వదినములయందున వివిధ పక్వాన్నములను తయారుచేసి, వాటిని విభూతిచే యలంకృతమైన పాత్రలో నింపియుంచెడి పరంపరానుగత ఆచారమొకటి కలదు. వీటిని పవిత్రమైనవిగా భావించి, గురు-లింగ-జంగమార్చనలు ముగిసిన పిదప వీటిని యిట్టి శివస్వరూపములగువారికి అర్పించి, ఆ తదుపరి యింటివార్లెల్లతినెడు సాంప్రదాయము గలదు. దూరం నుండి చూసిన యెడల, యీ పాత్రలు చూపరులకు పరమపవిత్రమైన పరిపూర్ణ వస్తువులుగాగోచరించును. విభూతిని ధరించినవాని ముఖమును చూసిన యెడల చూపరులకు ప్రసన్నత్వము మరియు పరిపూర్ణత్వము కన్పట్టును. శివపూజను చేసి, శివప్రసాదముగా భావింపబడెడి భక్ష్యాదులను సేవించిన వాని ముఖమున యెట్టి ప్రసన్నత్వము, మరియు పూర్ణత్వము స్ఫురించునో, అట్టి పూర్ణత్యాదులు భస్మమును ఫాలమున ధరించిన వాని ముఖమునను కనబడును. ప్రసన్న హృదయునిలో యీ పవిత్రమైన వాసనలకు చోటు ఉండదు. వాసనలు దహింపబడును. తత్ఫలితముగా దివ్యజ్ఞాన సంపత్తు అతనికి సొంతమగుచున్నది.

ప్రాచీన కాలములోని ఋషుల చరిత్రలు తెలియజెప్పునదేమనగా, శాక్రోక్త విధిన తయారుచేయబడిన విభూతిని, శాస్త్రోక్త విధిన ఫాలము యితాద్యంగములలో ధరించెడివారికి అణిమాద్యష్ట సిద్ధులు గల్గును.

అమరము చూసినవారికి యీ భావమే యేర్పడును. ఈ ప్రమాణమును గనుడి:

**శ్లో॥ "విభూతిర్భూతిరైశ్వర్య మణి మాదిక మష్టధా"** (అమప 1-39)

ఆణిమాద్యష్టైశ్యములన యెవ్వియో అనేది తెలిసికొనుట యెంతో అవసరము ఈ దిగువన గల ప్రమాణమును గనుడి!

**శ్లో॥ అణిమా మహిమా ప్రాప్తిః**
**ప్రాకామ్యం మహిమా తథా।**
**ఈశితా వసితా చైవ**
**తథా కామావశాయికా ॥**

అణిమ, లఘిమ, ప్రాప్తిః, ప్రాకామ్యము, మహిమ, ఈశిత, వశిత మరియు కామావశాయితము లనెడివి యష్టసిద్ధులని యీ ప్రమాణము వలన తెలియును.

"అణోర్భావః అణిమా" యనెడి వ్యుత్పత్తి ప్రకారము అణిమ యనగా సూక్ష్మాతి సూక్ష్మమైన శరీరమును దాల్చుట "లఘోః, భావః లఘిమా"యనెడి వ్యుత్పత్తి ప్రకారము లఘు రూపమును సిద్ధించి కొనుటయే లఘిమ. అతిదూరమున యున్న వస్తువులనైననూ చేతిని చాచి గైకొను శక్తి గల్గియుండుటయే ప్రాప్తియని యెరుంగవలెను. "ప్రాకామస్య భావః ప్రాకామ్యం" అనెడి వ్యుత్పత్తి ప్రకారము కోరిన యటుల సర్వమూ సిద్ధించుటయే ప్రాకామ్యము. మహతో భావో మహిమా యనే వ్యుత్పత్తి ప్రకారము అతి విశాలమైన స్వరూపమును దాల్చునదే మహిమయగును. 'ఈశితో భావ' ఈశితో యనెడి వ్యుత్పత్తి ప్రకారము ఈశిత యనగా ప్రభుత్వము. స్థావర పదార్థములు తన ఆజ్ఞను పాలించే విధముగా చేయునదే యీశితమని గ్రహించవచ్చును. వశినో భావః వశితా అనెడి దాని ప్రకారము సర్వమును తన వశమునందున యుంచికొనునదే వశితమగును. 'కామాన్ అవశేతే' ఇతి 'కామావశాయీ, కామావశాయినో భావః' కామావశాయితో అనే వివరణ ప్రకారము సత్యసంకల్పమే కామావశాయితయగుచున్నది.

అష్టసిద్ధులు గలవాడు పరిపూర్ణ స్వేచ్ఛను అనుభవించునని తెలియుచున్నది. ప్రకృతి యతనికి వశమై యతడు కోరినయటుల మెలగును. సాధారణ వ్యక్తి నీటిలో మునిగి, జలగర్భమున కేగి, తిరిగి రాగల విధిన, భూమిలోనికి జొచ్చుకొనిపోయి, తన యిచ్ఛానుసారముగా బయటికి వచ్చెడి సామర్థ్యము అష్టసిద్ధులు గలవానికుండునని తెలియుచున్నది.

శ్రీ రేణుక భగవత్పాదులవారికి శిష్యుడై గురూపదేశమును పొందిన అగస్త్యుడు, విభూతి మహిమనెరిగినవాడే, దానిని ధరించుట వలన అష్టసిద్ధులతో పాటుగా అనంతమైన దివ్యశక్తిని పొందునని తెలిపెడి కథ యొకటి కలదు. శ్రీ నీలకంఠ శివాచార్యులవారీ కథను వివరించిరి. క్రియాసారములో యీ కథ వివరింపబడినది. యీ దిగువన యివ్వబడిన ప్రమాణమును గనుడి:

**శ్లో॥ సముద్ర తీరమాసాధ్య భస్మాదాయాభి మంత్రి తం।**
**ధృత్వా లలాటే కరయోరాలేప్య సహసాఋషిః ॥**
**అజుహావాంబుధిం పాణిం ప్రసార్యమహానృషిః ।**
**తదానీమాగతాంబోధిః కరే నీహార బిందువత్ ॥**
**ప్రాశయామాస తం ధ్యాత్వా మహా దేవం ఋషీశ్వరః ।**
**సంహారేంద్రాసురావ్ పాపాన్ రాక్షసానపి దుర్జనాన్ ॥**
**వివముక్త్వా దదౌ భస్మ సురేశాయ ఘటోద్భవ ః** (క్రియాసారము, ఉపదేశము 8, పుట 130-131)

పై ప్రమాణములో యిమిడివున్న కథ ఏమనగా, అగస్త్య మహర్షి ఒకనాడు దేవేంద్రునితో విభూతియొక్క మహిమను చర్చించుచుండెను. విభూతి మహిమను ఎఱిగినవాడైనందుననూ, సదా విభూతి ధరించెడివాడైనందుననూ అగస్త్యుడు విభూతికి సంబంధించిన సిద్ధాంతములెన్నింటినో దేవేంద్రునికి తెలియబరచెను. అంతలోనే ఒక సంఘటన జరిగెను. ఇది దైవకల్పితమనియే చెప్పవలెను. అగస్త్యుడు సిద్ధాంతరీత్యా ప్రతిపాదించిన విభూతి మహిమను గురించి ఆచరణాత్మకముగా నిరూపించెడి అవకాశమును అగస్త్యునకు నీ ఘటనల వలన సాధ్యమయ్యెను. అదెట్టిదో చూచెదము గాక.

ఎంతో శక్తివంతులైన రాక్షసులచే పీడింపబడి భయభ్రాంతుడైన వరుణదేవుడు పరుగు పరుగున వచ్చి దేవేంద్రుని శరణుజొచ్చెను. రాక్షసుల యొక్క దురాగతములను వివరించెను. వారిని మనమేమీ చేయలేమని యునూ వారు దురాగతములు చేసిన పిదప సముద్రగర్భమునకు చేరి రక్షణ పొందుచున్నారనియును వివరించెను. దేవేంద్రుడు నిస్సహాయుడై దిక్కుతోచని స్థితిలో ఉండెను. వరుణునికి ఏమి చెప్పవలెనో అనెడిది అతనికి దోచలేదు. మౌనముగానే వుండిపోయెను. వరుణదేవుడు ఎన్నిసార్లు వినతులు చేసిననూ అవి యన్నియును అరణ్యరోదనములవలె నిష్ఫలములయ్యెను. అగస్త్యమహర్షి సంగతులన్నింటిని వినినవాడై దేవేంద్రుని మందలినిచెను. లోకపాలకుడైన నీవు లోక సంరక్షణ చేయవలదా? అది నీ బాధ్యత కాదా? అని నిలదీసెను. అపుడు దేవేంద్రుడు స్వామీ! నేనేమియును చేసెడి స్థితిలో లేను. వారు సముద్రగర్భములో నున్నందున వారిని వెన్నంటి చంపుటకు శక్యముకాదయ్యెను. సముద్రములోని నీరు నిశ్శేషమైనగాన వారిని చంపుటకు వీలు కాదు. మరి అట్టి స్థితి కలుగగలదా? అని ప్రశ్న రూపమైన జవాబునిచ్చెను.

అగస్త్యుడు ఆలోచనలకు లోనయ్యెను. దుష్టసంహారముచేయటు యనెడిది శిష్టధర్మము గనుక దానికి వలయు సహాయము చేయుట తన కర్తవ్యమని యెంచి దేవేంద్రునితో యిట్లనెను. ఓయీ! దేవేంద్రా! నీవు యుద్ధమునకు సన్నద్ధుడవై నా వెంబడి రమ్ము – నీ కోరికను తీర్చెదను అని అనెను. మహర్షి సముద్రతటమునకు వెళ్ళెను. వరుణుడు వారిని అనుసరించెను. సముద్ర తీరమును చేరిన పిదప అగస్త్య మహర్షి శివమంత్ర పురస్సరముగా సర్వాంగములయందును విభూతిని ధరించెను. ఆ విభూతినే తన కుడి అరచేతికి రుద్దుకొనెను. శివుని, శివభక్తులను మనస్సున తలచుకొని వారికి ప్రణామముల నర్పించి సముద్రుని ఆహ్వానించెను. సప్తసముద్రములలో వున్న జలసంపదయంతయు వచ్చి ఒక చిన్న నీటి తుంపెర ప్రమాణమున రూపుదిద్దుకొని ఋషిపుంగవుని అరచేతిన నిలెచెను. దేవేంద్రుని యొక్క ఆశ్చర్యమునకు అంతులేకుండెను. దేవతలెల్లరు దిగ్భ్రమకు లోనై చూచుచుండిరి. వరుణదేవుడు ఆనందభరితాంతరంగుడై నిలిచెను. అగస్త్యుడు ఆ నీటిని త్రాగెను. దేవేంద్రుడు మరుక్షణముననే రాక్షసుల పైకి దండెత్తి వారినెల్లరును తన వజ్రాయుధముచేత విగతప్రాణులను జేసెను. దేవతలు హర్షధ్వానములు చేసిరి. దేవేంద్రుని వినతిమేరకు అగస్త్యుడు మింగిన నీటిని ఉమ్మివేసెను. సప్త సముద్రములు యథావిధిగా జలసంపదతో నొప్పారి యుండెను.

## భసితము:

“భసితం తత్త్వ భాసనాత్” అనెడి పూజ్యపాదులువారి యుపదేశము ప్రకారము తత్త్వ భాసకమైనందున విభూతిని భసితమని పిలిచెదరు. “అనారో పితు రూపం తత్త్వం” అని తత్త్వమును గూర్చి చెప్పబడినది. కాల్పనికము కాక, వాస్తవికమైన దానిని తత్త్వమని యందురని చెప్పబడినది. వీరశైవ సిద్ధాంతమున కల్పితమైనదానికి స్థానమివ్వబడలేదు. కేవలాద్వైతులు నుడివెడి కాల్పనిక లేదా మిథ్యా భావములను వీరశైవాచార్యులు తిరస్కరించిరి. శ్రీ ఆది శంకరాచార్యుల వారి “జగన్మిథ్యా వాదము”ను ఖండించిరి. వీరశైవులకు జగత్తు సత్యమైనదే.

వీరశైవ సిద్ధాంతమునందున, చరాచర జగత్తు, శివాది భూమ్యంతముగల ముప్పది యారుతత్త్వములుగా ఉన్నది. “సర్వం లింగమయం జగత్” అని ప్రకటించిన వీరశైవ ధర్మమునకు చెందినవారు శంకరాచార్యుల వంటివారి బోధనలకు లోనై జగన్మిధ్యా భావమునంగీకరింతురే? ఈ విషయమున శ్రీ జగద్గురు రేణుకార్య శివాచార్యులవారి యీ క్రింది యుపదేశము గమనార్హమైనది.

**శ్లో ॥ పత్ర శాఖాది రూపేణ యథాతిష్ఠతి పాదపః**
**తథా భూమ్యాది రూపేణ శివ ఏకో విరాజతే॥**

వృక్షమేవిధముగా పత్రశాఖాదుల రూపమున విరాజిల్లుచున్నదో, అదే ప్రకారము శివుడు భూమ్యాదుల రూపమున విరాజిల్లుచున్నాడనుట శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశము.

శివుడొక్కడే ముప్పది యారు తత్త్వముల రూపమును దాల్చుచున్నాడు. ఈ కారణము వలన శివ, శక్తి, సదాశివ, ఈశ్వర మరియు శుద్ధ విద్య యనెడి శుద్ధతత్త్వములను, మాయ, కల, అవిద్య, రాగ, కాల, నియతులనెడి మిశ్రతత్త్వములును, అంతరంగ చతుష్టయమును, దశేంద్రియములును, పంచభూతములును, పంచతన్మాత్రలను శివ స్వరూపములే. వీటన్నింటి యొక్క తత్త్వమును యదార్థముగా తెలిసికొనినవాడే తత్త్వజ్ఞానియని యెరుంగవలెను.

తత్త్వజ్ఞానము సులభసాధ్యము కాదు. తన్నిమిత్తము శాస్త్రాధ్యయనాదులను తప్పనిసరిగా చేపట్టవలసి యుండును. అట్టి అధ్యయమునకై చిత్తశుద్ధి యవశ్యకము. అట్టి చిత్తశుద్ధిని సాధించుటకై భస్మము సాధనముగా పనిచేయును.

"భస్మధారణ కర్తవ్యమ్" అని చెప్పెడి శ్రీ మరితోంట దార్యులవారి వాక్కులను గనుడి

**శ్లో ॥ "నిః శ్రేయసై కసాధన బ్రహ్మవిద్యాంతరంగచిత్తశుద్ధి
సంపాదకత్వేన వైదిక శివపూజాంగత్వేన చ భస్మ
ధారణం కర్తవ్యమ్"** (నీ.చం. ప్రకరణ 7, పుట 133)

ముక్తికి సాధనా భూతమైన బ్రహ్మ విద్య యొక్క అంతరంగము చిత్తశుద్ధికి కారణభూతమైనది, వైదిక శివపూజా విధియందున అంగమున భస్మధారణ చేయదగినదైయున్నది.

సాధకుడు, బ్రహ్మ జ్ఞానమునకు నధికారి కావలెననినయెడల భస్మధారణ చేసికొనవలెనని శ్రీ పతి పండిత శివాచార్యులవారు నిర్దేశించిరి. వీరు బ్రహ్మసూత్రములకు భాష్యకారులై యుండిరి. అధాతో బ్రహ్మ జిజ్ఞాసా" (బ్ర.సూ. 1-1-1) అనెడి సూత్రమునకు భాష్యమును వ్రాయునపుడు "అథ" పదము యొక్క అర్ధమును క్రింది విధముగా వివరించిరి.

**శ్లో ॥ కల్యాణ కైవల్య విభూతి త్రయ ప్రదాయకాష్టావరణ -
పంచాచార - స్తద్గురు కరుణాకటాక్ష లబ్ధ శక్తి పాతా
ద్య విచ్ఛిన్న పరశివస్య యిష్టలింగధారణాత్మక
పాశుపత దీక్షాఽనంతర్యమిత్యథ శబ్దార్థోనే నిర్ణియతే"**

అష్టావరణ, పంచాచార బోధక, పాశుపత దీక్షానంతరము సాధకుడు బ్రహ్మజ్ఞానమునకు అదికారియగుచున్నాడు, అనెడిది శ్రీపతి పండితుల వారి హక్కులకు గల భావము. వీరశైవులలోని తత్వజిజ్ఞాసువులు భస్మధారణ యొక్క అవశ్యకతను యెరిగినవారై భక్తి శ్రద్ధలతో భస్మమును ధరించి కొని కృతార్థతాసిద్ధిని పొందగలరు.

దీని రహస్యార్థమేమనగా అంతః కరణ శుద్ధిగానిదే తత్వజ్ఞాన సిద్ధి సాధ్యము కాదు. అంతఃకరణ శుద్ధిని సాధించదలచినవారు కదు పరిశ్రమకు లోను కావలసియుండును. కారణమేమనగా, శాస్త్రము విధించిన విధిలో తీర్థయాత్ర సేవన, మంత్ర, జపతపాదులు చేయుటయనెడిది తప్పనిసరిగా చేయవలసిన విధులు, కఠిన పరిశ్రమ కోర్చెడివాడే వీటిని చేయగలడు. భక్తి శ్రద్ధలతో భస్మమును ధరించెడివానికి వీటితో పనిలేదు. అంతఃకరణ శుద్ధి అప్రయత్నముగనే సిద్ధించును. అంతేకాదు, తత్వజ్ఞాన సిద్ధియును, మోక్షప్రాప్తియును లభించును.

మోక్షప్రాప్తిని కోరెడివానికి యజ్ఞాదులేల? యని శ్రీ నీలకంఠ శివాచార్యులవారు ప్రశ్నించిరి.వారి ప్రశ్నల పరంపరను గనుడి:

**శ్లో ॥ కిం యజ్ఞైః కిమనేక తీర్థకలహైః కిం వేద పాఠప్రమ్యైః ।
కిం ఘోరైర్వివిధ్వై స్త పో భిరమలైః కిం మం త్రతంత్రైర్జపైః ।
కిం ధ్యానైః కిమనేక దాననికరైః కిం సాంఖ్య యోగైర్బ్ర మైః
మోక్షార్థీ సితభస్మనా చ నిపుణః కుర్యాత్రిపుండ్రం బుధః॥** (క్రియాసారము, ఉపదేశము 8,పుట 87)

పై ప్రశ్నలన్నియును మత్స్య పురాణములో నున్నవే. శ్రీ నీల కంఠ శివా చార్యులవారు, పురాణోక్తుల నుదహరించి, భస్మధారణ చేసినచో ముక్తి సులభ సాధ్యమగునని యుపదేశించిరి. ఈ విధముగా మోక్ష ప్రాప్తికై భస్మధారణ యవశ్యకమని, బహువిధమార్గముల ద్వార నిరూపితమైనది. వీరశైవులెల్లరూ భస్మధారణ యనివార్యమని యెంచవలెను.

భస్మము ధరించనివారికి గల్గెడి నకారాత్మక ఫలము లెవ్వి యనెడి ప్రశ్న తలయెత్తుటకవకాశము గలదు. ఇద్దానికి, స్మృతి యీ క్రింది విధిన యుత్తరమునిచ్చినది.

**శ్లో॥ సత్యం శౌచం జపో హోమస్తీర్థం దేవాదిపూజనం।
తస్య వ్యర్థమిదంసర్వం య స్త్రిపుండ్రం న ధారయేత్॥** (నారదీయ స్మృతి)

ఎరుగవలసినదేమనగా, మోక్షమును కోరెడివారు భస్మమును విధిగా ధరించవలెననుటకు సమర్థించే యీ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ ఆయుష్కామో యథారాజన్ భూతికామోఽథవా నరః**
**నిత్యం వై ధారయేద్భస్మ మోక్షకామీ చ వై ద్విజః ॥** (క్రియాసారము, ఉపదేశము 8, పుట:89)

యజ్ఞము చేసెడివానికి అగ్నిలేనిదే యభీష్టము నెరవేరదు కదా! అదేవిధాన భస్మధారణ కూడ మోక్షాపేక్షగలవానికి యనివార్యమని తెలిపెడి యీ ప్రమాణమును గనుడి:

**శ్లో॥ ముక్త్వా త్రిపుండ్రం మోక్షస్య సాధనం నహి విద్యతే।**
**యథా కృశాను రహిత స్త్వ ధ్వరో న విరాజతే ॥** (క్రియాసారము, ఉపదేశము 8, పుట 85)

ఈ విధముగా, అంతరంగమున శుద్ధిని బడసితత్త్వ జ్ఞానమును పొందుటకై భస్మధారణ అవశ్యకమని యెరిగిన పిదప సందేహ మనస్సునకు మరియొక ప్రశ్న యెదురగును. బహిరంగమున ధరింపబడెడి భస్మము అంతరంగము నెటుల శుద్ధి జేయును? తార్కిక దృష్టి చేత చూచిన యెడల యిది యెట్టుల సాధ్యమగునని దోచదా? పొయ్యిలో మంటకు బియ్యముతో ప్రత్యక్షమైన సంబంధముండదు. మంట తాకెడిది పాత్రకే కదా! మంట యొక్క ప్రభావము పాత్రలోనికి ప్రవేశించి బియ్యమును పక్వము చేయునటులే, భసిత ధారణము వలన అంతరంగము నిర్మలమగును.

ఈ విధముగా భస్మధారణ – తత్వజ్ఞాన సాధనలు సన్నిహితమగు సంబంధము గలవని ఎరిగి, వీరశైవులు భస్మమును ధరించి శివతత్త్వము యొక్క మహిమను మరియు గరిమను గుర్తెరిగి, బ్రహ్మ విద్యా సంపన్నులై లింగాంగ సామరస్యమను ముక్తిని బడయవలెను.

## భస్మము

"పాపానామ్ భర్త్సనాద్భస్మ" అనెడి శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారి ఉపదేశము ప్రకారము పాపములకు భయమును కల్గించుటచేత విభూతికి భస్మమనెడి నామము ప్రాప్తమైనది. బృహజ్జాబాలోపనిషత్తునందు "భస్మ సర్వాఘ భక్షణాత్" అని చెప్పబడినది. సర్వపాపములను భక్షించెడిదైనందున భస్మమనెడి పేరు లభించినదని ప్రతిపాదించబడినది. శాస్త్ర నిషిద్ధ ఆచరణలను ఆచరించినప్పుడు మనుజునికి పాపములు సంభవించుచున్నవి. ఈ పాపమును గురించిన వివరణ అమరకోశములో ఈ క్రింది విధిన యివ్వడమైనది.

**శ్లో ॥ అస్త్రీ పంకం పుమాన్ పాప్మా పాపం కిల్బిషకల్మషం**
**కలుషం వృజినైనోఽఘమంహో దురితదుష్కృతం** (అమరము 1-23)

పై శ్లోకము ప్రకారము పంకము, పాప్మా, పాపము, కిల్బిషము, కల్మషము, కలుషము, వృజినము, ఏనము, అఘము, అంఘము లేక అంహము, దురితము మరియు దుష్కృతములనెడివి పాపమునకు పర్యాయపదములు. మొత్తము మీద పన్నెండు శబ్దములు పాపమును సూచించుచున్నవి. ఈ శబ్దముల యొక్క వ్యుత్పత్తిని తెలుసుకొనుట ఎంతో అవసరము.

**పంకం: 'పచ్యతే – వ్యక్తీభవతి, విస్తారోభవతి వా దుఃఖమనేన ఇతి పంకం'**

దేనిచేతనైతే దుఃఖము అభివ్యక్తిమగునో లేదో దుఃఖము విస్తారమగునో దానిని పంకమని అందురు.

**పాప్మా: 'ఆప్నోతీ లోకాన్ ఇతి పాప్మా'**

జగత్తున జనులందరి యందు వ్యాపించుకొని యున్నందువలన దీనికి పాప్మా అను పేరు వచ్చినది.

**పాపము: 'పిబతి–భక్షయతి కర్తారం ఇతి–పాపం '**

తనను నిర్మాణము చేసినవానినే ఏదైతో భక్షించుచున్నదో దానిని పాపము అందురు.

**కిల్బిషము: 'కేలయతి-క్రీడయతి, విషయేషు ఇతి-కిల్బిషం'**

మనుజుని విషయసంబంధమైన క్రీడయందు ప్రవర్తించే విధముగా చేయుట దానిని కిల్బిషమని యందురు.

**కల్మషము: 'శుభంకర్మ శ్యతి తనూకరోతి వా కల్మషం'**

శుభకర్మమును అల్పముగా చేయునది.

**కలుషం: 'కలయతి, వశీకరోతీతి కలుషం'**

జగత్తులోని ఎక్కువమంది జనులను తన వశమునందుంచు కొనెడిది అయినందుచేత, కలుషితమందురు.

**వృజనం: 'వర్జ్యతి శిష్టైరితి వృజినం, వృదీవర్జనే'**

శిష్టులచేత వర్జింపబడునది అయినందున దీనికి వృజినమను పేరు కల్గినది.

**ఏనము: 'యాంతి గచ్ఛంతి  అధః అనేన ఇతి ఏనః'**

మనుజులు దేనిచేత అధోమార్గ గమనులగుచున్నారో దానిని ఏనము అని పిలుతురు.

**'ఏతి, గచ్ఛతి ప్రాయశ్చిత్తేన ఇతి ఏనః'**

దేనిని చేసిన ప్రాయశ్చిత్తము చేయవలసియుండునో అట్టి దానిని ఏనము అందురు.

**అఘము: 'అంఘతే, గచ్ఛతి దానాదిన ఇతి అఘమ్'**

దేనిని చేయుటచేత దానాదుల వలన నివృత్తిని బడవలసిన అవసరముండునో అట్టి దోషమును అఘము అందురు.

**అంఘము లేదా అంహము: 'అమతి గచ్ఛతి అథవా అంహతి, గచ్ఛతీతి అంఘః (అంహః)'**

ఏది శుభకర్మలచేత నివృత్తి కాబడుచన్నదో అతీ అంఘము.

**దురితము: 'దుష్టమితమ్ గమనమ్ అనేన ఇతి దురితం'**

మనుష్యుని దుర్మార్గమువైపునకు ఏది ఈడ్చుకొనిపోవుచున్నదో అది దురితమనబడును.

**దుష్కృతము : 'దుష్టం కృతమ్ కరణమ్ అనేన ఇతి దుష్కృతమ్'**

మనుష్యుని అంతఃకరణము మరియు బహిరంగములను ఏదైతే దూషితములుగా చేయుచున్నదో అది దుష్కృతము అగుచున్నది.

ఈ రీతిగా పాపము యొక్క పన్నెండు పర్యాయ నామముల వ్యుత్పత్తిని అవలోకనము చేయగా పాపమనగా దుఃఖప్రదాయకమును, వినాశకమును, విషయప్రవర్తకమును, శుభకర్మ నాశకమును, దుర్మార్గ ప్రవర్తకమును, దోషప్రదాయకమును, ప్రాయశ్చిత్త కారకమును అగు దోషమని తెలియుచున్నది. భగవద్దత్తములైన శరీరము, వాణి, మరియు మనస్సులు అనెడి త్రికరణముల మూలకముగా పాపకర్మములు, పుణ్యకర్మములును సంభవించుచున్నవి. పామరజీవులు ఈ త్రికరణముల మూలకముగా సదా అశుభకర్మములనే తలపెట్టుచున్నారు. శ్రీ నిజగుణ శివయోగులవారు చెప్పిన యటుల పరవధువుతో కూటమి, అన్యుల విత్తాపహరణ, అభక్ష్య పదార్థముల సేవన, మరియు హింస మొదలగునవి శరీరమువలన చేయబడెడి దుష్కర్మములు. అసత్యము, అనుచితము, నిష్ఠురత్వము, మరియు పైశూన్యత మొదలగునవి వాక్కుకు సంబంధించిన దుష్కర్మలగును. అనిష్టచింతన మరియు అన్యులకు అహితము చేయవలెననెడి కోరిక మొదలగునవి మానసిక సంబంధమైన దుష్కర్మలు. ఈ రీతిగా ఎల్లప్పుడూ త్రికరణముల వలన కలిగెడి పాపముల ఫలముగా మనుజుడు పతితుడై పామరయోనులయందు జన్మించెడి స్థితికి దిగజారుచున్నాడు. పామరములు, మరియు హీనములు అగు జన్మల యొక్క ప్రాప్తి కలుగవలదను కోరిక యుండిన యెడల సన్మార్గముల యందు ప్రవృత్తుడై శుభకర్మములనే ఆచరించవలెను. విభిన్నములైన దుష్కర్మముల నివృత్తికై అనేకములకు ప్రాయశ్చిత్త కర్మలు ప్రతిపాదించబడినవి.

వాటిని ఆచరించడము అంత సులభసాధ్యమైన పనికాదు. అందుచేత ఎల్లరూ సులభముగా సకలపాపముల నుండి నివృత్తి కావలెననెడి ఉద్దేశ్యము చేత ఆగమముల యందును, ఉపనిషత్తులలోను, పురాణాదుల యందును భస్మధారణ విధించబడినది. అందుకే సర్వపాపములను లేదా అఘములను భక్షించునదే భస్మమని బృహజ్జాబాలోపనిషత్తు సందేశమును యిచ్చుచున్నది.

**శ్లో ॥ భస్మ నిష్ఠస్య దహ్యంతే దోషా భస్మాగ్ని సంగమాత్।**
**భస్మస్నాన విశుద్ధాత్మా భస్మ నిష్ఠ ఇతిస్మృతః** (బృహజ్జా బాలోపనిషత్తు. 5-18)

బృహజ్జాబాలోపనిషత్తు ప్రమాణము ప్రకారము భస్మ స్నానము, భస్మోద్ధూళనము, భస్మధారణములందున తల్లీన మనస్సుగలవాడు భస్మనిష్ఠగలవాడు అగుచున్నారు. ఈ విధముగా భస్మనిష్ఠుడైన సాధకుని సర్వపాపములు భస్మీపటలమగుచున్నవి. ఈ విషయమును విదితముచేసెడి క్రియాసారములోని ఈ క్రింది శ్లోకమును గమనించుడి.

**శ్లో ॥ "భస్మమననాదేవ కిల్బిషాదీని నశ్యంతి। భస్మ**
**మననాదేవ పాపం భస్మసాత్ కరోతి । భస్మమననా**
**దేవ సంసారూత్తారణం కరోతి । స ఏష భస్మజ్యోతిః॥** (క్రియాసార. ఉపదేశ. 7, పుట-44)

ఈ ప్రమాణము ప్రకారము భస్మము ఒక దివ్యజ్యోతి.ఆ జ్యోతి యొక్క సాన్నిధ్యమున సకల కిల్బిషములు నాశనమగును.

**శ్లో॥ "మద్యం పీత్వా గురుదారాంశ్చ గత్వా**
**స్తేయం కృత్వా బ్రహ్మహత్యాం చ కృత్వా**
**భస్మచ్ఛన్నో భస్మశయ్యా శయానో**
**రుద్రాధ్యాయీ ముచ్యతే సర్వపాపైః ॥** (శాతాతపస్మృతి)

**అశుచిర్వాప్యనాచారో మనసా పాపమాచరన్ ।**
**శుచిరేవ భవేన్నిత్యం త్రిపుండ్రస్య చ దారణాత్ ॥** (స్మృతిసార)

మద్యపాన సేవనము, గురుపత్ని గమనము, దొంగతనము బ్రహ్మహత్య మొదలగు మహాపాతకములను ఆచరించిననూ, మానసిక పాపములను చేసిన అనాచారియునూ, భస్మధారణ చేయుటచేత సర్వపాపముల నుండి విముక్తుడు అగుచున్నాడు అనునది పై స్మృతి ప్రమాణములలోని సారాంశము.

**శ్లో॥ కంఠేచ ధారణాత్కంఠభాగాదికృతపాతకం।**
**బాహ్వోర్బాహుకృతం పాపం వక్షసోమనసాకృతం॥**
**నాభ్యాం పృష్ఠ కృతం సాపం పృష్ఠే గుదకృతం హరేత్।**
**పార్శ్వ యోర్ధారణాద్రామపరస్త్ర్యాలింగనాదిజం॥**
**భస్మాసనాభస్మశయ్య భస్మోద్ధూళితవిగ్రహః।**
**భస్మస్నానాత్ సదా పాపైర్ముచ్యంతేనాత్రసంశయః॥** (క్రియాసార ఉప. 8. పుట 85)

పవిత్రమైన భస్మమును కంఠమునందు ధరించినచో కంఠమునందు జనించిన పాపము, బాహువునందు ధరించినచో బాహువు నందు పుట్టిన పాపము, పార్శ్వమునందు ధరించినచో పరస్త్రీలను ఆలింగనము చేసికొనుటవలన వచ్చిన పాపము, మరియు ఆయా అవయవముల యందు భస్మమును ధరించినచో ఆయా అవయవముల యందు జనించిన పాపము నశించునని శివగీతలో ప్రతిపాదించిబడిన విషయములను ఉల్లేఖన చేస్తూ శ్రీ నీలకంఠ శివాచార్యులవారు తన ఉపదేశమునిచ్చిరి. అనేక గ్రంథముల యందు భస్మ మహిమను స్తుతించుచూ అనేకమైన దృష్టాంతములు విపులముగా వివరింపబడినవి. పాతకుల యొక్క లబ్ధి గురించి ఒకానొక దృష్టాంతమను యిచ్చుట గమనింతుముగాక.

ద్రవిడ దేశమునందు పామరుడగు ఒక బ్రాహ్మణుడుండెను. తాను ఉన్నత కులమునందున జన్మించిననూ ఆ కులమునకుఉచితములయిన సంధ్యావందనము, వేదాధ్యయనమును మొదలగు పవిత్ర కార్యములు చేయకుండగా విషయవ్యసనియై మద్యపానము, మాంసభక్షణ మరియు

వేశ్యాగమనము, మొదలగు దురాచారాలయందు కాలయాపన చేయదొడంగెను. ఇతని హీనాచరణలను గని మిగిలిన బ్రాహ్మణులెల్లరూ ఇతనిని కులము నుండి బహిష్కరించిరి.

విషయ వ్యసనము మనుజుని సద్గుణము, తపస్సు, జగత్పూజ్యత, దైహిక తేజస్సు మొదలగు వాటిని పాడుచేయును కదా! అయినను మనుష్యులు విషయ మృగతృష్ణవైపునకే పరుగెత్తుచుండుటను చూచినచో వివేకులకు ఆశ్చర్యము కలుగకమానదు.

ఈ విధముగా ఆ బ్రాహ్మణుడు ఎవరి బహిష్కారమునకు బెదరక తన హీనాచరణలను ఎప్పటివలెనే కొనసాగించెన. అతి విషయ వ్యసనియైన ఇతడు అల్పకాలము నందుననే దుర్బలుడుగను, తేజోవిహీనుగను అయి అకాలమరణము పాలయ్యెను. ఇతని మరణము గురించిన వార్తను వినిన వెంబడే అతని బంధువులలెల్లరూ కూడుకొని అతని కాలికి పగ్గమును కట్టి కుక్కచేత ఈడ్పించుకొని ఊరి బయటగల శ్మశానమునకు వచ్చిరి. ఆ శవమును అక్కడనే వదిలివేసి వెడలిపోయిరి. నిరాశ్రితమై పడి వున్న అతని మృతదేహమును తినుటకై డేగలు, కాకులు, కుక్కలు, పక్షులు మొదలగునవి చుట్టుముట్టెను. ఇతని ఆత్మను యమదూతలు యముని సన్నిధానమునకు తీసికొని వెడలిరి. ఇతను చేసిన కర్మను వివరించి తదనుగుణముగా యితనిని రౌరవాది నరకమునందు వేయవలయునని చెప్పిరి. యముడు అటులనే ఆదేశమునిచ్చెను. కాని ఆ నిర్ణయము తప్పునిదోచే విధముగా కొన్ని వాస్తవములు బహిర్గతమయ్యెను. ఈ విషయములన్నిటినీ వివరించెడి ఈ క్రింది ప్రమాణములను కనుడి

**శ్లో॥ లలాటే తస్య దోర్ద్వంద్వే వక్షస్యగ్రజన్మనః ।**
**సారమేయః సమాగత్య భక్షితుం తం ద్విజాధమమ్॥**
**చచార భస్మలిప్తాత్మ పాదోఽయం బ్రాహ్మణోత్తమాః ॥**
**తావతాయం ద్విజః శీఘ్రాత్ సద్గతిం ప్రాప్తవాన్ఖలు ॥** (క్రియాసారము – ఉప 8 – పుట – 118)

శ్మశానము ప్రక్కన పడవేయబడిన బాపని శరీరమును తినుటకై అక్కడికి ఒక కుక్క వచ్చి అతని మృతదేహము యొక్క ఫాలభాగము, యెద, పక్క భాగములు మొదలగువాటిపైన తన కాళ్ళను పెట్టి, వాని మాంసమును తినదొడంగెను. అక్కడికి వచ్చుటకు ముందు ఆ కుక్క శ్మశానములో విస్తారముగా పడివున్న చితాభస్మమునందు క్రీడాసక్తితో పడి పొరలాడి మేనంతయును బూడిదనిండి యుండగా భస్మోద్ధూళి తాంగియైయుండెను. బ్రాహ్మణుని శరీరము మీద కాళ్ళను పెట్టగానే దాని కాళ్ళకున్న భస్మము వాడి శరీరములోని ఆ భాగములకు అంటుకొనెను. అంత్య సమయమునందున శరీరము మీద భస్మమును గనిన శివుడు ఈ బాపనికి యమదూతల నుండి విముక్తిని ప్రసాదించి సద్గతిని కటాక్షించెను. యముడు ఈ విషయములను ఎరింగినవాడై యమదూతలు తప్పు చేసినారని తలచెను. శివుడు సద్గతిని ప్రసాదించిన పిదప ఆ బాపని ఆత్మను యమలోకమునకు తెచ్చుట మహాదోషము అని యెంచి పరితప్త హృదయుడయ్యెను. దోష నివారణకై శివదర్శనము చేసుకొని మన్నించమని వేడుకొనెను. శివుడు ప్రసన్నుడై యమునికి క్షమాభిక్ష నొసంగెను. బాపడు పాపిష్టియై యుండినను అసంకల్పితముగా భస్మోద్ధూళన, భస్మధారణ, సంయుతుడైనందున సద్గతిని అనుభవించెను.

ఈ విధముగా ఉపనిషత్తులు, పురాణములు, స్మృతి గ్రంథములు మరియు అనుభవజ్ఞులగు వారి గ్రంథములను పరిశీలించిన పిదప భస్మమునందున పాపమును భక్షించెడి సామర్థ్యము గలదని తేటతెల్లమైనది. శ్రీ రేణుక భగవత్పాదుల వారి ఉపదేశము యొక్క స్వభావము వేదాగమాదుల ననుసరించియే యున్నదనియును స్థిరపడినది. అందుచేత వీరశైవులు అందరూ అనివార్యముగా భస్మమును ధరించి తాము చిరకాలము నుండి చేసిన దోషములనుండి విముక్తిని పొందవలెనని శ్రీ భగవత్పాదులవారి ఆకాంక్ష.

ఇచ్చట ఒక విషయమును వివరించవలసియున్నది. భస్మమునందు పాపనివారక సామర్థ్యము వున్నదని తెలిసికొని భస్మధారియై పూర్వపాపములు పోయినవని తలంచి క్రొంగ్రొత్త పాపములను చేయుటకై పూనుకొనువారు జాగరూకత వహించవలసియుండును.పాపవిమోచనమునకు విపరీతమైన అర్థములను గైకొనవలదు. మనము తెలిసీ తెలియక ఒకసారి చేసిన పాపములను పరిహారము చేసుకొనుటకై భస్మమును ధరించుటలో ఔచిత్యముండును. కాని అలవాటుగా బుద్ధి పూర్వకముగా పాపములను చేసెడివాడు ప్రాయశ్చిత్తము కొరకై భస్మధారణ చేసినయెడల యెట్టి ఫలితము వుండదు. మీదు మిక్కిలి అధికమైన దోషము సంప్రాప్తమగును. అదెట్లులనిన శివ లాంఛనములను ధరించియు మంగళమయుడై, మంగళకారకుడై యుండుటకు బదులుగా లోకకంటకుడై యుండుట వలన సంబంధిత

వ్యక్తి శివాపరాధమును చేసినవాడగుచున్నాడు. దోషములు చేసినందువలన కలిగెడి పాపములకంటెను శివద్రోహము వలన కలిగెడి పాపములు తీవ్రతరములై రౌరవాదిన రకములయందు జీవుని త్రోసి వేసెడి పటిమను గలిగియుండును.

భస్మదారి లోకైక పూజ్యుడగుననియును, భస్మధారణ లేనివాడు ధిక్కారమునకు గురియగు ననియును తెలిపెడి వ్యాసోక్తి యొకటి కలదు. కనుడి.

**శ్లో॥ త్రిపుంద్ర సహితో జీవః పూజ్యైః సర్వైః సురాసురైః ।**
**పాపాన్వితోఽపి శుద్ధాత్మా కింపునః శ్రద్ధ యా న్వితః ॥** (శి.పు. వి.స. 24-25)

మహా పాపాత్ముడైన వాడైననూ లింగధారియై భస్మధారణ పొందిన యెడల పూజ్యుడగుచుండగా, సామాన్యుల వలె గాక ప్రత్యేక శ్రద్ధతో భస్మధారణ చేసేవారి గురించి వేరుగా చెప్పవలెనే? అనెడిది వ్యాసోక్తిలోని సారాంశము. ఇది యిట్టులుండగా, భస్మధారణ చేయువాడు దిక్కారమునకు తగినవాడని చెప్పబడినది. శివాలయములేని ఊరు ధిక్కారమునకు గురియగు ననెడి శివవాక్కు గలదు. అదే విధిన భస్మధారణ లేనివాడు ధిక్కరింపబడుదురని గుర్తించవలెను.

## క్షారముః

క్షారమనెడిది విభూతికి గల నాల్గవ పేరు. "క్షారణాత్ క్షారమాపదాం" అని శ్రీరేణుక భగపత్పాదుల వారు ఉపదేశమునిచ్చిరి. విపత్తులను తొలగించెడి దైనందున దీనికి క్షారమని పేరు గల్గినదని తెల్పిరి. బృహజ్జాబాలోపనిషత్తు "క్షారణాదాపదాంక్షారం" అని తెలిపినది. ఆచార్యులవారి వాక్కుకును, ఉపనిషద్వాణికిని భేదము లేదు.

"సర్వః స్వార్థం సమీహతే" అనెడి లోకోక్తి కలదు. జగత్తులోని వారెల్లరూ స్వార్థపరాయణులై యుందురనెడి దీని యర్ధము. స్వార్థపరులందరూ సంపదగలవారిని చుట్టుముట్టి తిరుగుచుందురు. ఇట్టివారి సంఖ్యను లెక్కించుట చాలా కష్టము. ఒక వ్యక్తికి విపత్తుగల్గగనే అతని చుట్టూ తిరిగెడి స్వార్థపరులు తరలిపోయెదరు. ఇది అందరి యనుభవములోనికి వచ్చెడి విషయమే కదా!

మనకు బంధువుల గూర్చి సరియైన యవగాహన లేదనే చెప్పవలెను. సంపద యుండినప్పుడు సమీపమునకు చేరి, సంపదకు దూరమైనప్పుడు సమీపమునకు రాకుండా ఉండెడివారు బంధువులగుదురే? ఈ విషయమున విజ్ఞత నిచ్చెడి చాణక్య వాక్కులను గనుడి

**శ్లో॥ ఆతురే వ్యసనే ప్రాప్తే దుర్భిక్షే శత్రుసంకటే।**
**రాజద్వారే స్మశానే చ యస్తిష్ఠతి స బాంధవః ॥** (చాణక్యనీతి)

రోగములు వచ్చినప్పుడును, ప్రియమైనవారు పోయినప్పుడును, చెడ్డకాలము వచ్చినప్పుడును, శత్రువుల వలన సంకటము సంప్రాప్తియైనప్పుడును రాజాస్థానమునకు పోవలసివచ్చినప్పుడును, మరియు స్మశానము వరకు వచ్చి మన పార్థివ శరీరమునకు వీడ్కోలు పలికెడివారు బంధువులని యీ చాణక్య నీతి వలన తెలియుచున్నది.

ఈ విధిన నుండెడి బంధువు లెందరను సందేహము వచ్చును. అప్పుడు తల్లిని మించి బంధువులుండరని తెలుసు. తల్లికంటె ఎక్కువగా యనురాగము నిచ్చెడి బంధువులును ఉప్పు కంటెను అధికముగా రుచినిచ్చెడి పదార్థములు లేవనెడి లోకోక్తిని వినని వారుందురే? "బంధుర్మాతృ బాంధవయోః" బంధువులలో తల్లి ప్రథమ స్థానమున నుండునని కోశకారుడు తెలిపెను.

జన్మప్రదాతయైన తల్లి, ఆపద్బాంధవులలో ప్రథమురాలనెడిది నిజమే. కాని ఆమె మన సమస్యలన్నింటినీ తీర్చజాలదు. అందుకే, ఆపదలు వచ్చినప్పుడు, గురువునో శివుడినో శరణు వేడెడి పరంపరానుగత సాంప్రదాయ మొకటి కలదు. శైవేతరులు, ఆయా మతములకు చెందిన దైవములను వేడికొందురు. వ్యక్తి ఆపదలు వచ్చినప్పుడు దైవమును ఈ క్రింది విధాన ప్రార్థించును.

**శ్లో॥ త్వమే వ మాతా చ పితా త్వమేవ**
**త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ ।**

**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ**
**త్వమేవ సర్వం మమ దేవ దేవ ॥**

బంధువుల గురించి సర్వజ్ఞులవారు చెప్పిన విషయములు జ్ఞానదాయకములు. వీరి వాక్కులను గనుడి.

**శ్లో॥ బంధుగళు ఆడవరు బందుండు హోగువరు**
**బంధనవ కళెయలరియరు గురు వింద**
**బంధు గళుంటే సర్వజ్ఞ॥**
**సర్వజ్ఞులవారి వాక్కుల తెలుగు రూపమున గనుడి**

బంధువులైనవారు వచ్చి తిని పోవుదురు. బంధనముల గడచ నెరుగరు గురువు కంటె బంధువులుందురే సర్వజ్ఞ!

కష్టములను కడతేర్చెడివాడు గురువని సర్వజ్ఞుల వాక్కులలోని భావము.

గురువు దైవముల మహత్తునెరుగని అవివేకులు ఆపదలు వచ్చినప్పుడు బంధువుల నాశ్రయించి భంగపడెడివారెందరో?

ఇది యిట్టులుండగా, ధనము వలననే సకల విపత్తులు దూరమగునని నమ్మెడివారెందరో గలరు. సువర్ణాభరణములను ఆపద్ధనముగా నెంచెడి లోకాచారము కలదు కదా! ధనమే సర్వస్వమనెడి యీ క్రింది సుభాషితమును గనుడి.

**శ్లో॥ ధనేన నిష్కులినాః కులినా భవంతి ।**
**దనైరాపదం మానవాః విస్తరంతి**
**ధనేభ్యః పరో బాంధవో నాస్తి లోకే**
**ధనాన్యర్జయధ్వం ధనాన్యర్జయధ్యం॥**

ధనము చేత కులహీనులు కులజులగుచున్నారనియును, ధనము చేత మానవులు విపత్తులను దాటుచున్నారనియును, ధనము కంటె వేరు బంధువులు లేరనియును, ధనమునే సంపాదించవలెననియును యీ సుభాషితము చెప్పుచున్నది. దీనిలోని భావమున కనుగుణముగనే లోకములోని మానవులు వర్తించుచున్నారు. ధనార్జనాపిపాసతో పరుగెత్తుచున్నారు. ధర్మాధర్మ విచక్షణము నీతి అవినీతి యనెడి ఆలోచన వీరికి యుండదు.

ధనము జీవనములోని సకల వ్యవహారములకు ప్రధాన మాధ్యమమైయున్నది. అందుచేత, ధనము జీవనముకు, ఆవశ్యకమైనదనెడిది నిజము. అయితే, ధనముచేతనే సకల విధములగు విపత్తుల దొలగించు కొనవచ్చుననెడి భావము సరియైనది కాదు. ఈ విషయమున భ్రమకు లోనై న్యాయాన్యాయముల నెంచకుండా ధనార్జన చేయుచున్నవారెందరో అనర్ధమును కొనితెచ్చుకొనుచున్నారు. ఈ కారణముననే యొక యనుభవుజ్ఞుడు ఈ క్రింది సందేశమునిచ్చిరి.

"అర్థమనర్థం భావయ నిత్యం"

ధనకనకాదుల వలన ఐహికవిపత్తులు దూరము కావచ్చును. ఇవియును తాత్కాలికముగనే పరిహారమగును ధనము వలన పారలౌకిక విపత్తులు దూరము కాజాలవు. ధర్మమే పారలౌకిక దుఃఖములను దూరము చేసేడి సాధనము. ఇహలోకమున విత్తమే పాత్రను పోషించునో అట్టి పాత్రను పరలోకమున ధర్మము పోషించును. అందుకే "పరలోకే ధనం ధర్మః" అని విజ్ఞులు తెలుపుదురు. ధర్మపాలన చేసే ధార్మికునికి ఇహలోకముననను పరలోకముననను ఎట్టి విపత్తులు నుండవు.

లోకమున యిష్టదైవమనే భావన యొకటి కలదు. ఇష్టదైవమునకు ప్రీతికరమైన వస్తువులను, సమర్పించెడి పరంపర గలదు. కొందరు వాటిని తమమేనున ధరింతురు. వీరశైవమున శివుడే యిష్ట దైవము. శివుని ప్రీతికరమైన వస్తువులలో భస్మమతిముఖ్యమైనది. భస్మ ప్రియుడగుటను, శివుడు దానిని శరీరము నిండా పులుముకొనుచున్నాడు. శివునికి ప్రీతికరమైన భస్మమును, భక్తుడు తన శరీరమునకు పులుముకొనిన యెడల శివుడు ప్రసన్నడగును. శివానుగ్రహము లభించును. విపత్తుల నుండి విముక్తి పొందగలడు.

ఈ కారణముననే, వీరశైవునకు భస్మస్నానము విహితమై యున్నది. భస్మస్నానము స్మృతి సమ్మతమైనదని తెలియుచున్నది. బోధాయన స్మృతిలోని శివపార్వతుల సంవాదము రూపమున నున్న యీ క్రింది ప్రమాణమును శ్రీ నీలకంఠ శివాచార్యుల వారు క్రియాసారమున పొందుపరచెను.

**శ్లో॥ అథాతః సంప్రవక్ష్యామి, భస్మస్నానం సులోచనే।**
**ఆయుష్యం బలమారోగ్యం శ్రీః పుష్టి వర్ధతే యధా॥**
**రక్షార్థం మంగలార్థం చ సర్వసంపత్సమృద్ధయే॥** (క్రియాసారము, ఉప. 6, పుట 17)

"ఓ పార్వతీ దేవీ! భస్మస్నానము చేత ఆయుష్యము, బలము, ఆరోగ్యము మరియు సంపదలు వృద్ధిగొనును. దైహిక, మానసిక పుష్టి లభించును. రక్షణ ప్రాప్తించును. మంగళములన్నియును సిద్ధించును.

శివుని ఉపదేశము ప్రకారము ఆయుశ్యము ఆరోగ్యము బలము ఐశ్వర్యము మొదలగువాటిని కలుగజేయు భస్మము నిజముగ ఆపత్‌బంధువులై యుండుటచే భస్మమునందు నిష్ఠ కలిగి వుండవలెను. తిరస్కారము చేయకూడదు. ఈ విషయమున క్రియాసారము ఒక వుదాహరణ యివ్వనైనది, దాని గురించి తెలిసికొందము.

వంగదేశమునందు భుజబలుడు అనే ఓ రాజు ప్రజాపాలన చేయుచుండెను. దానశూరుడగు నీతడు ప్రతిదినము అనేక బ్రాహ్మణులకు దానము చేయుచుండును. ఒకసారి విదర్భ దేశమునకు చెందిన సుశీలుడు అనెడి బ్రాహ్మణుడు రాజు దగ్గరకు భిక్షకై వచ్చెను. బిక్షను యిచ్చునప్పుడు రాజు నొసటన భస్మము లేదని గమనించిన సుశీలుడు రాజుతో "ఓ రాజా, భస్మము ధరించకుండా చేసిన శుభకార్యములు ఫలములను యివ్వజాలవు, భస్మమునందున అశ్రద్ధను వహించిన యెడల సంపద యంతయు నాశనమై దరిద్రము మరియు రోగములు కలుగును, పుత్రులు చనిపోవుదురు.

బ్రాహ్మణుడు చేసిన హితోపదేశము రాజుకు నచ్చలేదు. అతడు బ్రాహ్మణుని పరిహాసమునకు గురిచేసెను, రాజు బ్రాహ్మణుతో యిట్లనెను.

**శ్లో॥ భ వేయురేతీ తేయది వా తదా త్వా ప్రాప్య భూసురః**
**భస్మాదాయ చ ధృత్వై తద్దురితాని నిర్వర్తయె ॥**

ఓ భూసురా నీవు చెప్పినట్లు అట్టి అవస్థ నాకు కలిగినచో అప్పుడు నీ దగ్గరికి వచ్చి నీ వద్ద నుండి భస్మమును పొంది పాపమును కడుగుకొనెదను యిప్పుడు నీవు భిక్షను తీసికొని వెడలుము.

రాజు చేసిన హాస్యమును మరియు అతని మాటలను వినిన అభిమానవంతుడగు యా సుశీలుడు దానమును తీసికొనకయే వెడలిపోయెను.

భస్మ తిరస్కారము చేసిన ఘోరమైన తప్పిదము ఫలముగ కొంతకాలము పిదప రాజ్యమున మహామ్మారి వ్యాధి ప్రాప్తించెను. పిల్లలందరు ఆ వ్యాధిచేత మరణించిరి, రాజుగారి ఈ అవస్థను చూచి యితర రాజులు రాజ్యముపై దండెత్తిరి. అప్పుడు రాజు తన ప్రాణమును కాపాడుకొన భార్యతో కూడుకుని అడవికి వెళ్ళెను, అడవిబాటలో పోవునపుడు ఒక బలశాలియైన కొండ జాతి వాడొకడు రాజు భార్యను ఎత్తుకొనిపోయెను. రాజు వంటరివాడై మతిభ్రమకు గురియై తిరుగుతు తిరుగుతూ ఒక గ్రామములోనికి ప్రవేశించెను. ఆ వూరిలోని పిల్లలు రాజును పిచ్చివాడని అవహేళన చేయుచు అతనిమీద రాళ్ళను రువ్విరి, పగలంతయు తిరిగినా భిక్ష దొరకలేదు. రాజు ఆకలితో పొట్టన మాడ్చుకొనుచు తిరిగెను. నీళ్ళను కూడ త్రాగనివ్వనందున దాహముతో అలమటించిపోయెను, విధి లేక దొంగతనమును చేయుటకై ఒక యింటిలోనికి ప్రవేశించెను. యింటి యజమాని రాజును పట్టుకొని గ్రామ పెద్దల దగ్గరకి తీసికొని వెళ్ళెను, గ్రామపెద్ద విచారణ జరిపి దొంగతనము చేసినవాని కాళ్ళకు చేతులకు గల వ్రేళ్ళను నరికివేయుమని గ్రామ దూతలకు ఆదేశమునిచ్చెను, గ్రామదూతలు గ్రామాధికారి ఆజ్ఞను అమలుపరచి గ్రామమునుండి వెడలగొట్టిరి.

అప్పుడు దిక్కుతోచక కష్టపడుచు క్రింద పడుచు, లేచుచు యింకొక గ్రామమునకు వెడలెను. అచ్చట రాజు భార్యను ఏతుకొని పోయిన కొండజాతివాడు ఒక పులికి బలియైనందున మహారాణి వాని బారి నుండి తప్పించుకొని అటు యిటు తిరుగుచు ఆ గ్రామమలోనికి వచ్చి చేరెను.

అదే గ్రామములో సుశీలుడనెడి బ్రాహ్మణుడు నివసించుచుండెను. రాజు మరియు రాణి ఒకరినొకరు గుర్తించని స్థితిలో ఆ బ్రాహ్మని యింటికి చేరుకొని భిక్షను అడగజొచ్చిరి.

భిక్షగాళ్ళ మాటలు విని సుశీలుడు బయటకి వచ్చి వారిని చూసెను, వారు ఆదేశపు రాజు రాణియని గుర్తించి మీరు నన్ను గుర్తించినారా అని అడిగెను. రాజుకు రాణికి ఏమి తెలియకుండెను. అప్పుడు సుశీలుడు రాజుతో ఓ రాజా నీవు భస్మమును తిరస్కారము చేసినందున నీకీగతి పట్టినది అని అనగా రాజు జరిగిన సంఘటనలను జ్ఞాపకము చేసికొనెను, తాను చేసిన తప్పు ఏమిటో తెలిసికొనెను. అతడు సుశీలునితో యిట్లనెను. ఓ స్వామి నీకు అనంత కోటి వందనములు, మీరు దయదలచి భస్మమును ప్రసాదించుడు, అప్పుడు సుశీలుడు రాజు చేసిన తప్పులను క్షమించెను. ఆశీర్వాద పూర్వకముగ భస్మమును అనుగ్రహించెను. రాజు భస్మమును ధరించగనె అతని కాళ్ళ చేతుల వేళ్ళు వచ్చెను. అతనిని మరచిపోయిన రాణి అతనిని గుర్తించెను. భస్మము ప్రభావము వలన అన్ని వ్యాధులు తొలగిపోయెను. అదే సమయమున రాజుగారి అల్లుడు విచిత్రరథుడనెడివాడు వచ్చి వారిని కలుసుకొని వారికి వుచితమైన వస్త్రములనిచ్చి, తన సైన్యమును మామ గారికి సహాయముగనిచ్చెను.

అప్పుడు రాజు భస్మధారణ ఫలితముగా ఎంతో బలముగలిగిన వాడై పెద్ద సైన్యమును సమకూర్చుకుని తన రాజ్యమును ఆక్రమించిన రాజుపై యుద్ధమును ప్రకటించెను. శత్రురాజు సర్వాంగసుందరముగ తయారై వచ్చెను. కాని భస్మమును ధరించకుండెను. వానికి గర్వము గలిగి భయము లేకుండగ వుండెను. గర్వమున్నవానికి భక్తి గలుగదు గదా? రెండు సైన్యములు ఢీకొనెను, ఘోరమైన యుద్ధము జరిగెను. శత్రురాజు భస్మము ధరించనందున నేలకొరిగిన మరుక్షణమున వాని సైన్యము చెల్లాచెదురై పరుగెత్తెను. రాజు తన రాజ్యమును తన అధీనములోకి తెచ్చుకొని, ధర్మమార్గములో నడుపించుచు ప్రజలనందరిని కన్నబిడ్డల వలె చూచుచు భార్యభర్తలిద్దరు ప్రతి నిత్యము భస్మము ధరించుకొని పరమేశ్వరుని సదా ధ్యానించుచు సత్యప్రవర్తన గలిగి ధన ధాన్య సమృద్ధితో అష్టైశ్వర్యంబులతో తులదూగుతూ బ్రతికియున్నంతకాలము సుఖముననుభవించి అంత్య మందుకైలాసము పొందిరి. భస్మమొక భౌతికమైన పదార్థము. అది మనలను అన్ని ఆపదల నుండి నేవిధిన కాపాడగలదు? అనెడి సందేహములను పెంపొందంచికొనకూడదు. స్థూలముగా నది యొక భౌతిక పదార్థమైననూ, తాత్వికముగా అది పరశివుని స్వరూపమై యున్నది. అందుచేత, "భస్మయే వినిందంతి నిందంతి శివమేచ" అని చెప్పబడినది. శివునకి భస్మముతో అభేదముండుటచేత, భస్మమును నిందించిన యెడల శివుని నిందించినట్లగునని చెప్పబడినది.

ఇష్టలింగార్చన సందర్భమున, పూజలో నొక యంతర్భాగముగా, భస్మపు ఉండయొక్క పూజను చేయవలెనని నైష్ఠిక మహేశ్వరులు చెప్పుదురు. ఆ సందర్భమును పురస్కరించికొని చేయబడెడి భస్మ స్తుతిలో భస్మశివాభేదము పాటించబడుచున్నది. దిగువన గల స్తుతిని గనుడి.

**శ్లో॥ భస్మజ్యోతి స్వరూపాయ శివాయ పరమాత్మనే**
**షట్త్రింషట్ తత్వ బీజాయ నమః శాంతాయ తేజసే!**

ముప్పది యారు తత్వములకు మూల బీజమైన వాని కొరకు, తేజోవంతుడై యుండే వాని కొరకు, భస్మ జ్యోతి స్వరూపమున ప్రకాశించెడి వాని కొరకు, శివుని కొరకు నమస్కారమని యీ స్తుతి శివునికి మ్రొక్కుచున్నది.

శ్రీ నిజగుణశివయోగులవారు శివుని దేహములోని ప్రకాశమే నొక రూపము దాల్చి భస్మమైనదని తెలిపిరి. "శివనయ్యైవెళగు తానాద భసితాపను' యని యుపదేశించిరి. వివరములు గోరువారు వీరి కైవల్య పద్ధతిలోని శివయోగ విభాగమును చూడగలరు.

ఈ ప్రమాణముల వలన శివుడే భస్మమనియును, భస్మమే శివుడనియును స్థిరపడినది. వీరశైవులెల్లరు, ఈ భావమునే మనమున దాల్చి భస్మమును ధరించవలెను సకల విధములైన విపత్తులు దూరము కాగలవు.

పూర్వోక్త వివరణ వలన, విభూతిని క్షారయని పిలుచుటలో ఔచిత్యము గలదని తెలియుచున్నది. అందుచేత వీరశైవులు భస్మము యెడల భక్తి శ్రద్ధలను పెంచికొని ప్రతి నిత్యము శాస్త్రోక్త విధిన భస్మమును ధరించికొనుచు, ఐహిక మరియు ఆముష్మిక విపత్తుల నుండి విముక్తిని పొందగలరు.

## రక్షాః

విభూతియొక్క ఐదవ పేరు రక్ష. జీవులకిది రక్షణ కవచమై జీవులను రక్షించునని తెలియుచున్నది. "రక్షణాత్ సర్వభూతే భ్యో రక్షేతి పరగీయతే" అని ఆచార్యులవారు ఆనతినిచ్చిరి. సకల జీవులను రక్షించుటచేత యిది రక్షయనెడి పేరున కీర్తింపబడుచున్నదని శ్రీ భగవత్పాదుల

వారి యుపదేశములోని భావన. ఉపనిషద్వాదులును ఇదే అర్థమును క్షారము కొరకై స్వీకరించిరని తెలియుచున్నది. బృహజ్జా బాలోపనిషత్తులోని యీ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ "భూతప్రేత – పిశాచ – బ్రహ్మరాక్షస – అపస్మార –**
**భవస్మార – భయభీతే భ్యోఽబి రక్షణాద్రక్షేతి"**

భూతప్రేత పిచాశాచాదులు, బహు విధములైన రోగముల వలన గల్గు పీడలను నివారించునదే రక్షయని యుపనిషద్వాణి తెలిపినది.

ధర్మసాధన నిమిత్తం శరీరమనెడిది ముఖ్యమైన సాధనముగా పనిచేయుచున్నదని, యీ క్రింది ప్రమాణము వలన తెలియుచున్నది.

**"శరీరమాద్యం ఖలుధర్మ సాధనం" ॥** (కాళిదాసు)

శరీరములో ఆయువు వున్నంతవరకు శరీరమును రక్షించుకొనుట ఎంతో అవసరము. ఎన్నియో మహత్వ పూర్వమైన కార్యములను సాధించుటకు శరీరమే ఆలంబనము కదా! శరీరముతోబాటు జతకు మనస్సును, మరియు బుద్ధిని రక్షించుకొనుటయును అవసరమే.

ఆధ్యాత్మిక, అధి భౌతిక మరియు అధి దైవికములనెడి తాపత్రయములు ఎల్లప్పుడు మన శరీరమును మరియు మనోబుద్ధులను పాడుచునే చేయుచుండును.

ఈ దుఃఖత్రయములనివృత్తికై శాస్త్రముల యందు, మణి, మంత్ర మరియు ఔషధములనెడి తరుణోపాయములు ప్రతిపాదించబడినవి. అయినను వీరశైవ సిద్ధాంతము ప్రకారము, వజ్ర వైఢూర్యాది నవరత్నములను! సామాన్యమైన మంత్రములు మరియు విభిన్నమైన ఔషధములను శరణాగతిని పొందుట కంటె యిష్టలింగాధారణ పంచాక్షరి మహా మంత్ర జపము, మరియు భస్మరుద్రాక్షల ధారణల ద్వారా తాపత్రయములు నివృత్తులు కాగా వీరశైవుడు పరమకైవల్య పదమును పొందుట సులభమని చెప్పబడినది. శ్రీ నీలకంఠ శివాచార్యులవారు ఈ క్రింది విధిన తమ ఉపదేశమునిచ్చిరి.

**శ్లో॥ శివలింగం మణిః సాక్షాన్మంత్రం పంచాక్షరం తథా**
**భూతరేకౌషధం పుంసాం ముక్తి స్త్రీ వశ్యకర్మణీ ॥** (క్రియాసారము, ఉపదేశము 8 –202 పుట 76)

ఈ ఉపదేశము ప్రకారము, యిష్ట లింగము మణిగాను – పంచాక్షర ము మహా మంత్రముగాను, విభూతినే దివ్యౌషధముగాను భావించి వీరశైవుడు ముక్తి కాంతను పొందవచ్చును. ఈ సందర్భమున వాయవీయ ప్రమాణము ఈ క్రింది విధముగా తెల్పినది.

**శ్లో॥ పరమాస్త్రంచ శైవనాం భస్మతత్ పారమేశ్వరం।**

ఈ వచనానుసారముగా విచారించిన యెడల శైవులైనవారందరికిన వీరశైవులకును భస్మమే ఒక మహా దివ్యాస్త్రము. ఈ దివ్యాస్త్రమును ధరించిన వీరశైవునకు భూతప్రేతాదుల, అసుర రాక్షసాదుల, రోగరుచుల బాధలు కలుగవు. ఈ విషయమునే దేవీ కాళోత్తరము యీ క్రింది విధముగా తెలియజెప్పినది.

**శ్లో॥ జ్వర రక్షః పిశాచాప్యసురా యాతు దానకాః।**
**కుమార గ్రహ, భూతాశ్చ కూష్మాం డా ఢాఖినీ గణాః॥**

**బ్రహ్మ రాక్షస ముఖ్యాశ్చ పూతనా కుష గుల్మశాః।**
**భగంధరాణి నర్వాణి హ్యాసే తిర్వా తరోగశాః॥**
**చతుః షష్ఠిః పిత్తరోగః శ్లేష్మసప్తతి పంచశాః॥**
**వ్యాఘ్రు సర్ప భయంశ్చై వాప్యన్నే దుష్టమృగ అపి।**
**భస్మస్నానేన నశ్యంతి సింహానేవ మృగాదయః ॥** (క్రియాసారము, ఉ.దే. 8, పట 84)

జ్వరము, రక్ష, పిశాచ, అసుర, యాతు ధాన మన్మథ, నవగ్రహ, భూత, కూష్మాండమనెడి పిశాచము మొదలగు వాటి పీడల నుండి భస్మధారణ చేత రక్షింపబడవచ్చును. ఈ విధముగా ఆధ్యాత్మిక ఆది భౌతిక మరియు ఆది దైవిక ములనెడి తాపముల పీడల నుండి మనుష్యుని రక్షించుట వలన విభూతిని, రక్ష అనే పేరుతో వ్యవహరింతురు. ఈ తాపత్రయముల పీడ నివారణ గురించి విస్తారముగా తెలిసికొనెదము గాక. అధ్యాత్మిక దుఃఖములను బాహ్య మరియు అంతర్ దుఃఖములుగా విభజింపవచ్చును.

“వాపపిత్తాధి జం దుఃఖం బాహ్య మాధ్యాత్మికం మతం,” అనెడి శ్రీ జగద్గురు రేణుక పాదులవారి ఉపదేశము ప్రకారము, వాత పిత్తాదుల వికారముల చేత కల్గెడి శారీరక రోగములే ఆధ్యాత్మిక బాహ్య దుఃఖములు. ఆయుర్వేద శాస్త్రము ప్రకారము, వాత ప్రకోప వలన 81, పిత్త ప్రకోపము చేత 64, కసప్ర కోపముచేత 145, రోగములు గలుగుచున్నవి. ఇవి మొత్తము కలిసి 360లగుచున్నవి. వీటి నిమిత్తమున “చరకుదు” శుశ్రుతుదు మొదలగు మహర్షులు, వనస్పదుల ఔషధములను కన్పెట్టిరి. ఇంకను భస్మ తంత్ర విశారదులైన మహర్షులు శాస్త్ర విధియైన మంత్ర సంస్కార పూర్వకముగా చేయబడిన భస్మము చేత 80 వాత జన్యరోగములు, 64 పిత్త జన్య రోగములు, 75 కపజన్య రోగములు నివృత్తియగునని ప్రతిపాదించి ఆచరించిరి. ఈవిధముగా మొత్తము 219 రోగములు భస్మదారణాదులు వలన నివారింపబడుచున్నవి.

ఆధునిక ఔషధోపచారముల మోహజాలమునందు చిక్కికొని, మన దేశమునకు చెందిన ప్రాచీన మహర్షుల మార్గమునే మరచితిమి. ఈ కారణమువలన ఆపద్ధతులన్నియును సంపూర్ణముగా విస్మరింపబడి మరుగున పడిపోయినవి.

పాశ్చాత్య ఔషధములను సేవించుటవలన అనేకములైన హానులు వాటిల్లుచున్నవని కనుగొనబడినది. ఒక రోగ నివారణ నిమిత్తము తీసుకోబడె మందు, తన పక్ష ప్రభావము (సైడ్ ఎఫెక్ట్స్) వలన పది రోగములకు కారణమగుచున్నది. నిరుపేదలకు యీ మందుల లభ్యత గగనకుసుమమే. ఇట్టి పరిస్థితులలో ప్రాచీన పద్ధతులను పునర్జీవనము చేసికొనుట పరమావశ్యకమై యున్నది.

పరిశుద్ధమైన గోమయముచేత నిర్మితమైన భస్మమును అనుపాన భేదములతో ఉపయోగించుట వలన అనేక రోగములు నివారణ పొందునని అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులు చెప్పుచున్నారు. వయోవృద్ధులు అనుభవజ్ఞులును ఆయుర్వేద విజ్ఞాన విశారధులైన బన్నికొప్పకు చెందిన డా॥ ఎస్.ఎఫ్. హీరమఠ అనెడివారు ఎన్నో ప్రయోగములను జేసి, వాటిద్వార జన సామాన్యమునకు మేలును చేకూర్చిరి. ఈ కారణము వలననే యిటీవల కాలములో పాశ్చాత్య వైద్యులు కూడ ప్రాచీన భారత దేశ వైద్య చికిత్స పద్ధతులపైన మోజును పెంచుకొనుచున్నారు.

**గోమూత్రము, గోమయము, మరియు గోమయ భస్మముయొక్క ఉపచారములు**

గోవు యొక్క పాలు, పెరుగు నెయ్యి మొదలగునవే కాక దాని మల మూత్రములు కూడ పోషక విలువలను మరియు రోగ నిరోధకతత్వములను కల్గియున్నవి. అందుచేతనే భారతీయ సంస్కృతి యందు పంచగవ్యప్రాంశనవిహితమై యున్నది.

## గోమూత్ర చికిత్స:-

గోమూత్రము, తీక్షణము, క్షారము, వేడి మరియు మధురములనెడి గుణములు కల్గియుండును. ఇది పాచక, అగ్నిదీపక, మరియు బుద్ధివర్ధక గుణములను కల్గియుండి కఫము, వాయువు, కుష్ఠము, పాండురోగము, దమ్ము, జ్వరము, దగ్గు, మలబద్ధత, నేత్ర సంబంధ రోగములు, మరియు చర్మరోగములకు పరమౌషధముగా వాడవచ్చును. నిరోగియు, సశక్తము అయిన ఆవు యొక్క మూత్రమును గ్రహించి ఉపయోగించవలెను.

గోమూత్రమునందు, చక్కెర మరియు ఉప్పులను కల్పి సైందవలవణమును, రాగ చూర్ణమును చేర్చి సేవించుట చేత, సకల విధములైన ఉదరకోశ సంబంధ వ్యాధులు తగ్గును. ప్రాతఃకాలమునను, సాయంకాలమునను గోమూత్రమునందున పసుపును గల్పి పానము చేయించిన యెడల పిల్లల ఉదర రోగములు నయమగును.

ప్రతి దినము ప్రాతఃకాలమున తమ తమ శక్త్యానుసారముగా బట్టి యందు వడబోసిన గోమూత్రమును 21 లేదా 42 దినముల వరకు సేవించిన యెడల పాండురోగము తగ్గిపోవును. వేడిచేసిన గోమూత్రము చేత చెవులను కడిగికొనిన యెడల చెవిలో చీము నిండునది నిల్చిపోవును.

ప్రతిదినము కొంత పరిమాణమున గోమూత్రమును నీటిలో కల్పి పానము చేయుటవలన మూత్ర సంచి రోగము నయమగును. గోమూత్రమునందు, కొంత చక్కెరను కల్పి సేవించుటచేత, కళ్ళు మండుట, దాహము అలసట, నోటిలో అరుచి, మొదలగునవి తగ్గిపోవును.

తాజాగా నున్న గో మూత్రమును బట్టతో వడబోసి, కొంచెము ఉప్పును చేర్చి సేవించిన యెడల స్వల్ప సమయమునందుననే విరేచనమై, పొట్ట ఉబ్బుట తగ్గును.

పిల్లల పొట్ట ఉబ్బిన యెడల యిదే చికిత్స చేసిన యెడల పొట్టలోని క్రిములు నాశనమై స్వస్తత చేకూరును. పొట్టకు సంబంధించిన అన్ని రోగములకును గోమూత్రము అమృతము వంటిది. గోమూత్రము వలన చర్మ వ్యాధులు కూడ నయమగునని తెలియచెప్పబడినది. జిజ్ఞాసువులైనవారు గోమూత్రము యొక్క వివిధ ప్రయోగముల గురించి అనుభవజ్ఞులను అడిగి తెలిసికొనగలరు.

## గోమయ చికిత్స :-

గోవు పేడ వలన దుర్గంధము నాశనమగును, ఇది శోదకము, వీర్యవర్ధకము, పోషకము శాంతిప్రదాయకము, మరియు మలనివారకమై యున్నది. అందుచేతనే ప్రాచీనకాలమునుండియు యిల్లు మరియు ముంగిళ్ళను సంస్కరించుకొనుటకై గోమయము ఉపయోగించుచున్నారు. ఈ గోమయము రోగ చికిత్సయందున నుపయోగించబడుచున్నది. గర్భమునందున శిశువు మృతుడై యుండిన యెడల ఆవు పేడ రసమును, ఆవుపాలయందు కల్పి, ఆ స్త్రీ సేవించిన యెడల మృతశిశువు సులభముగా బయటకు వచ్చును. దురదయుక్తమైన వివిధ చర్మ రోగములు కల్గినప్పుడు ఆవుపేడను శరీరమునకు పూసుకొని వేడినీళ్ళతో స్నానము చేసిన యెడల, ఆయా చర్మ రోగములంతరించిపోవును. గోమయమునందు మెంథాల్, అమోనియా, పెనాల్, ఎండోలు మరియు పార్మాతిన్ మొదలగు దాతు తత్త్వములు నిండుగా వున్నందున, సూక్ష్మక్రిములను దరిజేరనియ్యవు. ఇంతకు ముందు చెప్పినయటుల కాకుండ గోమయమును, గో మూత్రమును హేయ దృష్టిలో జూచెడివార్కి వీటివలన గలగు లాభముల యొక్క ఎరుక లభ్యము కాదు. శ్రద్ధ కల్గినవారు, స్వానుభవము వలననే, వీటి ప్రయోజనములను గుర్తించి, ఫలమునొందగలరు.

## గోమయ భస్మ చికిత్స:-

శాస్త్రోక్త విధి ప్రకారము చేయబడిన భస్మము మహా ఔషధము వంటిది. అనుపాన భేదములచేత సర్వ రోగములను నివారించుటకై ప్రయోజనకారిగా నుండును. భస్మమును లేత తమలపాకు రసములతో కల్పి, అంజనముగా ధరించిన యెడల పాము, తేలు, మొదలగు విషపురుగుల బాధల వలన కల్గిన మూర్ఛల నుండి విముక్తి పొందవచ్చును. అదే విధముగా వేపాకు రసముతో కల్పిన భస్మమునుపయోగించినను యిట్టి ఫలితమే లభించును. పాము విషమును కక్కించుటకు కూడా, చేదు వస్తువులతో కల్పిన భస్మమును ఉపయోగించవచ్చును. భస్మమును, తేనె, నెయ్యి వంటివాటితో కల్పి లేపనమును చేసిన యెడల, గాయములు మానును. చనుబాలయందు భస్మమును కల్పి నాకించినయెడల గుహ దోషములు నివారణయగును. గర్భపాతమునకు లోనై శీతాధిక్యతను కల్గి బాధపడెడి స్త్రీలకు భస్మమును శరీరమునకు లేపనము చేసిన యెడల గుణము కల్గును. దమ్ము, ఉబ్బసము మొదలగు శ్వాసకోశ సంబంధిత రోగములున్న యెడల పిప్పళ్ళు, మిరియాలు, శొంఠిలతో కల్పిన భస్మమును సేవించిన యెడల అవి నయమగును. ఆవు నేతితో భస్మమును కల్పి పట్టించిన యెడల ఎంత గొప్ప వ్రణమైన నయమగును. పొట్టలోని క్రిములు భస్మమును సేవించిన యెడల నశించును, పండ్లు పుచ్చిన యెడల, భస్మమునుపయోగించిన తగ్గును.

గో మూత్రము, గోక్షీరము, గోదధి, గోఘృతము కల్పి పుటము పెట్టి భస్మమును తయారుచేసిన యెడల, అదొక దివ్యౌషధమై సర్వ రోగ నివారిణి కాగలదు. ఈ విధముగా భస్మముచేత అనేక రకములైన దుఃఖములు దూరమగుచున్నవి. ఇట్టి రక్షణ కల్పించునది గనుకనే దీనిని "రక్షా" అనెడి పేరున పిలుచుచున్నారు. అంతరంగమునకు చెందిన ఆధ్యాత్మిక దుఃఖముల నుండి రక్షణ "రాద్వే"షాది సంపన్న మాంతరంపరికీర్త్యతే" యనెడి శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదులా దేశానుసారము, కామము, క్రోధము, లోభము, భయము, ఈర్ష్యా, ద్వేషము, విషాదము, యిత్యాదులు మనుష్యునకు దుఃఖములను కలుగజేయును. ఇవియే అంతరంగపు ఆధ్యాత్మిక దుఃఖములు. వీటిని మానసిక రుగ్మతలని కూడ యనవచ్చును. జ్వరము మొదలగునవి శరీరమును బలహీనపర్చునటులనే, అంతఃరంగపు దుఃఖములు మనోబుద్ధులను శక్తిహీనములుగా చేయుచున్నవి. అంతరంగములోని నిర్మలమైన జ్యోతికి కొడిగట్టి కాంతి హీనమును చేయును. వీటి నివారణ కొరకు బహిరంగములైన ఔషధములేవియును

లేవు. ఆత్మజ్ఞానమును పొంది ఆత్మజ్యోతిని ప్రకాశమానముగా చేయుటకై అంతరంగ శుద్ధినిబడయుటెంతయో అవసరము భస్మ ధారణవలన అంతరంగశుద్ధి కల్గి ఆత్మజ్యోతి పునః ప్రకాశమానముగా వెలుగుట ప్రారంభమగును. ఈ విధముగా భస్మము వలన అంతరంగిక ఆధ్యాత్మిక దుః ఖములు కూడ నివారణమగుచున్నవి.

**అది భౌతిక దుఃఖముల నుండి రక్షణ**

"భూతాని అధికృత్య జాయత ఇతి అధి భౌతికం"

యనెడి వ్యుత్పత్తి ప్రకారం రాజు, దొంగ, పులి, సర్పము మొదలగు ప్రాణులచేత గలిగెడి దుఃఖమే అది భౌతిక దుఃఖమని పేరు. శ్రీ జగద్గురువులవారు రాజాదులచేత కల్గెడి దుఃఖమే. అది భౌతిక దుఃఖమని ఉపదేశించిరి. ఒక ప్రాణి యింకొక ప్రాణిని పీడించవలెననిన లోభ ద్వేషాదులే కారణములగుచున్నవి. ప్రపంచములోనియన్ని ప్రాణుల యందునివి యుండుటచే యీ పీడ ఎంతో కాలము నుండి కొనసాగుచు వచ్చుచున్నది. ఇతరులను పీడించెడిది స్వాభావిక గుణమని కొందరి మతము.

భస్మదారిగా, సాత్విక తపోమయ జీవితమును సాగించెడి వీరశైవునియందు ఈ గుణములు క్షీణముఖమును గొనుచున్నవి. అహింసా భావము పెరుగును. అహింసా భావము గల్గినవారి సన్నిధియందు, క్రూరభావములు నశించి వైరభావము దొలగిపోవునని పతంజలి యోగ సూత్రముల ద్వారా తెలియుచున్నది. ఈ కారణము వలననే ప్రాచీన మహర్షుల యొక్క ఆశ్రమములలో పరస్పర దైవభావము కల్గిన జీవుల మైత్రీ భావములో వుండెడివని తెలియుచున్నది. ఈ విధముగా సంపూర్ణమైన సాత్విక భావమును దాల్చినవారికి, రాజు, దొంగ, పులి, సర్పములు నష్టమును చేయజాలవు. ఇట్టి యోగ్యత పొందుటకు భస్మధారణమే మూలకారణమై యుండును. ఈ విధముగా భస్మము వలన అది భౌతిక దుః ఖములు నివారించబడుచున్నవి.

## ఆది దైవిక దుఃఖముల నుండి రక్షణ

"దైవాన్ అధికృత్యాజాయత యితి అధి దైవికం॥" అనెడి వ్యుత్పత్తి ప్రకారము గ్రహ యక్ష, భూతపిశాచాదులచే కలిగెడి దుఃఖమే, అది దైవిక దుఃఖమగుచున్నది. శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఆది దైవిక దుఃఖమును గురించి చెప్పుచూ గ్రహయక్షాది సంభవమని ఉపదేశించిరి. "గృహయక్షాదుల చేత గల్గెడి దుఃఖమే, అధి దైవిక దుఃఖమని వీరి ఉపదేశములోని భావన. ధర్మ భ్రష్టులై ఆచార హీనులై, జీవనమును గడిపెడి వారికే నవగ్రహముల మరియు భూత ప్రేతాదుల పీడ కల్గుచున్నది.

జ్యోతిశ్శాస్త్ర ప్రకారము, నవగ్రహములు అనెడివి "ఆదిత్యాదులు". ఈ గ్రహములన్నియు శివుని అనుచరులే. శివాజ్ఞకనుగుణముగనే తమ తమ వ్యవహారములను చేసికొనుచుండును. దైవభక్తి లేని దురాచారులకు, నానా పీడలను కల్గించి వారిని దైవభక్తులుగా చేయుటయే గ్రహ పీడన యొక్క ముఖ్య ఉద్దేశము. క్రూర స్వభావమును దాల్చిన ఒక్కొక్క గ్రహముల ఆరాధనను జేసి ఆయా గ్రహములు కృపనుబడయుట లోకాచారమై యున్నది. సకల గ్రహబలనాధుడైన పరమశివుని ఆరాధించి సర్వగ్రహముల పీడల నుండి దూరమగుటయే శ్రేష్ఠాతిశ్రేష్టమైన మార్గము వీరశైవులకు శివుని పూజించి శివానుగ్రహమును బడసి సర్వగ్రహ పీడల నుండి విముక్తిని పొందుటయే కర్తవ్యమైయున్నది.

పరమపావనమైన పంచాక్షరి మంత్ర పురఃసరముగా భస్మధారణను చేసిన శివభక్తుని మీద శివానుచరులైన, నవగ్రహములు తమ క్రూరదృష్టిని ప్రసరింపజాలవు. ఈ విధముగా భస్మము మనలను గ్రహ బాధల నుండి రక్షించుచున్నది. అదేవిధిన దేవయాని విశేషులైన విద్యాధర, అప్సరస యిత్యాదుల బాధలు, భస్మదారకి కలుగజాలవు. దీనికి గల కారణమును పుష్ప దంతుడు ఈ క్రింది విధముగా తెలిపెను. శ్మశానేష్వో క్రీడా స్మరహర పిశాచాః సహచరః చితాభస్మ లేపః స్రగపి నృకరోటి పరికరః

**శ్లో॥ అమంగల్యం శీలిం తవ భవతు నామైన మఖిలం**
**తథాపిస్మర్తూణాం వరద పరమం మంగళమసి।** (మహిమ్నః 24)

ఈ శ్లోకమున శివస్వరూపమును వర్ణిస్తూ భూతప్రేత పిశాచాదులు, శివుని సహచరులని పుష్పదంతుడు ప్రతిపాదించెను. అందుచేత పిశాచాదులు శివుని యెడల అనన్య ప్రేమలక్షణాత్మకమైన భక్తి గల్గియున్నవని సిద్ధమగును. శివునికి అతి ప్రియకరమైన విభూతిని ధరించిన

శివభక్తులను ఆ పిశాచాదులు శివ స్వరూపములుగానే భావించును. ఈ కారణము వలన భస్మధారికి పిశాచాదుల వలన బాధలు కలుగవు. ఈ విధముగా భస్మము మనలను అధి దైవిక దుఃఖములనుండి రక్షించుచున్నది.

ఈ రీతిన బహు విస్తృతమైన వివేచనను అవలోకనము చేసిన పిదప భస్మనిష్ఠగలవారిని, భస్మము త్రివిధ తాపముల నుండి రక్షించి, "రక్ష" యనెడి సార్థకనామధేయమును పొందినది.

శ్రీ జగద్గురువు రేణుకా భగవత్పాదుల వారు ఉపదేశించిన విభూతి యొక్క ఐదు పేర్లలో అణిగియుండెడి రహస్యార్థమును మనము విస్తారముగా తెలిసికొనవలసియున్నది. ఇంకను ముందుగా. యభస్మోత్పత్తికి కారణమైన నందాది పంచగోవుల వ్యుత్పత్తిని మరియు వాటి స్వరూపమును పరిశీలింతుము.

ఓం శాంతి శాంతి శాంతిః

దిII 22-8-1990

స్థలం - శివాహనుభవ మంగళభవనం - షోలాపురం

## విశేషప్రదీపిక

శైవ ధర్మములన్నింటికినీ భస్మధారణ విహితమని తెలుపబడినది. భస్మధారణ యనెడిది శైవుల యొక్క యవిభాజ్య లక్షణమని తెలుపబడినది. కాని భస్మధారణ కర్మమును నెరిగినవారు. తక్కువగా వుందురు. ఈ మర్మము నెరింగించి, శ్రీ కాశీ జగద్గురువుల వారు మనలను దన్యులను జేసిరి.

భస్మము జ్యోతి స్వరూపమనియును, ఆ జ్యోతి యే శివుడనియును, ఆ జ్యోతిని హృదయకమలమున ధరించవలెననెడి శ్రుతి వాక్యములు అంతర్భస్మధారణను నిర్దేశించుచున్నవి. అద్దాని బాహ్యరూపమే బహిర్భస్మధారణము. దీనినే శ్రీ భగత్పాదులవారు సోపాధిక భస్మధారణయని యనిరి.

"ఉపాధా ర్నా ధర్మ చిన్తా' అనెడిది అమరసింహునివాణి. ఉపాధి యనెడిది ధర్మ చింతకు గల పేరని చెప్పబడినది. ఉప సమీపే అధీయతే దర్మోస్య ఉపధిః - దు-ధాఞ్ ధారణ పోషణయోః - అనెడి వ్యుత్పత్తి ప్రకారము దేని సమీపము న ధర్మము చేయబడుచున్నదో నయ్యది ఉపాధియగును. శివధర్మము యొక్క ఆచరణ భస్మధారణ సహితముగా చేయబడును. గాన సోపాధిక భస్మధారణయనునది శివధర్మపరిపాలనకు అతి సన్నిహితముగా ఉండెడియంశమని తెలియుచున్నది.

ఇదే పదము పోషణ అనెడి అర్థములో కూడ నుపయోగింపబడినది. శివభక్తిని పెంచి పోషించెడిది భస్మమని తెలపవచ్చును. ఈ అర్థములో సోపాధిక భస్మమనగా శివభక్తిని వర్ధిల్లజేసెడిదని యెంచవచ్చును.

సోపాధిక భస్మమునకు గల లక్షణములలో ముఖ్యమైన వాటిని శ్రీ భగవత్పాదులవారు వివరించిరి. మొదటిది శివాగ్ని వలన సంపర్కము శివుని మంత్రమిందులో నిక్షిప్తమగుట రెండవ లక్షణము. భస్మమును సిద్ధము చేసెడి ప్రక్రియను వివరించెడి సందర్భములో శ్రీ విద్యా వాచస్పతిగారు నీ వివరములనిచ్చిరి.

భస్మము నిర్గుణ తత్త్వమునకు చెందినదైయున్నది. పరిశుద్ధతకు నిది ప్రతీకగా నిలిచినది. ఇది నాల్గు రకములుగా నుండునని శ్రీ భగవత్పాదులవారి తెలిపిరి. వీరి భావమును ఏకామ్రనాథుడు నీ క్రింది విధముగా విస్తరించిరి.

**సీ॥ "రమర్ధి నైశ్వర్య కారణో ద్భూతి నా**
**భూత్వైక హేతువై భూతి యయ్యె**
**తగ భావనాద్భసితాంబునా నిరవద్య**
**భావవోద్ధామమై భసితమయ్యె**
**నలినాపదాద్రక్షణా త్సారమన విప**
**త్కరణ సంహరణమై క్షారమయ్యె**
**నలి నభిరక్షణా ద్రక్షేతి యనగ సు**
**రృసు రక్షణీయమై రక్షయయ్యె**

యనుచు చదివి చదివి యామ్నానత భస్మ
విముఖి వృత్తి జెడిరి వెట్టి జన్మ
లెట్టి పోప మతులో నేకామ్రగురు చిత్త
నలిన భృంగ సోమనాథ లింగ! (అన్యవాద కోలాహలము, ప. 14)

విభూతివలన ఐశ్వర్యము, భాసితము వల భావ సంపత్తి, క్షారవలన విపత్తుల నుండి రక్షణ, రక్షణ వలన సర్వత్ర రక్షణ లభించునని తెలుపబడినది.భూతి వలన గల్గెడి భూరి మహిమాన్విత పరిణామముల గురించి ఈ క్రింది విధముగా తెలుపబడినది.

సీ॥ కుంభద్గదాంబోధి కుంభజ సంరంభ
బంధుర ప్రతిభా విభాతి భూతి
దారిద్ర్య కుధ్ర విద్రావణ దారుణ
మాతత పురుహూత హేతి భూతి
నిర్బంధ బహుజన్మ వీరేంద్ర మోహాంధ
కారార్క (దివ్య) విఖ్యాతి భూతి
కర్మవల్లీ మూల నిర్మూలనో ద్భూత
శాతకుద్దాల ప్రభాతి భూతి

యనుచు జదివి చదివి యామ్నాయనత భస్మ
విముఖత వృత్తి జెడిది వెట్టి జన్మ
లెట్టి పాపమతులో యేకామ్రగురు చిత్త
నలిన భృంగ సోమనాథ లింగ! (అన్యవాద కోలాహము, ప. 9)

భూతి వలన నారోగ్య భాగ్యము, ధన
కనకాదులతో కూడిన వస్తు పర భాగ్యము,
మోహమును ద్రుంచెడి జ్ఞాన భాగ్యము
మరియు పాశబంధమును ప్రారబ్ధి
కర్మాదుల నుండి విముక్తిని పొందగా
వచ్చెడి పరమపద భాగ్యము లభించును.

ఈ విధముగా చతుర్విధ సంపత్తిని గలుగ జేసెడి విభూతి లోకోత్తరమైనదని గుర్తించవలెను.

శ్రీ ఏకామ్రనాథుల వారి భాసితము యొక్క మహిమను నీ క్రింది విధముగా స్తుతించిరి.

సీ॥ భసితంబు శంకరోల్ల సితంబు భవ భయ
గ్రసితంబు లోక ప్రకాశితంబు
భసితంబు శ్రుత్యుపన్యసితంబు గంధ ప్ర
హసితంబు మలిన సన్యాసితంబు
భసితంబు శివకళాభ్యసితంబు దుష్ట వి
శసితంబు శిష్టాను శాసితంబు
భసితంబు భక్తి సంవసితంబు చంద్రికా
భసితంబు పరమ ప్రభాసితంబు
యనుచుజదివి చదివి యామ్నాయనుత భస్మ

విముఖ వృత్తి జెడిరి వెట్టి జన్మ
లెట్టి పాపమతులో యేకామ్రగురు చిత్త
నలిన భృంగ సోమనాథ లింగ! (అన్యవాద కోలాహలము, ప. 10)

భసితము శంకరుని చేత నలంకరించి కొనబడినదనియును, సంసార భయమును దూరము చేసెడిదనియును, వేద సమ్మతమైనదనియును సుగంధ పరిమళభరితమనియును, మాలిన్యమును దూరము చేసెడిదియును, ఈశ్వరాంశను కలుగజేయునదియును, దుష్టశిక్షణ మరియు శిష్ట రక్షణ చేయునదియును, భక్తి వాసన నిచ్చునదనియును తెలుపబడినది.

శ్రీ భగవతత్పాదుల వారి శివతత్త్వము ప్రకాశింపచేసెడి భసితమనెడి దానికి యేకామ్రనాథుల వారు విస్తృతమైన ప్రాతిపదికను గల్పించిరని తెలియుచున్నది.

శివభక్తి గలుగుట వలన ముక్తి లభించునని చెప్పబడుచున్నది. శివభక్తి యొక్క మహిమ వలన పాపములు నశించిపోవునని తెలిపెడి శ్రీ అన్నమయ్యగారి యీ క్రింది పద్యములు గనుడి.

ఊరు సంసార గజేంద్ర దర్పదళన వ్యాఘ్ర ప్రతాపోగ్రకే

సరి, దుష్ప్రాప శరీర బంధ విపులక్ష్మాజ ప్రజచ్ఛేద విస్ఫురిత క్రూర కుఠార ధార దురిత ప్రోద్భూత జీమూతదస్తర సంఘాక విఘాత మారుతము, నీ సద్భక్తి సర్వేశ్వరా! (సర్వేశ్వర శతకము, ప. 57)

ఈ పద్యమును గూర్చి వ్యాఖ్యానించుచు, శ్రీ డా॥ ముదిగొండ వీరభద్రయ్యగారు నీ క్రింది విధముగా వివరించారు.

"సర్వేశ్వరా! పెద్దదైన ఈ సంసారమనే గజేంద్రుని గర్వాన్ని ఖండించడం కోసం ఉంచిన శౌర్య భీకరమైన సింహం నీ భక్తి. దుర్లభమైన శరీరానికి బంధమనెడి అడవిని ఛేదించే క్రూరమైన గొడ్డలి పదునూ, పాపాల వల్ల పుట్టిన మబ్బులు సమూహానికి విఘాతమైన వాయువూ నీ భక్తి"

(సర్వేశ్వర శతకము, శ్రీ పావని సేవా సమితి ప్రచురణ పు. 77)

సూర్య తేజమున నడ్డుకొని గాఢాంధకారమున కల్పించెడి శక్తి కాలమేఘమునకుండును. జ్ఞాన ప్రకాశమును బంధించి వేసెడి సామర్థ్యము దురితము వలన గల్గిన పాప సమూహమునకుండును. ప్రచండమైన మారుతము వీచినప్పుడు మేఘము చెల్లాచెదురై, సూర్యకాంతి తేజోమయమై భూమ్యాకాశములను కప్పివేయును. అదే విధిన శివభక్తి గల్గినవానిని పాపములంటజాలవనియు తెలిసికొనవలెను. ఇట్టి మహిమాన్వితమైన భక్తికి భస్మము నాయువు పట్టని తెలియుచున్నది. ఈ విషయమును విశదము చేసెడి శ్రీ యేకామ్రనాథులవారి యీ క్రింది పద్యమును గనుడి!

**సీ.** **భస్మంబు విమల సద్భక్తి క్రియా కల్ప**
**లతికా ఫలార్ధ మూల ప్రదంబు**
**భస్మంబు శంకరార్పణ యోగ్య భక్తి నై**
**వేద్య కుంభ పవిత్ర వేష్టనంబు**
**భస్మంబు సచ్ఛివ భక్తి కెదారవ**
**స్బద్యోఘ పరిహృతోర్ధకంబు**
**భస్మంబలంకృత భక్తి కన్యా వశీ**
**కరణ కల్పిత తిలక ప్రదంబు**

**ఆ॥** **యనుచు జదివి చదివి యామ్నాను త భస్మ**
**విముఖి వృత్తి జెడిరి వెట్టి జన్మ**
**లెట్టి పాపమతులో యేకామ్ర గురు చిత్త**
**నలిన భృంగ సోమనాథ లింగ!** (అన్యవాద కోలాహలు, ప. 11)

భక్తి యనెడి కల్పలత పుష్పించి ఫలించుట కొరకు భస్మము మూలమని తెలుపబడినది.

విపత్తులను నిర్మూలించేదిగా చెప్పబడెడి క్షారము గూర్చి శ్రీ ఏకామ్రనాథుల వారు నీ క్రింది విధముగా తెలిపిరి.

**సీ.** **క్షారంబు భక్త్యలంకారంబు లోకాను**
**సారంబు విగత సంసారమనుచు**

క్షారంబు పరమార్థ సారంబు సద్గుణా
ధారంబు ప్రాభవొద్ధారమనుచు
క్షారంబు మోక్ష సంస్కారంబు భవబహి
ష్కారంబు వైదికాధారమనుచు
క్షారంబు వైరాగ్య సారంబు మోక్షాభి
తీరుబు నిరయ నిస్సారమనుచు

ఆ॥ నాది చదివి చదివి యామ్నాయ నుత భస్మ
విముఖవృత్తి జెడిరి వెట్టి జన్మ
లెట్టి పాపమతులో యే కామ్రగురు చిత్త
నలిన భృంగ సోమనాథలింగ! (అన్యవాద కోలాహలము ప. 12)

ఈ పద్యములోని "ప్రాభవోద్ధార" మనెడిది కీలకమని గ్రహించవలెను. ఆపదలు వైదొలగి పూర్వ ప్రాభవమును కల్గించెడిది క్షారమని గ్రహింపదగును.

యక్షరాక్షసాది పీడలను నివారించెడిది రక్షయని తెలిపెడి శ్రీ యే కామ్రనాథుని యీ క్రింది పద్యమును గమనించుడి

సీ॥ యక్షరక్షో రగాధ్యక్షోప నాక్షోప
తిక్షీయమాన సంరక్షరక్ష
రూపేక్షణా బ్రహ్మ రాక్షస విక్షేప
ణ క్షేపమానాభి రక్ష రక్ష
యాక్షేప భూతాన లేక్ష కక్ష పణుతా
దిక్షేపమాన సుర రక్ష రక్ష
యక్షీయ దాక్షిణ్య దక్షణేశ్వర భయ
ద్రక్షణ రక్షణ రక్ష రక్ష

ఆ॥ యనుచు జదివి చదివి యామ్నాయ నుత భస్మ
విముఖ వృత్తి జెడిరి వెట్టి జన్మ
లెట్టి పాపముతులో యేకామ్రగురుచిత్త
నలిన భృంగ సోమనాథ లింగ! (అన్యవాద కోలాహలము, ప. 13)

రక్ష వలన ఆది దైవిక తాపత్రయములు. భూతాప్రేతాది భయములు దూరమగునని చెప్పబడుచున్నది.

పిండ స్థలమునుండి భక్త స్థలమునకు విచ్చేసిన సాధకుడు సర్వతోముఖములుగా ఫలితముల నిచ్చెడి భస్మము యొక్క సామర్థ్యము గురించి నమ్మకమును పెంపొందించి కొనవలెను. ఇట్టి నమ్మకమును పెంపొందించికొనని యెడల భక్తి స్థిరపడెడి యవకాశము నుండదు.

ఈ సందర్భమున భక్తుడు గ్రహించవలసిన విషయము మరొకటి గలదు. శివభక్తి లేనివారును, ఇంద్రియ లోలత్వమున పరమానందమును పొందెడివారును, నిత్యా నిత్య మరియు ఆత్మా నాత్మ వివేకము లేనివాడను, అవి రాగచిత్తురులు, పాపచింతన గలవారు భస్మధారణ చేసినయెడల నిచ్చట చెప్పబడిన ఫలితములు లభించునా? భక్తిమార్గము ప్రకారము, ఇట్టివారికి సత్ఫలము లభించుననుటలో నభ్యంతరము నుండదు. ఇట్టి ఆలోచనను ప్రశ్నించెడివారును లేకపోలేదు. అట్టి యెడ భక్తుడు గ్రహించవలసిన సూత్రమేమిటి?

వీరశైవ సిద్ధాంతము ప్రకారము భక్తుడు సదాచార సంపన్నుడై యుండవలెను. దురాచార వర్తనగలవాడు భస్మలాంఛనాదులను ధరించిన యెడల, వేషలాంఛనుడగునే కాని భక్తుడు కాజాలడు. వేషలాంఛనుడు భక్తి పథమునకు చెల్లడు. జంగమ తిరస్కారమునకు గురియగును. సాక్షాత్తుగా శివుని యపరరూపమైన వాడును, సాకార జ్ఞాన స్వరూపమునకు జంగముడు మెచ్చ వలెనని మేలైన యాచార సంపత్తిని భక్తుడు పొందియుండవలెను. ఈ కారణము వలన పంచ విధ భస్మములు ధరించినను, పంచాచారములు పాటించని యెడల నాశించిన ఫలితము లభించదనుట ముమ్మాటికి నిజము.

'శివం భూయాత్'

## ఆశీర్వచనము - 3

శ్లో॥ నందా భద్రాచ సురభిః సుశీలా సుమనాస్తథా ।
పంచ గావో విభో ర్జాతాః సద్యోజాతాదివక్త్రతః । (సి.శి. 7-6)

నందా, భద్రా, సురభిః సుశీలా, సుమనాస్త థాయనెడి పంచగోవులు శివ విభుని యొక్క సద్యో జాతాది వక్త్రములు నుండి పుట్టినవి.

శ్లో॥ కపిలః కృష్ణధవల ధూమ్రరక్తాస్తదైవ చ ।
నందాదీనాం గవాం వర్ణాః క్రమేణ పరికీర్తితః ॥

నందాది గోవుల యొక్క వర్ణములు క్రమముగా పింగళ వర్ణము, నలుపు, తెలుపు, బూడిదరంగు, ఎరుపులై యుండును.

శ్లో॥ సద్యో జాతాద్విభూతిశ్చ వామదేవాద్భసితమేవ చ।
అఘోరాద్భస్మ సంజాతం క్షారం తత్పురుషాత్తథా॥
రక్షా చేశాన వక్త్రాచ్చ నందాది ద్వారతోభవత్ ॥

నందాది గోవుల ద్వారా సద్యోజాతము వలన విభూతి, వామ దేవము వలన భసితము, అఘోరము నుండి భస్మము, తత్పురుషము నుండి క్షారము, మరియు ఈశానము వలన రక్షలు పుట్టినవి.

## గోవుల ప్రాదుర్భావము :

విభూతి, భసిత, భస్మ, క్షార మరియు రక్షల యొక్క నామ విశేషముల రహస్యార్థములను బోధించిన పిదప, యీ విభూత్యాదుల నిర్మాణమునకు కారణ భూతములైన నందాదులు ప్రాదుర్భావమును గూర్చి శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశమునిచ్చిరి.

గోవుల ప్రాదుర్భావమును గూర్చి భారతదేశమున వివిధములగు కథలు వినవచ్చుచున్నవి. వీటన్నిట లక్ష్యమొక్కటే. గో మహిమను ప్రతిపాదించుటయే శ్రీ రేణుక భగవత్పాదులవారు "పంచగావో విభోర్జాతాః" అని యుపదేశించిరి. శివుడే పంచ గోవులకును ఉద్భవస్థానమనియును, సద్యోజాతాది వక్త్రములుండి నంద్యాది గోవులు ఉద్భవించినవనియును తెలిపిరి. వీరి వాక్కుకును ఉపనిషద్వాఙ్మయములో తెలుపబడిన భావములకును సామ్యము కనిపించుచున్నది. ఈ విషయమునిచ్చట ప్రస్తావింతుము గాక!

## శివుని పంచముఖములు :

ఆగమోపనిషద్వాఙ్మయములోను, పురాణములలోను శివునికి పంచముఖములు గలవని ప్రతిపాదించిబడినది. పద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష మరియు ఈశానములే ఆ పంచముఖములని తెలుపబడినది. పంచముఖములు గల శివుని సదా శివుడని పిలుతురు. శివుని ముప్పదియారు తత్వములలో సదాశివ తత్వమనెడిదొకటి కలదు. ఇది శివ, శక్తి తత్వముల పిదప వచ్చెడి తత్వము. దీనిలోన శివుని మిగిలిన ముప్పది మూడు తత్వములు గర్భీకృతమై యుండును. సదాశివుని యీ పంచముఖముల నుండియే సమస్త చరాచర ప్రపంచమంతయూ ఆవిర్భవించినది. ఈ ముఖములు క్రమక్రమముగా పూర్వ, దక్షిణ, పశ్చిమ, ఉత్తర మరియు ఊర్ధ్వ దిక్కులకు నధిష్ఠాత్మ శక్తులు ఈ పంచముఖముల నుండియే వీరశైవ మహామతస్థాపనా చార్యులైన శ్రీ జగద్గురు రేణుకాది పంచాచార్యులు ప్రాదుర్భవించిరి. ఈ విషయము శివాగమములలో ప్రతిపాదితమైయున్నది. శివుని పంచముఖముల సంక్షిప్త పరిచయమును చేసి కొనెదము గాక.

## సద్యోజాత ముఖము, నందాగోవు :

'సద్యః జాతః సద్యో జాతః' అనే వ్యుత్పత్తి ప్రకారము, అప్పటికప్పుడే ఆవిర్భవించేవాడు సద్యోజాతుడగుచున్నాడు. భక్తుల ఆర్త ధ్వనిని విని తత్క్షణమునందుననే వారి రక్షణకై ఆవిర్భవించే వాడైనందున శివునికి సద్యోజాతుడను పేరు గల్గెను.

నారాయణోపనిషత్తున సద్యోజాత శివుని రూపము గురించిన వర్ణన గలదు గమనించండి:

**శ్లో ॥ సద్యోజాతం ప్రపద్యామి సద్యో జాతాయ వై నమోనమః**
**భవే భవే నాతి భవే భవస్య మాం భవోద్భవాయనమః** (నారాయణోపనిషత్తు, అనువాకము 17)

ఇది యొక స్తుతి.. దీని తాత్పర్యమేమనగా, భక్తుల ఆర్త ధ్వనిని విని తత్క్షణమే ఆవిర్భవించెడి ఓ సద్యో జాతశివా!, నేను ప్రతి యొక్క జన్మయందున నీకు శరణాగతుడనగుచున్నాను. పూజించుటకు వీలు లేని వేరే యే జన్మలోను నన్ను పుట్టించకు.ఈ భవనమునకు కారణభూతుడవైన నీకు అనంత కోటి నమస్కారములు.

ఈ విధముగా సద్యోజాత ముఖమున కెంతయో ప్రాముఖ్యత గలదు. అట్టి ముఖము వలన విభూతి గల్గినదని తెలిపెడి యుపనిషత్ప్రమాణమును గనుడి.

**శ్లో॥ సద్యో జాతాత్ పృథ్వీ। తస్యాః స్యాన్ని వృత్తిః। తస్యః**
**కపిల వర్ణాఃనందా తద్గోమయేన విభూతిర్జాతా॥** (బృహజ్జాబా ఉ. 1-1)

సద్యోజాతము నుండి పృథ్వి జనించెను. పృధ్వికీ నివృత్తి కళ గల్గెను. దానినుండి కపిల వర్ణము గల నందాగోవు జనించెను. నందాగోవు గోమయము వలన విభూతి గల్గినది. ఇది యుపనిషద్వాణి సారాంశము.

## వామదేవము మరియు భద్రాగోవు :

"వామ ఏవ దేవః వామదేవః" యనెడి వ్యుత్పత్తి ప్రకారము సౌందర్య రాణిగా మూర్తీభవించిన శివుని మంగళమయమగు లీలా విగ్రహమునకు వామదేవుడను పేరు గల్గినది. వామదేవుని లీలా విశేషములను సంస్మరిస్తూ, ఆ మహాదేవుని వామదేవ రూపమునకు ప్రణామముల నర్పించుచున్న నారాయణోపనిషత్తులోని యీ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో ॥ వామదేవాయ నమో జ్యేష్ఠాయనమోః శ్రేష్ఠాయ నమో**
**రుద్రాయ నమః కాలాయనమః కలవికరణాయనమో**
**బలవికరణాయనమో బలాయనమో బలప్రమథనాయనమః**
**సర్వభూత దమనాయ నమో మనోన్మయాయ నమః॥** (నారాయణోపనిషత్తు, అనువాకము 18)

ఈ స్తుతి యొక్క తాత్పర్యము ఈ క్రింది విధముగా నున్నది.

మనోజ్ఞయగు సుందర లీలా విగ్రహయుక్తుడైన వామదేవుడును, బ్రహ్మ విష్ణువులకు జనకుడై మహాప్రళయమునకు నేకైక సాక్షియై యుండిన జ్యేష్ఠుడును, మృత్యుంజయుడై బ్రహ్మ విష్ణ్వాదుల కంటెను ఉత్కృష్టుడై యుండెడి శ్రేష్ఠుడును, మహాప్రళయమునందున బ్రహ్మ విష్ణ్వాదులకు రోదనము గల్గించెడి రుద్రుడును, సకల జీవులకు వారి వారి కర్మల కనుగుణముగనే తత్కాలమునందుననే ఫలముల నొసంగెడి కాలుడును, "కలాకాష్ఠాది వికరణ హేతుత్వం కల వికరణత్వ" మనెడి వ్యుత్పత్తి మేరకు అనేకానేక కళల ఉత్పత్తికి కారణభూతుడగు కల వికరణుడును, "బలశ్చాసౌ వికరణశ్చ, బల వికరణః" మనెడి వ్యుత్పత్తి మేరకు శరీరేంద్రియాది కరణముల నపేక్షించకుండగ నేమైననూ సాధించెడి సామర్థ్యముగల బలవికరణుడును, అజేయుడగు మహాబలునికిని, "బలాన్ ప్రమథయతీతి బలప్రమథనః" అనెడి వ్యుత్పత్తి మేరకు అత్యంత బలశాలులై జగద్వినాశనమునకు హేతువుగా పరిణమించిన మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ మరియు వామనావతారములను తన గణనాథులగు వీరభద్రాదుల చేత నిర్జింపచేసిన బలప్రమదుడును, మహాప్రళయమునందు సకల జీవరాశిని సంహారము చేసెడివాడగు సర్వభూత దమనుడును, భక్తుల మనస్సుల యందున నిండుగా నుండెడివాడగు మనోన్మయుడునగు శివునికై నమస్కారము.

సదాశివుని దక్షిణముఖమే వామదేవముగా పరిగణింపబడుచున్నది. దేనినుండియే భసితము పుట్టినదని "వామాద్భసితమభవత్" అనే ఆచార్యుల వాక్కుల వలన తెలియుచున్నది. భసితము యొక్క ఉత్పత్తి క్రమమును తెలిపెడి ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**"వామ దేవాదుదకం। తస్మాత్ ప్రతిష్ఠా । తస్యాః కృష్ణ వర్ణా**
**భద్రా। తద్గోమయేన భసితం జాతం"** (బృహజ్జాబాలోపనిషత్తు 1-1)

వామదేవము నుండి యుదకము, ఉదకము నుండి ప్రతిష్ఠా; దాని నుండి నల్లని భద్రా గోవు; భద్రా గోవు గోమయము నుండి భసితము పుట్టినదనునది యీ ప్రమాణములోని భావము.

'భద్ర' మంగళమనెడి పదమునకు పర్యాయ పదమని తెలిపెడి అమరసింహుని వాక్కులను గనుడి.

**శ్వః శ్రేయసం శివం భద్రం కల్యాణం మంగళం శుభం ।**

అనేక మంగళ పరంపరలకు కారణభూతమైనదై యున్నందుననే, వామదేవముఖమునుండి ఉద్భవించిన గోవుకు భద్రాయనెడి పేరు గల్గినది. దీని గోమయము వలననే భసితము ఉద్భవించినది.

## అఘోర ముఖము - సురభి గోవు :

నఘోర = అఘోరః; అనెడి వ్యుత్పత్తి మేరకు భయానకముకానిది అఘోరమగును. శివుని ప్రశాంతమైన స్వరూపమే అఘోరరూపము. "యాతేరుద్ర శివాతనూ ర ఘోరా పాపకాశినీ" (తై.త.సం4-5-1-1)తైత్తరీయ సంహితలో శివుడు పాపరహితుడనియును ప్రకాశించెడివాడనియును ప్రతిపాదించబడినది. నారాయణోపనిషత్తు శివుని అఘోరరూపమును ఈ క్రింది విధముగా వర్ణించినది.

**శ్లో॥ అఘోరే భ్యోదః ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః॥**
**సర్వేభ్యః సర్వ శర్వేభ్యో నమస్తే్య అస్తురుద్ర రూపేభ్యః॥** (నారాయణోపనిశత్తు అనువాకం - 19)

ఈ వర్ణన ప్రకారము, శివుడు ప్రశాంతుడును భయానకుడును మరియు మహా భయానకుడును అయి వున్నాడు. పుణ్యశీలురైన భక్తులకు అభీష్టమును ప్రధానము చేయునపుడు, అఘోరుడగును, పాపులైన దుష్టులను నిగ్రహించేటపుడు ఘోరుడగును; మరియు జగత్ సంహారకాలమునందు ఘోరము ఘోరతరమగు రూపమును దాల్చుచుండును. ఇంతటి పరమాత్ముని 25 లీలలకు నమస్కారము. ప్రకృతమున శివుని యొక్క ప్రశాంత స్వరూపమునే గలిగియున్న సదా శివుని పశ్చిమముఖమే అఘోరముఖము. ఈ ముఖము నుండియే భస్మముద్భవించినది. ఈ వ్యుత్పత్తి క్రమమును వివరించెడి ఉపనిషత్తు వాక్కులను గనుడి.

**శ్లో॥ అఘోరాద్వగ్నిః తస్మద్విద్యా! తస్యా రక్తవర్ణా**
**సురభిః తద్గోమయేన భస్మజాతం** (బృహజ్జాబాలోపనిషత్తు 1-1)

ఈ ప్రమాణము ప్రకారము అఘోర ముఖమునుండి అగ్ని, విద్యా కలా; మరియు రక్తవర్ణపు సురభి పుట్టినది.

అత్యంత సుగంధభరితమైయుండుట చేత ఈ గోవుకు "సురభి" యనెడి పేరు ప్రాప్తమైనది. దీని శరీరమునుండి వెడలిన పంచగవ్యములును సుగంధ ప్రపూర్ణములైయుండుటచేత ఈ గోవునకు, సురభి యనెడి పేరు గల్గినది. ఈ గోమయము నుండియే భస్మముద్భవించును.

సురభి :- సాధారణముగా సురభి యనెడి పదము కామధేనువుకు మాత్రమే వర్తించుననెడి భావము ప్రచురితమైయున్నది ఈ కామధేనువు సముద్రమదనకాలములో, పుట్టినదియును దానిని దేవేంద్రుడు గైకొని వెళ్ళినట్లు చెప్పబడుచున్నది. అట్టి యెడ శివ ముఖ సంజాతయగు ఈ సురభిః ఆ సురభి కంటెను భిన్నమైనదని యెరుగవలెను. అమరసింహుడు సురభి యనెడి పదమునకు వివరణనిస్తూ సుగంధపరిమళములనిచ్చెడి దేనినైనను (దగు) సురభియనవచ్చును. ఈ సూక్ష్మమును పాఠకులు గ్రహించగలరు.

## తత్పురుషముఖము మరియు సుశీల గోవు :

"సాయేనా పురుషః తత్పురుషః" యనెడి వ్యుత్పత్తి ప్రకారము పరమాత్ముడొక్కడే పురుష పదవాచ్యుడైయున్నాడు. అనగా, భగవంతుడు పురుష విశేషుడైయుండును. పతంజలి పురుషుని గూర్చి వివరిస్తూ "క్లేషకర్మ విపాకాశ యైరపిరా మృష్టా పురుష విశేశ ఈశ్వరః" (యోగసూత్రం 1-24) పై విధముగా చెప్పెను. క్లేశాదులు తాకకుండగా వుండెడి పరమేశ్వరుడే పురుషుడని పతంజలి యొక్క భావము.

తత్పురుష శివుని అభివర్ణించెడి నారాయణోపనిషత్తులోని, యీ మంత్రములను గనుడి;

**శ్లో॥ తత్పురుషాయ విద్మ హే మహాదేవాయధీమహీ!**
**తన్నోరుద్రః ప్రచోదయాత్!** (నా.ఉ. అనువాకము 20)

ఈ మంత్రము యొక్క తాత్పర్యమే మనగా సకల దేవతలయందు శివుడు శ్రేష్ఠుడై యుండుట చేత అతడు మహాదేవుడనియును, తత్పురుషుడనియును, నామధేయములు గలవు. అంతటి శివుని మేము ఉపాసించుచు ధ్యానించుచున్నాము. ఈ ఉపాసనయందు శ్రీ రుద్రుడే మమ్ములను ప్రేరేపించును.

తత్పురుష ముఖము సదాశివుని యొక్క ఉత్తర దిక్కులోని వదనము. దాని నుండియే క్షారము అనెడి విభూతి ఉద్భవించినది. ఆ వ్యుత్పత్తి క్రమమును వివరించెడి ఉపనిషత్తు మంత్రమిది.

**తత్పురుషాద్వాయుః। తస్మాచాంతిః। తస్స్యాః శ్వేతవర్ణా సుశీల।**
**తస్యా గోమయేన క్షారం జాతం॥** (బృ.జా.బా. ఉ. 1-1)

ఈ మంత్ర ప్రమాణము ప్రకారము తత్పురుషముఖమునుండి వాయువు; వాయువు నుండి శాంతికలా; శాంతికలా నుండి శ్వేత వర్ణపు సుశీల యనెడి గోవు వుద్భవించినది. సుశీల యొక్క గోమయము నుండియే, క్షారమనెడి విభూతి ఉద్భవించినది.

## ఈశానముఖము - మరియు సుమనాగోవు :

సర్వ నియామకుడై యుండుటచేత శివునికి ఈశానుడనెడి పేరు ప్రాప్తమైనది. ఈశాన స్వరూపమును వివరించెడి మంత్రమిది.

**శ్లో॥ "ఈశానః। సర్వవిద్యానామీశ్వరః। సర్వభూతానాం।**
**బ్రహ్మాధిపతి బ్రహ్మణోధిపతి ర్బ్రహ్మ శివోమే, అస్తు సదాశివోమ్॥** (నా.ఉ. అనుః 21)

ఈ రీతిగా నారాయణోపనిషత్తు, శివుని ఉచ్ఛ్వాస నిశ్వాస నుండి వేదములు మరియు ముఖారవిందమునుండి అగమములు; వెడలినందున "నిగమాగమాది" ఎల్ల విద్యలకు శివుడే నియామకుడు. సమస్త జీవులన్నింటికిని శివుడే యజమాని. "బ్రహ్మణానాం శివోదేవః క్షత్రియాణాం తుమాధవః। యనెడి మనుస్మృతి యొక్క ప్రమాణము ప్రకారము, బ్రాహ్మణులందరికి శివుడు ఉపాస్యుడైనందున అతనిని బ్రహ్మణోధిపతియని యందురు. ఇచ్చట బ్రాహ్మణులనగా బ్రహ్మ జ్ఞానసంపన్నులనియును; బ్రహ్మ విద్యనుపయోగించి ముక్తిని పొందుటకు కృషి చేయువారనియు గ్రహించవలయును. శివుని త్రికరణ శుద్ధి చేత ఉపాసన చేసెడివారెల్లరు శివ స్వరూపులైనందున, వారునూ బ్రహ్మణోధిపతులుగానే గుర్తించవలెను. అట్టి పరమశివుడు నా మనస్సులో నివసించమని పై మంత్రము వలన తెలియుచున్నది. ఈశానముఖము శివుని ఊర్ధ్వ దిక్కునకు చెందిన ముఖము, ఈ ముఖమునుండి యే "రక్ష" యనెడి విభూతి ఉద్భవించినది. రక్షా విభూతి యొక్క వ్యుత్పత్తి క్రమము ఈ క్రింది విధముగానున్నది.

**శ్లో॥ ఈశానాదాకాశం। తస్మాచ్ఛాంత్యతీతా। తస్సాశ్చిత్ర**
**వర్ణా సుమనాః। తద్గోమయే నరక్షాజాతా ।** (బృ జా ఉ. 1-1)

ఈ ఉపనిషత్తు మంత్ర ప్రకారము శివుని ఈశానవదనము నుండి ఆకాశతత్వము, శాంత్యతీతకలా మరియు చిత్రవర్ణపు గోవు "సుమనా" యనెడి పేరు గలది వుద్భవించినది. సుమన గోమయమునుండి రక్షా యనెడి విభూతి ఉద్భవించినది.

**శ్లో॥ "శోభనం మనోయస్యాః సా సుమనా"**

యనెడి వ్యుత్పత్తి ప్రకారము అత్యంత సాత్త్వికమనుసుగలవారిని "సుమనానొ" యందురు. ఇట్టి మహత్యము గల గోవు నుండి గల్గిన రక్షా యనెడి విభూతి కూడ ఎంతో మహత్వ పూర్ణమైనది. సర్వ సాధారణముగా శ్రేష్ఠతరమైన వస్తువులన్నియును భగవంతుని తేజస్సు నుండి పుట్టినవనియున్నది. జరుగుచున్నది. ఉపనిషత్తు వాదులను యిట్టి భావమునే కల్గియుండిరనియు ఈ క్రింది గీతోక్తి వలన తెలియుచున్నది.

**శ్లో॥ యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీ మదోర్జ్వ తమేవవా!**
**తత్తదేవా వగచ్ఛత్వం మమతేజోంశ సంభవం॥**

పై భావమును శ్రీ రేణుక భగవత్పాదుల ఉపదేశమునుండి గ్రహించినదని తెలియవలెను. ఈ విధముగా శ్రేష్టతరమైన గోవులు ఐదు శివుని పంచవదనముల నుండి ఉద్భవించి లోక కల్యాణ నిమిత్తము పంచ విధములైన విభూతులను ప్రసాదించినవి.

## గోమాత

సృష్టియొక్క ఆదియందు శివుని సద్యోజాతాది పంచముఖముల నుండి ఉద్భవించిన పంచ విధములైన గోవుల సంతానమే నేటి గో సంపద. భారతీయ సంస్కృతియందు గోవుకు మాతృ స్థానమివ్వబడినది. ఋగ్వేదమునందు గోవును గురించిన విషయమీ క్రింది విధంగా వున్నది.

**శ్లో॥ గౌర్మాతా వృషభః పితామే దివం కర్మజగతీ యే ప్రతిష్టా॥**

గోవుకు మాతాయనియును, వృషభమును పితాయనియును, ఈ మంత్రము వలన విశదీకరించబడినది. జన్మనిచ్చిన తల్లి శిశువునకు ఆరు నెలలు లేదా ఒక సంవత్సరము వరకు తన చనుబాలను తాగించవచ్చును. అయితే గోమాత మన జీవితాంతము వరకు తన పాలతో పోషణనిచ్చుచున్నది. ఈ కారణము వలన జన్మనిచ్చిన తల్లి కంటెను గోవు అధికమైనదని ఎంచబడుచున్నది.

తల్లి కంటె వేరు బంధువులేరనెడి ఒక లోకోక్తి కలదు. తల్లి స్థానములో నుండెడి గోవేగాక మనకు నిజమైన బంధువును ఎంచుటలో వివేకము కలదు. ఇదే భావము, యీ క్రింది పురాణోక్తిలోను కలదు.

**శ్లో॥ గావో బంధుర్మనుష్యణాంః మనష్యా బాంధవా గవాం!**
**గౌశ్చ్య యస్మిన్ గృహే నాస్తి ధ్బంతురహితం గృహం॥** (పద్మ : పు : సృష్టి ఖంథం 48-156)

ఈ విధముగా గోవును బంధువుగా చెప్పి గోవు లేని గృహము, బంధువులను గాంచని గృహమని చెప్పబడినది.

## భూలోకపు అమృతమే గోక్షీరము

జరాయుజులైన ప్రాణులకు పాలే మూలాహారం. మనుజుడు జరాయుజుడైనందున, మనజునకు మూలాధారము క్షీరమే. పసివారికి తల్లిపాలతో బాటుగా గోవుపాలను త్రాగించుటయు జరుగుచున్నది. వయస్సు పెరిగిన కొలది, అన్ని జంతువుల పాలను త్రాగడం జరుగును. చరకుని ప్రకారము గోక్షీరమే మిగతా పాలన్నింటిలోను ముఖ్యమైనదని యని తెల్పుచున్నాడు. శిశువులకు పొదరుపాలనిచ్చుట కంటెను గోక్షీరమునిచ్చుట వలన పోషక విలువలు పెరుగును. తేనీటికి అలవాటుపడిన ఆధునికులెందరో, ఆరోగ్యమును గుల్లజేసుకొనుచున్నారు. అట్టి వారికి గోక్షీరము యొక్క మహిమ తెలుపగలమే?

## గోరక్ష - జగద్రక్ష

మంగళకరమైనదియును; మనుష్యుని జీవనమునకు మూలాధారమైనది యగు గోవును రక్షించుట ప్రతియొక్కరి కర్తవ్యము. మన దేశపు ప్రాచీన ఋషులు; రాజర్షులు, గోరక్షకు అధికమైన ప్రాముఖ్యతనిచ్చిరని యెరుగనిదెవరూ? ఎంతోమంది రాజులు గోవుల గురించి భూమిని దానము చేసినారని శాసనముల వలన తెలియుచున్నది. గోగ్రహణమును గురించియే గదా కురుపాండవులకు స్పర్ధలేర్పడి తద్వారా కురుక్షేత్ర సంగ్రామమునకు దారితీసినది. మన దేశమునకు చెందిన వివిధ పీఠములకు చెందిన ఆచార్యులును, గోరక్షణకు ప్రాముఖ్యతనిచ్చిరి. మహ్మదీయ రాజులును మొదటగా గోరక్షకు ప్రాముఖ్యత నిచ్చెడివారనియు, అక్బరు పాదుషాగోహత్యను నిషేధించెననియును, అతడు తానే స్వయముగా గోశాలలను నిర్మించి ఆవుల పోషణ చేసిన ఆధారములు కన్పట్టుచున్నవి.

## గోసేవ వలన యిష్టార్థ ప్రాప్తి

సకల దేవతలకు ఆవాసస్థానమని యెంచబడిన గోవును సేవించుట చేత సకల దోషములు నివారణయగును. గోవులయెక్క ప్రాముఖ్యతను లోకమున చాటుటకే శివుడు గోపతి వాహనుడైనాడు. పశుపతిగా పేరెన్నికకన్నాడు. వైష్ణవులు నుతించెడి గోవిందనామము, శ్రీకృష్ణుని యొక్క గో సేవను స్మరింపచేయుచున్నది గదా! అతనికి గోపాలుడనే ఖ్యాతి కలదు గదా! ఇంతకుముందు చెప్పిన యటుల ఋగ్వేదములోని ప్రమాణము ప్రకారము, గో వృషభములు, మానవ జాతి మనుగడకు మాతాపితల పాత్రను పోషించుచున్నవి. ఈ కారణమువలననే శైవులకు వృషభుడు పరమారాధ్యమూర్తియైనాడు. వైష్ణవులు గోవేవకులైనారు. ఈ రహస్యమునెరిగి మానవజాతి లబ్ధిని పొందుగాక.

జ్వాబాలుని కొడుకైన సత్యకామ జాబాలి హారీతద్రుమగౌతమ మహర్షి అనతిప్రకారము 400 ఆవులు 1000 అయ్యే వరకు నిష్ఠ తోగోసేవచేసి తన స్థూల మరియు సూక్ష్మపిండములను పరిశుద్ధము చేసికొని చివరకు గురూపదేశము ద్వారా శ్రేష్ఠమైన బ్రహ్మజ్ఞానియై జాబాల మహర్షియనెడి పేరున ప్రసిద్ధుడయ్యెను. గోసేవ మరియు గోమయ భస్మము యొక్క యదార్థతత్వమును తెలిసికొని, యీతడే పిప్పలాదమహర్షి పుత్రుడైన, పైప్పలాదమునికి భస్మధారణ విధిని, అట్టి విధి ద్వారా జీవాత్మ పశుత్వ జీవనమును దాటి పరశివస్వరూపమును పొందెడి విధానమునుపదేశించిరి. ఆ ఉపదేశమే బ్రహ్మజ్జాబా లోపనిషత్తు పేరున ప్రసిద్ధిని గాంచినది.

ఇదే ప్రకారము ధౌమ్య మహర్షుల ఆశ్రమమునందు గోసేవను చేసిన ఉప మన్యు బహుశ్రేష్ఠమైన ఋషిగా మారిన కథయు సుప్రసిద్ధమైయున్నది. సూర్యవంశమునకు చెందిన దిలీపచక్రవర్తి కూడ గోసేవనము చేసి రఘువు అనబడు సత్పుత్రుని బడసిన కథ ఒకటి కలదు. దీనిని కాళిదాసు తన రఘువంశ కావ్యమున తెల్పెను. ఈ విధముగా గోసేవ వలన మనుష్యుని సకల పాపములు నివృత్తమగును. బ్రహ్మచారికి బ్రహ్మ జ్ఞానములభించును. గృహస్తులుకు సత్పాత్రత లభించును. అందు చేత గోసేవను చేసి లోకము ధన్యతను పొందును గాక.

పూజ్యులైన శ్రీ రేణుకాభగవత్పాదుల ఉపదేశము ప్రకారము శివుని పంచవదనముల నుండి పంచవర్ణములకు చెందిన పంచవిధములగు గోవులు జన్మించినవి. వాటి సంతతియే నేడును గలదనియును భావించి వాటిని సేవించి, వాటివలన కల్గు గోమయమును సంగ్రహించి, పంచవిధ విభూతులను నిర్మించుకొని, పంచవిధకార్యములు చేపట్టినపుడు, సందర్భానుసారముగ ఏదో నొక విభూతిని ధరించి, లబ్ధిని పొంది మనమందరము, జీవితములను కళ్యాణమయము జేసికొనవలయును.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

**ది. 23-8-1990**
**స్థలం : శివానుభవ మంగళభవనం - షోలాపురం**

## విశేష ప్రదీపిక :-

శ్రీ సదాశివతత్త్వము గురించి సద్గురువులు శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు విపులముగా తెలియజేసిరి. పంచబ్రహ్మ స్వరూపమైన సదాశివ తత్త్వము నుండి పంచ విధ భస్మముల యుత్పత్తికి కారణభూతములగు పంచవిధ గోవులు నుద్భవించినవని తెలిపిరి.

ముప్పది యారు తత్త్వములతో కూడినదే యీ జగత్తు. ఈ తత్త్వములలో శివ, శక్తి, సదాశివ, ఈశ్వర మరియు శుద్ధ విద్యలనెడివి శుద్ధ తత్త్వములనబడుచున్నవి. శివశక్తుల సంయోగము వలననే సదాశివతత్త్వము గల్గెనని చెప్పబడుచున్నది. 'అహమిదం' అనెడి తత్త్వమే సదాశివతత్త్వమందురు. నేనే యీ ప్రపంచమనెడి యభిమానమే 'అహమిదం' యనబడుచున్నది. శివుడు నవ్యక్తుడు. సదాశివుడు వ్యక్తావ్యక్తుడు. ఈశ్వరుడు పూర్ణరూపమున వ్యక్తమయ్యెడివాడు. ఈ విషయమును శ్రీ పాల్కురికి సోమనాథులవారు నీ క్రిందివిధముగా విడమరచి చెప్పిరి.

**సీ॥ పరమ స్వతంత్ర భాస్వర నిత్య సర్వజ్ఞ**
**మంగళ శ్రీ మహాలింగమూర్తి**
**నిఖిల మూలస్థంభ నిర్మల జ్యోతి మ**
**యాంగ ప్రయుక్తోరు లింగమూర్తి**

సకల నిష్కళయుతైశ్వర్య శాశ్వత సము
తుంగ సదాశివ లింగమూర్తి
అతనుత బ్రహ్మాచ్యుతా గోచరాచ్యుత
భంగుర దివ్యాంగ లింగమూర్తి
భక్త హృత్ప్రపూర్తి భావపశ్యుండగు
కల్మి మెరసె బంది కాంద్ర జేసి
వంగకాయలట్ల లింగముల్లా జూచు
ప్రతిభ మీకె యొప్పు బసవలింగ ॥ (చతుర్వేదసారము, ప 33)

శ్రీ సదాశివునికి నైదు ముఖములుండుననియును, సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానములే ఆ ముఖములనియు శివాగమములు తెలుపుచున్నవి. ఆది వీరశైవ జగద్గురువుల వారు నీ ముఖలముల నుండియే ఉద్భవించిరని శివాగమములలో చెప్పబడినదనెడిది విశ్వవిఖ్యాత సత్యము.

బ్రహ్మాచ్యుతాగోచరమైన తత్త్వమే సదాశివతత్త్వమనునది గమనార్హ మైన విషయము. పౌరాణికముగా చూసిన యెడల సదాశివతత్త్వము త్రిమూర్తుల తత్త్వము కంటెను నతీతమైన తత్త్వమని తెలుయబడుచున్నది శ్రీ పిడుపర్తి సోమనాథుల వారి యీ క్రింది భావమును గనుడి

సీ॥ "ఆదికి నాదియై యనుపమ మహిమ
నది వెలుగొందును నన్నిటి మీద
నది కేవలమగు లింగమూర్తి
యది నిర్వికారాజ మందుదయించె
శ్రీ సదాశివుడుందు చిచ్ఛక్తి వొడమె
శ్రీ సదా శివున కాజ్ఞాన శక్తి
కాసక్తి జనించె నా శివుడుందు
భాసురేచ్ఛాశక్తి ప్రభవించెనట్టి
శివునకు నిచ్ఛకు శ్రీ రుద్రుడయ్యె
నవని రుద్రునకు క్రియాశక్తి వొడమె
నా రుద్రుకు క్రియాశక్తికిని
ఘోరున నుదయంబు పొందె విష్ణుండు
ఆ విష్ణువునకు మహాలక్ష్మి గలిగె
నా విష్ణునకు లక్ష్మకయ్య నా బ్రహ్మ
ఆ విధాతకు వాణికి యయ్యె నా విధికి
నా వాణికిని సచరాచరంబయ్యె" (ప్రభులింగలీల, 2వ గతి)

ఈ తత్త్వమును బ్రహ్మ విష్ణువులు గానలేకపోయిరనెడిది లింగ పురాణములో చెప్పబడినది. ఈ విషయమున శ్రీ చంద్రశేఖర జగద్గురువులవారు నింతకు క్రితమే తెలిపియుండిరి. లింగరూపమున నున్న సదాశివుని శిరమును మరియు పాదములను బ్రహ్మ విష్ణువులు గానలేక విఫలురైరియని చెప్పబడినది. శివుని చక్రప్రదాన లీలా ప్రదర్శన సమయమున శ్రీ విష్ణువు చేసిన శివస్తుతిలో సదాశివుని పంచవదనములకు నమస్కారములు సమర్పింపబడినవని తెలుపబడినది. లింగ పురాణములోని యీ క్రింది శ్లోకములను గనుడి.

'అగ్నయే రుద్రరూపాయ రుద్రాణాం పతయే నమః
శివాయ శివమంత్రాయ సద్యోజాతాయ వేధసే॥
వామాయ వామదేవాయ వరదాయామృతాయతే।
అఘోరాతి ఘోరాయ సద్యోజాతాయ రంహసే॥
మోక్షాయ మోక్షరూపాయ మోక్ష కర్త్రే నమోనమః
ఆత్మనే ఋషయేతుభ్యం స్వామినే విష్ణవే నమః॥ (లింగపురాణము, అ. 8)

అష్టావరణములలోని గురుతత్త్వమునకు నీ ముఖములు జన్మనిచ్చినయటులు, భస్మము అనెడి ఆవరణ యుత్పత్తికి మూల హేతువులైన పంచ విధ గోవులను నీ పంచ వదనములనుండియే యుద్భవించినవని తెలిసికొనిన భక్తుడు భస్మ భస్తితాది భస్మ పంచకమును ధరించుటలో ననన్య సామాన్యమైన శ్రద్ధను ప్రదర్శించవలెననెడిదియే గుర్తించవలసిన విషయము.

తాత్త్వికముగా చూచిన యెడల జగత్తులోని సచరాచర వస్తువులన్నియును నీశ్వరాది భూమ్యంతము వరకు గల ముప్పది మూడు తత్త్వముల వలన గల్గినవే. బ్రహ్మ విష్ణ్వాది దేవతా గణములు కూడ యీ తత్త్వముల నుండి యుద్భవించినవనెడిది వాస్తవము. అణువు నుండి ఈశ్వరుని వరకు గల తత్త్వములన్నియును సదాశివతత్త్వము నుండి యుద్భవించినవే. అట్టి యెడ నందాది గోవులు సదాశివతత్త్వమునుండి యుద్భవించిన వనుట ప్రత్యేకముగా చెప్పవలసిన యవశ్యకత కలదా? యనెడి ప్రశ్న యుదయించవచ్చును. ఈ విధముగా చెప్పుటలోన గల అంతరార్థమును గ్రహించవలెను. భక్తస్థలమున సాధకుడు శ్రద్ధాభక్తిని పెంపొందించికొనని యెడల సాధన క్రమములో ప్రగతి ద్రుగ్గోచరము కాదు. భక్తస్థలములోని మిగిలిన యవాంతర స్థలములలోనికి ప్రవేశించజాలడు. లింగధారణ స్థలమున నిలిచిపోయి భక్తిపరముగా స్థాణువైపోవును. ఇట్టి స్థితి వైకల్యమును పొంది భక్తి తరిగిపోయి తిరోగమనము సంప్రాప్తము కావచ్చును. ఇట్టివి విచారించి భక్తుని కాపాడవలెను. తన్నిమిత్తమున సాధకునిలో భక్తిశ్రద్ధలను పెంచెడి నమ్మక నిర్మిత యొక్క ఆవశ్యకత యేర్పడి ఆది అంశలోనే పంచగోవుల ఉదంతమును గ్రహంచవలసి యున్నది. అయోనిజులంటనే ప్రజలలో నెంతో గౌరవము గలదు. సీతమ్మవారి గురించి తెలియనివారెవ్వరు ఇట్టి పవిత్ర భావన కల్పించుటకే యీ విధమైన యుపదేశమివ్వబడినదని గ్రహించగలరు.

– శివంభూయాత్ –

## ఆశీర్వచనము - 4

**శ్లో॥ ధారయేన్నిత్య కార్యేషు విభూతించ ప్రయత్నత।**
**నైమిత్తికేషు భసితం క్షారం కామ్యేషు సర్వధా॥**
**ప్రాయశ్చిత్తేషు సర్వేషు భస్మనామ యథా విధి।**
**రక్షా చ మోక్ష కార్యేషు ప్రయోక్తవ్యా సదాబుధైః॥** (సి.శి:- 7:- 9 - 10)

నిత్య కార్యములయందు విభూతిని, నైమిత్తికముల యందు భసితమును, కామ్య కార్యములందున క్షారమును, ప్రాయశ్చిత్త ములయందున భస్మమును, మోక్ష కార్యముల యందు రక్షను శాస్త్రోక్తపద్ధతిలో ధరించవలెను.

**నందాదీనాంతు యే వర్ణాః కపిలాద్యాః ప్రకీర్తితాః।**
**త ఏవ వర్ణా విఖ్యాతా భూత్యాదీనాం యథాక్రమం ॥** (సి.శి.: 7-11)

నందాదుల యొక్క కపిలాది వర్ణములు, విభూత్యాదులకు చెందిన వర్ణములని చెప్పబడినవి.

## కార్యముల విభాగము :

భారతీయ ప్రాచీన వాఙ్మయమైన వేదాగమ మరియు స్మృతి గ్రంథముల యందున మనమాచరించవలసిన కర్మములను విహిత మరియు నిషిద్ధములని రెండు భాగములుగా విభజింపబడినవి. శాస్త్ర సమ్మతమైనవి విహిత కర్మలు. తద్విపరీతమైనవి నిషిద్ధ కర్మలు. నిషిద్ధ మార్గ ప్రవృత్తియనెడిది మానవుని సహజ స్వభావమైనందున, నిషిద్ధకర్మలు అగణితములుగా నుండును. విహితకర్మలు నిత్య, నైమిత్తిక, కావ్య, ప్రాయశ్చిత్తములను నాలుగు విధములుగా నున్నవి.

శ్రీ జగద్గురు రేణుక భాగవత్పాదులవారు కార్యములైదు రకములుగా నుండుననియును, అవి నిత్య నైమిత్తిక కామ్య నిషిద్ధ మరియు మోక్షములనియును ఉపదేశించిరి.

మోక్షకార్యమనగా నేమి యనెడి సందేహము కలుగవచ్చును. నిష్కామకర్మమే మోక్ష కార్యమని గుర్తింపవచ్చును. ఇది ముక్తికి సాధనభూతమైనదిగా నుండవలెను.

విహిత కార్యముల యొక్క సంపూర్ణ ఫలములు మనకు దొరకవలెననిన తత్తత్ కార్యోచిత కార్యాచరణలతోపాటుగా పంచ విధములగు విభూతుల యొక్క ప్రయోగము పరమావశ్యకమైయున్నదను రహస్యార్థమును శ్రీ భగవత్ పాదులవారు నుపదేశించిరి. వాటిని యిచ్చట క్రమముగా విచారింతుము గాక.

## నిత్య కార్యములు - విభూతి :

"నిత్య కార్యేషు విభూతిం ధారయేత్" అనెడి ఆచార్యోక్తి ప్రకారము నిత్య కార్యము లాచరణ చేయునప్పుడు విభూతిని ధరించవలెను. "నిత్యం" అనగా "నియమేన భవం నిత్యం" అనెడి వ్యుత్పత్తి యివ్వబడినది నియమము వలన కల్గినది, కావున నిత్యం అనిపించుకొనుచున్నది. నియమములననుసరించి యను నిత్యము చేయబడునదే నిత్య కార్యమగుచున్నది. దీక్షానంతరము మరణ పర్యంతము ప్రతిదినము తప్పకుండగా ఆచరించు కార్యములే నిత్యకార్యములగును.

నిత్య కర్మల ననునిత్యము చేయుటచేత విశేష పుణ్యము సంప్రాప్తించదు. కాని చేయకుండిన యెడల దోషముగల్గును. ఈ క్రింది ప్రమాణమును గనుడి:

**శ్లో॥ నిత్యం సదాయావదాయుర్నకదాచిదతిక్రమేత్।**
**ఉపేత్యాతిక్రిమే దోషశ్రుతేరత్యాగదర్శనాత్ ॥**
**ఫలశ్రుతేర్వీప్సయాచ తన్నిత్య మిహ కీర్తితం। ॥** (శ్లోక కార్తికము, పుట 476)

ఇది మీమాంసా శాస్త్రములోని ప్రమాణము. వీరశైవులకు ఇష్టలింగధారణ మరియు పూజనము నిత్యకర్మలగును. ప్రాణ వద్ధారణీయం లింగం తవ" అనియును, కదాచిత్ కుత్రచిద్వాపి దేహతోన వియోజయ" అనెడి ఆచార్యోక్తులు (సి.శి.6-25) ఆదేశించినవని తెలిసికొనగలరు. ప్రాణమున్నంత వరకు లింగము ధరించదగినది. ఎప్పుడైనను, ఎక్కడైనను లింగమును దేహమునుండి దూరము చేయుకదదనునది ఆచార్యోక్తులలోని సారాంశము. ఇష్టలింగ పూజకును, ఈ నియమములే వర్తించునని గ్రహించగలరు. ఇష్టలింగ ధారణ మరియు పూజలతోపాటుగా పంచాక్షరీ మహామంత్రము యొక్క జపము, శివధ్యానము, శ్రీ రుద్రము, శివాగమములు, సిద్ధాంత శిఖామణి వంటి గ్రంథముల పారాయణము చేయుట వలన ఉత్తమ ఫలితములు గల్గును.

వీటన్నింటినీ ప్రతిదినము నిశ్చిత సమయమునందున తప్పనిసరిగా చేయవలెను. చేయకుండినచో దురితములు సంప్రాప్తమగును. ఈ క్రియల యొక్క ఆచరణ వలన మనకు రక్షణ ప్రాప్తమగును, తత్ఫలితముగా పతితులము కాజాలము. ఈ విషయమున మనుస్మృతి యీ క్రింది విధముగా తెలిపినది.

## "పూర్వం సంధ్యాం జపం స్థిష్ఠన్నైకమేనో వ్యపోహతి" :

రాత్రియందున చేయబడిన దోషములు, ప్రాతః కాలమున చేసెడి నిత్యకర్మలవలననూ, పగలు చేసెడి దోషములు సాయంకాలమున చేయబడెడి నిత్య కర్మల వలనను నివారణమగుచున్నవని మనువు వాక్కులలోని భావము. అందుకే, ఇష్టలింగ పూజాదులను కనిష్టముగా రెండు పర్యాయములైననూ చేయవలెను. మూడు మార్లు చేయుట యుత్తమము. గురుస్థానము నలంకరించినవారును, విద్యాభ్యాసము చేసెడివారును లింగపూజాదులను మూడుమార్లు తప్పనిసరిగా చేయవలెననెడి శాస్త్ర నియమము కలదు. వాకిలి, కిటికీలు, మొదలగు వాటి ద్వారా ప్రతిక్షణము యింటిలోనికి దుమ్ము, ధూళి వచ్చి నిలుచుచున్నది. పారిశుద్ధ్యనిమిత్తమున దినమునకు రెండు లేక మూడు పర్యాయములు చీపురుతో కసువును ఊడ్చివేసి శుద్ధిని చేయుచుందుము కదా! ఆ విధిన చేయని యెడ, "సర్వం ధూళిమయం గృహం" అనెడిది సిద్ధించును. మన శరీరము గృహము వంటిదే. నవరంధ్రములు ద్వారముల వంటివి. దశేంద్రియముల వలన నిత్యము అనేకానేకములైన దోషములు గల్గుచున్నవి. నిత్యక్రియ నాచరించి యీ దోషముల నుండి విముక్తిని పొందవలెను. ఆ విధిన చేయనియెడల దేహము దోషభూయిష్టమగును. నిత్య కార్యములనాచరించుట వలన బహిరంగ శుద్ధియును, అంతరంగ శుద్ధియును చేకూరును.

"ధారయేన్నిత్య కార్యేషు విభూతో" అనెడి శ్రీ భగవత్పాదులవారి ఆదేశము ప్రకారము నిత్య కార్యములు చేయునప్పుడు విభూతిని ధరించవలెను. ఇచ్చట విభూతి యనగా సద్యోజాత ముఖోద్భూతమైన నందాయనెడి గోవు యొక్క గోమయం చేత చేయబడిన విభూతియని గ్రహించవలెను. నందా గోవు సంతతికి చెందిన గోవు యొక్క గోమయం చేత చేయబడిన విభూతినిసంపాదించుకొని సదా ధరించడం ప్రతి వీరశైవుని యొక్క కర్తవ్యమని యెంచవలెను. ఇష్టలింగాదుల పూజించునప్పుడును, దీనినే ధరించవలెను.

## నైమత్తిక కార్యములు - భాసితము :

"నిమిత్త దాగతం, నిమిత్త భవం వా, నైమిత్తికం" యనబడెడి వ్యుత్పత్తి ప్రకారము ఏదో ఒక నిమిత్తము కొరకు నాచరించెడి కార్యములు మహాత్ముల జయంతి, వర్ధంతులనాచరించుట, పర్వదినములను జరుపుకొనుట, నైమిత్తిక కార్యములకు నిదర్శనములు ఇంతేకాకుండా వీరశైవాచార కౌస్తుభంలోని దశ కర్మ పద్ధతియు, పూర్వ ప్రయోగ రత్నము మొదలగు గ్రంథములలో ప్రతిపాదించబడిన గర్భా దానాదులను, నైమిత్తిక కార్యములుగానే భావించవలెను.

**శ్లో॥ విశుద్ధాః ప్రాకృతాశ్చేతి ద్వివిద మానుషాః స్మృతాః।**
**శివసంస్కారిణః శుద్ధాః ప్రాకృతా యితరే మతాః॥** (సి.శి.: 10-34)

పూజ్యశ్రీ రేణుక బగవత్పాదులవారు కటాక్షించిన ఈ ఆదేశము ప్రకారము పది విధములైన సంస్కారములను పొందినవారు శుద్ధ మనుష్యులుగా పరిగణించబడుదురు. తద్విపరీతముగా నుండెడివారు, ప్రాకృతులనబడుదురు.

## గర్భాధానము

ఋతుస్నానాంతరము శాస్త్రోక్త విధిన నొక సమయమునెంపిక జేసికొని సకల విద్యా లక్షణ సంపూర్ణ ఆయుష్మత్ పుత్ర జననార్ధముగా సకల ధార్మిక కార్యక్రమముల నాచరించి, గురువర్ణము యొక్కయు, భక్తవర్గములోని పెద్దల యొక్కయు ఆశీర్వాదమునబడసి, దంపతులు ఏకమగుట యేగర్భాదాన సంస్కారములోని లక్ష్యము. ఈ విధియందు నిష్టయున్న దంపతులకు సకల సలక్షణ సమన్వితులగు సంతతి సంప్రాప్తమగును.

## పుంసవనము :

ఆడపిల్లలు మూడు లేదా నాలుగు నెలల గర్భిణియైయున్నప్పుడు గర్భ దోష పరిహారము చేయు సంస్కారమే పుంసవనము. ఇది భావి సంతతి చక్కగా వుండవలెనని చేయు సంస్కారము.

## సీమంతము

గర్భము యొక్క ఆరు లేదా ఏడు నెలల యందు చేసేడి సంస్కారమే సీమంత సంస్కారము ఏడవ నెల పిదప సీమంతము చేసిన యెడల, అప్పుడు గర్భమునకు లింగధారణచేయవలెను. దీని రహస్యార్ధమేమనగా ఎనిమిది నెలలో గర్భస్థుడైయున్న శిశువుకు 'ముమూర్షా' (మరణయిచ్ఛ) తీవ్రమగును. అందువలన ఎనిమిదివ నెలలో అయ్యేడి ప్రసవములో జన్మించిన శిశువులు మరణించుట జరుగుచుండును. ఇట్టి ప్రమాదమును నివారించు నిమిత్తము, లింగధారణ సంస్కారము చేయుట శ్రేయస్కరము ఆ విధిన చేసిన యెడల ఆ శిశువునకు శివానుగ్రహము సంప్రాప్తమై పూర్ణాయుష్కుడగుచున్నాడు. వీరశైవ సాంప్రదాయము ప్రకారము భవియై జన్మించకుండ జన్మతః భక్తుడగుచున్నాడు. తల్లి ఎనిమిది నెలల గర్భవతిగా వున్నప్పుడు ఆమెకు చేసెడి సంస్కారముల ప్రభావము శిశువపైన బడునని తెల్పెడి ఆధారములు కలవు. మహాభారతములోని వీరాభిమన్యుని కథ యట్టిదే. నేటి వైజ్ఞానికులు గర్భస్థ శిశువు మీద సంస్కారము యొక్క ప్రభావమును గురించిన పరిశోధనలను జరుపుచున్నారు. వీరి లక్ష్యము గర్భస్థ శిశువును కాపాడుటే. ప్రాచీన ఆచార్యులు, ఉపదేశించిన సీమంతసంస్కారము మరియు వీరశైవాచార్యులు ప్రతిపాదించిన గర్భాష్టక లింగధారణ సంస్కారము ఎంత వైజ్ఞానికమైనదో గమనించవలసిన అవసరమే లేదు.

## జాతకర్మ :

శిశువు జన్మించిన అనంతరము, మూడవ లేదా అయిదవ దినమున, జరుపబడే సంస్కారమే జాతకర్మ సంస్కారము. ఈ సత్కార్యమునందు శిశువునకు లింగమును ధరింపజేయునదే యిందులోని ప్రముఖమైన కార్యము. గర్భాష్టకమున లింగధారణ చేయనివారు, ఈ కర్మను చేయవలెను. గర్భాష్టకమున లింగధారణ గావించినవారు, శిశువునకు లాంఛనప్రాయముగ లింగమును కట్టించవచ్చును.

## నామకరణము

నామమే ఎంతో ముఖ్యమైనదని తెల్పెడి ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ నామాఖిలస్య వ్యవహారాహేతుః శుభావహం కర్మ సుభాగ్యహేతు।**
**నామ్నైవ కీర్తిం లభతే మనుష్యస్తతః ప్రశస్తం ఖలునామ కర్మ॥**

పేరు వ్యవహారమునకు ముఖ్యమైనది అది మంగళ ప్రదము, సౌభాగ్య దాయకమును. దీనివలన మనుష్యుడు కీర్తిని బడయుచున్నాడు. ఈ కారణము వలన నామకరణ సంస్కారము అత్యంతావశ్యకమైయున్నది. ఈ సంస్కారమును శిశువు జన్మించిన 16 లేదా 21వ దినమునందున చేయుదురు. ప్రాంతీయ భేదముల బట్టి ఆయా పరిస్థితులననుసరించి ఈ సంఖ్య మారుచుండును. గురువర్గమువారును కుటుంబ పెద్దలును కూడి యీ కార్యమును జరుపుదురు. పేర్లను పెట్టునప్పుడు తమ యిష్ట దైవము యొక్క పేర్లను పెట్టునది ఆచారమై యున్నది. దీనికి కారణమేమనగా పిల్లలను పిలిచెడి సందర్భమున, దేవునియొక్క స్మరణ సహజముగానే జరుగుచున్నది. ఇంకొక విషయమేమనగా మగపిల్లలకు సరిసంఖ్య గల అక్షరముల పేర్లును, ఆడపిల్లలకు బేసి సంఖ్య గల అక్షరముల పేర్లను పెట్టవలెననెడి సాంప్రదాయము కలదు. ఈ కారణము వలన వీరశైవులు తమ మగపిల్లలకు శివ, రుద్ర, పశుపతి మున్నగు శివనామములనే పెట్టవలెను. ఆడపిల్లలకు శ్రీగౌరి, రుద్రాణి, పార్వతి, భవాని మొదలగు జగన్మాత పేర్లను పెట్టవలెను.

## అన్నప్రాశన :

శిశువునకు ఆరు లేదా ఎనిమిది నెలల ప్రాయమున, పళ్లు వచ్చిన పిదప, అన్నప్రాశనను చేయుదురు. మన స్థూల శరీరము అన్నమయ కోశము గల్గియుండుటచేత, శారీరక వృద్ధికై అన్న ప్రాశనను చేయించవలెను. "అన్నమయం హి సోమ్యమనః" అనెడి ఉపనిషత్ప్రమాణము ప్రకారము, అన్న రసము యొక్క అంతిమ పరిణామమే మనసైన కారణమున, మనో నైర్మల్యమునకు, సుసంస్కృత అన్నమే మూలమగును. అందుచేత, శిశువునకు మొదటి అన్నప్రాశన చేయించునప్పుడు సంస్కారయుక్తము, పవిత్రము, సాత్వికమైన అన్నమునే మొదటగా తినిపింతురు.

పిల్లలకు బాల్యమునందుననే సాత్వికమైన అన్నము తినెడిది అభ్యాసమైన పిదప వారు ఆ అభ్యాసమును జీవితాంతము వరకును కొనసాగింతురు. పిల్లలకు సాత్వికాహారము యెడల అభిరుచిని పుట్టించి పిల్లల జీవనమును సాత్విక మార్గమున పయనింపజేయుటయే అన్న ప్రాశన యొక్క ప్రధానమైన ఉద్దేశము.

## చౌలసంస్కారము :

మూడవ సంవత్సరమున శిశువునకు కేశఖండన చేయించుటయే చౌల సంస్కారమనబడును. మస్తక మెంతో సున్నితముగా నుండుటచే దానిని మూడు సంవత్సరముల వరకు జాగ్రత్తగా కాపాడవలెను. అందుకే, తల్లులు పిల్లల మస్తకమునకు నూనెతో రుద్ది రుద్ది గట్టిగా చేయుదురు. పిల్లవాని తల వెంట్రుకలును మస్తకమునకు రక్షణ కల్పించుచున్నవి. రెండు వర్షముల అనంతరము పిల్లవాని మస్తకమునందలి వెంట్రుకలును, కత్తిరించకుండగా అటులనే ఉంచిన ఎడల ఆ పిల్లవాని పెరుగుదలకు ఆ వెంట్రుకలే ప్రతిబంధకములగుచున్నవి. ఈ కారణము వలన ధర్మశాస్త్ర ప్రకారము మూడవ వర్షము నందుననే కేశఖండన సంస్కారము చేయవలయును. మొదటిసారి సంపూర్ణముగా కేశములను కత్తిరించివేసి ఆ పిదప కావలసినంత మేరకు వెంట్రుకలను మిగుల్చుకొని మరల, మరల కత్తిరించుకొనుచు పోవలయును.

## శివదీక్షా సంస్కారము :

పిల్లవాని ఎనిమిదవ సంవత్సరమున శివదీక్షా సంస్కారము చేయవలయునని విధించబడినది.

ఇంతకు పూర్వము బాలునకు లింగధారణ చేసినప్పుడు అతనికి ఎట్టి తెలివితేటలు ఉండవు. ఎనిమిది సంవత్సరముల వరకు వానికి పూర్తిగా తెలివితేటలు వచ్చి యుండును. ఇప్పుడు చేసిన శివదీక్ష మరియు మంత్రోపదేశముల ఎరుక వానికి అగును. అదుచేతనే సద్గురువులవారిచే పిల్లవానికి ఎనిమిది సంవత్సరమల ప్రాయమున శివదీక్ష సంస్కారమును జరిపించవలెను.

ఎనిమిది సంవత్సరముల నుండి పిల్లవానికి ధార్మిక క్రియలు చేయుట నధికారము ప్రాప్తమగుచున్నవి. ఎనిమిది సంవత్సరముల వయస్సున చేయబడు ఈ దృఢమైన సంస్కార ప్రభావము, జీవితాంతము వరకు ఉండును. కాన ప్రతి వీరశైవుడు పిల్లలకు తమ వంశపరంపరానుగుణంగా, శివాచార్యునిచే దీక్షాసంస్కారము తప్పనిసరిగా చేయించవలయును.

## వివాహము :

**శ్లో॥ బ్రాహ్మో దైవస్తథై వార్షః ప్రాజాపత్యస్తథాసురః ।**
**గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమోఽధమః ॥** (మను 3-21)

బ్రాహ్మ, దైవ, ఆర్య, ప్రాజాపత్యములు, ఉత్తమమైనవని తెలుపబడినవి. ఉత్తమ, సాంసారిక జీవనమునకై శ్రేష్ఠమైన పద్ధతిలో వివాహము జరిపించవలెను. వీరశైవులకు విహితమైన పద్ధతి యెట్టిదో సంస్కార సంబంధమైన గ్రంథముల ద్వారా తెలిసికొని వివాహమును చేయించవలెను. వీరశైవాచార కౌస్తుభవము, వీరశైవ సంస్కార చంద్రిక వంటి గ్రంథములను పఠించవలెను. అన్యుల పద్ధతి వీరశైవులకు విహితము కాదు.

## అంత్యేష్టి :

మృతదేహమునకు సంస్కారము చేయునదే అంత్యేష్టి అనిపించికొనును. లోకమున రెండు విధానములు గలవు. ఖననము మరియు దహనము. ఖననమే యుత్తమమైన విధానమని తెలిపెడి యీ క్రింది ప్రమాణమును గనుడి!

**శ్లో॥ శరీరం పంచ భూతాఖ్యం తత్వం తత్వేన యోజయేత్ ।**
**తత్రాపి పృథివీతత్వే యోజనం మోక్ష సాధనం ॥** (పారాశర స్మృతి)

పాంచభౌతికమైన దేహమును, ఎదో నొక తత్వమున కలుపవలెను. భూమిలో కలుపుట శ్రేష్ఠతర మగును. ఇది యీ శ్లోకములోని భావము.

వీరశైవునకు దహనము విహితమైనదా అనెడి ప్రశ్న తలయెత్తవచ్చును. దహనము విదితము కాదని చెప్పెడి యీ క్రింది ప్రమాణము గనుడి:

**శ్లో॥ దగ్ధస్య దహనం నాస్తి పక్వస్యపచనం నహి।**
**జ్ఞానాగ్ని దగ్ధ దేహానాం న చ దాహో న చక్రియా॥**

దీక్ష చేత దగ్ధుడైయున్న వానిని పునః దగ్ధము చేయుట విహితము కాదనియును, వీరశైవునకు ఖననమే శ్రేయస్కరమైనదని తెలుపునదే యీ ప్రమాణము.

వీరశైవ అంత్యేష్టి విధికి యొక ప్రత్యేకత గలదు. తత్సంబంధిత గ్రంథముల నవలోకము చేసి తగిన పద్ధతిలో నీ విధిని ఆచరించవలెను.

ఈ పై వివరించిన కార్యములన్నియునాయా నిమిత్తములు ప్రాప్తమైనప్పుడు చేయబడుచుండుట వలన నివి నైమిత్తిక కార్యములనబడును.

"ధారయేన్నేమిత్తి కేషు భసితం" అనెడి శ్రీ రేణుకాచర్యాలువారి యుపదేశానుసారముగా వీటి నాచరించునప్పుడ 'భసత'మనెడి విభూతిని ధరించిన, ఆయా కార్యముల పూర్ణ ఫలము ప్రాప్తము కాగలదు.

**కామ్య కార్యములు మరియు క్షారము**

శబ్ద కల్పద్రువము, కామ్యమనెడి పదమును ఈ క్రింది విధిన నిర్వచించినది.

**శ్లో॥ యత్కించిత్ ఫలముద్దిశ్య యజ్ఞదాన జపాదికం ।**
**క్రీయతే కాయకం యచ్చ తత్కామ్యం పరికీర్తితం ॥** (శబ్ద కల్ప ద్రుమము, పుట 92)

ఏదో నొక ఫలమునాశించి చేయబడెడి యజ్ఞ దానతపాదులను కామ్యకర్మలనియందురు.

మనుజునికి పశుపుత్ర ధనాదులనెడి ఐహిక మరియు స్వర్గాది భోగములనెడి పారలౌకిక ఫలములు కావలెనను కోరికయుండును. అపేక్ష యుండినచో కోరికలు నెరవేరవు. "మనోరథైర్న సిద్ధంతి కార్యాణి" అని కర్మతత్వ విశారదులు తెల్పిరి. "ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి" అని సుభాషితకారులు తెలిపిరి. ఆపేక్షకు ననుగుణంగా కార్యములను చేసినగాని ఫలప్రాప్తి కాదు.

శ్రీ రేణుకాచార్య జగద్గురువుల వారు "కామ్య కార్యేషు క్షారం ధారయేత్" అని యుపదేశించిరి. కామ్య కార్యములు శీఘ్రముగా ఫలము నివ్వవలెననిన యెడల క్షారమనెడి విభూతిని ధరించిన అల్పమైన ప్రయాస వలన యనల్పమైన ఫలము చేకూరును.

## ప్రాయశ్చిత కార్యము మరియు భస్మము

చేయబడిన దోషముల వలన వైపరీత్యము గల్గకుండగ నుండుటకై ప్రాయశ్చిత్తమును చేయుదురు. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ ప్రాయోనామ తపః ప్రోక్తం చిత్తం నిశ్చయ ఉచ్యతే ।**
**తపో నిశ్చయ సంయుక్తం ప్రాయశ్చిత్త మితిసృతం ॥** (అంగీరా స్మృతి నా.కో. పట 592)

ప్రాయః అనగా తపస్సనియును, చిత్తమనగా నిశ్చయమని, ఈ రెంటియొక్క కలయికయే ప్రాయశ్చిత్తమనియును చెప్పబడినది. పై ప్రమాణము ప్రకారము దోషనివారణార్థమై నిశ్చిత్తమై యున్న తపస్సు ప్రాయశ్చిత్త మగుచున్నది. విభిన్నమైన దోషములను తొలగించుటకై విభిన్నమైన తపస్సులు నిశ్చయింపబడినవి. సకల విధములగా పాపములకు ప్రాయశ్చిత్తమే దివ్యమైన ఔషధమని చెప్పబడినది. అందుచేత, "ప్రయతాత్వా ద్వ్యపజితం అశుభం కర్మ నాశయతీతి ప్రాయశ్చిత్త"మని హరీత స్మృతి తెలియజెప్పుచున్నది.

మనుజుడు పతనమగుటకు గల కారణముల గూర్చి తెలిసికొనుట యెంతో నవసరమైయున్నది ఈ విషయమున యాజ్ఞ్యవల్క్యుని హితమునుగనుడి.

**శ్లో॥ విహితస్యా నుష్ఠానాన్నిందితస్య చ సేవనాత్।**
**అనిగ్ర హోచ్చేంద్రియాణాం నరః పతనమృచ్ఛతి"** (శబ్ద కల్పద్రుమము, పు. 319)

విహిత కర్మములను చేయకుండుట, నిషిద్ధ కర్మలను చేయుట, ఇంద్రియములను నిగ్రహించకుండగ యుండుట యనెడి వీటి మూలమున వ్యక్తి పాపమును పొంది పతనమగును, అనేది స్మృతి వాక్కులోనిమిడియున్న భావము. మనువు ఇదేవిధిన చెప్పిరని మనస్మృతిలో ప్రమాణములు గలవు. దైహిక, వాచిక మరియు మానసికములుగా దోషములు విభజింపబడినవి. ప్రాయశ్చిత్తమును చేసికొనని యెడల, యీ క్రింది పరిణామములు గల్గుచున్నవి.

**శ్లో॥ శరీరకైః కర్మదోషైర్యాతి స్థావరతాంనరః।**
**వాచికైః పక్షిమృగతాం మనస్సైరంత్యాజాతితాం॥** (శబ్ద కల్పద్రుమము, పు. 319)

శారీరక దోషముల వలన స్థావరత్వము, వాచిక దోషముల వలన పక్షి మృగయోనులలో జన్మము, మానసిక దోషముల చేత హీనమైన జన్మలు లభించునని చెప్పబడినది.

ఇట్టి దోషముల నివారణకై వాచస్పత్యము ఈ క్రింది ప్రాయశ్చిత్తములను విధించినది

**శ్లో॥ శోషణేనశరీరస్య తపసాధ్యం యనేన చ**
**పాపకృన్ముచ్యతే పాపాత్ దానేనచ దమేన చ ॥**
**గంగ్వాకం దేవపూజా వేదాభ్యాసః స్తరిత్పవః।**
**నాశయంత్యాశు పాపాని మహాపాతకజాన్యపి।**

**విత్యైర్ద్విజాతయః శోధ్యా వ్రతై రావిష్కృతైనసః।**
**అనావిశ్కృత పాపాస్తు మంత్రైర్హో మైస్తు శోధయేత్ ॥** (వాచస్పత్యం, పుట 4527)

తపస్సు లేదా స్వాధ్యాయము చేత శరీరమును కృశింపజేసికొనుట, గంగాదులలో స్నానములు, గోదాన భూదానాదుల దానములు ప్రాయశ్చిత్త కర్మలుగా సూచింపబడినవి. ప్రాయశ్చిత్తముల జేసికొని, మరల పాపముల జేయుటకై పూనుకొనెడి వారిని గూర్చి మనువు ఈ క్రింది హెచ్చరికను చేసిరి.

**శ్లో॥ కృత్వా పాపం హి సంతప్య తస్మాత్ పాపాత్ ప్రముచ్యతే।**
**నైతత్ కుర్యాం పునఃతి నివృత్యాపూయతేనరః ॥** (మనస్మృతి)

చేసిన పాపమును మరల చేయననెడి దృఢమైన సంకల్పమును మదిలో దాల్చి, ప్రాయశ్చిత్తమును చేసిన యెడల ఫలితముండును. మరల మరల చేసిన పాపమును మరల చేస్తూ పోయిన యెడల దోషము ద్విగుణీకృతమగునని మనువు ఉద్బోధించెను.

వీరశైవ ధర్మాను యాయుల నిమిత్తము ఆగమములు ప్రాయశ్చిత్తమును విధించిన కారణాగమములోని యీ ప్రమాణములను వీక్షించండి.

**శ్లో॥ మూల మష్టోత్తర శతం కాలభంగేర్చనస్యతు।**
**పూజాయాశ్చ జపస్యాసి లోపే మూలం సహస్రకం॥**
**అథలింగస్య లోపేతు కర్తవ్యం శృణుసుందరి**
**లింగస్యా దర్శనేత్యాజ్యః ప్రాణః స్యుర్భక్తియోగతః॥**
**ప్రాణ త్యాగే త్వ శక్తశ్చేక వింశిద్వినావతి॥**

(కారణాగమము, క్రి.పా. పుట 10, 24, 32, 33, 35)

నిత్య కార్యములలో లోపమైన యెడల పంచాక్షరీ జపమును చేసి నివారణ పొందవలెనని చెప్పబడినది. సమయ భంగమై యెడల 108 మార్లు, ఒక దినమున, యిష్టలింగ పూజను చేయనియెడల 1008 మార్లు పంచాక్షరిని చేయవలెనని చెప్పబడినది. ప్రమాదవశమున నేలమీద లింగము పడిన యెడల 108 మార్లు పంచాక్షరిని చేయవలెను. లింగము పోయిన యెడల, అన్వేషించే సందర్భమున ఉపవాసము విధింపబడి దొరకనిచో ప్రాణత్యాగమే ప్రాయశ్చిత్తమగును. ప్రత్యామ్నాయముగ గురువు నుండి మరల దీక్షను పొంది లింగధారణను పొందవచ్చును. ఇవి కారణాగమములో విధింపబడిన ప్రాయశ్చిత్తములు.

ప్రాయశ్చిత్త కార్యములు చేయునప్పుడు భస్మమనెడి విభూతిని ధరించవలెనని ఆచార్యుల వారు ఉపదేశమునిచ్చిరి. "ధారయేత్సర్వేషు భస్మం (ప్రాయశ్చిత్త కర్మేషు సర్వదా" అనునవి ఆచార్య వాక్యములు, భస్మము ధరించకుండగా ప్రాయశ్చిత్త కర్మలను చేసిన యెడల సత్వర సత్ఫలితములు లభించగల అవకాశము తక్కువ.

## మోక్ష కార్యము - రక్షా :

మోక్షమును పొందుటకై చేయబడెడి కార్యములెల్లను మోక్షకార్యములే నిష్కామ కార్యములు చేసి, అంతః కరణ శుద్ధిని సాధించిన యెడల మోక్షము సుసాధ్యమగును.

"బంధాయ విషయాసక్తిర్ముక్తయే నిర్విషయం మనః" అనెడి దివ్యోక్తి ప్రకారము సాంసారిక విషయమాసక్తియే బంధనములకు కారణము విషయాభిలాష రాహిత్యమే ముక్తికి మూలము నిష్కామ కర్మయోగియే సాంసారిక విషయముల యెడల నభిలాష వీడి యుండగలడు. ఇతరుల కది సాధ్యమయ్యెడిది కాదు. అందుచేత నిష్కామ కార్యాచారణయే ముక్తియనబడుచున్నది. గీతాచార్యులును ఇట్టి భావమునే వెల్లడించిరి. "కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు" అనే వాక్కులు గమనార్హములు.

నిష్కామ కర్మలను చేయుటచే బంధనములు కలుగవని గ్రహించవలెను. కర్మలచే బంధింపబడని వాడు భగవంతునికిదగ్గరయగుచున్నాడు.

మోక్షకార్యములు చేయుసందర్భమున ధరించవలసిన విభూతి గురించి శ్రీ రేణుక భగవత్పాదులవారు, "మోక్షకార్యేషు రక్షా ప్రయోక్తవ్యా"

అని యుపదేశించిరి. ఈశానముఖమునుండి యుద్భవించిన సుమనా గోవు గోమయము చేత చేయబడెడి 'రక్షా'ను ధరించుట చేత వీరశైవుడు ముక్తి కాంతను అవలీలగా పొందగలడు.

ఈ రీతిన ప్రతియొక్కరు సద్గురునాదేశము ప్రకారము ఆయా కార్యముల నాచరించునప్పుడు ఆయా కార్యములకు సంబంధించిన విభూతిని ధరించి కృతార్థ సిద్ధిని బడయవలయును.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

దిll 24-8-1990

**స్థలం: శివానుభవ మంగళ భవనము - షోలాపురం**

## విశేష ప్రదీపిక:

శ్రీ కాశీ జ్ఞానసింహాసనాధీశ్వరులు చంద్రశేఖర శివాచార్యుల వారు పంచ విధ భస్మముల నేయే సందర్భములలో నుపయోగించ వలెనో యెంతో చక్కగా వివరించిరి. వీరశైవులకు విహితమయ్యెడి నిత్యనైమిత్తికముల గురించి శ్రీవారు తెలిపిన విషయము జ్ఞానదాయకములై యున్నవి.

నిత్య, నైమిత్తిక, ప్రాయశ్చిత్త మరియు మోక్షములనెడి పదములు నన్ని ధర్మములలో నుపయోగింపబడుచున్నవి. వీటికి యనేకమైన యర్థములు చెప్పబడుచున్నవి. చాలవరకు పూర్వమీమాంస పథమున గల యర్థములే లోకమున ప్రచారములోనున్నవి. తదితరమైన భావములు బహుళ ప్రచారమున లేవు. ఆయా ధర్మముల మౌళిక సూత్రముల నేపథ్యముననే నిత్య, నైమత్తిక మరియు ప్రాయశ్చిత్తముల గురించి తెలిసికొనవలెను. వీరశైవ ధర్మము ప్రకారము గనే మనమీ భావనను అర్థము చేసికొనవలెను.

శ్రీ భగవత్పాదులవారు నీ విషయమును స్పష్టము చేయుటకే కాబోలు "కార్యము" అనెడి శబ్దమును ప్రయోగించిరి.

కర్మ మరియు కార్యములు సమానార్థములుగా దోచినను, కొంచెము భేదముగలదు. విలియమ్స్ నిఘంటువు ప్రకారము కార్యమనగా చేయవలసినది. ధర్మము అనెడి అర్థము కూడ ఇవ్వబడినది. కార్యము చేయవలసిన ధర్మముగా తీసికొనుట వలన భావములో కొంత భేదము కన్పట్టును. నిత్య ధర్మము, నైమిత్తిక ధర్మము, ప్రాయిశ్చిత్త ధర్మములనెడివి దోచును. వీటిని వీరశైవ పరముగా పరిశీలించవలసి యున్నది.

వీరశైవుడు చేయవలసిన ధర్మములలో కొన్ని నిత్యములు, కొన్ని నైమిత్తికములు మరికొన్ని ప్రాయశ్చిత్తపరమైనవి. కాని యివి అన్నియును యీ దశలో నుపదేశింపబడునవి కావు. మున్ముందు నుపదేశింపబడెడి భక్తిమార్గ క్రియాస్థలము, చతుర్విధ సంపత్తి స్థలము, శీల సంపాదన స్థలము మొదలగు స్థలములలో విహితావిహతముల గురించి తెలుపబడినవి. భక్త స్థలమునలోనివి నుపయోగింపబడలేదు. కాన, నిత్యనైమిత్తి కాదులనగా నివియని గ్రహించుటకు వీలు కలుగదు.

పిండస్థలమునుండి భస్మధారణ స్థలము వరకు పయనించిన సాధకునికి యుపదేశించినవాటిలో నిత్య, నైమిత్తికములును, ప్రాయశ్చిత్త కార్యమును నెట్టివో తెలిసికొనవలెను. ఈ క్రింది వాటిని నిత్య కార్యములుగా స్వీకరించవచ్చును.

**(అ) గురుధ్యానము**
**(ఆ) శివధ్యానము**
**(ఇ) లింగధారణము**
**(ఈ) లింగపూజనము**
**(ఉ) స్వాధ్యయనము**

పై సందర్భములలో విభూతిని ధరించవలెనని చెప్పబడినది. బ్రహ్మముహూర్తమున లేచిన వెనువెంటనే, ముఖ ప్రక్షాళనము చేసికొని విభూతిని ధరించి, గురుధ్యానమును చేయవలెను. స్వగోత్రానికి సంబంధించిన జగద్గురువును స్తుతించిన పిదప, జగద్ గురువులను స్తుతించవలెను. ఆ పిదప తనకు దీక్షా సంస్కారమును చేసిన శివాచార్యుల వారిని మరియు స్థానిక గురు స్థలముననున్న మఠమయ్యను స్తుతించవలెను. గురుస్తుతిని చేసిన పిదప, గురుకారుణ్యము చేత సంపత్తిబడసిన భక్తుడు శివధ్యానమును చేయవలెను. స్నానాదులను ముగించిన పిదప యిష్టలింగార్చన చేయవలెను. ప్రాకృతులకు నిత్యకర్మలను చేయుటవలన విశేష ఫలము లభించదని తెలుపబడినది. విభూతి ధారణ ప్రభావము మూలమున నైశ్వర్య సిద్ధిగల్గును. ఐహిక, దైహిక, ఆముష్మిక ఐశ్వర్యములు సిద్ధించి సుఖమయము, శాంతిప్రదమైన జీవనము సంప్రాప్తమగును. జ్ఞానైశ్వర్యము కూడ లభించును.

నైమిత్తిక కార్యక్రమములలో గురువుగారి యాగమనమును గ్రహించవలెను. గురువుయొక్క అర్చనను నిత్యధర్మముగా చేసెడి వారి కమోఘమైన ఫలములు లభించును. కాని అయ్యది నేటి పరిస్థితులతో సాధ్యము కాదు. శ్రీ గురువు విచ్చేసిన సందర్భములలో గురువును సాదరముగ నాహ్వానము చేసి వారి పాదములను పూజించుటయే నైమిత్తికమని గ్రహించగలరు. శ్రీ గురువు జన్మదినోత్సవములను కూడా నెమిత్తకములుగా తీసికొనవచ్చును. లోకాచారము ప్రకారముగా కాని, కుటుంబపరంపరానుగతముగా కాని చేసికొనబడెడి పండుగ పబ్బములును నైమిత్తికములేయగును. ఈ సందర్భములలో కూడ శ్రీగురువును పిలిపించికొని పాదపూజలు చేసి పాదతీర్థ ప్రసాదములు స్వీకరించవలయును. ఈ సందర్భములో భసితమును పయోగించవలెను. భసితమును ధరించుటచే శివతత్త్వము ప్రకాశించునని శ్రీ భగవత్పాదుల వారు తెలిపిరి. భక్తుడు భావప్రకాశము యొక్క పరిణామ ఫలమున మంగళమయుడగుచున్నాడు. అంతరంగ బహిరంగములు పరిశుద్ధములగును. ముప్పదియారు తత్త్వములకు మూలముగా నుండెడి శివతత్త్వమును గూర్చి తెలికొనగల్గును. ఈ జ్ఞానము వలన ఆత్మజ్ఞానము గల్గును. నిత్యా నిత్యవివేకము పెరుగును. సంసారము లోని బంధముల నుండి విముక్తి లభించును. స్వామి భృత్య భావన బలపడును. ప్రత్యక్ష పరమేశ్వరుడైన శ్రీ గురువును సేవించాలనియు, తద్వారా ధన్యత బడయవలెననెడి కోరికయును దినదిన ప్రవర్ధమానమగుచుండును.

కామ్య కార్యముల విషయమున భక్తుడు భక్తినే కోరవలెను. శ్రీ అన్నమయ్య వారి యీ క్రింది పద్యములను గనుడి.

**సతివేడ్కం దన ప్రాణ వల్లభునితో సంయోగమర్థించుగా**
**కతనింబ్రార్థన సేసి సొమ్ము గొనిపోనట్టాడునే? భక్తుడీ**
**క్షితి నీ భక్తియ వేడుగాక మతి నీ శ్రీ పాదముల్గొల్చి కు**
**త్సిత కామ్యార్థము లెందు వేడుకొనునే చింతింప? సర్వేశ్వరా.** (సర్వేశ్వర శతకము పే. 45)

ఈ పద్యమున చెప్పబడిన "సంయోగ"మనెడి శబ్దము కీలకమైనదని గుర్తించవలెను ఈ శబ్దమునకు మూడర్థములు స్ఫురించును. అవి, శివయోగము, సతిపతి భావమున శివోపాసన చేయుచు శివానందము యొక్క అనుభోగము మరియు లింగాంగ సామరస్యము ఇవియే వీరశైవ ధర్మము యొక్క లక్ష్యములైయున్నవి. ఈ కారణము వలన భక్తుడు కుత్సితమైన కామ్యార్థములను కోరవలదు. ఇచ్చట, కుత్సితములనగా విషయోప భోగమునకు సంబంధించిన కోరికలు. అయితే నిత్య నైమిత్తకముల ఆచరించుట కొరకు వలయు పడి పదార్థములను కోరి కొనవచ్చును. అదియును తన కాయకము సఫలము కావలెనని మాత్రమే కోరికొనవలెను. తన్నిమిత్తమై యిష్టలింగమును మాత్రమే వేడికొనవలసియుండునని యింతకు క్రితమే తెలిసికొనియుంటిమి. ఈ సందర్భమున క్షారమును ధరించవలెనని గుర్తించగలరు. క్షారము వలన ఆపదలు వైదొలగిపోయి, విఘ్నవినాశనము జరుగును. విఘ్నవినాశనమును కోరుచూ వినాయకుని పూజించెడిది లోకాచారమే. వీరశైవాచారము కాదని గ్రహించగలరు. ఏదైనను కార్యమును చేపట్టి దాని ప్రాఫల్యమును వాంఛించినప్పుడు క్షారమును సర్వాంగముల యందున ధరించి విధిప్రకారముగా నిష్టలింగ పూజను చేసి లింగమునే వేడికొనిన, విఘ్నములు వైదొలగి కార్యసిద్ధి జరుగును.

నిత్య నైమిత్తిక కార్యములను చేయకుండిన దోషము సంప్రాప్తమగును. ఇట్టి దోషములు కాలాంతరములలో పాపములుగా పరిణమించెడి యవకాశము గలదు. లోకాచారము ననేక ప్రాయశ్చిత్తములు విధింపబడినది. నిషేధింపబడిన కార్యములు చేసినప్పుడు ప్రాయశ్చిత్తము చేసికొనవలెనని చెప్పబడినది. ఈ సందర్భమున భస్మమును ధరింపవలెనని చెప్పబడినది. వీరశైవునకు గురుపాద తీర్థసేవ యొక్కటియే ప్రాయశ్చిత్త విధియని గుర్తించవలెను. పాదతీర్థము యొక్క మహిమ మున్ముందు తెలుపబడును. భస్మమును ధరించి గురుపాద సేవ చేసి గురుకరుణను పొందినవానికి దురితములు హరింపబడునని తెలిసికొనగలరు. గురుద్రోహము, అనాచారమునకు పాల్పడుట మొదలగునవి దోషములని సర్వత్ర యెంచబడుచున్నవి. భస్మధారణ చేసికొని గురుకరుణను పాదతీర్థ రూపమున పొందవలెనని గ్రహించగలరు.

మోక్షమును కోరి తపస్సును చేయుటనెడిది లోకాచారమని పౌరాణిక గాథల వలన తెలియుచున్నది. కాయమును శుష్కింపజేసెడి తపశ్చర్యలను వీరశైవము నంగీకరించదు. గురుకారుణ్యమే మోక్ష హేతువని యెంచబడినది. ఈ విషయమును స్పష్టము చేసెడి శ్రీ అన్నమయ్యగారి పద్యమును గనుడి.

**అమరంగా గురుమంత్ర కార్ముకమునందాత్మాస్త్ర మష్టాంగ యో**
**గమహోముష్టి వివేకియేయుటయు దత్కాండం బజాండాది త**
**త్త్వములెల్లన్వడి గ్రుచ్చిపాఱి భవదుద్యత్ సూక్ష్మ కైవల్య ల**
**క్ష్యము నందద్భుత శక్తి తోడ గమియంగా నాటు సర్వేశ్వరా! ॥** (సర్వేశ్వర శతకము ప. 69)

గురుభక్తి సేయునప్పుడు రక్షను ధరించిన యెడల, ఆది దైవికములకు విఘ్నములు దూరమగును.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 5

శ్లో॥ భస్మోత్పాదన ముద్దిష్టం చతుర్థా తంత్రవేదిభిః
కల్పం చైవానుకల్పం చ ఉపకల్ప మకల్పకం॥ (సి.శి 7 - 12)

కల్పము, అనుకల్పము, ఉపకల్పము మరియు నకల్పమనేనవి భస్మతంత్ర విశారదుల చేత భస్మోత్పాదన కొరకై ఉద్దేశింపబడిన నాలుగు రకములైన విధులు

శ్లో॥ ఏషామాది ముత్కృష్ట మన్యత్సర్వమభావతః
యథా శాస్త్రోక్తవిధినా గృహిత్వా గోమయం నవం।
సద్యేన వామదేవేన కుర్యాత్పిండమనుత్తమం।
శోషయేత్పురుషేణైవ దహేద్ఘోరాచ్ఛివాగ్నినా
కల్పంతద్భస్మవిజ్ఞేయ మనుకల్ప మథోచ్యతే।
వనేషు గోమయం యచ్ఛ శుష్కం చూర్ణీకృతం తథా
దగ్ధం చైవానుకల్పాఖ్యమాపణాదిగతంతుయత్।
వస్త్రేణోత్తారితం భస్మ గోమూత్రా బద్ధ పిండకం
దగ్ధం ప్రాగుక్తవిధినా భవేద్భస్మోపకల్పకం।
అన్యైరాపాదితం భస్మ హకల్పమితికల్పితం॥ (సి.శి. 7:13-17)

ఈ నాల్గు విధములైన వాటిలో కల్పభస్మమే యుత్తమమైనది. ఇది లభించనిచో మిగిలినవాటిలో నేదో నొకదానిని స్వీకరించవలెను. సద్యోజాత మంత్రము చేత నూతనమైన గోమయమును పట్టికొని, వామదేవ మంత్ర పఠనము చేస్తూ వాటిని యుండలుగా చేసి, తత్పురుష, మంత్రమును పఠించుచు నా ఉండలను యెండబెట్టి అఘోర మంత్ర పఠనము చేస్తూ వాటిని కాల్చి, ఈశాన మంత్రమును పఠిస్తూ బిల్వపాత్రలలో సంగ్రహించవలెను. ఈ విధముగా తయారుచేయబడిన భస్మమును కల్పవిధిన చేయబడిన భస్మమని యందురు.

అరణ్యమునందున యెండిపడి యున్న పిడకలను సంగ్రహించి, వాటిని చూర్ణముగా చేసి, పై సూచించిన విధిన కాల్చి తయారుచేయబడెడి భస్మమును ననుకల్పభస్మమని యందురు. అంగడియందు లభించెడి భస్మమును తెచ్చి, చూర్ణమును చేసి, దానిలో గో మూత్రమును కలిపి, ఉండలుగా చేసి, ఆ ఉండలను శివాగ్నిలో దగ్ధమొనర్చి సంగ్రహించిన భస్మమును ఉపకల్పన భస్మమని యందురు. మంత్రజ్ఞాన శూన్యముగా చేయబడెడి భస్మము అకల్ప భస్మమగును.

## భస్మ నిర్మాణ విధి :

శ్రీ రేణుకాచార్యులవారు ఇనితవరకు సదాశివుని పంచవదనము నుండి యుద్భవించిన నందాది గోవుల మహిమాదులను, వాటి గోమయముల యొక్క లక్షణాదులను వివరించిరి. ఇప్పుడు భస్మమును సిద్ధపరచెడి కల్ప, అనుకల్ప, జకల్ప, లికల్పములనెడి విధులను వివరించిరి. అద్దాని గురించి సమస్త్యముగా తెలిసికొనెదము గాక.

## 1. కల్ప భస్మము

"కల్పః శాస్త్రే విధౌన్యాయే" అని చెప్పెడి మేదినీ కోశము ప్రకారము కల్పమనగా వేదము యొక్క షడంగములోని శాస్త్రము, న్యాయము మరియు పద్ధతియని యెరుంగవలెను. ప్రకృతమున కల్పమనగా నియమావళి యనెడి అర్థము. భస్మ నిర్మాణమును గూర్చి విధింపబడిన నియమములే కల్పము. ఈ నియమములు గోమయ గ్రహణ, పిండీకరణ, శోషణ, దహన మరియు సంగ్రహణ యనెడి ప్రక్రియల పద్ధతులను నిర్దేశించును నియమ బద్ధముగా నుండెడి పద్ధతి గూర్చి పరిశీలింతుము గాక.

## గోమయ గ్రహణ

గోమయమును సంగ్రహించెడి వాడు శుచిర్భూతుడై యుండవలెనని చెప్పబడిన గోమయ గ్రహణ పద్ధతిని వివరించుచుయీ యుపనిషద్వాణిని గనుడిః

**శ్లో॥ ఉపోష్య చ చతుర్దశ్యాం శుక్లే కృష్ణేథవా వ్రతీ।**
**పరేద్యుః ప్రాతరుద్ధాయశుచిర్భూత్వాసమాహితః॥**
**కృతస్నానః ధౌతవస్త్రః పయోర్ధ్వంచ సృజీచ్చగాం॥** (బృహజ్జా ఉ. 3-4 5)

ఈ ఉపనిషదుక్తి ప్రకారము శుక్ల లేదా కృష్ణ పక్షమిలోని చతుర్దశి తిథియందున, శివునిలో నుపవసించి, సాధకుడు శుచిర్భూతుడు కావలెను. గోవుకు స్నానము చేయించి మంత్రము చేత సంస్కరింపబడిన గడ్డిని మరియు నీటిని ఆ గోవు చేత త్రాగించవలెను. తదుపరి దినమున తెల్లవారగానే లేచి శుచిర్భూతుడై పరిశుభ్రమైన వస్త్రములను ధరించుకొని, ఆవు దగ్గరకు వెడలి, దూడను దాని దగ్గరకు చేర్చవలెను. దూడ పాలను త్రాగేటప్పుడు గోమయమును నేల మీద పడకుండగా గ్రహించవలెను. ఈ సందర్భమున సద్యోజాత మంత్రమును పఠించుచుండవలెను.

దీనికంటెను పూర్వమే కొన్ని జాగ్రత్తలు గైకొనవలసి యుండును. సల్లక్షణ సమన్వితమైన సద్గోవునే యెంపిక చేసికొనవలెను. ఈ విషయమున నుపనిషద్వాణి యీ క్రింది విధముగా నున్నది.

**శ్లో॥ వికటాంగమున్మత్తాం మహాఖలాం మలినామశివాది చిహ్నాన్వితాం**
**పునర్ధేనుం కృషాగాం వత్సహీనా మశాంతామదుగ్ధదోహనీం**
**నిరింద్రియాం జగ్ధతృణాం కేశచేలాస్థిభక్షిణీం సంధినీం**
**నవ ప్రసూతాం రోగార్తాంగాం విహాయ ప్రశస్తగోమయ**
**మాహరేద్గోమయం॥** (బృహజ్జా. ఉ. 3-1)

అంగహీనమైనదియును, మదోన్మత్తమైనదియును, పోరాడు స్వభావముగలదియును, మలిన సహితయును, అశుభ చిహ్నాములు గలదియును, కృషించినదియును, దూడలేనిదియును, ప్రశాంతమైన మనస్సులేనిదియును, గొడ్డుదినయును, నేత్రాదింద్రియములు లేనిదియును, గడ్డిని తినజాలనిదియును, వెంట్రుకలు పాతబట్టలు మొదలగు అశుద్ధ పదార్థములను తినెడిదియును, నానా విధమైన రోగములు చేత బాధను పొందెడిదియును, అప్పుడప్పుడే దూడను కనినదియును అగు గోవులను విడిచి ప్రశస్తమైన గోవుల గోమయమునే గ్రహించవలెను.

శ్రీ రేణుక భగవత్పాదులవారు గోమయ గ్రహణను గూర్చి తెలుపుచు "యథాశాస్త్రోక్త విధినా" అని ఆదేశించిరి. శాస్త్ర సమ్మతమైన విధిన గోమయమును గ్రహించవలెనని చెప్పిరి.

## పిండీకరణము :

గోమయమును ఉండలుగా చేయు ప్రక్రియనే పిండీకరణమని యందురు. ఈ ప్రక్రియను యాంత్రికముగా చేయుటయనెడిది "నకర్తవ్యం" అని చెప్పబడినది. పిండీకరణము మంత్ర పూర్వకముగా చేయవలెననెడి నియమమొకటి కలదు. "వామదేవేన కుర్యాత్ పిండమని యాచార్యులవారు నాదేశమునిచ్చిరి. ఆ విధివనే వామదేవ బ్రహ్మమంత్రమును పఠించుచు గోమయము యొక్క చిన్న చిన్న ఉండలను చేయవలెను.

## శోషణము :

గోమయపు ఉండలు ఎండుటకై యొక పరిశుద్ధమైన ప్రదేశమున పెట్టవలెను. అవి యెండునప్పుడు పఠించవలసిన మంత్ర మెట్టిదో ఆచార్యులవారు సెలవిచ్చిరి. "తత్పురుపేణ శోషయేత్" అనెడిది వారి ఆదేశము తత్పురుష బ్రహ్మమును పఠిస్తూ ఉండలను ఎండబెట్టవలెననెడిది ఆచార్యులవారి ఆదేశములోని భావము.

## దహనము :

దహనమునొక సంస్కార ప్రక్రియగా తీసికొనవలెను. గోమయమును సంస్కరించి తద్వారా దాని గుణమును ద్విగుణీకృతము చేయుటయే దహనప్రక్రియ యొక్క లక్ష్యము.

ఎండబెట్టబడిన వాటిని కుప్పగా చేర్చి గోమయ లేపనము చేయబడిన, మూకుడులో నుంచవలెను. ఉండలుంచబడిన మూకుడును పూజాదులతో సంస్కరించి, పుటము పెట్టి భస్మీకరణ చేయవలెను. భస్మీకరణ జరుగునప్పుడు అఘోరబ్రహ్మ మంత్రమును పఠించవలెను.

## సంగ్రహణ :

శాస్త్రోక్త విధి ప్రకారము దగ్ధము చేయబడిన పిండముల నుండి వెలువడిన విభూతిని బిల్వకాష్ఠము చేయబడిన పాత్రలతో సంగ్రహించుటయనేది యుత్తమమైన మార్గము. అది సాధ్యముకానియెడల స్వర్ణరజితాది పాత్రలలో సేకరించి భద్రముగా నుంచుకొనవలెను. సేకరణ సమయమున యీశాన మంత్రమును పఠించుచుండవలెను.

ఈ విధముగా, భక్తిశ్రద్ధలతో చేయబడెడి విభూతిని కల్ప భస్మమని యందురు. పద్ధతినతిక్రమించినను, భక్తిశ్రద్ధలు లోపించినను ఈ కల్ప భస్మ తన సామర్థ్యమును కోల్పోవును. శాస్త్రోక్త విధిన కల్ప భస్మములో నపారమైన సామర్థ్యము యిమిడి యుండునని వేరుగా చెప్పనవశ్యకత లేదు.

## అనుకల్ప భస్మము :

అడవిలో పడి యుండెడి యేరు పిడకలను గైకొని వచ్చి వాటినిచూర్ణము చేసి, ఆ చూర్ణమును పుటము పెట్టి భస్మము చేసి సంగ్రహించుట చేత అనుకల్ప భస్మమగును. దీనిని చేయునప్పుడు రెండే రెండు శాస్త్రోక్త ప్రక్రియలు చేపట్టబడుచున్నవి. అవి. దహనము మరియు సంగ్రహణ ఈ సందర్భములో క్రమముగా అఘోర బ్రహ్మమంత్రమును మరియు ఈశాన బ్రహ్మ మంత్రము మాత్రమే పఠింపవలయును. మిగిలిన పంచబ్రహ్మ మంత్రములు నుపయోగింపబడుట లుప్తమగును. అందుచేత, యిది కల్పభస్మము వంటి సామర్థ్యము గలది కాదు. దీనికి కాల్చి భస్మము కంటెను తరువాయి స్థానముల లభించుచున్నది.

## ఉపకల్ప భస్మము :

ఈ భస్మములో గోమయమును నుపయోగించరు. బజారులో లభ్యమయ్యెడి భస్మములను గొన తెచ్చి చూర్ణముగా చేయుదురు దానిని వడిగట్టి, మలినమును దూరము చేయవలెను. దూడపాలను కుడిచెడి సమయమును గోమూత్రమును సంగ్రహించి, ఆ గోమూత్రము చూర్ణములో కలిపి ఉండలను తయారుచేసికొనవలెను. ఆ పిదప పుటము పెట్టి భస్మమును పొందవలెను. పుటము పెట్టినప్పుడు భస్మమును పాత్రలోనికి గైకొనునప్పుడు ఈశాన బ్రహ్మ మంత్రమును చదువవలెను. సంస్కార పద్ధతి గుణాత్మకముగా లేనందున దీనికి తృతీయ స్థానము యివ్వబడినది.

## అకల్ప భస్మము :

"అనైరాపాది తం భస్మా అకల్ప మితి కల్పితం" యనెడి జగద్గురువు రేణుకా భగవత్పాదుల ఉపదేశము ప్రకారము మంత్ర జ్ఞానశూన్యులైన సామాన్య వ్యక్తులు ఏదో ఒక విధముగా తయారుచేసిన భస్మమే అకల్ప భస్మము. ఈ భస్మమునకు మంత్ర సంస్కారముండనందున చతుర్ధ (అధమ) స్థానమివ్వనైనది. విధిలేనిస్థితిలో తప్ప దీనిని ఉపయోగించరాదు.

ఈ నాల్గు విధులైన భస్మములందు కల్ప భస్మమే శ్రేష్ఠాతి శ్రేష్టము దీని నుపయోగించి చేసేడి యిష్టలింగపూజార్చనాదులు మహత్వపూర్ణమైన ఫలములొసంగును. ఇది లభ్యము కానియెడల అనుకల్ప భస్మమును, లేదా ఉపకల్ప భస్మమును నుపయోగించుట శ్రేయస్కరమగును.

ప్రతియొక్క వీరశైవుడు గమనించదగిన విషయమేమనగా తానే స్వయముగా తయారుచేసికొనిన భస్మమే శ్రేష్టతమమని గ్రహించవలెను. ప్రపంచములోని అనేక వ్యవహారములను మనమే స్వయముగా చేసుకొనుచున్నందు వలన గరిష్ట ఫలితములు లభించునని ఎల్లరకు తెలిసిన విషయమే గదా? ఇతరుల మీద ఆధారపడి యుండిన యెడల నష్టము వాటిల్లునని వేరుగా చెప్పనక్కరలేదు. 'మట్టికైనను ఇంటివాడుండవలెననెడి లోకోక్తి' మనకందరకు విదితమే కదా! అదేవిధముగా పరిశుద్ధమైన భస్మమును తయారుచేయుటలో మనము శ్రద్ధగైకొనిన యెడల తయారయ్యేడి భస్మము శీఘ్ర ఫలకారి కాగలదు. ఈ సందర్భమున మరొక విషయమున కూడగమనించవలసియున్నది. అంగట్లో లభించే భస్మములు ఎక్కువగా భవి జనులు చేసినవే కదా! వారిని వీరశైవులుపయోగించుటలో ధార్మిక సంబంధమైన బాదకములుండును.

ఈ నాలుగు విధములైన భస్మములలో ఏదో ఒకటి ఉపయోగించెడి సందర్భమున ఆయా భస్మములను సద్గురువులచేత పునః శుద్ధి చేయించుకొనవలెను. అప్పుడు గాని దానిని ధరించుటకు వీలుకాదు. గురువుల యొక్క పవిత్ర హస్త స్పర్శ, వారి పాదోదక ప్రోక్షణ మరియు వారి చేత జరుపబడెడి మంత్ర సంస్కారముల యొక్క ఉమ్మడి ఫలితముగా భస్మము ఎన్నో రెట్లు పవిత్రతను సంతరించుకొని సకల విధములైన దోషములను పరిహరించెడి సామర్థ్యమును పొందును. ఈ సందర్భము క్రయా విభూతి గురించి తెలిసికొనవలసి యున్నది. గురు, జంగముల వలన లభించెడి పాదోదకములను రెండు విధములుగా విభజింపవచ్చును. మొదటిది ధూళి పాదోదకము. రెండవది క్రియాపాదోదకము. ధూళి పాదోదకముతో పునీతము చేయబడిన భస్మము వీరశైవులెల్లరుకు విహితమై యున్నది. ఆ విధముగా సంస్కరించబడని విభూతిని ధరించవలదను నిషేధము కలదు. ఇక క్రియా పాదోదకమనెడిది శాస్త్ర రీత్య గురుపాదములకు సకల విధములైన అర్చనలు చేసిన పిదప వారియను గ్రహఫలముగా పొందెడి దివ్యమైన తీర్థము. దీనికి సాటి లేదు. శివపాదోదకమైనను గురుపాదోదకము కంటె మిన్న కాదు. ఇట్టి క్రియా పాదోదకములో తడిసిన విభూతిని పూజించి దేవుని కట్టమీద గాని లేదా పవిత్ర స్తలమునందు నుంచుకొనవలయును. ఈ విభూతినుపయోగించడము మూలమున, సకల విధములైన దోషములు దరికి చేరవు. ప్రచండమైన మారుతము వీచినపుడు దూది పింజలలాంటి దోషములు నిలుచునా?

ఈ కారణము వలన ప్రతి యొక్క వీరశైవుడు పలు విధములైనవిభూతుల యొక్క విశిష్టతను గుర్తించి వాటిని శాస్త్రపద్ధతిలో సిద్ధపరచుకొని, గురు, జంగముల కరుణ వలన పునీతము చేసికొని ఆయా విభూతులను ఆయా సందర్భములలో ధరించి ధన్యతను బడయుదురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

భస్మధారణయనెడిది ప్రాచీన కాలమునుండియును పరంపరానుగతముగా పాటింపబడుచున్నది. ఊర్ధ్వపుండ్రధారణ, కుంకుమ చందనధారణలు నంతప్రాచీనమైన యాచరణలు కావు. స్మార్తులు కుంకుమధారణను ప్రచారములోనికి తీసికొనివచ్చిరి. వీరు శంకరాచార్యులవారి యనుయాయులు. రామానుజాచార్యులు నూర్ధ్వపుండ్రముల కాధికత్యను చేకూర్చిరి. గంధము ధరించుకొని భోగన్ముఖత గలవారు ప్రాచుర్యములోనికి తెచ్చిరి. వేదకాలములో యజ్ఞయాగాదుల వలన లభ్యమయ్యెడి దానిని ధరించెడివారని తెలియుచున్నది. శ్రీ మత్ సోమనాథ భాష్యములో నివ్వబడిన యీ క్రింది ప్రమాణమునుగనుడి.

**"త్రైపర్ణికానా మగ్నిహోత్రాగ్నిజం...।**
**సర్వేణాం దేవాలయే స్థితమతి"** (శ్రీమత్సోమనాథభాష్యము, ద్వి.ప్ర)

వామాచారమును పాటించెడివారు రుద్రభూమిలోన లభ్యమయ్యెడి చితాభస్మమును ధరించెడివారని తెలియుచున్నది. శ్రీ విద్యావాచస్పతుల వారును నిద్దాని మహిమను నభివ్యక్తము చేసెడి కథనొకదానిని వివరించిరి. "అన్వేషాం దావానల సముద్భవం" అనెడి సోమనాథుని భాష్యవచనము ప్రకారము, దావానలము నుండి లభించెడి బూడిదను ధరించెడి సాంప్రదాయముండెడిది. దావానలమనగా నడవిలో పుట్టెడిచిచ్చు. "బ్రహ్మచారిణాం సవింధాగ్నిజమ్" అనెడి శ్రుతివచనము ప్రకారము పుడకల వలన లభించెడి బూడిదను భస్మముగా ధరించెడివారని తెలియుచున్నది. పొయ్యిలోని బూడిదను భస్మముగా ధరించెడి సాంప్రదాయమొకటి గలదనియు తెలియుచున్నది. శ్రీ బసవేశ్వరులవారి యీ క్రింది వచనమును గనుడి.

**ఒలెయ బూదియ బిలయలు బేడ**
**ఒలి దందె హూసి కొండిప్పుడు**
**హూసి ఏనుఫల, మనదల్లి లేసిల్ల దన్నక్క?**

**ఒందనాద హోగి ఒంబిత్త నాదువ డింభకరమెచ్చ**
**నమ్మకూడల సంగమ దేవ!** (బసవేశ్వరవ. 114)

బసవపురాణములో, పొయ్యిలోని బూడిదను విభూతిగ దాల్చెడి యాచారమునకు దృష్టాంతములు లభించుచున్నవి. ఈ క్రింది ద్విపదలను గమనించుడి.

**బడచితే నీర దూ పొడిచి బొట్టిదును**
**మడది యంగుష్టంబు మన్నింత మెదిచి**
**కడవనంటినయట్టి పిడుక విభూతి**
**యడర బుత్రుని నొసలారంగ బూయు"** (బసవ పురాణము, తృ.ఆ)

ఇది యిట్టులుండగా, విభూతి సంపాదన విధిని వివరించుచుచు, శ్రీ సోమనాథులవారు విరజానలము వలన గల్గెడివిభూతి సంపాదన క్రమమును వివరించిరి. ఈ క్రమము శ్రీ భగవత్పాదులవారు బోధించిన కల్పక్రమమును పోలియున్నది. శివాగ్నికి బదులుగా రుద్రాగ్నిని గూర్చి తెలుపబడినది గమనించుడి.

**"తేషాంచిరజానలజం వక్ష్యే।**
**అగ్నౌజ్వాలా వృతం రుద్రవహ్నిమండుమధ్యగం।**
**ధ్యాయేత కళాదళయుతం।**
**శక్తిస్వస్తిక ధారిణం। ఇది రుద్రాగ్నిం సంచిత్య ॥** (సోమనాథ భాష్యము, ద్విప్ర.)

శ్రీ చంద్రశేఖర జగ్ద్గురువులవారు సూచించిన విధముగనే గోమయమును సేకరించు విధి చెప్పబడినది. మిగిలిన విధి విధానము నీ క్రింది విధిన నివ్వబడినది.

**".... ప్రశస్త గోమయమాదాయ। ఈశ**
**తత్పురుష సద్యోజాతాద్వైరుత్పత్తి స్థితి**
**సంహార భేదై గ్రహణ కబళన శోషణ**
**దహన శోధనాది క్రమేణ పంచప్రణవ**
**పంచబీజైస్సహ పంచమంత్రై ర్విభూత్యాదీన్**
**సంపాద్య। సుదృఢతరమ్యతాళిత ప్రోక్షిత**
**చూతబిల్వా శోకదారుమయ పాతే**
**శిలామయ పాత్రే, వాధనత్రయ్యంగ్రహేదితి" ॥** (సోమనాథ, భాష్యము, ద్వి.ప్ర)

అయితే భక్త స్థలములోని సాధకునికి భస్మసంపాదన విషయములో గల కర్తవ్యమెట్టిది యనెడి సందేహమేర్పడును. ఈ సందర్భమున సాధ్యాసాధ్యముల విచారణకెంతయో ప్రాముఖ్యత గలదు. కాలక్రమములో భస్మమును సంపాదించుట యనెడి కార్యమును నైష్ఠికుడు మాత్రమే చేయగలడు. శ్రద్ధాభక్తియే లక్షణముగా గల భక్తస్థలమున నయ్యది సుసాధ్యము కాదు. అంతేకాదు నేటి దేశకాలమానపరిస్థితిలో నట్టి సంపాదనప్రక్రియను చేపట్టుటలో పెక్కు అవరోధములు గలవు. ఈ కారణమున యెయ్యది సాధ్యమగునో నట్టి దానిని మాత్రమే సంపాదించుట యుత్తమము. వాస్తవముగా చూసిన యెడల "భక్తి భావమే ముఖ్యము. అద్దానిని పెంపొందించుటకే భస్మము సాధనముగా నుపకరించుచున్నది. భక్తి పక్వదశకు వచ్చినదానికి అంతర్భస్మధారణయే విహితమని తెలిసికొంటిమి. ఆ దశకు చేరిన వానికి కలోపకల్పముల భేదభావముండదు. కాని భక్తి పెంపొందించికొనని దశలో సాధనముల శ్రేష్ఠత యెంతో కీలకమైన పాత్రను పోషించును. అయితే, వీరశైవ సిద్ధాంతము ననుసరించి గురువే సర్వస్వము. గురుకరుణ వలన భక్తి దృఢపడును. అందుచేత గురుకరుణ రూపమైన గురుపాదోదకముచేత గాని, గురుదత్తమైన లింగపాదోదకముచేత నైనను గాని పునీతమైన భస్మమే శ్రేష్ఠాతి శ్రేష్ఠమైనదని గుర్తించవలెను. శ్రీ గురువు క్రియాపాదోదకము చేత పునీతమైన దానిని యుత్తమమైన భస్మముగా. ధూళి పాదోదము చేత పునీతమైన భస్మమును మధ్యమముగా. లింగోదకము చేత పునీతమైన భస్మమును సామాన్యదానిగా స్వీకరించవచ్చును. అదేవిధిన జగద్గురుపాదోదకముచేత పునీతమైన భస్మము శ్రేష్ఠమమైనది. శివాచార్యులవారి పాదోదకము చేతి పునీతమైనది శ్రేష్ఠతరమైనది. మఠమయ్య పాదోదకముచేత పునీతమైన భస్మము శ్రేష్ఠమైనది.

పిండస్థలమునుండి భక్తస్థలమునకు చేరిన భక్తుడు తన శక్తిమేరకు నెయ్యది సాధ్యమో, నట్టి భస్మమును సంపాదించికొని ధరించవలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 6

శ్లో॥ ఏష్వేక తనుమాదాయ పాత్రేషు కలశాదిషు।
త్రిసంధ్య మాచరేత్ స్నానం యథాసంభవ మేవవా। (సి.శి 7 - 18)

క్రితయాశీర్వచనమున చెప్పిన యటుల విభిన్నమైన పాత్రల యందున సంగ్రహించి పెట్టబడిన భస్మమును తీసికొని, త్రికాలముల యందునను లేదా తనకు అనుకూలమైనన్నిమార్లు భస్మ స్నానమును చేయవలెను.

శ్లో॥ స్నానకాలే కరౌ పాదౌ ప్రక్షాల్య విమలాంభసా ।
వామహస్తతలే భస్మక్షిప్త్వా చ్ఛాద్యాన్య పాణినా
అష్టకృత్వాథ మూలేన మౌనీ భస్మాభిమంత్ర్యచ ।
శిరఈశాన మంత్రేణ తత్పురుషేణ ముఖం తథా
హృత్ప్రదేశమఘోరేణ వామదేవేన గుహ్యకం ।
పాదౌ సద్యేన సర్వాంగం ప్రణవేనైవ సేచయేత్ ॥ (సి.శి. 7-19.21)

భస్మ స్నానమును చేయుటకు ముందు కాళ్ళు, చేతులను కడిగికొని, ఎడమ అరచేతియందున భస్మమును పెట్టుకొని కుడి అరచేతితో దానిని ముయ్యవలెను. ఈ విధిన రెండు అరచేతుల చేత మూయబడిన భస్మమును కుడి తొడమీద ఉంచికొని మౌనముగ ఎనిమిది మార్లు పంచాక్షరీ మంత్రము చేత అభిమంత్రించవలెను. తదనంతరం ఈశాన మంత్రము చేత శిరస్సును, తత్పురుష, మంత్రము చేత ముఖమును, అఘోర మంత్రము చేత హృదయమును, వామదేవ మంత్రము చేత నాభి క్రింది భాగమునను (గుహ్యప్రదేశము), సద్యోజాత మంత్రము చేత పాదములను, ప్రణవము చేత సర్వాంగములను ప్రోక్షించి కొనవలెను.

శ్లో॥ భస్మనా విహితం స్నాన మిద మాగ్నేయముత్తమమ్।
స్నానేషు వారుణాద్యేషు ముఖ్య మేతన్మలాపహం ॥ (సి.శి. 7-22)

ఈ భస్మస్నానము చేత సకల దోషములు భస్మమగుటచేత, జలాది సప్త విధ స్నానము కంటెను ఇది ఉత్తమమైయున్నది.

శ్లో॥ భస్మస్నావతాం పుంసాం మథాయోగం దినే దినే।
వారుణాద్వైరలం స్నానైర్బాహ్యదోషాపహారిభిః (సి.శి. 7 - 23)

బాహ్యాంభ్యంతర దోషములు రెండును దూరము చేసెడి జ్ఞాన సాధనమైన భస్మస్నానమును శాస్త్రోక్త విధి ప్రకారము ప్రతిదినము ఎవరు చేయుదురో వారికి కేవలము బాహ్య దోషములను మాత్రమే నివారించెడి భస్మము వలన నెట్టి ప్రయోజనము ఉండదు.

శ్లో॥ ఆగ్నేయం భస్మనాస్నానం యతిభిస్తు విధీయతే
ఆర్ద్రస్నానాత్పరం భస్మ ఆర్ద్రే జంతువధో ధ్రువం॥ (సి.శి. 7-24)

యతులు ఆగ్నేయ స్నానమైన భస్మస్నానమునే చేయుదురు. జలాది ఆర్ద్రస్నానము నందున జలచరములగు జీవులు వధింపబడుట చేత దాని కంటెను భస్మస్నానమే ఉత్తమమైనది.

శ్లో॥ ఆర్ద్రంతు ప్రకృతిం విద్యాత్ ప్రకృతిం బంధనంవిదుః।
ప్రకృతేస్తు ప్రహాణార్థం భస్మనాస్నానమిష్యతే॥ (సి.శి. 7-25)

ఆర్ద్రమనెడిది ప్రకృతి. ప్రకృతి బధనకారియైనందున దాని వినాశనమునకై భస్మస్నానము విహితమై యున్నది.

శ్లో॥ బ్రహ్మాద్యా విబుధాః సర్వేమునయోః నారదాదయః।
యోగినః సనకాద్యాశ్చ బాణాద్యా దానవా అపి॥

**భస్మస్నాగతాః సర్వే శివభక్తిపరాయణాః।**
**నిర్ముక్త దోషకలిలానిత్య శుద్ధాభవంతి హి॥** (సి.శి. 7-26.27)

బ్రహ్మాది దేవతలు, నారదాది మునులు, సనకాది యోగులు, మరియు బాణాది దానవులు భస్మ స్నాన నిష్ఠ గలవారునై శివభక్తి పరాయణులై, సకల దోషముల నుండి విముక్తులై పరిశుద్ధులగుదురు.

**భస్మధారణ వ్రతము:**

భస్మోత్పాదన యొక్క విధులను ఉపదేశించిన పిదప శ్రీ పూజ్యులైన శ్రీ జగద్గురు రేణుకాచార్య భగవత్పాదుల వారు ఇప్పుడు భస్మ స్నాన మహత్యమును తెలియజేయు చున్నారు.

పూజ్యులు ఉపదేశించిన యీ భస్మధారణ విధి యందున ముఖ్యముగా భస్మస్నానము, భస్మోద్ధూలనము మరియు భస్మ త్రిపుండ్రధారణములనెడి మూడు విధములగు విషయములు గలవు. వీటి గూర్చి మన ప్రాచీన వాఙ్మయమైన వేదాగమోపనిషత్పురాణాదులలోన యెన్నియో ప్రమాణములు గలవు. భస్మధారణ విధిని నిరూపించుట కంటె ముందున, భస్మధారణ వ్రతము గూర్చి తెలిసికొనెదము.

భస్మధారణ యనెడిది వీరశైవుల యిష్టలింగ పూజావ్రతము యొక్క మహత్య పూర్ణమైన యంతర్భాగము. అన్య సిద్ధాంతములందున యిదొక స్వతంత్రమైన వ్రతముగా పరిగణింపబడినది. దీనిని పాశుపత వ్రతమనియు అందురు.

ఏ వ్రతమునకైననూ ఒక కాలపరిమితి విధించబడి యుండును. భస్మధారణకు సంబంధించిన వ్రతమునకు గల కాలపరిమితిని గూర్చి వాయవేయసంహిత కొన్ని వివరముల నిచ్చినది. వీటిని శ్రీ నీలకంఠవాచార్యులవారు, క్రియాసారమున పొందుపరిచిరి. ఆ ప్రమాణములను గనుడి!

**శ్లో॥ యావచ్ఛరీర పాతమ్ వంద్యాదశాబ్దమథాపివా**
**తదర్థ వాతదిర్థంవా మాసమైకం తథాపివా**
**దినద్వాదశకం వాథ వ్రతసంకల్పనావధి ॥** (క్రియాసారము, ఉపదేశము 6, పుట 25)

ఈ ప్రమాణములోని కాలవ్యవధి యీ క్రింది విధముగ నున్నది. (1) శరీరము పతనమైనంత వరకు, (2) పన్నెండు వర్షములు (3) ఆరు వర్షములు (4) మూడు వర్షములు (5) ఒక నెల (6) పన్నెండు దినములు.

ఈ కాలపరిమితులలో నేదియో యొకదానిని తమ శక్త్యానుసారముగా యెంపిక చేసికొని, తన్నిమిత్తమై శాస్త్రోక్తముగా సంకల్పమును చేసికొనవలెను. ఆ కాలపరిమితి మేరకు భస్మమును ధరించి, అది మేనున కనిపించే విధిన వర్తించుటే యీ వ్రతపాలనలోని కర్తవ్యపరమైన యంశము. కాల పరిమితి ముగియగానే, వ్రతము సంపన్నమగుచున్నది.

వీరశైవులు భస్మధారణకు సంబంధించిన ఆజన్మ వ్రతమును పరిపాలింతురు. లింగధారణను విధి ప్రకారముగా ధరించి, నయ్యది కన్పట్టె విధిన సంచరించిన యటులే, భస్మము అందరకూ కనిపించే విధిగా ధరింతురు. ఇట్టి వారు అసంఖ్యాకులుగా కలరు. ధర్మమునకు చెందిన లాంఛనమును ధరించుటకై లజ్జను పొందెడివాడు ధార్మికుడు ఎట్టులగును? అందుచేత ప్రతి వీరశైవుడు భస్మధారణను ఆజన్మ వ్రతముగా పరిపాలించవలెను. భస్మాలంకృత ఫాలభాగులై ప్రసన్న వదనముతో దర్శనమిస్తూ అన్యులకు మార్గదర్శకులగుచు లోకమున చరించవలెను.

## భస్మధారణ విధి:

స్నానము చేత శుచిర్భూతుడైన వీరశైవుడు పూజాగృహములోనికి ప్రవేశించి, ఆసనమునకు మధ్యన ప్రణవమును వ్రాసి, అద్దానికి నమస్కారమును చేసి పూర్వాభిముఖుడుగా కాని, ఉత్తరాభిముఖుడుగా కాని, పద్మాసనమునగాని సుఖాసనమున గాని కూర్చుండి, సంకల్పాదులను చేయవలెను.

## సంకల్పము :

అస్యశ్రీ భస్మధారణ మహామంత్రస్య పిప్పలాద ఋషిః (శిరసి)। దేవీగాయత్రి ఛందః (ముఖే)।
కాలాగ్నిరుద్రో దేవతా (హృదయే)। అగ్నిరితి బీజం (నాభౌ)। భస్మేతిశక్తిః (ఆధారే)। శివఇతి
కీలకం (పాదయోః)। మమదేహే సదూర్మ్యాది షడ్వికార విపృత్యర్థం, షట్స్థల బ్రహ్మ నిర్మాణ
సుఖ సంపద ప్రాప్తయే చ, భస్మస్నానోద్ధూలన ధారణాని కరిష్యే॥

## న్యాసము-కరన్యాసము :

కాలాయనమః – అంగుష్టాభ్యాం నమః
కలవికరణాయ నమః –తర్జనీభ్యాం నమః
బలవికరణాయనమః – మధ్యమాభ్యాం నమః
బలప్రమథనాయనమః – అనామికాభ్యాం నమః
సర్వభూతదమనాయనమః – కనిష్ఠకాభ్యాం నమః

## అంగన్యాసము :

కాలాయనమః – హృదయాయనమః
కలవికరణాయనమః – శిరసే స్వాహా
బలవికరణాయ నమః – శిఖాయై వషట్
బలప్రమథనాయనమః – కవచాయ హుం
సర్వభూత దమనాయ నమః – నేత్రతయాయ వౌషట్
మనోన్మనాయ నమః – అస్త్రోయఫట్
ఓం భూర్భువాస్సువారోమితి దిగ్బంధః॥

## దానం :

**అగ్నేర్వీర్య మహావీర్యం భువో వీర్యం తదైవచ ।**
**సర్వేషాం జోతిషాం వీర్యం భస్మరక్షతుసర్వదా।**
**భస్మజ్యోతిః స్వరూపాయ శివాయపరమాత్మనే**
**షట్త్రింశత్తత్య బీజాయ నమః శాంతాయ తేజసే॥**

అనంతరము సప్త స్నానములలో శ్రేష్ఠమైన దగు భస్మ స్నానమును చేయవలెను. ఈ సందర్భమున సప్త స్నానములగురించి తెలిసికొనుట యెంతో అవసరము.

## సప్త స్నానములు :

ధర్మశాస్త్రము నందున దైహిక మరియు మానసిక పరిశుద్ధికై కాలోచితములైన మంత్ర స్నానము, భౌమ స్నానము, ఆగ్నేయ స్నానము, వాయవ్య స్నానము, దివ్యస్నానము, వారుణ్యస్నానము మరియు మానస స్నానములనెడివి ప్రతిపాదింపబడినవి. ఇవియే సప్తస్నానములు.

## మంత్ర స్నానము :

మంత్ర పురస్సరముగా చేయునదే మంత్ర స్నానము. ఈ స్నానమువీ చేయునప్పుడు తన ధర్మమునకు చెందిన లేదా తనయిష్టదైవమునకు సంబంధించిన మంత్రమును జపిస్తూ కొన్ని జల బందువులను శిరస్సుమీద ప్రోక్షించి కొనవలెను. ఇదియే మంత్రస్నానము.

## (2) భౌమ స్నానము :

భూమితో సంబంధము గల్గిన స్నానమే భౌమ స్నానము. గంగానది పవిత్ర స్థానముల నుండి మట్టిని తీసికొని, తల మీద చల్లికొనవలెను. ఫాలమున తిలకముగా దిద్దవలెను. దీనినే భౌమిక స్నానమందురు.

## (3) ఆగ్నేయ స్నానము :

అగ్నికి సంబంధముగల్గిన స్నానమే ఆగ్నేయ స్నానము. అగ్నియందున సకల దాహకశక్తి యుండినటులే భస్మమునందున సకల దోషదాహక శక్తి యిమిడి యుండును. అందుచేతనే అగ్నికి మరియు బస్మమున కభేదము చూపబడినది. భస్మమునకు, అగ్నిశబ్దము ప్రయుక్తమైనది. మేని నిండా భస్మమును ప్రోక్షించి కొనుటయే ఆగ్నేయ స్నానమగును.

## (4) వాయువ్య స్నానము :

వాయువుతో సంబంధము గల్గియుండుటచేత యీ స్నానమునకు వాయవ్య స్నానమను పేరు గల్గినది. కేవలము వాయువు యొక్క స్పర్ష చేత వాయువ్య స్నానమగునని భావింపవలదు. గోదూళి మిశ్రితమైన గాలి సోకవలెను. ఉదయమునను, సాయంకాలమును గోవులు వెడలెడి మరియు ఇంటికి వచ్చెడి సమయముయందున గోధూళి ఆకాశమున విస్తరించియుండును. ఈ గోధూళి మిశ్రితమగు గాలినియెవరు స్పృశింతురో వారు వాయవ్య స్నానము చేసినవారగుదురు.

## (5) దివ్యస్నానము :

“దివి భవం దివ్య”మనెడి వ్యుత్పత్తి ప్రకారము, దివి నుండి భువికి దిగి పచ్చెడి సూర్య కిరణముల స్పర్శను పొందుట చేత దివ్యస్నానము సిద్ధించును. ఉదయమునను, సాయంకాలమునను వెలువడెడి సూర్యరస్మి నులివెచ్చగా నుండును. అదియే ప్రశస్తమైనది.

## (6) వారుణ స్నానము :

నీటితో చేసెడి స్నానమే వారుణ స్నానము. నిరోగియైనవాడు, చల్లటి నీటితో స్నానము చేయవలెను. నదీ జలములలోను, సరోవరములలోను స్నానమాడుట యనెడిది ప్రశస్త్యమైనదని యెంచబడినది.

## (7) మానస స్నానము :

బాహ్యోపకరణముల నుపయోగించకుండగ, మనస్సున భగవన్నామ స్మరణను చేయుటయే మానస స్నానమగును.

## భస్మస్నాన విశిష్టత :

సప్తవిధి స్నానములలో ఆగ్నేయ స్నానమని పిలువబడెడి భస్మస్నానమే ముఖ్యమైనది. దీనివలన బహిరంగశుద్ధితోపాటుగా నంతరంగ శుద్ధియు సిద్ధించును. “భస్మనా విహితం స్నానమిదమాగ్నేయ ముత్తమమ్” అని శ్రీ భగవత్పాదుల వారు ఆదేశించిరి. “స్నానమే వారుణాద్వేషు ముఖ్యమ్” అని బోధించిరి. మలమును హరింపజేయు ప్రభావము దీనికి గల్గుటచే యీ ఉత్తమత్వము ప్రాప్తించినదని స్పష్టపరిచిరి.

సాధారణముగా జలస్నానము నెక్కువగా ప్రచారములో నున్నది. దీనిని ఆర్ద్ర స్నానమని కూడ పిలిచెదరు. జలతత్యమనేదిభవబంధములకు సంబంధించినదని తెలియుచున్నది. మానవ జన్మకు కారణములను శుక్ల శోణితములు జలతత్వమునకు సంబంధించినవే కదా! మాతృగర్భమున నున్నప్పుడు జలావృతమై కోశమున నుండుట జరుగుచున్నది. ఈ విధముగా ప్రకృతి బంధములకు జలము మూలమైనదగుచున్నది. ఈ కారణమున జల స్నానము వలన భవబంధములు వైదొలగవు. తన్ని మిత్యము భస్మస్నానమాచరించివలెనని శ్రీ భగవత్పాదులవారు ఆదేశించిరి. "ప్రకృతేస్తు ప్రహార్ణార్థం భస్మనా స్నానమిష్యతే" యనెడి యాచార్యులవారి వాక్కులు, సంసార దుఃఖమును దూరము చేసెడి యీ భస్మస్నానమును యతులు నుత్తమమైనదానిగా నెంతురు. వీరు సదా భస్మస్నాన నిరతులై యుందురు.

## భస్మస్నాన విధి :

భస్మస్నానము చేయుటకై ఉద్యుక్తుడైన వీరశైవుడు, శుచిర్భూతుడై పవిత్రమైన ఆసనమున కూర్చుండి, యెడమ అరచేతి యందున భస్మపు పొడిని వేసికొని, దానిపై కుడి అరచేతితో మూసి, ముద్రాంకితమైన యున్న రెండు చేతులను కుడి తొడమీద పెట్టికొని, ఎనిమిది మార్లు పంచాక్షరీ మహామంత్రముతో అభిమంత్రించివలెను. ఇంతకుముందుగానే చెప్పినయట్టుల ఈశానమంత్రమును పఠిస్తూ శిరస్సున, తత్పురుష మంత్రము చేత ముఖమును, అఘోరమంత్రము చేత హృదయమును, వామదేవ మంత్రము చేత నాభిని, సద్యోజత మంత్రముచేత మరియు ప్రణవంత్రముల చేత సర్వాంగముల మీదను అనామిక వేలు చేత భస్మమును చల్లికొనవలెను. ఇదియే భస్మస్నానము.

భస్మస్నానము చేయునప్పుడు యెంతో జాగ్రత్తగా ఉండవలెను. భస్మపు రేణువులను భూమిమీద పడనివ్వకూడదు. పురుషార్ధ బోధలోని యీ ప్రమాణము ప్రకారము, భస్మము పతనమైన యెడల పాపము ప్రాప్తించును.

**శ్లో॥ యావంతః పతితా భూమౌ భస్మనః పరమాణవః।**
**తావద్వర్ష సహస్రాణి రౌరవం నరకం వ్రజేత్**
**ఇత్యేవం భస్మపతనే బహుదోషస్య కీర్తనాత్।** (క్రియాసారము, 6, 55, పుట 22)

ఎన్ని పరమాణువులు, నేలమీద పడినచో అన్ని వేల సంవత్సరముల పర్యంతము గౌరవ నరకప్రాప్తియుండునని, యీ ప్రమాణమున చూపి, శ్రీ శ్రీ నీలకంఠాచార్యులవారు మనలను హెచ్చరిక చేయుచున్నారు.

## భస్మస్నానము యొక్క ఫలము :

ఈ విధముగా అవధాన పూర్వకముగా భస్మమును ధరించిన యెడల గల్గెడి ఫలమేమి యనెడి సందేహము కలుగవచ్చును. ఇట్టి సందేహమే జనక మహారాజుకు గల్గెను. వారు యాజ్ఞవల్క్య మహర్షిని యీ విధిన ప్రశ్నించెను.

**"యాజ్ఞవల్క్య! భస్మస్నానేన కింజాయత్"**

యాజ్ఞవల్క్య మహర్షిగారు, ఈ క్రింది విధిన ఉత్తరువునిచ్చిరి.

**"యస్య కస్య చిచ్చరీరే యావంతో**
**రోమకూపాస్రావంతి లింగాని భూత్వాతిష్ఠంతి॥**

భావము: ఎవ్వడు భస్మ స్నానమును చేయునో వాని రోమకూపములలోనికి భస్మ కణములు ప్రవేశించి, కాల క్రమమున లింగములుగా మారుచున్నవని యాజ్ఞవల్క్య ముని ఉత్వర్లులోని భావము.

## భస్మస్నానము -వైజ్ఞానిక లాభము :

నేటి సుశిక్షిత సమాజమున, ముఖమునకును, శరీరమునుకును సుగంధయుత రసాయన పదార్థములు ధరించుట బహుళముగా కానవచ్చుచున్నది. ఇంకా కొందరు, నాటకములలోని పాత్రధారులు రుద్దుకొనినయట్లు రకరకములైన ద్రవ్యములనుముఖమునకును, పెదవులకును

ఎంతో దట్టముగా పులముకొనుచున్నారు. గంధర్వుల వలె సుందరముగాను, సుగంధము లనెడి విధముగాను ఉండవలెననెడి కోరికను గల్గి యుండుటలో దోషమేమియును లేదు. కాని వారు ఉపయోగించెడి పదార్థముల వలన యెట్టి విష పరిణామములు కలుగుచున్నవో తెలిసికొనకుండగ యుండెడిది మాత్రము క్షమించజాలని దోషము. నానావిధములగు చర్మరోగములు వచ్చి బాధకు గురియగుచున్నను, ఆధునికులకు జ్ఞానము వచ్చుటలేదు. నేటి వైజ్ఞానిక పరిశోధన వలన తెలియుచున్నదేమనగా ఆధునిక సౌందర్య సాధనముల వలన క్యాన్సరు వంటి భయంకరమైన వ్యాధులు వచ్చెడి యవకాశములు మెండుగా గలవు.

భస్మస్నానము చేసెకొనుట వలన విశేషమైన లాభములు కలవు. గోమయమునకును, గోమూత్రమునకును క్రిమిసంహారక, రోగ నిరోధక శక్తులు గలవు. ఆ గుణములు భస్మములో నుండుటచే భస్మస్నానము చేయువారికి చర్మరోగములంటవు.

అంతగా సుగంధ ద్రవ్యముల మీద ఆసక్తి వున్న యెడల తన్నిమిత్తమై ప్రాచీనులు చూపించిన మార్గమును అనుసరించిన యెడల అభీష్టసిద్ధితోబాటుగా ఆరోగ్య ప్రాప్తియును కల్గును. ఈ విషయమున బృహత్‌జాబాలోపనిషత్తులోని క్రింది ప్రమాణమును గమనించతగినది.

**శ్లో॥ సంయోజ్య గంధసలలైః కపిలా మూత్రకేణవా ।**
**చంద్ర కుంకుమ కాశ్మీర ముశీరం చందనం తథా ॥**
**గురుత్రితయంచైవచూర్ణయిత్వాతుసూక్ష్మతః ।**
**రక్షిపేదభస్మనీ తచ్చూర్ణమోమితి బ్రహ్మమంత్రతః ॥** (బ్రా.జ.ఉ. 3-27, 28)

పై శ్లోకానుసారముగా సుగంధ జలము కపిల జాతికి చెందిన గోమూత్రము, కుంకుమపువ్వు, కాశ్మీరపువ్వు శీరము; శ్రీగంధము; మొదలగు ప్రాచీన సుగంధ ద్రవ్యములను లేదా ఆయుర్వేదములో చెప్పబడిన సుగంధభరితములైన ద్రవ్యములు లేదా వనమూలికలను భస్మములో కలిపి కొనవచ్చును. ఈరీతిగా సుగంధ ద్రవ్యములచేత మిశ్రితమైన భస్మము ఉభయవిధములుగా పనిచేయును దైహికసౌందర్యము మొదటిఫలము దైహికముతోబాటు మానసిక ఆరోగ్యము రెండవఫలము. నేటి ఆధునిక సుగంధ రసాయనములకలవాటు పడినవారు తమ యొక్క అలవాట్లను మార్చుకొని భస్మస్నానముయెడల అనురక్తిని పెంచుకొనినయెడల వారికేకాకుండ సమాజమునకును శ్రేయస్సును కూర్చినవారగుదురు.

దేవాదిదేవుడైన మహాదేవునికి ప్రియమైన ఈ భస్మస్నానము అతని భక్తులైన దేవదానవాదులందరికిని ప్రియమైనదని తెలియచెప్పుటకే "బ్రహ్మవిద్యవిబుధాః సర్వే"యని పూజ్యపాదులు అనతినిచ్చిరి. ఆచార్యులవారి వాక్కు ప్రకారము బ్రహ్మాది ముప్పది మూడుకోట్ల దేవతలు, నారదాదిమునులు, సనకసనందాది యోగులు, బాణాసురాది రాక్షసులు; శివభక్తిపరాయణులై భస్మస్నానినిష్ఠగలవారై సకల దోషములనుండి పరిహారమును పొందిరి.

ఈ ప్రాచీన ఆచార్యులయొక్క మార్గమును మన ఆచార్యుడైన రేణుకాచార్యుల వారు సూచించిన విధముగా మనమెల్లరు భస్మస్నానిరతులమై దాని సముచిత లాభము పొంది ధన్యత పొందుదుము గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**ది॥ 26-9-1993**

**స్థలం : శివానుభవ మంగళభవనము - షోలాపురం**

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులవారు భస్మస్నానము యొక్క విశిష్ఠతను, ధారణ విధానమును నెంతో వివరముగా వివరించినారు.

"అప్లావ ఆప్లీవః స్నానమ్" అనెడిది యమర సింహుని వాక్కు. ఇవి స్నానమునకు గల పేర్లని తెలియుచున్నది. దేనిచేత మురికి దూరము చేయబడునో నయ్యది స్నానమని యనబడుచున్నది. స్నాత్యనేన స్నానం, ష్ణాశౌచే, అనెడిది స్నానము యొక్క వ్యుత్పత్తి.

మురికి రెండు విధములు. మొదటిది బహిరంగముననుండెడిది. రెండవది యంతరంగముననుండెడిది. బహిరంగమున నుండెడి మురికిని తొలగించుటకనేక విధములగు స్నానములు చిరకాలమునుండియు చేపట్టబడుచున్నవి. జలకములాడుట, సుగంధ పరిమళ ద్రవ్యములను పూసికొనుట యిత్యాదులు నీ కోవకు చెందినవి. అయితే, అంతరంగ బహిరంగ శుద్ధుల సాధించెడి భస్మస్నానము చేపట్టవలెననెడిది శ్రీ భగవత్పాదుల వారి వాక్కులు. ఈ వాక్కుల ప్రతిబింబమును నీ క్రింది ద్విపదలో గాంచగలము.

ద్వి॥ క్రియ 'భస్మలామకరే స్థాప్య' మనగ
మతి 'దక్షిణే నాభి మంత్రితం' బనగ
రతి శివధర్మ శాస్త్రాఖ్యాపిత ప్ర
యుత సూక్తి 'వారుణ ముత్సృజ్య' యనని
యతచమతి 'నాగ్నేయ మాచరేత్తనగ" (పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్రకరణము)

భస్మస్నానము శాస్త్ర సమ్మతమైనదని తెలిపెడి చతుర్వేద సారములోని యీ పద్యము గమనార్హమైయున్నది.

సీ॥ చర్చింప శివధర్మ శాస్త్రంబు దా'స్నాన
మాగ్నేయ మాచరేత్తనుచు బొగడ
ప్రకటింప వాయుపురాణంబు 'భస్మనా
చ త్రిపుంఢ్రక 'మని సంస్తుతింప
సంధిల్ల లైంగ్యంబు 'సర్వతీర్థావగా
హంబు భూతి స్నాన' మనుచు జదువ
నలి భవిష్యత్పురాణమున "భసితతను
మాపురా' యనుచు సమాఖ్య సేయ

ఆ॥ జను పురాణయుక్తి శాఖోపనిషదాగ
మాది ధర్మములను మహిత వృత్తి
వినుతి సేయుచుండ వేదురు లాభూతి
బాహ్యులగుటదేమి బసవలింగ ! (చతుర్వేదసారము; 61)

భస్మస్నానము ఆగ్నేయ స్నానమని పిలుతురు. ఇద్దాని వివరణను సోమనాథ భాష్యములో గాంచగలము.

శ్లో॥ ఆగ్నేయం భస్మనా స్నానం । యతి భిస్సవిధీయతే ।
అంభస్నానాత్పరం భస్మ । త్వంహోనాశయతి ధృవం ॥ (సోమనాథ భాష్యము, విభూతి మహాత్మ్యం)

స్కాంద పురాణములో భస్మస్నానము నీ క్రింది విధముగా స్తుతింపబడినది.

శ్లో॥ భస్మస్నానాత్పరం స్నానం పవిత్రాం నైవవిద్యతే ।
ఇత్యుక్త్వాముని దేవేభ్య శిస్నాతోయస్సశివస్స్వయమ్ ॥

భస్మస్నానము వలన గల్గెడి ఫలమును ఆగమపురాణాదులలో వివరించనైనది. ఈ క్రింది యాగమ వాక్కును గనుడి

శ్లో॥ సర్వతీర్థేషు యత్పుణ్యం । సర్వయజ్ఞేషు యత్ఫలం ।
తత్ఫలం కోటి గుణితం । భస్మస్నానాన్న సంశయః । (భీమాగమము)

భస్మస్నానము వలన యంతరంగ శుద్ధిగల్గునని యింతకు క్రితమే తెలియజేయనైనది. అద్దానిని సమర్ధించెడి ప్రమాణము.

శ్లో॥ భస్మస్నానాద్విశుద్ధాత్మా జితక్రోధో జితేంద్రియః ।
మత్సమీప ముపాగత్య నభూయో వినివర్తతే ॥ (లింగపురాణము)

వీరశైవ ధర్మమున శుద్ధాంతః కరణకు నెంతయో ప్రాముఖ్యత గలదు. భవికి పిండస్థలమున ప్రవేశించుటకు కావలసిన యవశ్యమైన లక్షణములలో పరిశుద్ధాంతఃకరణ యెంతో ప్రముఖమైనది. ఇది లేనివాడు పిండజ్ఞానమును సంపాదించజాలడు.

పిండజ్ఞానము లుప్తమైనవానికి సంసారముయెడల మమకారము, దేహాభిమానము. ఇంద్రియలోలత్వమధికముగా నుండును. ఇట్టివానికి గురుకరుణ లభించదు.

లింగధారియైనవానికి పరిశుద్ధాంతః కరణము నిత్యలక్షణమై యుండవలెను. పరిసరముల ప్రభావము మిక్కుటముగా నుండుటచే. భౌతికముగా శీతోష్ణవాతాతపాదుల వలన యంతరంగములోని పరిశుద్ధతను దెబ్బదీసెడి యాచరణలు చోటు చేసికొనవచ్చును. శీతల ప్రాంతములో నివసించెడి వానిని యుదాహరణముగా తీసికొనవచ్చును. ఆహార-విహారాదుల వలన యనాచారమునకు నాస్కారమేర్పడును. సామాజిక-సాంస్కృతిక పర్యావరణములోని లక్షణముల మూలమున ఆచారవంతునికి చిత్తచాంచల్యము కలుగవచ్చును. ఆచార విషయములలో ప్రాంతీయపరమైన భేదములను మనము గాంచుచున్నాము. మన రాష్ట్రములోని కొన్ని ప్రాంతములలో వివాహ సందర్భమున లింగధారణ జరుపుదురు. దక్షిణ దేశమున లోతట్టున నుండెడివారు లింగధారణ విషయములోన వైవిధ్యత కనబరుచుచున్నారు. ఈ విధముగా ఆచారముపైన పరిస్థితుల ప్రభావముండును. కాన ఈ స్థలమున ఆచార సంపత్తిమెండుగా నుండవలెను. ఆచారము ప్రాణప్రదమైనది. ఆచారమే స్వర్గము, అనాచారమే నరకమనునది శ్రీ బసవేశ్వరులవారి వాక్కు. ఆచారహీనుల నాది దేవుడు మెచ్చడని శ్రీ రేణుక భగవత్పాదుల వారి యువాచ. అంతాకరణ, శుద్ధికి - ఆచార మాన్యతకు సవినాభావ సంబంధము గలదు. ఆచార నిష్ఠ, అంతఃకరణశుద్ధిని పెంచు భస్మస్నానమునకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత గలదని తెలిసికొనవలెను. పిండస్థలము నుండి భక్తస్థలమునకు వచ్చిన భక్తుడు భస్మస్నానము యెడల ననురక్తిని పెంచికొనవలెను. జలస్నానము చేసినను, భస్మస్నానమును చేయుటను మరువకూడదు. అంతఃకరణ శుద్ధికి భంగమును కల్గించెడి క్రోధాదుల నుండి తనను తాను రక్షించికొనుటకు భస్మస్నానము నుపకరించుననెడిది గుర్తుంచుకోవలసిన విషయము.

**శివం భూయాత్**

## ఆశీర్వచనము : 7

**శ్లో॥ నమఃశివాయేతి భస్మకృత్యా సప్తాభిమంత్రితం ।**
**ఉద్ధూలయేత్తేన దేహం త్రిపుంద్రం చాపిధారయేత్ ॥** (సి.శి. 7-28)

ఓం నమఃశివాయ యనెడి మహా మంత్రము చేత, భస్మమును ఏడుసార్లు మంత్రించి శరీరము నిండా లేపనమును చేసికొనవలెను. పిదప త్రిపుండమును ధరించికొనవలెను.

**శ్లో॥ సర్వాంగోద్ధూలనం చాపి న సమానం త్రిపుంద్రకైః ।**
**తస్మాత్రిపుంద్రమేక్యకం లిఖేదుద్ధూలనం వినా ॥** (సి.శి. 7-28)

భస్మమును మొత్తము శరీరము మీద పులిమికొనినను, అది ఒక త్రిపుంద్రమునకు సరిరాదు. అందుచేత, భస్మోద్ధూళనమును చేసికొనకుండిననూ త్రిపుంద్రమును మాత్రము అవశ్యకముగా ధరించికొనవలెను.

**శ్లో॥ త్రిపుంద్రం ధారయేన్నిత్యం భస్మనా సజలేన హి ।**
**స్థానేషు పంచదశస్సు శరీరే సాధకొత్తమః ॥** (సి.శి. 7-30)

శ్రేష్ఠమైన సాధకుడు జల మిశ్రితమైన భస్మము చేత తన శరీరములొ పదిహేను స్థానములయందున ప్రతిదినము త్రిపుంద్రములను ధరించికొనవలెను.

**శ్లో॥ ఉత్తమాంగే లలాటేచ శ్రవణద్వితయే స్తథా ।**
**గలే భుజద్వయే చైవ హృది నాభౌచ పృష్ఠకే**
**బాహుయుగ్మే కకుద్దేశే మణిబంధద్వయేతథా ।**
**త్రిపుంద్రంభస్మనాధార్యం మూలమంత్రేణ సాధకైః ॥** (సి.శి. 7-28)

సాధకుడు తన శరీరము యొక్క 1) మస్తకము, 2) ఫాలము, 3-4) రెండు చెవులు, 5) కంఠము, 6-7) రెండు భుజములు, 8) హృదయము, 9) నాభి, 10) వెన్ను, 11-12) రెండు బాహువులు, 13) మెడ, 14-15) ముంజేతులు అనెడి పదిహేను స్థానములలొ పంచాక్షరీ మంత్ర పురః సరముగా త్రిండమును ధరించుకొనవలెను.

శ్లో॥ వామహస్తతలే భస్మక్షిప్యా చ్ఛాద్యాన్య పాణినా ।
అగ్నిరిత్యాదిమంత్రేణ స్పృశనవారాభి మంత్రచ ॥
త్రిపుండ్ర ముక్తస్థానేషు దద్యాత్సజల భస్మనా ।
శివం శివంకరం శాంతం సంప్రాప్నోతి న సంశయః ॥ (సి.శి. 33-34)

ఎడమ చేతిలో భస్మమును పెట్టుకొని, కుడిచేతిలో నద్దానిని మూసివేసి, "అగ్నిరితి భస్మ" యనెడి మంత్రమును పఠించుచు పదునైదు స్థానముల యందున భస్మమును ధరించుకొనవలెను. ఈ విధిన చేసికొనెడి వాడు నిస్సందేహముగా ప్రశాంతుడును, కళ్యాణకారకుడును అగు శివునినే పొందుచున్నాడు.

## భస్మోద్ధూళనము :

భస్మధారణ విధియందున నుండెడి ద్వితీయ సొపానమే. భస్మోద్ధూళనము గ్రహించగలరు. ఉద్ధూళన యనగా లేపనమని తెలిసికొనవలెను. మేనునంతట భస్మమును లేపనమును చేసికొనుటయే భస్మోద్ధూళనమని ఏడుమార్లు పంచాక్షరిచే భస్మమును నభిమంత్రించవలెనని శ్రీ భగవత్పాదుల వారు ఆదేశించిరి. దీనిలో గల రహస్యార్థమేమనగా, గత ఏడు జన్మలలొ చేయబడిన దొషములను పరిహారము చేసికొనుటకే యీ విధిన అభిమంత్రించవలెను.

భస్మోద్ధూళన వలనను, భస్మస్నాన, భస్మసేవనల యందున ప్రాప్తించిన యటులే, శరీరాంతర్గతమగు సూక్ష్మాణువులు పరివర్తనను పొంది పరిశుభ్రత చేకూరుచున్నది. ఈ విషయమున బృహ జ్జాబాలోపనిషత్తునొక కథను వర్ణించినది. దాని సారాంశమేమనగా నీలవర్ణుడగు కృష్ణుడు, భస్మోద్ధూళనాదులను చేసికొని పరిశుద్ధుడై శుభ్రవర్ణుడుగా మారుట. నల్లని మేని వర్ణముగలవారు, ప్రమాదకరమైన రసాయన పదార్థముల నుపయోగించుకొని, అందముగా కనిపించుటకు ప్రయత్నించుట మన మెరిగినదే. ఇట్టి వారు వివిధ రకములైన చర్మరోగములనుకొని తెచ్చుకొనుచున్నారు కదా ! అట్టివారు భస్మోద్ధూలనము చేసుకొని తగినలబ్ధిని పొందవచ్చును. పర్ణమార్పిడితో పాటు, మానసిక పరిశుద్ధితయును గల్గును.

## త్రిపుండ్రముల మహాత్మ్యము

భస్మధారణ విధిలోన చివరిదగు భస్మ త్రిపుండ్ర ధారణ యెంతో మహత్వ పూర్ణమైయున్నది. "సర్వాంగోద్ధూలన చాపిన సమానం త్రిపుండ్రకైః" యని శ్రీ రేణుకాచార్యులవారు ఆదేశము సర్వాంగములకును భస్మోద్దూలనమును చేసుకొనినూ, అది ఒక్క త్రిపుండ్రమునకు సాటిరాదని చెప్పబడినది. అందుచేత భస్మస్నానమును భస్మోద్ధూలనమును చేసిననూ చేయకుండిననూ, భస్మ త్రిపుండ్రములను మాత్రము తప్పనిసరిగా ధరించవలెను.

## త్రిపుండ్రధారణ విధి :

"త్రిపుండ్రం ధారయేన్నిత్యం భస్మనా సజలేనపి" అనెడి శ్రీ రేణుకాచార్యుల వారి ఆదేశము ప్రకారము జల మిశ్రిత భస్మము చేత భస్మ త్రిపుండ్రములను దాల్చవలెను. ఈ కారణము వలన భస్మమును గైకొని యెడమ అరచేతిలొ వేసుకొని జల మిశ్రితముచేసి త్రిపుండ్రములను ధరించవలెను. అద్దాని విధానమెట్టిదనగా.

మొదట యీ క్రింది అథర్వ శిఖకు చెందిన మంత్రమును పఠించవలెను.

శ్లో॥ "అగ్నిరితి భస్మ వాయురితి భస్మ జలమితి భస్మ స్థలమితి, భస్మవ్యామేతి భస్మ
భస్మేతి భస్మసర్వగం హ వా యిదంభస్మ మన ఇత్యేతాని చక్షూగుంషి భస్మాని ॥"

పై మంత్రముతో భస్మమును అభిమంత్రించి ఈ క్రింది మంత్రమును పఠించుచు భస్మపు పొడిలో తగినన్ని నీటిబిందువులను కలుపుకొనవలెను.

**శ్లో॥ "మానస్తోకే తనయే మానఆయుషి మానో గోషు మానో అశ్వేషురీరిషః ।**
**వీరాన్మానో రుద్ర భామితో వధిరః విష్మంతో నమసా విధేమతే ॥"**

పిదప జలమిశ్రితమైన భస్మంగల అరచేతియందున పంచకోణమును లిఖించి అందు ప్రణవసహిత పంచాక్షరిని లిఖించవలెను. తదుపరి, దానిని మూలమంత్రము చేత అభిమంత్రించవలెను. కనీసముగా ఎనిమిది మార్లైనను పంచాక్షరిని పఠించవలెను. పిదప ఈ క్రింది మంత్రములను పఠించుచు నా యా స్థానములయందున త్రిపుండ్రములను ధరించవలెను.

| | | |
|---|---|---|
| 1) | ఓం శివాయ నమః | (మస్తకమునందున) |
| 2) | ఓం మహేశ్వరాయ నమః | (ఫాలమున) |
| 3-4) | ఓం రుద్రాయ నమః | (రెండు చెవులయందున) |
| 5) | ఓం శ్రీకంఠాయ నమః | (కంఠమున) |
| 6-7) | ఓం శంభవే నమః | (రెండు భుజములయందు) |
| 8) | ఓం ఈశ్వరాయ నమః | (హృదయస్థానమున) |
| 9) | ఓం మహాదేవాయ నమః | (నాభియందున) |
| 10) | ఓం పశుపతయే నమః | (వెన్నున) |
| 11-12) | ఓం శంకరాయ నమః | (రెండు మోచేతులయందు) |
| 13) | ఓం వృషభాయ నమః | (మెడమీద) |
| 14-15) | ఓం పరమాత్మనే నమః | (మోచేతులయందు) |

ఈ విధిన, శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారి ఆదేశము ననుసరించి, ప్రతి వీరశైవుడు భస్మ త్రిపుండ్రములను ధరించుట యనేది వీరశైవుల కర్తవ్యమని యెంచి శ్రీవారి ఆనతిని అమలు చేయవలెను. తమ తమ యిష్టానుసారము ధరిచుట విహితము కాదు.

## భస్మధారణా స్థలములు : వైవిధ్యత

భస్మధారణ స్థలముల గురించి యేకాభిప్రాయము లోపించినది. ఆగమ పురాణాదులలొను, ఉపనిషత్తులలొను ఈ విషయమున భిన్నత్వము గోచరించుచున్నది.

**శ్లో॥ ద్వాత్రింశ ధ్ధానకేనాథ షొడశ స్థాన కేతవా ।**
**అష్టస్థాన తథా చైవ పంచస్థానే చ యోజయేతు ।**

(శివ. పు॥ చంద్రజ్ఞానాగమ క్రి సా : 6-44)

పై ప్రమాణ వాక్యానుసారము ముప్పది రెండు, పదహారు, ఎనిమిది మరియు ఐదు అనెడి వికల్పములతో భస్మ త్రిపుండ్ర ధారణా స్థానములు ప్రతిపాదించబడినవి. వీటి స్థానముల యొక్క వివరణ ఈ విధముగానున్నది.

**శ్లో॥ ఉత్తమాంగే లలాటేచ కర్ణ యొర్నేత్రయొర్ద్వయోః ।**
**నాసావక్త్ర గళేష్వమమ్ సద్వయ మనంతరం ॥**
**కుర్వరే మణిబంధేచ హృదయే పార్శ్వయోర్ద్వ యోః ।**
**నాభౌ గుహ్యాద్వయే చైవ ఊర్వో స్ఫిగ్విoబ జానుష**
**జంఘేద్వయే పాదయోశ్చా దాత్రింశత్ స్థానము త్తమం ॥**

(శి.పు. విద్యే 24 ; 98-100 చంద్రజ్ఞానాగము క్రి.సా : 6 ; 45-46)

ఈ శ్లోకములో సూచింపబడిన స్థానములు శిరస్సు (2) ఫాలము (3-4) చెవులు ; (5-6) కళ్ళు; (7-8) ముక్కుపుటములు, (9) నోరు, (10) కంఠము, (11-12) భుజము వెనుక జబ్బలు, (13-14) మోచేతులు, (15-16) మణికట్టులు, (17) హృదయం, (18-19) ప్రక్కలు, (20) నాభి, (21-22) మర్మ మరియు ఆసన స్థానములు, (23-24) తొడలు, (25-26) పిరుదులు, (27-28) మొకాళ్ళు, (29-30) పిక్కలు, (31-32) పాదములు.

ఈ విధముగా 32 స్థానములలో భస్మత్రిపుండ్రములను ధరించవలెనని చెప్పబడినది. ఇట్లేచెప్పెడి మరియొక ప్రమాణము కూడా పరిశీలించుడి.

**శ్లో ॥ విదద్యాత్ షోడశస్థానే త్రిపుండ్రంచ సమాహితః ।**
**శీర్ష ఖే చ లలాటే చ కంఠె చాంసద్వయే భుజే ॥**
**కుర్పరే మణి బంధే చ హృదయే నాభి పార్శ్వయోః ।**
**పృష్ఠే చైవమ్ ప్రతిష్టాయా జపేతత్వాది దైవతం ॥**

(శి.పు. వి :24, 102-104 చం.జా ; కి.పా : 6-45,46)

ఈ ప్రమాణములొ సూచింపబడిన 16 స్థానములు 1) శిరస్సు, 2) ఫాలము, 3) కంఠము, 4,5) జబ్బలు, 6,7) భుజములు, 8,9) మోచేతులు, 10,11) మణికట్టులు, (12) హృదయం, (13) నాభి, 14,15) ప్రక్కలు, 16) వీపు. ఈ 16 స్థానములయందు భస్మ త్రిపుండ్రములను దాల్చుట శ్రేయము.

మరొక ప్రమాణము నందు అష్ట విధస్థానము లీవిధముగానున్నవి :

**శ్లో॥ శిరఃస్థానమ్ లలాటంచ కర్ణద్వయమనంతరం ।**
**అంస యుగ్మం చ హృదయం నాభిరిత్యష్టమం భవేత్ ॥** (చ.ఆ : క్రి.పా. 6-54)

ఈ ప్రమాణము ప్రకారము 1) శిరస్సు, 2) ఫాలము, 3,4) చెవులు, 5,6) జబ్బలు, 7) హృదయం, 8) నాభి యనునవి భస్మ ధారణ స్థలములు.

భస్మధారణకై ఐదు స్థానములు సూచించెడి ప్రమాణము.

**శ్లో॥ అదవా నిటిలం బాహూ హృదయం నాభిరే వక ।**
**భస్మ స్థానాని కద్యంతే పంచబృహ్మాణి దేవతా ॥**

ఈ ప్రమాణము ప్రకారము 1) ఫాలము, 2,3) భుజములు, 4) హృదయము, 5) నాభి భస్మధారణ స్థలములుగా గుర్తించబడినవి.

బృషజాబాలోపనిషత్తులోని చతుర్థ బ్రాహ్మణమున, భస్మధారణస్థలములను విస్తృతముగా గురించి వివరించి, ఆయా స్థానములయందు భస్మధారణగావించిన యెడల, అట్టి స్థానములకు సంబంధించిన దోషములు నివారింపబడునని తెలుపబడినది.

భస్మ త్రిపుండ్రధారణలోని సుగుణముల దృష్ట్యా 32 స్థానములలో ధరించుటయే ఉత్తమము. 16 స్థానములలో భస్మమును ధరించిన మధ్యమముగాను, 8 స్థానములలో ధరించిన అధమపక్షము గాను గుర్తించగలరు. ఎవ్వరు ఏ ఏ విధముగా ధరించెదరో వారికి ఆయా విధములగు ఫలితములు దక్కును. భస్మము ధరించని వాని గతియెట్టిదో యనెడిది తెలిసికొనుటకై ఆసక్తి గలవారు, వాయవీయ సంహితలోని యీ క్రింది ప్రమాణమును చూడగలరు.

**శ్లో॥ యేశాం వపుర్మనుష్యాణాం త్రిపుండ్రేణ వినాస్థితం ।**
**శ్మశానసదృశం తస్మాన్న పేక్ష్యం పుణ్య కుజ్జనైః ॥**
**దిగ్భస్మరహితం భాలం దిగ్గ్రామ మశివాలయం ।**
**ధిగనీశార్చనం జన్మ దిగ్విద్యా మశ్శివా శ్రయాం ॥** (క్రియాసారం : ఉపదేశం 8 పుట, 84)

పై ప్రమాణము క్రియా సారములో యిమిడ్చిన

శ్రీ నీలకంఠ శివాచార్యులవారి క్రియాసారము ప్రకారము త్రిపుండ్రధారణలేని వాని దేహము శ్మశాన సదృశమైనది. పుణ్య జీవులైన వ్యక్తులు అట్టివారి ముఖమును చూడరాదు. శివజ్ఞానము నివ్వని విద్య; శివుని పూజించని జన్మ ; శివాలయములేని ఊరు; ధిక్కారము లైనయటులనే భస్మత్రిపుండ్రధారణలేని ఫాలభాగము కూడ ధిక్కార యోగ్యమగును, యని నిష్ఠరోక్తులను పల్కిరి. ఈ విధముగా మహానుభావుల యొక్క శాపతుల్యమైన వాక్కులకు గురియగుట కంటెను ; ఆరోగ్య పరిరక్షణ నిమిత్తమై, త్రిపుండ్ర ధారణ చేసికొనిన యెడల గురువుల యెక్కయు, శివుని యెక్కయు మెప్పుదలను పొందుటయే కాక "బుధవర్గము" కూడా ప్రశంసించును.

## త్రిపుండ్ర రేఖల రహస్యార్థము

మనము ధరించెడి భస్మ త్రిపుండ్రములందు మూడు రేఖలుండును. ఈ రేఖల రహస్యార్థం తెలిసిన భస్మ త్రిపుండ్ర ధారణ యెడల అధికమైన శ్రద్ధ కల్గునని యెంచి ఆ రహస్యార్థమును ఎరుగుదుముగాక.

**శ్లో॥ త్రిపుండ్రంకార యొద్ధీమాన్ బ్రహ్మ విష్ణుశివాత్మకం ॥** (చం.జా.ఆ.)

ఈ ప్రమాణము ప్రకారము మూడు రేఖలు త్రిమూర్తులకు ప్రతీకగా అయియున్నవి. ఈ దేవతలలోఏ ఒక్కరియందైనను భక్తి శ్రద్ధ గలవారు తప్పనిసరిగా త్రిపుండ్రధారణ కల్గినవారైయుండవలెను. అందుచేతనే కొందరు స్మార్థులు దీనిని శైవ వైష్ణవముల సమన్వయ చిహ్నముగా నెంచెదరు.

త్రిపుండ్రముపై విస్తృత పరిశీలన చేయవలసియున్నది. మొదటిరేఖ, గార్హపత్యాగ్ని అకారము, రజోగుణము, భూలోకము, దేహాత్మ, క్రియాశక్తి, ఋగ్వేదము, ప్రాతఃకాలీన సదనము మరియు మహేశ్వరుని స్వరూపముగానున్నది. ద్వితీయరేఖ, దక్షిణాగ్ని, ఉకారము, సత్వగుణం, అంతరిక్షం, అంతరాత్మ, ఇచ్ఛాశక్తి యజుర్వేదము, మధ్యాహ్న సవనము మరియు సదాశివుని స్వరూపమై యున్నది. మూడవరేఖ అహవనీయ అగ్ని, మకారము తమో గుణము, స్వర్గము, పరమాత్మ, జ్ఞానశక్తి, సామవేదము, సాయ, రత్నా, అహనము మరియు మహాదేవుని స్వరూపమైయున్నది.

ఈ రీతిన త్రిపుండ్రవర్ణన యొక్క తాత్పర్యమేమనగా విధి ప్రకారము, శ్రద్ధతో యీ త్రిపుండ్రములను ధరించిన వ్యక్తి త్రివేదజ్ఞాన సంపన్నుడుగాను, సత్వాది గుణముల కతీతుడుగాను, త్రిసంధ్యాశీలుడిగాను, కాగలుగుననియును, ఆతని యిచ్ఛా ; క్రియా ; మరియు జ్ఞాన శక్తులు జాగృతమును నొంది జగత్తునకు ఆదర్శప్రాయుడగును.

శివ రహస్యములోని ఈ క్రింది శ్లోకము త్రిపుండ్రముల యొక్క మహత్తును సూచించుచున్నది.

**శ్లో॥ సమస్త తీర్థేషు మయే చ కాశీ**
**విశ్వేశ్వరః సర్వసురోత్తమః స్యాత్ ॥**
**సమస్త తత్త్వైక్త రసా విభూతిస్తద్వైవ**
**పుండ్రేయమయం త్రిపుండ్రః ॥** (క్రి.సా. ఉప. 8, పు 87)

ఈ ప్రమాణము ప్రకారము సకల తీర్థములయందు కాశీ, సకల దేవతలలో విశ్వేశ్వరుడు శ్రేష్ఠమై యున్నటులనే, సర్వ తత్త్వముల యొక్క సారము విభూతి అయి వుండుటచే అన్ని త్రిపుండ్రములయందును, తిర్యక్ త్రిపుండ్రమే శ్రేష్ఠమైనదనియును ప్రతిపాదించబడినది. అందువలన ఊర్ధ్వ త్రిపుండ్రములు కాక, తిర్యక్ త్రిపుండ్రమునే ధరించవలెను.

## తిర్యకం త్రిపుండ్ర రహస్యము

వైష్ణవులు ఊర్ధ్వ త్రిపుండ్రములను స్మార్థులు, శైవులు మరియు వీరశైవులు త్రిరైక్ త్రిపుండ్రములను ధరింతురు. ఇది అనాదిగా వచ్చుచున్న లోకాచారము. అయితే ఈ రెండింటిలో యేది సరియైనది యనే ప్రశ్న ఉదయించును. కొందరు ఊర్ధ్వ త్రిపుండ్రములను

సమర్థింపగా, మరికొందరు త్రిరైక్ త్రిపుండ్రములను సమర్థింతురు. ఎవ్వరి వాదనలకు తగినట్లుగా ఆయా ప్రమాణములను కూడా ప్రతిపాదింతురు. పూర్వ పురాణమునందు త్రిరైక్ త్రిపుండ్రధారణ యెక్క రహస్యమును తెలిసికొనదగినదై యున్నది.

**శ్లో॥ స్రష్టా సృష్టి చ్ఛలానాః త్రిపుండ్రస్య ప్రశస్తతాం ।**
**ససర్జ స లలాటిం హితిర్యక్ నోర్ధ్వం నవర్తులం ॥**

**తిర్యగ్రే ఖాఃప్రకాశంతే లలాటే సర్వదేహినాం ।**
**తథాపిమానవాః మూర్ధా న కుర్వం త్రిపుండ్రకం ॥**

**న తథ్యానం న త ద్దానం న త జ్ఞానం నతత్తః ।**
**వినా తిర్యక్ త్రిపుండ్రాంకం విప్రేణ యదనుష్ఠితం ॥** (క్రి.సా : ఉ : 8 ; పుట–81)

దీని తాత్పర్యమేమనగా సృష్టికర్తయైన బ్రహ్మ మనుష్యులందరి ఫాలభాగములను ఎత్తుగాను గుండ్రముగాను చేయకుండగా చదునుగా చేసినాడు. ఇంతియు కాదు, కనుబొమ్మలను ఎత్తి చూసిన యెడల (నొసలాడించడము) స్వాభావికముగా అడ్డరేఖలు మాత్రమే కన్పట్టును. ఈ కారణము వలన త్రిపుండ్రములను అడ్డముగా ధరించి, సృష్టి నియమమును పాటించవలెను. దీనికి విరుద్ధముగా నిలువురేఖలను, గుండ్రని రేఖలను ధరించుట సరియైనది కాదు. వీరందరును తెలియని వారే ? కొందరు గుండ్రని చందనమును మాత్రమే ధరించుచున్నారు, అదియును సరియైనదిగాదు.

ఈ విధముగా అడ్డముగా, త్రిపుండ్రమును ధరించకుండ చేయబడెడి ధ్యానము, దానము, జ్ఞానము మరియు తపస్సులు వ్యర్థము లగుచున్నవి. ఈ రీతిగా బ్రహ్మ సృష్టిలోని సహజమైన నియమము ననుసరించి అందరు అడ్డముగా త్రిపుండ్రములను ధరించవలెను. అట్టివారు "శివం శివంకరం శాంతం సప్రాప్నోతి ససంశయః" యనెడి శ్రీ జగద్గురువు రేణుకా భగవత్పాదుల ఉపదేశము ప్రకారము శివసాయుజ్యమునే పొందగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 7-8-1990
స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

## విశేష ప్రదీపిక :

ఈ ఆశీర్వచనము ననునిత్యము మనమాచరించుకొనెడి నిత్యకార్యమైన యిష్ట లింగార్చనను సుసంపన్నము మరియు ఫలప్రదము చేసెడి మహత్తరమైన సాధనముగా నెంచ దగినదై యున్నది. శ్రీ కాశీ జ్ఞానపీఠాధీశ్వరులు మనలను ధన్యులను చేసిరి.

భస్మ స్నానము భస్మోద్ధూళనము, భస్మ త్రిపుండ్ర ధారములనెడివి యవినాభావ సంబంధముగల యంశములు, పరస్పర పూరకములని తెలియుచున్నది.

భస్మోద్ధూళన బహుప్రాచీన కాలము నుండి కొనసాగుచూ వచ్చుచున్న యాచారము. శివుడు భస్మోద్ధూళిత సర్వాంగుడని పురాణ సాహిత్యము తెలుపుచున్నది. శివయోగి శివాచార్యుల వారు పూర్వ పీఠికలో శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు, శ్రీ అగస్త్యుల వారున్నూ భస్మోద్ధూళనము చేసికొనెడి వారని తెలిపెడి విధముగా వారి వర్ణనను చేసిరి. గమనించుడి.

**శ్లో॥ తడిత్పింగ జటా భారై త్రిపుండ్రాంకితమస్తకైః ।**
**భస్మోద్ధూళితసర్వాంగైః స్ఫుర ద్రుద్రాక్షభూషణైః ॥** (సి.శి. 4-26)

శ్రీ బసవేశ్వరుల వారు 501వ వచనములో శివుడు "మైయల్లి విభూతియ ధరిసిద్వ" అని చెప్పుచు భస్మోద్ధూళన యొక్క విశిష్టతను పరోక్షముగా తెలిపిరి. తాను స్వయముగా భస్మోద్ధూళనను చేసెడి వాడినని తెలిపెడి యీ క్రింది వచనమును గనుడి :

**అరిసివనె మిందు, హొందొడిగియ తొట్టు**
**పురుషన టలవిల్లద లలన యంతే ఆగిద్దెనయ్యా ।**
**విభూతియనె హూసి రుద్రాక్షియనె కట్టి**
**శివనిమ్మల విల్లదంతె ఆగిద్దెనయ్యా !** (బసవేశ్వర వ. 269)

దీని తెలుగు భావమును గనుడి :

**పుసుపున మునిగి పొందొడవుల దొడిగి**
**పురుషుని వలపులేని లలన యటులై యుంటినయ్యా !**
**విభూతిని పూసి రుద్రాక్షను కట్టి**
**శివా ! మీ వలపులేని యటులై యున్నానయ్యా !** (అనువా. డా॥ మ.లి.స్వా)

శ్రీ సోమనాథుల వారు, పండితారాధ్య చరిత్రలో భస్మోద్ధూళనము గురించి నీ క్రింది విధముగా తెలియజేసిరి.

"దారౌద్రమైన బోధాయన స్మృతియు వారక మాత్వాహవామహె" యనగ భాతిగా శాతాత తపస్మృత సదభి జాతోక్తి యట్ల "భస్మచ్ఛన్న" యనగ జ్ఞానాదియైన విజ్ఞానేశ్వరంబు దాన "భస్మోద్ధూళితం బన నింక. (పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్ర.)

భస్మోద్ధూళన మనివార్యంబని చెప్పకుండినను, భస్మోద్ధూళనను చేసికొనిన పిదప భస్మ త్రిపుండ్రములను దాల్చుట వలన నుత్తమమైన ఫలితములు వచ్చునని గ్రహించవలెను.

అష్టావరణములలో నొకటగు భస్మము, రక్షా కవచమని చెప్పబడినది. "ఉద్ధూళన ప్రక్రియవలన భస్మము భక్తుని మేను నెల్లెడల పరివ్యాప్తి చెందును. తాను శివుని రక్షణలో నున్నాననియును, అరిషడ్వర్గములు తన్నేమీ చేయలే"వని భక్తుడు భావించుకొనును. తద్వారా భక్తి మరింత ప్రౌఢతరమగును.

భస్మము మంత్రితము కావలెననెడిది గుర్తించవలసిన విషయము. మంత్రితమైన బూడిద భస్మమై విరాజిల్లును. లోకమున నెన్నియో మంత్రములు గలవు. ఏ మంత్రము చేత భస్మమును మంత్రితము చేయవలెననెడి సందేహము గలుగవచ్చును. తాంత్రికులనేక మంత్రములను సూచించిరి. వైదికులు వేదమంత్రములను సూచింతురు. "అగ్నిరితి" ఇత్యాది భస్మములను మంత్రించెడి మంత్రములెన్నియో గలవు. వీరశైవున కెయ్యది విహితమనెడి ప్రశ్న ఉదయించును. ఇట్టి సంశయము నివారింపగ కాబోలు, శ్రీ భగవత్పాదుల వారు పంచాక్షర మంత్రము చేత యభిమంత్రితమైన భస్మమును ధరించవలెనని స్పష్టముగా తను యుపదేశమున తెలిపినవారైరి. ఈ విషయమును భక్తుడు గ్రహించవలెను.

పంచాక్షరి మంత్రము నష్టావరణములలో వొకటి. భస్మమును పంచాక్షరి చేత యభిమంత్రణ చేయుట వలన భక్తునకు ద్విగుణీకృతమైన ఫలము సంప్రాప్తమగును. పంచాక్షరితోపాటు అగ్నిరితి భస్మయనెడి మంత్రమును కూడా పఠింప వచ్చును.

భస్మస్నానము భేదతత్త్వమునకు సంకేతము. నేను పరిశుద్ధుడను గాను. అశుద్ధిని నివారించుకొనెదను. శుద్ధుడైన శివుని మెప్పు పొందవలెనినిన భస్మస్నాన మవశ్యము. భస్మోద్ధూళనము భేదాభేద బుద్ధికి సంకేతము. "నాకు శివునికి భేదము గలదు. ఈ భేదభావమును తొలగించుకొనుటకు నేను రుద్రునిగా మారవలెను" అనెడి భావనతో భస్మోద్ధూళనను చేసుకొని లింగవాయుగగుటకు భక్తుడు ప్రయత్నించెడి దిశలో భస్మము యొక్క యుద్ధూళనను గ్రహించవలెను. స్మార్తులు నాచరించెడి న్యాసక్రియ వంటిదని గ్రహించవలెను. భస్మోద్ధూళనము చేసికొని తాను రుద్రస్వరూడనైతినని భక్తుడు భావించును. భస్మ త్రిపుండ్ర ధారణ చేసిన వారిని శివుడందురు. అనెడి శివశరణుల వాక్కులు స్మరణీయములు. పిండస్థలము నుండి భక్త స్థలమును ప్రవేశించిన భక్తుడు భస్మ స్నాన భస్మోద్ధూళన భస్మ త్రిపుండ్ర ధారణల వలన శివతత్త్వమును సాధించు దిశలో పయనించవలెను.

**శివంభూయాత్**

## ఆశీర్వచనము - 8

**శ్లో॥ మద్యాంగులిత్రయేణైవ స్వదక్షిణ కరస్యతు ।
షడంగులాయతం మానమపి వా లికమానకం ॥
నేత్రయుగ్మ ప్రమాణేన ఫాలే దృత్త్రి పుండ్రకం ।
మధ్యమానామి కాంగుష్ఠైరనులోమ విలోమతః ॥
ధారయేద్యస్త్రిపుండ్రాకంసరుదో నాత్ర సంశయః ।
యజుశ్వేత మనువ్యాప్తం స్నిగ్ధం శోత్ర ప్రమాణకం ॥** (సి.శి. 7 : 25-37)

మన కుడిచేతి నడిమి మూడు వేళ్ళ చేత. ఆరు అంగుళముల ఎత్తు గల్గినట్టి పాలము యొక్క ప్రమాణమునకు సరిపడినట్లు, రెండు కనుబొమ్మల చివరి వరకు త్రిపుండ్రములను ధరించవలెను. లేదా కుడిచేయి, మధ్యమ అనామిక మరియు అంగుష్ఠ వేళ్ళ చేతనైన అనులోమ లేదా విలోమ పద్ధతిన రెండు చెవుల మధ్య సరళము, శుభ్రము మరియు స్నిగ్ధమైన త్రిపుండ్రమును ఫాలమునందు ధరించవలెను. ఈ విధముగా త్రిపుండ్రములను ధరించిన వాడు నిస్సంశయముగా రుద్రుడే.

**శ్లో॥ ఏవం సల్లక్షణోపేతం త్రిపుండ్రంసర్వసిద్ధిదం ।
ప్రాతః కాలే చ మధ్యాహ్నే సాయాహ్నేచ త్రిపుండ్రకం ।
కదాచిద్భస్మనా కురియాత్ సరుద్రో నాత్ర సంశయః ॥** (సి.శి. 7-38)

ఈ విధముగా సలక్షణములతో కూడిన త్రిపుండ్రములను త్రికాలములయందు లేదా ఒక సమయమునందున ధరించిన యెడల యట్టివాడు నిస్సంశయంగా రుద్ర స్వరూపుడేయగును.

**శ్లో॥ ఏవంవిధం విభూత్యాహి కురుతే య స్త్రిపుండ్రకం ।
సరౌద్ర ధర్మ సంయుక్త స్త్ర యీమ య ఇతి శ్రుతిః ॥** (సి.శి. 7-39)

పూర్వోక్త విధి ప్రకారము త్రిపుండ్రమును ధరించిననాతడు "య ఇదం త్రిపుండ్రం ధరతే" యనెడి శ్రుతి వాక్య ప్రకారము శివస్వరూపుడును వేద స్వరూపుడును అగును.

## త్రిపుండ్ర ధారణ విధి విధానము

త్రిపుండ్ర ధారణ విధి విధానములను తెలుసుకున్న తర్వాత శ్రీ రేణుకా భగవత్పాదులవారు, ఉభయ విధి ప్రకారముగా లక్షణము మరియు ఫలమును బోధించుచున్నారు.

భస్మము యొక్క త్రిపుండ్రమును ధరించునపుడు కుడిచేయి నడిమి మూడు వ్రేళ్ళతో (తర్జన, మధ్యమ మరియు అనామికల) జలమిశ్రితమైన భస్మమును లేపనము చేసుకొని మస్తకాదులందు ధరించుట మొదట పద్ధతి.

ఇంకను, అనామిక, మధ్యమ మరియు అంగుష్టములనెడి మూడు వ్రేళ్ళతో అనులోమ విలోమ పద్ధతి ప్రకారము త్రిపుండ్ర ధారణ చేయునది రెండో పద్ధతి. ఈ పద్ధతి ప్రకారము ధరించునపుడు॥ మధ్యమానాకాభ్యాం అనులోమతః ప్రదక్షిణతః రేఖాద్వయం తన్మద్యే అంగుష్ఠేన విలోమతః అప్రదక్షిణతః ఏకాం రేఖాం రచయేత్ ॥ యనెడి శ్రీమ న్నిరంజన మరి తొంటదార్యుల తత్త్వ దీపిక వ్యాఖ్యానము ప్రకారము కుడిచేతి మధ్యమ మరియు అనామిక వ్రేళ్ళచేత పాలమునందు ఎడమ నుంచి కుడికి రెండు రేఖలను ప్రదక్షిణా క్రమమునందు ధరించి, యానంతరము బొటనవ్రేలి చేత కుడి నుండి ఎడమకు మొదటి రెండు రేఖల మధ్య ధరించవలయును. ఇదే అనులోమ, విలోమ పద్ధతి. ఈ పద్ధతి శివపురాణమునందు కూడా చెప్పబడినది. గమనించుడి.

శ్లో॥ మధ్యమానామి కాంగుళ్య మధ్యేత్ ప్రతిలోమతిః ।
అంగుష్ఠేన కృతారేఖ త్రిపుండ్రాఖ్యభిధీయతే ॥ (సి.శి. విద్యా 24-86-87)

ఈ ప్రకారము ధరించునది సర్వోత్కృష్టమైన పద్ధతి యనబడును. దీనిని చేయుటకు సాధ్యము గాని యెడల, మొదట చెప్పిన పద్ధతినే అవలంబింపగలరు.

## త్రిపుండ్రము యొక్క లక్షణము - ప్రమాణము

పూజ్యపాదులు త్రిపుండ్రము యొక్క ప్రమాణమును ప్రతిపాదించుచు. "ఋజుశ్వేత మనోవ్యాప్తం స్నిగ్ధం" యని ఆదేశించిరి. మనము ధరించెడి భస్మము సరళరేఖగా శుభ్రముగాను, స్నిగ్ధముగా యుండవలెను. కొందరు జనులు అతి సూక్ష్మముగా, కడ్డీతో వ్రాసిన దాని వలె రేఖలను ధరింతురు. ఇది శాస్త్ర సమ్మతమైనది కాదు. మన వ్రేళ్ళు ఎంత మందముగానుండునో, భస్మరేఖలు కూడా అంతే ప్రమాణముగా నుండవలెను. వాటిని చెరిపి లేదా సరిదిద్ది చిన్నవిగా చేయుట యుక్తమైన చర్యగాదు.

ఫాలమునందు ధరియించెడి భస్మము యొక్క ప్రమాణము లేదా పొడవు ఆరు అంగుళములు లేదా రెండు వైపుల కంతల అంతము వరకు లేదా, రెండు కళ్ళ చివరల వరకు లేదా, రెండు చెవులను కల్పునట్టులుగా ఉండవలెను.

ఈ రీతిగా, చతుర్విధ పద్ధతులలో ఏదో ఒక పద్ధతి ప్రకారము త్రిపుండ్రములను ధరించవచ్చును.

## త్రిపుండ్ర ధారణ - కాలములు

మహాచార్యులవారి ఆదేశముల ప్రకారము త్రికాలములందు అనగా ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము తప్పనిసరిగా భస్మమును ధరించవలెను. సర్వత్ర యిది సాధ్యముగాని యెడల సాధ్యమైన సమయములందు ముఖ్యముగా ఉదయమునందు మాత్రము తప్పనిసరిగా ధరించవలెను. ఈ సందర్భమున మరొక విషయమును చెప్పవలసియున్నది. అది యేమనగా భస్మధారణకు కాలనియమముండునే ? నిరంతరము ఫాలభాగమున భస్మ త్రిపుండ్రములు కన్పించే విధముగా ధరించిన వాడే ఉత్తమోత్తముడని భావించబడును.

## త్రిపుండ్ర ధారణ ఫలము

శ్లో॥ ఏవం విధం విభుత్యాహిః కురుతేయస్త్రిపుండ్రకం ।
సరౌద్ర ధర్మసంయుక్త స్త్రయీామయ ఇతిశ్రుతిః ॥ (సి.శి. 7-39)

పై శ్లోకమున వివరించినట్లుగా త్రిపుండ్రములను ధరించిన వానికి రుద్ర పదవి లభించునని ఆచార్యునివాక్యము. శ్రుతి వాక్యము కూడా యీ విధముగానే యున్నది. గమనించుడీ.

శ్లో॥ యఇదం త్రిపుండ్రం ధరతీ స వేదత్రయధారీ !
భవతిస సంతతం త్రేతాగ్నిర్భవతి స పుష్కరత్రయ ।
స్నాతోభవతీ యస్త్రిపుండ్రధారి పురుషః సరుద్రః ॥

ఈ శృతి వాక్యము ప్రకారము త్రిపుండ్ర ధారణవలన ఎన్నో పలములు లభించుచున్నవని తెలుపుచూ చివరకు యట్టివాడు రుద్రుడే యగునని తెలియ చెప్పబడినది.

## త్రిపుండ్రధారిని సత్కరించుట చేత ఒనగూరు ఫలం

త్రిపుండ్రమును ధరించని వారి జతకు, త్రిపుండ్రధారులను సత్కరించుట వీరశైవుల ఆతిథ్య కర్మమై యున్నది. ఈ కారణమున భస్మనిష్ఠులు, త్రిపుండ్రధారులగు గురు జంగములు యింటికి వచ్చిన యెడల వారి పాదములను ప్రక్షాళన చేసి ఆ నీటిని ఇంటిలోని

యన్ని భాగములలోన సంప్రోక్షణ చేసి వారిని సత్కరించిన యెడల గృహస్తుల యొక్క సకల పాపములు దూరమై వారు పునీతులగుచున్నారు. ఈ విషయమును ధృవపరిచెడి ప్రమాణ మొకటి సౌర సంహితలో గలదు. శ్రీ నీలకంఠ శివాచార్యులవారు అద్దానిని క్రియాసారములో పొందుపరచిరని గమనించుడీ.

**శ్లో॥ త్రిపుండ్రధారిణః పాదౌ ప్రక్షాలయతి యఃపుమాన్ ।**
**సర్వ పాతక యుక్తోపి స సద్యః పూయతే నరః ॥** (క్రి.సా. ఉ.దే. 8-పుట 79)

సాధారణముగా కొందరు పనిగట్టుకొని త్రిపుండ్రములను ధరించెడి వారిని నిందిస్తూ ద్వేషభావమును వెలిబుచ్చుదురు. అట్టివారికి కలిగెడి ఫలమేమిటో తెలిపే ప్రమాణము ఈ క్రిందినివ్వ బడినది.

**శ్లో॥ త్రిపుండ్రం ఏ వినిందంతి నిందంతి శివమేవతే ॥**

ఈ ప్రమాణము ప్రకారము, ఎవ్వరైతే త్రిపుండ్రధారిని నిందింతురో వారు సాక్షాత్, శివుని నిందించినట్లుగా తెలుసుకోగలరు. ఈ ప్రమాణము వలన సిద్ధమయ్యెడిదేమనగా త్రిపుండ్ర ధారిణికిని శివునికిని అభేదము కలదు. కావున అతనిని నిందించిన శివనిందయైనటులే, అతనిని సత్కరించిన యెడల శివుని సత్కరించినటులనే యగును కదా ! అందుచేత భస్మధారణను విధిగా చేసెవారిని సత్కరించెధి సత్‌సంప్రదాయమును స్థాపించి సంపన్నులు కావలెను.

ఇదియునుగాక, కేవలము త్రిపుండ్రధారి యొక్క ముఖమును చూపెడు వ్రతము కలవారు, ఎందరో గలరనియును, అట్టివారికి భోగభాగ్యములబ్బినవనియును, పురాణములలో అనేక కథలు కలవు. దీని భావమేమనగా శివదర్శనము వలన గల్గెడి ఫలము. త్రిపుండ్రధారిని దర్శించడములన సిద్ధించును. ఇట్టివి ఆధునికులకు చోద్యము గొల్పెడివిగా కన్పించినను, నైష్టి కులకు యిందులోని భావము స్పష్టముగానే గోచరించును. ఈ విధముగా శ్రీ రేణుక భగవత్పాదులవారు. ఆదేశించిన ప్రకారము ప్రతి ఒక్కరు భస్మ త్రిపుండ్రములను విహితమైన పద్ధతులలో ధరించి సత్ఫలితములను పొందుటయే గాకుండ భస్మ త్రిపుండ్ర ధారులను గౌరవించి, శివదర్శనము వలన గలిగే ఫలమును బడయగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 28-8-1990

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

## విశేషప్రదీపిక

భస్మ త్రిపుండ్ర ధారణ విధివిధానమును శ్రీ కాశీ జగద్గురువుల వారు వివరించి భక్తలోకమున కెంతో నుపకారమును చేసిరి.

భస్మ త్రిపుండ్ర ధారణ చేయుట యనివార్యమైనదని చెప్పుచున్న యీ క్రింది శ్లోకమును గనుడి.

**శ్లో॥ పంచాక్షర జపం భస్మ స్నానం లింగార్చనం త్రయం**
**కదాచిదపి నత్యాజ్యం యథా శక్తి సమాచరేత్ ॥**
**ఉద్ధూళనం త్రిపుండ్రంచ మాయా పాశనివృత్తయే**
**ఆయనంతి మునిశ్రేష్ఠా అథర్వ శిరసి స్థితాః ॥**

ఈ శ్లోకము ప్రకారము ప్రతిజీవికి భస్మస్నానము, భస్మోద్ధూళనము, భస్మ త్రిపుండ్ర ధారణము, పంచాక్షరీ మంత్రజపము, లింగార్చన ములనెడివి యెట్టి సందర్భమునను విడువకూడని వైయున్నవి. అట్టి యెడ వీరశైవులకు వేరుగా చెప్పు నావశ్యకత లేదు. సామాన్య జనులకును నసుల్లగంఘనీయమైనవి వీరశైవులందరు ననుల్లంఘనీయమే కదా. ఉల్లంఘనీయము కాదని చెప్పుటకు గల కారణము శ్లోకములోనే యివ్వబడినది. మాయాపాశము నుండి విడివడి శుద్ధ తత్త్వముల వైపు పురోగమించుటకై భస్మ త్రిపుండ్ర ధారణ యవశ్యమైనదని తెలుపబడినది. భస్మ త్రిపుండ్రమును ధరించనివారు మాయాపరవశులై పతనమొదురని తెలియవలెను. మాయామోహితుడైన వాడు తన సాంగత్యమున నున్నవారిని కూడా పతనము చేయును. ఈ కారణము వలననే కాబోలు భస్మ త్రిపుండ్రములు ధరించని వారు నిందనీయులైరి. వీరిలో నూర్ధ్వ పుండ్రములు ధరించెడివారును గలరని తెలిసికొనవలెను. పండితారాధ్య చరిత్రలోను, అన్యవాద కోలాహలములోను ఊర్ధ్వ పుండ్రములు దాల్చిన వారి నిరసనను గాంచగలము. ఈ నిరసన తాత్త్విక పరమైనదే. భస్మ తిర్యక్ త్రిపుండ్రముల యొక్క శ్రేష్ఠతను ప్రతిష్ఠాపన జేసి, చదువరులను సన్మార్గములో పయనించే విధముగా మార్చుటయే యీ నిరసన యొక్క పరమార్థమని గ్రహించవలెను.

త్రిపుండ్ర ధారణ విధానములో గల భేదములు చాలావరకు గలవు. వీటిలో నేది శ్రేష్ఠమైనదని తెలుపుటలో ప్రయోజనము శూన్యము. విభూతి పత్రికలో, చదువరుల ప్రశ్నకు సమాధానము నిచ్చుచు, సులభమైన మార్గమును ననుసరించుటయే కర్తవ్యమని శ్రీ పండిత చిదిరేమఠం వీరభద్రశర్మ (కాశీ జగద్గురు) గారు తెలిపియుండిరి. శివ పురాణము ఇత్యాదులలోన "తర్జని-మధ్యమ-అనామికల ద్వారా చేసెడి భస్మధారణనే వివరించ బడినది. ఏ విధిన చేసిననూ సరియే. కావలసిన దేమనగా తప్పనిసరిగా యేదో నొక విధిన భస్మ త్రిపుండ్ర ధారణ చేయవలెను. త్రికాలములనెడి నియమము నావశ్యకము. వీరశైవుడు సర్వదా భస్మ త్రిపుండ్ర ధారణ గల్గిన వాడైయుండవలెను.

**శివంభూయాత్**

## ఆశీర్వచనము : 9

శ్లో॥ **బ్రహ్మ విష్ణుశ్చ రుద్రశ్చ దేవాః శక్రపురోగమాః ।**
**త్రిపుండ్రం ధారయంత్యేవ భస్మనాపరికల్పితం ॥** (సి.శి. 7-41)

త్రిమూర్తులును, ఇంద్రాది దేవతలును భస్మ త్రిపుండ్రముల ధరింతురు.

శ్లో॥ **వశిష్ఠాద్యామహాభాగా మునయః శ్రుతి కోవిదాః ।**
**ధారయంతిసదాకాలం త్రిపుండ్రం భస్మనా కృతం ॥** (సి.శి. 7-41)

శ్రుతికోవిదులైన వశిష్ఠాది ఋషులు సదా భస్మ త్రిపుండ్రములను ధరింతురు.

శ్లో॥ **శైవాగమేషు వేదేషు పురాణేష్వఖిలేషుచ ।**
**స్మృతీ తిహా సకల్పేషు విహితం భస్మ పుండ్రకం ॥** (సి.శి. 7-42)

వేదాగమ పురాణేతిహాసములలోను, స్మృతి కల్పములలోను భస్మ త్రిపుండ్ర ధారణ విహితమైయున్నది.

శ్లో॥ **ధారణేయం సమస్తానాం శైవానాం చ విశేషతః ।**
**నాస్తికో భిన్న మర్యాదో దురాచార పరాయణః ।**
**భస్మ త్రిపుండ్రధారీ చేన్ముచ్యతే సర్వకిల్బిషైః ॥** (సి.శి. 7-43)

ఎల్లరూ ముఖ్యముగా శైవులు భస్మమును విధిగా ధరించవలెను. నాస్తికులు, భిన్న మర్యాదగలవారు, దురాచారములు చేసెడి వారున్నూ భస్మమును ధరించవలెను. వారెల్లరూ పరిశుద్ధాంతరంగులు అయ్యెదరు.

## భస్మ త్రిపుండ్ర ధారణ - ప్రాచీనత్వము :

శివుడు దేవతలందరికినీ దేవుడై పూజలనందుకొనుచున్నాడు. అందుచేత దేవదేవుడనెడి సార్థక నామధేయము చేత పిలువబడుచున్నాడు. అందరికీ అన్నీ ఇచ్చి తనకంటూ ఏమియూ మిగిల్చుకొనక యుండుటయే యతని మహాత్మ్యము. ఈ విషయమును పుష్పదంతుడు ఎంతో రమ్యముగా చిత్రించెను కనుడి:

శ్లో॥ **మహోక్షః ఖట్వాంగం పరశురజినం భస్మ ఫణినః ।**
**కపాలం చేతీయత్తవవరదతంత్రోపకరణం ॥**
**సురాస్తాం తామృద్ధిం విదధతి భవద్భ్రూ ప్రణిహితాం ।**
**న హిస్వాత్మారామం విషయ మృగతృష్ణా భ్రమయతి ॥**

ముదుసలి యెద్దు, మంచపుకోడు, గొడ్డలి, మృగచర్మము, భస్మము, సర్పము, బ్రహ్మ కపాలములే సాధనములుగా గల శివుడు దరిద్రుడుగా దోచినను సర్వదేవతలకు సకల సంపదల నొసగగలిగిన మహదైశ్వర్యశాలి శివుడు అనెడి పుష్పదంతుడి మతము.

బ్రహ్మ విష్ణ్వాది దేవతలును, రాముడు, కృష్ణుడు మొదలగు మహాపురుషులును పదవులను, ప్రతిష్ఠలను, విజయములను మరియు సంతానాదుల నాకాంక్షించి శివుని పూజించి వారి వారి మనోరథములను నెరవేర్చుకొనిరని తెలిపెడి పౌరాణిక కథలెన్నియో కలవు. పూజించునప్పుడు 'పాశుపత దీక్ష'ను పొందిరి. తద్వ్రత నియమముల కనుగుణముగనే భస్మస్నాన, భస్మద్ధూళన, భస్మత్రిపుంద్ర ధారణలను చేసిరి. ఈ కారణము వలననే శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు, ఈ విషయమునే "బ్రహ్మా విష్ణుశ్చ ... త్రిపుంద్రం ధారయంతి" అని ఉపదేశించిరి. అదే విధిన సకల శాస్త్ర పారంగతులును, శ్రుతి కోవిదులును అగు వశిష్ఠాది ఋషులును శివభక్తులై భస్మ త్రిపుంద్ర ధారణను చేసి, తపస్సిద్ధిని బడసిలోకమున విఖ్యాతులైరి. ఈ విధముగా భస్మధారణ యొక్క ప్రాచీనత సుప్రతిష్ఠితమైయున్నదని తెలియుచున్నది.

"మహాజనో ఏనగతః సపంథాః" అనెడి లోకోక్తి ననుసరించి మహాపురుషులు నడిచిన మార్గముననే సామాన్యులు అనుసరించుట యనెడిది శ్రేయస్కరము కాగలదు.

శ్రీ మహావిష్ణువు దశావతారములను దాల్చినది లోకమెరిగన సత్యమే. అవతరించిన సందర్భము నందున పలుమార్లు భస్మధారియై శివారాధన చేసెను. ఈ యవతారపురుషులకు భక్తులైన వారెల్లరూ, వారి ఇష్టదైవము యొక్క అభీష్టమును నెరవేర్చిన శివుని యెడల భక్తిని పెంచుకొని భస్మ త్రిపుంద్రములను ధరించి శివానుగ్రహమునకు పాత్రులై తద్వారా వారి ఇష్టదైవములను ప్రసన్నులుగా చేసుకొనవలెను. కోరిన కోర్కెలు నెరవేరునను విషయము గమనార్హమై యున్నది.

## త్రిపుంద్ర ధారణ - వేదాగమ సమ్మతము :

భారతదేశములోని ధర్మములన్నింటికిని వేదాగమములే మూలసూత్రములైయున్నవి. అందుచేత, యే ధర్మము వారైనను వారివారి ధర్మ సిద్ధాంతములను ప్రతిపాదించునప్పుడు వేదాగమముల నుండి ప్రమాణములనుదహరించి ఆయా సిద్ధాంతములను స్థిరపరచుకొందురు. ఈ కారణముననే ఆయా ఆచార్యులు వ్రాసిన గ్రంథములలో వేదాగమ పురాణాదుల నుండి గ్రహించిన ప్రమాణములు విస్తృతముగా ఉండును.

పన్నెండవ శతాబ్దికి చెందిన శివ శరణులు ఆచార్య పద్ధతిని అనుసరించిరి వారి వచనములలో వేదాగమ పురాణాదుల నుండి గ్రహింపబడిన ప్రమాణములను పొందుపరిచిరి. ఇంతవరకు ఉపదేశము చేయబడిన భస్మధారణ వేదాగమ సమ్మతమే యని నిరూపితము చేయుటకై బహు విధ ప్రమాణములను ఉపనిషత్తు నుండియు, కల్పసూత్రముల నుండియు చూపబడినవి. అందుచేత వీరశైవులకు శివాగమములు, వేదముల మూలములనే విషయములు ఎవ్వరూ మరువకూడదు.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు తమ సిద్ధాంతము వేదాగమ సమ్మతమేనని వివరించిరి. సిద్ధాంత శిఖామణిలో ఈ విషయము తెలుపబడినది. వీరశైవులకు సిద్ధాంత శిఖామణి ప్రామాణిక గ్రంథమని గుర్తించవలెను. ఉపనిషత్తుల నుండియు కల్పి సూత్రముల నుండియు ప్రమాణములు చూపబడినవి. ఆ సిద్ధాంత శిఖామణిలో ఉన్న ప్రమాణములే.

తరువాతి కాలములో శివాచార్యులచే వ్రాయబడిన శ్రీకర భాష్యము, క్రియాసారము, వీరశైవానంద చంద్రిక యిత్యాది గ్రంథములు వేదాగమ పురాణాదుల నాధారము చేసుకొని రచింపబడినవే. భస్మధారణ గూర్చి అనేక ప్రమాణము లివ్వబడినవి. ఆసక్తి గలవారు ఈ గ్రంథములను పఠించగలరు.

## త్రిపుంద్రధారణ - కిల్బిష క్షయము

వేదాగమ సమ్మతమై పురాణాదులలో ప్రచలితమై యున్న భస్మధారణ వలన కిల్బిషములు దూరమగునని తెలిసికొనగలరు. నాస్తికుల నైననూ ఆస్తికులుగా మార్చెడి శక్తి యీ భస్మధారణకు గలదని, దురాచారులు సదాచారులుగా మారుదురని ఆచార్యులవారు సెలవిచ్చిరి.

నేటి కాలమున నాస్తికుల సంఖ్యయూ, దురాచారుల సంఖ్యయూ నానాటికి పెరుగుచున్నది. ఈ నేపథ్యమున భస్మ త్రిపుంధ్రధారణకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత గలదు. భస్మ స్పర్శచే పాపాత్ములైననూ పుణ్యాత్ములౌదురు. దీని నిరూపణకై యొక ప్రాచీన దృష్టాంతము గమనించెదము.

ప్రాచీనకాలమున నొక బ్రాహ్మణుడు, ధర్మబద్ధమైన జీవితమును మరిచి విచ్చలవిడిగా ప్రవర్తింప జొచ్చెను. నిషిద్ధానిషిద్ధములను, విహితావిహితముల నెంచక తిరుగాడజొచ్చెను. తత్ఫలితముగా వాడు బ్రహ్మరాక్షసిగా జన్మించెను. ఆ రాక్షసుడు, అటు ఇటు సంచరించుచూ క్రౌంచ మనెడి పేరుగల వనమునకు వచ్చెను. అచటనొక శివభక్తుడు భస్మస్నాన, భస్మోద్ధూలన, భస్మత్రిపుంధ్ర ధారణలను సలిపికొని శివధ్యానమున నిమగ్నుడై యుండుట గనెను. బ్రహ్మరాక్షసికి ఆకలిగొనెను.

బ్రహ్మరాక్షసుడు శివభక్తుని తిని తన ఆకలిబాధను తగ్గించుకొననెంచెను. శివభక్తుని సమీపించి, చేతితో తాకగా, శివభక్తుని మేనునగల భస్మపు కణములు రాక్షసుని చేతికి అంటుకొనెను. మరుక్షణముననే, రాక్షసుని పాపము నశించి. దివ్యాత్ముడుగా పరిణామము నొందెను. బ్రహ్మరాక్షసుడు తన పూర్వపు క్రూరస్వభావమును వీడి ప్రశాంత మనస్కుడయ్యెను. బ్రహ్మరాక్షసుడు మార్పునకు గల కారణమేమో యెరుగకుండెను. అతడు శివభక్తుని గురువుగా భావించుకొని పాదాక్రాంతుడై అనుగ్రహించుమని వేడెను. శివభక్తుడు భస్మ త్రిపుంధ్ర ధారణాదుల మహిమను వివరించి వానిలోని మార్పునకు భస్మమే కారణమని తెలిపిరి. రాక్షసుడు సంతోషభరితాంగుడయ్యెను. శివభక్తుని యనుజ్ఞన బడసి శివధామమును చేరిన వాడయ్యెను.

ఈ తీరున, భస్మధారణ మహిమ అపారముగా నున్నది. దీనియందున యెవరు యెంత శ్రద్ధ వహింతురో వారికి అంత ఫలితము గల్గునని అనుభవజ్ఞుల యభిప్రాయము శ్రీ రేణుక భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షికి భస్మధారణ మహిమను గూర్చి ఉపదేశమునిచ్చిరి. తద్వారా లోకకళ్యాణమును సాధించ సమకట్టిరి. జగత్తులోని వారెల్లరూ భస్మధారణ మహిమను తెలుసుకొనుటకై అవకాశమును కల్పించిరి. శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు ఆదేశించిన పద్ధతి ప్రకారము శివభక్తులు భస్మమును ధరించువలెను. భస్మస్నానము, భస్మోద్ధూళనములను క్రమ ప్రకారముగా చేపట్టవలెను. తాము చేసిన దురితములను దూరము చేసికొని పునీతులు కావలెను. వీరవ్రతులైన వీరశైవులు వీరభావమును వీడక భస్మధారణను విధిగా చేయవలెను.

ఆచార్యులవారి ఆదేశమును పాలించి, భస్మ స్నాన భస్మోద్ధూళన మరియు భస్మత్రిపుంధ్ర ధారణలను చేసుకొనిన వారికి ఇహలోక మరియు పరలోక సుఖములు ప్రాప్తమగును. అంత్యమున సద్గతి లభించును.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 7-8-1990

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

## విశేష ప్రదీపిక

దీనితో శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభయను గ్రంథమును భస్మధారణ స్థలము సప్తమ పరిచ్ఛేదము సంపూర్ణము.

శ్రీ కాశీ జగద్గురువుల వారు భస్మధారణ యొక్క ప్రాచీనత్వమును నెంతయో సుందరముగా ప్రవచించిరి.

భస్మధారణ యనివార్యమని ఇంతకు క్రితమే తెలుసుకొంటిమి. లౌకిక దృష్టి గల వారికిని, కామితార్థములు వాంఛించెడి వారికిని భస్మత్రిపుంధ్రధారణ యవశ్యమని తెలిపెడి ఈ ప్రమాణమును గనుడి :

**ధర 'గృతం స్వాదకృతం తేన' యన భూతి**
**లేకెద్ది చేసిన లేదు ఫలము**
**ధర శ్రుత మప్య శ్రుతం భవేత్తన భూతి**
**లేకెద్ది విన్నను లేదు ఫలము**

**తగనది తమనది తం చైవ యన భూతి**
**లేకెద్ది నుడివిన లేదు ఫలము**
**పొరి నదీక్షా నతపోమంత్ర మన భూతి**
**లేకెద్ది దొడిగిన లేదు ఫలము ॥**

**యనుచు జదివి చదివి యామ్నాయ నుతభస్మ**
**విముఖ వృత్తి జెడిరి వెట్టి జన్మ**
**లెట్టి పాపమతులో యేకాగ్ర గురు చిత్త**
**నలిన భృంగ సోమనాథ లింగ ॥** (అన్యవాద కోలాహలము, ప. 15)

శ్రీ భగవత్పాదుల వారి వాక్కులకు నేకాగ్రనాథుడు విస్తృతరూపము గల్పించెనని తెలియుచున్నది. సనత్కుమార సంహితలోను నిట్టి భావములనే గాంచగలము.

**శుభం భూయాత్**

# రుద్రాక్ష ధారణా స్థలము

## ఆశీర్వచనము : 1

**శ్లో॥ భస్మనా విహిత స్నాన త్రిస్త్రిపుండ్రాం కిత మస్తక ః ।**
**శివార్చన పరోనిత్యం రుద్రాక్షమపిధారయేత్ ॥** (సి.శి. 1)

విహితమగు రీతిన భస్మస్నానమాచరించి, భస్మ త్రిపుండ్రములను ధరించెడి శివార్చనాపరుడు రుద్రాక్షలను ధరించవలెను.

**శ్లో॥ రుద్రాక్ష ధారణాదేవ ము చ్యంతే సర్వపాతకైః ।**
**దుష్టచిత్తా దురాచారా దుష్ప్రజ్ఞాపి మానవాః ॥** (సి.శి. 2)

## రుద్రాక్షధారణ నిత్యకార్యము :

వీరశైవ సిద్ధాంతమందున నిత్యకర్మమనగా భస్మ, రుద్రాక్ష, ఇష్ట లింగధారణలు అట్టి నిత్య కర్మలోని అంతర్భాగములు. సౌకారణమువలననే శ్రీ రేణుక భగవత్పాదుల వారు "రుద్రాక్షాం నిత్యం ధారయేత్" అని ఆదేశము నిచ్చిరి. రుద్రాక్షను ధరించకుండగ శివపూజాదులను చేసిన యెడల వాటి ఫలములు పూర్ణముగా లభించవని తెలిపిరి. "శివార్చనపరోధారయేత్ రుద్రాక్షం" అని శ్రీ భగవత్పాదుల వారు శివార్చకులకెల్లరకు ఆదేశమునిచ్చిరి.

సిద్ధాంత శిఖామణికి వ్యాఖ్యానమును వ్రాసిన శ్రీ మరితొంట దార్యులవారు, వారి వీరశైవానంద చంద్రికయందున లింగపురాణములోని ప్రమాణమును చూపి, రుద్రాక్ష ధారణ చేయకుండగ నెట్టి కర్మలను నాచరించినను నవి నిష్ఫలములగునని తెలిపిరి. వారిచ్చిన ప్రమాణమును కనుడి.

**శ్లో॥ అరుద్రాక్ష ధరోభూత్వా యత్కించిత్కర్మ వైదికం ।**
**కుర్యా ద్విప్రస్తు యోమోహాన్నాసా వాప్నోతి తత్ఫలం ॥**

ఎవ్వడైనను రుద్రాక్షలను ధరించకుండగ యే చిన్నవైదిక కర్మను చేసినను దాని ఫలము లభించదని, పురాణోక్తి లోని భావము. ఈ ప్రమాణము దృష్ట్యా రుద్రాక్ష ధారణ వైదికులెల్లరకును అనివార్యమైనది. వారు చేసే నిత్య నైమిత్తికాదులలోను, ప్రాయశ్చిత్త కర్మములలోను భస్మ రుద్రాక్ష యనుల్లంఘనీయమని తెలియుచున్నది.

"నిత్య సదా యావదాయుః" అనెడి విజ్ఞోక్తి ప్రకారము ఆయువు ఉన్నంతవరకూ చేయవలసిన కార్యమే నిత్య కార్యమగుచున్నది. శ్రీ పూజ్యపాదుల వారి "నిత్యం రుద్రాక్షం ధారయేత్" అనెడి ఆదేశములోని అర్థమేమనగా ఆయువున్నంత వరకు రుద్రాక్షధారణ చేయవలెను. ఇది మానవులెల్లరకూ విహితమే. శివార్చనను ఇష్టలింగార్చన రూపములో చేసెడి వీరశైవులు, ఇష్టలింగధారణ మరియు పూజన, భస్మధారణలతో బాటుగా రుద్రాక్షధారణను విధిగా చేయవలెను. ఇష్టలింగార్చన చేసికొనెడి సమయములలో వీరశైవుడు సర్వాంగముల యందును రుద్రాక్షలను ధరించవలెను.

## రుద్రాక్షధారణ - చిత్తశుద్ధి :

"ప్రయోజనమనుద్దిశ్యన మందోపి ప్రవర్తతే" యనెడి వ్యావహారిక నుడిప్రకారము ప్రయోజనము లేనిదే యెవరును నేకార్యమునైననూ చేయరు. అట్లైన యెడల రుద్రాక్ష ధారణ యొక్క ప్రయోజన మెయ్యది ? అనెడి సందేహము కలుగవచ్చును. శ్రీ జగదాచార్యులవారు "మానవాః ముచ్యంతే సర్వపాతకైః" అని సందేహమునకు తగిన సమాధానమును ఇచ్చిరి. రుద్రాక్షలను ధరించినవారు సకల విధములైన పాతకముల నుండి విముక్తిని పొందెదరనెడిది ఆచార్యోపదేశములోని భావము.

పాతకమనగానేమి ? యనే ప్రశ్నకు "పాతయతీతి పాతకం" అనెడి వ్యుత్పత్తియుత్తరమగును. మనలకు పతనము గల్గించునదే పాతకమగుచున్నదనేది యీ వ్యుత్పత్తిలోని భావము. మానవుడు తాను చేసిన దుష్కర్మల వలన పతితుడగుచున్నాడు. పాపానుగుణము చేత చెట్టుగాను, చేమగాను, క్రిమిగాను, కీటకముగాను" మనుజుడు పుట్టుచున్నాడని శ్రీ నిజగుణ శివయోగిగారు సెలవిచ్చిరి.

ఎంతో నెత్తైన సౌధమును సోపానముల సహాయముతో నెక్కి పైమెట్టు మీద నిలుచుండి యటు యిటు చూచుట సర్వ సాధారణమే కదా ! కాని అజాగ్రత్త వహించిన యెడల, పై మెట్టు మీద నుండి కాలుజారిపడి, తత్ఫలితముగా దొరలుచూ దొరలుచూ క్రింది మెట్టు సమీపమున పడును. గాయములునై స్పృహ తప్పును. ప్రాణములును కోల్పోయే స్థితి కలుగును. ఇదే విధిన వివిధ యోనులలో చేసిన శుభకర్మల ఫలితముగా మానవజన్మ నెత్తిన జీవి సావధాన చిత్తుడై ఒకవేళ చేయకూడని నిషిద్ధ కర్మములను చేసిన యెడల, మరణానంతరము నీచ జన్మలకు లోనగుచున్నాడు పశుపక్ష్యాదులుగా పుట్టుచున్నాడు.

నిషిద్ధ కార్యములు చేయవలెననెడి కోరిక జీవికి సహజముగనే సిద్ధించును. అందుచేతనే సురాపానము, పరస్త్రీ గమనము, దొంగతనము ద్వారా పరవిత్తమును పొందుట యిత్యాదులు మానవుని సహజ ప్రవృత్తులుగా కనిపించును. వీటియందున కొంత మేరకు కొంత పరిమిత కాలము వరకు సంతోషముండు ననెడిది వాస్తవమే అయితే ఈ కర్మల యొక్క పరిణామములు మహాభయానకములుగా నుండును.

ప్రజ్ఞాహీనుడై, దుర్జనుల సహవాస ఫలితముగా చేయకూడని మహాపాతకములను చేసి, చివరకు బుద్ధివచ్చి, పశ్చాత్తాపమునకు గురయ్యెడి వానికి తరుణోపాయము గలదా ? అతడు హీనమైన జన్మలను పొందకుండగ రక్షణను కల్పించెడి సాధనములే మైనను గలవా ? అనే ప్రశ్నలు తలయెత్తుట సహజమే.

అట్టివారికి తరుణోపాయమును చూపిన ఆచార్య రేణుక భగవత్పాదుల వారు, లోకమునకు మహోపకారమును చేసిరి "దుష్ట చిత్తా దురాచారా దుష్ప్రజ్ఞాపి మానవాః సర్వపాతకైః ముచ్యంతే, రుద్రాక్ష ధారణాదేవ" యని అభయమును ప్రదానము చేసిరి.

"పాపంతు పాతకం" అనెడి కోషములోని వచనము ప్రకారము, పాపము పాతకములనెడివి పర్యాయపదములు. కాని వ్యుత్పత్తులలో భేదము గోచరించుచున్నది. "పాతయతీతి పాతకం" అనేది పాతమునకు వ్యుత్పత్తికాగా, "పిబతి కర్తారం ఇతి పాపం" అనెడిది పాపమునకు గల వ్యుత్పత్తి పాతకమును సూచిస్తే పాపము నాశనమును సూచించును. ఏ నిషిద్ధ పనిని చేసి ఆ పని చేతనే త్రాగబడుచున్నాడో లేదా భక్షింపబడుచున్నాడో అయ్యది పాపమని పిలువబడుచున్నది. వ్యుత్పత్తులెట్లులున్ననూ, రెంటి ఫలితమొక్కటే. వాటిని చేసే వానికి నాశనము కలుగును. మనుష్యులు తామే చేసిన పాపము యొక్క పరిణామముగా నాశనమగుచున్నారనునది మాత్రము గమనించదగిన విషయము.

**శ్లో॥ యావచ్చ పాపం దేహిః తావత్సిదిర్ నజాయతే ।**
**గతేచ పాతకే తస్యా సర్వం చ సఫలం భవేత్ ॥** (శి.పు.రుద్ర సంహిత సృష్టి ఖండం : 12-70)

ఈ ప్రమాణము ప్రకారము మనుజుని పతనమునకు, వినాశనమునకు కారణభూతమైన ఈ పాపం లేదా పాతకము యొక్క నివృత్తి కానిదే, మనుజుని యొక్క శుభకామములు సిద్ధింపజాలవు.

మనుష్యుని కృతి ఆతని విచారాధీనమై యుండును. చెడ్డపనులను చేయుటకు ముందుగనే చెడ్డ ఆలోచనలు మనస్సునందు రూపుదిద్దుకొనియుండును. ఈ విధముగా దుష్ట చిత్తుడైన వాడే దురాచారియగను. దురాచారియైన వాడు తన యొక్క ప్రజ్ఞనను మరియు యుక్తాయుక్త విచక్షణను, కోల్పోయినవాడు వినాశన ఉన్మఖతను పొందుచున్నాడు.

చెడ్డ యోచనలకు, చెడ్డవారి సంగమమే కారణము. అందుచేతనే సాంగత్యము వలన కామము, కామము వలన క్రోధము, క్రోధము వలన మోహము, మోహము వలన స్మృతి భ్రంశము, స్మృతి భ్రంశము వలన బుద్ధి నాశనము, తత్ఫలితముగా సర్వము నాశనమగునని గీతాచార్యుడు ప్రవచించెను. ఈ విచారములన్నింటిని అవలోకనము చేసిన పిదప మన మనోబుద్ధులే మన సద్గతికి నాంది యని తెలియుచున్నది. బుద్ధి శుద్ధిగా నుండిన యెడల సద్గతియును, తద్విరుద్ధముగా యున్న యెడల దుర్గతియును సంభవించును. మనోబుద్ధులను శుద్ధి చేసుకొనుటకు జప తపాదులు సూచింపపడినవి. వీటన్నింటిలో రుద్రాక్ష ధారణ యనునది. సులభమగు సాధనమని శ్రీ రేణుకా భగవత్పాదులవారు ఉపదేశమునిచ్చిరి. సిద్ధాంత శిఖామణి మీద వ్యాఖ్యానము వ్రాసిన శ్రీ మరితొంట దార్యులవారు, ఆచార్యులవాక్కులకు ఈ క్రింది వివరణ నొసంగిరి

**శ్లో॥ "రుద్రాక్ష ధారణ స్యాపి సకల మహాపాతో కోప పాతక**
**నివర్తకత్వేన చిత్తశుద్ధి ద్వార బ్రహ్మ విద్యాంగత్వా సకల॥**
**శ్రుతి స్మృతి పురాణాగమేశు బహుశః ॥**
**ప్రతిపాదిత మితి ముముక్షు భిరీర శైవ్య**
**స్తద్ధారణ మవశ్యం కర్తవ్యం ॥"** (వీరశైవానంద చంద్రికా వాదకాండ పు. 153)

రుద్రాక్ష ధారణ చేత మనుజుని పాతకము, ఉపపాతకము మరియు మహ పాతకములు నివృత్తియై చిత్తము పరిశుద్ధమగును. అదియును గాక, వీరశైవుడు లింగాంగ సామరస్య రూపమైన బ్రహ్మ విద్యకు అధికారియగును. ఈ విధముగా రుద్రాక్షధారణ బ్రహ్మవిద్య యొక్క అంగముగా అన్ని శ్రుతి, స్మృతి మరియు పురాణ ఆగమముల యందు, అనేక స్థలములలో ప్రతిపాదితమైనది. అందుచేత ముముక్షువులైన వీరశైవులు అంతః కరణ శుద్ధినాశించి రుద్రాక్ష ధారణను అవశ్యముగా చేయవలెను.

## రుద్రాక్షధారి - రుద్రుడు

రుద్రుని నేత్ర జలముల నుండి యుత్పన్నములైనందున రుద్రాక్షలుగా ప్రసిద్ధి గాంచిన ఈ రుద్రాక్షలు, రుద్రుడు ఎంత సమర్థత కలిగియున్నాడో అంత సమర్థతను బడసియున్నవి. వీటిని ధరించిన వాని దేహము, దేవాలయము వలె పవిత్రతను సంతరించుకొనును. అట్టి వాని జీవాత్మ, శివుని వలె పూజార్హతను పొందును. రుద్రాక్షధారి సాక్షాత్తు రుద్రుని వలె పూజనీయుడగుచున్నాడు. ఈ కారణము వలన శ్రీ నీలకంఠ శివాచార్యులవారు, రుద్రాక్ష మహిమను ఈ క్రింది విధముగా తెలిపిరి :

**శ్లో॥ యస్యదేహి భవేదేకో రుద్రాక్షఃశివభావకః ।**
**శివాలయంతు తద్దేహం సాక్షాచ్ఛంభుః శివః స్వయః ॥** (క్రి.సా. 11-333)

అత్యంత ప్రాచీనకాలమునందున సింధు దేశమున భూచక్రమనెడి పట్టణముండెడిది. అందులో సుప్రధీపమనెడి ఒక శివభక్తుడుండెను. శివపూజా ప్రియుడును, అన్న దాతయు అయిన యాతడు తన యింటి యందుగల ప్రాణులన్నింటిని మొదలుకొని జనులందరికిని రుద్రాక్ష ధారణను చేసియుండెను. అంతియే కాదు, రుద్రాక్షధారికి మాత్రమే అన్నదానమును చేసెడి ఒక కఠోరమైన

నియమమును పాలించుచుండెను. ఒకనాడు యితని నియమమును భంగము చేసెడి ఉద్దేశ్యము చేత యోగసిద్ధిని బడసిన సన్యాసి యొకడు భిక్షకై వచ్చి వాకిలియందు నిల్చి భిక్షను వేడెను. ఆతని మేనున రుద్రాక్షలు లేకుండెను. అందుచేత యింటివారు భిక్షను పెట్టక ముందుకు వెడులుమని కోరిరి. అప్పుడా సన్యాసి క్రుద్ధుడై కర్కశ శబ్దములచేత యింటివారిని తూలనాడు జొచ్చెను. భిక్షకుని యీ వ్యవహారమును సహించని సుప్రధీపుని పిల్లలు యా సన్యాసి యొక్క చేతి యందలి కర్రను లాగుకొని అతనిని కొట్టి ఇంటి ముంగిటి నుండి బయటకు పడదోసిరి. అవమానింప బడిన సన్యాసి ఆదేశపు రాజు గారి నాశ్రయించి న్యాయమును కోరెను. ఆ రాజు సుప్రధీపుని పిలిపించి, భిక్ష వేడిన ఈ యోగిని కొట్టుట యెంతవరకు ఉచితమైన చర్యయని విచారించెను. అప్పుడా శివభక్తుడు "నా సన్యాసో భవేద్రాజన్ వినా రుద్రాక్ష ధారణం" యని ఉత్తరమిచ్చెను. "ఓ రాజా ! రుద్రాక్షను ధరించని వాడు సన్యాసికాని యోగికాని కాడు. వీని మెడలో రుద్రాక్ష లేదు." ప్రధీపునుత్తరములోని భావము.

అప్పుడా సన్యాసి కోపము చెంది "ఓయీ రుద్రాక్షను ధరించనివాడు యోగికాడనియంటివే, చూడునా యోగసామర్థ్యమును యని చెప్పుచుండగనే, ఆ యోగితన యోగ సామర్థ్యము చేత స్వర్గమునకు పోయి కల్పవృక్షము యొక్క పుష్పములను తెచ్చి చూపించి నీ రుద్రాక్షధారణ యొక్క మహిమను చూపించు"మని సవాలు చేసెను. అంత సుప్రధీపుడు తన యింటి యందలి పెంపుడు పిల్లిని తెప్పించి దానితో "నీవు స్వర్గమునకు పోయి కల్పవృక్షము యొక్క కొమ్మను తీసుకొని రమ్ము" యజమాని ఆదేశమును విని ఆ పిల్లి సత్వరమే ఆకాశము వైపుకెగిరెను. ఆ మరుక్షణమే ఆకాశమున ఒక దివ్య విమానము ఏర్పాటు కాగా రుద్రాక్ష ధారియైన ఆ పిల్లి యట్టి విమానము నెక్కి స్వర్గమునకు పోయి, తక్షణమే కల్పవృక్షము యొక్క కొమ్మను తీసుకొని వచ్చెను. సమీపములోనున్న జనులు, ఎంతో ఆశ్చర్యమును పొందిరి. అప్పుడా శివభక్తుడు, ఆ పిల్లినుద్దేశించి యీ విధముగా యడిగెను. "ఓ మార్జాల శ్రేష్ఠమా ! నీవు స్వర్గమునకు పోయినపుడు అక్కడ నడిచిన ఘటనలన్నింటిని వర్ణించి ఈ జనులకు తెలియచెప్పుము" వెనువెంటనే ఆ మార్జాలము ఈ విధముగా చెప్ప దొడంగెను. నేను స్వర్గమునకు పోయిన వెంటనే, నన్ను గనిన క్షణమునందుననే దేవేంద్రుడు తన ఆసనము నుండి దిగి వచ్చి నాకు నమస్కరించి, పాదములకు పూజలను చేసెను. అంతటితో ఆగలేదు. తన ఆభరణములన్నింటిని నాకు తొడిగి నన్ను ఐరావతము మీద కూర్చుండబెట్టి స్వర్గము యొక్క పురవీధులలో త్రిప్పుచూ ఉత్సవమును చేసెను. దేవేంద్రుడు చేసిన, యా విధిని గని, ఆశ్చర్యచకితులైన యింద్రాణి యగు శచీదేవి ఇంద్రునితో నిట్లనెను "మార్జారోక్తియమీ మాంపూజాం కథ మర్హతీ దేవప" దీనికి భావమేమనగా, "ఓ దేవేశ్వరుడా ! పిల్లి నీవిధముగా సత్కరించుటకు దీనికి గల అర్హతము లేమిటో చెప్పవలసినదిగా కోరెను. అప్పుడు దేవేంద్రుడు ఈ క్రింది విధముగా నుత్తరమునిచ్చెను.

**శ్లో॥ బిభర్త్యం యం వరం పుణ్యం రుద్రాక్షం రుద్ర భూషణం**
**న యే వధన్యః పూజ్యో పి సర్వ ర్దే వైశ్చమాను షైః ॥** (క్రి.సా.11-131 పుట 156)

"ఓ శచీదేవి ! ఇది పుణ్యప్రధమైన రుద్రాక్షను ధరియించియున్నది. రుద్రాక్ష శ్రీ రుద్రుని ఆభూషణము, దీనిని ధరించినవారు రుద్రుని వలె లోకవంద్యులు. అందుచేతనే దీనిని పూజ్య బుద్ధి చేత సేవించితిని. ఈ విధముగా రుద్రాక్ష మహిమను వివరిస్తూ అనేక కథలను రుద్రాక్ష మహిమను వివరిస్తూ తెలియచెప్పెను. అప్పుడామె భక్తి ప్రపత్తులతో నాకు వందనమాచరించి, తన తొడమీద కూర్చుండబెట్టుకొని ప్రియముగా జూచినది. చివరకు దేవేంద్రుడే స్వయముగా కల్పవృక్షము యొక్క కొమ్మను దెప్పించి దానిని విమానముందుంచి పంపించినాడని, మార్జాలము సభలో తెలియజేసెను. మార్జాలము యొక్క మాటలను విని జరిగిన సంఘటనలను కనులార గనిన ఆ దేశపు రాజు మరియు ఆతని ప్రజలందరూ రుద్రాక్షయందు నిష్ఠ గలవారై సుప్రధీపుని వలన రుద్రాక్షలనుబడసి ధరించుకొనిరి. అప్పుడా యోగిపుంగవుడు లజ్జను పొంది, అహంకారమును వీడి, భయభక్తులను పెంచుకొని రుద్రాక్షధారణను చేసికొనెను.

శ్రీ నీలకంఠ శివాచార్యులవారు చెప్పిన ఈ కథనము శ్రీ స్కంధ పురాణములోనిది. ఈ కథ యొక్క సారాంశమును అవలోకించిన పిదప రుద్రాక్షను ధరించినవాడే కాకుండా, ఈ కథను వినిన వారు కూడా పాపముల నుండి విముక్తిని పొందుదురు. ఈ విధముగా రుద్రాక్షను ధరించినవాడు లోక పూజ్యుడగుననెడిది నిరూపితమైనది.

## రుద్రాక్ష ధారణ చేత - ఉత్కృష్ట జన్మప్రాప్తి :

హీన యోని యందు జన్మనెత్తిన ప్రాణులు రుద్రాక్ష ధారణము చేత ఉత్కృష్టమైన జన్మలను పొందుదురు యనెడిది శ్రీ నీలకంఠ శివాచార్యుల వారు మరొక కథ చేత నిరూపించిరి. నేటి ఆంధ్రప్రదేశమందలి నందిగామ మనెడి దానిలో మహానంది యను పేరుగల సర్వాంగ సుందరి అయిన వారాంగ నొకర్తె యుండెను. ఆమె దగ్గర మణి ఖచితమైన వాహనము, ఛత్రాచామరములు, బంగారపు పావుకోళ్ళు, విలువైన పెట్టెలు అమూల్యమైన సంపత్తులును, నూర్ల సంఖ్యలో గోవులు, నానా విధ సుగంధ ద్రవ్యములు, కోటానుకోట్ల స్వర్ణ నాణెములుండెను. ఆమె భోగభాగ్యములతో తులతూగుచు వేశ్య వృత్తి యందు కాలమును గడుపుచుండెను. అయినను ఆమెకు శివభక్తి మెండుగా యుండెను. ఈ విషయమును తెలుపునట్టి శ్లోకమీ విధముగా నున్నది.

**శ్లో॥ శివపూజార తా నిత్యం సత్యధర్మ పరాయణా ।**
**సదా శివకథా సక్తా శివనామ జపోత్సుకా ॥**
**శివభక్త జానాన్ దృష్ట్వా ప్రణమ్యతి సదాముదా ॥** (క్రి.సా. 10-20, 21, పుట 143)

ఈ శ్లోకములందలి భావమేమనగా ఆవారాంగణ శివపూజా నిష్ఠ కల్గి సత్య ధర్మ నిరతయై శివ కథా శ్రవణమునందు ప్రీతిని కలిగియుండి. శివనామ జపమునందాసక్తి కలదై యుండెను. శివభక్తులను గనినచో వారికి భక్తితో నమస్కారములు చేసెడిది. ఆమె తన వినోదము కొరకై ఒక కోతిని మరియు పుంజును పెంచుకొనెను. వాటిని రుద్రాక్ష కుండలములతోను మాలలతోను అలంకరించి అనేక భక్తిపాటలు పాడుతూ చప్పట్లు కొట్టుచూ, వాటి నాడించి ఆనందించుచుండెను. అవి కూర్చుంటూ, లేస్తూ అటు ఇటు పరుగెత్తుచూ ఉంటే తాను తన సఖులు చూచి ఎంతో వినోదమును పొందుచుండిరి. అట్టహాసమున నవ్వుకొనుచుండిరి. ఈ రెంటి నృత్యములు చూసిన వారికి ఆశ్చర్యము దోచుచుండెను. కాలాంతరమున ఆ రెండు నివసించెడి స్థానమునకు అగ్నిప్రమాదము వాటిల్లి అవి మరణించెను. మరణకాలము వరకు రుద్రాక్షలను ధరించిన మర్కటము కాశ్మీరదేశపు భద్రసేన మహారాజు కొడుకుగను, పుంజు ఆతని మంత్రి యొక్క కుమారుడిగను జన్మించినవి. రాకుమారునికి సుధర్మ యనెడి పేరును, మంత్రి కుమారునకు తారక యనెడి పేరును ఖాయము చేసిరి.

స్వరూపమునందు సుందరులైన వీరు పెరిగి పెద్దవారై స్వర్ణరత్నఖచితమైన ఆభరణములను ధరించక పూర్వజన్మ సంస్కార బలము వలన, రుద్రాక్షల యందు ప్రీతి గలవారై రుద్రాక్ష కంఠమాలలను, రుద్రాక్ష కంకణములను, రుద్రాక్ష కుండలములను ధరించి, శివపూజాసక్తులై, భోగభూమిలోని యోగిపుంగవులై జీవింపజొచ్చిరి. ఈ రహస్యమును తెలిసికొనుటకై భక్తసేన మహారాజు, తన రాజ్యమునందలి ఋషిపుంగవులను విచారించగా, వారు, వీరి పూర్వజన్మ వృత్తాంతము నెరింగించిరి. రుద్రాక్ష ధారణఫలముచేత మర్కటము మరియు కుక్కుటములు, ఈ శ్రేష్ఠమైన మానవజన్మ నెత్తిరని తెలుసుకొని ఆ రాజ్యములోని ప్రజలందరూ రుద్రాక్షదారులైరి. ఈ రాజు కొడుకు మరియు మంత్రి కొడుకు శివధ్యానమునందు ఎక్కువ కాలము గడుపుచూ, చివరకు శివ సాయుజ్యమును పొందిరి.

మహా నందా పేరు గల్గిన ఆ వేశ్య యొక్క నివాస స్థానమే నేడు మహానందిగా పవిత్ర శివక్షేత్రమై పరిణమించినది. ఈ క్షేత్రము శ్రీశైలమునకు సమీపమున కలదు. శ్రీశైలమును దర్శించిన యాత్రికులెల్లరు మహానందికి కూడా వెళ్ళుచుందురు.

ఒకవేశ్యాలయము, ఈ నాటి పవిత్ర క్షేత్రముగాను పరిణమించినదనిన, లేదా దురాచారి లేదా దుష్టుడు అయినను రుద్రాక్షను ధరించుట చేత పవిత్రులగుదురను ఈ విషయమునే జగద్గురువు రేణుకాచార్యులుపదేశించిరి.

అంతఃకరణమును శుద్ధి పరిచెడిదియు, హీన జన్మలను నివారించునదియును, పాతకములను బాపునట్టిదియును అగు రుద్రాక్షను ధరించుట వీరశైవులకు నిత్య సత్య ధర్మము. ఇష్టలింగమును సదా ధరించిన యటులే రుద్రాక్షను గూడా సదా ధరించవలయును.

ఈ విధముగా రుద్రాక్ష యొక్క పావన మహిమను ప్రారంభమున పరిచయము చేసి పూజ్య జగద్గురువులుగారు శ్రీ ఆగస్త్య మహర్షికి వాటి వ్యుత్పత్తిని యిక ముందు నిరూపించెదరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 30-8-1990

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

# విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు రుద్రాక్షధారణ యొక్క ప్రశస్తి గురించి ఎంతో సుందరముగా వివరించి చెప్పిరి. స్కాంధము నుండియును, క్రియాసారము నుండియును, శ్రీ వారొసంగిన దృష్టాంతములు జ్ఞాన దాయకములైయున్నవి.

రుద్రాక్ష యనెడిది యాస్తిక లోకముననను, నాధ్యాత్మిక సంస్కృతిలోను నెంతయో ప్రాముఖ్యతను సంతరించి కొనినది. వైష్ణవులు తులసి మాలలకును, స్మార్తాదులు స్ఫటిక మాలలకును కొంతమేరకు ప్రాముఖ్యత నిచ్చుటను గాంచగలము. షణ్మతముల ననుసరించెడి వారందరూ రుద్రాక్ష ధారణ యెడల యనురక్తిని గల్గియున్నారు. నేటి వైజ్ఞానిక జగత్తులోను, రుద్రాక్ష బహుళ ప్రచారమును పొందినది. ఆయుర్వేద విజ్ఞాన విశారదులు వివిధ రోగములకు రుద్రాక్ష ధారణాదుల వలన నివారణోపాయములను సూచించుచున్నారు. రుద్రాక్ష వైద్యశాలలు వెలసినవి.

సకల లోకోపకారమును సాధించెడి రుద్రాక్షలకు దశవిధశైవములలో నెంతయో ప్రాముఖ్యత గలదు. "భస్మధారణ మాత్రేణ శుద్ధో భూపతి సర్వదా", "రుద్రాక్ష ధారణేనవి శుద్ధోభవతి సర్వదా" యనెడివి సామాన్యమైన సూత్రములుగా నంగీకరింపబడినవి. ఈ సూత్రము లనుల్లఘనీయములని గుర్తింపబడినవి. శుద్ధి అను పదమునకు వివిధార్థములు గలవు. మలినమును దూరము చేయుట యనెడిది. విస్తృత ప్రచారములోనున్న అర్థము. ఈ అర్థము యొక్క నేపథ్యముననే దుష్టజ్ఞులు, దుష్టచిత్తులును, దురాచారులును రుద్రాక్ష ధారణ చేత దుష్టత్వమును వీడి సత్పురుషు లగుదురనెడిది గుర్తించవలెను. శ్రీ భగవత్పాదులవారు చెప్పిన యటుల, రుద్రాక్షధారణ వలన పాతకములు పతనమై పరిశుద్ధిని బడయుదురనెడిది గుర్తించ వలసిన విషయము హీనయోనులలో జన్మించిన ప్రాణులును రుద్రాక్ష ప్రభావము చేత నుత్తమ జన్మను బడయుదురనెడిది, క్రియాసారము ఇత్యాది గ్రంథములలో తెలియపరచబడినది.

దుష్టత్వము నే విధముగా నష్టమగుననెడి ప్రశ్న యుదయించవచ్చును రుద్రాక్షలు రుద్రత్వమును కల్గించెడి మహత్తు గల్గినవై యున్నవి. "నా రుద్రోరుద్ర మర్చయేత్" యనెడిది స్మార్తుల యభిప్రాయము తన్నిమిత్తమై వారు న్యాస ప్రక్రియను ననుష్ఠించవలెనని యుందురు. మహాన్యాసము లేదా లఘు న్యాసము ద్వారా రుద్రత్వమును పొంది రుద్రుని యర్చించ వలయునని చెప్పుదురు. శివతత్త్వజ్ఞుల ప్రకారము, భస్మ రుద్రాక్షలు ధరించిన యెడల మహాధ్యానము చేయుట వలన గల్గెడి ఫలితము లభించును. భక్తి తత్త్వజ్ఞులు భస్మరుద్రాక్షలు ధరించినవారికి మహాన్యాస మనావశ్యక మందురు.

శుద్ధమనెడి పదమునకు రక్షితమనెడి యర్థము గలదు. రుద్రాక్ష ధారణ వలన దేహము "శుద్ధాంత" మగును. "శుద్ధః రక్షితః అన్తః ప్రాంతో యస్య స ఇతి శుద్ధాంతః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము, రక్షితమైన ప్రాంతము గలదానిని శుద్ధాంత మనియుందురు. రుద్రాక్షల చేత రక్షితమైన ప్రదేశమే దేహమని తలచవచ్చును. ఈ అర్థము వీరశైవ తత్త్వమునకు నతి సన్నిహితముగా నుండును. దీక్షాసంస్కారము వలన శుద్ధిని బడిసెను భక్తుడు మరల శుద్ధి నిమిత్తము రుద్రాక్షలను ధరించవలెననెడి భావన సుసంగతము కాజాలదు. రక్షణ కొరకు రుద్రాక్షలను ధరించ వలెననెడిది అసంగతము కాజాలదు.

అష్టావననములనెడివి రక్షణ కవచములనియును, రుద్రాక్ష యనెడిది వాటిలో నొకటియని చెప్పబడినది. యుద్ధ వీరునికి కవచము నే విధముగా పనిచెయునో అష్టావరణములును నట్టి విధఇనే నిర్వహించుచున్నవి. వీరశైవుడును యుద్ధవీరుని వంటివాడే యని తెలిపెడి యీ క్రింది పద్యమును గనుడి :

**శ్లో॥ అమరంగా కురుమంత్ర కార్ముకమునం దాత్మాస్త్రమష్టాంగయో**
**గ మహాముష్టి వివేకి యేయుటయు దత్కాండం**
**త్త్వము లెల్లన్వడి గ్రుచ్చి పాటి భమదుద్యత్ సూక్ష్మకేవల్యల భజందాదిత**
**క్ష్యమునందద్భుత శక్తి తోడ గమియంగా నాటు సర్వేశ్వరా ॥** (సర్వేశఅవర శథకము, ప. 69)

కామక్రోధాదులు శత్రువులై భక్తుని భక్తిని నాశనము చేసెడి యవకాశము కలదు. లోభము వలన ధనాశతో లింకైకనిష్ఠా పరతంత్రతను కోల్పోయి బహుదేవతా ఉపాసన వైపు మొగ్గుచూపవచ్చును. ఇట్టి యరిష్టములు గలుగ కుండగ రుద్రాక్ష ధారణ రక్షణ కవచమై పరిరక్షించునని గుర్తించవలెను.

వీరశైవ దీక్షా విధానములో రుద్రాక్ష ప్రదానము నొక యవిభాజ్యమైన యంశముగా నున్నది. భూతిపట్టా దీక్ష పిదప రుద్రాక్ష ప్రదానము చేయబడుచున్నది. "ఆచార్యః రుద్రాక్ష పూజాం కృత్వా శిష్యస్య అవయవేషు రుద్రాక్షాన్ ధారయేతం" అని దీక్షా విధానము

నిర్దేశించుచున్నది. రుద్రాక్ష ప్రదానము పిదప లింగ ప్రదానము జరుగును. అందుచేత "లింగ-భస్మ-రుద్రాక్ష"లను శివుని యొక్క విభిన్నమైన యంశములని గుర్తించవలెను. భస్మధారణ స్థలమున శివుడే భస్మము, భస్మే శివుడని తెలిపెడి రుద్రజాబాలోపనిషత్తు వాక్యములను గంటిమి. ఈ స్థలమున రుద్రాక్షలును శివస్వరూపములని భావించవలెను. ఎ విధముగా లింగమును కాయమునుండి విడదీయకుండగ వేసుకొన వలెననెడి నియమము గలదో నదే విధముగా రుద్రాక్షను సదా ధరించవలెననెడి నియమమొకటి గలదని భావించుకొనవలెను. ఆచార్యోపదేశము ననుసరించి సదా రుద్రాక్ష ధారియై భక్తుడు తిరుగాడ వలెనని గుర్తించగలరు.

శివం భూయాత్

## ఆశీర్వచనము : 2

**శ్లో॥ పురా త్రిపుర సంహారే త్రినేత్రో జగతాం పతిః ।**
**ఉదపశ్య త్పురాం యోగమున్మీలిత విలోచనః ॥**

పూర్వమున త్రిపుర సంహారము చేసేటపుడు జగత్పతియును, త్రినేత్రుడును అగు శివుడు వదనమును పైకెత్తి కళ్ళను తెరిచి త్రిపురములను చూసెను.

**శ్లో॥ నిపేతస్త్య నేత్రేభ్యో బహవో జల బిందవః ।**
**తేభ్యోహిరుద్రాక్షా రుద్రాక్షా ఇతి కీర్తితాః ॥**

రుద్రనేత్రముల నుండి వెలువడిన అనేక జలబింధువులు నేల మీద పడగా రుద్రాక్షలు ఉత్పన్నమై లోక విఖ్యాతిని గాంచినవి.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు రుద్రాక్ష ధారణా మహిమను ఇంతకు క్రితమే వివరించిరి. ఇప్పుడు రుద్రాక్షల ఉత్పత్తిని గూర్చి వివరిస్తూ ప్రాచీన కాలమున ఘటించిన త్రిపురాసుర సంహారము గురించి సూత్రప్రాయముగా వివరించిరి. ఈ కథ శివపురాణములోని రుద్ర సంహితయందలి యుద్ధఖండము నందున నెంతో విస్తృతముగా వివరింపబడినది. పాఠకుల మానసిక తృప్తికై ఆ కథను నిచ్చట సంక్షిప్తముగా ప్రస్తావించు చున్నాము. రుద్రాక్ష యొక్క పుట్టుకకు గల నేపథ్యమును తెలిపెడి యీ కథను భక్తి శ్రద్ధలతో తెలిసికొనిన వారికి రుద్రాక్ష యొక్క మహత్తు మరింత స్పష్టమగును.

## త్రిపురాసురుల తపస్సు :

పూర్వ కాలమునందున తారకాసురుడనే రాక్షసునికి, తారకాక్షు, విద్యున్మాలి ; కమలాక్షులనెడి ముగ్గురు కుమారులుండిరి. వీరు బలశాలులైయుండిరి. తారకాసురుని యొక్క దురాగతములు హెచ్చిన పిదప శ్రీ షణ్ముఖస్వామి అవతరించి, తారకాసురుని వధించెను.

తండ్రి మరణానంతరము భయము గొనిన ఆతని కుమారులు తపస్సును చేసి అమరులు కావలయునని తలంచిరి. భోగయుతమైన జీవితమును విడిచి మేరు పర్వతమును చేరి ఒక గుహలో భగభగమండే ఎండలో పంచాగ్నులను ప్రతిష్ఠించి వాటి మధ్య నిలిచియును, చలికాలముయందున, అర్ధనగ్నముగా నుండి ఒంటి కాలుపై నిల్చి, అనేక వందల సంవత్సరములు అతికఠోరమైన తపస్సు నాచరించిరి.

## బ్రహ్మ నుండి వరదానము :

వీరి అతి ఉగ్రమైన తపస్సునకు మెచ్చిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, కావలసిన వరముల కోరుకొమ్మనియెను. అప్పుడా ముగ్గురు సోదరులు, అమరత్వమును ప్రసాదింపుమని కోరిరి. అప్పుడు బ్రహ్మదేవుడు "ఓ దైత్య శ్రేష్ఠులారా ! మరణమనెడిది దేహము యొక్క సహజ లక్షణము. దానిని తప్పించుటెవ్వరికిని సాధ్యముకాదు. దాని బదులుగా మరే వరమైనను కోరుకొమ్మనియెను.

అప్పుడు యోచనలకు లోనైన ఆ తారకుని కుమారులు ఆలోచించి, మాకు ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన పట్టణములను నిర్మాణము చేసి ఇవ్వవలెను. అవి క్రమముగా స్వర్ణము, రజితము మరియు ఉక్కు ద్వారా నిర్మింపబడి అభేద్యములై యుండవలెను. ఆ త్రిపురములు

ఆకాశమండలము నందు ఎల్లప్పుడు తేలియాడుతూ, తిరుగుతూ ఉండవలెను. కక్షలయందు తిరుగుచున్న మీ పట్టణములు వేయి సంవత్సరములకు ఒక్కసారి మాత్రమే, అదియును ఒక్క క్షణము మేరకు ఒకే వరుసలో కూడుకొని యుండవలెను. ఆ సమయమునందు దేవాదిదేవుడు ఎవ్వరు, ఎప్పుడు చూడని, వినని, కనని, రథము నెక్కి, అంతటిదగు ఒక బాణము చేతకొట్టినప్పుడు మాత్రమే మేము మరణించవలెను.

శివుడు అందరూ దేవతలకు దేవుడు అయినందువలన తాము శివునియందు భక్తి శ్రద్ధలున్న వారమై యున్నందున, ఆతడు మమ్ములను చంపనిచ్చగించడు. ఆ విధముగా సదా అమరులుగా మిగిలియుండ వచ్చును అని భావించి పై వరమును కోరిరి. వీరి ఈ విపరీతమైన కోరికను బ్రహ్మ అంగీకరించెను. మయుని పిలిపించి, ఆ పట్టణములను నిర్మింపజేసి వారికిచ్చెను. అప్పటి నుండి ఈ ముగ్గురు త్రిపురాసురులని ప్రసిద్ధి కెక్కిరి.

## త్రిపురములయందు - దినచర్య :

మయుని చేత నిర్మింపబడిన త్రిపురములు, స్వర్గము కంటెను మనోహరముగా నుండెను. చూసిన కడయెల్ల శివాలయములు కన్పట్టు చుండెను. ఆ నగర నివాసులు, ధర్మపరాయణులు, నీతి నిష్ఠాగరిష్ఠులైయుండిరి. త్రిపురములకధిపతులైన, తారకాక్షుడు, విద్యున్మాలి మరియు కమలాక్షులు, ధర్మపరాయణులై, నీతిని తప్పనివారై, శివభక్తి సంపన్నులై అధికారికమైన పుణ్యమును సంపాదించు కొనుచు సుఖజీవనము గడుపజొచ్చిరి.

## త్రిపురాసురులచే - దేవతల తేజోనధ :

తమ దైనందిన ఉత్తమ కర్మలచేత త్రిపురాసురులు తేజోవంతులై వెలుగొందుచుండిరి. భూలోకమునందున నిర్వహించబడే యజ్ఞయాగాదుల హవిర్భాగములను వీరే స్వీకరించ జొచ్చిరి. స్వర్గ, మర్త్య, పాతాళములలో వీరి శాసనములు అమలులోనికి వచ్చెను. ఇందుచేత ఇంద్రాది దేవతలు క్రమేపి తేజో విహీనులై, కష్టములపాలై, చివరకు బ్రహ్మను శరణుజొచ్చిరి. శరణాగతులైన దేవతల నుద్దేశించి బ్రహ్మ "ఓ దేవతలారా ! విషవృక్షోపి సంవర్ధ్య స్వయం చ్ఛేత్తు మసాం ప్రతం" యనెడి వాక్కు ప్రకారము తానే పెంచిన విషవృక్షమునైన తానే త్రెంచుట నీతి గాదు. తారకాసురుని సుతులకు నేనే త్రిపురముల నొసంగితిని. అందుచేత వారిని నేను సంహరించుట సాధ్యము కాదు. అందుకు దేవదేవుడైన శివునే శరణు పొందుడు అని బోధించెను.

## దేవతలు-శివుని-శరణుజొచ్చుట :

బ్రహ్మ ఆదేశము ప్రకారము, దేవతలెల్లరు శివుని సన్నిధానమునకుపోయి శివుని పరిపరివిధములుగా స్తుతించిరి :

**శ్లో॥ నమో హిరణ్యగర్భాయ సర్వసృష్టి విధాయినే ।**
**నమః స్థితి కృతే తుభ్యం విష్ణవే ప్రభ విష్ణవే ॥**
**నమో హరస్వరూపాయ భూతసంహారకారిణే ।**
**నిర్గుణాయ నమస్తుభ్యం శివాయా మిత తేజసే ॥**

దేవతల భక్తికి ప్రసన్నుడైన శివుడు వారి రాకకు కారణమడుగ, దేవతలు త్రిపురాసురుల వలన తమకు కల్గిన హాని గురించి వివరించిరి. నీవే దిక్కని విన్నవించిరి. అప్పుడు శివుడు –

"ఓ దేవతలారా ! ఈ త్రిపురాసురులు ప్రస్తుతము వేదవిహితకర్మలనే చేయుచున్నారు. పుణ్యశీలురై యున్నారు. ఎవ్వరు పుణ్యకార్యములలో నిమగ్నులై యుందురో అట్టివారిని సంహరించుట సాధ్యముకాదు. అందువలన దీని గురించి ఏదైనా యుక్తిని సాధించుటకై మీరందరూ విష్ణువు నాశ్రయించగలరని ఆదేశించెను."

## వైష్ణవ మాయ :

శివుని ఆదేశము ప్రకారము దేవతలు వైకుంఠమునకు పోయి ప్రార్థించి ఆతని ప్రసన్నతను బడిసి, తమ గోడును విన్పించిరి. విష్ణువు వారి గోడు నాలకించి, ధర్మ నిరతులైన వారిని అభిచారాదులచేత చంపుట ఖండితముగా సాధ్యము గాదు. త్రిపురనివాసులందరును. ధర్మనిష్టులైయున్నారు. ఎప్పటివరకు వేదవిహితములైన ధర్మములు నిర్వహింపబడు చుండునో, ఎప్పటివరకు శంకరుని పూజలు జరుగుచుండునో, ఎచ్చటివరకు పవిత్రమైన పనులు నడుచుచుండునో, అప్పటివరకు వీరు నాశనమగుట జరుగదు యని విష్ణువు అంతరంగమున అవలోకించెను. త్రిపురాసురులను ధర్మభ్రష్టులను చేయుటకై తన శరీరము నుండి ఒక మాయాపురుషుని పుట్టించెను. ఆతనికి సనాతన ధర్మమునకు విరుద్ధమైన అధర్మశాస్త్రము నుపదేశించెను. ఈ శాస్త్రమును త్రిపురముల యందు ప్రచారము చేసి, అచ్చటి రాజులను, ప్రజలను అధర్మయుతులుగా మారునట్లు ప్రయత్నించవలసినదిగా ఆదేశించెను.

ఈ మాయావి యతి తనవలె మాయావులైన నల్గురి శిష్యులతో కూడుకొని త్రిపురములలోనికి ప్రవేశించెను. అక్కడొక సుందరమైన ఉద్యానవనము నందు తన నివాసము నేర్పాటు చేసికొనెను. ఈతని శిష్యులు నిత్యము పట్టమునందు తిరుగుతూ, తమ గురువు యొక్క మహిమలను, క్రొత్త ధర్మము యొక్క విచారములను ప్రచారము చేయుచుండిరి. వీరికి సహాయమంద చేయుటకై శ్రీహరి నారదుని అచ్చటికి పంపించెను.

ఈ మాయా యతినుండి నారదుడు మొదటగా దీక్షను పొంది. త్రిపురాసురుల దరికి చేరి "ఓ తారకాసుర సుతులారా ! భాగ్యమే వాకిలి ఎదురుగా వచ్చిన యటుల మీ పట్టమునకు నొక యతివర్యుడొచ్చి యున్నాడు. ఆతడొక క్రొత్త ధర్మమును కన్పెట్టినాడు. ఆ ధర్మము ప్రకారము స్నాన, సంధ్యా వందన శివపూజాదులను చేసెడు ఆవశ్యకత లేదు. పుణ్యము, పాపము, స్వర్గ నరకములు మిథ్య. యిచ్చట మన మనుభవించెడి కష్టమే నరకము. యిచ్చటి ఐశ్వర్య భోగములే స్వర్గము. న్యాయాన్యాయములను విచారము చేయకుండ ధర్మమును సంగ్రహించి సుఖపడునదే జాణతనము. దేహమును దండించి, దేవతార్చనలను చేయుటయనేది మూర్ఖుల పని. ఈ పూజాపాఠములు జీవనముండెడివరకు ముగిసెడివి కావు. నిరుద్యోగులు చేసెడి కార్యములచేత నేను విసిగిపోయితిని. ఈ క్రొత్త ధర్మము చేత నాకర్షితుడనై దీక్ష పొందితిని. ఈ ధర్మమునందు దీక్షను పొందిన యెడల మీరు, యింతవరకు జేసిన కష్టతరములగు తపస్సును యికముందు చేయవలసిన అవసరములేదు.

మనస్సుకు సులభంగా రుచించెడి నారదుని మాటలను వినిన తారకుని పుత్రులు భ్రమకు లోనై ఆకర్షింపబడి, మాయాయతి దగ్గరకు వెళ్ళి దీక్షను బడసిరి. ధర్మాచరణములను త్యజించి, మనస్సుకు నచ్చిన యటుల దురాచారములను దుర్మార్గములను కొనసాగించిరి. "యధా రాజా తథా ప్రజ" యనెడి సూక్తి ప్రకారము ప్రజలు కూడా ఈ మార్గముననే యతికి శిష్యులైరి. శివాలయములు మూతబడెను. దేవతార్చన, జపతపాదులు నిర్వహింపబడుటలేదు. రాజుల వారి ప్రజలు స్వేచ్ఛావర్తునులే ధర్మమార్గమునకు విముఖులై అధర్మవర్తనల కలవాటుపడిరి.

ఈ విధముగా త్రిపురములు, విష్ణు మాయకులోనై, మోహపాశమున చిక్కినవి. దైత్యులెల్లరు శివపూజను విస్మరించిరి. స్త్రీల యొక్క శీలములును పాడైనవి. దురాచారములు బలపడజొచ్చెను. అప్పుడు శ్రీహరి కృతకృత్యుడై దేవతలందరిని వెంటనిడుకొని శివుని వద్దకు వెళ్ళి త్రిపురాసురులు ధర్మభ్రష్టులైన సంగతిని నివేదించిరి.

## త్రిపుర సంహారశీలలు :

అధర్మపరులను శిక్షించుటకును, ధర్మపరులను కాపాడుటకును, శివుడు ఇరువది ఐదు లీలను రచించెను. వాటిలో త్రిపుర సంహార లీల ఒకటి. ఈ లీలను గూర్చి పుష్పదంతుడు, ఈ క్రింది విధముగా రచించిరి.

**శ్లో॥ రథః క్షోణీ యంతా శతధృత్రిరగేంద్రో ధనురథో**
**రథాంగే చంద్రార్కౌ రథచరణపాణిః శరఇతి**

**దిధక్షోస్తేస్తే కోయం త్రిపురతృణ మాడంబర విధి**
**వీర్దేయైః క్రీడుత్యో న ఖలుపరతంత్రాః ప్రభుధియః ॥** (మహిమ్న స్తోత్రము 18)

శివుడు బహువిస్తారమైన భూమిని రథముగా చేసికొనెను. సూర్యచంద్రులు రథచక్రములు, నాలుగు వేదములు గుఱ్ఱము లయ్యెను. ఆదిశేషుడు రథమునకు బిగించెడి పగ్గమయ్యెను. చతుర్ముఖ బ్రహ్మ సారథి అయ్యెను. మేరుపర్వతము ధనుస్సుగా మారెను. వాసుకి అల్లె త్రాడయ్యెను. మహావిష్ణువు బాణమయ్యెను. అగ్నిబాణము మొన అయినది. ఈ విధముగా విచిత్రములైనవి కూడుకొని సిద్ధమైన రథమును శివుడు అధిరోహించెను. మరుక్షణముననే జగత్తు గడగడలాడెను. పంచభూతములలో ప్రకంపనము పుట్టెను. దిక్పాలకులకు దిక్కుతోచని స్థితియయ్యెను.

బ్రహ్మదేవుడు రథమును త్రిపురముల వైపు త్రోలికొని వెడలగా శివుడు, త్రిపురములపై తన దృష్టినిం నిలకడగానుంచెను. ఆకసమున నొకే కక్ష్యలో తిరుగాడుచున్న త్రిపురములను గనెను. వెంటనే దేదీప్యమానమైన ప్రకాశములో వెలింగెడి బాణములతో సంధించి విడిచెను. అది వెడలి త్రిపురములను చుట్టుముట్టెను. త్రిపురాసురులు, తాము చేసిన తప్పును గూర్చి తెలిసికొనిరి. మరణమే ప్రాయశ్చిత్తమని యెంచి. శివుని మన్నింపుడని వేడుకొనిరి. మున్ముందు తాము శివభక్తులుగానే జన్మించు విధముగా వరములను వేడిరి. భక్తసులభుడగు పరమేశ్వరుడు తథాస్తు అనెను. అప్పుడు వారు త్రిపురములతో సహా దగ్ధమై నేలకు రాలిరి. ఈ విధముగా త్రిపురములను దగ్ధము చేసి, శివుడు దేవతలను కాపాడెను. లోక కళ్యాణమును కల్గించెను. ఈ లీలా రచనలో శివుడు తన లక్ష్యం సాధనకై, తదేకదృష్టిని తెరిచియుంచిన కళ్ళ నుండి రాలిన కొన్ని జలబిందువనులు ఆ కళ్ళ నుండి రాలిపోయి నేలను తాకెను. అవి పడిన ప్రదేశముల యందున రుద్రాక్ష వృక్షములయ్యెను. రుద్రుని అక్షముల నుండి వెలువడిన జలములే బీజములై వాటి నుండి వృక్షములు పుట్టినందున వాటిని రుద్రాక్ష వృక్షములను పేరుతో పిలువజొచ్చిరి. శ్రీ జగద్గురువుల వారు ఈ అంశమునే నొక్కి వక్కాణించిరి. "నేత్రేభ్యోనిపేతుః జలబిందవః తేభ్యోహి రుద్రాక్షా రుద్రాక్షా ఇతి కీర్తితాః" అని తెలియజెప్పిరి.

కన్నీటిని మూడు విధములుగా విభజింపవచ్చును. అవి, దుఃఖాశ్రువులు, ఆనందాశ్రువులు, యోగాశ్రువులు, యోగాభ్యాసము చేయునప్పుడు, కన్నులను తెరిచియుంచి రెప్పలను వార్చకుండా చూస్తూ ముద్రలను సాధించే యత్నమును చేపట్టుదురు. అప్పుడు నేత్రముల నుండి జలము వచ్చును. అవి యోగాశ్రువులు. విలపించినప్పుడు దుఃఖాశ్రువులును, అమితానందనమును పొందినప్పుడు ఆనందాశ్రువులును వచ్చును. అశ్రువులలో సంబంధిత వ్యక్తి యొక్క సంకల్పము వ్యక్తమగును. అట్టి అశ్రువులా సంకల్పమును సాధించెడి శక్తిని గల్గియుండును. ఆ సంకల్పమున కనుగుణముగా పనులను సాధించును. సామాన్యుల అశ్రువుల కింత సామర్థ్యముండగా, శివుని అశ్రువులకును గల శక్తి యెట్టిదో చెప్పనక్కరలేదు. దుఃఖమును దూరము చేసి ఆనందమును గల్గించి చివరకు ముక్తికన్యతో సంయోగమును చేయించెడి శక్తి ఈ అశ్రువులకు గలదు. అట్టి శక్తియే రుద్రాక్ష బీజములలో నుండును.

రుద్రాక్ష యొక్క నిగూఢ తత్త్వము నెరిగిన వీరశైవాచార్యులు, వీరశైవుల తమ సంరక్షణకై రుద్రాక్షలను ధరించవలెనని తెలిపిరి. వీరశైవ ధర్మమున యష్టావరణములలో యంతర్భాగమని చాటి చెప్పిరి. ఈ విధముగా రుద్రాక్షల ఉత్పత్తిని చెప్పిన పిదప శ్రీ భగవత్పాదుల వారు వాటిలో గల భేదముల గూర్చి వివరించిరి.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 31-8-1990

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరంవిశేష ప్రదీపిక

## విశేషప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు రుద్రాక్ష ఉత్పత్తి గురించి యెంతో చక్కని వివరణ నిచ్చుచు త్రిపుర సంహార లీల గురించి తెలియజెప్పిరి.

లోకకళ్యాణము కొరకై శివుడు పంచవింశతి లీలను రచించెనని తెలియజెప్పబడినది. వీటిలో త్రిపుర సంహారము పంచవింశతి లీలలో ఒకటి. ఈ లీల యొక్క పరమార్థమెట్టిదో తెలిసికొనవలసి యున్నది. లౌకిక దృష్టితో గాంచిన యెడల త్రిపురములను ధ్వంసము

చేసి త్రిపురాసురులను సంహరించుటకై యీ లీల రచింపబడినది. దుష్టశిక్షణ శిష్టరక్షణ యనెడి భావము నీ లీలలో నున్న యటుల గోచరించును. పౌరాణిక గాథలు నీ విషయము నొక్కి చెప్పుచున్నవి.

వేదాగ మోపనిషత్తులలో ప్రతిపాదింపబడిన ధర్మ రహస్యములను సుబోధకముగా చెప్పుటయే పురాణముల లక్ష్యమని గుర్తించవలెను. అట్టి యెడ త్రిపుర దహనలీల నేపథ్యమున చెప్పబడెడి ధర్మ రహస్యమెట్టిది యనెడిది గుర్తించవలెను. త్రిపురాసురులు దుష్టులే. అయితే వారిని సంహరించుటకై త్రిపురసంహార లీలను రచించవలసిన యవశ్యకత గలదా యనెడిది తాత్వికపరమైన ప్రశ్న. శివుడు సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము మరియు సర్వభర్తృత్వము గలవాడు కదా ! అతని శక్తికి అడ్డంకులుండునే. జగత్ ప్రళయమును చేయగల సమర్థతగలవానికి త్రిపుర దహన మొక్క లెక్కలోని యంశమా యనెడిది భక్తి వాదులెదుర్కొనెడి ప్రశ్న. పుష్పదంతుడిట్టి ప్రశ్ననే యెదుర్కొని యుండెను. అతనికి తట్టిన సమాధానమును శ్రీ పండిత చిదిరెమఠం వీరభద్రశర్మ (కాశీ జగద్గురువు) గారు, పుష్పదంతుని శ్లోకము 18నకు వ్యాఖ్యానము వ్రాస్తూ) యీ క్రింది విధముగా తెలిపిరి.

లోకకంటకులైన అసురుల త్రిపుర దహనము చేయునెడ నీవు గావించిన సర్వస్వతంత్రమైన ప్రభుత్వమును కొనియాడి తీరవలసియున్నది. నీవు తలచినచో త్రిపురములను ఒక గడ్డిపోచవలె కాల్చియుందువు. కాని భూమిని రథముగను, బ్రహ్మను సారథిగాను, మేరువును విల్లుగాను, సూర్యచంద్రులను చక్రములుగాను, హరిని శరముగాను విరచించి యుద్ధయాత్రను సాగించితివి. సర్వతంత్రంమైనది కావున ఒక్కొక్కప్పుడు పరిచర్య చేయు సేయు సేవకుల తోడను వినోదార్థముగా నాడు కొనును కదా ! (శివ పంచస్తవి)

ఈ భావనలో పాశుపత సిద్ధాంతమిమిడి యున్నది. శివుడే పరబ్రహ్మ. మిగిలినవారందరూ స్వామి భృత్య న్యాయమున శివుని సేవింతురు. ఇట్టి భావనను యథావాక్కుల వారు నీ క్రింది విధముగా విశదీకరించిరి.

**చం॥ ఇన విఘ్నేశ్వర మాతృకా ద్రుహిణ బ్రహ్మస్కంధ దుర్గారమా**
**వనితాధీశ్వర భైరవుల్ బలసి భాస్వద్భక్తి సంయుక్తి నీ**
**కనిశంబున్ బరివార భృత్యని కరంబైరన్న నిన్నింక గొ**
**ల్వని వారెవ్వరజాండ భాండములలో వర్ణింప సర్వేశ్వరా ॥** (సర్వేశ్వర శతకము 5)

ఈ పద్యమును గూర్చి వ్యాఖ్యానించుచూ డా॥ ముదిగొండ వీరభద్రయ్యగారు నీ క్రింది విధముగా వ్రాసిరి.

"పార్వతీ ప్రమేయం లేకుండా జన్మించిన భైరవుడూ, కుమారస్వామి, శివ ప్రమేయం లేకుండా జన్మించిన విఘ్నేశ్వరుని వంటి శక్త్యుద్భవులు శివుని పరిచారకులు." (సర్వేశ్వర శతకము పుట 10)

సర్వశక్తివంతుడగు శివుడు స్వీయ క్రీడను వినోదార్థమై చేసెనని గ్రహింపదగును. ఈ భావన శివుని సర్వ కర్తృత్వమును నిరూపించెడిదైననూ త్రిపుర దహన లీలలోని తాత్వికత తెలియజేయజాలదు.

త్రిపుర దహనము వలన భస్మము యొక్క ప్రాముఖ్యత తెలియజెప్పి యుండునని, చెన్నబసవేశ్వరుని వచనముల వలన తెలియుచున్నది. కామదహన, కాలదహన, త్రిపుర దహనలీలలు భస్మతత్త్వమును తెలుపుచున్నవని గ్రహింప వచ్చును. త్రిపుర దహన లీలకొక ప్రత్యేకత గలదనియును నది రుద్రాక్షల యుత్పత్తికి సంబంధించినదని గుర్తించవలెను. రుద్రాక్షల యొక్క విశిష్టతను తెలియచెప్పుటకే శివయోగి శివాచార్యులవారు త్రిపురాసుర సంహార లీలను తెలియజెప్పెనని గ్రహింపవలెను. వాస్తవముగా చూసిన యెడల నీ అర్థమే స్ఫురించగలదు. తాత్వికార్థము కూడా నిదియేయని గ్రహించవలెను.

శివపురాణములోన రుద్రాక్షోత్పత్తి గూర్చి మరొక కథ ఇవ్వబడినది గమనించుడి

**శ్లో॥ దివ్యవర్ష సహస్రాణి మహేశాని పునః పురా ।**
**తపః ప్రకుర్వతస్సృస్తః మనస్సంయమ్య వైమమ ॥**
**స్వతంత్రేణ పరేషేన లోకోప్రకృతి కారణా ।**
**లీలయా పరమేశాని చక్షురున్మీలితం మయా ॥**
**పుటాభ్యాం చారు చక్షుర్భ్యాం పతితా జలబిందవః ।**
**తత్రా శ్రుబిందవో జాతా వృక్షా రుద్రాక్ష సంజ్ఞతాః ॥**
**భూమే గౌడోద్భవాశ్చ క్రే రుద్రాక్షాన్ శివవల్లభాన్ ॥** (శివపురాణం, విద్యేశ్వర సంహిత)

రెండు కథల పరమార్థమొక్కటే. రుద్రాక్షలు రుద్రనేత్రముల నుండి వెలువడిన జల బిందువుల నుండి యుత్పన్నమైన వృక్షముల వలన గల్గినవి. నేత్రములు జ్ఞానమునకు సంకేతములగుటచేత రుద్రాక్షలు శివజ్ఞానమును పెంపొందించుటకై యుత్పన్నము లైనవని గ్రహింపదగును.

శివంభూయాత్

## ఆశీర్వచనము : 3

**శ్లో॥ రుద్రనేత్ర సముత్పన్నారుద్రాక్షా లోకపావనాః ।**
**అష్టత్రింషత్ ప్రభేదేన భవంత్యుత్పత్తి భేదతాః ॥** ॥5॥

రుద్ర నేత్రముల నుండి యుద్భవించిన రుద్రాక్షలు లోకులను పవిత్రము చేసెడి శక్తి గలిగి యున్నవి. ఈ రుద్రాక్షలు ఉత్పత్తిభేదము చేత ముప్పైయెనిమిది ప్రకారములుగా నున్నవి.

**శ్లో॥ నేత్రాత్ సూర్యాత్మనః శంభోః కపిలా ద్వాదశోదితాః ।**
**స్వేతాః షోడశ సంజాతాః సోమరూపాద్విలోచనాత్ ॥** ॥6॥

శివుని సూర్యనేత్రముల నుండి వెలువడినవి, పన్నెండు రకములుగను, చంద్రనేత్రముల నుండి పుట్టినవి పదహారు రకములుగా గలవు. సూర్యనేత్రముల నుండి పుట్టినవి ఎరుపు రంగుతోను, చంద్రనేత్రము నుండి పుట్టినవి తెలుపు రంగుతోనుండును.

**శ్లో॥ కృష్ణాదశవిధాజాతా వహ్నిరూపాద్విలోచనాత్ ।**
**ఏవముత్పత్తి భేదేన రుద్రాక్షా బహుధాస్మృతాః ॥**

శివుని అగ్ని నేత్రము నుండి పదిరకములైన నల్లటి రుద్రాక్షలు ఉత్పన్నమైనవి. ఈ విధముగా రుద్రాక్షలు అనేక రకములుగా నుండునని చెప్పబడినవి.

రుద్రాక్ష శబ్దము యొక్క అన్వర్థకతః వ్యవహారమున కనుకూలముగా జగత్తులోని ప్రతియొక్క వ్యక్తి మరియు వస్తువలకును నామకరణము చేసెడి పద్ధతి గలదు. వీటిలో కొన్ని యౌగికార్థము గలవియును, కొన్ని గూఢార్థము గలవియును అయియుండును. రుద్రాక్ష యనెడి పేరు రుద్రనేత్ర సముత్పన్నములనెడి యర్థమును సూచించుటచే యిది యౌగికార్థమును పొందిన అన్వర్థమునకు నామధేయమై యున్నది. పరమాత్ముని నేత్రముల యందు పాప పరిహారక సామర్థ్యము ఉండునటులే, ఈ రుద్రాక్షలు లోకపావనము లైయున్నవి. ఈ కారణము వలననే, శ్రీ రేణుక భగవత్పాదుల వారు "రుద్రాక్షా లోకపావనాః" అని యుపదేశించిరి.

శివుని యనన్య భావన చేత పూజించెడి అనేకమంది మహానుభావులకు, నేత్రపరుషము, హస్తపరుషము, వాక్పరుషము మొదలగునవి ప్రాప్తమగును. వారు సిద్ధపురుషులైయున్నారు. ఈ సిద్ధుల మహిమచేత వీరు చూపు స్పర్ష మరియు వాక్కుల ద్వారా లోకములోని జనులను ఉద్ధరించు చుందురు. శ్రీ నిజగుణ శివయోగుల వారి యీ వాక్కులను గనుడి :

**శ్లో॥ నోడి కెలరం మాతనాడి కెలరం**
**ముట్టి కెలరం మిగె దేవరాగి మాళ్ప ఆచార్య శరణాగు ॥**

"చూసి కొందరిని, మాటలాడి కొందరిని, ముట్టి కొందరిని దేవునివలె ధన్యతనిచ్చెడి ఆచార్యునకు శరణం బొందుము" అనెడిది శివయోగుల వారి వాక్కులలోని భావము. శివోపాసన చేసిన వారికిన్ని, మహిమలుండగా, సాక్షాత్తుగా శివుని త్రినేత్రముల నుండి జాలిపడిన జలబిందువుల చేత నుత్పన్నములైన రుద్రాక్షల కెంత మహిమయుండునో తెలిసికొనగలమా ? అందుచేత రుద్రాక్షలను రుద్రస్వరూపములని యెంచి సమ్మతిన ధరించుటయే శ్రేయస్కరము.

## శివుడు - సర్వవ్యవహారముల సాక్షి :

ఉత్పత్తి భేదముల ననుసరించి రుద్రాక్షలు ముప్పది యెనిమిది రకములుగా నుండునని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి. శివుని త్రినేత్రములే యీ ప్రభేదములకు కారణభూతము లగుచున్నవి. "సహసాక్షి సహస్రపాత్" యిత్యాది శ్రుతి వాక్యముల ప్రకారము విరాడ్రూపుడైన శివునికి వేనకు వేలు నేత్రములు గలవని తెలియుచున్నది. పౌరాణిక వాఙ్మయమున శివునికి త్ర్యంబక, త్రినేత్రములనెడి పేర్లు గలవు. అయితే శివునికి మూడు కళ్ళు మాత్రమే గలవా ? అతడు సహస్రాక్షుడు కాడా ? అనెడి జిజ్ఞాస తలయెత్తకుండా ఉండదు. ఇట్టి జిజ్ఞాసువులు తెలుసుకొనవలసిన దేమనగా శివుడే సహస్రాక్షుడును, త్రినేత్రుడును అయియున్నాడు. ఇచ్చట సహస్రమనెడి పదమును సంఖ్యా వాచకముగా తీసుకొనవలదు. సహస్రమనగా అసంఖ్యాకమని గ్రహించవలెను. పరమాత్ముడుగా శివుడు సకల జీవుల హృదయములలో నివసించి యున్నాడు. అందుచేత నతడు సకల జీవులకును అంతర్యామియై చూచుచుండును. అందుచేత శివుని సహస్రాక్షుడుగా పిలువబడుచున్నాడు.

శివపరమాత్మ యొక్క లీలా విశేషములలో రుద్రరూపమొకటియని దలచవలెను. సంహారకార్యమును చేపట్టుటకై శివుడు ఈ రూపమును ధరించును. రుద్రరూపియైన శివునికి మూడు కళ్ళు ఉండును. సూర్యచంద్రాగ్నులే మూడు కళ్ళని యెరుంగవలెను. అట్టి యెడ శివుడు రేయంబవళ్ళు మనలను చూస్తూ ఉన్నాడు. మనము చేసెడి వ్యవహారములన్నింటికిని సాక్షిగా యున్నాడు ఈ విషయమును గ్రహించినవాడు చెడ్డపనులకు పూనుకొనగలడా ?

## రుద్రాక్షల ప్రభేదములు :

త్రినేత్రధారియైన శ్రీ రుద్రుడు తన సూర్యచంద్రనేత్రములను జగత్తు యొక్క ప్రకాశమునకై సదా వెరచిపెట్టును. అగ్నినేత్రమును మాత్రము సదా మూసియుండును. సంహారకాలమున మాత్రమే దానిని తెరుచును త్రిపురములను దహనము చేసెడి సందర్భమునందు ఈ మూడు నేత్రముల నుండి జలబిందువులు భూమిపై పడి వాటి నుండి రుద్రాక్ష వృక్షములు పుట్టినవని యింతకు ముందుగానే తెలుసుకొంటిమి.

"అష్ట త్రింశత్ ప్రభేదేన భవంత్యుపత్తి భేదతః" యనెడి పూజ్యపాదు లుపదేశము ప్రకారము రుద్రాక్షలు 38 ప్రకారములుగానుండును. వీటియందున శివుని సూర్య రూపనేత్రము నుండి కపిల వర్ణమునకు చెందిన 12 రకములును, చంద్రరూపనేత్రము నుండి తెల్లని వర్ణమునకు చెందిన 16 రకములు మరియు అగ్నిరూప నేత్రము నుండి నల్లటి వర్ణమునకు గల 10 రకములును వ్యుత్పత్తి అయినవి.

## శివుని సూర్యనేత్రమునకు చెందిన రుద్రాక్షలు :

సూర్యుని నేత్రము నుండి 12 రకములైన రుద్రాక్షలు ఎందుచేత ఏర్పడినవనెడిది తెలుసుకొనవలయును.

"సరతి ఆకాశే ఇతి, యద్వాసువతి కర్మణే లోకం ప్రేరయతి ఇతి సూర్యః" యనెడి వ్యుత్పత్తి మేరకు "సుగ్రతౌ, సుప్రేరణేవా" – "స్రూ" యనెడి గత్యర్థక అదవా "సూ" యనెడి ప్రేరణార్థక "సూర్య" యనే పదము నిష్పన్నమైనది. ఆకాశమునందు సంచరించుట చేత లేదా తాను ఉదితుడై జీవులను తమతమ కర్మలయందు ప్రేరేపించుట చేతను, అతనికి సూర్యుడను పేరు వచ్చినది. సూర్యోదయము కాగానే సకల జీవరాశి లేచి తమతమ వ్యవహారములందు నిమగ్నులైయుందురు. కర్మప్రేరకుడు యనెడి అర్థము సూర్యునికి సమంజసమైనది ఈ కారణము వలననే అక్కమహాదేవిగారు లోకము యొక్క చేష్టకు రవియే బీజమని చెప్పెను.

పద కోషములయందు సూర్యునికి అనేక నామములు కలవు. వాటిలో "అంద్వాదశాత్మ" యనెడి దొక ప్రసిద్ధనామము. "ద్వాదశాత్మానామూర్తయః యస్యా సహా ద్వాదశాత్మ" యనెడి దాని ప్రకారము ఇతడు 12 మూర్తులు, లేదా 12 కళలు కల్గియుండును. ఈ కారణము వలననే ద్వాదశాత్ముడగుచున్నాడు. యోగశాస్త్రములోని సూర్య నమస్కారములనెడి ఆసనములందున సూర్యుని ఒక్కొక్క మూర్తికి ఒక్క వధమైన 12 నమస్కార విధానములు ప్రతిపాదింపబడినవి. శ్రీ నాగేంద్రనాథ మరియు విశ్వనాథ వాసుయనెడి వారు

హిందీ విశ్వకోషమునందు- 1) వస్పషా, 2) మరమా, 3) విద్యా, 4) జ్యోతిర్భా, 5) శాశ్వత, 6) స్పుటా, 7) కైవల్య, 8) జ్ఞాన, 9) ఆవిర్భా, 10) ప్రకామ్య, 11) సంచితం, 12) బోధా లేదా అవగతియని సూర్యుని 12 నామములను తెల్పిరి. (భాగము 24 పుట 404, 405).

పరమాత్ముని యొక్క సూర్యనేత్రములోని 12 మూర్తులనుండి ఒక్కొక్క జలబింధువు నేలకురాలినందున అందులో నుండి 12 రకములైన కపిలవర్ణపు రుద్రాక్ష లుత్పన్నమయినట్లుగా తెలిసి కొనవచ్చును.

సిద్ధాంత సిఖామణికి సంస్కృత వ్యాఖ్యానము వ్రాసిన మరి తోంట దార్యులవారు "సూర్యనేత్రస్యా తాపిన్యాది ద్వాదశః కలాత్మకత్వాత్" యని చెప్పి సూర్యుని ద్వాదశాత్మ భావమును సమర్థించిరి. పిదప 12 రకముల గురించి ఉల్లేఖించిరి.

## సోమనేత్రము మరియు రుద్రాక్షలు

"శ్వేతా షోడష సంజాతః సోమరూప విలోచనాత్" యనెడి పూజ్యపాదుల వారు ఉపదేశము ప్రకారము శివుని సోమనేత్రము నుండి 16 రకములైన తెల్లటి రుద్రాక్షలు దర్శనమైనవి. ఇచ్చట 16 ప్రకారములెందుకనెడిది విచారించ వలసియున్నది. "సుతే అమృతం ఇతిసోమః" యనెడి వ్యుత్పత్తి ప్రకారము, అమృతప్రాయమైన వెన్నెలను వర్షించుటచేత చంద్రునికి సోముడు యనెడి నామము ప్రాప్తమైనది.

అమరసింహుడు చంద్రునికి 20 పర్యాయపదములనిచ్చుచూ, అందులో సోముడు "కళానిధి" యని వాటిని చేర్చెను. ప్రస్తుతం 'కళానిధి' యనెడిపేరు మన సందర్భమునకు ప్రయుక్తమైయున్నది. "కలాః నిధీయంతే అత్రా ఇతి కలానిధిః" యనెడి వ్యుత్పత్తి మేరకు అంశముల భాండాగారమే కళానిధి యగుచున్నది. అంశమును కిరణముగా భావించవలసి యున్నది. చంద్రుని యందున 16 అంశములు లేదా కళలు గలవని సుప్రసిద్ధమైయున్నది. అమావాస్య దినమునందు సంపూర్ణముగా కళారహితుడైన చంద్రుడు, శుక్లపక్షపు ప్రతి పదము నుండి ఒక్కొక్క కళను సంతరించుకొని వెలుగుచూ, పౌర్ణమి దినమున పూర్ణకళారూపుడై వెలుగుచున్నాడు. దీనిని మన మెల్లరము గాంచుచున్నాము. హిందీ పదకోషకారుడు 1) పూషా, 2) యశా, 3) సుమనస, 4) రతి, 5) ప్రాప్తి, 6) దృతి, 7) బుద్ధి, 8) సౌమ్య, 9) మరీచి, 10) అంశుమాలిని, 11) అంగీర, 12) శశిని, 13) చ్ఛాయ, 14) సంపూర్ణము, 15) తుష్టి మరియు 16) అమృత యనే వాటిని చంద్రుని కళలుగా ప్రతిపాదించెను. (భాగము-7, పు'ట 146-147)

ఈ కళలన్నియును తిథులభేదము చేత స్త్రీలవిభిన్న అంగములయందు ఉండెడి దానిని, కామశాస్త్రము నందున నిరూపించబడినది. ఈ షోడశ కళలతో కూడుకొని స్ఫురద్రూపియైన చంద్రుడు చూచుటకు ఎంతో ఆకర్షణీయుడుగానుండును. దేవతల గురువైన బృహస్పతి దగ్గర యతడు విద్యాభ్యాసము చేయునప్పుడు బృహస్పతి పత్నియైన తారాదేవి యాతని యందు అనురక్తురాలయ్యెను. ఆమె అనురాగమునకు లోనైన చంద్రుడు గురుభార్యా తల్పగమనమును చేయును. దీనిని తెలిసిన బృహస్పతి "ఏ కళల కారణము చేత నా భార్యయొక్క పాతివ్రత్యమును భంగము చేసినావో ఆ కళలన్నియును నశించిపోవుగాక" యని శాపమిచ్చెను. గురు శాపగ్రస్థుడైన చంద్రుని కళలు దినదినము క్షీణమగుచూ 15 కళలు అంతరించినవి. ఇంకనూ మిగిలిన ఒక్క కళనష్టమైన యెడల తాను సర్వనాశనమగునని భయపడి చంద్రుడు శివునికి శరణాగతుడయ్యెను. లోక కళ్యాణార్థముగా మిగిలిన ఒక్క కళను శివుడు తన జడయందు ధరించి దానికి అమృత రూపమునిచ్చెను. అందుచేతనే చంద్రుని 16వ కళకు 'అమృతకళ' యనెడి పేరు వచ్చినది. ఇదే శివుని చంద్రశేఖర లీల.

పరమాత్ముని యనుగ్రహముచేత మిగిలిన అమృతకళ ద్వారానే చంద్రుడు వెలుగజొచ్చెను. అయితే గురు శాపము అమోఘమైయున్నందున మళ్ళీ క్షయము నొందజొచ్చెను. ఈ విధముగా శుక్లపక్షమునందు వృద్ధియూ, కృష్ణపక్షమునందు క్షీణదశ అనాదికాలము నుండి చంద్రునిలో జరుగుతూ వచ్చుచున్నది. ఈ మేరకు పౌరాణిక కథలుగలవు.

ఈ రీతిగా పరమాత్ముని నేత్రరూపుడైన చంద్రుడు 16 కళలచేత శుభముగా నుండి ఒక్కొక్క కళకు ఒక్కొక్క రుద్రాక్ష చొప్పున 16 రుద్రాక్షలు త్పన్నమైనవని భావించవలెను. మరి తొంటదార్యుల వారు, యీ విషయమును సమర్థిస్తూ "తన్నేత్రస్యా అమృతాది షోడశ కళా త్మక త్వాత్" యని చెప్పెను.

## వహ్నినేత్రము మరియు రుద్రాక్షలు :

"కృష్ణాదశ విధీ జాతా వహ్ని రూపాద్విలోచనాత్" యనెడి పూజ్యపాదుల యొక్క ఆదేశము ప్రకారము 10 నల్లటి రుద్రాక్షలు, శివుని వహ్ని నేత్రము నుండి ఉత్పన్నమయ్యెనని తెలియుచున్నది. "వహతీ అవ్యం ఇతి వహ్నిః" యనెడి వ్యుత్పత్తి మేరకు దేవతలనుద్దేశించి యివ్వబడిన అవిర్భాగములను ఆయా దేవతలకు అందించెడివాడు. కావున అగ్నికి "వహ్ని" యనెడి పేరు ప్రాప్తించినది.

అమరసింహుడు అగ్నికి, 'వైశ్వానరవీతిహోత్ర' మొదలగు ముప్పది నాలుగు పర్యాయపదములను వ్రాసిరి. వహ్నికి ఈ క్రింది అవయవములు కలవని తెలియుచున్నది. ధూమ్రమము అర్చి ; ఉష్మా ; జలినీ ; జ్వాలినీ ; విస్ఫులింగిని ; శుశ్రీ ; సురూప ; కపిల మరియు అవ్యకవ్యవహః ఈ అవయవములను కళలు యని కూడా పిలిచెదరు. వివరములకై హిందీ పద విశ్వకోషములోని మొదటి భాగమును చూడుడి (భాగము-1, పుట-107).

మరి తొంటదార్యులు కూడా యిట్టి భావమునే ప్రతిపాదించిరి. ఈ ఒక్కొక్క అంగము నుండి ఒక్కొక్క రకమైన నల్లటి రుద్రాక్ష లుత్పన్నమైనవని భావించవలయును.

ఈ రీతిగా ఉత్పత్తి భేదము వలన రుద్రాక్షలు 38 విధములని పూజ్యపాదులు రుద్రాక్ష ప్రభేదములను ప్రతిపాదించిరి. వీరశైవులందరూ ఈ భేదములను తెలుసుకొని రుద్రాక్షధారణ విషయములో భక్తిశ్రద్ధలను పెంచుకొనెదరుగాక ! ఉత్తమ రుద్రాక్ష యొక్క లక్షణములను రుద్రాక్ష వక్త్రములలోని భేదములు, వాటిని ధరించుటవలన కలిగెడి ఫలములను తర్వాతి ఆశీర్వచనములో తెలుసుకొనగలము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 1-9-1990

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు ముప్పది రకములగు రుద్రాక్షల గురించి ఎంతో వివరముగా తెలియజేసిరి. శ్రీ మరితొంట దార్యుల వారు సూత్రప్రాయముగా చెప్పిన యంశములకు శ్రీవారు ననూహ్యమైన రీతిలో విశ్లేషణను నొసంగిరి.

బసవ పురాణములో శ్వేతవర్ణపు రుద్రాక్షల గురించి సూచనప్రాయముగా తెలియజేయబడినది. గమనించుడి

వలయుచో రుద్రాక్షములు ధరింపుచుండును

శ్లో॥ **"లలన ! రుద్రాక్షముల్ దాల్చవేమనిన**
**గడుగందు లవణ సాగర తీరమునను**
**బొడమిన రుద్రాక్షములు సహింపమిని**
**దెల్లంబు క్షీరాబ్ధి తీరమందుండు**
**తెల్ల రుద్రాక్షముల్ తెచ్చె నొక్కయ్య**
**యెప్పుడు దాల్చనున్నెక్కిన వనుచు ॥** (బసవపురాణము, తృ.తి.)

సాందర్భకము వచ్చిన ప్రసంగములో చెప్పబడినదే గాని, వివరములు నివ్వబడలేదు.

శివ మహాపురాణములో తామ్రవర్ణపు రుద్రాక్షల గురించి వివరంచనైనది. గమనించుడి ;

శ్లో॥ **తామ్రా స్నిగాధ దృఢాస్థూలా**
**కంటకైః సహితాః శుభాః ॥** (వి.సం. 23/ 21-22)

నల్లటి రుద్రాక్షల గురించిన ప్రసంగములంతగా కన్పట్టుటలేదు. ఇంకనూ శోధించవలసియున్నది.

త్రినేత్రముల తత్త్వమును విశ్లేషించిన శ్రీ పండిత చిదిరెమఠం వీరభద్రశర్మ (కాశీ జగద్గురు గారు) నీ క్రింది విధముగా తెలిపిరి –

"లోకమునందలి యంధతమసయమును ప్రచండ తేజముతో నశింపజేసి దట్టమైన వెలుగుజూపి లోకమును కర్తవ్యమున పడవేయుటకును, రాత్రిలో గూడా చల్లని వెలుగు నిచ్చి సమన్వయ సుఖము ననుగ్రహించుటకును సూర్యచంద్రాగ్నులు పరమావశ్యకములు. ఇవియే శివుని త్రినేత్రములు. అనగా సత్త్వరజస్తమస్సులని ముద్విధములుగా వ్యాపించిన సర్వ విశ్వదోషములను సూర్యచంద్రాగ్ని రూప త్రినేత్రములతో సాకల్యముగా నవలోకించి నిర్వహించు సామర్థ్యము శివుని కొక్కనికే గలదని భావము నివారించుటయే. (శివపంచస్త)

త్రిగుణముల వలన గల్గిన దోషమలను నివారించుటే త్రినేత్ర తత్త్వమని ఈ క్రింది విధముగా వివరించిరి :

**శ్లో॥ ఆప్యాయన స్తమో హర్తా, విద్యయా దోష తాహకృత్**
**సోమ సూర్యాగ్నినయన స్త్రినేత స్తేన శంకరః ॥**

సోమ తత్త్వమునకు చెందిన శ్వేత వర్ణపు రుద్రాక్షలు సత్త్వగుణమును ప్రకాశింపజేసి ఆహ్లాదమును గల్గించునని గుర్తించవలెను. తాత్త్విక పరముగా నియ్యది శివానందమును గలుగజేయును.

కపిలవర్ణపు రుద్రాక్షలు నజ్ఞానమును హరించెడివని గ్రహించవలెను. జ్ఞాన సముపార్జన కవరోధముగా నిలిచెడి రజోగుణము యొక్క తత్త్వము తగ్గించును. రజోగుణము యొక్క సకారాత్మక రూపమైన నిష్ఠకు నీ రుద్రాక్షలు బలమునిచ్చి లింగైక్య నిష్ఠాపర తత్త్వము వైపు పయనింప జేయును.

నల్లటి రుద్రాక్షలు తమోగుణము సంబంధమైన దోషములు నివారించుననియును, దురితములను దహించి తాపమును తగ్గించుననియును గుర్తించవలెను.

భక్తుడు సాధ్యాసాధ్యములను గుర్తెరిగి యేదైనానొక దానిని నెంపిక జేసికొనవలెను. తామ్రవర్ణమే యుత్తమమైనదని శివపురాణము సూచించుచున్నదని గ్రహించగలరు.

శివంభూయాత్

## ఆశీర్వచనము : 4

**శ్లో॥ అచ్ఛిద్రం కనకప్రఖ్యమనన్యధృతముత్తమమ్ ।**
**రుద్రాక్షం ధారయేత్ ప్రాజ్ఞః శివపూజాపరాయణః ॥** (8)

పురుగుల చేత రంధ్రములు చేయబడనివియును, సువర్ణకాంతులతో ప్రకాశించెడివియును, ఇంతకు క్రితము ఎవ్వరును ధరించనివగు శ్రేష్ఠమైన క్రొత్త రుద్రాక్షలను శివపూజాపరాయణులు ధరించవలెను.

**శ్లో॥ యథాస్థానం యతావక్త్రం యథాయోగం యథావిధి ।**
**రుద్రాక్షధారణం వక్ష్యే రుద్రసాయుజ్య సిద్ధయే ॥** (9)

శివసాయుజ్య రూపమైన ముక్తి యొక్క ప్రాప్తికై యే యే స్థానములయందు ఎన్నెన్ని ముఖముల ఎన్నెన్ని రుద్రాక్షలను ధరించవలెననెడిది విధి ప్రకారము చెప్పెదను శ్రద్ధగా వినుడి.

**శిఖాయామే కమేకాస్యం రుద్రాక్షం ధారయేద్బుధః ।**
**ద్విత్రి ద్వాదశ వక్త్రాణి శిరసి త్రీణి ధారయేత్ ॥**

**షట్త్రింశ ద్ధారయేన్ మూర్ధి నిత్యమేకా దశాననాన్ ।**
**దశ సప్తపంచ వక్త్రాన్ షట్ షట్ కర్ణద్వయే వహేత్ ॥**

**త్రయోదశ ముఖాన్స్రాహోర్ధరేత్ షోడశ షోడశః ।**
**ప్రత్యేకం ద్వాదశ వహేన్న వాస్యాన్మణిబంధయోః ॥**
**చతుర్దశముఖం యజ్ఞ సూత్ర మష్టోత్తరం శతం ।**
**ధారయేత్ సర్వకాలంతు రుద్రాక్షం శివపూజకః ॥** (సి.శి. 10-14)

ఒక ముఖము గల యొక రుద్రాక్షను శిఖాస్థానము నందునను, రెండు, మూడు మరియు పన్నెండు ముఖములు గల మూడు రుద్రాక్షలను శిరస్సునందునను, పదకొండు ముఖములుగల ముప్పదియారు రుద్రాక్షలను నెత్తి చుట్టూను, పది, యేడు, ఐదు ముఖములు గల రుద్రాక్షలను రెంటి చొప్పున చెవులయందును, ఆరు మరియు ఎనిమిది ముఖములుగల రుద్రాక్షలు పదహారు చొప్పునను (16+16=32) నాల్గు ముఖములుగల యాభై హృదయ సీమలోను, పదమూడు ముఖములు గల పదహారు, పదహారు రుద్రాక్షలను రెట్టలయందుననూ, పందొమ్మిది ముఖములు గల పన్నెండు పన్నెండు రుద్రాక్షలను ముంజేతులకును పధ్నాలుగు ముఖములుగల నూటా ఎనిమిది రుద్రాక్షలను యజ్ఞోపవీతముగను ధరించవలెను.

## ఉత్తమ రుద్రాక్ష పరీక్ష:

శివపూజా పరాయణులైన వారు నుత్తమ లక్షణములు గల రుద్రాక్షలనే ధరించవలెననియును తన్నిమిత్తమై తగు పరీక్షలను సలిపి, స్వీకరించి, ధరించవలెను. పరీక్ష నిమిత్తమై పరిశీలించవలసిన యంశము లెట్టివి యనెడి సందేహము కలుగకుండుటకై ఆచార్యులవారు పురుగులు తొలవనియును, స్వర్ణకాంతి వంటి కాంతిగలవియును, ఎవ్వరు ధరించనివియు ఉత్తమ రుద్రాక్ష లక్షణములని యుపదేశించిరి.

మనుజుని మంచి మరియు చెడు సంస్కారముల ప్రభావము అతడు ధరించెడి వస్తువుల మీద పడుననెడిది శాస్త్ర సమ్మతమైయున్నది. నేటి వైజ్ఞానికులును ఇట్టి యభిప్రాయములనే గల్గియున్నారు. ఒక వ్యక్తికి గల సంస్కారబలము వలన యతడు ధరించెడి వస్తువులకు పాత్రత లభించుచున్నది. మన కంటెను పెద్దవారును, గురువులును, మహానుభావులును అగువారు ధరించిన రుద్రాక్షలను ధరించుట యందున దోషముండదు. కాని మన కంటెను హీనులు, సంస్కార శూన్యులగువారు ధరించిన రుద్రాక్షలను ధరించవలదు.

శివపురాణములోను ఉత్తమ రుద్రాక్ష లక్షణము లివ్వబడినవి కనుడి :

**తామ్రాః స్నిగ్ధా దృఢాస్థూలాః కంటకైః సహితాః శుభాః**
**క్రిమిద్రష్టం నఛిన్నభిన్నం కంటకైర్హీన మేవచ ।**
**వ్రణ యుక్తమయుక్తాం చ షఢ్రుద్రాక్షాన్ వివర్జయేత్ ॥**
(శివపురాణము, వి.సం.23/21-22) క్రియాసారము 9/11-13, వీ.ఆ.చ. 158,159

రాగిరంగును గలవియును, స్నిగ్ధమైనవియును, గట్టిగాను, లావుగాను ఉండెడివియు, ముళ్ళు గలవియును, ఉత్తమమైనవనియును, పురుగు పట్టనివి, గుల్లగా చేయబడినవియు, వ్రణము గల్గి విరిగినవియు, వంకరటింకరగానున్నవియును అనుత్తమములు వీరశైవులు ఈ లక్షణములను మదిన నిల్పి రుద్రాక్షలను పరీక్షించుకొనవలెను.

## రుద్రాక్ష యొక్క పరిమాణము మరియు ధారణమహిమ

రుద్రాక్ష యొక్క పరిమాణము గురించి విభిన్నమైన అభిప్రాయములు గలవు. ఈ విషయమున వ్యాసమహర్షి యీ క్రింది విధముగా తెల్పిరి -

శ్లో॥ **ధాత్రీఫలప్రమాణం యచ్ఛ్రేష్టమేత దుదాహృతం ।**
**బదరీఫలమాత్రం తు మధ్యమం సంప్రకీర్తితం ॥**
**అదమం చణమాత్రం స్యాత్ప్రక్రియైషా పరోచ్యతే ॥** (శి.మ.పు. వి.స. 25వ అధ్యాయము - 14, 15)

వ్యాసులవారి ప్రకారము, ఉసిరికాయ ప్రమాణము గలవి మధ్యమ రకమునకు చెందినవగును. శనగల ప్రమాణము గల రుద్రాక్షలు అధమములు ఎంత పెద్ద పరిమాణము రుద్రాక్షదైతే అంత మేలుయని తెలుసుకొనగలరు. అయితే మరొక సందర్భములో యిదే వ్యాసులవారు, అదే శివపురాణములోను మరొక రీతిన చెప్పిరి. గమనించుడీ

**శ్లో॥ యధా యధా లఘుం స్యాద్వైత ధాధిక పలప్రదః ।**
**ఏకైకతః ఫలం ప్రోక్తం దశోశ్తరధికం బుధైః ॥** (శి.పు. వి.సం. 25వ అధ్యాయము – 18)

ఈ ప్రమాణము ప్రకారము పరిమాణము చిన్నదిగా నుండు రుద్రాక్ష అధికమైన ఫలమునిచ్చును. వ్యాసులవారి ఉపదేశములోని ఉమ్మడి స్వరూపము ప్రకారము అధిక పరిమాణము గల రుద్రాక్షను దాల్చిన లేదా అల్ప ప్రమాణము గల రుద్రాక్షలను దాల్చిన, అధికాధికమైన ఫలములు లభించును. ఈ కారణమువలన సల్ల క్షణములు కల్గిన పెద్ద ప్రమాణము గల రుద్రాక్షనైనను (ఉసిరికాయ) లేదా శనగగింజ పరిమాణము గల రుద్రాక్షనైనను ధరించుకొనవలెను. ఈ కాలమునందున ఈ రెండు రకములైన రుద్రాక్షల ధరలు ఆకాశములంటుచున్నవి. అంత ద్రవ్యమును వెచ్చించి రుద్రాక్షలను కొనలేనివారు, వారివారి ఆర్థికస్థితిని బట్టి అవసరమును బట్టీ వీటిని కొనుగోలు చేసుకోగలరు. గుర్తించవలసిన విషయమేమనగా, ఎదో ఒక రుద్రాక్షను ధరించి ఉండవలెను మరియు ధరించకుండా వుండని ఎడల వైపరీత్యములుండునని గ్రహించవలయును. ఈ విషయము శివ పురాణములోని యీ క్రింది ప్రమాణము గమనించదగియున్నది.

**శ్లో॥ శివనామ విభూతిశ్చ తధా రుద్రాక్ష ఏవచా ।**
**ఏతత్త్రయం మహాపుణ్యం త్రివేణి సదృషస్మృతం ॥**

**శ్లో॥ విభూతిర్యస్యా నో భాలె నాంగే రుద్రాక్షధారణం ।**
**నాస్యే శివమయీ వాణీ తం త్సజేద ధమంయధా ॥** (శి.పు. వి.స. 23 అధ్యాయం 10, 13)

పై శ్లోకముల ప్రకారము శివనామ ఉచ్చారణ, విభూతి మరియు రుద్రాక్షల ధారణ త్రివేణి సంగమము వంటివి, విభూతి, రుద్రాక్ష ధారులై శివనామ స్మరణ చేయు వారికి త్రివేణి సంగమస్నానఫలము ప్రాప్తమగును. దీనికి విపరీతముగా విభూతిరుద్రాక్షలను ధరించకుండ, శివనామము మాత్రమే జపించెవాడు అంత్యజుని వంటివాడు.

వీరశైవులకు యీ మూడింటితో పాటుగా మరొక్క 63 కూడా విస్మరింపజాలనివైయున్నవి.

అదియే లింగధారణ వ్యాసుల ప్రతిపాదించిన త్రివేణిలకు, ఈ చతుర్థవేణిని కూడా జోడించుట ఎంతో అవసరము. వ్యాసమహర్షి యొక్క ఉపదేశమును రేణుక భగవత్పాదుల ఉపదేశముతో పోల్చిన యెడల యీ రెంటికిని అభేదము గోచరించుచుండును. శివపూజా నిరతులైన ప్రతి ఒక్కరు, రుద్రాక్ష ధారణను తప్పనిసరిగా చేసికొనవలెను.

## రుద్రాక్ష ముఖములు వాటి మహిమ :

రుద్రాక్ష జాబాలోపనిషత్తు, శివపురాణము, సిద్ధాంత శిఖామణి క్రియాసారము మొదలగు ప్రాచీన ప్రామాణిక గ్రంధములయందు, రుద్రాక్షలకు ఒకటి నుండి 14 వరకు ముఖములుండునని ప్రతిపాదించడము జరిగినది. ఇప్పటి పరిస్థితియందు రెండు ముఖముల నుండి పదినాల్గు ముఖముల వరకు రుద్రాక్షలు లభ్యమగుచున్నవి. ఏకముఖ రుద్రాక్షల ఉత్పత్తి అతి తక్కువస్థాయిలో ఉండుటచే, ఎల్లరకు వాటి లభ్యత కష్టము. మీదు మిక్కిలి ఏకముఖి రుద్రాక్ష యొక్క మహిమ అపారముగా నుండుటచే, దానిని వెలబెట్టి కొని ధరించుట అందరకు సాధ్యమయ్యేడి విషయము కాదు. వాస్తవముగా చూసిన యెడల ఏకముఖ రుద్రాక్ష గురించిన ఆసక్తిని తగ్గించుకోవడమే మంచిది. ఇకమీదట శాస్త్రోక్త విధికి అనుగుణముగా ఆయా ముఖములు గల రుద్రాక్షల స్వరూపమును వాటి ఫలితములను తెలుసుకొనెదము గాక !

## ఏక ముఖి రుద్రాక్ష

శ్లో॥ ఏకవక్త్రంతు రుద్రాక్షం పరతత్త్వ స్వరూపకం ।
తద్ధారణాత్ పరే తత్త్వే లీయతే విజితేంద్రియః ॥ (రు3దాక్ష జాబాలోపనిషత్తు 2-1)

శ్లో॥ ఏక వక్త్రఃశివః సాక్షాద్భుక్తి ముక్తిఫలప్రదః ।
తస్యదర్శనమాత్రేణ బ్రహ్మహత్యాం వ్యపోహతి ॥

శ్లో॥ యత్ర సంపూజిత స్తత్ర లక్ష్మీ ర్ధరతారన హి ।
నశ్యం తుపద్రవాః సర్వే సర్వకామా భవంతిహి ॥ (శి.వ.పు. వీసం. అధ్యాయం 25, శ్లో॥ 64, 65)

ఈ శ్లోకముల ఆధారము ప్రకారము ఏకముఖరుద్రాక్ష పరతత్త్వ స్వరూపమైనది. దీని దర్శనముచే బ్రహ్మ హత్యాది పాతకములు తొలగిపోవును. దీనిని మస్తకము నందు ధరించెడి విధానము కలదు. ఆ విధముగా ధరించిన యెడల ఉపద్రవములన్నియును నాశనములై యిష్టార్థములు ప్రాప్తమగును. ఇదియును గాక ప్రతినిత్యమును దీనిని పూజించిన యెడల లక్ష్మీదేవి స్థిరముగా నా యింట నివసించియుండును. ఇది ఏకముఖి రుద్రాక్ష యొక్క మహిమ. శక్తిగలవారు దీనిని సంపాదించి లబ్ధిని పొందగలరు.

## రెండు ముఖముల రుద్రాక్ష

ఈ రెండు ముఖముల రుద్రాక్షను గురించి ఉపనిషత్తులు మరియు పురాణములీవిధముగా తెలియజేసినవి.

శ్లో॥ ద్వివక్త్రో దేవదేవేశః సర్వకామ ఫలప్రదః ।
విశేషతః సరుద్రాక్షో గోవధం నాశయే ధృవం ॥
(శి.పు. ని.సం. అధ్యాయం 25, శ్లో॥ 66)

శ్లో॥ ద్వి వక్త్రంతు మునిశ్రేష్ట చార్ధనారీశ్వరాత్మకం ।
ధారణాదర్థనారీశః ప్రియతే తస్యనిత్యశః ॥

పై ప్రమాణముల ప్రకారము రెండు ముఖముల రుద్రాక్షను ధరించుట చేత గొవధ ఇత్యాది పాతకములు తొలగి అర్థ నారీశ్వరులైన మహాదేవ దేవుల అనుగ్రహము ప్రాప్తమగును. సకల విధములైన మనోరథములు నెరవేరగలవు.

## త్రిముఖ రుద్రాక్ష

త్రిముఖ రుద్రాక్ష సంబంధిత ప్రమాణములివి.

శ్లో॥ త్రిముఖంచైవరుద్రాక్షమగ్నిత్రయస్వరూపకం ।
తద్ధారణాచ్ఛ హుతభుక్తస్య తుష్యతి సర్వదా ॥ (రు.జా. ఉ. 2-3)

శ్లో॥ త్రైవక్త్రో యొహి రుద్రాక్షః సాక్షాత్

ఈ సిద్ధాంతము యొక్క రాద్ధాంతము బౌద్ధములోగల వివిధ భేదములను తెలియజేసెడి ఈ ప్రమాణమును గమనించండి

అధికారానుగుణ్యేన బౌద్ధశాస్త్రం చతుర్విధం ।
ప్రత్యక్షగమ్యం బాహ్యార్థమితి సౌత్రాంతికో బ్రవీత్ ॥

**బుద్ధ్యాకారానుమే యార్థో బాహ్యోవైభాషికోదితః ।**
**బుద్ధిమాత్రం వదంత్యత్ర యోగాచారోన చాపరం ॥**
**నసన్నాసన్న సదసన్న చోభాభ్యాం విలక్షణం ।**
**చతుష్కోటి వినిర్ముక్తం తత్త్వం మాధ్యమికా విదుః ॥**

బౌద్ధము నాల్గు విధములనియును, బుద్ధుని శిష్యులైన వైభాషిక, సౌత్రాంతిక, యోగాచార మరియు మాధ్యమికులనెడి వారిచే నివి యేర్పరచ బడినవి. జగత్తు గూర్చి వీరిలో విభిన్నమైన యభిప్రాయములు గలవు. సౌతాంత్రికుని ప్రకారము బాహ్యమునందు ప్రపంచము గలదు. ఇది ప్రత్యక్షముగా ప్రతీతి యందుగలదు. వైభాషికుని మతమున జగత్తు బయటికి తోచదు. అయితే బుద్ధియందు ననుభవమునకు వచ్చుట చేత నద్దానిని బాహ్యమున గలదని అనుమానము వలన గ్రహించవలెను. యోగాచార్యుడు, జగత్తులేనే లేదు. అది మన బుద్ధిలోనే గలదు. మాధ్యమికుడు, శూన్యవాదమును ప్రతిపాదిస్తూ, లోనగాని, వెలుపలగాని, సద్రూపమున గాని, అసద్రూపమున గాని లేనే లేదు. "సర్వం శూన్యం" అంతయూ శూన్యమే.

ఈ నాల్గింటిలో సౌత్రాంతికులు, వైభాషికులును లోన వెలుపలగల వస్తువులన్నింటినీ అంగీకరించి, వాటికి క్షణికత్వమును ఆపాదించిరి. క్షణికత్వమనగా, ప్రతిక్షణమునను వస్తువు పుట్టి, నాశనమగునని అర్థము. వీరు విరక్తులైయుందురు. యోగాచార్యులు, "ప్రతిమావనితా న్యాయము" చేత బాహ్య వస్తువులనన్నింటినీ విజ్ఞానమనెడి మనస్సునచేర్చి మనోనియమనముతో వైరాగ్యోపదశమును చేయుదురు. మాధ్యమికులు దేనిని ఒప్పక, బాహ్యము లేదు, అంతరమూ లేదనుచు మధ్యస్థులై యుందురు. వీరు సుషుప్తావస్థ యనెడి గాఢనిద్రావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, దానిని జాగ్రదావస్థతో పోల్చి వైరాగ్యము నుపదేశింతురు.

## రెండు ముఖముల రుద్రాక్ష

రెండు ముఖముల రుద్రాక్షను గురించిన ప్రమాణాలివి.

శ్లో॥ **ద్వివక్త్రో దేవదేవేశః సర్వకామఫలప్రదః ।**
**విశేషతః సరుద్రాక్షో గోవధం నాశయేద్ధ్రువం ॥** (శి.పు. వి.సం. అధ్యాయం 25, శ్లో॥ 66)

శ్లో॥ **ద్వి వక్త్రంతు మునిశ్రేష్ఠ చార్ధనారీశ్వరాత్మకం ।**
**ధారణాదర్థ నారీశః ప్రియతే తస్యనిత్యశః ॥**

రెండు ముఖముల రుద్రాక్షను ధరించుట చేత గోవధ ఇత్యాది పాతకములు తొలగి అర్థ నారీశ్వరులైన మహాదేవీదేవుల అనుగ్రహము ప్రాప్తమగును. సకల విధములైన మనోరథములు నెరవేరగలవు.

## త్రిముఖ రుద్రాక్ష

త్రిముఖ రుద్రాక్ష సంబంధిత ప్రమాణములివి.

శ్లో॥ **త్రిముఖంచైవ రుద్రాక్షమగ్నిత్రయస్వరూపకం ।**
**తద్ధారణాచ్చ హుతభుక్తస్య తుష్యతి సర్వదా ॥** (రు.జా. ఉ. 2-3)

శ్లో॥ **త్రైవక్త్రోయోహి రుద్రాక్షః సాక్షాత్ సాధన దస్సదా ।**
**తత్ర్వ భావద్భవీ యుర్వై విద్యాః సర్వాః ప్రతిష్ఠితాః ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 67)

పై ప్రమాణముల ప్రకారము మూడు ముఖములరుద్రాక్ష గార్హ్యా పత్య దక్షిణ ఆహవనీయ యనెడి అగ్నుల యొక్క స్వరూపమై యున్నది. దీనిని ధరించుటచేత అగ్నిదేవుడు సంతృప్తి నొందును. సకల విద్యలు సంప్రాప్తమగును. విద్యార్జన దశలో వున్న వారు దీనిని ధరించుట శ్రేయస్కరము.

## చతుర్ముఖ రుద్రాక్ష

చతుర్ముఖ రుద్రాక్ష గురించిన ప్రమాణములివి.

**శ్లో॥ చతుర్ముఖంతు రుద్రాక్షం చతుర్వక్త్ర స్వరూపకం ।**
**దద్ధారణచ్చతుర్వక్త్రః ప్రీయతే తస్యనిత్యదా ॥** (రు.జా. ఉ. 2-4)

చతుర్ముఖ రుద్రాక్ష, చతుర్ముఖుడైన బ్రహ్మ స్వరూపము అయివున్నది. దీనిని ధరించుట చేత బ్రహ్మదేవుడు సంతుష్టుడై చతుర్విధ పురుషార్థముల నొసంగును.

ఈ విషయమున శివపురాణము నీ క్రింది విధముగా వివరించినది.

**శ్లో॥ చతుర్వక్త్రః స్వయం బ్రహ్మనరహత్యం వ్యపోహతి ।**
**దర్శనాత్ స్పర్శ నాత్ సద్యశ్చ చతుర్వర్గ ఫలప్రదః ॥**

ఈ ప్రమాణము కూడా యించుమించు పై ప్రమాణములోని భావమునే సూచించుచున్నది.

## పంచముఖ రుద్రాక్ష

పంచముఖ రుద్రాక్ష గురించిన ప్రమాణములివి.

**శ్లో॥ పంచ వక్త్రంతురుద్రాక్షం పంచబ్రహ్మ స్వరూపకం ।**
**పంచవక్త్రః స్వయంబ్రహ్మ పుంహత్యాం చ వ్యపొహతి ॥** (రు.జా.ష. 2-5)

**శ్లో॥ పంచ వక్త్రః స్వయం రుద్రః కాలాగ్ని ర్నామతః ప్రభుః ।**
**సర్వముక్తి ప్రదశ్చైవ సర్వ కామఫలప్రదః ॥**
**ఆగమ్యాగమనం పాప మభక్షస్య చ భక్షణం ।**
**ఇత్యాది సర్వపాపాని పంచ వక్త్రో వ్యపొహతి ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 69-70)

ఐదు ముఖముల రుద్రాక్ష పంచముఖుడైన సదాశివుని స్వరూపం. సద్యోజాత వామదేవ అఘోర, తత్పురుష మరియు ఈశానములనెడి పంచముఖములు గల సదాశివుని పంచబ్రహ్మయనియును, కాలాగ్ని రుద్రుడనియును పిలుతురు. ఇట్టి రుద్రాక్షను ధరించుట చేత నరహత్య దోషము నివృత్తియగును. అగమ్యురాలైన స్త్రీని కూడినచో వచ్చెడి దోషమును మరియు తినకూడని వస్తువులను తినుటవలన సంక్రమించు దోషములును, నివృత్తియై సకల విధములైన అభీష్టములు నెరవేరును.

పంచబ్రహ్మ మూర్తిని సదా కొలచెడి వీరశైవుడు, పంచముఖ రుద్రాక్షను ధరించుటలో ఆసక్తి కలిగియుండుట తప్పని సరి. ఈ రుద్రాక్ష ముక్తిదాయకమని గ్రహించవలెను.

## ఆరు ముఖముల రుద్రాక్ష

ఆరు ముఖముల రుద్రాక్ష గురించిన ప్రమాణములను గమనించుడి

**శ్లో॥ షడ్వక్త్ర మపి రుద్రాక్షం కార్తీకేయాధి దైవతం ।**
**తద్ధారణాన్ మహాశ్రీ స్యాన్మాహదీరొగ్య ముత్తమంః ॥**

**శ్లో॥ మతి విజ్ఞాన సంపత్తి శుద్ధయే దారయేత్ సుధీః ।**
**వినాయకాధి దైవవంచ ప్రవదన్తి వదీషిణః ॥** (రు.జా.ఉ. 2-6,7)

**శ్లో॥ షద్వక్త్రః కార్తికేయస్తు ధారణాద్దక్ష ణే భుజే ।**
**బ్రహ్మ హత్యాదికైః పాపైముచ్చ్యతే నాత్ర సంశయః ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 71)

సారాంశమేమనగా ఆరు ముఖముల రుద్రాక్షకు షణ్ముఖుదు అధిదేవత. గణపతికి కూడా ఇది ప్రీతికరమైనది. కుడిచేతికి ధరించుట వలన బ్రహ్మ హత్య పాతకము తొలగును. దీని ధారణ చేత ఆరోగ్యము, భాగ్యము, మనోబుద్ధులు యష్టార్థ సిద్ధులు, అంతః కరణ సిద్ధులు గల్గును.

## ఏడు ముఖముల రుద్రాక్ష

ఏడు ముఖముల రుద్రాక్ష గురించిన ప్రమాణమును గమనించుదు.

**శ్లో॥ సప్త వక్త్రంతు రుద్రాక్షం సప్తమాత్రాధి దైవతం ।**
**తద్ధారణాన్ మహాశ్రీః స్యాన్మహదా రోగ్య ముత్తమం ॥**
**మహతీ జ్ఞానసంపత్తిః శుచిర్ధారణతః సదా ॥** (రు.జా.ఉ. 2-8)

**శ్లో॥ సప్త వక్త్రో మహేశాని హ్యనంగో నామనామతః ।**
**ధారణాత్తస్య దేవేశి దరిద్రో పీ శ్వరో భవేత్ ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 72)

ఏడు ముఖముల రుద్రాక్షకు బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి మరియు చాముండా యనెడి పేర్లు గల సప్త మాత్రుకలే అధిదేవతలు. ఈ రుద్రాక్ష ధారణ చేత ఆరోగ్యము, భౌతిక సంపద, జ్ఞానసంపద లభించును. ఈ రుద్రాక్షకు అనంగమనెడి పేరు కూడా కలదు. దరిద్రుని శ్రీమంతునిగా చేసే శక్తి యీ రుద్రాక్షకు కలదు.

## అష్టముఖ రుద్రాక్ష

ఎనిమిది ముఖముల రుద్రాక్ష గురించిన ప్రమాణములను గనుడి.

**శ్లో॥ అష్ట వక్త్ర రుద్రాక్షం అష్టమాత్రాధిదైవతం ।**
**వస్వష్టక ప్రియంచైవ గంగాప్రీతికరం తథా ।**
**తద్ధారణాధిమే ప్రీతా భవేయుః సత్యవాదినః ॥** (రు.జా.ఉ. 2-9,10)

**శ్లో॥ రుద్రాక్షశ్చ ష్టా వక్త్రశ్చ వసుమూర్తిశ్చ భైరవః ।**
**ద్ధారణాత్తస్య పూర్ణాయుర్మృతో భవతీ శూలభృత్ ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 73)

ఎనిమిది ముఖముల రుద్రాక్ష అష్టవసువుల యొక్కయు, భైరవుని యొక్కయు స్వరూపమై యున్నది. దీనిని ధరించుటచే, పేరును, గంగాదేవియును సంతృప్తులగుదురు. ధరించిన వారికి ఇష్టార్థముల నిచ్చుదురు. దీర్ఘాయుష్మలగుదురు. శివసాయుజ్యమును పొందగలరు.

ఈ రుద్రాక్షకు గురుభార్యాగమన పాతకమును దూరము చేసెడి శక్తి గలదని, శ్రీ అప్పయ్య దీక్షితులవారు శివార్చన చంద్రికలో తెలిపిరి.

## నవముఖ రుద్రాక్ష

కోట్లానుకోట్ల పాతకములను దూరము చేసెడి నవముఖ రుద్రాక్షల మహిమను తెలిపెడి ప్రమాణముల గనుడి :

**శ్లో॥ నవ వక్త్రంతు రుద్రాక్షం నవశక్త్య ధి దైవతం ।**
**తస్య ధారణ మాత్రేణ ప్రియంతే నవశక్తయః ॥** (రు.జా.ఉ. 2-11)

శ్లో॥ **భైరవో నవవక్త్రశ్చ కపిలశ్చ మహామునిః ।**
**దుర్గావా తధిష్ఠాత్రీ నవరూపా మహేశ్వరీ ॥**
**తంధారయేద్వా మహస్తే రుద్రాక్షంభక్తి తత్పరః ।**
**సర్వేశ్వరో భవేన్నూనం మమ తుల్యో నసంశయః ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 74, 75)

శ్లో॥ **నవ వక్త్రం వామకరే ధృతం చ**
**లక్షకోటి మహా పాతక దోషహరం ॥** (శివార్చనా చంద్రికా.పు. 15)

తొమ్మిది ముఖముల రుద్రాక్షకు దుర్గ, భైరవుడు నవశక్తులు, కపిల మహర్షి అధిదేవతలై యన్నారు. దీనిని యెడమ చేతికి కట్టుకొనిన వాని సర్వైశ్వర్య సంపన్నుడగును.

## దశముఖ రుద్రాక్ష

పది ముఖముల రుద్రాక్ష గురించిన ప్రమాణములివి.

శ్లో॥ **దశవక్త్రం రుద్రాక్షం యమదైవత్యా మీశ్వరం ।**
**దర్శనాచ్ఛాంతిజనకం పాపానాం నాత్ర సంశయః ॥** (రు.జా.ఉ. 2-12)

శ్లో॥ **దశవక్త్రో మహేశాని స్వయందేవోజనార్ధనః ।**
**ధారణా త్తస్య దేవేశి సర్వాన్ కామానవాప్నుయాత్ ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 76)

దీనికి యముడు మరియు విష్ణువు అధిదైవతములు. దీనిని దర్శించుట చేత పాపములు పశమనమగును. ధారణ చేత గ్రహ, పిశాచ, భేతాళ, బ్రహ్మ రాక్షసాదుల బాధలు వైదొలగిపోవును. సకల కామితార్థములు కైవసమగును.

## ఏకాదశముఖ రుద్రాక్ష

సౌభాగ్య దాయకము మరియు విజయప్రదమగు ఈ రుద్రాక్షకు సంబంధించిన ప్రమాణములను గనుడి:

శ్లో॥ **ఏకాదశ ముఖం త్వక్షం రుద్రైకాదశ దైవతమ్ ।**
**తదితం దేవతం ప్రాహుః సదా సౌభాగ్య వర్ధనం ॥** (రు.జా.ఉ. 2-13)

శ్లో॥ **ఏకాదశ ముఖోయస్తు రుద్రాక్ష పరమేశ్వరి ।**
**సరుద్రో ధారణ స్తత్య సర్వత్ర విజయీ భవేత్ ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 27)

శ్లో॥ **ఏకాదశ వక్త్రం శిఖాయాం ధృతం సహస్రాశ్వమేధ ।**
**శత వాజపేయ శత సహస్ర గోదాన ఫలప్రదం చ ॥** (శివార్చనా చంద్రిక.పు. 15)

ఈ రుద్రాక్షకు ఏకాదాశ రుద్రులు అధి దేవతలు. దీనిని శిఖయందున ధరించినచో సహస్ర సంఖ్యలో అశ్వమేధయాగమును, నూరు వాజపేయములను, శత సహస్ర గోవులను దానము చేయుటకు సమానమైన ఫలము లభించునని తెలుపబడినది.

## ద్వాదశముఖ రుద్రాక్ష

సకలారిష్ట నాశనియగు ఈ రుద్రాక్షకు చెందిన ప్రమాణములు.

శ్లో॥ **ద్వాదశాస్యంతురుద్రాక్షం ధారయేత్ కేశదేశకే ।**
**ఆదిత్యావ తే సర్వే ద్వాదశైవ స్థితాస్తథా ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 78)

శ్లో॥ **రుద్రాక్షం ద్వాదశముఖం మహావిష్ణు స్వరూపకం ।**
**ద్వాదశాదిత్య రూపం చ బిభర్త్యేవ హి తత్పరః ॥** (రుద్రాక్ష జాబాలోపనిషత్తు, 2-14)

**ద్వాదశ వక్త్రం కంఠదేశే ధృతం బహుదక్షిణ**
**గోమేధాశ్వమేధ ఫలప్రదమైశ్వర్యాభివృద్ధి కారి**
**దాంష్ట్రి-శృంగి-చోరాగ్ని భయహరం సర్వపాప క్షయకరం చ ॥** (శివార్చనా చంద్రికా పుట 15)

దీనికి ద్వాదశాదిత్యులును, శ్రీ మహావిష్ణువును అధిదేవతలు. దీనిని శిఖలో ధరించెడి సాంప్రదాయము గలదు. కంఠసీమలోను ధరింతురు. అశ్వమేధ గోమేధాదుల ఫలమునిచ్చెడి దీనిని ధరించినవారికి యెట్టి భయములు ఉండవు. ఇది పై ప్రమాణముల సారాంశము.

## త్రయోదశముఖ రుద్రాక్ష

సకల సన్మంగళములను చేకూర్చెడిదని భావింపబడెడి దీని మహిమను వివరించెడి ప్రమాణములను కనుడి :

శ్లో॥ **త్రయోదశ ముఖం త్వక్షం కామదం సిద్ధిదం శుభం ।**
**తస్య ధారణమాత్రేణ కామదేవః ప్రసీదతి ॥** (రు.జా.ఉ. 2-15)

శ్లో॥ **త్రయోదశ ముఖో విశ్వే దేవస్త ద్ధా రణాన్నరః ।**
**సర్వాన్ కామానవాప్నోతి సౌభాగ్యం మంగళం భవేత్ ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 39)

శ్లో॥ **త్రయోదశ వక్త్రం మతుల భోగప్రదం రససాధన ధాతువాద ।**
**ఘటకాది సిద్ధికరం పితృ-మాతృ-భ్రాతృ-స్త్రీ వధ-దోషహరం ॥** (శివార్చనా చంద్రిక పుట 15)

ఈ రుద్రాక్ష వామదేవుని మరియు విశ్వేదేవుని స్వరూపమైయున్నది. అతుల భోగప్రదమైన దీని ధారణ చేత సకల సౌభాగ్యములు మరియు మంగళ పరంపరలు కలుగును. ఇది మాతృ, పితృ, భ్రాతృ యిత్యాదుల వధ చేత గల్గెడి పాపమును పరిహరించును.

## చతుర్దశముఖ రుద్రాక్ష

పదునాల్గు ముఖముల రుద్రాక్ష గురించిన ప్రమాణములివి.

శ్లో॥ **చతుర్దశ ముఖంచాక్షం రుద్రనేత్ర సముద్భవం ।**
**సర్వవ్యాధి హరం చైవ సర్వదారోగ్యమాప్నుయాత్ ॥** (రు.జా.ఉ. 2-16)

శ్లో॥ **చతుర్దశ ముఖో యోహి రుద్రాక్షః పరమః శివః ।**
**ధారయేన్మూర్ధ్ని తం భక్త్యా సర్వపాపం ప్రణశ్యతి ॥** (శి.పు. వి.సం. అ. 25, శ్లో॥ 80)

శ్లో॥ **చతుర్దశ వక్త్రం సర్వకార్యసిద్ధికరం ।**
**సకల వ్యాధిపాపహరం ॥** (శివార్చనా చంద్రికా పుట 15)

ప్రమాణములు చెప్పెడిదేమనగా ఈ రుద్రాక్ష సాక్షాత్తుగా శివరూపమే. సకల పాపములను శమనము చేసి, సకల శుభముల నొసంగెడి ఇద్దానిని శిరమున ధరించిన యెడల ఉత్తమమైన ఫలములు లభించును.

ఈ విధముగా శ్రుతి, పురాణాదుల వలన వివిధ ముఖములు గల రుద్రాక్ష విభిన్నములగు ఫలముల నొసంగుచున్నవి. దురిత నివారణతోపాటుగా సకల సన్మంగళములు చేకూర్చెడి రుద్రాక్షలు భక్తులకు కల్పతరువులై విరాజిల్లుచున్నవి. వివిధ రుద్రాక్షలలో కొంతమేరకు వైవిధ్యతయున్నను, రుద్రాక్షలన్నియు దురితములను రూపుమాపి యిష్టార్థసిద్ధిని గలుగజేయునవైయున్నవి.

రుద్రాక్షలిచ్చెడి ఫలముల గురించి కొందరికి అతిశయోక్తులుగా దొచవచ్చును. ధర్మమునకు సంబంధించిన విషయములను తార్కికదృష్టితో పరిశీలించిన ఫలముండదు. భక్తిభావము గలవారికి రుద్రాక్షలు ఫలదాయకములుగానే యుండును. "యథాభావ స్థథాభవతి" అనెడి సూక్తి ప్రకారము, హెచ్చగు భక్తిభావ పరిపుష్టి గలవారికి అధికమగు ఫలములు గల్గును.

అన్యవాద భావము లెట్టులుండిననూ, వీరశైవులకు రుద్రాక్ష అనివార్యమై ఆధ్యాత్మిక సాధనముగానున్నది. అష్టావరణములలో ఒకటగు రుద్రాక్ష యెడల తార్కిక భావమును వహించక, భక్తిభావమును పెంపొందించు కొని ప్రమాణములను పాటించవలెను.

## రుద్రాక్షధారణపథ్యములు:

చికిత్స పొందెడి రోగి ఔషధ సేవనతో పాటుగా పథ్య నియమములను పాటించవలసియుండును. ఎవరు ఎంతమేరకు పథ్యమును పాటింతురో అంతమేరకు నాయుర్వేదౌషధము గుణము నిచ్చును. పథ్యమును పాటించనివానికి, ఔషధము గుణమునివ్వదు. రోగనివారణకై చాలాకాలము అవసరమగును. ఇదే విధిన రుద్రాక్ష ధారణ వలన విశేష లబ్ధిని శీఘ్రగతిన పొందగోరువారు, పథ్యమును పాలించవలెను. పథ్యమును వివరించెడి ఉపనిషద్వాణిని కనుడి :

**శ్లో॥ మద్యం మాంసం చ లశునం పలాండుం శీఘ్రమేవచ ।**
**శ్లేషాత్మకం విద్యరాహమభక్షం వర్జయేన్నరః ॥** (రు.జా.ఉ. 2-47)

మద్యము, మాంసము, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, యిత్యాదులను త్యజించవలెను. శుభ్రమైన పరిశుద్ధమైన సాత్వికాహారమును సేవించినవారికి రుద్రాక్ష ధారణ వలన గరిష్టఫలము లభించును. తామసాహారమును స్వీకరించవలెననెడి ఆసక్తిని ఎదుర్కొనినవాడు ఎదురులేని జయములను పొందగలడు.

## రుద్రాక్ష ధారణ-స్థానములు మరియు శాస్త్రీయవిధి:

రుద్రాక్ష జాబాలోపనిషత్తు ఈ విషయములను విస్తృతముగా వివరించినది. అద్దాని ప్రకారము పూర్వకాలమున సనత్కుమారుడనెడి బ్రహ్మ మానసపుత్రుడు కాలాగ్ని రుద్రుని వద్దకు వెడలి "అధీహి భగవన్ రుద్రాక్ష ధారణ విధిం". "ఓ భగవంతుడగు రుద్రుడా! రుద్రాక్ష ధారణావిధిని యుపదేశించుడి".

అప్పుడు రుద్రుడు నిదాఘ, జడభరత, దత్తాత్రేతు, కాత్యాయన, భరద్వాజ, కపిల, వశిష్ఠ, పిప్పలాది మహర్షులనుద్దేశించి వారికి ఈ రుద్రాక్ష ధారణ విధిని వివరించెనని తెలుపబడినది.

ప్రస్తుతము శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు శ్రీ అగస్త్య మహర్షికి ఉపదేశించిన విధానమును తెలిసికొనెదము గాక.

**శ్లో॥ యధాస్థానం యధా వక్త్రం యధా యోగం యధావిధి ।**
**రుద్రాక్ష ధారణంవక్ష్యే రుద్రసాయుజ్య సిద్ధయే ॥**

రుద్రసాయుజ్య సిద్ధిని సాధించుటకై యే యే స్థానములలో ఎన్నెన్ని ముఖములుగల ఎన్నెన్ని రుద్రాక్షలనే విధిన ధరించవలెనో, శ్రీ రేణుక భగవత్పాదుల వారి యుపదేశములో తెలిపిరి.

శివపూజా పరాయణుడగు శివభక్తుడు తన యిష్టలింగార్చన చేయునప్పుడు మస్తకములోను శిఖాస్థానమున ఒక ముఖము గల నొక రుద్రాక్షను ధరించవలెను. అదే విధిన రెండు, మూడు మరియు పన్నెండు ముఖములుగల వాటిలో నొక్కొక్కటిగా గైకొని మూడు రుద్రాక్షలను తల మీద ధరించవలెను. పన్నెండు ముఖములుగల ముప్పదియారు రుద్రాక్షలను తలచుట్టూ ధరించవలెను. పది, యేడు మరియు ఐదు ముఖములను రెండేసి చొప్పున మొత్తము ఆరు రుద్రాక్షలను గల మాలలను రెండు చెవులలో ధరించవలెను. ఆరు మరియు ఎనిమిది ముఖముల వాటిని ఒక్కొక్కటి పదహారు చొప్పున ముప్పది రెండు రుద్రాక్షలను కంఠమునందు ధరించవలెను. నాల్గు ముఖముల యాభై రుద్రాక్షలను ఎదమీద ధరించవలెను. పదమూడు ముఖముల పదహారు రుద్రాక్షలను రెండు రెట్టలకు వేసికొనవలెను. తొమ్మిది ముఖములు గలవాటిని పన్నెండు పన్నెండు రెండు ముంజేతులకు వేసికొనవలెను. పద్నాలుగు ముఖములుగల 108 రుద్రాక్షలను యజ్ఞోపవీతము వలె ధరించవలెను.

ఈ విధి ప్రకారము ఎవ్వరు రుద్రాక్షలను ధరించుకొని యిష్టలింగార్చన చేయుదురో, అట్టివారు సకలదోషములను నివారించుకొని, సకల వైభోగములననుభవించి, ఇహపరసుఖములను పొంది, చివరకు శివసాయుజ్యము పొందుదురని పూజ్యపాదుల వారు సెలవిచ్చిరి.

రుద్రాక్ష ధారణ గురించి శరణులు కూడా విధివిధానమును తెలియజెప్పిరి. వీరశైవ చింతామణిలో నివ్వబడిన యీ ప్రవచనము గమనార్హమైయున్నది.

**ఏకముఖ రుద్రాక్షి నొందనే పశ్చిమదల్లి ధరిసువుదయ్యా**

**ద్విత్రి ద్వాదశముఖద మూరు మణియ మూర్ధ్నియల్లి ధరిసువుదయ్యా**

**ఏకాదశ ముఖద మూవత్తారు మణియ శిరబళసి ధరిసువుదయ్యా**

**ఐదు, ఏడు, హత్తు ముఖద రుద్రాక్షియం**
**ఒందొంద నాగలి ద్విష్ణదల్లి దరిసువుదయ్యా ।**
**షడష్టముఖద రుద్రాక్షియ ద్వాత్రింశత్ కంఠదల్లి ధరిసువుదయ్య ॥**
**చతుర్ముఖద రుద్రాక్షియ ఐవత్తు నాల్కు**
**ఉరమాలె యాగి ధరిసువుదయ్యా ।**
**త్రయోదశ ముఖద రుద్రాక్షియ షోడశ షోడశ**
**బాహుగళల్లి ధరిసువుదయ్యా ।**
**నవముఖ రుద్రాక్షియ ద్వాదశ ద్వాదశమం**
**మణిబంధగళల్లి ధరిసువుదయ్యా ।**
**చతుర్ధశద రుద్రాక్షి అష్టోత్తర శతవ**
**యజ్ఞోపవీత వాగి ధరిసువుదయ్యా ।**
**ఇంతరిదు, రుద్రాక్షియ ధరిసిద మహేశ్వరిన**
**హెచ్చిహెచ్చిగె అశ్వమేధద యజ్ఞద ఫలవపుదు ।**
**తప్పదయ్యా, సౌరాష్ట్ర సోమేశ్వర ।**

ఈ వచనపు తెలుగు రూపమిది :

**ఏకముఖపు రుద్రాక్ష నొకటి పశ్చిమమున ధరించెదరు**
**ద్విత్రి ద్వాదశ ముఖపు మూడు మణుల మూర్ధ్నియందు**
**ఏకాదశ ముఖపు ముప్పదియారు మణుల (ధరించుదునయ్యా)**
**శిరము చుట్టూ ధరించుదునదయ్యా ।**
**ఐదు, ఏడు, పది ముఖముల రుద్రాక్షల నొక్కొక్కటైన**
**ద్వికర్ణముల యందు ధరించుదునయ్యా ।**
**షడష్ట ముఖపు రుద్రాక్షల ముప్పది రెండు కంఠమందు ధరించుదునదయ్యా ।**
**చతుర్ముఖపు రుద్రాక్షల యాభైనాల్గు ఉరమాలగా ధరించుదునదయ్యా ।**
**త్రయోదశ ముఖపు రుద్రాక్షల షోడశ షోడశము**
**బాహువులయందు ధరించుదునయ్యా ।**
**నవముఖపు రుద్రాక్షల ద్వాదశ ద్వాదశము**
**మణి బంధముల యందు ధరించుదునయ్యా ।**
**చతుర్దశ ముఖపు అష్టోత్తర శతము**
**యజ్ఞోపవీతముగా ధరించుదునయ్యా ।**

**ఇదెరిగి రుద్రాక్షల ధరించిన మహేశ్వరుని**
**హెచ్చుహెచ్చుకు అశ్వమేధ యజ్ఞపు ఫలమగును,**
**తప్పదయ్యా, సౌరాష్ట్ర సోమేశ్వరా ।** (వీరశైవ చింతామణి, పుట 158-159)

ఈ వచనములోనిభావము, శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు నిర్దేశించిన యటులున్నవి.

## విశేష విచారము :

నేటి పరిస్థితులలో భిన్నమైన ముఖముల రుద్రాక్షల వెల విపరీతముగా పెరిగియున్నది. ఇవి ఇంత సంఖ్యలో దొరికెడిదియును దుర్లభమైన విషయమే. అయితే, పంచముఖ రుద్రాక్షలు విస్తృతముగా లభించుచున్నవి. వాటి వెలయును అధికముగా నుండదు. ఈ కారణము వలన, యుసిరికాయ ప్రమాణమున నుండెడి పంచముఖ రుద్రాక్షలనే ఆయాస్థలముల యందు ఆయా సంఖ్య మేరకు ధరించుట ఉత్తమమగును. మాలలను సిద్ధము చేసికొనెడి సందర్భమున, పాటించవలసిన నియమము లెట్టివో తెలిసికొనుట యెంతో అవసరము. ఈ విషయమున, అక్షమాలా ఉపనిషత్తు కొంత సహాయకారిగా నుండునని తెలియుచున్నది.

ఉపనిషత్తులోని యీ క్రింది ప్రమాణమును గనుడి :

**"తన్ముఖే ముఖం తత్పచ్ఛే పుచ్ఛం"** (అక్షమాలా ఉ॥ పుట 420)

రుద్రాక్ష యొక్క ముఖమునకు ముఖమును పుచ్ఛమునకు పుచ్ఛమును కలిపి రుద్రాక్షమాలను తయారు చేసుకొనవలెను. ఈ రీతిగా కుచ్చి కొనిన రుద్రాక్ష మాలలను ధరించుకొని యిష్టలింగార్చనను చేసుకొనినయెడల పూర్వోక్త ఫలములు లభించును.

## రుద్రాక్ష ధారణ-షడధ్వ శుద్ధి :

శ్రీ రేణుక భగవత్పాదుల వారు సూచించిన ప్రకారము రుద్రాక్ష ధారణ చేసికొనిన యెడల షడధ్వ శుద్ధి యగునని శ్రీ మరితోంటార్యుల వారు తెలిపిరి. వారి వాక్కులను గనుడి :

అయం భావః శుద్ధమిశ్ర సంకీర్ణ భువనాధీశ శివాష్ట విద్యేశ్వర శత రుద్ర సంఖ్యాత యజ్ఞోపవీత ధారణే భువనాధ్వ శుద్ధిః । వర్ణ సంఖ్యా తవక్షోమాలయా వర్ణాధ్వ శుద్ధిః । పద సంఖ్యాత మణిబుధ బాహు కంఠమాలయా పదాధ్వశుద్ధిః । షడంగ పంచబ్రహ్మ ప్రణవ మంత్ర సంఖ్యాత కర్ణా భరణేన మంత్రాధ్వ శుద్ధిః । శివ శక్త్యాత్మక కర్ణాభరణేన వాతత్సంఖ్యా తమస్త కమాలయా తత్త్వాధ్వ శుద్ధిః । అష్టత్రింశత్ కలాపూర్ణ సోమసూర్యాగ్ని లక్షణ శిరో రంధ్రమాలయా కలాధ్వ శుద్ధిః । ఏవం రూప షడధ్వ కారణీ భూత పరశివ బ్రహ్మ మయ శిఖాగతైక రుద్రాక్ష ధారణేన పరశివ స్వరూప ఏవ" యే రుద్రాక్షం ధత్తే సత్యం పరమః శివః న సత్యం పరమః శివ ఇతిశ్రుతేః". (తత్త్వ ప్రదీపికా వ్యాఖ్యా, పుట 116) వారద ప్రకాశనము, షోలా పురము.

శ్రీ మరితోంట దార్యుల వాక్కు యొక్క తాత్పర్య మేమనగా, వీరశైవ సిద్ధాంతమునందు శివదీక్షను చేయునప్పుడు అంగ లింగములను సంస్కరింతురు. అచ్చట వచ్చెడి బహు విధ సంస్కారములయందు షడధ్వన్యాసమనునది యొక మహత్వ పూర్ణమైన సంస్కారము. వర్ణ, పద, మంత్ర, కలా, తత్త్వ మరియు భువనములే షడధ్వములు వీటిలో మొదటి మూడు శబ్దా ధ్వములు, చివరి మూడు అర్థాధ్వములు శివుని విభిన్న స్వరూపములు. దీక్షను పొందెడి జీవాత్మ శరీరమునందున సంస్కార విశేషము చేత వీటిని కూడుకొనునదే షడధ్వన్యాసము. అందచేత సద్గురువులు క్రియా దీక్షాంతర్గతమైన స్వస్తికారోహణ దీక్షను చేయునప్పుడు తల్లి గర్భము నుండి యుత్పన్నమైన శరీరపు మాంస పిండత్వమును నివృత్తి చేయుటకై ఆపాద మస్తక పర్యంతము ఆరు స్థానముల యందున సంహార క్రమము చేత షడధ్వన్యాసమును, మంత్ర పిండత్వ ప్రాప్తికై ఉత్పత్తి క్రమము చేత ఆమస్తక పాద పర్యంతము షడంగముల యందు షడధ్వన్యాసమును చేయుదురు. ఈ షడంగ ధ్వన్యాస సంస్కారము చేత దీక్షితునికి మాంస పిండత్వము నివృత్తమై మంత్రపిండత్వము ప్రాప్తించును. ఇదొక భావనాత్మక సంస్కారము. తన శరీరమునందున షడధ్వములున్నవి అనెడి భావమునింతవరకు ఉండునో అంతవరకు నతని శరీరము మంత్రపిండమే. ఈ భావము యెల్ల కాలము ఉండవలెననియే శ్రీ రేణుక భగవత్పాదులవారు ఆయా అధ్వముల సంఖ్యగల రుద్రాక్షలను శరీరమునందలి

ఆరు అంగముల యందున ధరించుకొనుటకు ఆదేశము నిచ్చిరి. వారి ఉపదేశానుసారముగా, శుద్ధ మిశ్ర సంకీర్ణ భువనములకు ఎనిమిది మంది శివుని విద్వేశ్వరులు, నూరుమంది రుద్రులు, అధిపతులై యుందురు. వీరి ద్యోకతనమునకు 108 రుద్రాక్షలుగల మాలను యజ్ఞోపవీతముగా దేహమున ధరించినచో భువన ధ్యాసమగును.

అకారము నుండి క్ష కారము వరకు యాభై అక్షరములు ఉండుటచేత, యాభై అక్షరములు గల రుద్రాక్షలు ఎదమీద ధరించిన యెడల వర్ణ ధ్వన్యాసమగును. ముంజేతులు, రెట్టలు మరియు కంఠములందు మొత్తము 81 రుద్రాక్షలను వ్యోమ వ్యాపి మరియు వ్యోమ రూప మొదలగు 81 పదముల ప్రతీకగా ధరించుట చేత పద ధ్వన్యాసము చెవుల యందు ధరించెడి పన్నెండు రుద్రాక్ష పంచాక్షరి, పంచ బ్రహ్మ, ప్రణవములు కలిపి పన్నెండు మంత్ర ధ్వన్యాసమునకు ప్రతీకయగును. శిరస్సున ధరించెడి ముప్పది యారు రుద్రాక్షలు, శివుని 36 తత్త్వములకు ప్రతీక, అందుచేత వాటిని ధరించుట చేత మంత్ర ధ్వన్యాసమగును. శిరస్సునందున ధరించెడి రుద్రాక్షలు సూర్యచంద్రాగ్నులకు ప్రతీకగా ఉండును. సూర్యునికి పన్నెండు, చంద్రునికి పదహారు, అగ్నికి 10 తలలు ఉండును. మొత్తము 38 తలలగు వీటిని ధరించుటచే కలాధ్వన్యాసమగును.

ఈ అధ్వములన్నింటికీ మూలకారణుడైన పరశివుని ప్రతీకగా శిఖాస్థానమున ఒక ముఖమందే ఒక రుద్రాక్ష ధరించుటచేత "యో రుద్రాక్షం థత్ స సత్యం పరమః శివః స సత్యం పరమః శివః" అనెడి యుపవిషద్వాక్యానుసారముగా అతడు శివస్వరూపుడే అగుచున్నాడు.

ఈ విధముగా శ్రీ రేణుక భగవత్పాదుల ఉపదేశానుసారముగా రుద్రాక్షలను ధరించిన యెడల షడధ్వన్యాసము సిద్ధించి షడధ్వ శుద్ధియగును. మాంస పిండము, మంత్ర పిండమగును.

ఇట్టి వాడు ఇష్టలింగ ప్రాణలింగ భావలింగముల నర్చించుచు జీవితమును కొసాగించిన యెడల, శివసాయుజ్యము లభించును.

## రుద్రాక్ష ధారణా విధి :

శివపూజకుడు, దేశకాలాదుల సంకీర్తనము జేసి "మమ శివజ్ఞాన సంపత్యర్థం రుద్రాక్ష ధారణం కరిష్యే'' అని సంకల్పమును చేయవలెను. తాను ధరించెడి రుద్రాక్షలన్నింటినీ తీసుకొని, భక్తితో పూజించవలెను. ఈ క్రింది మంత్రమును పఠించుచూ నమస్కారమును చేయవలెను.

**శ్లో॥ రుద్రాక్ష వృక్షబీజాయ భూతిసంభూతి హేతవే ।**
**నేత్రాత్రయాయ రుద్రాయ నమోలోక హితార్థినే ॥**

ఆ పిదప యీ క్రింది మంత్రములను పఠించుచూ ఆయా స్థానములయందున రుద్రాక్షలను ధరించవలెను.

| మంత్రములు | స్థానములు | సంఖ్య |
|---|---|---|
| ఓం సదాశివాయ నమః | శిరము (శిఖ) | 1 |
| ఓం సొమసూర్యాగ్ని నేత్రాయ నమః | శిరస్సు | 3 |
| ఓం షట్ త్రింషత్ తత్వాత్మనే నమః | మస్తకము | 36 |
| ఓం షడ్బ్రహ్మణే నమః | కుడిచెవి | 6 |
| ఓం అష్ట మూర్త్యాత్మనే నమః | ఎడమచెవి | 6 |
| ఓం త్ర్యంబక కలాత్మనే నమః | కంఠము | 32 |
| ఓం శ్రీ కంఠాది మూర్త్యాత్మనే నమః | ఎద | 50 |
| ఓం కాయశ్రీ కంఠాయ నమః | కుడిరెట్ట | 16 |
| ఓం సోమ కలాత్మకాయ నమః | ఎడమరెట్ట | 16 |
| ఓం ద్వాదశాదిత్యాత్మనే | | |

| | | |
|---|---|---|
| శ్రీ మహాదేవాయ నమః | కుడిముంజెయ్యి | 12 |
| ఓం శ్రీ కేశవాది మూర్త్యాధిపాయ శ్రీ మదుమాపతయే నమః | ఎడమ ముంజెయ్యి | 12 |
| ఓం శతరుద్ర విద్యేశ్వరాత్మనే శ్రీ విశ్వేశ్వరాయ నమః | యజ్ఞోపవీతము | 108 |

ఈ విధముగా "ధారయేత్ సర్వకాలంతు రుద్రాక్షం శివ పూజకః" అనెడి శ్రీ రేణుకాచార్య జగద్గురువుల వారు ఆదేశించిన యటుల సర్వాంగముల యందును రుద్రాక్షలను ధరించి ధన్యతను బడయవలెను. వీరశైవులు శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము వలన ఇతోధికమైన లబ్ధిని పొందుదురు గాక.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 2-9-1990

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

## విశేష ప్రదీపిక

రుద్రాక్షధారణ విషయములో సప్రామాణికమైన వివరములనెన్నిటినో యీ యాశీర్వచనమునందు గాంచగలము. శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారీ వివరములను ప్రసాదించి భక్తలోకమును ననుగ్రహించిన వారైరి. శ్రుతి పురాణాదులలోని వివిధ ప్రమాణములనిచ్చి విషయమునకు ప్రామాణీకరణ చేకూర్చిరి.

శ్రీ సోమనాథులవారు సోమనాథభాష్యములో కొన్ని వివరములనిచ్చిరి. ఈ వివరములన్నింటినీ శ్రీ జగద్గురువు గారు తమ ఆశీర్వచనమున తెలియజేసిరి.

పండితారాధ్య చరిత్రలో దీక్షా ప్రకరణము నందున శివపురాణములో వివరించిన యటుల రుద్రాక్షలను ధరించవలెనని వ్రాయబడినది. శివపురాణములోని వివరములను కూడా శ్రీ జగద్గురువు గారి ఆశీర్వచనములో గాంచగలము.

సోమనాథ భాష్యములో శ్రీ సోమనాథుల వారిచ్చిన వివరణ విలక్షణముగానున్నది. గమనించుడి:

శిఖాయామేకమేకాస్యం । శ్రీ సదాశివాయ నమ ఇతి । ద్విత్రిద్వాదశ వక్త్రాణిత్రీణి శిరసి వహ్ని సోమాధిపాయ శివాయనమ ఇతి । ఏకాదశ వక్త్రం ష ట్త్రింశ మూర్ధి షట్ త్రింశత్తత్త్వాత్మకాయ పరశివాయనమః । పంచదశ సప్తే వక్త్రాణి కర్ణయోరేకమేకం సోమాయ నమ ఇతి । షడష్ట వక్త్రాణి కంఠేద్వా త్రింశత్ । త్రియంబక కలాత్మనే శ్రీ కంఠాయ నమ ఇతి । చతుర్వక్త్రాం పంచాశన్మాలికాయా మురసి । శ్రీ కంఠాది మూర్త్యాత్మకాయ శ్రీ సర్వజ్ఞాయ నమ ఇతి । బాహ్వోస్త్రయోదశ వక్త్రాణి షోడశ త్రిమూర్త్యాత్మకాయ శ్రీకంఠాయనమః । శ్రీ సోమకళాత్మకాయ శ్రీ సోమ నాథాయ నమః । మణి బంధనోర్వవ వక్త్రాణి ద్వాదశ నవవాక్త్రాణి ద్వాదశాధిత్యాధిపాయ శ్రీ మహాదేవాయ నమ ఇతి । దక్షిణే ద్వాదశాదిత్యధిపాయ । శ్రీ మహాదేవాయ నమ ఇతి । కేశాదీ మూర్త్యాధిపాయ ఉమాధి పతయే నమ ఇతి । వామే అష్టోత్తర శతం చతుర్దశ వక్త్రాణి శతరుద్ర విద్యేశ్వరాత్మకాయ । శ్రీ విశ్వేశ్వరాయ । చతుర్దశ వక్త్రాణి శత రుద్ర విద్యేశ్వరాత్మకాయ శ్రీ విశ్వేశ్వరాయ । చతుర్దశ వక్త్రాణి అష్టోత్తర శతం చొపవీతం । రుద్రాక్షం ధారయేత్ ..... (సోమనాథ భాష్యము, చ.ప్ర.)

మస్తకమున రుద్రాక్ష ధారణ చేసెడి సాంప్రదాయమును గూర్చి చతుర్వేద సారము "తనర లైంగ్యం" బునను "మస్తకేవాపి ధారయేత్తనుచు నాదటనుతింప" యని తెలుపబడినది.

భక్తుడు రుద్రాక్షలను ధరించెడి సందర్భమున నెరుగవలసిన యంశములు కొన్ని గలవు. మొదటిది- ధారణార్హత గల్గిన రుద్రాక్షలెయ్యవి యనెడిది, రెండవది - ధరించవలసిన మేనిలోని స్థలములు, మూడవది - రుద్రాక్షకుండెడి ముఖములు మరియు వాటి గుణములు. ఈ పరిజ్ఞానమును పొంది రుద్రాక్షలను ధరించుట యెంతో అవసరము.

పురుగులు తిని రంధ్రములు చేసెడిది గాంచగలము. పప్పు దినుసులు, ఫలములు ఇత్యాదులలో మనము నిట్టివి గాంచగలము. రేగుపళ్ళలోన యీ వైనమధికముగా నుండును. ఇవి భోగనీయములు కావని విసర్జింతుము. పురుగులు తినిన కర్ర బలహీనమగుటను గాంచగలము. వాటిని యుపయోగించుట వలన లాభముండదు. ఆలయములలో నుండెడి విగ్రహములు బీటలు వారిన యెడల నవి

అర్చనకు పనికిరావని యోగములు తెలుపుచున్నవి. ఈ కారణముననే రుద్రాక్షలు "అచ్ఛిద్రమై" యుండాలని శ్రీ భగవత్పాదుల వారు నాదేశించిరి. శివపురాణ వచనము ప్రకారము రుద్రాక్ష దృఢముగా నుండవలెను. రంధ్రములు పడి దృఢమైనదిగాకయుండిన వర్జనీయమని గ్రహించవలెను. "వర్జయేత్ క్రిమిదష్టం ఛిన్నభిన్నం" యనెడి క్రియాసారము యొక్క నిర్దేశమును భక్తుడు గ్రహించి దృఢమైన రుద్రాక్షను ధరించవలెను.

తేజస్సు వస్తువు యొక్క గుణోత్కృష్టకు తార్కాణమైయుండును. వర్ణము తేజస్సును నినుమడింపజేయును. తేజోహీనమైన వస్తువు గుణాత్మకమైనది కాదని గుర్తింపబడినది. పెరుగుదలలోనో, నారోగ్యములోనో లోపముండిన యెడల విస్తేజము సంప్రాప్తమగునని మనమెరుగుదుము. ఈ కారణముననే శ్రీ భగవత్పాదులవారు బంగారు వన్నెగల రుద్రాక్ష యుత్తమమైనదని తెలుపబడినది. భక్తుడు శ్రీ భగవత్పాదుల వారి వాక్కులకే యెక్కువ ప్రాధాన్యత నివ్వవలెను. కనక కాంతులీనెడివి యలభ్యమైన యెడల పురాణోక్తి ననుసరించవలెను. తామ్ర వర్ణపు రుద్రాక్షనెంపిక జేసికొనవలెను.

మానవుని శిఖా స్థానము సర్వోత్కృష్టమైనది దీక్షా కార్యక్రమములోన హస్తమస్తక సంయోగ సందర్భమున నీ స్థానము యొక్క ప్రాముఖ్యత తెలియజేయబడినది. అందుచేత నుత్తమోత్తమమైన రుద్రాక్షను శిరమున ధరించవలెను "ఏకవక్త్రః శివసాక్షాత్" అని శివపురాణము చేతను ఏకవక్త్రంతు రుద్రాక్షః పరతత్త్వ స్వరూపః" యని శ్రుతి చేత నుతింపబడిన యేకముఖ రుద్రాక్షను శిఖాస్థానమున ధరించుటలో నౌచిత్యము గలదు. దీని వలన "పరతత్త్వములో లీనమగుట సాధ్యమగునని రుద్రాక్ష జాబాలోపనిషత్తు వివరించినది "ఏక వక్త్రః ముక్తి ఫలప్రదః" యని శివపురాణము తెలిపినది.

శిరము ప్రధానమైన అంగము బుద్ధి వికాసమునకు కేంద్రస్థానము. బుద్ధియనెడిది యంతరంగములలో నొకటియని చెప్పబడినది. అంతరంగ శుద్ధి సాధించని యెడల ముక్తి లక్షించదు. తన్నిమిత్తమై రెండు, మూడు మరియు పన్నెండు ముఖముల రుద్రాక్ష నొక్కొక్కటి శిరమున ధరించవలెనని భగవత్పాదుల వారు తెలిపిరి. ద్వి వక్త్రం ధారణా దర్ధ నారీశ్వరః ప్రీయతే" అనెడి యుపనిష ద్వాక్యానుసారము ద్విముఖ రుద్రాక్ష వలన శివకారుణ్యము లక్షించును.

త్రిముఖ రుద్రాక్షవలన "విద్యాః సర్వాః ప్రతిష్ఠితాః" అని రుద్రాక్ష జాబాలోపనిషత్తు తెలుపుచున్నది. మోక్ష విద్య త్రిముఖ రుద్రాక్ష వలన వికాసమగునని గుర్తించవలెను. ద్వాదశ ముఖము వలన సర్వపాపములు క్షయించి యాదిత్య తేజము లభ్యమగునని తెలియుచున్నది. శ్రీ భగవత్పాదుల వారు నాదేశించిన విధినే శ్రుతి దీనిని శిరమున ధరించవలెనని యాదేశించినది.

ఏకాదశ ముఖము గల ముప్పదియారు రుద్రాక్షలను తల చుట్టును చుట్టుకొనవలెనని తెలుపబడినది. ఇయ్యది ముప్పది యారు శివతత్త్వములకు సంకేతము. ఈ తత్త్వముల జ్ఞానము గల్గి, భక్తుడు భద్రతను పొంది భద్రుడై విజయుడై సౌభాగ్యవంతుడై చివరన రుద్రత్వమును పొందునని శ్రుతి పురాణాదుల వలన తెలియుచున్నది.

శ్రవణేంద్రియము నెంతో ప్రాముఖ్యత సంతరించుకొనినది. శివభక్తుల యొక్కయు శివుని యొక్కయు గుణకీర్తనను వినిన యెడల శివుని కరుణ లభించునని వాక్కీల నియమము తెలుపుచున్నది. "వాగింద్రియము నిన్ను వర్ణించు శ్రోత్రేంద్రియము వినిపించు గుణాంకములు" చేయునని తెలుపుచున్న చతుర్వేద సారము (ప.బి2) ననుసరించి కర్ణములకు శివసాన్నిధ్యమును గల్గించెడి యవశ్యకత గలదు. ఆ దిశలోనే శ్రీ భగవత్పాదుల వారు ఐదు, ఏడు మరియు పది ముఖముల రుద్రాక్షలను రెండు రెండు చొప్పున మొత్తము ఆరు ఒక్కొక్క కర్ణమున ధరించవలెనని తెలిపిరి.

"పంచవక్త్రః రుద్రాక్షః సర్వముక్తి ప్రదః" అనెడిది శ్రుతి వాక్యము. ఇది ముక్తిదాయకమని యుపనిషత్తులు తెలుపుచున్నవి. ఏడు ముఖముల రుద్రాక్షను ధరించుట చేత "దరిద్రో పేశ్వరోభవేత్" అని శివపురాణము తెలుపుచున్నది. దశ వక్త్ర రుద్రాక్షను ధరించుట చేత కామిత ఫల సిద్ధి గల్గునని పురాణములు తెలుపుచున్నవి.

కంఠ ప్రదేశమెంతో ముఖ్యమైనది. యోగశాస్త్రానుసార మిదొక చక్రమును గల్గిన స్థానము, మగ్గియ మాయి దేవుని ప్రకారము నిచ్చట షల్లింగములలో నొకటగు లింగము నిలిచియుండును. ఇట్టి మహత్త్వపూర్ణమైన ప్రదేశమున ఆరు మరియు ఎనిమిది ముఖముల రుద్రాక్షలు పదహారు పదహారు చొప్పున ధరించవలెనని శ్రీ భగవత్పాదుల వారు నాదేశించిరి. "షడక్షరమపి రుద్రాక్షం ధారయేత్ మతి విజ్ఞాన శుద్ధయే" యనెడి యుపనిష ద్వాక్కు ప్రకారము షణ్ముఖ రుద్రాక్షను ధరించుటచే బుద్ధి పరిశుద్ధమగును. మతి సమ్మతముతో శివధ్యానములో మునిగిపోవును. భ్రమర కీటక న్యాయమున నిరంతర ధ్యానము వలన శివత్వము సిద్ధించును. అష్టవక్రములు గల రుద్రాక్షను ధరించుట చేత శివసాయుజ్యము సిద్ధించునని శివపురాణము తెలుపుచున్నది.

ఎదన ఇష్టలింగమును ధరించుట యనెడిది యుత్తమమైన పద్ధతియని తెలుపబడినది. మనస్సుకు కేంద్రమిది. శివయోగానుష్ఠానమునకు హృదయమే కేంద్రస్థానమని తెలుపబడినది.

మగ్గియ మాయి దేవుని ప్రకారము హృదయమనేది శివలింగ స్థానము. ఇట్టి మహిమాన్వితమైన స్థానమున నాల్గు ముఖముల రుద్రాక్షలను ధరించవలెనని తెలుపబడినది. యాభై రుద్రాక్షలను ధరించవలెనని శ్రీ భగవత్పాదుల వారు తెలిపిరి. చతుర్ముఖ రుద్రాక్షను ధరించుటచే ధర్మార్థ కామ మోక్షములు లభించునని శివపురాణము తెలుపుచున్నవి.

శివోపాసనలో నతి ముఖ్యమైన యర్చనాదులు చేయుటకై రెట్టలు, మణికట్లు నెంతో కీలకమైనవి. ఇట్టి పవిత్ర కార్యములను నిర్వహించెడి వీటికి వరుసగా పదమూడు మరియు తొమ్మిది ముఖముల రుద్రాక్షలను ధరించవలెనని శ్రీ భగవత్పాదుల వారు తెల్పిరి. రెట్టలకు పదహారు పదహారును, మణిబంధములకు పన్నెండు పన్నెండు చొప్పున ధరించవలెనని చెప్పబడినది. పదమూడు ముఖముల రుద్రాక్షలు సకల సన్మంగళములను గల్గించునని శ్రుతి పురాణములు ముక్తి కంఠముతో తెలుపుచున్నవి. "కామదం సిద్ధిదం శుభం" అనెడిది శ్రుతి వాక్యము. "సౌభాగ్యం మంగలం లభేత్" అనెడిది పురాణములోని వాక్కు. నవ వక్త్రములు గల రుద్రాక్షలు ధరించుటచే సర్వేశ్వర్యదత్త్వము లభించునని తెలుపబడినది. వీటిని ధరించినవాడు "సర్వేశ్వరో భవేన్నూనం మామతుల్యో న సంశయః" యనెడివి శివుని వాక్కులని శివపురాణము తెలుపుచున్నది.

తల పిదప మొండెమునకే ప్రాధాన్యత గలదు. షడ్లింగములలో నాలుగు లింగములు మొండెములో నుండును. దీనికి రక్షణ కవచముగా పదునాల్గు ముఖములు గల 108 రుద్రాక్షల మాలను నుపవీతము వలె ధరించవలెనని శ్రీ భగవత్పాదుల వారు తెలియజేసిరి. పదునాల్గు ముఖముల రుద్రాక్షలు శివ స్వరూపమని తెలుపబడినది. "చతుర్ముఖోయో హి రుద్రాక్షః పరమః శివః" అనేది పురాణవాక్కు. సకల సిద్ధులను సమకూర్చెడి శక్తి దీనికి గలదు. రోగములు దూరమగును. దీని వలన భవరోగమూ నశించి మోక్షము లభించును.

రుద్రాక్ష ధారణ విషయమున కొన్ని పద్ధతులతో భేదములు పొడచూపుచున్నవి. ఆరు ముఖముల రుద్రాక్షలు కుడి భుజమున ధరించమని శివపురాణము తెలుపగా, శ్రీ భగవత్ పాదుల వారీ విధిన తెలుపలేదు. శ్రీభగవత్ పాదుల వాక్కే యాచరణీయమని గ్రహించవలెను. శ్రుతి పురాణాదులలోని వాక్కులు శైవాదులను దృష్టియందిడికొని తెలుపబడినవి. శ్రీ భగవత్ పాదుల వారు వీరశైవ ధర్మానుయాయులకై నుపదేశము నిచ్చిరి. ఈ తాత్త్వికాంశము నవిస్మరణీయమైనదని గుర్తించవలెను.

శ్రీ భగవత్పాదుల వారి "రుద్రాక్ష ధార వక్ష్యే రుద్ర సాయుజ్య సిద్ధయే" యనెడి వాక్కుల విస్మరణీయములు, శ్రీ భగవత్పాదుల వారు ప్రవృత్తి మార్గమును విస్మరించి నివృత్తి మార్గము నెంపిక చేసికొనిరి. ఇతర ధర్మము లటుల కాదు. భోగభూయిష్టమైన ప్రవృత్తులను గల్గించును. అన్యమార్గముల నుసరణీయములు కావు. భక్తుడు భోగప్రియుడు కాకూడదు. లింగాంగ సామరస్యమే యతని లక్ష్యమై యుండవలెను. రుద్రాక్షలను అష్టావరణములలోని యొకటగు రక్షణ కవచముగానే భావించవలెను. కామక్రోధమోహాది యరిషడ్వర్గము నుండి రక్షణ పొందుటకై శరీరములోని వివిధాంగములలో రుద్రాక్షలను ధరించవలెను.

రుద్రాక్షలను ధరించెడి సందర్భమున ధారణా ఫలముల నాశించకూడదని తెలిసికొనవలెను. ఉపనిషద్వాదులు నిష్కామ కర్మను బోధించును. భగవద్గీతలో దీని గురించిన విశేషమైన వివరణ గలదు. వీరశైవుడు నిష్కామ భక్తి సత్క్రియలను చేయవలెనని క్రియావిదుల విశిష్టాభిప్రాయము. తదనుగుణముగనే రుద్రాక్షలను ధరించెడి సందర్భమున 'నిష్కామ' భావన గల్గియుండవలెను. ధారణ వలన గల్గెడి ఫలముల నాశించవలదనెడిదే గుర్తించవలసిన విషయము.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## ఆశీర్వచనము : 5

**శ్లో॥ ఏవం రుద్రాక్షధారీయః సర్వకాలేతు వర్తతే ।**
**తస్య పాపకథా నాస్తి మూఢస్యాపి న సంశయః ॥** (సి.శి. 7:58)

ఎవ్వడు విధి ననుసరించి రుద్రాక్షలను ధరించి ఎల్లప్పుడూ తిరుగాడుచుండునో వాడు మూర్ఖుడైనా పాపము అంటదు. ఈ విషయమున సందేహము లేదు.

**శ్లో॥ బ్రహ్మహః మద్యపాయీచ స్వర్ణహృద్గురు తల్పగః ।**
**మాతృహా పితృహా చైవ భ్రూణహా కృతఘాతకః**

**రుద్రాక్ష ధారణాదేవ ముచ్యతే సర్వపాతకైః ॥** (సి.శి. 7:59)

బ్రహ్మహత్య, మద్యపానము, స్వర్ణహరణ, గురుపత్నీగమన, మాతృహత్య, గర్భహత్య మరియు విశ్వాసఘాతుకము అనెడి మహాపాతకముల నాచరించిన కడుపాపియైనను రుద్రాక్షను ధరించుట చేత అతడు సర్వపాప వినిర్ముక్తుడగుచున్నాడు.

**శ్లో॥ ధర్శనాత్ స్పర్శనా చైవ స్మరణాదపి పూజనాత్ ।**
**రుద్రాక్ష ధారణాల్లోకే ముచ్యంతే పాతకైర్జనాః ॥** (సి.శి. 7:60)

పావనములగు రుద్రాక్షలను చూచుటచేతను, ముట్టుటచేతను, తలచుట చేతను, పూజించుట చేతను, ధరించుటచేతను, జగత్తులోని జనులు సర్వపాపముల నుండి ముక్తులగుచున్నారు.

**శ్లో॥ బ్రాహ్మణోవాంత్యజో వాపి మూర్ఖోవా పండితోపివా ।**
**రుద్రాక్షిధారణాదేవ ముచ్యంతే సర్వపాతకైః ॥** (సి.శి. 7:61)

బ్రాహ్మణుడైనను, చండాలుడైనను, పండితుడైనను, మూర్ఖుడైనను, రుద్రాక్షను ధరించుటచే పాపముల నుండి ముక్తులగుదురు. వర్ణాశ్రమ, విద్యాబుద్ధుల తారతమ్యము లేనే లేదు. ఎల్లరికీ రుద్రాక్ష ధారణ విహితమై యున్నది.

## రుద్రాక్ష ధారణ - పాపనివృత్తి :

రుద్రనేత్ర సంజాతములైన రుద్రాక్షలను, ఇంతకు క్రితమున చెప్పినయటుల విధి విధానము ప్రకారము ధరించుకొనిన వారికి యెట్టి దోషము లంటవని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి. “ముచ్యంతే సర్వ పాతకైః” అని సెలవిచ్చిరి. మూర్ఖుడైననూ, పండితుడైననూ పాపముల నుండి విముక్తిని పొందవలెననిన రుద్రాక్షలను తప్పనిసరిగా ధరించవలెను. ఇచ్చట, ప్రసంగానుసారముగా పాతకమంటే యేమిటి యనెడి విషయమును, స్మృతి గంధములను ఆధారముగా గొని విచారము చేసెదము.

## పాతకులు :

“పాతయతి అధోగమయతి, దుష్క్రియా కారిణమితి పాతకం” అనెడి వ్యుత్పత్తి మేరకు, దుష్కర్మలను చేసిన వానిని అధోగతికి త్రోసివేసెడి పాపములనే పాతకములని యందురు. 1) అతిపాతకము, 2) మహాపాతకము, 3) అనుపాతకము, 4) ఉపపాతకము, 5) సంకరీకరణ, 6) అపాత్రీకరణము, 7) జాతి భ్రంశకరణ, 8) మలావహ మరియు 9) ప్రకీర్ణక అనెడి తొమ్మిది విధములుగా పాతకములు నుండును.

## అతి పాతకము :

అతిశయమైన పాతకమే అతిపాతకము. ఎంతో గొప్పదగు పాతకమని అర్థము. మాతృ-దుహితృ-స్నుషాగమనం పుంసాం ; పుత్ర-పితృ-శ్వశుర గమనం స్త్రీణా” అనెడి కోశములోని వాక్యానుసారముగా పురుషులు తమ తల్లి, అక్కచెల్లెలు, కోడలు జతకు ; స్త్రీలు తమ కొడుకు, తండ్రి మరియు/లేదా మామ జతకు భోగమును చేసిన యెడల, దాని చేత ఉత్పన్నమయ్యెడి ఘోరమైన పాపమునకు “అతిపాతక”మను పేరు ఏర్పడినది.

## మహా పాతకము :

మహత్-అతిశయం, పాతకం-మహాపాతకం అనెడి వ్యుత్పత్తి మేరకు పెద్దదగు పాతకమును మహాపాతకమని యందురు.

**శ్లో॥ బ్రహ్మహత్యా సురాపానం స్తేయం గుర్వంగనా గమః ।**
**మహంతి పాతకాన్యాహః సంసర్గశ్చాపి తే సహ ॥** (మనుస్మృతి 11-55)

ఈ స్మృతి వాక్యమునందున మను మహర్షిగారు బ్రహ్మహత్య, మద్యపానము, దొంగతనము, గురుపత్ని గమనము లనెడి నాలుగు మహాపాతకములని చెప్పుచు, వీరితో సహవాసము చేయుట యనెడిది ఐదవ మహాపాతకమని తెలిపిరి.

## బ్రహ్మ హత్య:

“బ్రహ్మ జానాతీతి బ్రాహ్మణః” అనెడి వ్యుత్పత్తి ప్రకారము, బ్రహ్మజ్ఞాన సంపన్నుడగు బ్రాహ్మణుని ప్రాణాపహారణమే బ్రహ్మ హత్య. రాగద్వేషముల వలనగాని, ప్రమాదము వలననేగాని, స్వప్రవృత్తి వలనగాని, ఇతరుల ప్రేరణ వలననేగాని యిది సంభవించవచ్చును. వేదాధ్యయనమును చేసిన బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన వ్యక్తియేదయినా అపరాధమును చేసిన యప్పుడు, అతనిని చంపవలెననెడి ప్రసంగము వచ్చి, సంహరించిననూ, సంహరించినవానికి బ్రహ్మ హత్యా పాతకము ప్రాప్తమగునని మన ప్రాచీనమైన పురాణ సాహిత్యములో కనపడుచున్నది. ఇది యెట్లులైనదో చూసెదము గాక.

సృష్టికర్త అయిన బ్రహ్మ యొక్క శిరస్సును ఖండించినందులకై కాలభైరవునికి బ్రహ్మహత్యా పాతకము ప్రాప్తమైనదని తెలిపెడి కథ శ్రీ కాశీఖండము లోని 30వ మరియు 31వ అధ్యాయముల యందున ప్రతిపాదించబడినది. ఒకానొక సమయమునందున మేరుపర్వతము యొక్క శిఖరము మీద కూర్చుండియుండిన బ్రహ్మదేవుని దగ్గరకు అనేక మహర్షులు వచ్చిరి. వారు ఈ విధిన ప్రశ్నించిరి– “ఓ బ్రహ్మదేవా ! ఈ జగత్తునందున అవినాశియైన శ్రేష్ఠమైన పరమ తత్త్వమెయ్యది ?”

“నేనే ఆ పరమ తత్త్వమును. ఓ మునులారా ! ఋషులారా ! వినుడి. ప్రపంచము యొక్క సృష్టి, స్థితి, లయలకు నేనే కారణుడినై, యున్నాను” అని సగర్వముగా పలికెను.

బ్రహ్మదేవుని యహంకార పూరితమైన వాక్కుల గురించి తెలిసికొనిన విష్ణువు, బ్రహ్మ యొక్క దురహంకారమును ద్రుంచనెంచి బ్రహ్మదేవుని కడ ప్రకటనమయ్యెను. అతడు బ్రహ్మతో నిట్లనెను. “ఓయీ బ్రహ్మదేవా ! నీవు కేవలము సృష్టికర్తవే కదా ! పరమతత్త్వము నెట్లయ్యెదవు. నేను జగత్పాలకుడను. శ్రీ రుద్రుడేమో సంహారకర్త. అతడు మన యిద్దరికంటెను అధికుడు. అతడే అవినాశమును శ్రేష్ఠతరము అగు పరమ తత్త్వము. నేను చెప్పెడి విషయముల గురించి నీకు నపనమ్మకముండిన యెడల వేదముల నడిగి తెలిసికొనుము.

శ్రీ మహావిష్ణువు మాటలను వినిన వేదములు వెనువెంటనే విష్ణువు యొక్క అభిప్రాయము సరియైనదని తెలిపినవి. మదాంధుడగు బ్రహ్మకు ఈ మాటలు రుచించలేదు. సత్యమును వచించిన వేదముల మీద నతనికి ఆగ్రహము గల్గెను. అతడు యుక్తాయుక్తముల నెంచకుండగ వేదములను తూలనాడ జొచ్చెను. ఆ సమయమున శివుడచ్చట ప్రకటుడయ్యెను. శ్రీ మహావిష్ణువు, దేవతలు మరియు మహర్షులు తమతమ స్థానముల నుండి లేచి నిల్చుండి దేవదేవునికి నమస్కరించిరి. బ్రహ్మ ప్రవర్తన విచిత్రవముగా దోచెను. తన ఆసనమును వీడి లేవలేదు. శివునికి నమస్కరించలేదు. శివుని వేషభూషల గూర్చి విపరీత వ్యాఖ్యానములను చేయుచు, శివుని అవమానమునకు గురి చేసెను. పకపక నవ్వుచు, వెక్కిరించుచు, అవహేళన చేయుచు, వికృత చేష్టలను చేయుచు చూపరులకు జుగుప్సగలిగే విధిన ప్రవర్తించెను. అక్కడున్న వారందరూ, అతని తీరును చూచి ఖిన్నులైరి. అతనికి గర్వభంగము కావలెనని మనస్సులోనే కోరుకొనిరి. శివనిందను వినలేక చెవులను మూసుకొనిరి.

శివుడు ఉగ్రుడయ్యెను. ఉగ్రరూపమును దాల్చెను. ఆ రూపము నుండి భైరవుడు బయల్వెడలెను. బ్రహ్మ కడకేగి తన గోటితో నా బ్రహ్మ యొక్క పంచమ శిరస్సును చిదిమి వేసెను. బ్రహ్మ విగతగర్వుడై విశ్వనాథుడే శివుని వివిధ రీతుల నుతించి, మన్నించుమని వేడుకొనెను. శివుడతనిని యనుగ్రహించెను.

బ్రహ్మను దండించుటకై యతని శిరస్సును ఖండించిన భైరవునికి బ్రహ్మ హత్యాపాతకము వచ్చి అతనిని ఆవరించినది. కాలభైరవుని దేహము నల్లగా మారిపోయెను. తెగిన బ్రహ్మ శిరస్సు అతని చేతిని వీడదయ్యెను. తరుణోపాయమును కోరెను. అప్పుడు శివకు భైరవుని కిట్లనెను.

“ఓ కాలభైరవా ! ప్రస్తుతము నీకు బ్రహ్మ హత్యా దోషము అంటినది. దీని నివృత్తికై నీవు భిక్షాటనను చేయుము. కపాలము ఎప్పుడైతే తనకు తానై నీచేతిని వీడి నేలకు రాలునో అప్పుడు నీకు బ్రహ్మ హత్యాదోషము నివారణ యైనదని గ్రహించగలవు”.

శివుని ఆదేశము ప్రకారము భిక్షాటన చేయుచు సకల లొకములలోను సంచరించ దొడగెను. ఎక్కడైనను పావవిమోచనము గలుగలేదు. తిరుగుచు, తిరుగుచు తిరుపెమెత్తుచు, తిరుపెమెత్తుచు చివరకు భూలోకమునకు దిగి వచ్చెను. కాశీ నగరములోనికి ప్రవేశించెను. వెనువెంటనే బ్రహ్మ కపాలము కాలభైరవుని చేతిని వీడి నేలకు రాలెను. కాలభైరవుడు తనను బ్రహ్మహత్యా దోషము వీడెనని గ్రహించి సంతసించెను. అప్పటి నుండి కాలభైరవుడు కాశీలోనే నివసించుచున్నాడు. ఈ విధముగా కాశీ క్షేత్రము పాప పరిహార క్షేత్రమై విరాజిల్లుచున్నది. నేడును, వేలాది జనులు తమతమ దోషములను నివారించుకొనుటకై కాశీక్షేత్రమున నివసించుచున్నారు.

శ్రీరామచంద్రుడు రావణుని చంపెను. ఆ రావణుడు పులస్త్య వంశజుడగు ఉత్తమశ్రేణికి చెందిన బ్రాహ్మణుడైయుండెను. వేదపఠనాదులను విధిప్రకారము చేసి, సకల శాస్త్రముల నధ్యయనము చేసిన మహాపండితుడైయుండెను. అందుచేత రామునికి బ్రహ్మ హత్యాపాతకము చుట్టుకొనెను. తన్నివారణకై రాముడు ప్రఖ్యాతిన నున్న లింగమును ప్రతిష్ఠించి దోష నివారణ పొందెనని తెలిపెడి యైతిహ్యము కలదు. రాముడు ప్రతిష్ఠించిన లింగము, నేడొక జ్యోతిర్లింగముగా గుర్తింపును పొంది, కోట్లాది భక్తుల ననుగ్రహించుచున్నది.

ఇచ్చట గ్రహించవలసిన విషయమేమనగా బ్రహ్మ హత్యా దోషము నుండి తప్పించుకొనుటకు దేవతలకైననూ, మహాపురుషులకైననూ సాధ్యము కాలేదు. ఇక్క సామాన్యమానవుని గతి యెట్టిది. ప్రాయశ్చిత్తమును, విధి ప్రకారము చేసుకొని నివారణ పొందవలెను. అట్టి యభీష్టము నెరవేరుటకై రుద్రాక్షధారణను చేయుటవలన ఉత్తమ ఫలితములు లభించునని తెలిసికొనగలరు.

## బ్రహ్మహత్యకు సమానములగు అనుపాతకములు:

ఆత్మస్తుతి యిత్యాదులు స్వల్పదోషములని యెంచవలదని తెలిపెడి ఈ క్రింది ప్రమాణమును గనుడి

**శ్లో॥ అనృతంచ సముత్కర్షే రాజగావిం చ పైశునం ।**
**గురోశ్చాలీక నిర్బంధః మాని బ్రహ్మహత్యయా ॥** (మనుస్మృతి)

తనలో యుత్కృష్టత లేకున్నను, ఎదుటివారికి ఆత్మ ప్రశంసను వినిపించుట, రాజుకు అసత్యములగు నభియోగములను నివేదించి ఎవ్వరినైనను చంపించుట, గురువుకు అసత్యము చెప్పుట యనెడివి బ్రహ్మహత్యకు సమానముగా నుండెడి యనుపాతకములని చెప్పబడినది. "పాతకం బ్రహ్మ హత్యాది, తత్ సదృశం" అనుపాతకం అనెడి వ్యుత్పత్తి మేరకు వీటిని అనుపాతకములని యందురు. వీటివలన బ్రహ్మహత్య చేసినచో యెంత పాపము వచ్చునో అంతపాపము ప్రాప్తించుచున్నది. అందుచేత, జాగ్రత్త వహించి యుండుట శ్రేయస్కరమగును.

## సురాపానము :

"సురానపిబేత్" అనెడిది వేద సమ్మతమైన ఆజ్ఞయని గ్రహించవలెను. ఈ ఆజ్ఞను మీరుట, పాతకమగును. అది బ్రహ్మ హత్యకు సమానమగు పాతకమని గ్రహించగలరు. సురాపానము చేత బుద్ధి క్షీణించునని తెలియుచున్నది. తత్ఫలితముగా సురాపానము చేసే వారిలో ఉదాత్త భావములు దొలగిపోవును. హీనమైన ఆలోచనలు వచ్చి చేరును. ఇట్టివాడు క్రమేపి పతనమును పొందును. ఆరోగ్యైశ్వర్యాదులు కోల్పోవును. అకాల మరణమును పొందును. ఈ విధముగా సురాపానము వలన ఉభయలోక భ్రష్టత్వము ప్రాప్తించును. మానవునికి అత్యంత విలువైనది బుద్ధి. అట్టి బుద్ధిని నాశనమును చేసెడి సూరాపానము నుండి దూరముగా నుండుటయే శ్రేయస్కరము.

సురాపానమునకు సమానములగు పాతకములు

వీటి గూర్చి మనుస్మృతి యీ క్రింది విధముగా తెలిపినది

**శ్లో॥ బ్రహ్మోజ్ఞాతా వేదనిందా కౌటసాక్ష్యం సుహృద్వధః ।**
**గర్హితా నాద్యయోశీర్జగ్ధిః సురాపానసమానిషట్ ॥** (మనుస్మృతి 11-57)

చేసిన వేదాధ్యయనమును మరల మరల చేయకుండుట, వేదనింద, కూటసాక్షిగా కోట సాక్ష్యమును చెప్పుట, మిత్రుని సంహరించుట నిషిద్ధ పదార్థములను భక్షించుట యనెడివి సురాపానములో సమానమగు దోషములగుచున్నవి. వీటిని ఆచరించకుండగ యుండుటయే శ్రేయస్కరము.

## స్తేయము :

అన్యుల ద్రవ్యాపహరణే స్తేయమగును. జీవనోపాధికి యవశ్యకమయ్యెడి ద్రవ్యమును తానే చెమటోడ్చి సంపాదించుకొన వలెనని శాస్త్రము సుడుపుచున్నది. ఈ విధముగా కష్టపడి సంపాదించిన ద్రవ్యమును అన్యాయము కొరకై వ్యయ మొనరించుటకు మనస్సు ఒప్పదు. దొంగతనము, మోసము ఇత్యాదుల ద్వారా యనాయాసముగా గడించిన ధనమును మనుజుడు వ్యయ పరచి అవినీతికి పాల్పడుచున్నాడు. అవినీతి మార్గమున నడిచెడి వాడు పతనము కాకుండగా నుండగలడే ? మనుజుని రక్షణ నిమిత్తమున, శాస్త్రము అస్తేయమనెడి వ్రతమును బోధించినవి.

స్తేయమునకు సమానమైన అను పాతకములు

**శ్లో॥ నిక్షేపస్యాపహరణం నరాశ్వరజతస్యచ ।**
**భూమి వజ్రమణీనాం చ రుక్మస్తేయ సమంస్మృతం ॥** (మనుస్మృతి 11-58)

భూమిలోని సంపత్తు నపహరించుట, మనుష్యుడు, గుర్రము, వెండి, భూమి మరియు వజ్రమణుల అపహరణలు సువర్ణ స్తేయముతో సమానమైనవని యెంచ బడినవి.

## గురుపత్నిగమనం :

గురువుపత్ని యందున అనురక్తుడై కూడునది గురుపత్నీ గమనమగును. కామ వాసనాతి రేకమున యిది సంభవించును. సామాన్యకామవాసనమే గర్హనీయమైనదైయున్న యెడల దీని గురించి చెప్ప పనిలేదు. ఘోరనరకమే కలుగును.

## గురుపత్నిగమనము అనుపాతకములు :

**శ్లో॥ రేతః సేకః స్వయోనీషు కుమారీ ష్వంత్యజాసుచ ।**
**సఖ్యుః పుత్రస్య చ స్త్రీ షు గురుతల్పసమం విదుః ॥** (మనుస్మృతి 11-59)

అక్కచెల్లెళ్ళతోను, లగ్నము గాని కన్యతోను, చాండాల స్త్రీలను, స్నేహితురాళ్ళను, కోడళ్ళను భోగించునది గురుపత్ని గమనముతో సమానమైన పాతకములని చెప్పబడినవి.

**ఉపపాతకములు :**

**శ్లో॥ గోవధో యాజ్యసంయాజ్య పారదార్యాత్మ విక్రయాః ।**
**గురు మాతృ పితృత్యాగః స్వాధ్యాయాగ్న్యోః సుతస్యచ ॥**

**శ్లో॥ ధాన్య కుప్య పశుస్తేయం మధ్యపస్త్రీ నిషేవణం ।**
**స్త్రీ శూద్ర విట్వ క్షత్ర వధో నాస్తిక్యం చోపపాతకం ॥** (మనుస్మృతి 11 60-67)

గోహత్య, అయోగ్యుల పూజ, పరస్త్రీగమనము, తనను అమ్మికొనుట, బంధువుల పరిత్యాగము, వేతనమును తీసుకొని విద్యాదానమును చేయుట, వేతనము నిచ్చి విద్య నభ్యసించుట, అమ్మకూడనివగు పాలు, నెయ్యి వంటివి అమ్ముట, తల్లిదండ్రుల మరియు గురుసేవలను చేయకుండా నుండుట, భార్యను పడుపువృత్తిన పెట్టి జీవనమును గడుపుట, అభిచారాదుల ద్వారా చంపుట, మందు మంత్రముల చేత

వశీకరణ చేసుకొనుట, వంట చెరకుకై పెరిగే పచ్చని చెట్లను కొట్టుట, తన కొరకు మాత్రమే అన్నమును వండుకొని తినుట, అభక్ష్య పదార్థముల సేవన, ఋణమును తీర్చకుండుట, ధాన్యము, తామ్రము, లోహము, పశువులను దొంగిలించుట, మద్యపానము చేసిన స్త్రీలతో సంభోగము, స్త్రీ శూద్ర, వైశ్య, క్షత్రియాదుల వధ మరియు నాస్తికత్వము ఉపపాతకములన బడుచున్నవి.

## జాతి భ్రంశకరణ :

శ్లో॥ బ్రాహ్మణస్య రుజకృత్యా ఘ్రాతిరఘ్రేయ మద్యయోః ।
జోహ్మ్యంచ మైథునం పుంసి జాతి భ్రంశకరం స్మృతాం ॥ (మనుస్మృతి 11 68)

దండాదుల చేత బ్రహ్మజ్ఞానిని పీడించుట, దుర్గంధపూరితమైన మద్య పురీషాదులను వాసన చూచుట, కుటిలముగా వర్తించుట, పురుషుల ముఖాదుల యందు మైథున క్రియను సలుపుట జాతి భ్రంశకారకములగును. ఉత్తమ కులజుడైననూ భ్రష్టత్వమును పొందును.

## సంకరీకరణ :

శ్లో॥ ఖరాశ్వోష్ట్రమృగే భానా మజా వికవధస్తథా ।
సంకరీకరణం జ్ఞేయం మీనాహి మహిషస్యచ ॥ (మనుస్మృతి 11 69)

గాడిద, గుఱ్ఱము, ఒంటె, లేడి, ఏనుగు, గొఱ్ఱె, పోతు, మేక, చేప, సర్పము, దున్న యిత్యాదులను చంపుటయే సంకరీకరణ యని చెప్పబడినది. వీటిని చేయుట చేత జాతి సాంకర్యము వలన గల్గెడి దోషములు సంక్రమించునని యెరుంగవలెను.

## అపాత్రీకరణము :

శ్లో॥ నిందితేభ్యో ధనాదానం వాణిజ్యం శూద్రసేవనం ।
అపాత్రికరణం జ్ఞేయమసత్యస్య చ భాషణం ॥ (మనుస్మృతి 11 79)

నిందనీయుల నుండి ధనమును తీసుకొనుట, వ్యాపారము చేయుట, హీనులను సేవించుట, సత్యమును పలుకుట వంటివి మనుజుని మాన మర్యాదలను భంగపరచును. అందుచేత అపాత్రీకరణములని పిలువబడినవి.

## మలావహము :

శ్లో॥ క్రిమికీటవయోహత్యా మద్యానుగతభోజనం ।
ఫలైధః కుసుమస్తే మధైర్యం చ దులావహ ॥

క్రిమికీటకములను చంపుట, మధ్యానుగతమే భోజనమును చేయుటయును, పూలు, పళ్ళు, కట్టెలను దొంగిలించుటయును, అధైర్యమును గల్గియుండుట మలాపహములన బడుచున్నవి. ఎల్లరును వీటిని చేమకుండగ ఉండేందుకై జాగ్రత్త వహించవలెను.

## ప్రకీర్ణకము :

శాస్త్రము యొక్క ఆధారము లేనివియును, న్యాయాధీశ్వరులు నిర్ణయించే వాటిని ప్రకీర్ణములని యందురు. నిరాధారమైన వ్యాజ్యములను వేసి అమాయకుల ఆస్తులను హరించుటకు పూనుకొనుట ప్రకీర్ణమగును.

## మాతా పితరుల హత్య :

“మాతృదేవోభవ, పితృదేవోభవ” అనుచూ గాన వేదములు తల్లిదండ్రులను దేవతలుగా భావించినవి. మన జన్మదాతలును, పాలన పోషణ చేసి పెంచి పెద్దగ జేసిన వారి సేవ చేసి వారి ఋణమును తీర్చుకొనుటకు బదులుగా వారిని చంపివేసెడి దుర్మార్గులు అక్కడక్కడ కన్పట్టుచున్నారు. ఇట్టి వారు మహాపాతకమును చేసిన వారగుదురు.

## భ్రూణ హత్య :

'భ్రూణ' అనగా గర్భము లేదా శిశువు. శిశువులను చంపుట, గర్భస్రావము చేయించుట మొదలగునవి భ్రూణ హత్యలగును. మహాబలశాలియైన కంసుడు, తాను చేసిన భ్రూణ హత్య మూలముననే పతితుడై చంపబడెను. కుటుంబ నియంత్రణకై చేయించెడి గర్భస్రావములు నైతికముగా గర్హనీయములే.

## ఘాతకము :

విశ్వాసఘాతకమునే ఘాతుకమందురు. లౌకిక లేదా పారలౌకిక వ్యవహారమునకు విశ్వాసమే ముఖ్యమైనది. విశ్వాసమును గల్గిన వ్యక్తి యొక్క ధనమునో లేదా ప్రాణమునో హరించుట ఘాతకమన బడుచున్నది. ప్రతియొక్కరు ఘాతకమునకు పూనుకొనిన యెడల లోక వ్యవహారములు నిలిచిపోవును. సామాజిక వ్యవస్థయే నశించిపోవును. ఈ కారణముననే దీనికి ఘాతకమనెడి నామధేయము గల్గినది.

ఇంతవరకు చెప్పబడిన పాపముల మూలమున మానవుడు హీనాతిహీనమైన యోనులలో జన్మించునని తెలియుచున్నది. ప్రతియొక్కడు తాను చేసిన కర్మఫలమును తాననుభవించి తీరవలెను. ఇది శాస్త్రము చెప్పెడి మాట "నా భుక్తం క్షీయతే కర్మకల్పకోటి శతైరపి" అనెడిదే కదా శాస్త్రోక్తి. కర్మవిపాక శాస్త్రము చెప్పెడిదేమో తెలిసికొనవలెను. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ మహాపాతకజం చిహ్నం సప్తజన్మసు జాయతే ।**
**బాధతే వ్యాధిరూపేణ తస్య కృచ్ఛ్రాదిభిః సమః ॥** (శాతాతపీయ కర్మ విపాకము)

మహాపాతకమేదియేడు జన్మలవరకు వ్యాధిరూపమున వెన్నంటి జీవుని పీడించుచుండును. దాని నివారణకై కృచ్ఛ్ర యిత్యాది ప్రాయశ్చిత్తములను చేసుకొనవలసి యుండును. ఈ విధముగా అనేక కర్మలకు అనేకములగు ప్రాయశ్చిత్తములు గలవు. మనుస్మృతిలో నివి తెలుపబడినవి. వీటిని చేయుట చాలా కష్టము. అందరికీ సాధ్యమయ్యెడిది కావు. అయితే శ్రీ రేణుక భగవత్పాదుల వారు చూపిన మార్గము సులభ సాధ్యమైనదే. "రుద్రాక్ష ధారణాదేవ ముచ్యతే సర్వపాత్రకైః" అనెడిది ఆచార్యుల వారి యుపదేశము. రుద్రాక్షధారణము వలన పాపములన్నియును వైదొలగునని శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము. పూర్వోక్తమైన పాపములన్ని రుద్రాక్షధారణ చేత భస్మమగుచున్నవి. అట్టి వ్యక్తి జీవమున్నంత వరకూ పవిత్రుడుగానే యుండును. చచ్చునవాని పార్థివ శరీరమునకు రుద్రాక్ష యొక్క స్పర్శ లభించినచో వానికి పరలోకమున పరమ సుఖము లభించునని తెల్పెడి దృష్టాంతములు గలవు. ఇవి ధర్మగ్రంథములలో చెప్పబడినవి. క్రియాసారములో చెప్పబడిన యీ క్రింది దృష్టాంతము గనునార్హమైయున్నది.

ఒకసారి యముడు చిత్రగుప్తుని వెంబడించికొని భయభీతుడై పరుగెత్తుచూ కైలాసమునకు వచ్చి శివునకు నమస్కరించి ఈ క్రిందివిధముగా వేడుకొనెను. "ఓ ప్రభూ ! మీరు ప్రదానము చేసిన స్థానమున ఆసీనుడనై బహుకాలము నుండి వ్యవహారములను న్యాయమునకనుగుణముగానే నిర్వహించుచున్నాను. పుణ్యవంతులకు పురస్కారముగా స్వర్గమును, పాపులను నిగ్రహించుటకై నరకమును తమరు యేర్పాటు చేసిరి. తమరి ఆజ్ఞను పాలన చేస్తూ పుణ్యాత్ములను స్వర్గమునకు పంపించి పాపాత్ములను నరకమున వేసి శిక్షించుచున్నాను. అయితే యెప్పుడూ జరుగని ఆశ్చర్యకరమైన సంఘటన యొకటి యిప్పుడు సంభవించినది. అదేమనగా కళింగదేశపు రాజు పాలనలో 'వ్యాఘ్ర' అనెడి పట్టణమున్నది. అందున జామిత్రుడు అనెడి హీనుడును అగు పాపి యొకడుండెను. ఇతని తల్లి వ్యభిచారిణియైయుండెను. ఇతడు బాలకుడుగా నున్నప్పుడే తల్లి గతించిపోయెను. ఇతడు బాల్యదశలోనున్నప్పటి నుండియే యితని తండ్రి జూదలంపటుడై యెల్లప్పుడు వేశ్యల యిళ్ళలోనే యుండెడివాడయ్యెను. యుక్తవయస్సుకు వచ్చిన పిదప వీడును విషయలంపటుడై వేశ్యల సాంగత్యమున కాలమును గడపజొచ్చెను. వేశ్యలకు ధనమునిచ్చెడి నిమిత్తముననే తండ్రితో ఘర్షణపడి తండ్రిని తెగటార్చెను. చోరవృత్తిలో కాలమును గడుపుచుండెను. ఒకనాడు వీడు రాజభటుల చేతికి చిక్కెను. వారు కొట్టిన దెబ్బలకు నసువులు వీడెను. యమదూతలు వీని సూక్ష్మశరీరమును తీసుకొని నరకమునకు వచ్చి నా యెదుట ప్రవేశపెట్టిరి. చిత్రగుప్తుడు వ్రాసిన లెక్క ప్రకారము పుణ్యపాపముల గణన చేసి వీనికి శిక్షను విధించనైనది. యమదూతలు వీనికొక యాతనా శరీరమునిచ్చి, శిక్షను అమలు చేయుచున్నారు. నాల్గుదినముల నుండి యీ విధి

కొనసాగుచున్నది. పాపి కఠోరమైన శిక్షను అనుభవించుచున్నాడు. ఈ లోపుననే కొందరు శివగణమునకు చెందినవారు నరకలోకమునకు వచ్చి, నన్ను, నా భటులను బాగుగా కొట్టి యా పాపిష్టివానిని విడిపించుకొని శివలోకమునకు తీసుకొని వచ్చిరి. ఈ విధముగా తమరు పాపుల పక్షపాతులైయున్న యెడల యికముందున ధర్మపాలనా వ్యవస్థ యెటుల ఉండగలదు ?

అప్పుడు శివుడు నటనేయున్న భైరవుని వైపు తిరిగి యీ విధిన యగుటకు గల కారణమేమియని యడిగెను. భైరవుడొక విస్మయజనకమైన ఘటనను వివరింపజొచ్చెను. చక్రవాక రాజు గారి కూతురగు నొకర్తె సర్వాంగసుందరియై యుండెను. మంగళ స్నానమును చేసికొని, తన కురులను ఆరబెట్టుటకై ఉద్యానవనమున కేతెంచెను. తన మెడలోని కెంపుల మణిహారమును మల్లె పొదమీద నుంచి వెండ్రుకల నారబెట్టికొనెడి పనిలో నిమగ్నురాలై యుండెను. ఆకాశమున యెగిరెడి కాకికి ఆ మణిహారము మాంసపు ముద్ద వలె కన్పట్టెను. అది భ్రమకు లోనై ఆ హారమును ముక్కున కరచుకొని పైకి ఎగిరిపోయెను. కొంతసేపటి పిదప నిజమును తెలిసికొని, ఆ హారమును జారవిడిచెను. అది వచ్చి జామిత్రుని మృతశరీరము మీద పడినది. ఆ హారము మధ్యన యుండియున్న రుద్రాక్ష యొకటి యితని మస్తకమును తాకెను. తత్ఫలతముగా నితని పాపములు మసియైనవి. నిర్మలుడై పున్యాత్ముడుగా మారిన జామిత్రుని, యమదూతలు నిర్హేతుకముగా యమ యాతనకు గురిచేయుచుండిరి. ఇది చూచి శివగణములు సహించలేకపోయినవి. అకారణముగా జామిత్రుని శిక్షకు గురి చేయుచున్న యముడు మరియు యతని దూతలు శిక్షార్హులైరి. ఆ కారణమున వారిని దండించి, శివగణములు జామిత్రుని వెంబడించికొని కైలాసమునకు వచ్చినారు.

అప్పుడు యముడు భైరవుని కిట్లనెను. "ఓ భైరవ స్వామి ! బ్రతికియున్నవానికి రుద్రాక్ష వలన పుణ్యప్రాప్తి యగును కాని, మృత శరీరమునకు రుద్రాక్ష తాకినందు వలన పాపము లెట్లు నశించును ? దయచేసి వివరించుడి."

భైరవుడు యముని ప్రశ్నకు ఈ క్రింది విధిన బదులిచ్చెను.

**శ్లో॥ అస్థి కేశాది గంగాయామృతానాం బహుకాలతః ।**
**పతితంయదివై శీఘ్రం కైలాసంయాంతివై యమ ॥** (క్రియాసారము 11-464)

చచ్చిన యెన్నియో దినముల అనంతరము చచ్చిన వాని యెముకలు, కేశములు, బూడిద గంగలో కలిపిన పిదప యే విధముగా సద్గతి లభించుచున్నదో, అదే విధిన మృత దేహము మీద భూతి రుద్రాక్షాదులు ధరించిన యెడల కైలాస ప్రాప్తి కలుగుచున్నది.

భైరవుని ఉత్తరము చేత యమునికి సంతృప్తి చేకూరెను. యమునికి మరింత జ్ఞానోదయము కల్గించే నిమిత్తమున భైరవుడతనికి యీ విధిన యుపదేశించెను :

**శ్లో॥ ఆద్య ప్రభృతి రుద్రాక్ష ధారిణో మమ వల్లభాన్ ।**
**దూరదృష్ట్యా యమ భయాన్నత్వాతాన్ మనసా వ్రజః ॥** (క్రియాసాశీర, 11-168, పు.159)

"ఓ యమా ! ఇప్పటి నుండి రుద్రాక్ష ధారులను నీవు ముట్టకూడదు. వారికి దూరము నుండియే నమస్కారము చేయవలెను. వారి మీద మీ అధికారము నడవజాలదు.

ఆ పిదప, యముడు సెలవును గైకొని తనలోకమున కరిగెను. అప్పుడు యముడు ఒక నిశ్చయమును చేసికొనెను. శివభక్తుల దరికి చేరకూడదని నిర్ణయించికొనెను. ఆ పిదప, తన దూతలకు ఈ విధముగా నుపదేశము నిచ్చెను.

**శ్లో॥ యస్యాంగేనాస్తి రుద్రాక్ష స్త్రిపుండ్రం భాలపట్టకే ।**
**ముఖే పంచాక్షరం నాస్తి తమానయయమాలయం ॥** (శివ.పు., వి.సం. 2, అ-51)

ఎవ్వరి శరీరమున భస్మరుద్రాక్షలు లేవో, ఎవ్వరి ముఖమున పంచాక్షరీ మంత్రము ఉండదో, అట్టి వారిని మాత్రమే యమాలయమునకు తీసికొని రమ్మని తెలిపిరి.

ఈ విధముగా ప్రాచీన వాఙ్మయమున రుద్రాక్ష ధారణ యొక్క మహిమ బహు విధములుగా నుతింపబడినది.

**అయ్యా ! రుద్రాక్షి యిందె పరిదెను భవ పాశుంగళ**
**అయ్యా, రుద్రాక్షయిందె మురిదెను తనుగుణాదిగళ**
**అయ్యా, రుద్రాక్షి యిందె ఒరసి దెను మహామాయెయ**
**అయ్యా, రుద్రాక్షియిందె కళెదెను మహాపాతకవ**
**అయ్యా, కూడల సంగమ దేవ**
**శ్రీ మహారుద్రాక్షి యిందె గెలిదెనయ్యా సకల దురితం గళను** (వీరశైవ చింతామణి, పు.160)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి

**అయ్యా, రుద్రాక్ష చేత బాసితి భవపాశముల**
**అయ్యా, రుద్రాక్ష చేత విరిచితి తనుగుణముల**
**అయ్యా, రుద్రాక్ష చేత రాచితి మహా మాయను**
**అయ్యా, రుద్రాక్ష చేత గడిచితి మహాపాతకము**
**అయ్యా, కూడల సంగమ దేవ,**
**శ్రీ మహారుద్రాక్ష చేత గెలిచితినయ్యా సకల దురితములను**

రుద్రాక్ష ధారణ గురించి తెలిసికొని ధరించెడి దానికి యుత్తమ ఫలితములు లభించునని తెలిపెడి యీ కవి వాక్కులను గనుడి :

శ్లో॥ **ఎసెవ హలవు ముఖద భేదవరిదు ధరిసె**
**బ్రహ్మ హత్య పశువిఘాత భ్రూణ హత్య పాపనాశనం ॥**
**బసెదు చిత్తశుద్ధి యింద ధరిసిదాత రుద్రనెందు**
**వసుధె యొళగె సారు తిహుదు వేదవాక్యపు ॥** (వీరశైవ చింతామణి, పు. 155-156)

ఈ కృతి తెలుగు రూపమిది :

శ్లో॥ **ఎసగె పలు ముఖపు భేదము నెరిగి ధరించ**
**బ్రహ్మ హత్య పశువిఘాత భ్రూణ హత్య పాపనాశనం,**
**ఒసగి చిత్తశుద్ధితోడ ధరించువాని రుద్రుడనెద**
**వసుధలోన చాటుచున్నది వేదవాక్యము ॥**

రుద్రాక్ష ధారణా విధిని, ధారణా స్థాన వివేకమును, ముఖ విజ్ఞానమును బాగుగా నెరిగి రుద్రాక్షలను ధరించిన యెడల నుత్తమ ఫలితముండునని యీ కవి తెలియజెప్పెను.

## రుద్రాక్ష ధారణా మరియు స్పర్శనము :

ఏ కారణము వలననైనా ధరింపజాలనివారు రుద్రాక్షలను దర్శించి, స్పృశించినా పాప నివారణ జరుగునని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిరి. పూజ్య పాదుల వారి యుపదేశమును గనుడి

శ్లో॥ **దర్శనాత్ స్పర్శనాచ్చైవ స్మరణాదపి పూజనాత్ ।**
**రుద్రాక్ష ధారణాల్లోకే ముచ్యంతే పాతకైర్జనాః ॥** (సి.శి. 7:60)

దర్శనము మరియు స్పర్శనములను కూడ చేయజాలని స్థితిలో మననము చేసికొనిన పాతక నివారణ యగుననియును తెలియుచున్నది. రుద్రజాబాలోపనిషత్తు ప్రకారము, రుద్రాక్ష పదోచ్చారణ వలన ఎంతో పుణ్యము లభించునని చెప్పబడినది. ఈ ప్రమాణమును గనుడి –

శ్లో॥ తద్రురాక్షే వాగ్విషయే కృతేదశగోప్రదానేన యత్ ।
ఫలమవాప్నోతి తత్ఫలమశ్నుతే ॥ (రుద్రాక్షజాబాలోపనిషత్తు)

రుద్రాక్ష ధారణ వలన సద్యోన్ముక్తి కలుగునని తెలిపెడి యీ కవి నుడువులను గనుడి

శ్లో॥ స్మరిసె దురిత హరివు దీక్షిసల్కె కర్మవళివు దొలిదు
స్పర్శనవను మాడె జన్మ పాశ పరివుదు
ధరిసె రుద్రపదవి యరిదు ధరిసి జపిసె సద్యోన్ముక్తి
పరమ వీరశైవమతద మూలభూషణ ॥ (వీరశైవ చంతామణి, పు. 155)

దీని తెలుగురూపమిదియే

శ్లో॥ స్మరించ దురితముపాప దీక్షితునికి కర్మమడుగునొల్లి ।
స్పర్శనముచేయ జన్మపాశము పారునది ॥
ధరించ రుద్రపదవి యెరిగి ధరించి జపించ సద్యోన్ముక్తి ।
పరమ వీరశైవ మతపు మూలభూషణము ॥

ఈ విధముగా రుద్రాక్షలు శక్తివంతములైనవని తెలియుచున్నది. పూర్వోక్త ప్రమాణములన్నియును ఈ అంశమును సమర్థించుచున్నవి.

## రుద్రాక్ష ధారణ - వర్ణాశ్రమ ధర్మములు

రుద్రాక్షను ధరించెడి వాడే జాతికి సంబంధించిననూ ఫలమొక్కటేయని శ్రీ రేణుక భగవత్పాదుల వారు సమతావాదమును ప్రతిపాదించిరి. శ్రీవారి యుపదేశమును గనుడి

శ్లో॥ బ్రాహ్మణో వాంత్యజోవాపి మూర్ఖోవా పండితో పివా ।
రుద్రాక్ష ధారణాదేవ ముచ్యతే సర్వపాతకైః ॥

వలచి ధరించినవాడు బాపడైననూ, వెలివాడైననూ, మూఢుడైననూ, పండితుడైననూ వాని పాతకము నశించునని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి. భక్తియే ప్రధానమని గ్రహించవలెను రుద్రాక్ష యొక్క సామర్థ్యము యెడల నమ్మకమున్న వాడెవ్వడైననూ వాని నమ్మకమునకు తగిన ఫలము లభించునని గుర్తించవలెను. ఈ విషయమున శ్రీ స్వతంత్ర సిద్ధ లింగేశ్వరుల వారి వచనము గమనించదగినదై యున్నది.

శ్లో॥ బ్రాహ్మణ అంత్యజ మూర్ఖపండిత ।
బ్రహ్మచారి గృహస్థ, వానప్రస్థ, యతియాదదాగలి
రుద్రాక్షియ నొలిదు ధరిసువుదు కాణిరణ్ణా ॥

మత్తెజపకాల తపకాలదల్లి జపవ మాడు వవరు ।
దేవపూజెయల్లి శ్రీ రుద్రాక్షియనొలిదు ధరిసువుదు కాణిరణ్ణా ॥

శ్రీ రుద్రాక్షియ ధరిసిద పరమాత్మను
హెచ్చిహెచ్చిగె అశ్వమేధ శత యాగద ఫలవపడెదు
నిజగురు స్వతంత్ర సిద్ధలింగేశ్వరన కూడి
సుఖిసుహను కాణిరణ్ణా ।

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి

బ్రాహ్మణుడు, అంత్యజుడు, మూర్ఖుడు, పండితుడు, బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, యతియైనగాని రుద్రాక్షనొల్లి ధరించునది కానుడన్నా మరియు జపకాల తపకాల మందు జపము చేయువారు దేవపూజయందు శ్రీ రుద్రాక్షనొల్లి ధరించునది కానుడన్నా.

**శ్లో॥ శ్రీ రుద్రాక్షను ధరించిన పరమాత్ముడు**
**హెచ్చుహెచ్చుగు అశ్వమేధ శతయాగపు ఫలము బడసి**
**నిజగురు స్వతంత్ర సిద్ధ లింగేశ్వరుని గూడి**
**సుఖియగును కానుడన్నా ॥** (వీరశైవ చింతామణి, పు. 162)

వర్ణాశ్రమ, విద్యాబుద్ధులలో భేదభావమును గణించక యెవ్వరైననూ రుద్రాక్ష వలన యితోధికమైన లబ్ధి పొందవచ్చునని తెలియుచున్నది శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారి ఉపదేశము ప్రకారము ఎల్లరూ రుద్రాక్షను ధరించి ధన్యతను పొందుదురు గాక !

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 3-9-1992

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

# విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు పాతకుల స్వభావమును గురించి వివరణాత్మక విశ్లేషణ చేసిరి. పాపములను రూపుమాపెడి దిశలో రుద్రాక్ష ధారణను ఉత్తమమైనదని తెలిపిరి.

మాలిన్యాదుల వలన దోషములబ్బుట సహజమే. మాలిన్యములను దూరము చేసికొనుటకు జలస్నానాదులను చేయుట పరిపాటి. దురితముల వలన గల్గిన మాలిన్యములను దూరము చేసికొనుట యంత సులభమైన పనికాదు. జల స్నానాదులిచ్చుట సఫలము కాజాలదు. తన్నిమిత్తమై శాస్త్రములలో వివిధోపకరణములు సూచింపబడినవి. ప్రాయశ్చిత్త కర్మలు నీ కోవకు చెందనివే.

బ్రహ్మహత్యాది దురితములను చేసెడి వాడు, వాటిని కాలవశమున చేయుచున్నాడే కాని మరే కారణము కాదని కొందరందురు. బ్రాహ్మణుడు దుర్మార్గ ప్రవృత్తి గలవాడై లోక కంటకుడై నప్పుడునూ "బ్రాహ్మణో న హంతవ్య" అనెడిది పాటించజాలని వాడు బ్రహ్మ హత్యకు పూనుకొనును. తన భార్యను చెరబట్టిన బ్రాహ్మణుని చంపి శ్రీరాముడు ఆమెకు రక్షణ కల్పించెను. ఇట్టి ఉదాహరణలెన్నియో గలవు. అసంకల్పితముగా చేసిన యిట్టి దురితముల వలన గల్గిన మాలిన్యమును తొలగించుకొనుటకై రుద్రాక్షలు మరియు వాటి ధారణ యుపకరణములుగా వుండునని పురాణాదులలో చెప్పబడినది. ఈ అంశములను పండితారాధ్య చరిత్ర నీ క్రింది విధముగా తెలియజేసినది.

**యయిన లైంగ్యంబు 'రుద్రాక్ష ధరశ్శు**
**చియనంగ మరి శిరసి స్థితేయనగ**
**భ్రమితులై మత్స్య పురాణంబు నట్ల**
**రమణ రుద్రాక్ష ధర శ్శుచి యనగ**
**దనరారి కూర్మంబు దరలి పాప్మాన** (పండితారాధ్య చరిత్ర దీక్షాప్ర)

ప్రాచీనకాలమున బ్రహ్మహత్యను అతి తీవ్రముగా నిరసించెడి వారు. బ్రహ్మహత్య యనగా బ్రాహ్మణ హత్యయని గుర్తింపబడినది. ఇచ్చట, బ్రాహ్మణ యనెడి పదమును వర్ణవాచకముగా తీసికొనవలదు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడై యా జ్ఞానము నుపయోగించి బ్రహ్మత్వమును పొందుటకు యత్నించెడి వాడని తెలిసికొనవలెను. ఇట్టి వారిని వధించ కూడదనెడిది శాస్త్రోక్తి. శాస్త్రోల్లంఘన జేసినవాడు నిషేధిత కర్మనాచరించిన వాడగుచున్నాడు. తత్ఫలితముగా పాపము సంక్రమించును. రౌరవాది నరకములు ప్రాప్తించునని శాస్త్రవిదుల వాదన. ఇట్టి పాపాత్ములకు నొక తరుణోపాయముగలదని శివపురాణము చెప్పుచున్నది. గనుడి

**శ్లో॥ ఏక వక్త్రంతు రుద్రాక్షం పరతత్త్వ స్వరూపకం ।** (రుద్రాక్ష జాబాలోపనిషత్తు)
**తస్య దర్శన మాత్రేణ బ్రహ్మహత్యాం వ్యపోహతి ॥** (శివ మహాపురాణము,వి.సం.5 అ. 64-65)

ఏకముఖ రుద్రాక్ష పరతత్త్వ రూపమనియును, అద్దానిని చూచినచో బ్రహ్మహత్యా పాతకము పటాపంచలగునని యీ ప్రమాణముల వలన తెలియుచున్నది.

మద్యపానము దోషభూయిష్టమైనదని చెప్పబడినది. కాని మద్యపాన ప్రియుల సంఖ్య నానాటికి పెరుగుచున్నది. క్షణికమైన యానందము కొరకు మద్యమును సేవించి క్షమించజాలని దురితముల జేసెడి వారెందరో గలరు. దేవతలు సురాపానమును, బ్రాహ్మణాదులు సోమరసము త్రాగినచో, మేమెందుకు త్రాగకూడదని మొండిగా వాదించెడి త్రాగుబోతు లెందరో గలరు ఇట్టి అలవాట్ల బానిసల మాట యెట్టులుండినను పరిస్థితుల ప్రభావమునకు లోనై మద్యమును సేవించి పశ్చాత్తాపము నొందెడి వారికి తరుణోపాయము గలదని శివపురాణము తెలుపుచున్నది. గనుడి

**శ్లో॥ పంచవక్త్రః స్వయం రుద్రః కాలాగ్ని ... ర్నమతః ప్రభుః ।**
**అగమ్యా గమనం పాప మభక్ష్య స్య చ భక్షణం ।**
**ఇత్యాది సర్వ పాపాని పంచవక్త్రోవ్యపోహతి ॥** (శివపురాణము, వి.సం.)

పంచవక్త్ర రుద్రాక్ష ధారణ చేత మద్యపానము వలన కలిగెడి దోషములు నశించునని తెలియగలరు.

"మాతృదేవోభవ, పితృదేవోభవ" యనుచు మాతాపితరులకు దైవము కంటె నధికతరమైన గౌరవమును ప్రదానము చేసెడి సంస్కృతిలో మాతాపితరులను వధించెడి వారిని గాంచగలము. వీరిలోన సామాన్యులు నధిక సంఖ్యలో నుందురు. వీరందరును దురితములకు నెలవై దురితములు చేయుచు కాలము గడిపెడివారు. మహాపురుషులలో గూడా మాతాపితరుల వధకు కారకులైన వారు గలరు. కారణాంతరముల వలన మాతృవధకు కారకుడైన పరశురాముని చరిత్ర యిందులకు నుదాహరణగా నిలుచును. పితృవాక్య పరిపాలనకై మాతృమూర్తి తలను తెగ నరికిరి. ప్రహ్లాదుని విష్ణుభక్తి, యతని పితృవధకు కారణమయ్యెను. సామాన్యులలో నెవ్వరైనను పరిస్థితుల ప్రభావమునకు లోనై యిట్టి దురితములు చేయవచ్చును. అట్టి దురితముల ఫలమును ద్రుంచుటకు రుద్రాక్ష యుత్తమ సాధనమని తెలిపెడి యీ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ త్రయోదశ వక్త్రమతుల భోగప్రదం రససాధన ధాతువాద ।**
**ఘుటికాది సిద్ధికరం పితృమాతృ భ్రాతృ స్త్రీవధ దోషహరం ॥**

త్రయోదశ వక్త్రములు గల రుద్రాక్షలు ధరించుట చేత మాతృ-పితృ హత్యల దోషములతో బాటుగా భ్రాతృ-స్త్రీ హత్యల పాపము పోవునని చెప్పబడినది.

శ్రీ భగవత్పాదుల వారు సూచించిన ఇతర పాపములును తీవ్రతరమైనవే.

ఒక వ్యక్తి కష్టపడి సంపాదించిన సొమ్మును చౌర్యము చేయుట కడుహీనమైన చర్య. యిట్టివారు హీనయోనులలో జన్మింతురని ఇంతకు క్రితమున శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు తెలియజెప్పియుండిరి. మనుస్మృతి ప్రకారముగ దొంగతనమనెడిది మహాపాతకములలో నొకటి.

"గురుదేవోభవ" యనెడి సంస్కృతి మనది. జ్ఞాన దాతయగు గురువు దేవుని కంటెను గొప్పవాడని తెలుపబడినది. గురువు దారా పుత్రపుత్రికాదులు గురువువలె వందనీయులు. శిష్యులు గురు పరివారము లేదా కుటుంబము లోని వారితో లైంగిక సంబంధము గల్గియుండుట నిషేధింప బడినది. గురుపత్ని మాతృమూర్తి వంటిది. అట్టి పవిత్ర స్త్రీని పొందగోరి గురు తల్పమును చేరి గురుపత్నిని కూడెడి వాడు మహాపాపాత్ముడని మనుస్మృతి తెలిపినది. నీచమతులు బుద్ధిపూర్వకముగా తప్పిదమును చేయుదురు. అందమైన భార్య గల్గిన గురువు దగ్గర పాపచింతనతో శిష్యులుగా చేరెడి చెడ్డవారెందరో గలరు. వీరు క్షంతవ్యులు కారు. కాని చంద్రుని వంటివారు కొందరు కారణాంతరముల వలన గురుతల్పమును చేరెడి యవకాశము గలదు. వారి ప్రమేయము లేకుండగనే తప్పిదము సంభవించవచ్చును. గర్భహత్య స్త్రీహత్యతో సమమైనది. విశ్వాసఘాతము నరహత్యతో సమానమైనది.

ఇట్టి దురితములను చేసిన వారిని కాచి రక్షించెడి సామర్థ్యము రుద్రాక్షకు గలదని గుర్తించవలెను. ఈ క్రింది ప్రమాణమును గనుడి

**శ్లో॥ నవ వక్త్రం వామకరే ధృతంచ ।**
**లక్షకోటి మహాపాతక దోషహరం ॥** (శివార్చనా చంద్రిక, పు. 15)

రుద్రాక్ష ధారణచేత లక్ష కోటి మహాపాతకములు నాశనమగునని చెప్పబడినది. ఈ కారణము వలననే కాబోలు వీరశైవులు శాంతిపూజలు ప్రాయశ్చిత్తములను చేయవలసిన పనిలేదని విజ్ఞులయభిప్రాయము.

ప్రాయశ్చిత్త సంబంధమైన విషయములెంతో జటిలమైనవి. దురవగాహనకు నాస్కారము గల్గించెడివై యున్నవి. పండితుడు మాత్రమే వాటిని గ్రహించగలడు. ఆచరణ విషయములోనున్న కాఠిన్యములను నెదుర్కొని సాధించుట సామాన్యులకు నసాధ్యమైన విషయము. అట్టి యెడ మూర్ఖుడైన వాడు ప్రాయశ్చిత్తమును చేసికొనలేడు కదా ! అదే విధిన చాతుర్యర్ణములలోని శూద్రాదులకు ప్రాయశ్చిత్త విషయములలో నెన్నియో సమస్యల నెదుర్కొన వలసియుండును. యజ్ఞయాగాదులను చేయుటకు వారికి యవకాశము లేదు. బ్రాహ్మణ వర్గము సహాయము లేకుండగ ప్రాయశ్చిత్తమును చేయుట యసంభవము. ఎందుకనగా తత్సంబంధమైన సాంకేతిక జ్ఞానమంతయును వారి వశములోనున్నది.

రుద్రాక్ష ధారణ విషయములోన యిట్టి తారతమ్యముల కాస్కారము లేదు. పండితుడైననూ, పామరుడైనను, మతివంతుడైనను మతి హీనుడగు మూర్ఖుడైనను రుద్రాక్ష ధారణచేసి యింకో విధముగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదులలో నెవ్వరైనను రుద్రాక్షను దాల్చి లబ్ధిని పొందవచ్చును. గాయిత్రిని శూద్రులు. చేయకూడదనెడి నిషేధము గలదు. రుద్రాక్ష ధారణ విషయములోన యిట్టి నిషేధమున కాస్కారము లేదు. ఎవ్వరైనను ఏ విధిననైను రుద్రాక్షను ధరించవచ్చును. పౌరాణిక గాధల ప్రకారము, మరణము పిదపనైనను రుద్రాక్ష దేహమునకు తాకిన యెడల సద్గతి లభించగలదు.

రుద్రాక్షలు లభించకనో, మరే కారణము వలననో రుద్రాక్షలు ధరించుటలో నశక్తుడైనవాడు, రుద్రాక్షలను స్మరించిన చాలును పాతకములన్నియును వీగిపోవును.

వీరశైవ ధర్మమున రుద్రాక్షల స్మరణ, స్తుతి, దర్శన, స్పర్శన, పూజన మరియు ధారణములు విహితములైయున్నవి. పంచాచార పరాయణులు వీటిని తప్పనిసరిగా పాటింతురు. లింగైకపూజా తత్పరులు నిష్టలింగ పూజా సందర్భములలో వీటిని యనునిత్యము ధరించి ధన్యత బడయుచున్నారు. పిండస్థలమును వీడి భక్తాంగమును పొందిన వారు నీ విషయములను గ్రహించి తదనుగుణముగా ధర్మాచరణను జేసి వీరశైవ ధర్మమునుండి రక్షణను పొందవలెను.

**శివంభూయాత్**

## ఆశీర్వచనము : 6

మనుషుని జీవనము యొక్క సుఖదుఃఖములకు అతడు చేయు పుణ్యపాపములే మూలకారణము. మనుజుడు తన దుఃఖములన్నింటిని దూరము చేసికొని సుఖమును పొందవలెనని కోరుకొనును. సదా సుఖముగా నుండుటకై యతడు తన దోషములన్నింటినీ తొలగించుకొని సర్వోత్కృష్టమైన పుణ్యమును పొందవలెను. ఇట్టి స్థితిని సాధించెడి విధివిధానముల నెన్నింటినో ధర్మశాస్త్రములో చూడగలము. వీటిలో రుద్రాక్ష ధారణ యెంతో మహత్వపూర్ణమైనది. ఇంతవరకు జగద్గురువుల వారు పాపక్షయమును గురించి మాత్రమే యుపదేశించిరి. ప్రస్తుతము వారు పుణ్యప్రాప్తికి రుద్రాక్షధారణకును గల అనుబంధము గురించి యుపదేశము నిచ్చుచున్నారు.

## రుద్రాక్షధారణ - పుణ్యప్రాప్తి :

దానములలో గోదానమునకెంతో ప్రాముఖ్యత గలదు. కోటిగోవులను దానము చేసిన యెడల యెట్టి పుణ్యము లభించునో, అట్టి పుణ్యము రుద్రాక్షధారణ వలన లభించునని యుపదేశించిరి. వీరి ఉపదేశమును గనుడి

శ్లో॥ **గవాంకోటి ప్రదానస్య యత్ఫలంభువిలభ్యతే ।**
**తత్ఫలంలభతే మర్త్యో నిత్యం రుద్రాక్ష ధారణాత్ ॥** (సి.శి. 7:62)

గోదానము యొక్క విశిష్ఠతకు గల కారణములను తెలిసికొనినచో రుద్రాక్షధారణ యొక్క మహత్యము సుస్పష్టమగును.

యమలోకపు ద్వారము నందుండెడి వైతరణీ నదిని దాటవలయునని, దూడతో కూడిన కృష్ణవర్ణపు గోవును దానము చేయవలెనని శుద్ధితత్త్వము నందున ప్రతిపాదింపబడినది. ఆ దానసమయమున దాత పఠించవలసిన మంత్రము దిగువన ఇవ్వబడినది.

శ్లో॥ **యమద్వారే మహాఘోరే తప్తా వైతరణీనదీ ।**
**తాంచ తర్తుంద దామ్యేనాం కృష్ణాం వైతరణీం చతాం ॥** (వాచస్పత్యం 4972)

### వైతరణీ నది ఉత్పత్తి మరియు స్వరూపము :

శ్రీ జమదగ్ని మహర్షి, తమ ప్రాయశ్చిత్త వివేకమునందున వైతరణీ నది యొక్క స్వరూపమును ఈ క్రింది విధముగా తెలియజేసిరి.

**శ్లో॥ నదీ వైతరణీ నామ దుర్గంధా రుధిరావహా ।**
**ఉష్ణ తోయా మహావేగా అస్థికేశ తరంగిణీ ॥** (వాచస్పత్యం, పుట 4971)

ఎముకలు మరియు రక్తముతో కూడుకొని, దుర్గంధయుక్తమైనదై, సలసలలాడుచు నతివేగముగా ప్రవహించెడి నీరు గల్గినదై వైతరణీ నది భయంకరముగా గోచరించును. నరక ప్రవేశ ద్వారమున నుండుట చేత, జీవి దీనిని దాటియే తీరవలెను. వాహనాదుల చేత దీని దాటుటకు సాధ్యము కాదనియును, ఈ కారణముననే దానికి వైతరణీ యనెడి నామము గల్గినదని తెలియుచున్నది. "విగతా తరణీర్యత్ర సావైతరణీ" యనెడి వ్యుత్పత్తి మేరకు యీ అర్థము పొసగుచున్నది. "వితరణేన దానేన లంఘ్యతే ఇతి వైతరణీ" యనెడి వ్యుత్పత్తి మేరకు మహోత్కృష్టమైన గోదాన ఫలితము వలననే దీనిని దాటగలము యనెడిది స్థిరపడుచున్నది.

కాళికాపురాణములోని పదునెనిమిదవ అధ్యాయము నందున వైతరణీ నది యొక్క ఉత్పత్తి గురించిన కథ యొకటి కలదు.

శివపత్ని యైన సతీదేవి దక్షయజ్ఞము నందు ప్రాణత్యాగము చేసిన పిదప, వియోగ పరితాపమున శివుడు దుఃఖాశ్రువులను కురిపించ జొచ్చెను. శివుని దుఃఖాశ్రువులు భూమి మీద పడిన యెడల భూమి భస్మమగునని తలచి దేవతలు శనిని యీ క్రింది విధిన ప్రార్థింపజొచ్చిరి.

"ఓ శనీశ్వరుడా ! పూర్వకాలమున ఒక నూరు వర్షముల వరకు వాననీరు భూమి మీద పడకుండగ జేసిన సామర్థ్యము నీది. అప్పుడు అనావృష్టి గల్గెను. ఇప్పుడు శివుని నేత్రముల నుండి వెలువడిన యపారమైన జలరాశిని భూమి మీద పడకుండగ ఆపుజేసి ఇంకింప జేసుకొను సామర్థ్యము నీకు మాత్రమే కలదు. ప్రస్తుతము నీవు ఈ కన్నీటిని భూమి మీద పడకుండగ ఆపివేయవలెను" యని దేవతలు ప్రార్థింపగా, శని వారి కోరికను మన్నించెను. దేవతల మాయాజాలము యొక్క పరిణామముగా, శని శివునికి కనిపించకుండగ, శివుని ప్రక్కనే కూర్చుండి, శివుని అశ్రుజలమును పట్టుకొన దొడిగెను. అపారముగా వచ్చెడి అశ్రుజలమును తనలోన యిమిడ్చు కొనెడి సామర్థ్యమును కోల్పోయి తనలోనున్న జలమును జలధరమనెడి పర్వతము మీద కురిపించెను. జల సముద్రమునకు పడమర దిక్కుననున్న, యీ పర్వతము అశ్రుజలముల నాపికొనలేకపోయెను. పర్వతము చీలిపోయెను ఆ చీలిక నుండి అశ్రుజలము ప్రవహించి సముద్రమును చేరెను. సముద్రము ఉప్పొంగెను. శివుని అశ్రుజలము సముద్రమును భేదించికొని తూర్పునకు ప్రవహింపజొచ్చెను. పర్వతములో నుండి సముద్రములోనికి ప్రవేశించి, అచ్చటి నుండి ముందుకు తరలివెళ్ళినందున అశ్రుజలములోని దాహకశక్తి కొంతవరకు తగ్గిపోయెను. కాని దానిలోని ఉత్పత్తి స్థితి అటులే మిగిలెను. అదియే వైతరణీ నది అయ్యెను. దీనికి రెండు యోజనముల విస్తీర్ణము గలదు. ఇది యమలోకమును చుట్టుముట్టి యుండుటచేత అద్దానికి ఇది కందకము రీతిగా నున్నది. ఎన్నియో క్రూరజంతువులు ఇందులో కూడుకొని యుండుటచేత యిది ఎంతో భయంకరముగా తయారయ్యెను. గోదానమును చేసినవాడు దీనిని సులభముగా దాటగలుగురని శాస్త్రముల యందున వ్రాయబడుట చేత, మనుజుడొక మరణావస్థ సమీపించిన యప్పుడు గోదానమును ప్రదానము చేసెడి సాంప్రదాయము గల్గినది.

## రుద్రాక్ష ధారణ - కోటి గోదాన ఫలము

ఒక్క గోవును దానము చేసినచో ఇంత ఫలముండిన యెడల, కోటి గోవులను దానము చేసిన యెడల యెంత ఫలముండునో ననేది అంచనా వేయగలమే ? అంతఫలము కేవల మొక రుద్రాక్ష ధరించుట చేత గల్గుచున్నదనినచో రుద్రాక్ష ధారణా మహిమను లెక్కించగ నెవ్వరి తరమే ?

**శ్లో॥ దేహాత్మబుద్ధిజం పాపం నగోవధ కోటిభిః ।**
**ఆత్మాహం బుద్ధిజం పుణ్యం న భూతో న భవిష్యతి ॥**

దేహమే నేననెడి భావన చేత కోటి గోవులను చంపిన పాపము లభించును. ఆత్మనే తాను అనెడి భావన చేత గలిగెడి పుణ్యమునకు సాటిలేదని చెప్పబడినది. అట్టి ఎడ, ఆత్మనుండి మొదలుకొని ప్రపంచమంతయును రుద్ర స్వరూపమనెడి తాత్త్విక భావనను మదిలో దాల్చి, ఇట్టి తాత్త్విక రుద్ర దృష్టి చేత నొక తాత్త్విక రుద్రాక్షను ధరించి తత్ తాత్త్విక రుద్రాక్షకు ప్రతీకయగు భౌతిక రుద్రాక్షను ధరించుట వలన కోటిగోవుల దానము చేసిన ఫలము లభించుననెడి విషయములోన సందేహమునకు తావెక్కడిది ?

సందేహము గలవారు తమ సందేహ నివృత్తికై రుద్రాక్ష జాబాలోపనిషత్తులోని యీ క్రింది ప్రమాణమును గనుడి

**శ్లో॥ తద్రుద్రాక్షే శిరసి ధార్యమాణే కోటి గోప్రదాన ఫలం భవతి ॥** (రు.జా. ఉ-3:1)

## రుద్రాక్షధారణ - గంగాస్నాన ఫలము

"గంగా పాప హారతి" అనబడెడి ప్రఖ్యాతోక్తి ప్రకారము, గంగాపాపనాశని యనెడి ప్రఖ్యాతి లభించినది. అయితే గంగాస్నాన నిమిత్తము కాశీ యిత్యాది పుణ్యక్షేత్రములను దర్శించవలెను. తన్నిమిత్తమై యెంతో వ్యయప్రయాసల కోర్వవలెను. అట్టి యవశ్యకత లేకుండగా, ఎవరి యింట్లో వారు కూర్చొని సునాయాసముగా గంగాస్నాన ఫలమును పొందే సామర్థ్యము గంగాస్నానము వలన కలుగునని తెలియవచ్చినది. శ్రీ నీలకంఠశివాచార్యుల వారి ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ మూర్ధ్ని విన్యస్య రుద్రాక్షం యః స్నాతిమతి మాన్నరః ।**
**గంగాస్నాన ఫలం తస్య జాయతే నాత్ర సంశయః ॥** (క్రియాసారము, 10-12, పుట143)

తలమీద రుద్రాక్షను పెట్టుకొని స్నానమాడిన యెడల గంగాస్నానఫలము లభించునని యీ ప్రమాణము వలన తెలియుచున్నది.

## రుద్రాక్షల సంఖ్య - రుద్రాక్ష ధారణ

ఎంత అధికసంఖ్యలో రుద్రాక్షలను ధరిస్తే అంత అధికతరమైన ఫలితముండునని తేలియుచున్నది. రుద్రులు నూరుగురు గలరని శాస్త్రములు చెప్పినవి. అందుచేత 108 రుద్రాక్షలతో చేసిన మాలను శరీరము మీద ధరించుట శ్రేయస్కరము. రుద్రులు వేనకువేలు కలరనే శ్రుతి వాక్యములు గలవు. అందుచేత వేనకువేలు రుద్రాక్షలు ధరించవలెననెడి తలంపు రావచ్చును. అట్టి యెడ రుద్రాక్ష కిరీటమును, రుద్రాక్ష మంటపమును యేర్పాటు చేసికొనవలెను. ఈ విధముగా నధిక సంఖ్యలో రుద్రాక్షల నుపయోగించుకొనుచు అధికమైన లాభమును పొందగలరు.

## రుద్రాక్ష ధారణ - అపమృత్యువు నివారణ

మనుజుని జీవనమున నానావిధములగు విపత్తులు వచ్చుచుండును. "పురాకృతాని పుణ్యాని రక్షంతి" అనెడి సూక్తి ప్రకారము నొక్కొక్కసారి విపత్తులలో నసహాయక స్థితి యేర్పడినప్పుడు మనము చేసిన పుణ్యమే మనలను రక్షించును. రుద్రాక్ష ధారణ చేత విశేష పుణ్యము ప్రాప్తమగును గాన, యిద్దానితో ఎంతటి విపత్తులు వచ్చిననూ వాటిని తప్పించుకొని సురక్షితముగా నుండగలము. ఈ విషయమున నొక కథ కలదు. క్రియాసారములో శ్రీ నీలకంఠ శివాచార్యుల వారు ఈ కథను పొందుపరిచిరి.

ఎంతో పూర్వకాలమున మకరమనెడి రాజ్యముండెను. అందులోన నదే పేరుగల యొక పట్టణముండెను. దానిలో సుగుప్తుడనెడి బ్రాహ్మణుడు నివసించుచుండెను. అతనికి ఐదుగురు కొడుకులుండిరి. వారిలో చిన్నవానికి శాంతుడనెడి పేరుండెను. వీడు పిల్లల జతకు మన్నులో ఆడుకొనుచుండగా నతని కొక రుద్రాక్ష దొరికెను. శాంతునికి దాని మీద నమితమైన యనురాగము గల్గెను. దానినతడు తన మెడలో వేసుకొనెను. అప్పటి నుండి అతని జీవితమునందున గణనీయమైన పరివర్తన వచ్చెను. ఎల్లప్పుడూ అతడు మౌనమును వహించుకొని, నిరంతరము శివధ్యానమునందు మునిగి తేలుచుండెను. ఇతని యిట్టి వ్యవహారము వలన యింటివారికి వేసరిక కలుగజొచ్చెను. అందరూ, ఇతడు లౌకిక జీవనమునకు నుపయుక్తుడు కాడని యెంచి, తిరస్కార భారముతో చూడ దొడంగిరి.

కేరళ దేశమును పాలించెడి రాజొకడుండెను. అతడు, తన ఇష్టదైవమైన కాళికాదేవి ప్రీతికొరకై, ప్రతి సంవత్సరము నొక బ్రాహ్మణ బాలకుని కాళికి బలియిచ్చుచుండెను. బలిని వెతికి కొనితెచ్చుటకై యారాజు తన దూతలను మకర రాజ్యమునకు పంపెను. వారు వెతుకుచూ, వెతుకుచూ, మకర పట్టణమునకు వచ్చిరి. వారు వసుగుప్తుని కలిసి విషయమును నివేదించుకొని యతని సహాయము నర్థించిరి. అప్పుడా బ్రాహ్మణుడు, తన చిన్నకొడుకగుశాంతుడు నిష్ప్రయోజకుడని యెంచి, వానిని ఆ రాజదూతలకు అమ్మివేసెను. ఆ దూతలు శాంతుని వెంబడించుకొని తెచ్చి తమరాజుగారికి నప్పగించిరి.

కాళికాదేవికి శాంతుని బలి యిచ్చెడి ముహూర్తము నిర్ణయింపబడెను. బాలకునికి మంగళస్నానములను చేయించి, మంగళ వస్త్రములను ధరింపజేసి, యితరములగు వివిధాలంకారములను గావించి, దేవీ మందిరమునకు గొనిపోయిరి. పురోహితుడు సంకల్పాదులను చేసి బలి ఇచ్చుటకై బాలకుని మేనిన గల వస్త్రములను విప్పదీసెను. అప్పుడు ఆ బాలకుని మెడలోని రుద్రాక్ష మణి బహిర్గతమయ్యెను. ఆ రుద్రాక్ష కాళిక కంటబడెను. అప్పుడా దేవిలో గల్గిన భావములును ఈ క్రింది విధముగా నుండెను.

**శ్లో॥ దృష్ట్వైవనం శాంతికం కాళీ ధృతరుద్రాక్ష భూషణం ।**
**భీతా ప్రణమ్యమనసా సహసోత్తాయ సా పునః ।**
**హత్వా పురోహితం కోపాత్ ప్రాపౌరక్తం దురాత్మనః ॥** (క్రియాసారము, 11-197,198)

రుద్రాక్షను ధరించిన శాంతుని చూడగనే కాళియంతరంగమున నశాంతి చెలరేగి భీతిని చెందెను. మనస్సులోనే యతనికి ప్రణమిల్లెను. పిదప కోపముతో పురోహితుని చంపి వాని రక్తమును త్రాగెను. పిదప శాంతుని వైపు చూస్తూ "నీకేమి వరము కావలెనో కోరుకొను" మని యనెను.

అప్పుడు శాంతుడు ధీరుడై, ప్రశాంతమైన మనస్సు గలవాడై కాళి కిట్లనెను. "ఓ భగవతీ ! ఈవిధిన నరబలిని కోరుట మానుకొనుము. రాజుగారి కోరికలను తీర్చుము."

అప్పుడా దేవి, రాజు వైపుకు తిరిగి " ఓ రాజా ! రుద్రాక్ష ధారియైన యితడు సాక్షాత్తుగా రుద్రుడై యున్నాడు. ప్రస్తుత మితడు లోకపూజ్యుడు. పాణిగ్రహణ విధితో నీ కూతురు నితనికిచ్చి పెళ్ళిచేసి, యితని యందు నన్య శ్రద్ధగలవాడవగుము. నీ అభీష్టములు నెరవేరగలవు. ఇంతటి మహాత్ముని చంపుటకు సిద్ధపడినందున పురోహితుని చంపివేసితిని ఈతని పరివారములోని వారెల్లరూ మృతులైరి. ఇల్లు కూడా కాలిపోయినది. ఇతనిని అమ్ముకొనిన తల్లిదండ్రులు మరియు సహోదరులు కుష్టువ్యాధికి గురియై అన్నపానీయములకై యలమటించుచున్నారు.

దేవి మాటలను వినిన రాజు, శాంతుని యెడల భయభక్తులను పెంచుకొనెను. తన కూతురినిచ్చి పెళ్ళి చేసెను. రాజ్యపాలనా భారమును శాంతునికి అప్పగించెను. ఒక్క రుద్రాక్షలోనే యింత మహిమ యున్నదా యని యాశ్చర్యమును పొందిన శాంతుడు వేనకువేల సంఖ్యలో రుద్రాక్షలను మేనిన ధరించి శివభక్తిని పెంపొందించుకొని కాలమును గడిపెను.

కొన్ని సంవత్సరముల పిదప ఇతని తల్లిదండ్రులును, సోదరులును బిచ్చమెత్తుచూ, విలపించుచూ నితని రాజ్యమునకు వచ్చిరి. వారిని గుర్తించిన వాడై, వారిని పిలిపించి, మంగళస్నానములను చేయించి వారికి రుద్రాక్షలను గట్టెను. వారు కాలాంతరమునందున కుష్ఠు వ్యాధి నుండి విముక్తులై ఆరోగ్యవంతులై రుద్రాక్షలయందు నిష్ఠగలవారైరి.

ఈ విధముగా రుద్రాక్ష ధారణయందున అపారమైన మహిమ నిండియున్నదని తెలియుచున్నది. ఎవరు ఎంత శ్రద్ధను వహిస్తే వారికి నంత ఫలము లభించగలదని యెరిగి రుద్రాక్షధారణ వలన లబ్ధిని పొందగలరు.

## మరణకాలమునందున ఉపచారము

**శ్లో॥ మృతకాలేతు రుద్రాక్షం నిష్పీడ్య సహవారిణా ।**
**యః పిబేత్ చింతయన్ రుద్రం రుద్రలోకం స గచ్ఛతి ॥** (సి.శి. 7: )

మరణకాలమునందున రుద్రాక్షతో రాపిడి చేసిన నీటిని, రుద్రుని ధ్యానము చేస్తూ త్రాగిన యెడల రుద్రలోకమే ప్రాప్తమగును.

మనుజుని మరణకాలము బహు మహత్వ పూర్ణమైనది. "అంతే యా మతిః సాగతిః" అనెడి సూక్తి ప్రకారము, మనోవృత్తియే, ముందటి గతికి మూలకారణమగుచున్నది. దేహమును త్యజించునప్పుడు, ఎవరు ఏ విధముగా స్మరింతురో, వారా విధముగా సంసారము నందున పునర్జన్మలో నా రూపమును పొందుచున్నారని తెలియుచున్నది. భగవంతుని స్మరిస్తే భగవంతుని సాన్నిధ్యమున నుందురు కదా ! కాని చాలావరకు జనులు, సాంసారిక విషయములనే స్మరిస్తూ మరల సంసారమునే పొందుచున్నారు. ఈ అంశమును స్పష్టపరిచెడి కథ మహాభారతములో నొక కథ కలదు.

జడ భరతుడనెడి రాజు రాజ్యమును త్యజించి సర్వసంగ పరిత్యాగియై తపస్వి వేషమును వేసుకొని అడవికి వెడలి తపస్సు చేసుకొనజొచ్చెను. జీవితము యొక్క చివరికాలముననొక జింకతో స్నేహమును పెంచుకొనెను. మరణ సమయమాసన్నమయ్యెను. భగవన్నామ స్మరణ చేయలేకపోయెను. తాను స్నేహబంధము చేత బంధితుడై యున్నందున, మరణిస్తూ జింకనే స్మరియించెను. తత్ఫలితముగా జడభరతుడు మరుజన్మలో జింకయై జన్మించెను.

ఒకడు ఫోటో దిగవలెనని యెంతో సమయము వెచ్చించి, చక్కగా తయారై స్టూడియోకు పోయెను. అచ్చట, ఫోటోగ్రాఫర్ చెప్పిన యటుల సరిగ్గా కూర్చుండెను. కనురెప్పలను వాల్చకుండగ ఉండెను. ఫోటోగ్రాఫర్ 'రెడీ' అని క్లిక్ కొట్టేటప్పుడు తనకు తెలియకుండగనే కనులను మూసుకొనెను. మరుసటి దినమున వెడలి ఫోటోలను గైకొని చూసెను. అయ్యది గుడ్డివాని ఫోటోవలెనుండెను. గుడ్డివాడు కాకుండిననూ, ఫోటో గుడ్డివానిదగుటకు కారణమేమి ? స్వయం నియంత్రణ లోపించటమే కదా !

జీవనమంతయును మంచిగా గడిపి, మరణ సమయమున భగవన్నామ స్మరణ చేయజాలని వాని గతి యెట్టులగునో జడ భరతుని కథ తెలుపుచున్నది కదా ! ఈ కారణమున, మరణ కాలమాసన్నమైన యపుడు, యైహికములను మరిచిపోయి, 'శివ శివ' యనుచు నుండవలెను. మరణకాలమున, శివత్వమును పొందించెడి శివనామస్మరణ జేయవలెను.

మానవ కోటికి సద్గతిని కల్గించే నుద్దేశ్యముతో శ్రీ భగవత్పాదుల వారు రుద్రాక్షోపచారమును వివరించి బోధించిరి. రుద్రాక్ష తీర్థమును సేవించి, భస్మ రుద్రాక్షలను ధరించి, రుద్ర ధ్యానమును చేస్తూ 'రుద్ర రుద్ర' యనుచు ప్రాణమును వీడినచో సద్గతి కలుగకుండునే ?

కాన మరణావస్థలో నుండిన మనుజునకు స్నానము చేయించి, మేని నిండా భస్మమును పెట్టి, రుద్రాక్ష ధారణ చేయించి రుద్రాక్ష తీర్థమును త్రావించి, శివద్యానమును చేయించవలెను. వానికి సద్గతి కల్గించుటలో మూలపురుషుడుగానై పుణ్యమును గడించవలెను.

రుద్రాక్షోపచారము జీవన కాలమున చేసి కొనిన వానికి అనారోగ్యము కలుగజాలదని గుర్తించవలెను. రుద్రాక్షను ధరించి, రుద్రాక్ష తీర్థమును ప్రతిదినము సేవించిన వానికి రక్తపు పోటు అదుపులోన యుండునని యనుభవజ్ఞులు తెలుపుదురు. రాత్రివేళ, రుద్రాక్షనొక పాత్రలో వేసి, శుద్ధ జలమును నింపి, మూతను పెట్టి, ఉదయమున ద్రాగినచో నిరంతరము పూర్ణారోగ్యము గల్గును.

ఈ విధముగా భౌతిక, మానసిక, నైతిక ఆరోగ్యమును కల్గించి, అంత్యమున సద్గతిని కల్గించెడి రుద్రాక్ష వలన యితోధికమై లాభమును పొందగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

తేది : 4-9-1992

స్థలం : శివానుభవ మంగళ భవనము, షోలాపూరం

## విశేషప్రదీపిక

శ్రీ భగవత్పాదుల వారు గోదానము గురించియును, గోదానఫలమును గురించియును నెంతో వివరముగా చర్చించిరి.

పుణ్యార్జన గురించి యెంతో మంది తహతహలాడుచుందురు. పుణ్యము వలన స్వర్గాది ఫలములను పొందవచ్చుననెడిది సర్వత్ర అంగీకరింపబడినది. మరుజన్మలో పొందవలసిన సుఖములకు నీ జన్మలో జేసెడి పుణ్యము కారణమగునని తెలుపబడినది.

"పుణ్యః పుణ్యేన కర్మణా భవతి" అనెడి వాక్కు ననుసరించి పుణ్యములకు మనము చేసెడి పుణ్యకర్మలే కారణమగుచున్నవి. పరపీడన వలన పాపము, పరోపకారము వలన పుణ్యము వర్ధిల్లును. ఇది సాధారణ సూత్రమైయుండగా, శాస్త్రవిహిత కర్మల నాచరించుట చేత పుణ్యము లభించుననెడిది విశేషమైన సూత్రము. పరపీడన ప్రవృత్తి గల్గిన రాక్షసులు వీటి నాచరించి పుణ్యము నార్జించిరని, పురాణములలో తెలుపబడినది. ఇట్టి కర్మలలో తపస్సు, దానము మొదలైనవి గలవు. దానమునకు నొక ప్రత్యేక స్థానము గలదని తెలియుచున్నది. బలి చక్రవర్తి దాన గుణము వలన తరగని కీర్తిని స్వంతము చేసుకొనెను. భారతములోని దానకర్ణుని గురించి తెలియని దెవ్వరికి ? దానము వలన సద్గతి లభించును.

ఈ కారణమున, యథాశక్తి ప్రతియొక్కరు దానము చేసి పుణ్యము నార్జించ వలెననెడిది విస్తృత ప్రచారములోనున్న యభిప్రాయము. దానము నివ్వబడెడి వస్తుసంచయము గురించి తెల్పెడి యీ క్రింది శ్లోకమును గనుడి.

**శ్లో॥ తురగ శతసహస్రం గోగజానాంచ లక్షం ।**
**కనక రజత పాత్రం మేదినం సాగరాంతం ।**
**విమలకుల వధూనాం కోటికన్యాశ్చ దద్యాత్ ।**
**..... అన్నదానం ప్రదానమ్ ॥**

గజగోతురగ రజత కాంచన భూకన్యాన్నాదులు దానమున నొసంగబడుచున్నవి. గోదానమున కొక విశిష్ఠత గలదని విజ్ఞులు తెలుపుదురు. శ్రీ విద్యా వాచస్పతుల వారు వైతరణీ గురించి తెలుపుతూ గోదాన విశిష్ఠతను తెలిపిరి. గోదానమున కింత ప్రాముఖ్యత యెందులకు వచ్చినదో యెరుగవలసియున్నది.

"గౌమాతా వృషభః పితామే దివం కర్మ జగతీయే ప్రతిష్ఠా" యనెడి శ్రుతి వాక్యానుసారము గోవృషభములు మాతాపితరులుగా నెంచ బడినవి "గావో బంధుర్మనుష్యాణామ్" అనెడి పౌరాణిక వాక్కుననుసరించి, గోవు బంధువనియును భావింపబడుచున్నది. మానవునికీ విధముగా యుపయుక్తమయ్యెడి గోవును దానము చేయుట మంచిదని భావింపబడినది. పూర్వకాలమున రాజులు ఋష్యాదులకు గోవులను నధికముగా దానము చేసెడివారని తెలుపబడినది. పురాణములలో నిట్టికథలను గాంచగలము.

కోటిగోవులను దానము చేసిన యెడల నెట్టి ఫలము లభించునో యట్టి ఫలము రుద్రాక్ష ధారణ వలన లభించునని శ్రీ భగవత్ పాదుల వారు తెలిపిరి. ఇది గమనార్హమైన విషయము. రుద్రజాబాలోపనిషత్తు కూడా నిదే విధముగా తెలుపుచున్నది.

ఈ కారణమున పుణ్యార్జనాసక్తి గలవారు రుద్రాక్షలను తప్పనిసరిగా ధరించవలెను.

ఇచ్చట గమనించవలసిన ధర్మసూక్ష్మ మొకటి గలదు. రుద్రాక్ష ధారణ వలన దానఫలము లభించునని భావించుకొని దాన ధర్మములను వీడుట యుచితమైన విషయముగాదు. వీరశైవ ధర్మము ప్రకారము భక్తుడు దేహమును గురువునకును, ధనాదులను జంగమునికిని యర్పించవలెను. ఈ యుభయ లింగముల సేవలను చేసి కృతార్థత బడయవలెను. ఇచ్చట తెలిసికొనవలసిన విషయమేమనగా రుద్రాక్ష ధారణ యవిస్మరణీయమైనది. ఫలాపేక్షను వీడి దీనిని ధరించి ధన్యతబడయవలెను.

మరణకాలమున శివచింతనలో నుండిన యెడల శివలోకప్రాప్తి గల్గునని తెలుపబడినది. కొన్ని సందర్భములలోన యిది సాధ్యము కాకపోవచ్చును. అట్టి స్థితిలో తులసీ తీర్థము నివ్వవలెననెడి బ్రాహ్మణ సాంప్రదాయ మొకటి ప్రచారమున గలదు. వాస్తవముగా నియ్యది వైష్ణవ సాంప్రదాయమని వీరశైవ విధుల నిశ్చితాభిప్రాయము. శైవ-వీరశైవులు మరణ సమయమున నివ్వవలసిన తీర్థమెట్టిది యనెడి ప్రశ్న గల్గినప్పుడు, శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము ననుసరించ దగినదై యున్నది. రుద్రాక్ష తీర్థమును త్రాగించవలెననియును, దాని వలన రుద్రలోక ప్రాప్తిగల్గుననియును తెలుపబడినది.

ఈ సందర్భమున యొక విషయము మరువరానిదైయున్నది. గురుపాదోదకము, లింగపాదోదకము, జంగమపాదోదకములను, లింగత్రయము యొక్క ప్రసాదములను మరణశయ్యపైనున్న వానికి యిచ్చుట మరువరాదు. వీరశైవ ధర్మమున వీటికి సర్వోత్కృష్టమైన ప్రాముఖ్యత గలదు. యివి లింగాంగ సామరస్యమును గల్గజేయుననుట సదా మనమున దాల్చి రుద్రాక్ష తీర్థముతో పాటుగా లింగత్రయ తీర్థమును కూడా యివ్వవలెననుట మరువక గుర్తించగలము.

## ఆశీర్వచనము : 7

**భస్మోద్ధూలిత సర్వాంగా ధృత రుద్రాక్ష మాలికాః ।**
**యే భవంతి మహాత్మానో రుద్రాస్తే నాత్ర సంశయః ॥** (21)

సర్వాంగముల యందున భస్మమున ఉద్ధూలనము చేసికొనిన వారును, రుద్రాక్షమాలికలను ధరించిన వారును, యగుచు ఏ మహాత్ములుందురో వారు సాక్షాత్తుగా రుద్రులే యగుదురు. సంశయమునకిట స్థానము లేదు.

**నిత్యాని, కామ్యాని, నిమిత్తజాని ।**
**కర్మాణి, సర్వాణి, సదాపికుర్వన్ ॥**
**న భస్మ రుద్రాక్షదారోయది స్యాత్ '**
**ద్విజో న తస్యాస్తి ఫలోప పత్తిః ॥** (22)

ఏ ద్విజుడు ఎప్పుడూ నిత్య నైమిత్తిక మరియు కామ్యాది కర్మలను తప్పక చేయుచుండిననూ, ఒకవేళ భస్మరుద్రాక్షలను ధరించకుండగ ఉండిన యెడల, అతనికి ఆ కర్మల ఫలములు దొరకవు.

**సర్వేషు వర్ణాశ్రమ సంగతేషు ।**
**నిత్యం సదాచార పరాయణేషు ॥**
**శ్రుతి స్మృతిభామిహ చోద్యమానో ।**
**విభూతిరుద్రాక్షధరః సమానః ॥** (23)

బ్రాహ్మణాది వర్ణముల యందునను, బ్రహ్మచర్యాది ఆశ్రమముల యందునను ఉండి, ఎప్పుడూ సదాచార పరాయణులైయుండెడి జనుల యందున ఎవడు విభూతి రుద్రాక్షలను ధరించుకొని యుండునో అతడొక్కడే గౌరవాన్వితుడును, వేదశాస్త్రాదులచే పొగడబడెడి వాడుగను అగుచున్నాడు.

## రుద్రాక్ష ధారణ - కర్మఫలములు

భస్మరుద్రాక్షలు శివుని ప్రియమైన భూషణములు, వీటిని యెవ్వరు సదా దేహము మీద ధరించుకొని యుందురో వారు "తేరుద్రాః " అనెడి శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము ప్రకారము రుద్రులేయగుదురు. "అత్రన సంశయః" అనెడి వాక్కుల ప్రకారము, ఇట సందేహమున కాస్కారము లేదు.

కర్మముల ఆచరణ సందర్భమున కర్త భస్మ రుద్రాక్షలను ధరించకుండా ఉండిన యెడల నా కర్మలు నాశించిన ఫలముల నివ్వజాలవని శ్రీ భగవత్పాదుల వారు బోధించిరి. "తస్య ఫలోపపత్తిర్నాస్తి" అనెడివి శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము. ఈ కారణమున, భస్మరుద్రాక్ష ధారణలు నవిస్మరణీయములైనవి.

పొలమునందున పండిన పంట సురక్షితముగా ఉండవలెననిన, దాని యజమాని పొలము చుట్టూ కంచెను యేర్పాటు చేయించవలెను. నిర్మితమైన కంచె పొలములోని పంటను రక్షించును. వీరశైవుని యిష్టలింగాదుల పూజలు నిచ్చెడి ఫలములు సురక్షితముగా నుండవలెననిన, భస్మరుద్రాక్షలనెడి కంచెవంటి రక్షణ యెంతోనావశ్యకమై యున్నది. ఈ కారణము వలననే వీరశైవ ధర్మము నందున భస్మ రుద్రాక్షలు రక్షా కవచములుగా భావింపబడినవి. అష్టావరణములోనివి కలవు.

పూజాకాలమునందున దిగ్బంధము చేసే సాంప్రదాయము కలదు. అసుర శక్తుల నుండి రక్షణ పొందుటకే యీ విధి చేపట్టబడుచున్నది. ఇట్టి దుష్టాసుర శక్తుల నుండి కాపాడుకొనుటకై భస్మ రుద్రాక్షలనెడి కవచములను ధరించవలెనని, వీరశైవ ధర్మము బోధించుచున్నది. యుద్ధమునందున, యోధుడు కవచమును ధరించియే యుండవలెను. లేని యెడల నతడు అసువులను బాయును. అందువలన, యెల్లప్పుడు వీరశైవుడు భస్మ రుద్రాక్షలను ధరించుకొని యుండవలెను. అప్పుడే అతనికిని, అతని పూజాఫలమునకును రక్షణ చేకూరును.

## రుద్రాక్ష ధారియే శ్రేష్ఠుడు

భారతదేశమున ఆదికాలమునుండియును చాతుర్వర్ణ వ్యవస్థయును, చతురాశ్రమ వ్యవస్థయు కొనసాగుచు వచ్చుచున్నది. వర్ణ చతుష్టయములో నెయ్యది గొప్పది యనెడి ప్రశ్న తలయెత్తును. అట్టి ప్రశ్నయే చతురాశ్రమముల గురించి తలయెత్తును.

శ్రీ రేణుక భగవత్పాదుల వారు **"సర్వేషు వేదాగమ సంగతేషు విభూతి రుద్రాక్ష ధరః సమానః"** అని ఆదేశమును ఇచ్చిరి. విభూత రుద్రాక్షలను ధరించినవాడు, నే వర్ణము వాడైనను, యే యాశ్రమమునకు చెందినవాడైననూ శ్రేష్ఠుడే. జన్మతః యెవ్వడు శ్రేష్ఠుడు కాడనియును, ధర్మాచరణ వలననే శ్రేష్ఠత్వ మబ్బుననియును శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి.

## వర్ణ భేదములోని రహస్యము

"వర్ణాఃస్య బ్రాహ్మణాదయః" అనే శ్లోకములో 'వర్ణ' అనే శబ్దము జాతి వాచకమై యున్నది. గుణ-కర్మల నాధారముగా గొని చాతుర్వర్ణములు వ్యవస్థీకరింప బడినవని గీతాకారుడు తెలియజేసెను. ఇట్టి విభజన వైజ్ఞానిక పరమైనదని తెలియుచున్నది.

మానవుని జీవితములో జ్ఞాన, బల, సహకార మరియు సేవలకు నెంతయో ప్రాముఖ్యత గలదు. ఇవి ప్రముఖమైన రంగములు. జ్ఞానార్జన చేసి అద్దానిని సమాజములో నిర్వహించాక విధిగా ప్రచారము చేసెడి వాడే బ్రాహ్మణుడు. శారీరిక బలమును సంపాదించి, దాని చేత గ్రామ, రాష్ట్ర మరియు దేశములను రక్షించెడి వాడే క్షత్రియుడు. వర్తక వాణిజ్యాదుల చేత సరుకులను సంగ్రహించి అందరకు అందచేసి వారివారి యవసరములు తీర్చెడి వాడే వైశ్యుడు. ఇతడు సహకార భావనకు ప్రతీకగా యుండును. ఉచ్ఛనీచముల భేదముల నరయక, సేవా పరమైన మనోభావనతో శారీరక సేవల నందించువాడే శూద్రుడు.

వీరిలో నెవరు శ్రేష్ఠుడు ? ఎవడు కనిష్ఠుడనే భావము లేర్పడినచో ఘర్షణలు తలయెత్తును. వాస్తవముగా, ఎవ్వరూ కనిష్ఠులు కారు. అందరూ సమానులే. ఇట్టి భావన గల్గినప్పుడే సమాజము అభివృద్ధి పథమున పయనించగలదు.

మన శరీరమున మస్తక, భుజ, ఉదరములును, కాళ్ళు, చేతులును ప్రధానాంగములై యున్నవి. సమాజమనే కాయమునకు బ్రాహ్మణులను మస్తకముగాను, క్షత్రియులను బాహువులుగాను, ఉదరము వైశ్యులుగాను, శూద్రులు కాళ్ళుగాను, ఊహించవచ్చును. వీటిలో మస్తకమే శ్రేష్ఠమైనది, కాళ్ళు కనిష్ఠమైనవని యనుట సమంజసము కానేరదు. కాళ్ళు మస్తకమును మోసికొని విద్యాలయమునకు వేళ్ళకుండినచో విద్యాప్రాప్తియగునే ? ఉదరము వచనప్రక్రియను చేపట్టకుండిన మస్తకాదులకు శక్తిగల్గునే ? యెవ్వడైననూ దండెత్తుకొని వచ్చి మస్తకము మీద దెబ్బలను కొట్టిన యెడల బాహువులు దానిని రక్షించకుండగ యుండిన యది మిగులునే ? ఈ విధిన యెన్నియో ప్రశ్నలు మిగిలిపోవును.

అందుచేత సమాజములోని వర్ణములన్నియూ సమానమే అని భావించుకొనవలెను. అప్పుడే సామాజిక స్వస్థత చేకూరును. ఒకరు యింకొకరిని గౌరవించుకొనవలెను. అనురాగముతో మెలగవలెను.

లోతుగా ఆలోచించిన యెడల ప్రతియొక వ్యక్తియు, నాల్గు వర్ణముల సంయుక్త స్వరూపమని భావించవలసియుండును. బ్రాహ్మణులలో బ్రాహ్మణేతరుల వ్యవహారము కనిపించును. అదే విధముగా ప్రతి వర్ణములోను ఆ వర్ణము కంటెను భిన్నమైన వారి యొక్క వ్యవహారములను గావించగలము.

నేడు సేవా ధర్మమును చేసే బ్రాహ్మణులను, జ్ఞానోపదేశము చేసెడి పాత్రలో బ్రాహ్మణేతరుల నెందరినో చూడగలము. అట్టి యెడ భేదభావమెందుకు అనే ప్రశ్న గల్గును.

ఇంకొక విధముగా చూసిననూ అభేదము సిద్ధించును. ఉదయమున శౌచాదుల చేసుకొనునప్పుడు ఒక వ్యక్తి శూద్రుడగును. వస్తువుల మార్పిడిలో వైశ్యుడగును. ధనాదులను రక్షించుకొనుటలో క్షత్రియుడగును. అధ్యయనార్చనాదుల చేపట్టునప్పుడు బ్రాహ్మణుడగును.

సమాజము అన్ని వర్ణముల వారి మీద ఆధారపడియుండును. నేను గొప్ప నీవు తక్కువయని కలహించుకొనకుండగ సోదర భావముతో మెలగవలెను.

## ఆశ్రమములు - ప్రయోజనము

మన ప్రాచీన మహర్షులు ఆశ్రయములను నాలుగు భాగములుగా విభజించిరి. అవి బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము మరియు సన్యాసము. ఈ విభజన యుందున మనుజుని జీవన క్రమిక యణిగియున్నది. వీటి యందున క్రమముగా విజ్ఞాన, సంతాన, వైరాగ్య మరియు తత్త్వజ్ఞానములు ప్రాప్తమగును. ఈ విషయమును మహాకవి కాళిదాసు ఈ క్రింది విధముగా తెలిపిరి.

**శ్లో॥ శైశవే భ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణాం ।**
**వార్ధకే మునివృత్తినాం యోగేనాంతే తనుత్యజాం ॥** (రఘు వంశము)

మనుజుడు తన యిరువది లేదా యిరువది ఐదు సంవత్సరముల వరకు విద్యార్జన చేస్తూ జ్ఞానమును గడించవలెను. "ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సః" అనెడి యుపనిషదాదేశము ప్రకారము ఇరువదైదు వత్సరముల పిదప సంతాన ప్రాప్తికై గృహస్థా శ్రమమును స్వీకరించవలెను. వ్యక్తికొక సంతానమైన పిదప పిల్లవానికి విద్యాబుద్ధులు నేర్పించి, వివాహమును చేయవలెను. తండ్రి శబ్దాది విషయముల యెడల విముఖతను పొంది, వానప్రస్థ ఆశ్రమము స్వీకరించవలెను. సతీ సమేతుడై అడవిలోకి వెడలి యొక కుటీరము నేర్పాటు చేసికొనవలెను. ఆదర్శప్రాయమైన ఆధ్యాత్మిక జీవనమును కొనసాగించవలెను. చివరన తాను శివయోగాదుల ద్వారా దేహమును త్యజించవలెను.

ఈ విధముగా నాలుగు ఆశ్రమములను స్వీకరించి సావకాశముగా తన జీవనమును రూపించికొనునదే క్రమ వికాసము. దీనినే పిపీలికా మార్గమని యందురు.

ఇంకను, "యదహరేవ విరచేత్ తదహరేవ ప్రవ్రజేత్ గృహాద్వావ నాద్యా" అనెడి ప్రమాణము ప్రకారము ఎప్పుడు వైరాగ్య భావమేర్పడునో అప్పుడు సన్యాసమును స్వీకరించవలెను. గృహస్థా అదే క్రమమును పాటించవలసిన అవసరము లేదు. ఏ ఆశ్రమములోనున్న వాడైననూ, సన్యాసమును నేరుగా తీసుకొనవచ్చును. దీనిని విహంగమ మార్గమని అందురు. మొత్తము మీద ప్రతి యొక్కరు సన్యాస ఆశ్రమమును మరణము కంటెను ముందున స్వీకరించవలెను. అప్పుడే అతనికి మోక్షప్రాప్తి యగును.

ఈ విధముగా జీవనమును నొక క్రమము ప్రకారము గడిపెడివారు, భూతి-రుద్రాక్షలను ధరించవలెనని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిరి. శ్రుతి-స్మృతులకిది సమ్మతమైన విధేయని నిరూపించిరి.

భూతి రుద్రాక్షలు తప్పనిసరిగా ధరించవలెననెడి విషయమును విస్మరించెడి వారి విషయమున ఈ క్రింది ప్రమాణము గమనించదగియున్నది.

**శ్లో॥ న దేహీ యస్య రుద్రాక్షా న త్రిపుండ్రస్య ధారణం ।**
**స్మశానయేవ తద్దేహం తన్ముఖం గిరిగహ్వరం ॥**

ఈ ప్రమాణము ప్రకారము, భూతి రుద్రాక్షలను ధరించని వాని దేహము స్మశానము వంటిది, వాని ముఖము పర్వత గుహవంటిది. అట్టివాడు తిరస్కారమునకు యోగ్యుడగుచున్నాడు. ఈ కారణమున భస్మరుద్రాక్షలు ధరించిన గాని నిత్యనైమిత్తికములు ఫలప్రదములు కాజాలవు. భస్మ-రుద్రాక్షలు ధరించిన వానికివి సులభసాధ్యములు. వీటిని సాధించినవాడు లోక పూజ్యుడగు చున్నాడు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేష ప్రదీపిక:

శ్రీ కాశీ విశ్వారాధ్య జగద్గురు పరంపరానుగత శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు, రుద్రాక్ష ధారణ చేసిన వాడు నుత్తముడని సెలవిచ్చిరి.

భస్మధారణ స్థలమున "యస్త్రిపుండ్ర ధారీ పురుషః స రుద్రః" అనెడి శ్రుతి వాక్యము గురించి తెలిసికొని యుంటిమి. భస్మస్నాన, భస్మోద్ధూళనలు చేసికొని పిదప భస్మత్రిపుండ్రముల ధరించ వలెననెడిది యందరెరిగిన విషయమే. ఈ విధిన భస్మోద్ధూళనల జేసికొని రుద్రాక్షలను ధరించిన వాడు సాక్షాత్తుగా రుద్రుడే యగుచున్నాడని శ్రీ భగవత్పాదుల వారు తెలియజెప్పిరి. వాతూలాగమములోను నీ భావము లనుగాంచగలము. ఈ క్రింది శ్లోకమును గనుడి.

**శ్లో॥ యస్య భస్మ లలాటే స్తి కంఠేలింగమహాత్మ్యకం ।**
**రుద్రాక్ష ధారణం దేహి । సోహం దేవీ నసంశయః ॥**

శ్రీ బసవేశ్వర వారి వాక్కులను నీ విధముగనే యున్నవని తెలిసికొనగలరు. ఈ వచనమును గనుడి.

**శ్లో॥ శ్రీ విభూతి రుద్రాక్షి యిద్దవగ లింగవెంబె ।**
**ఇల్లవర భవి యెంబె ॥**
**కూడల సంగమ దేవా, సద్భక్తర నీ వెంబె ॥** (వ.సం. 451)

దీని యొక్క తెలుగు రూపమును గనుడి

**శ్లో॥ శ్రీ విభూతి రుద్రాలున్నవారిని లింగమందు ।**
**లేని వారిని భవియందు ॥**
**కూడల సంగమదేవా ।**
**సద్భక్తులె నీవందు ॥**

ఇంకను వివరములు గోరువారు బసవేశ్వర గీతామృతమును (317, 320) చూడగలరు.

ఇది యిట్లులుండగా కొందరు కారణాంతరముల వలన రుద్రాక్ష ధారణకు దూరమగుటను గాంచగలము. ఇట్టివారిలో నధిక సంఖ్యాకులు బ్రాహ్మణ వర్గమునకు చెందిన వారుండుట గమనార్హమైన విషయము. శ్రుతి ప్రకారము రుద్రాక్షలు ధరించి కర్మాచరణ చేయవలసియుండగా, వీరు నా విధిన చేయుకుండగ రుద్రాక్షేతరములను ధరించుచున్నారు. రుద్రాక్షలు ధరించకుండగ చేసెడి నిత్యనైమిత్తికాదులు ఫలితముల నివ్వ జాలవనెడిది శ్రుతి సమ్మతమైన యభిప్రాయము. ఈ విషయమును వారి దృష్టి పథమునకు తెచ్చుటకే శ్రీ భగవత్పాదుల వారు నీ యుపదేశమునిచ్చిరేమోయని యనిపించుచున్నది. బ్రాహ్మణులైనను, బ్రాహ్మణేతరులైనను రుద్రాక్షలను ధరించి కామిత ఫలములను పొందవలెననెడిదే గ్రహించవలసిన విషయము.

ఈ యభిప్రాయమును పెడచెవిన పెట్టెడి వారినుద్దేశించి శ్రీ భగవత్పాదులు నొక హెచ్చరికను చేసిరి. అగ్రకులజులైనను, విద్వాంసులైనను, సదాచారపరాయణులైనను రుద్రాక్షను ధరించని యెడల వారి యౌన్నత్యమును కోల్పోవుదురు. రుద్రాక్షలను ధరించెడి వాడు నే వర్గమునకు చెందిన వాడైననూ యుత్తముడేయని చెప్పబడినది. అదే విధముగా విద్యాగంధముగాని, ఆచార సంపత్తి లేనివాడైనను రుద్రాక్షను ధరించిన యెడల నతడు నుత్తమోత్తముడని చెప్పబడినది. ఇట్టి యోచనకు గల కారణమేమిటో గుర్తించవలసియున్నది.

వీరశైవ సైద్ధాంతిక భావనయే యిట్టి యభిప్రాయమునకు మూలమని తెలియుచున్నది. రుద్రాక్ష వలన రక్షణ పొందినవాడు. ఇంద్రియాదులపై విజయమును సాధించగలడు. క్రోధకామాదులను దరిచేరనివ్వక జీవించగలడు. క్రమక్రమముగా లోకోత్తరుడుగా పరిణామమును పొందగలడు.

భక్తుడు తెలిసికొనవలసిన దేమనగా నెట్టి సందర్భములోను రుద్రాక్ష ధారణను విస్మరించవలదు. వీరశైవ ధర్మమునకు కాయతుల్యమైన యష్టావరణములలో నొకటగు రుద్రాక్షను నిరంతరము ధరించి రుద్రత్వమును పొందుట కొరకు కృషి చేయవలెను.

## ఉపసంహారము

ఇంతవరకు శ్రీ సిద్ధాంత శిఖామణిలోని భక్తిస్థలాంతర్గతమగు రుద్రాక్ష ధారణ స్థలము గూర్చి కూలంకషముగా తెలిసికొంటిమి. ప్రస్తుతము రుద్రాక్ష యనెడి పదము యొక్క తాత్వికార్థమును మరియు దాని ధారణ విషయములోగల రహస్యార్థమును గూర్చి తెలిసికొందుము.

వీరశైవ సిద్ధాంతములోని అష్టావరణములను, అంతరంగపు అష్టావరణములు మరియు బహిరంగపు అష్టావరణములని రెండు విధములుగా విభజింపవచ్చును. శరీరముతో సంబంధము గల్గినవి బహిరంగపు అష్టావరణములు. అంతరంగములోని సూక్ష్మ శరీరముతో సంబంధము గల్గినవి అంతరంగపు అష్టావరణము లనబడుచున్నవి.

## అంతరంగపు రుద్రాక్ష : రుద్ర దృష్టి

ఇంతవరకు చర్చించిన రుద్రాక్షల విషయము స్థూల శరీరమునకు సంబంధము గలవియైనందున యవి బహిరంగపు అష్టావరణములోనివి. యంతర్గతమై యుండును. అయితే, అంతరంగమున ధరించెడి రుద్రాక్ష యెట్టిది యనెడి సందేహము కలుగును. రుద్ర దృష్టిని యలవరచుకొనుటయే అంతరంగపు రుద్రాక్షయగును.

రుద్రదృష్టియనగానేమియో తెలిసికొనుటకు ముందుగా సమదృష్టిని గూర్చి తెలిసికొనవలయును. పండితుడు సమదృష్టి గల్గియుండవలెనని గీతాకారుడు చెప్పియుండెను. ఈ శ్లోకమును కనుడి :

**శ్లో॥ విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని ।**
**శుని చైవ శ్వపా కేచపండితాః సమదర్శినః ॥** (గీతా 5-18)

పండితుడనేవాడు బ్రాహ్మణుడు మొదలుకొని అంత్యజుని వరకు మరియు గోవును మొదలుకొని కుక్క వరకు ఎల్ల ప్రాణులను సమదృష్టితో చూచెడివాడు. భేదభావములను పాటించనివాడు. రుద్రదృష్టి దీనికంటెను భిన్నమైనది. ప్రతిజీవిలోను రుద్రుడున్నాడనియు తెలిసికొని సకల ప్రాణుల యెడ ప్రేమానురాగములను కల్గియుండెడి విశాల దృష్టియే రుద్రదృష్టి. ఇట్టి ఉదాత్తమైన దివ్యమైన దృష్టిని యలవరచుకొనుటయే అంతరంగ రుద్రాక్ష ధారణము.

స్థూల శరీరము మీద అనేకమైన రుద్రాక్ష మాలలను ధరించినటులనే, ప్రతిజీవిలోను రుద్రుని సాక్షాత్కరించుకొనెడి భావనను కల్గియుండుటయే ముఖ్యమైనది. "యత్ర యత్ర మనోయాతి తత్రశివదర్శనం", యనెడి శైవోక్తి ప్రకారము ప్రతిజీవిలో శివుడున్నాడనునది గట్టిగా నమ్మవలెను. ఇట్టి దృష్టి గలవాడు సకల దోషముల నుండి విముక్తుడై, సద్యోముక్తుడు కాగల అర్హతపొందును. శ్రీ గురుసిద్ధ లింగేశ్వరులు యీ విషయమున నొకవచనమును వ్రాసిరి.

**శ్లో॥ తత్త్వ చింతామణి గళెంబ రుద్రాక్షిగళ ।**
**భక్తి భావదల్లి సర్తగొళిసి**
**యుక్తి విధాన విడదుధరిసి**
**సద్యోముక్త నాదెనయ్య**
**మహాలింగ గురు శివసిద్ధేశ్వర ప్రభువే**

దీని యొక్క తెలుగురూపము గనుడు

**శ్లో॥ తత్త్వ చింతామణులనెడి రుద్రాక్షల ।**
**భక్తి భావమునందు సరముగజేసి ।**
**యుక్తి విధానమును బట్టి ధరించి**
**సద్యోముక్తుని నైతినయ్యా**
**మహాలింగ గురుశివ సిద్దేశ్వర ప్రభువా ॥**

ఈ వచనములో, వచనకారుడు తాత్త్విక రుద్రాక్షల మహత్త్వమును తెలియజెప్పిరి. మనము బాహ్యమునందు ధరించెడి రుద్రాక్షలు, అంతరంగ మందుండు తాత్త్విక రుద్రాక్షలకు సంకేతములుగా నుండును. ఈ రెండు రకముల రుద్రాక్షలను ధరించిన వీరశైవుడు, తన యొక్క ప్రవర్తనను మార్చుకొనవలెను. బాహ్యాపరమైన రుద్రాక్షలను ధరించి, అంతరంగమున మలిన భావములున్న యెడల లాభముండదని గ్రహించవలయును. ఇంకోవిధముగా చెప్పవలెననిన, బసవేశ్వరాదులు సూచించిన విధముగా అంతరంగ శుద్ధిని సాధించి, బహిరంగమున రుద్రాక్షలను ధరించిన యెడల సత్ఫలితములుండును. ముంజేతికి రుద్రాక్షను ధరించిన యెడల అన్యులకు తాను యివ్వకూడదు, అన్యుల నుండి తాను పొందకూడదు యనెడి భావన కల్గి యుండవలెను. ఇచ్చట అన్యులనగా భస్మరుద్రాక్షలకును, ఇష్టలింగ ధారణకును, దూరమై సంసారమున చరించెడివారు. లింగధారియైన వీరశైవుడు వీరశైవులతో మాత్రమే యిచ్చిపుచ్చుకోవడము చేయవలెను. బాహ్యులయందు రుద్రాక్షలను ధరించిన పిదప, పరస్త్రీలను ఆలింగనము చేసుకొనరాదు. వేరే విధముగా చూచినయెడల, శీలవంతుడై, తన శీలమును తాను నిరంతరము కాపాడుకొనుచుండవలెను. రుద్రాక్షలను కుండలము ధరించినవాడు గురునిందను, వీరశైవ శాస్త్రముల నిందను మరియు జంగమనిందను, శివనిందను వినడము చేయరాదు. గొంతున రుద్రాక్షను ధరించిన పిదప ఆ మెడను గురులింగజంగముల ముందు మాత్రమే వంచవలెను. కాని పరదైవములకు మ్రొక్కుటకు వంచరాదు. ఈ రీతిగా వీరశైవుడు చరిత్రసహితుడై, యుండవలెనే కాని, చరిత్రహీనుడు కారాదు. అసుర శక్తులను దూరముజేసికొని దైవశక్తులను కూడదీసికొని యుండుటకు సంకేతమే, మనము బాహ్యమున ధరించెడి రుద్రాక్షల నిగ్రహించవలయును.

భస్మ, రుద్రాక్ష ధారణవలన పంచాక్షరి జపము వలన, పాపములు నశించునని శాస్త్రములందు వ్రాయబడినది గనుక, వాటిని ధరించుకొని పంచాక్షరిని జపిస్తూ, దోషములకు బాల్పడిన యెడల తప్పులేదని భావించుట శుద్ధ అవివేకము. ఈ రుద్రచిహ్నములు, పాపపు పనులు చేయుటకు అనుమతి పత్రములుగా భావించకూడదు.

తెలిసియో, తెలియకయో లేదా పరిస్థితుల ప్రభావము వలన, విధిలేక దోషములు చేసినవారికి, ఈ రుద్ర చిహ్నములు, దోష పరిహారమును సాధించిపెట్టగలవు. అదియును పశ్చాత్తాప పరితప్తమానసులై యుండి, ఆ తప్పులను మరొకసారి చేయరాదను దృఢ సంకల్పము కలవారికి మాత్రమే వీటి వలన విముక్తి లభించును. మరొక విషయమున గమనించవలసియున్నది. కేవలము ఆడంభరమును చాటుకొనుటకై ఈ రుద్రచిహ్నములను ధరించరాదని ప్రఖ్యాత వచనకారుడు, అంబిగ చౌడయ్యగారు ప్రకటించిరి. వారి వచనమును చూడుడి :

**శ్లో॥ విభూతి యనిట్టు రుద్రాక్షయం ధరిసి పంచాక్షరియ జపిసి,**
**కృతార్థరాదెవెంబ, పంచమహాపాతకరు నీవు కేళిరో,**
**ఆదెంతేం దొడె – విభూతియనిట్టు విశ్వాస విల్లవాగి**
**రుద్రాక్షయ ధరిసి రుద్ర గణంగళ నరియ రాగి**
**పంచాక్షరియ జపిసి పంచమహా పాతక బిడ రాగి ॥**

దీని తెలుగు రూపమును గ్రహించుడు

**విభూతిని పెట్టి రుద్రాక్షను గట్టి, పంచాక్షరిని జపించి కృతార్థుల మనెడి పంచమహాపాతకులు వీరు, వినుడో అది యెట్టులనిన – విభూతిని పెట్టి, విశ్వాసములేదు గాన రుద్రాక్షను గట్టి రుద్రగణముల నరయరు గాన పంచాక్షరిని జపియించి, పంచమహాపాతకముల విడరు గాన.**

చౌడయ్యగారు వచించిన ప్రకారము శివుని యందు అచంచలమైన విశ్వాసము కల్గి, నిరాకారుడైన శివుని, నిజరూపమే, గురులింగ, జంగమ, గణములని యెరిగి, పాపచింతన వీడి పాపకార్యములకు దూరముగానుండెడివాడు రుద్రాక్షలను ధరించిన యెడల యుక్తముగా నుండును.

ఢాంబిక రీతులను నిరసిస్తూ ఇతర శరణులు కూడా వచనములను వ్రాసిరి. దేవరదాసిమయ్య వంటివారు, బహిర్వేశమును నిరసిస్తూ మాటలాడిన ప్రకారము, నీతి గల్గి, మసలుకొను వారే నిజమైన రుద్రాక్షధారులని తెల్పిరి. అదే విధముగా, భక్తి తెరగును యెరిగి, మతిమరపును గడిచి, మరువక భక్తిమార్గ సత్క్రియలనాచరించువాడే నిజమైన రుద్రాక్ష దారియని నొక్కి చెప్పిరి.

ఈ విధముగా రుద్రాక్ష ధారణ మర్మము నెరిగి, అంతరంగమున భావపరమైన రుద్రాక్షను బహిరంగమున బహువిధములైన రుద్రాక్షలను ధరించుకొని ఐహిక, ఆముష్మిక ఫలములను పొందవలెను.

## రుద్రాక్షధారణ దేహ ఆరోగ్యము

ప్రపంచములోనున్న ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక ప్రగతితోబాటుగా, ఆరోగ్యప్రాప్తి కూడా అత్యంత ఆవశ్యకము. శరీరము ఆరోగ్యవంతముగా నున్నప్పుడే సకలకార్యములు సక్రమముగా జరుగును. ఇతి ఆధ్యాత్మిక కార్యక్రమములకు కూడా వర్తించును.

రుద్రాక్షకు ఓషధీపరమైన గుణములున్నవని ఆయుర్వేద వైద్యులు తెలిపిరి. శరీరమునకు సదా రుద్రాక్ష స్పర్శయున్న యెడల, రక్తపుపోటు, గుండెదడ మొదలగునవి సహజముగానే నివారింపబడును. నేటి వైజ్ఞానికులు కూడా యీ విషయమును క్రమేపి అంగీకరించుచున్నారు.

రుద్రాక్ష యొక్క వైజ్ఞానికపరమైన లాభముల నెరిగి పూర్వోక్తములైన (దీర్ఘ) రోగములకు పరిష్కారములు కనుగొనుట ఎంతో అవసరమని అన్ని వర్గముల వారు గుర్తించిరి. వారివారి మత విశ్వాసములతో సంబంధము లేకుండ, స్త్రీలును, పురుషులును, ధనికులు, పేదవారు, రుద్రాక్షలను ధరించుట గమనించుచున్నాము. దేశవిదేశములలో కూడా, వీటి ధారణ పై మక్కువ పెరుగుచుండుట గాంచగలము. ఈ కారణము వలన రుద్రాక్షల కొనుగోలు వెల ఆకాశము నంటుచున్నది. ఈ నేపథ్యములో సామాన్యులకు రుద్రాక్షలు అందుబాటులో లేకుండ పోవుచున్నవి. ఎంతో బహుళముగా లభించెడి పంచముఖ రుద్రాక్షలు కూడా లభ్యము కావడములేదు. ఈ కారణమును ఆసరాగా తీసుకొని, నకిలి రుద్రాక్షలు అమ్మబడుచున్నవి. వీరశైవులు తగు జాగ్రత్తను వహించి, కనీసము ఒక్క రుద్రాక్షనైనను ధరించుట విధిగా చేయవలెను. ఇష్టలింగ ధారణకై ఉపయోగించెడి శివ సూత్రమున్‌దు, ఒక రుద్రాక్షను చేర్చుకొనుట శ్రేయస్కరము.

## సకల రోగోపచారములకు రుద్రాక్షలు

మన దేశములో, అనేక రోగముల నివారణకై రుద్రాక్షల నుపయోగించెడి వైద్యులెందరో గలరు. ఈ విషయమును ఎంతో పరిశోధన సల్పిఆయుర్వేద విద్యలో, విశారదులైన లింగశ్రీ షటస్థల బ్రహ్మగురుదేవ శివాచార్య, హీరేమఠ చిక్కమన్నూరు వారు తెల్పిన ఉపచారములు గమనించదగినవై యున్నవి. రుద్రాక్షలను నీటిలో తడిపి, నూరి, దానికి సైందవలవణము చేర్చి, నాలుకపై లేపనము చేసిన యెడల నోరు పగులుడు, నోటి దుర్వాసన మొదలగునవి దూరమగును. కపజ్వరము వచ్చినవారు రుద్రాక్షలను నీటిలో గంధమును దీసి, దానికి తేనె, నెయ్యి కల్పి సేవించిన యెడల కఫ ప్రకోపము యొక్క భయముండదు. ఈ విధమూగా, రుద్రాక్షను ఎన్నో విధములుగా, ఉపయోగించవచ్చునని శివతత్త్వ దర్శనమనబడే గ్రంథములో వ్రాయబడినది. నైసర్గికమైన ఓషధ గుణములు గల రుద్రాక్షవంటి వాటిని గుర్తించక ఆధునిక సమాజము ఎంతయో నష్టపోవుచున్నది. తగు విజ్ఞానమును యీ విషయమున సముపార్జించుకొని, అన్ని విధములుగా రుద్రాక్ష ప్రయోజనమును పొందుటకు ప్రతి ఒక్కరు ప్రయత్నించవలెను.

ఈ రుద్రాక్షల వలన వీరశైవులకే కాకుండ, వీరశైవేతరులు కూడా ఇతోధికమైన లాభమును పొందవచ్చును. ఈ విషయమై మిగతా మతస్థులకు వీరశైవులు ప్రేరకులుగా మెలగవలసిన అవసరము కలదు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు నీ యుపసంహారమునందున కొన్ని కీలకమైన అంశములను గురించి ప్రస్తావించిరి. ఇవి నేటి కాలమునకు సరిపడియుండి విజ్ఞాన దాయకమైయున్నవి.

ఇంతవరకు రుద్రాక్షకు సంబంధించినవగు నెన్నియో అంశములు చర్చింపబడినవి. ఇవన్నియును స్థూల శరీరమునకే చెందినవై యున్నందున సూక్ష్మ శరీరమునకు దాల్చెడి రుద్రాక్ష గురించి శ్రీవారు వివరించిరి.

అంతర్లింగ ధారణ, భస్మజ్యోతి ధారణలను సూచించిన శ్రుతి, అంతర్ రుద్రాక్ష ధారణ కూడా విధించినది. చరాచర జగత్తులోని ప్రతి అంశములోను రుద్రుడు గలడనెడి భావము వహించి వాటి యెడల యనురాగ భావమును దాల్చుటయే యంతర్ రుద్రాక్ష ధారణయని తెలియజెప్పబడినది. ఇట్టి భావన వలన భూతదయ, అహింస, పరోపకారము వంటి యుదాత్తమైన విలువలకు ప్రాముఖ్యత లభించునని గుర్తించవలెను. పగ, ద్వేషము, ఈర్ష్య, అసూయ అసహనము వంటి హీనభావములు తొలగిపోవును. భక్త స్థలమునందలి సాధకుడీ విషయమును గుర్తించవలెను. తదనుగుణముగా ప్రవర్తించవలెను.

ఈ గుణములు మానవతా విలువలను పెంపొందించునట్లు చేయును. అయితే, మానవతా విలువలతో బాటుగా శైవీ సంపదను కూడా పెంపొందించుకొనవలెను. వివిధాంగములకు రుద్రాక్షలను ధరింపజేయునప్పుడు ఆయా అంగములను లింగైకనిష్ఠా పరతంత్రత వైపు మళ్ళించవలెను. కర్మేంద్రియముల వలన చేసెడి కర్మలలోను, జ్ఞానేంద్రియములు చేసెడి క్రియలలోను సాధ్యమైనంత మేరకు శివోన్ముఖత సాధించవలెను. బహిరంగమును రుద్రాక్ష ధారణకు నంకితము చేయునటులనే, మనోబుద్ధ్యాహంకారములను రుద్రమయము చేయవలెను.

రుద్రాక్ష ధారణ వలన పంచాచారముల పాలన బలపడవలెను. ఆచార సంపత్తి వలన భక్తిపరమైన ఐశ్వర్యము అభివృద్ధి చెంది గురులింగ జంగములు ప్రసన్నులు కాగలరు. ఇట్టి ప్రసన్నత సాధించినవాడు క్రమక్రమముగా మహేశ్వర స్థలము దిశలో పయనించును. అట్టి పయనము లింగాంగ సామరస్యమునకు దోహదము చేయుననెడి విషయమును సంస్మరించికొనవలెను.

# అష్టమ పరిచ్ఛేదము

## పంచాక్షర జపస్థలము

### ఆశీర్వచనము - 1

**శ్లో॥ ధృత శ్రీ భూతి రుద్రాక్షః ప్రయతోలింగ ధారకః ।**
**జపేత్ పంచాక్షరీ విద్యాం శివతత్త్వప్రబోధినీమ్ ॥** (1)

మంగళకరులూ, సాంప్రదాయికమైన సంస్కరణ గల్గినవారును భూతి రుద్రాక్షధారులు మరియు లింగధారులును అగు పవిత్ర భక్తులు పరశివతత్త్వమును ప్రకాశింప జేసెడి పంచాక్షరీ మహామంత్రమును జపించవలెను.

**శ్లో॥ శివ తత్త్వాత్ పరం నాస్తియథాతత్త్వాంతరం మహత్ ।**
**తథా పంచాక్షరీ మంత్రాన్నాస్తి మంత్రాంతరం మహత్ ॥** (2)

ఏ విధముగానైతే శివతత్త్వము కంటెను మహత్తరమైన తత్త్వము మరేదియును లేదో, అదే విధముగా పంచాక్షరీ మహా మంత్రము కంటెను ఘనమైన మంత్రమేదియును లేదు.

**శ్లో॥ జ్ఞాతే పంచాక్షరీమంత్రే కిం వా మంత్రాంతరై ఫలం ।**
**జ్ఞాతే శివే జగన్మూలే కిం ఫలం దేవతాంతరైః ॥** (3)

జగత్తుకు మూల కారణమైన శివుని గూర్చి తెలిసికొనిన పిదప వేరే దైవము గూర్చి తెలుసుకొనెడి యావశ్యకత యుండదు. అదే విధిన పంచాక్షరీ మహా మంత్రము గురించి తెలిసికొనిన పిదప వేరే మంత్రముల గురించి తెలిసికొన వలసిన యావశ్యకత యుండదు.

ఇష్టలింగమును, భూతి రుద్రాక్షలను సదా ధరించెడి వీరశైవునికి శివత్వము సిద్ధించుటకై పంచాక్షరీ మంత్రమును జపించవలెను. ఈ విషయమును లోకమున కెరింగించుటకై శ్రీ భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షికి పంచాక్షరీ మంత్రము యొక్క మహిమను మరియు జప విధానమును "పంచాక్షరీ జప స్థలము"న నిరూపించిరి.

వీరశైవ సిద్ధాంతము ప్రకారముగా ఈ జగత్తు తత్త్వాత్మకై యున్నది. ఈ తత్త్వములు ముప్పదియారు విధములుగా నున్నవి. వీటిలో శివతత్త్వము మొదటిది కాగా భూమి తత్త్వము చివరిది. భూమి మొదలుకొని శివుని వరకుగల తత్త్వములలో శివుడే విధముగా శ్రేష్ఠమైనవాడో, అదే విధముగా, మంత్రములన్నింటి లోను పంచాక్షరి శ్రేష్ఠమైనదైయున్నది.

శివుని సహస్ర నామములలో "శివ" అనెడిది మంగళకరము మరియు శ్రేష్ఠము అయియున్నది. శివనామము నాలుగు వేదముల యొక్క సార్వస్వమని తెలిపెడి యీ క్రింది పురాణోక్తిని గనుడి

**శ్లో॥ విద్యాసు శ్రుతిరుత్కృష్టా రుద్రై కాదశనీ శ్రుతౌ ।**
**తత్ర పంచాక్షరీ తస్యాం శివఇత్యక్షర ద్వయం ॥** (4)

ఈ ప్రమాణము తాత్పర్యమేమనగా పదునెనిమిది విద్యలలో శ్రుతియును, శ్రుతులయందున శ్రీ రుద్రము, రుద్రమున 8వ అనువాకము, దీనిలో "ఓం నమఃశివాయ" యనెడి మంత్రము, దీనిలో శివ యనెడి రెండక్షరములు సర్వోత్కృష్ఠమైనవి. ఈ విధముగా, 'శివ' యనెడి యక్షర ద్వయము. వేదసార సర్వస్వమైయున్నదని గ్రహించవలెను.

'శివ' అనే పదమును విభజించిన యెడల (శ్ + ఇ = శి , వ్ + అ = వ) రెండు వ్యంజనములుగను రెండు స్వరములుగాను విడిపోవును. వీటిలోని 'అ' అనెడి అక్షరము నుండియే ఋక్సామ వేదములు ప్రారంభమగుచున్నవి. 'ఇ' నుండి యజుర్వేదము ప్రారంభమగుచున్నది. 'శ్' నుండి అథర్వణ వేదము ప్రారంభమగుచున్నది. ఈ ప్రకారముగా 'శి' అనే అక్షరములో యజుర్వేదా ధారణ వేదముల సారము ఇమిడియున్నది.

'వ' అనెడి యక్షరములో వ్యాకరణ శాస్త్రసారము ఇమిడియున్నదని తెలియుచున్నది

'శివ' అనెడి శబ్దములో వేదవేదాంగముల సారము ఇమిడి యున్నదని తేలినది. ఇవి పంచాక్షరీ మహామంత్రమున సన్నిహితములై యుండి యున్నందున, పంచాక్షరీ సర్వోత్కృష్టమైన మంత్రమై విరాజిల్లుచున్నది.

మన సంస్కృతిలో త్రిమూర్త్యుపాసన యెంతోకాలము నుండియును కొనసాగుచున్నది. తత్త్వ జిజ్ఞాస గలవారు, త్రిమూర్తులలోని యొక్కొక్కరి పురాణములలో ముప్పదిమూడు కోట్ల దేవతలు నుపాస్యులని తెలుపబడినది. శాక్తేయ, సౌర, వైనాయక సాంప్రదాయికులు ఆయా సాంప్రదాయములను గూర్చి తెలిసికొనుటకును, ఆయా దేవతామూర్తుల తత్త్వము నెరుంగుటకై కృషి చేయుచుందురు.

శివతత్త్వము నెరింగినవాడు మరే తత్త్వము గూర్చి తెలిసికొనవలసిన పనిలేదు. దీనికొక కారణము గలదు. విష్ణ్వాది దేవతలు మాయాధీనులై మలత్రయమును పొందియుందురు. వీరికంటెను భిన్నముగా శివుడు నిర్మలుడు, నిత్యుడు, మాయను తన వశమున నుంచుకొనెడివాడు. శివతత్త్వము తెలిసికొనినవాడు నిర్మలుడైయుండును. అట్టి వానికి మలయుతులగు దేవతల తత్త్వము యొక్క యవశ్యకత ఉండదు.

ఏ విధముగా శివతత్త్వము నెరిగినవాడు వేరే తత్త్వము గురించి తెలిసికొనెడి యావకశ్యత యుండదో అదే విధిన పంచాక్షరీ మంత్రము గూర్చి తెలిసికొనిన వానికి వేరే మంత్రముల తత్త్వముల పరిజ్ఞానముతో పనిలేదు. ఇది శ్రీ పూజ్యపాదులు స్పష్టపరచిన విషయములోని సారాంశము. ఈ విషయము నెరిగి పాఠకులు తమరి యపోహలను దూరము చేసుకొనగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు పంచాక్షరీ మంత్రము యొక్క గొప్పతనము గురించి వివరించిరి.

శివతత్త్వమెంతో నిగూఢమైనది. అజ్ఞులకది వేద్యము కాదు. విజ్ఞులకైననూ నయ్యది విశదము కాదు. చతుర్దశ భువనములకు కారణభూతమై యుండెడి శివుని తత్త్వము నెరుగుటెటుల యనెడి ప్రశ్న యుదయించును.

ప్రకృతి, పురుషుడు మరియు పరశివుడు ననెడివి యెట్టివి, వాటి మధ్యగల సంబంధమెట్టిది మొదలగు నంశములను నెరుగలేని మానవుడు తికమకకు గురియగుచున్నాడు. వాస్తవమును నవాస్తవముగను, నవాస్తవమును వాస్తవముగాను చూచెడి స్థితిలోనున్నాడు. ద్వైతాద్వైతాది సిద్ధాంతములు శివతత్త్వములు నెరింగింప జాలవని వేదాంత విధుల యభిప్రాయము.

ఎరుగని యంశము నెరుగుటకు నభిలాష గలవాడు విద్యను నభ్యసించుటకు కృషి చేయును. భౌతిక సంపద గురించి తెలిసికొన దలచినవాడు భౌతికశాస్త్రము నెరుగుటకై విద్యల నభ్యసించవలెను. ఇట్టి విద్యలలో పంచాక్షరీ యనెడి విద్య మహోత్కృష్టమైనదని శ్రీ భగవత్పాదుల వారు నాదేశించిరి.

శివునికిని శివమంత్రమునకున భేదము ప్రకటింపబడినది. ఈ లింగపురాణోక్తిని గనుడి

శ్లో॥ **అగ్నయే రుద్రరూపాయ రుద్రాణాం పతయే నమః ।**
**శివాయ శివమంత్రాయ సద్యోజాతాయ వేధసే ॥** (లింగ. పు. అ. 8)

విద్యకును పరశివునికి నభేదము చూపెడి యీ క్రింది శ్లోకమున గనుడి

శ్లో॥ **ఏకాక్షరాయ రుద్రాయ అకారాత్మరూపిణే ।**
**అకారాయాది దేవాయ విద్యా దేవాయ వైనమః ॥**
**తృతీయాయ మకారాయ శివాయ పరమాత్మనే ।**
**సోమసూర్యాగ్ని వర్ణాయ యజమానాయ వైనమః ॥** (లింగ.పు. అ.8)

"పంచాక్షరికిని, శివునికి యభేదము ప్రతిపాదించినందున విద్యా దేహి" యనెడి శివుని లక్షణము పంచాక్షరి యొక్క లక్షణమగు చున్నది. పంచాక్షరి సకల విద్యలకు నెలవని గుర్తించవలెను. భక్తి శ్రద్ధలతో పంచాక్షరిని జపించెడి వానికి విద్యాభ్యాసము సులభతరమగునని భావించవలెను. "శివ ఏవ కేవలః", "శివమద్వైతం చతుర్థం", "శివ ఏకోధ్యేయః", ఇత్యాది శ్రుతి వాక్యములును, "న చాకస్య కశ్చిజ్జనితా న చాకధిపః", "న తత్సమ శ్చాభ్యధికశ్చ దృశ్యతే" అనెడి వాక్కులును శివాధికృతను తెలుపుచున్నది. అదే విధిన శివునితో యభేదము గల్గిన పంచాక్షరియును మంత్రాధికృతను సంతరించు కొనునని గుర్తించగలరు. భక్తస్థలములోని వాడు నెట్టి సందర్భములోను, పంచాక్షరిని విడిచి ఇతర మంత్రముల నాశ్రయించవలదనెడిది శ్రీ భగవత్పాదుల వారి సందేశమని గుర్తించవలెను.

## ఆశీర్వచనము - 2

**శ్లో॥ సప్త కోటీషు మంత్రేషు మంత్రః పంచాక్షరోమహాన్ ।**
**బ్రహ్మ విష్ణ్వాది దేవేషు యదా శంబుర్మహత్తరః ॥** (8-4)

బ్రహ్మ విష్ణువు మొదలైన దేవతలయందు శివుడు సర్వోత్తముడుగా నుండునటులే, ఏడుకోట్ల మంత్రములయందు పంచాక్షరి మహామంత్రము, మంత్ర రాజమైయున్నది.

**శ్లో॥ అశేష జగతాం హేతుః పరమాత్మ మహేశ్వరః ।**
**తస్య వాచకమంత్రోయం సర్వమంత్రైక కారణం ॥** (8-5)

సకల బ్రహ్మాండముల వుత్పత్తి స్థితి మరియు లయలకు శివుడు మూలకారణమై యున్నటులే, ఆతని వాచకమైన, యీ పంచాక్షరి మహామంత్రము, సకల మంత్రములకు మూలకారణమైయున్నది.

**శ్లో॥ తథ్యాభిదాన మంత్రో న యమభిధేయశ్చ స స్మృతః ।**
**అభిదానభి దేయత్వాత్ మంత్రాత్ సిద్ధః పరంశివః ॥** (8-6)

పంచాక్షర మహామంత్రము శివుని పిలిచెడి అభిదానమైయున్నది అనగా దీనిచేత శివుడు పిలువబడుచున్నాడు. ఈ కారణము వలన శివుడు అభిదేయుడు ఈ విధముగా మంత్రము మరియు శివులయందు అభిదాన అభిధేయ భావములుండుటచేత యీ మంత్రము ద్వారానే పరమశివుడు సాక్షాత్కారమవుచున్నాడు.

**శ్లో॥ నమః శబ్దం వదేత్పూర్వం శివాయేతి తతః పరం ।**
**మంత్రః పంచాక్షరోహ్యేషః సర్వశ్రుతి శిరోగతః ॥** (8-7)

నమః శివాయయనే పంచాక్షరమంత్రము సకల వేదముల శిఖామణియున్నది. తమతమ యిష్టదైవములను అభిముఖులుగా చేసికొనుటకు ప్రాచీనకాలములో మహర్షులు వేర్వేరు దేవతలకు, వేర్వేరు మంత్రములను ప్రతిపాదించిరి. ఈ విధముగా ప్రతిపాదింపబడిన మంత్రములు ఏడుకోట్ల సంఖ్యవరకు గలవని చెప్పబడినది. సకల దేవతలకు శివుడు ఏ విధముగా సర్వోత్తముడో, అదే విధముగా పంచాక్షరి మంత్రము మహోత్కృష్టమైన మంత్రమని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు, శ్రీ అగస్త్య మహామునికి బోధించిరి. సంస్థ బ్రహ్మాండముల సృష్టికి, శివుడు మూలకారణమైయుండును. ఈ పంచాక్షరి మహామంత్రము ఆతని అభిదానమైయున్నందున సకల మంత్రములకు మూలమై యుండును. లౌకిక వ్యవహారముల యందు ప్రతియొక్క వ్యక్తికి ఒక్కొక్క పేరుండును. ఆ పేరున్న వ్యక్తిని పిలిచినపుడు, ఆతను మాత్రమే స్పందించును. అటులనే పంచాక్షరి మంత్రము శివుని అభిదానమగుట చేత, శివుని స్పందింపజేసికొనుటకు, పంచాక్షరి మంత్రమే సాధనమైయున్నది. ఈ కారణము వలన, భగవత్పాదుల వారు "మంత్రాత్ సిద్ధః పరః శివః" యని ఉపదేశించిరి. జగద్గురువుల గారి ఉపదేశము ప్రకారము నమః శబ్దం పిదప శివః శబ్దము పలుకవలెను. ఈ ఉభయ శబ్దముల యొక్క ఉమ్మడి స్వరూపమే మంత్రము. అనగా "శివాయనమః" యనుట సరికాదు. నమః శబ్దము జీవాత్మక వాచకము. శివః శబ్ద, పరమాత్మ

వాచకం. ఈ రెండింటికి మధ్య గల "అయ" యనే శబ్దం జీవాత్మ-పరమాత్మల సంగమమును సూచించుచున్నది. పంచాక్షరి జపము చేయుట వలన, శివజీవ సామరస్యం సహజముగానే సిద్ధించును. ఈ రీతిగా శివజీవుల ఐక్యబోధకమైన, ఈ మహామంత్రము, వేదములన్నింటికీ శిరోమణిగా గుర్తింపబడి ప్రసిద్ధిని బడసినది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేషప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు పంచాక్షరీ మంత్రము యొక్క గొప్పతనమును వివరించిరి.

శివునికిని శివమంత్రమున కభేదము గలదని యింతకు ముందుననే తెలిసికొంటిమి. సర్వకర్తృత్వము మరియు సర్వ భర్తృత్వము శివుని లక్షణములైయున్నవి. ఈ క్రింది ప్రమాణమును గనుడి

**శ్లో॥ శివస్యా జ్ఞాబలా ద్విష్ణు ర్జాయతే మ్రీయతే పిచ ।**
**బ్రహ్మా సర్వజగత్కర్తా విరాట్ సామ్రాద్వరా దపి ॥** (సూత సంహిత)

బ్రహ్మ విష్ణువుల యస్తిత్వమునకును, వారి కార్య నిర్వహణ కర్తృత్వాదులకును శివుడే మూలకారణుడని చెప్పబడినది.

అదే విధిన శివపంచాక్షరియును మంత్ర రాజమని గ్రహించవలెను. "పంచాక్షరో య మభిదాస్యతి మంత్రరాజః" యనెడి ఆగమోక్తి యీ విషయమును ధృవపరచుచున్నది.

శివుడే జగత్కర్త యనెడి శివాగమములలో ప్రతిపాదింపబడిన యంశము. శ్రుతి పురాణాదులీ విషయమును సమర్థించుచున్నవి. ఇదే విధిన పంచాక్షరీ మంత్రము లన్నింటికిని జననియని తెలుపబడినది. "సప్తకోటి మహామంత్రై రుపమంత్రైరనేకశః । పంచాక్షరి ప్రలీయంతే పునస్తత్ర వినిర్గతాః ॥" అనెడి ప్రమాణము ప్రకారము నన్ని మంత్రములకు పంచాక్షరి తల్లివంటిదని తెలియుచున్నది.

గాయత్రి వేదమాతయని చెప్పబడినది. బ్రాహ్మణులీ విషయమును నొక్కి చెప్పుదురు. "మంత్రమాతా పంచాక్షరీ"యని మహేశ్వరులు నిశ్చయించి తెలిపిరి. భక్త స్థలములోని భక్తుడీ విషయమును మదిలో నుంచుకొనవలెను. పంచాక్షరీ వేదములకంటెను నుత్కృష్టమైనదని శ్రీ భగవత్పాదులు తెలిపియుండిరనెడి విషయమును నిచ్చట స్మరించవలెను. శివపంచాక్షరిని జూపించెడి వారికి గాయత్ర్యాది మంత్రము లనావశ్యకమని గుర్తించవలెను.

శివ సాక్షాత్కారమును పొందుటలో పంచాక్షరి ప్రధాన సాధనముగా నుపయోగపడునని గుర్తించవలెను. ఈ మంత్రము వలన శివజ్ఞానము లభించును. తద్వారా శివసాక్షాత్కారము సుసాధ్యమగునని గుర్తించగలరు.

భక్త స్థలములోని సాధకుడు నేకైక పంచాక్షరీ జప నిష్ఠా తత్పరుడై ఇష్ట లింగాదుల నర్చిస్తూ సాధనను పటు తరము చేసికొనవలెను. తద్వారా మహేశ్వర స్థలమున ప్రవేశించుటకు తగు అర్హతలను సంపాదించుకొనవలెను.

## ఆశీర్వచనము - 3

**శ్లో॥ ఆదితః పరిశుద్ధన్మలత్రయ వియోగతః ।**
**శివ ఇత్యుచ్యతే శంభుశ్చిదానంతఘనః ప్రభుః ॥** (8-8)

సచ్చిదానంద స్వరూపుడు సర్వ తంత్ర స్వతంత్రుడుయైన పరమాత్మ అనాదికాలమునుండియు మంత్ర రహితుడై పరిశుద్ధుడై యున్నాడు. ఈ కారణముననే నాతడు 'శివ' యనెడి పేరుతో పిలువబడుచున్నాడు.

**శ్లో॥ ఆస్పదత్వా దశేషణాం మంగళానాం విశేషతః ।**
**శివశబ్దాభిదేయోహి దేవదేవ త్రియంబకః ॥** (8-9)

దేవాదిదేవుడు సృష్టి, స్థితి, లయలకు కారణభూతుడు, ముక్కంటి యని పిలిపించుకొనెడి యా పరమాత్ముడు, సకల మంగళములకు ఆశ్రయుడై యుండుటచేత, శివుడు యనబడే పేరుతో పిలువబడుచున్నాడు.

**శ్లో॥ శివ ఇత్యక్షర ద్వంద్వం పరబ్రహ్మ ప్రకాశకం ।**
**ముఖ్య వృత్యా తదన్యేశాం శబ్దానాం గుణవృత్తయః ॥** (8-10)

'శివ' యనబడెడి రెండక్షరములు సాక్షాత్తు పరశివబ్రహ్మను తెల్పెడివిగా నున్నవి. మిగిలిన పరమాత్ముని నామములు, ఆతని గుణగణములను నిరూపించి, తన్మూలకముగా యాతని స్వరూపమును దర్శింపచేయుచున్నవి. ఈ కారణమున 'శివ' శబ్దమే ముఖ్యమైనది.

**శ్లో॥ తస్మాన్ముఖ్య తరం నామ శివ ఇత్యక్షర ద్వయం ।**
**సచ్చిదానంద రూపస్యా శంభో రమిత తేజసః ॥** (8-11)

సచ్చిదానంద స్వరూపుడు, అపరిమిత తేజస్వినైన పరమాత్మునికి 'శివ' యనే పదము ముఖ్యమైయున్నది.

పరమశివుని స్తుతించుటకై శాస్త్రముల యందు సహస్ర నామములు ఉపయోగింపబడినవి. వాటిలో 'శివ' యనెడి నామమంతో ముఖ్యమైన దనెడి విషయమును, పూజ్యపాదుల వారు ఆదేశముగా చెప్పిరి. ఆ పరశివ బ్రహ్మము అనాదికాలము నుండియు ఆణవాది మలత్రయ ముల నుండి ముక్తమైనదై సదా పరిశుద్ధమై యుండును. అంతియే కాదు సమస్త మంగళములకు ఆశ్రయమైయుండును. అందుచేత ఆ పరశివబ్రహ్మకు 'శివ' యనెడి పేరు ప్రాప్తమైయున్నది. మహాభారతమునందున "శివమిచ్చన్మనుశ్యాణాం తస్మాద్దేవః శివః స్మృతః" (7-473-90) యని చెప్పబడినది. దీని తాత్పర్యమేమనగా సమస్త మానవులకు కళ్యాణమును కోరెడివాడు కనుక మహాదేవునికి 'శివ' నామం ప్రాప్తమైనది. సర్వాంతర్యామియైన శివుడు, మనుజుల కళ్యాణము కొరకై ప్రతిక్షణం హితమార్గమును ఉపదేశించుచూనే యుండును. ఈ ఉపదేశమును, వినియు, వినని యటుల వర్తించెడి నేటి మనుష్యులు, జీవనమునందున కళ్యాణ పరంపరను పొందకనే, అనంతమైన దుఃఖమును అనుభవించుచుందురు. ఈ దుఃఖ పరంపర నుండి విముక్తి పొందవలెననిన, తమ తమ హృదయములయందు ఉదయించెడి శివుని అంతర్వాణిని కనుగొని, ఆలించి, తత్ప్రకారమే ఆచరించినవాడు అనంతమైన మంగళ పరంపరను అనుభవించును.

శివుడు కేవలము మనుజుల కళ్యాణమును కోరెడు వాడే కాదు యతనికి ప్రాణులన్నియును సమానములే. ఈ కారణము వలన నీతడు సకల జీవుల యొక్క కళ్యాణమును కోరుచుండును. ఈ మాటను శివుడే స్వయముగా చెప్పినయటుల మహాభారతములో కలదు చూడుడి.

**శ్లో॥ సమాభవంతి మే సర్వే దానవాశ్చాః మరాశ్చయే ।**
**శివోస్మి సర్వభూతానాం శివత్వం తేయన మేసురాః ॥** (మ.భా. 8-2-3-4)

ఈ రీతిగా శివ యనెడి పేరు యొక్క మహిమను శివుడు తానే దేవతల కుపదేశించెను. ఈ ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా "నా దృష్టియందు దేవదానవ మరియు మానవులు యనెడి భేదబుద్ధిలేదు. నాకు యెల్లరును సమానులే. నేను యందరి మంగళమును కోరుచుందును. అందుచేతనే నా పేరు 'శివ' యని యైనది".

ఈ రీతిగా కళ్యాణస్వరూపుడు సకల జీవకోటి కళ్యాణకారకుడుగా నుండెడి పరబ్రహ్మమునకు 'శివ' యనెడి నామము అన్వర్థమైయున్నది. అందుచేతనే శ్రుతియందు **'శివ ఏకోధ్యేయః శివంకరః'** (అధర్వశీర్షోపనిషత్తు, 3) యనెడి ప్రమాణము ప్రకారము మంగళకరుడైన 'శివ' యనే ఒక్క పదము మాత్రమే ధ్వనించవలెను. ఇదియేకాదు సర్వజ్ఞత్వము, నిత్య తృప్తత్వం, యనాది బోధతత్వం, స్వతంత్రత్వం, అలుప్తశక్తిమత్త్వం మరియు అనంతశక్తిత్వములనెడి శివమయములైన షడ్గుణైశ్వర్యములు 'శివుని'లో యుండుటచేత 'శివః శోభనాః సర్వజ్ఞత్వాదయో గుణా అస్య సంతతి శివః' యనెడి వ్యుత్పత్తి ప్రకారముయతనికి శివయనెడి పేరు సంప్రాప్తమైనది.

"శోభన త్వాత్ శివః" యనెడి వ్యుత్పత్తి మేరకు శివ శబ్దము సిద్ధమగుచున్నది. శోభనత్వమనగా శుద్ధత్వము అని అర్థం. శుద్ధత్వమనగా మలరహితుడైయుండుట. పరమాత్ముడిగా, శివునికి, అణవాదిమలత్రయముల యొక్క సంబంధముండని కారణమున ఆతనికి 'శివ'

యనెడి పేరు కల్గినది. అయితే 'వష్టీతి శివః' అనియు శివశబ్దము యొక్క వ్యుత్పత్తి కలదు. మంగళమయమైన ఇచ్ఛకలవాడు యనెడి యర్థం, దీనికి గలదు. శివుడు ప్రాణులకే కాదు, జడపదార్థములకు కూడా మంచినే అపేక్షించును. 'వశశాంతే' యనెడి వ్యాకరణ సూత్రమున కనుగుణముగా స్వచ్ఛ ప్రకాశ స్వరూపుడు లేదా స్వప్రకాశరూపుడు యనెడి అర్థము కల్గును. అట్టి యెడ స్వయం ప్రకాశుడగుట చేత శివనామము కల్గినదని చెప్పవచ్చును.

"సేతేస్మిన్ సర్వమితి శివః" "శ్యామ్యతీతి శివః" యనే వ్యుత్పత్తులు కలవు. వీటి ప్రకారముగా శివుడు సర్వాధారుడు, నిర్వికారుడు యని స్థిరమగును. ఈ విధముగా, నానా విధములైన వ్యుత్పత్తులను గమనించిన పిదప శివుని యొక్క స్వరూప స్వభావములు అనిర్వచనీయములని తెలియుచున్నది. సర్వోత్కృష్టమైన గుణములు, అనంతమైన శక్తులు, అపారమైన ప్రకాశము, విశేషమైన ప్రేమానురాగములు మొదలగు వాటి యొక్క సమగ్రస్వరూపమే "శివుడు" యని భావించవచ్చును.

అమరకోశమునందున 'శంభు' ఈశ, పశుపతి, శూలి మరియు మహేశ్వర మొదలగు నామములు పరమాత్ముని పర్యాయ నామములుగా చెప్పబడినవి. ఈ విధముగా నున్నప్పుడు, శివనామమునకు మాత్రమే యింతగా వుత్కృష్టత ఎందుకు యనెడి ప్రశ్న ఉదయించును. ఈ సందేహమును తీర్చుటకే శ్రీ ఆచార్యరేణుకవారు సహస్ర నామములతో శివయనెడి పదమే శ్రేష్ఠమైనదనియును, అది పరబ్రహ్మ యొక్క సాక్షాత్ స్వరూపమును తేలియపరుచుచున్నదనియును తెల్పిరి. మిగిలిన నామములు, కేవలము శివుని గుణగణములను మాత్రమే కీర్తించుచున్నవి. ప్రత్యక్షముగానవి పరమాత్మ తత్త్వమునుగాని, రూపమునుగాని సూచించుటలేదు. అందుచేతనే శివనామమునకు ప్రాముఖ్యతయు, పంచాక్షరి మంత్రమునకు మహత్త్వమును సిద్ధించినదని భగవత్పాదుల వారు స్పష్టపరచినారు. ఈ కారణము వలన వీరశైవులందరు, పంచాక్షరి మహామంత్రము యొక్క ప్రాముఖ్యత నెరింగినవారై, అట్టి మంత్రమును జపించుటలో, అత్యంత శ్రద్ధాసక్తులను కనబరచవలెను.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేషప్రదీపిక :

ఈ ఆశీర్వచనమున శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరులగు చంద్రశేఖర శివాచార్యులవారు 'శివ' పదమును గురించిన విశేషమైన విశ్లేషణ నిచ్చిరి.

"నమః శివాయ" యనెడి మంత్రములో శివయనెడిది ప్రధానమైనదని తెలియుచున్నది. సకల విద్యలకును ఇదియే మూలమని శ్రీ భగవత్పాదుల వారు తెలియజేసి యుండిరి. ఈ అక్షర ద్వయమున కింతటి విశిష్టత యెందుకు గల్గినదో తెలిసికొనవలసియున్నది. శివుని కనేకమైన నామములుండగా 'శివ' యనెడిదే యెందుకు ముఖ్యమైనదిగా యెంచబడుచున్నదనెడిదే గుర్తించవలసిన విషయము.

వేదవాఙ్మయమున కాదియైన ఋగ్వేదములో శివపదము అగ్నికి పర్యాయపదముగా నుపయోగింపబడినది. అగ్ని యొక్క సౌమ్యరూపమే శివుడని తెలుపబడినది. కాని యాగమ వాఙ్మయమున నిట్టి భావములు లేవు. శివాగమముల ప్రకారము శివుడే పరబ్రహ్మ. సృష్టి స్థితిలయలకు మూలకారణుడని తెలుపబడినది.

శివుడు చిదానంద స్వరూపుడని చెప్పబడెను. మంగళమయుడూ అతడే యజుర్వేదము ప్రకారము శివుడు మంగళకారకుడనియును చెప్పబడినాడు. శివుడు స్వప్రకాశము కలవాడని తెలుపబడినది. సూర్యచంద్రాగ్ని యిత్యాదులు శివుని ప్రకారము వలననే వెలుగుచున్నవని చెప్పబడినది.

ఈ కారణముల వలన శివుడే జగత్ కర్త. ఈ కర్తృత్వము 'శివ' పదమునకు కారణమని తెలిసికొనవలెను.

శివుని యితర నామములు శివుని యొక్క యేదో నొక లక్షణమునే ప్రతిఫలించును. శివ పదమట్టిది కాదని గ్రహించవలెను. శివుని యొక్క సకల లక్షణములను సంక్షిప్తముగా ప్రతిఫలించును. ఈ కారణముననే సహస్రాధికముగా వెలుగొందెడి సర్వేశ్వరుని నామధేయములలో శివయనెడి దానికి యనన్య సామాన్యమైన ప్రాముఖ్యత లభించినది.

తేజోమయుడైన శివుని తేజస్సు 'శివ' యనెడి యక్షరద్వయమున ప్రతిబింబించుచున్నది.

సంక్షిప్తముగా చెప్పవలెననిన పరబ్రహ్మ వాచకమైన శివపదము మోక్షకారకమగు పంచాక్షరీ మంత్రమునకు ప్రధానాంగమై నిలిచినది.

శివయనెడి పదము యొక్క ప్రాముఖ్యతను తెలిపెడి సర్వేశ్వర శతకములోని యీ పద్యమును గనుడి

**శ్లో॥ శివ వాక్య స్ఫురితాక్షర ద్వయ సకృజ్జిహ్వా ప్రదేశాత్ముడై ।**
**భవ దుఃఖాంబుధి దాటునన్న మరి తత్పంచాక్షరీ మంత్రము ।**
**త్సవలీం గడు శుద్ధుడై జపము వాంఛం జేయు భాస్వద్గుణా ।**
**ర్ణవ సౌభాగ్యము మానయెవ్వరికి నెన్నన్వచ్చు సర్వేశ్వరా ॥** (సర్వేశ్వర శతకము ప.116)

అన్నమయ్య మాటలు శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము ననుసరించి యున్నవని స్పష్టముగా తెలియుచున్నది.

## ఆశీర్వచనము - 4

**శ్లో॥ ఏతన్నామావిలంబేన మంత్రః పంచాక్షరః స్మృతాః ।**
**యస్మాదతః సదా జప్యో మోక్ష కాంక్షిభిరాదరాత్ ॥** (12)

ఇట్టి మహత్వపూర్ణమైన 'శివ' పదము పంచాక్షరీ మంత్రమున యడిగి యుండుట చేత మోక్షాపేక్ష గలవారు ఎప్పుడూ ఈ మంత్రమును ఆదరపూర్వకముగా జపించవలెను.

**శ్లో॥ యథానాదిర్మ హాదేవః సిద్ధః సంసారమోచకః ।**
**తథాపంచాక్షరో మంత్రః సంసారక్షయ కారకః ॥** (13)

అనాదియగు మహాదేవుడు, సంసార పాశము నుండి ముక్తిని గల్గించెడి వాడైనందున ప్రసిద్ధిని గాంచెను. అదే విధముగా పంచాక్షరీ మహా మంత్రమైననూ, మోక్షమును కల్గించేదిగా నున్నది.

**శ్లో॥ పంచభూతాని సర్వాణి పంచతన్మాత్ర కాణి చ ।**
**జ్ఞానేంద్రియాణి పంచాపి పంచకర్మేంద్రియాణి చ ॥** (14)

**శ్లో॥ పంచబ్రహ్మాణి పంచాపికృత్యాని సహ కారణైః ।**
**బోధ్యాని పంచిభీర్వర్ణైః పంచాక్షర మహామనోః ॥** (15)

పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచబ్రహ్మలు, పంచకృత్యములు, పంచాక్షరీ మహామంత్రము నుండియే యుద్భవించినవి.

**శ్లో॥ పంచథా పంచధాయాని ప్రసిద్ధాని విశేషతః ।**
**తాని సర్వాణి వస్తూని పంచాక్షరమయానిపి ॥** (16)

ప్రపంచములో నైదైదు గుంపులుగా నున్నవన్నియును పంచాక్షరి నుండియే యుద్భవించి యున్నవి.

ఈ పంచాక్షరీ మహామంత్రము నందున పరమపావనమూ, మంగళమయమూ, పరశివ బ్రహ్మ వాచకమూ అయిన శివ అనెడి పదము అంతర్గతముగా నున్నందున మోక్షాపేక్ష గలవారు ఈ మంత్రమును సదా జపించవలెనని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు నుపదేశించిరి.

జీవుడు, పరశివుని యంశయైననూ, ఈ సంసారమునందున తన వ్యవహారములలో మునిగి తేలుచు, ఈ జగత్తుకు మూలకారణుడైన పరశివుని మరచిపోయినాడు.

నిత్యసుఖస్వరూపుడైన పరశివుని మరచిపోయినందుకు ఫలస్వరూపముగా నెన్నియో దుఃఖముల ననుభవించుచున్నాడు. పూజ్యపాదుల వారు నుపదేశించిన యటుల, శివజీవైక్య బోధకమగు పంచాక్షరిని జపించుచు, పరశివునిగా మారుచున్నాడు. ఇది యెట్టులగును అనెడి సందేహము గలుగవచ్చును. వ్యాస మహర్షివారి యీ క్రింది శ్లోకమును గనుడి.

**శ్లో॥ కీటో భ్రమర ధ్యానేన భ్రమరో భవతి ధృవమ్ ।**
**మానవః శివయోగేన శివో భవతి నిశ్చయమ్ ॥** (లింగపురాణము)

కీటకము సదా భ్రమరము గూర్చి చింతిస్తూ భ్రమరమగుచున్నది. అట్టి యెడ పంచాక్షరీ మహా మంత్రమును జపించుచు, జీవుడు శివుడగుట చోద్యమే. యుగయుగాదలు నుండి పరశివుని నుండి పృథః కరణ పొందిన జీవుడు, శివునిలో నేకీకరణను సాధించే దిశలో పంచాక్షరీ జపము చాలా నుపయుక్తముగానున్న సులభసాధనమని గుర్తించవలెను.

నమ్మకము, విశ్వాసములనెడివి చాలా ముఖ్యమైన యంశములు. విశ్వాసహీనుడై చేసెడి పనుల వలన వచ్చెడి ఫలము ఆశించిన మేరకు ఉండజాలదు. ఈ కారణము వలననే శ్రీ రేణుక భగవత్పాదుల వారు "ఆదరాత్ జప్యో సదా" అని ఆనతిని ప్రదానము చేసిరి. ఆదరము అనెడి శబ్దము అత్యంత కీలకమైనదని యెంచవలెను. సమాదరణ చేయకుండగ, మంత్రము జపించిన యెడల వచ్చెడి ఫలము కంటెను, ఆదరణ సహితముగా చేసెడి జపమునకు నెన్నియో రెట్లు యధిక ఫలముండునని గ్రహించవలెను.

ఒక ఊరికి నొక గురువుగారు విచ్చేసిరి. ధర్మ ప్రచారార్థమై వచ్చిన యా గురువు వలన కొందరు దీక్షను బడసిరి. దీనిని గాంచిన యిరువురు బ్రాహ్మణ విధవరాళ్ళు, వలయు ప్రేరణను పొంది, గురువుగారిని దర్శించి దీక్షను బడసి మంత్రోపదేశమును పొందిరి. మంత్రోపదేశమును చేసెడి సమయమున, శ్రీ గురువుగారు, తాను చేసిన మంత్రోపదేశమును రహస్యముగా నుంచవలెననియును, మంత్రము నెవ్వరికినీ తెలుపవలదని యాదేశము నిచ్చిరి. శ్రీ గురువు గారి యుపదేశమును గూర్చి యెంతయో విశ్వాసము గల్గిన విధవరాళ్ళు అనన్య మనస్కురాళ్ళై మంత్రమును నిరంతరము జపించ జొచ్చిరి. మంత్రము యొక్క దివ్య ప్రభావ ఫలితముగా, వారొక దివ్యమైన దేవలోకపు విమానము నెక్కి గగన మార్గమున స్వర్గము దిశన పయనింపజొచ్చిరి. వారు దేవలోకమును ప్రవేశించుటకు యెంతో వ్యవధి లేకుండెను. నాలుగు లేదు ఐదు నిమిషములలో అచ్చటకు చేరు స్థితిలో నుండిరి. శ్రీ గురువు గారి మంత్ర మహిమ గూర్చి వారికి యెంతయో ఆశ్చర్యము గల్గెను. వారప్పుడు మంత్రజపమును ఆపివేసి, ఆలోచనా ప్రపంచములో విహరింపజొచ్చిరి. వారిరువురికిని, యొక సందేహము కల్గెను. శ్రీ గురువుగారు వారిరువురికి చేసిన మంత్రము నొకటియేనా ? లేదా భిన్నమైనదా ? యనెడి జిజ్ఞాస గల్గెను. ఈ విషయమై వారిరువురు చర్చింప దొడగిరి. శ్రీ గురువు వారు నుపదేశించిన మంత్రమే విధముగా నున్నది యున్నదని యొకరు ఇంకొకరిని పరస్పరముగా ప్రశ్నించి కొనిరి. అప్పుడొకర్తె, శ్రీ గురువు తనకు 'రం' అనెడి యేకాక్షర బీజమంత్రమును నుపదేశించిరని తెలియజెప్పెను. ఇంకొకర్తె తన మంత్రము గూర్చి వివరిస్తూ, శ్రీ గురువు తనకు 'డం' అనెడి ఏకాక్షర బీజమంత్రము నుపదేశించిరని తెలియజెప్పెను. అప్పుడు వారు తమ తమ మంత్రముల మహిమాతిశయముల గూర్చి తెలిసికొని ఆనందభరితాంతరంగులై వారి వారి మంత్రములను బిగ్గరగా నుడియదొడగిరి అప్పుడు వారిక 'రండం' అనెడి శబ్దము యొక్క స్ఫురణగల్గెను. వారిరువురి మనస్సులలో నేకకాలముననే యీ క్రింది విధమైన యాలోచనలు తలయెత్తెను :

"హా ! ఇదేమి ఆశ్చర్యము. ఇరువురి మంత్రములను కలిపిన యెడల 'రండం' యగుచున్నది. మేము విధవరాళ్ళమైనందున మా పేరునే మాకు మంత్రమని యుపదేశించిరి. ఇదెక్కడి మంత్రము? ఇతడెట్టి గురువు ? మమ్ముల నవమానమునకు గురి చేయుటకే ఈ విధిన ఉపదేశమును చేసిన యట్టుల స్ఫురించుచున్నది."

వారిరువురికిని గురువుగారి యెడల అనాదరభావమేర్పడెను. మంత్రము యెడల విపరీతమైన హేయభావము పొడసూపెను. మరుక్షణముననే వారిరువురును నేలకు గూలిరి. మంత్రము యెడలకల్గిన యనాదరభావమే వారికీగతి పట్టించెను. పతనమునకు కారణమయ్యెను.

అక్షరమెట్టిదైనను కావచ్చును. గురుముఖతః వచ్చిన పిదప అయ్యది మంత్రమేయగును. దాని యెడల అనాదరభావము కలుగవలదు. అట్టి యనాదరభావములు కల్గిన యెడల అనర్థములే వాటిల్లును. అందుచేత గురువుగారుపదేశించిన మంత్రమును

ఇంకొకరికి తెలుపగూడదు. అద్దానిని రహస్యముగానే యుంచవలెను. మంత్రము యెడల ఆదరణ భావమును సడలనివ్వగూడదు. ఈ రెండు విధములైన జాగ్రత్తలు గైకొనువాడు మంత్రసాఫల్యత సాధించగలడు. సాధకునికి సత్ఫలములు లభించగలవు. నమ్మకమే కీలకమైన యంశమని గ్రహించవలెను. విశ్వసనీయత లోపించినపుడు పాలు ద్రాగినా యవి విషముగా దోచి విషపరిణామములను కలుగజేయును.

శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు నుపదేశము చేసిన మంత్రము సామాన్యమైనది కాదు. పరశివ పరబ్రహ్మకు పర్యాయ పదమైన శివ యనెడి పదములను తనలో నిమిడ్చుకొనిన మంత్రమియ్యది శ్రేష్ఠాతిశ్రేష్ఠమైనది. ఈ మంత్రమును భక్తిశ్రద్ధలతో జపించిన యెడల శివజీవైక్యతా సిద్ధికి మార్గము సుగమమగును. జీవుడు సంసార సాగరమును దాటి యాధ్యాత్మిక మార్గమును చేపట్టగల స్థితికి చేరుకొనెను.

పరశివుని యందున నుండెడి సామర్థ్యము తత్ పరతత్వ వాచకమగు మంత్రమునను ఉండును. ఈ రహస్యమును గుర్తించిన శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఈ మంత్రము జీవుని తరింపజేసెడి యేకైక తారకమంత్రమని బోధించి లోకములకు మేలును చేసిరి. లోకకళ్యాణమును సాధించనెంచిరి.

"ముక్తయే కల్పితో మనుః" అనెడి బ్రహ్మోత్తర ఖండములోని వాక్కుననుసరించి, లోకులకు ముక్తిని ప్రసాదించుటకే పంచాక్షరీ మంత్రము కల్పింప బడినది.

అందుచేత మోక్షమును కోరెడివారు ఏకాగ్రచిత్తముతో పంచాక్షరీ మహామంత్రము జపించి కృతార్థులు కావలెను.

సంసారమును ముక్తిని గల్గించెడి యీ మంత్రము జగత్తు యొక్క ఉత్పత్తికి కారణభూతమైయున్నదని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశము నిచ్చిరి. ముప్పది యారు తత్త్వములును ఇందులోనుండియే గల్గినవనిరి. జగత్తులోని పంచవిధములుగా నమీకరించబడిన పంచబ్రహ్మ వంటి అంశములన్నియునూ పంచాక్షరీ మంత్రము నుండి జనించినవని తెలియజేసిరి.

శివ శబ్దమునకున్న మహిమ యపారమైనదని తెలియుచున్నది. ప్రపంచమునకు కారణమైన మంత్రము, ముక్తిని కూడా గల్గించును. ఈ విషయమును గుర్తెరిగి భక్తులు ఇతోధికమైన లబ్ధిని పొందగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేషప్రదీపిక :

గురూపదేశమును నిగూఢముగా నుంచి, పంచాక్షరీ మంత్రమును జపించినవానికి మోక్షము సులభ సాధ్యమని శ్రీ కాశీ జగద్గురువుల వారు నుపదేశించిరి.

'శివ' అనెడి పదము యొక్క ప్రాముఖ్యతను ఇంతకు క్రితమే నెరిగియుంటిమి. శివుని పరబ్రహ్మ తత్త్వమును నీ 'శివ' యనెడి శబ్దము సూచించుచున్నదని తెలియుచున్నది. ఈ కారణము వలననే పంచాక్షరి కింత ప్రాముఖ్యత లభించినదని తెలియుచున్నది.

పరబ్రహ్మగా శివుడు జగత్కారణుడని తెలిసికొనవలెను. శివాగమములలోన ఇది స్పష్టముగా తెలుపబడినది. జీవుడును శివుడే ప్రకృతి జీవుని కొరకై సృష్టింపబడినది. పరబ్రహ్మగా శివుడు సర్వ వ్యాపకుడైనందున ప్రకృతిలోను శివాంశ గలదనే గుర్తించవలెను. ఈ జగల్లీలా విలాసములో శక్తి శివునికి సాన్నిహిత్యమున నుండును. సృష్టి క్రమములలో మొదలున వెలువడినవే శుద్ధ తత్త్వము. అవి యేవనగా శివుడు శక్తి, సదాశివుడు ఈశ్వరుడు మరియు శుద్ధ విద్య. శుద్ధ విద్య స్థానమున పంచాక్షరీ మహామంత్రమును గ్రహించవచ్చును. దీని నుండియే భూమి పర్యంతము గల ముప్పది యొక్క తత్త్వములు వెలువడినవని గుర్తించవలెను. ఈ కారణముననే యథా వాక్కులవారు జగత్సృష్టికి పంచాక్షరియే కారణభూతమైన స్థానమని తెలిపిరి. ఈ క్రింది పద్యమును గనుడి

శ్లో॥ భవదీయానన పంచకంబు వలనం పంచాక్షర శ్రేణియు ।
ధృవమై తత్పదవర్ణపద్ధతుల శుంభత్పంచ భూతంబులు ।
ధృవనంబై యఖిలంబు బుట్టెను లసత్పంచాక్షరీ మంత్రమీ ।
భువనాండంబుల దల్లియై శుభములం బొందించు సర్వేశ్వరా ॥

శివాదులు పంచాక్షరీ జపము నాశ్రయించుకొని జపాదులు చేయుచు ముక్తిని పొందుట కొరకు కృషి చేయుదురు. ఇట్టి క్రియల వలన జన్మరాహిత్యము గలుగ వచ్చునేమో గాని సద్గతి లభించదని వీరశైవ విభుల నిశ్చితాభిప్రాయము.

దీక్షాత్రయము చేత మల విచ్ఛేదనము పొంది త్రివిధ లింగములను ధరించిన సద్భక్తుడు నిరంతర లింగధారియై, నిత్యానుష్ఠానమున భస్మస్నాన భస్మోద్ధూళన భస్మ త్రిపుండ్రధారణను చేసుకొని. విధి ప్రకారము రుద్రాక్షలను సర్వాంగముల యందున ధరించి గురూపదిష్ట విధిన పంచాక్షరిని జపించవలెననెడిది. వీరశైవమున విహితమైన విధి. తదనుగుణముగా సాధన జేసినవాడు, మహేశ్వర స్థలమున ప్రవేశించి తన సాధనను సుసంపన్నము చేసుకొనవలెను. భక్తుడు నీ ధర్మ సూత్రమునెరింగినవాడై, శివపథమున పయనించక వీరశైవపథగామియై లింగాంగ సామరస్యమును సాధించెడి దిశలో పయనించవలెను

## ఆశీర్వచనము - 5

శ్లో॥ ఓంకార పూర్వో మంత్రోఽయం పంచాక్షర మయఃపరః ।
శైవాగమేషు వేదేషు షడక్షరఇతిస్మృతః ॥ (17)

ఈ పంచాక్షరీ మంత్రమునకు పూర్వమున ఓంకారము వచ్చి చేరినప్పుడు నయ్యది వేదాగమములలోన షడక్షరియని పిలువబడినిది.

శ్లో॥ భస్మస్నానాదిభూతేన ప్రణవేన మహామనోః ।
ప్రబోధ్యతే మహాదేవః కేవలశ్చిత్సుఖాత్మకః ॥ (18)

పంచాక్షరి యొక్క మొదటనుండెడి ఓంకారము చేత సచ్చితానంద స్వరూపుడగు పరమాత్మ బోధింపబడుచున్నాడు.

శ్లో॥ ప్రణవేనైకవర్ణేన పరబ్రహ్మ ప్రకాశ్యతే ।
అద్వితీయం పరానందం శివాఖ్యం నిష్ప్రపంచకం ॥ (19)

అద్వితీయుడు, సచ్చితానంద స్వరూపుడు, ప్రాపంచిక భేదశూన్యుడు యైన పరమాత్ముడు ఓంకారము చేత ప్రకాశింపబడుచున్నాడు.

శ్లో॥ పరమాత్మ మనుర్జ్ఞేయః సోహం రూపః సనాతనః ।
జ్ఞాయతే హంసయోర్లోపాదోమిత్యేకాక్షరో మనుః ॥ (20)

సోహం అనెడి ప్రత్య జ్ఞాన రూపమైన సనాతనమైన మంత్రము శివజీవుల యేకత్వమును సూచించెడి మంత్రము అయియున్నది. దీని యందలి యుపాధిరూపములైన సకారహకారములు లోపమగుటచేత ఓంకారమనెడి ఏకాక్షర మంత్రము ప్రకటనమైనది.

శ్లో॥ ప్రణవేనైవ మంత్రేణ బోధ్యతే నిష్కలః శివః ।
పంచాక్షరేణ మంత్రేణ పంచబ్రహ్మతను స్థథా ॥ (21)

ప్రణవము చేత నిష్కలుడైన శివుడు బోధింపబడుచున్నాడు. పంచాక్షరి చేత సకళుడగు శివుడు బోధింపబడును.

శ్లో॥ నిష్కలః సంవిదాకారః సకలో విశ్వమూర్తితః ।
ఉబయాత్మాశివోమంత్రే షడక్షర మయే స్థితః ॥

నిష్కలుడగు శివుడు జ్ఞానరూపుడు. సకలుడైన శివుడు విశ్వరూపుడు. షడక్షరిలోన యీ రెండూ సంయోగమై యుండును.

పంచాక్షరి యొక్క ప్రస్తుతిని చేసిన శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు ప్రస్తుతము షడక్షరి యొక్క స్వరూపమును మరియు తత్వార్థమును బోధించిరి.

"ఓ అగస్త్య మహర్షీ ! పంచాక్షరీ మంత్రమునకు మొదట ఓంకారముతో సంబంధము కలుగగా నది షడక్షరియై వేదాగమముల చేత యీ పేరుననే పిలువబడుచున్నది.

ఓంకారమును ప్రణవ మనియును పిలుతురు. శివపద మే విధముగా పరమాత్మ వాచకమో ప్రణవము కూడా పరమాత్మ వాచకమే. "తస్య వాచకః ప్రణవః" యనెడి యూగసూత్రము యీ భావమునే స్ఫురింపజేయుచున్నది (యో.సూ.1-27) ప్రణవము పరమాత్మ వాచకమని పతంజలి భావమని చెప్పబడినది.

ను-స్తవనే (తుదాది 1486) అనే ధాతువు నుండి నిష్పన్నమైనది. 'ప్ర' యనెడి యుపసర్గ సంయోగమగుటచే ప్రణవమగును. శివుని నుతించెడి మొట్టమొదటి వర్ణమే ప్రణవము. "ప్రకర్షేణ ణూయతే ఇతి ప్రణవః" అనెడి వ్యుత్పత్తి ప్రణవమునకివ్వబడినది. నుతియనే భావమునే సూచించుచున్నదిది.

ఓంకారమునకును బ్రహ్మదేవునితో గల సంబంధమును వివరించెడి ఈ క్రింది ప్రమాణము గనుడి

**శ్లో॥ ఓంకార శ్చాథ శబ్దశ్చ ద్వావియౌ బ్రహ్మణః పురా ।**
**కంఠం భిత్వా వినిర్యాతౌ తస్మాన్మాంగలికా ఉభౌ ॥**

ఓంకారము మరియు అథ అనెడి శబ్దములు సృష్టియొక్క ఆదియందున బ్రహ్మదేవుని కంఠమును భేదించుకొని బయటకు వచ్చినవి. అందుచేత మొట్టమొదటి మంగళమయ శబ్దములుగా నామోదింపబడినవి.

ప్రణవము యొక్క తత్వార్థము నెంతో సుందరముగా చిత్రించిన ఘనత శ్రీ వ్యాసమహర్షి వారికి దక్కుచున్నది. ఈ పురాణోక్తిని గనుడి

**శ్లో॥ ప్రోహి ప్రకృతి జాతస్య సంసారస్య మహోదధేః ।**
**నవం నావాంతరమితి ప్రణవం వై విదుర్బుధాః ॥**
**ప్రః ప్రపంచో న నాస్తి వో యుష్మాకం ప్రణవం విదుః ।**
**ప్రకర్షేణ నయేద్య స్మాన్మోక్షం వా ప్రణవం విదుః ॥** (శివ పురాణము, ద్యా, 17, 4-5)

శివపురాణము యొక్క ప్రమాణములలో వ్యాసుల వారు ప్రణవము యొక్క తత్వార్థమును రెండు విధములుగా తెలిపిరి. 'ప్ర'యనగా ప్రాకృతిక, మహాసాగర సమమైన, సంసారము. 'వ' అనగా నా సముద్రమును దాటించెడి బహు సుందరమైన నౌక. మరియొక విధముగా చూసిన యెడల 'ప్ర' అనగా ప్రపంచము, 'న' అనగా నాస్తి లేదా ఉండెడిది కాదు. ప్రణవము జపించిన వారికి ప్రంచముండదనెడిది ప్రణవమునకు గల అర్థము. అదే విధముగా 'ప్రకర్షేణ నయతీతి ప్రణవః" వ్యుత్పత్తి ననుసరించి, జీవుని బలాత్కారముగా మోక్షము వైపుకు నీడ్చుకొని పొయ్యెడిది ప్రణవమని స్పష్టమగును.

ప్రణవమును జపించెడి వారికి మోక్షము నిశ్చతమని వ్యాసుని వాక్కుల వల్ల తేటతెల్లమగుచున్నది.

మరణకాలమున నెవ్వడు ఓంకారమును జపించునో వానికి కైవల్యము లభించునని గీతకారుడు తెలిపెను. కనుడి

**శ్లో॥ ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్నామనుస్మరన్ ।**
**యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాం గతిమ్ ॥** (గీతా, 8-13)

ఓంకారమనెడిది అ, ఉ, మల కూడిక యని చెప్పబడుచున్నది. ఇవి శివుని సత్-చిత్-ఆనంద స్వరూపములనియును చెప్పబడినవి. ఈ కారణము వలన పరశివుని నిర్గుణ రూపము. ఓంకారము మూలముననే ప్రకాశించుచున్నదని గ్రహించవలెను. శ్రీ భగవత్పాదులవారును ఈ విధముగనే ఆనతిని యిచ్చిరి.

శ్రీ మరితొంటారాధ్యుల వారు, తమ సిద్ధాంత శిఖామణి తత్త్వ ప్రదీపిక యనెడి గ్రంథములో బీజవృక్ష న్యాయమున ప్రణవమునకును పంచాక్షరికి యనుబంధమును చేసిచూపిరి. ప్రణవములోని తార, దండ, కుండల, అర్థచంద్ర బిందువుల నెడివి పంచాక్షరములైన న-మ-శి-వా-యలకు జన్మస్థానములని తెలిపిరి. ఈ కారణమున పంచాక్షరీ మహామంత్రమనెడి కల్పతరువునకు, ప్రణవమే బీజమని వివరించిరి.

ప్రతియొక్క వ్యక్తి, దివసమునకు కొన్ని వేల పర్యాయములు శ్వాసను పీల్చుచున్నాడు. శ్వాసయే ప్రాణమని యెరుగని వారెవ్వరు ? ఈ శ్వాస ప్రక్రియ 'హంసః'. హంసః యనే గతిన కొనసాగునని చెప్పబడుచున్నది. ఇది, యిట్టులుండగా, వీరశైవ ధర్మము ప్రకారము శ్రీ గురువు, శిష్యునికి దీక్షను ప్రదానము చేసెడి సమయమున యీ శ్వాసగతిని మార్చును. హంస గతిన నడిచెడి శ్వాస, గురుకరుణ వలన 'సోహం'గా పరిణమించును. ఈ సంస్కరింపబడిన శ్వాసగతిలో శివతత్త్వము ఇమిడియున్నది. అద్దానిని శ్రీ గురువు శిష్యునికి యీ విధిన యుపదేశము నిచ్చును.

'సోహంలో సః మరియు అహం అనెడి శబ్దములు గలవు. సః అనగా అతడనెడి అర్థము గలదు. అహంకు నేను అనెడి అర్థము గలదు. సోహం అనగా అతడే నేను అనే అర్థము గల్గును. సః అనగా శివుడుగాను, అహం అనగా ఆత్మగాను భావించిన యెడల శివజీవాభేదము సిద్ధించును. దీక్షను పొందిన ప్రతి వీరశైవుడు 'సోహం' అనబడు భావనను పొంది శివజీవైక్య సాధన కొరకు కృషి చేయవలెను.

'సోహం'లో వచ్చెడి 'సః మరియు 'హ' వర్ణములు శివుడు మరియు జీవులకు ప్రాతినిధ్యము వహించెడి ఉపాధులుగానున్నవి. ఈ రెంటిని త్యాగం చేసిన పిదప 'హంస యోర్లోపాదో నిత్యేకాక్షరో మనుః' అనెడి ఆచార్యోక్తికి అనుగుణముగా ఓంకార మంత్రము వ్యక్తమగుచున్నది. ఈ విధముగా ఓంకార మంత్రము వ్యక్తమగుచున్నది. ఈ విధముగా ఓంకార మహా మంత్రము నిరుపాధికమై యుండుట చేత నిష్కళ పరశివ బ్రహ్మమును బోధించునదై యున్నది. అధర్వ శీర్షోపనిషత్తు యందు ఇదే భావము యుండినటుల గోచరించుచున్నది. 'య ఓంకారః సః ప్రణవః యః ప్రణవః సః సర్వ వ్యాపీ' (2-3) అనెడి మంత్రము ప్రకారము పరబ్రహ్మ ప్రకాశమైన ఓంకారమునకు పరబ్రహ్మ అనియే సూచించబడినది. ఓంకారము నుండి నిష్కళ శివ పరబ్రహ్మము ప్రకటితమై ప్రకాశిస్తే సకల రూపమైన పంచబ్రహ్మ స్వరూపము పంచాక్షరీ మంత్ర ముఖముగా వెలుగుచున్నది. ఈ విధముగా ప్రణవ సహిత పంచాక్షరీ మంత్రములో పరశివుని యొక్క సకల మరియు నిష్కళ రూపములు సమరస భావముతో అణిగియున్నవి. ఈ కారణము వలన షడక్షరీ మహా మంత్రమును శ్రద్ధతో జపించెడి వారికి సగుణ శివపరబ్రహ్మ అనుగ్రహము వలన సకలారిష్ట నిరసనము సకలాభీష్ట సిద్ధియు కల్గును. అదే సమయములో నిష్కళ శివపరబ్రహ్మ అనుగ్రహము వలన శివత్వము సిద్ధించి కైవల్యము సంప్రాప్తమగుచున్నది.

ప్రణవ పంచాక్షరీ మంత్రము నందు యుండెడి షడ్వర్ణములు, షట్చక్రములయందు యుండెడి షడ్లింగముల యొక్క బీజాక్షరములనియును శ్రీ మగ్గేయ మాయి దేవులు గారు తమ అనుభవ సూత్రమనెడి గ్రంథమునందు తెలియపరిచినారు. వారి నుడువుల ప్రకారము ఆధార, స్వాధిష్ఠాన మణిపూరక, అనాహిత మరియు విశుద్ధములనెడి అయిదు చక్రములయందు క్రమముగా ఆచార లింగము, గురులింగము, శివలింగము, జంగమ లింగము మరియు ప్రసాద లింగములు సన్నిహితములై యుండును. వీటికే క్రమముగా 'నమశివాయ' యనెడి వర్ణములే బీజాక్షరములై యున్నవి. ఇంకను ఆజాచక్రమునందు యుండెడి మహాలింగమునకు ఓంకారమే బీజాక్షరము.

ఈ షడక్షర మహా మంత్రమును గురూపదేశమునకు అనుగుణముగా సావధాన చిత్తముతో మనస్సునందు జపించుచు పోయిన యెడల షట్చక్రములు క్రియాశీలములు అయి వాటి యందు యుండెడి షడ్లింగముల స్వరూప జ్ఞానమును గలిగి అంగాంగ సామరస్య రూపమైన పరమ కైవల్యప్రాప్తి సిద్ధమగునను నదే శ్రీమాయిదేవుల వారి హృద్గతాభిప్రాయము. ఈ ప్రణవ సహిత పంచాక్షరీ మంత్రము

విభిన్న బీజాక్షరములచేత కూడుకొని యుండగా ప్రసాద పంచాక్షరీ, మాయా పంచాక్షరీ, సూక్ష్మ పంచాక్షరీ స్థూల పంచాక్షరీ, మూల పంచాక్షరీ అనెడి ప్రభేదములను పొందును. వీరశైవ సదాచార సంగ్రహమునందున ఈ విషయము నిరూపించబడినది. ఇచ్చట చెప్పబడిన మూల పంచాక్షరియే షడక్షర మహామంత్రము. ఇట్టి మహాత్వపూర్వమైన షడక్షరీ మంత్రమును పరశివుని యొక్క సగుణ, నిర్గుణములకు ప్రాతినిథ్యము వహించునని మనస్సున గట్టిగా నమ్మి గురూపదేశము ద్వారా ఆ మంత్రమును బడసి శ్రద్ధతో, భక్తితో జపించినవారికి సగుణ శివుని కృపచేత అనంతమైన భోగభాగ్యములును, నిర్గుణ శివబ్రహ్మ కృపచేత అంగాంగ సామరస్య పూర్వమైన మోక్షమును బడయుదురని యెరింగి ఆధ్యాత్మిక సాధనచేసి ఇతోధికమైన ప్రాప్తిని పొందురు గాక.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు నీ యుపన్యాసములో ప్రణవము యొక్క ప్రాముఖ్యను తెలియజెప్పిరి.

'శివ' పదము యొక్క విశిష్టతను ఇంతకు క్రితమే తెలిసికొనియుంటిని. 'శివ'యనే శబ్దము పరబ్రహ్మ వాచకమని తెలిసికొని యుంటిమి. ఇప్పుడు పంచాక్షరీ మంత్రమును షడక్షరీగా మార్చెడి యేకాక్షరమైన "ఓం" గురించి తెలుపబడినది.

త్రిమూర్తివాదుల ప్రకారము చతుర్వేదములు బ్రహ్మముఖోద్భూతములు. ఆ వేదములకంటెను ముందున "ఓం" యనెడిది వెలువడెనని చెప్పబడినది. ఈ కారణమున వేదమంత్రములకు ఓంకారమును చేర్చి జరుపబడెడి యాచరణ ప్రారంభమైనదని తెలుపుదురు. వీరివాదన ప్రకారము ఓంకారము త్రిమూర్త్యాత్మకము. ఈ క్రింది శ్లోకమును గనుడి :

**శ్లో॥ అకారోవిష్ణురుద్దిష్ట ఉకారస్తు మహేశ్వరః ।**
**మకారేణోచ్యతే బ్రహ్మ ప్రణవేన త్రయోమతః ॥** (1)

శివుని పరత్వము నంగీకరించెడి వారీ వాదన నంగీకరించరు. శివుడే త్రిమూర్తుల జన్మలకు కారకుడనియును, నతడే పరబ్రహ్మయనియును, త్రిమూర్తులు శివుని యాజ్ఞకు బద్ధులై వారి వారి కార్యనిర్వహణలో నిమగ్నులై యుందురని తెలుపబడినది. వీరి వాదము ననుసరించి శివుడే ఓంకారము, ఓంకారమే శివుడు.

**శ్లో॥ శివోవా ప్రణవోహ్యేష ప్రణవో వాశివ స్మృతః ।**
**వాచ్య వాచక యోర్భేదో సాత్యంతం విద్యతే యతః ॥** (1)

డా॥ రుద్రప్ప గారు నీ శ్లోకము గురించి వ్యాఖ్యానించుచు నీ క్రింది విధముగా వ్రాసిరి.

శివుడే ప్రణవము, ప్రణవమే శివుడు, శబ్దార్థములకు భేదము లేదుగాన ప్రణవమను నోంకార శబ్దము చేత నెల్లప్పుడు శివరూపమగు నర్థము ఎల్లకాలము స్ఫురించుచున్నదని భావము.

(వీరశైవ సిద్ధాంత శిరోమణి, పుట 241)

శివునికి స్థూల సూక్ష్మ శరీరములు గలవనియును, స్థూల రూపమున జగత్ వ్యాపకత్వము గల్గి చరాచర జగత్తులోన వ్యాపించి యున్నాడని తెలుపుచు, సూక్ష్మ రూపమున శివుడు నిర్గుణ బ్రహ్మగాను, నిరాకారునిగాను నుండుననియును, నీ స్థితిని సూచించెడిదే యోంకారమనియును తెలిపెడివారు గలరు. యథా వాక్కుల వారి యీ పద్యమును గనుడి.

**శ్లో॥ అతివాఙ్మనసమై యజాండనిలయంబై యాదిమద్యాంత వ ।**
**ర్జితమై నిర్గుణ నిష్కలంక పదమై సిద్ధాంత మధ్యాత్మసం ।**
**యుతమై కోటి రవి ప్రకాశయుతమై యోంకార మంత్రాది సం ।**
**స్తుతమై యెంచ నచింత్యమై వెలుగు నీ సూక్ష్మంబు సర్వేశ్వరా ।** (సర్వేశ్వర శతకము, ప. 104)

'ఓం కారః పరమం బ్రహ్మ సర్వమంత్రేషు నాయకమ్' యనెడి వాక్యానుసారము ఓంకారమే పరబ్రహ్మయని తెలియుచున్నది. పంచాక్షరి కూడా శివపరబ్రహ్మ రూపమే యని చెప్పబడినది. ఒకవిధముగా చెప్పవలెననిన ప్రణవమునకును పంచాక్షరికిని యభేదము చెప్పబడినది. ముదిగొండ వీరభద్రయ్య గారు తమ సర్వేశ్వర శతక వ్యాఖ్యానమున ప్రణవము సూక్ష్మ పంచాక్షరి యని తెలిపిరి. ఇట్టి స్థితలో లింగధారి కర్తవ్యమెట్టిది యనెడి సందేహమేర్పడును. రెంటికీ గల యభేదము దృష్ట్యా, ప్రణవమును గ్రహించిన చాలును అనెడి యభిప్రాయము కలుగవచ్చును. అష్టావరణములలోనొకటగు పంచాక్షరీ మంత్రమును జపించని యెడల ధర్మాచరణ క్రమబద్ధము కానేరదు కదా ! ఈ స్థితిలో రెంటిని గ్రహించవలెనని తెలియచెప్పుటయే యీ భగవత్పాదుల వారి యుద్దేశమని గ్రహించవలెను.

ఈ కారణము మూలమున భక్త స్థలములోని సాధకుడు ప్రణవ సహిత పంచాక్షరిని మాత్రమే జపించవలెనని గ్రహించవలెను. వీరశైవునకు నెట్టి స్థితిలోను పంచాక్షరి యవిస్మరణీయమని గ్రహించవలెను. ఎవ్వరు నెట్టి ప్రమాణములు చూపినా పంచాక్షరిని వీడకూడదని తెలిసుకొనగలరు.

శుభం భూయాత్

## ఆశీర్వచనము - 6

**శ్లో॥ మూలం విద్యా శివః శైవం సూత్రం పంచాక్షరస్తథా ।**
**ఏతాని నామధేయాని కీర్తితాని మహామనోః ॥** (23)

పంచాక్షరీ మహా మంత్రమునకు అయిదు ప్రసిద్ధమైన నామములు గలవు. అవి మూలము, విద్యా, శివము, శైవసూత్రము మరియు పంచాక్షరము.

**శ్లో॥ పంచాక్షరీ మిమాం విద్యాం ప్రణవేన షడక్షరీమ్ ।**
**జపేత్ సమాహితో భూత్వా శివపూజా పరాయణః ॥** (24)

శివపూజా పరాయణుడైన వాడు, ప్రణవమును చేర్చికొని, పంచాక్షరిని షడక్షరిగా మార్చుకొని, శివపూజా సమయమున జపించవలెను.

**శ్లో॥ ప్రాణాయామ త్రయం ప్రాకృత్వా ప్రాఙ్ముఖోదఙ్ముఖో పివా ।**
**చింతయన్ హృదయాంభోజే దేవదేవం త్రయంబకమ్ ।**
**సర్వాలంకార సంయుక్తం సాంబం చంద్రార్ధ శేఖరమ్ ।**
**జపేదేతాం మహావిద్యాం శివరూపమనన్యదీః ॥** (26)

శివపూజా పరాయణుడైన వాడు, తూర్పునకు లేదా ఉత్తరమునకు ముఖుడై కూర్చుండి, తన హృదయ కమలమునందున సర్వాలంకార సంయుక్తుడు, త్రినేత్రుడును, చంద్రశేఖరుడును, అంబికా సహితుడును అగు శివుని చింతన చేస్తూ, వేరైన దేదియును చింతించక, షడక్షరిని జపించవలెను. ఏకాగ్రచిత్తమెంతో ముఖ్యమైనదని యెరుగవలెను. పంచాక్షరీ మంత్రమున కైదు పేర్లు గలవనియును, శివపూజా పరాయణుడైన వాడు ప్రణవ సహిత పంచాక్షరిని జపించవలెననియును, శ్రీ జగద్గురు రేణుకాచార్య భగవత్పాదులవారు నగస్త్య మహర్షికి నుపదేశించిరి.

పంచాక్షరికి గల పంచనామములు సహేతుకములైయున్నవి. తత్వాత్మకమైన ప్రపంచమునకు శివుడు మూలపురుషుడు. జగదుత్పత్తికి మూలకారణుడు. అదే విధిన, పరశివవాచకమై యున్న పంచాక్షరి జగత్తులోని వర్ణ సమామ్నాయమునకును, అద్దాని యుత్పత్తికిని మూలకారణమగుచున్నది. ఈ కారణమున, యీ మంత్రమునకు, మూల మనెడిది సార్థక నామమయినది. మరికొన్ని యంశములును ఈ భావమును సమర్థించుచున్నవి. జగత్తులోని పంచకములన్నియును పంచాక్షరి నుండి యుద్భవించినవని యింతకు క్రితముననే తెలుపబడినది. పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచేంద్రియములు మొదలగునవి యీ కోవకు చెందినవి. వీటికి మూలమైయున్న, పంచాక్షరికి మూలము అనెడి పేరు గల్గినదని భావించవచ్చును.

సకల విధములగు మంత్రములన్నియును పంచాక్షరి నుండి యుద్భవించి, తిరిగి ప్రపంచము యొక్క లయ దశలో పంచాక్షరిలోనే లీనమగుచున్నవని తెలిపెడి యాగమోక్తులు గలవు. చంద్ర జ్ఞానాగమములోని యీ క్రింది ప్రమాణమును గమనించుడి.

**శ్లో॥ సప్తకోటి మహామంత్రా రూపవక్త్రైరనేకథా ।**
**పంచాక్షరే ప్రలీయంతే పునస్తస్మాద్వినిర్గతాః ॥** (చంద్రజ్ఞాన ఆగమము క్రియాపాదము, 8-45)

పంచాక్షరీ మంత్రము యొక్క సర్వ కారత్వము మరెన్నియో విధములుగా తెలుపబడినది. చంద్రజ్ఞానాగమములోని క్రియాపాదమునందున (14-41) ఎంతో విస్తృతమైన చర్య చేపట్టబడినది. ఈ విధముగా పంచాక్షరికి 'మూల' యనెడి పేరు సక్రమమైనదేయని నిరూపింపబడినది.

విద్య యనెడిది బహువిధములుగా నుపయోగింపబడుచున్నది. అక్షరాస్యత గూర్చియు విద్య అనెడి పదము వాడబడుచున్నది. వాస్తవముగా, జీవ-శివులయైక్యతను నే విధముగా సాధించవలెను అనెడి దానిని. బోధించెడిదే విద్యయని గ్రహించవలెను. పంచాక్షరీ మంత్రజపము వలన శివ-జీవైక్యతా సిద్ధికి మార్గము సుగమమగునని యింతకు క్రితమే చెప్పబడినది. పంచాక్షరీ జప ప్రభావము వలన అట్టి విద్య ప్రాప్తమగునని భావించవలెను. అయితే పంచాక్షరీ విద్యాప్రాప్తికి సాధన మగునే కాని, విద్య కాజాలదనెడి సందేహము కలుగవచ్చును. దీని నివారణకై 'ఘృత'మునకు సంబంధించిన కొన్ని విషయములను పరిశీలించవలసియున్నది. నెయ్యిబలవర్ధినియని ఆయుర్వేదము చెప్పుచున్నది. ఇద్దానిని నుపయోగించుటచే ఆయువు పెరుగునని చెప్పబడినది. దీర్ఘాయువు అనెడి లక్ష్యమును సాధించు నిమిత్తము ఘృతము సాధనమగును. కాని కొందరి మతము ప్రకారము ఘృతమే దీర్ఘాయువు. ఈ ఉక్తిని చూడుడి 'ఆయుర్వై ఘృతం' ఘృతాయువులకు నభేదము చూపబడినది. ఇదే న్యాయమున పంచాక్షరి, విద్యయగుచున్నది. ఈ విధముగ, విద్యయనెడి పేరు సార్థక నామమైనది. పంచాక్షరిని పండితులు ఈ నామము చేత పిలుతురు.

పంచాక్షరి వలన సకల సన్మంగళములు సిద్ధించునని తెలుపబడినది. అంతే కాదు మంగళ స్వరూపుడును శివుని వాచకమైన యీ మంత్రమునకు 'శివ' యనెడి పేరు కల్గినది.

శైవధర్మమునకు సంబంధించినవియును, శివతత్త్వమునకు సంబంధించినవియూనగు అనేక సూత్రములు ఈ మంత్రములో సూక్ష్మముగా చెప్పబడినవి. ఈ కారణమున యీ మంత్రమునకు శైవసూత్రమనెడి పేరు గల్గినది. పంచవర్ణములు గల్గియున్నందున దీనికి పంచాక్షరి యనెడి పేరు గల్గెను.

మంత్రశాస్త్రము ప్రకారము ఓంకారమనెడిది మంత్రములన్నింటికిని మస్తకము వంటిది. ఈ కారణముననే శ్రీ జగద్గురువుల వారు 'షడక్షరీం జపేత్' అని ఆనతినిచ్చిరి.

ఏ మంత్రముకైననూ గురూపదేశము ఉండవలెను. వీరశైవ ధర్మము ప్రకారము శ్రీ గురువు, దీక్షా సమయమున, ఈ మంత్రోపదేశమును చేయును. వివాహముకంటెను పూర్వమే గర్భవతియై చరించెడి స్త్రీకిని, ఆమెకు కలిగెడి సంతానమునకు సమాజమున మన్నన లభించదు. తల్లిగా ఆమె పొందిన బాధ నిరర్థకమగును. తపస్సు ఫలించని తాపసి వలె, వేదన ననుభవించవలెను. గురూపదేశము లేకుండగా, మంత్రజపమును చేసెడి వాని గతియునట్టిదే. వీరశైవుడు దీక్షను పొంది విధి ప్రకారము మంత్రోపదేశమును బడసి, జపమును సలుపవలెనని గ్రహించవలెను.

ఏదో ఒక ధార్మిక అనుష్ఠానమును ఆచరించునప్పుడు శాస్త్రోక్త విధిని ఆవశ్యకముగా అనుసరించవలెను. జపానుష్ఠానమునకై శాస్త్రముల యందు స్థానము సనము దిక్కు ప్రాణాయామము న్యాసము మరియు దేవతలు వివరింపబడినవి. చంద్రజ్ఞాన ఆగమములో నున్న ఈ శ్లోకము గమనార్హమై యున్నది.

**శ్లో॥ వామదేవ ఋషిశ్చాశ్చ పంక్తిశ్ఛంద ఉదాహృతః ।**
**దేవతాచ శివఃసాక్షాత్ ప్రణవో బీజఉచ్యతే ।**
**ఉమాశక్తిరితి ప్రోక్తాన్యాసశ్చైవ షడక్షర్యాః ॥** (చం.జ్ఞా॥, క్రి.పా. 8-10)

ఈ రీతిగా షడక్షర మహామంత్రమునకు వామదేవుడే ఋషి. పంక్తియే ఛందస్సు. సదాశివుడే దేవత. ఓంకారమే బీజము ఉమయే శక్తి. శివుడే కీలకం అని నిరూపించనైనది. ఈ మహా మంత్రమును జపించునప్పుడు పూర్వము చెప్పిన విధముగా ఋష్యాదులను తన శరీరమునందున భావన చేత న్యాసము చేసుకొనవలెను. ఈ విషయమున లింగధారణ చంద్రిక యందు ఈ క్రింది విధముగా చెప్పబడినది.

**శ్లో॥ ఋషిం మూర్ధ్ని ముఖే ఛందః దేవతాం హృది విన్యసేత్ ।**
**ఆధారే బీజశక్తించ పాదయోః కీలకం న్యసేత్ ॥** (లిం.చ. పుట-134)

ఈ రీతిగా న్యాస ప్రకారము ప్రతిపాదించబడినది. దీని తాత్పర్యమేమనగా మస్తకమందున ఋషిని ముఖమునందున ఛందస్సును హృదయమునందున దేవతను నాభియందున బీజమును గుహ్యమునందున శక్తిని పాదమునందున కీలకమును న్యాసము చేసుకొనవలెను. ఋష్యాదులను ఈ విధముగా భావనాత్మకముగా శరీరము యొక్క విభిన్నమైన స్థానముల యందు స్థాపించుకొనునదే న్యాసము.

న్యాస ప్రకారము ఈ రీతిగా నున్నది. కుడిచేతిని ముష్ఠిగా బిగించి దాని అంగుష్ఠము చేత మస్తకమును ముట్టి అచ్చట ఋషిని, పిడికిలిని విప్పి అంగుష్ఠమును మరియు తర్జన వేళ్ళ చేత నోటిని ముట్టి ఛందస్సును అంగుష్ఠము మరియు మధ్యమ వ్రేళ్ళ చేత హృదయమును స్పృషించి అచ్చట దేవతను అంగుష్ఠము మరియు అనామికముల చేత నాభిని స్పృషించి, అచ్చట బీజమును అంగుష్ఠము మరియు కనిష్ఠములచేత గుహ్యమును స్పృషించి, అచట శక్తిని, రెండు చేతుల తర్జనీవ్రేళ్ళను కలిపి కట్టిన పిడికిలి చేత క్రమముగా కుడి పిడికిలిని ఎడమ నుండి కుడికి ఎడమ పిడికిలిని కుడి నుండి ఎడమకు మస్తక పరిక్రమమును చేసి కుడిచేతి తర్జని చేత కుడి పాదము యొక్క అంగుష్ఠమును ఎడమ తర్జని చేత ఎడమ పాదము యొక్క అంగుష్ఠమును రెండు పాదములయందు కీలకమును న్యాసము చేయవలెను.

ఈ న్యాస ప్రక్రియయు దేహ న్యాసము అంగన్యాసము మరియు కరన్యాసమని మూడు విధములుగానున్నది. అది మరల సృష్ఠి న్యాసము స్థితి న్యాసము, సంహార న్యాసము అనెడి మూడు విధములుగానున్నది. వీటిలోని సృష్ఠిన్యాసము గృహస్థలకును, స్థితి న్యాసము బ్రహ్మచారులకును సంహార న్యాసము సన్యాసులకును నిరూపితమైనది. అయితే వీరశైవ సిద్ధాంతమునందున ఈ రీతిగా ఆశ్రమ భేదముల చేత న్యాసభేదమును అంగీకరించబడలేదు. ఈ కారణమున ఏదో ఒక న్యాస పద్ధతిని తమ ఇచ్ఛానుసారముగా స్వీకరించవలయునని శ్రీ నీలకంఠ శివాచార్యులవారు క్రియాసారమనెడి గ్రంథమునందు చెప్పిన విచారమును షట్‌స్థలబ్రహ్మ శంభులింగ శివాచార్యుల వారు తమ అష్టావరణ వివేకము (పుట 95) ప్రతిపాదించిరి. ఈ న్యాస విధానములను తమ తమ గురువు గారు ఉపదేశించిన ప్రతి ఒక్కరు శ్రద్ధతో స్వీకరించవలెను.

జపము యొక్క స్థాన విషయమున ఆగమశాస్త్రముల యందు ఇల్లు, ఆవుల కొట్టము, పుణ్యారణ్యము, రమ్యమైన పర్వతము, నదీతీరము మరియు దేవాలయములు ఉత్తరోత్తర శత సహస్ర ఆయుత లక్ష మరియు కోటి విధములుగా హెచ్చినను ఫలదాయకములని ప్రతిపాదించబడినది. ఇది ఇటులుండగా వామహస్తమున లింగమును యిడుకొని అద్దానిని సాక్షిగా గొని చేసెడి జపమునకు అగణితమైన ఫలము లభించునని చెప్పబడినది. ఈ క్రింది శ్లోకమును గమనించుడి.

**శ్లో॥ యదిష్ట లింగం సంపశ్యన్ వామహస్థ స్థితిం పరం ।**
**జపతే తత్ఫలం వక్తుం న మయా శక్యతే గురో ॥** (చం.జ్ఞా., క్రి.సా. 8-74)

ఈ ప్రమాణములో ఇమిడియున్న అర్థమేమనగా వామహస్తమున యుండెడి ఇష్టలింగము యొక్క సాక్షియందు చేసిన జపము యొక్క ఫలము అగణితమైనది. దీనికి అవధులు ఉండవు. ఈ కారణము వలన పైన చెప్పిన ఏదో ఒక స్థానమునందు జపము చేయవలసి యుండిన ఎడల ఇష్టలింగము యొక్క సాక్షమునందు జపమును చేయునదే సర్వోత్తమమైయున్నది.

జపాభ్యాసమును చేయునపుడు కూర్చుండు ఆసనము మహత్వ పూర్ణమైనది. ఆసనము లేకుండా నేల మీద కూర్చుండి జపమును చేయకూడదు. ఆసనమునకై కృష్ణా జినము వ్యాఘ్ర చర్మము, కుశాసనము మరియు కంబళాసనములు ప్రసిద్ధములైయున్నవి. వీటి యందున 'సర్వసిద్ధస్తు కంబళే' అనెడి శృతి ప్రమాణము ప్రకారము కంబళి ఆసనమును వేసుకొనుటయే ఉత్తమోత్తమమైనది. ఆ కంబళి మీద కూర్చుండి సుఖాసనము లేదా సిద్ధాసనము నందున పూర్వాభి ముఖము లేదా ఉత్తరాభిముఖముగా కూర్చుండి జపమును

ప్రారంభించవలెను. జపాభ్యాసమునకై అంగుళి రేఖా శంఖమణి పగడము, స్ఫటికము, స్వర్ణమణి, కుశగ్రంధి (దర్భముడి) మరియు రుద్రాక్ష మాలలు ప్రతిపాదించబడినవి. వీటిలో రుద్రాక్షమాలయే సర్వశ్రేష్ఠమైనది. వీటియందున పదునైదు మణుల మాల చేత మారణ ఉచ్చాటనాది అభిచార క్రియాసిద్ధి ఇరువదియైదు మణుల మాల చేత ముక్తి ప్రాప్తి, ఇరువది ఏడు మణుల మాల చేత పుష్టి వృద్ధి ముప్పది మణుల మాల చేత ధనప్రాప్తి నూట ఎనిమిది మణుల మాలచేత జపమును చేసిన ఎడల సర్వార్థ సిద్ధియు లభించును. ఇంతే గాక రుద్రాక్ష మాలచేత జపమును చేయునపుడు అంగుష్ఠము చేత చేసిన ఎడల మోక్ష తర్జని చేత చేసిన ఎడల శతృనాశనము, మధ్యమచేత చేసిన ఎడల ధనప్రాప్తి, అనామిక చేత చేసిన ఎడల శాంతిప్రాప్తి కనిష్ఠముచే చేసిన ఎడల ఆకర్షణ శక్తి కలుగునని చంద్రజ్ఞాన ఆగమములోని క్రియాపాదము 8-65-70 నందున నిరూపించనైనది.

జపాభ్యాసము చేయు వీరశైవ సాధకుడు శరీరము మీద అంగీ మరియు రుమాళ్ళను ధరించుకొని గాని, వివస్త్రుడై గాని, ముక్తకేశుడై గాని, మాటలాడుచూ గాని జపమును చేయకూడదు. జపము చేయునపుడు, కామ, క్రోధ మరియు మదవృత్తులు మనస్సు నందు రాకుండా జాగ్రత్త వహించవలెను. జప సమయమున అలసత్వమును గాని త్రేన్పులు, ఎక్కిళ్ళు, ఆవిళ్ళు తీయడము గాని విడిచి వేయవలెను. అకస్మాత్తుగా కామాది వృత్తులు గాని, వెక్కిళ్ళు గాని వచ్చిన ఎడల ఆచమనము మరియు ప్రాణాయామము చేసి పునః జపమును ప్రారంభించవలెను. జపకాలమునందున అక్షరములు లోపము గాకుండునటుల జాగ్రత్త వహించవలెను.

పైన చెప్పిన నియమములను పాటించకుండా ఉండినప్పుడు మూగ, సుప్త, మృత, నగ్న, వీర్యహీన, వృథాఫల భుజంగ, కీలిత మరియు శూన్య మొదలగు దోషములు సంభవించును. వీటియందున న్యాసము లేనిది చేసిన జపము మూగ, ఆసనము లేనిది సుప్తము, ప్రణవరహితముగా యుండిన ఎడల మృతము, నమః స్వాహా, వషట్, హుం, ఫట్ మొదలగు ఫల విరహితముగా యుండిన నగ్నము, అధిక వర్గములుగా యుండిన వీర్యహీనము, గురూపదేశ రహితముగా యుండిన వృథా ఫలము, ఋషి, దేవతా మరియు ఛందో హీనముగా యుండిన ఎడల భుజంగము, మధ్య బీజాక్షరములు లేకుండా యుండిన కీలితము, జపించెడి మంత్రోచ్చారణ వేరే వారికి వినిపించిన ఎడల ఫలము శూన్యము – ఈ దోషములు గురించిన వివరములు పుట-234, 235లో ఇవ్వబడినది.

ఇవే గాక అభక్త అక్షర భ్రాంత లుప్త చిన్న హ్రస్వ దీర్ఘ, కథన మరియు స్వప్న కథనములనెడి దోషములు సంభవించును. మంత్రము ఎడల శ్రద్ధ లేకపోయినా అవి అభక్తము, ప్రమాదము చేత మంత్రాక్షరములు వైపరీత్యమైన ఎడల అక్షర భ్రాంతము, మంత్రాక్షరములు లోపమైన ఎడల లుప్తము, సంయుక్తాక్షరముల యందు ఏదో ఒక అక్షరము విభక్తమైన ఎడల ఛిన్నము, దీర్ఘ వర్ణమును హ్రస్వముగా ఉచ్ఛరించిన ఎడల హ్రస్వము, హ్రస్వ వర్ణమును దీర్ఘముగా పల్కిన ఎడల దీర్ఘము, గోపనీయమైన మంత్రమును ఇతరులకు చెప్పిన ఎడల కథనము దానినే స్వప్నావస్థలో జెప్పిన ఎడల స్వప్నాకథనము అగుచున్నవి. ఇంతకుముందు వర్ణించిన దోషములయందు అక్షర భ్రాంతము మొదలుకొని స్వప్నకథనము పర్యంతముగా గల దోషములు సంభవించిన ఎడల గురువుగారి నుండి మళ్ళీ ఉపదేశములను పొంది దోషనివారణ పొందవలెను. ఇంకను మొదటిదగు అభక్త దోషమును తానే నివారించుకొనవలెను అనగా శ్రద్ధను పెంచుకొనవలెను. దోషయుక్తమైన జపము ఫలప్రదము గాజాలదు. అందుచేత దోషములు కలుగకుండా తగిన జాగ్రత్తలు పాటించవలెను.

జపాభ్యాసమును ప్రారంభించుటకు ముందే "ప్రాణాయామ త్రయం కృత్వా" అనెడి భగవత్పాదుల యొక్క ఆనతి ప్రకారము విధి విధానము ననుసరించి మూడుసార్లు ప్రాణాయామము చేసి హృదయ కమలమునందున దేవాదిదేవుడైన మహాదేవుడిని ధ్యానించి, అన్యమునందు మనస్సును లగ్నము చేయకుండ ఏకాగ్రతతో జపించిన యెడల, ఆ జపమునకు సంపూర్ణ ఫలము సిద్ధించును.

అనేకమంది జనులు నోటిలో మంత్రమును జపిస్తూ, మనస్సునందు అన్యవిషయములందు ఆసక్తిని కల్గిన వారు కొందరైతే, మరికొందరు, మంత్రమును జపిస్తూ మధ్యమధ్యమున జపమును నిల్పివేసి, వ్యవహార సంబంధిత సంభాషణలు కూడా జరుపుచుందురు. అందువలన వారికి ప్రగతిశూన్యమై, చేసిన పరిశ్రమ మొత్తము వ్యర్థమగును. అటువంటి తీరికలేని వేళ్ళలో పరిమితమైన కాలములో జపమును ఏకాగ్రతతో చేసి ముగించుట శ్రేయస్కరము. ఈ కారణము వలన పూజ్యులు భగవత్పుదులు రేణుకాచార్యుల ఉపదేశానుసారము 'జపేదేతాం మహావిద్యాం శివరూప మనన్యధీ' యనెడి ప్రమాణముగా గైకొని ప్రతి యొక్కరు ప్రాణాయామము చేసి ధ్యానయుక్తముగా మంగళమయమైనటువంటి ఈ మహామంత్రమును జపించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులగు చంద్రశేఖర శివాచార్యుల వారు పంచాక్షరీ మంత్రము గురించి వివరించి, జపమును చేసెడి యావశ్యకత గురించి తెలియజేసిరి.

'మూలమాధ్యే' యనెడి యమరములోని వాక్కు ప్రకారము మూలమనెడి పదము మొదటి దానికి వర్తించును. మూలాతీతి మూలం యనెడిది మూలము యొక్క వ్యుత్పత్తి 'మూల ప్రతిష్ఠాయాం' ధాతువు మూల పదమునకు నుత్పత్తి స్థానమైయున్నది. ఈ జగత్తుకు దేవుడే మూలమని షట్ త్రింశత్ తత్త్వజ్ఞులు తెలుపుదురు. శివునికి శివమంత్రమున కభేదము గలదని తెలుపబడినది. ఈ ప్రమాణమును గనుడి.

**శ్లో॥ వాచకో వర్ణరూపస్య ద్వాచ్యస్తు పరమేశ్వరః। (శివాగమము)**

శివుడెట్లు జగన్మూలుడై యున్నాడో యతని మంత్రము కూడా మూలస్థానమున నుండెడిదగును. సదాశివుని పంచముఖముల నుండి మొట్టమొదట న-మ-శి-వా-య యనెడి యక్షరము లుద్భవించినవని తెలుపబడినది. ఈ కారణముననే పంచాక్షరిని మూల మంత్రమని పిలుతురు. ఈ క్రింది ప్రమాణమును గనుడి -

**శ్లో॥ జపేత్పంచాక్షరీ మేతాం విద్యాం పాశవిముక్తయే ।**
**అనేన మూల మంత్రేణ శివలింగం ప్రపూజయేత్ ॥**

పంచాక్షరి యనెడి మూలమంత్రమును పఠిస్తూ శివలింగమును పూజించిన యెడల పాశబంధము తొలగిపోవుననెడిది యీ శ్లోకములోని భావము.

లోకముననేకమైన విద్యలు గలవు. వీటిలో శ్రుతియే యుత్కృష్టమైనదని తెలుపబడినది. 'విద్యాసు శ్రుతి రుత్ కృష్టా' యనెడిది పౌరాణిక వాక్కు. 'ఉత్కృష్టా రుద్రైకాదశినీ శ్రుతౌ, తత్ర, పంచాక్షరీ' యనెడి ప్రమాణము ప్రకారము పంచాక్షరి శ్రుతికంటెను ఘనమైనది. దీనికి గల కారణమును వివరించెడి యీ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ సప్తకోటి మహామంత్రై రుపమంత్రై రనేకశః ।**
**పంచాక్షరీ ప్రలీయంతే పునస్తత్ర వినిర్గతాః ॥**
**అస్మిన్ వేదాశ్చ శాస్త్రాణి సర్వే పంచాక్షరే స్థితాః ॥**

సర్వమంత్రోప మంత్రములు, వేదములు, శాస్త్రములు పంచాక్షరిలో గలవని యీ ప్రమాణము తెలుపుచున్నది. ఈ కారణముననే పంచాక్షరికి విద్యయనెడి నామధేయము గలదు.

విద్యలన్నింటికినీ మాతృ స్థానమున నుండి మూలవిద్య యనదగిన పంచాక్షరి క్రమ ప్రకారముగా జపించెడి వారికి సకల శుభములు గలుగునని తెలుపబడినది. "మాంగల్యం పావనం ధర్మ్యం సర్వ కామ ప్రసాధనమ్" అనెడి పురాణోక్తి ప్రకారము ప్రథమవిద్యగా నెంచబడిన పంచాక్షరీ జపముచే శుభములు చేకూరును. వాయవీయ సంహిత ప్రకారము శివపంచాక్షరి అశేషార్థ ప్రదాయకమైనది. ఈ కారణము వలననే దీనికి 'శివ' యనెడి పేరు గల్గినది. శివయనగా శివంకరమైనదని గ్రహింపదగినది.

లోకమున భోగాసక్తి గలవారికి పంచాక్షరి శుభములు గల్గునటులే, శివయోగము ననుభవించే వారికి తత్త్వజ్ఞానమును గలుగ జేయునదియును పంచాక్షరియే. పంచాక్షరిని జపించుట చేత మోక్షము లభించునని తెలుపబడినది. 'కైవల్య మార్గదీపః' అనెడి స్కాందవచనము ప్రకారము పంచాక్షరి యవిద్యను నాశనము చేసి కైవల్య మార్గమును సూచించును అందుచేత దీనిని 'శివసూత్రమని' యందురు.

ప్రపంచమున గల సకల విధములగు పంచకములకు మూల జన్మస్థానమని యెంచబడిన పంచాక్షరిలోన పంచ అక్షరములు గలవు "నమశ్శబ్ద వదే త్పూర్వం శివాయేతి తతఃపరం" అనెడి ప్రమాణమీ విషయమును సూచించుచున్నది.

ఈ విధముగా మూలము, విద్య, శివము, శివసూత్రము మరియు పంచాక్షరి యనెడి నామధేయములు సార్థక నామధేయములగుచున్నవి.

ఇట్టి మహత్త్వపూర్వమైన పంచాక్షరీ జపము వలన యుత్తమ ఫలితములను పొందగోరువారు పూర్వాభిముఖము గానో యుత్తరాభిముఖముగానో కూర్చుండి జపమును చేయవలెను. హృదిన శివుని ప్రతిష్ఠించుకొనవలెనని చెప్పబడినది.

వీరశైవుడు ఇష్టలింగార్చన కుపక్రమించినయప్పుడు మొదటన పూర్వోక్తి విధిన కూర్చుండి జపమును చేయవలెను. యిష్టలింగ పూజ చేయునప్పుడు దృష్టిని యిష్టలింగము మీద నిలిపి పంచాక్షరిని జపించవలెను.

శుభం భూయాత్

## ఆశీర్వచనము - 7

**శ్లో॥ జపస్తుతిః త్రివిధః ప్రోక్తో వాచికోపాంశు మానసః ।**
**శ్రూయతే యస్తు పార్శ్వ స్థైర్యదా వర్ణ సమన్వయః ॥**
**వాచికః సతు విజ్ఞేయః సర్వపాప ప్రభంజనః ।**
**ఈశత్ స్పృష్ట్వా ధరపుటం యొూమందమభిధీయతే ॥**
**పార్శ్వ స్థైర్య కృతః సోయముపాంశుః పరికీర్తితః ।**
**అస్పృష్ట్వా ధరమస్పందిజిహ్వాగ్రం యొూంతరాత్మనా ॥**
**భావ్యతే వర్ణరూపేణ సమానస ఇతి స్మృతః ॥** (27-29)

జపము మూడు ప్రకారములుగా నుండును. అవి - వాచిక, ఉపాంశు మరియు మానసికములు, సమీపమున గల వ్యక్తికి స్పష్టముగా వినిపించెడి విధముగా జపించునదే వాచిక జపము. ఈ జపము చేత త్రికరణ జన్మపాపములు దూరముగును. రెండు పదవుల సహాయములో వేరెవ్వరికినీ వినపడని విధిన జపము చేసెడి విధమును ఉపాంశు జపమని యందురు, నాలుకను, పెదవులను కదల్చకుండగ మనస్సులోనే చేసికొనెడి జపము మానసిక జపము.

**శ్లో॥ యామతః కర్మయజ్ఞా ద్యా వ్రత దానతపాంసి చ**
**సర్వే తే జపయజ్ఞస్య కలాం నార్హంతి షోడషీం ॥** (30)

వ్రతదాన తపస్సులనెడి అన్ని ప్రకారముల కర్మ యజ్ఞములు జపయజ్ఞములోని పదహారవ భాగమునకు సరితూగజాలవు.

**శ్లో॥ మహత్త్వం వాచిక స్యైత జ్జపయజ్ఞస్య కీర్తితం ।**
**తస్మాచ్ఛ తగుణో పాంశుః సహస్రో మానసం స్మృతః ॥** (31)

కర్మయజ్ఞముల యందున వాచిక జపయజ్ఞము శ్రేష్ఠమైనది. దీనికంటెను నూరుపాళ్ళు అధికముగా గుణము నిచ్చెడిది యుపాంశుః జపము. మానసిక జపము వేయిరెట్లు గుణము నిచ్చెడిదైయున్నది.

**శ్లో॥ వాచికాత్ తదుపాంశోశ్చ జపాదస్య మహామనోః ।**
**మానసోహి జపః శ్రేష్ఠో ఘోరసంసార నాశకః ॥**

వాచిక జపము కంటెను, ఉపాంశు జపము కంటెను నతిఘోరమైన సంసారమును నాశనము చేసెడి మానసిక జపము శ్రేష్ఠమైనది.

**శ్లో॥ ఏతేష్వేతేన విధినాయధాభావం యథా క్రమం ।**
**జపేత్ పంచాక్షరీమేతాం విద్యాం పాశముక్తయే ॥** (33)

పూర్వోక్తమైన జపములను ఒక్కొక్క దానిని ఆశ్రయించి, అద్దాని విధి ప్రకారమే, భావపూర్వకముగా జపించిన యెడల సంసార పాశము నుండి ముక్తి లభించును.

శ్రీ జగద్గురువు రేణుకాచార్య భగవత్పాదుల వారు జపములను వర్గీకరించి, అవి మూడు విధములనియును, వాచకోపాంశు మానసికములే ఆ మూడు విధములనియును శ్రీ అగస్త్య మహర్షి వారికి ఉపదేశించిరి.

విధి ప్రకారము త్రికరణశుద్ధితో చేసెడి జపమును గురించి తెలుపుచూ, దీనికి యజ్ఞ దానతపస్సులు సాటిగా రాజాలవని శ్రీ భగవత్పాదుల వారు తెలియజెప్పిరి. ఇట్టి సత్క్రియ, జపయజ్ఞమని పిలువబడుచున్నది.

యజ్ఞమంటే యేమిటో తెలిసికొనుట యెంతోను అవసరము యజ్ అనెడి ధాతువు నుండి యజ్ఞమనెడి శబ్దము నిష్పన్నమైనది. యజ్ అనగా పూజించు లేదా భజించు అనెడి అర్థములు ఇవ్వబడినవి.

యజ్ఞము యొక్క ప్రయోజన మెట్టిదో తెలిసికొనవలెను. సామాన్యముగా మానవుని ప్రవృత్తి యధోముఖముగా నుండును. తత్ఫలితముగా నతడు తన త్రికరణముల చేత నిషిద్ధ కర్మలను చేయుచున్నాడు. పాపియై పతితుడుగా అగుచున్నాడు. ఇట్టి పతితులు తమను తాము ఉద్ధరించుకొని పావనులుగా మారుటకై గల మార్గములెట్టివి యనే జిజ్ఞాస కలుగును. శాస్త్రవిహితమైన మార్గములెన్నియో కలవని తెలిసికొనగలరు.

“యజ్ఞేన దానేన తపసా నాశకేన” అనెడి శ్రుతి ప్రమాణము ప్రకారము యజ్ఞ, దాన, తపసాదుల ద్వారా పతితమైన వాడు పుణ్యము నార్జించి సంప్రాప్తమైన దోషముల నుండి విముక్తిని పొందవచ్చును.

యజ్ఞము బహువిధములుగా నుండుననియును, హవనకుండమున యగ్నిని ప్రేల్చి హవిస్సును దేవతకు ప్రదానము చేసెడిది అట్టి పలురకములైన యజ్ఞములలో నొకటనియును గుర్తించవలెను.

అగ్నిని ప్రేల్చి హవిస్సుల నిచ్చెడి యజ్ఞమును కర్మయజ్ఞమని యందురు. యజ్ఞమనెడిది ఒక సత్కర్మయని మనువు తెలిపిరి. జ్యోతిష్టోమాది ప్రభేదముల చేత కర్మయజ్ఞములు నానా ప్రకారములుగానున్నవి. యజ్ఞములలో బహుళ ప్రచారము నొందిన కర్మయజ్ఞము వలన పరిమితమైన, అశాశ్వతమైన ఫలము లభించునని, గీతాదులు తెలుపుచున్నవి.

యజ్ఞములు ఇచ్చే ఫలముల వంటి ఫలములను తపస్సు, దానము మరియు వ్రతములను చేసి పొందవచ్చును. కృచ్ఛ్ర, చాంద్రాయణాదులు తపస్సుల కోవకు చెందినవి. ఇవి యెంతో కష్టసాధ్యమైనవి. దానము లనేకములుగా నున్నవి. షోడశ దానములు ముఖ్యమైనవిగా యెన్నబడినవి. పురాణోక్త వ్రతములెన్నియో గలవు. వేనకు వేల సంఖ్యలో గలవు. వైష్ణవులు, స్మార్తులు, వీరిని చూసి ప్రభావితులైన యితరులు సత్యనారాయణ వ్రతమును చేసికొనుటను కనుచున్నాము. శైవులు కేదారీశ్వర, ఉమా మహేశ్వరాది వ్రతములను చేయుచున్నారు. వీరి ప్రభావమునకు లోనైన వీరశైవులును ఈ వ్రతములు చేయుటయందున నాసక్తిని ప్రదర్శించుచున్నారు.

ఇవి అన్నియును, జపయజ్ఞముతో పోల్చిన ఎడల, అల్ప ఫలములనిచ్చెడివిగా తెలిసికొనలేని స్థితిలో జనులు అనవసరమైన కష్టనష్టములను కొనితెచ్చికొనుచున్నారు. ఇట్టి వారి యజ్ఞానమును తొలగించి, వారికి సన్మార్గమును చూపించుటకే శ్రీ భగవత్పాదుల వారు జప యజ్ఞము యొక్క విశిష్టతను కొనియాడిరి. పూర్వోక్త యజ్ఞ-దాన-తప-వ్రతాదులు జపయజ్ఞముతో సరితూగవనియును, వాటి కంటెను జపయజ్ఞము పదహారు రెట్లు అధికతరమైన ఫలమునిచ్చునని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల నుపదేశించిరి.

కర్మయజ్ఞమును చేయుటకై సాధన సామగ్రులను సంగ్రహించెడి కష్టమును సహించవలసి యుండును. జపయజ్ఞమునకట్టి యవశ్యకతలేదు. ఆబాలవృద్ధుల వరకు నెవరైననూ అతి సులభముగా జపమును చేసుకొనవచ్చును.

జపయజ్ఞము వలన లౌకిక వ్యవహారములకు నెట్టి ప్రతిబంధము ఏర్పడజాలదు. అందరి జీవితములోను, లౌకిక వ్యవహారమునకు చాలా ప్రాముఖ్యత ఉండును. ఆధ్యాత్మిక జీవనమునకు లౌకిక వ్యవహారములు అడ్డుగా నిలుచుననెడి వారెందరోగలరు. అయితే జీవితమున్నంతవరకూ లౌకిక వ్యవహారములు చేసియే తీరవలెననెడి వారెందరో గలరు. ఈ రెంటికి సామరస్యత సాధించెడి వాడే జాణయనెడి అభిప్రాయమునూ కలదు. జపయజ్ఞము నాశ్రయించిన వారికి నిట్టి సామరస్యతను సాధించుటలో నెట్టి యిబ్బందియును ఉండజాలదు.

యతీశ్వరుడొకడు భిక్షను వేడుచు నొక యింటి ముందు నిలిచియుండెను. 'భవతీ భిక్షాందేహి' అనుచు గృహిణిని పిలువజొచ్చెను. అతని పిలుపుల వలన ఫలితము లేకుండెను. అప్పుడు అతడు మౌనము వహించి గృహిణి రాకపోవుటకు గల కారణము గూర్చి తెలిసికొనెడి యిచ్ఛతో లోపలికి తొంగిచూచెను. గృహిణి వడ్లను దంచుచుండెను. అదే సమయమున పొరుగింటి ఇల్లాలును అక్కడికి వచ్చియుండుట ఆమెతో లోకవ్యవహారములను గూర్చి మాటలాడుచుండెను. ఇటు దంచుటయును, అట మాటలాడుటయును నిరాటంకముగా గొనసాగుచుండెను. యతికి నాశ్చర్యము గల్గెను. మాటలాడుటకై దంచుడును ఆపివేయవలసియుండును, కాని ఆమె ఆ విధిన చేయలేదు. ఆమె యొక్క జాణతనమునకు నివ్వెరపోయెను. లౌకిక మరియు నలౌకిక వ్యవహారములు భిన్నమైన వనెడి యభిప్రాయము గల్గిన యతి ఆ విషయము గూర్చి పునరాలోచన చేయదొడంగెను. లౌకిక వ్యవహారములో నిమగ్నులైయుండియూ ఆధ్యాత్మిక సాధన చేయవచ్చుననెడి జ్ఞానోదయ మతనికి గల్గెను. అలౌకిక లక్ష్యసాధనకై సన్యాసము ననావశ్యకమని గ్రహించెను. గృహస్థుడైన వాడు తన ఆధ్యాత్మిక సాధన వలన సన్యాసిగా నుండి సాధన చేసే వానికి సమముగా ఫలమును పొందవచ్చుననని గ్రహించెను.

ఇంతలోనే గృహిణి ద్వారము వైపు చూచి, తన తప్పిదమును తెలిసికొనెను. తాను లౌకిక వ్యవహారములలో పడి యతికి భిక్షవేయకుండగ యుంటిననియును, దాని వలన యతికి యిబ్బంది గల్గినదియని తెలిసికొని బాధకు గురి అయ్యెను. వెంటనే భిక్షను తీసుకొని యతి వద్దకు వచ్చి క్షమించవలసినదిగా వేడినదయ్యెను. అప్పుడా యతి, ఆమె కిట్లనెను –

"ఓ మాతా ! మీరు నన్ను క్షమించమని యడుగవలదు. మీరు ఆలస్యమును చేసి, నాకెంతో నుపకారమును చేసితిరి. మీరు సకాలములో భిక్షను వేసి యుండిన యెడల నాకీ యుపకారము లభించకుండెను. మీరు నాకు గురువులై మౌనముగానే యుపదేశమునిచ్చిరి. ఆధ్యాత్మిక ప్రగతి సాధించుటకై లౌకిక వ్యవహారములు ప్రతిబంధకము కాదని యెరిగితిని. మీకు నా కృతజ్ఞతలు."

గృహిణి కంతా గందరగోళముగా స్ఫురించెను. అతని మాటల నామె అర్థము చేసికొనలేక పోయెను. తెచ్చిన భిక్ష యతి జోలెలో వేసి వెనుదిరిగి వెడలిపోయెను. ఆ పిదప తాను గ్రహించిన యీ విషయమును అందరికీ బోధింపజొచ్చెను.

ప్రారంభదశలో, వీరశైవుడు ఒక నిర్జన ప్రదేశములో కూర్చుండి వాచిక జపమును చేయవలెను. బిగ్గరగా జపించుచు తనకే యింపుగా తోచే వరకు సాధన చేయవలెను. మనస్సు యొక్క చంచలత్వము వైదొలగి ఏకాగ్రత కలుగునంతవరకు వాచిక జపమును కొనసాగించవలెను. పిదప ఉపాంశు జపమును ప్రారంభించవలెను. కొంతకాలము గడిచిన పిదప మానసిక జపమును ప్రారంభించవలెను.

విధి ప్రకారము, భావపూర్ణముగా సల్పెడి మానసిక జపము, భవపాశమును భగ్న మొనరించి శివసాయుజ్య ప్రాప్తిని పొందుటకై జీవునికి సాధనముగా నుపకరించును.

వీరశైవులెల్లరూ యిష్టలింగము పై దృష్టిని కేంద్రీకరించుకొని మానసిక జపమును చేయవలెను. ఏకాగ్రత లేనివారికిది సాధ్యము కాదు. ఈ కారణమున సాధన చేయుచు లక్ష్యమును సాధించుకొనవలెను. శ్రీ రేణుక భగవత్పాదులవారు నుపదేశించిన యటుల మానసిక జపమును చేసి తగిన ఫలమును పొందగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## విశేషప్రదీపిక :

యజ్ఞమనగా నేమిటో తెలియపరచి జపయజ్ఞము యొక్క ప్రాముఖ్యతను తెలుపుచూ శ్రీ కాశీ జగద్గురువుల వారు పంచాక్షరీ మంత్రజపము యొక్క ప్రాముఖ్యతను వివరించి చెప్పిరి.

'స్వాధ్యాయ స్వాజ్జపః' అని చెప్పుచూ అమరసింహుడు జపస్వాధ్యాయముల కభేదమును చెప్పిరి. 'స్వవేదోధ్యయనం స్వాధ్యాయః' అనెడి వ్యుత్పత్తి ప్రకారము తన శాఖకు చెందిన వేదమును పలుమార్లు చదువుటయే స్వాధ్యాయమని చెప్పబడినది. అయితే ఈ వేదములన్నియును పంచాక్షరిలో నిక్షిప్తమై యున్నవని తెలిపెడి యీ క్రింది ప్రమాణమును గనుడి :

'అస్మిన్ వేదాశ్చ శాస్త్రాణి సర్వే పంచాక్షరేస్థితః' శివ యనెడి రెండక్షరములు శ్రుతులన్నింటి కన్న గొప్పవని పౌరాణికులు చెప్పుచున్నారు. ఈ కారణము వలన పంచాక్షరిని జపించుటయే కర్తవ్యమనియును, నా విధిన చేసిన యెడల నాల్గు వేదములను, పారాయణము చేసిన

ఫలము లభించునని గుర్తించవలెను. కొందరు నజ్ఞాన పరవశులై పంచాక్షరిని విస్మరణకు గురిచేయుచు, పంచాక్షరిని జపించెడి వారి కంటెను వేదమును జదివెడి వారే గొప్పవారని తలచుచున్నారు. ఇది శోచనీయమైన విషయము. లింగాంగుడట్టి భ్రమకు లోను కాకూడదనెడిది గ్రహించవలసిన విషయము. వేదమంత్రములు పంచాక్షరికి సమములు కావు. అందుచే వేదమంత్రముల మీద మమతను పెంచుకొని పంచాక్షరిని చిన్న చూపుకు గురిచేసెడి తప్పిదమును చేయకూడదు. భక్తితో పంచాక్షరిని జపించెడి వారికి వేదమంత్రముల నావశ్యకములని గ్రహించగలరు.

జపనం జపః (జప వ్యక్తాయాం వాచి) యనెడి వ్యుత్పత్తి ప్రకారము పలుమార్లు చదువుటయే జపమనిపించుకొనును. చదువుటలో శబ్దోచ్చారణ యిమిడి యుండును. ఉచ్చారణలోని భేదము వలననే జప భేదము లేర్పడునని తెలుసుకొనవలెను.

మంత్రమును నిగూఢమైనదానిగా స్వీకరించవలెనని చెప్పబడినది. గట్టిగా చదువుట చేత మంత్రము యొక్క గోపనము లుప్తమగును. మంత్రమును గుప్తముగా నుంచుకొనవలెననియును నా విధిన చేయకుండిన యెడల నవాంఛనీయములగు పరిణామములుండునని శ్రీ విద్యా వాచస్పతుల వారును నొక కథ ద్వారా తెలియజెప్పిరి. ఈ ధర్మసూక్ష్మము దృష్ట్యా మానసిక జపమే కర్తవ్యమని తెలుసుకొనవలెను.

దీక్షను గొని లింగధారియైన భక్తుడు మానసిక జపమును చేయవలెనని గ్రహించగలరు. ప్రారంభ దశలో కొన్ని యిబ్బందులు గల్గినా, వాటిని యెదుర్కొని మానసిక జపమును చేసెడి ప్రక్రియ పైన పట్టును సాధించవలెను. ఈ విధిన సాధన చేసిన యెడల సాధకుడు సాధనలో పరిపూర్ణత్వమును సంపాదించుకొని మహేశ్వర స్థలమును పొందుటకు అర్హతలను పొందును.

శుభం భూయాత్

ఈ సిద్ధాంతము యొక్క రాద్ధాంతము బౌద్ధములోగల వివిధ భేదములను తెలియజేసెడి ఈ ప్రమాణమును గమనించండి

**అధికారానుగుణ్యేన బౌద్ధశాస్త్రం చతుర్విధం ।**
**ప్రత్యక్షగమ్యం బాహ్యార్థమితి సౌత్రాంతికో బ్రవీత్ ॥**
**బుద్ధ్యాకారానుమే యార్థో బాహ్యోవైభాషికోదితః ।**
**బుద్ధిమాత్రం వదంత్యత్ర యోగాచారోన చాపరం ॥**
**నసన్నాసన్న సదసన్న చోభాభ్యాం విలక్షణం ।**
**చతుష్కోటి వినిర్ముక్తం తత్త్వం మాధ్యమికా విదుః ॥**

బౌద్ధము నాల్గు విధములు, బుద్ధుని శిష్యులైన వైభాషిక, సౌత్రాంతిక, యోగాచార మరియు మాధ్యమికులనెడి వారిచే నివి యేర్పరచ బడినవి. జగత్తు గూర్చి వీరిలో విభిన్నమైన యభిప్రాయములు గలవు. సౌతాంత్రికుని ప్రకారము బాహ్యమునందు ప్రపంచము గలదు. ఇది ప్రత్యక్షముగా ప్రతీతి యందుగలదు. వైభాషికుని మతమున జగత్తు బయటికి తోచదు. అయితే బుద్ధియందు ననుభవమునకు వచ్చుట చేత నద్దానిని బాహ్యమున గలదని అనుమానము వలన గ్రహించవలెను. యోగాచార్యుడు, జగత్తులేనే లేదు. అది మన బుద్ధిలోనే గలదు. మాధ్యమికుడు, శూన్యవాదమును ప్రతిపాదిస్తూ, లోనగాని, వెలుపలగాని, సద్రూపమున గాని, అసద్రూపమున గాని జగత్తు లేనే లేదు. "సర్వం శూన్యం" అంతయూ శూన్యమే.

ఈ నాల్గింటిలో సౌత్రాంతికులు, వైభాషికులును లోన వెలుపలగల వస్తువులన్నింటినీ అంగీకరించి, వాటికి క్షణికత్వమును ఆపాదించిరి. క్షణికత్వమనగా, ప్రతిక్షణముననూ వస్తువు పుట్టి, నాశనమగునని అర్థము. వీరు విరక్తులైయుందురు. యోగాచార్యులు, "ప్రతిమావనితా న్యాయము" చేత బాహ్య వస్తువులనన్నింటినీ విజ్ఞానమనెడి మనస్సునచేర్చి మనోనియమనముతో వైరాగ్యోపదశమును చేయుదురు. మాధ్యమికులు దేనిని ఒప్పక, బాహ్యము లేదు, అంతరమూ లేదనుచు మధ్యస్థులై యుందురు. వీరు సుషుప్తావస్థ యనెడి గాఢనిద్రావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, సర్వ శూన్యవాదము చేత పరమ విరక్తిని దాల్చియుందురు. మిగిలిన వారు స్వప్నావస్థను చూచి, దానిని జాగ్రదావస్థతో పోల్చి వైరాగ్యము నుపదేశింతురు.

## ఆశీర్వచనము-8

**శ్లో॥ అనేన మూల మంత్రేణ శివలింగం ప్రపూజయేత్।**
**నిత్య నియమ పంపన్నః ప్రయతాత్మా శివాత్మకః॥** -34-

నిత్యనియమ సంపన్నుడు తనయిష్టలింగమును మూల మంత్రము చేతనే యర్చించ వలెను.

**శ్లో॥ భక్యా పంచాక్షరేణైవ యః శివ సకృదర్చయేత్।**
**సోఽపి గచ్ఛేచ్ఛివస్థానం మంత్రస్యా స్యైవగౌరవాత్॥** -35-

ఎవ్వడు పంచాక్షరితో శివపూజను నొక్కసారియైనను జరుపునో నట్టి వాడు నా మంత్రప్రభావము చేత శివలోకమును పొందుచున్నాడు.

**శ్లో॥ అబ్భక్షా వాయు భక్షాశ్చ యే చాన్యే వ్రతకర్శితాః।**
**తేషామేతై ర్వ్రతైర్నాస్తి శివలోక సమాగమః॥**

జలమును మాత్రమే సేవిస్తూగాని, వాయుభక్షణ మాత్రమే చేస్తూగాని, మరే యితరములైన వ్రతముల చేతగాని శరీరమును శుష్కించికొనెడి వారికి శివలోకప్రాప్తి కాజాలదు.

**శ్లో॥ తస్మాత్త పాంసి యజ్ఞాశ్చ వ్రతాని నియమాస్తథా।**
**పంచాక్ష రార్చనస్యైతే కోట్యంశేనాపి నోసమాః॥**

లోకమున యాచరింపబడెడి యజ్ఞ దాన తపోనియములును, అనేకానేక వ్రతములును పంచాక్షరీ మంత్రము చేత చేసెడిశివ పూజ యొక్క గరిమకు కోటి యవ వంతుకు కూడ సరిరావు.

పంచాక్షరీ మంత్రము చేత శివుని యర్చించెడి వాడు నియమసంపన్నుడై యుండవలెనని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి. అష్టాంగ యోగములో నియమమనెడిది యొకటి గలదు. అద్దాని గూర్చి తెలిసి కొనుటకై అష్టాంగ యోగము గూర్చి సంక్షిప్తముగా తెలిసి కొనెదముగాక.

పతంజలి మహర్షి విరచితమైన యోగ శాస్త్రమున యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన మరియు సమాధులు యోగాంగములని తెలియజెప్పబడినది. వీరశైవుడు, శివయోగమార్గమున గమనించెడి వాడైనందున, నతడు ఈ అష్టాంగ యోగము గూర్చి తెలిసి కొనుట యెంతో అవసరమై యున్నది.

**పంచ విధ యమములు:**

"అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహాః" (యో.సూ. 2.30) యనెడి యోగసూత్రము ప్రకారము, అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము మరియు అపరిగ్రహములనెడివి పంచవిధయమములు.

అహింసాః " తత్రాహింసా సర్వథా సర్వదా సర్వభూతానామనభిద్రోహః" అనెడి వ్యాసోక్తి ప్రకారము ఎప్పుడైనను, ఎక్కడైనను, ఏ ప్రాణికైననూ ద్రోహము చేయకుండా ఉండెడిదే అహింస యని తెలియుచున్నది.

"తత్ర ప్రాణ వియోగ ప్రయోజనం వ్యాపారోహింసా"యని వృత్తికారుడైన భోజదేవుడు తెలియజేసెను. ఏదో నొక జీవి యొక్క ప్రాణమును తీయునదే హింస యని వీరి వృత్తిలోని భావము దీనిని చేయకుండగ యుండుటయే అహింస. "హింసా చ సర్వానర్థ హేతుః తదాభావో హింసా" యని భోజ దేవుడు తెలిపినది అవిస్మరణీయమైయ్యుంది. అన్నీ యనర్థములకు కారణభూతమైన హింస చేయకుండుటయే అహింస యనెడిది భోజదేవుని వృత్తిలోని భావము.

యజ్ఞాదుల యందున జేసెడి హింస, హింసయగునా? యనెడి విషయమున భేదాభిప్రాయములు గలవు. మీమాంసకుల ప్రకార మది హింస కానేరదు. యజమానికి హింసా ఫలమైన దుఃఖము సంప్రాప్తము కాదు. శాస్త్రవిహితముగా చేసెడి జంతుబలి హింస కాదనియును, అది సత్కర్మయనియును చెప్పబడినది. యోగ శాస్త్రజ్ఞులు, మీమాంసకుల వాదమును త్రోసిపుచ్చిరి. యజ్ఞములు చేసెడి వాడు అహింసా యమమును నుల్లంఘించు చున్నాడనియును, అట్టివానికి దోషము కల్గుననియును, ఆ దోషము యొక్క ఫలమును వాడనుభవించి తీరవలెననియును, యోగ శాస్త్రజ్ఞులు వాదింతురు. యజ్ఞ కర్మవలన వచ్చిన ఫలము స్వర్గాది సుఖములను గలుగ జేసిననూ, అహింస యనెడి దురితమువలన యబ్బిన దుష్కర్మ ఫలమును దూరము చేయ జాలదు. ఈ కారణమన కర్మయజ్ఞమును విస్మరించి జపయజ్ఞమును చేపట్టవలెనని శివయోగానుభావులు తెలిపిరి. శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమును ఈనేపథ్యమున గ్రహించవలసియున్నది. జపయజ్ఞమే శ్రేష్ఠతమైనదని గ్రహించ వలెను.

సాధారణముగా ప్రాణి హింస మూడు విధములుగా నుండునని తెలియుచున్నది. అవి. కృతము, కారితము మరియు అనుమోదితములు. తానే హింసకు పూనుకొనుట కృతమనియును, ఇతరుల చేత చేయించిన యెడల కారితమనియును, ఇతరులు చేసిన హింసను ఆమోదించినచో నది అనుమోదిత మగుననియును తెలిసికొనగలరు. ఇవన్నియును దోషభూయిష్టములే.

మానవుని హింసాప్రవృత్తికి లోభ, క్రోధ, మోహములే కారణములగుచున్నవి. జంతువు మాంసమును తినవలెననియును, వాటి చర్మముల నుండి లబ్ధిని పొందాలనె కోరికలను లోభములుగను పరిణితినిపొంది జంతు హింసకు దారి తీయుచున్నవి. పగబట్టిన వాని క్రోధము పెను భూతమై నర హింసకు కారణమగుచున్నది. యజ్ఞయాగాదులలోను, దేవతార్చనాదులలోను బలులనిచ్చి విశేషమైన ఫలములను పొందవలెననెడి మోహమును పెంచికొని యెంతో మంది జంతు హింసకును, నరహింసకును పూను కొనుచున్నారు. బలిని యిచ్చెడి యజమానియును, చేయించెడి హోతాదులును, యజ్ఞమును తిలకిస్తూ ఆనంద పరవశమున తేలియాడెడి యజ్ఞ ప్రియులును దోషము చేసిన వారగుచున్నారని యోగ శాస్త్రము వలన తెలుపుచున్నది.

పూర్వోక్తమైన దంతయును భౌతిక హింసకు సంబంధించినది. వాక్కుద్వార అవాచ్య శబ్దములను ప్రయోగింఛి యితరులను బాధకు గురి చేయుట యనెడిది హింసయే యగును. దీనిని వాచిక హింసక యని యందురు. మనస్సునందున యితరుల అనిష్టచింతన చేయుట యనెడిది మానసిక హింస యగుచున్నది.

అహింసను పాటించే వాడు భౌతిక హింస కాకుండగా యేవిధిన జాగ్రత్త పడునో, యదేవిధిన వాచిక మరియు మానసిక హింసలు సంఘటించకుండగ జాగ్రత్తను వహించవలెను. ఈ అంశమును నొక్కిచెప్పెడి, ఈశ్వర గీతలోని యీ క్రింది ప్రమాణమును గనుడి:

**శ్లో॥ కర్మణా మనసా వాచా సర్వభూతేషు సర్వదా ।**
**అక్లేషజననం ప్రోక్తాత్వహింసాపరమర్షిభిః ॥** (ఈశ్వర గీత 11-14)

కర్మచేతగాని, వాక్కుచేతగాని, మనస్సుచేతగాని యెప్పుడైననూ యేప్రాణికైననూ క్లేశము కల్గించ కుండగనుండుటయే అహింస.

వీరశైవులు, ఈ విషయమును యెరిగిన వారై అహింసను పాటించవలయును.

**సత్యము :**

సత్యమనగ యదార్ధమును తెలుపునది. ఇతరులను వంచించకుండ, వారిని భ్రాంతికిగురి చేయకుండ, నిరర్ధకముగాని యదార్థమైన నుడియే సత్యమైన వాణి "సత్యం యథార్థే వాఙ్మనసి" అనెడి యోగా శాస్త్ర భాష్యకారుని వాక్కుల ప్రకారము వాక్కు మరియు మనస్సుల యథార్థమే సత్యము. మాటకు, మనస్సు కబేధముండవలెను. మనస్సున యుండేదొకటి, వెలికి మరొకటి చెప్పిన యెడల యది సత్యము కాజాలదు.

ఎల్లప్పుడూ అసత్యమునే పలికెడి వారికి, సత్యము పలుకుట కష్టమనిపించవచ్చును. కాని సత్యమును అభ్యాసమును చేయుట వలన ప్రతి యొక్కరు సత్యమును పలికెడి నిష్ఠగలవారు కాగలరు. మనిషి స్వభావతః సత్య భాషియే. సాంగత్య దోషముల వలననో, మనో బుద్ధులు వికాసమును పొందని దశలోనో అసత్య భాషి యగు చున్నాడు. దురభ్యాసము వలన గల్గెడి యీ దోషమును

సతతము సత్యమును పలికెడి అభ్యాసము చేత దూరముచేసి కొనవచ్చును. సత్యమును పలుకుటయనేది వాక్ పరమైన తపస్సు దీనిని మించిన తపస్సు మరొకటి లేదని తెలిసి కొనగలరు పరమశివుడను గ్రహించిన వాక్కును, దురుపయోగమునకు గురి చేసిన యెడల నయ్యది మహా దోషమగు చున్నది. మనుమహర్షి ప్రకారము అట్టి దోషమును చేసెడి వారు పశుపక్ష్యాది హీనమైన యోనులలో జన్మించుచున్నారు. ఈ కారణము వలన సతతము సత్యమును వచించుటయే శ్రేయస్కరమగుచున్నది. సంయమనమే బ్రహ్మచర్యమనేది వారి నిర్వచనము.

భౌతికముగా సంయమనమును పాటిస్తూ, మైదున విషయమై ఆలోచన చేస్తూ, దానిగురించి మాటలాడుచూ ఉన్న యెడల యది బ్రహ్మచర్యమనిపించికొనదు. ఈ విషయమున యీశ్వరగీత యీ క్రింది విధముగా చెప్పినది.

**శ్లో॥ కర్మణామనసా వాచా సర్వావస్థాసు సర్వదా।**
**సర్వత్ర మైథున త్యాగం బ్రహ్మచర్య ప్రచక్షతే ॥** (ఈశ్వర గీతః 11-18)

శరీరము, వాక్కు మరియు మనస్సుల చేత సర్వదా సర్వావస్థలయందున మైథునమును త్యాగము చేయునదే బ్రహ్మచర్యం అనబడును.

మైథునమునకు వివిధాంగములుండుననియును, వాటిలో కొన్ని ముఖ్యమైనవి యెనిమిది విధములుగా నుండుననియును తెలియుచున్నది. ప్రేయసి లేదా ప్రియతముని స్మరించుట, వారి గూర్చియే మాటలాడుట, వారితో వినోదక్రీడల నాడుట, ఒకరినొకరుమైమరచి చూసికొనుట ఇరువురును కూడికొని గుప్తముగా మాటలాడుట, మనస్సునందున సంకల్పించికొనుట, నిశ్చయించికొనుట మరియు సంభోగ కార్యమును పూర్తి చేయుట యనెడి మైథునము యొక్క అష్టాంగములు తెలుపబడినది. వీటన్నింటినీ త్యాగము చేయుటయే బ్రహ్మచర్యమనిపించికొనును.

మైథునము రెండు రకములుగానుండును. అవి: నైష్ఠిక బ్రహ్మ చర్యము మరియు నుతబ్రహ్మచర్యము. నైష్ఠికబ్రహ్మచారి తన జీవనము యొక్క అంతము వరకును మైథునము యొక్క అష్టాంగములను త్రికరణ శుద్ధి చేత త్యాగముచేయ వలెను. గృహస్థుడైన వాడు, కేవలము సంతానాపేక్ష గలవాడై, నిశ్చితమైన తిథులలో మైథునము చేయుట నుత బ్రహ్మచర్యమనిపించి కొనును. ఇచ్చట, విషయ వాంఛలు తీర్చి కొనుటకై మైదునమొక సాధనమనెడి భావన లుప్తమగును. వీరశైవులు వివాహము పర్యంతము నైష్ఠికబ్రహ్మచర్యము పాటిస్తూ వివాహానంతరము, నుత బ్రహ్మ చర్యమును పాటించవలెను.

**అపరిగ్రహము:**

అన్యుల ధనాదులను గ్రహించి కొనక యుండుట పరిగ్రహమగును. తద్విరుద్ధమైనది అపరిగ్రహము. స్తేయము, పరిగ్రహముల ఫలితమొక్కటే. ఒకరి సొమ్ము మరొకరు పొందుట యనేది యీ రెంటిలోనుగలదు. కాని స్తేయములో చౌర్యము ఉండును. పరిగ్రహములో దానాదులు ఉండును. అపరి గ్రహమనగా దానాదులను తీసికొనకుండుట దానము చేసెడి వాని ద్రవ్యముతో పాటుగా వాడు చేసిన దుష్కర్మము దానము తీసికొనెడి వానికి ప్రాప్తించును. అట్టివాని ద్రవ్యమును గ్రహించిన వాడు సామాజిక లేదా ధార్మిక కార్యక్రమములకు వినియోగించకుండగ, స్వార్థము కొరకు వినియోగించిన యెడల, దానమును గ్రహించిన వాడు పతితుడగును. ఈ కారణమున, పరిగ్రహమును తీసికొని దోషమును పొందుట కంటె అద్దానిని తీసి కొనకుండా ఉండుటయే శ్రేయస్కరము కదా!

"అపరిగ్రహో భోగసాధనా నామనంగీకరః" అని వృత్తికారుడైన భోజదేవుడు, అపరిగ్రహమును నిర్వచించెను. (యో. సూ-వృ. 2-30). భోగసాధనములైన విషయములను గ్రహించకుండా ఉండుటయే అపరిగ్రహము. శబ్దస్పర్శాదులు దోషభూయిష్టములు. వీటికి దూరముగా నుండుట మంచిది, అందుచేత యితరుల ద్రవ్యమును తీసికొనకుండగా ఉండుటతో పాటు, విషయభోగాసక్తికి కూడ విడువవలెను. అప్పుడే అపరిగ్రహవ్రతము పరిపూర్ణమగును.

దేశ, జాతి, సమయ మరియు కాలాదులను బట్టి పూర్వోక్త పంచవిధయమములను సావచ్ఛిన్న, అరవిచ్ఛిన్నములనెడి రెండు విధములుగా విభజింపవచ్చును. దేశ, కాలమాన, జాత్యాదులతో సంబంధము లేకుండ సర్వకాల సర్వావస్థల యందు యమమును పాటించుట నిరవచ్ఛిన్నమైనదిగా గ్రహించవలెను. కొన్నిమినహాయింపులకు బద్ధుడై, యమములను పాటించుట సావచ్ఛిన్న పరమైన

యమమగును. హింసను ఉదాహరణగా తీసికొనిన యెడల విషయము సుబోధకమగును. కొన్ని ప్రాణులను మాత్రమే చంపుచు, మిగతా జీవుల యెడల అహింసాభావము గల్గియుండుట జాతిపరమైన సావచ్ఛిన్నతయగును. దేనినీ చంపకుండుటయే నిరవచ్ఛిన్నత యగును. కొన్ని క్షేత్రాదులందున చేయకుండా ఉంటే అది దేశపరమైన సావచ్ఛిన్నత. ఒక తిథిని మినహాయించి, అన్నిదినములలో హింసనుచేస్తే కాలసంబంధమైన సావచ్ఛిన్నత యనబడును. దేవుని కైమాత్రమే హింసను చేసి, ఇతర సందర్భములలో అహింసను పాటించుటయే సావచ్ఛిన్నయహింస యగును.

పతంజలి మహర్షుల వారు నిరవచ్ఛిన్నత పాటించవలెనని ప్రబోధించిరి ఈ విధిన యమ పాలన నెరపిన యడల నరక ద్వారములన బడెడి కామక్రోధాదులు దరిజేరవు. అందుచేత నిరవచ్ఛిన్నతతో కూడికొని యుండెడి యమపాలన చేయుట యుత్తమము మరియు శ్రేయస్కరమని గ్రహించి, అట్టి యమముల చేత జీవితము చక్కదిద్దుకొనవలెను.

**పంచవిధ నియమములు:**

"శౌచ సంతోషతపస్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః" (యో. సూ.2-32) అనెడి పతంజలి సూత్రము ప్రకారము శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము మరియు ఈశ్వ ప్రణిధానములనెడివి పంచవిధనియమములు.

**1) శౌచము:**

శౌచమనగా శుచి. ఇది బాహ్యమనియు, అంతరంగమనియు అను రెండు విధములుగా నుండును. మన్నుతోగాని, జలముతో గాని శుద్ధిని చేసికొనుట, హితమైనదియు మితమైనదియునగు సాత్వికా హారమును సేవించుట బాహ్యశౌచమగును. మైత్రి ముదితాదులచేత మదాభిమానములకు సంబంధించిన మాలిన్యములను తొలగించుకొనుటయే అంతరంగ శుద్ధియనబడును. వీరశైవుడు అంతరంగ బహిరంగములను శుచిగా పెట్టుకొనవలెను.

**2) సంతోషము:**

తనుకు దొరికిన భోగోపకరణముల వలన సమాధానమును పొంది, అధికమును అపేక్షించక యుండునదే సంతోషమనెడి చిత్రవృత్తి. భోగోపకరణముల చేత సంతోషము లభించదు. సంతోషమునకు మూలకారణము సమాధానమే. ప్రారబ్ధ కర్మానుసారముగా దొరికిన దాని యందున సమాధానమును పొందిన యెడల మనస్సుకు సంతోషముగల్గును. అంతే గాని బోగోపకరణముల ద్వారా జీవనము సుఖమయముకాజాలదు.

**3) తపస్సు:**

"తపోనామశరీర శోషణమ్" అనెడి సూక్తి ప్రకారము శరీర శోషణమునే తపస్సనియందురు, ఆకలి దప్పికలను సహిస్తూ, కాష్ఠమౌనము, ఆకాశమౌనాదులను పాటిస్తూ, చాంద్రాయణాది వ్రతములను పరిపాలిస్తూ తాపసులు శరీరమును శుష్కింపజేయుదురు. వీరశైవేతరులు దీనికి యెంతో ప్రాముఖ్యత నిత్తురు. దేహమును కృశింపజేసి తద్వారా ముక్తిని పొందగలరని చెప్పుదురు.

ఈ విషయమును శ్రీ జగద్గురు రేణుక భగత్పాదులవారు "శివార్థేదేహసంశోధస్తపః కృచ్ఛాదినోమతమ్" (సి.శి. 9-23) అని యుపదేశించిరి. దేహమును శుష్కింపజేసి కొనుట యనావశ్యక యని బోధించిరి. వీరశైవులు ఉపవాసములను చేయవలదు. దేహమును శుష్కింపజేసి కొనవలదు.

**4) స్వాధ్యాయము:**

"స్వాధ్యాయో మోక్షశాస్త్రాణామధ్యయన్ ప్రణవ జపోవా" అనెడి సూక్తి ప్రకారము, మోక్షోపదేశమును చేసెడి శాస్త్రముల అధ్యయనము లేదా ప్రణన జపమునకు స్వాధ్యాయనమందురు. "స్వాధ్యాయాన్ మా ప్రమదః" అనెడి యాదేశము. శ్రుతి సమ్మతమైనది యీ ఆదేశము ప్రకారము స్వాధ్యాయము నిత్యకర్మమైయున్నది.

వీరశైవులకు లింగాంగ- సామరస్యమే మోక్షము. ఇద్దానిని నిర్దేశించెడి యేకైక శాస్త్రమే "సిద్ధాంత శిఖామణి". ఇదియే వీరశైవుల మోక్షశాస్త్రము దీనిని రేణుక గీత యని కూడ అందురు. వీరశైవులు, ఇతర గీతల వైపుకాకర్షింపబడి రేణుక గీతను విస్మరించకూడదు. రేణుక గీతను తప్పని సరిగా పారాయణము చేయవలెను.

**5) ఈశ్వర ప్రణిధానము :**

ఈశ్వరార్పణ బుద్ధియే ఈశ్వర ప్రణిధానము. తాను చేసే ప్రతి కర్మ ఫలమును ఈశ్వరునికే అర్పించవలెను. కర్మఫలము యెడల ఆసక్తి కలిగి యుండకూడదు. దీనివలన జీవుడు తాను చేసిన కర్మల వలన లిప్తుడగుటలేదు. కర్మబంధములు అతనిని అంటవు.

ఇవియే వివిధ నియమములు.

**ఆసనములు:**

"అస్యతే అనే నేతి ఆసనం" అనెడి వృత్తి ప్రకారము, కూర్చుండెడి విశిష్టమైన ప్రకారమునే ఆసనమని అందురు "స్థిరసుఖమాసనమ్" (యో.సూ. 2-46), అని పతంజలి ఆసనమును గూర్చి తెలిపిరి. స్థిరమై, నిశ్చలమై, సుఖప్రదాయకముగా కూర్చుండెడి విధానమే ఆసనమని వీరి భావన. వ్యాఖ్యానకర్తయైన వ్యాసుడు అనేక ఆసనములను గూర్చి వివరించెను. పద్మాసనము, వీరాసనము, భద్రాసనము. స్వస్తికాసనము ఇత్యాదులన్నియును యోగ సాధనకు నుపయుక్తములై యున్నవి. ఈ ఆసనములు శారీరిక స్వాస్థ వర్ధనకును, మానసిక సంతులతను కాపాడుటకును లాభ ప్రదాయకములుగా నున్నవి. శివపూజా పరాయణుడు పద్మాసనము, సిద్ధాసనము లేదా సుఖాసనమును గాని వేసికొని కూర్చుండి శివయోగ సాధనకు నుపక్రమించ వలెను. వీరశైవుల ఆసనములగురించి అంతగా ఆలోచించ వలసిన పని లేదు. ఇచ్ఛానుసారముగా ఆసనమును ఎంపిక చేసి కొని శివపూజలేక ధ్యానమునకుపక్రమించ వచ్చును.

**ప్రాణాయామము :**

శాస్త్రోక్త పద్ధతి ప్రకారము శ్వాస- ప్రశ్వాసల స్వాభావికమైన గతిని నిలిపివేయుటయే ప్రాణాయామము. "... శ్వాస ప్రశాసయోర్గతి విచ్ఛేదః ప్రాణాయామః" అని పతంజలివారు ఉపదేశించిరి. (యో.సు. 2-49).

పూరక, కుంభ- రేచకములనెడివి ప్రాణాయామములోని ముఖ్యమైన యంశములు. ఒక క్రమపద్ధతిని గాలిని పీల్చికొనుటయే పూరకము. అద్దానిని లోపలనే నిరోధించి యుంచుటయే కుంభము. బంధించిన వాయువును క్రమపద్ధతిని వదిలి వేయుట రేచకమని యుందురు. ప్రారంభ దశయందు వీటిని గురువు గారి పర్యవేక్షణలో చేయవలెను. కొంతకాలము పిదప స్వతంత్రముగా చేసికొన వచ్చును. పంచాక్షరీ మహామంత్రజాపకులకు ప్రాణాయామమనెడిది ఫలకారిగా నుండును. చక్కగా అభ్యాసమును చేసి కొనెడి యవశ్యకత గలదని గుర్తించ వలెను.

**ప్రత్యాహారము :**

శ్రోత్రాది ఇంద్రియముల స్వ స్వ విషయముల నుండి విముఖీకరణమే ప్రత్యాహారము. ప్రాణాయామ ముఖ తరముగా చిత్తము నిరోధింపడిన పిదప బయట గల ఇంద్రియములన్నీ తమతమ విషయముల నుండి నివృత్తిని గొనును. అందుచేత చిత్త నిరోధపుకాలమునందున వేరొక ఉపాయము యొక్క అవశ్యకత లేదు. తేనెటీగలలో రాజు స్థానమున నొక ఈగ యుండును. అది ఉండిన యెడల అన్నియును కూర్చుండియుండును. అది యెగిరినచో మిగిలినవి కూడ వెడలిపోవును. అదే విధిన ఇంద్రియములన్నింటికిని రాజు వంటి మనస్సు తన విషయాసక్తి నుండి విముఖత పొందుచున్నది. ఈ విధముగా ప్రత్యా ప్రత్యాహారము సిద్ధించుచున్నది.

**ధారణము :**

"దేశబంధశ్చిత్తస్య ధారణ" (యో.సూ 3-1) అనే సూత్రమున పతంజలి ధారణ యొక్క లక్షణమును తెలియజేసిరి. ఏదో నొకప్రదేశమున చిత్తమును స్థిరముగా నిలుపుటయే ధారణయగు చున్నది. యోగశాస్త్రమునందు నాభి, హృదయము, నాసికాగ్రము మొదలగు విశిష్టస్థానముల యందు లేదా సూర్య చంద్రాది నాడుల యందున చిత్తవృత్తిని నిరోధించుటయే ధారణయని చెప్పబడినది.

వీరశైవమున ధారణకెంతో ప్రాముఖ్యత గలదు. కరస్థలమున గల ఇష్టలింగము మీదను, శరీరములోని హృదయాది స్థానములలోను చిత్తవృత్తిని నిరోధించి పంచాక్షర మహామంత్రమును జపించుచుండవలెను.

**ధ్యానము :**

"తత్ర ప్రత్య యైక తాధ్యానామ్" (యో. సూ. 3-2) అనెది సూత్రమున పతంజలి ధ్యాన లక్షణములను తెలియజేసెను. ఎచ్చట చిత్తవృత్తి నిరోధింపబడినదో నచ్చట ధ్యేయాకారవృత్తిని అఖండముగా ప్రవహింపజేయునదే ధ్యానము. పంచాక్షరీ జపమును ధ్యానయుక్తముగా చేయవలెను. శివయోగసాధకుడనబడెడి వీరశైవుడు, ఇష్టలింగాకారపు జ్యోతిర్లింగము మీదనైనను లేదా హృదయాదులయందున సుస్థిరముగా నిలుపబడిన ప్రాణభావలింగములందు ధ్యేయమును నిలిపి ధ్యానము చేయవలెను.

**సమాధి :**

"తదేవార్థ మాత్ర నిర్భాసం స్వరూప శూన్యమిన సమాధిః" (యో. సూ. 3-3) అనెడి సూత్రముద్వారా పతంజలి సమాధి లక్షణమును నిరూపించిరి. ద్యానాసక్తుడైనవాడు ద్యాతృధ్యానములను మరచి ధ్యేయ స్వరూపుడైనప్పుడు సమాధిస్థితి ప్రాప్తమగుచున్నది. నీరునందున పడిన లవణఖండము కాలాంతరమునందు జలరూపమై తన అస్తిత్వమును వీడి జల స్వరూపముగానే భావించునటుల ధ్యానాసక్తుడగువాడు నిరంతరమైన ధ్యేయముయొక్క చింతన వలన ఎప్పుడు ధ్యేయ రూపుడై సమాధిస్థితి అవస్థనందుడును దీని భావమేమనగా ధ్యానముయొక్క పరిపక్వమైన అవస్థయే సమాధి స్థితి. ఈ విషయమున స్కందపురాణమీ క్రిందివిదముగా చెప్పుచ్చున్నది.

'ధారణా పంచనాడి కార్యానమ్ స్యాత్షష్టనాడికమ్'.
'దిన ద్వాదశకేనైవ సమాధిరభిధీయతే'

ఈ రీతిగా ధారణ, ధ్యానము, సమాధుల యొక్క విలక్షణ తత్త్వము స్కందపురాణములో స్పష్ట పరుచనైనది. నాడికి ఘటికా అను పేరు కలదు. రెండున్నర ఘటికలు అనగా ఒక గంట. పంచానాడి పర్యంతముగా అనగా రెండుగంటలవరకు చిత్తము ఏకాగ్రముగా ఉండినయెడల అది ధారణ అని పించుకొనును. ఇంకను అరువది నాడుల పర్యంతముగా ఇరువది నాల్గుగంటల వరకు చిత్తవృత్తి ఏకాగ్రతను దాల్చిన యెడల అది ధ్యానమనిపించుకొనును. అటులనే పన్నెండు దినముల వరకు నిరంతరము చిత్తవృత్తి ఏకాగ్రత నిలిచినయెడల సమాధియగుచున్నది.

సమాధియనెడిది, అష్టాంగ యోగములోని చివరి అంగము, సద్యాన జపాసక్తుడగువాడు తన నిరంతర సాదన యొక్క ఫలస్వరూపముగా సమాధి స్థితిని పొందుచున్నాడు. ఈ విధముగా అష్టాంగ యోగములు శివయోగమునకు సహాయకములుగా యుండుట చేత పంచాక్షర జపాభ్యాసము చేసెడి వాడు వీటిని తన సాథన యందున అలవరచికొనవలయుననెదిదే పూజ్యులైన రేణుక భగవత్పాదులవారి ఆదేశము. వీరు 'నియమ సంపన్నః' అని సూచించినది ఈ అష్టాంగాయోగము యొక్క వివిధ అంగములకు వర్తించును ఆచార్యులవారి ఆదేశము ప్రకారము ఈ అష్టాంగయోగములను నిత్యము ఆచరించుచూ తన స్థూల మరియు సూక్ష్మ శరీరముల యందలి దోషములను కడిగి సాధకుడు స్థిరమైన చిత్తము గల వాడై తన ప్రయత్నము వలన శివాత్మకుడుగా కాగలుగుచున్నాడు.

పంచాక్షర మహామంత్రము యొక్క మహిమ వర్ణనాతీతమైనది భక్తిసంపన్నుడైన సాధకుడు పంచాక్షరీ మహామంత్ర జపము ద్వారా యిష్టలింగమును పూజించిన యెడల శివ సాయుజ్యము సిద్ధించుచున్నది. పూర్వోక్తమైన అష్టాంగ యోగ సంపన్నుడైన సాథకుడు అదే శివస్వరూపమును పొందుచున్నాడు. అష్టాంగ యోగములను, శివభక్తిని పోల్చి చూచిన యెడల భక్తియే శ్రేష్ట తమ మైనదని తెలియచున్నది. సాధ్యమైన యెడల యోగాంగములను సాధించుకొని పంచాక్షరీ మహామంత్రమును జపిస్తూ యిష్టలింగమును పూజించి శివస్వరూపమును బడయ వచ్చును. ఐతే అష్టాంగయోగము తప్పని సరిగా ఆచరించవలెననునది సరియైనది కాదు. పరిపూర్ణమైనభక్తి గలిగిన వానికి అష్టాంగ యోగములు. తపస్సు, వ్రతములు, చేయవలసిన పనిలేదు. ప్రాణాయామము ద్వారా శ్వాసను బంధించవలసిన పనియూ లేదు. భక్తియోగ సాధన ద్వారా శివజీవ సామరస్యమును సాధించవచ్చును. ఆచార్యులవారుపదేశించిన ప్రకారము భక్తితో పంచాక్షరిని జపించిన చాలును. ఇష్టలింగపూజలో పంచాక్షరిని పఠిస్తూ శివధ్యానమున మునిగియుండెడివాడికి ముక్తి లభించగలదు. ౨ ఇష్టలింగపూజలో రుద్రనమకము, చమకము మొదలగునవి వుపయోగించవలసిన పనియునూ లేదు. సామర్థ్యమున్నవారు వేదమంత్రములను పఠిస్తూ ఇష్టలింగార్చన చేసికొనవచ్చును. అందరూ ఆవిధముననే చేయవలెనను. నిర్భంధము లేదు. **'ఓం నమః శివాయ'** అనెడి మంత్రమును పఠిస్తూ భక్తి, భావపూరితమైన హృదయముతో ఇష్టలింగార్చన చేసిన వానికి గరిష్టమైన ఫలితములు లభించును.

ఈ లోకమునందు కొందరు హఠయోగము నవలంబిస్తూ కేవలము నీటిని సేవిస్తూ లేదా వాయువును భక్షిస్తూ కఠోరమైన వ్రతములను చేయుచున్నారు. వీరు తమ శరీరమును దండనకు గురి చేయుచున్నారు. తత్ఫలితముగా శరీరము సుష్కించి కృషించి పోవుచున్నది. మీదు మిక్కిలి దండనాత్మకమైన వ్రతములనాచరించుటచే మనుజుని మనస్సులోని సాత్విక భావనలు నిర్గమించి రాజస మరియు తామస భావనలు ప్రవేశించుచున్నవి. ఇట్టి సాధకుడు స్వాభిమానముతో అహంకార పూరిత హృదయుడై తిరుగాడెడి ఆస్కారముకలదు. ఈ అభిమాన అహంకారములు శివస్వరూపమును పొందుటకు ప్రతి బంధకములగుచున్నది. అందుచేత శివభక్తి లేని ఇట్టి కఠోర వ్రతాచరాలు శివలోక ప్రాప్తిని కలిగింప జాలవు. అందుకే ఆచార్య రేణుకులవారు "తేషామే త్యావు త్యే నా స్తి శివలోక సమాగమః" అని ఆనతినిచ్చిరి. తపస్సులను యజ్ఞయాగాదులను చేయవలసిన పనిలేదు. ఉపవాసాది వ్రతములే కాకుండా మూర్తి పూజను ప్రోత్సహించెది ఉమామహేశ్వర, సత్యనారాయణ, కేదారేశ్వర వ్రతాదులను శివరాత్రి ఉపవాసాదులును చేయవలసినపనిలేదు. ఇతర నియమములను పాటించవలసిన పనిలేదు శివభక్తి సంపన్నుడై పంచాక్షరీ మహామంత్రమును జపించుచూ ఇష్టలింగార్జన చేయుచూ యుండిన క్రమేపీ దివ్యమైన శక్తులు చేకూరి దేనినైననూ సాధించెడి సమర్థత కలుగుచున్నది. దీనికి కారణము లేక పోలేదు. కోటానుకోట్ల వ్రతముల ఫలము పంచాక్షరీ జపఫలములో కోటిలో ఒక్కభాగమని గుర్తించవలెను. ఇంత అల్పమైన ఫలితములనిచ్చె వ్రతాదులలో కాయము,మనస్సు మరియు ద్రవ్యమును వినియోగించి జీవితమును వ్యర్థము చేసికొనుట కంటె నిరంతరము యిష్టలింగదారియై పంచాక్షరీ మంత్రమును జపిస్తూ రోజుకొక్క సారి యిష్టలింగార్చనను చేసిన యెడల లింగాంగసామరస్యమైన ముక్తి సులభసాధ్యమగునుగదా! ఈ సందర్భమున మరొక విషయమును తెలుసుకొనవలసియున్నది. గురూపదేశమును పొంది తద్వారా శివమంత్రమును ఉపదేశముగా గురువుగారి నుండి గ్రహించి సాధన చేయుట తప్పనిసరి అట్లు కాకుండా ఒకరిని చూచియో, పుస్తకములనుచదివియో, ఒకరు చెప్పగా వినియో లేదా తనకు తోచిన విధముగా యిష్టలింగార్చనను చేయుటవలన ఆశించిన ఫలితము లభించదు. ఈ విషయమను వీరశైవులు గ్రహించి సద్గురువు వలన లింగ దీక్షనుపొంది మంత్రోపదేశమును, తత్త్వోపదేశమును గురువుగారి నుండి సంపాదించుకొని జీవితములను సార్థకపరచుకొనెదరుగాక.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

దీ. 13-09-1990

స్థలం: శివానుభవ మంగళ భవనము, షోలాపురము.

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులును, విద్యావాచస్పతులును, విశ్వారాధ్య జ్ఞాన సింహాసనాధీశ్వరులును అగు చంద్ర శేఖర శివచార్యులవారు, పతంజలి యోగములను సమీక్షించి వీరశైవులకు వలయు హితబోధను చేసిరి.

వీరశైవ ధర్మమున విహితము మరియు హితప్రదమును యిష్టలింగార్చనను యని తెలుపబడినది. బ్రాహ్మణాదులకు సంధ్యావందనాదులు నెట్టివో, వీరశైవులకు నిష్టలింగార్చన యట్టిది. వారు సంధ్యా వందనాదులను వీడజాలరు. వీడిన యెడల నట్టి చర్య వారి ధార్మికయస్తిత్వమునకు ప్రమాదకారిగా పరిణమించును. అదే విధిన యిష్టలింగార్చనను వీరశైవులు విధిగానాచరించవలసిన ధార్మిక చర్య. ఇద్దానిని మరిచిన యెడల వీరశైవుని యస్తిత్వమొకప్రశ్నగా మిగిలిపోవును.

లింగార్చనను షణ్మతములకు చెందిన వారెల్లరును భక్తితో చేయుదురు. వీరు పీఠముననున్న లింగమునో లేదా దేవాలయములోని లింగమునో యర్చింతురు. తన్నిమిత్తమై బ్రాహ్మణాదుల సహాయమును స్వీకరింతురు. ఈ పురోహితులు, వారివారి సంస్కారమున కనుగణముగా వివిధ మంత్రముల నుపయోగింతురు, వేదము తెలిసిన వారు శ్రీరుద్రము, పురుషసూక్తము, శ్రీ సూక్తము మొదలగునవి యుపయోగింతురు. కొందరు పురాణోక్తమంత్రముల నుపయోగిస్తే మరికొందరు వాగమోక్త మంత్రముల నుపయోగింతరు.

శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము ప్రకారము, పంచాక్షరీ మంత్రము చేతనే యిష్టలింగమునర్చించ వలెను. వీరశైవులకు స్థావర లింగార్చనలతో పనిలేదు. పంచాచార అష్టోత్తరణ నియమములను పాటిస్తూ పంచాక్షరీ మంత్ర పఠనముతో యిష్టలింగపూజను చేసిన చాలును.

కొందరు, లోకము పోకడననుసరించి వేద మంత్రముల నుపయోగించ దలచవచ్చును. అట్టి వారు శ్రీ రుద్రములోని మంత్రములనునుపయోగించవచ్చును. కాని ప్రతి మంత్రమునకు మొదలున మరియు చివరన పంచాక్షరిని జోడించుటలో నౌచిత్యముండును.

శ్రీ రుద్రేతరములగు వేదమంత్రములు నిష్టలింగపూజలో నుపయోగింపదగినవి కావు.

ఈ విధముగా నిష్టలింగార్చన చేసెడి భక్తునికి శివలోక ప్రాప్తియగునని తెలుపబడినది. శివలోక ప్రాప్తియనగా సాలోక్యముక్తి యని గ్రహించగలరు. వీరశైవుడు సాలోక్యముక్తిని వాంఛించకూడదనెడి నియమ మొకటి గలదు. అందుచేత, స్థావరలింగార్చకులగు వీరశైవేతరులు శివపంచాక్షరిని జపించుచు స్థావర లింగపూజసల్పిన యెడల సాలోక్యముక్తి కైవసమగును.

వీరశైవ ధర్మము ప్రకారము భక్తస్థలమున నుండెడి భక్తుడు నెల్లప్పుడును మాహేశ్వర స్థలమును ప్రవేశించుటయే తన లక్ష్యమని యెంచి లక్ష్య సాధనకై భక్తి శ్రద్ధలతో పంచాక్షరిని జపించుచు నిష్టలింగార్చనను చేయుచుండవలెను.

సాలోక్యముమ వాంఛిచెడి వారు సాధారణముగా వ్రత, తప, యజ్ఞాది కర్మల నాచరింతురు శివరాత్రివ్రతమును చేసి శివలోకమును చేరిన వారి కథలను శివ పురాణములో గాంచగలము, శిలాదుని తనయుడు తపస్సు చేసి శివసాక్షాత్కారమును పొంది గణ పదవిని పొందిన కథయును ప్రఖ్యాతిన గలవు. శివపంచాక్షరిని జపించుచు శివ లింగమును పొందగలరనెడిది గ్రహించవలసిన విషయము.

లోకమున కామితార్థముల నాశించెడి వారు నధికసంఖ్యలో నుందురు. ఇట్టివారు యజ్ఞ, దాన, వ్రత, తపాదుల నాచరించి వారి వారి కోరికలను నెరవేర్చికొనుటకు ప్రయత్నించు చుందురు.

వాజపేయ యజ్ఞమనెడి ప్రఖ్యాతి వహించిన యజ్ఞమొకటి గలదు. స్వర్గాది భోగముల నాశించెడి వారలీ యజ్ఞము నాచరింతురు. ఈ యజ్ఞమునెంతయో వ్యయ ప్రయాసలతో చేయ వలసియుండును. సామాన్యులిట్టి యజ్ఞమును చేయలేరు. ఈ యజ్ఞము నాచరించెడి సమయమున నియమపాలన జరుగని యెడల ఫలము చేకూరదు. పంచాక్షరివలన వేయి వాజపేయ యజ్ఞములు చేసిన ఫలము లభించునని తెలిపెడి యీ క్రింది ప్రమాణముగనుడి:

**శ్లో॥ పంచాక్షరీం సముచ్చార్య పుష్పం లింగే వినిక్షిపేత్ ।**
**యస్తస్వ వాజపేయానాం సహస్ర ఫలమిష్యతే ॥**

పంచాక్షరిని జపించుచు నొకపుష్పమును శివలింగమున పెట్టిన వానికి సకల కామితార్థములు సహస్రనాజపేయములు చేసిన ఫలితమును. సిద్ధించును గుర్తించవలెను. యజ్ఞయాగ తప వ్రతాదులను చేయవలసిన పని లేదని శ్రీ భగవత్పాదులవారి యుపదేశము. శ్రీ నీలకంఠశివాచార్యులవారు క్రియాసారమున నీ మంత్రము గురించి యీ విధిన తెలిపిరి:

**శ్లో॥ సర్వమంత్రాధికశ్చాయ మోంకారాద్యషడక్షరః**
**సర్వేషాం శివభక్తానా మశేషార్థప్రసాధకః ॥**

పంచాక్షరి వలన సర్వార్థములు సిద్ధించును.

యజ్ఞ యాగాదుల వలన లభించెడి ఫలము క్షనికమైనదని గీతాదులు బోధించుచున్నవి. శాశ్వతమైన ఫలముల నివ్వజాలవు. కాని పంచాక్షరి వలన పామరుడైనను పరమ పదమును పొందగలడని తెలిపెడి యీ క్రింది ప్రమాణమును గమనించుడి:

**కిమిహ బహుభిరుక్తైర్మంత్రమేక్ మహాత్మా**
**ప్రణవసహిత మాదౌ యస్తు పంచాక్షరాఖ్యం**
**జపతి పరమ భక్త్యా పూజయన్ దేవదేవం**
**సగత దురిత బంధో మోక్షలక్ష్మీంప్రమాతి ॥**

ఇట్టి మహిమాన్వితమైన మంత్రమును శ్రీగురువు కటాక్షించిన పిదప నన్య మంత్రముల గురించి యాలోచించుట వ్యర్థమని చెప్పెడి యీ క్రింది హిత భోధను గనుడి

**సర్వాన్ దేవాన్ పరిత్యజ్య యజేత్ పంచాస్యమిశ్వరం**
**సర్వాన్ మంత్రాన్ పరిత్యజ్య జపేత్ పంచాక్షరీం సదా ॥**

పంచాక్షరిని మినహాయించిన యెడల, మిగిలిన మంత్రములన్నియును త్యజ్యములేయని గ్రహించ గలరు.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-9

శ్లో॥ అశుద్ధోవా విశుద్ధోవా సకృత్ పంచాక్షరేణ యః।
పూజయేత్ పతితో వాపి ముచ్యతే నాత్ర సంశయః ॥ (సి.శి: 38)

శుద్ధి సహితుడైననూ శుద్ధి రహితుడైననూ, పతితుడైననూ, పంచాక్షరీ పఠన యుక్తముగా శివపూజనము నొక్కసారియైననూ, చేసిన యెడల నిస్సంశయముగా ముక్తుడగును.

శ్లో॥ సకృదుచ్చార మాత్రేణ పంచాక్షరమహామనోః।
సర్వేషామపి జంతూనాం సర్వపాపక్షియో భవేత్ ॥ (సి.శి: 39)

పంచాక్షరీ మహామంత్రము నొక్కసారి జపించిన మాత్రముననే సకలప్రాణుల యొక్క సకల విధములైన పాపములు తొలగుచున్నవి.

శ్లో॥ అన్యే పి బహవో మంత్రాః విద్యంతే సకలాగమే।
భూయో భూయః సమభ్యాసాత్ పురుషార్థప్రదాయినః (సి.శి: 40)

ఆగమములన్నిటి యందు వేర్వేరు మంత్రములెన్నియో గలవు. వాటిని మరల మరల జపించిన గాని పురుషార్థములు లభించవు.

శ్లో॥ ఏషమంత్రో మహాశక్తిరీశ్వరప్రతిపాదకః।
సకృదుచ్చారణాదేవ సర్వసిద్ధిప్రదాయకః ॥ (సి.శి: 41)

ఈశ్వర ప్రతిపాదకమై మహా శక్తివంతమైన యీ పంచాక్షరీ మంత్రము నొకసారి జపించిన మాత్రముననే, సకలాభీష్టములు సిద్ధించును. ఇందులో సందేహమునకాస్కారములేనే లేదు.

ఇహలోకమున అష్టాంగ యోగము నాచరించెడి యోగుల కంటెను భోగులే అధిక సంఖ్యలో నున్నారు. విహితకర్మలనాచరిస్తూ ధర్మబద్ధమైన జీవితమును గడిపెడివారి సంఖ్య తక్కువగానే యుండును. నిషిద్ధకర్మల నాచరించుచు నిరంతరము నధర్మజీవితమును గడిపెడివారే యధిక సంఖ్యాకులు ఈ స్థితిలో యోగులు, పరిశుద్ధాంతరంగులు శివ పంచాక్షరిని జపించుచు శివలింగము నర్చించి సద్గతిని పొందుదురనేది నిర్వివాదాంశమే. కాని యపరిశుద్ధాంతరంగులై, అపవిత్రులై, అకార్యముల నాచరించుచు అన్యాయ మార్గాను వర్తులై అధర్మపరాయణులై పతనమయ్యేడి గతి యొట్టిది? యనెడి సందేహము కలుగును. అట్టి వారిని యుద్ధరించి లోకకల్యాణమును సాధించుటకై శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు పంచాక్షరీ మంత్రమును జపించిన యెడల ముక్తుడగునని యుపదేశమునిచ్చిరి.

శివుడు సదాశుద్ధుడై యుండును. పవిత్రుడుగా నుండెడి శివుని స్పృశించిన వారు నపవిత్రులుగా నుండగల్గుదురే? పంచాక్షరీ మంత్రజపము చేత పతితుడు సమున్నతుడుగను, అపరిశుద్ధుడు పరిశుద్ధుడుగను, అధర్మి ధర్మిగా పరిణామమును జెందును.

మంత్రశాస్త్ర, విధి విధానము ప్రకారము జపమును చేయని యెడల, ఆ జపము సత్ఫలితముల నివ్వజాలదు. పురాణాగమాదులలోను ఈ విధినే తెలుపబడినది. కాని పంచాక్షరీ మంత్రమునకు యివన్నియును విహితములుకానేకావు. యమ నియమాదులతో పని లేదు. న్యాసాదుల నాచరించెడి యవశ్యకత లేదు ప్రాణాయామాదులతోనూ పని లేదు. అచంచలమైన భక్తి భావముండిన చాలును. ఇతరము లనావశ్యములు. భక్తిచేత నొక్క సారి పంచాక్షరిని జపించిన చాలు, పరమపదము సులభసాధ్యమే.

మంత్ర శాస్త్రము ప్రకారము జపము ఫలప్రదముకావలెననిన, విహితమైన సంఖ్యమేరకు కనిష్ఠ పక్షముగా జపము చేయవలెను. జపసంఖ్య పెరిగిన కొలది ఫలము గుణాధిక్యతను పొందును. ఇట్టి ప్రతిబంధక నియమావళి లేకుండగ నుండుటయే పంచాక్షరి యొక్క విశిష్టతయైయున్నది. ఏకకాలము జపించిన చాలును అనేక జన్మలలో చేసిన పాపములు పరిహారమై ముక్తి లభించుచున్నది దీనికి గల కారణములనేకములు. ఒక్కనిప్పురవ్వ, దూదిపర్వతమును భస్మీపటలము చేయునుకదా! అగ్నిలో నుండెడి శక్తియట్టిది.

పంచాక్షరీ మంత్రమునకు గొప్ప శక్తి గలదని శ్రీ భగవత్పాదులవారు నుపదేశించిరి. ఇట్టి గొప్ప శక్తిగల పంచాక్షరిని జపించిన పిదప పాపములెట్టుల మిగిలియుండును? పాపములు భస్మమగుట తథ్యము అని శ్రీ భగవత్పాదులవారు నభయమునిచ్చిరి. ఈ విషయమున శ్రీ షణ్ముఖ స్వామి వారి వచనము గమనార్హమైయున్నది.

**ಅರಿಯದೆ ಒಂದು ವೇಳೆ ಓಂ ನಮಃಶಿವಾಯ ಎಂದೊಡೆ**
**ಮರೆದುಮಾಡಿದ ಹಿಂದೇಳು ಜನ್ಮದ**
**ಕರ್ಮದ ಕಟ್ಟು ಹರಿದು ಹೋಯಿತ್ತು ನೋಡಾ।**
**ಅರಿದೊಂದುವೇಳೆ, "ಓಂ ನಮಃಶಿವಾಯ" ಎಂದೋಡೆ ದುರಿತ ಸಂಕುಲ ವೆಲ್ಲ ದೂರಾಗಿಹವು ನೋಡಾ।**
**ಇದಿಕಾರಣ, "ಓಂ ನಮಃಶಿವಾಯ" , "ಓಂ ನಮಃಶಿವಾಯ" ಎಂಬ ಮಂತ್ರವನ್ನು ಜಪಿಸಿ, ನಾನಾ ಭವದ**
**ಬಳ್ಳಿಯ ಬೇರುಕಿತ್ತೋಗೆದೆನಯ್ಯಾ! ಅಖಂಡೇಶ್ವರಾ!**

దీని తెలుగు రూపము:

**అరయక నొకవేళ 'ఓం నమఃశివాయ' యనిన మరచి చేసిన వేనుకటేడు జన్మల కర్మపు కట్టు విరిగి పోయినవి చూడుమో।**

**అరసినొక వేళ 'ఓం నమఃశివాయ' యనిన దురిత సంకులమెల్ల దూరమైనవి చూడుమో।**

ఇది కారణము,

**'ఓం నమఃశివాయ', 'ఓం నమఃశివాయ' యనెడి మంత్రమును జపించి, నానావిధ భవపు వల్లిది వేరు చిత్తైనదయ్యా! అఖండేశ్వరా!**

కామ క్రోధాదులకు, భయ భీతులకును, హాస్యాదులకు లోనైన వాడును, వీటికారణమున శివనామము నుచ్చరించిన యెడల, అట్టి ఉచ్చారణ సత్ఫలితములను కలుగజేయునని శ్రీమద్భాగవతమున చెప్పబడినది. ఈ కారణమున, తెలియునదేమనగా జీవితమందున, యెటులైననూ సరియే, ఒక్క పర్యాయము పంచాక్షరీ మహా మంత్రమును జపించవలెను. ఆ విధిన చేసిన వారికి శివసాయుజ్యము లభించును. ఈ విషయమున మనోహరమైన కథయొకటి గలదు.

ఒక ఊరిలో శివయోగప్పయనెడి యొక శివభక్తుడుండెను. అతడు ధర్మతత్పరతగలిగన వాడై మంచి ఆచారవంతుడైయుండెను. అతడు సంవత్సరమున కొక్కటినుండి నాల్గుసార్ల వరకు తమ యింటికి సంబంధము గల్గిన గురువులగు శ్రీ మ.ఘ.చ. పంచాక్ష శివాచార్య మహాస్వాములవారిని పిలిపించికొని భయభక్తులతో సేవించికొనుచుండెను. స్వాముల వారు విచ్చేయగనే, యింటి వారెల్లా నొకచోటుకుచేరి, గురువుగారికి పాదపూజలను చేసి, క్రియాపాదోదక కరణ ప్రసాదములను స్వీకరించి, పునీతులై, గురువులకు పక్వాన్నములను వడ్డించి, వారు తృప్తిగా ప్రసాదగ్రహణ చేసిన పిదప చేతికి నిండుగా దక్షిణనిచ్చి సాగనంపుచుండిరి. గురువుగారు పదేపదే వచ్చుట చేత కుటుంబ సభ్యులందరకూ సకాలములలో దీక్షాదులు నొసంగబడెను. అందరూ లింగధారణ మరియు పూజనములను విధిగా చేయుచుండిరి. అయితే, ఆ యింటిలోని ఒక్కడు మాత్రము ఈ విధి విధానమునకు విరుద్ధముగా ప్రవర్తించుచుండెను. లింగమును ధరించకుండగ తిరుగాడుచుండెను. దీక్షాదులకు దూరమయ్యెను. చండీశ్వరుడను పేరుగల్గిన వాడు, ఫాలమున భస్మమును ధరించకుండెను. గురులింగజంగమాదులకు తలవంచక తిరుగుచుండెను. ఒక్కసారి యైననూ శివనామమునుచ్చరించలేదు. గురుపూజాదులను చూచుటకైనను ఇష్టపడకుండెను. గురువుగారు ఇంటికి విచ్చేయుచున్నారనెడి వార్త తెలియగనే, గురువు వచ్చుటకు ముందుగనే, చండీశ్వరుడు ఇంటిని వదలి ప్రచండమైన మారుతము రీతిన వెడలి పోవుచుండెను. గురువుగారు వెడలి పోవునంత వరకు ఇంటికి తిరిగి వచ్చెడి వాడు కాదు. ఈ విధిన చండీశ్వరురడొక భవిగాను, నాస్తికుడుగాను ప్రవర్తించుచుండెను. శివయోగప్పయును అతని యింటి వారు చండీశ్వరుని సన్మార్గమున మళ్ళించుటకై శతవిధములుగా ప్రయత్నించి విఫలమనోరథులైరి. పేరుకు తగినట్లుగా చండియై ప్రవర్తిస్తూ, పెద్దలను గౌరవించక తిరుగుచును ఊరిలో చెడ్డ పేరును సంపాదించికొనిన కొడుకును గాంచి, శివ యోగప్ప అత్యంత మనోవేదనకు గురి అయ్యెను. కాలము గడచిన కొలది చండీశ్వరునిలో నధర్మపరాయణత్వము పెరిగెను. దుర్మార్గుడయ్యెను. తండ్రికి తల నొప్పిగా పరిణమించెను.

శివ యోగప్ప తన మనోవేదనను భరించజాలకుండెను. కొడుకునుద్ధరించికొన వలెననెడి కోరిక ప్రబలమయ్యెను. దిక్కుతోచని స్థితిలో గురువు నాశ్రయించి తరుణోపాయముబొందనెంచెను. ఒక దినమున యుదయకాలముననే గురువుగారి సన్నిదికి చేరి సాష్టాంగ పడి లేచి, ముకుళిత హస్తుడై యీ క్రింది విన్నపమును చేసెను.

" ఓ గురుదేవా! నా పూర్వజన్మలోని సంచిత ప్రారబ్ధ కర్మయేమో యనునట్లు, ఎప్పుడూ మానకుండా నుండెడి పుండు మాదిరిగను కొడుకు పుట్టినాడు. సామ దాన భేద దండోపాయముల నుపయోగించియో, మరో విధిననో, వానిలో మార్పు తీసికొని రావలెను. వానిని ధర్మపరునిగా చేయుడి. లేని యెడల, వాడు నొకే ఒక్కసారియైననూ శివమంత్రము నుచ్ఛరించెడి విధముగా చేయుడి వానినుద్ధరింపుడి" యని పరిపరి విధములుగా ప్రాధేయ పడెడి శిష్యుని గాంచి పట్టదేవుల వారిట్టులనిరి. "ఓ శిష్య రత్నమా! నీ స్థితినిగాంచి మాకును చింత గలుగుచున్నది. నీ కొడుకును మార్చెడిది నా బాధ్యతయైయున్నది. ఈ విషయమున నీవు నిశ్చింతగా ఉండుము అంతా మన మంచికే యని భావించి కొనుము. నీ కొడుకును మార్చుటకై యొక యోజన గలదు. మీరందరు తదనుగుణముగా మెలగుడి" ఆపిదప స్వాములు యోజన యొక్క వివరములనిచ్చిరి. గురుదేవులు ఇంటిలోనికి ప్రవేశించిరి.

పూర్వ యోజన ప్రకారము శ్రీ గురువు శిష్యుని యింటి కొక నాడు దయచేసిరి. భక్తుని యింటికి విచ్చేసిరి. ద్వారము వద్దనే శ్రీ గురువుకు పాదముల కభిషేకము, పూజను చేసి, హారతి నెత్తి, ఆ హారతిని పూర్ణకుంభముపైనయిడి, యెంతో సంభ్రమముతోను, సంబరముతోను స్వాగతమును పలికిరి. గురువుగారు గృహములోనికి ప్రవేశించిరి. భవియు, నాస్తికుడును అగు చండీశ్వరుడు వెనుకటి ద్వారము ద్వార నిర్గమించుటకు యత్నించెను. వీలు కాలేదు. ద్వారమునకు తాళము వేయబడియుండెను. తాళము చెవికై యీ గూడు ఆగూడులను వెతికెను. లాభము లేకుండెను. గురువు ఇంటిలోనికి వచ్చినాడని తెలిసికొని హతాశుడయ్యెను.

ఏమి చేయవలెనో దోచలేదు. ఒక గదిలో యొకమూలకు నక్కి కూర్చుండి యుండెను. విషయము నెరిగి, చండీశ్వరుని తండ్రి గురువు గారిని వెంటనిడుకొని, చండీశ్వరుడున్న గది లోనికి ప్రవేశించెను. "ఓ గురుదేవా! మూర్తీభవించిన జ్ఞాన రూపమా! దొంగ చిక్కినాడు. విచారణ ప్రారంభించుడి" యని శివయోగప్ప శివయోగీశ్వరునకు సవినయముగా విన్నవించి కొనెను. చండీశ్వరుడు, అందరి ముందునుండియే, తప్పించికొని బయటికి వెడలుటకై ప్రయత్నించెను. సాధ్యము కాలేదు. అందరూ అతనిని చుట్టు ముట్టి యుండిరి. దుష్టభావముగల్గిన చండీశ్వరుడు పాము వలె బుస్సు బుస్సు మనెను. కోపమును ప్రదర్శించెను. గురువు తన శాంత స్వభావమును వీడలేదు. చండీశ్వరునికిట్టులనెను. వత్సా! నేనిప్పుడు నీ సంరక్షణార్థమై బయలుదేరి వచ్చితిని. నిన్ను ధర్మమార్గమునకు తెచ్చియే తీరవలెననెడి సంకల్పముతో మఠమునుండి బయలు దేరితిని. నీ యుద్ధరణ యైన పిదపయే వేరగు కార్యక్రమము చేపట్టబడును. ఓ బిడ్డా! నేనిప్పుడు నిన్ను ఏ ధార్మిక కార్యక్రమమును చేయుమని చెప్పను. కేవలము ఒక్కసారి శివ పంచాక్షరిని పఠించిన చాలు. మా అందరి చెవులార వినే విధిన ఒకే ఒక్కసారి శివ పంచాక్షరిని పఠించుము. మంకుపట్టును వీడుము. చండా! ఓం నమఃశివాయ అని అనుము ఎందుకు మౌనముగా ఉంటావు"

గురువు గారి మాటలను వినిన చండీశ్వరుని యందు చలనము రాలేదు. ఇంకను జడుడయ్యెను మూర్ఖత్వము హెచ్చెను. గురువుతో వాదనకు దిగెను. "ఈ జగత్తులో నెవ్వరునూ ఎప్పుడునూ గానని వాడైయుండి, కేవలము కాల్పనికముగా నేర్పడిన వాని పేరును నన్ను స్మరించమని యందురే? అదెప్పటికీ సాధ్యము కాదు" అని ఛీదరించి కొనుచు, గట్టిగా అరుస్తూ, బల ప్రయోగము చేసి పరువెత్తి పారిపోవుటకు ప్రయత్నించెను. బ్రహ్మతేజోసంపన్నుడును, యోగము ద్వార దృఢపడిన వజ్ర కాయముగలవాడును, అమిత బలశాలియును అగు శ్రీగురువు, అందరికినీ విస్మయమును గొలిపేవిధిన, చండీశ్వరుని మట్టి గరిపించి, నేలకు అదిమి పట్టి, అతని మీద కూర్చొనెను. చండీశ్వరుడు నేల కొరిగినా, యతని యహంకారము నేలకొరగక వికటాట్టహాసమును చేయుచు వికృతముగా నాట్యమాడెను. గురువు గారు గద్దించి, శిష్యునికి భయముగలిగే విధముగా నిట్టులనెను. "ఇప్పటికైనా బుద్ధి తెచ్చికొని "ఓం నమఃశివాయ" అని యనుము. నిన్ను నేను వీడను. నీ పని పట్టుటకే వచ్చితిని నా మాట వినకుండిన నీగతి యేమగునో ఊహించికొనుము. మూర్ఖమును వీడు. శివనామమును జపించుము" గురువుగారి మాటలు, చేష్టలు చండీశ్వరునిలో భయమును పుట్టించెను. కాని వాని పట్టుదలకు భయము పుట్టలేదు. మొండితనము హెచ్చెను. బుద్ధిమందగించెను. కోపము పెరిగెను. గట్టిగా ఇట్టులనెను "ఓయీ గురుదేవా! నేను నీకు భయపడను. నీవునా ప్రాణమును తీసికొనినా నేను "ఓం నమఃశివాయ" అనను. ఇదినానిశ్చయము. నీవేమి చేసికొనెదవో చేసి కొనుము" వానికి తెలియకుండగనే వాని నోటినుండి ఓం నమఃశివాయ అనెడి పలుకులు వచ్చెను.

శ్రీ గురువు దిగ్గున లేచెను. నేను వచ్చిన పని ముగిసినదనెను. "వత్సా నీ విక లెమ్ము నీ యిష్టము వచ్చిన యటుల మెలగుము" అని చండీశ్వరుని లేవనెత్తెను. గురువుగారు లేచుచుండగనే "సాంబజయ నమః పార్వతీ పతయే హరహర మహాదేవ" అనెడి జయ ఘోషలు మిన్ను ముట్టెను. ఇంటిలోని ప్రతి యొకరు జయ ఘోషను చేసిరి. ఆ జయ ఘోష సకల లోకములలో సంచరిస్తూ శివలోకమును చేరి యుండునని భక్తులు భావించి కొనిరి. ఈ విధముగా శ్రీ ష.బ్ర శ్రీ పంచాక్షర శివాచార్యుల వారు నొక నాస్తికుని నోటి నుండి పంచాక్షరీ మంత్రము వెలువడునట్టుల జేసి యశస్వి అయిరి.

ఈ సంఘటన తరువాత నెంతయో కాలము గడించెను. చండీశ్వరునికి ఆయుష్యము తీరి యసువులు బాసెను. ప్రాచీనమైన ఆచారము ప్రకారము అతని సూక్ష్మ శరీరముతో నతని యాత్మను యమ దూతలు యమలోకమునకు మోసికొని పోయిరి. యమ ధర్మరాజుల వారు వాడుక ప్రకారము, ఈ జీవాత్మ యొక్క పాపపుణ్యముల చిట్టాను ఒప్పగించవలసినదిగా చిత్రగుప్తునికి ఆదేశమును ఇచ్చిరి.

చిత్రగుప్తుడు తన చిట్టా పుస్తకమును తెరిచి చూచి "ఈ జీవి చేసిన పుణ్యకార్యములు లేనే లేవు. కాని, ఒక్కసారి మాత్రము ఎట్టులనోనొ కట్టుల శివ పంచాక్షరిని యొక పర్యాయము నుడివినాడని " యమునికి తెలియజెప్పెను. యముడు ఆలోచనలో పడెను. "వీడికేగతి ప్రాప్తమగును? స్వర్గమా? నరకమా? ఒకే ఒక్కసారి శివ పంచాక్షరిని పలికినందున గలిగెట ఫలితమెట్టిది? ఇట్టి ప్రశ్నలెన్నియో యముని మస్తిష్కమును తొలచజొచ్చెను. ఈ విషయమతని యవగాహన కందని విషయమయ్యెను. యతని సేవా కాలమున యింతవరకిట్టి విషయము ఎదురు పడలేదు. ఇది యొక ప్రత్యేకమైన చర్చనీయాంశముగా తోచజొచ్చెను.

యముడును, ఈ విషయమును దేవేంద్రునికి నివేదించి కొనుటకై నిశ్చయించ కొనెను. అతడు చండీశ్వరుని పిలిచి, "ఓయీ! నీవు నీ సూక్ష్మ శరీరముతో, నా మహిష వాహనము మీద నా వెనుకన కూర్చొనుము. నీకు సంబంధించిన సమస్యను దేవతలకు రాజైన దేవేంద్రుని సన్నిధిన పరిష్కరించి కొన వలసి యున్నది. మనము అక్కడికి పోవలెను. త్వరపడుము" అని ఆనతినిచ్చెను.

చండీశ్వరుడు చచ్చినా, వాని హఠము చావలేదు. అది వానిని వెన్నంటియే యుండెను. వివేకశూన్యుడు, మూర్ఖుడు మరియు ఛలవాదియైన యా జీవుడు యముని కిట్లనెను "ఓయియమా" నే చెప్పేడిది వినుము.

నీవు నన్ను ఎక్కడికి విసిరివేసినా నాకెట్టి యభ్యంతరము లేదు. ఎక్కడైననూ నిశ్చింతగా నుండగలను. నీకు ఎటుల దోచితే యటుల చేయుము నేను సంతోషముతో మీ ఆజ్ఞను పాలించెదను. నన్ను మాత్రము, ఎక్కడికీ తీసికొని పోబోకు. ఎవ్వరి ముందంటే వారి ముందు చేతులు జోడించికొని నిల్చుండి వంగి వంగి  దండాలను పెట్టుటయనెడిది నాతోయయ్యెడి పనికాదు. నాకది చేతగాదు.

**ప్రత్యాహారము :**

శ్రోత్రాది యింద్రియముల స్వస్వ విషయముల నుండి విముఖీకరణమే ప్రత్యాహారము ప్రాణాయామ ముఖాంతరముగా చిత్తము నిరోదింపబడిన పిదప, బయటగల యింద్రియములన్నీ తమ తమ విషయముల నుండి నివృత్తిని గొనును. అందుచేత చిత్తనిరోధపు కాలము నందున వేరొక ఉపాయము యొక్క అవశ్యకత లేదు. తేనెటీగలలో రాజస్థానములో నొక ఈగ యుండును. అది ఉండిన యెడల అన్నియును కూర్చుండి యుండును. అది యెగిరి పోయినచో మిగిలినవి కూడ వెడలిపోవును. అదేవిధిన ఇంద్రియములన్నింటికిని రాజు వంటి మనస్సు తన విషయాసక్తి నుండి విముఖత గొనిన పిదప మిగిలిన యింద్రియములు కూడ విముఖత పొందుచున్నవి. ఈ విదముగా ప్రత్యాహారము సిద్ధించుచున్నది.

**ధారణము :**

దేశబంధశ్చిత్తస్య ధారణా (యో.సూ. 3-1) అనే సూత్రమున పతంజలి ధారణ యొక్క లక్షణమును తెలియజేసిరి ఏదోనొక ప్రదేశమున చిత్తమును స్థిరముగా నిలుపుటయే ధారణ యగుచున్నది. యోగ శాస్త్రమునందున నాభి, హృదయము, నాసికాగ్రము, మొదలగు విశిష్టస్థానముల యందున లేదా సూర్యచంద్రాగ్ని నాడుల యందున చిత్తవృత్తిని నిరోధించుటయే ధారణయని చెప్పబడినది.

వీరశైవమున ధారణకెంతో ప్రాముఖ్యతగలదు. కరస్థలస్థయిష్టలింగము మీదను, శరీరములోని హృదయాది స్థానములలోను చిత్తవృత్తిని నిరోధించి పంచాక్షరీ మహా మంత్రమును జపించవలెను.

**ధ్యానము :**

"తత్ర ప్రత్యయైకతా ధ్యానమ్" (యో.సూ.3-2) అనెడి సూత్రములో పతంజలి ధ్యానలక్షణమును తెలియజేసెను ఎచ్చట చిత్తవృత్తి నిరోధింపబడినదో నచ్చట ధ్యేయాకారవృత్తి అఖండముగా ప్రవహింపజేయునదే ధ్యానము.  పంచాక్షరీ జపమును చేసెడి

వాడు ధ్యానయుక్తముగా జపమును చేయవలెను. శివయోగసాధకుడనబడెడి వీరశైవుడు, ఇష్టలింగాకారపు జ్యోతిర్లింగము మీదనైనను లేదా హృదాదుల యందున సుస్థిరముగా నిలుపబడిన చిత్తవృత్తి వైపు ధ్యేయమును నిలిపి ధ్యానమును చేయవలెను.

అప్పుడు యమధర్మరాజు కృద్ధుడయ్యెను. కోపముతో గర్జిస్తూ "ఇదేమిటీ నీ ఇష్టము వచ్చినయట్లుగా నడచుకొనుటకు ఇది భూలోకము కాదు. ఈ నీ సమస్యకు పరిష్కారము పొందవలెనని నీవు ప్రత్యక్ష ప్రమాణముగా ఉపస్థితుడవై యుండుట ఎంతో అవశ్యకమైయున్నది. నా యజమాని యగు శివపరమాత్ముని నామమును ఉచ్చరించిన వాడివని నీకు మర్యాదను ఇచ్చుచున్నాను. మౌనముగా నా వెంట రమ్ము. వచ్చి మూహిషవాహనముపైన నా వెనుకన కూర్చోనుము" అని ఆజ్ఞాపించెను.

ఆవిధముగా చండీశ్వరుని తన నియంత్రణలోకి తెచ్చుకొని వానిని తనవెంట నిడుకొని యమధర్మరాజు అమరావతికి వెడలెను. అచ్చట దేవేంద్ర సన్నిధిన ఈ విధముగా మాటలాడజొచ్చెను. చండీశ్వరుని విషయమునందున నాకేమియును తోచుట లేదు అనుచు ఇట్టి సమస్యకు కారణభూతుడైన అతనిని దేవేంద్రుని ముందు ప్రవేశపెట్టెను. దేవేంద్రుడు ఆ చండీశ్వరుని చూచి భయాశ్చర్యముల చేత చేతులుముడుచుకొని నిలిచి యుండెను. యమునివైపు తిరిగి ఇట్లనెను అటులైన ఎడల ఈ సమస్యను జ్ఞానపురుషుడైన బ్రహ్మదేవునికి నివేదించుకొనెదము అనుచు యమరాజును మరియు చండీశ్వరుని వెంబడించుకొని ఐరావతమునెక్కి బ్రహ్మపురికి వెడలెను. అపుడు బ్రహ్మదేవుడు వారిరువురునిగని "ఓ మహిమాన్వితులైన శచపతీ మరియు యమధర్మరాజులారా! నాకు జగ సృష్టికార్యక్రమము గురించి మాత్రమే తెలియును శివమంత్రము యొక్క సకృదుచ్చారణ ఫలము విషయములో నేనూ అజ్ఞానుడనే ఈ కారణమున మనమిరువురము కలసి సదా శివనామము జపించెడి విష్ణువుదగ్గరకు వెళ్ళి పరామర్శచేసి విషయమును గ్రహింతుము గాక అనెను.

వారు వైకుంఠమునకు వెడలిరి. విష్ణువు వారి నాహ్వానించి వారు వచ్చినకారణమును తెలుపుడని కోరెను అపుడు వారు తామెదుర్కొనుచున్నసమస్యను గురించి తెలిపి తన్ని మిత్తమై పరిష్కారమును కోరిరి. విష్ణుమూర్తి వారితో ఇట్లనెను "మహిమాన్వితుడైన దేవాదిదేవుని బంధువులారా ఈ విషయమున నాకును అంతగా తెలియదు. శివనామోచ్చారణ చేయుటలో సదా నిమగ్నుడనై యుంటెనే కాని నేనెన్నడును ఆ మంత్రజపము యొక్క ఫలమును గురించి ఆలోచించలేదు మన మందరము శివుని యొద్దకువెళ్ళి అతనినే అడిగెదము గాక రండు" అనెను.

దేవపాలకులగు వైకుంఠ పతి, బ్రహ్మ దేవేంద్రుడు మరియు యమధర్మరాజు కైలాసమునకువెళ్ళిరి. మనము ఈమహానుభావుని ఇంతవరకు శ్రమపెట్టినది చాలు అతనిని ఇంకనూ శ్రమకు గురిచేయవలదు అని తలచిన వారై చండీశ్వరుని సూక్ష్మశరీరమును ఒక పల్లకీలో యుంచి ఆ పల్లకిని విరించి విష్ణ్వాదులు పల్లకి నిమోసికొనుచు కైలాసమునకు సకలమర్యాదలతో తీసికొనివెళ్ళిరి.

కైలాసమునందున గణాధీశ్వరుల మధ్య కూర్చొని యండెడి సర్వజ్ఞుడును, సర్వేశ్వరుడును అగు మహాదేవుని ఆనల్వురుదేవతలు సమీపించిరి. అప్పుడు విషయము నెరిగిన వాడై తన ధ్యానావస్థను విడిచివేసి లేచి నిలుచొని ఆ పల్లకీ సమీపమునకు వెడలి చండీశ్వరుని చేతిని పట్టుకొని పల్లకినుండి క్రిందికి దించి అనురాగముతో ఆలింగనము చేసికొనెను. అనంతరము ఆ సురపుంగవులకు ఆసనగ్రహణము చేయమని ఆనతి ఇచ్చెను. ఇంతదూరము వచ్చిన కారణము ఏమిటి అని ప్రశ్నించెను.

అపుడానల్వురు ఒకరిముఖములను యొకరు చూసికొనుచు ఏమియును మాటలాడ జాలక మౌనముగా యుండిపోయిరి. అట్టి స్థితిలో యమధర్మరాజు ధైర్యమును పెంచికొని లేచినిలుచుంది ముకుళితహస్తుడై మహాదేవునికి ఈ క్రిందివిధముగా వినతిని చేసెను "ఓ జ్ఞాననిధీ పరమేశ్వరా, ప్రణవస్వరూపా, ఈమర్త్యలోకమునకు చెందిన ప్రాణి మాకొక సమస్యను కలిగించెను. అదిఎట్టిదనిన ఇతడు తనమొత్తము జీవనమునందున కేవలము ఒకే ఒక పర్యాయము మీ పంచాక్షరీ మంత్రమును ఉచ్చరించి యున్నాడు. మిగిలిన జీవిత భాగములో మూర్ఖుడై, బుద్ధిహీనుడై అధర్మవర్తనుడై అకార్యములను కుకార్యముల నెన్నింటినో చేసెను ఈ స్థితిలో అతనికి వేయవలసిన శిక్ష ఎట్టులుండవలెను. పంచాక్షరీజపమును చేసి నందులకు ఫలము ఎట్టిది? మరణానంతరము పంచాక్షరీజపము చేసిన వాడికి కలిగెడి గతి ఎట్టిది. స్వర్గము నివ్వవలెనా మొదలగుప్రశ్నలు తలఎత్తినది. వీటిని తెలిసికొనవలెననెడి జిజ్ఞాస మాలో అందరికినీ కలదు. ఈ కారణమువలననే ఈ జీవిని ఇక్కడికి తీసికొని వచ్చితిమి దయచేసి ఈ విషయము గురించి మాకు ఉపదేశమును ఇవ్వండి.

మహేశ్వరుడు చిరునగవును నగుచు వారితో ఇట్లనెను ఈ మీ ప్రశ్నకునేను అప్పుడే ఉత్తరమునిచ్చితినే. నావర్తన వలన ఉపదేశముచేసితిని కదా. ఎరుగలేదా, అనెను. అపుడానల్వురు దేవతలు తలలను ఆడించి సంతోషసాగరమునందు తేలియాడిరి.

ఈ రీతిగా శివపంచాక్షరీ మంత్రమును ఒక్కసారియైనను పఠించినవారికి సాక్షాత్తుగా శివుని ప్రేమానురాగములతో కూడిన ఆలింగనాదులతో పాటు శివసాయుజ్యము లభించునని లోకములకు వెల్లడి అయ్యెను.

**ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః**

ది. 14-9-1990

స్థలం: శివానుభవ మంగళభవనం, షోలాపురు.

## విశేష ప్రదీపిక :

పంచాక్షరీ జపము వలన పాపక్షయమగునని శ్రీ కాశీ జగద్గురువులవారు విడమరచి చెప్పిరి అసంకల్పితముగా నైనను పంచాక్షరిని జపించుట చేత జన్మము సార్థకమగుననెడి విషయమును తెలియజెప్పుటకై స్వాములవారు దహరించిన కథ చిరస్మరణీయమైనది.

పంచాక్షరీ మంత్రమును జపించుచు శివ లింగము నర్చించెడివానికి బహుముఖములగు ప్రయోజనములు చేకూరునని తెలియుచున్నది పాపక్షయము, కామితారసిద్ధి, మరియు ముక్తి వంటివి యతిసులభముగా పొందవచ్చునని యీ యాశీర్వచనమున విశదీకరింపబడినది.

శివాగమములలో నెన్నియో మంత్రములు వివరింపబడినది. వీటికిని యిట్టి మహత్తుగలదని చెప్పబడినది. అయితే, వీటిని జపించుట కొరకు కొన్ని నియమములు విధింపబడినవి. శుచిర్భూతుడైన పిదప మాత్రమును జపించవలెననెడిది సాధారణ నియమము, బ్రహ్మముహూర్తమున లేచి సచేల స్నానమును చేసి, మంత్రమును జపించ వలెననెడి నియమములును గలవు. ఈ మంత్రములకు జపసంఖ్యయు నిర్ణయింపబడియుండును. కొన్నివేల పర్యాయములు భక్తి శ్రద్ధలతో జపించిన గాని సత్ఫలితములు సంప్రాప్తము గావు.

పంచాక్షరి యిట్టి మంత్రముల కోవకు చెందినది కాదని గుర్తించవలెను. ఇది యొక శక్తివంతమైన మంత్రము. "పంచాక్షరీ మహామంత్రము గురించి శ్రీ భగవత్పాదులవారు నింతకు క్రితమున చేసిన యుపదేశము గమనార్హమై స్రన్నది.

**శ్లో॥ శివతత్త్వాత్ పరం నాస్తి యథా తత్త్వాంతరం మహత్**
**తథా పంచాక్షరీ మంత్రాన్నాస్తి మంత్రాంతరం మహత్॥** (సిద్ధాంత శిఖామణి 8-2)

ఏ విధముగా శివతత్త్వము కంటెను శ్రేష్ఠమైనదియును, మహిమాన్వితమైనదియునునైన తత్త్వము వేరొకటి యుండదో, యదే విధిన పంచాక్షరీ మహామంత్రము కంటెను మహిమాన్వితమైనది వేరొకటి యుండదు. ఈ కారణముననే శ్రీభగవత్పాదులవారు, "ఏష మంత్రోమహాశక్తిః" యని సెలవిచ్చిరి.

"శత్యతే శక్తిః" యనెడి వ్యుత్పత్తి ప్రకారము ఈ మంత్రము వలన మనుష్యుడు శక్తివంతుడగురు. ఇచ్చట శక్తియనగా మంత్రమునకు గల సామర్థ్యముగా తీసి కొనవలెను జపక్రమములో నిమిడియున్న సాధక భాధకములు మరియు జపోపరి లభ్యమయ్యెడి ఫలితముల గరిష్ఠతను బట్టి మంత్రము యొక్క సామర్థ్యము నిర్ణయింప బడును.

పంచాక్షరీ మంత్రమును జపించెడివాడు శుచిర్భూతుడై యుండవలెననెడి నియమేమియును లేదు. స్నానాదుల నాచరించిన పిదపనే యీ మంత్రము జపించవలెననెడి ప్రతిబాధకము లేవియును లేవు. దీనికి గల కారణమేమిటో తెలిసికొనవలెను. భస్మోద్ధూళిత సర్వాంగుడై, భస్మత్రిపుండ్రములను దాల్చిన వాడును, రుద్రాక్ష ధారణగలవాడును, లింగధారణై కనిష్ట గల వాడును శివ పంచాక్షరిని జపించవలెనియును, అట్టి వారికి సద్గతి లభించునని యింతకు క్రితమే తెలిసికొని యుంటిమి. లింగధారణ, భస్మధారణ, రుద్రాక్ష ధారణలెడి యీ ధారణత్రయముచే తనువు సదా పరిశుద్ధమైయుండును. ఏ విధముగా జలము యొక్క క్షాళనశక్తి, అగ్ని యొక్క దహన శక్తి, వాయువు యొక్క చలన శక్తుల మూలమున మలినములు తోలగింపబడునో యదే విధిన ధారణ త్రయము యొక్క శక్తి సామర్థముల చేత స్థూలాంగము శుచిర్భూతమై వెలుగొందుచుండును అంతర్లింగ ధారణ, అంతర్భస్మదారణ, అంతర్రుద్రాక్ష ధారణాదుల చేత యంతరంగ శుద్ధియును చేకూరును. ఈ కారణము వలన పంచాక్షరీ జపించెడి సందర్భమున శుచిర్భూతుడు కావలెననెడిది యునావశ్యకమగును.

ఈ యంశమును వైపరీతముగా నర్థము చేసి కొని స్నానాదులను మాని వేయుటయో, లేదా వారానికొక పరి స్నానమును చేయుటయో చేయవలదు. కొన్ని సందర్భములలో స్నానమును చేయుట దుస్సాధ్యము కావచ్చును. అట్టి సందర్భములలో స్నానము చేయలేదనెడి కారణమున పంచాక్షరీని జపించుటను మానివేయకూడదనెడిదే గ్రహించవలసిన విషయము.

పంచాక్షరి వలన పాపక్షయమగుననెడిది సర్వత్ర యంగీకరింప బడిన విషయము. “మహాపాతక విచ్ఛిత్త్యై శివ ఇత్యక్షర ద్వయ” మనియును, “అలం నమస్క్రియా యుక్తోముక్తయే పరికల్పతే” యనియును తెలిపెడి స్కాందోక్తుల వలన పంచాక్షరి వలన పాపక్షయమగును. ఈ విషయమున శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనము గమనార్హమై యున్నది.

**పాతక శతకోటియ నొరసలు**
**సాలదే బందు శివన నామ?**
**సాలదే బందు హరన నామ?**
**కూడల సంగమ దేవా,**
**నిమ్మ ఉండిగెయ పశువమాడిదయాగి.** (బసవేశ్వర వచనము 84)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి:

**పాతక శతకోటియ నొరయుటకై**
**చాలదే యొక్క శివుని నామము?**
**చాలదే యొక్క హరునిని నామము?**
**కూడల సంగమ దేవా,**
**మీ యూడిగపు పశువును చేసినందులకు.** (బసవేశ్వర గీతామృతము,పు. 125)

శ్రీ రాముడు అవతారపురుషుడు ఇతనికి బ్రహ్మహత్య పాతకము సంక్రమించుటచే చేసిన పాపమునుండి విముక్తి పొందుటకు శివ లింగస్థాపన పంచాక్షరీమంత్ర జపము చేసెని తెలియుచున్నది. ఏ కామనాథుడీ విషయమునెంతో రమ్యముగా వివరించిరి.

**ఆలి గోల్పడె దండకాటవి యందున**
**పలవరించిన వాడు పౌంద్రకుండో**
**రావణు శక్తికి లక్ష్మణు పాటుకు**
**పరితాప మొందెనో పౌంద్రకుండొ**
**రావణున్ జంపిన బ్రహ్మహత్యలభింప**
**భ్రమితుండునగువాడొ పౌంద్రకుండో**
**రామేశు నిల్పి శ్రీ రామేశ్వరమున ని**
**ష్పాపుడై చను వాడొ పౌంద్రకుండో**
**చెనసి రామచంద్రుని చేతులు పౌంద్రక**
**వాసుదేవు మీదవైతు రజ్ఞు**
**లేమి చెప్పవచ్చునే..** (అన్యవాద కోలాహలము, ప. 83)

పంచాక్షరివలన కామితార్థమును పొందిన వారెందరో గలరు. గీతాచార్యుని జగత్ ఖ్యాతి నార్జించిన శ్రీ కృష్ణుడు సంతానాపేక్షతో పంచాక్షరిని జపించుచు శివ పూజను చేసి కామితార్థ సిద్ధిని బడసెనని తెలియుచున్నది. ఈ విషయమును దెలిపెడి యన్యవాద కోలాహలములోని యీ పద్యమును గనుడి.

**వసుదేవునకు బుట్టి వాసుదేవుండన**
**పాండవులను గొల్చెపౌంద్రకుండు2**
**మేఘమై శివుగొల్చి మెప్పించి సాంబుడ**
**నృట్టి దాగాంచెనే పౌంద్రకుండ**

**తనయాలి దనుమును దండిని గట్టతో**
**పనగట్లు దీసెనే పౌండ్రకుండు?**
**చెనసి యిట్టి కృష్ణ చేతలు పౌండ్రక**
**వాసుదేవు మీదలైతురజ్ఞు**
**లేమి చెప్ప వచ్చునే.........** (అన్యవాద కోలాహలము, ప 84)

భక్తస్థలము నందలి వీరశైవుడు పంచాక్షరిని మహాశక్తి వంతమైన మంత్రమని యెరిగినవాడై యద్దాని యెడల నమ్మకమును పెంచికొని నిత్యానుష్ఠానమైన యిష్టలింగార్చనను చేయునప్పుడు, శ్రీ భగవత్పాదులవారి యానతిని యమలుచేసి ధన్యతను బడయవలెను.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-10

**శ్లో॥ పంచాక్షరీం సముచ్చార్య పుష్పం లింగే వినిఃక్షిపేత్**
**యస్తస్య వాజపేయానాం సహస్రఫలమిష్యతే॥** (సి.శి.8- 42)

ఎవ్వడు పంచాక్షరిని నుచ్చరించుచు నొక పువ్వును యిష్ట లింగము మీద పెట్టుచున్నాడో వానికి వాజపేయ యాగము చేస్తే వచ్చే ఫలము కంటే వేయి రెట్లు అధికముగా నుండెడి ఫలము లభించును.

**అగ్ని హోత్రం త్రయోవేదా యజ్ఞాశ్చ బహుదక్షిణాః ।**
**పంచాక్షర జపస్యైతే కోట్యం శేనాపి నో సమాః॥** (సి.శి.8-43)

నిత్యాగ్ని హోత్రము గల్గియున్నా మూడు వేదములు చదివిన, భూరిదక్షిణలిచ్చి యజ్ఞములు చేసిన వచ్చెడి ఫలము పంచాక్షరీ మంత్రమును జపిస్తే వచ్చే ఫలితములోని కోటి వంతు అంశమునకు కూడ సరి తూగవు.

మన దేశములోని సంస్కృతి యందున యుగముల భేదము చేత ననేకములైన ఆచరణలు ప్రతిపాదింపబడినవి. కృతా, త్రేతా మరియు ద్వాపరముల యందున భగవంతుని కృపను పొందుటకై యజ్ఞములను యాగములను, అతి కఠినమైన తపస్సులను, కృచ్ఛ- చాంద్రాయణాది వ్రతములను ఆచరించుచుండిరి. భగవంతుడు మెచ్చవలెనని యజ్ఞాదికర్మముల కంటెను, భక్తి యేనిండుగా నుండవలెను. భక్తి లేనివారు ఎంతో కష్టమున కోర్చి యజ్ఞయాగవ్రత తపాదులను చేసినా ఫలితము ఉండదు.

భక్తితో చిన్నవ్రతమును చేసినా గొప్పఫలితము లభించును. చిన్న వ్రతమును చేసి అనల్పమైన భగవంతుని కరుణను పొందుటను విస్మరించి కఠిన పరిశ్రమకునోర్చి, అధికముగా ధనమును వ్యయపరచి, అల్ప ఫలములనిచ్చెడి పెద్ద పెద్ద వ్రత తపాదుల చేయనేల? యని శ్రీ రేణుక భగవత్పాదుల వారు ప్రశ్నించుచున్నారు.

శ్రీ భగవత్పాదలు వారు నానతి యిచ్చిన యటుల, పంచాక్షరిని జపిస్తూ ఒకపువ్వును లేదా నొక బిల్వదళమును యిష్టలింగమునకు సమర్పించిన యెడల వేనకు వేల సంఖ్యలో వాజపేయ జపాదులను, యాగాదులను చేస్తే వచ్చెడి ఫలములు లభించుచున్నవి. ఈ కారణము వలనె వీరశైవము నందున యిష్టలింగ పూజకు నధికమైన ప్రాముఖ్యత యివ్వబడినది. భక్తి సంపన్నులైన వీరశైవులు పంచాక్షరిని లేదా వెయ్యి మీద యెనిమిది బిల్వదళములను గాని యిష్టలింగమునకు సమర్పించెడి పద్ధతి కొనసాగుచు వచ్చుచున్నది. కొందరు శివనామములను పఠిస్తూ యిష్టలింగమునకు పత్రపుష్పములను సమర్పించెదరు. ఈ పద్ధతి వలన అపారమైన పుణ్యము లభించుననియును, యిష్టార్థసిద్ధి గల్గునని చాలా మందికి తెలియదు. ఇట్టి పూజవలన అపారమైన ఫలము లభించునని అనుభవజ్ఞులు మాత్రమే గుర్తించ గలరు. ఇట్టి మహిమను అనుభవించిన అసంఖ్యాకులలో కమలాక్షుడొకడు. ఇతని యనుభవమును గూర్చి తెలిసి కొనెదము గాక.

పూర్వకాలమున జగత్పాలకుడగు విష్ణువు ప్రతి దినము శివ లింగమునకు వేయి కమలములను సమర్పించి పూజించెడి నియమమును చేపట్టి యనునిత్యము శివ లింగమును భక్తి శ్రద్ధలతోను, నైష్ఠిక భావముతోను పూజింపజొచ్చెను. ఈ పూజ నిరాటంకముగా కొలది దినముల వరకు కొనసాగెను. ఒకసారి శివునికి హరి యొక్క శివభక్తిని పరీక్షించాలనెడి తలంపు గల్గెను. సహస్ర

కమలములనుండి యొక కమలమును మాయము చేసెను. ఎప్పటివలనే శివుని సహస్రనామములు పఠించుచు, విష్ణువు శివలింగమునకు కమలములను సమర్పింపదొడంగెను. చివరన శివనామము పఠించి చూడగా అర్పించుటకై పుష్పము లేకుండెను. ఆందోళనకు గురియైన విష్ణువు అటు ఇటు చూడగా కమలమును గాంచలేక పోయెను. కూర్చొని యున్న, ఆసనము నుండి లేచి వెళ్లి పువ్వును గ్రహించి తెచ్చినచో నియమభంగమగునేమోయని భయపడెను. ప్రత్యామ్నాయ మెట్టిదని ఆలోచించెను. అతినికొక ముపాయము పొడసూపెను. వెను వేంటనే నేత్రమును పెరికి, అద్దానిని శివలింగమునకు చివరి పుష్పముగా సమర్పించెను. విష్ణువులో గల వ్యామోహరాహిత్యమును, అతని యందలి యచంచలమైన భక్తిని, అతని శ్రద్ధానిష్ఠలను గమనించి శివుడు సంతోషించెను. విష్ణువునకెదుట ప్రత్యక్షమయ్యెను. "హేవత్సా"! నీ భక్తికి మెచ్చితిని యీ నాటి నుండి నీవు కమలాక్షుడివిగా పిలువ బడుదువుగాక! నీకు తిరుగులేని శక్తి సామర్థ్యములను చేకూర్చెడి సుదర్శనమును ప్రసాదించుచున్నాను. గైకొను మనెను. విష్ణువు శివుని పాదములపై బడి, లేచి నిల్చుండి, ముకుళితహస్తుడై శివుని పరిపరి విధములుగా స్తుతించెను. సుదర్శన చక్రమును కృతజ్ఞతా పూర్వకముగాగైకొనెను. ఈ విధముగా శ్రీ మహావిష్ణువు పుష్పములతో శివపూజను గావించి కమలాక్షుడై, చక్రధారియై, అపారమైన శక్తి సంపన్నుడై లోకమున పూజ్యుడై యున్నాడు. శివ మహాపురాణములో నీ కథ గలదు. పుష్పదంతుడు, తన మహిమ్నస్తోత్రములోన యీ కథను పొందుపరచెను. (శ్లో॥19)

బ్రహ్మాది దేవతలెల్లరూ శివుని పువ్వులతో నర్చించి ధన్యులైరని పౌరాణిక గాథలవలన తెలియుచున్నది. వీరు నత్యంత మహిమాశాలులైరి. అచంచలమైన శివభక్తిని గల్గి యుండెడి వీరశైవుడు, పుష్పములలోను, బిల్వపత్రాదులతోను శివుని పూజించవలెను. సంఖ్యానియమమును పాటించెడి యవశ్యకత లేదు. యథాశక్తి పుష్పములను సేకరించి యిష్టలింగమునకు సమర్పించవలెను. ఎక్కువగా పుష్పములను సమర్పించిననూ చాలును. సదాశివుని కృపకు పాత్రులై అనేకానేక యజ్ఞములు చేస్తే వచ్చెడి ఫలమును యిష్టలింగార్చన వలన పొందగలరు.

విభిన్నమైన సాంప్రదాయములకు చెందిన వారు చేయు చుండెడి, నిత్యాగ్నిహోత్ర నియమపాలన, వేదత్రయి యొక్క అధ్యయనము, జ్యోతిష్టోమాది యాగములు, షోడశమహాదానములు మొదలగునవి వీరశైవులు చేయవలసిన పనిలేదు. వీటిని చేయకుండగనే, వీటిని చేసి వివిధ ఫలములు పొందెడివారి ఫలములకంటెను కోటి రెట్లు అధికముగా నుండెడి ఫలమును పొందెడి యవకాశము గలదని శ్రీ భగవత్పాదుల వారు బోధించిరి. యిష్ట లింగమునకు పంచాక్షరిని పఠిస్తూ ఒక్క పుష్పమును సమర్పించినచాలును. ఇంతటి అపారమైన మహిమాన్విత ఫలముకైవసమగును. సులభ సాధ్యమైన పంచాక్షరీ మంత్రమును మానవమాత్రులెల్లరూ జపించి ధన్యతను బడయుదురు గాక.

**ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః**

ది. 15-9-1990

స్థలం శివానుభవ మంగళ భవనము, షోలపూర్

## విశేష ప్రదీపిక :

పంచాక్షరిని జపించుచు పుష్పాంజలి నిచ్చెడి వారి పుణ్యప్రాప్తిని తెలియపరచి, శ్రీ మహావిష్ణువు శివునికి అట్టి పుష్పాంజలినిచ్చి ధన్యుడయ్యెనని శ్రీ కాశీ జగద్గురువుల వారు నుద్బోధించిరి.

లింగార్చన సమయములోన భక్తుడు శివలింగమునకు పుష్పాంజలిని సమర్పించును. ఈ సందర్భమున శివసహస్రనామములనో, శతనామములనో లేదా ద్వాదశనామములనో నమస్కార పూర్వకముగా పఠించెడి సాంప్రదాయము గలదు. శ్రీ భగవత్పాదులవారు నీ సందర్భమున శివ పంచాక్షరిని జపించుటయే యుక్తమని తెలిపిరి. సహస్రనామములలో 'శివ' శబ్దమే పరబ్రహ్మావాచకమనియును నితర శబ్దము శివపరబ్రహ్మ యొక్కసాకార రూపము యొక్క గుణగణములను వర్ణించునని తెలిసి కొని యుంటిమి. ఈ కారణముననే శివ శబ్దముగల్గియున్న పంచాక్షరిని జపించుచు పుష్పార్చన చేయవలెను. ఈ విధిన చేసిన వానికి శివత్వము సిద్ధించునని తెలిపెడి యన్నమయ్య వారి యథావాక్కులను గనుడి:

**చం॥ ఒక పుష్పంబు భవత్పదద్వయముపై నొప్పంగసద్భక్తి రం**
**జకుడై పెట్టిన పుణ్యమూర్తికి బునర్జన్మంబు లేదన్న చం**

**యక కాలత్రితయో పచారములనిన్నర్చించున్ బెద్దనై**
**ష్ఠకుడై యండెడి వాడు నీవగుట దాచిత్రంబె సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప.88)

ఇట్టి నైష్ఠిక భక్తుని పూజించెడి వానికి గల్గెడి ఫలంబెట్టిదో దీ క్రిందనబినవి.

**ధరణిం దీర్థము లాడుకంటే, నతిమోదంబొప్ప యజ్ఞంబులం**
**బరగం జేయుటకంటే సువ్రతములొప్పన్ వేదశాస్త్రార్థత**
**త్పరుదై యాదట జల్పు కంటె మదినుత్సహించి నీ భక్తిమ**
**త్పరుష శ్రేష్ఠుల బూజసేయుట మహా పుణ్యంబు సరేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప.26)

భక్తులకింత శ్రేష్ఠత్వ మెందులకు గల్గినదో తెలిసికొన వలసి యున్నది. భారత సంస్కృతి యందున బ్రాహ్మణులగ్రవర్ణమునకు చెందిన వారని తెలుపబడినది. ఇట్టి యౌన్నత్యమునకు గల కారణమేమనగా వారు చేసెడి కర్మలుత్కృష్టములైయుండుటే. వేదత్రయిని పఠించుట, నిత్యాగ్ని హొత్రులైయగ్ని ముఖార్చన చేయుట, యజ్ఞముల నాచరించి భూరి దక్షిణలిచ్చుట ముదలగునవి ముత్కృష్ట కర్మలని యెంచ బడినవి. ఇవన్నియును పంచాక్షరిని జపించిన వచ్చెడి ఫలములో కోట్యంశమునకు సమమైన ఫలమునివ్వ జాలవు. ఈ కారణముననే అన్నమయ్య, శివభక్తుడు శ్రేష్ఠుడని తెలియజెప్పిరి. వీరశైవ ధర్మములోన భక్తస్థలమున నున్న వాడు నీ విషయమును గ్రహించి వేదాధ్యయనము, యజ్ఞయాగాదలనావశ్యకములని తెలిసికొని, యిష్టలింగార్చనలో శివ పంచాక్షరినుపయోగించి ధన్యుడు కావలెను.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-11

**శ్లో॥ పురా సానందయోగీంద్రః శివ జ్ఞాన పరాయణః।**
**పంచాక్షరం సముచ్చార్య నారకానుదతారయత్॥** (సి.శి. 8-44)

పూర్వమున సానంద శివ యోగీంద్రులవారు శివ జ్ఞాన పరాయణుడై పంచాక్షరిని జపించి నరకమునకు గురియైన వారి నెందరినో రక్షించెను.

**సిద్ధ్వా పంచాక్షరస్యాస్య శతానందః పురా మునిః।**
**నరకం స్వర్గ మకరోత్ సంగి రస్యాపి పాపినః** (సి.శి. 8-45)

పూర్వమున శతానందమహర్షుల వారు ఈ పంచాక్షరీ మంత్ర సిద్ధిచేత సంగిర యనెడి పాపిని రక్షించుటకై నరకమునే స్వర్గముగా మార్చివేసెను.

**శ్లో॥ ఉపమన్యుః పురా యోగీ మంత్రేణనేన సిద్ధిమాన్।**
**లబ్దవాన్ పరమేశానాచ్ఛైవశాస్త్రప్రవక్తృతామ్॥** (సి.శి. 8-46)

ఈ మంత్ర సిద్ధిని బడసిన శివయోగీశ్వరుడగు నుపమన్యుడు పూర్వకాలమున శైవ శాస్త్రముల ఆచార్యపదవిని పొందెను.

శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదులవారు, మహా మహిమాన్వితమైన పంచాక్షరిని జపించి సద్గతిని బడసి, పతితులనెందరినో నుద్ధరించిన విషయము నుపదేశించిరి. శ్రీ జగద్గురు రేణుకులవారు నుదహరించిన ఋషులు సామాన్యులు కారు. అసామాన్యమైన మహిమలతో విరాజిల్లిన వారు. వీరికి సంబంధించిన కథాంశమును సంక్షేపముగా వివరింతుముగాక.

పూర్వకాలమునందున పూర్ణవిత్తుడనెడి మహర్షికి సదానందడనెడి కొడుకు నుండెను. మహర్షుల వంశములో పుట్టిన వాడైనందున సదానందుడు సదాచారియై శివపూజాసక్తిగల వాడై యుండెను. అతడు తన మనస్సున యెల్లప్పుడూ పంచాక్షరీ మంత్రమును పఠించుంచుండెను. ఇట్టి సత్క్రియ ఫలితముగా అపారమైన దైవీశక్తి సంపన్నుడయ్యెను. ఒకసారి గరుడ పురాణమును శ్రవణముచేయుచుండగా, అందులో వర్ణింపబడిన నరక యాతన విని కలవరపడే దయార్థ్రహృదయుడయ్యెను. నరక వాసుల

నుద్ధరించుటకై బయలుదేరి వెడలెను. యమలోకమును చేరి లోనికి ప్రవేశించెను. సానందసహర్షిని గాంచి యముడెంతో నాశ్చర్యమును పొందెను. వెనువెంటనే లేచి యెదురేగి సకల మర్యాదలతో స్వాగతమునిచ్చెను.తీసి కొని వచ్చి, ఉచితాసనంబుపై కూర్చుండ పెట్టి అర్ఘ్య పాదాదుల నొసంగెను. "ఓ యముడా! నరకములో నున్న వారిని చూచుటకై వచ్చితిని. వారిని నా కొక్కసారి చూపించుమనగా. యముడు "ఓ మహర్షీ! తమంతటివారు, నరకమును గాని, నరక జీవులను గాని చూడరాదు." అని విన్నవించి కొనెను. సానంద ఋషి యముని మాటలను వినలేదు. నరక వాసులను తప్పని సరిగా చూసియే తీరవలెననెను. యముడు, మరో ఉపాయము లేని వాడై, సానంద ఋషిని వెంట నిడికొని, నరకయాతనకు గురి యయ్యెడి వారి దగ్గరికి పోయి వారిన అతనికి చూపెను. వారు పొందెడి ఘోరాతి ఘోరమైన నరక బాధను చూసి సానందులవారి మనస్సు కరిగి పోయెను. వారి నుద్ధరించ వలెననెడి తలంపుగలవాడై, పంచాక్షరీ మంత్రమును వారందరికీ వినబడెడి రీతిన, గట్టిగా పఠింప దొడంగెను. సానందుల వారి మంత్ర పఠనము వినగానే, నరకవాసులలో నొక వినూత్నమైన చైతన్యము గల్గెను. వారునూ పంచాక్షరీ మహామంత్రమును ముక్తకంఠముతో పఠించిరి. వెనువెంటనే, వారి పాపములు పటాపంచలయ్యెను. నరక జీవనము నకు స్వస్తి పలికి పుణ్యలోకమునకేగిరి. ఈ విధముగా సానందుల వారు పంచాక్షరి ద్వారా నరక వాసుల నుద్ధరించిన కథ, యెంతో ప్రఖ్యాతిని గాంచెను.

సానందుల వారు పంచాక్షరి చేత నరక వాసులకు పుణ్యలోకములను కలిగించిన యటుల శతానందులవారు పంచాక్షరీ జపము చేత సిద్ధిని పొందిన వాడై నరకమునే స్వర్గముగా మార్చెనని తెలియుచున్నది సంగిర యనెడి పాపిని రక్షించుటకై శతానందుల వారు నీ గతిన చేసిరని శ్రీ భగవత్పాదుల వారు సెలవిచ్చిరి. ఈ ఇరువురి చరిత్రల వలన తెలిసెడి దేమనగా మహా మహిమాన్వితమైన పంచాక్షరిని జపించి తద్వారా పతితుల నుద్ధరించి, లోక కాళ్యాణము సాధించ వచ్చును.

పూజ్యపాదు లుదహరించిన ఋషులలో నుపమన్యుడు మూడవ వాడు వారి చరిత్ర యీ క్రింది విధిన నున్నది:

అత్యంత పూర్వకాలమునందున, వేదజ్ఞుడును, కీర్తి శాలియునగు, వ్యాఘ్రపాదుడనెడి ఋషి పుంగవుడుండెను. అతడొక గొప్ప శివభక్తుడై యుండెను. అతనికి యిరువురు కుమారులు ఉండిరి. వారు పేర్లే ఉపమన్యుడు మరియు ధౌమ్యుడు వీరి బాల్యముననే వీరి తండ్రి దివంగతుడయ్యెను. వీరిని పెంచి పెద్దగా చేసెడి బాధ్యత వీరి తల్లి పైన బడెను. పేదరికముతోబాధపడుచు, తన కొడుకులను పెంచి పెద్దగా జెసెను. విద్యాభ్యాసము నిమిత్తము తన కొడుకులను వేరొక ఆశ్రమమునకు పంపించెను. ఆ ఆశ్రమములో నొక దినమున నుపమన్యుడు, ఆశ్రమపు ఋషులతో కూడికొని పాలను త్రాగెను. తన ఆశ్రమమునకు వచ్చి తనకు పాలనివ్వమని తల్లిని కోరెను. పేదరికముతో బాధపడుచున్న ఆమె వద్ద గోక్షీరము లేకుండెను. బియ్యపు పిండిని నీటిలో కలిపి, ఆ పానీయమును బాలునికిచ్చి, యివియే పాలని చెప్పెను. నిజమైన పాల రుచియెరిగిన వాడైనందున, తల్లిని నిలదీసి యడిగెను. నీవు ప్రతిదినము ఈ రీతిగనే చేయుచున్నావు. ఈ దినమున యివి పాలు కావని తేలినది. నాకు పాలేకావలెను. తీసికొని వచ్చి ఇవ్వవలెననెను.

కొడుకు మాటలను వినిన తల్లికి కడు వేదన కలిగెను. కొడుకుకు నిజము నెరింగింపగ నిశ్చయించికొనెను. అతని కిట్లనెను:

"ఓ పుత్రా! నేను కావలెనని మోసమును చేయ లేదు. నేను నిస్సహాయురాలినైయున్నాను. దుర్భరమైన పేదరికము నెలకొని యున్నది. విధి లేక గంజిని కాచి పాలని యిచ్చుచున్నాను. నన్ను తప్పు పట్ట వలదు. పరమశివునికి మనమీద దయలేదు. దయయుండిన నిట్టులగునే"

తల్లి మాటలను వినిన పిదప ఉపమన్యునికి విషయము అవగాహనకు వచ్చెను. తరుణోపాయమేమిటని తల్లిని యడిగెను. పరమేశ్వరుని కరుణను పొందవలెను. అది గల్గిన నాడు నీకు లోటు అనెడిది ఉండదు. అద్దానిని సంపాదించికొనుటకై శివుని గూర్చి తపస్సును చేయుమని ఉపమన్యునికి తల్లి సెలవిచ్చెను.

ఉపమన్యువు తల్లియాజ్ఞను పొందిన వాడై తపమాచరించుటకై అడవిలోనికి ప్రవేశించెను. ఒక నిర్జన ప్రదేశమును ఎంపిక చేసికొనెను. అచ్చట కూర్చుండి పంచాక్షరీ మహామంత్ర జపమును, నేకాగ్రమైన మనస్సుతో, సలుపుచు తపమాచరించెను. నిష్కల్మష హృదయుడగు ఉపమన్యుడి తపస్సు కొంత కాలము వరకు నిరాటంకముగా కొనసాగెను. అతడు త్రికరణ శుద్ధిని సాధించెను. అన్యము నెరుగని వాడై, అంతయును మరచి శివ ధ్యానములో నిమగ్నమై నిర్మలత్వమును సాధించెను.

పరమ భక్తుడైన ఉపమన్యువుకు, పరమేశ్వరుడొక పరీక్షను పెట్టదలచెను. తన భక్తునికి తన మీద నెంత మేరకు భక్తికలదో యనెడిది లోకమున కెరింగించ నెంచెను తద్వార ఉపమన్యునికి ప్రఖ్యాతిని గడించి పెట్టదలచెను.

శివుడు, ఇంద్రుని రూపమును దాల్చి ఉపమన్యువు ఎదుట ప్రత్యక్షమయ్యెను "వత్సా! నీ భక్తికి మెచ్చితిని. లెమ్ము, నీ కేమి కావలెనో కోరుకొనుము. స్వర్గవైభోగములు వలయునేని, అడుగుము." అని అనెను ఉపమన్యువు "కనులు తెరిచి చూచెను తన యెదుట నున్న ఇంద్రరూపమున నున్న శివమూర్తిని గాంచి యిట్టులనెను. "ఓయీ ఇంద్రా! నీ వేల వచ్చితివి? నిన్ను గూర్చి నేను తపమాచరించలేదు కదా! అయినా, నీ స్వర్గభోగముల యెడల నా కాసక్తి లేదు. వాటి ననుభవించుట కంటెను శివదాసునిగా యుండుటయే మేలు. నేను శివుని గూర్చి తపస్సును చేయుచున్నాను. అతడు వచ్చి నన్ను, మెచ్చినంతవరకు నేను నా తపస్సును వీడను. నీవు తొలగిపొమ్ము"

ఈ విధముగా నుడివిన యుపమన్యువు, తెరచిన కళ్ళను మూసికొని పంచాక్షరీ జపమును చేసికొనుచు శివయోగము నాచరింప జొచ్చెను. శివ ధ్యానములో నిమగ్నుడై మైమరచి యుండెను భక్తుని అచంచలమైన నైష్ఠికభక్తిని గని భర్గుడు పరమానంద భరితాంతరంగుడై, కపటేంద్ర రూపము విడిచి వేసి తన సాకార రూపమున ప్రకటనమయ్యెను. "భక్తాగ్రగణ్యా! పరమనిష్ఠాగరిష్ఠువైన నీ తపస్సుకు మెచ్చితిని. లే లె"మ్మనెను.

ఉపమన్యువు, సంభ్రమాశ్చర్యములకు లోనై, కనులను తెరిచి, కర కంఠునిగని, తాను ధన్యునైతినని బావించికొని , భవుని పాదములకు సాష్టాంగ పడి మ్రొక్కెను. లేచి నిల్చుండి చేతులు ముడిచికొని ముక్కంటిని మున్నెవ్వరునూ చేయని విధిన స్తుతించెను. సుధాకరుని నెత్తిన దాల్చిన వాడు సంతుష్టుడై ఆశీర్వదించెను. "ఓయీ వత్సా! దుగ్ధమును దుష్కరమగు తపస్సు చేసితివి. ఈ కారణమున ఒక కల్పము వరుకు గోదుగ్ధమును చవి చూడుము. పంచాక్షరీ మహామంత్రము వలన తపః సిద్ధిని గాంచితివి గాన, నీవు పరమ శైవశాస్త్ర విశారదుడవై, శివాచార్యుడవై వెలుంగుము. విశ్వమంతయును పర్యటించుచు, శైవ ధర్మ సూత్రములను వివరించి చెప్పుచు, పంచాక్షరి మహా మంత్రము యొక్క మహిత మహమను మనసార కొనియాడుచు లోక కళ్యాణమును సాధించెడిలోకోత్తర గురుమూర్తివికమ్ము" అని ఉపమన్యువును ఆశీర్వదించెను. ఉపమన్యువు "ధన్యోస్మి ధన్యోస్మి" యనుచు కృతజ్ఞాతా భావము, ముదము మనస్సున నిండియుండగా కైమోడ్పు చేయుచు ధన్యవాదములను ప్రకటించెను.

పంచాక్షరీ మహామంత్రము ద్వార సిద్ధిని బడసి, తద్వారా లోకోపకారము చేసిన యీ మువ్వరి చరిత్రల వలన భక్త కోటి స్ఫూర్తిని పొంది, పంచాక్షరీ మహామంత్రమును జపించి, ఈప్సితార్థములను, యిహలోక ఖ్యాతిని, పరమున పరమేశ్వరునితో సామరస్యమును సాధింతురు గాక.

**ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః**

ది. 16-9-1990

స్థలంః శివానుభవ మంగళ భవనము, షోలపూర్

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్ర శేఖర శివాచార్యులవారు, శివ పంచాక్షరిని జపించెడి వారి యొక్క శక్తి సామర్థ్యములను వివరించిరి.

సప్తకోటి మంత్రములలో మహిమాన్వితమైన మంత్రము లెన్నియో నుండవచ్చును. కాని యా మంత్రములన్నియును సాధకుని యాత్మోద్ధరణ కుపయుక్తమయ్యెడివే కాని వేరొండు కావు. కర్మసిద్ధాంతమును నమ్మెడి వారందరు "ఎవడి కర్మను వాడనుభవించక తప్పదు ననెడి ధోరణిలోన నాలోచింతురు. శ్రీ కృష్ణుడు చేసిన గీతోపదేశము వలన నీ బావము మరింత ప్రబలమై బహుళ వ్యాప్తిని చెందినది. స్వర్గ - నరకముల ప్రాప్తి యనెడి యాయాజీవులు చేసికొనెడి పుణ్యపాపముల వలన సంప్రాప్తమగుననియును, వాటిని తప్పించుట నెవ్వరికినీ తరము కాదనే భావన గలదు.

పంచాక్షరిని జపించెడి వాడీ విధముగా నాలోచించడు. జగత్తు శివలీలా విలాసార్థమై శివుని చేత సృషింపబడినది. స్వర్గమర్త్య పాతాళాదులిట్టివే. శివ కరుణ వలన నరకము స్వర్గమగును పంచాక్షరి జపించెడి వానికి శివ కరుణ సంప్రాప్తమై శివత్వము సిద్ధించును. ఇట్టి వారు లోకోద్ధారకు లగుదురు. ఆత్మోద్ధారణ కంటెను లోకోద్ధారణనే యుత్తమమైనదని తలతురు. ఇట్టి వారి సాంగత్యమున నున్నవారి కర్మపల్లటమై పోవును. వారు సద్గతిని పొందగలరు బసవన్నవారి యీ క్రింది వచనమును గనుడి :

**ఎవరెవరి సంగమేమేమి చేయదయ్యా**
**కీటము కుండలముగ కాదా అయ్యా!**
**చందనము సన్నిధిన బరిమళము దాకి,**
**వేప, బొబ్బిలి, చంద్రములు గంధములు కావా**
**మన కూడల సంగముని శరణుల సన్నిధితో**
**కర్మనిర్మలము కాక యుండునా?** (బసవేశ్వర గీతామృతము, పు.170-171)

శివభక్తులు దయామయులైనందున పాపులనై నుద్ధరించెడి యుదారబుద్ధి, వారికుండును. ఈ యంశమే యీ యాశీర్వచనమున నిరూపింపబడినది. లింగధారి యైన భక్తుడు శివపంచాక్షరిని జపించుచు తన శక్తిమేరకు లోకులకుపయోగపడవలెననెడిది గ్రహించవలసిన ధర్మ సూక్ష్మము.

-శివం భూయాత్-

## ఆశీర్వచనము-12

**శ్లో॥ వశిష్టవామదేవాద్యామునయోః ముక్తకిల్బిషాః।**
**మంత్రేణానేన సంసిద్ధా మహాతేజస్వినో2 భవన్ ॥** (సి.శి :8-47)

పాపముక్తులైన వశిష్ట వామదేవాదిమునులు ఈ మహా మంత్రము చేత అనేకమైన సిద్ధులను బడిసిరి. శాపానుగ్రహ సమర్థులైరి.

**శ్లో॥ బ్రహ్మాదీనాం చ దేవానాం జగత్సృష్ట్యాది కర్మణి ।**
**మంత్రస్యాస్యైవ మహాత్మ్యాత్ సామర్థ్యముపజాయతే ॥** (సి.శి :8-48)

బ్రహ్మ విష్ణువు మొదలైన దేవతలు ఈ పంచాక్షరీ మంత్రము యొక్క ప్రభావము వల్లనే జగత్తు యొక్క సృష్టి, స్థితి మరియు సంహార కార్యములను చేయుటకై సమర్థులు అగుచున్నారు.

**శ్లో॥ కిమిహ బహుభిరుక్తైర్మంత్రమేవం మహాత్మా ।**
**ప్రణవ సహితమాదౌ యస్తు పంచాక్షరాఖ్యం ॥**
**జపతి పరమ భక్త్యా పూజయన్ దేవ దేవ।**
**సగతదురితబంధో మోక్షలక్ష్మీం ప్రయాతి॥** (సి.శి :8-49)

ఈ పంచాక్షరీ మహా మంత్రము గూర్చి యెక్కువగా మాట్లాడుట వలన నేమి ప్రయోజనము? మహా దేవుని యిష్టలింగరూపమున పూజించుచు ఈ మంత్రము జపించినవారికి బంధముల నుండి విడుదల లభించును. మోక్ష లక్ష్మి సంప్రాప్తమగును.

ప్రాచీన కాలములో వసిష్ట, వామదేవాది మునులును, ఈ మంత్రమును గూర్చి అనన్యమైన శ్రద్ధ గల వారై సదా దీనిని జపించుచు సకల పాపముల నుండి విముక్తిని బడసి తేజోవంతులై గొప్ప కీర్తిని బడసిరి. ఈ విషయములను తెలిసి శ్రీ భగవత్పాదులవారు, దేవతల గురించి తెలిపిరి. విరించి విష్ణ్వాదులు నిరంతరము మహామంత్రమైన పంచాక్షరిని జపించి జగత్పాలనా సామర్థ్యమును పొందిరని తెలిపిరి. పెక్కుమాటలేల దీనిని జపించిన వాడు, మహా దేవుని పూజింపగనే సకల దురితములు దూరమై మోక్ష సామ్రాజ్యము లభించుచున్నది. ఈ కారణమున, మానవులకు, ఈ మంత్రమును మినహాయించిన యెడ, ముక్తిని సాధించి పెట్టెడి సాధనముమరొకటి లేదని గ్రహించవలెను. ఈ విషయమున శ్రీ నిజ గుణ శివయోగుల వారు తెలిపినది గమనించదగియున్నది. కనుడి:

**కాయవిడిదాత్మ రాశిగె పరతరముక్తిగు**
**పాయవిదు నిజ శివ మంత్రవణ్ణా।**
**తివరినరెంబు । శివశివ।**
**భువనద మానవరొమ్మె తామాగలి! శివమంత్ర**

**మోసదొళొమ్మె! శివమంత్ర**
**విదనుసురె! విదనుసురె!**

**శ్లో॥ సకృదుచ్చారమాత్రేణ పంచాక్షర**
**సర్వేషామపి జంతూనాం సర్వపాపక్షమోభవేత్॥**

**ఎనలాగి! ఇంతెన లాగి! శృతి యెన లాగి ।**
**హవణిసబారద కళుషవళిదు రాజి!**
**సువరు నిర్మల తెయిందెన లాగి**

దీని తెలుగు రూపమిది:

**కాయమిదు నాత్మరాశికి పరతర ముక్తికు**
**పాయమిది, నిజము శివమంత్రమన్నా!**
**వారు వీరనెడిదేమో! శివ శివ!**
**భువనపు మానవు లొకపరి తాము గాని శివ మంత్రమిదనిపించుడి.**
**మోసముతో నొకపరి శివమంత్రమిదని పించుడి.**

అనెగాన, ఇటులనెగాన, శ్రుతి యనెగాన, ఆలోచింపజాలని కల్మషముగడిగి రాజించుదురు నిర్మలతయందనెగాన.

శ్రీ శివయోగివారి నుడువుల ప్రకారము, పంచాక్షరి మంత్రములో నమోఘమైన శక్తి కలదనియును, వారిని వీరిని యనక మొత్తము మానవ జాతిని సముద్ధరించెడి శక్తి దానికి కలదనియును, ప్రతి యొక్కడు దానిని యొక్క పరియైనను నుచ్చరింపవలెననియును తెలియుచున్నది. లోకహితమను కోరే వారు నితరులచేత పంచాక్షరిని జపింపజెయ వలెననియును, ఎవ్వరైనను సమ్మతించని యెడల వారిని మోసమునకు గురిచేసియైనను వారి హితార్థమై వారి చేత పంచాక్షరీ మంత్రమును ఉచ్చరింపజేయవలెనని శ్రీ శివయోగులవారు ఉద్బోధించిరి. ఆ విధిన చేసిన యెడల అంతుచిక్కని అపారమైన పాపరాశి భస్మీపటలమై నిర్మలత్వము సిద్ధించునని అనిరి.

వశిష్టాది మునులు పంచాక్షరిని జపించి సద్గతిని మరియును సుస్థిరమైన కీర్తిని సంపాదించిరి. ఋషుల మార్గమననుసరించుట యనెడిది భారతీయ సంస్కృతిలో కొనసాగుచు వచ్చుచున్న సాంప్రదాయము. అందుచేత, శ్రీ భగవత్పాదులవారు ఆదర్శప్రాయులైన ఋషుల గురించి తెలిపి, వారు మంత్రరాజమైన పంచాక్షరిని జపించి, సుస్థిరమైన ఖ్యాతిని అనుపమానమైన పుణ్యఫలమును పొందినయటులే, నేటి మానవజాతి పంచాక్షరిని జపించి సద్గతిని పొందవలెనని శ్రీ భగవత్పాదులవారు ఆశించిరి. లోకకల్యాణము నాకాంక్షించెడి యిట్టి మహాదాచార్యులు సూచించిన మార్గమున పయనించుటయనెడిది మన కర్తవ్యమని భావించుట శ్రేయస్కరము. ఆ విధిన భావించి, ఆచరించి, అశేషమైనఫలమును పొందుదురు గాక!

## ఉప సంహారము

ఇంతవరకు శ్రీభగవత్పాదుల వారు ప్రతిపాదించిన పంచాక్షరీ జప మహిమను అవలోకించుట జరిగినది. మనకు తెలిసిన దేమనగా వీరశైవునకు పంచాక్షరీ మంత్రమొక అభేద్యమైన రక్షా కవచము అది తనను జపించెడి వారిని అహర్నిశలు కాపాడుచుండును. వేదాగమములలో ప్రతిపాదింపబడిన ప్రణవ సహిత పంచాక్షరి వీరశైవులకు నేకైక జప్యమంత్రమైయున్నది. శివుని అభిదానమైన యీ మంత్రమును పునః పునః పఠించుటచేత శివుని లక్ష్యమును మన వైపుకు త్రిప్పికొన వచును. "పంచాక్షరాత్ పరంనాస్తి పరిత్రాణం కలౌయుగే యనెడి" శివోక్తి ప్రకారము పంచాక్షరిని మినహాయిస్తే, మానవ కోటిని రక్షించెడి సాధనమేదియును ఈ కలియుగమున లభ్యమగుటలేదు.

ప్రాచీన మరియు ఆర్వాచీన సాహిత్యము నందున నొకే విధిన పంచాక్షరీ మహిమ కొనియాడబడినది.

శివరహస్య మనెడి గ్రంథము, శివుని మహిమను, శివపంచాక్షరి మహిమను నుతించిన విధమును గనుడి.

"శివ నామమనెడి మణి యెవ్వని కంఠసీమ యందున విరాజిల్లుచుండునో నతడు నీలకంఠునితో సమానమైన వాడు. శివనామము అమృతముతో సమానమైయున్నది. దీనిని పానము చేసిన వానికి పునః తల్లి పాలను త్రాగెడి యావశ్యకత ఉండదు. అట్టి వానికి పునర్జన్మ యుండదని గ్రహించగలరు. శివ నామము కొడవలితో సమానమైనది. దీనివలన లబ్ధిని పొందదలచిన వారు, దీనిచేత సంసార మనెడి మహావృక్షమును నరికిన యెడల, నయ్యది నేల గూలి మరల చిగురించలేని స్థితిని పొందును. శివనామము లన్నిటిలోను నిదియే శ్రేష్ఠతమమైనది. దురితములను దూరము చెసెడి సామర్థ్యము గల్గినదైయున్నది.

పంచాక్షరీ మంత్రమహిమను శివుడే స్వయముగా కొనియాడెనని శివ రహస్యము సప్తమాధ్యాయము వలన మానవాళికి తెలియుచున్నది. ఆ శివ భగవంతుని వాక్కులీ క్రింది విధిననున్నవి:

"ఓ యమధర్మరాజా! నానామము పాపమనెడి యరణ్యమునకు దావానలము వంటిది. ప్రళయ కాలాగ్ని, పర్వతశ్రేణుల నన్నింటినీ కాల్చి బూడిద చేసిన యటులే, నా మంత్రము నుచ్ఛరించుట వలన కోటాను కోట్ల సంఖ్యమేరకు గల పాపములన్నియును భస్మమగుచున్నవి. నా యొక్క నామ స్మరణ, నా స్మరణకు సమానమైనదై యున్నది అందు చేత, నా నామస్మరణలో తల్లీనులైయుండెడి భక్తుల దరికి నీవు పోవలదు. నీ జీవితమును కళ్యాణ ప్రదము చేసికొన దలచిన యెడల నీవు నా భక్తులను పూజించుము"

సౌర పురాణములోని యరువది నాల్గవ అధ్యాయమున పంచాక్షరీ యొక్క మహిమ యీ క్రిందివిధిన నుతింపబడినది:

సాధకుడు, బిల్వవృక్షము యొక్క కాండము కడ కూర్చుని యుండి, మూడు దినముల వరకును ఉపవాస వ్రతమునాచరించుచు, పంచాక్షరీ మంత్రము నొక్కలక్ష పర్యాయములు పఠించిన యెడల, వాడు చేసిన భ్రూణహత్యాది పాపములు నశించుచున్నవి. ఎవ్వడైననూ అజ్ఞానవశమున శివ నామములను పఠించినా అట్టి వానికిని శివుడు ముక్తిని ప్రదానము చేయు చున్నాడు. పవిత్రమైన నదిలో గాని, విశుద్ధమైన సరోవరముననైన గాని మునిగి శివధ్యానమును చేయుచు, శివ పంచాక్షరిని రెండు పర్యాయములు జపించినచో నట్టివాని పాపములన్నియును దూరమగును. అతడు పూతాత్ముడగును.

శివపురాణమునందున, బ్రహ్మాయమదూతలకు, పంచాక్షరీ మంత్రఫలితమును ఈ క్రింది విధముగా తెలిపిరి.

"పోయేటప్పుడు, వచ్చేటప్పుడు, కూర్చుండినప్పుడు, నిలుచుండినప్పుడు, మరియు పరుండినప్పుడు, మరే పనైనను పగలు రాత్రి చేయుచుండిననూ పంచాక్షరీ జపము చేసెడివారి మీద మీ అధికార ముండదు ఈ పవిత్రమైన మంత్రమును జపించెడి వాని ముఖము పవిత్రమైన తీర్థముతో సమానమై యుండును. ఈ కారణమున నట్టివాని ముఖదర్శనము వలన తీర్థస్నానము యొక్క ఫలము ప్రాప్తమగును. శరీరము మీద శివలింగము, భస్మము మరియు రుద్రాక్షలను ధరించి కొని పంచాక్షరీ మహామంత్రమును జపించెడి వాడు, దివ్యమైన క్షేత్రముతో సమానమైన కాయముగలవాడగును. అట్టి శివ భక్తుని శరీర దర్శన మాత్రము చేత దివ్యమైన క్షేత్రమును దర్శించెడి ఫలము ప్రాప్తమగును.

పద్మపురాణము నందున, సజ్జననింద, గురునింద, శ్రుతినింద, శాస్త్రనింద, దేవుని పేరిట పాపమును చేయుట, అహంకారి యగుట, మమకారముతో తప్పులు చేయుట, వ్రతదానాదులలో అశ్రద్ధ వహించడము మొదలగునవి సంభవించినప్పుడు పంచాక్షరీ జపము చేసిన యెడల, పై దోషముల వలన గల్గెడి దుష్పరిణామములు నిరోధింప బడు"నని చెప్పబడినది.

బ్రహ్మ వైవర్త పురాణము నందలి, బ్రహ్మఖండములో శ్రీ కృష్ణుల వారు శివ పంచాక్షరి మహిమను ఈ క్రింది విధిన తెలిపిరి.

"శివ నామము నంద నురాగమును పెంచికొని అనురాగముతో నా శివ నామమును జపించెడి వారిని సదా నేను వెన్నంటియుందును. శివ యనెడి శబ్దము కల్యాణ ప్రదమై యున్నది. బంధు-బాంధవ, ధన-కనకాదులను కోల్పోయినవాడైనను,

శివ పంచాక్షరిని జపించినచో సకల కల్యాణ పరంపరలను మరల పొందును. 'శివ' అనెడి రెండక్షరములలో పాపనాశకము ముక్తిదాయకములనెడి రెండర్థములు యిమిడి యున్నవి. మహా పాపియైనను పంచాక్షరిని జపించినచో పాపములు వైదొలగును ముక్తి లభించును."

మానవుని యొక్క అంతిమ ఘడియలు ఎంతో మహత్వపూర్ణమైనవని గుర్తించవలెను. అంతిమ ఘడియలయందు మనబుద్ధి దేనిని చింతించునో దానినే పొందుచున్నాము. జీవనము యొక్క మిగిలిన కాలములో ఏమి చేసిననూ చివరిన ప్రాణము విడిచేసమయమున సత్యమార్గమును ఘటించిన యెడల అతనికి సద్గతి ప్రాప్తమగుచున్నది. 'అంతేయా మతిః సా గతిః' అని శాస్త్రకారులు ప్రతిపాదించినారు. ఒక వ్యక్తి తన శరీరము యొక్క ఛాయాచిత్రమును తీసికొనవలెనని ఫోటోస్టూడియోకు వెళ్ళి ఎంతో జాగరూకతతో చక్కగా తయారై కూర్చొని ఫోటో తీయు సమయమున కనురెప్పలు వాల్చిన యెడల ఏమగునో మనకు తెలియునుకదా? అంత సమయము వరకు వాడు పొందిన కష్టము వృథా యగును. వాడి ఛాయా చిత్రము కనులు మూయుటవలన అంగవైకల్యము గల్గినదై జుగుప్సా కరముగా కన్పట్టును. తాను గుడ్డివాడు కాకుండినను గ్రుడ్డివాడను భావమును కలిగించు ఫోటో చూసినపుడు వాని మనోభావములు ఎట్లుండునో వూహించగలము. పరిచయములేని వాడు ఆ ఫోటో చూసినయెడల అతనిని గ్రుడ్డివాడనే భావించునుగదా? ఈ కారణమున గ్రహించవలసిన దేమనగా చివరిక్షణములు అనెడివి అత్యంత కీలకమైనవి జీవనము యొక్క చివరిక్షణమునందున మనము ఏమి తలచికొందుమో ఆ విధిన సద్గతియో దుర్గతియో లభించనున్నది. మహాభారతములో చెప్పిన యటుల ఒకవ్యక్తి లేడిమీద అనురాగముగలిగి దానినే మననము చేయుచుండెను. ఈలోపున మరణమాసన్నమయ్యెను. మరుజన్మలో వాడు లేడియై పుట్టెను. తెలిసికొనవలసిన దేమనగా చివరి క్షణమున మన మనస్సుకు తోచెడిభావమేమిటో మనకు తెలియదు. అప్పుడు మనబుద్ధి మన మాధీనములో నుండదు కదా? చివరి క్షణమున శివనామస్మరణ చేసిన యెడల పాపములు వైదొలగి పరమేశ్వరుని సన్నిధికి చేరుట యనునదె తథ్యమగును. కాని మనమటులచేయగలమా? చేయగలము అని గట్టిగా చెప్పలేము. ఈ కారణము వలన నిరంతరము పంచాక్షరీ జపమును చేయుట యనెడి దానిని అలవాటుగా చేసికొనిన యెడల చివరి క్షణములో తప్పనిసరిగా శివనామము అలవాటు ప్రకారముగా మన జిహ్వామీదకు రాగలదు. మనకు సద్గతి లభించగలదు. ఇది దృష్టిందుంచుకొని ప్రతి ఒక్కరూ శివ పంచాక్షరీ జపమును చేయుట నలవాటుగా మార్చుకొనవలెను.

తన భక్తుల యొక్క పాపములను హరించే వాడవుటచేతనే శివునికి హరుడు అనెడి పేరు సిద్ధించినది. శివనామమును జపించిన యటులనే హరనామమును స్మరించిననూ జీవులు పాపమునుండి ముక్తిని పొందుచున్నారు. హరనామమును ప్రత్యక్షముగా ఉచ్ఛరించిననూ లేదా ఈ రెండక్షరములను ఏదో ఒక శబ్దములతో కలిపి ఉచ్ఛరించిననూ పాపము నుండి ముక్తిని పొందగలరు. ఈ విషమున శివరహస్యము యనెడి గ్రంథములో ఒక సుందరమైన కథ వివరింపబడినది.

ఒక గ్రామమునందున బ్రహ్మహత్యచేశిన ఒక మహాపాపి యుండెను వాడు తన మరణ సమయమున తన పిల్లలను పిలచి "ఆహర వస్త్రం" అని అనెను. దీని యర్థమేమనగా బట్టను తీసికొనిరమ్ము. అదే విధిన సంహార 'ఏతౌ' అని అనెను. దీని భావమేమనగా వీరిద్దరినీ చంపుము. 'ప్రహర ప్రహర' అనెను. దీని బావమేమనగా కొట్టుడు, కొట్టుడు అనునది. ఈ విధముగా పలురకములైన శబ్దములను ఉచ్ఛరిస్తూ ప్రాణములను వీడెను.

ఈ శబ్దములన్నియును ఒక దానితో నొకటి సంబంధము లేనివై యున్నవి. 'ఆహర' మనగా తీసుకొని రమ్మనియునూ, 'ప్రహర' యనగా కొట్టుమనియును 'సంహార' మనగా చంపుమనియును అర్థములు కలవు. వాడు వస్త్రమును తెమ్మనేనేగాని మిగిలిన విషయములలో వాని భావమెమిటో తెలియదయ్యెను అనగా ఎవరిని చంపవలెను? ఎవరిని కొట్టవలెను? అని చెప్పెడి లోగనే వాడు. ప్రాణము వదిలెను. ఆపాపిని తీసికొని వెళ్ళుటకై యమదూతలు వచ్చిరి. అదే సమయమున శివదూతలు కూడా వచ్చిరి. శివదూతలు యమదూతలనడ్డకొనిరి. వారితో నిట్లనిరి. ఈతడు మరణకాలమునందున హరనామములను ఉచ్ఛరించుట చేత యితనిని యమలోకమునకు తీసుకొని వెడలకూడదు. మేము అతనిని తీసికొని శివలోకమునకు వెడలెదము. అప్పుడా యమదూతలు సంభ్రమాశ్చర్యములకు గురియై తమ మనోభావములను శివదూతల కీవిధముగా తెలియజెప్పిరి. ఇతడు అంత్యకాలమునందున

హర నామమును స్మరించలేదు. మీరు పొరబడుచున్నారు వీడనిన మూడు మాటలును హరునికి సంబంధిచినవికావు ఆహర, సంహర, ప్రహర అని నుడివినందున వీడు శివనామమును పఠించి నెటులగును. మేము వీనిని యమలోకమునకే తీసికొని వెళ్ళెదము ఈ విధముగా మాట్లాడిన యమభటులు శివ భటులను నిరోధించుటకై సిద్ధమైరి. ఈ విధముగా యమదూతలకును, శివదూతలకునూ వివాదము యేర్పడి వాద ప్రతివాదములు జరిగెను. చివరకు వారిలో ఎవరిది తప్పు. ఎవరిది ఒప్పు అను విషయములో పూర్ణాంగీకారము రాలేదు. ఇరువురూ వారి వారి వాదనలే సరియైనవని వాదించిరేకాని నిజమును ఎరుగుటకు ప్రయత్నించరైరి. చివరకు ఈ విషయమును శివుని వద్దనే తేల్చుకొనుటకై సిద్ధమైరి. యమదూతలు శివదూతలు శివపురినిచేరిరి. శివునికి నమస్కరించి విషయమును నివేదించిరి. ఎవరి వాదనలను వారు వినిపించగా శివుడు యమదూతలను వుద్దేశించి 'ఓ యమదూతలారా! అతడు జీవనము యొక్క ఉచ్ఛ దశలో ఎన్నో పాపములను చేసెను. అది నిజమే. అయితే అంత్య సమయమునందున కేవలము హరనామములకు ఆ,సం మరియు ప్ర అనెడి ఉపసర్గలను చేర్చి పలికినాడు. కేవలము హరహర అనెడివారి పాపములను పరిహారము చేసేవాడిని నేను. అట్టి యెడ హరనామమునకు విశిష్టముగా ఉపసర్గలను జోడించి పలికినందున ఇతడు నాకు ఎంతో ప్రేమ పాత్రుడు ఇతని మీద నాకు విశేషమైన ప్రేమ ఏర్పడినది. నా కృప యితని మీద ప్రసరించినది. ఈ కారణము వలన ఇతడు యమలోకమునకు వెడల జాలడు. అని పలికెను. యమదూతలు శివుని ఆజ్ఞను ఎరింగిన వారై సమాధానమును పొంది తమలోకమునకు వెడలిపోయిరి. ఆ సంబంధిత వ్యక్తి శివలోకముననే వుండి సాలోక్యముక్తిని అనుభవించెను.

శివుడు ఎంతో ఉదారుడును, సరళుడునూ మరియు భోళాస్వభావమును కలిగినవాడును అయివున్నందున ఆ భక్తుని ముఖమునండి వచ్చిన అన్వార్థప్రతిపాదకములగు పదముల నుండి హర అనెడి శబ్దమును తననామముగా గ్రహించి ఎంతో మందిని అనుగ్రహించిన కథలు విస్తృతముగా కలవు. ఈ విధముగా నున్నపుడు శివ భక్తుడైనవాడు నేరుగా శివ పంచాక్షరిని జపించిన యప్పుడు అతడు శివుని కృపకు పాత్రుడు కాకుండా యుండగల్గునె? ఉండజాలడు ఈవిషయమున నిజగుణ శివయోగులవారి ఈ క్రింది పద్యము గమనించదగినదై యున్నది.

కు॥ **" హరనామవను బిడదె జపిసబల్లవర భవ।**
**మరణ మాయాకర్మ మలపాశ బంధ బహు।**
**దురిత సంసార సంతాప సంచయళిదు**
**వరభోగ మోక్షవహుదు** ॥ప॥

దీని తెలుగు రూపమును గనుడి:

**" హరనామమును విడక జపించగలిగిన వారి భవము ।**
**మరణము మాయాకర్మము మలపాశబంధము బహు।**
**దురిత సంసార సంతాప సంచయము విరిగి**
**వరభోగ మోక్షమగును"**

శివయోగులవారు హరనామ స్మరణవలన కలిగెడి ఫలమును వివరించినారు.

కలియుగమునందున మంత్రజపము లేదా నామస్మరణవలన సకల యిష్టార్థములను పొందగలము. ఇంతేకాదు భవసాగరమును దాటగలము. ఈ విషయమున వైష్ణవభక్తులు, శివభక్తులు ఒకే విధమైన అభిప్రాయములను గలిగి వున్నారు. మనము చేసెడి నామస్మరణ రూపమైన ధర్మాచరణ చిన్నదై యుండవచ్చును. అయితే సాధకుడు సత్యమైన ప్రేమగలవాడిగను, శీలవంతుడిగను అయి వుండిన యెడల నామ జపము యొక్క ఫలమును ఎంతో శీఘ్రముగా పొందగలరు.

అధర్మ ప్రభోదకమైన కలియుగము ప్రారంభమైన యప్పుడు మహర్షులందరూ ఆందోళన చెంది బ్రహ్మదేవుని ప్రార్థించిరి. సంతుష్టుడైన బ్రహ్మదేవుడు మహర్షుల యెదుట ప్రత్యక్షమై 'ఓ మహర్షులారా! కలియుగమును గురించి మీరు భయపడవలసిన

పనిలేదు. వేరువేరు యుగములయందున యజ్ఞ యాగాది కష్టసాధ్యములైన ధర్మాచరణలను ఆచరించి బడయగలిగిన ఫలమును ఈ కలియుగమునందున కేవలము మంత్రజపము లేదా నామస్మరణ వలన బడయగల్గుదురు. ఇంతటి శక్తి కలియుగమునకు వుండినప్పుడు మీరెందుకు భయపడెదరు అని అభయవచనమునిచ్చి అనుగ్రహించి అంతార్ధనుడయ్యెను. అపుడు మహర్షులెల్లరూ సంతోష భరిత అంతరంగముగలవారై ఆనందముతో ఆడజొచ్చిరి. వారావిధముగా ఆడుకొనేడి సందర్భము నందున త్రిలోక సంచారి యగునారదుడు ఆకస్మికముగా వచ్చి మీరు ఆనందముతో నాడు కొనుటకు కారణము నెరిగిన వాడై తన మేనిమీద గల బట్టలన్నిటిని ఊడబెరికి విసరివేసి దిగంబర రూపమున కుడిచేయిచేత నోటిని, ఎడమ చేయిచేత గుహ్యాంగమును మూసికొని మహర్షులవెంబడి తాను కూడా ఎగిరెగరి యాడుకొనజొచ్చెను. నారదుని యొక్క ఈ అసభ్య ప్రవర్తనను గనిన ఋషులందరూ ఆశ్చర్యముతో, అతని నీవిధిన ప్రశ్నించిరి. ఓ నారదా! నీవు శిష్టాచారమునెరుగని వానివలె ఈ విధిన ఎందుచేత ఆడుచున్నావు? అప్పుడు అతడు 'ఓ మహర్షులారా! కలియుగమునందున కేవలము నామస్మరణచేత సర్వసిద్ధులను పొందవచ్చును అనెడిది నిజమే. అయితే, దాని జతకు సత్యమైన నుడి, మరియు సచ్చారిత్ర్యములనెడి పథ్యములను పాటించవలసియుండును. ఈ మర్మమును మీ అందరికినీ తెలియజేయుటకే నేను ఈ విధిన నోటిని, గుహ్యాంగమును మూసికొని సంజ్ఞాపూర్వముగా వుపదేశమును యిచ్చితిని. నారదుని ఈసాంకేతిక ఆచరణ యొక్క మర్మమును ఎరిగిన మహర్షులందరు కృతజ్ఞతా భావముతో నతమస్తకులైరి. ఈ విషయమును సర్వజ్ఞులవారును తెలియజెప్పిరి. సత్యవాక్పరిపాలన, సచ్చరిత్ర యొక్క ఆవశ్యకత ఎంతో కలదు. ఈ కారణమువలన మంత్ర జపమునుగాని, నామ స్మరణనుగాని చేసెడివాడు సత్యభాషియై, శీలవంతుడునునై యుండవలెను. అప్పుడే ఆ మంత్ర జపము యొక్క ఫలము శీఘ్రముగా సిద్ధించగలదు.

నీరు ఎల్లపుడు అధోముఖముగా ప్రవహించునటులనే మనుష్యుని మనోవృత్తియు సహజముగా అధోముఖముగా ప్రవర్తించును. యంత్రముయొక్క సాయముచేత నీటిని ఊర్ధ్వముఖముగా పయనింపజేయుటకు సాధ్యమగునటులనే శివ మంత్రము సాయముచేత మనస్సు యొక్క అధోప్రవృత్తిని తగ్గించి ఊర్ధ్వ ముఖమును పొందించుటకు సాధ్యమగుచున్నది. ఈ కారణమున మనస్సుకు మంత్ర సంస్కారమునిచ్చి దానిని నిరంతరము జపాభ్యాసముందుండువిధముగా చేసిన యెడల అది సాత్వికమైన, మంగళప్రదమైన శివకళను పొందును. ఈ శివకళా సంపన్నమైన మనస్సుగల మనుజుడు శివునివలె ప్రశాంతుడై సదా ప్రసన్నతగలవాడై యుండును. ఇంతటి వానిని తన మనస్సున కలిగెడి సంసారిక లాభహానులకు సంబంధించిన ఆలోచనలు అంతగా ప్రభావమునకు గురిచేయజాలవు. అంతేకాదు, పంచాక్షరీ మహామంత్రము యొక్క సతత జపాభ్యాసము పరిణామముగా సాధకుడు తన మాంసమయమైన దేహమును మంత్రమయమైన దేహముగా పరివర్తన చేసి కొనుచున్నాడు ఈ విధముగా మంత్రకాయుడయిన పూతాత్ముడి హస్త, పాద, మరియు నేత్రాదులకు అద్భుత సామర్థ్యము ప్రాప్తమగును. ఇట్టి వ్యక్తుల దర్శన, స్పర్శన, మరియు సంభాషణల వలన దుష్టచిత్తులు అయిన వారు వీరికి శిష్యులై పరివర్తనను పొందుదురు. ఈ విధముగా పంచాక్షరీ మహా మంత్రము యొక్క జపముచేత తాను ఉ ద్ధరింపబడుచూ, ఇతరులను ఉద్ధరించుచున్నాడు.

శివ పంచాక్షరీ మహామంత్రమునందున ఇంతటి అద్భుతమైన సామర్థ్యము అణగివుండుటచే ప్రతి ఒక్కరూ తమతమ గురువులనుండి మంత్రదీక్షను బడసి జపాభ్యాసమును ప్రారంభించవలెను. గురూపదేశములేనిదే చేసిన మంత్ర జపము ఫలకారి కాజాలదు. అందుకొరకే వీరశైవసిద్ధాంతమునందున ప్రతి ఒక్కరూ శివదీక్షను పొందవలయుననియునూ, గరువుగారి ముఖమున మంత్రోపదేశమును పొంది అనన్యమైన భక్తి శ్రద్ధలతో అద్దానిని జపిస్తూ త్రికరణముల ద్వారా శుద్ధిని బడసి సద్గతిని పొందుటకు ప్రయత్నించవలెనని చెప్పబడినది. ఈ కారణమున వీరశైవులెల్లరూ శివదీక్షనుపొంది మంత్రోపదేశమును బడసి నిరంతరము పంచాక్షరీ జపమును చేయుచు ధన్యులై లోక కళ్యాణమును సాధించి పరమున పరమేశ్వరుని పొందుదురుగాక.

**ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః**

**దీనితో శ్రీ సిద్ధాంత శిఖామని ప్రవచనప్రభ గ్రంథమున అష్టమ పరిచ్ఛేదము పంచాక్షర జప స్థలము సంపూర్ణము.**

**ది. 17-9-1990**

**స్థలంః శివానుభవ మంగళ భవనము, షోలపూర్**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారీ యాశీర్వచనమునందున పంచాక్షరి వలన పునీతులైనవారిని గురించి తెలియజేయుచు బ్రహ్మవిష్ణ్వాది దేవతలును, కపిలాది మునులును పంచాక్షరిని జపించి ధన్యులైరని తెలియజెప్పిరి. ఈ విషయమున పాల్కురికి వారు నీ క్రింది విధముగా నుపదేశించిరి.

**నవిచి ధ్యానా దర్చనా ద్ధారణాద**
**పి యనంగ విష్ణుప్రభృతి సురల్మునులు**
**బ్రయతి సంసార తారకమూనామనకి**
**దియ యంచు వీరభక్తి స్తిల చిత్తు**
**లయి 'మరుతో మర్ణమంత' నాశ్రుతిజ-**
**నిన 'రుద్రయత్తే జనిమ చారుచిత్ర'**
**మనదె ' నవా పి గుహ్యం బనవిష్ణు**
**దును బ్రహ్మయును నింద్రుడును సురల్ గొల్చి**
**పను గొని తమ తమ పదములు బడయ'** (పండితారాధ్యచరిత్ర, దీక్షప్ర.)

బ్రహ్మ విష్ణ్వా దిసురలు శివుని యర్చించి తమ పదవులు బడసిరని తెలుపబడినది. వీరీ సందర్భమున శివపంచాక్షరిని జపించిరని ప్రత్యేకముగా చెప్పు నవశ్యకత లేదు. దేవుళ్ళ వలె యక్ష కిన్నకింపురుషులును, వారితో బాటుగా మునులును శివపంచాక్షరిని జపించి ధన్యులైరి. పౌరాణిక వాఙ్మయములో నీ విషయములు విశదీకరింప బడినవి.

**ఉప సంహారము**

శ్రీ జగద్గురువుల వారు నీ యుపసంహారమున పంచాక్షరిని గురించిన సకల విషయములను సమీక్షించి, సత్ఫలితములను పొందగోరువారు నవలంబించ వలసిన వైఖరుల గురించి వివరించిరి.

శివ శబ్దము వేదాగమపురాణాదులలోన పలు పర్యాయములు నుపయోగింపబడినది. ఉపనిషత్తులలోను, మహాభారతములోను శివుని పరబ్రహ్మగా నుతింపబడెను. శివ పదము వేదసారమని యెంచబడినది. పరబ్రహ్మ వాచకమైన 'శివ' పదము ప్రధానాంగముగా గల పంచాక్షరీమంత్రమునకు ననన్య సామాన్యమైన ప్రాముఖ్యత గలదు.

సప్త కోటిమంత్రములు నేదోయొక్క ప్రయోజనములను నెరవేర్చు చున్నవి. కొన్ని పురుషార్థములను సాధించేవిగా నుండగా మరికొన్ని స్వర్గాది భోగములను కల్గించేవిగా నున్నవి. కామ్య కర్మలలోన నీ మంత్రములు నధికముగా నుపయోగింప బడుచున్నవి. ప్రాయశ్చిత్త కర్మలలో నుపయోగించెడి మంత్రములు కొన్ని గలవు. ఇవన్నియును పరిమిత ప్రయోజనములను నెరవేర్చెడివై పరిమితమైన శక్తి సామర్థ్యములు గల్గి యున్నవి. వీటిని జపించెడి క్రమము, తత్సంబంధమైన నియమాదులు మంత్రశాస్త్రమున వివరింప బడినవి.

ముప్పదిమూడు కోట్ల దేవతలు గలరని పురాణముల వలన తెలియుచున్నది వీరిలో బ్రహ్మ విష్ణువులు ముఖ్యులని యందురు. వీరందరి సృష్టి స్థితి మరియు లయలకు కారకుడైన వాడే శివుడని యెన్నో పురాణములు ఘోషించుచున్నవి వీరందరు శివుని యర్చించెడి సందర్భమున పంచాక్షరి నుపయోగించి ధన్యత బడసిరనియు తెలియుచున్నది.

పురాణములలో పంచాక్షరి యొక్క లక్షణమైన పాపక్షయము గురించి యధికముగా చెప్పబడినది. పాపక్షయమును కోరువారు పంచాక్షరిని ప్రాయశ్చిత్త కర్మగా స్వీకరింతురు. కామితార్థముల నాశించెడి వారు నిద్దానిని ప్రధాన సాధనముగా నెంచెదరు బ్రాహ్మణాచారములను పాటించెడి బ్రహ్మణాదులు పంచాక్షరిని నిత్యకర్మలలోను నైమిత్తికములలోను చాల అరుదుగా నుపయోగిస్తూ.

గాయత్రికి యెక్కువ ప్రాముఖ్యత నిచ్చుచున్నారు. పాల్కురికి వంటి వారి ధోరణులను విమర్శించిరి. అయినా, వేదమాత యని యెంచబడిన గాయత్రికి లభించెడి ప్రాముఖ్యత, వేదోపనిషదాది సకల విద్యలకు మాతృస్థానముగా నెంచబడిన పంచాక్షరికున్నంత ప్రాముఖ్యత లభించుటలేదని వీరశైవ విజ్ఞుల యభిప్రాయము. పంచాక్షరి యొక్క ప్రాముఖ్యతను గుర్తించని వారు నొక విధముగా నష్టజాతకులని యనెడివారును గలరు.

పంచాక్షరికి పరిపూర్ణమైన ప్రాముఖ్యతనిచ్చెడి వాడు వీరశైవుడు మాత్రమే యని యనవచ్చును. వీరశైవ ధర్మమున యీ క్రింది ప్రాథమిక సూత్రమని యెంచబడినది దానిని గనుడి.

**శ్లో॥ శివ ఏవ పరబ్రహ్మ సర్వలోకైకకారణః ।**
**అన్యదా శరణం నాస్తి.................**

శివుడే పర బ్రహ్మయని నమ్మి యతనని మాత్రమే శరణువేడవలె ననెడిదే యీ ప్రాథమిక సూత్రము. తదనుగుణముగనే యీ క్రింది బోధన పాటింపబడుచున్నది.

**శ్లో॥ సర్వాన్ దేవాన్ పరిత్యజ్య యజేత్పంచా స మీశ్వరం ।**
**సర్వాన్ మంత్రాన్ పరిత్యజ్య జపేత్పంచాక్షరీ సదా॥** (వీరశైవ సి.శి.పు.249)

నిత్యనైమిత్తిక ప్రాయశ్చిత్తాదుల కతీతముగా నుండెడి త్రిలింగార్చనను చేయుచు పంచాక్షరీ జపమును చేయుటే వీరశైవుని ప్రాథమిక కర్తవ్యమైయున్నది.

అష్టావరణములలో నొకటగు పంచాక్షరిని జపించుచు, నితరములను పరిత్యజించెడి ధోరణి ధర్మసమ్మతమైనది కాదు. సప్తకోటి మంత్రములలో యిది మంత్రరాజమనియును, సకలాభీష్టములనే కాదు సకల మోక్షములనిచ్చెడిదని యెంచి వేనకు వేలు పంచాక్షరిని జపించి ధన్యుడనైతిననెడి వాడు పొరబడుచునాడని గ్రహించవలెను. త్రిలింగముల యెడ భక్తిని గల్గి, త్రిలింగములకు త్రివిధసమర్పణలను చేసి, త్రిలింగార్చననే నిత్యనైమిత్తిక కామ్యప్రాయశ్చిత్త క్రియయని యెంచి, గురూపదేశమున ధన్యతను బడసి, ధృత లింగ రుద్రాక్షభస్మధారియై, పంచాక్షరిని త్రిలింగార్చన సమయమున నుపయోగించుచు, త్రివిధ లింగార్చన ఫలితముగా వచ్చెడి త్రివిధపాదొదక, త్రివిధ ప్రసాదములను స్వీకరించుచుండినగాని సద్గతి లభించదు.

సదాచారమునకు గల ప్రాముఖ్యతను శ్రీ విద్యావాచస్పతులవారు నొక్కిచెప్పిరి. ఈ విషయమున యన్నమయ్య వారి యీ పద్యము గమనార్హమైయున్నది.

**సత్యం బెప్పుడు తప్పదేనియు దురాచారుండు గాదేని యౌ**
**చిత్యం బేమఱదేని దుర్జనుల గోష్ఠింబొందదే భక్త సాం**
**గత్యం బాదట బాయదేని మదన గ్రస్తుండు గాదేని నీ**
**భృత్యుండాతడు మూడులోకములలో బూజ్యుండు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప.55)

ఈ పద్యములో వివరింపబడిన వర్తన కంటెను భిన్నముగా ప్రవర్తించెడి వానికి పంచాక్షరీ జపము సత్ఫలితముల నివ్వజాలునా? యనెడిదొక పెద్ద ప్రశ్న శైవులే విధిన భావించినా భావింతురు గాక, వీరశైవము ప్రకారముగా నిట్టి ప్రవర్తన గలవారు పంచాక్షరీ జపమును చేసినా ఫలితముండదు.

ఈ ధర్మసూత్రమును భక్త స్థలములోని వీరశైవుడు గుర్తించ వలెను. అష్టావరణముల చేత పరిరక్షితుండై, షట్స్థలజ్ఞాన సంపన్నుడై, సదాచారాది పంచాచారములను పాటించుచు సాధన చేసెడి వాడు భక్తి శ్రద్ధలతో పంచాక్షరీ జపమును జేసిన యెడల నాత్మోద్ధరణను, లోకోద్ధరణను సాధించి, లోకత్తరుడై లోకపూజ్యుడై లోకమున విరాజిల్లి పరమున పంచవదనుని కరుణాకటాక్షము వలన సద్గతిని పొందగలడు.

**-శివం భూవత్-**

# నవమ పరిచ్ఛేదము

## భక్తమార్గక్రియా స్థలము

### ఆశీర్వచనము-1

శ్రీ జగద్గురు శ్రీ రేణుక భగవత్పాదులవారు భక్తి స్థలాంతర్గతమైన తొమ్మిదవ అవాంతరస్థలమున భక్తుని లక్షణములను తెలియజెప్పుచు, నవవిధ భక్తులను గూర్చి వివరించిరి. వీరి యీ ఉపదేశమును గనుడి:

**శ్లో॥ భూతి రుద్రాక్షసంయుక్తో లింగధారీ సదాశివః।**
**పంచాక్షరజపోద్యోగీ శివభక్త ఇతి స్మృతః ॥**
**శ్రవణం కీర్తనం శంభోః స్మరణం పాదసేవనమ్.**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్॥**
**ఏవం నవవిధా భక్తిః ప్రోక్తా దేవేన శంభునా।**
**దుర్లభా పాపినాం లోకే సులభా పుణ్యకర్మణామ్॥** (సి.శి.9: 1-3)

విభూతి రుద్రాక్షలను ధరించి, యిష్టలింగమును సదా దేహము మీద ధరించిన వాడైయుండి, పంచాక్షరీ మహామంత్ర జపములోన సదానిమగ్నుడై యుండెడి వాడెవ్వడో వాడే శివభక్తు డనిపించికొనుచున్నాడు. భక్తి నవవిధములు. అవి. శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము మరియు ఆత్మ నివేదనము. ఇట్టి భక్తి పాపాత్ములకు దుర్లభమై పుణ్యాత్ములకైతే భక్తి సులభసాధ్యమైయుండును.

శివతత్వ శాస్త్రమును గూర్చిగాని, శివలీలను గూర్చిగాని ఆలించుట, శివస్తోత్రమును చేయుట మంగళమయమైన శివమూర్తిని ధ్యానించుట, శివుని పరమపవిత్రమైన పాదములను సేవించుట, శివలింగమును పూజించుట, శివునికి నమస్కరించుట, శివుని యెడ సఖ్యభావన గల్గియుండుట, శివునికి తనను తానే సమర్పించికొనుట యనెడివి చేయుట చాల కష్టసాధ్యము. ఊరకే దొరకునది కాదని శ్రీ భగత్పాదుల వారు హెచ్చరించుచున్నారు. ఈ నవ విధములగు భక్తిని గూర్చి తెలిసి కొందము.

#### శ్రవణభక్తి

"ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిధి ధ్యాసితవ్యః" యనెడిది శ్రుతి వాక్యము , ఆత్మయొక్క దర్శనమును చేసికొనవలెననిన మొదటగా శ్రవణము యొక్క యవశ్యకతగలదు. శివుని నామ, రూప, గుణ, ప్రభావ, లీల, తత్వములు మరియు రహస్యముల గూర్చి ప్రతి పాదించెడి ప్రవచనములను భక్తిశ్రద్ధలతోను, నమ్మకవిశ్వాసములతోను, ప్రేమానురాగములతోను వినుటయే శ్రవణ భక్తి. ఇట్టి శ్రవణ భక్తిని పొందుటకై శివ భక్తి సంపన్నులైన సత్పురుషుల సాంగత్యమును నిరంతరముగా చేయుచుండవలెను. అధిక భాగము మేరకు సమయమును సత్సంగమునందు గడపిన యెడల, శ్రీ గురువు యొక్క ముఖారవిందము వలన అమృతమయమైన శివకథల శ్రవణము చేయుట యనెడిది ప్రాప్తమగును. ఈ సత్సంగము మరియు సత్కథాకాలక్షేపమువలన పతితుడు పావనుడగుచున్నాడు. సంసారసంబంధమైన మాటలను వినివినీ జీవుడు విషయాసక్తిని పెంచికొని, విషయలంపటుడై యనంతకాలమునుండి అనేకమైన యోనులలో జన్మించుచు, జన్మలన్నింటిని నిరర్థకము చేసి కొనుచున్నాడు. జన్మనెత్తిన శిశువుకు పదహారు లేదా యిరువదియొక దినమునాడు ఆ శిశువుకు నామ సంస్కారమును చేయుదురు. ఆ శిశువు చెవిలో గురువు గారి చేతనో, మేనత్తచేతనో, వ్యవహారమునకై పేరును పలికి ఆ పేరుననే పిలుచుచుందురు. ఆ పేరుననే యా శిశువును మీద ప్రయోగించి పిలుచుటచేత, శిశువు కాపేరు తనది యనెడి భావనను దాల్చును ఈ భావనలోన అబిమానము యుండును. ఈ రీతిగా జీవుడు, తన శ్రవణేంద్రియము ద్వారా సంసారమును గురించి తెలిసికొనుచు, దాని యెడల మమకారమును పెంచికొనుచున్నాడు.

క్రమక్రమముగా సంసార వ్యామోహమునందున నిమగ్నుడగుచున్నాడు. ఆత్మతత్త్వమును మరచి పోయి లోకరంజనలో మునిగితేలుచుండును. క్రమముగా పరమాత్మ తత్త్వమునకు దూరమై, చివరకు పరమాత్మనే మరచి పోవును.

పూర్వజన్మ సుకృతమువలన సత్సాంగత్యము లభించినయెడ ఆత్మ, అనాత్మ, మరియు పరమాత్మ విషయకమైన జ్ఞానమునందాసక్తి, పెరుగుచున్నది. వీటిని గూర్చి వినవలెననెడి కోరిక జనించుచున్నది. తత్ఫలితముగా శ్రవణభక్తి పెరిగి దానివలన జీవాత్మ ప్రేమమార్గము నుండి విముఖుడై శ్రేయోమార్గము వైపు ప్రవృత్తుడగుచున్నాడు. "శ్రవణం సర్వధర్మే భ్యోవరం మన్యే తపోధనాః అని శ్రీనారదమహర్షి సనకాదులతో అనేకవిధములైన ధర్మాచరణలయందు శ్రవణ రూపమైన ధర్మాచరణ అత్యంత శ్రేష్ఠమైనది. ఈ శ్రవణ భక్తి యొక్క బలము వలననే మనము కూర్చున్న దగ్గరనే మన ఆరాధ్య దైవమును పొందవచ్చును.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులనుండి అగస్త్య మహర్షి, ధధీచి మహర్షి శ్రీ జగద్గురు ఘంటాకర్ణ భగవత్పాదులనుండి వ్యాసమహర్షి శ్రీ జగద్గురు ధేనుకర్ణ భగవత్పాదుల నుండి సానంద మహర్షి శ్రీ జగద్గురు విశ్వకర్ణ భగవత్పాదులనుండి దూర్వాస మహర్షి ఉపదేశమును బడసిన విషయము అందరూ ఎరిగినదే. మహా భారతములో ఇట్టి గురుశిష్య పరంపరకు సంబంధించిన విషయము లెన్నియోకలవు. మహా పురుషుడగు శ్రీ కృష్ణుని అర్జునుడు గురువుగా భావించి సేవించెననియును. అతని ఉపదేశమువలన వర శివుని కటాక్షమును పొంది సిద్ధినిబడసెననియు ఎరుగని వారెందరు. ఈ రీతిగా ప్రతి యొక్కరు మహాత్ముల యొక్కసాంగత్యమును పొంది శివుని నామ రూప గుణ ప్రేమ ప్రభావ లీలధామ రంగస్య మరియు తత్వ విషయములను ఎంతో ప్రేమానురాగములతో ఆలకించి తమ తమ జీవితములను పావనము చేసుకొన వలెను. ఇదియే శ్రవణ భక్తి యొక్క స్వరూప స్వభావము.

**కీర్తన భక్తి:-** ఈ నవవిధ భక్తులయందు రెండవ భక్తియే కీర్తన భక్తి. కీర్తన గానమును చేయుడమనెడి అనేకార్థములలో ఉపయుక్తమగుచున్నది. భక్తుడు భక్తుల ఎదుట భావ యుక్తముగా శివుని చరిత్రను వాద్యనృత్య సంగీతములతో స్తుతించునదే కీర్తన. ఈ కీర్తన భక్తి పతిత ఉద్ధారక గుణముకల్గియున్నది. దీని వలన దురాచారి సదాచారిగా పరివర్తన పొందగలుగుచున్నాడు. అందుచేతనే గీతయందున ఈ క్రింది విధముగ తెలుపబడినది.

**శో॥ అపి చేత్సుదురాచారో భజితే మాం అనన్యభాక్**
**సాధురేవ సమంతవ్యః సమ్యగ్ వ్యసితో షిసః** (గీత 9-30)

ఈ శ్లోకమునందు కీర్తన భక్తి వలన దుర్మార్గుడైనను సన్మార్గుడగునని చెప్పబడినది. ఈ శివభజన వలన జీవుడు అతిత్వరలోనే ధర్మాత్ముడగుచున్నాడు. శాశ్వతమైన శాంతిని పొందుచుచున్నాడు. అతిరహస్యమైన శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతమైనను కానీ, శివ మహిమ యొక్క కథనైనను కానీ, ఎవదు ప్రేమ పూర్వకముగా నిష్కామకర్మ భావనతో భక్తులకు తెలియబరుచుచున్నాడో అంతకు మించిన శ్రేష్ట మైనకార్యము వేరొక్కటి లేదు. తాను సద్గతిని పొందుటతో పాటుగా ఇతరులను సద్గతిని పొందెడి అవకాశము కల్పించుచున్నాడు. శివునికి ఇతని కంటెను ప్రేమపాత్రుడైన వాడు వేరొక్కడు యుండడు. ఈ కీర్తనభక్తి యొక్క పరిణామముచేత బ్రహ్మహత్య, పితృవధ, గోవధ, గురువధ మొదలగు మహాపాతకములనుండి విడుదల పొంది జీవి పరిశుద్ధాత్ముడగుచున్నాడు.

ఈ ఘోరమైన కలియుగమునందున అతి బృహత్తరములైన యజ్ఞదాన తపస్సులు యనెడి మహావ్రతములనాచరించుట సాధ్యమయ్యెడి పని కాదు. అందుచేతనే "కలే నామసంకీర్తనమ్" అనెడి ఉక్తి ఏర్పడినది. ఈ కలియుగమునందున జీవులు కేవలము శివుని నామసంకీర్తనముచేసి యజ్ఞ యాగాది క్రతువుల యొక్క ఫలములను సునాయాసముగ పొందుటకు సాధ్యమగుచున్నది. మన దేశము యొక్క ప్రాచీన గ్రంధములయందు ఇతిహాసిక ప్రమాణముల ప్రకారము నారద, వాల్మీక శుకదేవ మొదలగువారు గాని ఆర్వాచీనులైన శరణులుగానీ సంకీర్తనను చేసి పరమ పదమును ప్రాప్తింప జేసుకొనిరి. శివశరణులైతే తాము నుద్ధరింపబడుటయే గాక తమ వెన్నంటి యుండిన అసంఖ్యాకులగు సామాన్య భక్త గణములకు ముక్తిని ప్రసాదింపజేసిరి. ఈ విధముగా కీర్తన భక్తి అల్పాయాసము చేత మహా ఫలమును సిద్ధింపజేయునదై యున్నది. ఈ కారణమున ప్రతి యొక్కరు కీర్తన భక్తిని ఆశ్రయించి సద్గతిని పొందుదురుగాక.

**స్మరణభక్తి :-** స్మరణ మనగా తలచుటయనెడి అర్థముగలదు. ధ్యానము, మననము, మొదలగు అర్థములు దీనికి వర్తించుచున్నవి. శివుని నామము రూపము గుణము మరియు ప్రభవమును కీర్తనల మాధ్యమమున శ్రవణము చేయుటయేకాక మనస్సునందు

వాటిని గురించి సదాచింతించునదే స్మరణ భక్తి యగుచున్నది. ఏకాంతము మరియు పవిత్ర స్థానమునందున, స్థిరము మరియు సుఖకరముఅయిన ఆసనము నందు గూర్చుండి, మనస్సునందు ఎట్టి విషయలోలత్వము అంకురింపకుండునట్లు జాగ్రత్త వహించి ప్రశాంతమైన మనస్సుతో శివుని సద్గుణ, నిర్గుణ అథవా సాకార, నిరాకార స్వరూపము గురించి నిరంతరము చింతన చేయునదే స్మరణ భక్తి. శివస్మరణను కేవలము స్తిరాసనమునందున గూర్చుండి చేయ వలయుననెడి ప్రతిబంధకమేమియులేదు. నడుచునపుడు కూర్చున్నప్పుడు నిలచియున్నప్పుడు శివ ప్రసాదము స్వీకరించునపుండే గాక మరెప్పుడైనను ఏమి చేయుచున్నను పరిశుద్ధమైన మనస్సుతో శివధ్యానమును జేసెడి సదవకాశముగలదు.

పవిత్రుడుగా కాని అపవిత్రుడుగానీ ఎంతదైన్యావస్థయందుగానీ ఎవడు నిరంతరము శివధ్యానము శివ చింతనచేయునో వారు అంతరంగము నందును బహిరంగమునందును పరిశుద్ధతను పొందుచున్నారు. ఎవరు అనన్య భావనతో శివుని స్మరించు చున్నారో వారు భ్రమర, కీటకన్యాయ ప్రకారము శివస్వరూపులై వెలుగొందుదురు. కోరిక వలన గాని ద్వేషభావన వలనగాని స్నేహ భావము వలన గానీ మరేవృత్తి మూలకము వలన గానీ శివుని సదాస్మరించిన ఎడల స్మరణ చేయుచుండెడి వాడు శివస్వరూపుడెయగుచున్నాడు. ఈ స్మరణ భక్తివలన సద్గతిని పొందిన వారు అనంతమైన సంఖ్యలో గలరు ఇట్టి వారిలో సనకాది మహర్షులు, మార్కండేయ మొదలగు భక్తులు గలరు. శివప్రాప్తిని పొందవలయునను యిచ్ఛగలవారు తాము ఏపనిని చేయుచున్నను తాబేలు తమగ్రుడ్ల వైపునను, ఆవు తన దూడవైపునను కామి, తన కాముని వైపున లోభిని తన ధనము వైపునను లక్ష్యమును పెట్టిన యటుల శివుని వైపు లక్ష్యమును బెట్టి ధ్యానమును జేసిన ఎడల వారు శివస్వరూపులే యగుచున్నారు.

**పాదసేవన భక్తి :-** శివుడు లేదా సద్గురువు యొక్క చరణ కమలములయందు అనన్యమైన భక్తి భావనను యుంచి వాటిని పూజించుట మరియు పాదోదకమును సేవించుటయే పాదసేవన భక్తి యనబడుచున్నది. మానవుని యందున గల అందకారము మరియు అభిమానములను తొలగించి భగవత్ప్రాప్తి యొక్క యోగ్యతను కలిపించెడి భక్తియే పాదసేవన భక్తి. వివిధ శాస్త్రముల యందు పాదసేవన భక్తి యొక్క మహిమను అనేక విధములుగా వర్ణించబడినది. శ్రీ శంకరాచార్యుల వారు నుడివిన ఈ శ్లోకమును పరికించవలెను.

**శ్లో॥ అపార సంసారసముద్ర మధ్యే సంయజ్యతోమే శరణం కిమస్తి**
**గురోకవిపాలో కృపయా వదైతత్**
**విశ్వేశపాదాంబుజ దీర్ఘనౌక**

అపారమైన సంసార సాగరము మధ్యన మునుగెడి జీవులు తన సమీపమునకు నౌక వచ్చినపుడు శీఘ్రముగా దాని నాశ్రయించునటుల సంసారమనెడి సాగరమునందు మునిగెడి జీవులు తమ జీవితము నుద్దరించుకొనుటకై శివుని లేదా సద్గురువుల చరణారవిందములనెడి నౌకకు శరణులగుచున్నారు. శివుని లేదా సద్గురువుల పాదపంకజముల దర్శనమును పొందుట తన హస్తముల చేత వాటిని స్పృశించుట పాదముల పూజించి పాదోదకము స్వీకరించుట దివ్య చరణములను అంతరంగమునందు సదా చింతన చేయుట, దూరమందుండి నపుడు మానసిక పూజను నిర్వర్తించుట, వారి దివ్యచరణరజమును తన మస్తకముపైన ధరించుకొనుట, గురుచరణ స్పర్శచేత పవిత్రమైన భూమి గురించి క్షేత్ర భావనను దాల్చుట, మరియు గురు చరణ స్పర్శను పొందిన పాదుకలయందు శ్రద్ధను యుంచుట మొదలగునవి పాదసంసేవనా భక్తి ప్రధానాంగములుగా గుర్తింపబడుచున్నవి.

“పద్యదే గమ్యదే ఇతిపాదః” అనెది సూక్తి ప్రకారము పాదమనగా ఆచరణ లేదా నడక యనెడి అర్థముగలదు. మనుజుడు శుభాశుభస్థానములకు పోవలయుననిన పాదములే ముఖ్య సాధనము ఏ పాదములు సదా శాస్త్ర విహితమార్గమునందున తిరుగాడుచున్నవో అట్టి పాదములే పూజనీయములగు పాదములు. శివుడు గాని సద్గురువులుగానీ శాస్త్ర విహిత మార్గమందున సంచరించుటచే వారి యొక్క పాదములను పూజించుట శాస్త్ర సమ్మతమైయున్నది. అందుచేతనే శాస్త్రముల యందు పాదముల మహిమను విశేషముగ వర్ణించబడినది. ఈ పాదమహిమను ఎరిగిన వాడు పాదములకు వెలపల నుండెడి మరెట్టిదానిపై మక్కువ జూపడు. అందుచేతనే భక్తి భండారి బసవణ్ణ వారు బ్రహ్మారుద్రాది పదవులను తిరస్కరించి కూడలసంగమదేవుని మెప్పించిన శివశరణుల పాదమునే అనుగ్రహించమని శివుని ప్రార్థించెను. పాదసేవన రూపమైన భక్తి ద్వారా అనేక మంది జనులు సద్గతిని పొందుట జరిగినది. ప్రతి యొక్కరు శివుని లేదా సద్గురుని పాదముల యందు శ్రద్ధనుంచి శాస్త్రోక్తరీతిన పూజించి, సేవించిసత్ఫలములను పొందవలెను.

**అర్చనభక్తి:–** అర్చన యనగా పూజయని అర్థము. తన ఇష్ట లింగమును గాని ఇష్టదైవము యొక్క ప్రతిమనైనను గాని ఉపచారములచేత పూజించునదే అర్చనభక్తి. వీరశైవసిద్ధాంతమునందు బాహ్య మూర్తి యొక్క పూజ ప్రాశస్త్యము నివ్వక ఇష్టలింగపూజకే మహత్యమును ఇచ్చినారు. పూజోచితములైన ఉపచారములు పంచోపచార– అష్టోపచార, శోడషోపచార, రాజోపచారములనెడి భిన్నభిన్నములైన అర్పించెడి వారివారి శక్త్యానుసారముగా న్యూనాధిక్యములుగా యుండును. అర్చన యందు ఉపచారములకు ప్రాధాన్యత కంటె అర్పించెడి వ్యక్తి యొక్క భక్తి భావనకే విశేషప్రాముఖ్యతనీయనైనది. అందు చేతనే భగవద్గీత యందు.

**శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం యో మేభక్త్యా ప్రయచ్ఛతి**
**తరహం భక్త్యపహృత మశ్నావిం ప్రియతాత్మన ః**

అనియు ఉపచారములు జేసెడి వస్తువులకంటె ఉపచారమొనరించెడి భక్తుని యొక్క భక్తికే మహత్వము నీయబడినదని తెలుసుకొనుచున్నాము. పురాణములయందు భారతాదులయందు ముగ్ధభక్తితో శివుని అర్చించిన వారి సంఖ్య లెక్కకు మించి గలదు. ఈ విధముగా జూసిన ఎడల అర్చనజేయువారి యొక్క భక్తియే గీటురాయి యని తెలియుచున్నది. అందుచేత ప్రతియొక్కరు నిష్ఠగలవారైయుండి తమతమ ఇష్టలింగములను పూజించుకొని సద్గతిని పొందుదురుగాక.

**వందనభక్తి:–** నవ విధ భక్తిలో ఇది ఆరవది. వందనము అనగా వందనము, నమస్కరించుటయనెడి అర్థముగలదు. తన ఇష్టదైవమునకు లేదా సద్గురువునకు సాష్టాంగపూర్వకముగా నమస్కరించునదే వందనభక్తి. శివుని వాస్తవికస్వరూపము నెరిగి అతనికి నమస్కరించినపుడు నమస్కరించువ్యక్తికి దశాశ్వమేధముల ఫలముకంటెను అధికమైన ఫలముదక్కుచున్నది. పతితుడైన గానీ అర్హతగల్గి యుండు వాడైనగానీ, పరమ మూర్ఖుడైన గానీ, ఒక వేళ యాతని ముఖమునుండి “ఓం నమఃశివాయ” యనెడి నమస్కారప్రయుక్త శబ్దము వెలవడినంతనే సమస్త పాప బంధములచే విముక్తుడగుచున్నాడు. వందనము ఏకాంగ త్రయాంగ పంచాంగ సాష్టాంగము. మరియు ప్రదక్షణలనెడి పలువిధములుగా యున్నవని శాస్త్రములు ఉద్ఘోషిస్తున్నవి. వీటియందున మనుజుని అభిమానమును దూరముచేసెడి సాష్టాంగనమస్కారమే శ్రేష్ఠమైనదని పెద్దలు నుడివిరి. అందుచేత ప్రతి యొక్కరు శివుని లేదా సద్గురువునకు సాష్టాంగనమస్కారము చేసి తమ తమ దురభిమానుములను దూరము చేసుకొని సద్గతికి పాత్రులు కాగలరని తెలియజేయడమైనది.

**దాస్యభక్తి:–** సప్తమభక్తియే దాస్యభక్తి. గురు, దేవతలయందు యుండెడి అనురాగభావనతో తాను వారికి దాసుడనెడి భావము గల్గియుండుటమే దాస్యభక్తి యగుచున్నది. దాస్యభావముతో సేవలను చేయుటయందు నిమగ్నమైయుండి చరించుటయే దాస్య భక్తి. దాస్యభక్తిలో అప్త, అంగ, స్థాన మరియు సద్భావములని నాల్గు విధములుగ ప్రతిపాదించబడినది. వీరశైవసిద్ధాంతమునందున గల పంచాచారములలో నొకటియైన “భృత్యాచారము” ఇందుకు ఉదాహరణ. ఈ దాస్యభక్తి యొక్క పరిణామముగా నొక వ్యక్తి తన యందు నుండెడి మోహము మరియు మమకారములనుండి ముక్తిని పొందుచున్నాడు. ఒక వ్యక్తిని శుద్ధీకరించుటలో దాస్యభక్తి విశేషముగా పనిచేయును. గురులింగ జంగములయొక్క పాదసంసేవనము దాస్య భావముతో జేసి వీరశైవులు ధన్యతను పొందవలెను. తల్లిదండ్రులకును, వయస్సున పెద్దలకును గౌరవమును జూపి దాస్యభావముతో సేవించవలెననెడి విధానము ఎంతో ప్రచారములో గలదు. వీరశైవ ధర్మమునకు సంబంధించిన మౌలిక సూత్రములను పాటింపని వారిని దాస్య భావముతో పూజించవలసిన ఆవశ్యకత లేదని మహత్మ బసవేశ్వరులవారి చరిత్ర వలన తెలియుచున్నది.

**సఖ్యభక్తి :–** ఎనిమిదవ భక్తి. సఖ్యభక్తి ఇష్టదైవమందున మిత్రత్వభావనము పూని నుపచారములను జేయునదే సఖ్యభక్తి. ప్రతి మానవుని జీవితమునందున సఖుని యొక్క ఆవశ్యకత యదార్థముగ సిద్ధించుచున్నది. ఎవరికీ జెప్పని విషయములను తమ ఇష్ట సఖునికి చెప్పెడి వారెందరో గలరు. ఎంతో మంది తమ తమ సఖుల ఎడల తాదాత్మ భావన కల్గియుండుట మనము చూడగలము. జగత్తులో ఒక వ్యక్తి నింకొకరికి సఖుడైనను వాస్తవము గమనించిన వీరెవ్వరు నిజమైన సఖులుగారు. శివుడొక్కడే నిజమైన సఖుడు

"ద్వానుపర్ణా సయుజ సఖాయ" యనెడి ముండకోప నిషత్తులోని మంత్రము శివ జీవులను సఖుల రూపమున వర్ణించుటను గాంచగలము. ప్రతి యొక్కరు శివునే తమ నిజమైన శ్రేయోకారకుడైన సఖునిగా భావించుకొని తనకుదోచిన యుపచారములను జేసి సిద్ధిని పొందవలెను.

**ఆత్మనివేదనభక్తి:–** నవవిధ భక్తులలో ఇది చివరిది. పరమాత్మతత్వమును తెలుసుకొని అహంకార మమకారములకు దూరమై తన తను ధన మనములను పరమాత్మునికి భక్తితో సమర్పించునదే ఆత్మనివేదన భక్తిగా కొనియాడబడుచున్నది. ఈ భక్తి ప్రకారము నడచువాడు లాభము, నష్టము జయాపజయములు, యశము, నపకీర్తి, సుఖము, దుఃఖము మొదలగు వాటి గురించి పెద్దగా పట్టించుకొనక ఇవయన్నియు శివప్రసాదలబ్దములేయనుచు ప్రసన్నుడుయగుచున్నాడు. ఈ విధముగ తాను కేవలము నిమిత్తమాత్రుడననియు తనవలన జరుగు క్రియలన్నియు శివుని ప్రేరకముగా జరుగుచున్నవనియు భావించుకొని నడచువాడే ఈ భక్తికి ప్రాతినిధ్యము వహించెడి వాడగుచున్నాడు. ఎవడైనను తన అస్థిత్వమును చెరపుకొని శివ పరమాత్మకు శరణాగతుడై యుండుటయే ఆత్మ నివేదన భక్తి. ఇట్టివారే భగవంతునికి ప్రీతిపాత్రులగుచున్నారు. ఎవరు తమను తాము సంపూర్ణముగా సమర్పించుకొనుచున్నారో వారికి శివుడు వశీభూతుడగునున్నది. శివుడే వారి వద్దకు బయలు దేరి వెళ్ళునని చెప్పబడినది. ఈ కారణమువలన ప్రతియొక్కరు విధిగా శివునికి తమ తమ ఆత్మల నివేదన మొనరించుకొనవలెను.

ఈ తెరుగున శ్రవణ భక్తి మొదలుకొని ఆత్మ నివేధన భక్తి వరకు గల నవవిధభక్త్యుపచారముల చేత తమతమ భక్తిని నివేదన మొనరించుకొనెడి వాడే పరిపూర్ణ ఫలప్రదుడగు భక్తుడగుచున్నాడు. ఈ నవవిధ భక్తులు అత్యంతసామాన్యమైనవి. వీరశైవ ధర్మమునందున వీటికంటెను భిన్నముగా శ్రద్ధాభక్తి నిష్ఠాభక్తి, అవధానభక్తి, అనుభవభక్తి, ఆనందభక్తి, మరియు సమరసభక్తి యనెడి ఆరువిధములైన భక్తుల విధానములను ప్రతిపాదించబడినవి. ఈ వివిధములైన భక్తి మార్గములను ఆచరించుటకు, పూర్వార్జితమైన పుణ్యవిశేష ములుండవలయునని శ్రీ రేణుక భగవత్పాదుల వారు ఆనతిని ప్రదానముచేసిరి.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**దిll 19-9-1990.**

**స్థలం: శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్యుమమురము**

**బోధకాలు బసవేశ్వర దేవస్థానం. రాణి చెన్నూరు.**

## విశేష ప్రదీపిక :

భక్తి తత్వమును గురించి శ్రీ కాశీజగద్గురువుల వారు నెంతో వివరణాత్మకమైన యాశీర్వచనము నిచ్చిరి. నవవిధభక్తులకు సంబంధించిన సమగ్రమైన విశ్లేషణనిచ్చి భక్తులకెంతో మోదమును చేకూర్చిరి.

భక్తి మార్గక్రియాస్థలమున భక్తుడాచరించవలసిన కొన్ని ముఖ్యమైన క్రియలు వివరింప బడినవి. "ఏతాని శివభక్తస్య కర్తవ్యానిప్రయత్నతః" (సి.శి.5-29) యనెడి శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము నిచ్చుట స్మరించు కొనవలెను.

"కరణం క్రియా" యనెడి వ్యుత్పత్తి ప్రకారము కర్మకు క్రియకునభేదము చూపబడినది కాని విస్తృతార్థములో క్రియా శబ్దము కనేకార్థములు నివ్వబడినవి "ఆరమ్భోనిష్కృతిశ్శిక్షా పూజనం సంప్రధారణం ఉపాయః కర్మ చేష్టాచ చికిత్సాచనవ క్రియా" అని యమరము చెప్పినది. భవరోగమనెడి దానికి యెట్టి యాధ్యాత్మిక పద్ధతులు, ఉపాయములు, ప్రయత్నపూర్వక వ్యాపారములు క్రియలన బడుచున్నవి. షట్ స్థలములలోని భక్తస్థలమున పాటించ వలసిన క్రియలే భక్తిమార్గక్రియలని తెలిసికొన వలెను.

శ్రీ భగవత్పాదుల వారు భక్తుడెవ్వడనెడి దానికొక నిర్వచనమును ప్రదానము చేసిరి. గమనించుడి:

**భూతిరుద్రాక్ష సంయుక్తో లింగాధారీ సదాశివః॥**
**పంచాక్షరజపోద్యోగీ శివభక్తిః ఇతిస్మృతః॥**

ఈ నిర్వచనము శ్రీ భగవత్పాదులవారు నింతకు క్రితమిచ్చిన నిర్వచనము కంటె భిన్నముగా నున్నది. "శివే భక్తిః సముత్పాన్నాయస్యాసీ భక్త ఉచ్చతే" యనెడిది పంచమ పరిచ్ఛేదమున నివ్వబడిన నిర్వచనము (సి.శి. 5-25) శివుని గురించి యెవ్వనిలో భక్తి యుత్పన్నమగునో యతడు భక్తుడనబడును ననెడిది పూర్వమున నివ్వబడిన నిర్వచనము యొక్క అర్థము భూతిరుద్రాక్ష ధారణలు గల్గియుండి, సదా శివపంచాక్షరిని జపించెడి లింగధారియే శివ భక్తుడనెడిది యిప్పుడివ్వబడిన నిర్వచనము యొక్క భావార్థము. వీరశైవ వాఙ్మయములో భక్తి యనెడి శబ్దము నీయర్థములోనే వినియోగింపబడినదని తెలిసికొన వలెను. వీరశైవేతర వాఙ్మయమున మొదటి నిర్వచనములోని భావము ప్రతిబింబించునని తెలిసికొనగలరు. ఉదాహరణకై తెలుప వలెననిన పాల్కురికి వారు వీరశైవపరమైన భక్త శబ్దమును ప్రయోగించిరి. శ్రీ నాథుడు నధికముగా వీరశైవేతర భావమును ప్రతిబింబించెడి భావమున భక్తి పదమునుపయోగించెను. వీరశైవ పరిభాష ప్రకారము లింగధారణ భక్తుని మౌలికమైన లక్షణమని గుర్తించవలెను. వీరశైవేతర పరిభాష శివభక్తిగల వాడు శివభక్తుడనబడుచున్నాడు.

శివ భక్తిగల్గుట యనెడి సులభసాధ్యము కాదనియును, పాపమతులకది దుర్లభమని శ్రీ భగవత్పాదుల వారు సెలవిచ్చిరి. ఈ భావమును బహుసుందరముగా విస్తరించిన శ్రీ యేకామ్రనాథుల వారి యీ క్రింది పద్యమును గనుడి:

సీ॥ **శివపురాణాదులు చెవిబెట్ట నొల్లరు**
**గోత్ర వధాదులు కోరి విండ్రు**
**.................................**
**హరభక్త మహత్త్వ మాలింపనొల్లరు**
**యగ్ర జాతుల వధ లర్థి విండ్రు**

**విరసమతులు దుర్వివేకాభిరతులుక**
**ల్మషయుతులును కష్టమాత చరితు**
**లెట్టిపాపమతులో యే........** (అన్యవాద కోలాహలము,ప.34)

పాల్కురికి సోముని చతుర్వేదసారములోను, అన్నమయ్యగారి సర్వేశ్వర శతకములోను నిట్టి భావములను గాంచగలము.

శివభక్తి యెట్టి వారిలో నుద్భవించునో యనెడి దానిని శ్రీ భగవత్పాదులు నింతకు క్రితమే తెలిపి యుండిరి ఈ క్రింది యుపదేశమును గమనించుడి:

శ్లో॥ **నిత్యానిత్య వివేకినః సుకృతినః శుద్ధాయస్యాత్మనో।**
**బ్రహ్మోపేంద్ర మహేంద్రముఖ్యవిభవేస్వస్థాయితాం పశ్యతః।**
**నిత్యానందపదే నిరాకృత జగత్సంసార దుఃఖోదయే**
**సాంబే చంద్రశిరోమణౌ సముదయేద్భక్తిర్భవధ్వంసినీ॥** (సి.శి.5-73)

ఎంతో పుణ్యము చేసికొనిన గాని శివభక్తి ప్రాప్తించదని గుర్తించగలరు. అన్నమయ్య గారీ విషయమును నీ క్రింది విధిన విశదీకరించిరి.

**కామోద్రేక విజృంభణంబును సమగ్ర క్రోధమున్ లోభమున్**
**వ్యామోహంబు మదంబు మచ్చరము దీవ్రంబైన పంచేంద్రియో**

**ద్ధామా టోపముగ్రాచి పెంపెసగు తత్త్వజ్ఞానికింగాకతా**
**సామాన్యాత్ముల కేల నూలు కొను నీ సత్భక్తి సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప.62)

కామ క్రోధాదులకును యింద్రియలాలసత్వమునకును లోనై యుండెడి సామాన్యునికి శివభక్తి చేకూర జాలదని తెలుపబడినది. ఇందులకు విరుద్ధముగా నుండెడి మహానుభావులకే శివభక్తి చేకూరును.

భక్తి యనగా 'సేవ' యనెడి యర్థము గలదు భక్తుడు తన స్వామిని పలువిధములుగా సేవించును. ఈ సేవల యొక్క విస్తృతిని బసవపురాణమెంతో విస్తృతముగా తెలియజేసినది. వావిళ్ళ వారి ప్రతిలోని 102వ పేజి నుండి 107వ పేజి వరకు గల వర్ణనలలో శివ భక్తులు శివుని యేయే భావములతో పూజించిరో తెలియజేయబడినది. ఉదాహరణకై యీ క్రింది ద్విపదలను గనుడి:

**సర్వభక్తాత్మ! మీ జలకంబు వాడు**
**గుర్వుగా మాకాట కోటయ్యగారు**
**హర! మీ నగరి మాలకరి పుష్పదంతు**
**దరిది పూజారి కన్నప్పదేవయ్య**
**యిండెగట్టెడిది మా యిండెరేకవ్వ**
**ఖండదీపము వాడుగా నమినంది**
**నెట్టణ దీవించి నీకు విభూతి**
**బెట్టెడు వాడు మా పిళ్ళనైనారు.** (బసవపురాణము, ద్వితీయశ్వాసము)

శతాధికమైన రీతులన్నిటినీ స్థూలమూగా శ్రీ భగవత్పాదుల వారు నవవిధములుగా వర్గీకరించిరి యథావాక్కుల యన్నమయ్య గారు నీ నవ విధా భక్తులను తమ సర్వేశ్వర శతకములో వివరించిరని డా॥ ముదిగొండ వీరభద్రయ్య గారు తెలియజేసిరి (చూడుడి: సర్వేశ్వర శతకము: ముందుమాట).

వీరశైవ ధర్మమున చరలింగమునకే నధిక ప్రాముఖ్యత గలదని తెలుపబడినది. భక్త స్థలము నందలి వీరశైవుడు శ్రద్ధా భక్తి సమన్వితుడై నవవిధి మార్గముల ద్వార చరలింగమును సేవించవలెను. జడమైన విగ్రహాదులకు నవవిధములగు సేవలను సల్పెడి వారు గలరు. మరి కొందరు మాహాలోకములో విహరించుచు తాము తమ యిష్ట దైవమును సేవించు చున్నామని భావించి కొనుచుందురు. 'మానసిక సేవలు' చేయుచున్నామందురు. దేవాలయములలో నెలకొని యుండెడి స్థావర లింగములకు షడ్రసోపేతమైన నివేదనములు సమర్పించి "తినుతిను" మందురు. తిన్నాడులే యని భావించికొని వాటిని తామే పొట్టలుబ్బేవిధముగా తిందురు. చరలింగమైన జంగమయ్యను సేవించి, వారికి పడి పదార్థములను వడ్డించి, వారి భుక్తావశేషమును ప్రసాదముగా గొన వలెననెడి యాసక్తి వీరికుండదు. దేవుళ్ళకు గుళ్ళు గట్టించుటకై లక్షలు వ్యయమొనర్తురు. పేద జంగమయ్యపూరి గుడిసెలోన జీవించు చున్నాడని తెలిపినా పట్టించి కొనరు.

భక్తుడు నిజమైన భక్తి మార్గమున చరియించుచు చరలింగమునకు నవవిధములగు సేవలనందించ వలెనని తెలిసికొని తదనుగుణముగా ప్రవర్తించవలెను.

**–శివం భూయాత్–**

## ఆశీర్వచనము-2

శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు, నవ విధి భక్తులను గూర్చి తెలిపిన పిదప దృఢమైన శివభక్తి గల వాడే యుత్తముడనియును, అట్టి వాడు నేజాతికి చెందిన వాడైననూ శివునికి ప్రియుడగుచున్నాడని యుపదేశించిరి. వీరి యుపదేశమును గనుడి:

**శ్లో॥ అథమే చోత్తమే వాపి యత్ర కుత్ర చిద్రూర్జితా।**
**వర్తతే శాంకరీ భక్తిః స భక్త ఇతి గీయతే।**
**భక్తిః స్థీరీకృతా యస్మిన్ మ్లేఛే వా ద్వి జనత్తమే।**
**శంభోః ప్రియః నవిప్రశ్చ న ప్రియో భక్తివర్జితః॥** (సి.శి. 9-4-5)

అత్యంత నీచుడైనను, ఉత్తముడైననూ మరింకెవరైననూగాని, ఎవరి యందున ఘనతరమైన శివ భక్తి యండునో తనడే భక్తుడని పించికొనును. శ్వపచుడైనను గాని లేదా బ్రాహ్మణోత్తముడైనను గాని దృఢమైన శివభక్తి గలవాడు శివునికి ప్రియమైన వాడగునే కాని భక్తి హీనుడైన వాడు బ్రాహ్మణుడైననూ శివునికి ప్రియుడుగా కాలేడు, అనెడిది ఆచార్యోక్తిలోని భావము, శివుడు జాతిని పరీక్షించక భక్తిని మాత్రమే పరీక్షించుచున్నాడు. అతనికి కావలసినది కేవలము భక్తి మాత్రమే. ఈ కారణమున, శరణులు శివుని భక్తిప్రియుడని పిలిచిరి. లౌకిక జీవనము నందు భక్తికి ప్రాముఖ్యతగలదనెడిది, కన్పట్టుచున్నది జాతులలో నొకటి ఉత్కృష్టమైనదనియును, మరొకటి నికృష్టమైనదనియును గుర్తింపు పొందినవి. ఆయా జాతులలోని శీల వ్యవహారములే నట్టి విభజనకై కారణభూతమైన యంశములగుచున్నవి. హీనమైన కార్యములను చేపట్టెడి వానిని శ్వపచుడనియును, వేద విహిత ధర్మాచరణలను చేయువాడు బ్రాహ్మణుడనియును పిలువ బడుచున్నాడు. ఈ పరంపర యందున జనులు తమ పరంపరాగత ఆచారవిచారములను అనూచానముగా ఆచరించుచు వచ్చుచున్నారు. కొలది సందర్భముల యందు సాంగత్య సహవాసాదుల మూలకముగా పరివర్తనలు గల్గును. ఈ పరివర్తన పరిణామముగా శ్వపచులైన వారు శాస్త్రనిశిద్ధ కర్మలను ఆచరించుట కనుపించుచున్నది. ఇట్టి పరిస్థితి యంధున జాతి శ్రేష్ఠమైనదైననూ కృతి కనిష్టమై యుండునప్పుడు ఇచ్చుట జాతి కంటెను, కృతికేమహత్యమును ఇవ్వవలసియుండును. హీన కార్యములను చేయుచు తను ఉచ్చకులమునకు చెందిన వానినని యభిమానమును గొనుట యందు నర్థమేమున్నది. శివుడు అంతర్యామియై యుండు వాడగుటచే నతడు బాహ్యాడంబరముల కంటె అంతరంగశుద్ధివైపు దృష్టిని సారించును. ఈ కారణమున భక్తులైనవారు జాతి యొక్క హెచ్చు తగ్గులవైపు లక్ష్యము నిడక కేవలము భక్తి భావములో నుండెడి వారు శివుని ప్రేమానురాగములకు పాత్రులగుచున్నారు. భక్తకన్నప్ప కథ, యీ విషయమున కుదాహరణగా నిలుచున్నది. ఇతడు బోయవాడు చేసిన పూజావిధానము శాస్త్రవిహితమైనది కాదు. నివేదించిన నైవేద్యము నిషిద్ధ వస్తువులతో కూడికొని యుండెను. అయినా శివుడతనిని మెచ్చెను. దీనికి గల కారణము అతనిలోగల భక్తియే కదా!

ఆ పిదప, శ్రీ రేణుక భగవత్పాదుల వారు, భక్తిలోని వివిధ భేదములను గురించి యీ క్రింది విధముగా తెలిపిన వారైరి.

**శ్లో॥ సా భక్తిర్ద్వి విధా జ్ఞేయా బాహ్యాభ్యంతర భేదతః।**
**బాహ్యే స్థూలాంతరా సూక్ష్మా వీరమాహేశ్వరాదృతా॥**
**సింహాసనే, శుద్ధదేశే సురమ్యే రత్న చిత్రితే।**
**శివలింగస్య పూజా యా సా బాహ్యే భక్తిరుచ్యతే॥**
**లింగే ప్రాణం సమాధాయ, ప్రాణే లింగం తు శాంభవమ్।**
**స్వస్థం మనస్తథా కృత్వా న కించిచ్చింత యేయది॥**
**సాభ్యంతరాభక్తిరితి ప్రోచ్యతే శివయోగిభిః।**
**సా యస్మిన్ వర్తతే తస్య జీవనం భ్రష్ట బీజవత్॥** (సి.శి.9. 6-9)

ఈ ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా

శివ భక్తి బాహ్యమనియును అభ్యంతరమనియును రెండు విధములుగా నుండును. బాహ్యభక్తి స్థూలరూపముదైన యెడల అంతరంగపు భక్తి సూక్ష్మరూపమున నుండును. మనోహరమైన స్థానమునందు శుద్ధి చేసి, ఆసనమును వేసి దాని మీద కూర్చుండి వైభవోపేతముగా యిష్టలింగపూజను చేసి కొనునదే బాహ్యపూజయనిపించి కొనును. తన వామకరపీఠమున గల యిష్టలింగము నందు ప్రాణమును, ప్రాణము నుందున శివకలా యుక్తమైన లింగమును భావించి కొని, మనస్సు నందు వేరే విచారములును రానీయక చేయునదే అభ్యంతర భక్తియని శివయోగుల చేత చెప్పబడినది. ఇట్టి భక్తిగల వాడు తన కర్మబీజములను నాశనము చేసికొని ముక్తిని పొందును.

వీరశైవ సిద్ధాంతమునందలి లింగపూజావిధానము క్రమ క్రముగా వికాసమును చూపించెడిదైయున్నది. మొదట బాహ్యశుద్ధికి ప్రాముఖ్యత నిచ్చి, రాను రాను అంతరంగపు శుద్ధిని సాధించవలెనని తెలుపబడినది. యిష్టలింగపూజను చేయునప్పుడు స్థాన శుద్ధిని సాధించుట ఎంతో నవసరము. తాను కూర్చుండి శివపూజను చేసెడిప్రదేశమును షట్సమ్మార్జన చేత గాని మరే మార్గము చేతనైన పరిశుద్ధిని చేసి కొనవలెను. శుద్ధిచేయబడిన ప్రదేశమున నొక పీఠమును ఏర్పాటు చేసికొన వలెను. తన శక్తిమేరకు, ఆ పీఠమును అలంకరించి కొన వలెను. దాని మీద కూర్చొనుటకు ముందుగ పంచవిధ లేదా అష్టవిధ లేదా షోడషోపచార లేదా రాజోపచారముల ద్వారా పూజించుటకై వలయు సామగ్రిని యేర్పాటు చేసికొనవలెను. తాను పీఠము మీద కూర్చుండి, వంటరిగాకాని, సద్భక్తులను కూడికొనిగాని యభిషేకమును, బిల్వార్చన, పుష్పార్చనలను తన శక్తి మేరకు సలిపి మంగళహారతులనెత్తి, అత్యంతవైభవోపేతముగా ఇష్టలింగమును పూజించవలెను. ఇట్టిపూజ, బాహ్యభక్తికి చెందిన దగును. రుద్రాధ్యా పఠనము, సహస్ర లేదా లక్షలేదా కోటి బిల్వార్చనలతోను, నృత్యగీతాదుల చేతను ఈ వైభవమును నతిశయస్థాయికి తీసి కొని వెడల వచ్చును. ఈ పూజావిధానము నందున బాహ్యములగు పూజాసామగ్రికి యెక్కువ ప్రాధాన్యత యిచ్చుటచే నిది బాహ్యభక్తిగా గుర్తింపు పొందినది.

ఈ పూజావిధానమున వైవిధ్యత యున్న, యెడల యితర భక్తులు, యీ అర్చనవైపు ఆకర్షితులగుదురు. దీని చేత భక్తుడు తననూ, తనతో బాటుగా పూజలో పాల్గొన్న వారిని ఉద్ధరించుచున్నాడు. ఆకర్షితులైనవారికి భక్తి మార్గము యొక్క విశిష్టతను తెలియజెప్పి వారిని సన్మార్గమునకు మళ్ళించుటకు సాధ్యమగుచున్నది. ఈ కారణముననే వీరశైవ ధర్మాచారులు ఈ విధానమునకెంతో ప్రాధాన్యతను ఇచ్చి లోకముల నుద్ధరించుచున్నారు.

బాహ్యపరమైన పూజకంటెను అంతరంగపూజ యెంతో ప్రముఖమైనదై యున్నది. ఇందులో బాహ్యడంబరములకు ప్రాధాన్యత నివ్వబడదు. గురూపదేశము ననుసరించుచు, వామహస్తమున యిష్టలింగము నిడికొని సంక్షిప్తార్చన నిమిత్తము జలపుష్పాదుల చేత పూజనాచరించి, ఆపిదప, ప్రాణలింగమున యిష్టలింగమును, యిష్టలింగమున ప్రాణలింగమును అనుసంధానము చేస్తూ శివధ్యానమున కాలమును గడుప వలెను. దీనిని శివయోగులు నంతరంగభక్తియని అందురు. వారు దీనికే అధికమైన మహాత్యమును యిచ్చెదరు. కర్మబంధములను తెంచి కొనుటకు అంతరంగ పూజ ప్రధాన సాధనమై యున్నది. ఇట్టి భూతి సంయుక్తులైన భక్తులకు మరుజన్మ ఉండదని చెప్పబడినది. శ్రీ భగవత్పాదుల వారునూ, ఈ అంతరంగ శివపూజగూర్చి బహువిధములుగా కొనియాడిరి. ఈ అంతరంగ భక్తి యొక్క ప్రాముఖ్యత గూర్చి పెక్కు మాటలను మాటలాడెడి పని లేదు. ఇది నిస్సంశయముగా ముక్తి ప్రదము అని యుపదేశించే శ్రీ భగవత్పాదుల వారి యీ ఉపదేశమును గనుడి:

**శ్లో॥ బహునాత్ర కిముక్తేన గుహ్యా ద్గుహ్యతరా పరా।**
**శివభక్తిర్న సందేహ స్త యా యుక్తో విముచ్యతే॥** (సి.శి.9: 10)

అంతరంగ భక్తి సర్వోత్కృష్టమైనదనియును, యిది గోప్యమైన దనియును ఈ ప్రమాణము తెలియజెప్పుచున్నది. ఇట్టి మహనీయమైన భక్తి లభించుట దుర్లభమనియును, తన్నిమిత్తమై శివకారుణ్యము కావలెననియును శ్రీ భగవత్పాదుల వారు, ఉపదేశించిరి వారి యీ ఉపదేశమును గనుడి:

శ్లో॥ ప్రసాదాదేవ సా భక్తిః ప్రసాదో భక్తిసంభవః।
యద్వై వాంకురతో బీజం బీజతో వా యథాంకురః॥
ప్రసాదపూర్వికా యేయం భక్తిర్ముక్తి విధాయినీ।
నైవ సా శక్య తే ప్రాప్తుం నరై రేకేన జన్మనా॥
అనేకజన్మ శుద్ధానాం శ్రౌత స్మార్తానువర్తినామ్।
విరక్తానాం ప్రబుద్ధానాం ప్రసీదతి మహేశ్వరః।
ప్రసన్నే సతి ముక్తోః భున్ముక్తః శివసమోభవేత్॥
అల్ప భక్త్యాపియో మర్త్యస్తస్య జన్మత్రయాత్పరం
న యోనియంత్రపీడా వైభవెన్నై వాత్ర సంశయః
సాంగన్యూనా చ యా సేవా సా భక్తిరితి కథ్యతే॥ (సి.శి. 9–11–15)

అంతరంగభక్తి సర్వోత్కృష్టమైనది. మా యాదిపాశములనుండి విముక్తిని కలిగించి ముక్తి పథమును చూపెడి మార్గమది. ఈ అంతరంగ భక్తి సాధకుని యందు పుట్టుటకై శివానుగ్రహమే మూలకారణము శివానుగ్రహము మరియు శివభక్తికి బీజాంకుర సంబధము కలదు. బీజమునుండి అంకురము అంకురము నుండి పునః బీజము ఏవిధముగా వుత్పన్నమగునో అదేవిధముగా శివానుగ్రహమువలన భక్తి, భక్తి వలన శివానుగ్రహము కలుగుచున్నవి. ఈ విధముగా ఈ రెండును పరస్పర పూరకములైయున్నవి. శివానుగ్రహము వలన లభించెదియు, ముక్తిదాయకమైనదియును అగు శివభక్తి మనుష్యునకు ఒకే జన్మయందు లభించుటలేదు. జన్మజన్మాంతరములయందు శివధ్యానము శివపూజాదులను ఆచరించి పరిశుద్ధమైన చిత్తము గలవారై శ్రుతిమరియు స్మృతులయందు చెప్పబడిన నిత్యనైమిత్తిక కర్మలను ఆచరించెడి వారికినీ కామ్యకర్మల యందున విముఖత కల్గిన వారికినీ, వైరాగ్య భావన కలిగిన వారికినీ, శివజ్ఞాన సంపన్నులు అయిన వారికినీ శివానుగ్రహము కలుగుచున్నది. ఈ విధముగా శివానుగ్రహరూపమైన శివప్రసాదమును బడసిన వారికే ఈ అంతరంగభక్తి సిద్ధించుచున్నది. ఇట్టి అంతరంగ భక్తికి శివుడు వెనువెంటనే ప్రసన్నుడగును. అతని ప్రసన్నత ప్రాప్తమైన వెంటనే జీవుడు శివసమానుడై ముక్తిని బడయును. ఇంకను ఈ విలక్షణమైన అంతరంగ భక్తిలేని అల్పభక్తి సంపన్నులైన మిగిలిన శివభక్తులకు మూడు జన్మల పిదప ముక్తిలభించును. ఇంతకు పూర్వము చెప్పబడిన నవవిధ భక్తులచేత పరిపుష్టమైన భక్తియే పూర్ణభక్తి, వాటి యందున ఏదైన ఒక్కటి న్యూనమైన యెడల అద్దానిని అల్పభక్తియని పిలిచెదరు ఈ విధముగా నవ విధ భక్తులను కూడుకొని పూర్ణభక్తి సంపన్నుడైన వీరశైవునికి ఒకే ఒక జన్మయందున ముక్తి లభించునని తెలిసి కొనవలయును.

వీరశైవ భక్తుడు ఇతర శివభక్తులకంటెను విలక్షణమైనవాడని పూజ్యులు భగవత్పాదులవారు తెలియజెప్పిరి. వీరాగమములోని వాక్కులు కూడా ఆచార్యుల వారి వాక్కులకు సమర్ధత నిచ్చుచున్నవి. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

శ్లో॥ " ఏకేన జన్మనా ముక్తిర్ వీరాణాంతు మహేశ్వర
ఇతరేషాంతు శైవానాం ముక్తిర్జన్మత్రయేభవేత్ (వీరాగమము)

వీరశైవులైన వారికి ఒకే జన్మమునందున ముక్తి లభించుచుండగా ఇతరశైవులకు మూడుజన్మలనెత్తినకానీ ముక్తి సాధ్యము కాదు.

ఇతరశైవులు శివలింగమును వేదికమీద స్థాపించి పూజను చేసెదరు. వీరశైవులైనవారు హృదయమ నబడువేదికమీద శివలింగమును సదాస్థాపించుకొని అహం గ్రహోప్రాసనా పద్ధతి ప్రకారము అంతరంగికముగా శివలింగమును పూజించి శివరూపులు గానే అగుచున్నారు. కాన ఒకే ఒక జన్మయందున లింగాంగ సామరస్యపు రూపమైన ముక్తి లభించుచున్నది. ఇతరశైవులు బహిరంగమునందున ఆలింగమును వుంచి పూజ చేయుటచేత అంతఃకరణములు శుద్ధమై మూడవ జన్మమున నాతడు వీరశైవ పద్ధతి ప్రకారము శివదీక్షా సంపన్నుడై అంతరంగ భక్తిని ఆచరించి ముక్తిని బడయుచున్నాడు. ముక్తి కొరకై అంతరంగ భక్తి అవశ్యకమైనదనియును, మూలకారణమైనదనియును భగవత్పాదుల వారు తెలియజేసిరి.

ఈ అంతరంగ భక్తి దొరకవలెననిన శివానుగ్రహము కావలెనని యింతకముందే చెప్పుట జరిగినది. శివానుగ్రహము ఉండినప్పుడు భక్తియో? భక్తి వుండినపుడు శివానుగ్రహమో? అనేడిది ఒక అంతులేని ప్రశ్న. అయినను జీవునియందు భక్తి మొదట అవసరమైయున్నది. ఎందుకనగా జీవుడు భక్తిని ఆచరించని యెడల శివునికి ఏమీ నష్టములేదు. కాన శివానుగ్రహమును బడయుటకై జీవుడు శివుని యందున మొదటగా భక్తిని పెంపొందించుకొనిన భక్తి ఫలముగా శివానుగ్రహము కల్గుచున్నది. శివానుగ్రహము వలన జీవునిలో మరింత ఎక్కువభక్తి కలిగి మరింత అనుగ్రహము సంప్రాప్తమగుచున్నది. ఈ ప్రకారముగా భక్తి పెరుగుచు దాని వలన కలిగెడి సేవానుగ్రహ ఫలముగా కొంతకాలము పిదప అంతరంగభక్తి ఉత్పన్నమగుచున్నది. ఇదియే జీవుని యొక్కముక్తికి పరమపదసోపానమై నిలుచుచున్నది.

ఆ పిదప జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఈ భక్తి మూడు విధములుగా నుండునని తెలియజేయుటకు ఈ క్రింది ఉపదేశమును ఇచ్చిరి.

**శ్లో॥ సా పునర్భిద్యంతే త్రేతా మనోవాక్కాయసాధనైః।**
**శివరూపాదిచింతా యా సా సేవా మానసి స్మృతా॥**

**జపాది వ్రాచికి సేవా కర్మపూజా చ కాయికి।**
**బాహ్యా మాభ్యంతరం చైవ బాహ్యాభ్యంతరమేవ వా॥**

**మనోవాక్కాయ భేదైశ్చ త్రిధా తద్భజనం విదుః।**
**మనో మహేశధ్యానాఢ్యం నాన్య ధ్యానరతం మనః॥**

**శివనామరతా వాణీ వాఙ్మతా చైవ నేతరా।**
**లింగైః శివస్య చోద్దిష్టే స్త్రి పుంద్రాదిభిరంకితః॥**

**శివోపచారనిరతః కాయః కాయోన చేతరః।**
**అన్యాత్మవిదితం బాహ్యం శంభోరభ్యర్చనాదికమ్॥**

**తదేవతు స్వ సంవేద్య మాభ్యంతరం ముదాహృతమ్।**
**మనో మహేశప్రవణం బాహ్యాంభంతరముచ్యతే॥** (సి.శి. 9, 16-21)

భక్తి మానసికభక్తి, నాచిక భక్తి, కాయిక భక్తియని మూడు విధములు. తన మనస్సునందున శివుని స్వరూపాదులను ధ్యానిచెడి మానసికసేవయే మానసిక భక్తిగా ఒప్పబడినది. తనవాణిచేత శివ పంచాక్షరీ మంత్రము యొక్క జపములేదా శివస్తోత్రాదుల పాఠమును చేయునదే పాచికభక్తి. ఇదే విధముగా శరీరముచే చేయబడు లింగపూజా రూపమైన సేవయే కాయకభక్తి యని పిలువబడుచున్నది.

ఈ త్రికరణ భక్తి యొక్క స్వరూపమును ఇంకను స్పష్టపరచుటకై యిచట పూజ్యులైన భగవత్పాదుల వారు పునః బాహ్య, అభ్యంతర మరియు బాహ్యాభ్యంతరములుగా అతి సూక్ష్మములైన విధానములను నిరూపించినారు. ఇతరులకు తెలిసేవిధముగా చేసెడి కాయకపూజ బాహ్యాకాయకపూజ అనిపించికొనును. ఎవరికినీ తెలియకుండా చేయు కాయకపూజ అభ్యంతర కాయక పూజగా గుర్తించ బడినది. ఇదే తెరగున మనసు చేసెడి మంత్రజపము లేదా స్తోత్రపాఠాదులు యితరులకు వినబడువిధముగా చేసిన యెడల అది బాహ్యావాచిక పూజగను ఇతరులకు వినపడకుండ తనకుమాత్రమే వేద్యమగుచున్నయెడల అట్టి స్తోతాలదులు అంతరంగిక వాచిక పూజయగుచున్నది. ఇంకను వామహస్తపీఠమునందు ఇష్ట లింగము నుంచి పూజకు కూర్చున్నపుడు మనస్సు ఇష్టలింగ చింతన యందు ఆసక్తమైయుండిన యెడల అది బాహ్యామానసిక పూజగను. ఆమనస్సు అంతరంగములోని ప్రాణలింగము మరియు భావలింగముల చింతన యందు నిమగ్నమై యుండిన అది అంతరంగిక మానసిక పూజ యగుచున్నది. ఇంకను కాకాక్షి

గోలక న్యాయము ప్రకారము అనగా కాకికి ఒక్కటే అయిన కన్ను యొక్క గోలకము రెండు కన్నుల యందున అటు యిటూ తిరుగాడునటులనే ధ్యానమునకు కూర్చుండెది వ్యక్తి యొక్క మనస్సు ఒక సారి ఇష్టలింగధ్యానము నందుననూ, మరొక్క పరి అంతరంగములోని ప్రాణలింగ భావలింగముల ధ్యానమునందున క్షణక్షణమునకు తిరుగాడుచున్నయెడల అట్టి ఆచరణ బాహ్యాభ్యంతర మానసిక పూజయని పిలువ బడుచున్నది.

శివధ్యానమునందున ఆసక్తమైన మనస్సే నిజమైన మనస్సు. అన్య విషయాసక్తమైన మనస్సు మనస్సేకాదు. శివ నామమును జపించెడి వాణియే నిజమైన వాణి. అన్యులను నుతించెడి వాణి వాణియేకాదు. ఇదే ప్రకారముగా శివ లాంఛనములైన శివలింగము, రుద్రాక్ష, త్రిపుండ్రధారణలను చేసిన దేహమే నిజమైన దేహము. ఈ విషయములనన్నింటిని పూజ్యపాదులు ఇచ్చట నొక్కిచెప్పిరి. పూజ్యపాదుల ఆదేశము ప్రకారము శరీరము, వాణి, మరియు మనస్సులు సార్థకములు కావలెననిన వాటిని శివసేవయందున తల్లీనముచేయవలెను. దేహము శివపూజలోను, వాణిని శివస్తుతి యందునను, మనస్సును శివధ్యానమునందునను లగ్నము చేయవలెను. ఈ విధముగా చేసిన వానికి శివకృప సుసాధ్యమై సద్గతి లభించుటకు అది సాధనముగా పనిజేయచున్నది. చివరకు అట్టివారు తమ జీవితములను పావనము చేసికొని నిరంతర సాధన వలన కైవల్య ప్రాప్తిని పొందుచున్నారు.

కాయము, వాణి, మరియు మనస్సులు అనబడుత్రికరణములు భగవదార్చన కొరకే నిర్దేశింపబడినవి. ఈ త్రికరణములను పరిశుద్ధముగా నుంచికొనిననే వాటి చేత శివారాధన సంపన్నము కాగలదు. శివకృప లభించగలదు. కాని ఈ త్రికరణములు దోషయుక్తములైయున్నవి. దీనికి గల కారణమేమనగా జీవి అనేక జన్మలయందున అనేక దుష్కర్మలమూలమున త్రికరములను దోషభరితముగా చేసికొనుచున్నాడు త్రికరణ శుద్ధిలేని వానికి శివుని యొక్కకృప కలుగదు. నిజగుణ శివయోగులవారు ఈ విషయమును నొక్కి చెప్పిరి. "కరణత్రయము దోషపూరితముగా వున్నంత మేరకు శివుడు జీవుని మెచ్చడని తెలియజెప్పిరి".

త్రికరణములు దోష పూరితములు అగుటకు మరికొన్ని కారణములు కలవు. వీటిని శివయోగిగారు ఈ క్రింది విధముగా వివరించిరి.

"పరవధుకూటమి, పరవిత్తావహరణ, అభక్ష్యసేవన మరియు హింసలు కాయమునకు కలిగెడి దోషములు. అటులనే అసత్యము, అనుచితప్రలాపములు, నిష్ఠురత్వము, పైశూన్యత వాణికి సంబంధించిన దోషములు. అదే ప్రకారముగా జనులు మెచ్చని పనులు చేయుట యందాసక్తి, అనిష్టచింతన, ఇతరుల సతీసంపత్తులపైన ఆకాంక్ష మొదలగునవి మానసిక దోషములు."

ఈ త్రివిధములైన దోషముల యందు శారీరక దోషములచేత పామరజన్మము, వాణికి సంబంధించిన దోషములచేత పశు పక్షుల జన్మము, మరియు మానసిక దోషములచేత పాప యోనులు ప్రాప్తమగునని శ్రీనిజగురు శివయోగులవారు తెలియపరిచిరి. ఈ విధముగా మనుష్యుని యొక్క పతనమునకు ఈ త్రివిధములైన దోషములు కారణ భూతములగుచున్నవి. అట్టి యెడ అంతరంగ శుద్ధిని పొందుట యెటుల? శ్రీ భగవత్పాదులవారు ఈ ప్రశ్నకు వుత్తరమునిచ్చిరి. త్రివిధ భక్తులచేత త్రికరణములను శుద్ధీకరణ చేసికొనిన వెంటనే శివకృప ప్రాప్తమగునని తెలియజెప్పిరి. శ్రీ భగవత్పాదులవారి ఉపదేశము ప్రకారము ప్రతి యొక్కరు త్రికరణ శుద్ధితో బాహ్యపరమైన, అభ్యంతరపరమైన మరియు బాహ్యాభ్యంతో పరమైనభక్తులను ఆచరించి తమ జీవనములను పావనముగా చేసికొనగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**స్థలం: శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్యమమురము**
**బోధకాలు బసవేశ్వర దేవస్థానం. రాణి చెన్నూరు.**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు భక్తి విశిష్టత గురించియు, బాహ్యార్చనాదుల గురించియును అన్ని విషయముల నెరింగించి మనలను ధన్యులను చేసిరి.

ఒక్క వ్యక్తి యథమోత్తమస్థితి గతులతో సంబంధము లేకుండగా నెవ్వని యందున శివభక్తి స్థిరముగా నుండునో నతడు భక్తుడన బడునని తెలిపిన శ్రీ భగవత్పాదులవారి వాక్కులు జ్ఞాన దాయకములు. ఉచ్ఛనీచములు శివభక్తి కడ్డుగోడలు గావని గుర్తించవలెను. ఈ భావనను యథావాక్కుల వారు నీ క్రింది విధముగా విస్తరించి వివరించిరి.

**మ॥ బలవంతుండును దుర్బలుండును మహాప్రౌఢుండుమూఢుండునుం**
**కులహీనాత్మకుడున్ మహాకులజుడున్ గ్రూరుండు శాంతాతిని**
**శ్చల చిత్తుండును నొక్క రూపయగు, నీసద్భక్తి చిత్తంబులో**
**పలవర్థిల్లిని మీదనే విధమునన్ భావింపసర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము- ప.61)

శివ భక్తి గలవాడు శ్వపచుడైనను నతడు శివునికి ప్రియమును చేకూర్చెడి వాడని జెప్పిరి. శ్రీ బసవన్న వారి ఈ క్రింది వచనములో నిట్టి భావమును గాంచగలము

**వ॥ చతుర్వేదియాదదేను? లింగవిల్లదవనె హొలెయ!**
**శ్వచ నాదదేను లింగవిద్దవనె వారణాసి।**
**ఆతన నుడిగడణలే లేసు, ఆత జగక్కె పావన,**
**ఆతన ప్రసాధ వెనగమృత సేవనె!**
**నమే ప్రియశ్చతురేదీ మద్భక్తః శ్వపచో పివా।**
**తస్య దేయం తతో గ్రాహ్యం సచ పూజ్యోయథాహ్యహం ఎందుదాగి॥**
**కూడల సంగమ దేవర నరిదు సందాత షడుదరుశక్కదిక**
**జగక్కె పోవన వోడా।**

ఈ వచనము తెలుగు రూపము

**వ॥ చతుర్వేదియైననేమి? లింగములేని వాడెమాల**
**శ్వపచుడైననేమి? లింగమున్నవాడె వారణాసి**
**అతనినుడిగడనమే లెస్స, ఆతడు జగతికి పావనుడు.**
**అతని ప్రసాద సేవనము నాకమృత సేవనము**
**నమేప్రియశ్చతుర్వది మద్భక్తః శ్వపచచో 2 పివా।**
**తస్య దేయం తతోగ్రహనం స పూజోయధ్యాహం యనెగావున**
**కూడల సంగమదేవునెరిగి పూజించువాడు**
**షడుదకుషనుని కంటే నధికుడు.** (బసవేశ్వర గీతామృతము - 411)

సోమనాథ భాష్యములోను (10వ ప్రకరణము) నిట్టి భావననే గాంచగలము. ఉపవీతుడు, బ్రహ్మచారి, వేదాధ్యాయి, అగ్నిహోత్రి, యజ్ఞయాది సత్రయాగి, సర్వవిద్యార్థ విదుల కంటెను శివ భక్తి గల వాడే గొప్ప వాడని తెలుపబడినది.

శ్రీ భగవత్పాదులవారు పత్రి స్థలమునను బాహ్యాభ్యంతర భేదములను తెలిజేయుచు బాహ్యము కంటెనభ్యంతర విధానము నుత్తమమైనదని తెలుపుచూ వచ్చిరి. లింగధారణ స్థలమున నంతర్లింగ ధారణ విషయమున భస్మజ్యోతిధారణ గురించి తెలిసికొని యుంటిమి.

అటులనే రుద్రాక్షస్థలమునను, పంచాక్షర జప స్థలమునను బాహ్యాభ్యంతర భేదముల గురించి తెలిసికొనియుంటిమి. భక్తి విషయమున, యర్చనా విధానము నాధారముగా గొని, బాహ్యాభంతర భేదములు చేయనైనది. గంధపుష్పాదులనుపయోగించి, చేసెడి యర్చన బాహ్యార్చన యనియును, భౌతిక పరమైన వస్తువులను నుపయోగించ కుండగ, ధ్యానమునే ప్రధాన సాధనముగా గైకొని చేసెడి యర్చన యభ్యంతరార్చన యని గ్రహించవలెను.

బాహ్యార్చనలో వైవిధ్యత గలదు సామాన్య శైవులు లింగమునెచ్చట దర్శింతురో నప్పుడే పూజింతురు. ఈ ప్రమాణమును గనుడి:

**శ్లో॥ తత్రాదౌ సంప్రవక్ష్యామి శైవసామాన్యలక్షణం**
**శివలింగం యదా పశ్యేత్తదా కుర్యాత్సమర్చనం॥**

బ్రాహ్మణాదులలో నధికులు నీకోవకు చెందిన వారే "ఏతేషాం నియతిర్నాస్తి యథాలబ్ధం సమాచరేత్" యనెడి సూక్తి ప్రకారము సామాన్యశైవుడు శివార్చన యందున నియమము లేని వాడని తెలియుచున్నది. మిశ్రశైవుల లక్షణము నీ క్రింది విధిన నుండునని డా॥ కె. రుద్రప్పగారు తెలిపిరి.

**శ్లో॥ సామాన్యం లక్షణం ప్రోక్తం వక్ష్యే మిశ్రస్యలక్షణం**
**శైవంచ వైష్ణవం శాక్తం కౌమారం గాణపత్యకం।**
**సౌరం చాఖిల దైవత్యం పూజనంచ**
**సమభక్తిం సమాయుజ్య సమాచరేత్।**
**ఏ తేషూకైషు సర్వేషు తన్మంత్రేషు మిశ్రణాత్॥**
**సమ భక్తిం సమాయుజ్య సర్వాన్ లింగేషు భావయేత్॥** (శ్రీ వీరశైవ సిద్ధాంత శిఖామణి పు -42)

"శివవిష్ణుశక్తి కుమార గణపతి సూర్యఇత్యాద్యఖిల దేవతల పూజించు మిశ్రశైవుడు, శివుడు సర్వోత్తముడని తెలిసి యుండి, శివధర్మములను మరియు నన్య ధర్మములనాచరించుచు, సమస్త దేవతలు శివ లింగమున గలరని భావించుచు లింగమును పూజించుచుందురు".

స్మార్త ధర్మీయులగు శంకరాచార్యుని యనుయాములు మిశ్రశైవములోని సూత్రముల ప్రకారము శివలింగార్చనను చేయుదురు. శుద్ధశైవులు శివ సంబధమైన దేవతలనగా : దుర్గ, పార్వతి, గణపతి, కుమార, వీరభద్ర యిత్యాదులను పూజింతురు. శివ, శివదారాపుత్రాదులను విడిచి యితరులను పూజించరు. వీడి శివలింగార్చన యీ క్రింది విధముగా నుండును.

**శ్లో॥ మంత్ర యంత్ర క్రియా ముద్రాన్యాసా వాహనకాదిభిః।**
**ఉపచారై బహువిధైర్లింగం సింహాసనే యజేత్॥**

మంత్ర యంత్ర క్రియలు చేయుట, ముద్రలు న్యాసములు చేయుట, ఆవాహనమును చేయుట, బహువిధోపచారములతో శివలింగమును సింహాసమునందుంచి పూజించుట వంటి ఆచారములు గలవారు శుద్ధశైవులు.

వీరశైవ తత్త్వము నవగతము చేసికొనకయో మరే యితర కారణముననో వీరశైవులు ఈ వివిధ శైవ మార్గముననే పయనించుచున్నారు. ఇట్టి లింగార్చనా విధానములు ఫలము నిచ్చునని వీరశైవులకిది విహితము కాదని గ్రహించవలెను. వీరశైవుడభ్యంతర పూజ యందాసక్తి గలవాడైయుండవలెను అద్దాని యందున మానసికమే యనుసరణీయమని గ్రహించవలెను. కరపీఠార్చనయే కర్తవ్యమని యెంచ వలెను. గురూక్త విధిన లింగపూజను నను నిత్యము (త్రికాలముల యందున) విధిగానాచరించవలును.

బాహ్య పూజ లాకర్షణీయముగా నుండును. సాంగత్య దోషము వలన మన మనస్సు నటువైపు నాకర్షింప బడును. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకము, సహస్ర, కుంభాభిషేకము, పంచామృతాభిషేకము, లక్షబిల్వార్చన, కోటి బిల్వార్చన మొదలగు విధి విధానములే యుత్తమమైన వని తెలిపెడి పరధర్మీయుల గ్రంథములను చదివి భ్రమితులైన వారెందరో వీరశైవ విధానమును విస్మృతికి గురి చేయు చున్నారు. శివ లింగము పైన నొక్క పుష్పమిడిన యెడల యనంతమైన పుణ్యము లభించునని తెలిపిన విజ్ఞుల వాక్కులను వీరు విననొల్లరు. గంపల కొలది పూలను తెచ్చి పూజింపవెంతురు. ఈ విధానములన్నియల్పఫలదాయకములని గ్రహింపనొల్లని వారెందరో గలరు. వీరికి వీరశైవ పద్ధతుల గురించినవగాహన యుండదు. అంతేకాదు, వీరు పరపద్ధతుల యెడల శ్రద్ధాసక్తులను పెంచి కొని స్వధర్మము యెడల నిరాసక్తిని

ప్రదర్శించుచున్నారు. ఇట్టి వారు, భగవత్పాదుల యుపదేశముననుసరించి యంతర్లింగార్చనకై పూనుకొనుటయే వీరశైవులకు విహితమైనదని గ్రహించగలరు. వీరశైవులకు విహితమయ్యెడి యిష్టలింగార్చన ఈ క్రింది విధముగా నుండునని శివాగమములు తెలుపుచున్నవి.

**శ్లో॥ యో హస్త పీఠే నిజలింగమిష్టం**
**విన్యస్య తల్లీన మనః ప్రచారోః॥**
**బాహ్యక్రియా సఙ్గల నిస్పృహాత్మా**
**సంపూజ యత్యంగ సవీర శైవః॥** (వీరాగమము)

**-శివం భూయాత్-**

# ఆశీర్వచనము-3

శ్రీ భగవత్పాదుల వారు త్రివిధభక్తులను గూర్చి తెలియపరచిన పిదప శివభక్తుడు నాచరించవలసిన పంచవిధ యజ్ఞములను గురించి యుపదేశమునిచ్చిరి. ఈ క్రింది యుపదేశమను గనుడి:

**శ్లో॥ పంచధా కథ్యతే సద్భిస్తద్దేవ భజనం పునః ।**
**తపః కర్మ జపో ధ్యానం జ్ఞానం చేత్యనుపూర్వకమ్॥**
**శివార్థే దేహ సంశోపస్త పః కృచ్ఛ్రాది నో మతమ్॥**
**శివార్చా కర్మ విజ్ఞేయం బాహ్యం యాగాది నోచ్యతే॥**
**జపః పంచాక్షరాభ్యాసః ప్రణవాభ్యాసఏవవా॥**
**రుద్రా ధ్యాయాది కాభ్యాసో న వేదాధ్యయనాదికమ్॥**
**ధ్యానం శివస్య రూపాదిచింతానాత్మాదిచింతనమ్॥**
**శివాగమార్థవిజ్ఞానం జ్ఞానం నాన్యార్థ వేదనమ్॥**
**ఇతి పంచప్రకారో2యం శివయజ్ఞః ప్రకీర్తితః॥**
**అనేన పంచయజ్ఞేనయః పూజయతి శంకరమ్॥**
**భక్త్యాపరమయాయుక్తః సవైభక్త ఇతిస్మృతః॥**
**పూజనాచ్ఛివ భక్తస్య పుణ్యాగతి రవాస్యతే॥** (సి.శి.9. 22-27)

వీరశైవ సిద్ధాంతమునందున పంచవిధములైన పూజా ప్రభేదములు ప్రతిపాదింపబడినవి. వీటినే పంచయజ్ఞములని యందురు. అవి. తపస్సు, కర్మ, జప, ధ్యాన మరియు జ్ఞానములు.

**1) తపోయజ్ఞము:**

తపస్సనగా శరీరమును దండనకు గురిచేయుట. యోగశాస్త్రమునందున శారీరక దండనకు సంబంధించిన అనేక విధానములు ప్రతి పాదింపబడినవి. వీటిలో ఆకలి, దప్పిక మరియును శ్రీ శితోష్ణాది ద్వంద్వములను సహించుట, కాష్టమౌనము ఆకారమౌనముల నాచరించుట, కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములను పరిపాలించుట మొదలగునవి ప్రఖ్యాతిని పొందినవి.

త్రికరణ శుద్ధితో తపస్సును చేయునప్పుడు తనకు గల్గెడి ఆకలి, దప్పికలను సహించి కొన వలసిన యావశ్యకత గలదు. ఎప్పుడూ ఆకలిదప్పుల ఆలోచనలలో నుండెడి వారు ఆత్మశుద్ధిని సాధించజాలరు. ఈ కారణములవలననే శ్రీ నిజగుణ శివయోగులవారు, "ఆకలి దప్పులతో అలమటించెడి వానికి కూటమగునే గణపదవిలో యని ప్రశ్నించిరి. గణపదవి నాశించెడి వాడు ఆకలి దప్పుల విషయాక్తులను గూర్చి చింతించకను ఎల్లవేళలలో శివచింతనలో మునిగి తేలుచుండవలెను. ఇది శివయోగుల వారి సందేశము.

శీతోష్ణములనెడి ద్వంద్వములు శరీరమునకు సుఖదుఃఖములను కలుగజేయుచున్నవి. శివభక్తుడైన వాడు వీటిని కూడసహించవలెను. అమోఘమైన సహనశీలత గల్గిన తాపసులు, చలి కాలమున చల్లటి నీటిలో కూర్చుండి తపమాచరింతురు. మరికొందరు వేసవిలో పంచాగ్నుల మధ్య కూరుండి తపస్సును చేయుదురు. నాల్గువైపుల నాలుగు అగ్ని గుండములు తలమీద సూర్యుడు తాపము కలిగించుచుండగా తపస్సును చేయుటయే పంచాగ్నుల మధ్యన కూర్చొండి తపమాచరించుట యగుచున్నది. కుమారసంభవమున పార్వతీదేవి శివుని గూర్చి యిట్టి తపస్సును చేసెనని కాళిదాసు తెలిపిరి. మానవుడుతన సహనశక్తిని పెంచికొనుటకై యిట్టి తపశ్చర్యలు దోహదకారిగా నుండగలవు.

కొందరు ద్వంద్వములను సహిస్తూ, దానికి తోడుగా మౌనమును పాటిస్తూ తపస్సును చేయుచుందురు. మౌనములు రెండు విధములుగా నుండును. మొదటిది కాష్ఠమౌనము రెండవది ఆకారమౌనము. ఆకారమౌనమున కేవలము సంభాషణ మాత్రము నిలిపి వేయబడుచున్నది. కాష్ఠమౌనమట్టులకాక తన చేష్టలను ప్రకటించు కొనకుండా ఉండుట బాహ్యమున చూపరులకు మౌనిగా కన్పట్టినను, మనస్సుయొక్క వ్యవహారములను నిలుపలేని వాడై తన యింగితమును శారీరికచేష్టలచేత తెలియజెప్పు చున్నందున యితనిని ఆకారమౌని యని అందురు. మనస్సును, జిహ్వను, కళ్ళను, మిగిలిన శరీర అవయవముల వ్యాపారములను నిరోధించి, కట్టెమాదిరిగా కదలక మెదలక యుండెడి వాడే కాష్ఠమౌని. ఇట్టి స్థితిని సాధించుట కష్టసాధ్యమైన పని. ఆకార మౌనమును పాటిస్తూ క్రమ క్రమముగా కాష్ఠమౌనమును పాటించుటకై కృషిచేయవలెను. కోరికలను నిరోధించుటకై కాష్ఠ మౌనమును పాటించ వలెనని చెప్పబడినది. మనస్సును నిరోధించి, కాష్ఠమౌనమును పాటించెడి వాడే నిజమైన మౌని యగుచున్నాడు.

ఇదే విధముగా కృచ్ఛ మరియు చాంద్రాయణములనెడి అతి కఠినమైన వ్రతములను పాలించెడిదియు తపస్యేయని చెప్పబడినది. మనుస్మృతిలోన యీ రెంటికిని అధికరతరమైన ప్రాముఖ్యత యివ్వబడినది. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**త్ర్యహం ప్రాతస్త్ర్యహం సాయంత్ర్యహమద్యాదయాచితమ్**
**త్ర్యహం పరంచ నాశ్నీయాత్ ప్రాజాపత్యంచరేద్విజః॥** (మనుస్మృతి 11-212)

ఈ విధముగా మనుమహర్షి కృచ్ఛ్ర వ్రతము యొక్క స్వరూపమును తెలియపరచిరి. పరాశర మహర్షి తమ మన్వర్థముక్తావళి యందు మనుస్మృతికి వ్యాఖ్యానము చేస్తూ ఈ క్రింది విధముగా వ్రాశిరి.

శ్లో॥ **సాయం ద్వాత్రింశతి గ్రాసాః ప్రాతః షడ్వింశతిస్తథా**
**ఆయాచితే చతుర్వింశత్ పరం చానశనం స్మృతం**
**కుక్కుటాండప్రమాణంచ యావాంశ్చ ప్రశేన్ముఖమ్**
**ఏకం గ్రాసం విజానేయాచ్ఛుద్ధ్యర్థం గ్రాస శోధనమ్** (మ.స్మృ. మన్వర్థ 11-212)

ఈ వ్రతమును పాలించెడి వారు మూడుదినములవరకు కేవలము ప్రాతః కాలమునందుననే ఇరువది యారు కోడిగ్రుడ్డుల ప్రమాణముగల అన్నము ముద్దలను గ్రహించవలెను. మరొక మూడు దినముల పర్యంతము పగలంతయు ఉపవాసముండి సాయంకాలమునందుననే ముప్పదిరెండు కోడి గ్రుడ్డుల ప్రమాణముగల అన్నము ముద్దలను గ్రహించవలెను. ఆ తదుపరి కొన్ని మూడుదినముల వరకు అయాచిత అనగా వేడకుండగనే తనకు తానే వచ్చిన అన్నమునందలి ఇరువదినాలుగు కోడిగ్రుడ్ల ప్రమాణముగల అన్నమును మాత్రమే స్వీకరించవలెను. మరొక మూడుదినముల పర్యంతము సంపూర్ణముగా ఉపవాసమాచరించవలెను. ఇదే క్రమమును నిరంతరము కొనసాగించవలెను. ఇట్టి వ్రతమునే కృచ్ఛ్రవ్రతము అందురు దీనికి ప్రాజాపత్య వ్రతమను పేరు కూడా కలదు. ఈ కృచ్ఛ్రవ్రత పాలనమువలన సాధకుని యొక్క శరీరము క్రమక్రమముగా కృశించిపోవుచున్నది. తత్ఫలితముగా నయ్యేది పరిశుద్ధమగుచున్నది

శరీరశోషణ మరియు శుద్ధీకరణ చేసెడి మరొక వ్రతమునే చాంద్రాయణ వ్రతమని అందురు. ఈ వ్రతము గురించి మనుస్మృతిలో ఈ క్రింది విధముగా చెప్పబడినది.

శ్లో॥ **"ఏకైకం హ్రాసయేత్పిండం కృష్ణేశుక్లేచ వర్ధయేత్**
**ఉపస్పృశం స్త్రిషవణమేత చాంద్రాయణం స్మృతమ్** (మ.స్మృ. 11-227)

శుక్లపక్షము యొక్క ప్రతి పదమునుంఢి ఒక్కొక్క ముద్దను క్రముగా పెంచి కొనుచు పోయి పౌర్ణిమ దినమునందు పదిహేను ముద్దల భోజనముచేయవలెను. కృష్ణ పక్షమునందు ప్రతిపదమునుండి ఒక్కొక్క ముద్దను తగ్గించుకొనుచు అమావాస్య నాడు సంపూర్ణమైన ఉపవాసమును చేయవలేను. ఈ విధముగా చంద్రునివృద్ధి మరియు క్షయము జతకు అన్నము యొక్క కబళముల వృద్ధి క్షయములనాచరించుచు నుండెడి వ్రతమే చాంద్రాయణ వ్రతమని గుర్తింపబడినది.

ఈ విధముగా ఆకలి దప్పులు, మరియు శీతోష్ణాది ద్వంద్వములను సహించుట, కాష్టమౌనము, ఆకార మౌనములను పాటించుట, మరియు కృచ్ఛ, చాంద్రాయణాది వ్రతములను పరిపాలించుట వలన గలిగెడి శరీరశోషణములనే తపస్సు అని పిలిచిరి. అయితే జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఈ శివపంచయజ్ఞములయందు చెప్పిన తపస్సనెడివి ఇంతకు ముందు వర్ణించిన తపస్సు కంటెను భిన్నమైనవని గ్రహించవలెను.

వీరశైవుడు ఇంతటికష్టసాధ్యములైన మరియుకఠోరములైన వాటిని ఆచరించి "దేహ సంతోషః తపః కృచ్ఛ్రాది నోమతమ్" అనెడి ఆచార్యుల ఉక్తికి అనుగుణముగా శివపూజాసామాగ్రిని సేకరించునపుడు కలిగెడి కష్టమైననుగాని, శివపూజాదులను చేయునపుడు వేసికొనిన పద్మాసనాది ఆసనముల వలన కలిగెడి బాధలను సహించుటయే తపస్సు. ఇచ్చట కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములను నిషేధించుటచేత వీరశైవులు వాటినాచరించవలసిన అవశ్యకతలేదు.

**కర్మయజ్ఞము:** శివపంచయజ్ఞములందు రెండవదే కర్మయజ్ఞము కర్మమనగా ఇచట శాస్త్రవిహిత అనుష్ఠానము అని అర్థము. శాస్త్రవిహితకర్మలు చతుర్విధములనియును అవి నిత్యనైమిత్తక,కామ్య మరియు ప్రాయశ్చిత్తములని యును ఇంతకు క్రితమే తెలిసికొనియుంటిమి. ఆయుష్యమున్నంతవరకు చేయునదే నిత్యకర్మ. సందర్భము వచ్చినపుడు సంవత్సరమున కొకసారియే లేదా నియతకాలము ప్రకారము చేసెడిదియే నైమిత్తకము. ఐహిక మరియు పారలౌకిక కామితములను ఆశించి చేసెది యజ్ఞయాగాదులే కామ్యకర్మలు. ఇచ్చట తెలిసియో తెలియకయో కలిగెడిదోషములను నివారించుకొనుటకై చేసెడిదే ప్రాయశ్చిత కర్మ. వీటిలో నిత్యకర్మను అవశ్యముగా చేయవలెను. వీరశైవులకు ఇష్టలింగార్చననే శాస్త్ర విహితమైన నిత్య కర్మము. వీరశైవేతరులు చేసెడి నిత్యకర్మలు వీరశైవుడు చేయవలసిన అవశ్యకతలేదు. ఇతరులు ప్రతినిత్యము సంధ్యావందనమునందు హోమాహవనాది క్రియలను చేయుచున్నారు. అట్టివారి ముఖ్యయారాధ్య దైవము అగ్నియగుటచేత అది వారికి విహితముగా దోచవచ్చును. వీరశైవులకు ఆరాధ్యదైవము ఇష్టలింగమే అయివుండుటచేత ఇష్ట లింగార్చనకు మాత్రమే ప్రాధాన్యత యివ్వబడినది. పూజ్య భగవత్పాదులవారు ఇష్టలింగార్చననే కర్మ యజ్ఞమని స్పష్టము చేశిరి. కాన వీరశైవులు ఇష్టలింగార్చననే ప్రధానమైన కర్మగా తెలిసికొని దానిని మాత్రమే ఆచరించవలెను. ఇతర కర్మ యజ్ఞముల ఆచరణయొక్క ప్రసక్తి మనసునకు తెచ్చుకొనవలదు.

**జపయజ్ఞము:** మూడవదగు యజ్ఞమే జపయజ్ఞము. జపమనగా మంత్రముయొక్క పునః పునరావృత్తి శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు ప్రణవము లేదా పంచాక్షరి మహా మంత్రము లేదా రుద్రాధ్యాయపు పునః ఆవృత్తినే జపముగా బోదించిరి. ఇక్కడ వుండెడి ఆదిశబ్దము చేత పంచబ్రహ్మ మంత్రార్థ శిఖమొదలైన ఉపనిషత్తుల ఆవృత్తిని చేయవలయునని శ్రీ మరితొంట దార్యులు శ్రీ సిద్ధాంత శిఖామణి వ్యాఖ్యానమునందు తెలియపరచినారు. వీరశైవులకు హెచ్చగు వేదాధ్యయన భాగము అనవసరము.అనగా కర్మకాండ బోధకమైన వేదభాగ పఠనము అనావశ్యకమైనదని వీరశైవులు తెలుసుకొని ప్రవర్తించవలెను.

శివభక్తుడు తన వాణిని పవిత్రముచేసుకొనుటకు మంత్రములన్నింటికి మూలరూపమైన ఓంకారమును లేదా ఓంకార సహితమైన పంచాక్షరిని సదా జపించుచుండవలెను. ఇదే కాకుండా తన యిష్టలింగమునకు అభిషేకముచేయునప్పుడు రుద్రాధ్యాయము యొక్క పఠనమును చేయవలెను. సాధ్యమైనవారు ఒక ఆవృతియైనను రుద్రాధ్యాయము యొక్క పఠనము చేయవలెను. దీనివలన దారిద్ర్యాది దుఃఖములు దూరమగును. అయితే వీలుకాని వారు ప్రణవసహిత పంచాక్షరితో అభిషేకము చేసిననూ సరిపోవును. రుద్రాధ్యాయనమక చమక సహితముగా ఇష్ట లింగార్చన చేయలేనివారు భాదపడనవసరములేదు. ప్రణవసహిత పంచాక్షరితో నభిషేకము చేసినచో అదే ఫలము లభించగలదు.

పంచాక్షరీ మహామంత్రము గురించియు, ప్రణవము గురించియును పంచాక్షరీ జపస్థలమునందున విస్తారముగా వివరించనైనది. ఆసక్తి కలిగినవారు పఠించగలరు.

జపతోనాస్తి పాతకమ్' అనబడెది శాస్త్రోక్తికి అనుగుణముగా చూసినయెడల జపాభ్యాసము వలన సకల పాపముల నుండి విముక్తి లభించునని తెలియుచున్నది. పంచాక్షరీ మంత్రమును జపించుటవలన కలిగెడి ఫలము అనూహ్యామైనదని గుర్తించగలరు.

**ధ్యానయజ్ఞము:** పంచయజ్ఞములలో నాల్గవది ధ్యాన యజ్ఞము. ధ్యానమనగా చింతన సంసార చింతన అలమటించెడి జీవులకు శివధ్యానమే ప్రశాంతతను చేకూర్చగలదు. పతంజలి యోగశాస్త్రములోనీవిషయము గురించి విస్తారముగా చర్చించబడినది. అష్టాంగ యోగములో ఇది ఒకటనియును తెలియుచున్నది. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార ముఖములద్వారా శరీరమును, ఇంద్రియములను, ప్రాణములను శుద్ధిచేసుకొని వాటిమీద నియంత్రణ సాధించుటకై ప్రయత్నించి ఫలితము పొందిన పిదప తత్పరిణామముగా అంతరీంద్రియమైన మనస్సును నిరోధించుటకు ధారణాది అభ్యాసములను చేయవలసి యుండును. ఈ ధారణ అనెడిది రెండు గంటలవరకు విచలితము కాకుండా శివచింతనయందు కూర్చుండిన యెడల సిద్ధించును. అటులనే అట్టి శివచింతన ఎవరైనను చేసినయెడల అట్టివారి మాటలలో సత్యము నావగింజంతమేరకు కూడా లేదని గుర్తించగలరు. శివలింగము యొక్క తత్వమును తెలుసుకొనుటకై శివాగమములే సాధనములని శ్రీనిజగుణ శివయోగుల వారు తెలియబరచిరి. ఇది ఇటులుండగా వైష్ణవాది దర్మభోధకములగు భాగవతాది పురాణములను చదివి గాని వైనాయకాది మతముల భావములను ప్రచారము చెశెడి పౌరాణిక లేక పౌరాణికేతర సాహిత్యమును గాని చదివి శివజ్ఞానమును తెలుసుకొనుటకు ప్రయత్నించుట యనెడిది అర్ధహితమైన విషయము నిర్జలమైన ఎడారిలో నీటిని వెదుకుచూ పోయెడివాడి గతియే యిట్టి వానికి పట్టును. వీరశైవులీవిషయమును గుర్తింతురుగాక. పరశివ తత్వమును తెలుసుకొనుటకై శ్రీ భగవత్పాదులవారు బోధించిన యటుల శివజ్ఞానమును సంపాదించుటకై శివాగమములనభ్యసింపవలెను.

పైన వివరింపబడిన తపోయజ్ఞము, కర్మ యజ్ఞము, జపయజ్ఞము, ధ్యానయజ్ఞము మరియు జ్ఞానయజ్ఞముల ద్వారా ఎవడు శివునిని ఆరాధించుచున్నాడో వాడే శివభక్తుడు. వానికే శివసాయుజ్యము లభించుచునని. వీరశైవ విజ్ఞులు గ్రహింతురుగాక.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**దిii 20-9-1990**
**స్థలం: శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్యమమురము**
**బోధకాలు బసవేశ్వర దేవస్థానం. రాణి చెన్నూరు.**

## విశేష ప్రదీపిక :

యజ్ఞమనగా ప్రాకృతులు భావించి నాచరించునది కాదనియును,తద్భిన్నమైనదనియును, యజ్ఞమనగా పూజయనియును, పంచయజ్ఞములనగా ధ్యానాదులేననియును తేల్చి చెప్పి శ్రీ కాశీ జ్ఞానసింహా సనారూడులైయున్న శ్రీ చంద్రశేఖర శివాచార్యుల వారు, వీరశైవధార్మిక ప్రవచమును సుసంపన్నము చేసిరి.

బ్రాహ్మణ మార్గమున పయనించు వారికి యగ్ని ముఖార్చన విహితమని దోచును. వీరుపంచయజ్ఞములను ప్రతిపాదించి. నాచరించవలయునని యాదేశింతురు. దేవ, పితృ, ఋషి యజ్ఞములు పంచయజ్ఞములలో ముఖ్యమైనవి. వీరశైవమున యజ్ఞ సంస్కృతికి ప్రాముఖ్యత నివ్వబడలేదు. వీరశైవులకు యజ్ఞయాగాదుల విహితమని చెప్పెడి బసవ పురాణములోని యా క్రింది ప్రమాణములను గనుడి:

**సీii గత పూర్వజన్మ సంస్కారుడై తలప**
**వితత ద్విజత్వంబు పతితంబు గాదె?**
**నిర్మల గురు కృపాన్వీత జన్మునకు**
**గర్మ జన్మంబు దుష్కర్మంబు గాదె**
**యగ్గురు పాదంబు లర్చి(ర్చి)ంచు నతని**
**కగ్గిలో హవి వేల్పుటది తప్పుగాదె** (బసవ పురాణము, తమ్మయ్యగారి పరిష్కారము) పు40-41

శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము కూడ నీ రీతిననే గలదు. ముమ్ముందున రాబోవు "క్రియాలింగస్థలము"న శ్రీ ఆది జగద్గురువుల వారు సహేతుకమైన వివరణనిచ్చిరి. ఈ స్థలమున శ్రీ గురుడిచ్చిన యుపదేశములో నీ క్రింది యుపదేశము గమనార్హమై యున్నది.

**శ్లో॥ కిం యజ్ఞైరగ్ని హోత్రాద్యైః కింల్పో భిశ్చరైః**
**ఃలింగార్చన రతిర్యస్య స సిద్ధః సర్వ కర్మసు॥** (సి.శి.15-35)

"కింయజ్ఞః" అనెడిది లింగధారణీయమైనది యజ్ఞయాగాదులు, అగ్నిహోత్రములు, కఠినమైన తపస్సులతో పని లేదని గుర్తించవలెను. వీరశైవులలో నెవ్వరైనను యజ్ఞ యాగాదుల యడల ఆసక్తి కనబరచిన యెడల నయ్యది వారి సాంగత్య దోషమువలన సంప్రాప్తమైన బావమని గ్రహించవలెను సాంగత్య దోషమునకు లోనై యజ్ఞ సంస్కృతి వైపునాకర్షితులయ్యెడి వారి సంఖ్య క్రమేపి పెరుగుచున్నది. ఆర్యసమాజము వంటి సంస్థలియుద్భుత ప్రచారము వలన చాలా మంది యీ యజ్ఞ సంస్కృతి వైపు నాకర్షితులవుచున్నారు. భగవద్గీత కూడ యీ ధోరణిని పరోక్షముగా ప్రోత్సహించుచున్నది. ఇట్టి స్థితిలో వీరశైవ భక్తుడు తికమకకు గురియయ్యెడి యవకాశము కలదు. అట్టి వారి సందిగ్ధ భావమును తొలగించుటకు నీ యాశీర్వచనము జ్ఞాన దాయకమగును.

ఇది యిట్టులుండగా కొందరు ప్రాకృతమార్గమున గల పంచయజ్ఞములవైపు మొగ్గచూపుచున్నారు. "పాఠో హోమశ్చాతిథీనాం సపర్యా తర్పణం బలిః" యని యమరమున చెప్పబడినది. వర్ణవ్యవస్థ ననుసరించెడి వారగు బ్రాహ్మణాదులకిది విహితమేమోకాని వీరశైవులకిది విహితముకాదు. ఈ ధర్మము ప్రకారము పంచయజ్ఞములనగా ధ్యాన, జపాదుల ద్వారా యిష్టలింగార్చనను చేయుటయే యని శ్రీ భగవత్పాదులవారు స్పష్టము చేసిరి. శ్రీ చంద్రశేఖర జగద్గురువుల వారు విశ్లేషణతో వీరశైవ పంచయజ్ఞముల స్వరూప స్వభావములు నెంతయో వివరము చేసిరి. శ్రీ బసవేశ్వరాది శివశరణులును యజ్ఞ సంస్కృతిని నిరసించిరి. బసవేశ్వర గీతామృతమున నీ విషయము సవిస్తారముగా వివరించడనైనది.

భక్త స్థలము నందలి వీరశైవుడు భ్రమకు లోనుకాకుండ, పరధర్మ సంస్కృతుల జీవికి పోకుండ శ్రీ భగవత్పాదులవారు సూచించిన మార్గమున పయనించి మాహేశ్వర స్థలమును ప్రవేశించుటకొరకు కృషి సలుపవలెను.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-4

శ్రీ సిద్ధాంత శిఖామణి భక్తి మార్గక్రియా స్థలమునందున, శివభక్తుడు ఆచరించ వలసిన శివపంచయజ్ఞములు గూర్చి తెలిసికొనిన పిదప శ్రీ రేణుక భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షికి ఉపదేశించిన మరి కొన్ని భక్తి మార్గక్రియలీ క్రింది విధిన నున్నవి:

**శ్లో॥ అవమానాన్మహాఘోరో నరకో నాత్ర సంశయః।**
**శివభక్తో మహాతేజాః శివభక్తి పరాఙ్ముఖాన్॥**
**న స్పృశేన్నేవ వీక్షేత్నతైః సహ వసేత్ క్వచిత్।**
**యదా దీక్షాప్రవేశః స్యాల్లింగధారణ పూర్వకః॥**
**తదా ప్రభృతి భక్తో2 సౌ పూజయేత్ స్వాగమ స్థితాన్।**
**స్వమార్గాచారనిరతాః సజాతీయా ద్విజాస్తుయే॥**
**తేషాం గృహేషు భుంజీత నేతరేషాం కదాచన।**
**స్వమార్గాచార విముఖై ర్భవిభిః ప్రాకృతాత్మభిః॥**
**ప్రేషితం సకలం ద్రవ్యమాత్మలీనమపి త్యజేత్।**
**నార్చయేదన్య దేవాంస్తు న స్మరేన్న చ కీర్తయేత్॥**
**న తన్నైవేద్యమాశ్నీ యాచ్చివ భక్తో దృఢవ్రతః।**
**యద్గృహేష్వన్య దేవో స్తి తద్గృహాణి పరిత్యజేత్॥**
**నాన్య దేవార్చ కాన్ మర్త్యాన్ పూజాకాలే నిరీక్షయేత్।**
**సదాశివైకనిష్ఠానాం వీరశైవాధ్యవర్తినామ్॥** (సి.శి.9: 28-34)

పరమ కల్యాణ స్వరూపమైనశివుని భయ భక్తుల చేత పూజించిన యెడల సద్గతియే ప్రాప్తమగును శివునికి అవమానము కలిగే విధముగా అవధానము సల్పిన యెడల మహా భయంకమైన నరకమే సంప్రాప్తమగును. దీనియందున సందేహము లేనేలేదు.

మహా తేజస్వియైన శివభక్తుడు, శివ భక్తులు కాని వారిని ముట్టకూడదు. వారిని చూడకూడదు. వారి వెంబడి సహవాసమును చేయకూడదు. శివ భక్తుడు ఎల్లప్పుడూ సద్గురువునుండి దీక్షా సంస్కారములను పొంది శివాగమోక్త ఆచరణలను పరిపాలించెడి తన కంటెను శ్రేష్ఠులైన శివభక్తులను లేదా శివశరణులను, శివాచార్యులను విధి ప్రకారము పూజించవలెను. తన ఆచార విచారములకు పొందికగా నుండెడి శివాచార సంపన్నులైన భక్తుల తోడనే సహవాసమును చేయవలెను తన గ్రామము నందైననూ గాని, పరగ్రామము నందైననూ గాని ఇంకొకరి యింటిలో భోజనము చేసెడి ప్రసంగము వచ్చినపుడు వారు శివాచార సంపన్నులైన భక్తా-మాహేశ్వరులో కాదో యనెడిదానిని తెలిసికొనిన తరువాత భోజనమును చేయవలెను. శివసంస్కారములేని వారి యింటి యందు శివభక్తుడు ఆహారమును సేవించ కూడదు. వీరశైవ సంస్కారానికి దూరమై, మద్యపానము మాంసభక్షణను చేయువాడై, అన్యదైవములను పూజించు వాడై యిష్టలింగమును ధరించని వాడై దూరాచారిగా తిరుగాడెడి భవి దగ్గర నుండి శివ భక్తుడు ద్రవ్యాది పదార్థములను స్వీకరించ కూడదు. శివేతరమైన దేవతలను, శివభక్తుడు తన చేతులతో పూజించ కూడదు. వారి నామమును జిహ్వాపైకి తేకూడదు. మనస్సున వారి తలంపు రానివ్వకూడదు. అన్యదైవములకు నివేదించిన పదార్థములను స్వీకరించకూడదు. ఏ ఇంటిలో శివేతరమైన దేవతల అర్చన జరుగుచున్నదో, ఆ యింటిలోనికి శివభక్తుడు ప్రవేశించకూడదు. తాను శివపూజ చేసి కొనెడి సందర్భమున ఇతర దేవతలను పూజించే వారి ముఖమును చూడ కూడదు. ఈ నియమావళిని పాలిస్తూ ఎల్లప్పుడూ యిష్టలింగపూజలోను, శివధ్యానములోను తత్పరులై యుండవలెనని శ్రీ భగవత్పాదుల వారు ఉద్బోదించిరి.

శివుడు ఎల్లరకూ కల్యాణ కారకుడునూ, ఆశుతోషుడు. అయి యున్నాడు. భక్తితో నతనిని పూజించిన యెడల యతి శ్రీఘ్రముగనే జ్ఞానోదయమై శివభక్తుడు సద్గతిని బడయుచున్నాడు. "జ్ఞానమిచ్ఛేత్తు శంకరాత్" అనెడి ప్రమాణ వచనము ప్రకారము జ్ఞానా పేక్ష గల వారెవ్వరైననూ శివుని మాత్రమే పూజించవలెను.

**శ్లో॥ యదాచర్మవదాకాశం వేష్టయిష్యంతి మానవాః।**
**తదా శివమ విజ్ఞాయ దుఃఖ్యస్యాంతో భవిష్యతి॥** (శ్వేతాశ్వత ఉ. 6-20)

శివజ్ఞాన శూన్యునికి ముక్తిలభించదు. ఆకాశమును చాపను చుట్టనట్లుగా చుట్టి చంకలో పెట్టుకుంటినని యెవ్వడైననూ అనినచో నేవిధముగా విశ్వసించజాలమో, అదే విధిన శివజ్ఞానముతో ప్రమేయము లేకుండగ ముక్తిని పొందవచ్చునని యనెడి వాని మాటలను విశ్వసించకూడదు. ఈ విధముగా శివునికి అవమానమును చేసెడి వారు, తమ యీ దుష్కర్మ ఫలితముగా మహా దుర్గతిని పొందుదురని శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు హెచ్చరికను చేయుచున్నారు.

ధక్ష ప్రజాపతి యొక పెద్ద యజ్ఞమును రచించి, శివునికాహ్వానము పంపలేదు. తత్ఫలితముగా తన కూతురైన సతీదేవి యొక్క ఆహుతి గనవలసి వచ్చినది. అంతేకాదు తన తలను గోల్పోయి, దాని స్థానమున మేక తలను పొందిన వాడయ్యెననెడి పౌరాణికగాద కలదు. దక్షుడు ధరించిన మేక తల బుద్ధి హీనతకు ప్రతీకయైయున్నది. ఎవ్వడైననూ శివుని గూర్చి అగౌరవభావముతో మాట్లాడిన యెడల, లేదా శివుని యెడల వైషమ్యభావము వహించినవాడు మేక లేదా గొఱ్ఱెవంటి బుద్ధిగలవాడని భావించవలెను.

శివదీక్షా సంపన్నుడైన శివ భక్తుడు, శివభక్తులు కాని వారి వెంబడి యుండి సహవాసము చేయుట అట్టి వారితో మాటలాడుట లేదా వారిని చూచుట చేయకూడదు దీనికి గల కారణమేమనగా సాంగత్య దోషము వలన శివభక్తునిలో విపరీతమైన పరిణామములు సంభవించెడి యవకాశము గలదు. ఒక మనిషి మంచి వాడగుటగాని, చెడ్డ వాడగుటకు గాని, యతడు చేసెడి సహవాసమే కారణభూతమగుచున్నది. ఒక చిలుకల వ్యాపారి తన రెండు చిలుకలను వేరే వేరే వారైన యిరువురికి యమ్మిన పిదప నా రెండు చిలుకల వాగ్వ్యవహారము నందున అంతరము వచ్చునని తెలిపెడి దంతకథ ప్రఖ్యాతిన నున్నది. ఉత్తమ సంస్కారమును పొందిన చిలుక, వినయ పూర్వకముగా మాట లాడగా, సంస్కార హీనుని సాంగత్యమును పొందిన చిలుక, కర్ణకఠోరముగా మాటలాడును. ఇది సహవాసదోషము యొక్క ఫలము కాదా? ఈ కారణము వలననే యుత్తమ సంస్కారములను పొందిన సాదకుడు, హీన

సంస్కారము గలవారి తోడ సహవాసమును చేయవలదు.

శివ భక్తుడైనవాడు తనవలె సంస్కారియై సాధన యందు తన కంటె ముందెడి శ్రేష్టమైన వ్యక్తుల నాధరించి వారిసేవా మశ్రూషలను చేయవలెను. ఇందు వలన పెద్దల యొక్క అనుగ్రహము లభించును తత్పరిణామముగా ఆతని యొక్క శివ తేజస్సు క్రమ క్రమముగా అభివృద్ధిని గాంచును. అన్న పానాదుల విషయమున తెలుసుకొన వలసినదే మనగా సన్మార్గాచార విముఖులై, మద్యపాన మాంసభక్షణాదులను చేసెడి దురాచారము కల్గి మరియు లింగధారణకు దూరమైన భక్త జనుల యిళ్లలో ఎప్పటికిని అన్నపానాదులను తీసుకొనరాదు.

"ఆహారాశుద్దే సత్య శుద్ధిః" యనెడి ప్రమాణవచన ప్రకారము ఆహారము శుద్ధిగా యుండును ఆవిరుద్ధమైనప్పుడూ, అశుద్ధిచోటు చేసికొని మనస్సు వైకల్యమును పొంది దురాలోచనలకు సెలవగును. ఈ కారణము వలన మనస్సును దోష భూయిష్టముచేసెడి ఆహారమును యెప్పటికిని సేవించరాదు. భవిజనులైనవారు అభక్షభక్షణ మరియు అపేయపానాదులచేత తాము అశుద్ధులుగా యుండుటయేకాదు తమచుట్టు ప్రక్కల వారిని కూడ తమసాంగత్యము చేత దుష్టసంస్కారములను సంక్రమింపచేసి వారి పతనమునకు కారణ భూతులగుచున్నారు. అందు చేత శ్రీ రేణుక భగవత్పాదుల వారు భవిజనుల సహవాసమును నిషేదించినారు. వారి నుండి లభ్యమయ్యెడి పదార్థములను తీసుకొనుటపై ఆంక్షలనువిధించిరి. అట్టివి భౌతిక పరముగా ఎంతో అమూల్యములైనప్పటిని ఆధ్యాత్మికపరంగా నవి మూల్యనిహీనములుగా పరిగణించి వాటిని తిరస్కరించి, త్యజించవలెను.

ఇంకను శివభక్తుడు తనయిష్టలింగమునకు కాక అన్యదైవముల నర్చించెడి, కీర్తించెడి, స్మరించెడి, మరియు నివేదిత పదార్థములను స్వీకరించెడి వ్యవహారములను సర్వదా త్యజించవలెనని భగవత్పాదులవారుపదేశించిరి. అంతేమికాదు, అన్యదేవతల నుపాసించెడి వారి యొక్క మందిరములకు వెళ్ళుటపై కూడ ఆంక్షలను విధించిరి, తన యిష్టలింగమును విడిచి యితరేతరదేవతలను, అర్చించుటచేత తన యిష్టలింగమునందు, మరియు ఆ శివపరబ్రహ్మయందు, అశ్రద్ధను దాల్చినటయగును. సకల చరాచరములననుగ్రహించెడి శివుడు, యిష్టలింగరూపమున తనహస్తపీఠమునకు ప్రాప్తమైన పిదప, అన్యదేవతలవైపు చూడవలసిన అవసరము లేదు. జగత్కర్త యైన శివుని ప్రతి రూపమైన తనయిష్టలింగమును, తన హస్తము నందుంచుకొని అన్యదేవతలవైపు ప్రవృర్తులైనవారిని గని శ్రీ ప్రభుదేవులవారు, వారిని నిందనీయులనిరి. వీరశైవుడు తన భక్తిని దృఢతరముచేసి కొనవలెననిన లింగైకనిష్టా పరతంతుకడు కావలెను. ఒకే కడకు నిష్టలేని వాడిసాధనము ఎన్ని ధినములు కొనసాగినను నిష్ప్రయోజకమగును. నీరుకై అలమటించే రైతు తన పొలమునందున ఒక్కస్థానము నందునే నూరు అడుగుల వరకు తవ్వినచో వుండే ఫలితము కంటే నూరుస్థానముల యందు ఒక్కొక్క అడుగును త్రవ్విన యెడల నీరు పడునా? అదేవిధముగా, ఏకదేవనిష్టలేని వాడి భక్తియు నిష్ఫలమగునని తెలుసుకొనవలెను.

వీరశైవ ధర్మానుమాయియైన శివభక్తుడు తానుశివపూజనుచేయునప్పుడు లింగభక్తులు కాని వారి యొక్క ముఖమును చూడకూడదని పూజ్యపాదుల వారు ఆదేశమునిచ్చిరి.

ఇక్కడ విధించబడెడి నిషేదములన్నియును అన్యదేవతల యెడల హీనభావనమును వహించి, రూపొందించబడినవని భావించరాదు, భక్తుని యొక్క నిష్టను, తన యిష్టలింగమునందున కేంద్రీకరించుకొని తన నిష్టాభక్తిని పెపొందించు కొనవలయుననునదే, అంతర్లీనంగా వున్న ఆదేశము. "నహీనిందానిందితమ్ ప్రవర్తతే" యనెడి ప్రమాణము ప్రకారము ఎక్కడెక్కడ యితరదేవతల నిరాకరణ చేయబడుచున్నదో అక్కడక్కడ యిదే రీతిగా విషయగ్రహణ చేసికొన వలెను. ఈ విధముగా పూజ్యులవారి ఆదేశము ప్రకారము భక్త స్థలమునందలి వీరశైవుడు శివుని యందు నిష్ఠనుదాల్చి శివనిందను చేయకుండా యండవలెను. ఆ విధముగా చేసిన యెడల భక్తి దృఢతరమై యిహలోకమున కామితార్థములను పరమున ముక్తియును సులభముగా పొందవచ్చును.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ది॥ 21-9-1990**

**స్థలం: శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్యమమురము**

**బోధకాలు బసవేశ్వర దేవస్థానం. రాణి చెన్నూరు.**

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారి యాశీర్వచనమున భవిజన సాంగత్యము విహితము కాదని యెంతో విశ్లేషణాత్మకముగా తెలియజెప్పిరి.

శివ భక్తి గల వాడు భక్తుడనియును, భక్తి లేని వాడు భవి యనియును తెలియ జెప్పబడినది వీరశైవ ధర్మమున శివభక్తుడు పూజనీయుడు "పూజయే ద్భక్తం" యని శ్రీ భగవత్పాదుల వారు నాదేశించిరి. క్రిందటి యాశీర్వచనమున వివరింపబడిన విధముగా భక్తి గల వాడే భక్తుడనెడిది స్మరణీయము. వీరశైవమున శివునికి శివభక్తుని కభేదము చూపబడినది. అందు చేత భక్త స్థలములోని వీరశైవుడు భక్తుని పూజించవలెను. ఈ యంశము నెంతో వివరముగా తెలిపెడి యీ క్రింది పద్యమును గనుడి:

**మ॥ ధరణిం దీర్ఘములాడుకంటే, నతిమోదంబొప్ప యజ్ఞంబులం**
**బరంగం జేయుటకంటె, సువ్రతములొప్పన్ వేద శాస్త్రార్థత**
**త్పరుడై యాదట జల్పుకంటె, నుది మత్సాహించి నీ భక్తి మ**
**త్పురుష శ్రేష్ఠుల బూజసేయుట మహా పుణ్యంబు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప. 26)

శివ భక్తుడు నిగ్రహానుగ్రహ సమర్థుడనియును, నలిగిన నరకమున బడవేయు ననెడి శ్రీ భగవత్పాదుల వాక్కుకు, యథావాక్కుల వారీ క్రింది విధిన వివరణ నిచ్చినట్లు దోచుచున్నది.

**కరుణం జేకొనిరేని రౌరవ పదగ్రస్తాత్ము దేవేంద్రుగా**
**బరగం జేయుదు రాత్మలో నలిగిరే బర్జన్యు నారౌరవో**
**త్కర పంకప్రవిలీన కీటకముగా కల్పింతురన్నట్టిచో**
**హర నీ భక్తుల శక్తి యెట్లుగురి సేయన్వచ్చు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప. 36)

భక్తిలేని వాని సాంగత్యము వలన భక్తుడు తన అస్తిత్వమును కోల్పోయే యవకాశముగలదు. తత్ఫలితముగా భక్తుని ముఖ్య లక్షణమైన లింగైక నిష్ఠా పరతంత్రత వీడి యన్య దేవతాభజన, భావమునకు నీడ్చుకొనెడి పోయెడి యాలోచనలు, అభక్ష్యసేవన, శివభక్తి యెడల మరియు శివ భక్తుల యెడల విముఖత్వము గలుగ వచ్చును. అందుచే భక్తులు కాని వారి దర్శన, స్పర్శన, సంగతి, సహభోజనము, మొదలగునవి సర్వకాల సర్వావస్థలయందు వీడ వలెననెడి ఆగమోక్తి గలదు. ఇచ్చిపుచ్చు కోవడము వంటివి కూడ చేయవలదని తెలుపబడినది. సాంగత్య దోషమెంత ప్రబలమైనదో తెలియని దెవరికి? శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము సాధ్యమైనంత మేరకు నమలు చేయుటలోనే శ్రేయస్సు గలదని గుర్తించవలెను.

**-శివం భూయాత్-**

## ఆశీర్వచనము-5

శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు ఇంతకు క్రితము, అన్య దేవతల యుపాసనను చేయవలదని వీరశైవునికి యుపదేశమునిచ్చిరి. భక్తుని భక్తిని దృఢతరము చేయుటకై శ్రీ భగవత్పాదుల వారు, ఈ విషయముననే తమరి యుపదేశమును కొనసాగించిరి కనుడి:

**శ్లో॥ నహి స్థావరలింగానాం నిర్మాలాద్యుప భుజ్యతే।**
**యత్ర స్థావర లింగానామపాయః పరివర్తతే॥**
**అథవా శివభక్తానాం శివలాంఛన ధారిణామ్।**
**తత్ర ప్రాణాన్ విహాయాపి పరిహారం సమాచరేత్॥**

శివార్థం ముక్త జీవశ్చేచ్ఛివ సాయుజ్యమాప్నుయాత్॥
శివనిందాకరం దృష్ట్వా ఘాతయే దథవా శపేత్।
స్థానం వా తత్పరిత్యజ్య గచ్ఛే హద్యక్షిమేభవేత్
యత్ర చాచారనిందా స్తి కదా చిత్తత్ర న వ్రజేత్।
యద్గృహే శివనిందా స్తి తద్గృహిణి పరిత్యజేత్॥
యః సర్వభూతాధిపతిం విశ్వేశానం వినిందతి।
న తస్య నిష్కృతిః శక్యా కర్తుం వర్ష శతైరపి॥
శివ పూజా పరో భూత్వా పూర్వకర్మ విసర్జయేత్।
అథవా పూర్వకర్మస్యాత్ సా పూజా నిష్ఫలా భవేత్॥
ఉత్తమాం గతి మాశ్రిత్య నీ చాంవృత్తిం సమాశ్రితః।
ఆరూఢపతితో జ్ఞేయః సర్వకర్మబహిష్కృతః ॥
పంచాక్షరోపదేశీ చ నరస్తుతి కరో యది।
స్మోలింగీ స దురాచారీ కుకవిః స తు విశ్రుతః॥
చర్మపాత్రే జలం తైలం నగ్రాహ్యం భక్తి తత్పరైః ।
గృహ్యతే యది భక్తేన రౌరవం నరకం వ్రజేత్॥ (సి.శి.2ః 35-43)

వీరశైవ సిద్ధాంతము నందు ప్రసిద్దములైన పంచాచారములయందలి గణాచారమును గురించి ప్రత్యేకమైన శ్రద్ధను గనబరుచనలెను. గణాచారమనగా శివుని లేదా శివభక్తుల యొక్క అవహేళనను సహించక దానికి తన శక్యానుసారముగా ప్రతిక్రియను చేయునదే. ఇష్టలింగ నిష్టుడైన వీరశైవుడు, యిష్టలింగమునకు వెలుపలగల స్థావరలింగములను పూజించుటగాని, వాటి పై నైవేద్యనములను గ్రహించుటగాని చేయకూడదు. ఐనను అంతటిస్థావర లింగములకు మరియు శివలాంచనధారులైన భక్తులకు పరధర్మముల నుండి ఏదైన ప్రమాదము వాటిల్లిన యెడల వీరశైవుడు, ఆ స్థావరలింగమును మరియు దానినర్చించెడి శివభక్తులను తన ప్రాణములనిచ్చి యైనను కాపాడవలెనని పూజ్యులు తెలియపరిచిరి. ఈ విధముగా ప్రాణత్యాగము చేసిన వారికి సద్గతి లభించుచున్నది. ఆతనికి లభించెడి స్థానము అనల్పమైన శివసాయుజ్యము.

గణాచారము యొక్క స్పష్ట స్వరూపమును వివరించుచూ పూజ్య పాదులవారు శివభక్తుడైనవాడు శివదూషణను సహించకూడదని తెలియచేసిరి. అకస్మాత్తుగా తన ఎదురునకు వచ్చి ఎవరైన శివదూషణకు పాల్పడిన యెడల అట్టి శివద్రోహిని శిక్షించవలెను. ప్రాచీనకాలములో అట్టి వానికి మరణ దండన విధించెడి సాంప్రదాయముండెడిది. అది చేయనిచ్చ లేనివాడు కఠోరమైన శబ్దములచేత నిరశించి శపించెడువారు. ఈ రెండునూ చేయుసామర్థ్యము లేని వాడు ఆస్థలమును వీడి బహుదూరముగా వెడలి, శివ దూషణ చెవినపడకుండ జాగ్రత్త పడవలెను. ప్రతి క్రియ చేయకుండగా, లేదా, స్థానమును వీడకుండ మౌనముగా కూర్చుండి, శివదూషణను విను చుండిన యెడల, దోషము సంప్రాప్తమగును, దక్షప్రజాపతి శివనిందను చేసినప్పుడు, శివుని జడనుండి ఉద్భవించిన మహిమా శాలి యైన వీరభద్రుడనే గణేశ్వరుడు, దక్షబ్రహ్మాపై దండెత్తి, విరించి, విష్ణ్వాది దేవగణములను నిర్జించి దక్షుని తలను తెగనరికిన విషయము యిట్టి గణాచారమునకు సరియగు దృష్టాంతము. ఇది ప్రప్రథమ ఉదాహరణ యని శ్రీ మరితోంట దార్యులవారు తమ సిద్ధాంత శిఖామణి వ్యాఖ్యానమునందున లిఖించిరి.

అటులనే శివభక్తులకు అపాయము జరిగిన యెడల, తాను ప్రతిఘటించలేని స్థితిలోయున్న యెడల, ఆస్థానమును వీడిపోవలెనెడి నియమము యొక్క ఆచరణ శాంతి ప్రియుడైన బసవణ్ణ చేసెనని తెలియుచున్నది. ఈ విషయమును మరి తోంట దార్యుల వారు

ఉల్లేఖించిరి. కల్యాణమునందున క్రాంతియై, శివశరణుల యొక్క ప్రాణ, మానములకు భంగము వాటిల్లనప్పుడు ఆస్థితిని చక్కదిద్దలేని పరిస్థితిలో కల్యాణనగరమును వీడి సంగమేశ్వరమునకు బసవేశ్వరుడు వెడలిపోయెనన్నది చారిత్రాత్మకమైన విషయము.

ఈ ప్రకారము శివాచారము యొక్క దూషణ జరిగెడి ప్రదేశములకు కూడ శివభుక్తుడు పోరాదు. ఎవ్వరి యింటిలో శివనింద విన్పించునో, అట్టి వారియింటిని త్యజించుటయే మంచిదని ఉపదేశించిరి. "ఈశానః సర్వవిద్యానాం ఈశ్వరః సర్వభూతానాం" యనెడి వచనము ప్రకారము సకల జీవరాశికి, అధిపతియైన శివుని ఎవ్వడు నిందించునో, వాడు అట్టి నింద వలన గల్గిన దోషమునుండి విముక్తిని పొందుటకై 100 సం॥ ల పర్యంతము ప్రాయశ్చిత్త కార్యములనుచేసిననూ, వీడదు.

ఒక సామాన్య వ్యక్తిని దూషించుటయే శిక్షార్హమైన యెడల, పరబ్రహ్మ పరమేశ్వరుడగు శివుని నిందించిన యెడల కల్గెడి దోషముగురించి చెప్పుట శక్యమే? దీని భావమే మనగా శివనిందయనెడిది, అత్యంత భయానకమైనది. శ్రీ నిజగుణ శివయోగుల ప్రకారము ఈ దోషము గురించి చెప్పుట మాటలతో సాధ్యము కాదనిరి. పామరజీవులు పరులను నిందించుట లోనే కాలమును వెళ్ళ బుచ్చుచుందురు. ఇచ్చట నిందకు గురియైన వాడికి ఎట్టి అపాయములేదు. కాని నింద వేసిన వారికి తాత్కాలికంగా యానందము లభించినప్పటికిని, దీర్ఘకాలమున వాడుచేసిననింద వానికే ముప్పును తెచ్చును. ఈ కారణము వలననే వైరాగ్యగుణసంపన్నులు నిందకులను చూసి జాలిపడెదరు. ప్రతినిందను చేయుటకు బదులుగా వారిని ప్రేమించుటకు ప్రయత్నించెదరు. ఇట్టి చర్యలను విపరీతముగా అర్థము చేసికొని, ఎదుటి వారి సహనమును, బలహీనతగా నెంచి, నిందకుడు విజృంభించిన యెడల వాడు త్రవ్వుకొన్న గుంతలో వాడే పడును. అది యెట్టులనిన, ఆకాశము వైపు, ఊర్ధ్వముఖముగా ఎంత బలముగా రాయిని విసిరిన యెడల, అది అంతకన్న అధికవేగముగా వచ్చి ఆతనినెత్తిపైబడి బలమైనగాయమును చేయకుండయుండునే?

శివ శరణులు కూడ యిట్టి వైఖరినే అవలంభించిరి. బసవణ్ణ వంటి వారు శాంతి ప్రియులై, నిందకులను, ప్రతినిందకుగురి చేయకుండ మౌనముగా భరించిరి. ఇతర శరణులు కూడ బసవణ్ణగారి మార్గముననుసరించిరి. కొందరు శివశరణులు యిట్టి వైఖరి విహితము కాదని యెంచి వీరభద్రస్వామి గారు చూపించిన మార్గముననుసరించిరి. యిట్టివారిలో మడి వాలుమాచదేవర ప్రముఖుడు. ఏమనుష్యుడైతే ఎల్లప్పుడు పరనింద చేస్తూకాలము గడుపుచుండునో యట్టి వాడు మరుజన్మలో గబ్బిలమైపుట్టునని చెప్పబడినది. ఇది హీనాతిహీనమైన జీవి. ఆహారమును తీసికొనెడి నోటి నుండియే మలవిసర్జనము కూడచేయును. అందువనల, పరనిందను చేయుటకు దూరముగానుండుట శ్రేయస్కరము. ఈ కారణమువలననే శ్రీ భగవత్పాదులవారు నిందకుల సమీపమునకు చేరకూడదని శాసించిరి. సహవాస దోషమువలన నిందకుని ప్రవృత్తి మనకు సంక్రమించే అవకాశము లెక్కువ.

శివదీక్షా సంస్కారమును పొందిన దేవతాదుల యొక్క స్మరణాదులను విడిచిపెట్ట వలెను. ఉదాహరణకు చెప్ప వలెననిన, ఒక బ్రాహ్మణుడు, శివ దీక్షను పొంది, యిష్టలింగమును బడసినపిదప పూర్వాశ్రమమునకు చెందిన సంధ్యావందనాది కర్మలను చేయకూడదు. ఇష్ట లింగపూజలోనే నిమగ్నుడై యుండవలెను. ఒక వేళ కులాభిమానము వలననో, లేదా సాంగత్యదోషము వలననో, పూర్వాశ్రమమునకు చెందిన కర్మలను చేసిన యెడల వానికి యిష్టలింగపూజ ఫలము లభించదు. శివదీక్ష నిష్ఫలమగును. ఇట్టి శివశాస్త్ర విహితమైన మార్గమును వీడి తన యిచ్ఛానుసారముగా సంచరించిన యెడల యట్టి వాడు ఆరూడు పతితుడగుచున్నాడు. దీని భావమేమనగా అతి ఉన్నతమైన ఆధ్యాత్మిక విలువగల సమున్నతమైన మార్గమున పయనించుచూ తనయిష్టానుసారముగా నీచ కర్మలనుచేసిన వాడు ఆరూడు పతితుడనిపించుకొనును. సామాన్య భాషలో చెప్పవలెననిన, కనకపు సింహాసనమున కూర్చుండబెట్టిన శునకము రీతి యగును. ఆరూడు మనునది ఎక్కుటను సూచించును శివదీక్ష యనెడి సమున్నతమనెడి శిఖరము నధి రోహిస్తూ, క్రిందికి జారిపడడము. ఈ కారణము వలన యిష్టలింగార్చన రూపమైన శ్రేష్ట తరమైన సత్క్రి యలను చేసెడి భక్తుడు, అతి సామాన్యమైన కర్మలను చేసి తన గమనమును మార్చుకొనరాదు.

శివ భక్తుడు తనవాణి చేత శివస్తోత్రాదులను మాత్రమే చేయవలెను సామాన్యజనులను స్తుతించరాదు. ఒకవేళ, లోకాచారము ప్రకారము, ప్రలోభమునకు లోనై శివస్థుతిని చేసెడి నాలుకతో, నరస్తుతిని చేసిన యెడల, అలింగి, దురాచారి, మరియు కుకవి యని సంభోధింపబడను.

పూజ్య భగవత్పాదులవారు, శివభక్తుడైనవాడు చర్మముతో తయారుచేయబడిన పాత్రలలో నిలువచేయబడిన జలము, తైలము మరియు ఘృతములను స్వీకరించవలదని ఆంక్షను విధించిరి. పాత్ర అశుద్ధమై యుండుట చేత అందులో నుండెడి పదార్థము కూడ అపవిత్రమగును. అందుచేతనే శివపూజకులు ఆచార సంపన్నులై యుండుట వలన యిట్టి అపవిత్ర పదార్థములను స్వీకరించరాదు. ఎవ్వరైనను మొండిగా వాదిస్తూ, ఈ నియమం మునుల్లంఘించిన యెడల యట్టి వాడు ఘోరతరమైన రౌరవనరకమును పొందునని భగవత్పాదుల వారు హెచ్చరించిరి. దీనిలోని భావమేమనగా, చర్మముతో చేసినపాత్ర ఒక ప్రాణినిచంపిన పిదప గ్రహించినట్టిది. అట్టి దానినుపయోగించెడివాడు, దానిమరణమునకు పరోక్షకారణభూతుడగుచున్నాడు. హింసను చేసినవాడు నరకమును పొందక స్వర్గమునకు చేరునే?

భక్తి మార్గక్రియాస్థలములోని వీరశైవ సాధకుడు శివసంస్కృతిని సంరక్షించెడి కార్యముననిమగ్నుడై యుండును. ఆ లక్ష్యసిద్ధికై ప్రాణత్యాగమును చేయుటకైనను బద్ధుడై యుండును. శివనిందకులనుండి తాను దూరముగా యంటూ శివ పూజాదులను క్రమరీతినసల్పుచూ "ఆరూడ పతితుడను" అపఖ్యాతికి గురిగాకుండగ జీవనమును గడుపవలెను. భూతదయను కల్గిన వాడై, హింసకారణమువలన లభించే చర్మాది పదార్థములనుపయోగించక యుండవలెను. పరిశుద్ధమైన ఆచారముతో బాటుగా పరిశుద్ధమైన భావనలను మనస్సున యుంచుకొనిన యెడల, యతడు శివకృపకు పాత్రుడుకాగలడు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ది॥ 23-9-1990**

**స్థలం: శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్యమమురము**
**బోధకాలు బసవేశ్వర దేవస్థానం. రాణి చెన్నూరు.**

## విశేష ప్రదీపిక :

స్థావర లింగనిరసన, గణాచారపరిపాలన, ప్రాకృత కర్మ నిరసన, వాచిక శీల సంపాదనములకు సంబంధించిన మౌలిక సూత్రములను, శ్రీ కాశీజగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు తెలియజేసిరి.

భవి భక్తుడైన పిదప పూర్వాశ్రమ వాసనలను వీడలేని స్థితిలో ప్రాకృతాచారములవైపుకు మొగ్గు చూపెడి యవకాశము గలదు. సంధ్యావందన యజ్ఞయాగాదులతో బాటుగా మూర్త్యుపాసన, విగ్రహారాధన మొదలగువని ప్రాకృతాచారములలో గలవు. దేవాలయములలో నుండెడి లింగమూర్త్యుపాసనయును ప్రాకృతాచారమే యని శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము వలన తెలియుచున్నది. యిష్టలింగార్చన తత్పరుడైన వీరశైవుడు "పూర్వకర్మ విసర్జయేత్" అనెడి శ్రీ భగవత్పాదలవారి యాదేశము శిరసావహించవలెను. సహజ వీరశైవులలోని కొందరు సాంగత్య దోషము వలన స్థావర లింగార్చన యెడల ననురాగ భరిత మనస్కులగుచున్నారు. దేవాలయములలో నున్న ప్రతిష్ఠిత లింగములకును, పీఠమున నుంచబడెడి లింగములకును నర్చనలిచ్చి ప్రసాదమును స్వీకరించుచున్నారు. ఇట్టి వారికి జ్ఞానోదయము కల్గించుటయే యీ యాశీర్వచనము యొక్క లక్ష్యమై యున్నది. వీరశైవుడు, కరపీఠమున యిష్టలింగమునిడికొని పూజించే యాచారము గల్గి యున్నందున యతనికి వీరశైవుడనెడి పేరు గల్గినదని వీరాగమము తెలిపినది.

స్థావరలింగ స్వేష్టలింగములకు గల బేదములను వివరించుచు, స్థావర లింగమునెందుకు పూజించవలదో యనెడిది శ్రీ విధ్యావాచస్పతులవారు లింగ ధారణ స్థలమున వివరించిరి. వీరశైవుడు శుద్ధ, సిద్ధ మరియు ప్రసిద్ధప్రసాదములనే తీసికొనవలెను

స్వేష్టలింగప్రాణలింగ భావలింగముల పూజించి సిద్ధ ప్రసాదమును పొందవలెను. గురు జంగము లిచ్చెడిదే శుద్ధ–ప్రసిద్ధ ప్రసాదములు. ఇవి కాకుండ మరేవిధములైన ప్రసాదములు వీరశైవునకు పరిగ్రాహ్యములుగావు వివరములు గోరువారు బసవేశ్వర వచనామృతమును చదవ గలరు. "స్థావరమునకు కడ" గలదని శ్రీ బసవన్న వారు తెలియజేసిరి. అయితే శివాలయమునకు గాని, శివభక్తులకు గాని భద్రత లోపించిన యెడల వీరశైవుడు ప్రాణత్యాగమునకు సిద్ధపడి రక్షణ బాధ్యతను స్వీకరించవలెననెడి గణాచార నియమమొకటి గలదు. శైవులు మున్ముందున వీరశైవులుగా జన్మించి ముక్తిని పొందుదురని యాగమముల వలన తెలియుచున్నది అందుచేత ధర్మ పరిరక్షణ విషయములో వీరశైవులు శైవులతో కలిసి పరిశ్రమించ వలెననియును, నట్టి కృషిలో ప్రాణములు వీడనను నతినికిముక్తి లభించునని తెలిసికొనవలెను. శివనిందకులకు దూరముగా నుండవలె ననెడిదియును గణాచారనియమమే చివరకు, స్తుతి విషయమున వీరశైవులు శివునిని, శివభక్తుని మాత్రమే లక్ష్యముగా నుంచికొని శివకవి కావలెను.

**–శివం భూయాత్–**

## ఆశీర్వచనము-6

శ్రీ రేణుక భగవత్పాదులవారు, ఇంతవరకు భక్తులు నాచరించవలసిన సత్క్రియల గురించి తెలుపుచున్నప్పుడు, ధర్మశాస్త్రములో విహితమని చెప్పబడిన పంచసూతకముల గురించి తమ ఉపదేశమెట్టిదో తెలియజేయుచున్నారు. కనుడి

**శ్లో॥ నతస్య సూతకం కించిత్ప్రాణలింగాంగ సంగినః।**
**జన్మనోత్థం మృతోత్థం చ విద్యతే పరమార్థతః॥**
**లింగార్చన రతాయాశ్చ ఋతౌ నార్యా న సూతకమ్।**
**తథా ప్రసూతి కాయాశ్చ సూతకం నైవ విద్యతే॥**
**గృహే యస్మిన్ ప్రసూతా స్త్రీ సూతకం నా త్ర విద్యతే॥**
**శివపాదాంబు సం స్పర్శాత్ సర్వపాపం ప్రణశ్యతి॥** (సి.శి.9 : 44–46)

ప్రాణలింగసంగి యైన వానికి జనన సూతకము, మరణ సూతకము, జాతి సూతకము, ఉచ్ఛిష్ట సూతకము మరియు రజస్సూతకములు నుండవు. ఇదే విధముగా లింగార్చకుడైయుండిన వారికి మరే విధములైన దోషములంటవు. ఇట్టి సందర్భము లేర్పడినన యప్పుడు గురువు గారిని రప్పించికొని, పాదపూజను చేసి, ధూళి పోదోదకమును శిరమునను, క్రియాపాదోదకమును జిహ్వా యందున ధరించి కొనవలెను. పాదోదకమనెడి రక్షాకవచమును ధరించిన వానికి సూతక పాతకాదులెట్టుల తాకును? సకల దోషములు భస్మమగుట తథ్యమని తెలిసికొన వలెను.

ధర్మ శాస్త్రములో పంచసూతకములను పాటించ వలెనని చెప్పబడినవి. జనన, మరణ, రజ, జాతి మరియు నుచ్ఛిష్ట సూతకములు పంచసూతకములని గుర్తింపబడినవి. సూతకమనగా, అశౌచములేదా అపవిత్రత. ఇంటిలో ప్రసవమైన యెడల జనన సూతకం: ఎవ్వరైనను నిధనులైన యెడల, మరణ సూతకం, ఆడపిల్ల యుక్త వయస్కురాలైన యెడల రజస్యూతకము, ఇతరులు విడిచిన అన్నమును సేవించినయెడల యుచ్ఛిష్ట సూతకము నిమ్నజాతి జనుల స్పర్శ కల్గిన యెడల జాతి సూతకము సంక్రమించునని శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిరి. వీటిలో జనన సూతకమునకు పది దినముల అరౌచము, మరణ సూతకమునకు 12 దినముల అశౌచము, రజస్సూతకమునకు 3 దినముల అశౌచము చెప్పబడినది. అశౌచము కాల విధిని నిర్ణయించునపుడు, వ్యక్తులయొక్క పరస్పర సంబంధములమీదను, అశౌచపుదినముల యొక్క పరిమితులయందు వ్యత్యాసములు కాననగును. ఈ విషయమున విస్తృతమైన సంగ్రహణ కావలయుననిన, ధర్మశాస్త్రములనందు పేర్కొనబడిన అశౌచ నిర్ణయమును తెలుసుకొనగలరు.

వీరశైవ సిద్ధాంతమునందు, శివ దీక్షా సంస్కారము, ఇష్టలింగధారణ మరియు వాటి పూజలకు పురుషుల వలనే స్త్రీలు కూడ సమానమైన అర్హతలను కల్గియున్నారు. ఇష్టలింగపూజ అనునిత్యము చేయవలసిన సత్క్రియయైయున్నది. దానిని లింగబేధము లేకుండా ప్రతి ఒక్కొరు జీవన పర్యంతము తప్పని సరిగా పాటించవలెను. ఈ విధమైన లింగపూజా విధానము ప్రారంభించిన పిదప ఆడపిల్లకు రజస్సూతకాదులు ప్రాప్తము కాగా, వారికీ కాలావధియంధు అశౌచము ప్రాప్తమగునని భావింప బడుచున్నది. ఈ

అశౌచసమయమందున పూజాదులను నిర్వర్తించగూడదును నియమముండుట చేత వీరశైవ స్త్రీలు యిష్టలింగార్చనాదులను ఆ కాలములో చేయుట ఎలా సాధ్యమగుననెడి ప్రశ్న యుదయించును. లోకాచారము ప్రకారం ఆచరించిన యెడల అశౌచదోషము, యిష్టలింగపూజను విస్మరించడమువలన దీక్షానియమభంగం ప్రాప్తించును. ఈ ఉభయ సంకట ప్రాప్తి స్థితిలో ఆచార్యులవారుపదేశముగమనార్హమై యున్నది. ప్రాణలింగధారులైన వీరశైవులు, లింగధారణ, మరియు లింగపూజలకు ఏ అశౌచ నిషేదములేదని తెల్పుటకై, వీరశైవులకు యీ సూతకములంటవని ప్రతిపాదించిరి.

అశౌచమును పరిపాలించెడి వైదిక బ్రాహ్మణుల యందును, కొన్ని సందర్భములలో అశౌచమును నిషేదించి, పూజాదులను నిర్వహించెడి విషయమున వారికి అనుమతలొ సంగుచున్న శాస్త్ర ప్రమాణములు కలవు. శ్రీపతి పండితులవారు చెప్పిన యీ క్రింది విషయము గమనించదగినది.

**శ్లో॥ స్వేష్ట లింగైకపూజాయాం నైవాశౌచం విధీయతే।**
**పౌండరీక రజస్త్రీణాం స్వాగ్నిహోత్రే యదాః తథా॥**
**అకరస్పర్శ యోగ్యా పి యధా జిహ్వా మహేశ్వరీ।**
**మంత్రోచ్చారణ మాత్రన్యపూతా భవతె భూతతే॥**
**తథాః సూతకీ నశ్చేవా పూజామాత్ర సునిర్మలాః।**
**నాన్యస్పర్శానుకూలాసూంరితే వేదాను శాసనం॥** (బ.సూ.శ్రీకార 1-1-1)

ఈ రీతిగా సిద్ధాంతాగమము యొక్క ప్రమాణమునుదహరింఛి సూతక నిషేదమును సమర్థించినారు. వైదిక కర్మల యందు కొందరు అహితాగ్నయుతులై అగ్ని హోత్రకర్మను ప్రతిదినము చేయుచున్నారు. ఇంతేకాకుండ దీర్ఘ కాలము వరకు నడచెడి పౌండరీకయాగములు చేసెడి ఆచారముండును. గృహస్తులైనవారు యింతటి ధార్మిక అనుష్టానములను చేయునప్పుడు సపత్నీకులై చేయవలయుననెడి నియమముకలదు. ఈ విధంగా ప్రతి దినపు అగ్ని హోత్రమును చేయునప్పుడు లేదా దీర్ఘకాలిక పౌండురీకయాగముచేయునపుడు యజమానుని ధర్మపత్ని రజస్వలయైన యెడల ఆమె సచేలస్నానముచేసి తడి వస్త్రములతో వచ్చి కూర్చొని కర్మలయందు పాల్గొనవలెనని కర్మశాస్త్రము సమ్మతినిచ్చినది. నిత్యానుష్టానము యెక్కలోపంకాకుండ యుండవలెనని ధర్మ శాస్త్రమే విదిస్తున్నది ఇదే ప్రకారముగా వీరశైవులకు యిష్టలింగపూజ నిత్య కర్మమైయుండుట చేత శివ దీక్షా సంపన్నురాలైన ఆడపిల్ల, రజస్నూతకం ప్రాప్తమైనను స్నానము చేత శుచిరూతురాలై, గురు జంగముల పాదోదకమును ప్రోక్షించుకొని, యిష్టలింగపూజను చేసిన యెడల దోషమేమియునుండదు. ఇష్ట లింగపూజకు మాత్రమే మీ అశౌచమును నిషేదించ బడుటచే, అంతవరకు మాత్రమే ఆమెకు అనుమతి నిచ్చి, వేరే విషయములలో అనుమతినివ్వకయుండుటలో ఔచిత్యముండదు. అనగా అన్యవ్యక్తుల యొక్క స్పర్శ, లేదా పాకాదివ్యవహారములను చేయకూడదనెడినియమములను పాటించవలసిన పని లేదు. ఈ మాటనే సిద్ధాంతాగమము యొక్క వచనమునందున పేర్కొనబడినది. నోటిలోని నాలుకయు, కరస్పర్షకు అయోగ్యమై యుండినను, మంత్రోచ్చారణ చేత సదాపవిత్రమై యుండినటులే రజస్వలయైన స్త్రీ, యిష్టలింగపూజకు పవిత్రురాలుగానే యుండును. ప్రసూతి సందర్బంలో కూడా యిదే భావమును అన్వయించుకొనవలె.

"నహింస్యాత్ సర్వాభూతాని", "న మాంసమక్షీయాత్", "నోశ్చిష్టం కస్యచిత్ దద్యాత్", మొదలగుశాస్త్రీయ ఆదేశములయందు, సామాన్యముగా ప్రాణి హింస, మాంసభక్షణ, మరుయు ఉచ్చిష్టసేవన నిషయమున నిషేదము చేసినను "అగ్నిష్టోమియం పుశు మాలభేత, సోమేనోశ్చిష్టం" యిత్యాది విశేష శాస్త్ర భోధకములగు ప్రమాణములకు అనుసారముగా యజ్ఞమునందున పశుబలి, మాంసభక్షణ మరియు ఉచ్చిష్ట భక్షణ ప్రతి పాదించవబడినవి అందుచేత పైన వివరించిన సామాన్యనియమము విశేషనియమము చేత బాధితమై వీగిపోవుచున్నది. తత్ఫలితంగా విశేషనియమము ప్రకారము చేయబడిన ఆచరణలకు సామాన్య విషయములు చేసెడి నియమములు వర్తించవు. ఇతర సామాన్య స్త్రీలకు రజస్నూతకం ప్రసూతి సూతకం, ప్రాప్తించినను, లింగధారణ కల్గిన వీరశైవ స్త్రీలకు, యీ అశౌచములుండవు. విశేషశాస్త్ర నియమమువలన యీ మినహాయింపువీరికి వర్తించును.

సామాన్యముగా, వర్షఋతువు నందున నదుల యందుక్రొత్త నీరువచ్చినపుడు, ఆనీరు ఎంతో మలినమైయుండును. అందుచేత యప్పుడు నదికి రజస్నూతకముప్రాప్తమగుననియును, తెల్పుచూ ధర్మ శాస్త్రమునందున, అట్టి నదులలో, ఆ సమయమునందున స్నానముచేయకూడదను నియమము కలదు. ఇది ధర్మ శాస్త్రముచే విధించబడిన సామాన్య నియమము. ఈ నియమము గంగానదికి

వర్తించదని చెప్పబడినది. ఈ మినహాయింపు శాస్త్ర సమ్మతమైనదే. గంగానదికి సర్వకాలసర్వావస్తల యందు వర్షాకాలముతో సంబంధములేకుండ, నిండుగా నీరుండునని, అందు చేత పవిత్రత దానికుండునని విశేషనియమము చెప్పుచున్నది. దీనిని మరోపద్ధతిలో వివరించవలెననిన, వానకాలపు క్రొత్త నీటి వలన దీనికి రజస్సూతకము కలుగదు.

గంగానది యొక్క పవిత్రతకు మరో సంబంధము కలదు. శివుని జడనుంఢి బయల్వెడలి వచ్చెడి గంగానదికి పవిత్రత సహజముగా నుండును వర్షాకాలపు క్రొత్తనీరు నీరు దీని పవిత్రతకు భంగం కల్గించజాలదు. గంగానదిలోనినీటి స్పర్శచే మలినమైన నీరు కూడా పవిత్రమగును. అదేవిదముగా దీక్షసంస్కారము వలన కల్గిన యిష్ట లింగధారణాదులు నిరంతరము వీరశైవ స్త్రీల దేహమునందుటచే వారి వలన రజస్సూతకాదులు కలుగనేరవని తెలిసికొనవలెను. వారు స్పర్శించుటచే దోషభూయిష్టులైన అన్యులు పవిత్రులగుదురేకాని, తద్విరుద్ధముగా జరుగునే? శ్రీ నందీశ్వర శివాచార్యులవారు తమ లింగధారణ చంద్రిక యనెడి గ్రంథమునందు, ఈ సూతకముల గురించి తెలియచేస్తూ, శివదీక్షా సంపన్నులైన వీరశైవస్త్రీలు, సదాపరిశుద్ధులైయుందుట. ఆమెకు ఎట్టి అశౌచనిర్భందములు వర్తించవు. అనగా ఇష్టలింగపూజతో బాటుగా యింటిలోని యన్ని పనులను, పాకాదివ్యవహారములను, యధేచ్ఛగా చేసికొనవచ్చును. ఈ విషయమున సందేహమువహించవలసిన అవసరము లేదని తెలియజెప్పిరి. వీరు తమవాదనను సమర్థించుకొనుటకై యీక్రింది ప్రమాణములను ఉల్లేఖించిరి.

**శ్లో॥ లింగార్చన వ్రతానారసూతకీతురజస్వలా।**
**రవిరగ్నిర్యాధా వాయుఃహు కోటికోటి గుణశ్శుచిః॥** (వీరాగమము-)ల

**యధాహ్యగ్ని సమావేశన్నామో భవతి కేవలం ।**
**తధైవమమసాన్నిధ్యాన తే ప్రకృతి మానుషా ః॥** (పద్మపురాణం)

**తైలయుక్తంతు కార్యా సంజ్యోతిస్పర్షాత్ తధ్యవతత్ ।**
**స్నేహయుక్తస్య సద్భక్తిర్లింగ స్పర్షన లింగతౌ ॥** (శివరహస్య)

**శైవం లింగార్చనం యస్య యస్య చౌగ్ని పరిగ్రహః ।**
**వాన ప్రస్థతే నాంచశరీరే నాస్తి సూతకమ్ ॥** (పరాశరస్మృతి)

ఈ విధముగా వీరాగమము, పద్మపురాణం, శివరహస్య ఖండము, మరియు పారాశరస్మృతుల ప్రమాణ సహిత వచనములను ఉదహరిస్తూ శ్రీ పతి పండితులవారు సూతకమును నిషేధిస్తూ యదార్ధ వాదమును సమర్థించిరి. ఈ ప్రమాణములలోని భావమే మనగా సూర్యుడు. అగ్ని మరియు వాయువులు సర్వత్రా విశుద్ధములై యుండునటులే లింగదారియై లింగార్చనను చేయుచుండెడి నారియు సూతకవర్జితయై యుండును. ఆమె సాధారణ స్త్రీల కంటెను లేదా ఈ సూర్య అగ్ని, మరియు వాయువులకంటె కోటిరెట్లు అధికముగా శుచిర్భూతురాలై యుండును. అగ్ని యొక్క సంపర్కమును పొందిన ఇనుము కేవలము ఇనుముగా యుండకుండా అగ్ని సమతేజమగు ఇనుములా ఉండునటులనే లింగాధారియైన ఆడపిల్ల మిగిలిన ఆడపిల్లలవలే కేవలము ఆడపిల్లగా యుండక లింగధారియై బాలశివశరణిలా కన్పట్టుచున్నది. అగ్ని యొక్క సంపర్కముచేత ఇనుము అగ్ని స్వరూపమును దాల్చిన యటులనే దాని స్వభావము కూడా అగ్నివలనే ఇతర వస్తువులను కాల్చెడి శక్తి, సామర్ధమునుకల్గినదై యుండును. అదేవిధిన వీరశైవ స్త్రీ లింగధారణ పొందిన కారణమున లింగ స్వరూపమును దాల్చి సూతక పాతకములు కూడ దరిచేరని ఉత్తమ స్థితిని పొందును. అగ్ని సంపర్కము పొందుటచే ఇనుము శుద్ధమైనటుల లింగసంబందియైన వీరశైవ స్త్రీ తనకు సంక్రమించెడి సూతకపాతకములను భస్మీపటలము చేయును. ఏ విధముగ నూనేయొక్క సంపర్కమును పొందిన వత్తి జ్యోతియొక్క సంపర్కము కాగానే లింగము యొక్క సంపర్కముకాగానే వీరశైవుడు లింగస్వరూపుడగుచున్నాడు. లింగ స్వరూపియై తిరుగాడెడి వానిని సూతకపాతకములంట నేర్చునే? అటులనే అనుదినము ఇష్టలింగమును పూజించెడివారు ప్రతి దినము అగ్ని హోత్రమును చేసి అగ్ని ముఖార్చన చేయువానికంటేను లేదా వానప్రస్థ, సన్యాసాశ్రమమును స్వీకరించిన వారికంటెను అధికుడని చెప్పబడుచున్నవి. శివాగమములయందు ఈ విషయము విస్తృతంగా చర్చించనైనది. ధర్మశాస్త్రము ప్రకారము నిత్యాగ్నిహొత్రునికి మరియు గృహస్థా శ్రమమును వీడి, వానప్రస్థా మరియు సన్యా శాస్రమును స్వీకరించెడి వారికిని సూతకములు ఉండవని నిరూపించబడినవి. కాన లింగధారియై లింగార్చన చేసెడి వీరశైవునికి సూతకములుండవని గ్రహించవలయును.

బహు విధమైన ప్రమాణములను నేపథ్యముగా గొని శ్రీనందికేశ్వరశివాచార్యులవారు వీరశైవస్త్రీలకు రజః సూతకములుడంవని సమర్థించిరి. వీరశైవులు వారి స్త్రీలు సూతకాదులను పాటించవలసిన అవసరములేదు. ఇదే ప్రకారముగా వీరశైవులకు మరణ సూతకము ఉండదు. ఇంటిలో ఎవరైనను లింగైక్యులయినయెడల, లింగైక్యుడైన వ్యక్తికి స్నానాదులనుచేయించి అతని పార్థిన దేహమును భస్మరుద్రాక్షలతో యలంకరించి, అతనికంఠమునందుండెడి లింగమును పూజించి మళ్ళీ అతనికంఠమునకే గట్టుదురు. అతనికి కొన్ని ప్రాంతములలో గురుజంగమపాదోదక ప్రసాదములు కటాక్షించేడు సాంప్రదాయము గలదు. ఇంతేకాదు. అంత్యక్రియలు చెసిన వారి ఇంటిని శుభ్రముచేసి. అలికి, ఇంటిగురువు గారిని పిలపించుకొని, వారికి లింగపూజ సమార సంరంభములను సమకూర్చి, ఇంటిలోని ప్రతి యొక్కరూ విశేష శివపూజలో పాల్గొని తదుపరి గురువు పాదపూజను చేసి వారి పాదోదక ప్రసాదములను సేవించి పునీతులు కావల యుననెడి నియమములుగలవు. భక్త్యాతిశయముగల్గిన వారు ఇట్టి కార్యక్రమమును తక్షణమే చేసి, ధన్యత పొందుచున్నారు. ఇతరులు వారివారి సాధకబాధకములను దృష్టియందుంచుకొని ఏదో ఒక రోజు నెంపిక చేసుకొని దీనిని సంపూర్ణము చేయుచున్నారు. భక్తులు అధిక సంఖ్యలో నున్న ప్రాంతములలో ఇట్టి కార్యక్రమము అయిదు రోజులలోపుననే ముగియుచున్నది. ఇతర ప్రాంతములలో దశదినముల కాల పరిమితిలో గురుపూజ సంపన్నమగుచున్నది. ఇది ఇంటి వారియొక్క సౌకర్యార్థమే గాని శాస్త్రవిషిదిమైనది గాదు. ఒక వ్యక్తి లింగైక్యుడైనదినముననే ఈ కార్యక్రమమును చేపట్టుట శ్రేయస్కరమగును. ఇది ఇటులుండగా వీరశైవులకు మరణ సూతకము యుండుననెడిది సరియైనది కాదు. ఇతరులవలె పన్నెండుదినముల పరిమితి వరకు సూతకమును పాటించెడి అచారమును వీరశైవులు విస్మృతికి గురిచేయవలెను.అది పాటించెడి వారు కర్మ జీవులుగనుక వారికది విహితమైయుండవచ్చును. లింగజీవియైన వీరశైవుడు కర్మజీవి వలె వ్యవహరించుట వలన అరూఢ పతనము అనెడి దోషము సంభవించును. వీరశైవులెల్లరు ఈ ధర్మ సూక్ష్మమునెరిగి వీరశైవులకు మరణ సూతకములేదని తెలుసుకొనగలరు. తెలుసుకున్న ధర్మసూత్రమును ఆచరణలోపెట్ట వలెను. ఇతరులకు భయపడి లోకనిందగల్గునను సంకోచముతోనో, లోకాచారమును పట్టించెడి వారై వీరశైవ శాస్త్రోల్లంఘున చేసిన వారగుదురు. శాస్త్రోల్లంఘున చేయువారికి సద్గతి యబ్బునా? ఇదే తెరగున వీరశైవ సిద్ధాంతమునందున పాదోదక ప్రసాదసేవన యందు ఉచ్ఛిష్టసూతకనిషేధము విధించనైనది. ఒకేపాత్ర యందు పేయలేదా భోద్య పదార్థమును ఎవరో ఒకరు తీసుకొని సేవించి అట్టి సేవన పిదప మిగిలి యుండెడి పదార్థములను ఉచ్ఛిష్టమని అందుకు సర్వసామాన్యముగా అన్యుల భక్ష్యావశేషమైన ఉచ్ఛిష్టమును ఇతరులు సేవించకూడదని సామాన్యమైన నియమము ఒకటి గలదు, అయితే వీరశైవ పూజావిధానమునందు గురువు గారి పాదపూజాసమారంభమున అనేకులు సహభాగులై గురువు గారి పాదపూజానంతము ఒక పాత్రయందు సంగ్రహితమైనపాదోదకము మొదటగురువు గారు సేవించిన పిదప అక్కడ యుండెడి అన్య భక్తాదులు క్రమముగా ఒకరి తర్వాత మరొకరు ఒకే పాత్రలో యుండెడిపాదకమును సేవించుట ఉచ్ఛిష్ట స్వీకారమమగుననని కొందరు భావించవచ్చును. దీనిని స్వీకరించ వలదని భావించవచ్చును గూడా? ఇట్టివారికి ఇట్టి ప్రశ్నలుకల్గుటకు గల కారణము సాంగత్య శుద్ధి లేకపోవటమే? వీరికి పరధర్మములయొక్క ఆచారములు ఈ ప్రశ్నలను కల్గించుచున్నవి. ఈ కారణము వలననే శ్రీభగవత్పాదుల వారు సందేహనివృత్తిని చేయుటకై వీరశైవులకు ఉచ్ఛిష్ట దోషముండదని నిర్ద్వంధముగా తెలియజేసిరి.

వైదిక సాంప్రదాయముల యందు అగ్నిసోమయాగమును జేసి యజ్ఞము యొక్క వరసన ఒకపాత్రయంధున అవసిష్టముగానుండెడి సోమరసమును అయజ్ఞములో పాల్గొనిన బుత్విక్కు లందరు ఒకరి తర్వాత యొకరు వారివారి అర్హతానుసారముగ స్వీకరించవలెనను నియమముగలదు. ఇది ఉచ్ఛిష్ట దోషమునకతీతమైనదని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. అట్టి యెడల వారికి సంక్రమించని ఉచ్ఛిష్ట సూతకము వీరశైవులకెట్లు సంక్రమించును ? శ్రీ గురుపాదోదకము సోమరసము కంటెను శ్రేష్టతను కల్గినదని ప్రత్యేకముగా చెప్పనక్కరలేదు. సర్వజ్ఞుని ప్రకారము గురువును నరుడనెడి వానికిని లింగమును శిలయమవానికిని కరుణ ప్రసాదమును ఎంగిలికి అనెడి వానికిని నరకము తప్పదు. సర్వజ్ఞుడి ప్రకారము వీరశైవులకు ఉచ్ఛిష్ట సూతకము యుండదు. అందు చేత వీరశైవులెల్లరూ గురు, జంగముల తీర్థ ప్రసాదములను సందేహ రహిత చిత్తము గల వారై ప్రేమానురాగములతో గైకొని సకల విధములైన మాలిన్యములను దూరము చేసుకొనవలెను.

ఈ పంచ సూతకములలో మిగిలినది జాతి సూతకము కూడా చర్చనీయాంశమై యున్నది. ఏదో హీనజాతి యందు జనించిననతడొక వేళ వీరశైవాచార్యుల యొక్క అనుగ్రహమును బడిసి శివదీక్షాంసంస్కారమును పొందిన ఎడల అతను తన మొదటి జాతి రాహిత్యమును పొంది శివభక్తుడగుటచేత పరంపరానుగతముగా భేదభావమును చూపవలదని శ్రీభగవత్పాదులవారు ఆదేశించిరి. అనేక జాతుకు చెందిన కట్టెలనుఅగ్నిలో వేయుటకు ముందు ఆయా జాతుల కట్టెలను గుర్తించ వచ్చును. అవి

అగ్నియందు దగ్ధమైన పిదప వాటి జాతిని గుర్తించుట సుసాధ్యమైన విషయముగాదు. అ కట్టెలు తమనుతాము దహించుకొని తమజాతిని కూడ దహింపజేయుకున్నది. అదేవిధిన వివిధ జాతులకు చెందినవారు శివదీక్షను వడసి తమనుతాము దహించుకొని పాపమునుండి దూరమై దగ్గసువర్ణము వలె దేదీప్యమానమైన ప్రకాశముతో విరాజిల్లుచుందురు ఇక్కడ "దగ్ధ" మను పదము భౌతిక పరమైనది కాదు. దగ్ధమనగా సంస్కారమని గ్రహింప వలెను. అతను తన దోషములను ఏ విధముగా దగ్ధము చేసుకొనునో అదే విధిన పూర్వాశ్రమమునకు చెందిన జాతిని కూడ దగ్ధము చేసి కొనుచున్నాడు. ఇట్టి ఆధ్యాత్మిక సంస్కారము పొందిన పిదప అట్టి వానికి జాతి సూతకముండనే ఉండదు అనునదే శ్రీ భగవత్పాదులవారి ఉపదేశము. ఈ విధముగా ధర్మశాస్త్రములలో విధించబడినప్పటికిని వీరశైవులకు పంచసూతకముల నిషేధము వర్తించదని గుర్తించిన వీరశైవాచార్యులు పంచసూతకముల నిషేధము విధించిరి. మహాదాచార్యుల యొక్క వాక్కును పరిపాలించుట ప్రతియొక్క వీరశైవుని కర్తవ్యము వీరశైవేతరులకు పంచసూతకములను పాటింపని ఎడల దోషము సంక్రమించును. వీరశైవులకు మాత్రము పంచసూతకము పాటిస్తే దోషము. ఈ ధర్మసూక్ష్మమును ఎరిగిన వారై బసవాది శివశరణులు పంచసూతకములను నిషేధించిరి. వీరశైవులలో ధర్మరహస్యములను తెలుసుకొని శ్రీభగవత్పాదులు సూచించిన విధముగ పంచ సూతకములను పాటించకుండ అనునిత్యము ఇష్ట లింగపూజను ఆచరించుచు నైమిత్తికముగా గురుజంగముల పాదపూజలనుజేసి పాదోదక ప్రసాదములను బడసి సర్వకాల సర్వావస్థల యందును, శుద్ధులయి విరాజిల్లు చుండగలరు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**దిll 24-9-1990**

**స్థలం: దొడ్డవోటి బసవేశ్వర దేవస్థానం. రాణి చెన్నూరు.**

## విశేష ప్రదీపిక :

పంచ సూతకములను పాటించ వలదని చెప్పుచు శ్రీ కాశీజగద్గురువుల వారు నెన్నియో కీలకమైన సందేహములకు నుత్తరము నొసంగిరి.

సాంగత్య దోషమెంత ప్రబలమైనదో యనెడిది తెలుపుటకై సూతకమే యుదాహరణగా నిలుచును. ప్రాకృతాచారమునుసరించి అందరూ సూతకములను పాటించుచున్నారు. ఇది వీరశైవాచారమునకు విరుద్ధమైనదని తెలిపెటి యీ యాశీర్వచనము జ్ఞానదాకమును సూతకము పాటించవలదని వీరశైవ విదులు చెప్పుచుండగ నద్దానిని పెడచెవివి పెట్టి సాంగత్య ప్రభావమునకులోనై జాత్యాది సూతకములను పాటించెడి వారిని శ్రీ బసవేశ్వరుల వారు నీ క్రింది విధముగా మందలించిరి:

**ఆచారవ నరియిరి, విచారవ నరియిరి**
**జంగమస్థల లింగ కాణిరయ్యా!**
**జాతిభేదలిల్ల, సూతకలిల్ల, అజాతంగెకులలిల్ల!**
**నుడిదంతె నడెయ దిద్దదె**
**కూడల సంగయ్యా, మెచ్చ కాణిరయ్యా!** (బసవేశ్వర వచనము, 417)

ఇద్దాని తెలుగు రూపమిది:

**ఆచారము నరయుడి, విచారము నరయుడి**
**జంగమ స్థలము లింగస్థలము, కనుడయ్యా!**
**జాతి భేదము లేదు, సూతకము లేదు, అజాతునికి కులము లేదు**
**నుడివినట్లు నడువ కుండిన,**
**కూడల సంగయ్య మెచ్చడు కనుడయ్యా!** (బసవేశ్వర వచనము, 304)

బసవన్న వారి వచనములోని ఆచారము మరియు విచారము లనెడివి గమనార్హములైనవి. విచారమనగా తత్త్వము, ఆచారమనగా పంచాచారముల ప్రకారము నడచెడివర్తన. వీరశైవ తత్త్వము ప్రకారము లింగధారణ వలన జీవుడు క్రమక్రమముగా శివుడగును. దీక్షా సంస్కారమువలన నిర్మలుడైన జీవుడు మలరాహిత్యము గల శివుని వంటి వాడే. ఈ విషయమును తెలియపరచెడి యీ ప్రమాణమును గనుడి:

శ్లో॥ ఇంధనం వహ్ని సంయుక్తే వృక్షనామనవిద్యతే।
శివ సంస్కారసంపన్నం వర్జయేత్ పంచసూతకాన్॥

అగ్ని సంపర్కము చేత కాష్టము నగ్నియైన యటుల లింగస్పర్షచేత అంగము లింగమై నిర్మలమగును. అగ్నికి మాలిన్యమంటనటులే శివలింగధారికి సూతకము లంటవు. అందుచేత, వీరశైవుడు పంచసూతకముల విసర్జింప వలెను. వాస్తవముగా సూతకము గలదనుటయే పాతకమని బసవడు తెలియజెప్పెను.

పంచాచారములు వీరశైవ ధర్మమునకు ప్రాణము వంటివని తెలుపబడినది. ఈ యాచారములలో నరువది నాల్గు శీలములు తెలుపబడినవి. వీటిలోని దొకటగు నీ క్రింది శీలమును గనుడి:

శ్లో॥ పంచసూతక రాహిత్యం మత్యానిశ్చిత్యమానసే।
యో వీరో తద్వినిర్ముక్త స్తచ్ఛలంతు చతుర్దశ॥

బసవన్న వారి 'నుడిదంతె నడెయిరి" యనే ప్రబోధము కూడ గమనించదగినదై యున్నది. ఈ నుడువులు "శివ వాక్కులని గ్రహించ వలెను. శివాగమములలో నున్నవే శివవాక్కులని తెలిసికొనగలరు. శివాగమములు వీరశైవులు నూతకముల పాటించవలదని తెలిపినవి. వీరాగమములోని యీ క్రింది యంశములు గమనార్హములు.

శ్లో॥ గృహేయస్మిన్ ప్రసూతాస్త్రీ సూతకంనా త్ర విద్యతే
లింగార్చన రతాయాశ్చ ఋతౌ నార్యాన సూతకమ్॥
తథా ప్రసూతి కాయాశ్చ సూతకం నైవ విద్యతే॥

స్త్రీ సంబంధిత ప్రసూతి, రజస్వలా సూతకములు వీరశైవులకు లేవని తెలుపబడినది. ఇదే విధముగా జాతి, మరణ, ఉచ్ఛిష్ట సూతకములు లేవనియును తెలుపబడినది.

నేటి వీరశైవులలో మరణ సూతకము నెడవిపరీతమైన శ్రద్ధయలవడినది. బ్రాహ్మణ పద్ధతులు చూసి వీరి బుద్ధి బ్రాహణీకరణకు లోనైనది. దశదినకర్మ చేయుట, అంతవరకు పూజాదులను నిలిపివేయుట, స్త్రీలు నలంకరణాదులకు దూరమగుట మొదలగు విపరీత ధోణులునవలంబించుచున్నారు. అంతవరకు వీరినెవ్వరూ ముట్టకూడదనెడిది కూడ పాటింపబడుచున్నది. పూజాగదిలోనికి పోకుండగా నుందురు. ఇవి యన్నియును వీరశైవ ధర్మమునకు విరుద్ధమైన చర్యలు.

రజస్వలా సూతకమున ప్రాంతీయ భేదము లెన్నియోగలవు. ఇదియును నిర్హేతుకమైనదని గ్రహించవలెను.

మరణము, జననము, రజస్వల వంటివి సంభవించినప్పుడు వెనువెంటనే గురు-జంగములను పిలిపించికొని, గురుపాదపూజను గావించి ధూళి పాదోదకముతో యింటిని, క్రియా పాదోదకము చేత కుటుంబ సభ్యులు పునీతులు కావలెననెడిది యవిస్మరణీయము. గురువర్గమునకు చెందిన వారగు మఠమయ్య గురుస్థానమును స్వీకరించవలెను. ఆ పిదప గురు - జంగములకు యథాశక్తి సంభావనలనిచ్చి తృప్తి పరచవలెను. ఈ విధాన చేసిన పిదప మరే యితర శుద్ధి కార్యక్రమమును చేపట్టెడి యవశ్యకత లేదు. ఇది యిట్టులుండగా కొందరు పుణ్యావాచనము, తీర్థస్నాన శుద్ధి మొదలగునవి చెయుచున్నారు. ఇవి యనావశ్యములు. వీరశైవునకు గురు లింగ-జంగములే సర్వస్వము వీరినర్చించి పాదోదకప్రసాదములు పొందిన చాలును. నిరంతర లింగ, భస్మ, రుద్రాక్ష ధారణలను చేయుచు, పంచాక్షరిని మనస్సున పఠించు చుండెడి శివధర్మీయుని పవిత్రము చేసెడి వస్తువీ ప్రకృతిన లేనే లేదని గ్రహించవలెను. నమ్మకమును పెంచికొని పంచసూతకములను విడువవలెను. "విశ్వాసయుక్తః పూర్ణాత్మా వర్జయేత్ పంచసూతకాన్" అనెడి శివ వాక్యములు పాటించెడి వాడు శుభములను చవిచూడగలరు.

**-శివం భూయాత్-**

# ఉభయస్థలము

## ఆశీర్వచనము-1

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఇంతవరకు భక్తిమార్గోచిత క్రియలగురించి వివరించుచు, పంచసూతకములు పాటించ కూడదనెడి దానివిషయములో నుపదేశమునిచ్చి, తీర్థయాత్ర సేవన యొక్క అనేచిత్యము గురించి ఉపదేశము నిచ్చిన పిదప యీ క్రింది యుపదేశమునిచ్చిరి.

**శ్లో॥ గురోరభ్యర్చన్నేనాపి సాక్షాదభ్యర్చితః శివః ।**
**తయోర్నాస్తి భిదా కించిదేకత్వాత్ తత్త్వరూపతః ।**
**యథాదేవే జగన్నాథే సర్వానుగ్రహకారకే।**
**తథా గురువరే కార్యాదప చారాన్ దినే దినే ॥** (సి.శి: 52-53)

సద్గురువును పూజించిన యెడల సాక్షాత్తుగా శివునే పూజించినట్లుగా అగుచున్నది. శివుడే గురు రూపమున అవతరించినందున వస్తుతః వారిరువురి మధ్యన యెట్టి భేదమూ ఉండదు. అందుచేత అందరినీ అనుగ్రహించుటకు సమర్థుడైనవాడును, జగత్తుకే నొడయుడును అగు శివుని భక్తి పూర్వకముగా సకల పూజోపచారముల చేత యేవిధముగా పూజోపచారములు చేతురో అదేవిధిని శ్రీ గురువుకు ప్రతి దినము పూజోపచారములను సమర్పించ వలెను.

వీరశైవ సిద్ధాంతము నందున యిష్టలింగ మెటుల నారాధ్యమో , అటులనే శ్రీ గురువు కూడ ఆరాధనీయుడే, ఇష్టలింగపూజకే మహత్త్యముగలదో, గురు లింగ పూజకు కూడ నట్టి మహత్త్వము గలదు. సద్గురుడు మన యింటికి వచ్చినప్పుడు లేదా మనమే వారి మఠమునకు పోవునప్పుడును, ఏదో విధముగా గురువు గారి సాన్నిధ్యము దొరికినప్పుడు గురువు గారి పాదములకు యథాశక్తి పూజలను సమర్పించి కొనవలెను. అట్టి సందర్భములలోన యిష్టలింగ పూజకు ప్రాముఖ్యత యుండనేరదు. తత్త్వతః శివ గురువుల కభేదము నుండుట చేత యిష్ట లింగమున కేయే యుపచారముల నుపయోగించి పూజించుచున్నామో అట్టి యుపచారముల చేతనే గురుపాద పూజను చేయవలెను. పంచాష్ట షోడషద్వాత్రింశదు పచారములలో నేదేని యొకదాని చేత గురువు గారిని పూజించ వలెను. గురుపూజ చేత దొరికెడి పాదోదకమును సేవించిన యెడల నా దినమునకు చెందిన యిష్టలింగార్చనా ఫలము మనకు చిక్కిన యట్లగును గురువుగారి సన్నిధిలో నుండిన యప్పుడు, వారిని వీడి దూరమునకేగి నిత్యనైమిత్తికముగా యిష్టలింగ పూజను చేసెడి యవశ్యకత లేదు. వీరశైవులెల్లరు, ధర్మాచరణములోని యీ మర్మము నెరిగి ప్రతి యొక్కరు విహితమైన రీతిన ధర్మాచణను చేపట్ట వలెను.

ఈ ప్రపంచము నందున నందరి కంటెనూ అధికుడెవ్వడు? అనెడి ప్రశ్న మనకు గల్గుచున్నది. ఇట్టి సందేహమే శివ పత్నియగు పార్వతికి వచ్చెను. అప్పుడామె శివునికి యీ ప్రశ్నను వేసెను. అప్పుడు శివపరమాత్మ "న గురోరధికమ్" న 'గురోరధికమ్' " శివశాసనతః', 'శివశాసనతః', 'శివశాసనతః', అని యనుచు, "ఓ పార్వతీ దేవీ! నే చెప్పు విషయమును జాగ్రత్తగా వినుము. శివుని శాసనము వలన లోకములలోన గురువు కంటెను అధికులు మరెవ్వరూ లే"రని యనెను. శివ వాక్కుల ప్రతి బింబమును నుపనిషత్తులలోన గాంచగలము. యోగ శిఖోపని షత్తులోని యీ ప్రమాణమును గనుడి:

**శ్లో॥ నగు రోరధికః కశ్చిత్ త్రిషులోకేషు విద్యతే।**
**దివ్య జ్ఞానోపదేష్టారం దేశికం పరమేశ్వరమ్॥** (యోగనిఖోపనిషత్తు)

శ్రీ గురువు, దివ్య జ్ఞానము నుపదేశించి శివ పరబ్రహ్మ తత్త్వమును బోధించుచున్నాడు (అందుచేత) ముల్లోకములలోను గురుని కంటెనూ అధికులు వేరెవ్వరునూ లేరు.

పై యాగమోపనిషత్ప్రమాణముల దృష్ట్యా వీరశైవులు శివ-గురువులలో భేదము నరయక గురుపూజయే శివ పూజయని భావించికొని, అద్దాని నాచరించి, శ్రీ గురువుగారి కరుణా ప్రసాదములగు పాదోదకప్రసాదములను గ్రహించి ధన్యత బడయ

వలెను. ఉపనిషత్తులలోను, ఈ విధముగనే యుపదేశమును నిచ్చిన యటుల గోచరించుచున్నది. ఈ క్రింది ప్రమాణమును గనుడి:

**శ్లో॥ దివ్యజ్ఞా నోపదేష్టారం దేశికం పరమేశ్వరమ్॥**
**పూజయోత్పరయా భక్త్యా తస్యజ్ఞాన ఫలం భవేత్।**
**యథాగురుస్త థైవేశో యథైవేసస్తథాగురుః॥**
**పూజనీయోమహాభక్త్యాన బేదో విద్యతే తయోః॥** (యోగశిఖోపనిషత్)

శ్రీ గురువు దివ్యజ్ఞానోపదేశమును చేసి పరశివతత్త్వమును బోధించుచున్నాడు. అతనిని అనన్యమైన భక్తి చేత పూజించిన యెడల లింగాగ సామరస్య జ్ఞానమనెడి ఫలము లభించును. గురు వెట్టివాడో శివుడును అట్టివాడే, శివుడెట్టి వాడో గురువుయు నట్టి వాడే యని భావించవలెను. వారిరువురును గొప్ప భక్తి చేత పూజింప దగిన వారు. వారిరువురికిని మధ్యన భేదమును చేయకూడదు.

"గురు స్సాక్షాద్ భర్గోనరాకృతిః" అనెడి ప్రాచీనోక్తి యొకటి ప్రఖ్యాతిన గలదు. కైలాసములోని శివుడే, నరరూపమును దాల్చి గురువై లోకములనుద్ధరించు చున్నాడనెడిది ఈ ఉక్తిలోని బావము. శ్రీ భగవత్పాదులవారి యీ ఉపదేశములోనదే భావము కన్పట్టుచున్నది.

**శ్లో॥ అప్రత్యక్షో మహాదేవః సర్వేషామాత్మమాయయా**
**ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తిసిద్ధయే॥** (సి.శి. 9 : 53)

శివుడు మాయాశక్తి విశిష్టుడు. ఈ కారణమున అతడు అందరికీ కనిపించడు. అతడు భక్తుల నుండి భక్తిని పొందు కొరకు గురు రూపమున గోచరించుచున్నాడు.

శ్రీ భగవత్పాదుల వారి యీ ఉపదేశము ఎంతో విశిష్టమైనది. ఉపరివీక్షణము చేసిన యెడల శివ- గురువుల కభేదమును చెప్పినట్లుగా కనపడును. పర్యాప్తవీక్షణము చేసిన వారికి కించిద్భేదము గోచరించగలదు. శివుడు మాయాశక్తి విశిష్టుడు ఈ శక్తి యెంతో ప్రబలమైనది మనుజుని బుద్ధిమీద తన ప్రభావమును చూపును. అతనిని మాయా మోహితునిగా చేయును. మోహపాశబద్ధుడై జీవి సంసారమునందే తిరుగాడుచుండును. జగతిలో నానావిధములగు దుఃఖములననుభవించుచు జనన-మరణ చక్ర బంధమున చిక్కికొని పుట్టుచు చచ్చుచునుందురు. వీరికి తరుణోపాయము దోచదు. వీరిని చూచి దయామయుడైన శివుడు కరుణాబావము వహించి, పతితులనుద్ధరించుటకై తన మాయా శక్తిని వీడి జ్ఞాన శక్తిని ధరించి గురురూపమును దాల్చి భూలోకమునకు విచ్చేయును. జీవులకు శివతత్త్వము నుపదేశించును. అనాది కాలము నుండి జీవునిలో పేరుకొని పెరుగుచున్న అజ్ఞానమును తోలగించును. అజ్ఞాన సంపన్నుని శివజ్ఞాన సంపన్నునిగా చేయును. గురుకారుణ్యమును పొందిన నరుడు సంసార సాగరము నుండి బయల్వెడలి శివ సాయుజ్యమును పొందును శిష్యుని యొక్క సర్వతోముఖమైన యభివృద్ధికి శ్రీ గురువే కారణభూతుడగు చున్నాడు. ఈ కారణమున గురువే సర్వస్వమనెడి భావన గల వారికి ముక్తి సులభ సాధ్యమని చెప్పెడి వారెందరోగలరు. ఈ క్రింది కృతిని గమనించుడి:

**శ్లో॥ మంత్రమూలం గురువాక్యమ్ । పూజామూలం గురుపాదమ్।**
**ధ్యానమూలం గురోర్మూర్తి ః ముక్తి మూలం గురోః కృపా।**

గురువు యొక్క వాక్యమే మూలమంత్రము, గురుపాదములే పూజనీయములు, గురుమూర్తియే ధ్యాన గమ్యము, గురువు గారి కృపయే ముక్తి. ఇట్టి ఉదాత్తమైన భావమును పెంపొందించికొని ప్రతి యొక్కరు గురువుకు శరణాగతులు కావలెను.

శివుడు మరియు ఇతర దేవతలు వారి వారి అస్త్రశస్త్రముల నుప్రయోగించి దుష్టులను సంహరింతురని తెలుపబడుచున్నది. సంహరింప బడిన దుష్టుడు, పునర్జన్మనెత్తి మరింత హెచ్చుగ దుష్టత్వమును సంతరించి కొనుచున్నాడు. ఇట్టి వాడు ఎన్నిమార్లు సంహరింపబడిననూ వాని దుష్టత్వము వైదొలగిపోదు. కాని దుష్టుడు సద్గురువు దగ్గరకు వచ్చిన యెడల నతడు దుష్టుని సంహరింపడు. వానిలోని దుష్టప్రవృత్తిని సంహరించును. వానిని సన్మార్గము వైపు మళ్ళించును. వానికి జ్ఞానోదయమును గల్గించి మానసిక పరివర్తన గల్గించును. గురువుగారి యుపదేశమువలన మనస్సును మార్చికొనిన దుర్మార్గులెందరో సన్మార్గ పథగాములై అంత్యమున మహాపురుషులై లోకములనుద్ధరించిరి. వీరి చరిత్రలు ప్రసిద్ధిని గాంచినవి. వాల్మీకి ఆ కోవకు చెందిన వాడే కదా! భక్త కన్నప్ప కథనెరుగని శివ భక్తులుందురే?

ఈ కారణము వలన శ్రీ గురు ప్రత్యక్ష పరమేశ్వరుడని యెంచి, యతనిని సేవించి ధన్యతను పొంద వలెను. ఈ విషయమును మరింతగా తేటతెల్లము చేయుటకై శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమునిచ్చిరి.

**శ్లో।। శివ జ్ఞానం మహాఘోర సంసారార్ణవతారకమ్।**
**దీయతే యేన స గురుః కస్య వంద్యో న జ్యాయతే।।**
**యత్కటాక్షకలామాత్రాత్ పరమానందలక్షణమ్।**
**లభ్యతే శివరూపత్వం స గురుః కేన నార్చ్యతః।।**
**హితమేవ చరేన్నిత్యం శరీరేణ ధనేన చ।**
**ఆచార్యస్యోపశాంతస్య శివజ్ఞాన మహా నిధేః।।**
**గురోరాజ్ఞాం న లంఘేత సిద్ధి కామి మహామతిః।।**
**తదాజ్ఞానేనాపి శివాజ్ఞాచ్ఛేదకో భవేత్।।** (సి.శి.9 : 55-58)

మహా భయానకమైన యీ సంసార సాగరమును దాటించెడి శివజ్ఞానము ఎవరి నుపదేశము చేత ప్రాప్తమగునో అంతటి సద్గురువు ఎవ్వరికి పూజ్యుడు కాడు? అందరికీ పూజనీయుడే. కేవలము తనకటాక్ష వీక్షణము చేతనే పరమానంద రూపమైన శివస్వరూపమును తెలియజెప్పెడి సద్గురువు సకల ముముక్షువులకూ పూజనీయుడగుచున్నాడు. శివ జ్ఞానము యొక్క మహా నిక్షేపము రాగ ద్వేషాది రహితుడగు సద్గురువుకు శిష్యుడైన వాడు తన దేహము మరియు ధనము చేత ఎల్లప్పుడూ హితమునే గలుగజేయవలెను. మోక్షమనెడి సిద్ధిని బడసెడి వివేక సంపన్నుడైన వ్యక్తి సద్గురువు యొక్క ఆజ్ఞలను ఎప్పటికినీ మీరి నడువ వలదు.

జనన-మరణములు, ఆకలి-దప్పులు, మరియు శోకమోహములనెడి షడూర్మల చేత సంసారమనెడి సాగరము ఎంతో భయానకముగా కన్పట్టుచున్నది. ఇచ్చట జన్మను దాల్చిన ప్రతి యొక్క వ్యక్తి యీ ఉర్మల దెబ్బలకు తల్లడిల్లి పోవుచూ వాటి దెబ్బల నుండి తప్పించికొనవలయు శివ జ్ఞానము నావశ్యముగా గడించవలెను. ఇట్టి జ్ఞానము సద్గురువు యొక్క ఉపదేశము వలననే సిద్ధించును. దీనిని బడయవలెనినచో శిష్యుడు వినమ్రభావముతో గురువును శరణు జొచ్చవలెను. గురువు సన్నిధికి వెడలిన వాడు సమర్పించే మొదటిది ప్రణిపాతము. మన సంస్కృతి యందున యీ ప్రణిపాతమున కెంతో ప్రాముఖ్యత యివ్వనైనది అభివాదనము చేసేవారికి యీ క్రింది ప్రమాణము మార్గదర్శకమగుచున్నది అద్దాని ప్రాముఖ్యత నెరుంగుటకు దోహదకారి యగును.

**శ్లో।। అభివాదన శీలస్య నిత్యం వృద్ధోపసేవినః।**
**చత్వారి తస్యవర్ధంతే ఆయుర్విద్యా యశోబలమ్।।**

గురువులకు పెద్దలకు కేవలము శ్రద్ధతో నమస్కారమును చేయుట చేతనే ఆయుష్యము, యశస్సు, విద్యా మరియు కీర్తియును లభ్యమగు చున్నవి. వందనమున కిట్టి మహత్వము ఉండుట చేత శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు గురువు సన్నిదానమునకు చేరగనే నమస్కారమును చేయవలెనని యుపదేశము నిచ్చిరి.

వందన చేసి యూరకే యుండుట యుక్తము కానేరదు. వందనములు సమర్పించిన పిదప, అనునిత్యము శిష్యుడు తనయిష్ట లింగమును ఏ విధన అర్చించునో, అదే విధిన భక్తి ప్రపత్తులతో గురువు గారికి పాదములకు నర్చనల నివ్వవలెను తదుపరి తను, మనోధనములను సమర్పించి కొనవలెను.

ఎన్నటికినీ గురువు యెడల నహిత భావనను వహించికొనవలదు ఎల్లప్పుడు గురువుకు హితమునే చేయవలెను.

గురువాక్యపరిపాలన యనెడిది శిష్యుని మౌలిక కర్తవ్యము యెంచ వలెను. శివుని ఆజ్ఞయే విధిన అనుల్లంఘనీయమో, అదేవిధిన గురు వాక్యము ఉల్లంఘనీయము కాదు. సదా వినయ విధేయతలతో గురువాజ్ఞను పాలించవలెను. అట్టివారికి ఐహిక మరియు పార లౌకిక పరమైన అభ్యుదయము సంప్రాప్తమగును గురువు గారిని పూజించి, వారికి విధేయులై, వారి ఆజ్ఞను తు.చ. తప్పకుండ పాటించి పరమ పదమును పొందిన మహనీయులెందరో గలరు. వారి చరిత్రలు, నుపనిషత్తులలోను, పురాణములలోను ఉల్లేఖింప బడినవి. వీరిలో సత్యకామజాబాలుడు, ఉపమన్యువు, ఏకలవ్యుడు మరియు పద్మ పాదాచార్యుల వారలు ముఖ్యులు.

ఈ రీతిగా ఈ ఉభయ స్థలమునందున శ్రీ జగద్గురు రేణుకాచార్య భగవత్పాదులవారు శివునకు గురువునకు నభేదమును ప్రకటించిరి. గురుసేవయే శివసేవయని యెరిగిన వారై, ఆ సద్గురువుకు సాష్టాంగపడి, నమస్కరించి, పరిపరి విధములుగా

స్తుతించి, అష్టవిధ లేదా షోడషోపచారములను గావించుట, పాదతీర్థ ప్రసాదములను పూజాఫలములుగా పొంది, భక్తి శ్రద్ధలతోను, వినయవిధేయలతతోను వాటిని స్వీకరించి, గుర్వాజ్ఞయే శివునాజ్ఞయనియును, హరునాజ్ఞను ఉల్లంఘించిన యెడల వచ్చెడి పరిణామములు గుర్వాజ్ఞను తిరస్కరించిన వలన వచ్చునని యెరిగిన వారై సర్వదా సర్వకాలముల యందున గురువుగారి ఆజ్ఞలను పరిపాలిస్తూ, శ్రీ గురువుగారి సేవలో తను- ధన-మనములను సమర్పించి త్రికరణ శుద్ధితో గురువుని సేవించి గురువుగారి నిరుపమానమైన కరుణను బొంది దుర్భరమైన యీ సంసారమునుండి ముక్తులై లింగాంగ సామరస్య రూపకమైన ముక్తిని పొందుటకై వలుయు అర్హతలను పొంద వలయునని ఉపదేశించిరి. వీరశైవులెల్లరు, శ్రీ భగవత్పాదుల వారు సూచించిన మార్గమును అవగాహన చేసికొని, ఆచరించి ధన్యతను పొందుదురు గాక.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**దిll 26-9-1990**

**స్థలం: శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్యమమురము**
**బోధకాలు బసవేశ్వర దేవస్థానం. రాణి చెన్నూరు.**

## విశేష ప్రదీపిక :

వీరశైవ ధర్మమున గురుపూజ కెంత ప్రాముఖ్యత గలదో యనెడి దానిని శ్రీ కాశీ జగద్గురువులవారు విపులముగా వివరించిరి.

వీరశైవ ధర్మమున స్థలము పరబ్రహ్మ వాచకము. వీరాగమములోని యీ క్రింది శ్లోకమును గనుడి:

శ్లోll **యత్రా దౌస్థీయతే విశ్వం ప్రాకృతం పౌరుషం యతః।**
**లీయతే పునరంతేచ స్థలం ప్రోచ్యతత స్తతః ॥**
**స్థకార స్థాన వాచీ స్యాల్లకారోలయవాచకః।**
**తయోః కారణభూతంయత్తదేవస్థలముచ్యతే॥** (వీరాగమనము)

ఉభయ స్థలమనగా పరబ్రహ్మ తత్త్వమునకు చెందిన రెండు తత్త్వములు ముప్పది యారు తత్త్వములకతీతమైనది శివపరబ్రహ్మ తత్త్వమని తెలుపబడినది. శివపరబ్రహ్మ యనెడి మహాసముద్రములో శివాది భూమ్యంతముగల తత్త్వములు నీటినురుగు వంటివని శివయోగి శివాచార్యులు తమ ప్రార్థనాస్తుతితో తెలిపిరి. గురువు లింగము లనెడివివే యుభయ స్థలములు తత్త్వతః రెండును నొక్కిటే కాని లోక కల్యాణము నిమిత్తము శివపరబ్రహ్మ తత్త్వము గురు-లింములుగా పరిణామమును పొందును. జీవుని పాశములను తొలగించుటయే యీ పరిణామము యొక్క లక్ష్యము గురుడు-జీవునికి దీక్షనిచ్చి పాశవిమోచనము కల్గించును.

పాశవిమోచన మనగా మలవిమోచనము. మలచ్ఛేద నానంతరము గురుడు జీవునికి లింగప్రదానము చేసి భక్తునిగా జేయు చున్నాడు. చంద్ర జ్ఞానాగమము నీ విషయమున యీ క్రింది విధమున తెలిపినది.

శ్లోll **తను త్రయ గతానాది మలత్రయమిదం గురుః।**
**దీక్షాత్రయేణ నిర్దగ్ధ్వా లింగత్రయము పాదిశేత్॥** (చంద్రజ్ఞానాగమము)

గురు దత్తమైన యిష్టలింగమును పూజించుచు భక్తుడు ముక్తిని పొందును.

ఈ యుపదేశమున శ్రీ భగవత్పాదులవారు లింగముతో బాటుగా లింగతత్త్వము నెరిగించి తన కారుణ్యమును కటాక్షించి తద్వారా శివకటాక్షమును గల్గించెడి గురువు నర్చించ వలెనని తెలియజేసిరి. అనుదినము లింగమును నర్చించిన యటులే శ్రీ గురుని కూడ యర్చించ వలెనని యుపదేశించిరి. పరం పరాను గతముగా గురువు పూజలనంది కొనుచున్నాడు. మరమయ్య, షట్‌స్థలబ్రహ్మయైన చరమూర్తి, జగద్గురువుల పాదపూజచేసెడి సాంప్రదాయము వీరశైవ జనసామాన్యమున కలదు. కాని యజ్ఞాన వశమున కొందరు గురుని నరునిగా నెంచి యలక్ష్యము చేయుచున్నారు. అట్టి వారి భక్తి సద్గతి నివ్వజాలదు. ఈ విషయమున నీ క్రింది ప్రమాణము జ్ఞాన ప్రదమైయున్నది.

శ్లోll **గురుంనరం స్రీయం గౌరీంశిలాలింగం శివంహరిం**
**పంచాక్షరం చాక్షరస్తు సమం వదతి పాతకి।**

గురువును నరునిగాను, శక్తిని స్త్రీగాను, లింగమును శిలగాను, శివుని హరితో సమానమైన వానిగాను చెప్పుట చేత పాతకము ప్రాప్తించును. 'గురుభక్తి విహీనస్య శివ భక్తిర్నజాయతే" యని శ్రీ భగవత్పాదులవారు గురు మహత్త్వ స్థలమున దెలియ జెప్పిరి వరణమున శివుని మీద నెట్టి భక్తి ప్రదర్శింపబడునో యట్టి భక్తియే గురుని మీదను ప్రదర్శింప వలెను. "గురు రేవ పరంతత్త్వం", నగురోరధికం" వంటి సూక్తుల ప్రకారము శ్రీ గురువు పూజ్యుడగు చున్నాడు. గురువును విస్మృతికి గురిచేసిన యెడల జీవునికి నిష్కృతి యుండదని గ్రహించ వలెను.

భక్తి యనెడి పదము సేవను సూచించుచున్నది. గురు భక్తి యనగా గురుసేవ యనియును గుర్తించవలెను. గురు శుశ్రూష చేసి గురు కృపను పొందవలెను. ప్రసన్నుడైన శ్రీగురువు చేసెడి యుపదేశము వలన కానిదేదియును లేదు. ఈ క్రింది ప్రమాణమును గనుడి:

**నిష్కలోహి మహాదేవో.... సకలోగురు**
**రూపేణ సర్వానుగ్రహకో భవేత్॥**

గురూపదేశమువలన శ్వేతుడనెడి వాడు నిలువగల్గినాడని బసవేశ్వరులవారి వచనమొెటిగలదు. (వ.సం.653, బాడాలవారి యనువాదము, పుట,163). ఈ శ్వేతుడుతనను చంపుటకై వచ్చిన యముని చంపివేసెనని తెలిపెడి యథావాక్కుల వారి యీ క్రింది యదార్థ పద్యమునుగనుడి:

**క్షితిపై శ్వేతమునీంద్రు జంపనలు కంగీనాశుదేతెంచి నీ**
**యతి కోపాజ్జ్వల నాహుతి న్మడిసె దభ్యంబేకనిష్ఠాసమ**
**న్వితులం జేకొని భక్తవత్సలుడవై నీ వెల్లప్పుడు నావగా**
**బ్రతి పక్షావలికెట్లు వారి దెస జేరన్వచ్చు? సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, 42)

శివానంద ప్రాప్తిని గల్గించెడి శ్రీ గురువును నానందమున నుంచెడి బాధ్యత శిష్యకోటిపై గలదు. సుఖదుఃఖముల సమబావముతో చూసెడి వాడైనను, శ్రీ గురునికి వసతి సౌకర్యాదుల కొరత యేర్పడినప్పుడు కొంత యిబ్బంది గల్గవచ్చును. బాధకు గురి కావచ్చును అట్టి యిబ్బంది కలుగకుండగ నుండుటకై ధనకనక వస్తువాహనాదులను శ్రీ గురువుకు సమర్పించి కొనుట శిష్యుని కర్తవ్యమైయున్నది. నిత్యవైరాగ్య భావన గల్గిన శ్రీ గురువు కోరకుండినను నతని యవసరములను శిష్యులు గుర్తించి వాటిని తీర్చవలెను.

లోకకల్యాణము నాశించి శ్రీ గురువు కొన్ని యాజ్ఞలను విధించెడి యవకాశమ గలదు. ఈ ఆజ్ఞల నమలు చేయుట వలన వ్యక్తి గతముగా వ్యయప్రయాసలు గల్గినమా, వాటిని లెక్కసేయకుండగ శ్రీ గురువు వారి యాజ్ఞల నమలు చేసెడి వాడేనిజమైన శిష్యుడు. ఇది యిట్టులుండగా కొందరు శ్రీగురువు ఉల్లంఘన సహేతుకమని సమర్ధించి కొనును. గురువు ఆదేశమును సమీక్షించెడి యధికారము శిష్యుని కెక్కడిది? ఈ ప్రశ్న వారిని బాధించదు. ఇట్టి వారు పాతకమున కొడి గట్టిన వారగుదురని తెలిపెడి యీ క్రింది యనుభవసారమును గనుడి:

**కు॥ గురుమంత్రాధః కృతియును**
**గురునాజ్ఞోల్లంఘనంబు గురువిముఖతయున్**
**గురు రంధ్రాన్వేషణమును**
**గురుపాతకమంద్రు బుధులు గురుభక్తినిధీ!** (అనుభవ సారము, ప45)

భక్త స్థలములోని వీరశైవుడు "పూజయేద్గురు" అనెడి భగవత్పాదుల వారి యాదేశమును తు.చ. తప్పకుండా పాలన చేసి ధన్యతను బడయవలెను. "కుర్యాదుపచారాన్" యనెడి యాదేశము ప్రకారము సకల విధములైన యుపచారములను చేసి గురువుకు ప్రసన్నత కూర్చవలెను.

"హితం కుర్యాత్" అనెడి యాజ్ఞను పాలించుట కొరకు ధనాదులు సమర్పించ వలెను. గురువాజ్ఞోల్లంఘన చేసి నాతని యాగ్రహమునకు గురికాకుండ మెలగ వలెను. ఈ విధిన చేసిన యెడల నతడు మాహేశ్వర స్థలమున నడుగిడుటకు వలయు నర్హతలను బడయగల్గును.

**–శివం భూయాత్–**

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు విద్యావాచస్పతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామి వారు ఆతానాత్మ వివేచననుపదేశముగా ననుగ్రహించిరి. కాయమే ముఖ్యమైనదైయున్నదనెడి నిరీశ్వర వాదము నిశితముగా పరిశీలించిరి. బుద్ధియే ఆత్మయనెడి వారి గూర్చి వివరణనిచ్చిరి. ఆత్మ యీ రెంటికి భిన్నమైనదై యుండునని తెలిపిరి.

అంగస్థలములలో పిండస్థలము, పిండ జ్ఞానస్థలములెంతో ముఖ్యమైనవి పిండస్థలము గురించి తెలిసికొంటిమి. ఇప్పుడు పిండ జ్ఞానస్థలము గూర్చి తెలియ జెప్పబడుచున్నది.

## భక్తి మార్గ క్రియా స్థలము

## ఆశీర్వచనము-7

శ్రీ పూజ్యులైన జగద్గురు రేణుకాచార్య భగవత్పాదుల వారు ఇంతకు క్రితమున పంచసూతకముల గురించి యుపదేశము నిచ్చుచు వాటిని పాటించ వలదని యుద్బోధించి ప్రస్తుతమున తీర్థయాత్రల సంసేవన గురించి తమరి యుపదేశమును కటాక్షించుచున్నారు.

**శివస్థానాని తీర్థాని విశిష్టాని శివార్చకః ।**
**శివ యాత్రోత్సవం నిత్యం సేవేత పరయా ముదా ॥**
**శివక్షేత్రోత్సవ మహా యాత్రాదర్శిన కాంక్షిణామ్ ।**
**మార్గేఽన్నపాన దానం చ కుర్యాన్మాహేశ్వరోజనః ।**
**నాన్నతోయ సమం దానం చ హింసాపరం తపః ।**
**తస్మాన్మామాహేశ్వరో నిత్య మన్నతోయప్రదోభవేత్ ॥ (సి.శి. 9 : 47 – 49)**

మహదాచార్యుల వారి మహిమోపేతమైన దివ్యోపదేశము యొక్క తాత్పర్యమేమనగా, ఇష్టలింగ ధారియైన శివభక్తుడు శివనివాసపు క్షేత్రములైన కాశీ, కేదారము, శ్రీశైలము, కొల్లిపాక, భీమేశ్వర స్థానమైన ద్రాక్షారామముల వంటి క్షేత్రములను దర్శించి, అచ్చటి పవిత్ర తీర్థములయందున స్నానమును చేసి, అచ్చట జరుప బడెడి రథోత్సవాదులలో పాల్గొని పరమోన్నతమైన ప్రహర్షమును పొందవచ్చును. అంతేకాదు, శివక్షేత్ర తీర్థాదులకు బయలుదేరెడి యాత్రికులకు సౌకర్యమును చేకూర్చుటకై అన్న సత్రముల నేర్పాటు చేసి, వారికి ఆతిథ్యమును ఇవ్వవచ్చును. అన్నపానముల దానము కంటెను సమానమైన దానములుగా నుండెడి దానములు లేవు. అయితే అహింసకు సమానమైన తపస్సు వేరొకటి లేనేలేదు. దీని నెరిగిన యిష్టలింగధారియైన శివభక్తుడు తన శక్త్యాను సారముగా ఎల్లప్పుడు అన్నపాన దానములను చేయుచు ఉండవలెను.

వీరశైవ సిద్ధాంతమునందున ఉపచారపూజ, సమరస పూజ లనెడి రెండు రకములైన పూజా విధానములు గలవు. ఇష్టలింగపూజయనెడిది సమరసపూజ యగుచున్నది. శైవక్షేత్రములలోని దేవాలయములలో నుండెడి స్థావరలింగముల పూజ "ఉపచారికపూజ" యగు చున్నది. వ్యావహారిక దృష్టి చేత వీక్షించిన యెడల యీ రెండు విధములైన పూజలను చేయుటలో ననౌచిత్యము లేదని యనిపించును.

వివాహానంతరము, అత్తవారింటికి వచ్చిన యుత్తమురాలగు కోడలు తన ప్రాణనాథుని సేవలను చేయుచూ, ఆ సేవ జతకు ఇంటిలోనయున్న అత్త, మామ, మరిది, బావ, మొదలగు వారికి ఉపచారములను చేయ వలసియుండుట లోకాచారమై యున్నది. భర్తను సేవించుట యనెడిది, గృహిణి ప్రాథమిక ధర్మమైయున్ననూ, లోకపు పోకడ నను సరించి ప్రవర్తించుట, శిష్టాచారములను పాటించుట, కుటుంబ సభ్యులైన అత్త, మామ, మరిది, బావ, యిత్యాదులకు నుపచారములు చేయుట యనెడివి గృహిణి యొక్క బాధ్యతలై యున్నవి. ఇదే విధముగా ఇష్టలింగధారికి యిష్టలింగార్చన యనెడిది ప్రాథమిక కర్తవ్యమై యున్నది. అద్దానిని ఆచరించుచు, స్వగ్రామములోను, దాని చుట్టు ప్రక్కలను ఖ్యాతి గాంచిన క్షేత్రములలో వెలసిన స్థావర లింగములను పూజించుట యనెడి ఉపచార పూజ, గృహిణి అత్తమామలకునూ, బావ, మరిది యిత్యాదులకు చేసెడి ఉపచారము వంటిది. అందుచేత వీటిని పూజించుటలో ననౌచిత్యము

లేదని యనిపించును. సమరస పూజయైన యిష్టలింగార్చనకు, ఉపచార పూజయగు స్థావర లింగార్చనకు పరస్పర వైరుధ్యము లేదని దోచవచ్చును. భర్త సేవకంటెను, అత్తమామల సేవయే ముఖ్యమైనదని భావించెడివారు, వితండ వాదమును చేబూని స్థావర లింగపూజకు పెద్దపీటను, ఇష్టలింగపూజకు చిన్నపీటను వేయవచ్చును. స్థావరలింగార్చన యెడల వ్యామోహమును పెంచికొని యిష్టలింగార్చనను విస్మరించెడి దశకు కూడ చేరవచ్చును. ఉదాహరణకై చెప్పవలెననిన, శ్రీశైలమును దర్శించి, శ్రీ మల్లికార్జున లింగమును సేవించెడి వారిలో వీరశైవులు అధిక సంఖ్యలో గలరు. సంవత్సరమునకు నాలుగైదు పర్యాయములు శ్రీశైలమును సందర్శించి ధన్యుడనైతిని అని భావించెడి వారు అసంఖ్యాకులుగా ఉన్నారు. ఇట్టివారిలో యిష్టలింగమును మేనున ధరించకుండగ చరించుచు, ఇష్టలింగార్చనను చేసెడి నిత్య కర్తవ్యమును విస్మరించి సంసారమున తిరుగాడెడివారు గుణనీయమైన సంఖ్యలో గలరు. ఇట్టివారికి నచ్చజెప్పలేక, వారి యజ్ఞానము యెడల జాలిపడుచు, పెద్దలు మౌనమును వహించి యున్నారు. ఇంకొక దృష్టితో చూసిన యెడల క్షేత్రసందర్శనమును, స్థావరలింగార్చన కొరకు చేయవలదనియు, తమ తమ యిష్టలింగములను ఆయా పవిత్ర క్షేత్రముల యందున ఆచరించి ధన్యతపొందుట కొరకే తీర్థక్షేత్రములకు యాత్రీకులై పోవలననెడి వాదన యొకటి కలదు. ఈ వాదన ప్రకారము, శ్రీశైలమును సందర్శించెడి సందర్శకుడు అచ్చటి స్థావరలింగమును పూజించకుండగ, ఆ ప్రదేశములోని యొక్క పవిత్రమైన స్థలమున కూర్చుండి యిష్టలింగోపాసనను శ్రద్ధా భక్తులతో చేసికొని తమ సాధనను బలోపేతము చేసికొనవలెను. శరణులు కొందరు ఈ మార్గమునే యనుసరించి కదళీవనమును చేరి తమ తమ యిష్టలింగార్చనలో నిమగ్నులై కైవల్యమును పొందిరని వారివారి చరిత్రల వలన తెలియు చున్నది.

ఈ భావమునకు గల మూలాధారము లెట్టివో గమనించవలసియున్నది. ఈ వాదన ప్రకారము భూప్రదేశమును రెండు విధములుగా విభజింప వచ్చును. మొదటిది భోగ భూమి. మన యిళ్ళు ఈ కోవకు చెందనవని యెంచబడినవి, యోగ భూమి యనెడిది రెండవరకమునకు చెందినది. శైవ క్షేత్ర తీర్థాదులు యోగ క్షేత్రములుగా గుర్తింబడినవి. భోగ క్షేత్రములలో చేసెడి యిష్టలింగార్చన కంటెను, యోగ క్షేత్రముల యందు చేసెడి యిష్టలింగార్చన అధికముగా ఫలమునిచ్చునని భావింపబడినది. మన యిళ్ళలో జరిగెడి దైనందిన వ్యవహారముల వలన మనకు చిత్తైకాగ్రత లభించ దనియును, అందుచేత ఇళ్ళలో చేసెది యిష్టలింగార్చన కంటెనూ క్షేత్రాదుల యందుననైననూ, నదీతీరముల యద్దైననూ లేదా వన ప్రదేశముల యద్దైననూ చేసెడి యిష్టలింగార్చన అధికమైన ఫలము నిచ్చునని భావింపబడు చున్నది. యీవాదన వీరశైవ ధర్మసూత్రములకు అనుగుణముగా ఉన్నదని దోచును. ఇది యిట్టులుండగా, దీనికి విపరీతముగా యిష్టలింగపూజను మరచిపోయి, క్షేత్రమునందున వెలసిన స్థావరలింగమును దర్శించి, స్మర్శించి, పూజించి ధన్యుడనైతనని భావించే వీరశైవ ధర్మీయుడు ధర్మభ్రష్టుడగు చున్నాడు. వీరశైవ ధర్మమును పాలించని యిట్టి వారిని ధర్మము రక్షించునే? "ధర్మో రక్షతి రక్షితః" యనెడిది కదా ధర్మోక్తి. ఇట్టి ధర్మభ్రష్టుడు నిందనీయుడగు చున్నాడు. దీనికి కారణము లేకపోలేదు. ఇట్టి వారు ధర్మమునకు రెండు విధములుగా చేటును చేయుచున్నారు. వారు వ్యక్తిగతముగా చెడి పోవుట మొదటి దోషము. ఇది నిందనీయమే కదా! వీరు తమ సహవాసములో నుండెడి వారి భ్రష్టత్వమునకు కారకులగుచున్నారు. ఈ కారణము వలననైననూ నిందనీయులే. వీరశైవులలో గురుస్థానమును అలంకరించిన మఠస్థ అయ్యలు, సుఖస్థజంగములు, చరపట్టాధికారము గల చరమూర్తులు స్థావరలింగము యెడల వ్యామోహమును పెంచికొనిన యెడల, వీరిని చూసి యితరులెందరో వీరి మార్గమునసనుసరించెడి యవకాశము కలదు. ఇష్టలింగార్చనను జనులు విస్మరించుటకై యిట్టివారు కారణభూతులగుదురు. ధర్మోపదేశమును చేసెడి వీరే ఈ విధముగా చరించుట ధర్మబద్ధమైన ప్రవర్తన కాజాలదు. బోధించెడి ధర్మమును వారాచరించి చూపిన యప్పుడే వారి బోధనలకు సార్థకత లభించును.

క్షేత్రాదులను సందర్శించెడి వీరశైవులు, మొట్టమొదటగా వారి యిష్టలింగములకు శాస్త్రోక్త విధిన పూజను చేసి, యిష్టలింగమునకు నివేదించిన పదార్థమును ప్రసాదముగా స్వీకరించవలెను. ఆ విధముగా నాచరణ చేసి పునీతుడై, కేవలము దర్శనాసక్తితో దేవాలయముల యందలి లింగములను చూచుటకై బయలుదేరవలెను. స్థావరలింగమును దర్శించి ఆనందము ననుభవించ వలెను. పూజాదులను నిర్వహించెడి పనికి పూనుకొనవలదు. తదనంతరము, క్షేత్రాదులలో నిర్వహింపబడెడి రథోత్సవాదులలో పాల్గొని సంతోషము ననుభవించవలెను సద్గుణ సంపన్నురాలైన పతివ్రత, తన భర్తయొక్క "కనిష్ఠ" సోదరుడును తన మరిది యగు వాని భోగభాగ్యములను చూచి యేవిధముగా సంతోషించునో, అదేవిధముగా వీరశైవుడు క్షేత్రాదులలో జరుపబడెడి ఉత్సవాదులను చూసి సంతోషించవలెను. పూజాదులలో సతిపతి భావన యుండుట చేత, యిష్టలింగమును మాత్రమే పూజించవలెను. క్షేత్రస్థిత స్థావర లింగమును పూజించకూడదు. విజ్ఞులు విషయమును గ్రహింతురు గాక! ఈ విషయమున కాశీ పీఠమున జరిపించెడి ఆచరణ అందరికినీ అనుసరణీయమైనది.

వీరశైవ ధర్మమునకు చెందిన పీఠాచార్యులు, శివాచార్యులు, మఠస్థఅయ్యలు, భక్తా మాహేశ్వరులు, శివశరణులు కాశీ క్షేత్రమును శ్రావణ మాసము, అధికమాసము, శరన్నవరాత్రోత్సవముల యందునను, పర్వదినముల యందును కాశిని దర్శింతురు. వీరందరూ కాశీ పీఠమున నిర్వహింప బడెడి సామూహిక యిష్టలింగార్చనలో పాల్గొను చున్నారు. ఈ పద్ధతి చిరకాలము నుండి కొనసాగుచు నేటికిని ఆచరణలో గలదు. శివరాత్రి పర్వదిన సందర్భమున వేనకువేల సంఖ్యలో వచ్చెడి వీరశైవమునకు చెందిన వివిధ వర్గములవారు సామూహిక యిష్టలింగార్చనలో పాల్గోనెడి నిమిత్తమే యటకు వచ్చుచున్నారని తెలిసికొన గలరు. కాశీ పీఠాధిపతి స్వయముగా యీకార్యక్రమమునందు పర్యవేక్షణ భాగస్వామియగుచున్నాడు.

ఈ కారణము వలన యిష్టలింగార్చనను సుసంపన్నము చేసికొనెడి నిమిత్తముననే తీర్థక్షేత్రములను సందర్శించ వలెననియును, ఇదియే వీరశైవ ధర్మమునకు సమ్మతమైన విషయమని గుర్తించ గలరు. తదనుగుణముగా వర్తించి ధన్యులు కాగలరు. ఈ విషయమున సందేహమున కెంతమాత్రమూ ఆస్కారము లేదని సద్భక్తులు గ్రహించ గలరు.

తీర్థ క్షేత్రములను సందర్శించెడివారు తమ తమ శక్త్యాను సారముగా అన్న సత్రములను, చలిపందిరుల నేర్పాటు చేయించి అన్న జలదాసోహము చేయించవలెను. అన్నదానము నైతే ఆవశ్యకముగా చేయవలెను.

ధర్మశాస్త్రము లందున అనేకములగు దానములు చెప్పబడినవి. అయితే ఇవియేవియును అన్నదానమునకు సరిగా రాజాలవు. ఈ సుభాషితమును గనుడి.

**తురగశత సహస్రం గోగజానాంచ లక్షం ।**
**కనక రజత పాత్రం మేదినీం సాగరాంతం ॥**
**విమలకుల వధూనా కోటి కన్యాశ్చ దద్యాత్ ।**
**నహి నహి సమమేలైరన్నదానం ప్రధానమ్ ॥**

ఇందులోన అన్నదానము యొక్క మహిమ బహు విధములుగా కొని యాడబడినది. దీని తాత్పర్యమేమనగా, గుర్రములను లక్షలాది సంఖ్యలోను అదే విధిన లక్షల కొలది గోవులను, ఏనుగులను, వెండి బంగారు పాత్రలను, ఆసముద్రాంతముగల భూమిని, ఉత్తమ కుల సంజాతలైన కోటి కన్యలను దానము చేసినచో వచ్చెడి ఫలము, అన్న దానము చేసినందున లభించెడి పుణ్యమునకు సరిసమానము కాజాలదు.

ఈ ప్రపంచమున అన్నము, నీళ్ళను మినహాయిస్తే, ఇతర ఏ వస్తువుల నెంత మేరకు ఇచ్చిననూ ఒక వ్యక్తి తృప్తిని పొందజాలడు. అతనిని తృప్తి పరచుట ఎవ్వరికినీ సాధ్యము కాదు. మన శరీరములోనికి తీసికొనెడివే మనకు తృప్తిని యివ్వగలవు. బహిర్గతమున నుండెడి ధన కనకాదులు తృప్తిని యివ్వ జాలవు. ఆకలితో బాధపడెడి వానికి అన్నమును పెట్టిన పిదప అతడు పొట్టనిండు వరకే తినగల్గును పొట్టనిండిన పిదప పూర్ణతృప్తిని యనుభవించును. చాలు చాలనుచు తన తృప్తినెరుక పరచును. ఇదే విధిన మండు టెండకు తప్పిగొనిన వ్యక్తికి నీటినిచ్చిన యెడల నతడు పొట్టనిండుగా నీటిని త్రాగి ఆ పిదప చాలు చాలని తన తృప్తిని తెలియపరచును. గజతురగాదులు బహిరంగముననే ఉండును. మానవదేహములోనికి ప్రవేశించవు. అవి యెంత మేరకు యిచ్చినా, ఎదుటి వ్యక్తి మనః పూర్వకముగా చాలు అని అనజాలడు. అందుచేత తీర్థక్షేత్ర యాత్రికులకు భక్తులు తమ తమ శక్తిమేరకు అన్న పానీయములను సమర్పింప చేయవలెను. శ్రీ భగవత్పాదుల వారు ఈ విషయమును నొక్కి చెప్పుటకే "నాన్నతోయంసమం దానం" అని నొక్కి చెప్పిరి. అహింసకు సమానమైన తపస్సు ఏ విధముగా నుండదో, అదే విధిన జలాన్నాదులకు సమమైన దానముండదని చెప్పుచు, అన్నదానము యొక్క ప్రాముఖ్యతను వివరించిన వారైరి. తపస్సు లెన్ని చేసిననూ, అహింసావ్రతము పాటించనిచో ఫలమెలా పరిమిత స్థాయిలో నుండునో, అదే విధముగా దానము లెన్ని చేసిననూ అన్న దానము చేయకుండిన యెడల పూర్ణ ఫలము చేకూరదు.

ఇంకను శివభక్తుడాచరించ వలసిన వాటిలో కొన్ని నియమములను పాటించ వలెనని శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును ప్రదానము చేసిరి.

**స్వమార్గాచార వర్తిభ్యః స్వజాతిభ్యః సదావ్రతీ।**
**దద్యాత్ ఏభ్యః సమాదద్యాత్ కన్యాం కులసముద్భవామ్**
**ఏవమాచార సంయుక్తో వీరశైవో మహావ్రతీ।**
**పూజయేత్ పరయా భక్త్యా గురుం లింగంచ సంతతమ్॥ (సి.శి. 9- 50 .51)**

ఈ ఉపదేశము ప్రకారము శివాచార వ్రత సంపన్నుడైన శిభక్తుడు తన యింటియొక్క కన్యలను పెళ్ళిచేసి యిచ్చెడి. ప్రసంగము వచ్చినపుడు లేదా వేరేవారి దగ్గర నుండి తన యింటికి కన్యలను పెళ్ళిచేసుకొని తెచ్చుకొనెడి సందర్భములను వారి వారి ఆచారవిచారముల వైపు లక్ష్యమునుంచాలని భగవత్పాదుల వారు ఆదేశమునిచ్చిరి. మన వంశమునందు జన్మించెడి ఆడపిల్ల ఆచార సంపన్నురాలై వుండవలెననెడి అభిలాష వున్నయెడల తగు జాగ్రత్త వహించవలెను. కన్యలు సుశీలురు, సదాచారిణులు అయివుండిన యెడల వారి సంతతియు అంతటి సంస్కారమున్నవారు అగుదురు. మరొక మాటలో చెప్పవలెననిన వైవాహిక సంబంధములు చేసుకొనునప్పుడు తగు జాగ్రత్తలు వహించని యెడల ముందు తరములలో సంస్కారవంతులైన సుశీలురు, మరియు సదాచారము గల సంతతి కలుగుటకు అవకాశములు తక్కువగా నుండును. ఉత్తమ సంస్కారములుగల సంతానమును పొందవలెననిన తల్లియు సంస్కారవంతురాలై యుండవలెను గదా! ఇచ్చట సంస్కారమనెడి పదమును లింగధారణ భస్మధారణ, రుద్రాక్ష ధారణ మొదలగు శివసంస్కారములని గుర్తించ వలెను.

సమాజమునందలి నేటి అసభ్యవర్తనల పరిణామముగా మనదేశము యొక్క ప్రజల ఆచారవిచారముల యందు అస్తవ్యస్తత ఏర్పడి అవినీతి, అన్యాయ వర్తనులైనవారు వైపరీత్యమైన కార్యములను చేపట్టి దేశముయొక్క ఘనతకు మరియు దాని గౌరవమునకు భంగము తెచ్చుచున్నారు. వారూ పతితులై ఇతరులను పతితులుగా మార్చుచున్నారు. దీనికి గల కారణమేమనగా మనము సేవించెడి ఆహారములలో తగు జాగ్రత్తలు వహించక పోవడమె. మనము సేవించెడి ఆహారమే రక్తాది సప్తధాతువుల రూపముదాల్చి రేతస్సుగా పరిణామమొంది సంతానోత్పత్తికి కారణమగు చున్నది. పరిశుద్ధమైన ఆహారమును సేవించెడి వారి సంతానము పరిశుద్ధాంతమైన అంతరంగముగలదై యుండుట కవకాశముండును అటులకాకుండా నిషిద్ధ పదార్థములను సేవించిన యెడల ఆ పదార్థముల యొక్క ప్రభావము సంతానము పైనకూడా వుండు అవకాశము కలదు. ఉదాహరణకు చెప్పవలెననిన రజోగుణ లక్షణములుగల సంతానమునే పొందు అవకాశము గలదు, సత్వ గుణ సంపన్నులైన సంతానమును పొందగోరెడువారు తమ యొక్క ఆహారములో సత్వగుణ ప్రధానములైన పదార్థములను చేర్చుకొనవలసిన అవసరమున్నది. దీనికి ఒక కారణము కలదు. బీజము వలెనే సంతానముండునని ఎరుగని వారెవ్వరు? వేప విత్తును విత్తి మామిడి పండును అపేక్షించుటవలన ఏమైనా ఫలముండునే? ఆదే విధముగా మనము ఆచారవంతులమై వున్నప్పుడే మనసంతానము కూడా ఆచార సంపన్నత కలిగి యుండెడి అవకాశముండును. వైవాహిక సంబంధములు చేసికొనునప్పుడు కులక్రమానుగతములగు ఆచార విచారములను, మరియు సభ్యత సంస్కారములను పరీక్షించునది ఎంతో ఆవశ్యకమై యున్నది.

మనదేశమునందలి ప్రాచీన పద్ధతి ప్రకారము వరునికిని కన్యకును పరస్పరగుణము మేళనమును చూచి వివాహ సంస్కారములు చెసెడి ఆచరణ కలదు. ఇటీవలి కాలములో గుణమేళనను పరీక్షించే ఆచారము క్రమేపి తగ్గుచూ వచ్చి ధనమేళన పరీక్ష క్రమేపి హెచ్చుచు వచ్చుచున్నది. వర్తమాన సమాజములో సంభవించెడి వధువుల పీడన, పెద్దయెత్తున జరుగుచున్న హత్యలు ఆత్మహత్యలు ఈధనమేళన విష పరిణామములే కదా! అంతేకాదు ఎన్నో కుటుంబములు విచ్చినములై భార్యభర్తలు విడిపోయి, విడాకులకు పరుగులు తీయుటను మనము చూచుచున్నాము. వీటన్నిటిని నివారించుట కొరకు మరియు వరదక్షిణ వంటి దురాచారములను రూపుమాపుటకు మన సమాజమే జాగ్రత్త వహించవలెను. ఆధునికమైన పరివర్తన గలిగిన వారితోనూ, మనదేశము యొక్క ప్రాచీన సభ్యతకు కళంకము తెచ్చెడి వర్తనగలిగిన కుటుంబములతోను సంబంధ బాంధవ్యములు కలుగ కుండా జాగ్రత్త వహించుట ఆవశ్యకమే కదా! మనము తెలిసియుండియు తప్పులు చేసిన యెడల మన కుటుంబములోని సభ్యులయొక్క నైతిక పతనమునకు మనమే కారకులమగుదుము కదా!

ఇట్టి పరిణామములను దృష్టియందుంచుకొనియే వర కన్యల సంబంధములు చేయునప్పుడు ఆచారవిచారములను విచారించి తెలిసికొనవలెనని ఆదేశము నిచ్చిరి. సాత్వికాహార సంసేవనా నియమముకల వీరశైవులు ఇట్టి జాగ్రత్తలు తీసికొనని యెడల వారు చేసుకొనెడి వివాహసంబంధమునకు చెందినవారు అట్టి నియమమును ఉల్లంఘించెడి వారైన యెడల పరిణామము లెటులెండునో యూహించగలము.

వీరశైవధర్మమునందు జంగమ మరియు పంచమ యనెడి రెండు వర్గములు సృష్టి యొక్క ఆదికాలము నుండియు పరంపరానుగతముగా కొనసాగుచూ వచ్చుచున్నవి. వీరిలో జంగములు గురుపరంపరకునూ పంచములు శిష్యపరంవరకును చెందినవారై యున్నారు. ఈ కారణము వలన వీరిరువురి మధ్యన వైవాహిక సంబంధములు ఏర్పడుట లేదు.

పంచమ వంశమునందున వారు చేసెడి వుద్యోగ, వ్యవహారముల మూలకముగా బణజిగ, గానుగ, వక్కలిగ (వ్యవసాయ) హడపిగ (మంగళి), శివసింపిగ, (చిప్ప, చిప్పగ) కమ్మర, నేకార (నేతకాడు) మరియు బరీగార (రంగులు వేయువారు) మొదలగు అనేక వర్గములు అయివున్నవి. ఇప్పుడు వుండెడి ఈ భేదములు క్రిందటి కాలమున వుండెడివి కావని అందరూ ఎరుగవలెను మరొక్క మాట చెప్పవలెననిన యివన్నియును వృత్తుల మూలమున వచ్చిన భేధములే కాని జాతి పరమైన భేధములు కావు. ఈ కారణము వలన వైవాహిక సంబంధములు చేసుకొను నప్పుడు పంచముల నెడి భక్త వర్గము అంతర్భేదములను పాటించవలసిన ఆవశ్యకతలేదు. అయిననూ వారిలో నుండెడి ఆచార విచారముల స్థాయిని గమనించి సమానమైన ఆచారవిచారములు గలిగిన వారిని ఎంపిక చేసుకొనుట శ్రేయుస్కరమగును. అంతమాత్రమున దీనిని విపరీతముగా అర్థము చేసుకొన కూడదు వీరశైవులు, వీరశైవేతరులతో వైవాహిక సంబంధములను కలిగి వుండకూడదు అనెడి నిషేధము సర్వత్ర పాటించవలెను.

ఈ ప్రకారముగా జంగములు కూడా జంగములతో వివాహ సంబంధములు చేసుకొనునప్పుడు భిన్నగోత్రజులతోనే వివాహసంబంధములను చేసుకొనవలెను సమాన గోత్రజులతో వైవాహిక సంబంధములు చేసుకొనవలదనెడి నిషేధము కలదు. ఈ విధముగ వీరశైవులు వంశాభివృద్ధికై వివాహసంబంధములు చేసుకొనునప్పుడు కులము (జంగము లేక పంచమ) గోత్రము (నంది, భృంగి, వీర, వృషభ, స్కంధ) ఆచారవిచారములకు ప్రాధాన్యత నివ్వవలసినదేగాని అధికారము, అంతస్తు మరియు ధనములకు అంతగా ప్రాముఖ్యతనివ్వకూడదు. ఈ విధముగా భగవత్పాదులవారు ఆదేశించిన నియమములను మనము అనుసరించినప్పుడు సత్సంతానములను గని రాష్ట్రముయొక్క మరియు దేశము యొక్క సర్వతో ముఖ్యమైన అభివృద్ధికి భాగస్వాములుము కాగలము.

ఇంతకు క్రితము ఉపదేశింపబడిన నవవిధములైన భక్తులను మొదలుకొని ఇప్పుడు ఉపదేశించిన ధార్మిక మరియు సామాజిక నియమములను కట్టుదిట్టముగా పరిపాలనను చేసెడివాడే భక్తుడనిపించుకొనును. ఇట్టి శివభక్తుడు తాను ఆచరించెడి ఇష్టలింగపూజా విధియందు శ్రద్ధాసక్తులను కనబరచి దాని జతకు గురుపూజను కూడా చేయవలెను. ఈ విధముగా భక్తుని క్రియాచరణను తెలియపరచెడి భక్తి మార్గక్రియాస్థలము సంపన్నమైనది.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

దిః 25-9 - 1990
స్థలం : శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్య మహామటపం
దోర్డువీధి బసవేశ్వర దేవస్థానం, రాగిచేన్నూరు

## త్రివిధ సంపత్తి స్థలము

## ఆశీర్వచనము - 1

భక్తి స్థలమునందలి ఒక అవాంతర భేదమే త్రివిధ సంపత్తి స్థలము ఈ స్థలమునందును గురు లింగ మరియు జంగములయందు సమబుద్ధిని వహించుకొని వారి ఆరాధనను చేయవలెనని ప్రతిపాదింపబడినది. ఈ విషయమున శ్రీ భగత్పాదులవారు ఈ క్రింది ఉపదేశమును అనుగ్రహించిరి.

**శ్లో ॥ యథా గురౌ యథాలింగే భక్తిమాన్ పరివర్తతే**
**జంగమే చ యథా నిత్యమ్ భక్తిమ్ కుర్యాత్ విచక్షణః**
**ఏక ఏవ శివః సాక్షాత్ సర్వానుగ్రహకారకః**
**గురుజంగమ లింగాత్మా వర్తతే భుక్తిముక్తిదః ॥ (సి.శి. 9: 59-60)**

వివేక సంపన్నుడగు శివభక్తుడు గురువునందున, మరియు తన యిష్టలింగమునందున తన భక్తిని యుంచిన యటులనే జంగముని యందును అదే భావనను దాల్చికొని యుండవలెను. గురువే శివుడనియును, శివుడే గురురూపము దాల్చెనని గ్రహించవలెను. అందరినీ అనుగ్రహించెడి శివుడు తానొక్కడే అయివుండినను, గురు, లింగ, మరియు జంగములనెడి మూడు స్వరూపములను దాల్చి భక్తుల నుండి భక్తిని గ్రహించి వారికి ముక్తిననుగ్రహించు చున్నాడు. ఈ కారణము వలన గురు, లింగ, జంగములయందున భేద బుద్ధిని దాల్చి వుండకూడదు అనెడిదే పూజ్యులవారి ఉపదేశము యొక్క సారాంశము.

వీరశైవ సిద్ధాంతము ప్రకారము గురు, లింగ జంగములు ఆరాధ్యులు. ఆరాధ్యులనగా పూజనీయులని గ్రహించ వలెను. విభూతి, రుద్రాక్ష మంత్రములు పూజాసామాగ్రులు మరియు పాదోదక ప్రసాదములు పూజాఫలములై యుండును.

ఏక దేవోపాసననూ కట్టుదిట్టముగా ప్రతిపాదించిన ఈ సిద్ధాంతమునందున ముప్పురి పూజను చేయవలెనని చెప్పుట యుక్తమే? అనెడి జిజ్ఞాసు విమర్శకుల మనస్సుల యందు పుట్టవచ్చును. వీరిసందేహమునకు సమాధానముగా గురు, లింగ, జంగములు భిన్నులు గారనీ భగవత్పాదులు తెలియజేసిరి. అయితే శివుడు మూడు స్వరూపములను దాల్చి వుండునని తెలియజెప్పిరి. ఒక బిల్వదళమునందున మూడు ఆకులు కనుపించును. వాటియందు మూడు ఆకులు గలిగిన దానిని మూడు బిల్వదళములు అనకుండా బిల్వదళమునే గ్రహించబడుచున్నది. గురు లింగ జంగములు సంఖ్యయందు ముప్పురిగా తోచిననూ బిల్వదళము వలెనే ఒక్కడే అయిన శివుని యొక్క మూడు స్వరూపములై యున్నారని తెలిసికొన వలెను. సంసారము నందలి జీవులకు శివదీక్షా సంస్కారమును యిచ్చి వారి జీవనమును పావనము చేయుటకొరకే శివుడు గురు రూపమున అవతరించు చున్నాడు. అటులనే భక్తుల నుండి అతిథి సేవలను పొంది వారికి జ్ఞానమును కటాక్షించుటకు శివుడు జంగముడై అవతరించు చున్నాడు. ఈ విషయమును విడమరచి చెప్పెడి వీరాగమములోని ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**సర్వలోకోపకారాయ యో దేవః పరమేశ్వరః**
**చరత్యతిధిరూపేణ నమస్తే జంగమాత్మనే॥**

ఈ ప్రమాణము ప్రకారము శివుడు భక్తుల ఆతిథ్యమును స్వీకరించి వారిని వుద్ధరించుటకై జంగముడై అవతరించు చున్నాడన్నది వుపదేశించనైనది. ఈ కారణము వలన వీరశైవ భక్తుడు గురు, లింగముల యందు భక్తిని యుంచిన యటులనే జంగముని యందును సమానమైన భక్తిని వుంచవలెను.

జంగముడనగా చరలింగము. అనగా తిరుగాడెడి శివలింగమని భావించవలెను. ఇదే విషయమును శ్రీ భగవత్పాదులవారు ఈ క్రింది విధముగా తెలియజేశిరి.

**శ్లో ॥ లింగంచ ద్వివిధం ప్రోక్తం జంగమాజంగమాత్మనా**
**అజంగమే యథా భక్తిర్జంగమేచ తథాస్మృతా**
**అజంగమంతు యల్లింగం మృచ్ఛిలాదివినిర్మితం**
**తద్వరం జంగమమ్ లింగమ్ శివయోగేతి విశ్రుతం**
**అచరే మంత్రసంస్కారాల్లింగే వసతి శంకరః**
**సదాకాలం వసత్యేవ చరలింగే మహేశ్వరః (సి.శి. 9: 61-63)**

ఈ ఉపదేశము ప్రకారము లింగము జంగమలింగమని, మరియు అజంగమలింగమని రెండు విధములుగా నుండును. అజంగమ లింగమునందు భక్తిని యుంచిన యటులనే జంగమ లింగము నందును భక్తిని యుంచవలెను. మన్ను, శిల లేదా ఏదో ఒక పదార్థముచే నిర్మించబడిన శివలింగమును అజంగమ లింగమని పిలిచెదరు. ఇట్టి లింగమున మంత్ర సంస్కారము చేత శివసాన్నిధ్యము ప్రాప్తమగును. చరలింగమైన జంగముని యందున మంత్ర సంస్కారముల ప్రమేయము లేకుండా శివుడు సదా సన్నిహితుడై యుండును.

శ్రీ రేణుక భగవత్పాదుల వారు తమ ఈ వుపదేశమునందున చరాచర లింగ స్వరూపములను చిత్రించి చర లింగమైన జంగముని విశిష్టతను ప్రతిపాదించిరి. మనము హస్తము నందుంచుకొని పూజించెడి లింగము అజంగమ లింగము లేదా అచరలింగము. ఇది

స్వతంత్రముగా ఎచ్చటను సంచరించదు. మరియు ఎవరికినీ ఏమియును బోధించదు. అయితే శివయోగ సిద్ధిని బడసిన జంగముడు శివలింగమే అయియున్నాడు.

దేవాలయము నందు స్థాపింపబడిన శివలింగము కాని, దీక్షా సంస్కారమువల్ల వచ్చెడి యిష్టలింగము కాని శిలల చేతనే నిర్మించబడినవి. ఈ శిలామయమైన శివలింగముల యందలి శిలాత్వమును దూరము చేయుటకై మరియు శివత్వమును ప్రతిపాదించుటకు ఆగమోక్తమైన అనేకమైన విధి విధానములను ఆచరించవలసిన అవసరమున్నది. ఆగమజ్ఞులు జలాదివాసము, ధాన్యాదివాసము, పంచామృతాభిషేకము రుద్రాభిషేకముల చేత ఆయా లింగములలోని జడత్వమును దూరము చేసి వాటిలో శివకళను సంయోజనచేశి ప్రాణ పతిష్ఠాపన చేసిన పిదపనే ఆ లింగములు పూజనీయములగు చున్నవి. మరోక్క మాటలో చెప్పవలెనన్న ఈ విధి విధానములు చేసినగాని ఆయా లింగములలో శివసాన్నిధ్యము చేకూరదు. ఇంతకు క్రితము వివరించిన మంత్రాదులను చేసిన పిదప ఆ లింగములు పూజనీయములగు చున్నవి. అయితే జంగమ లింగము అనిపించుకొనెడి శివయోగియందు శివుడు సదాసన్నిహితుడై యుండును. అందు చేతనే శివపూజాసక్తుడైన శివభక్తుడు శివునిని యిష్టలింగ రూపమునందు పూజించిననూ శివుని సంతృప్తి పరచవలసిన యెడల జంగమార్చన చేయవలసియే యుండును.

"లింగముఖమ్ వైజంగమః" అనెడి ఉక్తి ప్రకారము లింగముఖమే జంగముడై యున్నాడు. ఒక చెట్టు యొక్క వేరునకు నీరు త్రాగించిన యెడల అది ఆ చెట్టు యొక్క శాఖలకు, ఉపశాఖలకు నీరు యందించిన యటులనే, లింగముఖమైన జంగమునిని తృప్తిపరచిన యెడల జంగమరూపుడైన శివుడు తృప్తిపడును. అందు చేతనే వీరశైవ సిద్ధాంతమునందున జంగమునకు ప్రాముఖ్యత యివ్వబడినది. ఈ విషయమున శ్రీబసవేశ్వరులు తమ వచనములో ఇదే భావనను తెలియ జెప్పిరి. లింగము యొక్క ముఖమే జంగమమని, వివిధ పదార్థములను నివేదించిన యెడల మును ముందు శివుడు సకల పదార్థములను యిచ్చునని, కాని ఆ జంగముని హరుడని ఎంచక నరుడని భావించిన యెడల నరకము తప్పదని శ్రీబసవేశ్వరుల వారు వ్యక్తపరచిరి. శ్రీ బసవేశ్వరుల వారు ఈ వచనమునందున అచరలింగము కంటెను చరలింగమైన జంగముడే గొప్పవాడని కొనియాడిరి. ఈ కారణము వలన జంగములను శ్రద్ధతో గని యాదరించి వారి యొక్క అనుగ్రహమును పొందవలెను.

ఈ లోకమునందున తాను సంపాదించినది కొంత మేరకు దానము చేయవలెననెడి ధర్మశాస్త్రపు ఆదేశమొకటి గలదు. దానము చేయునప్పుడు పాత్రతను పరీక్షించి దానమును చేయుట సర్వోత్తమమైన దగునదై యున్నది. అపాత్ర దానమును చేసిన యెడల దుర్గతి లభ్యమగునని తెలుపబడినది. ఇది యిట్టులుండగ ఎవ్వరికి దానము నియ్యవలెననెడి ప్రశ్నతలయెత్తును. ఇట్టి సందేహమును తీర్చుటకై శ్రీ భగవత్పాదుల వారు ఈ ఉపదేశము నిచ్చిరి.

**శ్లో ॥ శివయోగిని యద్దత్తం తద క్షయఫలం భవేత్ ।**
**తస్మాత్ సర్వప్రయత్నేన తస్మై దేయం మహాత్మనే ॥**
**యత్ఫలం లభతే జంతుః పూజయా శివయోగినః ।**
**తదక్షయమితి ప్రోక్తం సకలాగమపారగైః ॥ (సి.శి. 9-64-65)**

శ్రీ శివజ్ఞానియైన జంగమునికి చేయబడిన దానము శాశ్వతమైన ఫలము నిచ్చును. అందుచేత ప్రయత్నపూర్వకముగా జంగమయ్యకు దానమును యివ్వవలెను. సకల శాస్త్ర పారంగతులైన విద్వాంసులు జంగమారాధన చేత ప్రాప్తమయ్యెడిది యగణితమైనదని కొనియాడిరి. ఈ విషయమును వివరించెడి ఆగమోక్తిని గనుడి.

**దర్శనార్చనాత్తస్య త్రిసప్త కుల సంయుతాః।**
**జనాః ముక్తిపదం యాంతి కింపునస్తత్పరాయణాః (యోగ జాగమము)**

దీనిలోని భావమేమనగా, జంగమయ్యను దర్శించి పూజించిన యెడల, ఆ వంశమునకు చెందిన ఇరువది యొక్క తరముల వరకు గలవారు మోక్షమును పొందుచున్నారు. ఒక్క పరి జంగమయ్యను పూజించిన యింతఫలము లభించిన యెడల యొంతో శ్రద్ధతో

సదా జంగమారాధనలో మునిగి తేలెడి వానికి యెంత ఫలితము లభించునో అంచనా వేయుట సాధ్యము కాదు. ఆ ఫలము చాల గొప్పదని గుర్తించ వలెను.

మానావమానములు చేయుటలో వివేకము కోల్పోయిన యెడల వైపరీత్యములు సంభవించునని నీతిశాస్త్రకోవిదులు నొక్కి వక్కాణించిరి. జంగమయ్యకు అవమానమును చేసిన వానికి యెట్టి గతి లభించునో యనెడిది శ్రీ భగత్పాదులు వారు ఈ క్రింది విధిన యుపదేశించిరి.

**నావమన్యేత్ కుత్రాపి శివయోగిన మాగతమ్ ।**
**అవమానాద్భవేత్తస్య దుర్గతిశ్చ న సంశయః**
**శివయోగీ శివః సాక్షాదితి కైంకర్య భక్తితః ।**
**పూజయేదాదరేణైవ యధా లింగం యధా గురుః** (సి.శి. 9 : 66-67)

ఇంటికి వచ్చిన శివయోగిని బహిరంగము నందునైననుగాని, అంతరంగమునందున యైనను గాని ఎప్పటికి అవమానమును చేయకూడదు, ఎవ్వరైననూ ఎట్టులైననూ అవమానమును చేసిన యెడల వారికి దుర్గతి ప్రాప్తమగును. శివ భక్తుడు జంగమయ్యనుగని యతనిని శివునిగా భావించికొని, కింకరుని వలె సేవించ వలెను. జంగమయ్యను సేవించి, పూజించి, యతని తీర్థ ప్రసాదములను గొని, యతని యనుగ్రహమునకు పాత్రుడు కావలెనని దీనిభావము.

త్రివిధ సంపత్తి స్థలమున భగవత్పాదుల వారు చేసిన యుపదేశమును పర్యావలోకించిన యెడల, గురు లింగ జంగముల యొక్క మహతి సమానముగా కన్పట్టు చున్నది. సంఖ్యాపరముగా వీరు ముష్యురైననూ, తత్త్వతః యొక్కరే యనెడిది స్పష్టపడినది. ఒక్కడే అయిన శివుడు గురువై శివ దీక్షనిచ్చి, యిష్టలింగమై పూజాదులను గొనుచు, జంగముడై జ్ఞానబోధను చేయుచు శివ భక్తుని యుద్ధరించు చున్నాడు. చేసెడి కార్యములు భిన్నమైనవై యుండుట చేత విభిన్నమైన నామధేయములు వచ్చినవి.

అయిననూ మౌళిక స్వరూపమునందున యెట్టి భేదము ఉండదు. అందుచేత, శివభక్తుడు తన యిష్టలింగమును నిత్యము పూజించిన యుటుల, జంగమయ్యను కూడ పూజించ వలెను. తనకు సాధ్యమైనంత మేరకు మాన మర్యాదలను చేయవచ్చునే కాని, యెప్పుడునూ అవమానించ వలదు. పాము పడలగలను తుడుచుట, కొరివితో వెంట్రుకలను సరిద్దిదుకొనుట, పులిమీసములను పట్టికొని ఉయ్యాల నూగుట, సున్నపు రాళ్ళను వడిలో పెట్టుకొని యేటిలో దూకుట మొదలగు వానిచే యెట్టి ప్రమాదము గల్గునో మనమెరుగనిదికాదు. జంగమునికి అవమానము చేసిన యెడల యిట్టి ప్రభావ పరిణామములు సంభవించునని, శ్రీ బసవేశ్వరుల వారు తెలియ జేసియున్నారు. (వ.సం. 660)

శివభక్తుని అవమానించిన యెడల రౌరవాది నరకములు సంప్రాప్తమగుచున్నవి. సాక్షాత్తు శివస్వరూపమైన జంగమయ్యను అవమానించిన వానికి యెట్టి ఫలముండునో యూహింప జాలమే? అందుచేత నెట్టి పరిస్థితులలోను జంగమయ్యకు అవమానమును చేయకూడదు.

లోకమున సంపత్తు విపత్తులనెడివి తమ తమ ప్రభావములను చూపుచున్నవి. సగటు మనిషి సంపత్తునే కోరుకొనును, తన యభిలాషను తీర్చికొనుటకై దివారాత్రములు కృషిచేయుచుండును విపత్తును కోరికొనెడి వారుందురే ? అయితే, సంపత్తు-విపత్తుల వివేకము లోకమున ప్రచలితముగాలేదు. వీటినిగూర్చి విపరీతమైన అభిప్రాయ భేదములు గలవు. సామాన్యుల దృష్టిలో ధన ధాన్యాదులు, భూమి-భవనములు, సువర్ణ-రజతాదులు సంపత్తుగా కన్పట్టును. శివాచార్యుల దృష్టిలో యివి విపత్తులే. దేని చేత మనిషి సదా దుఃఖము ననుభవించునో, నయ్యది విపత్తుగా గైకొనయగునని గ్రహించవలెను. దేనివలన సుఖము-సమాధానము లభించునో నది సంపత్తు అగుచున్నది. భూవన్యాదులు దుఃఖదాయకములగుట చేత నయ్యవి విపత్తులేయని వివేకవంతులు తెలిపిరి.

జ్ఞానమే సంపత్తని శ్రీ అల్లమ ప్రభువుల వారు తెలిపిరి. భూమి, హేమము, భామిని మొదలగునవి మానవునికి దుఃఖమునే కలుగ జేయునని రామాయణ-భాగవతాదుల వలన తెలియుట లేదా? వీటిని విపత్తులుగానే భావించ వలెను. జ్ఞానవైరాగ్యములనెడి ద్వివిధ సంపత్తిని పెంపొందించి కొనుట యెంతో అవసరము. జ్ఞాన రత్నమును ధరించిన వాని కంటెను అధికమైన సాంద్రతగల ధనవంతుడెవ్వడు? ఇతడొక్కడే సిరివంతుడని శ్రీ అల్లమ ప్రభుదేవుల వారు తెలిపిరి.

ఇచ్చుట జ్ఞానమనగా శివజ్ఞానమని గ్రహించవలెను. శివతత్త్వ పరిజ్ఞానమె శివజ్ఞానమగును. శివుని మరచిన వానికి శివజ్ఞాన మబ్బునే? ఈ కారణమున శివస్మరణ ప్రాముఖ్యతను సంతరించికొనెను.

ఒక పరి లీలావస్థలో నున్న శివుడు కైలాసమున సర్వజ్ఞుడైన నందీశ్వరునిగని యీ విధిన ప్రశ్నించెను. "ఓ భక్తాగ్రేసరా! ఈ లోకమున సంపత్తు ఎయ్యది? విపత్తు ఎయ్యది?" శ్రీ నంధీశ్వరుల వారు వందన మాచరించి దైవమా! పరమేశ్వరా! నిన్ను స్మరించుటయే సంపత్తు, నిన్ను విస్మరించుటయే విపత్తని తెలియజెప్పిరి.

శ్రీ నందీశ్వరుల వారి నుడువులు జ్ఞాన దాయకములై యున్నవి. శివుని మరచిన వాని కంటెను దరిద్రుడుండడు, శివస్మరణలో మునిగి తేలెడి వాని కంటెను ధనవంతుడుండని గ్రహించ వలెను.

వీరశైవ ధర్మము ప్రకారము శివ స్వరూపములైన గురు లింగ జంగములు ఆరాధనీయులు వీరికే భక్తిని సేయవలెను. వీరిని గురించి తెలిసికొనుటయే శివాజ్ఞానమగు చున్నది. వీరిని భక్తి శ్రద్ధలతో నవ విధములైన భక్తి పథముల ననుసరిస్తూ భజించవలెను. అప్పుడు, వీరు భక్తుని యనుగ్రహింతురు. ఇట్టి యనుగ్రహము వల్లనే శివ జ్ఞానము చేకూరును. అదియే నిజమైన సంపత్తు తద్వి రుద్ధమైనది విపత్తు.

ఈ విషయమును సుస్పష్టము చేసెడి ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**గురౌ దేవే సమా బుద్ధిర్యధా సౌ శివయోగిని ।**
**సైవా త్రివిధ సంపత్తి ః సంవిత్సామ్రాజ్య శాలినామ్ ॥ (వాతులాగమము)**

ఈ ఆగమోక్తిలోని భావమేమనగా, శివ జ్ఞానమనెడి సామ్రాజ్యమును బడిసిన వారికి గురు, లింగ, జంగముల కరుణయే సంపత్తు. ఇట్టి ఆధ్యాత్మిక సంపత్తి, భౌతిక సంపత్తి కంటెను అధిక ప్రాముఖ్యత గలదై యున్నది. వీరశైవులెల్లరూ ఈ ధర్మ మర్మమునెరిగిన వారై గురు, లింగ, జంగముల యెడల సమ భావమును దాల్చి, తమ తమ శక్తి మేరకు వారికి అర్చనాదులనిచ్చి వారి యనుగ్రహమునకు పాత్రులై ధన్యతను బడయగలరు.

ఓం శాంతి ః  శాంతి ః శాంతి ః

ది ॥ 27-9 - 1990
స్థలం : శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్య మహామంటపం
దోర్డువీధి బసవేశ్వర దేవస్థానం, రాగిచేన్నూరు

## విశేషప్రదీపిక

జంగమ స్థలమును గురించిన విషయ వివేచనను శ్రీ యుతులు విధ్యావాచస్పతుల వారును, కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరులును శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు ప్రదానము చేసి వీరశైవ ప్రజాబాహుళ్యమును ధన్యులను జేసిరి.

"అథ సంపది, సంపత్తిః శ్రీశ్చ లక్ష్మీశ్చ" యని చెప్పుచు, సంపత్తి సంపదకు గల పేరని అమర కోశము చెప్పినది. "సంపద్యతే జనైరితి సంపత్, సంపత్తిశ్చ" (పద్కు-గతౌ) అనెడి వ్యుత్పత్తి ప్రకారము జనుల చేత పొందబడునది సంపత్తి యనబడు చున్నది. సూర్య రాయాంధ్ర నిఘంటువు ప్రకారము సంపత్తి యనగా సంపద, సమృద్ధి, జయము మరియు అనుకూల స్థితియని యెరుంగ వలెను. సామాన్యులెల్లరు వీటిని కోరుదురనెడిది సత్యము. వీరశైవుడు కోరెడిది వీటికంటెను భిన్నమైనది అదియే ప్రసాదము. దీనికి గల కారణమేమనగా, ప్రసాదము వలన భక్తి గల్గును భక్తియే వీరశైవమునకు మౌలికమైన యంశము. దీనిని పొందుటకై యేమి చేయవలెననెడి దానిని శివాను భావులు నీ క్రింది విధముగా వివరించి చెప్పిరి.

**అవిరళ లింగపూజయు నిరంతర సద్గురు భక్తి యుక్తియున్**
**సవినయ జంగమార్చనయు సత్యము శౌచము సచ్చరిత్రయుం**

**దవిలి ప్రసాద సేవయును దానొద గూర్చక వట్టి మాటలం**
**దవునెయు దాత్త భక్తి సుగుణాకర! శ్రీకర! దోషిభీకరా. (అనుభవసారము, 94).**

వీరశైవ ధర్మమున గురు-లింగ-జంగమములే యారాధ్యములు. వీరికి చేసెడి పూజార్చనాదులను దాసోహము అని యుందురు. త్రివిధములగు దాసోహము, అనగా గురు-లింగ-జంగములకు దాసోహము చేయనిదే, శివతత్వము గురించి తెలిసికొనుటయును, తద్వారా భక్తి వృద్ధినిగాంచుటయును సుప్రాప్తము గాదని తెలిపెడి బసవన్నవారి వచనమును గనుడిః

**శాస్త్రమును ఘనమందునా? కర్మను భజించు చున్నది.**
**వేదమును ఘనమందునా? ప్రాణివధను జెప్పుచున్నది.**
**శ్రుతినిఘనమందునా? ముందిడిన దరయు చున్నది.**
**అక్కడెక్కడా నీవులేని కారణము, త్రివిధదాసోహముననే కాని,**
**కానరాదు, కూడల సంగమ దేవుని. (బసవేశ్వర గీతామృతము, పు. 215)**

వేదవిదుడును, శాస్త్రపారంగతుడును, స్మృతి శ్రుతుల నెరిగిన వాడును. త్రివిధదా సోహములను చేయని యెడల నాశించిన ఫలముండదని గ్రహించగలరు. త్రివిధ దాసోహములు చేసిన వానికే త్రివిధ సంపత్తి గల్గునని తెలిసి కొనవలెను. గురువునకు దేహమును, లింగమునకు మనస్సును, జంగమునకు ధనమును నివేదించి, భృత్యాచారము సల్పిన యెడల త్రివిధ ప్రసాదములనెడి త్రివిధ సంపత్తులు లభ్యమగును. శుద్ధ, సిద్ధ, మరియు ప్రసిద్ధ ప్రసాదములను త్రివిధ సంపత్తి యని భావించ వలెను.

గురు-లింగముల గురించి నుభయ స్థలమున తెలిసికొంటిమి. జంగముడన నెవ్వడనెడి ప్రశ్న యుదయించును. శ్రీ భగవత్పాదుల వారు గురు-లింగముల కభేదము చెప్పినయటులే లింగ-జంగముల కభేదము చెప్పెను. గురు కారుణ్య ఫలముగా లింగమును బడసిన సాధకుడగు లింగధారి యొక్క శ్రద్ధ, నిష్ఠ, అవధాన, అనుభవ, ఆనంద మరియు సమరస భక్తులను నెప్పటికప్పుడు పరీక్షించి వలయు మార్గనిర్దేశకత్వమును, నవశ్యకమైన మేరకు నియంత్రణను చేపట్టుటకే శివుడు జంగముడై విచ్చేయును. వివరములు గోరువారు అనుభవసారములోని జంగమ స్థలమును దర్శించగలరు. అద్దమును చూచెడి అన్నలారా! జంగమమును జూచితిరా? జంగమములోన లింగయ్య సన్నిహితముగ నుండునని బసవేశ్వరుల వారు (వచనము 187లోన) ప్రకటించిరి. లింగమును పూజించిన వెనుక జంగమునికి జంకనే వలయునని (వ.సు. 189). భక్తుడైన పిదప జంగముని పూజింప వలెననెను (వ.సు.185). లింగమును పూజించుట కంటెను జంగముని పూజించుటే యుత్తమమని సర్వేశ్వర శతకమున చెప్పబడినది. జంగమ భక్తి యెటులుండవలెనో తెలిపెడి యీ పద్యమును గనుడి.

**క్రియగొన భక్తుండై బం**
**టయి బానిసయై నిజాపుడై యెన్నగబెం**
**టయి తుడవగచీపురు దా**
**నయి జంగమ భక్తి సేయునత డీశు డిలన్ (అనుభవసారము, ప 211)**

## వ్యాఖ్య (భ.మాక్రి. 7)

తీర్థక్షేత్ర సందర్శన విషయములో నిశిత పరిశీలన జరిపి వీరశైవుల కర్తవ్యమేమిటో యనెడి దానిని, వైవాహిక సంబంధ బాంధవ్యములను చేసికొను నప్పుడు చేపట్టవలసిన వైఖరి గురించియును శ్రీ కాశీ జగద్గురువుల వారు శ్రేయోదాయకమైన యుపదేశము నిచ్చిరి.

మన దేశమున తీర్థయాత్రల గురించి సకారాత్మకమైన ధోరణులు కలకాలము నుండి కొనసాగు చున్నవి. పౌరాణిక గాథలు నాయా క్షేత్ర తీర్థముల విశిష్టతను నినుమడింప జేసినవి. తత్ఫలితముగా ఆస్తికులలో అధిక సంఖ్యాకులు తీర్థ యాత్రలు చేయుచున్నారు. కొన్ని క్షేత్రములు దిన దిన ప్రవర్ధమానమై లక్షలాది యాత్రికుల నాకర్షించు చున్నవి.

ఇట్టి స్థితిలోన లోకం పోకడల ననుసరించెడి వారి సంఖ్య వీరశైవులలోను క్రమేపీ పెరుగు చున్నది. ఇది యెంత మేరకు ధర్మ సమ్మతమైన విషయమనెడిది పరిశీలించ దగినదై యున్నది.

తాత్వికముగా చూసిన యెడల వీరశైవ ధర్మమున యిష్టలింగమునకు మాత్రమే ప్రాముఖ్యత యివ్వబడినది. ఈ క్రింది ప్రమాణమును గనుడిః

**గురుణాదత్త లింగాద్వై నాస్తిదైవం మహీతలే ।**
**ఇతిభావాను సంధానం లింగాచార స్స ఉచ్యతే ॥ ......(శివాగములు)**

శ్రీ గురువు దీక్షా సమయమున నొసంగిన యిష్టలింగమే పూజనీయము, అయ్యది తప్ప భూతలమున నెయ్యదియు నర్చనార్హమైనది కాదు. ఇదియే లింగాచారమని చెప్పబడినది. లింగాచారము నాచారపంచకములలోన నొక్కటి మరియు నియ్యది యనుల్లంఘనీయమైనది.

ఇది యిట్టులుండగా, స్మార్తబ్రాహ్మణులు శివకేశవ భేదము చేయ కూడదనియును, ఇరువురిని పూజింపవలెనని యును ప్రతి పాదించిరి. వీరు శంకరాచార్యుల యను యాయులు. శంకర వాఙ్మయములో నద్వైత సిద్ధాంతము ప్రధానముగా నున్నను, స్తోత్రాదులు బహుదేవతారాధనను ప్రోత్సహించు చున్నవి. ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడిన యేకేశ్వరోపాసనను నమ్మి తదను గుణముగా ధర్మమునాచరించెడి వారిని యీ సాంప్రదాయమునకు చెందిన వారు నిశితముగా విమర్శించు చున్నారు. వీరి ప్రభావమునకు లోనైన వీరశైవులు నయోమయ పరిస్థితి నెదుర్కొను చున్నారు. ఇట్టి వారికి యీ యాశీర్వచనము జ్ఞానోదయము కల్గించును ఈ విషయమున కాశీ జగద్గురువుల వారి యుపదేశములు చిరస్మరణియములని చెప్ప వచ్చును.

వీరశైవమున అన్యదేవతా ఉపాసన నిషేధింప బడినది. ఈ విషయమును స్పష్టపరచెడి యీ క్రింది ప్రమాణమును గనుడిః

**ఇష్టలింగం పరిత్యజ్య అన్యదైవముపాసతే ।**
**ప్రసాదం నిష్ఫలం చైవ రౌరవం నరకం ప్రజేత్॥ (వీరశైవాచార ప్రదీపిక)**

ఇష్టలింగమును విడిచి వేరే దైవమును ఉపాసించ కూడదని తెలుపబడినది. ఈ విషయము నింకను విడమరచి చెప్పెడి శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గాంచుడి.

**నమ్మిన పడతికి గండడొక్కడే, కనుడో !**
**నమ్మ నెరిగిన భక్తునికి దేవుడొక్కడే, కనుడో !**
**వేడ ! వేడ ! యన్య దైవపు సంగము, పొల్లు !**
**వేడ ! వేడ ! పర దైవపు సంగము, పొల్లు !**
**వేడ ! వేడ ! అన్య దైవమనేది పాతర కనుడో !**
**కూడల సంగమ దేవుడు, గనిన ముక్కు కోయును కనుడో !** (బసవేశ్వర గీతామృతము, పు. **417)**

శరణసతి లింగపతి భావన నీ వచనమున గాంచగలము. స్మార్తులు ప్రతిపాదించెడి దానికిది సంపూర్ణముగా విరుద్ధమైనదని యెరుగ వలెను. వివరములు కోరువారు చతుర్వేద సారమును చూడగలరు.

ఇంతకు క్రితమే శ్రీ భగవత్పాదుల వారు స్థావర లింగార్చన నిషిద్ధమైనదని తెలిపిరి. అట్టియెడ శివమూర్త్యుపాసన, స్థావరలింగమూర్త్యు పాసనలు విహితములు కావని తేలినది.

ఇక నదీ స్నానముల విషయమును గమనించిన యెడల నదియును విహితము కాదని తెలుప బడినది. అష్టావరణములలో నొకటగు పాదతీర్థము సకల తీర్థముల కంటెను కోటిరెట్లు నధికమని తెలుప బడినది. ఈ యంశమును తెలిపెడి యథా వాక్కుల వారి యధార్థ వాక్కును గనుడిః

**పలు తీర్థంబుల గ్రుంకు కంటె మహిలో భక్తాంఘ్రిపానీయముల్**
**తల మీదన్ జిలి కించుకొన్న శుచి తీర్థంబాడ భారంబు**
**త త్ఫల మత్యల్పము భక్తియుగళాంభ స్పర్శనిర్ఝారమై**
**యలరున్ శాశ్వత భక్తిముక్తి ఫలదంబై యుండు సర్వేశ్వరా ! (సర్వేశ్వర శతకము, ప.23)**

యథావాక్కుల అన్నమయ్యగారు, నీ విషయమును విస్మరించెడి వారినుద్దేశించి జంగమ తీర్థాంబుధి నోలలాడక వివేక భ్రష్టులైపోయి లోకములో దీర్ఘములంచు నేరులు పొరలగా నేల? యని ప్రశ్నించిరి. ఈ విషయమున ముదిగొండ వీరభద్రయ్యగారు "ఈ పద్యం కూడ అష్టావరణాలలోని పాదతీర్థ విషయం జంగముని వ్యాజంగా చెప్పుచున్నది. జంగముడంటే మహేశ్వరుడే శివునికి లింగము ఒక రూపము కాగా జంగముడు రెండవ రూపం" (సర్వేశ్వర శతకం-వ్యాఖ్యానం)

ఈ విషయము లిట్టు లుండగా తీర్థక్షేత్ర సందర్శన మెందుల కనెడి ప్రశ్న ఉదయించును అద్దానికి శ్రీ విద్యావాచస్పాతుల వారు నొసంగిన హేతువులు నాలోచనలను రేకెత్తించే విధముగా నున్నవి. కేవలం ఉత్సవాదులు చూసి ప్రమోదము నొందుటకే తీర్థక్షేత్రములను సందర్శించ వలెననెడిది యొక యభిప్రాయము కాగా, నచ్చట నొక యేకాంత ప్రదేశమున కూర్చుండి యిష్టలింగార్చన చేసికొని ప్రసన్నత పొందవలెననెడిది శ్రీ వారి యభిప్రాయమై యున్నది. మొదటి భావనకు శ్రీవారి భావన వన్నె తెచ్చినది.

తీర్థ యాత్రా స్థలములలో మాహేశ్వరులు అన్నదాన సత్రములను, చలివేంద్రముల నేర్పాటు చేయవలెననెడి శ్రీ భగవత్ పాదుల వారి హితబోధ లోక కళ్యాణ కారకముగా నున్నది. వైవాహిక విషయమున శ్రీవారి హితబోధ యెంతగానో నుపయుక్తయై యున్నది. పరంపరాను గతముగా వచ్చెడి యాచార సాంప్రదాయములకును, నేటి స్థితిగతులకును మధ్య సాధ్యమైనంత మేరకు సమన్వయాన్ని సాధించి, వీరశైవ సంస్కృతికి ప్రతికూలముగా విఘాతము కలుగని విధము సంబంధము నేర్పాటు చేసికొనుట యనెడిది వాంఛనీయమని గ్రహించ గలరు.

శివం భూయాత్

## ఆశీర్వచనము : 1

## చతుర్విధసారాయ స్థలము

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు త్రివిధ సంపత్తి స్థలమున గురు-లింగ-జంగముల యుపాసన యొక్క ప్రాముఖ్యతను తెలిపియుండిరి. ఈ స్థలమున యీ ముృవ్వరి పాదోదక ప్రసాదముల యొక్క మహతిని యుపదేశించు చున్నారు. చతుర్విధ సారాయ స్థలమున నుపయోగించ బడిన సారాయ అనెడి శబ్దమునకు సారమనెడి యర్థము గలదు. వీరశైవుడు తన జీవితమున నాల్గు విధములగు సారములను గడించ వలెను. ఇవి : గురువు-లింగము-జంగముడు-వీరి పాదోదక- ప్రసాదము. వీటిని మినహాయించిన యెడల జీవితమంతయును నిస్సారమైనదిగా దోచును. ఈ విషయ విజ్ఞానమును తెలియ జేయుటయే యీ స్థలములోని శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమునకు లక్ష్యమై యున్నది. శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమును గనుడిః

**శ్లో ॥ పాదోదకం యథా భక్త్యా స్వీకరోతి మహేశితుః ।**
**తథా శివాత్మనోర్నిత్యం గురుజంగమయోరపి ॥**
**సర్వ మంగలమాగల్యం సర్వపావనపావనమ్ ।**
**సర్వసిద్ధికరం పుంసాం శంభోః పాదాంబుధారణమ్ ॥**
**శిరసాధారయే ద్యస్తు పత్రం పుష్పం శివార్పితమ్ ।**
**ప్రతిక్షణం భవేత్త స్య పౌండరీకక్రియాఫలమ్ ॥ (సి.శి. 9: 68-70)**

ఈ ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా శివభకుడైన వాడు తన యిష్టలింగము యొక్క పాదోదకమును ప్రతి నిత్యము సేవించిన యటులే, గురు-జంగముల యొక్క పాదోదకమును స్వీకరించ వలెను. గురు-లింగ-జంగముల పాదోదకము ఈ జగత్తులోని మంగళమయ పదార్థములన్నింటి కంటెను మంగళమయమై యున్నది. పావనమైన వాటికంటెను పావనమైనది. అటులనే సర్వవిధ సిద్ధులన నునుగ్రహించునదై యున్నది. అదే విధిన శివుని కర్పితములైన పత్రపుష్పాదులను భక్తుడు తన మస్తకము మీద ధరించి కొన వలెను. అట్టివానికి నొక పౌండరీక యాగమును చేసిన ఫలము లభించును.

శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము నవలోకించిన పిదప పాదోదకము యొక్క ప్రాముఖ్యత మరియు మహిమాతిశయము యెట్టిదనెడిది తెలియ వచ్చు చున్నది.

పాదోదకములోని మహిమను గుర్తెరుగ వలసినచో యీ శబ్దము యొక్క విశిష్టతను తెలిసికొన వలసియుండును. ఈ శబ్దములోని ప్రతి అక్షరమునకునూ ఒక ప్రత్యేకమైన విశిష్టత గలదని వీరశైవ విజ్ఞుల వలన తెలియు చున్నది.

పా = పరమ జ్ఞాన ప్రదము

దో = దోషనాశకము

ద = జనన – మరణముల దహన కారణము/కారకము.

క = కర్మనాశకము

ఈ విషయమును సమర్థించెడి యీ క్రింది ప్రమాణమును గనుడిః

**పాకారం పరమ జ్ఞానం దోకారమ్ దోషనాశనమ్ ।**
**దకారం దహ్యతే జన్మ కకారం కర్మనాశనమ్ ॥**

ఇట్టి మహామహిమాన్వితమైన పాదోదకమును ప్రతి యొక్క వీరశైవుడు భక్తిశ్రద్ధలతో స్వీకరించ వలెను. మన యింటి ముందున మనము ఎంతో పెంచికొనెడి. వృక్షమునకు, ప్రతి నిత్యము నీటిని పోసిన యెడల నయ్యది దినదిన ప్రవర్ధమానమై పెద్దగానైన పిదప వాంఛిత ఫలపుష్పాదుల నొసంగును. అదే విధిన భక్తుడు తన ఆంతరంగమునందున అత్యంత ప్రేమానురాగములతో పెంచి కొనెడి భక్తియనెడి వృక్షమును త్రివిధ పాదోదకములను ప్రదానము చేసిన యెడల నది పెరిగి పెద్దదై, వట వృక్షమై సంసారమనెడి సూర్య తాపము నుండి మనలనే కాక మన యిరుగు పొరుగు వాళ్ళను కూడ రక్షించును. కల్ప వృక్షముగా పరిణితిని పొంది యిష్టార్థ సిద్ధినొసంగును.

ఈ ప్రపంచము నందున పావనములును, మంగళకరములును మరియు సకలసిద్ధి ప్రదాయ కములగు వస్తువులెన్నో గలవు. ఇవేవియూ పాదోదకమునకు సరిరావు. అందుచేత వీరశైవులకు పాదోదకమే మంగళకరము. ఇది యే పావన కరము దీని వల్లనే సకల సిద్ధులు చేకూరును ఈ కారణమున దీనిని సాదర భావముతో స్వీకరించ వలెను. త్రికరణములను శుద్ధి చేసికొని మంగళమయమైన కాయము గలవారె సిద్ధపురుషుడుగా పరిణితినొందవలెను.

అశుచి ఇసుమంత గల్గినా గురు–జంగముల ధూళిపాదోదకమును నెత్తిమీద ప్రోక్షించికొని క్రియాపాదోదకమును స్వీకరించిన యెడల, భక్తుడు పవిత్రుడు కాగలడు. వీరశైవ పరంపరలో పాదోదకమును తయారు చేసెడి విలక్షణమైన పద్ధతి గలదు గురు–జంగముల పాదపూజను విధి ప్రకారము చేసి ఆ పాదములోని వివిధ భాగములో శివుని వివిధ లీలా విగ్రహములను భావతః స్థాపించి కొనవలెను. అంగుష్టము నందున రుద్రుని, తర్జని యందున శంకరుని మధ్యమికము నందున మహాదేవుని, అనామికయందున త్ర్యంబకుని, పాదతలము నందున సదాశివుని, కనిష్ఠిక యందున ఈ శానుని, పాదము యొక్క పై భాగమున కపిర్థిని వెనుకన మడిమ యందున రుద్ర భర్గులను, బోటన వ్రేలు మరియును ఇతర భాగములలో వేర్వేరు శివ స్వరూపములను భావించికొనవలెను. తదనంతరము, కనిష్ఠమును మొదలుకొని అంగుష్టము వరకు న–మ–శి–వా–య అనెడి అక్షరములను ఉభయ పాదముల యందును సంబంధము చేసికొన వలెను. ఆ పిదప పాదములకు పంచ లేదా అష్టవిధోపచారముల చేత పూజను చేయవలెను మహా మంగళ హారతి, పుష్పాంజలి ముగిసిన పిదప నైవేద్యమును నివేదించ వలెను. ఆ తరువాత, పాదముల మీద పెట్టబడిన పుష్పాదులను గ్రహించి, భక్తుడు వాటితో తన తలను స్పృశించి వేరొక పాత్రలో పెట్టుకొన వలెను. పాదాంగుష్ఠముల క్రిందున పాదోదక పాత్ర నుంచి, ఇంత కంటెను క్రితమే తయారు చేసిపెట్టి కొనిన గురుపాదోదకమును అంగుష్టముల మీద వేసికొని అభిషేకమును చేసి క్రిందున గల పాత్రలో గ్రహించ వలెను.

ఈ విధముగ సంగ్రహితమైన పాదోదకమే క్రియా పాదోదకమని పిలువబడు చున్నది. దీనినే కర్ణామృతమని కూడ వ్యవహరింతురు.

శాస్త్రోక్త పద్ధతి ప్రకారము సిద్ధించిన ఆ పాదోదకమును గురు, జంగమ పూజా సమారంభము నందున సమ్మిళితమైన ప్రతియొక్కరు. తమ ఇష్ట లింగము పైన మూడుసార్లు వేసి అరచేతియందున్న ఆ పాదోదకము ఒక్క చుక్క యైనను మిగల కుండునటుల సేవించ వలెను. దానిని సేవించునపుడు నోటి నుండి ఎట్టి శబ్దము రాకుండా జాగ్రత్త పడవలయును. ఈ విధముగ గురు పాద పూజ చేత

లభ్యమగు దానిని గురు పాదోదకమనబడును. జంగముని పాదోదకము చేత లభ్యమగు దానిని జంగమపాదోదకమనియును, ఇష్టలింగము పూజచేత లభ్యమగు దానిని లింగపాదోదకమనియును పిలుతురు. వీటినే క్రమముగా దీక్షా పాదోదకము, శిక్షాపాదోదకము మరియు జ్ఞాన పాదోదకమని చంద్రజ్ఞానాగమములో ప్రతిపాదించుటను గాంచగలము. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో ॥ సప్త సాగర పర్యంతం తీర్థ స్నాన ఫలం సదా**
**గురోరం ఘ్రి పయో బిందు సహస్రాంశం న పూరయేత్ ॥ (క్రియాపాగ 5-18)**

ఆగమోక్తానుసారము పాదోదక మహిమ అపారమైనది. "సప్తసాగర పర్యంతం యుండెడి సమస్త తీర్థముల యందు స్నానము చేసిన యెడల ఏ ఫలము లభించునో ఆఫలము కంటెను పాదోదకమును సేవించిన ఫలము ఎన్నోవేలరెట్లు అధికముగా యుండునని" తెలుసు కొనవలెను. ఈ గురు జంగముల పాదోదక మహిమను తెలుసుకొనియే వీరశైవ భక్తులు గంగా మొదలగు పవిత్ర నదుల యందు స్నానము చేయునపుడు గురు జంగముల పాదములను త్రమమస్తకముల మీద యుంచు కొని స్నానముజేసెడి శ్రేష్ఠమైన విధానము రూఢి యందు కలదని గనుచున్నాము. అందరి పాపములను దూరము జేయు సామర్థ్యము గంగా మొదలగు తీర్థములకు యుండిన ఎడల ఆ తీర్థములకు సంక్రమించెడి పాపమును దూరమొనరించు సామర్థ్యము గురు జంగముల పాదముల యందు ఉండునని శాస్త్రములు ఉద్ఘోషించు చున్నవి.

ఉదా:- అడసఠ తీరద గురుచరణ
పిరభీ హోతే అఖండ?

అని ఒక హిందీకవి వచించిన విధముగా గురు జంగముల పాదములందు అరువది ఎనిమిది తీర్థములు అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటాయని అందురూ తెలుసుకోవలసిన అవసరమున్నది.

ఈ గురు లింగ జంగముల పాదోదక మహిమను గూర్చి చంద్ర జ్ఞానాగమము ఏమి చెబుతుందో తెలుసుకొందాము.

**శ్లో॥ శోషణం పాపపంకస్య దీపనం జ్ఞానతేజసేః ।**
**గురోః పాదోదకం చిత్రం సంసారద్రుమనాశనం ॥ (క్రి. పా, 5-16)**

పైన తెలిప బడిన అగమమానుసారము పాదోదకమనెడిది పాప పంకిలమును దహించి వేయును. జ్ఞానమును తేజస్సును ఉద్దీపనచేయును. సంసారమనెడి వృక్షమును దెగనరుకును. ఈ విధముగా గొప్ప ఆశ్చర్యకరమైన ఫలితములు లభించుచున్నవి. పాదోదకమనగా పాద జలము. జలముతో బురదను ఎండించుట గాని. దీపమును ప్రద్దీపన చేయుట గాని, చెట్టును నాశనము చేయుట గాని అయ్యెడి పనిగాదు, అయితే అదేజలము గురుపాదములను తాకిన పిదప దానిలో ఇంతటి గొప్ప శక్తి సామర్థ్యము గలుగుచున్నదని ఆగమములు నిరూపించుచున్నవి. మహారాష్ట్రమునకు చెందిన ఒక గొప్ప వీరశైవ ఆచార్యులు శ్రీమన్మథ స్వామి గారు నుడివిన ఈ క్రింది వాక్కులు గమనార్హములై యున్నవి.

**కాశీ మేలియా ముక్తిదేహా! సద్భావేసేవితా శ్రీగురూతీర్థ।**
**తో సహజ హేయా జీవన్ముక్త। తీర్థ మహాత్మ్యఅయిసేహే॥**
**గంగా తీర్థి ఏక అవగుణఖోలీ జాతా। జాయా బుదవన**
**గురుతీర్థ న బుడవి మ్హా నూన। తరుణి జాతీ కైరాసీ**
**ద్వాదశలింగా కరితా పరిశ్రమ పరిగురుతీర్థా చౌనహే మహిమ**
**జేణే పావిజేశ్చయే పరబ్రహ్మా త్యాజీనరీ కోణకరీ (॥ పరమ రహస్యం 2-48:50)**

శ్రీ స్వాముల వారు పాదోదక మహిమను బహు విధములుగా కొనియాడిరి. కాశీక్షేత్రమునందు మరణించిన వారికి ముక్తిని ఇచ్చిన ఎడల గురు పాదతీర్థము తనను సేవించిన వారికి సద్గతినిచ్చునదై యున్నది. గంగా తీర్థము ఎంతో ప్రసిద్ధమై యున్నను

సువిశాలమైన దాని జలములో ప్రవేశించినప్పుడు ఎంతో మంది మునిగి చనిపోవుదురు. అయితే గురుపాద తీర్థము నందు ఎవరైనా మునిగిన ఎడల అట్టి వానిని అది సంసార సాగరము నుండి తరింప జేసి శివసాయుజ్యమును ఇచ్చెడిదై యున్నది. అంతేగాదు ద్వాదశ జ్యోతిర్లింగముల దర్శించిన యెడల ఎట్టి ఫలితము లభించుచున్నదో అట్టి ఫలము శ్రీగురు పాదోదక సేవన వలన లభించును. ఈ విధముగా మహా మహిమాన్వితులైన శ్రీ మన్మథ స్వామి వారు "కాశీలో మరణము కంటెను గంగలో స్నానము చేసిన దాని కంటెను. ద్వాదశ జ్యోతిర్లింగములను సేవించిన దాని కంటెను ఎన్నో రేట్లు అధికమైన ఫలితము శ్రీ గురు లింగ జంగముల పాదోదకముల వలన అనాయాసముగాను అల్ప కాలమందు ననే లభించునని" తెలిపిరి..

శ్రీ మన్మథ స్వామి వారు చెప్పిన విషయములు అతిశయోక్తులు గావు. ఈ మహానుభావుడు ఆగములన్నిటిని అధ్యయనము జేసి పరమ రహస్యమనెడి గొప్ప గ్రంథమును వ్రాసి భారతీయ సంస్కృతిలో వీరశైవమునకు ఒక సుస్థిరమైన స్థానమును కలిపించిన వారైరి. దీనిలో శాస్త్ర పరిజ్ఞానముతో పాటుగా అనుభవైక వేద్యములైన విషయములనెన్నింటినో ఈ గ్రంథమునందు పొందుపరచిరి. ఇట్టి మహిమాన్వితులైన మహనీయుల వాక్కులకు మహతిని ఇవ్వని వారు దురదృష్ట వంతులే కాగలరు.

వీరశైవ సిద్ధాంతమునందున పాదోదకము అందరికీ ఒక రక్షక కవచముగా భావించబడినది. ఏ శివ భక్తులు గురు లింగ జంగముల పాదోదకములు ప్రతి దినము భక్తి శ్రద్ధలతో సేవింతురో అట్టివారి స్థూల మరియు సూక్ష్మ శరీరములు పరిశుద్ధములై వారి దుర్మార్గ ప్రవృత్తిని దూరమే చేయు చున్నది. ఈ విధముగా వీరశైవులను సర్వవిధములుగా సంరక్షించు చుండుట చేత పాదోదకము ఆవరణ, లేదా రక్షాకవచము అని పిలువ బడుచున్నవి.

పాదోదకము మహిమను ప్రతిపాదించిన శ్రీ రేణుక భగవత్పాదులవారు ఈ క్రింది సూచించబడిన తమ ఉపదేశములో ప్రసాదము యొక్క మహిమును ప్రతిపాదించు చున్నారు.

**శ్లో ॥ భుంజీత రుద్ర భుక్తాన్నం రుద్ర పీతం జలం పిబేత్**
**రుద్రాఘ్రాతం సదా జిఘ్రేదితి జాబాలికే శ్రుతిః ॥**
**అర్పయిత్వా నిజేలింగే పత్రం పుష్పం ఫలం జలం ॥**
**అన్నాద్యం సర్వ భోజ్యంచ స్వీకుర్యాద్ భక్తిమాన్నరః ॥**
**గురుత్వాత్ సర్వభూతానాం శంభూఃరమితతేజసః ।**
**తస్మై నివేదితం సర్వం స్వీకార్యం తత్పరాయణైః ॥**
**యే లింగధారిణో లోకే యేశివైక పరాయిణాః ॥**
**తేషాంతు శివనిర్మాల్యముచితం నాన్యజంతుషు॥**
**అన్నజాతేతు భక్తేన భుజ్యమానే శివార్పితే ॥**
**సిక్థే సిక్థే ః శ్వమేధస్య యత్ఫలం తద వాప్యతే ॥ (సి.శి. 9 : 71-75)**

ఈ తరగున శ్రీ జగద్గురువుల వారు ప్రసాదము యొక్క మహిమను ఎంతో గొప్పగా కొనియాడిరి. వీరి ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా గురులింగ జంగములకు సమర్పించిన పిదప మిగిలేది అన్నమునకు ప్రసాదమను పేరుగలదు. రుద్ర భుక్తమైన అన్నమును రుద్రపీతమైన జలమును మరియు రుద్రాఘ్రాణమైన సుగంధాధి ద్రవ్యములను శివ భక్తుడైన వారు సర్వదా స్వీకరించ వలెనని జాబాలో పనిషత్తు యందు నిరూపితమై యున్నది. దీని భావమేమనగా ఇష్టలింగమునకు అర్పించిన ప్రసాదమునే శివభక్తుడు స్వీకరించవలెను. ఇదే ప్రకారముగా పాదోదకము శివార్పితము చేసియే గ్రహించవలెను. మనము త్రాగెడి జలమునకు గూడ ఇవే సూత్రము వర్తించును. అటులనే తాను ఉపయోగించెడి కుసుమాది సుగంధ ద్రవ్యములను శివలింగమునకు అర్పించి దానిని ప్రసాదరూపముగా అఘ్రాణించ వలెను. సంక్షిప్తముగా చెప్పవలెననిన ప్రతి నిత్యము శివ భక్తుడు అనుభోగము జేసెడి సకల విధములైన భోగములను శివునకర్పించి అట్టి వానిని శివ ప్రసాదముగా భావించి స్వీకరించవలెను. ఈ నియమము కర్మేంద్రియముల వలన గ్రహించు వస్తువులకును జ్ఞానేంద్రియముల వలన అనుభవించెడి శబ్దస్పర్శాదులకును వర్తించునని గ్రహించ వలెను.

ఇష్టలింగమునకు ప్రత్యేకమైన పదార్థమునే అర్పించవలయునను నియమము ఏదియును లేదు. అర్పించెడివి పత్రము కావచ్చును, పుష్పము కావచ్చును లేదా ఫలము కావచ్చును, వీటిలో శివభక్తుడు దేనిని సేవించ దలచునో అట్టి దానిని మొట్ట మొదలు తమ ఇష్టలింగమునకు నివేదన మొనరించ వలెను. ఆపిదప వాటిని శివ ప్రసాదమను భావనతో స్వీకరించవలెను. ఇదే విధిన దేహ ధర్మపరి పోషణకు వలయు భక్ష్య భోజ్యములను మరియు ఫల పానీయాదులను లింగమునకు అర్పించిన పిదపనే భక్తుడు ప్రసాదమనెడి భావనతో స్వీకరించవలెను పదార్థముగ భావించి తీసుకొనరాదు, సమర్పించు పదార్థము సుసంపన్నమైన షడ్రుచులతో గూడిన ఓగిరాదులైనను అన్నాదులైనను లేదా అంబలి నైనను నివేదనకు పాత్రములే. ఇట్లు నివేదించిన పదార్థములు తమ వైవిధ్యతను కోల్పోయి ప్రసాదములుగా పరిణమించుచున్నవి. ఈ విధముగా శ్రీ భగవత్పాదులవారు ప్రసాదమహిమను కొనియాడిరి. గురు లింగ జంగములకు అర్పించెడి పూర్వోక్తమైన పదార్థములు వారు స్వీకరించిన పిదప మిగిలిన భుక్తావశేషము ప్రసాదముగా పరిగిణింపబడు చున్నది. దానిని ఎంగిలియని భావించిన ఎడల మహాదోషము సంక్రమించును అని వీరశైవ విజ్ఞుల యొక్క అభిప్రాయము. గురు లింగ జంగములకు సమర్పించు పదార్థములు వారు అనుభోగము చేసిన పిదప మిగిలినంత మేరకు అవి గురు ప్రసాదముగాను లింగ ప్రసాదముగాను జంగమ ప్రసాదముగాను పిలువ బడుచున్నవి. వీరు మధ్యన భేద భావమును చూప వలదు. సాధారణముగా మనము అనుభవించు వస్తువులను తమవని అను భావముతో అనుభవించు చుందుము. అట్టి అనుభావము వలన అనుభోగము చేయువాడికి అహంకార భావన ఏర్పడి తద్వారా దోషములు ఆపాదింప బడుచున్నవి. అది కర్మబంధముగా ఏర్పడి తన యొక్క దుష్పరిణామమును చూపించును. ఇది ఇటులుండగా పదార్థములను గురువునకు నర్పణ చేసి "నామమ" అను సూక్త్యాను సారముగా తనది కాదను భావమును పెంచుకొని తాను స్వీకరించునది శివ స్వరూపులైన గురు లింగ జంగముల ప్రసాదమని భావించి స్వీకరించు శివ భక్తునకు అనూహ్యామైన పుణ్య ఫలము అనాయాసముగా లభించుచున్నది. అహంకారము లుప్తమైనందున కర్మ ఫలము యనబడు అంగము నిస్సారమై తేజోహీనమై నిలుచు చున్నవి. ప్రసాద స్వీకరణ కర్మాచరణ కాజాలదు. అది ఒక దివ్యమైన భక్తిమార్గ సత్క్రియ.

**ఈశానః సర్వవిద్యానా మీశ్వర స్సర్వభూతానాం**

అనెడి శ్రుతి వచనము మేరకు నీ చరాచర ప్రపంచము నందున యందరికంటెను గొప్పవారు పరశివుడే. అతడు సచ్చితదానంద స్వరూపుడై యున్నాడు. ఇంతటి యా పరశివుడే గురు-లింగ-జంగమ రూపమున మన యెదురుగా నుపస్థితుడై యున్నప్పుడు మనము సేవించెడి ప్రతియొక్క పదార్థమును నతనికి సమర్పించి దానిని ప్రసాద రూపమున గ్రహించ వలెనెడిదే మహాచార్యుల వారి యాదేశమై యున్నది. ఈ ప్రపంచమున యెవరు నిష్టలింగ ధారులై యుండురో; యెవరు జంగమ-గురు-లింగముల యెడ ననన్య భక్తి సంపన్నులైయుండి సదావారి పూజాదులొనర్తురీ, యట్టివారే యీ ప్రసాదమును స్వీకరించుటకు యోగ్యులై యుందురు. గురు-లింగ-జంగముల యెడల భక్తి లేనివారికిని, వీరి పూజలను చేయని వారికిని యింతటి శివ ప్రసాదము లభించ జాలదు. ఈ కారణమున గురు-లింగ-జంగముల యందు ననన్యభక్తి సంపన్నులై వారిని సేవించవలెను.

ఏ శివ భక్తుడు ఇష్టలింగధారియై లింగార్చితమైన ప్రసాదమును సేవించునో, యతడు సేవించెడి ప్రసాదము యొక్క యొక్కొక్క మెతుకునందున నొక్కొక్క యశ్వమేధ యాగపు ఫలమును నిచ్చెడి సామర్థ్యముండునని పూజ్యులు నిచ్చట యాదేశము నిచ్చిరి. శివ ప్రసాదమును స్వీకరించే యీ విధి "త్వాదత్తే భిరుద్రశంతయేభిః" అనెడి ఋగ్వేదపు మంత్రము నందునను ప్రతి పాదింపబడినది. ఈ మంత్రము యొక్క యర్థమేమనగా, "ఓ రుద్రుడా ! నీవు స్వీకరించి యను గ్రహించెడి ప్రసాదము సుఖకరమై భవరోగపు టౌషధమై యున్నది". ఇంతటి యీ నీ ప్రసాదమును నే శివభక్తుడు సేవించునో నతడు నహంకార, మమకార రహితుడు, పాపనిర్ముక్తుడు, భక్తిసంపన్నుడు మరియు మేధాసంపన్నుడునై యుండును.

మనుజని యాధ్యాత్మిక పురోగతికి యాతని మనస్సు యొక్క పరిశుద్ధి యత్యంత యవశ్యకమై యున్నది. మనస్సు పరిశుద్ధము కావలెననిన యాహార శుద్ధియే ముఖ్యమైనది.

ఇదే ప్రకారముగా, "రుద్రేణాత్తమమృతమ్" యజుర్వేదపు మంత్రమునందునను రుద్రునికియనగా నిష్టలింగమునకు నర్పించిన ప్రసాదము అమృత సదృశమైనది. దీనిని సేవించుటకు దేవతలును అపేక్షపడుదురు! అని ప్రతిపాదించ బడినది.

మనుజుని యాధ్యాత్మిక ప్రగతికి యతని మనస్సు యొక్క పరిశుద్ధత నత్యవశ్యకమై యున్నది. మనస్సు పరిశుద్ధము కావలెననిన ఆహార శుద్ధి యెంతగానో యవసరము మనస్సు పరిశుద్ధము కావలెనననిచో సాహార శుద్ధి కొరకై వలయు జాగ్రత్తలు తీసికొన వలెను. ఈ విషయమున ఛాందోగ్య పనిషత్తు నందున యీ క్రింది విధముగ తెలుపబడినది;

"ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః, సత్త్వ శుద్ధౌ ధృవాస్మృతిః, స్మృతేర్లాభే సర్వగ్రంథీనాం విప్రమోక్షః"

ఆహార శుద్ధి వలన మనస్సు యొక్క శుద్ధియు, మనశ్శుద్ధి వలన నిశ్చలమైన జ్ఞానము, నిశ్చల జ్ఞానము వలన హృదయ గ్రంధి యొక్క ఛేదనము, తద్వారా మోక్షము లభించునని యీ మంత్రము ప్రతిపాదించు చున్నది. ఆహార శుద్ధిని సాధించని యెడల మోక్షము చిక్కదని గ్రహించ వలెను. వీరశైవుడును ముక్తి గురించి యాలోచించుటను మానివేసి గురు-లింగ-జంగములను శ్రద్ధాసక్తులతో సేవించుచు ప్రసాదమును సేవించు చుండవలెను. మోక్షము తనకు తనే లభ్యమగును. ఈ విషయమున శ్రీ ప్రభుదేవుల వారు వెల్లడి చేసిన యమృత ప్రాయమైన ఈ యుపదేశమును గనుడిః

**అమృత సాగరొళ గిద్దు, ఆకళ చింతెయేకె ?**
**మేరుమందిర దొళగిద్దు జరగతొళెవ చింతే యేకె ?**
**శ్రీ గురువునొళ గిద్దు ముక్తియ చింతె యేకె ?**
**ప్రసాదదొళగిద్దు ముక్తియ చింతె యేకె ?**
**కరస్థలదొళగె లింగవిద్ద బళిక మత్తిన్నామ చింతెయేకే? హేళా ! గుహేశ్వరా.**
**ఈ వచనపు తెలుగు రూపమిది.**
**అమృత సారములోన నుండియు ఆవుల చింత యెందుకు?**
**మేరు మందిరములోన నుండియు, గనితొలచు చింత యెందుకు?**
**శ్రీగురువులోన నుండియు, ముక్తి యొక్క చింత యెందుకు?**
**ప్రసాదములోన నుండియు, ముక్తి యొక్క చింత యెందుకు?**
**కరస్థలములోన లింగమున్న పిదప మరి యింకను వేరే చింత యెందుకు? పేర్కొను గుహేశ్వరా!**
**(అనువాదము : డా॥ మఠం లింగయ్య స్వామి)**

ఆహరము శుద్ధిగావలెననిన యెడల సద్దానిని గురు-లింగ-జంగములకు సమర్పించ వలెను. ఆహరములో నుండెడి పెద్ద దోషమేమనగా దాని నార్జించిన వాడు ఇది నాదని భావించి కొనటయే? నాది యినెడి దానిని మమకారమని యందురు. మమకారమే సంసార బంధములకు మూల కారణమని గ్రహించ వలెను. "మమేతి బద్ధ్యతే జంతుః" అనెడిది వేద్యులు చెప్పిననుడి. నిజగుణ శివయోగి గారి మాటలలో చెప్ప వలెననిన "మమకారము కంటెను మించిన బంధము లేదు."

మమకారము వలననే సంసారమనెడి చక్రమునందున సాధకుడు చిక్కి బాధకు గురియగు చున్నాడు. ఏదియును నాది కాదని భావన తలయెత్తిన గాని మోక్షము సుసాధ్యము కాదనెడిది గుర్తించ వలసిన విషయము. వాస్తవికముగా నాలోచించిన యెడల మనకు కనిపించెడి దంతయును భగవంతునిదే. అయినను, జీవులు వృధాగా దీని యెడల నభిమానమును దాల్చు చున్నారు. ఈ యభిమానమునకు దూరమగుటయే యీ ప్రసాద భావనలోన యంతర్నిహితముగా నున్న యంశము. ప్రపంచములోని ప్రతి వస్తువును శివునిదే యనెడి భావన గల్గిన యెడల నా దనెడి భావన సహజముగానే నివృత్తమగును. ఈ విధముగా ప్రసాదము వలన సంసారమనెడి బంధము నుండి యెంతో సులభముగా విముక్తిని పొందవచ్చును. అందుకే శ్రీ భగవత్పాదుల వారు దీనిని యజ్ఞ యాగముల కంటెను నధిక ఫలదాయకమని తెలిపిరి.

శివ ప్రసాదమును శివ నిర్మాల్యమని కూడ నందురు. శివ నిర్మాల్యమును స్వీకరించి సేవన చేసెడి యధికారమెవ్వరికి గలదనెడి సందేహము కలగ వచ్చును. ఈ సందేహము తీర్చుటకై శ్రీ భగవత్పాదుల వారు నీ క్రింది యుపదేశమును ప్రదానము చేసిరి:

**నిర్మాల్యం నిర్మలం శుద్ధం శివేన స్వీకృతం యతః ।**
**నిర్మలై స్తత్పరైర్ధార్యం నాన్యైః ప్రాకృత జంతుభిః ॥**
**శివభక్తి విహీనానాం జంతూనాం పాపకర్మణామ్ ।**
**విశుద్ధే శివనిర్మాల్యే నాధికారోస్తి కుత్ర చిత్ ॥**
**శివలింగ ప్రసాదస్య స్వీకారౌద్య త్ఫలం భవేత్ ।**
**తథా ప్రసాదస్వీకారాధ్ గురుజంగమ యోరపి ॥**
**తస్మాద్ గురుం మహాదేవం శివయోగిన మేవ చ ।**
**పూజయేత్ తత్ర్పసాదాన్నం భుంజీయాత్ ప్రతివాసరమ్ ॥ ( సి.శి. 9: 76-79)**

ఏ పదార్థమును శివుడు స్వీకరించునో దానిని శివ నిర్మాల్యమని యందురు. అది యెంతో నిర్మలమైనదై యుండును. ఈ నిర్మలమైన శివ నిర్మాల్యమును స్వీకరించ వలెననిన స్వీకరించెడి వ్యక్తియును నిర్మలుడై యుండువలెను. పాప కర్మలను చేసెడి వారికిని, శివనిర్మాల్యమును స్వీకరించెడి యధికారము ప్రాప్తించదు. స్వేష్ట లింగము యొక్క ప్రసాదమును స్వీకరించుట చేత నే ఫలము సంప్రాప్తమగునో యట్టి ఫలమే గురు-జంగముల ప్రసాదము స్వీకరించుట చేత గల్గుచున్నది. ఈ కారణమున వీరశైవుడు తన యిష్ట లింగముతో బాటుగా గురు-జంగములను నను నిత్యము పూజించి త్రిలింగ ప్రసాదములను భక్తి శ్రద్ధలతో స్వీకరించ వలెను. ఇదియే శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశములోని సారాంశము.

శివ భక్తుని మనస్సు యొక్క నిర్మలతకు కారణ భూతమైనదే నిర్మాల్యము. ఈ కారణమున శివ భక్తుడు నిర్మాల్యమును ప్రతి దినము సేవించవలెను.

ఇది యిట్టులుండగా, శివ నిర్మాల్యమును స్వీకరించుట దోషమనియును, దానిని స్వీకరించిన వారు ప్రాయశ్చిత్తమును చేసి కొనవలె ననియును, తన్నిమిత్తమై కృచ్ఛ్ర వ్రతమును చేయవలెనని తెలుపబడినదనియును కొందరందురు. ఇట్టి వారు కొన్ని ప్రమాణముల నిత్తురు. వీరి సాధన వినిన పిదప శివ నిర్మాల్యమును స్వీకరించుట యెటుల యనెడి ప్రశ్న తలయెత్తును. వీరశైవ చింతామణి, వీరశైవానంద చంద్రికా వంటి గ్రంథములునీ విషయమున నొక స్పష్టమైన యాదేశము నిచ్చినవి వీటి ప్రకారము ప్రసాదము లేదా నిర్మాల్యమును ఆరు విధములుగా విభజింప వచ్చును. ఈ క్రింది ప్రమాణమును గమనించుడి:

**దేవస్వం దేవతా ద్రవ్యం నైవేద్యంచ నివేదితమ్ ।**
**చండ ద్రవ్యం బహిః క్షిప్తం నిర్మాల్యం షడ్విధం భవేత్ ॥ (వీ.చిం.పుట. 112)**

దేవస్యం, దేవతాద్రవ్యం, నైవేద్యం, నివేదితం, చండద్రవ్యం మరియు బహిః క్షిప్తములు నిర్మాల్యములలోని యారు రకములు. దేవుని కొరకు నివ్వబడిన గ్రామము, భూమి, దాస, దాసీజనులు దేవస్వలన బడుదరు. వెండి, బంగారము, రత్నాదులు దేవతా ద్రవ్యములన బడుచున్నవి. దేవునికి నర్పించుటక్తే సిద్ధ పరచబడిన పత్ర, పుష్ప, జల, ఫల మరియు నన్నాదులు నైవేద్యమన బడును. ఇవి నివేదన జరిగిన పిదప నవి నివేదితములగును. శివాలయములో చండీశ్వరునికి సమర్పించినవి చండద్రవ్యములన బడును. పిశాచాది యుసురీ శక్తులకై పెట్టిడిది బహిక్షిప్త మనబడును. వీటిలో దేవస్వ, దేవతా ద్రవ్యములు మరియు నైవేద్యములపై యెవ్వరికిని యధికారముండదు. రాజులు వేయించిన శాసనాలలో ఈ మూడింటిని యప హరించిన వాడు క్రిమిగా పుట్టునని తెలుప బడినది. "షష్టివర్ష సహస్రాణి విష్టాయాం జాయాతే క్రిమిః" అని హెచ్చరిక చేయబడినది. చౌర్యమును చేసినవాడు అరువది వేల వర్షముల వరకు క్రిమి యోనిలో జీవితము వెళ్ళ బుచ్చునని దీనిలోని భావము. చండ ద్రవ్యమును కూడ శివ భక్తులు స్వీకరింప వలదు. చండీశ్వరుని సంతతి వారమని చెప్పి కొనెడి వారు కొందరు గలరు. వారే యీ ప్రసాదమును గైకొందురు.

దక్షిణ భారత దేశములలోని కొన్ని దేవాలయములలో చండీశ్వరుని విగ్రహములను గాంచగలము. బహిః క్షిప్తము కూడ శివ భక్తులు తీసికొన వలదు. శివ భక్తులకు నివేదితముల యందు మాత్రమే యధికారము గలదు.

శివనిర్మాల్యమును గురుపుగారు చెప్పిన విధిన స్వీకరించ వలెననెడి నియమొకటి గలదు. దూర్వాస ముని కటాక్షించిన ప్రసాదమును నామునీశ్వరుడు చెప్పిన విధముగా స్వీకరించటలో వైఫల్యము చెందిన కారణమున శ్రీ కృష్ణుడు పూర్తిగా వజ్రకాయి కాలేక పోయెననియు, తత్ఫలితముగా నొక బాణాఘాతమునకు గురియై యసువులు బాసెననియును. చెప్పబడినది.

భక్తి స్థలము నందలి వీరశైవుడు, శ్రీ భగవత్పాపాదుల వారి యాదేశము మేరకు గురు-లింగ-జంగములను పూజించి వారి ప్రసాదమును బడిసి ధన్యులు కావలెను.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 28-9 - 1990
స్థలం : శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్య మహామంటపం
దోర్దువీధి బసవేశ్వర దేవస్థానం, రాగిచేన్నూరు

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులగు చంద్రశేఖర శివాచార్యుల వారు గురుసేవ, లింగసేవ, జంగమ సేవ మరియు వీరి వలన లభించెడి పాదోదక ప్రసాదములే నిస్సారమైన సంసారిక జీవితమునకు సారమును ప్రదానము చేసి ఇహపర సుఖముల నందజేయు సాధనములని ఆదేశమునిచ్చిరి.

ఈ స్థలమునకు ప్రసాద స్వీకృతి స్థలమనెడి మరొక పేరు గలదు. సిద్ధాంత శిఖామణి యొక్క కొన్ని ముద్రణలలోన యీ స్థలము ప్రసాద స్వీకృతి స్థలమని పిలువబడినది.

"సారోబలే స్థిరాంశే చన్యాయ్యే క్లీబం పరే త్రిషు" అనెడి యమరసింహుని వాక్కు ప్రకారము సారమనెడి పదము బలము, యుక్తము, శ్రేష్ఠము మరియు స్థిరములనెడి యర్థములలోన ప్రయోగించ బడుచున్నది. ఇవన్నియును గురు, లింగ, జంగమ మరియు పాదోదక ప్రసాదములకు వర్తించెడి వని గుర్తించ వలెను. భక్త స్థలములోని వీరశైవునకు చేవనిచ్చి యాధ్యాత్మకముగా సుసంపన్నము చేయునవియని గుర్తింప బడినది. బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి.

దాసోహమను సోపానము గొని పోయి గురువు గంటి, లింగము గంటి, జంగము గంటి, ప్రసాదము గంటి ఇట్లు చతుర్విధ సంపన్నుడినైతి చూడుమో, కూడల సంగమ దేవా! (బసవేశ్వర గీతామృతము, పుట. 490)

శ్రీ గురువు కరుణామయుడైన శివుడే, జీవుని యుద్ధరించి దీక్షనిచ్చి ఇష్టలింగమును కటాక్షించును. ఇష్టలింగము నంతర్లింగాను సంధానమునకు సాధనమై భక్తుని యాధ్యాత్మిక ప్రగతికి తోడ్పడును. ఆధ్యాత్మక ప్రగతిని యెప్పటికప్పుడు సమీక్షించి ప్రగతి గతిని నిరోధించెడి అడ్డంకులను తొలగించి సాధకుని సుశిక్షితుని చేసెడి లక్ష్యముతో శివుడే జంగముడై విచ్చేయును. ఈ ముప్వురు నారాధనీయులు, వీరి కరుణామృతమే పాదోదకత్రయము. చతుర్విధ మోక్షముల కంటెను నధికమగు ఫలము నిచ్చెడిదే వీరి భుక్తాన్న శేషము.

లింగధారియైన వారికి గురు-స్వేష్టలింగ జంగములే పూజనీయులు. మరితరము లేవియును ఆరాధ్యములు కావు పాదోదక ప్రసాదములే స్వీకరణ యోగ్యము. యితరములు తిరస్కృతి యోగ్యములు. శివుడొక్కడే వరుడనియును, నతడే జగత్కారణుడనియును, శివాగమములు తెలుపు చున్నవి. ఇతడు త్రిమలాతీతుడు. ఇతరేతరులు మలదేహులు, మాయాపాశ బద్ధులు. అందుచేత, శ్రేష్ఠులుగారు. గురు-జంగములు శివుని కంటెన నధికులని శివాగమములు తెలుపు చున్నవి. వారి పాదోదక ప్రసాదములు వారి వలెనే శ్రేష్ఠాతి శ్రేష్ఠమైనవి.

మనము సంపాదించెడి ధనాదులన్నియును నస్థిరములు. చలన స్వభావము గల్గినవి. గురుసేవ లింగ సేవ, జంగమ సేవ, పాదోదక సేవనము, ప్రసాద స్వీకారము వలన లభించెడి ఫలము శౌశ్వతమైనది. సంచిత కర్మను పటాపంచలు చెసెడి సామర్థ్యము గలవి. ప్రారబ్ధ కర్మ పరువెత్తి పోవును. ఆగామి కర్మ అగ్గిపాలై బుగ్గియగును. భక్తుడు కర్మ జిత్తగును.

పాదోదక భావన కొంగ్రొత్తది కాదు. దేవాలయాదులలో నిచ్చెడి తీర్థము నాయా దేవతల పాదోదకములనియే భావించు బడుచున్నవి. భారతాది యితి హాసములలో పెద్దల పాదములు కడిగి వాటిని తలమీద చిలకరించి కొనెడి సాంప్రదాయము గలదనెడిది చెప్పబడినది. బ్రాహ్మణ పద్ధతిని పాటించెడి వారును శ్రాద్ధ సమయములో పితృదేవతల ప్రతిరూపముగా వచ్చెడి బ్రహ్మణుల పాదములు కడిగి వాటిని నెత్తి మీద చల్లి

కొనెడి సాంప్రదాయము గలదని తెలియ చున్నది. లింగ ధారులలోన జంగమ పాదోదకమును, గురు పాదోదకములో జలకాలెడి సాంప్రదాయము కలదు. పరంపరాను గతముగా వచ్చెడి ఆచారము ప్రకారము గంగానదిలో మునిగెడి భక్తుడైనను గురు-జంగముల పాదమును తలమీద నిడికొని యాతీర్థజలమున స్నానమాడ వలెను. ఈ విషయమును విశద పరచుచు దానివలన గల్గెడి ఫలితమును సమీక్షించెడి యీ క్రింది పద్యమును గనుడి.

**పలు తీర్థంబుల గ్రుంకు కంటె మహిలో భక్తాంఘ్రి పానీయముల్ ।**
**తల మీదం జిలకించి కొన్న శుచి తీర్థం బాద భారంబుత**
**త్ఫలమత్సల్పము భక్త పాదయుగాళా భస్పర్శ నిర్ఝరమై**
**యలరున్ శాశ్వత భక్తి ముక్తి ఫలదంబై యుండు సర్వేశ్వరా! (సర్వేశ్వర శతకము 23)**

పాద తీర్థము వలన పాపప్రక్షాళనమే కాదు, శివానందము, శివజ్ఞానము లభించునని చేప్పబడినది. పాదమనగా ప్రసన్న త్వమనియును, తీర్థమనగా జ్ఞానమనియును శ్రీ భగవత్పాదులు మరొక సందర్భమున తెలియజేసిరి.

సాంగత్య దోషము వలన కొందరికి నితరేతర తీర్థముల యెడల యెంతో భక్తి గల్గి గురు-జంగమముల పాదోదకమును స్వీకరించుటలో ననాసక్తి గల్గుచున్నది. ఇష్టలింగమునకు దూరమై గురు-జంగముల యెడల నిరాసక్తి గల్గిన వారు కొందరైతే, పవిత్రమైన యిష్టలింగము పై గురు-జంగముల పాదోదకము వేసికొని గ్రహించుట యెట్టులనెడి సందేహముచే బాధపడెడివారు మరి కొందరు. ఇట్టి వారు నీ క్రింది బసవేశ్వరుల వారి వచనమును గనుడి:

గురు-లింగ-జంగముల వలన పాదోదక ప్రసాదములైనవి, ఆ భావన మహా ప్రసాదమై నాకు వేరే ప్రసాద మనెడిది లేదు కూడల సంగమ దేవా! (బసవేశ్వర గీతా. పు. 325)

గురు-జంగముల పాదోదకము యెడల భక్తిని, యనురక్తిని పెంపొదించు కొనవలెననెడిదే గ్రహించ వలసిన విషయము.

ప్రసాద మహిమ శ్రుతులలో నుతింప బడినది. శివాగమమములు ముక్త కంఠముతో శివ ప్రసాద మహిమను చాటు చున్నవి. పాపక్షయమును పుణ్యప్రాప్తిని గల్గించెడిది ప్రసాదమని చెప్పబడినది. లోకమున నధిక సంఖ్యాకులు ప్రసాదమనగా లింగమునకు నర్పించి గొనుననదేయని భావించు చున్నారు. లింగార్పితము చేసి యనుభోగము చేసి తృప్తిని పొందు చున్నారు. తాము భక్తిని చేయుచున్నామని చెప్పుటకు జంకుట లేదు. వీరిలో కొందరు స్థావర లింగముల కర్పించునదియే యుత్తమ మైన దని భావించు చున్నారు. వీరశైవ ధర్మము ప్రకారము వీరి భక్తియ సంపూర్ణమైనది. లింగమునకు నివెదించినది ప్రసాదము కాదనియును, చరలింగములైన గురు-జంగముల భుక్తాన్న శేషమే నిజమైన ప్రసాదమని యనెడి వాదన యొకటి గలదు. ఈ వాదనను హేతుబద్ధముగా ప్రతి పాదించిన ఘనత శ్రీ బసవేశ్వరుల వారికి దక్కును వీరి యీ క్రింది వచనమును గనుడి:

**అర్పితమర్పితమను చుండిరి...... లింగమునకిమ్మనది యుర్పితమే?**
**సవి సవి గొని యివ్వవలె గదా! అర్పితమర్పిత మనుచుదురెల్లరు**
**అర్పిత ముఖమునరయరు చూడుడో జంగమునికై యిడి జంగమ ప్రసాదము గొని రేని**
**నీకర్పితము కానుడో, కూడల సంగమ దేవా! (బ. గీ. అ. పు. 487)**

భక్త స్థలములోని వీరశైవుడు తెలిసికొన వలసిన దేవనగా, ప్రతి దినము గురు-లింగ-జంగములను పూజించి, పాదోదక ప్రసాదములగొని పునీతుడు కావలెను.

జంగము దున్న పిదప లింగ పూజలేల యనెడి వాదమొకటి గలదు. పండితారాధ్య చరిత్రలో నీ విషయము ప్రతి పాదించబడినది. అందుచేత, అనివార్యమైనవి గురు-జంగమ తీర్థ ప్రసాదములే. ఈ దృష్టితో చూసిన యెడల గురు పాద తీర్థము, జంగమ పాద తీర్థము, గురు ప్రసాదము, జంగమ ప్రసాదములనెడి నాలుగు చతుర్విధ సారాయములన వచ్చును.

నేటి స్థితిలో నీ విధిన భక్తిని చేయుట సుసాధ్యమైన విషయము కాదు. సాధ్యమైనంత మేరకు భక్తుడు గురు పాదోదక ప్రసాదములను జంగమ పాదోదక ప్రసాదములను తీసుకొనుటకు కృషి చేయవలెను. సాధ్యము కాని పక్షమున లింగ పాదోదక, ప్రసాదములతో తృప్తిని పొందవలెను.

నాస్తికులకును, శివభక్తి లేని వానికిని, అంగమున లింగము లేని వారికిని, అను నిత్యము స్వేష్టలింగ పూజ చేయని వానికిని చతుర్విధి సారాయములు సకారాత్మక ఫలితముల నివ్వజాలవు కొన్ని వేళలలో నమ్మిక లేని వానికి ప్రతికూల ఫలితములు పొడచూప వచ్చును. అందుచేత నీ కోవకు చెందిన వారికి పాదోదక ప్రసాదముల ప్రదానమును చేయ వలదు. "నమ్మనివారికి ప్రసాదమొక కాల కూట విషమని" శ్రీ బసవేశ్వరుల వారు సెలవిచ్చిరి.

శివం భూయాత్

## ఆశీర్వచనము : 1

## సోపాధి - నిరుపాధి-సహజదాన స్థలములు

శ్రీ రేణుక భగవత్పాదుల వారు చతుర్విధ సారాయముల గురించిన జ్ఞానమును ప్రదానము చేసిన పిదప యీ స్థలమున దానము యొక్క స్వభావాదులను, వాటిని పొంద గల్గిన వారి స్వరూప-స్వభావాదుల గూర్చి ఉపదేశించిరి.

**శ్లో ॥ శివ లింగే శివాచార్యే శివయోగిని భక్తిమాన్ ।**
**దానం కుర్యాద్ యథా శక్తి తత్ప్రసాదయుతః సదా ॥**
**దానం చ త్రివిధం ప్రోక్తం సోపాధినిరుపాధికమ్ ।**
**సహజం చేతి సర్వేషాంత్రేషు సర్వతంత్రవిశారదైః ॥**
**ఫలాభిసంధి సంయుక్తం దానం యద్విహితం భవేత్ ।**
**తత్ సోపాధికమాఖ్యాతం ముముక్షిభిరనాదృతమ్ ॥ (సి.శి. 9: 80-82)**

మానవ సమాజమునికై భోధింప బడిన దశవిధ ధర్మముల యందున దానము, ఒకటై యున్నది. స్వత్వ నివృత్తి పూర్వకముగా సత్పాత్రత యందున ధనాదులను సమర్పించనది దానము. భక్తుడైన వాడు శివలింగమునకు, శివాచార్యులకు మరియు శివయోగికి తన శక్తి-భక్తుల కనుసారముగా ఎప్పుడూ దానమును చేయు చుండవలెను. ఈ విధముగా చేసెడి దానములు మూడు విధములుగా నుండును. అవి : సోపాధిక, నిరుపాధిక మరియు సహజ దానములు. మొదటగా సోపాధిక దానము గూర్చి తెలిసికొనెదము గావుత.

## సోపాధిక దాన స్థలము :

ప్రతిఫలాపేక్ష చేత చేయబడెడి దానమును సోపాధిక దానమని యందురు. ఇది అంతగా ప్రశస్తమైనది కాదు. అందుచేతనిది ముముక్షువుల చేత నాదరింపబడుట లేదు.

"ప్రయోజన మనుద్దిశ్య మందోఽసిన ప్రవర్తతే" అనెడి లోకోక్తి యొకటి కలదు. మనుష్యులు ఏదోనొక పనిని చేపట్టు నప్పుడు మొదటగా ఆ కార్యము గురించిన ప్రతిఫలము గురించెయే ఆలోచించును. ప్రయోజనము లేదా ప్రతిఫలము లేకుండిన యెడల మందబుద్ధి గల వాడైననూ యే కార్యమునూ చేపట్టడు. మనుజని ప్రవృత్తి సాధారణముగా ఫలాత్మకమై యుండుట చేత, ప్రతియొక్క లౌకిక మరియు పారలౌకిక కర్మలకు ఫలమును బోధించెడి పద్ధతి కొనసాగుచు వచ్చు చున్నది. ప్రతి ఫలమే ప్రతివ్యక్తిని తన వైపుకు నాకర్షించు చున్నది. ఈ కారణము వలననే ప్రతి క్షేత్రము నందున ప్రతియొక్కరు వ్యాపార దృష్టి కోణముగల వారై లాభము నభిలషించు చున్నారు.

ఫలాపేక్షకు సంబంధించిన మనోవృత్తి యెంతో ప్రబలమైనది. ఇది ఎవరి మనస్సున నుండునో, యట్టివారు నేయే కార్యములు చేపట్టు చున్నారో, ఆయా సందర్భములలో పలు మార్లు ఫలాపేక్ష గల మనోవృత్తి వారి మనస్సులలో మద్భవించుచునే యుండును. ఈ కారణము చేత చేసెడి కార్యము నందున సంపూర్ణమైన సంయోగము జరుగదు. మనస్సు పూర్ణముగా సంయోగము చెందని కారణమున ఆయా కార్యములు అభిలషణీయమైన మేరకు సంభవించుట లేదు. ఇట్టి కోవకు చెందిన యే కార్యమునైననూ ముమక్షవులు చేపట్టుట యనెడిది వాంఛనీయము కాదు. ఎట్టి స్థితిలోను అద్దానిని వారు చేపట్టు కూడదు.

"తేన త్యక్తేన భుంజీథాః" అనెడి ఈ శావాసో పనిషత్ లోని ఉక్తి ప్రకారము, ప్రతి మనుజుడు, ఎద్దేని ననుభవించ వలెనైననూ అందులోని కొంత భాగమును అవశ్యముగా దానము చేయవలెను. దానమును చేయుట చేత మనుజుని సంకుచితమైన స్వార్థభావములు తగ్గు ముఖమును పట్టును. నిస్వార్థమైన సమిష్టి భావములు ఉద్భవించును. ఈ విధముగా దానరూపమైన ధర్మము, మనుజుని ఆధ్యాత్మిక ప్రవృత్తికి కారణమై యుండుట చేత, దీనిని ధర్మమనియే పరిగణించినారు. తాను కష్టపడి సంపాదించిన ధన, ధాన్య, వస్తు వాహనాదులను మనజుడు దానము చేయ వచ్చును. దీనిని చేయుట చేత, మనము అపేక్షించక యుండిననూ, దాని ఫలము మనకు దొరికియే తీరును. ఇట్టులైననూ ఎందరో జనులు ప్రతిఫలము నాశించియే దానమును చేయు చున్నారు. ఇట్టి దానము సామాన్యజనులకు ప్రీతి పాత్రమై యుండిననూ, ముముక్షువులకిది యప్రీతి కరమైనదై యుండును. ముముక్షువులైన వారికి ఐహిక లేదా పారలౌకికమైన ఫలాపేక్షలు ఉండవు. అందుచేత, సోపాధిక దానము అంత ప్రశస్తమైనది కాదని వారి యభిమతము. ముముక్షువుల చేత అనాదృతమైనదై యుండిననూ, జనసామాన్యమున. ధర్మమార్గమున పయనింపజేయుటకై ఇయ్యది దోహదకారిగా యుండట చేత దీనిని ధర్మమనియే పరిగణింతురు. ఈ విధముగా దానము యొక్క మొదటి అవస్థయే సోపాధిక దానమని ఎరుగ వలెను.

## నిరుపాధిక దాన స్థలము :

లౌకిక లేదా పారలౌకిక ఫలాపేక్ష లేకుండగా చేసెడి దానము నిరుపాధిక దానమనబడు చున్నది. దీనిని గూర్చి శ్రీ పూజ్యపాదులవారు ఈ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి.

**ఫలాభి సంధినిర్ముక్త మీశ్వరార్పిత కాంక్షితమ్ ।**
**నిరుపాధికమాఖ్యాతం దానం దానవిశారదైః ॥ (సి.శి. 9:43)**

ఫలాపేక్ష లేకుండగను, ఈశ్వరార్పిత బుద్ధితోను చేయబడెడి దానము నిరుపాదికదానముగ పరిణమించునని దానవిశారదులచేత చెప్పబడినదని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి. దీనినే నిష్కామ దానమని యందురు.

లోకలోకాంతర ఫలముల నపేక్షించుట చేత గల్గెడి పరిణామమెట్టిదో చాల మందికి తెలియదు. ఇది బంధమై, జీవుని సంసారమున పడియుండే విధముగా కట్టి వేయుచున్నది. ఇట్టిది సంభవించ కూడదని, ముముక్షువులు ఈశ్వరార్పణ బుద్ధితో దాన ధర్మములను చేయుదురు. ఈశ్వరార్పణ బుద్ధిని మినహాయించిన యెడల, మరెట్టి కోరికయూ లేకుండగ యీ దానము చేయబడుట చేత దీనిని నిష్కామ దానమని కూడ అందును. దానము నొక కర్మగా భావించెడి వారికి, నిరుపాధిక దానము నిష్కామ కర్మగా గోచరించును. ఉపనిషద్బ్రహ్మవాదులు ప్రతిపాదించెడి కర్మవాదములో నిష్కామ కర్మకు నెంతో ప్రాముఖ్యత గలదు. కర్మబంధములు విచ్ఛిన్నమగుననియును, పునర్జన్మ కాస్కారము ఉండదనియును తెలుపబడినది.

ఈశ్వరార్పణ బుద్ధికిగల ప్రాముఖ్యత యెట్టిదో యనెడిది తెలిసికొనుట యెంతో అవసరము. జీవుడు సాధారణముగా తన హితా హితములనా కాంక్షించియే కర్మల నాచరించును. తన హితము తనకు తెలియునని భావించికొని, తాదను గుణమైన కర్మను చేపట్టును. వచ్చెడి ప్రతి ఫలము వలన తనకు హితమగునని భావించు చున్నాడు. హితా హితములు నిర్ణయించుటలో జ్ఞానాజ్ఞానముల కెంతో ప్రాముఖ్యత గలదు. అజ్ఞాన పరవశుడైన వానికి హితము అహితముగాను, అహితము, హితముగాను గోచరించును. వారు చేపట్టెడి కర్మలు వారికి హితకారిగా కావలెనని భావించుకొని కర్మము అహితములను తెచ్చి పెట్టును. భస్మాసురుని వంటి వారు అతిఘోరమైన తపస్సు చేసి, తపఃఫలమును పొందిరి. అది వారికి యహితముగా పరిణమించెను కాదా! అందుచేత జీవుడు హితా హితముల చింతనను వీడవలెను. ఆ బాధ్యతను సర్వజ్ఞుడైన సర్వేశ్వరునికి వదిలివేయ వలెను. మనకేది హితము, ఏది అహితమనెడిది అతని కంటెను హెచ్చుగా నెరిగెడి వారెవ్వరు దానము చేయుటయే భక్తునిగా తన కర్తవ్యమై యున్నదని యెంచను. కర్తవ్యమును పూర్తి చేయుటకే దానమును చేయ వలెననెడి సత్సంకల్పమును చేబూని దానమును చేయును. మనకు హితము గల్గినప్పుడు, ఎయ్యది అభిలషణీయమో నయ్యది భగవంతుడు చేకూర్చి హితకారియగును. ఈ కారణముననే శ్రీ భగవాత్పాదుల వారు ఈశ్వరార్పణ బుద్ధితో దానములు చేయ వలెనని నిరుపాధిక దానస్థలమున బోధించిరి.

## సహజదాన స్థలము:

దాన ప్రక్రియలో త్రిపుటములుండును, దాత, స్వీకర్తృ మరియు వస్తువులనెడివి త్రిపుటములు. "దానమిచ్చెడి వానిని నేను, దానము స్వీకరించెడి వాడతడు, దానమిచ్చెడిది యిది" అనెడి భావమును వీడి, చేయుబడు దానమే సహజ దానమని పిలువ బడుచున్నది. ఈ దానము మిగిలిన రెంటి కంటెను విశిష్టమైనది. ఇతరేతర ధర్మ గ్రంథములలో దీని ప్రస్తావన గాన రాదు సకామ, నిష్కామములనెడివే వివరింప బడినవి. ఈ భావము సిద్ధాంత శిఖామణిలోనే వివరింప బడినది. అందుచేత యీ గ్రంథము యొక్క ఉత్కృష్టత స్పష్టమగు చున్నది. ఈ దానమును గురించి భగవత్పాదుల వారిచ్చిన యుపదేశమియ్యది.

**అదాతృ దాతృదేయానాం శివభావంవిచింత్యహి ।**
**ఆత్మనో కర్తృ భావం చ యదుద్దత్తం సహజం భవేత్ ॥**
**సహజం దానముత్కృష్టం సర్వదానోత్తమోత్తమమ్ ।**
**శివజ్ఞానప్రదం పుంసాం జన్మరోగనివర్తకమ్ ।**
**శివాయ శివభక్తాయ దీయతే యది కించన ।**
**భక్త్యా తదపి విఖ్యాతం సహజం దానముత్తమమ్ ॥ (సి.శి. 84:86)**

శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము యొక్క తాత్పర్య మీ క్రింది విధముగా నున్నది.:

దానముచేయువాడు దానమును స్వీకరించెడి వాడు, దానము చేసెడి వస్తువు శివస్వరూపము లేయని భావించి కొని, తన యందు అకర్తృత్వ భావనల నెలకొల్పిదాల్చికొని చేసెడి దానమే సహజదానము. సోపాధిక, నిరుపాధిక దానముల కంటెను నిది యుత్కృష్టమైనది. దీని వలననే శివభక్తుడు జనన మరణాత్మకమైన సంసార రోగమును నివారణ చేసికొని శివతాదాత్మ్య భావనను పొందుచున్నాడు. శివునికి గాని, శివ భక్తునికి గాని భక్తితో ఏదైననూ ఇచ్చిన యెడల నది సహజ దానమగునని శ్రీ భగవత్పాదులవారి భావమై యున్నదని గ్రహించగలరు.

సహజ దానములో "దాతా భోక్తా స్వయం శివః" అనెడి భావన యిమిడి యుండును. ఇచ్చెడి వస్తువు కూడ శివ స్వరూపమే. అప్పుడు త్రిపుటువులనెడి భేదభావము భగ్నమై "సర్వం శివ మయందానం" అనెడి భావమేర్పడు చున్నది. ఈ భావమును నేపథ్యముగా గొని, శివ భక్తుడు గురు-లింగ-జంగములకు దానము నివ్వవలెను.

ఈ దానము వలన దాత శివజ్ఞాన సంపన్నుడై సంసారమనెడి జననమరణాత్మక రోగము నుండి నివారణను పొందును. లింగాగ సామరస్యమును సాధించుటకై వలయు అర్హతను పొందు చున్నాడు.

అపాత్ర దానము చేయకూడదనెడి నియమ మొకటి కలదు. అట్టి దానము నిష్ఫలమగును. మీదు మిక్కిలి అట్టి దానము వలన దోషము సంప్రాప్తమగునని బావింపబడు చున్నది.

**దానాత్ స్వర్ణసహస్రశ్య సత్పాత్రే యత్ఫలం భవేత్ ।**
**ఏక పుష్పప్రదానేన శివేతత్ ఫలమిష్యతే ॥**
**శివ ఏవపరంపాత్రం, సర్వవిద్యానిధిర్ గురుః ।**
**తస్మై దత్తంతు యత్ కించిత్ దనంతఫలం భవేత్ ॥**
**శివయోగి శివః సాక్షాత్ః వజ్ఞాన మహో దదిః ।**
**యతి నాచి దీ యతేతస్మై తద్దానం పారమార్థికం ॥**
**శివయోగీ మహాపాత్రం సర్వేషాం దానకర్మణీ**
**తస్మాన్నాస్తి పరం కించిత్పాత్రం శాస్త్ర విచారతః**

**భిక్షామాత్ర ప్రదానేన శాంతాయ శివయోగినే**
**యఃఫలంలభ్యతే నైతద్ యజ్ఞకోటి శతైరపి.**

**శివయోగిని సంతృప్తే తృప్తో భవతిశంకరః**
**తత్ తృప్త్యా తన్మయం విశ్వం తృప్తిమేతి చరాచరం**
**తస్మాత్సర్వ ప్రయత్నేన యేన కేనాపి కర్మణా**
**తృప్తిమ్ కుర్యాత్ సదా కాలమన్నాద్యైః శివయోగినః**

**నిరుపాధిక చిద్రూప పరానందాత్మవస్తుని ।**
**సమాప్తంసకలంయస్యసదానీ శంకరః స్వయం ॥ (సి.శి. 9-87:94)**

శ్రీ భగవత్పాదుల వారి పై ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా సత్పాత్రుడైన వానికి ఒక వేయ్యి బంగారు నాణెములను దానము చేసిన యెడల ఏ ఫలము ప్రాప్తమగు చున్నదో అంతటి పుణ్యము యిష్టలింగమునకు ఒక పుష్పమును సమర్పించినంత మాత్రమున ప్రాప్తమగును. ఈ జగత్తునందలి సర్వవిద్యలకు నిధియు మరియు అందరికినీ గురుస్థానమున నుండిడి శివుడు ఒక్కడే సర్వోత్కృష్టమైన సుపాత్రుడు అయియున్నాడు. ఈ కారణమున అతని స్వరూపమైన గురువు గారికి ఇవ్వబడెడి దానము అనంతమైన ఫలమును యిచ్చెడిదై యుండును. ఇంకను శివజ్ఞాన సంపన్నుడైన శివయోగి కూడా సాక్షాత్తు శివ స్వరూపుడే. ఆ శివయోగికి ఏమి దానము చేసిననూ అది అత్యంత ఫలదాయకమై సహజదానమై వుండును. దానమును తీసికొనెడి విషయములో శివయోగిని మినహాయించితే వేరెవ్వరూ కూడా సుపాత్రులుకారు. అతడొక్కడే మహాపాత్రుడు. ఈ విచారము శాస్త్ర సమ్మతమై యున్నది. శాంతస్వరూపుడైన ఇట్టి శివయోగికి ఒక్క ముద్ద అన్నమును దానము చేయగా వచ్చెడి పుణ్యము ఒక కోటి యజ్ఞనములు చేసిన వచ్చెడి పుణ్యము కంటెను అధికముగా నుండును.

శివయోగి శివస్వరూపుడై యుండటచేత సాక్షాత్ శివుడే తృప్తుడగును అనెడిది అవిస్మరణీయమైన అంశము. ఈ కారణము వలన ప్రతి వీరశైవుడు తప్పని సరిగా శివయోగికి అనగా జంగమయ్యకు అన్నదానము చేయవలెను. తద్వారా అతనిని సంతృప్తి పరచవలెను. మరొకమాటలో చెప్పవలెనన్న సహజదానము చేత గురు-లింగ-జంగముల స్వరూపుడైన శివునికి తన తను, మన, ధనములను సమర్పించిన యెడల అదియె సర్వోత్కష్టమైన సహజదాన మగు చున్నది. ఇట్టి సహజదానమును చేసినవాడు సాక్షాత్ శివ స్వరూపుడే అగుచున్నాడు.

ఈ విధముగా శ్రీ జగద్గురు రేణుకాచార్య భగవత్పాదులవారు దానమునకు సుపాత్రులైన శివునికి, తత్సమాన శివయోగులకు దానము చేసిన కలిగెడి ఫలశ్రుతిని ప్రతిపాదించిన తరువాత ఈ భక్త స్థలము యొక్క సహజదాని మున్నుందుగల మహేశ్వర స్థలమును ఏవిధముగా ప్రవేశించునో అనెడి విషయమును ఈ క్రింది విధముగా ప్రతిపాదించిరి.

**ఉక్తాఖిలాచార పరాయణోస్సౌ సదావితున్వన్ సహజంతుదానమ్**
**బ్రహ్మాది సంపత్సు విరక్త చిత్తోభక్తోహి మహేశ్వర తాముపైతిః (సి.శి. 9-95)**

ఈ ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా ఈ భక్త స్థలమునందున యిప్పటి వరకు ఉపదేశము చేసిన పిండ స్థలమును మొదలుకొని సహజ దాన స్థలమున నున్న సాధకుడు సహజదానమును చేయుట యందు అభిరుచి కలవాడై బ్రహ్మ, విష్ణు మొదలైన పదవుల యందు నిరాసక్తుడై వుండి విరక్త భావమును గైకొనిన యెడల ముమ్ముందు మహేశ్వర స్థితిని పొందగలడు. అని ఆదేశమును యిచ్చిరి.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 25-9 - 1990
స్థలం : శ్రీ జగద్గురు విశ్వేశ్వర శివాచార్య మహామంటపం
దీనితో శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభు శ్రీంథమునవను పరిచేయము సంపూర్ణము.

## విశేషప్రదీపిక

దానముల స్వరూప స్వభావములను వివరించి యుత్తమమైన దానమెట్టిదో యనెడి విషయమున శ్రీ కాశీ జగద్గురువులవారు విజ్ఞాన దాయకమైన యుపదేశామృతమును ప్రదానము చేసిరి.

భారతదేశ సంస్కృతిలో దాన ధర్మములకితోధికమైన ప్రాముఖ్యత గలదు. దానగుణ విశిష్టులైన వారెందరో తరగని ఖ్యాతిని యార్జించిరి మహా భారతమున వ్యాసుడు చిత్రించిన కర్ణుని పాత్ర మరువజాలనిదై యున్నది.

ధర్మశాస్త్రము ప్రకారము, దానమనెడిది యొక కర్మ. ఇయ్యది కామ్య కర్మల కోవకు చెందినది. ఇహలోకములోను, పరమునను పరమ సుఖము నాశించెడి వారు పుణ్యఫల ప్రాప్తికై దానములను చేయుదురు వైవాహిక తంతులో కన్యాదానమనెడిది మన మెరుగుదుము. దీయుతే దానం అనెడి వ్యుత్పత్తి ప్రకారము దానమనగా "నిచ్చుట" అనియే. ఇచ్చట విశేషార్థము లేదు కాని దీని పర్యాయపదమైన "ప్రతిపాదనమ్" అనెడిది విశేషార్థమును సూచించు చున్నది. "ప్రతిపాద్యతే అనేన" అనెడి వ్యుత్పత్తి ప్రకారము దానము చేత పుణ్యము ప్రతిపాదింప బడుచున్నది. "అపవర్జనమ్, అంహంతి" అనే పర్యాయ పదములు పాపనాశనమనెడి యర్థమును సూచించును. వితరణ మనెడి పర్యాయ పదము ప్రకారము దానము చేత నరకము దాటబడుచున్నది. గోదానమునకీ యర్థము నన్వయింతురు భస్మధారణ స్థలములో గోదాన ఫలితము గురించిన విశేషాంశములను తెలిసి కొంటిమనెడిదిచ్చట స్మరణీయము.

భక్తి మార్గమున భక్తియే పరమ పురుషార్థము. అద్దాని నార్జించుటకై దానము సాధనముగా గైకొన బడుచున్నది. అనుభవసారములోని యీ క్రింది పద్యమును గమనించుడి.

**క. తను వొగ్గి ప్రాణమమ్మియ**
**ధన మెదురిచ్చియును భక్తిదా బడుయుట వ్రే**
**గనినం దనువును బ్రాణము**
**ధనమును పంచింప భక్తి దగ దొరకునొకో! (అనుభవ సారము, ప. 101)**

తమ-మన-ధనములను వ్యయరచ కుండగను చేసెడి భక్తి నిష్ఫలమగునని తెలియు చున్నది. శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి.

తను మన ధనము వెనుకనుంచికొని మాటల వామిని లోన లొటారము నుడువుదురు మీరెల్లరు వినుడో! తల లేని కోట పొల్లి పోవును గదా! గురిని తాదాక గలదా ! మాయాపాశము సడలి మనసు గంటువిడని దనుక కూడలు సంగను దేవుడు డెటూల పలచు నయ్యా! (బ. గీ. అ. పు. 2:12)

దానమనెడి ప్రక్రియలో దాతృ, గ్రహీతృ మరియు దత్త మనెడి యంశములుండును. దాతృదాన మిచ్చెడి వాడైతే, గ్రహీతృనద్దానిని తీసికొనెడి వాడు. దాతృయొక్క మానసిక స్థితిగతి మరియు దానితో నంతర్గర్భితమైన భావన దానము యొక్క స్వభావమును నిర్ణయించెడి యంశమని గుర్తించవలెను. బసవపురాణములోని మడివాలు మాచయ్యగారి కథలో నహంకార రహితముగా దానము నివ్వవలెనని తెలిపెడి యంశములు సోదాహరణ పూర్వకముగా నిరూపింపబడినవి. బసవన్నను, ముక్కంటి మూడవ కన్నును వేడిన సందర్భమును వివరించెడి కథనము నందున నిష్కామ దానము యొక్క విశిష్టత నిరూపింపబడినది. ఈ క్రింది ద్విపదలను గనుడి:

**మోడకు మోడకు మోరోరి ! సంగ !**
**మోడకు మోడకు మొక్కటియు నొల్ల**
**నెరుగవే సత్యమాహేశ్వరు లిండ్ల**

**నెరయంక కానిని నిజగతినన్ను**
**దాసయ్య వలె నిన్ను దవనిధివేడ**
**నా సిరియాలు నట్లాత్మజు గోర**
**గనక వృష్టినడుగ కరికాలు నట్ల**
**వనితకు నెడపుచ్చు మననంబిభాతి**
**వెండియు గుమ్మర గుండయ్య కిచ్చు**
**మిండ ప్రాయంబు గామింప గాదేని**
**స్వర్గాపవర్గాది సౌఖ్యంబు లొల్ల............. ( బసవపురాణము, ద్వి. ఆ)**

శ్రీ భగవత్పాదుల వారు పదేశించిన సహజ దానము గురించిన వివరణ ననుభవసారమున నీ క్రింది విధముగా నున్నది.

**వచ్చునెడ లింగ వశమను**
**నిచ్చునెడ భక్తులెల్ల నీశుండను ము**
**న్నిచ్చియు నిచ్చిన యెడదా**
**నిచ్చితినన దచల భక్తుడిల త్రిపురారీ ! (అనుభవ సారము, 147)**

భక్తుడు పొందెడి ధనాదులు శివుని కృపయే. అందుచేత నవి శివునివే. భక్తునివికావు. ఇట్టి భావమునే భక్తుడు దాల్ప వలెను. గ్రహిత్ర యెవ్వరనెడి ప్రశ్న వచ్చినప్పుడు, పాత్రత యనెడి యంశము వచ్చును. పాత్రత యెరుగనిదే దానము చేసిన వారు భ్రష్టులగుదురని చెప్పబడినది. ప్రాకృతులు బ్రహ్మణునికి దానమిచ్చెడి పద్ధతిని పాటింతురు. బ్రాహ్మణునికి దానము చేసిన బలి, కర్ణ, దక్ష, పరశు రామాదులు కష్టములు పాలైరని బసవన్న తెలిపిరి. జంగమయ్య మాత్రమే దానమును స్వీకరించెడి పాత్రత గల్గియుండునని "చతుర్వేద సారము" తెలుపు చున్నది. శివ–జంగముల కభేదముండుటచే దాతృ శివునికే దానమిచ్చిన వాడగు చున్నాడు. దాన వస్తువులోను శివుడుండును. ఇచ్చెడి భక్తుడు శివుని ద్రవ్యమును శివునికే యిచ్చి శివతృప్తిని పొంది మంగళమును గాంచునని గ్రహించవలెను.

శివం భూయాత్

# దశమ పరిచ్ఛేదము

## ఆశీర్వచనము :1

## మాహేశ్వర స్థలము

ఇంత వరకు శ్రీ భగవత్పాదుల వారు భక్త స్థలములోని అవాంతర భేదములన్నింటిని గురించి వుపదేశించిన పిదప ఈ స్థలమున మహేశ్వర స్థలము గురించి ఉపదేశించుచున్నారు.

**"శివే భక్తి : సముత్పన్నా యస్యాసౌ భక్తఉచ్యతే"** (సి.శి. - 5-26)

అనెడి ఆచార్య మూక్తి ప్రకారము శివుని యందు ఎవరు శ్రద్ధతో వర్తింతురో వారు భక్తులని పిలువబడుచున్నారు. వీరశైవ సిద్ధాంతమునందున భక్తి ఆరు విధములుగా విభజించిరి. మొదటిది శ్రద్ధా భక్తి ఎవరిని మనము పూజింతుమో వారి ఎడల అమితమైన శ్రద్ధ వుండుట ఎంతో అవశ్యము. శ్రద్ధా విహీనమైన పూజ నిష్ఫలమైనదగును. ఈ శ్రద్ధా భక్తిని పెంపొందించుకొనిన వాడే భక్తుడన బడుచున్నాడు. పూజ్యేషు అనురాగో భక్తిః అనెడి ఉక్తి ప్రకారము పెద్దవారైన తల్లితండ్రుల మీద, గురువుల మీద చూపెడి ప్రేమయే భక్తి. ఈ విధముగా ప్రేమానురాగములతో కూడిన భక్తి కలవాడై భక్త స్థలమునందలి వివిధ అవాంతర స్థలములలో ప్రవేశించి ఆయా నియమావళిని పాటించి సాధనల వలన పరిపక్వత పొందినవాడు భక్త స్థలమును దాటి మహేశ్వర స్థలమునకు చేరుచున్నాడు. ఈ విషయమును భగవాత్పాదుల వారు అగస్త్య మహర్షికి ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో ॥ భక్త స్థలం సమాఖ్యాతమ్ భవతా గణనాయకా**
**కేసవా ధర్మ భేదేన భక్తో మహేశ్వరో భవేత్ ॥ (సి.శి. 10-1)**

ఎట్టి ఆచార భేదము చేత భక్తుడు మహేశ్వరుడు కాగలడు? ఒక వస్తువు తన మొదటి నామమును వీడి వేరోక నామమును పడయవలెనినిన దాని స్వరూపమందున పరివర్తన కావలెను. నీరు పొయ్యి మీద పెట్టి కాయుచూ పోయిన యెడల ఆనీరు క్రమ క్రమముగా నూరు డిగ్రీల వరకు తాపమును పొందుచున్నదో అప్పుడు అది తన స్వరూపమును త్యజించి నూతన రూపమును ధరించు చున్నది. అది బాష్పరూపమును దాల్చి ఊర్ధ్వగామి యగుచున్నది. ఏ విధముగా నీరు అగ్నియొక్క సంబంధముచే బాష్పరూపమును దాల్చు చున్నదో అటులనే భక్త స్థలమునందలి సాధకుడు ఆ స్థలమునందు ఉపదేశించబడిన పదునైదు అవాంతర స్థలముల యందలి ఆచరణలను ఆచరించుచు చివరకు దాని సహజ స్థితికి చేరి అచటనుండి భక్త స్థలమును దాటి మహేశ్వర స్థలమున ప్రవేశించుచున్నాడు. ఈ విషయమును గూర్చి శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**కేవెలే సహజే దానే నిష్ణాతః శివతత్పరః**
**బ్రహ్మాదిస్థానవిముఖో భక్తో మాహేశ్వరః స్మృత : (సి.శి. 10-2)**

భక్తి స్థలమునందలి సాధకుడు అచ్చట ఆచరణలను ఆచరించుచు ఎల్లపుడు భక్తుడగానే వుండడు. అయితే ఆ భక్తస్థల స్థితిని పరిపక్వము చేసికొని మాహేశ్వర స్థితిని ప్రాప్తము చేసికొనును.

మొదటవక్లాసు విద్యార్థి గురు సాన్నిధ్యము నందున ఒక సంవత్సరము వరకు విధ్యాభ్యాసము చేసి సంవత్సరాంతమున పరీక్షలు వ్రాయును. ఆ పరీక్ష యందు అతడు వుత్తీర్ణుడైన యెడల పై తరగతికి వెడలునటులే భక్తుడు మహేశ్వరుడగు చున్నాడు. భక్తి ఫలరూపమును దాల్చవలసిన యెడల ఒకే ఒక యిష్ట దేవుని యందున ఆ భక్తిని స్థిరము చేయవలెను. ఒక రైతు బావిని త్రవ్వు సందర్భములో పదిస్థానములలో పదిపది గజములు త్రవ్వుట కంటెను ఒకే స్థానమును ఎంపికచేసికొని వంద గజముల మేరకు త్రవ్విన యెడల అధికమైన ఫలమును పొందును కదా! పుష్కలముగా జలము లభించునుగదా! దానిద్వారా ఫలసాయములో గుణాత్మకమైన మార్పురాగలదు.

ఇది ఇటులుండగా పది ప్రదేశములలో పది పది గజములు త్రవ్విన యెడల నీరు లభించక పోవటమే కాకుండా ధన నష్టము కూడా వాటిల్లును. ఇదే విధముగా ఒకే దేవుని యెడల ఎన్నో దినముల వరకు భక్తిని సలుపవలెను. అపుడే ఆ భక్తి పరివక్వత పొందును.

కొందరు అభిప్రాయము ప్రకారము ఒక వ్యక్తి ఐదు లేక ఆరుగురు దేవతలను అర్చించెదరు. వారెవ్వరనగా కుల దేవత, గృహ దేవత, గ్రామ దేవత, ఇష్ట దేవత, మొదలుగునవి, ఈ కోవకు చెందినవి. ఈ దేవతలందరు ఒకే మతమునకు చెందినవారై వుండవలయనెడి పట్టింపు ఏమియు నుండదు. షణ్మతములగు శైవ, వైష్ణవ, శాక్తేయ, కౌమార, వైనాయక, నరములకు చెందిన ఆధి దేవతలగు శివుడు, విష్ణువు, శక్తి, కుమారస్వామి, వినాయకుడు, సూర్యుడు మరియు వీరి అవతార రూపములు పై దేవతలు కావచ్చును. అంతియే గాదు. ఈ అధిదేవతల కుటుంబ సభ్యులు కూడా ఆరాధనీయులై వీరితో చేరుదురు. కుటుంబ సభ్యులతో పాటుగా వంధి మాగధులు, సేవకజనులు, వాహనాదులు, ఆయుధములు పూజనీయుల శ్రేణికి చెందుచున్నవి. ఈ విధముగా భక్తుడైన వాడు ఎంతమంది దేవతలను సేవించునో అతనికే తెలియని స్థితికి చేరును. ఈ స్థితిలో శ్రీ భగవత్పాదుల వారు తన జ్ఞాన ప్రకాశమును వెదజల్లి వీరశైవుల యొక్క భ్రమను దూరము చేయుచున్నాడు. వీరి ప్రకారము యిష్టలింగము మాత్రమే పూజనీయమైనది. మిగిలినవేవియూ పూజనీయుములుకావు. మరొక మాటలో చెప్పవలెనన్న వీరశైవులకు యిష్టదైవమైన శివుడైనను సాకార రూపమున పూజనీయుడు కాడు దేవాలయములో ప్రతిష్ఠితమైన శివలింగమైనను స్వయంభూలింగములుగా భావించబడెడి జ్యోతిర్లింగాదులైనను పూజనీయములుగావు.

ఈ విధముగా భక్తుడు తనభక్తి పెంచుకొనిన యెడల అతడు నిష్ఠాభక్తిని పొందుచున్నాడు. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా వుపదేశించిరి.

**భక్తేర్యదా సముత్కర్షో భవేద్ వైరాగ్య గౌరవాత్ ।**
**తదా మహేశ్వరః ప్రోక్తో భక్తః స్థిరవివేకవాన్ ॥ (సి.శి. 10-3)**

భక్తునందలి భక్తి, అతని యందుననే యుండెడి వైరాగ్యాది ఉత్కృష్టమైన గుణగణములచేత ఎప్పుడు ఉన్నతిని బడయుచున్నడో, అప్పుడు అతని యందునగల శ్రద్ధాభక్తి నిష్ఠాభక్తిగా పరివర్తన పొందుచున్నది. నిశ్చయేనతిష్ఠతి యితినిష్ఠా అనబడెడి వ్యుత్పత్తి ప్రకారము నిరంతరముగా ఒకేయిష్ట దేవతయందున చేసెడి భక్తియే నిష్ఠాభక్తి అనబడును. తైలధార అఖండముగా ఒకే స్థానము మీద పడునటుల తన యిష్ట లింగమునందున అఖండమైన మనోవృత్తిని నిలుపుటయే నిష్ఠాభక్తి యనబడును.

విద్యుత్ సంచయకేంద్రము నుండి అఖండముగా సంబంధము మనయింటిలోపలి బల్బు, ఫ్యాను, టి.వి. మొదలగు విద్యుత్ పరికరములతో వుండునపుడు మనము వెలుగు, గాలి, యిత్యాదులు గాగలి సౌకర్యమును పొందగలము. ఒకవేళ విద్యుత్ కేంద్రముతో సంబంధము నిలిచిపోయిన యెడల యిల్లు అంధకారబంధురమగును. మరియు అన్ని సౌకర్యములు ఆగిపోవును. పర శివుడు సచ్చిదానంద స్వరూపుడు, శాంత స్వరూపుడు అయివుండట చేత ఎవరు అఖండమైన భక్తిచేత అతనితో సంబంధమును గలిగి యందురో అట్టివారు నిరంతరము ఆనందమును సుఖశాంతులను పొందగలరు.

సుషుప్తి లేక గాఢనిద్రావస్థల యందు ప్రతి ఒక్కడు తన జీవాత్మను పరమాత్మతో సమరసము చేసికొనును అందుచేత వారు ఆనందాను భూతినే పొందుచున్నారు.ఈ కారణము వలననే కాబోలు ఆదిశంకరాచార్యుల వారు "సుషుప్తైక సిద్ధః శివః కేవలోకహం" అని వుపదేశించినారు. దీని భావమేమనగా ప్రతి యొక్క జీవుడు ఈ అవస్థలో శివునితో సంబంధము కలిగి యుండును. అతని వలననే ఆనందములో మునిగి తేలుచుండును. ఈ అవస్థయందున సుఖసాధని భూతమొలైన పరికరములు ఏవియు వుండవు. ఎవరైనను గాఢనిద్రావస్థలో టి.వి.ని చూడ గలరా? అయినను ప్రతి ఒక్కరు ఆనందాను భూతిని అనుభవించుచున్నారు. ఇట్టి ఆనందము విషయసంబంధమైన ఆనందమని అందురు. ఒక వ్యక్తి సుషుప్తావస్థలో పొందెడి ఆనందము దీని కంటెను భిన్నముగా నుండెడి ఆత్మానందమేయగుచున్నది.

ఇట్టి ఆత్మానందము తాత్కాలికమైనది. నిద్రాభంగము కాగానే ఆనందభంగము కూడా అగుచున్నది కాదా! అందుచేత వీరశైవ సిద్ధాంతము ప్రకారము ఆత్మానందమును పొందుటకు సుషుప్తావస్థను ఎంచుకొనక తద్భిన్నముగా నుండెడి జాగ్రదావస్థనే ప్వీకరించనైనది.

మాహేశ్వర స్థలమునందలి శివ భక్తుడు నైష్ఠికభక్తితో స్వయిష్టాలింగార్చనను చేయు చున్నపుడు. తన మనోవృత్తిని యిష్టలింగమునందున నిలిపి యిట్టి ఆత్మానందమును సాధించవచ్చును.

ముత్యముల గురించి మనమెరిగిన విషయమే. స్వాతి చినుకుల వలన ముత్యములగు చున్నవి. సముద్రములన పడెడి వర్షములో కొన్ని చినుకులు మాత్రమే ముత్యములు కాగల్గును నిష్ఠాభక్తియు అట్టిదే. అది ఎల్లరకు స్థిరపడదు. చిత్త చాంచల్యమున్న వారికి చిత్తైకాగ్రత చేకుంరునే? ముత్యముగా పరిణమించిన నీటిచుక్క మరల నీటిచుక్కగా మార గలదా? ఇది ప్రకృతి నియమములకు విరుద్ధమైనమాట ముత్యము ముత్యముగనే యుందును మాహేశ్వర స్థలమును చేరిన భక్తుడు నిష్ఠాభక్తి పొందిన పిదప దానిని వీడి మామూలు భక్తుడుగా మారుట సంభవము కాదు. ఇష్టలింగమును వినహాయించి వేరేకడకు భక్తుని మనస్సు పోజాలదు. ఈ విధముగా స్థిరభక్తి నెలకొనిన పిదప ఉత్కృష్టమైన వైరాగ్యము సుస్థిరమైన వివేకము ప్రాప్తమగు చున్నవి. ఈ విషయమున శ్రీ భగవత్పాదులవారి ఉపదేశము ఈ విధముగా నున్నది.

**భక్తిర్యదా సముత్క రో భవేద్ వైరాగ్య గౌరవాత్ ।**
**తదా మహేశ్వరః ప్రోక్తో భక్తః స్థిర వివేకవాన్॥** (సి.శి. 10-3)

ఉత్కృష్టమైన భక్తి కలవాడునూ, వైరాగ్యాది గుణములుగల వాడునూ, మరియు స్థిరమైన వివేకము కలవాడునూ మహేశ్వరుడగునని శ్రీ భగవత్పాదుల వారు సృష్టపరచిరి. మరొక మాటలో చెప్పవలెననిన యివి మహేశ్వర స్థలమునందున భక్తునికి వుండవలసిన సల్లక్షణములు.

భక్త స్థలములో నుండెడి వీరశైవుడు యిష్టలింగమును పూజించునపుడు యిష్టలింగములో ప్రేమను పెంచుకొనుటతో పాటుగా అన్యవిధములగు సాంసారిక విషయములలో కూడా ఆసక్తిని పెంపోందించుకొనును. ఇష్టలింగో పాసన ద్వారా యిష్టాసిద్ధిని పొందుచున్నాడు. అయితే మాహేశ్వర స్థలమును చేరిన భక్తుడు అట్టి అభిలాషలు కలిగి వుండడు. అతనికి సాంసారిక విషయములు కాని తత్సంబంధమైన వస్తుసంపదకానీ అనావశ్యకములు అతడు ఈశ్వరుని మాత్రమే ప్రేమించును. అనన్యమైన చిత్తముతో ఏకైక లింగనిష్ఠాపరతంత్రుడై యుండెడి వాడే మాహేశ్వర స్థలములో నుండెడి భక్తుడని గ్రహించ వలెను.

ఒకమహారాజు అత్యంత వయోవృద్ధుడు అయివుండెను. తన తరువాత సింహాసనమునకు యోగ్యమైన ఉత్తరాధికారిని ఎవ్వరినైనను నియమించుకొనవలెననెడి ఆలోచనను ప్రారంభించు కొనెను. చివరకు ఒకదినమున ఒక నిర్ణయమునకు వచ్చెను. సూర్యోదయము నుండి సూర్యాస్తమయము వరకు వచ్చినన్ను ముట్టుదురో వారినే నేను నారాజ్యసింహాసనము యొక్క ఉత్తరాధికారిగా నియమించెదనని రాజ్యమంతటను దండోరా వేయించెను. మరుసటి దినమున బ్రాహ్మీముహూర్తముననే రాజు తన విశాలమైన ఉద్యానవనము నందున సింహాసనారూఢుడై తన ఉత్తరాధికారి కొరకై ప్రతీక్షను చేయుచునుండెను.

ఆ రాజ్యములోని ప్రజలెల్లరు రాజువేయించిన దండోరాను విని ఎంతో ఆనందమును పొందిరి. రాజ్యాధికారము పొందుటకు ఇదియొక సరళమైన మార్గమని యెంచిరి. కేవలము రాజును స్పృశించినంత మాత్రమున చక్రవర్తులమగు చున్నాము. గదా? యనెడి ఆనందముతో ఉక్కిరి బిక్కిరి యగుచుండిరి. అందరూ రాజును ముట్టుటకు సిద్ధపడుచుండిరి. సూర్యోదయముకాగానే వెనువెంటనే ప్రతి ఒక్కరూ రాజుకుర్చొనియున్న ఉద్యాన వనమునకు పరిగిడుచుండిరి ఉద్యానవనమును ప్రవేశించిన పిదప ఎక్కడ చూసిననూ నానా ప్రకారములగు పానీయ సంబంధమై అంగళ్ళు, విఠాయి అంగళ్ళు, రకరకములైన వస్త్రభాండాగారములు, సువర్ణము మరియు రత్నములను గలిగిన అంగళ్ళు విరాజిల్లుచుండెను. ఇవ్వన్నియును చూపరులకు ఆకర్షణీయములుగా నుండి వారి మనుస్సులను దోచుకొని వారిని ప్రలోభ చిత్తులుగా చేసెడి సమర్థత గలిగి యుండెను. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయమేమనగా ప్రతి అంగడి కడ ఒక ఫలకము వుంచబడెను. దానిమీద ఈ విధముగా వ్రాయబడెను. ఇచట యిప్పుడు ప్రతియొక్క వస్తువు ఉచితముగా దొరకగలదు. ఆఫలకమును చూచిన ప్రతిఒక్కరి మనుస్సునందున ఆయా వస్తువులను సంగ్రహించవలెననెడి ఆశాభావము అంకురింపదొడగెను. ఇంక చెప్పేద్ది దేమున్నది? పాపప్రియులు, భోజన ప్రియులు, వస్తుసంగ్రహ ప్రేమగలిగినవారు, ఆచరణసేకరణ ప్రేమగలిగిన వారు ఆయా అంగళ్ళలో ప్రవేశించి తమకు కావలసిన వస్తుజాలమును సంగ్రహించెడి కార్యమున నిమగ్నులైరి. వీటిన్నిటీనీ ఏర్పాటుచేసిన రాజుగారిని మరచిపోయిరి. సూర్యాస్తమయమైననూ ఎవ్వరూ రాజుకడకు వెళ్ళి అతనిని చూచెడి ప్రయత్నమైనను చేయలేదు. అప్పుడు ఎంతో కోపమును పొందిన

మహారాజు తన మంత్రిని పిలుపించుకొని యిటులనెను ఓ మంత్రివర్యా! ఇదేమి ఆశ్చర్యము. మనరాజ్యమునందున ఒక్కడును కూడా లేడా? సూర్యాస్తమయమైనను ఒక్కడైనను నాదరిచేరలేదు. నా ప్రతీక్ష నిష్ఫలమైనది కదా. దీనికిగల కారణమేమి? అని ప్రశ్నించెను అతని మాటలలో అవధులు దాటిన ఆగ్రహము యిమిడి యుండెను. అపుడు మంత్రివర్యుడు మహారాజా! శాంతింపుడు ఉద్యానవనమున అనేక అంగళ్ళు ఏర్పాటు చేసి విషయాసక్తులైన ప్రజలకు వస్తుసంగ్రహమునకు తగిన అవకాశముచేయుట వలన ప్రజలెల్లరు వాటి సేకరణవలన ప్రలోభమునకులోనై తమను చూచుటకు రారైరి అనిచెప్పెను. అపుడురాజు శాంత చిత్తుడు కాకుండా మరింత కోపమును చెంది సైనికుల ద్వారా వారిని యిక్కడకు రప్పించుడి. వారు సంగ్రహించిన సామాగ్రిని కైవసము చేసుకొనుడి. ప్రతి ఒక్కరిని పగ్గముతో చెట్టుకుకట్టి చర్మమును ఒలిపించుడి చర్లకోలతో కొట్టించుడి అని అజ్ఞాపించెను రాజాజ్ఞ ప్రకారముగా మంత్రిగారు వారందరిని బంధించి తెచికొట్ట నారంభించెను. ప్రజలందరికిని పశ్చాత్తాపమయ్యెను. మనము ఈక్షుద్ర సామాగ్రుల ప్రలోభమును విడిచి రాజును స్పృశించిన యెడల రాజుగా ఉత్తరాధికారము స్వీకరించెడివారము గదా? మనము సంగ్రహించిన వస్తువులు మన దగ్గర మిగుల లేదు. చర్లకోల దెబ్బలు తప్పలేదు. అని మనస్సులో బాధపడ జుచ్చిరి. విషయాసక్తులైన ప్రతి ఒక్కరూ ఈ కథలో నుడివిన ప్రకారము బాధకు గురియగుదురు. పరమాత్ముడు ఈ సంసారము నందున మనుష్యులను పంపించినిది ఎందుకు? విషయాసక్తమగుటయేనా జీవితపర మార్ధము? ఎనుబడిదాలుగు లక్షల జీవరాశుల యందు శ్రేష్ఠతరమైన మానవుడు మిగిలిన ప్రాణులవలె కామాది విషయములలో ఆసక్తుడై వుండకుండా మనసారా తనను ముట్టి పూజించి తనను పొందవలెననెడిదే పరమాత్ముని వుద్దేశ్యము. అయితే మనుష్యుడు యిట్టి జ్ఞానమును కలిగియున్నాడా? ఎంత మంది కట్టి విజ్ఞానము కలుగును? అయిననూ యిట్టి ఆలోచన చేయుటకు సమయమెక్కడిది? నిరంతరము తిరుగాడుచూ విషయాసక్తిని పెంచుకొనుచూ విషయభోగములో తేలియాడెడివానికి జ్ఞానోదయము కలుగునే? శివుని యెడల ఆసక్తి పెరుగునే?

విషయాసక్తుడై విషయభోగముల నిమిత్తము ధనార్జనచేయుచు, ఆయా విషయముల ననుభవించుచూ అజ్ఞాన పరవశమున తిరుగాడెడువాడు ధైవభక్తిలేకుండగా వుండిన యెడల పామరుడు అనిపించుకొనును. ఒకవేళ విషయాసక్తులను తీర్చుకొనుటకు భగవదర్చన చేయుటకు పూనుకొనిన యెడల నట్టివారు సామాన్యభక్తులు అగుదురు. విషయ సంగ్రహముతో పాటుగా భగవంతుని యెడల భక్తిని పెంచుకొనినవారు విశేషభక్తులుగుదురు. విరాగచిత్తులై విషయాసక్తిని వీడి కేవలము శివుని ఆరాధనలో మునిగితేలుచూ ఎకైక నిష్ఠలో నుండెడివాడు మహేశ్వరుడు అనిపించుకొనును. వీరశైవులు ఈ విషయ సంబంధమైన పరిజ్ఞానమును పెంచుకొని తగిన లబ్ధిని పొందుదురు గాత!

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది॥ 12-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువుల వారు మహేశ్వర స్థలమునకు సంబంధించిన యుపోద్ఘాతము నీ యాశీర్వచనమున వ దానము చేసిరి భక్తుడీ స్థలమున లింగైక నిష్ఠా తత్పరుడై యుండవలెనని యుద్బోధించిరి. "లింగనిష్ఠా నియుక్తాత్మా మహేశ్వర మహాస్థలః" యనెడిది శివాగమ వాక్కు. లింగనిష్ఠ గల్గియుండుటయే మహేశ్వర స్థలము యొక లక్షణమని వివరించుచున్నది. "నియాతా స్థితిర్నిష్ఠా" అనెడి వ్యుత్పత్తి ప్రకారము నియతమైన స్థితిని నిష్ఠయని యందురు. లింగనిష్ఠా పరుని యింద్రియములన్నియును శివభక్తిపైన కేంద్రీకృతమై యుండును. మనోబుద్ధ్యాదులు శివుని వైపే పయనించును. "చిత్తము శివుని మీద స్థిరముగా నిలిచియుండును. చేతులారంగ శివపూజ" చేయును. త్రికరణ శుద్ధి లేకుండగ చేసెడి శివ పూజలు వ్యర్థమగును. చేతులారంగ శివ పూజ చేసెడి వాడు నోరు నొవ్వంగ శివకీర్తినే నుడువలెనని గట్టిగా నమ్మును వారి బ్రహ్మాదుల యెడల భక్తి కుదుదరు. నిష్ఠా భక్తి కలుగని వానికి ముక్తి కలుగదని చెప్పబడినది. యధ్ధావాక్కుల వారి యదార్థ వాక్కులే క్రింది విధిన నున్నవి.

**ఉరుపక్షంబులు వచ్చునంకు నిరుద్యోగంబునన్ వృక్షకో**

**టరమధ్యంబున నుండు పక్షిగతి నిష్ఠంగూడినీ భక్తివి**

**స్తరమాత్మం ప్రభవించునంతకును నీ సంసారకారాగ్రృహాం**
**తరగేహంబున నుండి జీవుడతి చింతంబొందు సర్వేశ్వరా (సర్వేశ్వర శతకము, ప.63)**

"నిష్ఠతో కూడిన శివభక్తి కలుగనంత వరకు జీవుడు రెక్కలు రాని పక్షివలె సంసారమనెడి కారాగృహములో బడియలమటించు చుండును" అనెడిది అన్నమయ్యవారి వాక్కులోని భావము.

అయితే, యిట్టి నిష్ఠా భక్తి గుల్గుట సుసాధ్యమైన విషయము కాదని గ్రహించ వలెను. శివపూజలు చేయవచ్చును. శివవ్రతములను సలుపవచ్చును.

వీటి ఫలముగా సకల కళల నభ్యసించ వచ్చును. బ్రహ్మవిష్ణ్వాది పదవులను పొందవచ్చును కాని నైష్ఠికమైన రీతిలోన శివ భక్తిని గడించుట యనెడిది సుసాధ్యమైన విషయము కాదని గ్రహించ వలెను. పూర్వ జన్మసుకృతము లేని వానికి శివ కరుణ లభించదు. శివ కరుణ లేని యెడల అవిద్య తొలగదు. అవిద్య కారణమున మాయామోహితుడైన జీవి భేద బుద్ధిని పెంపొందించికొనును. శివ జీవ తత్త్వము నెరుగడు. తత్ఫలితముగా బహుదేవతా రాధననే పరమోత్కృష్టమైన యాచరణయని యెంచును. సంసారము నందున బడి పరిభ్రమించును. షణ్మత్రములలో నెక్కడెననూ నైష్ఠికతనే యనివార్యమని చేప్పబడినది. ప్రచ్ఛన్న నాస్తికులనియును, ప్రచ్ఛన్న భౌద్ధులనియును పేరుగాంచిన కేవలాద్వైత పరంపరకు చెందిన కొందరు నిష్ఠా భక్తిని ప్రోత్సాహించుట లేదు. శివ కేశవాభేదము చూడ వలెననెడి వారిట్టివారే, వీరశైవ పండితులు అద్వైతమును తిరస్కరింతురు. దీనికి గల కారణమేమనగా శివాగమములు ప్రకారము శివేతర దేవతల యుపాసన వీరశైవ ధర్మమునకు విహితము కాదు. వివరములు గోరు వారు చంద్రజ్ఞానాగమమును చదువ గలరు.

భక్తి స్థలమును వీడి మహేశ్వర స్థలమున నడుగిడిన వీరశైవుడు బహు దేవతారాధన ప్రవృత్తికి గురికాకుండగ, అన్యదేవతా యుపానునను ప్రోత్సహించెడి వారి సాంగత్యమును వీడి, మాయను జయించి ప్రసాదియగుటకై ప్రసన్న హృదయముతో లింగైక నిష్ఠాతత్పరుడై శివుని ప్రసన్నుని చేసికొన వలెను.

శివం భూయాత్

# మహేశ్వర స్థలము

## ఆశీర్వచనము - 2

భక్త స్థలములోని సద్భక్తుడు నేయే యోగ్యతల మహేశ్వర స్థలమును ప్రవేశించ గలడనెడి సందేహమును నివృత్తి చేయుటకై శ్రీ భగత్పాదుల వారు, రెండు యోగ్యతలను విధించిరి మొదటిదగు లింగైక నిష్ఠాపరతంత్రతను గూర్చి తెలిసి కొంటిమి, ప్రస్తుతము దానమనెడి లక్షణము గురించి తెలిసికొనెదము గాక.

**శ్లో॥ "కేవలే సహజే దానే నిష్ణాతః ..... శివతత్పరః"** (సి.శి. 10-2) అనెడి యాచార్యోక్తి ప్రకారము దానగుణముగల వాడే మహేశ్వరుడు కాగలడు దానములు చేసెడి విషయమున నేర్పును గల్గియుండి సత్పాత్రతను గుర్తెరింగి, దానము నీయగల్గిన వాడై యుండవలెననెడి నియమము గలదు. అంతే కాదు, ఈ దానము సకామ లేదా నిష్కామ భావనతో కాకుండగ, సహజదాన విధి విధానము ననుసరించి చేయవలెను. సహజ దానము యొక్క వివరముల నింతకు క్రితమున నివ్వబడిన ఆశీర్వచనములలో గాంచగలరు. మానవుని యాధ్యాత్మక కౌన్నత్యము దేని మీద ఆధారపడి యుండును? దాతృత్య మనెడిది మనుజుని ఔన్నత్యమును తెలియజేయనదై యున్నదని శాస్త్రముల వలన తెలియు చున్నది. ఈ విషయమున ఉపనిషత్తులలో నొకసుందరమైన కథ కలదు.

ఒకానొక సమయమునందున, బ్రహ్మదేవుని దగ్గరకు దేవ, దానవ, మానవులు మూకుమ్మడిగా వెడలి మా అందరికీ ఒకే విధమైన యుపదేశమును కటాక్షించ వలెనని ప్రార్థించిన వారైరి. ఒకే సమయమున నొక వ్యక్తికి యుపదేశము నిచ్చుట సులభమైన పని. తద్విరుద్ధముగా ఒకే సమయమున ననేకులకు నుపదేశము చేయుట యనెడిది యెంతో కఠినమైన పని. ఒక్కొక్కరి బుద్ధి విచారములొక్కొక్క రీతిన నుండును కదా! కాన బ్రహ్మదేవుల వారు దేవ, దానవ మరియు మానవులకు నొకే విధముగా ద-ద-ద అనెడి యేకాక్షరమును

నుపదేశించిరి. భోగాసక్తులుగా పేరుగాంచిన దేవగణము, "ద అనగా నేమి? దయచేసి వివరించుడి" యని విజ్ఞాపనను చేసిరి. అప్పుడా చతుర్ముఖుడు, ప్రసన్న వదనారవిందములతో "ద" యనగా 'దమనము' అని తెలియ జెప్పిరి. మీరు అతిగా యింద్రియ లోలుడు కాకుండ, నీతిని పాటిస్తూ యింద్రియ నిగ్రహము పెంచికొనవలెననెడిది బ్రహ్మోపదేశములోని అంతరార్థము.

అత్యంత క్రూర స్వభావము గల్గి లోకకంటకులుగా పేరుగాంచిన దానవులు వివరణను కోరగా, విరించి విశిష్టమైన యుద్బోధను చేసిరి "ద అనగా దయ" అని అనిరి, మీరందరూ క్రూరత్వమును విస్మరించి, సకల ప్రాణుల యెడల దయా భావము గలిగి మెలగ వలెననెడిది బ్రహ్మోపదేశములోని సారాంశము.

అప్పుడు, మానవులు మాననీయుడగు బ్రహ్మనుద్దేశించి "స్వామీ! మా నిమిత్తమున "ద" అనెడి యక్షరము యొక్క అర్థమును కరుణతో స్పష్టముగా తెలియ జెప్పుడి" యని కోరగా అప్పుడా సృష్టి కర్త చిరునవ్వును చిలికించుచు "దత్త" యని అనిరి మీరు దాన శీలురుగా కావలెననెడిది దక్షపిత యొక్క యుపదేశములోని యేకైక భావము.

మానవుడు సహజముగా లోభగుణ విశిష్టుడై యుండును. ఈ లోభమే సకల పాపములకు మూలమై యున్నది. దానికి విరుద్ధముగా, ధర్మమే దానము మీద ఆధారపడియుండును. ధర్మచ్యుతికి దోహదము చేసెడి దైనందున లోభము దుర్గుణములలో నొకటిగా నెంచబడుచున్నది. శ్రీ నిజగుణ శివయోగుల వారు "కడులోభదింద దుర్గణ మన్యముంటె?" యని ప్రశ్నించిరి. లోభమునకు మించిన దుర్గణము మరేదియును లేదని వారి ప్రశ్నలోని భావము. కామక్రోధాది యరిషడ్వర్గములలో లోభము ప్రముఖమైనదని గుర్తించ వలెను.

లోభము వలన నుభయపద భ్రష్టత్వము గల్గునని తెలియు చున్నది. ఇహపర సుఖములకు దూరము చేసెడి దక్షత గల్గిన దుర్గణమే లోభమని దాని వ్యుత్పత్తి వలన తెలియు చున్నది. 'లునాతిలు భౌలోకౌ ఇతి లోభః' యనెడిది లోభపదము యొక్క వ్యుత్పత్తి, ఉభయ లోకములలోని సుఖములను ఖండించి వేయునదే లోభమని యీ వ్యుత్పత్తి చెప్పుచున్నది. లోభియైన వాడు ధనార్జన నిమిత్తము చేసికొని, యద్దానిని భద్రపరచుకొనుటలోనే తన మనోవృత్తిని నిలుపుకొని యుండును. అతనికి భోగాసక్తి యుండదు. తాను తినడు త్రాగడు, అనుభవించడు. తన వారిని తిననివ్వడు, త్రాగనివ్వడు, అనుభవించనివ్వడు. ధనము వ్యయమైనయప్పుడు అనల్పమైన మనోవేదనకు గురియగును. కుటుంబ సభ్యులు నిరసింతురు. ప్రతిఘటింతురు. ఘర్షణలు తప్పవు. ఇంతటి కష్టమును అనుభవము చేసికొనుచు కూడబెట్టి కాల క్రమమున కాల ధర్మమును చెందిన యెడల లోభికి దక్కెడి పరలోక సుఖమెట్టిది. కాలుని చేతిలో పడి కఠిన దండనకు గురియగుటే కదా!

ఈ కారణముల వలన గుర్తించవలసిన దేమనగా లోభ గుణమును వీడి దానగుణము నలవరచి కొనవలెను.

మనము సంపాదించెడి ధనమునకు మనమే హక్కుగల్గిన వారమని భావించి కొనుట సరియైనది కాదు. శాస్త్రసమ్మతమైనది కాదు. మనకు నలుగురు దాయాదులు గలరనియును మనము సంపాదించిన దానిని వారితో పంచికొన వలెననియును వేదాంతులు చెప్పుదురు. వారెవ్వరనగా దానధర్మము, రాజు, దొంగ మరియు అగ్ని. దానములు చేయుటవలన యెంతో పుణ్యము లభించునని యెరిగినా, దానమును చేయుట కిష్టపడెడి వారెందరు? పుణ్యము నాశింతురేగాని దానమును చేయుటకు పూనికొనరు. ఇట్టి వారికి రాజువలన బాధగల్గును. పన్నుల పేరిట నధికమొత్తములో ద్రవ్యమును సేకరించుట యనేది రాజులందరూ చేసెడి కార్యమే. నేటి ప్రభుత్వము నాటి రాజులు చేసెడి. విధిననే పన్నులు విధించుచున్నారు. ప్రభుత్వాధికారులు ముక్కుపిండి పన్నులను సేకరించుటను గాంచుచున్నాము. కొందరు ఎంతో జాగ్రత్త వహించి, కొన్ని యుక్తులను పన్ని ప్రభుత్వమునకు పన్నులు కట్టకుండ తప్పించు కొను చున్నారు. అట్టి వారికి మూడవ దాయాదియైన దొంగ బాధతప్పదు. దాచినదంతయును దోచికొని పోవును. ద్రవ్య నిక్షేప విషయమున తెలివిలేటలను ప్రదర్శించెడివారు దొంగల బారినుండి తప్పించు కొన వచ్చును. అప్పుడు అగ్ని బాధ గల్గి ద్రవ్యము నష్టము కావచ్చును. ఈ కారణముల వలన దానమును చేసి పుణ్యమును అర్జించుటయే శ్రేయస్కరము.

మనము ఈ జన్మలో సుఖసంతోషములతో నుండుటకు కారణమేమిటోయని తెలిసికొనెడి వారెందరు? మనము క్రిందటి జన్మలో చేసి కొనిన దాన ధర్మములే నేటి సుఖజీవనమునకు కారణములని యెంచవలెను. ఇటులనే మున్ముందు గల్గెడి జన్మలలో సుఖసంతోషములతో కూడికొని యుండవలెననిన యీ జన్మలో దానధర్మములు చేసికొనవలెను. మన యింటిముందున తిరుపయ్యై తిరిపమెత్తెడి వాడు,

కేవలము భిక్షమాత్రమే వేడుట లేదు. ఒక సందేశమును కూడ యిచ్చుచున్నాడు మరు జన్మలో తనవలె బిచ్చగాడై తిరుగాడెడి స్థితి నుండి తప్పించి కొనుటకై దానధర్మమును చేయుమని ఉద్బోధించు చున్నాడు. ఈ విషయమున యీ క్రింది సుభాషితము చూడదగినదై యున్నది.

**గృహం గృహమటన్ భిక్షుః శిక్ష్యతే నతు యాచ్యతే ।**
**అదత్వా మాదృశో మా భూః దత్వాచత్వా దృశో భవ ॥**

భిక్షమును వెయ్యక నావలె భిక్షుకుడువు కాకుండ, భిక్షము వేసి నీ వలెనే శ్రీమంతుడవై యుండుమనెడిది యీ భాషితములోని భావము. ఈ జన్మలో దానము చేయకుండిన యెడల మరు జన్మలో దరిద్రుడగుట నిశ్చయమని గుర్తించ గలరు.

ఒకానొక వూరినందు ఒక ధనాఢ్యుడు వుండెను. అతని వద్ద ధనము పొంగిపొరలుచుండెను. అయినను అతను సంస్కార శూన్యుడై యుండెను. ఎవరికినీ, ఎప్పుడునూ, ఏమిటినీ యివ్వలేదు. ఇతనిని చూచి భయపడి భిక్షగాళ్ళు ఆ వీధికే రావడము మానివేసిరి ఇతనికి ఒకే ఒక కుమారుడు వుండెను. అతనికి సంస్కార సంపన్నురాలైన కన్యనిచ్చి వివాహమును చేసిరి. ఇంటికి వచ్చిన కోడలు పిల్ల తన తల్లితండ్రుల నుండి ఉదాత్తమైన భావములతోను, సమున్నతమైన సంస్కారములతోను కూడిన వారసత్వముతో కూడుకొని యుండెను. అతిధి సంస్కారముల యెడల ఆమెకు అత్యంత అభిలాష యుండెడిది. ప్రతి దినము ఒకరిద్దరు అతిధులకైనను సత్కారము చేసి ధన్యత బొందవలెననెడి బలమైన కోరిక ఆమె మనస్సులో నుండెను. కాని అత్తమామల యొక్క వైఖరినిగాంచి ఆ వుత్తమురాలు మౌనము వహించి జరుగుచున్న దంతయును గమనించుచుండెను. ఆమె ఏమియును చేయుటకు అశక్తురాలై యున్నందున భగవంతునిపై భారమువేసి గడుపు చుండెను ఈ విధముగా అనేక దినములు గతించెను. ఒక దినమున ఒక భిక్షువు ఈ శ్రీమంతుని యింటిముందు నిలిచి భిక్షను కోరెను. కోడలికి కొండత సంతోషమాయెను. ఇన్ని సంవత్సరముల పిదప భిక్ష ప్రదానమును చేసే సౌభాగ్యము తనకు చేకూరినందులకు సంతోషభరితాంతరాంగి యయ్యెను. ఆ సమయమున అత్తగారు ఇంటిలో వుండి నందువలన ఆమెకు భిక్షను పెట్టెడి ధైర్యము కలుగదయ్యెను. ఆమె ఆనందము విషాదముగా మారెను. భిక్షనిడుటకవకాశము లభించినను భిక్షనిడ లేని స్థితినిచూసి ఆమె ఆవేదనకు గురియయ్యెను. ఆ భిక్షుకుడు కదలక మెదలక నిలిచి యుండెను. భిక్షను వేడుచునే యుండెను. ఆమె కారుణ్య భావముతో ఓమహానుభావా! తమరు మరొక యింటికి వెళ్ళుడి అని విన్నవించుకొనెను. వెనువెంటనే ఆ భిక్షుకుడు. ఏమమ్మా! మియింటిలో అన్నము లేదా? అని అడిగెను. అప్పుడామె వున్నది. అయితే అది పాచిపోయి యున్నది. అనికోడలు బదులు చెప్పెను. నిచ్చెను. అప్పుడా భిక్షుకుడు పాచినదైనను ఫరవాలేదమ్మా! నేనేమి వేడి యున్నమును వేడుటలేదే? మీదగ్గర వున్నదేదో పెట్టుడి అని నుడివెను అప్పుడా కోడలు అయ్యా! అదియైనను కొద్దిగనే వున్నది. ముందుకు వెళ్ళుడి అని చెప్పెను. భిక్షుకుడు ముందు యింటికి వెళ్ళెను.

కోడలు మాటలను వినిన అత్తగారు కోపమును చెందెను. అప్పుడు ఏమీ అనలేదు కానీ, ఇంటి యజమాని వచ్చిన పిదప ఎంతో రాద్ధాంతమును చెసెను. ఈమె భిక్షగానికి మన యింటియందున చద్దియన్నము వున్నది అని చెప్పెను అదికూడా కొంతమాత్రమే కలదట. ఈ కారణమున ముందటి యింటికి పొమ్మని చెప్పినదయ్యెను. ఈ విధముగా ఈమె మన మర్యాదకు భంగము కలిగించినది. ఈమెను ఆమెపుట్టింటికి పంపించుడి మన పిల్లవానికి మరియొక వివాహమును చేయుదముగాక.

మామగారు తన భార్యయొక్క కోపమును చూసి విచలిత మనస్కుడయ్యెను. నిజమేమిటో ఎరుగదలచి తన కోడలిని పిలిచి అమ్మా ! నీవు మాయింటికి వచ్చి నప్పటి నుండియు నీకు ఒక్కసారియైనను చద్దియన్నమును పెట్టలేదుకదా? మనమందరము ఎప్పుడునూ అట్టి అన్నమును తినలేదు. ప్రతిదినము వేడివేడి యున్నమునే తినుచున్నాము గదా! ఇది ఇటులుండగా నీవు బిచ్చగానితో ఆ విధమున ఎందుకు చెప్పితివి? కావలెనని చెప్పితివా? లేదా పొరపాటున నోరు జారినదా? అని అడిగెను. మామగారి మాటలను వినిన సంస్కార సంపన్నురాలైన కోడలు ఈ విధముగా బదులిచ్చెను. పూజ్యమామగారూ! ఉదయము వండిన అన్నము సాయంకాలము వరకు చల్లగా అగుచున్నది. మీ యింటియందున నిండి తాణకిసలాడుచున్న ధనధాన్యములు క్రిందటి జన్మము యొక్క కర్మ ఫలమువై యున్నవి. అప్పుడు అవి చల్లనైనవి కావా? ఈ జన్మమందున కొత్తగా ఎట్టి పుణ్యము చేయనందున ప్రాకత కర్మ ఫలమును అనుభవించుచున్నాము. అనగా ఈ సంపత్తు ఎక్కువ కాలము వరకు నిలిచియుండెడి అవకాశము లేదు అని అనెను. కోడలు ప్రతిపాదించిన ఆధ్యాత్మిక విచారమును వినిన అత్తమాములకు అప్పటికప్పుడే జ్ఞానోదయమయ్యెను. వారు వెనువెంటనే ఇంటియొక్క కార్యభారమును కోడలుకి అప్పగించి ధర్మ మార్గము నందున పయనించుటకు నిశ్చయించుకొనిరి.

మనుష్యులయందు ఎప్పటి వరకు దానము చేసెడి భావన వుత్పన్నము కాదో అప్పటివరకు పరివర్తన పొందుటకు అర్హతను పొందరు. అందుచేతనే బ్రహ్మ దేవుడు మనుష్యులను గురించి ఉపదేశము నిచ్చుచు 'ద'యను పదమును ఉచ్చరించిరి ఇచ్చుట ద యనగా దానము చేయుడి యనెడి అర్థము. దానము చేయనివాడి మనుస్సు సంకుచితమై యుండును. సువిశాలమైన మనస్సు కలవాడికే బ్రహ్మ జ్ఞానము సంప్రాప్తమగును కాని కృపణుడైన సంకుచిత మనస్కునికి ఎప్పటికిని బ్రహ్మజ్ఞానము కలుగదు. శివ పరబ్రహ్మ అత్యంత విశాలమైన విస్తృతి గలిగి యుండుటచే దానిని తెలిసికొనదలచిన వాని మనస్సుకూడా అంతే విశాలమైయుండవలెను. దాన రూపమున నుండెడి ధర్మము యొక్క అంతిమమైన ఫలము పరశివ బ్రహ్మ జ్ఞానమే అయియున్నది.

మనము అనుభవించెడి ప్రతియొక్క వస్తువును భగవంతునికి అర్పణజేసి దానిని ప్రసాదముగా భావించుకొని స్వీకరించెడి పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాచీనమై యున్నది. ఈశావాస్యో పనిషత్తునందున "తేనత్యక్తేన భుంజీథాః" అని వుపదేశింపబడినది. దీని భావమేమనగా త్యాగపూర్వకముగానే ఉపభోగమును చేయవలెను. కాని కేవలము భోగాసక్తితో ఉపభోగమును చేయకూడదు. ఎవ్వడైనను భోగ్యపదార్థములను భగవదర్పణము చేయకుండా లేదా వాటిని అతిధి అభ్యాగతులకు సమర్పించకుండా కేవలము తానొక్కడే భుజించు చున్నాడో అట్టివాడు పాపమును భుజించువాడై అంత్యమున నరకభాజనుడగు చున్నాడు. గీతాకారుడుకూడా ఇదే భావమును తెలియ జెప్పుచూ "భుంజతే తేత్వఘమ్ పాపాప పచంత్యాత్మ కారణాత్" ఎవడైతే కేవలము తనకొరకే అన్నమును వండు కొని తినుచున్నాడొ అట్టివాడు పాపాత్ముడగు చున్నాడు. ఇదంతయును పరికించిన పిదప త్యాగమునకు మించిన మహాత్తు దేనికినీ లేదని తెలియుచున్నది.

మనుష్యుడు త్యాగభావనను అలవరచుకొనుటకు క్రమ క్రమముగా దానగుణము పెంపొందించు కొనవలెను. మనము దేనినైనను ఇతరులకు యిచ్చిన యెడల అది అన్యాక్రాంతమగు చున్నదనెడి భావన సరియైనది కాదు అది తన కొరకే కట్టివుంచబడిన ముడుపని భావించవలెను. మహాకవి సర్వజ్ఞుడు కూడా దానము యొక్క మహాత్తును ఎంతో గొప్పగా వుపదేశించిరి.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు ఇంతకు క్రితమున దానము యొక్క లక్షణములను తెలియజేయుచూ అద్దాని త్రివిధ స్వరూపములను వివరించిరి. వాటిలోని దొకటగు సహజదానము యొక్క శ్రేష్టతను కోనియాడి, సోపాధిక మరియు నిరుపాధిక దానములకు చెందిన చింతన ఎంతో విస్తృతమైయున్నను సహజ దానమునకు సంబంధించిన విషయము అంతగా ప్రచారములోనికి రాలేదు. ఇద్దానిని ప్రతిపాదించిన ఘనత రేణుక భగవత్పాదుల వారికే దక్కినది. సహజదానమును చేయునప్పుడు దానమిచ్చువాడు శివుడే. తీసికొనెడివాడు శివుడే.... దానము యివ్వబడెడి వస్తువు కూడా శివుడే.. అనెడి భావనతో యిచ్చెడి ఈ దానము అనుపమానమైనది. దీనికి సరితూగెడి దానము మరొక్కటి యుండదు. శివజ్ఞాన ప్రాప్తిని కలిగించెడి ఈ సహాజదానమును మాహేశ్వర స్థలమున నుండెడి సధ్భక్తుడు తప్పని సరిగా ఈ దాన నిరతిని గలిగి యుండవలెను. మరొక మాటలో చెప్పవలెనన్న సహజదానమును చేసెడి విషయములో మాహేశ్వర స్థలమున నుండెడి భక్తుడు సిద్ధహస్తుడై యుండవలెను, అట్టివాడు పరమేశ్వరునికి ప్రీతిపాత్రుడే సామాన్యజనులకును గౌరవ పాత్రుడే ఇట్టివాడు దానగుణముతో పాటుగా భక్తిలో నైష్ఠికతను, సంసారము యెడల వైరాగ్యమును వహించుకొని యుండవలెను. వీరశైవులు ఈ విషయములను తెలిపికొనిన వారై మహేశ్వర స్థలమున విరాజిల్లుదురు గాక !

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 13-8 - 1991

స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువుల వారీ స్థలమున దానగుణము యొక్క విశిష్టత గురించి తెలిపిరి. త్యాగము చేయు సంకల్పము పరమోత్కృష్ట మైనదనియును, భక్తిగల్గిన త్యాగశీలుడు ముక్తి పథమున పయనించ గలడని తెలియ జెప్పిరి.

మహేశ్వరుని ముఖ్యలక్షణములలో నైష్ఠికత యొకటి యని గుర్తింప బడినది. నిష్ఠా భక్తి సంపన్నుడై మాహేశ్వర స్థలములో నుండెడి వీరశైవుని భావములెట్టులుండునో వివరించెడి శ్రీ బసవేశ్వరుని యీ క్రింది వచనమును గనుడి:

**అర్థము నర్థము చేసి కోలాహలము చేయుచుండనీ**
**పుట్టిన బిడ్డల నవఖండములుగ జేసి ఖండించు చుండనీ**
**ముట్టెడి స్త్రీని కళ్ళముందే యభిమానముగొని చెరచు చుండనీ**
**ఇటులీ త్రివిధములకు వెలుపల**

**ఇంకను నా యంగమాదికి రానీ**
**పట్టి ఖండములుగ కొయ్యనీ**
**కుచ్చెడి శూలము ప్రాప్తించని**

**వ్రేటు కొక దెస పన్నొక దెస చేయనీ**
**మరల లింగారాధన చేసెద, జంగమారాధన చేసెద ప్రసాదమునకు తప్పను**

**ఇటువంటి బాస కించిత్తు పొల్లైన యెడల**
**నీ వప్పుడే ముక్కను కోయుము కూడల సంగమ దేవా!** (బసవేశ్వర గీతా మృతము పు. 452)

"మాహేశ్వరోనముంచేత్ లింగపూజా మహావ్రతం మాహేశ్వరో నముంచేత్ జంగమార్చనం" యనెడి మౌళిక సూత్రములీ భావనలోన యిమిడి యున్నవని గ్రహించగలరు.

జంగమయ్య యనగా సాక్షాత్తుగా శివుడేయని త్రివిధ సంపత్తి స్థలమున తెలిసికొంటిమి. "ఏకఏవ శివః సాక్షాత్ – గురు జంగమ లింగాత్మా యనెడివి యాది జగద్గురు రేణుకుల వాక్కులు సర్వలోకోపకారార్థ శివుడే జంగముడై భక్తుని యాతిథ్యమును స్వీకరించునని వీరాగమము తెలిపినది జంగమారాధన యందున దాన ప్రక్రియ యిమిడి యుండునని గ్రహించ గలరు. "సర్వప్రయత్నేన జంగమాయ దేయం" అనెడిది యాగమ విహిత సూత్రము. లింగనిష్టతో పాటుగా మాహేశ్వర స్థలములోని వీరశైవునికి జంగమునికి దానమియ్యవలెననెడి నిష్ఠ గల్గియుండవలెననెడిది బసవన్నవారి వచనములోన యిమిడి యున్న మౌళిక విషయము. యిష్టలింగార్చన కంటెను జంగమా రాధనైక నిష్ఠ మహోత్కృష్టమైనదని పండితారాధ్య చరిత్రలోని పండితుని కథ వలన తెలియు చున్నది. సోమ నాథ భాష్యములోను నీ విషయములను గాంచగలము. వీరశైవ ధర్మమున గురు–జంగములకు మాత్రమే దానమొసంగ వలెననియును బ్రహ్మణాదులు దానమును గ్రహించుటకు అర్హులు కారని చెప్పబడినది బ్రాహ్మణాదులు లింగధారులు కారు అందుచే వీరశైవ ధర్మము ప్రకారము వీరు భవిజనులనబడుదురు. ఈ విషయమును నొక్కి చెప్పెడి బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి.

**ద్విజుల పలువుర కిచ్చి చెడిరి కడతేర్చ శరణుడొక్కడు చాలడే ?**
**వట బ్రాహ్మణుడై నారాయణుడు వచ్చి బలిని భూమినడుగ బలి బంధితుడై పోయె**
**శివుడు భక్తుడై వచ్చి దాసుని వస్త్రమును వేడ ఇచ్చిన దాసునికి తవనిధి దక్కె!**
**కపట విప్రుడై వచ్చి నారాయణుడు కర్ణుని వేడిన కవచ మిచ్చి కర్ణుడు రణమున చచ్చె**
**కామారి జంగముడై వచ్చి సిరియాళుని కొడుకును గోర**
**ఇచ్చు సిరియాళ సెట్టి కంచితో కైలాసమును చెరె.**

**పారుడై వచ్చి నారాయణుడు శిరమును గోర ఇచ్చిన నాగార్జునుని శిరమెగిరి పోయెను**
**జంగముడై వచ్చి శివుడు వధువు నడిగిన ఒప్పించు, బల్లాణుడు స్వయముగా లింగమయ్యెకాన**
**ఇహపరములకు శుభ ప్రదుడయ్యా మా సంగయ్య !**
(బాడాల రామయ్యగారు అనువాదించిన బసవేశ్వర వచనాలు. పు. 156) వ. సం. 622.

తాత్వికముగా చూసిన యెడల జంగమయ్య కర్మసంహారమూర్తి. బ్రాహ్మణుడు కర్మజీవి. యజ్ఞోపవీతమనెడి కర్మలతయని బసవపురాణము చెప్పు చున్నది. విధి నిషేధాతీత వర్తనుడు జంగముడు. కర్మ మార్గమున పయనించెడి వారికి ధర్మోపదేశము చేసెడి వాడు. వారిని కర్మయెడల విముఖులుగా నయ్యెడి విధముగా జ్ఞానబోధ చేసెడి వారు. బ్రాహ్మణునిది ప్రవృత్తి మార్గమైతే జంగమునిది నివృత్తి మార్గము. దీక్షా సంస్కారాదుల చేత కర్మమార్గమును వీడి భక్తి సత్క్రియలు చేసెడి వాడు బ్రాహ్మణుని కంటెను నధికుడని వీరశైవ ధర్మము చెప్పు చున్నది. బసవేశ్వరుని వచనములలోను, బసవపురాణములోను నీ విషయములు విపులముగా చర్చింప బడినవి.

ఈ కారణము వలన మాహేశ్వర స్థలములోని సద్భక్తుడు జంగమయ్యకు దానము నొసంగి ధన్యత బడియవలెను. ప్రాకృత మార్గము ననుసరించి బ్రాహ్మణులకు దానము చేయుట శ్రేయస్కరము కాదని తెలిసి కొనగలరు. శివుని సొమ్ము శివుని రూపమగు జంగమునికి యిచ్చితిననెడి భావముతో దానము చేయవలెనని గుర్తించ గలరు.

శివం భూమాత్

# మహేశ్వర ప్రశంసా స్థలము

## ఆశీర్వచనము - 1

మాహేశ్వర స్థలమునకు సంబంధించిన కొన్ని విషయములను ఉపదేశించిన పిదప శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు ఈ స్థలములోని అవాంతరభేదములను శ్రీ అగస్త్యమహర్షి వారికి ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో॥ మాహేశ్వరస్థలం వక్ష్యే యథోక్తం శంభునా పురా ।**
**మాహేశ్వర ప్రశంసాదౌ లింగనిష్ఠా తతః పరమ్ ॥**
**పూర్వాశ్రయనిరాసశ్చ తథాద్వైతనిరాకృతిః ।**
**ఆహ్వానవర్జనం పశ్చాదష్టమూర్తి నిరాకృతిః ॥**

**సర్వగత్వ నిరాసశ్చ శివత్వం శివభక్తయోః ॥**
**ఏవం నవవిధం ప్రోక్తం మాహేశ్వరమహాస్థలమ్॥**

**ఆదితః క్రమశో వక్ష్యే స్థలభేదస్య లక్షణమ్ ।**
**సమాహితే న మనసా శ్రూయతాం భవతామునిః ॥** (సి:శి 10;4-7)

ఈ ఉపదేశములోని సారాంశము ఏమనగా ఈ స్థలము నందున తొమ్మిది ఆవాంతర స్థలములు గలవు. అవి-మాహేశ్వర ప్రశంసా స్థలము, లింగ నిష్ఠా స్థలము, పూర్వాశ్రయ నిరసన స్థలము, అద్వైతనిరసన స్థలము, ఆహ్వాన విసర్జన స్థలము, అష్టమూర్తి నిరసన స్థలము, సర్వగత్వ నిరసన స్థలము, శివ జగన్మయ స్థలము మరియు భక్త దేహి లింగ స్థలము. శ్రీ భగవత్పాదుల వారు ఈ అవాంతరముల యొక్క స్వరూపమును విశ్లేషణ చేయుటకే మొదట మాహేశ్వర ప్రశంసా స్థలమును గురించిన ఉపదేశమును చేశిరి. ఈ సంధర్భముగా వారు మాహేశ్వరునకుండవలసిన లక్షణములను ఈ క్రింది రీతిగా తెలియజెప్పిరి.

**శ్లో॥ విశ్వస్మాదధికోరుద్రో విశ్వానుగ్రహకారకః**
**ఇతియస్యస్థిరాబుద్ధిః సవై మాహేశ్వరః శ్రుతః ॥** (సి.శి. 10-8)

మహేశ్వరుడి యొక్క మరొక్క పేరు రుద్రుడుగా నున్నది. త్రిమూర్తుల యొక్క పేర్లను చెప్పునపుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, లేదా బ్రహ్మ, విష్ణురుద్ర అని చెప్పుదురు. ఈ మహేశ్వరుడే రుద్రుడు అని గ్రహించ వలెను. ఈ యిరువురికి అభేదము ప్రతిపాదించబడినది. ఈ కారణమువలననే భగవత్పాదులవారు 'విశ్వస్మాద్' అధికః అని నుడివిరి. దీని భావమేమనగా విశ్వము కంటెను అధికుడు. ఇచట విశ్వము అనబడు పదమునకు ప్రంపచము అనియును నారాయణుడు అనియును అర్థములు కలవు. అట్టియేడ రుద్రుడు ఈ ప్రపంచము కంటెను. స్థితిపాలకుడగు విష్ణువుకంటెను గొప్పవాడని తెలిసికొనవలెను.

విష్ణువు సృష్టిని పరిపాలించిన యెడల రుద్రుడు దానిని, సంహరించు చున్నాడు. అటులనే "రోదయతి ఇతి రుద్రః" అని రుద్ర పదమునకు వ్యుత్పత్తి యివ్వబడినది. ఏడిపించెడివాడు రుద్రుడు అని దీని భావము. సృష్టి యొక్క సంహార కాలమున దేవ, దానవ, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్య, మానవాదులందరినీ నాశనము చేయును గనుక ఆసమయమున వారు విలపించుచుందురు.

రుద్రపదము యొక్క అర్థము కేవలము రోదనకు మాత్రమే పరిమితము చేయుట సరియైనది కాదని తెలియుచున్నది. రుద్ అనగా దుఃఖము అందుచేత రుద్ర అనెడి పదము "దుఃఖమ్ ద్రావయతి ఇతి రుద్రః" అనెడి వుత్పత్తిని చెప్పు కొనవలెను. తదనుగుణముగా తనను ఏవరు ఉపాసన చేయుదురో అట్టివారి యొక్క దుఃఖములను దూరముచేసెడివాడే రుద్రుడని అర్థము. ఈ కారణము వలననే సమస్త దోషనివారణ కొరకు శాంతి కార్యక్రమముల యందును భక్తులు దుఃఖమును దూరము చేసికొని సుఖమును పొందుటకై శ్రీ రుద్రము యొక్క పఠన పారాయణలను చేయుచున్నారు. అట్టియెడ ఏడిపించెడివాడు రుద్రుడు అనెడి యర్థము అర్థరహితమై పోవును. అయితే నమ్మినవారికి దుఃఖములను దూరము చేశిననూ నమ్మనివారికి దుఃఖమును కలిగించునో ఏమో? ఎవ్వరెరుగుదురు? ఆ విధముగా చూశిన యెడల రుద్రునికి రెండు వృత్పత్తులు సార్థకములే యగుచున్నవి. భక్తి శ్రద్దలతో రుద్రుని పూజించెడి వారికి దుఃఖములను దూరముచేయును. భవియై భవములో తిరుగాడెడి వారికి దుఃఖములు కలుగజేయును.

వీరశైవ ధర్మమునందున సమస్త దుఃఖములను దూరము చేసికొనుటకై ఇష్టలింగము మీద జటధారను పోయుచూ శ్రీ రుద్రమును పఠించెడి సాంప్రదాయము కొనసాగు చున్నది. వీరశైవేతరులు స్థావరలింగమును శ్రీ రుద్రముతో ఏవిధిన అర్చింతురో అదే విధిన వీరశైవుడు శ్రీరుద్రము నుపయోగించి ఇష్టలింగమును అర్చించుచున్నాడు. రుద్రాధ్యాయమును పఠించలేనివారు రుద్రుని మనస్సునందున నిలిపికొని పంచాక్షరి మహామంత్రముతో ఇష్టలింగమునకు అభిషేకము చేసిన యెడల వాంఛితార్థములు లభించగలవని అనుభవజ్ఞులు తెలియజేయుచున్నారు. ఈ విధముగా రుద్రుడు దుఃఖములను దూరముచేసి యిష్టార్థ సిద్ధిని కలుగజేయుచున్నాడు.

మృత్యువు ప్రకృతి సహజమైన విషయము వేదాంతుల ప్రకారము మృత్యువు ప్రకృతి అయిన యెడల జన్మము వికృతి యగుచున్నది. అందుచేత సృష్టికారుకుడైన బ్రహ్మకంటెను, స్థితిపాలకుడైన విష్ణువు కంటెను, మృత్యువును ప్రదానము చేసెడి అనుగ్రహమును కటాక్షించెడి రుద్రుడు ముఖ్యుడగు చున్నాడు. పుట్టిన వారందరూ చావకుండా వుండిన యెడల జగత్తు యొక్క స్థితి ఎటులుండునో ఊహించగలము. పుట్టెడివారికి స్థలముండునే? నేటి పరిస్థితులలో చావకుండా వుండిన యెడల విపత్కర పరిస్థితులు ఎట్లుండునో ఎరుగని దెవ్వరు?

శివుడు సృష్టి, స్థితి, సంహార, నిగ్రహ మరియు అనుగ్రహములనెడి పంచకృత్య సంపన్నుడై యున్నాడు. ఈ పంచకృత్యములు లోకకళ్యాణమును సాధించునవై యున్నవి. ఒక ఇంటిలో ఒక పిల్లవాడు పుట్టినయెడల జనులు దానిని ఈశ్వరానుగ్రహముగా భావించుచున్నారు. కాని ఒక వ్యక్తి చచ్చినపుడు అది ఈశ్వరానుగ్రహమని ఎందుకు భావించరో తెలియుటలేదు. అయితే శాస్త్రముల ప్రకారము జనన మరణములు ఈశ్వరానుగ్రహ ఫలములుగా లభించుచున్నవి. సుఖ దుఃఖములలో సుఖము ఈశ్వరానుగ్రహము వల్ల వచ్చుననియునూ, దుఃఖములు అటుల కావనియునూ పామరులు తలతురు. పండితుడు మాత్రము. సుఖ దుఃఖములు రెండును కూడా ఈశ్వరానుగ్రహములే యని భావించును. ఇది యిటులుండగా ఈశ్వరుడు లోకులకు దుఃఖమునెందుకు కలిగించును యనెడి ప్రశ్న ఉదయించును. లోక కళ్యాణకారకుడైన శివుడు దుఃఖమును కలిగించుట అతని తత్త్వమునకు అనుగుణ్యత కలిగినది కాదు కదా! అనెడి భావన కొందరిలో కలుగవచ్చును. దీనిలోగల ధర్మసూక్ష్మమును ఎరుగుట యెంతో అవసరము. సుఖాసక్తుడైన వ్యక్తి నిరంతరము విషయలంపటుడై సుఖమున తేలియాడుచూ శివుని మరచెడి అవకాశము కలదు. ఈ కారణము వలన శివుడు అప్పుడప్పుడు దుఃఖమును కలిగించి జీవుని యొక్క మనోవృత్తిని తనవైపుకు త్రిప్పుకొను చున్నాడు. దుఃఖములోనున్న ప్రతివ్యక్తి క్షణక్షణము భగవన్నామ స్మరణ చేయుట పరిపాటియే కదా! సామాన్యులు దుఃఖము వచ్చినప్పుడు మాత్రము దేవాలయములను చుట్టుచూ, తీర్థములను సేవించుచూ, వ్రతాదులనొనర్చుచు సుఖమును అభిలషించుచుందురు. సుఖమునకు కారణమైన సంపదకలుగగనే ధనమే పరమాత్ముడై నిరంతరము ధనముయొక్క చింతన చేయుచు దానిని ప్రదానము చేసిన భగవంతుని మరచుచున్నాడు. ఇది వాంఛనీయముకాదు కదా! వీరశైవ ధర్మమునందున లోకాచారముకంటెను విరుద్ధమైన వర్తన నిర్దేశించబడినది. సుఖ సంతోషములతో ప్రమేయము లేకుండా అనుదినము విధిగా ఇష్టలింగార్చన చేయవలెనని విధించబడినది. దీని భావమేమనగా భక్తుడు సదా భగవంతుని సాన్నిధ్యమున వుండుచున్నాడు. ఇదియే నిజమైన ఉపవాస దీక్ష. ఉపవాసమనగా 'ఉపనివాస'మని అనగా అనుక్షణం దగ్గరగా వుండుట అని గ్రహించవలెను.

సంసారమునందున సుఖ దుఃఖముల యొక్క నిష్పత్తిలో సమతౌల్యము వుండదు. సుఖము అణుప్రాయమైతే దుఃఖము అనంతమైనదిగా నుండును. యుగ యుగముల నుండి ప్రపంచోన్ముఖత కలిగి పరుగులు తీసెడి జీవాత్మను తన వైపు ఆకర్షించుకొనుట కొరకే నానారకములైన దుఃఖములను కల్పించుచున్నాడని భావించుకొనవలెను. సాంసారిక దుఃఖములో పరితప్తుడైన జీవుడు తప్పని సరిగా పరమాత్మవైపు ఆకర్షింపబడుచున్నాడు. గదా!

ఒకానొక రాజు శత్రురాజులచేత రాజ్యము ఆక్రమించబడగా పరాభవమును పొంది చివరకు రాజ్యభ్రష్టుడై తిరుగాడ జొచ్చెను. తన ప్రాణములను మిగుల్చు కొనుటకై పలాయన మంత్రమును పఠించుచూ చివరకు ఒక గవి ప్రదేశమును చేరి అందులో కూర్చొని యుండెను. ఆగుహకు ముందు భాగమున రహదారి యుండెను. ఆదారి వెంబడి అసంఖ్యాకమైన జనులు వచ్చి పోవుటను ఇతడు గమనించెను. తన ప్రజలును తనవైపు రావలెననిన ఏమి చేయవలయునో ఆలోచింప జొచ్చెను. అతని యందున అమూల్యమైన మూడు రత్నములుండెను. ఆసమయమున అతడు యోచించిన దేమనగా జనులు ఆమార్గమున వచ్చి పోవునపుడు ఒక రత్నమును విసరినయెడల వారు అద్దానిని తమరాజుగారి రత్నమని గుర్తెరిగి తనను సమీపింతురాని తలంచెను. ఈ విధముగా ప్రజలను తనవైపుకు ఆకర్షించుకొని కోల్పోయిన రాజ్యాధికారమును మరల పొందనెంచెను. ఇరువురు యువకులు ఆదారియందు వచ్చెడి, దానినిగాంచి ఆరత్నమును రహదారి మీద వేసెను. రత్నమునుగనిన యువకులు ఒకరికంటెను ముందు మరొకరు పరుగెత్తుచూ ఆరత్నమును కైవసము చేసికొనుటకై తమలోతాము పోరాడుకొనజొచ్చిరి. చివరకు ఆయిరువురిలో బలశాలియైన వాడు రత్నమును పొంది ఆనందించి యింటికి వెళ్ళగా ఇంకొకడు విలపించుచూ యింటిదారి పట్టెను. అయితే ఈ అమూల్యమైన రత్నము ఎవరెది? అనెడి ఆలోచన వారికి కలుగనేలేదు. రాజు ఇదేరీతిన తనవద్దనున్న మిగిలిన రెండు రత్నములను కూడా విసరగా యిట్టి ఫలితమే లభించెను. అతని వైపు తిరిగి చూచినవాడు ఒక్కడూలేకుండెను. ఎవరికైనను రత్నపుచింతనే కాని వేరొక చింతలేకుండెను. చివరకు రాజు నిరాశను చెంది వేదనకు గురియయ్యెను. తన రత్నములు కోల్పోయినందుకు కోపమును పెంచుకొనెను. జనుల యెడల అతనికి కోపము పెరిగెను. అతనొక వడిసెలను చేతబట్టి ఆదారిన మరెవరైననూ వచ్చినచో కొట్టవలెననెడి వుద్ధేశ్యముతో వేచికూర్చుండెను. అంతలోనే వేరే యిరువురు యువకులు ఆదారివెంబడి రాగా అదిగని అందులోని ఒకరి తలకు గురిబెట్టి రాజు జోరుగా రాయిని విసిరెను. ఆరాయి దెబ్బకు ఆ బాటసారి తలపగిలి రక్తము స్రవించజొచ్చెను. అప్పుడతడు ఎవరతడు? నాతల మీద రాయి విసరినది? అని అరచుచూ అటుయిటూ పరుగెత్తుచూ వెతుకుచూ వెతుకుచూ గవికడకు వచ్చెను. అప్పుడు అచ్చట తమ రాజుగారిని గని ఆశ్చర్యచకితుడయ్యెను. ఇదేమి మహారాజా! నాతలమీద రాయిని విసరినది తమరేనా? అప్పుడు ఆరాజు అవును. ఆరాయిని వేసినది నేనే నా ప్రజలను నావైపు ఆకర్షించుట కొరకు అమూల్య రత్నములను విసరినప్పుడు ఎవరూ వచ్చి విచారించలేదు. రాయి విసరగానె నా ప్రజలలో నొకడివగు నీవు నన్ను వెతుకుచూ ఇక్కడకు వచ్చితివి. అని చెప్పెను.

ఈ కథ వలన తెలియునదేమనగా పరమాత్మ ప్రపంచమందున సుఖ సమృద్ధిని యిచ్చిన పిదప సుఖము వెన్నునంటి పోయెడి యీ జీవులు పరమాత్మను మరిచిపొదురు. తనను మరచి సంసారమందున మరల మరల వచ్చెడి జీవులను తన వైపు రప్పించికొనుటకే శివుడు సంసారమందున నానా దుఃఖములను తెచ్చి పెట్టును. శివుని దగ్గరకు చేర్చెడి దుఃఖములు శివాను గ్రహ ఫలములే యని భావించికొన వలయును.

సాంసారిక జీవనములో వ్యస్తుడైన వాడు సుఖాలను కోరుననెడిది, లోకపు పోకడ. దైవ ప్రార్థనలో శివుని కోరునది సుఖమును గల్గించెడి వస్తువులే. కాని వైరాగ్య మూర్తులు సుఖముల నాశించరు. సుఖాలను నిరసించెదరు. వీరు దుఃఖాన్ని కోరుదురనెడిది సందేహాస్పదమైన విషయమే. వీరవిరాగిణి అక్కమహా దేవి, దుఃఖాన్ని కోరుచు, తనకు దుఃఖమును కలిగించ మని భగవంతుని వేడికొనిన దని తెలిపెడి యీ ప్రమాణమును గనుడి.

**మనె మనె తప్పదె కెయ్యొడ్డి బేడువంతె మాడయ్య బేడిదొడె ఇక్కదంతె మాడయ్య**
**ఇక్కిదొడె నెలక్కె బీళువంతె మాడయ్య**
**నెలక్కె బిద్దొడె, నానెత్తికొంబు దక్కెమున్నవెశుని**
**ఎత్తికొంబులతె మాడయ్య, చెన్న మల్లికార్జునయ్య!**

ఈ వచనము యొక్క తెలుగు రూపమమును గనుడి.

మన్కి మన్కి తప్పక కెయ్యెడి వేడునట్లు వేడగనే వేయనట్లు చేయయ్య వేలకు పడినచో, నేనెత్తి కొనుటుకు ముందే శుని యెత్తికొనునట్లు చేయయ్య చెన్న మల్లికార్జునా!

మహా భారతమున కుంతియు దుఃఖమునే కొరి కొనెనని తెలుపబడినది యుద్ధానంతరము, శ్రీ కృష్ణుడు "అత్తా నీ కింకేమేమి కావలెనో కోరికొనుము" అని అనెను అప్పుడామె "ఓ కృష్ణా! ఇంత వరకు కష్టము లెన్నింటినో యనుభవించితిని. ఇకముందు కూడ

భగవంతుడు అట్టి కష్టములనే కల్పించ మని కోరెద ననెను. కృష్ణుని కిదియెంతో నాశ్చర్యము కలిగించెను. ఆమెనుద్దేశించి, "అత్తా! ఇంత వరకు అనుభవించిన కష్టములు చాల లేదా! మళ్ళీ కష్టముల నెందులకు కోరితి" వని ప్రశ్నించెను. అప్పుడామె, భగవదను గ్రహము నిమిత్తముననే కష్టములు కోరినాననియును, కష్టము వచ్చినప్పుడు వాటిని తీర్చుటకు భగవంతుడు వచ్చుననియును, ఆ విధిన భగవంతుని సాన్నిధ్యము లభించునని బదులు పలికెను.

కనికరము లేని వ్యక్తిని పాషాణ హృదయుడని నిందించుటను గాంచ గలము. ఇట్టి ఘనీభూతమైన మనస్సుగలవాని మదిలో భగవంతుని రూపము రూపుదిద్దికొన జాలదు. తద్విరుద్ధముగా కష్టములను గాంచి మనస్సు ద్రవించగా, అట్టి మనస్సున భగవంతుని రూపము ఏర్పడు చున్నది. సుఖము గలవాని మది గట్టి పడి రాయివలె నుండును వాని మదిన భగవంతుని భావ చిత్రమేర్పడదు కష్టజీవి కంట తడిపెట్టిన యప్పుడు వాని మనస్సున భగవంతుడు రూపుదిద్దికొని యుండును. భగవంతుని సన్నిధిన విలపించి తన కష్టముల నేకరువు పెట్టికొను వారెందరో గలరు. వీరందరూ శివయోగము ననుభవించు చున్నారని భావించ వచ్చును.

రుద్రుడు రోదన నిచ్చి తనకెంతయో ఉపకారమును జేసెనని భావించికొని, రుద్రుని యెడల అచంచలమైన భక్తిని పెంచికొనెడి వాడే మహేశ్వరుడగును.

మలమనెడి పదము వీరశైవమున జీవుని లక్షణములు వివరించెడి సందర్భములో నుపయోగింపబడుచున్నది. జీవుడు మలా వృతుడని చెప్పబడినది. శివునికి యిట్టి యావృతముండదు. అతడు నిర్మలుడని చెప్పబడినది. మహేశ్వర స్థలములోని భక్తునకు శివుడు నిర్మలుడనియు, శివేతరు లెల్లరు జీవులైనందున మల సహితులనియును గట్టి నమ్మకము ఏర్పడ వలెను. ఈ విషయమును గూర్చి శ్రీ భగవత్పాదుల వారు చేసిన యుపదేశమును గనుడి.

**శ్లో॥ బ్రహ్మాద్యైర్మలిన ప్రాయైః నిర్మల్ పరమేశ్వరే ।**
**సామ్యోక్తిం యోనసహతే సవై మాహేశ్వరాభిదః॥** (సి.శి. 10:9)

ఈ ఉపదేశములోని తాత్పర్యమేమనగా, బ్రహ్మ మొదలగు దేవతలందరి యందున ఒకటి లేకుంటె మరొకటి దోషముగా గోచరించును. శివుడటుల కాదు. శివుడు నిర్మలుడు అందుచేత మాహేశ్వర స్థలము నందలి శివభక్తుడు, శివేతర దేవతలలో నెవ్వరును శివునికి సాటిరారనెడి భావమును మనమున దాల్చవలెను. ఈ విషయమున అన్నగారు ఈ విధిన తెలిపిరి.

**దేవనొబ్బ, నామ హలవు;**
**పరమ పతివ్రతెగె గండనొబ్బ**
**మత్తొందక్కెలుగిదడె కివి-మూగ కొయ్యువను**
**హలవు దైవద ఎంజల ఆంబవరనేనెంబె, కూడల సంగము దేవా!**

**ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి.**

**దేవుడొక్కడే నామములు పలు**
**పరమ పతివ్రతకు గండ డొక్కడే**
**మరొక వానికి తలవంచిన చెవి-ముక్కు కోయును**
**పలుదేవతల యెంగిలి తినెడి వారి నేనేమనెద?**
**కూడల సంగమ దేవా!**

మాహేశ్వర స్థలమున భక్తుడిట్టి భావములనే కలిగియుండవలెను. ఇష్టలింగమును మాత్రమే ఆరాధించ వలెను. అద్దానికి నివేదితమైన పదార్థమునే ప్రసాద భావమున గైకొనవలెను. పలుదేవతల ప్రసాదములను తీసికొనవలదు. ఇది బసవేశ్వరుల వారి వాక్కులోని సారాంశము, ఇద్దానికి విరుద్ధముగా నడచెడి వారు పొందనీయులని బసవన్నవారి భావమని గ్రహించ వచ్చును.

దేవుడొక్కడే యనెడి సిద్ధాంతముండినను, అనేక నామములతో పూజింప వాడొక్కడే యగును అయితే మనము చేసెడి భక్తి పలు కడకు ప్రాకిన యెడల నయ్యది విభజితమై పోవును. ఫలితముండదు అందుకే శివుడొక్కడే దేవుడని తలచి యతని యుందుననే నిష్ఠాభక్తిని పెంచి కొనిన యెడల, భక్తి ఫలప్రదము కాగలదు. గురుదత్తమైన యిష్టలింగముండగా, పలుదేవతల నర్చించెడి గొడవ యెందులకు? వీరశైవులకు శివేతర దేవతల యర్చన వాంఛనీయముకాదని గుర్తించ వలెను. మాహేశ్వరునకట్టి భావన రాకూడదనెడి నిషేధము గలదు.

శ్రీ భగవత్పాదుల వారు మహేశ్వర స్థలము గురించి మరికొన్ని విషయములను పదేశించిరి.

**శ్లో ॥ ఈశ్వరః సర్వ భూతానాం బ్రహ్మాదీనాం మహానితి ।**
**బుద్ధి యోగాత్ తదా సక్తో భక్తో మహేశ్వర స్మృతః ॥**

**శ్లో॥ బ్రహ్మాది దేవతాజాలం మోహితం మాయయా సదా! ।**
**అశక్తం ముక్తిదానేతు క్షమాతిశయ సంయుతం ॥**

**శ్లో॥ అనాదిముక్తో భగవానేక ఏవ మహేశ్వరః ।**
**ముక్తి దశ్చేతి యోవేద సవై మాహేశ్వరః స్మృతః ॥**

**శ్లో॥ క్షయాతిశయ సంయుక్తా బ్రహ్మావిష్ణ్వాది సంపదః ।**
**తృణవన్మన్యతే బుద్ధ్యా వీరమహేశ్వరః సదా ॥** (సి.శి. 10;10-13)

పై ఉపదేశముల భావమేమనగా సృష్టి కర్తయైన బ్రహ్మ మొదలుకొని సమస్త జీవులకు ప్రేరణకర్తయైన మహేశ్వరుడే శ్రేష్ఠమైన వాడని స్థిరవివేకముతో ఆ మహేశ్వరు నందున ఆసక్తుడైన భక్తుడే మాహేశ్వరుడు. దేవతలం వరు మాయాధీనులై యున్నారు. అయితే శివుడు మాత్రము మాయనుతన ఆధీనములో పెట్టుకొని యున్నాడు. ఇతడు అనాది ముక్తుడు. సదా ముక్తుడుగా యుండెడివాడే ముక్తిని ప్రసాధించగలడు. అట్టి సామర్థ్యము శివునకు మాత్రమే దోషయుక్తములై యున్నందున వీటి యెడల అనురక్తిని పెంచుకొనక వాటిని తృణప్రాయములుగా నెంచి తిరస్కరించు వాడే మహేశ్వరుడు. ఈ విధముగ పరికించిన యెడల మహేశ్వర స్థలమునందు నుండు భక్తునికి పరమేశ్వరుని యెడల యను రక్తియును, వివిధ పదవుల యెడ అనాసక్తియుండునని గ్రహించవలెను. సంసారిక విషయములలో వైరాగ్య భావన అధికముగా నుండి పారమార్థిక విషయములలో అనురాగముగల వాడె మహేశ్వరుడగును. ఈ విషయమును వీరశైవులు గ్రహింతురు గాక.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

ది ॥ 14-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేశప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యుల వారు శివతత్త్వము నెంతో వివరముగా తెలియ జెప్పిరి. శివుడొక్కడే దేవుడు, దేవుళ్ళుగా పిలువబడెడివారు నతని యధీనమున నుండెడి జీవులు అనెడి తత్వమును విడమరచి చెప్పిరి. మాహేశ్వర స్థలమున వీరశైవుడు శివైక నిష్ఠాతత్పరుడై యుండును. ఇట్టి భావనకు శివాగమములే మూలకారణములు. శివాగమముల ప్రకారము శివుడు సర్వకర్తృత్య సర్వభర్తృత్యము గలిగి యుండును. ముప్పది యారు తత్త్వములతో కూడిన యీ ప్రపంచము శివపరబ్రహ్మ నుండియే బయల్వెడలును. ఈ తత్త్వముల వలననే జీవులు-జగత్తు లేర్పడినవి. బ్రహ్మ విష్ణాదులందరు జీవులే. తాత్వికము శివుడొక్కడే దేవుడు.

ఇది యిట్టులుండగా మాయామోహితలైన వారు పౌరాణిక వాఙ్మయమునుగాంచి పలు రకముల భావన లేర్పరచుకొని శివతత్త్వము నెరుంగని స్థితిలో నున్నారు, త్రిమూర్తులు దేవుళ్ళు వీరందరును సమానులే యనెడి భావన కొందరి కేర్పడగా, మరి కొందరు షణ్మతముల చేత ప్రభావితులై విష్ణువు, కాళి, గణపతి, సూర్యుడు కుమారస్వామి ఇత్యాదులను గురబ్రహ్మలుగా నెంచి శివభక్తికి దూరమగు చున్నారు. స్మార్తులు

నొకవైపు శివకేశవాభేదము ప్రతిపాదించుచు, మరొకవైపు పూజా విధానములలో బహుదేవతోపాసనా ప్రొత్సహించు చున్నారు. ఇవన్నియును శివైకనిష్ఠాపరతంత్రతకు ప్రతిబంధకములై మార్గ భ్రష్టత్వము గల్గించెడి యవకాశము గలదు. ఈ కారణముననే శ్రీ భగవత్పాదుల వారు శివాధిక్యతా యనెడి భావము ద్వారా నైష్ఠికతను పెంపొందించకొన వలెనని సూచించిరి. ఇట్టి భావమును పొందిన వాడి యాలోచనా సరళి కద్దము పట్టెడి బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి.

**విశ్వాధికుని రుద్రుని పొగడెడి శ్రుతులు ఎవిశ్వరూపాయవైనమఃఎ**

**పరమరూపుడా నమో, పరమతత్త్వుడానమో ఆదియారూఢ అభయకరుడానమో**

**హరిని హరించిన వాడా నమోయని శ్రుతి చాటుచు నుండు**

**సంహార కారణుడానమో, మా కూడల సంగమ దేవా, మహద్మహద్భ్యో నమః**

శివుడు విశ్వాధికుడనెడి భావనను తెలిపెడి శివ రహస్యములోని యీ క్రింది శ్లోకమును గనుడిః

**శివం విశ్వాధికం సాంబమనన్యస దృశం ప్రభమ్ ।**

**యోన్యథా మనుతే మోహాత్ సభవేత్పల్క సాధమః**

ఈ శ్లోకము వలన శివుడ ద్వితీయుడనెడి భావన దృఢపడును. మాహేశ్వర స్థలములోని సాధకుడు నిట్టి భావమును గల్గియుండువలెనని గ్రహించ గలరు. నిష్ఠపెరిగి వృద్ధియుగుటకిట్టి భావన యెంతో అవసరమై యున్నది.

శివుడద్వితయుడనెడి భావము గల్గిన మాహేశ్వర స్థలములోని సాధకుని మనోభావము లెట్టులుండునో యనెడిది తెలిపెడి చతుర్వేద సారములోని యీ క్రింది పద్యమును గనుడి.

**క్రియకరో దేవ వికీర్తితో యకరో సతరవత్తన సూతసంహితలన**
**ఎక్రీడన కాయేవ క్రీడనకా యను కాళికాఖండ సూక్తములు మరియు**
**ఎయస్యకింకథనైన యాదిత్యసూక్తి తత్సూక్తిని 'నైవ ప్రసూతి' యనగ**
**దవిలిమును 'శుకవత్తన బ్రళయోదయో' యనగను నీశు క్రీడార్థమైన**
**పశువులు ష్టంబు లశ్వముల్ బంట్లు సురలు**
**క్రీడ సల్పును శంభుండు చూడజూడ**
**జచ్చి బుట్టెడి వారి శంభు సరియె**
**బ్రహ్మవిష్ణ్వాది దేవతత్ బసవలింగ!**

శివుడు స్వీయ లీలా విలాసముకై జగత్తును సృష్టించునని తెలిపెడి యీ అనామయుని స్తవమును గనుడి.

శ్లో॥ **చారూద్రేకే రజసి జగతాం జన్మసత్వేప్రకృషే**
**యాత్రాం భూయ స్తమసి బహుళే బిభ్రతం సంహృతించ ।**
**బ్రహ్మాద్యేతత్ ప్రకృతి గహనం స్తంబపర్యంత**
**క్రీడా వస్తుత్రినయన మనోవృత్తి మాసేత్ మాత్రాను గంత్॥** (అనామయస్తవము, 6)

ఈ స్తవము యొక్క తెలుగు రూపమును గనుడి:

**కలుగన్ సృష్టి రజోతిరేకమున ద్వతార్యమ్మె సత్వోన్నతిన్**
**మొలతెంచున్ స్థితి సంహృతి క్రియ తమః పుష్టిన్ మహేశా! చలా**
**చలమే నీ ప్రకృతిస్థ లోకములున్ స్తంభాది విధ్యంతముల్**
**చలనం బొందెడి నాట బొమ్మలయి నీసంకేత మాత్రంబునన్.**

(కాశీ జగద్గురు ప్రండిత చిదిరె మఠం వీరభద్ర (శర్మ) శివాచార్య) శివ పంచస్తవి, పు. 191

ఈ విధముగా మాహేశ్వర స్థలములోని వీరశైవుడు, శివుడు విశ్వాధికుడనియును, విశ్వకల్యాణ కారకుడనియును, అద్వితీయుడనియు, నిష్కల్మషుడనియు, సకలా భీష్ట ప్రదాతయనియు మరియు ముక్తి ప్రదాతయని నమ్మి, వేరగు బ్రహ్మాది దేవతలు శివునికి సములు కాజాలరని గట్టిగా విశ్వసించెడి చిత్త వృత్తిని పెంపొందించికొన వలెను. ఈ విధిన చేయని యెడల భ్రష్టుడై పతనమగును. తగు విధిన జాగరూకత వహించ వలెను.

శివం భూమాత్

# ఆశీర్వచనం - 2

## మాహేశ్వర ప్రశంసా స్థలము :-

మహేశ్వరుని మీద అత్యంత నిష్టయున్న వాడే మాహేశ్వరుడు. అతడే వైరాగ్యాది గుణసంపన్నుడై వీర మాహేశ్వరుడిగా పిలిపించుకొను చున్నాడని తెలుసుకొనగలరు. శ్రీ భగవత్పదులవారు యిట్టి వీర మాహేశ్వరుని గురించిన స్థితిగతులను యీక్రింది విధముగా నుపదేశించిరి.

**శ్లో ॥ శబ్ద స్పర్శాదిసంపన్నే సుఖ లేశే తు నిస్పృహః ।**
**శివానందే సముత్కంఠో వీరమాహేశ్వరో భవేత్ ॥** (సి.శి. 10-14)

నిష్ఠా భక్తి యున్నవాడు మాహేశ్వరుడైతే, వైరాగ్యాది ఉత్కృష్టమైన గుణములు కలవాడు వీర మాహేశ్వరుడనిపించుకొనును. సామాన్యముగా మనుజుడు విషయాధీనుడై యుంటాడు. శబ్దస్పర్శాది విషయములందు పరిపూర్ణమైన సుఖముండకుండ యుండినను, సుఖము పరిమితంగాయుండినను మరియు మీ విషయములందరికి తెలిసినను వీటి మీద ఆసక్తి తగ్గడములేదు. కాని విషయములందు లభించెడు అపరిమిత ఆనందములైనను, ఆత్మనుండి లభించుచున్నవి. ప్రతి యొక్కరి ఆత్మ ఆనందరూపమున నుండును. ఎవ్వరు అన్నింటిని విడిచిపెట్టి తన ఆత్మ సమీపమునకు పోవుచున్నాడో, వాడే పరిపూర్ణమైన ఆనందమును అనుభవించు చున్నారు. ఇతరులు ఆత్మను మరచి అన్యవస్తువులు లేదా వ్యక్తుల సమీపమునకు పోవునపుడు, ఆయా వ్యక్తుల లేదా వస్తువుల నుండి అల్పమైన సుఖమును పొంది దానికి తోడుగా అనల్పమైన దుఃఖమును కొనితెచ్చు కొనుచున్నారు. ఈ కారణము వలన నిరతిశయమైన ఆనందమును పొందవలయుననిన విషయ సంబంధమైన సుఖముల నుండి దూరముగా నుండవలెను. ఇంద్రియములు గ్రహములైతే విషయములు అతిగ్రహములైయుండును.

జనక మహారాజుగారు ఒకానొక సమయమందున బ్రహ్మజ్ఞానుల సమావేశము నేర్పాటు చేసి, జ్ఞానులయందు ఎవ్వరు సర్వశ్రేష్ఠ బ్రహ్మజ్ఞానులో వారికి వేయి గోవులను దానము చేయుదునని యును. మీలో సర్వ శ్రేష్ఠుడైన బ్రహ్మజ్ఞాని యెవ్వరో లేచి నిలచి తమను తాము మీ సభలో సమర్థించు కోగలరని యును, ఆవులన్నియు యిక్కడే యున్నవి. సభ మిమ్ములను బ్రహ్మజ్ఞానిగా గుర్తించిన యెడల వీటిని తమరు తీసికొని తమ ఆశ్రమమునకు వెళ్లవచ్చునని సవినయముగా తెలిపెను.

అయితే, అప్పుడక్కడ సమావేశమైన వారెల్లరు బ్రహ్మజ్ఞానులే. ఒక్కరుగాని, యిద్దరుగాని లేచి యుండెడి సాహసమును చేయరైరి. ఆస్థితినిగనిన జనక మహారాజు మనమునందున వీరి బ్రహ్మ నిష్ఠత్వమునకు సంబంధించిన విషయమున సందేహము పొడచూపెను. మహారాజుల వారి మనోభావము నెరింగిన యాజ్ఞ వల్క్య మహర్షి సభయందు లేచి తన శిష్యునుద్దేశించి “ఓ సౌమ్యుడా మీగోవులన్నింటిని తోలుకొని మన ఆశ్రమమునకు నడువుమని ఆజ్ఞాపించెను”. అప్పుడు, మిగతావారు “ఏమేమి మీరొక్కరే బ్రహ్మజ్ఞానులా మేము బ్రహ్మజ్ఞానులము కామా” యని యాజ్ఞవల్క్యుని ప్రశ్నించిరి ఆనుడువులను ఆలకించిన యాజ్ఞ వల్క్యుడు, మీ మీ బ్రహ్మ నిష్ఠత్వముల యెడల మీకు విశ్వాసమున్న యెడల మీరెవ్వరు ఎందుకు నిలుచుండలేదు? నేను శ్రేష్ఠ బ్రహ్మజ్ఞాని యని యెంచి లేచి నిల్చుండలేదు. "వైయంనోకామాః యనగా మాకు ఆవులు కావలసి యున్నవి. అందుకే వాటిని తోలుకొని పోవుచున్నాము" యని అనిరి. యాజ్ఞ వల్క్యులవారి జవాబును విని అక్కడన్న వారున్నూ ప్రశ్నకు జవాబిచ్చి గాని మీరు యి ఆవులను తీసికొని వెళ్ళగలరని నిలదీసిరి. ప్రతి ఒక్కరు నానా విధములైన ప్రశ్నలు సంధించిరి. ఎల్లర ప్రశ్నలకు సావధానముగా సమాధానములిచ్చు చుండగా, "జరా త్కారవుడనెడి

ఋషి, "కతి గ్రహాః" యని ప్రశ్నించెను. ఈ ప్రపంచమున గ్రహములేవి యనెడిది దీని అర్థం వెన్వెంటనే" కత్యతి గ్రహాః" యని ప్రశ్నించెను గ్రహములెన్ని యని దీని అర్థము మరియు అతిగ్రహము లేవియని కూడ ప్రశ్నించెను. అప్పుడు యాజ్ఞ వల్క్యుడు" అష్టే గ్రహాః అష్టావతి గ్రహ!" యని బదులిచ్చెను దీని భావమేమనగా గ్రహములు ఎనమిది, అతిగ్రహములు కూడ ఎనిమిదే యాజ్ఞ వల్క్యుడు, ఇంకా ఈ విధంగా వివరణలిచ్చిరి. ఘ్రాణః వాక్కు, జిహ్వాః, చక్షు;, శ్రోత్ర; మన; హస్త మరియు త్వక్కులు ఇవి గ్రహములు. ఇవి తమ తమ విషయములను గ్రహణము చేయును కనుక వీటికి గ్రహములని పిలుచుచున్నారు. అటులనే గంథము, వచనము, రసము, రూపము, శబ్దము; కామము, ఖర్మము, మరియు స్పర్శ యనెడి యీ ఎనిమిది విషయములకు అతి గ్రహోములని పిలుతురు. విషయములు గ్రహముల కంటెను శక్తి వంతములై యుండుటచేత వాటిని అతిగ్రహములందురు ఇంద్రియములు విషయములను అనుభవించి అనుభవించి చివరకు శక్తి హీనములగు చున్నవి. కాని విషయములు మాత్రము ఎల్ల కాలము శక్తి వంతములై యుండుచున్నవి. శబ్దమును వినివినీ చెవి ఒక్కొక్కసారి చెవిటి యగు చున్నది. కాని శబ్దము మాత్రము నిత్య నూతనముగా యుండు చున్నది. ఇ వ్విధముగా మిగిలిన యీంద్రియములన్నియును, శక్తి హీనములై యుండగా, విషయములన్నియు శక్తి వంతములై యుండును. ఈ అతిగ్రహములను వెన్నంటి యుండెడి మనుష్యుడు, తన జీవనము యొక్క అవసానదశలో అనంతమైన దుఃఖమునే అనుభవించవలసి యుండును. ఈ విధముగా యాజ్ఞ వల్క్యుడు తన సమాధనము ద్వారా సభను సంతృప్తిపరచి, బ్రహ్మ జ్ఞాన నిష్టలో శ్రేష్టుడుగా గుర్తింపును పొంది, జనక మహారాజునుండి గోవులను గ్రహించి దోలుకొని వళ్ళెను. అందువలన వీర మాహేశ్వరుడు అలమాత్రము సుఖము నిచ్చెడి శబ్దస్పర్శాది విషయములందు నిరాసక్తుడై అఖండమైన శివానందమును పొందెడి దాని యందున ఉత్కంఠ కల్గిన వాడై యుండును. ఈ కారణముననే మాహేశ్వరునికి వీరా యనబడె ఉపాధి ప్రాప్తమై, వీరమాహేశ్వరుడగు చున్నాడు.

విషయములు తన ఎదురుగా వున్నను వాటి యెడల విరక్తభావమును కల్గియుండుటయే వీర వృత్తి యగుచున్నది. వీరమాహేశ్వరునకు యి విధమగు వీరవృత్తి వుండి తీరవలెను.

ఈ ప్రపంచమంతయు శబ్ద స్పర్శాది విషయముల చేత పరిపూర్ణమై యున్నది. కాని పరమాత్ముని యందున శబ్ద స్పర్శాదులకు తావులేదు. అందుచేతనే అతనిని "అశబ్దం, అస్పర్శం, అరూసం, అవ్యయం" యని శాస్త్రములు వర్ణించినవి పంచమహాభూతములలో నొక్కటి యగు పృధ్వీతత్వమునందున శబ్ద స్పర్శ రూప, రస, గందముల నెడివి యను భవమునకు వచ్చు చున్నవి. కాని జలతత్వము నందున శబ్ద, స్పర్శ, రూప, రసములు మాత్రమే కన్పట్టును. అచ్చట గంధాను భూతి యగుట లేదు. తేజోతత్వము నందున శబ్ద, స్పర్శ, రూపములు మాత్రమే అనుభవమునకు వచ్చును. వాయు తత్వమునందున శబ్ద, స్వర్షములు మాత్రమే యనుభవనీయములు. వీటిన్నింటికీ మొదటిదగు ఆకాశ ఆత్యమున కేవలము ఒకే ఒక తత్వము కలదు. అదియే శబ్ద తత్వము. ఈ పంచభూతముల, ఉత్పత్తికి కేంద్రమైన పరమాత్ముని యందు, ఆశబ్ద తత్వము కూడ యుండదు. అందుకే శాస్త్రములు యాతనిని నిర్విషయురు తెలుపు చున్నవి. ఈ విషయము వలన తెలియునదేమనగా పృధ్వి నుండి యాకాశము వరకు గల పంచతత్వములలో క్రమ క్రమముగా ఒక్కొక్క (తత్వము) విషయము తగ్గుతూ చివరకు పరమాత్మని సన్నిధిన, విషయ రాహిత్యము సంభవించుచున్నది. ఈ కారణము వలననే, పరమాత్ముడు నిరంతరము సచ్చి దానందమున మునిగి తేలుచుండును. అతని యొక్క ఆనందము నుండి, ఒక అణుమాత్రమును గ్రహించిన విషయములు, ఎంత మేరకు సుఖముల నిచ్చుచున్నవో మనమెరుగునది కాదు గదా? ఆ సుఖము యొక్క పర్యావసానము దుఃఖమని గూడ మనమెరుగుదుము. మాఘ కవి యి విషయమును ప్రస్తావిస్తూ "అపాత రమ్యా విషయాః పర్యంత పరితాపినః" యని ప్రతిపాదించినారు. దీని భావమేమనగా విషయము లిచ్చెడి సుఖములు తాత్కాలికమైనవి. ఈ విషయము లన్నియు దుఃఖములను కల్గించును దుఃఖములను కల్గించెడి విషయముల నుండి దూరముగా నుండుటయే వివేకవంతుని లక్షణముగదా? అందుచేతనే వీర మాహేశ్వరుడు విషయ సుఖమునకు దూరముగా నుండుటకు ప్రయత్నించు చుండును. అట్టి వాని గూర్చి శ్రీ భగవాత్పుదుల వారు ఈ విధముగా తెలియజేసిరి.

**శ్లో : పరస్త్రీ సంగనిర్ముక్తః పరద్రవ్య పరాఙ్ముఖః ।** (సి.శి. 10-15)

పరధనమును, పరసతిని, దూరముగా యుంచుటయే మాహేశ్వరునికి కర్తవ్యమై యున్నది. ఇచ్చట గమనించ వలసిన విషయమేమనగా ద్రవ్యము, స్త్రీలకు పరయనెడి విశేషణమును జోడించ నైనది. దీని భావమేమనగా, వీరమాహేశ్వరుడు స్త్రీ సాంగత్యమును మరియు ధన సంపత్తులను విడువ వలసిన పనిలేదు ధర్మబద్ధముగా తనదగు స్త్రీ ధనములను అనుభవించ వచ్చును.

షడ్రిపుల యందున కామమనెడిది ధర్మ విరుద్ధమైనది కాదు. అది గ్రాహ్యమే యని చెప్పబడినది. ఇట్టి ధర్మ సమ్మతమైన కామమును గృహస్తుడు అనుభవించ వలెను. ఎవ్వరికైతే యింద్రి యనిగ్రహము సాధ్యము కాదో, యట్టి వారు వివాహాది సంస్కారములను స్వీకరించి, సంసారిక జీవనమును గడుప వచ్చును. వీరమాహేశ్వరునికి సంసారమును త్యాగము చేయవలెననెడిది లేదని గ్రహించవలెను. భగవత్పాదుల వారు పరస్త్రీ సాంగత్యము మాత్రమే దోషమనిరి. స్వ స్త్రీ సాంగత్యము విహితమే. పర వనిత, పరధనము, ఎవ్వరికైనను అవిహితములే!

కాశీ మహారాజు యొక్క సభ యందు, ఒక సేవకుడు మహారాణిని గని, ఆమె రూప యవ్వనాదులకు మోహితుడై ఆమె సాంగత్యమునకై అభిలాషను పెంచుకొనెను. అది అసాధ్యమని ఎరిగినను, తన కోరికను వీడజాలక మౌనముగా చింతించ జొచ్చెను. నిద్రా, ఆహారములను వీడి, ఎల్లప్పుడు మహారాణి ధ్యాసలో పడి కాలమును వెళ్ళబుచ్చు చుండెను. కాలక్రమమున యాతని ఆరోగ్యము క్షీణింపజొచ్చెను. అతడు క్రమ క్రమముగా కృషించుటకు కారణ మేమిటో, ఎరుగుదలచిన యాతని పత్ని ఆ విషయము నాతనితో ముచ్చటించెను. అప్పుడుతడు తన వ్యధను ఎరింగించి మహారాణిని పొందకుండిన యెడల తాను మరణించడము తధ్యమని తెల్పెను. భర్త యొక్క దురవస్తను గని, తన పతి ప్రాణములను దక్కించు కొననెంచి, ఆ మహాసాధ్వి, మహారాణి సన్నిధికేగెను. మహారాణికి, పరిపరివిధముల సేవలు చేసి ఆమె మెప్పుదలను పొందెను. మహారాణిగారు సంతోష భరితాంతరంగియై నీసేవలచేత సంతృప్తిని పొందితిని, అందుకు ప్రతి ఫలమును కోరుకోమ్మనెను. అప్పుడు ఆసాధ్వి, రాణిగారు "నెనడిగినదికాదనకుండ యివ్వగలరా! మొదట మీరు వాగ్దానము చేయుడి. ఆ పిదప తనకు గాని, తన కుటుంబ సభ్యులకు గాని ఎట్టి హానిని తలపెట్టు నని అభయ మివ్వుడి. ఇందుకు మహారాణి అనాలోచితముగానే తన ఆమోదము నిచ్చెను. అప్పుడా సాధ్వి తన భర్త యొక్క మనోవాంఛను తెలియ చేసెను. ఆమాటను వినిన మహారాణి మొదట గట్టిగా నవ్వినది. పిదప "నీభర్త జాతి మరియు సంస్కారములు లేనివాడై, హీన దశలో నున్నాడు. ఇట్టి స్థితిలో యాతనితో సాంగత్యము చేయుట సాధ్యముగాదు. కావున అతడు గంగానది తీరమునకు చేరి, ఒక గుడిసెను వేసుకొని, ప్రతి దినము గంగనందు మునిగి కేవలము ఫలములను మాత్రమే భుజిస్తూ; పంచాక్షరి మంత్రమును జపిస్తూ, పన్నెండు వర్షముల పర్యంతము తపస్సును ఆచరించి పరిశుద్దుడు కావలెను. అప్పుడు గాని తాను అతని కోరికను తీర్చె విషయమును ఆలోచించగలనని చెప్పెను.

తన సతి ద్వారా మహారిణిని పొందే విధానమునెరిగిన యా సేవకుడు, గంగా తీరమునకు వెళ్ళెను. మరియు సూచించిన విధి విధానమును ఆచరించెను. తపస్సు యొక్క ఫలము గాయాతడు పాపచింతన ముక్తుడయ్యెను. ఆతని ఖ్యాతియును దశ దిశలకు ప్రసరించెను. అనేకులా తని దర్శనము కోరి ఎంతో దూరము నుండి రాజొచ్చిరి. ఆ వచ్చిన వారిలో, రాణి తనభర్త యైన మహారాజులు కూడ యుండిరి. అప్పుడా మహారాణి, యతడు తన సేవకుడుని గుర్తించెను. "నా కొరకు తపస్సుచేసిన వాడు యితడేనా? అని యోచించుకొని ఎల్లరిని బయటకు పంపించి, యతని భావనలను పరీక్షించుటకై ఓ యతీశ్వరుడా నీవు ఎవ్వరి గురించి యింత ఘోర తపస్సు నాచరించితివో, ఆ మహారాణి నీ యెదురుగా నిల్చి యున్నది, నీ యభీష్టమును నెరవేర్చుటకు సిద్దముగా నున్నది యని పల్కెను." మహారాణి మాటలను విని, ఆ మహానుభావుడు ఆమెకు సాష్టాంగ పడి ఓ తల్లీ క్షుద్రవాసనలున్న నేను, నీ ఉపదేశమును విని, తదను గుణముగా నాచరించి, యిప్పుడుత్యంత నిర్మలుడు నై యున్నాను. నా హృదయ మందున ఎట్టి విషయ వాసనలు లేవు గాజును కోరిన వాడికి, చింతామణి లభించి నటయినది. మిమ్ములను అట్టి కోరిక కోరినందులకు నన్ను మన్నించ వలసినదిని వేడుకొనెను. తపస్వి యొక్క మనస్సునెరింగిన యా మహారాణి సంతుష్టరాలై అంతఃపురమునకు బయులుదేరి వెళ్ళెను.

అంతః కరణమునందున పరి శుద్ధుడైన వాడికి పర స్త్రీ పరధనముల యెడ యభిలాష పుట్టదు. మాహేశ్వరుడు వీర వ్రతమును పూని నిరంతరము పరిశుద్ధమైన అంతరంగము గల్గియుండుటచే యిట్టి కోరికలకు దూరముగా నుండును. సంపద గురించి చెప్పవలెననిన యాతడు స్వ కష్టార్జితమైన సంపదననే అనుభవించుటకు యిష్ట పడును అదియును గాక ధనార్జన యందున స్వాతిషయమును పెంచకొనక, దొరికిన దానితో తృప్తి పడును.

ఆశయనునది బల వత్తరమైనది. దీనికి ఆరంభమేకాని అంతులేదు. అది పెరుగుచునే ఉండును. ఆశాపాశము చేత బంధితుడైన మనుజుడు తన ఆశలను నెరవేర్చుకొనుటకై దశదిశలకు పరుగులు తీయుచుండును. ఒక సుభాషిత కారుడు యీ విషయమును ఈ క్రింది విధముగా తెల్పెను.

శ్లో॥ ఆశీనామ మనుష్యాణాం కా దాశ్చర్య శృంఖలా!
తయాబద్ధాః ప్రధావంతి ముక్తాస్తి ష్ఠంతికుత్రచిత్ ॥

దీని భావమేమనగా ఆశయనెడిది బహు విచిత్రమైనది దీని చేత బందింప బడిన వ్యక్తి అతిగా పరుగులు తీయుచుండును. కాని దాని నుండి విముక్తిని పొందిన వాడు ఒకకడ స్థిరముగా నిల్చియుండును. లోకమునందున సామాన్యముగా సంకెళ్ళు వేయబడినవాడు సరిగా నడువలేడు కదా! కాని ఆశయనెడి సంకెళ్ళలో బంధింపబడినవాడు శీఘ్రగతిన పరుగులు తీయుచుండు బహు విచిత్రమైన విషయము కదా! ఆశలు సముద్ర తరంగముల వంటివి. ఒకటి తీరిన వెంట మరొకటి చేరుచుండును. వయస్సు పెరిగిన కొలది శరీరము జీర్ణమై నశించినను, ఆశ మాత్రము నిత్య నూతనమై చిరంజీవిగా నుండును, ఒకకవి చమత్కరించిన విధముగా "తృష్ణకు నిరంతరము తరుణావస్థనే" యుండును. అనగా, వృద్ధాప్యము లేనిదని దీనిని జ్ఞానులు, "ఆశా నిత్య తరుణీ"యని వర్ణించిరి. శ్రీ శంకరాచార్యులవారు, ఆశ గురించి యీ విధముగా చెప్పిరి.

శ్లో ॥ అంగం గలితం ఫలితంముండం దశన విహీనం జాతం తుండం।
వృద్ధోయాతి గృహీత్వా దండం తదపినముంచ త్యాశాపిండం ॥

దీని అర్థమేమనగా, అవయవయములు, జీర్ణమైనను కేశములు నెరసినను, పండ్లూ డినను, శరీరమునకు ముప్పు వచ్చినను చేతికి కట్టెవచ్చినను, ఆశ మాత్రమే నిత్యయవ్వనముతో నుండును ఆశను తృప్తి పరుచుట ఎవ్వరికి సాధ్యము కాదు. అదొక బ్రహ్మ రాక్షసివంటిది. అదినిరంతరము పెరిగెడి గుణము కల్గి యున్నందున దీనిని పూర్ణముగా తుప్తిగా వించురుట. దుసాధ్యమైన విషయము. వీర మాహేశ్వరుడు దీనిని తెలిసికొనిన వాడు కావున, ఆశాపాశ బద్ధుడు గాడు.

పతంజలి ప్రకారము, యోగమనగాచిత్త వృత్త నిరోదమే. "యోగశ్చిత్త వృత్తి నిరోదః" యనెడి దొక యోగ సూత్రము. అందుచేత చిత్తవృత్తిని ఆశవైపుకు మరల్చకుండ నిరంతరము నిరోదించు చుండవలెను.

సంసారిక అభిలాష గలవారు జీవాత్మను సంసారసాగరము నందు ముంచిన యెడల స్వాద్యాయ, శాస్త్ర శ్రవణ, భగవదారాధన మరియు సత్సంగములు అట్టి జీవాత్మను పైకెత్తి పరమాత్మచెంతకు చేర్చుచున్నవి. ఈ కారణము వలన యోగమనగా, అన్ని రకముల చిత్త వృత్తముల నిరోధకముగా భావించరాదు. సంసారము వైపు పయనించెడు చిత్తవృత్తిని, క్లిష్ట వృత్తియని యందురు తద్విరుద్ధమైనది అక్లిష్ట చిత్త వృత్తి అక్లిష్ట చిత్త వృత్తి యోగులకంగీ కారయోగ్య మైన్నదే.

మనుజునికి మనస్సు నందు పరద్ర వాభిలాషకూడ ఎందుకు కల్గుననెడి సందేహము తలయెత్తును. అ కోరిక లెక్కువై, తదనుగుణముగా విత్త మార్జించక పోవటము వలన, తన కోరికలను తీర్చు కొనుటకై యాతడు పరద్రవ్యము నాశించాంచుచున్నాడు. పరద్ర వ్యమునాశించిన వాడి అంత రంగము మలినమై యుండును. ఇట్టి కోరికలను వీడిన గాని మనస్సు నిర్మలముకాదు. కోరికలనెడి మలనిర్మూలనమునకై వైరాగ్యమనె మంగళ స్నానమునాచరించ వలెను. బుద్ధి దోషితమై యుండిన యెడల మనస్సు నియంత్రణలోయుండదు. అది అనేక దిశలవైపు పరుగులు తీయుచుండును. తన్ని మిత్తమై వీర మాహేశ్వరుడు శివయోగము నాచరించుచూ, సమస్త కోరికల నుండి విముక్తిని పొందవలెను. శ్రీ భగవత్పాదులవారు "శివార్థకాయ సంపన్నః శివాగమ పరాయణః", యని (శి.సి. 10-15) యాదేశమునచ్చిరి. వీరమాహేశ్వరుడు, ఏ మంచి పనిని చేసిననూ అది తన కొరకు కాదని భావించుకొని, శివుని నిమిత్తమే తాను కార్యాసక్తుడనగు చున్నాడని యెంచి కార్యములు చేయును. ఈతని మనస్సునందున శివుడు నిండి యుండుటచే యాతడు చేసిన పనులు శివునకు ముదుపులగు చున్నవి.

వీరమాహేశ్వరుడు శివ జ్ఞాన సంపన్నుడై యుండవలెను ఇట్టి శివ జ్ఞానము శివాగములలో కలదు. ఈ ఆగమములలోని ఉత్తర భాగమున వీరశైవము పదేశింపబడినది వీర మాహేశ్వరుడు యీ శివాగమములను తప్పని సరిగా పారాయణము చేయ వలెను. అదే విధముగా సిద్ధాంత శిఖామణిని సిద్ధాంత కూడ నిత్య పారాయణ గ్రంధముగా తీసికొనవలె. ఈ నిత్య పారాయణము వలన మనస్సు నిర్మలముగా వుండుటతో బాటుగా జ్ఞానము కూడ సంప్రాప్తమగు చున్నది. పారాయణము చేయుటలో మరొక లాభము కలదు. పునః పున పఠించుట వలన ఆగమములలోని గూఢార్థము అనుభవమునకు వచ్చును. మనము మనయొక్క ఆత్మ స్వరూపమును చూడ గల్గుదుము.

శ్రీ భగవత్పాదుల వారు "శివస్తుతి రసాస్వాదమోదమాన మనాః శుచిః" యని యుపదేశించిరి. (సిశి. 10-16).

శివస్తుతిని నిరంతరము చేయుట ద్వారా శుచిత్వము సిద్ధించుచున్నది. మనుష్యుని నాలుక మధురము తిక్తము, కటువు, మరియు లవణము మొదలగు వాటిని ఆస్వాదనము చేసి, ఆనందమును అనుభవించి నటులనే, మనస్సు శివ నామా మృతమును సేవించి ఆనందమును అనుభవించును. ఈ క్రింది సుభాషితమును కనుడి.

**శ్లో ॥ మృద్వీకారసి తసి తాసమసితా స్వీ తంవిపీతం పయః ।**
**స్వర్గ యాతేన సుధా పృధాయి కతి ధా రంభాధరః ఖండితః ॥**

**శ్లో ॥ సత్యం బ్రూహి మదీయ జీవ భవతా భూయో భవే భ్రామ్యతా ।**
**శివ ఇత్యక్షర యోద్వర యోర్మధు రిమోద్గారః క్వచిల్లక్షితః ॥**

పై వాటి తాత్పర్యమే మనగా ఈ లోకము నందున ద్రాక్ష, చక్కెర, క్షీరము, మొదలైన రసములను పొట్టనిండుగా త్రాగి తృప్తుడుగా ఎట్లగుదురో, అట్లే త్రేన్పు తీయడము జరుగును. ఇంతటితో ఆగక ఆస్వాధించి స్వర్గమునకు పోయి అమృతపానము, రంభ మొదలైన అప్సరసల అదరామృతము ఎన్ని యోసార్లు పానము చేసి సుఖింతురు. కాని, భవసాగరమందున మళ్ళి మళ్లీ తిరగెడి నీవు శివనామా మృతమును స్వీకరించి త్రేన్పు తీసితివా?

భక్తి ఉద్యమములోని వారును యిట్టి ప్రశ్నలనే వేసిరి. శివస్తుతి మరియు శివనామ జపములు ఒక విధముగా రసములే. నవరసముల యందు శాంతము కూడ ఒక రసమే. శివుడు శాంత స్వరూపుడై యున్నందున అతని స్మరణవలన శాంతి ప్రాప్తమగు చున్నది. స్వాదిష్టమైన భోజనము ఉత్తమమైన అలంకారములు పొందినచిన తర్వాత సామాన్య మానవుడు ఏ విధముగా ఆనందించునో అదే విధముగా వీరమాహేశ్వరుడు, శివ నామామృతము నాస్వాధించి అనంతమైన ఆనందమును అనుభవించు చున్నాడు.

ఓం శాంతి : శాంతి : శాంతి :

ది ॥ 15-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

విషయలోలత్వయెంత ప్రమాదకరమైనదో యనెడి దానిని శ్రీ విశ్వారాధ్య పీఠాధీశ్వరులైన, కాశీ జగద్గురువులు, శ్రీ చంద్రశేఖర్ శివాచార్యుల వారు తెలియ చెప్పిరి. వారొసంగిన సోదా హరణాశీర్వచనము చిరస్మరణీయము.

మాహేశ్వర స్థలము నిష్ఠాభక్తికి కేంద్ర స్థానమని తెలిసి కొంటిమి. ఏకేశ్వరోపాసన యనెడి మహత్త్వ పూర్ణమైన విలువలను మనమున నిడికొని సాధన చేయవలసి యుండును. ఇయ్యది యెంతో ప్రాచీన కాలముననే ప్రతిపాదింప బడినది. ఉపనిషత్తులలోన యీ భావమును గాంచగలము. ఈ విలువల ననుసరించి జీవనము కొనసాగించుట కష్టతరమైన విషయము "ఇంద్రియ చపలత్వమే ప్రధానమైన యనవరోధము" అని విజ్ఞుల యభిప్రాయము. ఇంద్రియములు విషయోప భోగముల నాశించును. విషయ లాలసత్వమును పెంపొదించును. భోగలాలసునికి విషయ వాంఛలను తీర్చుకొనుటయే ముఖ్యము. చతుర్విధ పురుషార్థములలోన నతనికి అర్థ-కామములే యతనికి వాంఛనీయములు వీటి నిమిత్తమున నెంత మేరకైనను యత్నించును. కామ్య కర్మలే సాధనములని యెంచును. యజ్ఞ యాగ తపశ్చర్యల ద్వారా వీటి సంపాదన గతిని పెంచికొనుటకై యత్నించును. కామి తార్థముల నాశించి బహు దేవతోపాసన వైపు పరుగులు తీయును. తత్ఫలితముగా శివైక నిష్ఠాపరతత్త్వమునకు భంగము వాటిల్లి తిరోగమన ప్రాప్తి కలిగించును.

ఈ ధోరణిలో భక్తుడు భవియై, సంసారియై ప్రవృత్తి మార్గమున పయనించెడి స్థితికి వచ్చును. అందుచేత మాహేశ్వర స్థానమున గల వీరశైవుడు ఇంద్రియముల వలన గల్గెడి విషయానుభూతి యెడల నిరాసక్తుడై యుండెడి స్థితికి యెదుగ వలెను. వీర వ్రతమును పూని వీర మాహేశ్వరుడు కావలెను. వైరాగ్య భావన గల్గియుండుటె వీర మాహేశ్వరుని లక్షణమని గ్రహించ వలెను, సంపద యెడల నాసక్తిని వీడుట

యనెడిది మొదటి పరిణామమగును. ఎంతటి సంపదయైనను నతనికి గడ్డి పరక వలె దోచును. భక్తి యనెడిదే గొప్పది యని భావించెడి యితనికి యింద్రాదుల సంపత్తి యైనను ప్రలోభమునకు గురిచేయ జాలదు. ఈ యంశమును వ్యక్తము చేసెడి యీ క్రింది పద్యమును గనుడి:

**శ్రీవత్సాంకు రమా విశేషతయు వాక్ర్పీనాథు చాతుర్యమున్**
**దేవాధీశ్వరు వైభవోన్నతియు నా తిగ్మాంశు తేజంబు శ్రీ**
**దేవీనందను రూపవిభ్రమము చింతింపంగ నీ భక్తి**
**సద్భావాత్ముండగు పుణ్యమూర్తికి దృణ ప్రాయంబు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప. 21)

ఈ పద్యమునకు డా॥ ముదిగొండ వీర భద్రయ్యగారి యీ క్రింది వ్యాఖ్య గమనార్హమైయున్నది.

మానవుని సంపద కన్నా శ్రీ మహావిష్ణువు సంపద ఎప్పుడూ గరిష్ఠమైనది. కారణం, ఆయన సతీమణియే లక్ష్మీదేవి కాబట్టి, సకల ప్రజ్ఞలకు మూలపుటమ్మ సరస్వతి ఆమెకు నాధుడు బ్రహ్మ కాబట్టి ఆయన చాతుర్యం గరిష్ఠ మయినది. ఇట్లాగే వైభవంలో దేవేంద్రుడిది, తేజంలో సూర్య నారాయణునిదీ, రూపంలో మన్మధునిది ! అన్ని గరిష్ఠ స్థాయివి, శివభక్తుడిట్లాంటి వాటిని కూడ గడ్డి పరకతో సమానంగా చూస్తున్నాడంటే ఇవేవీ నిజానికి గరిష్ఠ స్థాయివి కావనీ, ఇంత కంటె శ్రేష్ఠాతి శ్రేష్ఠం, ఉత్తమోత్తమం ఈ ఐదింటినీ కలగలుపుకొని మించిన దాన్ని శివభక్తి ఇస్తుంది. కాబట్టే శివభక్తుడు వీటిని తృణ ప్రాయంగా చూస్తున్నాడు.

(సర్వేశర శతకము, పుట. 36 పావని సేవా సమితి ప్రచురణ, 1999,)

వైరాగ్య భావన గలవానికి యైహిక సుఖముల యెడల నాసక్తి యుండదు. జిహ్వాది యింద్రియముల వలన గల్గెడి యైహిక పరమైన సుఖమును కోరడు అభక్ష్యములను కోరడు. శివ ప్రసాదము కొరకే యభిలాష గల్గి యుండును. కర్ణములను శివానుభవ గోష్ఠుల కంకితము చేయును. కళ్ళతో దృష్టియోగము నాచరించుచు యిష్ట లింగార్చనలోన నిమగ్నుడగును. జంగమార్పిత సుగంధములనే వాసన చూడనెంచును. త్వగింద్రియముతో గురు-జంగముల పాదము స్పృశింప నిచ్చ గల్గిన వాడగును. ఇట్టి యనుభవ సంచయము వలన గల్గెడి ఆనందము నిరుపపానమైనదని యెంచును. ఈ యంశమును తెలిపెడి యీ క్రింది పద్యమును గనుడి.

అనయంబు వాయవ్యమునను, సంభాషణ ముత్తమంబనుచు సదుత్తరముగ బొందుగ లైంగ్యంబు నందు సంభాషణ ముక్తి యటంచు సమ్మోదితముగ సత్యంబు శివ ధర్మ శాస్త్రంబు నందు శై వానందమనుచును స(న)తులితముగ నొనర విష్ణుపురాణమున సకృత్యం భాషణాదపియనుచు సంపాదితముగ

మ్రోయునట్టి వేదంబుల నాయతముగ 'తేన సహసంపసే' త్తను దాన భక్తి పరులతో నాచరించు సంభాషణముల ఫలమెరుగ నల్పుల తరంబె బసవలింగ! (చాతుర్వేద సారము, ప. 90)

శివానందములో తేలియాడెడి వాడు సచ్చరిత్రుడై యుండుటకు కృషి చేయును, అట్టివాని స్థితిని తెలిపెడి యీ క్రింది వచనమును గనుడి.

పరువెత్తెడి పాముకంజను, ఎరగలి నాలుక కంజను సురియ మొనకంజను. ఒకటి కంజెదను, ఒకటి కవికెదను పరస్త్రీ పరధనములనెడి జావరము కంజెదను మున్నంజని రావణునికే విధి యైనది, అంజెదనయ్యా ! కూడల సంగమ దేవా ! (బసవేశ్వర గీతామృతము, పు. 314)

ఈ విధముగా మాహేశ్వర స్థలములోని వీరశైవుడు వీర వ్రతియై యింద్రియ జిత్తుగ విరాజిల్లవలయును.

శివం భూమాత్

## ఆశీర్వచనము : 3

## మాహేశ్వర ప్రశంసా స్థలము

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు, మాహేశ్వర స్థల ప్రశస్తిని వివరిస్తూ మాహేశ్వర స్థలములో భక్తుని లక్షణములను మరి కొన్నింటిని ఈ క్రింది విధముగా నుపదేశించిరి.

**శివస్తుతి రసాస్వాదమోదమాన మనాః శుచిః**
**శివోత్కర్ష ప్రమాణానాం సంపాదన సముద్యతః ॥**
**నిర్మమో నిరహంకారో నిరస్తక్లేశ పంజరః**
**అస్పృష్ట మద సంబంధో మాత్సర్యావేశ వర్జితః** (సి.శి. 10: 16-17)

వీర మాహేశ్వర స్థలమునందలి భక్తునకు శివస్తుతి యెడల అమితమైన యనురాగముండును. ఎల్లప్పుడు శివస్తుతిని చేయుచు సంతోషమున నుండును. అయితే శివస్తుతిని సంపూర్ణముగా చేయగలమా? చేయలేమని చెప్పవలసి యుండును. ఈ స్తుతిని చూడుడి.

**అసిత గిరిసమం స్యాత్ కజ్జలం సింధు పాత్రే**
**సురతరు వరశాఖా లేఖనీ పత్రమూర్వీ**
**లిఖతియది గృహీత్వా శారదా సర్వకాలం**
**తదపి తవ గుణానామీశ పారం న యాతి ॥**

పుష్పదంతుని స్తుతిలోని తాత్పర్య మేమనగా శారదాదేవి, సముద్రమును సిరాబుడ్డిగా జేసికొని, భూమినే వ్రాత పత్రముగా చేసికొని, కల్పవృక్షపు కొమ్మను లేఖినిగా చేసికొని, తన ఆయుష్య పర్యంతము వ్రాసినా శివుని గుణ గణ మహిమ ముగియ జాలదు. ఇది ఇట్టులుండగా, సామాన్య మానవుడు. ఎటుల శివుని పూర్ణముగా కొనియాడగలడు. నామస్మరణలోన అపారమైన శక్తి యిమిడి యున్నది. కలియుగమున దీనికిగల ప్రాముఖ్యత దేనికీ లేదని చెప్పబడినది. యజ్ఞయాగాదులు చేయుట కంటెను. అధికమైన ఫలదాయకమైనది నామస్మరణ యని తెలుప బడుచున్నది. దుర్మార్గులను సన్మార్గ వర్తనులుగా చేయును. సన్మార్గ వర్తనులను నాధ్యాత్మ పథగాములుగా చేయును. శివశరణుల ప్రకారము శివ నామోచ్చారణ మరియు స్మరణ చేసిన వారికి భవసాగరము ఇనికి పోవును. భర్గుని భవ్యమైన దయ సంప్రాప్తమగును. నామ స్మరణ చేసి తరించిన వారి కథలు బసవ పురాణములోను గలవు.

శుచి-అశుచి యనెడి భావనలు సగటు మనిషి యొక్క మస్తిష్కమును పురుగువలె తొలిచి వేయుచుండును. మంచి పనులు చేయునప్పుడు శుచిగా ఉండవలెననియును, శుచిగా అయ్యే వరకు అట్టి దానిని చేయ కుండుటను గమనించ గలము. ఒకానొక శివ బ్రాహ్మణుడు ఆ విధముగా దలచెను. సాధారణముగా శౌచమునకు వెళ్ళునప్పుడు యజ్ఞోపవీతమును చెవుకు చుట్టి కొనుట జరుగును. కాని యితడు అద్దానిని తన నాలుకకు చుట్టికొని వచ్చు చుండెను. మార్గమధ్యమున నొక శివాచార్యుడతనిని గాంచి, "ఇదేమిటి? జన్నివారమును జిహ్వకేల కట్టి కొంటివి" యని అడిగెను. అప్పుడా బాపడు సమాధానము చెప్పలేదు. మౌనముగా నుండెను. ఇంటికి వెడలి స్నానాదులు ముగించి కొని, శివాచార్యుని మఠమున కేగెను. ఉదయ మొక ప్రశ్న వేసితిరి కదా! దానికి నా ఉత్తరము నిచ్చెదను వినుడి. ఓ స్వామీ! శుచికి మేమెంతో ప్రాముఖ్యత నిత్తుము పవిత్రులముగా అయ్యెడి వరకును నే పనియును చేపట్టము. శివనామ సంకీర్తనము చేయుట నాకెంతో ప్రీతి పాత్రమైనది. పొరపాటున అద్దానిని, అశుచిగా నున్నవేళలో చేయుదునేమో యని భయపడి నాలుకకు నా జన్మివారమును చుట్టికొని యుంటిని.॥

బాపని యవివేకమును గాంచిన శివాచార్యుల వారు మౌనముగా ఉండిపోయిరి. బ్రహ్మణుని భావన సరియయినది కాదు. నామస్మరణకు అశుచి-శుచి యనెడి తారతమ్యమును పాటించెడి యావశ్యకత లేదు. సర్వకాల సర్వావస్థల యందు సర్వేశ్వరుని స్మరించి కొన వలెను. ధన్యతను బడయ వలెను. ఈ శివాచార్యుడు, బ్రహ్మణునికి హితభోధ చేయనెంచెను. కాని మెందులకో చేయడయ్యెను. అప్పుడా బాపడు, "స్వామీ! మౌనము వహించితిరేల? నా ప్రవర్తనలో యౌచిత్యము లేదా" అని అడిగెను అప్పుడు శివాచార్యుడు ఈ విధిన యుపదేశమును ఇచ్చిరి.

ఓ యీ బ్రహ్మకులజా! తర్కయుక్తమైన యుత్తరము నిచ్చితివి. కాని నీ భావన సరియైనది కాదు. అశుచి-శుచి యనే వాటి గురించి ఆలోచించు అవశ్యకత లేదు. దానికి గల హేతువును వివరింతును వినుము. శౌచ క్రియ నిమిత్తము నీవు కూర్చుండి యున్నప్పుడు, నీ దృష్టి యాచుట్టు ప్రక్కల గల యేదో నొక వస్తువుపైన లగ్నమై యుండును కదా! నీ మనోవృత్తి భగవదేతరమైన వస్తువుల యందున నిలిచినప్పుడు మరణము సంభవించిన యప్పుడు, పరిణామమేముండునో? నీ వేరుగనిది కాదు. "అంత్యే యా మతి ః సాగతి ః" అని

గదా శాస్త్ర వచనము. మరు జన్మలో నీవు ఆ వస్తువుగా పుట్టెడి యవకాశముండును కదా! అట్టిది నివారించుటకై యెల్లప్పుడు శివనామ స్మరణ చేయవలెను.

భూసురుని బుద్ధి పుష్పము వలె వికసన మొందెను. తనకు జ్ఞానోదయము గల్గించిన శివాచార్యుల వారికి ప్రణమిల్లి, గురు దక్షిణ సమర్పించి, యాశీర్వాదమును గైకొని స్వగృహమునకు వెడలెను.

శివ నామస్మరణ ప్రాముఖ్యత నెరిగిన మాహేశ్వరుడు సర్వకాల సర్వావస్థలలో శివనామ స్మరణలో మునిగి తేలుచుండును. నామస్మరణ వలన మనస్సు శుచి ర్భూతమగునని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిరి. మానవుని అంతరంగ బహిరంగములు శుచి ర్భూములగునని తెలియగలరు. అంతియే గాదు నామస్మరణ చేసెడి వాని చుట్టు ప్రక్కల నుండెడి భౌతిక-భౌతికేతరములన్నియును శుచిర్భూతములగును. సామూహికముగా శివనామ స్మరణ చేసిన యెడల నయ్యది మరింత గుణకారిగా నుండునని గుణతత్త్వ విశారదుల వలన తెలియు చున్నది. వీర మాహేశ్వరుడీ విషయమునెరిగిన వాడై సామూహిక నామ పఠన కార్యక్రమముల నేర్పాటు చేసి యద్దానికి నేతృత్యము వహించు చున్నాడు.

మాహేశ్వరుడు శివోత్కృష్ట భావమును మనసార నమ్ముచున్నాడు. శివుడొక్కడే వరుడనియును, విరించి విష్ణ్వాదుల అవరులనెడి భావన యిందులోన యిమిడి యుండును. తాత్త్వికముగా, ఇది సరియయిన భావననే కాని లోకమున ప్రచారములోనున్న ద్విమూర్తి, త్రిమూర్తి, అష్టమూర్తి వంటి భావనలు, శివోత్కృష్టత భావమునకు అవరోధముల నేర్పరచు చున్నవి. వీరశైవేతరులు, ఈ భావనలను ఉద్ధృతికి తెచ్చి బహు విధములుగా ప్రచారము చేయుచున్నారు. ఇట్టి స్థితిలో వీర మాహేశ్వరుడు తాను నమ్మిన శివోత్కృష్టత భావనను ప్రతిష్ఠించుటకై బహువిధములైన ప్రమాణములను సంపాదించు ప్రయత్నములో నిమగ్నుడై యుండును. చిత్తమున యేకాగ్రతను సాధించుటకై యతడు ఈ విధిన యత్నించుట యెంతయోను అవశ్యమై యున్నది. దీనికి మరొక ప్రయోజనము కూడ కలదు. భక్తి స్థలములో నుండెడి శ్రద్ధా భక్తి సహితులు ప్రచలిత మనస్కులై తప్పుడు మార్గములలో పయనించ కుండగ చూడవలసిన బాధ్యతను మాహేశ్వరుడు స్వీకరించును. వారికి ఆదర్శ ప్రాయుడై నిలిచి యుండును. వారికి ప్రేరణను ఇచ్చుటకై ప్రమాణములను సంపాదించుటలో నిమగ్నుడై యుండును. అహంకార మమకారము లెంత ప్రభావమును చూపునో, నది మనమెరిగిన విషయమే. ఇవి మానవునికి నైసర్గికములుగా నుండునని తెలియు చున్నది. "నేను" "నాది" అనే భావము వహించిన వారు స్వార్థపరులై స్వపర భేదము లేకుండగ నందరికిని క్లేశములను గల్గించు చున్నారు. తాము పతనమై, యితరులను పతనము దిశన పయనింప జేయుచున్నారు. మాహేశ్వరుడీ విషయముల నెరింగిన వాడై యెంతో జాగరూకత వహించి భక్తి భావమును సాధనముగా గొని అహంకారమును, వైరాగ్య దావానలముతో మమకారమును నాశనము చేయు చున్నాడు.

శంకరాచార్యుల వారు "అహం మమేతి నైసర్గి కోఽయం లోకవ్యవహారః" అని తెలిపిరి ప్రతియొక్కని అంతః కరణమున అహంకార మమకారములు గూడు కట్టుకొని యుండును. తాను కాని దానియందు తాననెడి భావన గల్గియుండుటయే అహంకారము. తనది కాని దానిని తనదని భావించునదే మమకారము. జీవులు, శరీరము తామని భావింతురు శరీరమునకు సంబంధించిన వన్నియును తనవనెడి భావన వహించును. వాస్తవముగా ఆలోచించిన యెడల శరీరము జీవునిది కాదు తత్సంబంధితము లైనవి జీవునివి కావు. సమస్త విశ్వమునకు ఈశ్వరుడే పతి. అతడే విశ్వమై విరాజల్లును. "ఈశావాస్య మిదం సర్వం యత్ కించ జగత్యాం జగత్" అని ఉపనిషత్తులో చెప్పబడినది ఈ జగత్తులోని వన్నియును ఈశ్వరునివే యని దీని భావము. జీవుడు వృధాగా అభిమానము పెంచికొని పతనమగుచుడు. దుఃఖము ననుభవించు చున్నాడు. ఉపనిషత్తులలోని భావనకు హృద్యమైన రూపముగా గోచరించెడి దాసిమార్యుల వారి వచనమును గనుడి.

**ఇళె నిమ్మదాన బెళెనిమ్మదాన**
**ఎత్తు నిమ్మదాన బిత్తు నిమ్మదాన**
**సుత్తిసూసువొ గాళి నిమ్మదాన**
**నిమ్మదానవ నుండు అన్యర హొగళువ**
**కున్నిగళనేనెంబె రామనాథా!**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది.

**ఇల మీ దానము ఫలము మీ దానము**
**ఎద్దు మీ దానము విత్తు మీ దానము**
**సుళ్ళుతిరుగు ఆగాలి మీ దానము**
**మీ దానమును మెక్కి యన్యుల బొగడెడి**
**కుక్కపిల్లల నేమందు రామనాథా!**

సర్వము ఈశ్వర కటాక్షమని భావించిన, యీశ్వరార్పణ భావముతోనను భోగము చేసెడి వానికి, అహంకార-మమకారము లంటవని దాసిమార్యుల వారి వచనము వలన తెలియు చున్నది. ఆద్యులలో నొక్కడగు దేవమార్యులు చూపిన మార్గముననే మాహేశ్వరుడు పయనించును అహంకార-మమకారములను దూరము చేసికొనును.

శ్రీ భగవత్పాదుల వారు తమ ఉపదేశమున మాహేశ్వరుడు పంచక్లేశములను విడిచిన వాడని తెలిపేను. "క్లిష్ణాతి ఇతిక్లేశః", ఈ పదము యొక్క ఉత్పత్తి వివరణ తెలిసికొనుట, దీనిలో అవిద్య, అస్మిత, రాగ, ద్వేష, మరియు అభినివేషమును ఈ పంచక్లేశములన్నియు నిరంతరము భక్తుని దుఃఖ సాగరమునందు ముంచుతూ తేల్చుచూ అంటి పెట్టి కొని యుండును. ఈ విధముగా క్లేశపంచకము, భక్తుని పురోగమనానికి నిరోధకముగా వుండును. వీటి యందు అవిధ్య లేదా అజ్ఞానమను క్లేషద్వయం మొట్టమొదట దుఃఖ కారణ భూతమగును దీనివలన భక్తుని అంతరంగము నష్టపడును. వీర మాహేశ్వరుడు తన హృదయము నందు సర్వము శివ మయమను అస్తిత్వమును నెలకొల్పి యున్నచో అజ్ఞానము దూరమగును. పిదప అస్మిత రాగ, ద్వేషము మొదలగు ఈ క్లేశ పంచకము సహజముగానే తమంతట తామే దూరమై పోవును. ఈ ఉదాహరణ కారణముగా వీర మాహేశ్వరుడు పంచ క్లేషములను విడిచిన వాడని సంభోధించడము ధర్మమే.

పూజ్య శ్రీ భగవత్పాదుల వారు, వీర మాహేశ్వరుని స్వరూపమును విశ్లేషణ చేస్తూ "అస్పష్టమద సంబందో మాత్సర్యావేశ వర్జితః " (సి.శి.10-17) యనెడి ఉపదేశ ప్రకారము, వీర మాహేశ్వరుడు మద మాత్సర్యములనెడి దోషములను దూరము చేసికొనిన వాడగును. ఈ మద మాత్సర్యములను ఇరువది రకముల రూపములుగా వివరించ వచ్చును. మదమనుపదమును విశ్లేషణ చేస్తూ అమలు లేదా ఉన్మాద, అధిక ధనమును కల్గియుండుట, విద్యాధి కుడగుట అధికారము హెచ్చుగా వున్నవాడు; అతి రూపనతి లేదా రూపవంతుడగుట, మరియు బందు ప్రీతి హెచ్చుడము వలన కల్గె కారుణ్యము అతని మనస్సు నందు ఒక విధమైన విలక్షణమగు ఉన్మాదము అంతర్లీనంగా వుంటుంది. దీనినే మదమను పరిభాషలో చెప్పదలచినచో, ధనమదము, విద్యామదము, అధికారమదము, సౌందర్యమదము మరియు యవ్వనమదమని అనేక ప్రకారములుగా యుండునని తెలియుచున్నది. ఇవి అన్నియు ఒక్క క్షణములోపుననే మనుజుని వివషుని చేసి మదాంధుడిగా మార్చును. వీర మాహేశ్వరునికి క్షణికావేశము లేక, ఆలోచన పరిభూతుడై యుండుట వలన ఈతని మనస్సు నందు, మదోన్మాదము దగ్గరకు చేరలేదు. ఈ విధిన, మాత్సర్యము కూడ అతని దరికి చేర లేదు. మాత్సర్యమను పదమునకు, అసహనము, అసూయ; యనెడి అర్థము కూడకలదు. ఈ అసహనము మరియు అసూయలు మానవుడిని అంటి పెట్టుకొని యుండుట వలన అనేక విధములుగా అనర్థములు సంక్రమించును. ఈ మాత్సర్యము వలన మనుజునికు మాత్రమే హాని జరుగడముతో బాటు, యితరులకు కూడ దీని వలన హానికల్గును, తద్వారా అనర్థములు వాటిల్లును.

ఒక వూరునందు యిద్దరు అజ్ఞానులుండిరి. వీరిద్దరు ఒకరిపై మరొకరికి మాత్సర్యము మెండుగా యుండెడిది. ఒకరికి తెలియకుండ మరొకరు వూరిప్రక్కన ప్రవహిస్తూన్న నది తీరమునకు పోయి తపస్సు చేయదలచిరి. ఇద్దరు నది దరికి చేరిరి. ఒకరు నదికి ఒకవైపున, మరొకరు నదికి మరొక వైపున కూర్చుండి శివుని గూర్చి తపస్సు చేయదొడగిరి. కొంత కాలమునకు యిద్దరిలో ఒకనికి శివుడు ప్రత్యక్షమయ్యెను. శివుని చూసిన, ఆ తపస్వి సంతోషించి, అనేక విధములుగా దేవ దేవుని స్తుతించెను. అతని ప్రార్థనలను వినిన శివుడు పరమానంద భరితుడై వరమునివ్వ దలచి, ఏమి కావలెనో కోరుకోమ్మనెను. ఆ అజ్ఞాని తనకు కావలసిన దానిని కోరుకోకుండ తన విరోదియైన రెండో వాడు నదికి అవతలి తీరమున తపస్సు చేయుచున్నాడనియు, అతనికి మొదలువరమును కటాక్షించవలెనని శివుడిని కోరెను. అందుకు శివుడు మొదట అంగీకరించక నీకు మాత్రమే వరమివ్వదలచినాను కావున వరమును కోరుకొమ్మనెను. ఐనను ఆ

అజ్ఞాని శివుని మరొక సారి తన ప్రత్యర్థికి మాత్రమే ముందు వరమివ్వ వలసినదని పిదప మాత్రమే తాను కోరగలనని నొక్కి చెప్పెను దానితో శివుడు రెండో వాడికి సాక్షాత్కరించి, అతని ప్రార్థనలను స్వీకరించి, వరమివ్వదలచెను. ఈ రెండోవాడు కూడ, మొదటివాడిపై ద్వేషభావముతో వుండట వలన, మొదటివాడికి వరమిచ్చిన తర్వాతనే తాను వరము కోరగలనని మనవి చేసెను. దీనితో శివుడు వీరిద్దరి మనసులలో నున్న మాత్సర్యమును తెలిసికొని రెండోవాడితో, మొదటివాడు కూడ నీవు కోరిన విధముగానె మనవి చేసినాడు కావున, తప్పని సరిగా నీకోరికను ముందుగా తెలుప వలసినదని ఆదేశించెను. దానితో రెండోవాడు తనకు జరిగిన దానికన్న రెండోవాడికి రెట్టింపు జరుగ వలెనని మనస్సున నిశ్చయించుకొని, తనకు జరుగబోయె అనర్థమును కూడ ఎంచక, శివుని ఈ విధముగా కోరెను. తనకున్న రెండు కన్నులలో ఒకటి; రెండు కాళ్ళలో ఒకటి మరియు రెండు చేతులలో ఒకటి పనిచేయకుండ వుండునట్లుగాను; మొదటి వాడి కున్న రెండు కళ్ళు, కాళ్ళు మరియు చేతులు పూర్తిగా పనిచేయకుండ వుండునట్లుగా వరమివ్వమని శివుని కోరెను. శివుడు వాడి అంతరంగమునెరగి తథాస్తు యని ఆ విధముగానే వరమిచ్చెను. ఈ విధముగా ఆయిద్దరు అజ్ఞానులు, ఒకరిపై మరొకరికి పెంచు కొన్న మాత్సర్యము వలన అవయవములును కోల్పోయిరి. ఎవ్వరికి లభించని శివుని దర్శనము లభించినను అతనిచే సత్ఫలితములను బడయుటకు బదులుగా అనర్థములను కొని తెచ్చుకొనిరి. దీనివలన తెలియున దేమన. "చెడపకురా చెడెదవు" అనునది మాత్సర్యముగల వారికి వర్తించును. ఈ కారణము చేత మాత్సర్యమును కల్గియున్న వారు తాము మరియు యితరులను కూడ అనర్థముల పాలు చేయగలరు. కాని వీర మాహేశ్వరుడు మాత్రము సర్వత, సమదృష్టి కల్గి యుండి, మాత్సర్య ఆవేశరహితుడుగా యుండును. అదియునుగాక ఆనందమయుడై యితరులకు కూడ ఆనందమును పంచియిచ్చేవాడుగా నిరంతరము పరశ్రమించును.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 16-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువుల వారు శివనామ సంకీర్తనామృతీ సంసేవన వలన గల్గెడి దివ్యాను భూతి గురించియును. మద-మత్సరముల వలన గల్గెడి పరిణామముల గురించియును తమ ఆశీర్వాదములో తెలియచెప్పిరి.

మాహేశ్వర స్థలములోని వీరశైవుడు యింద్రియములను తన వశములోనికి తెచ్చి కొనవలెనని యింతకు క్రితమే తెలిసి కొని యుంటమి. తన్నిమిత్తమైన "శివనామ స్మరణనే" యత్యుత్తమ మార్గమని తెలియుచున్నది. వశి యింద్రియ నిగ్రహ సంపన్నుని, సూచించు ననియు నతడు శివుడే యని తెలిపెడి యీ క్రింది పౌరాణిక ప్రమాణమును గనుడి :

**ప్రపంప సార సర్వస్వమేనైవ వశీకృతమ్ ।**
**తస్మాదస్య వశీకర్తా నాస్తీతి శివః స్మృతః ॥ (శివ పురాణము)**

ఈ కారణమున మాహేశ్వర స్థలములోని వీరశైవుడు శివనామస్మరణ, జపము ఇత్యాదుల ద్వార యీంద్రియ జిత్తమగును. శివ శబ్దములోని శకారవకారములు వరుసగా నాన బంధము మరియు నమృతత్వమునకు సంకేతములని చెప్పబడినది. ఈ ప్రమాణమును గనుడి:

**శం నిత్యం సుఖమానందం మికారః పురుషః స్మృతః ।**
**వకారశ్శక్తి రమృత మేలనం శివ ఉచ్యతే ॥ (శివ పురాణము)**

యింద్రియ విషయోపభోగములను తిరస్కరించి శైవానందము ననుభవించ గోరెడి మాహేశ్వర స్థలి శివనామా మృతమును గ్రోల నెంచెడి యిచ్ఛ గల్గియుండును. ఈ యంశమును నెంతో హృద్యముగా తెలియ జెప్పెడి బసవన్న వారి యీ క్రింది వచనమును గనుడి:

**వచన మందు మీదు నామామృతము నిండి**

**నయన దుందు మీదు మూతి నిండి**

**చెవి యందున మీదు కీరితి నిండి**

**మనముందు మీదు నెనవు నిండి**

**కూడల సంగమదేవా!**

**మీదు చరణ కమలములోన నేను నిండితి.** (బ.గీ.అ.పు. 344)

నామామృత సంసేవన వలన భవ బంధములు సడలి మాహేశ్వర స్థలములోని వీరశైవుడు శివ భక్తిని దృఢతరము చేసి కొని నైష్ఠికతను పెంచుకొన వలెనని యే శ్రీ భగవత్పాదుల వారి యాదేశములోని యంతరార్థము.

శివాగమముల ప్రకారము సప్తవిధ శైవములలో వీరశైవము మహోత్కృష్టమైనది. లోకకల్యాణకారణుడగు శివునితో సామరస్యమును సాధించుటకు కృషి చేసెడి వీరశైవుడును లోకకల్యాణ కారకుడై సర్వజన హితమును కోరును. శివోపాసన వలన ధన్యతను పొందవలెననెడి యాగమోక్తిని జన సామాన్యమున కెరుక పరచి వారిని భక్తి మార్గమున పయనింప నెంచును. శివపారమ్య భావన దృఢ పడనిదే శివభక్తి సిద్ధించదు. పారమ్య వైష్ణవశాక్తాది మతములు చెప్పెడి పరమైన విషయ బోధన వలన జనులు తిక మకకు గురియై విష్ణువే పరబ్రహ్మయని కొందరు, శక్తిలేని శివుడు శవమని యింకా కొందరు, శివ-కేశవ లిరువురు సమానులే యని మరికొందరు, బ్రహ్మవిష్ణు మహేశ్వరులు ముగ్గురు సమానులే యని యితరులు పరిపరి విధములుగా ప్రతిపాదించిరి. వీరందరు తమతమ వాదన కనుకూలమైన ప్రమాణములను ఎత్తిచూపిరి. పాండిత్య ప్రకర్ష చేత నాయా దేవతల పరత్వమును నిరూపించు నిమిత్తము శివపారమ్యమును తిరస్కరించిరి. ఇట్టి స్థితిలో శైవునికే శివపారమ్యమును గురించి సందేహ మేర్పడెడి స్థితి యేర్పడెడి యవకాశము గలదు. పోతన విషయమును నుదాహరణగా గైకొన వచ్చును. శివపారమ్యమును వీరశైవులైన సోమనాథాదులు నిర్ద్వంద్వముగా ప్రకటిస్తె, పోతన జన్మతః శైవుడై యుండియు విష్ణు పారమ్యము నంగీకరించి భాగవతమును రచించి, యద్దానిలో వైష్ణవ పారమ్యమును సుస్థాపితము చేసి శివపారమ్యమును భూస్థాపితము చేసెను. ఇట్టివి నివారించు నిమిత్తము వీరమాహేశ్వరుడు కృషి చేయును. శివ పారమ్యమును ప్రతి పాదించుటకై వలయు ప్రమాణములను సేకరించును. తన్నిమిత్తమై శివాగమములను నధ్యయనము చేయువలెనని చెప్పబడినది. శైవమును వేదాగమోపనిషత్తులలో గాంచినప్పటికిని, శివాగమములు శివ తత్త్వమును విశదీకరించిన విధిన వేదోప నిషత్తులు వివరించ లేదని చెప్పవచ్చును. అందుచేత శివుని జగత్పతిత్వమును చెప్పెడి ఆగమములే శివాధి కృతనిరూపణకు నధికప్రమాణముల నివ్వగలవు. ఈ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ శైవాగమేషు ముఖ్యం పశుపతి పాశా ఇతిత్రయం**
**తత్రపతి శ్శివ ఉక్తః పశవోహ్యణవోఽ ర్థపంచకం పోషో॥ (తత్వ ప్రకాశిక)**

బాదరాయణుని బ్రహ్మ సూత్రములలోన ఆగమోక్త పాశుపత తత్వము గురించిన చర్చగలదు. అందుచేత వీర మాహేశ్వరుడు వీటినాధారముగా గొని శివపారమ్య ప్రతిపాదన చేయుటలోన నౌచిత్యము గలదు. శివపారమ్య నిరూపణకై వలసిన దృష్టాంతముల నిచ్చుటకును వీర మాహేశ్వరుడు వెనుకంజ వేయడని గుర్తించ వలెను. ఈ విషయమును సుస్పష్టము చేసెడి సామర్థ్యము నిమిడ్చి కొనిన, చతుర్వేద సారమెనెడి సైద్ధాంతిక గ్రంథములోని యీ క్రింది పద్యమును గనుడి.

**శివుడె దైవంబని శిరమిచ్చి పలుకుదు**
**గురులింగమూర్తి శంకరుడటంచు**
**భవుడు దైవంబని పట్టుదు బెబ్బులి**
**మలహరు భక్తులే కులజులనియు.**
**హరుడె దైవంబని భరియింతు, విషము**
**ప్రసాదంబు మోక్షైక సదనమనియు**
**మృడుడె దైవంబని ముడి వైతు నా వీర**
**మాహేశ్వరంబె సన్మార్గమనియు**

**పశుపతికి బంట్లు దివిజులు పశువులనియు**
**వెండియును వాదు సల్పి సద్వివర మెలమి**
**దివి రనుష్ఠింతు నిదినా ప్రతిజ్ఞ గెలుతు**
**బరగ పరసమయాళిని బసవలింగ!** (చతుర్వేదసారము, ప. 28)

నైష్ఠికునికి సాధారణముగా నహంకార మమకారము లేర్పడును. నేనే యధిక నిష్ఠాపరుడననెడి భావము గలిగెడి యవకాశము గలదు స్వామి భృత్య న్యాయము న నుండెడి. మాహేశ్వర స్థలీయునికి అహంకారము విహితము కాదు. విరాగ భావనలకు నిలయముగా నుండవలసిన మనసున మమ అనెడి భావన రాకూడదు. అంతయు శివునిదే నాదేమియును లేదు, నేను నిమిత్తమాత్రుడన యనెడి భావనా పరంపరలే మాహేశ్వర స్థలములోని శివ భక్తుని కుండ వలెనని గ్రహించ గలరు.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 4

## మాహేశ్వర ప్రశంసా స్థలము

శ్రీ జగద్గురు రేణుకా భగవత్పాదుల వారు తమ ఉపదేశమును, పూజ్య ఆగస్త్య మహర్షికి తెలియ చేస్తూ, అందు మాహేశ్వర ప్రశంసను మరియు మాహేశ్వరుని ఉత్కృష్ట స్థితిని గూర్చి విశదీకరించిరి.

**శ్లో ॥ నిరస్తమదనోన్మేషో నిర్ధూతక్రోధ విప్లవః ।**
**సదాసంతుష్ట హృదయః సర్వప్రాణి హితేరతః ॥**

**శ్లో ॥ నివారణసముద్యోగీ శివకార్య విరోధినాం ।**
**సహచారీ సదాకాలం శివోత్కర్షాభిదాయినీః ॥**

**శ్లో॥ శివాపకర్ష సంప్రాప్తౌ ప్రాణత్యాగే ప్యశంకితః ।**
**శివైకనిష్ఠః సర్వాత్మా వీరమాహేశ్వరో భవేత్ ॥ (సి.శి.10;18-20)**

పై ప్రమణముల ప్రకారము, వీర మాహేశ్వరుడు మద మాత్సర్యములకు అతీతముగా మెలుగుచూ, కామక్రోధాది అరిషడ్వర్గములను దూరముగా నుంచును. శాస్త్రముల యందు యీ కామక్రోధాదులను, అంతరంగ శత్రువులని పేర్కొనడము జరిగినది. ఇవి సాధకుని యొక్క జ్ఞాన సంపత్తిని హరించి, అతనిని, నరకగామిగా చేయుచున్నవి. అదియునుగాక, భగవద్గీత యందు, యీకామ క్రోధ మరియు లోభాదులు, నరకమహా ద్వారము నందు పడవేయునని తెలియుచేయ బడినది. వివేకియైన సాధకుడు, నిరంతరము జాగ్రత్తగా వీటినన్నింటిని తన జ్ఞాన సంపత్తిచే దరిచేరకుండ నిరోధించగల్గును. అంతియేగాక ఉపనిషత్తుల యందు, ఉత్తిష్ఠత, జాగ్రత్త, మేలుకో, జాగ్రత్తయని హెచ్చరిస్తూ సుభాషితములను అందించడము జరిగినది.

**శ్లో ॥ కామః క్రోధశ్చ లోభశ్చ దేహె తిష్ఠంతి తస్కరాః ।**
**జ్ఞాన రత్నాప హారాయ తస్మాత్ జాగ్రత జాగ్రతః ॥**

పై శ్లోకము యొక్క భావమేమనగా కామ క్రోధ లోభముల నెడివి, దేహము నాశ్రయించి సాధకుని యొక్క జ్ఞాన సందనాపహరించి, పతితునిగా చేయుచున్నవి. మనుజుని కళ్ళు ప్రకృతిలోని ఏదేని వస్తువును జూచి భ్రమకుగురియై అతని జ్ఞాన సంపత్తినాపహరించుటకు దోహదపడుతుంది. కావున సాధకుడు, యీ విషయములో నిరంతరము జాగరూకుడై, వాటిని దరికి చేరకుండ వుంచవలెను. కామ క్రోధాది వాసనలు మనుజుని శత్రువులను పెంచడానికి, మిత్రులు శత్రువులుగా మారటానికి కారణభూతమగును. కాని వీర మాహేశ్వరుడు మాత్రము కామ, క్రోద మరియు లోభములకు గురికా కుండ సదా జాగ్రత్తగా నుంటూ తాను సంతుష్టుడై, తన హృదయమునందు, సర్వ ప్రాణుల హితమును ఎల్లప్పుడు కోరుచు, అందుకై నిరంతరము పరిశ్రమించు చుండును.

ఈ కామాది అరిషడ్వర్గములు సాధకుడిని రాక్షసునిగా మార్చును అందులకు కామారిని శరణు బొందవలెను. శివ శరణాగతి పొందిన వారికి మదనావేశము, మొదలగు కామ, క్రోధ, లోభములనెడివి దూరమై, అతని ననర్థముల నుండి కాపాడును. ఒక్క క్షణము దేహమును ఆవహించిన క్రోధము పెద్ద పెద్ద అనర్థములకు కారణమగు చున్నది. ఈ ఒక్క క్షణములో ఆవహించిన క్రోధ ఫలితమును

సరిదిద్దుకొనుటకు ఎంతయో వూహించని కాలము అవసరమగును. మనస్సునందు క్రోధ భావము ఆంకురించిన యెడల శరీరము తన సహజ స్వాస్థ్య స్థితిని కోల్పోవును. ఈ క్రోధము యొక్క ప్రభావము జఠరము నందు హృదయమునందు మరియు మేధస్సునందు, అంతర్లీనముగా యుండి తీవ్ర ప్రభావమును చూపును. ఈ క్రోధమునకు గురియైన మనుజుడు, మానసిక, శారీరక, అనారోగ్యములకు పాల్బడును. ఈ క్రోధము నుంచి తమను తాము తిరిగి సహజ స్థితికి మానసికంగా మరియు శారీరకంగా రావలయునని, కనీసము ఇరువది నాల్గు గంటల సమయము అవసరమగును. ఈ కారణము చేత, మనుజుడు తాను సాధించవలసిన మంచి పనులకు 24 గంటల వ్యవధిని కోల్పోవడము జరుగును. అనగా క్రోధము వలన విలువైన కాలమును కోల్పోవడమే గాక, చేయవలసిన ముఖ్యమైన పనులను చేయ లేక, తద్వారా ఒనగూడు ఫలితములను కూడ పొందలేక పోవచ్చును. ఈ విషయమును గ్రహించి, ప్రతి మనుజుడు క్రోధమును దరి చేరకుండగా ప్రయత్నించి, తద్వారా అనర్థములను రాకుండ జాగ్రత్తపడవలెను.

వీరమాహేశ్వరుడు మాత్రము క్రోధమును దరి చేరనీయ కుండ యుండుట వలన, దాని ద్వారా ఏర్పడు అనర్థములను గ్రహించుట వలన, తాను ప్రశాంత చిత్తుడై, మానసిక, శారీరక ఆరోగ్యము కల్గియుండును. క్రోధమునకు లోనగు సమయమును తెలిసికొను మనుజుడు, ముందుగా మౌనవ్రతమును ధరించవలెను. ఆ తర్వాత, కాళ్ళు చేతులు, కడుగుకొని, ప్రశాంతముగా నుండునట్లుగా మనస్సును నియంత్రించు కొనవలెను. ఇలా చేయడము వలన క్రోధము ఉపశమించును. ఒక వేళ క్రోధము ఆనహించినచో, ఆ వ్యక్తి పరిస్థితి యీ విధముగా నుండును. మొదలు దురుసుగా మాట్లాడును, ఆపిదప చేతిలో కర్రను లేదా రాతిని పట్టుకొని కళ్ళలో ఎరుపు రంగు వచ్చునట్లుగా తీవ్రతను పెంచుకొని, వాటిని విసురు చుండును మరియు యీ పరిస్థితి క్రమ క్రమముగా భయానకరూపమును దాల్చును. ఇట్టి పరిస్థితిని అదుపులోనికి తేవడానికి గాను, యీ ఉదాహరణను పరిశీలించవలె. ఒక వేళ మనుజునికి ఎక్కిళ్ళు వచ్చి, వూపిరాడని సంధర్భములో, నీరు త్రాగించిన, అతని ఆయాసము తగ్గి స్వస్థత చేకూరును. అదే విధముగా క్రోధము నావహించిన దేహమును చల్లబరుచుటకుగాను, క్రోధానికి గురైన వ్యక్తికి కావలసినంత నీరును త్రాగించి, శాంత చిత్తుడిని చేయవలెను. ఈ విషయమును వివరముగా తెలిసికొను నిమిత్తము దిగువనీయ బడిన సంఘటనను పరిశీలించవలెను.

ఒక వూరు నందు గల కుటుంబమున, గల అత్త కోడళ్లిరువురిలో ఏ ఒక్కరు శాంత మనస్కులు కారు. ఎల్లప్పుడు ఒకరిపై మరొకరు క్రోధమును కల్గి కోట్లాడుకొను చుండెడి వారు. దీనితో వారి మధ్య వుండవలసిన సంబంధములు చెడి, యింటి వాతవరణమున ఆశాంతి వృద్ధిచెంది, అందరికి సుఖ శాంతులు లోపించడము జరుగు తుండేది. వారి మధ్య జరుగు తగువులు కోపా వేశములు, క్రమ క్రమంగా పెరుగుతూ పోయినవి. ఒక రోజు, కోడలు కోపమును అదుపులో వుంచుకోలేక, అత్త తల్లిలాంటిదనే విషయమును కూడ విస్మరించి, కొట్టడానికి చేయి ఎత్తుట కూడ జరిగినది వీరిద్దరిలో సఖ్యత కుదుర్చుట ఎవరికి కూడ సాధ్యపడని రీతిలో పరిస్థితులు మారినవి. ఇది యిట్లుండగా ఒక రోజు మహాతపస్వియైన ఒక శివయోగి ఆవూరుకు వేంచేసినాడు. ఆతను ప్రతిరోజు ఉదయము యిష్టలింగ పూజను నిష్ఠతో జరుపెడి వాడు. సాయంకాల వేళలందు, ఆవూరినందరిని ఒకచోటచేర్చి ధర్మోపదేశమును ప్రవచనముల ద్వారా చేయుచుండెడి వాడు. ఆ తపస్వికి మధ్యాహ్న కాలమున ఖాళీ సమయమున్నప్పుడు, జనులెవ్వరైన వచ్చి తమసమస్యలు చెప్పుకొనగా అతడు పరిష్కారములను సూచిస్తూ వారివారి సమస్యలను నివృత్తి చేసి, ఆయా కుటుంబాలలో సామరస్యమును పెంపొందించుటకు ప్రయత్నించెడి వాడు. ఆ తపస్వి పరిష్కారముల విధి నెరంగిన ఆ యింటి కోడలు, ఒక రోజు అతనిని దర్శించి తనకు మరియు అత్తగారి మధ్య కోపకారణంగా జరుగు చున్న సంఘటనలను వాటి తీవ్ర ఫలితములను సవివరముగా తెలియ చేసి, పరిష్కారమును కొరెను. ఆ తపస్వి చూపిన పరిష్కార మీ విధము నుండెను. తాను అభిమంత్రించి యిచ్చిన నీటిని కోడలు తీసికొని పోవలసినదిగాను ఎప్పుడైన అత్తగార్కి కోపము వచ్చి నిందించడము మొదలు పెట్టిన యెడల, కోడలు మౌనముగా వాటిని స్వీకరిస్తూ, అభిమంత్రించిన నీళ్ళను అత్తగారి పాదములపై 'ఓం నమః శివాయ' యంటు చల్ల వలయునని యీ విధముగా కొన్ని దినములు చేయుడము వలన అత్తగారి కోపము తగ్గి, వీరిద్దరి మధ్య సఖ్యత కుదురననియు, బోధించెను. తపస్వి చెప్పిన విధముగా కోడలు కొన్ని రోజులు ఆచరించడము వలన అత్తగారి ప్రవర్తనలో మార్పు వచ్చి ప్రశాంత చిత్తురాలాయెను. ఇటూ కోడలు అత్తగారి తిట్లకు జవాబివ్వకుండా మౌనము వహించుట వలనను, మరియు అత్తగారి కోపమును తగ్గించుటకు, అభిమంత్రించి యిచ్చిన నీరుతో పాదాలపై చల్లుట వలన, వారి కోపము సహజముగానే తగ్గిపోయి, వారిద్దరు సమరస భావముతోను సఖ్యతతోను మెలుగుతూ శాంతి సుఖములను బడసిరి.

క్రోధమును నివారించు నిమిత్తము ప్రతి మనుజుడు అనుసరించవలసిన సులభోపాయములను గ్రహించవలెను. అందులో మౌన వ్రతమును వహించడము, పంచాక్షరి మంత్రమును జపించడము, నోరునందు నీరు పోసికొని పుక్కిలించి వుమ్మి వేయడము, లేదా

ఒకటి నుంచి నూరు వరకు అంక్యెలెను లెక్కించడము లాంటి సులభమైన పద్ధతులను పాటించడము వలన కోపమును తగ్గించు కోవడానికి వీలగును.

వీరమాహేశ్వరుడు, తన మనస్సునందు నిరంతరము పరమ శివుని ధ్యానించడము వలన బయటి విషయ ప్రభావములా తని నంటక సదా శాంత మనుస్కుడిగా వుండుటకు వీలుకల్గును. కోపము ఎట్టి పరిస్థితులలోను అతని దరిచేరక భయముతో పారిపోవును. ఈ సందర్భమున జాతిపిత మహాత్మ గాంధీ గారి శాంతి వచనములను పరిశీలించుట ఆవశ్యము. వారు బోధించిన ప్రకారము ఎవ్వరైన కోపముతో తమను ఒక చెంపపై కొట్టిన యెడల, వారిని రెండో చెంప పై కూడ కొట్ట వలసినదిగా విజ్ఞప్తి చేయవలెను. ఈ విధమైన శాంతి వచనములను పల్కుట చేత, క్రోధా వేశములోనున్న వాడు, తన కోపము పై నీళ్లు చల్లు కొనిన వాడగును.

సదా శివైకనిష్ఠో హృదయుడైన వీర మాహేశ్వరుడు, సమస్త ప్రాణుల యెడల హితమును కోరువాడై, మంగళమయ కార్యములను నిర్వహిస్తూ సమాజమునందు అ మంగళ పరంపరను తొలిగించుటకు సదా శ్రమించు చుండును. శివుని యందుగాని, శివ సంస్కృతి యందుగాని, అమంగళకరమైన వాతావరణము ప్రాప్తించిన యెడల, వాటిని పరిహరించుటకు తమ ప్రసంగముల ద్వార జనులయందు యిమిడియున్న భయమును తొలగించుటకు నిరంతరము కృషి చేయుచుండును. ఈతని మనోవృత్తి సదా బహు జన హితము మరియు సుఖము కొరకు వినియోగించును కావున యితనికి సర్వోత్కృష్ఠ గుణములు ఆపాదింప బడినవి. సాధకుడు తన జీవితము నీ విధముగా తీర్చి దిద్దు కొని సమాజ శ్రేయస్సుకు అంకితము కావలెను.

ఓం శాంతి : శాంతి : శాంతి :

ది ॥ 17-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు, చంద్ర శేఖర శివా చార్యుల వారు అరిషడ్వర్గముల వలన గల్గెడి విషపరిణామములను తెలియజేయుచు. కామాదులను దూరముగా నుంచవలెనని ప్రబోధించిరి.

వీర శైవ ధర్మమున లింగాంగసామరస్యమే నంతిమ లక్ష్యమై యున్నది. ఇద్దాని సాధనకై భక్తి మాధ్యమముగా పనిచేయును. మాహేశ్వర స్థలము నిష్ఠా భక్తికి నిలయమై యుండును. ఇట్టి భక్తి కామ క్రోధాదులు గల వానికి కలుగదని యను భావుల నిశ్చితాభిప్రాయమై యున్నది. బసవేశ్వరుల వారి యీ క్రింది వచనము గనుడి.

**ఎట్లు శివభక్తిని నేనుపమింతునయ్యా !**
**ఎట్లు శివాచారము నాకు వేద్యమగునయ్యా !**
**కామ క్రోధ లోభమోహ మదమత్సరముల చేత కట్టబడితిని**
**ఆకలి దప్పి వ్యసనముల చేత కుదించబడితి**
**పంచేంద్రియములు, సప్త ధాతువులు పరి పరియలు చేసి కాడింపబడితి**
**అయ్యా ? అయ్యా ! నా కుయ్యిని వినవయ్యా!**
**కూడల సంగమ దేవా! నేనేమి సేతునయ్యా !**

వీరశైవులు భక్తి యనెడి పురుషార్థమును గోరగా, నితరులు ముక్తి పురషార్థమును వేదుదురు. కామ క్రోధాది యరిషడ్వర్గములను జయింపక ముక్తి యనెడి యపవర్గ ఫలమును కోరినా ఫలముండదని తెలిపెడి యీ క్రింది యనుభవ సూత్రమును గనుడి.

క. **దుర్గుణికి కీర్తి, గర్వికి**
**భర్గార్చన, క్రోధికిని తపః ఫల మరిష**
**డ్వర్గ పరతంత్రునకు నప**
**వర్గసుఖంబును నసంభవము త్రిపురారీ!** (అనుభవ సారము, ప. 88)

ఈ కారణము వలన వీర మాహేశ్వరుడు అరిషడ్వర్గము నరికట్టవలెనని తెలిసికొనవలెను.

కామమును వీడిన వానికి కోరికల పరంపర తగ్గ ముఖము పట్టును. తత్ఫలితముగా అర్థాదుల నవశ్యతతగ్గును. కోరికలు జయించిన వాడే విరాగి కదా! మాహేశ్వర స్థలికి విరాగమవసరమని తెలిసి కొంటిమి. విరాగ చిత్తుడు నిత్య తృప్తుడై యుండవలెను. తృప్తి లేని వాని కుండెడి దురాశగాని, నిరాశగాని వీర మాహేశ్వరుని కుండవలదు. దురాశ పరపీడనకు దారి తీయును. చివరకు దురాశాపరుడు దుఃఖము పాలగును నిరాశ వలన మానసిక వైకల్యము గల్గును. వ్యక్తి తేజోహీనుడై, అహంకారవాదియై, ద్వేష పూరిత మనస్కుడై, క్రూరుడై, హింసకు కారకుడై పాపిగా మారెడి యవకాశము గలదు. ఈ విషయ సూక్ష్మమును వీర మాహేశ్వరుడు గ్రహించ వలెను.

వీరమాహేశ్వరుడైన వాడు శివ కార్యముల యెడల ననురక్తిని పెంచు కొని శివాచారులైన వారి సాంగత్యమున నుండ వలెను. శివాచారమును గురించి తెలిపెడి చంద్రజ్ఞానాగమములోని యీ క్రింది ప్రమాణమును గనుడి.

**శ్లో॥ ద్రవ్యక్షేత్ర గృహాదీనాం షోడషానాం విశోధనమ్ ।**

**శివశాస్త్రోక్త మార్గేణ శివాచార యితి స్మృతః ॥**

శివ భక్తుడు షోడశ శుద్ధులను సాధించి శివభక్తిని దృఢతరము చేసికొన వలెనని చెప్పబడినది. భూతశుద్ధి యనెడిది యిట్టి శుద్ధులలో నొకటనియును, నద్దాని ప్రకారము మాహేశ్వర స్థలములోని వీరశైవుడు దయా గుణము గలవాడై సకల జీవ హితుకరుడై యుండి జీవహింసను నిరోధించ వలెను. జీవహింసను ప్రోత్సహించెడి యజ్ఞ యాగాదులను నిరసించవలెను. శివోత్కర్ష యెడల యనురక్తిని గల్గియుండవలెను. శివోత్కర్ష గురించి వినుటచే చేవి సూతకము నశించును. చిత్తము శివుని మీద స్థిరముగా నిలుచును. అందుచేత, శివోత్కర్షను ప్రతిపాదించి, వివరించి, సమర్థించెడి వారి సాంగత్యము నభిలషణీయమని మాహేశ్వర స్థలీయుడు గ్రహించవలెను శివాపకర్ష వలన శివ భక్తి సన్నగిల్లును. పరవాదులు పనిగట్టుకొని శివాపకర్షను చేయుటకు పూని కొనునప్పుడు వీర మాహేశ్వరుడు గణాచారియై యుద్యమించ వలెను. వలసిన యెడల ప్రాణత్యాగము నకైనను సిద్ధపడవలెనని చెప్పబడినది.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

ది ॥ 17-8 - 1991
స్థలం : నాగపూర్

## ఆశీర్వచనము - 1

## లింగనిష్ఠా స్థలము

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు మహిమాశాలియైన అగస్త్య మహర్షికి మాహేశ్వర ప్రశంసా స్థలమును వివరించన పిదప లింగనిష్ఠా స్థలమును గురించి ఈ క్రింది విధముగా నుపదేశించిరి.

**అస్యమాహేశ్వరస్యోక్తం లింగనిష్ఠామహాస్థలమ్ ।**
**ప్రాణాత్యయోపి సంపన్నే యదత్యాజ్యం విధియతే ॥**
**అపగచ్ఛతు సర్వస్వం శిరచ్ఛేద నమస్తువా ।**
**మాహేశ్వరోన ముంచేత్తు లింగపూజా మహావ్రతమ్ ॥** (సి.శి. 10-21;22)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా వీరమాహేశ్వరుడు ఇష్టలింగము నందున అధిక నిష్ఠ గలవాడగుట చేత ఈ లింగపూజా రూపమగు ఈ వ్రతమును అతడప్పటికి వీడజాలడు తన యొక్క సర్వస్వము చేతినుండి జారిపోయినను మృత్యువే ప్రాప్తమైనను అదెంతటి ఆపత్తు వచ్చినను ఇష్టలింగ పూజావ్రతము తప్పకుండా ఆచరించెడి లింగనిష్ఠ కలిగియుండును.

ఈ ప్రపంచము నత్య వ్రతములనియు, నైమిత్తిక వ్రతములనియును అనేక వ్రతములు కలవు అను నిత్యము తప్పనిసరిగా ఆచరించడివే నిత్యవ్రతములు. నిమిత్తము వచ్చినప్పుడు మాత్రమే చేయబడెడి వ్రతములు నైమిత్తిక వ్రతములు. ఇవి ఆయా నిమిత్తము

కొరకు జనులు ఆచరించు చుందురు. అయితే ఇష్టలింగ పూజా రూపమైన వ్రతము నిత్య వ్రతమై అనునిత్యమూ ఆచరింపదగినదై యున్నది. "నిత్యం యాహదాయు ః" అనెడి ప్రమాణము ప్రకారము ఆయుష్యమున్నంత వరకు తప్పని సరిగా చేసెడి వ్రతమే నిత్యవ్రతము. దీనిని కొందరు నిత్యకర్మయని కూడా అందురు. వీర శైవులు మాత్రము దీనిని భక్త మార్గ సత్క్రియగా పిలిచెదరు. వీర శైవ ధర్మమునందున శివా చార్యలు తమ తమ శిష్యులకు శివదీక్షా సంస్కారమును చేయునప్పుడు శిష్యుని చేతికి కంకణమును కట్టి అతనిచేత ఒక సంకల్పమును చేయింతురు. అది ఎట్టిదనగా దీక్షా పురస్సరముగా సంప్రాప్తమైన ఇష్టలింగమును తాను ఎప్పటికిని దేహము నుండి దూరము చేయననియును మరియు అద్దానిని అనునిత్యము తప్పనిసరిగా పూజింతుననియు ప్రతిన పూనును. తన ఆయువున్నంత వరకు ఈ వ్రతమును పాలించెదనని గురువుగారికి వచనము నిచ్చి శిష్యుడీ వ్రతమును ప్రారంభించును. ఈ ఇష్టలింగపూజా మహావ్రతమునకు శాంభవ వ్రతమనియును మహా పాశుపత వ్రతమనియును, శిరో వ్రతమనియును పేర్లు గలవు. దేహము మీద సదా దేవుడిని ధరించెడి ఈ వ్రతము ఒక చిన్న వ్రతమే? మిగిలిన సాంప్రదాయములందున ఎవరూ తమ ఇష్ట దైవమును దేహము మీద ధరించుటలేదు. గుడి యందున స్థాపించి పూజించు చున్నారు. అయితే వీరశైవుడు మాత్రము తన ఇష్టలింగమునకు తన దేహమునే దేవాలయముగా మార్చి ప్రదానము చేయుచున్నాడు. అందు వలన ఇష్టలింగ ధారియొక్క దేహము సామాన్యుల దేహములవలె అపవిత్రమైనది కాదు. సామాన్యుల దేహములు తాత్వికముగా చూసిన యెడల త్రిమలముల చేత ఆవృతమై యుండును కదా! అందుచేత వారి దేహములు మల సహితములు కాని దీక్షా సంస్కారము ద్వారా మలరాహిత్యమును పొందిన లింగధారుల యొక్క శరీరములు పరమ పవిత్రమైనవి. ఈ దేహము మందిరము వంటిదనియును, నడిచెడి దేవాలయమనియును అందురు. ఈవాదము సరియైనది, కాదు. దేవాలయములు ప్రకృతిలోని అంతర్భాగములు. అందుచేత నవి పవిత్రములు కాజాలవు. ఈ కారణము వలన లింగధారి యొక్క కాయము దేవాలయముల కంటెను ఎన్నో రెట్లు పవితమైనది. వాస్తవికముగా చూసిన యెడల నేటి కాలమున దేవాలయములలో పవిత్రమైన కార్యములతో పాటుగా ఇతరేతరములు కూడా చోటు చేసికొనుచున్నవి. కదా!

శివాగమముల యందు వీరశైవమును గురించి తెలుపుతూ అది యొక సర్వోత్కృష్టమైన మతమని చెప్పబడినది. పారమేశ్వరాగమము ప్రకారము శివుడు పార్వతిని ఉద్దేశించి "న వీరశైవ సదృశం మతమస్తి జగత్రయేత్" అని ఉపదేశించెను. ముల్లోకములలోను వీరశైవమునకు సాటివచ్చెడి ధర్మమేదియు లేదనెడిది ఈ ఉపదేశములోని భావము. ఇదే భావమును అభివ్యక్తము చేసెడి నిజగుణ శివయోగులవారి ఈ క్రింది వచనములను గనుడి. "క్రిమికీట పతంగ జాతుల కంటే పశువులధికము ఆ పరుగు మనుష్యరధికరు। ఆ మనుష్యరింద ద్విజరధికరు। ఆద్విజరిం విప్రరధికరు। అవరింకృత బుద్ధిగళధికరు। అవరింసన్యాసిగళధికరు। అవరిం జ్ఞాని గళధికరు। ఆజ్ఞాని గళగింతలూ శివార్చక రధికరు। అవరిం లింగాంగ సంగి గళాధికరు। ఆలింగాంగ సంగిగళిం షట్స్థల జ్ఞానియాద వీరశైవరే సర్వోత్కృష్టను అవరిగె మూరులో కదల్లియూ సమాన విల్లవాగి వసముక్షు గళిం షట్స్థల జ్ఞానిగళాద వీరశైవదే వందిసలు పూజిసలు యోగ్యరహద్రెందు క్రియాపాదదల్లి ప్రతి పాద్య మక్కుమ."

శ్రీ శివయోగుల వారి వాక్కుల తెలుగు రూపమును గనుడి.

**క్రిమి కీట పతంగ జాతుల కంటె పశువులధికము**

**ఆ పశువుల కంటె మనుష్యులధికులు**

**ఆ మనష్యుల కంటె ద్విజుల ధిక్కులు**

**ఆధ్విజుల కంటె విప్రులధికులు**

**వారి కంటెను కృతబుద్ధిగల వారధికులు**

**వారి కంటెను సన్యాసులధికులు**

**వారి కంటెను జ్ఞానులధికులు**

**అజ్ఞానుల కంటెను శివార్చాకులధికులు**

**వారి కంటెను లింగాంగ సంగులధికులు.**

**ఆలింగాంగ స్తంగులకంటెను షట్స్థల జ్ఞానియైఔన వీరశైవుడే సర్వోత్కృష్టుడూ**

వారికి మూడు లోకముల యందున సమానులు లేనందునముముక్షువుల యందు షట్స్థల జ్ఞానులైన వీరశైవులే వందనము చేయుటకు పూజించుటకు యోగ్యులు అగుదురని, క్రియాపాదము నందున ప్రతిపాద్యమగును.

వీరశైవ ధర్మపు ఔన్నత్యమును మరియు ఇష్టలింగధారణ యొక్క మహాత్వమును తెలియని కొందరు జనులు గురవునుండి ప్రాప్తమైన ఇష్టలింగమును దేహముపై ధరింపకుండ భవులవలె సంచరించు చున్నారు. ఇట్టివారలు వ్రతభ్రష్టులని పిలువ బడుదురు. అట్టి వారికి సద్గతి ఎప్పుడూ లభించదు. అంతేకాక వీర మాహేశ్వరుడు తనకు ఎవరేని మరణపు భీతిని చూపించి లింగవ్రతమును విడిపించుటకు ప్రయత్నించినా మరణము నొందుటకు తయారగునే గాని ఇష్టలింగ పూజా మహావ్రతము నెప్పుడు విడవాడదు. మొగలుల పాలనాకాలమందు ముసల్మానులు అనేక హిందువులను మతాంతరము చేసెడి సమయమునందు లింగనిష్ఠులైన వీరశైవులు మతాంతరము నొందక ముసల్మానుల గోరియాకారపు లింగపుకాయలను ధరించి వాటిలో ఇష్టలింగములు నుంచుకొని తమ ధర్మ పరంపరను రక్షించు కొనుచువచ్చారు. మనపూర్వీకులు ధర్మవీరులై తమ ధర్మమును కాపాడకుండాయుండినచో నేడు ఈ ధర్మము గాని దాని ఆచరణలుగాని లెకుండా యండెడివి. యుగ యుగముల నుండి వచ్చిన ఈ మన ధర్మము అయాకాలములందు పరధర్మ ముల ఆక్రమణకు గురియైనా, నిష్ఠావంతులైన ఆచార్యుల మరియు భక్త సముదాయపు స్థిరాచరణల వలన నేటి వరకు మిగిలియున్నది. ఇంతటి వీరభక్తుల వంశములలో నేడు అధర్మపరులు జన్మించి ధర్మాచరణను మరచి తిరుగు చున్నారు. అందుచే నేడు మీరందరు మేల్కోనవలెను. ఎనిమిది సంవత్సరముల ప్రాయము మొదలుకొని ఎనభై సంవత్సరాల వృద్ధుని పర్యంతము ఎల్లరూ ధర్మప్రేమ గలవారై, ధర్మవీరులై ధర్మాచరణను ఆచరించవలెను.

ఇష్టలింగపూజా మహావ్రతమునకు ఏసూతకముల బాధలేదు. ఇంటియందు ఎవరేని జన్మించినా, లేఎవరేని మృత్యువు నొందినా, స్త్రీలు రజస్వలమెన్నా లేక ఇట్టి ఏ సూతకముల ప్రసంగము వచ్చినా లింగ పూజా మహావ్రతమును ఎవరూ తప్పరాదు. ఈ ధర్మమందు లింగాదీక్షా సంస్కారము స్త్రీ-పురుషులకు సమానముగా లభించుటచే, వారు లింగధారణను గాని, లింగపూజా మహావ్రతమునుగాని విడువరాదు. శివుని జటాజూటము నుండి పారుతూ వచ్చిన గంగ సదా పవిత్రురాలై యుండులాగున లింగధారియైన స్త్రీ గూడ పవిత్రురాలుగా యుండును. ఇష్టలింగము దేహము నుండి దూరమైన ప్రాణమునే త్యాగము చేయవలెనను నియమము ఈ ధర్మమునందు తెలుపబడినందున ఏ కాలమునందు ఎవరూ లింగమును త్యజింపరాదు.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు ఇంతవరకు వీరమాహేశ్వరుని లింగపూజా నిష్ఠను వర్ణించి ఇకముందుగా.

**లింగపూజా మకృత్వాతు ఏన భుంజం తి మానవాః ।**
**తేషా మహాత్మానాం హస్తే మోక్షలక్ష్మీరుపస్థితా ॥**
**కిమ నైర్ధర్మ ుకలి లై ః కేక సార్థ ప్రదా యిభిః ।**
**సాక్షాన్మోక్ష ప్రదః శంభోర్ధర్మో లింగార్చనాత్మకః ॥** (సి.శి. 10-23;24)

ఇటుల లింగపూజా మహాత్వమును తెలియ పరచిరి వీరశైవుడు లింగభోగొప భోగియై యుండుట చేత లింగపూజను చేయక అలింగమునకు నైవేద్యమును అర్పించకుండా దేనినీ భుజింపకూడదు. ఈ నియమమును కట్టుదిట్టముగా పాలించెడివారికి మోక్షలక్ష్మి సులభముగా ప్రాప్తమగును. మోక్షప్రదమైన ఇష్టలింగమును పూజించి ప్రసాదమను సేవించకుండా ముక్తి లభించవలెననిన ఎటుల లభించ గలదు? అది దుస్సాధ్యము. లింగమును ప్రతి దినమును పూజించి దాని యొక్క ప్రసాదమును స్వీకరించుట చేత మనస్సు ప్రసన్నమై యుండును. అట్టి ప్రసన్న చిత్తమునందుననే లింగాంగ సామరస్య జ్ఞానము గలిగి నిఃశ్రేయసము ప్రాప్తమగును. అందు కొరకే ఒక అనుభావి "ప్రతి నిత్యమూ ప్రసాదము భుజించు చుండిన యెడల ముక్తి యొక్క చింత ఏలయ్య? అని ప్రశ్నించును అనగా అట్టివారికి ముక్తి లభించియే తీరును.

వీరశైవుల ముఖ్య ధర్మాచరణ అనెడిది ఇష్టలింగార్చననే అయియున్నది. అందుకొరకే పూజ్యపాదులు "ధర్మో లింగార్చనాత్మకః" అని ఉపదేశించిరి. ధర్మశాస్త్రమునందున అనేకమైన ధర్మాచరణలు ప్రతిపాదింప బడినవి. వీటిలో వ్రతములు ఎన్నియో కలవు. ఇవన్నియును క్షుద్రమైన ఫలముల నిచ్చెడివిగాయున్నవి. ఇవేవియును ఇష్టలింగపూజకు సరిరావు. ఇది ఇట్టులండగా సాక్షాత్తూ మోక్షమును అనుగ్రహించెడి ఇష్టలింగపూజను పక్కకు నెట్టి పనికిరాని వ్రతములనెన్నింటినో చేసెడి వారిని వీరశైవులనదగునే? ప్రతి వీరశైవుడు ఇష్టలింగ పూజను

చేసిన యిష్టార్థసిద్ధి చేకూరును. చివరకు ముక్తియునూ సాధ్యమగును అట్టి యెడ ఇతరేతరములగు వ్రతములను చేయుట వలన వచ్చెడి ప్రయోజన మేమిటి? వృధా కాలయాపన. అమూల్యమైన వనరుల దుర్వినియోగము మరియు కారణరహితముగా తన దేహమును శుష్కింప జేసికొనుచు కుటుంబ సభ్యులకు అనవసరమైన ఇబ్బందులు కల్పించడమే తప్ప మరేఫలితము యుండదు. ఈ కారణము వలన వీరశైవులందరు లింగైక నిష్ఠాతత్పరులై యుండవలెను. "ఏ కేన జన్మనా ముక్తిః వీరానాంతు మహేశ్వర" అనెడి ప్రమాణము ప్రకారము వీరశైవులకు ముక్తి సులభము. మరోమాటలో చెప్పాలంటే లింగైక్య నిష్ఠా తత్పరునకు మరుజన్మ యుండదు.

ఈ వీర మాహేశ్వరుడు తనకవసరమయ్యెడి వస్త్ర భూషణాదులను, అన్నపానీయౌషధాదులను మరే ఇతరమునైనను, ఇష్టలింగమునకు సమర్పించి, లింగ ప్రసాద భావన మదినిదాల్చి ఉప భోగింప వలెనని ఉపదేశిస్తూ.

**శ్లో ॥ అర్పితే నాన్న ప్రానేన లింగే నియమ పూజితే।**
**మేహితా దేహ వృత్తింకుర్వంతి మహా మాహేశ్వరా హితే ॥** (సి.శి. 10-25)

ఈ రీతిగా శ్రీ జగద్గురువులవారు మాహేశ్వరుని మహామాహేశ్వరుడని తెలిపిరి.

ఈ మాహేశ్వర స్థలమునందున వివేచనవైపు దృష్టిని సారించన యెడల సూక్ష్మాతి సూక్ష్మమైన విచారము అనుభవములోకి వచ్చును. ఇష్టలింగమునందున నిష్ఠను పెట్టినప్పుడు మాహేశ్వరుడు అన్పించుకొనును. లింగపూజా మహా వ్రతము వీడ కుండా పరిపాలించిన యెడల వీర మాహేశ్వరుడు అనిపించుకొనును. ముమ్మందు లింగపూజా మహావ్రతమును నియమ బద్ధముగా జరుపుచు భక్ష్యాభోజ్య పదార్థములను లింగార్పితము చేసి ప్రసాద భావమును మనమునదాల్చి స్వీకరించెడి అసాధారణమైన నియమమును పరిపాలించునప్పుడు, మహా మహేశ్వరుడు అనిపించుకొనును. ప్రతి వీరమాహేశ్వరుడు తన ప్రగతివైపు లక్ష్యమును వుత్తరోత్తరముగా ఉన్నతికి చెందిన మార్గమున సాధనము చేయవలయునని గ్రహించవలయును.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 21-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

లింగధారణ, లింగపూజ, లింగ తీర్థ ప్రసాద స్వీకరణ లనెడివి యని వార్యములని తెలియ చెప్పెడి శ్రీ కాశీ జగద్గురువులవారి శుభాశీర్వచనము నెంతో మహత్త్వముతో కూడు కొనియున్నదని గ్రహించగలరు.

"లింగనిష్ఠ నియుక్తాత్మా మాహేశ్వర మహాస్థలః" యనెడి యాగమోక్తి ప్రకారము "లింగనిష్ఠ" యనెడిది మాహేశ్వర స్థలము యొక్క మేళికాంశమని తెలియు చున్నది. ఈ స్థలమున "లింగనిష్ఠ" ను కేంద్రాంశముగా గైకొని శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశము నీ స్థలమున ప్రదానము చేసిరి "ప్రాణాత్యయే పి సంపన్నే యదత్యాజ్యం విధీయతే" అనెడి ఆచార్యోక్తి గమనార్హమైయున్నది. ప్రాణసంకట మేర్పడినను నెద్దానిని విడువ వలదో నయ్యది లింగ నిష్ఠా స్థలమని చెప్పబడినది. "లింగపూజ" యనెడి దట్టిదని గ్రహించ వలెను. లింగాచారము ప్రకారము వీరశైవునికి "గురుణాదత్త లింగాద్వై నాస్తి దైవం మహితలే" యనెడి దృఢమైన విశ్వాసముండవలెను. ఇష్టలింగమే దైవము వేరే దైవము లేదు అనెడిదే యీ సూక్తిలోని భావము. సదాచారము ననుసరించి. శీల సంపాదన చేయవలెననెడి నియమమొకటి గలదు. ఈ నియమములు నిరంతర లింగధారణ మరియు విధి ప్రకారము చేసెడి లింగపూజలను వీరశైవుడు విధిగా చేయవలెను. లింగార్పితము చేసిన పదార్థములను ప్రసాదమనెడి భావనతో గ్రహించ వలెను. ఈ విషయముల యెడ భక్త స్థలమున నుండెడి వీరశైవుడు శ్రద్ధాసక్తులను కనబరచగా, మాహేశ్వర స్థలములోని వీరశైవుడు నైష్ఠికతను ప్రదర్శించును. ప్రాణము పోయినా పట్టు వదలడు. ఇట్టి నిష్ఠ యొక్క స్వరూప స్వభావమున తెలిపెడి యనుభవ సారములోని యీ పద్యమును గనుడి:

**క. జాఱనె నియమవ్రతముల**
**మిఱనె శివునాజ్ఞ నెందు మితి గడవక మున్**

**పాఱనె పలు త్రోవలకును**
**దాఱనె భక్తుండు భక్తతతి త్రిపురారీ!** (అనుభవ సారము, ప. 122)

లింగపూజ నొక వ్రత నిష్ఠతో చేసెడి మాహేశ్వర స్థలి యెట్టి యవాంతరములు వచ్చిననూ లెక్క చేయడు లింగ ధ్యాన-ధారణ-అర్చనలను వీడడు ఈ విషయమును సుబోధకము చేసెడి శ్రీ బసవేశ్వరుల వారి వచనమును గనుడి.

**వరం ప్రాణపరిత్యాగ శ్ఛేదనం శిరసోఽపివా ।**
**నత్వభ్యర్చ భుంజీయాత్ భగవంతం త్రిలోచనం ॥**
**న, దేహధర్మము తానయి నటులగానీ**
**కూడల సంగని పూజించనిదే నిలువ జాలను.** (బ.గీ.తి.పు.346)

"అసంపూజ్యమాన భుంజీత శివమాప్రాణ సంచరాత్" అనెడి యాగమోక్తియు నీ విషయమునే నొక్కి చెప్పు చున్నది.

బసవేశ్వరుల వారి 706 వ వచనము కూడ యిదే యంశమును వివరించుచున్నది. ప్రాణవిత్తమాన భంగములందున ధర్మమును తప్ప వచ్చు ననెడి లోకాచారము. కాని మెప్పుడైనను ధర్మము యనుల్లంఘనీయ మనెడి వీర్మశైవా చారము యొక్క విశిష్టత వేనోళ్ల కొనియాడ దగినదని గ్రహింగలరు.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 2

## లింగనిష్ఠా స్థలము

శ్రీ జగద్గురు రేణుకా చార్య భగవత్పాదుల వారు లింగనిష్ఠా స్థలమును గురించి మరికొంత ఉపదేశమును యిచ్చిరి.

**శ్లో ॥ చిన్మయే శాంకరే లింగేస్థిరం యేషాం మనస్సదా ।**
**విముక్తేత రసర్వార్థం తే శివా నాత్రసంశయః ॥**
**లింగేయస్యమనో నీనం లింగం స్తుతి పరా చ వాక్ ।**
**లింగార్చనపరౌ హస్తౌ సరుద్రో నాత్ర సంశయః ॥** (సి.శి.10-26;27)

చిన్మయమైన ఇష్టలింగమునందున మనస్సును స్థిరముగా నిలిపి వేరేయే ఆశా ఆమిషములు లేకుండగా ఎవడిమనస్సు సదా శివుడినే స్మరిచునో వాడు శివ రూపుడ అగుచున్నాడు. మనస్సు లింగము నందున లయము గొనిన యటులనే బాహ్య కారణములైన వాక్ మరియు హస్తములు శివస్తుతి మరియు శివపూజ యందు తన్మయము లైనప్పుడు ఆ వ్యక్తి శివుడే అగుచున్నాడు. ఇందులో సంశయము లేదు. తనను ఆరాధించుటకై శివుడు ప్రతియొక్కరికి త్రికరణములను దయతో కటాక్షించెను. తనువు, మనస్సు మరియు వాక్కులే త్రికరణములు. ఎంతో మంది వీటిని సాంసారిక సుఖమునకై ఉపయోగిస్తూ జనన మరణ చక్రబంధమున పడి కొట్టుమిట్టాడుచున్నారు. అట్లు కాకుండగా వీటిని ఇష్టలింగార్చనకై ఉపయోగించిన యెడల సద్గతి ప్రాప్తించు చున్నది. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో"ః అని జ్ఞానులు తెలియ పరిచినారు.

త్రికరణముల యందు మనస్సుయొక్క పాత్ర ఎంతో ముఖ్యమైనదై యున్నది. ఇష్టలింగమునందున మన మనస్సు నిలిచినప్పుడు వాక్కు మరియు శరీరము అద్దానిని అనుకరించు చున్నది. అందు కొరకే జగద్గురువుల వారు "చిన్మయో శంకరే లింగే స్థిరం యేషాం మనస్సదా" అని ఆనతి నిఇచ్చిరి. మనము పూజించెడి ఇష్టలింగము చూచెడి వారికి శిలామయముగా కన్పించినప్పటికినీ వస్తుతః అది ఒక చిన్మయమైనది. వీరశైవ సిద్ధాంతమునందున జడమైనది ఏదియును లేదు. సంపూర్ణమైన సృష్టిని కూడా వీరశైవులు చిద్రూపముగానే భావించు చున్నారు. ఎవరి దృష్టి స్థూలమై యుండునో వారికి జగత్తు స్థూలముగానే దోచును. సూక్ష్మదృష్టియున్న వారికి జగమంతయూ లింగమయమే యగును. అగ్ని సంపర్కము చేత తృణము అగ్ని రూపము దాల్చిన యటులనే చిన్మయ లింగము యొక్క నిరంతర చింతన

చేత చింతకుడు లింగరూపుడే యగుచున్నాడు. ఈ లింగము యొక్క చింతన చేయుచున్నప్పుడు ఇహలోక పరలోక సంబంధమైన కోరికలు ఉండకూడదు ఎట్టి సుఖము యొక్క కోరికయైనను మనస్సులో పొడ సూపకూడదు. ఎప్పుడైతే మనస్సున కోరిక పుట్టునో అప్పుడు శివ చింతనకు భంగము కలుగు చున్నది. అందు వలననే సర్వార్థముల యొక్క చింతనను వదలి సంపూర్ణముగా ఇష్టలింగ చింతన యందున మునిగి యుండవలెను. అప్పుడు వాడు చిన్మయ లింగమై విరాజిల్లు చుండును. వాస్తవికముగా జీవుడును, శివుడును యొకడే అయినను జీవుడు శివుడుగా పరిణామము పొందనంతవరకు జీవునకు శాంతి దొరకుటయనేది దుస్సాధ్యమైన విషయము. సముద్రము యొక్క నీరు సూర్య కిరణముల చేత ఆవిరియై మేఘరూపము ఆకాశములో సంచరించు చుండిననూ దానికి శాంతి అనెడిది ఉండదు. ఎప్పటి వరకు అది వర్షరూపమును దాల్చి చివరకు సముద్రములో కలియదో అప్పటివరకు దానికి శాంతి యుండదు. అటులనే పరమాత్మ స్వరూపమైన జీవుడు ఎక్కడికి పోయినను, దేనిని పొందినను, పరిపూర్ణమైన శాంతి లభించదు. శివ చింతనలో మునిగి క్రమ క్రమముగా శివునిగా పరివర్తన పొందిననాడే అతడికి శాంతి లభించు చున్నది. ఈ కారణము వలననే జగద్గురువు రేణుకా చార్యుల వారు మనఃపూర్వకముగా చిన్మయ లింగమునే చింతన చేయవలెనని ఉపదేశించిరి. ఇష్టలింగ పూజను చేయునప్పుడు మనస్సు లింగమునందే లీనమైయుండిన ఎడల అట్టి పూజ సఫలము కాకుండా యుండగలుగునే? చపలమైన మనస్సును స్థిరముగా నుంచుట కొంచెము కష్టమే! శరీరము యొక్క కదలికకు మనస్సు యొక్క గతికిని ఎంతో భేదము కలదు. ఆధునిక వైజ్ఞానిక యుగములోని విజ్ఞాన శాస్త్రము ప్రకారము అతివేగముగా పయనించెడిది కాంతి కిరణమే. దీని వేగమును అంచనా వేయుట సామాన్యులకు సాధ్యమయ్యేడి విషయము కాదు. ఒక అంచనా ప్రకారము ఒక సెకండుకు ఒక లక్ష ఎనభై ఆరు వేల మైళ్ళ వేగము చొప్పున కాంతికిరణము పయనించు చున్నది. మరొక్క అంచనా ప్రకారము సూర్యుని యొక్క కిరణము భూమిని చేరుటకు ఎనిమిది నిముషములు పట్టుచున్నది. ఇక మనస్సుయొక్క వేగమును గురించి చెప్పవలెనని నది కాంతికిరణము వేగము కంటెను ఎన్నోరెట్లు వేగముతో పయనించును. మరి ఇట్టి మనస్సును శరీరము యొక్క కదలికతో సమన్వయము చేయుట సాధ్యమయ్యేడి విషయము కాదు. కాని రెండింటి గతికి సమన్వయము సాధించినవాడు యోగి యుగు చున్నాడు. అది ఎట్లు సాధ్యమగును? అనెడి సందేహము కలుగవలచ్చును. శరీరము యొక్క గతిని పెంచుట సాధ్యమయ్యేడి విషయము కాదు. అది కాంతికిరణ మంతటి వేగముతో పయనించుట యనెడిది ఊహకందని విషయము. అసాధ్యమేయని చెప్పవలెను. అట్టి ఎడ మనస్సు యొక్క గతిని నిరోధించి శరీరము యొక్క గతితో సమన్వయము చేసికొనుట యొక్క టేమార్గాంతరమై యున్నది. శరీరము ఇష్టలింగార్చన కొరకై కూర్చొనియున్నప్పుడు. సాధకుని మనస్సును మరియు చిత్తవృత్తిని అద్దానిలో బంధించిన యెడల దేహము గతికిన్ని మనస్సు గతికిని పరిపూర్ణమైన సమన్వయము చేకూరును, పతంజలి యోగ శాస్త్రము ఈ సూత్రము మీదనే ఆధారపడియున్నది. "చిత్తవృత్తి నిరోధకమే యోగమని" పతంజలియొక్క మతము, కాని పతంజలి సూచించిన అష్టాంగయోగము కంటెను ఇష్టలింగార్చన ద్వారా సాధించబడెడు ఫలితము సులభసాధ్యమై, గుణాత్మకమై యుండును అని చెప్పవచ్చును. షణ్ముఖ స్వామి వారు తమ అనుభవమును ఈ విధముగా తెలియజేసిరి "మన వెంబమర్కటను, తనవెంబ వృక్షవనేరి ఇంద్రియంగళెంబ శాఖె, శాఖెగెహారి విషయం గళెంబ హణ్ణు ఫలంగళ గ్రహిసి. భవదత్త ముఖవాగె హోగు తిదెనోడా? ఈ మనవెంబ మర్కటన నిన్ననె నహెంబపారదల్లి కట్టి ఎన్నన్ను ళిహి కొళ్ళయ్యా అఖండేశ్వరా" ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి.

మనసనెడి మర్కటుడు, తనువనెడి వృక్షమునెక్కి ఇంద్రియములనెడి శాఖ శాఖకు ప్రాకి విషయంబులనెడి పళ్ళను గ్రహించి భవమటు ముఖముగా పోవుచున్నది. పాశనమున గట్టినన్ను మిగిలించికొనుమయ్యా అఖండేశ్వరా!

షణ్ముఖ స్వామి వారి వచనము ప్రకారము మనస్సును నిలకడగా నుంచవలెననిన శివాను గ్రహమును పొందుట ఎంతో అవసరము. అట్లే శివాను గ్రహమున ఇష్టలింగ పూజలో నిమగ్నుడై యుండుట చేత వీరశైవునకు సులభముగా మనోనిలకడ సంప్రాప్తమగును. ఇతరుల కది దుస్సాధ్యమే.

శివ పూజకు కూర్చొని యున్నప్పుడు మనస్సునందున ఏమైన పదార్థముల చింతన వచ్చిన యెడల చింతన భంగమై అది పదార్థముల చింతనగా మారిపోవును, ఆ విధముగా భక్తుడు చేసెడిది శివపూజ, చింతించెడిది మరియొక వస్తువు. ఈ విధముగా త్రికరణ శుద్ధికి భంగమేర్పడి సాధన నిషలమగును. అదే విధిన శివపూజ చేయునప్పుడు జిహ్వను నిరోధించకుండా ఇతరేతరముల గూర్చి మాట్లాడిన ఎడల లింగ నిష్ఠకు భంగమేర్పడు చున్నది. సాధకుడు మనస్సును నియంత్రించినటులనే జిహ్వను కూడా నిరోధించి త్రికరణ శుద్ధితో శివపూజను చేయవలయును.

కొందరు ఇష్టలింగార్చనను చేసి కొనుచు నిత్యకర్మ పూర్తియైనదని భావించుకొని కామ్య కర్మలను చేపట్టెడి అభిలాశ కలిగి యుందురు. ఉదయమున ఇష్టలింగార్చన చేసి సాయంకాలమున ఏదో యొక వ్రతమును చేసి రాత్రివేళ పలుదేవతాస్తుతులను భజన రూపమున చేసి నేను ధన్యుడనైతినని భావించెడివారు తెలిసికొనవలసిన విషయనేమనగా ఇష్టలింగార్చన కంటెను ఇతరములైన వేవియును వీరశైవునకు విహితములు కావు. ఈ విషయమున శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు లింగనిష్ఠస్య కింతస్య కర్మణా స్వర్గహేతునా (సి.శి.10-28)

అని ఉపదేశించిరి. దీని భావమేమనగా త్రికరణ శుద్ధితో ఇష్టలింగార్చన యందు తల్లీనమైయుండెడి మాహేశ్వరునికి స్వర్గ సాధనభూతములైన అగ్ని హోత్రది కర్మలు ప్రయోజనకారిగా యుండవు. కొందరు విచిత్ర చింతకులు మరొక విధిన ఆలోచించవచ్చును ఇష్టలింగపూజలో తల్లీనత సాధించలేక లోపమును పూరించుటకు ఈ కర్మలను చేయు చున్నాననవచ్చును. ఇట్టివాదన సరియైనది కాదు. అల్పఫలములను అశాశ్వతమైన ఫలములను ఇచ్చెడి, కర్మలు, అనల్పమైన మరియు శాశ్వతమైన ఫలదాయకమగు ఇష్టలింగార్చనాది భక్తి సత్క్రియలతో పోల్చుట తగనిపని. నిష్ఠను పెంచుకొనుటకు ప్రయత్నించవలెను. కాని ఇతర తప్పు మార్గములో పయనించ కూడదు.

యజ్ఞయాగాదులు శాశ్వతములైన ఫలములను ఇవ్వజాలవని చెప్పడిది ఎవరోకాదు. ఆ కర్మలను నిర్దేశించే శాస్త్రమే "క్షీణే పుణ్యే మర్త్యలోకం" అనెడి శాస్త్రోక్తి ప్రకారము పుణ్యము క్షీణించగనే జీవుడు స్వర్గము నుండి భూమి మీదికి పడుచున్నాడు. భగవద్గీత కూడా ఇట్టి భావమునే సమర్థించు చున్నది. ఒక వ్యక్తి పర గ్రామమునకు వెళ్ళి ఒక సత్రము నందు బసచేసిన యెడల అతడు తనవద్ద ధనము యున్నంత వరకే ఆవసతిని వాడు కొనగలడు. ధనము అయిపోయిన ఎడల అతడు వసతిని వీడి వృక్ష ఛాయను ఆశ్రయించ వలసినదే. స్వర్గోక భోగము గూడ అట్టిదే మాహేశ్వర స్థలమున నుండెడి భక్తుడు స్వర్గాది భోగములను తుచ్ఛమైనవని ఎంచి వాటి ఎడల నిరాసక్తత కలిగియుండును.

మాహేశ్వర స్థలమున నైష్ఠిక భక్తికి ప్రాముఖ్యత గలదు. ఈ విషయమును నొక్కి చెప్పుటకు కాబోలు శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును కటాక్షించిరి.

**శ్లో ॥ లింగనిష్టా పరంశాంతం భూతి రుద్రాక్ష సంయుతమ్ ।**
**ప్రశంసంతి సదాకాలం బ్రహ్మాద్యా దేవతాముదా॥** (సి.శి. 10-29)

ఈ శ్లోకముభావమేమనగా లింగనిష్ఠుడైన మాహేశ్వరుడు శివునికి అత్యంత ప్రియమైన భూతి రుద్రాక్షలను ధరించి ప్రశాంత చిత్తముతో కూర్చొని యున్నప్పుడు అతనిని గని బ్రహ్మాది దేవతలైనను ప్రశంసింతురు. ఇచ్చట గమనించవలసినది యేమనగా శివలాంఛనములకు ఎంతో ప్రాముఖ్యత కలదు. వాటియందు అపారమైన భక్తి యిమిడియున్నది. జీవనము యొక్క ప్రగతిని కోరెడివారు, సాత్విక ఆభూషణములు అనదగిన భూతి రుద్రాక్షలు ధరించిన యెడల జీవనము సార్థకమగును. మరణానంతరము సద్గతి లభించును. వీటి యొక్క మహిమను తెలిపెడి శాస్త్రాదుల ప్రకారము మరణ సమయమునందున ఇవి మన శరీరమున నుండిన యెడల మరణానంతరము గలిగెడి సారలౌకిక బాధలు దరిజేరవు.

ఒక వేటగాడు వేట కొరకు తన కుక్కను తీసికొని అరణ్యమునకు బయలుదేరి వెళ్ళెను. దినమంతయూ వెతికిననూ ఒక్క వేటయైననూ చిక్కలేదు. తిరిగిన యందులకు ఎంతో శ్రమయయ్యెను. తిరిగి వచ్చినప్పుడు ఎంతో దాహము కలిగెను. విశ్రాంతి తీసికొనుటకై వాడొక చెట్టు నీడను ఆశ్రయించెను. దాహము హెచ్చిన కొలది వాడికి బాధ హెచ్చుదొడంగెను. నీరు లభించలేదు. వాడు కూర్చున్న స్థలముననే అసువులు వీడెను. అతడు కూర్చున్న స్థలము స్మశానమునకు సమీపమున నుండెను. ఇతనిని వెన్నంటి వచ్చిన కుక్క స్మశానమందున పడి వున్న తన ఒడయుని శరీరమును గని అతడు నిద్ర పోవుచున్నాడని తలచి, వానిని లేపుటకై వాని నొసటిపై కాలితో రాయజొచ్చెను. దాని కాళ్ళకు అంటుకొనియున్న బూడిద ఆవేటగాని మృతకాయము యొక్క ఫాలభాగమున విరాజిల్ల దొడగెను. వాని జీవాత్మను మోసికొని పోవుటకై యమదూతలు వచ్చిరి. అప్పుడు వారి అభీష్టమునకు భంగము గలిగించెడి విధముగా శివదూతలు వచ్చి, వారిని నిరోధించి ఆ వేటగాని ఆత్మను శివలోకమునకు తీసుకొని వెడలవలెనని తెలియజేసిరి. యమదూతలు వారి మాటలను వినలేదు. ఇరువర్గములవారు కలహమునకు దిగిరి. చివరకు శివుడక్కడ ప్రత్యక్షమై మీరు కలహించుకొన కూడదు అంత్యకాలము నందున వీడి ఫాలభాగము చితాభస్మము

చేత అలంకృత మైనందున, వీడి పాపములన్నియును పటాపంచలై పుణ్యాత్ముడయ్యెను. ఈ కారణమున వీడు శివలోకమునకు పోదగివాడేకాని యమ లోకమునకు పోదగిన వాడు కాడని చెప్పెను. ఈ విధముగా శివలాంఛనములతో ఉహకందని విధముగా అనుపమానమైన శక్తులు గలవని తెలుపెడి ఎన్నో గాథలు శివపురాణమున గలవు. వాటిలో ప్రస్తుతము చెప్పబడిన కథ ముఖ్యమైనది. వీరశైవులు జీవన కాలమందు నైననూ జీవనానంతరమైననూ భూతి, రుద్రాక్షలు అలంకరించు కొనియుడిన యెడల సద్గతిని పొందగలదని సిద్ధాంతీ కరించడము జరిగినది.

పరంపరాను గతమైన శాస్త్రాచరణల ప్రకారము గంగాస్నానమును చేసినను, చేయక పోయినను, మరణానంతరము మాత్రము ఆ సంబంధిత వ్యక్తి అస్తికలు గంగలో కలపబడుచున్నవి. ఆ విధముగా గంగాస్నానము మరణకాలము నందునను, మరణము పిదప కూడా అవశ్యమై యున్నది, అదే విధిన భూతి రుద్రాక్షలు కూడా అంతే ప్రాముఖ్యతను గలిగియున్నవి.

భూతి రుద్రాక్షలను ధరించినవారు ఏలోకమున నున్ననూ మాన్యతనే పొందుచున్నారు. బ్రహ్మాది దేవతలైనను శిభక్తుల ఎదుట తలనొగ్గినిలుచు చున్నారు. అంతెందులకు. సాక్షాత్తు శివుడికంటెను శివభక్తుడే గొప్ప వాడనియును శివలాంఛనములు ధరించిన పిదప ఇట్టి ఆధిక్యత లభించుచున్నదనియును. తెలియుచున్నది. "మద్భకామమాధికా" మనెడి ఆగమోక్త ప్రకారము శివుడే శివలాంచనధారియైన శివభక్తుని యొక్క గొప్పతనమును ప్రకటించిన వాడయ్యెను. ఈ విధముగా ప్రతియొక్కడు శివలాంఛనములను ధరించి ఇష్టలింగార్చనను మనఃపూర్వకముగా చేసికొని ధన్యత పొందవలయును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 26-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

త్రికరణ శుద్ధితో లింగార్చన చేయవలెనని చెప్పుచు, నావిధముగా చేసిన వానిని త్రిమూర్తులు గౌరవింతురని శ్రీ కాశీ జగద్గురువు చంద్ర శేఖర శివాచార్యుల వారు నుపదేశించిరి.

ఆధ్యాత్మిక రంగములో త్రికరణ శుద్ధి కెంతో ప్రాముఖ్యతగలదు. మనసు, వాక్కు మరియు చర్యలలోన నేకత్వముండిన యెడల నయ్యది త్రికరణ శుద్ధి యనబడును.

లింగైక నిష్ఠా స్థలములోని వీరశైవుడు త్రికాల శివ పూజా దురంధరుడై యుండవలెను. శివపూజా సమయమున నైష్ఠికత పరమోత్కృష్ట దశకు చేరవలసియుండును. తన్నిమిత్తమై యచంచలమైన మనస్సును లింగోన్ముఖము చేయవలెను. లింగమే పరబ్రహ్మయనియును, మరే దైవము పూజినీయుడు కాడనెడి "లింగాచార" సూక్తిని దృఢముగా నమ్మవలెను. "అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అనెడి భావనతోను శరణార్థి రక్షింపవే యనెడి మనోభావనతోను 'రక్ష రక్ష స్వేష్ట లింగ'! యనెడి వినతితోను కరస్థలములోని లింగము పైన మనస్సును ప్రసరింప జేసి స్థిరముగా నిలుపవలెను. ఇది అంత సులభమైనది కాదు. రెండు అవరోధములేర్పడును మొదటిది, కాయ, మనోవికారములు. విషయాసక్తిని వీడని వానికి పలుదేవతో పాసన వైపుకు పయనించెడి కోరిక గల్గును. మనస్సు అటు వైపుకు నీడ్చికొని పోయెడి మాయా ప్రభావానికి లోనౌను. ధనమును కోరి లక్ష్మిని, చదువును గోరి శారదను, శక్తిని గోరి లలితను పూజించు మని పరవాదులు సూచింతురు. శివ కేశవులలో భేదము లేదు, విష్ణువును కూడ పూజించుమని స్మార్తులందరు. వీటికి వశుడైన వాడు త్రికరణ శుద్ధి లేని యిష్ట లింగార్చన చెసేడి వాడగును. నైష్ఠికతకీ ధోరణి గొడ్డలి పెట్టగును. రెండవ యువ రోధము స్థావరలింగము యెడల గల నమ్మకము. దేవాలయములలో నుండెడి లింగముల పూజ చేసిన యెడల నధిక ఫలములు లభించు ననెడి సామాన్య శైవుల వాదనలకు చెవి యొగ్గిన వీరశైవులు, జ్యోతిర్లింగాదులే మేలైనవనెడి భ్రాంతికి లోనగు చున్నారు. లింగధారణను సిద్ధాంత రీత్యా యంగీకరించిన స్మార్తాదులు యిట్టి భ్రాంతిని గలుగ చేయుచున్నారు. వీర మాహేశ్వరు డిట్టి ప్రభావములకు లోనై తన స్వేష్ట లింగ నిష్ఠను తగ్గించుకొనకూడదు. "నస్వేష్ట లింగ సదృశం లింగమస్తి జగత్త్రయే" యనెడి సూక్తి యెడల నమ్మక ముంచు కొనవలెను."న వీరశైవ సదృశం మతమస్తి జగత్త్రయే" యనెడి యాగమోక్తి యెడల నమ్మకము లేని వారికి స్వేష్ఠ లింగమే పరబ్రహ్మ యనెడి భావము కుదురదు.

మనస్సును లింగములో ననన్య భావముతో లీనము చేయకుండగ యెన్ని మార్లు శివ పూజలు చేసినను ఫలితముండదు. ఇట్టి వానికి శివభక్తి కుదరుదని తెలిపెడి యనుభావి యొక్క యనుప మోక్తులను గనుడి:

క. **పంచేంద్రియముల మది దూ**
**లించి మనోగతియు లింగలీనంబుగ భా**
**వించిన భక్తుండటు గా**
**కించుక మరచినను భక్తుడే? త్రిపురారీ** (అను భవసారము, ప. 64)

మనస్సును లింగలీనము చేయుటలో వాక్కు ప్రధానమైన పాత్ర పోషించును. శివభక్తుని పెంపొందించెడి శివభక్తి గీతములను చదువుట వలన నైష్ఠికత పెరుగును. శివుని పంచవింశతి లీలలను, శివప్రరబ్రహ్మతత్త్వమును, శివాధిక్యతా ప్రతిపాదకములగు గీతములను గానము చేయుట వలన గుణాత్మకమైన ఫలితము లభించగలదు. "నోరు నొవ్వంగ శివ కీర్తిని నుడువ" వలెను.

మనసార శివుని వలచి, నోరార శివుని కీర్తిని గానము చేసిన పిదప చేతులార యిష్టలింగార్చన చేయవలెను. షోడశోపచారముల చేతనైను, అష్ట విధార్చన పంచ విధార్చన చేతనైను శివుని యర్చించవలెను. తలపు, మాట లొకటై శివపూజ చేసిన వాడు ధన్యుడగునని భక్త్యుద్యమ నేతలు చెప్పుచున్నారు. ఇది యిట్టులుండగా కొందరు చేతులారంగ శివపూజ చేయాలి. నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువ వలెనని చెప్పుదురు. వీరు స్మార్తుల భావముల నాధారముగా గొని శివ - కెశవా భేదము పాటించాలని చెపెడివారు. ఇట్టి భావనను శ్రీ బసవేశ్వరుల వారు తీవ్రముగా ఖండించిరి. ఈ వచనమును గనుడి.

**హరి హరు డొకటే యను నోట లాలవే తోకపురుగులు**
**హరి పదిసార్లు చచ్చె బ్రహ్మచావుకు తుదిలేదు**
**హరుడెప్పుడైనా చచ్చెనేమో తెలిసిన చెప్పదయ్యా**
**అప్పటి కప్పుడే పలయంబు గాని ప్రభుడు సనాతనుడు కూడల సంగమ దేవుడు**

(బసవేశ్వర వచనము 543 బాడాల రామయ్య వారి యనువాదము).

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## పూర్వాశ్రయ నిరసన స్థలము

శ్రీ రేణుకా చార్య భగవత్పాదుల వారు లింగనిష్ఠ గూర్చి వివరించిన పిదప పూర్వాశ్రయ నిరసన స్థలమునకు సంబంధించిన యుపదేశము నిడిరి.

శ్లో **లింగైక్యనిష్ఠహృదయః సదా మాహేశ్వరో జనః ।**
**పూర్వాశ్రయగతాన్ ధర్మాంస్త్యజేత్ స్వాచారరోధకాన్ ।।**
**స్వచాతి కులజాన్ ధర్మాన్ లింగనిష్ఠావిరోధినః ।**
**త్యజన్ మాహేశ్వరో జ్ఞేయః పూర్వాశ్రయ నిరాసకః ।।** (సి.శి. 10-30;31)

కేవలము యిష్టలింగము నందుననే నిష్ఠగల్గిన మాహేశ్వరుడు తన పూర్వజాతికి సంబంధించిన సామాన్యములైన ఆచరణలను మరియు జనన మరణాది సూతకములను త్యజించవలెను. నేను పరిశుద్ధుడనెడి భావనతో లింగ పూజ నిష్ఠుడగుటయే పూర్వాశ్రయ నిరసన మగును.

ఒక స్థలము నుండి మరొక స్థలమునకు పోవలెననిన యెడల యాచార విచారములలో పరివర్తన చేసికొనుట యెంతో అవసరము. విద్యాభ్యాసమున ప్రాథమిక స్థాయినుండి మాధ్యమిక స్థాయికి వెడలిన విద్యార్థి తన అధ్యయన క్రమములో నెట్టిపరివర్తన చేసికొనునో

అదే విధిన మాహేశ్వర స్థలమును చేరుకొన్న భక్తుడు తాను జన్మించిన జాతికి చెందిన ఆచారవ్యవహారములను విడిచి పెట్టవలెను. లింగనిష్ఠకు వ్యతిరేకముగా నుండెడి, ఆలోచన విచారములను విడువకుండిన యెడల నైష్ఠిక భక్తికి భంగము వాటిల్లును. ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధము లేర్పడును.

జన్మతః లింగధారి కానివాడు, లింగ దీక్షను స్వీకరించెడి సందర్భమున తన పూర్వజాతికి సంబంధించిన ఆచార వ్యవహారములను త్యాగము చేయవలసి యుండును. కారణమేమనగా లింగదారియైన వానికి లింగాచారమే శ్రేష్ఠతమమైయుండును. ఈ విషయమున బసవేశ్వరుల వారిని యుదాహరణగా గైకొన వచ్చును. తన పూర్వాశ్రయ జాతియైన బ్రాహ్మణ జాతికి సంబంధించిన ఉపనయనమును తిరస్కరించి, తత్సంబంధమైన సంధ్యావందనాదులను వీడి, లింగధారి లక్షణములైన లింగధారణ, లింగపూజల యెడల నైష్ఠికతను పెంచి కొనెను. జన్మస్థలమును వీడి గురువు గారి నెలవైన కూడల సంగమేశ్వరమునకు విచ్చేసి, శ్రీ గురువు జాతవేదముని ప్రత్యక్ష పర్యవేక్షణలో నాధ్యాత్మిక ప్రగతిని చేపట్టిననెడిది వీరశైవులు ఎరుగని విషయములు కావు. పూర్వాశ్రయ నిరసన స్థలమునకు వీరి యుదాహరణకు సరితూగెడిది వేరొక్కటి లేదని చెప్పవచ్చును. షోలాపురమునకు చెందిన సిద్ధరామేశ్వరుడును బసవేశ్వరుని వంటివాడే. శుద్ధశైవుడై శ్రీశైలమల్లికార్జున స్వామి భక్తుడై స్థావర లింగములను స్థాపించి, వాటి కొరకై దేవాలయాదులదు నిర్మించెడి ప్రవృత్తిలోనున్న యతనికి అల్లమ మహాప్రభువు జ్ఞానోదయమును కల్గించెను. అల్లముని నిర్దేశము ప్రకారము చన్న బసవేశ్వరులవారిచే లింగదీక్షను పొంది పూర్వాశ్రయమునకు సంబంధించిన స్థావర లింగార్చనను విస్మరించెను. శరణసంస్కృతిలో బసవేశ్వరుడు, సిద్ధరామేశ్వరుడు పొందిన ఘనత యెట్టిదో వీరశైవులెల్ల రెరిగినదే.

పూర్వాశ్రయమును త్యాగముచేయకుండా సాధనచేసిన యెడల అట్టి సాధకుడి యొక్క జీవితమున ప్రగతి ద్యోతకము కాదు. తాను స్వీకరించిన ఆచారవిచారములకు ప్రతిబంధకములెన్నియో ఏర్పడును. బంధువుల నుండి వత్తిడి వచ్చెడి అవకాశముండును. వారి విరోధమును సహించుట దుస్సాధ్యమగును. వారి అవివేకమును తొలగించుటకు కూడా వీలుకాదు. ఇట్టి తరుణమున వీరశైవుడు వీరమాహేశ్వర స్థలమున తననైష్ఠిక భక్తిని ఏ విధముగా నిలుపు కోగలడు? ఆ సందర్భములో బంధువులనైనను వదలివేసి సాధనలో నిమగ్నమగుటయే యుత్తమము. అక్కమహాదేవి తన నైష్ఠికతకు అడ్డముగా నిలిచిన తన భర్తనే కాదు, తన భర్త వల్ల సంక్రమించిన రాజభోగములను కూడా తృణప్రాయముగా నెంచి వీరవిరాగిణియై, మొదట కళ్యాణమునకు వచ్చి శరణుల సాంగత్యమున అనుభవము యొక్క పుష్టిని పెంచుకొని శ్రీశైలమునకు వచ్చి స్థావరలింగార్చన యెడల ఆసక్తిచూపకుండా కదళీవనమునకేగి ఇష్టలింగార్చనలో మనస్సును, తనువును లగ్నముచేసి ముక్తిని పొందిన సంగతి అందరికీ తెలిసినదే.

పూర్వాశ్రయ నిరసన నియమమును పాటించెడివారు కేవలము వీరశైవులే యనెడి భ్రమకు లోనుకాకూడదు. ఎవరైనను దీనిని పాటించుటను గాంచగలము. నారదుని వుపదేశము వలన వైష్ణవమును స్వీకరించిన ప్రహ్లాదుడు తన తండ్రిని విస్మరించలేదా? అదేవిధిన కృష్ణభక్తికిలోనైన మీరాబాయి భర్తకు చెందిన సర్వస్వమును త్యాగముచేయ లేదా?

ఈ విధముగా చూసిన యెడల పూర్వాశ్రయ నిరసన స్థలమునందున శ్రీ భగవత్పాదుల వారు చేసిన ఉపదేశము అవశ్యముగ అనుసరణీయమని యెఱుగవలెను. ఒక ఊరున ఒక వ్యాపారి వుండెను. వానికి ధనమే సర్వస్వమై యుండెను. దివారాత్రములు దానిని సంగ్రహించుట యందును, సంగ్రహించిన దానిని భద్రపరచుట యందును నిమగ్నుడగు చుండెను. అపారమైన సంపత్తును సంపాదించెను. అయితే ఆసంపదవలన సుఖశాంతులు లభించలేదు. సుఖము కొరకు ధనమును సంపాదించగా దుఃఖమే సంప్రాప్తించె నిదేమిటి? అని ఆలోచించ దొడెగెను. సుఖమును సాధించెడి మార్గమును ఎరుగుటకై తన వద్దగల ధనకనకాదుల నన్నిటినీ మూటగట్టుకొని ఒక శివాచార్యుని సన్నిధికి చేరెను. మఠములోనికి ప్రవేశించగనే ఎదురున షట్స్థలజ్ఞాన సంపన్నుడైన ఆచార్యులను గనెను. వెనువెంటనే సాష్టాంగపడి, పైకిలేచి చేతులను శిరమునకు చేర్చి స్వామీ! నేను గొని తెచ్చిన ధనమును చూడుడి. ఈ ధనము వలన సుఖమును పొందగలనని యెంచి కూడబెట్టితిని. కాని అది సంభవించలేదు. ధనము దుఃఖమునే తెచ్చెను. దుఃఖ కారకమైన ఈ ధనము నాకు వలదు. నాకు కావలసినవి సుఖశాంతులు. తమరీ ధనమును గైకొని నాకు ఏదైన మార్గమును చూపుడు. నిజమైన సుఖమును పొందెడి అదృష్టమును నాకు కలిగించుడి అని ప్రార్థించెను. శివాచార్యులవారు ఆ భక్తుడి యొక్క ప్రార్థనను విని మొదట మౌనమువహించెను. కొంచెము సేపు ఆలోచించుకొని అకస్మాత్తుగా ఆ డబ్బు మూటను తీసికొని పలాయనమయ్యెను. గురువుగారి విచిత్రమైన ప్రవర్తనను గని

ఆ సంపన్నుడు సంభ్రమాశ్చర్యములకు గురియయ్యెను. ఈ ధనమున నేను వారి కొరకే తెచ్చితిని గదా! అట్టియెడ దానిని గైకొని పరుగెత్తుట యెందులకు? పరుగెత్తినను పరుగెత్తును గాక. నాకేమియు అభ్యంతరములేదు. నాకు మార్గదర్శనము చేయకుండా పరుగెత్తెనే? ఇపుడేమిటి కర్తవ్యము? అతని నుండి మార్గదర్శనము పొందని యెడల నాకు పోయెడిదేమీలేదు. ఆయన మార్గదర్శనమీయకుండిన యెడల నా డబ్బుమూటను నేను తెచ్చికొనెదను. అని మనస్సున దలచుకొని పరుగెత్తిడి ఆచార్యుల వెంబడి తానూ పరుగెత్తెను. ముందుముందున ఆచార్యుడు అతని వెంట సంపన్నుడు పరుగెత్తు చుండెను. ఆచార్యుడు సంపన్నుని గాంచి వానికి చిక్కకూడదని వేగమును పెంచెను. అతని నెటులైన పట్టుకొనవలెననెడి పట్టుదలతో సంపన్నుడు వేగమును పెంచి పరుగెత్తెను. ఈ విధముగ వారిరువురూ పదహారుమైళ్ళ వరకు పరుగెత్తిరి. వెనుక వచ్చెడి సంపన్నుడు ఆయాసపడుతూ వచ్చుచుండెను. కాయము చెమటలను గ్రక్కుచుండెను. అలసట యెక్కువైనందున శ్వాసగతి పెరిగి గాలి అందకుండెను. ప్రాణము పోవునో? ఏమో? అనెడి భావముకూడా కలిగెను. ఆచార్యుల వారు ఇదంతయు తెలిసికొనిన వాడై మార్గము ప్రక్కననున్న చెట్టునీడకు వెడలి అచట డబ్బుమూటను పడవైచి ఒక ఉచితమైన స్థలమున కూర్చొనెను. అల్లంత దూరమున చెట్టు నీడన కూర్చున్న శివాచార్యుని గనిన సంపన్నుడు ఎంతో ఆనందమును పొంది పరుగెత్తుచూ పరుగెత్తుచూ వచ్చి ఆచార్యులముందున్న డబ్బుమూటను యెదకు హత్తుకొని పట్టలేని సంతోషమునననుభవించుచు వుండగా అతని మనోవృత్తిని భరించలేని గుండె ఆగి పోవునా! అని యనిపించెను. అప్పుడు శివాచార్యుడు, ఏమయ్యా! నీకిప్పుడు ఎటుల అనిపించుచున్నది? అనెను నాకిప్పుడు ఆత్మానందమూ కలిగినదని సంపన్నుడు బదులుచెప్పెను. అప్పుడా శివాచార్యుడు ఈ ఆనందమునకు కారణమేమి? యని యడిగెను. ఈ మూట దొరిగినందుకే గురుదేవా! అని ప్రత్యుత్తరము నిచ్చెను. అటులైన ఒక ప్రశ్నకు సమాధానమిమ్ము. ఈ డబ్బు మూట ఇంత వరకు నీదగ్గరనే వుండెను కదా! నా వద్దకు రానప్పుడు నీకెందులకు ఆనందము కలుగలేదు. ఆనందము పొందెడు మార్గము నన్వేషిస్తూ నామతమునకెందుకు వచ్చితివి? అని శివాచార్యుడు ప్రశ్నించెను. అందులకు సంపన్నుడు దొంగిలించుకొని పోయిన డబ్బు మరల లభించినందులకు ఈ సంతోషము కల్గినది. అని బదులు చెప్పెను. అప్పుడాచార్యులవారు ఓ శిష్యోత్తమా! సుఖము, సంతోషము, శాంతి, భద్రత సంపత్తునందు వుండవు. అవి నీ ఆత్మలోనే వుండును. వాటిని పొందవలయుననిన బహిర్ముఖముగా పయనించిన యెడల లాభముండదు. తన్నిమిత్తమై అంతర్ముఖివై పయనించవలెను.

నీ యొక్క మూట చిక్కనపిదప వ్యగ్రత దూరమై శాంతి చిక్కినది కదా! ఇదే విధముగా మనస్సు శాంతమై మనుష్యునికి ఆత్మ సుఖము యొక్క ఆనందము లభించవలెననిన అంతర్ముఖి కావలెను. ఆ విధముగా నీవు సాధన చేశిన యెడల శాశ్వతమైన సుఖ శాంతులు లభించగలవు ఇదంతయు పర్యాలోచన చేసిన పిదప ఆ సంపన్నుడు, తాను అందర్ముఖి యై శివుని స్మరించుటయే గొప్ప సంపత్తు. అది దొరికిన పిదప ఎవరైనను తనకు విరోధులై వచ్చిన యెడల వారిని త్యజించవలెను, అనెడి నిర్ణయమునకు వచ్చెను. ఆ విధిన కొన్నాళ్ళు సాధనచేసి అంతరంగమున ప్రశాంతతను సాధించిన పిదప అంతరంగశుద్ధిని బడసి ఆ యాచార్యుని వద్దకు వచ్చెను. అప్పుడాచార్యుడు ఇతనికి మరింకేమి సందేహము కల్గినదో యని ఆలోచింప జొచ్చెను. ఆచార్యునికి ఆశ్చర్యము కలుగు విధముగా ఆ సంపన్న వ్యక్తి చేతులు జోడించుకొని ఈ విధముగా విన్నవించెను.

సాక్షాత్తు శివుడవైయున్న శివాచార్యా! ప్రణామములు. ప్రసుత్తము నేను మీ మతమునకు, తమరి నుండి గొప్పసంపదను పొందెడి కోరికతో వచ్చితిని నా పూర్వాశ్రమ ఆచార విచారములను విస్మృతికి గురిచేసి మీకు శరణుజొచ్చితిని. దయచేశి లింగదీక్షను కటాక్షించి నన్ను సుసంపన్ననిగా జేయుము.

నన్ను సంపన్ననిగా చేయుము అనిన శిష్యుని వాక్కులలోగల అర్థమును గ్రహించవలసి యున్నది. భౌతికపరముగా ఆలోచించిన యెడల అతడు ధన, కనక వస్తు వాహనాదులు పుష్కలముగా గలిగినవాడే. కాని ఆచార విచారములలో ఆగర్భదరిద్రుడై యుండెను. లింగదీక్షను పొంది సుసంపన్నుడు కాదలచెను.

శ్రీ భగవత్పాదులవారు ఈ విషయమును ఈ క్రింది విధముగా ఉపదేశమును కటాక్షించిరి.

**శ్లో॥ శివసంస్కారయోగేన విశుద్ధానాం మహాత్మనామ్ ।**

**కిం పూర్వకాలికైర్ధర్మై : ప్రాకృతానాం హితేమతాః ॥**

శివసంస్కార యోగేన శివధర్మాను షంగిణామ్ ।
ప్రాకృతానాం న ధర్మేషు ప్రవృతి రుపపద్యతే ॥ (సి.శి. 10-32:33)

భగవత్పాదుల వారి ఉపదేశములోని సారాంశమేమనగా దీక్షను పొందిన పిదప లింగనిష్ఠతో పరిశుద్ధులైన వారికి పూర్వాశ్రమములోని నైమితిక మరియు ప్రాయశ్చిత్త కర్మలను చేయవలసిన ఆవశ్యకత లేదు. ఇష్టలింగ పూజారూపమైన నిత్యకర్మమును వారు ఆచరించన చాలు ఇష్టలింగపూజను చేసిన యటులనే విభూతి, రుద్రాక్షలను ధరించిన యెడల సకల విధములైన పాపములు నష్టమగుచున్నవి. అందుచేత పాపకర్ములు చేసెడి ప్రాయశ్చిత్తములు వీరశైవులు చేయవలసిన పనిలేదు. అదే విధముగా ఇతరులు చేసెడి నిత్య కర్మలైన సంధ్యా వందనాదులు నైమిత్తిక కర్మలైన ఉపవాస వ్రతాదులు చేయవలసిన పనిలేదు. "సర్వేపదాః హస్తి పదే నిమగ్నాః" అనగా అన్ని పాదములు ఏనుగు పాదముల క్రింద అణిగిపోవును అనెడి సూక్తి ప్రకారము ఇష్టలింగ పూజలోనే నిత్య నైమత్తిక ప్రాయశ్చిత్తాది కర్మలన్నియును యిమిడి యున్నవి. ఒక్క ఇష్టలింగపూజను చేసిన యెడల ఆయాకర్మలన్నియు చేసిన ఫలము కంటెను అధికమైన ఫలము లభించుచున్నది. ధర్మము జాతి, వర్ణము మరియు పరంపరలు తమతమ భేదముల ద్వారా మనుజులను విభజించుచున్నవి. అయితే పూజ్యపాదులైన భగవత్పాదుల వారు ప్రజలను ఈ క్రింది విధముగా విభజించిరి.

శ్లో॥ విశుద్ధాః ప్రాకృతాశ్చేతి ద్వివిధా మానుషా స్మృతాః ।
శివసంస్కారిణః శుద్ధా ప్రాకృతాయితరే మతాః ॥ (10-34)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా మనుజులను రెండు విధములుగా విభజించ వచ్చును. ఒకరు విశుద్ధులు మరొకరు ప్రాకృతులు. శివదీక్షా సంస్కారమును పొందినవారు విశుద్ధులు. పొందనివారు ప్రాకృతులు. వీరశైవధర్మమందున జన్మించిన వారెల్లరు విశుద్ధులై వుండవలయుననెడి వుద్దేశ్యముతోనే గర్భస్థ శిశువుకే లింగధారణ చేయవలయునని ఉపదేశమునిచ్చిరి. జన్మను దాల్చెడి శిశువు ప్రాకృతుడై జన్మించకుండా సుసంస్కృతుడై జన్మించవలెననెడిదే ఆచార్యులివారి మహాదాశయము. శిశువు జన్మించిన పిదప ఎనిమిదవ వర్షము ప్రవేశించినప్పుడు సంస్కారమును చేశెడి ఆచారము ఇతర ధర్మములలో కలదు. వీరశైవుడు గర్భస్థ శిశువునకు ఎనిమిది నెలల ప్రాయమందుననే సంస్కారమును కలిగించుచున్నాడు. ఈ ధర్మముయొక్క సంస్కార విధికూడా ఇతరుల సంస్కారముకంటెను భిన్నమైనదై యున్నది. అత్యంత వైజ్ఞానిక పరమైనది. తల్లియొక్క గర్భమునందున శిశువు ఏడునెలలదై యున్నపుడు దానికి జన్మ జన్మాంతరముల జ్ఞానము వుండునని అనేకులు జ్ఞానమార్గమున నున్నవారు సెలవిత్తురు. అప్పుడా శిశువుతాను క్రిందటి జన్మలో పొందిన కష్టములను స్మరించి మరల జన్మించిన యెడల అట్టి కష్టములె యుండునని ఆందోళన చెంది భయపడెడి అవకాశము కలదు. దుఃఖమును పొందుచున్న ఆశిశువులో మరణపు కోరికయు కలిగెడి అవకాశము కలదు. ఎనిమిదవ మాసమునందు ప్రసవమయ్యెడి తల్లులు తమ శిశువులను కోల్పోవుట కూడా లోకమునందు గాంచగలము. లింగధారణ చేసిన యెడల ఆ శిశువునకు అభయ భావము ఏర్పడి అతనిలో మరణ పరమైన యిచ్ఛ వెనుకకు తగ్గును. ఈ కారణము చేత గర్భస్థ శిశువునకు ఎనిమిది మాసములు నిండగనే అగ్రామమునకు చెందిన మఠస్థ అయ్యచే లింగధారణను చేయించవలెను. లింగధారణ చేయునపుడు లింగమును శుద్ధిచేసి అద్దానిని శిశువుయొక్క తల్లి బాహువునకు కట్టవలెను. అటుల కాకున్న జన్మించగనే ఎంత తొందరగా వీలైతె అంత తొందరగా లింగధారణ చేయించెడి ఆచారము కలదు. కాని శిశువు గర్భమునందున్నపుడే చేయబడెడి లింగధారణ వున్నతమై యుండును. ఈ సందర్భమున మఠమయ్యను గురించిన వివరణ తెలిసికొనుట ఎంతో అవసరము. ఇతడు పరంపరానుగతముగ వీరశైవ ఆచార్యులకు అనుబంధము గలిగిన వీర, నంది, భృంగి, వృషభ మరియు స్కంద గోత్రములలో ఒక గోత్రమునకు చెందిన గురువర్గ కుటుంబము వాడై యుండును. ఇతనికి ఎనిమిది నుండి పదహారవ యేట మధ్య కాలములో చరపట్టాధ్యక్షుల సాన్నిధ్యమున అయ్యాచారము చేయబడుచున్నది. ఆ విధముగా సమున్నతమైన సంస్కారమును పొంది సంస్కారవంతుడై విధి ప్రకారము అనునిత్యము లింగార్చన చేయుచు నైమిత్తిక సందర్భములలో చరపట్టాధ్యక్షుల పాదపూజలు చేసివారి పాదోదక ప్రసాదములను స్వీకరించుచూ లింగకాయిగను, లింగ ప్రాణిగను పరిణామమునొందు చున్నాడు. ఇట్టి వాడే పాదోదక ప్రసాదములను కటాక్షించగలడు. అష్టావరణములలో ఈ రెండూ ముఖ్యమైనవి. ఇవిలేకుండా లింగాధారణ జరిపిన యెడల అట్టి లింగధారణ శాస్త్రబద్ధమైనది కాజాలదు. అంతే కాకుండా మంత్రోపదేశమును చేసెడి అర్హత ఇట్టివానికే గలుగు చున్నది. ఇది పరంపరాను గతముగా తరతరాలుగా కొనసాగుచూ వచ్చుచున్న ఆచారము అని గ్రహించగలరు ఇట్టి ఆచారమును పాటించుట ప్రతి ఒక్కరికి ధర్మమై యున్నది.

వీరశైవునికి మాతృగర్భమున నున్నపుడు ప్రాప్తమైన యా లింగము చివరకు భూగర్భమునూ జేరునంతవరకు అతని జతకే వుండుచున్నది. లింగనిష్ఠ యనగా నిట్టిది. ఇట్టి నిష్ఠ సామాన్యులకు గాని, పరిచయములేని వారికి గాని ఆశ్చర్యమును గలిగించును. దీనిని వారు ఒక విచిత్రముగ గనెదరు. ఇట్టి అనుభవమే వేదవ్యాస మహర్షి పొందినట్లుగా మహాభారతములోని ఈ క్రింది ప్రమాణము వలన తెలియుచున్నది.

**శ్లో॥ శైలాదేన మహాభాగా విచిత్రా లింగధారకాః ।**
**శవస్యోపరి లింగంచ ధ్రియతే చ పురాతన్యైః ।**
**లింగేన సహ పంచత్వం లింగేన సహ జీవితమ్ ॥**

ఈ ప్రమాణములోని భావమేమనగా లింగధారిగా జన్మించి జీవమున్నంత వరకు అంగము మీద లింగమును ధరించి చివరకా లింగమును ధరించియే సమాధిని పొందుచున్నాడు. ఇది యెంతో ఆశ్చర్యకరమైన విషయము.

శివసంస్కారమును పొందినవారు శుద్ధులనియునూ, ఇట్టి సంస్కారమును పొందక శివచిహ్నామైన లింగమును ధరించక యుండెడివారిని ప్రాకృతులనియును పిలుచుటకు గల కారణము యెట్టిది? తాత్త్వికముగా చూసిన యెడల లింగధారణ పొందిన వాడు జంతు దశ నుండి సంస్కారమును పొంది పశుపతిరూపమును పొందుచున్నాడు. ప్రాకృతులు అటులకాదు, సంస్కారహీనులు. పాశుపత ధర్మ ప్రకారము పాశబద్ధులైన పశువుల వంటి వారు. ఈ కారణము వలన వీరమాహేశ్వర స్థలమున నుండెడి శివభక్తుడు ప్రాకృతుల సాంగత్యమున నుండ కూడదు.

వర్ణాశ్రమ ధర్మములు నేటిస్థితిలో ఎంతో కలవరమును కలిగించుట చూచుచున్నాము. వాటిని గురించి భగవత్పాదులవారు ఇచ్చిన సందేశమును గమనించుడి.

**శ్లో॥ వర్ణాశ్రమాదిధర్మాణాం వ్యవస్థా హి ద్విధా మతా ।**
**ఏకాశివేన నిర్దిష్టా బ్రహ్మణా కథితాఽ పరా ॥**

**శివోక్త ధర్మనిష్ఠా తు శివాశ్రమనిషేవిణాం ।**
**శివ సంస్కారహీనానాం ధర్మః పైతామహః స్మృతః ॥** (సి.శి. 10-35;36)

ఈ ఉపదేశము ప్రకారము జగత్తులోని వర్ణాశ్రమములు రెండు రకములుగా నున్నవి. ఒకటి శివుడు ప్రతిపాదించినది. రెండువది బ్రహ్మ ప్రతిపాదించినది. బ్రహసృష్టికంటెను ముందుగనే శివసృష్టి చేయబడినదని తెలియగలరు. జననము కంటెను పూర్వమే శివసంస్కారములు పొందిన వీరశైవులు శివోపదిష్టములైన ఆచారముల నాచరించవలెను. తక్కిన వారు బ్రహ్మచేత నుపదేశింపబడిన వర్ణాశ్రమములను పాలించవలెను. ఇంకొక విధముగా చెప్పవలెననిన వీరశైవులకు చతుర్విధమైన వర్ణాశ్రమములు పాటించవలసిన అవసరములేదు. బ్రాహ్మణ, క్షతియ, వైశ్య శూద్ర అనెడి వర్ణభేదములు బ్రహ్మసృష్టి యందలివే. ఇవి శివసృష్టిలో లేవు. స్వతహాగా శివుని చేత సృష్టింప బడినవారైనందున వీరశైవులకు బ్రహ్మ సృష్టియందలి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనెడి వర్ణభేదములు వర్తించవు. అందుచేతనే వీరిని అతి వర్ణాశ్రమీయులు అని పిలుతురు. శివ సృష్టి యందలి ముఖ్యులైన వీర, నంది, భృంగి, వృషభ మరియు స్కందులు అనెడి పంచశివగణములు మరియు కాలారి, ముఖారి, వేదారి, పురారి, మరియు స్మరారులు అనెడి పంచజనులు శివ సృష్టిలోనివారు వీర, నంది మొదలైన శివ గణముల సంతానమే పరంపరాను గతముగా కొనసాగుచూ వచ్చుచున్న జంగములు. అదే ప్రకారముగా కాలారి, ముఖారి మొదలగు పంచజనుల సంతానమైననేటి పంచమసాలి, లేదా పంచమశీలురును. వీరిలో జంగములు గురువర్గమునకు చెందినవారు. పంచజనుల సంతతికి చెందిన వారు శిష్యులైయుందురని గ్రహించ వలెను. కాలాంతరమున అటు గురువర్గములోను ఇటు శిష్యవర్గములోను అనేకానేక ఉపవర్గములు వెలసినవి. ఈ జాతి భేదములు వారివారి ఉద్యోగధర్మముల వలన వచ్చినవే కాని ధర్మతః వచ్చిన భేదములు కావు. జంగములందరు కూడా ఒకే వర్గమునకు చెందిన వారే. వారియందు ఎట్టి అసమానతలు లేవు. అదే విధిన పంచజనులును. నేడు వ్యవహరింపబడుడి బణజిగ, గాణిగ, మదివాల, కుంభార, నేకార మొదలగు జాలిభేదములు

కృత్రిమమైనవి. వీటిని పాటించవలసిన అవసరము లేదు. ప్రాకృతులలో చతుర్వర్ణములు వుండినటులనే వీరశైవులలో జంగములు మరియు భక్తులు అనెడి రెండు వర్గములు గలవు. ఇవి వర్గములేగాని వర్ణములు కావు. జంగములు గురువులు కాగా భక్తులు శిష్యులై యున్నారు తత్వతః మనమందరము ఒకటే, మనము పూజించునట్టి శివలింగమూ ఒక్కటే. అనెడి విచారము కలవారై వీరశైవులందరూ ఒకే త్రాటిమీద నిలిచివుండుట అవశ్యమై యున్నది. ఈ ధర్మము నందున లింగధారులందరూ ఆచార్యుల చేత ఉపదేశింపబడిన శివధర్మా బ్రహ్మోప చరణలను పాటించవలసినదే కాని బ్రహ్మోపదిష్టమైనదియును, బ్రాహ్మణాది వర్ణభేదములననుసరించి వర్తించెడి వివిధ ధర్మములను పాటించవలసిన అవసరము లేదు.

బ్రహ్మ సృష్టిలోని ఏవర్గమునకు చెందిన వారైనను వీరశైవ దీక్షను పొందిన యెడల వారు తమతమ పూర్వాశ్రమ సంబంధముగల ధర్మములను ఆచరణలను తప్పనిసరిగా విడనాడవలయుననెడిది మరవకూడని విషయము దీనికి కారణమేమనగా శివసృష్టి బ్రహ్మసృష్టి కంటెను ఉదారమైనది ఉత్కృష్టమైనది.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 27-8 - 1991

స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

పూర్వాశ్రయ నిరాసక్తుని గురించి శ్రీకాశీ జగద్గురుల వారు యెంతయో జ్ఞానదాయకమైన ఆశీర్వచనమును కటాక్షించిరి.

ఆశ్రయ మనగా నిత్యముగా నుండెడిదని చెప్పబడినది. "ఆ సమంతాత్ శ్రియత ఇత్యాశ్రయఃయనెడిది వ్యుత్పత్తి పూర్వాశ్రయమనగా పూర్వమున నిత్యముగా నుండెడివని యర్థము వీటి యెడల నిరాసక్తిని ప్రదర్శించ వలెనని తెలియ జెప్పెడిదే పూర్వాశ్రయ నిరసన స్థలమని ఎరుగవలెను.

వీరశైవులను రెండు విధములుగా విభజింప వచ్చును. సహజ వీరశైవులు మరియు సహజీకృత వీరశైవులు. జన్మతః వీరశైవుని సహజ వీరశైవుడని యనవచ్చును. ఇతని తల్లి దండ్రులు వీరశైవులై యుండుటచే వీరు శివధర్మమున కనుగుణముగా తన సంతానమునకు లింగధారణాది సంస్కారములను విహిత మార్గమున జరిపింతురు. ఎనిమిది నెలల గర్భమున గల గర్భస్థ శిశువుకు లింగధారణ సంస్కారము చేయవలెనని శివ ధర్మశాస్త్రము తెలుపు చున్నది. జన్మించిన పిదప లింగధారణ జరిగిన యెడల, నట్టి లింగధారణ పొందిన వాడు సహజీకృత వీరశైవుడన బడుచున్నాడు. సహజీకృత వీరశైవుని మాతా పితరులు నితర ధర్మములకు చెందిన వారైయుండిన యెడల నా కుటుంబముతో నతని సంబంధ బాంధవ్యములు కొనసాగెడి యవకాశము గలదు. సాంగత్య దోషము గాకుండగ నుండెడి స్థితిలోనున్న సందర్భమున పొందిన యనుభవము వలననో నతనికి పరధర్మమునకు చెందిన కర్మల యెడల నాసక్తి గల్గెడి యవకాశము గలదు. ఇట్టి యాసక్తి వలన మాహేశ్వర స్థలములోని నిష్ఠ దెబ్బ తినెడి ప్రమాదము గలదు. నిష్ఠ చెడిన యెడల తిరోగమనమువైపు పయనించ వలసి యుండును. ఇట్టి వాడు పంచమహాపాతకములు చేసిన వాడగునని శ్రీ బసవేశ్వరులవారు తమ 765 వచనమున తెలిపిరని బాడాల రామయ్యగారి సమగ్ర సమీక్ష వలన తెలియుచున్నది. (చూడుడి; పుట. 187) ఇట్టి వాటిని నివారించి వీరశైవుని భక్తిని దృఢతరము చేయుటయే యీ స్థలమున నివ్వబడిన యుపదేశము యొక్క లక్ష్యము.

ప్రముఖ వీరశైవ కవి పాల్కురికి సోమనాథుడు సహజ వీర శైవుడు, కాగా మల్లికార్జున పండితుడు సహజీకృత వీరశైవుడు. మల్లికార్జున పండితుడు పూర్వాశ్రయ నిరసన మెటుల గావించెనో యనెడి దానిని సోమనాథుడు మెంతో రమ్యముగా చిత్రించెను. పండితారాధ్య చరిత్రలోని యీ చిత్రణను గనుడి:

**విధి నిషేధాతీత వీరశైవోక్త**

**విధి ఎసద్గురుభ్యో నివేదయేఎం త్తనగ**

**నవికల దేహ ప్రాణార్థముల్ పూర్వ**

**భవ భావి భవ సముద్భవ భవహరు, సకల**

**భవ హరు సాక్షాధభవు జితభావ**

**భవు శివు శ్రీ కోటి పల్లి యారాధ్య**

**దేవు శ్రీ పాదుకేందీవరంబులకు**

**భావం బెలర్చనర్పణ మాచరించి** ( పండితారాధ్య చరిత్ర)

పూర్వాశ్రయములో నిత్యకర్మలన బడు "విధి, నిషేధ" కర్మలను పండితుడు గురుపాదముల కడ విసర్జించెను. విధి కర్మలనగా విద్యుక్త కర్మలని నిషేదకర్మలనగా పాటింపకూడని పనులని గ్రహించ వలెను. శివ ధర్మ శాస్త్రమున నివి యుండవు. వీటిని పాటించెడి వారు ప్రాకృతులన బడుదురు. వీరశైవులు విశుద్ధులన బడుదురు. వీరికి ప్రాకృత "విధి, నిషేధము" లు వర్తించవు. ప్రాకృతులు వర్ణాశ్రమ ధర్మములను పాటించుట వారి విద్యుక్త ధర్మమని భావింతురు. అదే విధిన సూతాకాదులను వారు పాటించెదరు. విశుద్ధులైన వీరశైవులు వీటిని నిరాకరించి "అతివర్ణాశ్రమ ధర్మయులైరి" భవి భక్తుడైన పిదప వీటిని విస్మరించాలనెడిదే యీ స్థలములోని యుపదేశములోని కేంద్రాంశము. ఈ విషయములను సుస్పష్టము చేసెడి శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి.

**పుట్టు మందున భవి, మరల్చి భక్తుని జేసి, పూర్వాశ్రయము, కడచి**

**పొందునందు భవియై పోయెడివారి ముట్ట కూడదు.**

**అతనిని ముట్టినవాడు మున్ననే వ్రతచెడగరి అతని శ్రాద్ధ కాలమే శ్వానమాంసము**

**క్రియా కార్యమే క్రిములు, తద్దినమే మద్యమాంసము ఇది కారణము, కూడల సంగమ దేవా,**

**అతని యింటికి విచారించకుండ పోయెడి వానికి నాయకనరకము.....** (బ.గ.తి.)

శ్రాద్ధములు తద్దినములు దశదిన కర్మ ఇత్యాది క్రియాకార్యములను మాహేశ్వర స్థలి నిరాకరించ వలెను. తాను చేయవలదు. చేసెడి వారింటికి వెడలి ప్రసాదాదుల స్వీకరింపవలదు. ఇదే విధిన, సంధ్యావందనాదులు, సూర్య నమస్కారములు, అగ్నిముఖార్చనలగు యజ్ఞయాగములను విస్మరింప వలెను. కేవలము, తన నిష్ఠకు కేంద్ర స్థానమైన, యిష్టలింగార్చన యెడలనే యాసక్తిని గల్గియుండవలెను. మిగిలిన వేవియును విహితములు కావని గ్రహించవలెను. సంక్షిప్తముగా చెప్పవలెననిన లోకాచారమున గల వివిధ జప, తప, హోమ, అర్చన, అర్పణ, గోష్ఠి మొదలగు వాటి యెడల నాసక్తిని వీడవలెను. ఈ విధిన చేసినచో భక్తి దృఢతరమై ప్రసాది స్థలమున యవధాన భక్తి సల్పుటకు వలయు నిర్దుష్టమైన యర్హత లభించ గలదు.

శివం భూయాత్

# ఆశీర్వచనము - 1
# సర్వాద్వైత నిరసన స్థలము

శ్రీ జగద్గురు రేణుకాచార్య భగవత్పాదుల వారు పూర్వాశ్రీత ఆచార విచారములను వీడవలెనని తెలిపిన పిదప మాహేశ్వర స్థలము నందలి శివ భక్తుడద్వైత భావమును నిరసించవలెనని యుపదేశించిరి. గమనించుడి.

**శ్లో॥ పూజ్య పూజకయోర్లింగజీవయోర్భేదవర్జనే ।**
**పూజ్య కర్మాద్య సంపత్తేర్లింగనిష్ఠా విరోధతః ॥**
**సర్వాద్వైత విచారస్య జ్ఞానాభావో వ్యవస్థితేః ।**
**భవేన్మాహేశ్వరః కర్మీ సర్వాద్వైత నిరాసకః ॥** (సి. శి. 10-37;38)

మాహేశ్వర స్థలమున సాధకుడు నిష్ఠాభక్తి సంపన్నుడై యుండుట చేతను, సర్వాద్వైత స్థితి నిష్ఠాభక్తికి విరోధము గల్గినదైనందునను, అద్వైత భావన పొడచూపిన పిదప పూజ్యపూజక భావమేర్పడదనియును, అందుచేత సాధకుడు సర్వాద్వైత భావనను నిరాకరించ వలెను.

భారతీయ సాంస్కృతక పరంపరమందున ద్వైత, అద్వైత మరియు ద్వైతాద్వైమములనెడి యనేక సిద్ధాంతములు ప్రతిపాదింపబడినవి. శివ–జీవుల మధ్యన సదాభేదభావము గల్గియుండ వలెనని బోధించునదే ద్వైతము. దీనికి విరుద్ధమైనది, యద్వైతము. ఇందులోన యీ శివాజీవుల కభేదము పాటింపబడినది ద్వైతా ద్వైతము.

శ్రీ భగవత్పాదుల వారు ద్వైతా ద్వైతభావనను స్వీకరించి సమన్వయ వాదమును ప్రతిపాదించిరి వీరశైవమున మొదట ద్వైత భావన యేర్పడును, మధ్యస్థితిలో ద్వేతా ద్వైత భావన యేర్పడును చివరన యద్దైత్వ సిద్ధి గల్గును. షట్ స్థలములలోని భక్త మాహేశ్వర స్థలముల యందున ద్వైత భావ మేర్పడి, ప్రసాది ప్రాణలింగ స్థలములలో ద్వైతాద్వైత భావము గల్గి, శరణైక్య స్థలములలో అద్వైత భావన యేర్పడును. ఈ కారణముననే మాహేశ్వర స్థలమున యద్వైత భావన చెల్లనేరదని, శ్రీ భగవత్పాదుల వారు ఆదేశించిరి.

శివుడు పూజ్యుడు జీవుడు పూజకుడు సాధారణ పూజకుడు కాదు నైష్ఠిక పూజకుడు. విహిత పద్ధతిన శివపూజ చేయకుండిన యెడల నైష్ఠికతకు భంగము గల్గును. అద్వైత భావముతో పూజించిన యెడ నిష్ఠ సిద్ధించదు. ద్వైత భావమే వలయును. అద్వైతమున పూజ యెడల నిరాసక్తత పెరుగును ఆసక్తి రాహిత్యము వలన లింగపూజను నిలిపివేసే ఆస్కారము గల్గును. ఈ స్థితిని నివారించు నిమిత్తముననే ద్వైత నిరసన ప్రబోధింప బడినది.

ఉపచారముల యావశ్యతకత గురించి జిజ్ఞాస గల్గవచ్చును. ప్రేమానురాగము గలవనెడి దానిని తెలుపుటకు పలు మార్గములు గలవు. కొందరు సంభాషణలో తమ యనురాగమును వ్యక్తము చేయుదురు. దాని వలన యెదుటి వ్యక్తి కొంత మేరకు తృప్తి పడినా, అది సంపూర్ణముగా తృప్తి నివ్వదు. తియ్యగా మాట్లాడుటే కాని చేయుట యేమియును లేదనెడి అపవాదము గల్గెడి ప్రమాదము పొంచి యుండును. నేను త్రికరణ శుద్ధితో ప్రేమించు చున్నానని తెలియ చెప్పెడి యావశ్యకత యేర్పడును. ఈ స్థితిలోన యుపచారములు కీలకమైన పాత్రను పోషించును. లౌకిక జీవనమున అతిథి సత్కారములు చేసి మన ప్రేమను వ్యక్తము చేయుట జరుగును అదే విధిన మాహేశ్వర స్థలములోని భక్తుడు ఉపచార పూజలను చేయవలెను. అట్టి యెడ ద్వైత భావన యే యవసరమగు చున్నది. అద్వైత మనావశ్యకమగును.

శివుడు జీవుని కంటె భిన్నుడనియును అతడు జగత్తుకే ప్రేరకుడనియును మనమునదాల్చి మాహేశ్వరుడు ఉపాసన చేయవలెనని తెలుపుచూ అద్దానికి అద్వైతభావన ఏవిధముగా అవరోధకరమో తెలిపెడి భగత్పాదులవారి ఉపదేశమును గనుడి.

**శ్లో॥ ప్రేరకం శంకరం బు ధ్వా ప్రేర్యమాత్మానమేవచ**
**భేదాత్తం పూజయేన్నిత్యమ్ న చాద్వైత పరోభవేత్** (సి. శి. 10–39)

ఈ ఉపదేశములోని భావమేమనుగా శివుడు అందరికినీ ప్రేరకుడుగా నున్నాడు. "తేన వినాతృణ మపినచలతి" అనెడి వ్యక్తి ప్రకారము అతని ప్రేరణ లేనిది ఎవ్వరునూ దేనిని చేయలేరు. ఈ ఈశ్వరుడే ప్రేరకుడౌ యుండిన యెడల ప్రతి ఒక్కరూ ఉత్తమ కర్మలనే చేయవలెను, కదా! ఒక వేళ ఆ విధముగా వుండిన యెడల భూలోకమే స్వర్గమై యుండెడిది. కాని దానికి విరుద్ధముగా అధిక సంఖ్యాకులు దుష్కర్మలనే చేయుచున్నట్లుగా దోచుచున్నది. ఒక వేళ అట్టి దుష్కర్మలకు ఈశ్వరుడే ప్రేరకుడని ఒప్పుకొనిన యెడల దుష్కర్మలను చేయించెడు వాడు ఈశ్వరుడగుచున్నాడు. ఇదొక పెద్ద ప్రశ్న దీనికి మేధావులు వుత్తరము నీయ వలసినదే ఈశ్వరుడు శుభా శుభముల తారతమ్యము లేకుండా కేవలము ప్రేరక శక్తిగా నున్నాడు. అట్టి ప్రేరక శక్తిని సద్వినియోగము చేసుకొనినవాడు సజ్జనుడై లోకొపకారియై ములోకవంద్యుడై విరాజిల్లుచున్నాడు. ఆ శక్తిని దుర్వినియోగము చేసుకొనినవాడు తద్విరుద్ధముగా సిద్ధమై తన దుష్టకార్యక్రమముల వలన లోక కంటకుడై నిందితుడగు చున్నాడు. ఇచ్చట లోపము శక్తిదా? వ్యక్తిదా? అనెడి ప్రశ్న వేసికొనవలెను. ధనమున్నవాడు దానధర్మములచేసి పుణ్యాత్ముడగు చున్నాడు. అట్టి ధనము కలవాడే ఇంకొకడు పాపాత్ముడుగా మారుచున్నాడు. ఇచటి లోపము ధనముదా? వ్యక్తిదా? వర్షపునీరు భూమి మీద పడిన పిదప అది పలు ప్రదేశములకు పారి వివిధ ఫలసాయములకు కారణమగు చున్నది. ఒక కడ నిమ్మ, మరొక కడ చెఱకు వేరొక కడ మిరప, ఇంకొక కడ వరి ఫలసాయములు గలుగుచున్నవి. అయా బీజముల ప్రకారమే వేరువేరు ఫలసాయములు వచ్చుచున్నవి. కాని ఈ వైవిధ్యతకు వర్షపునీరు కారణమగునే? అదేవిధిన చెరకులోని తీపి, నిమ్మలోని పులుపు, పరస్పర విరుద్ధమైన రసములు. మరి ఈరెంటికినీ వర్షపునీరే కారణమైన యెడల ఆనీరే ఈరుచుల భేదమునకు

కారణమగునే? ఇట్టి ప్రశ్నలను గమనించిన యెడల ఈశ్వరుని యొక్క ప్రేరకశక్తి యొక్క స్వభావము అవగతమగును. వ్యక్తుల యొక్క అంతరంగములలో వైరుధ్యత వుండునని అందరూ ఎరిగిన విషయమే. దీనితో పాటుగా వారివారి సంస్కారములే వారివారి ప్రవర్తనలకు కారణమగుచున్నవి. "ఈశ్వరః వర్జన్యవద్ ద్రష్టవ్యః" అనెడి ప్రమాణము ప్రకారము ఈశ్వరుడు వాన నీటివంటివాడే. ఫలసాయములోగల భేదములకు వర్షమునీరు కారణము కానటులనే జీవులలోనున్న పలు విధములైన వైషమ్యములకు అతడు కారకుడు కాడు. ఆయా వ్యక్తుల యొక్క అంతరంగములే కారణములగుచున్నవి. అట్టి అంతరంగములను ప్రభావితపరచెడి పాత్రను సంస్కరణలు చేపట్టుచున్నవి. ఈ రెంటియొక్క వుమ్మడి ప్రభావమువలన వ్యక్తి దుర్మార్గుడుగానో సన్మార్గుడుగానో మారుచున్నాడు. ఇచట ఈశ్వరుడని యొక్క ప్రమేయము ఏమియునులేదు. అతని పాత్ర ప్రేరకశక్తిని కలిగించుట వరకే పరిమితముగను. అద్దాని యొక్క సద్వినియోగ దుర్విని యోగములపైన అతనికి ఆసక్తి వుండదు.

మనయింటిలో వివిధ రకములకు చెందిన విద్యుత్ పరికరములు గలవు. ఇవి చేసే క్రియలు విభిన్నముగా నుండును. ఒకటి వేడిగాలినిచ్చినచో మరొక్కటి చల్లని గాలినిచ్చును. ఒకటి శబ్దమును వినిపించినచో మరొక్కటి దృశ్యమును ప్రదర్శించును. ఒకటి వేడిమినిస్తే మరొకటి వెలుతురు నిచ్చును. ఇవన్నియును విద్యుత్ సరఫరా వున్నంత మేరకే ఆయా విధ్యుక్త ధర్మములను నిర్వహించగలవు. విద్యుత్ సరఫరా నిలిచిన యెడల అని జడములే. అన్నీ ఒకే కోవకు చెందిన జడపదార్థములు విద్యుత్ రాగానే మరల వైవిధ్యత ప్రారంభమగును. ఇదేవిధిన ఈశ్వరుడు ప్రేరకుడై విద్యుత్ వల సహకారమును అందజేయుచున్నాడు. ఆసహకారమును ఏవిధముగా ఉపయోగించవలెనో అది వ్యక్తి నిర్ణయమునకే వదలివేయవలసియున్నది. దుష్టుడైన మనుజుడు ఈశ్వరుని నుండి ప్రేరణ పొంది దుర్మార్గములను చేయుచూ పోయిన యెడల ఈశ్వరుడు మౌనముగా యుండునా? అనెడిది మరొక ప్రశ్న అయితే ఇంతకు క్రితమే చెప్పిన యటుల ఒక వ్యక్తి దుర్మార్గుడగుటకుగాని, సన్మార్గుడగుటకుగాని సంస్కారములే కొంత మేరకు కారణమగుచున్నవి. ఒకవేళ దుర్మార్గుడు సన్మార్గుడు కావలయుననిన అతనికి ఉత్తమ సంస్కారములను ప్రదానము చేసిన యెడల అతనిలో పరివర్తన వచ్చు అవకాశము కలదు. ఈ పరివర్తన సాధించుటలో ఈశ్వరునికి గలపాత్ర యెట్టిది? ఈ ప్రశ్నకు సమాధానమేమనగా ప్రేరణశక్తి కలిగించుటవరకే ఈశ్వరుడు పరిమితమై యుండును. సంస్కారముల ద్వారా పరివర్తన తెచ్చెడి మహత్తు గురువుకు మాత్రమే కలదు. ఎంతటి దుర్మార్గుడైనను ఉత్తమమైన గురువు లభించిన యెడల వాడు సన్మార్గుడు కాకుండా వుండగలుగునే? సన్మార్గుడు కావడమే కాదు సత్పురుషుడై క్రమక్రమముగా మహాపురుషుడుగా పరిణామము నొందగలడు. భారతదేశములో గల మహాపురుషులలో చాలావరకు ఈ కోవకు చెందినవారే. ఈ కారణమువలననే "భోగియైనను యోగికాగలడు" అనెడి నానుడికి ప్రచారము లభించినది. ఇట్టి మహత్కార్యము సాధించినందువలననే శ్రీ గురువుకు ఈశ్వరునితో సమానమైన స్థానమును కొందరు యివ్వగా మరికొందరు గురువు ఈశ్వరుని కంటెను అధికుడని నుడువుచున్నారు.

ఈశ్వరుని యొక్క ప్రేరణశక్తిని పొందిన ప్రతివ్యక్తి తానాచరించెడి దైనందిన ఆచరణలను జాగ్రత్తగా పరిశీలించుకొని, ఒకవేళ వాటిలో దురాచారములేవైనా వుండిన యెడల వాటిని మార్చుకొనుటకై వలయ సంస్కారములను పొందుట తప్పనిసరి. ఒక సద్గురువును ఆశ్రయించి సత్ సాంగత్యమును చేయుచూ తనలోనున్న దుర్మార్గప్రవృత్తిని దూరము చేసుకొనవలెను. ఇది యిటులుండగా నేనే ఈశ్వరుడను అనెడి భావము కలిగించెడి అద్వైతభావనతో లింగార్చన చేసిన యెడల ఫలితము వుండదు. అందుచేత ఇష్టలింగార్చన చేయు తరుణమున ఈశ్వరుడు ప్రేరకుడనియును తాను ప్రేరణను పొందెడి వ్యక్తిననియును మనమునదలంచి ఇష్టలింగార్చనను చేసిన యెడల సత్ఫలితములుండును. ఈశ్వరుని యొక్క ప్రేరణ శక్తిని సత్కార్యములు చేయుటకే వినియోగించ వలెననెడి సద్బుద్ధి కలుగును. ఈ కారణము వలన మాహేశ్వరుని స్థలములోని భక్తుడు "సర్వాద్వైత నిరసన" చేయువాడు కావలెను. ఈ విషయమున భగవాత్పాదుల వారు మరొక ఉపదేశమునిచ్చిరి గమనించుడి.

**శ్లో ॥ పతిఃస్సాక్షాన్మహాదేవః పశురేష తదాశ్రయః ।**
**అనయోః స్వామిభృత్యత్వమభేదే కథమిష్యతే ॥** (సి.శి. 10-40)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా "పతమ్ విశ్వస్య" అనెడి స్మృతి వచనము ప్రకారము పరమాత్మకు పతియను పేరు గలదు. అతని ఆశ్రయమున నుండువాడే జీవుడు ఇతనిని పశువు అని పిలుతురు. పతి మరియు పశువు మధ్యన స్వామి మరియు భృత్య

సంబంధముడుట చేత శివుడు మరియు జీవుడు భిన్నులు అనబడెడి భావము కలిగియుండుట తప్పనిసరి. ఈ భావమేర్పడుటకు అద్వైతభావన అవరోధముగా ఏర్పడును. శివోహమ్ అనెడి వాడు దాసభావమును వహించగలుగునే? అతను కూడా స్వామినని భావించు కొనుచున్నాడు. స్వామికి స్వామికి మధ్య స్వామి భృత్యసంబంధమేర్పడుట ఎట్లు? ఈ కారణము వలన అద్వైత భావన మాహేశ్వర స్థలములోని భక్తునకు ఉపయుక్తమైనదై యుండదు. వీరశైవ సిద్ధాంతమునకు మహా పాశుపత వ్రతమనెడి పేరొకటి కలదు. దీని ప్రకారము శివుడు పతి. బ్రహ్మాదిస్తంభ పర్యంతము గలచరాచరములన్నియును, పశువులే. ఈ పశువులను బంధించెడి పాశముమొకటి కలదు. అదెట్టిదనగా త్రిమలములనెడి ఆణవములము, మాయామలము, కార్మికమలములనెడి త్రివిధమలములు. ఈ త్రిమలములు ప్రతి యొక్కరిని ఆవరించి పాశబద్ధుడిని చేయుచున్నవి. ఇందులో దేవ తిర్మఙ్మనుష్యాదులనెడి భేదములేదు ఎల్లరూ పాశబద్ధులే. ఈ కారణమువలననే శివుడొక్కడే మాయకు అతీతుడనియుడను, విరించి విష్ణ్వాది దేవతల నుండి పిపీలికాది సమస్త జీవరాశి మాయచేత బద్ధులైన వారనియును పాశుపత సిద్ధాంతము తెలియుజేయు చున్నది. ఈ కారణము వలన శివుడు సర్వజ్ఞుడు సర్వశక్తి సంపన్నుడు కాగా ఇతరులెల్లరూ పరిమిత జ్ఞాన సంపన్నులు, పరిమిత కర్తృత్వశక్తి సంపన్నులు అగుచున్నారు. ఈ భావమునే వీరశైవము గ్రహించినదని తెలుసుకొనగలరు. వీరశైవుడనెడి వాడు శివుడు పతియని మనమున భావించుకొని తాను భృత్యుడను అనెడి భృత్యాచార భావమును సంస్మరించుకొని లింగార్చనను చేయవలెను. మాహేశ్వర స్థలముననున్న భక్తునకు అది కర్తవ్యమై యున్నది.

ఇట్టి కర్తవ్యమును నిర్వర్తించుటలో అద్వైతభావన అడ్డుగా నిలుచును ఈ కారణము వలన అయ్యది నిరసనీయమైయున్నది.

శ్రీ భగవత్పాదులవారు అద్వైత భావమును గురించియు దానిని తిరస్కరించ వలసిన ఆవశ్యకతను గురించియు మరి కొంత మేరకు ఉపదేశమునిచ్చిరి. గమనించుడి.

**సాక్షాత్కృతం పరం తత్త్వం యదా భవతి బోధతః**
**తదాద్వైతసమాపత్తిఃజ్ఞానహీనస్య న క్వచిత్ ॥**
**భేదస్య కర్మ హేతుత్వాద్ వ్యవహారః ప్రవర్తతే ।**
**లింగపూజాది కర్మస్థో న చాద్వైతం సమాచరేత్ ॥** (సి.శి. 10; 41-42)

మాహేశ్వరుని యొక్క భేద బుద్ధి పరమేశ్వరుని స్వాత్మ రూపమునందున సాక్షాత్కరించి కొనుట వరకు నిలిచివుండును. అభేదజ్ఞానము అయ్యేడి వరకు అద్వైత స్థితి కలుగ నేరదు. అద్వైత స్థితి కలిగిన వానికి క్రియా సిద్ధి ప్రాప్తము కాదు. మాహేశ్వర స్థలమున నున్న భక్తునకు క్రియాసిద్ధి తప్పనిసరిగా కావలెను. నైష్ఠిక భక్తి కలిగిన వానికి ఇష్టలింగ పూజాదిక్రియలు కర్తవ్యమైయున్నవి. ఈ కారణము వలననే "క్రియాద్వైతం న సమాచరేత్" అనెడిది చెప్పబడినది. మనయింటిలో వివిధ స్త్రీలు వుందురు. వారు తల్లి, చెల్లి భార్య మొదలగు వారై యున్నారు. వీరు వారివారి వ్యవహారములు చేయుటలో భిన్నమైన స్థితిలో నుందురు. తల్లిచూపించెడి ప్రేమకు, చెల్లి చూపించెడి ప్రేమకు, భార్య చూపించెడి ప్రేమకు అంతరములు కలవు. అనగా భేదభావమునెడిది తప్పనిసరి వీరందరు స్త్రీలే యైనప్పటికి తమ భర్తలదగ్గర మాత్రమే స్త్రీ పురుష సంబంధముగల ప్రేమను ప్రదర్శింతురు. ఈ కారణమువల్లనైనను భేధభావము వహించుట తప్పనిసరి పాశ్చాత్యదేశములోని స్త్రీలవలె విశృంఖలత్వము పొడ చూపిననాడు మన సంస్కృతి కుప్పలా కూలిపోవును కదా! ఈ కారణము వలన మాహేశ్వర స్థలములో నున్న శివ భక్తుడు అద్వైతభావన యెడల నిరాసక్తత గలిగి వుండవలెను. ఒకానొక పూరిలో ఒక శిష్యుడు గురువు గారి ప్రవచనమును వినుటకు పోవుచుండెను. ఆనాటి ప్రవచనమునందున అద్వైతభావనే ప్రతిపాదించబడెను.

**శ్లో ॥ విద్యావినయ సంపన్నే బ్రాహ్మణేగవి హస్తినీ ।**
**శుని చైవ స్వపచే చ పండితాః సమదర్శినః ॥**

అనెడి గీతాశ్లోకమును వుదహరించి బ్రాహ్మణ, గోవు, ఏనుగు, కుక్క మరయు చండాలుడు మొదలగు వారందరి యందున సమభావమ కలిగి వుండాలనీ అట్టి వాడే పండితుడనియును గురువుగారు ప్రతి పాదించిన పిదప ఆ ప్రవచనమును వినిన శిష్యుడు ప్రభావితుడయ్యెను. ఇంటికి వచ్చునపుడు దారిలో మదోన్నత్తమైన ఏనుగును చూచెను. అది తనతొండముతో ఎంతో మందిని గాయపరచుచుండెను. తన తొండమును అటు యిటూ త్రిప్పచూ అడ్డమొచ్చిన వారినెల్లరనూ పైకెత్తి విసరి వేయుచుండెను. శిష్యుడు

మాత్రము ఏనుగు నందుండెడి పరమాత్ముడే నాయందున్నాడు. ఇది నన్నేమి చేయును? అనుకొంటూ ఆదారి యందు పయనిస్తూ వచ్చెను. ఇతనిని చూసిన మావటివాడు గట్టిగా అరచుచూ దూరము వెళ్ళమని హెచ్చరించెను. అయిననూ వినలేదు. అతడు కావలయుననియే వచ్చుచుండెను కదా! ఏనుగు అద్వైతమెరుగదు కదా! అతనిని ఎత్తి గిర గిరా త్రిప్పి నేలకేసి కొట్టెను. వాని ఎముక లన్నియును విరిగిపోయెను. చుట్టుప్రక్కల వారు అతని మీద జాలిపడి అతనిని తీసుకొని వెళ్ళి ఒక వైద్యశాలలో చేర్పించిరి. శ్రీ గురువుకు ఇది తెలిసెను. ఆయన గాయపడిన వానిని పరామర్శించుటకై వెడలెను. అప్పుడా శిష్యుడు నడచిన ఘటనలన్నిటినీ వివరించి స్వామీ మీ అద్వైత ప్రవచనమును విని నేనీ స్థితికి చేరితిని మిమ్ములను నమ్మినందుకు నాకీగతి పట్టినది అనుచు విలపింప జొచ్చెను. అప్పుడా గురువుగారు అతనిని సమాధాన పరచి శోకమును మాన్పించి, అతనితో యిట్లులనెను. ఓ శిష్యా! నీవు కించత్ మూర్ఖుడనైతివి కదా! నీవన్న మాటలో సత్యమేవున్నది. ఏనుగులో భగవంతుడున్నాడు. అయితే ఏనుగు మీద కూర్చొని యున్న మావటిలోనూ పరమేశ్వరుడున్నాడు కదా! అతను చేసిన హెచ్చరికను నీవు గమనించి యుండిన యెడల నీకీస్థితి వచ్చెడిది కాదు కదా! అని వుపదేశము నిచ్చెను. ఇక ముందు దైనందిన వ్యవహారములలో అద్వైతమును పాటించవలదని హెచ్చరికను చేసేను. శ్రీ భగవత్పాదుల వారు ఇట్టి విషయమును దృఢతరము చేయుటకై ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

**శ్లో ॥ పూజాదివ్యవహారః స్యాద్భే దాశ్రయతయా సదా ।**
**లింగపూజాపరస్తస్మాన్నాద్వైతే నిరతో భవేత్ ॥** (సి.శి. 10-43)

ఈ ఉపదేశములోని తాత్పర్యమేమనగా పూజాది వ్యవహారములు భేద భావనలేనిది సంభవించవు. మాహేశ్వరుడు లింగపూజాపరుడు అయినందుచేత అతడు అద్వైత నిరతుడు కాకూడదు. అద్వైత నిరతుడైన యెడల పూజానిరతుడు కాలేడు. ఈ రెండునూ పరస్పరము విరుద్ధమైనవి. అందుచేత "అద్వైతమ్ నకర్తవ్యమ్" అని భావించుకొని అద్వైత భావనను దూరము చేసికొనవలెను.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 28-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

"క్రియాద్వైతం న కర్తవ్యం" యన బడెడి యాగమ సూత్రమును శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులు వారు యెంతయో విజ్ఞాన దాయకముగా వివరించి చెప్పిరి. ఈ సందర్భమున వారుదహరించిన కరిపీడితుని కథ కడు రమ్యముగాను, చిరస్మరణీయముగాను నున్నది.

భారత సంస్కృతిలో మూడు సిద్ధాంతము లధిక ప్రచారమునందినవి. అవి: ద్వైతము, అద్వైతము మరియు విశిష్టాద్వైతము. శంకరాచార్యుడు నద్వైతము నంగీకరించి దానికి యధిక ప్రాచుర్యమును కల్పించిరి. రామానుజుని యద్వైతము వైష్ణవులకు మాత్రమే నంగీకార యోగ్యమై యున్నది. శ్రీ కంఠుడు నద్వైతమును శైవపరముగా ప్రతిపాదించిరి. వీరశైవ సిద్ధాంతము వీటిన్నిటి కంటెను భిన్నమైనది. ఇది భేదా భేదముగా గుర్తింప బడినది. శివజీవ భేదమును అంగీకరించిన పిదపనే క్రమ క్రమముగా సాధన పరి పక్వత చెందిన దశలో శివ-జీవా బేద భావన యనుభవములోనికి వచ్చును. ప్రారంభ దశలో నున్న సాధకుడు అద్వైతము గురించి యాలోచించుట యనవసరమని దెలుప బడినది. ఈ సందర్భమున శ్రీ బసవేశ్వరుల వారు నుడివిన యీ క్రింది వాక్కులు నెంతయో నాసక్తిని గల్గించెడివిగా నున్నవి.

**ద్వైతాద్వైతముల జదివి యేమి చేయుదు రయ్యా**
**మాశరణులకు నెరికిలకై కరుగని దనుక**
**స్థావర - జంగమ మొకటే యని నమ్మని దనుక కూడల సంగమ దేవా,**
**వట్టి మాటల మాలల వలన నేమగును?**

మల్లికార్జున పండితుడును అద్వైతము విస్మరణీయమని తెలిపిరి. వారి యీ క్రింది పద్యమును గనుడి.

**మాయా వాదుల ముందర**
**మాయా వాదులటె వారి-మార్గము గీడి**
**స్సీయని యొల్లక రోసి 'శి**
**వాయ నమో' యనుచు నిన్నే వలగొంద్రు శివా!**

అద్వైత మార్గానుయాయులు "అహం బ్రహ్మోఽస్మి" యనెడి భావన పొందెడి స్థితియే యంతిమ లక్ష్యమని భావింతురు. "సోహం భావేన పూజ యేత్" యనెడిది వారు రూపొందించిన నియమము. సోహం భావన వీరశైవులకు విహితము కాదనియును, దాసోహమ్మనెడి భావనను మనమున ధరించుట కర్తవ్య మనియును చెప్పబడినది. ఈ విషయమున బసవేశ్వరుల వారి భావమును గనుడి.

**జన్మజన్మలకు పోవనీయక సోహం బనిపించక దాసోహంబనిపించుమయ్యా!**
**లింగ జంగమముల ప్రసాదము జూపి బ్రతికించుమయ్యా కూడల సంగమదేవా!**
**ఇదే భావను యధావాక్కుల అన్నమయ్యగారు యీ క్రింది విధముగా వివరించిరి.**
**మోహధ్వాంతములో మునింగిన మహా మూఢుండతి భ్రష్టుడై**
**సోహమ్మంచు దొడంగి నీకుగడు దూరాత్ముండగు గానిదు**
**ష్టాహంకార గుణంబు మాని మది సొంపారంగ సద్భక్తి**
**దాసోహమ్మన భవత్పదార్చకుడు నీవైయుండు సర్వేశ్వరా!** (సర్వేశ్వర శతకము, ప॥ 73)

దాసోహ భావన యోందుకు వహించ వలెననెడిది తెలిసికొన వలెననిన భృత్యాచారము గురించి తెలిసికొన వలెను. శివునికిని, శివభక్తులకు తాను దాసాను దాసుడననెడి భావన వహించుట యే భృత్యాచారము. ఈ ఆచారమును పాటించని వానికి భక్తి చేకూరదని తెలిసికొన వలెను.

కా॥ **భృత్యా చారమె భక్తియు**
**భృత్యాచారుబె ముక్తి పెంపును సొంపున్**
**భృత్యాచారము సరియే**
**నిత్యాహంకార ఘోర నియమ వ్రతముల్ ?** (అనుభవ సారము, 171)

స్వామి భృత్యసంబంధమే భక్తికి మూలాధార మని తెలుపబడినది. ఇది పాశు-పత సిద్ధాంతము నుండి బహిర్గతమైన భావన. ఈ సిద్ధాంతము ప్రకారము జీవుడు పాశవిచ్ఛేదనార్థము పతి కరుణ నాశించి పశుపతిని యారాధించ వలెను. ఇచ్చట నారాధనలో నారాధ్య ఆరాధక సంబంధము నంతర్గర్భితముగా నుండును.

**ఆరాధ్యుడైన యీశ్వరు**
**నారాధించుటయ స్వర్గ మపవర్గము ధా**
**త్రీ రాజ్యాది సుఖంబులు**
**బోరన గర్మాను రూపముల జనుల కగున్ !** (శివతత్త్వ సారము, ప. 33)

పూజ్య-పూజక సంబంధమును నొక్కి చెప్పుటచే కొంత దురావగాహన గల్గెడి యవకాశము గలదు. అద్వైత నిరాకరణ ద్వైత స్వీకరణగా భావించెడి ఆస్కారము గలదు. శివతత్త్వ సారమునకు విపులమైన పీఠిక వ్రాసి నడుదవోలు వేంకటరావు గారిట్టి భావమునే పెంపొందించి కొనిరి. వాస్తవముగా వీరశైవము ద్వైతమును కూడ నిరాకరించును. ద్వైతాద్వైతముల కతీతమైనదే వీరశైవ సిద్ధాంతము ఈ భావములను వివరించెడి మల్లికార్జున పండితుని యీ క్రింది పద్యమును గనుడి.

కా॥ **భేదము సిద్ధంబగుడు వి**
**భేదక సిద్ధియగు దద్వి-భేదక సిద్ధిన్**
**వేదోక్త కర్మదశలం**
**దాదర మగు దత్ఫల ప్ర-దారాధ్య గతిన్.** (శివతత్త్వ సారము, ప. 34)

మాహేశ్వర స్థలి పూజాది క్రియల నాచరించుచూ ఐక్య స్థలమున పూజ్యుడగునని గుర్తించ వలెను.

## ఆశీర్వచనము - 1

## ఆహ్వాన నిరసన స్థలము

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు తమ ఉపదేశమున మాహేశ్వరుడు అద్వైత భావన కలిగియుండకూడదని చెప్పిన పిదప ఈ క్రింది ఉపదేశము ఇచ్చిరి.

**శ్లో ॥ లింగార్చన పరః శుద్ధః సర్వాద్వైతనిరాసకః ।**
**స్వేష్టలింగే శివాకారే నతమావాహయే చ్ఛివమ్ ॥**
**యదాశివ కలాయుక్తం లింగం దద్యాన్మ హాగురుః ।**
**తదారభ్య శివస్తత్ర తిష్ఠత్యాహ్వానమత్ర కిమ్ ॥** (సి. శి. 10-44;45)

వీరశైవ సిద్ధాంతము ప్రకారము శ్రీ గురువు దీక్షా సంస్కారము చేయునపుడు శిష్యుని యొక్క అంగమునకు మరియు లింగమునకు సంస్కారము చేయును. లింగము నందున శివకళను నియోజనము చేసి శిష్యుని హస్త పీఠమున నిలుపుచున్నాడు. ఈ విధముగా శివ కళను నియోజనము చేసిన పిదప ఆలింగము నందున పునః పునః శివునిని ఆహ్వానించెడి అవసరము లేదు. ఇష్టలింగమనెడిది శివుని యొక్క నిరాకారరూపమే కదా!

భారత సంస్కృతియందున అనేక నైమిత్తిక పూజలను చేయునప్పుడు ఏ దేవుని పూజించు చున్నాడో ఆ దేవుని యొక్క విగ్రహమునందున గాని ఆ దేవునికి ప్రతిగా పెట్టబడిన వక్క ఇత్యాదులలోగాని ఆయాదేవతలను ఆహ్వానించుట యనెడిది జరుగుచున్నది. ఆవాహయామి; ఆవాహితోభవ; స్థాపయామి, స్థాపితో భవ, అవ కుంఠితో భవ, వరదో భవ అనెడి మంత్రములను చదువుచు ఆహ్వానించి పూజింతురు. పూజముగిసిన పిదప "గచ్ఛ, గచ్ఛ, సురశ్రేష్ఠ, పునరాగమనాయచ" అనెడి మంత్రమును పఠించి విసర్జన చేయుదురు. ఈ మంత్రముల అర్థమేమనగా ఆహ్వానించుచున్నాను, స్థాపించుచున్నాను. దయ చేసివచ్చి వరములను ఇమ్ము అనునది ఆవాహన మంత్రములోని అర్థము. పొమ్ము, పొమ్ము, మరలారమ్ము అనునది విసర్జన మంత్రములోని అర్థము.

ఒక పాత్ర నిండా నీటిని నింపి దానికి పూజ చేయుటకు ముందు ఈ క్రింది విధముగా పఠింతురు.

**శ్లో ॥ ఎగంగేచ యుమునేచైవ గోదవరీ సరస్వతీ ।**
**నర్మదే సింధు కావేరీ జలెస్మిన్ సన్నిధిం కురు॥ ॥**

ఈ మంత్రములోని భావమేమనగా గంగా, యమున, గోదావరి, నర్మద, సింధు, కావేరి నదులలోని నీరు ఈ కలశములో చేరే విధముగా చేయుము. ఈ విధముగా ఆహ్వానించి ఆ పాత్రకు పూజ చేసెదరు. ఈ విధముగా పూజాకార్య క్రమములన్నింటిలో ఆవాహన విసర్జనలు ఇమిడియున్నవి.

వీరశైవులకు ఇతరులకు వుండు నటుల గణపతి పూజ, వరద శంకర పూజ, కలశపూజ, లక్ష్మీపూజ, సరస్వతి పూజ, నవగ్రహ పూజ మరియు దశ దిక్పాలకుల పూజలనెడి నైమిత్తిక పూజలు వుండక కేవలము ఇష్టలింగార్చననే నైమిత్తిక పూజయై యున్నది. అను నిత్యము చేసెడి పూజలను నిత్య పూజలు అందురని ఇంతకు క్రితమే తెలిపియుంటిమి, ఇతరులకు సంధ్యా వందనము, అగ్నిపూజ ఇత్యాదులు నిత్యపూజలై యున్నవి. వీరశైవులకు ఇష్టలింగపూజయే నిత్యపూజ. మరోమాటలో చెప్పాలనిన వీరశైవులకు నిత్యపూజయైనను, నైమిత్తిక పూజయైనను ఇష్టలింగ పూజయే. ఇట్టి ఇష్టలింగమునందున ఒక వేళ పూజకాలమున శివునిని ఆహ్వానించి పూజముగిసిన పిదప అతనిని విసర్జించిన యెడల మిగిలిన వేళలలో ఆ లింగములో శివుడు ఉండడనే అర్థము కదా. అట్టి శివుడు లేని లింగమును దేహము మీద ధరించిన యెడల ఏమి ప్రయోజనముండును. వీరశైవా ధర్మములోని అష్టావరణముల యందు ఇష్ట లింగధారణ అవశ్యమైన అంశముగా యున్నది. ఆవరణ అనగా ఒక రక్షాకవచముగా తీసుకొనవలెను. ఇష్టలింగమనెడి రక్షాకవచములో శివుడు లేకుండిన యెడల అది రక్షాకవచము కాగలుగునే? శివుడు లేదని భావించిన యెడల లింగధారణ యెడల ఆసక్తి తగ్గి లింగధారి అలింగాధారియై

భవిగా మారెడి అవకాశము కలదు గదా! అట్టిది మాహేశ్వర స్థలమున నుండెడి భక్తునకుగల నిష్ఠను దెబ్బదీసెడిదిగా పరిణమించును. ఈ రీతిన ఆలోచించిన యెడల ఆవాహన విసర్జనలు చేయుట వలన ఎన్నో దోషములు సంక్రమించెడి అవకాశము కలదు. శ్రీ గురువు శాశ్వత ప్రాతి పదికమీద ఇష్టలింగము నందున శివుని ఆవాహన చేసి ప్రాణప్రతిష్ఠాదులు చేసిన పిదప అద్దానికి పునః పునః ఆవాహన, విసర్జనలు చేసినయెడల మరొకదోషము సంక్రమించును. అదెట్టిదనిన గురువు గారు చేసిన ప్రాణ ప్రతిష్ఠ ఎడల అపనమ్మకము కలిగిన వారమగుదుము. గురువు ఉపదేశము యెడల గాని, గురువు యెడల గాని అపనమ్మకము గలిగిన వానికి రౌరవాది నరకములు తప్పవని శ్రీ బసవేశ్వరులవారు సెలవిచ్చిరి. అట్టి తప్పిదమును చేయుట అవాంఛనీయము. మీదుమిక్కిలి అష్టావరణములోని మరొక రక్షా కవచమైన గురు కారుణ్యమును కోల్పోదుము. ఈ విధముగా ఆవాహన, విసర్జనల వలన అనేకములగు నష్టములు సంక్రమించును. శ్రీ భగవత్పాదులవారి ఉపదేశము ననుసరించి ఆవాహనను, మానుకొనుట కర్తవ్యమై యున్నది.

వీరశైవులకు ఇష్టలింగమనగా ప్రాణలింగము భక్తుని యొక్క ప్రాణము అందులో ప్రతిష్ఠితమై యుండును. శ్రీ భగవత్పాదుల వారు తమ ఉపదేశములో "ప్రాణ వద్ధారణీయమ్, తత్ ప్రాణలింగ మిదం తవ" అని తెలిపిరి. లింగధారణ స్థలమునందున ఉపదేశింపబడిన ఈ ఉపదేశము యొక్క అర్థమేమనగా భక్తునికి తన ఇష్టలింగమును తన ప్రాణమని తెలిసికొని దాని నెప్పటికైనను దూరము చేసికొన కూడదు. ఒకవేళ ఆవిధిన ఇష్టలింగము దేహము నుండి దూరమైన యెడల అట్టి భక్తుడు ప్రేతము వలె అశుచి, అపవిత్రత గలిగినవాడగును. అట్టివానిని స్పర్శించన యెడల ప్రేతమును స్పర్షించిన యటులేయగును. అనగా దోషము సంప్రాప్తమగును. ప్రేతమును స్పృశించినవాడు ఆదోషమును నివారణ చేసికొనుటకు స్నానాధులు చేయ వలెను. కదా. ఎన్ని మార్లు స్పృశిస్తే అన్నిమారులు చేయవలసినదే. ఆ విధముగా ప్రేత ప్రాయుడు అగుట కంటె ఆవాహన, విసర్జనాదులను వర్జించి ఇష్టలింగమును ఎల్ల కాలము ధరించినవాడై నిత్య శుద్ధుడై తిరుగాడుట మేలు కదా. ఇందులోని భావమేమనగా విసర్జన క్రియ ద్వారా ప్రాణలింగమును కోల్పోయిన వారమగు చున్నాము. అట్టి సాహసమును చేయుట హితకారి కాజాలదు. వీరశైవసాధకుడు ఏదో ఒక ప్రమాదము వలన కాని లేదా ఉద్దేశ పూర్వకముగా కాని ఇష్టలింగమును దేహము మీది నుండి దూరము చేసి కొనకూడదని ఉపదేశము నిచ్చిరి. వాస్తవముగా చూచిన యెడల నిరంతరముగా ఇష్టలింగమును ధరించుట వలన దేహమునకు రక్షణ ఏర్పడి ప్రమాదములు నివారింపబడుచున్నవి. అట్టివానికి ప్రమాదములు సంభవించవు. ఆహ్వాన, విసర్జనల వలన ఇష్టలింగము దేహమునకు దూరమై ప్రమాదములకు నెలవయ్యే అవకాశము కలదు. అట్టిది సంభవించకుండా జాగ్రత్త పడుటలోనే వివేకము కలదు.

ఈ విషయమున భగవత్పాదుల వారు ఇంకను ఈ విధముగా ఉపదేశమునిచ్చిరి.

**శ్లో ॥ సంస్కారేషు లింగేషు స్తదా సన్నిహితః శివః ।**
**తత్రాహ్వానం నకర్తవ్యం ప్రతి పత్తి విరోధతతః ॥** (సి.శి. 10-46)

భగవత్పాదుల వారి ఉపదేశములోని సారమేమనగా విధి ప్రకారము సంస్కారమును చేసిన పిదప ఇష్టలింగమునందున శివుడు సదా సన్నిహితుడై యుండును. ఈ విధముగా నుండెడి అతనిని మరల ఆహ్వానించుట నిరర్థకమగును, మన సన్నిధిన మన కిష్టమైన వ్యక్తి నిలుచోని యుండగా అతడిని గూర్చి కూతపెట్టి పిలిచి రమ్ము, రమ్ము అనడము హాస్యాస్పదమే కదా! అదే విధమున శివుడు సన్నిహితముగా ఇష్టలింగము నందు యుండిన పిదప అతడిని మరల మరల పిలిచిన యెడల అదియును హాస్యాస్పదమే! ఆవాహనము చేసిన పిదప విసర్జన చేయుట జరిగిన యెడల అది భక్తి మార్గమునకు నిరోధకముగా పరిణమించును. భక్తునియొక్క మనస్సునందున భక్తి సదా జాగృతమైయుండ వలెను. ఈ విధముగా ఇతడు ఇష్టలింగమునందున సదా శివుని అస్తిత్వమును భావించుకొని పవిత్ర జీవనమును, సాగించ వలెను. లింగపూజను చేయుచూ చేయుచూ లింగముగానే కావలెను. అందుచేతనే వీరశైవ సిద్ధాంతము నందున ప్రాణము పోయిన మనుష్యునికి లింగైక్యుడైనాడను పదము ప్రయోగించ బడినది. దీని తాత్పర్యమిది లింగమున ధరించి దానిని పూజించి చివరకు పూజకుడు లింగరూపమునే పొందు చున్నాడు.

ఈ ఆహ్వాన నిరసన స్థలమును ఉపసంహారము చేయుచు భగవత్పాదులవారు ఈ క్రింది ఉపదేశమును ఇచ్చిరి.

శ్లో ॥ నాహ్వానం న విసర్జంచ స్వేష్టలింగేతు కారయేత్ ।
లింగనిష్ఠాపరో నిత్యమితి శాస్త్రస్య నిశ్చయః ॥ (సి. శి. 10-47)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా లింగనిష్ఠుడైన మాహేశ్వర స్థలములోని భక్తుడు తన ఇష్టలింగము నందున శివుని ఆవాహన విసర్జనను చేయకూడదు సద్గురువులు ఆహ్వానించి ఇష్టలింగములో ప్రతిష్ఠింపబడిన శివుడు సదా ఆ ఇష్టలింగమున వసించి యుండునని భావించుకొని నిష్ఠతో పూజించుచూ ఉండవలెను. భావనలో అపారమైన సామర్థ్యము కలదు. ప్రతిక్రియను భావ మార్గమునానే చేయవలెను. భావన లేనిదే చేయబడిన క్రియలు నిష్ఫలములగును. కరపీఠమున ఇష్టలింగమునుంచుకొని, చేతిలో రుద్రాక్ష మాలను నోటితో పంచాక్షర మంత్రమును జపించుచూ యుండి భావ పూర్ణతలేకుండా యుండిన యెడల అట్టి పూజ యాంత్రిక పూజ అనిపించుకొనును. యాంత్రికముగా పూజ చేసిన యెడల లాభము ఏమియును ఉండదు. ఈ కారణము వలననే ఆచార్యుల వారు మాహేశ్వర స్థలములోని భక్తుని యొక్క భావనను సదా జాగృతముగా యుంచుట కొరకే ఆవాహన విసర్జనలను నిరసించిరి.

శివ సృష్టిలోని ఎనుబై నాల్గు లక్షల జీవరాసుల యందు మనుజ్యుడు సంస్కారములను పొంది భావనాత్మకముగా వ్యవహరించి భగవద్ రూపమును పొందెడి అవకాశమును పొందు చున్నాడు. వేరే ఏ జీవికి ఈ సౌకర్యము లేదు. అందుచేత సకలశాస్త్రములు మానవుడే సర్వశ్రేష్ఠుడని కొనియాడు చున్నవి. సృష్టిని చేయునప్పుడు ఎనుబది మూడు లక్షల తొంభైతొమ్మిది వేల తొంభై తొమ్మిది జీవరాసులను సృషించియు సృష్టి కర్తకు తృప్తి కలుగ లేదట ఈ జీవరాసులన్నియును అజ్ఞులై యున్నవి. వీటికి నా గురించి తెలిసికొనెడి అవకాశము కాని, పూజించెడి సామర్థ్యము కాని లేదు. అందుచేత అట్టి సామర్థ్యముగల ఒక జీవిని సృష్టించెదను. అనుకొని చివరకు మనుజ్యుని సృష్టించి వానికి అత్యధికమైన ఆయుష్యును ప్రదానము చేసెను. నూరు సంవత్సరముల జీవితము వేరే ఏ జీవులకు ఉండదు కదా! ఈ నూరు వర్షముల అవధియందున ఎప్పుడో ఒకప్పుడు నాకు సన్నిహితునిగా యుండవలెను. అనెడిదే శివుని ఇచ్ఛ. కాని నేటి స్థితి ఆ విధిన లేదు. అజ్ఞులైన మిగిలిన ప్రాణులు ప్రశాంతమైన జీవితము గడపు చుండగా, సర్వశ్రేష్ఠుడు అనిపించుకొనిన మనుజ్యుని జీవితము కోలాహలముతో కూడుకొనియుండును. ఎక్కడ చూచినాను అశాంతి వాతావరణమే. దానికి కారణము మనుజ్యులే ఒక గ్రామమునకు నొకసద్గురువు దయచేసి ఆ ఊరి జనులకు శివపూజా విధానమును తెలియ చేసి సాయం సమయమున ఉపదేశమును చేయుచుండిరి. ప్రతి దినమున ప్రవచనము నందున ఈశ్వరుని గురించియు అతని మహిమలను గురించియు ఎంతో మహత్వపూర్ణమైన ప్రతిపాదనలు చేయుచుండిరి. ఇటుల తెలియజెప్పినను మనుజులలో నాస్తిక భావన, స్వైద విహార ప్రవర్తన తగ్గనందున ఆసద్గురువు చాలా వేసర జెందిరి. ఇటుల ఒకదినమున నిరాశతో కూర్చొని యుండగా ఒక గృహస్థుడు వచ్చి "గురువర్యా నీవు దేవుని గురించి చాలా ఏదేదో చెప్పుచున్నావు. అలాగైన ఆదేవుడు ఎచ్చట గలడు?" అని ప్రశ్నించెను. గురువుల వారు చెప్పి చెప్పి విసుగు చెందియుండిరి. అప్పుడు వారు కోపముతో ఈశ్వరుడు జైలులో యున్నాడు అని అనిరి. దేవుడు మనుజ్యుని ఎందుకు సృష్టించెను అనెడి విషయమును మనుజుడు మరిచిపోవుచున్నాడు. ఇతడు మనుజ్య దేహమును ధరించినప్పటికిని పశువువలె ప్రవర్తించు చున్నాడు. మనుజ్యులందరు ఇటులనే యుండక పోవచ్చును. వేయికొక్కడైనను, లక్షకొక్కడైనను, కోటికొక్కడైనను ఉత్తముడైనవాడు ఊడ వచ్చును. అయితే హెచ్చు సంఖ్యలో ప్రజలు విచారహీనులై యున్నారు. కాన ప్రతియొక్క వ్యక్తి దేవునియొక్క అస్తిత్వమును ఎరిగి అతని యందు అనన్యమైన శ్రద్ధకలిగి యుండవలెను. ఈ కారణము వలననే పూజ్యపాదులవారు మాహేశ్వర స్థలమునందలి భక్తుడు నిష్ఠా గరిష్ఠుడై భగవంతుని అస్తిత్వమును భావించుకొని ఆవాహన విసర్జనాదులను తెలియజేసిరి. వీరశైవులందురు ఇదే విధమైన నైష్ఠికతను పెంపొదించుకొన వలెను. ఆవాహన విసర్జనాదులను వదిలివేయలెను. శివుడు సదా ఇష్టలింగ రూపమున తన దేహమున నిలిచియున్నాడని భావించుకొని విధి ప్రకారము పూజించుచు ధన్యతను బడయవలెను.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 29-8 - 1991
స్థలం : నాగపూర్

# విశేషప్రదీపిక

ఇష్టలింగార్చన విధానములోని యంశములకును తాత్త్వికపరమైన మౌళికాంశములకును సంతులిత యుండవలెనని ధర్మసూక్ష్మమును వీరశైవ ధర్మాచార్యులకు ప్రేరకుడై లోకకల్యాణము నాశించి పరిశ్రమించెడి కాశీ జగద్గురువులు. జ్ఞాన సింహాసనాధీశ్వరులు నెంతయో రమ్యముగా వివరించిరి.

"హుతిరాకారణాహ్వానమ్" అనెడి యమర సూక్తి ప్రకారము హూతి, ఆహ్వానము మరియు ఆకరణములు, పిలుచుట యనెడి ప్రక్రియకు పేర్లు. హూయతే అనయేతి హుతిః ఆహ్వానంచ (హ్వేఞ స్పర్ధాయం శబ్దేచ) అనెడి వ్యుత్పత్తి ఆహ్వానమున కివ్వబడినవి లేని వ్యక్తిని గాని శక్తినిగాని పిలిచికొనుటయే ఆవాహన ప్రక్రియ యొక్క పరమ లక్ష్యము. విసర్జన దీనికి విరుద్ధమైనది. పంపించి వేయుట నిది సూచించును. దేవి దేవతా పూజాదులలోన వీటిని గాంచగలము. పూజించ దలచిన దేవుడి నాహ్వానించి పూజించి, అవసరము తీరిన పిదప విసర్జించడమును చేయుటను గాంచగలము, అద్వైతులకు పూజ లనావశ్యకము. "ప్రజ్ఞాను బ్రహ్మ" అనెడి సూక్తి ప్రకారము అజ్ఞానమును విసర్జించిన వాడు తానే దేవుడ ననెడి భావనను పొందును. ఇట్టి స్వస్వరూప సందర్శన యే ముక్తి. ఈ స్థతిని చేపట్టి జ్ఞాన సముపార్జన చేయవలెను. ద్వైతములో పూజలు గలవు. ఇచ్చట ఆవాహన-విసర్జనలకు ప్రాముఖ్యత నివ్వబడును.

ద్వైత మార్గము నాశ్రయించెడి శైవపథములు కన్పట్టు చున్నవి. సప్తవిధశైవములలో నొకటి యగు శుద్ధ శైవములో దీనికి ప్రాముఖ్యత గలదని తెలిపెడి యీ క్రింది ప్రమాణమును పరికించుడి.

**శ్లో ॥ మంత్ర యంత్ర క్రియా ముద్రా న్యాసా వాహన కాదిభిః ।**
**ఉపచారై ర్బహువిధైర్లింగం సింహాసనే యజేత్ ॥**

మంత్రములతోను, యంత్రములతోను, క్రియలతోను సంబంధము గల్గిన యాచరణలు చేయుట, ముద్రలను ప్రదర్శించుట, ఆవాహనము చేసి బహు విధోపచారములతో శివలింగమును సింహాసనమున పూజించుట మొదలగు ఆచారములు గలవాడు శుద్ధశైవుడన బడునని యీ ప్రమాణము వలన తెలియు చున్నది. వీరు శివలింగముతో బాటుగా శివావరణ దేవతలకును ప్రాముఖ్యత నిచ్చి వారిని కూడ పూజింతురని తెలియు చున్నది. ఈ క్రింది ప్రమాణములను గనుడి :

**శ్లో ॥ శివావరణ దేవాశ్చ సర్వా స్సంపూజయేద్గుహ ।**
**పృథ క్స్థాన స్థితా స్సర్వా న్నార్చయే దన్యదేవతాః ॥**

దుర్గ, నందీశ్వర, వీరభద్ర, కుమార, గణపతులు శివావరణ దేవతలని తెలిసికొన గలరు. శివలింగమును పూజించెడి సందర్భమున వీరిని కూడ నాహ్వానించి పూజించెడి సాంప్రదాయమును శుద్ధ శైవులు పాటింతురు.

తెలిసీ తెలియని స్థితిలో కొట్టుమిట్టాడెడి కొందరు వీరశైవులు, శుద్ధ శైవాచారములను వీరశైవాచారములని భావించి, భ్రమకులోనై యావాహనాదులు చేయుచున్నారు. శివావరణ లేదా శివపంచాయతమును పూజించెడి సాంప్రదాయ మనావశ్యకమని తెలిసికొనవలెను. ఏకైక స్వేష్టలింగాతత్పరుడగు మాహేశ్వర స్థలములోని వీరశైవుడు తన యిష్టలింగమును మాత్రమే పూజించ వలెను. గురుదత్తమైన యిష్టలింగములోన సర్వకాల సర్వా వస్థల యందున పరశివుడు నుప స్థితుడై యుండును. అందుచేత పూజాసమయము నావాహానము చేయు నావశ్యకత లేదు. ఆవాహన చేయుట వలన మిథ్యాభావన లేర్పడి భక్తి భగ్నమై నిష్ఠ వికల మగునని గ్రహించగలరు. సాంగత్య దోషము వలననో, యన్య ధర్మీయులు వ్రాసిన గ్రంథముల వలననో, శివధర్మేతరములగు శాస్త్రాదుల యెడల నధికమగు నమ్మకము గల్గియుండుట చేత భ్రమకు నాస్కారము గల్గుచున్నది. భ్రమకులోను కాకుండగ నుండుటకై తగు జాగ్రత్తలను తీసికొనవలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## అష్టమూర్తి నిరసన స్థలము

నైష్ఠిక భక్తిగల్గిన మాహేశ్వర స్థలములోని భక్తునకు ఆవాహన చేయవలసిన పని లేదని తెలిపెడి యుపదేశము నిచ్చిన పిదప శ్రీ జగద్గురు రేణుకాచార్య భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షికి యష్టమూర్తి నిరసన గురించి యుపదేశము నిచ్చిరి:

**శ్లో ॥ యథాత్మాశివయోరైక్యం న మతం కర్మసంగినః ।**
**తథా శివాత్ పృథ్వ్యాదేరద్వైతమపి నేష్యతే ॥**
**పృథవ్యా ద్య ష్టమూర్తిత్వమీశ్వరస్య ప్రకీర్తితమ్ ।**
**తధి ష్ఠాతృభావేన న సాక్షాదేకభావత ః ।** (సి. శి. 10-48;49)

ఈ ఉపదేశములో నున్న భావమేమనగా భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, మరియు ఆత్మ అనెడివి అష్టమూర్తులని ప్రస్థిములైనవి. ఆనగా శివుడు ఎనిమిది రూపములలో వ్యక్తమగుచున్నాడు. ఈ కారణమున మనదేశమునందున పంచభూతములగు అగ్ని యిత్యాదులు మరియు సూర్య చంద్రాదులు ఆరాధింపబడు చున్నారు. పృథ్వీమీద మనము వసించుచున్నాము. నీరు మన జీవనాధారము. అగ్ని లేనిదే మన జీవనము గడవదు. గాలిలేనిది యూపిరి ఆడదు. ఆకాశమునందుననే సూర్య చంద్రాదులు తిరుగాడు చుండురు. శరీరమునందున ఆత్మ నిలచియున్నది. దానివలననే సర్వ వ్యవహారములు కొనసాగుచున్నవి. ఈ విధముగా శివుడు అందరికిని అష్ట తనువుల రూపమున ఆధార భూతమై యున్నాడు. అనగా యివి పరమాత్ముని యొక్క రూపములు. ఈ కారణమున వీటిని పూజించెడి సాంప్రదాయము కొనసాగుచున్నది. ఇతరులకైతే ఇది సరిపోవునేమో! కొన్ని కొన్ని సందర్భములలో ఉపయుక్తమైనది కూడా కావచ్చును. ఉదాహరణకు చెప్పవలెననిన సూర్యనమస్కారము వలన ఆరోగ్యము చేకూరుచున్నది. అయితే భగవత్పాదుల వారి ఉపదేశానుసారము వీరశైవునికి ఈ అష్టమూర్తులను పూజించ వలసిన పనిలేదు. మాహేశ్వర స్థలములోని భక్తుడు ఇట్టి భావననే పెంపొందిచుకోవలయును. అతనికి యిష్టలింగపూజయే ముఖ్యాతిముఖ్యమైనది. సూర్యచంద్రులను పూజించిన యెడల అతని నిష్ఠకు భంగము కలుగును. అందుచేత అష్టమూర్తులను నిరసన చేయవలెను. అష్టమూర్తులను ఈశ్వరుడుగా భావించుట సరియైనదికాదు. అయితే ఈశ్వరుడే వాటికి అధిష్ఠాన దైవమైయున్నాడని తెలిసికొని తనయిష్ఠలింగ నిష్ఠను పెంపొదించుకొని యిష్టలింగపూజలో నిమగ్నుడు కావలెను. ఈ విషయమును గురించి మరికొంత ఉపదేశము నీ క్రింది విధముగా నిచ్చిరి.

**శ్లో ॥ పృథివ్యాదికమిదం సర్వ కార్యకర్తా మహేశ్వరః ।**
**నైతత్సాక్షాన్మహేశోఽయం కులాలం ముర్తికయధా ॥** (సి. శి. 10; 50)

ఈ ఉపదేశము యొక్క భావమేమనగా శివుడు సృష్టి కర్త. అతడు మరియు సృష్టి ఒకటి కావు. ఇవి కార్యా కారణరూపమున భిన్నములైయుండును. పృధివ్యాదులు కార్యములై యుండగ ఈశ్వరుడు కర్తయై యున్నాడు. లోకమునందున కూడా కార్యకర్తృత్వములలో భేదము కన్పించుచున్నది. కుండలు చేయ వలెననిన కుమ్మరి, కర్తయై యున్నాడు. కుమ్మరికి, కుండకు భేదముండినటులనే శివునికి అష్టమూర్తులకు భేదము కలదు. ఈశ్వరుడు అధిష్టానుడు అయివుండుట చేత వాటి యెడల గౌరవ భావముదోచిననూ అవియే ఈశ్వరుడునుటకు వీలులేదు ఈశ్వరుడు ప్రత్యక్షముగా అనుభవగోచరము కాకుండా వుండినప్పుడు అతడు సృష్టించిన ఈ కార్యప్రపంచమును కని అనుమాన ప్రమాణము చేత అతని అస్తిత్వమును గుర్తించడము జరుగు చున్నది. దూరముగా నుండెడు పొగను చూచి "యత్ర యత్ర ధూమః తత్ర తత్ర వహ్నిః" అని భావించు కొనవచ్చును. అనగా ఎక్కడెక్కడ పొగవుండునో అక్కడక్కడ అగ్ని వుండును. అగ్ని లేనిది పొగరాదు కదా! ఈ కారణమున పొగ మరియు అగ్నుల మధ్య జన్యజనక సంబంధము కలదు. జన్మమైన పొగను కనిన పిదప దాని జన్మకు కారణమైన అగ్ని యొక్క అస్తిత్వము కలదని అనుమాన జ్ఞానము కలుగు చున్నది. ఇదే ప్రకారముగా ఈ విశాలమైన సృష్టి ఈశ్వరునికి కాక వేరే ఎవరిద్వారానో సాధ్యమయ్యెడిది కాదు. ఈ ప్రపంచమును చూసి ఈశ్వరుడు వున్నాడని ఆస్తికభావము వహించుట అవసరమైయున్నది. ప్రపంచములోని ఏ జీవుల వలననూ పంచమహా భూతముల నిర్మాణము సాధ్యముకాదు. మీదు మిక్కిలి ఈజీవులన్నియును వాటి వలననె ఏర్పడుచున్నవి. మన్ను రాళ్ళు, నీరు మొదలగు వాటిని గ్రహించి ఇల్లు, మఠము, మందిరము నిర్మించ వచ్చునే గాని వీటిద్వారా మన్ను, రాళ్ళు, ఇత్యాదులను నిర్మించుటకు మీలుకాదు. శిల్పి కళను మాత్రమే సృష్టించగలడుకాని శిలను

సృష్టించ గల్గనే ? అని ఒకకవి నుడివిన వాడయ్యెను. ఇది నిజమే ఈ విశాలమైన విశ్వమునకు ఈశ్వరుడు తప్ప వేరు కర్తలేడు. ఈ జగత్ సృష్టి ఈశ్వరకార్యమే కానీ ఈశ్వర స్వరూపము కాజాలదు. ఇట్టి భేదభావమునే మాహేశ్వర స్థలమునందలి భక్తుడు ధరించి వుండవలెను. అప్పుడే అతని నిష్ఠ పటుతరము కాగలదు. ఒక వేళ అష్టమూర్తులు శివుడని భావించిన యెడల ఆ అష్టమూర్తులను పూజించ వలసిన అవసరముండును. అది నిరర్థకము నిష్ప్రయోజన మగుటయే కాకుండా నిష్ఠకు భంగము కలుగజేయు విధముగా కూడా పరిణమింపవచ్చును. శ్రీ భగవత్పాదులవారు ప్రంపచము యొక్క స్వరూపమును వివరించుచూ ఈ క్రింది విధముగా ఉపదేశమును కటాక్షించిరి.

**శ్లో ॥ పృథివ్యాద్యాత్మ పర్యంత ప్రపంచోహ్యష్టధా స్థితః ।**
**తనురీశస్య చాత్మాయంః సర్వతత్త్వ నియామకః ॥**
**శరీర భూతాదేత స్మాత్ ప్రపంచాత్ పరమేష్ఠినః ।**
**ఆత్మ భూతస్య దేవస్య నాభేదో న పృథక్ స్థితిః ॥** (సి.శి 10-51;52)

పృథివి మొదలగు అష్టతత్త్వములు మరయు ఈశ్వరుని యందలి సంబంధము అభేదరూపమై యుండినను అది భేదరూపమున కూడాకలదు. ఇవి భేదాభేదరూపములో నుండునని ఆత్మ విషయములో తెలియ వచ్చు చున్నది.

శరీరము ఆత్మకాదు. ఆత్మ శరీరము కాదు. అయితే శరీరము లేనిది ఆత్మ ప్రకటము కాదు. జీవాత్మయొక్క సకల వ్యవహారములను శరీరమే నిర్వహించుచున్నది. ఇదే విధమున పంచభూతములు పరమేశ్వరునకు శరీరములైయున్నవి. దేహమునందు ఆత్మ యెటుల వుండునో ఈ ప్రపంచమున పరమాత్మ అటుల వ్యాపించియుండును. ఈ రీతిగా ప్రపంచమునకు పరమాత్మకు భేధము కలదు. అభేదము కలదు. ఈ భేదా భేదభావనను మాహేశ్వర స్థలమునందలి. భక్తుడు స్థిరపరచుకొనవలెను. పరమాత్మని అష్టమూర్తులైన పృథివ్యాదిపంచ భూతములు, సూర్యచంద్రాదులు అతని కంటెను భిన్నములై యున్నవి. అయితే ఆత్మ శివుని అంశమై యుండుటచే అది భిన్నముగా వుండుట ఎటుల? అనెడి ప్రశ్న ఉదయించును. ఈ విషయమున పూజ్యపాదులు ఈ క్రింది విధముగా ఉపదేశమును యిచ్చిరి.

**శ్లో ॥ అచేతనత్వాత్ పృథ్వ్యాదేరజ్ఞత్వాదాత్మనస్తథా ।**
**సర్వజ్ఞస్య మహేశస్య నైకరూపత్వమిష్యతే ॥** (సి. శి. 10 - 53)

పృథివ్యాదులు అచేతనములై యుండిన యటులనే జీవుడును అజ్ఞుడై యున్నాడు. వీటికంటెను విలక్షణమైన ఈశ్వరుడు చైతన్యవంతుడుగను సర్వజ్ఞుని గను అయివున్నాడు. అందుచేత పంచభూతములకును, పరమేశ్వరునికిని అభేదత్వము సిద్ధించదు. జీవి విషయమునకు వచ్చిన యెడల వాడు అల్పజ్ఞాన సంపన్నుడై యుండుట చేత అభేద భావన ఏర్పడదు. శివునివలె సర్వజ్ఞత్వమును సాధించినిచో అభేదము సిద్ధించును.

చేతనాచేతనముల యందును, సర్వజ్ఞాల్పజ్ఞులందును, సామరస్యము సంభవింపదు. సమానత్వములెనిదే సామరస్యవు సంభవించుటెటుల? పాలు, నీరు రెండు సమరసము అగును. అయితే చూచెడువారికి ఈ సమరసము సంపూర్ణముగా కనిపించినప్పటికినీ హంసయను పక్షికి ఈ రెండింటియందున భేదమే తోచును. అది ఈ రెంటినీ విడదీయ గలదు. పాలును మాత్రమే త్రాగి నీటిని విడిచివేయును. అదే విధిన అజ్ఞానములో నున్నవానికి అష్టమూర్తులు, శివుడు ఒకటిగా తోచినప్పటికి, శివజ్ఞాన సంపన్నులకు భేదము కన్పట్టును. జీవాత్మకు, పరమాత్మకు కూడా భేదము కలదనియును అంగీకరించబడినది. జీవునికి సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము ఈశ్వరత్వము లేవు. అతడు త్రిమలములచేత పరిమిత శక్తి సంపన్నుడగు చున్నాడు. అతడు ఆ త్రిములములను దూరము చేసికొనిననాడు ఈశ్వరత్వము పొందుటకు అర్హుడగును. క్రమేపి సాధన చేయుచు ఈశ్వరుడుగా పరిణమించు చున్నాడు. మాహేశ్వర స్థలమున అట్టి సిద్ధి సాధ్యము కాదని గుర్తించవలెను.

'ద్వా సుపర్ణా సయుజా సఖాయా' అనెడి ముండకో పనిషత్తులోని మంత్రమునందున జీవాత్మకు పరమాత్మకు భేదము ప్రతిపాదించబడినది. 'యత్ర జీవః తత్రశివః' అనెడి యుక్తి ప్రకారము శివుడు జీవుని యొక్క హృదయమునందున నిలిచి యుండును. అతడు సర్వజ్ఞుడగుట చేత జీవులందరి యొక్క స్థాయిని గుర్తించి వారికి కర్మ ఫలములను కటాక్షించుచున్నాడు. ఈ విధముగా భేద

భావము కలిగిన జీవాత్మ పరమాత్మ మధ్యన సమరస భావము ఏర్పడ జాలదు. ఇంతకు క్రితమే చెప్పిన యటుల మాహేశ్వర స్థలమున అది సిద్ధించదు. ఇంకా నాలుగు సోపానములు అధిరోహించి సాధనను, పరిపూర్ణము చేసి కొనిన వానికి అభేదము సంప్రాప్త మగును. శ్రీ భగవత్పాదులు మాహేశ్వర స్థలములోని భక్తుడు అష్టమూర్తి నిరసన భావమును సర్వకాల సర్వావ స్థలయందు కలిగి యుండవలెనని చెప్పుటకై ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**శ్లో ॥ ఇతి యశ్చింతయేన్నిత్యం పృథ్వ్యా దేరష్టమూర్తితః ।**
**విలక్షణం మహాదేవం సోఽష్ట మూర్తి నిరాసకః ॥ (సి. శి. 10-54)**

ఈ ఉపదేశములోని భావమేమనగా అష్టమూర్తుల కంటెను పరమాత్మ భిన్నమైన వాడని నిరంతరముగా చింతించెడి మాహేశ్వరుడే అష్టమూర్తి నిరాస్తకుడు అగుచున్నాడు. హస్తపీఠమునందున ఇష్టలింగమును ఎప్పటి వరకు శివరూపమని దృఢముగా తెలుసుకొనలేవో అప్పటి వరకు బ్రహ్మాండమే శివరూపముగా తెలుసుకొనుట ఎటుల? మరొక మాటలో చెప్పవలెననిన ఇష్టలింగమునందున శివుని అస్తిత్వమును గాంచనివాడు. బ్రహ్మాండము నందున కూడా శివుని యొక్క అస్తిత్వమును గుర్తించలేడు. అందుకే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు ఇష్టలింగమునందుననే సాధకుని యొక్క నిష్ఠ క్రమక్రమముగా పెరుగవలెనని అష్టమూర్తి నిరసనను ప్రతిపాదించిరి. ఈ విషయమును సద్భక్తులు గుర్తించెదరుగాక.

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

ది ॥ 30-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

అష్టమూర్త్యుపాసన వలన నైష్ఠికత దెబ్బ అనుననియు, అట్టి భావనను విస్మృతికి గురిచేసి యిష్టలింగపూజ యెడల నైష్ఠికత పెంచికొనవలెనని శ్రీ కాశీజగద్గురువుల వారు నుద్బోధించిరి.

శివతత్త్వము నెరుగుట చాల కష్టము. ఇట్టి స్థితిలో శివుడుష్టమూర్తి యనెడి భావన యుదయించెను. ఈ విషయమును మల్లికార్జున పండితుడీ క్రింది విధముగా తెలిపెను.

**ఇదిగో దదిగాదనియెడి**
**మొదల పృథి వ్యాదులైన - మూర్తుల నెల్లం**
**జదువుచు శివు నిన్నెరుగక**
**వెదకుచు నున్నవి. సమస్త వేదాంతములున్ (శివతత్త్వ సారము, ప. 3)**

"ఈ విషయము గురించి శ్రీ విదుదవోలు వేంకటరావుగారు నీ క్రింది విధముగా వ్రాసిరి: వేదములు శివుని తత్త్వమనేక రీతుల నున్నదని చెప్పుచున్నవే కాని, యాతత్త్వమిదియని సృష్టముగా చెప్పజాలవు. వేదాంతములును నిదమిద్ధమని నిర్ణయింపలేక శివుని గూర్చి తెలిసి కోనుట కింకను మార్గములు వెదకుచున్నవి."

(శివతత్త్వ సారము, కృష్ణా పత్రిక ముద్రణ పుట. 1 పాదదీపికలు)

అష్టమూర్తులకు చావు పుట్టుకలోండుట చేత నయ్యవి శివుడు కాజాలవు. ఈ విషచయును విడమరచి చెప్పెడి శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి.

**అష్టతను మూర్తి లింగమని యందురు వినుడయ్యా**
**ఆదికి బిడ్డ యతతము,**
**అతీతముకు బిడ్డ యాకాశము**
**ఆకాశముకు బిడ్డ వాయువు**
**వాయువుకు బిడ్డ యగ్ని**

**అగ్నికి బిడ్డ అప్పు, అప్పుకు బిడ్డ పృథ్వి**
**పృథ్వి నుండి సకలము జననము**
**మనస్సుకు బిడ్డ చంద్రుడు**
**చంద్రుని బిడ్డ సూర్యుడు**
**సూర్యుని బిడ్డ దేహము**
**దేహము బిడ్డ ఆత్మ**
**ఇటులీ తనువులన్నింటికీ యుత్పత్తి గలదు**
**ఉత్పత్తి రహితు డయోనిజుడు శూన్యుడు నిరాళుడు**
**మన కూడల సంగమ దేవునికి మాతా పితరులు లేరు. (బ. గీ. మృ. పుట. 624-625)**

షట్ త్రింషత్ తత్త్వములలోన పంచ భూతములుండినను, 31 తత్త్వములు నితరములును గలవు. ఇవన్నియును శివుని నిజమైన తత్త్వమును ప్రతిబింబించ జాలవని గ్రహించ గలరు.

శివం భూయాత్

# సర్వగత్వనిరసన స్థలము

## ఆశీర్వచనము - 1

మహామహిమాన్వితుడైన శ్రీ అగస్త్యమహర్షికి ఉపదేశమును కటాక్షించుచూ శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు శివుడు సర్వవ్యాపకుడైనను అతని పూజ ఒకే స్థానమున జరుగవలెనని తెలియజెప్పుచూ ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**సర్వగత్వే మహేశస్య సర్వత్రారాధనం భవేత్ ।**
**న లింగమాత్రే తన్నిష్ఠ న శివం సర్వగం స్మరేత్ ॥**
**సర్వగోఽపి స్థితః శంభుః స్వాధారే హి విశేషతః ।**
**తస్మాదన్యత్ర విముఖః స్వేష్టలింగే యజేచ్ఛివమ్ ॥ (సి. శి. 10 : 55-56)**

సామాన్యముగా ఈశ్వరుడు సర్వత్రా వ్యాపకుడుగా వుండిననూ అతని యొక్క ఆరాధనను ఒకే స్థానమునందున చేయవలేనేగాని యెల్లకడల చేయకూడదు. ఇట్టి దానినే సర్వగత్వనిరసన స్థలము అని అందురు. 'లింగమధ్యే జగత్సర్వమ సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ' మొదలగు వాక్యములలో పర శివుని వ్యాపకత్వము నిరూపింపబడినది. దేవుడు ఎక్కడ వున్నాడు? అనెడి ప్రశ్నకు దేవుడు ఎక్కడ లేదు? అనెడి ప్రశ్నయే వుత్తరమై యుండును. తృణ కాష్టముల యందు మనము కాంచగలము. అదే విధముగా అతడు సర్వత్రా అన్ని ప్రదేశముల యందు, అన్ని వస్తువుల యందు నిండియుండును. అట్టి శివుని ఆరాధన ఎక్కడెక్కడని చేయగలము? అందుచేత శివుని యొక్క ఆరాధన ఇష్టలింగమునందు మాత్రమే చేయవలెనని గుర్తించవలెను. ఆవు యొక్క శరీరములోని పాలు కేవలము దాని యొక్క పొదుగు నుండి మాత్రమే అభివ్యక్తమగుచున్నవి. వాస్తవముగా చూచినచో దాని రక్తము నుండి యే కదా పాలు ఏర్పడునది? అయితే రక్తకణమునందున పాలకణము అవ్యక్తముగా నున్నదిన భావించిన యెడల దాని శరీరమంతయును పాలేయని గ్రహించవలసి యుండును. ఈ కారణము వలననే కాబోలు ఆవు యొక్క సర్వాంగముల యందును దైవత్వము గలదని భావింపబడుచున్నది. గోవును ఆరాధించెడు వారు సర్వాంగములను ఆరాధించుచున్నారు గదా? కాని వాస్తవముగ పాలు అభివ్యక్తమగునది పొదుగులోనే. అదే విధిన ఈశ్వరుడు సర్వగతుడై యున్నను. ఇష్టలింగమునందుననే అభివ్యక్తమగుచున్నాడు. గోవును ఆరాధించెడు వాడు సర్వాంగములను ఆరాధించి పొదుగును గురించి పట్టించు కొనని యెడల పాలు లభించునే? అదే విధిన సాధకుడు ఇష్టలింగారాధనను చేయునపుడు సర్వగతుడైన శివుడు నా చేతిలోనున్నాడను భావనతో శివార్చనను చేయవలెను. ఈ విషయమున భగవత్పాదుల వారు మరికొంత యుపదేశమును ఈ క్రింది విధముగా నొసంగిరి.

**శివః సర్వగతశ్చాపి స్వాధారే వ్యజ్యతే భృశమ్ ।**
**శమీగర్భే యథావహ్నిర్విశేషేణ విభావ్యతే ॥**

**సర్వగత్వం మహేశస్య సర్వశాస్త్ర వినిశ్చితమ్ ।**
**తథాప్యాశ్రయలింగేన పూజార్థమధికా స్థితిః ॥ (సి. శి. 10 : 57-58)**

శివుడు 'ఆకాశవత్ సర్వగతశ్చ నిత్యః' అనెడి శాస్త్రప్రమాణము ప్రకారము సర్వవ్యాపకుడై యున్నాడు. అయిననూ అతని విశేష ఆధారస్థానము ఇష్టలింగమనియే భావించి ఆరాధించుట శ్రేష్ఠము. కట్టెలన్నిటిలోనూ నిప్పువుండిననూ, శమీ వృక్షములో అది విశేషముగా నుండును. అందుచేత అగ్నిని పుట్టించునపుడు శమీ వృక్షములో ఏ విధముగా అగ్ని విశేషముగా ప్రకటనమగునో అదే విధముగా ఇష్టలింగమునందున శివుడు ప్రకటన మగుచున్నాడు. అందుచేత మహేశ్వర స్థలమునందలి భక్తుడు ఇష్టలింగమునే శివుని ఆధార స్థానముగా భావించుకొని పూజించవలెను.

నిర్గుణ నిరాకారమైన శివుని పూజించెడి అభ్యాసము ఎల్లరిమనసులకు సాధ్యముకాక పోవచ్చును. మనస్సు యొక్క వ్యవహారములన్నియును సాకారమును అవలంబించియే కొనసాగుచున్నవి. అందుచేత బహిర్ముఖముగా పదిప్రదేశములకడకు పరుగెత్తిడి మనస్సును ఒకే కడకు కేంద్రీకరణ చేయు నిమిత్తము వీరశైవ ఆచార్యుడు సాధకుని యొక్క హస్త పీఠమునందున ఇష్టలింగమును ప్రదానముచేసినాడు. మనోవృత్తిని మొదటగా బాహ్యలింగమునందున స్థిరముగా నిలిపి ఆ పిదప ఆ మనోవృత్తిని అంతర్గతముగా చేసికొని సాధకుడు ప్రాణలింగ మరియు భావలింగముల పూజ చేయవలసియుండును. తన చిద్రూపము యొక్క చింతనయే ప్రాణలింగ అర్చన అయిన యెడల 'శివోహమ్' అనెడి భావనచేత తన ఆత్మనే శివస్వరూపముగా భావించి అనుసంధానము చేయునదే భావలింగార్చన యగును. మనోవృత్తి అంతర్ముఖముకాక బహిర్గతమైన యెడల ప్రాణలింగ భావలింగముల అర్చన సాధ్యము కాదు. మొదటగా బహిర్గతమునందున మనోవృత్తిని ఒకకడ స్థిరముగా నిలుపవలెను. మనమును అద్దమును చూసినపుడు మనదృష్టి యొక్క శక్తి దానికి ప్రతిఫలితముగా పరావర్తన చెంది మనముఖమునే గ్రహించినటుల ఇష్టలింగము యందు దృష్టిని స్థిరము చేసిన యనంతరము అంతర్ముఖ చింతన ప్రారంభమగును. ఆచింతనలోనే సాధకునికి ప్రాణలింగ భావలింగములు సాక్షాత్కారమగును అప్పుడే శివసాంగత్యమని కలుగుచున్నది. ఆక్షణమునుండి సాధకుడు సర్వత్రా శివుడిని కాంచగలడు. దృష్టి శివమయము కాకుండగా సృష్టి శివమయము కాకుండగా సృష్టి శివమయము కాజాలదు. అందుచేత సాధకుడు ఇష్టలింగమునందున దృష్టిని నిలిపి సాధనచేయుమని ఉపదేశించెను. ఈ కారణము వలన శివుని యొక్క సర్వగతత్వము నిరసించవలసి యున్నది. శ్రీ భగవత్పాదులు ఇష్టలింగమే శివుని మంగళమయ స్వరూపమని భావించమని ఈ క్రింది విధముగా ఉపదేశమును ప్రదానము చేసిరి.

**నిత్యం భాసి తదేయస్త్వం యా తే రుద్ర శివా తనూః ।**
**అఘోరాః పాపకాశీతి శ్రుతిరాహ సనాతనీ ॥ (సి. శి. 10-59)**

ఈ శ్లోకమునందున వేదమంత్రమును ఉదహరించి ఉపదేశమును చేయుట జరిగినది. వీరశైవులు పూజంచెడి ఇష్టలింగము శివుని మంగళమయమైన శరీరము. ఈ విషయము యజుర్వేదములో 'యాతే రుద్రః శివాతనూరఘోరాక పాపకాశినీ' అనెడి రుద్రమంత్రము నందున ప్రతిపాదించ బడినది. దీని యర్థములు ఈ క్రింది విధముగా నున్నవి. రుద్ర = ఓ రుద్రుడా! తే = నీ యొక్క శివ = మంగళ స్వరూపమైన యా=ఏదైతే తనూ=లింగరూపమైన శరీరము కలదో అది అఘోరా=శాంతస్వరూపమైనది అపాపకాశినీ = పుణ్యవంతుల దేహముల మీద కనిపించెడిది.

ఈ యజుర్వేదమంత్రము ఇష్టలింగ స్వరూపమును ప్రతిపాదించుచున్నది. దీని భావమేమనగా పుణ్యవంతులైన దేహముమీద ప్రకాశించెడి ఓ శివా! నీ యొక్క మంగళమయమైన స్వరూపమేదైతే కలదో అది శాంతమై మంగళదాయకమై వున్నది.

ఇదే ప్రకారముగా పవిత్రమ్తే వితతమ్ బ్రహ్మణస్పతే అనబడెడి ఋగ్వేదమంత్రమునను ఇష్ట లింగరూపమే ప్రతిపాదించబడినది. వేద వాఙ్మయమునందున ఇష్టలింగమునకు పవిత్రము అనెడి శబ్దము ప్రయోగించబడునది. ఆ యిష్టలింగము తాను పవిత్రమైయుండుటయేగాక తానుధరించిన వారిని పవిత్రము చేయుచున్నది. వేద వాఙ్మయమునందున ప్రయోగింపబడిన పవిత్రము అనబడెడి శబ్దము ఆగమవాఙ్మయములో 'ఇష్టలింగ' అను పేరుతో పిలువబడుచున్నది. ఈ విధముగా వీరశైవులు ధరించెడి యిష్టలింగము, దానిని ధరించెడి విధానము వేదాగమ సమ్మతమై యున్నది. ఇష్టలింగము యొక్క చింతన వేద వాఙ్మయములో వచ్చుట చేత వీరశైవ

ధర్మములోని ఇష్టలింగార్చన మరియు ధారణ బహు పురాతన కాలమునకు చెందినవని స్థిరపడుచున్నది. ఈ విషయమును తెలియని కొందరు వీరశైవము ప్రాచీనమైనది కాదనియును అర్వాచీనమైన దనియును ప్రచారముచేయు చున్నారు. ఈ కారణమున వీరశైవులు నిజమును నమ్మి సత్యమును ప్రచారము చేయగలరు. దేహము మీద ఇష్టలింగమును ధరించి తిరుగాడెడిది ఎంత ప్రాచీనమైనదనగా నయ్యది శివలింగమును ప్రతిష్ఠాపన చేసి పూజించెడి ప్రాచీన సాంప్రదాయమున కంటెను పూర్వకాలమునకు చెందినదియని గ్రహించగలరు. వీరశైవశివాచార్యులు భూమి మీద యవతరించినప్పటి నుండియు ఇష్టలింగధారణ మరియు పూజన కొనసాగుచూ వచ్చుచున్నది. ఈ కారణము వలన సనాతనకాలము నుండి కొనసాగుచూ వచ్చుచున్నది. ఈ కారణము వలన సనాతనకాలము నుండి కొనసాగుచూవచ్చుచున్న ఇష్టలింగధారణ మరియు పూజన కొనసాగించెడి బాధ్యత సమకాలీన వీరశైవుల పైన మోపబడినది. ఇష్టలింగార్చన చేసెడి సందర్భములో తన లింగము సాక్షాత్తుగా మంగళమయస్వరూపుడైన శివుడని భావించుకొని ప్రేమానురాగములతోనూ నిష్ఠాభక్తితోనూ పూజించుట యనెడిది. మాహేశ్వర్థుల మునందలి భక్తుని యొక్క ప్రాథమిక కర్తవ్యమై యున్నది. ఇట్టిది సాధించవలయుననిన సాధకుడు ఇష్టలింగము యొడల తననిష్టను మరింతగా పెంచుకొనవలెనని చెప్పుటకై శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**తస్మాత్ సర్వప్రయత్నేన సర్వస్థానపరాఙ్ముఖః ।**
**స్వేష్టలింగే మహా దేవం పూజయేత్ పూజకోత్తమః ॥**

**శివస్యసర్వ గత్యేపి సర్వత్ర రతివర్జితః ।**
**స్వేష్ట లింగే యజనాదేవం సర్వగత్వ నిరాసకః ॥** (సి.శి. 10 : 61- 61)

ఈ ఉపదేశము నందున సర్వగత్వనిరసన ప్రతిపాదించ బడినది. దీని తాత్పర్యమేమనగా శివుడు ఆకాశము వలె సర్వత్రా వ్యాపకుడైయున్నాడు. మాహేశ్వరుడు మాత్రము మిగతా స్థలముల యందు పరాఙ్ముఖత గలిగి వాటియందు తన భక్తిని నిలుపక తన యిష్టలింగమునందుననే ఆసక్తిని పెంచుకొని అనన్యభావముతో పూజించవలెను. అట్టి పూజయే యుత్తమపూజయగుచున్నది.

శ్రీ భగవత్పాదుల వారి యుపదేశములో ఒక విషయము అంతర్లీనముగా గలదు. ఒకటి అనురాగము రెండవది విరాంగము జగత్తులోని సర్వవస్తువుల యెడల విరాగ భవమును వహించి అని పూజనీయుములు కావని నమ్మి ఇష్టలింగయొక్కటియే అనురాగపాత్రమైనదని యెంచి ప్రేమానురాగములతో అనన్యమైన చింతనతో పూజించుట మహేశ్వర స్థలముననున్న భక్తుని కర్తవ్యమై యున్నది.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

ది ॥ 31-8 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

శివుడు సర్వగతుడై యుండుననెడి భావమును మదిన దాల్చిన యెడల నెట్టి పరిణామములు సంభవించునో యనెడిది వివరించుచు, శ్రీ కాశీ జగద్గురువుల వారు, నిట్టి భావము వలన భక్తికి చేటు సంభవించినని తెలిపిరి.

శివుని సర్వగతత్వమనెడిది బహుళ ప్రమాణముల చేత నిరూపితమైన భావన. ఈ క్రింది ప్రమాణమును గనుడి:

**శ్లో ॥ సర్వానన శిరోగ్రీవ: సర్వభూత గుహాశయ ః ।**
**సర్వవ్యాపీ సభగవాన్ తస్మా త్యర్వగతః శివః ॥**

శివుడు సర్వగతుడై యుండినను, నతడు లింగమునందుననే స్థిరముగా నుండునని బసవపురాణము తెలుపు చున్నది. ఈ క్రింది ప్రమాణములను గనుడి:

**సర్వ గతంబైన చంద్రాతపమున**
**సర్వశిలలు నుండ జంద్రకాంతంబు**
**స్రవియించు నారెంటి సామరస్యమున**
**స్రవియించునే యున్నశైలము లెల్ల**
**శిలలపై వెన్నెల గలుగదే గలిగి**
**ఫలమేమి యది ప్రాణపదము గాదట్లు**

(బసవపురాణము, షష్ఠాశ్వాసము వావిళ్ళవారి ముద్రణ, పుట 429-430)

శివుడు సర్వగతుడై యున్నను లింగధారుల యొక్క స్వేష్ట లింగముల యందున స్థిరముగా నుండి వారి పూజలంది కొని వారికి సకలములగు శుభములను చేకూర్చు ననెడి భావన మాహేశ్వర స్థలములోని భక్తుని కుండవలెను.

సర్వగతుడు శివుడనే భావన గల్గిన యెడల విశ్వములోని వస్తుసంచయము నెల్లను పూజించవలెననెడి కోరిక జనియించ వచ్చును. చెట్టు, పుట్ట, కట్టె, పాము, రాయి, రప్ప, బట్ట, ఇటుక మొదలగు వస్తువులను పూజించుచు పోయిన యెడల భక్తుని లింగైక నిష్ఠ నిర్వీర్యమై నీరుగారి పోవును. ఇయ్యది మహేశ్వర స్థలమున నున్న భక్తునికి హితకారి కాజాలదు. అందుచేత నతడు శివ సర్వగత తత్త్వము యెడల నిరాసక్తత గల్గి యుండవలెను. అట్టి స్థితిలోనే తన యిష్టలింగము యెడల నన్య సామాన్యమైన భక్తి గల్గును.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## శివజగన్మయ స్థలము

శ్రీ భగవత్పాదులవారు సర్వగత నిరసన స్థలములో సాధకుడు ఆచరించవలసిన విధివిధానమును తెలిపిన పిదప శివజగన్మయ స్థలమును గురించి ఈ క్రింది విధముగా ఉపదేశమును కటాక్షించిరి.

**శ్లో ॥ యస్మాదేతత్ సముత్పన్నం మహాదేవాచ్చరాచరమ్ ।**
**తస్మాదేతన్నభిద్యేత యథా కుంభాదికం మృదః ॥**

**శివతత్త్వాత్ సముత్పన్నం జగదస్మాన్నభిద్యతే ।**
**ఫేనోర్మి బుద్బుదాకారం యథా సింధోర్నభిద్యతే ॥**

**యథా తంతుభిరుత్పన్నః పటస్తం తుమయః స్మృతః ।**
**తథా శివాత్ సముత్పన్నం శివఏవ చరాచరమ్ ॥** (సి. శి. 10-63;64;65)

ఈ ఆచార్యోక్తి వలన శివుడు జగత్తునిండా నిండి వున్నాడని సిద్ధమగుచున్నవి. ఒక కార్యము ఉత్పన్నము కావలెననిన ఉపాధాన కారణము. నిమిత్త కారణము మరియు సహకార కారణములు అవసరమగును. మన్నుకండను చేయునపుడు కుమ్మరివాడు నిమిత్తకారణుడగు చున్నాడు. మన్ను ఉపాదాన కారణము. దండాచక్రాది సాధనసంపత్తి సహకార కారణము. ఇటులనే ఒక కుండను తయారుచేయవలెననిన ఈ మూడు కారణములు అవశ్యకమగుచున్నవి. అయితే జగత్తు అను కార్యము ఉత్పన్నము కావలెననిన సృష్టికి పూర్వమున శివునికి వెలుపల ఏవియు సామాగ్రులు లేవు. అందుచేతనే ఉపనిషత్తు 'సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్' అనిచెప్పినది. ప్రపంచపు ఉత్పత్తి యందున ఉపాదాన మరియు నిమిత్త కారణములు వేరువేరుగా నుండక అన్నియును తానైయుండెను. 'యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ' అనెడి స్మృతి ప్రమాణము ప్రకారము సాలెపురుగు తనగూటిని తయారుచేసు కొనుటకు తన దేహము నుండియే తీగలను గైకొని నిర్మాణము చేయును. ఈ సాలెపురుగే ఆ గూడుకు నిమిత్త కారణము మరియు ఉపాధాన కారణమై యున్నది. అదే విధిన పరమాత్మ తానొక్కడే జగదుత్పతికై సర్వవిధ కారణములుగా నున్నాడు. అందుకే వీరశైవ సిద్ధాంతము నందున శివునికి అభిన్నముగా నుండెడి దానిని ఉపాదాన కారణముగా తీసికొననైనది. శివుడు శక్తి విశిష్టుడై యుండుటచేత ఆశక్తి జగుదుత్పత్తికై ఉపాదాన కారణమగును. శివుని యొక్క

చైతన్యమే జగదుత్పత్తికై నిమిత్తకారణమగు చున్నది. ఈ విధముగా జగదుత్పత్తికి శివుడొక్కడే ఏకైక కారణమగుచున్నాడు. మన్ను నుండి ఉత్పన్నమైన కుండ మన్ను కంటెను భిన్నముగా నుండని యుటులనే శక్తి విశిష్టుడైన శివుని నుండి ఉత్పన్నమైన ప్రపంచము శివుని కంటెను భిన్నముగా వుండజాలదు. జగత్తు శివ స్వరూపమేయై యున్నది. సముద్రము నందున కనిపించెడి నురుగు సముద్రము కంటెను భిన్నముగా నుండని యుటులనే, తంతుల నుండి ఉత్పన్నమైన పటము తంతుల కంటెను వేరుగా యుండని యుటులనే శివతత్వము నుండి యుత్పన్నమైన ఈ ప్రపంచమంతయు శివరూపమేయై యున్నది. ఈ విషయమునే శ్రీ భగవత్పాదులవారు బహు విధములైన దృష్టాంతములతో నిరూపణను చేశిరి. వీరశైవ సిద్ధాంతము ప్రకారము సృష్టి ప్రక్రియను శ్రీ భగవత్పాదులవారు ఈ క్రింది విధముగా వుపదేశించిరి.

**శ్లో ॥ ఆత్మ శక్తి వికాసేన శివో విశ్వాత్మనా స్థితః ।**
**కుటీభావాద్ యథాభాతి పటికః స్వస్యప్రసారణాత్ ॥**

**తస్మాచ్ఛివమయం సర్వం జగదేతచ్చరాచరమ్ ।**
**తదభిన్నతయా భాతి సర్పత్వమివ రజ్జుతః ॥**

**రజ్జౌ సర్పత్వవద్ భాతి శుక్తౌ రజతత్త్వవత్ ।**
**చోరత్వ వచ్చాపి స్థాణౌ మరీచ్యాంచ జలత్వవత్ ॥**

**గంధర్వ పురవద్వ్యోమ్ని సచ్చిదానందలక్షణే ।**
**నిరస్తభేద సద్భావే శివే విశ్వం విరజతే ॥** (సి. శి. 10-66;69)

శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశములోని భావమే మనగా శివుని యందు అవినాభావ సంబంధము కలిగియుండెడి, శక్తి, వికసనము పొందిన పిదప జగదుత్పత్తి యగును. అది సంకోచమైన యెడల జగత్తువిలయమగును. ఈ జగత్తు యొక్క ఆవిర్భావము మరియు విలయములకు శివుడే నిమిత్త మరియు ఉపాదాన కారణుడగు చున్నాడు. అందుచేత శివుని నుండి వుత్పన్నమైన జగత్తు శివమయమే అయియున్నది. గాడాంధకారము నందున పగ్గము పామైదోచునటులనే దొంగల భయమున్న మనుష్యునికి మోడు చెట్టు దొంగవలె కనిపించినటులనే, ఆకాశము నందలి మేఘములు గంధర్వ నగరమువలె కన్పించి నటులనే అజ్ఞులైన జీవులకు ప్రపంచమే శివుడుగా గోచరించును. ఈ శివ జగన్మయ స్థలమును ఉపసంహారము చేయుచు శ్రీ భగవత్పాదులవారు ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**శ్లో ॥ పత్రశాఖాదిరూపేణ యథాతిష్ఠతి పాదపః ।**
**తథా భూమ్యాదిరూపేణ శివ ఏకోవిరాజతే ॥** (సి. శి. 10-66)

వేరు, కాండము, కొమ్మ, ఆకు, పూవు, కాయల వలన ఒక చెట్టు కన్పట్టును. చెట్టు అనబడెడి శబ్దమును ప్రయోగించినపుడు వీటిన్నిటితో కూడిన విశాలమైన చెట్టు బోధకమగుచున్నది, ఇచట వేరు, కాండము, యిత్యాదులు చెట్టు నుండి వేరు కాకుండా అందులోనే వుండి వుండి నటుల సృష్టిలోని పృథివ్యాది పంచభూతములు మరియు వాటి ద్వారా నిర్మించబడిన ప్రపంచము శివమయమే అయివుండును. ఈ భూత భౌతిక ప్రపంచము శివమయమై యుండుననెడిది తెలియజెప్పుటకే కాబోలు దక్షిణ భారత దేశములోని శివకంచియందు పృథ్వీలింగము, జంబు కేశ్వరమునందు జలలింగము, అరుణాచలమునందు తేజోలింగము, కాళహస్తియందు వాయులింగము, చిదంబరము నందు ఆకాశలింగము ప్రసిద్ధములై యున్నవి. ఇంతేకాదు. మహాభూతగణములను భగవంతుని రూపమున పూజించెడి సాంప్రదాయము భారతదేశమున కొనసాగుచూ వచ్చుచున్నది. మన శరీరములోని వివిధ అవయవములు వేరువేరుగా వుండిననూ అవియన్నియును శరీరములోని అంతర్భాగములుగా వుండినటులనే జగత్తులోని వివిధ అంశములన్నియును ఒక్కడే అయిన శివుని స్వరూపములు. అదే విధముగా శివుడునూ జగత్స్వరూపమే. దేవ, దానవ, గంధర్వ, మనుష్య యిత్యాదులు శివస్వరూపములే. అతనికి బహిర్గతముగా ఏదియును లేదు. అతడే సర్వము అయివున్నాడు. అనెడి భావమును మనమున దాల్చి మాహేశ్వర స్థలము నందలి భక్తుడు ఇష్టలింగ పూజను చేయుచు నుండవలెను ఇదియే శివజగన్మయ స్థలములోని విషయ సంచయము.

ఓం శాంతి ః శాంతిః శాంతిః

ది ॥ 1-9-1991

స్థలం : నాగపూర్

# విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులవారు శివుని జగన్మయ తత్త్వమును గురించి యెంతో చక్కగా వివరించి చెప్పిరి.

శివాగమ వేదవేదాంత పూరాణదులలో శివుని జగన్మయత్వము నెంతయో విస్తృతముగా ప్రతిపాదించ బడినది. "సర్వోహ్యేష రుద్రః" అనెడి శ్రుతి, "సర్వం శివమయం జగత్" అనెడి యాగమ వాక్కులీ విషయమును సమర్థించు చున్నవి. బసవ పురాణములోన శివుని జగన్మయత్వము నీ క్రింది విధముగా ప్రతిపాదింప బడినది:

**ఖండిత సూక్ష్మ వికస్వరలీల**
**సకలము గపటనాటక సూత్రములను**
**బ్రకటించు చైతన్యభావంబు శివుడు**
**అందు ఎనణోరణీయాం నన జొచ్చి**
**సందు లేకున్నట్టి శంభుడు శివుడు**
**నూవుల లోపలి నూనియ యట్ల**
**భావింప గాష్టంబు పావకు నట్లు**
**పూని పాషాణంబులో నిను మట్ల**
**తా నేత్రములలోని తద్రూపమట్ల**
**యలవడ పాలలోపల నేయి యట్ల**
**జల కుంభములలోని చంద్రుని యట్ల**
**వెలుగు నద్దంబు లోపలి నీడయట్ల**
**తలప బూసలలోని దారంబు నట్ల**
**ఘట పలనాదులలోని గగనంబునట్ల**
**పటికంపు శిలలోని భావంబునట్ల**
**వెలయ బీజములోని వృక్షంబునట్ల**
**నలరు శబ్దంబు లోపలి యర్థమట్ల**
**పర్వతంబులోని ప్రతిశబ్ద మట్ల**
**సర్వంబు నందును శర్వుండు నట్ల**
**ముల్లు గుట్ట దెరపి యెల్లెడ లేక**
**యెల్లచో దానయై యట్లున్న వాడుం**

(బసవ పురాణము, వావిళ్ళ ముద్రణ, పు. 432-433)

మాహేశ్వర స్థలములోని భక్తుడు, తన నైష్ఠిక భక్తి దృష్ట్యా, స్వేష్టలింగమే శివుని స్థిరమైన నిలయమని యెంచిననూ, శివుని విశ్వవ్యాప్త తత్త్వమును విస్మృతికి గురి చేయ వలదు. జగన్మయుడైన శివుడు తన యిష్టలింగములో విశేషముగా నుండునని భావించి పూజించి కొనవలెను. ఈ భావన వలన సాధకుడు కేవలాద్వైతము ప్రభావమునకు గురికాకుండగ తనను తాను రక్షించుకొనును. శంకరాచార్యుని జగన్మిధ్యాభావము వలన భక్తి భావమున కఘాతము గల్గును, నాస్తిక భావములు తలయెత్తును. శంకరాచార్యుని యద్వైతములోని తత్త్వము వలన భ్రాంతి హెచ్చి భక్తి భావము చెడును. జగత్తు మిథ్యకాదు. జగత్తు సత్యమే యని గ్రహించవలెను. "జగత్తులోని చరా చరాంశములన్నింటిలోను శివుడున్నాడు." అనెడి శక్తి శిష్టాద్వైత సిద్ధాంతమే యనుసరణీయమని గ్రహించవలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## భక్త దైహిక లింగ స్థలము :

"సర్వం శివమయం జగత్" అనెడి యదార్థమును శ్రీ అగస్త్య ఋషికి తెలియజెప్పిన పిదప శ్రీ భగత్పాదుల వారు అతనికి భక్తదైహిక స్థలమును గూర్చి యీ క్రింది విధముగా నుపదేశించిరి.

**శ్లో ॥ సమస్తజగదాత్మాపి శంకరః పరమేశ్వరః ।**
**భక్తానాం హృదయాంభోజే విశేషేణ విరాజతే ॥**
**కైలాసే మందరే చైవ హిమాద్రౌ కనకాచలే ।**
**హృదయేషుచ భక్తానాం విశేషేణ వ్యవస్థితః ॥** (సి. శి. 10-71;72)

భగవంతుడు సర్వవ్యాపకుడగుట చేత అతడు జగత్తునందలి కణ కణమునందున యున్నాడు. హిమాలయములోని కైలాసమున, మందర గిరిన, మేరు పర్వతమున శివుడు విశేషముగా వసించునని పురాణముల వలన తెలియు చున్నది. భక్తుల హృదయ కమలముననే శివుడుండునని యాచార్యులవారు నుపదేశించిరి.

బహుదూరమున నున్న హిమన్నగము సమీపమునకు పొవలసిన పనిలేదు. ఎంతో శ్రమ కోర్చి పర్వతాదుల నధిరోహించ వలసిన పనిలేదు. భక్తుల హృదయాం భోజముల యందున శివుడు గలడనెడి భావన మదిన దాల్చ వలెను. ఆ విధిన దలచి యతనిని సేవించి తరించుటకు పూనుకొన వలెను. ఆ విధిన చేయక, హిమన్నగమున శివుడున్నాడని కేదారాది తీర్థయాత్రలకు వెళ్లి అష్టకష్టముల పాలయ్యెడి వాడు, తేనె యింటిలోనే పుష్కలముగా నుండగా నది యెరిగి, యాస్వాదించుటకు మారుగా పర్వతమున కేగి బహుకష్టముల కోర్చి, తెనెను వెదకెడి వంటివాడని గుర్తించ వలెను. "అక్కెచేన్మధు విందేత కిమర్థం పర్వతం వ్రజేత్" అని సుభాషితకారుడు ప్రశ్నించెను. ఇంటిలో తేనె యుండగా పర్వతాని కెందుకు వెడలితివి అనెడిది యీ ప్రశ్నలోని భావము. హృదయమున నుండెడి శివుని గాంచ కుండా, హిమన్నగమున కేగి కైలాసము నధిరోహించే వారికీ ప్రశ్న వర్తించదా? వీరవిరాగిణి అక్కమహాదేవి వేసిన ప్రశ్నను నిరసన రూపమున ప్రకటించిరి. కనుడి:

**హగలు నాల్కు జాత అశనక్కె కుదివరు**
**ఇరుళు నాల్కు జావ వ్యసనక్కె కుదివరు**
**అగస నీరొళగిర్దు బాయారి సత్తంతె**
**తమ్మొళ గిర్ద మహా ఘనతను అరియదె**
**కెట్టిరయ్యా చెన్న మల్లి కార్జున!**

ఆమె వచనపు తెలుగు రూపమిది:

**పగలు నాల్గు జాము లశనముకై కుందుదురు**
**రాత్రిలో నాల్గు జాములు వ్యసనముకై కుందుదురు**
**చాకలి నీటిలో నుండియూ నోరెండి చచ్చినటుల**
**తమలోని మహాఘనము నరయక**
**చెడిరయ్యా చెన్న మల్లికార్జునా!**

సాంసారిక యనుభోగములలో కాలము వెడల బుచ్చెడి సంసారికి తనలోనే యిమిడి యున్న మహాఘనము యొక్క యెరుక యగుట లేదనియును, ఇట్టి వారు పతనమగుట తథ్యమని యును, దినమంతయూ నీటిలో నుండినా దాహముతో నోరెండి పోయి నాశనమయ్యెడి చాకలి వలె జీవుడు అజ్ఞాన వశమున నశించు చున్నాడని అక్కగారు తెలియ జెప్పిరి.

శ్రీ నిజగుణ శివయోగుల వారును నిట్టి యభిప్రాయమునే వెలిబుచ్చిరి. "ఊటక్కె విషయక్కె మరుగుతిప్పాతంగె కూట వప్పుదె ఘనపదదొళు" అని ప్రశ్నించిరి. "తిండికై విషయముకై మ్రగ్గతిప్పనికి కూట మగునే ఘనపదములోన" యనెడిది వీరి ప్రశ్నలోని భావము.

భక్తుల హృదయములలో శివుడుండు ననెడిది యెంతో ప్రాచీనమైన భావము. శివాగమము లీ విధిననే బోధించు చున్నవి. ఈ ఆగమోక్తిని గనుడి!

**శ్లో ॥ వేదవేదాంతవాక్యార్థ సంధానాతీత వర్తనః ।**
**భక్తి భావ పరానందో భక్త భావైకగోచరః ॥** (యోగజ ఆగమము)

ఈ ఆగమోక్తిలోని భావమేమనగా, శివుడు వేద వేదాంత వాక్యముల కగోచరుడైనను, భక్తుల భావములకు నానందించుట చేత భక్తుల భావములందుననే యతడు గోచరించును.

భారతీయ సంస్కృతి యందున ప్రతి యొక్క మానవుడు చివరి దశలోన వాసనారహితముగా నుండి సద్గతిని పొందవలెనని యుద్దేశించి చతురాశ్రమ వ్యవస్థను చేసిరి. ఆయా అవస్థల యందున ఆయా ధర్మముల నాచరించి జీవితము సాఫల్యము చేసి కొనవలెనని చెప్పుబడినది. ఈ విషయమున కవికుల చక్రవర్తి కాళిదాసు ఈ క్రింది విధముగా నుడివిరి.

**శ్లో॥ శైశవేఽభ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణాం ।**
**వార్థక్యే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజామ్ ॥**

శైశవమున విద్యాభ్యాసమును, యౌవనమున విషయ సుఖము, వార్ధక్యమున మౌనవృత్తిని వహించి చివరన యోగము వలన తనువును త్యజించ వలెననెడి పద్ధతి పాటింప బడెడిదని తెలియు చున్నది. నేటి స్థితి యిందుకు భిన్నముగా నున్నది. జీవితాంతము వరకును కుటుంబ జీవనమున కాలమును గడిపెడి వ్యక్తి యౌవ్వనమున కాలిడి నప్పటి నుండి విషయానుభవములలో మునిగి తేలు చున్నాడు. విషయాసక్తిని వదలని వానికి హృదయములోని శివుని వైపు మనోవృత్తి గమనించునే?

హృదయములో నిలిచి యున్న శివుని గాంచక శివుని కొరకై పలు ప్రదేశములలో తిరుగాడెడి వారిని వివేకులని యన వచ్చునే? ఈ విషయము గురించి యొక్క కథ ప్రచారమునందు గలదు.

ఒక ఊరిలో నొక త్రాగుబోతు బాగుగా సురపానమును జేసి మత్తుకెక్కగా శరీరము మీద స్పృహను కోల్పోయి ఊగుతూ తూగుతూ క్రిందపడుచు పైకి లేచుచు వెడలు చుండెను. అతడు తన యింటి యొక్క ప్రాంగణమున ప్రవేశించెను. కాని అది తన యిల్లు అనెడి సంగతిని గుర్తించెడి స్థితిలో లేకుండెను. అప్పుడు దారిన పోవు దానయ్యలను పిలిచి అయ్యరో! నాయిల్లు ఎక్కడున్నదో తెలియుట లేదు. ఎవరైనను దయతలచి నన్ను నా యింటికి చేర్చెదరా! అని అరవదొడగెను. మొదట ఎవరునూ పట్టించుకొనలేదు. కారణమేమనగా అతడు అతని యింటిముందటనే నిలిచియుండెను. త్రాగుబోతు వాగుడు మనకెందుకని కొందరు వెడలిపోయిరి. ఇంకా కొందరు కుత్తుక వరకు త్రాగడమెందుకు? ఈ విధముగా తయారై అందరికీ తలనొప్పిగా మారడమెందుకని దుర్భాషలాడిరి. వారిలో కొందరు దయాగుణము కలవారై నందున వాడి దరిచేరి ఇదిగో! ఇదియే నీ ఇల్లు అని చూపించిరి. అతడు వీరి మాటలను పట్టించుకొనక అప్పుడే నా యిల్లు వచ్చినదా! నా యిల్లు చాలా దూరములో నున్నది. నన్ను ఎవరి యింటికో పంపించు చున్నారు. వారు నాకు దేహశుద్ధి చేసెదరు. మీరు నా మీద పగపూని కొట్టించుటకై కుయుక్తులు పన్నుచున్నారా! ఏమి? అని బిగ్గరగా అరచు చుండెను. ఈ లోపున ఆదారిన ఒక శివాచార్యుడు వెడలు చుండెను. జనులు అతనికి పాదనమస్కారములాచరించి విషయమును నివేదించిరి. ఇతడు మత్తులో నున్నాడు. చెప్పినది వినుటలేదు. మీరే యితడిని సరియైన మార్గములో పెట్టవలె నని విన్నవించిరి. శివాచార్యుల వారు ఆ తాగుబోతు వైపు జూచి జాలి పడెను. కరుణార్ధ్ర హృదయుడై కావనేంచెను. కాని వాడు శ్రీ గురువు ఉపదేశమును. వినెడి స్థితిలో లేకుండెనని గ్రహించెను. అతడు అక్కడున్న వారిలో నొకనిని దగ్గరకు పిలిచి ఒక వాహనమును కొనిరండు అని ఆదేశము నిచ్చెను. అక్కడున్నవారు స్వామీ! వాడు రోగిష్టి కాదు వైద్యశాల కెందుకు? అని అనిరి. మరికొందరు మఠమునకు తీసుకొనివెళ్ళి బుద్ధి చెప్పునేమో పోనిండు.

వాహనము తీసుకొనిరండు అని తెలిపిరి. వాహనము తీసుకొనిరాబడెను. శ్రీ గురువు వానిని వాహనమున నెక్కించి తానును అద్దానిని అధిరోహించెను. స్వామీ! ఎక్కడకు వెళ్ళమనెదరు? అన్నాడు చోదకుడు అప్పుడా స్వామి నేను వలదు అన్నంత వరకు పూరిలోనే వాహనమును త్రిప్పుడి అని ఆనతిచ్చెను. ఆ వాహనము కొంత సమయము వరకు పూరిలోనే నలువీధుల యందున తిరుగాడ జొచ్చెను. రెండు మూడు గంటల పిదప త్రాగిన వాడి మత్తు దిగెను. అది గమనించిన శ్రీ గురువు ఛోధకు నుద్ధేశించి అయ్యా! వాహనమును ఇతనియింటికి గొనిపొండు. ఛోధకుడా విధముగనే చేసెను. వాహనము నిలువగనే ఆ త్రాగుబోతు గబుక్కున వాహనమును దిగి ఆహా! ఇదే నా ఇల్లు. అని తెలిసికొని శ్రీ గురువు పాదములకు నమస్కరించి ఓ గురుదేవా! నీవు నన్ను యింత దూరము గొనితెచ్చి నాయింటికి చేర్చితివి. అచటి అజ్ఞులు ఆ పనిని చేయలేక పోయిరి. నేను మీకు సదా కృతజ్ఞుడునై వుందును. అని సెలవుగైకొని గృహమునకు వెడలెను. శివాచార్యులవారు తనమఠమునకు వెడలిపోయిరి.

ఈ కథలోని సారాంశమేమనగా తనయిల్లు తన ఎదుట నుండినను మద్యపానము మత్తులో త్రాగుబోతు అద్దానిని గాంచడయ్యెను. ఎంతో దూరము వరకు త్రిప్పి, త్రిప్పి వాని మత్తునుదించి యింటికి తీసుకొనిరాగానే, వాడు తన గమ్యమును చేరితినని నంబరపడెను. ఈ విషయమున ఎన్ని వనరులు వృథా అయినవో, ఎంత సమయము గతించినదో వాడు ఎరుగడు హృదయ కమలములో ఈశ్వరుడున్ననూ అజ్ఞానమనెడి మత్తులోపడి అతనిని గాంచలేక శివుడు కాశి, కేదారము, కైలాసములలో నున్నాడని అక్కడికి పరుగులు తీసి ద్రవ్యమును, కాలమును వృథాచేసి భగవంతుని గానక బడలికను చెంది గృహోన్ముఖులయ్యెడి వారి గతి త్రాగుబోతు వంటిదే గదా? ఈ విషయమును గుర్తించెడివారు ఎందరు?

భక్తులైనవారు ఎన్నోసార్లు తమ యిష్టము వచ్చిన దేవాలయములకు దర్శనార్థమై పోవుచున్నారు. అచ్చట అష్టవిధార్చన, షోడశోపచారపూజ మొదలగునని ఆర్భాటముతో చేయించి మంగళహారతు లెత్తించెదరు. ఆ హారతిని తమముందుకు తీసుకొనిరాగానే గబగబ పరిగెత్తి కళ్ళ కద్దుకొనెదరు. అప్పుడు భక్తులు ఆ జ్యోతికి నమస్కారము చేసి తమ తమ భక్తి కనుసారముగా దక్షిణలు కూడా యిచ్చెదరు. వారి దృష్టిలో ఆకానుకలు దేవునికి చెందునట్టివి. అవి ఎవరి హస్తగతమగునో మనమెరుగమే? నిజముగా భక్తుల హితమును కోరెడి పూజారియైనచో అతడు తెచ్చునట్టి హారతిని భక్తుల హృదయమునందుండెడి దేవునికి హారతి పట్టువానిగా ప్రవర్తించి భక్తులకు హితమును చేయును. ఇక్కడ అంతర్గతముగా నుండెడి భావమేమనగా పూజారి ఆ జ్యోతిని మన హృదయములో నున్నదేవునికి దర్శింప జేసినచో మనము ఆ సంగతి గురించియే పట్టించుకొనక ఎదురుగానున్న ఒక విగ్రహమువైపు మన మనోవృత్తిని ప్రసరింప జేయుదుము ఇది అంతయును మనము శివుని గురించి సరియైన అవగాహన చేసుకొని యుండనందు ననే జరుగుచున్నది.

శివుడు సర్వవ్యాపకుడై యుండుట చేతనే భక్తుల యొక్క హృదయమున దేదీప్యమానముగా విరాజిల్లు చున్నాడు. అట్టియెడ జీవుని దేహముకూడా పవిత్రమైనదై మందిర సమమైయున్నది. అందుచే 'దేహమే దేవాలయమనెడి' సూక్తి ప్రచారములోనికి వచ్చెను. దుర్వ్యసనముల ద్వారా ఈ దేవాలయము యొక్క పవిత్రతను దెబ్బదీయుచు తిరుగాడెడివాడు శివునికి గాని మరేదేవునికి గాని ఎన్ని మందిరములు కట్టించినను ఏమి ఫలము? బహిర్గతముగా మందిరమును కట్టించుటకు బదులుగా హృదయ మందిరమునే దృఢతరము చేసికొనుటకు అంతరంగశుద్ధిని, బహిరంగ శుద్ధిని సాధించి దేహమును దేవాలయముగా మార్చి అందులోనున్న దేవుడిని భక్తి శ్రద్ధలతో ఆరాధించవలెను. దీని వలన సమాజము కూడా సంస్కరింపబడును. దుర్మార్గ ప్రవర్తనకు ప్రోత్సాహము లభింపక జనులందరునూ సన్మార్గమున పయనించుచూ సామాజిక పుష్టిని పెంచి సామాజిక సంతుష్టిని సాధించగలరు.

ఒక హిందీకవి ఈ విషయమున ఒక చక్కటి కవిత చెప్పెను. 'మందిర్ తోడో, మస్జిద్ తోడో లేకిన్ కిసీకా దిల్ మత్ తోడో'. దీనిని సకారాత్మకముగా అర్థము చేసికొనిన యెడల మనసమయమును మందిర నిర్మాణాదులకు అర్పితము చేయకుండా అద్దానిని మన హృదయములో నున్న కాలుష్యమును కడిగివేయుటకు వెచ్చింపవలెను. దీనికై ద్రవ్యాదుల ఆవశ్యకతలేదు. మనదైనందిన వ్యవహారములలో కొంత సమయమును మిగిల్చుకొని మనము అంతర్ముఖులమై పయనించి హృదయ కుహూరములోనున్న శివుని దర్శించుటకు కృషి చేయవలెను. ఈ విషయమున శ్రీ గురువుగారు వేదమంత్రమును ఉదహరిస్తూ తమ యొక్క ప్రతిపాదనను దృఢతరము చేయుటకై ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో॥ సర్వాత్మాపి పరిచ్ఛిన్నో యథా దేహేషు వర్తతే ।**
**తథా స్వకీయ భక్తేషు శంకరో భాసతే సదా ॥**

**నిత్యంభాతి త్వదీయేషు యాతే రుద్రశివాతనూ ః**
**అఘోరాః పాపకాశీతి శ్రుతిరాహ సనాతనీ ॥** (సి. శి. 10; 73-74)

ఈ ఉపదేశము యొక్క సారమేమనగా వస్తుతః పరమాత్ముడు అపరిచ్ఛిన్నుడైనను భక్తి సంపన్నులైన భక్తుల హృదయములందున భాసించుచున్నాడు దీనినే యజుర్వేదములోని మంత్రము సూచించుచున్నది. రుద్రుని మంగళమయమైన రూపము ప్రాణలింగ, భావ లింగముల రూపమున పాపరహితులైన భక్తుల హృదయము లందున సర్వదా ప్రకాశమానముగా వెలుగు చుండును. తన హృదయము పరమాత్ముని నివాసమైనను యోగ్యత లేనిది దానిని గాంచలేము. శ్రీ భగవత్పాదుల వారు యోగ్యత గురించి ఈ క్రింది విధముగా వుపదేశము నిచ్చిరి.

**శ్లో॥ విశుద్ధేషు విరక్తేషు వివేకిషు మహాత్మసు ।**
**శివస్తిష్ఠతి సర్వాత్మా శివలాంచనధారిషు ॥**

**నిత్యంసంతోషయుక్తానాం జ్ఞాన నిర్ధూతకర్మణామ్ ।**
**మాహేశ్వరాణామంతస్థో విభాతి పరమేశ్వరః ॥** (సి. శి. 10-75;76)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా అంతరంగ బహిరంగములను శుద్ధిచేసికొని యుండెడి వాడునూ, ఇహలోక పరలోక సుఖముల యెడ విముఖత కల్గినవాడును నిత్యానిత్య వివేకమును పొందినవాడును విశాల హృదయము గలవాడును శివలాంఛనములను ధరించెడివాడును. సదా సంతుష్టుడై యుండెడివాడును శివజ్ఞానముచేత కర్మకోటిని నాశనము చేసుకున్న వాడును. అగు మహాత్ముల హృదయము నందున శివుడు భాసిల్లు అద్దములో ప్రతిబింబము దోచిన యుటులనే శివుడు హృదయములో కన్నట్టును.

అంతరంగ యోగ్యతలు శివసాక్షాత్కారమునకు సహాయకములుగా వుండునటులే బహిరంగమునందున నుండెడి భస్మరుద్రాక్షాదులు శివసాక్షాత్కారమునకు తోడ్పడును. ఈ కారణము వలననే వీరశైవ ధర్మము నందున లింగము, భస్మము రుద్రాక్షలను ధరించవలయుననెడి నియమము విధింపబడినది. ఇవి దేహము మీద వుండినంత వరకు మనస్సులోనికి రజోభావముగాని, లేదా తమోభావముగాని ప్రవేశించెడి అవకాశము లేదు. శివ భక్తుడు సత్వగుణ సంపన్నుడై ప్రకాశించును. ఈ సత్త్వ గుణము వలననే శివుని సాక్షాత్కరించుకొనుట సులభతరమగును.

వేషభూషణముల ప్రభావము వలన మనుజుడు ఉత్తమ లేక నీచకర్మలను చేయుటకు పూనుకొను చుండును. ఒక వృద్ధురాలు అత్యంత సుందరమైన ముత్యపు గాజులను చేయించుకొని వాటిని చేతులకు అలంకరించుకొనెను. ఆమె చేతుల యందు ఆగాజులు అప్రతిమానముగా కన్పట్టదొడగెను. అప్పుడామె మనస్సునందున ఆ గాజులను ఊరిలోని జనులకు చూపించిరావలెననెడి యిచ్ఛ కలిగెను. అప్పుడామె తన యింటిని విడిచి అనేక జనుల యిండ్లలోకి చేతులను విసురుకొనుచూ పోయి వారికి తన చేతులను చూపించునుద్దేశ్యముతో వారి ముందునకు తనచేతులను చాచికొని మాటలాడ జొచ్చెను. ఈ విధముగా ఎన్నో యిళ్లకు తిరుగాడెను. ఎవరి దృష్టియు ఆగాజుల వైపుకు వెళ్ళదయ్యెను. ఎవరునూ ఆమెను మెచ్చుకొనలేదు. ఆమెకు ఆ ఆభూషణము యెడల అసంతోషము కలుగ జొచ్చెను. ఆ స్థితికి గల కారణమేమనగా ఆమెలో రజోగుణము, ఆధిక్యమందున నుండెను. రజోగుణముచేత ఉత్పన్నమైన అహంకారాదులు ఎల్లప్పుడు మరొక్కరి నుండి ప్రశంసలను ఆపేక్షించు చుండును. ఎదుటివారి ప్రశంసలే అహంకారమునకు ఆహారములగును. ఇతరుల యొక్క స్తుతి దొరకని యెడల అభిమానము విక్షిప్తమైన రూపమును దాల్చి అనర్థమును కొనితెచ్చును. తాను తొడిగిన గాజుల యెడల ఎవరి ప్రశంస లభ్యము కానందున వాటి యెడల అభిమానము, సంతోషము కలుగుటకు మారుగా అసహనము, కోపము కలుగజొచ్చెను. అప్పుడు ఆ సాయంకాల సమయమునందున ఆ వృద్ధవనిత చేతి యందున అగ్గిపెట్టెను పట్టుకొని ఊరువెలుపలకు పోయి అక్కడ వుండెడి గడ్డివాము నొకదానికి నిప్పును పెట్టెను. అర్థక్షణములోనే నిప్పు విరాడ్రూపమున దాల్చెను. దాని నార్పుటకై ఊరులోని జనులెల్లరూ నిండిన బిందెల నెత్తికొని పరుగెత్తుకొని వచ్చిరి. జనులెల్ల అగ్నినార్పునపుడు అచ్చటనే కూర్చునియున్న ఆ వృద్ధ వనిత దగ్గరకు ఒక పడతి వచ్చి ఆ మంటల యొక్క వెలుగున మిలమిలా మెరయుచున్న ముదుసలిదాని ముత్యపు గాజులను గని ఏమవ్వా! నీ గాజులు ఎంతో సుందరముగా నున్నవే. ఎక్కడ చేయించితివి. అని అడిగెను. అప్పుడా వృద్ధ వనిత మనస్సులో సంతోషము తలయెత్తెను. అప్పుడామె ఆ వనిత నుద్దేశించి నిన్ననే మీ యింటికి వచ్చినపుడు నీవీ గాజుల గురించి మాట్లాడియుండినచో ఈ గడ్డి వాముకి నిప్పెందుకంటు కొనెడిది? అని గద్దించిపలికెను. అప్పుడు ఈమెనే యపరాధియని అందరికీ తెలిసెను. అగ్నివలన కలిగిన నష్టమును

ఆమె నుండి వసూలు చేసిరి. చూసితిరా? రజోగుణము యొక్క ప్రభావము. మనుజుడు సాత్త్విక భావముతో నుండవలెననిన సాత్త్విక వేషధారణ యొక్క ఆవశ్యకత ఎంతైనా కలదు. అందుకొరకే శ్రీ జగద్గురువులవారు శివలాంఛనములను ధరియించమని. ఉపదేశము నిచ్చిరి. శివలాంఛనములు ధరించినవారు విశుద్ధ హృదయులగుదురు. తద్వారా శివసాక్షాత్కారమును పొందగలుగుదురు.

ఈ రీతిగా సహజదానము నుండి ప్రారంభమైన మాహేశ్వరుని జీవనము లేదా స్థితి లింగనిష్ఠాదుల వలన వుత్తరోత్తరముగా, ప్రగతిని పొందుచూ పూర్వాశ్రయ నిరసన మరియు సర్వాద్వైన నిరసనలను చేసి తన యిష్టలింగము నందున ప్రతి దినము ఆవాహన విసర్జనాదులను చేయకుండా దానిలో శివుడు వున్నాడని గట్టిగా నమ్మి అష్టమూర్తులలో శివుడున్నాడు అని భావింపక, సర్వవ్యాపకుడై యున్న. శివుడు తన యిష్టలింగమునందుననే కేంద్ర బిందువై యున్నాడని భావించుకొని భక్త దైహిక స్థలమున శివుడు తన హృదయ మందిరమున నున్నాడని నమ్ముచూ సాధనచేయ వలెననెడి దానితో ఈ మాహేశ్వర స్థలము సంపన్నమగుచున్నది.

'శివ వకోధ్యేయః శివంకరః సర్వమన్యత్ పరిత్యజ' అనెడి సూక్తి ప్రకారము కళ్యాణ కారకుడగు శివుడొక్కడే ధ్యానమునకు యోగ్యుడై యున్నాడు. ఇట్టి శ్రుతి వచనమును మనమునందు వుంచుకొని సదా శివధ్యానమును చేయుచు యిష్టలింగనిష్ఠ యందున అనురక్తిని పెంచుకొని యిష్టలింగార్చనను చేయుచూ తన హృదయముననే శివుడు గూడుకట్టుకొని యున్నాడని గట్టిగా నమ్మిన మాహేశ్వర స్థలములోని భక్తుడు ప్రసాద స్థలమును ప్రవేశించు చున్నాడు.

శ్రీ జగద్గురువులవారు ఉపదేశము చేశిన స్థలములన్నింటిని సరిగా అవగాహన చేసికొని తన సాధనను పరిపుష్టిని చేసి కొనుటకు వీరశైవులెల్లకు కృషి చేయవలయను. పూజ్యపాదులు మాహేశ్వర స్థలమును గురించిన ఉపదేశమును ముగిస్తూ ఈ క్రింది విధముగా ఆశీర్వచనము నిచ్చిరి.

**శ్లో॥ అన్యత్ర శంభోరతి మాత్ర శూన్యో**
**నిజేష్టలింగే నియతాంతరాత్మా ।**
**శివాత్మకం విశ్వమిదం విబుధ్యన్**
**మాహేశ్వరోఽసౌ భవతిప్రసాదీ ॥** (సి. శి. 10-77)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా శివుడు సర్వవ్యాపకుడై యుండిననూ మాహేశ్వరుడు సర్వత్రా శివరతిని చేయకుండా ఇష్టలింగము నందుననే శీమితము చేసిననూ శివుడిని విశ్వము నిండా నిండివున్నాడని భావించవలెను. ఇట్టి భావనను పొంది ఇష్టలింగమునందుననే నిష్ఠను దాల్చి తన హృదయమునందున శివుని ప్రకటనము చేసి కొనిన మాహేశ్వరుడు మున్ముందు ప్రసాదిగా పిలువబడుచున్నాడు. మీరందరూ మాహేశ్వర స్థలమును చేపట్టి అద్దానిని సమర్ధవంతముగా తమ సాధనలోనికి తెచ్చికొనగలరు. ప్రసాదిగా పరిణామము పొందుటకై తగిన అర్హతలను సంపాదించు కొనగలరు.

ఓం శాంతిః శాంతి ః శాంతి ః

ది ॥ 2-9-1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వచనమునందున సర్వగతుడైన సర్వేశ్వరుడ శివ భక్తుని హృదయ సీమలో విరాజిల్లు చుండునని నిరూపించనైనది.

మాహేశ్వర స్థలములోని భక్తుడు, విశ్వవ్యాపకుడైన శివుడు తన యిష్టలింగములోన విశేషముగాను స్థిరముగాను, నుండునని భావించ వలెనని యింతకు క్రితమే తెలిసి కొని యుంటిమి. స్వేష్టలింగము మీద నమితముగా నుండెడి నైష్ఠిక భక్తి పెంచికొనుట యే యా భావము యొక్క లక్ష్యమని గుర్తించ వలెను. అయితే, యితడు జంగమార్చన యందునను నట్టి నైష్ఠిక భక్తినే గల్గియుండ వలెను. ఈ విషయము తెలిపెడి యా ఆగమ ప్రమాణమును గనుడి:

**శ్లో॥ యో గురూక్తేన మార్గేణ లింగపూజారతః సదా ।**
**జంగమానర్చయే ద్భక్త్యా సహి మాహేశ్వరః స్మృతః ॥** (పారమేశ్వరా గమము ప. 5)

"సహజే దానే నిష్ఠతో భక్తో మాహేశ్వరః స్మృతః" యనెడి యాచార్యుల వాక్కులు మాహేశ్వరుడు సహజ దానియై యుండవలెనని తెలుప బడినది.

ఈ రెండు సూత్రముల దృష్ట్యా, సాధకుడు తన నిష్ఠా భక్తిని జంగమయ్య వైపు కేంద్రీకరించ వలసి యుండును. ఇట్టిభావ మేర్పడుటకై శివ భక్తులు వంద్యులనెడి భావమేర్పడుట నెంతయో యవశ్యము. తన్నిమిత్తమే యీ స్థలమున బోధన చేయబడినది.

శివుడు భక్తైక దేహుడనెడి భావనకు శివుడు భక్తికి వశ్యుడనెడి భావన నేపథ్యమున నుండును. భారతీయ సాంప్రదాయములో భగవంతుడు భక్తునికి వశుడై యుండునని యంగీకరించనైనది. ఈ భావమును స్పష్టపరచెడి ఆంధ్ర మహా భారతములోని యీ క్రింది ప్రమాణమును గనుడి:

**ఆదికి నాది లోకముల కన్నిటికిం బ్రభుడవ్వయుండువే**
**దాది పవిత్రవాచక సహస్ర పరిస్పుట వాక్యరూపు డం**
**హోదళన ప్రకారక శుభోదయ కారణ దివ్య నాముడం**
**భాదయితుండు దృజ్మహితఫాలుడులోలుడు భక్తి యుక్తికిన్ ॥** (ద్రోణ పర్యము, ఐదవ ఆశ్యాసము)

భక్తునికి వశుడయ్యెడి శివుడు భక్తుని హృదయ సీమలో విరాజిల్లునని తెలిసికొన గలరు. అట్టి వాని లక్షణములను తెలియ జెప్పెడి. శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి:

భక్తుని ముఖ దర్పణమున లింగము గాన వచ్చును
భక్త దేహిక దేవుడ నిమిషుడుగా ! కూడల సంగమ దేవుడు
భక్తుని నుడికి నడుమన రాశిగా నుండును
సకల జీవ రాశిలోను శివుడు గల డనెడిది నిజమే
కాని యతడు శివభక్తుని మదిన సమరస భావమున నుండునని గ్రహించ వలెను.
ఈ విషయమును తెలిపెడి. బసవపూరణములోని యీ క్రింది ప్రమాణమును గనుడి:

**సర్వగతుండగు శర్వులోపలను**
**సర్వంబు నుండంగ శరణుని మనసు**
**కరగు రెంటికి సమకళ గల్గుగాన**
**కరగునే తక్కిన నరుల చిత్తములు**
**నఖిలంబు లింగమధ్యంబున లేదె**
**యఖిలంబు నుండియు నందేమి ఫలము**
**శరణుని కొరకె శంకరుని లీలయును**
**శరణుని హృదయంబు శంకరుని కొరకె (కు) ః**
(బసవ పురాణము, షష్ఠాశ్వాసము, వావిళ్ళ ముద్రణ, పు. 430)

యథా వాక్కుల అన్నమయ్య వారును నిదే విధిన తెలియ జేసిరి.

అమరన్ భక్తుల కెల్ల నీవ హృదయంబై యుండుటన్ వారి సౌఖ్యము నీ సౌఖ్యము, వారి కూర్మియు సమగ్రంబైన నీ కూర్మి తత్త్వము భావింపగ వారి కోపము భవత్ప్ర ఖ్యాత రౌద్ర ప్రభావము, దా వారల వాక్యనిర్ణయము నీ వాక్యంబు సర్వేశ్వరా! (సర్వేశ్వర శతాకము, ప. 40)

మాహేశ్వర ధర్మము నాచరించువారు విశుద్ధులు, విరాగసంపన్నులు, జ్ఞానలునైన శివలాంఛన ధారులలో శివుడు వసించునని భావించి వారిని సేవించి వారికి దాసోహమున ధనాదులను సహజదానము చేయవలెను.

శివం భూయాత్

# ఏకాదశ పరిచ్ఛేదము

## ఆశీర్వచనము - 1

## ప్రసాది స్థలము

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు అగస్త్య మహర్షికి మాహేశ్వర స్థలమును గూర్చి పూర్తిగా వివరించిన పిదప, అగస్త్య మహర్షి ఈ క్రింది విధముగా వేడుకొనెను.

**శ్లో॥ ఉక్తో మాహేశ్వరః సాక్షాల్లింగనిష్ఠాదిధర్మవాన్ ।**
**కథమేషః ప్రసాదితి కథ్యతే గణనాయక ॥** (సి. శి. 11-1)

ఈ అభ్యర్థనలోని భావమేమనగా మొదట చెప్పబడిన లింగనిష్ఠాదుల ధర్మాచారణ సంపన్నుడైన మాహేశ్వర స్థలములోని భక్తుడు ఏ వైశిష్ట్య పరిణామము వలన ప్రసాదిగా పిలువ బడుచున్నాడు. శ్రీ భగవత్పాదులవారు అగస్త్యులవారి ప్రశ్నకు ఈ క్రింది విధముగా ఉత్తరమును యిచ్చిరి.

**శ్లో॥ లింగనిష్ఠాదిభావేన ధ్వస్తపాప నిబంధనః ।**
**మనః ప్రసాదయోగేన ప్రసాదిత్యేష కథ్యతే ॥** (సి. శి. 11-2).

ఈ ఉపదేశములోని భావమేమనగా సాధకుడు తన యిష్టలింగమునందున నితాంతమైన నిష్ఠ కలిగిన వాడగుటచేత అతని పాపబంధనములు తెగిపోయి ఎల్లపుడు మనస్సున ప్రసన్నత పొడసూపునో అప్పుడు అతడు ప్రసాదిగా పిలువబడుచున్నాడు. సదా ప్రసన్నుడై యుండుటయే ప్రసాది యొక్క లక్షణమై యున్నది.

వీరశైవ సిద్ధాంతమునందున సాధకుని యందలి భక్తి వికాసముగొని నటులనే అతని స్థితి యందున వికాసము కన్పట్టును. ఈ సిద్ధాంతమునందు చెప్పబడిన ఆరు విధములైన భక్తులలో అవధానభక్తి మూడవది. ఇది ప్రసాది స్థలమున నుండెడి భక్తునియందున నెలకొని యుండును. మొదటిదైన శ్రద్ధాభక్తి వికాసమై నిష్ఠాభక్తిగా పరివర్తనమొందును. అదియును వికసనమొంది అవధానభక్తిగా రూపుదాల్చును. అవధాన మనగా సావధానత లేదా జాగ్రత్త సదా జాగరూకుడై యుండెడి సాధకుడె ప్రసాదికాగల్గును చాల వరకు మనుజులు జాగరూకులై యుండుట యనెడిది అరుదు. అతడు ఏదో ఆలోచనయందు మగ్నుడై యుండును. అందుకే శాస్త్రకారులు జాగ్రత యందున జాగ్రత, జాగ్రత యందులి స్వప్నము, జాగ్రత యందలి సుషుప్తి యని జాగ్రతలో మూడు విధములుగా వర్గములను చేసిరి ఆత్మయొక్క ఎరుకలో నుండెడి జాగ్రతలో జాగ్రతమైన యెడల మనోరాజ్యము జాగ్రత యందలి స్వప్నమని పిలువబడు చున్నది. అందుచేత ఏదో కారణము వలన దిజ్మూఢుడై కూర్చుండట యనెడిది జాగ్రత యందలి సుషుప్తి, సామాన్యముగా మనుష్యుడు చూచుట యనెడిది జాగరూకతలో కనిపించి నప్పటికి అతడు నిజముగా జాగరూకుడుగా నుండక ఏదో ఒక కల్పన యందున మునిగి యుండును. మనుష్యుని ఈ మానసిక వికారమును దూరముచేసి మనస్సును పరిశుద్ధము చేయుటకై ప్రసన్నత కలిగి వుండవలెను. అట్టి ప్రసన్నత యిచ్చెడిదే ప్రసాది స్థలము. అందుచేతనే పూజ్యపాదులవారు "మనః ప్రసాద యోగేన ప్రసాదీ త్యేష కథ్యతే" అని ఆనతి నిచ్చిరి. ఎవరి మనస్సు నందున సదా ప్రసన్నత యుండునో అతడే ప్రసాది యనబడుచున్నాడు ప్రసన్నత యనెడిది మనస్సు యొక్క ఒక ఉత్కృష్టగుణమని యెఱుగవలెను.

మనస్సు యొక్క ప్రసన్నతయే ఆరోగ్యము యొక్క మూలసూత్రమై యున్నది. మనస్సునందున సంతోషరాహిత్యము, సమాధాన రాహిత్యము తాండవము చేసిన యెడల ఆ వ్యక్తి అనారోగ్యమునకు ఆమంత్రణ నిచ్చుచున్నాడు. ప్రసన్న హృదయని తాకుటకు ఏ రోగము ముందుకురాదు. సాధారణముగా మనుజునికి వచ్చురోగములన్నియును, వాత, పిత్త, కఫ జన్యములై యుండును. కాని సర్వసాధారణముగా మానసిక కారణము వలననే తొంబది శాతము రోగములు వచ్చుచున్నవని తెలియు చున్నవి. ఇట్టి మనోజన్యమైన

రోగములను దూరము చేసికొనుటకై నిరామయ జీవితమును గడుపవలయును. తన్ని మిత్తమై ప్రతి ఒక్కడూ ప్రసన్నుడై యుండుటకు ప్రయత్నించ వలెను. ఒకవేళ ఏదైన ఒక వ్యక్తి ప్రసన్నుడుగా లేడనిన ఆవ్యక్తిలో గల తృప్తిరాహిత్యమునకు సంబంధించిన వాసనలు ఆమానసిక ప్రసన్నతను దెబ్బతీయు చున్నవని గుర్తించవలెను. మనస్సులోని వాసనలన్నిటిని తృప్తిపరచుట ఎవరికినీ సాధ్యముకాదు. హఠముగల పిల్లలను సమాధానము చేయుట ఎంతదుస్తరమో మనస్సులోనున్న యిట్టి అసంతృప్తిని దూరము చేయుటయూ అంతే కష్టమైనది. గాలిని నిలుపవచ్చునేమో కాని మనస్సును నిలుపుట ఎవరికైనను తరమే? ఏదైన ఒక వస్తువు అవసరమని తోచినపుడు దానిని సాధించు నిమిత్తము మనస్సు ఎప్పుడునూ వ్యగ్రమై యుండును. ఆపేక్షితమైన వస్తువు దొరకినపుడు క్షణ కాలము వరకు సమాధానము కలిగిననూ, వేరొక వస్తువు యొక్క చింతన వలన మనస్సు మరల వ్యగ్రమగు చున్నది. జగత్తులోనున్న భోగభాగ్యములన్నింటినీ ఒక వ్యక్తికి యిచ్చిన యెడల వాడు తృప్తిని పొందునని భావించవలదు. వాడికి అసంతృప్తి వుండియే యుండును ఒక వ్యక్తిని పరిపూర్ణముగా తృప్తి పొందించ వలెననిన ఏదైనా ఉపాయము కలదా యను ఆలోచన వచ్చును. అట్టిది సాధ్యము కాదని తెలిసికొనవలెను. ఒక వ్యక్తికి భగవద్దర్శనము లభించినపుడే అట్టి పరిపూర్ణ తృప్తి కలుగునని విజ్ఞులు తెలియజేయు చున్నారు.

ఈ విషయమును స్పష్టము చేసెడి ఈ క్రింది కథను గమనించుడి.

ఒక చక్రవర్తి ఎంతో ఉదారుడుగా అనేకులకు భిక్షను యిచ్చుచుండెను. అతడు ఒక విశిష్టమైన నియమమును పాలించుచుండెను. అదెట్టిదనగా ఆదినమున వచ్చెడి మొదటి భిక్షుకుడికి వాడు ఏదైననూ, ఎంత అడిగిననూ యిచ్చి అతనిని తృప్తి పరచెడి నియమము. రాజుగారి ఈ నియమమును తెలుసుకొని అనేక భిక్షుకులు మొదటి భిక్షుకులై భిక్షను వేడుటకు ప్రయత్నించు చుండిరి ఈ విధముగా రాజదర్బారులో ప్రతిరోజు భిక్ష ప్రదానము చేసెడి కార్యక్రమము కొనసాగుచుండెను. ఒకానొక రోజు ప్రథమ భిక్షుకుడిగా వచ్చిన వాడు భిక్షాందేహి యని యాచించెను. అప్పుడు రాజ సేవకుడు అతని వద్దకు వచ్చి యథా ప్రకారముగా నీకు కావలసిన దేమిటి? ఎంత వలయును? అని అడిగెను. ఆ భిక్షుకుడు ఇంతకుముందు వచ్చిపోయిన వాడుకానందున విలక్షణుడై యుండును. నాకు ఏమికావలయును? ఎంత కావలయును? అనుటకంటె మీరు ఏమి యివ్వగలరు? ఎంత యివ్వగలరు. అది గమనించి తీసుకొని వెళ్ళెదను, అప్పుడా రాజ భటుడు యిట్టులనెను. ఓ భిక్షుకా! ఇది నీకు తెలియదేమో! మారాజు గారు విధించిన ఆజ్ఞ ప్రకారము నీకు ఏమికావలయునో ఎంత కావలయునో వేడవలసి యుండును లేని యెడల రాజాజ్ఞ ఉల్లంఘించిన యటుల యగును అని అనెను. అప్పుడా యాచకుడు రాజభటుని బలిమని గని తనలో తాను నవ్వుకొని ఆభటునితో నిట్లనెను. కానిమ్ము, ఇదిగో! నా చేతినందున ఒక చిన్న జోలెకలదు. ఇది నిండు వరకు ఏదైనను వేయ వచ్చును. అని అనెను. యాచకుని ఈ మాటలను వినిన రాజ భటుడు ఆభిక్షుకుని చిన్న జోలెను ఏదో ఒక ధాన్యముతో నింపుట కంటెను ముత్యములు, రత్నములతో నింపుట మేలని యెంచి రాజుగారి భాండాగారము నుండి రత్నాదులను ఒక బుట్టయందు నింపుకొని తెచ్చి జోలె యందు వెశేను. జోలె నిండిన యటుల కన్పించలేదు మరల మరొక బుట్టను తెచ్చి జోలెను నింపుటకు యత్నించెను. ఈ విధముగా ఎన్ని మార్లు వేసిననూ జోలెనిండ దయ్యెను. రాజుగారి భాండాగారము రిక్తమై పోయెను. ఈ ఆశ్చర్యకరమైన ఘటన గురించి విని ఆజోలెను చూచుటకై మహారాజుగారే పరుగెత్తు కొని వచ్చిరి. జోలె చూచుటకు చిన్నగానే వుండెను. మరి ఎందుకు నిండలేదు? అని ఆలోచించి ఆలోచించి సమాధానము గనలేని వాడై సమాధానము నిమిత్తము భిక్షుకునే ప్రశ్నించెను. ఇదెట్టిజోలె? ఎందుకు నిండుట లేదు? యని అడిగెను. అప్పుడా భిక్షుకుడు ఓ దొరా! ఇది మామూలు జోలె కాదు. బట్టతో కుట్టినది కాదు. మనజుని మనస్సు అనెడి జోలె ఇది. ఇందులో విశ్వమునంతను వేశిననూ ఎప్పటికినీ నిండదు. అని ప్రత్యుత్తరము నిచ్చెను. అప్పుడా రాజు అట్లైన ఈ జోలెను నింపెడి మార్గమేదెన కలదా? యని అడిగెను. అటులనే దీనిని నింపెడి సామర్థ్యము ఎవ్వరికైనను వుండునా? అని ప్రశ్నించెను. అప్పుడా భిక్షుకుడు రాజునుద్దేశించి ఓ మహారాజా! ఈ జోలెను నింపెడి మార్గము పరమాత్మునికి మాత్రమే తెలియును. అతడు మాత్రమే దీనిని నింపగలడు. అని బదులు పలికెను. ఈ మాటలను వినిన మహారాజు మనసు నందలి మాలిన్యమును దూరము చేశెడి భావము యిమిడి యుండెను. అనగా మహారాజు కూడా తనధ్యాసను భగవద్భక్తి వైపు మరల్చు కొనవలయు ననెడిదే భిక్షుకుని మాటలోని భావము సాధారణ మానవుడిని భిక్ష ద్వారా తృప్తి పరచుట కంటెను భక్తి ద్వారా సర్వేశ్వరుని తృప్తి పరచుట మేలైన పనికదా! ఎవరి మనస్సునందున పరమాత్మని చింతన అహర్నిశలూ నడుచుచుండునో అట్టివాడే నిత్య సంతృప్తుడై యుండగలడు. ఇట్టివాడు ప్రారబ్ధ కర్మల వలన దొరికిన ఫలములను గైకొని తృప్తి పొందును. వాటిలోని కనిష్టత, గరిష్టతల గురించిన చింతవుండదు. దొరకినదానితో తృప్తి పొందును. ఈ తృప్తి యందుననే నిజమైన సుఖము యిమిడి వుండును. లేని యెడల నిరంతరము దుఃఖమే

లభ్యమగును. ఆ దుఃఖములోనే కాలమును వెళ్ళబుచ్చ వలసి యుండును. వీరశైవ ఆచార్యులు సాధకుని సదా సంతృప్తుడై యుండవలెనని యే ఈ ప్రసాది స్థలమున ఉపదేశము నిచ్చిరి. మనస్సును ఆమూలముగా పరివర్తన చేయనిదే అందులో ప్రసన్నతను నింపుట సాధ్యము కాదు. ఈ కారణము వలన మనస్సు యొక్క వుత్పత్తికి సంబంధించిన కారణము నందుననే పరివర్తనను చేయువలసి యుండును. "అన్నమయం హి సౌమ్య మనః" అనెడి ఛాందొగ్యోపనిషత్తు సూక్తి ప్రకారము అన్నమే మనస్సు యొక్క వుత్పత్తికి కారణభూతమైన అంశము. మనము సేవించెడి అన్నము యొక్క పరిణామము వలననే మనస్సు తన స్మరణ శక్తిని కోల్పోవును. మనస్సు యొక్క నిలుకడకు ఆహారమునకు గల అవినాభావ సంబంధమును తెలియ జేసెడి కథ యొకటి కలదు.

పూర్వకాలమున నొక ఋషి వరేణ్యుడు మనస్తత్వము నెరిగిన వాడై సుఖమ యమైన జీవితమును కొనసాగించు చుండెను. అతని కొక పుత్రుడు గల్గెను. వానికి యుక్త వయస్సు రాగానే గురు కులమునకు పంపించెను. చిరకాలము వరకు విధ్యనభ్యసించిన పిదప పుత్రుడు, వెనుదిరిగి వచ్చెను. తల్లి దండ్రుల కెంతయో సంతోషము గల్గెను. ఋషి తనకొడుకు నుద్దేశించి "యేమేమి విద్యల నభ్యసించితి" వని అడిగెను. "వేద వేదాంగేతి హాసములతో పాటుగా ఆగమాదులను కూడ యధ్యయనము చేసితి"నని కొడుకు ఉత్తరము నిచ్చి, ఆయా వేదా గమాదులలోని మంత్ర భాగమును పఠించి వినిపించెను. పఠనములోన యెట్టి లోపము లేకుండెను. తండ్రిగారు సంతోషపడిరి. "నీకు ధారణ శక్తి యమోఘముగా నున్నది. సంస్కరణ యనెడిది ధారణకు మూలాధారము స్మరణ శక్తికి మనస్సు కీలకమై యుండును. ఔచిత్యము నెరిగి యన్న సంసేవన జేయవలెను. తద్వార నీ స్మరణ శక్తిని కాపాడు కొను"మని భోదించెను. తండ్రిగారి మాటలు, కొడుకులోన నాలోచనల రేకెత్తించెను. తాను కష్టపడి కంఠస్థము చేసిన మంత్రము లెక్కడికి పోవును. అన్నముతో వాటికి సంబంధమెక్కడిదని తలచెను. ఋషి గారు కొడుకులో పొడసూపిన యనుమానము సందేహమై యొక ప్రశ్నగా తలయెత్త గలదని గ్రహించెను. తన కొడుకుకు జ్ఞానోదయము గల్గింప నెంచి యిట్లులనెను. "నీవు ఉపవాస దీక్షను స్వీకరించుము క్రమ క్రమముగా నాహారమును తగ్గించుచు నిరాహారివిగా అగుము. ఆ పిదప ఆహారము సేవన క్రమముగా పెంచికొని వచ్చుచు మామూలు స్థితికి రమ్ము. ఒక పక్షము పర్యంతర మీ విధిన చేయుమనెని తండ్రిగారి మాటలలోన మౌచిత్యము గలదని యెంచి యుపవాస దీక్షను వహించెను. శాస్త్రవిహితమైన చాంద్రాయణ వ్రతమును చేయ బూనెను. పాఢ్యమి నుండి ఆహారము తగ్గించుచు తగ్గించుచు అమావాస్య నాటికి నిరాహారి అయ్యెను. కేవలము నీటిని మాత్రమే సేవించు చుండెను. అప్పుడా ఋషి పుత్రుని సమీపించి, "నీవు నేర్చిన మంత్రములను మరొక పరి వినవలెనని కోరిక గల్గినది వినిపించు" మనెను. కొడుకెంత ప్రయత్నించిననూ మంత్రములు స్మరణలోనికి రాకుండెను.కంఠస్థము చేయబడిన మంత్రము లేల జ్ఞాపకమునకు వచ్చుట లేదో? యనెడిది తెలియక మథన పడెడి కొడుకును గని, "వత్సా! విశ్రమించుము. తరువాత చదివించి కొనెద" నని చెప్పెను. పౌర్ణిమకు వ్రతము సమాప్తమయ్యెను. కొడుకు యథావిధిన ఆహారము సేవించు చుండెను. తన తండ్రిగారు మంత్ర పఠనము చేయుమని కోరెను కదా! యని జ్ఞప్తికి తెచ్చికొని, తండ్రిని సమీపించి "మంత్ర పఠనము చేసెదను. విను" దనెను తండ్రి సమ్మతించెను. కొడుకు అప్రయత్నముగానే అన్ని మంత్రములు చదివెను. అప్పుడా తండ్రి "వత్సా! నేనడిగినప్పుడేల పఠించవైతి"వని యడిగెను. కుశాగ్ర బుద్ధి గల్గిన కుమారుడు, తండ్రి గారి మనోగతము నెరింగెను. తన యజ్ఞానమును దూరము చేయుటకే తండ్రి తనకీ వ్రతము నాచరించుమని చెప్పెనని గ్రహించెను. "తండ్రీ! నాకు జ్ఞానోదయ మైనది. మనస్సుకు ఆహారముతో గల సంబంధమును ప్రయోగాత్మకముగా తెలియ జెప్పితిరి. నేను ధన్యుడనైతి" నని తండ్రికి కృతజ్ఞతా పూర్వకముగా వందనమాచారించెను. మనము సేవించెడి అన్నమే, ధాతు రూపము దాల్చి మనోదారుఢ్యమునకు పకరించునని గ్రహించ గలరు.

ఆహారము సాత్విక, రాజస మరియు తామ సములనియెడి మూడు విధములుగా నుండును. సులభముగా జీర్ణమై మనస్సున సత్యగుణమును ప్రవర్తింప జేసెడి పాలు, పళ్ళు, కాయగూరలు, మొలకెత్తిన పప్పు దినుసులు, ఉప్పు-కారము తగ్గ ముఖమున నుండెడి పక్వాన్నములు సాత్వికాహారము కోవకు చెందినవి. మద్యమాంసాదులు, అతిగా ఉప్పు-కారములతో పాటుగా ఘాటైన మసాలాలలో కూడిన పక్వాన్నములు రాజస గుణము గల్గించును. అందుచేత, ఇది రాజసాహారముగా పిలువబడు చున్నది. చల్దిది, పాచినది మొదలగు అథమ శ్రేణికి చెందిన యాహారము తామసాహారమని పిలువ బడుచున్నది.

వీరశైవ సిద్ధాంతమున పదార్థ సేవన కంటెను ప్రసాద సేవనకే ప్రాముఖ్యత గలదు. స్వాత్విక గుణమును గల్గించెడి పదార్థములను యిష్ట లింగమునకు నివేదించగా నయ్యవి ప్రసాదముగా పరిణమించును దీనిని సేవించుట చేత మనుస్సు నిర్మల మగునని తెలిపెడి శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమును గనుడి.

శ్లో॥ నైర్మల్యం మన నో లింగం ప్రసాద ఇతి కథ్యతే ।
శివస్య లింగరూపస్య ప్రసాదా దేవ సిద్ధ్యతి ॥
శివప్రసాదం యద్ద్రవ్యం శివాయ నివేదితమ్ ॥
నిర్మాల్యంతత్తుశైవానాం మనోనైర్మల్యకారణమ్ ॥ (సి. శి. 11-6;7)

మనస్సు యొక్క నైర్మాల్యమే ప్రసాదము. మనస్సు యొక్క యీ నిర్మలత శివ ప్రసాదము యొక్క సేవన చేత ప్రాప్తమగును. ఈ కారణమున ప్రతి యొక్కరు తాము సేవించెడి ఆహారమును, ఇష్ట లింగమునకు సమర్పించి స్వీకరించ వలెను. ఇట్టి సమర్పణను లింగమునకు తినిపించుటగా భావించ వలదు. పదార్థములలోని దోషములను నివారించి కొనుటకే సమర్పణ, చేయవలెనని గ్రహింప వలెను.

శివుడు పదార్థమును గ్రహించదు. అందులోని దోషములను గ్రహించి, నిర్మలమైన దానిని మనకు ప్రదానము చేయుచున్నాడు.

ప్రకృతి సహజముగానే పరిశుద్ధముగా నుండును మానవుడు అపరిశుద్ధతకు కారణుడగు చున్నాడు. అపరిశుద్ధతను గ్రహించి, ప్రకృతి పరిశుద్ధమొనర్చి మనుజునికి ప్రదానము చేయుచున్నది. పూల చెట్టను ఉదాహరణగా గైకొన వచ్చును. దుర్గంధ పూరితమైన పదార్థములను, మలయుక్తమైన జలములనది గ్రహించి సుగంధ భరితమైన పుష్పములను ప్రసాదించు చున్నది. ఫలదాయకములగు వృక్ష సంపదయు నీ కోవకు చెందినవే. అదే విధిన శివాకారమైన యిష్టలింగము దోషములను సంగ్రహించి మనోనైర్మల్య కారణమగు ప్రసాదమును ప్రదానము చేయుచున్నది.

సమర్పించెడిది సాత్వికాహారమైన యప్పుడు వాటిలో నుండెడి దోషము లెట్టివి? యనే సందేహము గల్ల వచ్చును. మానవుడు ద్రవ్యార్చన నిమిత్తమున నెన్నియో దోషభూ యిష్టమైన పనులను చేయును. అట్టి ద్రవ్యము చేకరింపబడిన పదార్థములలో నీ దోషమిమిడి యుండును శివార్పణ చేసి యా దోషషములను తొలగించికొనవలెను.

మాహేశ్వర స్థలములోని భక్తుడు ఎప్పుడూ ప్రతినిత్యము శివ ప్రసాదమును సేవించెడి వ్రతమును అత్యంత అవధాన పూర్వకముగా పరిపాలించునో అప్పుడు అతడు ప్రసాధి యని పిలువ బడుచున్నాడు "అన్నమ్ బ్రహ్మేతి వ్యజానాత్" అనెడి ఉపనిషత్ వాక్యము ప్రకారము అన్నము కూడా పరబ్రహ్మ స్వరూపమేయై యున్నది. ఈ కారణము వలన ప్రతి ఒక్కరూ అన్నము యెడల పూజ్య బుద్ధిని దాల్చి యుండవలెను. అన్నము వండిన పిదప దానిని దేవతాభావముతో పూజించి అనంతరము దేవునికి నైవేద్యముగా పెట్టి తనకు దొరికిన ప్రసాదమును ఏమీ మిగల్చకుండ సేవించ వలెను. అప్పుడే మనము అన్న పరబ్రహ్మను పూజించిన వారమగుదుము. ఈ దినములలో ఎల్లెడల అన్న పరబ్రహ్మ యొక్క అవమానము చేయుట యనెడిది కనబడుచున్నది. "ఎడ" చేసుకొనిన అన్నమును సగము, సగమే తిని మిగిలినది బయటకు వేసెడి అనిష్టపరంపర ప్రారంభమైనది. ఇటీవలి కాలములో కూర్చొని అనెడి పద్ధతిలుప్తమై పశువులవలె తిరుగాడుచు తినెడి ప్రవృత్తి దినదినము పెరుగు చున్నది. దీనిని చూసిన పిదప మనమే మన సంస్కృతిని పాడుచేసుకొను చున్నామేమో అనుభావము కలుగును. ఇది ఎంతో బాధకరమైన విషయము. ఈ పద్ధతి ఈ విధముగనే కొనసాగిన యెడల భారతదేశ సంస్కృతికే ఒక పెద్ద కళంకము రాగలదు. భారతీయ తత్త్వశాస్త్రము నందున భోజనమనగా ఒక యజ్ఞమనియే భావించబడినది. ఏ విధముగానైతే యజ్ఞకుండములో దేవుని యొక్క నామమములు స్మరించుచూ హవిస్సు వ్రేల్చబడునో అదే విధముగా ప్రతి వ్యక్తి తమ ఉదరమునందున నుండెడి వైశ్యానర అగ్ని రూపములో గల పరమాత్ముని సేవించు చున్నటుల భావించుకొని అన్నము ముద్దలను భగవన్నామ ఉచ్చారణ చేయుచూ తీసుకొనవలెనని చెప్పబడినది. బసవేశ్వరుల వారుకూడా ప్రసాదమును స్వీకరించు సమయమున ఊరికే తినకుండా ప్రతి ముద్ద కొకసారి శివ నామము స్మరిస్తూ స్వీకరించవలెనని తెలియ జెప్పిరి. ఇవి నేటి కాలమున సాధ్యమగునే? యని కొందరడగ వచ్చును. కాని భక్తి గల వారికి, నిష్ఠయున్నవారికి నుసాధ్యమే యని అనుభవజ్ఞులను చున్నారు. యజ్ఞములేక పూజాదులను చేయునపుడు మనుష్యుడు స్నానాదులను చేశి శుచిర్భూతుడై పాల్గొను నటులనే భోజనము చేయునపుడు కూడా ఆశుచిత్వమును పాటించిన యెడల ఆ అన్నమును పరబ్రహ్మ స్వరూపముగా నెంచి స్వీకరించుటకు వీలగును. శాస్త్ర విహిత పద్ధతిలో అన్నమును సేవించుటకు అలవిగాని వానికి ఆ పరబ్రహ్మ తత్త్వము అవగతమగునే? కానేరాదు. అన్న పరబ్రహ్మము యెడల గౌరవ భావము కలిగిన వాడే శివ పరబ్రహ్మ జ్ఞానమును పొందుటకు అర్హత గలిగి యుండును. ఈ విషయమునే లోకులు ఎరుగుట కొరకై శ్రీ సిద్ధాంత శిఖామణిలో ప్రసాది స్థలము ఉపదేశించ నైనది. దీక్షా విధానమునందు ప్రసాది దీక్ష యనెడి యొక్క విశిష్టమైన సంస్కారము కలదు. ఈ దీక్షను స్వీకరించిన వాడు తన జీవన పర్యంతము అన్నము యెడల గౌరవ భావమే కలిగి యుండగలడు. ఇతడు ఆహారమును సేవించునపుడు అద్దానిని

యిష్టలింగమునకు సమర్పణ జేసి సేవించును. ప్రసాదములోని ఒక్క కణమైనను వదలకుండా భక్తి భావముతో గైకొనును. ఇంతటి ప్రసాద సేవనా పద్ధతి వలననే మనస్సు ప్రసన్నమగును. ఈ మనస్సును శుద్ధిచేసికొన వలెననిన ఆ అన్నము పరిశుద్ధమైనదై యుండి అయ్యది శివార్పితమై యుండవలెను. అద్దానిని మిగల్చకుండా సేవించెడి భక్తి భావన గలిగిన వాడై ప్రసాది యని యనిపించుకొనుటకు అర్హత గలిగి యుండును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 3-9 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

ప్రసాది స్థలమున, శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యుల వారు ప్రసాదమునకు సంబంధించిన మౌలికాంశములను వివరించిరి.

భక్తి మార్గమున ప్రసాదమున కెంతయో ప్రాముఖ్యత గలదు. ఆరాధ్యములగు గురు-లింగ-జంగముల నారాధించి యారాధకుడు పొందెడి యారాధనా ఫలమే ప్రసాదమని సర్వత్ర గుర్తించ బడినది.

"ప్రసాదస్తు ప్రసన్నతా" అనెడి యమరసింహుని వాక్కు ప్రకారము ప్రసాదము మరియు ప్రసన్నతలు పర్యాయ పదములు ఇవి నైర్మాల్యమునకు పేర్లని చెప్పబడినది. "ప్రసీదతతి ప్రసాదః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము ప్రసన్నమగుటయే ప్రసాదము.

"నైర్మల్యం మనసోలింగం ప్రసాద ఇతి కథ్యతే" అనెడి శ్రీ భగవత్పాదుల వారు ప్రసాదమున కిచ్చిన నిర్వచనము మనస్సు నిర్మలముగాను, ప్రసన్నతతో నుండుటయే ప్రసాదమని చెప్పబడినది. మానసిక ప్రసన్నత నిర్మలమైన జ్ఞానము వలననే సిద్ధించునని గ్రహించ వలెను. అజ్ఞానికి క్లేశముండునే గాని ప్రసన్నత యుండదు. కేవల జ్ఞానము కూడ ప్రసన్నత నివ్వజాలదు. మనస్సు యొక్క చంచలత్వమును నిరోధించెడి శక్తి కేవల జ్ఞానమున కుండదు. నిర్మలమైన జ్ఞానమే చిత్తవృత్తిని నిరోధించి ధారణా శక్తిని పెంచగలదు. ఇట్టి నిర్మలమైన జ్ఞానము శివునికి నివేదింప బడిన పదార్థములను స్వీకరించుట వలన లభించు చున్నది. ఎట్టి పదార్థమైనను శివునికి నివేదించిన పిదప నయ్యది నిర్మలమై యుండునని గుర్తించ వలెను. అద్దానిని భక్తుడు ప్రేమాను రాగములతో సేవించును. ఈ విషయమును మల్లికార్జున పండితుడీ క్రింది విధముగ తెలిపిరి.

**కం॥ నిర్మల పదార్థమగుటను**
**నిర్మాల్యం బనగ నెగడు-నీ నిర్మాల్యం**
**బర్మిలి గుడుతురు భక్తులు**
**కర్మక్షయ మగుట మోక్ష - కాంక్షులు రుద్రా!** (శివతత్త్వ సారము, ప. 219)

స్థూలముగా నిర్మాల్యము మరియు ప్రసాదము లొకటే అయినను, సాంకేతికముగా నివి భిన్నమైనవిగా దోచును. నిర్మాల్యము కారణమైతే ప్రసాదము కార్యమగునని గుర్తించ వలెను. దీని భావమేమనగా నిర్మాల్యమును కుడుచుట వలన ప్రసాదము సిద్ధించును.

ప్రసాద భావనను వివరించి చెప్పెడి యత్నమును చతుర్వేద సారములోన గాంచ గలము. శ్రీ సోమనాథుల వారి యీ క్రింది పద్యము గమనార్హమైనది.

**ముదమంది శివధర్మమున ఎనిర్మలత్వాచ్చ నిర్మాల్యంఎ మనుచు వినిశ్చ యముగ**
**నయమొంద స్కాందమునం ఎద్రివిధం చార్పితం చైవఎ యని విశ్రుతముగ నలరి**
**ఘన మా శివ రహస్యమున ఎనిష్టలింగస్య యద్దత్తమనుచు విఖ్యాతముగను**
**మొదలను శ్రీ లైంగ్యమునఎ యదా హారాయ కల్పితం బనుచు నఖండ లీల**

**మ్రోయు బహుపురాణ మూలంబు లింగ ప్ర**
**సాదమనుచు విషము శంకరునకు**
**నర్పితంబు జేసి యారగించి నట్టి**
**ప్రతిభ మీకె చెల్లు బసవలింగ!** (చతుర్వేద సారము, ప. 70)

నైష్ఠిక లింగ భక్తి గల్గి మనః ప్రసన్నతా సిద్ధికై శివ ప్రసాదమును నవధాన భావనతో సేవించెడి వాడు ప్రసాది యనియును, అతడు చెసేడి భక్తి యవధాన భక్తి యని గుర్తించవలెను. సావధాన చిత్తముతో ప్రసాద సంసేవన చేయనిచో భక్తి యల వడదని తెలిపెడి మహానుభావి యొక్క యీ క్రింది పద్యము గమనార్హమై యున్నది.

**అవిరళ లింగపూజయు నిరంతర సద్గురు భక్తి యుక్తియున్**

**శివం భూయాత్**

**సవినయ జంగమార్చనయు సత్యము శౌచము సచ్చరిత్రయుం**
**దవిలి ప్రసాద సేవనయు దానొాడ గూర్చక వట్టి మాటలం**
**దవునె యుదాత్త భక్తి సుగుణాకర! శ్రీ కర! దోషభీకరా!** ( అనుభవ సారము, ప. 94)

## ఆశీర్వచనము - 2

## ప్రసాది స్థలము

ప్రసాది స్థలములోని భక్తుడు నైష్ఠికతలో తన యిష్టలింగమునకు సమర్పించిన ప్రసాదమును మాత్రమే స్వీకరించునని తెలియ జెప్పెడి ఉపదేశమును శ్రీ భగవత్పాదుల వారు అగస్త్యమహర్షికి ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో ॥ అన్నశుద్ధ్వాహి సర్వేషాం తత్త్వశుద్ధిరుదాహృతా ।**
**విశుద్ధమన్నజాతం హి యచ్ఛివాయ సమర్పితమ్ ॥**

**తదేవ సర్వకాలం తు భుంజానో లింగతత్పరః ।**
**మనఃప్రసాదమతులం లభతే జ్ఞానకారణమ్ ॥ (సి. శి. 11; 9-10)**

ఈ ఉపదేశములోని సారంశమేమనగా మనము సేవించెడి అన్నము పరిశుద్ధమై యుండిన యెడల దాని చేత నిర్మించబడెడి మనస్సు పరిశుద్ధముగా కాగలదు. అన్నము పరిశుద్ధము కావలెననిన మనము సేవించుటకు మొదలు దానిని శివునికి సమర్పించవలెను. లింగనిష్ఠ కలిగిన మాహేశ్వర స్థలములోని భక్తుడు సకల పదార్థములను తన యిష్టలింగమునకు సమర్పించి సేవించును ఈ విధముగా ప్రతి దినము ప్రసాదము సేవించుట చేత అతని మనస్సు ప్రసన్నమగుచున్నది. ఇట్టి ప్రసన్నహృదయమే జ్ఞానప్రాప్తికి దోహదము చేయును. మనుజుని జీవనమునందున మనశ్శాంతి ఎంతో అవశ్యమైనది. దినదినము మనము చేశెడి లౌకిక మరియు అలౌకిక వ్యవహారములన్నియును మనమనస్సుయొక్క సమాధానము కొరకే చేయుచున్నాము. ఇట్టిది సాధించుటకై కొందరు శబ్ద, స్పర్శ, రూప, రస మరియు గంధములను వెన్నంటి పోవుచున్నారు. వాటిని వారు ఎన్ని మార్లు అనుభవించిననూ పరిపూర్ణమైన సమాధానమును పొందలేకయున్నారు. మనశ్శాంతిని పొందలేక పరితపించెడి నెందరినో మనము గాంచగలము అయితే మనశ్శాంతి అనగానేమిటి? అనెడి ఒక జిజ్ఞాస కొందరి మనస్సులలో తల యెత్తవచ్చును. శాంతి, సమాధానములు బహిర్గతమున లభించెడి వస్తువులుకావు. ఇవిమనలోననే నున్నవి. ఇవి మన ఆత్మస్వరూపములై యున్నవి. దానిని ఎరిగెడి మనము మనస్సును స్థిరముచేసి కొనలేని స్థితిలో యుండుటచేత వాటి యొక్క అస్తిత్వమును గుర్తించ లేక పోవుచున్నాము. మనస్సును స్థిరము చేసికొనుటకై ప్రాణాయామము, ధ్యాన ధారణాదులు మొదలైనవి. యోగశాస్త్రమునందున చెప్పబడినవి. దానికంటెను మొదలుగా మన మనస్సు యొక్క నిర్మాణమునకు కారణభూతమైన అన్నము వైపు దృష్టిని సారించెడి అవశ్యకత కలదు. ఎవరికి యోగ్యమైన మరియు ప్రమాణమునకు తగినంత సేవించవలెననెడి కళ అవగతమగునో అట్టివారే యోగశాస్త్రములోని రహస్యములను ఎరుగుటకు అర్హులు కాగలరు. ఇది తెలియజెప్పుటకే ఆచార్యులవారు ప్రసాది స్థలమును ఉపదేశించిరి. ఇట్టి మాటలనే గీతాది గ్రంథములలో గాంచగలము. యుక్తమైన ఆహారమును, విహితమైన విహారములు ఎంతో అవశ్యకములు. సరిగా తినుటను ఎరిగినవాడే యోగి కాగలడు అనెడి మాటను వినినప్పుడు ఎంతో మందికి ఆశ్చర్యము కలుగ వచ్చును. ఇదేమిటి? మనకు తినుటకు రాదా? యనెడి భావన కూడా జనులయందు ప్రశ్నరూపమున బహిర్గతము కావచ్చును. నూటికి తొంబది శాతము వ్యక్తులకు భోజన స్వీకారకళ రాదని యనిన యెడల అతిశయోక్తి కాజాలదు.

భోజనము చేయద మెరిగిన వానికి రోగము లేదు అనెడి లోకోక్తి యొకటికలదు. ఇదెంతో మంది వ్యక్తులు గుర్తించరని తెలియజేప్పెడి ఆధారములు గలవు. రోజురోజుకు క్రొత్త క్రొత్త చికిత్సాలయములు, క్రొత్త క్రొత్త చికిత్సా పద్ధతులు, చికిత్సా పరికరములు వచ్చుచున్నవి. అతిగా తిని ఒళ్లును పెంచుకొని తద్వారా బాధను పొందుచు ఆయర్వేద వైద్యశాల నుండి అల్లోపతి వైద్యశాలకు, అచటనుండి ప్రకృతి చికిత్సాలయమునకు, ఆచికిత్సాలయము నుండి యోగాశ్రమమునకు పరుగులు తీసెడి వారు ఎందరో మనకు తెలియదా? సౌకర్యములు పెరిగిన కొలది రోగములు తగ్గుముఖము పట్టవలెను. కాని దినదినము రోగముల సంఖ్య తారాస్థాయినందు చున్నది. కొంగ్రొత్తరోగములు తలయెత్తి వైద్యుల మస్తిష్కములను, రోగిష్టుల ద్రవ్యసంచులను కొరికి వేయుచున్నవి. పూర్వకాలమునందున ఒకే వైద్యుడు అన్ని రోగములకు చికిత్సను చేసెడివాడు. నాడీ పరీక్ష ద్వారా ఎంతరోగమునైనను గుర్తించి దానికి చికిత్స చేసెడివారు నేడునూ కలరు. కాని వారిని గౌరవించెడివారెవరు? నేటి కాలమున ఒక్కొక్క అవయవమునకు ఒక్కొక్క వైద్యుడు ప్రత్యేకీకరణ సాధించి చికిత్సచేయుచున్నాడు. నేడైతే పంటికొక వైద్యుడు, కంటికొక వైద్యుడు, యెముకకొక వైద్యుడు, ముక్కుకొక వైద్యుడు వున్నారు. ఈ విధముగా అన్ని ప్రధాన అవయవములకు వైద్యులు గలరు మునుముందు ఇది వైపరీత్యమును పొంది ముప్పదిరెండు పండ్లకు ముప్పదిరెండు రకములైన వైద్యులు అవసరమగునో ఏమో? యనెడి భీతి మనకు కలుగుచున్నది. వీరందరికినీ విరామములేకుండా రోగులు వచ్చుచున్నారు గదా! దీనిని చూసిన యెడల రోగముల సంఖ్యతో పాటుగా రోగిష్టుల సంఖ్య కూడా దినదినము పెరుగుచున్నది.

సమస్తరోగములకు ఉదరములో నున్న అజీర్ణత యే మూల కారణము అగుచున్నది. ఈ కారణము వలన యుక్తాహారిగా మారిన పిదప మనుజుని స్థూల మరియు సూక్ష్మశరీరములు ఆరోగ్య భరితముగా నుండగలవు. సాత్వికాహారము యొక్క పాత్ర యెట్టిదో వేరుగా చెప్పనక్కరలేదు. సాత్వికాహారము రోగములనే విధముగా తగ్గించునో అదేక్రమమున రాజసిక ఆహారము రోగముల సంఖ్యను పెంచును. ఈ విషయమునెరిగిన పాశ్చాత్యులు మాంసాహారమును వీడి ఆదేశములలో ఖరీదైన ఆహారముగా నెంచబడెడి శాఖాహారములను భుజించుచున్నారు. దీనికి విరుద్ధముగా మనదేశములో శాఖాహారుల సంఖ్య తగ్గుముఖము పట్టుచున్నది.

దేహము మరియు మనస్సులు ఆరోగ్యవంతముగా నుండవలెననెడి ధ్యాసలేని నేటి మనష్యులు ఏమి తినవలయునో ఏమి తినకూడదో అనెడి వివక్షతను కోల్పోయినారు. ఉదరమునందలి జఠరాగ్ని రూపమైన పరమాత్ముని నివాస మందిరమును అడ్డమైన కసవు మరియు దోషభరిత పదార్థములతో నింపుచున్నారు. ఏమితినవలయనో ఏమి తినకూడదో అనెడిది తెలుసుకొనెడి గుణగణములు కూడా ఉండిన యటుల కనుపించదు. ఆరోగ్యశాస్త్రము ప్రకారము ఉదరములోని అర్థభాగము అన్నము, మిగిలిన భాగములోని అర్థభాగమునీరును, ఆ మీద మిగిలిన భాగము గాలికొరకు ఖాళీగా వుంచవలెనని చెప్పబడినది. ఇది యిటులుండగా వీరు తిండికొరికే బ్రతుకుచున్నారా? అనెడిది తోచు విధముగా గొంతు వరకు అన్నమునే నింపుచున్నారు. అందులో వీటికైనను స్థానముండదు.

ఒక వ్యక్తి ఒక సమారంభముయొక్క అతిథిగా పోయి అచ్చట వుండెడి పంచవిధ పక్వాన్నములను గని భోజనమునకై పూనుకున్నపుడు అత్యాశతో మధురపదార్థములను అతిగా సేవించెను. సేవించెటప్పుడు ఎంతో ఆనందము ననుభవించెను. అయితే అతిగా సేవించుట చేత ఉదరశూల ప్రారంభమయ్యెను. అద్దానిని నివారించుకొనుటకై ఒక వైద్యుడి కడకేగెను. అప్పుడా వైద్యుడు ఒక మాత్రనిచ్చి దీనిని మ్రింగి ఒక గ్లాసెడు నీరు త్రాగుడీ అంతా సరిపోవును అని అనెను. అప్పుడా మనుజుడు నాపొట్టలో ఆ మాత్రమైనను చోటు లేదు గదా! ఒకగ్లాసెడు నీరు త్రాగుట ఎటుల? అనెను. అయిననూ అంత మాత్రము చోటుండినచో మరొక భక్ష్యమును తినియుండెడివాడిని కదా! అని వాపోయెను.

చూచితిరా? భోజనము యొక్క అత్యాశ. అన్నము తనదైనను కానీ, ఇతరులదైనను కానీ పరిమితిని మీరి సేవించిన యెడల విపరీతములను ఎదుర్కొన వలసి యుండును.

మనము మనయింటికి ఎవరినైనను భోజనము కొరకై పిలిచినపుడు వారు పొట్టనిండా తినిననూ వారికి వెక్కసమయ్యే విధముగా మరల మరల బలవంతముగా వడ్డించెడి సంప్రదాయము మనలో కలదు. అయితే దీని వలన తినిపించెడివాని అహంకారమునకు తృప్తి, కావచ్చును. కాని తినెడివాడికి అది శిక్షయే కాగలదు. అందుచేతనే సుభాషితకారులు 'అతిసర్వత్రవర్జ్యయేత్' అని ఉపదేశించిరి.

ఒకసారి ఆయుర్వేద ఆచార్యుడొకడు తన శిష్య సమూహమునకు వనస్పతుల యొక్క గుణధర్మములను మరియు వాటివలన నివారింపబడెడి రోగముల గురించియు తెలియపరచెను. ఒకదినము వారిని పరీక్షించుటకై కోరరుక్ అని అడిగెను. దీని భావమేమనగా

రోగములేని వాడెవ్వడు? అప్పుడు శిష్యులలోని ఒకడు చ్యవనప్రాశను సేవించెడువాడు అని అనెను. మరొక్కడు కాదు కాదు త్రిఫలాచూర్ణమును తినెడివాడు అని అనెను. మరొకడు ఆరెండునూ కాదు. చంద్రప్రభాగుళికలను తినెడివాడు అని అనెను. ఇవన్నియును సరియైన జవాబులు కావని యెరిగిన జాణయైన శిష్యుడొకడు ఈ విధముగా పల్కెను "హితభుక్" "మితభుక్" "ఋతుభుక్" అని వుత్తరమునిచ్చెను. దీని భావమేమనగా హితముగా, మితముగా మరియు ఋతుక్రమమునకు అనుగుణముగా తినెడివాడే నిరోగి శిష్యుని వుత్తరమును విని గురువు గారెంతో సంతోషపడి నీవే ఉత్తముడగు చికిత్సకుడివి కాగలవు అని ఆశీర్వదించెను.

వీరశైవ ఆచార్యులు అన్నమును కేవలము హితముగా సేవించుటనే గాదు. దేవునికి సమర్పించిన అన్నమునే ప్రసాదముగా స్వీకరించమని ఉపదేశించిరి. ఇట్టి ప్రసాదమునకు మరియు అన్నమునకుగల భేదము కనబడక పోవచ్చును. సామాన్యునికి రెండూ ఒకే విధముగా దోచవచ్చును. అయితే సూక్ష్మముగా అవలోకనము చేసినచో ఆరెంటికీ భేదము స్పష్టముగా కనబడును. ఇష్టలింగమునకు సమర్పించుటకు ముందు ఆ పదార్థము మీద యజమానికి నాది యనెడు భావము వుండును. ఇష్టలింగమునకు సమర్పించిన పిదప అట్టి భావన దూరమై ఇది దేవునిది అనుభావము ఏర్పడును ఇందులోని అంతరార్థమేమనగా నా పండు, నాకాయ అని చెప్పుచున్ననూ వాటినే దేవుని పండు, దేవుని కాయ అనెడి భావము వెడలి దేవుని ప్రసాదము అనెడి భావన వచ్చును. మరోమాటలో చెప్పవలెననిన పదార్థము యొక్క గుణగణములు నష్టమై అది ప్రసాదముగా పరిణమించుచున్నది. అది కాయగా కన్పించినప్పటికిని నమ్మకమైవున్న వాడికి అది కాయకాదు. అది దేవుడు కటాక్షించిన ప్రసాదము. అట్టి ప్రసాదమును సేవించుట చేత మనస్సునకు ప్రసన్నత చేకూరును. ప్రసాదము పరిమాణము నందున తక్కువగా నున్నను సంతృప్తి మాత్రము పరిపూర్ణముగా నిచ్చును. ఇష్టలింగనై వేద్యముగానీ, గురువు వారి దగ్గర నుండి తీసుకొనెడి ప్రసాదముగానీ కొలది ప్రమాణములో నుండిననూ హెచ్చుతగ్గులు దోచవు గదా! ఇది ఇటులుండగా పదార్థములు తినునప్పుడు హెచ్చుతగ్గులు లేకుండినను హెచ్చుతగ్గులు కన్పట్టును. వేరొకరి పళ్ళెరములో నుండెడి లడ్డు పెద్దగాను, మనకు వడ్డించిన లడ్డు చిన్నదిగాను కన్పట్టెడి అవకాశము గలదు. వాస్తవముగా రెండూ ఒకే పరిమాణములో నుండినను మనమనోగత అభిప్రాయము ఆ విధముగా నుండును.

లింగార్పితము కానిది ఏదియును స్వీకరించవలదని తెలియజెప్పుచూ శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**శ్లో॥ ఆత్మభోగాయ నియతం యద్యద్ ద్రవ్యం సమాహితమ్ ।**
**తత్తత్ సమర్ప్యదేవాయ భుంజీతాత్మవిశుద్ధయే ॥**

**నిత్యసిద్ధేనదేవేన భిషజా జన్మరోగిణామ్ ।**
**యద్యత్ ప్రసాదితం భుక్త్వా తత్తజ్జన్మరసాయనమ్ ॥ (సి. శి. 11; 11-12)**

శ్రీ భగవత్పాదుల వారి ఆదేశము ప్రకారము తాను అనుభవించుటకు సంగ్రహించబడిన సకల పదార్థములను ఇష్టలింగమునకు సమర్పించియే స్వీకరించవలెను. ఈ విధముగా ప్రతిదినము లింగభోగోపభోగిగా జీవనమును సాగించిన యెడల ప్రసాదసేవన ఫలితముగా మనస్సు సహజముగానే పరిశుద్ధమగును. సత్యుడు నిత్యుడు అయిన శివునికి వైద్యనాథుడనే బిరుదుకలదు. సామాన్యముగా వైద్యుడు తన ఔషధము చేత వాత పిత్తాది దోషములను నివారణ చేయుచున్నాడు. అయితే వైద్యులకే రాజైన శివుడు తన ప్రసాదరూపమైన ఔషధము చేత జనన మరణ రూపమైన భవరోగమునే తొలగించుచున్నాడు. ఈ విధముగా చూసిన యెడల శివునికి నివేదించిన పదార్థము ఒక రసౌషధమై జీవుని భవరోగమును మాన్పుచున్నది. అంతరంగ శుద్ధిని, బహిరంగ శుద్ధిని సాధించిపెట్టు చున్నది. ఆదిభౌతిక, ఆధ్యాత్మక, ఆధిదైవికములనెడి తాపత్రయములు మనుజుని దహించివేయు చుండును. ఇట్టి తాపత్రయములను దూరము చేసికొనుటకు శివ ప్రసాదమే ఒక దివ్యౌషధమై యున్నది. ప్రతి దినము ప్రసాదమును సేవించెడి వాడు తన మనస్సును సాత్వికభావనతో నింపుచున్నాడు. తత్ఫలితముగా నచ్చుట జ్ఞానోదయము కల్గుటకు ఆస్కారము ఏర్పడు చున్నది. ఇంతే కాకుండా ప్రసాదసేవన వలన సకల విధములగు దోషములు, మోహములు నష్టమగుచున్నవి. ఈ ప్రసాద సంసేవన వలన మహదానంద సంప్రాప్తి గలుగునని తెలియ వచ్చుచున్నది. పాపాత్మలకు యిది లభించదు. పుణ్యాత్ములకు మాత్రము యిది సాధ్యమే, బ్రహ్మా విష్ణ్వాది దేవతలు వశిష్ఠాది ఋషులు శివ ప్రసాదము వలననే సిద్ధులను సాధించిరని తెలియుచున్నది. వారి వలెనే ప్రసాద సంసేవన చేసిడివాడున్నూ సకల సిద్ధులను పొందునని గట్టిగానమ్మి ప్రసాద సంసేవనా వ్రతమును పాటించవలెను. ప్రసాదము యొక్క ప్రభావమును గురించి ఎంత

వర్ణించిననూ తక్కువే సర్వసాధారణముగా కాయమును వజ్రకాయముగా మార్చుకొన వలెననెడి తలంపు చాలామందికి గలుగును. అట్టిది సాధించుటకు ప్రసాదము సమర్థత కలిగినదని హరి వంశములో చెప్పబడినది. ఆ దృష్టాంతము ఈ క్రింది విధముగా నున్నది.

మూర్తీభవించిన రుద్రావతారమా యనిపించెడి దూర్వాస మహర్షి ఒకసారి ద్వారకా నగరమునకు వెడలెను. ఆనగరము యొక్క ముఖ్య వీధినందున సంచరించుచు ఈ నగరమున నన్ను అతిథిగా సేవించెడి వారెవరైనను కలరా? యనుచు సంచరించజొచ్చెను. ద్వారకానగరములోని జనులకు అతిథిసేవను చేయవలెననెడి కోరిక యుండిననూ మహామహిమాన్వితుడైన ఇట్టి మహర్షికి అతిథి సేవలను చేయుటలో ఏమైనా పొరపాట్లు దొర్లునేమోయని భయపడి అతని వద్దకే పోవుటకు సంకోచించు చుండిరి. ఎవరినుండియూ ఆతిథ్యము చిక్కలేదు. అప్పుడు దూర్వాస మహర్షికి కోపము వచ్చెను. అట్టి మహర్షి యొక్క గొప్ప తనమును ఎఱిగిన వాడైన శ్రీ కృష్ణుడు అతని యెదుటకు వచ్చి మారాచనగరమునకు వచ్చి అతిథి సేవలను అందుకొనుడని విజ్ఞాపన చేసెను. అప్పుడా ఋషి ఒక రథమును ఏర్పాటు చేయమని అడిగెను. శ్రీ కృష్ణుడు ఆ విధముగానే చేసెను. అతడు తెచ్చిన రథమునకు రెండు గుర్రములుండెను. అప్పుడా ఋషి కృష్ణుని వుద్దేశించి గుర్రములచే లాగబడెడి రథమునందున కూర్చొనజాలను. కనుక సతీసమేతముగా నీవు రథమును లాగుచూ తీసుకుని వెళ్ళుడు యని కోరెను. అప్పుడా కృష్ణుడు మహర్షిని రథములో కూర్చొండ బెట్టి తానూ, మరియు రుక్మిణీ దేవి ఆరథమును లాగికొనుచూ తీసుకొను వెళ్ళుటకు నిశ్చయించుకొనెను. రథములో కూర్చొని యున్న మహర్షి ఊరక యుండలేదు. శ్రీ కృష్ణుని సహనమును పరీక్షించుటకు కాబోలు! గుర్రములను అదలించెడి కోలతో వారిని ఒకటిరెండు సార్లు అదలించెను రాచనగరుకు వెళ్లిన పిదప మహర్షి గారికి అభ్యంగన స్నానమును చేయించి శివపూజకు తగిన ఏర్పాట్లు చేయించెను. ప్రసాదమునకు ఏమి కావలెను స్వామీ! అని శ్రీ కృష్ణుడు దూర్వాసుని అడిగెను. వేడివేడి పాయసమును తీసుకొని రమ్మని చెప్పెను. మహర్షి గారి పూజ పరిసమాప్తము కాగానే వేడి పాయసమును తెచ్చి మహర్షుల వారి ముందుంచెను. దానిని దూర్వాస మహర్షి ముట్టిచూసి దీనిని నీ సర్వాంగములకు లేపనము చేసుకొమ్మని ఆజ్ఞాపించెను. శ్రీ కృష్ణుడు మహర్షిగారి ఆజ్ఞను పరిపాలించెను. కాని పాదములకు మాత్రము పూసికొనలేదు. అది గ్రహించిన ప్రసాదలిప్తమైన నీ సర్వాంగములు వజ్రమయమైనను నీపాదములు మాత్రము చర్మమయమై యున్నవి. కాలాంతరము నందున నీకు రావలసిన మృత్యువు పాదములనుండే రాగలదు. అని అనుగ్రహించెను. అందరికీ తెలిసినటుల శ్రీ కృష్ణుని యొక్క మృత్యువు, బోయవాడు వేశిన బాణము చేత కాలి బొటనవ్రేలు తెగగొట్టబడి సంభవించెను. శివుని ప్రసాదమునందున యింత మహత్తు కలదని అందరూ ఎరిగి అద్దానిని అనుభవించవలెను. ఇట్టి ప్రసాదము వలన కలిగెడి లాభములను శ్రీ గురువుగారు ఈ క్రింది విధముగా తెలియజెప్పిరి.

**శ్లో॥ ఆరోగ్యకారణం పుంసామంతః కరణశుద్ధిదమ్ ।**
**తాపత్రయమహారోగసముద్ధరణభేషజమ్ ॥**

**విద్యావైశద్యకరణం వినిపాత విఘాతనమ్ ।**
**ద్వారం జ్ఞానావతారస్య మోహచ్ఛేదస్య కారణమ్ ॥**

**వైరాగ్య సంపదో మూలం మహానంద ప్రవర్ధనమ్ ।**
**దుర్లభం పాపచిత్తానాం సులభమ్ శుద్ధ కర్మణామ్ ॥**

**అదృతం బ్రహ్మ విష్ణ్వాద్యైర్వసిష్ఠాదేశ్చ తాపసైః ।**
**శివస్వీకృతమన్నాద్యం స్వీకార్యం సిద్ధికాంక్షిభిః ॥ (సి. శి. 11; 13-16)**

దీని యొక్క తాత్పర్య మేమనగా శివ ప్రసాదమును సేవించుటచే ఆరోగ్యప్రాప్తి అంతః కరణ శుద్ధి, తాపత్రయ నివారణ లభించును. శుద్ధ విద్య సంప్రాప్తమగును. సకల విధములైన దోషములు నాశనమగును. శివ జ్ఞానోదయము గలిగి అజ్ఞానము నశించును. ఈ ప్రసాదమనెడిది నిత్యానందమును కలిగించెడిది. ఇది అందరికీ సిద్ధించెడిది కాదు. కేవలము పుణ్యాత్ములకు మాత్రమే లభించును. దేవతలు, ఋషులు దీనిని సేవించి ధన్యతను బడసిరి. ఇష్టలింగ నైవేద్యమునకు యిట్టి పదార్థమునే చేయవలెననెడి నియమమేమియును లేదు. ఏ పదార్థమైనను నివేదించ వచ్చును. కాని అది సాత్త్వికాహార కోవకు చెందినదై యుండవలెను.

శ్లో ॥ పత్రం, పుష్పం, ఫలం, తోయం యచ్ఛివాయ నివేదితమ్ ।
తత్తత్ స్వీకారయోగేన సర్వపాపక్షయో భవేత్ ॥ (సి. శి. 11-12)

మనష్యునికి కొన్ని విశిష్టమైన పదార్థములు తినుట యందు అభిరుచి యుండిన యటులే దేవునికి కూడా అట్టి అభిరుచి యుండునని కొందరునుకొనెదరు. ఉదాహరణకు చెప్పవలెననిన మంగళగిరిలోని లక్ష్మీనరసింహస్వామికి పానకమే ప్రీతికరమని భక్తులందరు పానకమునే విగ్రహమునోటిలో పోయుదురు. అటులనే సంతోషి మాతకు పులుపు పడదని దానిని నివేదన చేయరు. ఇష్టలింగమునకు నివేదన చేసెడి పదార్థములు ఎట్టివైనను, అవి సాత్వికములైన యెడల శివుడు సంతోషముగ గ్రహించును. ఇక్కడ గ్రహించవలసిన విషయమేమనగా దేవునికి పాలు మాత్రమే నైవేద్యముగా పెట్టవలెను. లేదా చక్కెర మాత్రమే నైవేద్యముగా పెట్టవలెను. అనెడి భావన సరియైనది కాదు. కొందరి దృష్టిలో దేవునికి మిఠాయిలు మాత్రమే పెట్టవలెను కాని అన్నాదులు పెట్టకూడదను భావము గలిగియుండుట కూడా సరియైనది కాదు. ఒక వ్యక్తి తన స్థితి, గతి ప్రకారము ఏ ఏ పదార్థములను ఆహారముగా తీసిగొనగల్గునో ఆయాపదార్థములను భగవంతునికి అర్పణచేసి దానిని ప్రసాదముగా గైకొనవలెను. శివశరణులలో అంబలిని నివేదన చేశిన వారు కూడా కలరు. అట్టివారిని బసవన మెచ్చికొనెను. దీనిలోని అంతరార్థమేమనగా శివునికి షడ్రచులతో పనిలేదు. అతనికి కావలసినది. కేవలము భక్తి మాత్రమే. భక్తితో సమర్పించెడి పత్రము, పుష్పము ఫలము మరియు నీటినైన స్వీకరించును. అతడు స్వీకరించిన పిదప అవి ప్రసాదములై అమృతతుల్యములగు చున్నవి. భక్తుడు పాటించ వలసిన నియమ మొక్కటే. అది ఎట్టిదనగా వీరశైవ ధర్మము ప్రకారము ఏ ఏ పదార్థములు నివేదనీయములో ఆయా పదార్థములను మాత్రమే యిష్టలింగమునకు నివేదింప వలెను. ఇతర ధర్మములకు చెందిన ఆచారములను గని వాటిచేత ప్రభావితులు కారాదు.

శ్రీ భగవత్పాదుల వారు ప్రతిపాదించిన ప్రసాద నియమము ఆగమసమ్మతమైనదిగా కన్పట్టుచున్నది. ఈ క్రింది ఆగమోక్తిని గనుడి.

శ్లో ॥ గురు జంగమ లింగానాం నిర్మాల్యం భుక్తి ముక్తిదమ్ ।
సదైవానుభవేద్దేవి! ప్రసాద వ్రతముత్తమమ్ ॥

పై శ్లోకములోని భావమేమనగా వీరశైవులు గురు లింగ జంగములను పూజించుచూ వారునొసంగిన ప్రసాదమును సేవించెడి వ్రతమును పాటించవలెను. అట్టి ప్రసాద వ్రతము ఉత్తమోత్తమమైనది. దాని వలన భుక్తి ముక్తులును కలుగును. గురువొసంగినది శుద్ధ ప్రసాదమనియును. ఇష్టలింగము కటాక్షించినది సిద్ధప్రసాదమనియును, జంగమయ్య ప్రసాదము చేసినది ప్రసిద్ధ ప్రసాదమనియును గుర్తించ వలెను. వీటివలన త్రికరణ శుద్ధి కలిగి సేవించెడి వారు సర్వాంగ శుద్ధిని పడయుచున్నారు. అందుచేత వీరశైవులెల్లరూ ఈ త్రిలింగముల ప్రసాదమును పొందుటకు త్రికరణ శుద్ధిగా ప్రయత్నించి సఫలమనోరథులై సేవించి ధన్యతను పొందుదురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 4-9 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

ప్రసాదము యొక విశిష్టతను ప్రణుత ప్రఖ్యాత జ్ఞానపీఠాధీశ్వరులు కాశీ జగద్గురువులు చంద్రశేఖర చార్యుల వారెంతయో విశదముగా తెలియ పరచిరి.

"లింగనిష్ఠాది భావేన, మనః ప్రసాద యోగేన" అనెడి ఆచార్యుల వారి వాక్కుల ప్రకారము మాహేశ్వరుడు ప్రసాదిగా పరిణామమొందుటకు లింగనిష్ఠను మరింత దృఢతరము చేసికొని మనః ప్రసన్నతను సాధించవలెను. ప్రసాది స్థలమున సాధకునికి అవధాన భక్తి సహాయకారిగా నుండును.

అవధాన మనగా మనస్సును నొక విషయము పై నిలుపుట యని నిఘంటువు చెప్పుచున్నది. చిత్తైకాగ్రతను సాధించుటయే యీ స్థలము యొక్క లక్ష్యము. చంచలమైన మనస్సు చిత్తైకాగ్రతను సాధించుటలో నొక ప్రధానమైన యవరోధముగా నిలుచును. దీని చంచలత్వము వలన యింద్రియములు ప్రేరణకు గురియై భోగాసక్తిని పెంచును. కాయ వికారములు పాడు చేయుట ప్రారంభించును. కాయమును శుద్ధి చేసికొని యద్దానిని ప్రసాద కాయముగా మార్చికొనవలసి యుండును. తత్ఫలితముగా యింద్రియములు సాధకునికి వశమై వర్తించును. కాయమును ప్రసాదమయము చేయుటకై పరిశుద్ధమైన పదార్థములను సేవించవలెను. అనర్పితమైన పదార్థము దోషభూయిష్టములై యుండును. పదార్థములను శివునికి నివేదించి పరిశుద్ధముగ చేసి కొనవలెను. అర్పిత పదార్థము నైర్మల్యమనబడను. నైర్మల్య సంసేవన వలన కాయము నైర్మల్యమగును. అనిల కాష్ఠన్యాయమున మాంస మయమగు కాయము ప్రసాదమయమై విరాజిల్లును. సాధకుడు నింద్రియ వ్యాపారములను నిరోధించుట జరుగును. అవయవములను భవించే విషయోప భోగములను స్వేష్ట లింగమునకు సమర్పించును. లింగ నివేదితమగు విషయ సుఖము పరిణామమునకు గురియై విషయోప భోగములు లింగోప భోగములగను. లింగోప భోగానంతరము లభించెడి భుక్తావశేషమును స్వీకరించి సాధకుడు కాయవికారములపై విజయమును సాధించును. ఇంద్రియ జిత్తగును. లింగోప భోగము వలన లభించెడి లింగ ప్రసాదము ననుభోగము చేసెడి ప్రక్రియలో సావధాన చిత్తముతో నిమగ్నుడయ్యెడి యీ సాధకుని భోగాంగి యని యందురు. భక్త మాహేశ్వర స్థలములలో త్యాగాంగిగా నుండెడి సాధకుడు భోగాంగిగా తన సాధనను కొనసాగించుచు ననిర్వచనీయమైన యానందము ననుభవించును. ఈ కారణముననే శ్రీ భగవత్పాదుల వారు ప్రసాదమును మహానంద ప్రవర్ధకమైనదిగా నభివర్ణించిరి. ఈ ఆనందము సామాన్యుడు పొందెడి ఆనందము వంటిది కాదు. సామాన్యుడు పొందెడిది క్షణికానందము. ప్రసాది పొందెడి యానందమున కంతులు నుండువు. దీనికి గల కారణ మేమిటో తెలిసి కొనవలెను. సామాన్యుడు అవిద్యచేత పీడితుడై సుఖ-దుఃఖముల వివక్షత కోల్పోయి దుఃఖమునే సుఖమని కొని బాధకు గురియగును. మాయా ప్రభావమునకు లోనై మోహపరవశుడై అహంకార మమకారముల వలన పంచక్లేశములనను భవించును. భవ బాధములకు లోనై జన్మరోగి యగును. వీటిన్నింటి యుమ్మడి ఫలితముగా భౌతికముగా రోగగ్రస్తుడు కావచ్చును.

ప్రసాది ప్రసాదము వలన జ్ఞాన సమపార్జన చేయును. జ్ఞానముతో భాటుగా మోహచ్ఛేదనము, భవభయహరణము, కర్మసంహార మొదలగు నద్వితీయములగు ఫలితములు ప్రసాదికి లభించును. సంసారము యొక్క నైజము నెరిగి, నిత్యవైరాగ్య విశిష్టతను పొంది, శివయోగ సాధనలో నిమగ్నడగును. మనః ప్రసన్నత్వము నతడు సాధనముగా గైకొనును, "చిత్తవృత్తి నిరోధక" మనెడి భావన కంటెను భిన్నముగా నుండెడి. "చిత్తవృత్తి నిర్దేశకమే" యోగమనెడి భావమును పొందును. ప్రాణలింగి స్థలమున యంత ర్ముఖియై యంతర్లింగాను సంధానము వలన శివయోగమును సాధించుటకై వలయు సాధన సంపత్తిని సమకూర్చు కొనును.

ప్రసాదము వలన సకల విద్యలు సంప్రాప్తమై వైరాగ్యము సిద్ధించునని శ్రీ భగవత్పాదుల వారు తెలుపగా నద్దానిని శ్రీ సోమనాథుల వారు నీ క్రింది విధముగా విస్తరించిరి.

**వసుధ 'మేధావీ భవతి' యన నంత**
**నసలార మేధావియై ప్రవిర్తిల్లు** (పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్రు. )

ప్రసాదికి ప్రసాదము వలన సర్వజ్ఞత్వము సిద్ధించునని సోమనాథుల వారు తెలిపిరి, అణిమాది యష్ట సిద్ధులు కూడ గల్గునని శ్రీ సోమనాథుల వారు తెలిపిరి. ఈ కారణము వలననే కాబోలు శ్రీ భగవత్పాదుల వారు ప్రసాదము సర్వసిద్ధి ప్రదమ్ అని వివరించి చెప్పిరి.

ప్రసాద మహిమను మలిన దేహులు గుర్తించ జాలరు. ప్రాకృతులకది వేద్యము కాదు ప్రాజ్ఞులే యద్దానిని గుర్తించ గలరు. అందుచే, ప్రసాద స్థలములోని వారు సాంగత్య దోషములకు గురియై తత్ఫలితముగా ప్రసాద కాయమును చెరిచికొనెడి దుర్దశకు దిగజార కూడదు. తగు సావధానమును మదిన దాల్చవలెను.

శివం భూయాత్

# ఆశీర్వచనము - 1

# గురుమాహాత్మ్య స్థలము

వీరశైవ సిద్ధాంతమునందున లింగపూజకు నుండెడి ప్రాముఖ్యత గురుపూజకును గలదు. అందుచేత, శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు గురుమాహాత్మ్యము గూర్చి యీ క్రింది విధముగా నుపదేశించిరి:

**శ్లో॥ యథా శివప్రసాదాన్నం స్వీకార్యం లింగతత్పరైః ।**
**తథాగురోః ప్రసాదాన్నాం తద్దైవ శివయోగినామ్ ॥**

**గురు రేవాత్ర సర్వేషాం కారణం సిద్ధి కర్మణామ్ ।**
**గురురూపో మహాదేవో యతః సాక్షాదుప స్థితః ॥ (సి. శి. 11; 18-19)**

ఈ ఉపదేశము ప్రకారము, మనుజుని సర్వ విధీ సిద్ధులకును, భుక్తి ముక్తులకును, శ్రీ గురువే కారణభూతుడగును. గురు కటాక్షము లేని వారికి యిహ పరసౌఖ్యములు లభింపజాలవు. శివుడే గురువై యున్నందున సకల విధ సిద్ధులను, భుక్తి ముక్తులను నిచ్చెడి స్థితిలోన గలడు. వీరశైవుడు లింగము నందున యెట్టి శ్రద్ధాభక్తి గల్గియుండునో, అట్టి భక్తినే గురు-జంగమయ్యల యెడల గల్గి యుండవలెను. ఈ మువ్వురు ఆరాధనీయులని గ్రహించ వలెను. ఈ ముర్వురు స్థూల రూపమున వేర్వేరుగా కనబడినా, తత్వతః ముర్వురూ ఒక్కడే యని గ్రహించవలెను. "ఏకమూర్తిః త్రయోభాగః అనెడి యాగమోక్తి" ప్రకారము శివుడే గురు-లింగ-జంగమ రూపముల దాల్చును. ఈ విషయమున బిల్వదళమును ఉదాహరణగా గైకొన వచ్చును. మూడు దళములు గల్గినను దానిని యేక బిల్వ మనియే యను చున్నాము. ఈ కారణము వలననే మహానుభావులు తాము పొందబోయెడి ప్రతి జన్మలోను గురు-లింగ-జంగమయ్యల సేవలను చేపట్టువలెనని కోరుకొనును. శివుని ప్రార్థించుచు, అద్దానిని కటాక్షించుమని కోరును. మహారాష్ట్రకు చెందిన మన్మథ స్వామి యనెడి మహాను భావుడు నిట్టి మహత్తరమైన కోరికనే గల్గి యుండెనని తెలియు చున్నది. వారి యీ క్రింది వాక్కులను గనుడి.

**శ్లో॥ గురు ఆణి లింగ జంగమాచి సేవా ।**
**దేయీ మజ దేవా జన్మోజన్మీ ॥**

జన్మ జన్మాంతరముల వరకును గురు-లింగ-జంగములను సేవించెడి మహాభాగ్యము నను గ్రహించమని మన్మథ స్వామి మహాదేవుని కోరెనని యీ మహావాక్యముల వలన తెలియు చున్నది.

భారత సంస్కృతి యందున గురువునకు మహత్వ పూర్ణమైన స్థానమివ్వ బడినదని అందరు ఎరిగిన విషయమే. గురువే శివుడు, శివుడే గురువు. ఈ ఇరువురికి భేదము లేదని చెప్పబడినది. ఈ విషయమున శ్రీ గురువు గారైన భగవత్పాదుల వారిచ్చిన యుపదేశమును గనుడి:

**శ్లో॥ నిష్కలోహి మహాదేవో నిత్యజ్ఞాన మహోదధిః ।**
**సకలో గురురూపేణ సర్వాను గ్రాహకో్య భవేత్ ॥**
**యశ్శివః సగురర్భేయో యోగురుః సశ్శివః స్మృతః ।**
**నతయోరంతరం కుర్యాత్ జ్ఞానవా ప్స్వొ మహామతి ॥**
**హస్త పాదాది సామ్యేన నేత రిరైః సదృశమ్వదేత్ ।**
**ఆచార్యమ్ జ్ఞానదమ్ శుద్దమ్ శివరూపతయాస్థితమ్ ॥ (సిద్దా సి. శి. 11; 20-22)**

ఈ ఉపదేశములోని భావమేమనగా నిత్యజ్ఞానము యొక్క మహా సాగరస్వరూ పుడును నిరాకారుడును అగు పరః శివుడే అందరిని అనుగ్రహించుటకై సగుణరూపమును దాల్చి గురుడై వచ్చియున్నాడు. అందుచేత శివుడే గురువు. గురువే శివుడు వీరురివురి మధ్య యెట్టి భేదము ఉండజాలదు. అందుచేత జిజ్ఞాసగల సాధకుడు తనకు జ్ఞానోదయమును గలిగించిన గురువును సాక్షాత్ శివునిగా భావించవలెను. మిగిలిన మనుష్యుల వలెనె గురువును గూడా బావించిన యెడల గురువును ఇతరులతో పోల్చిన యెడల దోషము సంప్రాప్తమగును. గురుని నరుడనిన వానికి నాయక నరకము తప్పదని వచనకారులు బోదించిరి. ఇచ్చట నాయకనరక మనగా రౌరవాది నరకములని గుర్తించవలెను. జ్ఞానోపదేశము చేసిడి సద్గురువును శివుడని బావించిన యెడల శివజ్ఞానమబ్బును. లేని యెడల అట్టి జ్ఞానము కలుగదు. శారీరక దృష్టి చేత గురువునకును యితరులకును భేదము కనబడకుండినను గురువులో యుండెడి మహోత్కృష్టమైన జ్ఞానము వలన గురువు యితరుల కంటెను విలక్షణమైన వాడు. ఈ విషయమున ఆచార్యుల వారు యీ క్రింది విధమున ఉపదేశమిచ్చిరి.

**శ్లో॥ అచార్య స్యావమానేన శ్రేయః ప్రాప్తిర్ విహన్యతె**
**తస్మాన్ ని శ్రేయసః ప్రాప్త్యై పూజయేత్ తం సమాహితః (సి. శి. జి. 11; 23)**

పై ఉపదేశము ప్రకారము ముక్తిని కాంక్షించే వాడు తన నడకలోను నుడువులలోను ఎప్పటికిని గురువును అవమానమునకు గురిచేయవలదు, తగిన జాగ్రత్తలు తీసుకొనవలెను. ఒక వేళ పొరపాటున నోకాని మరే కారణము వలనకాని గురువునకు అవమానము జరిగిన యెడల ఆ వ్యక్తి యొక్క శ్రేయా మార్గము భగ్నమగు చున్నది. ఇదంతయు గమనించి మోక్షమును గోరెడివాడు గురువుగారికి తగిన గౌరవము నిచ్చును. తగిన రీతిన ఆరాధన చేయవలెను. గురువు యొక్క ఆరాధన చేయకుండగా ఆరాధన క్రియ పూర్ణము కాజాలదు. ఎంతోమంది దేవతలను పూజించిన ఆ పూజలన్నియును అసంపూర్ణములే యగును. గురువును పూజించిన గాని దేవతారాధనలు సంపన్నములై తగిన ఫలితముల నిచ్చును.

**శ్లో॥ గురు భక్తి విహీనశ్య గురు భక్తిర్న జాయతే**
**తథః శివే యథా భక్తిః తథా భక్తిర్ గురావపి ( సి. శి. జి 11-24)**

ఈ ఉపదేశము ప్రకారము శివ భక్తి సంభవించవలెననిన గురు భక్తి కావలెను. గురు భక్తి లేని వానికి శివ భక్తి కలగదు. ఇదే మాటను బసవన్నగారు కూడా నొక్కి చెప్పిరి. శివపథమును నెరుగ వలెననిన గురు పథమే మొదలు అని నుడివిరి. భక్తుడైన వాడు గురువుగారికి నమస్కరించ కుండా శివుని పూజించిన యెడల శివ కృప లభింపజాలదు. అణవాది మలయుక్తుడైన జీవుడు గురువుచేత శివ దీక్షను పొంది పరిశుద్ధుడైన పిదపనే శివుని పూజించుటకును శివకృపను సంపాదించుటకును అధికారము గలవాడుగును. మేనినిండా బురదను పూసుకొని ఒక పిల్ల తనయింటిలోనికి వచ్చినప్పుడు అకస్మాత్తుగా ఆ శిశువు యెదుట తండ్రి ఉండిన యెడల ఆ శిశువుకు సంతోషమై తండ్రి వద్దకు పరుగెత్తి అతని చంకలో చేరుటకు ఉధ్యమించిన యెడల ఆ తండ్రి ప్రవర్తన యెటుల వుండును? ఆ శిశువుని యెత్తుకొని లాలన చేయనే చేయరు. మీ తల్లి దగ్గరుకు వెళ్ళి పరిశుభ్రముగా తయారై మంచి వస్త్రములను వేసుకొని రమ్మని పంపించును. తల్లి తన వద్దకు వచ్చిన శిశువును హృదయమునకు హత్తుకొని లాలన పాలన చేసి పిల్లను శుభ్రము చేసి మంచి వస్త్రములను వేయును. అప్పుడా తండ్రి శిశువును యెత్తుకొని వాత్సల్యమును ప్రదర్శించును. ఈ ఉదాహరణ శివునికి గురువునికి వర్తింప చేయవచ్చును. తండ్రి స్థానములో శివుడుండగా తల్లి స్థానములో గురువుండును. త్రిమలా వృతుడై మానసికంగా అశుద్ధిని బడసి అంతః కరణ శుద్ధి లేని వాడై విషయ సుఖములలో నిమగ్నుడయ్యెడి జీవి యీ ఉదాహరణలోని శిశువుతో సమానము గురువును మినహాయించి శివుడిని వేడికొనిన ఫలితముండెనే? ఇట్టి జీవి గురువుని జేరి గురు కారుణ్యమును పొంది త్రిమలములను ఛేదించుకొని అంతరంగ బహిరంగములను శుద్ధి చేసికొనినచో శివుడు అతనిని అంగీకరించును. దగ్గరకు చేర్చుకొని తన కరుణామృతమును కురిపించును. ఈ విధముగా గురు స్థలమునకు యింత ప్రాముఖ్యత నుండగా గురువుని విస్మతికి గురిచేసెడి అవివేకులను యేమన గలను?

వీరశైవ సిద్ధాంతము నందున ప్రసాదమునకు యెంతో ప్రాముఖ్యతకలదు. మాహేశ్వర స్థలము నందలి భక్తుడు నైష్ఠిక భక్తితో అను నిత్యము ముప్పూటలలో శివ ప్రసాదమును ఇష్ట లింగ ప్రసాద రూపమున సేవించవలెను. లింగ ప్రసాదముతో పాటుగా సద్భక్తుడు గురువు మరియు జంగమయ్యల ప్రసాదమును సేవించ వలెను. అప్పుడే అతని సాధనకు పరిపూర్ణత లభించ గలదు. లింగ ప్రసాదమును సేవించుచున్న నెపముతో గురు ప్రసాదమును జంగమ ప్రసాదమును విస్మృతికి గురి చేసిన యెడల, కాయ మనోవికారముల వలన నైష్ఠిక భక్తికి భంగము వాటిల్లును. అందుచేత నైష్ఠిక భక్తుడు త్రివిధ ప్రసాదముల యెడల సావధాన చిత్తము గలవాడై భక్తితో సేవించి హృదయమున ప్రసన్నతను బడసి ప్రసాది కావలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 5-9 - 1991
స్థలం : నాగపూర్

# విశేష ప్రదీపిక

త్యాగాంగి భోగాంగియై యవధాన భక్తి తత్పరుడై పురోగమనమును సాధించినను, నతడు గురు మహిమ యెడల నుదాసీన వైఖరి నవలంబించుట తగని పని యని శ్రీ జగద్గురువులు చంద్ర శేఖర శివా చార్యుల వారును బోధించిరి.

వీరశైవమున భక్త స్థలమెంతో కీలకమైనదనియును, గురుస్థల-జంగస్థల-ప్రసాద స్థలముల వలన భక్త స్థలము లోని వాడు క్రమ క్రమముగా మహేశ ప్రసాది స్థలములలోనికి ప్రవేశించి సాధనను పరిపక్వము చేసి కొని సిద్ధిని పొందునని యను భవసారము (సోమనాథుడు, ఓం నమః శివాయ సా, పరిషత్తు, 2000) వలన తెలియు చున్నది. గురు-జంగమ-ప్రసాద స్థలముల నేపథ్యమున భక్త స్థల గ్రంథము ప్రసాద స్థలమునందున గురు ప్రసాదము గురించి యీ క్రింది విధముగా తెలుప బడినది.

**కి॥ జంగమ పరాఙ్ముఖుండై**
**లింగార్చన సేయు నతని లీల దలంపన్**
**వెంగలి యై శవమునకును**
**శృంగారము సేయునట్లు శివ భక్తి నిధీ!**

**క॥ అవిరళ గురు కారుణ్య**
**ప్రవిమల శుద్ధ ప్రసాద పరిపూర్ణానం**
**దవివర్జితునకు జంగమ సవిశేషార్చన మదెట్లు సమకూరు మదిన్ ? (అను.సా.ప.223-224)**

శుద్ధ ప్రసాదము కీలకమైన దనియును దానిని పొందని వాడు చేసెడి భక్తి శవమునకు చేసెడి శృంగార రీతిగ సత్ఫలితముల నివ్వజాలదని తెలుప బడడినది? గురు కారుణ్యము వలననే యిట్టి ప్రసాదము సిద్ధించును. అందుచేత, వీరశైవునికి శ్రీ గురువే సర్వస్వమని తెలుపబడినది ఈ క్రింది పద్యమును గనుడి:

**క॥ గతియ మతియు దెసయు దిక్కును**
**బతియును తలి దండ్రితోడు ప్రాణము నర్థ**
**ప్రతతియు బంధుడు విద్యో**
**న్నతియున్ సద్గురుడ కాడె నారయ పుత్రా! (అనుభవ సారమును ప. 52)**

అయితే, ధర్మాను యాయులు తల్లి దండ్రిని యాధర్మముగా గైకొందురు. అట్టి యెడ గురువే సర్వస్వమనెడి భావన యెట్లు నిలుప గలదనెడి సందేహము సామాన్యులకు గల్గుట సహజమే ఈ విషయమున, వీరశైవ ధర్మీయులు, ఆగమ సాంప్రదాయమును స్వీకరించిరి. శివుడు జీవుని యుద్ధరించుట కొరకు గురురూపమున వచ్చునని తెలుపబడినది. జీవుని చేరదీసి యతని యజ్ఞానమును తొలగించి సంసార భ్రాంతిని దూరము చేసి శివ పథమును చూపును. ఈ విషయమును స్పష్టము చేయుచు, శ్రీ మల్లికార్జున పండితులు వారు గురు ప్రసాదము పొందకుండగ శివుని గురించి యెరుగ జాలదని తెలియ జెప్పిరి.

**క॥ నెరసిన గురు ప్రసాదము**
**నరలగ జగదేక సకల-రల్లభుదాదిం**
**గరకుతుడ వేల్పని ని**
**న్నెరిగితి నీ మహిమ యెరుగనేమియు రుద్రా!**

శిష్యునికి శ్రీ గురువు దీక్షాగురువై దీక్షనిచ్చి, శిక్షా గురువై శిక్షణనిచ్చి, జ్ఞాన గురువై లింగాంగ సామరస్య విజ్ఞానమును ప్రదానము చేసి నివృత్తి మార్గమున పయనింప జేయును. ఈ కారణముననే శ్రీ గురువు పరంజ్యోతిగా గుర్తింప బడినాడు. ఈ పద్యమును గనుడి:

**క॥ హేతువులు వారి దృష్టాం**
**తాతీతు బై పరాంతమగు చున్న పరం**
**జ్యోతి మరితానె యిల గురు**
**వై తనరుట శిష్య రక్షణార్థము గాదె?**

ఇట్టి సత్యము నెరిగిన వాడైన శ్రీ బసవేశ్వరుల వారు, ప్రాకృత మార్గాను యాయులైన తల్లి దండ్రుల "ఆ జ్ఞోల్లంఘన" జేసి శ్రీ గురువును శరణుజొచ్చి, శ్రీ గురువు కారుణ్యమును పొంది గొప్ప యనుభావియై లోకఖ్యాతిని విఖ్యాత రీతిన పొందిన విషయము విశ్వమెరిగిన సత్యమే. సాధకుడు గురుమాహాత్మ్యమును గుర్తించి, యతనిని భక్తితో పూజించి యతని భుక్తాన్న శేషమును ప్రసాద భావనతో భుజించి తరించ వలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## లింగమహాత్మ్య స్థలము

శ్రీ రేణుక భగవాత్పాదుల వారు శ్రీ గురు మాహత్మ్యమును బోధించిన పిదప శ్రీ అగస్త్యమహర్షికి లింగ మాహాత్మ్యమును గురించి ఉపదేశించిరి. మనము అనునిత్యము ఆరాధించెడి దేవుని మహిమను గుర్తెరగని యెడల ఆ దేవుని యెడల భక్తి విశేషముగా పెరుగ జాలదు. వీరశైవులకు పరామాధ్య మూర్తి యై యిష్టలింగము యొక్క మహిమను తెలియపరచుటకే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు యీ ఉపదేశమును కటాక్షించిరి.

**శ్లో॥ గురు మాహాత్మ్య యోగేన నిజజ్ఞానాతిరే కతః ।**
**లింగ స్యాపి చ మాహాత్మ్యమ్ సర్వోత్కృష్ఠమ్ విభావ్యతే ॥**
**శివస్య బోధలింగం యథాగురు బోధిత చేతసా**
**తదేవ లింగ విజ్ఞేయం శాంకరమ్ సర్వకారణమ్ (సి. శి. ణి 11-25 & 26)**

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా గురుమహిమను తెలుసుకొని ఆ గురువునందున అనన్యమైన శ్రద్ధగలవానికి సద్గురువు నుండి ఉత్కృష్టమైన జ్ఞానము ఉపదేశము రూపమున లభ్యమగును. ఆ జ్ఞానము యొక్క పరిణామముగా తాను ఆరాదించెడి యిష్టలింగము కూడా సర్వోత్కృష్టమైనదని తెలియును. లింగము జగము యొక్క స్థితిలయలకు కారణమైయుండును అందు కొరకే పూజ్యపాదాలు లింగమునకు సర్వ కారణము అనెడి విశేషణములను జోడించిరి. ఉపనిషత్తునందున దేనిని బ్రహ్మ అని పిలువపడుచున్నదో దానినే శివాగమములు లింగమని ప్రతిపాదించినవి. శ్రీ నిజగుణ శివయోగుల వారు తెలిసినయటుల జగదాదియగు లింగమును గురించి తెలుసుకొనవలెననిన ఆగమ శాస్త్రమునకే శరణు గావలెనని తెలియ పరచిరి. ఆగమ జ్ఞానము లేని వారికి లింగతత్వము యొక్క పరిపూర్ణ జ్ఞానము ఎప్పటికి లభించజాలదు.

శివాగమములు, స్వతహాగా శివుని చేతనే ఉపదేశింప బడినవి. ఇట్టి శివాగములలోని జ్ఞానమును గురించి తెలిసికొనక లింగమును గురించి తెలిసికొనుటకు ప్రయత్నించెడి వాడు సత్ఫలితములను పొందజాలడు, ఎంతో విస్తృతముగా నుండెడి శివాగములను అధ్యయనమును జేయుట అందరికీ సాధ్యమయ్యెడి విషయము కాదు. ఈ కారణముల వలన భక్తులు ఆగమ శాస్త్ర సంపన్నుడగు శ్రీ గురువుకు శరణాగతులు కావలెను. వారి ఉపదేశామృతమును తనివితీరా గ్రోలవలెను. తద్వారా చిన్మయమురూపమైన లింగతత్వమును తెలుసుకొనవలెను. ఈ విషయమును గురించి శ్రీ భగవత్పాదుల వారు యీ క్రింది విధముగా ఉపదేశమునిచ్చిరి.

**శ్లో॥ పరమ్ పవిత్ర మ మలమ్ లింగమ్ బ్రహ్మ సనాతనమ్**
**శివాభిధానం చిన్మాత్రిమ్ సదానందం నిరంకుశమ్**
**కారణం సర్వ లోకానాం వేదానామపి కారణం**
**పూరణం సర్వతత్వస్యం తారణం జన్మవారిధేః**

**జ్యోతిర్మయ నిర్దేశ్యం యోగినా మాత్మాని స్థితమ్**
**కథమ్ విజ్ఞాయితే లోకే మహా గురుదయామ్ వినా (సి.శి. జి 11; 27-29)**

ఈ ఉపదేశము ప్రకారము సనాతనమైన శివపరబ్రహ్మ లింగము పరమ పవిత్రమైనది. ఈ జగత్తుయందలి కొన్ని పదార్థములు కారణాంతరముల వలన అపవిత్రములుగను, అశుద్ధములుగను అగు చుండెను. వాటిని సంస్కార మూలకముగా శుద్ధి పరిచెడి పద్ధతి లోకమున రూఢియందున్నది. మనము ఉపయోగంచెడి వస్త్రములు మలినమైన యెడల వాటిని ఉతికి శుభ్రము చేసుకొను చున్నాము. పాత్రల కంటిన మలినము బూడిదతో కాని మన్నుతోకాని తోమి శుభ్రము చేసుకొను చున్నాము. ఈ విధముగా మరల మరల అపరిశుభ్రముగా తయారయ్యెడి వస్త్రాది పదార్థములను వివిధ ఉపాయముల ద్వారా శుద్ధము చేసుకొను చున్నాము. అయితే పరబ్రహ్మ లింగమునకు మాలిన్యము అంటెడి ప్రశ్న యే ఉండదు. అట్టి పవిత్రమైన లింగమును దీక్షా సంస్కారము పిదప దేహము మీద ధరించు కొనిన యెడల శరీరము సర్వకాల సర్వావస్థలయందు పవిత్రమై యుండి లింగధారికి జనన మరణ రజస్వలసూత కాదులు ఉండవని ఉపదేశించడమైనది. పవిత్రమైన వస్తువు యొక్క సంబంధము చేత అపవిత్రమైన వస్తువు కూడా పవిత్రమయ్యెడి అవకాశము కలదు. గంగానది కలిసిన కాలుష్యమంతయు గంగానది యొక్క పవిత్రత చేత పవిత్రమగు చుండును. అటులనే లింగము యొక్క సంబంధము దేహమునకు నిరంతరముగా ఉండి నందున దేహము కూడా పవిత్రమయియుండును.దీనికి యెట్టి అపవిత్రత అంటజాలదు. ఈ కారణము వలననే పవిత్రము చేసెడి స్వభావమును గలిగిన లింగమును ఋగ్వేదమునందున పవిత్ర అనెడి పేరుతో సంభోదించనైనది. ఈ లింగతత్వమునే శివ అని పిలవబడు చున్నాది. శివ తత్వమనగా లింగతత్వమే. లింగ తత్వమనినను శివ తత్వమే. ఈ రెంటికిని భేదము లేదు ఈ తత్వము ఎల్లప్పుడు జ్ఞానరూపమై యుండును. ఇది ఆనంద దాయకమైనది. శివుడే అందరి మీద పరిపాలన చేసెడి వాడైనందునను, అతని మీద శాసనము చేసెడి వాడు వేరుగా యెవ్వరునూ లేనందుననూ శివుడు నిరంకుశుడని ప్రతిపాదించబడినది. ఈ శివుడే సకల లోకాంతరములకు కారణభూతుడగు చున్నాడు. సకల విశ్వము లింగము నుండియే ఉద్భవించు చున్నది. శివుని నుండియే వేదములు ఉద్భవించెననియూ సధ్యాజ్యోత, వామదేవ, అఘోరతత్పురుషములనెడి ముఖముల నుండి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము బయలు వెడలెనని చెప్పబడినది. శివుని ఈశాన ముఖము నుండి వాతులాది యిరువది యెనిమిది శివాగమములు బహిర్గతము లైనవని చెప్పబడినవి.

ఈ పరశివలింగము పరిపూర్ణముగా నుండును. ప్రపంచములోని యే వస్తువును పరిపూర్ణ మైనదిగా బావించుటకు వీలు లేదు. వాటిలో ఏదో ఒక లోపము ఉండియే తీరును. కాని లింగతత్వములోని పూర్ణతత్వమునకు యెట్టిలోటును లేదు. ఈ లింగతత్వము యొక్క చింతన చేత భక్తులు జనన మరణాత్మకమైన మహాసముద్రమును దాటగలుగుదురు. ఇది స్వయముగా జ్యోతిర్లింగమయి యున్నది. లింగతత్వమును యథాతదముగా తెలియు జేయుటకు శాస్త్రములకైనను సామర్థ్యత లేదు. అందుకే శివతత్వమును అనిర్దేశ్యమైనదని గుర్తించవలెను. ఇష్టలింగమును గురించి శ్రీ నిజగుణ శివయోగుల వారు యీ క్రింది విధముగా తెలియజెప్పిరి.

**మాతు మణంగ లింద త్త్రశా మీరిద తాతిశయాద**
**నిరుపాదిక నిర్మల జ్యోతి బెళగుత్తదే**
**విమల పరం జ్యోతి బెళగు త్తదే**

దీని యొక్క తెలుగు రూపము యీ క్రింది విధముగా నున్నది.

మాట మనషులకు నటుమీరిన స్వాతిశయక నిరుపాదిక నిర్మల జ్యోతి వెలుగు చున్నది. విమల పరంజ్యోతి వెలుగు చున్నది.

ఈ జ్యోతిర్లింగ తత్వము శాస్త్రములకు అగోచరమై యుండినను శివయోగులకు అనుభవ గోచరమై యున్నది. ఇది ప్రతి యొక్కరి అంతరంగముల యందున జ్యోతిర్లింగ రూపమున సదా విరాజిల్లు చుండినను సామాన్యులైన జనులకు దీని యొక్క అస్థిత్వము అనుభవములోనికిరాదు. అంతర్ముఖమైన మనోవృత్తి గలవారు యెరుగ గలుగుదురు అట్టి కోవకు చెందిన శివయోగులు యీ తత్వమును తమ దేహమునందలి మూలాధార, హృదయ మరియు భృకుటి మధ్యముల యందు సాక్షాత్కరించు కొందురు. ఈ విషయమును శ్రీ భగవత్పాదుల వారు యీ క్రింది విధముగా ఉపదేశించిరి.

శ్లో॥ ఆదారే కనక ప్రఖ్యం హృదయే విద్రుమ ప్రధమ్
భ్రూమధ్యే స్పటిక చ్ఛాయం లింగం యోగి విభావయేత్

ఈ ఉపదేశములోని సారాంశమేమన అంతరంగ మందున జ్యోతిర్లింగమును సాక్షాత్కరించు కొనవలెననిన శివయోగములను సాధించవలెను. ఇష్ట లింగ పూజ శివయోగములోని అంతర్భాగమే. నానా విధ ఉపచారముల చేత లింగపూజను వైభవో పేతముగా చేసిన మాత్రమున ఆపూజానంతరము కాని ముందుగాని దృష్టి యోగమును సాధించవలసి యుండును. హస్త పీఠమున ఇష్ట లింగమును పెట్టుకొని ధగధగ మెరిసెడి ఇష్ట లింగమందున ఏకాగ్రత దృష్టి నిలిపి అంత రంగములోన భృకిటి మధ్యము యిత్యాది ప్రదేశములకు మనోవృతిని కేంద్రీకరించినప్పుడు మన యిష్ట లింగము ఆకారమువంటి జ్యోతిర్మయమయిన ఆకారమును హృదయాది స్థానములో కాంచగలుగుదుము అందుచేతనే యిట్టి స్థితిని యోగులు మాత్రమే కనుగొనెదరని ఆచార్యుల వారు సెలవిచ్చిరి.

ఈ జ్యోతిర్లింగము అందరి హృదయములలో యుండినను అద్దానిని బహిర్ముఖ ప్రవృత్తి గల్గిన వారు చూడలేరు. అంతర్ముఖులైన శివయోగులకు మాత్రమే యదిగోచరమగును. ఈ అంతర్లింగ అనుసంధానమును వీరశైవా చార్యులు ప్రాణలింగార్చన మరియు భావలింగార్చన యని యందురు ఈ లింగ తత్త్వము యొక్క మహిమ అనంతమైనది. దీని ఆదిమధ్యాంతములు తెలుసుకొనుట సులభతరము గాదు. దేవాను దేవతలు ఈ లింగము యొక్క మహిమను గాంచజాలక అసమర్దులై యుండిరి శ్రీ వ్యాస మహిర్షిగారు, లింగ మహా పురాణమునందు యీ మహిమను ఎంతో అద్భుతముగా చిత్రించిరి.

పరమాత్ముడైన శివుడు జగత్‌పాలన నిమిత్తము విష్ణువును మరియు బ్రహ్మను సృష్టించి తన సంకల్పము చేత వారికి కొన్ని విధులను అప్పగించెను. బ్రహ్మ శివుని ఆదేశానుసారము నియమబద్దముగా సృష్టి కార్యమును సాగించ వలసి యుండును. మరియు విష్ణువు జగత్తులోని సకల ప్రాణుల ఆలన పాలనను చూడవలసి యుండును. జగత్తులయమును మాత్రమే పరశివుడే స్వయముగా రుద్రుడి రూపములో నిర్వహించు చుండెను. ఒకా నొక సమయమున పర శివాంశ చేత సృష్టించ బడిన బ్రహ్మ మరియు విష్ణువుల మధ్య వివాదమేర్పడెను. సకల ప్రాణులను సృష్టించి జగత్తు పరిధ విల్లడానికి కారణ భూతుడగుట చేత బ్రహ్మతానే, విష్ణువు కన్న అధికుడనని, మరియు ప్రాణులన్నియు తననే ముందుగా పూజించి అగ్రస్థాన మొసంగ వలసి యుండునని, సృష్టి గావించక పోయినచో ఆ ప్రాణుల ఉనికి యుండదు కావున వాటి ఆలన పాలన చూడ వలసిన ఆవశ్యకత లేదని, బ్రహ్మ భావించి విష్ణువుతో తన ఆధిక్యత గూర్చి తెలియజేసి, విష్ణువు కూడ మిగతా ప్రాణుల వలెనే బ్రహ్మ యొక్క ఆధిక్యతను అంగీకరించి, పూజింప వలసినదని వాదించెను. అందుకు విష్ణువు అంగీకరించక తానే అధికుడనని, బ్రహ్మ కన్న శ్రేష్టుడునని తన వాదనీ విధముగా విన్పించెను. సృష్టి కార్యము చాల సులభము, ప్రాణులను సృష్టించి జగత్తున విడిచిపెట్టి, వారి కర్మాను సారము మనగ వలసినదని బ్రహ్మ తనవిధిని ముగించు కొనును. కాని తాను మాత్రము, పిండము నుండి ప్రాణము పోసుకొని జగత్తున పడిన ప్రతి ప్రాణి యొక్క క్రమాభివృద్ధికై అవసరమగు అన్ని ఏర్పాట్లను చూడవలసి యుండుననియు; శైశవ దశ నుండి యవ్వనము; ప్రౌఢత్వము; వార్ధక్యము మున్నగు దశలయందు ప్రతి ప్రాణి సుఖమయమైన, విజ్ఞాన దాయకమైన, ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన జీవనమును గడుపుటకు అవసరమగు అన్ని వసతులను; సదుపాయములను; సామగ్రిని; విద్యాబుద్ధులను సమకూర్చ వలసి యుండుననియు; ప్రతి ప్రాణి యొక్క జన్మకు సార్థఖ్యత కల్గించుట చాల కష్టతరమైన దనియును మరియు ముఖ్యమైన విధి యనియు, అట్టి బాధ్యతలు నెరవేర్చుట చేత తానే శ్రేష్ఠుడనిని విష్ణువు వక్కాణించెను. అంతియే గాక సర్వ ప్రాణులు తనకు మాత్రమే పూజలు చేసి అగ్ర స్థానమొసంగ వలయునని, యీ కారణాన బ్రహ్మకన్న తానే శ్రేష్ఠుడనియు తనవాదనను వినిపించెను. వీరిద్దరివాదనలలో, వారు నిర్వహించే విధులు జగత్తునకు చాలా అవసరము. ఒకరు తన విధులు నిర్వర్తించక పోయినచో, యావత్ జగత్తు స్థంభించి పోవును. వీరిరువురు తమ ఆధిఖ్యత గురించి వాదులాడు కోవడము వలన తాత్కాలికాంగా పరశివుడు అప్పజెప్పిన వీరి పనులలో స్థబ్ధత ఏర్పడెను. దానిని గమనించి ఆకాశవాణి వారిరువు నుద్దేశించి మీరిద్దరు ఒక అంగీకారమున కొచ్చి తమలో ఎవరు శ్రేష్ఠుడో నిర్ణయించ వలసినది, వారిని సృష్టించిన ఆ ఆది దేవుడే యనియు, బ్రహ్మ మరియు విష్ణువు పరమాత్మ యగు పరశివుని శరణుజొచ్చి వలసినదిగా సలహా యిచ్చెను. అప్పుడు ఆపర శివుడు ఆది మధ్యాంతములేని సాకార లింగరూపమున వారికి సాక్షాత్కరించెను. తదుపరి వారిలోని అధికార ప్రలోభమును పసి గట్టి, వారికి గుణపాఠమును నేర్పదలచియును, లింగము యొక్క విశిష్టతను తెలియ జేయదలచి వారి నుద్దేశించి యీ విధముగా సెలివిచ్చెను. బ్రహ్మ మరియు విష్ణువులలో, ఎవ్వరు ముందుగా యీలింగము యొక్క మొదలును గాని అనగా పాదములను గాని లేదా మస్తకమును గాని అనగా అంతమును గాని గాంచి

తనకు తెలియచేయుదురో అతడిని వారివురిలో శ్రేష్ఠుడిగా పరిగణింతునని తెల్పెను. అప్పుడు బ్రహ్మ తాను లింగము యొక్క అంతమును జూచి వచ్చెదనిని, హంస వాహనము మెక్కి వెడలెను. విష్ణువు కూర్మ రూపమును దాల్చి లింగము యొక్క ఆది (పాదములను) గనివచ్చుటకు బయలు దేరెను. ఈ విధముగా బ్రహ్మ విష్ణువులు కొన్ని వేల సంవత్సరములు లక్షల యోజనములను పయనించిరి. కాని బ్రహ్మకు లింగము యొక్క మస్తిష్కము గాని, విష్ణువునకు లింగము యొక్క పాదములు గాని కన్పడలేదు.దానితో అలసిన వారిద్దరు తిరిగి ప్రయాణము చేసి ఆ పరమాత్మని సన్నిధికి చేరిరి. బ్రహ్మ తాను లింగము యొక్క మస్తిష్కమును చూచుటకు పోయిన మార్గములో కామధేనువు గని, తాను లింగము యొక్క అంతమును జూచుటకు అశక్తుడనైనానియు, ఏ విధముగానైనను పరమేశ్వరుని ముందు మాత్రము, తాను ఆ లింగము యొక్క అంతము జూసినట్లుగా సాక్ష్యము నివ్వ వలసినదిగా ప్రార్థించగా, కామధేనువు అంగీకరించెను. అదే సమయములో లింగము యొక్క మస్తిష్కమున అలంకరించబడిన మొగిలి పువ్వు జారి, పాదముల వైపు వచ్చుచుండెను. దానిని జూచిన బ్రహ్మ మొగిలి పువ్వును గని, అది యొక్కడి నుండి వచ్చుచున్నదో తెలిసికొని, తాను కూడ లింగము యొక్క మస్తిష్కమును జూచి, తిరుగ ప్రయాణము చెసినట్లుగా సాక్ష్యమివ్వ వలసినదిగా కోరెను. ఈ విధమైన రెండు అబద్ధపు సాక్ష్యములను కూడగట్టుకొనిన బ్రహ్మ, పరమాత్ముని చేరి, తాను లింగము యొక్క మస్తిష్కమును గాంచితినని, అందుకు కామధేనువు మరియు మొగిలి పువ్వు లిరువురు సాక్షులని గట్టిగానమ్మ బల్కెను. అప్పుడు పరమాత్ముడు సత్యమును నిర్ధారించుకొనుటకై మొదట కామధేనువును బ్రహ్మ వాక్కులలోని సత్యము తెలుపుమని కోరెను. అప్పుడా కామధేనువు స్పష్టముగా మాటలలో చెప్పక; తలను బ్రహ్మ వాక్కునకు అనుకూలముగాను; పృష్ఠ భాగమునందు తోకను నిజము కాదని తెలియజేయు సంకేతములనిచ్చెను. దీనితో బ్రహ్మ వాక్కులు నిజము కాదని తేలెను. పరశివుడే లింగాకారములో సాక్ష్యాత్కరించిన వాడు గావున, నిజము తనకు తెలిసినను, బ్రహ్మ కామధేనువు; మరియు మొగిలి పువ్వులలోని సత్య నిష్ఠను పరీక్షించుటకై యీ ప్రయత్నము చేసెను. చిరకు ఆముప్వురు అసత్యమును పలుకుట చేత వారిని కఠినముగా శపించెను. బ్రహ్మకు లోకములందు పూజలుండవనియును; కామధేనువును దర్శించువారు; దాని ముఖమును దర్శించుట వలన ఫలితముండదని, దాని పృష్ఠ భాగమునే దర్శించిన వలయు కోరికలు తీరుననియు మరియు మొగిలి పువ్వు శాశ్వతముగ లింగ పూజకు పనికి రాని పుష్పముగా ప్రకటించెను. దీనితో భీతిల్లిన బ్రహ్మ దేవుడు, తాను అధికార దర్పముతోను, అజ్ఞానము చేతను, శ్రేష్ఠుడిగా ప్రకటించ బడుటకై అసత్యమాడినట్లు గాను, అట్టి అసత్యమునకు విధించిన శిక్ష చాల బాధకరమైనదని దానిని పరిగ్రహింప వలసినదిగా దేవ దేవుడిని అనేక విధములుగా ప్రార్థించెను. అప్పుడు శాంతించిన పరశివుడు బ్రహ్మనుద్దేశించి, ప్రతి గ్రామ మధ్యలో బోడ్డురాయి లేదా బ్రహ్మ శిలగా నిన్ను ప్రాణులు స్థాపించి, జ్ఞాపకము వుంచుకొందురని సెలవిచ్చెను.

పరమాత్ముడు విష్ణువునుద్దేశించి లింగము యొక్క పాదములను చూడడానికి వెళ్ళి వాటిని చూడ గల్గినవాయని ప్రశ్నించెను. అప్పుడు విష్ణువు తనకు లింగము యొక్క పాదములను కనుగొను సామర్థ్యము లేదని, కనుగొనుట ఎవ్వరికి సాధ్యము కాదని, అందు వలన ఆది దేవుడే శ్రేష్ఠుడనియు తాను మాత్రము ఆతని సంకల్ప సృష్టిననియు సత్యమును పల్కెను. అప్పుడు పరశివుడు, విష్ణువు తన అసమర్థతను నిర్భయంగాను, నిక్కచ్చిగాను వెలువరించుట విని సంతోషించి, జగత్తునందు, సకల ప్రాణుల చేత పూజింపబడుదువని వరమిచ్చెను. అప్పుడు విష్ణువు మరియు బ్రహ్మ యిరువురును. తాము అల్పులమని, ఆది దేవుడైన పరశివుడే శ్రేష్ఠుడని, తాము ఆతని ఆజ్ఞాను వర్తులమని లింగరూపమున వెలసి, ఆ పరశివుడే తన ఆదికృతను నిరూపించినాడని తలంచి, పరి పరి విధములుగా ఆ లింగము యొక్క మహాత్మ్యమును స్తుతించిరి.

ఈవిషయమున బసవన్న గారు కూడ లింగతత్త్వము యొక్క మహత్వమును కొనియాడిరి. ఈ క్రింది వచనమును చూడిరి.

**"జగదగల ముగిలగల మిగియెగల నిమ్మగల**
**పాతాళ దిందత్తత్త నిమ్మ శ్రీ చరణ**
**బ్రహాండ దిందత్తత్తనిమ్మ శ్రీ మకుటు**
**అప్రమాణ అగమ్య అగోచర అప్రతిమ లింగవె**
**కూడల సంగమ దేవయ్యా!**
**ఎన్న రస్థలక్కె బందు చుళు కాదిరయ్యా"**

పై కన్నడ వచనమునకు తెలుగు రూపము

**"జగత్తు కగలము మొగులుక గలము**
**మిగుల గలము మీయగలము**
**పాతాళము కంటె నటటు మీ శ్రీ చరణము**
**బ్రహ్మాండము కంటెనటటు మీ శ్రీ మకుటము**
**అప్రమాణ అగమ్య అగోచర అప్రతిమ లింగమా**
**కూడల సంగమ దేవయ్యా**
**నా కరస్థలముకు వచ్చి చులుకైతివయ్యా"**

శ్రీ బసవేశ్వరుల వారు లింగము యొక్క మహత్తును పలువిధములుగా కొనియాడి అది తనకరస్థలమునకు ఇష్టలింగ రూపమున ప్రాప్తమైనదని వివరించిరి.

పరాత్పరుడును, పరమాత్మయు అగు పరశివ లింగము యొక్క మహిమ అపారమైనది దానికి ఆద్యంతాదులు లేవు, ఈ లింగ తత్త్వము గురువు యొక్క అనుగ్రహము వలన మాత్రమే సాధ్యము. గురువను గ్రహము లేనివారు ఎంతటి పురుషులైనను దీనిని తెలిసికొన జాలరు. ఈ దివ్య జ్యోతిర్లింగము యొక్క ఆది అంతములను తెలియ లేక బ్రహ్మ విష్ణ్వాది దేవతలు అలమటించిరని చెప్పుచు ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**బ్రహ్మణా విష్ణు నా పూర్వం యల్లింగం జ్యోతిరాత్మకమ్ ॥**
**అపరిచ్ఛేద్య మభవేత్ కేనవా పరిబోద్యతే ॥**
**బహునాత్ర కిముక్తేన లింగ బ్రహ్మ సనాతనమ్ ।**
**యోగినో యత్ర లీయంతే ముక్తపాశ నిబంధనా ॥**
**పీఠికా పరమాశక్తిః లింగంసాక్షాత్ పరః శివః ।**
**శివశక్తి సమాయోగం విశ్వం లింగం తదుచ్యతే ॥**
**బ్రహ్మదయం మణిసర్వేమానయః పౌనపాదయః**
**శివ లింగార్చనా దేవ స్వంస్వల పదమ వాప్నుయుః ॥**
**విశ్వాధి పత్య మీశస్య లింగమూర్తేః స్వభావజం ।**
**అనన్య దేవ సాదృశ్యం శృతి రాహ సనాతనీ ॥ (సి. శి. 11; 30-34)**

ఈ ఉపదేశములోని తాత్పర్యమేమనగా లింగము యొక్క మహిమను ఎంత వరకు కొనియాడిననూ తక్కువే. పర బ్రహ్మ లింగము సనాతనమైనది. శివయోగులు ఈ లింగము యొక్క చింతనను చేసి అణవాది మలముల నుండి ముక్తులై లింగ రూపులయిరి. ఆ పరబ్రహ్మ లింగము యొక్క పీఠము శక్తి రూపమై యున్నది. బాణము సాక్షాత్ లింగ స్వరూపమే. శక్తిస్వరూపము, శివశక్తుల సంయుక్త రూపమే శివలింగము. విశ్వమంతయు శివ శక్తుల రూపమున నుండుటచే ఆ విశ్వము లింగస్వరూపమనియే భావించ వలెను. బసవన్న వారి వచనమును ఈ నేపథ్యము ననే అవగాహన చేసుకొన వలెను. ఈ భావనకు సమర్థత నిచ్చెడి "లింగ మధ్యే జగత్సర్వం లింగ బాహ్యం పరం నాస్తి" అనెడి ఆగమోక్తులు గమనార్హములైయున్నవి.

బ్రహ్మాది దేవతలు శౌనకాది ఋషులు, యక్ష కిన్నెరాదులు, ఈ శివలింగమును పూజించియే తమ తమ పదవులను పొందిరి. ఇచ్చట దేవతలు అనుపదము యొక్క వివరణ ఇవ్వవలసి యుండెను. సాంకేతికముగా దేవుడొక్కడే. అతడే శివపరబ్రహ్మ. దేవతలు అనబడే వీరందరునూ ఒక జాతికి చెందిన జీవులని గ్రహించవలెను.

ఈ కారణమున పరశివలింగమే సమస్త విశ్వమునకు ఆది పత్యము వహించు చున్నది. విశ్వాధికృత మరియు విశ్వాధి పత్యము లింగమూర్తికే కాని వెరెవ్వరికీ లేదని గ్రహించ వలెను. ఇది స్వభావ సిద్ధమైనదే కదా. అందువలన శివుడు అనన్యసదృశుడై యున్నాడని

గ్రహించవలెను. పరశివలింగమే సర్వోత్కృష్టమైన దనియును ఈ విషయమునే శృతి శాస్త్రాదులు ఘంటా ఘోషగా చాటుచున్నవనియును తెలిసికొనగలరు. ప్రసాది స్థలమున యుండెడి భక్తుడు ఈ లింగము యొక్క మహతిని యెరిగి దానియందు మాత్రమే తన అవధానమును కేంద్రీకరించుకొన వలెను. ఇచ్చట లింగమనగా ఇష్ట లింగమని యే గ్రహించవలెను. బసవన్న వారు చెప్పిన యటుల విశ్వవ్యాపితమైన లింగము గురుకరుణ వలన ఇష్టలింగ రూపమున ఇవ్వబడినది. అదియే నిజమైన లింగము. ఈ కారణము వలన ప్రసాది స్థలములోని శివ భక్తుడు ఇష్టలింగే తరములకు లింగాదుల వైపు తన శ్రద్ధా శక్తులను మరియు అవధానమును కేంద్రీకరించ వలదు. అతనికి ఇష్ట లింగము మాత్రమే మానసిక వృత్తిని కేంద్రీకరింప దగినదై యున్నది. మరోమాటలో చెప్పవలెననిన స్థావర లింగాదులు మాహేశ్వర స్థలములోనున్న భక్తునకు ఆరాధనీయములు కావు. ఈ సత్యమును గ్రహించి వీరశైవులు తమ అవధాన భక్తిని పెంచి కొనెదరు గాక.

ది ॥ 6-9 - 1991
స్థలం : నాగపూర్

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యుల వారు లింగమాహాత్మ్యము నెరింగించుటకై లింగతత్త్వమును విడమరచి చెప్పిరి.

లింగతత్త్వము నిగూఢమైనది సామాన్యులకిది యగోచరమై యుండును. ఈ విషయమును తెలిపెడి యీ క్రింది పద్యమును గనుడి :

**ఉ॥ లింగము మూర్తియంచు మరి లింగము నేమని పూజసేయుండా**
**లింగము మూర్తియంచు మరి లింగము నెక్కడ నెట్లుగొల్చుము**
**న్నంగము లేదు సత్క్రియకు నంగము లేక భజింపరాదు లిం**
**గాంగ వినిశ్చయం బెరుగ నన్యుల శక్యమే లింగ సంచితా! (అనుభవ సారము; ప.151)**

ఈ విషయమును వివరించి చెప్పెడి శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనము గమనార్హమై యున్నది.

**భూతోయ పావక సమీరణ యాబ రాదు లెల్ల**
**ఆది ఆధారములోని పరమాత్మ లింగమందు**
**ఆది మధ్య యవసానముల నరయని**
**అగమ్య వేదాది సకల శాస్త్ర ప్రమాణికులు అద్దాని నిట్టిదని యుపమించ లేరు**
**మహంత కూడల సంగమ దేవా! (బసవేశ్వర గీతామృతము, పు. 620)**

అత్యంత ప్రాచీనమైన అగమాలు గాని, యెంతో గౌరవాన్ని పొందిన వేదాలు గాని లింగతత్త్వమును గుర్తించ లేక పోయినవి. ఈ విషయమును మల్లికార్జున పండితుడీ క్రింది విధిన తెలియ జేసిరి.

**కం॥ బందుగ శివుని తత్త్వం**
**బందగ విజ్ఞాన మేక మజమణు చరమా**
**నందం బనియెడుగాని య**
**నిందితముగ నిట్టిదనగ నేరవు శ్రుతులున్ (శివతత్త్వ సారము, ప. 2)**

షట్ త్రింషత్ తత్త్వముల కుద్భవ స్థానమైన లింగము వలననే వేదాగమాదులు యుద్భవించినవని తెలిసి కొన వలెను. అట్టి యెడ వేదాదులు గాని, ఆగమాలు గాని, వేదాంతము లైనను లింగతత్త్వము నెరుగ జాలవు కదా! హరిబ్రహ్మాలు లింగము యొక్క ఆద్యంతములను చూడజాలక విఫలమనోరథులై రనెడిది పౌరాణిక ప్రసిద్ధిని గాంచిన విషయమే గదా! అప్పుడు హరి బ్రహ్మాలు లింగమును పర బ్రహ్మాగా యెంచి యీ క్రింది విధిన స్తుతించిరని తెలుప బడినది.

అనాది మల సంసార రోగవైద్యాయ శంభవే !
నమః శివాయ శాంతాయ బ్రహ్మణే లింగమూర్తయే
ఆది మధ్యాంత హీనాయ స్వభావానల దీప్తయే
నమః శివాయ శాంతాయ బ్రహ్మణే లింగ మూర్తయే !
ప్రళయార్ణవ సంస్థాయ ప్రళయోత్పత్తి హేతవే
నమః శివాయ శాంతాయ బ్రహ్మణే లింగమూర్తయే
జ్వాలా మాలావృతాంగాయ జ్వలన స్తంభరూపిణే
నమః శివాయ శాంతాయ బ్రహ్మణే లింగమూర్తయే
ప్రధాన పురుషేశాయ వ్యోమ రూపాయ వేధసే
నమః శివాయ శాంతాయ బ్రహ్మణే లింగమూర్తయే
నిర్వికారాయ నిత్యాయ సత్యాయామల తేజసే
నమః శివాయ శాంతాయ బ్రహ్మణే లింగమూర్తయే
మహాదేవాయ మహతే జ్యోతిషే నంత తేజసే
నమః శివాయ శాంతయ బ్రహ్మణే లింగమూర్తయే
వేదాంత సారరూపాయ కాల రూపాయ ధీమతె
నమః శివాయ శాంతయ బ్రహ్మణే లింగమూర్తయే

**(వీర శైవ సంస్కార చంద్రిక, పుట. 349)**

ఇట్టి లింగ తత్త్వము శ్రీ గురువుల వారి యుపదేశము వలననే వేద్యమని తెలిసి కొనవలెను అన్యథా అసంభవమని భగవత్పాదుల వారు తెలిపిరి. ఈ భావమును పాల్కురికి వారు నీ క్రింది విధిన విస్తరించి చెప్పిరి.

ఉ॥ అంగమ దృశ్యదృశ్యముల కాశ్రయు దయ్యును గాన రానిస
న్మంగళ లింగమూర్తి నసమాన జగత్త్రయ చక్రవర్తి ను
త్తుంగ విశాల కీర్తి నవధూత వినమ్రజనార్తి నాత్మలో
సాంగముగాగ సద్గురు కృపాద్యుత గా కెరుగంగ వచ్చునే ?

సహజీకృత వీరశైవుడై బ్రాహ్మణ్యముతో పొత్తును బాసి శ్రీ గురు లింగ జంగమాంకిత తను-మన-ధనములు గల్గిన సద్భక్తుడు, మహానుభావిగా పేరుగాంచిన శ్రీ మల్లికార్జున పండితుడు, తన యనుభవములో వేద్యమైన యీ సత్యమునీ క్రింది విధముగా వివేదించిరి:

కం॥ నెరసిన గురు ప్రసాదము
వరలగ జగదేక సకల - వల్లభుడాదిం
గరకంఠుడ వేల్పునిని
న్నెరిగితి నీ మహిమ నెరుగ నేమియు రుద్రా! **(శివతత్త్వ సారము, ప. 75)**

శివాను భావులైన వారు తమ రచనలలో శివారాధన వలననే బ్రహ్మ విష్ణ్వాదులు తమ తమ పదవులను పొందిరనెడి శ్రీ భగవత్పాదుల వాక్కులను విస్తరించి చెప్పిరి. శ్రీ మల్లికార్జున పండితుని ఈ క్రింది పద్యము విషయమును విశదీకరించు చున్నది.

ఉ॥ లోకములన్ని నీ తనువులోనివ నీవట యెంత కల్గుదో
నాకప పద్మసంభవ జనార్ధనులాదిగనెల్ల పెద్దలున్

**నీకొల దింతయంతయని నేరక మ్రొక్క దొడంగి రన్న ని**
**న్నేకరణిన్ నుతింతు పరమేశ్వర శ్రీ గిరి మల్లికార్జునా!** **(అముద్రిత శతకము)**

అందుచేత ప్రసాది లింగనిష్ఠా తత్పరుడై నైష్ఠిక భక్తితో నిష్టలింగమును పూజించి ప్రసాదమును గ్రహించ వలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## జంగమ మాహాత్మ్య స్థలము

శ్రీ జగద్గురువుల వారు మొదటగా గురులింగముల మహాత్మ్యము నుపదేశించి ఆపిదప జంగమ మాహాత్మ్య స్థలమును గురించి తమ ఉపదేశమును కటాక్షించిరి. వీరశైవ ధర్మము నందున గురు లింగ జంగములు మాత్రమే పూజ నీయులు. ఈ ముప్వురును భిన్నమైన వారు కారు ఏక బిల్వ నుండు మూడు దళముల వలె వీరు పరస్పర అనుబంధమును కలిగి యుందురు. బిల్వదళమనగా మూడు దళములతో కూడిన ఆకు. అటులనే పరశివుడనగా గురు-లింగ-జంగములు. పరశివుడు నిరాకారుడైతే గురు-లింగ-జంగములు పరశివుని సాకార రూపములు. "ఏకమూర్తి స్త్రయోబాగాః గురు లింగంతు జంగమాః" అని చెప్పబడినది. శివుడే గురు రూపమును దాల్చి భవికి శివదీక్ష నిచ్చి భక్తుని జేసి వాడిని ధన్యుని చేయుచున్నాడు. ఆ పరశివుడే ఇష్ట లింగరూపమును దాల్చి గురుదత్త లింగమై భక్తుని శరీరమును అలంకరించి సదా సన్నిహితుడై సకల విధములుగా రక్షణను కల్పించు చున్నాడు. మరల ఆ పరశివుడే సాకార జ్ఞానరూపుడైన జంగమ రూపమును దాల్చి భక్తులను లింగాంగ సామరస్య మార్గమున నడిపించి ముక్తులుగా చేయచున్నాడు. ఈ విధముగా విభిన్నములుగా యుండెడి మూడు రూపములు యనబడు భక్తోద్ధారణ ఒకే కార్యమును చేయు చున్నారు. ముప్వురి లక్ష్యమొక్కటే. భక్తుని సరియైన మార్గములో నడిపించి లింగైక్యతను సాధించే విధముగా తీర్చిదిద్దుట.

జంగమయ్య జగమెల్లయును శివ స్వరూపమేయని తెలిసికొని అంతటి శివ జ్ఞానమును అందరికి ఉపదేశించు చున్నాడు. అట్టి జంగమయ్య యొక్క స్వరూపమును గూర్చి శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశముని ఇచ్చిరి.

**శ్లో॥ గురు శిష్య సమారూఢ లింగ మాహాత్మ్య సంపదః ।**
**సర్వం చిద్రూప విజ్ఞానాజంగ మాధిక్య ముచ్యతే ॥**

**జానంత్యతిశయాద్యే తు శివం విశ్వ ప్రకాశకమ్ ।**
**స్వస్వరూపతయా తే తు జంగమా ఇతికీర్తి తాః ॥ (సి. శి. 11; 35 - 36)**

ఈ ఉపదేశములోని భావమేమనగా గురువు మరియు శిష్యుడు ఇరువురి చేత ఆరాధింపబడెడి లింగము యొక్క మహిమ ఎంతో గొప్పది. అది ఒక చిత్ స్వరూపము. చిద్రూపమైన ఆ లింగము జగమంతయు వ్యాపించు కొనియున్నది. కాని విజ్ఞత గలిగిన వారే దీని నెరుగ గలరు. విజ్ఞత గలిగిన వారెల్లరకును శిఖామణిగదోచెడి జంగమయ్య లింగ తత్త్వమును గుర్తించును. లింగ తత్త్వమును అవగతము చేసికొనినవాడై నందుననే జంగమయ్య పూజనీయడగు చున్నాడు. తన స్వయం ప్రకాశము చేత జగత్తుకు ప్రకాశము నివ్వగలిగిన పరాత్పరుడగు శివుని జంగమయ్య తన ఆత్మగా తెలిసికొని సాక్షాత్ శివ స్వరూపుడగు చున్నాడు. ఈ లోకమున శివుని ప్రత్యక్షముగా పూజించుట సంభవమగునే? అది అసాధ్యము శివ జ్ఞాన స్వరూపుడైన జంగమయ్యను ఆరాధించుట ద్వారా మనము శివుని పూజించిన వారమగు చున్నాము. జంగమయ్య కోరిన పదార్థములను ప్రదానము చేసి సహజదానిగా నిలిచెడి ప్రసాద స్థలములోని భక్తుడు జంగమ తృప్తినే సాధించు చున్నాడు. "శివయోగిని సంతృప్తే తృప్తో భవతు శంకరః" అని చెప్పబడినది. శివజ్ఞానియైన జంగమయ్య తృప్తిని చెందితే శివుడు గూడా తృప్తిని చెందును. సుదృఢమైన శివజ్ఞానము అనబడే ఐశ్వర్యము గల జంగమయ్యను శివయోగి అని పిలుతురు. జంగమయ్య మరియు శివయోగి అనెడి పదములు ఒకే ఒక అర్థమును బోధించెడివై యున్నవని గ్రహించ వలెను.

శివ యోగము ద్వారా ఈ జగమంతటిని తెలిసికొనుటకు పూనిన జంగమయ్య క్రమ క్రమముగా ఆజ్ఞానములో పరిపుష్టిని సాధించి శివయోగిగా పరిణామము చెందునని భావింపదగును ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశము నొసంగిరి.

**శ్లో॥ యే పశ్యంతి జగజ్జాలం చిద్రూపం శివయోగతః ।**
**నిర్ధూతమల సంస్పర్శా స్తే స్మృతాః శివయోగినః ॥**
**ఘోర సంసార తిమిర పరిధ్వంస న కారణమ్ ।**
**యేషామస్తి శివజ్ఞానం తే మతాః శివయోగినః ॥**
**జితకామా జితక్రోధా, మోహగ్రంథి విభేదినః ।**
**సమలోష్టాశ్మ కనకాః సాధవః శివయోగినః ॥**
**సమాః శత్రౌ చమిత్రే చ సాక్షాత్ కృత శివాత్మకాః ।**
**నిస్పృహా నిరహంకారా వర్తంతే శివయోగినః ॥ (సి. శి. 11; 37-40)**

శివునితో నిరంతరము సంబంధము కల్పించెడి విధానమునకు శివయోగమనెడి పేరు. ఈ విధానమును సాధించిన వాడే శివయోగి యగుచున్నాడు. ఎవరు శివునితో సదా సంబంధమును గలిగి యుందురో వారు శివస్వరూపులే అగుచున్నారు. మన ఇంటిలోని విద్యుద్దీపములు వెలుగులు జమ్ముచూ దేదీప్యమానముగా ప్రకాశించ వలెనని ఆ దీపములకు విద్యుత్ కేంద్రముతో సంబంధము కలిగించ వలెను. శివుని యందలి దివ్య జ్ఞానమును ప్రాప్తము చేసికొనుటకు సాధకుడు శివునితో సంబంధము గలిగి యుండవలెను. ప్రాచీన కాలమునకు చెందిన కపిల కణాద పతాంజలి మొదలగు ఋషులు పొందిన జ్ఞానము శివధ్యానము, శివకరుణ వలన పొంది వివిధ శాస్త్ర గ్రంథములు వ్రాయుటకు నుపయోగించిరి.

శివయోగము వలన శివునితో తాదాత్మ్యము పొందుట సాధ్యమగును. శివునితో తాదాత్మ్యము పొందిన వానికి మలవాసనలు ఉండవు కదా! మలము తొలిగిన పిదప అతడు అంతరంగములోను, బహిరంగములోను పరిశుద్ధుడగు చున్నాడు. ఆ పరిశుద్ధత కారణముగా శివజ్ఞానము లభ్యమగును. అప్పుడతడు తానేశివుడని ఎరుగుటయే కాకుండా తన చుట్టు పక్కలను విశ్వమంతయును శివ స్వరూపమని భావించు చున్నాడు. ఇట్టి మహిమాన్వితుడైన శివయోగి వలన ఎవ్వడేని ఉపదేశమును పొందిన యెడల అతడు మనోనైర్మల్యమును సాధించు చున్నాడు. శివయోగి కామక్రోధాదులను గెలిచి మోహము అనెడి దానిని హృదయ గ్రంథి నుండి తొలగించుకొనెడి వాడగును. ఇతడు ద్వంద్వములను గాంచెడి వాడు కాడు. అదే విధముగా అసమానతలను కూడా గాంచ జాలడు. సమతా మమతా అతని లక్షణములై యుండును. భౌతికవైభవములు అతనికి ప్రలోభములు కల్పించవు. అందుచేత సంపదల యెడల విముఖత గలిగి యుండును. ముఖ్యముగా పరద్రవ్యముల నాశించడు. బంగారమును మట్టితో సమానముగా చూచును, విరాగ జీవితమును గడిపెడి శివయోగికి శతృవులూయుండరు, మిత్రులూయుండరు. అందరూ సమానులే. నిరహంకారము శివయోగి యొక్క విశిష్ట లక్షణమై యుండును. ఇట్టి సకల సద్గుణ లక్షణములతో శోభిల్లెడి శివయోగిని గౌరవించి పూజించని వారెవ్వరు. వీరు, వారనక ఎల్లరూ ఎల్లెడల శివయోగిని పూజించి ధన్యతను బడయుదురు శ్రీ భగవత్పాదులవారు శివయోగిని గూర్చి మరికొంత ఉపదేశమును ఈ క్రింది విధముగా ఇచ్చిరి.

**శ్లో॥ దుర్లభంహి శివజ్ఞానం దుర్లభం శివచింతనమ్ ।**
**యేషామేతద్ ద్వయం చాసితేహి సాక్షాచ్ఛివాత్మకాః ॥**
**పాదాగ్ర రేణ వో యత్ర పతంతి శివయోగినామ్ ।**
**తదేవ సదనం పుణ్యం పావనం గృహమేధినాం ॥**
**సర్వసిద్ధి కరం పుంసాం దర్శనం శివయోగినామ్ ।**
**స్పర్శనం పాపశమనం పూజనం ముక్తి సాధనమ్ ॥**
**మహతాం శివతాత్పర్య వేది నా మనుమోదినామ్ ।**
**కిం వాఫలం హినో సిద్ధ్యేత్ సంపర్కాచ్ఛివ యోగినామ్ ॥ (సి.శి. 11; 41-44)**

శ్రీ భగవత్పాదుల వారి యానతి ప్రకారము శివుడే సర్వోత్తముడు అనెడిది గాని, నేనే శివ స్వరూపుడను అయియున్నాను అనెడి చింతనగాని సులభముగా లభించెడివి కావు శివజ్ఞానము మరియు శివ చింతనలు సాధారణ మానవులకు దుస్సాధ్యములై యున్నవి. కారణమేమనగా పరిశుద్ధాంత రంగునికి మాత్రమే ఇవి లభ్యమగును. బహిరంగ ప్రవృత్తిని పెంపొందించు కొనిన వానికి ఇవి లభించవు. శివయోగికి మాత్రము ఇవి సుసాధ్యములే. ఈ కారణము వలన శివయోగిని శివరూపియని భావించ వలెను. వాస్తవముగా చూడ నిస్సందేహముగా అతడు శివ స్వరూపుడే. అతడు కాలుపెట్టిన ప్రదేశము పరమ పవిత్రమై విరాజల్లును. కారణమేమనగా అతని పాదమును తాకినధూళి ఎంతటి మలసహితమైన ప్రదేశమునైనను నిర్మలము చేయ గలిగెడి సామర్థ్యము గలిగి యుండును. దీని భావమే మనగా సంసారమున తిరుగాడెడి జీవులందరు శివయోగిని తమ ఇళ్ళల్లోని తీసికొనివెళ్ళి పవిత్రము చేసికొనవలెను. ఇంటిని పవిత్రము చేసికొనుటకు గోము త్రాదులను, గంగ మట్టిని ఉపయోగించెడి అలవాటు గలిగిన వారు ఈ ధర్మ సూక్ష్మమును గుర్తెరిగినవారై శివయోగి యొక్క పాద ధూళి ద్వారా తమ తమ గృహములను పావనము చేసికొన వలెను.

పాపోపశమనము గురించి ప్రాయశ్చిత్త కర్మలెన్నియో విధింపబడినవి. ప్రసాది స్థలమున భక్తునికి అవి విహితములు కావు. తనువును శివయోగి పాదములకు తాకించి మనస్సును శివయోగి పాదపూజకు ముట్టించి ధన్యతను బడసిన వానికి పాప పంకిలమము యొక్క ప్రభావము మిగిలి యుండదు. విగత కల్మశుడై విరాజిల్లును. లింగాంగ సామరస్యమును సాధించెడి అర్హతను పొందగలుగును.

శివ రహస్యమును గుర్తించిన వానికి శివానందము సంప్రాప్తమగును. ఐహిక సుఖములకు ప్రాముఖ్యత నిచ్చెడి వాడు ఇట్టి పారలౌకిక సుఖమును అనుభవింపజాలడు. ఇట్టి అనుభవమును పొందెడి జంగమయ్యల సాన్నిధ్యమున ఎల్లకాలము యుండెడి వానికి సకల సిద్ధులు కలుగునని గుర్తెరుగ వలెను. సత్‌సాంగత్య మహిమను కొనియాడని నీతి శాస్త్రజ్ఞులు యుందురే? ఎల్లరు సత్సాంగత్యమును పొందవలెనని బోధింపబడినది. వీరశైవులు జంగమయ్యను సత్పురుషునిగా భావించుకొని అతని సాంగత్యములో నుండి, అతడు పొందెడి శివానందములో భాగము పంచుకొనుటకు ప్రయత్నించ వలెను. చందనము యొక్క సాంగత్యములో సాధారణమైన కట్టెలు సుగంధ భరితములై హృదయమునకు ప్రసన్నత గలిగించిన యటులనే జంగముల సాంగత్యము పొందిన సద్భక్తులు తమ అనుభావము వలన లోక కళ్యాణమును సాధించవలెను. అజ్ఞానములో కొట్టుమిట్టాడెడి వారి యెడల సానుభూతిని ప్రదర్శించి దయామయులై, వారిని చేరదీసి జంగమ సాంగత్య సౌభాగ్యమును కల్పించిన యెడల వారికి శివుడు ప్రసన్నుడగును.

శివ ప్రసన్నత సాధించ దలచిన వాడు జంగమారాధన యెడల శ్రద్ధాసక్తులను కనబరచ వలెను. సనాతన కాలము నుండియు జంగమా రాధన యొక్క ప్రాముఖ్యత గుర్తింప బడుచున్నది. గణా రాధన చేయనివానికి జంగమారాధన యెడల ఆసక్తి పెరిగెడి అవకాశము లేదు. అందుచేత ప్రసాది స్థలములోని భక్తుడు గణారాధనా నైపుణ్యమును కూడ సంపాదించు కొనవలెను. ఈ విధముగా ప్రసాది స్థలములోని సద్భక్తుడు తోటి సద్భక్తులను గౌరవిస్తూ గురులింగ జంగములను శివ స్వరూపములుగా భావించుకొని కొలిచి ప్రసాదమును గైకొని సావధాన చిత్తముతో ప్రసన్న హృదయుడు కావలెను. ప్రత్యేకంగా వీరశైవులు ఈ ధర్మ రహస్యమును గుర్తింతురు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 7-9 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

ప్రసాది స్థలమున నున్న భక్తునికి జంగమయ్య యెడల యనన్య సామాన్యమైన యవధాన భక్తి యుండవలయునని యీ స్థలమున నుపదేశించనైనది. శ్రీ కాశీ జగద్గురువుల వారు జంగమ మాహాత్మ్యమును నెంతయో విశదముగా ప్రతిపాదించిరి.

సప్త విధశైవములకు చెందిన వారందరు జంగమయ్యను శివ స్వరూపునిగా భావించి కొలుతురు. శ్రీశైల క్షేత్రములోని మల్లికార్జునో పాసనను దాహరణగా గైకొన వచ్చును. శ్రీశైల మల్లికార్జున స్వామిని భక్తులు జంగమ కులజుడగు మల్లయ్యగా భావించికొని జంగమార్చన

చేయు చుందురు. శివుడే జంగమ వేషమును ధరించి నిలిచెనని సామాన్య శైవులు భావించగా, జంగమయ్య మల్లికార్జున మూర్తి రూపమున కొలువబడు చున్నాడని వీరశైవులు భావింతురు. "యః శివః స జంగమః; యః జంగమః స శివః" అనెడి సూక్తి ప్రకారము శివ-జంగముల కభేదము గలదు. "జంగమ రూపశ్శివః శివః ఏవ జంగమ రూపః" అని చెప్పబడినది. శివ భక్తుడే జంగముడన బడుచున్నాడు. జంగమునికి శివభక్తి యవశ్యముగా నుండవలసినదే. కాని ప్రతి శివ భక్తుడు జంగముడు కాదని వీరశైవ పండితుల సుస్థిరాభిప్రాయము, జంగముడు పూజ్యుడైతే శివ భక్తుడు పూజకుడు. వీరివురి మధ్య స్వామి-భృత్య సంబంధముండును. జంగమ శబ్దమున కెవ్వరి కిష్టమైన యర్థమును వారు కల్పించి చెప్పుచున్న ప్రస్తుత పరిస్థితిలో శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము జ్ఞాన దాయకమై యున్నది.

"జం-గమ్యంత ఇతి-అతిశయేన గచ్ఛంతీతి జంగమాః" అనెడి వాక్కు ప్రకారము అతిశయమైన మార్గమున జ్ఞాన సముపార్జన చేసి, దానిని భక్తులకు పంచిపెట్టి తరింపజేసెడి వాడే జంగముడని గ్రహించ వలెను. "బ్రహ్మం చరంతి బ్రాహ్మణః" అనెడి సూక్తి వలె 'జ్ఞానం చరంతి జంగమః' అనెడి సూక్తి గలదు. సాకారమౌ శివ జ్ఞానమే చరలింగమై జంగమయ్యగా గుర్తింప బడినది. జంగమయ్య గారి సహాయము లేకుండగ, సాధకుడు సిద్ధిని పొందజాలడు. శ్రీ గురువు భక్తి మార్గ సత్క్రియాచరణమునకు మార్గదర్శ కత్వము వహించగా, జంగమయ్య సాధించెడి ప్రక్రియకు వలయు సాధన-సంపత్తిని, బుద్ధి-కుశలత, విషయ-నైపుణ్యము, ప్రేరణ-వైఖరులను ప్రదానము చేయును. సాధకునికి లింగాంగ సామరస్యము సాధించెడి దిశలో పయనింప జేయును. తన్నిమిత్తమై యవసరమయ్యెడి జ్ఞానము, విజ్ఞత, ఆచారము-విచారము, సమత-మమత అనురాగము-విరాగములను గల్గియుండును. స్వయం ప్రకాశమూర్తియై విరాజిల్లును. శివయోగ సాధనలో నిష్ణాతుడై, శివుని చిద్రూపము ననుభవించుచు, తదనుభవానందము నందరికి తగిన రీతిన నందజేయుచు నుండును. సంసార భ్రాంతిని తొలగించును. ఈ కారణములన్నింటి మూలమున జంగమయ్య గారు పూజ్యుడగును. ప్రసాది యతని ప్రసాదమును సావధాన చిత్తముతో గైకొని ప్రసాదోప భోగియై తరించవలెను.

శివం భూయాత్

# ఆశీర్వచనము - 1

# భక్త మాహాత్మ్య స్థలము

జంజ్ఞాసువులగు సద్భక్తులారా!

ఇంతవరకు మీరెల్లరూ గురువు యొక్క మహిమను, లింగమ మహిమను మరియు జంగముని మహిమునూ వినిన వారలైతిరి. ఈ గురు-లింగ-జంగములందు అనన్య భక్తిని యుంచిన భక్తుని మహిమ గూడా తక్కువైన దేమీకాదు వారున్నూ అంతే పూజ్యపాదులు ఈ భక్తమహాత్మ్య స్థలమునందు భక్తి మరియు భక్తుని మహాత్తును గూర్చి శ్రీ భగావత్పాదుల వారు ఈ రీతిగా ఉపదేశించిరి.

**శ్లో॥ గురోర్లింగస్య మాహాత్మ్య కథనాచ్చివ యోగి నామ్ ।**
**సిద్ధం భక్తస్య మాహాత్మ్యం తథా హ్యేష ప్రశస్యతే ॥**
**యే భజంతి మహాదేవం పరమాత్మానమ వ్యయమ్ ॥**
**కర్మణా మనసా వాచా తే భక్తాంతి కీర్తితాః ।**
**దుర్లభా హి శివే భక్తిః సంసార భయ తారిణీ ।**
**సాయంత్ర వర్తతే సాక్షాత్ స భక్తః పరి గీయతే ॥ (సి. శి. 11; 45-47)**

గురు-లింగ-జంగముల మహత్తును తెలిసికొని వారి యెడల అసాధారణ భక్తితో నడచుకొనెను భక్తుని మహిమను శాస్త్రములు గూడా కొనియాడినవి. భక్తుడనగనే భగవంతుని మహాత్వము వ్యక్తమగును. భక్తుడే లేకున్నచో భగవంతుని మహిమనూ ఎలా తెలిసికొనేది? అందుచే భగవంతుడు "మద్భక్తాః మమాధికాః" అనగా నాభక్తులు నాకంటెను అధికులు అని తెలిపెను.

ఈ కారణము వలననే భక్తుని గొలిచిన వారు భగవంతుని గొలిచిన వారగుదురని చెప్పబడినది. శివతత్త్వ నిరూపణ నిమిత్తము పరవాదులతో వాదించి శివ పారమ్యమును ప్రతిపాదించిన భక్తుల కథలు బసవపురాణములో కలవు. వీరిని గౌరవించుట కొరకు శివుడు కొన్ని లీలలను సృష్టించెనని తెలుప బడినది. హలాయుధుని కథను ఉదాహరణగా తీసికొన వచ్చును. సిరియాలుని గర్వోపశమనార్థమై శివుడు రచించిన లీలయే హలాయుధుని కథలో వివరింపబడినది. భక్తులను గౌరవించ వలెననియును, వారి యెడల భయ భక్తులు గల్గి యండవలెననియును తెలుపబడినది.

భక్తుడనిన నెవడు? యనెడి ప్రశ్న ఉదయించెడి యవకాశము గలదు. చేతులారంగ శివపూజ చేసి, నోరు నొవ్వంగ పలువురి కీర్తిని పొగడెడి వాడు భక్తుడగునా? అనెడిదొక పెద్ద ప్రశ్న. దేవుడొక్కడే యైనప్పుడు పూజించుట మరియు కీర్తించుట యనెడిది వాని గురించి యే ఉండవలెను. మనసా, వాచా, కర్మణా మహాదేవుని భజించెడివాడే భక్తుడని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిరి. మహాదేవుడే పరమాత్మయని నమ్మవలెను. అతడే శాశ్వతుడనియును గ్రహించవలెను. చిత్తైకాగ్రతను సాధించి, యద్దానిని శివుని వైపై కేంద్రీకరించు వాడే నిజమైన భక్తుడు. ఇతరదేవీ దేవతల వైపు మొగ్గు చూపె వాడు, భక్తుడు కారని శ్రీ భగవత్పాదుల అభిప్రాయము.

త్రికరణ శుద్ధితో కూడిన శివ భక్తిని సాధించుట సులభ సాధ్యమైన విషయము కాదు. మనస్సు చంచలమైనది. పరిపరి విధములుగా పరుగులు తీయును. చిత్తస్థైర్యము లేనివారు అధిక సంఖ్యలో నుందురు. వీరి బుద్ధి యవిహిత మార్గములు కనుగుణముగా నుండును. కర్మ బుద్ధిని యనుసరించును. నుడివే వాక్కులు, చేసే పూజలు శివపరమైనవిగా నుండెడి యవకాశము ఉండదు. ఇట్టి స్థితిలో శివభక్తిని త్రికరణ శుద్ధితో చేసెడి వాడు ధన్యుడు? పూజనీయుడే కదా!

శివభక్తి లేని వాని క్రియలు నిష్ఫలములగునని తెలుపుటకై శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును ప్రదానము చేసిరి:

**శ్లో॥ కింవేదైః కిం తతః శాస్త్రైః కిం యజ్ఞైః కిం తపోవ్ర తైః ।**
**నాస్తి చేచ్ఛాంకరీ భక్తిర్దే హినాం జన్మరోగిణామ్ ॥**
**శివ భక్తి విహీనస్య సుకృతం చాపి నిష్ఫలమ్ ॥**
**వీపరిత ఫలం చ స్యాద్దక్ష స్యాపి మహాధ్వరే ॥ (స. శి. 11-48-49)**

వేదముల చేతగాని, శాస్త్రముల చేతగాని, యజ్ఞతపస్యాదుల చేతగాని ఫలితముండదు. శివ భక్తి గల్గియుండక వేదభ్యాసాదులు చేసిన వారు నిష్కలులగుదురని గుర్తించ వలెను. కొన్ని సందర్భములలో సుకృతి యని పిలువబడెడిది విపరీతమైన ఫలముల నివ్వగలదు. మహాధ్వరము చేత ధక్షుడు అట్టిఫలమునే పొందెను కదా!

ధక్ష ప్రజాపతి మొదట అనన్య సామాన్యమైన శివ భక్తిని గల్గి ప్రజాపతిగా విరాజిల్లెను. మాయా ప్రభావమునకు లోనై శివ భక్తికి దూరముగా చరింప జొచ్చెను. క్రమ క్రమముగా వైషమ్య భావము వహించెను. శివ భక్తిని కించపరచ జొచ్చెను. గర్వాంధుడై చరియింప జొచ్చెను. ఒక గొప్ప యజ్ఞమును చేయసంకల్పించి, శివుని యద్దానికై ఆహ్వానించ డయ్యెను. ఆహ్వానము లేకుండిననూ అనురాగముతో విచ్చేసిన శివ సతిని అవమానము చేయగా భరించ లేక సతి యజ్ఞ కుండములోనికి దూకి యసువుల బాసెను. సంభవించిన సంఘటనలను నందీశ్వరుల వారు శివునికి నివేదింపగా. శివుడు రుద్రుడై. జడముడి విప్పి యొక్క జటను పీకి యొకరాతి మీదికి విసిరి కొట్టెను. అందులో నుండి రుద్రుని ప్రతిరూపుడును, రౌద్రావతారుడును భీమ రూపముగల వీర భద్రుడు దయించెను. శివ కుమారుడగు నీ వీర భద్రుడు శివునికి ప్రణమిల్లి యాజ్ఞను ప్రదానము చేయుమని కోరెను. శివుడు దక్ష గర్వభంగమే కర్తవ్యమని యాదేశించెను. వీర భద్రుడు యజ్ఞ సదనమునకు వెడలి. విరించి విష్ణ్వాది దేవతలెల్లరును అచ్చట గాంచి, దక్షుని చెంత యుండినందున వారి శివ భక్తి కళం కితమవగా. శివ భక్తి విహీనులై వికృత భావమును దాల్చిన వీరందరికి వీర భద్రుడు గర్వ భంగము చేసెను. శిక్షకు గురిచేసెను. వారు భయ భీతి చేత పరిగెత్తి పారిపోయిరి. ధక్షుడొక్కడే మిగిలెను. వీర భద్రుడతని శిరము ఛేదించెను. పిదప. శివుని యానతిన అజముఖము నాతని మొండెమునకు జోడించి సజీవుని చేసెను. ఈ కథ సుప్రసిద్ధమైన దే. యజ్ఞము విఘ్నమయ్యెను. సహజ సిద్ధమైన తలపోయి, బుద్ధి హీనతకు సంజ్ఞవలె నిలిచెడి మేకతల దక్షునికి గల్గెను. ఇదంతయూ శివభక్తికి దూరమైనందు వలన గల్గిన పరిణామములే కదా! ఈ విధముగా ఎంతటి సుకృతులైనను శివ భక్తిలేని యెడల వారి క్రియలు సత్ఫలితముల నివ్వజాలవు ఈ విషయమును వీరశైవులు గ్రహించ వలెను.

శివభక్తి వున్న మనుజుడు అకస్మాత్తుగా అవధాన హీనత మూలమున పాపకృత్యములు చేసిననూ తన యందలి శివ భక్తి ప్రభావము వలన ముక్తిని పొందునని శ్రీ భగవత్పాదులు ఈ క్రింది విధముగా ఉపదేశమును యిచ్చిరి.

శ్లో॥ అత్యంత పాపకర్మ్యా ్య పి శివ భక్త్యా విశుధ్యతి ।
చండో యథా పూరా భక్త్యా పితృహ్యాపి శివో భవత్ ॥

సుకృతం దుష్కృతం చాపి శివభక్తస్య నాస్తిహి ।
శివభక్తి విహీనా నాం కర్మపాశ నిబంధనమ్ ॥

శివాశ్రితానాం జంతూనాం కర్మణా నాస్తి సంగమః ।
వాజినాం దిననాథస్య కథం తిమిరజం భయం ॥

నిరోద్ధుం న క్షమం కర్మ శివభక్తాన్ విశృంభిలాన్ ।
కథం మత్తసజాన్ రుంధే చ్ఛంభిలా బిసంతంతుజా ॥ (సి. శి. 11; 50-53)

శాస్త్రము నందున విహితము మరియు అవిహితము అనెడి రెండు విధములైన కర్మలు సూచించ బడినవి. అవిహిత కర్మలను నిషేధకర్మలని కూడా అందురు. శివభక్తుడు సాత్త్వికస్వభావము గలిగిన వాడై సదా విహితమైన క్రియలనే చేయును. కాని కొన్ని కొన్ని సందర్భములలో పరిస్థితుల ప్రభావము వలన నిషిద్ధ క్రియలను చేపట్టిన యెడల కలిగెడి పరిణామములు ఎట్టివి? అనెడి ప్రశ్న తల యెత్త వచ్చును. ఇచ్చట గమనించ వలసిన దేమనగా అట్టి కార్యములు భావనా పరిపూర్ణత వలన కలిగినవా? లేక భావనాభావము వలన కలిగినవా? అనెడిది గుర్తించవలెను. ఇచ్చట భావన అనగా భక్తిభావన అంతరంగ శుద్ధి కలిగి అకుంఠితమైన శివభక్తి గలిగిన వాడే పరిపూర్ణమైన భక్తి భావన కలిగిన వాడని గ్రహించ వలెను. తద్విరుద్ధముగా నుండెడివాడు. భావనాభావము కల్గినవాడు. వీడు కళంక చిత్తుడై యుండును. అంతరంగ బహిరంగ శుద్ధిని సాధించని స్థితిలో నుండును. వీరిర్వురు చేయు కర్మల ఫలితము లెట్లుండునో యనెడిది ఎంతో ఆసక్తికరమైన విషయము ఇంతకు క్రితమే తమ ఉపదేశములో శ్రీ భగవత్పాదుల వారు భక్తి భావన లేకుండగా చేసెడి సత్కార్యములైనను ఫలితము లివ్వజాలవని చెప్పియుండిరి. ఆ విషయమునే మరొక్కసారి ముచ్చటించుచూ భావనాభావము గలవారు చేసెడి కర్మలు ఫలితములు యివ్వవని తెలియ జెప్పెను. వీరు చేసెడి విసుకృత కర్మములైననూ కొన్ని కొన్ని పర్యాయములలో దుష్ఫలితములనివ్వ వచ్చును. కాని శివ భక్తునకు ఈ సూత్రము వర్తించదు. శివ భక్తుడు నిషిద్ధ కర్మలను చేసిననూ అతడు స్వార్థము కొరకు చేయడు. పరార్థము నాశించెయే చేయును. శివుని యెడల గల నైష్ఠిక భక్తి వలన వచ్చెడి భావావేశముతో అతడు చేసెడి పనులు లోకము దృష్టిలో నిషిద్ధకర్మలైనప్పటికినీ శివుని దృష్టిలోనవి విహిత కర్మలుగనే భావింప బడును. అంతే కాకుండా అట్టి భక్తునిలోని భక్తి ప్రభావము వలన ఎట్టి దోషములు అతనిని అంటజాలవు. ఉదాహరణకు చెప్పవలెననిన చండప్రచండమైన కాంతితో ప్రకాశించెడి సూర్యుని తిమిరము ఆవరించగల్గునే? ఎన్నటికీ అది జరుగదు. ప్రకాశము చేత తిమిరము ధ్వంసము చేయబడుచున్నది. అదే విధిన శివభక్తుని భక్తిచేత అతడు చేసిన నిషిద్ధ కర్మల ఫలము అతని నంటదు. శ్రీ భగవత్పాదుల వారు చండుడు అనబడువాని కథను ఉదహరించిరి. ఇతడు శివభక్తిలో పరిపుష్టుడై యుండి నైష్ఠికభక్తిని పాటించుచుండెను. కారణాంతరముల వలన పితృ వధకు పాల్పడెను. కాని శివభక్తి ప్రభావము వలన అతనికి పితృ వధా కర్మ యొక్క ఫలము బంధనముగా మారలేదు. శివునితో నతడు సాలోక్య మోక్షము ననుభవించు చున్నాడు. శివభక్తునికి నిషేధా నిషేధముల నెడివి వుండవు. అతడు నిరంకుశుడు. ఏక్రియనైనను చేపట్ట వచ్చును. ఒక మత్తగజమును గొలుసులు ఏ విధముగా బంధించి పెట్టజాలవో అదే విధిన శాస్త్రనియమములు అతనిని బంధింపజాలవు. ఈ విధముగా శ్రీ భగవత్పాదుల వారు భక్తుని యొక్క మహిమ మహోన్నతమైనదని ప్రతిపాదించిరి.

భక్తుడైన వాడు త్రికరణ శుద్ధితో భగవంతుని భజించెడివాడగు చున్నాడు. తన యిష్టలింగమును వామ హస్తమున నుంచికొని పూజించి, ఆ పిదప ప్రాణభావ లింగములను ధ్యానించి పూజించి ఆరాధించును. ఈ విధముగా త్రికరణ శుద్ధులతో పూజించెడి వాడగుట చేత యితడు సాంసారిక భయముల నుండి దూరమగు చున్నాడు. జనన మరణాత్మకమైన భవరోగములు యితనిని బంధింపజాలవు. ఇతడు ముక్తికి అన్ని విధములుగా అర్హుడగుచున్నాడు. ఇట్టి అర్హత భక్తి హీనుడైన వానికి లభించదు. వాని యొక్క జ్ఞానా జ్ఞానములతో సంబంధము లేకుండా భక్తిని పాటించెడు వాడే ముక్తికి యర్హుడగు చున్నాడు.

శివ భక్తి కల్గినవాడికి జాతిపరమైన దోషములు అంటవని తెలియ జెప్పెడి శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును గనుడి.

శ్లో॥ బ్రహ్మణః క్షత్రియో వ్యాపి వైశ్యోవా శూద్ర ఏవవా ।
అంత్యజో వా శివే భక్తః శివవన్మాన్య ఏవ సః ॥

శివ భక్తి సమావైశె క్వ జాతి పరికల్పనా ।
ఇంద నేష్వగ్నిదగ్ధేషు కెవా భేదః ప్రకీర్త్యతే ॥

శుద్ధానియమ సంయుక్తాః శివార్పిత ఫలాగమాః ।
యర్చయంతి శివం లోకే విజ్ఞేయాస్తే గణేశ్వరాః ॥ (సి. శి. 11; 54-56)

శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశములోని సారాంశమేమనగా శివభక్తిని పాటించుటకు వీరు, వారు అనెడి భేదభావము లుండవు. వీరికి మాత్రమే హక్కుగలదు. ఇతరులకు అధికారములేదు అనుటకునూ సాధ్యము కాదు. ఇది అందరికీ లభ్యమయ్యెడిదే. శివభక్తి కల్గిన వాడు ఏ జాతికి సంబంధించిన వాడైనను శివస్వరూపుడని భావించవలెను. శివభక్తుల యందున జాతులులేవు. అందుచేత జాతి భేదమును పాటించవలదు. ఒక భక్తునికి పూర్వాశ్రయములో నుండెడి జాతి నిలిచి వుండదు. ఏ విధముగా అగ్నిని తాకిన కట్టెలు భస్మమై పోవునో అదే విధిన శివభక్తుని యొక్క పూర్వాశ్రయ జాతి నశించిపోవును. పూర్వాశ్రయములోనున్న బ్రాహ్మణుడు పూర్వాశ్రయములోని శూద్రునితో సోదరభావముతోనే మెలగవలయును. భేదభావమును చూపించవలదు

ప్రస్తుత సమాజమున జాతిమూలకముగా నున్న భేద భావనలను దూరము చేసికొనుటకు దీక్షా సంస్కారము సాధనముగా నుండునని గుర్తించగలరు. మన దేశమున అనాది కాలము నుండి కొనసాగుచూ వచ్చుచున్న వర్ణ భేదములను దూరము చేసికొనుటకు శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశము సాధనముగా నుండును. శివభక్తులందరూ సమతా భావముతో మెలగవలెను. అనునదే భగవత్పాదుల వారి యొక్క ఆదేశమై యున్నది.

పన్నెండవ శతాబ్దికి చెందిన శివశరణులు కూడా ఇట్టి భావములనే ప్రచారము చేసిరనెడి విషయము వీరశైవులెల్లరికీ సువిదతమే గదా!

ఆచార్యులవారు ఉపదేశించిన మార్గమున శివదీక్షను పొంది త్రికరణ శుద్ధిని సాధించి ఇష్టలింగ పూజను నైష్ఠిక భక్తితో నిర్వహించెడి వారికి ఎట్టి వైపరీత్యములు రాజాలవు. రుద్రుని అర్చించెడివాడు రుద్రుడై అర్చించ వలెననెడి ఆగమోక్తి ఒకటి కలదు. ఈ ఆగమోక్తి ప్రకారమే శివ భక్తులు శివస్వరూపమును దాల్చి శివభక్తి నాచరించి సాక్షాత్ శివులే యగుచున్నారు. ఈ కారణము వలన వీరు శ్రేష్ఠులు అనెడి విషయము ప్రతి పాదించబడు చున్నది. వీరి శేష్ఠత్వము ఆధ్యాత్మిక పరమైనదని గుర్తించవలెను. వీరశైవులందరూ ఈ ధర్మ రహస్యములను తెలిసికొని సమతా మమతల పాటించుచూ ఉత్తరోత్తరా అభివృద్ధిని సాధింతురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 1-4 - 1991
స్థలం : నాగపూర్

## విశేషప్రదీపిక

సావధాన చిత్తముతో లింగత్రయమైన గురు-లింగ-జంగముల మహత్తు నెరిగిన వాడై యవధాన భక్తితో వారి ప్రసాదమును గొనెడి భక్తుడు అ సామాన్యుడని యీ యాశీర్వచనము తెలుపు చున్నది.

శివుని యందు నిశ్చలమైన భక్తి గల్గిన వాడే భక్తుడని శ్రీ భగవత్పాదుల వారు భక్తుడ్యనెవ్వడో తెలియ జెప్పిరి. కాని యిట్టి భక్తి దుర్లభమని చెప్పిరి. ఈ భావమును యేకాగ్ర నాథుడీ క్రింది విధముగా విస్తరించి.

**శివపురాణాదులు చెవి బెట్ట నొల్లరు**
**గోత్రవధాదులు గోరి విండ్రు**
**ప్రమథగణాడంబరము విననొల్లరు**
**వేబితా మహావధల్ ప్రేమ విండ్రు**
**ఘన గురు బోధ లాకర్ణింప నొల్లరు**
**గురువధా కథనంబు గోరి విండ్రు**
**హర భక్తు మహత్త్వ మాలింప నొల్లరు**
**యుగ్ర జాతుల వధలర్థి విండ్రు**

**విరస మతులు దుర్వివే కాభిరతులుక**
**ల్మషయతులును కష్టమాన చరితు**
**లెట్టి పాపమతులో యే.......... (అన్యవాద కోలాహలము వావిళ్ళ ప్రచురణ, ప. 34)**

శివ ధర్మము గురించి యెరుగని వారు నీ విధిన ప్రవర్తించుచుండుట కాశ్చర్యపడనవసర ముండదు. కాని శైవుల మని చెప్పి కొని తిరుగాడెడి వారు శివ భక్తి విహీనులై ప్రవర్తించుట గాంచ గలము ఇట్టి వారిని గాంచిన శ్రీ పాల్కురికి సోమనాదుడా క్రింది విధిన స్పందించిరి:

**జగమున గొందరు శైవుల మంచును**
**బల్కు చుందురు మరి పాటిగాను**
**వివరంబుగా సప్తవిధశైవ భేదంబు**
**లేరుగనేరరు గురుతరము గాను**
**వృత్తి శైవంబగు బత్తివైష్ణవమగు**
**ద్రికరణ శుద్ధి లేదెంచి చూడ**
**గీర్తింపగా శివ గీతలు చదువరు**
**తగ భగవద్గీత లగణితం బ**

**టంచు బల్కుచు నుందురు పంచముఖుడు**
**ఘనత మీరిన భగవంతు డనెడు బుద్ధి**
**దోషమేమందు వైష్ణవ తుల్యు లవని**
**బరశివ ప్రసాదు లెట్లొకో బసవలింగ! (చతుర్వేద సారము, ప. 362)**

శివ భక్తి యెందులకు కలుగదో? తెలిపెడి యన్నమయ్య వారి యమృత వాక్కుల గనుడి:

**శ్లో॥ కామోద్రేక విజృంభణంబును సమగ్రక్రోధమున్ లోభమున్**
**వ్యామోహంబు మదంబు మచ్చరము దీవ్రంబైన పంచేంద్రియో**
**ద్ధామాటోపము గ్రాచి పెంపెసగు తత్త్వజ్ఞానికింగాక తా**
**సామాన్యాత్ము కేల నూలు కొనునీ సద్భక్తి సర్వేశ్వరా? (సర్వేశ్వర శతకము, ప. 62)**

అరిషడ్వర్గము చేత పీడింప బడెడి వారును, శివతత్త్వము నెరుగక యజ్ఞాన తిమిరమున బడి యలమటించెడి వారును, నిత్యానిత్య వివేకము కోల్పోయిన వారును కామ్య కర్మలను చేయుట సహజమే. శివభక్తి విహీనుల చేత చేయబడెడి కృతులు ఫలించవని శ్రీ భగవత్పాదుల వారు వివరించిరి. ఈ భావనను శ్రీ మల్లికార్జున పండితుడీ క్రింది విధిన వివరించిరి:

**క. శివభక్తి లేక చేసిన**
**వివిధా ధ్వర ముఖ్యసకల-వేదపురాణా**

**ది విహిత కర్మవితానము**
**లవి యెల్లను నిష్ఫలంబులగు నీశానా! (శివ తత్త్వ సారము, ప. 113)**

శ్రీ మల్లికార్జున పండితుని ప్రకారము శివభక్తి లేక చేసినా వేద విహిత కర్మలు నిష్ఫలములే యని తెలియ జేయబడినది.

శివ భక్తిహీనులగు వారు చేయు సుకృత కర్మ లైనను విపరీత ఫలముల నిచ్చునని శ్రీ భగవత్పాదుల వారు సెలవిచ్చిరి. దక్షక్రతువు నుదాహరణగా నిచ్చిరి. ఈ భావమును యథా వాక్కుల వారు నీ క్రింది విధముగా విస్తరించిరి.

**అతి దక్షుండగు దక్షుడీ జగములో యాగంబు సల్లక్షణ**
**స్థితిగా జేయుచు నుండి నిన్ను మది నుద్దేశింప మింజేసితా**
**హతుడయ్యేన్ మదినట్టి కార్యములు పొందైయుండునే? కర్తస**
**మ్మతితో చేయని దుర్మదుండు మనునే భావింప సర్వేశ్వరా. (సర్వేశ్వర శతకము, ప. 17)**

శివభక్తి గలవాడు దుష్కృతము చేయడు. అయినను, నతడు చేసెడివి లోకము దృష్టిలో నిషద్ధములైనవై కన్పట్టినా వారికి నే దోషము లబ్బవని తెలిసి కొనవలెను. ఈ విషయమును శ్రీ మల్లికార్జున పండితుడీ క్రింది విధిన వివరించిరి.

**కం॥ జాత్యాది సూతకంబులు**
**హత్యాది సమస్త పాత-కాదులు శివ! నీ**
**భృత్యుల పొందునె? జలములు**
**నిత్యస్థితి పొందనేర్చునే? జలజములన్ (శివతత్త్వ సారము)**

అనల కాష్ఠ న్యాయమున శివభక్తుని కల్మషము లన్నియును భక్తియనెడి శివాగ్ని చేత భస్మీపటల మగును. "మద్భక్తా విగత కల్మషః" అనెడి యాగమ వాక్కు విధినిషేధ ప్రాయశ్చిత్తాదులను, కావ్యా కర్మలను శివ భక్తుడు చేయడని బ్రాహ్మణ్యమును వీడి బ్రాహ్మణ కర్మరత్త్వము నిష్ఫలమైనదని మల్లికార్జున పండితుడు తెలియె జేసిరి. కేవలము నిష్ఠతో శివ భక్తిని చేసిన చాలునని ప్రకటించిరి. ప్రసాది స్థలములోని భక్తుడు భక్తి మాహాత్మ్యము నెరిగి యతనిని పూజనీయుడని భావించ వలెను. ఈ విషయమును తెలిపెడి యీ పద్యమును గనుడి:

**భక్తుల ప్రసాద మెప్పుడు**
**భక్తునాకేడు గడయు-భక్తుల గతియే**
**భక్తుల విరవుడ నని శివ**
**భక్తుల కొనియాడ వలయు భక్తులకు శివా! (శి. త. సా. ప. 139)**

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## శరణ మాహాత్మ్య స్థలము

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షికి శరణుని మహిమ గురించి ఈ క్రింది విధముగా నుపదేశమును యిచ్చిరి.

**శ్లో॥ గురులింగాది మాహాత్మ్య బోధాన్వేషణ సంగతః ।**
**సర్వాత్మానా శివాపత్తిః శరణ స్థాన ముచ్యతే ॥**

**బ్రహ్మాది విబుధాన్ సర్వాన్ ముక్త్వా ప్రాకృత వైభవాన్ ।**
**ప్రపద్యతే శివం యత్తు శరణం తదుదాహృతమ్ ॥ (సి. శి. 11; 57-58)**

శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము ప్రకారము వీరశైవ ధర్మందున పూజనీయులైన గురు, లింగ జంగముల మహాత్మ్యమును తెలిసికొని ఆ శివునికి సర్వభావముచేత శరణాగతుడైనవాడే శరణుడు అనిపించు కొనుచున్నాడు. బ్రహ్మ విష్ణ్వాది ముప్పది మూడుకోట్ల దేవతల ప్రాకృతమైన సంపదను పొందిన వాడుగుచున్నాడు. శివుడొక్కడే అప్రాకృత సంపత్తు కలిగిన వాడు. ఈ కారణము వలనెనే 'శివ ఏకోధ్యేయః శివంకరః సర్వ మన్యత్ పరిత్యజ్య' అని శ్రుతులు చాటుచున్నవి. శివుని ఒక్కనినే ధ్యానించవలెను. ఇతరులు అట్టి ధ్యానమునకు అర్హులుకారు. అందుచే అందరినీ పరిత్యజించవలెను. వేరొక్క మాటలో చెప్పవలెననిన అతడు సర్వజగత్తుకు రక్షకుడుగా వున్నాడు. అతనికే భక్తులు శరణాగతులు కావలెను. శరణాగతుడయ్యెడువాడు అహంకారము విడనాడవలెనని గ్రహించవలెను.

శరణ స్థలములో నుండెడి శివభక్తుడు విరించి విష్ణ్వాది దేవతల నుండి ఏమియును ఆశించడు. వారియొక్క ప్రాకృత వైభవము శరణుని ప్రలోభమునకు గురిచేయజాలవు. కారణమేమనగా శరణునికి
కావలసినది అప్రాకృతవైభవమే. అతడు ప్రాకృత వైభవమును తృణప్రాయముగా నెంచును. అతడు అప్రాకృత వైభవ సంపన్నుడైన శివుని మాత్రమే శరణు వేడుచున్నాడు, కాన శరణుడు అనిపిలువ బడుచున్నాడు.

శివునినొక్కనినే శరణువేడుటలో గల అంతరార్థము ఒకటి కలదు. ముప్పది మూడు కోట్ల దేవతలు ఒకానొక సమయములో శివుని శరణువేడినవారే. సందర్భాను సారముగా తాము అశక్తుల మని భావించినయప్పుడు, శివుని శరణు బొందిన వారే ఈ కారణాన బ్రాహ్మపర్యంతము శరణువేడెడి శివుని వీడి ఇంకొకరిని శరణువేడుటలో విజ్ఞత యుండదు. వీరశైవ ధర్మము ప్రకారము శివుడొక్కడే పూజనీయుడు. ఈ విషయమును విస్మరించుట విహితమైనది కాదు. అందుకే శివశరణుడు శివుని మాత్రమే శరణువేడును. కర్ణాటకలోనూ మహారాష్ట్రలోను జన్మించి సాధనచేశిన శివ శరణులు ఏకైక లింగ నిష్ఠా పరతంత్రతాను గురించి పలువిధములుగా ప్రస్తుతించిరి. ఇట్టివి లేని వారిని నిశితముగా విమర్శించిరి.

ఆధ్యాత్మక చేసెడి వారిలో పోటి పరిస్థితి నెలకొని యుండును. నాసాధన ఉత్తమమైనది, నీ సాధన అట్టిది కాదు అనెడి వాద ప్రతి వాదములు కూడా జరుగుచు నుండును. మహర్షులలో కూడా ఇట్టి వాదనలు తలయెత్తెననుటకు వశిష్ట విశ్వామిత్రుల యుదంతమే నుదాహరణగా నుచున్నది. ఇది అహంభావము వలన కలిగెడి కించిత్ వికారము. శివ శరణుడు ఇట్టి వికారమును దరిచేరనీయడు. ఆధ్యాత్మిక సాధనలో తానెంతో వెనుక బడి యున్నానని భావించునే కాని అగ్రగామియై యున్నానని ఎప్పటికినీ తలపడు. ఇట్టి భావనను ఆత్మన్యూనతా భావముగా తీసికొనకూడదు. ఇది అతని నమ్రతకు చిహ్నము. సాధనచేసెడు వానికి ఎకైక నిష్ఠ వుండి తీరవలెను. బహుదేవతో ఉపాసనా వాంఛనీయమైనది కాదు. ఇద్దానిని శరణులు వ్యభిచార వృత్తి వంటిదని విమర్శించిరి. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును కటాక్షించిరి.

**శ్లో॥ శరణ్యః సర్వ భూతానాం శంకరః శశిశేఖరః ।**
**సర్వాత్మనా ప్రపన్నస్తం శరణాగత ఉచ్యతే ॥**
**విముక్త భోగలాలస్యో దేవతాంతర నిస్పృహః ।**
**శివమభ్యర్థయన్ మోక్షం శరణార్థీతి గీయతే ॥ (సి. శి. 11; 58-60)**

ఈ ఉపదేశములోని భావమేమనగా ఈ లోకమున శరణ, శరణాగత, మరియు శరణార్థి అనెడి పదములు ప్రయోగింప బడుచున్నవి. చంద్ర చూడుడైన శివుడు సర్వ ప్రాణులకు శరణ్యుడై యున్నాడు. దీని యర్థమేమనగా సకల ప్రాణులకు శరణువేడదగిన వాడై యున్నాడు. దీని నెరిగి శివుని యందున ఎల్లప్పుడు ప్రతిపత్తిని పొందిన వాడికి శరణాగతుడు అను పేరు గల్గును. శరణాగతుడనగా ఎల్లవేళలా శరణు జొచ్చిన వాడు. శివుని అనేక లీలలలో శరణాగత రక్షక లీల యనెడి దొకటి కలదు. చంద్రుడు గురుద్రోహమును జేసి గురువు చేత శాపగ్రస్తుడై శివుని శరణు వేడెను. బృహస్పతి శాపమువలన అతడు క్షయరోగియై సకల కళలను కోల్పోయెడి స్థితిలో, శివుడాతనికి ప్రాణదానము చేసెను. ఈ కథ అందరికీ విదితమే. శివుడు తనను శరణువేడిన దేవతలను రక్షించెనని అనేక కథలు కలవు.

శివునికి 'శరణ్య' అనెడిది సార్థక నామధేయమైనదని చెప్పవచ్చును. 'శరణే సాధుః శరణ్యః' అనెడి వ్యుత్పత్తి ప్రకారము శరణాగతులను కాపాడే వాడు 'శరణ్యుడన' బడుచున్నాడు. శివుని యొక్క శరణాగత వాత్సల్యము నెరిగి యాతనిని శరణు జొచ్చిన వానిని 'శరణాగతుడని' యందురు. శరణార్థియనెడి పదమునకు విశిష్టార్థ మొకటి గలదు. 'అర్థ్యతే ఇతి అర్థి అనెడి' వ్యుత్పత్తి ప్రకారము ఆపేక్ష గలవాడు

అర్థియగు చున్నాడు. ధనార్థి విద్యార్థి మొదలగునవి ఉదాహరణములుగా నిలుచును. మోక్షము నర్థించి వాడే శరణ్యునికి శరణాగతుడైన శరణార్థి యనిపించి కొనును.

శివుడొక జ్ఞాన నిధియై యున్నాడు. వైరాగ్యమతని విశిష్ట లక్షణముగా నున్నది. ఈ కారణము వలన అతనిని భోగ భాగ్యములను కోరవలదు. మోక్షమును మాత్రమే యపేక్షించవలెను. ఈ రహస్యము నెరిగిన వీరశైవుడు కేవలము మోక్షమనెడి శరణును ఆర్థించును. ఈ విధముగా అతడు శరణార్థి యగుచున్నాడు.

లోకాచారము ప్రకారము, సాధకుడు చతుర్విధ పురుషార్థములను సాధించు నిమిత్తమున కృషి చేయుచున్నాడు. మోక్షేతరములగు పురుషార్థములలో నేదో యొక దోషమును గల్గించెడి గుణము ప్రక్షిప్తమై యున్నది. ధర్మములో అహం, అర్థములో లోభము కామములో మోహమును గాంచ గలము. ధర్మమును పాలించెటప్పుడు ఇహ-పర సుఖముల అపేక్ష గల్గును సక్రమముగా ధర్మమును పాలించెడి వానికి కామితిర్థములు సిద్ధించు ననెడిది శాస్త్రోక్తియని చెప్పబడుచున్నది. సకామ కర్మాచరణ స్వర్గాది సుఖములు పొందుటకు హేతువగును. స్వర్గాది సుఖములునూ అశాశ్వతమైనని. పుణ్యాధిక్యత క్షీణించగనే స్వర్గ సుఖములు దూరమగును. జన్మ ప్రాప్తమగును. అర్థమెన్నియో అనర్థములకు కారణభూతమగు చున్నది. అన్ని అనర్థముల కంటె నెక్కువ గర్హనీయ మైనది లోభము-ధన ప్రలోభము వలన కర్మ బంధములు పటుతరములగు చున్నవి. జీవి పతనమునకు కారణ భూతముగా నిలిచెడి వాటిలో లోభము ముఖ్యాతిముఖ్యమైనది. కామము వలన మోహము జన్మించును మోహము వలన బుద్ధి నాశనమగు చున్నది. ఈ విధముగా జీవి యనేక నిషిద్ధ కర్మల నాచరించెడి దిశలో పయనించి బంధములకు గురి చేయును. జనన-మరణముల నుండి ముక్తిని గల్గించు. శక్తి మోక్షమునకు మాత్రమే గలదు. ఈ కారణము వలన శరణ స్థలమునందలి భక్తుడు కేవలము మోక్షమును మాత్రమే కోరును.

ఒకవేళ యెవ్వరైన లోభమోహములకు గురి కాకుండగా అర్థకామమముల ననుభవించుటకు పూనికొనిననూ, వీటివలన నిరంతరము అసంతృప్తి భావన గల్గును. అర్థము నెంత మేరకు సంపాదించినను, యింకా సంపాదించ వలెనను కోరిక వదలదు. అదే విధిన 'న జాతు కామః కామా నామముప భోగేన సామ్యతి' అనే సూక్తి ప్రకారము, కామమును తృప్తి మేరకు అనుభవించుట యెవ్వరికినీ సాధ్యము కాదు ఇంకా ఇంకా అనుభవించ వలెననెడి కోరిక దిన దిన ప్రవర్ధమానమగు చుండును. ఈ లౌకిక విషయముల నెరిగిన శివ భక్తుడు శరణ స్థలమున త్రివిధ పురుషార్థములను వదలి మోక్షమును మాత్రమే కోరు కొనును. ముక్తి యనెడిది ధృవమైన పదవి యని గుర్తెరిగిన వాడై శివుని కొలిచి ముక్తిని పొందుటకు యత్నించును. ధృవ పదము గూర్చి విభిన్నమైన యభిప్రాయములు గలవు. ఈ సందర్భమున యుత్తానపాదుని కథ విషయమును విస్పష్టము చేయగలదు.

పూర్వకాలమున ఉత్తాన పాదుడనెడి రాజు ఉండెను అతని కుమారుడొక పరి తండ్రి గారి తొడ మీద కూర్చుండుటకు ప్రయత్నించెను. తన సవతి తల్లి వలన ప్రయత్నభంగము వాటిల్లెను. అతడు తన తండ్రి తొడపైన కూర్చుండి పితృవాత్సల్యమును పొంద లేక పోయెను. తల్లి యొక్క ప్రేరణ చేత ఆబాలకుడు తపస్సు నాచరించి అక్షరుడై ధృవనక్షత్రము రూపమున వినీలాకాశమున వెలుగు చున్నాడని పౌరాణిక గాధ వలన తెలియుచున్నరి. అయితే ఈ ధృవత్వము శాశ్వతమైనది కాదు. ప్రళయ కాలమున విశ్వమంతయును లయమౌ వేళ ధృవ పదవి విశ్వముతో పాటుగా లయమగును. సాంకేతిక పరముగా యిట్టి ధృవ పదమున నవగతము చేసుకొనవలెనని ధృవమనగా నేమిటో తెలిసికొనవలసి యున్నది. అచంచలము సుస్థిరము అనునవి ధృవమునకు అర్థము. మరొక అర్థము ప్రకారము ధృవమనగా నిశ్చయాత్మకముగా జరుగునది. ఒక సంఘటన నిశ్చయాత్మకముగా జరిగిన యెడల అది ధృవ యనబడుచున్నది. 'జాతస్య మరణం ధృవమ్' అనెడిది ఆ అర్థములాగనే అవగాహన చేసుకొన వలెను. అట్టియెడ ధృవమనగా నెట్టిది? అన్న ప్రశ్నకు శాశ్వాతమైన దొక్కటే ధృవమైనదని యెంచదగును. అట్టి యెడ ముక్తి ధృవపదమగును. ధృవుడు పొందిన ధృవపదమునకును ముక్తియనెడి ధృవపదమునకు భేదము చెప్పుటకై ధృవుడు పొందిన ధృవపదమును సాపేక్షమైన ధృవపదమని యనవచ్చును. ముక్తి యనెడిది తద్విరుద్ధమైనది. అనగా ఇది పరిపూర్ణమైన ధృవపదము దీనిని నిరపేక్షమైన ధృవపదమని కూడా అందురు శరణ స్థలమున నుండెడి భక్తుడు కేవలము నిరపేక్షమైన ధృవపదము నాశించును కాని సాపేక్షమైన ధృవపదము నాపేక్షించడు.

శరణాగతులైన వారికి శరణు నిచ్చినవాడు సకలాభీష్టములను నెరవేర్చుట యనెడిది జరుగునని చిరకాలము నుండి నమ్మబడు చున్నది. ఇట్టి విషయమును నిరూపించెడి గాథలు ఎన్నియో కలవు. శరణువేడిన సుగ్రీవుని కోరికను తీర్చుటకై రాముడు వాలిని

చంపెనని యందురు. ఈ విధముగా శరణాగతుల కోర్కెలు తీర్చెడి కథలు యితిహాసములో ఎన్నియో కలవు. గయోపాఖ్యానము కూడా ఈ కోవకు చెందినదే. తనను శరణు వేడిన వారికి శివుడు కల్ప ధృవమువలె సకల విధములైన కోరికల దీర్చునని తెలుపుచూ శ్రీ భగవత్పాదులు ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**శ్లో॥ యే ప్రపన్నా మహాదేవం మనోవాక్కాయ కర్మభిః ।**
**తేషాంతు కర్మ జాతేన కిం వాదేవాది తర్పణైః ॥**
**సర్వేషామపి యజ్ఞానాం క్షయీః స్వర్గః ఫలాయతే ।**
**అక్షయం ఫలమాప్నోతి ప్రపన్నః పరమేశ్వరమ్ ॥**
**ప్రపన్నపారిజాతస్య భవస్య పరమాత్మనః ।**
**ప్రపత్యా కిం న జాయేత పాపినామపి దేహినామ్ ॥ (సి. శి. 11; 61-63)**

ఈ ఉపదేశములోని తాత్పర్యమేమనగా ఎవరు శివుని త్రికరణ శుద్ధిగా శరణు జొత్తురో వారికి అతడు కల్ప వృక్షమువలె కోరికలన్నింటిని తీర్చును. అతడిచ్చెడి ఫలములు శాశ్వతమైనవి. వాటికి క్షయమనెడిది వుండదు. యజ్ఞయాగాది కర్మల వలన లభించెడి ఫలము స్వర్గోపభోగముల నిచ్చినను అది యశాశ్వతమైనదే.పుణ్యక్షయము కాగానే పునః భూలోకములో జన్మించవలసి యుండును. శివుడిచ్చెడి ఫలము వలన జన్మరాహిత్యము కలుగును. శరణా గతుడైనవాడు ఎట్టివాడు? అనెడి ప్రశ్నకు నాస్కారము లేదు. శరణుజొచ్చిన వాడు పాపియైనను అతనికి దృఢతరమైన భక్తి యుండిన యెడల శివుడతడు కోరిన వరములనిచ్చును. శివుడు కోరునది త్రికరణ శుద్ధితో కూడు కొనిన భక్తి. యిచ్చునది మాత్రము అక్షయ సంపదలు. వీటిలో ముక్తికూడా మిళితమ్. ముక్తి అక్షయమైనదని చెప్పనక్కరలేదు గదా!. ఈ విషయమును స్పష్టము చేసెడి కథ యొకటి కలదు.

ఒకడు ఎన్నియో పాపములను చేసి అపఖ్యాతికి లోనయ్యెను. తాను ప్రాయశ్చిత్తము చేసికొని పాపముల నుండి ముక్తిని పొందవలెనని పతితపావనుడైన శివపరమాత్ముని శరణుజొచ్చెను. పరమాత్ముని నాల్గు ద్వారములలో ఒక ద్వారము కడ నిలిచివుండెను. ఆ మందిరము యొక్క మూడు ద్వారములు తెరచివుండినను ఒకటి మాత్రము మూయబడి యుండెను. తెరచివుంచిన మూడు ద్వార ములకడ భక్తి, జ్ఞాన, వైరాగ్యములనెడి మాటలు వ్రాయబడిన మూడు ఫలకములు వేలాడు చుండెను. ఒక్కొక్క ద్వారము కడ ఒక్కొక్క ద్వారపాలకు డుండెను. వచ్చిన పాపినిగని ఆ ద్వార పాలకుడు నీవు భక్తుడవేనా? యని అడిగెను. పాపి నేను భక్తుడను కాననెను. అప్పుడా ద్వారపాలకుడు నీకు యీ ద్వారము నుండి ప్రవేశము లభించదని ప్రకటించెను. అప్పుడా పాపి మరొక ద్వారము కడకేగి. లోపలకు వెళ్ళుటకు ప్రయత్నించగా అచటి ద్వారపాలకుడు ఆపి ఏమీ! నీవు వైరాగ్యశాలివా? అని ప్రశ్నించగా, భోగలాలసుడగు ఆపాపి ఛీ! ఛీ! నాకెక్కడి వైరాగ్యము, నేను వైరాగ్యశాలినికాను అనెను. అట్లైన నీకీ ద్వారము నుండి ప్రవేశము లభించదని ద్వార పాలకుడు చెప్పెను. పాపి మరొక ద్వారము కడకేగెను. అచ్చట కూడా అతనికి అడ్డు కలిగెను. ద్వారపాలకుడు నిలిపి నీవు ఆత్మ జ్ఞానివా? అని యడిగెను. అప్పుడా పాపి నాకెక్కడి జ్ఞానము అని వుత్తరమునిచ్చెను. అక్కడ కూడా ప్రవేశము లభించలేదు. ఇక మిగిలిన ద్వారము మూసియుండబడినదై యుండుట చేత పాపి శివసదనములోనికి ప్రవేశించ లేని స్థితిలో నుండెను. తాను యింత దూరము వచ్చినది వృథా అయ్యెనే? యని బాధపడజొచ్చెను. క్రమేపీ ఆబాధ బడబానలమై కోపమునకు దారితీసెను. అతడు కృద్ధుడై ఈ విధముగా గొంతుచించుకొని అఱచెను. ఏమీ! భక్తి జ్ఞాన వైరాగ్యములు కలవారికేనా శివసాన్నిధ్యము లభించెడిది. ఇతరులకు అవకాశము లేదా! అట్టియెడల పరమాత్మునికి పతితపావనుడు అనెడి పేరేందుకు ? ఆ పేరు సార్థక నామమగుట లేదే? ఆ పేరును నీకు కల్గుటలో ఔచిత్యములేదు. ఓ పరమాత్మా! పతితులుపావనులు కాజాలని. ఎడల నీవా నామమును విడచివేయుము. శివుడులో తట్టున నుండెను. ద్వారపాలకుడు అతని వద్దకేగి జరిగిన విషయమును నివేదించి ఆ పాపి విసరిన సవాలును గురించి చెప్పిరి. అప్పుడా శివుడు మూసిన ద్వారమును తెరిపించి ఆ పాపిని లోపలకు రప్పించెను. శివదర్శనము చేత అతని పాపములు పటాపంచలయ్యెను. పరిశుద్ధుడై నిలిచెను. శివుడతనికి సాయుజ్యపదవి నొసంగెను. ఆ తెరచిన ద్వారము అదే విధముగా తెరచియే పెట్టబడెను. అక్కడొక నూతన ఫలకము వ్రేలాడదీయ బడెను. ఆ ఫలకము మీద పతితుల ద్వారము అని వ్రాయబడి యుండెను. ఈ విధముగా శివునికి పతితపావునుడనెడి బిరుదు సార్థకనామ ధేయమయ్యెను.

పాపియైన వానిని శివపరమాత్ముడు మాత్రమే ఏ విధముగా ముక్తినివ్వగలడు? అనెడి ప్రశ్న వుదయింప వచ్చును. ఇందులోగల శాస్త్రీయమైన రహస్యమేమనగా 'అధర్మః క్షరతి కీర్తనాత్' అనెడి ప్రమాణము ప్రకారము తాను చేసిన పాపములను వొప్పుకొని వాటిని

ఇతరుల ముందు బహిర్గతము చేసిన యెడల అది పాపికి ప్రాయశ్చిత్తమగు చున్నది. పాపియైనవాడు తాను పాపినని తెలిసికొనుట యే అతడు ముక్తుడగుటకు అర్హతను తెచ్చుచున్నది. ఈ కారణము వలననే పశ్చాత్తాపము చెందిన పాపిని పరమేశ్వరుడు రక్షించుచున్నాడు. పరమాత్మునికి శరణైన వాని జన్మ సార్థకమైనదనియును యితరులకు శరణైన వాని జీవితము నిరర్థకమైన దనియును తెలియ జెప్పెడి భగత్పాదులవారి ఉపదేశమును గనుడి.

**శ్లో॥ ప్రపన్నానాం మహాదేవ్రో పరిపక్వాంతరాత్మనామ్ ।**
**జన్మైవ న్మ నాన్యేషాం వృథా జననసంగినామ్ ॥**
**దుర్లభం మానుషం ప్రాప్య జననం జ్ఞాన సాధనమ్ ।**
**యేనజానంతి దేవేశం తేషామాత్మా నిరర్థకః ॥**
**తత్కులం హి సదా శుద్ధం సఫలం తస్య జీవితమ్ ।**
**యస్య చిత్తం శివే సాక్షాత్ విలీనమ బహిర్ముఖమ్ ॥ (సి.శి. 11; 64-66)**

ఈ ఉపదేశము యొక్క సారాంశమేమనగా మనుష్యజన్మ యొక్క ముఖ్యలక్షణమే శరణాగతిని వేడుట. మనుష్యజన్మను పొందియు శివుని ఎవరు శరణువేడరో వాని జన్మ జన్మమే కాదు. అట్టివారి జన్మ నిరర్థకమగుచున్నది.

మానవజన్మ లభించుటయే దుర్లభమైన విషయము. అట్టి జన్మను సార్థకము చేసుకొనవలెను. శివుని శరణు బొందవలెను. మనము చేసెడి సుకృతములే మన మరణము పిదప వెంబడి తీసికొని వెళ్ళగలము. దీని భావమేమనగా సుకృతము వలన పొందిన పుణ్యమును తీసికొని వెళ్ళగలము. ఇతర సంపదలేవియును మనవెంబడిరావు. పుణ్యము సంపాదించకుండా మరణించినవాడు దరిద్రుడై తిరుగాడును. అందుచేత పుణ్యమనెడి సంపదను పొందుటకై శరణార్థి రక్షింపవే! అని శివుని వేడుకొనవలెను.

ఏ భక్తుడు బహిర్ముఖముగా నున్న మన ప్రవృత్తిని అంతర్ముఖము చేసికొని శివయోగము ద్వారా శివజ్ఞానియై విరాజిల్లునో అతడొక్కడే యుద్ధరింపబడుట మరొక అతని పుత్ర, మిత్ర, కళత్రాదులందరునూ ముక్తికి చేరువవు చున్నారు. ఇట్టి కథలను బసవపురాణములో గాంచగలము. తాను ముక్తిని పొందుటయే కాకుండా తన చుట్టుప్రక్కలనున్న ఏడు వాడల జనులకు ముక్తిని పొందింప జేసిన మహాశరణుల కథలుకూడా చెప్పబడినవి. తనను ఉద్ధరించుకొనుటయే కాకుండా తన కుటుంబమును తన కులమును, యిరుగుపొరుగును ఉద్ధరించెడి శరణుని యొక్క మహాత్మ్యమును ఎన్ని విధముల కొని యాడినను తక్కువవనే యగును. ఈ విషయమును వీరశైవ భక్తులు గుర్తించి శరణ మార్గమున పయనించుటకు వలయు ప్రయత్నమును చేయుదురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 2-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వచనమున, లింగత్రయ మాహాత్మ్యము నెరిగిన భక్తుడు, శివుడే జగద్రక్షకుడనియును, నతనిని మాత్రమే శరణు బొంద వలెననియును మనమున భావించి శరణాగతుడగు చున్నాడని ప్రతిపాదింప బడినది.

ప్రాకృత భావనా విశిష్టులైన వారు బ్రాహ్మణ సాంగత్య దోషము వలన ప్రభావితులై శివుని లయ కారణునిగా నెంచు చున్నారు. తత్ఫలితముగా, శివుని కంటెను భిన్నమైన వాడొకడు జగద్రక్షకుడుగా నున్నాడనెడి భావము ప్రచలితమైనది. విష్ణువు శరణాగత రక్షకుడని వైష్ణవులు ప్రచారమును చేసిరి. భారతములోని ద్రౌపతి మాన సంరక్షిత గాథలు, భాగవతములోని గజేంద్ర మోక్షము, రామాయణములోని విభీషణ వృత్తాంతము లధిక ప్రచారము నందెను. ఇట్టి ప్రచారముచే శివుని జగద్రక్షకునిగా భావింప జాలరైరి. ఆ విషయమును విదితము చేసెడి యీ క్రింది పద్యమును గనుడి:

సీ॥ ఆకసమున కడు జోకను జను దెంచు
వైన తేయుని జూచి మానుగాను
ద్వారకా పురివాస! కారుణ్య సాగర!
ధీయుత పోష! కృష్ణా! యటంచు
బొగడుదు రరిమురి జగదుపకారియౌ
వృషభేషు స్మరణ గావింప రెపుడు
మోదంబు మీర బ్రహ్లాద విభీషణ
యను చుస్మరించెద రను దినంబు
నీదు భక్తుల జూడరు నీ స్వరూప
మిట్టి దన్నను మరి చెవి బెట్ట రహహా!
యట్టివారిని భువి శైవులను టదెట్లు
వసుధ వారు ప్రసాదులె బసవ లింగ! **(చతుర్వేద సారము, ప. 363)**

ఇట్టి భావనలు లింగైక్య నిష్ఠా పరతత్త్వమునకు గొడ్డలి పెట్టులై భక్తుని భవిగా మార్చి వేసెడి యవకాశము గలదు. ప్రసాది స్థలములోని భక్తుడిట్టి భావమునకు లోను కాకూడదు. శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతము ప్రకారము శివుడే జగత్కర్త, జగద్రక్షకుడు. ఈ భావమును విడదీసి వివరముగా చెప్పెడి యీ క్రింది శ్రీ పాల్కురికి వారి పద్యమును గనుడి:

సీ॥ ఈక్షింప శ్రుతులు "సంరక్షితాం సృష్టించ
జయ" యన నచ్చైక శాసనముగ
జనుచుండు మరి "సురక్ష్యతరాం శ్చలోకాంశ్చ
లోకపాలాంశ్చ" నా ప్రాకటముగ
దవిలి యథా దేవతా సృష్టి యన
"బశవోభి" యనంగను నపారితముగ
నట్లు "యున్మేష నిమిషచయ" మన ధరను
భవుడు గను దెరవంగ నుత్పత్తి యగుట
హరుడు గన్మూయ జెడెడు బ్రహ్మాండ కోట్లు
బ్రహ్మవిష్ణ్వాది దేవతల్ బసవలింగ! **(చతుర్వేద సారము, 160)**

ఈ పద్యములోని తత్త్వమును తెలిపెడి శ్రీ మల్లికార్జున పండితుని యీ క్రింది పద్యమును గనుడి:

భువనోత్పత్తి స్థితి లయ
వివిధ వ్యాపార ముఖ్య విభుడవు పశుబం
ధ విమోక్ష దక్షుడవును వ
రవర ప్రదుడవును నీవేరాజా భరణా **(శివతత్త్వ, సారము, ప. 87)**

శ్రీ భగవత్పాదుల వారు చెప్పిన యటుల భోగలాలసులకును, త్రికరణ శుద్ధి లేని వారికిని, శివ-జీవ నిత్యానిత్య వివేకములు లేని వారికిని శివుడొక్కడే నిజమైన రక్షకుడనెడి భావము నేర్పడదు. ఇట్టి వారి నుద్దేశించి కాబోలు శ్రీ బసవేశ్వరుడి యనుభవమున నీ వచనము.

వేసి వాలిని కూల్చి కట్టెను శరధిని, పది తలల రావణుని యొకే యమ్ము చేత మట్టు పెట్టె
ఛలముచే లంకాద్వీపమును నేల మట్టము చేసె
కలి విభీషణునికి పట్టమును కట్టిన రాముని చూపుమా!
మాయా సంసారమునకు వచ్చి, వాయికి చెడి వట్టిగా యేరు పారి పోవలదు?
కర్మ కూడల సంగనికి శరణను దయ్యా ! **(బసవేశ్వర వచనము, 622)**

శివుని శరణనిన చాలును నెట్టి వారికైనను సకల సన్మంగళములు చేకూరునని తెలుప బడినది. ఈ క్రింది ద్విపదల గనుడి :

**పరముని శరణన్న పాపక్షయంబు**
**పరముని శరణన్న పరమ పావనము**
**వరదుని శరణన్న బ్రత్యక్ష సుఖము**
**వరదుని శరణన్న భవరోగ హరము**
**భవ హర! శరణన్న భక్తి సేకూరు**
**భవహర! శరణన్న బంధము లీ్వగు**
**అసదృశు శరణన్న భాగ్యము ల్గల్గు**
**అసదృశు శరణన్న బాయు నాపదలు**

భక్తుడు శివుని శరణాగతుడై యవధాన భక్తిని సలుప వలెనని గ్రహించగలరు.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## ప్రసాధమాహాత్మ్య స్థలము

శ్రీ సిద్ధాంత శిఖామణిలోని ప్రసాదాంతర్గత స్థలమైన అంతిమ అవాంతర స్థలమే ప్రసాద మాహాత్మ్య స్థలము. ఈ స్థలమున ప్రారంభము నందుననే ప్రసాదమును గురించిన వివేచన చేయనైనది. ఇచ్చట ప్రసాదమనగా శివానుగ్రహమే సాధకుడైన వాడు తన సామర్థ్యము వలన మాత్రమే కైవల్యమును పదయజాలడు. సాధనతో పాటుగా శివుని అనుగ్రహము కూడా కావలెను. ఈ విషయమునే శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షికి క్రింది విధముగా ఉపదేశము చేశిరి.

**శ్లో॥ గురులింగాది మహాత్మ్య విశేషానుభవస్థితిః ।**
**యస్మాచ్ఛివ ప్రసాదాత్ స్యాత్తద స్య మహిమోచ్యతే ॥**

**సదా లింగై కనిష్ఠానాం గురుపూజాను షంగిణామ్ ।**
**ప్రపన్నానాం విశుద్ధానాం ప్రసీదతి మహేశ్వరః ॥**

**ప్రసాదోపి మహేశస్య దుర్లభః పరికీర్త్యతే ।**
**ఘోర సంసార సంతాపనివృత్తిర్యేన జాయతే ॥ (సి. శి. 11; 67-69)**

శివాను గ్రహరూపమైన ప్రసాదము ఎవరికి సంప్రాప్తమగునో వారికే గురు, లింగ మహాత్మ్యములు అవగతమగును. అందుచేత ప్రసాద మహిమను అందరూ గుర్తెరిగి లింగమునందున నిష్ఠ గలిగి గురుపూజాతత్పరుడై, అనన్య భావముతో శివునినే శరణు జొచ్చినవాడు శివాను గ్రహమునకు పాత్రుడగు చున్నాడు. అట్టి వారికే శివుడు ప్రసన్నుడై తన కటాక్షమును ప్రసాదించును. శివుని ప్రసాదమును సంపాదించుట సులభసాధ్యమైన విషయముకాదు. శివ ప్రసాదము లేనిది సంసారము నుండి ముక్తి లభించదు.

సంసారములో అనేకమైన తాపములుగలవు వీటిని స్థూలముగా మూడు విధములుగా విభజన చేయవచ్చును. ఇవి – ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములు. ఇవి జీవులను సదా పీడించుచుండును. వీటినుండి విముక్తి పొందవలెననిన శివాను గ్రహము పొందియేతీరవలెను. ఈ ప్రసాదమును పొందెడి విధి విధానమును శ్రీ భగత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో॥ యజ్ఞాస్త పాంసి మంత్రాణాం జపశ్చింతా ప్రబోదనమ్ ।**
**ప్రసాదార్థం మహేశస్య కీర్తితాని న సంశయః ॥**

**ప్రసాదమూలా సర్వేషాం భక్తిరవ్య భిచారిణీ ।**
**శివ ప్రసాద హీనస్య భక్తిశ్చాపి నసిధ్యతి ॥ (సి. శి. 11; 70-71)**

యజ్ఞములు, తపస్సులు, జపములు మొదలగునవి శివ ప్రసాదము సాధించుట కొరకేనని చెప్పబడినవి. శివ భక్తి లేక వీటిని చేసిన యెడల ఫలితము వుండదు. భక్తి యనెడిది ప్రసాదము మూలముననే లభించును. శివ భక్తిహీనుడైనవాడు ప్రసాదమును పొందుట కర్హుడు కాజాలడు. శివ ప్రసాద మహిమ యెట్టిదనగా దానిని పొందిన వాడు ఎట్టి వాడైననూ వానికి సద్గతి సంప్రాప్తమగు చున్నది. ఈ విషయమునే భగవాత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో॥ గర్భస్తో జాయమానో వాజాతో వా బ్రాహ్మణోదవా ।**
**అంత్యజో వాపి ముచ్యేత ప్రసాదే సతి శాంకరే ॥ (సి. శి. 11-72)**

శివాను గ్రహమును పొందెడి వారి యందు వయోసంబంధమైన తారతమ్యములుగాని, జాతి సంబంధమైన భేదములుగాని ప్రతిబంధకములుకాజాలవు. గర్భస్థ శిశువు కైనను, అప్పుడప్పుడే పుట్టిన వానికైనను, బ్రాహ్మణునికైనను, అంత్యజునికైనను శివప్రసాదము సిద్ధించ గలడు. శివ ప్రసాదము వలన పదవులు కోరువారికి పదోన్నతియును కలుగునని శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**శ్లో॥ బ్రహ్మాద్యా విబుధాః సర్వే స్వస్వస్థాన నివాసినః ।**
**నిత్య సిద్ధాః భవంత్యేవ ప్రసాదాత్పారమేశ్వరాత్ ॥ (సి. శి. 11-73)**

బ్రహ్మాది దేవతలు తమ తమ స్థానములు యందు ఉండి నిత్యసిద్ధిని పొందుటకు శివప్రసాదమే కారణమై యున్నది. ఈ విషయమై పురాణములలో బహువిధమైన ఉదాహరణలు యివ్వబడినవి. మరొక మాటలో చెప్పవలెననిన శివాను గ్రహములేనివానికి ఆయాపదవులలో సక్రమమైన విధి నిర్వహణ చేయుటకు సాధ్యముకాదు. శివ ప్రసాదము పొందిన వారికి 'సర్వంశివమయమ్ జగత్' అనెడి భావన ఏర్పడునని చెప్పెడి భగవత్పాదులవారి ఉపదేశమును గనుడి.

**శ్లో॥ ప్రసాదే శాంభవే సిద్ధే పరమానందకారణీ ।**
**సర్వం శివమయం విశ్వం దృశ్యతే నా త్రసంశయః ॥ (సి.శి. 11-74)**

శివప్రసాద సిద్ధి కలిగిన వాడు పరమానందము ప్రాప్తమగుననియును, విశ్వములో శివదర్శనము చేయుచు విశ్వరూప శివ సందర్శన భాగ్యమును పొందగలడు. శివ ప్రసాదము వలన జననమరణములను దూరము చేసుకొనవచ్చు ననెడి శ్రీభగవత్పాదుల వారి ఈ యుపదేశమును గనుడి :

**శ్లో॥ సంసార చక్ర నిర్వాహ నిమిత్తం కర్మకేవలమ్ ।**
**ప్రసాదేన వినా శంభోర్న కన్యాపి నివర్తతే ॥ (సి. శి. 11-75)**

శాస్త్రజ్ఞుల ప్రకారము జీవుడు జనన మరణ చక్రమున చిక్కి నానా యోనులయందు పుట్టి సుఖదుఃఖములనను భవించుచున్నాడు. ఈ ప్రకియకు ప్రారబ్ధ కర్మయే కారణము. దీనితో పాటు సంచిత, ఆగామి, కర్మలు కూడా దోహదము చేయుచున్నవి. ఈ కర్మలతలను త్రెంచిన యెడల జన్మ లభించదని భక్త్యుద్యమనేతలు ప్రవచించిరి. శ్రీ భగవత్పాదులవారు జన్మరాహిత్యము పొందదలచిన వారికి మార్గాంతరమును సూచించెను. అదియే ప్రసాదము. ప్రసాదము వలన కర్మ భస్మీపటలమై పునర్జన్మ వుండదు.

శివ ప్రసాదమునకు సాటిగా వుండునది ముల్లోకములలో మరేదియును లేదని చాటి చెప్పెడి భగవాత్పదులవారి ఉపదేశము గనుడి.

**శ్లో॥ బహునాత్ర కిముక్తేన నాస్తి నాస్తి జగత్రయే ।**
**సమానమధికం చాపి ప్రసాదస్య మహేశితుః ॥**
**శివప్రసాదే సతి యోగభాజః సర్వం శివైకాత్మతయా విభాతి ।**
**స్వకర్మముక్తః శివభావితాత్మా సప్రాణలింగీ తి నిగద్యతే సౌ ॥ (సి.శి. 11; 76-77)**

శివ ప్రసాద మహిమ అసమానమై, అనుపమానమై వర్ణనాతీతమైనది. శివ ప్రసాదమును ప్రాప్తి చేసికొనిన వాడు, ఈ సకల జగత్తును శివుని కంటె భిన్నముకాదని ఎఱిగి శివయోగిగా సాధన చేసి సర్వకర్మల నుండి విముక్తుడై ప్రాణ లింగి యని యనిపించుకొనును. ప్రసాది స్థలము యొక్క పరిపూర్ణ యవస్థానంతరము ప్రాణ లింగి స్థలము యొక్క మహి మాతిశయమును గుర్తించి వీరశైవులెల్ల సఫలమునోరథులై ప్రాణలింగి స్థలమున ప్రవేశించుటకై ప్రయత్నించ వలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

ప్రసాదమని పిలువబడెడి శివకారుణ్యమునకు సరిసమానమైనది కాని యధికమైనది కాని "నాస్తి నాస్తి జగత్రయే" యనెడి భగవత్పాదుల వారి దివ్యభావమును శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు తమ ఆశీర్వచనము నెంతో విశదముగా విశ్లేషించి వివరించి చెప్పెరి.

సంసారములో పడి బాధలకు గురి అయ్యెడి వారెందరో గలరు. బాధోపశనార్థమే పరితపించెడి వారు నెందరో నుందురు. సారహీనమైన సంసారము నుండి ముక్తిని కోరెడివారు కొందరే. ఇది యిట్టులుండగా చాలమంది ఇహ-పర సుఖములను వాంఛింతురు. పలు విధములగు మార్గముల నాశ్రయించి తమ తమ కోర్కెలను నెర వేర్చు కొనుటకై యత్నింతురు. వీరిలో కొందరు పూర్వ జన్మసుకృతము వలన శివ మహిమను దెలిసికొని శివ ప్రసాద లబ్ధికై ప్రయత్నింతురు.

శివ ప్రసాద మంత సులభముగా లభించదు. సంసారము యెడల హేయ భావమును గల్గి, గురుకారుణ్యమును పొంది లింగైక్య నిష్ఠాతత్పరుడై జంగమ దాసోహము, సద్భక్త జనుల సేవలు చేసిన వారికి మాత్రమే ప్రసాదమాహాత్మ్య మెట్టిదో తెలియ గలదు. శివ ప్రసాదములో నమోఘమైన శక్తి గలదు. గర్భస్థ శిశువైనను పరమపదమును పొందగలదు. అంత్యజుడైనా అందల మెక్క గలడు.

ఆగమాది వేదాదులలో యజ్ఞయాగ తపశ్చర్యాదుల చేత శివ కరుణ పొంద వచ్చునని తెలుపబడిననూ నరనారాయణులు శివుని గురించి తపశ్చర్యాదుల నాచరించి పాశుపతాస్త్ర చక్రా యుధములను బడిసిరనెడిది పౌరాణిక ప్రశస్తిని పొందిన యంశము. కాని భక్తియే శివప్రసాదమునకు మూలమని శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము వలన తెలియు చున్నది. భక్తుద్యమ శిఖామణిగా చారిత్రాత్మక ప్రసిద్ధిని గాంచిన శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనను నిట్టి భావనను గాంచగలము.

నీ వొల్లినదే పుణ్యము, నీ వొల్లనిదే పాపము. సకల జగములలోన ననుశ్రుతుడనై యుంటినయ్యా నీవు వొల్లిన వాడే నిన్నెరుగ గలడు.

**ప్రసాదాద్దేవతా భక్తిః ప్రసాదో భక్తి సంభవః ।**
**యద్వైవాంకురతో బీజం బీజతోవా యథాంకురః ॥**

**నీవు వొల్లిన వాడే ధన్యుడు జగమునకే పావనుడు కూడల సంగమ దేవా!** (బ.గీ.అ.పు. 353)

శివకారుణ్యము లేనివానికి భక్తి కుదురదనెడిది గమనార్హమైన విషయము. ప్రసాది యవధాన

భక్తిని దృఢతరము చేసికొని ప్రాణలింగి స్థలమును చేరుటకు ప్రయత్నించుట శ్రేయస్కరము.

శివం భూయాత్

# ద్వాదశ పరిచ్ఛేదము

## ఆశీర్వచనము - 1

## ప్రాణలింగి స్థలము

పూజ్యపాదులు శ్రీ రేణుక భగవత్పాదుల వారు ఉపదేశమును కటాక్షించి ప్రసాదమాహాత్మ్యమును గురించి తెలిపిన పిదప శ్రీ అగస్త్య మహర్షి ఈ క్రింది విధముగా ప్రశ్నించిన వాడయ్యేను.

**శ్లో॥ భక్తోమహేశ్వరశ్చేతి ప్రసాదీతి నిభోధితః ।**
**ఏక ఏవ కథం చైషః ప్రాణలింగితి కథ్యతే ॥ (సి. శి. 12 -1)**

ఓ గురుదేవా! భక్తుడు మాహేశ్వరుడుగాను, మాహేశ్వరుడు ప్రసాదిగాను, పరిణామమును పొందునని యింతకు క్రితమే ఉపదేశించిన వారైతిరి. ఇపుడా భక్తుడు ప్రాణలింగి యగునని చెప్పుచున్నారు. ఇది ఎట్టుల సంభవము? శ్రీ భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షి సందేహమును తీర్చుటకై ప్రదానము చేసిన ఉపదేశము.

**శ్లో॥ భక్తో మాహేశ్వర శ్చేతి ప్రసాదీతి చ కీర్తితః ।**
**కర్మ ప్రాధాన్య యోగేన జ్ఞానయోగోస్య కథ్యతేః ॥ ( సి. శి. 12-2)**

ఓ అగస్త్య మహర్షీ! సాధకుడు భక్త మహేశ మరియు ప్రసాద స్థలములలో కర్మమార్గమున పయనించును. భక్తితో బహిరంగ పరమైన సత్క్రియలను చేయుచు క్రమ క్రమముగా తన సాధనను సుసంపన్నము చేసికొనును. భక్త స్థలమున ప్రారంభమైన ఈ సాధన ప్రసాద స్థలమున పరిపూర్ణమగు చున్నది. ఈ బహిరంగ పూజల ద్వారా సాధకుడు అంతరంగ శుద్ధిని, బహిరంగ శుద్ధిని బడయుచున్నాడు. తదనంతరము సాధకుడు జ్ఞాన మార్గమున పయనించును. తన్నిమిత్తమై ప్రాణలింగి స్థలము మొదటి మెట్టని గ్రహించవలెను. వీరశైవ సిద్ధాంతము ప్రకారము ముక్తి సాధించుటకు కర్మ, జ్ఞానములు ఆవశ్యకత సరి సమానముగా నుండును. అందుకొరకే ఈ ధర్మమునకు కర్మజ్ఞాన సముచ్ఛయమను స్వభావము సమకూడినది.

ప్రాణలింగి యననెట్టివాడో అని తెలిపెడి ఉపదేశమును శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా ప్రదానము చేసిరి.

**శ్లో॥ లింగం చిదాత్మకం బ్రహ్మ తచ్ఛక్తిః ప్రాణరూపిణీ ।**
**తద్రూప లింగ విజ్ఞానీ ప్రాణలింగీతి కథ్యతే ॥ (సి. శి. 12-3)**

జ్ఞానస్వరూపమైన బ్రహ్మమే లింగము. ఆలింగము శక్తి సహితముగా నుండును. ఆశక్తి లింగమునకు ప్రాణము వంటిది. ఇట్టి విజ్ఞానమును పొందిన వాడే ప్రాణలింగి యన బడును.

శ్రీ భగవత్పాదుల వారు ప్రాణలింగి స్థలములోని అవాంతర భేదములను ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో॥ ప్రాణలింగి స్థలం చైతత్పంచ స్థల సమన్వితం ।**
**ప్రాణలింగి స్థలం చాదౌ ప్రాణలింగార్చనం తతః ॥**

**శివయోగ సమాధిశ్చ తతూ లింగనిజ స్థలం ।**
**అంగ లింగి స్థలం చాథ క్రమాదేషాం భిదోచ్యతే ॥ (సి. శి. 12; 4-5)**

ప్రాణలింగి స్థలములో అయిదు అవాంతర భేదములు కలవు. అవి యేమనగా ప్రాణలింగి స్థలము, ప్రాణలింగార్చన స్థలము, శివయోగ సమాధి స్థలము, లింగ నిజ స్థలము, మరియు అంగ లింగ స్థలము.

శ్రీ భగవత్పాదుల వారు ఒక్కొక్క స్థలము గురించి తమ ఉపదేశమున శ్రీ అగస్త్య మహర్షి వారికి ప్రసాదించిరి. పరబ్రహ్మము ప్రాణరూపియైన శక్తితో విశిష్టమై ప్రాణ లింగమనబడుచున్నది. ఈ ప్రాణలింగ స్వరూపమును జ్ఞాన మార్గముననేకాక యోగ మార్గమున కూడా తెలిసికొన వచ్చును. యోగ మార్గమున తెలిసికొన వలెనన ప్రాణాయామాదుల అవగాహనముండవలయును. ప్రాణాయామ క్రియాదుల వలన శివ యోగులు ఈ లింగము నేవిధముగా తెలిసికొనెదరో శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో॥ ప్రాణా పాన సమాఘాతాత్ కందమధ్యాద్యదుత్థితమ్ ।**
**ప్రాణ లింగం తదా ఖ్యాతం ప్రాణా పాన నిరోధిభిః ॥ (సి. శి. 12-6)**

మన శరీరమున అయిదు రకములైన వాయువులు విహరించు చుండును. అవి ప్రాణ, అపాన, ఉదాన, వ్యాన, మరియు సమానములగునవి. వాయువు ఒకటేయై యుండినను విభిన్న స్థానములు మరియు విభిన్న క్రియల మూలకముగా ఈ అయిదు పేర్లు వచ్చినవి. 'హృది ప్రాణ' అనగా హృదయము నందున మొదలు కొని నాసిక పర్యంతముగా సంచరించెడి వాయువును ప్రాణవాయువు అని పిలుతురు. ఈ ప్రాణ వాయువును ప్రతి వ్యక్తి నిమిషమునకు 15 సార్లు, దినమునకు 21,600 మార్లు పీల్చుకొని వదులును. మరొక మాటలో చెప్పవలెనన్న నీ వాయువు నా సాగ్రము నుండి హృదయము వరకు దినమునకు 21,600 మార్లు సంచరించు చున్నది. ఈ వాయువు వలననే శరీరము జీవ సహితమై యున్నది. ఇది ఆగి పోయిన నాడు వ్యక్తి మరణించును. ఇంకను 'గుదేపాన' అనెడి సూక్తి ప్రకారము మలద్వార స్థానమున అపాన వాయువు నివసించి యుండును. ఇది మలమూత్రములను బయటకు తెచ్చెడి కార్యమును చేయుచుండును. ఈ వాయువు దుర్బలము అయిన యెడల మలమూత్రముల విసర్జనకు ఆటంకము ఏర్పడును. 'సమానో నాభిమండలే' అనెడి సూక్తి ప్రకారము నాభి స్థానమున సంచరించెడి వాయువునకు సమాన వాయువని యందురు. అన్నరసమైన రక్తమును సకల అవయవములకు ప్రసరింప జేసెడి కార్మమును ఇది చేయు చుండును. 'వ్యానః సర్వ శరీరగః' అనెడి సూక్తి ప్రకారము నవనాడుల యందు సంచరించి రక్త ప్రసరణ క్రియను సమతుల్యముగా చేసెడిదే వ్యాన వాయువు. ఈ వాయువు వికృతమైన యెడల రక్త సంబంధమైన రోగములు పొడసూపును నేటి కాలమున ఎంతో మందిని బాధపెట్టెడి రక్తపోటు ఈ కోవకు చెందినదే. 'ఉదానః కంఠదేశస్థ' అనెడి సూక్తి ప్రకారము ప్రతి ఒక్కరి కంఠసీమను ఉదాన వాయువు వుండును దీని వలన త్రేన్పులు, ఎక్కిళ్ళు మొదలగునవి వచ్చుచున్నవి. శరీరాంతర్గతమైన దూషిత తత్త్వములను బహిర్గతము చేయుటకే ఉదాన వాయువు బయటికి వచ్చునని తెలిసికొనవలెను. ఈ విధముగా ఒకే వాయువు భిన్నభిన్న రూపముల మన శారీరక క్రియలను సక్రమముగా నడిపించు చున్నది. ప్రకృత ప్రసంగమునందు శ్రీ రేణుక భగవత్పాదుల వారు విశిష్టమైన ప్రాణాయామ విధాన మూలకమైన ప్రాణ లింగ స్వరూపమును తెలియ పరచినారు. పూజ్యుల ఉపదేశము ప్రకారము శివయోగ సాధకుడు దీర్ఘ ప్రాణాయామముల మూలకముగా తన ప్రాణ వాయువును మర్మస్థానమున నుండెడి అపానవాయువు వరకు తీసుకొని వెళ్ళి అచట ఆ రెండూ సంఘటనమైన పిదప ఆ సంఘటన ఫలితముగా ఒక జ్యోతి ఉత్పన్నమగును. ఆ జ్యోతియే ప్రాణ లింగము. ఆపాన వాయువునకు ప్రాణ వాయువు సంఘటనకాగా ఆ రెండింటికి మధ్య ఘర్షణ ఏర్పడి జ్యోతి ప్రజ్వలన మగునని తెలిసికొన వలెను. ఈ జ్యోతి ఊర్ధ్వముఖమున నుండును. ఇది హృదయ స్థానమునకు వచ్చి నెలకొని యుండును. దీనినే శివయోగులు ప్రాణ లింగమని యందురు. ఈ ప్రాణ లింగము నిరంతరము ప్రజ్వరిల్లు చుండునని శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది వుపదేశమును యిచ్చిరి.

**శ్లో॥ ప్రాణో యత్ర లయం యాతి భాస్కరే తుహినం యథా ।**
**తత్ర్పాణ లింగముద్దిష్టం తద్ధారీ స్యాత్త దాకృతిః ॥ (సి. శి. 12-7)**

హృదయమందున యుండెడి ఈ జ్యోతి ప్రాణవాయువు సహాయమున నిరంతరము వెలుగుచు ప్రాణలింగమని పిలువబడు చున్నది. చలికాలము నందు వేకువ జామున గడ్డిమీద మంచు తుంపరలు కన్పట్టును. సూర్యోదయము వరకు కనిపించెడి ఈ తుంపరలు ఆతదుపరి కాలమున నణగి పోవును. సూర్యుని యపారమైన తేజస్సు కివి అవిరైపోవుచున్నవి. ఇదే విధముగా హృదయమున ప్రకటన చెందిన జ్యోతి యందు ప్రాణము విలీనమగు చున్నది. వీరశైవ సిద్ధాంతము నందున వచ్చెడి త్రిలింగములలో ఇది ఒకటి. ఇష్టలింగ, ప్రాణలింగ, భావలింగములనెడివి త్రిలింగములు. ప్రాణలింగి స్థలమున నుండెడి భక్తుడు ఈ ప్రాణలింగ అస్థిత్వమునెరిగి నదా ఆప్రాణలింగము యొక్క ధ్యానముననే నిలిచి యుండును. హృదయము నందలి ఈ ప్రకాశముగల జ్యోతిని సామాన్యులు ఎరుగజాలరు.

యోగ మార్గముననూ, జ్ఞానమార్గముననూ దీనిని అనుభవములోనికి తెచ్చుకొన వచ్చును. యోగ మార్గమునందు పూర్వోక్త విధముగా ప్రాణాయా మాదులను చేయవలసి యుండును. గురు ముఖతః ఉపదేశమును పొంది గురువుగారి పర్యవేక్షణలో సాధన చేయవలసి యుండును. అటుల కాకుండా స్వతంత్రించి సాధన చేయుటకు పూను కొనిన యెడల సత్ఫలితము లుండవు. ఈ మార్గమున నే కాక జ్ఞానమార్గము ద్వారా ఈ జ్యోతిని దర్శించెడి వారు కూడా కలరు. ప్రాణ లింగము ప్రకాశమానమై చిద్రూపమున వుండునని యెరిగిన వారై, నిరంతరము అద్దాని ధ్యానములో మునిగి, ప్రాణలింగమును దర్శించ వచ్చును. ఈ విషయమున శ్రీ జగద్గురువుల వారు ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**శ్లో॥ జ్ఞానినాం యోగయుక్తానామంతః స్ఫురతి దీపవత్ ।**
**చిదాకారం పరబ్రహ్మ లింగమజ్ఞైర్న భావ్యతే ॥ (సి. శి. 12 -8)**

జ్ఞానులును, యోగులును జ్యోతిర్లింగ రూపమునగల ఈ ప్రాణ లింగమును గాంచగలరు. చిదాకారమున నుండెడి ఈ పరబ్రహ్మలింగమును సామాన్యులు కానజాలరు. మరొక మాటలో చెప్పవలెననిన బహిర్ముఖ ప్రవృత్తి కలిగిన వారు ప్రాణలింగమును గాంచలేరు. తన్నిమిత్తమై అంతర్ముఖ మనోవృత్తిని పెంపొందించుకొన వలెను. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు క్రింది విధమున మరికొంత విశదీకరించిరి.

**శ్లో॥ అంతః స్థితం పరంలింగం జ్యోతీరూపమ్ శివాత్మకమ్ ।**
**విహాయ బాహ్యలింగస్థా విమూఢా ఇతికీర్తితాః ॥ ( సి. శి. 12-9)**

వీరశైవ సిద్ధాంతమందున యిష్టలింగధారణ, దాని అర్చన గురించిన ఆవశ్యకత నిర్దేశింప బడినది. అది ఒక్కటే అంతిమమని భావించవలదు. దానితో పాటు ప్రాణలింగ భావలింగములను కూడా తెలిసికొని శివార్చన స్తూలము. క్రమక్రమముగా శివునితో అభేదమును సాధించవలెను. ఈ విధముగా ప్రాణలింగ భావలింగ సాధనములు చేయకుండగా మొత్తము జీవితమును యిష్టలింగార్చనకై పరిమితము చేసుకొనిన మూర్ఖు లనబడుదురు. ఇట్టి మూర్ఖత్వమును తొలగించు ఉద్దేశ్యముతోనే శ్రీ భగవత్పాదుల వారు, బహిర్ముఖ ప్రవృత్తి గలవారిని విమూఢులనిరి. దీనిని మరొక విధముగా అర్థము చేసికొనవలదు. సాధకుడు తెలిసి కొనవలసిన దేమనగా ఇష్టలింగార్చన అనివార్యమైనదే. దానిని వీడుటకు వీలులేదు. కాని అదియే సర్వస్వమని భావించుట పొరపాటు. గాఢాంధకారములోనున్న గుహలోనికి ప్రవేశించుటకై తిమిరమును పారద్రోల వలసి యుండును. గుహలో జ్యోతి యుండిననూ అది గుహ యొక్క అంతార్భాగమున నుండుట చేత మార్గదర్శన నిమిత్తము ఒక సాధన కావలసి యుండును. ప్రాచీన కాలములో దివిటీలను పట్టుకొని జనులు చీకటిలో సంచరించెడివారు. ఇష్టలింగము కూడా దివిటీ వలె మార్గమును దర్శింప జేసి ప్రాణలింగమును వీక్షించు ప్రక్రియను సుగమము చేయును. దీని వలన తెలియునదేమనగా ప్రాణలింగార్చన, యిష్ట లింగార్చనలు పరస్పర పూరకములు. వీరశైవుడు తమ వామకర స్థలము నందుండెడి లింగముపై దృష్టిని కేంద్రీకరించుచునే, తన మనో వృత్తిని హృదయము వైపు ప్రసరింప జేయవలెను. ఆ విధముగా సాధనచేసిన వానికి హృదయ స్థానమున యిష్టలింగ ప్రమాణములో ప్రాణలింగము కన్పట్టును. ఈ విధముగా సాధన చేయుచు నిరంతరము ప్రాణలింగార్చనలో మునిగి యుండెడి వాడే ప్రాణలింగి యగు చున్నాడు. ఈ రహస్యమును గుర్తెరిగి వీరశైవ సాధకులు ప్రాణలింగ స్థలమున ప్రవేశించి తమ సాధనను బలోపేతము చేసి కొనవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యుల వారు ప్రాణలింగ స్థలమును గురించిన మౌళికాంశముల నెన్నింటినో యీ యాశీర్వచనములో వివరించిరి.

అవధాన భక్తి చేత జ్ఞానమనెడి ప్రసాదము నార్జన చేసి, కర్మ మార్గమును పరిత్యజించి శివతత్త్వమునను భోగము చేయుటకు సంసిద్ధుడైన వీరశైవుడు ప్రాణలింగ స్థలమున ప్రవేశించునని తెలియ వలెను.

ఈ స్థలము భోగాంగ సంబంధము గల్గినదని మగ్గియ మాయి దేవుల వారు వివరించిరి. అనుభవ భక్తిని యాధారముగా గొని, సాధకుడు శివునితో నభేద స్థితి ననుభవించుట కొరకు కృషి చేయును. ప్రసాది స్థలము భేదాభేద భావన పెంపొందుటకు ప్రారంభ దశకాగా, ప్రాణ లింగి స్థలమున గల్గిన జ్ఞానము చేత వీరశైవుడు తనకు శివునికి కొంత మేరకు భేదము దోచినను చాల వరకు నభేదమని గుర్తించును. ఇట్టి యభేద భావనను ధృఢతరము చేసి కొనుటకు శివయోగ మార్గమును చేపట్టును. లింగము పరబ్రహ్మమనియును, తన ప్రాణము శక్తి స్వరూపమనియును గుర్తెరుగును. లింగమున ప్రాణమును, ప్రాణమున లింగమును సంయోగము చేసి కొనుటయే తన లక్ష్యమని యెంచును. ఈ విషయమును సూచన ప్రాయముగా దెలిపెడి శివాను భవ సూత్రకారుని యీ పద్యమును గనుడి:

**శ్లో॥ గతి "లింగమధ్యే జగత్యర్వ" మను మధ్య కలితాంబరము మహా కాశ మనుచు**
**బూని "యణోరణీయా" నన జైతన్య తత్వంబ యధ్యాత్మ తత్త్వ మనుచు**
**రతి "లింగ బాహ్యాత్పరం నాస్తి" యన బాహ్యే శూన్యంబ యదియ తా శూన్య మనుచు**
**నెరయంగ "బ్రహ్మేతి నిశ్చితం" బన లింగ భావంబ యది పర బ్రహ్మమనుచు**

**రూఢిగా 'నేక పవ రుద్రో' యటంచు**
**భోగి భూషణు సద్భక్తి యోగ నిరతి**
**నార్యులర్చింతు రెడపక యతుల మహిమ**
**బ్రణుతి సేయును శ్రుతులును బసవలింగ ! (చతుర్వేద సారము ప. 171)**

లింగము పరబ్రహ్మమని చెప్పిన పిదప సోమనాదుల వారు 'ప్రాణము లింగాను బంధము గాగనా లింగంబు ప్రాణాను సంగతముగ' నుండునటుల వీరశైవుడు సాధన చేయవలెనని యుద్బోధించిరి. (ప. 2-67)

ప్రాణలింగి స్థలములోని వీరశైవుడు అంతర్లింగాను సంధానమును చేసికొనుటకు కృషి చేయవలెననెడిది గ్రహించవలసిన విషయము.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 2

## ప్రాణలింగి స్థలము

ఇంతకు క్రితము ఆశీర్వచనము నందున ప్రాణలింగి స్థలమును గురించి ఉపదేశము యివ్వబడినది. ఆ స్థలము గురించిన మరికొంత ఉపదేశమును శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా నిచ్చిరి.

**అంతః స్థితం పరం లింగం జ్యోతిరూపం శివాత్మకమ్ ॥**
**విహాయ బాహ్యలింగస్థా విమూఢా యితి కీర్తితాః ॥ (సి. శి. 12-9)**

ఈ శ్లోకము నందున అంతరంగము నందుండెడి జ్యోతి స్వరూపమైన లింగమును విస్మరించి కేవలము బాహ్యలింగము మైన ఆసక్తిని కేంద్రకరించు వారిని విమూఢులు అని పిలువ బడినారు. బాహ్యలింగమునగా రెండు విధములుగా అర్థము చేసికొనవలెను. మొదటిది మందిరములలో నుండెడి స్థావరలింగము. రెండవది దేహము మీద నుండెడి ఇష్టలింగము కాని మరితోంటదార్యుల వారు తమ వ్యాఖ్యానమున బాహ్యలింగమనగా స్థావరలింగమనియే వివరించిరి వారి వివరణను గనుడి. "అత్ర బాహ్యలింగం ఇష్టలింగాతిరిక్తమ్ ప్రాకృతలింగపరమ్, ఇష్టలింగస్య చిదానంద ఘువత్వేన అంతరత్వాదితి" అనెడి ఈ వివేచన ప్రకారము బాహ్యలింగమనగా మందిరములలో నుండెడి స్థావరలింగమే. దీనిలో అంతరార్థ మేమనగా తనశరీరము కంటె వేరుగా నుండెడిది ఇష్టలింగమనెడిది బాహ్యలింగముగా కన్పించినను అంతర్లింగాను సంధానమునకు సహాయముగా నుండుటచేత ఇష్టలింగము బాహ్యలింగము కాజాలదు. భక్తుని యొక్క మనోవృత్తిని ప్రాణలింగము వైపు ప్రసరింపజేయ వలెననిన ఇష్టలింగమును వామహస్తమునందుంచుకొని దానియందుననే దృష్టినినిలిపి త్రాటక యోగమును చేయుచు ముద్రాదుల సహయముచేత తన మనోవృత్తిని ప్రాణలింగము కడకు తీసుకుని పోవలెను. ఈ విధముగా

ఇష్టలింగము బాహ్యమున వుండిననూ పూర్ణముగా బాహ్యమున వుండినట్లుగా భావించుటకు వీలులేదు పాక్షికముగా ఇది అంతర్లింగముగా పుపయోగపడుచున్నది.

స్థూలమైన ధృష్టితో విచారించగా వీరశైవులు నిరంతరము ధరించెడి యిష్టలింగము మరియు మందిరము లందు స్థాపించబడిన శివలింగములను బాహ్యలింగములుగనే భావించవలెను. అయితే ఈ రెండింటిలో మందిరములలో నుండెడి లింగము స్థావరలింగమగును. ఇష్టలింగము అనగా ఇష్టార్థప్రదాయకమైనా లింగము. స్థావరలింగములకు ఇది అన్వయము కాదు. ఇష్టలింగమనగా కేవలము దేహము మీద ధరించెడి లింగమనియే భావించవలెను.

ఈ విషయమున ఒక జిజ్ఞాస అందరి మనస్సుల యందును ఉదయించ వచ్చును. అది ఏమనగా ఇష్టార్థములను నొసంగెడి సామర్థ్యము మందిరాదులలో స్థాపించబడిన స్థావరలింగములలో కన్పట్టుచున్నది. అనేకమంది భక్తులు తమగ్రామమునందుండెడి శివలింగములను మరియు తీర్థ క్షేత్రముల యందుండెడి జ్యోతిర్లింగములను కోరికలను కోరుకుని ఆయాలింగములను పూజించి యిష్టార్థసిద్ధిని బడయుట మనము గాంచగలము. ఈ విధముగా యిష్టార్థప్రదాయకమైన సామర్థ్యముగల మందిరముల నుండెడి శివలింగములలో వుండిన విషయము అందరి అనుభవములోనికి వచ్చుటచేత ఆయా లింగములను యిష్టలింగములని ఎందుకు అనకూడదు. దేహము మీద దరించెడి లింగమునకే యిష్టలింగమనెడి ప్రయోగమును మితము చేయుట ఏ విధముగా యుక్తమైయున్నది.

మనుష్యుని యిష్టార్థములు రెండు విధములుగా నుండును. మొదటిది లౌకిక భోగములకు సంబంధించినది. రెండవది మోక్షమునకు అనుబంధము గల్గినది ఈరెంటిలో ఏదిముఖ్యమైనది అనెడి ప్రశ్న ఉదయించగనే ముక్తియే ముఖ్యమైనదను ఉత్తరము బహిర్గతమగును. స్థావర లింగమునందున ముక్తిని యిచ్చెడి సామర్థ్యము లేదని వీరశైవ సిద్ధాంతము ప్రకటించినది. ఆ లింగములు భౌతిక పరమైన భోగభాగ్యములను పూర్తి చేయు వచ్చునేమో కాని మోక్షమును కలుగజేయవు. వీరశైవ సిద్ధాంతము ప్రకారము మోక్షమనగా లింగాంగ సామరస్యము వీరశైవులు తమ వామహస్తమున పెట్టుకొనెడి తమ యిష్టలింగమును తమ ఆత్మయొక్క స్వరూపమని భావించుకొని దానిని అహంగ్రహ రూపముగా ఉపాసించు చున్నారు. ఇట్టి లింగాంగ సామరస్యమును సాధించుటకు యిష్టలింగమే ఎంతో అవశ్యకమై యున్నది. మందిరములలో నుండెడి లింగములను భక్తుడు ద్వైతభావముతోనే పూజించును. అచటనుండెడి లింగము తన ఆత్మకంటెను. భిన్నమైన దనియును, దానినుండి అనుగ్రహమును అపేక్షించుచున్నాననియును భావించునే కాని ఆ లింగము తాననియును తానే ఆ లింగమనియును భావించగలడా? ఇట్టి భావన ఇష్టలింగము నందున మాత్రమే సాధ్యమగుచున్నది. స్థావరలింగము వలన లింగాంగ సామరస్యము దొరకదు. వీరశైవులకు పరమ యిష్టమైన లింగాంగ సామరస్యరూపమైన సాయుజ్యము లభింపజేశెడి లింగమైనందున ఈ లింగమునకు యిష్ట లింగమనెడి నామధేయము సార్థకమైనది ఈ దృష్టి కోణముతో చూశిన యెడల స్థావర లింగమెన్నటికినీ యిష్టలింగము కాజాలదు. అది యిష్టదైవము యొక్క ప్రతి రూపము కావచ్చును.

ఈ విషయమున శ్రీ మాయిదేవులవారు ఈ క్రింది విధముగా ఉపదేశమును ప్రదానము చేసిరి. 'ఇష్టిః పూజా తయా నిత్యం యిష్టం పూజిత మాదరాత్ ఇష్టలింగమితి ప్రోక్తమ్' దీని భావమేమనగా 'ఇష్టిః పూజా' అనగా నిత్యపూజ, 'తయా' అనగా ఆ పూజ చేత, 'నిత్యం' అనగా ప్రతిదినము, 'ఆదరాత్' అనగా ఎంతో ఆదర భావము వలన, 'యిష్టమ్' అనగా పూజించబడెడి, 'లింగమ్' అనగా లింగము. ఈ విశ్లేషణలోని అంతరార్థమేమనగా సాధకుని చేత ప్రతినిత్యము సాదరభావముతో తప్పని సరిగా పూజించబడెడి లింగమే యిష్టలింగము. వీరశైవ సిద్ధాంతము నందున యిష్టలింగమును దేహము మీద ధరించి ప్రతి నిత్యము పూజించవలెననెడి కట్టు దిట్టమైన నియమము కలదు. సాధకుడు యెక్కడకు పోయిననూ అతని మేనుమీద యిష్టలింగముండటచేత అతని నిత్య పూజకు ఎట్టి ఆటంకము కల్గుట లేదు. ఒక మందిరమునందు స్థాపించబడిన లింగమును పూజించుటకు ఒక అర్చకుడు నియమింపబడిననూ కాలాంతరము నందున కారణాంతరముల వలన వేరొక వూరికి పోయినపుడు అతడు ఆ లింగమును పూజించెడి బాధ్యత మరొక్కనికి అప్పగించి వెడలుచున్నాడు. ఈ విధముగా ఆ లింగము ఒకని చేత పూజింపబడక మరొక్కరి చేత కూడా పూజింప బడుచున్నది. పూజరి నిత్యనియమము ఆ లింగమును పూజించుట ఆ నియమమునతడు నిర్వహించలేని పక్షమున అద్దానిని మరొక్క నికప్పజెప్పును. ఇష్టలింగము పూజ అట్టిదికాదు. తన యిష్ట లింగమును తానే పూజించ వలెను. అద్దానిని పూజించుటకు ఇంకొకరిని నియమించ జాలము. ఈ కారణమున దేహము మీద ధరించెడి లింగమే యిష్ట లింగమగు చున్నది. శ్రీ గురువుగారు యిష్ట లింగమును దీక్షా పూర్వకముగా ప్రదానము

చేయునప్పుడు దానిని సాధకుని ప్రాణముతో అనుసంధానము చేయును. ఇది నీకు ప్రాణము వంటిదనియునూ, నీ బొందిలో ప్రాణమున్నంత మేరకు నీవు దీనిని పూజించ వలెనునియును. నిర్దేశము నిచ్చునని ఇంతకు క్రితమే తెలిసికొని యుంటిమి. ఆ ఉపదేశము ఈ దిగువన యివ్వబడినది.

**ప్రాణ పద్ధారణేయం తత్ ప్రాణలింగమిదం తవ ।**
**కదాచిత్ కుత్రచిద్వాపి న వియోజయ దేహతః ॥ (సి. శి. 6 -26)**

ఈ ఉపదేశములోని సారాంశము ఏమనగా శిష్యునికి కటాక్షించబడిన యిష్టలింగము ప్రాణసమేతమై యుండుటచేత దానిని ప్రాణము వున్నంత వరకు దేహము నుండి విడదీయకూడదు. ఇది దేహము యొక్క ఒక అంగము వంటిది.

సాధకుని యొక్క ప్రాణశక్తి యిష్ట లింగములో నుండుటచేత ఇది బాహ్యలింగము వంటిది కాదు. మందిరములలో నుండెడి లింగములలో జీవుని ప్రాణశక్తి యుండదు కదా!

శివయోగ సాధకుడు తన యోగసిద్ధిని బడసిననూ ఇష్టలింగమును త్యాగము చేయవలదు. దీనికి కారణమే మనగా శ్రీ శివాచార్యులవారు 'జ్ఞానామృతేన తృప్తోపి యోగీ ధర్మం న సంత్యజేత్' అని ఉపదేశమం జ్ఞానయోగము వలన గాని, శివయోగము వలనగాని, సిద్ధిని పొందిన వీరశైవుడు లింగార్చననూ మరియు లింగధారణను మానకూడదు. శ్రీ భగవత్పాదుల వారు వీరికి 'ధర్మో లింగార్చనాత్మకః' అని వుపదేశమునిచ్చిరి. ఈ ఉపదేశము యొక్క సారాంశమేమనగా ఇష్టలింగధారణ మరియు అర్చన ఎప్పటికైననూ వీడకూడదు. అట్టి యెడల శివజ్ఞానమును కాని శివయోగమును కాని సిద్ధిని పొందని సాధారణ భక్తుల గురించి వేరుగా చెప్పవలసిన పనిలేదు. శివయోగ సాధనకు తమ వామహస్తము నందున ఇష్టలింగమును పెట్టుకొని లింగాంగ సామరస్యమును అనుసంధానము చేయునప్పుడు అతని దేహము యొక్క ఆకరము పంచసూత్ర ఘటిత లింగాకారముగానే దోచును. శాస్త్రములందు ఉపదేశించబడిన "శివో భూత్వా శివం యజేత్ రుద్రోభూత్వా రుద్రమర్చయేత్" అనెడి ప్రమాణముల ప్రకారము శివుడుగా మారి సాధకుడు శివుని అర్చించవలెను. అనెడి నియమమొకటి కలదు. అది వీరశైవుని యెడల పరిపూర్ణముగు చున్నది. ఇచ్చట రుద్రుడనగా శివునికి పర్యాయపదమని భావించవలెను. ఈ కారణము వలన వీరశైవుని యొక్క ఇష్టలింగ పూజకే విశిష్టత కలదని భావించవలెను. శ్రీ గురువు దీక్షా సమయము నందున చేశెడి సత్క్రియలలో ముఖ్యమైనదిగా యెంచబడెడిది యేమనగా తన యోగశక్తిచేత శిష్యుని పశ్చిమ శిఖాచక్రము నందుండెడి చిత్కళను ఆకర్షించి శిష్యుని యిష్టలింగమునందున ప్రతిష్ఠించుటయే అందుచేత చిత్కళా విశిష్టమైన యిష్టలింగమును ప్రాణలింగమని యెంచ వలెను.

ఇష్టలింగమును ప్రాణలింగముగా భావించి పూజించెడి సాధకుడు వాస్తవముగా నుండెడి ప్రాణలింగమును విస్మరించునా? అది జరుగదు. అతడు క్రమ క్రమముగా ప్రాణలింగో పాసనయందు ఆసక్తిని పెంచుకొనును. ఇది యిటులుండగా ప్రాణలింగమును పూజించుటలో అనాసక్తి కల్గినవాడు ప్రాణలింగము యెడల అర్చనను చేయుగల్గునే? అది సాధ్యముకాదు.

ప్రాణలింగి యనెడు వాడు సదాతన ప్రాణలింగమునే చింతించుచుండునని తెలియ జెప్పెడి శ్రీ భగవత్పాదులవారి ఉపదేశము ఈ క్రింది విధముగా నున్నది.

**సంవిల్లింగ పరామిశ్రే బాహ్యవస్తుపరాఙ్ముఖః ।**
**యః సదావర్తతే యోగి ప్రాణలింగీ స ఉచ్యతే ॥ (సి.శి. 12-10)**

అంతర్ముఖ వృత్తిని సాధించిన శివయోగి యెల్లప్పుడు బాహ్య వస్తువుల యెడల పరాఙ్ముఖుడై చిద్రూపమైన ప్రాణలింగమునే పూజించుచుండును. అట్టి శివయోగిని ప్రాణలింగి యని అనవచ్చును. విశ్వము మాయా వికల్పజమని అందుచేత బాహ్య వస్తువుల యెడల పరాఙ్ముముఖత వహించుట అవసరమని తెలిపెడి భగవత్పాదుల వారి ఈ ఉపదేశమును గనుడి.

**మాయావికల్పజం విశ్వం హేయం సంచింత్య నిత్యశః ।**
**చిదానందమయే లింగే విలీనః ప్రాణలింగవాన్ ॥ (సి. శి. 12-11)**

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా ఈ ప్రపంచము మాయామయమైయున్నది. అందుచేత అతను బహిర్ముఖముగా నుండిన యెడల అతనికి ప్రాపంచిక విషయముల యెడల మోహభావము ఉత్పన్నమగును. తాను సంపాదించుకొనిన ప్రతి వస్తువు మీద మమతను పెంచి కొనును. ఇట్టి మమత్వ బుద్ధియే మోహపాశమై అతని పతనమునకు దారితీయును. ఈ కారణము వలన ప్రాణలింగి స్థానములోని శివభక్తుడు అంతర్ముఖ ఉన్ముఖత పెంపొదించు కొనును. ప్రాణలింగము యనెడి శబ్దమును ఇంకనూ సృష్టీకరించుటకై శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును కటాక్షించిరి.

**సత్తా ప్రాణమయీ శక్తిః సద్రూపం ప్రాణలింగకమ్ ।।**
**తత్సా మరస్య విజ్ఞానాత్ ప్రాణలింగీతి కథ్యతే ।। (సి. శి. 12-12)**

ప్రతి యొక్కరి అంతః కరణము నందున 'అహమస్మి' అనెడి స్ఫూర్తి ఏదైతే కలదో దానినే ప్రాణమయీ శక్తి అనియందురు. అహమస్మి యనగా నేను వున్నాను అని అర్థము ఈ ప్రాణ స్వరూప శక్తి విశిష్టమైన అంత రంగపు జ్యోతిర్లింగమును ప్రాణలింగముగా పిలుతురు ఇంకొక విధముగా చెప్పవలెననిన జ్యోతిర్లింగము శివస్వరూపమైతే ప్రాణ స్వరూప శక్తి శక్తిస్వరూప మగును. ఈ రెంటి యొక్క కలయికనే ప్రాణమయీ శక్తి విశిష్టమైన జ్యోతిర్లింగమగుచున్నది. ఈ విధముగా 'చిద్రూపోహం' అనెడి సామరస్యరూపమైన భావనను మరియు జ్ఞానమును పొందినవాడు. ప్రాణలింగిగా గౌరవింపబడు చున్నాడు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ।। 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

లింగాంగ సామరస్యమును సాధించెడి సాధనా క్రమములో ప్రాణా-లింగ సమ్మథన క్రియా చరణ యనెడి దొక కీలకమైన స్థలమని యీ యాశీర్వచనము నొక్కి చెప్పుచున్నది.

ప్రాణ శక్తికి హృదయమే కేంద్రస్థానము యోగ సాధకులు నీ స్థలము నొక పద్మముండు ననియును, దానికి 12 దళములుండుననియును యీ దళములలో 8 అధోముఖముగా నుండునని చెప్పుదురు. ఇద్దానిని గుర్తించ కుండగ భక్తిని సేయుట వ్యర్థమైన కార్యమని శివానుభవేద్యుల నిశ్చితాభిప్రాయము. శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి :

**అష్టదళ కమలమును జుట్టెడి జీవాత్మది,**
**మెట్టిన దళము నరయ కుండగ**
**యేను భక్తుడ నెట్లందు?**
**యేను శరణుడ నెట్లందు?**
**యేను లింగైక్యుడ నెట్లందు?**
**కూడల సంగమ దేవా !**
**నా మనము సమాధానము కాని దనుక. (బసవేశ్వర గీతామృతము, పు. 333)**

హృదయ స్థానమున షల్లింగములలోని దొకటగు జంగమ లింగ స్థానమని మగ్గియ మాయి దేవుల వారు సూత్రీకరించిరి. వీరి యీ శ్లోకమును గనుడి :

**స్థలంచ చరలింగాఖ్యం సముత్పన్నమనుత్తమమ్ ।**
**తదుపాసక రూపత్వా త్ర్పాణ లింగ స్థలొబభౌ ।। (అనుభవ సూతబె, 3-36)**

ఈ లింగము యొక్క లక్షణము లీ క్రింది విధముగా నుండనని తెలుపబడినది.

**సాభ్యంతరంగ బహిరంగమమూర్త తత్త్వం ।**
**జ్యోతిర్మయం పురుషమక్షరతః పరాఖ్యం ॥**
**స్యాత్మాది శక్తి ఘటితం మనసైవ నిత్యం ।**
**ద్యాతవ్య రూపమితి యచ్చర లింగ మాహుః ॥ (శివానుభవ సూత్రము, 3-31)**

ఈ లింగమును చూడని వాడు వ్యర్థ జీవము గల వాడనియును, మూఢుడనియును తెలుపబడినది. ఇట్టి వాడు భవంతుని గాంచలేడని శ్రీ పిడుపర్తి సోమనాథుల వారు తెలిపిరి. వీరి యభిప్రాయమును గనుడి:

**విలసి తంబులౌ శీల విధములు నుండు**
**వెలుపల నొకటియు వెదుక బోరాదు**

**తనలోని లింగంబు తాగానదేని**
**ననుగాన నోపదెన్నటికి నతండు (ప్రభు లింగ లీల, ప్రాణలింగ గతి, పుట.- 136)**

ఈ లింగమును గని ధన్యులైన వారిలో శ్రీ బసవేశ్వరుల వారును నొకరు వీరి యీ క్రింది వచనమును గనుడి:

**జ్ఞాన జ్యోతి ధ్యానము చే**
**నాళశుద్ధ ద్వారమున పడి**
**అర్చించి చూచితి మా కూడల సంగమ దేవుని. (బాదాల వారి యనువాదము, సం; 813)**

హృదయమున గల చరలింగమున ప్రాణలింగాంగమును విలీనము యొనర్చుటయే ప్రాణలింగి స్థలి యొక్క పరమ లక్ష్యమై యుండవలెనని తెలిసి కొనగలరు. ఈ విషయమును సూచన ప్రాయముగా తెలిపెడి యనుభవ సారములోని యనుభవసూక్తిని గనుడి:

**.....స్వప్రాణలింగ లింగ ప్రాణ మధన**
**విలీనాంతరము ప్రాణలింగి లీల.... (అనుభవ సారము, ప. 238)**

**ఈ క్రింది పద్యమున కొంత వివరణను గాంచగలము.**

**ప్రాణేశునకతన ప్రాణంబు వల్లభి**

**సన్మవో భావంబు సజ్జపట్టు**

**చిత్రగ్రముత్తంగ సింహాసనము హృద**
**యాజ్ఞ మధ్యంబు విహం (ర) భూమి...... (అనుభవ సారము, ప. 228)**

శివం భూయాత్

## ఆశీర్వచనము -1

## ప్రాణలింగార్చన స్థలము

ఇంతకు క్రితము ఉపదేశములో ప్రాణలింగమును గురించి తెలిసికొని యుంటిమి. అహం చిద్రూపః అనెడి బోధయుక్తమైన జ్యోతియే ప్రాణలింగమని తెలుసుకొంటిమి. ఈ ప్రాణలింగము యొక్క అర్చన ఏ విధముగా చేయవలెనో అనెడి విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**అంతర్గతం చిదాకారం లింగం శివమయం పరమ్ ।**
**పూజ్యత్ భావపుష్పైర్యత్ ప్రాణలింగార్చనమ్ హి తత్ ॥** (సి. శి. 12-13)

ఈ ఉపదేశములోని భావమేమనగా హృదయకమలమునందున విరాజమానమైయున్న చిదా కారలింగమును భావమయమైన పుష్పము చేత పూజించవలెను. అట్టి పూజయే ప్రాణలింగార్చన అనిపించుకొనును. ఏ విధముగా ఇష్టలింగార్చనకు వివిధ ఉపచారముల యొక్క అవశ్యకత వుండునో అదే విధముగా ప్రాణలింగార్చనకు భావమయమైన సామాగ్రి యొక్క అవశ్యకత వుండును.

ఒక వ్యక్తికి స్వప్నమునందున ఒక సర్పము వెన్నంటి వచ్చి అతనిని కరచెను. ఆసర్పము యొక్క విషము చేత మూర్ఛితుడై నేలమీద పడెను. ఆ అవస్థలో అతడు ఎంతో ఆందోళన చెంది యుండెను. ఇంతలోనే మెలకువ వచ్చెను. పాము యిత్యాదులు సమీపమున లేనందున అతనికి నిర్భీతి కలుగవలెను. కాని అతనికి భయాందోళనలు తగ్గలేదు. పరుగెత్తుచూ పరుగెత్తుచూ ఒక వైద్యుని కడకేగెను. నన్ను పాము కరచినది. దయజేసి ఔషధమును యివ్వుడి అని వేడెను వైద్యుడు అతని దేహమును పరీక్షించి పాము కరచిననూ విషము యెక్కినట్లుగా కనుపించుట లేదు అని తెలిసి కొనిన వాడై ఆవచ్చిన వానిని నీకు ఆపాము ఎక్కడ కరచినదని యడిగెను. అప్పుడా వ్యక్తి జరిగిన విషయములను ఈ క్రింది విధముగా ఏకరవు పెట్టెను. "ఓ వైద్యశిఖామణీ! నేను పరుండినయప్పుడు. ఒక స్వప్నమును గాంచితిని. ఆస్వప్నమునందున ఒక భయంకరమైన సర్పము కనిపించెను. దానిని గాంచి భయపడి పరుగెత్తి తిని అది నావెనువెంటనే పరుగెత్తుచూ వచ్చెను. నేనంత దూరము పరుగెత్తిననూ అది అంతదూరము వరకూ వచ్చుచండెను. చివరకు అది నన్ను కాటువేసినది."

అప్పుడా వైద్యుడు ఓ మహాశయా! నీకు నీదగ్గరకు వచ్చిన అవస్థ ఎట్టిది? అది స్వప్నావస్థ. నీవు నీదగ్గరకు వచ్చిన అవస్థ ఎట్టిది? ఇది జాగ్రదా వస్థ. స్వప్నావస్థలో జరిగిన సంఘటనకు జాగ్రదవస్థలో పరిష్కారము దొరకదు. అందుచేత నీవు దయచేసి ఈ పాముకాటు దోషమును నివారించుకొనుటకై ఈ దినము రాత్రి మరల కలనుగనుడి. ఆకలలోనే వైద్యునకేగుడి. అట్టి వైద్యుడు మాత్రమే నీకు ఉపచారము చేయగలుగును. నాలాంటి వానికి సాధనముకాదు. అనిచెప్పి పంపించెను.

ఈ కథలో వివరించిన ప్రకారము ప్రాణ లింగార్చన కొరకు పత్రం, పుష్పం, ఫలం, తోయం అనెడి భౌతిక పదార్ధముల అవశ్యకత లేదు. కేవలము భావములోనే మజ్జన, పుష్ప పత్రముల సమర్పణ, మరియు ఫలని వేదన భావత్మకముగనే జరుగవలెను. దీనిని సాధారణ పరిభాషలో మానసిక పూజయని అన వచ్చును. ఇట్టి పూజను కాలనియమములతో పని లేకుండా ఎప్పుడైనను చేయవచ్చునని ఎంతకాలమైనను చేయవచ్చునని శ్రీ భగవత్పాదుల వారు తెలుపుచూ ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

**అంతః పవన సంస్పృష్టే సుసూక్ష్మాం బర శోభితే ।**
**మూర్ధ న్యచంద్రవిగులత్ ధాసేకాతి శీతలే ॥**
**బద్ధేంద్రియ నవద్వారే బోధదీపే హృదాలయే ।**
**పద్మపీఠే సమాసీనం చిల్లంగం శివవిగ్రహమ్ ॥**
**భావయిత్వా సదాకాలం పూజయేత్ భావవస్తుభిః ॥ (సి.శి. 12; 14-15)**

ఈ శ్లోకములో భావమయ వస్తువుల గురించియూ, ప్రాణ లింగపూజ గురించియూ తెలుపబడినది. శివయోగి యనెడివాడు తనశరీరములోని నవద్వారములను బంధించుకొని ధ్యానస్థుడై కూర్చున్నపుడు అతని బ్రహ్మరంధ్రము నందుండెడి చంద్రమండలము నుండి అమృత బిందువుల వర్షము చేత తడుహుడి అతిశీతలమై యున్న హృదయాకాశమున శివజ్ఞాన రూపమైన జ్యోతి ప్రకాశ మానమై కనిపించును. అది శరీరములో నుండెడి ప్రాణ వాయువుచేత వ్యాప్తిని పొందును. ఈ విధముగా అంతరంగమున కన్పట్టెడి ప్రకాశమానమైన వెలుతురున అతని హృదయ స్థమగు ద్వాదశ కమల కర్ణికయందున మంగళ మయమైనదియు, చిద్రూపమైన దియును అగు ప్రాణలింగము విరాజల్లుచూ భావమునందున కన్పట్టును. ఈ ప్రాణలింగమును సాధకుడు భక్తితో అర్చించవలెను. అట్టి అర్చనకు అవశ్యమయ్యెడి పదార్థములెట్టివో శ్రీ భగవత్పాదుల వారు. ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**క్షమాభిషేకసలిలం వివేకో వస్త్రముచ్యతే ।**
**సత్యమాభరణం ప్రోక్తం వైరాగ్యం పుష్పమాలికా ॥**
**గంధః సమాధి సంపత్తి రక్షతా నిరహంకృతిః ।**
**శ్రద్ధా ధూపో మహాజ్ఞానం జగద్భాసి ప్రదీపికా ॥**

**భ్రాంతి మూల ప్రపంచస్య నైవేద్యం తన్నివేదనమ్ ।**
**మౌనం ఘంటాపరిస్పందస్తాంబూలం విషయార్పణమ్ ॥**
**విషయ భ్రాంతిరాహిత్యం తత్ప్రదక్షిణ కల్పనా ।**
**బుద్ధిస్తదాత్మికా సక్తిర్నమస్కార క్రియా మతా ॥**
**ఏవం విధైర్భావ శుద్ధే రుపచారైరదూషితైః ।**
**ప్రత్యఙ్ముఖమనా భూత్వా పూజయేల్లింగమాంతరమ్ ॥ (సి. శి. 12; 16-20)**

ఈ ఉపదేశములోని సారాంశము ప్రాణలింగార్చనను సూచించు చున్నది. అభిషేకమునకై క్షమాగుణమే పరిశుద్ధమైన జలమగు చున్నది. ఇచ్చట క్షమ అనగా ఎంతటి ప్రతికూల పరిస్థితి వచ్చినను సహించుకొని యుండుట ఇంకొంక అర్థములో ఏపనిని చేయటకైనను సామర్థ్యము కలిగిన యెడల దానిని క్షమయని అందరు. ఏదో ఒక సద్గుణము యొక్క ప్రతి విరోధము చేయుచూ పోయిన యెడల ద్వేషము ఉత్పన్నమగును దాని వలన సామాజిక ప్రగతి కుంటుబడును. ద్వేషమునకు ప్రతిద్వేషముతోడై అద్దానిని సాధించు కొనుటకై దైహిక బౌద్ధిక మరియు ఆర్థిక వనరులు వ్యయమగును వీటన్నిటినీ పోగొట్టుకొని నిరాశను ఎదుర్కొను పరిస్థితి కూడా రావచ్చును. అందుచేత ప్రతి వ్యక్తి క్షమాభావమును కలిగివుండవలెను. సామాజిక ప్రగతికి ఇది ఎంతో అవశ్యకమై యున్నది. ప్రాణలింగార్చన చేశెడువానికి ఇది ప్రథమ భావద్రవ్యమని గుర్తించవలెను. ఇట్టి పవిత్రమైన భావజలముతో ప్రాణలింగమును అభిషేకము చేయవలెను. ఇది మహదాచార్యులవారి ఉపదేశము. అభిషేకానంతరము వస్త్ర సమర్పణ ఒక ఉపచారమై యున్నది. ఈ భావాత్మకమైన పూజలో వివేకమే వస్త్రమై నిలచును. ఇచ్చట వివేకమనగా రెండు విధములుగా అర్థము చేసుకొనవలెను. మొదటిది నిత్యానిత్యవివేకము. రెండవది ఆత్మానాత్మ వివేకము. బుద్ధిహీనుడు నిత్యమైన పదార్థమును అనిత్య పదార్థముగను. అనిత్యమైన పదార్థమును నిత్యమైన పదార్థముగను చూచుచున్నాడు. అదే విధముగా ఆత్మను శరీరముగను, శరీరమును ఆత్మగను చూచుచున్నాడు. అదేవిధముగా ఆత్మనుశరీరముగను, శరీరమును ఆత్మగను చూచుచున్నాడు. ఇట్టి లోపభూయిష్టమైన దృక్పథమునకు స్వస్తి పలికెడివాడే వివేకవంతుడు. వివేకవంతుడైనవాడు నిత్యమైనదేది? అనిత్యమైనదేది? సత్యమైనదేది? అసత్యమైనదేది? మొదలగునవి గుర్తించగలడు. అనిత్యమైన వస్తువుల యెడల అనురాగమును పెంచుకొనడు. ఆత్మపరమాత్మలే నిత్యమైనవని యెంచి వాటి యెడల జ్ఞానమును పెంపొందించు కొనును ఆత్మజ్ఞానములేని వాడు అంతరంగశుద్ధిని బడయలేడు అంతరంగశుద్ధిలేని వానికి ప్రాణలింగార్చన చేయుట కూడనిపని ఇట్టి విశిష్టమైన వివేకమునే ప్రాణలింగస్థలమునందలి భక్తుడు ప్రాణలింగమునకు సమర్పించుచున్నాడు. దీనితో అంతర్లీనమైయున్న భావమేమనగా ప్రాణ లింగస్థలమునందలి భక్తుడు శివజ్ఞాన సంపన్నుడై ప్రాణలింగార్చనను చేయును.

జ్ఞాన శూన్యుడు శివార్చన చేశిన యెడల ఆ అర్చననూ ఒక కర్మగా పరిగణించును. కాని జ్ఞానసంపన్నుడు దానిని పరమాత్మ జ్ఞానమును, ఆత్మ జ్ఞానమును పెంచుకొనుటకు సాధనముగా యెంచును.

సాధారణముగా లింగపూజలో లింగమునకు బంగారు తొడుగులు, రత్న హారములు మొదలుగునవి ఆభరణములుగా నుపయోగించెడి సాంప్రదాయము కొనసాగుచు వచ్చునున్నది. మందిరములలోని స్థావర లింగములకు నిట్టి అలంకారములను చేయుదురు. నాగాభరణాలంకారము చేసెడి సాంప్రదాయము కూడా కలదు. ఇష్టలింగార్చనలో ఇష్టలింగమునకు రుద్రాక్షమాలను స్ఫటిక మాలను వేసి అలంకరించెడి సాంప్రదాయము కూడా కలదు. ప్రాణలింగార్చనకైతే భౌతిక పరమైన ఆభరణముల యొక్క అవశ్యకత లేదు. ఆచార్యులవారి ప్రకారము సత్యమునే మనము ఆభూషణముగా సమర్పించవలెను. సత్యం వద అనెడిది వేదము యొక్క ఆదేశము శ్రీ గురువు దీక్షాప్రదానము చేసెడి సందర్భములో శిష్యునకు సత్యం వద అని ఆదేశము నిచ్చును. సత్యవాక్పరి పాలన చేయుమని శాస్త్రములు చెప్పుచున్నవి.సత్యవాక్పాలన చేసిన హరిశ్చంద్రుడు చిరంజీవియైనాడు. కాని సాధారణ మానవునికి సత్యవాక్పరి పాలన సుసంగతమైన విషయముగా లేదు. కారణము లెన్నియోగలవు. మనుష్యుడు స్వభావ సిద్ధముగా సత్యవాదియే పరిస్థితుల ప్రభావమువలన అసత్య సంభాషణను అప్పుడప్పుడు చేయును. ఇది క్రమ క్రమముగా అలవాటుగా మారిపోయి నిత్య అసత్య సంభాషిగా మారిపోవును. ఈ విధముగా పరిణామమునొందినవారు అంతరంగములోని స్వాభావికమైన చిరతర సౌందర్యమును పోగొట్టుకొనెదరు. ఈ కారణము వలన సత్యవాక్పరిపాలనా నిష్ఠ ఒక సుందరమైన ఆభరణము. ప్రాణలింగమునకు అర్పించుటకు దీనికి మించిన ఉత్తమాభరణము

వుండదు. ధర్మములన్నింటికినీ సత్యమే మూలము. సత్యవాక్పరిపాలనకంటె తపశ్చర్య ఉత్తమమైనది కానే కాదు. అన్నిలోకములలో సత్యమే విజయశాలియై యున్నది. మానవుని సర్వతోముఖమైన అభివృద్ధికి సత్యమే శరణ్యము. ఒకవేళ అసత్యమాడుటకు అలవాటు పడిన యెడల క్రమక్రమముగా ఆ అలవాటును తగ్గించుకొని సత్యవాది కావలెను. ఈ విషయమును ఎఱుకపరచెడి ఒక చక్కని కథ కలదు.

కౌరవ పాండవులు గురుకులము నందున అభ్యాసము చేయుచుండిరి. శ్రీ గురువులైన ద్రోణాచార్యులవారు. సత్యంవద అనెడి వాక్యమును ఉపదేశించి దానిని అభ్యాసము చేసికొని రండి అని అందరికి ఆదేశము నిచ్చెను. మరు దినమునందున అందరూ ఆశబ్దమును గురువుగారికి వినిపించి దానిని మేము కంఠస్తము చేసితిమని చెప్పిరి అయితే యుధిష్ఠిరుడు మాత్రము మౌనముగా కూర్చుండి యుండెను. అప్పుడా గురువుగారు ఒయీ యుదిష్ఠిరా! నీకు ఈ రెండు శబ్దముల యుక్తి అభ్యాసము కాలేదా? ఎందుకు మౌనము వహించితివి అని విచారించెను. అప్పుడు యుధిష్ఠిరుడు ఓ గురుదేవా! అభ్యాసము చేయుచున్నను. ఇంకా నా అభ్యాసము కొనసాగుచున్నది. అది పూర్తియైన పిదప తమరికి నివేదించెదను. అని వుత్తరము నిచ్చెను. ఈ విధముగా అనేక దినములు గడచిపోయెను. ఈ విషయమును అందరూ మరచిపోయిరి. అయిననూ యుధిష్ఠిరుడు ఈ విషయమున సాధన చేయుచునే యుండును. ఒక శుభ దినమున గురువుకడకేగి స్వామీ! నా అభ్యాసము పూర్ణమైనది అని చెప్పెను. అప్పుడు శ్రీ ద్రోణాచుర్యుల వారు సత్యంవద అనునది అభ్యాసము చేయుటకు ఇన్ని రోజులు పట్టినదా? అని అడిగెను. అప్పుడా యుధిష్ఠురుడు ఓ గురుస్వామీ! నేను మొదట అసత్యములనే మాట్లాడు చుంటిని తమరు సత్యంవద అని ఉపదేశించి సత్యమునే మాట్లడుము అని నిర్దేశించిన పిదప అసత్యము యొక్క పరిమాణమును దినమునకు ఒక్కింత తగ్గించు కొనుచూ తగ్గించుకొనుచూ యిప్పుడు అసత్య సంభాషణా ప్రవృత్తిని త్యజించితిని. నేను సత్యభాషినైతిని అని బదులు పలికెను.

ఈ కథలోని సారాంశమేమనగా అసత్య సంభాషణలకు అలవాటు పడినవాడు అకస్మాత్మగా సత్యసంభాషి కాజాలడు. క్రమక్రమముగా దురలవాటును మానుకొన వలెను. ఈ విధముగా సత్యవాక్పరిపాలనను అలవర్చుకొనిన వాడు సముజ్వలమైన భవిష్యత్తును సంపాదించుకొనును అసత్యవాది అనంతమైన ద్రవ్యమును వెచ్చించి అపూరూపమైన ఆభరణములను చేయించుకొని ఎంత అలంకరించు కొనిననూ వాని అంతరంగము వక్రగతిననే యుండును. బహిరంగములోని సౌందర్యము అంతరంగములోని కురూపమును మార్చజాలదు. అట్టి అసత్యవాది నిరంతరము అశాంతికి గురియై చివరకు అశాంతిలోనే మరణించు చున్నాడు ఈ కారణము వలననే వ్యక్తుల యొక్క జీవనమును రక్షించుటకై శ్రీ గురువు సత్య సంభాషణను ప్రాణలింగమునకు సమర్పించుమని బోధించిరి.

సువర్ణాభరణముల కంటెను సుగుణాభరణయే ఉత్తమమైనదని సుభాషితకారులు తెలియ జెప్పుచున్నారు. "గుణాః పూజస్థానం గుణిశు నచ లింగం వయః" అనెడిది పెద్దల ఆదేశము. స్త్రీపురుషుల యొక్క వివక్షతో కొందరు స్త్రీ అధిక సౌందర్యవతి అని అంటే మరి కొందరు పురుషుడే సౌందర్యవంతుడు అని అందురు. ఈ విషయమున వైష్ణవులు శ్రీ కృష్ణుని లీలలను వర్ణించుచూ అతని సౌందర్యమునకు మోహితులై అనేక మంది సౌందర్యవంతులు అతనిని చేరి ధన్యత బడసిరని చెప్పుదురు. అయితే యిక్కడ గ్రహించవలసిన విషయమేమనగా సద్గుణ వతి లేదా సద్గుణవంతుడే ఉత్తముడు దేహపరమైన సౌందర్యము లేదా ఆ సౌందర్యమును శోభాయమానము చేశెడి సువర్ణాభరణములు గణనీయము వైనవికావు. సద్గుణములన్నింటిలో సత్యవాక్పరిపాలన యే ఉత్తమోత్తమ మైనదని ఎరుగనివారెవరు?

వైరాగ్యమే సకల సుఖములకు మూలమనెడి ఒక యభిప్రాయము కలదు. లౌకిక మరియు పారలౌలికములగు క్షణిక సుఖముల యందు ఆసక్తుడైన వాడు అనంతమైన దుఃఖమునే అనుభవించుచున్నాడు. ప్రారంభమున విషయోపభోగములు సుఖదాయకములనిపించిననూ క్రమేపి అవి దుఃఖములుగనే పరిణమించు చున్నవి. జీవనము యొక్క ప్రాథమిక దశలో సుఖములను అనుభించిన వారెందరో అంత్యమున దుఃఖమునే అనుభవించిరి గదా సుఖ సంతోషముల అభిలాష కలిగిన వాడు బహిర్ముఖుడై యుండుచున్నాడు. వీటి యెడల అనాసక్తి కల్గిన వాడే అంతర్ముఖి కాగలడు. వైరాగ్యభావన పెంపొందించు కొననిదే అంతర్ముఖ ప్రవృత్తి యేర్పడదు. అంతర్ముఖ ప్రవృత్తికి ప్రాణలింగార్చనకు అవినాభావ సంబంధము కలదు. ఈ విషయమును గ్రహించి సత్పురుషులు వైరాగ్య భావనను పెంపొందించుకొనిరి. ఇట్టి భావననే ప్రాణ లింగమునకు పుష్పమాలగా సమర్పించవలెనని శ్రీ భగవత్పాదులు ఆదేశము నిచ్చిరి. ఇచట గమనించ వలసిన విషయమేమనగా వైరాగ్యమునకు పుష్పమాల యనెడి ఉపమానమును ఎందుకొరకు ఉపయోగించిరి అనెడిదే విచారణీయము పుష్పమాలిక తన పరిసరముల యందుగల అన్ని ప్రదేశములను సుగంధ భరితము చేయును. దుర్గంధమేమైన

యుండిన యెడల అది పారద్రోలబడును. వైరాగ్యమునకు కూడా అట్టి గుణమే గలదని భావించ వలెను. విషయాసక్తి అనెడిది దుర్గంథము – భోగములనను భవించవలెనను కోరిక సగటు మనిషి మనస్సున నిండియుండును. యోగులకైనను స్వర్గలోకములో రంభాదులతో వైభోగము ననుభవించ వలెననెడి కోరిక యుండెడి అవకాశము కలదు. ఈ విషయమున విశ్వామిత్ర మహర్షిని ఉదాహరణాగా తీసుకొనవచ్చును. అతనిలో అట్టి విషయవాసనలు లేని యెడల మేనకను విషయోప భోగమునకు అనువైనదని యెంచగలుగునే? ఈ కారణము వలన ప్రాణలింగార్చన చేశెడి సాధకునికి పరిపూర్ణమైన వైరాగ్యభావన వుండవలెను. అందుచేతనే శ్రీ జగద్గురువుల వారు వైరాగ్యమనెడి పుష్పమాలను ప్రాణలింగమునకు సమర్పించవలెనని ఆదేశము నిచ్చిరి. వైరాగ్యములో నుండెడి. సుగంథము విషయాసక్తిచే బయల్పడెడి దుర్గంథమును దూరము చేయునని గుర్తించవలెను. విషయాసక్తి గలవారికి అది సుగంథముగానే దోచును. అట్టివారికి విషయాసక్తిలోని దుర్గంధమ అవగతము కాదని తెలియ జెప్పడి కథ ఒకటి కలదు.

ఒకపరి ఒక ఆగర్భ శ్రీ మంతుడు శివయోగ సిద్ధులైన శివాచార్యులొకరి భోజనమునకై ఆహ్వానించెను. గురువుగారు తన యింటికి దయచేయుచున్నారనియును, ఆ సందర్భమున యింటిని శుభ్రముగా వుంచుకొనవలయునని యునూ యెంచి గోడలకు సున్నమునూ, ద్వార బంధములకు వర్ణములను వేయించి యింటిని చక్కగా తీర్చిదిద్దెను. సుగంధద్రవ్యములలో ప్రోక్షించి గృహాంత ర్భాగమును పరిమళ భరితముగా చేసెను. ఇంటికి వచ్చిన వారందరునూ అతనిని మెచ్చికొనిరి. ఇంటి యజమాని తనగృహమును పరిశుద్ధము చేయుటకు కృషిచేసుటేగాని తన అంతరంగములోని విషయ వాసనలనెడిదుర్గంధమును దూరము చేశికొన లేక పోయెను. ఆ మంత్రణ మేరకు విచ్చేసిన గురువుగారు క్షణ కాలము వరకు విశ్రమించి ఇంటిలోని వాతావరణమును పరికించి నిశితముగా వీక్షించి వెంటనే ఒక వస్త్రమును గైకొని ముక్కును మూసికొని కూర్చుండెను. ఈ విషయమును గనిన ఇంటి యాజమాని సంభ్రమాశ్చర్యములకు గురియయ్యెను. అప్పుడతడు తన మదిలోని సంశయమును దూరము చేసికొనుటకై శ్రీ గురవు కడకేగి ప్రణమిల్లి పైకిలేచి ముకుళిత హస్తుడై వినమ్రాభావముతో ఈ విధముగా అభ్యర్థించెను ఓ గురుదేవా! ఇంత స్వచ్ఛమైన మరియు సుంగధభరితమైన యింటి యందు తమరికి దుర్గంధము యెక్కడ నుండి వచ్చుచున్నది? దయచేసి తెలియజేయుడి. అప్పుడా గురువు ఆ దుర్గంధమనెడిది నీ మనస్సులో నుండి వచ్చుచున్నది. కారణమేమనగా నీ మనస్సులో దుర్గంధమే నిండి కొనియున్నది. అని చెప్పెను. శ్రీ మంతునికి శ్రీ కంఠప్రతిరూపమైన శివాచార్యుల వారి మాట అర్థముకాలేదు. అప్పుడతడు ఓ గురుదేవా! నాకు ఎట్టి వాసనయు రావడము లేదు కదా! అని ప్రశ్నించెను. అప్పుడా శ్రీ గురువు అనుభవపూర్వకముగా విషయమును తెలియజేయవెననిన తలంపు కలిగిన వాడై శిష్యుని వెంటనిడుకొని ఊరివెలుపల నున్న తోళ్ళువారి కేరికి తీసుకొని వెళ్ళెను. అచటగల గృహములన్నియును చర్మ కారుల గృహములే. ఆ వీధి యంతయు దుర్గంధపూరితమై యుండెను. అద్దానికి గల కారణమేమనగా అచ్చట అనేక ప్రాణుల పచ్చితోళ్ళు వ్రేలాడబడియుండెను. అవి ఉపయుక్తముగా చేసి కొనుటకై యెండబెట్టబడియుండెను. ఆ దుర్గంధమును భరించెడి శక్తి శ్రీ మంతునికి లేకుండెను. అతడు ముక్కును గట్టిగా మూసికొని శ్రీ గురువునుద్దేశించి ఏదో పలుకుటకు ఉద్యుక్తుడయ్యెను. అతని ముఖకవళికలను గమనించిన శ్రీ గురువు అతని నుద్దేశించి ఏమయ్యా! నీవెందులకు ముక్కును మూసికొంటివి? అని యడిగెను అప్పుడా శ్రీ మంతుడు ఓ గురుదేవా! మనమిక్కడి లెందుకు వచ్చితిమి? ఏమిటీ దుర్వాసన? మీ వంటి మహనీయులు యిచ్చటకు రావచ్చునే? నాకీ వాసన భరించలేనిదై యున్నది. దీనిని నేను సహించలేకనే ముక్కును మూసుకొంటిని అని బదులు పలికెను. అప్పుడా గురువుగారు ఓ భాగ్యవంతుడా! అదుగో అటుచూడు ఈ యింటిలో నిరంతరము నివాసము చేయుచున్న వారెవరునూ ముక్కును మూసికొనలేదే? వారికీ వాసన రావడములేదా? యని యడిగెను. అయ్యో! గురుదేవా! ఏమిటీ ప్రశ్న వీరందరూ దుర్వాసనలో వుండి దాని కలవాటు పడిరి. వారికి దుర్గంధము యొక్క అరయిక వుండదు. శ్రీ మంతుని మాటను వినిన వెంటనే సదా దుర్వాసన యందు యుండెడి వారికి దుర్వాసనదోచదు. నీవును అట్టి వాడివే నీవు యెల్లప్పుడు విషయవాసనలో కూరుకుని యుండుట చేత నీకు ఆ విషయవాసనల దుర్గంధము యొక్క అరయిక లభించుట లేదు. అని తెలియ జేసెను. విషయవాసనల విషయమును వివరించి చెప్పెను. శబ్ద స్పర్శాది విషయములు సాధకుని అంతఃకరణమున ఆసక్తి కరమైన వాసనను నెలకొల్పును. అతనిని సంసారమువైపు నెట్టును. సంసారము నుండి విముఖుడు కానివానికి ప్రాణలింగార్చన సాధ్యముకాదు. ఈ విషయమును తెలియపరచుటకె శ్రీ భగవత్పాదుల వారు వైరాగ్యమును పుష్పమాలికతో పోల్చిచెప్పిరి.

“గంధః సమాధి సంపత్తిః” అని శ్రీ భగవత్పాదులు బోధించిన దానిలోని అంతరార్థమును గ్రహించవలసి యుండును. లింగార్చనలో చందనము యొక్క ఉపయోగము విస్తృతముగా నున్నది. గంధము నూరి దానిని లింగమునకు సమర్పించుట యనెడిది అందరెరిగిన

విషయమే ఇట్టి గంధమును పోలిన భావనను శ్రీ భగవత్పాదుల వారు సమాధితో పోల్చిరి. మనస్సులోని ప్రపంచ విషయకమైన వృత్తులను దూరము చేసికొని నిరంతరము ప్రాణలింగార్చనలో మునిగెడు వాడికి మనస్సును సమాహితము చేసుకొనవలసి అవసరముండును. అద్దానినే సమాధియని అందరు మనస్సును చలించనివ్వ కుండా ఏకాగ్రత సాధించుటయే సమాధి యని గ్రహించవలెను. ప్రాణలింగార్చకుడు నిరంతరము మనస్సు యొక్క వృత్తిని పర్యవేక్షణ చేసుకొని దానిని సక్రమమైన మార్గములో నుంచు కొనవలెను. ఉపచారములలో గంధానంతరము వచ్చెడిది అక్షతోపచారము శ్రీ భగవత్పాదులవారు నిరహంకారమునే అక్షతలుగా సమర్పించమని ఆదేశము నిచ్చిరి. లౌకిక లేదా లౌకికేతరమైన విషయములను బడసిన పిదప కార్యసాధకునకు అహంకారమనెడిది వచ్చుట సహజమే. అహంకారము చేత మనుజుడు తాను సాధించిన ఉన్నతమైన స్థితి నుండి పతితుడు యగునేమోనన్న భయము కలుగక తప్పదు. అందుచేత ఆధ్యాత్మిక సాధకునికి అహంకారమనెడిది హితకారి కాదు. ఇతరుల కెవ్వరికినీ సాధ్యముకాని నిష్ఠతో ప్రాణలింగమునకు చేరితిననెడి భావన సాధకునికి వచ్చిన యెడల అతని సాధనకు భగ్నములేర్పడి అతడు చ్యుతిని పొందుచున్నాడు. ఈ విషయము తెలియ జేప్పుటకే శ్రీ భగవత్పాదులవారు నిరహంకారమును అక్షతలుగా సమర్పించవలెనని ఆదేశించిరి మరొక మాటలో చెప్పావలెనన్ని ప్రాణలింగ స్థలములోని భక్తుడు అహంకారాభిమానములను దూరము చేశికొని ప్రాణలింగార్చన చేపట్టవలెను. ఇట్టి నిరహంకార స్థితిని సాధించుట యెటుల? కార్యసాధకునకు కించత్ అహంకారము సమకూడుట సహజమే కదా? కాని శివాను గ్రహము లేనిది కార్యసాధన చేకూరదని తెలిసికొనుట జరుగుట లేదు. కార్యసాధకుడు తనకృషి వలననే ఈ కార్యము సిద్ధించినదని భావించును. ఇది వాస్తవము కాదు. శివుని కరుణలేనిది ఎట్టి కార్యమైనను సాధింపబడదు శివాజ్ఞలేనిది చీమైన కుట్టదనెడిది లోకోక్తి ఈ లోకోక్తిలోని అంతరార్థమును సాధకుడు గ్రహించవలెను. తనకార్య సాధనకు తాను నిమిత్తమాత్రుడననియును, కార్యమును చేశెడివాడునూ శివుడే యనియును, చేయుంచు కొనెడివాడునూ శివుడే ననియునూ భావించిన యెడల సాధకుని దరికి అహంకారము రాజాలదు. ఈ భావమును గుర్తెరిగియే శ్రీ గురువు నిరహంకారమును అక్షతలుగా సమర్పించమని చెప్పెను. ధూపమును గురించి వివరించుచూ శ్రీ జగద్గురువుల వారు శ్రద్ధనే ధూపముగాను, మహాజ్ఞానమునే దీపముగాను ప్రాణలింగమునకు సమర్పించ వలెనని ఉద్బోధించిరి. లౌకిక మరియు పారలౌకిక వ్యవహారములకు శ్రద్ధయే మూలకారణమై యున్నది. ఏపనిని చేశినప్పటికి దానిని శ్రద్ధాపూర్వకముగా చేశిన యెడల ఫలవంతము కాగలదు. ధూపసమర్పణ వలన పరిసరములు పరిశుద్ధమగునని తలంప బడుచున్నది. శ్రద్ధయనెడి ధూపము ద్వారా అంతరంగములోని వాతావరణము పరిశుద్ధమగునని గ్రహించవలెను. బహిర్గతమైప ప్రదేశమును రాత్రి వేళలో ప్రకాశమానముగా చేయుటకై దీపము యొక్క ఆవశ్యకత కలదు. అంతరంగములో నుండెడి చీకటిని పారద్రోలుటకు సాధనమెట్టిది? అనెడిది తెలుసుకొనుటకు ఆచీకటి యెందువలన వచ్చినదో తెలిసికొనవలసి యుండును. అజ్ఞానమే అంధకారమై అజ్ఞులమనస్సులను ఆవరించుకొని యుండునని విజ్ఞులు విశదపరచిరి. అట్టి ఆజ్ఞానాంధకారమును దూరము చేయునది. సుజ్ఞానమే కదా! సుజ్ఞానములకెల్లను అమితమైన శ్రేష్ఠత కల్గినది. శివజ్ఞానము అందుచేత నియ్యది మహాజ్ఞానముగా పిలువబడుచున్నది. లింగార్చన సమయములో దీప దర్శనము ఒక విహిత చర్యగా నున్నది. ఈ చర్యను భావపూర్వకముగా మహాజ్ఞానము ద్వారా చేపట్టవలెనని శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశము నిచ్చిరి ఇక నైవేద్యము గురించి తెలియజేయుచూ శ్రీ భగవత్పాదులవారు ప్రపంచమునే నైవేద్యముగా సమర్పించమని ఉపదేశించిరి. ఈ ప్రపంచమంతయును శివుని చేత నిర్మించబడినదే కదా! అది ఈశ్వరునిదే యగును. అయిననూ వ్యక్తులు భూమ్యాదులను గైకొని ఇవి నావి యనెడి భావమును దాల్చి నిరంతరము మోహమమకారములలో మునిగి తేలుచుందురు. ఇది భ్రాంతి వలన కలిగెడి భావన భ్రాంతి దూరమైన యెడల అవగాహన పెరుగును. ఈ భ్రాంతిని వీడి ప్రపంచములోని ప్రతి వస్తువు నాది కాదనెడి భావముతో అద్దానిని శివునికి నైవేద్యముగా సమర్పించిన యెడల అహంకార మమకారములు దూరమగును. ఈ ప్రపంచము నాది యనెడి భావముకూడా పోవును. ఈ విధముగా సాధకుని తీర్చిదిద్దుటకై నివేదనాభావము రూపొందించబడినది. ఈ విధముగా సాధన చేయుచు అభ్యాసము చేసిన యెడల సాధకుడు పరిపూర్ణతను సాధించ గలడు. వీరశైవ భక్తులెల్లరు ప్రాణలింగి స్థలరహస్యములలో ముఖ్యమైనదగు ప్రాణలింగార్చనను గురించి గుర్తెరిగి తమసాధనను సుసంపన్నము చేసుకొనెదురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

దిు 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

# విశేషప్రదీపిక

శ్రీ కాశీ జ్ఞానసింహాస నాధీశ్వరుల వారు ప్రాణలింగార్చనలో నుపయోగింప బడెడి వస్తువుల గురించియును, ఆయా వస్తువుల సమర్పణ వెనుక యిమిడియున్న తత్త్వమును గురించి వివరముగా తెలియజేసిరి.

ప్రాణలింగ స్థలమున కెదిగిన సాధకుడు అనుభవ భక్తి చేత పురోభివృద్ధిని సాధించును. ఇచ్చటకు విచ్చేసిన సాధకుడు అవధాన భక్తి చేత ప్రసాది స్థలమున సాధనను సుసంపన్నము చేసికొనిన వాడనెడిది జ్ఞప్తికి తెచ్చికొన వలసిన విషయము అయితే అనుభవభక్తి యవధాన భక్తి కంటెను భిన్నమైనదని గుర్తించ గలరు. అవధాన భక్తి క్రియా ప్రాధాన్యత గల్గినది కాగా ననుభవ భక్తి జ్ఞాన పథమునకు ప్రాముఖ్యత నిచ్చును. శివ యోగ సాధన ద్వార యనుభవమును గడించుటకు కృషి చేసెడి దశలో సాధకుడుండును. శివయోగ సాధనలోని యంతర్భాగమే ప్రాణలింగార్చన మనెడిది గ్రాహ్యమైన విషయము.

ప్రాణలింగము త్రిలింగములలో నొకటి. ఇష్ట, భావలింగములు లింగ త్రయములోని మిగిలిన లింగములు భక్త మహేశ స్థలములలో స్వేష్టలింగార్చనకు ప్రాముఖ్యత యివ్వబడగా నీ స్థలమునకు సాధకుడు నిష్ఠ లింగార్చనకు తక్కువ ప్రాముఖ్యత నిచ్చి ప్రాణలింగార్చన కధికమైన ప్రాముఖ్యత నివ్వవలసి యుండును.

ప్రాణ లింగము భావాత్మకమైన దని శ్రీ భగవత్-పాదుల వారి యుపదేశము (12; 14-15) వలన తెలియు చున్నది. భావమనెడిది మనోవృత్తికి సంబంధించిన విషయము భావపుష్టి గల్గినట్టి శివజ్ఞానులకును, శివయోగానుష్ఠాన నిరతులకు మాత్రవే ప్రాణలింగము స్ఫురించుననియును, అజ్ఞులకియ్యది యగోచరమనియును తెలుప బడినది. (సి. శి. 12; 8)

భావత్మకమైన లింగమునకు భావాత్మకమైన వస్తువులు సమర్పించుటలోనే యౌచిత్యము గలడనెడిది శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాముల వారు సోదాహరణ పూర్వకముగా నిరూపించిరి.

భావ వస్తువుల విషయములో వైవిధ్యత గోచరించు చున్నది. శివ మహాపురాణములో నివ్వబడిన మానసిక పూజ, శంకరాచార్య విరచిత శివ మానస పూజ, శ్రీ పాల్కురికి సోమనాథుల వారు విరచించిన ప్రాణలింగ పూజా విధి వంటివి పరిశీలించినచో యీ విషయము సుబోధకము కాగలదు. శ్రీ జగద్గురు రేణుకాచార్యుల వారు సూచించిన భావద్రవ్యములకును, యితరులు సూచించిన వాటినికి విస్పష్టమైన భేదము గోచరించు చున్నది. అయితే, శిపురాణము, శంకారాచార్య విరచిత స్తుతి వంటి వాటితో భక్తి తత్త్వమునకు ప్రాధాన్యత నివ్వబడినది. షట్ స్థల జ్ఞాన నేపద్యమున వ్రాయబడిన సోమనాథుని కృతి (పండితారాధ్య చరిత, పు. 161-193) శ్రీ రేణుకాచార్యుల వారి భావనా చక్రమునకు సన్నిహితముగా నున్నది. గమనించుడి.

**జను సదానంద జనితా శ్రీ సమితి**
**దన హృదీశునకు మజ్జన వారిగాగ**
**దనరు చిత్తా గ్రంబు దడియోత్తుగాగ**
**ఘన సత్క్రియా రతి గంధంబు గాగ**
**బోనరు ముత్పులు కలు పుష్పముల్ గాగ**
**వినుత తత్త్వ విభూతి భూతిగాగ**
**సతత నిజాత్మ వాసన ధూపముగను**
**నఅశయ జ్ఞానాంశు లారతుల్ గాగ**
**భరితని వేదిత ప్రాణ పథంబు**
**హరున కర్పించు పదార్థముల్ గాగ**
**శమితేంద్రియానురాగము విడియముగ**
**నమిత లాజ్మణులు పుష్పాంజలుల్ గాగ**
**భావింప మరయు మహావసరంబు**
**నీ విధంబు జెల్లె............ (పండితారాధ్య చరిత్ర)**

ప్రాణలింగార్చన కై యుపయోగించ వలసిన భావ వస్తువులన్నియును సాధకునిని సద్గుణ సంపన్నునిగా చేసెడివై యున్నవి. క్షమ, వివేకము, సత్యవాక్పరి పాలనము, వైరాగ్యము, సమాధి సంపత్తి, అహంకార రాహిత్యము, శ్రద్ధ, జ్ఞానము, సంసార భ్రాంతి వంటివి సాధకుడలవరచి

కొని సాధన చేయవలెననెడిది పరోక్షముగా చెప్పబడినదని గ్రహించగలరు. ఈ గుణ గణములు లేనివాడు శివాను భవ ప్రాప్తిని పొందలేడని గ్రహించ వలెను. ఆచార నిరతి, సదాచార సంపత్తి, శీలసంపాధన మొదలగు సుదాత్తమైన భావములలో నిచ్చట తెలుప బడిన గుణముల ప్రసక్తి వచ్చును. విషయ సారము నెరిగిన విజ్ఞులు శ్రీ జగద్గురు రేణుకాచార్యుల వారి యుపదేశము వలన ప్రభావితులై తమ తమ జీవన గమనమును మార్చుకొని ధన్యులు గావలయును.

శివం భూయాత్

# ఆశీర్వచనము - 2

## ప్రాణలింగార్చన స్థలము

ఇంతకు క్రితము శ్రీ జగద్గురువుల వారు నైవేద్యాది ఉపచారముల గురించి తెలిపి యుండిరి. ప్రాణలింగార్చన గురించిన మరికొన్ని విషయములను శ్రీ జగద్గురువుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**మౌనం ఘంటాపరిస్పంద స్తాంబూలం విషయార్పణమ్**
**విషయభ్రాంతిరాహిత్యం తత్ప్ర దక్షిణ కల్పనా ।**
**బుద్ధి స్తదాత్మకా సక్తిర్న మస్కారక్రియామతా ॥ (సి. శి. 12; 18-19)**

ప్రాణలింగార్చన యందు మౌనమే ఘంటానాధమని గ్రహించవలెను. బాహ్యలింగపూజల యందున ఘంటానాదము చేశెడి సందర్భములో ఈ క్రింది మంత్రమును పఠింతుము.

**ఆగమార్థం తు దేవానాం గమనార్థం తు రక్షసామ్ ।**
**కుర్వే ఘంటారవం భక్త్యా సర్వో పద్రవనాశనమ్ ॥**

ఈ మంత్రములోని భావమేమనగా అసుసుశక్తులు నాశనమై దైవీశక్తులు వచ్చి సాధకుని యొక్క సర్వోపద్రవములను నాశనము చేయుగాక ! అందుచేత పూజయందు ఘంట, జాగటి మరియు శంఖము మొదలగు మంగళధ్వనులను చేశెడి పరిపాటి కలదు. మన పరిసరములందుగల విఘ్నకారియగు అసురీశక్తులు ఈ ఘంటానాదమును విని దూరము పోవలెననెడిది ఘంటానాదములోని అంతరార్థము శ్రీ జగద్గురువుల వారు ప్రాణలింగార్చనలో మౌనమును ఘంటానాదముగా సమర్పించవలెనని కోరుటలోగల అంతరార్థమును తెలుసుకొన వలసి యున్నది. మౌనమనగా మనస్సులోని యిచ్ఛలన్నింటికినీ ఉపశమనము అని గ్రహించవలెను. మనయందున ఏదో ఒక ఇచ్ఛ వున్నపుడు మనము మనవాక్కు ద్వారా బహిర్గతము చేయుదుము వాక్కు మనస్సులోనున్న అభీష్టమును తెలియజెప్పెడి సాధనము. అట్టియెడ మూగవాడు తన మనోభీష్టమును ఏ విధముగా తెలియ జేయును? అనెడి ప్రశ్న కలుగవచ్చును. సంజ్ఞల వలన గానీ లేదా వ్రాత పుర్వకముగా గానీ మూగవాడు తన అభీష్టమును తెలియజెప్పి తన యొక్క భావ ప్రకటనను సాధించుచున్నాడు. మౌనముగా నుండియే ఈ పనులను చేయగలుగు చున్నాడు. ఈ దృష్టాంతము దృష్ట్యా సాధకుడు కూడా మౌనముగా వుండుచూ కార్యమును సాధించగలడు. సకల విఘ్నములను దూరము చేసికొనుటకు ఈ మౌనము సాధనముగా నుండగలదు. మౌనము రెండు విధములుగా నుండును. మొదటిది ఆకారమౌనము, రెండవది కాష్ఠమౌనము ఇంతకు ముందు యిచ్చిన ఉదాహరణలోని మూగ వానివలె మౌనము పాటించుతూ తనకు కావలసిన అభీష్టములను అభివ్యక్తము చేసెడి మునిని ఆకారమౌని యని యందురు. ఇందులో భౌతికముగా మౌనముండిననూ మనస్సు క్రియా శీలకముగనే నున్నది. మనోవృత్తి నిరోధింపబడుటలేదు. వ్యక్తి యొక్క మనస్సులో కోరికలు జనించుటయు వాటిని తీర్చుకొనుటయు జరుగుచున్నది. వాస్తవముగా చూచినచో ఇది మౌనము కాదు. నిజమైన మౌనము కాష్ఠ మౌనమే కట్టెవలె కదలక మెదలక కూర్చుండి కాయముతో పాటుగా మనస్సును కూడా స్తంభింపజేసి మనోవృత్తిని బంధించి నిలుకడగా వుండుటయే కాష్ఠ మౌనము మౌన వ్రతమును పాటించెడు వారు ఆకారమౌనమునే పాటించుచున్నారు. దీని భావమేమనగా నాలుకకు విశ్రాంతి లభించుచున్నది. శరీరములోని మిగిలిన అంగములన్నియును యథావిధిగా బహిరంగ మనోవృత్తిని గలిగి యున్నవి. ఇట్టివాడు విషయ వాసనలకు దూరము కాగల్గునే? కాజాలడు. ఈ కారణము వలన శ్రీ జగద్గురువులవారు ప్రాణలింగి స్థలములోని భక్తుడు కాష్ఠమౌనమును పాటించి అంతర్ముఖియగుటకే ప్రయత్నించవలెనని ఉద్దేశించి మౌనమునే ఘంటానాదముగా సమర్పించమని ఉపదేశించిరి.

శ్రీ మరితోంటదార్యుల వారు మౌనము యొక్క ప్రయోజనమును వివరించుచు "అనాహతనాదాను సంధాన హేతుత్వాత్" అని తెలియజేశిరి. నాదము రెండు విధములుగా నుండును. అవి ఆహతనాదము మరియు అనాహతనాదము. రెండు వస్తువుల సంఘటన చేత బయల్వెడలెడిది ఆహతనాదము ఘంట, జేగంట, భేరి, మృదంగము, వీణ మొదలగు వాటిచే వెడలెడి నాదము ఆహతనాదమగును. సాధకుడు సకలేంద్రియములను నిరోధించి మనోవృత్తిని అంతర్ముఖము చేసుకొని మౌనముగా కూర్చొని యున్నపుడు అతనికి తన అంతరంగమునందున ఒక విలక్షణమైన నాదము వినిపించగలదు. అదియే అనాహత నాదము. ఇట్టి అనాహత నాదమునే ప్రాణలింగార్చనలో ఉపయోగించ వలెననియును ఇష్టలింగార్చనాదులలో ఆహత నాదమును వుపయోగించ వలెననియును గ్రహించగలరు.

శ్రీ భగవత్పాదుల వారు, ప్రాణలింగార్చన విషయములో, విషయార్పణమే తాంబూలమని యనిరి. తాంబూల సమర్పణలో మూడంశములు ప్రధానముగా నుండును. అవి ఆకు, వక్క, మరియు సున్నము. వీటిలోన యేది తగ్గిననూ తాంబూల మనిపించు కొనజాలదు.

శ్రీ భగవత్పాదులలోని తాంబూల మనినలియయములనిన యెడల, యద్దాని యంతారార్థ మెట్టిది. లోకములోని వ్యవహారములకు త్రిప్పుటములు కారకములగు చున్నవి. ప్రమాతృ, ప్రమేయము మరియు ప్రమాణములే యీ త్రిపుటములు, ప్రమాతృ యనెడి వాడు జీవి ప్రమాణములనెడివి పంచజ్ఞానేంద్రియములు ప్రమేయములు అనగా పంచతన్మాత్రలు కళ్ళు ప్రమాణములుగా గైకొనిన యెడల రూపము ప్రమేయమగును.

త్రిపుటముల నివార్యములని చెప్ప బడినవి. ఏ ఒక్కటి లేకుండినను విషయాను భావము పరిపూర్ణము కాజాలదు. ఈ విషయమున నొక గ్రుడ్డి వానిని యుదాహరణగా గైకొన వచ్చును. ఇతనిలో ప్రమాతృ మాత్రమే గలదు. ప్రమాణములోపించినది. ప్రమేయమైన రూపము అనుభవములోనికి రాజాలదు. చెవిటి వానికి చెవులనెడి ప్రమాణములు లేనందున శబ్ద పరమైన యనుభవము గల్గుగ జాలదు. తాంబూలములోని త్రిపుటములని గ్రహించవలెను. ఈ విధముగా విషయములను సమగ్రముగా సమర్పించుట చేత, విషయ చింతన పరిపూర్ణముగా వైదొలగునని గ్రహించవలెను. ప్రాణలింగ స్థలము నందలి భక్తుడు విషయ భోగములకు లోను కాకుండగ యుండ వలెననెడిది యీ సమర్పణలోని యంతరార్థమని గ్రహించ గలరు.

ఉపచారములలో ప్రదక్షిణ కెంతో ప్రాముఖ్యత గలదు. శివాలయములలో భక్తులు ప్రదక్షిణ చేయుటను గాంచగలము. ప్రదక్షిణలో పలువిధములైన ప్రభేదములు గలవని శ్రీ అపయ్య దీక్షితుల వారు తెలియ జేసిరి. ఆశ్రమ ధర్మముల ననుసరించి యీ ప్రభేదములు ఏర్పరచ బడినవని తెలియు చున్నది. శివలింగము చుట్టి వచ్చిన యెడల ప్రదక్షిణ మగు చున్నది. యిది అన్ని ఆశ్రమములకు చెందిన వారు చేయవచ్చునని తెలుప బడినది.

యిష్టలింగార్చనలో ప్రదక్షిణ విలక్షణముగా నుండును. ఈ విషయము నింతకు క్రితమే తెలిపి యుంటిమి. ప్రాణలింగార్చన సందర్భమున ప్రదక్షిణ యే విధముగా నుండవలెనో యనెడి దానిని వివరిస్తూ, నది విషయ భ్రంతి రాహిత్యము రూపములో నుండవలెనని యుపదేశించిరి. విషయ భ్రాంతియనగా విషయముల గురించిన భ్రాంతి. భ్రాంతి, భ్రమణములకు సన్నిహితమైన సంబంధము గలదు. భ్రాంతికి లోనైన వాడు పరిభ్రమణమును చేయుచుండును. కామవాంఛను తీసికొనుటలోనే నిజమైన సుఖము గలదని భావించెడి వాడు భామినీ పరమైన యన్వేషణలో తిరుగుచుండును. రాత్రింబవళ్ళు సాని కొంపలలోన కాలమును వెడల బుచ్చెడి వారు. గణనీయమైన సంఖ్యలో నుందురని తెలిపెడి గాథలు చాల గలవు. అట్టి భ్రాంతిని వీడి తిరుగాడుటే ప్రాణలింగ స్థలములోని భక్తుని కర్తవ్యమై యున్నది.

ఈ కారణమున, శ్రీ భగవత్పాదులు అట్టి భ్రాంతిని రాహిత్యము చేసికొని యద్దానిని ప్రాణలింగమునకు అర్పించవలెనని యాదేశించిరి.

నమస్కారమును గూర్చి వివరిస్తూ "బుద్ధేస్తదాత్మికా శక్తి ర్నమస్కార క్రియా మతా" అని ఉపదేశించిరి. ఎవ్వైనను క్రియలను చేయునప్పుడు అహం అహం అని అహంకరించెడి బుద్ధి ప్రవృత్తిని, అభిమానమును వీడి, ప్రాణలింగముతో సమరసమగునదే ప్రాణలింగార్చనలోని నమస్కార క్రియ ప్రాణలింగము నర్చించి ప్రాణలింగముగ నయ్యెడిదే యీ అర్చనలోని పరమార్థమని గ్రహించగలరు.

ఈ విధముగా ప్రాణలింగార్చన చేయునప్పుడు. ప్రత్యమ్మఖమైన మనస్సుతో అంతరలింగము నర్చింప వలెనని తెలిపెడి ఆచార్యులవారి ఉపదేశము ఈ క్రింది విధిన గలదు.

**ఏవం విధై ర్భావ శుద్ధై రుపచారై రదూషతైః ।**
**ప్రత్యన్ముఖమనా భూత్యా పూజయేల్లింగ మాంతరమ్! ॥ ( సి. శి. 12-20)**

భావ శుద్ధిగల సామగ్రి చేతను, అంతరలింగమును అంతర్ముఖియైన మనస్సుతో పూజించ వలెననెడిది యీ శ్లోకములోని భావము.

ప్రాణలింగార్చన గురించి సంక్షిప్తముగా చెప్పవలెననిన క్షమ, సత్యము, వైరాగ్యము, చితవృత్తి నిరోధము, నిరహంకారము, శ్రద్ధా, జ్ఞానము, ప్రాపంచిక భ్రాంతి, మౌనము, బుద్ధ్యాదుల సమర్పణ మొదలగు భావశుద్ధి సహిత భావా సామగ్రిని ప్రత్యన్ముఖమైన మనస్సుతో సేకరించికొని చిత్తై కాగ్రతతో ప్రాణలింగమును పూజించ వలెను. క్రమముగా పూజను పటుతరము చేసికొనవలెను. అంత్యముతానే ప్రాణలింగమై విరాజిల్లెడి దశకు చేరికొన వలెను.

వీరశైవులీ విషయములను గ్రహించి ప్రాణలింగార్చనోన్ముఖతను పెంపొదించు కొందురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దిః 3-4 - 1992
స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

ప్రాణలింగార్చనకు సంబంధించిన ముగింపును శ్రీ జగద్గురు చంద్ర శేఖర శివాచార్యుల వారు మౌనము, విషయ భ్రాంతి నిరసన, అహం భావరహిత క్రియా చరణల గురించిన విషయములను వివరించిరి. తాంబూలము గురించి శ్రీ వారిచ్చిన విశ్లేషణ విశిష్టమైనదై యున్నది.

ప్రాణలింగ స్థలములోని సాధకుడు భావ శుద్ధి గల్గినట్టి భావ వస్తువులతో నంతర్ముఖుడై ప్రాణలింగమును పూజింప వలెనని చెప్పబడినది. (సి. శి. 12 - 20) అందు చేత నీ పూజ యొక్క పరమార్థము భావశుద్ధిని సాధించుటేయని గుర్తించ వలెను. అనుభవ భక్తిని సాధించుటలో భావశుద్ధి యెంతో కీలకమైన పాత్రను పోషించును. "భావ శుద్ధ విల్లదవంగె భక్తి నెల గొళ్ళదు" అనెడిది యను భావుల వాక్కు (శ్రీ బసవేశ్వర గీతా మృతం వ.సం. 656) "భావము శుద్ధముగా లేనివానికి భక్తి నెల కొనదు." అనెడి యీ యనుభవ సూక్తి యొక్క అర్థము "యాథా భక్తి స్తథా సిద్ధిః సత్యం సత్యం న సంశయః" యనెడిది యాగమము చెప్పినట్టిది. భక్తిని బట్టియే లక్ష్యసిద్ధి యాధారప బడియుండుననెడిది యీ ఉక్తిలోని భావము ప్రాణిలింగ్యంగమును చరలింగములో లయము చేసి సమరస భావమును పొందుటే యీ స్థలము యొక్క లక్ష్యమై యున్నది. అందుచేత లింగత్వమును సాధించుటకై భావశుద్ధిని పొందుట చాల ముఖ్యమైన విషయము. అందుచేతనే ఆగమములు "యథా భావం తథా లింగం సత్యం సత్యం న సంశయః" అని చాటి చెప్పినవి, భావశుద్ధిని బడయని యెడల లింగాంగా సామరస్య సుసాధ్యమైన దగునని గుర్తించ గలరు. భావ శుద్ధి యొక్క ప్రాముఖ్యతను కనుగొనిన శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనము గమనార్హమై యున్నది.

ఆసె రోష హరుషాది గళెంబ కరణేంద్రియవ ముట్టలీయదె
ఆచారవ శివాచారవ మాడులె భయభక్తి యింద తోరువె మనదల్లి వంచనె యిల్లదె
భావశుద్ధియు పూజేయ మాడలె ఎన్న ప్రాణ శక్తి యుండ కూడులె కూడల సంగమ దేవర.

దాని తెలుగు రూపమిది.

**ఆస రోష హరుషదాదు లనెడి కరణేంద్రియములను ముట్టనీయకే**
**ఆచారమును శివాచరమున చేసెద భయ భక్తుల వలన చూపెద మనమున పంచన లేకుండగ**
**భావశుద్ధి పూజను చేసెద నాప్రాణ శక్తితో కూడెద కూడల సంగమ దేవుని**
**(శ్రీ బసవేశ్వర గీతామృతము వ. సం॥ 764)**

శివం భూయాత్

# ఆశీర్వచనము - 1

# శివయోగ సమాధి స్థలము

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు ప్రాణలింగార్చన విధానమును తెలిపిన పిదప, ఆ పూజా క్రమముచేత లభించెడి సమాధి స్థితి గూర్చి యీ క్రింది విధముగా నుపదేశించిరి.

**అంతః క్రియారతస్యాస్య ప్రాణలింగార్చన క్రియ్యః ।**
**శివధ్యాన సంపత్తి ః సమాధిరితి కథ్యతే ॥**

ఈ ఉపదేశానుసారము, సమాధి యనగా శివాత్మధ్యాన సంపదయే లింగాంగ సామారస్యమును సాధించెడి దిశ దీనినొక ముఖ్యమైన దశగా గుర్తింప వచ్చును.

యోగ మనెడి దానిని వివరించుచు, పతంజలి చిత్తవృత్తి నిరోధమే యోగమని తెలిపిరి చిత్తవృత్తి ఐదు రకములుగ నుండునని తెలుపబడినది. అవి యేమనగా ప్రమాణ, విపర్యంను, వికల్ప, నిదా మరియు స్మృతులు. ఈ ప్రతి యొక్క దానిని మరల రెండు భాగములుగా విభజింప వచ్చును. అవి క్లిష్టా క్లిష్టములు. అక్లిష్టపరమైన చిత్తవృత్తులను నిరోధించుట వలన యోగసిద్ధి గల్గునని పతంజలి యోగ సూత్రముల వలన తెలియు చున్నది.

శ్రీ భగవత్పాదుల వారే శివయోగమును సాధించెడి క్రమమును ఈ క్రింది విధముగా నుపదేశించిరి.

**సర్వతత్త్వోపరిగతం సచ్చిదానంద భాసురమ్ ।**
**స్వప్రకాశమనిర్దేశ్య మవాఙ్మనస గోచరమ్ ॥**

**ఉమాఖ్యయామహాశక్త్యా దీపితం చిత్స్వరూపయా ।**
**హంస రూపం పరాత్మానం సోఽహం భావేన భావయేత్ ॥**
**తదేకతానతా సిద్ధిః సమాధిః పరమోమతః ॥ (సి. శి. 12; 22-23)**

పరశివుడనెడివాడు ముప్పది యారు తత్త్వముల కతీతుడైన వాడు పృథివ్యాది శివతత్త్వము వరకు గల తత్త్వములన్నియును పరశివ తత్త్వము నుండి యే యుత్పన్నమై యున్నవి. ఇంతకు క్రితమే తెలిపిన యటుల, పరశివునికి విశ్వోత్తీర్ణుడను పేరు గలదు. ఈ తత్త్వముల కంటెను భిన్నముగా నుండి యున్నందు వలననే యీ పేరతనికి గల్గినది ప్రాణలింగ స్థలము నందలి భక్తుడు విశ్వోత్తీర్ణుడైన పరమ శివునితో తన జీవాత్మను తాధాత్మ్యము చేసి చింతించెడి స్థితిని సాధించెడి దే శివ యోగ సమాధి యనబడుచున్నది. ఇచ్చట పర శివ తత్త్వము సచ్చితానంద స్వరూపమై, స్వయం ప్రకాశమై, యనిర్దేశ్యమై, వాక్కు మరియు మనస్సుల కందనిదై యుండును. ఈ మహాలింగతత్త్వము చిద్రూపమైన యుమాశక్తి సమేతమై యుండును. పరమ హంస రూపమైన యీ పరాత్పర తత్త్వమును 'సోఽహం' (నేనాతత్వరూపమై యున్నాను) అనెడి భావనతో చేసెడి ఆత్మ పరమాత్మల యైక్యతారూప చింతనయే శివ యోగ సమాధి యగుచున్నది.

ఈ తత్త్వము వాక్కు కందనిది, మనస్సు చింతించ జాలనిదనెడి యంశములు పరిశీలనార్థములై యున్నవి. ఇట్టి యగోచరమైన దానిని గురించి చింతించ యెటుల యనెడి ప్రశ్న యుదయించ వచ్చును.

చింతించుట యెందుల కనెడి మరో ప్రశ్న గలుగ వచ్చును. విషయాసక్తి గల్గిన విషయ చింతకులకు ఈ తత్త్వమ గోచరమని గ్రహించవలెను. ఇట్టి వారి మనస్సు గాఢంధకార బంధకమై యుండుటచే పరిశుద్ధ తత్త్వము వారికి గోచరము కాజాలదు. అంతరంగ శుద్ధి బడసిన వానికి యీ తత్త్వము అనుభవ వేద్యమని గ్రహించవలెను. అతడి వ్యావృత్తి యనెడి విలక్షణమైన పద్ధతి చేత యీ తత్త్వము వివరించ గల్గుదుమని గ్రహించ వలెను.

ఉమా యనెడి చిత్ శక్తి చే కలిసి యుండుట చేత మహాలింగమునకు హంస యనెడి పేరు (యోగ శాస్త్రముననుసరించి) గల్గినది కైలాసము నందలి మానస సరోవరము నందున హంస తిరుగాడు చుండును. భక్తుని మానస సరోవరమున తిరుగాడుటచే లింగమున

కీ పేరుగల్గినది పూజ్యులైన భగవత్పాదుల వారు ఆహంస చింతనను 'సోహం' రూపమున చేయుటకు ఆదేశించిరి. అజ్ఞానులైన జీవులు హంస తత్త్వమును మరిచి ఎల్లప్పుడు అహం అహం అని వ్యవహరించుచూ సంసార బంధమునందున బంధితులగుదురు. అయితే శివయోగ సమాధి నాచరించెడు సాధకుడు సోహం సోహం అనుచు ఆపరమహంస రూపమైన మహాలింగ తత్త్వముతో తన ఆత్మను సమరస భావముతో నిలుపుకొని చింతన చేయుచుండును. శివయోగ సమాధిని బడసి సంసారము నుండి ముక్తిని పొందుటకు కృషి చేయును. పరమతత్త్వమును మరచి అహం అని అహంకరించెడి జీవులు 'వర్ణాధ్వ' అనెడి పాశమునందున బంధితులగుదురు. సిద్ధాంత శిఖామణి యొక్క వ్యాఖ్యనములో శ్రీ మరి తోంటదార్యులు అధ్వముల గురించి ఈ క్రింది విధముగా తెలిపిరి. అధ్వములు ఆరుతెరగులుగా నుండును. అవి ఏమనగా 'వర్ణాధ్వ, పదాధ్వ, మంత్రాధ్వ, భువనాధ్వ, తత్వాధ్వ మరియు కళాధ్వములు అధ్వయనగా మార్గమనియుర్థము పరమ తత్త్వమైన మహాలింగ తత్త్వమును యెరుగుటకై ఆరు అధ్వములు ఆరు మార్గములుగా నిలిచియున్నవి. ఈ అధ్వములు అశుద్ధముగా నుండిన యెడల జీవుని పాశ బద్ధునిగా చేయును శుద్ధిగా నున్న యప్పుడు ముక్తి మార్గమున పయనింపజేయును. అకారము నుండి 'హకార' పర్యంతముగల వర్ణములే వర్ణాధ్వము. ఈ వర్ణాధ్వముచే బంధితుడైన జీవుడు ఎల్లప్పుడు అహంకార పూరిత భావుడై యుండును. జాగ్రధవస్థలములోను, స్వప్నావస్థలోను ఇట్టి భావమునే కలిగి యుండును. 'అహం' అనెడి అభిమానమే బంధన కారి యగును. దీనినుండి విముక్తి పొందుటకై 'సోహం' అనబడు భావనను అలవర్చు కొనవలెను. 'అహం' అనెడి అభిమానము కలిగినపుడు అది వ్యష్టి రూపమున నుండి జీవుని స్థూల మరియు సూక్ష్మ శరీరమునకు పరిమితమై యుండును. అదియే సోహం రూపమును దాల్చిన యప్పుడు సమిష్టి రూపమును ధరించి ముక్తికి కారణమగు చున్నది. ఎవని వద్ద వ్యష్టి భావన వుండునో వాడు అహం భావముతో నుండుట చేత జీవుడుగానే కొనసాగును. సమిష్టిభావన కలిగినవాడు శివుడుగా పరిణామము నొందుటకు ప్రయత్నించును. ఆ మార్గమున పయనించును. అహంభావ పూరితుడైన వాడు రాగ ద్వేషాది వికారములకులోనై ప్రతికూల మరియు అనుకూల జ్ఞానములను పొందుచున్నాడు. రాగమున్నవాడి యెడల అనుకూలమైన వైఖరి ద్వేషమున్న వారి యెడల ప్రతికూల వైఖరి ప్రదర్శించను పుణ్యపాపములకు ఈ అనుకూల ప్రతికూల వైఖరులే పుట్టి నిల్లుగా పరిణమించు చున్నది. వ్యష్టిభావన క్రమ క్రమముగా అనర్ధపరంపరలను పెంచి జీవుని జనన మరణ చక్రబంధమున బిగించు చున్నది. సమిష్టి భావన గలిగిన వానికి రాగద్వేషములు కలుగవు. అట్టివానికి పుణ్యము, పాపము అనెడివి అంటజాలవు పుణ్యపాపములే లేనప్పుడు పునర్జన్మ ఎందుకుండును? అందుచేత 'సోహం' అనబడు సమిష్టి భావము సంసార బంధములను తెగటార్చెడి సాధనమని గుర్తించగలము.

సమిష్టి రూపమైన ఈ 'సోహం' భావము తైలధారవలె మనస్సునందున ఎప్పుడు అఖండ స్వరూపమును దాల్చునో అప్పుడు భక్తునికి శివయోగము సిద్ధించు చున్నది. దీని భావమేమనగా 'సోహం' భావనతో ప్రాణలింగమును అఖండముగా చింతన చేయునదే శివయోగ సమాధి యగుచున్నది. శ్రీ భగవత్పాదుల వారు ఈ విషయమున మరికొంత ఉపదేశమును ప్రధానము చేయుచు ఈ క్రింది విధముగా ఆ దేశమును యిచ్చిరి.

**పరబ్రహ్మ మహాలింగం ప్రాణోజీవః ప్రకీర్తితః ।**
**తదేకభావమననాత్ సమాధి స్థః ప్రకీర్తితః ॥ (సి. శి. 12-22)**

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా ప్రాణము అనుశబ్ధము యొక్క అర్థము జీవమనియును, లింగము అనబడెడి శబ్దము యొక్క అర్థము పరబ్రహ్మమనియును శ్రీ పూజ్యపాదులు బోధించిరి అనగా జీవరూపమైన నేను శివరూపమునే అయివున్నాను. అను నిరంతన చింతనయే ప్రాణలింగార్చన యని గ్రహింపదగును. వీరశైవ సిద్ధాంతము నందున మహాలింగమనగా పరశివ బ్రహ్మమే అందుచేత శివజీవ ఐక్యత సిద్ధియే శివయోగ సమాధియని తెలిసి కొనగలరు. మనస్సులోని ఇతరేతర ప్రవృత్తులను దూరము చేసికొని తదాకార వృత్తిని అభ్యసించుచూ ఎప్పుడూ మనస్సు సంపూర్ణముగా ధ్యేయస్వరూపమును పొందునో అప్పుడే సాధకుడు సమాధి స్థితిని ప్రాప్తించుకొనను. సమాధి సమయములో అద్దానిని సాధించెడి తరుణములో అన్యాకార వృత్తులు ఉద్భవించిన యెడల వాటిని దూరము చేసికొని తదేకరూపముగా, చింతించెడి క్రియనే మననము అని పిలుతురు. సోహం సోహం అని ధ్యానము చేసెడి సాధకుని మనమునందున ఒక్కొక్కసారి 'అహం' అనెడి భావన రావచ్చును. దానిని ఎప్పటికప్పుడు దూరముచేశికొనుచూ 'సోహం' భావనను అలవరచు కొనవలెను. ప్రతియొక్క వీరశైవ శివయోగ సాధకుడు ప్రతి దినము యోగ సాధన చేయుచూ శివయోగ సమాధి స్థితిని పొందుటకు ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురువులు చంద్ర శేఖర శివాచార్యుల వారు 'సోహం' భావము యొక్క ప్రాముఖ్యత నెంతో వివరముగా తెలిపిరి. 'అహం' భావమును వీడి సోహం భావమును చేపట్టి హృదయ గతుడుగా నున్న శివుని యందున ధ్యానమును నిలుపుట యోగ సమాధియగునని తెలిపిరి.

పతంజలి ప్రతిపాదించిన యోగ పథమే బహుళ ప్రచారముననున్నది. మోక్ష సాధనకిది స్వతంత్రమైనట్టి మార్గమని చెప్పబడినది. చిత్త వృత్తిని నిరోధించుటయే యోగమని తెలుపబడినది. సమాధి యనెడిది అష్టాంగ యోగములోని యంతర్భాగము. యమని యామాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణములు మిగిలిన యాగములు శివయోగము దీని కంటెను భిన్నమైనదిగా గోచరించు చున్నది. ఈ క్రింది శ్లోకమును గనుడి:

**జ్ఞానం శివమయం భక్తిః శైవీ ధ్యానం శివాత్మకం ।**
**శివవ్రతం శివార్చేతి శివయోగోపి పంచాధా ॥**

"శివే యోగః శివయోగః" అనెడి భావమీ శ్లోకమున యంతర్లీనమై యుండి యున్నదని తెలియు చున్నది. ఇందులో సమాధి యనెడి పదము లేక పోవడము గమనార్థమైన విషయము అయితే యోగమునకు వీరశైవ పరమైన విశ్లేషణ నిచ్చిన మగ్గియ మాయి దేవుడు తమ శతక త్రయమున ధ్యాన, ధారణ సమాధులు శివయోగము యొక్క అంగములని తెలిపిరి. ఈ విశ్లేషణలన్నింటి కంటెను శ్రీ జగద్గురువు రేణుకాచార్యుల వారి భావనలు భిన్నముగా నున్నవని తెలియు చున్నది. "శివాత్మధ్యాన సంపత్తి" యే సమాధియని వివరింప బడినది (12:2) ధ్యాన సమాధులు సమైక్యము చేయబడినట్లు దోచు చున్నది. ఈ విషయము క్రింది యుపదేశమున స్పష్టీకరింప బడినది:

**పరబ్రహ్మ మహాలింగం ప్రాణో జీవః ప్రకీర్తితః ।**
**తదేక భావమననాత్ సమాధిస్థః ప్రకీర్తితః ॥ (సి. శి. 12-24)**

ధ్యానము యొక్క ప్రాముఖ్యతను ఉపనిషద్వాదులు కూడ గుర్తించిరని తెలియ చున్నది. "తస్యాభి ధ్యానాత్ యోజినాత్ తత్త్వ భావాత్ భూయశ్చాంతే విశ్వమాయా నివృత్తిః" అనెడి శ్వేతా శ్వేతరోప నిషధ్వాక్యము ప్రమాణముగా నిలిచినది. అయితే, ధ్యానముల గురించి తెలిపినప్పుడు శైవ వైష్ణవాది మతములు ఆయా ఆరాధ్య దైవముల గుణ కీర్తన చేయుటయే ధ్యానము యొక్క లక్ష్యమని భావించినట్లు తెలియు చున్నది. ధ్యాన శ్లోకములను పరికించినచో నీ విషయము వాస్తవమని తెలియ గలదు. అయితే శ్రీ భగవత్ పాదుల వారు లింగాంగముల సంయోగము గురించిన మననమే ధ్యానము యొక్క లక్ష్యమని తెలిపిరి ఈ విధముగా శ్రీ భగవత్పాదుల వారిచే ప్రతిపాదింప బడిన సమాధి భావన ప్రత్యేకమైనదిగా గోచరించు చున్నది. "సమ్యగాధీయత్ మనోऽత్రేతి సమాధిః "పు. దు ధాఞ ధారణ పోషణయోః" అనెడి పద విశ్లేషణను గమనించినచో శ్రీ భగవత్ పాదుల వారి భావన సమగ్రమైనదని తోచ గలదు.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 2

## శివయోగ సమాధి స్థలము

ఇంతకు క్రితము శివయోగ సమాధిలోని ప్రారంభ స్థితి గురించి తెలిసికొని యుంటిమి ఇట్టి స్థితిని ప్రాప్తము చేసుకొనుటకై వలయు షట్చక్రముల జ్ఞానమును శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా బోధించిరి.

**అంతః షట్చక్రరూఢాని పంకజాని విభావయేత్ ।**
**బ్రహ్మాది స్థానభూతాని భ్రూమధ్యాంతాని మూలతః ॥**

**భ్రూమధ్యా దూర్ధ్వ భాగేతు సహస్రదళమంబుజమ్ ।**
**భావయేత్తత్ర విమలం చంద్రబింబం తదంతరే ॥**

**సూక్ష్మ రంధ్రం విజానీయాత్ తత్కైలాసపదం విదుః ।**
**తత్రస్థం భావయేచ్ఛంభుం సర్వకారణ కారణమ్ ॥ (సి. శి. 12; 25:27)**

ఇది శివయోగ సమాధిని గురించి తెలుసు కొనవలసిన విషయమై యున్నది. ప్రతియొక్క వ్యక్తి సూక్ష్మ శరీరము నందున షట్చక్రములు వుండును వాటి గురించి చిత్తమును ప్రసరించినప్పుడు ప్రతి యొక్కరికి వాటి పరికల్పన కలుగును. మన యందునే యుండెడి వస్తువులు మనము చూచుటకు ప్రయత్నించని యెడల అవి మనకు తోచవు మనమెన్నోసార్లు ఎంతో మహత్వపూర్ణమైన వస్తువులు యింటిలో ఒక ప్రదేశమున పెట్టి ఆ పిదప మరొక ప్రదేశములో కూర్చున్నప్పుడు దాని వైపు ఆలోచనను ప్రసరింపజేశి అది అక్కడ వున్నది. అనెడి భావనను పొందుచున్నాము. ఇంతటి అనుభవము ప్రతి ఒక్కరికి కలుగును. అటులనే సూక్ష్మ శరీరమునందుండెడి షట్చక్రముల పరిస్థితి లౌకికమైన వ్యక్తి మతిమరపు కలిగిన వ్యక్తి వంటివాడు. తనయింటిలో ఏ వస్తువు ఎక్కడున్నదో తెలియక, వాటిని గురించి ఆలోచించుటకే ప్రయత్నించక యలమటించెడి వాని వంటివాడు. అట్టివానికి వస్తువులున్నను లేనట్టుగానే దోచును. శివయోగి అంతఃర్ముఖియై బహిఃప్రవృత్తులను నిరోధించి మనోవృత్తిని అంతరంగము వైపు మళ్ళించి కృషి చేసిన యెడల అతనికి అంతరంగము యొక్క పరిపూర్ణమైన పరిజ్ఞానము కలుగును సామాన్య వ్యక్తి ఏ విధముగా తన చుట్టుప్రక్కలకు దృష్టిని ప్రసరింప జేశి ఏ వస్తువు ఎక్కడున్నదో అనెడిది ఏ విధముగా తెలుసుకొనునో అదే విధిన శివయోగి అంతరంగమున నున్న వస్తువుల గురించి తెలుసు కొనగలుగును. ఇట్టి శివయోగి తనసాధన ద్వారా అనుభవములోనికి తెచ్చుకొనెడి షట్ చక్రముల యొక్క పరిజ్ఞానమును శ్రీ పూజ్యపాదులు వివరించిరి గుదస్థానమునందున ఆధార చక్రమునందున నాలుగుదళములు కలిగిన కమలముండును. గుహ్యాస్థానమునందున గల మణిపూరక చక్రమునందున దశదళకముల ముండును. హృదయము నందుండెడి అనాహత చక్రమునందున ద్వాదశ దళ కమలముండును. కంఠస్థానమునందున విశుద్ధి చక్రము నందున పదహారు ధళముల కమలముండును. భ్రూమధ్యమున గల ఆజ్ఞా చక్రమున రెండు ధళముల కమల ముండును. ప్రారంభము నందున ఇవి అనుభవమునకు రాక పోవుచ్చు. అయితే భావమున నిలుపుకొనిన యెడల క్రమ క్రమముగా వాటి యొక్క అస్తిత్వము గోచరించును. స్థూల శరీరము నందుండెడి, గుడము, గుహ్యాము, నాభి, హృదయము, కంఠము మరియు భ్రూమధ్యములు అనెడి కేంద్రములు ప్రతి యొక్కరికీ గోచరించెడివే. ఆయా కేంద్రములందున ఆయాధళములు కమలములను భావపరముగా భావించుకొని వాటివైపు నిరంతరము మనస్సును కేంద్రీకరించిన యెడల ఆయా కమలములను సాక్షాత్కరించుకొన వచ్చును. మూలాధారము నుండి ఆజ్ఞాపర్యంతముగల చక్రముల యందున క్రమముగా 'న' కార 'మ' కార 'శి' కార 'వ' కార 'య' కార మరియు ప్రణవములను భావించుకొన వలెను.

ఈ తెలగును శివయోగ మార్గము ద్వారా షట్చక్రములను దాటి తన మనోవృత్తిని భ్రూమధ్యమునకు పై భాగమునకల సహస్రధళ కమలభాగమైన మస్తకము వైపు మనోవృత్తిని కేంద్రీకరించవలెను. ఆ సహస్రకమలము మధ్యన ఒక నిర్మలమైన చంద్ర బింబము వుండినటుల భావనను పెంపొందించు కొనవలెను. ఆ చంద్రబింబము మధ్యన అత్యంత సూక్ష్మమైన ఒక రంధ్రముండును. శ్రీ జగద్గురువుల వారు అద్దానిని కైలాసమని అనిరి. కైలాస పర్వతము మీద సర్వమునకు కారణభూతుడైన సర్వులకు శుభమును గలిగించెడి శివుని భావించుకొని ధ్యానము చేయవలెను. అతి వున్నతమైన హిమాలయ పర్వతము నందున, అతి వున్నతమైన స్థానమున కైలాస పర్వతము గలదని యెరుగు చున్నాము. పురాణములలో శివుడు కైలాసములో నుండెనని చెప్పబడినది. కైలాసము బహిరంగమున యుండిన యటులనే అంతరంగమున ఒక కైలాసము కలదు దీనినే శివయోగులు గాంచు చున్నారు. 'యుద్బ్రహ్మాండే తత్ తద్ పిండాండే' అనెడి వ్యక్తి ప్రకారమ బ్రహ్మాండమునందుండెడి వస్తువులన్నియును. ఒక వ్యక్తి యొక్క పిండాండమున నుండును. ప్రతి ఒక్కరికి అంతర్ముఖ మనోవృత్తి ఏర్పడుదు కనుక తమలోనే వున్న కైలాసమును మరచి బహుదూరముననున్న కైలాసము వైపు పరుగులు తీతురు భౌతిక వాది అతి కష్టముతో కూడుకొని యున్న శ్రమ చేత కైలాస పర్వతమును చేరుచున్నాడు. శివయోగి తనమనోవృత్తిని మూలధారమునుండి సహస్రారము వరకు ప్రసరింపజేశి కైలాసమును సాక్షాత్కరింప జేసుకొను చున్నాడు. శివయోగ సమాధికి ఇట్టి మహత్వము గలదని గుర్తించవలెను.

'ఊర్ధ్వముగచ్ఛంతి సత్యస్థాః' అనెడి ఉక్తి ప్రకారము సాత్విక ప్రకృతికల మనుజుని మనోవృత్తి ఊర్ధ్వముఖముగా నుండును. నీటిని కాచి నప్పుడు వంద డిగ్రీల స్థాయిలో నయ్యది బాష్పమై ఊర్ధ్వగతిన పయనించును. అదేవిధిన తపోమయ జీవనము చేత సాత్వికమైన

అంతఃకరణము ఊర్ధ్వముఖము అగును. ఇంతటి ఊర్ధ్వముఖ వృత్తిని సాధకుడు ఆధారచక్రము నుండి సహస్రార చక్రము వరకు క్రమించి అచ్చట నుండి కైలాసము నందలి శివుని సాక్షాత్కరించుకొని సమాధి స్థితిని ప్రాప్తింప జేసుకొను చున్నాడు. ఇతడు బహిరంగమును మరచి అంతరంగములోని ఆత్మానందమున తల్లీనుడై యుండు చున్నాడు. దీనికి విరుద్ధముగా నున్నవానికి ప్రపంచానుభూతి కలుగునని శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**బహిర్వాస నయా విశ్వం వికల్పార్థం ప్రకాశతే ।**
**అంతర్వాసిత చిత్తనామాత్మానందః ప్రకాశతే ॥ (సి. శి. 12-28)**

దీనిలోని భావమేమనగా ఎవరిమనసు బహిర్వాస నాయుకమై వుండునో అట్టివారికి అనేక వికల్పాత్మకమైన ఈ విశ్వము దృగ్గోచరమగు చున్నది. ఇంకను శుభ వాసనల చేత సాత్త్వికమైన శివయోగుల అంతఃకరణము అంతర్ముఖమగుట చేత బహిరంగ ప్రపంచమును మరచి ఆత్మానందమును అనుభవించును.

"పరాంచిఖాని వృతృణత్ ప్వయంభూః" అనబడెడి ఉపనిషత్ప్రమాణము ప్రకారము అందరి యొక్క యింద్రియములు బహిర్మఖములై యుండును. ఇది బ్రహ్మచేశిన కృత్యమని తెలుసు కొనవలెను. వేయిమందిలో ఏ ఒక్కధీరుడో శివయోగ బలము చేత ప్రాపంచిక విషయములను దూరము చేసుకొని అంతర్ముఖడగు చున్నాడు. సాత్త్వికుడగున తనొక్కడే ఆత్మానందమును బడయుచున్నాడు. అంతర్ముఖము కాకుండా ఆత్మానందమును బడయుట సాధ్యమయ్యెడి విషయము కాదు. సుఘప్తావస్థ యందున అర్థాత్ గాఢమైన నిద్రావస్థ యందున ప్రతి వ్యక్తి బహిరంగ ప్రపంచమును మరచి అంతర్ముఖడగు చున్నాడు. అట్టి స్థితిలో అతనికి ఆత్మానందము లభించును. ఆ అనుభూతిని ఎక్కువ కాలము పొందవలెననిన దానిని గురించిన పరిజ్ఞానము తెలిసియుండవలెను కదా! కాని అట్టి జ్ఞానము కేవలము సుఘప్తావస్థ యందు మాత్రమే అనుభవమునకు వచ్చుచున్నాది. అందుకే శంకరాచార్యులు "సుఘప్తేకసిద్ధః శివః కేవలోఽహం" అనెడి వుక్తి ప్రకారము సంఘప్తావస్థతిశ ప్రతి జీవుడు శివరూపమునే అనుభవించు చున్నాడని ప్రతి పాదించిరి. ఈ స్థితియందున జీవి కర్మాధీనమైన యవస్థలో నుండును. అందుచేతనే అది యెప్పుడంటే అప్పుడు లభించదు. శివయోగము స్వపురుషార్థ సాధ్యమగుట చేత దాని బలము వలన జాగ్రదవస్థ యందు శివయోగి యంతర్ముఖియై తాను కోరినంత మేరకు శివానందమును అనుభవించ గలడు.

పూజ్యపాదులు శ్రీ రేణుక భగవత్పాదుల వారు మనోవృత్తిని అంతర్ముఖము చేసెడి విధి విధానమును ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**ఆత్మారణిస ముతేన ప్రమోదమథనాత్సుధీః ।**
**జ్ఞానాగ్నినా దహేత్సర్వం పాశజాలం జగన్మయమ్ ॥ (సి. శి. 12-29)**

మనస్సు యొక్క బహిరంగ వృత్తికి కారణభూతములైన సాంస్కారికి వాసనలను ఎంతవరకు సాధకుడు దూరము చేసుకొనదో అంతవరకు అతనికి ఆత్మానందము లభించజాలదు. ఆకాశములో తిరుగాడెడి గాలిపటము మనము దారమును విడచిన కొలది మన కంటెను దూరముగా పోవును. దానిని దగ్గరగా తీసుకొని రావలెననిన దారమును మనవైపునకు లాగికొనవలెను. ఇది అందరూ ఎరిగిన విషయమే ఇదే విధిన శబ్ద స్పర్శాది విషయములను అనుభవించెడి మనస్సు బాహ్య ప్రపంచమునందున బహుదూరము వరకు ప్రయాణము చేసి యుండును. దానిని నియంత్రణము చేసి అంతర్ముఖిగా చేసుకొనుటకై మనము దానిని నియంత్రించవలెను. ఆచార్యులవారి ప్రకారము ఆత్మ అనెడి కట్టెను ప్రమోదము అనెడి వృత్తిచేత మర్దించినపుడు జ్ఞానము అనెడి అగ్ని వుత్పన్న మగును. ఈ జ్ఞానాగ్ని చేత సాంసారిక రూపములైన పాశజాలములన్నియును దహించు కొనిపోయి శివ యోగి ఆ ఆత్మనందమునందున తల్లీనమగు చున్నాడు.

పూర్వకాలమునందు కట్టెల మథనముచేత అగ్నిని పుట్టించెడి పద్ధతి ప్రచలితమై యుండెడిది. రెండు శమీవృక్షపు కట్టెలను ఒకదానితో ఒకట్టి రాపిడిచేసిన యెడల అగ్ని వుత్పన్నమగును. రానురాను చెకిముకి రాయి మీద దూదిని పెట్టి అగ్నిని పుట్టించెడి పద్ధతి ప్రారంభమైనది. ఆ పిదప ఉక్కుతునకతో జోరుగా కొట్టి తద్వారా అగ్నిని పుట్టించుట కూడా ప్రారంభమైనది. రెండు వస్తువుల యొక్క ఘర్షణ వలన వుత్పన్నమగునని తెలియు చున్నది. ఆ విధముగా పుట్టిన యగ్ని తన సమీపములోని వస్తువులను కూడా దహించు చున్నది. ఆత్మ అనబడే ఆరణి నుండి వుత్పన్నమైన జ్ఞానాగ్ని సాధకుని యందలి మలమాయాది పాశములను కాల్చివేయును. "జ్ఞానాగ్నిః

సర్మకర్మాని భస్మసాత్ కురుతే తథా" అని గీత బోధించుచున్నది. ఈ విధముగా జ్ఞానాగ్ని చేత మలమాయాది కర్మలను దహించుకొని శివయోగి ఆత్మానందము నందుననే తల్లీనముగా సమాధి స్థితిని పొందు చున్నాడు. "అక్క చేన్మధు విందేత కిమర్థః పర్వతం వ్రజేత్" అనెడి వుక్తి ప్రకారము ఇంటి యందుననే యుండెడి తేనెను విడిచి దానిని వెతుకుచూ పర్వతమునకు పోవుట యెందుకు? అనెడి నీతి వచనము ప్రకారము ఆత్మలోనే ఆనందరూముగా నుండెడి దానిని పొంది ఆనందమును అనుభవించక సంసారమునందున దానిని వెతుకు చున్నాము. ఇట్టి ఆనందమును మరచి సాంసారిక జీవులు పరావలంబన పొంది దుఃఖమును పొందుట చూచుచున్నాము. ఇట్టి దుఃఖమును దూరము చేయుటకే శ్రీ భగవత్పాదుల వారు శివయోగ సమాధిని ఉపదేశించిరి ఈశివయోగి సమాధి యొక్క మర్మమునెరిగి ప్రతిఒక్కరు శివానందములో నోలలాడుటకు ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 10-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వచనము నందున శ్రీ జగద్గురు చంద్ర శేఖర శివాచార్యుల వారు షట్ చక్రముల గురించిన విషయములను సమగ్రముగా తెలియ జెప్పిరి. విషయవాసనలను దూరము చేసి కొన వలెనని బోధించిరి.

విషయ చింతన, విషయ సుఖాసక్తి యిత్యాదులు విశ్వముతో సంపర్కము గల్గియుండుట చేత కలుగు చున్నవి. "బహీర్వాసనయా విశ్వం వికల్పార్థం ప్రకాశతే" (సి.శి.12;28) యనెడి ఆచార్యోక్తిలో నీ యంశమును గాంచగలము. ప్రాణ లింగ స్థలమును చేరిన వాడు "మాయా వికల్పజం విశ్వం హేయం" (సి. శి. 12; 11) అని చింతించునని శ్రీ భగవత్పాదుల వారు సెలవిచ్చిరి. చిదానంద మయుడైన లింగమునందున విలీన మగుటకు యత్నించెడి వాడే ప్రాణలింగియని తెలుప బడినది.

"అంతర్గతం చిదాకారం లింగం శివమాయం పరమ్" (సి. శి. 12 : 13) అని తెలిపెడి ఆచార్యోక్తి లింగము యొక్క స్థానమును గురించిన సూచన లిచ్చినది. అంతరంగమున నుండెడి లింగములో లీనము కావలెనని చో ప్రత్యన్ముఖమైన మనో వృత్తి యొక్క యావశ్యకత గలదు. ఇట్టి యావశ్యకతను గుర్తించిన శ్రీ భగవత్పాదుల వారు "షట్ చక్రని రూఢని పంకజాని విభావయేత్" అని తెలిపిరి. ఈ సూచన నేపథ్యమున కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరుల వారు ప్రధానము చేసిన షట్ చక్ర-సప్త పద్మ జ్ఞాన మమూల్యమైనదని గ్రహించ గలరు. ఈ జ్ఞానమును పొందనిచో సాధకుడు అంతర్ముఖి కాజాలడు.

శ్రీ పాల్కురికి సోమనాథుల వారి "సోమానాథ స్తవములో ప్రాణలింగి యంతర్ముఖియై యనుభవ భక్తి యెట్టులాచరించునో యనెడిది తెలుపబడినది. గమనించుడి;

**గురుమూర్తివై భూతగుణముల బాపి**
**కరణ చతుష్టయ గతులను దెల్పి**
**యాధారమాదిగా నారు చక్రములు**
**సాధింప నేర్పుము సదయ నిత్యంబు**
**విదిత్ శివాచార విహిత మార్గముల**
**పదపడి యాత్మలో ప్రభవింప జేయు**
**షడ్వి ధప్రాణముల్ షడ్విధహస్త**
**షడ్విధ భక్తుల సమకూర్చి మరియు**
**లింగంబు లారును లీలతో నిష్ఠ**
**లింగంబు నందు విలీనంబు సేసి**
**ప్రాణలింగమునందు బరిణమింపంగ**
**బ్రాణున కెరిగింపు పరమభావమున**

(శ్రీ పాలకురికి సోమానాథ కవి లఘు కృతులు, శివశ్రీ చిమిరాల చంద్ర శేఖరయ్య, దేవరపల్లి ప్రచురణ, 1962 పుట. 22)

## ఆశీర్వచనము - 3

## శివయోగ సమాధి స్థలము

శివయోగ సమాధి స్థలము నందున ఆత్మానందాను భూతిని పొందెడి విధి విధానమును ఇంతకు క్రితము తెలుసుకొని యుంటిమి. ఇట్టి అనుభూతిని పొందెడి కోరిక అందరికీ వుండిననూ కొందరు మాత్రమే సాఫల్యతను పొందుచున్నారు. దీనికి గలకారణమేమిటి? అనెడి ప్రశ్న ఉదయించ వచ్చును. అద్దానికి సమాధానముగా శ్రీ భగవత్పాదులవారు ఈ క్రింది విధముగా ఉపదేశమునిచ్చిరి.

**సంసార విషవృక్షస్య పంచక్లేశ పలాశినః ।**
**ఛేదనే కర్మమూలస్య పరశుః శివభావనా ॥ (సి. శి. 12-30)**

ప్రతి జీవి అవిద్యాది పంచక్లేశముల చేత ఆక్రాందుడై యుండుటచే శివయోగ మార్గము నందున సహజముగానే ప్రవృత్తుడు కాజాలడు. ఎటులనో యటుల ప్రవృత్తుడైనను ఈ క్లేశములను దూరము చేసి కొనకనతడు శివయోగమునందున సాఫల్యతను పొందజాలడు. ఒక వృక్షము అనేక ఆకులతో కూడుకొన్న యటులనే సంసారమనెడి వృక్షమునకు అవిద్య, అస్మిత, రాగ, ద్వేష, మరియు అభినివేశములనెడి పంచక్లేశములు పల్లవములై యుండును. ఈ సంసార వృక్షమునకు మూలధారము మనము చేయు శుభాశుభకర్మలే. ఈ కర్మమూలమైన సంసార వృక్షమును శివభావన చేత లేదా శివోహం యనెడి భావన చేత నిర్మూలము చేయవలెను. మరోమాటలో చెప్పవలెననిన శివోహం యనెడి గొడ్డలిచేకొని సంసారమనెడి విషవృక్షమును నరికివేయవలెను.

పూర్వోక్తములైన అవిద్యాదులకు శ్రీపూజ్యులు క్లేశములని యే పేరిడిరి. క్లిష్నాతి ఇతి క్లేశః అనెడి వ్యుత్పత్తి ప్రకారము జీవుని ఎక్కువగా దుఃఖింపజేసెడి గుణము వీటికున్నందున ఇవిక్లేశము లనబడుచున్నవి. ఈ క్లేశములలో మొదటిది యవిద్యయగును. యోగసూత్ర భాష్యమునందున 'అవిద్యా చతుష్పదా' అని ప్రతిపాదించబడినది. అవిద్య ఒకటియేయైననూ అది నాల్గు విధములుగా దుఃఖమును యిచ్చు చున్నది. 'అనిత్యా శుచి దఃఖానాత్మసు నిత్య శుచి సుఖాత్మ ఖ్యాతి ర విద్యా' అని యోగ శాస్త్ర ప్రతిపాదనము. అనిత్య వస్తువు నందున నిత్య బుద్ధి అశుచి వస్తువునందున శుచిబుద్ధి దుఃఖమునందున సుఖబుద్ధి మరియు అనాత్మనందున ఆత్మ బుద్ధి గలుగజేసి అవిద్య మనుజలను క్లేశములకు గురిచేయుచున్నది.

త్రికాలాబాధితమైన వస్తువును నిత్యము అని పిలుతురు. అది మూడు కాలము లందునూ ఒకేరీతిగా నుండును. దానిలో పరివర్తన యునునది వుండదు. అంతటి తత్త్వము యేది యనగా నది పరశివత్త్వమే. కాని యజ్ఞుడైన జీవుడు ఈ విషయము నెరుగక క్షణక్షణమునకు పరివర్తన చెందెడి ప్రపంచమునే నిత్యమని యెంచుచు దాని నుండి దుఃఖమును పొందుచున్నాడు. కారణమేమనగా విశ్వములోని ప్రతి వస్తువు మార్పుకు గురియై దానినపేక్షించు వానికి దుఃఖమును గలుగ జేయుచున్నది. ఇట్టిమార్పు లారు విధములుగా నుండును. అవి ఏమనగా "అస్తి జాయతే వివర్ధతే, విపరిణామతే, అపక్షీయతే, వినశ్యతే" వీటిని షడ్విధవికారములనియు, వీటి కాధారమైన వాటిని అనిత్య వస్తువు లందురు. స్వభావతః అనిత్యముగానున్న వాటిని అజ్ఞుడు నిత్యమని యంచుచున్నాడని యింతకు ముందే చెప్పియుంటిమి. అనిత్యములైన వస్తువులలో వికృతి సంభవించినపుడు విషయలోలుడైన వ్యక్తి ఉద్వేగమును పొందుచున్నాడు. ఈ విధముగా అవిద్యమూలముగా దురవగాహన కలుగుచున్నది. సంసారములోని ప్రతిఒక్కరూ అనంతమైన దుఃఖమును పొందుచునే యున్నారు. విజ్ఞులైన వారు అవిద్య యొక్క స్వభావమునెరిగి నిత్యానిత్య వివేచనను పెంపొందించుకొని ఈ దుఃఖమునుండి దూరము కాగల్గుదురు.

అశుచియందు శుచిబుద్ధిని దాల్చునదే ఒకరకమైన అవిద్య. శుచియనగా పవిత్రమైన మరియు పరిశుద్ధమైనదని యర్థము. అశుచి దానికి విరుద్ధమైనది. అపవిత్రత అపరిశుద్ధత దాని లక్షణములై యుండును. ప్రతిఒక్కరి శరీరము స్వభావతః అశుచికి సంబంధించినదే అయినను అజ్ఞులైన జీవులు దీనిని శుద్ధమైన దానిగనే భావించు చున్నారు. ఇట్టిభావన వలన వెనువెంటనే దుః ఖముకలుగక పోవుచ్చును. ఈ విషయమై యోగశాస్త్రమునందున ఒక సూక్తి కలదు.

**స్థానాత్ బీజాదుపష్టంభాన్ని స్యనందాన్నిధ నాదపి ।**
**కాయమాధేయశౌచత్వాత్ పండితా హ్యశుచిం విదుః ॥ (యోగశాస్త్ర భాష్యము 2-5)**

స్థానము, బీజము, ఉపష్టంభము, స్యందన, మరియు నిధనములు అనెడి అయిదు కారణముల చేత శరీరము అశుచియైనదని చెప్పబడినది. శరీరము వుత్పన్నమయ్యే స్థానము. తల్లి గర్భము. అది మలమూత్రాదులచేత నిండియుండును కదా! అందుచేత దేహము యొక్క జన్మస్థానము అపవిత్రమై యున్నది. ఇదే రీతిగా శరీరము యొక్క ఉత్పత్తికి మూల కారణములైన రేతస్సు, రక్తములు కూడా అపవిత్రములైనవే ఈ రేతస్సు మరియు రక్తము మనము సేవించెడి అన్నము యొక్క వికార రూపములు. ఈ విషయమున తెలుసుకొన వలసినదేమనగా మనము భుజించెడి అన్నాదులు మనశరీరము నందు రస, రక్త, మాంస, మజ్జ, మేధస్సు, అస్థి, శుక్రములను సప్తధాతువులుగా పరివర్తన నొందును, ఒక పాత్ర యందున అన్నమును యుంచినపుడు ఆకాలమున నది పవిత్రముగనే కన్పట్టును. కాలాంతరమున అది అశుచి రూపమును దాల్చును. మొదటి దినమున అన్నము యొక్క శుద్ధమును మరియు సుగంధమును అనుభవించిన వ్యక్తి మూడునాలుగు రోజులు తరువాత పాచిపోయిన మీ అన్నము నుండి బయల్వెడలెడి దుర్గంధమును భరించలేక ముక్కును మూసికొని. దూరముగా విసిరివేయును. ఈ విధముగా పక్వమైన అన్నము మూడు దినములలో అపవిత్రమైన ఎడల దానిని సేవించిన పరిణామ ఫలితముగా కలిగెడి రేతస్సు మరియు రక్తము అపవిత్రము గాకుండా యుండునే. అందుచేత శరీరోత్పత్తికి మూల కారణములైన రేతస్సు మరియు రక్తము అపవిత్రమగుట చేత దేహము గూడా అపవిత్రమైనదే.

శరీరము యొక్క ఉపష్టంబము కూడా అశుచితో కూడుకొనియున్నదే. ఉపష్టంబమనగా ఆధారము. శరీరమునకు రస రక్తాధి సప్తధాతువులే ఆధారములు. ఇవి క్షీణించిన స్థితిలో మనుజుడు నిస్తేజుడు, దుర్బలుడు అగును. వీటిని దేహమునందున సక్రమముగా యుండు విధముగా జాగ్రత్తలు గైకొనిన యెడల తేజస్సు మరియు బలము చేకూర్చుచున్నవి. ఇంతకుముందే చెప్పిన యటుల సప్తధాతువులు అన్నము నుండి కలుగుటచే ఇవియును అపవిత్రమైనవే. ఉపష్టంబన అపవిత్రమైనదగుట చేత శరీరము కూడ అపవిత్రమైనదై యుండును.

శరీరము నుండి బయటకి వెడలు మలమూత్రాదులు అపవిత్రములై యున్నవి. ఈ అపవిత్ర పదార్థములు ఎప్పుడూ శరీరము నుండి బయటకు వచ్చుచుండుట చేత శరీరమంతానివి నిండుకొని యుండును. అందుచేత శరీరము అపవిత్రమైనదై యుండును. ఈ కారణము వలన 'స్వభావ దుర్గంధమిదం శరీరం' అనెడి వాక్కు ప్రచారములోనికి వచ్చినది. స్వాభావికముగా శరీరము దుర్గంధముతో కూడుకొని యున్నదని దీనిలోని అర్థము. శరీరము నందున నెలకొనియున్న దుర్గంధము గురించి గుర్తెరిగిన జీవుడు దీనిని తరచూ శుభ్రము జేసికొంటూ పరిమళ ద్రవ్యములను పూసికొని దుర్గంధమును కప్పిపుచ్చుటకు ప్రయత్నము చేయును. మానవుడెన్ని ప్రయత్నములు చేసిననూ దేహము పవిత్రమగుట లేదు.

కొంతమందికి తమ దేహము నెడల ఎంతో అభిమానముండును. వారు తమ చర్మమును ప్రకాశవంతముగా జేసికొనుటకై బహువిధములైన ప్రయత్నములు చేయుదురు. ఒకవేళ ఆచర్మము లేదని భావించిన యెడల వారెట్టి అందముతో కూడుకొనియుందురో మనము ఊహించగలము. ఇది ఒక మాంసపు ముద్ద వలె గోచరించును. ఈ విషయమున ఒక సుభాషితకారుడును "యదంతస్తద్బహిర్భవేత దండమాదాయలోకోయం శునఃకాకాంశ్చవారమేత్" దేహము మీద చర్మము యొక్క ఆవరణ లేని యెడల తన మాంసమును తినుటకై తనను వెన్నంటి వచ్చెడి కుక్క, నక్క మరియు కాకి మొదలగు వాటి నుండి తనను తాను రక్షించు కొనుటకై ఎప్పుడూ దండపాణియై తిరుగవలసిన అవసరము యుండెడిదని వాపోయిరి. ఈ విధముగా శరీరము అపవిత్రమై యుండిననూ అవిద్య మరియు వ్యామోహముచే ప్రభావితమైన మనుజుడు దేహము యొక్క అశుచి గురించి మరచి దానిని నిరంతరము ప్రేమించుచు దాని మోహములో పడి దుఃఖము నొందు చున్నాడు. 'మరణావస్థ ప్రాప్తమైనప్పుడు జాతస్యమరణం ధృవం' అనెడివారు కన్పట్టుదురు. ప్రాణమున్నంత వరకే శరీరమునకు గౌరవము లభించును. ప్రాణము పోయిన పిదప దీనిని ముట్టటకైనను ముందుకురారు. ముట్టిన యెడల సూతకమగునని. నమ్మి సచేల స్నానము చెసెడి వారెందరో కలరు. ఈ విధముగా దేహమనెడిది అనిత్యమైనదని తెలియు చున్నది.

ఇదే ప్రకారముగా అవిద్యవలన సుఖదాయకమైన వస్తువులు దుఃఖదాయకముగను, దుఃఖదాయకమైన వస్తువులు సుఖదాయకముగను కన్పట్టును. ఈ భావనన చేత మానవుడు దుఃఖమునే పొందుచున్నాడు. శబ్ద స్పర్శాదుల వలన కలిగెడి సుఖము వాస్తవముగా సుఖము కాదనియును అది దుఃఖమేయనియును తెలిసికొనజాలడు. భ్రమకులోనై విషయముల ననుభవించుటకు తహతహ లాడుచుండును. 'ఆపాతరమ్యాహ విషయా ప పర్యంత పరితాపినః' విషయముల వలన వచ్చెడి సుఖము తాత్కాలిక మైనదనియును అవి కాలాంతరమున దుఃఖదాయకమగు చున్నవనియు మహాకవి భారవినుదువులు గమనించ దగినవి. భర్తృహరి "భోగేరోగ భయం" అని చెప్పెను. భోగము వలన రోగములే వచ్చుచున్నవని దీనిలోని భావం.

ఈ చర్చ వలన తేలినదేమనగా మానవుడు భ్రమకు గురియై సుఖ దుఃఖముల వలయములో పడి అనంతమైన దుఃఖములచే నలమటించు చున్నాడు. ఇక ఆత్మ విషయమునకు వచ్చిన యెడల అవివేకులు ఆత్మను అనాత్మగాను, అనాత్మను ఆత్మగాను గాంచు చున్నారు. దీనికి గల కారణము అవిద్యయే. స్థూల శరీరము మొదలుకొని బుద్ధి తత్త్వము వరకు గల తత్త్వములన్నియును అనాత్మరూపములే అవిద్య చేత ప్రభావితులైన అజ్ఞులు సుఖదాయకములగు దేహేంద్రియ మనఃప్రాణముల నాత్మలుగా నెంచి భ్రమకు లోనగు చున్నారు. ఇట్టివారు ఎల్లప్పుడు దుఃఖమునే అనుభవింతురు.

అన్ని క్లేశములకు అవిద్య మేకారణమగు చున్నది.ఇది పంచక్లేశములలో ఒకటైనను వాటిని కూడా ప్రభావము చేసే అవకాశము కలదు. ఈక్లేశము దూరము కావాలనిన శివయోగమే శ్రేష్టమైనట్టి ఉపాయము. అందుచేత శ్రీ రేణుక భగవత్పాదుల వారు శివయోగము వలన గలిగెడి శివ భావన చేత పంచక్లేషాత్మకమైన సంసారమనెడి వృక్షమును నరికి వేయవలెనని ఉపదేశించిరి. శ్రీ భగవత్పాదులవారి ఉపదేశమును అవగతము చేసికొని వీరశైవులు శివయోగ సమాధిని ఆచరించుటకు ప్రయత్నింతురుగాక.

ఓం శాంతిః  శాంతిః  శాంతిః

దిః 11-4 - 1992

స్థలం : జంగమ వాడి మఠము, వారణాసి

## విశేషప్రదీపిక

శివయోగ సమాధి స్థలము గురించి ప్రదానము చేయబడినట్టి యీ మూడవ ఆశీర్వచనము సంసార వృక్ష చ్ఛేదనోపాయముల గురించిన విశ్లేషణకై యుద్దేశింపబడినది. శ్రీ కాశీజగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు యోగ సూత్రముల నాధారముగా గొని సంసార మనెడి విష వృక్షము యొక్క స్వభావమును విశ్లేషించిరి.

సంసార మనెడి విషవృక్షమును ఆగమోక్త విధిన విశ్లేషించ వచ్చునని తెలియుచున్నది. శివాను భవసూత్రము ప్రకారము ప్రాణలింగము భోగాంగమునకు చెందిన అంశమనియును, దీనికి సూక్ష్మశరీరముతో సంబంధ ముండుననియును, తెలియుచున్నది. (శివానుభవ సూత్రము, 4:11-17) ఈ అంగము శుద్ధాశుద్ధ (మిశ్ర) తత్త్వములతో సంబంధము గల్గినదై యుండును. షట్ త్రింశత్ తత్త్వములలోని మిశ్ర తత్త్వముల యుందున పురుష తత్త్వము గలదు. శుద్ధ తత్త్వములలోని శుద్ధ విద్య ప్రవృత్తి మార్గమున మాయయై శివుని పురుషునిగా జేయు చున్నదని శివాగములలో తెలుపబడినది. ఈ పురుషుడు పంచకంచుకముల చేత నా వృతుడై యుండునని చెప్పబడినది. కళ, విద్య, రాగ, కాల, నియతులే ఈ పంచకంచుకములు, శ్రీ బాడాల రామయ్య విద్య గురించి చెప్పక అవిద్య గురించి చెప్పిరి. (శ్రీ బసవేశ్వర వచనముల సమగ్ర సమీక్ష, త. జ. విద్యాసంస్థ, సిరిగెరె, 1976, పుట. 313). విద్యనే అవిద్యగా చెప్ప వచ్చును. ఈ పంచకంచుకముల ప్రభావమునకులోనై "పురుషుడు సంసారి యయ్యెనని" తెలుపబడినది. ఈ పంచ కంచుకములను శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు, పూర్వపీఠికలో పంచతత్త్వములని గుర్తించిరి. (శ్రీ. సి.శి.వ.ప్ర. శ్రీ జగద్గురు పంచాచార్య మానవ ధర్మ సంస్థ, 2006, పుట 6), శ్రీ వారు గుర్తించిన యీ పంచతత్త్వములే సంసారమనెడి విషవృక్షమునకు గల పంచ పత్రములు. శివభావ మనెడి గొడ్డలితో సంసారమనెడి వృక్షమును కూల్చివేయ వలెననెడి శ్రీ రేణుకభగవత్పాదుల బోధన ననుసరించి సాధకుడు నూర్ధ్వగామియై మిశ్ర తత్త్వముల నధిగమనించ గలడని తెలిసి కొన గలరు. పంచతత్త్వము నశించి పోయి, సాధకుడు భోగాంగమును వీడి, యోగాంగి యగుననెడిదే తెలిసి కొనవలసిన విషయము.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 4

## శివయోగ సమాధి స్థలము

ఇంతకు క్రితము అవిద్యా విషయకమైన విషయ సంచయమును తెలిసికొనియుంటిమి. పంచక్లేశములలో ఇది ముఖ్యమైనదని ఎరిగియుంటిమి. అవిద్య చేత పీడితులయ్యెడి వ్యక్తులను ఉద్ధరించుటకే శ్రీ జగద్గురువులవారు శివయోగ సమాధిని సూచించి యుండిరి.

పంచక్లేశములలో అస్మిత అనెడిది రెండవది ఆత్మబుద్ధి తాదాత్మ్యముతో అహం అహం అని అహంకారించునదే అస్మిత యగుచున్నది. పతంజలి మహర్షి అస్మిత యొక్క లక్షణములను తెలుపుతు "దృక్ దర్శన శక్త్యో రేకాత్మ తేవాస్మితా" అని తెలిపిరి (యోగ సూత్రము 2-6) దృక్ శక్తి అనగా పురుషుడు లేక ఆత్మ దర్శన శక్తి యనగా బుద్ధి పురుషుడు చిద్రూపుడై యుండుట చేత అతడు దృష్టు డయి యున్నాడు. ప్రపంచముయొక్క దర్శనమునకై బుద్ధియే ముఖద్వారమై యుండుట చేత దానిని దర్శన శక్తియని యందురు. ఈ విధముగా పరస్పర భిన్నములైన 'చిత్' జడరూపములైన ఆత్మ బుద్ధుల తాదాత్మ్యముచే ప్రతీయమానమైన అహంకారమే అస్మిత యనబడుచున్నది. అస్మిత వలన సుఖ దుఃఖముల యనుభవమును పొందవలసిన అవసర ముండును. సుఖ దుఃఖముల భోగము బుద్ధి యొక్క ధర్మమైనను, ఆ బుద్ధితో తాదాత్మ్యము పొందిన ఆత్మకు కూడా అవి అనుభవవేద్యము నగుచున్నవి. అట్టి స్థితి వలన దుఃఖమును అనుభవించే స్థితికి జీవి తేబడుచున్నాడు. ఈ అస్మిత వలన ఆత్మ 'అహమస్మి' (నేను ఉన్నాను), అహం సుఖి (నేను సుఖముగా ఉన్నాను), అహం దుఃఖి (నేను దుఃఖితుడ నై యున్నాను), అహం కర్తా (నేను కర్త నై యున్నాను), మరియు అహం భోక్తా (నేను అనుభవించెడివాడనై యున్నాను) అనెడి భావములు పొందుచున్నది.

అహంకారమనెడిది ఇతరుల నుండి దొరికెడి మాన, సన్మాన మరియు స్తుతుల చేత పోషింప బడుచున్నది. ఈ మాన, సన్మానములునెప్పుడూ లభించెడివి కావు. ఎప్పుడు ఇవి లభించవో అప్పుడు అహంకారమునకు దెబ్బ తగిలి జీవుడు దుఃఖమును ఎదుర్కొను చున్నాడు. స్తుతి అనెడిది అహంకారమునకు ఆహారమై యున్నది. ఈ ఆహారమే ఆనందమును కలిగించు చున్నది. అయితే ఎవరైనను నిందచేసిన ఎడల దుఃఖము సంప్రాప్తమగుచున్నది. ఈ ప్రపంచమునందు స్తుతి చేసెడి వారి కంటెను నింద చేసెడి వారి సంఖ్య నధికముగా నుండును. తత్ఫలితముగా అహంకారము దెబ్బతిని జీవుడు నిరంతరము దుఃఖమునే అనుభవించు చున్నాడు. ఈ అస్మిత ఎంతో ప్రమాదికారిగా పరిణమించి భవ బంధముకు దారి తీయుచున్నది.

రాగమనెడిది మూడవ కోవకు చెందిన క్లేశము. సుఖ భోగానంతరము అంతఃకారణము నందున మిగిలిపోయెడి అభిలాశా విశేషమే రాగమని యెరుగవలెను. పతంజలి మహర్షి 'సుఖాను శయీ రాగః' (యోగ సూత్రము 2-7) అని రాగము యొక్క లక్షణమును ప్రతిపాదించిరి. దీని తాత్పర్యమేమనగా, తాను పూర్వ మందు ననుభవించిన సుఖము యొక్క స్మృతి చేత గలిగిన తృష్ణా భావమే రాగము. మనుష్యుడు ఎప్పుడూ ఎంతటి సుఖము ననుభవించునో అప్పుడు అతడి మనస్సు నందున సుఖము యొక్క సంస్కారము మరియు ఆ సుఖమునకు కారణీభూతములైన సాధనముల సంస్కారము గలుగు చున్నది. కాలాంతరము నందు యా సంస్కారము చేత పూర్వాను భూతుల సుఖము యొక్కయూ దానికి సంబంధించిన సాధనముల యొక్కయూ అవశ్యకత కలదనెడి భావము కలుగు చున్నది. ఇదియే రాగమని ఎరుగవలెను. మనస్సు కెమరా నందు గల ఫిల్ము వంటిది. దృశ్యమును దర్శించినను మనస్సు నందు శాశ్వతముగా ముద్రింపబడు చున్నది. ఆ ఫిల్ము చేత ఎన్నో కాపీలను తీసుకొన వచ్చును. మనస్సు మీద నొక చిత్రము బింబించిన యెడల అది చెదిరిపోక సదా సంస్కార రూపములో నిలిచి పోవును. కాంచిన వస్తువులు లేక వ్యక్తులు, వినిన మాటలు మనస్సు నందున ఎంతో కాలము వరకుండి వాటి స్మృతికి కారణములగు చున్నవి. "సంస్కార జన్యం జ్ఞానం స్మృతిః" అని శాస్త్ర కారులు స్మృతి యొక్క లక్షణమును ప్రతిపాదించిరి. మనస్సు మీద ఒకసారి గలిగిన సంస్కారము కాలాంతరమున మరల మరల స్మృతికి వచ్చుచున్నది. మనస్సు తనకు గలిగిన సుఖ సంస్కారములను సురక్షితముగా నుంచుకొని స్మృతిమూలక పూర్వాను భూత సుఖమును మరల మరల అనుభవించాలని కోరుచుండును. ఇట్టి అభిలాషనే రాగమగును. ఇది ఒక సుఖాను భావమును వెన్నంటియే యుండును. ఒక సుఖమును ఎన్ని మార్లు అనుభవించినను తృప్తియనెడిది కలుగ నేరదు. అందుచేత జీవనము యొక్క చివరి క్షణము వరకు మనుజుని మనస్సున అనురాగము నిలిచి యుండును. ఈ స్మృతి వలన మరల మరల జన్మించుచూ యుందురు. ఈ విషయము గురించి శ్రీ నిజగుణశివయోగలవారు "రాగ దిం వేరిన్ను భవబీజ ముంటె" రాగము కంటె వేరొక భవబీజముండునా అని ప్రశ్నించిరి.

జీవులు భవమునందున రావలసిన యెడల రాగ మొకటి యుండిన చాలును. ఏదోయొక ప్రదేశమునకు గాని ఏదో యొక వ్యక్తి వద్దకు గాని ఎవరైనా యొకడు పోవుచుండిన యెడల అతని కావ్యక్తి పైనను లేదా స్థలము పైనను అనురాగము గలదని గ్రహించవలెను. ఈ రాగము నుండి విముక్తులు కావలసిన ఎడల భగవంతుడు ఇచ్చిన నూరు సంవత్సరముల ఆయువులో నయ్యది సాధ్యముకాదు. అయితే ప్రయత్న పూర్వకముగా అనురాగము నుండి విముక్తి బడయ వచ్చును. లేనిఎడల జీవి భవబంధములో బడి తిరుగుతునే యుండును.

సంస్కారముల మీద ఇంతటి అనురాగము గలిగన వ్యక్తి అల్ప సుఖమునే అనుభవించు చున్నాడు. ఈ సుఖమును గురించిన విషయమును వివరించెడి సుభాషితమును గనుడి.

**రాత్రిర్గమిష్యతి భవిష్యతి సుప్రభాతమ్ భాస్వాను దేష్యతి పంష్యతి పంకజశ్రీః ।**
**ఇత్థం నిచింతయతి కోశగతే ద్విరేఫే హా హంత! హంత ! నలినం గజ ఉజ్జహార ॥**

కమలము మీద అత్యంత అనురాగియైన భ్రమరము ప్రతి సాయంకాలమున కమలములోని మకరందమును గ్రోలుటకై సరోవరమునకు వచ్చి వికసితమైన కమలమునందు కూర్చుండి మకరందమును ఆస్వాదించ జొచ్చినది. ఈ లోగా సూర్యాస్తమయము అయ్యెను. కమలము తనదళములను మూసికొనెను. కమలమును ఛేదించి బయటకు వచ్చేడి సామర్థ్యము గలియున్ననూ కమలము మీదనున్న అనురాగము చేత భ్రమరము కమలములోనే నిలిచియుండెను. రాత్రి గడిచి సూర్యోదయ వేళ కమలము విచ్చు కొనినప్పుడు యా కమలము నుండి ఎగిరిపోగలనని ఆలోచించెడి లోపునే ఒక ఏనుగు వచ్చి జలక్రీడను చేయుచు కమలములను తన తొండముతో పీకి చిత్తు చిత్తుగా చేయగా యా తుమ్మెద కూడా వాటితో బాటు చిత్తు చిత్తయ్యెను. ఈ ఉదాహరణ సాంకేతికముగా రాగం యొక్క ఫలితమును చూపు చున్నది. విషయా సక్తి కలిగిన భ్రమరము, భ్రమలో పడి ప్రాణము మీదకు తెచ్చుకొనెను కదా!

పంచక్లేశములలో చివరిది ద్వేషము పతంజలి ప్రకారము 'దుఃఖాను శయీ ద్వేషః' (యోగ సూత్రము 2-8) అని ద్వేషము యొక్క వ్యుత్పత్తిని ప్రతి పాదించిరి. దుఃఖమునకు కారకుడగు వ్యక్తి లేదా వస్తువు గురించి మనస్సునందు గలిగెడి క్రోధ భావమే ద్వేషము. ద్వేషము రాగము యొక్క మరొకరూపము రాగమునకు ప్రతిబంధక మేర్పడినప్పుడు క్రోధ యావిర్భవించును. అందు వలన రాగద్వేషములు ద్వంద్వములన బడుచున్నవి. ఆకలిదప్పులు, జనన మరణములు, రాగద్వేషములు ఒకే కోవకు చెందినవి. ఇవి వేర్వేరుగా నుండక రెండూ కలిసి యే యుండును. అందుచేత పంచక్లేశములను ప్రతిపాదించేటప్పుడు, రాగద్వేషములను ఒక క్రమములో చెప్పుదురు. ఒక నాణెమునకు రెండు వైపులు నుండు నటులనే రాగద్వేషములు కూడా ఒకే అంశము యొక్క రెండు రూపులు. ద్వేషము వలన వ్యక్తి దుఃఖమునే చవిచూచు చున్నాడు. ద్వేషమునకు జ్వలన స్వభావము కలదు. అగ్నివలె ఇది దహించి వేయును. క్రోధాగ్ని కూడా నట్టిదే. ఎదుటివాడి కొరకు ఉద్దేశించబడిన క్రోధము వలన ఎదుటివాడు దగ్దమగుట కంటె. ముందు గనే క్రోధి దగ్ధమగు చున్నాడు. అతడి అంగ, ప్రత్యంగములు తాపములకు గురియగు చున్నవి. క్రోధమునకు కారకులైన వారికి హానిని తలపెట్టుటకు ముందే క్రోధి తనకు తానే హానిని కలిగించు కొనుచున్నాడు. మన ఇంటికి అంటిన నిప్పు మన ఇంటినే కాకుండా పక్కవారింటిని కూడా భస్మము చేయునటులే క్రోధి అయిన వాని వలన వాని అనుచరులు, సహచరులు దుఃఖమును పొందుచున్నారు. ఈ కారణము వలననే ద్వేషియైనవాడు తనకు తానే వైరి యనెడి వాక్కును శాంతుడు పరులకు శతృవనియును తెలుప బడుచున్నది. మరొక మాటలో చెప్పాలంటే "తన కోపమె తన శతృవు తన శాంతమె తనకు రక్ష." ఈ కారణము వలన జగద్గురువుల వారు పంచక్లేశములను వదిలి వేసి ప్రశాంత చిత్తుడై యుండవలయునని భక్తునికి ఉద్బోధించిరి. ఆ పిదప భక్తుడు అంతర్ముఖియై శివయోగ సమాధిని సాధించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 12-4 - 1992

స్థలం : జ్ఞాన మందిరము - జంగమ వాడి మఠము వారణాసి

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వాదము నందు శ్రీ గురు దేవులు క్లేశత్రయము గురించిన వివరముల నిచ్చి అస్మిత రాగద్వేషములే క్లేశత్రయమని తెలిపిరి.

అస్మిత గురించి తెలుపుచు శ్రీ గురువు గారు అస్మిత యనెడిది యహంకార రూపమున బహిర్గతమై జీవిని క్లేశములకు గురి చేయునని తెలిపిరి. అహంకారాభి మానముల వలననే శివుడు జీవుడగు చున్నాడు. శుద్ధ తత్త్వములలో నుండెడి సమిష్టి అహం మాయా ప్రభావమునకు లోనై అశుద్ధ తత్త్వమై వ్యష్టి అహంకారమగు చున్నది.

వ్యష్టి అహంకార మంతః కరణములలో నొకటి సుఖ దుఃఖాద్యంతరిక వ్యవహారమునకు కారణభూతమైన వగుటచే "బుద్ధ్యహంకార మనుస్సు లంతః" కారణములనిపించి కొనుచున్నవి. ఇవియే కర్మకుమూలమై నిలిచెడి కారణములు వీటి వలననే సంసార బంధములేర్పడు చున్నవి.

రాగ ద్వేషములు అంతః కరణముల వలన గల్గుచున్నవి. సంకుచితమైనట్టి అర్థములో క్లేశమనగా రాగ-ద్వేషములే. వాస్తవ దృష్టితో పరిశీలించిన యెడల రాగ ద్వేషములు భిన్నముగా నుండెడి రెండంశములు కావు. రాగము నకారాత్మక రూపమే ద్వేషము. తాత్త్వికముగా పరిశీలించిన యెడల నన్యోన్యాభావ భేద లక్షణసమన్వితమైన మాయామలము పురుష తత్త్వము నావరించి యతనిలో రాగ-ద్వేషములను కల్గించు చున్నవి. మిశ్ర తత్త్వంలోని రాగము ప్రభావము వలన స్త్రీకి-చందన- వనితాదుల యందున నాసక్తిని పెంచి కొనును. ఈ ఆసక్తి వలననే రాగము జనించును. విషయోప భోగ క్రమములో గల్గెడి సాధక-బాధకములే ద్వేషమును గల్గించును. రాగ-ద్వేషములకు లోనైన వాడు విహితా విహితముల విచక్షణను కోల్పోయి విద్యుక్త కర్మల నాచరించుటలో విఫలుడై దోషకరుడగు చున్నాడు. నిషేధితములైన కర్మల యెడల నాసక్తిని పెంచికొని. వాటి నాచరించి పాప కర్మియగు చున్నాడు. అతడు చేసెడి పాపకర్మల వలన కర్మ బంధములు బిగిసి పోయి జనన-మరణ చక్రబంధమున చిక్కికొని దుఃఖముననుభవించు చున్నాడు.

అహంకార-రాగ-ద్వేషములనెడి యీ మూడు పత్రములు శివభావన యనెడి గొడ్డలి చేత సంసారమనెడి విష వృక్షము నరకబడినప్పుడు నశించి పోవు చున్నవి. ప్రాణలింగి స్థలములోని సాధకుడు శ్రద్ధా భక్తి, నిష్ఠాభక్తి, అవధాన భక్తి నాచరిస్తూ తాను గడించిన యనుభావము నాధారముగా గొని శివ భావ వైభవోన్నతిని గడించి, సంసారమను మాయా వృక్షమును చేదించి యనుభావ భక్తి నాచరించుచు తన యనుభూతికి పుష్టినివ్వ వలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 5

## శివయోగ సమాధి స్థలము

క్రిందటి యాశీర్వచనములలో పంచక్లేశములలోని నాల్గింటిని గూర్చి తెలిసికొంటిమి. ఇప్పుడు ఐదవదగు నభినివేశము గూర్చి తెలిసికొందము. పతంజలి "స్వరసవాహీవిదుషోఽపి తథారూఢోఽభి నివేశః" (యో.సూ. 2-9) అనుయోగ సూత్రము వలన అభినివేశము యొక్క లక్షణమును తెలిపెను. అనేక జన్మలలో ననుభవించిన మరణ దుఃఖముల వలన గల్గెడి భయము జీవిని వెన్నంటి యుండును. ఇట్టి మరణానుభవము వలన వచ్చెడి సంస్కారమే 'స్వరస' ఈ సంస్కారము వలన గల్గెడి భయమే యభినివేశము.

ప్రతి జీవికి మరణ భయముండును. వేలకువేల సంఖ్యల తేళ్ళు యేక కాలమున కుట్టిన యెడల యెంత వేదన గల్గునో అంతకంటె నధికమైన వేదన మరణము వలన గల్గునని విజ్ఞులు తెలిపిరి. సంప్రజ్ఞాత సమాధిని బడిసిన శివయోగులను మినహాయించి మిగిలిన ప్రతి యొక్కరికిని యీ భయము తప్పని సరిగా ఉండును. "జాతస్య హిధ్రువో మృత్యుః" (సి.శి. 5-64) జనన-మరణములు శరీరము సహజ ధర్మములు అని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి. వీరశైవ ధర్మమును స్వీకరించని వానికి "ధ్రువం జన్మ మృతస్యచ" అని తెలుపబడినది. జనన-మరణ చక్రమున బందింపబడి భాధకులోనయ్యెడి వానికి మరణాను భవము పలు పర్యాయములు ననుభవములోనికి వచ్చును. అందుకే, మరణమనెడి పేరు వినగానే దేహి గడగడ వణకును.

భయమునకు కారణమైన మరణాను భవము నెవ్వడు గుర్తించి తెలిసికొన జాలడు. కాని పూర్వ జన్మలలోని యనుభవము వలననే యీ భయము గల్గు చున్నది. లక్షకొలది మరణములను చవిచూసిన జీవికి యీ మరణముల వలన సంస్కారమేర్పడునని తెలిసికొని యుంటిమి. ఇదియే మరణ భయమును గల్గించునని గుర్తించ వలెను. ఈ కారణముననే వ్యక్తి తనకు మరణము రాకూడదని కోరి కొనును. అయితే మనమెంత వేడినను, మృత్యువు మనలను వీడదు కదా!

మృత్యువనెడిది శాశ్వతమైన యంశములలో నొకటి. దీనికి గల శాశ్వతత్వము మరే దానికిని యుండదు. విద్య ఐశ్వర్యము మరియు నధికారములను గోరిన వానికి లభించే యవకాశ ముండిననూ, అవి తప్పని సరిగా లభించుననెడి నియమేమియును లేక మన భాగ్యాను సారముగా లభించు చున్నవి. మృత్యువు అని వార్యముగా అభించెడిది. దానిని తప్పించి కొనుట యనెడి దెవ్వరికిని సాధ్యము కాదు. ఎంత దూరము పారి పోయిననూ, అది మనలను వీడదు. ఈ విషయమును వివరించెడి కథ యొకటి.

పూర్వకాలమున యొక రాజ్యమును పాలించు రాజేంద్రుడికి మరణమనిన భయము గల్గు చుండెను. ఒక దినమున నతడొక హంసతూలికా తల్పమున. నిదురించు చుండెను. నిదురలో నొక భయానకమైన కలగనెను. ఒక భయంకరాకారము రాజును సమీపించెను. దీర్ఘకాయుడు, భయంకరమైన కోరలు గలవాడు, మేఘవర్ణుడగు నా భయంకరాకారము రాజునుద్దేశించి, "ఓయీ రాజా! నీకు మరణ

కాలమాసన్నమైనది. రేపు సాయంకాలము సంధ్యా సమయమున నేను నీ ప్రాణమును తీసికొని పోయెదను. నీవు సిద్ధపడియుండుము అని సూచించెను. భయ భీతికి గురియైన రాజుకు మెలుకువ గల్గి అది వేకువ సమయమని గ్రహించెను. వెంటనే లేచి, కాలకృత్యములను ముగించికొని, రాజు జ్యోతిష్యుని రావించి, గడిచిన రాత్రి తాను గాంచిన కల గురించి తెలియజెప్పెను. అప్పుడా జ్యోతిష్యుడు రాజుతో "రాజా! వేకువన వచ్చెడి కలలు నిజముగా పరిణమించునని పెద్దలు చెప్పుదురు. వచ్చినది మృత్యువే అయియుండును. నేటి సాయం సమయమున నీవు జాగరుకుడవై యుండవలె. ఈ సమయము దాటినచో మీకు భయముండదు. మీరు రాజమందిరమున నుండ వలదు. మృత్యువు వచ్చి వెడలి పోయిన పిదప మీరిక్కడికి దయచేయవలెను." అని సలహా నిచ్చెను.

రాజు కీ సలహా నచ్చి ఒక మంచి గుర్రమును తెప్పించికొని దాని నధిరోహించి శరవేగముతో బయలు దేరి వెడలెను. సాయం సమయము ప్రయాణము చేయు చునే యుండెను. క్రమక్రమముగా రాజ్యము సరిహద్దులను దాటి వెడలెను. అప్పుడతడు బడలిక చెందిన వాడై ఒక చెట్టుకడ విశ్రాంతిని గైకొన నెంచెను. అక్కడ నొక ఆసనము నేర్పాటు చేసికొని కూర్చొని సేద తీర్చికొను చుండెను. అకస్మాత్తుగా ఎవ్వరో అతని భుజమును తట్టి పిలవగా అటువైపు చూసి తాను కలలో గాంచిన భీకరాకారమే యిచ్చటికి వచ్చెనని గ్రహించెను. చేయునదేమియును లేక ముఖమును తేలవేసెను. అప్పుడా మృత్యువు ఓయీ రాజా! నిన్నిక్కడికి రప్పించుటకే నేను నీకు కలలో దర్శన మిచ్చితిని. మృత్యువు నుండి తప్పించి కొన నెంచితివే? నీ వెంత అవివేకివి అనుచు రాజు ప్రాణమును తీసికొని వెడలి పోయెను. రాజు నిర్జీవుడై పడియుండెను.

భౌతికముగా చూసిన యెడల ప్రతి వస్తువు లేదా జీవి భావ వికారములకు గురికావలసినదే. షడ్భావ వికారములలో నాశనమొక్కటి. నాశనము కాకుండ యుండెడి దేదియును లేదు. శరీరము కూడ నట్టిదే. ఇది ప్రకృతి నియమము. యోగి గాని భోగికాని దేహమును వీడ వలసినదే. వంద సంవత్సరములకు మించిన బ్రతుకు బ్రతక వచ్చునేమో! యోగుల కది సాధ్యమగునని యందురు. ఎంత కాలము బ్రతికినను, మరణము పొందవలెను. హనుమంతుడు, అశ్వత్థామ చిరంజీవులందురు. మార్కండేయు డట్టివాడే. యిచ్చట గ్రహించవలసిన విషయమేమనగా చిరంజీవి యనగా చిరకాలము జీవించి ప్రఖ్యాతుల నార్జించిన వాడనియే కాని మృత్యుంజయుడని కాదు. శివుడొక్కడే మృత్యుంజయుడు. జీవి శరీరమును వీడవలెననెడిది నియమై యున్నది. చిరంజీవులైనను కల్పాంతమున ప్రళయము నందున నశించెడి వారే.

చచ్చిన వారిని బ్రతికెంచెడి మహిమలు గలవారుందురని మనము విను చున్నాము. అద్దైననూ ఒకానొక సమయమున మరణమును నొందుదురు. మరణము భయానకమైన దందురు. ఇది నిజమే కాని దీనికంటెను భయానకమైనది మరణ భయము. మరణము వచ్చెడి భయముతో చచ్చెడి వారెందరో గలరు.

ఇంత వరకు పంచక్లేశముల గూర్చి తెలిసికొంటిమి అవిద్య, అస్మిత, రాగ, ద్వేష మరియు అభినివేశములు జీవికి భాధాకరముగా పరిణమించును. వీటివలన అధిగమింప జాలని యతి క్లిష్టమైన పరిస్థితు లేర్పడి దుఃఖదాయకములగునని వేరుగా చెప్పనవసరము లేదు. ఈ స్థితిని యెదుర్కొనెడి మార్గమే "శివోఽహం" అనే భావనతో నాచరించెడి శివ యోగ సమాధి. శివోఽహం అనెడిది గొడ్డలి వంటిదనియును, సంసారమనెడి విషవృక్షమును కూల ద్రోయుట కిది సాధన మనియును గుర్తించ వలెను. వృక్షము కూలినచో నావృక్షమునకు పల్లవములగు పంచక్లేషములు కృషించి నశించును. ఈ సమాధి యందు భక్తుడు తాను శివునని భావించి కొనుటచే శివజ్ఞానము లభించును. శివజ్ఞానము వలన నేను, నాది యనెడి భావములు నశించి శివుడు, శివునిది యనెడి భావము గల్గును. అహంకార మమకారములు గల వారినే పంచ క్లేశములు పీడించును. అవి లేని వారినవి యేమియును చేయలేవు.

శివయోగ సమాధిన నున్న భక్తునకు శివ ధ్యానము ఎంతో ముఖ్యమైనదని తెలియు చున్నది. ఈ విషయమును వివరించెడి శ్రీ జగద్గురువుల వారి యీ క్రింది యుపదేశమును గనుడి.

**అజ్ఞాన రాక్షసోన్మేష కారిణః సంహృతా త్మనః ।**
**శివధ్యానంతు సంసారశ్చండ భాస్కరః ॥**

కనులు తెరచిన రాక్షసుని వంటిదియును, ఆత్మను ఆవరించి యున్నట్టిదియును, అంధకారము వంటిదగు అజ్ఞానమును దూరము చేసికొనుటకు చీల్చి చెండాడునది శివజ్ఞానమని యెరుగ వలెను. శివజ్ఞానము వలన శివయోగ సమాధి పరిపూర్ణమగును. ఈ విషయము గుర్తెరిగి భక్తులు శివధ్యానము చేయుచు, శివ యోగ సమాధి నాచరించి సుఖులై యుందురు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దిll 13-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురువుల వారు మరణభయము గురించి యెంతో వివరముగా తెలిపిరి. చావు బారి నుండి తప్పించి కొనుట దుస్సాధ్యమైన విషయమని తెలుపుటకై శ్రీ వారొసంగినట్టి యుదాహరణ చిరస్మరణీయమైనది.

శివుడు నిత్యుడు, మాయాతత్త్వము యొక్క ప్రభావానికి లోనైన శివుని నిత్యతత్త్వము సంకోచమైనదై కాల తత్త్వముగా మారును. దీని ప్రభావము వలన పురుషుడు కాలగణనకు బద్ధుడై పోవును. భూతవర్తమాన భవిష్యత్తులు గలవనెడి భావన పొందు చున్నాడు. కాల తత్త్వ ప్రభావము వలన జనన-మరణముల చింతన గల్గుచున్నది. ద్వైత భావమున్నంత వరకు మరణ భయములు వెన్నంటియే యుండును. ప్రాణలింగి స్థలములోని సాధకుడు మిశ్రతత్త్వమైన కాల తత్త్వ ప్రభావమునకు లొంగి పోక సాధనను కొనసాగించ వలెనని చో, తాను జీవుడ ననెడి భ్రాంతిని వీడవలెను. ఈ విషయము సూక్ష్మాగమములో వివరింప బడినది. "త్యక్త్వా జీవభ్రమం భూయో లింగాత్మా ప్రాణలింగకః" (పుట. 59, శ్లోll 35), జీవ భ్రమ తొలగించుటకై శివ భావనయే మూలాధారమైన సాధనమగును, శివభావన యనగా శివత్వ భావన, శివత్వ భావన సుస్థిరమైనది అయినప్పుడు సాధకుడు తానే శివుడననియును, కాలము తనను బంధింప జాలదనియును, కాలాతీతుడగుట చేత తాను మృత్యుంజయుడ ననియును, భావించి కొనును. ఈ విధమైన మనోవృత్తితో సాధన కొనసాగించు సాధకుడు మరణ భయము నధిగమించ గలడు.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## లింగ నిజ స్థలము

ఇంతకు క్రితము ఆశీర్వచనమున శివయోగ సమాధి గురించి తెలిసికొని యుంటిమి పరాత్పరమైన పరబ్రహ్మలింగము మహాలింగ రూపమున మన యందుననే యుండునని తెలిపెడి స్థలమే లింగ నిజస్థలము. ఈ స్థలమున పరాత్పర లింగము మని నిజరూపముగా నుండునని బోధింపబడినది ప్రతి యొక్కరి నిజస్వరూపము లింగరూపమే అయివున్నది. దీనిని యెరుగని జీవులు బహిర్ముఖులై పరిభ్రమించి లింగ తత్త్వమును గానక దుఃఖ భాజనమైన సంసారములో తిరుగాడు చున్నారు. ఇట్టి మనుజుల యొక్క మనోవృత్తిని అంతఃర్ముఖము చేయుట కొరకే పతంజలి ఋషి యోగ శాస్త్రమును రచించిరి. 'యోగః చిత్తవృత్తి నిరోధః' అని పతంజలి యోగ లక్షణమును ప్రతిపాదించిరి. మనస్సులోని ప్రవృత్తులన్నింటినీ నిరోధించుట యోగము కాదు. క్లేశదాయకమైన క్లిష్టవృత్తులను మాత్రము నిరోధించుటయే యోగము. చిత్తవృత్తి ప్రమాణవృత్తి విపర్యవృత్తి, వికల్పవృత్తి, నిద్రావృత్తి మరియు స్మృతివృత్తిగా అయిదు విధములుగా నుండును. వీటిలో క్లిష్ట మరియు అక్లిష్ట భేదములచేత చిత్తవృత్తులు పదిరకములుగా నుండునని విభజింపబడినవి.

'క్లేశమూలా క్లేశఫల్లాచ వృత్తిః క్లిష్టా' అనెడి నిర్వచనము ప్రకారము ఏ వృత్తి క్లేశమూలము, క్లేశఫలదాయకము అయ్యిందునో అది యే క్లిష్టవృత్తి అనబడుచున్నది. క్లేశమునకు మరియు క్లేశ ఫలమునకు కారణ భూతము కాని వృత్తులను అక్లిష్ట వృత్తులని అందరు. ఏ వృత్తుల చేత మనకు క్లేశము కలుగునో వాటిని మాత్రమే నిరోధించ వలెననెడిది పతంజలి మహర్షిగారి ఆశయమై యున్నది. పంచజ్ఞానేంద్రియములు మరియు మనస్సును ఆరు యింద్రియములు అందురు. ప్రపంచ విషయమైన ప్రమాణజ్ఞానము చేత మనుష్యునికి నిరంతరము క్లేశమేగలుగు చున్నది. అందుచేత ఈ జ్ఞానమునకు క్లిష్ట ప్రమాణజ్ఞానమని పేరిడబడినది. ఇంకను ఆత్మ సాక్షాత్కార

రూపమైన ప్రమాణ జ్ఞానము చేత ప్రతి ఒక్కరికి ఆనందమే ప్రాప్తమగుట చేత ఆ ప్రమాణ జ్ఞానమునకు అక్లిష్ట ప్రమాణ జ్ఞానమను పేరు. ఈ విధముగా ఆత్మ జ్ఞానాకార వృత్తి అక్లిష్ట ప్రమాణమగును. ప్రపంచాకార వృత్తి క్లిష్ట ప్రమాణమగును. మహర్షి పతంజలి ఆదేశ ప్రకారము క్లిష్టదాయకమగు ప్రపంచాకార వృత్తినే సాధకుడు నిరోధించవలెను.

విపర్య లేదా విపరీత జ్ఞానమునకు కారణ భూతమైన వృత్తిని విపర్య వృత్తి అని అందురు. దీని వలన జీవి వున్న వస్తువును మరచి లేని వస్తువు యొక్క జ్ఞానమును పొందు చున్నాడు. తాడునందు కనిపించెడి పాము, మోడు బారినచెట్టును చూచి దొంగయనెడి భావము యివన్నియును విపర్య జ్ఞానము యొక్క ఉదాహరణములు. వీటి వలన కూడా జీవి దుఃఖమునే అనుభవించు చున్నాడు. ఈ కారణమున విపర్య వృత్తి క్లిష్ట వృత్తి యగు చున్నది. ఒక బండరాయి నుండి నిర్మించ బడిన దేవతా విగ్రహము నందు దేవత్వ బుద్ధిని అపాదించునది కూడా ఒక విధమైన విపర్య వృత్తియే. అయితే ఆశిలా విగ్రహము నందున శివతత్వ భావనతో ఆరాధించునప్పుడు ఆరాధకునికి సుఖ సమాధానములు సంప్రాప్తమగు చున్నవి. కాన విపర్య వృత్తి క్లిష్టదాయకము కాదు. ఏ విపర్య వృత్తులు క్లిష్టదాయకములు కావో వాటిని అక్లిష్ట విపర్య వృత్తులు అనవచ్చును. ఈ విపర్య దృష్టి మూలకముగా సాధకునికి స్థూల తత్వము నుండి సూక్ష్మ తత్వము కడకు వెడలుటకు అనుకూలమైన పరిస్థితి ఏర్పడును. అందుచేత రజ్జు సర్పాత్మకమైన క్లిష్ట విపర్య వృత్తిని మాత్రవేు యోగి యైనవాడు నిరోధించ వలెనని గుర్తించ వలెను. వికల్పమనగా ఒక రకమైన మనోరాజ్యమే. మనస్సు యెల్లప్పుడు ఏదో ఒకటి చింతించు చుండును. ఇట్టి చింతనయే వికల్పము లనవచ్చును. ఈ వికల్ప వృత్తి కూడా రెండు విధములుగా నుండును. ఒకటి క్లిష్ట వికల్పవృత్తి రెండవది అక్లిష్ట వికల్ప వృత్తి సంసార విషయకమై ఏ వికల్ప వృత్తి పయనించి మనుష్యునికి దుఃఖదాయకమగు చున్నదో అట్టి వికల్పవృత్తిని క్లిష్ట వికల్ప వృత్తి యనియును. దీనికి విరుద్ధమైనది, అక్లిష్ట వికల్పవృత్తియై యుండును క్లిష్ట వికల్ప వృత్తి వలన జనులు ఎంతో కష్టమును అనుభవించు చున్నారు. ఈ విషయమును వివరించు కథ ఒకటి కలదు.

విష్ణు శర్మ యనెడి ఒక బడుగు బ్రాహ్మణుడు అను దినము భిక్షను వేడికొనుచూ తన పొట్టను పోషించు కొను చుండెను. తాను తినగా మిగిలిన పిండిని ఒక బట్ట యందు కట్టి చూరునకు వ్రేలాడ గట్టెను. ఒక సారి ఆ పిండి మూటను వ్రేలాడ గట్టిన చూరుక్రింద, నేల మీద ప్రక్క వేసుకొని పరుండెను. నిద్ర పోవుటకు ముందు ఆ పిండి మూటనే చూస్తూ వుండెను. ఈ లోపున అతని కొక ఆలోచనతో మనోరాజ్య (ఊహ) నిర్మాణము ప్రారంభమయ్యెను. దేశములో దుర్భిక్షము కలిగినప్పుడు ఎక్కడనూ ఆహారము చిక్కక జనులు అలమటింతురు. ఈ నా పిండికి వేల రూపాయలు దొరకును. నేనొక శ్రీమంతుడిని అగుదును. ఆ డబ్బుతో వేరు వేరు వ్యాపారములుచేశి డబ్బును కూడబెట్టెదను. క్రమ క్రమముగా కోటికి పడగనెత్తెదను. శ్రీమంతుడి యింటికి చెందిన కన్యను వివాహము చేసికొని సుఖమయ జీవితమును సాగింతును. కాలాంతరమున నలుగురైదుగురు సంతానము కలుగును. నేనొక్కడనే వ్యాపారము నందున నిమగ్నుడై కూర్చునప్పుడు నన్నొక 'చిరంజీవి ఇంటికి రా' అని పిలువదొడగెను. వ్యాపారములో నిమగ్నుమై యున్ననేను నా కొడుకు యొక్క అల్లరిభరించ లేక పోతిని కృద్ధుడనై దురాగ్రహమునకు గురియై ఆ తుంటరిని కాలెత్తి తన్నెదను. అనుకొనుచు కాలుతో జాడించి తన్నగా చూరుకు వ్రేలాడుచున్న పిండి మూట ముడి విడిపోయి యంతయు వాడి శరీరముపై పడెను. వాని మేనంతయు పిండితో నిండెను. వెంటనే వాడు మనోరాజ్యము నుండి వాస్తవిక జగత్తుకు వచ్చెను.

ఇట్టి కాల్పనిక మనోవృత్తులనే వికల్ప వృత్తులు అందురు. ఇవియును క్లేశదా యకములగుటచే క్లిష్ట వికల్ప వృత్తు లనబడుచున్నవి. అయితే కొన్ని అక్లిష్ట వికల్ప వృత్తులు కూడా కలవు. మఠమందిరములను, అన్న సత్రము, చలి పందిరులు మొదలగునవి కట్టించెడి వికల్ప వృత్తులు క్లేశదాయకములు కావు. అందుచేత వాటిని అక్లిష్ట వికల్ప వృత్తులని అన వచ్చును. ఇట్టివాటిని నిరోధించ వలసిన పనిలేదు. నాల్గవ వృత్తి నిద్రావృత్తి. నిద్రయనగా స్వప్నమనెడు అర్థమును తీసుకొనవలెను. స్వప్నములు కూడా రెండు విధములుగా నుండును. మంచి స్వప్నములు మరియు చెడు స్వప్నములు. స్వప్నములు మనయిష్ట పూర్వకముగా గానీ ప్రయత్న పూర్వకముగా గానీ రావు. అయినను జాగ్రద వస్థలో ఏఏ విషయములను మనము అధికముగా చింతించు చుందుమో వాటిని గురించిన స్వప్నములు కనుట సహజమే. కాని కొన్ని సందర్భములలో వీటికి విరుద్ధముగా కూడా స్వప్నములు కలుగు చున్నవి. సాంసారిక విషయములకు గుర్తించిన స్వప్నములు క్లేశదాయక మైనవి. మెలకువలోనూ క్లేశమే, స్వప్నములోనూ క్లేశమే అనుభవించుట జరుగును. ఇట్టివి సాధారణముగా రాగద్వేషముల వల్ల కలుగుచున్నవి. శివపూజ, స్వాధ్యాయము, శివధ్యానము మొదలగునవి స్వప్నములో వచ్చిన యెడల అవి అక్లిష్టస్వప్నములగును. పగటిపూట మనము ఒకవేళ ఎంతో అనురాగముతో పూజాదులను చేసిన యెడల అట్టి స్వప్నములనే రాత్రి పూట కనెడి అవకాశము కలదు. అక్క మహాదేవి వీరాగిణి యై తిరుగాడిననూ ఆమె శ్రీశైల మల్లికార్జున స్వామిని తనపతిగా భావించి అతని స్మరణలో తిరుగాడు చుండెను. పగలంతయు అతని చింతయే ఆమెకు ఒక కలవచ్చెననియును, ఆకలలో మల్లికార్జునుడు వచ్చి

ఆమెను చేపట్టెననియునూ ఒక వచనములో ఆమె వ్రాసి కొనెను. ఇట్టి కలలు అక్లిష్టదాయకములైనవే. నిరంతరము పరమాత్మని చింతన చేయుట వలన మంచి స్వప్నములే కలుగును. సంసారము గురించి ఆలోచించుచూ యుండిన యెడల అట్టి స్వప్నములే వచ్చును. అవి దుఃఖదాయకములె క్లిష్టవృత్తులగు చున్నవి. స్మృతి యనెడిది చివరి వృత్తి. సంస్కార జన్యమైన జ్ఞానమే స్మృతి యన బడుచున్నది. ఇదియైనను క్లిష్ట, అక్లిష్ట అనెడి రెండు విధములుగా నుండును. తనకు అనుకూలమైన వ్యక్తి కలయిక స్మృతి సుఖదాయకముగనే యుండును. దీనికి విపరీతమైనది. దుఃఖదాయకముగును. అభిసారికను ఈ విషయమున ఉదాహరణగా తీసుకొనవచ్చును. ఈమె యొక్క స్మృతిలో అనుకూల ప్రతికూల స్మృతులు కలిసి యుండును. ప్రపంచమునందున ఏ వ్యక్తియూ జీవితాంతము వరకు అను కూలముగా నుండునని భావింప వలదు. ఏదో ఒకరోజు అతడు ప్రతికూలుడు కావచ్చును. అందుచేత సాంసారిక వస్తు మరియు వ్యక్తుల గురించిన స్మృతులు ఎట్టివైననూ క్లిష్ట స్మృతులే. ఆత్మ పరమాత్మలకు సంబంధించిన స్మృతులెవైతే కలవో అవి అమరానందమునిచ్చును. అందుచేత అవి అక్లిష్ట స్మృతులగు చున్నవి. శ్రీ నిజగుణ శివయోగులవారి ప్రకారము ఇట్టి స్మృతుల వలన సంస్మృతి బంధములు తెగిపోయి ఆత్మ తత్త్వము బహిర్గతమగును. సంసారిక దుఃఖములు కూడా దూరమగును. సాంసారికి స్మృతి వృత్తులను నిరోధించవలెనని, పతంజలి మహర్షి ఉద్బోధించిరి. యోగసాధకుడు పతంజలి మహర్షి ఉపదేశము మేరకు ప్రమాణ, విపర్య, వికల్ప, నిద్ర, మరియు స్మృతి వృత్తులను గమనించి క్లిష్ట వృత్తుల జోలికి పోకుండా సాధన చేసినచో అది యోగమగును. ఈ యోగములో పలురకములు కలవు. హఠయోగము, రాజయోగము, మంత్ర యోగము, లయయోగము, మొదలగునవి ఈ కోవకు చెందినవి. శ్రీ భగవత్పాదులు వుపదేశించెడిది శివయోగమన బడుచున్నది. ఈ శివయోగము మూలముననే భక్తుడు లింగ తత్త్వమున ప్రవేశించ గలడు. శ్రీ భగవత్పాదుల వారు ఈ విషయమును గూర్చి ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**స్వాంతస్థ శివలింగస్య ప్రత్యాక్షా సుభవస్థితిః ।**
**యసైవ పరలింగస్య నిజమిత్యుచ్చతే బుధైః ॥** (సి. శి. 12-32)

ప్రతి యొక మనుజుని హృదయము నందున పరమాత్ముడు నివసించి యుండును. వీరశైవ పరిభాషలో దీనిని శివ లింగమని యందురు. శివయోగ మార్గము ద్వారా శివ యోగి అంతర్ముఖుడుగా తన అంతరంగములోని లింగతత్త్వమును ప్రత్యక్షముగా అనుభవించగలడు. ఇట్టి తత్త్వమును తెలిసికొనుటయే లింగనిజ స్థలము అగును. 'బీజే యథాంకురః సిద్ధః తథాత్మన్ శివస్థితః' అనెడి ఆచార్యుల వారి యుపదేశము ప్రకారము బీజములో ఏ విధముగా మొలక వుండునో అదే విధముగా మనుజునిలో శివుడుండును. అయిననూ సామాన్య వ్యక్తి దానిని కాంచజాలడు. కారణమేమనగా అతడు యెల్లపుడూ బహిర్ముఖుడై యుండును. ఎవరైతే అంతర్ముఖులై ప్రయత్నము చేయుదురో అట్టి వారికి శివదర్శనము గలుగును. 'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మా నమైక్షైత్ । వ్యావృత్త చక్షుః అమృతత్వమిచ్ఛన్' అనెడి వుపనిషత్ వాక్యము ప్రకారము అమృతత్వ అపేక్ష మరియు అంతర్ముఖ మనోవృత్తి లేకుండగ ఆత్మ తత్త్వమును ఎట్టి ధీరుడైననూ బడయజాలడు. ఇట్టి స్థితి అందరికీ చిక్కదు. ఏలక్షకొక్కడో లింగతత్త్వమును దర్శించగలడు. మిగిలిన వారందరూ బహిరంగ వృత్తి గలవారై క్షణికానందమును పొందుచూ అనంత దుఃఖము ననుభవించచూ సంసారములో తిరుగాడు చుందురు.

ఒక వ్యక్తి తన చేతియందు లక్షల రూపాయల విలువ చేయు రత్నమును పెట్టుకొని తన యజమాని సూచించిన ప్రదేశమున గల వ్యక్తికి యిచ్చుటకై పరుగెత్తు చుండెను. దారి మధ్యమున వాని కాలికి ఒక రాయి తట్టుకొని నేల మీద పడెను. వాడు తనను తాను రక్షించుకొనుటకై పిడికిలి విప్పెను. తత్ఫలితముగా ఆరత్నము ఎగిరి ఎక్కడనో పడెను. అతనికి దెబ్బ పెద్దదైనందున మూర్ఛను పొంది యుండెను. కన్నులు విప్పిచూడగా అతని చేతిలో పదిరూపాయల బిళ్ళ పడెను. అప్పుడతను దానిని గైకొని ఆనందించుచూ ముందుకు నడచెను. ఈ ఆనందములో తనచేతనున్న రత్నము జారిపోయినదను విషయమునే మరచెను. ఈ నిర్లక్ష్యమునకు ప్రతిఫలముగా అతడు శిక్షకు గురియయ్యెను. ఇటులనే సామాన్యవ్యక్తులు క్షణికమైన ఆనందమునిచ్చెడి పదిరూపాయల బిళ్ళ వంటి వాటిపై ధ్యాసను నిల్పి అమూల్యమైన ఆత్మతత్వమనెడి రత్నమును జారవిడుచు చున్నారు. శివదర్శనమును చేసుకొనెడి మహద్భాగ్యమును కోల్పోవుచున్నారు. విజ్ఞులైన వారు శివ యోగ మార్గము ద్వారా తమలోనే నిలిచి యున్న పరమాత్మ తత్త్వమైన నిజ లింగమును గాంచి స్వస్థులై సుఖముగా జీవింతురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్ర శేఖర శివాచార్యులు వారు చిత్తవృత్తుల గురించిన కీలకమైన విషయములను బోధించిరి. వీటి జ్ఞానము నూత గొని సాధకుడు అంతర్ముఖుడై యనిర్వచనీయమైన ప్రాణలింగమును సాక్షాత్కరించి కొనగలడు. తద్వారా లింగనిజతత్త్వము నెరుగగలడు.

నిజమనెడి పదము గురించి అమరము "స్వకే నిత్యే నిజ"మ్మని చెప్పబడినది. "నియతం జాయత ఇతి నిజం" అనెడిది లింగన పండితుని వివరణ "లింగ నిజం" ను శ్రీ మరితోంట దార్యుల వారు "లింగస్య నిజ స్వరూప" మనెడి అర్థమున ప్రయోగించిరి. లింగ నిజమనగా లింగస్య స్వస్వరూపమని భావించుటలో నౌచిత్య ముండును.

లింగము యొక్క నిజతత్త్వము నెరుగుట సుసాధ్యమైన విషయము కాదు. వివిధ పథములకు చెందిన వారు వేదాదులను ప్రమాణముగా గొని వివిధ రీతులలో వ్యాఖ్యానములను చేసిరి. వీరిలో నుపనిషద్బ్రహ్మ వాదులు, మాయా వాదులు, శాస్త్ర వాదులు, ఆగమ కోవిదులెందరో గలరు. శివాను భావుల యభిప్రాయమేమనగా వేదాది ప్రమాణములు లింగ తత్త్వమును వివరించుటలో వైఫల్యమును పొందినవి. ఈ విషయమున, శ్రీ బసవేశ్వరుల వారి వచనము గమనార్హమై యున్నది.

**వేద వేది సలరియదె అభేద్య లింగవెందు నడునడుగిత్తు**
**శాస్త్ర సాధిసలరియుదె అసాధ్య లింగవెందు సారుత్తైదావె**
**తర్య తర్కిసలరియదె అతర్క్య లింగమెందు మనం గౌళ్ళవు.**
**ఆగమము గమనిస లరియదె అగమ్య లింగవెందు హోదవు.**
**నరరు సురరు అంతువ కాణరు నమ్మ కూడల సంగన ప్రమాణ శరణబల్ల.**

(శ్రీ బసవేశ్వరుని వచనము సం॥ 952-డా.హెచ్ తిప్పేరుద్ర స్వామి వారి సంపాదన)

దీని తెలుగు రూపమిది:

**వేదములు నివేదింప నరయక వడకినవి**
**శాస్త్రము సాధింప నరయక అసాధ్య లింగమని చాటుచున్నవి.**
**తర్కము తర్కింప నరయక అతర్క్యలింగమని మరులు గొనినవి**
**ఆగమము గమింప నరయక అగమ్య లింగమని పోయినవి.**
**నరులు సురులు అంతును గానరు మా కూడల సంగని ప్రమాణము శరణడెరుగు.**

శివం భూయాత్

## ఆశీర్వచనము - 2

## లింగ నిజ స్థలము

క్రిందటి ఆశీర్వచనమున లింగ నిజ తత్వమును తెలిసికొంటిమి. ఈ స్థలమున నుండెడి భక్తుని లింగ నిజస్థలం యను పేరుతో పిలిచెదరు ఇట్టి భక్తుడు దర్శించెడి పరబ్రహ్మ తత్వమును గురించి శ్రీ భగవత్పాదుల వారు క్రింది విధముగా నుపదేశించిరి.

**శ్లో॥ బ్రహ్మ విష్ణ్వాదయోదేవాః సర్వే వేదాదయస్తథా ।**
**లీయంతే యత్రగమ్యంతే తల్లింగం బ్రహ్మైకేవలం ॥ (సి. శి. 12-33)**

బ్రహ్మాది దేవతలు, వేదాది శాస్త్రములు ఎందుండి ఉత్పన్నములై యెందులో లయమగునో అట్టి పరబ్రహ్మ తత్త్వమును లింగము అందురు. "నిశ్వసి తమేతదృగ్వేదః యజుర్వేదః సామవేదః అథర్వణ వేదః" అనబడే వ్యక్తి ప్రకారము సదాశివుని యొక్క నాల్గు ముఖముల నుండి నాలుగు వేదములు వచ్చినవి. సద్యోజాత, వామదేవ, అఘోర మరియు తత్పురుష ముఖముల విశ్వాసముల నుండి క్రమముగా ఋగ్వేదము, యుజుర్వేదము, సామ వేదము అథర్వణ వేదములు ఆగమములు వచ్చినవి. ఈశాన ముఖము నుండి ఇరువది యెనిమిది ఆగమములు వెలువడినవి. 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వం' అనెడి శాస్త్రోక్తి ప్రకారము బ్రహ్మవిష్ణ్వాది దేవతల జన్మలకు కూడా శివుడే కారకుడగు చున్నాడు. ఈ కారణముననే పరశివతత్త్వము విష్ణ్వాది దేవతలకు, వేదాది శాస్త్రములకు జన్మస్థానమై యున్నది. పుట్టిన ఏవస్తువైననూ చివరకు ఎచ్చట పుట్టినవో అచ్చట లయము కావలసినదే. పరశివ తత్త్వములో పుట్టిన విష్ణ్వాదులందరూ అందులోనే లయమగుదురు. ఈ విషయములను శ్రీ జగద్గురువుల వారు ఈ క్రింది విధముగా వుపదేశించిరి.

**శ్లో॥ చిదానందమయః సాక్షాచ్ఛివ ఏవనిరంజనః ।**
**లింగమిత్యుచ్యతే నాన్యద్యతః స్యాద్విశ్వ సంభవః ॥ (సి. శి. 12-34)**

శివుడు చిదానందమయుడు. నిరంజనుడు అయివున్నాడు. శివానందమయమనగా సద్రుపము, చిద్రూపము, మరియు ఆనందరూపము అని అర్థము. ఇచ్చట ప్రయోగించబడిన 'మయట్' ప్రత్యయము వికారార్థముగా నుండక స్వరూపార్థముగానే నున్నది. శివుడు సద్వికార, చిద్వికార, ఆనంద వికారములతో కూడి యుండక సద్రూప, చిద్రూప, మరియు ఆనంద రూపముగా వున్నాడని యే యర్థము.

శివుడు సచ్చిదానంద రూపముగా నుండిన యటులనే నిరంజనుడుగా నున్నాడు. అంజనము అనగా కాటుక. కాటుక యనెడిది కళంకపూరకముగా నుండును. నిరంజనమనగా యెట్టి కళంకము లేనిది. నిరంజనుడనగా నిష్కళంకుడు అని అర్థము. ఇంతటి నిష్కళంకుడు, చిదానందుడు అయిన శివుని నుండి ఈ సచరాచరవిశ్వము ఉత్పన్నమగును. అందులోనే లయమగును. దీనినే లింగమన్న పేరుతో పిలుచుచున్నారు. ఈ లింగతత్త్వమును గురించి ఇంకను వివరించుచూ శ్రీ భగవత్పాదులవారు. ఈ క్రింది ఉపదేశమునిచ్చిరి.

**శ్లో॥ బహునాత్ర కిముక్తేన లింగమిత్యుచ్యతే బుధైః ।**
**శివాభిధం పరంబ్రహ్మచిద్రూపం జగదాస్పదమ్ ॥ (సి. శి. 12-35)**

ఈ జగమున కంతయూ ఆధారభూతమైన, చిద్రూపమైన శివపర బ్రహ్మనే ఆగమశాస్త్రజ్ఞులు లింగమని పిలిచిరి. లింగము నుండి పుట్టి లింగములోనే లయమయ్యెడి ప్రపంచములో జీవించుచు లింగతత్త్వమును అరయక సంసార దుఃఖములో పడి బాధనుచెందు చున్నారు. మనదగ్గరనున్న వస్తువును మనము మరచి పోయిన యెడల అద్దానిని మరొకరు గుర్తుచేయ వలసిన అవసరముండును. ఈ విషయమున ఒక కథ కలదు.

ఒక గస్తీతిరిగెడి మనజుడు చేతిన కందిలి (లాంతరు) పట్టుకొని మధ్యరాత్రి యందు వూరంతయును తిరుగుచుండెను. చలి కాలపు సమయము చలి విపరీతముగా నుండెను. అతనికి పొగ త్రాగెడి అలవాటుండెను. అంగిజేబులో చిలుము, మరియు పొగాకు తీసుకొని. నిప్పుకై అటు యిటు చూచినపుడు ఒక యింటి అరుగు మీద ఒక వ్యక్తి కంబళి కప్పుకొని పరుండి యుండెను. అతని వద్ద కేగి అతనిని నిద్దురలేపి అగ్గిపెట్టెనడిగెను. అతడు ఆగస్తీతిరిగెడివాడి వైపు విచిత్రముగా చూస్తూ ఏమయ్యా నీ చేతిలో కందిలిని పట్టుకొని అగ్గిపెట్టెకై నన్ను లేపితి వేమిటి? కందిలిలోననే మంట వున్నది గదా! దానితో నీవు నీ యొక్క చిలుము నంటించు కొన వచ్చును గదా! యని బుద్ధిచెప్పిన వాడయ్యెను. అతను చెప్పినంత వరకు కూడా ఆ గస్తీ తిరుగెడి వానికి ఇది అవగతము కాలేదు. ఇదే విధముగా ప్రతి యొక్కరి అంతరంగమున విరాజిల్లెడి లింగతత్త్వమును తెలియక దానిని నిర్లక్ష్యము చేయుటచే అది వుండియును కూడా లేనట్టులనే యగు చున్నది. సద్గురువు యొక్క ఉపదేశము ముఖమున అది యెరుకకు వచ్చును. అప్పుడు దాని నుండి యెల్లరూ ఆనందమును పొందుదురు. ఇందులో సందేహమునకు ఆస్కారము లేదు. లింగ తత్త్వమును గురించి ఇంకను తెలియ జెప్పుటకై శ్రీ గురువు ఈ క్రింది ఉపదేశమును యిచ్చిరి.

శ్లో॥ వేదాంత వాక్యజాం విద్యాం లింగమాహుస్తథా పరే ।
తదసద్ జ్ఞేయరూపత్వా ల్లింగస్య బ్రహ్మరూపిణః ॥ (సి. శి. 12-36)

వేదాంత శాస్త్రమునందు జ్ఞానమునే పరమాత్ముడని పిలుతురు ఇది సరియైనది కాదు పరమాత్ముడు జ్ఞేయుడైయున్నాడు. జ్ఞానము అతనిని యెరిగెడి సాధనమై యున్నది. సాధనమునే సాధ్యముగా ప్రతిపాదించుట అంత యుక్తమైనది కాదు. అందుచేత లింగరూపమైన పరబ్రహ్మ జ్ఞేయ రూపములో నున్నాడని శ్రీ పూజ్యపాదు లాదేశము నిచ్చిరి. ఈ విషయమునే స్పష్టపరచుచు ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

శ్లో॥ అవ్యక్తం లింగమిత్యాహుర్జగతాం మూలకారణం ।
లింగీ మాహేశ్వర శ్చేతి మతమేతద సంగతమ్ ॥ (సి. శి. 12-37)

సాంఖ్య సిద్ధాంతమునందున ఉత్పత్తి మరియు లయములకు కారణ భూతమైన ప్రకృతిని లింగముగా మరియు మహేశ్వరుని లింగిగా పిలిచినారు. ఇది కూడా సూక్తమైనది కాదు. ఏదైనా యొక సృష్టి జరుగవలెనన్న ఉపాదానకారణము మరియు నిమిత్త కారణములు కావలసి యుండును. సాంఖ్య మరియు వేదాంత శాస్త్రము నందున ప్రకృతి మరియు మాయలను క్రమముగా నిమిత్త కారణములుగా అంగీకరించిరి అయితే వీరశైవ సిద్ధాంతమునందున శక్తి విశిష్టమైన శివుని అభిన్న నిమిత్తో పదాన కారణముగా స్వీకరించనైనది. సాలెపురుగు తాను అల్లిన వలకు (గూడు) తానే ఉపాదాన మరియు నిమిత్త కారణముగా వుండునటులే ఈ విశ్వము యొక్క సృష్టికి శివుడొక్కడే ఉపాదన మరియు నిమిత్త కారణుడగు చున్నాడు. శివుని యందు ఉండు శక్తి శివుని కంటే భిన్నమైనది కాక ఆరెండును ఒకే తత్త్వమైయున్నవి. అందు వలన శక్తి విశిష్టమైన శివునే లింగమన వలెను. కాని జగము మరియు అవ్యక్తముయగు ప్రకృతిని లింగమనుట యుక్తమైన పని కాదు. ఈ విధముగా పరశివలింగ స్వరూపము, సాంఖ్యులు మరియు వేదాంతాభిమతులు లింగము కంటెను, భిన్నముగా ప్రతిపాదించి ఆమహాలింగము యొక్క మహాజ్యోతి స్వరూపమును ఈ క్రింది విధముగా తెలిపిరి.

శ్లో॥ నసూర్యోభాతి తత్రేందుర్న విద్యున్న చపావకః ।
నతారకః మహాలింగే ద్యోతమానే పరాత్మని ॥ (సి. శి. 12-38)

జగత్తులోని వస్తువులను సృష్టింప జేయుటకు సూర్య, చంద్ర విద్యుత్, అగ్ని మరియు తారల ప్రకాశమే కారణముగా కానగలము వీటిలో సూర్యునిది ప్రబలమైన ప్రకాశము. సూర్యోదయము కాగానే అతని ప్రచండమైన తేజస్సుచేత తారా చంద్రాదుల ప్రకాశము నిస్తేజమై వెలవెల బోవును. అటులే మహాలింగము యొక్క స్వయం ప్రకాశ తేజము ముందు సూర్యుని ప్రకాశము కూడా నిస్తేజగమగును. శాస్త్రములందు ఆత్మ ప్రకాశమును వర్ణించునప్పుడు కోటి సూర్య సమప్రభః అని ప్రతిపాదించిరి. ఆత్మజ్ఞానికి సూర్యచంద్రాదులు యొక్క ప్రకాశ మావశ్యకత లేదు. ఆత్మ వలననే ఆత్మను తెలిసికొనవలెను. మిగిలిన ప్రకాశములన్నియును ఆత్మ ప్రకాశముయందు నిష్ప్రయోజకములు అగును. వాస్తవము నరయగా సూర్యచంద్రాదులు మహాలింగము యొక్క ప్రకాశమును గ్రహించి తద్వారా ప్రకాశమానము లగు చున్నవని తెలిపెడి భగవత్పాదుల వారి ఉపదేశము ఈ క్రింది విధముగా నున్నది.

శ్లో॥ జ్యోతిర్మయం పరం లింగం శృతి రాహ శివాత్మకం ।
తస్యభాసా సర్వమిదం ప్రతిభాతి నసంశయః ॥ (సి. శి. 12-39)

సనాతనమైన శృతియందున పరశివ లింగమును జ్యోతిర్మయముగా ప్రతిపాదించనైనది. యావత్ ప్రపంచమునకు మూల జ్యోతి యొకటే. అదే ఆలింగము. ఆలింగము యొక్క జ్యోతి నుండి స్ఫూర్తి పొంది సూర్యచంద్రాదులు జ్యోతిరూపంగా కన్పట్టు చున్నవి. పరశివ బ్రహ్మము లింగ రూపమే యనియు వేరు కాదనియును తెలిపెడి శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశమును గమనించుడి.

**శ్లో ॥ లింగాన్నాస్తి పరం తత్త్వం యదస్మా జ్జాయతే జగత్ ।**
**యదే తద్రూపతాం ధత్తే యదత్ర లయమశ్నుతే ॥**

**తస్మా ల్లింగ పరం బ్రహ్మ సచ్చిదానంద లక్షణమ్ ।**
**నిజరూపమితి ధ్యానాత్ తదవస్థా ప్రజాయతే ॥ (సి. శి. 12; 40-41)**

ఈ ప్రపంచము నందు లింగతత్త్వమును మినహాయిస్తే శ్రేష్ఠమైన దగు వేరే తత్త్వమేదియును లేదు. ఈ చరా చర విశ్వమంతయు లింగతత్త్వము నుండియే ఉద్భవించి లింగతత్త్వముననే కొనసాగుచు లింగ తత్త్వముననే లయమగును. ఇట్లు సృష్టి స్థితి లయలకు మూలకారణమైన శివ పరబ్రహ్మతత్త్వమే లింగతత్త్వము. లింగతత్త్వము సచ్చిదానంద స్వరూపమైనది. అంతటి లింగ స్వరూపమును తన నిజ స్వరూపముగా భావించి ఎవరు నిరంతరము అద్దాని ధ్యానములో మునిగియుందురో వారు నిజలింగ స్వరూపులే యగుదురు. ఇంతటి మహత్తరమైన లింగ నిజ స్థితిని ప్రాప్తము చేసుకొనుట యే శివ యోగ సాధకునికి జీవన పరమార్థము కావలెనని గ్రహించగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దిః 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్ర శేఖర శివాచార్యుల వారు లింగతత్త్వమునకు సంబంధించిన ధర్మ సూక్ష్మములను వివరంగా బోధించిరి.

లింగతత్త్వము గురించి యవగాహన లేని వారు లేవ నెత్తిన చర్చనీయాంశములను విశ్లేషించి చూచుట యెంతో యవశ్యకమైన యంశము.

"జగతాం మూలకారణ మవ్యక్తం లింగం" అనెడిది మొదటి చర్చనీయాంశము కాగా "వేదాన్త వాక్యజా విద్యా లింగం" అనెడిది రెండవది.

అవ్యక్తమే లింగమనెడి వారి వాదనకు శ్వేతాశ్వతరోపనిషత్తులోని 'మాయాంతు ప్రకృతిం విద్యా మాయినంతు మహేశ్వరమ్' అనెడిదే మూలాధారము, సాంఖ్యుల యీ వాదము నిరాధారమైన దని తెలిపిన శ్రీ కాశీ పీఠాధీశ్వరుని వాక్కులు జ్ఞాన ప్రదములై యున్నవి. మాయ షట్ త్రింషట్ స్థలములలో మిశ్రతత్త్వములకు చెందినది. శుద్ధ తత్త్వములోని శుద్ధ విద్య ప్రవృత్తి క్రమములో మాయ యగునని శివాగమములు తెలుపు చున్నవి. షట్ త్రింషట్ తత్త్వముల కుద్భవ స్థానము లింగమని గుర్తించ గలరు అందుచేత నవ్యక్తము లింగము కాజాలదనెడిది నిరూపిత సత్యము. వేదాంత జన్యమైనదియును, విద్యగా పరిగణింప బడెడిది యగు మహావాక్య సంచయమొక్కటి కలదు. యజుర్వేదములోని "అయమాత్మా బ్రహ్మ", ఋగ్వేదములోని "ప్రజ్ఞానం బ్రహ్మ", అథుర్వణ వేదములోని "అహం బ్రహ్మాస్మి" సామ వేదములోని 'తత్త్వమసి' యనెడి మహావాక్యముల నుండి యుత్పన్నమైన జ్ఞానమే లింగమందురని తెలుపు వారలు గలరు. ఈ వాదమును శ్రీ రేణుకా చార్యుల వారు తిరస్కరించిరి. జ్ఞాతృవు, జ్ఞానము, జ్ఞేయమనెడి త్ర్యంశముల కంటె భిన్నముగా, వాఙ్మనస్సుల కగోచరముగా నుండెడి లింగమును జ్ఞానమనుటలో నౌ చిత్యముండదు. జ్ఞేయమే ప్రధానమైనది అదియే నిజలింగము.

ప్రాణలింగి యిట్టి సందేహములకు నవకాశము నివ్వక తన అంతరంగమున తాను సాక్షాత్కరించి కొనిన లింగమే మహా లింగము యొక్క స్వస్వరూపమని యెంచును.

శివం భూయాత్

# ఆశీర్వచనము - 1

# అంగలింగ స్థలము

ఇంతకు క్రితము లింగనిజ స్థలము గురించి తెలిసికొంటిమి. ప్రాణ లింగ స్థలములోని అంతిమ అవాంతర స్థలము అంగలింగ స్థలము. ఈ స్థలమునందున అంగ-లింగముల వాస్తవిక స్వరూపమును తెలియపరచి ఆ రెంటి యొక్క అభేద తత్వమును నిరూపింపనైనది. శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశమును గనుడి.

**శ్లో॥ జ్ఞానమంగమితి ప్రాహుః జ్ఞేయం లింగం సనాతనమ్ ।**
**విద్యతే తద్ద్వయం యస్య సోంగ లింగీతి కీర్తితః ॥ (సి.శి. 12-42)**

జ్ఞానమునకు అంగమునియును సనాతనమైన జ్ఞేయమునకు లింగమనియును, పేర్లుగలవు ఇచ్చట జ్ఞానమనగా జ్ఞానమున్న జీవాత్మయని అర్థము. అంగమనెడి శబ్దము వీరశైవ సిద్ధాంతము యొక్క ప్రత్యేకమైన పారిభాషిక పదము. సామాన్యముగా అంగ శబ్దమునకు శరీరమనెడి పేరుగలదు. ఐతే ఇచ్చట వీరశైవతత్వం ప్రకారము అంగమనగా శరీరము కాదు. శరీరి యనబడే అర్థములో ఉపయోగించబడినది. శరీరి అనగా, శరీరము దాల్చిన జీవి అని అర్థము. జీవి అనే పదమున అందరూ ఉపయోగించిన యటుల సామాన్యమైన జీవి అనెడి అర్థము కాదు. జీవియనగా పరిశుద్ధాంత రంగుడైన శుద్ధ జీవినే వీరశైవ పరిభాషలో అంగమని అందురు. మలత్రయములను దూరము చేసికొని పరశివతత్వమును పొందుటకై మహోత్కృష్టమైన జిజ్ఞాసగల జీవుడే అంగపద వాచ్యుడని గుర్తించ వలెను. "అంగచ్ఛతి ఇతి అంగః" అను వ్యుత్పత్తి ప్రకారము జ్ఞానము మరియు యోగముల సమాధి స్థితి మూలమన పరమాత్మ తత్వమును పొందెడి సామర్థ్యముగల జీవియే అంగుడని గుర్తించవలెను. ఈ అంగనిచేత పొందబడెడి పరమ తత్వమే లింగము. ఈ విధముగా లింగాంగముల స్వరూపమును తెలిసికొన్న ప్రాణలింగ స్థలములోని భక్తునికి అంగలింగి అనెడి పేరు గలదు. ఈ విధముగా అంగ లింగముల చింతనను చేసి అంగ లింగి స్థితిని పొందెడిది అందరి జీవనోద్దేశమై యుండవలెను.

మనము ఎవరినైనను 'నీ వెవడివి' అని ప్రశ్నించినప్పుడు సంబంధిత వ్యక్తి తన పరిచయమును చేసుకొనుటకై తల్లిదండ్రుల పేర్లను గాని ఇంటి పేరునుగాని, ఊరి పేరును గాని తెలుపును. ఇవియన్నియు జీవి యొక్క నిజమైన పరిచయమునకు సాధనములు కాజాలవు. జీవుడు ఎక్కడి నుండి వచ్చినాడో యనెడిది తెలుపుటయే ముఖ్యమైనది. "తదంశో జీవనామకః" అనెడి ఆచార్యోక్తి ప్రకారము ప్రతివొక్కడు శివుని అంశజుడె జన్మించుటకు ముందు ప్రతివొక్కరు పరమేశ్వర స్వరూపులై యుందురు. పరమాత్ముని నుండి వచ్చిన ఈ జీవికి ప్రతి దినము కొంత సమయము అవశ్యముగా ఉండితీర వలెను. పరమాత్మ సంబంధము లేకుండగా ఒక జీవి బ్రతుకుట యనెడిది సాధ్యమయ్యే విషయముకాదు. ప్రగాఢమైన నిద్రలో జీవి తన మూల స్వరూపమైన పరమాత్మ స్వరూపముతో తాదాత్మ్యము పొందుటచే ఆ అవస్థ యందు ప్రతి ఒక్కరు నిజమైన సుఖములో నుందురు. అందుకే ఈ సుషుప్తి అవస్థముక్తి యనెడి అవస్థకు మచ్చుతునక వంటిదని గుర్తించ వలెను.

సుషుప్త్యావస్థ యందు సుమారు ఆరు గంటల వరకు ప్రతి ఒక్కరూ నిద్రానందమును అనుభవింతురు. ఈ సమయమునందున జీవి సాంసారిక విషయముల యెడల నిమగ్నమై యుండజాలడు. అతడు పరమాత్ముని అంశమై యున్నందున. అతనితో సమరసభావమును పొందుటకై ప్రయత్నించును. సుషుప్త్యావస్థయందు జీవి యుండెడి స్థితి అతని స్వాధీనమున యుండెడిది కాదు. అతడు కర్మాధీనుడై యుండును. మనము కోరినప్పుడు గాఢ నిద్రరాదు అన్న సంగతిని గుర్తించవలెను. శివయోగ మార్గమున ప్రాణ లింగ స్థలమున సాధన చేసెడి భక్తునికి పరాధీనత యుండదు. తను కోరిన సమయమున యోగముద్రలోకి వెడలి పరమాత్మతత్త్వముతో సామరస్యమును సాధించ గలడు. అందుచేత ఈ పరమాత్మతత్త్వమును అనుభవించ వలసిన యెడల శివయోగ సమాధికి సంబంధించిన విషయములను పూర్తిగా తెలిసికొని యుండవలెను. ఈ విషయమున శ్రీ రేణుక భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమును ప్రదానము చేసిరి.

**శ్లో॥ అంగే లింగం సమారూఢం లింగే చాంగముపస్థితమ్ ।**
**ఏ తదస్తి ద్వయం యస్య స భవేదంగ లింగవాన్ ॥ (సి. శి. 12-43)**

లింగమునందు అంగమును అంగమునందు లింగమును పరస్పర సామరస్య భావమున సదా చింతన చేయువాడే అంగలింగి యనబడు చున్నాడు. లింగతత్త్వము వ్యాపకమగునది యగుటచేత అందులో అంగము ఉండుట సంభవించినను, పరిచ్ఛిన్నమైన లింగతత్త్వమునందు పరివ్యాపకమైన లింగతత్త్వమును ఏ విధముగా వుంచగలము అనెడి ప్రశ్న ఉదయించినపుడు, ఆకాశమునందున ఘటము మరియు ఘటమునందున ఆకాశము యుండుట యెటుల సంభవమో అటులనే అంగలింగముల పరస్పర అస్తిత్వము ఉండుట తథ్యము. ఏది సర్వవ్యాపకమై యున్నదో అది అన్ని ప్రదేశములలో వుండును. అందుచేతనే పూజ్యులు లింగాంగముల పరస్పర సామరస్య చింతన నుపదేశించిరి. ఇట్టి చింతన దృఢతరము కావలెనని చింతన నిరంతముగా చింతన చేయుచు సాధనచేయ వలసి యుండును. శ్రీ భగవత్పాదుల వారు ఈమహాలింగమును భక్తుడు పూజించవలెనని ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

**శ్లో॥ జ్ఞాత్వాయః సతతం లింగం స్వాంతస్థం జ్యోతి రాత్మకమ్ ।**
**పూజయేద్భావరుసుమై తం విద్యా దంగ లింగినమ్ ॥ (సి. శి. 12 -44)**

అంగము నందు లింగము, లింగము నందు అంగము గలదు. అనెడి సామరస్యమైన జ్ఞానము చేత సాధన పూర్తి కాజాలదు. ఆ జ్ఞానము దృఢతరము కావలెను. అందుచేత నిరంతర పూజ మరియు చింతన అవశ్యకములై యున్నవి. తనలో జ్యోతిరూపమైన ప్రాణలింగము గల దనెడి జ్ఞానము గలిగిన పిదప యింతకు క్రితమే తెలియ జెప్పబడిన క్షమ ఇత్యాది భావాత్మకమైన పూజాద్రవ్యాల చేత ప్రాణలింగమును అర్పించి ఆ పిదప లింగాంగముల ఐక్యాను సంధానము గురించి భావమును పరిపుష్టి చేసుకొన వలెను.

వీరశైవ సిద్ధాంతము నందు భక్తి వలననే ముక్తి కలుగునని ప్రతి పాదించబడినది. ప్రాణలింగ స్థలమునందలి భక్తుడు చేసెడిది అనుభవ భక్తియని తెలుపబడినది. వ్యవహారములందు కన్ను, చెవి ఇత్యాదులచే రూపము మరియు శబ్దము ఇత్యాదులను అనుభవము చేసికొనిన యటులనే తన పరిశుద్ధమైన మనోవృత్తి చేత ప్రాణ లింగమును సాక్ష్యాత్కరించు కొనునదే ప్రాణలింగ స్థలమగు చున్నది. దీనిని అనుభవ భక్తియని అందురు. ఇచ్చట భ్రమరకీటక న్యాయము ప్రతిపాదించబడినది. కీటక మెల్లప్పుడూ భ్రమరము యొక్క చింత చేయుచు చివరకు భ్రమరముగా మారిన యటులనే భక్తుడు లింగము యొక్క చింతన చేయుచూ చేయుచూ చివరకు తన అంగమునే లింగముగా మార్చుకొను చున్నాడు. ముక్తి యొక్క అపేక్షయున్నా వారికి లింగమే పరంధామమని తెలియ జెప్పెడి. ఆచార్యులవారి ఉపదేశమును గనుడి.

**శ్లో॥ జ్ఞాయతే లింగమేవైకం సర్వేఃశాస్త్రైః సనాతనైః ।**
**బ్రహ్మేతి విశ్వధామేతి విముక్తేః పదమిత్యపి ॥**

**ముక్తి రూపమిదం లింగమితి యస్య మనస్థితిః ।**
**సముక్తో దేహయోగే పి స జ్ఞాని సమహాగరుః ॥ (సి. శి. 12 ; 45-46)**

సనాతనములైన వేదాగమ శాస్త్రములు లింగతత్త్వమునే ప్రతిపాదించు చున్నవి. దీనినే బ్రహ్మమనియు, విశ్వధామమనియు, ముక్తి పదమనియును పిలుచుచున్నారు. ఈ పేర్లన్నియును ఒకే మూలతత్త్వమును ప్రతిబింబించు చున్నవి. ముక్తి పథమును తెలుసుకొను వారు దేహధారులైనను ముక్తులేయగు చున్నారు. లింగతత్త్వమును తెలిసి కొనిన వాడే మహాజ్ఞాని అతడే మహాగురువు. అంతరంగములోని లింగతత్వమును తెలిసికొని అనుభవించిన వానికి ముక్తి లభించును ఇది తెలిసి కొనిన వానికి సంసారమే గతియని శ్రీ భగవత్పాదుల వారు తెలియ జెప్పిరి.

లింగము శాశ్వతమైనదని తెలిసి కొనవలెనని శ్రీ భగత్పాదుల వారు నీ క్రింది విధముగ నుపదేశించిరి.

**శ్లో॥ అనాది నిధనం లింగం కారణం జగతామితి ।**
**ఏన జ్ఞానంతి తే మూఢా మోక్షమార్గ బహిష్కృతాః ॥ (సి. శి. 12-47)**

లింగము అనాధి రూపమైనది. దీనికి జననములేదు 'అనిధనం' అనగా మరణరహితమైనది. లింగము జనన మరణ రహితమై నందున దానిని అనాది నిధనమని పిలిచిరి.

న్యాయ శాస్త్రములో ఒక వస్తువు యొక్క ఆభావమును ప్రాగభావము, ప్రధ్వంసా భావము, అన్యోన్యాభావము మరియు అత్యంతా భావము అని నాల్గు విధములుగా ప్రతిపాదించ బడినది. ఈ చతుర్విధ ఆభావములు పరశివ లింగమునకు సంభవింప జాలవు. వస్తువు వుత్పత్తి కంటెనూ ముందు దాని ప్రాగ భావము యుండును. శ్రీ పరబ్రహ్మ లింగమునకు వుత్పత్తి లేదు కనుక దానికి ప్రాగ భావము యుండెడి అవకాశమే లేదు. ఒక వస్తువు భగ్నమైన పిదప కలిగెడి ఆభావమును ప్రధ్వంసా భావమందురు. ఉదాహరణకు చెప్పవలెననిన ఒక కుండను పగుల గొట్టిన పిదప వచ్చెడి ఆభావమే ప్రధ్వంసా భావము. లింగము నాశరహితమైనందున ప్రధ్వంసా భావమున కాస్కారము లేదు. ఘటము పటము గాదు, పటము ఘటము అనెడి పరస్పర భేదమును ప్రతిపాదించెడి ఆభావమును చెప్పుటకు పరస్పరము, భిన్నములగు రెండు పధార్థముల యొక్క అవశ్యకత గలదు. విశ్వమంతయూ లింగ రూపమే కనుక, లింగము వెలుపల ఏమియునూ లేదు కనుకనే అన్యోన్యాభావము కూడా రాజాలదు. త్రికాలముల యందు ననూ వుండని దానిని అత్యంతా భావము అని అందురు. గగనకుసుమము, గొడ్డు దాని కొడుకు దీనికి ఉదాహరణలు. పరశివలింగము త్రికాలా భాధితమైనందున దానికి అత్యంతాభావము కూడా కలుగ జాలదు. ఒకవేళ దానికి అత్యంతా భావము అంటగట్టిన యెడల అట్టి స్థితిలో ఏవస్తువును యుండజాలదు.

నాటక రంగము నందున ఒక నాటకము ప్రారంభమయ్యెడి సమయము కంటె పూర్వము దీపములను అంటించి పెట్టుదురు. నాటకము ముగిసి అందరూ పరుండిననూ ఆదీపములు అటులనే యుండును. అదే విధిన పరమాత్మ లింగమనెడి జ్యోతిర్లింగ ప్రకాశము నందుననే ఈ సంసారమనెడి నాటకము యొక్క వ్యవహారములన్నియును నడచు చున్నవి. వ్యవహారములు ముగిసినా ప్రకాశము లుప్తముకాదు. సకల విశ్వమున కది సాక్షీభూతమై నిలుచును, ఈ కారణము వలననే శ్రీ భగవత్పాదుల వారు పరశివ లింగమునకు అనాది నిధనము అనెడి విశేషణము నిచ్చిరి. ఇంతటి ఈ లింగతత్త్వమే చరాచర జగత్తు యొక్క వుత్పత్తి స్థితి మరియు లయలకు కారణమగు చున్నది. ఎవరైతే ఇంతటి పరమాత్మ లింగమును తన ఆత్మరూపముగా ఎరుగరో అట్టివారు మూఢులని శ్రీ భగవత్పాదుల వారు సెలవిచ్చిరి. మోహగ్రస్తమైన బుద్ధి యున్నవారే మూఢులు సాంసారిక వ్యవహారములలో చిక్కుకొని మోహమునకు గురియైన వారు ముక్తిని పొందజాలరని తెలియ జెప్పిరి. ఈ జనన మరణ చక్రము నుండి విడుదల పొందవలెననిన లింగాంగ సామరస్వరూపమైన చింతనయే పరమోపాయమై యున్నది. ప్రాణలింగి స్థలములోని భక్తుడు ఏ విధముగా తుర్యావస్థకు చేరునో అనెడి దానిని శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా విశదపరచిరి.

**య్గః ప్రాణాలింగార్చన భావపూర్ణైద్రమ్యైరుపేతః శివభావి తాత్మా।**
**సఏవ తుర్యః పరికీర్తితోసౌ సంవిద్విపాకాచ్ఛరణాభిదానః ॥** (సి. శి. 12 -48)

ప్రాణలింగ స్థలము నందు ఉపదేశింప బడిన అర్చనా సామగ్రుల చేత భావపూర్ణముగా ప్రాణలింగార్చనలు చేసినప్పుడు, క్రమక్రమముగా భక్తుడు శివ భావ సంపన్నుడగును. అట్టి స్థితిని తుర్యావస్థ యందురు. ఒక కుండ నీటి చేత పరిపూర్ణముగా నిండియుండి నటులనే ఇతడు శివ భావన చేత పరిపూర్ణుడై యుండును. ప్రాణలింగ స్థలములోని భక్తుడు తన భక్తిని పరిపూర్ణమైన పరిపక్వ దశకు తెచ్చుకొనిన పిదప అతడే శరీణుడుగా పరిణామమొందును మహాచార్యుని వారు చేసిన ఉపదేశము సరిగా అవగాహన చేసికొని ప్రతి యొక్కరు శరణ స్థలము వైపు పయనించుటకు కృషి చేయవలెను.

ఓం శాంతి ః శాంతిః శాంతి

ది ॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వచనము నందు శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు "అంగ-లింగి" యొక్క లక్షణములను వివరించి ప్రాణలింగి స్థలమునకు ముగింపును పలికిరి.

అంగ లింగముల స్వభావముల నెరిగి అంగమును లింగముతో లీనము చేసెడి విధివిధానము నెరిగి తదను గుణముగా సాధనను తీర్చిదిద్దు కొనుటయే "అంగ-లింగి" యొక్క లక్ష్యము.

వీరశైవము సూతసంహితలో చెప్పబడిన "భేదా భేదో భేద పతే మతస్త్రయః" అనెడి వాటిలో భేదాభేదము బ్రతిపాదించెడిదై యుండునని భక్త స్థలమును తెలియ జెప్పబడినది.

**శృత్యేకదేశ ప్రామాణ్యం ద్వైతాద్వైత మతాదిషు ।**
**ద్వైతాద్వైత మత శుద్ధే విశేషాద్వైత సంజ్ఞకే ॥**

యని తెలిపిన శ్రీపతి పండితుల వారి వివరణ స్మరణీయమై యున్నది. భక్త్యాది స్థలములలో సాధకుడు క్రియా ప్రాధాన్యత గల సాధనను చేయుచు అంగ లింగములలో భేదమును గాంచును. ప్రసాది స్థలమున సాధకుడు చేసిన ఫలితముగా లభించిన ఫలము ప్రాణలింగికి సాధనమగును. శివ-జీవ భేదమనెడి భ్రమను తొలగించి కొనుటకై యనుభవమును గడించును. ప్రారంభదశలోని యవాంతర స్థలములలో చేసిన సాధన ఫలితముగా లింగనిజ స్థలియై శివ జ్ఞానమును పొంది జ్ఞానియగును. అచ్చట లింగతత్త్వము నెరిగిన వాడై యీ స్థలములో నంగ-లింగము లొకటే యనెడిది తెలిసి కొనును. అభేద భావన పొందుటలో మొదటి మెట్టు నధిరోహించి యుండునని తెలిసి కొనగలరు. స్వీయ క్రియా పథమునకు జ్ఞాన మార్గమును జోడించి సాధనను కొనసాగించును. ఈ స్థితిని వర్ణించెడి యనుభసారములోని యీ పద్యము గమానార్హమై యున్నది.

**సీ॥ సహజ సజ్జనశి వాచార నిర్లోభని**
**యుక్తి జంగమ భక్తి భక్త పదము**
**అంగగుణేతర లింగైక నిష్ఠాప**
**రత్వంబు మాహేశ్వర స్థలంబు**
**సతత బాహ్యాంత రార్పిత లింగ వికచనా స్వాదన సుఖము ప్రసాది నెలవు**
**స్వప్రాణలింగ లింగ ప్రాణ మధనవి లీనాంతరము ప్రాణలింగి లీల**

(అను భవసారము, ప. 238)

(ఓం నమశ్శివాయ సాహిత్య సాంస్కృతిక పరిషత్తు సికింద్రాబాద్, 2000)

శ్రీ పాల్కురికి వారి "ప్రాణ లింగ మధన భవ్య జీవన్ముక్తి, కెనయు వేరు ముక్తి గనగ గలదె" (అ.సా. ప॥ 220) వాక్కులు ప్రాణలింగి యొక్క "జ్ఞానము"ను సూచించునవె యున్నవి.

శివం భూయాత్

# త్రయోదశ పరిచ్ఛేదము

## ఆశీర్వచనము - 1

## శరణ స్థలము

ఇంతకు క్రితము ఆశీర్వచనములలో భక్తాది ప్రాణలింగ పర్యంతము గల చతుర్విధ స్థలముల యొక్క అవాంతర స్థలముల గురించి తెలిసి కొంటెమి ఇప్పుడు శ్రీ అగస్త్య మహర్షికి బోధింప బడిన శరణ స్థలమునకు సంబంధించిన శ్రీ భగవత్పాదుల వారి ఉపదేశమును తెలిసికొనెదము గాక. శ్రీ భగవత్పాదుల వారు అగస్త్యుల వారికిచ్చిన ఉపదేశము ఈ విధముగా ప్రశ్నించిరి.

**శ్లో ॥ మహేశ్వరః ప్రసాదీతి ప్రాణలింగీతి భోధితః ।**
**కథమేశ సమాధిష్టః పునః శరణ సంజ్ఞకః (సి. శి. 13-1)**

మాహేశ్వరాది ప్రాణలింగ స్థల పర్యంతము పయనించిన భక్తుడు ఏ విధముగా శరణుడనిపించు కొనునో దయచేసి తెలియ జేయవలసినది. ఈ ప్రశ్నకు స్పంధిస్తూ శ్రీ భగవత్పాదులవారు ఈ క్రింది విధముగా ఉపదేశమును కటాక్షించిరి.

**శ్లో ॥ అంగ లింగీ జ్ఞానరూపః సతీ జ్ఞేయః శివః పతిః ।**
**యత్ సౌఖ్యం తత్ సమావేశే తద్వాన్ శరణనామవాన్॥ (సి. శి. 13-2)**

ప్రాణ లింగ స్థలములోని భక్తి సాధకుడు ఉపస్యుడైన శివుని తనపతిగాను మరియు ఉపాసకుడగు తనను అతని సతిగాను భావించుకొని ఆ సతి పతి భావన చే ఎప్పుడైతే ఆనందమును అనుభవించునో అప్పుడు ప్రాణ లింగి స్థలములోని భక్తుడు శరణుడు అనిపించుకొనును. శరణ స్థలమునందు సాధకుని భక్తిని ఆనంద భక్తియని అందరు. ఈ అలౌకిక సతిపతి భావన చేత కలిగెడి ఆనందము లౌకిక సతిపతి భావమునకు విలక్షణమైనది. ఒక ఇంటిలో నివసించెడి పరివారములోని సదస్యులయందు ఏదో యొక్క విధమైన పరస్పర సంబంధము వుండియే తీరును. పితాపుత్రః భాతృ బాతృ (అన్నదమ్ములు) మరియు భగిని భాతృ (అన్న చెల్లెలు) మొదలగు అనేక సంబంధములు లోకమున కలవు అట్టివాటి కంటెను, సతిపతి సంబంధము అత్యంత సన్నిహితమైనది. పతికి సతిమీద సతికి పతిమీద వుండెడి ప్రేమ వంటి ప్రేమ మరే సంబంధములలో గాంచజాలము. పత్నియనగా కేవలము ఒక భోగ్య వస్తువుకాదు. ఆమె షడ్గుణ సంపన్నురాలైన సహధర్మచారిణి. సుభాషిత కారులు "షడ్ధర్మయుక్తా, కులధర్మ పత్నీ" అని చెప్పిరి. దానికి సంబంధించిన శ్లోకము ఈ క్రింది విధముగానున్నది.

**శ్లో॥ భోజ్యేషు మాతా కరుణేశుదాసీ కార్యేషు మంత్రీ ।**
**రూపేషు లక్ష్మీ శయనేశు రంభా క్షమయా ధరిత్రీ ష్యాడ్గుణ్ణ భార్యా కుల ముద్ధరంతీ ॥**

ధర్మపత్ని పతి తినునప్పుడు తల్లిగాను, గృహకార్యాచరణల యందు దాసిగాను, సలహా లిచ్చుటలో మంత్రిగాను, భోగ విషయములలో రంభగాను, క్షమా విషయంలో భూదేవిగాను ప్రవర్తిస్తూ కులము నుద్ధరించును. లోకములందున్న సంబంధ బాంధవ్యములన్నింటి కంటె సతి పతుల సంబంధము మహత్వపూర్ణమైనది. ఈ కారణము వలననే భక్తునికి భగవంతునికి గల అనుబంధము సతీపతులతో పోల్చి చెప్పుచు, తద్వారా శరణ స్థలమునకు సంబంధించిన మౌలిక సూత్రములను ప్రతిపాదించిరి.

**శ్లో ॥ స్థలమేతత్సమాఖ్యాతం చతుర్ధా ధర్మభేదతః ।**
**ఆదౌ శరణమాఖ్యాతం తతఃస్తామసవర్జనమ్ ॥**
**తత్ నిర్దేశ ముద్దిష్టం శీలసంపాదనం తతః ।**
**క్రమాల్లక్షణ మేతేషాం థయామి నిశీమ్యతాః ॥ (సి. శి. 13; 3-41)**

ఈ స్థలమునందు శరణ స్థలము, తామసనిరసన స్థలము, నిర్దేశ స్థలము మరియు శీల సంపాదన స్థలములనెడి అవాంతర భేదములు గలవు. మొదటి స్థలమైన శరణ స్థలము గూర్చి ఉపదేశము నిచ్చుచు శ్రీ భగవత్పాదుల వారీ ఈ క్రింది విధముగా తెలిపిరి.

**శ్లో ॥ సతీవ రమణేయస్తు శివే శక్తిమ్ విభావయన్ ।**
**తదన్యవిముఖః సోయమ్ జ్ఞాతహ శరణనామవాన్ ॥ (సి. శి. 13-5)**

ఈ శ్లోకము యొక్క తాత్పర్యమేమనగా తనపత్నికి అన్ని విధములైన సుఖములనిచ్చువాడే పతి. భగవంతుడు జీవులకు సకల విధములైన సుఖములనిచ్చుచున్నాడు. కనుక సకల జీవులకు అతడు పతియే. ఇచ్చట గుర్తించవలసినది ఏమనగా లౌకిక వ్యవహారములలో తిరుగాడెడి పతి కంటె అలౌకిక పతియగు పరమాత్ముని స్థితి విలక్షణమై యుండును. లౌకిక విషయముల యందు సతిపతుల మధ్య సంబంధము శాశ్వతమైనది కాదు. ఋణానుబంధమున వారు ఒక్కటగు చున్నారు. ఆ ఋణము తీరగనే విడి పోవుచున్నారు. పతి మరణంచిన పిదప అతని సతికి వైధవ్యము సంప్రాప్తమగు చున్నది. విధవరాళ్లు మంగళ కార్యములలో పాల్గొన కూడదు. శివుడనే పతి అజరుడు మరియు మృత్యుంజయుడై యున్నందున అలౌకిక సతికి వైధ్యవ్యమే ప్రాప్తము కాదు. అందుకే అక్క మహాదేవి 'సావకెడువ గండరన్నోదు ఒలెయలి ఇరిసవ్వా' అని తన పతిని గురించి చావు మరియు చెడుగు లేని భర్తను పొయ్యిలో వేయమ్మా అని చెప్పెను. అలౌకిక పతికి చావూలేదు మరియు అతడు చెడెడిదీ లేదు.

పరమాత్మనే తన పతిగా నమ్మి అతడు కాక పరులగు వారి యెడల దృష్టినిసారించ కుండా యుండుటయే శరణ స్థలములోని విశిష్టమైన లక్షణము. ఈ తెరగున ఈ భావన కామము మీద విజయమును సాధించిన అమోఘమైన తత్వముగా కన్పట్టును కామాన్ని జయించుట సులభమగు మార్గము కాదు. అతడు అజేయుడని చెప్పబడు చున్నాడు. అట్టిదానిని జయించుటకు శరణమార్గమే సులువైన మార్గమని ఎరుగ వలయును. శరణుడు కామమును జయించి అత్యంత ఉన్నత శ్రేణికి చెందినవాడగు చున్నాడు. అక్క మహాదేవి కీర్తి అంతా ఇంతా అని చెప్పుటకు వీలులేదు ఆమె ఇట్టి కీర్తిని సంపాదించుటకు కారణమేమనగా ఈశ్వరునే ఆమె పతిగా స్వీకరించినది. ఆశ్చర్యకర విషయమేమనగా లౌకికమైన పురుషుని కాకుండా పరమాత్మయనెడి పురుషునే పతిగా పొందుట లౌకిక దృష్టిలో పురుషుని పత్నిగా భావించు కొనుట సహజముగా సంభవించదు. అది సమంజసమైనది కూడా కాదు. ఆధ్యాత్మికముగా చూచిన యెడల ఇది సహజమే యనిపించును. ఇచ్చట సకల జీవులకు పరమాత్ముడొక్కడే పతిగా యగుచున్నాడు. ఒక భక్తుడు తాను ఈశ్వరుని పతిగా భావించిన యెడల అతడు పరమేశ్వరునికి అతి సమీపమునన్నున్న వాడగు చున్నాడని భావించ వలెను. లౌకిక జీవితములో ఏ విధముగా సతీపతులు సన్నిహితముగా నుందురో అదే విధముగా భక్తుడు భగవంతుడు ఎంతో సన్నిహితముగా నుండి పరస్పరము ప్రేమానురాగములను పెంపొందించు కొనుచున్నారు.

ఒక పతివ్రతయైన పడతి తన పతికి యందు ఏ విధమైన పాతివ్రత్య భావమునందునో అదే విధమున భక్తుడు కూడా భగవంతుని యెడల ఏకైక నిష్ట కలిగిన వాడగు చున్నాడు. ఇంతటి స్థితి సంపన్నుడగు సాధకుడు శరణుడు అనిపించు కొనుచున్నాడు. ఈ సందర్భమున శ్రీ సిద్ధ రామేశ్వరుల వారి ఆత్మాను భవము ఎంతో జ్ఞానదాయకముగా నున్నది.

సొన్నలాపురమునకు చెందిన శ్రీ సిద్ధరామేశ్వర శివయోగుల వారు శివయోగమున మునిగియుండగా ఒక పడతి ఆయన యోగ మందిర ప్రాంగణమున ప్రతి దినము వేకువన కసువును ఊడ్చి కలాపి చల్లి ముగ్గులను వేసి అలంకరించు చుండెను. ఈమె చేసెడి సేవ చాలా కాలము వరకు కొనసాగుచునే యుండెను. ఈ సేవ చేసెడి వారెవరు? ఆమె మనోఇచ్ఛ ఏమిటి? తెలుసుకొనుట కై సిద్ధ రామేశ్వరులవారు ఆమె వచ్చెడి సమయమును కనిపెట్టి బయటకు వచ్చెను. అప్పుడామె రంగవల్లిని వేయుచుండెను. మహాయోగేశ్వరుడామెతో నీకేమి కావలెనని ప్రశ్రించెను. ఓ స్వామీ నీమీద మరులుగొని నేనీ సేవను అనురాగ భావముతో చేయుచున్నాను. నీ దగ్గర అనుమతిని గైకొనలేదు. క్షమించ గలరు. నాకోరికను అడిగితిరిగాన వినుడు. నీతో వివాహము చేసుకొనవలెనను కోరిక నాకు కలదు. దయచేసి ఆ కోరికను నెరవేర్చుడి. ఈ విధమున ఆమె అతనికి సతియై వైవాహిక సంబంధమును ఏర్పాటు చేసి కొనదలచెను. అద్దానికి శ్రీ సిద్ధరామేశ్వరుల వారు 'అమ్మా' ఒక స్త్రీ ఇంకొక స్త్రీతో వివాహ సంబంధమును పొందగలుగునే? ఎక్కడైననూ ఇది జరుగినదని వింటివా. నేను లింగమునే పతిగా భావించుకొంటిని. అతని సతిగా శరణ స్థలము నకాలము గడుపుచున్నాను. ఇది ఇట్టులుండగా మన ఇరువురి వివాహము ఎటుల సాధ్యమగును? అని బదులు పలికెను.

ఈ విధమైన మహోదాత్త భావనతో సిద్ధరామేశ్వరుల వారు కాముడిని జయించి లోక ప్రఖ్యాతిని గడించెను. శరణ స్థలమునందలి భక్తుడు లౌకిక పరమైన ఆనందముల వైపు మనస్సును మరల్చడు. అతనికి కావలసినది అలౌకికానందమే. ఈ లౌకిక సతి-పతి భోగము కంటె అలౌకిక పరమైన ఆనందము ఎంతో గుణాత్మకము గాను, విభిన్నము గాను యుండును. ఈ అంశమును గురించి శ్రీ భగవత్పాదుల వారీ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**శ్లో ॥ పరిజ్ఞాతే శివే సాక్షాత్ కో వాన్యమభికాంక్ష్యతి ।**
**నిధానే మహతి ప్రాప్తే కఃకాచం యాచతేన్యతః ॥ (సి. శి. 13-6)**

అక్షయమై అమూల్యమైన రత్నసంపదను పొందిన వ్యక్తి ఏ విధముగా గాజుతో చేసిన ఆభరణముల నాపేక్షించడో, శివునితో అలౌకికానందము ననుభవించెడి భక్తుడు లౌకిక సుఖముల ఎడల అపేక్ష కలిగి యుండుడు. ఎవరి అస్తిత్వము వలన జగత్తుకు అస్తిత్వము లభించినదో ఎవరి ప్రకాశము వలన జగత్తున వెలుగు నిండు చున్నదో, ఎవరి ఆనందమును పొంది జగత్తు ఆనందమును అనుభవించు చున్నదో అట్టి భగవంతుని భర్తగా పొందిన శరణుడు సాంసారిక యిచ్ఛలయందు ఆసక్తి ప్రదర్శించుటు, ఎన్నటికీ సంభవించదు.

లోకాచారమున దేవాలయములకు పోయి దేవతా విగ్రహములను పూజించి ధనకనకాది వస్తువులను, అధికారమును లేదా సంతానమును కోరెదరు. అయితే శరణ స్థలమునందలి భక్తుడు వీటిని కోరడు, వీటి ఎడల అతనికి మోహము జనియించదు. లోకములోని ఏవస్తువూ శాశ్వతమైనది కాదు. అటులనే ఏ ఆనందమూ శాశ్వతమైనది కాదు. ఇట్టి వివేకము మనస్సునందు కలిగిన శరణుడు క్షణికమైన సుఖము నఅపేక్షింపడు ఏ రత్నరాశులు గలిగిన ధనికుడు గాజు మణుల గురించి ప్రలోభమును పోందడో అదే విధముగా శివుని సాన్నిధ్యమనబడెడి అనంతమైన సంపదను బడసిన శరణుడు లౌకిక సంపదలను కోరుకొనడు. అతనికి కావలసినది, భక్తియనెడి సంపద మాత్రమె.

రుద్రరూపుడు, బుద్ధిమంతు డయిన శివ భక్తుని గాంచి ఒక లౌకికుడు ఈ ప్రపంచమునందున సంపత్తులనగా నేమి? విపత్తు అనగానేమి? వివరించి చెప్పుమని యడిగెను. అప్పుడా శివ స్వరూపుడైన భక్తాగ్రగణ్యునిడు, ఓ మహాశయా! నీవు భావించిన యటుల సంపదయనగా ధనము కాదు. సువర్ణము మరియు రత్నరాసులు కూడా కావు. నిజమైన సంపత్తు శివస్మరణనే. శివుడని స్మరించిన భక్తుడు శరణుడగు చున్నాడు. శివ స్మరణనే అనుపమానమైన సంపత్తు, అదే శరణుడు శివ పరబ్రహ్మ స్మరణను మరచిన యెడల మానవుడగు చున్నాడు. శరణుడై శివునికి సతియై మహోన్నతమైన స్థితికి ఎదిగిన భక్తుడు పతితుడై భవిగా మారుదు కంటె హెచ్చుగు విపత్తు మరేదైనా యుండునే? అని బదులినిచ్చెను. ఈ విధముగా శరణుడు శివ చింతనలో మునిగి యుండుట చేత అతనికి మరి ఏ విషయముల యెడల అభిరుచి యుండదు.

అజ్ఞానమనెడి అంధకారము నష్టము చేయ శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి.

**శ్లో ॥ సంసార తిమిరచ్ఛేదే, వినాశంకర భాస్కరమ్ ।**
**ప్రభవంతి కథం దేవాః హద్యోతా ఇవదేహినామ్ ॥ (సి. శి. 13-8)**

ఘోరమైన చీకటి దూరము కావలెననిన ప్రచండ భాస్కరుని అవశ్యకత గలదు. సూర్యోదయము కాగానే అంధకారము పరుగులు దీయుచు పారిపోవును. ఇదే తెరుగున అహంకార మమకారము లనెడి చీకటిని దూరము చేయుటకై శివునిని మినహాఇస్తే వేరెవ్వరికిని సాధ్యము కాదు. అజ్ఞాన తిమరము దూరము చేసెడివాడు శివుడొక్కడే. అందరికి సుఖమును ప్రదానము చేసెడి శంకరుని ఆరాధించియే బ్రహ్మాది దేవతలు తమతమ పదవులను పొంది యున్నారని, తమ కష్టములను దూరము చేసికొనిరనియును పురాణములలో చెప్పబడినది. శరణుడు సర్వలోక శుభంకరుడైన శివ పరబ్రహ్మ పూజను మినహాయిస్తే వేరే దేవతామూర్తుల పూజల యెడల అనురక్తుడై పూజించడు. శివ పరబ్రహ్మనైనను ఇష్టలింగ రూపముననే పూజించును. ఈ విషయమును విపులీకరిస్తూ శ్రీ భగవత్పాదుల వారీ క్రింది విధముగా చెప్పిరి.

శ్లో ॥ సంసారార్తః శివం యాయాద్ బ్రహ్మాద్యైః కింఫలమ్ సురైః ।
చకోర స్తృషితః పశ్యేచ్చంద్రం కింతారకా అపి ॥

శివునికి శరణాగతుడు కాకుండా సంసారము వలన ముక్తులగుటకు ఎప్పటికినీ సాధ్యము కాదు. ఇతర దేవతలను మనస్సునందున నిలుపుకొని పూజించుట కంటె శివుని మాత్రమే పూజించుట ఎంతో అవసరము. సదా వెన్నెలను సేవించెడి చకోర పక్షి ఎల్లప్పుడు చంద్రోదయమునే ఆకాంక్షించును, కాని నక్షత్రముల కాంతి వలన కడుపునింపుకొనదు. అదే విధముగా శరణుడు శివ పరబ్రహ్మ వైపే తన ఆరాధనను కేంద్రీకరించు కొనును. ఇచ్చట లింగపతి శరణ సతి అనెడి భావన యిమిడి యున్నదని శరణ స్థలములోని భక్తుడు ఈ విషయమును గ్రహించవలెను.

ఈ సంసారము నందున సుఖము కంటె దుఃఖమే ఎక్కువగా నున్నది. దీనికి గల కారణమేమిటో తెలిసికొనవలెను. సుఖిగా యున్న జీవి భగవంతుని జ్ఞాపకము చేసికొనడు. దుఃఖములు వచ్చినప్పుడు దేవుని వైపు తిరుగును. సుఖమున్నప్పుడు మనుజుడు భగవంతుని మరువక యుండిన దుఃఖమేల వచ్చునని ఒక కవి ప్రశ్నించెను. జీవుడు దుఃఖము వచ్చి నప్పుడు కూడా యా దుఃఖము నుండి విముక్తిని పొందాలనెడి స్వార్థముతోనే శివ పరబ్రహ్మను స్మరించును కాని స్వతహాగా భక్తితో కాదు.

శ్రీ భగవత్పాదుల వారీ విషయమున మరికొంత జ్ఞానమును ప్రదానము చేసిరి.

**శివయేవ సమస్తానాం శరణ్యః శరణార్థినామ్ ।**
**సంసారోరగ దష్టానాం సర్వజ్ఞః సర్వదోషహా ॥**

**శివజ్ఞానే సముత్పన్నే పరానందః ప్రకాశతే ।**
**తదాసక్త మనా యోగీ నాన్యత్రరమతే సుధీః ॥**

**తస్మాత్ సర్వప్రయత్నేన శంకరం శరణం గతః ।**
**తదనంత సుఖం ప్రాప్యేమోదతే నాన్యచింతయా ॥ (సి. శి. 13; 10-12)**

జనన మరణాత్మకమైన సంసార రోగము చేత పీడితులైన వారి యొక్క దోషములను దూరము చేయు సమర్థత గలిగిన వాడును, సర్వజ్ఞుడును అయిన శివునికే ప్రతి యొక్కరు శరణుజొచ్చవలెను. అతడొక్కడే శరణాగత రక్షకుడై యున్నాడు. ఈ విధముగా అనన్యభావముతో శరణు వేడిన వానికి శివజ్ఞానము సముత్పన్నమై పరమానందము ప్రాప్తమగును. పరమానందమును కటాక్షించెడి వానివైపే చిత్తమును ప్రసరింపజేసి అవ్యక్త శివానందము ననుభవిస్తూ శరణుడు ఆనందమును పొందుచున్నాడు. ఈ విధముగా షడ్ భక్తులలోని ఆనంద భక్తిని సాధనముగా గొని శివానందమును పొందుచు శివుని యెడల పతి భావన తన యెడల సతి భావన కలిగి ప్రతి ఒక్కరు శివుని ఉపాసన చేయవలెనని గుర్తించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 3-4 - 1992
స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వచనము నందు శ్రీ జగద్గురువు చంద్రశేఖర శివాచార్యుల వారు శరణ స్థలమునకు సంబంధించిన మౌళిక విషయములను బోధించిరి.

"అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణంమమ" అంటూ ప్రతి అర్చకుడు దేవతార్చనా సమయమున తన ఆరాధ్య దైవమును ప్రార్థించుటను గాంచ గలము. శరణాగతి యనెడిది భారతీయ సాంప్రదాయముల విశిష్ట లక్షణమై యున్నది. భగవంతుని రక్షకునిగా నెంచి రక్షణార్థ మతని

శరణు జొచ్చుట పౌరాణిక గాథలలో చూడగలము. దక్షుని శాపము వలన భీతిని చెందిన చంద్రుడు శివుని శరణు వేడి తన యస్తిత్వమును దక్కించి కొనుట మన మెరిగియే యున్నాము. ఇచ్చట జీవుని బలహీనత్వము దేవుని ప్రబలత్వము ద్యోకతమగు చున్నవి.

వీరశైవ ధర్మమున శరణ స్థలములోని సాధకుడు "ఆనంద ప్రాప్తికై శివుని శరణు జొచ్చును. లింగమే తన పతి యని, తాను సతిననెడి భావన పొందును. దేవతా రతి వలన శివానంద ప్రాప్తిని పొంద గోరును. ఈ విషయమును స్పష్టము చేసెడి శ్రీ బసవేశ్వరుల వారి క్రింది వచనము గనుడి.

జగమెల్లా అరియలు ఎనగొబ్బ గండనుంటు.
ఆను ముత్తైదె ఆను నిట్టైదె కూడల సంగమ దేవయ్యనంతప్ప, ఎనగొబ్బ గండనంటు,
(శ్రీ బసవేశ్వర వచనము 503, డా॥ తిప్పేరుద్రస్వామి సంపాదన)

ఈ వచనపు తెలుగు రూపము :

జగమెల్ల నరయ నాకొక గండడు గలడు నేను నిత్యముత్తైదను కూడల సంగయ్యయనబడెడి నాకొక గండడు గలడు.

విశిష్టాద్వైతమున వైష్ణవులు ప్రతిపాదించెడి రాధాకృష్ణ తత్త్వమిట్టిదే. దేవుడు ప్రేమికుడు కాగా సాధకుడు ప్రేమించెడి ప్రియురాలగు చున్నది. అయితే వీరశైవ పథమున సాధకుడు సతియగును. ఇతడు మనువాడిన సతి వంటివాడు. అన్యుల వైపు కన్నెత్తి చూడడు. నిరంతరముగా శివానందములో తేలి యాడు చుండును. విశిష్టాద్వైత వాదులు దీనినే మోక్షమని యందురు. అయితే ఈ ముక్తి సాయుజ్య ముక్తి కాక. సాలోక్య ముక్తియగును. ఇట్టి ముక్తిన్ని సాధకుడు శరణ స్థలమున పొందుననియు, ఐక్య స్థలమున సాలోక్య సామ్రాజ్యముల కతీతముగా నుండెడి శివ-జీవ సామరస్యమును పొందుననియు తెలిసి కొనగలరు.

"శివే శక్తిం విభావయన్" యనెడి ఆచార్యోక్తి (13:5) నవగతము చేసికొనుట యెంతో అవసరము. శ్రీ బసవేశ్వరుని వచనములో 'నిట్టైద' అనెడి పదము గురించి తెలిసికొనిన యెడల విషయము సుగమము కాగలదు. 'ముత్తైద' 'నిట్టైద' అనెడి పదములకు గల సంబంధమును తెలిసికొన వలసియున్నది. పతి బ్రతికి యుండిన స్థితిలో సతి ముత్తైదగా గుర్తింపబడును. పతి యసువులను బాయనంత వరకే ముత్తైదువ తన ముందును ఆ పిదప స్త్రీ వైధవ్యము ననుభవించననెడిది లోకమెరిగిన విషయమే "నిట్టు" అనెడి పదము నిత్యమైనది, శాశ్వతమైన దనెడి అర్థములో ప్రయోగింపబడు చున్నది. నిరంతరముగా ముత్తైదువుగా నుండెడి స్త్రీయే నిట్టైదువయగును. అట్టి స్థితి ననుభవించెడిది శక్తి యొక్కటే. శివాని యనుబడు నిత్య సుమంగళియైన శక్తియే 'నిట్టైద'యన బడును. శ్రీ భగవత్పాదుల వారి బోధన మేరకు సాధకుడు తాను శక్తినని భావించి కొనవలెను. షట్ త్రింషత్ తత్త్వములలో శక్తి తత్త్వము శుద్ధ తత్త్వములకు చెందినదై యున్నది. సదాశివ తత్త్వము కంటెను అతీతమై యుండెడి స్థితి. సదాశివ, ఈశ్వర, శుద్ధ విధ్యా తత్త్వములు సాత్వికాహంకారమునకు బద్ధములై యుండెడి తత్త్వములు. స్వాతికాహంకారమును "ఊర్ధ్వమాయ" యని గుర్తించెడి సాంప్రదాయమొకటి కలదు. మిశ్రతత్త్వములలో మాయ యెట్టి పాత్రను పోషించునో, అట్టి పాత్రనే ఊర్ధ్వమాయ పోషించుననియును, శివుని ప్రవృత్తి మార్గమున పయనింప జేయునునది గుర్తించ వలసిన విషయము. ఊర్ధ్వమాయ ప్రభావమునకు లోనైన శివుడు సదాశివ,ఈశ్వర, శుద్ధ విద్యల రూపమును దాల్చుననియును, సృష్టి స్థితి, లయముల నొనరించునని గుర్తించ గలరు. శుద్ధమాయ స్థానమున భవుడై సృష్టి రచన గావించును. మృదుడుగా నీశ్వర స్థానమున నిలిచి స్థితి పాలన చేయును. హరుడై సదాశివుని స్థానమున నిలిచి లయ మొనరించును. శరణుని స్థానము ఈ స్థానము లన్నింటి కంటెను మించిన స్థానమని గుర్తించ వలెను. శరణుడు శక్తి స్థానమున సుస్థిరముగా నిలిచి శివుని ననుభవించు ననెడిదే గుర్తించ వలసిన విషయము, ఈ స్థానమున సాధనను సఫలీకృతము చేసికొనును. తత్ఫలితముగా శివునితో సమరస ప్రాప్తిని పొందును. ఇట్టి స్థితి ఐక్య స్థలమున లభించును.

శరణుడుండెడి స్థితిలో ప్రపంచముండదు. ప్రాపంచిక విషయములను విస్మరించి సాధకుడు "ఆనంద భక్తి" నాచరించును. శివానందము ననుభవించును. ఈ ఆనంద స్వరూపమెట్టిదో యనెడి దీ యాగ మోక్తి వివరించు చున్నది.

**"శివ నిత్యత్త్వం నిశ్చింతాః సానంద దర్శణో భవేత్"** (సూక్ష్మాగమము)

ఈ ఆగమోక్తి ప్రకారము శివుడు నిత్యుడని యెరిగిన వాడై శరణుడు నిశ్చింతతో నానందము ననుభవించు చున్నాడు. ఇచ్చట యెరుగుట యనెడిదే కీలకమైన యంశము. ఈ కారణముననే "అరిదడె శరణ, మరెదడె మానవ" యనెడి శరణోక్తి బహుళ ప్రచారమును పొందినది. ఈ సందర్భములో "అంగలింగీ జ్ఞానరూపః సతీ జ్ఞేయః" అనెడి రేణుకోక్తి స్మరణీయమై యున్నది. ప్రాణలింగ స్థలమున చేసిన సాధన ఫలితము భ్రమర కీటక న్యాయమున శివుడై, తానె శివుడననెడి జ్ఞానసంపత్తిని పొందిన దశయిది. అంగ-లింగముల సామ రస్యమున నీ యనుభవము వచ్చునని తెలిసి కొనగలరు.

శరణుడై సాధకుడు నభవించెడి యానంద మద్వితీయమైనది. ఇట్టి నిరుపమానమైన యానందము ననుభవించెడి సాధకుడు అన్యము గురించి ఆలోచించడని తెలుపుటకై శ్రీ రేణుకాచార్యుల వారు బహు విధములైన యుదాహరణముల నిచ్చిరి. వారి ఉపమానములు విషయమును విస్పష్టము చేయు చున్నవి.

శ్రీ రేణుకాచార్యుల వారి (13:12) యుపదేశము అంతర్నిహితముగా నొక సందేశము గలదు. "సర్వప్రయత్నేన శివం శరణం గచ్ఛతాత్" మొదటి సందేశము "తదన్తర సుఖం ప్రాప్యమోదస్వ" అనెడిది రెండవది. ఇతరేతరములైన భ్రమలకు లోనుకాకూడదనియును, బ్రహ్మ విష్ణు గణేశాదుల శరణు జొచ్చ వలదనియును, కేవలము శివునికి శరణాగతుడుగా నుండి సుఖము ననుభవించుచు ప్రమోదము నొందవలెననెడిది యీ సందేశముల సారాంశము.

శివం భూయాత్

## ఆశీర్వచనము : 1

## తామస నిరసన స్థలము

శ్రీ భగవత్పాదుల వారు శరణ స్థలమున భక్తుడు పొందెడి యలౌకికానందము గుర్తించి యుపదేశము నిచ్చిన పిదప భక్తుని తామ సగుణ నిరాసక్తత గూర్చి యీ విధముగా ఉపదేశమును ప్రదానము చేసిరి.

**శ్లో॥ శివాసక్త పరానంద మోదినా గురుణా యతః ।**
**నిరస్యంతే తమోభావాః స తామస నిరాసకః ॥** (సి. శి. 13:13)

తమోగుణము వలన గల్గెడి నిద్రా లస్య కలహ మోహములను శరణ స్థలము నందలి భక్తుడు తొలగించి కొని తామస నిరాసక్తుడగు చున్నాడు.

శరణుని మనస్సు సదా శివుని యందే లగ్నమగుట చేత, అతడు నానంద సముద్రములో మునిగి తేలుచుండును. ఇట్టి స్థితిలో యున్న వాడికి నిద్రాది తామస వికారములు గణనీయములు కావు. అవి వాడిపై యెట్టి ప్రభావము చూపజాలవు. శరీర ధర్మమున కనుగుణముగా గాంచిన యెడల యీ వికారములను నివారించ లేమనియును. ఒక వేళ నవి దరి చేరినా, శరణుడు తన వివేకము చేత వాటిని దూరము చేసికొనును.

శరణ స్థలమున ప్రవేశించిన భక్తుని తామ సగుణముల వలన బాధగల్గునా యనెడి ప్రశ్న ఉదయించును. అయితే శరీర ధారియైన ప్రతి యొక్కరియందు ప్రకృతి జన్యములైన గుణములు అవశ్యముగా అవరించి యుండును. ప్రకృతి యందున సత్వ రజ మరియు తమో గుణములు ఉండును. ఈ మూడు గుణముల సామ్యా వస్థనే ప్రకృతి యని శాస్త్రజ్ఞులు పిలిచిరి. మనుజుని దేహమందున ఈ త్రిగుణములు గానీ వాత, పిత్త, కఫములనెడి త్రిదోషములుగాని సామాన్యావస్థ యందు ఉండవు. సత్వ రజ తమోగుణములు విష మా వస్థకు చేరినప్పుడు మనిష్యుని ప్రకృతి కూడ విషమానవస్థకే చేర్చును. మనుజునంతః కరణమునందున ఏదో ఒక గుణము తమ ప్రాబల్యతను పెంపొందించుకొని మిగిలిన రెండు గుణములను తన ఆదీనములో నుంచుకొనును.

సత్వగుణము నధికముగా యున్న వ్యక్తులు రజస్తమో గుణములు సత్వగుణము యొక్క అధీనము లో యుండును. ఇదేవిధిన ఇతర గుణములు తమ ఆధిక్యతను పెంపొందించు కొనినప్పుడు మిగిలిన రెండు గుణములు వాటి అధీనములో యుండును. శరణ స్థలమున నుండెడి భక్తుని యొక్క అంతరంగము నందున సత్వ గుణాధిక్యత యుండును. రజస్తమములు అల్ప ప్రమాణములో యుండును. అల్ప ప్రమాణములో యుండినను అవి తమ యొక్క ప్రభావమును చూపకుండ యుండజాలవు. పాముయొక్క కోరలలోను తేలు యొక్క తోక కొండిలోను విషము యుండునని అందరూ ఎరిగినదే. విషము ఒక్కటే అయినను పాము యొక్క విషము అతితీక్షణమైనది. తేలు విషము అల్ప ప్రమాణములో యుండినను దుష్ప్రభావమును కల్గించక మానదు. పాము కరచిన వానికి మరణము సంభవించు నవకాశము గలదు. తేలు కరచిన వానికి మరణ భయ ముండకుండినను మరణ తుల్యమైన వేదననను భవించుచునే యుండును. కరచిన క్షణము నుండి భాధిత వ్యక్తి బాధలో యలమటిస్తూ అటూ ఇటూ తిరుగుచునే యుండును. అల్పప్రాణములై నుండునది యైనను తేలు విషము

బాధింప కుండ యుండునే? అదే విధిన అల్పప్రమాణములో యుండిన రజస్తమో గుణములు సత్వ గుణాధిక్యత గల వ్యక్తిని బాధపెట్టుచునే యుండును. శరణ స్థలములోని భక్తులు సాత్విక మార్గమున జీవనము సాధించు చుండినను అప్పుడప్పుడు రజఃతమోగుణముల ప్రభావమునకు లోనై తాత్కాలికముగ పథభ్రష్టు దగుచున్నాడు. తనతప్పును తానెరిగి మరల సన్మార్గములోనికి వచ్చుచున్నాడు. ఈ విధముగా తామస గుణ ప్రభావములను దూరము చేసుకొనెడి శరణుని తామస నిరాస్తక్తుడు అని యందరు. ఆయా కాలములలోని యనేకానేక శరణులు తమ తమ వచనములలో తమ తమ యంతః కరణములో యున్న భావములను ఎత్తి చూపిరి.

"నా చిత్త మొక్క మేడి పండనియు లోపల చూసిన యెడల అన్నీ పురుగులే యనియును శ్రీ బసవేశ్వరుల వారు తెలియ జేసిరి."

"శ్రీ షణ్ముఖ స్వామి వారు మనమనెడి మర్కటము తనువనెడి చెట్టునెక్కె" యని వాపోయెను మనమనెడి మర్కటమును నిరోధించ లేకున్నాను దేవా" యనుచు సర్ప భూషణ శివ యోగి గారు సతమతమయ్యెను. ప్రతి శరణుడూ తమ తమ వచనములలో తామస నిరసనమును చేసిరి. ఈ విధముగా ప్రకటన చేయుట వలన ఒక ప్రయోజనము గలుగునని ఎంచబడుచున్నాది. చెప్పకుండా యుండిన యెడల ఈ గుణములు మనలోనె మిగిలి పోవును. తమ తమ గుణ గణములను చెప్పుకొనుట వలన యవి బహిర్గతములై మనకు దోష నివారణ కల్గును. కానీ తను దోషములను తాను జేప్పు కొనెడి శక్తి సామర్ధ్యములు ఎంత మంది కుండును. దేవుని విగ్రహము ముందు గూర్చొని జేసిన దోషములను ప్రకటించెడి వారు కొందరు గలరు. కానీ సమాజము ముందు తమ దోషములను బహిర్గత పరచువారెందరు? వీరి సంఖ్య అల్పములే శ్రీ గురువు ముందైనను సమాజము ముందైననూ తమ దోషములను ఎత్తి చూపువారే సత్పురుషులగుదురు. మిగిలిన వారు సామాన్య జనులే. ఇంతకు క్రితము వివరించిన శరణుల వచనములలో తమ దోషములను ఎత్తి చూపుటలో వెనుక ముందు లేదని గొచరించును. ఇట్టి వారందరూ నిస్సందేహముగ మహాపురుషులే. ఈ ప్రయత్న శీలముగల శరణుదు తామస నిరసనను బాహాటముగా చేయును.

తమో గుణము వలన కల్గెడి దుష్పరిణామములను తనకుతానే ఎందుకు బహిర్గతము చేసుకొనవలయు ననెడి విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమునిచ్చిరి.

**శ్లో ॥ యస్యజ్ఞానం తమోమిశ్రం నతస్య గతిష్య తే ।**
**సత్యం హి జ్ఞానయోగస్య నైర్మాల్యం విదురుత్తమః ॥ (సి. శి. 13-14)**

ఎవని జ్ఞానము నిర్మలమై యుండక తమో గుణ మిశ్రి తమై యుండునో అట్టి వానికి సంసార బంధమే కాని ముక్తి ప్రాప్తము కాజాలదు. శుద్ధమైన సత్వ గుణమే జ్ఞాన యోగమునకు సాధనయగుటచే శరణుడు తనయందలి అవశిష్టమైన తమో గుణమును నిరసించును. మాదక ద్రవ్యములను సేవించిన వ్యక్తి లౌకిక జీవనమును అనర్థము ననుభవించి ప్రగతిని సాధించ కుండునటులే తమో గుణావర్తియైన వాడు ప్రగతిని పొందజాలడు.

ఒకానొక సమయము నందున నలుగురు మిత్రులు పడవ ద్వారా ప్రయాగ నుండి కాశీకి ప్రయాణింప నిశ్చయించు కొనిరి. పున్నమి వెన్నెలలో త్రివేణీ సంగమమునకు విచ్చేసి ఒక సుందరమైన పడవ యందు గూర్చుండి ప్రయాణమును కొనసాగించిరి. వారు నలుగురు కూర్చున్నది మొదలుగా యదేచ్ఛగా భంగు యను మత్తు పదార్థ ద్రవమును సేవించు చుండిరి. ఆ మత్తు మీదనే ఇద్దరిద్దరి చొప్పున పడవకు యిరు వైపుల వంతుల వారీగా తెడ్డును వేయుచూ ప్రయాణము చేయుచుండిరి. రాత్రియంతా ఈ రీతిగ సాగిన పిదప బ్రాహ్మిముహుర్తమున వారికి మత్తుదిగినది. చుట్టు ప్రక్కల పరిశీలించగా అది త్రివేణీ సంగమమే అయియుండెను. పడవ తానున్న ప్రదేశమందే యుండెను. కించిత్తు కూడ ముందుకు సాగలేదు. ఇది అశ్చర్యముగొల్పెడి విషయమే. ఎందుకిట్లు జరిగినదని ఆలోచించగా వారు మత్తులో మునిగి యుండుటచే తామస గుణము హెచ్చి వారి బుద్ధికి గ్రహణము పొడచూపెను. పడవకు కట్టిన పగ్గము తీరము నందు నాటిన మేకు నుండి తొలగింపక పోవుటయే కారణమై యున్నది. తెలివి దెచ్చుకున్న ఆ నల్గురు ప్రయాణీకులు తాము మత్తు పదార్థసే వనమూలకంగా ఏర్పడ్డ తమో గుణ ప్రభావము చేత మేకుకు గట్టిన పగ్గము దొలగింప మరచుట జరిగినదని గ్రహించి, పశ్చాత్తాప చిత్తులై మనసులో అమలిన భావమనే తామ సగుణమును నిరోధించుటకు ప్రయత్నింప బూనిరి. మత్తు పదార్థ సేవనము వల్ల బుద్ధి వికాసము జెందక తమో గుణమావహించి తమ ప్రయాణ ప్రగతికి అడ్డు కట్టగా నిల్చినదని గ్రహించి నాటి నుండి మనస్సును

మలిన పరచు తమో గుణ ప్రభావ హేతువులైన పదార్థములలో సేవనముల నుండి దూరమై సత్త్వ వర్తనులై వెలంగుచుండిరి. దీని వలన మనకు తెలిసిన దేమనిన సన్మార్గ వర్తనులైన శరణులు తమ బుద్ధి వికాస మొనరించు సత్వ గుణమునకే కాక విశేష ప్రాముఖ్యత నీయుటం వలన తమో గుణ నిరసన సాధ్యమగునని పూజ్య భగవత్పాదుల ఉపదేశ సారాంశము.

ఇతర వేదాంత గ్రంథముల యందు త్రిగుణములకు సంబంధించిన విస్తారమైన చర్చ గలదు. అందులో తమో గుణము ఆధ్యాత్మిక ప్రగతికి ప్రతి బంధకమని చెప్పబడినది. ఈ గుణముల వృద్ధికి  మనము నిత్యము తీసుకునే ఆహారమే కారణమని చెప్పబడినది. చెడి పోయిన ఆహారము లేదా చల్ది యన్నములు సేవించుట వలన తమో గుణ మభివృద్ధి చెందునని జెప్పబడినది. తమో గుణమును దూరము జేసుకొనుటకు సాత్వికాహారమునే సేవించ వలెను.

తమో గుణము బందనములకు కారణమగు చున్నది. అజ్ఞానము వలన ఉత్పన్నమయ్యే గుణముతో పాటు తమో గుణము ఇంచుకించుక నభివృద్ధి చెందుచున్నది. తనవశములో యున్న జీవులను తమో గుణము ప్రమాదము ఆలస్యము, నిద్ర అనెడి మూడు పాశముల చేత బంధించు చున్నది. శాస్త్ర విహితమైన నియమముల నుల్లంఘించుటయే ప్రమాదకరమని, ప్రమాదమునకు లోనైన వాడు తన నిత్య కర్మలను వీడు చున్నాడు. "స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం" అని శాస్త్రము ఉపదేశించు చున్నది.

ప్రమాదమనెడిది ఒక ప్రమాదకరమైన దుర్గుణము. ఒక సారి దానికి వశుడైన ఎడల ఆ వ్యక్తిని అది మళ్లీ మళ్లీ తన వశములోనికి దెచ్చు కొనును. నేడు చేసెడి కార్యము రేపు చేయ వచ్చును లే అనెడి భావన ప్రమాద వశముననే వచ్చు చున్నది. ఈ రోజు చేయవలసిన పనిని ఇప్పుడే చేయవలయునను భావము తామస గుణ ప్రవృత్తి గల వ్యక్తికిరాదు. "శ్వః కర్తవ్యం అద్యకుర్వీత" అని చెప్పబడినది. రేపు జేయ వలసిన పనిని ఇప్పుడే జేయుము అని దాని అర్థము.

ఆలస్యమనుననది తమో గుణము యొక్క మరొక రూపము. "ఆలస్యం హి మనుష్యాణాం  శరీర స్త మహారిపుః" అని సుభాషిత కారులు ఉపదేశించిరి. అలస్యమే మనిషి అంతః శత్రువు యనెడిది దీని యొక్క భావము. ఈ భావమునే ప్రతిబింబించెడి ఈ క్రింది శ్లోకమును గనుడు.

**శ్లో ॥ అలసస్యకులో విద్యా అవిద్యస్యకుతో ధనమ్ ।**
**అర్ధస్య కుతో మిత్రం అ మిత్ర స్యకుతః సుఖమ్ ॥**

సోమరికి విద్యరాదు, విద్యలేని వానికి ధనము అభించదు.

ధన హీనునుకి మిత్రులు అభించరు. మిత్రులు లేని వానికి సుఖమెక్కడిది? అని దీని అర్థము ఈ విధముగా సుఖ రాహిత్యమునకు సోమరి తనమే కారణమగు చున్నది. ఈ విషయమును సమగ్రంగా వివరించు నొక కథ ప్రచారములో నున్నది.

అత్యాలస్య భావము కల్గిన నొకానొక వ్యక్తి దారిగుండా వెళ్తూ ప్రయాణ బడలిక నుండి సేదదీర్చు కొనుటకు ప్రక్కనే యున్న రేగి చెట్టు క్రింద విశ్రాంతి కుపక్రమించెను. అదే సమాయాన గాలికి కొన్ని పళ్లు చెట్టు పై నుండి విశ్రాంతి తీసుకును చున్న వ్యక్తి చుట్టూ రాలిపడెను. అంతలో అటుగా నొక వ్యక్తి గుర్రముపై స్వారీ చేయుచు వెళ్లు చుండుట గమనించిన విశ్రాంతి తీసుకొను వ్యక్తి ఆ గుర్రపు స్వారీ చేయు వ్యక్తిని పిలుచు చుండెను.  గుర్రము పై నుండి వెళ్తున్న వ్యక్తి అయ్యో పాపం క్రింది నుండి లేవలేని స్థితిలో నున్నాడని విశ్రాంతి తీసుకునుచున్న వ్యక్తిని గమనించి, అతని సమీపమునకు వచ్చేసెను. చెట్టు క్రింద యున్న వ్యక్తి  గుర్రము పై నున్న వ్యక్తితో క్రింద బడిన రేగుపళ్లను ఏరి తన నోటి యందు వేయమని చెప్పెను. అందుకు గుర్రము పై నున్న వ్యక్తి ఈతడొక పనికి మాలిన వాడని గ్రహించి బదులు పల్కకుండగా అక్కడి నుండి నిష్క్రమించెను. జగత్తులో మనము సుఖము ననభవింప వలయుననినా సోమరి తనమును దరి చేరనీయ కూడదు. మృగరాజైన సింహము తన ఆహారమును సంగ్రహించుటకు తనదైన శైలిలో వేట ప్రారంభించెను. వేటాడ కుండా యుంటే మృగమునకు భోజనము లభించదు. "ఏ నహి సుప్తస్య సింహస్య ప్రవిష్యంతి ముఖే మృగాః" అనెడి సూక్తి ప్రకారము పరుండిన సింహము నోటిలోనికి ఆహారము తనంతట తానుగా వచ్చి పడదుగా? సింహాము తన ఆకలిని తీర్చు కొనుటకై  వేటాడియే తీరవలయును. తమో గుణప్రదానుడైన వ్యక్తి ఈ విషయమును గ్రహించి తమో గుణము నుండి విముక్తి పొంది తీరవలెను.

మూడవ పాశమగు నిద్ర గురించి చెప్పవలెననిన నిద్ర యనెడిది అవసరమే. శారీరకంగాను మానసికంగాను అలసి పోయిన వ్యక్తికి నిద్ర వలన విశ్రాంతి లభించును. దినమునకు సుమారు ఐదారుగంటల విశ్రాంతి అవసరము. అంతమేర నిద్రించిన తప్పులేదు. కానీ కొంతమంది నిద్రరాకుండినను పరుండి కళ్లు మూసుకొని యుందురు. క్రమముగా మగత నిద్రకు లోనగుదురు. ఇది తమో గుణము యొక్క ప్రభావము. రాత్రింబవళ్లుఈ విధముగా నిద్రించు వారూ గలరు. శాస్త్ర కారులు ఇట్టి నిద్రను నిందనీయమని జెప్పిరి. ఆరోగ్యమునకు యవసరమగునంత మేరకు నిద్రించి మిగిలిన సమయమును శివ శరణులు శివ యోగా భ్యాసమున కుపయోగించ వలెను. ఇంతే గాక తన నుండి ప్రమాదమేమైనా జరుగ నున్నదా నేను సోమరినా నేను అతిగా నిద్రించు చున్నానా. అనెడి ప్రశ్నలను తనకు తానే వేసుకొని స్వయం నియంత్రణ ద్వార ప్రమాదము అలసత్వము మరియు అతి నిద్రలను ప్రయత్న పూర్వకముగా దూరము చేసుకొన వలెను. శివ భక్తులెల్లరు ఈ రహస్యములనెరిగి తామ సగుణమునకును దాని వలన కలిగెడి పరిణామములకును దూరముగా యుండి విహితమైన శ్రేయమును పొందుదురు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది ॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్ర శేఖర శివాచార్యుల వారు తామస గుణమునకు సంబంధించిన మౌళిక విషయములను వివరించిరి. సాధకుడు తామస నిరసనను చేసెడి వాడై యుండ వలెనని హితబోధ చేసిరి.

తామస నిరసన స్థలమును సైద్ధాంతికముగా పరిశీలించిన యెడల, శరణ స్థలమునకు వర్తించెడి యంశమా యనెడి సందేహము గల్గును. త్రిగుణము లనెడివి ప్రకృతి తత్త్వమునకు చెందినవి. సాధకుడు మాహేశ్వర స్థలమున ప్రకృతి తత్త్వము నధిగమించును. శక్తి తత్త్వమున ప్రకృతి యొక్క పరమార్థ మెట్టిదో గుర్తించ వలసి యున్నది. ఈ యంశము గురించి తెలిసికొన వలెనననిచో "అంగ లింగీ జ్ఞానరూపః" అనెడి ఆచార్యోక్తి (సి. శి. 13:2) యుప కరణముగా దోహదము చేయును జ్ఞాన రూపుడైన అంగ లింగి తాను సతిననియును, శివుడు తన పతియనియును భావించి కొని శరణుడగునని చెప్పబడినది. (సి. శి. 13:2) జ్ఞానరూపమనెడి పదమునకు "శివ విజ్ఞాన మేవ స్వరూపం యస్యస తాదృశః శివజ్ఞాన వాన్ ఇత్యర్థః" అనెడి వివరణ యివ్వబడినది. (తత్త్వప్రదీపిక) ఇట్టి జ్ఞాన గుణసంపన్నుడైన శరణుని జ్ఞానము యొక్క స్వభావమును గురించి తెలుపుటయే ఆచార్యుల వారి లక్ష్యమై యుండి యున్నటుల దోచు చున్నది.

జ్ఞానము యొక్క స్వభావము త్రిగుణముల వలన ప్రభావితమగును రజస్తమో గుణముల కారణమున జ్ఞానము కలుషిత మగునని తెలుప బడినది. తమో గుణము చేత కలుషితమైన జ్ఞానము గలవానికి దుర్గతి ప్రాప్తించునని శ్రీ భగవత్పాదుల వారు వివరించిరి. "సత్త్వం హి జ్ఞానయోగస్య నైర్మల్యం" అని ఆనతినిచ్చిరి. ఈ సందర్భమున సూత సంహితలోని యీ వాక్కు గమనార్హమైనదై యున్నది. "సత్త్వాత్ సుఖం చ జ్ఞానంచ వైరాగ్యం సౌఖ్యమేవచ"

సతీ పతుల సామరస్య రూపమున నుండెడి సుఖమే ఆనందమగు చున్నది. శరణుడీ సుఖము ననుభవించుటకు సత్త్వమే కారణమగు చున్నదని సూత సంహిత వలన తెలియు చున్నది. సత్త్వ జ్ఞాన ప్రదమనియు తెలుప బడినది. ఈ విధముగా సత్త్వము మరియు ఆనందము పరస్పర పూరకములును, పరస్పర పోషకములును అగు చున్నవి.

సత్త్వము యొక్క ప్రాముఖ్యత దృష్ట్యా శ్రీ భగవత్పాదుల వారు సత్త్వ గుణము శరణుని విశిష్టమైన భూషణమని తెలియ జెప్పనెంచెను

సాధకుడు సాధన చేసెడి క్రమములో క్రమము తప్పెడి యవకాశము లేదన జాలము "అరిదడె శరణ మరెదడె మానవ" యనెడి నానుడికి గల ప్రాచుర్యమును బట్టి యీ యంశమందరికినీ తెలిసినదే యని అన వచ్చును. అట్టిది సంభవించిన యెడల నట్టి పరిణామమునకు జ్ఞానము కలుషిత మగుటె యని తెలిసికొన వలెను. సాధకుల కీ విషయము బోధపడుట కొరకే శ్రీ భగవత్పాదుల వారీ యుపదేశమును ప్రదానము చేసిరి.

శ్రీ రేణుక భగవత్పాదుల వారి భావమును ప్రతిబింబించెడి యీ రగడ గమనార్హమై యున్నది.

శ్రీ పరమానందోదయ శరణం
వ్యాపిత ఘన మహిమానిధి శరణం
నిజలీలా పరివర్తిత శరణం
అజగజ్జన సంకీర్తిత శరణం
సర్వాను గ్రహ నేత్రం శరణం
సర్వవశైక కళత్రం శరణం
నిర్భీకృత నిరావరణం శరణం
గర్భీకృత పురహరణం శరణం
స్వచ్ఛం దాచార పరం శరణం
స్వచ్ఛతర జ్ఞానతరం శరణం..........
(పాల్కురికి సోమనాథుని "షట్ స్థలద రగళె")

ఈ రగడలోని చివరి పాదం గమనార్హమై యున్నది. స్వచ్ఛతరమైన జ్ఞాన మనగా శ్రీ రేణుకాచార్యుల వారు ప్రతి పాదించిన సత్త్వవిశిష్టమైన జ్ఞానమని యెరుగ వలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము : 2

## తామస నిరసన స్థలము

క్రితపు ఆశీర్వచనములో తమో గుణము నుండి ఉత్పన్నములయ్యేడి దుర్గుణములకు శరణుడు దూరముగా నుండవలెనని చెప్ప బడినది. ఈ విషయమును గురించి శ్రీ భగవత్పాదుల వారు మరి కొంత జ్ఞానమును ప్రదానము చేసిరి.

శ్లో ॥ శమోదమో వివేకశ్చవైరాగ్యం పూర్ణభావనా ।
క్షాంతిః కారుణ్య సంపత్తిః శ్రద్ధా సత్య సముద్భవా ॥

శివభక్తిః పరోధర్మః శివజ్ఞానస్య బాంధవాః ।
ఎతైర్యుక్తో మహాయోగీ సాత్వికః పరికీర్తితః ॥ (సి. శి. 13;15-16)

అంతరింద్రియ నిగ్రహము బహిరింద్రియ నిగ్రహము నిత్యా నిత్య వస్తు వివేకము, విషయ సుఖముల యెడల వైరాగ్యము, అఖండమైన పరశివ ధ్యానము, సహనము, భూతదయ, నైజము నందున విశ్వాసము, అకుంఠితమైన శివభక్తి వుత్తమమైన శివార్చన అనెడి ఈ పది గుణములు శివజ్ఞానమునకు మరియు శివయోగమునకు సహాయకము లైయుండును. వీటిని శివజ్ఞాన బంధువులందురు. ఈ గుణములు భగవద్గీతలో నుపదేశింపబడిన. దైవా సంపత్తుకు చెందిన గుణముల వలె దోచినను, వాటి కంటె భిన్నమైనవిగను మరియు గుణాత్మకముగా ఆధిక్యత గలిగినవైయున్నవి. ఈ పది గుణములకు విపరీతముగా నుండెడి గుణములు అసుర గుణములు. పై పది గుణముల నలవరచుకొనిన వాడు పర శివునితో సమరస భావమును పొందుట కర్హతను సంపాదించు కొను చున్నాడు. అసుర సంపదను పెంపొందించు కొనినవాడు పురాణములలో వర్ణింపబడిన రాక్షసుల వలె ప్రవర్తించుచు వారి వలెనే పతనమగుదురు. ప్రతి జీవి తన ఇచ్ఛాను సారముగా శ్రీ భగవత్పాదుల వారు వివరించిన గుణములను గాని లేదా తద్విరుద్ధమైన గుణములను గాని అలవరుచు కొనుటకై పరిపూర్ణమైన స్వేచ్ఛ కలదు. మానవుని జీవితమును ఒక రైల్వే జంక్షనుతో పోల్చవచ్చును. ఆ జంక్షనులో నున్నవాడు తన ఇచ్ఛాను సారముగా ఏ మార్గముననైననూ పయనించ వచ్చును. ఉత్తర దిశ లేదా దక్షిణ దిశకు అనెడిది, నిర్ణయించు కొని టెక్కెట్టును కొని స్వేచ్ఛగా వెడల వచ్చును. అదే విధమున జీవి తన ఇచ్ఛాను సారముగా అసుర గుణములను గాని శైవ గుణములను గాని అలవరుచు కొన వచ్చును. ఐతే ఫలితమునకు మాత్రము వాడు కర్త కాదు. అసుర మార్గము నెంచు కొనిన వాడు సకలారిష్టములను

ఎదుర్కొనుచు. అష్ట కష్టముల పాలై భవమున బడి పతన మగును. శ్రీ భగవత్పాదుల వారు సూచించిన శైవ గుణములను పొందిన వాడు ముమ్ముందు సకల సన్మంగళముల, ననుభవించి లింగాంగ సామరస్యము ద్వారా శివుడిగా పరిణామమును పొందు చున్నాడు. కాని దురదృష్టవశాత్తు అజ్ఞాన వశమున అధిక సంఖ్యాకులు అసుర సంపదను వరించు చున్నారని వేరుగా చెప్పనక్కర లేదు. ఆధునిక సంస్కృతిని గమనించిన వారి కీ విషయము సుబోధకమే.

ప్రతి జీవి అసుర సంపత్తును పొంద కుండా జాగరూకత వహించి యుండ వలెననియును, తన్నిమిత్తమై తామ సగుణమును వర్జించ వలెనని శ్రీ జగద్గురుల వారు ఉపదేశించిరి. క్షమ, దమాదులు అలవరుచు కొనినవాడు సాత్వికుడై విరాజిల్లును. ఇట్టి వానికి ఆత్మ జ్ఞానము లభించు చున్నది. మనము సంపాదించిన సంపద భౌతిక సంపద, అన్యాంక్రాంతమయ్యెడి అవకాశము కలదు. మన ఇష్టా యిష్టములతో ప్రమేయము లేకుండా దొంగలో, దొరలో, వైద్యులో మరెవ్వరో దానిని హస్తగతము చేసికొందురు. కాన భౌతిక సంపద అశాశ్వతమైనది. కాని క్షమ-దమాదులతో కూడు కొనిన శైవీ సంపదను ఎవ్వరును గ్రహించలేరు. దొంగలు దొంగలించలేరు. రాజులు బలాత్కారముగా తీసుకొని వెళ్ళలేరు. శ్రీ భగవత్పాదుల వారు ఉపదేశించిన గుణములలో క్షమయనెడిది మొదటి గుణము క్షమయనగా అంతరింద్రియ నిగ్రహమని గ్రహించ వలెను. దమము గూడా క్షమము వంటిదే కాని దీనికి బహిరింద్రియములతో సంబంధము కలిగియుండును. బహిరింద్రియ విగ్రహమే దమమగు చున్నది. క్షమ-దమములు పరస్పరము సాపేక్ష సంబంధము గలిగి యున్నవి. మనస్సు ఇచ్ఛ వలె బహిరింద్రియములు పనిచేయునది గాంచు చున్నాము. మనస్సు ఇంద్రియములకు అధిపతి. మనస్సునకు చూడాలనిపించినప్పుడు. నేత్రేంద్రియము తన కార్యమునందు ప్రవృత్తమగును. వినవలసిన యప్పుడు శోత్రేంద్రియము తనవ్యవహారములో ప్రవృత్తమగును. ఇదే విధముగా మిగిలిన ఇంద్రియములు మనస్సు కోరిక ప్రకారము వాటికి సంబంధించిన వ్యవహారములలో ప్రవృత్తమగు చున్నది.

మనస్సు శబ్దస్పర్శాది విషయములను ఆయా ఇంద్రియముల ద్వారా అనుభావ మొందుచున్నది. ఇంద్రియముల యొక్క ప్రమేయము లేకుండా మనస్సు ఏ విధముగా సుఖ భోగమును పొందజాలదో అదే విధముగా మనస్సు యొక్క ప్రమేయము లేకుండా ఇంద్రియములు తమ తమ వ్యవహారములలో ప్రవృత్తము కాజాలవు. ఈ కారణము వలననే శ్రీ భగవత్పాదుల వారు అంతరింద్రియ నిగ్రహమునకు దోహము చేసెడి శమమును గురించి ఉపదేశము నిచ్చిరి. శరణ స్థలము నందలి భక్తుడు అంతరింద్రియ నిగ్రహమునకై ప్రయత్నించవలెను. మనస్సును నిగ్రహించుటకై బుద్ధి యొక్క అవశ్యకత గలదు. బుద్ధి నిర్దేశమునకు అను గుణముగనే మనస్సు ఏదో యొక్క కార్యక్రమము నందున నిమగ్నమై యుంటున్నది. మనస్సు మీద బుద్ధి నియంత్రణ సర్వ సాధారణంగా కొనసాగిననూ మనస్సు శక్తి వంతమై నందు వలన బుద్ధిని తన వైపునకు తిప్పు కొనగలదు. తన కనుకూలమైన నిర్ణయమును బుద్ధి చేత చేయించగలదు. కార్యాలయములో పనిచేసెడి ఒక బంట్రోతు తన మీద అధికారిని తన యొక్క అధీనములో నుంచు కొని అతని చేత తన కూలమగు పనులు చేయించుకొనెడిది గాంచ గలము. పై అధికారి లంచగొండియై, వివేకహీనుడై యుండిన యెడల ఇట్టి అనర్థములు సంభవించు చున్నవి. అయితే అతడు నీతి మంతుడై నిష్ఠుర వాదియై నిర్ణయములను చేసిన ఎడల ఇట్టి వైపరీత్యము సంభవించదు. ఇదే రీతిన బుద్ధి న్యాయా న్యాయములను విచారించి న్యాయమైన నిర్ణయములనే తీసుకొనగలదు. ఐతే ఎవరి బుద్ధి వివేకమును కోల్పోవునో వారి మనస్సు అధిపత్యము వహించి సకల అనర్థములకు కారణమగు చున్నది. రావణుడు సీతను కోరుటయు. ఉదాహరణగా గ్రై కొన వచ్చును. ఇంకను బుద్ధి వివేక సంపన్నమై యుండిన యెడల మనస్సు మీద అధికారము నెరపును. వికృతమైన మనస్సు బుద్ధిని వికృత మార్గమున పయనింప జేయుచు అధో పాతాళమునకు నెట్ట బడుచున్నాడు. వికృతమైన బుద్ధి వలన సంబంధిత వ్యక్తి నాశనమగు చున్నాడు. ఈత రానివాడు తనను రక్షించుటకు వచ్చిన వానిని కౌగిలించుకొని ఏ విధముగా వాని మరణమునకు కారణమగు చున్నాడో అదే విధముగా వివేకహీనుని సాంగత్యమున నుండెడి వారందరు పతనమగు చున్నారు.

దమము అనెడిది మరొక సద్గుణము. బాహ్యేంద్రియములను నిగ్రహించుటకై ఇది ఉపయోగపడును. శమము మరియు దమము ఒకదానితో మరొకటి సహకరించుకొనును. శమము వలన దమము సిద్ధించును. దమము వలన క్షమమూ సిద్ధించును. మనసు బయటి విషయములతో సంపర్కమును పొందుటకు అనర్హురాలైనను ఇది కొత్త విషయములకు మాత్రమే వర్తించును. పాత అనుభవముల స్మృతి ఉండనే ఉండదు. భూత భవిష్యత్తుల చింతన చేసెడి దానిని మనోరాజ్య పాలన అని అందురు. ఈ సందర్భములో బుద్ధి

జాగృతమై దమమునకు సహకారము అందజేయును. ఇట్టి సత్ఫలితములకు దోహదము చేసెడి క్షమ దమములను శరణ స్థలములోని భక్తుడు తప్పని సరిగా అలవరచు కొనవలెను. ఇంకను మూడవ గుణము వివేకము. వివేకము రెండు రకములుగా నుండును. ఒకటి నిత్యా నిత్య వివేకము. రెండవది ఆత్మానాత్మ వివేకము. ఈ రెండు వివేకముల వలననే సాధకుడు క్షమ దమములను పొందగలుగును. వివేకము వలననే సాధకుడు నిత్యమైన దేమిటి, అనిత్యమైన దేమిటి, ఆత్మ అనగానేమి, ఆత్మకానిది ఏమి? గుర్తించు చున్నాడు. తన బుద్ధిని నిత్యమైన వస్తువుల ఎడలను, ఆత్మ జ్ఞానమునకు సంబంధించిన విషయముల ఎడలను కేంద్రీకరింప జేయును. అప్పుడది మనస్సు యొక్క చంచలత్వమును దూరము చేసి మానసిక స్థైర్యమునకు దోహదము చేయును. చంటి పిల్ల ముందు అనేక ఆట వస్తువులను పెట్టినప్పుడు అది ఒకప్పుడు ఒక వస్తువు ఎడలను, మరొకప్పుడు మరొక ఆట వస్తువు ఎడలను అనురక్తిని ప్రదర్శించును. క్షణక్షణమునకు చంచల భావమును చూడగలము. అయితే అదే పిల్ల ముందు ఒకే వస్తువును పెట్టిన ఎడల కేవలము ఆ వస్తువు ఎడల మాత్రమే అనురక్తిని ప్రదర్శించును. అందుచేత వివేకవంతుడైన వాడు తన మనస్సును పరిపరి విధములుగ పయనింప నివ్వక కేవలము ఆత్మ జ్ఞానము వైపే నిలుపును. అట్టి ఆత్మ జ్ఞానములోనే క్రీడించు చుండును. అట్టి వానికి అంతరింద్రియములు మరియు బహిరింద్రియములు అదుపులో యుండును. అందుచేతనే క్షమ-దమములు చిత్త వృత్తిని నిరోధించుటకు సాధనములని గ్రహించ వలెను. ఇదే రీతిగా వైరాగ్యము కూడా మరొక సద్గుణమై యున్నది. సుఖముల ఎడల విరక్త భావము వహించుట యే వైరాగ్యము. ఐతే భూలోకమున వైరాగ్యము తీసుకొని పరలోకమున స్వర్గమోక్షముల ద్వారా సుఖమును పొందగోరెడి వాడు నిజమైన వైరాగ్యము గలవాడు కాదు. అందుకే శాస్త్రకారులు "ఇహామాత్ర ఫలభాగ విరాగః" అని వైరాగ్యమనెడి పదమునకు నిర్వచనము నిచ్చిరి. ఆత్మ చింతన యందు ఆసక్తి యుండదు జగత్తును తృణ ప్రాయముగా నెంచును అతడు కోరుకొనెడిది శివ పరమాత్మలో సామరస్యము మాత్రమే మిగిలిన వన్నియును అభిలషణీయములు కావు. ఈ తత్వము నెరిగిన శివ శరణులు చతుర్విధ పురుషార్థములను నిరాకరించి పురుషార్థమునగా కేవలము భక్తియే యనెడి వినూత్నమైన నిర్వచనమును ప్రదానము చేసిరి.

పూర్వభావన యనెడిది మరొక సద్గుణము. అఖండమైన శివధ్యానమున నుండుటయే పూర్ణభావన యగును. శివాలయములలో లింగము మీద నిరంతరము నీరును పోయుచు నభిషేకము చేయుటకై లింగము మీద నొక కుంభమును వ్రేలాడే యేర్పాటు చేయుదురు. అధోభాగమును వృషభ ముఖముండును. అందులో నుండి నీరు లింగము మీద నిరంతరముగా పడుచుండును. ఇదే విధిన శివుని ధ్యానమును నఖండముగా చేయుచుండ వలెనని గ్రహించ వలెను. ధ్యానము ప్రారంభించిన సమయము నుండి ముగించెడి వరకు మీరే యితరమైన ఆలోచనను మనస్సులోనికి రానివ్వకూడదు. ఇట్టి అఖండమైన ధ్యాన మనబడెడి పూర్ణభావన శరణునికి యుండవలెననియును నిది యనివార్యమైనదనియును గ్రహించగలరు.

క్షాంతి యనెడిది యారవ సద్గుణము క్షాంతి యనగా క్షమము. ఒక వ్యక్తి దోష భూయిష్టమైన పనిని చేసి మరోక వ్యక్తికి హాని తలపెట్టుట చూడగలము క్షమించుమని కోరెడి దోషులను గాంచ గలము. క్షమించుట యనెడిది బహు విధములైన కారణముల వలన సంభవించు చున్నది. మోహ భయస్వార్థాదులు ప్రధాన కారణములని చెప్పబడు చున్నది. పిల్లలు క్షమించరాని తప్పు చేసినను, తల్లి దండ్రులు వాటిని క్షమించు చుందురు. సంతానము యెడగల వ్యామోహము వలననే వారీ విధిన క్షమించు చున్నారు. ఒక బలిష్ఠ వ్యక్తి మరొకనికి పట్టి బాదిన సందర్భములలో శక్తి హీనుడు శక్తి సమేతుని క్షమించు చుండును. ఈ క్షమాపణలో భయము ఇమిడి యున్నది. ప్రతి క్రియ చేయలేని స్థితిలో యీ పరిస్థితి యేర్పడునని గ్రహించ వలెను. దెబ్బ దినిన వ్యక్తి ప్రతి క్రియను చేసెడి స్థితిలో నుండినా ఎదుటి వానిని క్షమించెడి సందర్భములను చూడగలము. ప్రతీకారము వలన వచ్చెడి లబ్ధి నామమాత్రముగా నున్నప్పుడు, ఈ విధిన క్షమించుట యనెడిది సంభవించును. ఇట్టి క్షమకు స్వార్థమే కారణమగు చున్నది.

క్షాంతి యనగా శిక్షించెడి సామర్థ్యము గల్గిననూ, ఎదుటి వారిని సంస్కరించ వలెననెడి యుద్దేశముతో ప్రదానము చేసెడిది క్షమ. ఈ విషయమును స్పష్టపరచెడి కథ యొక్కటి కలదు.

సదాచార సంపన్నడగు శివాచార్యుల వారొకరు ఒక నౌకలో ప్రయాణమును చేయు చుండిరి లింగధారణాది శివ చిహ్నములను ధరించి శివ తేజముతో విరాజిల్లు చుండెను. సద్బుద్ధి గలవారు, అతని పాదములకు నమస్కరించి యాశీర్వచనములను పొందిరి. కాని దుర్బుద్ధిగల పోకిరి యువకులు కొందరు శివాచార్యుల నాట పట్టించుటకై వివిధ కోతి చేష్టలను చేయుచు, నతనిని అవమానమునకు

గురించేయు చుండిరి. మిగిలిన వారు భయగ్రస్తులై యేమియును చేయలేని స్థితిలో నుండిరి. వారు, "ఓ సదాశివా! నీ స్వరూపమైన శివాచార్యుల వారు అవమానమునకు గురియగు చున్నారు. వారి శాంతమే యెదుటి వాని దురాగతములను సహింప జేయు చున్నది. ప్రతి క్రియ చేపట్టుట లేదు. కారణమేమో తెలియుట లేదు. నీవైనను దుష్టులను శిక్షించ కుండగ యుండుట భావ్యము కాదు దయ చేసి ప్రతీకారము గాని ప్రతి క్రియగాని చేయు"దని శివుని వేడి కొనిరి. భక్త వత్సలుడైన శివుడు దుష్టులను శిక్షింపనెంచెను. శివాచార్యుల వారి మనోగతము నెరుగుటకై యా ఆచార్యుని మనమున ప్రకటన పొందెను. "ఓయీ శివాచార్యా ! యింత ఓర్మి యెందులకు వహింతువు. ఇట్టి వారిని క్షమించ వచ్చునే? నీవు కోరినచో, నౌకను నీటిలో ముంచి, ఆదుష్టులను సంహరించెదను మిగిలిన వారికిని, నీకును హాని జరుగకుండగ జాగ్రత్త వహింతును. నీయభీష్ట మెట్టిదో తెలుపు మనెను.

మూర్తీ భవించిన శాంతి స్వరూపమైన శివాచార్యుల వారు శివునితో నిట్లనెను.

ఓ భక్తవత్సలా! సన్మంగళ స్వరూపుడా! మృడ మూర్తివై లోకుల సంక్షేమమును కూర్చెడి వాడి యీ విధముగా మాట్లాడ తగునే? దుష్ట శిక్షణ చేయుట వివేక వంతుల లక్షణమని నేనెంచుదును. దుష్టత్వాన్ని శిక్షించ వలెననెడిదే కర్తవ్యమని నీవే గురు రూపమున వచ్చి యుపదేశము నిచ్చితివి కదా! నాకు ప్రియమును జేకూర్చు నెంచితివేని, నౌకను తల క్రిందులుగా చేసి వారిని చంపుటకు మారుగా, వారి బుద్ధులను తల క్రిందులుగా చేసి వారి దుర్బుద్ధిని సద్బుద్ధిగా మార్చుమయ్యా! "పాహిమాం అనలేను తండ్రీ "పాహి లోకానామ్" అనెదనయ్యా సర్వేశ్వరా!" శివుడు అంతర్ధానమై పోయెను. శ్రీ శివాచార్యుల వారి కప్రియమును చేయ జాలకుండెను. అంతలోనే గమ్యము వచ్చెను. ఎవరి దారిన వారు వెడలిరి.

ఏడవ సద్గుణమే కారుణ్యము భూతదయనే కారుణ్యమందురు. కరుణ గలవాడు నితరులు పడెడి వేదనను చూడ జాలడు. సంరక్షించెడి భద్రాత్మకుడగును. ఎదుటి వారి దుఃఖమును దూరము చేయును. శ్రీ మన్నిరంజన శివయోగి గారు "కరుణ విరలి జీవ రొళు". జీవుల యెడ కరణాభావము గల్గి యుండనీ!" అని యనెను. "లోకాన్ సమస్తానాం సుఖినో భవన్తు" అని ఆశీర్వచనములు వల్లించి యజ్ఞములలో జంతు బలి నిచ్చి "యిది తప్పుకాదు; ధర్మసమ్మతమైనదే" యని యనెడి వారిని గాంచిన శ్రీ బసవన్న వారు నీ క్రింది వచనమును చెప్పిరి.

**దయ విల్లద ధర్మవదావు దయ్యా ।**

**దయవే బేకు సకల ప్రాణిగళెల్ల రల్లియూ ॥**

**దయ యే ధర్మద మూలవయ్యా ।**

**కూడల సంగయ్య నంతల్ల దొల్లనయ్యా! ॥**

దయమే ధర్మమునకు మూలమని చాటె. దయలేని ధర్మము ధర్మము కాదనిరి యజ్ఞ సంస్కృత్తిని నిరసించిరి, దయా హీనులను దయామయుడగు సంగమేశ్వరుడు మెచ్చడనిరి. ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి:

**దయలేని ధర్మ మెట్టిదయ్యా !**
**దయయే వలయు సకల జీవుల యందున**
**దయయే ధర్మమునకు మూలమయ్యా !**
**కూడల సంగయ్య నట్లుగాని దొల్లదయ్యా !**

ప్రాణుల ఎడల దయా భావము యుండిన ఎడల వ్యక్తుల యొక్క హృదయము వికాసమగును, హృదయ వైశాల్యముండిన పరబ్రహ్మ తత్త్వమును ఎరుగ గలడు లింగాంగ సామరస్య రూపమైన ఐక్యస్థితిని చేరవలెననిన దయా భావము తప్పని సరిగా యుండి తీరవలయును. ఒక గొఱ్ఱె ప్రాణమును కాపాడుటకు రాజదండనను ఎదుర్కొనుటకు సిద్ధపడిన భక్తుల కథలు బసవపురాణములో గాంచ గలము. కిన్నర బ్రహ్మయ్య గారి కథ అట్టిదే, ఎనిమిదవ సద్గుణమే శ్రద్ధ ఇచ్చట శ్రద్ధయనగా నమ్మకము మరియు విశ్వాసము. విశ్వములోని ఏ వ్యవహారమైనను నమ్మక విశ్వాసముల మీద ఆధారపడియే నడచు చున్నది. పరస్పరము విశ్వాస రాహిత్యము గలిగియుండిన

ఎడల ప్రపంచ వ్యవహారము లెల్ల అస్తవ్యస్తములగును. ఒక వ్యక్తి ఒక వస్తువును కొనుటకై అంగడికి పోయినపుడు అతడు అడిగిన వెంబడే అంగడి కారుడు దానిని తీసి అతనికి ఇచ్చుచున్నాడు. గ్రహకుడు కూడా దాని వెలను తక్షణమే చెల్లించు చున్నాడు. వారిరువురి మధ్య విశ్వాసము కలదని తెలియుచున్నది. గ్రహకుడు మరియు అంగడి కారుని మధ్యన అవిశ్వాసముండిన ఎడల ఎవరు ముందు ఇవ్వవలెను ఎవరు వెనక ఇవ్వవలెను అనెడి ప్రశ్న వుదయించును. డబ్బు ఇచ్చినంత వరకు వస్తువు ఇవ్వనని అంగడివాడనవచ్చును. అదే విధమున గ్రాహకుడు కూడా మొండిగా వాదించ వచ్చును. ఎవరికైనా యొకరికి విశ్వాసము కలుగని ఎడల వ్యవహారము జరగదు. అదే విధిన మన గురువుల ఎడనూ, ఇష్ట లింగము ఎడలనూ ధర్మ శాస్త్రమని ఎంచబడిన గ్రంధముల యందును ఉన్న నమ్మకమే శ్రద్ధయన బడుచున్నది. వాటి ఎడల అవిశ్వాసమును దాల్చ కూడదు. గురువులు చెప్పునది చెప్పుదురు. మేము చెసేది చెసెదము అనెడి వారుందురు. శాస్త్రముల యందు వ్రాసి యుండినను నేటి కాలమున ఎవరాచరించు చున్నారు, అని అనెడి వారునూ కలరు. ఈ ఇరు తెగలకు సంబంధించిన వారు సంశయ చిత్తులగు చున్నారు. ఇట్టి వారిని ధర్మము రక్షించదు శ్రద్ధలేని వానిని భగవంతుడు కూడా రక్షించునే?

శ్రద్ధయనెడిది జ్ఞానోదయమునకు కారణమగు చున్నది. "శ్రద్ధా వాన్‌ల భతేజ్ఞానం" అని పెద్దలనిరి. శ్రద్ధ గలవానికి జ్ఞానము అబ్బును శరణ స్థలములోని భక్తుడు తప్పని సరిగా శ్రద్ధను కలిగియుండ వలెను. తొమ్మిదవ సద్గుణము శివభక్తి పరశివ బ్రహ్మ మీద అనన్యమైన ప్రేమ గలిగి యుండుటనే శివ భక్తి యని యందురు. ఇచ్చట ఒక విషయమును గమనించ వలసియున్నది. శివుడనగా సాకారము మరియు నిరాకారమని రెండు భావములు గలవు. శైవులు ద్వైత భావము గలిగిన వారై సాకారము వైపు మొగ్గ చూపెదరు. వీరశైవులట్లుగాదు. వీరశైవులు నిరాకార నిర్గుణ శివ బ్రహ్మ ఎడల భక్తి కలిగియుండ వలెను. జీవితాంతము సాకారము వైపు తిరుగాడెడి వానికి లింగాంగ సామరస్యము సిద్ధింపజాలదు. ఇచ్చట భక్తి యనగా పూజ్యుల ఎడల అనురాగము కలిగి యుండుట శరణ స్థలములో యుండెడిది భక్తునికి మాత్రము త్రిలింగములు మాత్రమే పూజనీయములు. అవి ఇష్ట ప్రాణ భావలింగములు వాటిని మినహాయించి స్థావరలింగముల ఎడల అనురక్తి కలిగి యుండకూడదు. స్థావరము కంటెను జంగమము శ్రేష్ఠమనెడి శ్రీ బసవేశ్వరుల వారి వాక్కును అనుసరించి గురులింగమును, జంగమలింగమును అనురాగ భావముతో ప్రేమించవలెను.

పది యవ సద్గుణము పరోధర్మము. పరోధర్మమనగా ఉత్కృష్టమైన శివాచారమని అర్థము వీరశైవ సిద్ధాంతమునందున పరశివతత్త్వమును పొందుటకై లింగాచార, సదాచార, శివాచార, గణాచార మరియు భృత్యాచారమునెడి పంచ విధములగు మహోత్కృష్టమైన ఆచారములను పాటించవలెను. వీరశైవ ధర్మమునకు పంచాచారములే ప్రాణములని చెప్పబడినది. శరణ స్థలములోని సాధకుడు ఈ ఐదు స్థలముల ఎడల శ్రద్ధను వహించి సాధనను చేయవలెను.

ఈ విధముగా శమ, దమ, వివేక, వైరాగ్య, పూర్ణభావన, క్షమ, కరుణ, శ్రద్ధ, శివభక్తి మరియు పరోధర్మములు అనెడివి దశ విధమైన సద్గుణములు జ్ఞానోత్పత్తికి సహాయకారిగా యుండును. అందు చేతనే శ్రీ భగవత్పాదుల వారు వీటిని శివజ్ఞాన బంధువులని సంబోధించిరి. సాత్వికుడనగా ఈ దశ సద్గుణములు గలిగిన శివయోగి అని గుర్తించ వలెను. సాధకుడు తన ఉపాసనా బలము చేత ఎంతెంత మేరకు పరశివ బ్రహ్మము సమీపమునుకు పోవుచుండునో అంతంత మేరకు అతని యందు శైవ గుణములు అలవడుచు బోవుచుండును. శరణ స్థలములోని సాధకుడు మున్ముందు ఐక్యస్థలము నందున లింగాంగ సామరస్యము పొందవలసి యుండినందున తమోగుణము స్వల్పమైనను ఉండకూడదు. ఈ ఉద్దేశముతోనే తామస నిరసన స్థలము నందున ఈ దశ సద్గుణములు బోధించ బడినవి. వీటిని ఎవరు అలవరుచు కొందురో వారు సాత్విక గుణములు పొంది. తామ సగుణములకు దూరమగుదురు. కాన ప్రతి యొక్కరు ఈ గుణములను అలవరుచు కొనుటకు ప్రయత్నించవలెను.

ఓం శాంతి : శాంతి : శాంతిః

ది ॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

# విశేషప్రదీపిక

శ్రీ జగద్గురువు చంద్రశేఖర శివాచార్యుల వారు శరణుడు సత్త్వగుణ సంపన్నుడని ప్రతిపాదించుచు తదను గుణమైన విశ్లేషణ నిచ్చిరి.

శరణ స్థలమనెడిది యెంతో యున్నత్తమైన దశ. భక్తాది స్థలములలో సాధనను సఫలీకృతము చేసికొని యీ దశకు చేరును. సాధన క్రమములో సత్త్వ గుణములన్నియును సాధకుని కలవడు చున్నవి. ఈ విషయమును ప్రతిపాదించెడి శ్రీ బసవేశ్వరుల వారి వచనము గనుడి.

**భక్త నెంతెంబెనయ్యా భవియ సంగబిడదన్నక్క ?**
**మహేశ్వర నెంతెంబెనయ్యా పర స్త్రీ పరరర్థదాసెబిడ దన్నక్క ?**

**ప్రసాదియెంతెంబెనయ్యా ఆదివ్యాధి నష్టవాగ దన్నక్క?**
**ప్రాణలింగియెంతెంబెనయ్యా ప్రాణ స్వస్థిరవాగ దన్నక్క ?**
**శరణనెంతెంబెనయ్యా పంచేంద్రియ నాశవాగదన్నక్క ?**
**.................... కూడల సంగమ దేవా !** (శ్రీ బసవేశ్వర వ.సం. 509)

ఈ వచనము యొక్క తెలుగు రూపము :
**భక్తుడెట్లుందునయ్యా భవి సంగమును వీడనిదనుక ?**
**మహేశ్వర డెట్లుందునయ్యా పరస్త్రీ పరార్థముల యాశ వీడనిదనుక ?**
**ప్రసాది యెట్లందునయ్యా అధివ్యాధి నష్టముగాని దనుక ?**
**ప్రాణలింగి యెట్లందునయ్యా ప్రాణము స్వస్థిరము కాని దనుక ?**
**శరణుడెట్లందునయ్యా పంచేంద్రియములు నాశముగాని దనుక ?**
**.................. కూడల సంగమ దేవా !**

కాయ వికారములకు, మనోవికారములకు లోనైన వాడు శరణుడన బడడు, కాయ మనో వికారాదుల కవకాశము నివ్వని వాడే సత్త్వ గుణ సంపన్నుడగు చున్నాడు. దేహేంద్రి యాదులను, అంతరంగ చతుష్టయు ప్రకృతి తత్త్వ లక్షణములు జీవుడు ప్రకృతిలో భోగముల ననుభవించుటకై దేహేంద్రియాదులు సాధనములగును. అశుద్ధ తత్త్వములైను యింద్రియాదులు త్యాగాంగము యొక్క లక్షణములనియును, త్యాజ్యములనియును వాతూలములోని శివానుభవ సూత్రము తెలుపు చున్నది. వాతూలాది యాగమములలో నిర్ధేశింపబడిన విధి విధానముననుసరించి భక్తి స్థలమున శ్రద్ధను, మహేశ్వర స్థలమున నిష్ఠను, ప్రసాది స్థలమున యవధానమును, ప్రాణలింగి స్థలమున యనుభవమును గడించి, సాధకుడు శరణుడగు చున్నాడు. శ్రద్ధానిష్ఠలలవడగనే త్యాగాంగము నష్టమగును. అపధా నానుభవముల వలన భోగాంగము భగ్నమగును. మరొక విధముగా చెప్పవలెననిన త్యాగాంగములోని యవాంతర భేదములైన భక్తాంగము ఆచార లింగములోను మహేశాంగము గురులింగములోను లయమగును. భోగాంగమునకు చెందిన ప్రసాదాంగము శివ లింగములో లయమగును. ప్రాణలింగి యగును. చరలింగములో లయమగును. తత్ఫలితముగా యోగాంగము గల్గిన శరణుడు, దానిని ప్రసాదలింగములో లయము చేయుటకై కృషి చేయుచుండును. ప్రసాద లింగము జ్ఞానపరమైనదై నందున శరణుడు సోమనాథుడు "షట్ స్థలద రగళె"లో చెప్పిన యట్లుగా స్వచ్ఛతరమైన జ్ఞాన సంపత్తి గల్గియుండ వలెను. సూత సంహితలో చెప్పిన విధముగా సత్తము జ్ఞానమును పెంచెడిదై నందున సాధకుడు శ్రీ భగవత్పాదుల వారు వివరించిన గుణములను తప్పని సరిగా నిలుపు కొన వలెననెడిదే గ్రహించ వలసిన విషయము. ఈ విధముగా సాధన చేసిన వాడు త్రిగుణాతీతుడై శరణ స్థలమున తన సాధనను సుసంపన్నము చేసికొన గలడు. సుసంపన్నమైన సాధకుడు దశ యెట్టులుండునో యనెడి దానిని శ్రీ బసవేశ్వరుల వారిదైన యీ క్రింది వచనము వలన తెలిసి కొనగలము.

**శరణ సమ్మవప్ప నిజగుణ భరితనప్పడె**
**సత్వరజస్తమ క్రోధ బిడదన్నక్క అనుభావలెల్లియదొ?**

**.............................................................................................................**
**శరణ సజ్జనికె సమయాచార నిజవ్రతవు దురాచారి గళిగలవడదు**
**నమ్మకూడల సంగన శరణ రిగల్లదె,**

(శ్రీ బసవేశ్వర వ. సం. 855) డా॥ తిప్పెరుద్ర స్వామి సంపాదన

దీని తెలుగు రూపము గనుడి :

**శరణ సమ్మత మయ్యెడి నిజగుణ భరితుడగునెడ**
**సత్వరజస్తమ క్రోధములు వీడని దనుక అనుభావమెక్కడిదో.**

..............................................................

**శరణ సజ్జనునికి సమయాచారము నిజ వ్రతము**
**దురాచారుల కలవడదు. మాకూడల సంగని శరణులకు గాక.**

శివం భూయాత్

## ఆశీర్వచనము - 3

## తామస నిరసన స్థలము

ఇంతకు క్రితము దశ సద్గుణముల గురించి తెలిసికొని యుంటిమి సాత్వికుడైన శరణుడు కామ క్రోధాదులకు గురికాకూడదని తెలిపెడి జగద్గురువుల వారి ఈ క్రింది ఉపదేశమును గనుడి :

**శ్లో॥ కామక్రోధ మహోమోహ మదమా త్సర్య వారణాః**
**శివజ్ఞాన మృగేంద్ర స్య కథమ్ తిష్ఠంతి సన్నిధౌ** (సి. శి. 13-17)

అరిషడ్వర్గములు శివశరణుని పీడింప జాలవు. ఐతే సాధారణ వ్యక్తి వీటికి గురియై అష్టకష్టములు పొందుట మనము చూడగలము. మన హృదయమునకు అంటుకొనెడి విధముగా రూపకాలంకార మాధ్యమమున శ్రీ భగవత్పాదుల వారు తమ ఉపదేశమునిచ్చిరి. గజేంద్రము ఎంతో శక్తివంతమైనది. చెట్లు, చేమలు పెరికి వేయగలదు. పలురకములైన మృగజాలమును తొండమున బట్టి నేలకేసికొట్టి పాదములను మోపి చంపి వేయగలదు. కాని అది కలలో సింహమును గాంచిన కలవర పడి పరుగులు తీయును. కామ క్రోధాది అరిషడ్వర్గములు మత్తగజములవంటవి. శివశరణుడు మృగేంద్రుడే. మహోన్నతుడగు శివ శరణుని ఎదురుగా అరిషడ్వర్గములు నిలువ లేవు.

కామ క్రోధ మోహాదులు నరకమునకు ద్వారములని పండితులు చెప్పుదురు. వీటికి చిక్కకుండా వుండెడివాడు నరకమును పొందక సద్గతిని పొందునని సర్వత్రా అంగీకరించబడినది సుభాషితకారులు వీటి ఎడల జాగరూకత వహించి యుండవలెనని. చెప్పుదురు. ఈ క్రింది శుభాశితమును గనుడి. "కామః క్రోధశ్చలో భశ్చ దేహేతిష్ఠంతి తస్కరాః జ్ఞాన రత్నాప హారాయ తస్మాజ్జాగ్రత జాగ్రత్త" కామ క్రోధ లోభములు మనదేహములో నుండెడి దొంగలు. వీరు సదా మనలో నుండెడి జ్ఞాన రత్నములను దొంగిలించు కొనుటకు ప్రయత్నించు చుందురు. కాన మనము నిరంతరము జాగ్రత్త వహించి యుండవలయునని చెప్పబడినది.

ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుజాలడనెడి సామెతయొకటి గలదు. అమూల్యమైన వస్తువులు ఇంటిలో యుండిన ఎడల వాటిని కాపలాకాయుటకై నిద్రాహారములు మాని మెలుగుచుండ వలెను. ఏక్షణమున వారు సంపదను దొంగిలింతురొ ఎవరెరుగుదురు. అటులనే కామ, క్రోధ, లోభ, మోహములు ఏ క్షణమున మన యొక్క జ్ఞానమును గ్రహించి అజ్ఞానమునకు గురి చేయునో అనెడిది తెలిసి కొనుట చాలా కష్టము.

చాల మంది కామ క్రోధాదులను ప్రదర్శించి విషయ లంపటులై పతనమైన పిదప పశ్చాత్తాపమును పొందుటను గాంచ గలము. 'వృద్ధ నారీ పతివ్రతః' అనెడి లోకోక్తి ప్రసిద్ధమైనదే, తప్పు చేసి బాధపడుట కంటె తప్పుచేయకుండా యుండుటయే మేలైన విషయము. ఈ కారణము వలన శరణ స్థలములోని భక్తుడు వీటి నుండి దూరమగుట కొరకు ఎప్పటి కప్పుడు జాగ్రత్తను వహించు చుండవలెను.

కామ క్రోధాదుల వేగము సుడిగాలి వంటిది. సుడిగాలి యందున చిక్కిన వస్తువులు తల్లడిల్ల పోవును. వీటిలో చిక్కిన మనుజులు కూడా ఆక్షణమున ఉద్వేగమునకు గురియగుదురు. అదే విధముగా మనుజుడు కామ క్రోధములనెడి వాటి వేగ గమనమును గుర్తించ

కుండా అజాగ్రత్తతో ఉండిన ఎడల అతడు పతనమగుట తథ్యము. కామమనెడిది ఎల్లపుడూ అసంతృప్తికే గురి చేయును. ఎంత అనుభవించినను ఇంకనూ పొందవలెననెడిది మనమున పెరుగుచు నేయుండును. కామ దాహమును పూర్తిగా తీర్చుకొనిన వ్యక్తి ఎవ్వడును లేడు. ఈ కారణముల వలన నే నిగ్రహము అనెడి దానికి ప్రాముఖ్యత లభించినది. ఉప భోగము వలన శాంతిని పొందని కామవు నిగ్రహము వలన నిర్వీర్యమగు చున్నది. ఈ విషయమున ఈ క్రింది శ్లోకము గమనార్హమై యున్నది.

**శ్లో ॥ నజాతు కామః కామానా ముపభోగేన శామ్యతి ।**
**హవిషా కృష్ణ వర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥**

మండెడి అగ్ని యందు అజ్యము పోసిన ఎడల ఆ అగ్ని ప్రజ్వలనము గొనునే గాని తగ్గదు. అదే విధిన కామోప భోగము చేయుట వలన కామము మరింత పెరుగునే కాని తగ్గదు. శరణ స్థలములోని భక్తుడు ఈ విషయమును గ్రహించి జాగరూకుడై యుండ వలెను. అరిషడ్వర్గములలో క్రోధము రెండవదగును. మన ఇష్టమునకు అడ్డుదగిలినయప్పుడు క్రోధము ఉత్పన్నమగును. మన యందు గలిగెడి క్రోధము వలన ఇతరులకు ఎక్కువగా హానిజరుగక పోవచ్చును. కాని మనకు మాత్రమది గమనార్హమైన చేటును కలుగ జేయును. మన ఇంటికి అంటిన నిప్పు మన ఇంటిని కాల్చకుండగా మరొక ఇంటికి అంటుకొనదు గదా. అదే విధిన క్రోధము కూడా కృద్ధుని సంపూర్ణముగా భస్మము చేయు చున్నది. క్రోధము వలన సంబంధిత వ్యక్తికి తాపము పెరుగును జ్వరతాపము వలన రాక్తాదులు దహింపబడి ఏ విధముగా బలహీనత వచ్చి చేరునో అదే విధిన క్రోధము చేత తప్తుడైనవాని శరీరములోని అగ్ని అతని రక్తనాళములను కాల్చి వేయుచున్నది. కట్టెలో పుట్టిన నిప్పు కట్టెను భస్మము చేసినయటులనే కోపము కూడా సంబంధిత వ్యక్తిని సంపూర్ణముగా భస్మము చేయు చున్నది. కోపము వచ్చినప్పుడు క్షణ కాలము మౌనము మహించి శివధ్యానము సలిపిన ఎడల కోపము తనంతటకు తానే శాంతమగును కోపమును నియంత్రణ చేయుటకు ఎన్నో ఉపాయములు గలవని ఇంతకు క్రితమే తెలియ జేసియుంటిమి. కాన శరణ స్థలములోని సాధకుడు క్రోధము మీద విజయమును సాధించుటకై పరిపరి విధములుగా ప్రయత్నములను చేపట్ట వలను. ఉపాయములన్నింటిలో శివధ్యానము, శివ జ్ఞానము ఉత్తమోత్తముమైనదని గుర్తించుట ఎంతో ముఖ్యమైన విషయము.

ఐహిక మరియు పారలౌకిక సుఖముల ఎడల జీవికి ప్రలోభమును కలిగించునదే లోభము. "లనాతి ఉజాలోకొ ఇతిలోభః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము లోభమును పొందినవాడు ఉభయ పద భ్రష్టుడగు చున్నాడు. లోభిమైనవాడు దానధర్మాదులనూ చేయ జాలడు. అటులనే సుఖజీవనమును కూడా గడుప జాలడు. ఇహలోకములోను దుఃఖమునే అనుభవించును. పరలోకమున నరకము పొందునని శాస్త్రములు చెప్ప చున్నవి. శ్రీమన్నిరం జన శివ యోగి గారి ప్రకారము లోభమును మించిన దుర్గుణము లేదు. మిగిలిన దుర్గుణము లన్నియును. లోభము నుండియే ఉత్పన్నములగు చున్నవి. శరణ స్థలములోని భక్తుడు ధనాదుల ఎడల నిష్పృహ కలిగియుండ వలెను. నిష్పృహ గలవ్యక్తికి జగత్తంతయు తృణ ప్రాయముగా కనిపించును. "నిస్పృహస్యతృణం జగత్" అనెడి పండిత వాక్కుని గమనించ గలరు. అదే విధముగా మోహము గూడా ఒక గొప్ప దుర్గుణము. మోహమనగా అత్యాసక్తి అని అర్థము దీని వలన ఎన్నియో అనర్థములు సంభవించును. ప్రపంచము నందలి వస్తువులు లేదా వ్యక్తుల ఎడల మోహమును పెంపొందించు కొను వాడు ఎల్ల కాలము ఆ వస్తువు లేదా వ్యక్తి గురించి ఆలోచిస్తూ జీవితము యొక్క లక్ష్యమును మరచి పోవును. క్రమ క్రమముగా పతనమై పలు జన్మలకు త్రోయబడు చున్నాడు. ఆసక్తి అవసరమే. అత్యాసక్తి ఇంకను అవసరమే. తెలివి గలవాడు ఆత్యాశక్తిని తన ఇష్ట లింగము యొక్క ఉపాసనవైపు మరల్చుకొనును. శరణునకు ఇదే శరణ్యము. శరణుని యొక్క మనస్సు పరిశుద్ధమై యుండును. తామరాకును నీరు అంట జాలదు. నీటి బిందువులు నేలకురాలును. అదే విధిన శరణుని యొక్క మనస్సును విషయ భోగములంట జాలవు. విషయ భోగములంటని ఎడల ఆసక్తి ప్రసక్తి యేయుండదు.

మదము మరొక దుర్గుణము అధికమైన దురభిమానము లేదా గర్వము వలన మదము ధృవించు చున్నది. దీని వలన జీవి పలు విధములుగా పతనమగు చున్నది. శాస్త్రకారుల ప్రకారము పలు రకములైన మదములు కలవు. యవ్వన మదము, విద్యా మదము, కుల మదము, శీల మదము, ధన మదము, రూప మదము, తపో మదము, రాజ్య మదములనెడివి వీటిలో ముఖ్యమైనవి. వివేకహీనుని ఇవి అంటికొని బాధించును. మదోన్మక్తుడైన వ్యక్తి ఈ మదమును దుర్వ్యిని యోగము చేసికొని పీడను పొందును. యవ్వన మదములో నున్నవాడు కామమునకు దాసుడై పతనమగుట తథ్యము. ఈ విషయమున ఈ క్రింది శ్లోకము గమనార్హమై యున్నది.

**శ్లో ॥ విద్యా వివాదాయ, ధనం మదాయ, ఫలస్య శక్తిః పరపీడనాయ**
**సాధోస్తు సర్వం విపరీతమేతత్ జ్ఞానాయ, ధానాయ చ రక్షణాయ.**

సజ్జనుడు మరియు దుర్జనుని మధ్యగల వ్యత్యాసము ఈ శ్లోకమున సూచించ బడినది.వివేక వంతునిలోని విద్య విజ్ఞానాభివృద్ధికి దోహదము చేయును కాని వివేకహీనునిలోని విద్య వివేక భ్రష్టత్వము కలిగించి అనవసరమైన వివాదములకు దారితీయును. సజ్జనులందు వుండెడి సంపద దురభిమానమునకు దారితీయక దానధర్మములకు ఉపయోగపడు చున్నది. సజ్జనుల యొక్క యౌవ్వన శక్తి లోకోపకారానికి ఉపయోగ పడునే కాని లోక పీడనకు కాదు. దుర్జనునిలోని కుల, శీల, రూపాదులు దురభిమానమును పెంచి లోకకంటకునిగా మార్చు చున్నది. శరణుడు అత్యంత సాత్విక గుణము గలవాడై ఈ మదములకు లోనుగాకుండ నుండ వలెను. చివరగా మాత్సర్యమును గురించి తెలిసికొనవలెను. ఇతరుల యొక్క ప్రగతిని సహించ కుండా యుండునదే మాత్సర్యము ఈ మాత్సర్య గుణమును వ్యక్తి తన ప్రగతికిని, ఇతరుల ప్రగతులకు అడ్డుగోడగానిలుచును. అందరికీ హితమును చేకూర్చుటయే మానవ జన్మ యొక్క పరమార్థము. దానివలననే దేశము బాగుపడును. మాత్సర్యమును వహించిన ఎడల సర్వనాశనము తప్పదు. ఇట్టి దుర్గుణమును సమీపమునకు రాకుండా జాగ్రత్తపడ వలెను. ఉపనిషత్తులలో ఈ విషయమున ఈ క్రింది విధముగా తెలుపబడినది.

**శ్లో ॥ సర్వేభవంతు సుఖినః సర్వేసంతునిరామయాః**
**సర్వేభద్రాణి పశ్యంతు మాగశ్చిద్ దుఃఖభాగ్భవేత్**

అందరి సుఖమును ఆశించినవానికే మాత్సర్య భావన దూరమగును. వ్యక్తి స్వార్థము కంటెను, సమిష్ట సంక్షేమమే ముఖ్యమైనదని గుర్తించవలెను. శరణ స్థలము నందలి భక్తుడును లోక కల్యాణము కొరకే ప్రయత్నించును. ఈ కారణము వలననే శ్రీ జగద్గురువుల వారు శరణునిపైన అరిషడ్వర్గములు ప్రభావమును చూపజాలవని తెలియ చెప్పుచు మృగరాజు యొక్క ఉదాహరణనిచ్చిరి. కాళిదాసు చెప్పిన యటుల "వికారహూత్ సతి విక్రయంతె ఏషాంన చేతాంసితేమే వధారాః" మనస్సును వికృతము చేసే విషయములు ఎదుటన ఉండిననూ వాటివలన ప్రభావమునకు లోనుగాని వాడే ధీరుడు, శరణుడు ప్రపంచము మధ్యలో నుండియు సాంసారిక దోషములు అంటకుండా తిరుగాడెడి శరణ స్థలము నందలి భక్తుడు ధీరుడేకాదు. వీరాధివీరుడు యుద్ధమున విజయమును సాధించెడివాడే వీరుడనెడిది సామాన్యుల భావము. కామక్రోధాదులపై విజయమును సాధించినవాడే అసలైన వీరుడనెడిది విజ్ఞుల భావన. అట్టి ఎడ శరణ స్థలమునందలి భక్తుడు వీరుడును, ధీరుడును అగుచున్నాడు. వీర శైవులీ విషయమును గమనించి కామ క్రోధాదుల ఎడల వీర భావమును పూని శరణ మార్గమున పయనించ వలెను.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

ది ॥ 3-4 - 1992

స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరులు జగద్గురు చంద్ర శేఖర శివాచార్యుల వారు కామ క్రోధాది దుర్గుణముల గురించి వివరించిరి ఇవి శరణుని యంట జాలవని తెలిపిరి.

అరిషడ్వర్గ మాధ్యాత్మిక చింతనకును, మోక్షపథమునకు నవరోధములుగా నిలుచునని తెలుప బడినది. ఇవి రజోగుణము నుండి యుద్భవించునని తెలియు చున్నది. "రజసో రాజసోభావః కామ క్రోధ బదాదయః" అనెడి శివగీతోక్తి (9:22) శరణుడు త్రిగుణాతీతుడు. ఈ కారణముననే శ్రీ భగవత్పాదులవారు అతనిని సింహముతోను, కామ క్రోధమదాదులను మత్త గజములతో పోల్చిరి మత్తగజము లెంత శక్తివంతములై యున్ననూ సింహము సన్నిధిని నిలువ గలవా? శ్రీ భగవత్ పాదుల వారి భావముల ఛాయల నీ క్రింది పద్యములో గాంచ గలము.

## మహాస్రగ్ధర :

**అవినాశుల్ సంయమీశుల్ వ్యపగత విషయా హ్లాదులు ద్యత్ ప్రమోదుల్**
**ధ్రువకీర్తుల్ శాంతమూర్తుల్ దురితహరణ సద్బుద్ధులా జ్ఞానసమృద్ధుల్**

**భవదూరుల్ నిర్వికారుల్ ప్రణుతగుణ మహాపాత్రు లానంద గాత్రుల్**
**శివభక్తుల్ తత్త్వముక్తుల్ చిరతర సుమనస్సిద్ధు లాత్మ ప్రబుద్ధుల్.**
(పాల్కురికి సోమనాథుని అనుభవ సారము ఓఃన.సా.సా, పరిషత్తు ప. సం. 193)

శరణులను కామ క్రోధాదు లేమియు జేయ జాలవనెడి దానికి గల కారణ మెట్టిదో యెరుంగ వలసి యున్నది.

చతుర్విధ పురుషార్థముల సంపాదనకై పరిశ్రమించెడి ప్రవృత్తిని భారతావనిలో చూడగలము. ధర్మమునాచరించెడి క్రమములో వర్ణవివక్షత పొడచూప వచ్చును. అర్థ సంపాదన క్రమములో మితిమీరిన యుత్సుకతను ప్రదర్శించెడి వారి సంఖ్య నానాటికి పెరుగు చున్నది. విహితావిహిత వివక్షతకు నవకాశము నివ్వకుండగ కామము ననుభవించాలనెడి వారెందరో? మోక్షాపేక్షతో వామాచారముల నెన్నికొనెడి వారు కొందరైతే, కర్మాచారణలో నమితాసక్తిని ప్రదర్శించుచు కర్మఠులై పశుహింసకు పూనుకొనెడి వారు మరికొందరు. ఈ ధోరణులన్నియును అరిషడ్వర్గమునకు ఆహ్వానము నిచ్చెడివై యున్నవి.

బసవపురాణము ప్రకారము, శివశరణులు "భక్తి" యనెడి దానినే పురుషార్థముగా నెంతురు. వీరశైవ పథము భక్తిలో ప్రభవించి, భక్తితో గమియించి సమరస భక్తిలో పరిపూర్ణత్వము నొందు చున్నది. ఈ కారణమున నరిషడ్వర్గ మతని దరిని చేరజాలదనెడిది, గ్రహించ గలరు.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 4

## తామస నిరసన స్థలము

శ్రీ భగవత్పాదుల వారు, తామస నిరసనలోని యంతార్భాగములైన కామ క్రోధాదుల నిరసన గురించి యుపదేశించిన పిదప రజోగుణమునకు సంబంధించిన విషయముల నీ క్రింది విధిన నుపదేశించిరి.

**శ్లో ॥ యత్రకుత్రాపివా ద్వేష్టి ప్రపంచే శివరూపిణి ।**
**శివ ద్వేషీ సవిజ్ఞేయో రజసా విష్టమానసః ॥** (సి. శి. 13:18)

ఈ ప్రపంచము శివ స్వరూపూమై యున్నది. ఇందులోని యణువణువు శివమయమై యున్నది. ఏ వ్యక్తిమైన యీ ప్రపంచములో నంతర్భాగములై యున్ననొక వ్యక్తిని గాని, లేదా వస్తువును గాని ద్వేషించిన యెడల, నతడు శివునినే ద్వేషించు వాడగును. ఈ ద్వేష బుద్ధికి మూల కారణము రజోగుణముగా గుర్తింప బడినది.

రజోగుణాధిక్యత గల వ్యక్తికి మనస్సున ద్వేషము నిండుగా నుండును. క్రోధము రీతిగనే ద్వేషము కూడ తత్ క్షణమే ప్రకటన మయ్యేడిదికాదు. ప్రచ్ఛన్నముగా నుండును. తగిన సమయమునకై యెదురు చూచు చుండును. రజోగుణ సంపన్న దందరినీ సంతోషపెట్ట జాలడు. సాత్వికుడందరినీ సంతోష పెట్టగలడు. బుద్ధి లేనివాడు ద్వేషియగునని తెలియు చున్నది. "నాస్తి బుద్ధి మతాంశత్రుః" అని చాణుక్యుడు తన చాణక్య నీతియందున తెలిపెను. బుద్ధిగల వారికి లోకమున శత్రువులే యుండరనెడిది చాణక్య వాక్కు మన దేశమున కొందరు అజాత శుత్రువులుగా పిలువ బడుచున్నారు. వారి మనస్సులోన యితరుల యెడల ద్వేష భావము కలుగనే కలుగదు. ఈ సద్గుణము వలన, వీరిని ద్వేషించెడి వారైనను వీరిని సమీపించగనె తమ ద్వేష భావమును వీడి సాత్వికులై మెలుగుదురు.

తాత్వికముగా, కనిపించెడి ప్రపంచమంతయు చిచ్ఛక్తి విశిష్టుడైన శివుని యవికృత పరిణామ ఫలితముగా పుట్టుచున్నది. అందుచేత, యిద్దానిని ద్వేషించ వలదు. ద్వేషించిన వాడు శివ ద్రోహము చేసిన వాడై దుర్గతికి పాత్రుడగును. అట్టి దుర్గతిని తెలిపెడి, శ్రీ భగవత్పాదుల వారి యీ యుపదేశమును గునుడి.

శ్లో ॥ యో ద్వేష్టి సకలాన్ లోకాన్ యోవ్యాఽహంకురుతే సదా ।
యో ఽసత్వభావనాయుక్తః సతామస ఇతిస్మృతః ॥ (సి. శి. 13-19)

తామసముగల వాడు అందరినీ ద్వేషించుచు అహంకార భావముతో చరించు నుః తానే శ్రేష్ఠుడ ననెడి భావనతో దుర్గతిని పొందును. అహం భావము గలవాడు అధోపాతాళమునకు పడిపోవును. శరణ స్థలమున నున్న భక్తునికి 'అహం' ఉండకూడదు. 'దాసోహం' అనే భావన యుండవలెను. అద్వైతులు, అహం 'బ్రహోస్మి' యనెడి దానిని సమర్థించుచు నియ్యది సాత్వి కాహంకరమనియును దీని వలన దోషము గల్గదనియందురు. శరణ స్థలములో నున్న వానికి యిదియును విహితము కాదు.

నా కన్న పెద్దలు లేరు అనెడి దానిలో నన్యుల యెడల నొక తిరస్కార భావము నిమిడి యుండును. ఇతరులను తిరస్కరించుట యనెడిది సాత్వికుల లక్షణము కాదు. నీతి యుక్తమైన పనియును కాదు. అందుచేత నిట్టి యహంకారమును ననైతిక యహంకారమనియు. సామాన్యముగా దీని వలన యనేక యపాయములు సంభవించును.

లోకోద్ధరణ నిమిత్తమై మహాను భావులు నహంకారమును వీడి జీవితమును సౌభాగ్యవంతముగా చేసి కొనవలెనని తెలుపుదురు. ఇట్టి యమూల్యమైన సలహాలను పెడచెవిన పెట్టి చెడి పోయెడి వారిని చూడగలము. ఇట్టి విషయమునే యెరుక పరచెడి కథయొకటి గలదు.

ఒకానొక యూరిలోని నొక రత్నముల వ్యాపారి నిరంతరము నౌకాయనము చేయుచు దేశవిదేశములలో రత్నముల వ్యాపారమును చేయుచుండెను. సదా సముద్రము మీద పయనించు చున్నను, యీత నేర్చికొన వలెననెడి ఆలోచన నేర్చుటకు గల యావశ్యకత యతనికి దోచ లేదు.

స్వదేశమునకు వచ్చినప్పుడతడొక శివా చార్యులను దర్శింపనెంచి. శ్రీ గురువుల మఠమునకు వెడలి సాష్టాంగపడి యాశీస్సులను వేడెను. ఆచార్యుల వారు నుచిత రీతిన నాశీర్వదించిరి. అతడు చిరపరిచితుడై యున్నందున, శివాచార్యుల వారు నతని యోగక్షేమముల నరసి వ్యాపారమున బాగా గడించు చున్నాడనియును. నౌకలో పీపాల నిండుగా రత్నములను కొని ప్రయాణము చేయు చుండునని తెలిసికొనెను. సంవత్సరము పొడువునా సముద్ర యానములోనే గడుపునని. ఈదుట వచ్చునా యన్నిన ప్రశ్నకు ఉత్తరము నిచ్చుచు తాను ఈతను నేర్వలేదనెను.

శ్రీ గురువు నతని క్షేమమును కోరిన వాడై యతనికీ విధిన సలహాను ఇచ్చెను.

"వత్సా! నీ వంటి వానికి యీత వచ్చి యుండవలెను. కాని నీకు గల సమయా భావము వలన నయ్యది సాధ్యము కాకపోవచ్చును. ఇప్పుడు నేర్చుట యనెడి సుసాధ్యమైన విషయము కాదు. అయితే, యొక యుపాయము గలదని మరువ వలదు. అదేమనగా రెండు పీపాలను చంకలో యిరికించికొని సముద్రములో దూకి ప్రాణమును రక్షించి కొన వచ్చును. ఎల్లప్పుడు రెండు, బిరడాలు బిగింపబడిన పీపాలను సిద్ధముగా నుంచికొనుము."

కృతాజ్ఞతా పూర్వకముగా వందన మాచరించెను, కొన్ని రత్నములను శ్రీ గురువు వారి పాదముల వద్ద సమర్పించి తన దారిన తాను వెడలెను.

ఒకప్పుడతడు నౌకాయానము చేయు సమయమున పెద్దతుఫాను వచ్చి. నౌకయూగిపోవు చుండెను. సముద్రపు నీరు లోనికి ప్రవేశించెను. సముద్రములో నౌక మునుగుననెడిది తథ్యమని తెలిసెను. రత్నాల వ్యాపారి తన రత్నముల పీపాల వద్దకు వెడలి ఆరాట పడజొచ్చెను. వాటినెట్లు దక్కించు కోవలెననెడి యాలోచనతో బుద్ధిమందగించెను. ఆచార్యుల వారి యుపదేశము రుచించలేదు. రెండు రత్నములతో నిండిన పీపాలను తీసికొని దుముకనెంచెను. అదియును సాధ్యము కాలేదు. ఒక్క దానినిగైకొని సంద్రములో దూకెను. పీపాతో సహా సముద్రములో మునిగి పోయి యసువుల బాసెను.

శరణ స్థలమునందలి భక్తుని యుద్ధరించుటకై శ్రీ రేణుక భగవత్పాదుల వారు నహంకారమును వీడవలెనని యుద్బోధించిరి. భోధనల నుండి లబ్ధిని పోందెడివారు ప్రగతిని గాంచగలరు. లేని ఎడల రత్నాల వ్యాపారి వలె నశింతురు.

తమోగుణము కలవాడు ఆహంకారముతో పాటుగా అసత్య సంభాషణ కూడ చేయును. సత్యమైన దానిని అసత్యమైన దానిగాను అసత్యమైనదానిని సత్యమైన దానిని గాను చూచును అదే విధముగా ఆత్మ విషయములో ఆనాత్మ వస్తువులను నాత్మ సంబధమైన విషయములలో ఆత్మ విషయములను గాంచును, ఈ రీతిగా ఆమోమయ స్థితికిలోనై శివచింతన, శివ ధ్యానము చేయక, జనన మరణముల వలయుములో పడి భాదలకు గురియగును, ఇది ఆంతయు తమో గుణము యొక్క ప్రభావమని గుర్తించ వలెను.

ఎల్లప్పుడు అందరినీ ద్వేషిస్తూ వుండు వ్యక్తి ఆందరి కంటె నేనే ఆధికుడనని తలుస్తూ తామసుడై అహంకారమునకులోనై ఎల్లప్పుడు అనవసరమైన విషయములను గురించి కాలమును వృధాచేయుచుండును.

ఈ విధముగా తమోగుణముచే పీడింపబడెడి వానికి తరుణోపాయమెట్టిది అనెడి ప్రశ్న వుదయించగనే శ్రీ భగవత్పాదుల వారు ఒక వుపాయమును సూచించిరి ఆది ఎట్టిది అనిన ఒక వ్యక్తి జ్ఞానమును సంపాదించినట్టిదే. ఈ విషయము విడమరచి చెప్పెడి శ్రీ భగవత్పాదుల వారి ఈ క్రింది వుపదేశమును గనుడి.

**శ్లో ॥ తమో మూలా హి సంజాతా రాగ ద్వేషాది పాదపాః**
**శివ జ్ఞాన కుఠారేణ చిద్యంతే హి నిరంతరం**
**శివజ్ఞానే సముత్పన్నే, సహస్రాదిత్య సన్నిభి**
**కుతస్తమో వికారాః స్యుర్మహతాం శివయోగినామ్**

తమోగుణ ప్రదానమైన ఆనురాగము పగ మున్నగు పెక్కు చెట్లు శివజ్ఞాన మనెడి గొడ్డలి చేతనె చేధింపబడును. వేయి సూర్యులతో సమానమైన శివయోగులకు దమోగుణ జనిత వికారమెట్లు గలుగును?

శ్రీ భగవత్పాదుల వారు రూప కాలంకారము ద్వారా తమోగుణ నిరసనను తెలియ జేసిరి, తమోగుణ సమన్వితములయన రాగద్వేషములనెడి వృక్షముల తెగనరుకుటకై శివజ్ఞాన మనెడి గొడ్డలిని వుపయోగించ వలెనని చెప్పిరి. మొక్కలను సులభంగా పీకివేయ వచ్చును. మొలక మహావృక్షమైన పిదప పెరికివేయుట కష్ట సాధ్యమగును అప్పుడు గొడ్డలి అవసరమగును, రాగద్వేషములు వృక్షములైతె జ్ఞానమునెడిది గొడ్డలి యగును, యిట్టి జ్ఞానమును పొందిన వాని తేజము ఆమోఘముగా నుండును ఈ తేజము సహస్ర ఆదిత్యుల ప్రకాశముతో పోల్చబడును. ఒక సూర్యుదు వుదయిస్తే నే ఆంధకారము తొలగిపోవును. అట్టి యెడ వేయి సూర్యులు వుదయించిన యెడల అంధకారముండునా?

ఈ విధముగ శరణ స్థలములోని శివయోగి తనలో వెలిగెడి శివజ్ఞానము వలన రజస్తమోగుణముల వికారములను పొందడు. అందరితో సమభావమున ప్రవర్తించును, ఏవరిని ద్వేషించడు. ఎల్లప్పుడు తృప్తిని పొంది సంతోషముగా శివయోగమును ఆచరించు చుండును. ఎల్లప్పుడు ఇతరుల సుఖసంతోషములకై ప్రయత్నించు చుండును. వీరశైవుల లెల్లరు యిట్టి గుణముల పొందుటకు ప్రయత్నించ వలెను.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

ది ॥ 3-4 - 1992
స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు తామస గుణము యొక్క స్వభావమును గురించి వివరించిరి. తామస గుణము శరణుని సన్నిధికి చేరజాలదని ఆనతి నిచ్చిరి.

తామస గుణమన్ని ధర్మముల చేత నిరాకరింప బడినది. ఇది సాధకుని పతనమునకు కారణభూతమైన దని చెప్పబడినది. మహాభారతములోని కృష్ణార్జున సంవాదములో నీ విషయ సంబంధమైన హితబోధ బహుళ ప్రాచుర్యము నందినది. "నిద్రాలస్య ప్రమాదాది - వంచనాద్యాస్తు తామసాః" నిద్ర ఆలస్యము ప్రమాదము వంచనలు తామస గుణజన్యములని శివగీతలో తెలుప బడినది. ఆలస్యమనగా సోమరితనమనియును, ప్రమాదమనగా అజాగ్రత్తయని గుర్తించ గలరు.

సాధకుడు భక్తి స్థలమున శ్రద్ధాభక్తిని జేసెడి స్థితిలోనే ప్రమాదము పురోగమనమునకు గురియగును. శ్రద్ధతో జాగరూకత యిమిడి యుండును. మాహేశ్వర స్థలమున భక్తుడాచరించెడి నైష్ఠిక భక్తి వలన యుపాధి గుణములు దూరమగును. నిద్ర, సోమరితనము మొదలగునవి నిర్గమించును. ప్రసాది స్థలమున సాధకుడు చేపట్టెడి యవధానము వలన ప్రసన్నత ప్రాప్తించును. ప్రసన్న హృదయము గలవాడు వంచన జేయ జాలడు. ఈ కారణముననే కాబోలు. ఈ విషయమును స్పష్టము చేసెడి యీ క్రింది పద్యము గమనార్హమై యున్నది.

**క. కూడునె యుపాధి గుణముల**
**నోడునె వంచించి యవసరోచితముల రెం**
**డాడునె సద్భక్తుడు గొం**
**డాడునె భవవిపినముల మహానందాత్మా !**

(శ్రీ సోమనాథుని అనుభవ సారము, ప. 121)

తామస గుణములన్నియును యుపాధి గుణములే. అహంకారము కూడ యుపాధి గుణమే. యీ విషయమును శివగీత క్రింది విధముగా తెలిపినది:

**శ్లో ॥ దేహే స్మిన్నభిమానేననమహోపాయబుద్ధయః ।**
**అహంకారేణ పాపాని - క్రియంతే హంత సాంప్రతమ్ ॥** (శివగీత ; 9:52)

దేహాభిమానము వలననే అహంకారము జనించును. అహంకారము మమకారమునకు తల్లి వంటిది. మమకారము వలననే రాగ ద్వేషములు గల్గు చున్నవి. జీవ-శివాభేదమనెడి జ్ఞానము వలన అహంకరాము నష్టమగును. తత్ఫలితముగా రాగ ద్వేషములు తొలగి పోవుచున్నవి.

శరణ స్థలమున నుండెడి శివయోగి శివజ్ఞాన సంపదతో బాటుగ శరణాగత భావ సంపత్తి గల్గిన వాడై యుండును. శరణాగతునికి దాసోహ భావమే భూషణముగా నిలుచును. సో హం భావన జ్ఞాన ప్రకాశమై పథమును చూపు చుండగా దాసోహం భావన సతీ-పత్యను భవమునకు పుష్టిని సమకూర్చును. ఆనంద భక్తిని యాచరించుటలోన శరణుడు, యీ రెండు భావముల చేత వలయు సహకారమును పొందును. ఒక వైపు తాను శివుని సతి ననెడి భావము గల్గును. తనకు శివునకి భేదము లేదనేడి భావము మరొక వైపున గల్గును ఇట్టి యపూర్వమైన భావముల మేళన వలన శరణుడు సహస్ర భాను సన్నిభుడై శోభించు చుండగా చీకటిని పోలెడి తమోగుణమతని దరికి చేరజాలదు.

ఈ స్థితిలో శరణుడను భవించెడి విశిష్టాను భవ మెట్టులుండునో యనెడి దానిని వివరించెడి శ్రీ బసవన్న వారి క్రింది వచనము గమనార్హమైనదై యున్నది.

**జ్ఞానద బలదింద అజ్ఞానదకేడు నోడయ్యా!**
**జ్యోతియ బలదింద తమంధద కేడు నోడయ్యా!**
**సత్యద బలదింద అసత్యద కేడు నోడయ్యా!**
**పరుషద బలదింద అవలోహద కేడు నోడయ్యా!**
**కూడల సంగన శరణన అనుభావదింద**
**ఎన్న భవద కేడు నోడయ్యా !** ( బసవేశ్వరుని ప. సు. 841)

ఈ వచనము యొక్క తెలుగురూపమిది.

**జ్ఞానపు బలము వలన నజ్ఞానపు చేటు చూడయ్యా!**
**జ్యోతి యొక్క వలన తమంధపు చేటు చూడయ్యా !**
**సత్య బలము వల నసత్యపు చేటు చూడయ్యా !**
**పరుషపు బలము వలన నవలోహపు చేటు చూడయ్యా !**
**కూడల సంగని శరణుని యనుభావపు బలము వలన నా భవపు చేటు చూడయ్యా !**

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## నిర్దేశ స్థలము

శరణ స్థలమునందున తామసనిరసన స్థలము పిదప వచ్చెడిదే నిర్దేశ స్థలము. నిర్దేశమనగ చూపుట, తెలియ పరచుట అని యర్థము. సద్గురువు యొక్క మార్గదర్శనలేకుండగ సాధకుడు ఆధ్యాత్మికముగ పెరుగుదల పొందలేరు. ఈ విషయమును తెలియజేయుటకే శ్రీ జగద్గురు శ్రీ రేణుక భగవత్పాదుల వారు నిర్దేశ స్థలమును వుపదేశించిరి.

**శ్లో ॥ నిరాకృత్యతమో భాగం, సంసారస్య ప్రవర్తకం ।**
**నిర్దిశ్య తే తుయత్ జ్ఞానం సనిర్దేశ ఇతిస్మృతః ॥** (సి. శి. 13:22)

సంసారము యొక్క ప్రవృత్తికి మూల కారణమైన తమో గుణము నిరాకరించెడి జ్ఞానమునే నిర్దేశమని పిలుతురు, నిర్దేశ స్థలమున ఇట్టి జ్ఞానమును గూర్చియు దానిని భోదించు ఆచార్యుని గురించియు వుపదేశింపబడినది, గురు వుపదేశము లేనిదే జ్ఞానము ప్రాప్తించదని శ్రీ భగవత్పదుల వారు తెలియ జేసిరి, ఈ క్రింది శ్లోకమును గనుడి.

**గురురేవ పరం తత్త్వం, ప్రకాశయతి దేహినాం ।**
**కోవా సూర్యం వినాలోకే, తమసో వినివర్తకః ॥** (సి. శి. 13 : 23)

శ్రేష్ఠమైన ఆత్మ తత్త్వమును భోదించి ఆజ్ఞులను సుజ్ఞులుగ చేసెడి వాడే సద్గురువు. జగత్తులో చీకటిని దూరము చేయుటకు సూర్యుడు ఒక్కడే సమర్థుడు. ఆదే విధిన ఆజ్ఞానమనెడి చీకటిని పారద్రోలుట శ్రీ గురువు కొక్కనికే సాధ్యమగును. పుస్తకములో చదివి స్వతంత్రముగ జ్ఞానమును సంపాదించెడి ప్రయత్నము నిష్పలమగును, సద్గురువును తప్పని సరిగ ఆశ్రయించ వలెను. ఈ విషయమును దృడపరచుటకై శ్రీ గురువుల వారు ఈ క్రింది వుపదేశమునిచ్చిరి.

**శ్లో ॥ అంతరేణ గురుంసిద్ధం కథంసంసార నిష్కృతిః ।**
**నిదాన జ్ఞాం వినావైద్యం, కోవారోగో నివర్తతేః ॥** (సి. శి. 13:24)

జ్ఞానమునెరింగిన గురువులనగాక ఈ సంసార బంధము ఎట్లు తొలిగిపోవును, రోగభాద విషయమును తెలిసిన వైద్యునిచే గాక రోగము నెవ్వరిచే నివారించ బడును.

"శరీరం వ్యాధి మందిరం" శరీరమునందున అనేక రకములైన రోగములు ప్రబలు చున్నవి. రోగిష్టి ఆ భాదను పడజాలక చికిత్స కొరకై వైద్యుని ఆశ్రయించును, అనువభజ్ఞుడైన వైద్యుడు అతనిని పరీక్షించి రోగమున గల కారణమేమిటి? దీని నివారణకై ఏ ఔషదము వాడవలెను? అను విషయములను తెలిసి కొని చికిత్స చేసిన యెడల రోగము తొందరగ నివారింపబడను. ఆదే విధిన శరణ స్థలమున నుండు భక్తుడు శివయోగమునందున సిద్దిని బడసిన శ్రీ గురువు దగ్గరకు వెళ్ళి తన ఆజ్ఞానమనెడి రోగము నివారించు కొని సుజ్ఞాని అగు చున్నాడు.

శాస్త్ర కారులు భవమును రోగమని యందురు. ఈ రోగమును నివారించెడి వాడే భవరోగ వైద్యుడగును. ఈ విషయమునే శ్రీ భగవత్పాదుల వారు నొక్కి చెప్పిరి. శివుడు భవరోగ వైద్యుడని వేదాగమ పురాణాదులలో నుతింప బడినాడు. శివుని యభిన్న స్వరూపుడైన వాడును, వీరశైవ ధర్మ గ్రంథములలో నిర్ధేశింప బడిన లక్షణములను గల్గియున్న వాడే భవరోగ వైద్యుడగును. కాని యీ లక్షణములను గల్గియుండక తమకు తామే గురువులనిపించి కొనెడి వారెందరో గలరు. వైద్యపరమైన యర్హతలను పొందకుండగ, తనకు తానే వైద్యడనని యనెడి వారే యీ "మేము గురువుల" మనెడి వారని గుర్తించ వలెను. నకిలీ వైద్యుని వైనమును తెలిపెడి కథ యొకటి కలదు.

ఒక యూరిలో నొక వైద్యుని నని చెప్పికొనెడి వ్యక్తి యుండెను. అతని శక్తి గురించి యతని కమోఘమైన విశ్వాసముండెను. ఒక నాడొక వ్యక్తి యాకస్మికముగా కాలధర్మము జెందెను. వైద్యుని కాశ్చర్యము గల్గెను. అతడు తన శిష్యుని రావించి, యీ చచ్చినావాడెవ్వడో

వివరము లెట్టివో కనిపెట్టి రమ్ము అని ఆజ్ఞాపించెను. "ఏమేమి గురుదేవా! వానిని బ్రతికించి మృత్యుంజయుని చేయుదురా?" అని శిష్యుడడిగెను. నేను ఆ విషయమును సావకాశముగా వివరింతును. నీవు వెడలి విషయ సేకరణ చేసి రమ్మనెను. శిష్యుడు గురుని యాజ్ఞను పాలించెను. వివరములను నివేదించెను. తన సంశయమును తీర్చి కొనుటకై "స్వామీ! యీ వివరముల నెందుకు కోరితిరో వివరించు మని శిష్యుడు వేడికొనెను. అప్పుడా, గురువు శిష్యుని కిట్లనెను:

"ఓయీ శిష్యరత్నమా! చచ్చిన వాడు మన వద్ద యౌషధమును గొనిన వాడేమో యని కొంటిని. కాని నీవు చెప్పిన వివరముల ప్రకారము వాడు మన దగ్గరకు రానే లేదని తేలినది. ఇప్పుడొక నూతన సమస్య తల యెత్తినది. వీడు మన మందును తిన లేదు కదా! మరణమెట్టుల గల్గెను."

ఈ వైద్యుడు రోగ నిర్మూలనా నైపుణ్యము గలవాడు కాదనియును, రోగి నిర్మూలనా కౌశలము గల వాడని తెలియు చున్నది. ఇట్టి వైద్యుల నుద్దేశించి యొక సుభాషిత కారుడు ఈ క్రింది సుభాషితమును చెప్పెను.

**శ్లో ॥ వైద్యరాజ నమస్తుభ్యం యమరాజ సహోదరః ।**
**యమస్తు హరతి ప్రాణాన్ త్వంతు ప్రాణాన్ ధనానిచ ॥**

ఓ వైద్యరాజా! మీకు నమస్కారము. మీరు యమునికి సహోదరులు యముడు ప్రాణమును మాత్రమే తీసికొని వెడలును. మీరు మాత్రము ధన ప్రాణములను గైకొందురు. (అందుచేత, మీరు మాననీయులు).

కవిగారి వెటకారమును గ్రహించని వారుందరే? వీరశైవ ధర్మము ప్రకారము అర్హతలు లేని గురువునాశ్రయించిన శిష్యునిగతి యెట్టులుండునో ఊహింప గలము. శ్రీ గురువు నజ్ఞాన మాలిన్యమును తొలగించెడి వాడని తెలిపెడి శ్రీ భగవత్పాదుల వారి యీ క్రింది యుపదేశమును గనుడి:

**శ్లో ॥ అజ్ఞానమలినం చిత్తదర్పణం యో విశోధయేత్ ।**
**ప్రజ్ఞా విభూతియోగేన తమాహుర్గురు సత్తమమ్ ॥** (సి. శి. 13:25)

మనస్సనెడి దొక దర్పణము వంటిది. దర్పణము స్వచ్ఛముగా నుండిన యెడల సృష్టముగా నుండెడి ప్రతిబింబమును ప్రదర్శించ గలదు. ధూళి గల దర్పణము వలన ఫలితమెట్టిదో తెలియని దెవ్వరికి? మనుజుని చిత్తము నొక దర్పణముగా నెంచిన యెడల, దాని నిర్మాల్యత ప్రాముఖ్యతను సంతరించి కొనును. నిర్మల చిత్తము లేని వారికి ఆత్మ జ్ఞానము ప్రాప్తము గాదు. శ్రీ గురువు వివేకోపదేశము ద్వారా చిత్తము నిర్మలము చేయబడు చున్నది.

అంతరంగమునందున నుండెడి చిత్తమునకు మాలిన్యము ఎక్కడినుండి వచ్చిచేరును? అనెడి సందేహము కలుగ వచ్చును. దానికి సమాధానమేమనగ మన శరీరమునకు తొమ్మిది ద్వారములు గలవు, ఈ ద్వారముల ద్వారా మాలిన్యము ప్రవేశించి చిత్తమును కల్మషము చేయును. మన యింటిలో నుండెడి ద్వారములు కిటికీలు మొదలగు వాటిద్వార ధుమ్ము దూళి యింటిలోనికి ప్రవేశించును. యిదే విధిన నవ ద్వారము గలిగిన దేహములోనికి మలినము ప్రవేశించును, జ్ఞానేంద్రియములు మరియు కర్మేంద్రియముల ద్వారా జీవాత్మ భోగముల ననుభవించును, ఆ భోగములకు సంబంధించిన విషయ వాసన మనస్సు నందు సంగ్రహించ బడును. ఈ సంస్కారము యొక్క ఫలితముగ మరల మరల ఆ విషయ భోగముల ననుభవించాలనెడి కోరికయు ఎప్పటికప్పుడు పుట్టి పెరుగుచుండును. ఈ విధముగా చిత్తమునందు సంగ్రహింపబడు పూర్వాను భూత విషయ సంస్కారమే చిత్తము యొక్క మాలిన్యమని గుర్తించ బడినది, విషయముల యొక్క క్షణకాల భంగురము అగు అనుభవము వలన కలిగెడి అల్ప సుఖము మరియు ఆ పిదప లభించెడి అనంత దుఃఖముల గురించి విచారించక జీవుడు మాయ ప్రభావము వలన అటువైపు పరుగిడు చుండును, యిట్టివాడు సద్గురువుకు శరణా గతుడై గురువు వుపదేశమును బొంది నిత్యా నిత్య వివేకము మరియు ఆత్మ అనాత్మ వివేకము పెంపొందించికొని తద్వారా చిత్తము నిర్మలము చేసికొనును. ఈ విధముగా వుపదేశమనెడి విభూతి ద్వారా శిష్యుని చిత్తమనెడి దర్పణమును శ్రీ గురువు పరిశుద్ధముగ జేయుచున్నాడు. ఆ పిదప శిష్యుడు శివుని తన చిత్తమందున నిలుపుకొనును.

వుదాహరణముగ ఒక విదేశమునకు చెందిన ఓ చిత్రకారుడు భారతదేశమునకు వచ్చి యిచ్చట మహారాజులవారు ఏర్పాటు చేసిన చిత్రకళాపోటిలో పాల్గొనెను. మహారాజుల వారు ఒక విశాలమైన భవనమున ఏదురుబదురుగానున్న గోడల మీద ఇరువురి చిత్రకారులకు చిత్రములుదించుటకు వలయు సామగ్రిని ఏర్పాటు చేసి ఒక మాసములో చిత్రమును దించవలెనని ఆదేశమునిచ్చెను. ఒక గోడ విదేశీయునికిని మరొకటి స్వదేశీయునికి కేటాయింపబడెను. గడువు ముగిసిన పిదప మహారాజులవారు ఆ చిత్రములను పరిక్షించుటకై సిబ్బందితో విచ్చేసెను. తమ దేశము యొక్క కళాకారుని చిత్ర కళనుచూసి ఏంతో ఆనందిచెను. ఆ పిదప విదేశయుని చిత్రకళానైపుణ్యము ఎటులున్నదోయని వానికి సంబధించిన గోడ దగ్గరికి చేరెను. ఆ కళాకారుడు తన గోడకు ముందున ఒక పటలమును వేలాడగట్టెను, మహరాజుల వారి ఆగమునుమును గమనించిన వాడై ఆ పటలమును పక్కకు నెట్టి మహారాజుగారిని వినయ పూర్వకముగ ఆహ్వానించి స్వాగత వచనములను పలికి తన చిత్రమును చూడుమని రాజుగారికి విన్నపము చేసెను. అప్పుడు మహారాజు అతని చిత్రమును చూచి ఆశ్చర్యభరితుడయ్యెను, యిదేమి చిత్రమని ముక్కు మీద వేలు వేసుకొనెను, స్వదేశీయుడు ఏ చిత్రము గోడపైన వేసెనో ఆదే చిత్రమును గోడలోపల వేయబడియుండెను, రాజు ఏమయ్యా! గోడ లోపల నీవు చిత్రమునే విధిన దించితివి అని ప్రశ్నించెను. అప్పుడు ఆ విదేశియుడు ఓ మహారాజా! నేను చిత్రము వేసెడి గొడవరకే పోలేదు. నాకు కేటాయించిన గోడలో కనిపించెడి చిత్రము మీ దేశమునకు చెందిన కళాకారుని చిత్రము యొక్క ప్రతిబింబమై యున్నది. అయితే ఆ ప్రతిబింబము స్పష్టముగ వుండవలెనని నేను గోడను రుద్ది రుద్ది అద్దముగ మార్చితినని సమాధానమిచ్చెను. ఆ విదేశియుని జాణతనమును గని ప్రథమ పురస్కారమును విదేశియునికే యిచ్చెను.

ఈ రీతిగ చిత్రకారుని వలెనె గురువు గారు శిష్యుని చిత్తమును రుద్ది రుద్ది అద్దము వలె చేయును. ఆ అద్దమునే శిష్యుని మనములో వున్న పరమాత్ముడు దర్శనమిచ్చును. శ్రీ గురువు గారి కరుణ కట్టాక్షము గురించి శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా వుపదేశించిరి.

**ఆ పరోక్షితత్వస్య జీవన్ ముక్త స్వభావినః ।**
**గురోః కటాక్షే సంసిద్దే కోవా లోకేషు దుర్లభః ॥**
**కైవల్య కల్పతరవో గురువః కరుణాలయాః ।**
**దుర్లభా హి జగత్యస్మిన్ శివాద్వైత పరాయణాః ॥**

స్వస్వరూప జ్ఞానముచే సాక్షాత్కరింపబడిన శివ స్వరూపము గలవాడును జీవన్ముక్తస్వభావము గలవాడునైన గురుని కరుణా కటాక్షము లభింపగా లోకమందు బొందరాని పురుషార్థ ముందునా? అనగా సకల పురుషార్థదాయి గురుకరణయె యనుట. మోక్షమనెడి మహా ఫలముల నొసంగు దేవ వృక్షములను కరుణా శీలుడును శివాద్వైత బావనా సక్తులును ఆయిన గురువులు ప్రయత్నము చేత గాని లభింపరు. అరుదుగా నున్నా రనుట. మనుజుడు తన జీవనమునందున ఏదైనను ప్రయత్నముచే సాధించ వచ్చును. వాటిన్నిటి కంటెను గురు కరుణ ఏంతో మహత్మ్య పూర్వకమైనది. ఓకవేళ్ళ అన్ని వుండియు గురు కరుణ లేకున్నచో ఏవియును లభించజాలవు. తత్ఫలితముగా ఆట్టివాని జీవితము వ్యర్థమగును. ఈ భావమును ప్రతిబింబించెడి శ్రీ శంకరాచార్యుల వారి యీ క్రింది శ్లోకమును చూడుడిః

**శ్లో ॥ శరీరం సురూపం తథావా కలత్రం !**
**ధనం మేరుతుల్యం యశశ్చారు చిత్రమ్ !**
**గురోరంఘ్రి పద్మే మనశ్చేన లగ్నం !**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్ !**

అందమైన తనువు, తదనుగణమగు రూపముగల భార్య, మేరుపర్వతమంత సంపద, అనంతమైన కీర్తి గల్గిన ఫలమేమి? గురుభక్తి లేకుండిన యెడల యివి యన్నియును నిష్ప్రయోజనములగును. గురుపాదముల యెడ భక్తి గల్గి యుండుటయే నిజమైన సంపద మరియు సుఖములను గల్గియుండట.

శివయోగ సిద్ధిని బడసిన సద్గురువు కరుణామయుడై శిష్యునికి కల్పతరువై యభీష్టము నెరవేర్చును. ఇట్టిమహిమాన్వితులైన శ్రీ గురువులు లభించుట యనెడిది సుసాధ్యమైన విషయము కాదు. స్వర్గములో నెలకొని యున్న కల్ప వృక్షము కేవలము భోగములను

మాత్రమే ప్రదానము చేయును. కైవల్యము నివ్వ జాలదు. కాని శ్రీ గురువు భోగమోక్షముల నివ్వ గల్గెడి సమర్థత గల్గియుండునని గ్రహించ వలెను. కల్యాణ దాయకుని "కైవల్య కల్పతరవే కల్యాణ గురువేనమః" అని స్తుతించి యతని కృపను బడయవలెను. శ్రీ కంఠ శివాచార్యుల వారు, ఈ విధిన స్తుతించి గురు కరుణను పొంది, బ్రహ్మసూత్రములకు భాష్యమును వ్రాసి ప్రబలమైన కీర్తిని పొందగల్గిరని తెలియు చున్నది.

లోకమున నసంఖ్యాకులైన గురువు గలరు. వీరెల్లరు కైవల్యము నివ్వగల్గుదురే? యనెడిదొక గొప్ప ప్రశ్న. పరమ రహస్య మీ ప్రశ్న కీ క్రింది విధిన యుత్తరము నిచ్చినది.

**శ్లో ॥ గురవోబహ వస్సంతి శిష్యవిత్తాపహారకాః ।**
**శిష్య హృత్తాప హారాస్తు గురురేకోఽపి దుర్లభః ॥**

శిష్యుల విత్తమున పహరించెడి గురువు లెందరో గలరు. శిష్యుని హృదయ గతలోపమును దూరము చేసి కైవల్యము నిచ్చెడి గురువులు లభించుట కష్ట సాధ్యమైనది.

ప్రాకృతులై తిరుగాడెడి గురువులలో నప్రాకృత పరంపరకు చెందిన శివాద్వైత జ్ఞాన సంపన్నుడైన శ్రీ గురువు నుత్తమోత్తముడని శ్రీ భగవత్పాదుల వారు నీ క్రింది విధముగా తెలియజేసిరి.

**శ్లో ॥ క్షీరాబ్ధిరివ సింధూనాం సుమేరురివ భూభ్రుతాం ।**
**గ్రహాణామివ తిగ్మాంశుర్మణీ నామివ కౌస్తుభః ।**
**ద్రుమాణామివ భద్ర శ్రీ ర్దేవానామివ శంకరః ।**
**గురుః శివః పరః శ్లాఘ్యోగురూణాం ప్రాకృతాత్మనామ్ ॥** (సి.శి. 13:28-29)

శ్రీ భగవత్పాదుల వారనేక యుపమానముల నిచ్చి శ్రీ వీరశైవ గురుపరంపర యుత్కృష్టమైనదని తెలియ జెప్పిరి. సప్త సాగరములలో క్షీర సాగరము వంటివాడును, పర్వతాష్టకములో మేరువు వంటి వాడును, నవగ్రహములలో సూర్యుని వంటి వాడును, చతుర్దశ రత్నములలో కౌస్తుభము వంటి వాడును, దేవతలలో శంకరుని వంటి వాడును, అగుచు శ్రేష్ఠుడై శ్రీ గురువు విరాజిల్లు చున్నాడు.

గురు స్థలము నలంకరించెడి వాడు భక్తి స్థలము నుండి ఐక్య స్థలము వరకు గల షట్ స్థలములను సాధించెడి యర్హత, జ్ఞానము మరియు అనుభవము గల్గియుండాలని చెప్పుటకే శ్రీ భగవత్పాదుల నిర్దేశ స్థలమున నుపదేశము నిచ్చిరి. వీరశైవులు ప్రాకృతులగు నన్య గురువుల నాశ్రయించ గూడదని గుర్తెరుగ గలరు.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

దిll 3-4 - 1992
స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు నిర్దేశన స్థలము నందున గురువుల వారిచ్చెడి నిర్దేశము యొక్క ప్రాముఖ్యతను విశదపరచిరి.

తామస నిరసన చేసి, త్రిగుణాతీతుడై, శివసాన్నిధ్యమున శివానందము నను భవించువాడై యుండెడి శరణునికి నిశ్చింత యొక లక్షణమై యుండును. నిశ్చింత లక్ష్యమును నిర్లక్ష్యమునకు గురి చేసెడి యవకాశము గలదు. అంతేకాదు, సాధనా క్రమములో కొన్ని యడ్డంకులను తొలగించి లక్ష్యాన్ముఖత గల్పించుటకు నిర్దేశత యవశ్యమగు చున్నది.

"అపవాదస్తు నిర్దేశో నిదేశ శ్శాసనంచసః, శిష్టి శ్చాజ్ఞాచ" అనెడి అమర సింహుని వాక్కు ఆజ్ఞకు నిర్దేశమున కభేదము చూప బడినది "నిర్దిశ్యతే ఆదిశ్యత నిర్దేశః దిశ అతిసర్జనే" అనెడి పండిత వాక్కు ఉపదేశింపబడునదే నిర్దేశమగు చున్నది.

శరణ స్థలము సాధన చేసెడి వానికెట్టి నిర్దేశము కావలసి యుండుననెడి ప్రశ్న యెదురగును. శ్రీ బసవన్న వారి వచన మొకటి కలదు. గమనించుడి.

**సత్యవిదె సమాధానవిదె మనక్కె బారదిదేనయా?**

**సర్వసనుమతవెంబ సుఖవిదె మనక్కె సోంక దిదేనయా?**

**ఆ నీలనెంబు దొందు ఘనలిదె, కూడల సంగమ దేవా, భ్రమెయో?** (శ్రీ బసవేశ్వర ప.సం. 913), డా॥ తిప్పేరుద్రస్వామి సంపాదన.

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి.

**సత్యమిదే సమాధనమిదే మనస్సుకు రాదిదే మయ్యా**

**సర్వ సనుమత మనెడి సుఖమిదే మనస్సుకు సోకది దేమయ్యా!**

**నేను నీవనెడి దొక ఘనమిదే కూడల సంగమ దేవా భ్రమయో?**

శరణుడు సాధన క్రమములో వాఙ్మనస్సుల కగోచరమైన స్థితినను భవించు ననెడిది తెలిసి కొనగలరు. ఇట్టి స్థితిలో నతనికి నిర్దేశమిచ్చెడి వారెవ్వరనెడి ప్రశ్న తలయెత్తును. ప్రాకృత పరంపరకు చెందిన యద్వైతా చార్యులు చేసేడి భోధలు శివాద్వైత భావముల వలె స్ఫురించుటను చూడ గలము. విశిష్టాద్వైతుల వాదములు శక్తి విశిష్టాద్వైతమును పోలియుండును. కాని కేవలా ద్వైతమునకును, శివాద్వైతమునకును గల భిన్నత్వము సామాన్యుల కవగతము కాదు. విశిష్టాద్వైతమునకు శక్తి విశిష్టాద్వైతమునకు గల తేడాను, విజ్ఞులు మాత్రమే గుర్తించ గలరు.

విజ్ఞత, విశిష్టానుభవసంపాదము గల్గినట్టి వారై జీవన్ముక్తిని పొందిన యప్రాకృత గురువులు మాత్రమే నిర్దేశన నివ్వగలరనెడిది గుర్తించ వలసిన విషయము "యః ప్రజ్ఞా విభూతియోగేన విశోధయేత్ చిత్త దర్పణం" అనెడి ఆది జగద్గురువుల వారి వాక్కులనీ నేపథ్యమునందున స్వీకరించ వలెను.

శివాద్వైత పరాయణులైన గురువులు లభించుట దుర్లభమైన విషయమని తెలిపిన ఆచార్యుల వారి హితబోధ శిరోధార్యమని గుర్తించ గలరు. వేషధారులును. శివాద్వైత జ్ఞాన శూన్యులును, ఆచార సంపత్తి లేని వారును ఆయిన వారి నాశ్రయించ కుండ తగిన జాగరూకతతో గురువు గారిని గుర్తించ వలెను.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## శీలసంపాదన స్థలము

శరణ స్థలములోని చివరి అవాంతర స్థలమే శీల సంపాదన స్థలము. శీలవంతుడెవడు? శీలమనగానేమి? శరణ స్థళములో నున్న వానికి శీలముల అవశ్యకత కలదా? లేదా? ఇవన్నియును నీ స్థలమున వివరింప బడినవి. శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమును గనుడి:

**శ్లో ॥ జిజ్ఞాసా శివ తత్త్వస్య శీలమత్యుచ్యతే బుధైః ।**
**నిర్ధేశ్యయోగదార్యాణాం తద్వాన్ శీలీతికథ్యతే ॥** (సి. శి. 13:30)

ఈ ఉపదేశము ప్రకారము, శివతత్త్వమును తెలిసికొనవలెననెడి తీవ్రమైన ఉత్కంఠతయే శీలమని పించికొనును. సద్గురువుల వారి యుపదేశమును విని యెవ్వరు శివతత్త్వము యెడల జిజ్ఞాసను పెంచికొనెదరో వాడు శీలవంతుడన బడును.

మనుజునిలో జిజ్ఞాస యుండెడిది సహజమే. ఈ జిజ్ఞాస లౌకిక విషయముల గురించి గల్గును పారలౌకిక జిజ్ఞాస శీలవంతుని లక్షణమని చెప్ప జాలము. శివతత్త్వము గురించి గల్గెడి జిజ్ఞాస యే శీలమనియును, అదిగలవాడే శీల వంతుడనగు చున్నాడు.

శ్రీ వ్యాస మహర్షి తన బ్రహ్మసూత్రములలో "అథః బ్రహ్మజిజ్ఞాసా" అని మొట్ట మొదటగా వ్రాసిరి. వివేక, వైరాగ్యశమాది షట్ సంపత్తి ముముక్షతా యనెడి సాధనా సంపత్తి గల్గిన వాడే పరశివ బ్రహ్మ జిజ్ఞాస గలవాడగుటకు అర్హుడగు చున్నాడు. మిగిలిన కోటాను కోట్ల సంఖ్యలో నున్నవారు శివేతర విషయములలో జిజ్ఞాస పెంచికొని జనన-మరణములకు లోనగు చున్నారు. జీవితమును సార్థకత చేసికొన వలెననెడి కోరిక గలవాడు పరశివ బ్రహ్మ జిజ్ఞాసను పెంపొదించి కొనవలెనని తెలిసికొన వలెను. శ్రీ భగవత్పాదుల వారును నీ యుద్ద్వేశేముతోనే యీ శీల సంపాదన స్థలమును నుపదేశించిరి.

వీరశైవ సిద్ధాంతమునందు విశ్వము తత్వాత్మకమై యున్నది. శివతత్త్వమును మొదలుకొని ముప్పది యారుతత్త్వములం ప్రతిపాదింపబడినవి. పృధ్వీ తత్త్వము చివరిదగు చున్నది. ఈ తత్త్వమును తెలిసికొనుటకే కొందరు లింగాంగ సామరస్యమును సాధింప నెంతురు. ఈ మార్గమున పరమకైవల్యమును సంపాదించికొనుటకై యుండెడి జిజ్ఞాసను శీలమన వచ్చును.

వీరశైవ సిద్ధాంతము నందున వివిధాచారములు ప్రతిపాదింప బడినవి. ఇవి స్థూలముగా నైదు విధములు. శివాచారము, లింగాచారము, సదాచారము, గణాచారము మరియు భృత్యాచారము. గణాచారమునకు చెందిన వాటిలో 64 (అరువది నాల్గు ఆచారములు గలవు వాటినే శీలములని యందురు. మరొక మాటలో చెప్పవలెననిన అరువది నాల్గు శీలములతో కూడినదే గణాచారము. ఇచ్చట శీలమనగా నుత్తమ ఆచరణయని చెప్పబడినది.

పరంపరాను గతముగా శీలాచారములను కాపాడి కొనుచు వచ్చే వారిని కూడ శీలవంతుల నెడి పేరుతో పిలుచుట రూఢియందు గలదు.

ఏ కుటుంబము శీలములను కాపాడి కొనుచు వచ్చు చున్నదో ఆ కుటుంబ సభ్యులను శీలవంతులని యనియెడిది కూడ రూఢియందున గలదు.

చంద్రజ్ఞాన ఆగమమునందు క్రియా పాదములోని 9వ పటలములో వలయు వివరములు గలవు జిజ్ఞాస గలవారు తెలిసి కొనగలరు.

ప్రస్తుతము, శరణ స్థలమున శీలమనగా శివ తత్త్వపు జిజ్ఞాస యని తెలిసికొన గలరు. చిత్తమును స్థిరముగా శివునిలో నిలుపుటయే శీలమని పండితుల యుపదేశము. ఈ క్రింది విధమును గనుడి.

**శ్లో ॥ ప్రపన్నార్తి హరే దేవే పరమాత్మని శంకరే ।**
**భావస్య స్థిరతా యోగః శీలమిత్యుచ్యతే బుధైః ॥** (సి. శి. 13:31)

శరణా గతులైన వారి మనోవ్యధను దూరముగా లగ్నము చేయుటయే శీలమని యీ యుపదేశములోని భావము. ప్రారంభ దశలోన జిజ్ఞాసగా నుండెడిది కాలాంతరమున క్రమ క్రమముగా శివ భావమును పొంది మనస్సున స్థిరముగా నిలుచును. స్థూల తత్త్వములను నింద్రియములు గ్రహించ గలవు. కాని సూక్ష్మతత్త్వములనవి గ్రహించలేవు. తన్నిమిత్తమై భావము యొక్క యవశ్యకత యేర్పడును.

"భావో మానస చేష్టాత్మా పరిపూర్ణ శివా శ్రయః" (సి.శి. 16-67) అనెడి శ్రీ భగవత్పాదుల వారి యుపదేశ మొకటి గలదు. శివుని పూర్ణముగా ఆశ్రయించికొని యుండెడి మనస్సునే భావమని యందురని తెలుప బడినది. ఇంతటి పరిశుద్ధమైన భావన వల్లనే పరశివ బ్రహ్మను గాంచ గలము. ఎవ్వరైతే పరిపూర్ణమైన భావముతో శరణాగతులగుదురో వారు శాంతిని పొందుదురు. వారి బాధలను శివుడు హరించి వేయును. "హరతి ఇతిహరః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము భక్తుల దోషములను మరియు తాపములను హరించు వాడే హరుడని గుర్తించ గలరు. "శం కరోతి శంకరః" (శం-సుఖే) అనెడి వ్యుత్పత్తి ప్రకారము శంకరుడుగా శివుడు సుఖశాంతుల నిచ్చును. దుఃఖములను దూరము చేసి సుఖములను ప్రదానము చేసెడి మంగళ కారకుడగు శివుని యంతరంగమున ధ్యానించునదే శీలము యొక్క అంతరార్థమని గ్రహించ వలెను. మనము దేనిని యమితముగా ప్రేమించుదుమో దానికి సంబంధించిన భావము మదిన నిండి పోవును. పామరులైతే విషయ భోదనములనే ప్రేమింతురు. వారి మనస్సున నిండుగా విషయ వాసనలే తోణకిసలాడు చుండును. అచ్చట శివపరబ్రహ్మ భావమును నింపి కొనుటకు స్థానమే మిగిలి యుండదు. ఇట్టి వారికి భవము తప్పదు. భవిగా జీవించుచు కాల క్రమములలో పతనమగు చున్నారు.

ప్రేమానురాగముల వలన మన మెంత మేరకు ప్రభావితమగుదుమో తెలియ జేసెడి కథ యొక్కటి గలదు.

ఒక యూరిలో నొక శివాచార్యుడుండెను. అతనికి యెంతో తెలివైన శిష్యుడొకడుండెను శివాచార్యుల వారి పేరు సిద్ధరామయ్య కాగా శిష్యుని పేరు వివేక లింగమును. శ్రీ సిద్ధరామయ్య శివాచార్యుల వారిని యొక లింగవంతుడు శివపూజ్యకై యాహ్వానించెను. ఆచార్యుల వారు వివేక లింగమును వెంట నిడి కొని భక్తుని యింటికి బయలు దేరివెడలెను. పద్ధతి ప్రకారము శివ పూజ గురు పూజాదులు ముగిసిన పిదప పళ్ళెరమున ప్రసాదమునకై పదార్థములు నిడ బడెను. అందులో నొక జిలేబియుండెను. లింగనివేదన జేసికొని సిద్ధరామయ్యగారు నొక ముద్దను తినిన పిదప వివేక లింగమునకును, ఇంటివారి నుద్దేశించి బాగా ఆకలిగా యున్నది యేమియును మిగిల్చకుండగ తిందుననెను. వివేక లింగము, మరి ప్రసాదమో? యని ప్రశ్నించెను. సిద్ధరామయ్యగారు చిరునవ్వు నవ్వి నయ్యది క్రమ ప్రకారము ఇచ్చెదననెను. ఆచార్యుల వారు భూక్తావశేషమును ప్రసాదముగా కటాక్షించెడి ఆచారమును పాటించు చుండెను. ప్రసాద స్వీకరణ ముగిసెను. "వివేకా! పొట్టలో కొక్కమెతకు కూడ పోదురా" యనుచు ఖండించుట కుద్యుక్తుడయ్యెను. "స్వామీ ఆగండి!" తొందర పడవద్దు ఆ జిలేబి పెట్టినది మాపొరుగువాడు వేడి వెడిగా వడ్డించాలని చేసికొని తెచ్చినాడు. ఒక అయిదారు జిలేబిలైనా తినుడి లేకపోతే బాధపడునేమో? యనెను. శివాచార్యుల వారు వల్లెయని వానిని కూడ స్వీకరించి ప్రసాదము ప్రదానము చేసి ఖండించెను. అప్పుడా వివేక లింగము "స్వామీ ఒక్కమెతుకుకు స్థలము లేదంటిరి కదా! జిలేబిల నెటుల తింటిరని" యడిగెను. "ఒయీ వివేకా, వినుము ఒక రాజధానిలో జనము క్రిక్కిరిసి యుండెను ఈ లోగా రాజుగారు రథము నెక్కియటు వచ్చిరి. జనులు పక్కకు జరిగి రథము వెడలుటకు వీలు కల్పింతురు. ఇది నీ వెరిగిననదే ప్రేమాను రాగములతో కూడిన జిలేబీలు పొట్టలోకి పోవగనే, యచ్చట స్థలము లభించినది. ఇదియే యందులోని పరమరహస్య" మని యనెను. వివేక లింగమున కవగతమయ్యెను. ప్రేమాను రాగము లెంత గొప్పయో యనెడిది తెలిసికొన గల్గెను.

శరణ స్థలములోని సాధకుడు తనమనస్సునందున తనకు ప్రియమైన పరమాత్మకు అవకాశము నిచ్చి అతని యందుననే తనభావనను స్థిరము చేసికొని శీలసంపాదకుడు అనెడి పేరును పొందును. శరణుని యొక్క మనస్సులోని ప్రగాఢమైన ప్రేమ గురించి శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశమునిచ్చిరి.

**శ్లో ॥ శీలం శివైక విజ్ఞానం శివధ్యానైక తానతా**
**శివప్రాప్తి సముత్కంతా తద్యోగీ శిలవాన్ స్మృతః॥** (సి.శి. 13:32)

ఈ ఉపదేశము ప్రకారము శివునొక్కనినే తెలుసుకొన వలసి యున్నది. శివనొక్కడినే ధ్యానించవలెను. శివుని పొందుటలోనే ఉత్సుకత కలిగి యుండవలెను. ఇవన్నియును ఎవరి మనమున స్థిరముగా నుండునో అతడు శీలవంతుడగును.

ఒక గ్రామమునందున చికిత్సక బుద్ధిగల ఒక వ్యక్తి ఆవూరు యొక్క మఠాధిపతిగారైన శివాచార్యుల వద్దకు వెళ్ళి నీవు శివుడిని చూశితివా! అని యడిగెను. అప్పుడు వారు, ఔను గాంచితిని అని వుత్తరము నిచ్చెను. అపుడా వ్యక్తి నీవు గనిన శివునిని నాకు చూపించగలవా? అని ప్రశ్నించెను. అపుడా శివాచార్యులవారు చూపించెదను. పద యనియనెను. శివాచార్యులవారు ఈ వ్యక్తిని తీసుకొని అడవికి పోయి అందులో ప్రవహించెడి నదిలో స్నానమాడుటకు సిద్ధపడిరి. ముందుగా ఆ వ్యక్తిని నీటిలో మునగమని శివాచార్యులు చెప్పిరి. అతడు మునిగి మీదికి లేచుచుండగ అతని రెండు భుజములను అదిమి పట్టి అతనిని లేవనియలేదు. అతనెంత ప్రయత్నించినను పైకి లేవలేక పోయెను. శివాచార్యుల యొక్క బలముముందు వాని ప్రతిఘటన నీటిలో కలసి నీరైపోయెను. ఆచార్యుల వారు అతనిని క్రిందకు నెట్టుచునే యుండెను. అతడు ఊపిరి అందక వుక్కిరి బిక్కిరి యగుచుండెను. ప్రమాద స్థితికి చేరుటకు ముందుగనే ఆచార్యుల వారు తన చేతులను సడలించి వేసెను. ఆయువకుడు దిగ్గున మీదికి లేచి దేవుని చూపించెడి పద్దతి ఇదియేనా? యని అడిగెను. అతనెంతో కోపముతో నుండెను. గురువుగారు మాత్రము సమాధాన చిత్తము కలిగిన వారై అతనిని ఈ విధిన ప్రశ్నించెను. నిన్ను నేను నీటిలో అదుమునప్పుడు నీమనస్సునందున ఎట్టి అపేక్ష ప్రబలముగా నుండెను. ఈ ప్రశ్నకు ఆయువకుడిటుల సమాధానమిచ్చెను. నాకు ఊపిరాడుటకై గాలి దొరకవలయుననెడి ఒకే ఒక కోరిక మనసంతయు నిండి యుండెను. దీనిని మినహాయించి మరే కోరిక లేకుండెనని జవాబిచ్చెను. అప్పుడా శివాచార్యుల వారు అతనికి ఈ విధముగా బుద్ధిని చెప్పెను. నీరు నందు మునిగినప్పుడు నీ మనస్సునందున 'గాలి కావలెను'. అనెడి వ్యాకులత వ్యాపించి యుండినటులనే ఎప్పుడైనను శివుని గురించి ఇట్టి వ్యాకులతనే నీ మనస్సున నిండినప్పుడు నీవు శివునిని గాంచుటకు అర్హుడవుకాగలవు.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు శీలవంతుని యొక్క లక్షణము గురించి మరికొంత ఉపదేశము నిచ్చెను. గనుడి.

**శ్లో ॥ శివాదన్యత్ర విజ్ఞానే వైముఖ్యం యస్య సుస్థిరమ్।**
**తదాసక్తమనో వృత్తి స్తమాహుః శీల భాజనమ్॥** (సి. శి. 13:33)

ఏ శరణునికి శివునిని కాకుండా వేరే దేవత యెడల ఆసక్తి వుండదో మరియు తన యిష్టలింగమునందుననే తదేక చిత్తము కలిగి వుండునో అట్టి శరణుడు శీల భాజనుడని పిలువబడు చున్నాడు. సాధకునందున ఎప్పుడూ ఏకాగ్రచిత్తము అవశ్యముగా నుండవలెను. చిత్తైకాగ్రత లేని వాడు తన లక్ష్యమును సాధించజాలడు. శీల సంపాదన స్థలమున సాధకుడు చిత్తైకాగ్రము యొక్క ప్రాముఖ్యతను గుర్తించ వలెను. పూజ్యపాదులు శీలము విషయమున ఒక లౌకిక ఉదాహరణ నిచ్చి విషయమును విశదపరచుచున్నాడు. గనుడి.

**పతివ్రతాయా యచ్ఛీలం పతిరాగాత్ ప్రశస్యతే ।**
**తథా శివానురాగేణ సుశీలో భక్త ఉచ్యతే ॥**

**పతింవినా యథాస్త్రీణాం సేవాన్యస్య తు గర్హణా ।**
**శివం వినా తథాన్యేషాం సేవా నింద్యా కృతాత్మనామ్ ॥** (సి. శి. 13;34-35)

తనపతి మీద ప్రేమతో సతి పాతివ్రత్యమును పాటించిన యుటులనే శివుని మీద అతిశయమైన ప్రేమ గలిగిన శరణుడు తన శీలమును అధికతరము చేసికొనును. పతివ్రతామణులకు తన పతిని కాక యితరులను ప్రేమించుట యెటుల నిందనీయమో అటులనే శివశీలసంపన్నుడైన వానికి పరదైవమును భజించుట అటులనే నిందనీయము. పతివ్రతా శీలమును భంగము చేసికొనిన స్త్రీ అపరాధమును చేసిన దానిగా పరిగణింపబడు చున్నది. అదే విధిన శివేతరమైన దేవతలను భజించెడు వాడు దోషియగు చున్నాడు. అన్యదేవతల యెడల తిరస్కార భావమును గలిగి యుండుటయే శీలవంతుని లక్షణమని గ్రహించ వలెను.

షట్ స్థలముల యందున నొకటగు నీ శరణ స్థలమున సతిపతి న్యాయము చెప్పబడినది. శరణసతి, లింగపతి యనెడివి. ఈ స్థలము యొక్క రహస్యమై యున్నది. పతి వ్రతామణి తనమనోభావమున యెల్లప్పుడు తన పతినే నిలుపుకొని యుండును. అతడు భుజించు వరకు తాను భుజించక ఎంతో ఓర్పునువహించి యుండును. ఆమె లక్ష్యమంతయును. అతనిని సంతోష పెట్టుటయే. అతని తిండి యందునను బట్టల యందుననూ, తగిన శ్రద్ధలు తీసుకొని ఏ విధమైన లోటు కలుగకుండా జాగ్రత్తపడును. ఈమె సతిగా సార్థక నామధేయురాలగు చున్నది. ఇదే విధిన శరణడు శివుని యెడల అంకిత భామము వహించి యుండును. తన ప్రతి చేష్టలోను శివకరుణను. పొందవలెననెడి అనన్యమైన కోరిక అతని యందుండును. అన్యదేవతల దలపడు. అన్యదేవతా తిరస్కారమునగా యితరదేవతలను చిన్నచూపుకు గురిచేయుటకాదు. తాను తన యిష్టదైవము యెడల అపరిమితమైన ఆసక్తిని ప్రదర్శించుటయే ఈ తిరస్కారములోని భావనయని గ్రహించవలెను. మరొక్క విషయమేమనగా అన్యదేవతా తిరస్కారమనగా అన్యదేవతా దూషణ యని గ్రహించుట యుక్తమైన పనికాదు. ఇక్కడ గ్రహించ వలసినదేమనగా తన యిష్టదైవము యొక్క ఆరాధనలో భావసంబంధమైన అవరోధములు కలుగకుండుటకే ఈ తిరస్కార భావము ఉద్దేశింపబడినది. ఇతర దైవములను అగౌరవపరచు విధిన ప్రవర్తించకుండుటయే ఉత్తమమైన పని. మరొక మాటలో చెప్పవలెనన్న మరేదేవత యెడల ద్వేషభావము వహించవలదు.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు శరణ స్థలమునందున శీలసంపాదనను గురించి లౌకిక మరియు దార్శనిక ఉదాహరణ నిచ్చిన పిదప ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**శ్లో ॥ బహునాత్ర కిముక్తేన శివజ్ఞా నైక నిష్ఠతా ।**
**శీలమిత్యుచ్యతే సద్భిః శీలవాం స్తత్పరో మతః ॥**

**శివాత్మబోధైకరతః స్థిరాశయః శివం ప్రపన్నో జగతామధీశం ।**
**శివైకనిష్ఠో హి త శీల భూషణః శివైక్యవానేష హి కథ్యతే బుధైః ॥** (సి.శి.13; 36:37)

శీలసంపాదన గురించి చాలా మేరకు ఉపదేశించనైనది. ఇంకా ఎక్కువ చెప్పిన ప్రయోజనమేమి? శ్రీ గురువు వుపదేశించిన జ్ఞానోపదేశమునందు మాత్రమే శ్రద్ధను నిలిపియుండవలెను. అన్యమును గురించి ఆలోచించ కూడదు. ఈ విధముగా శీలము గురించిన విచారములు బహు విధములుగా నున్నవి. శివమహాపురాణము, కూర్మపురాణము, వాతులాగమము మరియు లింగపురాణము మొదలగు వాటిలో శీలమును గురించిన ప్రస్తావన కలదు. అవి ఈ క్రింది విధముగా నున్నవి.

1. **వ్రతం శివైక విషయం నియమశ్చ సనాతనః ।**
**శీలమిత్యుచ్యతే సద్భిః యేన శీలా భవేత్ పుమాన్ ॥** ( శివ మహా పురాణము)

2. **పరస్య శివతత్త్వస్య జిజ్ఞాసామధికృత్య యత్ ।**
**ఈక్షణాసు చ వైరాగ్యం తచ్ఛీలం పరమం స్మృతమ్ ॥** (కూర్మ పురాణము)

3. **నధ్యాయేన్న స్మరేదన్యంన పశ్యేచ్ఛృణుయాన్న చ ।**
**యద్ గృహేష్వన్య దేవోస్తి తద్ గృహాణి పరిత్యజేత్ ॥**
**శివాదన్యం న సేవే హమితి యచ్చాస్థయా సదా ।**
**శివమేవ నిసేవేత తదేతచ్ఛీల ముత్తమమ్ ॥**
**విశ్వమేతదశేషంచ శివయిత్యవధారితా ।**
**యా భాతి సుదృఢా బుద్ధిస్తదేతచ్ఛీల ముత్తమమ్ ॥** (వాతులాగమము)

4. **శివ ఏవస్వయం జ్యోతిర్నాన్యత్ కించేన విద్యతే ।**
**ఇతియచ్ఛ స్థిరీర్భాసస్తచ్ఛీలం పరమంవిదుః ॥** (లింగపురాణము)

పై శ్లోకములలోని భావము సిద్ధాంత శిఖామణిలో బోధింపబడిన విషయములతో ఏకీభవించు చున్నది. ఈ విధముగా ఈ స్థలమున ఉపదేశింపబడిన శీలము ప్రకారము శరణ స్థలములోని భక్తుడు శివుడే తనకు రక్షకుడనియును అతను మినహా ఎవ్వరులేరనియును, శివుని శరణుజొచ్చి తనను సతిగాను, శివునిని పతిగాను భావనను నిలుపు కొని శివునియందున ఏకైక నిష్ఠగలిగిన శీలవంతుడు మునుముందున ఐక్య స్థలమున ప్రవేశించి లింగాంగ సామరస్యము దిశన పయనించగల్గును.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

ది ॥ 24-4 - 1992
స్థలం : జ్ఞానమందిరం జంగమ వాడి మఠం, వారణాసి

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు శీలముల గురించియును, శీలసంపాదన గురించియును వేదాగమపురాణేతి హాససమ్మతమైన విషయముల నెన్నింటినో వివరించిరి.

శీలమనెడి పదము సత్ప్రవర్తనకు పర్యాయ పదముగా నుపయోగింప బడుచున్నది. సత్ప్రవర్తన సద్గుణ సంపత్తి వలన గల్గుచున్నది. శీలవతికి గుణమే యాభరణమని చెప్పబడిన శ్రీ బసవన్న వారి క్రింది వచనమును గనుడి:

**నీరింగె నైదిలియే శృంగార**
**సముద్రక్కె తెరెయే శృంగార**
**నారిగె గుణవే శృంగార**
**గగనక్కె చంద్రమనె శృంగార**
**నమ్మకూడల సంగన శరణరిగె**
**నొసల విభూతి యేశృంగార**

(శ్రీ బసవేశ్వర వచనము సం. 74 డా॥ తిప్పేరుద్రస్వామి సంపాదన)

ఈ వచనమున చెప్పబడిన "నారిగె గుణవే శృంగార" యనెడిది గ్రాహ్యము శరణ స్థలములోని సాధకుడు "సతి-పతి న్యాయమున" సాధనను చేపట్టును. "సతీవ విభావయన్" అనెడి ఆచార్యోక్తి (శి.సి.13:5) యీ విషయమును తెలుపు చున్నది. శివ-సతి స్థానములో నుండెడి శరణుడు శీలవంతుడై యుండవలెను భావశుద్ధిని బడియుటకు శీల సంపాదన యుపకరణముగా పని చేయుననని తెలిపెడి చతుర్వేద సారములోని యీ క్రింది పద్యము వలన తెలియు చున్నది:

**లోకనిషిద్ధాన్న పాకాదు లెల్లసం**
**స్కారకృతాన్నపాకములు సమమె**
**గాన సంస్కారకృతానర్థములు వాని**
**పూర్వాశ్రమంబెట్లు పుచ్చు వచ్చు**
**సంస్కార కృతపాక శాకాది కములు సం**
**స్కారిత దర్శన స్పర్శనాది**
**దర్శన స్పర్శనాత్మకమైన విషయా**
**దులవియెల్ల నిరసన మమర జల్పి**

**భవి వితాన క్రియాసిద్ధి పరగ జేసి**
**భవి విసర్జనుడైనట్టి భక్తుడెపుడు**
**సిద్ధ లింగ సూక్ష్మాచార శుద్ధి వలన**
**భావశుద్ధిని బడయును బసవలింగ.** (చతుర్వేద సారము, ప. 343)

"పరమాత్మని భావస్య స్థిరయోగః శీలమిత్యుచ్యతే" యనెడి జగద్గురూక్తి (సి. శి. 13-31) యీ యంశము గురించి తెల్పిన దనెడి దవిస్మరణీయము. వ్యాశీల్యవతి యగు స్త్రీ భర్త యొక్క ప్రేమానురాగములను పొందుటకు కృషి చేయును. అన్య పురుషుల గురించి ఆలోచించదు. ఇదే విధిన శరణుడు అన్య పథముల గురించి యెరుగుట కైననూ యిష్టపడడు. ఈ విషయమును తెలిపెడి శ్రీ బసవన్న వారి క్రింది వచనమును గనుడి:

**నిష్ఠె యింద లింగవ పూజిసి**
**మత్తొందు పథ్య నరియద శరణరు**
**సర్పన హెడెయ మాణక్యదంతిప్పరు భూషణరాగి**
**దర్పణదొళగె ప్రతిబింబదంతె హింగదిప్పరు**
**కూడల సంగమ దేవా, నిమ్మ శరణరు** (శ్రీ బసవేశ్వర వ.సం. 745)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి:

**నిష్ఠతోడ లింగము బూజించి మరియొక్క పథము నరయని శరణులు**
**సర్పపు ఫణముకు మాణిక్యము వలె యుందురు భూషణములై**
**దర్పణములోని ప్రతిబింబము వలె క్రుంగక యుందురు**
**కూడల సంగమ దేవా మీదు శరణులు**

లింగైక నిష్ఠాపరతంత్రత శరణునికి భూషణము వంటి దనెడిది గుర్తించ వలసిన యంశము. "శివాదన్యత్ర విజ్ఞానే వైముఖ్యంయస్య సుస్థిరమ్ తమాహుః శీల భాజనమ్" (సి. శి. 13:33) అనెడి శ్రీ రేణుకోక్తిలో నిదే భావమిమిడి యున్నదని గ్రహించ గలరు.

దర్పణములోని ప్రతిబింబమునకును తత్సంబంధిత వస్తువు లేదా వ్యక్తికి భేదము కన్పట్టును. ఇదే విధముగా శీల వంతుడై వెలిగొందెడి శరణుడు శివునికి ప్రతిబింబమైనట్లు గోచరించుననెడిది గుర్తించ దగిన విషయము. శివ-జీవాభేద భావము స్థిరపడుట శీల సంపాదన వలన సుసాధ్యమగుననెడిదే తెలిసికొన దగిన విషయము. ఈ సందర్భమున "శివైకనిష్ఠాహిత శీలభూషణః శివైక్యవాన్" అనెడి శ్రీ భగవత్పాదుల వారి యానతి (సి. శి. 13:37) స్మరించ వలసినదై యున్నది. వీరశైవాచార సంపన్నులు వీరమాహేశ్వరాచార సంపన్నులు శీలసంపాదనా నిరతులై ఆచార పంచకములో నుండెడి చతుష్షష్టి శీలములను నిష్ఠతో పరిపాలించి పరమపదమైన లింగాంగ సామరస్యమును సాధించిరనెడిది చరిత్రకెక్కిన విషయమే ఇట్టి వారిలో పాల్కురికి సోమనాథ కవి వంటి వారు తెలుగు నాడున చరిత్రనే సృష్టించిరనెడిది నిత్య సత్యము.

శివం భూయాత్

# చతుర్ధశ పరిచ్ఛేదము

## ఆశీర్వచనము - 1

## ఐక్యస్థలము

షట్ స్థలముల యందున ఆరవస్థలమే ఐక్యస్థలము దీనిని గురించి అగస్త్యులవారు శ్రీ భగవత్పాదుల వారిని ఈ క్రింది విధముగా ప్రశ్నించెను.

**తామసత్యాగసంబంధాన్నిర్దేశాచ్ఛీలతస్తథా ।**
**శరణాఖ్యస్య భూయోస్యస్య కథమైక్య నిరూపణమ్ ॥** (సి. శి. 14-1)

ఇందులోని భావమేమనగా తామసత్యాగము నుండి మొదలుకొని శీలసంపాదన వరకూ గల అంతః కరణమునకు సంబంధించిన యోగ్యతలు పొంది శరణ స్థలములోని భక్తుడు ఏఏ కారణములచేత ఐక్యుడుగా పిలవబడు చున్నాడు. ఈ ప్రశ్నకు శ్రీ రేణుక భగత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉత్తరము నిచ్చిరి.

**ప్రాణలింగా దియోగేన సుఖాతిశయమేయివాన్ ।**
**శరణాఖ్యః శివేనైక్య భావనాద్యైక్యవాన్ భవేత్ ॥** (సి. శి. 14-2)

ఈ ఉపదేశములోని తాత్పర్యమేమనగా శరణ స్థలములోని సాధకుడు తన అంతరంగము నందున నుండెడి ప్రాణలింగము యొక్క అనుసంధానమును సర్వదా చేయుచుండును. దానియందుననే అతిశయమైన ఆనందముననుభవించుచూ ఆజ్యోతిర్లింగమునందున ఎప్పుడు సామరస్యమును పొందునో అప్పుడతనిని ఐక్యస్థలియని పిలిచెదరు. "ఏకస్యభావః ఐక్యం" అనెడి ఉక్తి ప్రకారము భేద భావమును వీడి సామరస్య భావనను పెంపొందించు కొనుటయే ఐక్యస్థితి. భగవంతునితో ఐక్యాను సంధానమును ఎందుకు చేయవలెను. అతనిని వేరుగానుంచి పూజించిన చాలదా? అనెడి ప్రశ్న సర్వసామాన్యముగా ఉదయించుట సహజము. ఈ కారణము వలననే నిజగుణ శివయోగిగారు భుక్తి సుఖము సంసారములో నుండును. ముక్తిని అరసెడి వారు ఎందరు? అని తెలిపిరి ఈశ్వరుని భిన్నముగా భావించుకొని అతనిని అనన్యభక్తిచేత ఆరాధించి అనంతమైన భోగభాగ్యములను బడయవచ్చుననెడిది నిజమే. అయితే ఆక్షణికమైన ఐశ్వర్యము వలన శాశ్వతమైన సుఖము లభించజాలదు. పరమ సుఖమును పొందలేము. ఈశ్వరునితో ఐక్యరూపమైన సామరస్యమైన సంపత్తును సంపాదించుటే జీవుని యొక్క లక్ష్యముగా తీసుకొన వలెను.

ప్రతియొక్క జీవి తన జీవనమునందున తనను విడిచి పోయెడి అనేకమైన సంపదలను అనేకసార్లు సంపాదించి పోగొట్టుకొను చున్నాడు. ఈ విధముగా ఎంతో కాలము నుండి జరుగుచూ వచ్చుచున్నది. అయితే యిప్పుడు యింతటి సంపత్తును సంపాదించ వలెనని నదియెట్టిదో తెలిసికొనవలెను. ఒక్కసారి సంపాదించిన అదెన్నటికిని మనలను విడిచిపోజాలదు. ఈ విధముగా మనలను వీడి పోజాలని సంపదను సంపాదించుటనే ఐక్యసంపత్తి అనియందురు. ఈశ్వరునికంటే భిన్నులైన జీవులకు పదే పదే మృత్యుసంబంధమైన భయముండును. అట్టి భయము లింగాంగ సామరస్యము సాధించెడి వాడికుండదు. మృత్యువును వీడి అమృతత్వస్థితిలో విరాజిల్లుచుండును. సమాజములో ఒక జీవికి మరొక జీవికి సంబంధబాంధవ్యములేర్పడు చున్నవి. ఇవన్నియును అశాశ్వతములే శాశ్వత బంధమని తెలుపబడెడి దాంపత్యములో కూడా అశాశ్వత నెలకొని యుండును. లింగాంగ సామరస్యములో అశాశ్వత మనెడిది వుండదు. ఈ సంబంధము శిరస్థాయిగా నుండెడి సంబంధము. లౌకిక పరముగా నుండెడి సంబంధములలో వివాహమనెడిది అందరికీ తెలిసిన సంబంధమే. సమాజము దీనినంగీకరించినది. ఎక్కడో జనించిన యిరువురు దగ్గరకు చేరి సామరస్య భావముతో జీవించుటకు ప్రయత్నించు చుందురు. వీరిలో కొందరు మాత్రమే సఫలమనోరధులౌదురు. అధిక సంఖ్యాకులు విరసత భావముతోనే గలరని కన్పట్టుచున్నది. దీనికి గల కారణమేమనగా ఇరువురికి పరస్పరమైన స్వార్థముండుటచే ఎప్పుడెప్పుడు వారి స్వార్థమునకు భంగము గలుగునో అప్పుడప్పుడు విరసత భావమేర్పడును. శివుడు సంపూర్ణముగా నిస్వార్థ భావముతో నుండుటచేత తనలో సమరసుడగుటకు వచ్చిన జీవిని పరమానందముతో

స్వీకరించుచున్నాడు. సామరస్య భావమునకు భంగమేర్పడు అవకాశమేలేదు. జీవుడు తనంతతానుగనే ఐక్యతాసిద్ధిని కోరుచున్నాడు. శివుడును దానినే కోరును. అందుచేత విరసతకు ఆస్కారమేలేదు. 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' అనెడి ప్రమాణ వాక్యము ప్రకారము శివునిలో సమాసముగా నుండుటకై పోయినవాడు పరమ సామరస్యరూపమైన శివునిగానే అగుచున్నాడు. అన్ని నదులు తమనామ రూపములను వీడి సముద్రమునందున సమరస భావమును పొందినటుల శివునిలో ఐక్యాను సంధానము చేసెడి జీవులు తమ అస్తిత్వమును కోల్పోయి ఐక్యస్థితిని పొందుచున్నారు. ఈ సిద్ధాంత శిఖామణిలోని ఐక్య స్థలమున నాలుగు అవాంతర భేదములుగలవని శ్రీ పూజ్యపాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశమునిచ్చిరి.

**ఐక్య స్థలమిదం ప్రోక్తం చతుర్ధా మునిపుంగవ**
**ఐక్య మాచార సంపత్తి రేక భావనమేవ చ ॥**
**సహ భోజన మిత్యేషాం క్రమాల్లక్షణముచ్యతే.** (సి. శి. 14-3)

ఇచ్చట వచ్చెడి అవాంతర స్థలములేవనగా ఐక్య స్థలము, ఆచార సంపత్తి స్థలము, సహ భోజన స్థలములు వీటి యొక్క లక్షణములను శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా తెలియజేసిరి.

**విషయా నంద కణికాని స్పృహో నిర్మలాశయః ।**
**శివానంద మహాసింధు మజ్జనాదైక్య ముచ్యతే ॥** ( సి. శి. 14-4)

ఐక్య స్థలమును పొందవలెననిన ఎంతో కాలము నుండి సాధించవలసిన ప్రత్యేకమైన యోగ్యతలను యిచట వివరించనైనది. శబ్ద స్పర్శాది విషయముల వలన ప్రతి ఒక్క జీవికి అత్యల్పమైనవి మరియు అల్పకాలికమైన సుఖములు గలిగి అనంత కాలము వరకు దుఃఖము కలుగును. అందుచేతనే నిజగుణ శివయోగివారు వలదు వలదు భోగముల కూటమి విషము కలసిన రుచికరమైన భోజనము అనిపలికిరి. విషయములు రుచికరమైన భోజనము వలెనే కన్పట్టినను విషమిశ్రితమగు భోజనము నిచ్చెడి పరిణామముల నిచ్చును. ఐక్య స్థలములోని సాధకుడు ఈ విషయముల యెడల విముఖత గలిగి యుండును.

అనంత జన్మములందు విషయ సుఖమునే అనుభవించిన మనస్సునకు అదే ప్రియమైనదిగా కనబడుటచే మనస్సు ఆవైపునకై స్వాభావికముగా పోవును. అయిననూ వివేకవంతుడగు వాడు విచారపూర్వకముగా దానిని ఆ మార్గము నుండి నివృత్తిని చేసికొనవలెను. షణ్ముఖ శివయోగిగారు ఈ విధముగా తమ అనుభవమును వచనరూపంలో తెలిపి వివరించిరి.

**మనవెంబ మర్కటవు తనువెంబ వృక్షవనేరి**
**ఇంద్రియ గళెంబ శాఖెశాఖె హారి**
**విషయంగళెంబ హణ్ణుఫలంగళ గ్రహిసి**
**భవదత్త ముఖవాణి హోగుతిదె నోడా**
**ఈ మనవెంబ మర్కటన నిమ్మ నెనహెంబ**
**పాశదల్లి కట్టి ఎన్ననుళుహి కోళ్ళయ్య అఖండేశ్వరా.**

మనస్సు విషయ చింతనను విడిచిపెట్ట వలెననిన పరమాత్ముని చింతనయే అమోఘమైన సాధన అని పూజ్యులు వివరించిరి. ఐక్య స్థల సాధకుని మనస్సు సదా లింగాంగ సామరస్య విద్యయందు లయమైయండుటచే అది సహజముగనే విషయానందము నుండి విముఖమై యుండును.

అట్టి ఐక్య స్థలము నందలి సాధక జీవులకు విషయములలో అగుపించెడి ఆనందము లేశమైననూ యుండక ఆత్మ స్వరూప దర్శనపు ఆనందము వేద్యమగును. యత్సుఖేనానుమోదతే........ అను వచనము నందు రేణుక భగవత్పాదులు పరమాత్మ ఆనందమును పొందువారలకు ప్రపంచము ఆనందరూపముగా గోచరించుటను సూక్ష్మముగా తెలియ పరచిరి. ఇంటి యందు మధురమైన ఖాద్య పదార్థములను తయారు చేసెడి సమయాన స్వతహాగా మాధుర్య గుణము లేని సెనగ పిండి, గోధమ రవ్వ మున్నగు వాటికి మాధుర్య

గుణముగల బెల్లము లేక చక్కెర కలిపినపుడు బేసన్ వుండలు, రవ్వ వుండలు తయారై స్వాద భరితములగుటను ప్రతి యొక్కరికి అనుభవ వేద్యమే ఆవుండలలో మాధుర్యము బెల్లము-చక్కెరలదే గాని రవ్వ సెనగ పిండులది కాదు. అదేలాగున విషయాదులందు కనిపించెడి ఆనందము ఆత్మ-పరమాత్మలదే కాని విషయాదులకు చెందినది కాదని ప్రతియొక్కరూ తెలిసికొనవలెను.

మనము అనుభవించెడి విషయములు ఎల్లప్పుడూ మనకు సుఖమునే ఇవ్వవు. అవి అనుకూలించినటుల కనిపించినపుడు సుఖములుగా పరిణమించును. అవే విషయములు మనకు ప్రతికూలములైనపుడు దుఃఖదాయకములగు చున్నవి. శాస్త్రకారులు "అనుకూల వేదనీయం సుఖం, ప్రతికూల వేదనీయం. దుఃఖం" అని సుఖ దుఃఖములపై వ్యాఖ్యానించిరి. విషయములు ప్రారంభములో అనుకూలముగా కనిపించి చివరన ఒక్కసారిగా ప్రతికూలమగుట తథ్యము నిజగుణ శివయోగుల వారు ఈ విధముగా ఉపదేశమునిచ్చిరి.

**పడె పడె యోళు మొదలత్యాయాస ।**
**నడు విరుతి హ్రదలె సుఖ దాభాస ॥**
**కడెయోళు హేగెము సుకుత్తి హ్రదు ।**
**సిడిమిడి యాగళె మనస్సింగ హ్రదు॥**

ఈ విధముగా విషయముల యందలి అనుకూలత ప్రతి కూలతలను వివరిస్తూ విషయ సుఖపు క్షణికతను ఎంతో మార్మికముగా వివరించిరి. సాంసారిక విషయములు ఒకసరి అనుకూలముగాను మరొక పరి ప్రతికూలముగాను కనిపించును. ఐనా పరమాత్ముడు వాటినెప్పుడూ ప్రతికూలముగా చూపించడు. ఇట్టి సదా అనుకూలుడగు పరమాత్ముని జతన సామరస్య రూపమైన ఐక్యస్థితిని పొందవలెననిన అనుకూల-ప్రతికూలాత్మకమైన విషయానందము నందు నిస్పృహ చెందవలసియే యుండవలెను. ఎవడు విషయ సుఖపు త్యాగమును చేయునో అతడికి పారమార్థిక సుఖము ప్రాప్తమగును. సత్సంగమునందు భాగము వహించుటకు జనులు తమ తమ గృహములను వీడి శివానుభవ భవనములకు వెళ్ళెదరు. ఒక గంటసేపు భోగభూమియైన తమ ఇళ్ళను వీడి ఈ శివాను భవమునందు పాల్గొనినపుడు శివాను భూతికలుగుట సర్వులుకూ అనుభవైక వేద్యమే.

గృహమును వీడనిదే సత్సంగపు శివాను భూతి ఆనందము కలుగని లాగున, శబ్దాది విషయముల నుండి విముఖుడు కానిచో ఐక్యాను భూతి ప్రాప్తము కానేరదు. త్యాగమునందు అపారమైన సామర్థ్యము యుండును. 'త్యాగేనైకే అమృతత్త్వమానశుః' అనునటుల ఉపనిషత్తు త్యాగమును, అమృతత్త్వపు సాధనగా వివరించిరి. అందుచే క్షణిక సుఖదాయకములగు విషయములను అవశ్యముగా త్యజించ వలసియుండును. ఇటుల విషయ వాసన చేత విముక్తుడైన వాడు నిర్మలాశయుడగు చున్నాడు. దీని అర్థము ఏమనగా నిర్మలాంతః కరణుడగు చున్నాడు. విషయాభిలాష చేత ముక్తుడైన లేదా పరిశుద్ధమైన చిత్తము అనెడి మహాసింధువునందు నిమగ్నమగు చున్నది. చిత్తము బహిర్ముఖమైనపుడు సంసార లంపటము కలుగును. అదే అంతర్ముఖమైనపుడు ఆత్మానుభవము లభించును. ఈ లాగున ఐక్య స్థలమునకు చెందిన భక్తుడు విషయానందము యొక్క క్షణికతను ఎరిగి ఆశను వీడి నిర్మలమైన అంతఃకరణము కలవాడగును. శివసామరస్య పూర్వకమైన మహా సింధువు నందు నిమగ్నమగును. ఈ స్థితినే ఐక్య స్థితి అని అందరు.

ఓం శాంతి ః  శాంతి ః  శాంతిః

## విశేషప్రదీపిక:

అంగ స్థలములలో చివరిదైన ఐక్య స్థలమునకు సంబంధించిన పరిచయ మీ ఆశీర్వచనమున యివ్వడమైనది. శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు విషయ సుఖముల యభిలాష వలన సంభవించెడి పరిణామముల విశ్లేషణ నిచ్చిరి.

ఆనంద మనెడిది పలు విధములుగ నుండును. విషయోప భోగము వలన గల్గెడి క్షణికమైన సుఖము నానందముగా నెంచెడి వారు గలరు, సాధకుడు తన ఆనందభక్త్యాచరణ వలన పొందెడి ఆనందమే నిజమైన ఆనందమని యెరుగ వలెను.

ఆనంద భక్తిని చేసెడి భక్తుడు తాను శివుని రక్షణలో యున్నాననెడి భావమును గల్గియుండును. ఈ భద్రతా భావన, ఆనందాను భవ సంపాదనకు మార్గమును సుగమము చేయును. అంగ-సతి, లింగపతి యనెడి భావైక నిష్ఠ వలన యఖండమైన శివానందము లభించు ననెడిది యనుపమానమైనదని చెప్ప బడినది. శివాద్వైత జ్ఞానము వలన సతి-పతుల యభేద జ్ఞానము గల్గును. ఇదియే సత్యము, మిగిలిన దంతయును

మిథ్యయనెడి జ్ఞానైక నిష్ఠ కల్గుచున్నది. వీటి యొక్క ఉమ్మడి ఫలితముగా శరణుడు ఆనంద సముద్రములోన తేలియాడు చుండును. ఇట్టి ఆనందము విషయ భోగముల వలన లభించెడి సుఖము కంటెను భిన్నమైనది ఇంద్రియముల వలన లభించెడి సుఖము మలినముతో కూడికొని యుండుననెడిది గుర్తించవలెను. శివానంద ప్రాప్తిని పొందిన వాడు శరణాంగమును ప్రసాదలింగములో విలీనము చేయునని శ్రీ మగ్గెయ మాయి దేవుని శివాను భవ సూత్రము వలన తెలియు చున్నది. శరణాంగము ఐక్యాంగముగా పరిణమించునని తెలిసి కొనగలరు. ఆనంద భక్తిని ఆచరించకుండ సమరస భక్తిని చేపట్టుట యనెడిది దుస్సాధ్యమైన విషయమనెడిదని గ్రహించ వలెను.

శివాగమములలో ఐక్య స్థలము గురించిన వివరణ గలదు. "శివ జీవోభయ భ్రాంతి రహిత శ్చైక్య ఉచ్యతే" అనెడిది సూక్ష్మాగమములో తెలుపబడినది. శరణ స్థలమున జీవ-బ్రహ్మలు సతీపతులు ఇచ్చట భిన్నత్వము గోచరించును. ఎంతమేర కన్యోన్యానురాగ మభివ్యక్తమై వారిరువురి నొక్కటిగా చేసినను వారు ఇరువురనెడిది. సత్యదూరమైన విషయముగాదు. ఇరువురనెడి భ్రాంతి భగ్నమై శివ-జీవులొక్కటై పోయెడి దశయే ఐక్య స్థలమని గుర్తించ గలరు. శిఖి-కర్పూర న్యాయమున అంగము లింగములో లీనమగుటయే సంభవించును.

శ్రీ పాల్కురికి సోమనాథుడు శరణుడు ఐక్యుడుగా పరిణమించెడి క్రమము నీ క్రింది విధముగా తెలియ జేసిరి.

**అజ్ఞలేని నీడ యనలేని శబ్దంబు**
**రెండులేని మొదలు నిండియున్న**
**యరయు బొరయు లేని యానంద నీరధి**
**దరచు శరణ నెళవు తరమె పొగడ?** (అను భవసారము, ప. 233)

"ఆనంద శరధి మజ్జనాదైక్యము చ్యతే" అనెడి ఆచార్యోక్తిలోని భావమును పై పద్యములో చూడగలము.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 2

## ఐక్య స్థలము

శ్రీ రేణుక భగత్పాదుల వారు ఐక్య స్థలమును గురించి మరికొంత ఉపదేశమును ఈ క్రింది విధముగా ప్రదానము జేసిరి.

**నిర్ధూత మలసంబంధో నిష్కళంక మనోగతః ।**
**శివోహమితి భావేన నిరూడోపి శివైక్యతామ్ః ॥**

**శివేనైక్యం సమాపన్నశ్చిదానందస్వరూపిణా ।**
**న పశ్యతి జగజ్జాలం మాయాకల్పితవైభవమ్ ॥** (సి.శి. 14;5-6)

ఈ తెగున ఐక్య స్థలమును గూర్చి వివరించుచు అంతః కరణమునందలి త్రివిధముల సంబంధములను సంపూర్ణముగా దూరము చేసికొనెడి నిష్కలంకమైన మనసున్న శివయోగి ఎప్పుడు 'శివోహం' అనెడి భావనలో కూడుకొని యుండునో అప్పుడతడు శివైక్యుడని పిలువబడు చున్నాడు. సచ్చిదానంద స్వరూపియైన శివునితో సామరస్యాత్మకమైన ఐక్య స్థితిని పొంది శివయోగి శివదృష్టిని బడసి యుండును. అందువలన అతడు మాయాకల్పితమైన జగత్తునుగానక శివస్వరూపమైన జగత్తునే గాంచుచుండును. ఇట్టి స్థితియే ఐక్యస్థితి యునబడు చున్నది.

మనష్యుని సద్గతి మరియు దుర్గతులకు వారివారి భావనలే కారణములగును. సాంసారిక భావనలతో సతమతమయ్యెడి వాడు సంసారమునందుననే చిక్కుకొనియుండును. 'శివోహమ్' అనెడి భావన కలవాడు సంసారము నుండి విముక్తిని బడసి శివసాయుజ్యమును పొందగలడు. సామాన్యముగా జీవి ఆణవాది మలత్రయములతోడ ఆవరించి బడియుండుట చేత అతడు సంసారమునందుననే ప్రవృత్తిమార్గమున కభిముఖుడై తిరుగుచున్నాడు. తన వ్యాపకమైన స్వరూపమును మరచి పోవుచున్నాడు. తనొక అణువు అనెడి భావనను పొందు చున్నాడు. ఇది ఆణవమలము యొక్క ప్రభావము గురువు వలన ఉపదేశమును పొంది శాస్త్రములు అభ్యసించిన పిదప తాను శివుని కంటెను. భిన్నుడు కాదను భావమును పెంపొందించుకొని క్రమ క్రమముగా 'శివోహం' అనెడి భావనను దాల్చును. అప్పుడు

ఆణవమలము సంపూర్ణముగా వైదొలగి పోవును. ఇట్టి నిష్కళంకుడైన జీవుని మనస్సునందున రాగద్వేషాది పంచక్లేశములుగాని, కామక్రోధాది అరిషడ్వర్గములుగాని చేరజాలవు. అవి మనస్సును కళంకితము చేయలేవు. అందుచేతనే శ్రీ భగవత్పాదులవారు ఐక్య స్థితిలోని భక్తుని నిష్కళంక మనోగతుడని అభివర్ణించెను. మనుజుడు దేనితో తాదాత్మ్య చింతనను చేయుచున్నాడో. ఆ స్వరూపమును దాల్చుచుండును. భ్రమర కీట న్యాయమున కీటకము నిరంతరము భ్రమరధ్యానము చేయుటచే తాను భ్రమరమైనటుల భక్తుడు కూడా శివోహమనెడి భావనతో శివుడుగా మారుచున్నాడు. అయితే జగత్తునందున సామాన్యజీవుల యెడల తాదాత్మ్యము పొందిన యెడల అతడు ఆ జీవుల వలన అనంతమైన దుఃఖములు పొందు చున్నాడు. శివుడు పరమానంద స్వరూపుడైనందున అతనితో తాదాత్మ్య భావన పొందినవాడు ఆనందమునే పొందునుగానీ దుఃఖమును పొందెడి ప్రసక్తియుండదు. అట్టి వారు సర్వత్ర ఆపరశివునినే గాంచుచుందురు గాని జగత్తును గాంచజాలరు.

జాగ్రద వస్థయందును మరియు స్వప్నావస్థయందునను వ్యవహరించెడి ఒక సామాన్యమైన జీవి గాఢనిద్రా వస్థను పొందినపుడు బాహ్య ప్రపంచమును దర్శించ జాలడు. దీనికి గల కారణమేమనగా సాంసారిక విషయముల యందున విహరించెడి అతని మనోబుద్ధులు సుషుప్తి సుఖమునందున మునిగి యుండుటయే. నిద్రానందము యొక్క మత్తులో ఒక సామాన్య జీవి ప్రపంచమునే మరచి పోవుచుండగా శివానందములో మునిగిపోయిన ఐక్య స్థలములోని భక్తుడు ఏ విధముగా తాను ప్రపంచమును చూడగలడు? అందుచేతనే పూజ్యపాదులు 'నపశ్యతి జగజ్జాలం మాయాకల్పిత వైభవమ్' అని వుపదేశించిరి.

ఒక వ్యక్తికి జ్ఞానము గలుగగనే ప్రపంచమునందలి పంచమహాభూతముల యందు మార్పేమీ రాజాలదు. అవన్నియును ఎప్పటివలెనే యుండును. కానీ వచ్చిన మార్పు జ్ఞానియొక్క దృష్టియందు నిలిచియుండును. తత్ఫలితముగా పంచభూతాత్మకమైన ఈ ప్రపంచమును పరమాత్మనిగానే చూచుచున్నాడు. అవి పంచభూతముల వలన కలిగినవనెడి భావనను పొందదు. ఈ కారణము వలననే జ్ఞానులు 'యథాదృష్టిః తథాసృష్టిః' అని అనిరి. శివయోగి సృష్టియొక్క పరివర్తన గురించి ఆలోచించడు. తన దృష్టిని పరివర్తన చేసుకొనెడి విషయమును గూర్చియే ఆలోచించును. దృష్టి పరివర్తన పొందిన పిదప సృష్టి తనంతట తానుగా అతని భావనకు అనుగుణముగా దృగ్గోచరమగును. మనము ఏ అద్దమును మాధ్యమముగా గొని చూతుమో ఆ అద్దము యొక్క వర్ణములో జగత్తు కనిపించును. ఎఱుపు అద్దమును ధరించిన యెడల తెల్లటి వస్తువైనను ఎర్రగనే కనిపించును. అదే విధిన శివయోగి ఈ ప్రపంచమును శివస్వరూపముగా చూచుచున్నాడు. అతనికి వేరేదియును గోచరించదు. 'ఆత్మవత్సర్వభూతాని యఃపశ్యతి స పండితః' అనెడి నుడి ప్రకారము ఐక్య స్థలములోని సాధకుడు సచ్చిదానంద స్వరూపమైన తన ఆత్మను తాను కాంచునటులనే ప్రపంచమును కూడా గాంచుచున్నాడు. విశ్వమంతయును ఆత్మ స్వరూపమైన శివునిగా గాంచుచున్నాడు. మరొక మాటలో చెప్పవలెననిన ఇతని దృష్టిలో జీవునికీ శివునికీ భేదములేదు గనుక శివునకు విశ్వమునకు కూడా భేదముగోచరించదు. విశ్వములో శివుని, శివునిలో విశ్వమును దర్శించగలడు. మాయా ప్రభావము వలన కలిగిన భేద బుద్ధినశించి అభేదబుద్ధి ఏర్పడును. ఈ విషయమున భగవత్పాదుల వారు మరికొంత ఉపదేశమును ఈ క్రింది విధముగా యిచ్చిరి.

**బ్రహ్మాండ బుద్ బుదోద్భేద విజృంభీ తత్త్వవీచిమాన్ ।**
**మాయా సింధుర్లయం యాతి శివైక్యవడవానలే ॥** (సి. శి. 14-7)

దీనిలోని సారాంశమేమనగా బడబాగ్ని యందున సముద్రము విలయమగునటులనే శివైక్య భావన యనెడి భావాగ్నిలో మాయా ప్రపంచము అనెడి సముద్రము విలయమగుచున్నది. బడబానలమనెడిది. ఒక రకమైన అగ్ని అగ్ని యొక్క వివిధ రూపములలో భూతాగ్ని, దివ్యాగ్ని, ఆకరజాగ్ని, జఠరాగ్ని, జ్ఞానాగ్ని, బడబాగ్ని అనెడివి వివిధరకములని శాస్త్రజ్ఞులు తెలుపుదురు. మనము ప్రతి నిత్యము ఉపయోగించెడి యగ్నియే భూతాగ్ని దీనిని భౌతికాగ్ని అని కూడా అందరు. ఆకాశము నందున పిడుగురూపమున నుండెడి అగ్నిని దివ్యాగ్ని అనబడును. దివ్ అనగా ఆకాశమని గ్రహించవలెను. ఆకరము అనగా గని. అందులో పుట్టినది ఆకరజాగ్ని ఇచ్చట లభించెడి సువర్ణమును ఆకరజాగ్ని యని అందురు. జఠరాగ్ని యనగా ఉదరమున నుండెడి అగ్ని. ఇది మనము తినిన ఆహారమును జీర్ణము చేయును. జ్ఞానము వలన ఉత్పన్న మయ్యెడి ప్రకాశమును జ్ఞానాగ్ని యందురు. సముద్రమున ఉత్పన్నమయ్యెడిది బడబాగ్ని.

ఈ సంసార రూపమైన సాగరమునందున ఎవడు మునుగు చున్నాడో అతడు మాయా పాశమునందున చిక్కుకొని పోవుచున్నాడు. ఇచ్చట మాయాపాశమనగా రాగద్వేషములే. ఇవియే జీవాత్మను కట్టివేయును. సుఖమును యిచ్చి జీవాత్మను కట్టివేసెడిది రాగమైతే, దుః

ఖమునిచ్చి ఆ బంధమును బలోపేతము చేయునది. ద్వేషము. సంసార సాగరమును దాటుటకు శివునిచేత కటాక్షింపబడిన మనస్సు లేదా బుద్ధియనెడి పడవకు రాగద్వేషములు పగుళ్ళుగా పరిణమించును. వాటి ముఖముననే సంసార సాగరము మన మనోబుద్ధులను ముంచివేయుచున్నది. ఒకే ఒక రంధ్రముండినను పడవలో నీరు ప్రవేశించునుగదా! రెండు రంధ్రములుండినచో పడవ నిలువ గలుగునే! ఈ రాగద్వేషములనెడి వాటిని మూసివేసి నౌకకు భద్రతచేకూర్చుటకే 'శివోహం' అనెడి భావనను అలవరచుకొనవలెను. ఈ భావనచేత శివదృష్టి ఏర్పడును. 'సర్వం శివమయమ్ జగత్' అనెడి వాస్తవము దృగ్గోచరమగును. ఈ విధముగా మాయా సముద్రము నిశ్శేషమై నిర్గమించును. ఈ కారణము చేత జీవుడు సదా శివధ్యానము నందుననే మునిగి తేలవలెను. మాయా శక్తి యొక్క తిరో ధానము గురించి శ్రీ జగద్గురువుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశమునిచ్చిరి.

**మాయా శక్తితిరోధానాచ్ఛివే భేదవికల్పనా ।**
**ఆత్మ నస్తద్వినాశే తు నాద్వైతాత్కించి దిష్యతే ॥** (సి. శి. 14-8)

ప్రతి యొక్క మనుజుని బుద్ధి మీధ మాయాశక్తి వ్యాపించి యుండుటచేత శివ జీవులయందు భేదభావన ఉత్పన్నమై యుండును. ఆత్మ జ్ఞానముచేత అది తొలగిపోయిన పిదప శివజీవుల భేదము కరగిపోయి వారిరువురి మధ్యన అద్వైత స్థితి ప్రాప్తమగును. శివుని యొక్క ఈ మాయా శక్తి యొక్క ప్రభావము నుండి దూరము కావలెననిన శివునినే శరణు వేడవలెను. శివుని నుండి దూరమైన యెడల ఈ మాయాశక్తిలో చిక్కుకొనక తప్పదు. బెస్తవారు చేపలను పట్టుటకు నదికి పోయి వలను విసురుటకు నీళ్ళలో దిగినపుడు చేపలు భయపడి దూరముగా పరుగెత్తును. వాటిలో నాలుగైదు మాత్రమే అతని కాళ్ళచుట్టు తిరుగాడు చుండును. ఇందులో ఆశ్చర్యకరమైన విషయమేమనగా అతని కాళ్ళ చుట్టూ తిరుగాడెడి చేపలు వలలో చిక్కకుండా, అతని నుండి దూరముగా పరుగెత్తిడి చేపలే వలలో చిక్కుకొనును. ఇదే విధముగా శివుని ధ్యానములోను, శివచింతనలోను మునిగి తేలెడివారు మాయాజాలములో చిక్కజాలరు. శివుని కాదని దూరముగా వెడలి తిరుగాడెడివారే మాయా ప్రపంచములో చిక్కుకొని బాదలకు గురి యగు చుందురు.

శివుని ధ్యానములో మునిగి యుండుటయే శివునికి సమీపముగా నుండుట యనెడిదని గ్రహించ వలెను. తద్విరుద్ధమైనది శివునికి దూరముగా పోవుట. దేవుని ముందు కూర్చొనియు ఎల్లపుడు దేవుని మీదనే మనస్సును లగ్నము చేయుట సాధ్యము కాదని మనందరకీ తెలిసిన విషయమే. శివయోగియైన సాధకుడు త్రికరణ శుద్ధితో శివుని సమీపముననే యుండును. అందుచేత అతనికి శివ సాయుజ్యము పొందుట సుసాధ్యమైన విషయమగును.

వీరశైవ సిద్ధాంతమునందున శివునికి పతియనియును, జీవునికి పశువనియును సంభోదనగలదు. ఈ విధముగా పతిత్వము, పశుత్వరూపములు పరస్పర విరుద్ధమైనవి అయినందున ఈ రెంటికి ఏ విధముగా అద్వైతసిద్ధి సిద్ధించును అనెడి ప్రశ్న తలయెత్త వచ్చును. అద్దానికి శ్రీ జగద్గురువుల వారు ఈ క్రింది విధముగా ఉత్తరమును యిచ్చిరి.

**పశుత్వంచ పతిత్వంచ మాయామోహ వికల్పితమ్ ।**
**తస్మిన్ ప్రళయమాపన్నే కః పశుః కో నువాపతిః ॥** (సి. శి. 14-9)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా సాంసారిక జీవులు మాయామోహములకు గురియైన పిదప, ఆణవ మలము, మాయామలము, కార్మికమలము. అనెడివాటిచే కట్టబడుటచే పశువని పిలువబడుచున్నాడు. జగత్తులో ఆవు, గేదె మొదలగు పశువులు జ్ఞానహీనములై చేశిన తప్పునే మరలమరలచేయుచూ యజమాని దండనకు గురియగుచూ అటునిటూ తిరుగాడుట గాంచగలము. ఇదే విధిన జీవికూడా అజ్ఞానపరవశుడై పశువువలె ప్రవర్తించుచున్నాడు. అనంతమైన దుఃఖమును అనుభవించుచూ జనన మరణ రూపమైన ఈ ప్రపంచములో తిరుగాడు చున్నాడు. ఈ విషయమును స్పష్టముచేసెడి ఈ క్రింది శ్లోకమును గనుడి.

**ఆహారనిద్రా భయమైథునం చ ।**
**సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్ ॥**

**ధర్మోహితేషా మధికో విశేషో ।**
**ధర్మేణ హీనః పశుభిస్సమానః ॥** (సుభాషితము)

మనుష్య జన్మను ధరించి మనుష్యులకు యోగ్యమైన ధర్మములను ఆచరించ కుండిన వానిని మనుజుడని అనగలమే? ఇట్టి ధర్మభ్రష్టులను తోకలేని పశువులని జ్ఞానులను చున్నారు.

మనుష్య జీవులను సంస్కరించుటకే భగవంతుడు వంద సంవత్సరముల ఆయువును ప్రదానము చేశెను. ఈ కాలములో మనోబుద్ధులను పరిశుద్ధము చేసికొని భగవంతుని వలె నిష్కల్మషుడుగా కావలెననునదే భగవంతుని యొక్క ఆశయము. ఇది ఇటులుండగా చాలామంది జనులు ఇట్టి సదవకాశమును వినియోగించుకొనక పశువులవలె ప్రవర్తించుచు ఎప్పటికప్పుడు పతనమగు చున్నారు. ఎప్పుడైతే జీవి సద్గురువు యొక్క కటాక్షము చేత గురువాజ్ఞ ప్రకారము ధర్మాచరణను జేసి మాయా మోహముల నుండి విముక్తి పొందుటకు లింగాంగ సామరస్యమువైపు పయనించునో అప్పుడతని పశుత్వము ధ్వంసమగు చున్నది. అతడు శివత్వమును పొందును. ఈ స్థితిలో అతడు పశుత్వ, శివత్వ భావనకు ప్రాధాన్యత నీయక శివజీవేకత్వ భావనకు ప్రాధాన్యత నిచ్చును. ఈ విధముగా భావించి సాధనను దృఢతరము జేసికొని క్రమ క్రమముగా అతడు శివత్వమును ప్రాప్తించుకొనును. లింగాంగ సామరస్య భావనలో విలీనమగును.

ఓం శాంతి : శాంతి : శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు శరణుడు లింగైక్యు టెట్టులగునో యనెడి వివేచనను చేసిరి. ఇదియెంతో విజ్ఞానదాయకమైన రీతిలో గలదని గుర్తించగలరు.

"శివోఽహమితి భావేన" అనెడిది సాధకునికి సాధనమనెడి దేదో తెలుపు చున్నది. లక్ష్యమనెడి మాయ యనెడి దానిని నష్టపరచవలెను. అయితే, శివ–శక్తుల యే కత్వమును ప్రతిపాదించెడి దశలో మాయ గురించిన చర్చను చేపట్టుటెట్లు? మాయ మిశ్రతత్వములలోనిది. శుద్ధతత్వమైన శివ తత్వమునకు సంబంధించిన దానిలో మాయను గురించిన ప్రసక్తి యుండదు. ఇచ్చట శ్రీ భగవత్పాదుల వారు సూచించిన మాయ "ఊర్ధ్వమాయ" యని గుర్తించ వలెను. ఇతి సాత్వికాహంకారము వలన గల్గును. అద్వితీయముగా నుండెడి బ్రహ్మతత్వము త్రికములుగా విడిపోవుచున్నది.

పతి, పశువు, పాశమనెడివే త్రికములు, త్రిమలములనే పాశమని యందురు. పాశము చేత బంధితుడైన జీవుడు భేదమును గాంచును. శివ–శక్తుల మధ్యనుండెడి భేదభావము ఆణవ మలము వలన గల్గుచున్నది. శివునిలోని 'సర్వజ్ఞోఽహం' అనెడి భావన, శక్తిలో 'అహం సర్వకర్తా' యనెడి భావన వలననే ప్రవృత్తి మార్గమునకు పథమేర్పడు చున్నది. శక్తి స్థానమున నుండెడి ఐక్యాంగుడు శివోఽహం అనెడి భావనను సాధనముగా గొని యూర్ధ్వమాయను ఛేదించును అది నిశ్శేషముగా నశించినప్పుడు ఐక్యాంగము మహాలింగములో లీనమై పోవును. లింగాంగముల మధ్యగల భేద భావము భగ్నమగును. అభేద భావము పొడ చూపును. జీవుడు శివునిలో నైక్యమై యుండెడి దశలో నతడు నిర్వికార నిరంజన మూర్తిగా వెలుగొందును. సాకారుడుగా కన్పించినను నిరాకరునిగా వర్తించును. ఈ స్థితిలో నతడు తన గురించి గాని, జగత్తుగురించి గాని పట్టించి కొనడు. శ్రీ పాల్కురికి సోమనాథుడీ యంశము నెంతో చక్కగా వివరించిరి. అతని లఘుకృతులలోని క్రింది సీసమును గమనించుడి.

**సీ. ధరనవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ యను కర్మ యోగంబు నపహసించి**
**యేదియు లేక జ్ఞానాదేవ మోక్షమన్ జ్ఞాన యోగంబు హాస్యంబు జేసి**
**వదలక 'యాత్మనా' మిదమ గ్రజేత్తను ధ్యానయోగంబును నా శ్రయించి**
**తగనెంచ బుజ్యాయథామను వాయంబను భక్తి యోగంబు చే బాగుగాను.**

**ఆ॥వె॥ ఆ జేవ పొదలు పరమ శివయోగ సుఖ సుధా**
**శరధి మరచి తన్ను జగము మరచి**
**లింగగతి చరించు లింగ లింగైక్యుల**
**జేర్పవయ్య నన్ను చెన్నమల్లు.** ( చెన్నమల్లు సీసములు, ప. 31)

శివం భూయాత్

## ఆశీర్వచనము - 3

## ఐక్య స్థలము

శ్రీ భగవత్పాదుల వారు నైక్య స్థలము గురించి మరికొంత యుపదేశము నిచ్చిరి కనుడి:

**ఘోర సంసార సర్పస్య భేదవల్మీక శాయినః ।**
**బాధకం పరమాద్వైత భావనా పరమౌషధమ్ ॥** (సి. శి. 14:10)

ఈ శ్లోకములోని భావమేమనగా పరమాద్వైత మనెడి దానిని ధరించి భేదభావ మనెడి పుట్టలో నిదురించెడి సంసార మనెడి ఘోర సర్పమును నాశనము చేయవలెను.

పాముకు కాటువేసే గుణముండును సంసారమునకు చేటు చేసెడి గుణముండును పామును చంపిన గాని ప్రాణభయము తొలగదు. సంసారము నశించిన గాని ముముక్షువుకు భవ పాశముల నుండి విముక్తి లభించదు. పాముకు పుట్టరక్షా కవచమై యుండును పుట్టను నాశనము చేయని యెడల పామును చంపుట కష్టసాధ్యమగును. సంసార మనెడి సర్పమునకు భేద భావమే మూలమై యున్నది. భేద భావము నశించకుండగ సంసారము తొలగిపోదు.

సంసారమునగా భవ బంధములు చేత నేర్పడిన వలయమని గ్రహించ గలరు. ఈ బంధములు మమ (నాది) అనెడి మూలాధారము మీద నాధారపడి యుండును. వస్తువుల నుద్దేశించి యిది నాది యనెడి భావన గల్గినప్పుడు నది భవ బంధమగును. భూమి నాది యనెడి భావము వలన నేర్పడిన బంధమే మాతృదేశము, జన్మభూమి, పుట్టినిల్లు స్థిరాస్తి చరాస్తి యిత్యాది భావములకు ఆస్కారమేర్పడును. బంగారు మయమైన లంకారాజ్యము లభించినా, ఇది నాదికాదు, నాది అయోధ్యయని పరుగిడిన రామభద్రుడు భవ బంధములకు చిక్కిన వాడై యుండెనని గ్రహించవలెను. వ్యక్తుల గురించి యేర్పడెడి బంధములు కూడ యిట్టివే, పొన్ను, భూమి, పడతి మరియు మమతలు పరస్పరము పెనవేసికొని యుండెడి బంధములు ఈ బంధము జీవుని యుక్కిరి బిక్కిరి చేయును. ఇది యిట్టులుండగా పడతి మూడు భావములను పొంది భవ బంధములను పటుతరము చేయును. తల్లి, భార్య, కూతురు నెనెడి పడతి రూపములే జీవుని సంసారములో తిరుగాడెడి విధముగా చేయుచున్నవి.

ఇచ్చట గ్రహించ వలసిన విషయమేమనగా ప్రపంచము కంటెను సంసారము భిన్నమైనది. ప్రంపచములోని చరాచర వస్తు సంచయము సృష్టిలోని యంతర్భాగము. ఆ వస్తు సంచయము యెడల జీవుడు పెంచు కొనెడి మమకారము వలననే సంసారమేర్పబడినది. సృష్టిని నాశనము చేయకూడదు. శివ లీలా విలాసమున కదియవశ్యముగా కావలెను. సంసారము జీవి చేత కల్పితమైనది. నివృత్తి మార్గమున కవరోధముగా నిలుచును. అందుచేత నాశనము చేయదగినది. లేని యెడల జీవికి మిశ్ర మరియు శుద్ధ తత్త్వముల వైపు గమనించుట కష్టతరమగును.

భేద భావమే సంసార నాశనము నకవరోధమై నిలుచును. భేదములకు నాస్కారము గల్గించెడివి మూడంశములని గ్రహించ వలెను. అవి జడము, జీవము మరియు దైవము. ఈ మూడింట మధ్యగల పరస్పర బేదముల వలన జడ-జీవి, జడ-ఈశ్వర మరియు జీవేశ్వర భేదములు వాటి గురించిన భావములు గల్గును. అదే విధిన జడ-జడములకును, జీవ-జీవములకును గల భేదములు దృగ్గోచరమగును. ఈ భేదము లేవియును లేవు అనెడిదే జ్ఞానము అన్నియును శివుడే యనెడిదే శివ జ్ఞానము.

మిశ్రతత్త్వములలోని అవిద్యయే యిట్టి భేదభావమునకు కారణ భూతమగు చున్నది. ప్రాణలింగ స్థలమును ప్రవేశించిన భక్తుడు శివ యోగము ద్వార జీవ-శివ యోగమునకు కృషి చేయును. క్రమ క్రమముగా ఐక్య స్థలమున ప్రవేశించిన వానికి శివైక్యమే లక్ష్యమై యుండుటచే భేదములను తొలగించి కొనవలెను. భేద భావము నశించనిది జీవుడు-శివుడు కాలేడు.

"నాది" అనెడి భావన స్థానములో మనది అనెడి భావన పెంపొందించి కొనుట చేత భవ బంధములు సడలే అవకాశము కలదు. వ్యష్టి మమకారములో భేదముండును. సమిష్టి మమకారమున భేదము నశించును. జీవి-జీవి గల భేద భావము నశించును. ఇది అందరికీ సాధ్యమయ్యెడిది కాదు. సమిష్టి మమకారమును పెంపొందించి కొనిన వారు మహాత్ములగుదురు. విశ్వైక కుటుంబ భావన

గలవాడు సుస్థిరమైన కీర్తిని బడయును ఇట్టి వారిని భేద భావమంటదు. ఇట్టివారు ననాది కాలము నుండియును వచ్చు చుండెడిది వాస్తవమని చరిత్ర వలన తెలియు చున్నది.

ఇచ్చట యొక సందేహము గలుగ వచ్చును. అసంఖ్యాకమైన జీవులలో నైక్యతను గాంచుటెటుల సాధ్యమగును. "పిండే పిండే మతిర్భిన్నా" అనెడి లోకోక్తి ప్రకారము జీవులలో ససంఖ్యాకమైన భేదములు గలవు. శారీరక, బౌద్ధిక, మానసిక ఇంద్రియ సంబంధిత భేదములు కోకొల్లలు వీటిని విల్లక్ష్యము చేసి యైక్యతా భావమును పెంపొందించుట ఎటుల సాధ్యమగును.

శ్రీ భగవత్పాదులు కారణ శరీరముల గురించి ప్రస్తావించిరని గుర్తించ వలెను. దీనిని ఆత్మతో పోల్చి కొన వచ్చును. అందరి ఆత్మలలో నేకత్వము గలదు. భిన్నత్వము గోచరించదు. పలు విధములగు పుష్పముల నేకము చేయునది దారము. పూల దండకది మూలాధారము, పువ్వులలో భేదముండును. దారమొక్కటే.

ఈ భావము దాల్చినప్పుడు శరీరములను నాశనము చేసి ఐక్యతను సాధించవలెననెడి భావన కాస్కారము లేదు. ఘటములలోని భేదమును తొలగించుటకు ఘటములను పగుల గొట్టవలసిన పని లేదు. వాటిలో నుండెడి ఆకాశములో ఐక్యతను గాంచిన యెడల జడ-జడములలో నుండెడి భేద భావము నశించును. జడములలో కూడ శివుని గాంచగల్గుదుము. అదే విధిన జీవులలో బహిర్గతముగా భేదములు కన్పట్టినా, అంతర్గతముగా భేదములుండవని తెలియును. జీవులలో నుండెడి శివుడొక్కడే కదా! ఇట్టి భావన మున్ముందు జీవుడే శివుడు అనెడి భావన యేర్పడుటకై పునాదిగా నిలుచును.

భేదములు, భేద భావములు మాయ చేత కల్పితములు. వీటిని వీడి "సర్వం శివ మయం జగత్" అనెడి భావన దాల్చిన యెడల భేద భావములు భగ్నమగును. సంసారము నశించి పోవును. వివేకము దయించి ఆత్మ పరమాత్మలలో భేదములేదనే భావన గల్గును.

ఓం శాంతి : శాంతి : శాంతిః

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వచనమున శ్రీ జగద్గురువు చంద్రశేఖర శివాచార్యుల వారు భేద దృష్టి యనెడి ప్రమాద భూయిష్టమైన దానిని జయించుటకు వలయు నుపాయముల గురించి యానతినిచ్చిరి.

భేద భావము వలననే సంసార బంధము లేర్పడు చున్నవని చెప్పబడినది. యెంత వరకు భేద భావము ధీశక్తిని తన నియంత్రణలో నుంచి కొనునో అంత వరకు జీవుడు కర్మఠుడై నిషిద్ధాతి కర్మలను జేయుచు సంసారిగా నిలిచి పోవుననెడిది గ్రాహ్యమైన విషయమే “నాస్తితేషు జాతి విద్యారూపకుల ధన క్రియాది భేదః” అనెడిది నారదుని భక్తి సూత్రము (72 వ సూత్రము) భక్తుడీ భేద భావములను గల్గియుండ దనెడిదే దీనిలోని భావము ఈ భేద భావము స్థూల శరీరమునకు సంబంధించినవి. సూక్ష్మ శరీరములోని యవిద్య చేత కల్పింప బడినవి. స్థూల సూక్ష్మ శరీరములు నష్టమైపోయి కారణ శరీరము మాత్రమే నిలిచి యుండెడి దశలో భేద భావ చింతన రాదు. అయితే శ్రీ భగవత్పాదుల వారు సూచించెడి భేదము ఊర్ధ్వమాయ వలన కల్గెడిదని తెలిసికొనవలెను. సాత్వికాహంకారము వలన గల్గిన భేద భావము వలననే పర శివుడు శివ-శక్తులుగా విడిపోయెననియను, శక్తి విశిష్టుడైన శివుడు జగత్తు యొక్క సృష్టికి కారణభూతుడయ్యె ననెడిది ప్రవృత్తి మార్గమున గల్గెడి విధి విధానము నివృత్తి క్రమములో భేద భావము సడలి షట్ త్రింషత్ తత్త్వములు పరబ్రహ్మ తత్త్వములో లీనమగును.

శ్రీ బసవన్న వారు "లింగము సోకిన సుఖములోన యంబుధిలోని వడగళ్ళయటు భిన్న భావము నరయక యున్నానయ్యా" యని తమ యనుభవమును వివరించిరి (వ. సం. 941).

ఇచ్చట గ్రహించ వలసినదేమనగా ఐక్యుడు శివ-జీవ భేదమును వీడి శివునితోన భేదమును సాధించును ఇట్టి స్థితిలో శివాద్వైత భావన సాధనా పథముగు చున్నది. సమరస భక్తిలోని శివాద్వైత భావనను గల్గియుండవలెననెడిదే తెలియదగిన విషయము.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 4
## ఐక్య స్థలము

పూజ్య పాదులు ఐక్య స్థలమును గురించి ఇంకను ఈ విధముగ ఉపదేశము నిచ్చిరి.

భేద బుద్ధి సముత్పన్న-మహా సంసార సాగరం ।
అ ద్వైత బుద్ధి పోతేన, సముత్తరతిదే శకః ॥ (సి. శి. 14-11) కః

సాగరము దాట వలెననిన పడవను ఏ విధముగ ఆశ్రయించ వలసి యుండునో ఆదే విదిన ఈ భేదరూపియగు సంసారమనెడి సాగరము దాటుటకు శివాద్వైత భావనా రూపమైన పడవను దేశి కోత్తముడు ఆశ్రయించును.

ఈ కనిపించెడి ప్రపంచమునందున అనేక విధములైన భేద భావములు మనము గాంచు చున్నాము. శాస్త్ర కారులు ఈ భేదమును జీవ జీవుల భేదము జీవ జడముల భేదము జడ ఈశ్వరుల భేదము జీవ ఈశ్వరుల భేదము జడ జడముల భేదము అని అయిదు విధములుగా నిరూపించినారు, ఈ భేద రూపముననున్నదే సంసారము పరమేశ్వరుడు మాత్రము అభేద రూపుడుగానె నున్నాడు. అతని యందు ఏ ప్రకారమైన భేదమును చేయుటకు వీలుకాదు. పరిచ్ఛిన్న వస్తువుల యందు భేదము చేయవచ్చును. కాని అపరిచ్ఛిన్న వస్తువు యందు భేదము చేయుట దుస్సాధ్యమైన విషయము కొన్ని కొన్ని సందర్భాలలో ఆఖండములగు పంచ భూతములనె ఖండ ఖండములుగ చేయజాలము. అట్టియెడ పరమాత్ముని యందున ఖండభావన చేయుట సాధ్యమైయ్యెడి విషయము కాదు. అన్నదమ్ములు పిత్రార్జితములైన భూమి మొదలగు అస్తిని పంచుకొనునప్పుడు ఆఖండమైన భూమిని ముక్కలు చేయుటకు సాధ్యముకాదు. భూమి మీదనే హద్దులను పాతుకొని విభజించుకొందురు. ఇంతటి విభావనలు ఏన్నో సార్లు జరుగు చుండును, అంతే కాదు ఖండ ఖండములుగా అయిన భూమి గాంచి ఏంతో మంది జనులు అభిమానమును పెంచుకొని సంతోషపడుటగాంచ గలము. యిది అంతయు వారి మానసిక భ్రమనెకాని వాస్తవము కాదు.

"భూమ్యో హసంతి మమ భూమిరితి బ్రువాణమ్." యని ఒక సుభాషిత కారుడు అనెను. దీని భావమేమనగా ఇద్దరు అన్నదమ్ములు భూమిని పంచుకొని ఇది నీ భూమి అది నా భూమి అనెడి దానిని గాంచి భూమి ఫక్కున నవ్వినది.

పరమాత్ముని సంకల్పము చేత పుట్టిన భూమి వంటి పంచభూతములనే ముక్కలు ముక్కలుగా చేయుటకు సాధ్యము కానపుడు సర్వకారణుడు ఆయిన పరమాత్ముని యందు బిన్న తనుగాంచుట ఏవ్వరిచే సాధ్యము కాదు.

సంసారమనగ కనిపించెడి జగత్తుకాదు. జగత్తులోని వివిధ వస్తువుల పైన లేదా వ్యక్తుల పైన మనము పెంచుకొనిన మమకారమే సంసారము అగుచున్నది. ఈ సంసారము నిన్న, మొన్నటిది కాదు అనాటి కాలము నుండి కొనసాగుచు వచ్చు చున్నది.

మనజుడు తన దైనటువంటి నిత్య వ్యవహారముల యందు తన పేరును వుపయోగించక వ్యవహరించ వచ్చును కాని నేను నాది అనెడి వాటిని వుపయోగించకుండ వుండజాలడు. మీరు ఎవ్వరి ఇంటికిగాని వెళ్ళినప్పుడు ఆ యింటి తలుపులు మూసివుండిన యెడ ఆ తలుపులు తట్టి నీవచ్చిన సంగతిని తెలుపుదువు అప్పుడు గృహమందున్న వారు మీరువ్వరు అన్ని ప్రశ్నింతురు అప్పుడు మీరు నేను అని అనునప్పుడు వారు నీ ధ్వనిని గుర్తించినప్పుడు తలుపులు తీయుదురు, లేని యెడల నీవంటే ఎవ్వరు అని అడుగుదురు, అప్పుడు నీవు నీ పేరును చెప్పుదువు ఈ వ్యవహారమును చూసిన పిదప మనము మన తల్లి, దండ్రులు పెట్టిన పేరును ఉపయోగింపక ముందుననే నేను అనెడి మాట వుపయోగింతుము నేను అనెడి ఈ సర్వనామ పదము వుపయోగించకుండ వుండుట చాల కష్టమైన పని మన పేరు మనము పుట్టిన పిదప కొన్ని రోజుల తర్వాత పెట్టబడు చున్నది. కాని మనము ఎన్ని జన్మలేత్తినమో అన్ని జన్మలలోను మనము నేను అనె పదము వుపయోగించితిమి అట్టి దానిని మార్చుట సాధ్యమగును నేను అనే పదము ఆహంకారమును చూపించును నాది అనునది మమకారమును చూపించును. మన మొక దీపమును వెలిగించినప్పుడు అదీపపు జ్వాల ఊర్ధ్వ ముఖముగ మండుచు తన చుట్టు ప్రక్కల వున్న ప్రదేశమును వెలుతురుతో నింపి వేయును, ఇచ్చట దీపపు కొడ ఆహంకారమును చూచించును. అయితే అది ఇచ్చెడి వెలుతురు మమకారమును చూచించును.

ఒక వ్యక్తి ఆహంకారానికి ప్రతీక అయితే అతని భూమి, ఇల్లు, సామగ్రి, భార్య, పిల్లలు మమకారానికి ప్రతీకగనుందురు. దీపమునకు ప్రకాశమునకు ఏట్టి సంబందముండునో అట్టి సంబంధమే అహంకార మమకారములకు వుండును అని అందరు గ్రహించ వలెను. వ్యక్తి యొక్క అహంకారమనెడి జ్యోతి చిరకాలము నుండి వెలుగుచునే యున్నది. ఇక ముందుకూడ వెలుగును మమకారము కూడ నట్టిదే కాని మమకారము ప్రదర్శించెడి వస్తువు మారవచ్చును. యిల్లు, పొలము మార్చెడి వారెందరో కలరు ఈ మమకారము మరియు అహంకారముల వలన ఎల్లప్పుడు దుఃఖమే గలుగు చున్నది. ఈ దుఃఖమునకు కారణము మనుజుడు పెంపొందించుకొనెడి భేద బుద్ధియె భేద బుద్ధిని వీడి అద్వైత భావమును వహించిన ఎడల ఈ దుఃఖములు దూరమగును యిట్టి అద్వైత స్థితియే ఈ ఐక్య స్థలమున బోధించబడినది సర్వమును ఈశ్వరుడు అనునదే శివాద్వైతమగు చున్నది. ఈ విషయమును భగవత్‌పాదుల వారు ఈ క్రింది విధముగా మరికొంత జ్ఞానభోద జేసిరి.

**అజ్ఞాన తిమిరుద్రిక్తా కామ రక్షః క్రియాకరీ ।**
**సంసార కాలరాత్రి స్తునశ్యే దద్వైత భానునా ॥**

అజ్ఞాన రూపమైన చీకటి వలన గలిగినట్టి కామ వాంఛ వ్యవహార రూపమైన రాక్ష సకృత్యమును చేసెడి సంసారమనెడి కాళరాత్రి అద్వైతమనె సూర్యుడు వుదయించగానే చీకటి తొలిగిపోవును. వుదయమున మనుజుడు ఆకలి దప్పులకును, రాత్రిన వ్యసనమునకును గురియైనచో నట్టివారు శివాద్వైత తత్త్వమును తెలిసికొనజాలరు. ఈ విషయమును వివరించెడి అక్క మహాదేవిగారి వచనమును గనుడి:

**హగలు నాల్కు జావ అశనక్కె కుదివరు**
**ఇరుళు నాల్కు జావ వ్యసనక్కె కుదివరు**
**ఆగస నీరొళగిర్దు బాయారి సత్తంతె**
**తమ్మొళ గిర్ద మహాఘన వన్ను అరియదే**
**కెటరయ్య చెన్న మల్లికార్జున ।**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది

**పగలు నాల్గు జాములు ఆకలికి కుందుదురు**
**రాత్రిళ్ళు నాల్గు జాములు వ్యసనముకు కుందుదురు**
**చాకలి నీటిలోనే యుండి నోరారి చచ్చినటు**
**తమలోనున్న మహాఘనమును అరయక**
**చెడిరయ్యా ! చెన్న మల్లికార్జున !**

ఈ వచనమున అశన వ్యసనములకు ఎంత మేరకు పాత్రకలదో తెలియచేయడమైనది. నీటిలో చిక్కి తనను తానెరుగ జాలక జీవిచెడిపోవు చున్నాడు. తనలోనున్న మహాఘనమైన పరశివతత్త్వమును తెలియ లేకున్నాడు. ఏ విధిన చాకలి నీటిలోనే వుండిననూ, దాహము వేసి చచ్చి పోయిన యటుల జీవుడు పతనమగు చున్నాడు. చాకలికి నీరును త్రాగి ప్రాణమును దక్కించుకొన వలెనన్న ఆలోచన ఏవిధిన వచ్చుట లేదో అదే విధిన జీవునికి శివుని గురించి తెలిసికొనవలెననెడి ఆలోచన వచ్చుట లేదు.

సాంసారిక జీవులు కాళరాత్రిలో నిద్రలో మునిగి పోయి, విషయాభిముఖలగు చున్నారు. దీనికి విరుద్ధముగా శివయోగులు వారి సాధన యొక్క బలము చేత నిద్రా మోహము నుండి విముక్తులై జాగరూకులై యుందురు. గీతాకారుడు ఈ విధముగా తెలిపెను. "యానిశాసర్వ భూతానాం తస్యాం జాగర్తి సంయమి" సర్వసామాన్య జీవులు ఏ ఏ విషయములలో నిద్రించు చుందురో ఆయా విషయములలో యోగులు మేల్కొని యుందురని గీతాకారుని భావము. జగద్గురు రేణుక భగవత్పాదులు సంసారమును చీకటి రాత్రిగా వర్ణించిరి. ఇచ్చట చీకటి యనగా అజ్ఞానమని భావించవలెను. అజ్ఞానము చేత ఆవృతమైన జీవి యొక్క అంతరంగమునందున వాసనారూపమైన రాక్షసి ఘోరమైన నృత్యము చేయుచుండును. దీనికి తృప్తి యనెడిది వుండదు. ఈ విషయమున భర్తృ హరి "భోగాన భుక్తాః వయమేవ భుక్తాః" అని చెప్పెను. విషయములను నేను భుజించుట లేదు. విషయములే నన్ను భుజించు చున్నవి. అని భర్తృ హరి వాక్కులోని భావము.

యయాతి అనెడి రాజు ఆయుష్యమున్నంత వరకు విషయములను భోగించి తృప్తిని పొందక తన కొడుకు యొక్క ఆయుష్షును బడసి విషయముల వలననుభవించి చివరకు అసంతృప్తినే మిగుల్చుకొనెను. ఈ విషయమును తెలిపెడి ఈ శ్లోకమును గనుడి :

**న జాతు కామః కామానాం ఉపభోగేన శామ్యతి ।**
**హవిషా కృష్ణ వర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే ॥**

ఈ రీతిగా తన అనుభవమును యయాతి వ్యక్తపరచెను ధగధగమనెడి అగ్ని గుండమునందు సమిధలను మరియు హవిస్సును వేసి ఆ అగ్నిని ఏ విధముగా ఆర్పలేమో అదే విధముగా వాంఛిత విషయములను భోగించి ఆయా వాంఛలను తగ్గించుకొనలేము. వీటియొక్క ఉపశమనమునకు వివేకమే సాధనమై యుండును. రాత్రి వుండునంతవరకే రాక్షసుల యొక్క ప్రభావము వుండునటుల అజ్ఞానాంధకార రూపమైన రాత్రి యున్నంత వరకే కామాదుల యొక్క ప్రభావము వుండును. శివజ్ఞానమనెడి సూర్యోదయమైనప్పుడు రాత్రి పగలగును. రాక్షసులు పలాయనము చేయుదురు.

ఈ శివాద్వైత రూపమైన సూర్యోదయమగుటకై 'శివోహం' అనెడి భావనను నిరంతరముగా పెంపొందించు కొనవలెను. ఈ భావన యొక్క ఫలితముగా శివయోగి ఈ జగత్తును శివస్వరూపముగా గాంచు చున్నాడు. తద్వారా అజ్ఞానమనెడి చీకటిని భగ్నము చేయుచున్నాడు. శ్రీ భగవత్పాదులవారు శివాద్వైత భావననే ముక్తికి సోపానమని యనిరి.

**తస్యా దద్వైత భావస్య సదృశో నాస్తియోగినామ్ ।**
**ఉపాయో ఘోరసంసారమహాతాపనివృత్తయే ॥** (సి. శి. 14-13)

ఈ రీతిగా శ్రీ భగవత్పాదులవారు భయానకమైన సంసారము అనెడి తాపమును తగ్గించు కొనుటకు శివాద్వైత మనెడి భావన కంటెను మించినది లేదని తెలియజేసిరి. ఇచ్చట ఘోరమనగా భయానకమైనది యని అర్థము ఇది ప్రతి ఒక్కరిని భయమునకు గురిచేయును. ఎచ్చటెచ్చట ద్వైత భావన యుండునో అచ్చటచ్చట సంసారమనెడి భయము వుండియే తీరును. అందుచేతనే శ్రుతి యందున ద్వితీయాద్వై భయం భవతి అనెడిది వుపదేశింపబడినది శివయోగి యనెడి వాడు శివాద్వైత భావనను అనుసంధానము చేసికొని ద్వైతభావనను వీడును. తద్వారా భయము నుండి విముక్తిని పొందును. ఈ విధముగా సాధకుడు భయము నుండి తనకు తానే విముక్తిని గాంచు చున్నాడు. ఈ విషయమున భగవత్పాదుల వారు మరికొంత యుపదేశమును ఈ క్రింది విధముగా నిచ్చెను.

**అద్వైత భావనా జాతం క్షణమాత్రేపి యత్సుఖమ్ ।**
**తత్సుఖమ్ కోటి వర్షేణ ప్రాప్యతేనైవ భోగిభిః ॥** (సి. శి. 14-14)

ఒక్క క్షణకాలమైనను అద్వైత భావనను దాల్చిన యెడల దాని వలన కలిగెడి ఏ ఆనందమైతే కలదో అంతటి ఆనందము రాజ భోగమును అనుభవించెడి భోగులు ఒకకోటి సంవత్సరముల కాలముననుపొందజాలరు. ఈ విధముగా శివాద్వైత భావన వలన జనించెడి ఆనందము యొక్క మత్తును తెలియజేసిరి. శివయోగులు విషయ సంబంధితమైన భావనవైపు పరుగుతీయక శివాద్వైత భావన వలన సంపూర్ణమైన శాంతిని పొందుచున్నాడు. ఈ విషయమున మరికొన్ని విషయములను ఈ శ్లోకము ద్వారా తెలియ జేసిరి.

**చిత్త వృత్తి సమాలీన జగతః శివయోగినః ।**
**శివానంద పరిస్ఫూర్తి ర్ముక్తిరిత్యభిధీయతే ॥** (సి. శి. 14-15)

ఈ శ్లోకములోని తాత్పర్యమేమనగా తనమనోవృత్తి యందున సకలజగత్తును అణగించుకొనిన శివయోగికి శివాద్వైత భావన వలన గలిగెడి ఆనందాభివ్యక్తమే ముక్తి యని పిలువబడుచున్నది. ఏ ద్వైత భావనయు లేకుండగా ఏకైక స్థితిలో ఇది ప్రాప్తమగును గాన దీనిని ఐక్యస్థితి యందురు. దీనిని ఐక్య స్థలమని గూడా అందురు. ఇట్టి స్థితిని మీరెల్లరూ పొందవలెనని కోరడమైనది.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

# విశేషప్రదీపిక

శ్రీ భగవత్ పాదుల వారిచ్చిన వివిధోప మానముల గురించి వివరణ నిచ్చుచు శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు జీవన్ముక్తిని సాధించిన వాని సల్లక్షణములను వివరించిరి.

సంసార మనెడి దానికి అహం-కార మమకారములే మూలమనెడి శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారి వాక్కులు చిరస్మరణీయములు. నాది యనెడిది యున్నంత వరకు సంసారముండును. ఘట సర్పమై కాటువేయును. ప్రగాఢమైనట్టి యంధకార బంధురమైన కాళ రాత్రి సాధకుని కాముకుని చేయును. జ్ఞానోదయమైన స్థితిలో దీనిని వీడదలచిన వారికిది మహా సముద్రమై తరించుటకు వీలులేని దగుచున్నది. ఇట్టి స్థితి సామాన్యుడెదుర్కొనెడిదని గ్రహించ గలరు.

"లింగ నిష్ఠాది భావేన ధ్వస్త పాపనిబంధనః" అనెడి ఆచార్యోక్తి (సి. శి. 11:2) ప్రకారము సాధకుడు కర్మబంధముల నుండి విముక్తి పొందిన సాధకుడు భవమున పడెడి వాడు. ఈ స్థలమున సాధకుడు మహాలింగము నుపాసనా మూర్తిగా పరిగ్రహించి పరిపూర్ణమైన నిష్ఠతో సాధన చేయు చుండుననెడి దవిస్మరణీయమైన యంశము. "సర్వకర్మముక్తః శివభావితాత్మా" యనెడి రేణుకోక్తి (సి. శి. 11:75) ప్రకారముగా సర్వబంధములు తొలిగిపోగా శివ స్వరూడగు చున్నాడు. శివైక్య స్థలమును ప్రవేశించెడి సందర్భమున "శివాత్మ బోధైక రతః స్థిరాశయః" యనెడి సిద్ధాంతోక్తి (సి.శి. 13:37) ప్రకారముగా శివ-జీవ భేద విజ్ఞానమున వైశారద్యము నొంది లింగాంగ సామరస్య మనెడి లక్ష్యమును సాధించే సదాశయమును గల్గి యుండును.

శివాత్మ బోధైక రతునికి సంసారము వలన భయముండదు. ఇట్టి భవ భయ రాహిత్యమును సాధింప నెంచెడి వాడు శివోఽహ మనెడి తలంపును పెంచికొన వలసిన యవశ్యకత యెంతైనా కలదు. ఈ భావన అహం బ్రహ్మాఽస్మి యనెడి కేవలాద్వైత భావన కంటెను భిన్నమైనదని గ్రహించ గలరు. కేవలాద్వైతము యొక్క విశిష్ట లక్షణమును శివ తత్త్వసార మీ క్రింది విధముగా వివరించినది.

**ఆరాధ్యం దారాధకు**
**దారాధక మనగ లేని - యద్వైతదురా**
**చారకృత సర్వ శూన్యా**
**కారస్థితి నేమి సేయగావచ్చు శివా!** (శివతత్త్వ సారము, ప. 50)

కేవలాద్వైతమున నారాధనకు నాస్కారముండదు. ఆరాధన లేని చోట భక్తి యుండునే? శివాద్వైత మట్లుగాదు. ఐక్య స్థలమున ఆరాధకుడంగుడు. ఆరాధ్యము మహాలింగము. సమరస భక్తితో భవుని సమరస భావమనెడి భావ పుష్పములతో పూజించెడి నిష్ఠ గల్గిన స్థలమిది.

ఆచార్యుల వారు ప్రతిపాదించిన శివోఽహము శివాద్వైతమునకు సంబంధము గల్గినది. శివ జీవులకు భేదము లేదనెడీ భావముతో శివునర్చించి శివకారుణ్యమును పొందెడి సాధనా స్థలమిది. శివ కరుణ వలన శివుడయ్యెడి స్థితిని సాధకుడు పొందునని గ్రహించ గలరు.

శివ స్వరూపమైన జగత్తును చిత్తమున లయము చేసికొనెడి లింగైక్యుడు జగజ్జాలమును వీక్షించక సచ్చిదానందమున నోలలాడుచు సమరస సుఖము ననుభవించును. ఇదియే ముక్తి పదమని తెలిసికొనగలరు. జీవుడు సకాయుడుగా నున్నప్పుడే యిది ప్రాప్తించును. ఈ కారణమున నియ్యది జీవన్ముక్తి పదమని గ్రహించ గలరు.

శివం భూయాత్

# ఆశీర్వచనము - 1

# ఆచార సంపత్తి స్థలము

శివాద్వైత భావన చేత భేద బుద్ధి నష్టమై శివస్వరూపముతో సామరస్య భావన పొందునదే ఐక్య స్థితియని తెలిసికొంటిమి. ఈ స్థలములోని తదుపరి స్థలమే ఆచార సంపత్తి స్థలము ఇందులో జ్ఞాని యొక్క ఆచారవిచారములవైపు వివేచన కొనసాగును. జ్ఞానము పొందిన పిదప ప్రారబ్ధ కర్మము అవశిష్టమై యుండును. అది పరిసమాప్తి అగునంతవరకు జ్ఞాని తనదైనందిక క్రియలను కొనసాగించు

చుండవలెను. జ్ఞానము చేత సంచిత, మరయు ఆగామి కర్మలు నష్టమైనను ప్రారబ్ధ కర్మ మాత్రము నిలిచియే యుండును. జ్ఞానులైనను, అజ్ఞానులైనను దీనిననుభవించియే తీరవలెను. చేతినుండి విసరిన రాయి దాని వేగమున్నంత వరకు ముందుకు పోవుచునే యుండును. ప్రారబ్ధ కర్మ వున్నంత వరకు దేహయాత్ర కూడా కొనసాగును. ఈ కారణము వలన శివజ్ఞాన సంపన్నుడైన శివయోగి తన జీవనావధియందున ఎట్టి ఆచార విచారములను కలిగియుండవలెనో తెలిసికొన వలసి యున్నది. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమునిచ్చిరి.

**శివైక భావనా పన్న శివత్వో దేహ వానపి ।**
**దేశికోహిన లిప్యేత స్వాచారైః సూతకాదిభిః ॥** (సి. శి. 14-16)

శివజ్ఞాన సంపన్నుడైన శివయోగి శివస్వరూపుడే అయివుండినందున అతడు దేహధారి యైననూ దేహాభిమానమును కలిగియుండడు. అందుచేత అతడు తన చేత చేయబడెడి శుభాశుభకర్మల చేత లిప్తుడగుట లేదు. సూర్యుడు మరియు అగ్ని అన్నిరసములను పీల్చినను ఏ విధముగా అలిప్తముగా నుండునో అదే విధముగా శివయోగియు సర్వ విషయములన నుభవించిననూ నిర్లిప్తుడై యుండును. అనెడిది శివరహస్య గ్రంథమందు ప్రతిపాదించబడినది మనము వసియించెడి భూమి కర్మభూమిగా పిలువబడుచున్నది. ఇచ్చట నివసించెడివాడు ఏదో యొక్క కర్మను చేయుచునే యుండవలయును దేహమున్నంత వరకును కర్మలను చేయుట తప్పనిసరి. అజ్ఞాని చేసెడి కర్మవిధికంటెను జ్ఞాని చేసెడి కర్మ పద్ధతి విలక్షణముగా నుండును. అజ్ఞాని దేహము, కరణము మరియు కర్మల అభిమాన భావమును పెంచుకొని అంటుకొను చున్నది. అయితే జ్ఞాని అభిమానుల వహించకుండ కర్తృత్వ భావనను వీడి కర్మలను ఆచరించుట చేత ఆకర్మ ఫలము అతనికి అంటుట లేదు. నాటకము నందున రాముని పాత్రను అభినయము చేసెడి ఒక కళాకారుడు ప్రేక్షకుల ముందు తన కుశల అభినయమును వ్యక్తపరచెడి సందర్భమున సుఖ దుఃఖములను ప్రదర్శించుచూ ప్రేక్షకులను సుఖ దుఃఖములకు గురి చేయుచున్నాడు. తాను మాత్రము తన అంతరంగము నందున ఈ సుఖ దుఃఖములను అనుభవించుట లేదు. అనగా అతను నిర్లిప్త భావముతోనే అభినయమును చేయు చున్నాడు. అటులనే జ్ఞాని అయిన వాడు కర్తృత్వ భావన చేత కర్మను ఆచరించక నటుని వలె భావమును వహించి కర్మలను చేయును. అందుచేత ఆ కర్మల నుండి దూరముగానే యుండు చున్నాడు. ఇట్టి నిస్సంగత్వము చేత కర్మ ఫలము అతనికి అంటుట లేదు. ఈ విధముగా కర్మలు చేయుచునే కర్మ ఫలము నుండి తప్పించు కొనెడి వాడిని కుశల కర్మి అని యందురు. ఇచ్చట నతడు తన కౌశల్యముతో కర్మ ఫలమును దూరముగా నెట్టి వేయుచున్నాడు. గీతాకారుడు దీనినే యోగమని యనెను యోగః కర్మ సుకౌశలమ్ అనెడిది గీతోక్తి, జలము నందు జనించియు తామర దాని నుండి అలిప్తమై యుండును. ఇదే విధిన శివయోగి కూడా ప్రపంచమునందు ఉండియును దానికి అంటుకొనకొండ చరించు చుండును. కొబ్బరి కాయలోని కొబ్బరి యెండిన పిదప బయటి నుండెడి చిప్పనుండి విడివడి వేరుగా ఏ విధముగా అగునో అదే విధమున జ్ఞాని దేహ కారణాదుల మధ్య వుండియును వాటిని అంటకుండా వుండును. అజ్ఞాని అయిన వాడిని పచ్చి కొబ్బరి కాయతో పోల్చవచ్చును. ఇందులో కొబ్బరి టెంకను అంటుకొనియే యుండును. తద్వారా తాను చేసెడి శుభాశుభకర్మల యొక్క ఫలితమును అనుభవించు చున్నాడు.

సంకల్ప పూర్వకముగా చేయబడెడి కర్మలు మాత్రమే ఫల ప్రదములగును. తద్విరుద్ధముగా చేసెడివి ఫలదాయకములు కాజాలవు. అజ్ఞాని సంకల్ప పూర్వకముగా కర్మలను చేసిన యెడల జ్ఞాని సంకల్పరహితముగా కర్మలను చేయును. ఇచ్చట సంకల్ప రహితమనగా కర్మ ఫలములను ఆశించకుండా కర్మలను చేయునదే సంకల్ప రహితమైన కర్మయగును. ఈ కారణమున జ్ఞానికి కర్మ ఫలము అంటదు.

కనిపించెడి విశ్వమే ఒక రంగ భూమి ఈ ప్రపంచము యొక్క సృష్టిని చేసిన పరమాత్ముడూ ఒక నటుడే. ఈ కారణముననే శివుని నటరాజుగా పిలుచు చున్నారు. విశ్వము యొక్క ఈ వ్యవహార మంతయు అతని యొక్క లీలానాటకము ఇంత చేశిననూ నేను చేసితిని అనెడి అభిమాన అహంకారములు అతనిలో లేశ మాత్రము కూడా వుండవు. ఈ కారణముననే అతడు ఆనందరూపుడై యున్నాడు. పరమాత్ముని యొక్క విశాలమైన నాటకమునందు తానొక పాత్రను ధరియించి అభినయించెడి అల్పజీవి అనేక అభిమాన అహంకారములచే వ్యాప్తినిగొని సదాదుఃఖితుడై యుండును. నేను చేశితిని, నేను చేశితిని, అని చూపించెడి అభిమానమే అతని దుఃఖమునకు మూలకారణము మగుచున్నది. ప్రచార ప్రసారములు లేనిదే కార్యమును చేసిడి పద్ధతి జీవునికి తెలియదు. అతడు ఏ చిట్టి పొట్టి చిల్లర పనిని చేశినా దానిని ప్రచారము చేయుటకు ఎంతో శక్తిని వ్యయపరుచును. ప్రచారము చేయుకుండా కార్యమును చేసెడి కౌశల్యమును పెంపొందించు కొనుట ప్రతి ఒక్కరి కర్తవ్యమై యున్నది. ఇట్టి గుణమును ప్రకృతి నుండియు పరమాత్ముని నుండియు నేర్చుకొనవలెను. ప్రకృతి

మౌనముగా నుండియే అంతను సాధించు చున్నది. భూమియందు విత్తనమును నాటిన యప్పుడు అది కొంత కాలము పిదప మొలకెత్తి పెరిగి పెద్దగై పుష్పఫలములను మరియు నీడను జనుల కిచ్చుచున్నది. నేను యివన్నియును చేయు చున్నాననెడి భావన ఆ చెట్టుకు లేదు. ఈ విధిన మనకు చెప్పుట లేదు. సువిశాలమైన ప్రపంచమును రచించిన పరమాత్ముడు మౌనముగానే యుండును. కాని సామాన్య మానవుడు గోరంతలు చేసి కొండంతలుగా చేశిన యటుల చెప్పును. శివయోగి అట్టి వాడు కాదు. మానసిక వృత్తుల యందు మౌనమును సాధించి ప్రకృతి పరమాత్ములవలె నిర్లిప్తుడై యుండును. మనుజునికి మౌనము యొక్క మర్మమే అర్థముకాదు. అతడు ఎప్పుడును. అరచుచూ, కేకలు వేయుచూ, ఏడ్చుచూ, నవ్వుచూ, పిచ్చిపిచ్చిగా మాట్లాడుచూ వుండును. సగటు మనిషికి అవసరమున్ననూ, అవసరములేకున్ననూ అప్రస్తుత ప్రసంగమును చేశెడి అభిలాష వుండును. వినెడి వాడు దొరికిన యెడల ఏమైననూ చెప్పగలడు. ఎంతసేపైనను చెప్పగలడు. కాని అందరూ చెప్పుట కిష్టపడెడు వారేగాని వినుటకు సిద్ధపడెడు వారు తక్కువే, మనిషి నిదురించినపుడు కూడా మౌనముగా నుండడు. నిదురలో కూడా బడబడమని కలవరించుచుండును. ఇట్టి వ్యక్తి మౌనిగా అగుట యెట్లు? అనెడిది గొప్ప ప్రశ్న.

మనుజుడు సుఖిగా నుండవలెననిన ప్రపంచములో నుండియు లేనటులగా మెలగవలెను. మనుజుని నోటిలో నుండెడి నాలుక నూనె, నెయ్యి వంటి జిగట పదార్థములను తినిననూ వాటినుండి అంటి కొనకూండా నిర్లిప్తముగా నుండును. జ్ఞానియైన వాడు నాలుకవలె వేటినీ తనకు అంటనీయడు ప్రతి వ్యక్తి దేహమును, మనస్సును, బుద్ధి నిర్మలముగా పెట్టుకొనవలెనని మహాపురుషులు అందరు. ఒకానొక మహాను భావుడు మరణ సమయమున పరమాత్ముని వుద్దేశించి నీవిచ్చిన మానోబుద్ధులను నీవెట్టి స్థితిలో నిచ్చితివో అదే స్థితిలో నీకు తిరిగి యిచ్చివేయు చున్నాను అని అనెను. ఇది అందరికీ సాధ్యమగునే? మన జీవన కాలములో తమ మన, బుద్ధులను చెరచి ఎన్నో అమంగళ కార్యములను చేయుచూ తిరిగెడి మనుజులకు వీటిని నిర్మలముగా నుంచుకొనుట కష్ట సాధ్యమైన విషయము. ఈ కథ వినుడు.

ఒక వూరునందున ఇద్దరు ఆడపిల్లలు అన్యోన్య భావమున స్నేహితురాళ్ళుగా కాలమును గడుపుచుండిరి. ఒకసారి సమీపములో నున్న వూరిలో జరిగెడి జాతరకు పోయెడి ప్రసంగమురాగా వారిరువురిలో నొకరికి క్రొత్త వస్త్రములు లేకుండెను. అప్పుడు ఆమె స్నేహితురాలు తన దగ్గరనున్న క్రొత్త బట్టలలో నుండి ఒక క్రొత్త పట్టు చీరను ఆమెకిచ్చి జాతరకు వెంట తీసుకొని పోయెను. జాతరలోని గడబిడ యందున ఒకరు మరొకరి నుండి విడిపోయిరి. స్నేహితురాలిచ్చిన క్రొత్త పట్టు చీరను కట్టిన ఆ ఆడపిల్ల జాతరంతటనూ తిరుగుచూ వెదికి వెదికి ఇంటికి వెళ్ళునప్పుడు తన దగ్గర గల కొంత సొమ్ముతో మిఠాయిని కొనుటకై అంగడిలోనికి వెళ్ళెను. అచ్చట జిలేబీ, చెగోడి, బజ్జి మొదలగు వాటిని కొని చేతి సంచిలేనందు వలన చీరకొంగులోనే అన్నింటిని వేసుకొని ఇంటికి వచ్చెను. ఇంటికి రాగానే ఆ చీరనిండా జిగట, నూనె అంటుకొని యుండెను. స్నేహితురాలికి ఆ చీరను తిరిగియివ్వగా ఆ చీర యొక్క స్థితినిగని ఆ ఆడపిల్ల మరొక్కసారి ఈమెకు క్రొత్త చీర నివ్వకూడదని మనసులో నిర్ణయమునకు వచ్చెను. ఇచ్చినందులకు పశ్చాత్తాపపడెను. వస్త్రము యొక్క మహాత్త్వమును ఎరుగని స్థితిలో ఆ ఆడపిల్ల వస్త్రమును మలినము చేసిన యటులనే పరమాత్ముడు మనకిచ్చిన దేహము, మనస్సు, బుద్ధిలను సంసార భోగములకుపయోగించి వాటిని మలినపరచి వాటిని త్యజించునపుడు మలినసహితముగనే త్యజించుచున్నాము. చీరను మలిన పరచిన ఆడపిల్లకు, దేహాదులను మలినపరచిన వ్యక్తికి పోలిక సుస్పష్టముగా నున్నది. శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదులవారు శివ భావ సంపన్నుడైన దేశికోత్తమునికి కర్మలు అంటవని తెలిపెను. పంచసూతకములు కూడా అతనిని అంటవని ఉపదేశమును యిచ్చిరి. ధర్మశాస్త్రము ప్రకారము సూతకములుండునని తెలియజేయబడినది. ఇది ఐదు రకములనియును. ఇవి వచ్చినప్పుడు దైవపూజ యిత్యాదులను చేయకూడదనియునూ నియమము ఒకటి కలదు. సామాన్య వ్యక్తికి యివి నిషిద్ధములైననూ, శివయోగికి ఎట్టి సూతకములుండవని శ్రీ భగవత్పాదులవారు ఆదేశమునిచ్చిరి. సామాన్యులకొరకై వుద్దేశింపబడిన శాస్త్ర నియమములు శివాద్వైత జ్ఞానులకు అన్వయించవు. శివజ్ఞాని యొక్క చిత్తము శివసామరస్యము యొక్క ఆనందానుభూతిలో నిమగ్నమై యుండుటచేత అతను ఏవిధిన ప్రవర్తించవలెనెడి నియమములను విధించలేము. కృష్ణుడు భోగిగా యున్ననూ, శుకుడు త్యాగిగా యున్నను. జనకుడు రాజుగా యున్ననూ వీరిని శాస్త్రకారులు జ్ఞానులుగానే గుర్తించిరి. చూచుటకు వారి బాహ్యవ్యవహారములు భిన్నభిన్నములుగా కన్పించిననూ అంతరంగములోని స్థితి ఒకే విధిననున్నది. అందుచేత జ్ఞాని బాహ్యా వ్యవహారముల యందు ఈ విధముగనే వుండవలెననెడి నిబంధనలు ఏమియూలేవని అందరూ అంగీకరింతురు. ఈ కారణము వలన శివయోగికి శుభాశుభములు కాని సూతకములుగాని యుండవని శ్రీ భగవత్పాదులవారు తమ వుపదేశములో తెలియజేశిరి.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

## విశేషప్రదీపిక

లింగైక్యుని యాచార సంపత్తి గురించిన మౌలికాంశము లీయాశీర్వచనము నందున వివరింప బడినవి.

ఆచార నిరతియనెడిది ప్రాథమికముగా స్థూల శరీరమునకు సంబంధించిన యంశము "ఉక్తాఖిలాచాపరాయణో భక్తో హి మహేశ్వరము పైతి" యనెడిది భక్త స్థలమునకు చెందినట్టి ఆచార్యుల వారియుపదేశము. (సి. శి. 9:94)

"లింగాచార స్సదాచార శ్శివాచార స్తదైవచ । గణాచారో భృత్యాచారః పంచాచారాః ప్రకీర్తిత" అనెడిది వీరశైవాచార ప్రదీపికలో చెప్పబడిన యంశము.

త్యాగాంగమును యిష్ట లింగములోను, భోగాంగమును ప్రాణలింగములోను సమరస భావముతో లీనము చేసి భావలింగోపాసనా నిరతుడైనట్టి యైక్యాంగుని కాచరించ వలసిన దేమియునుండదు. శరణ స్థలమును దాటి యైక్య స్థలమున సాధన చేసెడి సాధకునికి నాచారము లుండవనెడిదే జగద్గురూక్తిలోని భావమని గ్రహించగలరు. ఈ విషయమున యవగాహనను పటుతరము చేసికొనుట కొరకు మహానుభావియగు శ్రీ బసవేశ్వరుల వారి క్రింది వచనము పయుక్తముగా నున్నది.

సత్తుహుట్టువ నల్లసందేహి సూతకియల్ల ఆకార నిరాకార నోడయ్యా! కాయవంచక నల్ల, జీవ వంచక నల్ల నిరంతర సహజ నోడయ్యా! శంకయిల్లద మహామహిమను నోడయ్యా! కూడల సంగన శరణ నుపమాతీత నోడయ్యా! (శ్రీ బసవన్న వ. సం. 940)

దీని తెలుగు రూపము గనుడి:

**చచ్చి పుట్టువాడు కాడు**
**సందేహి సూతకి కాడు.**
**ఆకారము నిరాకారము చూడయ్యా !**
**కాయవంచకుడు కాడు,**
**జీవ వంచకుడు కాడు**
**నిరంతరము సహజము చూడయ్యా !**
**శంకలేని మహా మహిముడు చూడయ్యా !**
**కూడల సంగని శరణుడు ఉపమాతీతుడు చూడయ్యా !**
**సూతకాదులు లౌకికాచారమునకు చెందినట్టివి**

"పరమ భక్తి రతులు లౌకికాచారాదూరులై చరింతురనియును, సాధకుడిట్టి వారి సాంగత్యమున తన యను భావమును సుసంపన్నము చేసి కొన వలయు ననియును" (శ్రీ సోమనాథుని చెన్న మల్లు) సీసము (సం. 17) వలన తెలియు చున్నది.

## ఆశీర్వచనము - 2

## ఆచార సంపత్తి స్థలము

ఆచార సంపత్తిని గురించి శ్రీ భగవత్పాదుల వారు మరికొంత ఉపదేశమును ఈ క్రింది విధముగా ప్రదానము చేశిరి.

**శివాద్వైత పరిజ్ఞానే స్థితే సతిమన స్వినామ్ ।**
**కర్మణా కిం ను భావ్యమ్ స్యాద కృతేన కృతేన కృతేనవా ॥** (సి. శి. 14-17)

ఈ ఉపదేశములోని భావమేమనగా శివునితో సమరస భావమును పొందియుండెడి శివయోగి శివస్వరూపుడై యుండుట చేత ఇంతటి మనస్విచేత ఏ ప్రకారమైన శుభా శుభకర్మలు గలిగిననూ వాటి యొక్క ఫలములు అతనిని అంటవు. అందుచేతనే శ్రీ కృష్ణుడు మహాభారత యుద్ధమును ఇంతటి మనస్విచేత ఏ ప్రకారమైన శుభాశుభ కర్మలు గలిగిననూ వాటి యొక్క ఫలములు అతనిని ఆత్మజ్ఞానిగా

చేశి యుద్ధమునుచేయించెనని చెప్పబడినది. జ్ఞాని యనెడువాడు అహంకారమమకారముక్తుడై యుండును. అట్టి స్థితిలో అతడు చేశెడి కర్మల యొక్క ఫలితము అతనిని అంటదు. ఏదో ఒక వ్యక్తి లేదా స్థానము విషయమున మన మనస్సునందున వుండెడి అభిమానమే మన సుఖదుఃఖములకు కారణమగుచున్నది. సామాన్య జీవులు యిట్టి యభిమానము వహించి యుండుటచే ఎన్నో విపరీతమైన కష్టములకు గురియగుచున్నాడు. ఈ విషయమును వివరించెడి కథ ఒకటి కలదు.

ఒకసారి ఒక వైద్యుని వద్దకు ఒక వ్యాపారి వచ్చెను. అతడు రక్తపుపోటు చేత బాధపడు చుండెను. చికిత్సను చేయమని వైద్యుని కోరెను. వైద్యుడు ఎంత ఉపచారమును చేశిననూ, రోగి ఎన్ని యౌషధములు సేవించిననూ రక్తపుపోటు తగ్గలేదు. కొన్ని దినముల పిదప అదే రోగముతో బాధపడెడి యింకొక వ్యాపారి వైద్యుని వద్దకు వచ్చెను. వైద్యుడు అతనికిని ఔషధోపచారములు చేసెను. అతనికి కూడా ఔషధములు గుణ మివ్వలేదు. రక్తపుపోటు తగ్గలేదు.

ఈ విషయము గురించి ఆలోచించిన వైద్యుడు వారిరువురితోనూ ప్రత్యేకముగా సంప్రదించెను. వారి మానసిక ఒత్తిడికి గలకారణమేమిటని అడిగెను. వారివో నొకడు ఈ విధిన బదులిచ్చెను. నాకిరాణా అంగడికెదురుగా మరొకని కిరాణా అంగడి వున్నది. అతని అంగడి యందుగిరాకీ పెరుగుటను చూడగనే నా మనస్సు దానిని సహించ జాలదు. ఈ విధముగా నేను ప్రతి దినము ఈ విధమైన మానసిక ఒత్తిడికి గురియగు చున్నాను. వేరొక వ్యాపారియు నిదే తెరగున వుత్తరము నిచ్చెను. వైద్యుడు యిరువురి రోగములకు కారణమేమిటనెడిది. తెలుసుకొనెను. వీరికి ఔషధములెంత కాలమిచ్చిననూ ప్రయోజనముండదని యెరిగి వారిరువురిని పిలిపించుకొని మీరిరువురూ మీమీ అంగళ్ళలో కూర్చునకుండగా ఒకరి అంగడిలో ఒకరు ఒక వారము వరకు కూర్చొని అప్పుడు నా వద్దకు వచ్చి పరీక్షించుకొనుడని చెప్పెను. వారావిధిననే చేశిరి. వారి రక్తపు పోటు సహజముగనే తగ్గి ఆరోగ్యవంతుని రక్తపుపోటు స్థితికి వచ్చెను. రోగ నివారణ జరిగెను. ఇరువురూ పరస్పరము ఒకరి అంగడిలో ఒకరు కూర్చొన్నపుడు తమసొంత అంగళ్ళలో పెరిగెడి సందడిని చూశి సంతుష్టులై మానసిక వత్తిడి నుండి విముక్తిని పొందిరి. ఇచ్చట యిరువురు వ్యాపారుల రక్తపుపోటుకు నాది అనెడి అభిమానమే కారణమగు చున్నదని స్పష్టమైనది. సామాన్య మానవుని మనస్సులో కూడా యిట్టి భావనలే యుండును. పూజ్యపాదుల వారు మనస్వియైన శివయోగుల స్థితిని యిచ్చట ప్రస్తావించి నారు. ప్రశస్తమైన మనస్సున్నవాడిని మనస్వి యందురు. మనస్సువలె దృష్టియుండును. దృష్టివలె సృష్టి కన్పట్టును ఎవరి మనస్సునందున యెట్టుల యుండునో వానికి సృష్టికూడా అటులనే కన్పట్టును. మనస్వి యొక్క మనస్సు పరిశుద్ధమై యుండును. వారి దృష్టియూ పరిపూతమై యుండును. వారి దృష్టి పరిపూతమై యుండును. వారి దృష్టి శివదృష్టి యగు చున్నది. వారు దేనిని చూశిననూ శివ రూపముగనే గాంచుదురు. సృష్టిలోని ఏ వస్తువు పైనను వారికి అభిమాన ముండదు. అందుచేత సఖదుఃఖములు, పుణ్యపాపములు వారిని అంటవు. కర్మఫలముల గురించెయే ఈ సుఖ దుఃఖములుగానీ, పుణ్యపాపములుగానీ కలుగుచున్నవి. మనసే వీటికి మూలాధారము. ఆత్మ మాత్రము ఈ వ్యవహారములన్నింటికీ సాక్షీభూతమై యుండును. శివయోగియు ఆత్మవలెనే సాక్షీభూతుడై దేహాదుల యొక్క అభిమానమును వీడి కర్తృ, భోక్త అనెడి భావములను వీడియుండును అందుచేత అతడు చేశిన కర్మముల ఫలము అతనిని అంటదు. జ్ఞానియైన వాడు సమదర్శియై యుండుననెడిది శాస్త్రోక్తి ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశమునిచ్చిరి.

**శంభోరేకత్వభావేన సర్వత్ర సమదర్శనః ।**
**కుర్వన్న పి మహా కర్మ న తత్ఫల మవాప్నుయాత్ ॥** (సి. శి. 14-18)

ఈ ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా శివాద్వైత జ్ఞాన సంపన్నుడగు శివయోగి మహాలింగముతో సామ రస్యమును దాల్చుకొని యుండును. అతని దృష్టి యందున మహాలింగము తప్ప మరొక్కటి యేదియునూ కనిపించదు. ఇది మన్ను. ఇది బంగారము అనెడి భేదదృష్టి వలన అతనికి కర్మఫలములు అంటువు. ప్రపంచమును సమముగా చేయుట యనెడిది అందరికీ సాధ్యమగు విషయముకాదు. శ్రీ నిజగుణ శివయోగిగారు ఈ ప్రపంచమును విషమ సంసారమనెను. విషమత యనెడిది సంసారము యొక్క భూషణమై యున్నది. జ్ఞానులు దీనిని సమదృష్టితో చూశినప్పుడు విషమత వెనుదిరిగి పోవును. శివుడు సమదృష్టి కలవాడని చెప్పబడు చున్నది. శివయోగియు శివుని వలె సమభావము కలిగియున్నందున శివుని వలెనే శాంతుడుగను, ఆనంద సంపన్నునిగను వున్నాడు. అయితే సమదృష్టిని అలవరచుకొనుటలో కొంత యిబ్బంది గలదు. ఈ ప్రపంచములో దేహేంద్రియాదుల విషయములో అసమభావమే యెక్కువగా యుండును.

సమదృష్టిని పెంపొందించు కొనదలచినవాడు దేహముల యెడగాని, యింద్రియముల గురించిగాని చింతించడు. అందరిలో నుండెడి ఆత్మ ఒక విధముగనే నుండును గనుక అతడు ఆత్మను దృష్టి యందుంచుకొని సమభావముతో చూచును. ఈ సమభావనను గురించి గీతాకారుడు ఈ క్రింది విధముగా చెప్పెను.

**విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణేగవిహస్తినీ ।**
**శునిచైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥**

దీనిలోని భావమేమనగా వేదాధ్యయనము చేశిన వినయాది సద్గుణములు కలిగిన బ్రాహ్మణుని యందుగాని, ఆవు, కుక్క, ఏనుగు మరియు చండాలుని యందుగాని, జ్ఞానులు భేద భావమును చూపరు. సమదర్శనముతో తిలకింతురు. ఇచ్చట సమదర్శనమనగా కుక్క, ఏనుగు, బ్రాహ్మణుడు, చండాలుడు వీరందరు సమానులు అని అనుట కాదు. వీరియందుగల ఆత్మ సమానమైనదని తెలిసి కొనవలెను. భావమునందుననే అద్వైతమును భావించ వలెనే కాని క్రియయందు అద్వైతమును ఆచరించ కూడదు. ఒకవేళ క్రియాద్వైతమును చేశినయెడల అదిలోక విరుద్ధమగును. తనకొడుకు మరియు తన యింటి యందుండెడి కుక్కలోని ఆత్మ ఒకటియైనను తాను తినునప్పుడు కొడుకును పిలుచుకొని తినునేకాని కుక్క ప్రక్కన కూర్చుని తినడు కదా! కుక్కను పుత్రుని వలె ప్రేమించవచ్చునే కాని పుత్రునివలె వ్యవహరించుట కూడదు. ఈ విధముగా వ్యవహారముల యందున అద్వైతమును పాటించిన యెడల గొప్పగొప్ప అనర్థములే వచ్చును. ఈ విషయమున ఒక కథ కలదు.

ఒక గురువు గారు అందరి యందున ఆత్మ ఒకటిదే యనెడిది బోధించిన విషయమును మననము చేశి కొనుచు శిష్యుడు తన యింటికి వెడలుచుండెను. దారి యందున మదోన్మత్తమైన ఏనుగు వచ్చుచుండెను. ఏనుగు మీద కూర్చున్న మావటి ఏనుగుకు మదమెక్కినది. దూరముగా వెళ్ళుడి అనుచూ కేకలు వేయుచుండెను. మావటియొక్క ధ్వనిని విని ఆవీధిలోని వారెల్లరూ జాగ్రత్త వహించిరి. గురువు నుండి అద్వైతబోధను పొందిన శిష్యుడు మాత్రము ప్రక్కకు జరుగక ఏనుగునకు ఎదురుగా వచ్చుచుండెను. అతని మనస్సులో నుండెడి భావమేమనగా వీధిలో భయపడి తప్పుకొను వారి భయమునకు ఆధారము లేదు. మావటి అజ్ఞాని దూరము వెడలుమను చున్నాడు. ఏనుగులోని ఆత్మనాలోని ఆత్మ ఒకటే కనుక దాని గురించి నేను చింతించవలసిన అవసరములేదు ఈ విధముగా ఆలోచించుచూ ఏనుగును సమీపించెను. మదమెక్కిన ఏనుగు మట్టిబుర్రయన దగిన శిష్యునిని పైకెత్తి దూరముగా విసిరివేశెను. కాళ్ళుచేతులు విరిగిపోయెను. శిష్యుని యొక్క యాతనను గురించి వినిన గురువు శిష్యుని సమీపించి ఏమైనది? అని యడిగెను. అప్పుడతడు ఓ గురుదేవా! మీ ఉపదేశము యొక్క ఫలమిది యని బదులు పలికెను. మీరే ఉపదేశమునిచ్చుచూ వివిధ జంతువులలో నుండెడి ఆత్మకు మనలోని ఆత్మకు భేధములేదని చెప్పితిరి గదా! దానినే మననము చేశికొనుచూ వచ్చుచుంటిని. ఈ అనర్థము జరిగినదని చెప్పెను. అప్పుడా గురువు ఓయీ శిష్యా! నీవు నా వుపదేశమును సరిగా వినలేదు. సరిగా అర్థము చేసికొనలేదు. మావటి వానిలోని ఆత్మ, నీ ఆత్మ ఒకటి కావా? అతడు చేశిన హెచ్చరికను నిరాదరణకు గురిచేశితివి కదా! నీకు ఏనుగులోని ఆత్మనే కనిపించెను. కాని మావటి వానిలోని ఆత్మ కన్పించలేదు కదా! ఇదంతయు నీ అవగాహన లోపము వల్ల వచ్చినదేకానీ మరేకారణము వల్లనూ వచ్చినది కాదు అనిచెప్పెను.

ఈ కారణము వలన అందరిలోని ఆత్మలు ఒకటే యైననూ తనకు యోగ్యులనిపించిన వారితోనే సమరసము చేయవలెను. అందరితో సమరసము చేయుట కూడనిపని అందరి యెడల భావాద్వైతము వహించి యోగ్యుల యెడల క్రియాద్వైతము వహించ వలెను.

భావములో అద్వైతము శోభించిననూ వ్యవహారములలో విషమతకే దారితీయును. ఆకారణముననే ఇరువురు వ్యక్తులను ఒకటిచేయునప్పుడు వారియందలి వయస్సు, జ్ఞానము మరియు అధికారముల యెడల తగు సావధానత వహించ వలెను. వధూవరుల విషయములలో స్వల్పమైన విషమత వుండినను వివాహము చేతురు. ఎక్కువ విషమతను విస్మరించరు. వరుని వయసు, విద్య, అధికారము మొదలగు వాటిలో వధువు తక్కువగా నుండవలెను. అప్పుడే వారి కాపురము అన్యోన్యముగా నుండును. వారి అధికారములో సమానత్వముండిన యెడల వారి జీవనమునందున ఒక అగాధము ఏర్పడు నవకాశము కలదు. ఇద్దరూ వివేక సంపన్నులై యుండిన యెడల యెట్టి యిబ్బంది యుండదు. సర్వత్ర యిది సంభవించదు. ప్రపంచ వ్యవహారములు సరియైనరీతిగా సాగవలెననిన విషమత

వుండవలెననియే భగవంతుడు విషమతను సృష్టించెను. రైలుపట్టాలు సమానముగా నున్నంతమేరకే పనులు సక్రమముగా జరుగును. వాటి మధ్య అంతరము తగ్గినప్పుడు అవిరెండునూ కూడుకొనునది చూడగలము. అదే విధిన ఇరువురు జీవుల యొక్క సమమైన బ్రతుకు కొరకై వారియొక్క విషమతలు పరస్పర పూరకములని తెలిసికొనవలెను. సృష్టి విషమముగా నుండిననూ దృష్టి సమముగా నుండవలెననెడిదే భగవత్పాదుల యొక్క ఆశయమై యున్నది. విషమత యందుననే సమతనుగాంచునదే సమదృష్టి. ప్రపంచమునందున విషమత వుండిననూ సమదృష్టి యుండిన యెడల ప్రపంచములో విషమత గోచరించదు. ఇట్టి సమదృష్టి కలిగిన శివ యోగిని ఏకర్మ బంధములు బంధించవు. అతడు లౌకిక దృష్టితో కర్మలు చేశినట్లు కనిపించిననూ అంతరంగమునందున అతడేమియును చేయుట లేదు. అకర్తృడుగను. అభోక్తుడుగను వుండును. జీవనమున శివానందము ననుభవించును. ఇదియే ఐక్య స్థలమునందలి ఆచార సంపత్తియని గ్రహించ వలెను.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్య మహా స్వామి గారు కర్మ యనెడి దనావశ్యమైనదని తేల్చి చెప్పిరి.

కర్మవాదమున కెంతో ప్రాముఖ్యత నిచ్చెడి వారు కర్మనాచరించుట తప్పని సరియని వాదించుటను గాంచగలము. కర్మను చేయుటే తమ ధర్మమని యెంచెడి వారును గలరు. వీరిని గురించి మార్గం పెద్ద వీరప్ప కవి యీ క్రింది విధముగా తెలియ చెప్పిరి.

**ఉ. కర్మల సేతనే ననుచు కర్మఠుడై పలు కర్మలెన్నియో**
**మర్మమెరుంగకన్ సలుపు మాయువు జీవుని రీతిగాంచుడీ!**
**ధర్మమెరుంగ కన్ తిరుగు తానొక బుద్ధి విహీనజీవియై!**
**కర్మములేల యీశ్వరుని కైవడి యుండెడి కర్మ జిత్తుకున్.** (అముద్రితము)

సమరస భక్తికి నెలవైన యైక్య స్థలమున సాధకుడు శివ-జీవుల యెడ సమదృష్టి గల్గియుండును.

శివుడే తానని భావించెడి బుద్ధిని గల్గి లింగాంగ సామరస్యమును సాధించెడి దిశలో పయనించెడి వాడు కర్మాచరణ యెడల నిరాసక్తిని ప్రదర్శించును వాటిని తిరస్కరించి తిరుగులేని పథమున పయనించి కృతార్థడగును ఈ విషయము నన్నమయ్య యీ క్రింది విధముగా తెలిపిరి.

**వరుసంబైకొని వచ్చు కర్మములమున్వారించి మాయామల**
**జ్వరముల్దాల్చి యపార ఘోరతర సంసారాబ్ధి లంఘించి భీ**
**కర సూక్ష్మాంగ విచిత్ర కంచుకము వీకంబుచ్చి పోవైచి తా,**
**బరమవ్యోమము సొచ్చు నీయచల సద్భక్తుండు సర్వేశ్వరా !** (సర్వేశ్వర శతకము పే. 141)

పద్యము 112. పావని వారి ప్రచురణ

ఈ పద్యములోని "కర్మలను వారించి" యనెడిది గమనార్హమైనదని గ్రహించ గలరు.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 3

## ఆచార సంపత్తి స్థలము

ఇంతకు క్రిందటి స్థలమున శ్రీ భగవత్పాదులవారు సమదృష్టి గురించి ఆశీర్వచనమునిచ్చిరి. ఆ విషయముననే భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

**సుకృతే దుష్కృతే వాపి బ్రాహ్మణో వాం త్యజ్యోపివా ।**
**శివైకభావయుక్తానాం సదృశో భవతి ధృవమ్ ॥** (సి. శి. 14-19)

సమదృష్టి సంపన్నుడైన శివయోగికి పాపియేకాని పుణ్యాతుదేకాని బ్రాహ్మణుదేకాని అంత్యజుదేకాని ఒకే విధముగా కన్పట్టుదురు. వీరందరినీ అతడు సమభావముతో చూచును.

మనుష్యులలో నుండెడి కొన్ని గుణములు దృష్టికి అగోచరమై యుండును. యాత్రకొరకై పోయిన యొక్క మనుజుడు తన కేశములను ఖండించుకొని గుండుతో వచ్చిన యెడల అతను చెప్పిననూ లేక చెప్పక పోయిననూ చూచిన వారికి అతడు తిరుపతికో లేదా ప్రయాగకో పోయి వచ్చెనను భావము కలుగును. శరీరములో కలిగెడి ప్రవర్తననుగని అతడు యాత్రకు పోయివచ్చినది గుర్తించిన యటులనే బాహ్యలక్షణములను గాంచి జ్ఞానిని గుర్తించుట సాధ్యమయ్యెడి విషయముకాదు. అయితే ఒక వ్యక్తి యొక్క ఆచార విచారములు మరియు అతని దినచర్యను గమనించిన యెడల అతడు జ్ఞానియా కాదా? అనెడిది అనుమాన ప్రమాణముల ద్వారా గుర్తించ వచ్చును. మన యెరుక మన క్రియల చేత అభివ్యక్తమగును. మనము చేసెడి క్రియలను బట్టి మనకెంత మేరకు జ్ఞానముగలదో యనెడిది జగత్తుకు తెలుపుటకు సాధ్యమగును. ఈ జగత్తులో పుణ్యవంతులు, పాపాత్ములు కలిసియే యుందురు. పుణ్యపాపములు అంతఃకరణ ధర్మములని యింతకు క్రితమే తెలిసికొంటిమి. శరీరము పుణ్య పాపముల సంపాదనకు సాధనము మరియు వాటి ఫలములైన సుఖదుః ఖములను అనుభవించెడి మాధ్యమమై యున్నది. అందుచేతనే శరీరమునకు భోగాయతన అను పేరుగలదు. పుణ్యపాపము లాచరించుటకు మరియు వానిఫలముల ననుభవించుటకు మనస్సే ముఖ్యమైనది. కర్తృత్వము, భోక్తృత్వము అనెడి భావనలు మనస్సు యొక్క ధర్మములైయున్నవి. ఒక వ్యక్తి పుణ్యాత్ముడుగాను, పాపాత్ముడుగాను పిలువబడుటకు అతని మనస్సు కారణమగు చున్నది. ఈ విషయమును అందరూ యెరుగ వలెను. మనస్సును మినహాయించి ఆత్మయనెడి దృష్టితో చూచిన యెడల ఈ భేదములు పొడుచూపవు. ఆత్మకు జాతి భేదములు కూడా వుండవు. బ్రాహ్మణుని ఆత్మయైనను. అంత్యజుని ఆత్మయైనను ఒకే విధిననుండును. అదే విధిన పుణ్యాత్ముల పాపాత్ముల ఆత్మలు ఒక్కటే.

మనము కట్టెడి ఇల్లు మఠము మందిరము మరియు పర్ణశాలలు రూపములు భిన్న భిన్నములుగా నుండవచ్చును. వాటిలో హెచ్చు తగ్గులు వుండవచ్చును. కొన్ని విలువైనవి కూడా వుండవచ్చును. అయితే వీటిలో నుండెడి ఆకాశము మాత్రము సమానముగానే యుండును. కట్టడములో నుండెడి భేదము ఆకాశములో గాంచ జాలము. ఈ కారణము వలననే పరమాత్మనికి పోలిక చెప్పునపుడు పంచమహాభూతముల యందలి అతిసూక్ష్మమైన ఆకాశము పోలికనే చెప్పుదురు. "ఆకాశవత్ సర్వగతశ్చనిత్యః" అనెడిది శ్రుతివాక్యము ఆకాశము శుద్ధము, నిర్లిప్తముగా వుండునటులనే ఆత్మ, పరమాత్మలు కూడా అదే విధిన నుండును. అశుద్ధి, అపవిత్రతలు శరీర మనో బుద్ధులలో నుండ వచ్చును. ఆత్మ యందు అని వుండవు. ఈ విధముగా ఆత్మ జ్ఞాని దృష్టియందు పుణ్యాత్ములు, పాపాత్ములు అనెడి భేదభావము వుండదని శ్రీ భగవత్పాదుల వారు సెలవిచ్చిరి. వర్ణాశ్రమముల ధర్మమునందును ఇట్టి భావమే యుండునని తెలియజేయుచూ ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

**వర్ణాశ్రమ సదా చారై ర్జ్ఞానినాం కిం ప్రయోజనమ్ ।**
**లౌకికస్తు సదాచారః ఫలాభావ్యేపి భావ్యతే ॥** (సి.శి. 14-20)

భారతీయ సంస్కృతి యందున వర్ణాశ్రమములు చిరకాలము నుండియు పాటింపబడు చున్నవి. ఎవరికి వారు వారి వర్ణమునకు మరియు ఆశ్రమమునకు సంబంధించిన నియమములను పాటించవలెననెడి నిబంధన కలదు. ప్రాచీన ఋషులు మరియు ఆచార్యులు వర్ణాశ్రమ ధర్మముల వారు వారివారి చట్రములోనే వికాసము పొందవలెనని తలంచిరి. అయితే ఈ వర్ణాశ్రమ ధర్మములో హెచ్చు తగ్గులు లేవని, వీరెల్లరు పరస్పర సహకార భావముతో మెలగలెననెడిది తెలుసుకొనవలెను. అప్పుడే సమాజములో అలజడులు మరియు గందరగోళములు ఉపశమించును. లేని యెడల ఈ విభేదముల యొక్క విశ్వరూపము అశాంతికి కారణము కాగలదు. లౌకిక జీవనము నందున ఈ వర్ణాశ్రమ ధర్మముల పాలన అవశ్యమై యుండిననూ, శివాద్వైత జ్ఞాన సంపన్నుడైన శివయోగులకు వర్ణాశ్రమ ధర్మముల యొక్క పాలన అనావశ్యకమని భగవత్పాదుల వారు ఆదేశము నిచ్చిరి. శాస్త్రవిహితమైన ధర్మపరిపాలనను చేయకుండా వుండిన యెడల ప్రత్యవాయము ప్రాప్తము కాదా? అనెడి ప్రశ్న వుదయించినపుడు శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా వుపదేశము నిచ్చిరి.

**నిర్ధగ్ధ కర్మ బీజస్య నిర్మల జ్ఞాన వహ్నినా ।**
**దేహివద్భా సమానస్య దేవాయాత్రాతు లౌకికీ ॥** (సి. శి. 14-21)

నిర్మలమైన శివజ్ఞానము అనెడి అగ్నిచేత సంసార కారణములైన పుణ్య పాపములనెడి కర్మ బీజములను కాల్చి బూడిదను చెశెడి శివజ్ఞాని దేహధారి వలె కన్పించిననూ అతని దేహస్థితియూ కాల్చిన బట్టలవలె ఆకార మాత్రము గానే వుండును.

ఆ జీవన్ముక్తుడు తన దేహ వ్యాపారములను విదేహకైవల్యము వరకు కలిగి యుండును. ఈ కారణము వలన 'అకరణే ప్రత్యవాయః ' అనెడి సంబంధము. అతనికి వుండదని పూజ్యపాదుల యొక్క వుపదేశములోని అంతరార్థము శాస్త్రమునందున కర్మనాశనమునకై రెండు మార్గములు ఉపదేశింపనైనవి. అవి భోగమార్గము జ్ఞాన మార్గము. తాను చేశిన కర్మను ఉపభోగము చేసి నిశ్శేషము చేయుట భోగ మార్గము. జ్ఞానాగ్ని చేత సంచిత కర్మను దహించి వేయుట జ్ఞాన మార్గము. మొదటి మార్గము అంత సులభతరమైనది కాదు. ప్రాక్తన కర్మ ఫలములను అనుభవించునపుడు జీవి నూతన కర్మలను చేయుచుండును. మొదటి కర్మలు సమాప్తమైననూ నూతన కర్మలు మిగిలియుండును. అందుచేత భోగ మార్గము వాంఛనీయము కాదు. ఈ కారణము వలన జ్ఞాన మార్గమే ఫలప్రదమైనదని శాస్త్రకారులు వుపదేశించిరి. జ్ఞానియైన వాడు తన కర్మలను కాల్చివేసి సమూలముగా నాశనము చేయును. అందుచేత అతనికి పునర్జన్మ వుండదు.

ఏ శివయోగి తన కర్మ బీజములను జ్ఞానాగ్నితో దగ్ధము చేసుకొను చున్నాడో అతని దేహస్థితి చూచుటకై కనిపించిననూ వాస్తవముగా నుండదు. మడచిన బట్ట కాల్చిన పిదప చూచుటకు దూరము నుండి మడచిన బట్ట వలెనే కనిపించును. కాని అది వుపయోగమునకు రాదు. శివ జ్ఞాని యొక్క కర్మ కూడా నట్టిదే. ఫలరూపమును పొందజాలదు. వారి జీవితము సామాన్యుని జీవితము వలె కన్పించిననూ వాస్తముగా అవి విలక్షణమైనవి. ఈతడు నిత్య కర్మలను చేయవలసిన పనిలేదు. చేశిననూ గుణ దోషములుండవు. ఈ విషయమును ఒక దృష్టాంతమ ద్వారా శ్రీ భగవత్పాదులు ఈ క్రింది విధముగా తెలియజేశిరి.

**శివ జ్ఞాన సమాపన్న స్థిర వైరాగ్య లక్షణః ।**
**స్వకర్మణాన లి ప్యేత పద్మ పత్రమివాంభసా ॥** (సి. శి. 14 - 22)

శివాద్వైత జ్ఞానము యొక్క ఫలముగా ధృఢతరమైన వైరాగ్యమును పొందియుండెడి శివయోగి తన యిష్టమునకు వచ్చిన కర్మలను చేయుచుండిననూ ఆ కర్మ ఫలముల నుండి తామరాకున నీటి బిందువు వలె నిర్లిప్తుడై యుండును. శివ జ్ఞానికి ప్రాప్తమైన వైరాగ్యము వివేకము మూలముగా లభించిన దైనందున అది ధృఢతరముగా నుండును. మనుజులకు కొన్ని కొన్ని సందర్భములలో వైరాగ్యము వుదయించ వచ్చును. వీటిని పురాణ వైరాగ్యము, ప్రసూతి వైరాగ్యము, మరియు శ్మశాన వైరాగ్యములని అందురు. ఇది ఆయా సందర్భములలో మాత్రమే నిలిచి తదుపరి మాయమగును. ఇట్టి వైరాగ్య భావనలు అస్థిరమైనవి. వివేకముతో కూడు కొనిన వైరాగ్య మట్టిది కాదు. సంసార హేయ భావము వలన కలిగెడి వైరాగ్యమే వివేక యుతమైన వైరాగ్యమని అన వచ్చును. ఐహికము మరియు పారలౌకికములైన సుఖముల క్షణికతను గుర్తెరిగి వివేకవంతుడు యెట్టి వైరాగ్య భావన పొందు చున్నాడో అట్టిది సుస్థిరముగా నిలుచును. ఈ వైరాగ్య భావన కల్గిన జ్ఞాని పుణ్య పాపములను చేశిననూ అవి అతనిని అంటవు. ఇతరులకు వారిలో దోషము కన్పించిననూ అతడు దోషముల నుండి విముక్తుడగు చున్నాడు. ఇంకను జ్ఞానుల యందు వారు ఆచరించిన శుభాశుభ కర్మల ఫలములు వారియందు వుండునని తలంచినను వాటి యొక్క అనుభవము వారు పొంద వలసిన అవసరము లేదని ఛాందోగ్య ఉపనిషత్తునందు తెలియపరచబడినది. జ్ఞాని పుణ్య పాపములను అనుభవించ కుండా వుండిన యెడల వాటిననుభవించు వారెవరు? అనెడి ప్రశ్న వుదయించును. దీని సమాధానమేమనగా కొందరు జనులు జ్ఞానులను స్తుతింతురు. మరికొందరు నిందింతురు. స్తుతించిన వారికి పుణ్య ఫలము, నిందించిన వారికి పాపఫలము లభించునని తెలుసుకొనవలెను. ఈ విధముగా జ్ఞాని యొక్క పుణ్య పాపములు స్తుతినిందలు చేశిన వారికి చెందినవై, కాని అతడు నిర్లిప్తుడై వుండును.

జ్ఞాని పుణ్య పాపముల విషయముగా రెండు విధానములు ప్రతిపాదించ బడినవి. అతడు విహిత, నిషిద్ధ కర్మలను చేశిననూ వాటి ఫలము వుద్భవించుట లేదు. ఒక వేళ పుణ్య పాపములు త్పన్నమైనను అవి అతనికి చెందుట లేదు. ఈ రెండు విధములుగా జ్ఞానియైనవాడు కర్మ ఫలములకు భాజనుడు అగుటలేదు.

పూజ్య పాదులు కమల పత్రము యొక్క ఉదాహరణను చెప్పుటకు గల కారణమిదియే ప్రారబ్ధ కర్మ వున్నంత వరకు దేహధారిగా నుండి జీవన్ముక్తుడుగా ఆనందము ననుభవించుచూ దేహపాతమైన పిదప కైవల్యమును పొందును. పుణ్యపాప ఫలముల యొక్క అవశేషము వుండనందున అతడు పునర్జన్మ నెత్తడు.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరులైన చంద్రశేఖర శివాచార్య మహాస్వాముల వారు సమ దృష్టి గల సాధకుని దృక్కోణము గురించి వివరించి చెప్పిరి.

భేద బుద్ధి వలననే జీవునికి యుచ్చ నీచముల గురించిన తలంపులు వచ్చు చున్నది. శివ-జీవా భేద బుద్ధి జనించిన పిదప భేద భావము సడలి పోవును. సమరస భక్తి వలన జీవ భ్రమను వీడిన సాధకునికి భేద బుద్ధి గల్గదు కదా! ఈ యంశము గురించి వివరించి చెప్పెడి అన్నమయ్య గారి పద్యమును గనుడి :

**బలవంతుడను దుర్బలుండును మహా ప్రౌఢుండు మూఢుండునుం**
**కులహీనాత్మకుడన్ మహాకుల జుడున్ గ్రూరుండు శాంతాతిని**
**శ్చల చిత్తుండును నొక్క రూపయగు నీ సద్భక్తి చిత్తంబులో**
**పల వర్ధిల్లిన మీదనే విధమునన్ భావింప సర్వేశ్వరా !**

(సర్వేశ్వర శతకము, ప. 61) శ్రీ పావని సేవా సమితి ప్రచురణ, 1999)

శ్రీ మల్లికార్జున పండితుడీ విషయమును క్రింది విధముగా తెలిపెను.

**బందేమి భక్తి సంగతి**
**జండాలుండైన భూతి శాసన ధరుడై**
**యుండిన పూజ్యుడె యతనిన్**
**ఒండనగా జనుదు భక్తి యోగమున శివా!**

(శివ తత్త్వ సారము, ప. 119) కృష్ణా పత్రిక ప్రచురణ.

ఆచార సంపత్తి స్థలి జాతి వివక్షతను చూపడనెడిది శ్రీ భగవత్ పాదుల వారి యుపదేశములోని సారాంశము. ఈ విషయమును నొక్కి చెప్పెడి శ్రీ మల్లికార్జున పండితుని క్రింది పద్యమును గనుడి:

**అవి చారంబున నెప్పుడు**
**శివ శాసన పూజనంబు సేయగ వలయున్**
**శివభక్తుల గని జాత్యా**
**ది విచారము విడవలయు దృఢ భక్తి మెయిన్.** (శివతత్త్వ సారము, ప. 121)

ఈ పద్యమునకు వివరణ నిచ్చుచు "శివ భక్తుల చూచి వారే జాతివారని విచారించ కూడదు. శైవ మతమున జాతి భేదములు లేవని" శ్రీ నిడుదవోలు వేంకటారావుగారు వివరించిరి.

శివం భూయాత్

## ఆశీర్వచనము - 4

## ఆచార సంపత్తి స్థలము

శ్రీ భగవత్పాదుల వారు యింతకు క్రితము శివజ్ఞాని పద్మ పత్రము వలె అలిప్తుడై యుండునని తెలియజెప్పిరి. ఇప్పుడు అతడు శివరూపమును పొందునని చెప్పు చున్నాడు. గమనించుడి.

**గచ్ఛంస్తిష్ఠన్ స్వపన్ వాపి జాగ్రన్వాపి మహామతిః ।**
**శివ జ్ఞాన సమాయోగా చ్ఛివపూజాపరః సదా ॥** (సి. శి. 14-23)

శివైక్య భావన సంపన్నుడైన శివయోగి నడచునప్పుడు, నిద్రించునపుడు, మెలకువగా వున్నపుడు, నిలిచి యున్నప్పుడూ, ఇంకను ఏకార్యము చేయుచున్ననూ అతడు శివపూజా పరాయణుడుగానే అయివుండును. ప్రతిక్షణము 'శివోహం' భావనను చింతన చేయుచుండును. శాస్త్రమునందున శివపూజాపరమైన అనేక నియమములు కలవు. శివదీక్షా సంపన్నుడైన సాధకుడు శివపూజను చేయునపుడు ఇట్టి దిశకు తిరిగి కూర్చొనవలెననియును, ఇట్టి ఆసనమున కూర్చుండవలెననియును చెప్పబడినది. నడచునప్పుడు, నిద్రించునపుడు తినునప్పుడు మంత్ర జపము చేయకూడదని కూడా చెప్పబడినది. సాధకునికై చెప్పబడిన ఈ నియమములు సిద్ధి స్థితిని పొందిన శివయోగికి బంధనములు కాజాలవు. అతని చిత్తము సదాశివుని యందున ఆసక్తమై యుండుట చేత అతనికి విధి నిషేధముల కట్టుబాటు వుండదు. అందుచేత పూజ్యపాదులు శివయోగి సర్వావ స్థల యందునను శివపూజా పరాయణుడై వుండునని శెలవిచ్చిరి.

శ్రీ శంకరాచార్యుల వారు శివమానస స్తోత్రము నందున శివయోగి యొక్క సర్వ వ్యవహారములు శివారాధన అని వివరించిరి. అతని వుపదేశము ప్రకారము ఆత్మయే పరమాత్ముడు. బుద్ధియే గిరిజ. ప్రాణములే సహచరులు. శరీరమే మందిరము. సకల విషయోప భోగమే పూజ. నిద్రయే సమాధి. అటునిటునడచునదే ప్రదక్షిణ. మాటలాడునదే స్తోత్రము. ఈ విధముగా శివయోగి యొక్క ప్రతి యొక్క కర్మ శివపూజయని వివరించిరి. సామాన్యముగా మందిరములోనే దేవుడిని చూసెడి సాధకుడు పూజ, స్తోత్రము, ప్రదక్షిణ మొదలగు వాటికై మందిరమునకే పోవలసి యుండును. అయితే తన హృదయ మందిరమున శివుని ఆరాధించెడి శ్రేష్ఠ సాధకుడు వేరు ప్రదేశమునకు పోవలసిన అవసరము లేదు. అతని త్రికరణముల ద్వారా నడిచెడి సర్వవ్యవహారములు శివపూజగానే పరిణమించు చున్నవి. ఇతని దృష్టి శివమయముగా నుండుట చేత సమస్త సృష్టిని శివమయముగా చూచు చున్నాడు. ఈ కారణము వలన సాధనా వస్థలో సాధకుని కొరకై నిర్దేశించబడిన నియమావళి సిద్ధావస్థలో యున్న శివయోగికి వర్తించవు.

శ్రీ రేణుక భగవత్పాదుల వారు ఐక్య స్థలమును చేరిన శివయోగి యొక్క శివదర్శనమును గురించి ఈ క్రింది విధముగా వివరించిరి.

**యద్యత్ పశ్యతి సామోదం వస్తులోకేషుదేశికః ।**
**శివదర్శన సంపత్తి స్తత్ర తత్ర మహాత్మనః ॥** (సి. శి. 14-24)

శివైక్య భావనను పొందిన శివయోగి అత్యంత ప్రీతి పూర్వకముగా ఏఏ వస్తువులను చూచునో అవెల్లనూ అతనికి శివదర్శనముగనె కన్పట్టును. దృష్టి శివమయమై యుండుట చేత సృష్టి శివమయముగా తోచుటలో ప్రతి బంధకము వుండదు. వస్తుతః సర్వత్ర శివుడే నిండి వుండినను అతనిని చూచెడి కోరిక లేనందు వలన సామాన్య జనులు శివదర్శనమునకు దూరమగు చున్నారు. మాయా మోహములకు లోనగు చున్నారు. లోకమునందున తాడును చూచి పామనుచు, కౌచిప్పనుగని వెండియనియును, మోడును గని దొంగ యనియును తలచుచుందురు. వస్తుతః వారు భావించెడివి అందులో లేవు. అయినను దృష్టి దోషము వలన వున్నది లేనిదిగను, లేనిది వున్నదానిగను కనుపించు చున్నది. ఇటులనే శివచింతలేని మనుజుడు శివుని ప్రాపంచికముగా భావించు చున్నాడు. వస్తుతః ప్రపంచమనెడిదే లేదు. ఇదంతయూ శివ రూపమే అందులకే ఒక ఉపనిషత్తులో "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనగా సర్వమూ పరశివ బ్రహ్మమే అయివున్నదని వుపదేశింపబడినది. ఇదియే భావము శివజగన్మయ స్థలమునందున గమనించితిమి. ఈ స్థలమునందున భగవత్పాదుల వారు భౌతిక ప్రపంచమంతయు శివరూపముగా నున్నదని ఎంతో హృద్యముగా ప్రతిపాదించిరి. పతంజలి మహర్షి యోగ శాస్త్రమునందున శివదర్శనమునకై చిత్త వృత్తి యొక్క నిరోధమును వివరించిరి. శ్రీ రేణుకులు శివయోగము నందున చిత్త వృత్తి యొక్క నిరోధమును చెప్పకుండా ఆ వృత్తి పోవు ప్రదేశమంతయూ శివ మయముగా చూడవలెనని వుపదేశించిరి. ఇది యొక సహజమైన సమాధి యోగము. మనస్సును నిగ్రహించి సమాధిని సాధించినప్పుడు ఆక్షణమునందున అది శాంతముగా కనిపించిననూ సమాధి నుండి ఉత్థానమైన పిదప కాలువిచ్చిన గుఱ్ఱమువలె అతిచంచలముగా అటు యిటు పరుగెత్తుటను ప్రారంభించును. అందుచేత చిత్త నిరోధరూపమైన పతంజలి వుపదేశము కంటెను సర్వత్ర శివభావననూ వహించెడి శివయోగము సరళము, శ్రేష్ఠమునై యున్నది. అందుచేత మనస్సు మీద ఏదో ఒక ఒత్తిడిని దోచకుండా దానిని సహజముగా సర్వత్ర శివదర్శనము యొక్క మూలమున సమాధిని పొందుట శ్రేష్ఠము.

శివయోగి దృష్టి శివరూపముగా నుండుట చేత అతడు పొందెడి దర్శన సంపత్తి అమోఘమైనదని తెలియ జేయుచు శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

**యద్యచ్చింతయతే యోగీ మనసా శుద్ధభావనః ।**
**తత్తచ్ఛివ మయత్వేన శివధ్యాన ముదాహృతమ్ ॥** (సి. శి. 14-25)

శివభావన యున్న శివయోగి తన మనస్సుతో దేనిని యోచించు చున్నను నదంతయును శివ ధ్యానముగనే కన్పట్టును. భావనయే శివరూపమై యుండునప్పుడు దాని నుండి వెడలెడి చింతన లన్నియును శివ రూపమును మినహాయించి వేరే యేమియును నుండదు. ఈ విధముగా నంతరంగ బహిరంగముల యందున శివ చింతననే చేస్తే శివయోగి చింతన శివ పరముగానె యుండును.

**యద్కించిద్భాషితం లోకే స్వేచ్ఛయా శివయోగినా ।**
**శివస్తోత్ర మిదం సర్వం యస్మాత్ సర్వాత్మకః శివః ॥** (సి. శి. 14-26)

శివయోగి తన యిచ్ఛాను సారముగానే మాటలను మాట్లాడినను నవి శివ స్తోత్రములే యగును. మాటలు స్తోత్రములుగా కావలెననిన యతని వాణి యెంత సంస్కారవంతముగా నుండ వలెనో గ్రహించ వలెను. శివుడిచ్చెడి వాక్కు సార్థకము కావలెననిన యెడల నది శివగుణములనే గానము చేయు చుండవలెను.

శివ స్తుతి చేయవలయుననిన వాక్కు జిహ్వ శివమయము కావలెను. ఎవ్వడైతే శివుని గుణ గణములు గానము చేయునో, వానికి శివుని ఉత్కృష్ట గుణములు నలవడును. గుణగణ వర్ణిన యనగా నా గుణగణములను మన యందున నలవరచు కొనెడి ప్రక్రియ యని గ్రహించ వలెను. ఈ కారణముననే మన దేశములోని కవులందరు శివస్తుతులను రచించిరి. స్తోత్రములు రచించిన వారు వాటిని గానము చేయు చుందురు. రచనా ప్రక్రియను చేపట్ట లేని వారు వేరె యెవ్వరైననూ వ్రాసిన స్తుతిని గానము చేయవలెను. ఆ విధిన చేసిన వారికి దైవీ సంపత్తి సుగుణముల రూపములో లభించు చున్నది.

స్తోత్రములు ఛందో బద్ధముగా నుండవలెననెడి యభిప్రాయమొకటి గలదు. ఇది నిరాధారమైన భావన. భక్తి పూర్వకముగా వ్రాయబడిన స్తోత్రములకైనను ప్రాముఖ్యత కలదు. వాస్తవముగా చూచిన ఎడల భక్తి భావయుతంగా వ్రాయబడిన ఛందో బద్ధ స్తోత్రముల కంటెను, భక్తి భావనా భరితముగా వ్రాయబడిన గీతములకే ఎక్కువ మహాత్వము గలదు. ఈ సందర్భమున శివ శరణుల వచనముల గురించి చెప్పవచ్చును ఛందోనియమములు పాటించకున్నను భావ గర్భితములై భక్తి భావసహితములై యొప్పారుచునున్నవి. ఇట్టే రచనలు శివపరమాత్మకు కూడ ప్రీతిని కల్పించెడివని వేరుగా చెప్పనక్కర లేదు. ఓంకార మనెడి ప్రణవము నుండి అక్షరములన్నియును వెలువడి యుండిన ఏ అక్షరమైనను మంత్రమగుటకు అర్హత గలిగి యున్నదని పండితులు చెప్పుదురు. ఈ కారణము వలన శబ్ద సౌందర్యము కంటెను భావ సౌందర్యమునకే ప్రబలమగు ప్రాముఖ్యత గలదని గుర్తించ వలెను. ఈ వాస్తవము నేపథ్యముననే శ్రీ భగవత్పాదుల వారు శివయోగి యొక్క మాటలన్నియును స్తోత్రములగునని ఉపదేశించిరి.

శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు శివయోగి యొక్క ప్రతి యొక్క క్రియ శివ పూజగా పరిణమించునని తెలియజెప్పవచు ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

**యాయా చేష్టా సముత్పన్నా జాయతే శివయోగినామ్ ।**
**సాసా పూజా మహేశస్య సర్వదా తత్గతాత్మనామ్ ॥** (సి. శి. 14-27)

శివ లింగమునందున తాదాత్మ్య భావన చేత ఐక్యమయ్యెడి శివయోగి దేహమునందున ఏ ఏ క్రియలు గలుగునో అవన్నియును శివపరమాత్మ పూజయే అగుచుండును. సామాన్యముగా శరీరము చేత ఏ క్రియ యనబడినను అది అంతగా మహాత్వ పూర్ణమైనది కాజాలదు. మనః పూర్వకముగా ఆచరించబడిన క్రియలే మహాత్వ పూర్ణములగును. ఎప్పుడు శరీరము ఉండే యచ్చట మనస్సు యుండదు. ఈ రెండింటికిని విపరీత సంబంధము ఉండును. అందుకే శారీరక క్రియ కంటెను మానసిక క్రియ మహాత్వ పూర్ణమైనదై యుండును. శివయోగి యొక్క చిత్తము శివుని యందున తల్లీనమై యుండుట చేత అతని శరీరము నుండి చేయబడెడి పనులన్నియును శివపూజగా పరిణమించునని భావించ వలెను. శివధ్యాన, శివచింతనలకు బాహ్యపరమైన ఏ కార్యకలాపములు అడ్డంకులుతే జాలవు. అన్యులతో

మాటలాడుచు, ఇంటి పనులను చేయగలుగ నటులయే శివ చింతన చేయుచు ఏ కార్యక్రమములైనను చేయవచ్చును. ఈ కారణము వలన శివ యోగివలె శివాసక్తి చిత్తులై తమ కర్తవ్య కర్మలను పరిపాలించుట హెచ్చు సూక్ష్మమైనది. కర్తవ్య కర్మలను చేయునపుడు శివ ద్యాన శివ చింతనలు చేయుట అసాధ్యమనిన ఎడల ప్రారంభమునందున నామస్మరణనైనను చేసెడి అలవాటును పెంపొందించు కొనవలయును.

ఒక మనష్యుడు శౌచక్రియలను పూరించుకొని వచ్చునప్పుడు తన నాలుకకు జనివారమును చుట్టుకొని వచ్చుటను శివాచార్యులు గమనించిరి వాడిని చూచి అతడాశ్చర్యము చెందెను. శౌచమునకు పోయినప్పుడు చెవికి జంధ్యమును చుట్టినది ఆచారమై యున్నది. అయితే నాలుకకు చుట్టెడి ఈ పద్ధతి ఎక్కడి నుండి వచ్చినదని ఆలోచించి అతనిని ఈ విధముగా ప్రశ్నించెను. ఓయీ నీవు జంధ్యమును చెవికి చుట్టు పద్ధతిని విడిచి నాలుకకు ఎందులకు చుట్టితివి? దీనిలో గల అంతరార్థమేమి? అని ప్రశ్నించెను. అప్పుడా వ్యక్తి ఓపూజనీయుడా నా నాలుకకు సదా భగవంతుని నామమును జపించెడి అభ్యాసమున్నది. శౌచమునకు కూర్చోనినప్పుడు నామస్మరణ చేయుట సరియైన పని కాదు కదా! అందుకే నామస్మరణ చేయకుండగ నుంచుటకై నాలుకకు జంధ్యమును చుట్టి బంధించితిని అని చెప్పెను. అప్పుడా మహాత్ముడు ఓయీ నీకుండెడి అలవాటు సరియైనదే అఖండముగా నామస్మరణ చేసెడి వారికి శుచిఅశుచుల భేదము ఉండదు. నామస్మరణను ఎప్పుటికిని చేయుచుండ వలయును. దీనికి గల కారణమును చెప్పెదను వినుము. మనుజుని అంత్యసమయము ఎప్పుడు, ఏ విధిన రానున్నదో ఎవరికినీ తెలియదు. ఆ కారణము వలన చేయవచ్చునా, చేయగూడదా అనెడి ప్రశ్నల జోలికి పోకుండా ఎల్లప్పుడు భగవంతుని చింతన చేయుటయే యుక్తమైన విషయము అంత్య సమయమునందున శివ చింతనతో దేహమును విడచినప్పుడు చచ్చెడి వ్యక్తి శివునితో సమరస మగుచున్నాడు. ఈ కారణము వలన ప్రతి యొక్కరు సర్వకాల సర్వావస్థలయందున శివచింతన చేయుచునే వుండవలెను.

శివాద్వైత జ్ఞానము నందున తల్లీనమైన శివయోగి పరిస్థితి ప్రసంగాను సారముగా అతని శరీరము వలన ఏ కార్యక్రమములు జరిగినను అవి శివపూజకు సమానములగునని శ్రీ భగవత్పాదుల వారు ఈ స్థలమునందున సవివరముగా నిరూపించిరి. ఐక్య స్థితికి పొందిన శివయోగి దేహమును ధరించియుండియూ, దేహరహితడగు చున్నాడు. అందుచేత ఇతనికి కర్తవ్యాకర్తములు ఉండవు. సమదర్శియైన ఏ కర్మలు ఘటించినను వాటి యొక్క లంపటము అతనికి అగుట లేదు. ఇతని దృష్టిలో సుకృతి, దుష్కృతి, బ్రాహ్మణుడు-మాలవాడు అనెడి భేద భావములు యుండవు. ఇతనికి వర్ణాశ్రమ ధర్మములు పాలించవలెననెడి కట్టుబాటు కూడా వర్తించదు ఇతనియందున యుండెడి శివాద్వైత భావము పరిణామముగా ఇతని సంచిత కర్మ సమూలముగా దగ్ధమగుటచే, ఇతనికి పునర్జన్మ యుండదు. స్థిరవైరాగ్య చిత్తుడైన శివయోగి 'పద్మ పత్ర మివాంభసి' అనెడి న్యాయము ప్రకారము సంసారములో యుంటూనే సంసారములో లేని వాడుగా నుండును. ఇతని మాట చేత, నడక మొదలగునవన్నియును శివార్చనలేయగుట చేత ఇతనికి విధిని శేధములు వుండనే వుండవు. ఇతడు ఏది చేసినను అది ఆమోదయోగ్యమై యుండును. ఇతడొక నిరంకుశ ప్రభువని గుర్తించ వలెను. ఈ స్థితియే మానవుని యొక్క చరమ స్థితియని తెలుసు కొనవలెను.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు చంద్ర శేఖర శివాచార్యుల వారు ఆచార సంపత్తికి చెందిన యీ చివరి యాశీర్వాదమునందున శివయోగి చేష్టలన్నియును శివపూజలై పోవునని తెలిపిరి.

ఆచార మనాచారములనెడివి వీరశైవమున విశిష్టములైన భావములై యొప్పుచున్నవి. ఆచారము భక్తునికి భూషణము కాగా, అనాచారము భక్తుని పతనానికి సంకేతమై నిలుచును. పంచాచారములు విధి నిషేదావిహిత క్రియల గురించి తెలిపెడి యాగము నియమావళియని చెప్పబడినది. ఇయ్యని యనుల్లంఘనీయములని చెప్పబడినది.

అయితే సమరస భక్తిని సాధనముగా గొని లింగాంగ సామరస్యము సాధించు క్రమమున సాధన చేసెడి సాధకునికి చెందిన యాచార సంపత్తి యెట్టిదనెడిది ప్రస్తుత ప్రశ్న.

ఐక్య స్థలమున నుండెడి వాడెట్టులుండునో యనెడిది మరొక ప్రశ్న ఈ విషయమున మన సంశయములను నివారించెడి సాధనముగా నొప్పెడి యీ క్రింది పద్యమును గమనించుడి.

**శ్లో ॥ ఆజ్ఞారాధన పాత్రుచే విధి నిషేధాది క్రియానీతుచే**
**నజ్ఞానాబ్ధి వహిత్రుచే బరమ యోగానందుచే భక్తి స**
**మ్య జ్ఞానాశ్రయణీయుచే ననఘుచే మాపండితారాధ్యుచే**
**నాజ్ఞా సిద్ధియు జిత్త శుద్ధియు సముద్యత్ ప్రీతమై బొందెదన్**

(శ్రీ మల్లికార్జున పండితారాధ్యోదాహరణము పద్య. 2)

ఐక్య స్థలికి విధి నిషేధాదులుండవని గ్రహించ గలరు. ఈ విషయము నింకనూ స్పష్టము చేసెడి యీ సీసము గాంచుడి.

**మనసున పుట్టెడి మాన్యుని చింతనల్ మనసిజవారునకు ధ్యాన మౌను**
**తలచెడి తలపులు వలపుల భావాలు నుతులౌను శివునికి యతులితముగ**
**యేవేవి చూసినా యవియన్ని శివమూర్తి దర్శన భాగ్యంబు ధన్యముగను**
**నడచినా శివపూజ నడవక నిలిచినా పురహరు పూజలౌ పుడమి మీద**
**నిద్ర లోయుండినా మేల్గాంచి నిలిచి నా శివునికి పూజలై యొప్పునెప్పుడును వినుము.**
**చేష్ట లేవియై నశివుని కిష్టమౌను లింగ లింగైక్యుని విధిని యెరుగ తరమె ?**

(మార్గం పెద్ద వీరప్ప కవి అముద్రితము)

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## ఏక భాజన స్థలము

శివ జ్ఞాన సంపన్నుడైన శివయోగి యొక్క శరీరము నుండి అయ్యెడి పనులన్నియును లింగార్చన క్రియలేయని ఇంతకు క్రితమే తెలియజెప్పనైనది. ఈ స్థలము నందున ఏక భాజన విషయము గురించి ఆలోచింతుము గావున తనను, శివ పరబ్రహ్మను మరియు ప్రపంచమును ఏక రూపముగా భావించెడి స్థలమే ఏక భాజన స్థలము. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశమును ప్రదానము చేసిరి.

**విశ్వం శివమయం చేతి సదాభావయతోధియా ।**
**శివైక భాజనాత్మ త్వాదేక భాజనముచ్యతే ॥** (సి. శి. 14-28)

ఈ శ్లోకములోని భావమేమనగా లింగైక్య జ్ఞాన సంపన్నుడైన శివయోగి తనను లింగరూపములోని శివుని మరియు జగత్తును శివమయముగా నెరుగుచు ప్రపంచములోని భేదములను మరచి శివుని యందున ఐక్య భావమును పొందునప్పుడు ఏకభాజన స్థలములోనున్న వానిగా పిలిపించు కొనును.

జీవులు ఈశ్వరుడు జగత్తులనెడి పదార్థ త్రయముల చింతన ముఖ్యమైనవై యున్నవి. నేనంటే ఎవరు జగత్తనగా నేమి. దీనిని నిర్మించినదెవరు అనెడి ప్రశ్నల మీదనే దర్శనములన్నియును పెంపొందినవి. వినుటకు ఈ మూడు పదార్థములు విభిన్నముగా కనిపించిననూ మూడింటికిని మూలము ఒకటేయని గుర్తించవలెను సృష్టికి పూర్వమునందున ఒక్కటిగా నున్న శివ పరబ్రహ్మ సృష్టి కాలము నందున

జీవుడు, జగత్తు, ఈశ్వరులుగా వికాసమగు చున్నది. ఇదంతయును శివపరమాత్మని వికాసమై యున్నది. జీవుడు భక్తుడై యున్నాడు. ప్రపంచము భోగ్య వస్తువు. ఈశ్వరుడు ప్రేరకుడుగను, సాక్షీభూతుడుగను అయియుండును.

ఈశ్వరుని ప్రేరణ చేతనే అందరూ ప్రేరితులగు చున్నారు. కొందరు మంచి పనులలో ప్రవృత్తులైన ఎడల మరికొందరు. చెడు కార్యములను చేపట్టు చున్నారు. ఈ విధముగా అగుటకు గల కారణము లేమి? ఈశ్వరుడు శభాశుభ కర్మలకు ప్రేరకుడైననూ అందరినీ శుభ కర్మల యందుననే ప్రేరేపించు చుండును. శుభాశుభ కర్మల వైశమ్యమునకు ఈశ్వరుడే కారణమనిన ఎడల అతడు పక్షపాతియని అనిపించు కొనును. ఇంతటి పక్షపాత భావన గలవాడు ఈశ్వరుడెట్లగును అను ప్రశ్న ఉదయింప వచ్చును. అన్ని ప్రశ్నలకు సమాధాన మేమనగా ఈశ్వరుడు కేవలము ప్రేరకుడే. అతడు శుభ కర్మలకు ప్రేరకుడని లేదా అశుభ కర్మలకు ప్రేరకుడని భావించ వలదూ, భూమి యందు విత్తిన అనేక బీజములు వర్షము పడిన పిదప అంకురించి, పెరిగి, పెద్దవై ఫల ప్రదములగు చున్నవి. ఆయా ఫలముల యొక్క స్వరూప స్వభావములు భిన్న భిన్నములుగా నుండునని మనము ఎరుగుచునే యున్నాము. అన్ని బీజములు అంకురించుటకు వర్షపు నీరే కారణమగు చున్నది. అయితే రుచులలో గల భేదమునకు బీజములే కారణమగు చున్నవి. విద్యుత్తు నుండి ప్రేరణ పొందిన అనేక పరికరములు వేరే, వేరే కార్యములను నిర్వహించు చున్నవి. ప్రేరణ విద్యుత్తుదే కాని వివిధ యంత్రముల యొక్క పనితనము వేర్వేరుగా నుండును కదా. ఇదే విధిన ప్రేరకుడు ఈశ్వరుడే ఐనను కార్యముల యొక్క స్వభావము జీవుల పైననే ఆధారపడి యున్నది. ఈశ్వరుడు సత్ప్రవర్తనను ప్రేరేపించును లేదా దుష్ట ప్రవర్తనకు దోహదమిచ్చును అని భావించ వలదు. జీవుల యొక్క ప్రవృత్తియే వారి వారి కార్యస్వభావములకు కారణములగు చున్నవి. దుష్ట ప్రవృత్తి గలవాడు దుష్కృతములను చేయు చున్నాడు. సత్ ప్రవృత్తి గలవాడు. సత్కార్యములను చేయు చున్నాడు. తత్ అనుగుణముగనే సుఖమునో, దుఃఖమునో అనుభవించు చున్నాడు. కర్మల యొక్క ఫలములే సుఖ దుఃఖములు కదా ఇంకను పంచ భూతాత్మకమైన ప్రపంచము జీవునికి భీజ్యమై యున్నది. సామాన్యులైన జీవులకు జీవుడు, ఈశ్వరుడు, ప్రపంచము లనెడి భేదము కన్పట్టును కానీ శివయోగికి ఈ భేదము పొడచూపదు. అతని దృష్టిలో అంతయూ శివమయమే. ఇట్టి స్థితిని పొందుటకై సర్వదా ఐక్యాను సంధానమునే చేసి కొనవలసి యుండును. ప్రపంచములో శివుని కంటెనూ భిన్నమైనది ఏదియును లేదు నేను కూడా శివ స్వరూపుడనే. ఈ తెరుగున చింతించుటయే ఏక భాజన స్థలమునందు గల సాధకుని లక్షణమై యున్నది. బహిరంగమున భేదములు తోచినప్పటికిని, అంతరంగమున మాత్రము భావాత్మకమైన అద్వైత స్థితి నెల కొని యుండును.

**స్వస్య సర్వస్య లోకస్య శివ స్యాద్వైత దర్శనాత్ ।**
**ఏక భాజన యోగేన ప్రసాదైక్య మతిర్భవేత్ ॥** (సి. శి. 14-29)

శివుడు, జీవుడు మరియు జగత్తు యొక్క ఐక్య చింతన చేత మనస్సుకు ప్రసన్నత ప్రాప్తమగు చున్నది. ద్వైత స్థితి యందు ఉండునప్పుడు ఇట్టి అనుభవము లభింపదు. అసంతుష్ట, ప్రసన్నతా రాహిత్యము దోచును. ద్వైత భావము తొలగిన గాని ఈ భావములు వైదొలగవు. మనస్సులో ప్రసన్నతను సాధించునదే ప్రసాదమని అనబడు చున్నది. అన్య వ్యక్తి మరియు అన్య వస్తువుల చేత మనస్సుకు ప్రన్నత కలుగ వచ్చును. కాని అట్టి ప్రసన్నత అశాశ్వతమైనదే క్షణికమైన ఇట్టి ప్రసన్నతకు ప్రాముఖ్యత నిచ్చుట వివేకవంతమైన లక్షణము కాదు. ప్రపంచము నందున మనకు మరియు లోకమునకు ప్రసన్నత నిచ్చెడివాడే పరశివుడని గ్రహించ వలెను. ఈ ఏక భాజన స్థలమున ఇట్టి ప్రసన్నతను సంపాదించుటయే కర్తవ్యమై యున్నది.

ఏకభాజన స్థితిని పొందిన శివయోగికి ప్రసాదైక్యమతి వుద్భవించునని శ్రీ భగవత్పాదులు ఉపదేశించిరి. వీరశైవ ధర్మమునందున పాదోదక ప్రసాదములు పూజ ఫలముగా లభించునని చెప్పబడినది. గురు-లింగ-జంగములు ఆరాధ్యములగును వీరిని పూజంచిన పిదప త్రివిధములగు పాదోదక ప్రసాదములు ప్రాప్తమగు చున్నవి. గురువు నుండి ప్రాప్తమ య్యెడిది గురు పాదోదకము మరియు గురువు ప్రసాదము. ఇష్ట లింగము వలన ప్రాప్తమయ్యెడిది స్వఇష్టలింగ పాదోదకము మరియు ప్రసాదము. జంగమయ్య నుండి లభించెడిది జంగము పాదోదకము మరియు ప్రసాదము ఇచ్చట ప్రతిపాదించబడిన గురు-లింగ-జంగములు ఒక్కడేయైన పరశివుని స్వరూపములై యుండుట చేత ఈ స్థలము నందలి శివయోగి-వారిని విడివిడిగా గాంచక ఒక్కరిగనే చూచు చున్నాడు. ఆరాధ్యమూర్తి యుండగా అతని నుండి లభించెడి పూజ ఫలములు కూడా ఒకే విధముగా నుండును. ఈ విధముగా ఈ త్రిలింగముల యొక్క పాదోదక ప్రసాదములలో భేదభావములు యండదని గ్రహించ వలెను. ఇట్టి భేద భావరాహిత్యమునే ప్రసాదైక్య మతి అని పిలిచెదరు. శివుని యందు ప్రపంచముందునా? ప్రపంచము నందు శివుడు యుండునా అనెడి ప్రశ్న వుదయించ వచ్చును. ఈ ప్రశ్నకు వుత్తరముగా శ్రీ భగవత్పాదుల వారు. ఈ క్రింది ఉపదేశమును ప్రధానము చేసిరి.

**శివే విశ్వమిదం సర్వం శివః సర్వత్ర భాసతే ।**
**ఆధారాదేయ భావేన శివస్య జగతః స్థితిః ॥** (సి. శి. 14-30)

శివుని యందున జగత్తు కలదు. జగత్తు నిండా శివుడు ఉన్నాడు. పరస్పరముగా ఆధార, ఆధేయ, భావ సంబంధముచే శివుడు మరియు జగత్తు ఉందురని తెలిసి కొనవలెను. ఆకాశము నందున నీవున్నావా నీలో ఆకాశమున్నదా అని ఎవరైన ప్రశ్నించన ఎడల నేను ఆకాశమునందు న్నాను ఆకాశము నాయందున్నది అనెడి ఉత్తరము వచ్చును. అదే విధముగా శివునికిని, జగత్తుకును సంబంధము వుండునని గ్రహించ వలెను. శివునిలో జగత్తుయుండును. జగత్తులో శివుడుండును అనెడిది గ్రహించ వలసిన విషయము.

వ్యాపకమైన వస్తువును పరిచయము చేయునప్పుడు శృతులు పరస్పర విరోధమైన వాక్యముల ద్వారా పరిచయమును చేయుట గాంచగలము. ఈ శావాస్య ఉపనిషత్తు యందున పరమాత్మ స్వరూపమును తెలియ జేయునప్పుడు, ఆపరమాత్ముడు అతి దూరముగానున్నాడు అటులనే అతి సమీపముగానున్నాడు అతనిలో సర్వమూయున్నది. సర్వములో అతనూ యున్నాడు. అతనికి కాళ్ళులేవు అయినను వేగముగా పరుగెత్తును అతనికి చేతులు లేవు అయినను అన్నింటిని పట్టుకొనును. అతనికి కళ్ళులేవు అయినను అందరినీ చూచు చున్నాడు. అనెడి వర్ణనలు కన్పట్టు చున్నది. ఇచ్చట నివ్వబడిన వర్ణనలలో పరస్పరమైన విరుద్ధ భావనలు గలవు. అయినను వ్యాపకమైన వస్తువును వర్ణించునప్పుడు అది ఏ మూల వర్ణించినను సమన్వయమగు చున్నది. ప్రపంచమందున పరమాత్మ, పరమాత్మ నందున ప్రపంచము లని చెప్పునపుడు వినెడి వానికి విరుద్ధముగా కనిపించినను వాస్తవముగా వైరుధ్యము లేదు. భగవంతుడు సర్వవ్యాపకుడై నందున అతనిలో జగత్తు గలడనెడిది సత్యమే. జగత్తులోని అన్ని వస్తువులలో సూత్రాత్మగా నుండుటచే అతడు జగత్తులోను యున్నాడు. చెట్టులో మండక యుండెడి మంటవలె, నురుగును క్రక్కెడి పాలలో ఉండెడి నెయ్యి వలె శివుడు అదృశ్యముగా ఉన్నాడు అతని యొక్క అస్తిత్వము యొక్క బలము వలననే జగత్తు ఈ విధముగా కొనసాగు చున్నది.

ఈ ప్రపంచమునందున అస్తి, భాతి, ప్రియ, నామ, మరియు రూపములను పంచతత్త్వములు గలవు. వీటిలో ఆస్తి, భాతి ప్రియములు పరమాత్ముని సచ్చిదానంద స్వరూపము యొక్క పరిచాయక ములైయున్నవి. వీటిని విడిచిన యెడల మిగిలిన ప్రపంచపు ఏ పదార్థముకైనను విలువ అనెడిది లేదు. ఈ విధముగా పరమాత్ముని అస్తిత్వము నుండియే ప్రపంచము యొక్క అస్తిత్వము ప్రాప్తించు చున్నది. సమస్త భువన బ్రహ్మాండములను తనయందున నుంచికొని, మరల తాను వాటిలోన యుండునది పరశివుని యొక్క విశిష్టతయై యున్నది. ఈ తెరగున, ప్రపంచము మరియు పరమాత్మల నడుమ ఆధార-ఆధేయ రూపమైన సంబంధము స్పష్టముగా కలదు. ఈ విధముగా ప్రపంచము మరియు పరమాత్ముల సంబంధమును వివరించిన శ్రీ పూజ్యపాదుల వారు ఏక భాజన స్థలములోని సాధకునికి ప్రపంచము మరియు పరమాత్మలు భిన్నముగా దోచక ఏకరూపములుగానే కన్పట్టునని చేప్పుచు శ్రీ భగవత్పాదుల వారు నీ క్రింది విధముగా నుపదేశించిరి.

**చిదేక భాజనం యస్య చిత్త వృత్తేః శివాత్మకమ్ ।**
**నావృత్తస్య కిమేతేన మాయామూలేన వస్తునా ॥** (సి. శి. 14-31)

శివునితో ఐక్య భావనను పొందిన ఈ ప్రకారముగా శివాత్మకమైన చిత్తవృత్తిగల శివయోగికి మాయామూలకమైన ఈ ప్రాపంచిక భేదము నుండి ఎలాంటి ప్రయోజనమూ యుండదు. ఎవరి చిత్తమున శివుడే వ్యాపించి యుండునో అతనికి వేరేదియూ కనిపించదు. మనము దేనిని చూచు చున్నాము, ఎలా చూచు చున్నాము అను దానికి మన మనస్సు యొక్క స్థితియే కారణము. ఎవరి హృదయము నందు నిరంతరము శివుని అస్తిత్వపు అనుభూతి యుండునో వారి చిత్తమునందు లేశ మాత్రమైననూ ప్రాపంచిక ఆసక్తి తలకెక్కదు. అప్రాప్తమైన వస్తువు కొరకు ప్రాప్తియొక్క ఇచ్ఛగూడ అంకురించును. అన్నీ లభించిన వానికి అలాగే అతృప్తునికి వాటి యొక్క స్పృహ యూ కలుగనేరదు. అలాగే ఏక భాజన స్థలమునందలి వాడు సర్వత్ర తన స్వరూపమునే దర్శిస్తూ సర్వ విషయ విముక్తుడై ఆనంద రూప స్థితి యందు వర్తించును.

ఈ ప్రపంచపు అస్తిత్వమునకు చిద్రూపియైన పరమాత్ముడే కారణమనుటను తెలియ పరుచుటకై జగద్గురు రేణుక భగవత్పాదులు ఈ విధముగా ఉపదేశించిరి.

**చితో ప్రకాశయతే విశ్వం తద్వినా నాస్తి వస్తుహి ।**
**చిదేక దిష్ఠ చిత్తానాం కిం మాయా పరికల్పితైః ॥** (సి. శి. 14-32)

ఘట పటాది ప్రపంచము నెల్ల చిద్రూపమైన పరశివుడే ప్రకాశంప జేయును. ఆచిత ప్రకాశము లేకుండిన ఎడల వేరే ఏ వస్తువునూ గోచరించదు. నీరు నందు పుట్టిన నురుగు నీరు రూపముగా అయియుండునటులనే చిద్రూపుడైన పరమాత్మయందుతోచెడి ప్రపంచమంతయు చిన్మయమే అయియున్నది. ఇంతటి చిద్రూపమైన పరమాత్మునిలో ఏక భాజన స్థితిని పొందిన శివయోగికి మాయా కల్పిత భేదము చేత ఏ ప్రయోజనము యుండదు. చిత్ర మందిరము నందున దోచెడి చిత్రములకు ప్రొజెక్టర్ నుండి వచ్చెడి ప్రకాశమే కారణమై యుండునటులనే ఈ ప్రపంచమనెడి చిత్రము యొక్క ప్రతీతికి పరమాత్ముని చిత్ప్రకాశమే కారణమగు చున్నది. ప్రొజెక్టర్ యొక్క ప్రకాశము లేని యెడల చిత్రములు కనిపించని యటులనే పరమాత్ముని ప్రకాశము లేని యెడల ఈ ప్రపంచము కనిపించదు. సూర్యుని మూసి మేఘము సూర్యుని ప్రకాశము నుండియే దోచునటుల పరమాత్మను మూసివేసిడి ఈ ప్రపంచము ఆతని వెలుగునందుననే దోచు చున్నది. ఈ విధముగా పరమాత్ముని ప్రకాశము గురించి తెలిపి శ్రీ పూజ్యపాదులవారు ఏక భాజన స్థలములోని భక్తుని యొక్క చరమ దశ గురించి ఈ క్రింది విధముగా తెలియ జేసిరి.

**వృత్తి శూన్యే స్వహృదయే శివ లీనే నిరాకులే ।**
**యస్సదా వర్తతే యోగీ సముక్తోనాత్ర సంశయః ॥** (సి. శి. 14-33)

బాహ్య వ్యవహారములన్నియును శూన్యము కాగా తన హృదయము నందు వుండెడి శివ పరబ్రహ్మ యందు ఎప్పుడూ శివయోగి యొక్క చిత్త వృత్తి సదాకాలము నందు లీనమగునో అప్పుడు తానే జీవన్ముక్తుడని అనిపించుకొను చున్నాడు చిత్తము బహిర్ముఖమైనపుడు సంసారము కలుగును అంతర్ముఖమైనపుడు ముక్తి లభించును. ఈ విధముగా చిత్తము యొక్క అంతర్ముఖత్వము, బహిర్ముఖత్వముల మీదనే ముక్తి మరియు సంసారములను గుర్తించ వచ్చును. విషయముల మీద చింతనను చేసెడి చిత్తము సంసారము వైపు పయనించును. అదే అంతర్ముఖమై శివచింతన యందు మునిగిన ఎడల ముక్తి మందిరము ప్రవేశించును.

మనము ఎవరి సమీపమునకు పోవుదుమో వారి స్వభావము యొక్క ప్రభావము మన మీద పడుట సహజము ప్రపంచము యొక్క స్వభావము దుఃఖ రూపముగా వుండిన ఎడల పరశివుని యొక్క స్వభావము ఆనంద రూపముగా నుండును. అందుచేత ఎంత కాలము ప్రపంచము నందున నివసించినను ఉత్తరోత్తర దుఃఖములే దొరకును కాని సుఖము దొరక జాలదు. అందుచేత పూజ్యపాదులు ప్రపంచాకారపు బహిర్ముఖ వృత్తిని పొంది అంతరంగపు శివ చింతనయందు నిలుచుటకు ప్రారంభించ వలెనని ఉపదేశించిరి. శివుడు సచ్చిదానంద స్వరూపుడగుటచే అతని చింతనచే అతని సచ్చిదానంద స్వరూపమే మనకు ప్రాప్తించును.

సముద్రము నందున ఎన్నో కెరటములు ఉదయించు చుండును. మన మనో వృత్తులు కూడా నట్టివే, జాగ్రత్, స్వప్నములలో నిరంతరముగా పైకి లేచెడి వృత్తులు సుషుప్తి యందున విలయమగు చున్నవి. గాఢమైన నిద్రావస్త యందు మనస్సులోని వ్యవహారము లన్నియును నిలిచిపోవును. ప్రతియొక్కరికి ఆనందాను భూతి కలుగును. అచ్చట ఏమీ లేకుండినను లేదా ఉండినను భేదముదోచదు. అందరికీ ఆనందము సమానముగా లభించును. ఇదే తెరుగున ఏక భాజన స్థలపు శివయోగి బహిర్ముఖమైన వృత్తులను నిరోధించి అంతర్ముఖమైన వృత్తి చేత పరమాత్ముని చింతించుచు అతని ఆవృత్తి అచ్చటనే అణిగిన ఎడల అదే అతని జీవన్ముక్తి ఇంతటి స్థితిని పొందునప్పుడు ఆ శివయోగి ఏకభాజన స్థళియని పిలిపించుకొను చున్నాడు. ఇట్టి స్థితిలో అతడు విశ్వమంతయును తెలిసికొనును. తాను కూడా శివునినేయను భావనను పొందును శివ, జీవ మరియు జగత్తులనెడి భావనలలోని భేదము సమసి పోవును. చిద్రూపమైన శివుని ప్రకాశము నుండియే జగత్తు ప్రకాశించునని తెలిసికొని ఆ శివుని సచ్చిదానంద స్వరూప చింతన యందున తన చిత్త వృత్తిని నిలుపును చివరకు ఆ చిత్తవృత్తిని అచ్చటనే లీనము చేసి జీవన్ముక్తి యొక్క విలక్షణమైన ఆనందమును అనుభవించు శివయోగియే ఏక భాజన స్థలి అనుటను తెలియ పరుచనైనది.

ఓం శాంతి : శాంతి : శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యుల వారు శివుడే సకల జగత్తుకు మూలాధారమని తెలియ జెప్పిరి.

భాజన మనెడి పదమును నాధార భూతమైన యంశముగా స్వీకరించ వచ్చును. భాండమే విధిన భాండములోని వస్తుజాలమున కాధారమగు చున్నదో అదే విధిన భాజనము ఆధేయమున కాధారమగు చున్నదని గ్రహించ గలరు. "భజ్యతే ఆధేయేనేతి భాజనం-భజ సేవాయాం" అనెడి వివరణ ప్రకారము ఆధేయము చేత పొందబడునది భాజనమగును.

సకల జగత్తుకు శివుడొక్కడే యాధార భూతమైన వాడనెడి యేకైక చిత్తవృత్తి గల్గిన వానిని యేక భాజన స్థలియని యన వచ్చును. వేరొక టేదియును నాధారముగా నుండ జాలదనెడి మనోవృత్తి వలన జనించిన జ్ఞానైక చిత్తుడితడని గ్రహించ గలరు.

జగత్తుకు శివుడొక్కడే ఆధార భూతుడై యుండెడి వాడని తేలిపెడి బసవపురాణములోని యీ ద్విపదలను గనుడి :

"వేదవేదాంతాది వాద సిద్ధాంత 'వాదతర్కముల సంపాదించి మించి' న్యాయవైశేషి కాద్యఖిల వాగ్గుష్ట 'ధీయుతోక్తుల బేక్కు దెరగులు సూపి' "నద్వితీయుండు రామనాథుడె కర్త 'సద్విధి సర్వము సర్వేశ్వరుండు' శ్రుతి "ఏక ఏవరు ద్రో" యను తత్త్వ గతి "లింగమధ్యే జగత్సర్వ" మనియు రతి "లింగబాహ్యాత్పరం నాస్తి" యనియు' సతతమిటుల చాటెడి గాన' యీక్షింప నింతయు నీశ్వరమయము దక్షత గల్గెనా తర్కింపు" దనిన.

(బసవ పురాణము షష్ఠాశ్వాసము)

"విశ్వం శివమయం" (సి.శి. 14-28) అని తెలిపిన శ్రీ భగవత్పాదుల వారి వాక్కులు స్మరణీయములు.

"లింగమధ్యే జగత్సర్వ" మ్మనెడి భావన యాగమ ప్రోక్తమైనది. "లీయతే గమ్యతే యత్రయేన సర్వం చరాచరం, తదేత ల్లింగ మిత్యుక్త" మ్మని యనుభవ సూత్రము (3:2) చెప్పు చున్నది ప్రళయమునకు ముందునను, వెనకనను జగమునకు లింగమే గతియైయుండు ననెడిదె గ్రహించ వలసిన విషయము ఈ భావమును తెలియ జెప్పెడి బిల్హణుని కృతిని గనుడి :

**సర్వేషాం హృది విద్యసే శివతతస్త్వద్ధ్యాన యోగేన కిం**
**విశ్వస్యోపరి వర్తసే యదితదా త్వత్పాదుమూలే నతిః**
**త్రైలోక్యం త్వయి లీయతే యదితదా త్వత్ప్రాప్త్యై పాయైరలం**
**సత్యప్యాయతనే తనౌ కిమపరం దైవం నరో చిష్యతే ॥** (బిల్హణస్తవము-4)

"త్రైలోక్యం త్వయి లీయతే" యనెడిది గ్రహించ వలసిన విషయము. ఈ స్తుతి యొక్క తెలుగు రూపమును గనుడి:

**ఉల్లము నందు నందరకు నుండెద లేని తలంచ నేల? ని**
**న్నెల్ల జగత్తుపై నెసగెదేని త్వదం ఘ్రికి మ్రొక్కునౌ జగం**
**బుల్లయ మొందనీ యొడల బొంద నుపాయము లేల? నిన్ను మే**
**నిల్లుగ నుల్లసిల్ల నిక నేటికి రోయగ నన్య దైవమున్.** (శ్రీ వింజమూరి లచ్చారాయ కవి)

శివం భూయాత్

## ఆశీర్వచనము - 1

## సహ భోజన స్థలము

జిజ్ఞాసువులైన సద్భక్తులారా !

శ్రీ సిద్ధాంత శిఖామణి యొక్క ఐక్య స్థలాంతర్గతములైన అవాంతర స్థలముల గురించి తెలిసి కొంటిమి. ఐక్య స్థలములో చివరి అవాంతర స్థలమే సహ భోజన స్థలము సహ భోజన స్థలమనగా ఇతరులతో కూర్చొని భుజించునదే సామాన్యమైన అర్థము అగు చున్నది. మన దేశము నందున ఈ సహ భోజన పద్ధతి ఎంతో ప్రచారము నందు గలదు. ఈ సహ భోజనము రెండు విధములుగా

నుండును. వేరే వేరే పళ్ళెరములలో వడ్డించు కొని ఒకే పంక్తి యందు కూర్చొని తినెడిది ఒక సహ భోజనమైతే, ఒకే కంచములో అనేకులు కూర్చొని తినునది ఇంకొక విధమైన సహ భోజనము ఈ సహ భోజనము వలన అన్యోన్య భావనలు పరస్పరముగా పెరుగును. సౌహార్ద్ర భావము ఏర్పడును. ఒక పరివారము నందున భర్త, భార్య, పిల్లలు సహ భోజనము చేయు చుండునటులనే ఒకే గురువు యొక్క అనేక శిష్యులు సహ భోజనము చేసెడి పద్ధతి రూఢియందు కలదు. ఇట్టి పద్ధతి వలన భేద భావనలు దూరమై ఐక్య భావన ఒన గూడును. వీరశైవులు పూజా పద్ధతి యందుననూ సహ భోజనము వంటి పరిపాటిని చూచు చున్నాము. ఇంటి యందున గురువుగారి పాదాపూజా సమారంభము నడచునప్పుడు పాదపూజ అనంతరము ఒక పాత్రయందు సంగ్రహించిన పాదోదకమును పాద పూజలో సమ్మిళుతులైన ప్రతి యొక్కరు ఆ ఒకే పాత్ర నుండి పాదోదకమును సేవింతురు. ఒకరు పాదోదకము స్వీకరించిన అనంతరము దానిలో ఉచ్ఛిష్ట భావనను దాల్చనిదే ప్రతి యొక్కరు పూజ్య బుద్ధి చేత సేవించెడి పద్ధతి ఇది. ఈ విధానములన్నియును వ్యావహారిక క్షేత్రమునందున మనుష్యులందున సౌహార్ద్ర భావనను పెంపొందించెడి సాధనములై యున్నవి. వ్యావహారిక క్షేత్రము నందున సహ భోజనము పద్ధతి యుండునటులనే ఆధ్యాత్మిక క్షేత్రముననూ ఒక సహ భోజన పద్ధతి కలదు. దీని గురించి జగద్గురువుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**గురోః శివస్య శిష్యస్య స్వ సరూపతయా స్మృతిః ।**
**సహ భోజన మాఖ్యాతం సర్వ గ్రాసాత్మ భావతః ॥** (సి. శి. 14-34)

ఇచ్చట సహ భోజనమనగా తాను మొదలు భిన్న భిన్నముగా అనుభవించిన పదార్థములను మరల తనయందే ఐక్యమగుటను తెలిసి కొనవలెనని అర్థము సాధకుడు ప్రారంభకా వస్థయందు తనను తాను గురువు కన్ననూ తన ఆరాధ్యుడైన శివుని కన్ననూ భిన్నముగా భావించు కొనును. అతడే వేళలలో ఐక్య స్థలమును తలపించు కొనునో ఆభేదము లేవియూ మిగిలి యుండవు. ఇటుల తన గురువు, తన ఆరాధ్య దేవుడిని తన ఆత్మజ తన సమరసముగా భావించు స్థలమే సహ భోజన స్థలము దానినే పూజ్యులు ఈ రీతిగా వివరించిరి.

**శివం విశ్వగురుం సాక్షాద్యో జయేన్నిత్య మాత్మని ।**
**ఏకత్వేన చిదాకారే తదిదం సహ భోజనం ॥** (సి. శి. 14-35)

సాక్షాత్తుగా శివాకారమైన తన యందున శివుని, గురువును, మరియు జగత్తును ఏక రూపముతో ఎప్పుడూ సంయోజనము చేసి యెరుగుటయే సహ భోజన స్థలమని తాత్పర్యము-శిష్యుడైన వాడు గురువు యొక్క ఉపదేశమును విని దానినే మననము మరియు ధ్యానము చేయుచూ పోయిన యెడల గురువుకు కలిగెడి అనుభవమే శిష్యునికి ప్రాప్తమగును. ఈ విధముగా ఇరువురి యొక్క అనుభవములు ఒకటి యైనప్పుడు వారిరువురి అనుభవముల యొక్క సామరస్యము ఫలితముగా వారిరువురి మధ్య ఎట్టి భేదము ఉండజాలదు. శిష్యుడు కూడా ఐక్య స్థితిని పొందుట చేత వారిరువురి మధ్యన బోధ్యాబోధక భావము వైదొలగి సామరస్య స్థితి గలుగును. గురువుతో ఐక్య భావనను దాల్చిన యటులే శివునితోనూ ఐక్య భావనను దాల్చుట చేత శిష్యుని స్థితి సహ భోజన స్థితియని పిలువబడినది.

ఈ విధముగా సహ భోజనము యొక్క స్వరూపమును అన్వయ మార్గము చేత ఉపదేశించిన పూజ్యులు దానినే వ్యతిరేక మార్గము చేత ఈ క్రింది విధముగా ఉపదేశించిరి.

**అయం శివో గురుశ్చైష జగదేత చ్ఛ రాచరం ।**
**అహం చేతి మతిర్యస్యై నాస్త్య సౌ విశ్వ భోజకః ॥** (సి. శి. 14-36)

దీని భావమేమనగా ఇతడు శివుడు, ఇతడు గురువు, ఇది జగత్తు, వీటి కంటెను నేను భిన్నమైన వాడిని అనెడి భేద ప్రతీతి ఎవరియందు వుండునో వారు "సహ భోజి అథవా విశ్వ భోజి" అని పిలిపించుకొన జాలరు. సహ భోజి స్థితిని పొందవలెననిన భేద భావములన్నింటిని విడనాడ వలసి యుండును. ప్రపంచము నందున సామాన్య వ్యవహారములలో భేదము వుండిననూ ఆధ్యాత్మికమైన అభేదమును సాధించు కొనునదే సహ భోజకుడి లక్ష్యమై యున్నది.

అభేద రూపమైన సహ భోజన స్థితిని పొందినప్పుడు శివయోగికి శాశ్వతమైన ఆనందము ప్రాప్తమగును. ఇంతటి సామరస్యైక్యానందమును అనుభవించునదే జీవన్ముక్తి యొక్క విలక్షణమైన ఆనందమని తెలిసికొన గలరు.

ఓం శాంతి : శాంతి : శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు శ్రీ చంద్రశేఖర శివాచార్యుల వారు సహ భోజన స్థలమున జీవుడు పొందెడి యభేదానుభవము గురించి తెలిపిరి.

అవిధ్య వలననే శివ-జీవ, శివ-జగత్, జీవ-జగత్తులు వేరుగా నుండెననెడి భావములు పుట్టు చున్నవి. భేదభావము వదలి పోయినగాని ముక్తి దొరక దనెడిది శివాద్వైతుల నిశ్చితాభిప్రాయమని తెలియు చున్నది. ఈ విషయమును తేట తెల్లము జేసెడి యీ పద్యమును గనుడి.

**సమసి పోయినగాని చనదు భవము**
**జీవుడను తలంపు శివజీవ భేదంబు**
**వమ్మగాని యెడల భవముచనదు**
**జగమనే భావంబు జగ-శివ భేదంబు**
**చనిపోవ కున్నచో చనునె భవము?**
**తాననే భావంబు తర-తమ భేదంబు**
**తరలి పోయినగాని తగులు పోదు.**
**భేద భావంబె భవముకు విత్తనంబు**
**సత్య మెరుగుడి భవముకు సత్యమిదియె**
**యైక్య సిద్ధిని పొందుట కై వదలుడు**
**భేదముల నెల్ల సమరస వేద్యులార**

(మార్గం పెద్ద వీరప్ప కవి అముద్రితము)

శివం భూయాత్

## ఆశీర్వచనము - 2

## సహభోజన స్థలము

శ్రీ రేణుక భగవత్పాదుల వారు సహభోజన స్థలము నందున శివయోగి యొక్క మనోవృత్తి పరిపూర్ణమైన అద్వైతస్థితిని పొందునని తెలియపరచుచూ పూజ్యపాదులు ఈ క్రింది విధముగా ఉపదేశము నిచ్చిరి.

**అహం భృత్యః శివః స్వామీ శిష్యో -హమ్ గురురేవవై ।**
**ఇతి యస్య మతిర్నాస్తి సచాద్వైత పదే స్థితః ॥** (సి. శి. 14-37)

ఈ ఉపదేశములోని అర్థమేమనగా నేను సేవకుడను. శివుడు అధిపతి నేను శిష్యునిని. వీరు గురువుగారు. అనెడి భేద భావము ఎవరి యందు వైదొలగి పోవునో అతడే శివైక్యరూపమైన అద్వైత స్థితిని పొందును.

సామాన్యముగా లోకమునందలి సామాన్య జనుల మనస్సునందున స్వామి, భృత్య, గురు, శిష్య భావనలు వుండును. అందుచేత వీరు మా యింటి గురువుగారు. మా యింటి దేవుడు అనుచు భేదభావమును చూపుచుందురు. వ్యావహారిక దృష్టి యందున ఇది యోగ్యమై యున్నది. ప్రారంభావస్థ యందున ఈ భేద భావము సాధకునికి పోషకముగా దోచిననూ సాధన శక్తివంతమైన పిదప

భేదము తరగిపోవుచు వుండవలసి వచ్చును. అటుల కాకుండా పోయిన యెడల సాధకుని ప్రగతిలో మార్పు కనబడదు. శివధ్యానము, శివచింతనలను చేయుట యనగా యాంత్రికముగా శివధ్యానము చేయుటకాదు. శివచింతన చేయుచూ చేయుచూ చివరకు శివస్వరూపుడుగా మారుటయే శివచింతనలోని వుద్దేశ్యము. శివధ్యానము మరియు శివచింతన చేశెడి వారి మనస్సులలో సావకాశముగా శివభావన దృఢమగు చుండును. ఈ భావన పెరుగుచూ పోవుటచేత తాను శివసేవకుడిగా వున్నాననెడి మొదటి భేద భావన క్రమక్రమముగా తగ్గిపోవును. ఆరాధ్యుడు అగు శివుని మరియు తనయందున భేదము సమసి పోయిన యటులనే గురు శిష్యుల మధ్యగల భేద భావము కూడా సమసి పోవును. ఈ విధముగా గురు శిష్య, స్వామి భృత్య సంబంధములు నిశ్శేషముగా నిర్మూలమైన పిదవ పరమాద్వైత స్థితి ప్రాప్తమై శివయోగి సహాభోజన స్థలి యగు చున్నాడు.

ఇట్టివాడు మునుముందు వహించెడి భూమిక గురించి శ్రీ భగవత్పాదులు ఈ క్రింది విధముగా వుపదేశము నిచ్చిరి.

**పరాహంతామయే స్వాత్మ పావకే విశ్వ భాస్వతీ ।**
**ఇదంతాహ వ్యహోమేన విశ్వహో మీతి కథ్యతే ॥** (సి. శి. 14-38)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా పరాహంతా రూపమైన స్వాత్యాగ్నియందు అదీ, ఇదీ అనెడి భేదము ప్రతీత రూపమైన ప్రపంచమనెడి హోమద్రవ్యమును హవనము చేయువాడే విశ్వహోమి యని యెరుగు వలెను. లోకమునందున హోమము చేయునపుడు ఒక అగ్నికుండమును నిర్మాణము చేశి దాని యందు అగ్నిని ప్రజ్వలించి, ఆజ్య, సమిధల చేత హోమము చేయునది కాంచుచున్నాము. హోమము చేయుటకు పూర్వమున వేరు వేరు జాతికి చెందిన సమిధలు హోమమైన పిదప ఒకే విధమైన భస్మరూపమున పరివర్తన మొందుట చూడగలము. హోమపు వుద్దేశ్యము కేవలము ఆజ్యమును మరియు సమిధలను దహించుటయే కాదు. అయితే మనలోపల నుండెడి ద్వైత భావనలు అనెడి సమిధలను దహించి వేయుటయే సామాన్య జీవులయందు 'అహంతా' యండిన యెడల జ్ఞానుల యందు 'పరహంతా' యుండును. 'అహంతత' ద్వైత భావనకు మూలమైన యెడల 'పరహంతత' అద్వైత భావనకు నాంది యగుచున్నది. జీవుల యందలి వ్యష్టి రూపమైన 'అహంతత' వారి బంధమునకు కారణమైన యెడల 'పరాహంత' రూపమైన సమిష్టి అహంభావము ముక్తికి సాధనమై యున్నది. ఈ కారణము వలననే భగవత్పాదుల వారు 'పరాహంతా' రూపమైన అగ్ని యందున విశ్వము యొక్క భేదము నెల్లనూ హవనము చేయవలెనని ఉపదేశించిరి. అగ్ని గుండము నందలి అగ్నికిలోనైన సమిధలన్నియును ఏ విధముగా అగ్ని రూపముగా అగుచున్నవో 'పరహంతా' రూపమైన అగ్నియందున సమర్పించిన ప్రపంచము యొక్క ద్వైతమంతయు 'పరహంతా' రూపమునే అగుచున్నది. అనగా ఈ విశ్వహోమి సర్వమంతయును తన ఆత్మ రూపముగానే భావించు చున్నాడు. ఈ విధముగా సంపూర్ణ విశ్వమును 'అహం' రూపమున అనుభవించెడి ఈ శివయోగి యొక్క భావమును 'పరహం' లేదా 'పరాహంతా' అని పిలుతురు. ఇంతటి 'పరాహంతా' సంపన్నుడైన శివయోగియే విశ్వహోమి అనెడి వాడుగా పిలువ బడుచున్నాడు. శివైక జ్ఞాన సంపన్నుడైన శివయోగి 'పరాహంతా' స్వరూపమును వివరించిన పూజ్యులు అతని యందలి 'పరాహంతా' ఏ విధముగా పూర్ణహంతా యగునో ఈ క్రింది విధముగా వివరించిరి.

**అహం శివో గురుశ్చాహ మహం విశ్వమ్ చరాచరమ్ ।**
**యయా విజ్ఞాయతే సమ్యక్పూర్ణా హంతేతి సా స్మృతా ॥** (సి. శి. 14-39)

శివుడను నేనే గురుడను నేనే. చరాచరాత్మకమైన ప్రపంచము నేనే అని సర్వమును తన ఆత్మరూపముగా అనుభవించునదే 'పూర్ణాహంతా' అనబడు చున్నది. అహమనెడి శబ్దము అకారాది హకారాంతముగా నుండెడి సకల మాతృ కాక్షరముల క్రోడీకరణ రూపముగా నుండి మరియు బిందు సమేతముగా నున్నది. ఆగమ సిద్ధాంతము నందున శివుని నాదమనియును. శక్తిని బిందు వనియును పిలుతురు. విశ్వము యొక్క ఉత్పత్తికి కారణభూతమైన శక్తిని పరాహంతా యనియును, విమర్శ శక్తి యనియును పిలుతురు. శివైక్య స్థితిని పొందిన శివయోగి పరాహంతా లేదా పూర్ణహంతా స్థితిని పొందుట చేత విశ్వమంతటినీ తన ఆత్మ రూపముగా తెలిసికొనెడి యోగ్యతను పొందు చున్నాడు ఈ విధముగా అతని యందు వుండెడి సమిష్టి అహము పూర్ణహంతాయని పిలువబడు చున్నది. ఈ స్థితిని పొందిన శివయోగి ద్వంధ్వభావములను వీడి నిర్ద్వంధ్వ స్థితియందున యుండి ఆనందమును అనుభావించు చుండును.

ఈ ఐక్య స్థలమునందలి శివయోగి యొక్క అద్వైత స్థితిని శ్రీ పూజ్యపాదుల వారు ఇంకొక రూపమున తెలియపరచిరి.

**ఆధారవహ్నౌ చిద్రూపే భేదజాతం జగద్ధవిః ।**
**జుహోతీ జ్ఞానయజ్వాయః స జ్ఞేయో విశ్వహవ్య భుక్ ॥** (సి. శి. 14-40)

ఎవడు చిద్రూపమైన ఆధారయగ్ని యందున జగత్తు యొక్క భేద సమూహము నంతనూ హవిస్సుగా అర్పించి హోమమును చేయునో అతనిని "జ్ఞాన యజ్ఞ దీక్షిత" అనియును "విశ్వహవ్యభోజి" యనియును పిలుతురు. ఇంతటి జ్ఞాన యజ్ఞము ముఖాంతరముగా ఎవరి యహంభావము విశ్వవ్యాపకమగునో వారు తమను విశ్వరూపముగా భావించుకొను చున్నారు. ఈ విశ్వాత్మక భావన వలన సంకుచిత భేదభావనలు తొలిగి పోవును. ఈ అనుకూల ప్రతికూల భావనలు తొలిగిన పిదప అతని ద్వారా పుణ్యపాపములు సంభవింప జాలవు. పుణ్యాపాపములే లేని యెడల జనన మరణ రూపమైన చక్రము కూడా లుప్తమగును. ఈ విధముగా శివాద్వైత భావన సంసార చక్రము నుండి తరించెడి శ్రేష్ఠమైన ఉపాయముగా భావించవలెను. దానిని పొందుటకు గల విధానమును శ్రీ పూజ్యపాదులు ఇచ్చట ఉపదేశించిరి.

ఈ శివాద్వైత స్థితిని పొందిన శివయోగి అన్యుల యెడల సమానుభూతిని కలిగి యుండును. లౌకిక జీవుల యందున సానుభూతి యుండిన యెడల శివజ్ఞానులైన శివయోగుల యందు సమానుభూతి యుండును. అన్యులు రోగముల చేత దుఃఖముల చేత బాధపడునప్పుడు వారిని పలుకరించుట అనెడిది శిష్టాచారమై యున్నది. బాధపడెడి వారిని సమాధాన పరచుటకు కొన్ని మంచి మాటలు చెప్పుటయు గాంచు చున్నాము. దీనినే సహాను భూతి యని అందురు. ఇంకను ఇతరులు అనుభవించెడి దుఃఖమును చూసి మన అంతఃకరణమునందున అదే దుఃఖము అనుభవించిన యెడల అది సమానుభూతి యగుచున్నది. ఒకసారి రామకృష్ణ పరమహంసగారు హుగ్లి, నదియందున నౌకలో కూర్చొని ప్రయాణము చేయుచుండెను. అక్కడ ప్రక్కనే వున్న కొంతమంది జనులు ఒకనిచుట్టుచేరి మనస్సుకు వచ్చినటుల తిట్టుచుండిరి. ఆదృశ్యమును చూశి పరమహంసగారు నౌక నుండి లేచినిలచి నన్నుకొట్టవలదు అని గట్టిగా అరచిరి. పరమహంసగారి ఆర్ధధ్వనిని విని స్వామీ! మిమ్ములనెవరు కొట్టుచున్నారు? ఎందుకు కేకలు పెట్టితిరి? అని ప్రశ్నంచిరి. అప్పుడా పరమహంస అక్కడ కూర్చుని వున్న నిందిత వ్యక్తి వైపు చేతిని చాచిచూపి అదిగో! చూడుడి అచ్చట నన్ను కొట్టుచున్నారు. అని చెప్పెను ఇది పరమహంసగారి సమానుభూతికి ఉదాహరణ అచ్చట కొట్టుచున్న వారిని వుద్దేశించి కొట్టవలదు అని చెప్పుచూ దెబ్బలు తినెడి వాడి యెడల కరుణా భావము వహించుట సమానుభూతికి చిహ్నము. విశ్వశాంతికి సహాను భూతి కంటెను సమానుభూతియే దోహదకారిగా నుండును. ఐక్యస్థితిలోని శివయోగి ఇట్టి సమానుభూతినే పొందునని గుర్తించవలెను.

ఈ విశ్వభోజి విశ్వమునందలి భేదమును ఏ విధముగా దూరము చేసి కొనవలెననెడి ప్రశ్న ఉదయించినపుడు శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా వుపదేశమునిచ్చిరి.

**చిదాకారే పరాకాశే పరమానంద భాస్వతీ ।**
**విలీన చిత్తవృత్తీణాం కావా విశ్వక్రమస్థితిః ॥** (సి.శి. 14-41)

దీని భావమేమనగా ఊర్ధ్వకమలము యొక్క నడుగడ్డయందు యుండెడి రంధ్రములో నిత్యానంధమయముగా నుండెడి మహాలింగమనెడి సూర్యుని యందున మనోవ్యాపారములన్నియును లీనమైయుండెడి ఐక్యస్థలములోని శివ యోగికి ద్వంద్వాత్మకమైన వ్యవహారములు ఏ విధముగా గోచరించును. గోచరించవనెడిదే తాత్పర్యము. విశ్వము యొక్క వ్యవహారమును లేకుండగ చేసుకొనవలెననిన దానిని నష్టము చేశెడి వుద్దేశ్యము పొందక తన చిత్తవృత్తిని దాని నుండి పరా వర్తన చేసికొని అంతర్లీనము చేసికొనిన యెడల ప్రపంచములోని ద్వైతభావములన్నియును అదృశ్యమై పోవును. మనము గాఢనిద్రలోనున్నపుడు బహిరంగము యొక్క ప్రపంచము ఏ విధముగా కనిపించదో అటులనే అంతరంగములోని మహాలింగమునందు చిత్తము అణిగిన పిదప శివ యోగికి ఎట్టి ద్వైతభావములు వ్యవహారము అనుభవమునకు రాదు. శివుని చేత సృష్టించబడిన జగత్తును నష్టముచేశెడి హక్కు మనకు లేదు. ప్రపంచము యొక్క వ్యవహారము అవసరమని యెంచిన యెడల అద్దానిని నాశనము చేయుటకంటె నా చిత్తవృత్తిని అంతర్లీనము చేసికొనుటయే వుత్తమమైన పద్ధతి. ఈ విధముగా చేశిన యెడల ప్రపంచము యొక్క వ్యవహారము తనంతటతానే అదృశ్యమగును. శివయోగిని అది బాధించజాలదు.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

## విశేషప్రదీపిక

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యుల వారు నీ యాశీర్వాదమునందున చిదగ్ని గుండములో సకల విధములైన భేదభావములను త్రేల్చవలెనని సెలవిచ్చినారు.

సహభాజన స్థలి సహభోజన స్థలియు ననబడు చున్నాడు. కారణమేమనగా నితడు భేదభావమనెడి సమిధలను నగ్నికి నాహుతిగా నిచ్చి తద్యజన ఫలము ననుభవించి విశ్వభుక్కగు చున్నాడు. వీరశైవుడు చేయదగిన హోమమిదియే యని యెరుగ వలెను. విశ్వములో నెలకొని యున్న భేదము భావములతో హోమమును చేసి విశ్వహోమితయై నిలిచెడి వీరశైవుడే విశ్వభాజనుడై, విశ్వ భోక్తయై యైక్య స్థలి యగునని గ్రహించ గలరు.

భేద బుద్ధిని బుగ్గిగా జేయుమని పిలుపు నిచ్చిన ఒక భక్తుని ప్రభోధము క్రింద విధిన యున్నది.

"అదియిదియను తలపు, ఇది కాదనుటయు వీడి" చరియించినన్ భవభీతి వీడు అదియిది యనుబుద్ధిని బుగ్గిగాగ కాల్చి భూతి నొప్పుగ దాల్చుమో బుద్ధిమంత।

(మార్గం పెద్ద వీరప్ప కవి అముద్రితము)

శివం భూయాత్

## ఆశీర్వచనము - 3

ఇంతకు క్రితము సహభోజన స్థలములోని కొన్ని విషయములను తెలిసికొనియుంటిమి. ఈ స్థలమునందున ముఖ్యముగా ప్రతిపాద్యమైన విషయమేమనగా శివయోగి యొక్క అద్వైత స్థితి యనెడిది చివరిదశ. సంసారమునందున ఎంతో ఆసక్తియున్న శ్రేష్ఠమైన సాధకునికి దీనిని తెలుసు కొనవలెననెడి కోరిక వుండుట సహజమే. ఇది ఒక అపూర్వమైన సంపత్తు ఎన్నటికినీ తరగనిది. దీనిని బడసినవాడు నిజమైన శ్రీమంతుడు అగుచున్నాడు. జనసామాన్యులకు శివాద్వైత భావన యొక్క మహత్వము తెలియనందున క్షణికమైన భౌతికసంపత్తి పొందుటలోనే జీవితమును గడపుచున్నాడు. ఈ కారణము వలననే వేదాంతులు పిడికిలి పట్టివచ్చాడు చేతులుచాపి పోయాడు అని అందరు. పుట్టినప్పుడు పసివాడు పిడికిలిని బిగించుకొని తల్లి గర్భము నుండి బయటకు వచ్చును. వృద్ధాప్యదశలో ప్రాణము విడుచునప్పుడు అదే వ్యక్తి రెండు చేతులను చాపుకొని ప్రాణములు వీడును. ఈ దృశ్యమును చూచినపిదప వ్యక్తి సంసారమునకు వచ్చినప్పుడు ఏదియో పట్టుకొని వచ్చినాడు కాని వెడలునప్పుడు దానిని విడచి వేసి వెళ్ళినాడు అనెడి భావన కల్గును, ఇహలోకము నందున మనము జీవన కాలములో గడించిన సంపత్తిని మృత్యు దేవత ప్రభావము వలన క్షణములో విడచివేసి వేళ్ళుచున్నాము. మనము సాంపాదించిన ఆస్తి అన్యుల పరమగును. ఈ విషయము నెరుగక దివారాత్రములు కష్టపడుచూ ధనమును సంపాదించు చున్నాము. ఇది ఇటులుండగా శివద్వైతమనెడి జ్ఞానమును సంపాదించిన యెడల అద్దానిని మృత్యువుకూడ మను నుండి దూరము చేయజాలదు. ఇదియే ఈ స్థలములో చెప్పబడిన విషయము యొక్క సారాంశము. శరీరము మరియు శరీరమునకు సంబంధించిన భౌతిక ప్రపంచము వైపుననే లక్ష్యమునుంచుకొనిన జీవులకు శివాద్వైత భావము ఎప్పటికినీ లభించ జాలదు. ఈ కారణము వలననే శ్రీమాన్ నిజగుణ శివయోగిగారు 'మతిగల్గనే జడులకు అద్వైతమును అరయుటకు' అని ప్రశ్నించిరి. ఇదే విషయమును యాజ్ఞవల్క్య ఋషులవారు తమ ధర్మపత్నియైన మైత్రేయికి చెప్పియుండిరి.

ఒకసారి యాజ్ఞవల్క్య మహర్షి గారు విధి ప్రకారము సన్యాసమును స్వీకరించవలెనని యోచించి తనయిరువురు పత్నులైన కాత్యాయని, మరియు మైత్రేయిల యొక్క పోషణ గురించి తనభౌతిక సంపదను సమానముగా పంచి యిరువురును పిలిచి ఆసంపదను వారికి అప్పగించి నేను సన్యాసమును స్వీకరించుటకు పోవుచున్నానని చెప్పిరి. కాత్యాయని తనకు దొరికిన సంపదను గైకొని మౌనముగా నుండెను. మైత్రేయి మాత్రము నాకు నీవు విడిచి పోయెడి యందును భాగము అవసరము లేదు. నీవు దేనిని సంపాదిచుటకు వెడలు చున్నావో దానిలో నాకు భాగము కావలెనని కోరెను. మైత్రేయి యొక్క మాటలను విని యాజ్ఞవల్క్యుడు సంతుష్టాంతరంగుడై ఆమెకు అద్వైతజ్ఞానము నుపదేశించెను. ఈ కథ బృహదారణ్యక ఉపనిషత్తునందున ఎంతో విస్తారముగా ప్రతిపాదించబడినది. జడపదార్థముల

యెడల ఆసక్తిగల వారికి లేదా జడబుద్ధిగలవారికి శివాద్వైత విద్యరుచించదని నిజగుణులవంటి జ్ఞానుల యొక్క అభిప్రాయము. వీరశైవ శరణులు కూడా వేయింటికి ఒక సత్యము, లక్షకు ఒక భక్తుడు, కోటికి ఒక శరణుడు అని తెలియజేశిరి. దీనిలోని భావమేమనగా ఐక్య స్థలమునకు చేరెడివారి యొక్క సంఖ్య ఎంతో పరిమితముగా నుండును.

చేతిలోపలి ఏదో ఒక వస్తువును విడిచివేయుట సరళమైనప్పటికినీ, మనస్సుయనెడి పిడికిలి యందుగల వస్తువును విడుచుట దుస్సాధ్యమే మనస్సుయొక్క ముష్టి కపిముష్టి వంటిదని పండితులు అందురు. కోతులను పట్టెడువాడు కోతులను పట్టుకొనుటకు సన్నని మూతిగల ఇనుపగుండిలో పుట్నాలను వేసి నేలమీద పెట్టెదరు. కోతి వచ్చి ఆ పుట్నాల ఆశకు గుండిలో చేతినివుంచి పుట్నాలను పిడికిలిలో పెట్టుకొని చేతిని పైకిలాగుటకు ప్రయత్నించును. కాని పిడికిలి బిగించినందున చేయి బయటకు రాదు. ఈలోపున కోతుల పట్టెడువాడు వచ్చి దానిని పట్టుకొని బంధించును అదే విధిన జడవస్తువులను తన పిడికిలిలో బిగించుకొనుట చేత సామాన్యమానవుడు సంసారము నుండి విముక్తిని బడయవలెననిన జడవస్తువుల యొక్క చింతనను విడిచివేసి చిదద్వైత చింతన యందు మునిగిపోవలెను. అందులకే శ్రీ రేణుక భగవత్పాదులవారు ఈ స్థలమునందున చిదద్వైత చింతన యొక్క రహస్యమును తెలియజేశిరి. ఈ విషయమున భగవత్పాదుల వారు మరికొంత వుపదేశమును ఈ క్రింది విధిన ఇచ్చిరి.

**నిరస్త విశ్వసంబాధే నిష్కలంకే చిధంబరే ।**
**భావయేల్లీనమాత్మానమ్ సామరస్య స్వభావతః ॥** (సి. శి. 14-42)

దీని భావమేమనగా సహభోజన స్థలపు శివయోగి జననమరణాది సకల క్లేశములు మరియు దోషములు లేని జ్ఞానా కాశరూపమైన ఆలింగతత్వమునందున తాను స్వరూపహాని, వృద్ధులు లేని సజాతీయ సమాన సమరస భావనతో స్థిరముగా అణగి పోవుదునని భావించును. మరొక మాటలో చెప్పవలెననిన సంసార బాధలు లేనిదియును నిష్కళంకమైనదియును చిదంబరమునుందు వుండెడిదియును నగు పరతత్వములో తాను సామరస్య పూర్వకముగా లీనమైనటుల భావించు కొనును లింగతత్వమేతానని తానే లింగతత్వమనీ యెరిగి అచ్చటనే మౌనముగా నుండును. ఇట్టి అనుభవము సులభముగా లభించునది కాదు. నచికేతుడు యముని దగ్గరకు పోయి ఆత్మవిద్యను ఉపదేశంచమని కోరినప్పుడు యముడు అతనికి ఆత్మవిద్యను బోధించక ఆయుష్షు ఐశ్వర్యము, అధికారము, పుత్ర పౌత్రాది ప్రలోభములను చూపెను. నచికేతుడు వాటికి లోంగలేదు. ఆత్మవిద్యనే కోరెను. యముడు చివరకు ఆత్మవిద్యను బోధించెనని కఠోపనిషత్తున తెలియజేయబడినది. ఈ కథలోని నీతి యేమనగా భౌతిక ప్రలోభములకు లోనుగాకుండా వుండిన యపుడే శివాద్వైత విద్య ప్రాప్తమగును. యెనువది నాలుగు లక్షల జీవరాసుల యందున కేవలము మానవునికి మాత్రమే ఈ విద్య లభ్యమగు చున్నదని శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిరి. అయిననూ మనుజులందరూ దీని యెడల ఆసక్తిని ప్రదర్శించుట లేదు. దీనికి గల కారణమేమనగా వీరందరునూ పాశబద్ధులై యున్నారు. పాశబద్ధులైన వారు పశుతుల్యులు అగుచున్నారు. దేవునికి అర్పించుటకు కొబ్బరికాయను కొనుటకు వెళ్ళెడి మనుజుడు దానిని అటులనె తీసుకొని రాకుండా పొట్టుతీయించి, వాయించి, అటు యిటూ వూపి దానిలో నీరు కలదో, లేదో తెలిసికొని తాను తీసుకొని వచ్చుచున్నాడు. బయటికి చూచుటకు అది టెంకాయ వలె కన్పించిననూ లోపల కొబ్బరి మరియు నీరు వున్నదో లేదో యనెడిది పరీక్షించిన యటులనే మనజుని ఆకృతిలో నున్నవానికి మానవత్వము ఎంత మేరకు గలదు. అనెడిది గుర్తించ వలసి యున్నది. ఆ విధముగా పరీక్షించిన యెడల నిజమైన మానవులు కొందరే కలరని తేలుసు. ఈ కారణము వలననే మనుజులను సంస్కరిచుటకై పలు విధములుగు మార్గములు సూచింపబడినవి. వీటిలో యోగము యిత్యాదులు కలవు. ఈ మార్గములను అవలంబించి శరీరము, వాక్కు, మనస్సు మరియు బుద్ధులను సంస్కరించు కొనుటకు ప్రయత్నించువారునూ కలరు. అటులనే ఆత్మ విద్యప్రాప్తికి ప్రయత్నించ వలసిన అవసరము కలదు. మనదేశములోని మహాత్ములందరూ ఈ విషయమై తమ జీవితములను త్యాగము చేశి తమ అనుభవములను రచనల రూపమున సమాజమునకు అందజేశిరి. వాటిని చదివి వారి అనుభవమును చింతన చేయుట ద్వారా వారి అనుభవమును పొందుటకు సాధ్యమగును. ఈ మార్గమున పయనించెడి వాడు విసుగును పొందుకుండా తన ప్రయత్నమును సర్వదా కొనసాగించు చుండ వలెను. శ్రుతియు "స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమది తవ్యం" అని భోధించినది. ప్రమాదము అనగా ఆలస్యము ఏదో ఒక నియమమును మనుజుడు చేపట్టినప్పుడు కొన్ని సదర్భములలో ఆనియమములకు భంగమయ్యెడు స్థితి ఏర్పడును. అయిననూ ఆనియమమునూ తప్పకూడదు అనెడిదియే శాస్త్రము యొక్క ఆదేశమై యున్నది. ఒక్క సారి తప్పుచేసిన యెడల మరల మరల తప్పు చేయుటకు అవకాశమేర్పడు చున్నది. మన జీవితము నందున అన్ని విషయములకు సమయము కేటాయించినటులనే స్వాధ్యాయమునకు కూడా కొంత సమయమును కేటాయించ వలెను. తానొక్కడే కూర్చొని శాస్త్ర గ్రంథములను అభ్యసించిన యెడల దానిని స్వాధ్యాయమని యందురు. తాను తెలిసికొనిన తత్వమును ఇతరులకు

భోధించిన యెడల అద్దానిని ప్రవచనమని అందరు. ఏ విధముగా ఆహారసేవన దైహిక బలవర్ధనకు కారణమగు చున్నదో అటులనే స్వాధ్యాయ ప్రవచనముల వలన మానసిక మరియు భౌద్ధిక పురోభివృద్ధి జరుగు చున్నది. కుండలో వండి పెట్టి వుండిన దానిని తినుటకు ఎంతో మంది కలరు. కాని బుద్ధి యనబడెడి కుండలో నున్న దానిని గైకొని తినెడి వారు తక్కువగా వుందురని తెలిసికొనిన శాస్త్రకారులు స్వాధ్యాయ ప్రవచనములకై ఆదేశమునిచ్చిరి. లోకములో ఎన్నో విద్యలు కలవు. ఇవన్నియును భుక్తి కొరకే ముక్తికొరకుండెడి సాధనమే ఆధ్యాత్మిక విద్య అందుచేతనే శ్రుతి 'సావిద్యా యా విముక్తయే' అని తెలిపినది. ముక్తిని కలిగించెడి విద్యయే నిజమైన విద్యయని ఈ శ్రుతివాక్యములోని భావము.

**సైషా విద్యా పరా జ్ఞేయా సత్తానంద ప్రకాశినీ ।**
**ముక్తిరిత్యుచ్యతే సద్భిర్జగ న్మోహనివర్తిన్ ॥** (సి. శి. 14-43)

సచ్చిదానంద స్వరూపమునూ, ప్రకాశమానమూ అయి వున్నదియునూ అగు విద్యయే పరావిద్య దీని నుండియే జగత్తులోని భేదభ్రాంతి దూరమగును. ఈ విద్య చేతనే పరతరముక్తి ప్రాప్తమగును. ఇదియే సరియైన నిజమైన విద్య. దీనిని ఎవరు బడయుదురో వారి జన్మయే పరమ పావనము. ఆత్మ జ్ఞానమునకు సరి యయ్యెడి వేరొక వస్తువులేదు. నిష్కళమైన మరియు నిరంజనమైన పరతత్వమును ప్రతిపాదించుటచే ఈ విద్యకు ఇంతటి పవిత్రత ప్రాప్తమైనది. ఇట్టి విద్యను పొందిన వారెల్లరూ పరమపావనులే. ఈ విద్యద్వారనే జీవుడు ముక్తి పరమకైవల్యమును పొందును. ఈ పరమకైవల్య పదమునే ఐక్య స్థలమని యందురు. ఇదియే అంగషట్ స్థలమునందున అంతిమ స్థితి ఈ స్థితిని బడసిన వాడు శివుడగు చున్నాడు.

వీరశైవ సిద్ధాంతము ప్రకారము బందము మరియు ముక్తి యనగా శక్తి యొక్క సంకోచ వికాసములే. శక్తి యొక్క సంకోచము చేత అంగుడు బంధనమునకు గురియగు చున్నాడు. ఆ బంధములు సడలి లింగాంగ సామరస్యము సిద్ధించవలెననిన శక్తి వికాసమును పొందవలెను. ఇచ్చట షట్ స్థల సోపానము నందున క్రమక్రమముగా భక్తి రూపముననున్న శక్తి వికాసమును పొందు చున్నది. షట్ స్థల సోపానములలో మొదట శ్రద్ధా భక్తి ఏర్పడి ఆ పిదప నిష్ఠా భక్తి, అవధాన భక్తి, అనుభవ భక్తి, ఆనంద భక్తి సమరస భక్తి అనెడివి సమకూరును. ఇవి యన్నియును భక్తి యొక్క వికాస క్రమమును చూపించు చున్నవి. తత్ఫలితముగా సాధకుడు భక్త మహేశ, ప్రసాది, ప్రాణలింగి, శరణ మరియు ఐక్య స్థలమును పొందుచున్నాడు. ఈ పరంపరలోని చివరి దశను చేరిన శివయోగి సర్వ బంధముల నుండి విముక్తిని పొంది పరమకైవల్యమును పొందుచున్నాడు. ఈ విధముగా తెలిపిన శ్రీ భగవత్పాదుల వారు ఈ స్థలము యొక్క ఉపసంహారమును ఈ క్రింది విధముగా చేశిరి.

**భక్తాది నార్మాపర ధర్మయోగాత్ ప్రాప్యే కభావః పరమాద్భుతేన ।**
**శివేన చిద్వ్యోమమయేన సాక్షాత్ మోక్షశ్రియో భాజన తాముపైతి ॥** (సి. శి. 14-44)

ఈ శ్లోకములోని తాత్పర్యమేమనగా భక్తాది స్థలముల అవాంతరములైన నలుబది నాల్గు స్థలముల యందు చెప్పబడిన సదాచారములను అనుష్ఠానము చేయుట చేత హృదయ కమల మధ్యమున నుండెడి జ్ఞానాకాశ స్వరూపము పరమాశ్చర్యరూపము అయిన మహాలింగముతో ఇంతకు పూర్వము చెప్పిన రీతిలో సామరస్యమును పొందిన యోగి పరమమోక్ష లక్ష్మిని పొంది అచ్చమైన సుఖమును పొందుచున్నాడు. అని చెప్పుచూ శ్రీ భగవత్పాదుల వారు సహభోజన స్థలమున తన ఉపదేశమును ముగించిరి.

ఐక్య స్థళమునందలి ఐక్య స్థలము, ఆచార సంపత్తి స్థలము, ఏక భాజన స్థలము మరియు సహభోజన స్థలములు అనెడి అవాంతర భేదములు గల ఈ సిద్ధాంత శిఖామణి యొక్క పదునాల్గవ పరిచ్ఛేదము సంపూర్ణమైనది.

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

## విశేషప్రదీపిక

ఈ ఆశీర్వచనమున శ్రీ కాశీ జగద్గురువుల వారు సహభాజన స్థలి యొక్క చిత్తస్థితి గురించి తెలియ జెప్పిరి. అతడు చిదాకాశమున లీనుడై యుండునని వివరించిరి.

శివజీవైక్యతా సిద్ధిని నిర్దేశించెడి విద్య యందున రమించెడివాడే వీరశైవుడన బడుననెడిది విదిత విషయమే. అట్టి శివజ్ఞానముననే చిత్తమును స్థిరముగా నుంచెడి శివయోగి సహభాజనుడన బడుచున్నాడు. ఇచ్చట భాజనమనగా ననుభోగమని గ్రహించ గలరు. విద్యలో

రమించుచు ననుభవమును పొందెడి శివయోగి సమరస సుఖమును ననుభోగము చేసికొనుచు చిదా కాశమున విహరించు చుండును. ఈ విషయమును విస్పష్టము చేసెడి క్రింది పద్యమును గనుడి:

**"శివుడు తానని తానెర్గి చిత్తమలర**
**తనను తే దామర్చి మెలగునా ధన్యుడెపుడు**
**నింగి యందున చిద్వ్యోమ నిలయమందు**
**నైక్యుడుండును మౌనంబు నాట్యమాడ.**

(మార్గం పెద్ద వీరప్ప కవి అముద్రితము)

"తనను తా మరచి తామెలగు" యనెడిది గమనించి దగిన యంశము సహభాజన స్థలమున సాధన చేసెడి ధన్య జీవి తాను జీవుడననెడి భావము వీడి చరించును. శ్రీ మల్లికార్జున పండితుల వారీ విషయము నీ క్రింది విధముగా తెలియ జెప్పిరి.

**నీవని యెరిగిన పిమ్మట**
**నీవ యెరుంగుదని యుండు నీ నిజ భక్తుం**
**దావంతయు నేనని యెడు భావన గైకొనుడు గార్య భారమున శివా!**

(శివతత్త్వ సారము, ప. 172)

శివునితో సామరస్య భావమున నుండెడి సాధకుడు సమరస రూపధారియగును. ఈ విషయమును షట్స్థల రగడ యీ క్రింది విధముగా తెలుపు చున్నది.

**సుమహద్భావ కరం లింగైక్యం - సమరస రూపధరం లింగైక్యం**
**పరతర వస్తు నిజం లింగైక్యం - పరిపూర్ణ నిరంజన లింగైక్యం**

(సోమనాధుని లఘు కృతులు)
మందానిల - మధురగతి రగడ